ఈనాడు అల్లూరి సీతారామరాజు

రంపచోడవరంలో సంజీవిని ఆసుపత్రి!

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో రంపచోడవరంలో సంజీవిని ఆసుపత్రి ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తామని మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి చెప్పారు. ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక వైటీసీలో ఆదివారం మెగా వైద్య శిబిరం ఏర్పాటైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమెకు మహిళలు హారతులు పట్టారు. కొమ్ము, రేలా, థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. అంతకుముందు సీతపల్లిలోని బాపనమ్మతల్లి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ బాపన్నదొర, ఈవో సత్యరమేష్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శిబిరంలో న్యూ ట్రిపుల్, జీఎస్ఎల్, జీఎస్ఆర్ ఆసుపత్రులకు చెందిన వైద్యులు రోగులను పరీక్షించి మందులు ఇచ్చారు. నియోజకవర్గంలో సికెల్‌సెల్ ఎనీమియాతో ఎక్కువ మంది బాధపడుతున్నారని చెప్పగా.. వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే శిరీషాదేవి చెప్పారు. ఇర్లపల్లికి చెందిన కందుల సాయి దంపతులు ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.లక్ష చెక్కును భువనేశ్వరికి అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు గిడ్డి ఈశ్వరి, వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, ఎస్టీ కమిషన్ డైరెక్టర్ సునీత, నాయకులు విజయభాస్కర్, డీఎస్పీ సాయిప్రశాంత్, శిబిరం పర్యవేక్షకుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.లక్ష విరాళం చెక్కును భువనేశ్వరికి అందజేస్తున్న కందుల సాయి దంపతులు

అల అరకులోయలో!

ఆంధ్రా ఊటీ అరకులోయ ఆదివారం సందర్శకులతో సందడిగా మారింది. పొగమంచు నడుమ అరకు అందాలను తిలకించేందుకు పర్యాటకులు తరలివచ్చారు. గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానం, కాఫీ తోటలు, వ్యూపాయింట్ తదితరాలు కిటకిటలాడాయి. మాడగడ సన్‌రైజ్ పాయింట్‌ని చూసేందుకు పర్యాటకులు ఎక్కువగా ఆసక్తి చూపటంతో ఆ మార్గంలో వాహనాలు బారులు తీరాయి. ఓవైపు చలి వణికిస్తున్నా. . వెరవకుండా సందర్శకులు తరలి వస్తుండటం విశేషం.

– న్యూస్‌టుడే, అరకులోయ

అరుగుపైనే ఆటాపాట!

అరకులోయ మండలం మాదల పంచాయతీ తుంగగెడ్డ గ్రామంలో పాఠశాల వంట గదే చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంగా మారింది. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రానికి భవనం లేకపోవడంతో ఈ పరిస్థితి ఎదురైంది. అంగన్‌వాడీ సామగ్రిని వంటగదిలో నిల్వ చేస్తున్నారు. చిన్నారులు అరుగుపైనే ఆటపాటలతోపాటు భోజనాలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మించి చిన్నారుల ఇబ్బందులు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, అరకులోయ

విడివిడిగా పుట్టి.. ఒక్కటిగా పెరిగి!



మనం రోజూ చూసే ప్రకృతే అయినా ఒక్కోసారి మన కళ్లకు చెట్లు, చేమలు సైతం వింతగా కనిపిస్తుంటాయి. చింతపల్లి- గూడెంకొత్త వీధి మార్గంలో దుచ్చరిపాలెం సమీపంలో రహదారిని ఆనుకుని ఉన్న వీటిని చూడండి.. ఇవి రెండూ సమాంతరంగా పెరిగిన మామిడి చెట్లు. నిజానికి ఇవి వేర్వేరు వృక్షాలు. మొదళ్లు వేరైనా దూరం నుంచి చూసేవారికి ఒకే చెట్టు అన్న భ్రమ కలిగిస్తున్నాయి. విడివిడిగా పుట్టినా కలిసి ఉంటే కలదు సుఖం అన్నట్టుగా పెరుగుతున్నాయి.

– న్యూస్‌టుడే, చింతపల్లి

విస్తారంగా తియ్య దుంప సాగు

మన్యంలో తియ్య దుంపల సాగు విస్తారంగా సాగుతోంది. ఆరోగ్య రక్షణకు, ఔషధ పరంగా వీటిని వినియోగిస్తారు. ఎరువులు వాడకుండా సహజసిద్ధంగా పండించే ఈ దుంపలకు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఆయా రాష్ట్రాల నుంచి వ్యాపారులు సరిహద్దు ప్రాంతాలకు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. పెదబయలు, ముంచంగిపుట్టు, పాడేరు, జి.మాడుగుల, హుకుంపేట, డుంబ్రిగుడ మండలాల్లో సుమారు పది వేల ఎకరాల్లో సాగవుతోంది. – న్యూస్‌టుడే, పాడేరు పట్టణం

బెత్తం వదిలిన తేజోవతికి పార్టీ పగ్గాలు

✦ తెదేపా అరకు పార్లమెంటు జిల్లా అధ్యక్షురాలిగా నియామకం
✦ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణరావు

ఈనాడు, పార్వతీపురం మన్యం

అరకు పార్లమెంటు స్థానం ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించారు. అప్పటి నుంచి తెదేపా ఒక్కసారి కూడా ఈ స్థానాన్ని దక్కించుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అధిష్ఠానం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. పార్టీ బలోపేతం, వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల లక్ష్యంగా తెదేపా అరకు పార్లమెంటు జిల్లా అధ్యక్షురాలిగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మోజూరు తేజోవతి(42)ని, ప్రధాన కార్యదర్శిగా బీసీ వర్గానికి చెందిన దత్తి లక్ష్మణరావు (61)ను నియమించింది. చాలా మంది ఆశావహులు ప్రయత్నించినా ఈమెనే పదవి వరించింది.

పాలకొండ నియోజకవర్గంలో ఉపాధ్యాయినిగా పనిచేస్తూ రెండేళ్ల కిందట రాజీనామా చేసి తెదేపాలో చేరిన తేజోవతి వైపే అధిష్ఠానం మొగ్గు చూపింది. గిరిజన సంఘం మండలి సభ్యురాలిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సాలూరు, పాలకొండ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని టిక్కెట్ ఆశించారు. ఇందుకు ప్రభుత్వోద్యోగాన్ని వదిలేసి రాజకీయ ఆరంగేట్రం చేశారు. ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడంతో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు.

✦ ప్రధాన కార్యదర్శి పదవి దక్కిన దత్తి లక్ష్మణరావు రెండు సార్లు, ఆయన భార్య రెండు సార్లు జియ్యమ్మవలస మండలాధ్యక్షులుగా పనిచేశారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా, పలు నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడిగా పనిచేశారు.

తేజోవతి

లక్ష్మణరావు

జోడు పదవులు మన్యానికే.. ఈ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రెండు జిల్లాలు ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు శాసనసభ స్థానాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు స్థానాలు ఉన్నాయి. మన్యం జిల్లాలోని నాలుగింటినీ కూటమి అభ్యర్థులు దక్కించుకున్నారు. అందులో సాలూరు నుంచి మంత్రి, కురుపాం నుంచి ప్రభుత్వ విప్ పదవులు ఉన్నాయి. దీంతో అరకు పార్లమెంటు అధ్యక్ష పదవి అల్లూరి జిల్లాకు దక్కొచ్చని అంతా భావించారు. ప్రస్తుత అధ్యక్షుడు కిడారి శ్రావణకుమార్ అరకు నియోజకవర్గానికి చెందిన నాయకుడే. ఈ సారి కూడా అధ్యక్ష పీఠం ఆ నియోజకవర్గానికే కేటాయిస్తారని పార్టీ నాయకులు భావించారు. అన్ని అంశాలు పరిశీలించాక ఎన్నికల నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు పదవులిచ్చారు.

రాజకీయాల్లో ఎదగాలనే ఆకాంక్షతో.. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం జోగిపాడు తేజోవతి స్వగ్రామం. ఎస్టీ కొండదొర సామాజిక వర్గం. విద్యాభ్యాసం సీతంపేటలో సాగింది. తెర్లాం మండలం కాగాం గ్రామానికి చెందిన విద్యుత్తు శాఖ ఉద్యోగి కోటిపల్లి జయరాజును కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితురాలినై ఉద్యోగం వదిలి తెదేపాలో చేరానని ఆమె ఈ సందర్భంగా 'ఈనాడు'కు చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చిన తక్కువ సమయంలో అధినేత పెద్ద బాధ్యతలు అప్పగించారు. ఆ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు లేకుండా చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన అధినేత చంద్రబాబు, మంత్రి లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కె.అచ్చెన్నాయుడులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ఎత్తిపోతలకు మోక్షం!

● పాడేరు ఏజెన్సీలో 20 పథకాల పునరుద్ధరణకు చర్యలు
● నేడు తడిగిరిలో శంకుస్థాపన

పాడేరు, న్యూస్‌టుడే

మన్యంలో ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకాలకు ఎట్టకేలకు కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగింది. ఆయా పథకాలను మరమ్మతులు చేపట్టి.. పదేళ్లపాటు నిర్వహించేందుకు రూ.37.2 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఏజెన్సీలో ఎత్తిపోతల పథకాల స్థితిగతులను తెలుసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ మైనర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విజయనగరం సర్కిల్ ఈఈ భీమారావు, ఏఈఈ అనుదీప్, సిబ్బంది సెప్టెంబర్ నెలలో పర్యటించారు. ప్రభుత్వానికి నివేదిక అందించారు.

తడిగిరిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

● పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, చింతపల్లి మండలాల్లో 1996లో 22 ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేశారు. తొలుత కొన్నేళ్లపాటు బాగానే పనిచేశాయి. గిరిజన రైతులు ఎత్తిపోతల పథకాల నిర్వహణపై ఆసక్తి చూపకపోవడం, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమేణా ఈ పథకాలు నిరుపయోగంగా మారాయి. ఆ సమయంలో ఏజెన్సీ ప్రాంతానికి ఏపీ మైనర్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సేవలు దూరమయ్యాయి. రెండు దశాబ్దాల క్రితం వరకు ఏపీఎంఐడీసీ డీఈఈ కార్యాలయం పాడేరులో ఉండేది. అప్పట్లో ఇంజినీర్లు గిరిజన ప్రాంతానికి చుట్టపుచూపుగా వచ్చి ఒకటి, రెండు ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తీసుకొచ్చేవారు. విశాఖపట్నంలో ఉన్న ఏపీఎంఐడీసీ కార్యాలయాన్ని శ్రీకాకుళానికి తరలించడంతో ఏజెన్సీలో ఎత్తిపోతల పథకాల బాగోగులను పట్టించుకునే పరిస్థితి లేకపోయింది. ప్రస్తుతం ఈ కార్యాలయాన్ని విజయనగరానికి మార్చారు. ప్రస్తుతం ఏజెన్సీలోని ఎత్తిపోతల పథకాలు విజయనగరంలోని ఏపీఎంఐడీసీ పరిధిలో ఉన్నాయి.

● హుకుంపేట మండలం తడిగిరి పంచాయతీలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సాగునీటి సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విశాలమైన వ్యవసాయ భూములు కలిగిన తడిగిరి గ్రామంలో వర్షం పడితేనే తప్ప మెరక భూముల్లో సాగు చేసేందుకు వీలుపడని పరిస్థితి ఉండేది. జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ చొరవతో 100 ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ మైనింగ్ విభాగం సహకారంతో రూ.35 లక్షల నిధులతో సోలార్ సిస్టం ద్వారా ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులకు సోమవారం తడిగిరి గ్రామంలో శంకుస్థాపన చేయనున్నట్లు సర్పంచి పి.రంజిత్‌కుమార్ తెలిపారు.

ఎత్తిపోతల పథకం	ఆయకట్టు (ఎకరాల్లో)	నిధులు (రూ.కోట్లలో)
హుకుంపేట	100	3.09
బొరాపల్లి	300	2.42
అడ్డుమండ	200	1.91
తడిగిరి	200	4.43
కొట్నాపల్లి	170	2.03
నట్టలపుట్టు	150	1.49
కింతలి	145	1.76
దిగుడుపుట్టు	85	1.19
మాలెల	70	1.06
బెంజిపూర్	200	1.90
కొత్తవలస	200	1.95
కోడిగెడ్డ	100	1.06
జోడిగెడ్డ	100	3.09
బందబయలు 1,2	150	4.15
సేరిబయలు1, 2	344	2.37
ఉబేటిపుట్టు	74	0.80
రాయిగెడ్డ	90	1.33
కొత్తూరుబయలు	90	1.12

గణితంపై పట్టు.. భవితకు మెట్టు!

నేడు గణిత దినోత్సవం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు గణితంపై పట్టు సాధిస్తూ.. భవితకు బాటలు వేసుకుంటున్నారు. ఐదేళ్లుగా పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు గణితంలో ఎక్కువ మార్కులు సాధిస్తున్నారు. మౌలిక భావాలను సూత్రాల రూపంలో సులభంగా అర్థం చేసుకుంటున్నారు. ప్రతి రోజూ సాయంత్రం పాఠశాల ముగిసిన తరువాత గంట సమయం అదనంగా కేటాయిస్తున్నారు. ఉపాధ్యాయులు సుందరమ్మ, నూకాలమ్మల పర్యవేక్షణలో ఒక ప్రశ్నకు వేర్వేరు పద్ధతుల్లో జవాబులు కనుక్కొని సూత్రాలు నమోదు చేస్తున్నారు. ఈనెల 22న గణిత దినోత్సవం సందర్భంగా తాము చేసిన ప్రయోగాలు, రూపొందించిన చిత్రపటాలను ప్రదర్శించేందుకు సిద్ధమవుతున్నారు.

■ పదో తరగతిలో విద్యార్థినులు సులభంగా మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులను గ్రేడులుగా విభజించారు. గణితంలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా వివరిస్తున్నారు. అంతర్జాలం ద్వారా పాఠ్యాంశాలను వీక్షించడం వల్ల సులభంగా అర్థం చేసుకుంటున్నారని ఉపాధ్యాయురాలు సుందరమ్మ తెలిపారు.

గణిత ప్రయోగాల చిత్రపటాలను ప్రదర్శిస్తున్న చింతపల్లి ఆశ్రమ పాఠశాల బాలికలు

4డీ.. విద్యార్థుల అనారోగ్యంతో ఢీ

బాలల ఆరోగ్యానికి ప్రత్యేక కార్యక్రమం

అనంతగిరి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతుంది. ఇందులో భాగంగానే రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద ఛైల్డ్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా జరుగుతున్నాయి. ఇందులో నాలుగు రకాల వ్యాధులు (4డీ).. పుట్టుకతో వచ్చే లోపాలు, బాల్యంతో వచ్చే వ్యాధులు, పోషకాహార లోపాలు, ఎదుగుదల లోపం వంటి నాలుగు రకాల కేటగిరిలుగా విభజించి స్క్రీనింగ్ చేసి ఉచితంగా చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

చేసే పరీక్షలివీ..: ఏఎన్ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లు, ఇతర వైద్య సిబ్బంది నేరుగా బాలల వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అంగన్‌వాడీ చిన్నారులకు కేంద్రాల వద్ద, విద్యార్థులకు పాఠశాలల వద్ద పరీక్షలు నిర్వహించనున్నారు. రక్తహీనత, ఎత్తు, బరువు, వినికిడి, దృష్టి, దంత, చర్మ పరీక్షలతో పాటు మానసిక రుగ్మతలు వంటి వాటిపై తల నుంచి కాలి గోటి వరకు స్క్రీనింగ్ చేసి వివరాలను ఏపీ హెల్త్ యాప్‌లో నమోదు చేస్తారు.

జిల్లాలో మొత్తం పీహెచ్‌సీలు : 64

పరీక్షలు నిర్వహించాల్సిన పిల్లలు: 3,31,568

ఇప్పటివరకు నిర్వహించింది: 1,29,760

వ్యాధి తీవ్రతను బట్టి... 18 ఏళ్లలోపు బాలబాలికలకు ఈ పరీక్షలను నిర్వహిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు భవిత కేంద్రాలలో ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఈ పరీక్షలను నిర్వహిస్తారు. స్క్రీనింగ్‌లో సమస్యలున్న విద్యార్థులకు వైద్యాధికారి పర్యవేక్షణలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారి సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆసుపత్రులలో వైద్యం అందిస్తారు.

ప్రత్యేక శ్రద్ధ అవసరం: పిల్లలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఈ పరీక్షల్లో లోపాలు ఉన్నట్లుగా గుర్తించిన చిన్నారులకు ప్రత్యేక వైద్యం సైతం అందించనున్నాం. పిల్లల విషయంలో తల్లిదండ్రులూ ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరముంది.

– ప్రతాప్, ఏడీఎంహెచ్‌వో, అల్లూరి జిల్లా

ఉష్ణోగ్రతల్లో స్వల్పమార్పులు

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. చలితీవ్రత యథాతథంగా కొనసాగుతోంది. ముంచంగిపుట్టులో ఆదివారం 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాగా.. జి.మాడుగుల 7.6, పెదబయలు 8.3, అరకులోయ 8.8, చింతపల్లి, పాడేరు 9.2, హుకుంపేట 9.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.

అప్పన్న స్వామికి పగడాల హారం

సింహాచలం, న్యూస్‌టుడే: విజయనగరం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు సింహాద్రి అప్పన్న స్వామికి ఆదివారం పగడాలు పొదిగిన బంగారు హారం బహూకరించారు. సింహగిరికి వచ్చిన వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. వేదాశీర్వచనం అనంతరం హారాన్ని డిప్యూటీ ఈవో రాధ, పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావుకు అందజేశారు.

'అమూర్‌కార్ప్'తో ఆర్థికాభివృద్ధి

చేపల సాగుకు కేవీకే ప్రోత్సాహం

ఆరు నెలల్లో రెండు కేజీల బరువు

రంపచోడవరం, న్యూస్‌టుడే

ఏజెన్సీ ప్రాంతంలో అమూర్‌కార్ప్ చేప పిల్లల పెంపకం గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తోంది. పందిరిమామిడిలోని కృషి విజ్ఞాన కేంద్రం మూడేళ్లుగా ఎంపిక చేసిన రైతులకు చేప పిల్లలను అందజేస్తోంది. ఈ రకం చేప పిల్లలు ఆరు నెలల్లోనే కేజీన్నర నుంచి రెండు కేజీల వరకు బరువు పెరుగుతాయని మత్స్య శాస్త్రవేత్త వీరాంజనేయులు చెబుతున్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో బెంగళూరులోని మత్స్య పరిశోధన, సమాచార కేంద్రం నుంచి రెండు నెలల వయసున్న చేప పిల్లలను ఇక్కడకు తీసుకువస్తున్నారు. ఒక్కో రైతుకు రెండు వేల చొప్పున 20 మందికి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

● రైతు అమూర్‌కార్ప్ రకం చేప పిల్లలతోపాటు బొచ్చె, రవ్వ, గడ్డి రకాలకు చెందిన చేపలనూ పెంచుకోవచ్చు. మిగతా వాటి కంటే వీటిలో రోగ నిరోధకశక్తి అధికం. 27 శాతం ఎదుగుదల ఎక్కువ. ఫీడ్ వినియోగం తక్కువ. బంగారుతీగ రకానికి చెందిన చేపలకు ప్రత్యామ్నాయంగా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి అమూర్‌కార్ప్ చేప పిల్లల పెంపకాన్ని ప్రోత్సహిస్తోంది. ఏజెన్సీలో చెరువుపాలెం, రాజంపాలెం, ఆముదాల బంద, ఐ.పోలవరం, కొత్తాడ, లబ్బర్తి, కింద్ర గ్రామాలకు చెందిన 20 మంది రైతులకు మూడేళ్లుగా చేప పిల్లలు అందజేస్తున్నట్లు శాస్త్రవేత్త వీరాంజనేయులు పేర్కొన్నారు.

వంటింట్లో 'ఉజ్వల' వెలుగు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: కట్టెలు, బొగ్గుల పొయ్యిల నుంచి వచ్చే పొగ పీల్చి మహిళలు అనారోగ్యానికి గురవకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉజ్వల యోజనను(పీఎంయూవై) పునఃప్రారంభించింది. ఈ పథకం ద్వారా దారిద్ర్య రేఖకు దిగువనున్న పేద మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరయ్యాయి. సిలిండర్ రూ.2,200, గ్యాస్ పొయ్యి రూ.1000, రెగ్యులేటర్‌కు రూ.250, ఒక మీటరు పైపు రూ.190, గ్యాస్ పుస్తకం రూ.25.. దాదాపు రూ.3740ను సంబంధిత కంపెనీలు భరిస్తున్నాయి. మొదటి సిలిండర్‌ను ఉచితంగానే ఇస్తున్నారు. తరువాత తీసుకునే సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం రూ.300 రాయితీ ఇస్తుంది. ఈ పథకం అమలుకు కలెక్టర్ ఛైర్మన్‌గా, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ ప్రతినిధి జిల్లా సమన్వయకర్తగా, పౌర సరఫరాలశాఖ అధికారిగా సభ్యుడిగా ఉంటారు.

దరఖాస్తు ఇలా.. రేషన్‌కార్డులో పేర్కొన్న పేర్ల మీద ఎటువంటి గ్యాస్ కనెక్షన్ ఉండకూడదు. ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా నకళ్లు సమర్పించాలి. నెలకు రూ.10వేల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారు అనర్హులు. అర్హులైన పేద మహిళలు గ్యాస్ గోదాముల వద్దకెళ్లి సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

పోలియో నిర్మూలనకు సమష్టి కృషి

పాడేరు, న్యూస్‌టుడే: పోలియో సమూల నిర్మూలనకు అందరూ కృషిచేయాలని ఎంపీ తనూజారాణి పిలుపునిచ్చారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమం జరిగింది. పాడేరు జిల్లా ఆసుపత్రిలో ఎంపీ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జిల్లా వ్యాప్తంగా 1,29,959 మంది చిన్నారుల్లో 1,12,839 మందికి చుక్కల మందు వేసినట్లు డీఎంహెచ్‌వో కృష్ణమూర్తినాయక్ తెలిపారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో వేస్తామన్నారు. మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారి వి.సాయిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీ తనూజారాణి, డీఎంహెచ్‌ఓ కృష్ణమూర్తినాయక్, వైద్యాధికారులు

(c) eenadu

టెట్‌కు వెళ్లి.. తిరిగిరాని లోకాలకు!

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: రింతాడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు **మఠం ఝాన్సీ** ఆకస్మికంగా మృతి చెందారు. పెదబయలు మండలం రూఢకోట గ్రామానికి చెందిన ఆమె రింతాడ పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) రాసేందుకు శుక్రవారం విశాఖపట్నం వెళ్లారు. శనివారం పరీక్షకు హాజరైన ఆమె పరీక్షా కేంద్రం నుంచి సోదరి ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకుంది. ఆదివారం తిరిగి బయలుదేరే సమయానికి అస్వస్థతకు గురైనట్లు సహచర ఉపాధ్యాయులు తెలిపారు. ఆసుపత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు పేర్కొన్నారు. అందరితో సరదాగా ఉంటూ, పక్కా ప్రణాళికతో విద్యాబోధన చేసే ఉపాధ్యాయిని చనిపోవడం బాధాకరమని మండల విద్యాశాఖ అధికారులు గోవిందరావుపడాల్, రామన్న, ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు, ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని, సుస్థిర ఆదాయం పొందవచ్చని సిబ్బంది పేర్కొన్నారు. కిండ్ర కాలనీలో నాగరాజు నిర్వహిస్తున్న సమీకృత ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఆదివారం వై.రామవరం మండలం ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు సిబ్బంది సందర్శించారు. సాగుచేస్తున్న పంటలు, తక్కువ స్థలంలో ఎక్కువ పంటలు తీసే విధానాన్ని పరిశీలించారు. ప్రకృతి సిద్ధంగా తయారుచేస్తున్న ఎరువుల తయారీని పరిశీలించారు. క్షేత్రంలో బీజామృతం, ఘన, జీవామృతాలను తయారు చేశారు. రసాయన ఎరువులు లేకుండా ప్రకృతి సిద్ధమైన కషాయాలతో పంటలు ఎలా రక్షించుకోవాలో రైతులకు వివరించారు. రీజినల్ మోడల్ మండల్ లీడ్ రమాప్రభ, పీఈ కొండా, ఎన్ఎఫ్ఏ గంగరాజు, డీటీటీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నేటి నుంచి 'ఈనాడు' క్రికెట్ పోటీలు

■ ఈఎస్ఎల్ ట్రోఫీలో సత్తా చాటేందుకు సిద్ధమైన యువ క్రికెటర్లు

■ ముస్తాబైన ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ - 2025' (ఈఎస్ఎల్) క్రికెట్ పోటీలు నేటి(సోమవారం) నుంచి నగరంలోని ఆంధ్ర మెడికల్ కళాశాల (ఏఎంసీ) మైదానంలో ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు 'ఈఎస్ఎల్' వేదికగా నిలుస్తుంది. ఇప్పటికే అతి పెద్ద టోర్నీగా 'గిన్నిస్ బుక్ రికార్డ్స్'లో చోటు సంపాదించిన మెగా ఈవెంట్‌లో భాగస్వాములయ్యేందుకు యువ క్రికెటర్లు ఉత్సాహంగా ఉన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభ చూపి.. ప్రత్యర్థులపై విజయం సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మ్యాచ్‌ల నిర్వహణకు ఏఎంసీ మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేటి మ్యాచ్‌లు: ఉదయం 9 గంటలకు: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా(ఏయూ) × అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(తగరపువలస); ఉదయం 11 గంటలకు: సాంకేతిక విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కాలేజీ(పీఎంపాలెం) × బి.బలరామ కృష్ణ డిగ్రీ కాలేజ్(గాజువాక)

రేపటి మ్యాచ్‌లు (23-12-25): ఉదయం 8 గంటలకు గీతం కాలేజ్(రుషికొండ) × ఆదిత్య డిగ్రీ కాలేజ్(గోపాలపట్నం), ఉదయం 10 గంటలకు: ఆదర్శ్ డిగ్రీ కాలేజ్(విశాఖ) × బెహరా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(నరవ); మధ్యాహ్నం 1 గంటకు: విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(దువ్వాడ) × గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ(రుషికొండ)

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ NECC (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Gift Partner: KL UNIVERSITY (DEEMED TO BE UNIVERSITY)
Regional Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P. Call: 994 999 3483 | www.ggu.edu.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
Dolphin Diagnostic Services
District Sponsor: TIRUMALA విద్యాసంస్థలు
Organised by ఈనాడు ఈతరం క్లబ్

జగన్ జన్మదిన వేడుకల్లో వర్గపోరు

పెదబయలు, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకల్లో పెదబయలు మండల పార్టీలో వర్గపోరు కొట్టొచ్చినట్లు కనిపించింది. స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద ప్రస్తుత పార్టీ మండలాధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సండడి కొండబాబు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. సీకరి పంచాయతీ సిరసపల్లి గ్రామంలో మాజీ మండలాధ్యక్షుడు ఆనందరావు ఆధ్వర్యంలో వేరేగా వేడుకలు జరిగాయి. గంపరాయి సూరయ్య, రూఢకోట సర్పంచ్ కాతరి సురేష్, మాజీ సర్పంచి సింహాచలం పాల్గొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ వర్గాలుగా కార్యకర్తలు విడిపోయారని పలువురు చర్చించుకున్నారు.

వృద్ధులకు రగ్గుల పంపిణీ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో ఆదివారం జరిగిన మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొని కేకు కోశారు. వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ రామకృష్ణ, ఎంపీపీ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఎం.మాకవరంలో వైకాపా శ్రేణులు వేడుకలు నిర్వహించాయి. మండల ఉపాధ్యక్షురాలు నూకాలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రత్నం, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, సర్పంచి చినతల్లి, బాబులు తదితరులు కేక్ కోశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీడర్ అంబులెన్సులో ప్రసవం

చింతూరు, న్యూస్‌టుడే: నెలలు నిండిన గర్భిణిని పురిటి నొప్పులతో ఏడుగు రాళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫీడర్ అంబులెన్సులో తరలిస్తుండగా.. మార్గ మధ్యలోనే ప్రసవించిన ఘటన మండలంలోని బలిమెల వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. వలస గ్రామమైన నర్సింహలంకకు చెందిన గర్భిణి మడివి దూలమ్మకు పురిటి నొప్పులు అధికమవ్వడంతో స్థానిక ఆశా కార్యకర్త లక్ష్మి ఫీడర్ అంబులెన్సుకు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ డ్రైవర్ ఆ గ్రామానికి వెళ్లి గర్భిణిని పీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గం మధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అంబులెన్సు ఈఎంటీ రవి, ఆశా కార్యకర్త రహదారి పక్కన అంబులెన్స్ నిలిపి ప్రసవం చేశారు. అనంతరం తల్లీబిడ్డను రాళ్లపల్లి ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఇద్దరూ క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

తల్లీబిడ్డతో ఈఎంటీ, ఆశా కార్యకర్త

ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు సంఘం కృషి చేయాలని ఎమ్మెల్యే విష్ణుకుమారరాజు, కేఎస్ఎన్ రాజు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. అచ్యుతాపురం మండలం కొండకర్ల వద్ద ఆదివారం అనకాపల్లి రాజపుత్ర సమాజ్ జిల్లా స్థాయి సమావేశం సంఘం అధ్యక్షులు దంతులూరి దిలీప్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వీరు మాట్లాడుతూ క్షత్రియుల్లో చాలా మంది పేదలు ఉన్నారని, వీరికి సాయం అందించి ఆదుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు మాట్లాడుతూ క్షత్రియుల్లో పేదవారి విద్య, ఉపాధి, వైద్య సదుపాయాలు తమ సంస్థల ద్వారా కల్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు మాట్లాడుతూ పేద వారిని చదివించడానికి అందరూ ముందుకు రావాలని కోరారు.

చెరకు రైతుల సమావేశం నేడు

చోడవరం, న్యూస్‌టుడే: గోవాడ చక్కెర కర్మాగారంలో ఈ ఏడాది గానుగాట ప్రారంభించాలంటూ సోమవారం ఉదయం చెరకు రైతులు సమావేశం కానున్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు చెప్పారు. రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, అఖిలపక్షం పేరిట నిర్వహిస్తున్న ఈ సమావేశానికి చెరకు రైతులందరూ హాజరుకావాలని కోరారు.

డ్వామా ఇన్‌ఛార్జి పీడీగా రవీంద్ర

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా డ్వామా ఇన్‌ఛార్జి పీడీగా రవీంద్రను నియమిస్తూ విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకూ పీడీగా పని చేసిన ఆర్.పూర్ణిమాదేవి వ్యక్తిగత కారణాలతో 38 రోజులు సెలవు పెట్టారు. కుమార్తె చదువు కోసం ఆస్ట్రేలియా వెళ్తున్నారు. డ్వామాలో ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న రవీంద్రకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఆయన సోమవారం కలెక్టర్ విజయకృష్ణను కలిసి అనకాపల్లి డ్వామా కార్యాలయంలో విధుల్లో చేరుతున్నారు.

కారు, బైకు ఢీ ఒకరికి గాయాలు

అనంతగిరి (గ్రామీణం), న్యూస్‌టుడే: కాశీపట్నం దర బంగారమ్మతల్లి ఆలయ సమీపంలో కారు, బైక్ ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. అరకులోయ వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం, ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్నాయి. బైకుపై వెలుతున్న కె.ప్రసాద్‌కు గాయాలయ్యాయి. కుక్క అడ్డంగా రావడంతో ద్విచక్రవాహనదారుడు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కారుపైకి దూసుకెళ్లి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు. అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన ప్రసాద్

గ్రామ కంఠం.. హక్కు పక్కా!

రెండో విడత 'స్వామిత్వ' సర్వే పూర్తి

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పల్లెల్లో 'స్వామిత్వ' సర్వే జోరుగా సాగుతోంది. పంచాయతీల్లోని గ్రామ కంఠాల్లో నివసిస్తున్న వారికి ఆస్తి హక్కు కల్పించేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేయిస్తోంది. రెండో విడత సర్వేలో అనకాపల్లి జిల్లా ముందంజలో ఉంది. 360 ఆవాసాలకు సంబంధించి కొలతలు తీయడం పూర్తయింది. మూడో దశ సర్వే పూర్తయ్యాక అర్హులకు యాజమాన్య కార్డులు జారీ చేయనున్నారు.

★ దశాబ్దాలుగా గ్రామ కంఠాల్లో నివాసం ఉంటున్న వారికి ఎటువంటి ఆస్తి హక్కు లేక పోవడంతో వారి జీవనం దయనీయంగా ఉంది. ఇలాంటి వారందరికి ఆస్తి హక్కు పత్రాలు అందజేసేందుకు 'స్వామిత్వ' సర్వే చేస్తున్నారు. యాజమాన్య కార్డులు పొందితే బ్యాంకు రుణాలు పొందేందుకు వీలుంటుంది. గతంలోనే డ్రోన్ సర్వేతో గ్రామాల మ్యాప్‌లు సిద్ధం చేశారు. వీటి ఆధారంగా క్షేత్ర స్థాయిలో నివాసాల కొలతలను సరిచూస్తున్నారు. మార్పులు, చేర్పులతో తుది నివేదికలు తయారు చేస్తున్నారు. ఈ వారిలో జిల్లాలో గ్రామాల్లోని పక్కా కార్యాచరణతో ఈ పనులు చేపడుతున్నారు.

స్వామిత్వ సర్వేలో సిబ్బంది

★ రెండో దశలో ప్రాపర్టీ పార్సిళ్లను పేర్కొంటున్న 1,88,073 నివాసాల సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. గ్రామ కంఠాలతోపాటు వాటిని ఆనుకుని, దూరంగా ఉన్న జిరాయితీల్లోనూ పడిన మించి నివాసాలున్న వాటిని పరిగణనలోకి తీసుకుని సర్వే చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సందీప్ చెప్పారు. మూడో విడతలో 234 గ్రామాల్లో సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు.

★ జిల్లా వ్యాప్తంగా 669 గ్రామాల్లో సర్వే చేయాలని నిర్ణయించారు. తొలుత జీరో సర్వే పేరిట 51 గ్రామాల్లో, మొదటి విడత సర్వే 17 గ్రామాల్లో పూర్తి చేశారు. రెండో విడతలో 360 గ్రామాల్లో చేపట్టిన సర్వే ఇటీవల పూర్తయింది. సర్వే పూర్తయిన గ్రామాల్లో పంచాయతీ అధికారులు గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఇప్పటికి 360 గ్రామాలకు 101 చోట్ల గ్రామసభలు నిర్వహించారు.

విద్యార్థులే దేశ భవిష్యత్తు

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు ఏపీ జెన్‌కో కల్యాణ మండపంలో సోషల్ స్టడీస్ కంబైన్డ్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు డీజే సునీల్, భానుప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 225 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఏపీ జెన్‌కో ఈఈ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. మత్తుపదార్థాలకు దూరంగా ఉండి.. చదువుతోపాటు సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. ఎస్సై యాసీన్ మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విశ్రాంత ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి ఈ పోటీలకు ఆర్థికసహాయం అందించారు. వైద్యాధికారులు అఖిల్, సృజనారాయ్, జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శంకర్‌రావు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో విద్యార్థులు

దీపకాంతిలా సూరీడు

ఈ చిత్రాన్ని చూస్తే విద్యుత్తు స్తంభం వద్ద ఏర్పాటు చేసిన లైటులా కనిపిస్తుంది కదూ.. కానీ ఆదివారం సాయం సంధ్యవేళ అస్తమిస్తున్న సూరీడు ఇలా చింతపల్లి- గూడెంకొత్తవీధి మధ్య కనిపించాడు.

– చింతపల్లి, న్యూస్‌టుడే

ప్రార్థనా మందిరాలకు కొత్త కళ

పాడేరు పట్టణం, మోతుగూడెం, న్యూస్‌టుడే: క్రిస్మస్ సమీపిస్తుండడంతో ప్రార్థనా మందిరాలు కొత్త కళను సంతరించుకున్నాయి. పాడేరు పట్టణంలో పాస్టర్ దైవకృప ఆధ్వర్యంలో నడుస్తున్న కారుణ్య చర్చిని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. ▮ 3లోయరు సీలేరు ప్రాజెక్టులోని సీఎస్ఐ, యూసీఐఎం, గెరిజిఎం, ఐపీసీ, లివిగ్ స్టోన్, షారోన్ క్రైస్తవ ప్రార్థనా మందిరాలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబవుతున్నాయి.

పండ్ల తోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: గిరిజనులు తమ భూముల్లో పండ్ల తోటలతోపాటు, వాణిజ్య పంటలు సాగు చేయడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే ఆస్కారం ఏర్పడుతుందని రాష్ట్ర ఉద్యానవన శాఖ సంయుక్త కమిషనర్ శివరామ్ అన్నారు. కూడూరులో గిరిజనులు సాగుచేస్తున్న నిమ్మ, జాఫ్రా, అవకాడో తోటలను ఆదివారం ఆయన పరిశీలించారు. మొక్కలు నాటిన దగ్గర నుంచి అవి పెరిగి దిగుబడి ఇచ్చే వరకు ఆయా మొక్కలను జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నారు. అనంతరం అవి ఆర్థికంగా దోహదం చేస్తాయన్నారు. గిరిజనులకు పండ్ల తోటల సాగుకు ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సాహం అందిస్తోందని, ఇటువంటి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధిహామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

కూడూరులో పండ్ల తోటలు పరిశీలిస్తున్న శివరామ్

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ప్రజలతో మమేకమై అంకితభావంతో పని చేస్తే ఎక్కడికి వెళ్లినా గుర్తింపు ఉంటుందని అరకులోయ సీఐ హిమగిరి అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్సైగా పనిచేసి బదిలీపై వెళ్తున్న పాపినాయుడు వీడ్కోలు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఆయన్ను సన్మానించారు. సీఐ మాట్లాడుతూ.. ఉద్యోగుల బదిలీలు సాధారణమన్నారు. ఎస్సై సురేష్, నేతలు దన్నెరావు, స్వామి, భాస్కరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు ఎస్సైగా పనిచేసి విజయనగరం బదిలీపై వెళ్తున్న రామకృష్ణను స్థానికులు సత్కరించారు. సీఆర్పీఎఫ్, ప్రత్యేక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సై రామకృష్ణను సన్మానిస్తున్న పోలీసు సిబ్బంది

దామనపల్లిలో తాగునీటి ఇక్కట్లు

దేవీపట్నం, న్యూస్‌టుడే: దామనపల్లిలో తాగునీటి ఇక్కట్లు తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు. గ్రామంలో దాదాపు 120 కుటుంబాలకు తాగునీటిని సరఫరా చేసే ప్లాస్టిక్ ట్యాంకు మరమ్మతుకు గురవడంతో తాగునీరు వృథాగా పోతోందని చెబుతున్నారు. మరో ట్యాంకు ఏర్పాటు చేసినా నీటి సరఫరా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నిర్వహించిన గ్రామసభలో తాగునీటి సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అధికారులు చర్యలు తీసుకుని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

'అభివృద్ధిని అడ్డుకునే మావోయిస్టులు మాకొద్దు!'

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: 'మావోయిస్టులు వద్దు... అభివృద్ధే ముద్దు...' అంటూ గిరిజనులు గళమెత్తారు. మారేడుమిల్లిలో ఆదివారం మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధాన కూడలి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా సాగింది. అభివృద్ధి నిరోధకులుగా మారిన మావోయిస్టులు మాకొద్దని, నిరసన వ్యక్తం చేశారు. మావోయిస్టులు ఎక్కడ ఉంటే అక్కడ అభివృద్ధి కుంటుపడుతుందని, శాంతియుత వాతావరణం చెదిరిపోతుందని అన్నారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో అమాయక గిరిజనులను చంపడం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం వారికి పరిపాటిగా మారిందని ఆరోపించారు. స్థానిక ప్రధాన కూడలిలో మావోయిస్టుల దిష్టిబొమ్మ దహనం చేశారు.

మారేడుమిల్లిలో మావోయిస్టులకు వ్యతిరేకంగా ఆదివాసీల ర్యాలీ

నడపడం రాకున్నా.. నడిపేస్తున్నారు!

● చిరునామా మార్పుతో డ్రైవింగ్ లైసెన్సులు

● సెన్సార్ల ఏర్పాటులో జాప్యంతో మధ్యవర్తుల దందా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

డ్రైవింగ్‌పై అవగాహన లేకుండా వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. కార్లు, జీపులు నడపడం రాకుండానే చాలామంది మధ్యవర్తుల ద్వారా లైట్ మోటార్ వెహికల్ (ఎల్ఎంవీ) లైసెన్సు పొందుతున్నారు. ఇలాంటి వారికి అడ్డుకట్ట వేసేందుకు చోదక పరీక్ష నిర్వహించే ట్రాక్ వద్ద సెన్సార్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పరీక్ష సమయంలో ఏమాత్రం వాహనాన్ని సరిగా నడపలేకపోయినా సెన్సార్లు పసిగట్టేస్తాయి. తద్వారా లైసెన్సు పొందేందుకు అనర్హులవుతారు. ఈ ప్రక్రియ అంతా విశాఖపట్నంలో పక్కాగా అమలవుతోంది.

★ అనకాపల్లిలో ఆర్డీవో కార్యాలయం వద్ద సెన్సార్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహన తనిఖీదారుల పర్యవేక్షణలోనే చోదక పరీక్షలు జరుగుతున్నాయి. కొందరు మధ్యవర్తులు అభ్యర్థుల చిరునామా మార్చేస్తూ చోదక పరీక్షలో పాస్ చేయిస్తామంటూ అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇలా పలువురికి అనకాపల్లి జిల్లా చిరునామాతో లైసెన్సులు ఇప్పించినట్లు రవాణా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో నిఘా పెట్టారు. ★ డ్రైవింగ్ లైసెన్సుల జారీని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి వారితోనే శిక్షణ, ట్రాక్ పరీక్షలు చేయించేలా ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలో రెండు డ్రైవింగ్ శిక్షణ, పరీక్షా కేంద్రాలకు టెండర్లు ఆహ్వానించగా నలుగురు దరఖాస్తు చేశారు. వీటిని కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వానికి పంపనున్నారు. వీటిలో ఖరారైన వారు మూడు ఎకరాల స్థలంలో డ్రైవింగ్ శిక్షణ, పరీక్షా కేంద్రాలకు సంబంధించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి లైసెన్సులు మంజూరు చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

సెన్సార్లు ఏర్పాటు చేయాల్సిన డ్రైవింగ్ ట్రాక్

సమగ్ర పరిశీలన తర్వాతే..

ట్రాక్‌పై వాహనాన్ని నడిపే విధానాన్ని పరిశీలించే చోదకులకు లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. అనకాపల్లిలో ట్రాక్‌కు త్వరలోనే సెన్సార్లు ఏర్పాటు చేస్తాం. చిరునామా మార్చి ఇక్కడ లైసెన్సులు ఇప్పిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై నిఘా పెట్టాం. అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రైవింగ్ వచ్చాకే లైసెన్సు కోసం దరఖాస్తు చేయాలి.

– మనోహర్, జిల్లా రవాణా శాఖాధికారి

బాలిక జూలో 'బ్లాక్‌స్వాన్' దత్తత

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జంతువుల సంరక్షణలో భాగంగా ఆళ్వార్ దాస్ పబ్లిక్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న నలం జెస్సికా పుట్టినరోజు సందర్భంగా ఆమె జూ పార్కులో ఒక బ్లాక్ స్వాన్‌ను ఏడాది పాటు దత్తత తీసుకున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఆదివారం తెలిపారు. ఇందుకు అయ్యే ఖర్చును రూ.10,800 అందజేసినట్లు పేర్కొన్నారు. అదే విధంగా పిల్లలు, సామాన్య ప్రజల్లో వన్యప్రాణుల పట్ల ప్రేమ, సంరక్షణ పెంపొందించడానికి రోజు, నెల, వార్షికపరంగా జంతువుల దత్తత తీసుకునే అవకాశం కల్పించామన్నారు. అనంతరం జెస్సికాకు ధ్రువపత్రం అందించారు. ఏడాది పాటు ఆమె ఎన్నిసార్లయినా జూలో ఉచిత ప్రవేశం పొందవచ్చన్నారు.

జెస్సికాకు ధ్రువపత్రం అందజేస్తున్న క్యూరేటర్ మంగమ్మ

గంజాయి స్వాధీనం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: గంజాయి విక్రయాలు, కొనుగోళ్లు చేస్తున్న ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి స్థానిక సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిశాలోని కొరాపుట్‌కు చెందిన కె.లాలూ(20), కె.అశీస్(19), సాల్మన్ పారీస్(28) గంజాయి విక్రయిస్తుండగా.. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన గంజి వంశీ(27), నీలం అనిల్(19), ఎం.ప్రవీణ్(20) కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు.. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి ఆరున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

గంజాయిని స్వాధీనం చేస్తున్న పోలీసులు

JOBS

సెంట్రల్ గవర్నమెంట్ సోలార్ సబ్సిడీ స్కీమ్ నందు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. Q: 10 to PG. జీతం: 30 వేలు to 50 వేలు. ✆ 95155 05557, 99898 57775.

ఉమానీలకంఠేశ్వరస్వామి సన్నిధిలో ఫ్రాన్స్ దేశీయుడు

ఆలయంలో ఫ్రాన్స్ దేశస్థుడు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాడేరులోని గిరి కైలాస్‌లో కొలువుదీరిన ఉమానీలకంఠేశ్వర స్వామిని ఫ్రాన్స్ దేశీయుడు ఆదివారం దర్శించుకున్నాడు. ఆలయ ధర్మకర్త కొట్టగుల్లి సింహాచలంనాయుడు ఆయనకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశిష్టతను సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుని ఇక్కడకు వచ్చానని పేర్కొన్నారు. స్వామివారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

పోలియో కేంద్రాల వద్ద 104 ఉద్యోగుల నిరసన

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలంటూ.. డిమాండ్లతో కూడిన ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆదివారం పల్స్ పోలియో కేంద్రాల వద్ద 104 ఉద్యోగులు నిరసన తెలిపారు. అరబిందో సంస్థ చెల్లించిన చివరి నెల వేతనాలను ప్రతి ఉద్యోగికి కొనసాగించాలని, ఇప్పటి వరకు తగ్గించిన వేతనాలను బకాయిలతో చెల్లించాలని డిమాండ్ చేశారు. భవ్య యాజమాన్య వేధింపులు, షోకాజ్ నోటీసులు, సస్పెండ్ చర్యలు నిలుపుదలచేయాలన్నారు. రద్దు చేసిన 15 క్యాజువల్ సెలవులను తక్షణం పునరుద్ధరించాలని, అయిదేళ్ల కాలపరిమితి పూర్తి చేసుకున్న 104 వాహన డ్రైవర్లకు నూతన స్లాబ్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. డీఈవోలకు జీవో 7 ప్రకారం రూ 18,500 చెల్లించాలని, బఫర్ సిబ్బందిని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

రాజవొమ్మంగిలో ప్లకార్డులతో 104 సిబ్బంది నిరసన

జాతీయస్థాయి మహిళా బాక్సింగ్ పోటీలకు ఎంపిక

పిఠాపురం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రెండురోజులుగా రాష్ట్రస్థాయి మహిళా బాక్సింగ్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. ఆదివారం విజేతలకు బహుమతులు అందజేసి, జాతీయ స్థాయి పోటీలకు 10 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌గా విశాఖపట్నం, రన్నర్‌గా కాకినాడ జిల్లా, ద్వితీయ స్థానంలో నెల్లూరు జిల్లా క్రీడాకారులు బహుమతులు సాధించారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర, అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగాయి.

త్వరలో నోయిడాలో..: విశాఖపట్నానికి చెందిన కె.శ్రీవర్షిత, ఎస్‌జీజేఎస్ మల్లిక, ఎండీ ముహూరున్నీషా బేగం, కె.షైనీ శ్రీ, ఎస్.దీపిక, జె.స్వప్న, వి.రేష్మ, అనకాపల్లికి చెందిన మౌనిక కల్యాణి, బి.భవానీ, విజయనగరానికి చెందిన పి.సుమిత్రలను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. వీరంతా ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో డిసెంబరు 31 నుంచి జనవరి 5వరకు జరిగే జాతీయస్థాయి మహిళా బాక్సింగ్ పోటీల్లో తలపడతారని నిర్వహణా కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, నాయకులు

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	116	112
లైవ్	143	132
డ్రెస్డ్	207	234
స్కిన్‌లెస్	236	244

(c) eenadu

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులపైనే పశువుల నివాసం ఉండటంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ముప్పు ఏర్పడుతోంది. – ప్రభుదాసు, మారేడుమిల్లి,

✓: మారేడుమిల్లిలోని ప్రధాన రహదారులపై పశువుల సంచారం అరికట్టడానికి అవసరమైన చర్యలు చేపడతాం. – శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి

మేమున్నాం.. మీకు తోడుగా
పాడేరు 89853 66570
అరకులోయ: 63034 86346
రంపచోడవరం: 94908 77172

శ్రమదానంతో రహదారి మరమ్మతులు

అనంతగిరి, న్యూస్‌టుడే: పెదకోట పంచాయతీ టొంకోట గ్రామస్థులు తమ ఊరి రహదారిని శ్రమదానంతో బాగు చేసుకున్నారు. ఈ గ్రామంలో శ్రీభైరవమూర్తి పంచపాండవుల జాతరను జనవరి 4న నిర్వహించేందుకు గ్రామస్థులు నిర్ణయించారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే ఉద్దేశంతో రహదారిని బాగు చేసుకున్నారు. ఈ ఏడాది కురిసిన వర్షాలకు రహదారి అధ్వానంగా తయారై రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. దీంతో శ్రమదానం చేసినట్లు స్థానికులు తెలిపారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి శాశ్వత రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.

శ్రమదానంతో రహదారిని బాగు చేసుకుంటున్న టొంకోట గ్రామస్థులు

గిడ్డంగుల కొరత.. అన్నదాత కలత!

జి.మాడుగుల, న్యూస్‌టుడే: ఏజెన్సీలో శీతల గిడ్డంగుల కొరత గిరిజన రైతుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. మన్యంలో చింతపల్లి మండలం రాజుపాకలు వద్ద తప్పితే ఎక్కడా శీతల గిడ్డంగులు లేవు. ఫలితంగా రైతులు పండించే పంటలు నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోయింది. ఐటీడీఏ ఆధ్వర్యంలో గతంలో జి.మాడుగుల మండలంలో నిర్మించిన శీతల గిడ్డంగి వినియోగంలోకి రాక నిరుపయోగంగా మారింది.

గిరిజన ప్రాంతంలో కాఫీ, పసుపు, అల్లం, వేరుశెనగ, ఉద్యాన పంటలైన అరటి, మామిడి, కూరగాయలు పండిస్తున్నారు. ఈ పంటలను నిల్వ చేసుకునే పరిస్థితి లేకపోయింది. పంటలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచలేక, దళారులకు తక్కువ ధరకే విక్రయించి నష్టపోతున్నారు. పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకునే వారు కరవయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అలంకారప్రాయంగా..

జి.మాడుగుల మండలం సింగర్బ పంచాయతీ రచ్చపల్లి సమీపంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన శీతల గిడ్డంగి అలంకారప్రాయంగా మారింది. అప్పట్లో దీని నిర్వహణను డ్వాక్రా సంఘాలకు అప్పగించారు. అధికారులు పట్టించుకోకపోవడం, నిర్వహణ లేమి, సదుపాయాలు కల్పించకపోవడంతో లక్ష్యం నీరుగారిపోయింది. ఈ కేంద్రంలో తుప్పలు పెరిగి జంతువులు, విషసర్పాలకు ఆవాసాలుగా మారాయి. అధికారులు చొరవ తీసుకొని దీన్ని అందుబాటులోకి తీసుకురావాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రచ్చపల్లిలో తుప్పల మధ్య శీతల గిడ్డంగి

నిధులు మంజూరుచేస్తాం..

శీతల గిడ్డంగులు నిర్మించుకునేందుకు రైతులు ముందుకు వస్తే నిధులు మంజూరు చేస్తాం. ఏజెన్సీలో చింతపల్లి మండలం రాజుపాకలు వద్ద గత ఏడాది శీతల గిడ్డంగి నిర్మించాం. పలు మండలాల్లో 17 కలెక్షన్ కేంద్రాలు ఏర్పాటుచేశాం. రైతుల అవసరాలను బట్టి ఈ కేంద్రాలను నిర్మించేందుకు సిద్ధంగా ఉన్నాం. జి.మాడుగులలో ఉన్న కేంద్రాన్ని పరిశీలించి.. వినియోగంలోకి తీసుకొచ్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తాం. – కర్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి, పాడేరు

ఆత్మీయ సమావేశంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' కలయిక.. ఆత్మీయ వేడుక

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ముంచంగిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో 2003లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థినుల ఆత్మీయ కలయిక ఆదివారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఏనుగురాయి పంచాయతీలోని పర్ధాపుట్టులో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అప్పట్లో వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సత్కరించారు. నాడు ఉపాధ్యాయులు నేర్పిన బుద్ధులు తమ అభివృద్ధికి సోపానాలయ్యాయని ఛైర్‌పర్సన్ సహా వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్నవారు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు అక్కారావు, జేఎస్ఎన్ మూర్తి, గోపి, రమణమూర్తి, డీడీబాబు, సత్యనారాయణ, రాంబాబు, నాగలక్ష్మి, లక్ష్మి, భగత్‌రామ్, నాగరాజు, ప్రసాదరావు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లున్నా.. రవాణా సౌకర్యమేదన్నా?

పెదబయలు, న్యూస్‌టుడే: మన్యంలో తారురోడ్లున్న ప్రతిచోటకు ఎర్ర బస్సు సౌకర్యం కల్పిస్తామని అధికారులు ప్రగల్బాలు పలికారు. ప్రస్తుతం అనేక గ్రామాలకు తారురోడ్ల సౌకర్యం ఉన్నా.. ఆర్టీసీ బస్సు జాడ లేకపోవడంతో ఆటోలే దిక్కవుతున్నాయి. పాడేరు డివిజన్‌లోని అనేక గ్రామాలకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన కింద తారురోడ్లు నిర్మించారు. వీటిలో కనీసం 25 శాతం గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని గలగండ పంచాయతీ సిరసపల్లి నుంచి వనభంగి పంచాయతీ వరకు, పెదకోడాపల్లి మీదుగా కిముడుపల్లి వరకు, సీకరి నుంచి కూడాసింగి మీదుగా లక్ష్మీపేట వరకు, కుజుభంగి నుంచి రూడకోట, కొరవంగి వరకు, ముంచంగిపుట్టు మండలంలోని పెదగూడ, కిలగాడ, పడాలపుట్టు, దారెల, సుజనకోట తదితర గ్రామాలకు తారురోడ్డు సౌకర్యం సమకూరింది. వీటిలో కేవలం ముంచంగిపుట్టు మండలంలోని పెదగూడకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. మిగిలిన వాటికి లేదు. ముంచంగిపుట్టు వరకు నిత్యం పాడేరు నుంచి షటిల్ బస్సులు నడుపుతున్నారు. ఈ గ్రామాలకు ఉదయం, సాయంత్రం బస్సులు నడిపితే కొంతమేర ప్రజలకు సౌకర్యం కలుగుతుంది. అధికారులు స్పందించి బస్సులు ఏర్పాటు చేయాలని ఈప్రాంత ప్రజలు కోరుతున్నారు.

సరిసపల్లి మీదుగా వనభంగి వరకు నిర్మించిన తారురోడ్డు

పొగమంచు.. మురిపించు!

మన్యంలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇక్కడి అందాలను పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. గూడెంకొత్తవీధి మండలం పెదవలస సమీపంలోని బీడింగ్ కొండలపై మంచు అందాలు ఆకట్టుకుంటున్నాయి. పచ్చని గిరుల మధ్య శ్వేత వర్ణంలో పొగ మంచు సోయగాలు చూపరులను మైమరిపిస్తున్నాయి. ఈ కొండకు వెళ్లే మార్గాన్ని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందితే తమకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
– గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

రాళ్ల మార్గంలో రాకపోకలెలా?

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాలకు శాశ్వత రహదారి సమకూరక గిరిజనులు అవస్థలు పడుతున్నారు. డుంబ్రిగుడ మండలం కొల్లాపుట్టు పంచాయతీ పరిధిలోని బిట్రగండ, ఎగువ కొల్లాపుట్టు, బొడ్డమామిడి రెండేళ్ల క్రితం బీటీరోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. కంకర వేసి అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం కంకర తేలి ప్రయాణానికి అవస్థలు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేసి.. ప్రయాణ కష్టాలు తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

రాళ్లు తేలిన ఎగువ కొల్లాపుట్టు రోడ్డు

వీరీవీరీ గుమ్మడి కాయ

గుమ్మడి పాదు సాధారణంగా పందిళ్లు, ఇళ్లు, కంచెలపై పాకుతుంది. ఏబులుకొండి సింగి ప్రభుత్వ పాఠశాలలో మంచినీటి బోరును ఆధారంగా చేసుకుంది. గతంలో బోరుపై ఆకులు గుబురుగా కప్పివేయడంతో కాయ కనిపించలేదు. ప్రస్తుతం పాదు ఎండిపోవడం ప్రారంభించడంతో ఆకులు తగ్గి.. బోరు గొట్టానికి తాజాగా నిగినిగలాడుతూ వేలాడుతున్న గుమ్మడికాయ కనిపించింది. – గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

గిరిజనులకు రగ్గుల పంపిణీ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: చినలబుడు పంచాయతీ తురాయిగుడ, కరాయిగుడ, అనంతగిరి మండలంలోని పలు గ్రామాల్లో గిరిజన కుటుంబాలకు వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, గిరిజనసంఘం నాయకులు రగ్గులు పంపిణీ చేశారు. అరకులోయ, అనంతగిరి మండలాల పరిధిలో 500 రగ్గులు అందజేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గిరిజన సంఘం నాయకులు బాలదేవ్, రామారావు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తురాయిగుడలో రగ్గులు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు, గిరిజన సంఘ నాయకులు

నేడు సర్వసభ్య సమావేశం

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీతామహలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ అనూషాదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

మారుమూల గ్రామాల్లో అభివృద్ధి పనులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ పాలనలో మారుమూల గ్రామాలకు రహదారులు, తాగునీటి సౌకర్యాలు సమకూరుతున్నాయని ఏపీటీడీసీ డైరెక్టర్ కిల్లు వెంకటరమేష్‌నాయుడు అన్నారు. బెన్నవరం పంచాయతీ సర్పంచి సన్యాసమ్మతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆదివారం ప్రారంభించారు. బెన్నవరంలో తాగునీటి ట్యాంకు, కొత్తఊరు నుంచి బోనకాలమామిడి వరకు తారురోడ్డు, తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. తారురోడ్డు నిర్మాణంలో నాణ్యత లేదని గ్రామస్థులు ఫిర్యాదు చేశారని, పనుల్లో నాణ్యత లోపిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. బెన్నవరం వంతెన నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామని, దీనికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. అనంతరం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తెదేపా నాయకులు పూజారి నారాయణమూర్తి, సులభం కర్రి నాయుడు, మత్స్యరాజు, రమేష్, వరాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బెన్నవరంలో తాగునీటి ట్యాంకును ప్రారంభిస్తున్న రమేష్‌నాయుడు తదితరులు

రామాలయానికి విద్యుదీపాలంకరణ

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: విద్యుద్దీపాల వెలుగులో శ్రీరామగిరి రామాలయం మెరిసిపోయింది. ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా ఆలయానికి, గోపురానికి, మెట్ల ముఖ ద్వారానికి విద్యుద్దీపాలు అలంకరించారు. పుణ్యక్షేత్రమైన ఈ రామాలయంలో రెండు రోజులు ముక్కోటి ఉత్సవాలు జరపడం ఆనవాయితీ.

ఆరుగురు జూదరుల అరెస్టు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: లబ్బర్తిలో కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. వారి నుంచి రూ.4100 నగదు, రెండు కోడి పుంజులు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

మంచు అందాల్లో మునిగి తేలుతూ!

వంజంగి మేఘాల కొండపై సందర్శకుల సందడి

పాడేరు, న్యూస్‌టుడే: మన్యంలోని పర్యాటక ప్రాంతాలకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. వంజంగి మంచు కొండల అందాలు పర్యాటకులను పరవశింపజేశాయి. ఇక్కడ ఎకో టూరిజం చెక్ గేటు ద్వారా సుమారు రూ.1.60 లక్షల ఆదాయం వచ్చిందని నిర్వాహకులు తెలిపారు.

★ హుకుంపేట మండలం తడిగిరి అటవీ ప్రాంతంలోని సీతమ్మ పర్వతం (జెండా కొండ)పై హైదరాబాద్‌కు చెందిన 13 మంది యువకులు ట్రెక్కింగ్ చేశారు. ఈ ప్రాంతం ట్రెక్కింగ్‌కు అనుకూలమని, దీన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

మన్యం... సందర్శక శోభితం


పొల్లూరు జలపాతంలో..

మోతుగూడెం, న్యూస్‌టుడే: మన్యంలో క్రిస్మస్ సందడి నెలకొంది. వారంతపు రోజు ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో మోతుగూడెం తరలివచ్చారు. సీలేరు నదిపొడవునా, ఫోర్‌బే, ఏవీపీ (పికప్), డొంకరాయి జలాశయాల వద్ద సందర్శకులు సందడి చేశారు. పొల్లూరు జలపాతం, సీలేరు నదిలో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. సామూహిక భోజనాలు చేసి ఆటపాటలతో ఆనందంగా గడిపారు.

చెరువులవెనంలో కోలాహలం

చింతపల్లి, న్యూస్‌టుడే: మన్యాన్ని చలిపులి ఒకవైపు వణికిస్తున్నా పర్యాటకుల రద్దీమాత్రం తగ్గడం లేదు. దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు పర్యాటక ప్రాంతాలకు తరలివస్తున్నారు. చింతపల్లి మండలం లంబసింగి, చెరువులవెనం, తాజంగి, బోడకొండమ్మ ఆలయం, ఎర్రవరం జలపాతాల వద్దకు ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు చేరుకున్నారు

చెరువులవెనం వ్యూపాయింట్‌పై రద్దీ

పాపికొండల విహారయాత్రకు 24 పర్యాటక బోట్లు

దేవీపట్నం, న్యూస్‌టుడే: పాపికొండల విహారయాత్రకు పర్యాటకుల రద్దీ కొనసాగుతోంది. దేవీపట్నం మండలం గండిపోశమ్మ ఆలయం నుంచి 10, వీఆర్‌పురం మండలం పోచవరం రేవు నుంచి 14... మొత్తం 24 పర్యాటక బోట్లలో 1557 మంది పర్యాటకులు ఆదివారం పాపికొండలు అందాలను తిలకించడానికి వెళ్లారని కంట్రోల్ రూం అధికారులు తెలిపారు. పర్యాటకుల రద్దీతో గండిపోశమ్మ ఆలయం వద్ద సందడి నెలకొంది. ఆలయం వరద ముంపులో ఉండటంతో వచ్చిన భక్తులు కొండపై నుంచే అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద వరద నీరు క్రమంగా తగ్గుతోంది. పర్యాటకుల రద్దీ నేపథ్యంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించి పాపికొండల విహారయాత్రకు పచ్చ జెండా ఊపారు.

పోశమ్మగండి నుంచి విహారయాత్రకు వెళ్తున్న బోట్లు

చాపరాయి జలవిహారిలో..

చాపరాయిలో సందడి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: చాపరాయి జలవిహారిలో పర్యాటకులు సందడి చేశారు. అంజోడ సిల్క్‌ఫాం పీనరీ కిటకిటలాడింది.

జి.మాడుగుల, న్యూస్‌టుడే: కొత్తపల్లి జలపాతంలో సందర్శకులు బారులు తీరారు. ఇక్కడి అందాలు ఆస్వాదించి ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ సందడి చేశారు.

పీఆర్సీ అమల్లో తాత్సారం తగదు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పీఆర్సీ అమలు, ఐఆర్ (మధ్యంతర భృతి) ప్రకటించడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు పేర్కొన్నారు. పాడేరులో ఆదివారం సంఘ జిల్లా అధ్యక్షులు రావుల జగన్‌మోహన్‌రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వెంకటపతిరాజు మాట్లాడుతూ.. పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుర్జయ్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్, ఆర్.నాగేశ్వరరావు, చిన్నారావు, శశికుమార్, సన్యాసిరావు, రామారావు, శాంతకుమారి, సత్యనారాయణ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి వెంకటపతిరాజు

ప్రభుత్వ స్థలంలో పార్కింగ్!

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయలో ప్రైవేట్ వ్యక్తులు చక్కగా వ్యాపారం చేసుకుంటూ పార్కింగ్‌కు మాత్రం ప్రభుత్వ స్థలాలను వినియోగించుకుంటున్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రైవేట్ వ్యక్తులు కాఫీహౌస్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసేందుకు వచ్చే వాహనదారుల కోసం నిర్వాహకులు పార్కింగ్‌ను ఏర్పాటు చేయలేదు. స్టేట్‌బ్యాంక్‌కి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని ఏకంగా పార్కింగ్ స్థలంగా మార్చేశారు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్థలానికి సంబంధించి రుసుం వసూలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలంలో నిలిపిన వాహనాలు

పాడేరు ఘాటీలో కలప లారీ బోల్తా

పాడేరు, న్యూస్‌టుడే: మన్యం నుంచి మైదాన ప్రాంతానికి నీలగిరి కలపతో వెళ్తున్న లారీ పాడేరు ఘాట్‌రోడ్డులో అదుపు తప్పి బోల్తాపడింది. ఆదివారం మధ్యాహ్నం గరికిబంద సమీపంలో ఇప్పమాను మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. అధిక లోడు కారణంగానే మలుపుల వద్ద ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారిపై లారీ బోల్తా పడడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు స్తంభించాయి.

గరికిబంద సమీప మలుపులో బోల్తాపడిన కలప లారీ

మూడు గంటలు.. ముప్పుతిప్పలు

సీలేరు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నుంచి సీలేరు జీసీసీ పెట్రోల్ బంక్‌కు డీజిల్‌ను తీసుకెళ్తున్న ట్యాంకర్ ఆదివారం స్థానిక జలవిద్యుత్కేంద్రం సమీపంలో ప్రధాన రహదారిపై సాంకేతిక మరమ్మతులతో నిలిచిపోయింది. దీంతో మూడు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. ట్యాంకర్‌ను పక్కకు జరిపే మార్గం లేక.. తాత్కాలిక రహదారిని తయారు చేశారు. ఎట్టకేలకు వాహనాలు ముందుకు కదిలాయి.

సీలేరు జలవిద్యుత్కేంద్రం సమీపంలో నిలిచిన వాహనాలు

వైద్య శిబిరంలో 160 మందికి సేవలు

రంపచోడవరం, న్యూస్‌టుడే: సిరిగిందలపాడులో ఆదివారం రామకృష్ణమిషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 160 మందికి వైద్యసేవలు అందించినట్లు ట్రస్టు కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనంద మహరాజ్ తెలిపారు. శిబిరంలో వైద్యులు తలారి వెంకట సుబ్బారావు, దాసరి ఉమామహేష్, శ్రీనివాస్ రాయుడు రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలను ఏజెన్సీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్యాంపు ఇన్‌ఛార్జి స్వామి లోకమయనంద చెప్పారు. రామకృష్ణ మిషన్ సమన్వయకర్త కానుమోను శ్రీనివాస్, వలంటీర్ పెద అప్పారావు పాల్గొన్నారు.

మహిళతో మాట్లాడుతున్న వైద్యుడు

జర్రెలలో పంచాయతీ విభజనకు ఆమోదిస్తూ చేతులు ఎత్తిన గిరిజనులు

జె.రాళ్లగెడ్డ పంచాయతీ ఏర్పాటుకు తీర్మానం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: జె.రాళ్లగెడ్డ కేంద్రంగా నూతన పంచాయతీ ఏర్పాటుకు గిరిజనులు తీర్మానం చేశారు. జర్రెలలో సర్పంచి నాగరాజు, కార్యదర్శి శ్రీదేవి ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ సభ నిర్వహించారు. ఈ పంచాయతీ పరిధిలో ప్రస్తుతం 26 గ్రామాలుండగా.. 13 గ్రామాలను విభజించి జె.రాళ్లగెడ్డ కేంద్రంగా పంచాయతీ ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు పొత్తూరు విష్ణుమూర్తి, చిక్కుడు అశోక్, రీమల బుజ్జిబాబు, సంతోష్ పాల్గొన్నారు.

రెండు చుక్కలు.. జీవితానికి రక్షణ

ముంచంగిపుట్టులో పోలియో చుక్కలు వేస్తున్న సుభద్ర

రంపచోడవరంలో చుక్కలు వేస్తున్న పీవో స్మరణ్‌రాజ్

రెండు పోలియో చుక్కలతో జీవితానికి రక్షణ ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం జరిగింది. అరకులోయలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మత్స్యలింగం పాల్గొన్నారు. ముంచంగిపుట్టులో చిన్నారులకు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర పోలియో చుక్కలు వేశారు.

★ రంపచోడవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో శిబిరాన్ని పీవో స్మరణ్ రాజ్ ప్రారంభించారు. ఏజెన్సీప్రాంతంలో పోలియో నివారించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ నెల 22, 23 తేదీల్లోనూ ఇంటింటికి వెళ్లి చుక్కల మందు వేస్తారని తెలిపారు. చింతూరులో ఏఎస్పీ హేమంత్ ఎర్రంపేట ఎంపీపీ పాఠశాలలో, జిల్లా ఉప వైద్యాధికారి పుల్లయ్య చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఎటపాక మండలం నెల్లిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ పుల్లయ్య ప్రారంభించారు.

★ రాజవొమ్మంగి పీహెచ్‌సీ పరిధిలో 1338 మందికి, లాగరాయి పీహెచ్‌సీ పరిధిలో 647 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు సుష్మ, శరత్ చంద్ర, సతీష్ తెలిపారు.
– న్యూస్‌టుడే, బృందం

చింతూరులో ఏఎస్పీ హేమంత్..

గూడెంకొత్తవీధి మండలం ధారకొండలో..

ధర చూస్తే గుడ్లు తేలేయాల్సిందే!

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే, మార్కెట్‌లో కోడి గుడ్ల ధరలు రికార్డు స్థాయిలో పెరిగిపోయాయి. గత నెలలో ఒక్కో గుడ్డు ధర రూ.6.35 ఉండగా.. ఈ నెలలో రూ.7కు పెరిగింది. గత రెండు వారాల నుంచి గుడ్డు రూ.7.30 పలుకుతోంది. చికెన్, మటన్ ధరలు సైతం ఆకాశాన్నంటాయి. మైదాన ప్రాంతాలైన ఎలమంచిలి, పాయకరావుపేట నుంచి మన్యానికి కోడిగుడ్లు ఎగుమతి అవుతుంటాయి. పెరిగిన ధరలతో రెండు వారాలుగా కోడిగుడ్ల సరఫరా నిలిచిపోయాయని స్థానిక వ్యాపారులు చెబుతున్నారు.

డుంబ్రిగుడ ఎస్సైగా సురేష్



డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: డుంబ్రిగుడ ఎస్సైగా ఎల్.సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు ఎస్సైగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

పరిపాలన అధికారిగా విశ్వనాథ్

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: డుంబ్రిగుడ మండల పరిషత్తు పరిపాలన అధికారిగా చింతర్ల విశ్వనాథ్ ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఆయన పదోన్నతిపై ఏఓగా నియమితులయ్యారు. మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కృషి చేస్తానని పేర్కొన్నారు.

(c) eenadu

ఈనాడు అమరావతి గుంటూరు

సోమవారం డిసెంబరు 22, 2025

పారిశ్రామిక పార్కుకు 71.57 ఎకరాలు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: మంగళగిరి మండలంలోని చినకాకానిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు 71.57 ఎకరాల వక్ఫ్ భూమిని కేటాయిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఇటీవల నోటిఫికేషన్ జారీ చేశారు. చినకాకానిలోని వక్ఫ్‌బోర్డుకు చెందిన 14 సర్వే నంబర్ల పరిధిలోని 71.57 ఎకరాల స్థలాన్ని ఏపీఐఐసీకి కేటాయించినట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

స్పందించారు.. రూపుమార్చారు

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని గ్రామం వడ్డమానుకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ చొరవతో వారం రోజుల వ్యవధిలోనే బీటీ రోడ్డు పూర్తయ్యింది. రాజధాని అమరావతి రైల్వే లైన్, రైల్వే స్టేషన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుల కోసం 7 గ్రామాల్లో 16,666 ఎకరాల భూమిని ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకోవడానికి నిర్ణయించింది. ఈ నెల 10న గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ రైతులతో సమావేశం అయ్యారు. భూ సమీకరణపై స్థానికుల అభిప్రాయాలు సేకరించారు. ఇదే సమయంలో రాజధాని ఎన్-17 రోడ్డు నుంచి తమ గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలు ఏర్పడి పాడైపోవడంతో కొత్త రోడ్డు నిర్మించాలని స్థానికులు ఆయన్ను కోరారు. స్పందించిన ఆయన తగు చర్యలు తీసుకోవాలని సీఆర్డీఏ అధికారులను ఆదేశించారు. స్వయంగా ఇంజినీర్లను వెంట తీసుకొని వెళ్లి రోడ్డు పరిస్థితి చూపించారు. ఈ నెల 14న పనులు ప్రారంభించిన అధికారులు ఆదివారం ఉదయానికి బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. 1148 మీటర్ల పొడవు, 4.5 మీటర్ల వెడల్పుతో నాలుగు లేయర్లుగా రూ. 98.7 లక్షలు నిధులతో దీన్ని నిర్మించారు. స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలిసి మంత్రి నారాయణ సోమవారం ఉదయం ప్రారంభించనున్నారు. రాజధాని గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని గ్రామస్థులు చెబుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించిన తర్వాత ఇలా..

పర్యవేక్షణ లోపం.. రోగులకు శాపం..!

ఆక్సిజన్ పైపులైను వాల్వ్‌ల వద్ద తుప్పు పట్టి ఇలా..

జీజీహెచ్‌లో ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ తీరిది

ఈనాడు, అమరావతి

పర్యవేక్షణ లోపం రోగులకు శాపంగా మారుతోంది.. గుంటూరు జీజీహెచ్‌లోని ఆక్సిజన్ సరఫరా వ్యవస్థలో నిపుణుల కొరత, నిర్వహణలో ఇబ్బందులు ప్రమాద హెచ్చరికలు సూచిస్తున్నాయి. జీజీహెచ్‌కు నిత్యం 5 వేల మందికి పైగా చికిత్స కోసం వస్తుంటారు. ఇందులో 1500 నుంచి 2 వేల మంది ఇన్‌పేషెంట్లుగా నమోదవుతుంటారు. సుమారు 200 వెంటిలేటర్ పడకలు ఇక్కడ ఉండగా.. మొత్తం 1200 పడకలకు ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ అనుసంధానమై ఉంది. మొత్తం 50 కిలోలీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి, నిల్వ సామర్థ్యం కలిగిన ప్లాంటు జీఎంసీలో ఉండగా.. 1800 అవుట్‌లెట్లను కలిగి ఉంది. ఇవి కాకుండా, మూడు పీఎస్ఏ(ప్రెజర్ స్వింగ్ అబ్జార్షన్) ప్లాంట్లు, ఆక్సిజన్ సిలిండర్లతో కూడిన వ్యవస్థలు ఉన్నాయి. ఇందులో లిక్విడ్ ఆక్సిజన్ సరఫరాను కీలకంగా చెప్పవచ్చు.

బకాయిలు సైతం.. కీలకమైన లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా వ్యవస్థలో ప్రధానంగా వాల్వ్‌ల వద్ద తుప్పు పట్టి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండడం, ఫ్లో మీటర్లపై సరైన నిపుణుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎంత మొత్తంలో సరఫరా అవుతోందో అర్థం కాని పరిస్థితి. ప్రతి మూడు నెలలకు రూ.6 లక్షల వరకు నిర్వహణ కోసం వెచ్చిస్తుండగా.. ప్రస్తుతం రూ.15 లక్షలు బకాయిలు ఉన్నట్లు చెబుతున్నారు.

ఎలా పడితే అలా.. వాస్తవానికి, ఫ్లో మీటర్లు, వాల్వ్‌ల పర్యవేక్షణకు మానిఫోల్డ్ టెక్నీషియన్లు తప్పక ఉండాలి. అయితే, జీజీహెచ్‌లో ఆ పోస్టులే మంజూరు చేయలేదు. ప్రస్తుతం ఆక్సిజన్ పైపులైన్లను బయో మెడికల్ విభాగం సిబ్బందే చూస్తుండడంతో ఏం జరుగుతోందో పూర్తిస్థాయిలో తెలియడం లేదు. ప్రస్తుతానికి పైపులైన్ల పరంగా ఇబ్బంది లేదని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. అయితే, సిబ్బంది పరంగా మాత్రం కొరత ఉంది. కనీసం 10 నుంచి 15 మంది మానిఫోల్డ్ టెక్నీషియన్లు ఉంటే తప్ప ఇక్కడ సమస్యకు పరిష్కారం దొరకని పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టులో ఉన్న గుత్త సంస్థ ఓ ముగ్గురిని ప్రస్తుతం వినియోగించి నెట్టుకొస్తోంది.

తనిఖీలు చేయట్లేదే.. నిరంతర ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ ఉన్నప్పుడు దాన్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం విధి. ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా.. ప్రెజర్ పక్కాగా కొనసాగుతోందా.. వాల్వ్‌లు బ్లాక్ అయ్యాయా.. ఇలా అన్ని కోణాల్లోనూ పరిశీలించాల్సి ఉంటుంది. కానీ ఆ పరిస్థితి కరవైంది. అలాగే, స్పేర్ పార్ట్స్ కొనుగోళ్లు మరో ఇబ్బందిగా మారాయి. ఎస్ఎస్ వాల్వులు, ఎల్ టైప్ అడాప్టర్లు, ఆక్సిజన్ కీ ప్లగ్స్.. ఇలా ఎప్పటికప్పుడు మార్చాల్సి ఉంది. ప్రత్యేకంగా సిబ్బంది లేక ఏవి ఎప్పుడు మార్చుతారో అర్థం కాని పరిస్థితి. రోగుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు ఈ విభాగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తే బాగుంటుంది..!!

జనవరిలో యువతకు ఉచిత శిక్షణ

సీతారాంపురం, న్యూస్‌టుడే : అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎలీప్), సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ (సీఈడీ) అనుబంధ సంస్థ ద్వారా జనవరి మొదటి వారంలో వ్యవసాయ అనుబంధ వ్యాపార రంగాలపై యువతకు ఉచిత శిక్షణ ఇస్తామని ఎలీప్ అధ్యక్షురాలు కె.రమాదేవి తెలిపారు. 45 రోజులపాటు ఈ శిక్షణ ఉంటుంది. అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, పశువైద్య విజ్ఞానం, చేపల పెంపకం, బయో టెక్నాలజీ, అగ్రి ఇంజినీరింగ్, ఫారెస్ట్రీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బీజెడ్‌సీ, హోమ్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌పై పీజీ, డిగ్రీ చదివిన పట్టభద్రులు అర్హులని పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. జాతీయ వ్యవసాయ విస్తరణ కేంద్రం జారీ చేసిన ధ్రువపత్రాన్ని అందజేస్తామన్నారు. బ్యాంకుల ద్వారా రాయితీతో కూడిన రుణ సదుపాయాన్ని పొందవచ్చని వివరించారు. ఆసక్తిగల వారు ఈ నెల 23 నుంచి 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94412 66769 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

విధేయతకు పట్టం..!

గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా మాణిక్యరావు

ప్రధాన కార్యదర్శిగా పోతినేని శ్రీనివాసరావు

ఈనాడు, అమరావతి

పిల్లి మాణిక్యరావు

పోతినేని శ్రీనివాసరావు

విధేయతకు పట్టం కట్టారు.. అనుభవం, అంకితభావానికి పెద్దపీట వేశారు.. రాజకీయ వైరాగ్యం కలిగిన గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా పిల్లి మాణిక్యరావును, ప్రధాన కార్యదర్శిగా పోతినేని శ్రీనివాసరావును ఆ పార్టీ అధినేత చంద్రబాబు నియమించారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ రాజధాని ప్రాంత ప్రజాప్రతినిధిగా కీలక బాధ్యతలు చూస్తున్నారు. దీంతో ఇక్కడ ప్రత్యామ్నాయం సామాజిక సమీకరణాల్లో భాగంగా పిల్లి మాణిక్యరావును నియమించినట్లు ఆ పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పదవి కోసం తీవ్ర పోటీ ఉన్నా అనేక పేర్లు పరిశీలనకు వచ్చాయి. కొందరు మహిళలు సైతం ఆశించారు. పార్టీ అధినాయకత్వం ఉన్న ప్రదేశం కావడంతో అనేక మంది నాయకులు ఆసక్తి చూపారు. సామాజిక సమీకరణాలు, కూటమి నేతల సమన్వయం.. ఇలా అనేక అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ నియామకం చేసినట్లు తెదేపా నేతలు చెబుతున్నారు. పిల్లి మాణిక్యరావు చీరాల ప్రాంతానికి చెందిన వ్యక్తి కాగా, గుంటూరులో స్థిరపడ్డారు. గతంలో ఎమ్మెల్సీగా పనిచేశారు. ప్రస్తుతం తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్నారు. గత వైకాపా పాలనలో అరాచకాలు, అవినీతి, అక్రమాలను ఎండగట్టడంతో పాటు.. అప్పటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన అనేక ఆందోళనల్లో ఆయన పాల్గొన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక లిడ్‌క్యాప్ ఛైర్మన్‌గా నియమించారు. తాజా సమీకరణాల్లో పార్టీ పదవి వరించింది. గుంటూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఆరు తెదేపా, ఒకటి జనసేన ప్రాతినిధ్యం వహిస్తుండడంతో ఇక్కడ 'సమన్వయం' కీలకంగా మారింది.

సమర్థంగా బాధ్యతలు నిర్వహిస్తూ..

ఇక, తెదేపా ప్రధాన కార్యదర్శిగా పోతినేని శ్రీనివాసరావును పార్టీ అధిష్ఠానం కొనసాగించింది. ఈయన గతంలో మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పనిచేశారు. తొలి నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేశ్ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా, సమర్థంగా నిర్వహించారు. అనంతరం లోకేశ్ నియోజకవర్గ తెదేపా ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించారు. ఇప్పుడు మళ్లీ అదే స్థానాన్ని కొనసాగించారు. గుంటూరులో వివిధ వర్గాలను సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకెళ్లించే బాధ్యతను ఆయనకు అప్పగించారు.

మహంకాళి ఆలయానికి మహర్దశ

మంత్రి లోకేశ్ చొరవతో రూ.6 కోట్ల నిధులు

కంఠంరాజుకొండూరు మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధికి మహర్దశ వచ్చింది. మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో ఈ నిధులు సమకూరనున్నాయి. మంత్రి చొరవతో ప్రత్యేక నిధులు రూ. 6 కోట్లు, ఆలయ నిధులు రూ. 2 కోట్లు వెరసి రూ. 8 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. రెండు నెలల్లో పనులు మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో అనుకున్న ముఖమండపంతో పాటు ఆలయం చుట్టూ ఇప్పుడున్న పాత ప్రహరీ తొలగించి రాతితో నిర్మించనున్నారు. పడమర వైపు గాలిగోపురం వచ్చే అవకాశం ఉంది. వీటితోపాటు ఇతర మార్పులు చేయనున్నట్లు సమాచారం. **- కంఠంరాజుకొండూరు(దుగ్గిరాల), న్యూస్‌టుడే**

ఆపదను తరిమేలా.. ఆదర్శంగా నిలిచేలా..

కర్రసాములో బాలికలకు ఉచిత శిక్షణ

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే

శిక్షకుడు సాంబయ్య పర్యవేక్షణలో కర్రసాము నేర్చుకుంటున్న విద్యార్థినులు

బాలికల సంరక్షణ విద్యాశాఖ మంత్రి లోకేశ్ ప్రోత్సాహం ఇస్తున్నారు. సంప్రదాయ యుద్ధకళ అయిన కర్రసామును ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులకు ఉచితంగా నేర్పిస్తున్నారు. పూర్వ కాలంలో దొంగల బారి నుంచి గ్రామాలను రక్షించేందుకు ఈ యుద్ధ విద్యను ఆయుధంగా సృష్టించారు. ఆయన ఆదేశాల మేరకు అనంత ఆనంద ట్రస్ట్ సహకారంతో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థినులకు వారానికి ఒక రోజు చొప్పున ఈ క్రీడను నేర్పిస్తున్నట్లు ఎంఈవో బాబు తెలిపారు. నియోజకవర్గంలో మంగళగిరి, నిడమర్రు, చినకాకాని, రేవేంద్రపాడు, నూతక్కి గ్రామాలలోని స్కూళ్లలో శిక్షకుడు సాంబయ్య పర్యవేక్షణలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. కర్రసాము నేర్చుకోవడం వల్ల శారీరక ఆరోగ్యంతోపాటు ఆత్మవిశ్వాసం పెరుగుతుందని శిక్షకుడు చెబుతున్నారు.

ఆసక్తి కలిగింది.. 'కర్రసాము నేర్చుకోవాలన్న ఆసక్తి పెరిగింది. మంత్రి లోకేశ్ ఆదేశాలతో విద్యార్థినులకు ఉచితంగా నేర్పించడం బాగుంది. రాష్ట్రస్థాయిలో ఈ క్రీడలో సత్తా చాటాలని ఉంది' అని నూతక్కి పీఎం శ్రీ జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్.ప్రసన్న ఉత్సాహంగా చెబుతోంది.

ధైర్యంగా ఉంది.. 'నాకు కర్రసాము నేర్చుకోవడం చాలా ఇష్టం. విపత్కర పరిస్థితి తలెత్తినా నన్ను నేను కాపాడుకోగలనన్న ధైర్యం వచ్చింది' అని చినకాకాని జడ్పీ పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని **సమంత** చెబుతోంది.

కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ నేడు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలను పీజీఆర్ఎస్‌లో అందించవచ్చని తెలిపారు. మీకోసం వెబ్‌సైట్‌లోనూ సమస్యలు నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నమోదు చేసుకున్న అర్జీల స్థితిని 1100 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. జిల్లా కేంద్రంతో పాటుగా డివిజన్, మండలం, పట్టణాల్లోనూ ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

22, 23 తేదీల్లో అగ్రిటెక్ హ్యాకథాన్

గుంటూరు రూరల్: ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 22, 23 తేదీల్లో నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్ -2025 నిర్వహించనున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోపాలకృష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ ఆధారిత సంస్థల సహకారంతో జరగనున్న హ్యాకథాన్‌లో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. డిసెంబర్ 23న కిసాన్ దివస్ సందర్భంగా విజేతలకు రూ.లక్ష బహుమతి, సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

వాయు నాణ్యత.. ఏమా కథ..!

ఉమ్మడి జిల్లాలో 9 కొత్త కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు

పారిశ్రామిక, వాహనాల కాలుష్య అధ్యయనానికి సన్నాహం

ఈనాడు, అమరావతి

వాయు కాలుష్యాన్ని అధ్యయనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 9 కొత్త కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ఆరంభించారు. తద్వారా పారిశ్రామిక, వాహనాల ద్వారా వెలువడుతున్న కాలుష్య స్థాయిలను అంచనా వేయడంతోపాటు.. పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టనున్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) రాష్ట్రంలో 62 గాలి నాణ్యత పరీక్ష కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా అన్ని పుర, నగరపాలికల్లో ఇవి తప్పక ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నారు. ఇందులో అమరావతి, గుంటూరు, పల్నాడు, బాపట్ల రీజియన్‌లో 9 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా పారిశ్రామిక, ట్రాఫిక్ వల్ల ఏర్పడుతోన్న కాలుష్యాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం, ప్రజారోగ్యాన్ని కాపాడడానికి ఉన్న మార్గాలపై దృష్టి పెట్టనున్నారు.

గుంటూరులో ఇప్పటికే నాలుగు.. గుంటూరు నగరంలో పదేళ్ల క్రితమే నాలుగు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. దేశవ్యాప్తంగా కాలుష్య కోరల్లో చిక్కిన నగరాలపై అధ్యయనం చేసిన కేంద్రప్రభుత్వం, ఆ జాబితాలో గుంటూరు కూడా ఉన్నట్లు తేల్చింది. ఇక్కడ వాయు నాణ్యతను పెంచడానికి అప్పట్లోనే కసరత్తు ప్రారంభించి, ఈ కేంద్రాల ఏర్పాటుకు పూనుకుంది. అలాగే, ఏటా రూ.కోట్లు మంజూరు చేస్తోంది. ఆ నిధులతో జీఎంసీ పరిధిలో పలు కార్యక్రమాలు చేపట్టారు. వాహనాల కాలుష్యాన్ని తగ్గించేందుకు చెత్త తరలింపునకు 200 ఈ-ఆటోలు సమకూర్చారు. సీసీరోడ్ల నిర్మాణం, మొక్కల పెంపు.. ఇలా అనేకం ఈ జాబితాలో ఉన్నాయి. నాలుగు కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు గాలి కాలుష్యాన్ని అధ్యయనం చేస్తుండగా.. ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో తాజాగా ఉమ్మడి జిల్లాలో మరికొన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

హాయ్ పిల్లలూ.. ప్రధానితో మాట్లాడతారా..!

- పరీక్షా పే చర్చలో పాల్గొనేందుకు విద్యార్థులకు చక్కని అవకాశం
- ఆన్‌లైన్‌లో నమోదుకు జనవరి 11 తుది గడువు

ఈనాడు, అమరావతి

హాయ్ పిల్లలు.. మీరు మన ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో నేరుగా మాట్లాడాలనుకుంటున్నారా.. ఆయనకు ప్రశ్నలు సంధించాలనుకుంటున్నారా.. మీ అనుమానాలను నివృత్తి చేసుకోవాలనుకుంటున్నారా.. అయితే, మీకో సదవకాశం.. పరీక్షా పే చర్చ-2026 ద్వారా మీరు అనుకున్నవి సాధించవచ్చు. ఇందుకు మీరు చేయాల్సిందల్లా.. ప్రధానమంత్రి పరీక్షా పే చర్చ యాప్ లేదా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ నమోదు చేసుకోవడమే. ఏటా పరీక్షల ముందు కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇప్పుడు 9వ ఎడిషన్‌లో దీన్ని చేపట్టగా.. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధాని మోదీ నేరుగా సంభాషించనున్నారు. పరీక్షలను సమర్థంగా, ఒత్తిడి లేకుండా ఎదుర్కోవడం, పరీక్ష అంటే విద్యార్థుల్లో నెలకొన్న భయాన్ని పోగొట్టడం దీని ముఖ్య ఉద్దేశం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 1,57,439 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో నమోదయ్యారు. ఈ అవకాశం 2026 జనవరి 11వ తేదీ వరకు ఉంది. త్వరితగతిన వివరాలు నమోదు చేసుకోవాలని విద్యాశాఖ వర్గాలు సూచిస్తున్నాయి. ఇందులో పాల్గొనేందుకు 6 నుంచి 12 తరగతుల విద్యార్థులు అర్హులు.

ఇదీ లెక్క..

ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా ఈ శనివారం రాత్రి 10 గంటల సమయానికి 1,57,439 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. ఇందులో జిల్లాల వారీగా వివరాలు చూస్తే.. గుంటూరు జిల్లా 3వ స్థానం, పల్నాడు జిల్లా 8, బాపట్ల జిల్లా 18వ స్థానంలో ఉంది.

ఇలా లాగిన్ కావొచ్చు..

విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు "హెచ్‌టీటీపీఎస్://ఇన్నోవేట్ ఇండియా1.ఎంవైజీవోవీ.ఇన్ అని క్లిక్ చేయాలి. ఎంటర్ కాగానే క్లిక్ ఏజ్ స్టూడెంట్, టీచర్, పేరెంట్స్ అనే లాగిన్స్ దిగువన కనిపిస్తాయి. వాటిలోకి ఎంటర్ కాగానే మీ మొబైల్ నంబర్, జీమెయిల్ ఖాతా వివరాలను పూర్తి చేయాలి. ఓటీపీతో లాగిన్ అయి క్లిక్ చేయాలి. విద్యార్థులు నేరుగా ఫోన్ నంబర్, జీమెయిల్‌తో చేయొచ్చు. ఒకవేళ అవి లేకుంటే ఉపాధ్యాయుల లాగిన్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రాథమిక సమాచారం వివరాలను పూర్తి చేసి.. థీమ్‌ను ఎంచుకుని 500 అక్షరాల్లోపు వివరించాలి. పరీక్షా పే చర్చకు ఎంపికైన సుమారు 2 వేల మందికి విద్యా మంత్రిత్వశాఖ పీపీసీ కిట్లను బహుమతిగా అందజేయనున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

సద్వినియోగం చేసుకోండి.. పరీక్షా పే చర్చ కార్యక్రమంలో పాల్గొనే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. అన్ని మండలాల ఎంఈఓలు స్పందించి విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఎక్కువ మంది నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలి. **- సలీం బాషా, డీఈవో, గుంటూరు**

200 యూనిట్ల ఉచిత విద్యుత్తుకు దరఖాస్తు చేయండిలా...

మీకోసం

బార్బర్ దుకాణాలు నిర్వహించే నాయీ బ్రాహ్మణులు నెలకు 200 యూనిట్ల వరకు విద్యుత్తు వినియోగిస్తే ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఇది గత నెల నుంచే అమల్లోకి వచ్చింది. దీనికి ఎలా దరఖాస్తు చేయాలి? ఎవరికివ్వాలో తెలియక దళారులను ఆశ్రయించి చాలామంది డబ్బులు పోగొట్టుకుంటున్నారు. అనుసరించాల్సిన విధానాలేమిటో తెలుసుకుందాం..

● లబ్ధిదారులు తొలుత విద్యుత్తుశాఖ ఏఈకి దరఖాస్తు చేసుకుంటున్నట్టు రిక్వెస్ట్ లెటర్ తయారు చేసుకోవాలి. ● దానికి లేబర్ లైసెన్సు, దుకాణం ఎదుట లబ్ధిదారు నిలుచున్న ఫొటో, విద్యుత్తు బిల్లు నకలు, తహసీల్దారు కార్యాలయం నుంచి పొందిన కుల ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, అద్దె ఖరారునామా జత చేయాలి. ● అద్దె ఖరారునామా లేనివారు అఫిడవిట్ జత పరచాలి. ● దరఖాస్తు పూర్తి సెట్‌ను తమ ప్రాంత విద్యుత్తుశాఖ ఏఈకి అందజేయాలి. ● అక్కడి నుంచి అడ్మినిస్ట్రేటివ్ అధికారులకు వెళ్తుంది. ● ఆమోదం అనంతరం పథకం వర్తిస్తుంది. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

ఆంధ్రప్రదేశ్ రైతులకు శుభవార్త

రైతు సోదరులారా కేంద్ర వ్యవసాయ శాఖ వారి e-ANNADATA లో సభ్యత్వం తీసుకోండి.

ఏజంట్లు కావలెను

e-అన్నదాత కార్డులు రైతులకు పంపిణీ చేయుటకు ఏజంట్లు కావలెను మరియు మీ మండలాల్లో త్వరలో ప్రారంభించే e- అన్నదాత క్యాంటీన్లు (ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు) కావలసినవారు సంప్రదించండి.

ఇట్లు: కన్నా రవి దేవరాజు (BJP)
e-అన్నదాత A.P కో ఆర్డినేటర్, ✆ 96184 25367

చుక్కలకొండ బురుజు వద్ద ట్రెక్కర్స్

చుక్కలకొండ ఎక్కేద్దాం ఎంచక్కా

యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గుంటూరు శాఖ సభ్యులు, రూట్ ఫిట్ జిమ్ సభ్యులు ఆదివారం కొండవీడులోని చుక్కలకొండ బురుజును అధిరోహించారు. ఉదయం 6 గంటలకు గుంటూరు నుంచి బయలుదేరి చుక్కల కొండ సమీపంలోని 1000 మెట్లు ఎక్కి అక్కడి నుంచి తాడు సాయంతో కొండను ఎక్కారు. ట్రెక్‌కు 75 మంది వచ్చారు. అక్కడ ఆటపాటలతో గడిపి, ట్రెక్ అనుభవాలను పంచుకున్నారు. కొల్లూరు సుధాకర్ లీడర్‌గా, మల్లికార్జునరావు ట్రెక్ సమన్వయకర్తగా వ్యవహరించారు. **– నవభారత్‌నగర్, న్యూస్‌టుడే**

వ్యర్థాలను అర్థవంతంగా మార్చి..

చౌడవరంలోని వెంకటేశ్వర బాల కుటీర్ పాఠశాలలో పాత టైర్లను అర్థవంతంగా వినియోగిస్తున్నారు. నెమలిలా.. అందమైన పూలకుండీలుగా మలిచి ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. **- ఈనాడు అమరావతి**

డీసీసీబీ శాఖల్లో 51 విచారణకు సిద్ధం

నిలుపుదలకు నేతలను కలుస్తున్న ఉద్యోగులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని సహకార బ్యాంకుల్లో చోటుచేసుకున్న అవకతవకల విషయం అసెంబ్లీలోనూ చర్చనీయాంశమైంది. ప్రభుత్వం దీనిపై హౌస్ కమిటీని నియమించింది. హౌస్ కమిటీ విచారణలో జీడీసీసీబీ కూడా ఉంది. గత నెలలో జరిగిన హౌస్ కమిటీ విచారణకు జిల్లా సహకార బ్యాంకు అధికారులు వెళ్లి సభ్యులు అడిగిన వివరాలు తెలిపారు. జిల్లాలోని సహకార బ్యాంకు శాఖలన్నింటిపైనా 51వ విచారణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రెండు సార్లు విచారణ గడువును పెంచింది. తాజాగా కూడా రెండు నెలల్లో విచారణ చేపట్టి నివేదిక అందించాలని సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం నుంచి జిల్లాలోని బ్యాంకు శాఖల్లో విచారణ చేయనున్నారు.

తొలుత 19 చోట్ల.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో సహకార బ్యాంకు బ్రాంచులు 44 ఉన్నాయి. వీటిలో ఉమ్మడి జిల్లా పరిధిలో 19 శాఖల్లో సోమవారం నుంచి సహకార శాఖ అధికారులు విచారణ చేయనున్నారు. ఈనేపథ్యంలో బ్యాంకు ఇన్‌ఛార్జి సీఈఓ.. బ్రాంచి మేనేజర్లు, ఉద్యోగులు విచారణకు సహకరించాలని సూచనలు చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పరిపాలన కార్యాలయంతో పాటు నగరంలోని శాఖలు ప్రస్తుతం విచారించనున్న జాబితాలో ఉన్నట్లు తెలిసింది. దీంతో బ్యాంకు ఉద్యోగులు పలువురు ఇటీవల ఓ ఎమ్మెల్యేను కలిసి విచారణను నిలుపుదల చేయాలని కోరారు. విచారణ కొనసాగింపు దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో అక్రమాలకు పాల్పడిన ఉద్యోగుల ఆందోళన చెందుతున్నారు.

అమరావతిలో పనులు రయ్.. రయ్

తుళ్లూరు, న్యూస్‌టుడే

అమరావతిలో నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. రాజధానిలో ఎటు చూసినా వేల మంది కార్మికులు, వాహనాలు, యంత్రాలు, భారీ నిర్మాణ సామగ్రి దర్శనమిస్తున్నాయి. రాజధాని సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు ఐకానిక్ టవర్స్, ట్రంక్ రోడ్లు, మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, జడ్జిలు, ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, అఖిల భారత సర్వీసు అధికారుల భవన సముదాయాల పనులు వేగంగా జరుగుతున్నాయి. మరో వైపు రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధికి శరవేగంగా ఎల్పీఎస్ లేఔట్ నిర్మాణ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం లేఔట్‌లలో జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు రోడ్లు, సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసే పనులు చేస్తున్నారు. ఏపీ ఎన్ఆర్టీ, హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు పనులు చురుగ్గా సాగుతున్నాయి.

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టులో బేస్‌మెంట్ కోసం ర్యాఫ్ట్ ఫౌండేషన్ నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

హ్యాపీనెస్ట్ ప్రాజెక్టులో బేస్‌మెంట్ పనులు.. అమరావతిలో నిర్మిస్తున్న హ్యాపీ నెస్ట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. పైల్ ఫౌండేషన్ పనులు పూర్తి కావడంతో బేస్‌మెంట్ ఏర్పాటు చేయటం కోసం ప్రస్తుతం కార్మికులు ర్యాఫ్ట్ ఫౌండేషన్ పనులు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టును 12 టవర్స్‌తో 2 బేస్‌మెంట్‌లు, గ్రౌండ్ ఫ్లోర్+18 ఫ్లోర్‌లుగా నిర్మిస్తున్నారు. ప్రతి ఫ్లోర్‌కు 4 లేదా 6 ప్లాట్లను నిర్మాణం చేస్తున్నారు. మొత్తం 1200 ప్లాట్లు నిర్మించనున్నారు. 29.23 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును నిర్మించనున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

(c) eenadu

ఈఎస్ఎల్ క్రీడా సంబరానికి సై

నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రజెంట్స్' 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' (ఈఎస్ఎల్)-2025కు రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిభావంతుల్ని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ఈఎస్ఎల్' పండగ ఆసన్నమైంది. వర్ధమాన క్రికెటర్ల ప్రతిభకు వేదికగా నిలుస్తూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న 'ఈనాడు క్రికెట్' సోమవారం ప్రారంభం కానుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా క్రికెట్ మ్యాచ్‌లకు చలపతి ఇంజినీరింగ్ కళాశాల (ఎన్ఐఏటీ) మోతడక క్యాంపస్‌లోని క్రికెట్ మైదానాలు ఇందుకు వేదిక కానున్నాయి. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, మెడికల్, ఫార్మా కళాశాలల జట్లు క్రికెట్ టోర్నీలో తమ అదృష్టం పరీక్షించుకోనున్నాయి. తొలుత జిల్లా స్థాయిలో మ్యాచ్‌లు జరుగుతాయి. సోమవారం జిల్లా స్థాయి మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అనంతరం ప్రాంతీయ స్థాయిలో మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు. తర్వాత రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయి.

Aster Ramesh HOSPITALS We'll Treat You Well

వేదిక: చలపతి ఇంజినీరింగ్ కళాశాల (ఎన్ఐఏటీ)

షెడ్యూల్ ఇలా.. గ్రౌండ్-1 ☛ ఉదయం 9.00 గంటలకు యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాల X చలపతి ఇంజినీరింగ్ కళాశాల(ఎన్ఐటీఏ) ☛ ఉదయం 11.30 గంటలకు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల X ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట **గ్రౌండ్-2** ☛ ఉదయం 9.00 గంటలకు కేఎల్ యూనివర్శిటీ X ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ☛ ఉదయం 11.30 గంటలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల X ఎన్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, విశదల

Title Sponsor
Dhanik Bharat Educational Institutions
— The Lloyd Group Initiative —
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor
City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor
City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner ఈనాడు.నెట్
TV Partner ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

దేశాభివృద్ధిలో గ్రామీణ బ్యాంకులు కీలకం

జ్యోతి వెలిగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: దేశాభివృద్ధికి గ్రామీణ బ్యాంకుల తోడ్పాటు కీలకమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని జేకేసీ కళాశాల ఆడిటోరియంలో ఏపీ గ్రామీణ బ్యాంకుల విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని మోదీ లక్ష్యమైన వికసిత్ భారత్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో భాగంగా రైతులు, ప్రజలకు రుణాలు మంజూరు చేయడం ద్వారా గ్రామీణ బ్యాంకులు చేయూత అందించాలన్నారు. ఏపీ గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలకు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కావాల్సిన రుణాలు, డ్వాక్రా సంఘాలకు ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు వెల్లడించారు. విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కె.శివరామప్రసాద్ అధ్యక్షత వహించగా.. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి బ్యాంకు జీఎం ఎస్.ఆర్.రఘునాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ లక్ష్మీనరసయ్య, కోశాధికారి పరమహంసరెడ్డి, జిల్లాల కార్యవర్గ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణాల ఊబిలో సొసైటీలు

వినియోగించని గోదాములతో బకాయిల భారం

న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)

బహుళ ప్రయోజనకర సౌకర్యాల గోదాము

జిల్లాలో బహుళ ప్రయోజనకర గోదాములను వ్యాపారానికి వినియోగించని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రుణాల ఊబిలో చిక్కుకున్నాయి. ఈ సొసైటీల అధికారులు త్వరపడి వీటిని సొంతానికి వాడుకోవడం లేదా అద్దెకు ఇవ్వడం చేయకుంటే ఈ రుణ భారం మరింత పెరిగే అవకాశం ఉంది. ✦ కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని 29 పీఏసీఎస్‌ల పరిధిలో గోదాములు నిర్మించి ఇచ్చింది. ఒక్కో గోదాముకు రూ.40 లక్షల రుణం మంజూరు చేసింది. వీటి నుంచి ఆదాయం వచ్చేలా సొంతానికి లేదా అద్దెకు ఇవ్వాలని సూచించింది. ఈ వచ్చిన ఆదాయం నుంచి ఏటా రూ.6 లక్షల వంతున ఇచ్చిన రుణం తీరే వరకు చెల్లించాలని పేర్కొంది. 2 సొసైటీలు ఇప్పటికే గోదాముల్లో సొంతంగా వ్యాపారం చేస్తున్నాయి. మూడు అద్దెకు ఇచ్చాయి. ఈ వచ్చిన ఆదాయంలో కొంత రుణ బకాయిల కింద చెల్లింపులు జరుపుతున్నాయి. గోదాములను దేనికీ వినియోగించని వాటికి రుణం భారంగా మారింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సొసైటీల పరిధిలో రైతులకు రుణాలు ఇవ్వాలని నగదు మంజూరు చేసింది. సొసైటీలు ఈ నగదును రైతులకు రుణంగా ఇచ్చాయి. వీరు చెల్లించిన రుణాన్ని ఆ సొసైటీలు తిరిగి జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు చెల్లించాయి. వీటిని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కరెంటు ఖాతాలో జమ చేసుకుంది. ఇందులో గోదాముల బకాయిల కింద ఒక్కో సొసైటీ నుంచి రూ.6 లక్షలు చొప్పున జమ చేసుకుంది. ఇక్కడ రైతులు తీసుకున్న రుణం చెల్లించేశారు. వీరు చెల్లించిన రుణం నుంచి కొంత ఆ బకాయిల కింద జమ చేసుకోవడంతో సదరు సొసైటీలు బకాయి పడ్డాయి. ఇలా ఏటా జమ చేసుకోవటం వల్ల సొసైటీ బకాయి కొండలా మారనుంది.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దు

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఈగల్ చీఫ్ రవికృష్ణ

ఎస్వీఎన్‌కాలనీ(గుంటూరు), న్యూస్‌టుడే: మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందనే విషయాన్ని యువత గ్రహించాలని ఏపీ ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో జేకేసీ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన రోటోఫెస్ట్-25 బహుమతి ప్రదానానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యూనిసెఫ్, రోటరీ తదితర సంస్థలు పోలియోరహిత సమాజం కోసం కృషి చేస్తున్నాయన్నారు. పిల్లల ఇష్టాలను తల్లిదండ్రులు తెలుసుకుని ప్రోత్సహిస్తే.. వారి భవిష్యత్తు గొప్పగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో నాలుగు వేల విద్యాసంస్థల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. మత్తు పదార్థాల వల్ల వచ్చే డబ్బు మాఫియా చేతుల్లోకి వెళ్తుందని, దీనివల్ల దేశభద్రతకు ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా లక్ష్య సాధనకు యువత కృషి చేయాలని చెప్పారు. సైబర్ నేరాలపై రోటరీ వంటి సంస్థలు విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఆటల్లో వక్తృత్వ ప్రతిభ చూపిన విద్యార్థులకు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈసందర్భంగా ఆకే రవికృష్ణను రోటరీక్లబ్ ఆఫ్ గుంటూరు ఘనంగా సత్కరించింది. క్లబ్ అధ్యక్షుడు నంబూరి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌరవ అతిథి అసిస్టెంట్ గవర్నర్ కె.వి.భాస్కరరావు, ప్రాంతీయ చైర్మన్ మామిడి సుబ్బారావు, ఏపీ గ్రామీణ బ్యాంకు ప్రాంతీయ మేనేజర్ సీహెచ్.శ్రీనివాస్, కార్యదర్శి రవికిరణ్ కనమర్లమూడి, కోశాధికారి హరనాథ బాబు, డైరెక్టర్లు ముప్పవరపు వెంకట సత్యనారాయణ, గార్లపాటి రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ అన్సారియా

నగరంపాలెం, న్యూస్‌టుడే: పోలియో చుక్కలు వేయించడం ద్వారా చిన్నారులను వైకల్యం నుంచి కాపాడవచ్చని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం శ్రీనివాసరావుతోట యూపీహెచ్‌సీ కేంద్రంలో పిల్లలకు కలెక్టర్ చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు వేయించాలన్నారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు 958 బూత్‌లు, 16 ట్రాన్సిట్ పాయింట్లు, 6 బఫర్ స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఐదేళ్ల లోపు వయసున్న పిల్లలు 2,14,981 మంది ఉన్నారన్నారు. 2,57,980 డోసులు, 12,899 వైల్స్ సిద్ధం చేశామన్నారు. 784 రిస్క్ ప్రాంతాలు గుర్తించామని, 104 రూట్లు, 72 సంచార బృందాలు, 4,090 వ్యాక్సినేటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. మొత్తం 4,406 మంది వైద్య, విద్యా శాఖ సిబ్బంది ఇందులో పాల్గొంటున్నారన్నారు. పోలియో చుక్కలు వేసిన తర్వాత మూడు రోజులు ఇంటింటి పర్యవేక్షణ చేసి పోలియో చుక్కలు వేయని పిల్లలను గుర్తించి వేస్తారన్నారు. గుంటూరులో నాలుగో రోజు కూడా ఈ కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.విజయలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎ.శ్రావణబాబు తదితరులు పాల్గొన్నారు.

గెలుపును పంచడమే నిజమైన ఆట

విజేతలను అభినందిస్తున్న డీసీపీ సరిత

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: క్రీడలంటే పతకాలు కాదని, గెలుపును పంచడమే ఆటకు నిజమైన నిర్వచనమని ఎన్టీఆర్ కమిషనరేట్ డీసీపీ సరిత అన్నారు. ఆదివారం స్థానిక వికాస్‌నగర్‌లోని వికాస్ గ్రౌండ్స్‌లో భాష్యం ఒలంపస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డీసీపీ సరిత భాష్యం స్పోర్ట్స్ మీట్ జెండాను ఆవిష్కరించి క్రీడా జ్యోతిని వెలిగించారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. దేశానికి వన్నె తెచ్చిన ఎంతో మంది క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న భాష్యం యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీసీపీ సరిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్ఈవోలు శివ, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలను ప్రతిఘటిద్దాం'

మాట్లాడుతున్న పరాశరన్, వేదికపై కాంతారావు, నరేష్‌గుప్తా, అజయ్‌కుమార్

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఫాసిస్టు విధానాలు అవలంబిస్తోందని ఎన్ఎఫ్‌పీఈ (నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్) మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.పరాశరన్ మండిపడ్డారు. ఆయన ఆదివారం తెనాలిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సీ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ 41వ రాష్ట్ర మహాసభల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగబద్ధ సంస్థలను తన చెప్పుచేతల్లో ఉంచుకుని ప్రభుత్వ వినాశకర విధానాలను ప్రశ్నించిన సంస్థలను. వ్యక్తులను అణచి వేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. ఈ క్రమంలో కేంద్రం తెచ్చిన చీకటి చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించిన రైతులకు విరాళం ఇచ్చిన తమ సంఘం గుర్తింపును రద్దు చేసిందని విమర్శించారు. ఉపాధి హామీ చట్టానికి పెట్టిన మహాత్మాగాంధీ పేరును తొలగించి.. ఆయన పట్ల వ్యతిరేకతను చాటి చెప్పిందన్నారు. ఇటీవల కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను హరించనున్నాయని ఆలిండియా పోస్టల్ జనరల్ సెక్రటరీ నరేష్‌గుప్తా పేర్కొన్నారు. మహా సభల రిసెప్షన్ కమిటీ గౌరవాధ్యక్షుడు కాకతీయ కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ డి.ఎల్.కాంతారావు మాట్లాడుతూ.. తపాలా కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. రాష్ట్ర సీఐటీయూ ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్, గ్రూప్ సీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌బాబు, మురళి, విద్యాసాగర్, మర్రెడ్డి, ఎ.పోతురాజు, ఎం.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. సర్కిల్ అధ్యక్షుడు కె.గణపతి సభకు అధ్యక్షత వహించారు.

సబ్ డివిజన్ అధికారిపై ఎస్పీ ఆగ్రహం

గుంటూరు నగరం, పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఓ కేసు దర్యాప్తులో సబ్ డివిజన్ అధికారి వ్యవహరించిన తీరుపై ఎస్పీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత వైకాపా ప్రభుత్వంలో నల్లపాడు జీడీసీసీ బ్యాంకులో జరిగిన అక్రమాలపై ఇప్పటికే 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇద్దరిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చారు. అరెస్టు చేసిన వారిని పూర్తి స్థాయిలో విచారించకుండా హడావుడిగా కోర్టులో హాజరుపర్చిన సబ్ డివిజన్ అధికారిపై ఆదివారం రాత్రి ఎస్పీ తీవ్ర స్థాయిలో మందలించినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన రికార్డులన్నీ తన కార్యాలయంలో అప్పగించాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. నల్లపాడు జీడీసీసీ బ్యాంకులో జరిగిన అక్రమాలపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. సబ్ డివిజన్ అధికారిపై ఎస్పీ మండిపడటం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలతో సబ్ డివిజన్ అధికారిని తప్పించి క్రైమ్ డీఎస్పీకి దర్యాప్తు బాధ్యతలు అప్పగించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం
కంఠంరాజు కొండూరు గ్రామము, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా.
E-Procurement Tender
శ్రీ అమ్మవారి దేవస్థానము నందు 3 వివిధ అభివృద్ధి పనుల కొరకు టెండర్లు ప్రకటన చేయడమైనది. వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in నందు చూడగలరు.
శ్రీ అమ్మవారి సేవలో సం/- కార్యనిర్వహణాధికారి

మానవత్వ విలువలకు ప్రతిబింబాలు మోదుకూరి సినిమాలు

సన్మానం అందుకున్న శంకర్, వెంకటరెడ్డి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: మానవత్వ విలువలకు ప్రతిబింబాలుగా మోదుకూరి జాన్సన్ చలనచిత్రాలు ఉంటాయని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రావి రంగారావు అన్నారు. అమరావతి సాహితీ మిత్రులు సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన సాహిత్య సభలో ఆయన మోదుకూరి జాన్సన్ సాహిత్యం గురించి మాట్లాడారు. ఆనాటి బడుగుల బాధల్ని చూపించే నాటకాలు రాసి తెనాలి పరిసర ప్రాంతాల్లో చైతన్యం పెంచారన్నారు. ప్రముఖ నటుడు జగ్గయ్య దుగ్గిరాలలో ఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడు.. శిష్యుడిగా జాన్సన్ నాటకాలపై ఆసక్తి పెంచుకున్నారన్నారు. ఆయన రాసిన నాటకాల విశిష్టత గమనించి సినిమా పరిశ్రమ దగ్గరకు తీసుకుందన్నారు. దురాచార నిర్మూలనకు ఆయన సినిమా సంభాషణ రచయితగా ఎంతో కృషి చేశారన్నారు. అణువు అణువునా వెలసిన దేవా.., కదిలింది కరుణ రథం లాంటి పాటలు ఆయనలోని మానవతా ప్రేమను సూచిస్తాయన్నారు. అనంతరం పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవితా పఠనంలో సంబరాజు రమణి, గడల శివప్రసాద్, ఆర్.కుమారస్వామి, అనోది శంకర్, మన్నం వెంకట గురువు, వక్కలగడ్డ వెంకటేశ్వరరావు, యర్రగుంట్ల పాణిరావు, బండికల్లు జమదగ్ని, లక్ష్మి పాల్గొన్నారు. ఈ మాసం కవిగా పగడాల వెంకటరెడ్డిని, నిక్కచ్చి కవిత విజేత ఎ.శంకర్‌ను సంస్థ అధ్యక్షుడు రావి రంగారావు, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ టి.సేవకుమార్ సత్కరించారు.

జ్యోతి వెలిగిస్తున్న ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ ఛాన్సలర్ రాంబాబు

కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

వేడుకగా ప్రారంభమైన వివా వీవీఐటీయూ యువజనోత్సవం

పెదకాకాని, న్యూస్‌టుడే: నిరంతరం పుస్తక పఠనంలో మునిగితేలే విద్యార్థులు రెండు రోజుల పాటు ఆట, పాటలతో సరదాగా గడిపేందుకు నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్సిటీ వేదికైంది. ఆదివారం 'వివా వీవీఐటీయూ 2025-26' జాతీయ స్థాయి యువజనోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 93 అంశాల్లో పోటీలు నిర్వహిస్తుండగా.. తొలిరోజు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'యామిని ఇన్ ద స్ట్రీట్ ఆఫ్ చైనా' ప్రతిబింబించేలా యూనివర్సిటీ ప్రాంగణాన్ని చైనాలోని సంస్కృతులు, పురాణాలు, ఆకృతులతో తీర్చిదిద్దారు. ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాశాలల నుంచి 9500 మంది విద్యార్థులు హాజరయ్యారు. పిల్లలు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువులోని వారి అనుభవాలు పంచుకున్నారు. నెయిల్ ఆర్ట్, హ్యాండ్ ప్రింటింగ్, బంతి ఆట, షూటింగ్, థ్రెడ్ పుల్లింగ్, డంబుల్స్ గేమ్ స్టాళ్ల వద్ద విద్యార్థులు తమ ప్రతిభను పరిక్షించుకున్నారు. వీవీఐటీయూలోని వివిధ బ్రాంచ్‌ల విద్యార్థులు 'శాక్' (స్టూడెంట్ యాక్టివిటీ కమిటీ)గా ఏర్పడి ఈ కార్యక్రమాలను నిర్వహించడం విశేషం.

నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి

వీవీఐటీయూకు చెందిన 'శాక్' (స్టూడెంట్ యాక్టివిటీ కమిటీ) అధ్యక్షురాలిగా ఉన్నాను. ఈ కమిటీలోని విద్యార్థులంతా కలిసి యువజనోత్సవంలోని ప్రతి కార్యక్రమం ఎలా నిర్వహించాలో నిర్ణయం తీసుకుంటాం. వేల సంఖ్యలో వచ్చే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయడంలో శాక్ విజయం సాధించింది. శాక్‌లోని సభ్యులు ఇతరులతో మాట్లాడే విధానం. అందరినీ కలుపుకొని పోవడం వంటి స్కిల్స్‌తో ముందుకు సాగుతున్నారు. ఉద్యోగ నియామకాల్లో ఈ అనుభవం ఉపయోగపడుతుంది. **- టి.నవ్య (శాక్ అధ్యక్షురాలు)**

బాలికపై అత్యాచారం కేసులో నలుగురి అరెస్టు

నిందితులను కోర్టు వరకు నడిపించుకుంటూ తీసుకెళ్తున్న పోలీసులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళగిరి పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐ వీరాస్వామితో కలిసి డీఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. తాడేపల్లి పరిధిలోని కేఎల్‌రావు కాలనీకి చెందిన షేక్ ఖాదర్‌బాషా, షేక్ కమల్‌సాహెబ్, విజయవాడ సుందరీనగర్‌కు చెందిన షేక్ సలీం, షేక్ రబ్బానీ ఈ నెల 18వ తేదీ 13 ఏళ్ల బాలికను రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో మంగళగిరిలోని 16వ నంబర్ జాతీయ రహదారి వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి ముగ్గురు నిందితులు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు కేకలు వేయడంతో ఆ ప్రాంతంలో వారు బాలికను రక్షించారు. జరిగిన విషయాన్ని తల్లికి వివరించగా ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను మంగళగిరి సమీపంలోని ఎర్రబాలెం వెళ్లే మార్గంలో వంతెన వద్ద అరెస్టు చేశామని, నిందితుల్లో ఖాదర్‌బాషా, కమల్‌సాహెబ్ తండ్రీకొడుకులుగా గుర్తించామని డీఎస్పీ చెప్పారు. కాగా, నిందితులను పోలీసులు వీధుల్లో నడిపించుకుంటూ మంగళగిరి కోర్టుకు తీసుకువెళ్లారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, రిటైల్ ధర - 165, చికెన్ విత్‌స్కిన్ - 239, చికెన్ స్కిన్‌లెస్ - 272.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232, చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 145, 151, 165 చికెన్ విత్ స్కిన్ - 280 చికెన్ స్కిన్‌లెస్ - 290.

అదృశ్యం కేసు.. పోక్సోగా మార్పిడి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను ప్రేమ పేరుతో వల వేసి.. కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన యువకుడిని నున్న పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన బాలిక (17) విజయవాడ, నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే పెదనాన్న ఇంట్లో ఉంటోంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో రాహుల్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పాడు. వాటిని నమ్మిన బాలిక. ఈ నెల 18 రాత్రి యువకుడితో కలిసి వెళ్లిపోయింది. 19న బాలిక కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు...
అదృశ్యం కేసుపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బాలిక కిడ్నాపర్ల బారి నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పోలీసులు తీసుకువచ్చారు. దర్యాప్తులో ఆమెపై అత్యాచారం చేసినట్లు తేలింది. దీంతో మిస్సింగ్ కేసు సెక్షన్లను మార్చారు. రాహుల్ పక్కా ప్రణాళిక ప్రకారం హైదరాబాద్ నుంచి అద్దె కారు తీసుకొచ్చాడు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు నంబరు ప్లేటు మార్చాడు. స్నేహితులతో కలిసి ఆమెను కిడ్నాప్ చేశాడు. సత్తెనపల్లిలోని ఓ లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అలాగే అతడితోపాటు స్నేహితులపై కిడ్నాప్ సెక్షన్లు పెట్టారు. ప్రధాన నిందితుడితోపాటు అతనికి సహకరించిన ఇద్దరు స్నేహితులను నున్న పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph :81422 92071.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

గుంటూరు, పేరేచర్ల NRI IT కాలేజ ప్రక్కన ORRకి మధ్య APCRDA ప్లాట్లు కలవు. ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫ్రీ. 77290 75959, 99591 27008.

TO LET

COMMERCIAL

తెనాలి చెంచుపేట బాను టీస్టాల్ ఎదురు మెయిన్‌రోడ్ ఫేస్‌తో 24X60 అ॥షెడ్డు, 18X30 అ॥ ఖాళీ స్థలం, 4X60 అ॥ సందు అద్దెకు. ✆ 78932 66771.

JOBS

Wanted Software Developer Cloud Adminstrator Fashion Designer Beautician Receptionist (Trainers). ✆ 93472 77429

Wanted Receptionist, Co-ordinator & Office Boys to Work in Educational Institution, Brodipet, 4/9, Guntur. Contact: 90007 46753 Interviews Tuesday (23rd Dec) from 11am.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

డ్రీమ్‌స్కేప్ ఎడ్యుకేషన్ కన్సల్‌టెంట్స్ గుంటూరులో పనిచేయుటకు టెలీకాలర్స్(F) మార్కెటింగ్(M) కావలెను మంచిజీతం + ఇన్సెంటివ్స్ పార్ట్/ఫుల్‌టైం వర్క్. ✆ 9248865536

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు టెలికాలర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్, మరియు సీనియర్ టీం లీడర్స్ కావలెను. ✆ 95500 08995.

ప్రముఖ కంపెనీలలో సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటి ఆఫీసర్స్. 10-15 వేలు, 8గం॥ డ్యూటీ, SSC పాస్, 20-50 సం॥. ✆ 85209 77729, 85209 77759.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ నందు క్లాస్ ఇన్‌ఛార్జీస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము : 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు : ఇంటర్ నుండి పి.జి వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర॥ 91000 69089.

తెనాలి దగ్గర, దుగ్గిరాలలోని ప్రముఖ కాఫీ పరిశ్రమలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, ప్యాకింగ్ బాయ్స్ కావలెను. రూమ్, క్యాంటీన్ సౌకర్యం కలదు. ✆ 92980 11777, 80961 61777

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, క్యాంపస్ హాస్టల్ A.Oగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 18000/- వరకు ఇవ్వబడును. ఉచిత భోజనము వసతి కల్పించబడును. విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు:22 సం॥ల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర. ✆: 92487 33320.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

1)మార్కెటింగ్ ఏజెంట్లు, 2) కలెక్షన్ ఏజెంట్లు 3) టెక్నికల్ పర్సన్లు 4) కంప్యూటర్ ఆపరేటర్లు 5) రిసెప్షనిస్ట్ కావలెను. SITI కేబుల్ & బ్రాడ్‌బ్యాండ్ ఆఫీసు, JKC రోడ్, గుంటూరు. 70930 76288.

తెనాలి రిలయన్స్ పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు 2 పంప్ బాయ్స్ (8 గం॥ డ్యూటి) జీతం: 12 వేలు+ESI & ఎయిర్ బాయ్ ఒకరు కావలెను. 93470 51723.

గుంటూరులోని ప్రముఖ, శానిటరీ షాపులో పనిచేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ (M/F) కావలెను. జీతం 12K - 16K ✆ 94936 56892

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

(c) eenadu

తెనాలి

•తెనాలి •పొన్నూరు

దేశాభివృద్ధిలో హిందువుల పాత్ర కీలకం

కమలానంద భారతిస్వామికి స్వాగతం పలుకుతున్న కళాకారిణులు

చేబ్రోలు, న్యూస్‌టుడే: సమైక్యతతో ఉంటే హిందూ సమాజం అభివృద్ధి చెందుతుందని కమలానంద భారతి స్వామి తెలిపారు. చేబ్రోలు మండలంలోని వేజండ్లలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశాభివృద్ధిలో హిందువుల పాత్ర కీలకమని.. అందరూ ఐక్యంగా లేకుంటే స్వదేశంలోనే మైనార్టీలుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ధర్మాన్ని కాపాడుకుంటూ సేవలు చేయాలని పిలుపునిచ్చారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

డైరీ.. క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అబద్ధయ్య, సంఘ నాయకులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, సంఘ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉన్నాయని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య పేర్కొన్నారు. తెనాలిలో ఆదివారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ పద్మశాలి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘ అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ పర్యవేక్షణలో జరిగిన సమావేశంలో వివిధ నామినేటెడ్ పోస్టుల్లో నియమితులైన పద్మశాలి ప్రతినిధులు, ఉద్యోగ విరమణ చేసిన పెద్దలు, నూతనంగా ఉద్యోగాలు సాధించిన యువత, వివిధ పురస్కారాలు అందుకున్న మొత్తం 80 మందిని ఘనంగా సత్కరించారు. అనంతరం సంఘ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. నాగేశ్వరరావు, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, చంద్రశేఖర్, సుజాత, తిరుమల శ్రీదేవి, జ్యోతి, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, 400 మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి రైతుబజార్లలో బోర్డు మీది ధరల కంటే.. కొన్ని కూరగాయలకు అధిక ధరలు వసూలు చేస్తున్నారు. **- శ్రీనివాసరావు, తెనాలి** ✔ విక్రయదారులతో మాట్లాడుతాం. అధిక ధరలు చెబితే ఆయా రైతు బజార్లలోని మా సిబ్బందికి ఫిర్యాదులు చేయవచ్చు. **- రామకృష్ణ, ప్రధాన రైతు బజార్ పర్యవేక్షణాధికారి** ? తెనాలి పట్టణ గంగానమ్మపేట నుంచి నెహ్రూ రోడ్డుకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా కార్లు అడ్డుగా పెడుతున్నారు. **- రాఘవేంద్రరావు, గంగానమ్మపేట** ✔ ట్రాఫిక్ పోలీసులతో పెట్రోలింగ్ చేయిస్తాం. వాహనదారులతో మాట్లాడి తొలగింపజేస్తాం. **- బి.జనార్దనరావు, డీఎస్పీ** ★ ఐతానగర్‌లో ప్రధాన పైపులైన్ పగిలి తాగునీరు వృథా అవుతుందని స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి చేయించారు. **- న్యూస్‌టుడే, తెనాలిటౌన్**

? పొన్నూరు పరిధిలోని 4వ వార్డులో రహదారిపై ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. **- షేక్ రియాజ్, 4వ వార్డు** ✔ గొయ్యికి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. **- షేక్ హాసీనా, సహాయ ఇంజినీరు** ? పొన్నూరు పరిధిలోని జీబీసీ రహదారిలో చెత్తను తొలగించడం లేదు. శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. **- పి.వెంకటరమణ, జీబీసీ రహదారి** ✔ చెత్తను తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- పోతురాజు, ప్రజారోగ్యశాఖాధికారి** ★ పట్టణ పరిధిలోని 12వ వార్డులో వీధి దీపం వెలగడం లేదని అందిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి.. మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, పొన్నూరు**

పల్లెల ప్రగతికి.. పైసలేవి..?

అభివృద్ధికి నోచుకోని 6 గ్రామాలు

★ మండలం: పొన్నూరు
★ టైడ్ నిధులు :రూ.58,61,919
★ అన్ టైడ్ :రూ.39,07,946.

న్యూస్‌టుడే, పొన్నూరు

ఆలూరులో మట్టి రహదారి

గత వైకాపా పాలనలో పొన్నూరు పురపాలక సంఘంలోకి చింతలపూడి, కట్టెంపూడి, కసుకర్రు, వడ్డిముక్కల, కట్టెంపూడి, పెద ఇటికంపాడు గ్రామాలను విలీనం చేశారు. విలీన ప్రక్రియపై గ్రామస్థులు అభ్యంతరం తెలిపి హైకోర్టును ఆశ్రయించారు. ఆయా గ్రామాలకు పంచాయతీ పాలక వర్గం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరు కావడం లేదు. నిధులు లేకపోవడంతో రహదారులు లేక, సిమెంటు మురుగు కాలువలు లేక, ఇతర సమస్యలతో గ్రామస్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి ఆ గ్రామాలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి పల్లె ప్రగతికి బాటలు వేయాలని స్థానికులు కోరుతున్నారు. * మండలానికి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ. 97,69,865 విడుదలయ్యాయి. నిధులు రావడంతో పంచాయతీలు ఊపిరి పోసుకున్నాయి. పొన్నూరు మండల పరిధి ములకుదురు, నండూరు, పెదపాలెం, వల్లభరావుపాలెం, దొప్పలపూడి, మన్నవ, బ్రాహ్మణకోడూరు, మామిళ్లపల్లి, దండమూడి, ఆరెమండ తదితర గ్రామాల్లో సిమెంటు రహదారులు, సిమెంటు మురుగు కాలువల నిర్మాణాలకు ఖర్చు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

మొన్నటి వరకు పంచాయతీ ఖాతాలో నిధులు లేకపోవడంతో ప్రజా సమస్యలు పరిష్కారం కాక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. నిధులు విడుదల కావడంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఊరటనిచ్చిందని అభిప్రాయపడుతున్నారు. **ఎన్నికలు జరగకపోవడంతో...** దీనిపై మండల ఈవోపీఆర్డీ వేముల శ్రీనివాసరావును న్యూస్‌టుడే వివరణ కోరగా.. 6 గ్రామాలకు ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు కాలేదని చెప్పారు. నిధులు మంజూరు చేసిన గ్రామాల్లో వివిధ రకాల అభివృద్ధి పనులను నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

పోలియో చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో అన్నపూర్ణ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఈరుగుల అన్నపూర్ణ తెలిపారు. తెనాలి డివిజన్ పరిధిలోని పట్టణాలు, గ్రామాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు కేంద్రాలను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఆమె పట్టణంలోని పలు పోలియో కేంద్రాలను పరిశీలించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, ఎంహెచ్‌వో ఏసుబాబు, పలువురు కౌన్సిలర్లు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. **కొల్లిపర:** కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి పల్స్‌పోలియో చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డాక్టర్ నేహారెడ్డి మాట్లాడుతూ.. మండల పరిధిలో 2761 మంది చిన్నారులకు పోలియో నివారణ చుక్కల మందు వేసినట్లు తెలిపారు.

నాయకత్వ లక్షణాల పెంపునకు క్రీడలు దోహదం

విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించిన వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి విద్యాసాగర్, మహదేవ్ తదితరులు

పెదకాకాని, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు పెంపుదలకు క్రీడలు, కళలు దోహదపడతాయని ఛాన్సలర్ ఆచార్య పరుచూరి వెంకటేశ్వర్లు తెలిపారు. నంబూరు వీవీఐటీయూలో ఆదివారం ప్రారంభమైన 'విబ్ వీవీఐటీయూ 2025-26 జాతీయ స్థాయి యువజనోత్సవాల తొలి రోజు ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ పరుచూరి వెంకటేశ్వరరావు, అమెరికన్ ప్రొఫెసర్ దండి రాజు హాజరయ్యారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు వారు ధ్రువపత్రాలు అందజేశారు. వీవీఐటీయూ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీవీఐటీయూ కార్యదర్శి మహదేవ్, రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆంగ్లంపై మోజుతో అమ్మభాషను మరవద్దు

పుస్తకం ఆవిష్కరిస్తున్న రచయిత ప్రకాష్, సుశీలమ్మ, రవిబాబు, నాగేశ్వరరావు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: పాఠశాలలన్నింటిలోనూ తెలుగు భాష పట్ల మమకారాన్ని పెంచాలని సాహితీ విశ్లేషకురాలు సీహెచ్ సుశీలమ్మ పేర్కొన్నారు. బొల్లిముంత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కవిరాజు పార్కులో నిర్వహించిన పుస్తకావిష్కరణ సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆంగ్లంపై మోజుతో అమ్మభాషను మరవద్దని హితవు పలికారు. మానవ జీవితాల్లో మిళితమైన జానపద గీతాలు సమాజంలో మానవీయతను పెంచాయని కొనియాడారు. అనంతరం రచయితలు పి.ప్రకాష్, చందునాగేశ్వరరావు రచించిన తెలుగుజాతి వెలుగుదారి భాషోద్యమ గీతాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఫౌండేషన్ కార్యదర్శి చందు సుబ్బారావు పాల్గొన్నారు. ఈ సభకు ప్రజా సాహితి సంపాదకులు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహించారు.

సీసీ రోడ్డు.. కమ్యూనిటీ హాల్ ప్రారంభం

ఎంపీటీసీ సభ్యురాలు మాధవితో కలిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకానిలోని జ్యోతినగర్‌లో రూ.14 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, రూ.5 లక్షలతో వేసిన సీసీ రోడ్డును స్థానిక నేతలతో కలిసి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదివారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీసీ రోడ్డు, కమ్యూనిటీ హాల్‌ను పూర్తిగా అందుబాటులోకి తెచ్చి.. ఇచ్చిన హామీని నెరవేర్చామని ఎమ్మెల్యే తెలిపారు. అంతకుముందు స్థానిక తెదేపా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొని అర్జీలు స్వీకరించారు. త్వరగా సమస్యలు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దళితవాడలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలి

మాట్లాడుతున్న పీవీ సునీల్‌కుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే: దళిత వాడలను పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ఏపీఎస్ అధికారి పీవీ సునీల్‌కుమార్ కోరారు. శనివారం పొన్నూరు రేపల్లె రోడ్డులో నిర్వహించిన ఆత్మగౌరవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దళితులు అభివృద్ధి చెందాలంటే తప్పని సరిగా అధికారం చేతిలో ఉండాలని పేర్కొన్నారు. దళిత వాడలను పంచాయతీలుగా ఏర్పాటు చేస్తే ఏటా రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు. దళిత వాడల్లో ఇప్పటి వరకు సబ్‌ప్లాన్ నిధులు కింద రూ.1.90 లక్షల కోట్లు ఖర్చు చేస్తే, ఆ నిధులు ఎటువైపు వెళ్లాయో ఎవరికీ తెలియదని వెల్లడించారు. మాల యువసేన రాష్ట్ర అధ్యక్షులు పొందుగల చైతన్య, రాజేష్, గొట్టిపాటి రమణకుమారి, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల ఆర్థిక సాయం

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెనాలి జామియా మసీదు మౌజన్ అంజాఖాన్‌కు వైద్య చికిత్స నిమిత్తం రాష్ట్ర వక్ఫ్ బోర్డు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేసింది. ఆ చెక్కును వక్ఫ్ బోర్డు డైరెక్టర్ మహ్మద్ ఇస్మాయిల్ బేగ్ ఆదివారం మసీదు వద్ద అంజాఖాన్‌కు అందించారు. మత పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

పద్మనాభశర్మకు వేంకటేశ్వర గుప్తా అవార్డు ప్రదానం

అవార్డు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు రాంబాబు, అక్కేశ్వరరావు, భాగవతారిణులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రముఖ హరికథా ఆచార్య తెలనాలుకల వేంకటేశ్వరగుప్తా, భాగవతారిణి మామిడి సరస్వతి చిరస్మరణీయులని కళాకారులు కొనియాడారు. మారీసుపేటలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం గుప్తా జయంతి, సరస్వతి సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. నిర్వాహకులు నన్నపనేని రాంబాబు, కోట అక్కేశ్వరరావు గుప్తా లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును హరికథా చూడామణి బుర్రా పద్మనాభశర్మకు అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సి. హెచ్. విద్యావతి , బెజ్జంకి నాగమణి, సి. హెచ్. శివపార్వతి, వేణు, ప్రదీప్ సి. హెచ్. శ్రీదేవి, కె. విజయ సారథి, సి. హెచ్. రవిశంకరరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ ఆలయానికి రూ.2 లక్షల విరాళం

దాతకు అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న కృష్ణమోహన్

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన అత్తోటి సుబ్బారావు, వెంకట పద్మావతి దంపతులు ఆదివారం విరాళం అందజేశారు. నిత్య అన్నదానానికి రూ. 1,00,116, గోసంరక్షణకు రూ. 1,00,116 చొప్పున అందించారు. వీరికి ఆలయ డిప్యూటీ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ అమ్మవారి చిత్రపటాలు అందజేసి సత్కరించారు.

పేదలకు నిత్యావసరాలు.. వస్త్రాల పంపిణీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి మండలం పెదరావూరులో పెన్నీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పేదలకు నిత్యావసరాలు, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా పర్యవేక్షించారు.

సమయపాలన పాటించకపోవడంతో అనారోగ్య సమస్యలు

వైద్యులను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అనేక అనారోగ్యాలకు కారణం పోషకాల లోపమే.. ఏది పడితే అది తినడం, సమయపాలన పాటించకపోవడంతో అనారోగ్య సమస్యలు అధికమవుతున్నాయని వైద్యులు వెంకటేశ్వరరావు, పర్వతరెడ్డి కాంతారావు తెలిపారు. వాకర్స్ క్లబ్ తెనాలి-2 ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ.. ఆహార నియమాలు పాటించాలన్నారు. నూనెలు, మసాలాలను తగ్గించుకోవడం, సీజనల్ పండ్లు కచ్చితంగా తీసుకోవడం, దాహం వేసినా వేయక పోయినా తగినన్ని నీళ్లు తాగడం అవసరమని వివరించారు. క్లబ్ అధ్యక్షుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజెళ్ల అనుమహేశ్వరరావు అధ్యక్షత వహించిన సమావేశంలో పెద్ద సంఖ్యలో హాజరైన సభ్యుల సందేహాలకు వైద్యులు సమాధానాలిచ్చారు. ఆనందరావు, వరహాలరావు, భుజంగరావు, డి.అనుమహేశ్వరరావు, అనూరాధ, పద్మశ్రీ, ప్రసన్నలక్ష్మి, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

దుప్పట్లు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరావు

పొన్నూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతా దివ్యాంగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాదాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం నేతాజీనగర్ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామని వెల్లడించారు. దివ్యాంగులకు దుప్పట్లు అందజేసిన దాత బండారుపల్లి శ్రీనివాసరావును ప్రత్యేకంగా అభినందించి, పేద ప్రజలకు నిర్వహించే సేవ కార్యక్రమాల్లో దాతలు భాగస్వాములు కావాలని కోరారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు జీఎంఎస్. గుప్తా, కొల్లి మాధవి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయికి దూరంగా ఉండండి.. జీవితాలు మార్చుకోండి

గంజాయికి దూరంగా ఉండాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ బి.జనార్దనరావు స్పష్టం చేశారు. తెనాలి నియోజకవర్గ పరిధిలో గతంలో నమోదైన గంజాయి విక్రయ, వినియోగ కేసుల్లోని నిందితులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వన్ టౌన్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐలు మల్లికార్జునరావు, రాములనాయక్, సాంబశివరావు, నాయబ్‌రసూల్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ప్రదర్శనలో బ్రహ్మకుమారి, తులసి తదితరులు

పొన్నూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కసుకర్రులో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరయ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాజయోగ ధ్యాన కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. తెనాలి డివిజన్ బ్రహ్మకుమారి ఆశ్రమం ప్రతినిధి తులసి మాట్లాడుతూ.. రోజూ ధ్యానం చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ఒత్తిడిని దూరం చేయాలంటే ధ్యానం చేయడమే సరైన మార్గమని తెలిపారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

కేకు కోస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, సంఘం, గ్రామపెద్దలు

పెదకాకాని, న్యూస్‌టుడే: పెదకాకాని అంబేడ్కర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొన్నారు. కేకు కోసి విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఆశీస్సులు అందుకున్నారు.

ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేయొద్దు

కొల్లిపర, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని కేంద్రప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పేర్కొన్నారు. దావులూరులో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి పనుల డిమాండ్‌కు సరిపడ నిధులు సమకూర్చాలని కోరారు. నిధుల కేటాయింపులో కేంద్రప్రభుత్వ ఆధిపత్యం సరికాదన్నారు. కార్మిక సంఘం నాయకులు ములకాశివసాంబిరెడ్డి, జిలుగు ముక్కంటి, ధనలక్ష్మి, గ్రేసమ్మ, బి.శకుంతల తదితరులు పాల్గొన్నారు.

త్రివిక్రమస్వామి సేవలో ఎమ్మెల్సీ ఆలపాటి

చెరుకూరు(పర్చూరు), న్యూస్‌టుడే: మండల పరిధి చెరుకూరులోని శ్రీ త్రివిక్రమస్వామివారిని ఆదివారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దర్శించుకున్నారు. పండితులు ఆయనకు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనాలు అందించారు. ఈవో దామా నాగేశ్వరరావు స్వామి ప్రసాదాలు అందజేశారు.

నంబరు ప్లేట్లు లేని వాహనాలు సీజ్

కారును తనిఖీ చేస్తున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్త కార్యక్రమంలో భాగంగా తెనాలిలో ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని.. వేగంగా వాహనాలు నడుపుతున్న, ఒకే వాహనంపై ఎక్కువ మంది ప్రయాణిస్తున్న, మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న తదితరాలకు సంబంధించి మొత్తం 120 కేసులు నమోదు చేశారు. నంబరు ప్లేట్లు లేని 25కు పైగా వాహనాలు సీజ్ చేశారు. డీఎస్పీ బి.జనార్దనరావు పర్యవేక్షించగా సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యభిచార ముఠా అరెస్టు

పెదకాకాని, న్యూస్‌టుడే: గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ నారాయణస్వామి తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన ఓ మహిళ వ్యభిచారం నిర్వాహకురాలిగా మారి.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తోంది. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాలతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఇద్దరు మహిళలు, పురుషులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా కొల్లూరు నుంచి ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఆదివారం పెదరావూరు వద్ద గుర్తించి.. కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

విజేతగా ఉపాధ్యాయుల క్రికెట్ జట్టు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: గుంటూరులో జరిగిన జిల్లా స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల్లో తెనాలి మండల జట్టు విజయం సాధించి రాష్ట్ర పోటీలకు ఎంపికైందని మండల విద్యాశాఖాధికారి లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. బృంద సభ్యులను అభినందించారు.

పేలిన గ్యాస్ సిలిండర్లు.. మూడు పూరిళ్లు దగ్ధం

మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి యడ్లలింగయ్య కాలనీ శివారులో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఓ పూరింట్లో వృద్ధురాలు కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా మంటలు ఒక్కసారిగా ఎగసిపడటంతో ఆమె కంగారు పడి బయటకు వచ్చారు. ఆ మంటలు క్రమంగా ఎగబాకి పక్కనే ఉన్న మరో రెండు పూరిళ్లకు అంటుకోవడంతో అవి కూడా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో రెండు వంట గ్యాస్ సిలిండర్లు పేలి పెద్దగా శబ్దాలు రావడంతో స్థానికులు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న తెనాలి అగ్నిమాపక కేంద్ర సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.



గుంటూరు తూర్పు



ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.లో) టమాట 45, వంగ 22, బెండ 39, పచ్చి మిర్చి 34, కాకర 44, క్యారెట్ 35, క్యాబేజీ 24, బీర 32, దొండ 39, బంగాళాదుంప 27, ఉల్లిపాయలు 30, గోరుచిక్కుడు 48, దోస 35, పొట్ల 38, చామ దుంప 24, గోంగూర 10, తోటకూర 10, చుక్క కూర 10, మెంతికూర రూ.5, కొత్తిమీర 20, బీట్ రూట్ 33, కీర 45, క్యాప్సికం 60, అల్లం 80, ఫ్రెంచి బీన్స్ 85, సొర 15, అరటి 8 - న్యూస్టుడే, పట్నంబజారు

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్టుడే: సోమవారం ప్రజాఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కమిషనర్ ఛాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863- 2224202) కార్యక్రమం ఉంటుందని, తర్వాత ప్రజల నుంచి అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

94406 38515, 80085 73097

★ అశోక్‌నగర్ ప్రధాన దారిలోని కాల్వలో పూడిక చేరి మురుగు నీరు పారడం లేదని స్థానికులు వినోద్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్‌కు తెలపగా సిబ్బందితో పూడికలు తీయించారు. ★ పద్మావతినగర్ మూడోలైన్‌లో వీధులు చెత్తకుప్పలతో అపరిశుభ్రంగా మారుతున్నాయని స్థానికులు చరణ్ 'మేమున్నాం.. మీకుతోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య అధికారులకు తెలపగా వాటిని సిబ్బందితో తీయించారు.

- నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్టుడే

ప్రాణాంతకంగా పార్కింగ్ బోర్డులు

పట్నంబజారు, న్యూస్టుడే

తూర్పు విభాగపు ట్రాఫిక్ పోలీసుల పనితీరు వాహనదారుల ప్రాణాల పాలిట శాపంగా మారింది. బస్టాండ్ సెంటర్‌లోని తూర్పు విభాగపు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై పోలీసులు ఇటీవల పార్కింగ్ బోర్డుల్ని ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే రహదారిపై పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయటం ఏమిటని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ ఐలాండ్ సెంటర్‌లో, పులిపాక హైస్కూల్‌కు వెళ్లే దారిలో ఈ బోర్డుల్ని ఉంచటంపై వాహనచోదకులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒక ద్విచక్ర వాహనదారుడు రాత్రి వేళ చీకటిలో వీటిని ఢీకొని గాయాల పాలయ్యారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఈ బోర్డులు తొలగించాల్సిన అవసరం ఉంది

నేడు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

గుంటూరు విద్య: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన సోమవారం గుంటూరు పాతబస్టాండ్ కూడలి వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉర్దూ ఉన్నత పాఠశాలలో జరగనుందని డీఈవో సలీంబాషా పేర్కొన్నారు. ఈనెల 15న పాఠశాల స్థాయి, 18న మండలస్థాయిలో ప్రదర్శనలు జరగ్గా, వాటిలో జిల్లా స్థాయికి ఎంపికైన మొత్తం 162 ప్రాజెక్టులు సోమవారం జిల్లా స్థాయి ప్రదర్శనలో పాల్గొన్నాయి. ప్రతి మండలం నుంచి వచ్చిన వాటిలో (గ్రూప్ ప్రాజెక్టులు 7 ఉండగా విద్యార్థి, ఉపాధ్యాయ వ్యక్తిగత నమూనాలు ఒక్కొక్కటి చొప్పున ప్రదర్శనకు రానున్నాయి. ఈ ప్రదర్శనలో అత్యుత్తమంగా నిలిచిన 11 ప్రాజెక్టులు ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనకు వెళ్లనున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – దేవాదాయ ధర్మదాయ శాఖ

శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి దేవస్థానము

పాతగుంటూరు, గుంటూరు టౌన్ & మండలము, గుంటూరు జిల్లా

లైసెన్స్ హక్కులకు ఇ-టెండర్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన

పాత గుంటూరులోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానమునకు చెందిన గుంటూరు కొరిటిపాడులోని ఖాళీ స్థలానికి ది. 22–12–2025 సోమవారం టెండర్లు నిర్వహిస్తున్నారు. గుంటూరు కొరిటెపాడులోని సర్వే నెం. 41 నందు ప్లాను ప్రకారం య. 2–807 సెంట్లు (0-204 సెంట్లు రోడ్లుకు పోగా) రెండు ప్లాట్లు క్రింద 11 సంవత్సరాలు కాల పరిమితి మేరకు టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నారు. ఆసక్తిగలవారు ఈ వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

నోట్: ది.07–12–2025న ఈనాడు దినపత్రికలో వచ్చిన ప్రకటనలో మార్పు: దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు E.M.D. రూ: 50,00,000 నుండి రూ. 10,00,000 (ఒక్కొక్క ప్లాట్కి) మార్పు చేసారని గమనించవలసినదిగా ప్రార్థన.

గుంటూరు
తేది: 21–12–2025

సం/– ఎన్.ఎల్.టి. సౌమ్య,
కార్యనిర్వహణాధికారి

కష్టపడ్డారు.. కానిస్టేబుల్ కొలువు సాధించారు

నెహ్రూనగర్ (గుంటూరు), న్యూస్టుడే

శిక్షణకు తరలి వెళుతున్న అభ్యర్థులతో కుటుంబ సభ్యులు

నిరుద్యోగులకు పోలీసు కొలువు అంటే ఎక్కువ మక్కువ. ఈ ఉద్యోగాలకు దరఖాస్తుకున్న వేలాదిమంది అభ్యర్థులు గత వైకాపా ప్రభుత్వ వైఖరితో అల్లాడిపోయారు. కానిస్టేబులు ఉద్యోగాలకు కేవలం ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించి ఆ తర్వాత పట్టించుకోకుండా వారి జీవితాలతో నాటి ప్రభుత్వం చెలగాటమాడింది. కానిస్టేబులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మూడేళ్ల పాటు మానసిక వేదన అనుభవించారు. ఈక్రమంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి అభ్యర్థుల కల నెరవేర్చింది. పోలీసు కవాతు మైదానంలో సోమవారం నుంచి వీరికి శిక్షణ ప్రారంభంకానుంది.

పోలీసు కాలేవని అవహేళన చేశారు

పాత గుంటూరుకు చెందిన మాతంగి **అనిల్‌కుమార్** తండ్రి శ్యాంబాబు లారీ డ్రైవర్. తల్లి సునీత కూలీ. చిన్నతనం నుంచి ఆర్థిక పరిస్థితి అంతగా లేకపోవడంతో తల్లిదండ్రులతో కలసి పొలం పనులకు వెళుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుకున్నాడు. ఇంటర్, ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. 2018లో ఎస్సైగా దరఖాస్తు చేయగా మెయిన్స్‌లో మార్కులు తగ్గాయి. అప్పుడందరూ పోలీసు కొలువు నీవల్లకాదని అవహేళన చేశారు. ఎలాగైనా కష్టపడి పోలీసు కొలువు సాధించాలని కసి పెంచుకున్నాడు. 2022లో ఎస్సై, కానిస్టేబులు ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదలవగా పట్టుదలతో ప్రయత్నించాడు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రభుత్వగ్రంథాలయంలో పుస్తకాలు చదువుతూ సిద్ధమయ్యాడు. సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగానికి అర్హత సాధించాడు. ఇంతలో ఉద్యోగాల ప్రక్రియ నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఎంపిక ప్రక్రియ చేపట్టడంతో సివిల్ కానిస్టేబులుగా ఎంపికయ్యాడు. గ్రూప్స్ ఒన్ అధికారి కావాలనేది లక్ష్యమని అనిల్‌కుమార్ తెలిపారు.

కూలిపనులు చేసుకుంటూ..

చుట్టుగుంటకు చెందిన **నాగరాజు** తండ్రి శ్రీను బేల్దారి పనులకు, తల్లి బుజ్జి కూలి పనులకు వెళుతుంటారు. చిన్నతనం నుంచి నాగరాజుకు పోలీసు కావాలని కల. ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్ వరకు చదివారు. టీజేపీఎస్‌లో డిగ్రీ పూర్తి చేశాడు. 2019లో ఎస్సై, కానిస్టేబులు ఉద్యోగాలకు నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేయగా రాతపరీక్షలో ఉత్తీర్ణత కాలేదు. 2022లో మళ్లీ దరఖాస్తు చేశాడు. ఎస్సై రాత పరీక్షలో మార్కులు తగ్గగా కానిస్టేబులు ప్రిలిమ్స్ పాస్ అయ్యాడు. అయితే కొలువుల పిలుపు ఆగిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు కారణంగా చిన్నపాటి కూలి పనులు చేసుకుంటూ ఆశగా ఉద్యోగం కోసం ఎదురుచూస్తూ ఉన్నాడు. కూటమి ప్రభుత్వం చొరవతో ఉద్యోగం పొందటంతో కుటుంబ సభ్యుల ఆనందానికి అవధుల్లేవు. డబ్బులులేవని నిరాశ చెందకుండా కష్టపడి చదువుకొని ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిస్తే ఉద్యోగం సాధించవచ్చని, ఎస్సై కావాలనేది లక్ష్యమన్నాడు నాగరాజు.



పోలియోను దరి చేరనీయొద్దు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్టుడే: దేశంలో పోలియో తిరిగిం -కుండా చిన్నారులకు పోలియో చుక్కల మందు అందించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం ఎన్జీవో కాలనీలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, డిప్యూటీ మేయర్ షేక్ సజీలతో కలిసి మంత్రి పాల్గొన్నారు.

పట్నంబజారు: పాతగుంటూరు ఎల్.బి.నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ మీర్ మహమ్మద్ భాషా, సిబ్బంది పాల్గొని చిన్నారులకు చుక్కలు వేశారు. తొలుత ప్రజల్లో అవగాహన కల్పించారు.

నెహ్రూనగర్: నెహ్రూనగర్‌లో కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ శ్రీనివాస్, కొత్తపేటలో కార్పొరేటర్ పోతురాజు సమత చంద్రశేఖర్ పోలియో చుక్కలు వేశారు. కూటమి నాయకులు మార్కెట్ శ్రీను, ఎర్రగోపు నాగేశ్వరరావు, రవికుమార్, రవితేజ, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి చుక్కల మందు వేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ మేయర్ సజీల

నెహ్రూనగర్‌లో..

కొత్తపేటలో..

రోడ్డుపైకి మురుగు.. చేయండి కనుమరుగు

కొత్తపేట ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాల సమీపంలో కాలువలో మురుగు పారక రోడ్డు పైకి ప్రవహిస్తోంది. కాలువలో పూడిక తొలగించకపోవడంతో రోజుల తరబడి మురుగు పేరుకుపోయి పాచిపట్టింది. దుర్వాసనతోపాటు దోమలకు ఆవాసంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. సమీపంలో పాఠశాల ఉండటంతో చిన్నపిల్లలు, విద్యార్థులకు మరింత ఇబ్బందిగా మారింది. సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. **- న్యూస్టుడే, నెహ్రూనగర్**

డాక్టర్ రఘుకు అవార్డు ప్రదానం

పట్నంబజారు, న్యూస్టుడే: ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు కోల్‌కత్తాలో జరిగిన జాతీయ స్థాయి క్షయ, ఛాతీ వైద్యుల జాతీయ సమ్మేళనంలో గుంటూరుకు చెందిన డాక్టర్ శ్రీకంటి రఘు అవార్డు సాధించారు. ఏటా దేశవ్యాప్తంగా వైద్యులు అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రదానం చేస్తారు. ఈ ఏడాది డాక్టర్ శ్రీకంటి రఘుకు టి.బి.అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ డాక్టర్ వి.కె.అరోరా అవార్డు ప్రదానం చేశారు.

'తూర్పు' అభివృద్ధికి సహకరించండి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్టుడే: తూర్పు నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనులకు జీఎంసీ నుంచి సహకారం అందించాలని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీ కమిటీ ఛైర్మన్ నసీర్ కోరారు. ఆదివారం జీఎంసీ కార్యాలయంలో కమిషనర్ పులి శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందజేశారు. నసీర్ మాట్లాడుతూ అద్దె భవనంలో నడుస్తున్న కొత్తపేట పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించేలా కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు. పాలాసుపత్రి వద్ద మహిళలకు మల్టీపర్పస్ సెంటర్ నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. పొన్నూరు రోడ్డులో సద్భావన మండపం నిర్మాణాన్ని పీఎంజేవీకే పథకం కింద చేపట్టాలన్నారు. ఆటోనగర్‌లో నీటి కనెక్షన్లు పెంచి వాటి ధరలు తగ్గించాలని కోరారు.

రౌడీయిజం, గంజాయిపై ఉక్కుపాదం

గుంటూరు నేరవార్తలు, న్యూస్టుడే: జిల్లా వ్యాప్తంగా ఆదివారం పోలీసు స్టేషన్‌లలో రౌడీషీటర్లకు, పాత నేరస్థులు, అనుమానాస్పద వ్యక్తులకు, గంజాయి కేసుల్లో నిందితులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లాలో రౌడీయిజం, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో పోలీసులు ఈమేరకు పాత నేరస్థులను పిలిపించి హెచ్చరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

పట్నంబజారు, న్యూస్టుడే: నగర ప్రధాన రహదారుల్లో ఆదివారం డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో పోలీసులు నాకా బందీ నిర్వహించారు. నందివెలుగు రోడ్డు, పొన్నూరు రోడ్డు, ఏటుకూరు రోడ్డు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు నిర్వహించి గంజాయి తరలించే వారిపై నిఘా పెట్టారు. నగరంలోకి వచ్చే వాహనాల్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై పాతగుంటూరు పోలీసులు 38, లాలాపేట పోలీసులు 41 కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 9 మందిపై కేసులు నమోదు చేసి వారి వాహనాల్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. తనిఖీల్లో సీఐలు వెంకట ప్రసాద్, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరు రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

గుంటూరు నేరవార్తలు: గంజాయి వినియోగించినా, విక్రయించినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని పశ్చిమ డీఎస్పీ అరవింద్ హెచ్చరించారు. ఆదివారం నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో 'సంకల్పం-మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం' కార్యక్రమం నిర్వహించారు. గంజాయి కేసుల్లో పాత నిందితులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. నగరంపాలెం సీఐ సత్యనారాయణ, ఎస్సై రాంబాబు, ప్రసన్నకుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ అరవింద్, సీఐ సత్యనారాయణ, ఎస్సైలు

ఉద్యోగ విరమణ వయసు పెంచాలి

గుంటూరు విద్య, న్యూస్టుడే: రాష్ట్రంలో మోడల్ పాఠశాలల ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని ఏపీఎస్టీయూఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఏపీ మోడల్ స్కూల్స్ ఎస్టీయూ శాఖ ఆధ్వర్యంలో సమావేశం ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. కార్యక్రమంలో పల్నాడు జిల్లా ఏపీ మోడల్ స్కూల్ ఎస్టీయూ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి శౌరిరాజు, రాష్ట్ర సహాధ్యక్షులు ఎం.ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం

గుంటూరు నేరవార్తలు, న్యూస్టుడే: మహిళల రక్షణ, భద్రతకు పోలీసులు అత్యంత ప్రాధాన్యం ఇస్తారని నగరంపాలెం సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం వైద్య కళాశాలలో వసతి గృహ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఎస్సై ప్రసన్నకుమార్ మాట్లాడుతూ విద్యార్థినులపట్ల ఎవరైనా ఇబ్బందికరంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా డయల్ 112కు సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణా, అమ్మకాల సమాచారం తెలిస్తే సమీప పోలీసులకు, 112కు తెలపాలన్నారు.

చిల్డ్రన్స్ క్లబ్ ర్యాలీ

నెహ్రూనగర్: పుచ్చలపల్లి సుందరయ్యనగర్‌లో విశ్వమానవ సంక్షేమ సంఘం, గుంటూరు చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మస్తాన్‌రావు, భారవి, ఖాసిం షహీద్, లూథర్‌పాల్, మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కృషిచేద్దాం

పట్నంబజారు: పేదల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ సాయం చేయాలని ఆర్య వైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం అన్నారు. పట్నంబజారులోని సంస్థ కార్యాలయంలో ఆదివారం 110 మంది పేదలకు నిత్యావసర సరకులు, పింఛన్లు పంపిణీ చేశారు. ఆవోపా ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బ్రహ్మం పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నా నందకిషోర్, డాక్టర్ ఊటుకూరి సురేష్, యేలూరి నరసింహారావు, మహంకాళి శ్రీనివాసరావు, రాధాకృష్ణయ్య, స్వామి గుప్త తదితరులు పాల్గొన్నారు.

సరకులు, వస్త్రాలు పంపిణీ చేస్తున్న బ్రహ్మం, డాక్టర్ సురేష్

త్రోబాల్ పోటీల్లో గుంటూరు తూర్పు మండలం గెలుపు

గుంటూరు విద్య, న్యూస్టుడే: ప్రభుత్వ ఆదేశాలమేరకు ఉపాధ్యాయినులకు నిర్వహించిన త్రోబాల్ పోటీల్లో గుంటూరు తూర్పు మండలం జట్టు జిల్లా స్థాయిలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్టుకు డీసీఈబీ కార్యదర్శి ఎ.తిరుమలేష్, ఎంఈవో జ్యోతికిరణ్ బహుమతులు అందజేసి అభినందించారు. జనవరిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన జట్టు పాల్గొనుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కోచ్‌గా వ్యవహరించిన శాంతి, సీనియర్ పీడీలు పాల్గొన్నారు.

గెలుపొందిన ఉపాధ్యాయినులకు బహుమతి ఇస్తున్న డీసీఈబీ కార్యదర్శి తిరుమలేష్

ర్యాలీల పేరుతో హంగామా

తాడికొండ: వైకాపా నాయకులు ర్యాలీల పేరుతో రహదారులపై ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా తాడికొండలో నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈక్రమంలో తుళ్లూరు వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోలేటి అనిల్ అతివేగంగా కారు నడుపుతూ పక్కన ఆపి ఉన్న విద్యుత్ శాఖ ఏడీ కారును ఢీకొట్టారు. ఆ సమయంలో బయట విద్యుత్ పనుల తనిఖీ చేస్తున్న ఆ శాఖ అధికారులు భారీ శబ్దం రావడంతో ఉలిక్కిపడ్డారు. ఈ క్రమంలో వైకాపా నాయకులు అధికారులతో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. కారు లోపల ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

సిబ్బందితో వాగ్వాదానికి దిగిన వైకాపా నేతలు

ఘటనలో దెబ్బతిన్న కార్లు

(c) eenadu

గుంటూరు పశ్చిమ

శ్వాసకోశ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అరండల్‌పేట, న్యూస్‌టుడే: శ్వాసకోశ వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చెస్ట్ ఫిజీషియన్ డాక్టర్ పి.కాశీరాం అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. సభకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ కాశీరాం మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో ఊపిరితిత్తుల సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో అవగాహన సంస్థ సభ్యులు టీవీ సాయిరాం, విశ్రాంత ఎంపీడీవో డి.వెంగళరావు, సీహెచ్.చలమారెడ్డి, కరీముల్లా, నూరుల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

కృష్ణనగర్ రైతుబజారులో నిన్నటి ధరలు(కిలో రూ.ల్లో): టమాట 45, వంగ 27, బెండ 39, పచ్చిమిర్చి 43, కాకర 48, బీర 49, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజి 24, క్యారెట్ 35, దొండ 39, బంగాళదుంప 27, ఉల్లిపాయలు 30, గోరుచిక్కుళ్లు 48, దోస 35, సొర 23, పొట్ల 38, అరటికాయ 10, పెద్ద చిక్కుళ్లు 50, చామదుంప 24, బీట్‌రూట్ 33, కీరదోసకాయ 45, బీన్స్ 85, క్యాప్సికమ్ 60, కొత్తిమీర 20, ఆకుకూరలు 10, నిమ్మకాయలు 25, అల్లం 80, వెల్లుల్లి 120. - **న్యూస్‌టుడే, పట్టాభిపురం**

పలకలూరు రోడ్డుకు వెళ్లాలంటే హడల్

గుంటూరు నగరం, న్యూస్‌టుడే

గుజ్జనగుండ్ల నుంచి పలకలూరు రోడ్డుకు వెళ్లాలంటే వాహనచోదకులు, పాదచారులు హడలిపోతున్నారు. గుత్తేదారులకు లాభం చేకూర్చే పనులకు అధికారులు వత్తాసు పలకడంతో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధులు మట్టిమయం అవుతున్నాయి. పలకలూరు రోడ్డులో వారం రోజులుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. నెల రోజుల క్రితం పైపులైన్ ఏర్పాటు కోసం రోడ్డు పగలగొట్టి మట్టి పూర్తిగా తొలగించకుండా వదిలేశారు. వారం క్రితం డివైడర్లలో గతంలో ఉన్న మట్టిని తవ్వి రోడ్డుపై పోశారు. మళ్లీ డివైడర్లలో నింపేందుకు కొత్తగా తీసుకొచ్చిన మట్టిని రహదారిపై కుప్పలుగా పోశారు.

రహదారిపై మట్టి కుప్పలు

వారం రోజులుగా అవస్థలు

గుత్తేదారులు ఇష్టారాజ్యంగా చేస్తున్న పనులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు మట్టి కొట్టుకుపోయి ఆనవాళ్లు కనిపించడంలేదు. ఈ మార్గంలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. పాఠశాలలు, కళాశాలల బస్సులతో పాటు సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ, మాచర్ల తదితర ప్రాంతాల వైపు నుంచి వచ్చే ప్రజలు ఎక్కువగా ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. రద్దీగా ఉండే రహదారిలో మట్టికుప్పలు పోసి వదిలేయడంతో వాహనాలు వెళ్తుంటే.. దుమ్ము లేచి వెనక వచ్చే వారి కళ్లలో పడి ఇబ్బందులు పడుతున్నారు.

★ దుకాణాల్లో ఉన్న వస్తువులు, ఇళ్లలో ఉన్న సామగ్రి దుమ్ము కొట్టుకుపోతుంది.

★ గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి రత్నగిరినగర్ వరకు వెళ్లేందుకు వాహనచోదకులు, పాదచారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు.

వాహనాలు వెళ్తుంటే రోడ్డుపై పరిస్థితి

లక్షలు వెచ్చించి.. మళ్లీ తవ్వించి..

రెండు సంవత్సరాల క్రితం లక్షలు వెచ్చించి డివైడర్‌లో మట్టి పోసి పూలమొక్కలు నాటారు. తాజాగా డివైడర్‌లో ఉన్న మట్టిని తొలగించి మొక్కలు నాటే సాకుతో మట్టి నింపుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో పచ్చదనం ముసుగులో ప్రజాధనాన్ని గుత్తేదారులు దోచుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలకలూరు రోడ్డులో ప్రజల ఇబ్బందులు పట్టించుకోకుండా గుత్తేదారు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని, వారం రోజులు గడిచినా ఇంతవరకు ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఇటువైపు తొంగిచూడలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు స్పందించి వాహనచోదకులకు, స్థానికులకు ఇబ్బందిలేకుండా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సక్రమ తాగునీటి సరఫరాయే లక్ష్యం

రిజర్వాయర్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన పెమ్మసాని చంద్రశేఖర్, మాధవి, రవీంద్ర, శ్రీనివాసులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరు నగరంతో పాటు విలీన గ్రామాలకూ సక్రమంగా తాగునీటి సరఫరా చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఏటీ అగ్రహారం, ఉద్యోగనగర్‌లో ఎలివేటెడ్ లెవెల్ సర్వీస్ రిజర్వాయర్లు, ఎన్జీవో కాలనీలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు ఎమ్మెల్యే గల్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. పెమ్మసాని మాట్లాడుతూ 30 సంవత్సరాల క్రితం నిర్మించిన స్టోరేజ్ ట్యాంకులు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా మొత్తం ఏడు ట్యాంకులు పునర్నిర్మించేందుకు రూ.35 కోట్లతో ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. ఏటీ అగ్రహారం, ఉద్యోగనగర్ ప్రాంతాల్లో రిజర్వాయర్లకు భూమిపూజ నిర్వహించామని, త్వరలో బీఆర్ స్టేడియం ట్యాంకుకు శంకుస్థాపన చేస్తామని వివరించారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలకు కనీస వసతులు కల్పించకుండా ఇబ్బందులు పెట్టిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి మౌలిక వసతులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం – దేవాదాయ ధర్మాదాయ శాఖ

శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి దేవస్థానము

పాతగుంటూరు, గుంటూరు టౌన్ & మండలము, గుంటూరు జిల్లా

లైసెన్స్ హక్కులకు ఇ-టెండర్, సీల్డ్ టెండర్ మరియు బహిరంగ వేలం ప్రకటన

పాత గుంటూరులోని శ్రీ అగస్త్యేశ్వర స్వామి దేవస్థానమునకు చెందిన గుంటూరు కొరిటిపాడులోని ఖాళీ స్థలానికి ది. 22-12-2025 సోమవారం టెండర్లు నిర్వహిస్తున్నారు. గుంటూరు కొరిటెపాడులోని సర్వే నెం. 41 నందు ప్లాను ప్రకారం య. 2-807 సెంట్లు (0-204 సెంట్లు రోడ్లుకు పోగా) రెండు ప్లాట్లు క్రింద 11 సంవత్సరాలు కాల పరిమితి మేరకు టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నారు. ఆసక్తిగలవారు ఈ వేలం పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

నోట్: ది.07-12-2025న ఈనాడు దినపత్రికలో వచ్చిన ప్రకటనలో మార్పు: దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వులు మేరకు E.M.D. రూ: 50,00,000 నుండి రూ. 10,00,000 (ఒక్కొక్క ప్లాట్కి) మార్పు చేసారని గమనించవలసినదిగా ప్రార్థన.

గుంటూరు
తేది: 21-12-2025

సం/- ఎన్.ఎల్.టి. సౌమ్య,
కార్యనిర్వహణాధికారి

అశ్రునివాళి

జననం 15-06-1955
మరణం 08-12-2025

కీ॥శే॥ శ్రీ బండ్లమూడి సాంబశివరావు గారు

మంచికి మారుపేరుగా నిలిచి మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి..
అనంత లోకాలకు వెళ్లిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ విజయ వాసవి డెవలపర్స్ & బిల్డర్స్
మే॥ప్రొ॥ మాజేటి కిరణ్‌కుమార్

PSR INFRA

కొమ్మినేని నాగేశ్వరరావు
పొన్నెకల్లు

మంత్రి సాయిబాబు
గుంటూరు

ద్రవిడ మహాసముద్రం.. దళితవాద ప్రతిబింబం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ద్రవిడ మహాసముద్రం కవిత్వ సంపుటి దళిత వాదానికి ప్రతిబింబం లాంటిదని సాహితీవేత్త డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. ఈశ్వర వరప్రసాద పరిషత్తు ఆధ్వర్యంలో జిల్లా రచయితల సంఘం సహకారంతో ప్రముఖ వచన కవిత్వ రచయిత గూండ్ల వెంకట నారాయణకు లంకా సూర్యనారాయణ సాహితీ పురస్కార ప్రదానం ఆదివారం జరిగింది. బ్రాడీపేట కొరటాల భవన్‌లో జరిగిన సభలో ఈ పురస్కారాన్ని వెంకట నారాయణకు ప్రదానం చేశారు. వెంకట నారాయణ మాట్లాడుతూ పుస్తకానికి భక్తుడైన లంక సూర్యనారాయణ పేరున సాహితీ పురస్కారం అందుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. సభకు గుంటూరు జిల్లా రచయితల సంఘం ఉపాధ్యక్షుడు కేజే రమేష్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పరిషత్తు సమన్వయకర్త మోదుగుల రవికృష్ణ, ఎస్ఎం సుభాని, నానా, శ్రీవశిష్ట, కందిమళ్ల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకుంటున్న గూండ్ల వెంకటనారాయణ

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు చాయ్ విత్ జనసైనిక్

నగరంపాలెం, న్యూస్‌టుడే: నగరంలోని అన్ని డివిజన్లలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే జనసేన పార్టీ ఆధ్వర్యంలో 'చాయ్ విత్ జనసైనిక్' ఏర్పాటు చేసినట్లు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. స్థానిక 46వ డివిజన్ రెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాల వద్ద జనసేన డివిజన్ అధ్యక్షుడు అంబటి కుమార్ ఆధ్వర్యంలో చాయ్ విత్ జనసైనిక్ ఆదివారం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు రాష్ట్ర కార్యదర్శి వడ్రాణం మార్కండేయ బాబు, జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా డివిజన్‌లో నాయకులు, జనసైనికులు పాదయాత్రగా వాడవాడలా ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్‌లో ప్రధానంగా తాగునీరు, డ్రెయినేజీ సమస్య ఉందని గుర్తించారు. తక్షణమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, నగర కమిటీ నాయకులు, వీరమహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటున్న శ్రీనివాస్‌యాదవ్, నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM
80086 22566, 97042 53525, 80085 74897

చెత, వ్యర్థాల తొలగింపు: గుండారావుపేట చెక్కల బజార్ వీధిలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త, వ్యర్థాలను తొలగించారు.

స్పందనకు వందనం

కాలువల్లో పూడికతీత: సంపత్‌నగర్ వీధుల్లోని కాలువల్లో మురుగు పేరుకుపోయి పారుదలకు ఆటంకం ఏర్పడింది. సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ చందు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన సిబ్బందిని పంపి కాలువల్లో పూడిక తీయించారు. **-న్యూస్‌టుడే, నగరంపాలెం**

మిరప బోర్డు, పరిశోధన సంస్థ ఏర్పాటుకు వినతి

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గుంటూరులో జాతీయ మిరప బోర్డు, మిరప పరిశోధన సంస్థను ఏర్పాటు చేయాలని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట రామకృష్ణ కోరారు. ఈమేరకు కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో మిరప పంటను పండిస్తున్నప్పటికీ గుంటూరు మిర్చికి ప్రత్యేక స్థానం ఉంది. గుంటూరులో మిర్చియార్డు ఉన్నా స్వతంత్ర జాతీయ మిరప బోర్డు, పరిశోధన సంస్థ, విత్తన జన్యు బ్యాంకు లేదు. ఇక్కడ రైతులు తక్కువ నాణ్యత కలిగిన విత్తనాలు, తెగుళ్ల బెడద వల్ల ఇబ్బందులు పడుతున్నారు'.. అని వివరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి

నగరంపాలెం, న్యూస్‌టుడే: ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే బాధ్యత తల్లిదండ్రులదేనని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ కోరారు. జీజీహెచ్‌లో చిన్నారులకు డాక్టర్ ఎస్ఎస్‌వీ రమణ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడం ద్వారా తల్లిదండ్రులు సమాజ ఆరోగ్య రక్షణలో భాగస్వాములయ్యారన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడంలో డాక్టర్ వంశీ మార్గదర్శకత్వం, వైద్య, నర్సింగ్ సిబ్బంది, వాలంటీర్ల కృషి అభినందనీయమన్నారు.

చిన్నారికి చుక్కల మందు వేస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ రమణ

26న లక్ష్మణ చక్రవర్తికి పురస్కార ప్రదానం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: సీహెచ్ లక్ష్మీనారాయణ స్మారక పురస్కారాన్ని ఈ ఏడాది తెలంగాణ విశ్వవిద్యాలయం ఆచార్యుడు, ప్రముఖ రచయిత, విమర్శకుడు డాక్టర్ సీహెచ్.లక్ష్మణచక్రవర్తికి ఇస్తున్నట్లు పురస్కార ప్రదాన సంఘం పక్షాన సీహెచ్.సుశీలమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 4 గంటలకు బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జరిగే సభలో పురస్కారం అందజేస్తారన్నారు.

మహిళ చేతి సంచి లాక్కుని పరారీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రోడ్డుపై నడిచి వెళ్తున్న ఒక మహిళ చేతి సంచిని గుంజుకుని దొంగలు పరారయ్యారు. కాటూరి వైద్య కళాశాలలో పని చేసే బ్రాడీపేటకు చెందిన వెంకట జగదాంబ.. ఎస్వీఎన్ కాలనీలోని తల్లి వద్దకు బయల్దేరారు. ఆటో దిగి రోడ్డుపై నడిచి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఆమె చేతి సంచి గుంజుకుని అప్పటికే సిద్ధంగా ఉన్న ద్విచక్ర వాహనంపై ఎక్కి పరారయ్యాడు. దీంతో ఆమె పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగ్‌లో నాలుగు బంగారు గాజులు, సెల్‌ఫోన్, ఏటీఎం కార్డు ఉన్నాయని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

దోమల నివారణపై అవగాహన

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: స్వచ్ఛత, ఆరోగ్యం పట్ల విద్యార్థులు కల్పిస్తున్న అవగాహన ప్రజానీకానికి వేగంగా చేరుతుందని కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. అభ్యుదయ మహిళా కళాశాల డైరెక్టర్ బి.రోహిణిదేవి ఆధ్వర్యంలో లక్ష్మీపురం మదర్‌థెరిసా విగ్రహం వద్ద దోమలపై దండయాత్ర పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానవహారం, ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.రాధామాధవి, రోటరీ క్లబ్ ఆదర్శ్ అధ్యక్షులు అనురాధ, పి.సత్యవాణి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞలో పాల్గొన్న కమిషనర్ శ్రీనివాసులు

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనచోదకులు, ఆటో డ్రైవర్లు, ఇతర వాహనాల యజమానులు నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని సౌత్ డివిజన్ డీఎస్పీ భానోదయ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టిన నాకాబందీలో భాగంగా అమరావతి రోడ్డు, జేకేసీ కళాశాల రోడ్డులో వాహనాలు తనిఖీ చేశారు. లైసెన్సులు, సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్నవారు, ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వారిని గుర్తించి కౌన్సెలింగ్ చేశారు. సీఐ వంశీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

తెదేపాను మరింత బలోపేతం చేయాలి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. తెదేపా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆదివారం ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెమ్మసాని ఆయన్ను అభినందించి గ్రామ, డివిజన్, వార్డు స్థాయి నుంచి పార్టీ కార్యవర్గాన్ని పటిష్ఠపర్చాలని సూచించారు. మాణిక్యరావు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన గుంటూరు ఎంపీ, ఎమ్మెల్యేలు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. జెండా మోసిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ వడ్రాణం హరిబాబు, రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

పెన్షనర్ల సమస్యలపై విస్తృత చర్చ

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ అసోసియేషన్ 6వ త్రైవార్షిక సదస్సు ఆదివారం అమరావతి రోడ్డులోని విజయమ్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. సదస్సును యూబీఐ ఎండీ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఆశీష్ పాండే ముంబై నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూబీఐ విజయవాడ, తిరుపతి జోన్ల జీఎంలు సి.వి.ఎన్.భాస్కర్‌రావు, శ్రీనివాసులు, ఏపీ గ్రామీణ బ్యాంక్ ఛైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి, గుంటూరు, నరసరావుపేట ప్రాంతీయ హెడ్‌లు ఎస్.జవహర్, మాధురి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ పెన్షనర్స్ సంఘ ఛైర్మన్ ఎం.ఎం.భాస్కర్, ఏఐయూబీ పీఏ అధ్యక్షుడు ఎ.వి.రమణ, విశ్రాంత జీఎంలు కె.ఎల్.రాజు, నాగేంద్రనాథ్, ప్రముఖ పారిశ్రామికవేత్త సామినేని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కళాకదంబం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై ఆదివారం యువ కళావాహిని, కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్, నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ సంయుక్త నిర్వహణలో కళాకదంబం జరిగింది. తొలుత సినీ నాటక కళాకారుడు మీసాల లక్ష్మణ్ పద్యగానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ తదితరులు ప్రసంగించారు. తొలుత ఆంధ్రప్రదేశ్ రెరా సభ్యుడు దామచర్ల శ్రీనివాసరావు తదితరులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు దంపతులను పలు కళాసంస్థల నిర్వాహకులు సత్కరించారు. జి.మల్లికార్జునరావు, డి.తిరుమలేశ్వరరావు, నడింపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వీవీ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదే వేదికపై డాక్టర్ కోగంటి వెంకట శ్రీరంగనాయకి తిరుప్పావై ప్రవచనం, ఆమె శిష్యులు కీర్తనలకు అనుగుణంగా నృత్యప్రదర్శన చేశారు.

రామరాజు దంపతులను సత్కరిస్తున్న గోపాలకృష్ణ తదితరులు

శ్రద్ధాంజలి

కీ॥శే॥ శ్రీ బండ్లమూడి సాంబశివరావు గారు

జననం: 15-06-1955 మరణం: 08-12-2025

మీ ప్రతి అడుగు మా కోసమే మీ ప్రతి ఆలోచన కుటుంబ శ్రేయస్సు గురించే మీ క్రమశిక్షణ,
నిజాయితీ, విలువలు మా అందరికీ ఆదర్శం. మీరు మా మధుర స్మృతులలో ఎల్లప్పుడూ ఉంటారు.
మీ దివ్య ఆశీస్సులు మాకు ఎప్పుడూ తోడు ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ...

భార్య: బండ్లమూడి ఉదయలక్ష్మీ

కుమార్తెలు - అల్లుళ్ళు
బండ్లమూడి భార్గవి, USA - దామినేని ప్రభాకరరావు, USA
బండ్లమూడి సౌజన్య, USA - ఉమ్మలనేని సుధీర్, USA
మరియు కుటుంబ సభ్యులు - బంధుమిత్రులు

పెద్దకర్మ: ది. 22-12-2025 సోమవారం తాడికొండ గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును.

(c) eenadu

ఈఎస్ఎల్ క్రీడా సంబరానికి సై

నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రజెంట్స్' 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' (ఈఎస్ఎల్)-2025కు రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిభావంతుల్ని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ఈఎస్ఎల్' పండగ ఆసన్నమైంది. వర్ధమాన క్రికెటర్ల ప్రతిభకు వేదికగా నిలుస్తూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న 'ఈనాడు క్రికెట్' సోమవారం ప్రారంభం కానుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా క్రికెట్ మ్యాచ్‌లకు చలపతి ఇంజినీరింగ్ కళాశాల (ఎన్ఐఏటీ) మోతడక క్యాంపస్‌లోని క్రికెట్ మైదానాలు ఇందుకు వేదిక కానున్నాయి. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, మెడికల్, ఫార్మా కళాశాలల జట్లు క్రికెట్ టోర్నీలో తమ అదృష్టం పరీక్షించుకోనున్నాయి. తొలుత జిల్లా స్థాయిలో మ్యాచ్‌లు జరుగుతాయి. సోమవారం జిల్లా స్థాయి మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అనంతరం ప్రాంతీయ స్థాయిలో మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు. తర్వాత రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయి.

Aster Ramesh HOSPITALS We'll Treat You Well

వేదిక: చలపతి ఇంజినీరింగ్ కళాశాల (ఎన్ఐఏటీ)

షెడ్యూల్ ఇలా.. గ్రౌండ్-1 ☛ ఉదయం 9.00 గంటలకు యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాల X చలపతి ఇంజినీరింగ్ కళాశాల(ఎన్ఐటీఏ) ☛ ఉదయం 11.30 గంటలకు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల X ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట **గ్రౌండ్-2** ☛ ఉదయం 9.00 గంటలకు కేఎల్ యూనివర్సిటీ X ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ☛ ఉదయం 11.30 గంటలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల X ఎన్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, విశదల

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

దేశాభివృద్ధిలో గ్రామీణ బ్యాంకులు కీలకం

జ్యోతి వెలిగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: దేశాభివృద్ధికి గ్రామీణ బ్యాంకుల తోడ్పాటు కీలకమని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని జేకేసీ కళాశాల ఆడిటోరియంలో ఏపీ గ్రామీణ బ్యాంకుల విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రధాని మోదీ లక్ష్యమైన వికసిత్ భారత్ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్లో భాగంగా రైతులు, ప్రజలకు రుణాలు మంజూరు చేయడం ద్వారా గ్రామీణ బ్యాంకులు చేయూత అందించాలన్నారు. ఏపీ గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ కె.ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలకు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కావాల్సిన రుణాలు, డ్వాక్రా సంఘాలకు ఆర్థిక చేయూత అందిస్తున్నట్లు వెల్లడించారు. విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కె.శివరామప్రసాద్ అధ్యక్షత వహించగా.. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి బ్యాంకు జీఎం ఎస్.ఆర్.రఘునాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ లక్ష్మీనరసయ్య, కోశాధికారి పరమహంసరెడ్డి, జిల్లాల కార్యవర్గ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

రుణాల ఊబిలో సొసైటీలు

వినియోగించని గోదాములతో బకాయిల భారం

న్యూస్‌టుడే, తెనాలి (కొత్తపేట)

బహుళ ప్రయోజనకర సౌకర్యాల గోదాము

జిల్లాలో బహుళ ప్రయోజనకర గోదాములను వ్యాపారానికి వినియోగించని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు రుణాల ఊబిలో చిక్కుకున్నాయి. ఈ సొసైటీల అధికారులు త్వరపడి వీటిని సొంతానికి వాడుకోవడం లేదా అద్దెకు ఇవ్వడం చేయకుంటే ఈ రుణ భారం మరింత పెరిగే అవకాశం ఉంది.

✦ కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని 29 పీఏసీఎస్‌ల పరిధిలో గోదాములు నిర్మించి ఇచ్చింది. ఒక్కో గోదాముకు రూ.40 లక్షల రుణం మంజూరు చేసింది. వీటి నుంచి ఆదాయం వచ్చేలా సొంతానికి లేదా అద్దెకు ఇవ్వాలని సూచించింది. ఈ వచ్చిన ఆదాయం నుంచి ఏటా రూ.6 లక్షల వంతున ఇచ్చిన రుణం తీరే వరకు చెల్లించాలని పేర్కొంది. 2 సొసైటీలు ఇప్పటికే గోదాముల్లో సొంతంగా వ్యాపారం చేస్తున్నాయి. మూడు అద్దెకు ఇచ్చాయి. ఈ వచ్చిన ఆదాయంలో కొంత రుణ బకాయిల కింద చెల్లింపులు జరుపుతున్నాయి. గోదాములను దేనికీ వినియోగించని వాటికి రుణం భారంగా మారింది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సొసైటీల పరిధిలో రైతులకు రుణాలు ఇవ్వాలని నగదు మంజూరు చేసింది. సొసైటీలు ఈ నగదును రైతులకు రుణంగా ఇచ్చాయి. వీరు చెల్లించిన రుణాన్ని ఆ సొసైటీలు తిరిగి జిల్లా కేంద్ర సహకార బ్యాంకుకు చెల్లించాయి. వీటిని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కరెంటు ఖాతాలో జమ చేసుకుంది. ఇందులో గోదాముల బకాయిల కింద ఒక్కో సొసైటీ నుంచి రూ.6 లక్షలు చొప్పున జమ చేసుకుంది. ఇక్కడ రైతులు తీసుకున్న రుణం చెల్లించేశారు. వీరు చెల్లించిన రుణం నుంచి కొంత ఆ బకాయిల కింద జమ చేసుకోవడంతో సదరు సొసైటీలు బకాయి పడ్డాయి. ఇలా ఏటా జమ చేసుకోవటం వల్ల సొసైటీ బకాయి కొండలా మారనుంది.

ద్విచక్ర వాహనంలో పాము కలకలం

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి ఎయిమ్స్ వద్ద ఆదివారం సాయంత్రం ఓ బైక్ ట్యాంక్ అడుగు భాగంలో పాము కనిపించడం కలకలం రేపింది. వాహనాన్ని బయటకు తీసే క్రమంలో పామును గమనించిన వ్యక్తి వెంటనే బైక్‌ను వదిలేసి దూరంగా వచ్చేశాడు. వైద్యశాల సెక్యూరిటీ, అటవీ సిబ్బంది, పాములను పట్టే నిపుణులు ద్విచక్రవాహనంలో ఉన్న పామును బయటకు తీసి ప్లాస్టిక్ డబ్బాలో బంధించారు. అనంతరం కొండ ప్రాంతంలో వదిలిపెట్టారు.

వాజ్‌పేయీ విగ్రహ ఆవిష్కరణకు ఏర్పాట్లు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో ఈ నెల 25న మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లను భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సురేంద్ర రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, భాజపా ప్రోటోకాల్స్ ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం తదితరులు ఆదివారం పరిశీలించారు. ఈ కార్యక్రమానికి రాజధాని రైతులను ఆహ్వానించేందుకు ఈ నెల 23న తుళ్లూరులోని హెచ్ఎస్ఆర్ కల్యాణ మండపంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు.

ప్రత్తిపాడు(కాకుమాను) రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వాజ్‌పేయీ విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని భాజపా రాష్ట్ర కిసాన్ మోర్చ మాజీ ఉపాధ్యక్షుడు పాండు రంగ విఠల్ అన్నారు. ప్రత్తిపాడులో ఆయన ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మండలంలో కొన్ని ఆలయాల నిధులు, భూములు అన్యాక్రాంతం చేశారని ఆరోపించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పక్కకు ఒరిగిపోయిన ఇసుక లారీ

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాయపూడి నుంచి గుంటూరు వైపు వెళుతున్న ఇసుక లారీ తుళ్లూరు లైబ్రరీ సెంటర్‌లో రోడ్డుపై ఇరుక్కుపోయి ఒక పక్కకు పూర్తిగా ఒరిగిపోయింది. భయపడిన డ్రైవర్ కిందకు దూకేసాడు. త్రుటిలో ప్రమాదం తప్పింది. ఇటీవల తాగు నీటి పైపుల మరమ్మతుల కోసం పంచాయతీ సిబ్బంది రహదారిని తవ్వి గోతులు పూడ్చివేశారు. అయితే భారీ వాహనాలు రాకపోకల సమయంలో రోడ్డు కుంగి వాహనాలు ఇరుకు పోతున్నాయి. పోలీసులు అక్కడికి వచ్చి ఇరుక్కు పోయిన లారీని క్రేన్‌ల సహాయంతో బయటకు లాగారు. ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి కుంటలో దిగి కార్మికుడి మృతి

మంగళగిరి గ్రామీణం: నీటి కుంటలో స్నానానికి దిగిన కార్మికుడు మృతి చెందిన సంఘటన ఇది. ఎస్ఐ చిరుమామిళ్ల ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రతాప్‌నాయక్(32), డిట్టు నాయక్ రెండు రోజుల కిందట రోడ్డు పనుల నిమిత్తం నీరుకొండ గ్రామానికి వచ్చారు. ఆదివారం ఉదయం వారు ఇద్దరు గ్రామ శివారు రిజర్వాయర్ కోసం తీసిన నీటికుంటలో స్నానానికి దిగారు. ఈ నేపథ్యంలో ప్రతాప్‌నాయక్ నీటిలో గల్లంతై మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు ఎయిమ్స్ మార్చురీకి తరలించి.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఫిరంగిపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నేపళ్ళ నరేంద్ర, సురేష్‌లు బైక్‌పై గుంటూరు నుంచి శ్రీశైలం వెళుతుండగా ఫిరంగిపురంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఒకరు తీవ్రంగా.. మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. వారిని 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఏఎస్ఐ మురళీకృష్ణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: అడవి తక్కెళ్ళపాడులోని టిడ్కో ఇళ్ల సముదాయం, స్వర్ణ భారతినగర్‌లలో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, కూటమి నేతలు పాల్గొన్నారు. కేక్ కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీస్తు బోధనలు అనుసరణీయన్నారు.

పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

ఏకాగ్రతకు చదరంగం దోహదం

తాడికొండ: చదరంగంతో ఏకాగ్రత మెరుగుపడుతుందని మోతడక చలపతి ఫార్మసీ ప్రిన్సిపల్ నల్లాని వెంకట రామారావు పేర్కొన్నారు. కళాశాలలో రాష్ట్ర స్థాయి ఓపెన్ చెస్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ జిల్లాల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ వారు ఎంపికైన విజేతలకు బహుమతులు అందజేయనున్నారు కళాశాల ఛైర్మన్ వై.వి ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక వికాసం, ఆలోచన శక్తి పెరిగేందుకు తమ వంతుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.

పోలియో నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: పోలియో నిర్మూలన ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఆదివారం చౌడవరం, పొత్తూరు, ఓబులనాయుడుపాలెం గ్రామాల్లో విద్యార్థులు పల్స్ పోలియోపై అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. శిబిరాల వద్ద సేవలందించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాదు, ప్రిన్సిపల్ కొల్లా శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

అవగాహన ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

గెలుపును పంచడమే నిజమైన ఆట

విజేతలను అభినందిస్తున్న డీసీపీ సరిత

గుంటూరు విద్య, న్యూస్‌టుడే: క్రీడలంటే పతకాలు కాదని, గెలుపును పంచడమే అసలు నిజమైన నిర్వచనమని ఎన్టీఆర్ కమిషనరేట్ డీసీపీ సరిత అన్నారు. ఆదివారం స్థానిక వికాస్ గ్రౌండ్స్‌లో భాష్యం ఒలంపస్ వార్షిక స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా డీసీపీ సరిత భాష్యం స్పోర్ట్స్ మీట్ జెండాను ఆవిష్కరించి క్రీడా జ్యోతిని వెలిగించారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. దేశానికి వన్నె తెచ్చిన ఎంతో మంది క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న భాష్యం యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు డీసీపీ సరిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్ఈఓలు శివ, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ అధికారిపై ఎస్పీ ఆగ్రహం

గుంటూరు నగరం, పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఓ కేసు దర్యాప్తులో సబ్ డివిజన్ అధికారి వ్యవహరించిన తీరుపై ఎస్పీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గత వైకాపా ప్రభుత్వంలో నల్లపాడు జీడీసీసీ బ్యాంకులో జరిగిన అక్రమాలపై ఇప్పటికే 11 మందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఇద్దరిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపర్చారు. అరెస్టు చేసిన వారిని పూర్తి స్థాయిలో విచారించకుండా హడావుడిగా కోర్టులో హాజరుపర్చిన సబ్ డివిజన్ అధికారిపై ఆదివారం రాత్రి ఎస్పీ తీవ్ర స్థాయిలో మండిపడినట్లు సమాచారం. కేసుకు సంబంధించిన రికార్డులన్నీ తన కార్యాలయంలో అప్పగించాలని హుకుం జారీ చేసినట్లు తెలిసింది. నల్లపాడు జీడీసీసీ బ్యాంకులో జరిగిన అక్రమాలపై ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. సబ్ డివిజన్ అధికారిపై ఎస్పీ మండిపడటం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాలతో సబ్ డివిజన్ అధికారిని తప్పించి క్రైమ్ డీఎస్పీకి దర్యాప్తు బాధ్యతలు అప్పగించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని సౌత్ డివిజన్ డీఎస్పీ భానోదయ హెచ్చరించారు. నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలోని పాత నేరస్థులు, రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారికి ఆదివారం స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. తీరు మార్చుకోకుంటే పీడీ యాక్ట్ నమోదు చేసి నగర బహిష్కరణ విధిస్తామని స్పష్టం చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. సీఐ వంశీధర్, ఎస్సైలు పాల్గొన్నారు.

కుల రహిత సమాజమే లక్ష్యం

తాడేపల్లి: కుల రహిత హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సీతానగరం చిన్నజీయర్‌స్వామి ఆశ్రమంలోని మండపంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్ల పూర్తయిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివన్నారాయణ అధ్యక్షత వహించారు. మంగళగిరి మరకత పీఠాధిపతులు జక్కేపురం మంగళ మహారాజ్‌స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ సేవలను కొనియాడారు. విభాగ్ ప్రచారక్ నవీన్ కృష్ణకుమార్, పుట్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల నివాళి

మంగళగిరి గ్రామీణం: ఎర్రబాలెం గ్రామ సీపీఐ నాయకుడు సయ్యద్ అబ్దుల్ రషీద్ స్మారక స్తూపానికి ఆదివారం ఆ పార్టీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, జిల్లా కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తదితరులు నివాళి అర్పించారు.

శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం
కంఠంరాజు కొండూరు గ్రామము, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా.
E-Procurement Tender
శ్రీ అమ్మవారి దేవస్థానము నందు 3 వివిధ అభివృద్ధి పనుల కొరకు టెండర్లు ప్రకటన చేయడమైనది. వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in నందు చూడగలరు.
శ్రీ అమ్మవారి సేవలో సం/- కార్యనిర్వహణాధికారి

జ్యోతి వెలిగిస్తున్న ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ ఛాన్సలర్ రాంబాబు

కబడ్డీ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

వేడుకగా ప్రారంభమైన వివా వీవీఐటీయూ యువజనోత్సవం

పెదకాకాని, న్యూస్‌టుడే: నిరంతరం పుస్తక పఠనంలో మునిగితేలే విద్యార్థులు రెండు రోజుల పాటు ఆట, పాటలతో సరదాగా గడిపేందుకు నంబూరులోని వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నోలాజికల్ యూనివర్సిటీ వేదికైంది. ఆదివారం 'వివా వీవీఐటీయూ 2025-26' జాతీయ స్థాయి యువజనోత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 93 అంశాల్లో పోటీలు నిర్వహిస్తుండగా.. తొలిరోజు నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'యామిని ఇన్ ద స్ట్రీట్ ఆఫ్ చైనా' ప్రతిబింబించేలా యూనివర్సిటీ ప్రాంగణాన్ని చైనాలోని సంస్కృతులు, పురాణాలు, ఆకృతులతో తీర్చిదిద్దారు. ఈ పోటీలకు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాశాలల నుంచి 9500 మంది విద్యార్థులు హాజరయ్యారు. పిల్లలు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువులోని వారి అనుభవాలు పంచుకున్నారు. నెయిల్ ఆర్ట్, హ్యాండ్ ప్రింటింగ్, బంతి ఆట, షూటింగ్, ట్రెడ్ పుల్లింగ్, డంబుల్స్ గేమ్ స్టాళ్ల వద్ద విద్యార్థులు తమ ప్రతిభను పరిక్షించుకున్నారు. వీవీఐటీయూలోని వివిధ బ్రాంచ్‌ల విద్యార్థులు 'శాక్' (స్టూడెంట్ యాక్టివిటీ కమిటీ)గా ఏర్పడి ఈ కార్యక్రమాలను నిర్వహించడం విశేషం.

నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి

వీవీఐటీయూకు చెందిన 'శాక్' (స్టూడెంట్ యాక్టివిటీ కమిటీ) అధ్యక్షురాలిగా ఉన్నాను. ఈ కమిటీలోని విద్యార్థులంతా కలిసి యువజనోత్సవంలోని ప్రతి కార్యక్రమం ఎలా నిర్వహించాలో నిర్ణయం తీసుకుంటాం. వేల సంఖ్యలో వచ్చే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయడంలో శాక్ విజయం సాధించింది. శాక్‌లోని సభ్యులు ఇతరులతో మాట్లాడే విధానం. . అందరినీ కలుపుకొని పోవడం వంటి స్కిల్స్‌తో ముందుకు సాగుతున్నారు. ఉద్యోగ నియామకాల్లో ఈ అనుభవం ఉపయోగపడుతుంది. **- టి.నవ్య (శాక్ అధ్యక్షురాలు)**

బాలికపై అత్యాచారం కేసులో నలుగురి అరెస్ట్

నిందితులను కోర్టు వరకు నడిపించుకుంటూ తీసుకెళ్తున్న పోలీసులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళగిరి పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐ వీరాస్వామితో కలిసి డీఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. తాడేపల్లి పరిధిలోని కేఎల్‌రావు కాలనీకి చెందిన షేక్ ఖాదర్‌బాషా, షేక్ కమల్‌సాహెబ్, విజయవాడ సుందరీనగర్‌కు చెందిన షేక్ సలీం, షేక్ రబ్బానీ ఈ నెల 18వ తేదీ 13 ఏళ్ల బాలికను రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో మంగళగిరిలోని 16వ నంబర్ జాతీయ రహదారి వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి ముగ్గురు నిందితులు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు కేకలు వేయడంతో ఆ ప్రాంతంలో వారు బాలికను రక్షించారు. జరిగిన విషయాన్ని తల్లికి వివరించగా ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను మంగళగిరి సమీపంలోని ఎర్రబాలెం వెళ్లే మార్గంలో వంతెన వద్ద అరెస్టు చేశామని, నిందితుల్లో ఖాదర్‌బాషా, కమల్‌సాహెబ్ తండ్రీకొడుకులుగా గుర్తించామని డీఎస్పీ చెప్పారు. కాగా, నిందితులను పోలీసులు వీధుల్లో నడిపించుకుంటూ మంగళగిరి కోర్టుకు తీసుకువెళ్లారు.

అదృశ్యం కేసు.. పోక్సోగా మార్పిడి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను ప్రేమ పేరుతో వల వేసి.. కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన యువకుడిని నున్న పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన బాలిక (17) విజయవాడ, నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే పెదనాన్న ఇంట్లో ఉంటోంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో రాహుల్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పాడు. వాటిని నమ్మిన బాలిక. . ఈ నెల 18 రాత్రి యువకుడితో కలిసి వెళ్లిపోయింది. 19న బాలిక కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు... అదృశ్యం కేసుపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బాలిక కిడ్నాపర్ల బారి నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పోలీసులు తీసుకువచ్చారు. దర్యాప్తులో ఆమెపై అత్యాచారం చేసినట్లు తేలింది. దీంతో మిస్సింగ్ కేసు సెక్షన్లను మార్చారు. రాహుల్ పక్కా ప్రణాళిక ప్రకారం హైదరాబాద్ నుంచి అద్దె కారు తీసుకొచ్చాడు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు నంబరు ప్లేటు మార్చాడు. స్నేహితులతో కలిసి ఆమెను కిడ్నాప్ చేశాడు. సత్తెనపల్లిలోని ఓ లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అలాగే అతడితోపాటు స్నేహితులపై కిడ్నాప్ సెక్షన్లు పెట్టారు. ప్రధాన నిందితుడితోపాటు అతనికి సహకరించిన ఇద్దరు స్నేహితులను నున్న పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, రిటైల్ ధర - 165, చికెన్ విత్‌స్కిన్ - 239, చికెన్ స్కిన్‌లెస్ - 272.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232, చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 145, 151, 165 చికెన్ విత్ స్కిన్ - 280 చికెన్ స్కిన్‌లెస్ - 290.

91.9 FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph :81422 92071.

REAL ESTATE
PLOT FOR SALE
GENERAL

గుంటూరు, పేరేచర్ల NRI IT కాలేజి ప్రక్కన ORRకి మధ్య APCRDA ప్లాట్లు కలవు. ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫ్రీ. 77290 75959, 99591 27008.

TO LET
COMMERCIAL

తెనాలి చెంచుపేట భాను టీస్టాల్ ఎదురు మెయిన్‌రోడ్ ఫేస్‌తో 24X60 అ॥షెడ్డు, 18X30 అ॥ ఖాళీ స్థలం, 4X60 అ॥ సందు అద్దెకు. ✆ 78932 66771.

JOBS

Wanted Software Developer Cloud Adminstrator Fashion Designer Beautician Receptionist (Trainers). ✆ 93472 77429

Wanted Receptionist, Co-ordinator & Office Boys to Work in Educational Institution, Brodipet, 4/9, Guntur. Contact: 90007 46753 Interviews Tuesday (23rd Dec) from 11am.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

డ్రీమ్‌స్కేప్ ఎడ్యుకేషన్ కన్సల్‌టెంట్స్ గుంటూరులో పనిచేయుటకు టెలీకాలర్స్(F) మార్కెటింగ్(M) కావలెను మంచిజీతం + ఇన్సెంటివ్స్ పార్ట్/ఫుల్‌టైం వర్క్. ✆ 9248865536

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు టెలికాలర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్, మరియు సీనియర్ టీం లీడర్స్ కావలెను. ✆ 95500 08995.

ప్రముఖ కంపెనీలలో సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ ఆఫీసర్స్. 10-15 వేలు, 8గం॥ డ్యూటీ, SSC పాస్, 20-50 సం॥. ✆ 85209 77729, 85209 77759.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాస్ ఇన్‌ఛార్జ్‌స్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము : 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు : ఇంటర్ నుండి పి.జి వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర॥ 91000 69089.

తెనాలి దగ్గర, దుగ్గిరాలలోని ప్రముఖ కాఫీ పరిశ్రమలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, ప్యాకింగ్ బాయ్స్ కావలెను. రూమ్, క్యాంటీన్ సౌకర్యం కలదు. ✆ 92980 11777, 80961 61777

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, క్యాంపస్ హాస్టల్ A.Orr పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 18000/- వరకు ఇవ్వబడును. ఉచిత భోజనము వసతి కల్పించబడును. విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు:22 సం॥ల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర. ✆: 92487 33320.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

1)మార్కెటింగ్ ఏజెంట్లు, 2) కలెక్షన్ ఏజెంట్లు 3) టెక్నికల్ పర్సన్లు 4) కంప్యూటర్ ఆపరేటర్లు 5) రిసెప్షనిస్ట్ కావలెను. SITI కేబుల్ & బ్రాడ్‌బ్యాండ్ ఆఫీసు, JKC రోడ్, గుంటూరు. 70930 76288.

తెనాలి రిలయన్స్ పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు 2 పంప్ బాయ్స్ (8 గం॥ డ్యూటి) జీతం: 12 వేలు+ESI & ఎయిర్ బాయ్ ఒకరు కావలెను. 93470 51723.

గుంటూరులోని ప్రముఖ, శానిటరీ షాపులో పనిచేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ (M/F) కావలెను. జీతం 12K - 16K ✆ 94936 56892

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు

ఎస్‌ఐ వెంకట్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నూతన ఎస్‌ఐలు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు ముగ్గురు ఎస్‌ఐలు నూతనంగా నియమితులైనట్లు సీఐ ఏవీ బ్రహ్మం, ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకట్ తెలిపారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసుకున్న బి.రవితేజ, బి.హరికృష్ణ, సంఘ సురేష్‌లు ఆదివారం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐలుగా బాధ్యతలు స్వీకరించారు. స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని వారు తెలిపారు.

అందని నీరు.. ఇదేం తీరు..

నిర్వహణ లోపాలతో జనం అవస్థలు

తుళ్లూరు, మేడికొండూరు, న్యూస్‌టుడే:

తాడికొండ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో స్థానికులతో ఇబ్బందులు పడుతున్నారు. సమగ్ర రక్షిత తాగు నీటి పథకాలు సరిగా పని చేయకపోవటం, స్థానికంగా చెరువులు, బోరుబావుల నిర్వహణ సరిగా లేకపోవటంతో తాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయి. కొన్ని చోట్ల గతంలో వేసిన పైపులు పూడిపోవటం, వడ పోతల బావులు అపరిశుభ్రంగా మారటం, మోటార్లు కాలిపోవటం వంటి సమస్యలతో తరచూ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.

దొండపాడు అంబేడ్కర్ కాలనీలో తాగునీరు రావడం లేదని చూపుతున్న మహిళలు

మండలం	జనాభా
మేడికొండూరు	65,000
తుళ్లూరు	54,000

కొనుగోలు చేసుకోవాల్సిందే....

మేడికొండూరు మండలంలో తాగు నీటి సరఫరా వ్యవస్థ అధ్వానంగా మారింది. గ్రామాల్లో అక్కడక్కడ తాగు నీటి చెరువుల్లో జమ్మి, తూడి కాడ దట్టంగా పెరిగింది. మరో పక్క కొన్ని గ్రామాల్లో వడపోతబావులు (ఫిల్టర్ బెడ్లు) పాడైపోయాయి. దీంతో నీరు దుర్వాసన వస్తోంది. ఆర్థికంగా భారమైనప్పటికీ తాగు నీటిని బయట కొనుగోలు చేసుకుంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ❖ కొర్రపాడు తాగు నీటి చెరువు అపరిశుభ్రంగా తయారైంది. భీమినేనివారిపాలెంలో పైపులు దెబ్బతినడంతో శివారు గృహాలకు నీరు అందడం లేదు.

రోజుల తరబడి ఇంతే..

తుళ్లూరు మండలం దొండపాడు గ్రామంలో పాతపాడు, కొత్తపాడులో పైపులైనుల మరమ్మతుల కారణంగా కొద్ది రోజుల నుంచి తాగు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ట్యాంకర్లతో పంచాయతీ అధికారులు నీరు సరఫరా చేస్తున్నారు. అంబేడ్కర్ కాలనీలో 3 రోజుల నుంచి మంచి నీరు సరఫరా కావటం లేదు. మరో ప్రక్క దొండపాడు టిడ్కో గృహాల్లో మంచి నీరు సరిగా సరఫరా జరగక పోవటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హరిశ్చంద్రపురం వద్ద నిర్మించిన సీపీడబ్ల్యూఎస్ స్కీం నుంచి తాగు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ఈ సమస్య ఉత్పన్నం అయ్యింది. తుళ్లూరుకు నూతన బోరు బావిని ఏర్పాటు చేయాల్సి ఉంది.

విద్యార్థులతో మాట్లాడుతున్న బాలకోటయ్య

వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వండి

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీ రాష్ట్ర సంక్షేమ బోర్డు ఛైర్మన్ పోతుల బాలకోటయ్య సూచించారు. మంగళగిరిలోని సోషల్ వెల్ఫేర్ బాలికల, బాలుర వసతి గృహాలను ఆయన ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుని మంచి పేరు తీసుకురావాలని సూచించారు. 'ముస్తాబు' కార్యక్రమ ఆవశ్యకతను వివరించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

'స్త్రీశక్తి' పథకంతో కుటుంబాలకు అండ

కుట్టు శిక్షణ పొందిన మహిళలతో నారా బ్రాహ్మణి

తాడేపల్లి, మంగళగిరి, మంగళగిరి గ్రామీణం, పెదనందిపాడు, మేడికొండూరు, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్ సొంత నిధులతో చేపట్టిన 'స్త్రీశక్తి' పథకంలో కుట్టు మిషన్ శిక్షణ పొంది కుటుంబానికి అండగా నిలుస్తున్నామని పలువురు మహిళలు ఆయన సతీమణి నారా బ్రాహ్మణి వద్ద ఆనందం వ్యక్తం చేశారు. ఆదివారం మంగళగిరిలో క్రికెట్ పోటీలు ప్రారంభోత్సవానికి హాజరైన ఆమెకు వారు పుష్పగుచ్ఛం అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. వారు తయారు చేసిన వస్త్రాల డిజైన్లను చూపారు. ఈ సందర్భంగా మైదానం వద్ద ఏర్పాటు చేసిన మంగళగిరి అభివృద్ధి పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను బ్రాహ్మణి తిలకించారు. తొలి రోజు శ్రీకృష్ణ లెవెన్ జట్టు.. స్పెన్సర్స్ లెవన్ జట్టు మధ్య హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో శ్రీకృష్ణ ఎలెవన్ జట్టు విజయం సాధించింది. ✦ మంత్రి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి పుట్టినరోజు వేడుకలను పార్టీ వర్గాలు అనాథశరణాలయాల్లో ఆదివారం నిర్వహించాయి. కాజ ఆమోదిని బాలికల హోమ్‌లో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు బోగి వినోద్ ఆధ్వర్యాన కేక్ కోసి బాలలకు అల్పాహారంతోపాటు రాతపుస్తకాలు అందించారు. ఎర్రబాలెంలోని షారోను అనాథ బాలల ఆశ్రమంలో తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, ఆరుద్రభూలక్ష్మి, జయసత్యా సంయుక్తంగా కేకు కోశారు. పెదనందిపాడు మండలం పాలపర్రులో తెదేపా నాయకుడు విజయసుశీల రావు, మేడికొండూరులో తెలుగు యువత ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

రథం పునరుద్ధరణకు చేయూత

మరమ్మతులకు రూ.20 లక్షల సొంత నిధులు

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మంగళగిరి మల్లేశ్వరస్వామి దేవస్థానం పెద్ద రథం పునరుద్ధరణకు నారా లోకేశ్ సహకారం అందిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ బోగి కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు. రథాన్ని బాగు చేయించాల్సిన అవసరం ఉందని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన రూ.20 లక్షలు సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం ఆ నిధులతో పాత రథ చక్రాలు, రంగులు, చిన్న చిన్న మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. మిగిలిన పనులను మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నాటికి పూర్తవుతాయన్నారు. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

తాడికొండ,న్యూస్‌టుడే: మోతడక గ్రామం ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యర్థాలు చేరాయి. ఈ సమస్యను స్థానికులు పంచాయతీ కార్యదర్శి అనిల్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించారు. జేసీబీ సహాయంతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

అడవి తక్కెళ్లపాడు ఉపకేంద్రంలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

పోలియోను తరిమికొడదాం

న్యూస్‌టుడే బృందం: పోలియోను తరిమికొడదామని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. ఆదివారం మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆయా వైద్యాధికారులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడికొండూరు: పేరేచర్లలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్..

వైఎస్ జగన్ పుట్టినరోజు కార్యక్రమాలు

న్యూస్‌టుడే బృందం: వైకాపా అధ్యక్షుడు జగన్ జన్మదినం సందర్భంగా ఆదివారం నియోజకవర్గాల వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జుల ఆధ్వర్యంలో కేకులు కోశారు. మిఠాయిలు పంచిపెట్టారు. పెదనందిపాడులో బలసాని కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో 150 మంది పేద మహిళలకు చీరలు అందజేశారు. ప్రత్తిపాడులో రక్తదానశిబిరం ఏర్పాటు చేశారు. మేడికొండూరులో వనమా బాలవజ్రబాబు, మాజీ మంత్రి సుచరిత ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్యక్రమాలు జరిగాయి. వైద్య శిబిరం, అన్నదానం నిర్వహించారు.

మేడికొండూరులో కేకు కోస్తున్న సుచరిత, వైకాపా నాయకులు

వైకాపా ర్యాలీలంటే జనం బెంబేలు..

తాడికొండ, న్యూస్‌టుడే: వైకాపా నాయకుల ర్యాలీల పేరుతో రహదారులపై ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. జగన్ జన్మదిన వేడుకల్లో భాగంగా తాడికొండలో నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో తుళ్లూరు వైకాపా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కోలేటి అనిల్ అతివేగంగా కారు నడుపుతూ పక్కన ఆపి ఉన్న విద్యుత్‌శాఖ ఏడీ కారును ఢీకొట్టారు. ఆ సమయంలో బయట విద్యుత్ పనుల తనిఖీ చేస్తున్న ఆ శాఖ అధికారులు భారీ శబ్దం రావడంతో ఉలిక్కిపడ్డారు. ఈ క్రమంలో కొద్దిసేపు వైకాపా నాయకులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. కారు లోపల ఎవరూ లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

విద్యుత్ శాఖ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన వైకాపా నేతలు

ఘటనలో దెబ్బతిన్న కారు

అశ్రునివాళి

జననం 15-06-1955

మరణం 08-12-2025

కీ॥శే॥ శ్రీ బండ్లమూడి సాంబశివరావు గారు

మంచికి మారుపేరుగా నిలిచి మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి.. అనంత లోకాలకు వెళ్లిన మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ విజయ వాసవి డెవలపర్స్ & బిల్డర్స్ మే॥పా॥ మాజేటి కిరణ్‌కుమార్

PSR INFRA

కొమ్మినేని నాగేశ్వరరావు పొన్నెకల్లు

మంత్రి సాయిబాబు గుంటూరు

రూ.2 లక్షల విలువైన ఇస్త్రీ పెట్టెల వితరణ

లబ్ధిదారులతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ప్రతినిధులు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: ఇస్త్రీ చేస్తూ జీవనోపాధి సాగించేవారికి ఆర్థిక భారం తగ్గించి మెరుగైన ఉపాధి పొందేందుకు ఎల్‌పీజీ ఇస్త్రీ పెట్టెలను అందజేసినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షుడు ప్రెగడ రాజశేఖర్ తెలిపారు. మంగళగిరిలోని వీజే జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన రోటరీ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గంతోపాటు విజయవాడకు చెందిన 20 మందికి రూ.2 లక్షల విలువైన ఇస్త్రీ పెట్టెలను బహూకరించినట్లు చెప్పారు. ముఖ్యఅతిథి రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ ఎస్‌వీ రామ్‌ప్రసాద్, పీడీజీ అన్నె రత్నప్రభాకర్, అసిస్టెంట్ గవర్నర్ పూర్ణచంద్ పాల్గొని ఇస్త్రీ పెట్టెలను పంపిణీ చేశారు. ఆ క్లబ్ కార్యదర్శి నిరంజన్ గుప్తా, సర్వీసు ప్రాజెక్టు డైరెక్టర్ చనుమోలు గోపాల్, రోటరీ వ్యవస్థాపక అధ్యక్షుడు అనీల్‌చక్రవర్తి ఇసునూరి, గాజుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా ముందుకు సాగాలి

నియామకపత్రాలు అందుకున్న వారితో శంకరరావు

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: మంగళగిరి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘానికి నూతనంగా ఎన్నికైన నాయకులకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆదివారం నియామకపత్రాలను అందజేశారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా డోకిపర్తి శ్రీనివాసరావు నియామకపత్రం పొందారు. ఈ సందర్భంగా బీసీల ఐక్యతను కోరుతూ మంగళగిరిలో ప్రదర్శన నిర్వహించారు. తొలుత అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించిన అనంతరం టిప్పర్ల బజారులోని కల్యాణ మండపంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పారెపల్లి మహేష్ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రధాన కార్యదర్శిగా మంగళగిరి ప్రసాద్, ఉపాధ్యక్షునిగా తోటా గౌరీశంకర్, కోశాధికారి రేఖాశివరామ్ ఎన్నికయ్యారు. తాడేపల్లికి కిలారి నూకరాజు, మంగళగిరికి జొన్నాధుల వెంకటకృష్ణ, తాడేపల్లి పట్టణానికి ప్రభురాజు ఎన్నికయ్యారు.

చిరు వ్యాపారులకు చేయూత

టిఫిన్ బండి పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

తుళ్లూరు: తెదేపా మాజీ మండలాధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్ ఆర్థిక సహకారంతో ఆదివారం తుళ్లూరు గ్రామానికి చెందిన నారదయ్య, దొండపాడు గ్రామానికి చెందిన నాగలక్ష్మిలకు చిరు వ్యాపారుల నిమిత్తం టిఫిన్ బండ్లు పంపిణీ చేశారు. మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దాత తెలిపారు. తెదేపా నాయకులు గద్దె కోటేశ్వరరావు, నల్లూరి మధు, జమ్ముల శ్రీనివాసరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు, విజయవాడ-8, గాయత్రీనగర్, కంచుకోటవారి వీధి కాపురస్తులు **నవ్య స్వాతి మోటపర్తి** గారి వల్ల సంజాయిషీ పొంది ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా..

నా క్లయింటు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తిని తాడేపల్లి గ్రామం, తాడేపల్లి మండలం, గుంటూరు జిల్లా కాపురస్తులు శ్రీ దొంతిరెడ్డి సీతారామిరెడ్డి గారి కుమారుడు **శివరామకృష్ణారెడ్డి** గారి నుండి క్రయము చేయదలచి క్రయము ఖరారు చేసుకొనియున్నారు.

కాగా, షెడ్యూల్ దాఖలా ఆస్తిని సదరు దొంతిరెడ్డి శివరామకృష్ణారెడ్డి గారు ది. 02-12-2004వ తేదీన కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ, సత్యనారాయణపురం కాపురస్తులు తాడేపల్లి సచ్చితానందరావు గారి కుమారుడు **సీతారామారావు** గారి వలన తాడేపల్లి మండలం, తాడేపల్లి గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన తాడేపల్లి గ్రామ డి.నెం. 26/2రు దాఖలా య.0.38 సెంట్లు శేరి మెరక భూమిని క్రయము పొంది వారి పేర మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, దస్తావేజు నెం. 9332/2004రుగా రిజిస్ట్రేషన్ చేయించుకొని, తదాది రెవెన్యూ శాఖ వారి నుండి భూమి యాజమాన్యపు హక్కు పత్రం మరియు పట్టాదారు పాస్ పుస్తకం పొంది సర్వసంపూర్ణ స్వాధీన నిర్వివాద హక్కుభుక్తములతో అనుభవించుచున్నారు. కాగా, షెడ్యూలు దాఖలా ఆస్తి సదరు తాడేపల్లి సీతారామారావు గారికి పూర్వార్జితంగా సంక్రమించిన ఆస్తి అయివున్నదని తెలుపుతున్నారు.

కాగా, సదరు షెడ్యూల్ తాలూకు స్థిరాస్తిపై ఎవరికైననూ ఏ విధమైన హక్కులు గాని, చెల్లదగు క్లెయిములు గాని, కోర్టు వ్యవహారములు గాని, థర్డ్ పార్టీ క్లెయిములు గాని, తనఖా వగైరాలు గాని మరి ఏ విధమైన అభ్యంతరములు గాని ఉన్న యెడల వారు ఈ ప్రకటన తేదీ లగాయతు **7 రోజుల వ్యవధి** లోపుగా తగు సాక్ష్యాధార పత్రముల కాపీలతో లిఖిత పూర్వకముగా రిజిష్టరు పోస్టులో తిరుగు చీటీతో సహా యీ దిగువ చిరునామాకు తెలియజేయవలసినది. సదరు గడువు తేదీలోగా చట్ట ప్రకారము చెల్లదగు ఎటువంటి క్లెయిములు గానీ, అభ్యంతరములు గాని రాని యెడల షెడ్యూలు ఆస్తిని నిర్వివాద ఆస్తిగా యెంచి నా క్లయింటు షెడ్యూల్ ఆస్తిని క్రయము పొంది వారి పేర రిజిష్టర్డు క్రయ దస్తావేజు పొందగలరనియు, ఆ దర్మిలా వచ్చు ఎట్టి అభ్యంతరములు గానీ, క్లెయిములు గానీ, నా క్లయింటును గానీ, షెడ్యూలు ఆస్తిని గానీ, చట్టపరంగా బైండు చేయజాలవనియు, నా క్లయింటు పొందు క్రయమును భంగము చేయజాలవనియు, ఇందుమూలముగా తెలియచేయటమైనది.

షెడ్యూలు: గుంటూరు డి. మంగళగిరి సబ్ డి. యిలాకా, తాడేపల్లి మండలం, మంగళగిరి సబ్ రిజిస్ట్రారు వారి యిలాకా, **తాడేపల్లి గ్రామ పంచాయతీ** ఏరియాలో చేరిన తాడేపల్లి గ్రామ **డి.నెం. 26/2రు, ఖాతా నెం. 1970రు దాఖలా** య.0.38 ట్లు లేక హె. 0.152ర్లు శేరి మెరక భూమికి **హద్దులు: తూర్పు:** కరకట్ట హద్దు, **దక్షిణం:** కళ్లం రత్తారెడ్డి గారి భూమి హద్దు, **పడమర:** రుద్రభూమి హద్దు, **ఉత్తరం :** కరకట్ట హద్దు మరియు యావత్తు యీజ్మెంట్ హక్కులతో సహా.

యస్. కోటిరెడ్డి, అడ్వకేట్

విజయవాడ, 59-6-31/ఎ2, లక్ష్మీ అపార్ట్‌మెంట్, గాయత్రీనగర్,

తేది: 21-12-2025 విజయవాడ -520 008 మొబైల్ నెం. 98486 86957

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

తాడేపల్లి, న్యూస్‌టుడే: మంగళగిరిలో పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ బృందం ఆదివారం 306 మొక్కలను పంపిణీ చేసింది. మిద్దె సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో నేరేడు, రావి, జామ వంటి జాతుల మొక్కలతోపాటు మరికొన్ని ఔషధ మొక్కలను అందజేసినట్లు బృంద ప్రతినిధి డాక్టర్ ఆకురాతి కోదండ రామయ్య తెలిపారు. భావితరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించడంకోసం ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

అవీ ఇవీ

పాఠశాల అభివృద్ధే ధ్యేయం

పెదనందిపాడు: పాఠశాల అభివృద్ధే ధ్యేయమని అప్ప జడ్పీ హెచ్‌ఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ (పెదనందిపాడు) సహ అధ్యక్షుడు ఆర్.శివరామకృష్ణయ్య అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చేయూత ఇవ్వాలని, ఇందులో భాగంగా పాత భవనాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించాలని నిర్ణయించారు. అధ్యక్షుడు డాక్టర్ సీకే రామయ్య, కార్యదర్శి జి.అప్పారావు, కోశాధికారి జవహర్‌రాణి, సభ్యులు పాల్గొన్నారు.

శాకాహారం, ధ్యానంతో ఆరోగ్యం

ప్రత్తిపాడు(కాకుమాను), న్యూస్‌టుడే: శాకాహారంతో శరీరానికి కావాల్సిన మంచి పోషకాలు అందుతాయని, ధ్యానంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు పొనకాల శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు ప్రపంచ ధ్యాన దినోత్సవ ర్యాలీని గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ కాకాని సురేష్ ప్రారంభించారు. ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

'దిల్లీలో ఆమోదం తెలిపి..ఇక్కడ వ్యతిరేకిస్తారా..?'

కాకుమాను: వైద్య కళాశాలలు పీపీపీ విధానంలో నిర్మించేందుకు దిల్లీలో ఆమోదం తెలిపి రాష్ట్రంలో మాత్రం వ్యతిరేకించడమేంటని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి వైకాపా అధినేత జగన్‌ను ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటరీ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిటీ పీపీపీ విధానాన్ని ఆమోదిస్తే అందులో వైకాపా ఎంపీ గురుమూర్తి సంతకం చేశారన్నారు. సీఎం చంద్రబాబుకు బిజినెస్ రిఫార్మర్ అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

తాడేపల్లి, మంగళగిరి: మంగళగిరి ఇమ్మానుయేల్ చర్చిలో ఆదివారం పాస్టర్ బొంతపూరి రవి ప్రకాష్ ఆధ్వర్యంలో మహిళలకు క్రిస్మస్‌ను పురస్కరించుకుని చీరలు పంపిణీ చేశారు. పలువురు విశ్వాసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

మంగళగిరి గ్రామీణం: ప్రజా భద్రత, చట్ట పరిరక్షణ లక్ష్యంగా పలుచోట్ల వాహనాలను తనిఖీ చేసినట్లు మంగళగిరి గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ ఆదివారం తెలిపారు. ఎన్.ఆర్.ఐ, ఆత్మకూరు, ఎర్రబాలెం డాన్ బాస్కో స్కూల్ కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేసి నిబంధనలు పాటించిన చోదకులు కౌన్సెలింగ్ ఇచ్చారు. నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసి బైక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు.

మద్యం సీసాల పట్టివేత

పెదనందిపాడు: పెదనందిపాడు-చిలకలూరిపేట రహదారిలో అడ్డరోడ్డు వద్ద ఆదివారం ఎస్సై సీహెచ్ సత్యనారాయణ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. పాలపర్రు వైపు వెళుతున్న ఓ కారులో అక్రమంగా తీసుకువెళ్తున్న 131 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని.. డ్రైవర్ జమ్మిశెట్టి వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

శ్రద్ధాంజలి

కీ॥శే॥ శ్రీ బండ్లమూడి సాంబశివరావు గారు

జననం: 15-06-1955 మరణం: 08-12-2025

మీ ప్రతి అడుగు మా కోసమే మీ ప్రతి ఆలోచన కుటుంబ శ్రేయస్సు గురించే మీ క్రమశిక్షణ, నిజాయితీ, విలువలు మా అందరికీ ఆదర్శం. మీరు మా మధుర స్మృతులలో ఎల్లప్పుడూ ఉంటారు. మీ దివ్య ఆశీస్సులు మాకు ఎప్పుడూ తోడు ఉంటాయి. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ...

భార్య: బండ్లమూడి ఉదయలక్ష్మి

కుమార్తెలు - అల్లుళ్లు

బండ్లమూడి భార్గవి, USA - దామినేని ప్రభాకరరావు, USA

బండ్లమూడి సౌజన్య, USA - ఉమ్మలనేని సుధీర్, USA

మరియు కుటుంబ సభ్యులు - బంధుమిత్రులు

పెద్దకర్మ: ది. 22-12-2025 సోమవారం తాడికొండ గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును.

(c) eenadu

శ్రీమతి అమరావతి... ఎవరికో బహుమతి

విజయవాడ నోవోటెల్‌లో శ్రీమతి అమరావతి సీజన్-10 ఆడిషన్స్ ఆదివారం నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేలా మహిళలు ర్యాంప్ వాక్‌తో సందడి చేశారు. 34 మంది పాల్గొనగా 22 మందిని జనవరి 10న జరిగే ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

చిన్నారులందరికీ పోలియో చుక్కలు

జిల్లాలో అయిదు సంవత్సరాల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ డీకే బాలాజీ కోరారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం చిలకలపూడి పాండురంగ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు కలెక్టర్ స్వయంగా పోలియో చుక్కలు వేశారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయన తన కుమారుడు సమృద్ధకు కూడా చుక్కలు వేశారు. డీఎంహెచ్‌వో యుగంధర్, డీఐవో ప్రేమ్‌చంద్, కమిషనర్ బాపిరాజు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొట్టె వెంకట్రావు పాల్గొన్నారు.
- న్యూస్‌టుడే, కలెక్టరేట్ (మచిలీపట్నం)

ఇ-చలానా తెలుసుకోండిలా..

కొత్తగా 'వాట్సప్ గవర్నెన్స్'లో సేవలు

ప్రభుత్వ సేవలన్నీ ఇప్పుడు ఒక్క క్లిక్‌తో మీ చరవాణిలోనే పొందవచ్చు. దీని కోసం వాట్సప్ గవర్నెన్స్ అందుబాటులోకి తెచ్చారు. తాజాగా పోలీసు సేవలను చేర్చారు. దీనిలో మీ వాహనంపై ఉన్న ఇ-చలాన్ వివరాలను తెలుసుకోవచ్చు.. అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చెల్లించవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ సేవల కోసం 95523 00009 నంబరును అందుబాటులోకి తెచ్చింది. దీనిని మీ ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి. వాట్సప్‌లో HI అని మెసేజ్ చేయండి. 'మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్' వస్తుంది. 'టిక్' అని టైప్ చేస్తే.. తెలుగు భాషలోకి మారుతుంది. దాని కింద భాగంలో ఉన్న 'సేవను ఎంచుకోండి' అనే దాన్ని క్లిక్ చేయండి. వచ్చిన 'సేవల్లో' 'పోలీసు సేవలు' ఎంపిక చేసుకోవాలి. దానిలో ఎఫ్ఐఆర్, ఎఫ్ఐఆర్ స్థితి, ఇ-చలాన్ అనే మూడు ఆప్షన్లు వస్తాయి. ఇ-చలాన్ విభాగాన్ని ఎంపిక చేసి.. మీ వాహనం నంబరు నమోదు చేసి క్లిక్ చేయాలి. మీ వాహనం రిజిస్ట్రేషన్ నంబరుపై ఉన్న ఇ-చలాన్లు కనిపిస్తాయి. వాటిని ఆన్‌లైన్ లోనే.. బ్యాంకు కార్డు ద్వారా చెల్లింపులు చేయవచ్చు. రశీదు కూడా వస్తుంది. ఒకవేళ చలాన్‌లు లేకపోతే.. 'నో చలాన్స్ ఫౌండ్' అని వస్తుంది.

పోలీసులు రూపొందించిన ప్రోచర్..

రవాణా శాఖ చలానాలు

నిబంధనలను ఉల్లంఘించిన వాహన చోదకులపై రవాణాశాఖ కూడా చలాన్‌లు విధిస్తుంటుంది. వీటిని ప్రత్యేకంగా 'పరివాహన్ సేవ' అనే వెబ్‌సైట్‌లో చూడొచ్చు. దీని కోసం https://parivahan.gov.in అనే సైట్లోకి వెళ్లి 'ఇ చలాన్ పేమెంట్'ను క్లిక్ చేయండి. దానిలో మీ వాహనం నంబరు నమోదు చేసి.. క్లిక్ చేస్తే మీ వాహనంపై ఉన్న ఇ-చలాన్‌లు వరుసగా కనిపిస్తాయి. ఇక్కడ రవాణాశాఖ చలాన్‌లతో పాటు పోలీస్‌శాఖ నమోదు చేసిన చలాన్‌లు కూడా కనిపిస్తాయి. అక్కడే పేమెంట్ ఆప్షన్ కూడా ఉంటుంది. దాన్ని క్లిక్ చేసి ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టేయవచ్చు.

– విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

బీసీ నేతకే పగ్గాలు

తెదేపా జిల్లా అధ్యక్షుడిగా గురుమూర్తి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

తెదేపా కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా వీరంకి వెంకట గురుమూర్తి నియమితులయ్యారు. జిల్లాలోని సామాజిక సమీకరణాల నేపథ్యంలో ఆయనకు అనూహ్యంగా అవకాశం లభించింది. ఉమ్మడి కృష్ణాలో బీసీ, ఓసీ వర్గాల వారు అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఒకటి బీసీ వర్గానికి కేటాయించాలని తెదేపా అధిష్ఠానం నిర్ణయించింది. జిల్లాల విభజన తర్వాత నుంచి ఇదే పంథా కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లాకు ఓసీ సామాజిక వర్గానికి చెందిన నెట్టెం రఘురామ్, కృష్ణాకు బీసీ నేత కొనకళ్ల నారాయణరావు గత అధ్యక్షులుగా వ్యవహరించారు. తాజాగా ఎన్టీఆర్‌లో ఓసీ సామాజిక వర్గ నేత గద్దె అనురాధకు అవకాశం ఇవ్వడంతో కృష్ణా జిల్లా పార్టీ పగ్గాలను బీసీ సామాజిక వర్గానికి చెందిన గురుమూర్తికి అప్పగించారు.

పార్టీలో సేవలు: పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరుకు చెందిన గురుమూర్తి విద్యార్థి నాయకుడిగా పార్టీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ, కృష్ణా జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధి హామీ పథకం కమిటీ సభ్యుడు, తెదేపా బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ★ పార్టీ ప్రతిపక్షంలో ఉండగా జిల్లాలో బస్సుయాత్ర, రైతుపోరు బాట, పాదయాత్ర, యువగళం, బాబుకు తోడుగా బీసీలు, జయహో బీసీలు వంటి కార్యక్రమాలు విజయవంతం చేయడంలో విశేషంగా కృషి చేశారు. పాదయాత్ర సమయంలో జగ్గయ్యపేట, మైలవరంలో బీసీసెల్ తరఫున కలవపూడి ప్రదర్శనలతో ఉత్తమ బీసీ సెల్ అధ్యక్షుడిగా అవార్డు అందుకున్నారు. ★ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం పలు పోరాటాలు చేసి పార్టీ పెద్దల మన్ననలు పొందారు. ★ వైకాపా ప్రభుత్వంలో గన్నవరంలోని తెదేపా కార్యాలయంపై దాడిని అడ్డుకుని నేతకు అండగా నిలిచారు. అక్రమ కేసు పెట్టి రాజమండ్రి జైలుకు పంపారు. 17 అక్రమ కేసులు ఆయనపై బనాయించారు. ★ పార్టీ నేతలపై అక్రమ కేసులపై నిరసనలు, వైకాపా తప్పుడు నిర్ణయాలను ఎండగట్టడం, బీసీలను తెదేపాకు చేరువ చేయడంలో కీలకంగా వ్యవహరించారు. దీంతో పలువురి నేతల పేర్లు పరిశీలనకు వచ్చినా అనూహ్యంగా వీరంకి గురుమూర్తికి పార్టీ జిల్లా అధ్యక్షపీఠం దక్కింది.

పార్టీ విధేయుడికి ప్రధాన కార్యదర్శిగా.. కృష్ణా జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శిగా గోపు సత్యనారాయణ నియమితులయ్యారు. మచిలీపట్నం మండలం కానూరు గ్రామానికి చెందిన ఆయన ఓసీ సామాజిక వర్గానికి చెందినవారు. 1985లో తెదేపాలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడిగా... రెండు సార్లు గ్రామ సర్పంచిగా చేశారు. పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా.. మచిలీపట్నం మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా చేశారు. జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు.

బొప్పాయి చెట్టుకి క్యారెట్..!

బొప్పాయి చెట్లకు క్యారెట్లు కాయడం ఎక్కడైనా చూశారా..? అదేంటి, క్యారెట్ భూమి నుంచి వస్తుంది కదా..! బొప్పాయికి అదెలా సాధ్యమని ఆశ్చర్యపోకండి. ఇటీవల బొప్పాయి తోటల్లో క్యారెట్‌లు, పక్షుల తరహాలో కాయలు చిత్ర విచిత్రంగా కనిపిస్తున్నాయి. ప్రతీ తోటలో ఎక్కడో ఓ చోట గోచరిస్తుంటే అన్నదాతలు ఆశ్చర్యపోతున్నారు. ఇందులో భాగంగానే ఎన్టీఆర్ జిల్లా మైలవరం ప్రాంతంలోని ఓ తోటలో క్యారెట్ మాదిరిగా బొప్పాయి కాసింది. అయితే జన్యుపర లోపాలతో పాటు, రైతుల సస్యరక్షణలో లోపాలతోనే కాయ పరిమాణం పెరగక వేరే ఆకృతుల్లో కనిపిస్తున్నాయని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. - న్యూస్‌టుడే, మైలవరం

24న ఉయ్యూరులో జాబ్ మేళా

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉయ్యూరులో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. బస్టాండ్ సమీపంలోని ఎన్‌ఏసీ శిక్షణ కేంద్రంలో ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుందన్నారు. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఫార్మసీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసున్న వారు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం 7981368429, 8885159008 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

అలంకారం అపురూపం .. అతివ నైపుణ్యం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

ఉత్సవాలు, నవరాత్రుల సమయాల్లో దేవతామూర్తుల అలంకరణకు భక్తులు ఎంతో ప్రాధాన్యం ఇస్తుంటారు. వివిధ రకాల పూలదండలు, వస్త్రాలతో అలంకరణ చేయడం సాధారణమే కానీ బందరు మండలం మేకవాని పాలెంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మవార్లు మాత్రం యాలకులు, బాదంపప్పులతో చేసిన దండలు, కిరీటాలు ధరించి ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారు. వీటి వెనుక ఆలయ నిర్వాహక సభ్యురాలు ఖుర్షిదా సృజన దాగి ఉంది.

ఖుర్షిదా

కొన్ని రోజుల ముందు నుంచే.. సుబ్రహ్మణ్యా స్వామి ఆలయంలో ఒక్కో పర్వదినాన ఒక్కో రకమైన అలంకరణలో దేవతామూర్తులు దర్శనమిస్తారు. స్వామివారి జన్మ నక్షత్రం కృత్తికా, సుబ్రహ్మణ్య షష్ఠి, కావడిసేవ తదితర రోజుల్లో ఆకట్టుకునే అలంకరణ చేస్తారు. బాదంపప్పు, యాలకులు, వివిధ రకాల పుష్పాలు, గడ్డి, నెమలి పింఛాలు, ముత్యాల దండలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. బాదంపప్పు, యాలకులతో చీరలు, అమ్మవారి జడలు చేయడం విశేషం.

అనధికార లేఔట్లలో రిజిస్ట్రేషన్ చేయొద్దు

ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్ ● 'ఈనాడు' కథనానికి స్పందన

ఉయ్యూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉయ్యూరు మండలం గండిగుంట పంచాయతీ పరిధిలో తొమ్మిది అనధికార లేఔట్లలో రిజిస్ట్రేషన్లు చేయకుండా వాటిని 22ఏలో చేరుస్తూ కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణా జిల్లా గండిగుంట పంచాయతీ పరిధిలో వెంచర్లు వేసిన కొంత మంది యజమానులు స్థలాన్ని ప్లాట్లుగా విభజించి అమ్మేసిన తర్వాత కామన్ సైట్లను విక్రయిస్తున్నారు. ఇలా ఓ అనధికార లేఔట్‌లో 226/3 సర్వే నంబరులో 72 సెంట్లు, 228/1ఎలో మరో 75 సెంట్లు కామన్ సైట్‌గా చూపించిన స్థలాన్ని యజమాని ఒకరికి విక్రయించాడు. అలాగే కాటూరు రోడ్డులోని వెంచర్ యజమాని కామన్ సైట్‌ను ఒక వ్యక్తికి విక్రయించారు. వీటిపై ఇటీవల 'ఈనాడు'లో 'గండిగుంట.. మిగలకుండా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు డీపీవో అరుణ గండిగుంట వచ్చి సైట్లను పరిశీలించారు. ఆమె నివేదిక ప్రకారం వాటిని రిజిస్ట్రేషన్ చేయొద్దని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సమస్యపై సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

విజయవాడ క్రీడలు: రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని చెన్నుపాటి ఇండోర్ స్టేడియంలో 22 నుంచి 28 వరకు యోనెక్స్ సన్‌రైజ్ 78వ జాతీయ అంతర్ రాష్ట్ర, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ జరుగుతుంది. స్టార్ షట్లర్లు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ వ్యక్తిగత, డబుల్స్ విభాగాల్లో తలపడనున్నారు. సోమవారం రాష్ట్ర మహిళా జట్టు ఉత్తరాఖండ్ జట్టుతో, రాష్ట్ర పురుషుల జట్టు తమిళనాడు జట్టుతో తలపడతాయని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పోలినేని అంకమ్మచౌదరి తెలిపారు.

ప్రమాదం చెప్పి రాదు.!

పాఠశాలలకు సెలవు రోజుల్లో నగరంలో ఆట స్థలాలు లేక కృష్ణా నది ఒడ్డున ఇసుక తెన్నెలపై ప్రమాదకరంగా ఆటలు ఆడుతున్నారు. నీటి కుంటల్లో లోతు తెలియక దిగి చిన్నారుల ప్రాణాలు పోయిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. వీటి సమీపంలోకి రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. -ఈనాడు, అమరావతి

గురితప్పని బుల్లెట్

రైఫిల్ షూటింగ్‌లో ఉమా మహేష్ పతకాలు

ఒలింపిక్స్‌లో విజయమే లక్ష్యంగా సాధన

నగరంలోని పోస్టల్ కాలనీలో నివసించే మద్దినేని రామకృష్ణ, మంజుల దంపతుల కుమారుడు ఉమా మహేష్ (20) రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటుతున్నాడు. కేఎల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 3 నుంచి 11 వరకు జైపుర్ (రాజస్థాన్)లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో తలపడి రైఫిల్ షూటింగ్‌లో రజత పతకం సాధించాడు. 2017లో ఇతను షూటింగ్‌లో అడుగుపెట్టాడు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్- 17 పోటీల్లో తలపడి కాంస్య పతకాన్ని సాధించి.. రాష్ట్ర జట్టులో స్థానం సాధించాడు.

అనంతరం గుంటూరులోని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్‌లో కోచ్ సుబ్రహ్మణ్యం వద్ద ప్రవేశించారు. ఆరు నెలల పాటు తండ్రి రోజూ అతన్ని గుంటూరు తీసుకెళ్లి శిక్షణకు దించి తిరిగి మళ్లీ రాత్రి 10 గంటలకు తీసుకొచ్చేవారు. ప్రస్తుతం భారత సీనియర్ జట్టులో కొనసాగుతూ విజయవాడ నగరపాలక సంస్థకు స్వచ్ఛ నిర్వేక్షణ్ కార్యక్రమానికి 'బ్రాండ్ అంబాసిడర్'గా కొనసాగుతున్నాడు. 2028 లాస్ ఏంజల్స్ ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాడు ఉమా మహేష్.
– న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

ఇవీ విజయాలు: 2022లో జర్మనీలో జరిగిన జూనియర్ వరల్డ్ కప్‌లో పసిడి పతకం సాధించాడు. 2023లో దక్షిణ కొరియాలో జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌లో కాంస్యం, అదే ఏడాది దక్షిణ కొరియాలో జరిగిన ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి, రజతం దక్కాయి. 2024లో ఇండోనేషియాలో జరిగిన ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో ఒక పసిడి, ఒక రజతం, 2024 స్పెయిన్‌లో జరిగిన వరల్డ్ కప్‌లో వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో రెండు పసిడి పతకాలు పొందాడు. 2024 దిల్లీలో వరల్డ్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకం, మూడేళ్ల పాటు బెంగళూరు, అసోం, జైపుర్‌లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఒక పసిడి, రెండు రజత పతకాలు, 2024 హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో ఆలిండియా అంతర్ విశ్వ విద్యాలయాల షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి దక్కింది.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

కలెక్టరేట్(మచిలీపట్నం), న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని అన్ని మండల, డివిజన్ కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ పరిష్కార వేదిక ఉంటుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమీపంలోని కేంద్రాల్లో అర్జీలు సమర్పిస్తే అధికారులు తగు చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

❖ **ఉద్యోగుల గ్రీవెన్స్** డేని సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముందు ఉదయం 9.30 నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. ఉద్యోగులు, పింఛనుదారులు గమనించాలని కోరారు.

అజ్మీర్ యాత్రికులకు వసతులు

మచిలీపట్నం (గొడుగుపేట): అజ్మీర్ యాత్రికులకు కూటమి ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తోందని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. అజ్మీర్‌లో ఉరుసు ఉత్సవాలకు మచిలీపట్నం నుంచి ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో ఆదివారం ముస్లింలు బయలుదేరి వెళ్లారు. ఆర్టీసీ ఛైర్మన్‌తో పాటు ఏపీ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసీమ్‌బేగ్, మంత్రి కొల్లు తనయుడు పునీత్ తదితరులు చాదర్ అందించారు.

యంత్రాలు మూలకు.. లక్ష్యం గాలికి..

నిత్యం కొన్ని వేలమంది ప్రయాణికుల రాకపోకలతో రాష్ట్రంలోనే అత్యంత రద్దీగా ఉండే విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో స్వచ్ఛభారత్‌లో భాగంగా విజయవాడ నగర పాలక సంస్థ సహకారంతో ప్లాస్టిక్ బాటిళ్ల రీసైక్లింగ్ చేసే యంత్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి చేయడం లేదు. దీంతో ఒకదానికి విద్యుత్తు సదుపాయం నిలిపేయగా.. మరొకదాన్ని మూలకు చేర్చారు. వీటిపై అవగాహన ఉండి ప్లాస్టిక్ బాటిళ్లు వేద్దామని వచ్చిన ప్రయాణికులు వాటి దుస్థితి చూసి వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని, లేకుంటే అక్కడి నుంచి తొలగిస్తే కనీసం స్థలం అయినా కలిసి వస్తుందని అంటున్నారు. -ఈనాడు, అమరావతి

జనవరిలో యువతకు ఉచిత శిక్షణ

సీతారాంపురం, న్యూస్‌టుడే : అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎలీప్), సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ (సీఈడీ) అనుబంధ సంస్థ ద్వారా జనవరి మొదటి వారంలో వ్యవసాయ అనుబంధ వ్యాపార రంగాలపై యువతకు ఉచిత శిక్షణ ఇస్తామని ఎలీప్ అధ్యక్షురాలు కె.రమాదేవి తెలిపారు. 45 రోజులపాటు ఈ శిక్షణ ఉంటుంది. అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, పశువైద్య విజ్ఞానం, చేపల పెంపకం, బయో టెక్నాలజీ, అగ్రి ఇంజినీరింగ్, ఫారెస్ట్రీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బీజెడ్‌సీ, హోమ్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌పై పీజీ, డిగ్రీ చదివిన పట్టభద్రులు అర్హులని పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. జాతీయ వ్యవసాయ విస్తరణ కేంద్రం జారీ చేసిన ధ్రువపత్రాన్ని అందజేస్తామన్నారు. బ్యాంకుల ద్వారా రాయితీతో కూడిన రుణ సదుపాయాన్ని పొందవచ్చని వివరించారు. ఆసక్తి గల వారు ఈ నెల 23 నుంచి 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94412 66769 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

కిరణ్‌శర్మ వెనుక.. ఆగ్రా ముఠా!

- ☛ పిల్లల తరలింపు, విక్రయాల్లో తెరపైకి కొత్త పేర్లు
- ☛ ప్రియాంక, మరో ఇద్దరు మహిళల పాత్ర

ఈనాడు, అమరావతి

పిల్లల విక్రయాలకు సంబంధించి మరిన్ని కోణాలు వెలుగుచూస్తున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి శిశువుల తరలింపు వెనుక మరికొందరి పేర్లు బయటకు వస్తున్నాయి. దిల్లీలోనే కిరణ్‌శర్మపై మరికొంత మంది సూత్రధారులు ఉన్నట్లు తేలింది. ఇటీవల కిరణ్ శర్మను అరెస్టు చేసినప్పుడు విచారణలో పలు విషయాలు వెల్లడయ్యాయి. ఆమె వెనుక ఆగ్రాకు చెందిన ముఠా ఉంది. దిల్లీ, పరిసర ప్రాంతాల్లో కిరణ్ శర్మ నేరుగా పిల్లలను వారి తల్లిదండ్రుల నుంచి కొనుగోలు చేసి విజయవాడకు తరలించేదని భావించారు. దర్యాప్తులో ఆమె మరో ముఠా నుంచి తీసుకుంటుందని తెలిసింది. ఆగ్రా ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు ఇందులో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. వీరిలో ప్రధానంగా ప్రియాంక కీలకమని తేలింది. ఆమెతో పాటు మరో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో కేసు మూలాల్లోకి వెళ్లేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

లావాదేవీలు, సంబంధాలపై దృష్టి

ఒక బృందం.. ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టు అయిన 12 మందిలో ముఖ్యమైన వారి బ్యాంకు లావాదేవీలు, ఫోన్ కాల్స్‌పై దృష్టి సారించింది. కిరణ్‌శర్మ, బలగం సరోజిని, నందిని, బ్లెస్సీ ఖాతాలకు ఎవరి నుంచి డబ్బు బదిలీ అయింది? వీరి నుంచి ఎవరెవరి ఖాతాలకు వెళ్లింది? అన్న వివరాలు పరిశీలిస్తున్నారు. మరో బృందం.. ప్రధాన నిందితుల సీడీఆర్‌లను వడపోస్తోంది. వీరి ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్‌ను వడపోస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఎవరెవరితో మాట్లాడారన్న వివరాలను లెక్క తేల్చుతున్నారు. విజయవాడ నగరంలోని మూడు స్టేషన్లలో నమోదైన మూడు కేసులతో పాటు గతంలో మహిళా స్టేషన్‌లోని కేసులో పీటీ వారెంట్లు వేసేందుకు దర్యాప్తు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆ తర్వాత కస్టడీకి తీసుకోనున్నారు.

ముంబయి ముఠా కోసం వేట

ప్రధాన నిందితురాలు సరోజిని.. ముంబయి ముఠా నుంచి ముగ్గురు పిల్లల్ని తీసుకుంది. ముంబయికి చెందిన కవిత.. మూడు సార్లు నూరి, సతీష్‌ల ద్వారా రైలులో పిల్లలను పంపించింది. ఈ నేపథ్యంలో వీరిని కూడా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు. పాత కేసులో కిరణ్‌శర్మతో పాటు దిల్లీకి చెందిన అనిల్ ప్రమేయమూ ఉంది. దీంతో వీరందరిని అరెస్టు చేసి కేసు మూలాల్లోకి వెళ్లేందుకు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. వీరంతా ఎలా పిల్లల్ని కొనుగోలు చేశారు? లేదా ఎక్కడైనా కిడ్నాప్ చేశారా? అన్నది తేలాల్సి ఉంది.

రీసర్వే చిక్కుముడులు

- ☛ వైకాపా పాలనలో అడ్డగోలుగా వ్యవహారం
- ☛ దరఖాస్తులు ఇస్తున్నా కొలిక్కిరాని సమస్యలు

ఈనాడు, అమరావతి, హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

వైకాపా వేసిన రీసర్వే చిక్కుముడులు ఏళ్లు గడుస్తున్నా కొలిక్కి రావడం లేదు. జాయింట్ ఎల్పీఎంలు, విస్తీర్ణాలలో వ్యత్యాసాలు, ప్రైవేటు భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడం వంటి సమస్యల సుడి గుండాల్లో అన్నదాతలు అల్లాడుతున్నారు. మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా పరిష్కారాలు కనిపించడం లేదు.

★ **ఎందెందు వెతికినా..** ఉమ్మడి జిల్లాలో వైకాపా పాలనలో 365 గ్రామాల్లో, 5లక్షల ఎకరాల్లో పైగా రీసర్వే చేపట్టారు. 6,753 జాయింట్ ఎల్పీ నంబర్లు ఉండగా ఇందులో దాదాపు లక్ష ఎకరాల వరకు ఇరుక్కుపోయాయి. దీంతో రుణాలు రావడం లేదు. పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదు. క్రయ విక్రయాలకు అవకాశం లేక రైతులు అల్లాడుతున్నారు. నమూనా గ్రామంగా రీసర్వే చేసిన బాపులపాడు మండలం రేమల్లెలో ఒకరి భూమి మరొకరి పేరుతో నమోదు చేయడం, విస్తీర్ణాలు తగ్గడం, జాయింట్ ఎల్పీఎం నంబర్లు కేటాయించడం వంటి సమస్యలు కోకొల్లలు..3సార్లు గ్రామసభలు పెట్టినా ఫలితం లేదు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సర్వే ఏడీలు మోహన్‌రావు, జోషీలా మాట్లాడుతూ..సమస్యపై వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరిస్తామని తెలిపారు.

గ్రామసభలో అర్జీలు సమర్పిస్తున్న రైతులు

అరెకరం కోత: ఆర్.ఎస్.నంబరు 7-1ఎలో మా కుటుంబానికి మొత్తం 4.18 ఎకరాల పొలం ఉంది. రీసర్వే అనంతరం దీనిని 3.66 ఎకరాలకు పరిమితం చేశారు. విశాఖపట్నంలో నివసించే మేము అన్ని ఆధారాలతో తప్పులను సరిచేయాల్సిందిగా పదేపదే ఇక్కడకు వచ్చి అర్జీలు సమర్పించినా ఫలితం లేకపోయింది. ఇటీవల తగ్గిన 52 సెంట్లలో 19 సెంట్లు కలుపుతామని చెప్పారు.
-వీరమాచనేని ప్రసాద్, రేమల్లె(బాపులపాడు)

విసిగిపోయాం: ఆర్.ఎస్ నంబరు 188/2లో నా పేరిట ఉన్న 40 సెంట్లు అసలు నమోదు చేయలేదు. నా భార్య పేరిట ఆర్.ఎస్.నంబరు 413/4బి, సిలో 2.50 ఎకరాలకు 2.23 ఎకరాలే నమోదు చేశారు. అర్జీలు ఇచ్చి అధికారుల చుట్టూ తిరిగి విసుగొచ్చింది. పరిష్కారం లేదు.
-దండమూడి బాలకృష్ణ, రేమల్లె(బాపులపాడు)

ఆంధ్రప్రదేశ్ రైతులకు శుభవార్త
రైతు సోదరులారా కేంద్ర వ్యవసాయ శాఖ వారి e-ANNADATA లో సభ్యత్వం తీసుకోండి.
ఏజంట్లు కావలెను
e-అన్నదాత కార్డులు రైతులకు పంపిణీ చేయుటకు ఏజంట్లు కావలెను
మరియు మీ మండలాల్లో త్వరలో ప్రారంభించే e-అన్నదాత క్యాంటీన్లు (ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు) కావలసినవారు సంప్రదించండి.
ఇట్లు: కన్నా రవి దేవరాజు (BJP)
e-అన్నదాత A.P కో ఆర్డినేటర్, ✆ 96184 25367

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

ఈఎస్ఎల్ క్రీడా సంబరానికి సై

నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు: తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' (ఈఎస్ఎల్)-2025కు రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిభావంతుల్ని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ఈఎస్ఎల్' పండగకు సమయం ఆసన్నమైంది. వర్ధమాన క్రికెటర్ల ప్రతిభకు వేదికగా నిలుస్తూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న 'ఈనాడు క్రికెట్' సోమవారం ప్రారంభం కానుంది. ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ మ్యాచ్‌లకు కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్ క్రికెట్ మైదానం వేదిక కానుంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, మెడికల్, ఫార్మా కళాశాలల జట్లు క్రికెట్ టోర్నీలో తమ అదృష్టం పరీక్షించుకోనున్నాయి. తొలుత జిల్లా స్థాయిలో మ్యాచ్‌లు జరుగుతాయి. సోమవారం జిల్లా స్థాయి మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అనంతరం ప్రాంతీయ స్థాయిలో మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయిలో కూడా పోటీలు జరగనున్నాయి.

EENADU SPORTS LEAGUE 2025

KAMINENI HOSPITALS VIJAYAWADA

వేదిక: కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్, కానూరు.

షెడ్యూల్ ఇలా.. 22.12.2025 (మొదటి మ్యాచ్) సీనియర్ విభాగంలో కేబీఎన్ డిగ్రీ కళాశాల X ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల 22.12.2025 (రెండవ మ్యాచ్) జూనియర్ విభాగంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (విజయవాడ) X ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ETV BHARAT, ఈనాడు.నెట్ FM Partner: ఈ FM Mee FM TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

వివరాలు పక్కా.. సేవలు ఎంచక్కా!

'యూఎఫ్ఎస్' యాప్ సర్వేతో ప్రయోజనాలెన్నో

జిల్లా వివరాలు	
మండలాలు:	26
సచివాలయాలు:	508
జనాభా:	17.35 లక్షలు

పమిడిముక్కల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాల అవసరం ఉన్న వారెంత మంది, ఎంతమంది ఏ విధమైన అవసరాలకు ఎదురు చూస్తున్నారో పక్కాగా తెలుసుకునేందుకు కూటమి ప్రభుత్వం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యూఎఫ్ఎస్) అనే ఏకీకృత సర్వేను ప్రారంభించింది. కుటుంబం, కుటుంబ సభ్యులు, స్థిర చరాస్తులు, విద్యార్హతలు, జీవనవిధానం వంటి అన్ని వివరాలను ఒకే సర్వేలో తెలుసుకోనున్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం, అందులో సభ్యులు, స్థిర చరాస్తులు, విద్య, ఉద్యోగ, వృత్తి వివరాలను పక్కాగా సేకరించనుంది. ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక యాప్ ఆధారంగా ఇకపై పౌరసేవలు, ప్రజాసంక్షేమ పథకాల రూపకల్పనతోపాటు పారదర్శకంగా, వేగవంతంగా అమలుపరచటానికి మార్గం సుగమం కాగలదని ప్రభుత్వం భావిస్తోంది.

యాప్ వాడకంపై శిక్షణపొందుతున్న సచివాలయాల సిబ్బంది

ఎంపీడీఓ పర్యవేక్షణ: గ్రామాల్లో యూఎఫ్ఎస్ సర్వేకు సచివాలయ సిబ్బంది రానున్నారు. జనవరి 12 లోపు ఒక్కో ఉద్యోగి 200 కుటుంబాల సర్వే పూర్తిచేయాల్సి ఉంటుంది.

కార్డులిస్తారు..

- గతంలో జరిగిన వివిధ సర్వేల్లో నమోదు కాని వారు ఇందులో నమోదవుతారు.
- సర్వే పూర్తికాగానే ప్రతి కుటుంబానికి ఒక కుటుంబ ప్రయోజన కార్డు ఇస్తారు.
- భవిష్యత్తులో ఆయా పథకాలకు అర్హత పొందుతారు.

యాప్‌లో ఏముంటాయంటే

పౌరుడి వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక వివరాలు, విద్యానైపుణ్యం, ఉపాధి, ఆదాయం, కుటుంబ స్థాయి వివరాలు, ఈకేవైసీ ఇతరాలు ఉంటాయి. ఆధార్ కార్డు వివరాలతో సహా అన్నీ పూరించాలి. కుటుంబ సభ్యులు ఇచ్చే వివరాల్లో తప్పులుంటే ప్రభుత్వ పథకాలకు దూరమవుతారు. యాప్‌లోని ప్రతి అంశాన్ని పూర్తిచేసి రూఢి పత్రాలను అందజేయాలి. ఉదాహరణకు భూములుంటే పట్టాదారు పాసుపుస్తకం నకలు, విద్యార్హత ధ్రువపత్రాలు జతపరచాలి. ఈవిధంగా సంతకాలు, వేలిముద్రలతో ఇంటి యజమానితోపాటు సభ్యులందరి సమాచారం అందులో నమోదుకావాలి.

సాతులూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

తీరు మారని వైకాపా!

ఫ్లెక్సీల్లో వివాదస్పద వ్యాఖ్యలతో ప్రజల్లో ఆందోళన

బంటుమిల్లి, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఓటమి పాలైనా వైకాపా నాయకులు, కార్యకర్తల తీరు మాత్రం మారడం లేదు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా కృష్ణా జిల్లా బంటుమిల్లి మండలం సాతులూరులో ఆయన అభిమానులు బ్యానర్ ఏర్పాటు చేశారు. అందులో 2029లో రప్పా.. రప్పా, 88 మ్యాజిక్ ఫిగర్ దాటాక గంగమ్మ జాతరే అనే వివాదాస్పద వ్యాఖ్యలు రాశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దాన్ని తొలగించారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.50 లక్షల విలువైన బంగారం రికవరీ

కంకిపాడు (గ్రామీణం, న్యూస్‌టుడే : కంకిపాడు పోలీసులు అంతర్ రాష్ట్ర దొంగను పట్టుకుని రూ.50 లక్షల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పునాదిపాడు వద్ద హైవే రోడ్డుపై ఐదుగురు ద్విచక్ర వాహనాల్లో నిలబడి మాట్లాడుకుంటూ ఉండగా అటుగా వెళుతున్న పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 2023లో కంకిపాడులోని కంకిపాటి శివశంకరరావు ఇంట్లో జరిగిన దొంగతనం బయటకు వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిని విచారించగా సుమారు 15 చోరీలు చేసి.. ఆ సొత్తు వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టినట్లు తేలింది. దీంతో 409 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మిగతా నలుగురిని విచారణ చేస్తున్నారు. ఆదివారం కంకిపాడు పోలీస్ స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సీఐ జె.మురళీకృష్ణ, ఎస్సై సందీప్ కేసు వివరాలు వెల్లడించారు.

మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు, పక్కన సీఐ మురళీకృష్ణ, ఎస్సై సందీప్, సిబ్బంది, వెనుక నిందితుడు (ముసుగులో)

చోరీలు చేయడంలో ప్రత్యేక విధానం

విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయ పాలవలస గ్రామానికి చెందిన పున్నాన రాంబాబు చెడు వ్యసనాలకు బానిసై తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతను ప్రత్యేకించి ఇళ్లలో బీరువా తాళాలు ఎక్కడ పెడతారో గుర్తించి బీరువా తెరిచి అందులోని కొంతమేర మాత్రమే బంగారు ఆభరణాలు చోరీ చేస్తుంటాడు. దీంతో ఇంట్లో వారికి చోరీ జరిగినట్లు అనుమానం రాకుండా ఉండటంతో పాటు ఇంట్లో వారిపై, బంధువులపై అనుమానం వచ్చేలా ఉంటుంది. ఇలా చోరీ చేయడంతో నిందితుడు దొరక్కుండా తిరుగుతున్నాడు. దీంతో పలు కుటుంబాల్లో కుటుంబ కలహాలు, బంధువులు, సన్నిహితుల మధ్య వివాదాలు జరిగాయి.

తాకట్టు పెట్టేందుకు మధ్యవర్తుల సహకారం

చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుడు తాను తాకట్టు పెట్టకుండా పెనమలూరు మండలం మురళీనగర్‌కు చెందిన పఠాన్ వసీమ్‌ఖాన్, పఠాన్ నాగూర్, చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన షేక్ అస్లాం, కానూరుకు చెందిన ఎం.నాగ విఘ్నేష్, మోర్ల పిచ్చిరెడ్డితో ముత్తూట్, మనప్పురం ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టిస్తాడు. ఆ డబ్బు తీసుకుని వారికి కమిషన్ ఇచ్చేవాడు.

నిందితుడిపై 50 కేసులు

నిందితుడు గతంలో శ్రీకాకుళం జిల్లాలో 29, విజయనగరం జిల్లాలో 14, విశాఖపట్నం జిల్లాలో 2, ఎన్టీఆర్ జిల్లాలో 2, ఏలూరు జిల్లాలో 2, గుంటూరు జిల్లాలో 1 కేసు ఉన్నాయి. ఆదివారం నిందితుడిని అరెస్టు చేసి.. కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు.

'కామన్ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలి'

బంటుమిల్లి, న్యూస్‌టుడే: విద్యా రంగంలో కామన్ స్కూల్ విధానం ప్రవేశపెట్టాలని యూటీఎఫ్ నాయకులు అన్నారు. ఆదివారం బంటుమిల్లిలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) జిల్లా నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని తెలిపారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీల ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. కృష్ణా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎండీ షౌకత్ హుస్సేన్, వి.కనకారావు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శులు కేఏ ఉమామహేశ్వరరావు, మనోహర్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ వీరాస్వామి, మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు, సీనియర్ కార్యకర్తలు కె.కాంతయ్య, అనుమకొండ వెంకటేశ్వరరావు, సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షౌకత్ హుస్సేన్, కనకారావు

బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడిగా శివయ్య

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : ఆర్.కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండలంలోని ఉప్పులూరులో ఆదివారం నిర్వహించిన ఎన్నికలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవానీ యాదవ్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ బుస్సే నాగప్రసాద్, ఏఎంసీ అధ్యక్షుడు అన్నే ధనయ్య పాల్గొని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా గణేష్ భవానీ మాట్లాడుతూ రాష్ట్రంలో 139 బీసీ కులాలున్నాయని.. వాటిలో అనేక మంది కులవృత్తులు, చేతివృత్తులు, సంచార జీవితాన్ని గడుపుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారికి చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా కొండవీటి శివయ్య, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా జుట్టురి సాయి వెంకటేష్, జిల్లా విద్యార్థి విభాగ అధ్యక్షుడిగా నాగనబోయిన బసవ శంకర్రావు యాదవ్, జిల్లా కార్యదర్శిగా మోదుగమూడి వెంకట సత్యనారాయణ, నియోజకవర్గ అధ్యక్షుడిగా తాటిపాముల నాగయ్య, ఉపాధ్యక్షుడిగా నక్కా వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా తమ్మిశెట్టి నాగమురళీకృష్ణ, కార్మిక విభాగ అధ్యక్షుడిగా కుప్పల శ్రీనివాసరావు, సేవాదళ్ విభాగం అధ్యక్షుడిగా కఠారి పవన్‌కుమార్, విద్యార్థి విభాగ అధ్యక్షుడిగా విరగాని సాయికృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శివయ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ భవానీ యాదవ్, ఏఎంసీ అధ్యక్షుడు ధనయ్య తదితరులు

పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

ప్రకృతి సాగుతో ఆరోగ్యకర సమాజం

గూడూరు, న్యూస్‌టుడే: ప్రకృతి సాగు.. ఆరోగ్యకర సమాజం ఏర్పాటుకు దోహదపడుతుందని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గూడూరు మండలం పినగూడూరులంక గోసదన్‌లో సౌభాగ్య విధానంలో సేవ్ సంస్థ నిర్వాహకుడు మేకపోతుల విజయరామ్ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఆదివారం ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. బుడమేరుకు వరద వచ్చినప్పుడు, మోంథా తుపాను సమయంలో నీరు చేరడంతో రసాయనిక ఎరువులు వినియోగించిన పొలాల్లో పంట కుళ్లిపోయి నష్టం జరిగిందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసిన పొలాల్లోని పంటలు తట్టుకుని మంచి దిగుబడి ఇచ్చాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులంతా ప్రకృతి సాగుపై దృష్టి సారించాలన్నారు. మహిళలకు గోమయంతో చేసే వస్తువులపై శిక్షణ ఇచ్చి, వారి ద్వారానే విక్రయాలు చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్‌కు కలెక్టర్ సూచించారు. విజయరామ్ మాట్లాడుతూ తాను రూపొందించిన సౌభాగ్య విధానంలో ఎకరాకు ఏడాదికి రూ.3 లక్షలకు తగ్గకుండా ఆదాయం వస్తుందని తెలిపారు. కలెక్టర్ పలువురు అధికారులు, రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో పంటలతో పాటు ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులను పరిశీలించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి జె.జ్యోతి, వ్యవసాయ శాఖ ఏడీ మణిధర్, తహసీల్దారు రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల నుంచి బంగారు ఆభరణాల చోరీ

చల్లపల్లి, న్యూస్‌టుడే: వృద్ధ దంపతులను మాయమాటలతో నమ్మించి దేవుడి పానకమంటూ పానీయంలో మత్తు మందు కలిపి ఇచ్చి బంగారం, వెండి ఆభరణాలు చోరీ చేసిన సంఘటన చల్లపల్లి మండలం పురిటిగడ్డలో చోటుచేసుకుంది. దీనిపై చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వృద్ధులైన బెజవాడ శివరామకృష్ణప్రసాద్-లీలాకుమారి దంపతులు పురిటిగడ్డలో ఉంటున్నారు. ఈ నెల 19వ తేదీన ఒక వ్యక్తి వీరి ఇంటికి వచ్చి మంగళగిరి పానకాలస్వామి గుడి నుంచి తీసుకువచ్చానంటూ మత్తు మందు కలిపిన పానకాన్ని వారితో తాగించాడు. కొద్దిసేపటికే వారు స్పృహ తప్పి పడిపోవడంతో లీలాకుమారి మెడలోని ఐదు సవర్ల బంగారు తాళిబొట్టు చైను, చేతులకు ఉన్న మూడు సవర్ల బంగారు గాజులు, వెండిప్లేటు, వెండి కలశం చెంబు తీసుకుని పారిపోయినట్లు ఆ దంపతుల కుమారుడు భవానీకిషోర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి ఇంటి వెనుక ఉన్న మరో ఇంటిలో ఒక పోర్షన్‌లో అద్దెకోసం వారం రోజుల క్రితం వచ్చాడని, రూ.2500 అద్దె నిమిత్తం అడ్వాన్స్ ఇచ్చినట్లు పోలీసుల ఫిర్యాదులో తెలిపారు. ఈ సంఘటన అనంతరం వృద్ధ దంపతులు చల్లపల్లిలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చల్లపల్లి ఎస్.ఐ.కె.వై.దాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెంకాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232, చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, 159, 170 చికెన్ విత్ స్కిన్ - 290 చికెన్ స్కిన్‌లెస్ - 300.

రమణీయం... భారతీయ నృత్య వైభవం!

గుడివాడ(సత్యనారాయణపురం), న్యూస్‌టుడే: అంతరించిపోతున్న భారతీయ సంప్రదాయ నృత్య కళలను ప్రోత్సహిస్తున్న ద్వారకా సాయి సేవాసమితి సభ్యుల సేవలు మరువలేనివని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్సు పర్యవేక్షణలో సత్యనారాయణపురం ఉపద్రష్ట వెంకటశాస్త్రి హాలులో ఆదివారం కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. అక్కినేని కళాశాల కరస్పాండెంట్ కాటగ్రడ్డ అప్పారావు మాట్లాడుతూ సంప్రదాయ శాస్త్రీయ నృత్యాలు భారత సంస్కృతి మూలాల్ని కాపాడతాయన్నారు. ప్రతిభ చూపిన నృత్య కళాకారులకు ఇండియన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు మాగంటి శ్రీనివాసరావు, ఘంటశాల పవన్, నవ్వుల పొదరిల్లు అధ్యక్షుడు డాక్టర్ ఎంఎస్‌వీ సత్యనారాయణబాబు, కూచిపూడి నాట్యమండలి సభ్యులు రాధాశ్యామ్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, డాక్టర్ యలమంచిలి రోజా, ద్వారకా సాయి సేవా సమితి అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, కార్యదర్శి మరీదు శ్రీనివాసరావు, సూరాబత్తుల జ్యోతి నాట్యాచారిణి మరీదు జయిన్య, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అభినందిస్తున్న కొనకళ్ల నారాయణరావు, మాగంటి శ్రీనివాస్ తదితరులు

- చిన్నప్పటి నుంచీ భరతనాట్యం, కూచిపూడి అంటే ఇష్టం. భారతీయ సంప్రదాయాన్ని విశ్వవ్యాప్తం చేయాలనే ఉద్దేశంతో మెలకువలు నేర్చుకుంటున్నాను. పలు ప్రదర్శనలు ఇచ్చాను.

- జి.హర్షిత, విజయవాడ, 9వ తరగతి

- యూట్యూబ్‌లో పలువురు ప్రదర్శించిన నృత్యాలను చూసి నేర్చుకున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడ్డాను. భరత నాట్యం అంటే నృత్య కళ మాత్రమే కాదు. మన ఆలోచనలు భావరూపంలో వ్యక్తపరిచే కళాత్మక సాధనం.

- ఎన్.నాగ వర్షిత, గుడివాడ, 8వ తరగతి

సంప్రదాయాల పరిరక్షణకు కృషి

మన సనాతన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించేందుకు నా వంతు కృషి చేస్తాను. కూచిపూడి అనేది ఆంధ్రప్రదేశ్‌కు గౌరవం తీసుకువచ్చిన ప్రాంతం. ఈ నృత్యం ద్వారా ఆంధ్రప్రదేశ్ కీర్తిని నలుమూలలకు తీసుకువెళ్తాను. **- పి.శ్రీనిధి, 9వ తరగతి, నరసరావుపేట**

నేనూ భాగస్వామిని అవుతా..

భరత నాట్యం ద్వారా నా కలను నిజం చేసుకున్నాను. చదువుతో పాటు కూచిపూడి, కథాకళి కూడా నేర్చుకున్నాను. కళలకు పుట్టినిల్లు భారతదేశంలో అవి అంతరించిపోకుండా చేసే కృషిలో నేనూ భాగస్వామిని అవుతా.

- వై.స్వరూప, 9వ తరగతి, అమలాపురం.

జగన్మాత సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచనం మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి, స్థానాచార్య శివప్రసాద శర్మ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

కథలు స్ఫూర్తిదాయకంగా ఉంటే మేలు

సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పూర్ణచందు, సాంబశివరావు తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : కథలు స్ఫూర్తిదాయకంగా, సామాజిక ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శ్రీకంఠస్ఫూర్తి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో శ్రీకంఠస్ఫూర్తి రచించిన 'కథ మళ్ళీ మొదలయింది' కథల సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నగరంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు కథలో కాలానుగుణమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలియజేశారు. రచయిత కంఠస్ఫూర్తి సమాజంలో వస్తున్న మార్పులకు అక్షర రూపం ఇచ్చారని వివరించారు. కథల సంపుటిని డాక్టర్ గుమ్మా సాంబశివరావు పరిచయం చేయగా.. అవధానుల మణిబాబు సమీక్షించారు. తొలి ప్రతిని సాహితీవేత్త ఎల్.శ్రీనివాసరాజు స్వీకరించారు. డాక్టర్ జి.వి.పూర్ణచందు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ ప్రముఖులు పాణ్యం దత్తాత్రేయశర్మ, రసరాజు, డాక్టర్ ఎం.సుగుణరావు, ఆచార్య కొప్పరపు నారాయణ మూర్తి, డాక్టర్ సాధనాల వెంకటస్వామి నాయుడు, ఎల్.శివరామకృష్ణ, విజయ కనక దుర్గ, వంశీ కంఠస్ఫూర్తి పాల్గొన్నారు.

చదరంగం విజేత హరీష్ సాయిరామ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని శ్యామ్ నగర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో పుచ్చలపల్లి హరీష్ సాయిరామ్ విజేతగా నిలిచాడు. మొత్తం ఆరు రౌండ్ల పాటు నిర్వహించిన ఈ పోటీలో హరీష్ సాయిరామ్ ఆరు పాయింట్లతో ప్రథమ, మీసాల ఈశ్వరరావు అయిదు పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలవగా.. నారాయణ రిషిత తృతీయ స్థానంలో నిలిచింది. చిన్నారులను ప్రోత్సహించేందుకు పలు వయసు విభాగాల్లో బాలబాలికలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమానికి కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, డాక్టర్ రాణి నరసింహమూర్తి, సిటీ కేబుల్ ఎండీ దండమూడి కృష్ణమోహన్, రాష్ట్ర సిటీ కేబుల్ ఆపరేటర్స్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ శ్రీనివాసరావు, బి.వెంకట్ హాజరయ్యారు. విజేతలను ది విజయవాడ చెస్ సంఘం అధ్యక్షుడు ఎండీ అక్బర్ పాషా, కార్యదర్శి ఎం.రాజీవ్ అభినందించారు.

చెరుకు ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్ దుర్మరణం

గారపాడు (గన్నవరం (గ్రామీణం), న్యూస్‌టుడే : ఉంగుటూరు మండలం గారపాడు వద్ద ఆదివారం తెల్లవారుజామున చెరుకు లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు.. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలకు చెందిన పసుపులేటి రాజు (26) చెరుకు లోడు ట్రాక్టర్‌ను ఉయ్యూరు కేసీపీ చక్కెర పరిశ్రమకు శనివారం రాత్రి బయలుదేరాడు. తెల్లవారుజామున 3 గంటలకు తేలప్రోలు-ఉయ్యూరు మధ్య ఉన్న గారపాడు వద్దకు చేరాడు. ఈ క్రమంలో చెరుకు లోడుకు కట్టిన తాడు తాటిచెట్టుకు తగలడంతో ఇంజిన్ పక్కకు లాగి అదుపు తప్పింది. రోడ్డు పక్కన ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్ లోడు డ్రైవర్ మీద పడటంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతికష్టం మీద మృతదేహాన్ని ఉంగుటూరు పోలీసులు బయటకు తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

23న కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్

సీతారాంపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పనశాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన కొత్తవంతెన వద్దగల పద్మపూజిత ఆటో ఫైనాన్స్‌లో 'కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్' నిర్వహిస్తామని ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుభూషణ్‌రావు తెలిపారు.

91.9 FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆81422 92071

REAL ESTATE

LEASE/ RENT

నూజివీడు- విస్సన్నపేట M.Rd లీలానగర్ 7500 Sft పక్క గోడౌన్ అద్దె/లాంగ్‌లీజుకు కలదు. C: 10Am-5 Pm. ✆ 98481 73135/ 63045 88926.

JOBS

Wanted Software Developer Cloud Adminstrator Fashion Designer Beautician Receptionist (Trainers). ✆ 93472 77429

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు టెలికాలర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్, మరియు సీనియర్ టీం లీడర్స్ కావలెను. ✆ 95500 08995.

SWEET MANTRA The Telugu House కానూరు, M.G రోడ్, విజయవాడ. WANTED సూపర్‌వైజర్స్, క్యాషియర్స్ పూర్తి బయోడేటాతో 11A.M to 3 P.M పై అడ్రస్సునందు సంప్రదించండి.

Male Nurse (or) Assistant తమ్మినేని హాస్పిటల్ గుణదలలో పనిచేయుటకు కావలెను. Contact: 98482 42880.

బ్యాంక్‌ఆఫీసులో పర్మినెంటుగా పని|| వెరిఫికేషన్స్, డేటాఎంట్రీ, అక్కౌంటెంట్స్, సూ||వైజర్స్, కం.ఆపరేటర్స్, అడ్మిన్‌ఇన్‌ఛార్జి, జీ:15 to 25k. ✆ 95058 38531.

MARKETING/ SALES

Paytm కంపెనీ విజయవాడలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M) కావలెను. Q: 10th ఆపైన. Age: 18-36. స్మార్ట్ ఫోన్, బైకు ఉండవలెను. జీతం: 20K+ Inc ✆ 83282 99866/ 83283 09019.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

మచిలీపట్నం

● మచిలీపట్నం ● పెడన

హిందూ ధర్మాన్ని పరిరక్షిద్దాం

చల్లపల్లి: హిందూ ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపైనా ఉందని, అదే హిందూ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని పెదకళ్లేపల్లి ఓంకార పీఠాధిపతి విజయానందగిరి స్వామీజీ అన్నారు. ఆదివారం రామానగరంలో ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సమ్మేళనాన్ని నిర్వహించారు. పెదముత్తేవి ముముక్షుజన మహాపీఠం పీఠాధిపతి గౌర కృష్ణ గురుదేవులు మాట్లాడుతూ దేవాలయాలు కుటుంబ, విద్యా వ్యవస్థలు పటిష్ఠంగా ఉండాలని చెప్పారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ కార్యవాహ ఎం.శ్రీనివాసరెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ కోనేరు బలరాం, సహ సంఘ చాలక్ వై.సాయీశ్వరరావు, చల్లపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు అడపా రవి, తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు

టమాట 48, వంగ 20, బెండ 36, పచ్చిమిర్చి 36, కాకర 44, క్యాబేజీ 24, క్యారెట్ 38, దొండ 34, బంగాళాదుంప 29, ఉల్లిపాయలు 30, గోరుచిక్కుడు 42, దోస 36, సొర 20,18, అరటికాయ 7,8, చిక్కుళ్లు 44, బీర 40, చామదుంప 26, మునగ 20/18, కంద 40, బీట్‌రూట్ 34, కీరదోస 44, బీన్స్ 86, క్యాప్సికం 64, అలసందలు 50, చిలకడదుంప 40, కొత్తిమీర 17/08, పుదీనా 15/05 సోమవారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. ఫిర్యాదులుంటే ఎస్టేట్ అధికారి బలిచక్రవర్తి, ఫోన్ 9182361295లో సంప్రదించవచ్చు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

సినిమాలు

రేవతి: అవతార్-3
మినీ రేవతి: గుర్రం పాపిరెడ్డి
సిరికృష్ణ: అఖండ-2
సిరివెంకట్: అవతార్-3

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

☛ నగరంలోని హౌసింగ్ బోర్డు సర్కిల్ సమీపంలో రహదారి పక్కన వేసిన చెత్త, ఖాళీ కొబ్బరి బొండాలు తొలగించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత వాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తేగా.. అధికారులు స్పందించి.. సమస్య పరిష్కరించారు.

-మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షుడు నాగసాయిశ్రీనివాస్

ఐక్యతతోనే హక్కుల సాధన

మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే: ఐక్యంగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమని ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు సన్నిధి నాగసాయిశ్రీనివాస్ అన్నారు. నగరంలోని వాసవీ భవన్‌లో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ పరంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వాసవీ భవన్‌లో జనవరిలో దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహావిష్కరణ ఉంటుందని చెప్పారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాదు, ఆర్యవైశ్య ప్రముఖులు, సంఘ నాయకులు తాడేపల్లి మెహర్‌బాబా, వెంట్రప్రగడ వీరాంజనేయులు, రాజమోహన్, కన్నయ్య, చక్కా చెన్న కేశవరావు తదితరులు ప్రసంగించారు. వివిధ ప్రాంతాలకు చెందిన నాయకులు పాల్గొని పలు అంశాలపై సమీక్షించారు.

అధ్వానంగా అండర్‌పాస్‌లు!

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో అండర్ పాస్‌లు అధ్వానంగా మారడంతో ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని వైకాపా ప్రభుత్వ హయాంలో అనేకసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో చిన్నపాటి వర్షం పడితే చాలు మోకాలిలోతు నీరు నిలిచి రోజుల తరబడి తిష్ఠ వేస్తోంది.

❖ మచిలీపట్నం మూడు స్తంభాల కూడలిలోని అండర్‌పాస్ అస్తవ్యస్తంగా తయారైంది. ఒక రోజు వర్షం కురిస్తే చాలు.. ఆ ప్రాంతంలో చేరిన నీరు దాదాపు నెల రోజులకుపైగా నిలుస్తోంది.

ఈ కారణంగా స్థానికులతో పాటు రాకపోకలు సాగించే బందరు, గూడూరు మండలాల పరిధిలోని ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులకు అర్జీలు కూడా అందించారు. దీనిపై ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై

మచిలీపట్నం మూడు స్తంభాల కూడలిలో ఇదీ పరిస్థితి

విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

❖ బందరు మండలం సుల్తానగరం వెళ్లే దారిలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై గ్రామస్థులు రిలే దీక్షలు కూడా చేపట్టారు. దీంతో లోతట్టుగా ఉన్న రహదారిని కొంతమేర అభివృద్ధి చేశారు. అయితే సమస్య మళ్లీ పునరావృతమైంది. ఎస్ఎన్‌గొల్లపాలెం సమీపంలో ఉన్న అండర్‌పాస్ వద్ద కూడా నీరు నిలిచింది. ఎప్పటి నుంచో ఇలాగే ఉన్నా పట్టించుకునే నాథుడే లేరని ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పటికి పరిష్కారమయ్యేనో?

అండర్ పాస్‌ల వద్ద నెలకొన్న సమస్యలను ఎప్పటికి పరిష్కరిస్తారో నని ప్రజలు ఎదురు చూస్తున్నారు. మురుగు పారేందుకు ఏర్పాటు చేసిన డ్రెయిన్లు కూడా పాడైపోయాయి. వాటిపై ఉన్న కల్వర్టుల దిమ్మెలు ధ్వంసమయ్యాయి. కొన్ని చోట్ల పిచ్చిమొక్కలు మొలిచి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో వాన నీరు పారే అవకాశం లేకుండా పోయింది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని విధంగా తయారైంది. ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా జాతీయ రహదారుల శాఖ అధికారులు పట్టించుకుని అండర్‌పాస్‌ల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

సామర్థ్యాల అంచనాకు పోటీలు దోహదం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: పోటీల్లో పాల్గొనడం ద్వారా సామర్థ్యాలు అంచనా వేసుకుని భవిష్యత్తులో మరింత ఉన్నతంగా రాణించేందుకు అవకాశం ఉంటుందని వివిధ పాఠశాలల ప్రతినిధులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. నగరంలోని జవహర్ పబ్లిక్ స్కూల్, శ్రీచైతన్య స్కూల్లో 'ఈనాడు, ఈటీవీ' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. వర్తమాన వ్యవహారాలు, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించగా.. ఆయా పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జవహర్ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన పోటీల్లో ఎన్.షాలెం(8వతరగతి), కేజీవీ బాబూరావు(9వతరగతి), ఎన్.డోలాచాతుర్య(9వతరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. విజేతలకు పాఠశాల కరస్పాండెంట్ వీవీ శివప్రసాద్, ఉపాధ్యాయులు ఇ.రమాదేవి, కె.రూపాదేవి, వి.శ్రావణి బహుమతులు అందజేశారు. ☛ శ్రీచైతన్య స్కూల్లో నిర్వహించిన పోటీల్లో బి.సాయి మనస్విని(8వతరగతి), బి.సత్యశ్రీనిధి(9వ తరగతి), జి.సందీప్(9వ తరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ప్రతిభ చాటిన వారికి ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, జి.మణికంఠ, జె.వెంకటేశ్వరరావు తదితరులు బహుమతులు అందజేశారు.

విజేతలతో జవహర్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ శివప్రసాద్, ఉపాధ్యాయులు

విద్యార్థులతో శ్రీచైతన్య స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

రక్తదానం ప్రాణదానంతో సమానం

శ్రీరామ్‌ను సత్కరిస్తున్న ఉపకులపతి రాంజీ, వివిధ సంస్థల ప్రతినిధులు, అతిథులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: రక్తదానం ప్రాణదానంతో సమానమని కృష్ణావిశ్వవిద్యాలయ ఉపకులపతి కె.రాంజీ అన్నారు. స్టార్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో ఆదివారం నగరంలోని సన్‌స్టార్ పాఠశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉపకులపతి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అపోహలు వీడి అందరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తెదేపా రాష్ట్ర నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, స్టార్ కళాశాల అధినేత పి.శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. విద్యా సంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కలిసి 40మంది రక్తదానం చేసినట్లు డైరెక్టర్ అయ్యప్పస్వామి తెలిపారు.

ముగిసిన పద్య నాటికల ప్రదర్శన

భాస్కరపురం(మచిలీపట్నం): సత్యహరిశ్చంద్ర పాత్ర భూమి ఉన్నంత కాలం నిలిచి ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విజయవాడ కళాంజలి థియేటర్స్ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన పద్య నాటికల ప్రదర్శన ఆదివారంతో ముగిసింది. చింతామణి, సత్య హరిశ్చంద్ర నాటకాల్లో కళాకారులు జీవించారు.

చిన్నారుల భవితకు రెండు చుక్కలు

మచిలీపట్నం రైల్వేస్టేషన్ ప్రాంతంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల

మచిలీపట్నం (గొడుగుపేట), గూడూరు, మచిలీపట్నంరూరల్, పెడన, గ్రామీణం, కృత్తివెన్ను, బంటుమిల్లి, న్యూస్‌టుడే: ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం బందరు, పెడన నియోజకవర్గాల్లో నిర్వహించిన శిబిరాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొని వైద్యాధికారులు, సిబ్బంది సమక్షంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. బందరు నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి యుగంధర్ వివిధ ప్రాంతాల్లో పర్యటించి కార్యక్రమ నిర్వహణ తీరును పరిశీలించారు. ☛ వన్నూరుకూనారులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా తెదేపా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. ☛ తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 36 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేయగా 2286 మందికి పోలియో చుక్కలు వేశారు. ☛ చేవేంద్రపాలెం పీహెచ్‌సీ పరిధిలోని వివిధ గ్రామాల్లో 26 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి 1506 మంది బాలలకు చుక్కలు వేసినట్లు వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెడన అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో 17 కేంద్రాల్లో 2290 మంది బాలలకు పోలియో చుక్కలు వేసినట్లు ఇన్‌ఛార్జి కమిషనర్ కాగిత రామాంజనేయులు చెప్పారు. పెడన పీహెచ్‌సీ పరిధిలోని 1201 మంది బాలలు లక్ష్యం కాగా 96 శాతం సాధించినట్లు వైద్యాధికారిణి మీనాదేవి పేర్కొన్నారు. జిల్లా మలేరియా అధికారి రామారావు మండలంలోని శింగరాయపాలెం కేంద్రంలో బాలలకు పోలియో చుక్కలు వేశారు. ☛ కృత్తివెన్ను మండలం వ్యాప్తంగా 95 శాతం పోలియో చుక్కల పంపిణీ పూర్తయినట్లు వైద్యుడు సాయిసందీప్ తెలిపారు. ☛ బంటుమిల్లి బస్టాండ్ వద్ద మండల వైద్యాధికారి పవన్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పెదతుమ్మిడి పీహెచ్‌సీ వద్ద జిల్లా మలేరియా అధికారి బి.రామారావు.. పోలియో చుక్కలు వేశారు. బంటుమిల్లి, పెదతుమ్మిడి పీహెచ్‌సీల పరిధిలో 3911 మంది చిన్నారులకు గాను 3775 మందికి చుక్కలు వేశారు.

చిలకలపూడి పాండురంగ స్కూల్లో డీఎంహెచ్‌వో యుగంధర్

పెడన: శింగరాయపాలెంలో డీఎంవో రామారావు

బంటుమిల్లిలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, వైద్యాధికారి పవన్‌కుమార్

స్వామి ఆదాయం రూ.7.85లక్షలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ సేవల రూపేణా రూ.7.85లక్షలు వచ్చినట్లు ఈవో శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. * ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వాస్తవ్యులు ముదునూరు నాగలక్ష్మి శర్మ నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,001, ముదునూరు రాజరాజేశ్వరరావు రూ.41,550 అందించారు. దాతల్ని సత్కరించారు.

కొండలమ్మకు పూజలు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానానికి వేలాది భక్తులు తరలివచ్చి పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక పాలపొంగళ్లు వండి సమర్పించారు. పల్స్‌పోలియో సందర్భంగా ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రంలో చిన్నారులకు ఛైర్మన్ ఈడే మోహన్, ఈవో కొండలరావు పోలియో చుక్కలు వేశారు.

ప్రేమతో ఉందాం.. క్రీస్తు సందేశం ఆచరిద్దాం

ఐక్య క్రిస్మస్ వేడుకలో ప్రార్థనలు చేస్తున్న దైవ సేవకులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: క్రీస్తు సందేశం అనుసరిస్తూ తోటివారితో ప్రేమ, దయతో వ్యవహరిద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. మచిలీపట్నం కోనేరు సెంటరులో ఆదివారం ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, తెదేపా రాష్ట్ర నాయకులు కొనకళ్ల జగన్నాథరావు (బుల్లయ్య) తదితరులు ప్రసంగించారు. క్రీస్తులోని ఓర్పు, సహనం అందరూ అలవరచుకోవాలన్నారు. దైవప్రసంగీకులు జాన్‌వెస్లీ, అల్లూరి విశ్వప్రసాద్, వడ్డే నవీన్ తదితరులు క్రీస్తు సందేశం అందించారు. ప్రఖ్యాత సినీగాయని కల్పన క్రీస్తు గీతాలు ఆలపించారు. క్రిస్మస్ క్యారల్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులు థామస్ అబ్రహం, మేకా విజయ్‌కుమార్, మత్తే భాస్కర్, వాల్టర్సన్, థామస్ నోబెల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగోత్సవం

బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పయాగం చేస్తున్న పండితులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: మచిలీపట్నం బచ్చుపేట వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు విశేష పూజలు నిర్వహించారు. 700 లీటర్ల ఆవు పాలతో స్వామివారికి అభిషేకం చేశారు. సాయంత్రం వేదపండితుడు ముత్తేవి శ్రీనివాస శశికాంత్ ఆధ్వర్యంలో పుష్పయాగోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఛైర్మన్ ముత్తేవి రవికాంత్, ఈవో గోవాడ వెంకటకృష్ణారావు పర్యవేక్షించారు. ☛ ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బలరామునిపేట యతిరాజభవనంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గుదిమెళ్ల లక్ష్మీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ☛ మండల పూజా మహోత్సవాల్లో భాగంగా చెమ్మనగిరిపేట అయ్యప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు, అయ్యప్ప దీక్షాపరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బలరామునిపేట యతిరాజ భవనంలో దేవతామూర్తులు

ప్రత్యేక పూజలు అందుకున్న చెమ్మనగిరిపేట అయ్యప్పస్వామి

బంటుమిల్లిలో..

బంటుమిల్లి, న్యూస్‌టుడే: బంటుమిల్లి రామాలయం వద్ద అయ్యప్పస్వామికి ఆదివారం పుష్పయాగం నిర్వహించారు. గురుస్వామి కొల్లా రాంబాబు తదితరులు ఆధ్వర్యంలో వివిధ రకాల పుష్పాలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు.

ఘనంగా మహా సుదర్శన హోమం

పెడన, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా స్థానిక గుడివాడ రోడ్డులో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం మహా సుదర్శన హోమం నిర్వహించారు. శైవ మహాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వేద పండితులు పరాశరం కృష్ణప్రసాద్, అగ్రిహోత్రం హరికృష్ణలు హోమ క్రతువు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బళ్ల ప్రసాద్, శైవ మహా పీఠం అధ్యక్షుడు శింగరాజు శ్రీనివాసరావు, కార్యదర్శి మల్లంపల్లి శ్రీనివాసరావు, కోశాధికారి శింగరాజు నాగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల సంచారం.. రాకపోకలకు అంతరాయం

రహదారులపై సంచరిస్తున్న పశువులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి నగరపాలక సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా.. ఫలితం ఉండటం లేదు. రద్దీగా ఉండే మార్గాలపై పశువులు తిరుగుతుండటంతో రాకపోకలకు ఆటంకంగా మారుతోందని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.

- మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

పూడిక తొలగించక... మురుగు పారక

నగరంలోని జిల్లా కోర్టు సమీపంలో వైష్ణవి మందిరానికి వెళ్లే రహదారి పక్కన డ్రెయిన్ పూడిపోయింది. అదే ప్రాంతంలో వ్యర్థాలు మేట వేశాయి. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొంత కాలంగా ఈ సమస్య ఉందని, సచివాలయ సిబ్బందికి చెప్పినా స్పందన లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి పూడిక తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

- గొడుగుపేట (మచిలీపట్నం), న్యూస్‌టుడే

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

లక్కోజు సంజీవ్‌రాయశర్మకు నివాళి

పెడన, న్యూస్‌టుడే: లక్కోజు సంజీవ్‌రాయశర్మ గణిత శాస్త్రంలో రాణించి.. పేరు గడించారని పలువురు వక్తలు ప్రశంసించారు. లక్కోజు జయంతి సందర్భంగా పెడనలో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాంజలి విద్యానికేతన్ విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గణిత ఉపాధ్యాయుల్ని సత్కరించారు. కార్యక్రమంలో పీఎస్వీ శ్రీనుబాబు, భవిరి శంకర్‌నాథ్, చింతలూరి సత్యనారాయణ, పి.దేవేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రిలయన్స్ మార్ట్‌లో మహిళల చేతివాటం

పెడన, న్యూస్‌టుడే: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని రిలయన్స్ మార్ట్‌లో చేతివాటం చూపిస్తున్న మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక తోటమూల ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలు ఆదివారం ఉదయం రద్దీగా ఉన్న సమయంలో మార్ట్‌లోకి ప్రవేశించి ఖరీదైన నిత్యావసరాలను చోరీ చేస్తున్నట్లు మేనేజరు కిశోర్ గుర్తించారు. దుస్తుల్లో దాచిన వస్తువులను బయటకు తీయించి స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మహిళలను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. గత మూడ్రోజులుగా వారు మార్ట్‌కు వచ్చి వెళ్తున్నట్లు సీసీ కెమెరా పుటేజీల ద్వారా నిర్ధారించారు.

అల్లుకున్న తూడు.. పట్టదా గోడు

నగరంలోని ఆదర్శనగర్ ప్రాంతంలో రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న డ్రెయిన్‌లో తూడు దట్టంగా అల్లుకుపోయింది. కొంతకాలంగా ఇలాగే ఉండటం, పూడిక తొలగింపు పనులు చేపట్టకపోవడంతో ఎగువ నుంచి వచ్చే మురుగు దిగువకు పారక, ఆర్టీసీ కాలనీ, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాగే వదిలేస్తే భవిష్యత్తులో మరిన్ని అవస్థలు పడాల్సి వస్తుందంటున్నారు. డ్రెయిన్‌లో పూడిక తొలగించాలని కోరుతున్నారు.

- గొడుగుపేట(మచిలీపట్నం), న్యూస్‌టుడే



విద్యార్థులకు ఉపకారవేతన చెక్కు అందజేస్తున్న బండి రామకృష్ణ

యువత ఉన్నతంగా ఎదగాలి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: యువత అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలని డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ అన్నారు. ఆదివారం నగరంలోని కృష్ణవేణి ఐటీఐ ప్రాంగణంలో శ్రీవాసవీ విద్యార్థి సహాయ నిధి సంస్థ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ విద్యార్థి సహాయ నిధి సంస్థ విద్యార్థులకు ఏటా రూ.లక్షల్లో ఉపకార వేతనాలు అందించడంతో పాటు పేదలకు వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం 250 మందికి రూ.5లక్షలు, పేద కుటుంబాలకు సైకిళ్లు, కుట్టు యంత్రాలు, గ్రైండర్‌లు పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, శ్రీవాసవీ విద్యార్థి సహాయ నిధి సంస్థ అధ్యక్షుడు కె.రమేశ్, ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బాబు, కోశాధికారి చిట్టూరి సత్యనారాయణరావు పాల్గొన్నారు.

రహదారా.. డంపింగ్ కేంద్రమా..!

స్థానిక 23వ వార్డు వైఎస్ఆర్ కాలనీ ప్రధాన రహదారి డంపింగ్ కేంద్రంగా మారింది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పురపాలక సిబ్బంది ఇంటింటికి తిరిగి చెత్త సేకరించడం లేదని, ప్రత్యామ్నాయం లేక రహదారి పక్కన వేయాల్సి వస్తోందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. చెత్త తరలింపునకు అధికారులు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- పెడన, న్యూస్‌టుడే

దాతల చేయూతతో మోపిదేవి ఆలయం దినదినాభివృద్ధి

మోపిదేవి, న్యూస్‌టుడే: దాతల చేయూతతో మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం దినదిన ప్రవర్ధమానం అవుతోందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ వ్యాఖ్యానించారు. దాతల భాగస్వామ్యం మరింత పెరగాలని, దాన్ని అందిపుచ్చుకుని భక్తులకు మౌలిక సౌకర్యాలు, వసతులు కల్పిస్తామన్నారు. సినీ నిర్మాత, డాక్టర్ ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ అట్లూరి నారాయణరావు రూ.కోటి వితరణతో టేకు రథం తయారీని ఆదివారం పూజలు చేసి ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం మురుముళ్లకు చెందిన కొల్లాటి కామేశ్వరరావు- శ్రీనివాసరావు శిల్పుల నేతృత్వంలో రథం తయారు చేస్తున్నారు. దేవదాయ శాఖ నిర్ణయించిన ధర చెల్లిస్తే కొత్తగా భక్తుల కోసం నిర్మించిన కాటేజీ గదులకు దాత పేరిట నామకరణం చేస్తామని, సంవత్సరానికి 20 నుంచి 30 రోజులు వారికి కేటాయిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవర ప్రసాదరావు తెలిపారు. రథ శిల్పులను సత్కరించారు. తహసీల్దార్ హరినాథ్, మండలి వెంకటరామ్, చిరువోలు బుచ్చిరాజు, గద్దే శ్రీధర్, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి, నడకుదిటి జనార్దనరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

పెడన, న్యూస్‌టుడే: మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు ఆదివారం పెడనలో వైకాపా శ్రేణులు నిర్వహించాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక, నియోజకవర్గ కన్వీనర్ ఉప్పాల రాము తదితరులు పాల్గొని.. కేక్ కోశారు. ఎంపీపీలు సంగా మధుసూదనరావు, రాజులపాటి వాణి, వెలివల చినబాబు, కూనసాని గరుడ ప్రసాద్, జడ్పీటీసీ సభ్యురాలు మైలా రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బంటుమిల్లిలో ఆపార్టీ జిల్లా కార్యదర్శి సుజ్ఞానం మహేష్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 32 మంది రక్తదానం చేశారు.

వేడుకల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ హారిక, ఉప్పాల రాము తదితరులు

పబ్లిక్ లీగల్ నోటీసు

నా క్లయింటు కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు కాపురస్తులు నల్లూరి (లేటు) మోతీలాల్ గారి భార్య విజయలక్ష్మి గారి కుమారులు 1) వంశీ కృష్ణ 2) శశాంక్ గార్ల సంజాయిషీ ప్రకారం ది. 21-12-2025న ఈనాడు దినపత్రికలో చల్లపల్లి వాస్తవ్యులు డాక్టర్ నల్లూరి రవీంద్రనాథ్ గారి తరుపున ఇచ్చిన బహిరంగ ప్రకటన/ PUBLIC NOTICEలోని విషయములు అన్నియు పూర్తిగా అవాస్తవాలు అని తెలియచేయడమైనది. నల్లూరి (లేటు) మోతీలాల్ గారు వారి జీవిత కాలంలో తన తండ్రి నల్లూరి శివరామకృష్ణయ్యకు ఏవిధమైన పవర్ ఆఫ్ అటార్నీ ది. 09-02-1982న వ్రాసి యుండలేదు. ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నీ సృష్టించి నల్లూరి (లేటు) మోతీలాల్ గారి ఆస్తిని కాజేయవలెననే దురుద్దేశ్యంతో డాక్టర్ నల్లూరి రవీంద్రనాథ్ తన తండ్రి ద్వారా దొంగ దస్తావేజులు సృష్టించినారు. సదరు నోటీసులోని షెడ్యూలులో పొందుపరిచిన హద్దులు తెలియజేస్తూ ఏవిధమైన డాక్యుమెంట్స్ లేవు. నా క్లయింటు నల్లూరి (లేటు) మోతీలాల్ కుటుంబ సభ్యులకు చెందిన ఆస్తిపై నల్లూరి రవీంద్రనాథ్‌కు ఏవిధమైన సంబంధంలేదు. సదరు మోతీలాల్‌పై మొదట నా క్లయింటు మచిలీపట్నం కోర్టులలో CAVEATS కూడా దాఖలుచేసి యున్నారు. ఇనగదురుపేట పోలీసు స్టేషన్‌లో, SP గార్కి వ్రాత పూర్వక ఫిర్యాదులు కూడా ఇచ్చియున్నారు. నల్లూరి రవీంద్రనాథ్‌కు ఏవిధమైన ఆస్తి R.S. నెం. 210 మచిలీపట్నం, రాజుపేటలో లేదు అని తెలియజేయటమైనది.

లంకిశెట్టి బాలాజీ M.A., B.Sc., BL.
లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ BA, LLM (USA)
అడ్వకేట్స్ ✆ 98482 12612
మచిలీపట్నం, ది. 21-12-2025

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

పనిచేసే వారికి సముచిత స్థానం

గురుమూర్తికి మిఠాయి తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్సీ వైవీబీ

ఉయ్యూరు, న్యూస్‌టుడే : తెదేపాలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని.. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వీరంకి గురుమూర్తినే ఇందుకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.వి.బి. రాజేంద్రప్రసాద్ అన్నారు. ఉయ్యూరులోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తిని ఘనంగా సత్కరించారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి ఫణికుమార్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అజ్జు తుల్లా, బీసీ నాయకులు శ్రీనివాసరావు, జడ్పీ పాఠశాల ఛైర్మన్ శివసాయి ప్రసాద్ పాల్గొన్నారు.

పోరంకి వాసవీ క్లబ్‌కు బెస్టు రీజియన్ అవార్డులు

రామకృష్ణ నుంచి అవార్డు అందుకుంటున్న మస్తానయ్య

పోరంకి, న్యూస్‌టుడే : పోరంకి వాసవీ క్లబ్ ఛైర్‌పర్సన్ రాచమడుగు మానస, కార్యదర్శి కారంశెట్టి మస్తానయ్య వాసవీ క్లబ్ సూపర్‌బెస్టు ఛైర్‌పర్సన్, సూపర్‌బెస్టు రీజియన్ సెక్రటరీ అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ అవార్డులు అందజేశారు. వారిని పలువురు అభినందించారు.

కోనేరు ఛారిటబుల్ ట్రస్టు నూతన కార్యవర్గ ఎన్నిక

స్థలదాతను సన్మానిస్తున్న ట్రస్టు ప్రతినిధులు

పెనమలూరు, న్యూస్‌టుడే : గోసాల కోనేరు ఛారిటబుల్ ట్రస్టుకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోసాలలో ట్రస్టు తరఫున నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో కోనేరు నరేంద్రబాబు అధ్యక్షత ఆదివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా మాజీ మేయర్ కోనేరు శ్రీధర్, కార్యదర్శిగా రవీంద్రనాథ్ ఠాగూర్, కోశాధికారిగా తరుణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 26 ఏళ్ల నుంచి ట్రస్టు సామాజిక సేవలను అభినందిస్తూ పెనమలూరుకు చెందిన కోనేరు రామ్మోహనరావు రూ.5 లక్షలు, పటమటకు చెందిన కోనేరు బసవ పూర్ణమ్మ రూ.2 లక్షలు, కురుమద్దాలికి చెందిన కోనేరు జగదీశ్వరరావు, సోదరులు రూ.1.50 లక్షలు, నూతన అధ్యక్షుడు కోనేరు శ్రీధర్ రూ.లక్ష విద్యానిధికి విరాళం అందించారు. ఆశ్రమ స్థల దాత కోనేరు నాగేశ్వరరావు, విజయకుమారి దంపతులు, ట్రస్టు ప్రముఖరాలు కోనేరు సీతారావమ్మను ట్రస్టు ప్రతినిధులు సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు కోనేరు కోటేశ్వరరావు, వెంకట రామారావు, కోనేరు రాధాకృష్ణ, నాగేశ్వరరావు, నార్ల మాలతి, ప్రముఖ వైద్యులు యార్లగడ్డ రమేష్, పారిశ్రామికవేత్త నన్నారామ్, విద్యావేత్త తమ్మారెడ్డి నిర్మల పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

కేకు కోస్తున్న వీరాస్వామి, ఫాస్టర్ ఇమ్మాన్యుయేలు తదితరులు

యనమలకుదురు, న్యూస్‌టుడే : క్రీస్తు మార్గం అనుసరణీయమని నగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరాస్వామి అన్నారు. ఆదివారం యనమలకుదురులో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఆయన పాల్గొని కేకు కోశారు. ఆయన మాట్లాడుతూ ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు క్రిస్మస్ పండగ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో దైవ సేవకుడు ఇమ్మాన్యుయేలు క్రీస్తును స్తుతిస్తూ ప్రార్థనలు చేశారు. ఈఖన్‌డేల కిరణ్ బ్రదర్స్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మోసాలను ప్రజలు మరిచిపోలేదు

విజయవాడ వన్ టౌన్ : వైకాపా ప్రభుత్వ పాలన ఐదేళ్లలో జగన్ మోహన్‌రెడ్డి చేసిన పాపాలు, రాష్ట్ర ప్రజలను నమ్మించి చేసిన మోసాలను రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదని ఏపీ నగరాల సామాజిక వర్గం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ సుకాశి కిరణ్ చెప్పారు. ఆదివారం పాతబస్తీ నెహ్రూబొమ్మ కూడలిలోని ఆయన కార్యాలయంలో మాట్లాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

◆ కానూరు కామయ్య తోపు సెంటర్లో కొన్ని రోజులుగా చెత్త తీయటం లేదని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కమిషనర్ షేక్ నజీర్ సిబ్బందిని పంపి సమస్య పరిష్కరించారు. ◆ యనమలకుదురు డొంకరోడ్డులో మసీదు సెంటర్ వద్ద కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగటం లేదని స్థానికులు తెలిపారు. స్పందించిన మున్సిపల్ ఈఈ భూషణం సిబ్బందిని పంపి విద్యుత్తు దీపాలకు మరమ్మతులు చేయించారు. **-కానూరు, యనమలకుదురు, న్యూస్‌టుడే**

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి : శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గొల్లపూడికి చెందిన ఎం.రవీంద్రనాథ్ రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది అమ్మవారి దర్శనం చేయించారు.

కంభంపాటి వెంకట నరసమ్మకు నివాళి


చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, నాయకులు

పెద్దఅవుటపల్లి (గన్నవరం గ్రామీణం), న్యూస్‌టుడే : తెదేపా సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు కంభంపాటి రామ్మోహన్ తల్లి వెంకటనరసమ్మ (99) బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న అవనిగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ మంత్రి పీతల సుజాత, కలపాల కిరణ్, నాయకులు ఆమె చిత్రపటానికి ఆదివారం నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు

వేడుకలో వైకాపా కార్యకర్తలు

పెనమలూరు, న్యూస్‌టుడే : పెనమలూరు, చోడవరం గ్రామాల్లో వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం నిర్వహించారు. పెనమలూరు ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మరీదు సుజాత ఆధ్వర్యాన కేకు కోసి పంచారు. చోడవరంలో కార్యకర్తలు టపాసులు కాల్చారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్ జంక్షన్ : హనుమాన్ జంక్షన్‌లో వైకాపా మండల కన్వీనర్ నక్కా గాంధీ, ఎంపీపీ నగేశ్, జడ్పీటీసీ సభ్యురాలు గంగాభవానీ, నాయకులు కిరణ్‌మూర్తి, దయాల విజయనాయుడు ఆధ్వర్యంలో కేకు కోశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

వసతి గృహం.. నిరుపయోగం

★ కరోనా సమయంలో మూత ★ పునరుద్ధరిస్తే విద్యార్థులకు ప్రయోజనం

కంకిపాడు, న్యూస్‌టుడే

పేద విద్యార్థుల బంగారు భవితకు బాటవేసే ప్రభుత్వ వసతి గృహాలు కరోనా ప్రభావం నుంచి ఇంకా కోలుకోలేదు. నాలుగేళ్లుగా మూతపడిన 80 శాతం సాంఘిక సంక్షేమ శాఖ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. నిర్వహణ లోపంతో కొన్ని శిథిలావస్థకు చేరగా, మరికొన్ని పాముల పుట్టలకు నిలయంగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ముస్తాబు' పథకంతో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన ఈ భవనాలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకునే అవకాశం లభించింది.

నాలుగేళ్లుగా మూతపడిన కంకిపాడులోని బాలుర వసతి గృహ భవనం

నియోజకవర్గంలో ఒక్కటే..

పెనమలూరు నియోజకవర్గంలో కంకిపాడు, గొడవర్రు, పునాదిపాడు, తెన్నేరు, ఆకునూరు, ఉయ్యూరులో చాలా కాలం ఎస్సీ, బీసీ వసతి గృహాలు నిర్వహించారు. వీటిలో చేరడానికి సిఫార్సులు అవసరయ్యేవి. బాల, బాలికలతో కళకళలాడేవి. 2020- 21లో కరోనా లాక్‌డౌన్ సమయంలో వీటిని నెలల తరబడి మూసేశారు. వీటి బాగు, నిర్వహణపై వైకాపా ప్రభుత్వం శీతకన్ను వేసింది. దీంతో గొడవర్రులోని బాలికల వసతి గృహం మినహా అన్నీ మూత పడ్డాయి.

ప్రయత్నాలు ఫలించలేదు

2025- 26 విద్యా సంవత్సరం ప్రారంభంలో దరఖాస్తులు ఆహ్వానించారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది ఆయా పాఠశాలలకు వెళ్లి అవగాహన కల్పించినా ఫలితం లేకపోయింది. అకునూరు, తెన్నేరు వసతి గృహాలను ఇతర ప్రభుత్వ శాఖలు వినియోగించుకుంటున్నాయి. మిగతావన్నీ నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి.

'ముస్తాబు'ను విస్తరించాలి

ప్రభుత్వ వసతి గృహాలకు పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ముస్తాబు' పేరుతో పథకాన్ని ప్రకటించింది. మూతపడిన వసతి గృహాల స్థితిగతులపై నివేదికలను ఇప్పటికే సంబంధిత ఉన్నతాధికారులకు పంపారు. వీటిని పునరుద్ధరిస్తే నిరుపేద విద్యార్థులకు వసతితో పాటు క్రమశిక్షణతో కూడిన మెరుగైన విద్య అందుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పశువుల ఎరువుతో వాహనదారులకు ఇక్కట్లు

టిప్పరు నుంచి జారుతున్న ఎరువు

కంకిపాడు, న్యూస్‌టుడే : కంకిపాడు- గొడవర్రు రహదారిపై పశువు పేడతో ప్రయాణికులు ఇక్కట్ల పాలయ్యారు. ఆదివారం రాత్రి రొయ్యూరు వైపు నుంచి వస్తున్న భారీ టిప్పరు వెనుక భాగం తలుపు గడి ఊడింది. దీంతో నీటితో పలుచగా ఉన్న ఎరువు వాహనం నుంచి జారి రహదారిపై గుట్టలుగా పడింది. ఇలా 100 మీటర్ల మేర విస్తరించడంతో జిగురుగా తయారైంది. దీంతో వాహనదారులు అంచుల్లో రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఎరువు నుంచి వ్యాపిస్తున్న దుర్వాసనతో దుకాణదారులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు. దీన్ని తొలగించే యత్నంలో యజమానులు, పోలీసులున్నారు.

అజాగ్రత్తగా ఉంటే.. అంతే సంగతులు

కోతకు గురైన రైవస్ కాల్వ కట్ట

రైవస్ కాలువపై ఆంగ్లేయుల కాలంలో నిర్మించిన వంతెనకు రెండు వైపులా కట్టలు కోతకు గురయ్యాయి. పశువుల రాకపోకలతో ఇవి మరింత విస్తరించాయి. కంకిపాడు- కేసరపల్లి రహదారిపై ఇక్కడ అంచులు, ఇనుప రెయిలింగ్ ధ్వంసమయ్యాయి. ఇరుకుగా ఉండటంతో వాహనాలు పక్కకు వెళ్లే అవకాశం లేదు. గుంతలను గుర్తించలేక వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రక్షణ గోడ నిర్మాణం, బారికేడ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. **-ఉప్పులూరు (కంకిపాడు), న్యూస్‌టుడే**

విజయవంతంగా పల్స్ పోలియో

పోరంకిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు తదితరులు

బాపులపాడులో సర్పంచి, ఎంపీపీ, జడ్పీటీసీ, తదితరులు

గన్నవరంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

న్యూస్‌టుడే, బృందం : జిల్లాలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రులు, బస్టాండ్లు, రద్దీ కూడళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేసి.. ఆరోగ్య సిబ్బంది 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పలు చోట్ల అధికారులు, వైద్యులు పరిశీలించారు. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కార్యక్రమాలను ప్రారంభించారు.

కలవపాములలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చౌదరి...

కానూరులో దుర్గగుడి పాలకవర్గ సభ్యుడు వెలగపూడి శంకరబాబు తదితరులు

ఉయ్యూరులో రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్ అధికారిణి డాక్టర్ శిరీష

నారా బ్రాహ్మిణి పుట్టిన రోజు వేడుక

వేడుకలో తెదేపా నేతలు

పెనమలూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సతీమణి బ్రాహ్మిణి జన్మదిన వేడుక తెలుగు యువత ఆధ్వర్యంలో గంగూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు గొల్లపూడి ఫణీంద్రకుమార్, ఇర్ఫాన్ పాషా, అబ్దుల్ గౌస్ కేకు కోసి చిన్నారులు, వృద్ధులకు పంచారు. కార్యక్రమంలో తెలుగు యువత ప్రతినిధులు అహ్మద్‌ఖాన్, చిత్తూరి ప్రవీణ్, నాగరాజు, మౌలాలి, సురేష్, గౌతమ్, నాగేంద్ర పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారం చూపరా?

మురుగు దుస్థితి

తిప్పనగుంట పంచాయతీ పరిధిలో మురుగు వ్యవస్థ అధ్వానంగా తయారైంది. కాలువలు సరిగా లేకపోవడం, కచ్చా కాల్వలు పూడి మురుగు స్తంభించి, చిన్నపాటి వర్షానికే రోడ్లపై చేరుతోంది. మరోవైపు వీరవల్లి, కానుమోలకు వెళ్లే మార్గాలు పూర్తిగా ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సీసీ రోడ్లు వేసి అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్

కీలక మార్గం.. అంతటా అధ్వానం

రహదారి దుస్థితికి నిదర్శనంగా..

బాపులపాడు పంచాయతీ పరిధిలో రాకపోకలకు కీలకమైన మేడేపూడి సుబ్బారావు నగర్ ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రెండు హైవేలను అనుసంధానం చేస్తూ దేవాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, రైల్వేస్టేషన్‌కు వెళ్లడానికి ఈ మార్గం కీలకం. రద్దీగా ఉండే ఈ రోడ్డు కొన్నేళ్లుగా అధికారులు పట్టించుకోక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల పశువైద్య శిబిరంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రాగా.. రహదారికి మరమ్మతులు చేసేందుకు హడావుడి చేసిన పంచాయతీ యంత్రాంగం తర్వాత పట్టించుకోలేదు. దీనిపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, హనుమాన్ జంక్షన్**

జగన్మాత సేవలో ఉయ్యూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను ఉయ్యూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆదివారం దర్శించుకున్నారు. వెలగపూడిలోని సచివాలయాన్ని దర్శించుకున్న విద్యార్థుల బృందం అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి చేరింది. దేవస్థానం ఏఈవో రమేష్, వెంకటరెడ్డి వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారికి ఉచితంగా అమ్మవారి దర్శనం చేయించారు.

సీఐగా బాధ్యతల స్వీకరణ

రమేష్

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : హనుమాన్ జంక్షన్ నూతన సీఐగా ఎల్.రమేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంటలిజెన్స్ సీఐగా పని చేస్తున్న ఆయన్ను ఇక్కడకు బదిలీ చేశారు. గతంలో సీఐగా ఉన్న కేవీవీఎన్ సత్యనారాయణను 3 నెలల కిందట వీఆర్‌కు పంపగా, అప్పటి నుంచి ఈ స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఉన్నతాధికారులు ఆ స్థానంలో రమేశ్‌ను నియమించగా.. ఆదివారం స్థానిక అభయాంజనేయస్వామిని దర్శించుకుని ఆయన బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

కార్మికలోకం ఐక్యంగా ఉద్యమించాలి

ఉయ్యూరు, న్యూస్‌టుడే : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని, వాటిని అరికట్టేందుకు కార్మికలోకం ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక శ్రామిక భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉద్యోగ, కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా వర్గాల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభల్లో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశానికి సమితి మండల అధ్యక్షుడు ఇస్మాయిల్ అధ్యక్షత వహించారు. ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి కీర్తి, సీఐటీయూ మండల కన్వీనరు రాజేష్, రత్నం భాస్కరరావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

సీఐటీయూ సభలు జయప్రదం చేయండి

పోరంకి, న్యూస్‌టుడే : విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించే సీఐటీయూ అఖిల భారత సభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.నరసింహారావు అన్నారు. ఆదివారం పోరంకిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకంగా ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు సరళ, పాతాళలక్ష్మి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆకతాయిల ఆగడాలు అరికట్టరా?

పోలవరం కట్టపై మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలు

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే : గన్నవరం పరిసరాల్లో ఆకతాయిల వల్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నిర్మానుష్యంగా ఉండే పాలిటెక్నిక్ కళాశాల, కేసరపల్లి ఏలూరు కాలువ, పోలవరం కాలువ, మర్లపాలెం, అజ్జంపూడి, బుద్ధవరం, తెంపల్లి, వీరపనేనిగూడేలకు చెందిన కొంత మంది యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. స్థానిక పోలీసులు వారిని గుర్తించినప్పటికీ ద్విచక్ర వాహనాలు, ఫోన్లు స్వాధీనం చేసుకుని వదిలేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆకతాయిల ఆగడాలు మరింత ఎక్కువయ్యాయని నివాసితులు వాపోతున్నారు. రోడ్లపై మద్యం తాగుతూ, జూదం ఆడుతున్నారు. జిల్లా పోలీసుశాఖ ఇప్పటికైనా స్పందించి ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తాం

కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : ఈడుపుగల్లు గ్రామాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు సర్పంచి పి.ఇందిర చెప్పారు. ఆదివారం గ్రామంలోని రెండు అంతర్గత రహదారుల అభివృద్ధికి మాజీ ఎంపీపీ దేవినేని రాజా, తెదేపా గ్రామ అధ్యక్షుడు షేక్ షకార్, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యుడు రవికిషోర్‌తో కలసి ఆమె శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు నిధులు కేటాయించక పనులు చేయలేక పోయామన్నారు. ప్రస్తుతం కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరగా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. రూ.8.5 లక్షల నిధులతో రహదారులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు ప్రవీణ, కె.సుధాకర్, పి.సుధాకర్, చెల్లు సంగీతరావు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

యోగాతో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం

యోగా చేస్తున్న విద్యార్థినులు

పెనమలూరు, న్యూస్‌టుడే : యోగాతో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం అలవడతాయని ప్రముఖ యోగా గురువు దుర్గారావు పేర్కొన్నారు. పోరంకి శ్రీగోసలైట్స్ జూనియర్ కళాశాలలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు యోగా చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న దుర్గారావు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే యోగాను ఆచరిస్తే అనేక ప్రయోజనాలు ఉంటాయని పేర్కొన్నారు. మానసిక ప్రశాంతత, జ్ఞాపకశక్తి పెరగటంతో పాటు విద్యలో రాణించవచ్చని సూచించారు. విద్యార్థులను కళాశాల ఛైర్మన్ నరేంద్ర బాబు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఉష, తెదేపా నేత గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.75 వేల విరాళం

విరాళం అందిస్తున్న బుచ్చిబాపయ్య

హనుమాన్ జంక్షన్, న్యూస్‌టుడే : బాపులపాడు ధర్మకోనేరు చెరువు వద్ద నిర్మిస్తున్న శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి దేవాలయానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన లయన్స్ క్లబ్ సీనియర్ నాయకుడు మేడికొండ బుచ్చిబాపయ్య రూ.50 వేలు, వీరమాచనేని రామబ్రహ్మం రూ.25 వేలు విరాళంగా అందజేశారు. ఆదివారం ఆలయ నిర్మాణకర్తలు గూడపాటి రత్నశేఖర్, కొల్లి వెంకట్రావు, తమిరి రమేశ్, తుమ్మల నారాయణరావుకు విరాళాన్ని అందించారు.

అపూర్వం.. ఆత్మీయ కలయిక

పాఠశాలలో పూర్వ విద్యార్థులు

నున్న, న్యూస్‌టుడే : నున్న జడ్పీ హైస్కూల్ 1983- 84 పూర్వ విద్యార్థులు 41 ఏళ్ల తర్వాత ఆత్మీయంగా కలిశారు. ఆదివారం పాఠశాల ఆవరణలో అందరూ కలిసి ఆటపాటలతో సందడి చేశారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలో మౌలిక సదుపాయాలను పరిశీలించారు. తమ పాఠశాల పదో తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు వచ్చే ఏడాది నుంచి టాలెంట్ టెస్ట్ నిర్వహించి ఉత్తీర్ణత సాధించిన వారికి ఉపకార వేతనాలు అందజేస్తామని తెలిపారు. సుమారు 75 మందికి పైగా పూర్వ విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా గడిపారు.

నిత్య వ్యాయామంతో గుండె జబ్బులు దూరం

కరెన్సీనగర్ : విజయవాడ ఈస్ట్ జెమ్స్ లయన్స్ క్లబ్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుణదల తమ్మినేని హాస్పిటల్‌లో ఆదివారం 150వ నెల మధుమేహ వ్యాధి, రక్తపోటు వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.ప్రవీణ్ హాజరై మాట్లాడుతూ .. జంతువుల్లో లేని గుండె జబ్బులు మనుషులకు వస్తున్నాయని పరిశోధనల్లో తేలిందన్నారు. అవి ఆకలేసినప్పుడే తింటాయని, పచ్చి మాంసాన్ని బాగా నమిలి తీసుకుంటాయని, ఉప్పు కారాలు ఉండని కారణంగా వాటికి జబ్బులు రావని వివరించారు. నిత్యం వ్యాయామం చేస్తూ, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ నియంత్రించుకోవడం ద్వారా గుండె జబ్బులను నివారించవచ్చని తెలిపారు.

(c) eenadu

గుడివాడ
• గుడివాడ • పామర్రు • అవనిగడ్డ

మువ్వన్నెల వెలుగులు

అశ్వారావుపాలెం (అవనిగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: అశ్వారావుపాలెంలో దేశభక్తిని చాటేలా మువ్వెన్నెల వెలుగులు విరజిమ్ముతున్నాయి. రాబోయే ఆంగ్ల సంవత్సరాది, సంక్రాంతి, గణతంత్ర పండగలను పురస్కరించుకుని సర్పంచి పీవీఎన్ లంకమ్మప్రసాద్ నేతృత్వంలో గ్రామస్థులు గ్రామ ముఖద్వారం, విద్యుత్తు స్తంభాలు, ప్రధాన రహదారులకు మువ్వన్నెల రేడియం స్టిక్కర్లను అంటించారు.

నేడు మంత్రి రాక

మోపిదేవి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పాఠశాలల ముస్తాబు కార్యక్రమానికి సోమవారం మోపిదేవి గురుకుల పాఠశాలలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత శ్రీకారం చుట్టనున్నారు. ఉదయం 8గంటలకు పాఠశాలకు మంత్రి వస్తారని ప్రధానాచార్యులు కే.వీరరవి తెలిపారు.

ప్రమాదాల నివారణపై అవగాహన

నందివాడ(గుడ్లవల్లేరు): నందివాడ మండలం పుట్టగుంట సెంటర్ వద్ద ఆదివారం ఎస్.ఐ కె.శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఆటోవాలాలకు వాహన ప్రయాణం, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలకు అధిక కారణాలు అతివేగమేనని, కొద్ది నిమిషాల తేడా వలన వచ్చే ప్రయోజనం కన్నా నష్టాలే అధికమని, కుటుంబ సభ్యులను గుర్తుంచుకుని మితిమీరిన వేగం కూడదని హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
గుడివాడ: 89775 35999 పామర్రు : 80085 74684 అవనిగడ్డ: 80085 74679

స్పందనకు వందనం

పెదపారుపూడి, న్యూస్‌టుడే: పెదపారుపూడి మండలం దోసపాడు గ్రామంలో నీటిపైపులైను లీకయిందని స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.నరేష్ స్పందించి వెంటనే పైపులైనుకు మరమ్మతులు చేయించారు. బి.సి.కాలనీలో వీధిలైట్లు లేవని తెలపగా దీపాలు ఏర్పాటు చేయించారు. డ్రైనేజీ పూడుకుపోయిందని తెలపగా, ఆయన సిబ్బందితో పూడిక తీయించారు. ❖ పెదపారుపూడి మండలం వెంట్రప్రగడ పంచాయితీ కార్యాలయం వద్ద చెత్త పేరుకుపోగా స్పందించిన కార్యదర్శి సాగరరాణి చెత్తను సిబ్బందితో తొలగించారు. పంచాయితీ చెరువు దగ్గర, బస్టాండు సెంటర్‌వద్ద వీధిలైట్లు వెలగడం లేదని తెలపగా, స్పందించిన కార్యదర్శి సాగరరాణి వీధి దీపాలు వేయించారు. తూర్పు పక్కన డ్రైనేజీ పూడుకుపోయిందని తెలపగా సిబ్బందితో పూడిక తీయించారు.

అసంపూర్తి నిర్మాణంతో అవస్థలు

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే

ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తామని గ్రామ పంచాయతీలకు ప్రత్యామ్నాయంగా గత ప్రభుత్వం గ్రామ సచివాలయం వ్యవస్థను ప్రవేశపెట్టింది. యుద్ధప్రాతిపదికన సచివాలయాలను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసింది. కానీ వాటికి భవనాలను సమకూర్చడంలో అలసత్వం వహించడంతో పాటు సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయకపోవడంతో అవి అసంపూర్తి నిర్మాణాలతో దర్శనం ఇస్తున్నాయి. అవనిగడ్డ మండలంలోని అశ్వారావుపాలెంలో సచివాలయాన్ని రూ.40లక్షల వ్యయంతో నాలుగున్నర ఏళ్ల కిందట చేపట్టారు. నిధులు సకాలంలో మంజూరు కాకపోవడంతో గుత్తేదారుడు అసంపూర్తిగా వదిలేశాడు. భవనానికి దర్వాజాలు, కిటికీలు, తలుపులు, ఫ్లోరింగ్ పనులు, విద్యుత్తు సౌకర్యంతో పాటు రంగులు దిద్దాల్సి ఉంది.

అశ్వరావుపాలెంలోని గ్రామ సచివాలయం

◆ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సచివాలయాన్ని ఏర్పాటు చేయడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. చాలీ చాలని గదుల్లో ఇటు పంచాయతీ, అటు సచివాలయం సిబ్బంది అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయించి వినియోగంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపేదీ..

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ప్రధాన పంట కాలువకు ఇరువైపులా రోడ్డు మార్జిన్లు ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు ఒక్కటైనా తొలగించలేదు. మీరే స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించాలని సుమారు 20 రోజుల క్రితం గ్రామ పంచాయతీ అధికారులు ప్రతి దుకాణం వద్దకు వెళ్లి వెంటనే తొలగించాలని చెప్పినా కూడా ఆక్రమణదారులలో చలనం రాలేదు. రోడ్డు మార్జిన్ ఆక్రమించి టిఫిన్ హోటళ్లు, బడ్డీ కొట్లు, మాంసం దుకాణాలు, పూలమొక్కల ప్రైవేటు నర్సరీలు పెట్టడమే కాకుండా ఖాళీ స్థలాలు ఆక్రమించి పరదాలు కట్టి, అద్దెలకు కూడా ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వీటి వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. వాటితో పాటు క్రేన్‌లు, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాలకు ఈ ప్రదేశం నిలయంగా మారింది. కొంత మంది కంకర రోడ్డు మార్జిన్‌లో డంపింగ్ చేసి వ్యాపారాలు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి గతంలో ఆర్డీవో హైమావతి ఆక్రమణలు తొలగించిన విధంగా వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా రోడ్డు మార్జిన్‌లో తొలగించని ఆక్రమణలు

అవనిగడ్డ 2వ వార్డు కాల్వగట్టు ఇలా..

నేడు విద్యుత్తు సరఫరా నిలుపుదల

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: మండలంలోని కొతవరం, వడ్లమన్నాడు, రెడ్డిపాలెం, వేమవరం, వేమవరపాలెం, భీమునిగుంట, ఉలవలపూడి గ్రామాలలో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం1 వరకూ విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈఈ శ్యామల వెల్లడించారు.

కరుణామయుడు క్రీస్తు

గుడివాడ: లోకంలో పాపులను రక్షించడానికి కరుణామయుడు క్రీస్తు ఈ లోకానికి వచ్చారని డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు పేర్కొన్నారు. స్థానిక విద్యావికాస్ పాఠశాలలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు క్రీస్తు జనన వృత్తాంతాలను తెలిపే పాటలు పాడారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షిద్దాం

చల్లపల్లి, న్యూస్‌టుడే: హిందూ ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపైనా ఉందని, అదే హిందూ సమ్మేళనం ముఖ్య ఉద్దేశమని పెదకళ్లేపల్లి ఓంకార పీఠాధిపతి విజయానందగిరి స్వామీజీ అన్నారు. ఆదివారం రామానగరంలో ఆర్ఎస్ఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం హిందూ సమ్మేళనాన్ని నిర్వహించారు. పెదముత్తేవి ముముక్షుజన మహాపీఠం పీఠాధిపతి గౌర కృష్ణ గురుదేవులు మాట్లాడుతూ దేవాలయాలు కుటుంబ, విద్యా వ్యవస్థలు పటిష్ఠంగా ఉండాలని చెప్పారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత సహ కార్యవాహ ఎం.శ్రీనివాసరెడ్డి, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ కోనేరు బలరాం, సహ సంఘ చాలక్ వై.సాయిశ్వరరావు, చల్లపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు అడపా రవి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయానందగిరిస్వామి

దాతల చేయూతతో మోపిదేవి ఆలయం దినదినాభివృద్ధి

మోపిదేవి, న్యూస్‌టుడే: దాతల చేయూతతో మోపిదేవి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయం దినదిన ప్రవర్ధమానం అవుతోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ వ్యాఖ్యానించారు. దాతల భాగస్వామ్యం మరింత పెరగాలని, దాన్ని అందిపుచ్చుకుని భక్తులకు మౌలిక సౌకర్యాలు, వసతులు కల్పిస్తామన్నారు. సినీ నిర్మాత, డాక్టర్ ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవ కమిటీ కన్వీనర్ అట్లూరి నారాయణరావు రూ.కోటి వితరణతో టేకు రథం తయారీని ఆదివారం పూజలు చేసి ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్ముడివరం మండలం మురుముళ్లకు చెందిన కొల్లాటి కామేశ్వరరావు- శ్రీనివాసరావు శిల్పుల నేతృత్వంలో రథం తయారు చేస్తున్నారు. దేవదాయ శాఖ నిర్ణయించిన ధర చెల్లిస్తే కొత్తగా భక్తుల కోసం నిర్మించిన కాటేజీ గదులకు దాత పేరిట నామకరణం చేస్తామని, సంవత్సరానికి 20 నుంచి 30 రోజులు వారికి కేటాయిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. రథ శిల్పులను సత్కరించారు. తహసీల్దార్ హరినాథ్, మండలి వెంకటరామ్, చిరువోలు బుచ్చిరాజు, గద్దే శ్రీధర్, రావి నాగేశ్వరరావు, రావి రత్నగిరి, నడకుదిటి జనార్ధనరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

టేకు రథం నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

మంచం, చక్రాల కుర్చీ బహూకరణ

పామర్రు(గ్రామీణం): కురుమద్దాలి ఆరోగ్య ఉపకేంద్రానికి మంచం, పరుపు, చక్రాల కుర్చీ బహూకరించామని గ్రామ ప్రముఖుడు, ఫౌండేషన్ ప్రతినిధి కొసరాజు రాంబాబు ఆదివారం తెలిపారు. ది కృష్ణా డిస్ట్రిక్ లారీ ఓనర్స్ ఫౌండేషన్ విజయవాడ వారి ఆర్థిక సహకారంతో వీటిని అందించామన్నారు.

గీతా మందిరంలో పూజలు

చల్లపల్లి: ధనుర్మాసం సందర్భంగా శ్రీఆర్యవైశ్య సంఘ భవనంలోని గీతా మందిరంలో విశేష అర్చన, విష్ణు సహస్ర నామ పారాయణ, తిరుప్పావై ప్రవచనం ఆదివారం జరిగింది. గోదాకృష్ణ భక్తబృందం ఆధ్వర్యంలో స్వామివారికి వెన్న నివేదన జరిగింది. ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి వరదా హరిగోపాల్, మారుతి, కొల్లిపర సురేంద్ర, నాగకుమారి, ప్రమీల, తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

తలుపు ఊడిపోయినా పట్టించుకోరా !

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని 6వ వార్డులో (పాత బిల్డింగ్‌పై అంతస్తు) మహిళల మరుగుదొడ్లలో ఒక దానికి తలుపు ఊడిపోయినా పట్టించుకోవడం లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మహిళలు మరుగుదొడ్డికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. సుమారు 16 బెడ్లు ఉండగా రెండు మరుగు దొడ్లలో ఒకదానికి తలుపు లేకపోవడంతో ఇబ్బందికరంగా ఉందని, వెంటనే తలుపును అమర్చాలని మహిళ రోగులు కోరుతున్నారు.

అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో తలుపు ఊడిపోయిన మరుగుదొడ్డి

మరుగుదొడ్ల నిర్మాణం ఎండమావేనా..

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పులిగడ్డ చౌరస్తాలో ప్రయాణికులకు మరుగుదొడ్ల నిర్మాణం ఎండమావిగానే మారింది. దివిసీమ ముఖద్వారమైన పులిగడ్డలోని నాలుగురోడ్ల కూడలిలో ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు ఒంటికైనా రెంటికైనా ఉగ్గబట్టుకోవాల్సిందే.. చౌరస్తాలో ఎప్పుడూ ప్రయాణికుల సందడి ఉంటుంది. రేపల్లె, తెనాలి, మచిలీపట్నం, విజయవాడ, అవనిగడ్డ తదితర ప్రాంతాలకు ప్రతిరోజు పులిగడ్డ చౌరస్తా నుంచి ఉద్యోగస్థులు, విద్యార్థులు, వ్యాపారస్థులు ప్రయాణిస్తుంటారు. రేపల్లె వైపు బస్‌షెల్టర్ వద్ద మచిలీపట్నం, విజయవాడ వైపు వెళ్లే బస్‌షెల్టర్ వద్ద బస్‌ల కోసం నిత్యం నిరీక్షించే ప్రయాణికులతో రద్దీగానే ఉంటుంది. మహిళ ప్రయాణికులకు ఆ ప్రాంతంలో మరుగు దొడ్ల ఏర్పాటు లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారు. పులిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని చౌరస్తాలో మరుగు దొడ్ల వసతి కల్పించాలని సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

పులిగడ్డలోని నాలుగు రోడ్ల కూడలి

విపత్తులను ఎదుర్కొని ఐవీఎం సేవలు

చల్లపల్లి, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మేమున్నాం అంటూ బాధితులకు అండగా నిలుస్తున్న సేవా సంస్థ ఇండియా విలేజ్ మినిస్ట్రీస్(ఐవీఎం) అని యువ నాయకులు మండలి వెంకట్రామ్(రాజా) అన్నారు. ఆదివారం పురిటిగడ్డలో ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి సురేష్-రోజా దంపతుల ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించారు. విజయ, సోఫీ, తెదేపా మండల కార్యదర్శి శ్రీనివాసరావు, చల్లపల్లి ఉపసర్పంచ్ నాని, నాయకులు సురేంద్రనాథ్ బెనర్జీ, సి.ఐ కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న ఐవీఎం డైరెక్టర్ సురేష్ తదితరులు

బాబోయ్... కుక్కలు

బెంబేలెత్తుతున్న ద్విచక్ర వాహనదారులు

అవనిగడ్డ-అశ్వరావుపాలెం రహదారిపై విచ్చలవిడిగా కుక్కల స్వైర విహారం

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: అవనిగడ్డ-అశ్వారావుపాలెం రహదారులపై విచ్చలవిడిగా కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అటు ప్రయాణమంటేనే ద్విచక్ర వాహనదారులు పట్టపగలే భయాందోళన చెందుతున్నారు. రాత్రివేళ అయితే గ్రామ సింహాలు మీద పడి కరుస్తున్నాయని ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల పలువురు కుక్క కాటుకు గురై ఆస్పత్రిలో యాంటీ రేబీస్ ఇంజక్షన్లు చేయించుకున్న సంఘటనలు ఉన్నాయి. గ్రామ పంచాయతీ అధికారులు కుక్కలను పట్టించి జనావాసాలకు దూరంగా వదిలివేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

పల్స్‌పోలియో విజయవంతం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పురపాలక సంఘంలో 60 పల్స్ పోలియో కేంద్రాలలో 11996 మందికి పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 11526 మందికి వేసి 96 శాతం లక్ష్యాన్ని సాధించారని గుడివాడ పురపాలక కమిషనర్ సింహాద్రి మనోహర్ తెలిపారు. స్థానిక హోమియో ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. పట్టణంలోని అన్ని ప్రాంతాలతో పాటు గుడివాడ ఆర్టీసీ బస్టాండు, రైల్వే స్టేషన్‌లలో కూడా వేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. పోలియో మహమ్మారిని తరిమి కొట్టడానికి ప్రతీ ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. మరో రెండు రోజుల పాటు ఇంటింటికీ తిరిగి సిబ్బంది చుక్కలు వేస్తారన్నారు.

గుడివాడలో చిన్నారికి పోలియో చుక్కలను వేస్తున్న కమిషనర్ సింహాద్రి మనోహర్

అవనిగడ్డలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, న్యూస్‌టుడే : పోలియో మహమ్మారి మరోసారి వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం శ్రద్ధ వహిస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. అవనిగడ్డలో చిన్నారులకు చుక్కలు వేశారు. నాయకులు మండలి వెంకట్రామ్, తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి, న్యూస్‌టుడే: నిడుమోలులో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కూచిపూడి బస్టాండ్‌లో రోటరీక్లబ్ ఆధ్వర్యాన కార్యక్రమాన్ని ఎస్.ఐ పి.శిరీష ప్రారంభించారు. జొన్నలగడ్డ హనుమకుమార్, బెల్లంకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూచిపూడిలో..

వీరంకిలాకు(పమిడిముక్కల), న్యూస్‌టుడే: వీరంకిలాకు ఆరోగ్య కేంద్రం పరిధిలో 103, కపిలేశ్వరపురం పరిధిలో 99 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారులు అఖిల, సైరాఖాతూన్, బాలాజీ, ఇందు తెలిపారు.

పామర్రు గ్రామీణం: నిమ్మకూరు పీహెచ్‌సీ పరిధిలో 865 మందికి పోలియో చుక్కలు వేశామని డాక్టర్ కె.చరణ్‌తేజ్ తెలిపారు. కురుమద్దాలిలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ పోలియో చుక్కలు వేశారు.

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే : తోట్లవల్లూరులో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి పోలియో చుక్కలు వేశారు.

పామర్రు, న్యూస్‌టుడే: కనుమూరు పీహెచ్‌సీ పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైందని డీడీవో పి.రాజేష్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో వైద్యుడు జేషన్‌ఖాన్‌తో కలిసి పోలియో చుక్కలు వేశారు.

పెదపారుపూడి, న్యూస్‌టుడే: వెంట్రప్రగడ గ్రామ సచివాలయంలో తెదేపా మండల అధ్యక్షుడు చలసాని రమేష్‌చౌదరి పోలియో చుక్కలు వేశారు.

నాగాయలంక, న్యూస్‌టుడే: నాగాయలంక, ఎదురుమొండి, సొర్లగొంది పీహెచ్‌సీల పరిధిలో 97 శాతం చుక్కల మందు వేసినట్లు నాగాయలంక వైద్యాధికారి కె.శ్యామ్ ప్రసాద్ తెలిపారు.

పార్టీ కోసం అహర్నిశలు పనిచేసే వ్యక్తి గురుమూర్తి

పామర్రు, న్యూస్‌టుడే: పార్టీ కోసం అహర్నిశలు పనిచేసే వ్యక్తి వీరంకి గురుమూర్తి అని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ఆదివారం స్థానిక తెదేపా కార్యాలయంలో తెదేపా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి గురుమూర్తి, ఎమ్మెల్యే పరస్పరం సత్కరించుకున్నారు. పార్టీ అభివృద్ధి కోసం తామిద్దరం కలిసి కృషిచేస్తామన్నారు.

ఎమ్మెల్యే కుమార్ రాజాను సన్మానిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు గురుమూర్తి

49 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడ, న్యూస్‌టుడే: రౌడీ షీటర్లు ఎక్కడున్నా పూర్తిగా పోలీసులకు అందుబాటులో ఉండాలని, పిలిచిన వెంటనే స్టేషన్‌కు రావాలని గుడివాడ టూటౌన్ సీఐ జేఆర్‌కే.హనీఫ్, రూరల్ ఎస్.ఐ ఎన్.చంటి బాబు పేర్కొన్నారు. స్థానిక టూటౌన్‌లో 34 మంది, రూరల్ పోలీసు స్టేషన్‌లో 25 మంది రౌడీ షీటర్లు, అనుమానిత షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షీటర్లు ఎవరైనా సత్ప్రవర్తనతో లేకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా వివాదాలలో తలదూర్చినా, రాత్రి వేళల్లో అనుమానంగా కనిపించినా చర్యలు తప్పవన్నారు.

గుడివాడ టూటౌన్ పోలీసు స్టేషన్‌లో రౌడీలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ హనీఫ్

వాసవీక్లబ్ హోమియో వైద్యశిబిరం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. డాక్టర్ మణికంఠ 62 మందిని పరీక్షించి క్లబ్ ద్వారా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అన్నం సత్యవాణి, కుసుమ, గోళ్ల వెంకటరత్నం, మలిశెట్టి చెంచురాములు పాల్గొన్నారు.

సామూహిక శాంతి కళ్యాణం

మంటాడ(పమిడిముక్కల), న్యూస్‌టుడే: స్థానిక శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం సామూహిక శాంతి కళ్యాణం జరిగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కోకిలాంబకు నివాళి

కోకిలాంబ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘంటసాల, న్యూస్‌టుడే: వైజ్‌మెన్ క్లబ్ జిల్లా గ్రామీణ డైరెక్టర్ గుత్తికొండ కోకిలాంబ దశదిన కర్మ సందర్భంగా ఆమె చిత్రపటానికి ప్రముఖులు నివాళులర్పించారు. నేతలు వెంకటరామకృష్ణ, సుభాష్‌చంద్రబోస్, రాజబాబు, కృష్ణా జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు సుబ్బారావు, కరెడ్ల సుశీల, సర్పంచి గుత్తికొండ రాము, తదితరులు పాల్గొన్నారు.

30న ముక్కోటి ఏకాదశి వేడుకలు

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ జగన్నాథపురంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 30న ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని ఈవో కందుల వేణుగోపాలరావు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ లింగం శివరామకృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. దేవాలయంలో ఉత్సవ వేడుకలపై ధర్మకర్తల మండలి సమావేశమయ్యారు. 30వ తేదీన తెల్లవారుజాము 4 గంటలకు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులు నిమ్మగడ్డ కృష్ణారావు, చందు శ్రీనివాసరావు, పి.రాజేశ్వరరావు, వేదాంతం కృష్ణవేణి, కొడాలి విజయలక్ష్మీ, గుడపాటి సుజాత, పతంగి హేమ, జోగి సాంబ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో దేవస్థానం అధికారులు, ధర్మకర్తలు

స్వామి ఆదివారం ఆదాయం రూ.7.85లక్షలు

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి దేవాలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ సేవల రూపేణా రూ.7.85 లక్షలు వచ్చినట్లు ఈవో శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. * ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వాస్తవ్యులు ముదునూరు నాగలక్ష్మి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,001, ముదునూరు రాజరాజేశ్వరి రూ.41,550 అందించారు. దాతల్ని సత్కరించారు.

కొండలమ్మకు పూజలు

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానానికి జిల్లా నలుమూలల నుంచి వేలాది భక్తులు తరలివచ్చి పూజాదికాలు నిర్వహించారు. మహిళలు సామూహిక పాలపొంగళ్లు వండి సమర్పించారు. పల్స్‌పోలియో సందర్భంగా ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రంలో చిన్నారులకు ఛైర్మన్ ఈడే మోహన్, ఈవో కొండలరావు పోలియో చుక్కలు వేశారు.

సీఎమ్మార్ఎఫ్ చెక్కుల పంపిణీ

గూడపాడు(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ మండలం గూడపాడులో ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా ఆదివారం సీఎమ్మార్ఎఫ్ చెక్కులను నేరుగా బాధితుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, మండల పార్టీ కార్యదర్శి వీరంకి తులసీదాసు, కూటమి నాయకులు శీలం బాబూరావు, ఈడే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భారతీయ చరిత్రలో ధైర్యానికి ప్రతీక ఛత్రపతి శివాజీ

కోసూరు(కూచిపూడి), న్యూస్‌టుడే: భారతీయ చరిత్రలో ధైర్యానికి ప్రతీకగా ఛత్రపతి శివాజీ మహారాజ్ నిలిచారని పింగళి వెంకయ్య రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్వచ్ఛాంధ్ర మిషన్ పూర్వపు ఛైర్మన్ డాక్టర్ సీఎల్.వెంకట్రావు అన్నారు. మొవ్వ మండలం కోసూరు విజయశ్రీ సనఫ్లవర్ హైస్కూలు ఆవరణలో సంస్కార భారతి(ఆంధ్రప్రదేశ్), పింగళి వెంకయ్య రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ఆదివారం రాత్రి నాట్యప్రదర్శనలతోపాటు చారిత్రక నాటకాన్ని ప్రదర్శించారు. కూచిపూడి శ్రీసిద్ధేంద్రయోగి నాట్యకళాపీఠం పూర్వపు ప్రిన్సిపల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి నృత్య నిర్వహణలో వేదాంతం దేవి భవాని, డి.సంధ్యారాణి, కె.దివిజలు ముందుగా బాలగోపాలతరంగంలో, అనంతరం వినాయకౌత్తం, దశావతారాల నృత్యాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. అనంతరం డాక్టర్ పి.వి.ఎస్.కృష్ణ(సంస్కార భారతి అధ్యక్షులు) రచన, దర్శకత్వంలో దాదాపు 60 మంది కళాకారులు ప్రదర్శించిన జయహో శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. సన్‌ఫ్లవర్ గ్రూప్ సంస్థల అధినేత ఎం.డి.వి.ఎస్.ఆర్.పున్నంరాజు, ట్రస్ట్ కార్యనిర్వహణాధికారి డాక్టర్ టి.ఎం.వి.ప్రసాదరావు పాల్గొన్నారు.

జయహో శ్రీఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితచరిత్రలో ఓ సన్నివేశం

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

ఘనంగా వై.ఎస్.జగన్ జన్మదినం

అవనిగడ్డ, న్యూస్‌టుడే : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో సమన్వయకర్త సింహాద్రి రమేష్‌బాబు కేకు కోశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీ, ఇతర నేతలు పాల్గొన్నారు.

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక వైకాపా కార్యాలయంలో ఆ పార్టీ అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పబ్లిక్ లీగల్ నోటీసు

నా క్లయింటు కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు కాపురస్తులు నల్లూరి (లేటు) మోతీలాల్ గారి భార్య విజయలక్ష్మి గారి కుమారులు 1) వంశీ కృష్ణ 2) శశాంక్ గార్ల సంజాయిషీ ప్రకారం ది. 21-12-2025న ఈనాడు దినపత్రికలో చల్లపల్లి వాస్తవ్యులు డాక్టర్ నల్లూరి రవీంద్రనాథ్ గారి తరుపున ఇచ్చిన బహిరంగ ప్రకటన/ PUBLIC NOTICEలోని విషయములు అన్నియు పూర్తిగా అవాస్తవాలు అని తెలియచేయడమైనది. నల్లూరి (లేటు) మోతీలాల్ గారు వారి జీవిత కాలంలో తన తండ్రి నల్లూరి శివరామకృష్ణయ్యకు ఏవిధమైన పవర్ ఆఫ్ అటార్నీ ది. 09-02-1982న వ్రాసి యుండలేదు. ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నీ సృష్టించి నల్లూరి (లేటు) మోతీలాల్ గారి ఆస్తిని కాజేయవలెననే దురుద్దేశ్యంతో డాక్టర్ నల్లూరి రవీంద్రనాథ్ తన తండ్రి ద్వారా దొంగ దస్తావేజులు సృష్టించినారు. సదరు నోటీసులోని షెడ్యూలులో పొందుపరిచిన హద్దులు తెలియజేస్తూ ఏవిధమైన డాక్యుమెంట్స్ లేవు. నా క్లయింటు నల్లూరి (లేటు) మోతీలాల్ కుటుంబ సభ్యులకు చెందిన ఆస్తిపై నల్లూరి రవీంద్రనాథ్‌కు ఏవిధమైన సంబంధంలేదు. సదరు మోతీలాల్‌పై మొదట నా క్లయింటు మచిలీపట్నం కోర్టులలో CAVEATS కూడా దాఖలుచేసి యున్నారు. ఇనగదురుపేట పోలీసు స్టేషన్‌లో, SP గార్కి వ్రాత పూర్వక ఫిర్యాదులు కూడా ఇచ్చియున్నారు. నల్లూరి రవీంద్రనాథ్‌కు ఏవిధమైన ఆస్తి R.S. నెం. 210 మచిలీపట్నం, రాజుపేటలో లేదు అని తెలియజేయటమైనది.

లంకిశెట్టి బాలాజీ M.A., B.Sc., BL.
లంకిశెట్టి సాయి ఫణి సంతోష్ BA, LLM (USA)
అడ్వకేట్స్ ✆ 98482 12612
మచిలీపట్నం, ది. 21-12-2025

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
సోమవారం డిసెంబరు 22, 2025

శ్రీమతి అమరావతి... ఎవరికో బహుమతి

విజయవాడ నోవోటెల్‌లో **శ్రీమతి అమరావతి** సీజన్-10 ఆడిషన్స్ ఆదివారం నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పేలా మహిళలు ర్యాంప్ వాక్‌తో సందడి చేశారు. 34 మంది పాల్గొనగా 22 మందిని జనవరి 10న జరిగే ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

వ్యవసాయ సమస్యలకు పరిష్కారం పొందండిలా..!

'ఈనాడు' ఆధ్వర్యంలో డీఏవోతో ఫోన్‌ఇన్ రేపు

ఈనాడు మీతోడు

జిల్లాలో రబీ సీజను ఆరంభమైంది. ఇందుకు సరిపడా యూరియా, ఎరువులను అందుబాటులో ఉంచామని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఎరువుల నిల్వలు, వీటి పంపిణీలో, రబీ పంటలకు సంబంధించి రైతుల సందేహాలను నివృత్తి చేయడానికి 'ఈనాడు' ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి (డీఏవో) **డి.ఎం.ఎఫ్.విజయకుమారి** తో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. అన్నదాతలు తమ సమస్యలను నేరుగా తెలియజేయవచ్చు. ఆమె సమాధానాలు ఇస్తారు. రైతులు చేయాల్సిందల్లా నిర్ణీత సమయంలో ఈ కింది నంబర్‌కు ఫోన్ చేయడమే. - న్యూస్‌టుడే, ఎన్టీఆర్ కలెక్టరేట్

83310 56859 | 23.12.25 మంగళవారం | 11–12 గంటల మధ్య

ఇ-చలానా తెలుసుకోండిలా..

కొత్తగా 'వాట్సప్ గవర్నెన్స్'లో సేవలు

ప్రభుత్వ సేవలన్నీ ఇప్పుడు ఒక్క క్లిక్‌తో మీ చరవాణిలోనే పొందవచ్చు. దీని కోసం వాట్సప్ గవర్నెన్స్ అందుబాటులోకి తెచ్చారు. తాజాగా పోలీసు సేవలను చేర్చారు. దీనిలో మీ వాహనంపై ఉన్న ఇ-చలాన్‌ల వివరాలను తెలుసుకోవచ్చు.. అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనే చెల్లింపులు చెల్లించవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ సేవల కోసం 95523 00009 నంబరును అందుబాటులోకి తెచ్చింది. దీనిని మీ ఫోన్‌లో సేవ్ చేసుకోవాలి. వాట్సప్‌లో HI అని మెసేజ్ చేయండి. 'మన మిత్ర వాట్సప్ గవర్నెన్స్' వస్తుంది. 'టీఈ' అని టైప్ చేస్తే.. తెలుగు భాషలోకి మారుతోంది. దాని కింద భాగంలో ఉన్న 'సేవను ఎంచుకోండి' అనే దాన్ని క్లిక్ చేయండి. వచ్చిన సేవల్లో 'పోలీస్‌శాఖ సేవలు' ఎంపిక చేసుకుంటే.. దానిలో ఎఫ్ఐఆర్, ఎఫ్ఐఆర్ స్థితి, ఇ-చలాన్ అనే మూడు ఆప్షన్లు వస్తాయి. ఇ-చలాన్ వివరాలను ఎంపిక చేసి.. మీ వాహనం నంబరు నమోదు చేసి క్లిక్ చేయాలి. మీ వాహనం రిజిస్ట్రేషన్ నంబరుపై ఉన్న ఇ-చలాన్‌లు కనిపిస్తాయి. వాటిని ఆన్‌లైన్‌లోనే.. బ్యాంకు కార్డు ద్వారా చెల్లింపులు చేయవచ్చు. రశీదు కూడా వస్తుంది. ఒకవేళ చలాన్‌లు లేకపోతే.. 'నో చలాన్స్ ఫౌండ్' అని వస్తుంది.

పోలీసులు రూపొందించిన బ్రోచర్..

రవాణా శాఖ చలానాలు

నిబంధనలను ఉల్లంఘించిన వాహన చోదకులపై రవాణాశాఖ కూడా చలాన్‌లు విధిస్తుంటుంది. వీటిని ప్రత్యేకంగా 'పరివాహన్ సేవ' అనే వెబ్‌సైట్లో చూడొచ్చు. దీని కోసం https://parivahan.gov.in అనే సైట్లోకి వెళ్లి 'ఇ చలాన్ పేమెంట్'ను క్లిక్ చేయండి. దానిలో మీ వాహనం నంబరు నమోదు చేసి.. క్లిక్ చేస్తే మీ వాహనంపై ఉన్న ఇ-చలాన్‌లు వరుసగా కనిపిస్తాయి. ఇక్కడ రవాణాశాఖ చలాన్‌లతో పాటు పోలీస్‌శాఖ నమోదు చేసిన చలాన్‌లు కూడా కనిపిస్తాయి. అక్కడే పేమెంట్ ఆప్షన్ కూడా ఉంటుంది. దాన్ని క్లిక్ చేసి ఆన్‌లైన్‌లో డబ్బులు కట్టేయవచ్చు.

– విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

మహిళా నేతకే.. తెదేపా పగ్గాలు

★ గద్దె అనూరాధకు దక్కిన అవకాశం
★ పార్టీ ఆవిర్భావం తర్వాత తొలిసారి

తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలిగా గద్దె అనూరాధ నియమితులయ్యారు. జిల్లాలోని సామాజిక సమీకరణాల నేపథ్యంలో అనూరాధకు అనూహ్యంగా అవకాశం లభించింది. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఒకటి ఓసీ, మరొకటి బీసీలకు తెదేపా అధిష్ఠానం అవకాశం కల్పిస్తోంది. జిల్లాల విభజన తర్వాత నుంచి ఇదే పంథా కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లాకు ఓసీ వర్గానికి చెందిన నెట్టెం రఘురామ్, కృష్ణాకు బీసీ వర్గం నేత కొనకళ్ల నారాయణరావు గత అధ్యక్షులుగా వ్యవహరించారు. ఇప్పుడు కూడా కృష్ణా జిల్లా పార్టీ పగ్గాలను బీసీ సామాజిక వర్గం నేత వీరంకి గురుమూర్తికి అప్పగించడంతో.. ఎన్టీఆర్‌లో ఓసీ వర్గానికి చెందిన గద్దె అనూరాధకు అవకాశం ఇచ్చారు. తెదేపా ఆవిర్భావం నుంచి ఒక్కసారి కూడా ఉమ్మడి, ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లాకు మహిళా నేతలు పార్టీ పగ్గాలు చేపట్టింది లేదు. తొలిసారి గద్దె అనూరాధకే అవకాశం కల్పించారు.

జిల్లాలోని తిరువూరు సహా పలు నియోజకవర్గాల్లో పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడానికి అనుభవజ్ఞురాలైన నేత అవసరం. కూటమి పార్టీల మధ్య కూడా సమన్వయలోపం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న గద్దె అనూరాధకు అవకాశం ఇచ్చే పరిస్థితులను ఆమె దక్కించుకోగలిగారని పార్టీ అధిష్ఠానం భావిస్తోంది. 2014-19 వరకు ఉమ్మడి కృష్ణా జిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్‌గా అనూరాధ పనిచేసిన సమయంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా తన హయాంలో పాలన సాగించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపట్టారు. ఉత్తమ జిల్లా పరిషత్ అవార్డు ఆమె హయాంలోనే వరించింది. ఆది నుంచి సౌమ్యంగా.. చాలా స్పష్టంగా.. ప్రతి విషయంలోనూ ఆమె నిర్ణయాలు, వ్యవహారశైలి ఉంటాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వివాదాలు పరిష్కారం కావాలంటే అలాంటి వ్యవహారశైలి, అనుభవం ఉన్న నేత ఉండాలనే భావనతోనే అనూరాధకు అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. అనూరాధ భర్త గద్దె రామ్మోహన్ విజయవాడ తూర్పు ఎమ్మెల్యే. వీరిద్దరూ పార్టీలో కీలకమైన నేతలుగా కొనసాగుతున్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. ఈనాడు, అమరావతి- న్యూస్‌టుడే, కొండపల్లి

పార్టీ విధేయుడికి ప్రధాన కార్యదర్శి పదవి..

ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా **చెన్నుబోయిన చిట్టిబాబు** నియమితులయ్యారు. పార్టీ విధేయుడిగా పేరున్న చిట్టిబాబు.. ప్రస్తుతం కొండపల్లి మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా ఉన్నారు. వైకాపా హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఆయన కౌన్సిలర్‌గా గెలిచారు. కొండపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్ ఎన్నిక వివాదం అవ్వడంతో ఎట్టకేలకు న్యాయస్థానం ఆరు నెలల కిందట తీర్పు ఇవ్వడంతో చిట్టిబాబు వైస్ ఛైర్మన్ బాధ్యతలు చేపట్టారు. తాజాగా ఆయనకు పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది.

బొప్పాయి చెట్టుకి క్యారెట్..!

బొప్పాయి చెట్టుకు క్యారెట్లు కాయడం ఎక్కడైనా చూశారా..? అచ్చంగా క్యారెట్ భూమి నుంచి వస్తుంది కదా..! బొప్పాయికి అదెలా సాధ్యమని ఆశ్చర్యపోతారు. జీవం బొప్పాయి తోటల్లో క్యారెట్ల, పక్షుల తరహాలో కాయలు చిత్ర విచిత్రంగా కనిపిస్తున్నాయి. ప్రతీ తోటలో ఎక్కడో ఓ చోట గోచరిస్తుంటే అన్నదాతలు ఆశ్చర్యపోతున్నారు. ఇందులో భాగంగానే ఎన్టీఆర్ జిల్లా మైలవరం ప్రాంతంలోని ఓ తోటలో క్యారెట్ మాదిరిగా బొప్పాయి కాసింది. అయితే జన్యుపర లోపాలతో పాటు, రైతుల సస్యరక్షణలో లోపాలతోనే కాయ పరిమాణం పెరగక వేరే ఆకృతుల్లో కనిపిస్తున్నాయని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

అలంకారం అపురూపం .. అతివ నైపుణ్యం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

ఉత్సవాలు, నవరాత్రుల సమయాల్లో దేవతామూర్తుల అలంకరణకు భక్తులు ఎంతో ప్రాధాన్యం ఇస్తుంటారు. వివిధ రకాల పూలదండలు, వస్త్రాలతో అలంకరణ చేయడం సాధారణమే కానీ బందరు మండలం మేకవాని పాలెంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, అమ్మవార్లు మాత్రం యాలకులు, బాదంపప్పులతో చేసిన దండలు, కిరీటాలు ధరించి ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిస్తారు. వీటి వెనుక ఆలయ నిర్వాహక సభ్యురాలు ఖుర్షిదా సృజన దాగి ఉంది.

ఖుర్షిదా

కొన్ని రోజుల ముందు నుంచే.. సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఒక్కో పర్వదినాన ఒక్కో రకమైన అలంకరణలో దేవతామూర్తులు దర్శనమిస్తారు. స్వామివారి జన్మ నక్షత్రం కృత్తికా, సుబ్రహ్మణ్య షష్ఠి, కావడిసేవ తదితర రోజుల్లో ఆకట్టుకునే అలంకరణ చేస్తారు. బాదంపప్పు, యాలకులు, వివిధ రకాల పుష్పాలు, గడ్డి, నెమలి పింఛాలు, ముత్యాల దండలతో ప్రత్యేకంగా అలంకరిస్తారు. బాదంపప్పు, యాలకులతో చీరలు, అమ్మవారి జడలు చేయడం విశేషం.

సంక్షేమం... ఆరోగ్యానికి ప్రాధాన్యం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలకు ఒక వైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ.. మరో వైపు మెరుగైన వైద్య సేవలు అందేలా సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని మంత్రి సవిత, ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలు గద్దె అనూరాధ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని ఏపీఐఐసీ కాలనీలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆదివారం ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 52 లక్షల మంది చిన్నారులున్నట్లు సర్వేలో తేలిందని, ఆ పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనూరాధ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు అశ్రద్ధ చేయకుండా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, పేరేపి ఈశ్వర్, పొట్లూరి సాయి బాబు, పాతూరి సాంబశివరావు, వడ్లపట్ల గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి సవిత, గద్దె అనూరాధ తదితరులు

'ప్రజాసమస్యల పరిష్కార వేదిక' నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో ఈ నెల 22వ తేదీ సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్/ నగరపాలక సంస్థ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరిస్తారని పేర్కొన్నారు. విజయవాడ కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినతులు స్వీకరించనున్నట్లు వివరించారు. అర్జీలను మీకోసం వెబ్‌సైట్ Meekosam.ap.gov.in లోనూ దాఖలు (నమోదు) చేసుకోవచ్చన్నారు.



ప్రమాదం చెప్పి రాదు.!

పాఠశాలలకు సెలవు రోజుల్లో నగరంలో ఆట స్థలాలు లేక కృష్ణా నది ఒడ్డున ఇసుక తెన్నెలపై ప్రమాదకరంగా ఆటలు ఆడుతున్నారు. నీటి కుంటల్లో లోతు తెలియక దిగి చిన్నారుల ప్రాణాలు పోయిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. వీటి సమీపంలోకి రాకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. -ఈనాడు, అమరావతి

గురితప్పని బుల్లెట్

రైఫిల్ షూటింగ్‌లో ఉమా మహేష్ పతకాలు

ఒలింపిక్స్‌లో విజయమే లక్ష్యంగా సాధన

నగరంలోని పోస్టల్ కాలనీలో నివసించే మద్దినేని రామకృష్ణ, మంజుల దంపతుల కుమారుడు ఉమా మహేష్ (20) రైఫిల్ షూటింగ్‌లో సత్తా చాటుతున్నాడు. కేఎల్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 3 నుంచి 11 వరకు జైపూర్ (రాజస్థాన్)లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో తలపడి రైఫిల్ షూటింగ్‌లో రజత పతకం సాధించాడు. 2017లో ఇతను షూటింగ్‌లో అడుగుపెట్టాడు. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి అండర్- 17 పోటీల్లో తలపడి కాంస్య పతకాన్ని సాధించి.. రాష్ట్ర జట్టులో స్థానం సాధించాడు.

అనంతరం గుంటూరులోని ది ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్‌లో కోచ్ సుబ్రహ్మణ్యం వద్ద ప్రవేశించారు. ఆరు నెలల పాటు తండ్రి రోజూ అతన్ని గుంటూరు తీసుకెళ్లి శిక్షణకు దించి తిరిగి మళ్లీ రాత్రి 10 గంటలకు తీసుకొచ్చేవారు. ప్రస్తుతం భారత సీనియర్ జట్టులో కొనసాగుతూ విజయవాడ నగరపాలక సంస్థకు స్వచ్ఛ నిర్వేక్షణ్ కార్యక్రమానికి 'బ్రాండ్ అంబాసిడర్'గా కొనసాగుతున్నాడు. 2028 లాస్ ఏంజల్స్ ఒలింపిక్స్‌లో దేశానికి పతకం అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాడు ఉమా మహేష్.

– న్యూస్‌టుడే, విజయవాడ క్రీడలు

ఇవీ విజయాలు: 2022లో జర్మనీలో జరిగిన జూనియర్ వరల్డ్ కప్‌లో పసిడి పతకం సాధించాడు. 2023లో దక్షిణ కొరియాలో జూనియర్ వరల్డ్ ఛాంపియన్‌లో కాంస్యం, అదే ఏడాది దక్షిణ కొరియాలో జరిగిన ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి, రజతం దక్కాయి. 2024లో ఇండోనేషియాలో జరిగిన ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో ఒక పసిడి, ఒక రజతం, 2024 స్పెయిన్‌లో జరిగిన వరల్డ్ కప్‌లో వ్యక్తిగత, మిక్స్‌డ్ విభాగాల్లో రెండు పసిడి పతకాలు పొందాడు. 2024 దిల్లీలో వరల్డ్ యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకం, మూడేళ్ల పాటు బెంగళూరు, అసోం, జైపూర్‌లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో ఒక పసిడి, రెండు రజత పతకాలు, 2024 హరియాణా రాష్ట్రం కురుక్షేత్రలో ఆలిండియా అంతర్ విశ్వ విద్యాలయాల షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి దక్కింది.

బోంబేడయింగ్ since 1879
పండుగ ఆఫర్స్
కింగ్‌సైజ్ MRP. 2899
క్వీన్‌సైజ్ MRP. 2699
సింగిల్ కాట్ MRP. 1499
బెడ్‌షీట్ సెట్స్‌పై
60% డిస్కౌంట్
Raymond / TRIDENT
200 T.C. డబుల్‌కాట్ MRP. 2999
3 సెట్స్ కేవలం రు.3300 లకే
2 ప్యాంట్సు కొనండి
1 ప్యాంటు ఉచితం
మానస బీసెంట్‌రోడ్ ✆ 2571497
మానస ఎం.జి. రోడ్ ✆ 2497476
మానస గాయత్రినగర్ ✆ 2486598
మానస పోరంకి. ✆ 2582939
అనూష పటమట ✆ 9440137486
సౌమ్య పంటకాలువ రోడ్ ✆ 9440609448

24న ఉద్యోగ మేళా

కలెక్టరేట్ (మచిలీపట్నం): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉయ్యూరులో ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. బస్టాండ్ సమీపంలోని ఎన్ఏసీ శిక్షణ కేంద్రంలో ఉదయం 9 గంటలకు మేళా ప్రారంభమవుతుంది. పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఫార్మసీ పూర్తిచేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసున్న వారు జాబ్ మేళాలో పాల్గొనేందుకు అర్హులు. ఇతర వివరాల కోసం 79813 68429, 88851 59008 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

కిరణ్‌శర్మ వెనుక.. ఆగ్రా ముఠా!

☛ పిల్లల తరలింపు, విక్రయాల్లో తెరపైకి కొత్త పేర్లు
☛ ప్రియాంక, మరో ఇద్దరు మహిళల పాత్ర

ఈనాడు, అమరావతి

పిల్లల విక్రయాలకు సంబంధించి మరిన్ని కోణాలు వెలుగుచూస్తున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల నుంచి శిశువుల తరలింపు వెనుక మరికొందరి పేర్లు బయటకు వస్తున్నాయి. దిల్లీలోనే కిరణ్‌శర్మపై మరికొంత మంది సూత్రధారులు ఉన్నట్లు తేలింది. ఇటీవల కిరణ్ శర్మను అరెస్టు చేసినప్పుడు విచారణలో పలు విషయాలు వెల్లడయ్యాయి. ఆమె వెనుక ఆగ్రాకు చెందిన ముఠా ఉంది. దిల్లీ, పరిసర ప్రాంతాల్లో కిరణ్ శర్మ నేరుగా పిల్లలను వారి తల్లిదండ్రుల నుంచి కొనుగోలు చేసి విజయవాడకు తరలించేదని భావించారు. దర్యాప్తులో ఆమె మరో ముఠా నుంచి తీసుకుంటుందని తెలిసింది. ఆగ్రా ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు ఇందులో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. వీరిలో ప్రధానంగా ప్రియాంక కీలకమని తేలింది. ఆమెతో పాటు మరో ఇద్దరు మహిళలు కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో కేసు మూలాల్లోకి వెళ్లేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.

లావాదేవీలు, సంబంధాలపై దృష్టి

ఒక బృందం.. ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టు అయిన 12 మందిలో ముఖ్యమైన వారి బ్యాంకు లావాదేవీలు, ఫోన్ కాల్స్‌పై దృష్టి సారించింది. కిరణ్‌శర్మ, బలగం సరోజిని, నందిని, బ్లెస్సీ ఖాతాలకు ఎవరి నుంచి డబ్బు బదిలీ అయింది? వీరి నుంచి ఎవరెవరి ఖాతాలకు వెళ్లింది? అన్న వివరాలు పరిశీలిస్తున్నారు. మరో బృందం.. ప్రధాన నిందితుల సీడీఆర్‌లను వడపోస్తోంది. వీరి ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ కాల్స్‌ను వడపోస్తున్నారు. ఎప్పుడెప్పుడు ఎవరెవరితో మాట్లాడారన్న వివరాలను లెక్క తేల్చుతున్నారు. విజయవాడ నగరంలోని మూడు స్టేషన్లలో నమోదైన మూడు కేసులతో పాటు గతంలో మహిళా స్టేషన్‌లోని కేసులో పీటీ వారెంట్లు వేసేందుకు దర్యాప్తు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆ తర్వాత కస్టడీకి తీసుకోనున్నారు.

ముంబయి ముఠా కోసం వేట

ప్రధాన నిందితురాలు సరోజిని.. ముంబయి ముఠా నుంచి ముగ్గురు పిల్లల్ని తీసుకుంది. ముంబయికి చెందిన కవిత.. మూడు సార్లు నూరి, సతీష్‌ల ద్వారా రైలులో పిల్లలను పంపించింది. ఈ నేపథ్యంలో వీరిని కూడా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేశారు. పాత కేసులో కిరణ్‌శర్మతో పాటు దిల్లీకి చెందిన అనిల్ ప్రమేయమూ ఉంది. దీంతో వీరందరిని అరెస్టు చేసి కేసు మూలాల్లోకి వెళ్లేందుకు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. వీరంతా ఎలా పిల్లల్ని కొనుగోలు చేశారు? లేదా ఎక్కడైనా కిడ్నాప్ చేశారా? అన్నది తేలాల్సి ఉంది.

యంత్రాలు మూలకు.. లక్ష్యం గాలికి..

నిత్యం కొన్ని వేలమంది ప్రయాణికుల రాకపోకలతో రాష్ట్రంలోనే అత్యంత రద్దీగా ఉండే విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో స్వచ్ఛభారత్‌లో భాగంగా విజయవాడ నగర పాలక సంస్థ సహకారంతో ప్లాస్టిక్ బాటిళ్ల రీసైక్లింగ్ చేసే యంత్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి చేయడం లేదు. దీంతో ఒకదానికి విద్యుత్తు సదుపాయం నిలిపేయగా.. మరొకదాన్ని మూలకు చేర్చారు. వీటిపై అవగాహన ఉండి ప్లాస్టిక్ బాటిళ్లు వేద్దామని వచ్చిన ప్రయాణికులు వాటి దుస్థితి చూసి వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలని, లేకుంటే అక్కడి నుంచి తొలగిస్తే కనీసం స్థలం అయినా కలిసి వస్తుందని అంటున్నారు. -ఈనాడు, అమరావతి

జనవరిలో యువతకు ఉచిత శిక్షణ

సీతారాంపురం, న్యూస్‌టుడే : అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఎలీప్), సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ (సీఈడీ) అనుబంధ సంస్థ ద్వారా జనవరి మొదటి వారంలో వ్యవసాయ అనుబంధ వ్యాపార రంగాలపై యువతకు ఉచిత శిక్షణ ఇస్తామని ఎలీప్ అధ్యక్షురాలు కె.రమాదేవి తెలిపారు. 45 రోజులపాటు ఈ శిక్షణ ఉంటుంది. అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, పశువైద్య విజ్ఞానం, చేపల పెంపకం, బయో టెక్నాలజీ, అగ్రి ఇంజినీరింగ్, ఫారెస్ట్రీ, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, బీజెడ్‌సీ, హోమ్ సైన్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్‌పై పీజీ, డిగ్రీ చదివిన పట్టభద్రులు అర్హులని పేర్కొన్నారు. ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామన్నారు. జాతీయ వ్యవసాయ విస్తరణ కేంద్రం జారీ చేసిన ధ్రువపత్రాన్ని అందజేస్తామన్నారు. బ్యాంకుల ద్వారా రాయితీతో కూడిన రుణ సదుపాయాన్ని పొందవచ్చని వివరించారు. ఆసక్తి గల వారు ఈ నెల 23 నుంచి 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 94412 66769 ఫోన్ నంబరులో సంప్రదించాలని ఆమె కోరారు.

ఆంధ్రప్రదేశ్ రైతులకు శుభవార్త
రైతు సోదరులారా కేంద్ర వ్యవసాయ శాఖ వారి e-ANNADATA లో సభ్యత్వం తీసుకోండి.
e-Annadata
ఏజంట్లు కావలెను
e-అన్నదాత కార్డులు రైతులకు పంపిణీ చేయుటకు ఏజంట్లు కావలెను
మరియు మీ మండలాల్లో త్వరలో ప్రారంభించే e-అన్నదాత క్యాంటీన్లు (ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు) కావలసినవారు సంప్రదించండి.
ఇట్లు: కన్నా రవి దేవరాజు (BJP)
e-అన్నదాత A.P కో ఆర్డినేటర్, ✆ 96184 25367

రీసర్వే చిక్కుముడులు

☛ వైకాపా పాలనలో అడ్డగోలుగా వ్యవహారం
☛ దరఖాస్తులు ఇస్తున్నా కొలిక్కిరాని సమస్యలు

ఈనాడు, అమరావతి, హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

వైకాపా వేసిన రీసర్వే చిక్కుముడులు ఏళ్లు గడుస్తున్నా కొలిక్కి రావడం లేదు. జాయింట్ ఎల్పీఎంలు, విస్తీర్ణాలలో వ్యత్యాసాలు, ప్రైవేటు భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడం వంటి సమస్యల సుడి గుండాల్లో అన్నదాతలు అల్లాడుతున్నారు. మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా పరిష్కారాలు కనిపించడం లేదు.

★ **ఎందెందు వెతికినా..** ఉమ్మడి జిల్లాలో వైకాపా పాలనలో 365 గ్రామాల్లో, 5లక్షల ఎకరాల్లో పైగా రీసర్వే చేపట్టారు. 6,753 జాయింట్ ఎల్పీ నంబర్లు ఉండగా ఇందులో దాదాపు లక్ష ఎకరాల వరకు ఇరుక్కుపోయాయి. దీంతో రుణాలు రావడం లేదు. పాస్‌పుస్తకాలు ఇవ్వడం లేదు. క్రయ విక్రయాలకు అవకాశం లేక రైతులు అల్లాడుతున్నారు. నమూనా గ్రామంగా రీసర్వే చేసిన బాపులపాడు మండలం రేమల్లెలో ఒకరి భూమి మరొకరి పేరుతో నమోదు చేయడం, విస్తీర్ణాలు తగ్గడం, జాయింట్ ఎల్పీఎం నంబర్లు కేటాయించడం వంటి సమస్యలు కోకొల్లలు..3సార్లు గ్రామసభలు పెట్టినా ఫలితం లేదు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల సర్వే ఏడీలు మోహన్‌రావు, జోషీలా మాట్లాడుతూ..సమస్యపై వచ్చిన అర్జీలను వేగంగా పరిష్కరిస్తామని తెలిపారు.

గ్రామసభలో అర్జీలు సమర్పిస్తున్న రైతులు

★ మైలవరం మండలం దాసుల పాలెంలో రీసర్వేలో 100 మందికి పైగా జాయింట్ ఎల్పీ ఎంల సమస్య వచ్చింది. అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో కూటమి సర్కారు అధికారం చేపట్టిన తర్వాత పెట్టిన గ్రామసభలను సైతం గ్రామస్థులు బహిష్కరించారు.

★ **ఇక్కట్లు:** వీరులపాడు మండలం పెద్దాపురానికి చెందిన నిమ్మల సూర్యావతికి 9.58 ఎకరాల భూమి ఉంది. వైకాపా సమయంలో జరిగిన రీసర్వేలో 9.28 ఎకరాలే వచ్చినట్లు తేల్చారు. దాదాపు 30సెంట్లు వ్యత్యాసం వచ్చింది. సమస్య అధికారుల దృష్టికి తీసుకెళ్లి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పరిష్కారం లేదు. పెద్దాపురంలో రీసర్వే సమస్యలే పెద్ద సంఖ్యలో ఉన్నాయని, కలెక్టర్ మళ్లీ సర్వే చేయాలని ఆదేశించినా ఇప్పటికీ మొదలుకాలేదు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

ఈఎస్ఎల్ క్రీడా సంబరానికి సై

నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

న్యూస్‌టుడే-విజయవాడ (క్రీడలు): తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' (ఈఎస్ఎల్)-2025కు రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిభావంతుల్ని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ఈఎస్ఎల్' పండగకు సమయం ఆసన్నమైంది. వర్ధమాన క్రికెట్ ప్రతిభకు వేదికగా నిలుస్తూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న 'ఈనాడు క్రికెట్' సోమవారం ప్రారంభం కానుంది. ఉమ్మడి కృష్ణా జిల్లా క్రికెట్ మ్యాచ్‌లకు కానూరులోని కేపీసీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్ క్రికెట్ మైదానం వేదిక కానుంది. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, మెడికల్, ఫార్మా కళాశాలల జట్లు క్రికెట్ టోర్నీలో తమ అదృష్టం పరీక్షించుకోనున్నాయి. తొలుత జిల్లా స్థాయిలో మ్యాచ్‌లు జరుగుతాయి. సోమవారం జిల్లా స్థాయి మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అనంతరం ప్రాంతీయ స్థాయిలో మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు. రాష్ట్ర స్థాయిలో కూడా పోటీలు జరగనున్నాయి.

వేదిక: కేపీసీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్, కానూరు.

షెడ్యూల్ ఇలా.. 22.12.2025 (మొదటి మ్యాచ్) సీనియర్ విభాగంలో కేబీఎన్ డిగ్రీ కళాశాల X ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల
22.12.2025 (రెండవ మ్యాచ్) జూనియర్ విభాగంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (విజయవాడ) X ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల

KAMINENI HOSPITALS VIJAYAWADA
EENADU SPORTS LEAGUE 2025
Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: GGU GODAVARI GLOBAL UNIVERSITY RAJAMAHENDRAVARAM, A.P.
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Gift Partner: KL UNIVERSITY (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner / FM Partner / TV Partner: ఈనాడు.net, Mee FM, ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

విజయవాడలో ఎండీఎంఏ పట్టివేత

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, పటమట

- 10 గ్రాములు స్వాధీనం, ముగ్గురి అరెస్టు
- పోలీసుల నిర్లక్ష్యంతో పారిపోయిన నిందితుడు

విజయవాడలో మరో సారి డ్రగ్స్ కలకలం రేగింది. బెంగళూరు నుంచి ఎండీఎంఏ తీసుకొచ్చి విజయవాడలోని ఓ హోటల్‌లో తీసుకుంటుండగా పోలీసులు దాడి చేసి ముగ్గురిని పట్టుకున్నారు. వీరి నుంచి మత్తుమందు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి వారు ఉపయోగించిన కారుతో సహా స్టేషన్‌కు తరలించారు. కారు పార్కు చేసి రావాలని నిందితుడికే తాళాలు అప్పగించడంతో అతడు పరారయ్యాడు.

వ్యసనాలకు బానిసలై.. తరచూ బెంగళూరుకు: విజయవాడలోని మధురానగర్‌కు చెందిన వెంకట జగదీష్‌కుమార్, సింగ్‌నగర్‌కి చెందిన అఖిలేష్ అలియాస్ అఖిల్ ఇంటర్ తర్వాత చదువు మానేశారు. వీరు చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. స్నేహితుల పార్టీల్లో ఎండీఎంఏ అలవాటైంది. తరచూ బెంగళూరు వెళ్లి అక్కడ కొని విజయవాడ తెచ్చి స్నేహితులతో కలిసి తీసుకునేవారు. ఈనెల 19న కారులో వీరిద్దరూ బెంగళూరుకు బయలుదేరారు. 20న అక్కడకు చేరుకున్నారు. మహేష్ వద్దకు వెళ్లి రూ.36వేలు చెల్లించి 19 గ్రాముల డ్రగ్స్ కొనుగోలు చేశారు.

హోటల్‌లో మత్తులో జోగుతూ.. వీరు బెంగళూరు వెళ్లిన విషయాన్ని జగదీష్ స్నేహితుడు జకీర్ ద్వారా నెల్లూరుకు చెందిన రాజేష్ తెలుసుకున్నాడు. వెంటనే జగదీష్‌కుమార్‌కు ఫోన్ చేసి తనకు తెలిసిన తేజ అనే వ్యక్తి నుంచి 2 గ్రాముల ఎండీఎంఏ తీసుకురావాలని కోరాడు. పాత బకాయి కూడా ఇవ్వాల్సి ఉందని చెప్పి రూ.20వేలు జగదీష్‌కుమార్ యూపీఐ ఖాతాకు బదిలీ చేశాడు. దీనిని జగదీష్ తొలుత తిరస్కరించాడు. పోలీసుల నిఘా ఉందని చెప్పి, ఆ రూ.20వేలను తిరిగి రాజేష్ ఖాతాకు వెనక్కి పంపించాడు. తర్వాత బతిమిలాడి జగదీష్‌ను ఒప్పించి డబ్బులు పంపించాడు. తర్వాత తేజ వద్ద రెండు గ్రాములు తీసుకుని కారులో బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో నెల్లూరులో దిగి రాజేష్‌కు ఎండీఎంఏ ఇచ్చారు. అక్కడవారు కొంత డ్రగ్స్ తీసుకున్నారు. జగదీష్ కారు మొరాయించడంతో అక్కడే వదిలేసి, రాజేష్ కారులో ముగ్గురూ విజయవాడ చేరుకుని మాచవరం స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో దిగారు. అక్కడ ముగ్గురూ డ్రగ్స్ తీసుకుని మత్తులో మునిగి తేలారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు హోటల్‌పై దాడి చేసి, వీరిని పట్టుకుని 10 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు.

రాజేష్ పరారీ.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను తీసుకుని మాచవరం స్టేషన్‌లో కారుతో సహా అప్పగించారు. కారును బయట పార్కు చేసే సమయంలో డోర్ లాక్ పడలేదు. దీంతో నిందితుడు రాజేష్‌ను లాక్ వేయమని పోలీసులు చెప్పడంతో అతను కారు స్టార్ట్ చేసుకుని రెప్పపాటులో స్టేషన్ నుంచి పరారయ్యాడు. తర్వాత అప్రమత్తమైన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రాజేష్ కోసం గాలిస్తున్నారు. మిగిలిన నిందితులు జగదీష్‌కుమార్, అఖిలేష్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. వీరికి ఎండీఎంఏ అమ్మిన మహేష్, తేజ కోసం మరో బృందం బెంగళూరు వెళ్లింది.

పేదరిక రహితంగా ఎన్టీఆర్ జిల్లాను తీర్చిదిద్దాలి

విద్యాధరపురం, న్యూస్‌టుడే : పేదరిక రహితంగా ఎన్టీఆర్ జిల్లాను తీర్చిదిద్దాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఛాంబర్ ఆఫ్ రియల్టర్స్ అండ్ బిల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో అమరావతి విశిష్ట సేవా పురస్కారాలను ఎంపీ కేశినేని చిన్ని, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 విధానంతో రాష్ట్రంలో పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నారన్నారు. వంద మంది మార్గదర్శకులు వెయ్యి కుటుంబాలను దత్తత తీసుకొని ఆసరాగా నిలవడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్ ఆనాడు ముందుచూపుతో కొండలపై విత్తనాలు చల్లించి పర్యావరణ పరిరక్షణకు నాంది పలికారన్నారు. ఎంసీ దాస్ వంటి విద్యావేత్తలు తమ ప్రసంగాల ద్వారా ఎందరినో చైతన్య పరిచారని చెప్పారు. మార్గదర్శకులను గౌరవించడం సామాజిక బాధ్యతగా భావించాలన్న భావం కలిగినందుకు కార్యక్రమ నిర్వాహకులను అభినందించారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు మాట్లాడుతూ నగర ప్రముఖులు ఎందరో విద్యార్థులకు రూ.కోట్లు విలువ చేసే ఆస్తులను విరాళంగా అందజేశారని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబు 1995లో జన్మభూమి పేరుతో శ్రమదానంతో ప్రజలను భాగస్వాముల్ని చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అత్తలూరి నాగమల్లేశ్వరరావు, సారేపల్లి శరత్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి బొప్పన భవకుమార్, బసవేశ్వరరావు, విశ్వనాథ్, రామకృష్ణ, రామారావు, యాంకర్ ఉదయభాను పాల్గొన్నారు.

జంధ్యాల శంకర్‌ను సత్కరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు తదితరులు

'వాలిడేషన్ చట్టాన్ని ఉపసంహరించుకోవాల్సిందే'

గాంధీనగర్, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వాలిడేషన్ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అఖిల భారత పింఛనర్ల సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి చట్టాల వల్ల భవిష్యత్ తరాలకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. ఓపీఎస్ పింఛనర్లను విడగొట్టి భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర పే కమిషన్ సిఫార్సులు అమలు చేయకుండా కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. దీన్ని తిప్పికొట్టేందుకు దేశం, రాష్ట్ర స్థాయిల్లో ఐక్య ఉద్యమాలు చేసేందుకు ఏకం కావాలని పిలుపునిచ్చారు. 35, 40 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా ప్రభుత్వానికి సేవలు అందించిన పింఛనర్లకు పింఛను ఇచ్చేందుకు ఎందుకు వెనుకాడుతున్నారని బొప్పరాజు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శర్మ మాట్లాడుతూ.. కేంద్ర సంఘం సూచన మేరకు ఎలాంటి నిర్ణయానికైనా రాష్ట్ర సంఘం కట్టుబడి ఉంటుందన్నారు. ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ పి.కె.శర్మ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పింఛనర్స్ వాయిస్ పత్రిక చీఫ్ ఎడిటర్ ఎస్.ఎస్. దుబే, సెక్రటరీ జనరల్ డి.సుధాకర్, ఏపీ ఎన్జీవో సంఘం మాజీ అధ్యక్షుడు జి.పి.రావు, ఎ.రాజేంద్రబాబు, ఎం.సి.లింగన్న, పీవీఎస్ఎన్ఎల్ శాస్త్రి, లవకుమార్, ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, సైకం శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, పక్కన శర్మ, సుధాకర్

23న కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్

సీతారాంపురం: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పనశాఖ, డీఆర్‌డీఏ-సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీన కొత్తపేటలోని పద్మ ప్రభాత్ జీత్ ఆఫ్ ఫైనాన్స్‌లో 'కంపెనీ స్పెసిఫిక్ డ్రైవ్' నిర్వహిస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి సి.మధుబాబు తెలిపారు. వీల్స్ మార్ట్, పద్మప్రభాత్ ఆటో ఫైనాన్స్ కంపెనీల్లో ఉద్యోగాల ఖాళీలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్ పూర్తిచేసినవారు అర్హులన్నారు. రూ.12వేల నుంచి రూ.18వేల వరకు వేతనం ఇస్తారు. వివరాలకు ఫోన్ 89779 39475, 90326 33548 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కథలు స్ఫూర్తిదాయకంగా ఉంటే మేలు

సంపుటిని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, పూర్ణచందు, సాంబశివరావు తదితరులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : కథలు స్ఫూర్తిదాయకంగా, సామాజిక ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శ్రీకంఠస్ఫూర్తి సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో శ్రీకంఠస్ఫూర్తి రచించిన 'కథ మళ్ళీ మొదలయింది' కథల సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నగరంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు కథలో కాలానుగుణమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలియజేశారు. రచయిత కంఠస్ఫూర్తి సమాజంలో వస్తున్న మార్పులకు అక్షర రూపం ఇచ్చారని వివరించారు. కథల సంపుటిని డాక్టర్ గుమ్మా సాంబశివరావు పరిచయం చేయగా.. అవధానుల మణిబాబు సమీక్షించారు. తొలి ప్రతిని సాహితీవేత్త ఎల్.శ్రీనివాసరాజు స్వీకరించారు. డాక్టర్ జి.వి.పూర్ణచందు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సాహితీ ప్రముఖులు పాణ్యం దత్తాత్రేయశర్మ, రసరాజు, డాక్టర్ ఎం. సుగుణరావు, ఆచార్య కొప్పరపు నారాయణ మూర్తి, డాక్టర్ సాధనాల వెంకటస్వామి నాయుడు, ఎల్.శివరామకృష్ణ, విజయ కనక దుర్గ, వంశీ కంఠస్ఫూర్తి పాల్గొన్నారు.

జగన్మాత సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచనం మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి, స్థానాచార్య శివప్రసాద శర్మ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

రెండు చుక్కలతో చక్కని ఆరోగ్యం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : రెండు చిన్న పోలియో చుక్కలు.. ఆరోగ్యకరమైన భవితకు బాటలు వేస్తాయని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. సుసంపన్న, ఆరోగ్య, ఆనందకర ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఆదివారం గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూలులోని పోలియో బూత్‌ను ఆయన సందర్శించారు. చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకునే క్రమంలో ఆరోగ్య ఆంధ్ర సాకారానికి సమష్టి కృషి జరుగుతుందన్నారు. పోలియోను అంతమొందించినప్పటికీ.. అప్రమత్తంగా ఉంటూ 5ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా.. చుక్కలు వేయించాలని సూచించారు. ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటింటి సర్వే చేసి.. మిగిలిపోయిన చిన్నారులకు మందు వేస్తామని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల సహకారంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బస్టేషన్, రైల్వేస్టేషన్, ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాల్లో పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, డీఐవో శరత్‌బాబు, విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య, 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ. చిత్రంలో డీఎంహెచ్‌ఓ సుహాసిని, కార్పొరేటర్ బాలస్వామి

97 శాతం నమోదు

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే : జిల్లావ్యాప్తంగా చిన్నారులకు పోలియో చుక్కలు కార్యక్రమం విజయవంతం అయిందని, 97 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని తెలిపారు. ఆదివారం జిల్లావ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. 1,62,265 మంది చిన్నారులకు గాను 1,57,574 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. నేడు (సోమవారం), రేపు (మంగళవారం) కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సమాజ సేవకులను గుర్తించడానికే సత్కారాలు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజం కోసం కృషి చేసే వారిని గుర్తించడానికే సత్కార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శివశ్రీ గెంటేల వెంకటరమణ తెలిపారు. సద్గురు శివానందమూర్తి భగవానుల జయంతిని పురస్కరించుకొని జగ్గయ్యపేట మండలం బలుసుపాడు గ్రామంలోని గురుధామ్ ధర్మక్షేత్రంలో ఆదివారం శివానంద ఎమినెంట్ సిటిజన్ పురస్కారాలను ప్రదానం చేశారు. గెంటేల వెంకటరమణ-వసంతలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రికి చెందిన ఆంకాలజిస్ట్ డా. సి.కె.నాయుడు, విజయవాడ ఆర్కే ఆసుపత్రికి చెందిన ఆర్.ఈశ్వర్, జగ్గయ్యపేట శ్రీరామ ఆసుపత్రికి చెందిన డా. బి.యోగిరాంలకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ జలవనరులశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. గురుధామ్ ధర్మక్షేత్రంలో జరిగే సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను, వైద్యులు వి.ఎస్.ఎన్.రావు, ఎన్.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రాఘవేంద్రన్ పాల్గొన్నారు. దివంగత సిరివెన్నెల సీతారామశాస్త్రి రచించిన కవితలతో స్వరపరిచిన సీడీని ఆవిష్కరించారు. సిరివెన్నెల తనయుడు యోగేశ్వర్ స్వరపరిచారు. సిరివెన్నెల సతీమణి పద్మావతిని సత్కరించారు.

యోగిరాం దంపతులను సన్మానిస్తున్న వెంకటరమణ. చిత్రంలో ఉదయభాను, సి.కె.నాయుడు, ఈశ్వర్, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

వంకాయలు-20/26, టమాటా-47, బెండ-36, పచ్చిమిర్చి-38, కాకర-44, బీర-40, క్యాలీ ఫ్లవర్-30/25, క్యాబేజీ-24, క్యారెట్-38, దొండ-34, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-30, గోరుచిక్కుళ్లు-42, దోస-30/36, సొర-18/20, పొట్ల-35, అరటికాయ-7/8, చామదుంప-24, అల్లం-74, మునగ-20/18, ఆకుకూరలు (కట్ట)-3, కంద-40, బీట్ రూట్-34, కీరదోస-44, బీన్స్-70/86, క్యాప్సికమ్-64, చింతకాయలు-60, కొత్తిమీర-8/15, పుదీనా-5/15 (నిన్నటివి). - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

సాధన చేస్తున్న కిదాంబి శ్రీకాంత్

నేటి నుంచి జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు యోనెక్స్ సన్‌రైజ్ 78వ జాతీయ అంతర్ రాష్ట్ర, 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ జరుగుతుంది. ఆదివారం రాత్రి రాష్ట్ర షట్లర్ కిదాంబి శ్రీకాంత్ స్టేడియంలో సాధన చేశాడు. స్టార్ షట్లర్లు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ వ్యక్తిగత, డబుల్స్ విభాగాల్లో తలపడనున్నారు. సోమవారం రాష్ట్ర మహిళా జట్టు ఉత్తరాఖండ్ జట్టుతో, రాష్ట్ర పురుషుల జట్టు తమిళనాడు జట్టుతో తలపడతాయని రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పోలినేని అంకమ్మచౌదరి తెలిపారు. సోమవారం జరిగే పోటీల ప్రారంభోత్సవానికి ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, బోడె ప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు హాజరవుతారని పేర్కొన్నారు.

చదరంగం విజేత హరీష్ సాయిరామ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని శ్యామ్ నగర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నీలో పుచ్చలపల్లి హరీష్ సాయిరామ్ విజేతగా నిలిచాడు. మొత్తం ఆరు రౌండ్ల పాటు నిర్వహించిన ఈ పోటీలో హరీష్ సాయిరామ్ ఆరు పాయింట్లతో ప్రథమ, మీసాల ఈశ్వరరావు అయిదు పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలవగా.. నారాయణ రిషిత తృతీయ స్థానంలో నిలిచింది. చిన్నారులను ప్రోత్సహించేందుకు పలు వయసు విభాగాల్లో బాలబాలికలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ముగింపు కార్యక్రమానికి కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, డాక్టర్ రాణి నరసింహమూర్తి, సిటీ కేబుల్ ఎండీ దండమూడి కృష్ణమోహన్, రాష్ట్ర సిటీ కేబుల్ ఆపరేటర్స్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కేవీ శ్రీనివాసరావు, బి.వెంకట్ హాజరయ్యారు. విజేతలను ది విజయవాడ చెస్ సంఘం అధ్యక్షుడు ఎండీ అక్బర్ పాషా, కార్యదర్శి ఎం.రాజీవ్ అభినందించారు.

విజేతలతో అతిథులు

'సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ రాయాలనడం తగదు'

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరులోని లక్ష్మీపురం మను గార్డెన్స్‌లో ఆదివారం యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ స్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా.వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సర్వీస్ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ రాయాలని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తు రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన నాలుగు డీఏల్లో ఒక్కటి ఇచ్చి సరిపెట్టారని, కనీసం వచ్చే విద్యా ఏడాది నుంచి అయినా సంవత్సరానికి రెండు డీఏలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం భవిష్యత్తు కార్యాచరణ ప్రకటించి, యూటీఎఫ్ కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షులుగా కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య, కార్యవర్గ సభ్యులుగా 18 మందిని ఎన్నుకున్నారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు, వేదికపై సంఘ నాయకులు

అదృశ్యం కేసు.. పోక్సోగా మార్పిడి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికను ప్రేమ పేరుతో వల వేసి.. కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన యువకుడిని నున్న పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన బాలిక (17) విజయవాడ, నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే పెదనాన్న ఇంట్లో ఉంటోంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో రాహుల్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పాడు. వాటిని నమ్మిన బాలిక.. ఈ నెల 18న రాత్రి యువకుడితో కలిసి వెళ్లిపోయింది. 19న బాలిక కనిపించడం లేదని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు...: అదృశ్యం కేసుపై పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బాలిక కిడ్నాపర్ల బారి నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో పోలీసులు తీసుకువచ్చారు. దర్యాప్తులో ఆమెపై అత్యాచారం చేసినట్లు తేలింది. దీంతో మిస్సింగ్ కేసు సెక్షన్లను మార్చారు. రాహుల్ పక్కా ప్రణాళిక ప్రకారం హైదరాబాద్ నుంచి అద్దె కారు తీసుకొచ్చాడు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు నంబరు ప్లేటు మార్చాడు. స్నేహితులతో కలిసి ఆమెను కిడ్నాప్ చేశాడు. సత్తెనపల్లిలోని ఓ లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. దీంతో అతడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అలాగే అతడితోపాటు స్నేహితులపై కిడ్నాప్ సెక్షన్లు పెట్టారు. ప్రధాన నిందితుడితోపాటు అతనికి సహకరించిన ఇద్దరు స్నేహితులను నున్న పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒకి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232, చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, 159, 170 చికెన్ విత్ స్కిన్ - 290 చికెన్ స్కిన్‌లెస్ - 300.

వన్య ప్రాణుల విక్రయం.. నిందితుల అరెస్టు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: శేషాచలం అడవుల పరిధిలో వన్య ప్రాణులను చంపి వాటితో వ్యాపారం నిర్వహిస్తున్న ఏడుగురిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుందర్ ఆదివారం తెలిపిన వివరాల మేరకు...ఈ నెల 19న రాజంపేట డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, విజయవాడకు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ, ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు కలిసి పట్టణంలోని ఓ లాడ్జిలో సోదాలు చేసి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్‌కు చెందిన జె.రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు గుర్తించారు. అతనితో పాటు ప్రకాశం జిల్లాకు చెందిన పుచ్చకాయల భూపతిరాజు, పప్పుల జయరావ్, రైల్వేకోడూరుకు చెందిన మొలకల సుబ్రహ్మణ్యం, కుంభకోణం శ్రీరాములు ఆచారి, రాజంపేటకు చెందిన ఉప్పుటూరు శివ, విజయవాడకు చెందిన కాజా రవికుమార్‌లను పట్టుకున్నారు. శనివారం రాత్రి నిందితులను రాజంపేట కోర్టులో హాజరుపరచగా వారికి వచ్చే నెల 2వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు రేంజర్ వివరించారు.

91.9 FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీబంగారం విడిపించి ఈరోజు మార్కెట్ ధరకు కొనబడును. స్పాట్‌క్యాష్ ✆81422 92071

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు టెలికాలర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్, మరియు సీనియర్ టీం లీడర్స్ కావలెను. ✆ 95500 08995.

SWEET MANTRA The Telugu House
కానూరు, M.G రోడ్, విజయవాడ.
WANTED
సూపర్‌వైజర్స్, క్యాషియర్స్
పూర్తి బయోడేటాతో 11A.M to 3 P.M పై అడ్రస్సునందు సంప్రదించండి.

REAL ESTATE

LEASE/ RENT

నూజివీడు- విస్సన్నపేట M.Rd లీలానగర్ 7500 Sft పక్క గోడౌన్ అద్దె/లాంగ్‌లీజుకు కలదు. C: 10Am-5 Pm. ✆ 98481 73135/ 63045 88926.

Male Nurse (or) Assistant తమ్మినేని హాస్పిటల్ గుండలలో పనిచేయుటకు కావలెను. Contact: 98482 42880.

JOBS

Wanted Software Developer Cloud Adminstrator Fashion Designer Beautician Receptionist (Trainers). ✆ 93472 77429

బ్యాంక్ఆఫీసులో పర్మినెంటుగా పని|| వెరిఫికేషన్స్, డేటాఎంట్రీ అక్కౌంటెంట్స్, సూ||వైజర్స్, కం.ఆపరేటర్స్, అడ్మిన్ఇన్‌ఛార్జి, జీ:15 to 25k. ✆ 95058 38531.

MARKETING/ SALES

Paytm కంపెనీ విజయవాడలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ (M) కావలెను. Q: 10th ఆపైన. Age: 18-36. స్మార్ట్ ఫోన్, బైకు ఉండవలెను. జీతం: 20K+ Inc ✆ 83282 99866/ 83283 09019.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

తిరువూరు
• తిరువూరు • మైలవరం

తార వెలిసింది..

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని వీధుల్లో సందడి వాతావరణం నెలకొంటోంది. గొల్లపూడి, పరిసరాల గ్రామాల్లో క్రీస్తు జననం తెలిపేలా పశువుల పాకలు, పెద్ద నక్షత్రాలు, విద్యుత్తుదీపాలతో అలంకరణ చేస్తున్నారు. దీంతో వీధులు కోలాహలంగా మారాయి. - న్యూస్‌టుడే, గొల్లపూడి

ఘనంగా నారా బ్రాహ్మణి జన్మదిన వేడుక

విస్సన్నపేట మండల కేంద్రంలోని తెదేపా కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోసి పార్టీ శ్రేణులకు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు కొంగల శ్రీనివాసరావు, రాయల కిట్టు, రాంబాబు, శివబాజీ, అశోక్, మల్లి, తేజ ప్రవీణ్, కోలేటి రంగారావు తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

✦ తిరువూరు 18వ వార్డులోని డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకున్నాయని స్థానికుడు రామకిషోర్ సమస్యను 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపించి శుభ్రం చేయించారు. – న్యూస్‌టుడే, తిరువూరు టౌన్

✦ కొండపల్లి బ్యాంకు కూడలిలో కాలువకు చెత్త అడ్డుపడి మురుగు రోడ్డుపైకి వస్తుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా అధికారులకు తెలిపారు. స్పందించిన మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వెంకటరత్నం పారిశుద్ధ్య సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, కొండపల్లి

? కవులూరులోని ముస్లిం బజార్‌లో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయి అవస్థలు పడుతున్నాం. తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.
- మౌలాలీ గ్రామస్థుడు ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సంబంధిత సిబ్బందితో బోరుకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరిస్తాం. - సరోజా, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, జి.కొండూరు

టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: బెంగళూరులోని జైన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ మహిళల టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో తలపడే డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ. త్రిమూర్తి ఆదివారం వెల్లడించారు. ఎంపికైన జట్టు సభ్యులను ఉపకులపతి డాక్టర్ పి. చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాధిక రెడ్డి అభినందించారు. జట్టులో భూమి శేఖర్, బి.లక్ష్మీ సాయి రితిక, ఎ.యశస్వి, కె. చరిష్మా నాగరాణిలకు స్థానం దక్కింది. జట్టుకు కె.నాగరాజు (పీడీ, కోనసీమ వైద్య కళాశాల, అమలాపురం) మేనేజరుగా నియమితులయ్యారు.

ప్రత్యేక తరగతులు.. నీరసంతో చదువులు

జి.కొండూరు, న్యూస్‌టుడే

పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డిసెంబరు మాసం మొదటి వారం నుంచి అదనపు తరగతుల నిర్వహణ చేపట్టి వంద రోజుల పాఠ్య ప్రణాళిక అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో పది విద్యార్థులు ఉదయం 8 గంటలకు పాఠశాలకు హాజరై సాయంత్రం అయిదున్నర వరకు ఉంటారు. నిత్యం ఓ సబ్జెక్టు ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతిని నిర్వహించి, దానిపై పరీక్ష పెట్టి వారి పురోగతిని ఉన్నతాధికారులకు తెలియపరచాలి. వెనకబడిన వారికి సైతం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండటంతో విద్యార్థులు అధిక ఒత్తిడి, అలసట గురవుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు

గంగినేని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ఉపాధ్యాయులు

గతంలో ప్రభుత్వమే విద్యార్థులకు అల్పాహారం అందించేదని పలువురు వెల్లడిస్తున్నారు. దీంతో వారు కొంత శక్తిని పొంది మరింత చదువుకునే వారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ అల్పాహారం లేకపోవడంతో విద్యార్థులు నీరసంగా ఉంటున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు తరగతులకు హాజరైన వారికి అల్పాహారం ఏర్పాటు చేస్తే మేలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సొంత నిధులు సమాకూర్చి..

మండలంలోని గంగినేని జడ్పీ ఉన్నత పాఠశాలలో 40 మంది విద్యార్థులు అదనపు తరగతులకు హాజరవుతున్నారు. వీరికి ఆ బడిలోని ఉపాధ్యాయులే స్వయంగా నిధులు సమకూర్చి అల్పాహారం అందించేందుకు శ్రీకారం చుట్టారు. తమ విద్యార్థులు అధిక శాతం ఉత్తీర్ణత సాధించాలంటూ ప్రతి రోజు గోధుమ రవ్వతో ఉప్మా, శెనగలు అందిస్తున్నారు. ఇదే కాక మరొక రోజు బిస్కెట్ ప్యాకెట్లు కూడా అందించాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

గతంలో మాదిరిగా..

ఉపాధ్యాయులు స్వయంగా నిధులు సమకూర్చి అల్పాహారం ఏర్పాటు చేయడంతో విద్యార్థులు శ్రద్ధతో చదువుతున్నారు. ఉపాధ్యాయులకు శ్రమ కలుగకుండా గతంలో మాదిరిగా ప్రభుత్వమే అల్పాహారం ఏర్పాటు చేస్తే మేలు కలుగుతోంది. - కొమ్మిన బోయిన రజని, గంగినేని పీఎంసీ ఛైర్మన్

ఉత్తీర్ణత పెరుగుతోంది

విద్యార్థులకు అల్పాహారం అందిస్తే వారు ఎక్కువ శ్రద్ధతో చదివి అధిక మార్కులు పొంది ఉత్తీర్ణత శాతం పెరుగుతోంది. ప్రభుత్వం అల్పాహారం ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.
- బండారు బాలాకుమారి, చెవుటూరు పీఎంసీ ఛైర్మన్

సాగర్ జలాలు విడుదల

గంపలగూడెం, న్యూస్‌టుడే : ఎన్నెస్పీ రెండో జోన్‌లోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక 72వ కి.మీ నుంచి ఆదివారం 1034 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 497 క్యూసెక్కులు చేరాయని, అక్కడ నుంచి దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కి 60, పెదకొమిర 30, మధిర 50, నిదానపురం 60 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

వృద్ధురాలి నేత్రదానం

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రానికి చెందిన బొమ్మిన దమయంతి(80) వృద్ధాప్యంతో శనివారం మృతి చెందగా.. ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు కరుణా ఐ బ్యాంకుకు దానం చేశారు. ఐ బ్యాంకు నిపుణులు ఆదివారం వచ్చి ఆమె కార్నియాలను తీసుకెళ్లినట్లు ఆమె కుమారుడు బొమ్మిన వెంకటరమణ తెలిపారు. గతంలో తన తండ్రి నేత్రాలు దానం చేసినట్లు ఆయన చెప్పారు.

దమయంతి (పాత చిత్రం)

సీలింగ్ భూముల ఆక్రమణలకు తావు లేదు

రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్‌తో కలిసి మ్యాప్ పరిశీలిస్తున్న ఆర్డీవో మాధురి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట మండలం కొండపర్వ గ్రామ పంచాయతీ పరిధిలోని సీలింగ్ భూములను తిరువూరు ఆర్డీవో కె. మాధురి, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణితో కలిసి ఆదివారం పరిశీలించారు. సీలింగ్ భూములు ప్రభుత్వ భూములుగా ఉంటాయని, వాటి ఆక్రమణలకు ఎలాంటి తావులేదని ఆర్డీవో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో 1175.175 ఎకరాల సీలింగ్ భూములకు గాను ప్రభుత్వం హక్కుదారులైన పేదలకు పట్టాలు ఇవ్వగా కొండపర్వలో 328.7 ఎకరాల భూమి ఉందన్నారు. త్వరలో వీటి హద్దులు నిర్ణయించి ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తామన్నారు. ఆర్‌ఐ సుజాత, మండల సర్వేయర్ శంకర్రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి సహకరిద్దాం

కొండపల్లి, న్యూస్‌టుడే : పోలియో మహమ్మారి రాష్ట్రంలో మళ్లీ చూడకూడదన్న ప్రభుత్వ సంకల్పానికి తల్లిదండ్రులందరూ పూర్తి సహాయ సహకారాలు అందించాలని పల్స్ పోలియో రాష్ట్ర నోడల్ అధికారి, ఫ్యామిలీ వెల్‌ఫేర్ జాయింట్ డైరెక్టర్ నిర్మల గ్లోరి అన్నారు. ఆదివారం పల్స్ పోలియో పర్యవేక్షణలో భాగంగా ఇబ్రహీంపట్నం రింగుకూడలిలో చిన్నారులకు ఆమె పోలియో చుక్కలు వేశారు. అధికారులు శ్రీనివాస్, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న నిర్మల గ్లోరి

బ్రాహ్మణులకు సంక్షేమ పథకాల పునరుద్ధరణ

సమావేశంలో మాట్లాడుతున్న బుచ్చి రాంప్రసాద్

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని బ్రాహ్మణుల కోసం అనేక సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ పేర్కొన్నారు. మైలవరంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ ఆత్మీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పథకాలకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు పొందేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్పొరేషన్ డైరెక్టర్ ఫణికుమార్, క్రెడిట్ సొసైటీ ఎండీ శ్రీనివాస్, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వి.బాలాజీ ప్రసాద్, సతీష్, శర్మ, మారుతీ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా సూర్యనారాయణ

విస్సన్నపేట, న్యూస్‌టుడే : యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శిగా బీసీహెచ్‌వీ సూర్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా పి.రామకృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరువూరు మను గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా సమావేశంలో వీరు ఎన్నిక అయినందుకు యూటీఎఫ్ విస్సన్నపేట తరపున మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్. చంటిబాబు, ఎ.మురళీ కృష్ణ అభినందనలు తెలిపారు.

సెక్యూరిటీ స్థానే పీటీడీ కానిస్టేబుల్‌గా మార్చండి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రజారవాణా శాఖ (ఏపీ పీటీడీ/ఆర్టీసీ)లో సెక్యూరిటీ కానిస్టేబుల్ పేరును పీటీడీ కానిస్టేబుల్‌గా మార్చి, గౌరవాన్ని కాపాడాలని ఏపీ పీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో విజిలెన్స్, సెక్యూరిటీ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు డి. అంకినీడు, ప్రధాన కార్యదర్శి టి.వెంకటేశ్వరరావుల నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ.. సెక్యూరిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఐకాస అండగా ఉంటుందన్నారు. పేరు (డెసిగ్నేషన్) మార్పు, గత పే స్కేల్లో కానిస్టేబుల్ కేడర్‌కు జరిగిన అన్యాయం, ట్రావెల్, సమదుస్తుల అలవెన్స్‌లు తదితరాలపై సమావేశంలో చర్చించారు.

ప్రతి జీవిలో దైవాన్ని చూడటమే సనాతన ధర్మం

గంపలగూడెం, న్యూస్‌టుడే : హిందూ ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని శ్రీలలితా పీఠాధిపతి ఆదిత్యానంద భారతి స్వామి పిలుపునిచ్చారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం వందేళ్ల ఉత్సవం సందర్భంగా ఆదివారం గంపలగూడెం సీతా రామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దైవం, ధర్మం ఒక్కటేనని, ప్రతి జీవిలో దైవాన్ని చూడటమే సనాతన ధర్మం అన్నారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు వంశీధర్ ప్రభుజీ, హిందూ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంగళరావు, స్థానిక హిందూ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ఆదిత్యానంద భారతి స్వామి

గోదారంగ నాయకులకు ధనుర్మాస పూజలు

గంపలగూడెం, న్యూస్‌టుడే : ధనుర్మాసం సందర్భంగా ఆదివారం తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లోని వైష్ణవాలయాల్లో గోదారంగ నాయక స్వామికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, విశేషాలంకరణలు చేశారు. పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం గోదాదేవి ఆలపించిన తిరుప్పావై పాశురాలను పఠించారు.

పాత తిరువూరు: ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

గుంతలు.. రాకపోకలకు ఇక్కట్లు

శ్రీరాంపురం నుంచి పేర్వంచ వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో ముచ్చనపల్లి గ్రామంలోని ఊర చెరువు చప్టాపై గోతులు పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో స్థానికులు వాటి వద్ద ప్లాస్టిక్ డబ్బా పెట్టిన ఉపయోగం లేకుండా పోయింది. వాహనాల రాకపోకలకు అది కూడా పగిలిపోయింది. దీంతో రాత్రి సమయంలో ఈ మార్గంలో ప్రయాణాలు చేసే వారు చప్టాపై వాహనాలు అదుపు చేయలేక పడిపోతున్నారు. అధికారులు స్పందించి దీనికి మరమ్మతులు చేయించి రాకపోకలు సజావుగా సాగే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

చెత్త పేరుకుంది.. వాసన వీడనంటోంది!

ఇబ్రహీంపట్నం సడక్ రోడ్డు నివాస ప్రాంతాల వద్ద చెత్త పేరుకుంది. కొందరు చుట్టు పక్కల నుంచి వ్యర్థాలను తెచ్చి కాలువ పక్కన వేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. రోజూ చెత్త కుండి శుభ్రం చేయక పోవడంతోనే సమస్య వస్తుందని ఆవేదన చెందుతున్నారు. చెత్త మురుగులో కలిసిపోవడంతో కాలువ పారుదల లేదని, అటు వైపు రాకపోకలు సాగించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోందని చెబుతున్నారు. దీనిపై పురపాలిక పారిశుద్ధ్య పర్యవేక్షక అధికారి మధు స్పందిస్తూ చెత్తను రోజూ తొలగిస్తున్నా, చెత్త కుండి పరిసరాలలోనే వేస్తున్నారని, అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. - న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

పగుళ్లిచ్చి.. ప్రమాదకరంగా మారి..

జి.కొండూరులోని పులివాగు పక్కన శివాలయానికి వెళ్లే సీసీ రోడ్డు మధ్యకు పగుళ్లిచ్చి ప్రమాదకరంగా మారింది. దీంతో అటుగా ప్రయాణించే

ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆదమరిస్తే పక్కనే ఉన్న పులివాగులో పడిపోయే ప్రమాదముందని గ్రామస్థులు వాపోతున్నారు. నిత్యం శివాలయానికి వెళ్లే భక్తులు అవస్థలు పడుతున్నారని, ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం శూన్యమని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారికి మరమ్మతులు చేయించి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, జి.కొండూరు

ఆలయ కమిటీ ఛైర్మన్ పదవి ఇవ్వాలని వినతి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ పదవి జనసేన నాయకుడు శివాపురం గ్రామానికి చెందిన లగడపాటి శంకర్‌కు ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు ఆదివారం వినతిపత్రం అందజేశారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

విస్సన్నపేట- సత్తుపల్లి రోడ్డులో ఆర్యవైశ్య కల్యాణ మండపం సమీపంలో రహదారి పక్కనున్న డ్రెయినేజీ ప్రమాదకరంగా మారింది. లోతుగా ఉండి దానిపైన ఎటువంటి రక్షణ చర్యలు లేకపోవడంతో నిత్యం అటు వైపు రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో దీనికి రక్షణగా సిమెంట్ స్తంభాలు సరిహద్దుగా ఏర్పాటు చేశారు. కానీ అవి శిథిలావస్థకు చేరి విరిగిపోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, విస్సన్నపేట

పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యం

విస్సన్నపేట బస్టాండ్‌లో చిన్నారికి మందు వేస్తున్న మాధురి

గంపలగూడెం మండలం గోసవీడులో..

ఓబులాపురంలో..

జి.కొండూరులో..

మైలవరంలో..

తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కేంద్రాల ద్వారా తల్లిదండ్రులు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బృందం

డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలి

రెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో సమావేశమైన నాయకులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని గ్రామాల్లో డ్రెయినేజీల సమస్యను పరిష్కరించాలని తీర్మానించినట్లు సీపీఎం మండల కమిటీ నాయకులు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం సీహెచ్.విజయ్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో మండల కార్యదర్శి టి.వీరా స్వామి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో డ్రెయినేజీల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎం. మాధవరెడ్డి, వి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 80 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు సంఘ అధ్యక్షుడు సీహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. కంటి ఆపరేషన్ అవసరమైన 15 మందిని నూజివీడు అమెరికన్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వివరించారు.

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : స్థానిక నాగార్జున పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో రక్తపోటు, మధుమేహం ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యులు సత్యతేజ, రవీంద్ర, లక్ష్మణరావు, ఆనిషా రాయ్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో..

రెడ్డిగూడెం : నేత్ర పరీక్షలు చేస్తున్న లక్ష్మీకుమారి

తెల్లారిందోయ్.. చలి మంటలు వేయండోయ్!

శీతాకాలం మొదలైంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం మైలవరం ప్రాంతంలో 16 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో రహదారులు కన్పించని విధంగా మంచు పడటంతో ఉదయం 9.30 గంటల వరకు వాహనాలు నడపడానికే భయపడాల్సి వచ్చింది. దీంతో జనాలు కూడళ్లలో మంటలేసి చలి నుంచి ఉపశమనం పొందారు. - న్యూస్‌టుడే, మైలవరం

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

వేడుకల పేరుతో ట్రాఫిక్‌కు అంతరాయం

మైలవరం, న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మైలవరంలో ఆదివారం నిర్వహించారు. జోగి రమేష్ తనయుడు రాజీవ్ ఆధ్వర్యంలో స్థానిక ఇంజినీరింగ్ కళాశాల వద్ద నుంచి ద్విచక్ర వాహనాల ప్రదర్శన చేపట్టారు. ప్రవాసాంధ్రుడు లకిరెడ్డి హనిమిరెడ్డితో కలిసి కేకు కోశారు. బైక్ ర్యాలీలో వైకాపా కార్యకర్తలు హంగామా చేయడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పామర్తి శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, తిరుపతిరావు, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రెడ్డిగూడెం కూడలిలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పి.విజయ భాస్కరరెడ్డి, సర్పంచి ఎం.రాణి, నాయకులతో కలిసి కేకు కోశారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వి.భరత్‌కుమార్‌రెడ్డి, టి.రవిబాబు, పి.సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో సత్తా

వీరులపాడు : జిల్లా స్థాయిలో పురుష ఉపాధ్యాయుల విభాగంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో వీరులపాడు జట్టు విజేతగా నిలిచింది. మైలవరంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన ఫైనల్లో తిరువూరు డివిజన్ నుంచి ఏ.కొండూరు మండలం జట్టు, నందిగామ డివిజన్ నుంచి వీరులపాడు మండల జట్టు తలపడ్డాయి.

స్వదేశాగమన శుభాకాంక్షలు

శ్రీ గంద్ర వీరభద్రరావు - శ్రీలక్ష్మి గార్లు
రాజుగూడెం, తిరువూరు (మం), NTR Dist.

మా మిత్రుడు, శ్రేయోభిలాషి
శ్రీ గంద్ర వీరభద్రరావు - శ్రీలక్ష్మి గార్లు
అమెరికా పర్యటన దిగ్విజయంగా ముగించుకొని
నేడు స్వదేశమునకు విచ్చేయుచున్న సందర్భంగా
స్వాగత శుభాకాంక్షలు తెలియజేస్తూ..

తూము కోటేశ్వరరావు - శ్రీ పద్మావతి జ్యూయలరీ, తిరువూరు
కొమ్మినేని నాగేశ్వరరావు - S/o. వీరయ్య, రాజుగూడెం
గంద్ర ప్రసాద్, ఛైర్మన్ - NSP డిస్ట్రిబ్యూటరీ కమిటీ, రాజుగూడెం
మోరంపూడి నరసింహారావు - రియల్ ఎస్టేట్, కొండెగట్ల
కొమ్మినేని సత్యనారాయణ - శ్రీ సాయిరాఘవ హార్డ్‌వేర్ ప్లైవుడ్ & జనరల్ మర్చంట్, VM బంజర్
నూతక్కి వెంకట రమేష్‌బాబు - A.P.S.R.T.C. తిరువూరు, TNTUC సెక్రటరీ
చప్పిడి సురేష్ - రియల్ ఎస్టేట్, తిరువూరు
బొగ్గుల శ్రీనివాసరెడ్డి - రియల్ ఎస్టేట్, టేకులపల్లి
గడ్డం కృష్ణారావు - బిజినెస్, పాత తిరువూరు
కొమ్మినేని రామకృష్ణ - S/o. కేశవరావు, రాజుగూడెం
కందుల మల్లిఖార్జునరావు - సాఫ్ట్‌వేర్ ఇంజినీరు, Hyderabad
కాటినేని వెంకటేశ్వరరావు - A.P.S.R.T.C. తిరువూరు, SWF సెక్రటరీ
నర్వనేని సతీష్ - సాఫ్ట్‌వేర్ ఇంజినీరు, Hyderabad.
వేల్పుల భాస్కరరావు - హిందీ టీచర్, తిరువూరు

విజయవాడ తూర్పు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగర వాసుల సమస్యల పరిష్కారానికి వీలుగా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వివిధ డివిజన్ల ప్రజలు తమ పరిధిలోని సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగు కాలువలు, వీధి దీపాలు, రహదారులపై గుంతలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను వినతుల రూపంలో అందించాలని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

✦ మూడో డివిజన్ గుణదల పాత పంచాయతీ కార్యాలయం, విజయనగర్ కాలనీ కొండ ప్రాంతంలో భూగర్భ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ పొంగుతున్నాయని స్థానిక నివాసి సుబ్బారావు మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ దీక్షిత్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన యంత్ర సాయంతో పూడిక తీయించారు.

✦ 3వ డివిజన్ గుణదల ఎస్సీ కాలనీ ప్రాంతంలో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్థానిక నివాసి అమృతవాణి మేమున్నాం... మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి హెచ్.శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల పొగ, మందులు కొట్టించారు. సమస్య పరిష్కరించారు.

✦ 11వ డివిజన్ ఏపీఐఐసీ కాలనీ 11-5/69ఎ విద్యుత్తు స్తంభానికున్న దీపం వెలగడం లేదని స్థానిక నివాసి పి.మధుసూదనరావు మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు. అంధకారం తొలగించారు. – న్యూస్‌టుడే, కరెన్సీనగర్

ఆలోచన అదిరింది... ఆవిష్కరణ మెరిసింది

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

ఫార్మసీ విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు మొగ్గు చూపుతున్నారు. సహజ సిద్ధంగా దొరికే వస్తువులతో ప్రజలకు ఉపయోగపడే వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం దొరుకుతున్న కొన్ని రకాల మందుల వినియోగంతో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని భావిస్తున్న తరుణంలో ఎటువంటి ఇబ్బందులు లేని ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒంటి నొప్పులు, జలుబు, తలనొప్పికి ఔషధాలు, చర్మం అందంగా ఉండేలా వివిధ రకాల నూనెలు తయారు చేశారు. ఆయా ఉత్పత్తులు వినియోగిస్తే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావని చెబుతున్నారు సిద్ధార్థ ఫార్మసీ విద్యార్థులు. అనుమతులు పొందాక కొద్ది రోజుల్లోనే తక్కువ ధరకే తమ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.

ఒత్తిడి నుంచి ఉపశమనానికి..

బీఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతున్న **పి.ఆకాంక్ష, టి.వర్షిణి, టి.బిందుశ్రీ...** యూకలిప్టస్, లావెండర్, పిప్పర్‌మెంట్ ఆయిల్ వినియోగించి ఇన్‌హెల్లర్ రూపొందించారు. దానిని పీల్చితే దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి నుంచి కొంత ఉపశమనం పొందవచ్చునని వివరించారు. సహజ సిద్ధంగా దొరికే వస్తువులతో తయారు చేసినందున ఎటువంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

చర్మ సౌందర్యానికి..

ఎంఫామ్ ఫార్మాస్యూటికల్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు **కె.హరిచందన, కె.లాస్యప్రియ, బి.శశికాంత్..** తదితరులు సబ్బులు తయారు చేశారు. ముల్తాని మట్టి, టి ట్రీ ఆయిల్ సహాయంతో ఒకటి, గులాబీ రేకుల రసం, లావెండర్ ఆయిల్, గొర్రె పాలతో మరో రకం సబ్బు సిద్ధం చేశారు. అవి ముఖానికి రాయడం వల్ల జిడ్డు తొలగిపోయి ప్రకాశవంతంగా ఉంటుందని చెబుతున్నారు. చర్మ సౌందర్యానికి అవి ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు.

కండరాల నొప్పి నివారణకు..

బీఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతున్న **టి.విద్యశ్రీ, ప్రపుల్ల..** పుదీనా పువ్వు, కర్పూరం, ఆవాల నూనె, కుంకుమ పువ్వు సహాయంతో నూనె తయారు చేశారు. దానిని వినియోగిస్తే కండరాల నొప్పి తగ్గుతుందని చెబుతున్నారు. సహజ సిద్ధ వస్తువులతో తయారు చేసినందున ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావని తెలియజేశారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

పటమట న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి తెదేపా నాయకుడు గద్దె క్రాంతి కుమార్ అండగా నిలిచారు. 12వ డివిజన్ నెహ్రూ రోడ్డుకు చెందిన కాజా బాషా అనారోగ్యంతో బాధ పడుతుండగా.. ఆదివారం క్రాంతి ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, నాయకులు అబ్దుల్ కరీం, శాయన సత్యనారాయణ, ఎండీ ఇబ్రహీం, కోడే సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : మరమ్మతుల వల్ల మొగల్రాజపురం సెక్షన్, 33 కేవీ బృందావన్ విద్యుత్తు ఉపకేంద్రం, 11కేవీ బృందావన్ కాలనీ ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పి.రవీంద్ర బాబు తెలిపారు. దీంతో పకీర్‌గూడెం కాలువ కట్ట, బృందావన కాలనీ, ఎ కన్వెన్షన్ రోడ్డు, సింధు భవనం రోడ్డు, సిరీస్ రాజు రోడ్డు, ఎఫ్ ట్రానిక్స్ రోడ్డు, పకీర్‌గూడెం రోడ్డుల్లో విద్యుత్తు ఉండదని పేర్కొన్నారు.

మురుగు లీకేజీకి అడ్డుకట్ట

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: మూడో డివిజన్ కరెన్సీనగర్ ఓం నమః శివాయ రోడ్డులో గత వారం రోజులుగా భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి మురుగు లీకేజీ అవుతోందని ఆదివారం 'ఈనాడు'లో 'మురుగు నీరు... పట్టదా..' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. యంత్ర సాయంతో మ్యాన్‌హోల్‌లో పూడిక తీశారు.

తాగునీటి పైపునకు మరమ్మతులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: కరెన్సీనగర్ దాసాంజనేయ ఆలయం రోడ్డు చివర బాయన బాబూజీ మలుపు వద్ద తాగునీటి పైపు లీకేజీ అవుతోందని 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. తాగునీరు లీకేజీ ప్రాంతంలో తవ్వకాలు చేపట్టి పైపులకు మరమ్మతులు చేశారు.

గుంత పూడ్చివేత.. తప్పిన ప్రమాదాలు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: హైటెన్షన్ రోడ్డు ఆయుష్ ఆస్పత్రి నుంచి నాగార్జుననగర్ వెళ్లే దారిలో ఏర్పడిన గొయ్యి వల్ల రాత్రి వాహనదారులు పడిపోతున్నారని 'ఈనాడు'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. తారుతో గొయ్యిని పూడ్చారు. కాలనీలో మరికొన్ని చోట్ల కూడా గోతులు పూడ్చారు.

తెదేపా మరింత బలోపేతం: ఎంపీ

పటమట, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలిగా నియమితులైన గద్దె అనూరాధ, ప్రధాన కార్యదర్శిగా నియమితులైన చెన్నుబోయిన చిట్టిబాబులకు ఎంపీ శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్ష పదవికి తొలి మహిళగా అనూరాధ ఎంపికై చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. వారి సారథ్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

వ్యాయామంతో గుండె జబ్బులు దూరం

పర్యావరణ హిత పెన్నులు చూపుతున్న డాక్టర్ రామకృష్ణ, జస్తి ప్రసాద్ తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: విజయవాడ ఈస్ట్ జెమ్స్ లయన్స్ క్లబ్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుణదల తమ్మినేని హాస్పిటల్‌లో ఆదివారం 150వ సాయి మధుమేహ వ్యాధి, రక్తపోటు వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.ప్రదీప్ హాజరై మాట్లాడుతూ.. జంతువుల్లో లేని గుండె జబ్బులు మనుషులకు వస్తున్నాయని పరిశోధనల్లో తేలిందన్నారు. దీనికి మూడు కారణాలని చెప్పారు. అవి ఆకలివేస్తేనే తింటాయని, పచ్చి మాంసాన్ని బాగా నమిలి తినుతుంటాయని, ఉప్పు కారాలు ఉండని కారణంగా వాటికి జబ్బులు రావని వివరించారు. నిత్యం వ్యాయామం చేస్తూ, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ నియంత్రించుకోవడం ద్వారా గుండె జబ్బులను నివారించవచ్చని తెలిపారు. డాక్టర్ తమ్మినేని రామకృష్ణ, డాక్టర్ పద్మ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడే మందులను ఉచితంగా అందజేశారు. గౌరవ అతిథి ఎల్.వెంకటేశ్వరరావు పర్యావరణ హిత పెన్నులు అందజేశారు. శిబిరాన్ని జాస్తి ప్రసాద్ పర్యవేక్షించగా, క్లబ్ ప్రతినిధులు అనిల్ కుమార్, రంగా శ్రీనివాసరావు, త్రినాథరావు, జాస్తి నవీన్, మురళి, ఎన్.వి.ఆర్., పండు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక.. ఆనందాల వేడుక

స్థానిక కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 ఏడాది పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పటమటలోని ఆ పాఠశాలలో నిర్వహించారు. స్నేహితులంతా ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఒక్కసారిగా అందరూ చిన్న పిల్లలుగా మారి పాఠశాలలో తాము చేసిన అల్లరి, చిలిపి పనులు గుర్తు చేసుకుని ఆనందంలో మునిగిపోయారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పాదపూజ చేసి ఘనంగా సత్కరించారు. - పటమట, న్యూస్‌టుడే

దేశానికి ఆత్మ.. హిందూ ధర్మం

మాట్లాడుతున్న మాతా శివానంద సరస్వతి

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: దేశానికి ఆత్మ.. హిందూ ధర్మమని, హిందూ సమాజాన్ని చైతన్యవంతం చేసి దేశాన్ని విశ్వగురుస్థానం నిలపాలనే లక్ష్యంతో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కృషి చేస్తుందని మాత శివానంద సరస్వతి అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్ళ, వందేమాతరం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం స్థానిక వెటర్నరీ కాలనీలోని మల్లినేని నాగేశ్వరరావు గ్రంథాలయంలో నిర్వహించారు. ఎన్టీఆర్, సెంట్రల్ ఎక్సైజ్, లయోల గార్డెన్స్, వెంకటేశ్వర కాలనీ, వెటర్నరీ కాలనీవాసులు పాల్గొన్నారు. హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు దావులూరి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏపీ ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యకారిణి త్రినాథ్ పాతాలా, జగతి మాట్లాడారు. కాలనీ ప్రముఖులు వీరమాచినేని రంగ ప్రసాద్, సుంకర రాజేష్, శ్రీమన్నారాయణ, భాజపా రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి కిలారు దిలీప్, కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, జీవీ రామారావు, ముక్కపూడి సత్యనారాయణ, బుర్ర సురేష్, చనుమోలు సురేష్, కోనేరు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే ప్రభుత్వ లక్ష్యం

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

కరెన్సీనగర్, కృష్ణలంక, నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఏపీఐఐసీ కాలనీలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు, పాతూరి సాంబశివరావు, నాదెండ్ల రాజేష్, కరీమ్, శాయిన బుజ్జి, రెడ్డి రాంబాబు, పోతురాజు, డాక్టర్ ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

★ రాణిగారితోట పరిధిలో 10 కేంద్రాల ద్వారా సుమారు 1360 మంది చిన్నారులకు పోలియో చుక్కలువందించినట్లు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సందీప్ తెలిపారు.

★ నగరపాలక సంస్థ పరిధిలో 0-5 ఏళ్లలోపు చిన్నారులు 1,56,072 మంది ఉండగా, సాయంత్రం వరకు కేవలం 72,500 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయగలిగారు. చిన్నారులు పూర్తి స్థాయిలో గుర్తించి పోలియో చుక్కలు వేసేందుకు మరో రెండు రోజులపాటు ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. పల్స్‌పోలియో కోసం నగరంలో 64 డివిజన్ల ప్రాంతాల్లో 332 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పాతబస్తీలోని ఓ కేంద్రంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి చిన్నారులకు చుక్కలు వేశారు. బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్, దుర్గగుడి ప్రాంతాల్లో 25 ట్రాన్సిట్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

సంప్రదాయాలు కాపాడుకోవాలి

కేదారేశ్వరపేట, న్యూస్‌టుడే : హిందూ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం లోటస్ ల్యాండ్ మార్క్‌లో నిర్వహించిన హిందూ సమ్మేళనానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. హిందూ ధర్మానికి ప్రత్యేకత ఉందని, అనేక ఆటుపోట్లు తట్టుకొని దేశంలో ధర్మం నిలబడిందన్నారు. సనాతన ధర్మం గురించి పిల్లలకు నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో భారతదేశం విశ్వగురువుగా ఎదగబోతుందని భాజపా నాయకురాలు యామినీ శర్మ అన్నారు. హిందువులంతా ఐక్యతగా ఉండాలని పరిపూర్ణ సరస్వతీ స్వామీజీ పిలుపునిచ్చారు.

రహదారులకు మరమ్మతులు... తొలగనున్న ఇక్కట్లు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

పంట కాలువ రోడ్డులో చేస్తున్న పనులు

చూసేందుకు చిన్నపాటి గుంతలే అనుకుంటారు. . కానీ వాటి వల్ల రాకపోకలు కొనసాగించే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళ అదుపు తప్పి ద్విచక్ర వాహనదారులు పడి గాయపడుతున్నారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించారు. కొద్ది రోజులుగా రహదారుల మరమ్మతులు చేయడం వల్ల పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు ఇక్కట్లు తొలగిపోనున్నాయి. నియోజకవర్గంలో ప్రధాన, అంతర్గత రహదారుల్లో దెబ్బతిన్న, గోతులు పడిన రహదారుల మరమ్మతులకు నగరపాలక సంస్థ నుంచి రూ.53 లక్షల నిధులు మంజూరయ్యాయి. వాటితో పనులు చేపట్టారు. మొగల్రాజపురంలో ఏఎస్ రామారావు రోడ్డు గుహల వద్ద, పటమట పంట కాలువ రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్, స్టెల్లా కళాశాల ఇండోర్ స్టేడియం సమీపంలో రహదారులపై గోతులు పడ్డాయి. దీంతో రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. వాటిని మరమ్మతులు చేశారు. క్రీస్తురాజపురం, కరెన్సీనగర్, గురునానక్ కాలనీ, పటమట ప్రాంతాల్లో పనులు చేశారు. ఇంకా మిగిలిన ప్రాంతాల్లో చేసేలా చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఈఈ సామ్రాజ్యం తెలిపారు.

క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకం

కేక్ కోస్తున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె తదితరులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఏసు క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శకమని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. వెటర్నరీ కాలనీలోని వెన్యూ ఫంక్షన్ హాలులో క్రైస్ట్ టెంపుల్ పాస్టర్ పాల్ ఇమ్మాన్యుయేల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో వారు పాల్గొన్నారు. నాయకుడు బొప్పన భవకుమార్, మానికొండ శ్రీధర్, వి.నరసింహచౌదరి, చాట్ల రాజశేఖర్, ఇత్తడి ఛార్లెస్, మాదిగాని గుర్నాథం తదితరులు పాల్గొన్నారు. తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

పరేడ్‌కు నర్సింగ్ విద్యార్థిని ఎంపిక

దేవిప్రియ

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: దిల్లీలో వచ్చే ఏడాది జనవరి 26వ తేదీన నిర్వహించే గణతంత్ర దినోత్సవం పరేడ్‌కు విజయవాడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థిని డి.దేవిప్రియ ఎంపికైంది. ఆమె బీఎస్సీ నర్సింగ్ 4వ సంవత్సరం చదువుతోంది. డా.ఎన్టీఆర్ విశ్వవిద్యాలయం తరఫున ఆంధ్రా ఎన్ఎస్ఎస్ జట్టులో ఆమె చోటు సాధించారు.

అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా ఉంటే మేలు

సత్కారం అందుకున్న రాజుతో రాజేంద్రప్రసాద్, సశ్రీ తదితరులు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : విద్యార్థులను సృజనశీలురుగా, పరిశోధకులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని ఎ.ఎస్.ఆర్. సొసైటీ డైరెక్టర్ ఎం.వి.ఎస్.రాజు అన్నారు. పీబీ సిద్ధార్థ కళాశాల అధ్యాపకులకు ఆదివారం కళాశాల సెమినార్ హాలులో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు నిత్య విద్యార్థిలా మరిన్ని అంశాలు తెలుసుకుంటే విజ్ఞానం పెరుగుతుందని, ఫలితంగా విద్యార్థులకు అందించే అవకాశం కలుగుతుందని సూచించారు. ప్రిన్సిపల్ మేకా రమేశ్, కార్యక్రమం సమన్వయకర్త ఎస్.బాబు రాజేంద్ర ప్రసాద్, తెలుగు, గణిత విభాగాధిపతులు సశ్రీ, జె.ఎల్.రాంప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: బెంగళూరులోని జైన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ మహిళల టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో తలపడే డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి ఆదివారం వెల్లడించారు. ఎంపికైన జట్టు సభ్యులను ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధిక రెడ్డి అభినందించారు. జట్టులో భూమి శేఖర్, బి.లక్ష్మీ సాయి రితిక, ఎ.యశస్వి, కె.చరిష్మా నాగరాణిలకు స్థానం దక్కింది. జట్టుకు కె.నాగరాజు (పీడీ, కోనసీమ వైద్య కళాశాల, అమలాపురం) మేనేజరుగా నియమితులయ్యారు.

పేద కుటుంబాలకు చేయూత

అవసరమైన వారికి సహాయం చేసి.. అండగా నిలవడమే అసలైన క్రిస్మస్ అని మెస్సీయ ఫెలోషిప్ ఛైర్మన్ సజ్జా రత్నకుమార్ అన్నారు. క్రిస్మస్ నేపథ్యంలో ఆదివారం ఆటోనగర్ 100 అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్‌లో సుమారు 70 పేద కుటుంబాలకు రూ.లక్ష విలువ చేసే నిత్యావసర వస్తువుల కిట్లు అందజేశారు. రత్నకుమార్ మాట్లాడుతూ క్రీస్తు మార్గాన్ని అనుసరించి తోటివారికి సహాయపడాలని సూచించారు. సంస్థ కోఆర్డినేటర్ సజ్జా జ్యోతి తదితరులు పాల్గొన్నారు. **- పటమట, న్యూస్‌టుడే**

నిఘా కొరవడి.. చరవాణుల చోరీ..

కనకదుర్గమ్మ వారధి గుంటూరు బస్టాపు వద్ద దొంగలు చరవాణుల అపహరణకు పాల్పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ నుంచి నగరానికి చెందిన అధిక శాతం మంది గుంటూరు, తెనాలి తదితర ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాపు వద్ద రద్దీ నేపథ్యంలో దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. బస్సులు ఎక్కే వారి చరవాణులను అపహరిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. **- కృష్ణలంక, న్యూస్‌టుడే**

సంగీతంతో మానసికోల్లాసం

గాంధీనగర్, న్యూస్‌టుడే : సంగీత సాధనతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆదివారం నగరంలోని సంగీత నృత్య కళాశాలలో నిర్వహించిన స్వాతి ఆర్కెస్ట్రా 20ఏళ్ల మహోత్సవాలకు ఆయన ముఖ్య అతిగా విచ్చేసి మాట్లాడారు. కళారంగంలోకి ఇటీవల యువ కళాకారులు రావడం అభినందనీయమన్నారు. హైపర్ ఆది విశిష్ట అతిథిగా విచ్చేసి సందడి చేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు.. సీనియర్ గాయకుడు మహ్మద్‌తో పాటు పలువురు కళాకారులకు ఘనంగా సత్కరించారు. గాయకులు పలు చిత్రాల్లోని పాటలను చక్కగా ఆలపించి.. ఉర్రూతలూగించారు. సంస్థ వ్యవస్థాపకుడు సత్య, రాము, రసూల్, విజయ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సత్యను సత్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే : కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడలోని మాచవరానికి చెందిన ఎస్‌టీపీ రాఘవకుమర్ కుటుంబ సభ్యులు రూ.1,00,116, ఏలూరు జిల్లా కైకలూరు మండలం చాట్రాయి గ్రామానికి చెందిన ఘంటశాల నాగరాజు, నీరజాక్షి దంపతులు రూ.55,980 విరాళం అందజేశారని ఈవో చక్రధరరావు ఆదివారం తెలిపారు. వీరికి స్వామి చిత్రపటం అందజేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

సత్యనారాయణపురం(గాంధీనగర్), న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టాలని ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం మూడో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. ప్రమాదాల రహదారులు, ముఖ్యమైన కూడళ్లు, ట్రాఫిక్ నియంత్రణ విధానం.. తదితర అంశాలపై సమీక్షించారు. పలు సూచనలు చేశారు. ప్రజలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. సీఐ కొత్తూరు కిషోర్‌బాబు పాల్గొన్నారు.

వెటరన్ టీటీ పోటీ విజేతల వెల్లడి

అతిథుల చేతుల మీదుగా విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న కె.జయరామ్ (విజయవాడ)

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పటమట ఫన్‌టైమ్స్‌లో ఆదివారం నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి వెటరన్ టేబుల్ టెన్నిస్ పోటీలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ పోటీని ప్రారంభించగా.. రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి పి.విశ్వనాథ్ విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. ఫన్ టైమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శి కె.విజయబాబు, కోశాధికారి ఎం.సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

✦ పురుషుల సింగిల్స్ 40+ కేటగిరీలో ప్రదీప్, శ్రీకాంత్‌రాజు, 50+లో వైటీవీ సుబ్బారావు, మల్లికార్జునుడు, 60+లో కె.జయరామ్, అబ్బాస్, 65+లో సీహెచ్ హనుమంతరావు, వీవీ రమణ, 70+లో గంగాధర్, గిరిధర్, 75+లో ఎస్.ప్రభాకరరావు, వీవీ సుబ్రహ్మణ్యం, డబుల్స్ 40+లో బి.రాజు/ప్రదీప్, శ్రీకాంత్/కార్తీక్, 50+లో నరసింహారావు/సుభాకృష్ణ, బి.భాస్కర్/వేణుగోపాల్, 60+లో కె.జయరామ్/అబ్బాస్, జీవీఎస్ కృష్ణారావు/శ్రీనివాసరావు, మహిళల సింగిల్స్ 40+లో పి.భారతి, ఎస్.ఆరతి, 50+లో సత్యవతి, సూర్య పద్మావతి, 60+లో బేబీ సరోజిని, డాక్టర్ అరుణ, డబుల్స్ 40+లో బేబీ సరోజిని/సత్యవతి, భారతి/ఆరతి, మిక్స్‌డ్ డబుల్స్‌లో సురేష్/సరోజిని, జయరామ్/భారతి జోడీలు వరుస స్థానాలు కైవసం చేసుకున్నారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

రక్త దాన శిబిరాన్ని పరిశీలిస్తున్న దేవినేని అవినాష్ తదితరులు

పటమట, విజయవాడ సిటీ న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఎన్టీఆర్ జిల్లా వైకాపా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించారు. వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాల వేసి రక్త దాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, పండ్లు, చీరలు పంపిణీ చేశారు. నిర్మల శిశుభవన్, ప్రేమదాన్ ఛారిటీస్ వద్ద వృద్ధులు, చిన్నారుల మధ్య కేక్ కట్ చేశారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు. పకీర్‌గూడెంలో కేక్‌ను అవినాశ్, కార్పొరేటర్ రెహానా నాహిద్ కోశారు.

లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు

గాంధీనగర్, న్యూస్‌టుడే : సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు లాడ్జిల్లో నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. గదులను తనిఖీ చేసి.. రికార్డులు పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల వస్తే సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సీజ్ చేస్తామని ఆమె హెచ్చరించారు. సీఐ లక్ష్మీనారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల ముఠా అరెస్టు

అద్దంకి, న్యూస్‌టుడే: భూమి పొరల్లో ఉండే గుప్తనిధుల్ని గుర్తించేందుకు అద్దంకి వచ్చిన ఐదుగురు ముఠా సభ్యుల్ని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద మెటల్ డిటెక్టర్, స్కానర్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. సీఐ ఎ.సుబ్బరాజు అందించిన సమాచారం మేరకు.. కడప జిల్లా రాజంపేటకు చెందిన కె.సుధాకర్, పి.శివకుమార్ అలియాస్ శివయ్య, పి.మనీంద్రతో పాటు విజయవాడ రాణిగారితోటకు చెందిన ఎం.తిరుపతిరెడ్డి, ఎల్.శ్రీనివాసరెడ్డిలు కొల్లూరు, గొల్లపేట, పులిచింతల వద్ద రంగురాళ్లు, వజ్రాలు ఏరుకునే సమయంలో మిత్రులయ్యారు. ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్న తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆధునిక యంత్రాలతో రంగురాళ్లు, వజ్రాలు గుర్తించేందుకు మెటల్ డిటెక్టర్, స్కానర్ కొనుగోలు చేశారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఇంట్లో లంకెబిందెలు ఉన్నట్లు తెలుసుకుని, వాటిని గుర్తించేందుకు అద్దంకి వచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న సమయంలో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా వివరాలు వెల్లడించారు. వీరిపై గతంలో ఎలాంటి నేరచరిత్ర లేదని పోలీసులు వెల్లడించారు.

బాలికపై అత్యాచారం కేసులో నలుగురు..

తాడేపల్లి, మంగళగిరి, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నలుగురు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళగిరి పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐ వీరాస్వామితో కలిసి డీఎస్పీ మురళీకృష్ణ వెల్లడించారు. తాడేపల్లి పరిధిలోని కేఎల్‌రావు కాలనీకి చెందిన షేక్ ఖాదర్‌బాషా, షేక్ కమల్‌సాహెబ్, విజయవాడ సుందరీనగర్‌కు చెందిన షేక్ సలీం, షేక్ రబ్బానీ ఈ నెల 18వ తేదీ 13 ఏళ్ల బాలికను రైల్వేస్టేషన్ నుంచి ఆటోలో మంగళగిరిలోని 16వ నంబర్ జాతీయ రహదారి వద్ద నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి ముగ్గురు నిందితులు బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు కేకలు వేయడంతో ఆయా ప్రాంతంలో వారు బాలికను రక్షించారు. జరిగిన విషయాన్ని తల్లికి వివరించగా ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులను మంగళగిరి సమీపంలోని ఎర్రబాలెం వెళ్లే మార్గంలో వంతెన వద్ద అరెస్టు చేశామని, నిందితుల్లో ఖాదర్ బాషా, కమల్‌సాహెబ్ తండ్రీకొడుకులుగా గుర్తించామని డీఎస్పీ చెప్పారు. కాగా, నిందితులను పోలీసులు వీధుల్లో నడిపించుకుంటూ మంగళగిరి కోర్టుకు తీసుకువెళ్లారు.

(c) eenadu

నందిగామ

●నందిగామ ●జగ్గయ్యపేట

తిరుపతమ్మ ఆలయానికి రూ.2 లక్షల విరాళం

దాతకు అమ్మవారి చిత్రపటం బహూకరిస్తున్న కృష్ణమోహన్

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయానికి గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన అత్తోటి సుబ్బారావు, వెంకట పద్మావతి దంపతులు ఆదివారం విరాళం అందజేశారు. నిత్య అన్నదానానికి రూ.1,00,116, గోసంరక్షణకు రూ.1,00,116 చొప్పున అందించారు. వీరికి ఆలయ డిప్యూటీ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ అమ్మవారి చిత్రపటాలు అందజేసి సత్కరించారు.

ధర్మ రక్షణకు సమాయత్తమవ్వాలి

మాట్లాడుతున్న అనఘానంద స్వామీజీ. చిత్రంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: హిందువులంతా ఐక్యంగా ఉండాలని, ధర్మ రక్షణకు సమాయత్తమవ్వాలని దత్త ఆశ్రమం పీఠాధిపతి అనఘానంద స్వామీజీ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వంద సంవత్సరాల వేడుకల్లో భాగంగా కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మ రక్షణే దేశ రక్షణ అని అన్నారు. సనాతన ధర్మ ఔన్నత్యాన్ని, దేశ ఘనతను పిల్లలకు తెలియజేసేలా తల్లిదండ్రులు కృషి చేయాలని సూచించారు. జగన్నాథ్ మందిర వ్యవస్థాపకుడు దయానిధి దాస్ మాట్లాడుతూ.. ఆలయాల్లో హిందూ ధర్మ విశిష్టతను తెలియజేసేలా సత్సంగాలు జరగాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ప్రస్థానంలో చేసిన సేవలను సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర సహ సంయోజక్ సాయిరాం వివరించారు. అంతకుముందు స్థానిక నెహ్రూ సెంటర్ నుంచి భారీ ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సామూహిక పశువుల వసతిగృహానికి శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ సౌమ్య

మునగచర్ల (నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా మునగచర్ల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న సామూహిక పశువుల వసతిగృహం(షెడ్) నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. పశుపోషణలో భారాన్ని తగ్గించడానికి పైలట్ ప్రాజెక్టుగా దీన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ షెడ్ ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వస్తారనే సమాచారం ఉందన్నారు. గ్రామంలోని తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్ విస్తరణకు రూ.40 లక్షలు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. అనంతరం కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానికంగా ఇప్పటికే ఏర్పాటు చేసిన పశువుల వసతిగృహాన్ని, పశుగ్రాస పెంపక క్షేత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచి పంగులూరి నరసింహయ్య, కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, ఎంపీడీవో ఆర్వీఎస్ ప్రసాదరావు, తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, తెదేపా నాయకులు రాటకొండ చంద్రశేఖర్, ఉన్నం అప్పారావు, మన్నెం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం కొనుగోళ్లు

ముళ్లపాడు వద్ద రైస్‌మిల్లులో వడ్ల బస్తాలు

నందిగామ, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వంలో ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయి. ధాన్యం విక్రయించిన 24 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాలకు అధికారులు డబ్బులు జమ చేస్తున్నారు. ఈ ప్రక్రియను కలెక్టర్ లక్ష్మీశ నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో గత ఖరీఫ్‌లో 1.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ప్రస్తుత సీజన్‌లో దిగుబడులు పెరగటంతో 1.60 లక్షల టన్నులు కొనాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 14,372 మంది రైతుల నుంచి 1,03,536 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు. గ్రేడ్-ఏ రకం 87,941 మెట్రిక్ టన్నులు, కామన్ రకం 15,595 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వం సేకరించింది.

☛ కలెక్టర్ చొరవతో ధాన్యం కేంద్రాల్లో కొనుగోళ్లు ముమ్మరం చేశారు. మద్దతు ధర 75 కిలోల బస్తా ఏ గ్రేడ్ రకం రూ.1792, కామన్ రకం రూ.1776గా ఉంది. జిల్లాలో 147 కేంద్రాలు ఏర్పాటు చేశారు. నందిగామ డివిజన్‌లో 53 ఉన్నాయి. అన్నదాతలు గోనె సంచులు, ధాన్యం రవాణాకు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశారు. కల్లాల నుంచి నేరుగా రైస్ మిల్లులకు ధాన్యం తరలించేందుకు లారీలు సమకూర్చారు. ఒకవేళ రైతులు సొంతంగా ట్రాక్టర్లు, లారీల్లో పంట తీసుకొస్తే టన్నుకు రూ.350 చొప్పున ప్రభుత్వం రవాణా ఛార్జీలు చెల్లిస్తుంది. రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయాలు చేస్తున్నారు. అనంతరం ఎంపిక చేసిన మిల్లులకు ధాన్యం తరలిస్తున్నారు.

నందిగామ డివిజన్‌లో.. నందిగామ డివిజన్‌లోని ఏడు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేస్తున్నారు. స్థానిక ఆర్డీవో కె.బాలకృష్ణ కేంద్రాల వద్దకు వెళ్లి పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటి వరకు 2,302 మంది రైతుల నుంచి 19,167 టన్నుల ధాన్యాన్ని కొన్నారు.

ఎంపీడీవోపై వైకాపా ఎంపీటీసీ సభ్యుల ఆగ్రహం

సమావేశం నిర్వహణపై ఎంపీడీవోను ప్రశ్నిస్తున్న రాము, సురేశ్

నందిగామ, నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: సెలవురోజు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం నిర్వహించడాన్ని ప్రశ్నించిన తమపై ఎంపీడీవో ప్రసాదరావు అమర్యాదగా మాట్లాడారని పల్లగిరి, కొండూరు వైకాపా ఎంపీటీసీ సభ్యులు రాము, సురేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ పెసరమల్లి రమాదేవి అధ్యక్షతన ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సెలవురోజు సమావేశం ఏర్పాటు చేయడంపై చర్చ జరిగింది. ఈ సమయంలోనే వైకాపా ఎంపీటీసీ సభ్యులు వేదిక వద్దకు వెళ్లి ఎంపీడీవోను ప్రశ్నించారు. మండల పరిషత్తు దుకాణాన్ని ఎంపీటీసీ సభ్యులకు తెలియకుండా లీజుకు ఇవ్వడాన్ని, తమ గ్రామంలో ప్రజాదర్బార్ నిర్వహించి తనకు సమాచారం ఇవ్వలేదని కొండూరు ఎంపీటీసీ సభ్యుడు సురేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దుకాణం లీజును రద్దు చేస్తామని ఎంపీడీవో చెప్పారు. మునేటి వరద సమయంలో ఏటి పట్టు గ్రామాలకు ట్యాంకర్లతో తాగునీరు ఇవ్వకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంపై ఎంపీపీ ప్రశ్నించారు. దాములూరు, మునగచర్ల మిల్లుల బ్యాంకు గ్యారెంటీ ముగిసిపోవడంతో రైతులు ధాన్యాన్ని జగ్గయ్యపేట, మైలవరానికి తరలించడానికి ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక మిల్లులకు పంపేలా చూడాలని జడ్పీటీసీ సభ్యుడు గాదెల వెంకటేశ్వరరావు అధికారులను కోరారు. పాత విద్యుత్తు తీగలను మార్చాలని, కూడలి శివాలయానికి 24 గంటల విద్యుత్తు లైన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆర్‌అండ్‌బీ, ఐసీడీఎస్, విద్య తదితర శాఖలపై సమీక్షించారు. వైస్ ఎంపీపీలు తుమ్మల సాంబశివరావు, అన్నం పిచ్చయ్య, తహసీల్దారు సురేశ్ బాబు, పంచాయతీరాజ్ డీఈఈ రమేశ్, ఏవో జె.నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

కాదంబరిశ్యామక ఆశ్రమంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు

ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పూర్ణకుంభంతో స్వాగతిస్తున్న వేదపండితులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ శివారు అనాసాగరం కాదంబరిశ్యామక ఆశ్రమాన్ని తెలంగాణ జలవనరులశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌తో కలిసి ఆశ్రమంలోని మహాలక్ష్మి, వారాహిమాత, ప్రత్యంగిరా దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆశ్రమ మాత అనుమోలు శ్రీదేవి, శ్రీనివాసరావు దంపతులు మంత్రిని సత్కరించారు. అంతకుముందు వీరికి వేదపండితులు మేళతాళాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామినేని శ్రీనివాసరావు, ఆశ్రమ నిర్వాహకులు సురేశ్ పాల్గొన్నారు.

ఆలయ ఛైర్మన్ పదవి ఇవ్వాలని వినతి

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయ ఛైర్మన్ పదవి జనసేన నాయకుడు శివాపురం గ్రామానికి చెందిన లగడపాటి శంకర్‌కు ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు ఆదివారం వినతిపత్రం ఇచ్చారు. నేతలు శివ, రామకోటేశ్వరరావు, బ్రహ్మం, కిశోర్, హరి పాల్గొన్నారు.

శ్రీరాం తాతయ్యకు వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ వర్సిటీ జట్టు

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: బెంగళూరులోని జైన్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ అంతర్ వర్సిటీ మహిళల టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో తలపడే డాక్టర్ ఎన్టీఆర్ వర్సిటీ జట్టును వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి ఆదివారం వెల్లడించారు. ఎంపికైన జట్టు సభ్యులను ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధిక రెడ్డి అభినందించారు. జట్టులో భూమిశేఖర్, బి.లక్ష్మి సాయి రితిక, ఎ.యశస్వి, కె.చరిష్మా నాగరాణిలకు స్థానం దక్కింది. జట్టుకు కె.నాగరాజు (పీడీ, కోనసీమ వైద్య కళాశాల, అమలాపురం) మేనేజరుగా నియమితులయ్యారు.

పంచాయతీ విభజనపై సంతకాల సేకరణ

పెద్దవరంలో సంతకాలు సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి జనార్దనకుమార్

నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని పెద్దవరం పంచాయతీ నుంచి చెర్వుకొమ్ముపాలెం, కొత్తలక్ష్మీనారాయణపాలెం గ్రామాలను విభజించాలని కోరడంతో ఆదివారం గ్రామసభలు ఏర్పాటు చేసి వినతి పత్రాలు స్వీకరించారు. డిప్యూటీ ఎంపీడీవో సోమేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి జనార్దనకుమార్ ఆధ్వర్యంలో పెద్దవరం, చెర్వుకొమ్ముపాలెం గ్రామాల్లో సంతకాలు సేకరించారు. ఇందులో పంచాయతీని విభజించాలని 315 మంది, పెద్దవరం పంచాయతీలోనే కొనసాగించాలని 1669 మంది సంతకాలు చేశారు. వివరాలను ఎంపీడీవో ప్రసాదరావుకు అందజేశామని ఉద్యోగులు తెలిపారు.

తాగునీరు వృథా..

జగ్గయ్యపేట మండలంలోని తక్కెళ్లపాడులో తాగునీటి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోంది. దీంతో సరిపడా నీరు సరఫరా లేక గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు తక్షణం స్పందించి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జగ్గయ్యపేట గ్రామీణం

దారంతా కంపచెట్లు.. రాకపోకలకు ఇక్కట్లు

మాగల్లు- సోమవరం ఆర్‌అండ్‌బీ రోడ్డులో కంప చెట్లు పెరగడంతో ద్విచక్ర వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. మాగల్లు నుంచి మునేటి ప్రధాన కాలువ వరకు రహదారికి ఇరువైపులా ముళ్లచెట్లు పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలను చూడలేక వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి కంపచెట్లు తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. -నందిగామ (గ్రామీణం), న్యూస్‌టుడే

యూటీఎఫ్ జిల్లా కార్యదర్శిగా సూర్యనారాయణ

విస్సన్నపేట, న్యూస్‌టుడే: యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శిగా డీసీహెచ్‌వీ సూర్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులుగా పి.రామకృష్ణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరువూరు మను గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా సమావేశంలో వీరు ఎన్నిక అయినందుకు యూటీఎఫ్ విస్సన్నపేట తరఫున మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్.చంటిబాబు, ఎ.మురళీ కృష్ణ అభినందనలు తెలిపారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీల విజేత వీరులపాడు

జుజ్జూరు(వీరులపాడు), న్యూస్‌టుడే: జిల్లాస్థాయిలో ఫ్యూచర్ ఉపాధ్యాయుల విభాగంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో వీరులపాడు జట్టు విజేతగా నిలిచింది. మైలవరంలోని లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో ఆదివారం నిర్వహించిన ఫైనల్లో తిరువూరు డివిజన్ నుంచి ఎ.కొండూరు మండలం జట్టు, నందిగామ డివిజన్ నుంచి వీరులపాడు మండల జట్టు తలపడ్డాయి. ఈ పోటీలో వీరులపాడు మండలం జట్టు విజయం సాధించింది. సంబంధిత ఉపాధ్యాయులను ఎంఈవో పాల్ కెనడీ అభినందించారు.

దీక్షలకు రుసుం వసూలుపై భక్తుల ఆగ్రహం

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు తిరుపతమ్మ ఆలయంలో అమ్మవారి దీక్షలు స్వీకరించే భక్తుల నుంచి రూ.50, రూ.200 వసూలు చేయడంపై ఆదివారం భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ కౌంటరులో ఆలయ సిబ్బంది, భక్తులకు దీనిపై వాగ్వాదం చోటుచేసుకుంది. రసుంల పేరిట దోచుకుంటున్నారని భక్తులు మండిపడుతున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు నచ్చజెప్పడంతో శాంతించారు.

పోలియో చుక్కలకు చక్కని స్పందన

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమానికి చక్కని స్పందన లభించింది. 0-5 సంవత్సరాల చిన్నారులకు వైద్యసిబ్బంది పోలియో చుక్కలు వేశారు. సోమ, మంగళవారాల్లో ప్రతి ఇంటికి వెళ్లి మిగిలిపోయిన పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నారు. జగ్గయ్యపేట పట్టణం మిట్టగూడెంలోని ఎంపీపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. నందిగామ 16వవార్డు, మునగచర్ల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన శిబిరాల్లో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

– న్యూస్‌టుడే, బృందం

మిట్టగూడెం ఎంపీపీ పాఠశాలలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య

జగన్నాథపురంలో.. తహసీల్దారు రవికుమార్ ● తోటరావులపాడులో.. తెదేపా రాష్ట్ర కార్యదర్శి యలగాల నూకానమ్మ ● మునగచర్లలో.. ప్రభుత్వ విప్ సౌమ్య

అధిక లోడు.. అవస్థలు తోడు

జగన్నాథపురం మలుపు వద్ద రహదారిపై జారిన కంకర

జగన్నాథపురం(వీరులపాడు), న్యూస్‌టుడే: పరిమితికి మించి అధిక లోడుతో కంకరను తరలిస్తున్న టిప్పర్లు మూలమలుపుల వద్ద ఒక్కసారిగా ఆగుతుండటంతో అందులోని కంకర రోడ్డుపై పడుతోంది. కంచికచర్ల మండలం దొనబండ క్వారీల నుంచి వీరులపాడు మండలం మీదుగా తెలంగాణ రాష్ట్రానికి రోజు టిప్పర్లలో వాహన సామర్థ్యానికి మించి కంకరను తీసుకెళ్తున్నారు. జగన్నాథపురం మలుపు వద్దకు రాగానే కంకర కింద పడుతుండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ద్విచక్ర వాహనాలు వాటిపై నుంచి వెళ్లినప్పుడు అదుపుతప్పి ప్రమాదానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బ్రాహ్మణుల సంక్షేమ పథకాల పునరుద్ధరణ

మైలవరం, న్యూస్‌టుడే : రాష్ట్రంలోని బ్రాహ్మణుల కోసం అనేక సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ పేర్కొన్నారు. మైలవరంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణ ఆత్మీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పథకాలకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు పొందేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్పొరేషన్ డైరెక్టర్ ఫణికుమార్, క్రెడిట్ సొసైటీ ఎండీ శ్రీనివాస్, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వి.బాలాజీ ప్రసాద్, సతీష్, శర్మ, మారుతీ, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేవీఆర్ కళాశాల వ్యవస్థాపకుడు సూర్యనారాయణకు నివాళి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ కేవీఆర్ కళాశాల వ్యవస్థాపకుడు అడుసుమల్లి సూర్యనారాయణ 40వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు యర్రంరెడ్డి బాబూరావు, ఉపాధ్యక్షుడు వెచ్చా ఉమామహేశ్వరగుప్తా, సభ్యులు వీఎస్‌ఆర్‌కే ప్రసాద్, ఇ.పిచ్చేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

సాగర్ జలాల విడుదల

గంపలగూడెం: ఎన్నెస్పీ రెండో జోన్‌లోని మధిర బ్రాంచి కెనాల్‌కు ఖమ్మం జిల్లా కప్పలబంధం నియంత్రిక 72వ కి.మీ నుంచి ఆదివారం 1034 క్యూసెక్కుల సాగర్ జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ బాబు తెలిపారు. గంపలగూడెం మండల సరిహద్దులోని 23వ కి.మీ వద్దకు 497 క్యూసెక్కులు చేరాయని, అక్కడ నుంచి దిగువన మేజర్ల వారీగా గంపలగూడెం 30, ఊటుకూరు-1కి 60, పెదకొమిర 30, మధిర 50 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

చెట్టుని ఢీకొట్టిన డీసీఎం.. డ్రైవర్ మృతి

మృతుడు జంగం నరసయ్య

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి మండలం వీఎం బంజర్ శివారులో డీసీఎం వ్యాను చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఏపీలోని జగ్గయ్యపేట మండలం గుండ్లగాయపాలేనికి చెందిన జంగం నరసయ్య చిల్లకల్లులో నివాసం ఉంటున్నారు. ఆయన నడుపుతున్న వ్యానును వీఎం బంజర్ వద్ద వెనుక నుంచి మరో లారీ ఢీకొంది. దీంతో వ్యాన్ అదుపుతప్పి రహదారి పక్కనున్న చెట్టును ఢీకొట్టడంతో డ్రైవర్ నరసయ్య క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు క్రేన్ సాయంతో క్యాబిన్ నుంచి అతడిని బయటకు తీసి పెనుబల్లి వైద్యశాలకు తరలిస్తుండగానే మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు.

మెకానిక్ దుకాణం దగ్ధం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని చిల్లకల్లు రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున మెకానిక్ షాప్ దగ్ధమైంది. ఎవరైనా కావాలని నిప్పు పెట్టారా? లేకుంటే చలిమంట వేసుకుని ఆర్పకుండా వెళ్లిపోతే ఈ ఘటన జరిగిందా అనేది తెలియదు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో మంటలు రావడం చూసి స్థానికులు దుకాణ యజమాని రాజేశ్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. సుమారు రూ.50 వేల నష్టం జరిగినట్లు రాజేశ్ వాపోయారు. తనకు ఇదే ఆధారమని, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య స్పందించి మానవత్వంతో ఆదుకోవాలని ఆయన కోరారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

కేకు కోస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామలో ఆదివారం వైకాపా అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎం.జగన్మోహనరావు, ఎమ్మెల్సీ ఎం.అరుణ్‌కుమార్ కేకు కోసి పంపిణీ చేశారు. వైకాపా నాయకుడు పారుపల్లి హరిబాబు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, నాయకులు ఎండీ మస్తాన్, జీవరత్నం, పాకాలపాటి కిరణ్, చల్లా బ్రహ్మేశ్వరరావు, వైఎస్ఎన్ ప్రసాద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

జగ్గయ్యపేట గ్రామీణం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తనతో మెలిగితే రౌడీషీట్లు తొలగిస్తామన్నారు.

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ పోలీస్‌స్టేషన్‌లో విజయవాడ రూరల్ డీసీపీ బి.లక్ష్మీనారాయణ ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు తావు లేదని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్సైలు మోహనరావు, సూర్యవంశీ పాల్గొన్నారు.

వైభవంగా భజనమాల పారాయణం

సత్యసాయి మందిరంలో భజనలు ఆలపిస్తున్న మహిళలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ రైతుపేట భగవాన్ సత్యసాయి మందిరంలో ఆదివారం మహిళలు సామూహికంగా 101 భజనమాల వేడుక నిర్వహించారు. సాయినామ పారాయణం చేశారు. భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 14 మంది సన్నకారు రైతులకు ఒక్కొక్కరికి రూ.2 వేల విలువైన పురుగునివారణ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా అధ్యక్షుడు జి.సాయివిశ్వనాథం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు అమ్మినేని జ్వాలాప్రసాద్, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ ఏచూరి రాము, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయరహదారిపై ప్రమాదకరంగా యూటర్న్‌లు

అండర్‌పాస్‌ల నిర్మాణమే పరిష్కారం

మునగచర్ల వద్ద ఇటీవల ప్రమాదం చోటుచేసుకున్న ప్రదేశం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై పలు గ్రామాల వద్ద అండర్‌పాస్‌లు నిర్మించకపోవడంతో స్థానికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. తమ గ్రామాల వద్ద అండర్‌పాస్‌లు నిర్మించాలని వారు వేడుకుంటున్నా అడుగు ముందుకు పడటం లేదు. హైదరాబాద్-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ను ఇటీవల గ్రీన్‌వే రహదారిగా మార్చాలని నిర్ణయించారు. కనీసం ఈ రహదారి విస్తరణ సమయంలోనైనా అండర్‌పాస్‌లు నిర్మించాలని కోరుతున్నారు.

మరోవైపు ఈ రోడ్డుపై ఉన్న మునగచర్ల యూటర్న్ ప్రమాదకరంగా మారింది. ఇటీవల చోటుచేసుకున్న ప్రమాదంలో నందిగామ చెరువుబజారుకు చెందిన చలమాల శ్రీనివాసరావు మృత్యువాతపడ్డాడు. భార్య, పిల్లలు కుటుంబ పెద్దను కోల్పోయి రోదిస్తున్నారు. గతంలోనూ ఇదే యూటర్న్ వద్ద మునగచర్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గంటా రంగారావు మృతిచెందారు. ఇలా అనేక మంది ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ సమస్యను పరిష్కరించాలంటూ సర్పంచి నరసింహయ్య, గ్రామస్థులు ఎంపీ కేశినేని శివనాథ్‌ను కలిసి విన్నవించారు. స్పందించిన ఎంపీ ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అండర్‌పాస్ మంజూరు చేయించారు. కానీ, ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు.

❖ ఈ జాతీయ రహదారిపైనే ఐతవరం మద్రాస్ ఫిల్లర్ కాఫీ హోటల్ వద్ద మరో యూటర్న్ ఉంది. ఇక్కడ నుంచి పాతకంచల గ్రామానికి వెళ్లడానికి కొంతమంది వాహనదారులు వ్యతిరేక దిశలో ప్రయాణిస్తున్నారు. ఇక్కడ అండర్‌పాస్ లేక కంచల గ్రామస్థులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నందిగామకు రాకపోకలు సాగిస్తున్నారు. అంబారుపేట, ఐతవరం గ్రామాలకు బైపాస్ మంజూరైంది. ప్రమాదాల నివారణకు పోలీసులు స్టాప్ బోర్డులు పెట్టినా.. ప్రయోజనం ఉండట్లేదు.

వాహనాల అతివేగం కూడా ప్రమాదాల తీవ్రత పెరగడానికి కారణమవుతోంది. మరోవైపు నందిగామ వైజంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం ఆలస్యం వల్ల వాహనాల రద్దీ పెరుగుతోంది. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు వెంటనే అవసరమైన ప్రదేశాల్లో అండర్‌పాస్‌లు నిర్మించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

(c) eenadu

విజయవాడ పశ్చిమ

ప్రతిభ చూపి.. బహుమతి సాధించారు

విజేతలతో ప్రిన్సిపల్ బి.శివరామప్రసాద్ తదితరులు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతబస్తీ టీసీఎంఏ (ది క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్) ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. పాఠశాల స్థాయిలో వర్తమాన వ్యవహారాలు, జనరల్ నాలెడ్జ్, క్రీడలపై క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రథమ బహుమతి పి.సుభాష్ (7వ తరగతి), ద్వితీయ బహుమతి కె.మణికంత (9వ తరగతి), తృతీయ బహుమతి పి.మోక్షిత్ (08వ తరగతి) సాధించారు. విజేతలకు పాఠశాల ప్రిన్సిపల్ బి.శివరామప్రసాద్, ఉపాధ్యాయులు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

స్పందించారు.. నీటి సరఫరా చేశారు

చిట్టినగర్, న్యూస్‌టుడే : భీమన వారిపేట కొండ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన రిజర్వాయరు ప్రారంభించినా నీటి సరఫరాకు నోచుకోలేదు. 17న 'ఈనాడు'లో దీనిపై 'ప్రారంభించారు.. సరఫరా మరిచారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి నీటి విభాగం అధికారులు స్పందించారు. చిన్న చిన్న మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరా ప్రారంభించారు.


వినియోగంలోకి తెచ్చిన రిజర్వాయరు

ఈ కాలనీలో ఉంటే కన్నీళ్లే

★ తాగునీటి కొరతతో సతమతం ★ అపరిశుభ్రత మధ్య జీవనం

భవానీపురం, న్యూస్‌టుడే

నగరానికి సమీపంలో ఉన్న జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వాసులు సమస్యల మధ్య జీవనం సాగిస్తున్నారు. కాలనీలో సరైన మౌలిక వసతులు సమకూరక పడరాని పాట్లు పడుతున్నారు. జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకంలో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో దశాబ్దాల క్రితం జీ+3 కాలనీ నిర్మాణం చేశారు. విజయవాడ నగర పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని ప్రజలకు అక్కడ గృహాలు కేటాయించారు. ఆనాటి నుంచి ప్రజలు ఆ కాలనీలో నివాసం ఉంటున్నారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. మ్యాన్‌హోల్స్ నుంచి మురుగు పొంగి రహదారుల మీదకు చేరుతోంది. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, భూగర్భ డ్రైనేజీ బాధ్యతలను విజయవాడ నగరపాలక సంస్థ వారే చేపడుతున్నారు. కాలనీలో పారిశుద్ధ్య బాధ్యతలను నిర్వర్తించేందుకు 40 మంది కార్మికులు ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్నారు. వారికి సక్రమంగా జీతాలు చెల్లించకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. వీధుల్లో చెత్త పేరుకుంటోంది.

కాలనీలో అధ్వానంగా రహదారి

- ★ కాలనీలో బ్లాక్‌ల సంఖ్య: 250
- ★ ఒక్కో బ్లాక్‌లో గృహాలు : 32
- ★ మొత్తం గృహాలు : 8 వేలు
- ★ నివాసం ఉంటున్న ప్రజలు: 16 వేలకు పైమాటే...

ఒకే ట్యాంకు నుంచి నీటి సరఫరా..

కాలనీలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. నీటి సరఫరా సక్రమంగా చేయక నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఒకే ట్యాంకు ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. ఆ ట్యాంకుకు నీటిని నింపటం, విడుదల చేయటానికే సమయం సరిపోతుంది. ప్రజల అవసరాలకు సరిపడా ట్యాంకు సామర్థ్యం సరిపోవటం లేదు. అదనంగా మరో ట్యాంకు నిర్మాణానికి గత తెదేపా ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేశారు. తర్వాత వైకాపా ప్రభుత్వ హయాంలో దృష్టి పెట్టక పనులు సాగలేదు. నీటి కోసం గతంలో అనేక సార్లు కాలనీ వాసులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేశారు. అయినా... నగరపాలక సంస్థ అధికారులు దృష్టి పెట్టడం లేదు.

జగన్ మోసాలను ప్రజలు మరిచిపోలేదు

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వ పాలన ఐదేళ్లల్లో జగన్‌మోహన్ రెడ్డి చేసిన పాపాలు, రాష్ట్ర ప్రజలను నమ్మించి చేసిన మోసాలను రాష్ట్ర ప్రజలు మరిచిపోలేదని ఏపీ నగరాల సామాజిక వర్గం అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టర్ సుకాశి కిరణ్ చెప్పారు. ఆదివారం పాతబస్తీ నెహ్రూబొమ్మ కూడలిలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.... రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను జగన్ మోసం చేశారని పేర్కొన్నారు. ప్రజల నుంచి వైకాపా నేతలకు ఎదురవుతున్న వ్యతిరేకతను పక్కదారి మళ్లించేందుకే ఆ పార్టీ నేతలంతా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరవాసుల సమస్యల పరిష్కారానికి వీలుగా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు, మూడు సర్కిల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వివిధ డివిజన్ల ప్రజలు తమ పరిధిలోని సమస్యలను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సకాలంలో పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ప్రధానంగా తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగు కాలువలు, వీధి దీపాలు, రహదారులపై గుంతలు, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను వినతుల రూపంలో అందించాలని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

దుర్గగుడి పరిసరాల్లో పారిశుద్ధ్యం అధ్వానం

నక్షత్రవనం పక్కన పిచ్చి మొక్కలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మ దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి నిత్యం వేలాది భక్తులు వస్తుంటారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాల్సిన పారిశుద్ధ్య సిబ్బంది అలసత్వం కారణంగా నక్షత్రవనం పక్కన పిచ్చిమొక్కలు, చెత్తతో అపరిశుభ్రంగా మారింది. అమ్మవారి దర్శనం చేసుకున్న భక్తులు మల్లేశ్వరాలయం దర్శనం చేసుకుంటారు. మల్లేశ్వరాలయం దిగువన రూ.కోటి వెచ్చించి నక్షత్రవనం ఏర్పాటు చేశారు. దీనిలోకి ప్రవేశించేందుకు అనువుగా లేక ఏడాది నుంచి భక్తుల రాకపోకలు బాగా తగ్గాయి. దీంతో పారిశుద్ధ్య సిబ్బంది కూడా ఈ ప్రాంతాన్ని పట్టించుకోవడం లేదు. పైగా ప్రసాదం కవర్లు, చెత్త తీసుకెళ్లి డబ్బాలలో వేయకుండా నేరుగా ఆలయ మార్గం నుంచి కిందకు వదిలి వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పారిశుద్ధ్యం దారుణంగా మారింది. పిచ్చిమొక్కలను తొలగించకపోవడంతో విష కీటకాలు, పాములు ఈ మార్గంలో సంచరిస్తున్నాయని భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం భక్తుల నుంచి నేరుగా సేకరిస్తున్న అభిప్రాయ సేకరణలో సైతం పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్న విషయం స్పష్టమైంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

జగన్మాత సేవలో ఉయ్యూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను ఉయ్యూరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆదివారం దర్శించుకున్నారు. వెలగపూడి శంకర్‌బాబు సహకారంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం అమ్మవారి దర్శనానికి ఇంద్రకీలాద్రికి చేరింది. దేవస్థానం ఏఈవో రమేష్, వెంకటరెడ్డి వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారికి ఉచితంగా అమ్మవారి దర్శనం చేయించారు. పాలక మండలి సభ్యుడు అవ్వారు శ్రీనివాసరావు, పద్మావతి ఠాకూర్, ప్రత్యేక ఆహ్వానితుడు వెలగపూడి శంకర్‌బాబు అమ్మవారి దర్శనం చేయించారు. ప్రధానోపాధ్యాయుడు టి.వి. నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు మాధవ్, జోత్స్న, సుగుణాకరరావు, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురం ప్రాంగణంలో విద్యార్థులతో శ్రీనివాసరావు, పద్మావతి ఠాకూర్, శంకర్‌బాబు తదితరులు

దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి గొల్లపూడికి చెందిన ఎం.రవీంద్రనాథ్ రూ.లక్ష విరాళాన్ని ఆదివారం అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ అధికారి జగన్ వారికి విరాళం రసీదు, అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

దాత రవీంద్రనాథ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి జగన్

ప్రముఖులకు సన్మానం.. జ్ఞాపికల అందజేత

ఎంసీ దాస్‌ను సత్కరించి జ్ఞాపికను అందజేస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఉదయభాను

అవార్డు అందుకుంటున్న వి.లక్ష్మయ్యచౌదరి

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఛాంబర్ ఆఫ్ రియల్టర్స్ అండ్ బిల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అమరావతి విశిష్ట సేవా పురస్కారాలను ఎంపీ కేశినేని చిన్ని, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు అందజేశారు. **- విద్యాధరపురం, న్యూస్‌టుడే**

తారల మిణుకులు.. క్రిస్మస్ గురుతులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : క్రైస్తవులు తమ ఇళ్ల ముంగిట, భవనాల పైన, వీధుల్లో నక్షత్రాలు ఏర్పాటు చేసి సందడి చేస్తున్నారు. విద్యుత్తు కాంతులతో అవి వెలుగొందుతున్నాయి. విభిన్న రూపాల్లో వీధుల్లో దర్శనమిస్తున్నాయి. పశువుల పాకలు వేస్తూ యువత ఆధ్యాత్మిక సేవలో తరిస్తున్నారు. క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ వీధుల్లో ఏర్పాటు చేసిన ఆర్చీలు ఆకట్టుకుంటున్నాయి. లంబాడీపేట అడ్డరోడ్డులో ప్రతి ఇంటా నక్షత్రాలు వెలుగుతూ ముచ్చట గొల్పుతున్నాయి.

ఎస్‌డీఏ చర్చి వీధిలో వెలుగొందుతున్న స్టార్

జోడుబొమ్మలవీధిలో ఆర్చి

అ'పూర్వ' కలయిక.. ఆనందాల వేడుక!

స్థానిక కోనేరు బసవయ్య చౌదరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999-2000 ఏడాది పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పటమటలోని ఆ పాఠశాలలో నిర్వహించారు. స్నేహితులంతా ఆనాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. ఒక్కసారిగా అందరూ చిన్న పిల్లలుగా మారి పాఠశాలలో తాము చేసిన అల్లరి, చిలిపి పనులు గుర్తు చేసుకుని ఆనందంలో మునిగిపోయారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులకు పాదపూజ చేసి ఘనంగా సత్కరించారు. **- పటమట, న్యూస్‌టుడే**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? కొత్తపేట సుబ్రహ్మణ్యేశ్వరాలయం వద్ద మెట్ల మార్గంపై చెత్త దర్శనం ఉండి.. దుర్వాసన వస్తోంది. **-కోటి, స్థానికుడు**
✔ పరిశీలించి చెత్త తరలింపు చర్యలు చేపడతాం. **-నరసింహరావు, స్థానిక శానిటరీ అధికారి**
? సామారంగం చౌకీ రామాలయం వద్ద పక్కా కాలువలో పూడిక పేరుకుంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. **-రామేశ్వరశర్మ, స్థానికుడు**
✔ సిబ్బందిని పంపి కాలువలో పూడిక తీయించే చర్యలు తీసుకుంటాం. **-యోగేంద్ర, స్థానిక శానిటరీ అధికారి**
-విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

స్పందనకు వందనం.. ★ పాత రాజరాజేశ్వరీ పేట మణికంఠ ముందుల దుకాణం వద్ద పక్కా కాలువలో పూడిక పేరుకుందని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా'కు సమాచారం ఇచ్చారు. స్పందించిన పారిశుద్ధ్య అధికారులు కార్మికులతో పూడిక తీయించారు.

నిత్య వ్యాయామంతో గుండె జబ్బులు దూరం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: విజయవాడ ఈస్ట్ జెమ్స్ లయన్స్ క్లబ్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుణదల తమ్మినేని హాస్పిటల్‌లో ఆదివారం 150వ నెల మధుమేహ వ్యాధి, రక్తపోటు వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.ప్రవీణ్ హాజరై మాట్లాడుతూ.. జంతువుల్లో లేని గుండె జబ్బులు మనుషులకు వస్తున్నాయని పరిశోధనల్లో తేలిందన్నారు. దీనికి మూడు కారణాలని చెప్పారు. అవి ఆకలేసినప్పుడే తింటాయని, పచ్చి మాంసాన్ని బాగా నమిలి తీసుకుంటాయని, ఉప్పు కారాలు ఉండని కారణంగా వాటికి జబ్బులు రావని వివరించారు. నిత్యం వ్యాయామం చేస్తూ, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ నియంత్రించుకోవడం ద్వారా గుండె జబ్బులను నివారించవచ్చని తెలిపారు. డాక్టర్ తమ్మినేని రామకృష్ణ, డాక్టర్ పద్మ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడే మందులను ఉచితంగా అందజేశారు. గౌరవ అతిథి ఎల్.వెంకటేశ్వరరావు పర్యావరణ హిత పెన్నులు అందజేశారు. శిబిరాన్ని జాస్తి ప్రసాద్ పర్యవేక్షించగా, క్లబ్ ప్రతినిధులు అనిల్ కుమార్, రంగా శ్రీనివాసరావు, త్రినాథరావు, జాస్తి నవీన్, మురళి, ఎన్.వి. ఆర్.పండు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత పెన్నులు చూపుతున్న డాక్టర్ రామకృష్ణ, జాస్తి ప్రసాద్ తదితరులు

ఆ వీధులు నందనవనం

★ పచ్చని చెట్లతో కళకళ ★ నగరవాసుల్లో మొక్కల పెంపకంపై చైతన్యం

విద్యాధరపురం, న్యూస్‌టుడే

'వృక్షో రక్షిత రక్షితః' అనే సూక్తి ప్రస్తుత పరిస్థితుల్లో నగరవాసులు ప్రతి ఒక్కరికీ అర్థం అవుతోంది. కాంక్రీట్ జంగిల్ పేరుతో సిమెంటు రోడ్లు వేస్తున్న నగరంలో మొక్కలు నాటే ఆలోచన మరిచారు. మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా గతంలో పచ్చదనం- పరిశుభ్రత, వనం- మనం పేరుతో తెదేపా ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు పచ్చని చెట్టు- ప్రగతికి మెట్టు అన్న నానుడి ప్రతి ఒక్కరి చెంతకు చేరింది.

★ గట్టు వెనక ప్రాంతంలో కొన్ని వీధులు నందనవనాన్ని తలపించేలా మొక్కలు పెంచారు. దశాబ్ద కాలం క్రితం నాటిన మొక్కలు మహా వృక్షాలుగా మారి నీడ ఇస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మొక్కలు నాటేందుకు అనువైన సమయం. నగరవాసుల్లో పచ్చదనంపై కలిగిన చైతన్యంతో ఇంటి ఆవరణలో వృక్షాలను తొలగించకుండా శ్లాబును కూడా వాటి చుట్టూ వేసి పచ్చదనాన్ని పరిరక్షిస్తున్నారు.

★ ప్రియదర్శిని కాలనీలో ఇలాంటి వృక్షం చూపరులను ఆకర్షిస్తోంది. ఇదే స్ఫూర్తి మరికొంత మంది కలిగేందుకు ఈ వృక్షం దోహద పడుతోంది. సితార సెంటరు నుంచి ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు వరకు ఇతర ప్రాంతాల నుంచి తరలించిన వృక్షాలు కూడా చూడ ముచ్చటగా తయారయ్యాయి. కొంతమంది గృహ యజమానులు మొక్కల నుంచి దోమలు, ఈగలు వ్యాపించకుండా ఉండేలా దోమతెరలు ఏర్పాటు చేసి పెంచుతున్నారు.

వనాన్ని తలపిస్తున్న కామకోటినగర్ కృష్ణారావు వీధి

★ పార్థసారథి వీధిలో మురుగు కాల్వ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని గృహ యజమానులు వదలకుండా పచ్చని మొక్కలతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. గంజి ఎలమందయ్య వీధిలో ఇంటి ముందు ఇతరులు చెత్త వేస్తున్నారని ఓ గృహ యజమాని ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నారు. ప్రతి ఇంటా నాటిన మొక్క వారితో పాటు చుట్టుపక్కల ఉన్న వారికి నీడను ఇవ్వడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహద పడుతోందని మొక్కల ప్రేమికులు చెబుతున్నారు.

జగన్ పుట్టినరోజు వేడుక

భవానీపురంలో రక్తదానం చేస్తున్న యువకులు

భవానీపురం, న్యూస్‌టుడే : మాజీ సీఎం జగన్ పుట్టినరోజు వేడుకను భవానీపురంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించారు. 42వ డివిజన్ కార్పొరేటర్ చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో శివాలయం సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. పలువురు రక్తదానం చేశారు. 40వ డివిజన్ కార్పొరేటర్ యరెడ్ల ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో బ్యాంకు సెంటర్ వద్ద కేకు కోసి పంచారు.

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే : వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం వైకాపా నాయకులు నిర్వహించారు. పాతబస్తీ 53వ డివిజన్ వైకాపా అధ్యక్షుడు గురు మహంతు మహేష్ సారథ్యంలో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి కేకు కోసి పేదలకు పండ్లు పంపిణీ చేశారు. 54వ డివిజన్ పంజాసెంటర్‌లో వైకాపా నాయకుడు హసన్ బాషా ఆధ్వర్యంలో కేకు కోసి పేదలకు చీరలను పంపిణీ చేశారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేయిద్దాం.. అంగ వైకల్యాన్ని తరిమేద్దాం

చిట్టినగర్, విద్యాధరపురం, భవానీపురం, విజయవాడ వన్‌టౌన్, రైల్వేస్టేషన్ : నగరంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. నగర మేయర్ భాగ్యలక్ష్మి, కలెక్టర్ లక్ష్మీశ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా 0-5 ఏళ్ల లోపు చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కలు వేశారు. వైద్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈసారి మాల్స్‌లోనూ కేంద్రాలు ఏర్పాటు చేసి.. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

మేయర్ భాగ్యలక్ష్మి ఒడిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తూ..

లంబాడీపేటలో సిబ్బంది

ఇంద్రకీలాద్రిపై ఈవో శీనానాయక్...

కబేళా సెంటరులో పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

2026 కాలమానిని ఆవిష్కరణ

కాలమానిని ఆవిష్కరణలో అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : తిథులు, జాతక ఫలాలు, వార నక్షత్రాలు అందరికీ అర్థమయ్యే రీతిలో కాలమానినిలో పొందుపరిచామని శ్రీదుర్గా గాయత్రి అర్చక యాగ్నిక పురోహిత సేవా సంఘ అధ్యక్షుడు విన్నకోట శ్రీనివాసశర్మ అన్నారు. ఆంజనేయ వాగు సెంటర్‌లోని శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలోని అయ్యప్ప స్వామి సన్నిధిలో 2026 కాలమానిని ఆదివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలమానిని 8 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తున్నామని చెప్పారు. కార్యక్రమం ఆలయ వ్యవస్థాపక ఛైర్మన్ నందిపాటి నాగవెంకట శ్రీనివాసరావు, ఆలయ ఈవో వై.సీతారామయ్య పర్యవేక్షణలో నిర్వహించారు. సంఘ సభ్యులు పసుమర్తి రామకృష్ణ, బుద్ధిరాజు చంద్రశేఖర్‌శర్మ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

చిట్టినగర్, న్యూస్‌టుడే : కొత్తూరు తాడేపల్లి గ్రామం, రైస్ మిల్లు వద్ద ఇందుర్తి శివకృష్ణ (29) అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై హరిప్రసాద్ సిబ్బందితో దాడి చేసి 180 ఎంఎల్ 18 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేశారు. అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

వెటరన్ టీటీ పోటీ విజేతల వెల్లడి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: పటమట ఫన్‌టైమ్స్‌లో ఆదివారం నిర్వహించిన 10వ రాష్ట్ర స్థాయి వెటరన్ టేబుల్ టెన్నిస్ పోటీలో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ పోటీని ప్రారంభించగా.. రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి పి. విశ్వనాథ్ విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. ఫన్‌టైమ్స్ కార్యనిర్వాహక కార్యదర్శి కె. విజయబాబు, కోశాధికారి ఎం.సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

★ పురుషుల సింగిల్స్ 40+ కేటగిరీలో ప్రదీప్, శ్రీకాంత్‌రాజు, 50+లో వైటీవీ సుబ్బారావు, మల్లికార్జునుడు, 60+లో కె.జయరామ్, అబ్బాస్, 65+లో సీహెచ్ హనుమంతరావు, వీవీ రమణ, 70+లో గంగాధర్, గిరిధర్, 75+లో ఎస్.ప్రభాకరరావు, వీవీ సుబ్రహ్మణ్యం, డబుల్స్ 40+లో బి.రాజు/ప్రదీప్, శ్రీకాంత్/కార్తీక్, 50+లో నరసింహారావు/సుభాకృష్ణ, బి. భాస్కర్/వేణుగోపాల్, 60+లో కె.జయరామ్/అబ్బాస్, జీవీఎస్ కృష్ణారావు/శ్రీనివాసరావు, మహిళల సింగిల్స్ 40+లో పి.భారతి, ఎస్. ఆరతి, 50+లో సత్యవతి, సూర్య పద్మావతి, 60+లో బేబీ సరోజిని, డాక్టర్ అరుణ, డబుల్స్ 40+లో బేబీ సరోజిని/సత్యవతి, భారతి/ఆరతి, మిక్స్‌డ్ డబుల్స్‌లో సురేష్/సరోజిని, జయరామ్/భారతి జోడీలు వరుస స్థానాలు కైవసం చేసుకున్నారు.

అతిథుల చేతుల మీదుగా విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న కె.జయరామ్ (విజయవాడ)

గద్దె అనూరాధకు అభినందనలు

విద్యాధరపురం : ఎన్టీఆర్ జిల్లా తెదేపా అధ్యక్షురాలిగా గద్దె అనూరాధను నియమించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా సుదీర్ఘకాలం పని చేసిన అనుభవం ఉన్న ఆమె నియమించినందుకు అధినేతలు చంద్రబాబు, లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పటిష్టతకు నాయకత్వం తీసుకునే నిర్ణయాలను శిరోధార్యంగా భావిస్తామని తెలిపారు.

విద్యుత్తు ఉద్యోగి అదృశ్యం

చిట్టినగర్, న్యూస్‌టుడే : విద్యుత్తు శాఖలో పని చేస్తున్న ఉద్యోగి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. విజయవాడ గ్రామీణ ప్రాంతం కొత్తూరు తాడేపల్లి గ్రామానికి చెందిన కనికళ్ల వరలక్ష్మి, సత్తిరాజుల కుమారుడు సతీష్ (46) తణుకులో భార్యతో కలిసి ఉంటున్నాడు. తాడేపల్లిగూడెంలోని విద్యుత్తు విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తి ఇంటికి, ఉద్యోగానికి వెళ్లకుండా రోడ్డు మీద, రైల్వేస్టేషన్‌లో పడుకుంటున్నాడని విద్యుత్తు కార్యాలయం నుంచి తల్లికి ఫోన్ చేసి చెప్పారు. అక్కడికి తల్లి వెళ్లి సతీష్‌ను ఇంటికి తీసుకు వచ్చింది. 10 రోజులు ఉన్నాడు. అనంతరం 2025 అక్టోబరు 18న ఉద్యోగానికి వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకీ తెలియలేదు.

సినిమాలు

★ **గుర్రం పాపిరెడ్డి:** జయరామ్(గాంధీనగర్), పీవీపీ మాల్(బందరురోడ్డు) : **అవతార్ (ఫైర్ అండ్ యాష్):** జీ-3(రాజ్-యువరాజ్), మీరాజ్, జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), అప్సర, స్వర్ణ కాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు) : **ఫైటర్ శివ :** స్వర్ణకాంప్లెక్స్(గవర్నరుపేట) : **కామ ది డిజిటల్ సూత్రాస్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), పీవీఆర్ మాల్(బందరు రోడ్డు) : **మిస్టీరియస్:** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), లైలామాల్(బందరురోడ్డు)

మారియో : స్వర్ణ కాంప్లెక్స్ (గవర్నరుపేట) : **అఖండ-2:** అలంకార్, శైలజ, జీ-3(రాజ్-యువరాజ్), మీరాజ్, జయరామ్, ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), అప్సర, స్వర్ణ కాంప్లెక్స్(గవర్నర్‌పేట), తారా స్క్రీన్స్, రవీంద్ర సినిమాస్(పాయకాపురం), రామ్ సినిమాస్(గుణదల), సౌమ్య(వన్‌టౌన్), స్వాతి(భవానీపురం), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు) : **మోగ్లీ :** ఊర్వశి ఐనాక్స్(గాంధీనగర్), స్వర్ణ కాంప్లెక్స్(గవర్నరుపేట), సాయిరామ్, రాజ్‌కుమారి(వన్‌టౌన్), లైలా మాల్, పీవీపీ మాల్, పీవీఆర్ మాల్(బందరు రోడ్డు), ట్రెండ్‌సెట్ మాల్(క్యాపిటెల్ సినిమాస్), ఎల్ఈపీఎల్ ఐనాక్స్(పటమట), పవర్ వన్ మాల్(కానూరు). **- విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే**

(c) eenadu

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మధురానగర్, న్యూస్‌టుడే : విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతుల కారణంగా మధురానగర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని పలు ప్రాంతాలకు సోమవారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు నేతాజీకాలనీ, రమాదేవి స్కూల్‌రోడ్డు, బావిరోడ్డు, తుంగం కోటేశ్వరరావు వీధి తదితర ప్రాంతాలకు విద్యుత్తు ఉండదని ఈఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

రాఘవకుమార్ కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఈవో చక్రధరరావు

ఆత్రేయపురం, న్యూస్‌టుడే : కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడలోని మాచవరానికి చెందిన ఎస్‌టీపీ రాఘవకుమార్ కుటుంబ సభ్యులు రూ.1,00,116, ఏలూరు జిల్లా కైకలూరు మండలం చాట్రాయి గ్రామానికి చెందిన ఘంటశాల నాగరాజు, నీరజాక్షి దంపతులు రూ.55,980 విరాళం అందజేశారని ఈవో చక్రధరరావు ఆదివారం తెలిపారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

సీతారాంపురం–63036 11232, పాయకాపురం– 90631 44761

పాయకాపురం: వాంబేకాలనీ జీ బ్లాక్ వద్ద, వార్డు సచివాలయం సమీపంలో కాలువలో పూడిక తీయడం లేదు. స్థానికులు ‘మేమున్నాం మీకు తోడుగా’కు సమాచారం ఇచ్చారు. దీనిపై ‘ఈనాడు’లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో పూడిక తీయించారు.

☛ వాంబేకాలనీ జీ బ్లాక్ 9వ బిల్డింగ్ వద్ద రాత్రివేళల్లో పలువురు యువకులు గంజాయి తాగుతున్నారు. దీనిపై ‘ఈనాడు’లో వచ్చిన వార్తకు నున్న పోలీసులు స్పందించారు. నిఘా ఏర్పాటు చేసి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేశారు.

? ప్రశాంతినగర్ శారదా విద్యాపీఠ్ వద్ద రోడ్డుపై చెత్త కుండీలో వ్యర్థాలు తరలించడం లేదు. - **దుర్గాదేవి, స్థానికురాలు** ✔ పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తరలిస్తాం. - **శివరామకృష్ణ, శానిటరీ అధికారి**

? ప్రకాష్‌నగర్ ఎన్టీఆర్ బొమ్మ సెంటర్ కూడలిలో రోడ్డుపై మాంసాహార వ్యర్థాలను అలానే వదిలేస్తున్నారు. తీవ్ర దుర్వాసన వస్తోంది. - **కిషోర్, స్థానికుడు** ✔ వ్యర్థాలు తరలించేలా చర్యలు తీసుకుంటాం. - **రాజ్‌కుమార్, శానిటరీ అధికారి** - **న్యూస్‌టుడే, పాయకాపురం**

ఆత్మరక్షణకు ఉందిగా కరాటే..!

జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో బాలల సత్తా

పాయకాపురం, న్యూస్‌టుడే

సమాజంలో మనలను మనం రక్షించుకోవడానికి కరాటే ఎంతగానో ఉపకరిస్తుందని భావించిన తల్లిదండ్రులు.. తమ పిల్లలకు ఆత్మరక్షణ విద్య నేర్పిస్తున్నారు. ముఖ్యంగా బాలికలు, యువతులు, మహిళలపై అఘాయిత్యాల నేపథ్యంలో వాటిని దీటుగా ఎదుర్కొనేందుకు సాధన చేయిస్తున్నారు. పిల్లలు సైతం ఎంతో ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం పెంపొందుతుందని, ఏకాగ్రత పెరుగుతుందని వారు చెబుతున్నారు. మరోవైపు జిల్లా, రాష్ట్ర స్థాయి వేదికలపై పోటీపడి పతకాలు సాధిస్తున్నారు. తమనుతాము ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటున్నారు.

మానసికస్థైర్యం పెరుగుతుంది

నేను రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్‌లో 7వ తరగతి విద్యనభ్యసిస్తున్నాను. తల్లితండ్రులు వెంకటరమణ, రమాదేవి. నాన్న ఆర్మీలో పని చేసి పదవీ విరమణ చేశారు. కరాటేలో ప్రస్తుతం గ్రీన్‌బెల్ట్ పొందాను నాలుగుసార్లు రాష్ట్ర, జిల్లా స్థాయిలో పోటీపడి మూడు ప్రథమ బహుమతులు పొందాను. ఇటీవల అంతర్ జిల్లాల కరాటే పోటీల్లో ప్రథమ స్థానం సాధించాను. సాధన వల్ల వ్యక్తిత్వం అలవడుతుంది. మానసికస్థైర్యం పెరుగుతుంది. ఆడపిల్లలు తమను తాము రక్షించుకోవడానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుంది. - **ఎం.పూజిత, సుందరయ్యనగర్**

బాలికల రక్షణకు ఇది అవసరం

నేను రాజీవ్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి చదువుతున్నాను. రోషన్, రుహినా తల్లిదండ్రులు. నాన్న ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. ఎంతో కష్టపడి నన్ను చదివిస్తున్నారు. వ్యక్తిగత, ఆత్మరక్షణ కోసం కరాటే నేర్పిస్తున్నారు. ప్రస్తుతం బ్లూ బెల్ట్ ర్యాంక్‌లో ఉన్నాను. ఇటీవల అంతర్ జిల్లాల కరాటే పోటీల్లో పాల్గొని ప్రథమస్థానం సాధించాను. పసిడి పతకం గెలుపొందాను. ఆరుసార్లు జిల్లా స్థాయిలో పోటీపడ్డాను. మూడు ప్రథమ, రెండు ద్వితీయ స్థానాలను కైవసం చేసుకుని ట్రోఫీలు పొందాను. బాలికలు కరాటే విద్యను తప్పనిసరిగా నేర్చుకోవాలి. - **మహమ్మద్ రుబీదా తస్నీం, ఉడాకాలనీ**

చాలా చురుకుగా ఉంటా

నేను లహరి విద్యామందిర్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. తల్లిదండ్రులు శ్రీనివాసరావు, సత్యవేణి. నాన్న లాండ్రీ దుకాణం నిర్వహిస్తూ.. కుటుంబాన్ని పోషిస్తున్నారు. నాకు కరాటే అంటే ఇష్టం. బాగా మెలకువలు నేర్చుకున్నారు. పర్పుల్ బెల్ట్ ర్యాంక్‌లో ఉన్నాను. ఇప్పటికే నాలుగు సార్లు రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో తలపడి మూడు ప్రథమ బహుమతులు, ఒక ద్వితీయ బహుమతి సాధించాను. పలు ట్రోఫీలు సాధించాను. కరాటే వల్ల చాలా చురుకుగా ఉంటాం. క్రమశిక్షణ అలవడుతుంది.
- **జిన్నాడ యోగనాగాంజనేయులు, ప్రకాష్‌నగర్**

చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది

నేను వివేకానంద సెంటినరీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాను. తల్లిదండ్రులు నాళం బాబు, లక్ష్మీలు. తండ్రి డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రస్తుతం పర్పుల్ బెల్ట్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాను. నాలుగు సార్లు రాష్ట్ర, జిల్లా స్థాయిలో వివిధ విభాగాలలో పోటీపడ్డాను. రెండు సార్లు ప్రథమ, రెండు సార్లు ద్వితీయ బహుమతులను గెలిచాను. ఇటీవల అంతర్ జల్లాల కరాటే పోటీల్లో పాల్గొని ట్రోఫీ పొందాను. కరాటే చేయడం వల్ల చదువుపై ఏకాగ్రత పెరుగుతుంది. దీనివల్ల పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలం.
- **నాళం యశ్వంత్ సూర్యఫణి కార్తికేయ, శాంతినగర్**

హిందూ సంప్రదాయాలు కాపాడుకోవాలి

కేదారేశ్వరపేట, న్యూస్‌టుడే : హిందూ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం లోటస్ ల్యాండ్ మార్కులో నిర్వహించిన హిందూ సమ్మేళనానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ పిలుపుమేరకు దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. హిందూ ధర్మానికి ప్రత్యేకత ఉందని, అనేక ఆటుపోట్లు తట్టుకొని దేశంలో ధర్మం నిలబడిందన్నారు. సనాతన ధర్మం గురించి పిల్లలకు నేర్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో భారత దేశం విశ్వగురువుగా ఎదగబోతుందని భాజపా నాయకురాలు యామినీ శర్మ అన్నారు. హిందువులంతా ఐక్యతగా ఉండాలని పరిపూర్ణ సరస్వతీ స్వామీజీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విజయకృష్ణా సూపర్ బజార్ ఛైర్మన్ వెలగా సురేష్, కమిటీ కన్వీనర్ పల్లపోతు మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు కె.యు.చంద్రమోహన్, అన్నే సాంబశివరావు, కిషోర్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో సరస్వతీ స్వామీజీ, విప్ బొండా, సురేష్ తదితరులు

సంగీతంతో మానసికోల్లాసం

సత్యను సత్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్ : సంగీత సాధనతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆదివారం నగరంలోని సంగీత నృత్య కళాశాలలో నిర్వహించిన స్వాతి ఆర్కెస్ట్రా 20 ఏళ్ల మహోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కళారంగంలోకి ఇటీవల యువ కళాకారులు రావడం అభినందనీయమన్నారు. హైపర్ ఆది విశిష్ట అతిథిగా విచ్చేసి సందడి చేశారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు.. సీనియర్ గాయకుడు మహ్మద్‌తో పాటు పలువురు కళాకారులకు ఘనంగా సత్కరించారు. గాయకులు పలు చిత్రాల్లోని పాటలను చక్కగా ఆలపించి.. ఉర్రూతలూగించారు. సంస్థ వ్యవస్థాపకుడు సత్య, రాము, రసూల్, విజయ్, షరీఫ్ పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించడం బాధ్యత

సత్యనారాయణపురం(గాంధీనగర్) : వృద్ధాప్యం ప్రతి ఒక్కరి జీవితంలో భాగమని.. ఈ నేపథ్యంలో వృద్ధులను ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని లయన్స్ మాజీ గవర్నర్ గోపీనాథ్ అన్నారు. దుర్గాపురంలోని విజయా నర్సింగ్ కళాశాలలో ఆదివారం వయోవృద్ధుల ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ప్రతి నెలా నాణ్యమైన నిత్యావసర వస్తువులు అందిస్తున్న సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ చల్లా హరికుమార్, తేజ్‌రాజ్ సోలంకి, జగన్‌మోహనరావు, బి.శ్రీనివాసరావు, తట్టి అర్జునరావు, గోదావరి వెంకటేష్, మధుసూదనరావు, లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.

చేనేతల జీవితాల్లో వెలుగులు నింపుదాం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : చేనేతల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నేత వస్త్రాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ చీరల దినోత్సవం సందర్భంగా మహాత్మా గాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో అఖిల భారత పద్మశాలీయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రతి చీర వెనుక నేత కార్మికుడి ఆత్మ నివేదన ఉంటుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ.. చేనేతోద్యమ సూరీడు ప్రగడ కోటయ్య.. ఆధునిక తెలుగు నిఘంటుకర్తగా పలు గ్రంథాలు రాశారని చెప్పారు. భాషోద్యమ సూరీడుగా వెలుగొందిన రవ్వా శ్రీహరి చరిత్రలో నిలిచిపోతారన్నారు. వారిద్దరి పేరుతో అవార్డులు ఇవ్వడం అభినందనీయమని కొనియాడారు. ఆచార్య రవ్వా శ్రీహరి సాహితీ పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు కలిమిశ్రీకి అందించారు. ప్రగడ కోటయ్య అవార్డును లొల్లా వీర వెంకట సత్యనారాయణలకు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.ప్రభాకర్, వావిలాల సరళాదేవి, ఉపేంద్ర గుప్తా, ప్రసాద్, గోలి భాస్కరరావు, దివి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకుంటున్న కలిమిశ్రీ

ప్రజలకు మెరుగైన సేవలు

మధురానగర్ : పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు

మధురానగర్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతున్నారని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కొనియాడారు. ఆదివారం 59, 62 డివిజన్లలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తోందన్నారు. ఆసుపత్రుల బలోపేతం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, ఆధునిక వైద్యసేవల కల్పన వంటివి చేస్తున్నట్లు వివరించారు. పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయాలని కోరారు. స్థానిక తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కేదారేశ్వరపేట : స్థానిక 32వ డివిజన్, అయోధ్యనగర్‌లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో కార్పొరేటర్ రామ్మోహనరావు, విజయకృష్ణా సూపర్‌బజార్ ఛైర్మన్ వెలగా సురేష్, డివిజన్ అధ్యక్షుడు శేషుబాబు తదితరులు పాల్గొన్నారు. అయిదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యనగర్‌లో...

పాయకాపురం : నిండు జీవితానికి రెండు చుక్కలు అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 62వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. మాజీ కార్పొరేటర్ పైడి తులసి, నాయకులు జలకం రాజా పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

మధురానగర్, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తున్న సంక్షేమ పథకం అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చేయూత అందిస్తోందన్నారు. ఆదివారం 60వ డివిజన్, వాంబేకాలనీకి చెందిన పలువురు లబ్ధిదారులకు రూ.2.33 లక్షలు విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. 20 నెలల్లో నియోజకవర్గంలో రూ.10 కోట్ల విలువైన చెక్కులు అందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఆలోచన అదిరింది... ఆవిష్కరణ మెరిసింది

విజయవాడ సిటీ, సీతారాంపురం

ఫార్మసీ విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు మొగ్గు చూపుతున్నారు. సహజ సిద్ధంగా దొరికే వస్తువులతో ప్రజలకు ఉపయోగపడే వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. ప్రస్తుతం దొరుకుతున్న కొన్ని రకాల మందుల వినియోగంతో అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని భావిస్తున్న తరుణంలో ఎటువంటి ఇబ్బందులు లేని ఉత్పత్తులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఒంటి నొప్పులు, జలుబు, తలనొప్పికి ఔషధాలు, చర్మం అందంగా ఉండేలా వివిధ రకాల నూనెలు తయారు చేశారు. ఆయా ఉత్పత్తులు వినియోగిస్తే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావని చెబుతున్నారు సిద్ధార్థ ఫార్మసీ విద్యార్థులు. అనుమతులు పొందాక కొద్ది రోజుల్లోనే తక్కువ ధరకే తమ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.

ఒత్తిడి నుంచి ఉపశమనానికి..

బీఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతున్న **పి.ఆకాంక్ష, టి.వర్షిణి, టి.బిందుశ్రీ...** యూకలిప్టస్, లావెండర్, పిప్పర్‌మెంట్ ఆయిల్ వినియోగించి ఇన్‌హెల్లర్ రూపొందించారు. దానిని పీల్చితే దైనందిన జీవితంలో ఎదురయ్యే ఒత్తిడి నుంచి కొంత ఉపశమనం పొందవచ్చునని వివరించారు. సహజ సిద్ధంగా దొరికే వస్తువులతో తయారు చేసినందున ఎటువంటి ఇబ్బంది ఉండదని చెబుతున్నారు.

చర్మ సౌందర్యానికి..

ఎంఫామ్ ఫార్మాస్యూటికల్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు **కె.హరిచందన, కె.లాస్యప్రియ, బి.శశికాంత్..** . తదితరులు సబ్బులు తయారు చేశారు. ముల్తాని మట్టి, టి ట్రీ ఆయిల్ సహాయంతో ఒకటి, గులాబీ రేకుల రసం, లావెండర్ ఆయిల్, గొర్రె పాలతో మరో రకం సబ్బు సిద్ధం చేశారు. అవి ముఖానికి రాయడం వల్ల జిడ్డు తొలగిపోయి ప్రకాశవంతంగా ఉంటుందని చెబుతున్నారు. చర్మ సౌందర్యానికి అవి ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు.

కండరాల నొప్పి నివారణకు..

బీఫార్మసీ తృతీయ సంవత్సరం చదువుతున్న **టి.విద్యశ్రీ, ప్రఫుల్ల..** పుదీనా పువ్వు, కర్పూరం, ఆవాల నూనె, కుంకుమ పువ్వు సహాయంతో నూనె తయారు చేశారు. దానిని వినియోగిస్తే కండరాల నొప్పి తగ్గుతుందని చెబుతున్నారు. సహజ సిద్ధ వస్తువులతో తయారు చేసినందున ఎటువంటి అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావని తెలియజేశారు.

సెక్యూరిటీ స్థానే పీటీడీ కానిస్టేబుల్‌గా మార్చండి

మాట్లాడుతున్న బొప్పరాజు, పక్కనే జనకుల, అంకినీడు, వెంకటేశ్వరరావు తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ (ఏపీ పీటీడీ/ఆర్టీసీ)లో సెక్యూరిటీ కానిస్టేబుల్ పేరును పీటీడీ కానిస్టేబుల్‌గా మార్చి, గౌరవాన్ని కాపాడాలని ఏపీ పీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు, ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. విజయవాడలోని రెవెన్యూ భవన్‌లో విజిలెన్స్, సెక్యూరిటీ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు డి.అంకినీడు, ప్రధాన కార్యదర్శి టి.వెంకటేశ్వరరావుల నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మాట్లాడుతూ.. సెక్యూరిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏపీ ఐకాస అండగా ఉంటుందన్నారు. పేరు (డెసిగ్నేషన్) మార్పు, గత పే స్కేల్లో కానిస్టేబుల్ కేడర్‌కు జరిగిన అన్యాయం, ట్రావెల్, సమదుస్తుల అలవెన్స్‌లు తదితరాలపై సమావేశంలో చర్చించారు.

గౌరవ అధ్యక్షుడిగా బొప్పరాజు నియామకం

బొప్పరాజును ఏపీ పీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, వివిధ ప్రాంతాలకు చెందిన సెక్యూరిటీ స్టాఫ్ అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు.

❖ ఏపీ పీటీడీ (ఆర్టీసీ) విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ శాఖ తరఫున ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర అథ్లెటిక్ మీట్‌లో బంగారు పతకాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్ ఎన్.పి.రావు, కానిస్టేబుల్ ఎన్.ఎస్.వి.డి.ప్రసాద్‌లను బొప్పరాజు సత్కరించి అభినందించారు.

విద్యార్థులకు ధ్యాన తరగతులు

సాధన చేస్తున్న బాల బాలికలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : నగరంలోని మహాత్మా గాంధీ రోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా చిన్నారులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. వల్లభనేని సుమతి మాట్లాడుతూ.. శ్వాస మీద ధ్యాస పెట్టాలని సూచించారు. సాధనతో ఏకాగ్రత పెరుగుతుందని, ఆందోళన తగ్గి రక్తపోటు నియంత్రణలో ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి ఉదయం నిద్ర లేవగానే పావుగంట ధ్యానం చేయాలని ఆమె సూచించారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి, వై.ధనలక్ష్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి మృతి

మధురానగర్, న్యూస్‌టుడే : ఇన్నర్‌రింగ్ రోడ్డులోని ఒక బార్ వద్ద యువకుడు అనుమానాస్పద మృతి చెందినట్లు గుణదల పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. చనిపోయి రెండు రోజులు అయి ఉండొచ్చని భావిస్తున్నారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

సత్యనారాయణపురం(గాంధీనగర్): రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టాలని ట్రాఫిక్ డీసీపీ షిరీన్‌బేగం సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం మూడో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. ప్రమాదాల రహదారులు, ముఖ్యమైన కూడళ్లు, ట్రాఫిక్ నియంత్రణ విధానం.. తదితర అంశాలపై సమీక్షించారు. పలు సూచనలు చేశారు. ప్రజలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాలని సూచించారు. సీఐ కొత్తూరు కిషోర్‌బాబు పాల్గొన్నారు.

లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు

గాంధీనగర్, న్యూస్‌టుడే : సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు లాడ్జిల్లో నార్త్ ఏసీపీ స్రవంతిరాయ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. గదులను తనిఖీ చేసి.. రికార్డులు పరిశీలించారు. అనుమానిత వ్యక్తుల వస్తే సమాచారం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే సీజ్ చేస్తామని ఆమె హెచ్చరించారు. సీఐ లక్ష్మీనారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి

మాచవరం, న్యూస్‌టుడే : అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ ఎ.ఎస్.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక ఎస్సార్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ టీచర్స్ సంఘం(జీసీజీటీఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.గోపాల్‌నాయుడు అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరెడ్డి నివేదిక వెల్లడించారు. అధ్యాపకుల బదిలీలు, ఉద్యోగోన్నతులు, సర్వీసు నియమాలు తదితర సమస్యలపై చర్చించారు. ఎన్టీఆర్ జిల్లా సంఘం కార్యదర్శి బి.సుధాకర్ పర్యవేక్షించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.వి.శేషయ్య, కె.శ్రీనివాస్, కె.నవీన, పలు జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ

‘ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం’

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : వైద్య విద్యలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన 107, 108 జీవోలను రద్దు చేసి.. 100 శాతం ప్రభుత్వ సీట్లుగానే ఇస్తామన్న కూటమి ప్రభుత్వం.. పాత విధానాలనే అవలంబిస్తోందని వైద్యులు ఘంటా వెంకట్రావు విమర్శించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పద్ధతిలో ప్రైవేటీకరించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం బాలోత్సవ భవన్‌లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ(పీడీఎస్‌వో).. ‘వైద్య విద్య ప్రైవేటీకరణ-సమాజంపై ప్రభావం’ అంశంపై సదస్సు ఏర్పాటు చేసింది. ముఖ్యవక్తగా ఆయన హాజరై మాట్లాడారు. వైద్య విద్యను మరింత కార్పొరేట్ చేసేందుకు ప్రభుత్వం పీపీపీ పద్ధతిని ప్రవేశపెట్టిందని విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పేర్కొన్నారు. వైద్య కళాశాలల పరిరక్షణ కమిటీ కన్వీనర్ అలా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రైవేటు వ్యక్తులకు లాభాలు వచ్చేలా విధానాలు ఉన్నాయని విమర్శించారు. సంపద మొత్తాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెడుతున్నారని ఆరోపించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ అధ్యక్షత వహించారు. సదస్సులో ప్రధాన కార్యదర్శి ఎ.సురేష్, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ కె.శంకర్, కొల్ల రాజమోహన్, ఎల్.భాను, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

‘గుర్రం పాపిరెడ్డి’ చిత్ర బృందం సందడి

గాంధీనగర్, న్యూస్‌టుడే : నగరంలో ‘గుర్రం పాపిరెడ్డి’ చిత్ర యూనిట్ బృందం సందడి చేసింది. చిత్రం విజయ యాత్రలో భాగంగా ఆదివారం గాంధీనగర్‌లోని జయరామ్ థియేటర్‌ను సందర్శించింది. హీరో, హీరోయిన్ నగేష్, ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ.. ఈ సినిమా అన్ని కేంద్రాల్లో విజయవంతం ప్రదర్శితమవడం ఆనందంగా ఉందన్నారు. దర్శకుడు మురళీ మనోహర్ అద్భుతంగా తెరకెక్కించారని కొనియాడారు. కామెడీ, థ్రిల్లర్ అంశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటున్నాయని చెప్పారు. కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రమని చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు మురళీమనోహర్, నిర్మాతలు వేణు, అమర్, జైకాంత్, రాజ్‌కుమార్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో నగేష్, ఫరియా అబ్దుల్లా తదితరులు

బంజారాల సంస్కృతిని భావితరాలకు అందించాలి

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : బంజారాల సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడంతో పాటు వాటిని భావితరాలకు అందించాలన్నదే ఆలిండియా బంజారా సేవా సంఘం ముఖ్య ఉద్దేశమని సంఘం ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, జీఎస్టీ విభాగం డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బి.బి.వెంకటేశ్వరరావు అన్నారు. సంఘం రాష్ట్ర, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆదివారం ఎంబీ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని రాష్ట్రాల్లోని బంజారాల సమస్యల పరిష్కారం కోసం సంఘం కృషి చేస్తుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లక్ష్యమైన పే బ్యాక్ టు సొసైటీ కాన్సెప్ట్‌తో సంఘం పనిచేస్తుందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రి నాయక్ మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి 78ఏళ్లు గడుస్తున్నా సంఘీయుల పరిస్థితిలో మార్పు లేదన్నారు. రాజకీయ ప్రాధాన్యత తగ్గడంతో పాటు మైదాన ప్రాంతాల్లోని వారికి అన్యాయం జరుగుతోందన్నారు. సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.రాంబాబు నాయక్, తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్, దొరస్వామి నాయక్, బి.శ్రీనివాసరావు, ఎ.బద్యానాయక్, వివిధ జిల్లాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటుతున్న వెంకటేశ్వరరావు, చక్రి నాయక్, రాంబాబు నాయక్ తదితరులు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

దేవుని గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

గాంధీనగర్, న్యూస్‌టుడే : మొఘల్రాజపురం ట్రినిటీ గాస్పెల్ ఫెలోషిప్ చర్చిలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్రదర్ పి.దేవదాస్ కుమార్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు చిన్నారులు ఏసు క్రీస్తు జన్మవృత్తాంతంపై ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. వాక్యాలు, దేవుని పాటలతో ఉత్సాహంగా సాగింది. ఏసు క్రీస్తు పట్ల ప్రతి ఒక్కరూ భయభక్తులు కలిగి ఉండాలని దేవదాస్‌కుమార్ సూచించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు హాజరయ్యారు.

వివాహ పరిచయ వేదికకు స్పందన

గాంధీనగర్, న్యూస్‌టుడే : బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో నిర్వహించిన 46వ బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికకు స్పందన లభించింది. దాతల సహకారంతో అనేక మందికి వివాహాలు కుదిరాయని సంఘం అధ్యక్షుడు కొప్పరపు వెంకట బలరామకృష్ణ మూర్తి తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈమని శ్రీరామచంద్రమూర్తి, జి.పాండురంగ వరప్రసాద్, గుడిపాటి మురళీకృష్ణకుమార్, వెంకటేశ్వరశర్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ అధికార ప్రతినిధిగా శ్రీనివాస్



గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర విద్యార్థి సంఘ సమావేశాలకు అధికార ప్రతినిధిగా వేముల శ్రీనివాస్‌ను నియమిస్తూ జాతీయ కార్యదర్శి రాజీవ్ గాంధీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా అధ్యక్షుడి నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సమన్వయకర్త వరకు ఎదిగేలా చేసిన సంఘానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రోత్సహించిన షర్మిల, ఏపీసీసీ ఉపాధ్యక్షుడు వి.గురునాథం, పీసీసీ జనరల్ సెక్రటరీ ఎస్ఎన్‌రాజా తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

(c) eenadu

ఈనాడు
అనకాపల్లి
సోమవారం 22 డిసెంబరు 2025

పట్టుదల నడిపించింది.. కల నెరవేరింది!

ఐఈఎస్‌లో చంద్రశేఖర్‌కు 27వ ర్యాంకు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

రుత్తల చంద్రశేఖర్. స్వస్థలం నర్సీపట్నం. మధ్యతరగతి కుటుంబం. తండ్రి బాలకృష్ణ పిండిమిల్లు నిర్వహిస్తున్నారు. తల్లి కృష్ణకుమారి గృహిణి. 2016లో యూపీఎస్సీ పరీక్షల్లో 68వ ర్యాంకు సాధించిన చంద్రశేఖర్ ఇండియన్ ఆర్మీలో చేరారు. అంతటితో అతడి కల ఆగిపోలేదు. తనకెంతో ఇష్టమైన రైల్వేలో ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్-2025 పరీక్ష రాసి 27వ ర్యాంకు సాధించారు. ఈ ర్యాంకుతో ఇండియన్ రైల్వే మేనేజ్‌మెంట్ సర్వీసెస్ / నేవల్ ఆర్మమెంట్ సర్వీసెస్‌లో ఉద్యోగం రావచ్చని చెబుతున్నారు. లక్ష్య సాధనకు 3 నెలలు సెలవు పెట్టి పట్టుదలతో చదివి మంచి ర్యాంకు సాధించారు.

★ నర్సీపట్నంలోని మాంటిస్సోరీ కాన్వెంట్‌లో ఎనిమిదో తరగతి వరకు, డాన్‌బాస్కో పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. విశాఖపట్నంలోని శ్రీచైతన్యలో ఇంటర్మీడియట్ 95.7 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. రాయ్‌పూర్ ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేసి పుణెలో రూ.8.5 లక్షల వార్షిక వేతనంతో ప్రొడక్షన్ ఇంజినీరుగా రెండేళ్లపాటు పనిచేశారు. ఉన్నతంగా ఎదగాలన్న పట్టుదలతో ఉద్యోగానికి రాజీనామా చేసి ఐఈఎస్ సాధించాలన్న పట్టుదలతో ఇంట్లోనే ఏడాదిపాటు సొంతంగా చదివి 68వ ర్యాంకు సాధించారు. 2016లో ఇండియన్ ఆర్మీలో ఉద్యోగం సాధించారు. 2021లో రైల్వే, నేవల్ విభాగాలను ఐఈఎస్‌లో చేర్చడంతో తన కల నెరవేర్చుకునేందుకు పట్టుదలతో చదివి సాధించారు.

చుక్కల మందుతో నిండు జీవితం

96.7 శాతం పల్స్ పోలియో నమోదు

అనకాపల్లి ఆసుపత్రిలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జిల్లాలో 1,446 కేంద్రాలను ఏర్పాటు చేసి 1,91,319 మంది (96.7 శాతం) చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు జిల్లా టీకా అధికారి డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు.

నడపడం రాకున్నా.. నడిపేస్తున్నారు!

- చిరునామా మార్పుతో డ్రైవింగ్ లైసెన్సులు
- సెన్సార్ల ఏర్పాటులో జాప్యంతో మధ్యవర్తుల దందా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

డ్రైవింగ్‌పై అవగాహన లేకుండా వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసుల విచారణలో తేలింది. కార్లు, జీపులు నడపడం రాకుండానే చాలామంది మధ్యవర్తుల ద్వారా లైట్ మోటార్ వెహికల్ (ఎల్ఎంవీ) లైసెన్సు పొందుతున్నారు. ఇలాంటి వారికి అడ్డుకట్ట వేసేందుకు చోదక పరీక్ష నిర్వహించే ట్రాక్ వద్ద సెన్సార్ల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పరీక్ష సమయంలో ఏమాత్రం వాహనాన్ని సరిగా నడపలేకపోయినా సెన్సార్లు పసిగట్టేస్తాయి. తద్వారా లైసెన్సు పొందేందుకు అనర్హులవుతారు. ఈ ప్రక్రియ అంతా విశాఖపట్నంలో పక్కాగా అమలవుతోంది.

★ అనకాపల్లిలో ఆర్డీవో కార్యాలయం వద్ద సెన్సార్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహన తనిఖీదారుల పర్యవేక్షణలోనే చోదక పరీక్షలు జరుగుతున్నాయి. కొందరు మధ్యవర్తులు అభ్యర్థుల చిరునామా మార్చేస్తూ చోదక పరీక్షల్లో పాస్ చేయిస్తామంటూ అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇలా పలువురికి అనకాపల్లి జిల్లా చిరునామాతో లైసెన్సులు ఇప్పించినట్లు రవాణా శాఖ ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో నిఘా పెట్టారు.

సెన్సార్లు ఏర్పాటు చేయాల్సిన డ్రైవింగ్ ట్రాక్

★ డ్రైవింగ్ లైసెన్సుల జారీని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి వారితోనే శిక్షణ, ట్రాక్ పరీక్షలు చేయించేలా ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలో రెండు డ్రైవింగ్ శిక్షణ, పరీక్షా కేంద్రాలకు టెండర్లు ఆహ్వానించగా నలుగురు దరఖాస్తు చేశారు. వీటిని కలెక్టర్ పరిశీలించి ప్రభుత్వానికి పంపనున్నారు. వీటిలో ఖరారైన వారు మూడు ఎకరాల స్థలంలో డ్రైవింగ్ శిక్షణ, పరీక్షా కేంద్రాలకు సంబంధించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి లైసెన్సులు మంజూరు చేయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.

సమగ్ర పరిశీలన తర్వాతే..

ట్రాక్‌పై వాహనాన్ని నడిపే విధానాన్ని పరిశీలించే చోదకులకు లైసెన్సులు మంజూరు చేస్తున్నాం. అనకాపల్లిలో ట్రాక్‌కు త్వరలోనే సెన్సార్లు ఏర్పాటు చేస్తాం. చిరునామా మార్చి ఇక్కడ లైసెన్సులు ఇప్పిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై నిఘా పెట్టాం. అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. డ్రైవింగ్ వచ్చాకే లైసెన్సు కోసం దరఖాస్తు చేయాలి.

– మనోహర్, జిల్లా రవాణా శాఖాధికారి

వినూత్నంగా.. ఆకట్టుకునేలా..

- మూర్తీభవించిన మాస్టారు సేవలు
- నేడు గణిత దినోత్సవం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే

దిబ్బిడి జడ్పీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ఏవీఎస్ మూర్తి విద్యార్థులను ఆకట్టుకునేలా, వినూత్నంగా బోధన చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పదోతరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేసేందుకు 'విద్యార్థి మేలుకో' పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారిలో స్ఫూర్తి కల్పిస్తున్నారు. తరగతి గదిలోనే కాకుండా ఉదయం, సాయంత్రం వేళలు, సెలవు రోజుల్లోనూ విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నారు.

★ తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లల చదువుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. చరవాణి, టీవీలకు దూరంగా ఉంచడంతోపాటు పరీక్షల సమయంలో విద్యార్థులు శ్రద్ధగా ఉండటానికి పలు సూచనలు చేస్తున్నారు. విద్యార్థులకు మంచి ఆహారం అలవాటు చేస్తూ వారి ఆరోగ్యం కోసం సొంత ఖర్చుతో డ్రైఫ్రూట్స్ అందిస్తున్నారు. శతశాతం ఫలితాల సాధనకు కృషిచేస్తున్నారు.

గణితంపై భయాన్ని పోగొట్టేలా..

చాలామంది విద్యార్థులు గణితమంటే భయపడతారు. ఈ సబ్జెక్టులో వెనకబడిపోతుంటారు. గణితం అంటే భయాన్ని పోగొట్టి సులభంగా నేర్చుకునేలా మూర్తి మాస్టారు వినూత్నరీతిలో బోధన సాగిస్తున్నారు. శ్రీనివాస రామానుజన్ పేరిట గణిత క్లబ్ ఏర్పాటు చేశారు. ఈ క్లబ్‌లో ఉన్న 310 మంది విద్యార్థులకు ఆట పాటలు, నృత్యాలు, లఘునాటికల ద్వారా బోధన చేస్తున్నారు. సెలవురోజుల్లో విద్యార్థులను పొలాలకు తీసుకువెళ్లి కొలతలు కొలిపించి రేఖాగణితం సులువుగా అర్థమయ్యేలా అవగాహన కల్పిస్తున్నారు.

పొలం కొలతలు తీస్తున్న విద్యార్థులు

విధేయతకు అందలం

- తెదేపా జిల్లా అధ్యక్షుడిగా తాతయ్యబాబు
- ప్రధాన కార్యదర్శిగా కాశీనాయుడు

ఈనాడు డిజిటల్ – అనకాపల్లి, న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం, బుచ్చెయ్యపేట

అనకాపల్లి జిల్లా, లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులను ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బత్తుల తాతయ్యబాబు, లాలం కాశీనాయుడికి మరోసారి అవకాశం ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం అధికారిక ప్రకటన వెలువడింది. కొద్దిరోజులుగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకంపై ఉత్కంఠ నెలకొంది. అధిష్ఠానం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేసి ప్రజాప్రతినిధులు, నాయకుల అభిప్రాయాలను సేకరించింది. అధ్యక్షుడి రేసులో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాదంశెట్టి నీలిబాబు ఉన్నారు. వీరిపై ఎంపీ, ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు తమ అభిప్రాయాలను అధిష్ఠానం వద్ద వెల్లడించారు. ఐవీఆర్ఎస్ ద్వారా కార్యకర్తల నుంచి అభిప్రాయాలను సేకరించింది.

★ జిల్లాలో కాపు సామాజిక వర్గం ఎక్కువ. ఇద్దరూ ఇదే సామాజిక వర్గం కావడంతో తాతయ్యబాబు, బాలాజీలకు పోటాపోటీగా మద్దతు లభించింది. ఇటీవల బాలాజీకి జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఇస్తున్నట్లు ప్రచారం జరిగింది. తాజాగా అధిష్ఠానం తాతయ్యబాబును ప్రకటించడంతో ఉత్కంఠకు తెరపడింది.

★ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే టికెట్ గవర సామాజిక వర్గానికి చెందిన పీలా గోవిందసత్యనారాయణకు ఇవ్వాల్సి ఉంది. పొత్తులో భాగంగా జనసేనకు ఇచ్చారు. జిల్లాలో ముగ్గురు జనసేన ఎమ్మెల్యేలు, భాజపా తరఫున ఎంపీ ఉన్నారు. మూడు పార్టీల నేతలను సమన్వయం చేసుకుంటూ తెదేపాను ముందుకు తీసుకెళ్లాలి. బత్తుల తాతయ్యబాబుతో పోలిస్తే.. బాలాజీ వయసు, రాజకీయ అనుభవం తక్కువ. జిల్లా వ్యాప్తంగా మూడు పార్టీల నేతలతో తాతయ్యబాబుకు సత్సంబంధాలున్నాయి. మాటతీరు, నేర్పుకలిగిన వ్యక్తి, కష్టపడి పనిచేసే తత్వం ఉండటం, అందర్నీ సమన్వయం చేసుకుంటూ పనులు చేయడం, పార్టీ అప్పగించిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించడంతో అధిష్ఠానం ఆయనకే రెండోసారి పట్టం కట్టింది.


సభాపతి అయ్యన్నకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తాతయ్యబాబు, కాశీనాయుడు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన బత్తుల తాతయ్యబాబు, లాలం కాశీనాయుడు సభాపతి అయ్యన్నపాత్రుడిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పార్టీ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి మరింత పాటుపడతామన్నారు.

తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట మండలం వడ్డాది స్వస్థలం. 1995 నుంచి తెదేపాలో కొనసాగుతున్నారు. వార్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. వడ్డాది సర్పంచిగా, బుచ్చెయ్యపేట ఎంపీపీగా పనిచేశారు. చోడవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జిగానూ వ్యవహరించారు. 2024 ఎన్నికలకు ముందు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఎన్నికల్లో చోడవరం అసెంబ్లీ టికెట్ ఆశించారు. ఐవీఆర్ఎస్ సర్వేలో అధిక శాతం మంది కేఎస్ఎన్ఎస్ రాజుకు మొగ్గు చూపడంతో తాతయ్యబాబుకు టికెట్ రాలేదు. అప్పట్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

కాశీనాయుడు

కోటవురట్ల మండలం జల్లూరు స్వస్థలం. 2012 నుంచి తెదేపాలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా, జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఉంది. ఆయన భార్య పద్మావతి సర్పంచిగా ఉన్నారు. సభాపతి అయ్యన్న, హోం మంత్రి అనితకు అనుచరుడుగా కొనసాగుతున్నారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినా.. ఆయన వద్దనుకున్నారు. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పదవిని ఆశించగా దక్కలేదు. ఈ క్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండోసారి అవకాశం కల్పించారు.

తరుగు తీస్తే తాట తీస్తా

రైస్ మిల్లర్లకు ఎమ్మెల్యే హెచ్చరిక

దేవరాపల్లి, న్యూస్‌టుడే : రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సమయంలో తూకంలో అవకతవకలకు పాల్పడే రైస్ మిల్లర్లపై కఠినంగా వ్యవహరిస్తానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ హెచ్చరించారు. తరుగు పేరుతో రైతులకు మోసగించాలని చూస్తే తాట తీస్తానని, విజిలెన్సు అధికారులతో విచారణ చేయించి కటకటాల్లోకి పంపేందుకు సైతం వెనకాడబోనన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసే సమయంలో రైసు మిల్లర్లు తరుగు పెడుతున్నారంటూ రైతుల నుంచి నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదులందాయన్నారు. తరుగు ఎందుకు పెడుతున్నారని రైతులు ప్రశ్నిస్తే, కొంతవాటా మీ ఎమ్మెల్యేకి ఇస్తున్నామని, అందుకే తరుగుపెట్టాల్సి వస్తోందంటూ మిల్లర్లు సమాధానం చెబుతున్నారంటూ బాధిత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఈ ఆరోపణలను అధిష్ఠానం తన దృష్టికి తీసుకురాగా అవాక్కయ్యానని ఎం.అలమండలో ఆదివారం జరిగిన సభలో ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి చెప్పారు. ఈ వ్యవహారంపై విచారణ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌కు సూచించినట్లు వెల్లడించారు. రైతుల పొట్టకొట్టే నీచ బుద్ధి తనకు లేదన్నారు. మాడుగుల నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లర్లను ఇప్పటివరకు చూడలేదన్నారు. వాళ్లు అవినీతి చేస్తూ తనకు ఆపాదించాలని చూడటంపై ఎక్కడి వరకైనా వెళ్తానని స్పష్టం చేశారు. రైతులు విక్రయించే ధాన్యంలో ఏమాత్రం తరుగుపెట్టినా ఊరుకునేది లేదన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

అప్పన్న స్వామికి బంగారు హారం

సింహాచలం, న్యూస్‌టుడే: విజయనగరం జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు సింహాద్రి అప్పన్న స్వామికి ఆదివారం పగడాలు పొదిగిన బంగారు హారం బహూకరించారు. సింహగిరికి వచ్చిన వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. వేదాశీర్వచనం అనంతరం హారాన్ని డిప్యూటీ ఈవో రాధ, పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావుకు అందజేశారు.

చెరకు రైతుల సమావేశం నేడు

చోడవరం, న్యూస్‌టుడే: గోవాడ చక్కెర కర్మాగారంలో ఈ ఏడాది గానుగాట ప్రారంభించాలంటూ సోమవారం ఉదయం చెరకు రైతులు సమావేశం కానున్నారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు చెప్పారు. రైతు సంఘాలు, ప్రజా సంఘాలు, అఖిలపక్షం పేరిట నిర్వహిస్తున్న ఈ సమావేశానికి చెరకు రైతులందరూ హాజరుకావాలని కోరారు.

గ్రామ కంఠం.. హక్కు పక్కా!

రెండో విడత 'స్వామిత్వ' సర్వే పూర్తి

నర్సీపట్నం, న్యూస్‌టుడే

పల్లెలో 'స్వామిత్వ' సర్వే జోరుగా సాగుతోంది. పంచాయతీల్లోని గ్రామ కంఠాల్లో నివసిస్తున్న వారికి ఆస్తి హక్కు కల్పించేందుకు ప్రభుత్వం ఈ సర్వే చేయిస్తోంది. రెండో విడత సర్వేలో అనకాపల్లి జిల్లా ముందంజలో ఉంది. 360 ఆవాసాలకు సంబంధించి కొలతలు తీయడం పూర్తయింది. మూడో దశ సర్వే పూర్తయ్యాక అర్హులకు యాజమాన్య కార్డులు జారీ చేయనున్నారు.

స్వామిత్వ సర్వేలో సిబ్బంది

★ దశాబ్దాలుగా గ్రామ కంఠాల్లో నివాసం ఉంటున్న వారికి ఎటువంటి హక్కులు లేక పోవడంతో వారి జీవనం దయనీయంగా ఉంది. ఇలాంటి వారందరికీ ఆస్తి హక్కు పత్రాలు అందజేసేందుకు 'స్వామిత్వ' సర్వే చేస్తున్నారు. యాజమాన్య కార్డులు పొందితే బ్యాంకు రుణాలు పొందేందుకు వీలుంటుంది. గతంలోనే డ్రోన్ సర్వేతో గ్రామాల మ్యాప్‌లు సిద్ధం చేశారు. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో నివాసాల కొలతలను సరిచూస్తున్నారు. మార్పులు, చేర్పులతో తుదిగా నివేదికలు తయారు చేస్తున్నారు. దశలవారీగా జిల్లాలోని గ్రామాలన్నింటిలోనూ పక్కా కార్యాచరణతో ఈ పనులు చేపడుతున్నారు.

★ రెండో దశలో ప్రాపర్టీ పార్సిల్స్‌గా పేర్కొంటున్న 1,88,073 నివాసాల సమాచారాన్ని ఆన్‌లైన్లో పొందుపరిచారు. గ్రామ కంఠాలతోపాటు వాటిని ఆనుకుని, దూరంగా ఉన్న జిరాయితీల్లోనూ పదికి మించి నివాసాలున్న వాటిని పరిగణనలోకి తీసుకుని సర్వే చేస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి సందీప్ చెప్పారు. మూడో విడతలో 234 గ్రామాల్లో సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు.

★ జిల్లా వ్యాప్తంగా 669 గ్రామాల్లో సర్వే చేయాలని నిర్ణయించారు. తొలుత జీరో సర్వే పేరిట 51 గ్రామాల్లో, మొదటి విడత సర్వే 17 గ్రామాల్లో పూర్తి చేశారు. రెండో విడతలో 360 గ్రామాల్లో చేపట్టిన సర్వే ఇటీవల పూర్తయింది. సర్వే పూర్తయిన గ్రామాల్లో పంచాయతీ అధికారులు గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఇప్పటికి 360 గ్రామాలకు 101 చోట్ల గ్రామసభలు నిర్వహించారు.

ఇళ్ల లెక్క తేలింది

45 వేలకుపైగా దరఖాస్తులు

నక్కపల్లి, న్యూస్‌టుడే

సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఈ నెల 14 వరకు అవకాశం కల్పించడంతో 45 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. కూటమి సర్కారు కొలువుదీరిన తర్వాత గత ఐదేళ్లలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడంపై దృష్టిసారించింది. ఈ క్రమంలో ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి మూడు లక్షల ఇళ్లను ప్రారంభించింది. జిల్లాలో 13 వేలకుపైగా ఉన్నాయి. ఇదే సమయంలో సొంత స్థలాలు ఉండి ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి ఉన్న గృహాల మంజూరుకు చర్యలు చేపట్టింది. కేంద్రం ద్వారా ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భారీగా ఇళ్లను మంజూరు చేయించగా, పలు దశల్లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

ఇంటి నిర్మాణానికి పిల్లర్లు వేసేందుకు గుంతలు తవ్వుతున్న లబ్ధిదారుడు

తుది ఆదేశాలు రాగానే..

ప్రభుత్వం ఇచ్చిన తుది గడువు ఇటీవల ముగిసింది. జిల్లాలో 45 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిశీలన జరుగుతోంది. దరఖాస్తుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో చెక్ చేస్తున్నాం. నివేదికను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపుతాం. తుది ఆదేశాలు రాగానే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభానికి శ్రీకారం చుడతాం. – వై.శ్రీనివాసరావు, పీడీ, గృహనిర్మాణ సంస్థ

★ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి వచ్చిన దరఖాస్తులు 45 వేలకుపైగా ఉన్నాయి. లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.1.59 లక్షల చొప్పున ఇంటి నిర్మాణానికి ఇవ్వనుంది. ఇందులో ఉపాధి పని దినాలను కలిపి చెల్లిస్తారు. దరఖాస్తుల్లో తొలి ఐదు స్థానాల్లో పరవాడ - 4403, పాయకరావుపేట- 3478, కోటవురట్ల - 3406, సబ్బవరం - 3243, మాడుగుల - 2531 మండలాలు ఉండగా 290 దరఖాస్తులతో ఎలమంచిలి మండలం చివరి స్థానంలో ఉంది.

బల్క్‌డ్రగ్ వ్యతిరేక శిబిరం తొలగింపు

సీఎం, మంత్రి హామీతో దీక్షల విరమణ

నక్కపల్లి, న్యూస్‌టుడే: రాజయ్యపేట గ్రామస్థులు బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని ఆదివారం వారే తొలగించారు. సీఎం చంద్రబాబునాయుడు, హోం మంత్రి అనిత ఇచ్చిన హామీలను తెలియజేసేందుకు కమిటీగా వెళ్లిన వారంతా రచ్చబండ వద్ద గ్రామస్థులతో సమావేశమయ్యారు. కశింకోట మండలం తాళ్లపాలెంలో శనివారం జరిగిన సమావేశంలో సీఎం చంద్రబాబు, హోం మంత్రి అనిత బల్క్‌డ్రగ్ విషయంలో ఆందోళన అక్కర్లేదని, గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామంటూ హామీ ఇచ్చారని వివరించారు. ఈ నేపథ్యంలో కొందరు దీనిపై పూర్తిస్థాయిలో భరోసా రాలేదని, రాతపూర్వక హామీ ఇవ్వాలని మాట్లాడారు. స్వయంగా సీఎం హామీ ఇచ్చినప్పుడు రాతపూర్వకంగా అంటే ఎలా సాధ్యమనే చర్చ జరిగింది. ఈ క్రమంలో స్థానికుల మధ్య కొద్దిసేపు అభ్యంతరాలు, తర్జన భర్జనలు జరిగాయి. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు మురళి, రామకృష్ణ, అప్పన్న తదితరులు పలు సూచనలు చేశారు. హామీకి కట్టుబడి అభివృద్ధి జరగాలంటే శిబిరాన్ని తొలగించాలన్న అంశం చర్చకు వచ్చింది. ఈ విషయమై మత్స్యకార నాయకులంతా మాట్లాడుకోగా, కొందరు శిబిరం తొలగించడాన్ని వ్యతిరేకించారు. సీఎం, హోం మంత్రి హామీ ఇచ్చిన తర్వాత శిబిరాన్ని కొనసాగించడం సరికాదని నిర్ణయించుకుని అందరూ కలిసి తీసేశారు. గ్రామంలో వీలైనంత త్వరగా అభివృద్ధి పనులు చేపట్టేలా కలెక్టర్‌ను సోమవారం కలిసి విన్నవించాలని నిర్ణయించారు. సమావేశంలో సర్పంచి అప్పలనర్స, జడ్పీటీసీ సభ్యురాలు కాసులమ్మ, సత్తియ్య, తాతీలు, బయ్యన్న, కోదండరావు, గంగరాజు, నాగేశ్, నల్లోడు, స్వామి, కాశీరావు, సోమి, శివాజీ, పైడతల్లి, కాశీరావు తదితరులు పాల్గొన్నారు.

శిబిరం తొలగిస్తున్న మత్స్యకారులు

(c) eenadu

సీఎంఆర్‌లో కాస్మెటిక్స్, ఫుట్‌వేర్, హోమ్‌నీడ్స్ విభాగాల ప్రారంభం

జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, గంటా శ్రీనివాసరావు, గణబాబు సీఎంఆర్, కంకటాల అధినేతలు మావూరి వెంకటరమణ, మల్లిక్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: నగరంలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న సీఎంఆర్ సరికొత్త హంగులతో కాస్మెటిక్స్, ఫుట్‌వేర్, హోమ్‌నీడ్స్ విభాగాలను ఆదివారం ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, గంటా శ్రీనివాసరావు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, కంకటాల మల్లిక్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ విశాఖతో కలుపుకొని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో సీఎంఆర్ ఒక ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరలకే అందించడం సీఎంఆర్ ప్రత్యేకమన్నారు. వ్యాపారంలోనే కాకుండా సామాజిక సేవలోనూ మావూరి వెంకటరమణ ముందుంటున్నారని, ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని కొనియాడారు. మావూరి వెంకటరమణ మాట్లాడుతూ 40కి పైగా శాఖలను విజయవంతంగా నడుపుతున్నామన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు. జబర్దస్త్ టీం నటులు బుల్లెట్ భాస్కర్, నరేశ్, వినోద్ సందడి చేశారు. కొనుగోలుదారులతో ముచ్చటించారు.

పోలియో చుక్కలపై అపోహలు వద్దు

నర్సీపట్నంలో పసిబిడ్డకు చుక్కల మందు వేస్తున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడంలో ఎటువంటి అపోహలు వద్దని సభాపతి అయ్యన్నపాత్రుడు సూచించారు. నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆదివారం ఓ చిన్నారికి పోలియో చుక్కలు వేశారు. నియోజకవర్గంలో ఐదేళ్లలోపు వయసున్న 28,467 మంది చిన్నారులందరికీ చుక్కలు వేయాలని సిబ్బందికి సూచించారు. గవ్వుపేట, వెలమవీధి, తోటవీధిలో అయ్యన్న సతీమణి, తెదేపా కౌన్సిలర్ పద్మావతి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సూర్యచంద్ర, వైద్యాధికారి శాంతి, అధికారులు ప్రశాంతి, వీరజ్యోతి పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఈనాడు' క్రికెట్ పోటీలు

- ఈఎస్ఎల్ ట్రోఫీలో సత్తా చాటేందుకు సిద్ధమైన యువ క్రికెటర్లు
- ముస్తాబైన ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' ప్రజెంట్స్ 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ - 2025' (ఈఎస్ఎల్) క్రికెట్ పోటీలు నేటి(సోమవారం) నుంచి నగరంలోని ఆంధ్రా మెడికల్ కళాశాల (ఏఎంసీ) మైదానంలో ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు 'ఈఎస్ఎల్' వేదికగా నిలుస్తుంది. ఇప్పటికే అతి పెద్ద టోర్నీగా 'గిన్నిస్ బుక్ రికార్డ్స్'లో చోటు సంపాదించిన మెగా ఈవెంట్‌లో భాగస్వాములయ్యేందుకు యువ క్రికెటర్లు ఉత్సాహంగా ఉన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభ చూపి.. ప్రత్యర్థులపై పైచేయి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మ్యాచ్‌ల నిర్వహణకు ఏఎంసీ మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేటి మ్యాచ్‌లు: ఉదయం 9 గంటలకు: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా(ఏయూ) × అవంతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(తగరపువలస); ఉదయం 11 గంటలకు: సాంకేతిక విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కాలేజ్(పీఎంపాలెం) × బీ.సుబ్బరామిరెడ్డి అండ్ బీ.బలరామకృష్ణ డిగ్రీ కాలేజ్(గాజువాక)

రేపటి మ్యాచ్‌లు (23-12-25): ఉదయం 8 గంటలకు గీతం కాలేజ్(రుషికొండ) × ఆదిత్య డిగ్రీ కాలేజ్(గోపాలపట్నం), ఉదయం 10 గంటలకు: ఆదర్శ్ డిగ్రీ కాలేజ్(విశాఖ) × బెహరా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(నరవ); మధ్యాహ్నం 1 గంటకు: విజ్ఞాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ టెక్నాలజీ(దువ్వాడ) × గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ(రుషికొండ)

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) "Sunday ho yah Monday roz khao ande"
Beverage Partner: CMR Shopping Mall
Gift Partner: KL University
Regional Sponsor: GGU Godavari Global University, Rajamahendravaram, A.P. Call: 974 999 3483 | www.ggu.edu.in
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Digital Partner: ఈనాడు.net, ETV Bharat
Dolphin Diagnostic Services
District Sponsor: తిరుమల విద్యాసంస్థలు
Organised by ఈనాడు ఈతరం

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

శిలాఫలకం ఆవిష్కరించిన ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అభివృద్ధి.. ఆరోగ్యం.. అనకాపల్లి ఉభయతా చర్యలు తీసుకుంటున్నామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ అన్నారు. అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో ఆరోహ్‌మ మెగ్నసిటా ఇండియా లిమిటెడ్ కార్పొరేట్ సామాజిక సేవా నిధుల కింద రూ.1.40 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వ్యసన విముక్తి కేంద్రం, మార్చురీ ఆధునికీకరణ, రోగుల సహాయకుల విశ్రాంతి భవనం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆసుపత్రికి ఎంఆర్ఐ స్కాన్ లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీన్ని త్వరలోనే అందిస్తామన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిని 400 పడకలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఆసుపత్రిలో వైద్య పోస్టులు అన్నీ భర్తీ చేశామన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక సేవా నిధుల కింద ఎంపీ చొరవతో ఏడాదిలోనే జిల్లాలో రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ 2014-19లో చంద్రబాబునాయుడు చొరవతో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రిని అభివృద్ధి చేశామన్నారు. ఆరోహ్‌మ మెగ్నసిటా కంపెనీ ప్రతినిధి నాగేశ్వరరావును ఎంపీ, ఎమ్మెల్యే సత్కరించారు. ఎస్పీ తుహిన్‌సిన్హా, నాయకులు బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్, గవర సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ కృష్ణారావు, అభివృద్ధి కమిటీ సభ్యులు డీడీ నాయుడు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో మరింత భద్రత

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజల భద్రత మరింత మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నట్లు అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తెలిపారు. అనకాపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎంపీ ల్యాడ్స్ నిధులతో సమకూర్చిన ఆధునిక సీసీటీవీ కంట్రోల్ రూంను ఆదివారం ఆయన ప్రారంభించారు. మహిళా భద్రత కోసం ఏర్పాటు చేసిన వాహనాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ ప్రారంభించారు. నాగార్జున సిమెంట్ కర్మాగారం సీఎస్ఆర్ నిధులతో అందించిన 55 సైబర్ బోర్డులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పట్టణంలోని కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 80 సీసీ కెమెరాలతో కంట్రోల్ రూంలో పరిశీలిస్తూ నిఘా పెట్టొచ్చన్నారు. దీంతో భద్రత మరింత పటిష్ఠంగా ఉంటుందన్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, నాయకులు దాడి రత్నాకర్, పొన్నగంటి అప్పారావు, ఈర్లె శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

అఖిల గాండ్ల తెలుకల జిల్లా అధ్యక్షుడిగా వెంకటరావు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలో అఖిల గాండ్ల తెలుకల జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా గండిపల్లి వెంకటరావు, వర్కింగ్ అధ్యక్షుడిగా కోమాలపల్లి వాసుదేవరావు, కార్యదర్శిగా పోలిశెట్టి నూకేశ్వరరావు, కోశాధికారిగా రాజాపు కోటేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా వెన్నెటి మహాలక్ష్మిలను ఎన్నుకున్నారు. పరదేశినాయుడును జిల్లా యువజన అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటేపల్లి కొత్తనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికైన జిల్లా కమిటీ ప్రతినిధులు

సనాతన ధర్మంతోనే శాంతి

మాట్లాడుతున్న శంకర విజయానందగిరి స్వామీజీ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: హిందూమతం చాలా గొప్పదని, ప్రపంచంలోని అన్ని దేశాల్లో హిందూ దేవుళ్లను పూజిస్తున్నారని శ్రీశంకర విజయానందగిరి స్వామీజీ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎలమంచిలి ధర్మవరంలో ఆదివారం హిందూ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సనాతన ధర్మంతోనే శాంతి ఉంటుందన్నారు. హిందువుల ఐక్యతే ప్రపంచ శాంతికి శ్రీరామరక్ష అన్నారు. హిందూధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీపీఎస్ నాయుడు, బండారు సత్యబంగారుశెట్టి, కొఠారు సాంబ, బండి నాగేంద్ర, ఆడారి రెడ్డినాయుడు మాట్లాడారు. సమాజంలో హిందూ ధర్మవీరులను ఈ సందర్భంగా సన్మానించారు. కోలాట నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. హరిదాసులను ఆహ్వానించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కట్టా సత్యనారాయణ, మల్ల కొండబాబు, పడాల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

'ఛాంపియన్' తారలు.. తళుక్కు!

హీరో రోషన్, హీరోయిన్ అనస్వర రాజన్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మూడేళ్ల విరామం తర్వాత మంచి చిత్రంతో ముందుకు వచ్చానని ఛాంపియన్ సినిమా హీరో రోషన్ అన్నారు. బీచ్‌రోడ్డు గోకుల్‌పార్కు తీరంలో ఆదివారం సాయంత్రం ఛాంపియన్ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ.. ఛాంపియన్ తప్పక అలరిస్తుందన్నారు. దర్శకుడు ప్రదీప్ అద్వైతం మాట్లాడుతూ.. 1948 నేపథ్యంలో సాగే యాక్షన్ వార్ డ్రామాగా దీన్ని తీర్చిదిద్దామన్నారు. సినిమా చాలా బాగా వచ్చిందన్నారు. హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ.. ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ మూవీ కాబోతుందన్నారు. కార్యక్రమంలో నిర్మాత జెమిని కిరణ్, నటి ఊహ, చిత్ర బృందం పాల్గొంది.

బొజ్జన్నకొండపై సందడి

అనకాపల్లి (గ్రామీణం), న్యూస్‌టుడే: శంకరం బొజ్జన్న కొండకు ఆదివారం భారీగా పర్యాటకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు తరలివచ్చారు. కొండ ఆవరణ రద్దీగా మారింది. కొండ పైభాగంలో ప్రాచీన బౌద్ధ విగ్రహాలు, లింగాల కొండ స్తూపాలను తిలకించారు. విద్యార్థులు, యువకులు సెల్ఫీలతో సందడి చేశారు. మధ్యాహ్నం సామూహిక వనభోజనాలు చేసి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి చేశారు.

వివిధ పాఠశాలల విద్యార్థులతో బొజ్జన్న కొండ

పీఆర్‌సీ ప్రకటించాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం సంక్రాంతి కానుకగా పీఆర్‌సీ ప్రకటించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మురళీమోహన్ కోరారు. సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా పీఆర్‌సీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు ప్రకటించాలన్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి చినబ్బాయి పాల్గొన్నారు.

డ్వామా ఇన్‌ఛార్జి పీడీగా రవీంద్ర

కలెక్టరేట్, నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా డ్వామా ఇన్‌ఛార్జి పీడీగా రవీంద్రను నియమిస్తూ విశాఖ కలెక్టర్ హరేంద్రప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకూ పీడీగా పనిచేసిన ఆర్.పూర్ణిమాదేవి వ్యక్తిగత కారణాలతో 38 రోజులు సెలవు పెట్టారు. కుమార్తె చదువు కోసం ఆస్ట్రేలియా వెళ్లనున్నారు. డ్వామాలో ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేస్తున్న రవీంద్రకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారని కలెక్టరేట్‌లోని డ్వామా కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఆయన సోమవారం కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి అనకాపల్లి డ్వామా కార్యాలయంలో విధుల్లో చేరనున్నారు.

అచ్చొచ్చిన చోట.. ధనాధన్ ఆట..!

చెలరేగి ఆడుతున్న జెమీమా రోడ్రిగ్స్

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: భారత మహిళల క్రికెట్ జట్టు అదరగొట్టింది. అచ్చొచ్చిన విశాఖ మైదానంలో తిరుగు లేదని మరో మారు నిరూపించింది. ఆదివారం రాత్రి పీఎం పాలెం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో భారత్, శ్రీలంక మధ్య జరిగిన తొలి టీ-20 మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. జెమీమా రోడ్రిగ్స్ చెలరేగడంతో మరో ఐదు ఓవర్లు ఉండగానే భారత్ విజయదుందుభి మోగించింది.

★ జెమీమా రోడ్రిగ్స్ 69 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. అందులో 10 ఫోర్లు ఉన్నాయి. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన చెప్పుకోదగ్గ స్కోరు చేయకపోవడం అభిమానులను నిరాశపర్చింది. ★ మ్యాచ్‌ను తిలకించేందుకు 7,500 మంది అభిమానులు స్టేడియానికి తరలివచ్చారు. భారత బౌలర్లు క్రాంతి గౌడ్, దీప్తిశర్మ, శ్రీచరణి వికెట్లు తీసినప్పుడు అభిమానులు కేరింత కొడుతూ వారిని ఉత్సాహపరిచారు. భారత బౌలర్ శ్రీచరణి బౌలింగ్‌లో శ్రీలంక బ్యాటర్ విష్మి గుణరత్నే భారీ సిక్సర్ కొట్టింది. 17.4 మీటర్ల ఎత్తులో వెళ్లిన ఆ బంతిని పట్టుకోవడంలో స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన విఫలమైంది. శ్రీలంక జట్టులో బ్యాటర్ విష్మి గుణరత్నే అత్యధికంగా 39 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాటర్లు అంతా కలిసి 9 బౌండరీలు, 1 సిక్సర్ కొట్టారు. భారత జట్టు క్రీడాకారిణులు ఐదు క్యాచ్‌లు వదిలేయడం గమనార్హం. భారత బౌలర్లలో వైష్ణవి శర్మ పొదుపుగా బౌలింగ్ చేసింది. నాలుగు ఓవర్లు వేసి కేవలం 16 పరుగులు మాత్రమే ఇచ్చింది.

శ్రీలంక బ్యాటరు కవీసా దిల్‌హరిని రనౌట్ చేస్తున్న కీపర్ రిచా ఘోష్

మ్యాచ్‌ను తిలకిస్తున్న అభిమానులు

షాట్ కొడుతున్న స్మృతి మంధాన

ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు సంఘం కృషి చేయాలని ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, కేఎస్ఎన్ రాజు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు సూచించారు. అచ్యుతాపురం మండలం కొండకర్ల వద్ద ఆదివారం అనకాపల్లి రాజపుత్ర సమాజ్ జిల్లా స్థాయి సమావేశం సంఘం అధ్యక్షులు దంతులూరి దిలీప్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వీరు మాట్లాడుతూ క్షత్రియుల్లో చాలా మంది పేదలు ఉన్నారని, వీరికి సాయం అందించి ఆదుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు మాట్లాడుతూ క్షత్రియుల్లో పేదవారి విద్య, ఉపాధి, వైద్య సదుపాయాలు తమ సంస్థల ద్వారా కల్పిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు మాట్లాడుతూ దేశంలో 90 మంది ఎంపీలు క్షత్రియులేనన్నారు. పేద వారిని చదివించడానికి అందరూ ముందుకు రావాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీలు డీవీ సూర్యనారాయణరాజు, పాకలపాటి రఘువర్మ మాట్లాడారు. అనంతరం సంఘ అధ్యక్షులు దంతులూరి దిలీప్‌కుమార్ ముఖ్యఅతిథులను, జిల్లాలో క్షత్రియ సంఘాల అధ్యక్షులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ క్షత్రియ ఫెడరేషన్ ఛైర్మన్ పెదబాబు, వైస్ ఛైర్మన్ జీఎస్ రాజు, కె.కె.రాజు, సీఎస్ఎన్.రాజు, చింతపాటి ప్రసాద్‌బాబు, రాధా సుందర సుబ్బరాజు, మంతెన లీలావతి, పిన్నమరాజు వాసు, చేకూరి శ్రీనివాసరాజు, భూపతిరావు వర్మ, బీవీఎస్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రఘురాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక

అద్దంకి, జె.పంగులూరు, న్యూస్‌టుడే: అండర్-18 రాష్ట్ర స్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు బాపట్ల జిల్లా పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. వీటిలో ఉత్తమ ఆట తీరు ప్రదర్శించిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు మేకల సీతారామిరెడ్డి, ఖోఖో సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హనుమంతరావు ఆదివారం తెలిపారు.

బాలుర జట్టు: సీహెచ్.బాజీబాబు,ఎస్.మహేష్, పి.నరేష్, ఎల్.వీరేంద్ర, ఎం.భరత్‌కుమార్ (ప్రకాశం), డి.రాకేష్, డి.షణ్ముఖ శ్రీనివాస్, షాజిద్‌ఖాన్ (కృష్ణా), బి.అజయ్, బి.సాయి (వైజాగ్), డి.వరుణ్, టి.సూర్యనారాయణ (చిత్తూరు), సలీం (విజయనగరం), జీవీఆర్ కిరణ్(తూర్పుగోదావరి), షేక్ నబీ రసూల్(గుంటూరు), ఎ.నందకిషోర్‌రెడ్డి (కర్నూలు)

బాలికల జట్టు: గుణవతి, తేజశ్రీ, భవాని (శ్రీకాకుళం), లక్ష్మి, అమృత, గుణవతి(చిత్తూరు), పురందేశ్వరి, యశోద (ప్రకాశం), ఉమా హర్షిత(గుంటూరు), పూజిత (విజయనగరం), శ్రావణి (విశాఖ), శివకీర్తి (కర్నూలు), దుర్గాదేవీ(తూర్పుగోదావరి), భార్గవి(అనంతపురం), గౌస్ ఉన్నీసా (నెల్లూరు).

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FOR SALE

వైజాగ్, డైమండ్ పార్క్ దగ్గర నెలకు 5-6 లక్షల బిజినెస్ గల రన్నింగ్ రెస్టారెంట్ సామాన్లు అన్ని కలిపి 10 లక్షలు మాత్రమే. Ph: 9849724847, 7799338085

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లోGovt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదాలేదా నెలవారీవడ్డీకి పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ 7386201191

PERSONAL CLASSIFIEDS

MISSING

కనిపించుట లేదు

శ్రీ జితేంద్ర సాహూ, తండ్రి పేరు భగిరథి సాహూ, ఎట్/ పిఒ- టింకిబిర, పిఎస్- రీమల్, జిల్లా- దేవ్‌గఢ్, పిన్-768109. ఐఎంఎఫ్ఎ ఫ్యాక్టరీ నుంచి 13.12.2025న ట్రక్కులతో పాటుగా వారు విశాఖపట్నం పోర్టుకు ఎస్కార్టుగా వెళ్లారు, ఫ్యాక్టరీని సా.7.30 గం. సాయంత్రం వదలి వెళ్లి, విశాఖపట్నాన్ని 15.12.2025న ఉదయం చేరారు. వారు కటక్‌ను 16.12.2025న చేరలేదు మరియు వారి మొబైల్ నంబర్ స్విచ్ ఆఫ్ చేయబడి ఉన్నది. ఈ వ్యక్తిని ఎవరైనా కనుగొంటే దయచేసి 9338062120 ను సంప్రదించండి.

REAL ESTATE

FLAT FOR SALE

MADHURAWADA

MVV Flora - 3+1 BHK | 2421 sq.ft | UDS: 83.4 sq.yds 2 Car Parkings Ph: 8309390836

EENADU eClassifieds

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ మం. గోవిందపురంరోడ్డు, హైవేకి 1/2km తా.రోడ్డు ఫేసింగ్, 9ఎకరాలు కొబ్బరితోట &13ఎకరాలు 100' రోడ్డు ఉన్న స్థలం అమ్మకం. 9440255187

JOBS

Computer Data Operator (M/F) with min 1 year exp. in Excel. Job at MVP Sector-1, Visakhapatnam. Email:giri.fomra@gmail.com ✆ 93902 07565, 99482 05000.

Service Engineers / Sales Coordinators (Females) / ITI-Fitter & Electricians with 5 Years Exp. in Pumps/ Motors/ Panels for Vizag & Hyderabad Branch. WhatsApp Resume and Contact Later. Cell No: 9444391787.

Wanted Insurance Advisors for a Reputed Insurance Company Unemployees, Retired, Housewives & Others. ✆ 9652530409.

సెంట్రల్ గవర్నమెంట్ సోలార్ సబ్సిడీ స్కీమ్ నందు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. Q: 10 to PG. జీతం: 30 వేలు to 50 వేలు. ✆ 95155 05557, 99898 57775.

ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేయుటకు హమాలీసికి సూపర్‌వైజర్ కావలెను. జీ: 13,500/- (26 రో॥)+PF, ESI. Ph.: 9247356570, 9032456763.

USAలో 2y బాబును చూసుకోవడానికి వీసా కల్గిన ఆడ కేర్‌టేకర్ కావలెను. జీతం + భోజనం + ఉచిత వసతి. ✆ 92469 98571, 92469 99571.

గాజువాక, గోపాలపట్నం షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం : 18,000. Ph: 9154296343, 9154296345.

వైజాగ్ ప్రముఖ షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం:10000 - 12000 + ఫుడ్, రూము. 9030588502, 9704637370

MVP కాలనీ గెస్ట్‌హౌస్ (Oyo హోటల్) నందు పని చేయుటకు రిసెప్షనిస్ట్ & రూమ్ బాయ్స్ కావలెను. ఫుడ్&వసతి కలదు. వ॥28 సం॥లోపు ✆7036488899.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బస్సు నుంచి జారి పడి ప్రధానోపాధ్యాయిని మృతి

ఎం.ఝాన్సీ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: బస్సు ఎక్కుతూ జారిపడి తీవ్రంగా గాయపడిన ఓ ప్రధానోపాధ్యాయిని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటన పాయకరావుపేట బస్టాండ్‌లో చోటుచేసుకుంది. ఎస్.నర్సాపురం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న ఎం.ఝాన్సీ (62) శనివారం స్కూలు కాంప్లెక్స్ సమావేశం అనంతరం సాయంత్రం ఆరు గంటలకు ఆటోలో పాయకరావుపేట ఆర్టీసీ కాంప్లెక్సు చేరుకున్నారు. బస్సు ఎక్కే సమయంలో డ్రైవర్ అజాగ్రత్తగా ముందుకు పోనిచ్చాడు. దీంతో ఆమె కింద పడిపోయారు. కాలు ఫుట్ బోర్డులో ఇరుక్కుపోవడంతో తుంటి ఎముక విరిగింది. స్థానికులు ఆమెను హుటాహుటిన తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తునిలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ప్రమాద సమాచారాన్ని విశాఖలోని కుటుంబ సభ్యులకు అందించారు. శస్త్రచికిత్స నిమిత్తం విశాఖపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. ఆమెకు ఒక కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆయన అమెరికాలో ఉంటున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అప్పన్న చెప్పారు.

★ అనకాపల్లికి చెందిన ఝాన్సీ మూడేళ్ల కిందట బదిలీపై ఇక్కడకు వచ్చారు. పాఠశాలలో శనివారం జరిగిన స్కూలు కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులకు జీఎఫ్ఎల్ఎన్‌పై అవగాహన కల్పించారు. మహిళా ఉపాధ్యాయులతో కలిసి ఫొటోలు దిగారు. పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆటోలో పాయకరావుపేట బస్టాండ్‌కు వచ్చారు. సాయంత్రం సమయంలో పేట నుంచి నక్కపల్లి, అడ్డరోడ్డు, అనకాపల్లి వైపు వెళ్లే వాహనాలన్నీ ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటాయి. బస్సెక్కాలంటే సాహసం చేయాల్సిందే. బస్సు ఎక్కుతుండగా ఒక్కసారిగా బస్సు ముందుకు కదలడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఎస్సై పురుషోత్తం చెప్పారు. ప్రతి రోజూ అనకాపల్లి నుంచి ఆమె బస్సులో వస్తుంటారు. పాఠశాల ముగిసిన తర్వాత బస్సులోనే వెళ్తుంటారు. మరో ఆరు నెలల్లో పదవీ విరమణ చేయనున్నారు. ఇటీవలే రాజానగరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని సైతం పాఠశాలలో జరిగిన ప్రమాదంలో మృత్యువాత పడిన విషయం తెలిసిందే.

గాలి నాణ్యతపై తనిఖీలు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: పరిశ్రమల్లో గాలి నాణ్యత సూచీ(ఎక్యూఐ) పరిశీలన కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆదివారం పలు పరిశ్రమల వద్ద తనిఖీలు చేసింది. పోర్టు, కార్గోబెర్త్, మిత్తల్ స్టీల్, రైన్ సీఐఐ కార్బన్ కోక్ స్టోరేజ్, కోరమండల్, హిందుస్థాన్ పెట్రోలియం పరిశ్రమల వద్దనున్న పరిసరాలను పరిశీలించి అక్కడ గాలి నాణ్యతను పరిశీలించింది. ఆయా పరిశ్రమల వద్ద గ్రీన్ టార్పాలిన్లు వేయాలని, నిరంతరం శుభ్రత పాటించాలని, కాలుష్య పరిమితులను సూచించింది. కార్యక్రమంలో పీసీబీ ఈఈ పి.వి.ముకుందరావుతో పాటు, టాస్‌ఫోర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొని కారు బోల్తా

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా రాయగడ రాణా పరిధిలోని ఎస్.కరడసింగి-లంజిపాదర్ గ్రామ రహదారి మధ్యలో చెట్టును ఢీకొని కారు బోల్తా పడిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రాలోని విశాఖపట్నానికి చెందిన వైద్యులు జీరంగో ప్రాంతంలో ఉంటున్న చంద్రగిరి బౌద్ధ మందిరాన్ని సందర్శించి మహేంద్రగిరి వైపు వెళుతున్న సమయంలో గ్రామ మలుపు వద్ద అదుపుతప్పి చెట్టుకు ఢీకొని కారు బోల్తాపడింది. ఈ ఘటనలో వైద్యులకు స్వల్ప గాయాలయ్యాయి.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	116	112
లైవ్	143	132
డ్రెస్డ్	207	234
స్కిన్‌లెస్	236	244

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **అవతార్3**, రామచంద్ర, షిర్డిసాయి: **అఖండ-2**, వెంకటేశ్వర: **గుర్రంపాపిరెడ్డి**, పర్తిసాయి: **అవతార్3** (తెలుగు3డి), సత్యనారాయణ స్క్రీన్1: **అవతార్3**, స్క్రీన్2: **మోగ్లీ**, **అచ్యుతాపురం:** శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **అఖండ-2**

అనారోగ్యానికి గురైన మహిళకు ఆర్థికసాయం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: మండలంలోని సర్వసిద్ధి ఎస్సీ కాలనీలో కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కసిపా చినతల్లికి అంబేడ్కర్ యువజన సేవా సంఘం సభ్యులు రూ.10,700 ఆర్థికసాయం అందించారు. సంఘం అధ్యక్షుడు రమణరావు ఆధ్వర్యంలో సభ్యులంతా ఆదివారం చినతల్లిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని, నగదు అందజేశారు. సంఘ సభ్యులు రమేష్, శ్రీను, చిలుకు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలి, న్యూస్‌టుడే: శారదానది కొత్తూరు వద్ద జలధార ఆకట్టుకుంటోంది. నురగలు కక్కుతూ వస్తున్న ప్రవాహంతో ఈ ప్రాంతం ఆహ్లాదకరంగా మారింది. ఫొటోషూట్ల కోసం యువత ఇక్కడికి తరలివస్తున్నారు.

ఆకట్టుకుంటున్న జలధార

ముమ్మరంగా వరికోతలు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో ముమ్మరంగా వరికోతలు కోస్తున్నారు. మండలంలో 11,237 హెక్టార్లలో సాంబమసూరి, ఆర్‌జీఎల్ 2537 రకాలు సాగు చేశారు. వరి పంట పక్వానికి రావడంతో ముమ్మరంగా కోతలు కోస్తున్నారు. దీంతో కూలీల సమస్య తలెత్తింది. దీంతో యంత్రాలతో కోతలు కోస్తున్నారు.

తెదేపా శ్రేణుల సంబరాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి బత్తుల తాతయ్యబాబు నియామకంపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాతాయ్యబాబు స్వగ్రామం వడ్డాదిలో సంబరాలు జరిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జూదం ఆడుతున్న అయిదుగురి అరెస్టు

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పెదరామభద్రపురం గ్రామంలో పొలాల్లో జూదం ఆడుతున్న అయిదుగురిని పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.4,600 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అప్పన్న తెలిపారు. పట్టుబడిన వారిని రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు.

గ్రామాభివృద్ధికి యువత సహకరించాలి

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధికి యువత సహకరించాలని కొక్కిరాపల్లి కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. మొక్కల వద్ద ఉన్న గడ్డిని తొలగించి శుభ్రపరిచి కంచెలు సరిచేశారు. గ్రామ జ్యోతి సంఘం యువతీ, యువకులు చేపడుతున్న కార్యక్రమానికి పెద్దలు సహకరిస్తున్నారు.

రోడ్డు పక్కన చెత్త తొలగిస్తున్న యువకులు, చిన్నారులు

కళ్లముందే కాల్చివేత

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పూడిమడకను ఆనుకొని ఉన్న కంపెనీకి ముడిసరకుతో వచ్చిన ప్రమాదకరమైన రసాయన వ్యర్థాల ప్లాస్టిక్ కవర్లను ఆదివారం బహిరంగంగా దహనం చేశారు. కాలుష్య కారకమైన కవర్లను కాల్చడంతో పూడిమడకకు చెందిన టీఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి పొన్నమళ్ల కొండబాబు మండిపడ్డారు. పూడిమడక పరిసరాలు కాలుష్యానికి గురవుతున్నాయని, ఇళ్లపై నల్లటి ధూళి పడుతోందన్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు.

దహనం చేస్తున్న రసాయన వ్యర్థాల కవర్లు

నక్కపల్లి ఆసుపత్రిలో పిల్లలకు అందని వైద్యం

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి ప్రభుత్వాసుపత్రిలో చంటిపిల్లల వైద్య నిపుణుడు లేకపోవడంతో కష్టాలు తప్పడంలేదు. స్థానిక 50 పడకల ఆసుపత్రిలో కొద్దినెలల కిందట వరకు చంటిపిల్లల వైద్యనిపుణురాలు ఉండేదారు. ఈ వైద్యురాలు మూడు నెలల క్రితం బదిలీపై వెళ్లగా, ఇంతవరకు ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో చంటిపిల్లల వైద్యం నిమిత్తం వస్తున్న వారికి పూర్తిస్థాయిలో వైద్యం అందక కష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం చలిగాలుల కారణంగా పిల్లలను జ్వరం, దగ్గు, జలుబు వేధిస్తోంది. దీంతో రెండు మండలాల నుంచి ప్రజలు నిత్యం నక్కపల్లి ఆసుపత్రికి ఈ సమస్యలతోపాటు, ఇతర అనారోగ్య సమస్యలతో చిన్నారులను తీసుకువస్తున్నారు. ఇతర విభాగాల వైద్యులున్నా, చంటిపిల్లలకు సంబంధించి కొంతమేర మాత్రమే వైద్యం చేయగలుగుతున్నారు. గతంలో నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల నుంచి ప్రతినెలా వందలమంది చిన్నారులను వారి కుటుంబ సభ్యులు ఇక్కడికి తీసుకువచ్చేవారు. నెలకు ఓపీ దాదాపు 600కు పైగా నమోదయ్యేది.

చంటిపిల్లలతో వచ్చిన జనం

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..: ఆసుపత్రిలో రెగ్యులర్ చంటిపిల్లల వైద్య నిపుణుడు లేని మాట వాస్తవమే అయినా, ఉన్నతాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. కోటవురట్ల ఆసుపత్రి నుంచి గురు, శుక్ర, శనివారాల్లో ఓ వైద్యుడు ఇక్కడకు వస్తున్నారు. – సునీల్ సురేష్‌రాజు, ఇన్‌ఛార్జి, ప్రధాన వైద్యాధికారి

రహదారులకు మహర్దశ

రూ.22.65 కోట్ల కేటాయింపు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పేట నియోజకవర్గంలోని ప్రధాన రహదారులకు మహర్దశ పట్టనుంది. వైకాపా పాలనలో గుంతలతో నిండిన రోడ్లకు కూటమి ప్రభుత్వం కొత్తరూపు తీసుకువస్తోంది. రోడ్ల అభివృద్ధిపై హోంమంత్రి వంగలపూడి అనిత ప్రత్యేకంగా దృష్టి సారించడంతో నిధుల వరద పారుతోంది. దీంతో రహదారులు కొత్తందాలు సంతరించుకోనున్నాయి.

నియోజకవర్గంలో రోడ్ల పనులకు రహదారులు, భవనాల శాఖ నుంచి ఇప్పటికే ఆరు రోడ్లకు రూ.5.22 కోట్లు తొలివిడతలో విడుదల చేశారు. ఈ పనులను హోంమంత్రి వంగలపూడి అనిత ఇటీవలే ప్రారంభించారు. తాజాగా మరో రూ.22.65 కోట్లు కేటాయించారు. మండలంలోని వెంకటనగరం నుంచి పాల్మన్‌పేట, ఈదటం వరకు 11 కి.మీ.రోడ్డుకు రూ.అయిదు కోట్లతో పనులు చేపడతారు. వీటితో పాటు రేవుపోలవరం నుంచి బంగారమ్మపాలెం, ఉద్దండపురం నుంచి తిరుపతిపాలెం, ఎస్.రాయవరం నుంచి పిట్ల పాలెం రహదారులకు రూ.7.50 కోట్లు వెచ్చించనున్నారు. పి.ధర్మవరం నుంచి ఎలమంచిలి రోడ్డు వరకు రూ.1.75 కోట్లు, మంగవరం నుంచి గోపాలపట్నం మీదుగా పెంటకోట వరకు ఉన్న రోడ్డును రూ.1.30 కోట్లతో కొత్తరూపు తీసుకువస్తారు. నక్కపల్లి మండలంలోని సారిపల్లిపాలెం నుంచి రాజయ్యపేట వరకు రహదారిని రూ.3 కోట్లతో విస్తరిస్తారు.

పాల్మన్‌పేట నుంచి వెంకటనగరం వెళ్లే రోడ్డు

అభివృద్ధికి చిహ్నాలు..: రహదారులు అభివృద్ధికి చిహ్నాలు. గుంతలు లేని రోడ్లు ఉండాలన్నదే నా ధ్యేయం. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ ముందంజలో తీర్చిదిద్దుతా. అభివృద్ధికి చిరునామాగా పేటను మారుస్తా. – వంగలపూడి అనిత, హోంమంత్రి

గౌతమ్ కూడలి విస్తరణకు చర్యలు

పాయకరావుపేట గ్రామీణం: పాయకరావుపేటలోని అత్యంత రద్దీ ప్రాంతం గౌతమ్ కూడలిని విస్తరించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు ఆర్‌అండ్‌బీ, వుడా, పంచాయతీరాజ్ శాఖలు సిద్ధం చేస్తున్నాయి. ప్రధాన రహదారి విస్తరణతో పాటు నాగరాజుపేట రైల్వే వంతెనకు మార్గానికి అనుగుణంగా ఈ కూడలిని తీర్చిదిద్దేలా పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాంతంలో జనాల రద్దీ అధికంగా ఉంటోంది. నిత్యం ట్రాఫిక్ సమస్య ఉంటోంది. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దాలని హోంమంత్రి అనిత అధికారులకు సూచించారు. ఇప్పటికే రూ.4.5 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణకు కార్యచరణ సిద్ధం చేశారు.

వృథా నీటికి అడ్డుకట్ట

రాంబిల్లి, న్యూస్‌టుడే: వృథాగా పోయే నీటికి అడ్డుకట్ట వేయడంతో భగర్భజలాలు వృద్ధి చెందుతున్నాయి. మండలంలోని మూడు గ్రామాలకు విస్తరించి ఉన్న పంచదార్ల కొండ పరిసరాల్లో పడే వర్షం నీరు ఊటగెడ్డ ద్వారా వృథాగా పోయేది. సెజ్‌లో ఏషియన్ రంగుల పరిశ్రమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) పథకం నిధులు రూ.కోటి వ్యయంతో మూడుచోట్ల చెక్‌డ్యామ్‌లు నిర్మించింది. వెంకటాపురం, హరిపురం, భోగాపురం పరిసరాల్లో నిర్మించిన ఈ చెక్‌డ్యామ్‌లతో ఊటగెడ్డలో పుష్కలంగా నీటి నిల్వలు ఉంటున్నాయి. వీటి నిర్మాణంతో భూగర్భ జలాలు వృద్ధి చెందడంతోపాటు జీవాలు, పశువుల దాహార్తి తీరుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అల్లుకున్న నిర్లక్ష్యం!

అనకాపల్లి, న్యూస్‌టుడే: ఇవి చెట్లు అనుకుంటే పొరపాటే. తీగలు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రైతులకు శిక్షణ ఇచ్చేందుకు అనువుగా ఓ భవనం నిర్మించాల్సి ఉంది. గతంలో తెదేపా హయాంలో రూ.2.30 కోట్లతో పనులు ఆరంభించారు. ఆ తరవాత వైకాపా పాలనలో నిధులు రాక నిర్మాణాలు నిలిచిపోయాయి. ఇనుప చువ్వలను తీగలు అల్లుకున్నాయి. దీనిపై ఏడీఆర్ ముకుందరావును వివరణ కోరగా నిధుల కోసం ఉన్నతాధికారులకు తెలిపామన్నారు.

మట్టిరోడ్లతో కుస్తీలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేటలో వీధి రోడ్లకు మోక్షం కలగడం లేదు. పట్టణంలోని 20 వార్డుల పరిధిలో సుమారు 30 వేలకు పైగా జనాభా ఉంది. రోజురోజుకీ పట్టణం విస్తరిస్తోంది. వీధి రోడ్లకు కొత్తకళ రావడం లేదు. ప్రధానంగా పోలీస్ రాజ్‌నగర్, దేవీనగర్, కొబ్బరితోట ప్రాంతం, న్యూకాలనీ, ఆనంద్‌నగర్, చక్కా నగర్, శీలానగర్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికీ మట్టిరోడ్లే దర్శనమిస్తున్నాయి. శివారు ప్రాంతాల అభివృద్ధిపై పెద్దగా దృష్టి సారించకపోవడంతో ఈ దుస్థితి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక వసతుల కల్పనకు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ముంపు సమస్యకు మోక్షం..

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: వెంకటనగరం గ్రామస్థులకు పంపానది వరద ముంపు నుంచి రక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఏటా నదిలో వరద తాకిడికి సమీపంలో నివాసాలు మునిగిపోయేవి. లోతట్టు ప్రాంత వాసులు ఆస్తి నష్టం జరిగి తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యపై పలుమార్లు సర్పంచి వంకా రమణ అధికారులకు దృష్టికి తెచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హోంమంత్రి అనిత ముంపు సమస్యకు కాంక్రీట్ గోడ ద్వారా పరిష్కారం చూపారు. సుమారు రూ.10 లక్షలకు పైగా నిధులు వెచ్చించి సుమారు వంద మీటర్లుకు పైగా వంతెన కింది ప్రాంతం నుంచి ప్రత్యేక రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. దీంతో ఇబ్బందులు తీరాయని గ్రామస్థులు చెబుతున్నారు.

ఎలమంచిలిలో రక్తదాన శిబిరం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: జగన్ పుట్టిన రోజు సందర్భంగా ఎలమంచిలిలో వైకాపా నాయకులు మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యేలు కన్నబాబురాజు, కరణం ధర్మశ్రీ పరిశీలించారు. మాజీ ఎంపీపీ బొడ్డు గోవింద్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు నిర్వహించారు. వంద మందికి పైగా దాతలు ఇక్కడ రక్తదానం చేశారు.

ఎస్.రాయవరం, నక్కపల్లి, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం గుడివాడ, నక్కపల్లి వైకాపా కార్యాలయాల వద్ద ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు కేక్ కోసి నాయకులకు తినిపించారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నక్కపల్లిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులు అర్పించారు.

పాయకరావుపేట: పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు ఆధ్వర్యంలో కేక్ కోశారు. నాయకులు చిక్కాల రామారావు, జడ్పీటీసీ సభ్యుడు లంకా సూరిబాబు పాల్గొన్నారు.

కోటవురట్ల: పాములవాకలో వైకాపా మండల అధ్యక్షులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు రక్తదానం చేశారు. కోటవురట్లలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజు, దత్తుడు సీతబాబురాజు కేసు కోశారు.

రైల్వేస్టేషన్.. డంపింగ్ యార్డా?

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి రైల్వే స్టేషన్ డంపింగ్ యార్డుగా మారింది. స్టేషన్ ఆవరణ చెత్తతో నిండిపోయింది. భరించరాని దుర్గంధంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం పక్కన పెద్ద ఎత్తున చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. ఇవి గాలికి ఎగిరి ప్రయాణికులపై పడుతున్నాయి. స్టేషన్‌లో పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నా పరిశుభ్రత కరవైంది. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. నెలల తరబడి పేరుకుపోయినా తొలగించలేదని అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు.

అపరిశుభ్రంగా ఎలమంచిలి రైల్వేస్టేషన్ పరిసరాలు

ఎన్నాళ్లకో కలిసి.. ఊసులెన్నో మెదిలి..

మునగపాక ఉన్నతపాఠశాలలో 1999-2000బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కశింకోటలో స్నేహితుడిని సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

హరిపాలెం పదో తరగతి పూర్వ విద్యార్థులు

రాంబిల్లి, న్యూస్‌టుడే: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు ఆదివారం వేడుకగా సాగాయి. అచ్యుతాపురం మండలం హరిపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1992-93 బ్యాచ్‌కు చెందిన సుమారు వంద మందికిపైగా పదోతరగతి విద్యార్థులు గోకివాడ మార్గంలో కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆట, పాటలతో గడిపారు.

మునగపాక, న్యూస్‌టుడే: వారంతా 25 ఏళ్ల క్రితం మునగపాక జడ్పీ పాఠశాలలో పదోతరగతి చదువుకున్నారు. ఆదివారం చదువుకున్న పాఠశాలకు చేరుకుని నాటి తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదువునేర్పిన గురువులు అలంక సూర్యప్రకాశరావు, సూరిశెట్టి ప్రసాదు, దాడి కృష్ణ తదితరులను సత్కరించారు. పూర్వ విద్యార్థులు కర్రి శ్రీను, పెంటకోట మహేష్, దాడి అరుణ్ కుమార్, టెక్కలి లక్ష్మణరావు, పిల్లా జగదీష్, కాండ్రేగుల బుజ్జి పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలోని ఏఎంఏఎల్ హైస్కూల్లో 1983-84 పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం కలిశారు. కొణతాల రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. బొజ్జన్న కొండ వద్ద విజయనగరం జిల్లా వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 56 ఏళ్ల పైబడిన వారంతా యువకుల్లా సందడి చేశారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట డీఎన్ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదో తరగతి విద్యార్థులు బయ్యవరం సమీపంలోని శారదావనంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. రచయిత బొడ్డేడ బలరామస్వామిని సత్కరించారు. దగ్గుపల్లి శివకుమార్, కలగా శివానందం, శిమ్మనపూడి ఉదయ భాస్కరరావు, కర్రి పద్మనాభం పాల్గొన్నారు.

బొజ్జన్న కొండపై పూర్వ విద్యార్థుల భేటీ

రాజాధిరాజ వాహనంపై వెంకన్న

నక్కపల్లి, న్యూస్‌టుడే: ధనుర్మాస వేడుకల్లో భాగంగా ఉపమాక వెంకన్న ఆదివారం సతీసమేతంగా భక్తులకు రాజాధిరాజ వాహనంపై దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. సన్నాయి, వాయిద్యాల నడుమ భక్తులు గోవింద నామస్మరణ చేసి హారతులు ఇచ్చారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆలయం నుంచి ఉత్సవమూర్తుల తిరువీధి

వరహావతారంలో పాండురంగడు

పాయకరావుపేట, న్యూస్‌టుడే:. పట్టణంలోని పాండురంగస్వామి ఆలయంలో స్వామిని ఆదివారం వరహా అవతారంలో అలంకరించారు. ఆలయ అర్చకులు కృష్ణస్వామి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

ఊడలు దిగి.. చెట్టుగా ఎదిగి!

తుమ్మపాల చక్కెర కర్మాగారం నివాస సముదాయం వద్ద మర్రి ఊడల్లో ఒకటి భూమికి దిగి చెట్టుగా ఎదిగింది. చెట్టు పక్కన చెట్టు జంటగా ఉన్నాయి. – న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

సుదీర్ఘ చరిత్ర సొంతం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో ఆంధ్రా బాప్టిస్టు చర్చి సుదీర్ఘ చరిత్ర సొంతం చేసుకుంది. వందేళ్ల కిందటే నిర్మించిన అతి పురాతన చర్చిగా రికార్డు నెలకొల్పి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. 1907లో ఆగ్లేయుల పాలనలో దీన్ని నిర్మించారు. ఇప్పటికి 118 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో సెంటినరీ పేరు చేర్చారు. బ్రిటిష్ పాలనలో కంటోన్మెంట్ ఏరియాగా ఉన్న ఈ ప్రాంతంలో అప్పటి ఇంజినీర్లు దీన్ని నిర్మించారు. బాలికలు కూడా చదువుకోవాలని ఉత్తరాంధ్రాలో తొలిసారిగా ఇక్కడే ప్రత్యేక పాఠశాల నడిపేవారు. వారి తల్లిదండ్రులను ఒప్పించి పాఠశాలకు వచ్చేలా చేసేవారు. వీరికి భోజనం వసతి కల్పించేవారు. స్వాతంత్ర్యం వచ్చే వరకూ 35 ఏళ్లపాటు చర్చిలో బాలికల ప్రత్యేక పాఠశాల నడిచేది. అనంతరం ఇక్కడే ప్రభుత్వం బాలికోన్నత పాఠశాల ఏర్పాటు చేశాక ఈ పాఠశాలను అందులో విలీనం చేశారు. ఏటా క్రిస్మస్ సందర్భంగా ఈ చర్చిలో పేదలకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

విద్యుద్దీపాలతో అలంకరణ

క్రిస్మస్ కానుకల పంపిణీ

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పద్మనాభరాజుపేటలో సర్పంచి గొన్నాబత్తులు శివసాయంతో ఏర్పాటు చేసిన క్రిస్మస్ కానుకలను ఆదివారం వైకాపా ఇన్‌ఛార్జి కరణం ధర్మశ్రీ అందజేశారు.

అనకాపల్లిలో చీరలు పంపిణీ చేస్తున్న సురేంద్ర

బొద్దపు ఎర్రయ్యదొర, కొల్లి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి గాంధీనగరంలో పుల్‌గ్యాస్పల్ చర్చిలో ఆదివారం మినీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పాస్టర్ చంద్రశేఖర్ విక్టోరియా నిర్వహించిన వేడుకలో కేక్ కోశారు. పిల్లలకు పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర చేతుల మీదగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. గోల్డ్‌వాసు, క్రైస్తవ సోదరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తూకంలో నిబంధనలు పాటించడం తప్పనిసరి

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: తూనిక గుళ్లపై నిబంధనలు పాటించాలని ఆశాఖ సహాయ నియంత్రకులు పి.రామచంద్రయ్య కోరారు. పట్టణంలో గాంధీమార్కెట్‌లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను వ్యాపారులు తప్పకుండా పాటంచాలన్నారు. నిబంధనలు మీరితే భారీగా అపరాధ రుసుం విధిస్తామన్నారు. ముద్రలులేని తూనికలు వినియోగిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. కొలతల చట్టంపై అవగాహన కల్పించారు. అనకాపల్లి నియంత్రకులు రామారావు, కొండారెడ్డి పాల్గొన్నారు.

తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే అనకాపల్లి రింగురోడ్డులోని రహదారిపై స్పీడ్ బ్రేకర్లు గుర్తించేలా రంగులు వేయలేదు. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. – రఘు, అనకాపల్లి, ?: ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం. – వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేటలోని పార్కులో పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేయాలి. పార్కులో కూర్చునేందుకు ఏర్పాట్లు చేయాలి. – పి.శివ, స్థానికుడు, ?: పార్కులో మౌలిక వసతులు కల్పిస్తాం. ఆట వస్తువులు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం. – కె.డేవిడ్, ఈవో

పాయకరావుపేట, న్యూస్‌టుడే: సమస్య: పాయకరావుపేటలోని ఆటస్థలం వద్ద ఆక్రమణలు పెరిగిపోయాయి. దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీటిని తొలగించాలి. – కె.శ్రీను, పాయకరావుపేట, ?: ఆక్రమణలు తొలగిస్తాం. తాఖీదులు జారీ చేస్తాం. – కె.డేవిడ్, ఈవో

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: చిననాలుగురోడ్ల కూడలి, పెరుగుబజార్ వద్ద ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాహనాలు ఇష్టం వచ్చినట్లుగా నిలుపుతున్నారు. – రాజశేఖర్, అనకాపల్లి, ✓: ట్రాఫిక్ రద్దీని సరిచేస్తున్నాం. నిబంధనలు పాటించని వాహనదారులపై కేసులు నమోదుచేస్తున్నాం. – వెంకట నారాయణ, ట్రాఫిక్ సీఐ, అనకాపల్లి.

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: ఎలమంచిలి పట్టణంలో కోతుల సమస్య తీవ్రంగా ఉంది. పరిష్కారానికి చర్యలు చేపట్టాలి. – వి.కిషోర్ ఎలమంచిలి ✓: కోతులను పట్టించి అటవీ ప్రాంతంలో విడిచిపెట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం. – ప్రసాదరాజు, మున్సిపల్ కమిషనర్

ధ్యానం జీవనంలో భాగం

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రశాంతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఇంటర్ డీఐఈఓ వినోద్‌బాబు తెలిపారు. పట్టణంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని కరపత్రాలు ఆవిష్కరించారు. ధ్యానం జీవనంలో భాగం చేసుకోవాలన్నారు. వైద్యులు విష్ణుమూర్తి మాట్లాడుతూ ఆదాయం కంటే ఆరోగ్యం చాలా ముఖ్యమన్నారు. ఈకార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు బుద్దా శ్రీనివాసరావు, కార్యదర్శి ప్రకాశరరావు, కోశాధికారి సానా త్రినాథ్, బుద్దా రమణాజీ, రాజేశ్, సతీష్, గౌరీపతి, కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

పగలూ వెలుగులే

రాంబిల్లి, న్యూస్‌టుడే: మండలంలో పలు గ్రామాల్లో వీధి దీపాలు ఆర్పే వెసులుబాటు లేకపోవడంతో పగలూ వీధి దీపాలు వెలుగుతూనే కనిపిస్తున్నాయి. మండలంలో శివార్లతో కలిపి మొత్తం గ్రామాలు 56 ఉన్నాయి. పగలూ, రాత్రి వీధి దీపాలు వెలుగుతుండటంతో కొద్ది రోజులకే అవి కాలిపోతున్నాయి.

పోలియో రహిత సమాజానికి కృషి

అనకాపల్లి గ్రామీణం, నెహ్రూ చౌక్, న్యూస్‌టుడే: పోలియో నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చిన్నతల్లి పేర్కొన్నారు. సిరసపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు శ్రీనివాసరావు, రమణాజీ నెహ్రూచౌక్ బస్టాండ్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఎలమంచిలి/ గ్రామీణం, అచ్యుతాపురం, రాంబిల్లి: అచ్యుతాపురం మండలం రామన్నపాలెంలో ఎమ్మెల్యే సుందరపు విజయ కుమార్ చిన్నారులకు చుక్కల మందు వేశారుజ. ఎలమంచిలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నార. 96 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామని దిమిలి వైద్యాధికారి ఆర్.వెంకటేశ్ చెప్పారు.

పాయకరావుపేట, ఎస్.రాయవరం, కోటవురట్ల, నక్కపల్లి, న్యూస్‌టుడే: పేటలో తెదేపా మండల, పట్టణ శాఖల అధ్యక్షులు చించలపు ప్రదీప్, యాళ్ల వరహాలబాబు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు పాల్గొన్నారు. ఎస్.రాయవరం మండలం గుడివాడలో మాజీ సర్పంచి నల్లపరాజు వెంకటరాజు పోలియో చుక్కలు వేశారు. కోటవురట్ల మండలం జల్లూరు పల్స్ పోలియో కేంద్రంలో పలువురు చిన్నారులకు తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు పోలియో చుక్కలు వేశారు. మండలంలో 95 శాతం పూర్తి చేశామని, మిగిలిన 5 శాతం ఇంటింటికి శత శాతం పూర్తి చేస్తామని వైద్యాధికారులు ప్రత్యూష, సంతోష్‌కుమార్ చెప్పారు. నక్కపల్లిలో తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త కొప్పిశెట్టి వెంకటేష్, వైకాపా రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, భాజపా జిల్లా నాయకుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కశింకోట: కశింకోట పంచాయతీ కార్యాలయం, జాతీయ రహదారిపై కేంద్రాలను డీఎంహెచ్ఓ ఎం.హైమావతి సందర్శించారు. వైద్యాధికారిణి వై.యశోద తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో పల్స్ పోలియో నమోదును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

సిరసపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ చిన్నతల్లి

జల్లూరులో..

(c) eenadu

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: అవతార్, గుర్రంపాపిరెడ్డి ఆడి 2: అఖండ-2, ఆడి 3: అవతార్, మిస్టీరియస్, ఆడి 4: అవతార్ మిస్టీరియస్, రాజు: అఖండ-2, బంగార్రాజు: జిన్, మిస్టీరియస్ చోడవరం: శ్రీసాయిలక్ష్మి: ఆంధ్రా కింగ్ తాలుకా, సాయిలక్ష్మి: పాంచ్ మినార్, పూర్ణా: అఖండ2

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్తిబాబు

చోడవరం, న్యూస్‌టుడే: అడ్డూరు, వెంకన్నపాలెం తోటల్లో ఆదివారం వనసమారాధన కార్యక్రమాలు జరిగాయి. బార్ అసోసియేషన్, సహకార సంఘాల ఉద్యోగులు, కాలేజీ గ్రౌండ్ వాకర్స్ తదితర సంస్థల సభ్యులు పాల్గొని సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుంకరి సత్తిబాబు, ఉపాధ్యక్షుడిగా రమేష్, మేనేజ్‌మెంట్ నిర్వాహకుడిగా సాంబారు శ్రీను నియమితులయ్యారు.

తెదేపా శ్రేణుల సంబరాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా బత్తుల తాతయ్యబాబు రెండోసారి నియామకంపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాతయ్యబాబు స్వగ్రామం వడ్డాదిలో సంబరాలు చేస్తున్నారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో కేక్ కోసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డాదిలో తెదేపా నాయకుల సంబరాలు

సమీప పంచాయతీలో విలీనం చేయండి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: తమ గ్రామాన్ని దీక్షితుల అగ్రహారం పంచాయతీలో విలీనం చేయాలని దీక్షితులపాలెం వాసులు ఆదివారం ఎ.కోడూరులో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం పింద్రంగికి శివారుగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. గ్రామ తెదేపా అధ్యక్షుడు లెక్కల నాయుడు, ఉపసర్పంచి అమ్మతల్లినాయుడు, లెక్కల రాము, వేచలపు శ్రీను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టరు రొంగలి మహేశ్, సీనియర్ నాయకులు సబ్బవరపు రామునాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం జన్మదిన వేడుకలు

చోడవరం, మాడుగుల గ్రామీణం, కె.కోటపాడు, న్యూస్‌టుడే: గ్రామ సచివాలయాల ఏర్పాటు ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేర్చిన ఘనత జగన్‌దే అని వైకాపా జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. చోడవరం పట్టణంలో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులతో కలిసి కేక్ కోశారు. మాడుగుల బస్టాండ్ ఆవరణలోని మాజీ డిప్యూటీ సీఎం బూడిముత్యాలనాయుడు నిర్వహించారు. ఆనందపురంలో జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనూరాధ, ఎంపీపీలు కేకు కోశారు.

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్ ఆధ్వర్యంలో ఇక్కడ నిర్వహించిన రక్తదాన శిబిరంలో 201మంది రక్తదానం చేశారు. పార్టీ ఇంఛార్జి బొడ్డేడ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతకాయల సన్యాసిపాత్రుడు పాల్గొన్నారు.

చీడికాడ, న్యూస్‌టుడే: చుక్కపల్లిలో ఎడ్ల బళ్ల పరుగు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. విజేతలుగా కొయిలాడ మోహన్ (కె.జె.పురం), పరదేశిమాంబ(వావిలపాడు), పరవాడ నాయుడు(అర్జునగిరి) నిలిచారు. గెలుపొందిన వారికి స్థానిక సర్పంచి మజ్జి లక్ష్మణమ్మ, మండల వైకాపా అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబు, పాలసంఘం అధ్యక్షుడు వెంకటరమణ గ్రామపెద్దలు బహుమతులు అందజేశారు.

రక్తదానం చేస్తున్న గణేష్, చిత్రంలో మాజీ మంత్రి అమర్‌నాథ్

కలిగొట్ల వంతెన

ఎన్నటికి పూర్తయ్యేనో..?

దేవరాపల్లి, న్యూస్‌టుడే : కలిగొట్ల వంతెన పూర్తవుతుందో.. లేదో అనే సందిగ్ధత నెలకొంది. రాష్ట్ర విభజన సమయంలో ప్రారంభమైన ఈవంతెన పనులు కొంతమేరకు పూర్తయ్యాయి. వంతెనకు ఇరువైపులా కేవలం అప్రోచ్‌రోడ్లు నిర్మిస్తే పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది.

▼ రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారంతో పాటు మిగతా వంతెన పనులు పూర్తిచేయాలంటే అదనంగా రూ. 5కోట్లు వరకు ఖర్చవుతుందని ర.భ.శాఖ అధికారులు అంచనావేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పనులు పూర్తిచేస్తే అల్లూరి జిల్లాతో పాటు అనకాపల్లి, విశాఖ పట్నం జిల్లాలకు వెళ్లేందుకు మార్గం సుగమమవుతుంది.

అసంపూర్తిగా కలిగొట్ల వంతెన అప్రోచ్ రోడ్డు

▼ రాష్ట్ర విభజన తరువాత వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వంలోనూ ఈ పనులు పడకేశాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఈ వంతెన పూర్తిచేయడంపై దృష్టి సారించారు. కలెక్టరు విజయకృష్ణన్ సహా జిల్లా ఉన్నతాధికారుల్ని తీసుకొచ్చి వంతెన పరిస్థితిని చూపించారు. వంతెనకు ఇరువైపులా భూములు కోల్పోతున్న రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం విషయంలో చిక్కుముడి పడటంతో ఈ వంతెన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. విషయం ఆర్అండ్‌బీ అధికారులు వారి దృష్టికి తీసుకెళ్లారు. దానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ కార్యరూపం దాల్చలేదు. సుమారు రూ. 5కోట్ల వ్యయంతో వంతెన పనులు అప్పట్లో చేపట్టారు. ఆ నిధులు ప్రధాన వంతెన పూర్తిచేయడానికి సరిపోయాయంటూ అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధికి సంపూర్ణ సహకారం

దేవరాపల్లి, న్యూస్‌టుడే : ఎం.అలమండ పంచాయతీ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి భరోసా ఇచ్చారు. ఈ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎన్టీఆర్ విగ్రహ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. దీంతోపాటు గ్రామం మీదుగా రూ.3 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులకు శంకుస్థాపన, ఎర్రవానిపాలెంకి రూ.25 లక్షల వ్యయం సమకూర్చిన ఇంటింటి కొళాయిలను ఆయన ప్రారంభించారు. ఇదే గ్రామానికి చెందిన కాళ్ల ప్రసాదు, దేవి దంపతులకు పీఎంఈజీపీ పథకం ద్వారా మంజూరైన బొలెరా వాహనాన్ని (రూ.8.90 లక్షలు) వారికి అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రానికి వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రైవాడ జలాశయ ఛైర్మన్ పోతల పాత్రునాయుడు, మాజీ సర్పంచి గొర్లె సన్యాసినాయుడు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిర్వహణకు నోచుకోని మంచినీటి కోనేరును

శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతానన్నారు. అసంపూర్తిగా ఉండిపోయిన పంచాయతీ భవనాన్ని పూర్తిచేయడానికి నిధులు మంజూరుతో పాటు అసంపూర్తిగా మిగిలిపోయిన ఎం.అలమండ-మామిడిపల్లి రోడ్డు పూర్తి చెయ్యడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కిలపర్తి భాస్కరరావు, పోతల అచ్చియ్యమ్మ, మండల తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు పెద్దాడ వెంకటరమణ, డి.డి.నాయుడు, ర.భ.శాఖ ఈఈ సాంబశివరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ మెరుపులు..

జాతీయ పతకాలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే

స్కేటింగ్‌లో ఆ బాలల ప్రతిభ అందరిని అబ్బురపరుస్తోంది. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ప్రతిభ చాటుతున్నారు. నర్సీపట్నానికి చెందిన చిన్నారులు లగుడు లక్ష్మి ప్రజ్ఞ శ్రీ ఆధ్య, కన్నూరి అనీష్ త్వరలో గ్వాలియర్‌లో నిర్వహించనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జాతీయ పోటీల్లోనూ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. వేసవి శిబిరంలోని శిక్షణ వీరిని తిరుగులేని స్కేటర్లగా తీర్చిదిద్దింది. స్థానిక రుత్తల లత్సాపాత్రుడు నందనవనంలోని రింక్‌లో సాధన చేస్తున్న చిన్నారుల్లో అనేక మంది ఇప్పటికే జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలతో మెరిశారు. ప్రస్తుతం జాతీయ పోటీల్లో సైతం రాణిస్తున్నారు. అర్జున్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన శిక్షకుడు కురచా మణికంఠ కల్యాణ్ ఈ ప్రాంతంలోని 4 నుంచి 16 ఏళ్ల లోపు బాలలకు ఏడేళ్లగా శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రీడలోని పిల్లల ఉత్సాహాన్ని చూసి సభాపతి అయ్యన్నపాత్రుడు ఇక్కడి రింక్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు.

బాలల స్కేటింగ్

ఇన్‌లైన్ 'ప్రజ్ఞ' దిట్ట

స్థానిక అమరావతి స్కూల్‌లో అయిదో తరగతి చదువుతున్న ప్రజ్ఞ ఇన్‌లైన్ స్కేటింగ్‌లో మంచి ప్రతిభతో దూసుకుపోతోంది. ఈ నెలలోనే ఈ బాలిక విశాఖలోని రోలర్ స్కేటింగ్ ఆఫ్ ఇండియా (ఆర్ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జాతీయ పోటీల్లో కాంస్య పతకం గెలుచుకుంది. గతంలో వేసవి శిబిరంలో చేరింది. ఇప్పుడు వేగానికి దోహదపడే వరుస చక్రాల బూట్లతో ఇన్‌లైన్ స్కేటింగ్‌లో రాణిస్తోంది. గతంలో రాష్ట్ర స్థాయి ఆర్ఎస్ఎఫ్ఐ పోటీల్లో 8 నుంచి 10 ఏళ్లు లోపు వయసు విభాగంలో బంగారు పతకాన్ని దక్కించుకుంది. రాష్ట్రంలోనే ఈ విభాగంలో అప్పుడు ఈ విజయం సాధించిన తొలి బాలికగా గుర్తింపు పొందింది. తాజాగా ఎస్‌జీఎఫ్ జాతీయ పసిడి పతకం లక్ష్యంగా సాధన చేస్తోంది.

'అనిష్' కు ఎదురులేదు: స్కేటింగ్ పోటీల్లోని రోడ్డు విభాగంలో కన్నూరి అనిష్ సత్తాకు అందరి నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. నాతవరం మండలం ములగపూడిలోని ఎంపీపీయూపీ స్కూల్‌లో 5వ, తరగతి చదువుతున్నాడు. వేసవి శిబిరంలో చేరినప్పటి నుంచి రోజూ నర్సీపట్నంలోనే రింక్‌లో సాధన చేస్తున్నాడు. గతంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పలు పతకాలు సాధించాడు. 8 నుంచి 10 ఏళ్ల విభాగంలో 1000, 500 మీటర్ల రోడ్డు స్కేటింగ్‌లో పసిడి పతకాలు గెలుపొందాడు. ఈ నెలలోని విశాఖలోని జాతీయ పోటీల్లో పాల్గొన్నప్పటికీ పతకం దక్కలేదు. త్వరలో చేపట్టనున్న ఎస్‌జీఎఫ్ జాతీయ పోటీల్లో ఏకంగా బంగారు పతకం కోసం నిర్విరామంగా ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు.

మాడుగుల సమస్యలపై సమీక్ష

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన మాడుగుల గ్రామాభివృద్ధి లక్ష్యంగా యువత ముందుకు అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం దేవి ఆడిటోరియంలో గ్రామస్థులతో జనసేన సంయుక్త కార్యదర్శి రొబ్బా మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏరాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రధాన సమస్యల గురించి చర్చించారు. అనంతరం ఈ సమస్యలపై అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు.

సమావేశంలో గ్రామస్థులు

ధ్యాన శిక్షణ తరగతులు ఏర్పాటు చేయిస్తా : అయ్యన్న

విద్యార్థులు, పట్టణవాసులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న సభాపతి అయ్యన్న

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: రోజూ 15 నిమిషాలపాటు ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని సభాపతి అయ్యన్నపాత్రుడు విద్యార్థులకు సూచించారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటైన కార్యక్రమంలో అయ్యన్న ప్రసంగిస్తూ.. ప్రధానోపాధ్యాయులు ముందుకొస్తే నిపుణుల ద్వారా విద్యార్థులకు ధ్యాన శిక్షణ తరగతులు ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. మనలో మార్పు వస్తే సమాజంలోనూ మార్పు వస్తుందన్నారు. ఏ రంగంలో ఆసక్తి ఉందో గమనించి పిల్లలను ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. మీ ఆశలను పిల్లలపై రుద్దుతూ ఒత్తిడి పెంచవద్దని హితవు పలికారు. ప్రతి ఒక్కరూ ఒత్తిడితో సతమతమవుతున్నారని యోగ, ధ్యానం చేయడం ద్వారా బయటపడొచ్చన్నారు. హార్ట్‌ఫుల్‌నెస్ ప్రాంతీయ ప్రతినిధి గోపాల్ ధ్యానం వల్ల ప్రయోజనాలను వివరించారు. కౌన్సిలర్లు పద్మావతి, ఆదిలక్ష్మి, నర్సింహమూర్తి జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-92లో పదో తరగతి చదువుకున్న 60 మంది విద్యార్థులు ఆదివారం రాచపల్లి శ్రీకామేశ్వరమ్మ ఆలయం వద్ద కలుసుకున్నారు. వివిధ ప్రాంతాలలో ఉంటున్న వీరంతా తొమ్మిదేళ్లగా డిసెంబరు నెలలో సమావేశమవుతున్నారు. చదువుకునే రోజులలో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. కుటుంబ యోగాక్షేమాలను చెప్పుకుని ఆనందాలు పంచుకున్నారు. ప్రతిఏటా స్నేహితులతో కార్యక్రమం ఏర్పాటుకు కృషి చేసి దిగ్విజయంగా నడిపిస్తున్న వి.బాలాజీకుమార్‌ను అంతా అభినందించారు.

ప్రసాదుకు సత్కారం

చోడవరం, న్యూస్‌టుడే: యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన మొల్లి ప్రసాదును మాజీమంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను ఆదివారం సత్కరించారు. తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, యాదవుల సమక్షంలో ప్రసాదుకు శాలువా కప్పి పూల మాల వేశారు. ఎంపీపీ గాడి కాసులమ్మ, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ పల్లా నర్సింగరావు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, గంధవరం వాసులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మేలుకొలుపులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: ధనుర్మాసం పురస్కరించుకుని నారాయణరాజుపేట, మాకవరపాలెం తదితర గ్రామాల్లో నెలగంట మొదలుకుని ప్రతిరోజు తెల్లవారుజామున మేలుకొలుపు కార్యక్రమాన్ని భక్తులు నిర్వహిస్తున్నారు. గ్రామ దేవాలయం వద్ద నుంచి సీతారాములు చిత్రపటం పట్టుకుని బయలుదేరి గ్రామ పురవీధుల్లో శ్రీరామ నామాలు స్మరిస్తు మేలుకొలుపు నిర్వహిస్తున్నారు. సమరసత ధర్మ రక్షణ సమితి ప్రతినిధులు రత్నమాల, రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఊరేగింపులో భక్తులు

ఆన్‌లైన్ చెల్లింపులతో అక్రమాలకు చెక్

చోడవరం, న్యూస్‌టుడే: పంచాయతీల్లో పన్ను చెల్లింపులు ఆన్‌లైన్ పద్ధతి ప్రవేశపెట్టడంతో పారదర్శకతలో మరోమెట్టు ఎక్కనుంది. గతంలో ఇలాంటి పద్ధతి లేకపోవడంతో నిధులు భారీ మొత్తంలో స్వాహా అయ్యేవి. ఇందుకు సాక్ష్యమే రూ.17.4లక్షలు పంచాయతీ కళ్లుకప్పి మింగేయడం. దీనిపై నర్సీపట్నం డీఎల్‌డీఓ విచారణ చేసి ముగ్గురు ఉద్యోగులు కారణమని తేల్చింది. వారి నుంచి డబ్బు వసూలు చేయడంలో విఫలం కావడంతో ప్రస్తుతం పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది.

✦ కన్నంపాలెం పంచాయతీలో పని చేసే కార్యదర్శి ఇంటిపన్నుల సొమ్మును బ్యాంకులో జమ చేయలేదు. గ్రామంలో అభివృద్ధికి నిధులలేమి ఆటంకంగా మారింది. పంచాయతీ పన్నుల తతంగమంతా చూసుకోవడానికి పంచాయతీల గుమాస్తాలను నియమించేవారు. సంక్రాంతి నుంచి పన్నుల వసూలు చేసేవారు. ఆవిధంగా వసూలు చేసిన సొమ్మంతా మరుసటి రోజు పంచాయతీ కార్యాలయంలో జమచేయాల్సి వచ్చేది. దీన్నే అవకాశంగా చేసుకొని పలువురు అవకతవకలకు పాల్పడేవారు.

ఇంటి యజమానికి ఆన్‌లైన్ రసీదు అందజేస్తున్న పంచాయతీ అధికారులు

✦ ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టడానికి తాజాగా కూటమి ప్రభుత్వం పంచాయతీల్లో అవినీతి నిరోధించే క్రమంలో ఆన్‌లైన్ పద్ధతికి శ్రీకారం చుట్టింది. ఇంటి యజమానే చరవాణి నుంచి స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా చెల్లించవచ్చు. యాప్ గురించి తెలియకపోతే పంచాయతీకి వెళ్లొచ్చు. నగదు రూపంలో ఇవ్వాల్సిన అవసరం లేదు. ఆన్‌లైన్‌లో బిల్లు చెల్లించిన వివరాలను రసీదుపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తెలుసుకోవచ్చు. చోడవరం మండలంలో 32 పంచాయతీల్లోనూ రూ.3.12 కోట్లు వసూలును ఆన్‌లైన్‌లోనే చేస్తున్నారు.

నగదు రహిత విధానం

పంచాయతీ విధించే ఇంటి పన్నును ఎవరికి వారే తమ చరవాణిల ద్వారా చెల్లించండి. కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదు. గుమస్తాల వెంట తిరగాల్సిన పనిలేదు. ఆన్‌ఆలైన్ చెల్లింపు తర్వాత వివరాలను తెలుసుకునే అవకాశముంది. ప్రతి ఒక్కరూ కొత్త విధానాన్ని ఉపయోగించుకుంటూ ఇంటి పన్నుల చెల్లింపులు చేయాలి.

– కె.శ్రీనివాసరావు, కార్యదర్శి, చోడవరం పంచాయతీ

పేద కాపులను ప్రభుత్వం గుర్తించాలి

నాతవరం, న్యూస్‌టుడే: పేద కాపులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని కాపు సంఘం జిల్లా నాయకులు కోరారు. తాండవ జలాశయం వద్ద నల్లగొండమ్మ ఆలయ ప్రాంగణంలో ఆదివారం వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి జిల్లా నలుమూలల నుంచి అనేక మంది విచ్చేశారు. కాపు సోదరుల్లో ఐక్యత రావాలని, ఆర్థికంగా స్థిరపడిన కుటుంబాలు పేద కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. అల్లాడ సురేష్, చక్రవర్తి, వనిమిన సూర్యారావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. నెలకు ఒకచోట సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఘనంగా హిందూ ధర్మ సమ్మేళనం

గొలుగొండ, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు అయిన సందర్భంగా జోగుంపేట కూడలిలో ఘనంగా హిందూ ధర్మ సమ్మేళనం నిర్వహించారు. గొలుగొండ రామాలయం నుంచి ద్వారకానగరం వరకు శ్రీరాముని శోభా యాత్ర నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న స్వామీ రామానంద మాట్లాడుతూ శ్రీరాముని అడుగుజాడల్లో నడవాలన్నారు.

సమ్మేళనానికి హాజరైన మహిళలు

చీడికాడలో ప్రజాదర్బార్ నేడు

చీడికాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం చీడికాడ తులసీ కల్యాణ మండపంలో సోమవారం ప్రజాదర్బార్ జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం మొదలవుతుందన్నారు. ఫిర్యాదు పత్రంతో పాటు ఆధార్‌కార్డు జెరాక్స్ దానిపై ఫోన్ నంబరు రాయాలని పేర్కొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఉద్యోగుల సమస్యలు

మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ తాతారావు

చోడవరం, న్యూస్‌టుడే: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో పనిచేసే పీఏసీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు తెలిపారు. వెంకన్నపాలెం గ్రామంలో పీఏసీఎస్ ఉద్యోగుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా తాతారావు హాజరయ్యారు. జీవోనెం.36 అమలుకు కృషి చేస్తామన్నారు. పీఏసీఎస్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు బొడ్డేటి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి జి.రమణ, ఉపాధ్యక్షుడు గొంతెన అప్పారావు, లోవరాజు, బోర ఈశ్వరరావు, లక్ష్మణకుమార్, గౌరవాధ్యక్షులు నాగభూషణం, స్వామి, జగన్‌లు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయాలి

మాకవరపాలెం, న్యూస్‌టుడే : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మధ్యాహ్న భోజన నిర్వాహకుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి హాజరైన కార్మికుల సంఘం నాయకులు ప్రసన్న హాజరయ్యారు. ప్రభుత్వం బిల్లుల చెల్లించడంలో జాప్యం కారణంగా కార్మికులు అప్పులు తెచ్చి భోజనం పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. సీఐటీయూ మహాసభలకు కార్మికులను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గంట్ల శివ పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: సీఐటీయూ అఖిల భారతీయ మహాసభలు జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ కోరారు. బలిఘట్టంలోని ఆ కార్మికుల సంఘ కార్యాలయంలో ఆదివారం మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కార్మికులకు బోర్డు నుంచి అందాల్సిన సంక్షేమ పథకాలు ఏవీ రావడం లేదన్నారు. సీఐటీయూ నాయకులు చిరంజీవి, రమణ తదితరులు పాల్గొన్నారు.

చెరకు రైతుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వం

చెరకు కాటా వద్ద నిరసన చేస్తున్న నాయకులు

దేవరాపల్లి, న్యూస్‌టుడే : చెరకు రైతుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోందని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో గోవాడ చక్కెర కర్మాగారం మూతపడకుండా కాపాడి రైతుల పక్షాన నిలిచామన్నారు. ఈ కర్మాగారాన్ని తెరవాలంటూ మండలంలోని బోయిలకింతాడ చెరకు కొనుగోలు కేంద్రం వద్ద రైతులు, వైకాపా శ్రేణులతో కలిసి ఆయన ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఆదివాసీలపై అక్రమ కేసులు ఎత్తివేయాలి!

రోలుగుంట, న్యూస్‌టుడే: ఎం.కె.పట్నం శివారు ఛటర్జీపురం భూవివాదంలో ఈ ఏడాది అక్టోబర్‌లో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించి ఛటర్జీపురం ఆదివాసీలపై నమోదైన అక్రమ కేసులు ఎత్తివేయాలని నిజనిర్ధారణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ గ్రామానికి చెందిన భూవివాదంలో ఈ ఏడాది అక్టోబరు 21న కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో కీలక నిందితుడిగా భావిస్తున్న పీఎస్ అజయ్‌కుమార్‌తోపాటు మరి కొందరిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆదివారం ఆల్‌ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) అఖిల భారత కిషన్ మహాసభల ఆధ్వర్యంలో ఛటర్జీపురం భూములను ఈ కమిటీ సందర్శించింది. అక్టోబరులో చోటుచేసుకున్న వివాదంపై విచారణ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఐలాజ్ ప్రతినిధులు హరినాథ్, కె.జనార్దన్, మానుకొండ లచ్చిబాబు, బుగత శివలతోపాటు ఏపీ ఆదివాసీ సంఘం అనకాపల్లి జిల్లా కన్వీనరు మోసూరి రాజు, ఐదో షెడ్యూలు సాధన కమిటీ జిల్లా అధ్యక్షుడు కొత్తెం అప్పారావు పాల్గొన్నారు.

ఛటర్జీపురాన్ని సందర్శించిన నిజనిర్ధారణ కమిటీ

పథకాలు సమర్థవంతంగా అమలుచేయాలి

రోలుగుంట: ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కోడ్‌తో కలిపి కార్డుల్లో భద్రపరిచి సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయాలని సీడీపీఓ శిక్షణా అధికారి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, సర్పంచులు మండలస్థాయి అధికారులతో ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన నూతన వ్యవస్థలో ప్రతికుటుంబాన్ని ఒక యూనిట్‌గా పరిగణించి 1.4కోట్ల కుటుంబాలకు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జూన్ 2026 నాటికి అన్ని కుటుంబాలకు వర్తించేలా కార్యక్రమాన్ని రూపకల్పన చేయాలన్నారు.

రెండే చుక్కలతో నిండైన జీవితం

వడ్డాదిలో పోలియో చుక్కలు వేస్తున్న తాతయ్యబాబు

మాడుగుల గ్రామీణం, దేవరాపల్లి, కె.కోటపాడు, న్యూస్‌టుడే: మాడుగుల మండలంలోని ఒమ్మలి గ్రామంలో పల్స్‌పోలియో కార్యక్రమానికి సర్పంచి సింహాచలంనాయుడు, సన్యాసిరావు, ఒమ్మలి హాజరయ్యారు. దేవరాపల్లి మండలంలో పల్స్‌పోలియో విజయవంతమైంది. ఎం.అలమండలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చౌడువాడ, లంకవానిపాలెం ఆరోగ్యకేంద్రాల పరిధి 32 పంచాయతీల్లో పోలియో చుక్కలు వేశారు.

చోడవరం, రోలుగుంట, నాతవరం: గవరవరం పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం 4,251 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. గాంధీగ్రామంలో మండలాధ్యక్షురాలు గాడి కాసులమ్మ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోలుగుంట, బుచ్చెంపేట పీహెచ్‌సీల పరిధిలో సగటున 98శాతం విజయవంతమైందని రోలుగుంట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రావణి, భేగంలు తెలిపారు. నాతవరంలో 1564 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించామని వైద్యులు కేవీ భూషణం తెలిపారు.

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా జరిగింది. వడ్డాదిలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పోలియో రహిత సమాజం కోసం ఐదేళ్లలోపు పిల్లలు అందరికీ చుక్కల మందు వేయాలని సూచించారు.

చీడికాడ, రావికమతం న్యూస్‌టుడే: చీడికాడ, పెదగోగాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పల్స్ పోలియో జరిగింది. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులతో కలిసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని వైద్యాధికారులు సునీల్‌కుమార్, మురళీకృష్ణ ప్రారంభించారు. రావికమతం, కొత్తకోట పీహెచ్‌సీ పరిధిలోని 28 గ్రామ పంచాయతీలు, శివారు గ్రామాల్లోని పిల్లలకు పోలియో చుక్కలు వేయించారు. రావికమతం పీహెచ్‌సీ పరిధిలో 3,641 మంది పిల్లలు ఉండగా 3471 మందికి, కొత్తకోట పీహెచ్‌సీ పరిధిలో 1938 మందికి చుక్కలు వేయించారు.

గాంధీగ్రామంలో

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు

లక్ష్మీకాంత్
స్క్రీన్-1: అఖండ-2
స్క్రీన్-2: మోగ్లీ

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి హైదరాబాద్ సమీప ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన దుప్పలపూడి శ్రీనివాసరావు, సౌమ్య దంపతులు వారి కుమార్తె ఈష పేరిట ఆదివారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో దేవస్థానం ఈవో ఎన్.సుజాతకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

చుక్కల మందుకు చక్కని స్పందన

పెందుర్తిలో చిన్నారికి పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. పెందుర్తి గ్రామీణ మండలంలో శొంఠ్యాం పీహెచ్‌సీ, జీవీఎంసీ వార్డుల్లోని యూపీహెచ్‌సీల ఆధ్వర్యంలో అయిదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ జరిగింది. పాత పెందుర్తిలో మేయర్ పీలా శ్రీనివాసరావు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. సరిపల్లిలో సర్పంచి గొర్లె రామకృష్ణ, రాంపురంలో జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, చినముషిడివాడలో 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత, పాపయ్యరాజుపాలెంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు దీన్ని ప్రారంభించారు.

వేపగుంట, న్యూస్‌టుడే: జెర్రిపోతులపాలెంలో సర్పంచి మడక అప్పలరాజు పోలియో కేంద్రాన్ని ప్రారంభించి పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. వేపగుంట బీసీకాలనీలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, ఆర్.ఆర్.వెంకటాపురం, సత్తివానిపాలెం తదితర చోట్ల స్థానిక నాయకులు ఈ ప్రక్రియ ప్రారంభించారు.

పరవాడ, న్యూస్‌టుడే: లంకెలపాలెంలో ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ప్రారంభించారు. పరవాడ పీహెచ్‌సీలో వైద్యాధికారులు జయశ్రీకరిష్మా, హారిక చిన్నారులకు పోలియోచుక్కలు వేశారు. వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఈ ప్రక్రియ నూరు శాతం పూర్తయినట్లు వైద్యాధికారి కనకఅప్పారావు తెలిపారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో 97.4 శాతం మందికి పోలియో చుక్కలు వేసినట్లు సబ్బవరం పీహెచ్‌సీ వైద్యుడు ఎన్ఎస్ఆర్ చక్రవర్తి తెలిపారు. మొగలిపురంలో పెందుర్తి తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, 88వ వార్డులో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం నారపాడు శివారు బల్లిపాలెం గ్రామంలో రోడ్డుపక్కన వ్యర్థాలు పేరుకుపోయి రోగాల భయం వెంటాడుతోంది. –శ్రీనివాసరావు, బల్లిపాలెం. ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. –మామిడి శంకరరావు, సర్పంచి, నారపాడు

?: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం ఆంజనేయ స్వామి మందిర సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. –ఎస్.సత్యనారాయణ, మల్లునాయుడుపాలెం. ✓: ఆ ప్రాంతంలో వెంటనే వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. –బోను దేవుడమ్మ, సర్పంచి, మల్లునాయుడుపాలెం

వేపగుంట, న్యూస్‌టుడే: ?: వేపగుంట ఎస్సీకాలనీలో కాలువలు శిథిలావస్థకు చేరి ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. –శ్రీనివాసరావు. ✓: కాలువల నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటాం. –దిలీప్‌కుమార్, వర్క్స్ విభాగం ఈఈ

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ-భరణికం మార్గంలో వీధిదీపాలు లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. –శ్రీనివాస్, పరవాడ. ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. –రమేశ్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

పర్యాటక తీర ప్రాంతాల్లో వసతులేవీ..!

పరవాడ, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలో ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, అప్పికొండ తీరాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ఆకట్టుకునే విశాల పర్యాటక తీర ప్రాంతం ఉన్నప్పటికీ వసతులు లేని కారణంగా పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్, మెడ్‌టెక్ జోన్, హిందుజా వంటి పారిశ్రామిక సంస్థలు ఈప్రాంతంలో ఏర్పడడంతో పర్యాటకుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. కుటుంబ సభ్యులతో సంబంధిత తీరాలకు సరదాగా వచ్చే వారంతా వసతులు లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి చేస్తామని హామీలిచ్చినా కార్యరూపం దాల్చలేదని స్థానికులు అంటున్నారు. కూటమి సర్కారు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్పికొండ తీరం

ఇవీ సమస్యలు

తీరప్రాంతం వెంబడి పచ్చని తోటలున్నా పర్యాటకుల కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు, నీడనిచ్చే విడిది గొడుగులు, గుడారాలు లేవు. ★ పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు, పార్కులు కానరావు. విశ్రాంతి గదులు లేవు. ★ ప్రమాదకరం కానిచోట సరదాగా స్నానాలు చేసిన వారు దుస్తులు మార్చుకోవడానికి సౌకర్యం లేదు. ★ ఉప్పుటేరులో బోటు షికారు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేవు. ★ తిక్కవానిపాలెం తీరంలో దశాబ్దాల క్రితం నిర్మించిన సిమెంట్ బెంచీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ★ అప్పికొండలో మరుగుదొడ్లు మూతపడి ఉండడంతో పర్యాటకులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాటికి నిరంతర నీటి సరఫరా కల్పించి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధికి నోచుకోని తిక్కవానిపాలెం తీరం

చీకటి పడితే అంధకారమే..

ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరాల్లో సాయంత్రం వేళ విద్యుత్తుదీపాలు లేకపోవడంతో అంధకారం అలముకుంటుంది. సాయంత్రం సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆయా ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు కాసేపు తీర ప్రాంతంలో గడుపుదామన్నా చీకటి కారణంగా వీలుకాని పరిస్థితి. గతంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన సోలార్ ఎల్ఈడీ విద్యుత్తు దీపాలు కొద్దినెలలకే మూలకు చేరాయి. గుర్తు తెలియని వ్యక్తులు స్తంభాలు, సోలార్ పలకలు పట్టుకుపోయారు. పర్యాటకులు తాగునీరు, అల్పాహారం వంటివి ఇంటి నుంచే తెచ్చుకోవాల్సిన పరిస్థితి.

ఉక్కునగరంలో ఫిట్‌థాన్ ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న ఉక్కు డైరెక్టర్ డాక్టర్ సలీమ్ ఎం.పురుషోత్తమన్, తదితరులు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు–3), న్యూస్‌టుడే : ఉక్కునగరం డిపాల్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్‌థాన్ నిర్వహించారు. ఉక్కు డైరెక్టర్ డాక్టర్ సలీమ్ ఎం.పురుషోత్తమన్ ఫిట్‌థాన్ ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు. సుమారు 1100 మంది పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉక్కు అధికారులు ఎం.మధుసూదనరావు, ఎన్.భాను, వి.లీల, డాక్టర్ సారంగి, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఫాదర్ అనీష్ మాథ్యూ, ఫాదర్ సాజి, ఫాదర్ జోషఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గంగవరం మత్స్యకార గ్రామంలో పులిచెర్ల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పేద ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పులిచెర్ల మురళీకృష్ణ, మాజీ కౌన్సిలర్ పులిచెర్ల రాజేశ్వరి, ఫోర్ ఎస్ హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ పి.రవికిరణ్, డాక్టర్లు తపన్‌కుమార్, రాధిక, స్రవంతి, గీతిక, కృష్ణ, అనిల్, జోయ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

'ముకులపల్లి' సేవలు ఆదర్శనీయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: నాలుగు దశాబ్దాలుగా ఉక్కు, ఎన్ఏడీ నిర్వాసితుల సమస్యలపై పోరాడిన ముకులపల్లి అప్పారావు జీవితం ఆదర్శనీయమని భాజపా ఎస్సీ మోర్చా విశాఖ జిల్లా అధ్యక్షుడు ముకులపల్లి ప్రకాష్ కొనియాడారు. ఆదివారం పెదగంట్యాడ కూడలిలో ఉక్కునిర్వాసిత ఎస్సీ సంఘం అధ్యక్షుడు అప్పారావు 25వ వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజూరి దీపక్, నాయకులు మహేశ్వరరెడ్డి, వంశీ, సత్యారావు, భువనేశ్వర, మునలయ్య, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వన సమారాధన

పాపయ్యరాజుపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: సుజాతనగర్ సత్యసాయి భజన మండలి సభ్యులు ఆదివారం పాపయ్యరాజుపాలెం సమీప మూడు ఆలయాల కూడలి వద్ద వన సమారాధన చేపట్టారు. సత్యసాయి ఆనంద నిలయం గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సత్యసాయి చిత్రపటం వద్ద దీపారాధన చేసి భజనలు చేశారు. భజన మండలి సభ్యులు భూలి, గోపి, బుజ్జిబాబు, సీతారాం, తారారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న భజన మండలి సభ్యులు

షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు కర్నూలులో జరిగిన 44వ సీనియర్ మహిళలు, పురుషుల రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అనకాపల్లి జిల్లా మహిళల జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు అనకాపల్లి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పైలా ప్రవీణ్ తెలిపారు. బాపట్ల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, గుంటూరు జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి జట్టు సభ్యులను ఆయన అభినందించారు.

పోటీల్లో విజేతగా నిలిచిన అనకాపల్లి జట్టు

రాంకీ ఫౌండేషన్ చేయూత

పాఠశాల ప్రధాన ద్వారానికి గేటుతో పాటు సమీపంలో నిర్మించిన సైకిల్ షెడ్డు

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో వసతులు కల్పనకు రాంకీ ఫౌండేషన్ చేయూతనిచ్చింది. సంస్థ సీఎస్ఆర్ నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టింది. పాఠశాల ప్రధాన ద్వారానికి కొంతకాలంగా గేటు లేక పోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నూతన గేటు తయారు చేయించి ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేశారు. విద్యార్థుల సైకిళ్ల కోసం ఓ షెడ్డు నిర్మించారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించి గోడలపై ఆకట్టుకునే బొమ్మలు కూడా వేయించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సింహగిరిపై వైభవంగా అయ్యవారి సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం అయ్యవారి సేవ వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి బంగారు తొళక్కియాన్ పల్లకిలో కొలువుదీర్చారు. పండితుల పారాయణాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ పల్లకిని నడకలతో ఆలయ బేడామండపంలో దేవతామూర్తుల తిరువీధి నిర్వహించారు. అంతర్ సన్నిధి వద్ద స్వామి, అమ్మవార్లకు పూలదండలు మార్చి తాంబూలం నివేదించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తిరుప్పావై సేవాకాలం జరిగింది. అమ్మవారి తిరువీధి, తిరుప్పావై పాశుర విన్నపం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తిరువీధిలో పాల్గొని గోవింద నామస్మరణ చేశారు.

స్వామి, అమ్మవార్లు

నూతన నియామకం

ఏకగ్రీవంగా ఎన్నికైన యాదవ సంఘం సభ్యులు

సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు బి.సాయినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం సబ్బవరం శ్రీసీతారామ కల్యాణ మండపంలో పెందుర్తి నియోజకవర్గ యాదవ సంఘం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడిగా పెందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు కసిరాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పల్లా కృష్ణ, ఉపాధ్యక్షుడుగా గొల్లగాని సత్యనారాయణ, కార్యదర్శులుగా నమ్మి నరసింగరావు, నంబారు రమణ, కోశాధికారిగా ఈశ్వరరావు, ఆదిలా ప్రతినిధిగా పల్లా సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా మొల్లి సత్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, మూడు మండలాలకు చెందిన అధ్యక్షులు, పాల్గొన్నారు.

వైభవంగా తిరుప్పావై సేవాకాలం

పూజలందుకుంటున్న స్వామివారు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుప్పావై సేవాకాలం వైభవోపేతంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువజామున శ్రీవారికి ధూపదీప సేవలు నిర్వహించారు. సేవాకాలం నిర్వహించి తిరుప్పావై ఆరవ పాశురాన్ని స్వామికి విన్నపం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పాశుర పారాయణం చేశారు. అర్చకులు స్వామికి విశేష నివేదనలు సమర్పించి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు.

ఆలయ ప్రాంగణంలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఆధ్యాత్మికం

వేపగుంట, న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పాశుర విన్నపం, తిరుప్పావై ప్రవచన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. లక్ష్మీపురం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, చింతలగ్రహారం కృష్ణాలయంలో, సింహపురికాలనీ రామాలయంలో, లక్ష్మీనరసింహనగర్ గోపీజనవల్లభస్వామి ఆలయంలోనూ ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు

నాయుడుపాలెం నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

పరవాడ, న్యూస్‌టుడే: లంకెలపాలెం, నాయుడుపాలెం, పరవాడ, వాడచీపురుపల్లి, ధర్మారాయుడుపేట, కలపాక, సినిమాహాల్ కూడలి తదితర ప్రాంతాల్లో ఆదివారం మేలుకొలుపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు రామాలయాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. నగర సంకీర్తనలో స్థానికులు పాల్గొని భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

దేశపాత్రునిపాలెంలో రింగులైట్లు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం బాలాజీనగర్, శ్మశానవాటిక, దుర్గమాంబ గుడి, శ్రీసాయి దర్శిని రెసిడెన్సీ, సుబ్రహ్మణ్యనగర్-2 తదితర ప్రాంతాల్లో కొత్తగా వీధి దీపాలు (రింగులైట్లు) ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఆదివారం రాత్రి వాటిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలు, కాలనీల్లో విద్యుత్తు దీపాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు. కూటమి నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వీధిదీపాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు

హద్దు దాటితే బహిష్కరణ వేటు తప్పదు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ కె.వి.సతీశ్‌కుమార్

పెందుర్తి, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు హద్దు దాటితే నగర బహిష్కరణ వేటు తప్పదని పెందుర్తి సీఐ కె.వి.సతీశ్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు స్టేషన్ ఆవరణలో ఆదివారం సాయంత్రం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వపు ప్రవృత్తిని వీడి మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. నేరాలకు పాల్పడినా, నేరాలు చేసే వారికి ఆశ్రయం కల్పించినా, సహకరించినా కఠిన చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

వాహనదారులకు అవగాహన

వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ సురేశ్

పెందుర్తి, న్యూస్‌టుడే: నగరంలో ఇకపై ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు శిరస్త్రాణం ధరించని వాహన చోదకులకు బంకుల్లో పెట్రోల్ వెయ్యరని వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ కె.సురేశ్ తెలిపారు. ఇటీవల పాత గోశాల - వేపగుంట బీఆర్టీఎస్ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన చినముషిడివాడ వద్ద శిరస్త్రాణం ఆవశ్యకతపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

★ వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వెనుక కూర్చున్నవారు కూడా తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. ★ పెందుర్తి, సింహాచలం బీఆర్టీఎస్ కారిడార్లలోని మధ్య మార్గంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర పెద్ద వాహనాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. ★ ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించవద్దని సూచించారు. వాహన చోదకులు నిబంధనలు పాటించి ప్రాణరక్షణ చర్యలు అనుసరించాలని కోరారు.

మానసిక వికాసానికి ధ్యానం దోహదం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ధ్యానంతో మానసిక వికాసం వృద్ధి చెందుతుందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ధ్యాన దినం పురస్కరించుకుని అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నెల్లిముక్కు కల్యాణ మండపంలో ధ్యాన వేడుక నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, అహింస ధ్యానకేంద్రం నిర్వాహకులు మీసాల శివగణేశ్వరరావు, వనితి, పిట్టా రెడ్డి, కిలాని ముసలయ్య, ధ్యాన కేంద్రాల సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, చిత్రంలో ధ్యాన కేంద్రాల ప్రతినిధులు

టిడ్కో ఇళ్లు కేటాయించాలి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడలో టిడ్కో ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ఆదివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసనకు దిగారు. వక్తలు మాట్లాడుతూ.. ఈనెల 17 నాటికల్లా గృహాలు కేటాయిస్తామని అధికారులు మాట తప్పారన్నారు. నేటికీ కేటాయించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నివాసిత సంఘం సభ్యులు రమణి, లక్ష్మి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో లబ్ధిదారుల నిరసన

సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులోని ఏపీ ఈపీడీసీఎల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (సీఓఈఈటీ) కార్యాలయ భవన సముదాయంలో ఏపీ విద్యుత్తురంగ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఎలక్ట్రాన్‌వైబ్-ఏపీ హ్యాకథాన్ ఫలితాలను ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. హ్యాకథాన్ పోటీలను సీఓఈఈటీ, క్లీన్ క్లైమేట్ ఫౌండేషన్ (సీసీఎఫ్) ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ సంయుక్తంగా నిర్వహించాయి. ఇందులో హమ్‌సాట్, ఐసెన్‌సెస్, ఏరోవ్యన్, స్మార్ట్ గ్రిడ్, ఓల్డ్‌వైస్ సంస్థలు విజేతలుగా నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవంలో సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ.. వివిధ సంస్థల మధ్య పోటీతత్వంతో పాటు సృజనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించి, స్టార్టప్ సంస్థలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గత ఏడాది ఏపీ హ్యాకథాన్-2024 విజేతలకు ఇప్పటికే ఏపీఈపీడీసీఎల్‌లో ప్రాజెక్టులు కేటాయించామన్నారు. ★ స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించే దిశగా ఈ ఏడాది అక్టోబరులో ఆహ్వానించిన మేరకు 45 సంస్థలు పాల్గొన్నాయి. వీటిల్లో రాష్ట్ర విద్యుత్తు పంపిణీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు స్మార్ట్ డేటా, ఆధారిత ఆధునిక సాంకేతిక పరిష్కార మార్గాలను కనుగొనేలా తుదిజాబితాలో 9 స్టార్టప్ సంస్థలు ఎంపికయ్యాయన్నారు. సీఎండీలు పృథ్వీతేజ్, లోతేటి శివశంకర్, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.

విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీలు పృథ్వీతేజ్, శివశంకర్

బింగో సర్కస్ ప్రారంభం

జ్యోతి వెలిగించి సర్కస్‌ను ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు

వేపగుంట, న్యూస్‌టుడే: పొట్టకూటి కోసం ప్రమాదకర విన్యాసాలతో చూపరులను అలరించే సర్కస్ కళాకారులను ప్రజలు ఆదరించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు కోరారు. వేపగుంట ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం వారు కళాకారులతో కలసి బింగో సర్కస్‌ను ప్రారంభించారు. వేపగుంట, పెందుర్తి పరిసర ప్రాంతాల ప్రజలకు ఇదో చక్కటి అవకాశమని, ఈ ప్రదర్శన పిల్లలకు చూపించడం వల్ల వారికి వినోదంతోపాటు, విజ్ఞానాన్ని అందించే అంశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సునీల్ చౌహాన్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారుల విన్యాసాలను అతిథులు తిలకించి వారిని అభినందించారు.

జగన్ పుట్టిన రోజు వేడుకలు

పెందుర్తి, పరవాడ, వేపగుంట, సబ్బవరం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నియోజకవర్గంలో ఆదివారం పలుచోట్ల జరిగాయి. పెందుర్తిలో చిన అప్పలనాయుడు యువసేన ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్వతీపురం మన్యం జిల్లా వైకాపా పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు తదితరులు కేక్ కోశారు. 96వ వార్డు డీఆర్‌సీ మాల్ వద్ద అన్నదానం నిర్వహించారు. పరవాడ మండలం పిట్టవానిపాలెంలో నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వేపగుంట సమీప గౌతంనగర్‌లో అనాథ పిల్లలకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారు. మొగలిపురంలో నిత్యావసర వస్తువులు అందించారు. మల్లునాయుడు చెరువు గట్టుపై మొక్కలు నాటారు.

కేకు కోస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

11వ వర్ధంతి

మంచికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి, మహోన్నతమైన వ్యక్తిత్వంతో అందరినీ ఆప్యాయంగా చిరునవ్వుతో పలుకరిస్తూ... పేదల పెన్నిధిగా పిలువబడే మీరు దైవస్వరూపులు. ఎందరో విద్యార్థులకు బంగారు భవిష్యత్తును ఇచ్చి, కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన మీరు మానుండి దూరమై నేటికి 11 సం॥లు గడిచిననూ మీ మధుర జ్ఞాపకాలు మరువలేనివి. భగవంతుని సన్నిధిలో మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ పేరూరి అప్పారావు గారు
Rtd. HM

ఆలయ ధర్మకర్త: షిరిడిసాయి ఆలయం
జననం: 01-07-1946 మరణం: 22-12-2014
పాపయ్యరాజుపాలెం

భార్య: రమణమ్మ గారు
Rtd. Teacher

కుమారులు - కోడళ్ళు:
పి.వి. రఘు (లేటు) - విజయభాస్కరలక్ష్మి
పి.ఎ. రాజశేఖర్ (లేటు) - జానకి, టీచర్

కుమార్తెలు - అల్లుళ్ళు:
కె. కృష్ణవేణి - వెంకటరావు, సివిల్ ఇంజినీర్
కె. శాంతికుమారి, టీచర్ - నాగేశ్వరరావు, టీచర్

చెల్లి: బుచ్చియ్యమ్మ

మనుమలు, మనుమరాళ్ళు: చందనసాయి, ప్రత్యూష, గ్రీష్మసంపత్, వెంకటసత్యసంహిత్, జవహర్, షర్మిల, మనస్విని, పూర్ణిక శ్రేయస్విని

(c) eenadu

అక్రమాల తతంగం

➤ ఐసీడీఎస్‌లో అస్తవ్యస్తం! ➤ 65 ఏళ్లకూ ఉద్యోగ విరమణ లేని వైనం

ఏదీ పట్టని యంత్రాంగం!

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో (ఐసీడీఎస్) నిత్యం ఏదో ఒక సమస్యపై వివాదం తలెత్తడం సర్వసాధారణమైంది. రెండు జిల్లాల్లోనూ పరిపాలన అస్తవ్యస్తంగా.. గందరగోళంగా మారింది. అత్యధిక సీడీపీఓలు ఉన్నతాధికారులను అసలు లెక్కచేయడం లేదు. ధర్మవరం సీడీపీఓ అక్రమాల బాగోతంపై ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయానికే ఆధారాలతో సహా ఫిర్యాదు వెళ్లడం ప్రస్తావనార్హం. కొందరు అంగన్‌వాడీ సిబ్బందికి పదవీ విరమణ వయసు దాటినా విధుల్లోనే ఉంచడం విశేషం. ఈ అక్రమాల తతంగాన్ని స్వయంగా ఆ శాఖ డైరెక్టర్ వారంతపు వీసీలో ప్రస్తావించడం కలకలం రేపుతోంది.

65 ఏళ్లు దాటినా విధుల్లోనే..

రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేనివిధంగా అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లు. అంగన్‌వాడీ సిబ్బందికీ ఇదే వర్తిస్తుంది. 'ఈ-సాధన' రికార్డు ప్రకారం సీకేపల్లి ప్రాజెక్టులో ఒక ఆయాకు 65 ఏళ్ల ఐదు నెలలు దాటినా విధుల్లో ఉన్నారు. ఇదే ప్రాజెక్టులో మరొకరు, బత్తలపల్లి, మడకశిర, హిందూపురం ప్రాజెక్టుల్లో ఒక్కొక్కరు ఉన్నారు. వీరందరికి 62 ఏళ్లు పూర్తయ్యాయి. ఆయా ప్రాజెక్టుల సీడీపీఓలు మాత్రం వారికి వత్తాసు పలికేలా నివేదిక పంపించారు.

అనంతలో ఎఫ్ఎన్ఓ.. ధర్మవరంలో ఆయా

ధర్మవరం ప్రాజెక్టు గాంధీనగర్-2 అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు(ఆయా) 2022, 2024 సంవత్సరంలో లెక్కలేనన్నీ సెలవులు పెట్టారు. అయినా సీడీపీఓ, సంబంధిత సూపర్‌వైజర్ ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ విషయమై అదే కేంద్రంలో పని చేసే కార్యకర్త అన్ని ఆధారాలతో సీఎం కార్యాలయానికి, పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర సంజాయిషీ ఇవ్వాలంటూ సీడీపీఓ, సూపర్‌వైజర్లకు ఈనెల 12న తాఖీదులు ఇస్తే.. ఇప్పటికీ వారు సమాధానం ఇవ్వలేదు. సదరు ఆయా అనంత ఆస్పత్రిలో ఎఫ్ఎన్ఓగా పని చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆమె అంటే హడల్!

ధర్మవరం సీడీపీఓపై లెక్కలేనన్నీ ఫిర్యాదులు అందాయి. ఈమెకు తాఖీదు ఇవ్వడానికి పీడీ భయపడే పరిస్థితి. సీడీపీఓను టచ్ చేస్తే కొందరు రిపోర్టర్లుగా చెప్పుకొనే వ్యక్తులు పీడీని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇదే విషయాన్ని ఆమె స్వయంగా డైరెక్టర్ ముందు మొరపెట్టుకున్నట్లు తెలిసింది. ఆమెపై సమగ్ర నివేదిక పంపాలని డైరెక్టర్ ఆదేశించినా నేటికీ అతీగతీలేదు.

సీడీపీఓలకు తాఖీదులు ఇచ్చాం

ధర్మవరం పట్టణం గాంధీనగర్-2 ఆయాపై విచారణ చేశాం. అక్కడి సీడీపీఓ, సూపర్‌వైజర్‌కు తాఖీదు ఇచ్చాం. దీనిపై సమగ్ర నివేదిక డైరెక్టర్‌కు పంపిస్తున్నాం. వయసు దాటినా విధుల్లో ఉంచిన ఆ నాలుగు ప్రాజెక్టుల సీడీపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. దీనిపై కలెక్టర్‌కు ప్రత్యేక నివేదిక పంపిస్తాం. - **ప్రమీల, పీడీ, ఐసీడీఎస్**

పోలియో రహిత సమాజం నిర్మిద్దాం: కలెక్టర్

చిన్నారికి మందు చుక్కలు వేస్తున్న కలెక్టర్ ఆనంద్, చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం(వ్యవసాయం): పోలియో రహిత సమాజం నిర్మించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని, 0-5 ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించుకోవాలని జిల్లా పరిపాలనాధికారి ఆనంద్, అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. ఆదివారం అనంతపురం నగరం కోర్టురోడ్డులోని నెహ్రూ పురపాలక ప్రాథమికోన్నత పాఠశాలలో చిన్నారులకు చుక్కలు మందు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా అంతటా వైద్యాధికారులు, సిబ్బంది చిన్నారులకు చుక్కలు వేశారన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు. జిల్లాలో 2,84,774 మంది 5 ఏళ్లలోపు చిన్నారులున్నారు. 1,785 బూత్‌ల్లో 5,247 మంది వైద్య సిబ్బందిని నియమించామని తెలిపారు. ఎంపీ మాట్లాడుతూ.. నిండు జీవితానికి రెండు చుక్కలు చిన్నారులకు వేయించుకోవాలన్నారు. పల్స్ పోలియో ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకులు హేమంత్‌కుమార్, డీఎంహెచ్‌వో ఈబీ దేవి, డీఐవో శశిభూషణ్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి పాల్గొన్నారు.

అడ్డంగా నిలిపేస్తే.. ఆపదే!

బెంగళూరు- హైదరాబాద్ జాతీయ రహదారిపై ఇష్టానుసారం వాహనాలను ఆపి కొందరు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ఏడాదిలో ఆగి ఉన్న వాహనాలను ఢీకొని ఎంతోమంది మృత్యువాత పడినా మేల్కొలుపు ఉండటం లేదు. హంపాపురం వద్ద జాతీయ రహదారిపై బెంగళూరు వైపు వెళ్తున్న ఓ లారీని డ్రైవర్ రోడ్డుపై అడ్డంగా ఆపేశాడు. వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలకు ఈ విషయం తెలిపేందుకు హెచ్చరిక బోర్డును పెట్టాలన్న విషయాన్ని మర్చిపోయాడు. ఇలా చేయడం భారీ ప్రమాదాలకు తావిచ్చినట్లే అవుతుంది. - **ఈనాడు, అనంతపురం**

రద్దీ.. రద్దు.. ఊగిసలాట

ఇతర డిపోలకు బస్సుల తరలింపు

అనంతపురం ఆర్టీసీ డిపోలో బస్సు రాకకోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

అనంతపురం (అశోక్‌నగర్), న్యూస్‌టుడే: అన్ని రాష్ట్రాలను, ప్రాంతాలను కలిపే విధంగా జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్సులు అనుసంధానం చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ప్రస్తుత పరిస్థితి ఉంది. అసలే తక్కువగా బస్సులు ఉండగా ఉన్న వాటిని కూడా ఆక్యుపెన్సీ పడిపోయిందన్న సాకు చూపి ఇతర డిపోలకు తరలిస్తున్నారు. దీంతో అనంతపురం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఒక్కోసారి బస్సుల్లేక ప్రయాణాలను రద్దు చేసుకొనే దయనీయ పరిస్థితి ఏర్పడుతోంది. అనంతపురం ఆర్టీసీ డిపో నుంచి ఇటీవలే ఏకంగా ఏడు బస్సులు ఇతర డిపోలకు తరలించడంతో జిల్లా కేంద్రంలోని ప్రజలకు అవసరం లేదా? అన్న ప్రశ్న తలెత్తుతోంది.

జిల్లాలో మొత్తం డిపోలు: 7
బస్సుల సంఖ్య: 460
రోజుకు తిరిగే కిలోమీటర్లు: 1,96,992

డిమాండ్ అమాంతం..

స్త్రీశక్తి పథకం అమలు నుంచి బస్సుల్లో విపరీత రద్దీ ఏర్పడింది. ఆదివారం, శనివారం రోజుల్లో మరింత రద్దీ పెరుగుతోంది. ఆక్యుపెన్సీ రేటు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రద్దీగా ఉన్న రూట్లుకు బస్సులను సమకూర్చాల్సిన అవసరం ఏర్పడింది.

★ ఇతర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చి ఇక్కడి నుంచి ఏ ప్రాంతానికి అయినా వెళ్లడానికి అవకాశం ఉంటుంది. అనంతపురంలోనే జిల్లాలోని అన్ని డిపోల పరిధి కంటే ఎక్కువ జనాభా ఉంది. నగరంతోపాటు సరిహద్దు గ్రామాల్లో 5 లక్షల జనాభా ఉంది. జిల్లా కేంద్రంలోనే సాధారణంగా ఎక్కువగా ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, ఇతరత్రా అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఇతర ప్రాంతాలకు బస్సులు అవసరం ఎక్కువగా ఉంటుంది. జిల్లా కేంద్రంలో ఉన్న బస్సులను అక్టోబరులో ఐదు, డిసెంబరు 20న రెండు బస్సులు వెళ్లే రూట్లు రద్దు చేసి రాయదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, గుంతకల్లు డిపోలకు పంపడంతో అనంతపురం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.

అగచాట్లెందరికో..

★ అనంతపురం డిపో నుంచి ఇతర ప్రాంతాలకు ఏడు బస్సులను పంపి ఆ రూట్లలో బస్సులు లేకుండా చేశారు. ★ నెల్లూరుకు ఉదయం 9 గంటలకు, రాత్రి 9 గంటల సర్వీసు బస్సు రద్దు ★ హైదరాబాద్‌కు ఉదయం 7 గంటలకు, 10 గంటలకు రాత్రి 9 గంటల సర్వీసు రద్దు ★ బెంగళూరు సాయంత్రం 3.30 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రద్దు

అనంత లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా పూల నాగరాజు

ఈనాడు, అనంతపురం: అనంతపురం లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జి.శ్రీధర్‌చౌదరిని నియమించారు. మరోసారి అధ్యక్ష పదవిని బీసీకి కేటాయించడం పట్ల ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. గతంలో వాల్మీకి బోయ సామాజికవర్గానికి చెందిన గాది లింగప్ప (గుంతకల్లు) లింగరాజు (ఉరవకొండ), కాలవ శ్రీనివాసులు (రాయదుర్గం) జిల్లా తెదేపా అధ్యక్షులుగా పనిచేశారు. రాయదుర్గం నియోజకవర్గం గుమ్మఘట్టకు చెందిన పూలనాగరాజు 1984లో సాధారణ కార్యకర్తగా తెదేపాలో చేరారు. 1987-88లో రాయదుర్గం తాలూకా యువత అధ్యక్షుడిగా ఉన్నారు. 1989-94 వరకు అడహక్ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. తర్వాత 1994లో గుమ్మఘట్ట జడ్పీటీసీగా తెదేపా తరపున పోటీ చేసి గెలుపొందారు. తర్వాత కొన్నేళ్లు జిల్లా కమిటీ సభ్యుడిగా, అధికార ప్రతినిధిగా ఉన్నారు. 2014లో మళ్లీ గుమ్మఘట్ట జడ్పీటీసీగా గెలుపొందారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం 2017లో అనంతపురం జడ్పీ ఛైర్మన్‌గా అవకాశం కల్పించింది. 2024 ఎన్నికల్లో రాయదుర్గం టికెట్ ఆశించినా పార్టీ అంగీకరించలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయన్ను ఆర్టీసీ కడప రీజినల్ ఛైర్మన్‌గా నియమించింది.

కాలవ నిరాకరించడంతో..

పార్లమెంటు అధ్యక్ష పదవి కోసం త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరించారు. గడ్డం సుబ్రహ్మణ్యం, ఉన్నం మారుతిచౌదరి, ఆలం నరసానాయుడు పేర్లు మొదట్లో వినిపించాయి. అయితే బీసీలకే పదవి ఇవ్వాలని పార్టీ పెద్దలు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేరును దాదాపు ఖరారు చేశారు. అయితే పదవి స్వీకరించేందుకు కాలవ పూర్తిగా నిరాకరించారు. తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా కాలవ ఒప్పుకోలేదు. దీంతో కొంత కసరత్తు తర్వాత పూల నాగరాజు పేరును ప్రకటించారు.

ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్‌చౌదరి

రాంనగర్(అనంతపురం): పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కూడేరు మండలం కడదరకుంటకు శ్రీధర్‌చౌదరికి అవకాశం లభించింది. పార్టీ కోసం ఆయన 1988 నుంచి పని చేస్తున్నారు. తెలుగు విద్యార్థి, తెలుగు యువత, కూడేరు మండల పార్టీ అధ్యక్షుడిగాను, జిల్లా ఉపాధ్యక్షుడిగాను, అధికార ప్రతినిధిగా, ప్రధాన కార్యదర్శిగా వివిధ పదవుల్లో పని చేశారు. రెండోసారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

కోటగోడకు ఆక్రమణ చెదలు

■ కూలగొట్టి ఇంటి నిర్మాణాలు చోద్యం చూస్తున్న అధికారులు

తలుపుల, న్యూస్‌టుడే: అక్రమార్కులకు తలుపుల కోట కాసులు కురిపిస్తోంది. చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు అవుతున్నా పట్టించుకొనే వారే కరవయ్యారు. రాయల కాలంలో తలుపులను పాలించిన సామంతరాజులు (పాలేగాళ్లు) కోటగోడను నిర్మించారు. వృత్తాకారంలో ఉన్న కోటగోడ 8.95 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. కబ్జాదారులు కోటగోడను పగులకొట్టి రాళ్లు, మట్టి తరలించి గోడ స్థానంలో ఇళ్లు, రస్తాలను ఏర్పాటు చేసి క్రయవిక్రయాలు జరిపారు.

మిగిలింది 30 శాతమే

ప్రస్తుత సమాచారాన్ని బట్టి 70 శాతం పైగా కోట గోడ ఆక్రమణకు గురైంది. మరో 30 శాతం మాత్రమే ఈశాన్యంలో మిగిలింది. ఇంత జరిగినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీటిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రస్తా పేరుతో కబ్జా

ఓ గుత్తేదారు వేసిన ఇంటి ప్లాట్లకు రస్తా పేరుతో షాదీమహల్ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించాడు. ప్రధాన కోటగోడను కళాశాల ఎదురుగా, పోలీస్ వెనుకవైపు, బీసీ వసతిగృహం సమీపంలో మూడుచోట్ల, కోటగోడ ఉత్తరం వైపు కోటనుగోడను పగులగొట్టి రహదారి వేసి ఇంటి నిర్మాణాలు చేపట్టారు.

ఆనవాళ్లు కనుమరుగు

సర్వే నంబరు 415లో 8.93 ఎకరాల విస్తీర్ణంలో వృత్తాకారంలో కోటగోడను సామంత రాజులు నిర్మించారు. ఆ కోటగోడ ఆనవాళ్లు చాలావరకు తుడిచిపెట్టుకుపోయాయి. కోటలో మరో చిన్నపాటి లోకోటను 417 సర్వేనంబరులో 1.26 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. వీటి ఆనవాళ్లు రికార్డులకే పరిమితమయ్యాయి. ఆ మొత్తం స్థలాన్ని చుట్టూ ఉన్న పట్టాదారులు కబ్జాచేసి ప్లాట్లు వేసి, వేరు వేరు సర్వేనంబరు వేసి ఏకరంగా రిజిస్టర్లు చేయించుకున్నారు.

అక్రమార్కులపై చర్యలు తప్పవు - రెడ్డిశేఖర్ తహసీల్దార్ తలుపుల

కోటగోడ ఆక్రమణలు ఇప్పటివి కావు. కోటగోడను ధ్వంసం చేసి రహదారులు, ఇళ్లు నిర్మించుకొన్నారు. ఈ మధ్య విశ్రాంత సైనికుడి స్థలం కబ్జాపై కొలతలు వేశాం. చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించాం. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా చూస్తా, ఉన్న కోటగోడను రక్షించేలా చర్యలు తీసుకుంటాం.

అంతటా సాయి స్వరూపం

విశ్వాసులకు ఏసు సందేశం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: దేవుడిలో భక్తుడు లీనమవడమే దైవత్వం అన్న సత్యసాయి సందేశాన్ని కళ్లకు కట్టినట్లుగా భక్తులు చూపారు. ఆదివారం సాయికుల్వంత్ మందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో భాగంగా న్యూజిలాండ్ దేశానికి చెందిన భక్త బృందం 'త్వమేవాహం' (నేనే నీవు..నువ్వే నేను) నృత్య నాటిక ప్రదర్శించింది. సత్యసాయి, శ్రీకృష్ణుడు, ఏసు ప్రభు, శిర్డిసాయి మానవాళికి అందించిన సందేశాన్ని ఈ నాటిక ద్వారా తెలిపింది. అనంతరం భక్తులు సత్యసాయి, ఏసు భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించి, మహాసమాధిని దర్శించుకున్నారు. న్యూజిలాండ్ బాలవికాస్ చిన్నారులు తమ సంప్రదాయ నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. సత్యసాయి గ్లోబల్ క్రిస్మస్ బృందం ప్రశాంతి నిలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసింది.

పాలిటెక్నిక్ కళాశాలల మహిళా జోనల్ పోటీలు

హిందూపురం: హిందూపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి రెండు రోజులు పాలిటెక్నిక్ కళాశాల జోనల్ స్థాయి మహిళా పోటీలు కొనసాగుతాయని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కృష్ణమనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 28వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గ్రేమ్స్ జోనల్ స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లాల 10 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 150 మంది మహిళా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రన్నింగ్, షాట్‌పుట్, హైజంప్, లాంగ్ జంప్, కోకో, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్ తదితర పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు తిరుపతిలో 2026, జనవరి మాసం చివరిలో జరిగే ఫైనల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి పీడీ వెంకట్రాములు, అధ్యాపకులు రెడ్డిశేఖర్, శ్రీనివాసులు, హరినాథ్‌బాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెట్

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) ఆదివారం ముగిసాయి. ఈ నెల 10న ఆరంభమై 21న ముగిశాయి. జిల్లాలో 7 కేంద్రాల్లో చివరి రోజు 1,256 మందికిగాను 1129 మంది హాజరయ్యారు.

నేటి నుంచి కానిస్టేబుళ్లకు శిక్షణ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇటీవల ఎంపికైన స్టైఫండరీ కేడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల (ఎస్‌సీటీపీసీ)కు ఈనెల 22 నుంచి 9 నెలల శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో, శిక్షణార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయా? అనే అంశాన్ని పరిశీలించేందుకు అనంతపురం జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డీటీసీ) ఆదివారం డీఐజీ షిముషి, ఎస్పీ జగదీశ్ వేర్వేరుగా సందర్శించారు. అధికారులు డీటీసీ పరిసర ప్రాంతాలు, వసతులు, బ్యారక్‌లు, వంటశాల, జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్ తదితర ప్రాంతాలను పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ అలియాస్ బాషా, డీటీసీ, ఏఆర్ డీఎస్పీలు సూర్యనారాయణరెడ్డి, నీలకంఠేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న అనంతపురం రేంజి డీఐజీ షిముషి

స్వచ్ఛ సేవకులకు.. చలి గండం

■ వణుకుతూనే పారిశుద్ధ్య పనులు ■ అందని రక్షణ సామగ్రి

చెత్త ఊడుస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

ధర్మవరం పట్టణం, కదిరి, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పడిపోతున్నాయి. చలి వణికిస్తోంది. పారిశుద్ధ్య కార్మికులు మాత్రం కోడి కూయక ముందే ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి కేటాయించిన ప్రదేశాలకు చేరుకొని చెత్తను తొలగించి పట్టణాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతున్నారు. అయితే చలి నుంచి రక్షణ పొందేందుకు చలి కోట్లు, చేతులకు తొడుక్కునే గ్లౌజులు లేవు. ఆప్రాన్ దుస్తులు, రెయిన్ కోట్లు, బూట్లు, సబ్బులు, కొబ్బరినూనె, మాస్కులు పంపిణీ చేయకపోవడంతో కార్మికులు వణుకుతూనే చెత్తను ఊడ్చుతున్నారు. తమ కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీల్లో కార్మికుల వివరాలు

● ధర్మవరం పట్టణంలో 40 వార్డులుండగా 350 మంది కార్మికులు అవసరం. అయితే 271 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి మూడేళ్ల నుంచి ఎటువంటి సామగ్రి అందడం లేదు.

● కదిరి పురపాలకలో 36 వార్డులకుగాను 229 మంది ఉండాల్సి ఉండగా 165 మంది కార్మికులు పని చేస్తున్నారు.

● హిందూపురంలో 420 మందికిగాను 360 మంది కార్మికులు పనిచేస్తున్నారు.

● పుట్టపర్తిలో వంద మంది అవసరం ఉండగా 59 మంది మాత్రమే ఉన్నారు. వీరందరికి పరికరాలు, సామగ్రి అందడం లేదు.

త్వరలోనే అందజేస్తాం

- నటరాజ్, శ్యామ్‌సన్, కదిరి, ధర్మవరం పట్టణ శానిటేషన్ అధికారులు

పారిశుద్ధ్య కార్మికులకు రెగ్యులర్ దుస్తులు, ఉపకరణాలు, కాస్మోటిక్స్‌ను త్వరలోనే అందజేస్తాం. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

మైనర్లతో ఆ తప్పు ముప్పే!

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:

ఈ ఏడాది ప్రారంభంలో శ్రీసత్యసాయి జిల్లాలో ఓ యువకుడు ప్రేమపేరుతో ఓ బాలికపై లైంగికదాడి చేశాడు. ఆ ఘటనను ఫోన్‌లో చిత్రీకరించి మిత్రులకు పంపాడు. దీన్ని చూపి బెదిరించి రెండేళ్లపాటు ఇరవై మందికి పైగా అత్యాచారం చేశారు. బాధితురాలు గర్భం దాల్చడంతో విషయం బయటకు వచ్చింది. 15 మందిపై పోక్సో కేసు నమోదైంది. అందులో పదిమంది యువకులే.

★ తాజాగా అనంతపురం నగరంలో చదువుతున్న ఓ అమ్మాయిని ముగ్గురు యువకులు వేర్వేరుగా ప్రేమపేరుతో వేధించారు. ఆమెను బెదిరించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అందరిపై పోక్సో నమోదైంది.

జిల్లాలో పోక్సో కేసులిలా..	
2023	89
2024	82
2025	79

సామాజిక మాధ్యమాలతో పక్కదారి

పిల్లలు, టీనేజర్లు సోషల్ మీడియాకు విపరీతంగా బానిసలవుతున్నారు. పిల్లలు వారికి తెలియకుండానే లైంగిక విషయాలపై ఆసక్తి ఏర్పరచుకుంటున్నారు. టీనేజీలోకి అడుగు పెట్టిన మగ, ఆడపిల్లల్లో ఈ ధోరణికి ఎక్కువైంది. ఈ దుష్ప్రభావాల నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

బాలబాలికలకు పోక్సో రక్షణ

'పోక్సో' అంటే: (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్స్ యాక్టు) అనేది లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం.

అమలు: 2012 నవంబరు 14 నుంచి

ఉద్దేశం: ఇది 18 ఏళ్ల లోపు బాలబాలికలపై జరిగే లైంగిక దాడులను అరికట్టడానికి ఉద్దేశించినది. పరస్పరం ఇద్దరి మధ్య ఇష్టపూర్వకంగా శారీరకంగా కలిసినా పోక్సో చట్టం దృష్టిలో నేరమే.

శిక్షలు ఇలా..

18ఏళ్ల లోపు బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులన్నీ 'పోక్సో' చట్టం పరిధిలోకి వస్తాయి. లైంగిక దాడి చేస్తే కొత్త 'భారత న్యాయ సంహిత' చట్టంలోని సెక్షన్-64, వేధింపులకు గురి చేస్తే సెక్షన్-74లతోపాటు నిర్భయ, పోక్సోచట్టాల కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే పదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలుశిక్ష పడుతుంది.

★ శిక్షలు నేర తీవ్రతను బట్టి ఉంటాయి. లైంగికదాడి కనీసం 3 సంవత్సరాల నుంచి 30 ఏళ్లదాకా జైలు శిక్ష ఉంటుంది. 12 ఏళ్లలోపు బాలబాలికలపై అత్యాచారానికి పాల్పడిన వారికి మరణశిక్ష కూడా విధించొచ్చు.

అవగాహన ముఖ్యం

ఇటీవల పాఠశాలలు, కళాశాలలే కాకుండా ఇళ్ల వద్ద కూడా ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. చట్టాల గురించి తెలుసుకున్నపుడే భయం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలకు ఇలాంటి చట్టాలపై సున్నితంగా తెలియజెప్పాలి. పాఠశాలల్లో చట్టంపైన అవగాహన కల్పించాలి. **- శాంతామణి, సఖిసెంటర్, అడ్మినిస్ట్రేటర్**

బీటీపీ పూర్తి ఆయకట్టుకు నీటి విడుదల

నీటిని విడుదల చేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: బీటీపీ కుడి, ఎడమ కాలువల నుంచి పూర్తి ఆయకట్టు 5102 ఎకరాలకు నీరు అందించాలని నీటి పారుదల శాఖ అధికారులను ప్రభుత్వం విప్ ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం బీటీపీ నుంచి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి నీటిని విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుకు నీరు రావడంతో ఆయకట్టు పొలాలు కళకళలాడుతున్నాయన్నారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలోనే పెద్ద తరహా ప్రాజెక్టుల్లో ఒక్కటైన బీటీపీకి త్వరలోనే పూర్వ వైభవం వస్తుందన్నారు. కృష్ణాజలాలు బీటీపీకి తేవడానికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఛైర్మన్ కాలవ రాజు, మండల కన్వీనర్ కాలవ సన్నన్న, మార్కెట్ యార్డు ఛైర్మన్ హనుమంతరెడ్డి, మాజీ ఎంపీపీ గిరిమల్లప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులతో జిల్లా కొత్త కార్యవర్గం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: ప్రభుత్వం వెంటనే 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. 11వ పీఆర్‌సీ గడువు ముగిసి రెండేళ్లయినా 12వ పీఆర్‌సీ గురించి పట్టించుకోకపోవడం భావ్యం కాదన్నారు. సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల వంద రోజుల ప్రణాళిక కార్యాచరణ పర్యవేక్షణకు విద్యాశాఖేతర అధికారులను నియమించడం తగదన్నారు. సెలవు రోజుల్లో మినహాయింపు ఇవ్వాలన్నారు. సీపీఎస్ ఉపాధ్యాయులకు డీఏ బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో నిలిచిపోయిన స్కూల్ అసిస్టెంటు ఇంగ్లిష్ పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక: అనంతరం జిల్లా నూతన అధ్యక్షుడిగా కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.చంద్ర, గౌరవాధ్యక్షుడిగా త్రిమూర్తి, ఉపాధ్యక్షులుగా రవీంద్రారెడ్డి, రాజశేఖర్, ఉషారాణి, రాందాస్ నాయక్, బలరాముడు, ఐదుగురు కార్యదర్శులు, ఆరుగురు కౌన్సిలర్లు, పదిమందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు నరేష్‌కుమార్, లతా రామకృష్ణ, ఆది బయన్న, భానుప్రియ, యంజారప్ప, సంగీత, కృష్ణవేణి, అంజనామూర్తి, లలిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో సిరి కార్యవర్గం ఏకగ్రీవం

హిందూపురం, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో సిరి అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం హిందూపురం పట్టణం పట్టుగూళ్ల మార్కెట్‌లోని సమావేశ భవనంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా నూతన కార్యవర్గం అధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, అసోసియేట్ అధ్యక్షుడు టీవీ పార్థసారథి, ఉపాధ్యక్షులు కాలజ్యుత, రెడ్డప్ప ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీలో కార్యదర్శులుగా శ్రీనివాసులు, మహేశ్‌లకు స్థానం కల్పించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నట్లు వివరించారు.

పదిలో 95 శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రసంగిస్తున్న విద్యాశాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకులు సుబ్బారావు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 95 శాతం ఉత్తీర్ణత సాధించడానికి చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ సంయుక్త సంచాలకులు సుబ్బారావు ఆదేశించారు. ఎంఈవోలు, హెచ్‌ఎంలతో ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్లో ఆయన సమావేశం నిర్వహించారు. 100 రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేయాలన్నారు. ఎంఈవోలు ప్రతి రోజూ కనీసం 2 పాఠశాలల్లో తనిఖీ చేయాలన్నారు. రోజువారీ నివేదిక ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. జిల్లాలో సక్రమంగా 100 రోజుల ప్రణాళిక అమలు కావడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రోజుకు 2 వేల మంది విద్యార్థులు ప్రత్యేక తరగతులకు గైర్హాజరవుతున్నారని పేర్కొన్నారు. గత సంవత్సరం తక్కువ ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో చర్చించారు. ఈ సంవత్సరం ఉత్తీర్ణత పెరగడానికి కృషి చేయాలన్నారు. ప్రతి రోజూ ఇద్దరు ఎంఈవోలు, ఇద్దరు ప్రధానోపాధ్యాయులకు ఫోన్ చేస్తానని, 100 రోజుల ప్రణాళికపై ఆరా తీస్తానన్నారు. అలసత్వం వీడాలన్నారు. అనంతరం రాప్తాడు మండలంలో వంద రోజుల ప్రణాళికను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులే హాజరు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటివరకూ పదో తరగతి విద్యార్థులు తక్కువ శాతం మార్కులు, ఎక్కువ శాతం మార్కులు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేకంగా చర్చించారు. డీఈవో ప్రసాద్‌బాబు, ఉప విద్యాశాఖాధికారులు మల్లారెడ్డి, శ్రీనివాసరావు, డీసీఈబీ కార్యదర్శి గంధంనేని శ్రీనివాసులు పాల్గొన్నారు.

పొరుగుసేవల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా శిరీష్‌రెడ్డి

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా పొరుగు సేవ ఉద్యోగుల సంఘం జేఏసీ ప్రధాన కార్యదర్శిగా శిరీష్‌రెడ్డి నియమితులయ్యారు. నగరంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయనను ఎంపిక చేశారు. శిరీష్‌రెడ్డి ప్రస్తుతం జేఎన్‌టీయూలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా ఉన్నారు.

ఈఎస్ఎల్ క్రీడా సంబరానికి సై

నేటి నుంచి క్రికెట్ పోటీలు

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' సమర్పణలో 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్ఎల్)-2025' క్రికెట్ పోటీలకు రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిభావంతులను వెలికి తీయాలన్న దృఢ సంకల్పంతో 'ఈనాడు-ఈటీవీ-ఈతరం క్లబ్' ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించిన 'ఈనాడు క్రికెట్' సోమవారం ప్రారంభం కానుంది. ఉమ్మడి అనంత జిల్లా క్రికెట్ మ్యాచ్‌లకు అనంత క్రీడా గ్రామం వేదిక కానుంది. సోమవారం తొలిరోజు పురుషుల విభాగంలో పోటీలు జరుగుతాయి. తొలివిడతలో ఇంటర్, పాలిటెక్నిక్, వృత్తి విద్యా కళాశాలలు, రెండో అంచెలో ప్రాంతీయ, మూడో అంచెలో ఉమ్మడి రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయి.

వేదిక : అనంత క్రీడా గ్రామం, అనంతపురం

హాకీ మైదానంలో జరిగే పోటీల వివరాలు

- ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధర్మవరం × ఎస్ఎల్ఎన్ జూనియర్ కళాశాల, అనంతపురం
- ఉదయం 11 గంటలకు అనంతపురం పాలిటెక్నిక్ కళాశాల × ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాయదుర్గం
- మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, గుంతకల్లు × ప్రభుత్వ జూనియర్ కళాశాల, తలుపుల

ఫుట్‌బాల్ మైదానంలో...

- ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కళ్యాణదుర్గం × శ్రీ సత్యసాయి జూనియర్ కళాశాల, అనంతపురం
- ఉదయం 11 గంటలకు శ్రీసాయి కృప జూనియర్ కళాశాల, ధర్మవరం × ఎస్ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాల, గుంతకల్లు
- మధ్యాహ్నం 2 గంటలకు బాలాజీ విద్యావిహార్ జూనియర్ కళాశాల, హిందూపురం × సీవీ రామన్ డిప్లొమా కళాశాల, తాడిపత్రి

Title Sponsor
Dhanik Bharat Educational Institutions
The Lloyd Group Initiative
Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Beverage Partner
CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor
MITS DEEMED TO BE UNIVERSITY MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner
TV Partner
Organised by

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

క్రిస్మస్, నూతన సంవత్సర స్పెషల్ ఆఫర్ 3 BHK, 2BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అనంతపురం నడిబడ్డున గల మీనాక్షి అపార్ట్‌మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. సెల్: 7416560179, 9515651111

JOBS

Required Sales Excutives for Tanishq Jewellery Store, Inter Pass with Retail Experience # Tanishq Jewellery, R.F. Road, Anantapur. Ph: 9441719143

Wanted: Nurses, Custodians, Tutors, Councillor, Computer Teacher. Montessori Elite EM School, ATP. ✆ 7386261972, 9052061355.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జిన్, వార్డెన్స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22సం||లపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ✆ : 92487 33371.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

ఇంటర్ కాలేజీలో పనిచేయడానికి మహిళా టెలీకాలర్స్ కావలెను. సంప్రదించండి: ✆ 8019989913.

AIRTEL WIFI హిందూపురం పట్టణం నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం: 16500 + ఇన్సెంటివ్స్ కలవు. ఆండ్రాయిడ్ ఫోన్ + బైక్ + డ్రైవింగ్ లైసెన్స్ ఉండవలెను. సంప్ర: ఉమామహేశ్వరరెడ్డి ✆ 9000029003.

FACULTY/ TEACHERS

Wanted Physical Science teacher to teach upto 10th (ITI also) EXP. Min. 3 Years. Send Resumes to Whatsapp 9441011084. UshaKiran High School, Vempalli, Kadapa Dist.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

డా.సుష్మాకు బెస్ట్ ఓవరాల్ ప్రెజెంటేషన్ పురస్కారం

శ్రీనివాస్‌నగర్, రుద్రంపేట: బెంగళూరులో ఆదివారం బీఈసీ వేదికగా 74వ ఇండియన్ నేషనల్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో ముమ్మకోటకు చెందిన డాక్టర్ సుష్మా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అంశంపై బెస్ట్ ఓవరాల్ ప్రెజెంటేషన్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. డాక్టర్ సుష్మా బెంగళూరులో ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అవార్డుతోపాటు ఆమెకు రూ.10 వేల నగదు బహుమతిగా అందించారు. ఈ నగదు మొత్తాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతగా క్యాన్సర్ బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి విరాళంగా అందజేయనున్నట్లు ప్రకటించారు.

అప్పులు తీర్చే మార్గం లేక పరారీ

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరుకు చెందిన రూపసగుడి మనోహర్ మిరప పంట పెట్టుబడుల నిమిత్తం గ్రామంలోని తోటి రైతులు, వ్యవసాయ కూలీల నుంచి సుమారు రూ.40.85 లక్షలు అప్పులు తీసుకుని వాటిని చెల్లించలేక ఐపీ పెట్టి పరారైనట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మనోహర్‌కు అప్పులు ఇచ్చిన సుమారు 43 మంది బాధితులు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని న్యాయం చేయాలని కోరారు. కొన్నాళ్ల కిందటే సదరు రైతు గుట్టుచప్పుడు తనకున్న నాలుగెకరాల పొలాన్ని, గ్రామంలోని ఇంటిని అమ్మేసినట్లు తెలిసింది.

పోలీస్ స్టేషన్ వద్ద ప్రామిసరి పత్రాలు చూపుతున్న బాధిత రైతులు, కూలీలు

23న శిశుగృహ పోస్టులకు ముఖాముఖి

అనంతపురం(శ్రీనివాసనగర్), న్యూస్‌టుడే: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) అనుబంధ శిశుగృహ పోస్టులకు దరఖాస్తులు చేసుకున్న అర్హత కలిగిన అభ్యర్థులకు ఈనెల 23 లేదా 24వ తేదీన మౌఖిక పరీక్ష(ఇంటర్వ్యూ) నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన దస్త్రంపై కలెక్టర్ ఆనంద్ ఆమోదం తెలియజేసినట్లు పీడీ అరుణకుమారి తెలిపారు. ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ఎదురుగా బీసీ స్టడీ సర్కిల్ హాలులో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించే అవకాశం ఉంది. ఇక్కడి పోస్టుల భర్తీకి ఈనెల 8 నుంచి 14దాకా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం 137 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వడపోసిన తర్వాత ఇంటర్వ్యూకు 80 మంది అర్హత సాధించారు. మేనేజర్ పోస్టుకు ఇద్దరు, సోషల్ వర్కర్‌కు ఏడుగురు, ఏఎన్ఎంకు 32, ఆయా పోస్టులకు 29 మంది, వాచ్‌మెన్ ఆరుగురు ఉన్నారు. ఇంటర్వ్యూ నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని నిర్దేశిత అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి తెలియజేయనున్నారు.

వైకాపాలో భగ్గుమన్న విభేదాలు

జగన్ జన్మదిన వేడుకల్లో నాయకుల మధ్య వాగ్వాదం

సోమందేపల్లి: సోమందేపల్లిలో వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో నాయకుల మధ్య వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. మాజీ మంత్రులు ఉష, శంకరనారాయణ వర్గాల మధ్య ఆదివారం మరోమారు బయటపడ్డాయి. పెద్దమ్మగుడి వద్ద సోమందేపల్లి ఉప సర్పంచి వేణు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఒక వర్గంగా, మరోవైపు వైఎస్సార్ విగ్రహం వద్ద మండల కన్వీనర్ గజేంద్ర, జడ్పీటీసీ సభ్యుడు డీసీ అశోక్‌కుమార్ తదితర వర్గంగా జగన్ జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి ఉష భర్త చరణ్‌రెడ్డితో కేకులు కోయించేందుకు పోటాపోటీగా సిద్ధమయ్యారు. ఇదే సమయంలో వైఎస్సార్ విగ్రహం వద్దకు వచ్చిన బ్రహ్మసముద్రం సర్పంచి పరంధాములు ఇరువర్గాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెండు వర్గాలుగా నాయకులు, కార్యకర్తలు జగన్ జన్మదిన వేడుకలు ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎన్నికలముందు ఇలా వర్గాలుగా విడిపోతే మరోమారు ఇక్కడికి రాకుండా తమ గ్రామాల్లోనే కలిసి వేడుకలు, కార్యక్రమాలను చేసుకొంటామని ఆయన తెగేసి చెప్పారు. ఈసందర్భంగా మొదట వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకొన్న చరణ్‌రెడ్డి.. రెండు వర్గాలుగా నాయకులు, కార్యకర్తలు విడిపోయి, కేకులు కోయడానికి రెండుచోట్ల ఏర్పాటు చేసినట్లు తెలుసుకొని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చివరకు రెండు కేకులను ఒకేచోట ఉంచి నాయకులు, కార్యకర్తల మధ్య ఆయన వాటిని కోశారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బ్రహ్మసముద్రం సర్పంచి పరంధాములు (అయ్యప్ప మాలధారణలో ఉన్న వ్యక్తి)

నల్లచెరువు: నల్లచెరువు మండలంలో ఆదివారం వైకాపా నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలో గొడవపడ్డారు. తొలుత నల్లచెరువు పంచాయతీ సర్పంచి పంచరత్నమ్మ వర్గం పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంది. అనంతరం వైకాపా మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి వర్గం జగన్ పుట్టిన రోజు వేడుక నిర్వహించుకోవడానికి బస్టాండు దగ్గర ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు వచ్చింది. అక్కడ అప్పటికే సర్పంచి వర్గం కట్టిన ఫ్లెక్సీ ఉండటంతో రవికుమార్‌రెడ్డి వర్గం దాన్ని పక్కకు తోసేసింది. అక్కడే ఉన్న సర్పంచి వర్గం అడ్డుకోవడంతో విభేదాలు బయటపడ్డాయి. దళిత వర్గానికి చెందిన సర్పంచి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు దళిత సంఘం సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

భగవద్గీత పఠనం.. ప్రతిభకు పతకం

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచశాంతి కోసం మైసూరు దత్త పీఠంలోని అంతర్జాతీయ గీతా ఫౌండేషన్ నేతృత్వంలో అంతర్జాలంలో అంతర్జాతీయ స్థాయి భగవద్గీత-2025 పరీక్ష పోటీలను గత నవంబరు నెలలో నిర్వహించారు. దేశ, విదేశాల్లోని వేలాదిమంది దత్తభక్తులు ఇందులో పాల్గొని గీతలోని శ్లోకాలను పారాయణం చేసి ప్రతిభ చాటారు. డిసెంబరు 1న జరిగిన గీతాజయంతి పురస్కరించుకొని ఆ పీఠం వ్యవస్థాపకులు గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతులమీదుగా విజేతలకు పసిడి పతకాలు, ప్రశంస పాత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. కైవసం చేసుకున్న వారిలో హిందూపురం పట్టణానికి చెందిన దత్తభక్తులు డాక్టర్ రమ్య, గృహిణులు కల్పన, హర్షిత, లావణ్య, తేజశ్విని, శ్వేత, సరస్వతి, విద్యార్థులు వాగ్దేవి, రుశ్యంత్, చిన్మయి, రవికిరణ్‌సాయి, శ్రీకర్ ఉన్నారు.

అంతర్జాతీయ భగవద్గీత అంతర్జాల పరీక్షా పోటీల్లో పసిడి పతకాలను సాధించిన హిందూపురం దత్తభక్తులు

శ్రద్ధాసక్తి ఉంటే దేనినైనా సాధించవచ్చు

శ్రద్ధ, ఆసక్తి, పట్టుదల, ఉత్సాహం, ప్రోత్సాహం, ఆలోచన ఉంటే దేనినైనా సాధించవచ్చనేది నేను భగవద్గీతలోని శ్లోకాలను నేర్చుకొని అంతర్జాల పరీక్షలో నెగ్గి పసిడి పతకం తీసుకోవడంలో నిరూపణ అయిందని భావస్తున్నా. అంతర్జాల పరీక్షలో దృశ్య విధానంలో కళ్లు మూసుకోమంటారు. తర్వాత శ్లోకం పేరు చెప్పినపుడు ప్రారంభిస్తే జైగురుదత్త అంటే నిలిపివేయాలి. ఇలా పోటీలు జరిగాయి. **-రమ్య, దంతవైద్యురాలు, హిందూపురం**

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

తల్లిదండ్రుల ప్రోత్సహంతో చదువు కుంటూ భగవద్గీతలోని శ్లోకాలను కంఠస్థం చేయడాన్ని నేర్చుకున్నాను. రోజులో 3 గంటలు కేటాయించాను. బంగారు పతకం దక్కించుకొని అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం నాకెంతో ఆనందంగా ఉంది. **- రవికిరణ్‌సాయి, 8వతరగతి**

ఫుట్‌బాల్ ఫైనల్ రౌండ్‌కు తమిళనాడు

చివరి మ్యాచ్‌లో నెగ్గిన ఆంధ్ర జట్టు

తమిళనాడు జట్టు సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: దేశవాళీలో ప్రతిష్ఠాత్మకమైన సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ నాకౌట్ పోటీలకు తమిళనాడు జట్టు అర్హత సాధించింది. గ్రూపు-జిలో తమిళనాడు జట్టు ఒక్క ఓటమి లేకుండా విజయఢంకా మోగించింది. దీంతో క్వార్టర్ ఫైనల్ పోటీలకు దూసుకెళ్లింది. ఒక్కో గ్రూపు నుంచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానం సాధించిన జట్టు నాకౌట్ పోటీల్లో పాల్గొంటుంది. తమిళనాడు జట్టు వరుసగా అండమాన్ నికోబార్, ఆంధ్ర, పుదుచ్చేరి జట్లపై విజయాలు సాధించింది. ఆదివారం ఆర్డీటీ ఫుట్‌బాల్ మైదానంలో జరిగిన చివరి లీగ్ పోటీలో తమిళనాడు జట్టు 3-0 గోల్స్ తేడాతో పుదుచ్చేరి జట్టుపై ఘన విజయం సాధించింది. ప్రత్యర్థి జట్టుకు గోల్ చేసే అవకాశం లేకుండా మ్యాచ్ ముగిసింది. మరో పోటీలో ఆంధ్ర జట్టు అండమాన్ నికోబార్ జట్టుపై 1-0 గోల్ తేడాతో విజయం సాధించింది. ఈ పోటీల్లో వరుస ఓటములతో కుంగిపోయిన ఆంధ్ర జట్టుకు చివరి మ్యాచ్‌లో విజయం సాధించడంపై కాస్త ఊరట లభించింది. గత ఏడాది ఒక్క మ్యాచ్‌లో కూడా ఆంధ్ర జట్టు గెలవలేక చతికిలబడింది. ఈసారి సాధించిన ఈ గెలుపు ఆంధ్ర జట్టుకు ఊపిరిపోసింది. చివరి పోటీలో ఆంధ్ర జట్టు ఆటగాడు అక్షయ్‌రెడ్డి గోల్ చేసి జట్టును గెలిపించాడు. కలెక్టర్ ఓ.ఆనంద్, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి డేనియల్ ప్రదీప్ తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖల సహకారంతో ఈ పోటీలు విజయవంతంగా ముగిశాయని డేనియల్ ప్రదీప్ తెలిపారు. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, ఇతర సభ్యుల సహకారంతోనే సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలు జయప్రదమయ్యాయని వెల్లడించారు.

జగన్ పుట్టిన రోజు వేడుకల్లో వికృత చేష్టలు

కనగానపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా వైకాపా నాయకులు వికృత చేష్టలు చేశారు. ఆదివారం జగన్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోటలో వైకాపా నాయకులు వేట కొడవళ్లతో పొట్టేళ్ల తలలు నరికి వాటి రక్తంతో జగన్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చిత్రపటాలకు అభిషేకించి.. జై జగన్ అంటు నినాదాలు చేశారు. అనంతపురం జిల్లా విడపనకల్లులో ఇదే తరహా వికృత చేష్టలకు పాల్పడటం గమనార్హం.

ఆలయ సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారికి ధనుర్మాస పూజల్లో భాగంగా నేడు(సోమవారం) వేకువజామునే పూజలు మొదలవుతాయి. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు పర్యాయాలు అభిషేకాలు. తర్వాత పది నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 వరకు స్వామివారి దర్శనం ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలోని పోలీసు శిక్షణ కళాశాల సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. నగర శివారులోని పంగల్ రోడ్డు ప్రాంతానికి చెందిన అరుణ్ (32) ద్విచక్ర వాహనంపై బళ్లారి సర్కిల్ వైపు నుంచి గడియార స్తంభం వైపునకు వెళ్తూ స్థానిక పీటీసీ వద్ద డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బైకును నడుపుతున్న అరుణ్ తలకు తీవ్రగాయాలు అవడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. గమనించి స్థానికులు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మూడో పట్టణ పోలీసులు ప్రమాద ఘటన వివరాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం గదికి తరలించారు.

ఆంధ్ర సీనియర్ వన్‌డే జట్టులో వినయ్‌కుమార్‌కు చోటు

అనంతపురం క్రీడలు: బీసీసీఐ ఆధ్వర్యంలో బెంగళూరులో జరగనున్న విజయ్ హజారే సీనియర్ వన్‌డే పోటీలకు జిల్లాకు చెందిన బి.వినయ్‌కుమార్ ఎంపికయ్యాడు. అనంతపురం గ్రామీణ మండలం కురుగుంట గ్రామానికి చెందిన ఈ యువకుడు ఎడమచేతి వాటం స్పిన్నర్, మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. బంతితో, బ్యాటుతో కదం తొక్కడంతో వన్‌డే జట్టుకు ఎంపికయ్యాడు. ఆంధ్ర సీనియర్ జట్టులో గత ఏడాది అన్ని ఫార్మాట్లలో ఎంపికయ్యాడు. ఈసారి ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో అమరావతి రాయల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈసారి వన్‌డే విజయ్ హజారే టోర్నీకి ఎంపికయ్యాడు. బెంగళూరులో ఈ నెల 24 నుంచి జనవరి 8వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఆంధ్ర వన్‌డే జట్టుకు ఎంపికైన వినయ్‌కుమార్‌ను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్, కార్యదర్శి ఎ.యుగంధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సర్దార్ తదితరులు అభినందించారు. వన్‌డే పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని వారు పిలుపునిచ్చారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

అర్జున్ కుమార్

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : నరసాపురం గ్రామంలో చేనేత కార్మికుడు అర్జున్‌కుమార్(24) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. అర్జున్‌కుమార్ మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రి, తల్లి అనారోగ్యానికి గురవడంతో చికిత్స కోసం అప్పులు చేశాడు. తల్లి అనారోగ్యంతో మృతిచెందింది. తండ్రి మల్లేష్‌తో కలిసి జీవిస్తున్నాడు. చేసిన అప్పులు తీరకపోవడంతో నిత్యం బాధపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి తల వెంట్రుకలకు వాడే రంగును తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. బంధువులకు తండ్రి మల్లేష్ సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అమానుల్లా తెలిపారు.

మోతాదుకు మించి మందుల వాడకం.. విద్యార్థిని మృతి

ఎస్కేయూలో ఘటన

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థి మాధుర్య అనారోగ్యంతో ఆదివారం మరణించడం చర్చనీయాంశం అయింది. గోదావరి వసతి గృహంలో ఉంటూ ఆ విద్యార్థి బయోటెక్నాలజీ విభాగంలో ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఉదయం 6.30 గంటలకు అస్వస్తతకు గురికావడంతో అంబులెన్స్‌లో సర్వజన ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే మృతి చెందినట్లు సమాచారం. ఇన్‌ఛార్జి వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పరీక్షల విభాగం సంచాలకులు జీవీ రమణ విద్యార్థిని మృతిపై ఆరా తీశారు. ఆ విద్యార్థిని మోతాదుకు మించి మందులు తీసుకోవడంతో గుండెపోటు వచ్చి మరణించినట్లు అధికారులు తెలిపారు.

నేటి పరీక్షలు వాయిదా..

మాధుర్య అనే విద్యార్థి మరణించినందున 22న విశ్వవిద్యాలయానికి సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ రమేష్‌బాబు తెలిపారు. వర్సిటీలో 22న జరగాల్సిన పీజీ పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు జీవీ రమణ తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణం

ధర్మవరం, న్యూస్‌టుడే: రాప్తాడు సమీపంలోని రైల్వేగేట్ వద్ద ఆదివారం రైలుకిందపడి బీటెక్ విద్యార్థి సాయిరాజ్ (22) ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. గుత్తి మండలం బసినేపల్లికి చెందిన సాయిరాజ్ అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ తృతీయ ఏడాది చదువుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అతడు అయ్యప్ప మాల ధరించి ఉన్నట్లు చెప్పారు. ఆత్మహత్యకు కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

నీటికుంటలో పడి బాలుడి విషాదాంతం

కమలేశ్వరరెడ్డి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : తల్లి పొలం వద్ద పనులు చేస్తుండగా చూడటానికి వెళ్లిన ఆ బాలుడు ప్రమాదవశాత్తు నీటికుంటలో కాలుజారి పడి మృతిచెందాడు. ఈఘటన పెద్దవడుగూరు మండలం రాలువుడికిలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన ఆకుల సోమశేఖరరెడ్డి, సువర్ణ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సువర్ణ భర్త పదేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుమారుడైన ఆకుల కమలేశ్వరరెడ్డి(13)కి మతిస్థిమితం సరిగా ఉండదు. రెండో తరగతి చదువుతున్నాడు. తల్లి పొలంలో పత్తి కోత పనుల్లో ఉండగా ఇంటి వద్ద ఒక్కడే ఉండలేక పొలం వద్దకు వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత ఇంటికి వెళ్తున్నానని తల్లి సువర్ణతో చెప్పి బయలుదేరాడు. సమీపంలో కుంట వద్దకు రాగానే కాలుజారి అందులో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడం వల్ల బాలుడు కుంటనీటిలో ఊపిరాడక మృత్యువాత పడ్డారు. అటుగా కొందరు కూలీలు గమనించి బాలుడి బంధువులకు తెలియజేశారు. వారొచ్చేపాటికి మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లి సువర్ణ విలపించిన తీరు అందర్నీ కలచి వేసింది. బాలుడు మృతిచెందడంతో ఉపాధ్యాయులు వెళ్లి బంధువులను పరామర్శించి సంతాపం తెలిపారు.

వివాహిత మృతి అనుమానాస్పదం

కనగానపల్లి, న్యూస్‌టుడే: వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కనగానపల్లి మండలం మామిళ్లపల్లిలో ఆదివారం చోటచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై మహమ్మద్ రిజ్వాన్ తెలిపిన వివరాల మేరకు.. మామిళ్లపల్లికి చెందిన మహిళ(30) ఈనెల 18న రాత్రి ఇంటిలో పెట్రోలు పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వెంటనే భర్త గమనించి మంటలు ఆర్పి ధర్మవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్య సేవలను అందిస్తుండగా ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నార్పల మండలం నలపరెడ్డిపల్లికి చెందిన ప్రహల్లాదరెడ్డి తన కుమార్తెతో సన్నిహితంగా ఉండేవాడని, అప్పుడప్పుడు పలకరించి వెళ్లేవాడని ఈనెల 18న రాత్రి మామిళ్లపల్లిలో కూతురు ఇంటికి వచ్చి గొడవ పడ్డాడని ఫిర్యాదులో పేర్కొంది. తన కూతురిని ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించడంతో విసుగుతో పెట్రోలు ఒంటిపై పోసుకొని నిప్పు అంటించుకుందని, పక్కగదిలో ఉన్న భర్త గమనించి మంటలను ఆర్పి వేసి వైద్యశాలకు తీసుకెళ్లినట్లు వివరించింది. ప్రహల్లాదరెడ్డిపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరింది. ప్రహల్లాదరెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు.

(c) eenadu

స్థానికంగానే భూ సమస్యలకు పరిష్కారం: ఆర్డీవో

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలు, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో వసంతబాబు పేర్కొన్నారు. రైతుల భూములకు సంబంధించిన మ్యుటేషన్, ఆర్‌వోఆర్ తదితర సమస్యలు మండలస్థాయి లేదా సబ్ డివిజన్ స్థాయిలో పరిష్కారం అవుతాయన్నారు. సమస్యల పరిష్కారానికి పలు మండల కేంద్రాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలు వారివారి భూ సమస్యలను మండలస్థాయిలో తహసీల్దార్, డివిజన్ స్థాయిలో రెవెన్యూ డివిజనల్ అధికారులను సంప్రదించి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు.

రాయదుర్గం

•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

ఘనంగా కనకదాస జయంతి

బెళుగుప్ప, న్యూస్‌టుడే: భక్త కనకదాస జయంతి వేడుకలు స్థానికంగా ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే భక్త కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి కురుబలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిమను ట్రాక్టరుపై ఊరేగింపు నిర్వహించారు.

భక్తకనకదాస విగ్రహాన్ని ఊరేగిస్తున్న కురుబలు

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: ఓబుళాపురం జనతా కాలనీలో రోడ్లపై మురుగు నిల్వ ఉండటంతో చిన్నపిల్లలు, వృద్ధులు, కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. **- జనతా కాలనీవాసులు**

సమాధానం: కాలనీని పరిశీలించి మురుగు నిల్వకుండా చర్యలు తీసుకుంటాం. **-నాగరాజు, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని బీసీ కాలనీలో రాదిరెడ్డిలో ఇనుప విద్యుత్తు స్తంభం ఉంది. దీనివల్ల ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. **-మల్లికార్జున, బీసీకాలనీ**

సమాధానం: వెంటనే బీసీ కాలనీని పరిశీలించి విద్యుత్తు స్తంభం తొలగింపునకు తగు చర్యలు తీసుకుంటాం. **-నరసింహులు, ఏఈ**

సమస్య: ముదిరె గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ కాలువలో మురుగు పేరుకుపోయింది. దీంతో స్థానిక ప్రజలు దుర్వాసనతోపాటు దోమలు వ్యాప్తితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **- నాగరాజు, గ్రామస్థుడు**

సమాధానం: మురుగు తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. **-సోమనాథ్, పంచాయతీ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, డి.హీరేహాళ్

లోపిస్తున్న పారిశుద్ధ్యం... తప్పని ఇక్కట్లు

న్యూస్‌టుడే, ఉరవకొండ

గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపిస్తుండటంతో ప్రజలు అనారోగ్యంతో ఇక్కట్లకు గురవుతున్నారు. ఉరవకొండ మండలం షేక్షానుపల్లి, లత్తవరం, మోపిడి, ఆమిద్యాల, రాయంపల్లి, రాకెట్ల, ఆరవకోడ, విడపనకల్లు మండలం పాల్తూరు, హావళిగి, విడపనకల్లు, గడేకల్లు, వజ్రకరూరు మండలం కొనకొండ్ల, గడేహోతూరు, ప్యాపిలి, బెళుగుప్ప, కూడేరు మండలం జల్లిపల్లి, ముద్దలాపురం తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించింది. కాలువలు లేకపోవడంతో మురుగు దారుల్లోనే ప్రవహిస్తోంది. కొన్నిచోట్ల సిమెంటు దారులే మురుగు కాలువలుగా దర్శనం ఇస్తున్నాయి. ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య మెరుగు చర్యలు చేపట్టక పోవడంతో సమస్య జటిలంగా మారుతోంది.

పరిస్థితుల మెరుగుకు చొరవ

గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ఎప్పటికప్పుడు చొరవ చూపాలని కార్యదర్శులను ఆదేశించాము. ఇంకా సమస్య ఉన్న ప్రదేశాలను గుర్తించి మరింత మెరుగైన చర్యలు చేపడతాం. పారిశుద్ధ్యం సమస్య నివారణకు ఇళ్ల ముందర ఇంకుడు గుంతలు తవ్వించుకునేలా ప్రజల్లో చైతన్యం తీసుకొస్తాం. **- రవిప్రసాద్, ఎంపీడీవో, ఉరవకొండ**

దోమల వ్యాప్తికి అవకాశం

మురుగు నిల్వ వల్ల పారిశుద్ధ్య సమస్య తద్వారా గ్రామాల్లో దోమల ప్రభావం అధికంగా ఉంది. చీకటి పడితే దోమల ఉద్ధృతి పెరుగుతోంది. ఇళ్లవద్ద బయట కూర్చోవాలన్నా ఆలోచించాల్సిన దుస్థితి. వీటి నివారణకు మందులు పిచికారీ చేయడం గాని, వృథా ఆయిల్‌బాల్స్‌ను నీటిలో కలుపడం గాని పంచాయతీ అధికారులు చేపడుతున్న పరిస్థితి లేదు. ఫాగింగ్ అటకెక్కింది. వాతావరణంలో మార్పుల కారణంగా ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి, పారిశుద్ధ్య మెరుగు చర్యలతోపాటు, దోమల వ్యాప్తి నివారణకు తగిన మందులను పిచికారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉరవకొండ మండలం పెద్దముష్టూరులో సిమెంటు దారిపై మురుగు

దారిలో గుంతలు.. ప్రయాణ కష్టాలు

వజ్రకరూరు మండలం పరిధిలోని కొనకొండ్ల నుంచి గుంతకల్ వెళ్లే ప్రధాన రహదారిలో స్వాగత ద్వారం వద్ద దారిలో గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. ఆ దారిలో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఎదురుగా వచ్చినపుడు ద్విచక్రవాహన చోదకులు గుంతలు తప్పించే క్రమంలో తరచుగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ దారిలోని గుంతలకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వజ్రకరూరు**

ఫ్లెక్సీ తొలగింపుపై నిరసన

కణేకల్లు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్టాండు ఎదురుగా వైఎస్సార్ విగ్రహం వెనుక స్తంభానికి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ కట్టిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చిత్రంతో కూడిన ఫ్లెక్సీ తొలగింపు ఆదివారం వివాదాస్పదంగా మారింది. ఆదివారం మాజీ సీఎం జగన్ పుట్టినరోజు నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఫ్లెక్సీని తొలగించాలని పంచాయతీ అధికారులను కోరడంతో సిబ్బంది శనివారం రాత్రి తొలగించారు. ఈ చర్యను తెదేపా నాయకులు తప్పుబడుతూ నిరసన తెలియజేశారు. ఆదివారం రాత్రి అదే చోట వైఎస్ జగన్ ఫ్లెక్సీని ఏర్పాటుకు వైకాపా నాయకులు సన్నాహాలు చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు.

ఫ్లెక్సీని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఎస్సైకి సన్మానం

కణేకల్లు, న్యూస్‌టుడే: సైబర్ కేసును ఛేదించి ఉత్తమ సేవలకు పురస్కారం ఏబీసీడీ అవార్డు అందుకున్న ఎస్సై నాగమధును ఆదివారం తెదేపా నాయకులు సన్మానించారు. మండల తెదేపా కన్వీనర్ వన్నారెడ్డి లాలెప్ప, నాయకులు ఆది, బసవరాజు, సుదర్శన, వెంకటేష్ చౌదరి, రమేష్, చాంద్, మాబుసాబ్, నాగరాజు, సలీం పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.3.29 లక్షలు

అనంతపురం (వ్యవసాయం): అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని సంతల్లో మొత్తం రూ.3,29,100 ఆదాయం వచ్చింది. శనివారం గొర్రెలు, మేకల సంతలో రూ.1,93,500 ఆదాయం రాగా, ఆదివారం పశువుల సంతలో రూ.1,35,600 ఆదాయం వచ్చిందని కార్యదర్శులు ఏడీఎం రాఘవేంద్రకుమార్, రూప్‌కుమార్ తెలిపారు.

ధర్మ పరిరక్షణకు ఐక్యం కావాలి

బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: సనాతన ధర్మం.. హిందువుల జీవన విధానమని కర్ణాటకలోని చిత్రదుర్గం జిల్లా ఆలూరు ఆనంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీశంకరానంద స్వామి, ఆర్ఎస్ఎస్ క్షేత్ర కార్యవాహ్ తిప్పేస్వామి పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఉంతకల్లులో ఏర్పాటు చేసిన సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. హిందూ సమాజం కలసికట్టుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. సమ్మేళన కార్యక్రమ నిర్వాహకులు దేవిరెడ్డి, హీరోజీరావు, నాగేంద్రప్ప, రవికుమార్, పెద్ద రెడ్డి, రాజేంద్ర, మంజు, జయరామిరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు. ✤ సనాతన ధర్మాన్ని పాటించాలని కర్ణాటకలోని బళ్లారి కమ్మరచేడు సంస్థాన మఠం పిఠాధిపతి శ్రీ కళ్యాణ్‌స్వామిజీ పేర్కొన్నారు. డి.హీరేహాళ్ శ్రీశివలింగారూడ స్వామి మఠంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం బాలికల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విశ్రాంత ఆర్మీ అధికారి ఎర్రిస్వామి, నాయకురాలు రూపశ్రీ, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ రాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఎస్ఎస్ నాయకులు తిప్పేస్వామి

28న ఉరవకొండలో సమ్మేళనం

ఉరవకొండ: ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 28న ఉరవకొండలో హిందూ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంఘం ప్రతినిధులు గోపి, వెంకట తదితరులు ఆదివారం పేర్కొన్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం మాలధారులకు ఉరవకొండ గ్రామీణ పోలీసు సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఎస్ఐ గురికాల శివప్రసాద్, ఆయన సోదరులు అన్నదానం నిర్వహించారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కుటుంబ సమస్యల కారణంగా నాలుగు రోజుల కిందట కళ్యాణదుర్గం మండలం పాలవాయిలో పురుగుమందు తాగిన బాలిక(17) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు కళ్యాణదుర్గం గ్రామీణ పోలీసులు తెలిపారు.

పోలీస్‌స్టేషన్ భవనం మార్పు

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: బళ్లారి- బెంగళూరు జాతీయ రహదారి(ఎన్‌హెచ్150-ఎ) విస్తరణలో భాగంగా డి.హీరేహాళ్ పోలీస్‌స్టేషన్ భవనం కటింగ్‌లో వెళ్లడంతో సోమవారం నుంచి పాత తహసీల్దారు కార్యాలయంలో స్టేషన్ విధులు నిర్వహిస్తామని ఎస్సై గురుప్రసాద్ రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడికి గాయాలు

విడపనకల్లు, న్యూస్‌టుడే: విడపనకల్లు మండలం ఉండబండ వంకవద్ద వడ్ల మిషన్‌కు అడ్డుగా ఉన్న విద్యుత్తు తీగను తొలగించడానికి వెళ్లిన ఉండబండకు చెందిన అనిల్ విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. చేతికి, కాళ్లకు గాయాలవడంతో స్థానికులు ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. వైద్యులు చికిత్స చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం బోల్తాపడి...

కూడేరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం ముద్దలాపురం వద్ద జాతీయ రహదారిలో ఆదివారం ద్విచక్ర వాహనం బోల్తాపడి అనంతపురానికి చెందిన విష్ణువర్ధన్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని అనంతపురం తరలించారు.

పన్నులపై అవగాహన

అనంతపురంవిద్య: ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లకు ఈఎస్ఐ, ఈపీఎఫ్, ప్రొఫెషనల్ ట్యాక్స్‌పై అవగాహన కార్యక్రమం ఆదివారం రఘుసైనిక్ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. జీఎస్టీపై డీసీటీఓ సుబ్బన్న, అనిల్‌కుమార్, ఈఎస్ఐపై జగదీశ్వరరెడ్డి, మోహన్, రామకృష్ణ, ఈపీఎఫ్‌పై శ్రీనివాసబాబు, నరేంద్ర అవగాహన కల్పించారు.

సరిహద్దు చెక్‌పోస్ట్ తనిఖీ

విడపనకల్లు: విడపనకల్లు సమీపంలోని కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్ట్‌ను విడపనకల్లు ఎస్సై ఖాజాహుసేన్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. వాహనాల పత్రాలు పత్రాలు, సరకు రవాణాపై పోలీసు తనిఖీ చేశారు.

ఒకరిపై కేసు నమోదు

డి.హీరేహాళ్ : మల్లికేతికి చెందిన హంపమ్మను అదే గ్రామానికి చెందిన ఈరణ్ణ అనే వ్యక్తి దూషించాడని ఆమె ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

జింకపిల్ల అప్పగింత

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలోని శ్రీదేవి బీఈడీ కళాశాల సమీపంలో ఆదివారం సాయంత్రం తెదేపా మాజీ పట్టణ కన్వీనర్ డిష్ మురళి, 9వ వార్డు అధ్యక్షుడు డీలర్ శీన, గుత్తేదారు వెంకటేష్‌లు జింకపిల్లను గుర్తించారు. రోడ్డుపై ఏదైనా వాహనం ఢీకొందా? లేక కుక్కలు తరుముకొచ్చాయా? తెలియని పరిస్థితి. వెంటనే ఆ జింకపిల్లను పట్టణంలోని నగరవనం వద్దకు తీసుకెళ్లి అటవీశాఖ బీట్ అధికారి నాగేనాయక్‌కు అప్పగించారు. ప్రతిఒక్కరు వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలని అటవీ శాఖ సిబ్బంది కోరారు.

మహిళా ధర్మ ఫెస్టివల్ బజార్ ప్రారంభం

అనంత సాంస్కృతికం: లలిత కళా పరిషత్‌లో ఆదివారం డిజిటల్ మహిళా ధర్మసంఘం ఆధ్వర్యంలో ధర్మ ఫెస్టివల్ బజార్ ప్రారంభమైంది. తెదేపా నాయకురాలు బల్లాపల్లవి, డిజిటల్ మహిళా శక్తి జాతీయ నాయకురాలు డా. ఈదుల ఆశ్లేష సంయుక్తంగా ప్రారంభించారు. బల్లాపల్లవి మాట్లాడుతూ.. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కలిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహిళా శ్రమకు సరైన వేదికలు లభిస్తే స్వయం ఉపాధి ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తే మహిళా వ్యాపారాలకు బలం చేకూరుతుందని అలాంటి వాటిలో ఈ బజారు ఒకటని అభిప్రాయపడ్డారు.

కుళాయిల వద్ద అపరిశుభ్రత

కుందుర్పి మండలంలోని అపిలేపల్లి గ్రామంలో ప్రజల తాగునీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన శ్రీరామిరెడ్డి తాగునీటి కుళాయిల వద్ద చెత్తాచెదారం వేయడంతో అస్తవ్యస్తంగా మారింది. అక్కడే పిచ్చిమొక్కలు పెరగడంతో విష పురుగుల సంచారం పెరిగింది. తాగునీటి వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంచాయతీ అధికారులు కుళాయిల వద్ద పొదలు, చెత్తను తొలగించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కుందుర్పి**

కల్వర్టుపై రంధ్రం.. పట్టింపు శూన్యం

ఉరవకొండ పట్టణం సీవీవీ నగర్‌లో లత్తవరం దిశగా వెళ్లే దారిలో మురుగు కాలువపై కల్వర్టుకు రెండు నెలల కిందట రంధ్రం పడి ప్రమాదకరంగా మరినా పట్టించుకునే వారే కరవయ్యారు. వాహనదారులు ఏ మాత్రం పొరబడినా ప్రమాదానికి గురి కావాల్సిందే. ఇక రాత్రిపూట వచ్చే పాదచారులు అక్కడ గాయాలపాలవుతున్నారు. దీనిపై ఎంపీడీవో రవిప్రసాద్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ కల్వర్టుకు మరమ్మతులు చేయించేలా స్థానిక పంచాయతీ అధికారులను ఆదేశిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

ఆదమరిచారో.. అంతే సంగతులు!

విడపనకల్లు మండలం పాల్తూరు నుంచి హావళిగి వెళ్లే రహదారి పక్కన పెద్దగుంత ప్రమాదకరంగా మారింది. వాహనదారులు అజాగ్రత్తగా వెళితే ప్రమాదాలకు గురికావాల్సిందే. అంతేకాకుండా ఇక్కడే ప్రమాదకర మలుపు ఉండటంతో రాత్రి సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి ఈ గుంతను పూడ్చివేయాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, విడపనకల్లు**

సీపీఐ కరపత్రాల విడుదల

ఉరవకొండ: సీపీఐ శత వసంతాల ముగింపు వేడుకలను జనవరి 18న తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేశవరెడ్డి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద విడుదల చేసిన సందర్భంగా మాట్లాడారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు, మండల కార్యదర్శి హసేన్‌బాషా, సుల్తాన్, తిప్పయ్య పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం బస్టాండ్‌లో పోలియో చుక్కలు వేస్తున్న ఆర్డీవో వసంత్‌బాబు, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్

ఉడేగోళంలో చుక్కల మందు వేస్తున్న తెదేపా నాయకులు, వైద్య సిబ్బంది

భావితరాలకు పోలియో చుక్కలు

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని పలు పీహెచ్‌సీలు, ఉప కేంద్రాల పరిధిలో అన్ని గ్రామాల్లో ఆదివారం అయిదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమం సుమారు 95 శాతం పూర్తియిందని వైద్యులు పేర్కొన్నారు. ఇంకా చుక్కలు వేయించుకోకుండా మిగిలిపోయిన చిన్నారులకు సోమవారం వారివారి ఇళ్ల వద్దకే వైద్య సిబ్బంది వచ్చి చుక్కలు వేస్తారన్నారు. పిల్లలు జ్వరం, జలుబు ఇతరత్రా అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్నా... రెండు చుక్కల పోలియో డ్రాప్స్ తప్పనిసరిగా వేయించాలని, ఇవే వారి నిండు జీవితానికి బంగారు భవితను ఇస్తాయని అధికారులు తెలిపారు. **- న్యూస్‌టుడే బృందం**

ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో...

మాజీ సీఎం జన్మదిన వేడుకలు

కళ్యాణదుర్గం, విడపనకల్లు, న్యూస్‌టుడే: వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను దుర్గం కార్యాలయంలో ఆ పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య కేక్‌కోసి ప్రారంభించారు. ✦ వైకాపా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మాదినేని ఉమామహేశ్వరనాయుడు క్యాంప్ కార్యాలయంలో జగన్ పుట్టినరోజు వేడుక నిర్వహించారు. జీకే కృష్ణమూర్తి అభిమాన సంఘం నాయకులు పార్వతీనగర్‌లో కేక్ కోసి వేడుక చేసుకున్నారు. ✦ విడపనకల్లు మండలం జాతీయ రహదారిపై జగన్ చిత్రపటాల వద్ద పొట్టేళ్లను కోసి రక్తం చిందించారు.

కేక్ కోసి పంపిణీ చేస్తున్న తలారి రంగయ్య, నాయకులు

విలువైన స్థలానికి రక్షణ కరవు!

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ సీవీవీ నగర్‌లో సాంఘిక సంక్షేమశాఖకు చెందిన వసతి గృహ భవనం 50 సెంట్లలో ఉంది. దానిని ఏడేళ్ల కిందట మూసేశారు. కొన్నాళ్లు ఇందులో తాత్కాలికంగా ఏఎస్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని నడిపారు. భవనం చుట్టూ ప్రహరీ కూలిపోయింది. ఇక్కడ సెంటు ధర రూ.4 లక్షల వరకు పలుకుతోంది. దీంతో ఈ స్థలంపై అక్రమార్కులు కన్నేస్తున్న దాఖలాలున్నాయి. గతంలో కొందరు ఆక్రమించుకునే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. రూ. కోట్లలో విలువైన స్థలాన్ని రక్షించే దిశగా సాంఘిక సంక్షేమ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. సొంత భవనం లేక బాలికల కళాశాల వసతిగృహం కొన్నేళ్లుగా అద్దె భవనంలో నడుస్తోంది. ఈ భవనాన్ని అభివృద్ధి చేయడం గాని, లేదా తొలగించి కొత్తది నిర్మించే దిశగా అధికారులు చొరవ చూపితే భవిష్యత్తులో విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. దీనిపై ఏఎస్‌డబ్ల్యూవో రామ్మోహన్‌ను వివరణ కోరగా స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టామన్నారు. అలాగే ప్రస్తుత భవనం స్థానంలో కొత్తది నిర్మించడానికి సాంఘిక సంక్షేమ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు.

నిరుపయోగంగా మారిన వసతిగృహ భవనం

నేడు ఇన్‌ఛార్జి ఎంపీపీగా నాగరత్నమ్మ బాధ్యతల స్వీకరణ

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ మండల పరిషత్ ఇన్‌ఛార్జి అధ్యక్షురాలిగా మండల ఉపాధ్యక్షురాలు దర్గాహొన్నూరుకు చెందిన నాగరత్నమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఉప ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. ఇటీవల ఎంపీపీ యూ.పద్మ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. కలెక్టర్, సీఈవో ఇన్‌ఛార్జి ఎంపీపీగా నాగరత్నమ్మను నియిమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సమాజసేవకు అంకితం కావాలి: కాలవ

రాయదుర్గం, న్యూస్‌టుడే: పోషకాహార లోపంతో సతమతమవుతున్న రాయదుర్గం నియోజకవర్గం ప్రజలకు లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేసేలా సభ్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. లయన్స్ క్లబ్ సిల్వర్ జుబ్లీ పూర్తిచేసుకున్న సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేఉసిన నేత్రశిబిరాన్ని ప్రారంభించిన సందర్భంగా కాలవ మాట్లాడారు. బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు పలువురికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలోలయన్స్ క్లబ్ అధ్యక్షుడు తాయి శ్రీనివాసులు, కార్యదర్శి పౌరాళు ధనార్జున, కోశాధికారి పేర్మి సత్యనారాయణ, ఆ సంఘం సభ్యులు అశోక్‌కుమార్, అంబాజీరావు, అబ్దుల్ కాలిక్, పౌరాళు శ్రీనివాసులు, శంకర్ బాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

(c) eenadu

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

ఖురాన్ కంఠస్థ పోటీలు

ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

తాడిపత్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఉన్న పద్మవాణి పాఠశాలలో ఆదివారం యునైటెడ్ ఫోరమ్ ఖురాన్ స్టడీస్ ఆధ్వర్యంలో కంఠస్థ పోటీలు నిర్వహించారు. పలువురు ముస్లిం చిన్నారులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి నియోజక వర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహిస్తారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు నాగ పీరయ్య, ప్రిన్సిపల్ మహబూబ్‌బాషా, మత పెద్దలు మౌలానా రషీద్ తదితరులు పాల్గొన్నారు.

డప్పు కళాకారుల మహాసభలు జయప్రదం చేద్దాం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: డప్పు కళాకారుల సంఘం 3వ జిల్లా మహాసభలను విజయవంతం చేద్దామని కళాకారుల సంఘం ప్రతినిధులు కొండప్ప, ఎర్రికొండప్ప పిలుపునిచ్చారు. ఆదివారం బుక్కరాయసముద్రంలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. సోమవారం అనంతపురంలో మహాసభలు జరుగుతాయని మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి కళాకారులు భారీగా తరలి రావాలన్నారు. కళాకారులకు ప్రస్తుతం ఇస్తున్న పింఛను రూ.4 వేల నుంచి రూ.7 వేలకు పెంచాలనే డిమాండుతో ఈ సభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాకారులు బాలప్ప, శ్రీరాములు, నాగేంద్ర, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న డప్పు కళాకారులు

నేత్ర జబ్బులతో జాగ్రత్త

పామిడి, న్యూస్‌టుడే : కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే అని పట్టణ లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్ తిరుపతి నాయుడు పేర్కొన్నారు. ఆదివారం భావసార క్షత్రియ కల్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వైద్య నిపుణురాలు డాక్టర్ అంజలి 120 మందిని పరీక్షించారు. వారిలో 40 మందిని కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద సదుపాయం కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. పట్టణ లయన్స్ క్లబ్ సభ్యులు, శంకర కంటి ఆసుపత్రి, లక్ష్మీ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న నేత్ర వైద్యురాలు డాక్టర్ అంజలి

సమస్యలు బోలెడు.. తీరేదెన్నడు

నాయీబ్రాహ్మణ కాలనీలో కాలువ లేక కల్యాణ మండపం వద్ద నిలిచిన మురుగు

పురపాలిక: గుంతకల్లు
కాలనీలు : నాలుగు
జనాభా : 7వేలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులోని కసాపురం రోడ్డు ఏరియా శివారు కాలనీల్లో ఇప్పటికీ సరైన మౌలిక వసతులు లేవు. కాలనీలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. కొన్ని చోట్ల ఇప్పటికీ మట్టిరోడ్లే దర్శనం ఇస్తున్నాయి. మరికొన్ని చోట్ల సీసీరోడ్లు ఉన్నా మురుగు కాలువలు నిర్మించలేదు.

● 1వార్డు నాయీబ్రాహ్మణ కాలనీలో 80 కుటుంబాలు దాకా ఉన్నాయి. మురుగు కాలువలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. గత ప్రభుత్వంలో చేపట్టిన కాలువ నిర్మాణం నిలిచిపోయింది. పూర్తి చేయడానికి రూ.10లక్షలకు మూడు నెలల కిందట టెండర్ వేశారు. ఇప్పటి వరకు పనులు మొదలు కాలేదు.

● మైనార్టీ కాలనీ 18ఏళ్ల క్రితం కాలనీ ఏర్పడింది. అన్ని వీధుల్లోను మట్టిరోడ్లే ఉన్నాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

● సిద్ధార్థనగర్‌లో సీసీ రోడ్డు అరకొరగానే ఉన్నాయి. పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రాంతంలో కచ్చా రోడ్డుతోనే సరిపెట్టారు.

● సంజీవ్‌నగర్‌లో ఎస్‌ఆర్‌కే బాలుర ఉన్నత పాఠశాల వెనుక ఉన్న మట్టిరోడ్డు పనులు చేపట్టలేదు. సీసీరోడ్డు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువ నిర్మాణం చేపడతాం

నాయీబ్రాహ్మణ కాలనీలో కాలువ నిర్మాణం పనులను తొందరలో చేపడతాం. మిగతా చోట్ల సీసీరోడ్లకు ప్రతిపాదనలు పంపించాం.
- హరికృష్ణ, ఏఈ, గుంతకల్లు పురపాలక పట్టణం

ధ్యానంతో ఒత్తిడి దూరం

తాడిపత్రి, న్యూస్‌టుడే: ప్రతి రోజూ ధ్యానం చేయడం వల్ల ఎలాంటి ఒత్తిడినైనా జయించొచ్చని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాడిపత్రి హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానకేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ధ్యానం చేయడం మంచి అలవాటు అని, ప్రతి విద్యార్థి వీటిని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ పలువురు తెదేపా నాయకులు, ధ్యానకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 8008612342

సమస్య : పాత గుంతకల్లులో సూర్యమఠం వద్ద మెయిన్‌రోడ్డు పక్కన డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. **- రాజేశ్**

సమాధానం: కాలువలో పడిన ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం.
- వేణుగోపాల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, గుంతకల్లు పురపాలక సంఘం
– న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

వైద్యశిబిరానికి స్పందన

తాడిపత్రి: టీచర్స్ కాలనీ పెన్షనర్ల భవనంలో ఆ సంఘం ఆధ్వర్యంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి సౌజన్యంతో గుండెవైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెన్షనర్లు పెద్దఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకున్నారు. ఉచితంగా బీపీ, ఈసీజీ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. శిబిరంలో 150 మంది పాల్గొన్నట్లు సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు.

సీఐటీయూ కాలనీలో

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే : గుంతకల్లులో సీఐటీయూ కాలనీలో పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం జరిగింది. జనరల్ మెడిసిన్ వైద్యులు జయవర్ధన్‌రెడ్డి, చిన్నపిల్లల వైద్యులు కీర్తికిరణ్ రెడ్డి, ఆర్థోపెడిక్ నిపుణుడు జిలాన్, సివిల్ సర్జన్ శ్రీనివాస్‌యాదవ్, గైనకాలజిస్ట్ సుజాత, తదితర వైద్యులు శిబిరంలో 300 మంది కాలనీవాసులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

పెద్దపప్పూరు ఎస్సై బదిలీ

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: పెద్దపప్పూరు పోలీసు స్టేషన్ ఎస్సై నాగేంద్రప్రసాద్ నంద్యాల జిల్లాకు బదిలీపై వెళ్లినట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు. ఇటీవల ఎస్సైపై అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. ఇసుక అక్రమ రవాణా, సివిల్ పంచాయతీల్లో తలదూర్చడంతో పాటు బాధితుల పట్ల దురుసు ప్రవర్తన, అవినీతి కారణంగా ఉన్నతాధికారులు నంద్యాల జిల్లాకు బదిలీ చేసి వీఆర్‌లో ఉంచినట్లు సమాచారం.

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

పామిడి, న్యూస్‌టుడే : సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆధ్యాత్మిక గురువు, సనాతన ధర్మ ప్రవచన కర్త డాక్టర్ ఆదిత్య పరాశ్రీ స్వామి పిలుపునిచ్చారు. ఆదివారం పామిడిలోని సరస్వతీ విద్యామందిరంలో హిందూ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికిఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా పట్టణ పురవీధుల గుండా సంగీత వాయిద్యాలు, పిల్లల కోలాటం మధ్య పెద్ద ఎత్తున ఊరేగింపు సాగింది. అనంతరం సభను ఉద్దేశించి దత్తా పీఠాధిపతి సురేంద్ర మహారాజ్ మాట్లాడారు. వేదికపై ముఖ్య అతిథిగా హాజరైన ఆదిత్య పరాశ్రీ స్వామి జ్యోతిని వెలిగించారు. తర్వాత ఆయన ప్రసంగిస్తూ హిందూవుల ఐక్యత సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. హిందూమతం అందర్నీ గౌరవిస్తూ అక్కున చేర్చుకుంటుదన్నారు. వేదికపై చిన్నారులు చేసిన భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, గోమాత పరిరక్షణ నృత్య రూపకం ఆకట్టుకున్నాయి. విశ్వ హిందూ పరిషత్ నాయకులు కత్తి రామచంద్రారెడ్డి, విశ్వ హిందూ పరిషత్ కేంద్ర కమిటీ సభ్యురాలు, ప్రముఖ న్యాయవాది లలిత ప్రభాకర్, హిందూ సమ్మేళన మండల నాయకులు లీలామనోహర్, విశ్వనాథ్, చౌడయ్య, బీవీ రత్నమయ్య, శ్రీనివాసులు రావు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు నల్లప రెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న సనాతన ధర్మ ప్రవచన కర్త ఆదిత్య పరాశ్రీ స్వామి

ఆధునిక వ్యవసాయ యంత్రాలపై అవగాహన

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : రైతు సంక్షేమ పథకాలపై గార్లదిన్నె సమీపంలో ఉన్న దక్షిణ ప్రాంత వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ ట్రాక్టర్ నగర్ ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రైతులతో ప్రత్యక్ష లైవ్ ఇంటరాక్షన్ జరిగింది. ఈసందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దిశానిర్దేశంలో రైతుల ఆదాయం పెంపు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతల వినియోగంపై చర్చించారు. వ్యవసాయ యాంత్రీకరణ ఉపమిషన్, కస్టం హైరింగ్ సెంటర్లు, ఫార్మామెషినరీ బ్యాంకులు వంటి పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల ఆదాయం పెంపు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతల వినియోగంపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఈకార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పి.పి.రావు, జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ, ఏడీ అల్తాఫ్ హాలీఖాన్, వ్యవసాయాధికారులు సోమశేఖర్, శ్యామ్‌సుందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

నేత్రపర్వంగా హిందూ సమ్మేళనం

గుత్తి, న్యూస్‌టుడే : సనాతన ధర్మంతోనే సమాజ పురోగతి సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరించాలని సూచించారు. సనాతన ధర్మం ఎంతో పవిత్రమైందన్నారు. ఆదివారం గుత్తి ఫుట్‌బాల్ క్రీడామైదానంలో హిందూ సమ్మేళనాన్ని ఆర్‌ఎస్ఎస్ ఏర్పాటు చేసింది. సమ్మేళనంలో గుత్తి మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా, మాతాజీ శ్రీస్వామి శివానందపురి మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ వల్లే దేశంలో హిందూ సమాజ రక్షణ సాధ్యమవుతోందన్నారు. దేశానికి ఆత్మ హిందూధర్మమని చెప్పారు. స్వామి వివేకానంద హిందూవుగా జీవించు-హిందూవు అని గర్వించాలని చెప్పారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మతం కాదన్నారు. సభలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. సమ్మేళనానికి ముందు ఆర్‌అండ్‌బీ అతిథిగృహం నుంచి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గాంధీచౌక్ మీదుగా రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, గుత్తి వ్యవసాయ మార్కెట్‌యార్డు కమిటీ మాజీ ఛైర్మన్ శ్రీనివాసయాదవ్, బేతాపల్లి సూరి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిని వెలిగిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు

వైభవంగా అయ్యప్ప గ్రామోత్సవం

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని క్రిష్టిపాడులో ఆదివారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్సీకాలనీలోని రామాలయంలో అయ్యప్ప మాలధారులు భక్తిశ్రద్ధలతో పడిపూజ చేశారు. అనంతరం పురవీధుల గుండా ప్రదర్శన నిర్వహించారు.

అశ్వర్థ ఆలయంలో ప్రత్యేక పూజలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలో ప్రసిద్ధి చెందిన అశ్వర్థ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అశ్వర్థనారాయణస్వామి, శ్రీచక్రభీమ లింగేశ్వరస్వామి వారికి వేద పండితులు అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కోటంక గ్రామ సమీపంలో కొండల మధ్య వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు రామాచార్యులు ఉదయం అర్చనలు, క్షీరాభిషేకాలు, ఆకుల పూజలు వంటి విశేష పూజలు జరిపి స్వామిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ప్రత్యేకాలంకరణలో స్వామి

తాడిపత్రిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

గుంతకల్లు : అంబేడ్కర్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా వైద్యాధికారిణి ఈబీదేవి

గుత్తిలో కమిషనర్ జబ్బార్‌మియా

యల్లనూరులో.. పోలియో చుక్కలు వేస్తున్న వైద్యాధికారి లోకేశ్

చిన్నారుల జీవితానికి రెండు పోలియో చుక్కలు

గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో ఆదివారం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమాన్ని మొదల రోజు దిగ్విజయంగా పూర్తి చేశారు. 99 శాతం వరకు చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రధానంగా ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండు, పట్టణ ఆరోగ్యకేంద్రాల్లో 0-5 వయస్సు లోపల ఉన్న పిల్లలకు చుక్కలు వేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్రాలను నిర్వహించారు.

గుంతకల్లు : ఆర్టీసీ బస్టాండులో మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, వైద్యాధికారి గంగాధర్ ఆధ్వర్యంలో..

శింగనమలలో..

బుక్కరాయసముద్రంలో.. ఎంపీపీ సునీత

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

శింగనమల, న్యూస్‌టుడే : మండల పరిధిలోని తరిమెల గ్రామ సమీపంలో అతి వేగంతో వచ్చిన కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయలయ్యాయి. నాయనవారిపల్లి గ్రామానికి చెందిన నలుగురు హరి, చందు, కిరణ్, భార్గవ్ ఆదివారం తరిమెల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా కారు వేగంతో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో హరి, చందు, కిరణ్‌లకు గాయాలు కాగా, భార్గవ్‌కు తీవ్ర గాయాలవ్వడంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు

శింగనమల న్యూస్ టుడే : శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి, మార్కెట్ యార్డు ఛైర్మన్ దండు శ్రీనివాసులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా మాట్లాడిన గార్లదిన్నె మండలం కనుంపల్లి గ్రామానికి ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు తెదేపా నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సుమారు 100 మందితో కలిసి శింగనమల పోలీస్ స్టేషన్‌లో ట్రైనీ ఎస్.ఐ దాయాకర్‌కు ఏఎస్ఐ చితంబరానికి రాతపూర్వకంగా ఫిర్యాదు కనుంపల్లి ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఎప్పుడు కూలుతాయో!

గుంతకల్లులోని మున్సిపల్ కూరగాయల మార్కెట్ వెనుకలా ఉండే కాంప్లెక్స్ గదులు శిథిలావస్థకు చేరాయి. గదుల ముందు భాగంలో సిమెంటు పెచ్చులూడి కడ్డీలు తేలాయి. మరికొన్ని చోట్ల బిల్డింగ్ స్లాబ్ ముందుకు కుంగి ప్రమాదకరంగా ఉంది. అద్దెకున్న వారు కొందరు గదులను ఖాళీ చేశారు. వీటిని పడగొట్టి కొత్త నిర్మాణాలు చేపట్టకపోవడంతో పురపాలిక ఆదాయం కోల్పోతోంది.
-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

ఆదమరిస్తే ఆపదే!

హనుమేశ్‌నగర్‌లోని ఉర్దూ ఉన్నత పాఠశాలకు చెందిన రోడ్డులోని మురుగు కాలువపై నిర్మించిన కల్వర్టుకు గండి పడింది. ఇది విద్యార్థుల పాలిట గుదిబండగా మారింది. విద్యార్థులతో పాటు కాలనీకి చెందిన పిల్లలు అదుపుతప్పి పడి గాయపడుతున్నారు. విద్యుత్తు లేని సమయంలో రాత్రిపూట పాదచారులు ప్రమాదానికి గురౌతున్నారు. అధికారులు వెంటనే మరమ్మతులు చపట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, గుంతకల్లు**

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

యాడికి, న్యూస్‌టుడే: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను యూపీఎస్ సీఐ కె.శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం యాడికి పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఘర్షణలు, గొడవలు, నేరాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. ఎస్సై వెంకటరమణ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇంటి స్థలాలు, భూముల సమస్యలున్న వారు వాటిని పరిష్కరించుకోవాలని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్ అన్నారు. ఇందుకు సంబంధించి ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఉపయోగించుకోవాలని ఆయన ఆదివారం ఒక పత్రికాప్రకటనలో తెలిపారు. సమస్యలున్న వారు, మ్యూటేషన్, రికార్డ్ ఆఫ్ రైట్స్, ఎఫ్‌లైన్, సబ్‌డివిజన్ లాంటి సమస్యలను తాము పరిష్కరిస్తామని చెప్పారు. అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిఆర్.ఎస్.లోని హోరబ్ చర్చి సమీపంలో నివాసం ఉంటున్న విశ్రాంత రైల్వే ఉద్యోగి సుధాకర్‌రావు ఇంట్లో చోరీ జరిగింది. ఆయన ఈనెల 19న పనిమీద హైదరాబాదుకు వెళ్లాడు. ఆదివారం తెల్లవారుజామున ఆయన తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగిన విషయాన్ని తెలుసుకున్నాడు. దుండగులు ఇంటి తాళాలు పగుల గొట్టి లోపలికి ప్రవేశించి బీరువాలోని 9 తులాల బంగారు కమ్మలు, ఉంగరాలు, కంఠాభరణంతో రూ.15వేలు నగదును చోరీ చేశారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తిలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు పుణ్యవతి తెలిపారు. మ్యూటేషన్, ఆర్‌వోఆర్, ఎఫ్ లైన్, సబ్‌డివిజన్ తదితర సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సమస్యలపై తమకు ఫిర్యాదు చేయాలని ఆమె ప్రజలకు సూచించారు. స్థానికంగా పరిష్కారం కాకపోతే సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

పది పరీక్షలకు.. ప్రణాళికతో సాధన

ప్రత్యేక తరగతులతో శిక్షణ

యాడికి, తాడిపత్రి, న్యూస్‌టుడే : విద్యార్థుల భవిష్యత్తును మార్చేది పదో తరగతి. దీంతో పిల్లల చదువుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తోంది. ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో చదివి మంచి మార్కులు సాధించాలనే సంకల్పంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా ఉపాధ్యాయులను ఆదేశాలు జారీ చేసింది. పరీక్షలు దగ్గర పడుతుండటంతో చదివిన పాఠ్యాంశాలను మరవకుండా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారు. అరగంట సమయం కూడా వృథా చేయకుండా ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తూ సంసిద్ధం చేస్తున్నారు.

యాడికి మండల వ్యాప్తంగా ఈ విద్యా సంవత్సరం పది పాఠశాలల్లోని మొత్తం 297 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

అందరిపై శ్రద్ధ కనబరుస్తూ..

విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు విద్యార్థులను చదివించడం జరుగుతోంది. సబ్జెక్టుల వారీగా తరగతులు తీసుకుంటూ, గతేడాది ఫలితాల కంటే వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులకు చదువు పట్ల ఏకాగ్రత ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, ప్రతి రోజూ సాయంత్రం వేళ 20 మార్కులకు సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. తక్కువ మార్కులు వచ్చిన వారికి మెరుగైన ఫలితం వచ్చేలా శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడి ఫలితాలను వెంటనే అన్‌లైన్‌లో విద్యాశాఖకు చేరవేస్తున్నారు.

ఆదివారం తరగతులకు హాజరైన విద్యార్థులు

మండలం	ఉన్నత పాఠశాలలు	విద్యార్థులు
తాడిపత్రి	16	852
యాడికి	10	297
పెద్దపప్పూరు	09	273
పెద్దవడుగూరు	07	374

సెలవు రోజుల్లోనూ..

ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేస్తున్నాం. సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పాఠశాలలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం.
- సీతారామాంజనేయులు, ఎంఈవో-2, యాడికి

ఘనంగా జగన్ జన్మదినం

శింగనమల,న్యూస్ టుడే : శింగనమలలో ఆదివారం వైకాపా మండల కన్వీనర్ పూల ప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకల ఘనంగా నిర్వహించారు. రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద విగ్రహానికి పూలమాల వేసి కేకు కోసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నార్పల : మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను నార్పలలోని ఎస్వీ కల్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సత్యానారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శింగనమల నియోజకవర్గ ఇన్‌ఛార్జి శైలజానాథ్, తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

గుత్తి, న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిరోజును పురస్కరించుకుని ఆదివారం వైకాపా నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేశారు. గుత్తిలో పట్టణ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేకు కోసి ప్రజలకు పంపిణీ చేశారు. గుత్తిఆర్.ఎస్.లో శనివారం అర్ధరాత్రి నాయకులు గురుప్రసాద్‌యాదవ్, పురపాలిక కౌన్సిలర్ వాల్మీకిశివ రైల్వేబుకింగ్ కార్యాలయం వద్ద చలికి ఇబ్బందిపడుతున్న నిరాశ్రయులకు దుప్పట్లు అందజేశారు.

తూకాల్లో తేడాలుంటే కఠిన చర్యలు

పామిడి, న్యూస్‌టుడే : జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పామిడిలోని బీబీసీ రోడ్డులో తూనికలు, కొలతలు శాఖాధికారి శంకర్ పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయం వద్ద వినియోగదారులకు అవగాహన కల్పించారు. అనంతరం వినియోగదారులు తీసుకెళ్తున్న కూరగాయలు, పండ్లను తూకాలు వేసి పరిశీలించారు. తూకం రాళ్లను పరిశీలించి తూకాల్లో తేడాలుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తూనిక రాళ్లను పరిశీలిస్తున్న తూనికలు, కొలతలశాఖాధికారి శంకర్

విద్యార్థులకు క్విజ్ పోటీలు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో శంకరానందగిరిస్వామి జూనియర్ కళాశాలలో ఆదివారం ఏపీజే అబ్దుల్ కలామ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. క్విజ్ కాంపిటీషన్ పోటీల్లో కౌసిక్ ప్రథమ స్థానం, లికిత్, శర్మస్ ద్వితీయ స్థానాలు, గౌతమ్, పునీత్‌కుమార్ తృతీయ స్థానం సాధించారు. క్విజ్ పోటీలను తహసీల్దార్ రమాదేవి ప్రారంభించారు. కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్ విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్లు హర్షద్, సంజిదా, అడ్వకేట్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు నగదు అందజేస్తు న్న కేసీ హరికుమార్

(c) eenadu

అనంతపురం

•అనంతపురం •రాప్తాడు

వైభవంగా పల్లకీసేవ

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామి వారికి విశేష అర్చనలు, అభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. యాగమండపంలో రాహుకేతు, కుజదోష, కాలసర్పదోష నివారణకు సుబ్రహ్మణ్యేశ్వర మూలమంత్ర బీజాక్షర హోమాన్ని నిర్వహించారు. ఆదివారం జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

సందడిగా హిందూ సమ్మేళనం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనం సందడిగా సాగింది. మండలంలోని పలు గ్రామాల నుంచి హిందువులందరూ పంపనూరు నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. శృంగేరీ మఠం అనంతపురం పీఠాధిపతి విద్యానృసింహ భారతి స్వామీజీవారు పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని కనకదాస కల్యాణమండలంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొని హిందూ ధర్మం గురించి వివరించారు. ఎన్నో వేల సంవత్సరాల నుంచి హిందూ ధర్మం కొనసాగుతోందని వివరించారు.

మహిళా ధర్మ ఫెస్టివల్ బజార్ ప్రారంభం

అనంత సాంస్కృతికం: లలిత కళా పరిషత్‌లో ఆదివారం డిజిటల్ మహిళా ధర్మ సంఘం ఆధ్వర్యంలో ధర్మ ఫెస్టివల్ బజార్ ప్రారంభమైంది. తెదేపా నాయకురాలు బల్లాపల్లవి, డిజిటల్ మహిళా శక్తి జాతీయ నాయకురాలు డా.ఈడల ఆశేష సంయుక్తంగా ప్రారంభించారు. బల్లాపల్లవి మాట్లాడుతూ.. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ కలిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మహిళా వ్యాపారులకు సరైన వేదికలు లభిస్తే స్వయం ఉపాధి ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహిస్తే మహిళా వ్యాపారులకు బలం చేకూరుతుందని అలాంటి వాటికే ఈ బజారు ఒకటని అభిప్రాయపడ్డారు. మహిళలకు కావాల్సిన అన్ని వస్తువులు దొరుకుతాయన్నారు. మహిళల శ్రమకు వేదికగా నిలుస్తుందన్నారు. డా.ఈడల ఆశేష మాట్లాడుతూ.. మహిళా సాధికారతను అభినందిస్తూ మహిళ చేతిలో ఉపాధి ఉంటే కుటుంబం వెలుగొందుతుందన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం

సందేశమిస్తున్న పాస్టర్ సంపత్‌కుమార్

అనంత సాంస్కృతికం: ఏసుక్రీస్తు అనుసరించిన బోధనలు, సూక్తులు అనుసరణీయమని వాటిని ఆచరిస్తే జీవితం బంగారుమయమవుతుందని పాస్టర్లు పేర్కొన్నారు. క్రిస్మస్ మాసంలోని ఆఖరి ఆదివారం కావడంతో నగరంలోని చర్చిలన్నీ క్రైస్తవులతో కిటకిటలాడాయి. సప్తగిరి కూడలిలోని ఎస్‌ఐయూ చర్చి పాస్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ.. గురువారం జరిగే క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరుపనున్నామన్నారు.

జిల్లాలో బీసీ భవన్ నిర్మించండి..

రుద్రంపేట, న్యూస్‌టుడే: జిల్లాలో బీసీ భవన్ ఏర్పాటు చేసేందుకు కలసి కట్టుగా ముందుకు నడచి కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని భారత బహుజన్ ఫ్రంట్ నాయకులు ఆదివారం పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వంలోని బీసీ ప్రజా ప్రతినిధులు బీసీ భవన్ ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. బహుజన ఫ్రంట్ వ్యవస్థాపకులు ఓబులేసు, విశ్రాంత జడ్జి కృష్ణప్ప, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్ఆర్ నాగభూషణ, బీసీ, మైనార్టీ ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.3.29 లక్షలు

రాంనగర్: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో మొత్తం రూ.3,29,100 ఆదాయం వచ్చింది. శనివారం గొర్రెలు, మేకల సంతలో రూ.1,93,500 ఆదాయం రాగా, ఆదివారం పశువుల సంతలో రూ.1,35,600 ఆదాయం వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి ఇన్‌ఛార్జి కార్యదర్శి, ఏడీఎం రాఘవేంద్రకుమార్, గ్రేడ్-2 కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు.

పార్కింగ్ సమస్యకు చరమగీతం

అశోక్‌నగర్: నగరంలో పార్కింగ్ సమస్యకు చెక్ పెట్టే దిశగా నగరపాలక సంస్థ ఓ అడుగు ముందుకు వేసింది. ఇటీవల కలెక్టర్ ఆనంద్, ఎస్పీ రాజశేఖర్ అధ్యక్షతన రోడ్డు ప్రమాదాల నివారణ కమిటీ సమావేశంలో నగరంలో పార్కింగ్ ప్రదేశాల ప్రస్తావనకు వచ్చింది. పలు నగరాల్లో పార్కింగ్ ప్రదేశాలు ఉన్నాయని అదే తరహాలో నగరంలో ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించడంతో ప్రక్రియ కదలిక వచ్చింది. ఇప్పటి దాకా వాహనాలు ఉంచడానికి స్థలం చూపకుండా (పార్కింగ్ ప్రదేశాలు) వాహనాలను ఎక్కడ ఉంచాలన్న ప్రశ్న ప్రజల నుంచి ఎదురయ్యేది. అన్ని సమస్యలను చక్కదిద్దడానికి రద్దీ ప్రదేశాల్లో వాహనదారులు తమ వాహనాలను ఉంచడానికి 22 ప్రదేశాలను గుర్తించారు. అక్కడ ఉంచే వాహనాలను క్రమపద్ధతిలో ఉంచడానికి గుత్తేదారులను ఎంపిక చేయడానికి నగరపాలక టెండర్లు ఆహ్వానించింది. వాహనదారులు రుసుం చెల్లించాలి. ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా రోడ్డు మీద వాహనాలు ఉంచితే పోలీసులు అపరాధ రుసుం విధిస్తారు.

గడియార స్తంభం కూడలి సమీపంలో నగరపాలక షాపింగ్ కాంప్లెక్స్ సెల్లార్, పక్కనే పూల దుకాణాల వద్ద ఖాళీ ప్రదేశం, కన్యకాపరమేశ్వరి ఆలయం ముఖద్వారం పక్కన, బెంగళూరు బేకరి వద్ద వాహనాలు ఆపేందుకు స్థలం గుర్తించారు.

పాతూరు చెన్నకేశవస్వామి దేవాలయం ముందు ఖాళీ ప్రదేశం

అక్కడ వెళ్లాలంటేనే భయం

పాతూరు మార్కెట్‌లోకి వెళ్లే వారంతా తాడిపత్రి బస్టాండ్ వద్ద రోడ్డుకు రెండు వైపైలా అడ్డంగా ఉంచుతారు. గాంధీ విగ్రహం వెనుక వైపున రోడ్డులో పూల వ్యాపారులు విక్రయిస్తుంటే ఆ రోడ్డు మీద వాహనాలు ఉంటాయి. వెళ్లేందుకు దారి లేక తీవ్ర ఇబ్బందిగా ఉండటంతో చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ఉన్న ఖాళీ ప్రదేశం, సీడీ ఆసుపత్రి పార్కింగ్ ప్రదేశంగా ఎంపిక చేశారు

● పీటీసీ ప్రహరీ పక్కనే గంగమ్మ గుడి, నడిమి వంక మోర్ షాపు, కళ్యాణదుర్గం, బళ్లారి బైపాస్ ఉపరి తలవంతెన కింద, ఆర్ట్స్ కళాశాల ప్రధానగేటు ఎదురుగా, రైల్వే స్టేషన్ నుంచి సైపుల్లా వంతెన, సైపుల్లా వంతెన కింద, రఘువీరా టవర్, సత్యషాప్, బొమ్మన షాపు, జూనియర్ కళాశాల ప్రహరీ పక్కన, త్రివేణి వంతెన వద్ద స్థలాలను గుర్తించారు.

సప్తగిరి కూడలి సమీప ప్రాంతాల్లో షాపింగ్స్ చేసే వారికి సమీపంలోనే కొన్ని ప్రాంతాలు ఎంపిక చేశారు. నగరపాలక ఎదురుగా ఖాళీ ప్రదేశం, లలితకళాపరిషత్ పక్కన, అంబేడ్కర్ విగ్రహం నుంచి చర్చి పక్కన, తెలుగు తల్లి విగ్రహం, జడ్జి బంగ్లా సమీపంలోని అంబేడ్కర్ ఉపరితల వంతెన కింద ఉన్న ఖాళీ ప్రదేశాలను పార్కింగ్‌లకు వినియోగిస్తారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అశోక్‌నగర్ : 9440247485
తపోవనం: 8008573010
రుద్రంపేట: 8008550310

సమస్య: పాతూరు మార్కెట్ వద్ద ఆవుల బెడద ఎక్కువగా ఉండటంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది.**-మారుతికుమార్**

సమాధానం: ఆవుల యజమానులకు నోటీసులు ఇస్తాం.

సమస్య: త్రివేణి వంతెన సమీపంలో పెద్ద పెద్ద గుంతలు పడటంతో కిందపడుతున్నాం.
- పరమేశ్

సమాధానం: మరమ్మతులు చేసి సమస్య తీర్చుతాం.

(పై ప్రశ్నలకు నగరపాలక ఇన్‌ఛార్జి ఆరోగ్య అధికారి పావని, ఈఈ షాకీర్ సమాధానాలు ఇచ్చారు.) – న్యూస్‌టుడే, అశోక్‌నగర్

లైట్లు వెలిగాయి

స్పందనకు వందనం

అనంత నగరపాలక : నగరంలోని రహమత్‌నగర్‌లో వీధి లైట్లు వెలిగించారు. శనివారం మేమున్నాం మీకు తోడుగా ద్వారా రహమత్‌నగర్‌లో రెండు వీధి లైట్లు వారం రోజులుగా వెలగడం లేదని విశ్రాంత ఉపాధ్యాయుడు రంగప్ప తెలిపారు. తక్షణమే లైట్లు వెలిగే విధంగా చర్యలు చేపట్టాలని కమిషనరు బాలస్వామి డీఈ దాక్షాయిణికి ఆదేశించడంతో సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించి లైట్లు వెలిగే విధంగా చర్యలు చేపట్టారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు భార్గవి ఎంపిక

అద్దంకి: అండర్-18 రాష్ట్ర స్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు బాపట్ల జిల్లా పంగులూరులోని సుబ్బరామిరెడ్డి బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. వీటిలో ఉత్తమ ఆట తీరు ప్రదర్శించిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు సీతారామిరెడ్డి, ఖోఖో సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హనుమంతరావు ఆదివారం తెలిపారు. బాలికల జట్టులో అనంతపురం నుంచి భార్గవి ఎంపికైంది.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తే ప్రజల్లో గుర్తింపు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: నిజాయతీ, నిస్వార్థం, అంకితభావంతో పనిచేస్తేనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. రాజకీయాల్లో అనేక ఒడిదొడుకులు ఎదురైనా ప్రజల పక్షాన పనిచేస్తేనే పదవులకు సార్థకత ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. అనంతపురం గ్రామీణ మండలం సోములదొడ్డి గ్రామంలో శ్రీ అశ్వర్థనారాయణస్వామి నూతన ఆలయ కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె తొలుత స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీకి ఎన్నికైన సభ్యులు స్వామి ఆస్తులను పరిరక్షించి అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలని పిలుపునిచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి, ఇతర సభ్యులు 8 మంది బాధ్యతలు స్వీకరించారు. రాచానపల్లి సొసైటీ ఛైర్మన్ పామురాయి రఘు, స్థానిక తెదేపా నాయకులు పామురాయి వెంకటేశ్వర్లు, నాగలింగారెడ్డి, వీరనారప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సునీత

క్యాన్సర్ బాధితురాలికి సరకుల వితరణ

కమలానగర్: శ్రీసత్యసాయి జిల్లా ఎన్‌పీకుంట మండలం గవకన్నపల్లికి చెందిన సావిత్రమ్మ క్యాన్సర్‌తో ఏడాది నుంచి బాధపడుతోంది. నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ నిర్మలమురళిని సంప్రదించగా పుట్టినిల్లు ఆశ్రమంలో రూ.10 వేలు విలువ చేసే రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరకులను అందించారు.

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచాలి

రుద్రంపేట : స్థానిక సంస్థల ఎన్నికల్లో గిరిజనులకు పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ల శాతం పెంచాలని గిరిజన ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లికార్జున నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. రూల్‌ఆఫ్ రిజర్వేషన్ పాటించి గిరిజన తండాలలో అభివృద్ధికి బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

క్రికెట్‌లో అనంతపురం డివిజన్ జట్టు గెలుపు

పోటీలు ప్రారంభిస్తున్న పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి శ్రీనివాసులు

అనంతపురం క్రీడలు: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో అనంతపురం డివిజన్ జట్టు గుంతకల్లు జట్టుపై ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. ఆదివారం ఆర్డీటీ మైదానంలో జరిగిన ఈ పోటీలో తొలుత బ్యాటింగ్ చేసిన గుంతకల్లు జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 138 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన అనంతపురం డివిజన్ జట్టు 14 ఓవర్లలోనే లక్ష్యాన్ని సాధించి మూడు వికెట్లు కోల్పోయింది. బ్యాటరు వెంకటేశ్వరరెడ్డి (71) అద్భుత బ్యాటింగ్ చేసిన ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు. పీడీలు గోపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజు, నరసింహారెడ్డి, ప్రభాకర్, శ్రీనివాసులరెడ్డి, మంజుల, ఆంజనేయులు, నారాయణ పాల్గొన్నారు. సోమవారం కళ్యాణదుర్గం, గుంతకల్లు జట్ల మధ్య ఉదయం మరో పోటీ జరుగుతుందని శ్రీనివాసులు తెలిపారు.

నగరంలో నేడు

కమలానగర్ : జిల్లా కలెక్టరేట్, పోలీసు కార్యాలయాల్లో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల నిర్వహణ..

పొంచి ఉన్న ప్రమాదం

శ్రీనగర్ పార్కు సమీపంలో రహదారిలో కల్వర్టుకు ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మెలు కుంగిపోవడంతో వాహన రాకపోకలు సాగిస్తున్నప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. నగర కార్పొరేషన్ అధికారులు స్పందించి కుంగిన సిమెంట్ దిమ్మెలు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

ప్రమాదాలు జరగొద్దని..

చెన్నై, బెంగళూరు జాతీయ రహదారులు కలుసుకునే చోటు నుంచి రాప్తాడు మండల కేంద్రానికి వెళ్లే రహదారిపై కొన్ని సంవత్సరాలు నుంచి పెద్ద పెద్ద గుంతలు అలానే ఉన్నాయి. ఆ గోతుల్లో తమ వాహనాలు ఇరుక్కుపోయి ఆటోలు దెబ్బతున్న సందర్భాలు ఉన్నాయి. ఈ పరిస్థితిని గమనించిన ఓ ఆటోడ్రైవర్లలో ఓ చోదకుని ఇంటి వద్ద నిర్మాణ వ్యర్థాలను ఆటోల్లో నింపుకొని గోతుల్లో నింపాడు. అతడి ప్రయత్నాన్ని పలువురు మెచ్చుకున్నారు. **- ఈనాడు అనంతపురం**

పశువులకు ఆపన్న హస్తం

ఆకలి వేస్తే సమయానికి మనం ఎక్కడో ఓ చోట తినచ్చు. అదే నోరు లేని మూగ జీవాలు ఎవరినీ అడుగలేవు. వీధుల్లో తిరుగుతున్న పశువులకు ఆపన్న అస్తంగా నిలిచారు శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ఓ పశువుల ప్రేమికుడు. ఇంటి ముందు టబ్బులు ఏర్పాటు చేసి రోజూ రెండు పూటలా అందులో దానా వేస్తున్నారు. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

మురుగు.. ముప్పుతిప్పలు

రుద్రంపేట-ఆలమూరు వైపు వెళ్లే ప్రధాన రహదారి పీవీకేకే ఐటీ కళాశాల సమీపంలో విద్యుత్తు నియంత్రిక ముందు మురుగు నిలువ ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉంది. **- న్యూస్‌టుడే, రుద్రంపేట**

ఈఎస్ఐ, ఈపీఎఫ్, పన్నులపై అవగాహన

అనంతపురం విద్య: ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లకు ఈఎస్ఐ, ఈపీఎఫ్, ప్రొఫెషనల్ ట్యాక్స్‌పై అవగాహన కార్యక్రమం ఆదివారం రఘుసైనిక్ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. జీఎస్టీపై డీసీటీఓ సుబ్బన్న, అనిల్‌కుమార్, ఈఎస్ఐపై జగదీశ్వరరెడ్డి, మోహన్, రామకృష్ణ, ఈపీఎఫ్‌పై శ్రీనివాసబాబు, నరేంద్ర అవగాహన కల్పించారు. ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, రవిచంద్రరెడ్డి, గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, రాఘవేంద్ర, కృష్ణమూర్తి, నూర్జహాన్ పాల్గొన్నారు.

అపుస్మా ఆధ్వర్యంలో: అన్‌ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఈఎస్ఐసీపై వివేకానంద జూనియర్ కళాశాలలో అవగాహన కల్పించారు. స్ప్రీ కార్యక్రమం ద్వారా లభించే ప్రయోజనాలను అధికారులు రామకృష్ణ, గోపాల్, మోహన్,జగదీశ్వరరెడ్డి అవగాహన కల్పించారు. అపుస్మా రాష్ట్ర సమన్వయకర్త పుల్లారెడ్డి, జిల్లా అధ్యక్షులు సుబ్బారెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

ఉచిత మెగా శిబిరానికి స్పందన

ఆర్కేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: పీపుల్స్ హెల్త్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రాజీవ్‌కాలనీ పంచాయతీ మహదేవనగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. కళ్లు, గొంతు, చెవి, ముక్కు, సంబంధిత వైద్యులు జనరల్ ఫిజిషియన్, చర్మవ్యాధులు, గైనిక్ తదితర రోగాలకు సంబంధించి వైద్యులు శిబిరంలో హాజరయ్యారు. గైనకాలజిస్టు ప్రసూన, ఈఎన్‌టీ వైద్యుడు నిరంజన్, వైద్యులు పవిత్ర, సుచిత్ర, గోపాల్, కిషోర్ పాల్గొని పరీక్షలు నిర్వహించారు. 300 మందికిపైగా శిబిరంలో పాల్గొన్నారు.

సహకార మంత్రిత్వశాఖ సలహాదారుడికి సన్మానం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆధ్వర్యంలో సహకార మంత్రిత్వశాఖ హిందీ సలహాదారుడుగా నియమితులైన గైబువల్లీకి యూత్ ఎడ్యుకేషన్ ఎంప్లాయ్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. హిందీభాషా ప్రచారానికి గైబువల్లీ 20 సంవత్సరాలు చేసిన సేవలను గుర్తించి ఈ పదవి రావడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు శివారెడ్డి, మనోజ్‌కుమార్, సర్దార్‌వలి, సోమశేఖర్, నజీర్, జగదీష్, ఇంతియాజ్, జాకీర్‌హుసేన్ పాల్గొన్నారు.

34,310 మందికి పోలియో చుక్కలు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో పల్స్‌పోలియో చుక్కల మందు లక్ష్యానికి చేరువ అయ్యామని కమిషనరు బాలస్వామి పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన పల్స్ పోలియో కేంద్రాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో 5 సంవత్సరాలలోపు ఉన్న చిన్నారులకు చుక్కల మందు వేశారు. నగరంలో 34,310 మంది చిన్నారులకు చుక్కల మందు వేయాలని లక్ష్యాన్ని నిర్ణయించారు. 120 బూత్‌లు, 8 ట్రాన్సిట్ పాయింట్‌లు, 12 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు. డిప్యూటీ కమిషనరు డాక్టర్ పావని, ఏఎస్ఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న నగర కమిషనరు బాలస్వామి, తెదేపా కార్పొరేటర్ బాలాంజినేయులు, సిబ్బంది

రాప్తాడు: రాప్తాడు మండలంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వైద్యాధికారి శివక్రిష్ణ తెలిపారు. మండలవ్యాప్తంగా 4,035 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు.

ఎరుకుల అభివృద్ధికి కృషి

కమలానగర్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎరుకుల కులస్థుల అభివృద్ధికి కృషి చేస్తానని ఉమ్మడి అనంతపురం జిల్లా ఎరుకుల యువజన విభాగం అధ్యక్షుడు కరుణాకర్ పేర్కొన్నారు. అధ్యక్షుడిగా కరుణాకర్‌ను ఆదివారం ఆసంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ చిరంజీవి ఆధ్వర్యంలో ఎన్నుకొని అభినందించారు. ఎరుకుల కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు.

విద్యార్థులతో శ్రీరామ కీర్తనలు

అనంత సాంస్కృతికం: భగవంతుడు పూర్ణపురుషుడు. మనిషిగా జన్మించి తనేమిటో తత్వమేమిటో లోకానికి స్పష్టంగా రామచంద్రుడి రూపంలో విశద పరిచాడని, చిక్‌బళ్లాపుర ఓంకారం పీఠాధిపతి ఉమామహేశ్వర స్వామి పేర్కొన్నారు. ఆదివారం కోర్టు రోడ్డులోని వరదాంజనేయస్వామి ఆలయంలో జరిగిన వైదిక కార్యక్రమాలకు హాజరయ్యారు. మొదట ఆయన ఆలయంలో పూజలు చేశారు. 50 మంది విద్యార్థులు కార్యక్రమంలో శ్రీరామ జపం, శ్రీరామ కీర్తనలు ఆయన ఆలపించి పాడాల్సిన వైనం వివరించారు.

పూజలు చేస్తున్న పీఠాధిపతి

తెరపై ఈనాడు

అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే : గాయత్రి, నీలిమ, ఎస్వీ సినిమా : **అవతార్ ఫైర్ అండ్ యాష్,** గౌతమి : **గుర్రం పాపిరెడ్డి,** గంగ, గౌరి, త్రివేణి, శాంతి : **అఖండ-2..** తరంగిణి : **మరియు, కామ ది డిజిటల్ సూత్రాస్,** తేజశ్విని : **ధురంధర్,** సుధా : **ఆంధ్రాకింగ్ తాలూకా.**

CHANGE OF NAME

I, **KORRA JAYASREE** (Old Name), W/o. **RAMAVATH RUPESH MURTHY,** resident of H.No: 4-871-4, Balaji Homes, Kalyandurgam Road, Papampeta, Ananthapuramu, A.P. I have changed my name as **KORRA JAYASREE BAI** (New Name), **W/o. RAMAVATH RUPESH MURTHY,** Hereafter my name is known as **KORRA JAYASREE BAI** (New Name), **W/o. RAMAVATH RUPESH MURTHY.**

సేవాకేంద్రం.. తెరిస్తే ఉపయుక్తం

మూత పడిన సర్వీసు సెంటర్

అనంత సాంస్కృతికం: తిరుమలకు ఏడుకొండల స్వామి దర్శనం చేసుకునేందుకు జిల్లావాసులకు సౌలభ్యంగా ఉండేందుకు ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో 20 ఏళ్ల క్రితం తి.తి.దే. కల్యాణ మండపంలో భక్తులకు సర్వీసు సెంటర్ ప్రారంభమైంది. మొదట్లో ఒకే రకం దర్శనం టికెట్లతో కేంద్రం ప్రారంభమైంది. ఇంటి యజమాని వెళ్లి ఎంతమందికి కావాల్సి ఉన్నా ఒకరే వెళ్లి అంత మందికి దర్శనం టికెట్లు పొందేవారు. తర్వాత ఆ పద్ధతి మారి దర్శనానికి వెళ్లే ప్రతి వ్యక్తి కేంద్రానికి వచ్చి వేలిముద్ర వేసిన తర్వాత రూ.50 దర్శనం టికెట్ ఇస్తూ చేతికి ట్యాగు కట్టేవారు. నిత్యం వందలాది మంది దర్శన టికెట్లు పొందుతూ.. తిరుమలేశుడి దర్శించుకునేవారు. సాంకేతికత పెరిగి సేవల, దర్శనం టికెట్లు సైతం అనంతపురంలోనే దొరికే సౌలభ్యం కల్పించారు. అర్చన, తోమాల, వస్త్రం సేవలు తప్పించి అన్ని రకాల దర్శన టికెట్లు అనంతపురంలోనే పొందే అవకాశం కల్పించారు. ఈ కౌంటర్ నుంచే అనుకూల తేదీల్లో (టికెట్లు అందుబాటులో ఉంటే) దర్శన టికెట్లు పొందేవారు. గదులు ఇక్కడే రిజర్వు చేసుకునేవారు. ఇది గతం.

ఇష్టారాజ్యంగా వసూళ్లు

కరోనా లాక్‌డౌన్‌లో 22-5-2021 నుంచి సర్వీసు సెంటర్ మూతపడింది. జనజీవనం సాధారణ స్థితికి వచ్చినా మూతపడిన తి.తి.దే. సర్వీసు సెంటర్‌కు వేసిన డోర్ లాక్ లోనే ఉంది. కేంద్రం తెరవకపోవడంతో నిరక్షరాసులకు తిరుమల టికెట్లు పొందడం గగనమవుతోంది. ఫలితంగా నెట్ సెంటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. నెట్‌సెంటర్ వారు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. చదువుకున్నవారికీ ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లు దక్కడం గగనం అవుతోంది.

టికెట్లు పొందే వీలు కల్పించాలి..

ఇక్కడ టికెట్లు పొంది ఎలాంటి కష్టం లేకుండా వెళ్లి స్వామి దర్శనం చేసుకుని వచ్చేవాళ్లు. ప్రస్తుతం ఆసౌకర్యం లేదు. తి.తి.దే. స్పందించి మూతపడిన కౌంటర్‌ను ప్రారంభించాల్సిన ఆవశ్యకత ఉంది **- అశ్వర్థనాయక్, మాజీ తి.తి.దే. సభ్యుడు, విశ్రాంత రైల్వే ఎస్, ఎస్ అధికారి**

ఆశోక్‌నగర్‌లోని హరిహర దేవాలయంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం నిర్వహిస్తున్న గురుస్వాములు

సేవా కార్యక్రమాలతో జగన్ జన్మదిన వేడుకలు

అనంత నగరపాలక: మాజీ సీఎం జగన్ జన్మదినాన్ని పురస్కరించుకొని వైకాపా ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వైకాపా కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి కేకు కోశారు. ప్రభుత్వ ఆసుపత్రి, వృద్ధాశ్రమాలు, బుద్ధిమాంద్యం పిల్లలు, దివ్యాంగులు ఉన్న సంస్థల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, మేయర్ వసీం, ఉపమేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంక్ వితరణ: రుద్రంపేట: రుద్రంపేట పంచాయతీ చంద్రబాబునగర్‌కు చెందిన ఎంపీటీసీ మహబూబ్ బీ ఆధ్వర్యంలో పంతుల కాలనీ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు తాగునీటి ట్యాంక్ వితరణ చేశారు.

కార్మికుల తొలగింపు విరమించుకోవాలి

ఆర్కేనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: 50 సంవత్సరాలు నిండిన కార్మికులను మెడికల్ రంగంలో తొలగింపు నిబంధనను గుత్తేదార్లు విరమించుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా యాభై ఏళ్లు నిండిన శానిటేషన్ కార్మికులను తొలగిస్తూ కాంట్రాక్టర్లు నిబంధనలు పెడుతున్న సమయంలో గత నెలలో హైకోర్టులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కేసు వేశామన్నారు. కేసు విషయాన్ని పరిశీలించిన కోర్టు యాభై ఏళ్లు నిండిన కార్మికులను తొలగించకూడదని కోర్టు తీర్పు ఇచ్చారన్నారు. తీర్పుపై హర్షిస్తున్నామన్నారు. కావున ప్రభుత్వం స్పందించి తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌గౌడ్, నగర కార్యదర్శి కృష్ణుడు, నాయకులు చిరంజీవి, మనోహర్, శోభ, వెంకటేశ్, రామాంజనేయులు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి

IN THE COURT OF THE II nd ADDL. JUNIOR CIVIL JUDGE : ANANTHAPURAMU

O.S. No: 952/2024

Between:
Canara Bank., Clock Tower Branch, Ananthapuramu ....**Plaintiff**

And

Tagguparthy Chandra Mouli and Others ....**Defendants**

Notice to the Defendant No: 1, 2 and 3

D1. **Tagguparthy Chandra Mouli** S/o T.Yerriswamy, R/at D.No. 4-6-23, Ram Nagar, Ananthapuramu .
D2. **B.Sudarshan Reddy** S/o B. Nagi Reddy, R/at D.No. 1-2-286, R.K. Nagar, Ananthapuramu.s
D3. **A.Honnursa** S/o A.Dharmadevulu, R/at D.No. 13-1-118, M.G. Colony, Ananthapuramu

పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 17-03-2026వ తేది ఉదయం 10.30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

K.Ramesh Babu, Advocate, Ananthapuram. Cell: 9398549442

విధేయతకే తెదేపా పట్టాభిషేకం

అధ్యక్షుడిగా సుగవాసి ప్రసాద్‌బాబు
ప్రధాన కార్యదర్శిగా పఠాన్ ఖాదర్‌ఖాన్

ఈనాడు, కడప: రాజంపేట పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడుగా సుగవాసి ప్రసాద్‌బాబును నియమిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన కార్యదర్శిగా మదనపల్లెకు చెందిన పఠాన్ ఖాదర్‌ఖాన్‌ను నియమించింది. సామాజిక సమీకరణాలు, సామర్థ్యం, విధేయత తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని ఆ పార్టీ అధినేత చంద్రబాబు వారిని ఎంపిక చేశారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నియామకం పూర్తి కావడంతో జిల్లా కార్యవర్గం పూర్తి స్థాయిలో ఏర్పాటుపై దృష్టి సారించనున్నారు. తెదేపా ఆవిర్భావం నుంచి పసుపు జెండా మోసిన మాజీ ఎంపీ రాయచోటికి చెందిన సుగవాసి పాలకొండ్రాయుడు చరమాంకం వరకు పార్టీకి సేవలు అందించారు. ఇటీవల ఆయన మరణించడంతో పాలకొండ్రాయుడి చిన్న కుమారుడైన ప్రసాద్‌బాబు రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుని పార్టీకి సేవలందిస్తూ వస్తున్నారు. సామాజిక సమీకరణలను దృష్టిలో పెట్టుకుని బలమైన సామాజిక వర్గానికి చెందిన సుగవాసిని పార్టీ అధ్యక్షుడిగా నియమించింది. ప్రసాద్ నియామకానికి సంబంధించి సంకేతాలు వెలువడగానే పార్లమెంట్ స్థానంలోని పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. రాయచోటి నియోజకవర్గంలో సుగవాసి కుటుంబానికి బలమైన అనుచరగణం ఉంది.

మైనార్టీకి ప్రాధాన్యం

పార్లమెంట్ పరిధిలో మైనార్టీ ఓటర్ల శాతం అధికంగా ఉండటం, ఇటీవల ఆ వర్గానికి చెందిన ఓటర్ల మద్దతు పార్టీకి పెరిగిందనే సర్వే అంచనాలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన కార్యదర్శి పదవి ఆ వర్గానికి అవకాశం కల్పించి మదనపల్లెకు చెందిన పఠాన్ ఖాదర్‌ఖాన్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. సాధారణ కార్యకర్తగా ఉన్న ఖాదర్‌ఖాన్‌కు పార్టీలో పెద్దపీట వేసింది. అంగళ్లలో చంద్రబాబుపై రాళ్ల దాడి కేసులో బాధితుడైన పార్టీ కార్యకర్తకు అవకాశం ఇచ్చారు. హజ్ కమిటీలో డైరెక్టర్‌గా, సర్పంచిగానూ పని చేశారు. మదనపల్లెలో ప్రత్యామ్నాయ నాయకుడిగా తయారు చేయడంలో భాగంగానూ ఈ చర్యలు చేపట్టిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్రీడలతో ఒత్తిడి దూరం.. మానసికోల్లాసం

క్రీడా జ్యోతితో మైదానంలో పరుగు తీస్తున్న ఎస్పీ ధీరజ్, పోలీసులు

త్రోబాల్ పోటీలో పాల్గొన్న మహిళ పోలీసులు

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని కవాతు మైదానంలో పోలీసు వార్షిక క్రీడా పోటీలను ఆదివారం క్రీడా జ్యోతిని వెలిగించి జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రారంభించారు. 24 గంటలు విధి నిర్వహణలో ఒత్తిడికి గురయ్యే పోలీసులకు క్రీడలు మానసికోల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. ప్రతిభ కనపరిచిన వారిని రాష్ట్రస్థాయి పోలీస్ మీట్‌కు పంపుతామని తెలిపారు. విజేతలకు జ్ఞాపికలు అందచేశారు. అదనపు ఎస్పీ పరిపాలన వెంకటాద్రి, డీఎస్పీలు కృష్ణమోహన్, మహేంద్ర, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువు టు అండమాన్ నికోబార్

ములకలచెరువు, న్యూస్‌టుడే : జిల్లా నుంచి అండమాన్ నికోబార్ దీవులకు టమాటాలు ఎగుమతి అవుతున్నాయి. అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో పండించిన టమాటాలకు అక్కడ మంచి డిమాండు ఉంది. నవంబరుతో పాటు డిసెంబరు మొదటి వారంలో ధరలు పతనం కావడంతో అన్నదాతలు దిగాలు చెందారు. తాజాగా ఓ వ్యాపారి అండమాన్ నికోబార్ దీవులకు ఎగుమతి చేసేందుకు రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తుండటంతో లాభాలు పొందుతున్నారు.

- పీలేరుకు చెందిన రైతు రాంబాబు 700 బాక్సులు, అన్నమయ్య జిల్లా ములకలచెరువుకు కిలోమీటరు దూరంలో ఉన్న శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం ఎర్రబల్లికి చెందిన రైతు సిద్ధారెడ్డి 400 బాక్సులు అండమాన్‌కు ఎగుమతి చేశారు. చాలా మంది రైతులు కూడా ఎగుమతి బాటే పట్టారు.

ఖర్చులన్నీ వ్యాపారివే

టమాట పంట కోత దశకు వచ్చే సమయానికి ధరలు పతనమవడంతో దిగాలు చెందిన అన్నదాతలు కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన వ్యాపారిని ఆశ్రయించారు. ఆయన పంటను పరిశీలించి ఊజీ, మచ్చలు లేని తోటలను పరిశీలించి ఎంపిక చేసుకుంటున్నారు. కాయల కోత, రవాణా తదితర వాటి ఖర్చులన్నీ ఆ వ్యాపారే భరిస్తుండటంతో రైతులకు ఎలాంటి భారం లేదు. సేకరించిన మేలు రకం టమాటాలను చెన్నై ఓడ రేవుకు తరలించి.. అక్కడ్నుంచి అండమాన్ నికోబార్ దీవులకు రవాణా చేస్తున్నారు. పంట దిగుమతులు అండమాన్ నికోబార్ దీవులకు చేరాలంటే వారం రోజుల సమయం పడుతుంది. ఈ రకం టమాట ఎనిమిది రోజులైనా తాజాగా ఉంటోంది.

ఇక్కడ రూ.750.. అక్కడ రూ.1100

టమాట మార్కెట్‌లో రైతులు కూలీ, కమీషన్, రవాణా ఖర్చులు చెల్లించాలి. అండమాన్ దీవులకు ఎగుమతి చేస్తే వ్యాపారులే పంట కోత, రవాణా ఖర్చులు చెల్లిస్తారు. స్థానికంగా తోటల వద్ద 25 కిలోల బాక్సు ధర రూ.750 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అండమాన్ దీవుల్లో 25 కిలోల బాక్సు ధర రూ.1,100లకు విక్రయిస్తున్నట్లు వ్యాపారి చెప్పారు. ఇది రైతులకు లాభిస్తోంది.

‘ఈనాడు’ మెగా క్రికెట్ టోర్నీకి సై

నేటి నుంచి పోటీలు ప్రారంభం

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా ప్రారంభం కానున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ‘ఈఎస్ఎల్’ వేదిగా నిలుస్తోంది. ఇప్పటికే అతిపెద్ద టోర్నీగా ‘గిన్నిస్ రికార్డ్స్’లో చోటు సంపాదించిన మెగా ఈవెంట్‌లో భాగస్వాములయ్యేందుకు వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన యువ, మహిళా క్రికెటర్లు తమ సత్తాను చాటుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభ చూపి ప్రత్యర్థులపై పైచేయి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నాకౌట్ పద్ధతిలో ఈ నెల 22 నుంచి జనవరి 6వ తేదీ వరకు జిల్లాస్థాయిలో క్రికెట్ సమరం జరగనుంది.

నేటి మ్యాచ్‌లు (22-12-2025)

సీనియర్స్ మెన్స్ (KSRM Ground)

- ఫాతిమా మెడికల్ కాలేజీ, కడప x ఎస్వీ డిగ్రీ కళాశాల, కడప 8.00 A.M.
- సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల, జమ్మలమడుగు x SDHR డిగ్రీ కళాశాల, రాయచోటి, 10.00 A.M.
- శ్రీ జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల, మదనపల్లి x అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, రాజంపేట. 1.00 P.M.

ఉమెన్స్ (KORM Ground)

- SRIT ఇంజినీరింగ్ కళాశాల, ప్రొద్దుటూరు x KSRM ఇంజినీరింగ్ కళాశాల, కడప. 8.00 A.M.
- KORM ఇంజినీరింగ్ కళాశాల, కడప x SBSYM డిగ్రీ కళాశాల, మైదుకూరు. 10.00 A.M.
- SRIT డిప్లొమా కళాశాల, ప్రొద్దుటూరు x SBSYM జూనియర్ కళాశాల, మైదుకూరు. 1.00 P.M.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Beverage Partner: CMR Shopping Mall
Regional Sponsor: MITS Deemed to be University, Madanapalle Institute of Technology & Science
Gift Partner: KL (Deemed to be University)
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ఈటీవీ భారత్, ఈటీవీ ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

అనుమతుల్లేవు.. తినమతులే

ఓబులవారిపల్లె, రాజంపేట గ్రామీణ, నందలూరు, న్యూస్‌టుడే : రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గంలో మట్టి, ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. అక్రమంగా ఎర్రమట్టి, ఇసుకను కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటోంది. స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు.. కొందరు అధికారుల సహకారంతో వారు తోడేళ్లుగా ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. ప్రభుత్వ, ప్రైవేటు, అటవీ, చెరువు, కొండ, గుట్ట అన్న తేడా లేకుండా భారీ యంత్రాలతో గుల్ల చేస్తున్నారు. అలాగని ఇదంతా దొంగచాటుగా జరిగే వ్యవహారం అనుకుంటే పొరపాటే. నిత్యం అధికారులు తిరిగే మార్గంలోనే వందల టిప్పర్లతో బరితెగించి తరలించడం.. ఇక్కడి అధికారుల తీరుకు అద్దం పడుతోంది. స్థానికుల నుంచీ ఫిర్యాదులు అందుతున్నా నీటి పారుదలశాఖ నిద్రపోతోంది.

శృతిమించిన గ్రావెల్ మాఫియా ఆగడాలు

ఆదివారమే ఎందుకంటే..

సాధారణ రోజుల్లో మట్టి, ఇసుక అక్రమ తరలింపు కొనసాగుతుండగా ఆదివారం అధికారులు ఎవరూ ఉండరు, ఫిర్యాదిచ్చినా రారని అక్రమార్కులు తెగబడుతున్నారు. ఇష్టారాజ్యంగా యథేచ్ఛగా తమ పనులు కానిచ్చేస్తున్నారు.

ఎక్కడంటే:

- ఓబులవారిపల్లె మండలంలోని కొర్లకుంట చెరువు నుంచి మూడు రోజులు మట్టి అక్రమంగా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రోజుకు 100 నుంచి 150 ట్రిప్పులు చొప్పున ఇప్పటికే 400 ట్రిప్పులకు పైబడి మట్టిని తరలించారు. ప్రస్తుతం అన్ని చెరువులు నిండుగా ఉండడంతో అక్రమార్కుల కన్ను ఈ చెరువుపై పడింది. గుంతలను సైతం వదలకుండా మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. కొర్లకుంట చెరువులో నీళ్లు లేకపోవడంతో ఇక్కడ మట్టి తవ్వకాలు చేపట్టారు.
- నందలూరు, రాజంపేట పరిధిలోని చెయ్యేరులో యథేచ్ఛగా ఇసుకను టిప్పర్లతో తరలించారు. అయినా అక్రమార్కులను అడ్డుకునే వారే లేరు. టిప్పర్లు చెయ్యేరు నదిలో కన్పిస్తున్నా యంత్రాలతో తోడేస్తున్నా అధికారుల కళ్లకు కనిపించకపోవడం గమనార్హం.

ఇప్పుడూ వైకాపా నేతలదే హవా

ఓబుళవారిపల్లె, రాజంపేట, నందలూరు ప్రాంతాల్లో నేటికీ వైకాపా హవా కొనసాగుతోంది. స్థానిక ప్రజాప్రతినిధులు కొందరు మాఫియాతో జట్టు కట్టి నేటికీ పెత్తనం కొనసాగిస్తున్నారు. ఏ ప్రభుత్వం ఉన్నా తమదే పైచేయి అంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. వారి పనులు చక్కబెట్టుకుంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక నేడు

రాయచోటి, న్యూస్‌టుడే: రాయచోటిలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు అర్జీలను మీకోసం.ఏపీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొంటే వాటిని కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలుగానే పరిగణించి నిర్ణీత గడువు లోపు పరిష్కరిస్తామన్నారు. మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని అర్జీలను కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తీసుకురావచ్చని ఆయన తెలిపారు. గతంలో ఇచ్చిన అర్జీల పరిష్కార స్థితిని తెలుసుకొనేందుకు 1100 నెంబర్‌కు కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

140 ఏళ్లు... తరగని చర్చి వన్నెలు

రైల్వేకోడూరు పట్టణంలోని టోల్‌గేట్ వద్ద ఉన్న దక్షిణాంధ్ర లూథరన్ చర్చి జిల్లాలో అందమైన నిర్మాణాల్లో ఒకటి. ఈ చర్చిని 1882లో ప్రారంభించి 1884లో పూర్తి చేశారు. అప్పటి బ్రిటీష్ పాలనలో జర్మన్ మిషనరీలకు చెందిన హెన్రీ మేయర్ అనే ఆయన ఈ చర్చిని నిర్మించినట్లు క్రైస్తవ మత పెద్దలు చెబుతుంటారు. ఇప్పటికి 140 సంవత్సరాలు పూర్తవుతున్నా ఎక్కడా చెక్కు చెదరని నిర్మాణంగా నిలుస్తూ నిరంతరం క్రీస్తు ప్రార్థనలకు నెలవై ఉంది. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలకు ముస్తాబవుతోంది. **- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు**

అతివకు ఆర్థిక ఆసరా

☛ రివాల్వింగ్ ఫండ్‌గా రూ.15 వేలు

సమావేశమైన డ్వాక్రా మహిళలు

ఓబులవారిపల్లె, న్యూస్‌టుడే : స్వయం సహాయక సంఘాలకు ఆర్థికంగా అండగా నిలవడం ద్వారా మహిళాస్వావలంబన సాధించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. గత ప్రభుత్వ హయాంలో నిస్తేజంగా మారిన రివాల్వింగ్ ఫండ్ విధానాన్ని పునరుద్ధరించింది. కొత్తగా ఏర్పడిన బృందాలకు కొంత మొత్తంలో నగదు అందించడమే ఈ పథకం ఉద్దేశం. ఈ మేరకు గతేడాది ఆగస్టు 2 నుంచి ఈ ఏడాది నవంబరు 30 మధ్యలో ఏర్పడిన సంఘాలకు రూ.15 వేలు చొప్పున అందించనుంది. రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల కొత్త సంఘాలకు రివాల్వింగ్ ఫండ్ మంజూరు చేసింది. ఇందులో 1,278 బీసీ సంఘాలు, 509 ఎస్సీ, 213 ఎస్టీ సంఘాలకు సామాజిక వర్గాల వారీగా లబ్ధి చేకూరనుంది.

- రివాల్వింగ్ ఫండ్‌తో సంఘం నిధి పెరుగుతుంది. సభ్యుల అవసరాలకు అనుగుణంగా అంతర్గత రుణాల మంజూరుకు, బ్యాంకుల ద్వారా ఎక్కువ మొత్తం రుణం పొందేందుకు ఈ నిధి దోహదపడుతుంది. తద్వారా సుస్థిర జీవనోపాధులు ఏర్పాటు చేసుకుని ఆదాయాన్ని పెంచుకోవచ్చు.
- జిల్లాలో 2 వేల సంఘాలకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. ఇందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలున్నాయి. ముందుగా సమాఖ్య ఖాతాలకు అక్కడి నుంచి సభ్యులకు నగదు చేరనుంది. ఈ సొమ్ము తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. పొదుపు చేసుకుంటూ.. నగదు నిల్వను పెంచుకోవచ్చు. తద్వారా గరిష్ఠంగా రుణాలు పొందేందుకు అవకాశం ఉంటుంది.

జ్వరాల వల... మదనపల్లె విలవిల

ఆసుపత్రిలో బారులు తీరిన రోగులు

మదనపల్లె వైద్యం, గ్రామీణ, న్యూస్‌టుడే : మదనపల్లె డివిజన్‌లో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు కలుషితం కావడం, దోమల ఉద్ధృతితో జ్వరాలు వ్యాపిస్తున్నాయి. మరో వైపు.. జనం జ్వరాల బారిన పడి ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇటీవల కాలంలో ఆసుపత్రికి వచ్చే వారిలో టైఫాయిడ్, డెంగీతో ఎక్కువగా వస్తున్నారు.

- మదనపల్లె జిల్లా ఆసుపత్రికి ఏడు నెలల్లో 3,377 మందికి టైఫాయిడ్ పరీక్షలు చేయగా 602 మందికి నిర్ధారణ అయ్యింది. అలాగే 2,928 మందికి డెంగీ పరీక్షలు చేయగా 46 మందికి పాజిటివ్ వచ్చింది. ఇది ఒక్క మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో నమోదు అయిన సంఖ్య మాత్రమే.
- జిల్లాలో పీహెచ్‌సీలు 60, సీహెచ్‌సీలు 11, ఏరియా ఆసుపత్రులు 7, జిల్లా ఆసుపత్రి ఉంది. వీటితో పాటు సుమారు 200కు పైగా ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. వీటిలో రోజులు జ్వర పీడితులు బారులు తీరుతున్నారు.

7 నెలల్లో ఆసుపత్రిలో బయటపడిన జ్వరాల కేసులు

నెల	టైఫాయిడ్	డెంగీ
జూన్	58	2
జులై	83	3
ఆగస్టు	103	10
సెప్టెంబరు	178	7
అక్టోబరు	87	11
నవంబరు	77	10
డిసెంబరు	36	3

నాటి ఏనుగు మల్లమ్మ కొండే నేటి హార్సిలీహిల్స్

ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ పూర్వ నామం ఏనుగు మల్లమ్మకొండ. సముద్ర మట్టానికి 4,312 అడుగుల ఎత్తులో ఆంధ్రా ఊటిగా ప్రసిద్ధి చెందిన ఈ కొండ పేరు మారడం వెనుక నేపథ్యాన్ని పరిశీలిస్తే.. పూర్వం ధార్మిక చింతనాపరురాలైన మల్లమ్మ ఈ కొండపై తపస్సు చేస్తుండగా ఆమెకు ఏనుగులు పండ్లను తెచ్చి ఇచ్చేవట. దట్టమైన అటవీ ప్రాంతంలో మల్లమ్మ ఏనుగులను సంరక్షించడంతో స్థానికులు ఈ కొండను ఏనుగు మల్లమ్మ కొండగా పిలుస్తూ వచ్చారు. 1871లో మదనపల్లెలో ఉన్న బ్రిటీష్ సబ్ కలెక్టర్‌గా సర్ రాబర్ట్ హార్సిలీ నియమితులయ్యారు. ఇంగ్లాండుకు చెందిన ఈయన వేసవి ఎండల తీవ్రతను తట్టుకోలేక శీతల ప్రాంతాలను అన్వేషిస్తూ ఏనుగు మల్లమ్మకొండను అధిరోహించారు. నడి వేసవిలోనూ ఆహ్లాదకరంగా ఉన్న వాతావరణం, ప్రకృతి అందాలను చూసి ఆకర్షితుడయ్యారు. తదనంతరం హార్సిలీ ఉద్యోగోన్నతిపై కడప జిల్లా కలెక్టర్‌గా నియమించబడ్డారు. అప్పట్లో ఈ ప్రాంతం ఆయన పరిధిలోనే ఉండటంతో తనకున్న అధికారాలతో కొండపైకి దారి వేసి, బంగ్లా నిర్మించారు. అలా ఇది హార్సిలీహిల్స్‌గా మారింది. **- న్యూస్‌టుడే, బి.కొత్తకోట**

గుట్టపై మయూరాల చెట్టా!

కొండపై ట్రెక్కింగ్ బృందం



ఈ చిత్రం చూశారా.. మోడు వారిన చెట్టుకు నెమలిని పోలిన కాయలు కాచాయేమిటి అనుకుంటున్నారా.. అవి కాయలు కాదండి బాబూ.. మయూరాలే. మదనపల్లె సమీపంలోని గుట్టలపై వీటి సంతతి పెరగడంతో గుంపులుగా దర్శనమిస్తున్నాయి. ఆదివారం ట్రెక్కింగ్‌కు వెళ్లిన మదనపల్లె బృందానికి ఈ చిత్రం కన్పించింది. తెల్లవారుజామునే కొండలెక్కుతూ సందడి చేస్తున్న యువత ఇలాంటి అద్భుత చిత్రాలను తమ చరవాణుల్లో బంధిస్తున్నారు. **- న్యూస్‌టుడే, మదనపల్లె విద్య**

నిండు జీవితానికి రెండు చుక్కలు


పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

డైట్ (రాయచోటి), న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో 5 ఏళ్ల లోపు చిన్నారులు సుమారు 1,78,150 మందికి పోలియో చుక్కలు వేసేందుకు 1,615 కేంద్రాలను ఏర్పాటు చేసి 3,230 బృందాల ద్వారా ఏర్పాట్లు పర్యవేక్షించడం జరిగిందన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.రాధిక, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలలకు రూపం.. నాలుగో సింహం

ఒంటిపై ఖాకీ దుస్తులు ఉండాలి.. పేదలకు న్యాయం అందేలా చూడాలి.. శాంతి భద్రతలను పరిరక్షించాలన్నదే ఆ యువత లక్ష్యం. పోలీసు ఉద్యోగంపై మక్కువ పెంచుకున్నారు. ఎస్సై కావాలన్న లక్ష్యంతో పట్టుదలగా చదివారు. మార్కుల తేడాతో త్రుటిలో అవకాశాలను కోల్పోయారు. అంది వచ్చిన అవకాశం అంతలోనే చేజారినా నిరాశ పడలేదు. పట్టు వదల్లేదు... మరింత శ్రమించి ఎట్టకేలకు నాలుగో సింహం కావాలన్న కల నెరవేర్చుకున్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకుని శిక్షణకు వెళ్తున్న జిల్లా యువత విజయపథం ఇది. కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి ఉన్నతికి బాటలు వేసుకుంటామని ధీమాగా చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, చిట్వేలి (పుల్లంపేట)

మార్పు తెచ్చిన మార్కు

నా పేరు దిగువ పట్ల హేమంత్ కుమార్.. మాది చిట్వేలి మండలం సిద్దారెడ్డిపల్లె.. తల్లిదండ్రులు రామచంద్రయ్య, శంకరమ్మ. ప్రధాన వృత్తి వ్యవసాయం. క్రమశిక్షణకు మారుపేరైన ఈ శాఖలో చేరి శాంతి భద్రతలను గాడిన పెట్టాలని కలగన్నా.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో బీటెక్ పూర్తి చేసి ఎస్సై ఉద్యోగానికి ప్రత్యేక శిక్షణ తీసుకుని పట్టుదలతో చదివాను. చివరికి ఒక్క మార్కు తేడాతో పొందలేకపోయాను.

కష్టానికి తగిన ఫలితం దక్కింది

నా పేరు మినుగు మురళి.. మాది పుల్లంపేట మండలం కొమ్మవారిపల్లె అరుంధతీవాడ. సుబ్రహ్మణ్యం, వెంకటసుబ్బమ్మ మా తల్లిదండ్రులు. కూలి పనులు, వ్యవసాయం చేసుకుంటూనే నన్ను చదివించారు. బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ వేటలో భాగంగా ఎస్సై పోటీ పరీక్షలకు పోటీ పడ్డాను. నా శ్రమకు తగిన ఫలితం రాలేదు. అయినా నిరుత్సాహపడకుండా కానిస్టేబుల్ పరీక్షకు సిద్ధమయ్యా. నా కష్టానికి తగిన ఫలితం దక్కింది. శిక్షణకు పయనమవుతున్నాను. ఎస్సై కావాలన్నదే నా ఆశయం.

ఉన్న తోద్యోగానికి శ్రమిస్తా

నా పేరు రాయన శ్రీకాంత్.. మాది చిట్వేలి మండలం కేకే వడ్డిపల్లె.. రామచంద్రయ్య, సీతమ్మ మా అమ్మా, నాన్న. వ్యవసాయమే జీవనాధారం. బీటెక్ పూర్తి చేశా. కానిస్టేబుల్ ఉద్యోగానికి గట్టి ప్రయత్నం చేశాను. నా శ్రమ వృథా కాలేదు. ఫలితం దక్కింది.

అమ్మా, నాన్నల కోరిక నెరవేర్చా

నా పేరు ఓబిలి నాగేంద్ర బాబు.. మాది నేతివారిపల్లె తల్లిదండ్రులు సుబ్బరాయుడు, వెంకటమ్మ. వారు గంపలు, బుట్టలు అల్లుకుంటూనే నన్ను ఎమ్మెస్సీ వరకు చదివించారు. నన్ను పోలీసు డ్రస్సులో చూడాలన్నదే వారి కోరిక. వారి కల నెరవేర్చా.



(c) eenadu

ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడిగా రామాంజులు

డైట్(రాయచోటి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడుగా నల్లమల రామాంజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డైట్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీపాల మహేష్, ఆర్థిక కార్యదర్శిగా కొండూరు మురళీ మోహన్‌రాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడుగా వి.మధుసూదన్‌రెడ్డి, గౌరవాధ్యక్షులుగా బచ్చల శ్రీనివాసులు, క్రమ శిక్షణ సంఘం ఛైర్మన్‌గా పి.వెంకటరమణ, జిల్లా అసినోయేట్ అధ్యక్షులుగా సి.వి.రమణ, కులశేఖర్‌రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వెంకటసుబ్బయ్య, జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలుగా సునీత, ఉపాధ్యక్షులుగా రాజేంద్రప్రసాద్, నాగేశ్వర్‌నాయక్, దేవలానాయక్, వాలునాయక్, జిల్లా కార్యదర్శులుగా వెంకటరామరాజు, అసిఫ్, ఆంజనేయులునాయక్, బ్రహ్మం, రాష్ట్ర కౌన్సిలర్లుగా ప్రసాద్‌నాయుడు, కృష్ణమూర్తి, వేణుమాదవ్‌రాజు, శ్రీనివాసులు, తహసీన్, రమణయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ఎ.బి.రామకృష్ణంరాజు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని వారు తెలియజేశారు.

23న రాజంపేట బంద్‌కి ఐకాస పిలుపు

రాజంపేట బంద్‌కు పిలుపునిస్తూ నినదిస్తున్న ఐకాసా నాయకులు

రాజంపేట: రాజంపేట జిల్లా సాధన ఉద్యమంలో భాగంగా ఈనెల 23న రాజంపేటలో బంద్ నిర్వహించాలని నిర్ణయించినట్లు ఐకాస నాయకులు తెలిపారు. స్థానిక ర.భ.శాఖ అతిథిగృహంలో ఆదివారం సమావేశమైన ఐకాస నాయకులు ఉద్యమ కార్యచరణపై చర్చించారు. ఈ నెల 23న రాజంపేటలో బంద్‌ని నిర్వహించాలని పిలుపునిచ్చింది. ప్రజలు, దుకాణ యజమానులు, ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల నిర్వహకులు బంద్‌కి సహకరించాలని కోరారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

రాయచోటి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను విస్మరించిందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటిలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.30 వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండు చేశారు. యూనియన్ నాయకులు హరిబాబు, శ్రీనివాసులు, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ఆర్థిక బకాయిలు చెల్లించాలి

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

పీలేరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం పెన్షనర్లకు సత్వరం ఆర్థిక బకాయిలు చెల్లించాలని పీలేరు నూతన పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పి.చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పీలేరు ప్రియదర్శిని జూనియర్ కళాశాలలో పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా నరసింహారెడ్డి, అధ్యక్షుడిగా వి.చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రామచంద్ర, కోశాధికారిగా పి.కృష్ణయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా సీతారామయ్య, ఆంజనేయులు, రాజారెడ్డి, వెంకటయ్య, కార్యదర్శులు సత్యనారాయణ, మల్‌రెడ్డి, శ్రీధర్ ఏకగ్రీవంగా ఎన్నికై ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ పెన్షనర్లకు పీఆర్సీ చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉత్తర్వులు చాలా కఠినంగా ఉన్నాయని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కరవు భత్యం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సురేంద్రనాథరెడ్డి, శ్రీనివాసులు, సత్యనారాయణ పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్య

కంభంవారిపల్లి: మండలానికి చెందిన బాలుడు (16) తల్లి మందలించిందని క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలుడు చిత్తూరు జిల్లా చౌడేపల్లెలో పదో తరగతి చదువుతూ అక్కడే వసతిగృహంలో ఉంటున్నాడు. వసతిగృహం నుంచి శనివారం ఇంటికి వచ్చాడు. ఇంట్లో చరవాణి చూస్తుండటంతో తల్లి మందలించింది. వెంటనే బయటకు వచ్చి ఇంటికి గడియ వేసి వరండాలో బాలుడు ఉరి వేసుకున్నాడు. వెంటనే తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో శవ పరీక్ష నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

అన్నను హత్య చేసిన తమ్ముడు

తండ్రిని కోల్పోయి విలపిస్తున్న పిల్లలు

గుర్రంకొండ, న్యూస్‌టుడే : మండలంలోని గుర్రంకొండ పంచాయతీ మర్రిగారి తాగిన మైకంలో అన్నదమ్ముల గొడవ పడి.. తమ్ముడు అన్నను హత్య చేసిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వాల్మీకిపురం సీఐ రామాంజి కథనం మేరకు.. మర్రిగారి చెందిన షేక్ సాదిక్ (26), షేక్ రఫీ (23)లు అన్నదమ్ములు. సాదిక్‌కు మదనపల్లె చెందిన మహిళతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. గొడవపడి అతని భార్య పుట్టింటికి వెళ్లింది. సాదిక్ తిరుపతిలో చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం చేస్తూ.. అప్పుడప్పుడు స్వగ్రామానికి వస్తున్నాడు. తమ్ముడు రఫీ స్వగ్రామంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అన్నదమ్ములు ఇద్దరు తరచూ గొడవ పడేవారు. ఈ క్రమంలో తాగిన మైకంలో ఇరువురూ ఘర్షణ పడ్డారు. శనివారం అర్ధరాత్రి అన్నను తమ్ముడు హత్య చేసినట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని క్రైమ్ సీఐ చంద్రశేఖర్, ఎసై బాలకృష్ణ పరిశీలించారు. సాదిక్ మరణించడంతో అతని పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం

వెంకట సాయికుమార్ లక్ష్మీప్రసాద్ అలియాస్ ప్రతాప్

రాయచోటి, రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: రాయచోటి - గాలివీడు మార్గంలోని యండపల్లి వద్ద ఆదివారం చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. రాయచోటి మండలం మాధవరం వడ్డపల్లెకు చెందిన రేవన వెంకటసాయికుమార్(24), రేవన లక్ష్మీప్రసాద్ అలియాస్ ప్రతాప్(18)లు ద్విచక్ర వాహనంపై రాయచోటి నుంచి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. యండపల్లి సమీపంలోని ఏకో పార్కు వద్ద రోడ్డుపై కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణ పనులు అక్కడ ఎలాంటి సూచికలు అమర్చకపోవడంతో పల్సర్ వాహనంపై వస్తున్న యువకులు కల్వర్టును గుర్తించకపోవడంతో అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యారు. తీవ్రంగా గాయపడిన వెంకటసాయికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన లక్ష్మీప్రసాద్ అలియాస్ ప్రతాప్‌ను స్థానికులు రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గ మధ్యలో లక్ష్మీప్రసాద్ మరణించాడు. విషయం తెలుసుకున్న వారి మరణ వార్త తెలియగానే ఆ గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది.

Government of Andhra Pradesh
APEWIDC, ANNAMAYYA DISTRICT
Tenders are invited one procurement Tender Notice
Nit No.9 to 13/EE/APEWIDC/AE/Kdp/2025-26 dt.20.12.2025 1st call and 14/EE/APEWIDC/AE/Kdp/2025-26 dt.20.12.2025 2nd call.
Downloading Commencement on 24.12.2025 and Closing date may be viewed in e-procurement.gov.in.
For further details can be viewed at https://tender.apeprocurement.gov.in or Contact Cell No.9133994901.
Sd/- Ramana, Executive Engineer, APEWIDC, ANNAMAYYA District.

ప్రకృతి వ్యవసాయం.. ఆరోగ్యం.. ఆదాయం

ఆసక్తి చూపుతున్న రైతులు
ఏటీఎం, ఏ-గ్రేడ్ పద్ధతుల్లో సాగు

వీరబల్లి, న్యూస్‌టుడే: రైతులకు ఇతర పంటల కన్నా ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసే పంటలతోనే అధిక లాభాలు సాధ్యం. పెట్టుబడులు తగ్గించుకుని తక్కువ ఖర్చులతోనే అధిక దిగుబడి సాధించి ఆర్థికంగా స్థిరపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రసాయనిక మందులతో ఖర్చులు ఎక్కువగా, దిగుబడులు తక్కువగా రావడంతో రైతులు నష్టపోవడంతో పాటు భూకమతాలు శక్తి విహీనంగా మారడం, ఆ ఉత్పత్తులు తిన్నవారు అనారోగ్యాలకు గురయ్యే పరిస్థితులు దాపురించాయి. ప్రకృతి వ్యవసాయంతో జనాలకు ఆరోగ్యకర ఉత్పత్తులను అందించడంతో పాటు భూమిని శక్తిమంతంగా మార్చుకోవడంతో పాటు ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పురుగు మందులు లేని వ్యవసాయాన్ని ప్రత్యేకంగా రైతులకు సంబంధిత సిబ్బందితో అవగాహన కల్పించి సాగుకు ప్రోత్సహిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే : మండలంలో ఇప్పటికే ఓదివీడు, మట్లి, వంగిమళ్ల వీరబల్లి పంచాయతీల్లో ఈ మోడల్స్ పంటలు సాగు చేసి అధిక దిగుబడులు సాధించారు. ఈ మోడల్స్‌లో సుమారు 50 మంది రైతులు వరకు వంద ఎకరాలు వరకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేశారు.

- మొదటగా గ్రామాల్లో ఏ-గ్రేడ్ మోడల్‌లో పంటలు, అంతర పంటలు సాగు చేయడం, ఏటీఎం మోడల్‌లో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు.

ఏ-గ్రేడ్ మోడల్‌లో అంతర పంటలు

- మండలంలో దిగువరాచపల్లి పంచాయతీకి చెందిన శంకర్‌రెడ్డి ఏ-గ్రేడ్ మోడల్‌లో ఒకటిన్నర ఎకరాలో వేరుసెనగ సాగు చేశారు. అంతర పంటలుగా అలసంద, అనుములు, పెసర, కంది, మొక్కజొన్న, సజ్జలు, మటిక, బెండ, ఉద్దులు, ఆకుకూరలు మూడు రకాలు సాగు చేశారు.
- వీటికి ద్రవ, ఘన జీవామృతాలు, కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణాలు, పంచగవ్య ద్రావణాలు, కషాయాలు పిచికారి చేశారు. సాగుకు సుమారు రూ.52 వేలు వరకు ఖర్చు చేశారు. మొదట ఆకుకూరలు, పెసర, ఉద్దులు దిగుబడులు మొదలవగా, తరువాత అలసంద, అనుములు, కంది పంటలు దిగుబడి ఇవ్వనున్నాయి. ప్రస్తుతం వేరుసెనగలో గతంలో కంటే దిగుబడి అధికంగా వచ్చాయి.
- ఒకటిన్నర ఎకరాకు 26 మూటలు వరకు వేరుసెనగ కాయలు దిగుబడి రాగా రసాయనిక ఎరువులతో గతంలో కేవలం 13 మూటలు కూడా వచ్చేవి కాదన్నారు. ప్రస్తుతం ప్రకృతి వ్యవసాయం ద్వారా చేయడంతో దిగుబడి రెట్టింపు అవడంతో పాటు ఖర్చు కూడా తగ్గిందన్నారు.
- ప్రస్తుతం కూడా కంది పంట పూత దశలో ఉండగా దీంతో కూడా ఆదాయం వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. మండలంలో సేంద్రియ ఎరువుల దుకాణం కూడా ఏర్పాటు చేసుకుని అవసరమైన వారికి విక్రయించడం జరుగుతుందన్నారు.

కూరగాయలకు ఏటీఎం

ఏటీఎం పద్ధతిలో 20 సెంట్లలో ఆకుకూరలు, గడ్డజాతి, కూరగాయలు సాగు చేయడం వల్ల 20 రోజులుగా వీటితో ఆదాయం పొందే అవకాశాలున్నాయి. ఘన, ద్రవ జీవామృతాలు, కషాయాలు వాడడం వల్ల ఎలాంటి చీడపీడలు ఆశించకుండా ఉంటాయి. కూరగాయలు ఇంటి అవసరాలకు పోను మిగతా వాటిని ప్రకృతి వ్యవసాయ స్టాల్‌లో అమ్ముతామని మట్లికి చెందిన మహిళా రైతు చెన్న కృష్ణమ్మ తెలియజేశారు. ఈ పద్ధతి ద్వారా కూరగాయలు సాగు చేయడం వల్ల ఇంటితో పాటు ఆదాయ మార్గంగా కూడా ఉంటుందన్నారు.

దిగువరాచపల్లి పంచాయతీ కల్లేవాండ్లపల్లి సమీపంలో ఏ-గ్రేడ్ మోడల్‌లో సాగు చేసిన పంట

రైతులందరికీ అవగాహన కల్పిస్తున్నాం

వీరబల్లి మండలంలో సుమారు 50 మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలో ఏ-గ్రేడ్ మోడల్‌లో పంటలు, ఏటీఎం పద్ధతిలో ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. వారంతా మంచి దిగుబడులు సాధిస్తున్నారు. వాటిని విక్రయించేందుకు ప్రత్యేకంగా వీరబల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్టాల్ ఏర్పాటు చేశాం. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వస్తే సిబ్బంది ద్వారా సాగుకు అవసరమైన కషాయాలు, జీవామృతాలు తయారు చేయిస్తాం.

- రామాంజనేయులు, ప్రకృతి వ్యవసాయాధికారి

విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి

రాయచోటి, న్యూస్‌టుడే: విద్యా వ్యవస్థపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. డైట్ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఎన్‌టీఏ ఉపాధ్యాయ సంఘ సమావేశలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ తెదేపాకు అనుబంధంగా పని చేస్తున్నప్పటికీ ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించడంలో ముందంజలో ఉంటూ ఉపాధ్యాయుల శ్రేయస్సు కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొనే అనేక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు కోరారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రవీంద్రారెడ్డి, కడప జిల్లా అధ్యక్షుడు ఎ.బి.రామకృష్ణంరాజు, అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, ప్రసాద్‌నాయుడు, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

బెటాలియన్‌కు శిక్షణ పోలీసులు

సిద్దవటం: శిక్షణకు వచ్చిన ఏపీఎస్పీ శిక్షణ పోలీసులకు పక్కాగా శిక్షణ ఇవ్వనున్నట్లు బెటాలియన్ కమాండెంటు ఆనంద్‌రెడ్డి తెలిపారు. భాకరాపేట ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లో ఆదివారం శిక్షణకు వచ్చిన వారికి పలు రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంటు మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లా మినహాయించి మిగిలిన జిల్లాలకు చెందిన 336 మంది శిక్షణ తీసుకునేందుకు వచ్చారని తెలిపారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు వద్దు

● యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్

ప్రసంగిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్

పీలేరు, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలలు మనుగడ సాగించాలంటే ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు తగ్గించాలని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ డిమాండు చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్వీఎస్ఎస్ కల్యాణ మండపంలో జరిగిన యూటీఎఫ్ జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలకు భిన్నంగా అనేక బోధనేతర కార్యక్రమాలను ఉపాధ్యాయులపై రుద్దడం వల్ల చదువుపై ఏకాగ్రత పెట్టలేక పోతున్నారని చెప్పారు. ఇందువల్ల గత ఐదేళ్లలో 15 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలల్లో క్రమేణా తగ్గిపోవడం వల్ల ఉపాధ్యాయుల పోస్టులు తగ్గి, ఐదు వేలకు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని ఆందోళన వ్యక్తం చేశారు. బోధనేతర బాధ్యత నుంచి ఉపాధ్యాయులను విముక్తి కలిగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇతర శాఖలు ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించేలా చేయడం బాధాకరమని అన్నారు. 2023లో 11వ పీఆర్సీ కాలం ముగిసినా ఇంత వరకు 12వ పీఆర్సీ కమిటీ వేయకపోవడం శోచనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా ఒక డీఏ, ఆదర్శ పాఠశాలల ఏర్పాటు తప్ప మిగిలిన సమస్యలు ప్రభుత్వం పరిష్కరించలేదని విమర్శించారు. ముందుగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి జాబీర్, సహ అధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా కార్యదర్శి అక్రంబాషా, నాయకులు చంద్రశేఖర్, విశ్వనాథరెడ్డి, సుదాకర్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ గంగిరెడ్డి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : వసతిగృహాల్లో ఉన్న 10వ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చదవాలని ఏఎస్‌డబ్ల్యూఓ గంగిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె మండలంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహంలో మదనపల్లె డివిజన్‌లో ఉన్న పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు పాఠ్యాంశాలను పునశ్చరణ (రివిజన్) చేసుకోవాలన్నారు. అలాగే సమయ సారిని (టైంటేబుల్) ఏర్పాటు చేసుకుని క్రమ పద్ధతిలో చదవడం వల్ల మంచి మార్కులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రేరణాత్మక వక్త రామ్మూర్తి మాట్లాడుతూ విద్యార్థులు మనోవికాసానికి సంబంధించిన వివరాలు తెలియజేసి పరీక్షలంటే ఉన్న భయాలను తొలగించారు. అనంతరం సైబర్ సెక్యూరిటీ ఇంజినీరు విజయ్‌కుమార్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్లు రాంప్రసాద్, స్వర్ణలత, పద్మావతి, మనోరంజని, వెంకట రమేశ్‌బాబు, నూరుల్లా, రవీంద్రనాయక్, శంకరప్ప, 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సాధన సమితి తీర్మానాలు

జిల్లా సాధనలో పాల్గొన్న గిరిజన సంఘాల నాయకులకు సన్మానం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లె జిల్లా సాధన ఉద్యమంలో ఎస్టీ సంఘాల నాయకులు పాత్ర అభినందనీయమని జిల్లా సాధన సమితి కన్వీనర్ శివప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక అమ్మచెరువుమిట్టలోని ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఎస్టీ ఉద్యోగులు, ఎస్టీ సంఘాలు సయుక్తంగా నిర్వహించిన సన్మాన సభలో జిల్లా సాధనలో పాల్గొన్న ఎస్టీ నాయకులను ఘనంగా సన్మానించారు. వీరితోపాటు మదనపల్లె జిల్లా కావడానికి అసెంబ్లీ వేదికగా పోరాడిన ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, కిశోర్‌కుమార్‌రెడ్డిలకు సమావేశం తరపున అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. వంద ఎకరాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటు, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం, రోడ్ల విస్తరణ చేపట్టాలని, వేసవి జలాశయాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయించాలని, తాగునీటి సౌకర్యం మెరుగుపరచాలని, పది ఎకరాల్లో గిరిజన భవన్ నిర్మించాలని, అంబేడ్కర్, బీసీ, మైనార్టీ భవనాల నిర్మాణం చేపట్టాలని, 100 ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల కోసం ఆదర్శ కాలనీ నిర్మాణం చేపట్టాలని తీర్మానించారు. అనంతరం గిరిజన సంఘాల నాయకులు కె.దివాకర్, కోనయ్య, మున్నానాయక్, గంగులప్ప, న్యాయవాది బాబు, ఈశ్వరయ్యను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీచందు, ఆనందరావు, శివకుమార్, శ్రీరాములు, శివశంకర్‌నాయక్, చలపతి, రామాంజులు, ప్రభాకర్, ఉషారాణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ ఛాంపియన్‌గా రామసముద్రం జట్టు

విజేతగా నిలిచిన రామసముద్రం ఉపాధ్యాయ జట్టు

రామసముద్రం: రాయచోటిలో ఆదివారం జరిగిన ఉపాధ్యాయినుల జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో రామసముద్రం జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. రాయచోటి జట్టుతో ఫైనల్స్‌లో తలపడి విజయాన్ని సొంతం చేసుకుంది. జట్టును మండల విద్యాశాఖతోపాటు ఉపాధ్యాయ సంఘాలు అభినందించారు.

మహిళపై దాడి ఘటనలో కానిస్టేబుల్‌పై కేసు నమోదు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని బూచిపల్లెకు చెందిన ఓ మహిళపై దాడి చేసిన ఘటనలో ఓ పోలీసు కానిస్టేబుల్‌తో సహా మరో ఆరుగురిపై కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని బూర్లపల్లె పంచాయతీ పోతుపేటకు చెందిన రెడ్డెప్పకు అదే గ్రామానికి చెందిన సుజాతతో 16 ఏళ్ల కిందట వివాహమైంది. ఇటీవల సుజాత కుటుంబంలో కలహాలు ఏర్పడి, పంచాయితీ జరిగినా ఫలితం లేకుండా పోయింది. మూడు రోజుల క్రితం పీటీఎంలోని పోలీసు స్టేషన్ ఎదుట మరోసారి పంచాయితీ చేస్తుండగా, సుజాత తమ్ముడు కేవీపల్లె పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ సురేంద్ర వ్యవహారంలో జోక్యం చేసుకున్నాడు. రెడ్డెప్ప చెల్లెలైన రెడ్డెమ్మ చెవిని కొరికేసి వారి బంధువులైన సోమశేఖర్, గౌరమ్మ, లక్ష్మీనరసమ్మ, హరిత, వెంకటరమణ, గంగులప్ప తదితరులపై దాడి చేశాడు. అంతేగాక ఈ ఘటనలో అడ్డుకోబోయిన ముక్కోళ్ల నరసింహులుపై దాడికి దిగాడు. ఈ ఘటనపై నరసింహులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు. కాగా ఇరువర్గాలను పిలిపించి ఉన్నతాధికారులు రాజీ చేసినట్లు సమాచారం.

ఏఎల్‌ఎం సస్పెన్షన్ ● ఎల్ఐకి షోకాజ్ నోటీసులు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటనలో సీటీఎం సెక్షన్ ఎనుములవారిపల్లెకు చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్ రాంబాబు నాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఆదివారం విద్యుత్తు శాఖ ఈఈ ఎం.గంగాధరం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే ఘటనలో సీటీఎం లైన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వేమారెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేశారు. వారంలోపు వివరణ ఇవ్వాలని లేని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. మదనపల్లె మండలం ఎనుములవారిపల్లె పంచాయతీలో 11 కేవీ విద్యుత్తు తీగ 15 రోజుల కిందట తెగిపడిన విషయాన్ని ఏఎల్‌ఎం రాంబాబు నాయక్ దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. ఆయన మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహించారు. దాని గురించి పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 20న రైతు ఎర్రబల్లి చంద్రశేఖర్ (56) తన పొలానికి వెళ్లే క్రమంలో తెగిపడిన 11 కేవీ తీగను తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఈఈ గంగాధరం, ఏడీఈ సురేంద్రనాయక్, ఏఈ రమేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి.. గ్రామస్థులను విచారణ చేశారు. ఏఎల్‌ఎం, లైన్ ఇన్‌స్పెక్టర్ నిర్లక్ష్యం వహించారని నిర్ధారించారు. ఈ మేరకు ఒకరిని సస్పెండ్, మరొకరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబీకులు అధికారులను కోరారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

శ్రీనివాసులురెడ్డి మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య పిల్లలు

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే : మిద్దెపై నుంచి టెంకాయలు కోసేందుకు ప్రయత్నించిన వ్యక్తికి సమీపంలో ఉన్న విద్యుత్తు తీగలు తగిలి మృతి చెందాడు. భార్య పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లె మండలం ముష్టూరు పంచాయతీ దిగువపల్లెకు చెందిన గువ్వల శ్రీనివాసులురెడ్డి (34) ఇతరుల ఇంటిపై ఉన్న చెట్టు నుంచి టెంకాయలు కోసేందుకు వెళ్లారు. చెట్టుకు ఆనుకుని ఉన్న విద్యుత్తు తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అతని స్వగ్రామం పుంగనూరు మండలం ఎల్లారబైలు. ఐదేళ్ల ముందు కూలి పనుల కోసం దిగువపల్లెకు వచ్చి చంద్రకళను పెళ్లి చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. అతనికి భార్యతోపాటు పిల్లలు మేఘన (3), మోక్షజ్ఞ (9 నెలలు) ఉన్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయింపు

కొత్త స్తంభాల ఏర్పాటు కాంట్రాక్టు కుదుర్చున్న ఆర్‌డీఎస్ సంస్థ, విద్యుత్తు శాఖ నిర్లక్ష్యంతోనే శ్రీనివాసులురెడ్డి మృత్యువాత పడ్డాడని కూటమి నాయకులు ఆరోపించారు. విద్యుత్తు శాఖ మృతుని కుటుంబానికి ఆర్థిక పరంగా భరోసా కల్పించాలని తెదేపా నాయకులు మునిరత్నం, రాజన్న, మల్లికార్జున, రమణ, సుధాకర్, రెడ్డెప్ప, లక్ష్మన్న, మండల జనసేన అధ్యక్షుడు ప్రదీప్‌సింగ్ డిమాండు చేశారు. విద్యుత్తుశాఖ అధికారులు వచ్చి న్యాయం చేయాలని నిమ్మనపల్లె - మదనపల్లె రహదారిపై బైఠాయించారు. గంటసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఆటో బోల్తాపడి మహిళ..

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో మండల పరిధిలోని చియ్యవరం పంచాయతీ ముత్తరాచపల్లెకు చెందిన పాతపాటి అంకమ్మ(50) అనే మహిళ మృతి చెందారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు... రవి, అంకమ్మ దంపతులది వ్యవసాయ కుటుంబం. ఆదివారం ఆమె తన కోడలు అఖిల, ఏడాది వయసున్న మనవడు అకీరాతో కలిసి కోడూరుకి ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో ఆటో వడ్డిపల్లె వద్దకు రాగానే అదుపు తప్పి రోడ్డుపై బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవరుతో పాటు అఖిల, ఆమె కుమారుడు సురక్షితంగా బయట పడ్డారు. అంకమ్మ తలకు తీవ్ర గాయం కావడంతో ఆమె అపస్మారక స్థితికి చేరారు. స్థానికులు కోడూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె చనిపోయారని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వన్య ప్రాణుల విక్రయాల కేసులో ఏడుగురి అరెస్ట్

పట్టుబడిన నిందితులతో అటవీశాఖ రేంజర్ శ్యాంసుందర్, సిబ్బంది

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: శేషాచలం అడవుల పరిధిలో వన్య ప్రాణులను చంపి వాటితో వ్యాపారం నిర్వహిస్తున్న ఏడుగురిని అటవీశాఖ అధికారులు అరెస్టు చేశారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు రేంజర్ శ్యాంసుందర్ ఆదివారం తెలిపిన వివరాల మేరకు...ఈ నెల 19న రాజంపేట డీఎఫ్‌వో జగన్నాథ్‌సింగ్, విజయవాడకు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ, ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు కలిసి పట్టణంలోని ఓ లాడ్జీలో సోదాలు నిర్వహించి, అక్కడ వివిధ ప్రాంతాలకు చెందిన నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణాలోని మహబూబ్‌నగర్‌కు చెందిన జె.రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఈ వ్యవహారాలకు ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు గుర్తించారు. అతనితో పాటు ప్రకాశం జిల్లాకు చెందిన పుచ్చకాయల భూపతిరాజు, పప్పుల జయరావ్, రైల్వేకోడూరుకు చెందిన మొలకల సుబ్రహ్మణ్యం, కుంభకోణం శ్రీరాములు ఆచారి, రాజంపేటకు చెందిన ఉప్పుటూరు శివ, కృష్ణా జిల్లా విజయవాడకు చెందిన కాజా రవికుమార్‌లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మృతిచెందిన పూడుపాము (రెండు తలల పాము)ను స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి నిందితులను రాజంపేట కోర్టులో హాజరుపరచగా వారికి వచ్చే నెల 2వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు రేంజర్ వివరించారు.

EENADU Classifieds

JOBS

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ్ నందు హాస్టల్ ఇన్‌ఛార్జీస్, వార్డెన్స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22సం॥లపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ✆: 92487 33371.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆: 81215 41212.

ప్రముఖ కంపెనీలో టీం లీడర్స్‌గా మదనపల్లి, ప్రొద్దుటూరు ఏరియాలో P/F పనిచేయుటకు M/F కావలెను. Q: డిగ్రీ, MBA, MCA. ✆:94403 51657.

కడపలో డా॥ పరమేశ్వరరావు ENT హాస్పిటల్ నందు పనిచేయుటకు ఇద్దరు నర్సులు, కాంపౌండర్స్ మరియు ఇంట్లో పనిచేయుటకు ఇద్దరు ఆడవారు కావలెను. కడప వారికి ప్రాధాన్యత. Cont: 9492410402.

కడప, అప్సర సర్కిల్ మా హోటల్ నందు పనిచేయడానికి టిఫిన్ మాస్టర్ & సర్వింగ్ స్టాఫ్ వెంటనే కావలెను. ✆: 9505522723.

ప్రముఖ కంపెనీలో ఫుడ్ డెలివరీ జాబ్స్, డ్రైవర్స్ కార్ & బైక్ నడుపుటకు అర్జెంటుగా కావలెను. Ph: 89786 70153.

FACULTY/ TEACHERS

Wanted Teachers, Watchman (Husband & Wife), Caretakers for Hostel. Teachers for Pre-Primary, Primary and High School for a School in Kadapa. Wardens for Hostel, PET, Music Teacher. For details Contact: 9963970766.

Wanted Physical Science teacher to teach upto 10th (IIT also) EXP. Min. 3 Years. Send Resumes to Whatsapp 9441011084. UshaKiran High School, Vempalli, Kadapa Dist.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ॥ 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్‌లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చటపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మదనపల్లె
•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

మంచిమాట : క్షమించడం వల్ల గతం మారకపోవచ్చు, కానీ భవిష్యత్తు మారుతుంది.

వక్ఫ్ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మదనపల్లె జమియా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ గౌస్ మొహిద్దీన్, కార్యదర్శి సికిందర్‌ఖాన్ అన్నారు. ఆదివారం మదనపల్లెలోని టిప్పుసుల్తాన్ మైదానంలోని మసీదులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వక్ఫ్ బోర్డుకు సంబంధించి పట్టణానికి చెందిన వ్యక్తి తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి భూమిని కాజేయడానికి కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. మదనపల్లె వక్ఫ్‌బోర్డుకు సంబంధించి భూ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందించిన సీఎం వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సాజిద్ అలీఖాన్, అబూబకర్‌సిద్ధిక్, మహమ్మద్‌అమీర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం నిర్మాణమే లక్ష్యం

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జున స్వామి సన్నిధిలో ఉచిత అన్నదాన సత్రం నిర్మాణమే లక్ష్యమని అగ్ని వన్నికుల క్షత్రియుల సంఘం రాయలసీమ అధ్యక్షుడు బలరాం అన్నారు. ఆదివారం పీలేరు, కంభంవారిపల్లె, కలికిరి, వాల్మీకిపురం మండలాల్లో సంఘం నూతన సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు. పీలేరులో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 7 రాష్ట్రాల పరిధిలోని అగ్ని వన్నికుల క్షత్రిలు ఏకతాటిపై నిలచి శ్రీశైలం ఉచిత అన్నదాన సత్రం నిర్మాణానికి సంకల్పించామన్నారు. తమ సామాజిక ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చంద్రకళ, సుబ్రహ్మణ్యం, రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ములకలచెరువు, న్యూస్‌టుడే : ములకలచెరువులోని శ్రీశారద స్కూల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్ చిన్నపిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఛాతి వైద్య నిపుణులు డాక్టర్ ఈశ్వర్‌నారాయణ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

ఆదాయం ఘనం.. వసతులు దూరం

ఇది మదనపల్లె ఆర్టీసీ కార్గో పరిస్థితి

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : ఆర్టీసీ సంస్థకు ఆదాయం సమకూరినా.. మదనపల్లె బస్టాండ్‌లో కార్గో కేంద్రానికి పక్కా భవనం సమకూరలేదు. 2017లో బస్టాండ్ ఆవరణంలోని ఓ చిన్న రేకుల షెడ్‌లో కార్గో సేవలు ప్రారంభమయ్యాయి. రోజూ ఇక్కడ్నుంచి ఎక్కడెక్కడికో పార్శిళ్లు వెళ్తున్నాయి.. ఎక్కడ్నుంచో ఇక్కడికి వస్తున్నాయి. కేంద్రానికి భవనం నిర్మించాలని నిధులు మంజూరై మూడేళ్లైనా నిర్మాణం చేపట్టలేదు. దీంతో షెడ్‌లోనే కార్యాకలాపాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. పార్శిళ్లు ఎండినా, తడిచినా వాటి గురించి పట్టించుకునే పరిస్థితి కరవైంది. ఎగుమతి, దిగుమతి కేంద్రాలు వేర్వేరుగా ఉండటంతో వాటి గుర్చి సరైన సమాచారం తెలియకపోవడంతో అవసరార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. కార్గో కేంద్రం తనిఖీ నిమిత్తం తరచూ వస్తున్న అధికారులు దాని విస్తరణ గురించి పట్టించుకోవడం లేదు.

కరవైన కనీస సౌకర్యాలు

సరకుల రవాణాలోనే కాక, ఆదాయంలో సైతం జిల్లాలో మదనపల్లె బస్టాండ్ ప్రథమ స్థానంలో ఉండగా, రాయలసీమ జిల్లాల్లో నాల్గో స్థానం ఉంది. రోజూ సుమారు రూ. లక్ష. నెలకు రూ.30 లక్షలమేర ఆదాయం వస్తోంది. ఏటా సుమారు రూ.3 కోట్లకు పైగా కార్గో ద్వారా ఆదాయం సమకూరుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. డోర్ డెలివరీతో సేవలను విస్తరిస్తున్నా వసతులు మాత్రం శూన్యం. కార్గోకు వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలున్నాయి. ఎగుమతి, దిగుమతి కేంద్రాల వద్ద కూర్చోవడానికి, తాగునీటి వసతి కరవైంది. సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడికొచ్చిన పార్శిళ్లను అందజేసే వారికి ఇక్కడ గదులు లేక ఇబ్బంది పడుతున్నారు. కేంద్రాన్ని ఆర్టీసీలో రోడ్డు పక్కనే నిర్మించాలని కోరుతూ ఆరు నెలల కిందట ప్రతిపాదనలు పంపారే కానీ దాని గురించి పట్టించుకోవడం లేదు. వ్యాపారం కోసం మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు సైతం లేకపోవడం విశేషం.

కార్గో కార్యాలయం

సమస్యలు నివేదించాం..

మదనపల్లె ఆర్టీసీ బస్టాండులోని కార్గో రవాణా కేంద్రం భవనాల నిర్మాణానికి నిధులు మంజూరై మూడేళ్లైంది. నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఇక్కడి పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదించాం. మరోసారి ఈ విషయంపై అధికారులతో మాట్లాడుతాం.

- బి.అమరనాథ్, డీఎం, మదనపల్లె 2వ డిపో

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : తంబళ్లపల్లె నియోజకవర్గంలోని మూడు మండలాల్లో సోమవారం మధ్యాహ్నం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ములకలచెరువు ఏడీఈ గోవింద్‌రెడ్డి తెలిపారు. బురకాయలకోటలోని 132 కేవీఏ ఉప కేంద్రంలో నిర్వహణ పనులు చేస్తుండటంతో ములకలచెరువు, బి.కొత్తకోట, పీటీఎం మండలాల్లో సోమవారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్తు వినియోగదారులు గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

తవ్వకాలపై ఫిర్యాదు

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల పంచాయతీలోని మౌలాకా పహాడ్‌లో తవ్వకాలు జరిగాయని, దీనిపై దర్యాప్తు జరపాలని అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి శిష్య బృందం సభ్యులు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

పీలేరు, న్యూస్‌టుడే : కోటపల్లె శ్రీపద్మావతి ఆండాళ్ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు రంగాచార్యులు, గోపి కృష్ణ ఆధ్వర్యంలో శ్రీనివాసుని కల్యాణం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవం పురస్కరించుకుని స్వామి వార్లను పట్టువస్త్రాలు, పుష్పాలలో అంకరణ చేశారు. కల్యాణం అనంతరం భక్తులు ఆలయంలోని పద్మావతిదేవి, శ్రీవెంకటేశ్వరస్వామి, గోదాదేవిని దర్శించుకుని కొబ్బరి కాయలు సమర్పించారు.

అరెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

తంబళ్లపల్లె, ములకలచెరువు, న్యూస్‌టుడే : తంబళ్లపల్లెలోని సిద్దారెడ్డిగారిపల్లిలో వెలిసిన నాయీబ్రాహ్మణుల కులదేవత అరెమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా డిసెంబర్ నెల మూడో ఆదివారం నాయీబ్రాహ్మణుల కుటుంబాలలోని పురుషులు అరెమ్మ అమ్మ వారికి దీపాలు, బోనాలు సమర్పించి పూజలు నిర్వహిస్తారు. నాయీబ్రాహ్మణుల సంఘం మండల అధ్యక్షుడు బాలకృష్ణ ఆధ్వర్యంలో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని అమ్మ వారిని వేడుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో అరెమ్మ అమ్మవారు

వైభవంగా అంబులం పూజ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని కొత్తపేటవీధిలో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో అంబలం పూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి వారి ఉత్సవ విగ్రహానికి కనుల పండువగా పంచామృతాభిషేకం, అంబలం నిర్మించి అందులో అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వినాయక స్వామి వారిని అధిరోహింపజేసి విశేష పూజలు చేశారు. అయ్యప్ప స్వామి భజన చేశారు. ఈ సందర్భంగా మాలాదీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు.

అధ్యాపకులకు అవగాహన

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : జాతీయ విద్యా విధానంపై అవగాహన పెంచుకోవాలని మిట్స్ డీమ్డ్ టుబీ విశ్వవిద్యాలయం ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్ అన్నారు. ఆదివారం కళాశాలలో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ఇంటర్మీడియట్ కళాశాలల అధ్యాపకులకు నిర్వహించిన ఒక రోజు కార్యశాలలో ప్రిన్సిపల్ మాట్లాడారు. విద్యా విధాన సంస్కరణలు, ఉన్నత, వృత్తి విద్యల్లో వాటి ప్రభావవంతమైన అమలు గురించి అధ్యాపకులకు తెలియజేశారు. వృత్తిలో నైపుణ్యం సాధించాలంటే కాలానుగుణంగా మారుతున్న అంశాలపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతులు పి.రమేష్‌రెడ్డి, చంద్రశేఖర్, రంజిత్‌భాస్కరన్, నిత్య, మనీష్‌శర్మ, కె.సతీష్, జూనియర్ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మిట్స్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.రామనాథన్

ఉద్యోగాలకు 33 మంది ఎంపిక

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి తదితరులు

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మదనపల్లె శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో శని, ఆదివారాల్లో జరిగిన ప్రాంగణ నియామకాల్లో 33 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ రమాదేవి తెలిపారు. చెన్నైకు చెందిన ఆల్‌డీజీ టెక్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు బిజినెస్ ప్రాసెస్ ఎగ్జిక్యూటివ్ హోదాకు అర్హులైన ఉద్యోగుల కోసం ఈ ఎంపిక నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ప్లేస్‌మెంట్ అధికారి మహేశ్‌బాబు అభినందించారు.

ఉపాధ్యాయినికి బహుమతి

ఉపాధ్యాయిని సువర్ణదేవికి బహుమతి అందిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : రాయచోటిలో డైట్ పాఠశాలలో శనివారం జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో వాల్మీకి పురం జిల్లా పరిషత్తు పాఠశాల ఉపాధ్యాయిని సువర్ణదేవి ప్రదర్శించిన జీవశాస్త్రంలో ఏకో ఫ్రెండ్లీ బోధనోపకరణాల నమూనా పలువురిని ఆకర్షించింది. ఆ నమూనాను చూసిన జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయినిని అభినందించి బహుమతిని అందించారు. స్థానిక జిల్లా పరిషత్తు పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి మాట్లాడుతూ సువర్ణదేవి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయినిని సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

కానిస్టేబుల్‌కు బంగారు పతకం

రామసముద్రం, న్యూస్‌టుడే : రాయచోటి పోలీసు పరేడ్‌లో ఆదివారం జరిగిన పోలీసు స్పోర్ట్స్ మీట్ వంద మీటర్ల పరుగు పందెంలో రామసముద్రం పోలీసుకానిస్టేబుల్ భరత్‌రెడ్డి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఎస్పీ ధీరజ్ కుమార్‌ను నుంచి బంగారు పతకాన్ని అందుకున్నారు. ఎగస్ఐ దిలీప్‌కుమార్, పోలీసు సిబ్బంది ఆయన్ను అభినందించారు.

భరత్‌రెడ్డిని అభినందిస్తున్న తోటి క్రీడాకారులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

పోలియో రహిత సమాజ స్థాపన అందరి బాధ్యత

పోలియో రహిత సమాజ స్థాపన మనందరి బాధ్యత అని వైద్యాధికారులు పేర్కొన్నారు. ఆదివారం మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. పోలియో కేంద్రాల్లో ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కల మందు వేశారు. మొబైల్ వాహనాల్లో తిరిగి చుక్కలు వేశారు. మిగిలిన చిన్నారులకు సోమ, మంగళవారాల్లో చుక్కల మందు వేయనున్నట్లు వైద్యులు తెలిపారు. - న్యూస్‌టుడే బృందం

మదనపల్లెలో పోలియో చుక్కలు వేస్తున్న డాక్టర్ జిలాన్

కరాటేలో చిన్నారుల ప్రతిభ

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరుకు చెందిన జేకేసీ కరాటే, కుంగ్‌ఫూ శిక్షణ కేంద్రం విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం చిత్తూరు శాంతా రఘురామన్ కల్యాణ మండపంలో జరిగిన జాతీయ కరాటే కుంగ్‌ఫూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆ శిక్షణ కేంద్రానికి చెందిన విద్యార్థులు 17 మంది స్వర్ణం, 16 మంది రజితం, 12 మంది కాంస్య పతకాలు సాధించారని ఆయన తెలిపారు. ఈ పోటీల్లో వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నారని నిర్వాహకుడు దామె తెలిపారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : గత వైకాపా ప్రభుత్వ హయాంలోనే నిరుపేదలకు వంద శాతం సంక్షేమం అందిందని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బైపాస్ రోడ్డులో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కేకు కోసి వైకాపా నాయకులకు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి కేశవరెడ్డి, నాయకులు కలీం, శ్రీధర్‌రాయల్, శివారెడ్డి, మోహన్‌రెడ్డి, ఇబ్రహీం, రవి, చికెన్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కేకుకోసి నాయకులకు, కార్యకర్తలకు పంచిపెడుతున్న మాజీ ఎమ్మెల్యే

హార్సిలీహిల్స్‌లో ట్రెక్కింగ్

బి.కొత్తకోట, న్యూస్‌టుడే : హార్సిలీహిల్స్‌లో మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ట్రెక్కింగ్‌లో వంద మంది ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. కేడెట్లకు రోప్ హ్యాండ్లింగ్, హిల్ క్లైంబింగ్ తదితర వాటిపై శిక్షణ ఇచ్చామని ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ఎన్.నవీన్‌కుమార్ తెలిపారు. కేడెట్లకు ఎన్‌సీసీకి చెందిన బీ, సీ ధ్రువపత్రాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ సంజు ఖడా, ఇన్‌స్ట్రక్టర్ హవాల్దార్ డి.ఎన్.రెడ్డి, హవాల్దార్‌లు నందన్‌రామ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

రూ.18.74 లక్షలతో అభివృద్ధి పనులు

పాత న్యాయస్థాన భవనం దెబ్బతినకుండా ఏర్పాటు చేస్తున్న రేకులు

పీలేరు, న్యూస్‌టుడే : పీలేరులోని మూడు న్యాయస్థానాల భవనాలకు రూ.18.70 లక్షలతో మరమ్మతు పనులు చేస్తున్నారు. 1865లో నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పెంకులతో నిర్మించినందున అది వర్షాలకు దెబ్బతినకుండా రూ.8.85 లక్షలతో భవనం మొత్తం రేకుల షెడ్ పనులు చేపట్టారు. పాతబడిన అదనపు సివిల్ జడ్జి కోర్టు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాల పైకప్పు వర్షాలకు ఉరవకుండా మరమ్మతులు చేస్తున్నారు. అలాగే 11వ అదనపు జిల్లా న్యాయస్థానం వద్ద, పాత న్యాయస్థానాల భవనాల వద్ద వేర్వేరుగా మరుగుదొడ్లు రూ.4.84 లక్షలతో నిర్మిస్తున్నామని ఆర్‌అండ్‌బీ డీఈ సురేశ్ నాయక్ చెప్పారు.

తండాకు నిధులు కేటాయించాలని వినతి

పెద్దమండ్యం, న్యూస్‌టుడే : మండలంలో వెనకబడిన అవికేనాయక్ తండా అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు, సర్పంచి నటరాజనాయక్ మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆదివారం మంత్రిని కలసి వినతి పత్రం అందజేశారు. అవికేనాయక్ తండాలో కనీస లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన మంత్రికి వివరించారు.

ధ్యానంతో మనసుకు ప్రశాంతత

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : ధ్యానంతో మనస్సుకు ప్రశాంతత చేకూరుతుందని యోగా గురువు పీవీఎస్ లక్ష్మి అన్నారు. ఆదివారం పీలేరులోని అంతర్జాతీయ యోగా, ధ్యానం దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా, ధ్యానం ప్రాధాన్యత గురించి వివరించారు. శాంతికి యోగా, ధ్యానం ఒకటే మార్గమన్నారు.

ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ

పీలేరు గ్రామీణ : పీలేరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్‌గా నారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నెల్లూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై పీలేరుకు వచ్చారు.

నాయకుల సంతాపం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : జనసేన పార్టీ కార్యకర్త వెంకటేశ్వరప్రసాద్ గుండె పోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి పార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి, మార్కెట్ యార్డు ఛైర్మన్ జంగాల శివరామ్ నివాళులర్పించారు. సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

❖ మదనపల్లె మండలం మాలేపాడులో తెదేపా కార్యకర్త కృష్ణమూర్తిరెడ్డి మృతి చెందారు. ఆయన మృతదేహానికి తెలుగుయువత నాయకులు రాటకొండ బాబురెడ్డి, శ్రీరామ్‌చినబాబు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉపాధ్యాయుడి ఆకస్మిక మృతి

కంభంవారిపల్లి : కంభంవారిపల్లెకు చెందిన ఉపాధ్యాయుడు రవీంద్రనాథరెడ్డి (57) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన నూతనకాలవ పంచాయతీ పెద్దిరెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. అతనికి భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

అపూర్వ కలయిక.. ఆనందాల వేడుక

కోన ఉన్నత పాఠశాలలో నాటి ఉపాధ్యాయులతో..

కలకడ, న్యూస్‌టుడే : మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984-85 విద్యా సంవత్సరం పదో తరగతి చదివి విద్యార్థులు ఆదివారం ఆదే పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నతనంలో తరగతి గదిలో చేసిన అల్లర్లు, చిలిపి చేష్టలు, ఆడిన ఆటలు అన్నీ గుర్తు చేసుకున్నారు. అనంతరం అందరూ కలసి భోజనం చేశారు. అంతకు ముందు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని తీర్మానించారు. పాఠశాల ముందు ఏర్పాటు చేసిన స్టేజీపైన, ముందు భాగంలో రూ.1.50 లక్షలు ఖర్చు చేసి టైల్స్ వేయించారు.

ములకలచెరువు : మండలంలోని చౌడసముద్రం జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1972-73వ బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు రంగారెడ్డి, విశ్వనాథ్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాఠశాల ఆవరణంలో రూ.లక్షకు పైగా ఖర్చు చేసి స్టేజీపై రేకుల షెడ్డు ఏర్పాటు చేయించారు. అనంతరం రోజంతా వారు సందడిగా గడిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అశ్విని, పూర్వ విద్యార్థులు శేఖర్‌గుప్తా, రత్నశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణ, మల్లప్పనాయుడు, అక్కుల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకటాచలపతి, మహబూబ్‌బాషా, శివయ్య, గిరిజకుమారి పాల్గొన్నారు.

చౌడసముద్రం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల బృందం



(c) eenadu

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ఘనంగా ముందస్తు క్రిస్మస్

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లా క్రిస్టియన్ సెల్ టీడీపీ జనరల్ సెక్రటరీ మల్లూరు సుధాకర్ నివాసంలో ఆదివారం ముందస్తు సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజల్లో ఆనందాన్ని నింపి సామాజిక సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మంత్రి అన్నారు. క్రైస్తవ సోదరులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

విహారం.. విజ్ఞానం.. వీక్షణం

గండికోటలో బోయనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువు, మార్కులే కాకుండా ప్రకృతిలోని సహజ వనరులు, పురాతన కట్టడాలు, ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించినపుడు వారిలో కొత్త ఉత్తేజం కలుగుతుందని బోయనపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.భారతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు బెలూం గుహలు, గండికోట, యాగంటి ప్రాంతాలు చూపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓబులేసు, పుత్త జనార్ధన్, శేషగిరి, రామరాజు దార్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

3న ప్రసన్న రంగనాథస్వామి కల్యాణోత్సవం

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణం రైల్వే స్టేషన్ రోడ్డులోని ఏబీ చంద్రారెడ్డి గార్డెన్స్‌లో జనవరి 3న గోదాదేవి, మహాలక్ష్మిదేవి సమేత ప్రసన్న రంగనాథస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తిరుప్పావై భక్తసేవా సమితి ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు రాజంపేట పట్టణం ఈడిగపాళెంలోని వినాయకస్వామి, బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆదివారం భక్తులు ఆవిష్కరించారు. మహావిష్ణువుకు ప్రీతిపాత్రమైన ధనుర్మాసంలో నిర్వహిస్తున్న స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తరించాలని కోరారు.

ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న భక్తులు

గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సాధన

✦ పది విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక

గాలివీడు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ

గాలివీడు, న్యూస్‌టుడే: విద్యాశాఖ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మెగా పీటీఎంలు నిర్వహించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పరస్పర సహకారంతో విద్యార్థుల చదువులపై ప్రత్యేక దృష్టి సారించారు. పది పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వంద రోజుల ప్రణాళికతో వందశాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా ముందుకెళ్తున్నారు.

■ వంద రోజుల ప్రణాళిక సక్రమంగా అమలయ్యేందుకు జిల్లా, నియోజకవర్గ, మండల వ్యాప్తంగా పర్యవేక్షకులను నియమించారు. ఆయా పాఠశాలలను పర్యవేక్షిస్తూ ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పునశ్చరణ తరగతులు, ఉదయం నేర్చుకున్న సబ్జెక్టులపై సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష విధానం తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. మార్చి 14 వరకు ప్రణాళిక బద్ధంగా కార్యక్రమం అమలయ్యేందుకు చర్యలు చేపట్టారు.

■ మండలంలోని గాలివీడు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పది తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు షేక్ జాఫర్ తెలిపారు. వారికి సబ్జెక్టు నిపుణులతో బోధన జరుగుతోందన్నారు. తగిన పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు.

ప్రత్యేక తరగతులపై పర్యవేక్షణ

పది పాఠశాలలో వంద రోజుల ప్రణాళిక పకడ్బందీగా అమలవుతోందని ఎంఈవో నాగరాజు పేర్కొన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, సబ్జెక్టులపై స్లిప్ టెస్టులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ విద్యా సంవత్సరం వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తామన్నారు.

జిల్లా క్రికెట్ విజేత సుండుపల్లె జట్టు

సుండుపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ క్రికెట్ పోటీలలో భాగంగా ఆదివారం రాయచోటిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో సుండుపల్లి ఉపాధ్యాయ జట్టు విజేతగా నిలిచింది. జిల్లా స్థాయి తుదిపోరులో రాజంపేట డివిజన్ నుంచి సుండుపల్లి, రాయచోటి డివిజన్ నుంచి సంబేపల్లె మండలాల ఉపాధ్యాయ జట్లు పోటీ పడ్డాయి. సుండుపల్లి జట్టు సంబేపల్లి జట్టుపై 15 పరుగుల తేడాతో విజయం సాధించింది.

విజయ చిహ్నం చూపుతున్న ఉపాధ్యాయులు

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

రాజంపేట, న్యూస్‌టుడే: యూటీఎఫ్ మండలశాఖ నూతన కమిటీ అధ్యక్షునిగా జి.నాగేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన సంఘ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ గౌరవాధ్యక్షునిగా సాంబశివయ్య, ఉపాధ్యక్షులుగా వినోద్‌కుమార్, తులశమ్మ, కోశాధికారిగా కె.శివకుమార్, కార్యదర్శులుగా లక్ష్మీప్రసన్న, వీరశ్యామల, భాగ్యలక్ష్మి, వెంకటరమణ, వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా పది మందిని ఎన్నుకున్నారు. కాగా మండల ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం.రమణయ్యను ఎన్నుకున్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపిక

సుండుపల్లి: విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జిల్లా విద్యాధికారి సుబ్రహ్మణ్యం

చిట్వేలి (పుల్లంపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలకు చిట్వేలి ఉన్నత పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దుర్గరాజు ఆదివారం అన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్రదర్శనల్లో చిట్వేలి ఉన్నత పాఠశాల విద్యార్థులు వాటర్ కన్జర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగంలో కె.చందు, పి.భరత్‌కుమార్ రూపొందించిన ప్రాజెక్టు, అలాగే గ్రీన్ ఎనర్జీ విభాగంలో వి.దివ్యశ్రీ, ఏ.సుస్మితలు రూపొందించిన ప్రాజెక్టు, వ్యక్తిగత విభాగంలో బాంబో పల్ప బ్రైడెగ్రాడెబుల్ శానిటరీ ప్యాడ్స్ అంశంలో విద్యార్థిని రుకియా రూపొందించిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

చిట్వేలి: విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న జిల్లా విద్యాధికారులు

సుండుపల్లి: రాయచోటిలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో మండలంలోని తిమ్మసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల గణిత నమూనా రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. 8వ తరగతి విద్యార్థులు ఇ.వినయ్, వి.హర్షప్రియలు గైడ్ గణిత ఉపాధ్యాయుడి సూచనలో రూపొందించిన అండర్‌స్టాండింగ్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ 3డి షేప్స్ వర్కింగ్ నమూనాను రూపొందించారు. ఈ ప్రాజెక్ట్ ఎంపిక కావడంతో ఆ విద్యార్థులను, గణిత ఉపాధ్యాయుడు పి.అశోకరాజులను జిల్లా విద్యాధికారి సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకుడు కె.శ్రీనివాసరాజు, ఉన్నతపాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు రెండు చుక్కలు

రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని ఐదు సంవత్సరాలలోపున్న పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేశారు. రాజంపేటలో సబ్‌కలెక్టర్ హెచ్.ఎస్.భావన పాల్గొని ఎలాంటి పోలియో సమస్యలతో బాధపడకుండా పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే రెండు చుక్కలు వేయించాలని తెలిపారు. చిన్నమండెం బస్టాండు పోలియో కేంద్రాన్ని వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరక్టరు డాక్టర్ రామగిడ్డయ్య పరిశీలించారు. జిల్లా వైద్యాధికారి లక్ష్మీనరసయ్య పల్స్‌పోలియో కార్యక్రమం పరిశీలనలో భాగంగా మడితాడు పోలియో కేంద్రం తనిఖీ చేసి ఓ బిడ్డకు పోలియో చుక్కలు వేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సానే శేఖర్ పుల్లంపేట మండలంలోని పోలియో కేంద్రాలను పరిశీలించారు. - న్యూస్‌టుడే, బృందం

రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సబ్‌కలెక్టర్ హెచ్.ఎస్.భావన

పుల్లంపేటలో చిన్నారులను గుర్తించి చుక్కలు వేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శేఖర్ సిబ్బంది

చిన్నమండెం బస్టాండు వద్ద పోలియో కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్య

గుప్తనిధుల ముఠా అరెస్టు

అద్దంకి, న్యూస్‌టుడే: భూమి పొరల్లో ఉండే గుప్తనిధుల్ని గుర్తించేందుకు అద్దంకి వచ్చిన ఐదుగురు ముఠా సభ్యుల్ని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సీఐ ఎ.సుబ్బరాజు అందించిన సమాచారం మేరకు.. రాజంపేటకు చెందిన కె.సుధాకర్, పి.శివకుమార్ అలియాస్ శివయ్య, పి.మనీంద్రతో పాటు విజయవాడ రాజీగారితోటకు చెందిన వారు రంగురాళ్లు, వజ్రాలు ఏరుకునే సమయంలో మిత్రులయ్యారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఇంట్లో లంకెబిందెలు ఉన్నట్లు తెలుసుకుని, వాటిని గుర్తించేందుకు అద్దంకి వచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న సమయంలో పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

నారా లోకేశ్‌ను కలిసిన కస్తూరి

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు కలిసినట్లు తెలిపారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఆదివారం కలిశామన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలో తెదేపా కార్యకర్తలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయనకు వివరించామన్నారు. ఇక్కడ చేయాల్సిన అభివృద్ధి పనులు, రాజకీయ పరిణామాలపై మంత్రితో మాట్లాడినట్లు వివరించారు.

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో కస్తూరి విశ్వనాథనాయుడు

జిల్లా కేంద్రం కావాలన్న ఆకాంక్షను ప్రభుత్వానికి నివేదిస్తాం

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, నాయకులు, ఐకాస సభ్యులు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేటను జిల్లా కేంద్రం చేసే విషయంలో ప్రభుత్వం స్పందించి, మాకు న్యాయం చేయాలని ఐకాస నాయకులు కోరారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ ఆదివారం రైల్వేస్టేషన్ రోడ్డులో రిలే దీక్షలు ఆదివారానికి 12వ రోజుకి చేరుకున్నాయి. ఈ దీక్షలో మండలంలోని పెద్దకారంపల్లి, మునక్కాయలపల్లి, గుండాలపల్లి గ్రామాల ప్రజలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఐకాస నాయకులు మాట్లాడుతూ జిల్లా సాధనలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. అన్ని ప్రాంతాలకు సమదూరంలో ఉన్న రాజంపేటను జిల్లా కేంద్రం చేయడం సమంజసమని తెలిపారు. **రైల్వేకోడూరు:** రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రంగా మార్చాలన్న ఇక్కడి ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ ఆదివారం రైల్వేకోడూరులో జేఏసీ ఆధ్వర్యంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సంఘం సభ్యులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇదివరకే ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రాష్ట్ర తెదేపా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, జనసేన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి

చిన్నమండెం, న్యూస్‌టుడే: తంబళ్లపల్లె తెదేపా సమన్వయకర్త కొవూరి మల్లికార్జుననాయుడు, చిన్నమండెం సింగిల్‌విండో అధ్యక్షుడు కొవూరి శివయ్యనాయుడు తల్లి సుబ్బమ్మ(92) ఆదివారం మృతి చెందారు. మండల పరిధిలోని పడమటికోన కస్పాపల్లెకు చెందిన ఆమె అనారోగ్యం, వయసు రీత్యా మృతి చెందారు. సుబ్బమ్మ మృతదేహానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. **సంబేపల్లె:** మండలంలోని శెట్టిపల్లి గ్రామం గాండ్లపల్లెకు చెందిన టీడీపీ బీసీ నాయకుడు రిటైర్డ్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరమణ భౌతికకాయానికి రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఆయన గుండెపోటుతో మృతిచెందారు.

PUBLIC NOTICE

dt.20.12.2025

It is hereby informed to the public that my client rep. by Branch Manager, Sundaram Home Finance Ltd., Kadapa intended to sanction loan for below mentioned schedule property in favour of Lakkireddy Sujatha, W/o L. Mallikarjuna Reddy, R/o G2 Sanjeev Sai Apartment, New Krishna Nagar, Kodur Mandal & Village, Annamayya District. Originally the property belongs to V. Narasaiah, S/o V. Venkata Swamy Setty who purchased the same as per Doc.No.460/1965 dt.26.02.1965 and he in turn executed un-registered will deed in favour of his son V.Venkateswarlu and daughter-in-law namely V.Karunambika dt. 10.10.1983. based on the said will deed V.Venkateswarlu and V.Karunambika both of them executed a registered GPA-cum-sale deed in favour of V. Vijaya Kumar Reddy and M. Tejasree as per Doc.No.1886/2018 dt. 18.07.2018 to an extent of Ac.9-05 cents in different survey numbers, and later on 05.07.2019 V.Vijaya Kumar Reddy and M.Tejasree both of them sold Item No.1 property in favour of L.Sujatha, W/o L.Mallikarjuna Reddy as per Doc.No. 1728/2019. V.Vijaya Kumar Reddy and M.Tejasree both of them sold Item No.2 property in favour of V. Chandra Kala W/o V.LakshmikarReddy, as per Doc.No.1030/2019 dt. 29.04.2019. Thereafter, V. Chandrakala had sold the property in favour of L.Sujatha as per Doc.No.2321/2022 dt.25.07.2022. In this matter original will deed or copy and death certificate of V. Narasaiah documents are not available or not traced out. Now my client's financial institution intends to disburse the loan amount in favour of L.Sujatha.

So if anyone having objection against the property and the same may be intimated to Branch Manager, Sundaram Home Finance Ltd., Kadapa within 7 days in writing or orally for compliance.

SCHEDULE

Item No.1 as per Doc. No.1728/2019

The property is situated at Annamayya district, Pullampeta Sub District, Kodur Mandal, Mysoreravaripalli Grama Panchayathi and Kodur Village fields, in Sy. No.1582/A2B, 1583/1, 1585/2, 1585/4, 1585/1B,1585/2,1590/1B, 1586/2 B-Block Plot No.6,7,8 & 9 to an extent of 733.33 Sq. yards with in the following boundaries:- East : 25 feet wide road, West : B-Block Plot No.21, 22,23,24, North: 30 feet wide road, South : K.Revathi B-Block Plot No.10 & 11.

Item No.2 as per Doc. No.2321/2022

The property is situated at Annamayya District, Pullampeta Sub District, Kodur Mandal, Mysoreravaripalli Grama Panchayathi and Kodur Village fields, in Sy. No.1582/A2B, 1583/1, 1585/2, 1585/4, 1585/1B,1585/2,1590/1B, 1586/2 B-Block Plot No.23 & 24 to an extent of 366.66 Sq. yards with-in the following boundaries:-

East : B-Block Plot No.6 & 7, **West :** 25 feet wide road, **North** : 30 feet wide road, **South** : Madhavaraju Subramanyam B-Block Plot No.22

G. VENKATESWARA REDDY, ADVOCATE, KADAPA, Cell: 99480 92702

శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నేడు

సుండుపల్లి, న్యూస్‌టుడే: సుండుపల్లిలోని విరూపాక్ష, చెన్నకేశవస్వామి (శివాలయం) ఆలయ ప్రాంగణంలో సోమవారం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు గోవిందమాలా పాదయాత్ర భక్తబృంద నిర్వాహకులు తెలిపారు. స్వామి వార్లకు కల్యాణం, అన్న ప్రసాదం పంపిణీ, సంకల్పము తదితర కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. గోవింద మాలాధారులు, భక్తులు పాల్గొనాలని కోరారు.

నల్ల గంగమ్మ ఛైర్మన్‌కు సన్మానం

సంబేపల్లె, న్యూస్‌టుడే: దేవరాయి నల్ల గంగమ్మ ఛైర్మన్ కూనాసి సుబ్బరాజు యాదవ్ దంపతులను ఏపీ ఫారెస్ట్ కమిషన్ డైరెక్టర్ ఎర్రగొల్ల రెడ్డెయ్య యాదవ్, యాదవ సోదరులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్డెయ్య యాదవ్ మాట్లాడుతూ... తెదేపా బీసీలకు పెద్ద పీట వేసిందన్నారు. బీసీలకు పదవులు కల్పించడంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. నల్లగంగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కోడూరువాసికి డాక్టరేట్ ప్రదానం

సుదర్శనశర్మకు డాక్టరేట్ అందజేస్తున్న యూనివర్శిటీ నిర్వాహకులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: న్యూ దిల్లీలోని సోక్రటీస్ సోషియల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి తనకు గౌరవ డాక్టరేట్ లభించిందని పట్టణానికి చెందిన వేంకటేశ్వరస్వామి దేవాలయం ధర్మకర్త బండాత్మకూరు సుదర్శనశర్మ తెలిపారు. యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అడ్వైజరీ కమిటీ సభ్యుడు ఎన్.జైన్ చేతుల మీదుగా ఈ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నట్లు చెప్పారు. తాను చేసిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించిందని వివరించారు.

సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యం

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుమారుడు నిచ్చల్ నాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాలెంగొల్లపల్లె పంచాయతీలోని గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలపై ఆరాదీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏ సమస్య ఉన్నా తన తండ్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, ఏఎంసీ ఛైర్మన్ షఫీనాయక్, క్లస్టర్ ఇన్‌ఛార్జి శంకారపు జయరామ తదితరులు పాల్గొన్నారు.

సంబేపల్లెలో కంటి వైద్య శిబిరం

సంబేపల్లె, న్యూస్‌టుడే: సంబేపల్లె మండల కేంద్రంలోని తేజ స్కూల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించినట్లు గ్రామీణ వైద్యుల ఆర్గనైజింగ్ సెక్రటరీ వీరశంకర్ తెలిపారు. ఈ శిబిరంలో 80 మందికి కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మేరీథెరీసా మహిళా మండలి సౌజన్యంతో పాటు పుష్పగిరి కంటి వైద్యశాల వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కేవీఎస్ నాయుడు, వైద్యుడు వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డామిట్.. డివైడర్ అడ్డం తిరిగింది

ఈ చిత్రంలో కనిపిస్తున్నది రాజంపేట పట్టణం మార్కెట్‌కి సమీపంలోని రహదారి మధ్యలో దెబ్బతిన్న డివైడర్. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో డివైడర్ దెబ్బతిని అడ్డం తిరిగింది. అసలే మార్కెట్ రద్దీగా ఉంటుంది. పైగా అక్కడ రోడ్డు విస్తరణ జరగలేదు. ఉన్న కొద్దిపాటి డివైడర్‌ని కూడా బాగు చేయలేకపోతున్నారు. దీని కారణంగా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఏదైనా ప్రమాదం జరిగితేగానీ అధికారులు స్పందించరేమోనని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు దెబ్బతిన్న డివైడర్‌ని భాగాన్ని తొలగించడమా.. బాగు చేయడమో చేస్తేగానీ సమస్య తీరదు. - **న్యూస్‌టుడే, రాజంపేట**

మానవత సంస్థ సేవలు ప్రశంసనీయం

రాయచోటి, న్యూస్‌టుడే: మానవత సేవలు ప్రశంసనీయమని ఆ సంస్థ రాయచోటి శాఖ ఛైర్మన్ శివగంగిరెడ్డి తెలిపారు. పట్టణంలోని కొత్తపేట ప్రతిభ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో విద్యను ప్రోత్సహిస్తూ నైతిక విలువలపై అవగాహన కల్పించడం సంతోషకరమన్నారు. మొక్కలు నాటి వాటిని పరిరక్షించేలా ప్రజలకు అవగాహన కలిగిస్తూ పర్యావరణాన్ని మెంపొందించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు. ఆనారోగ్యంతో బాధపడుతూ సుదూర ప్రాంతాల ఆసుపత్రులకు తరలించేందుకు అంబులెన్సులు, శవ పేటికలకు అవసరమైన బాడీ ప్రిజర్లు సంస్థ తరఫున అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రెడ్డి చైతన్య, డాక్టర్ నాగశ్వేత, అధ్యక్షుడు అంకం జయచంద్రారెడ్డి, చింతం రెడ్డి వెంకట్రామిరెడ్డి, మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రాజంపేట వాకర్స్ అసోసియేషన్‌కు ఉత్తమ అవార్డు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: వాకర్స్ ఇంటర్నేషనల్ వారు విశాఖపట్టణంలో ఆదివారం నిర్వహించిన పోటీల్లో రాజంపేట పట్టణంలోని వాకర్స్ అసోసియేషన్‌కు ఉత్తమ సేవా అవార్డు వచ్చిందని శంకర్‌నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కొండూరు శరత్‌కుమార్ రాజు, శంకర్‌నాయుడులు మాట్లాడుతూ రాజంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేయడం, ముఖ్యంగా వైద్య శిబిరాలు, గ్రామాల్లో తాగు నీటి వసతులు కల్పించడంతో ఈ అవార్డు వచ్చిందని ఆయన వెల్లడించారు.

అవార్డును అందుకుంటున్న రాజంపేట వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు

రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజక వర్గాల్లో వైకాపా నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్ జగన్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేకు కోసి మిఠాయిలు పంపిణీ చేశారు. పలు చోట్ల అన్నదానం చేశారు. రైల్వేకోడూరులో వైకాపా నాయకులు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేకును కోసి తినిపించుకున్నారు. - **న్యూస్‌టుడే బృందం**

రైల్వేకోడూరు వైకాపా కార్యాలయంలో కార్యకర్తలకు కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

విధేయతకే పట్టం

న్యూస్‌టుడే, బాపట్ల

బాపట్ల లోక్‌సభ తెదేపా అధ్యక్షుడిగా సలగలకు మరోసారి అవకాశం

ప్రధాన కార్యదర్శిగా నక్కల రాఘవ

పార్టీ పదవులు అప్పగించడంలో అనుభవం.. అంకితభావం.. విధేయతకు తెదేపా అధిష్ఠానం పెద్దపీట వేసింది. బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా సలగల రాజశేఖరబాబు, ప్రధాన కార్యదర్శిగా నక్కల రాఘవను పార్టీ అధినేత చంద్రబాబు నియమించారు. వీరి పేర్లు అయిదురోజుల క్రితమే ఖరారైనా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం అధికారికంగా ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు 2024 ఏప్రిల్ నుంచి లోక్‌సభ అధ్యక్షుడిగా ఉన్న సలగలకు మరోసారి అవకాశం ఇచ్చారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులతో కలిసి సమన్వయంతో పని చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో పార్టీ ఘన విజయం సాధించేలా కృషి చేయాల్సిన బాధ్యత నూతన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులపై ఉంది.

ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నేతకు..

బాపట్లకు చెందిన **రాజశేఖర బాబు** సీనియర్ రాజకీయ నాయకుడు. తండ్రి సలగల బెంజిమెన్ బాపట్ల ఎంపీగా పని చేశారు. జనరల్ స్థానంగా ఉన్న బాపట్ల నుంచి 1989 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1991 లోక్‌సభ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. బెంజిమన్ రాజకీయ వారసుడిగా వచ్చిన రాజశేఖరబాబు కాంగ్రెస్, వైకాపాలో రెండున్నర దశాబ్దాలు పని చేశారు. 2014లో తెదేపాలో చేరారు. 2019, 2024 ఎన్నికల్లో బాపట్ల లోక్‌సభ పార్టీ టిక్కెట్ ఆశించినా దక్కలేదు. 2009 ఎన్నికల నుంచి బాపట్ల లోక్‌సభ నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వు అయింది. నియోజకవర్గ పరిధిలో అధిక సంఖ్యలో ఎస్సీ సామాజికవర్గ ఓటర్లు ఉన్నారు. ఈ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వేమూరు, సంతనూతలపాడు ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాలుగా ఉన్నాయి. పార్టీ అధ్యక్షుడి ఎంపిక నిమిత్తం త్రిసభ్య కమిటీ గత అక్టోబరులో బాపట్ల వచ్చి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆశావహులు, ముఖ్య నేతలను కలిసి వారి అభిప్రాయాలు సేకరించి అధినేత చంద్రబాబుకు నివేదిక అందించారు. అధ్యక్ష పదవి కోసం నలుగురు నేతలు పోటీ పడ్డారు. తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని సలగల కోరారు. సామాజిక సమీకరణాల్లో భాగంగా ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఆయన పేరును చంద్రబాబు ఖరారు చేశారు.

చినగంజాం మండలానికి చెందిన బీసీ నేత

పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలం కడవకుదురుకు చెందిన బీసీ నేత **నక్కల రాఘవ** తెదేపా ఆవిర్భావం నుంచి క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. మండలంలో పార్టీకి కీలకనేతగా ఉన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అత్యంత సన్నిహితుడిగా పేరుంది. లోక్‌సభ నియోజకవర్గంలో బీసీలు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీ పట్ల విధేయత ఆయనకు కలిసి వచ్చింది. బీసీ నేతకు అవకాశం ఇవ్వాలని అధినేత చంద్రబాబు నిర్ణయించి బాపట్ల లోక్‌సభ తెదేపా ప్రధాన కార్యదర్శి పదవికి రాఘవను ఎంపిక చేశారు. ప్రస్తుతం పార్లమెంటు నియోజకవర్గ యాదవ సాధికార కన్వీనర్‌గా ఉన్నారు.

ఖో కొడతా.. పాయింటు పడతా..!

జె.పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి బాలిక నారాయణమ్మ జూనియర్ కళాశాలలో అండర్-18 రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. - న్యూస్‌టుడే, జె.పంగులూరు

ప్రథమ ఇంటర్ పరీక్షల తీరు మారె

ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు

గణితం వంద మార్కులకే..

న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె అర్బన్, వేమూరు

పదో తరగతి పరీక్షల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యలోనూ సంస్కరణలు అమలు చేస్తోంది. జూనియర్ ఇంటర్ విద్యార్థుల సిలబస్ మార్చారు. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రశ్నపత్రం పూర్తిగా మారింది. పరీక్షల షెడ్యూలును ఇంటర్ బోర్డు ఇప్పటికే విడుదల చేసింది. నూతన పరీక్ష విధానంపై జిల్లా స్థాయిలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు ఇంటర్ బోర్డు అధికారులు బాపట్లలో ఇటీవల ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

☛ భౌతిక రసాయన శాస్త్రాలకు 85 మార్కుల ప్రశ్నపత్రం ఇస్తారు. ప్రస్తుత విధానంలో 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. పబ్లిక్ పరీక్షల్లో గణితం, భౌతిక, రసాయన శాస్త్రం, చరిత్ర, కామర్స్, రాజనీతి శాస్త్రం, ఎకనామిక్స్‌కు 32 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. గతంలో 24 పేజీల బుక్‌లెట్ ఇచ్చారు. ప్రశ్నల సంఖ్య పెరగటంతో బుక్‌లెట్‌లో పేజీలు పెరిగాయి. వృక్ష, జంతుశాస్త్రాలను కలిపి జీవశాస్త్రంగా ఒకే సబ్జెక్టుగా పరిగణిస్తారు. మొత్తం 85 మార్కులకు వృక్ష, జంతు శాస్త్రాల ప్రశ్నపత్రాలు ఉంటాయి. ఒకేరోజు పరీక్ష రాయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వృక్ష, జంతు శాస్త్రాలకు 24 పేజీల చొప్పున రెండు బుక్‌లెట్లు ఇవ్వనున్నారు. గతంలో రెండు వేర్వేరు సబ్జెక్టులకు 60 మార్కుల చొప్పున మొత్తం 120 మార్కులకు ప్రశ్నపత్రాలు ఇచ్చేవారు. రెండ్రోజులు విడివిడిగా పరీక్ష రాశారు. మిగతా సబ్జెక్టులకు 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో 29 (85) మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లే.

జిల్లాలో జూనియర్ ఇంటర్ కళాశాలలు: 96
పరీక్ష రాస్తున్న ప్రథమ సంవత్సర విద్యార్థులు: 10,120

తడబాటుకు గురికాకుండా పరీక్షలు బాగా రాసేలా జూనియర్ ఇంటర్ విద్యార్థులకు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ద్వితీయ ఏడాది వారికి ఎలాంటి మార్పు ఉండదని, పాత పద్ధతిలోనే పరీక్షలు జరుగుతాయన్నారు.

గణిత ప్రశ్నపత్రం 1990 సంవత్సరం నుంచి 150 మార్కులకు ఉండేది. ఆ తర్వాత దీన్ని గణితం-1ఏ, గణితం-1బిగా మార్చారు. ఒక్కో పేపరు 75 మార్కుల చొప్పున రెండు పేపర్ల విధానాన్ని ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. తాజాగా జూనియర్ ఇంటర్ విద్యార్థులకు గణితంలో ఒకే పేపరు విధానాన్ని ప్రవేశపెట్టారు. మార్కులను వందకు కుదించారు. ఇంటర్ ప్రథమ ఏడాది పరీక్ష విధానంలో వచ్చిన మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని, మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహిస్తున్నామని ఇంటర్ విద్య జిల్లా అధికారి జుబేర్ చెప్పారు. ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌లో భాగంగా పరీక్షా విధానం మారింది.

డీసీసీబీ శాఖల్లో 51 విచారణకు సిద్ధం

నిలుపుదలకు నేతలను కలుస్తున్న ఉద్యోగులు

గుంటూరు, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని సహకార బ్యాంకుల్లో చోటుచేసుకున్న అవకతవకల విషయం అసెంబ్లీలోనూ చర్చనీయాంశమైంది. ప్రభుత్వం దీనిపై హౌస్ కమిటీని నియమించింది. హౌస్ కమిటీ విచారణలో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కూడా ఉంది. గత నెలలో జరిగిన హౌస్ కమిటీ విచారణకు జిల్లా సహకార బ్యాంకు అధికారులు వెళ్లి సభ్యులు అడిగిన వివరాలు తెలిపారు. జిల్లాలోని సహకార బ్యాంకు శాఖలన్నింటిపైనా 51 విచారణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రెండు సార్లు విచారణ గడువును పెంచింది. తాజాగా కూడా రెండు నెలల్లో విచారణ చేపట్టి నివేదిక అందించాలని సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం నుంచి జిల్లాలోని సహకార బ్యాంకు శాఖల్లో విచారణ చేయనున్నారు.

తొలుత 19 చోట్ల...

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సహకార బ్యాంకు బ్రాంచులు 44 ఉన్నాయి. వీటిలో ఉమ్మడి జిల్లా పరిధిలో 19 శాఖల్లో సోమవారం నుంచి సహకార శాఖ అధికారులు విచారణ చేయనున్నారు. పది రోజుల కిందటే బ్యాంకు అధికారులకు సహకార శాఖ అధికారులు నోటీసులు జారీ చేసి విచారణ సమయంలో అడిగిన దస్త్రాలు చూపించేలా ఆదేశాలివ్వాలని సూచించారు. ఈనేపథ్యంలో బ్యాంకు ఇన్‌ఛార్జి సీఈఓ.. బ్రాంచి మేనేజర్లు, ఉద్యోగులు విచారణకు సహకరించాలని సూచనలు చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పరిపాలన కార్యాలయంతో పాటు నగరంలోని శాఖలు ప్రస్తుతం విచారించనున్న జాబితాలో ఉన్నట్లు తెలిసింది. దీంతో బ్యాంకు ఉద్యోగులు పలువురు ఇటీవల ఓ ఎమ్మెల్యేను కలిసి విచారణను నిలుపుదల చేయాలని కోరారు. విచారణ కొనసాగింపు దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

వాయు నాణ్యత.. ఏమా కథ..!

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో 9 కొత్త కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు

పారిశ్రామిక, వాహనాల కాలుష్య అధ్యయనానికి సన్నాహం

వాయు కాలుష్యాన్ని అధ్యయనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 9 కొత్త కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ఆరంభించారు. తద్వారా పారిశ్రామిక, వాహనాల ద్వారా వెలువడుతున్న కాలుష్య స్థాయిలను అంచనా వేయడంతోపాటు.. పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టనున్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) రాష్ట్రంలో 62 గాలి నాణ్యత పరీక్ష కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా అన్ని పుర, నగరపాలికల్లో ఇవి తప్పక ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నారు. ఇందులో అమరావతి, గుంటూరు, పల్నాడు, బాపట్ల రీజియన్‌లో 9 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా పారిశ్రామిక, ట్రాఫిక్ వల్ల ఏర్పడుతోన్న కాలుష్యాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం, ప్రజారోగ్యాన్ని కాపాడడానికి ఉన్న మార్గాలపై దృష్టి పెట్టనున్నారు.

గుంటూరులో ఇప్పటికే నాలుగు.. గుంటూరు నగరంలో పదేళ్ల క్రితమే నాలుగు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. దేశవ్యాప్తంగా కాలుష్య కోరల్లో చిక్కిన నగరాలపై అధ్యయనం చేసిన కేంద్రప్రభుత్వం, ఆ జాబితాలో గుంటూరు కూడా ఉన్నట్లు తేల్చింది. ఇక్కడ వాయు నాణ్యతను పెంచడానికి అప్పట్లోనే కసరత్తు ప్రారంభించి, ఈ కేంద్రాల ఏర్పాటుకు పూనుకుంది. అలాగే, ఏటా రూ.కోట్లు మంజూరు చేస్తోంది. ఆ నిధులతో జీఎంసీ పరిధిలో పలు కార్యక్రమాలు చేపట్టారు. వాహనాల కాలుష్యాన్ని తగ్గించేందుకు చెత్త తరలింపునకు 200 ఈ-ఆటోలు సమకూర్చారు. సీసీరోడ్ల నిర్మాణం, మొక్కల పెంపు..ఇలా అనేకం ఈ జాబితాలో ఉన్నాయి. నాలుగు కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు గాలి కాలుష్యాన్ని అధ్యయనం చేస్తుండగా.. ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో తాజాగా ఉమ్మడి జిల్లాలో మరి కొన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

రెండు చుక్కలతో ఆరోగ్యం

బాపట్ల, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. పట్టణంలోని రెల్లికాలనీ పురపాలక ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు పోలియో నివారణ చుక్కలు వేసి కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. కలెక్టర్ కుమారుడు జెవిన్ కిరాయుకు ప్రాంతీయ ఆసుపత్రిలో పల్స్‌పోలియో చుక్కలు వేయించారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో నివారణ చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. జిల్లాలో 1315 కేంద్రాల్లో 1.45 లక్షల మంది చిన్నారులకు చుక్కల మందు వేయాలన్నది లక్ష్యమన్నారు. డీఎంహెచ్‌వో విజయమ్మ మాట్లాడుతూ తొలి రోజు 1,17,841 మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు తెలిపారు. 81.21 శాతం నమోదైనట్లు చెప్పారు.

చిన్నారికి చుక్కల మందుఉ వేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

రూ.50 వేలు లాభం చూపి.. రూ.17.61 లక్షలు దోచి

సత్తెనపల్లి: రూ.50 వేలు లాభం చూపించి సైబర్ నేరగాళ్లు రూ.17.61 లక్షలు దోచేసిన ఘటన పట్టణంలో వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. సత్తెనపల్లికి చెందిన గొట్టిముక్కల వెంకట రాఘవేంద్ర శ్యాంప్రసాద్, ఆయన స్నేహితురాలు నెల్లూరి పద్మావతి టైలరింగ్ కేంద్రం నడుపుతున్నారు. యస్ సెక్యూరిటీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వాట్సాప్ గ్రూపులో మిథాలీ మిశ్రా, రాజీవ్ మాథూర్‌లు వారికి పరిచమయ్యారు. బ్లాక్ ట్రేడింగ్(షేర్లు అమ్మడం కొనడం)లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని ఆశ చూపారు. దీంతో శ్యాంప్రసాద్, విజయలక్ష్మి గత నెల 16న ట్రేడింగ్ కోసం రెండు బ్యాంకు ఖాతాలు తెరిచారు. మొదటి ట్రేడింగ్‌లో వారికి రూ.50 వేలు లాభం చూపించారు. ఆ తర్వాత ఎక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు నమ్మించడంతో రూ.17,61,100 పంపించారు. లాభాలు రాకపోగా అసలు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

పర్యవేక్షణ లోపం.. రోగులకు శాపం..!

గుంటూరు జీజీహెచ్‌లోని ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ దుస్థితి

ఈనాడు, అమరావతి

పర్యవేక్షణ లోపం రోగులకు శాపంగా మారుతోంది. .గుంటూరు జీజీహెచ్‌లోని ఆక్సిజన్ సరఫరా వ్యవస్థలో నిపుణుల కొరత, నిర్వహణలో ఇబ్బందులు ప్రమాద హెచ్చరికలు సూచిస్తున్నాయి..ఫ్లో మీటర్ల నిర్వహణలోనూ ఇదే సమస్య ఉత్పన్నమవుతుండగా, ప్రత్యేక సిబ్బంది అవసరాన్ని అడుగడుగునా గుర్తు చేస్తుండడం కీలకమైంది.

గుంటూరు జీజీహెచ్‌కు నిత్యం 5 వేల మందికి పైగా చికిత్స కోసం వస్తుంటారు.

ఆక్సిజన్ ప్లాంట్

ఇందులో 1500 నుంచి 2 వేల మంది ఇన్‌పేషెంట్లుగా నమోదవుతుంటారు. సుమారు 200 వెంటిలేటర్ పడకలు ఇక్కడ ఉండగా..మొత్తం 1200 పడకలకు ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ అనుసంధానమై ఉంది. మొత్తం 50 కిలోలీటర్ల ఆక్సిజన్ ఉత్పత్తి, నిల్వ సామర్థ్యం కలిగిన ప్లాంటు జీఎంసీలో ఉండగా..1800 అవుట్‌లెట్లను కలిగి ఉంది. ఇవి కాకుండా, మూడు పీఎస్‌ఏ(ప్రెజర్ స్వింగ్ అబ్జార్షన్) ప్లాంట్లు, ఆక్సిజన్ సిలిండర్లతో కూడిన వ్యవస్థలు ఉన్నాయి. ఇందులో లిక్విడ్ ఆక్సిజన్ సరఫరాను కీలకంగా చెప్పవచ్చు.

బకాయిలు సైతం.. కీలకమైన లిక్విడ్ ఆక్సిజన్ సరఫరా వ్యవస్థలో ప్రధానంగా వాల్వ్‌ల వద్ద తుప్పు పట్టి సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండడం, ఫ్లో మీటర్లపై సరైన నిపుణుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎంత మొత్తంలో సరఫరా అవుతోందో అర్థం కాని పరిస్థితి. ప్రతి మూడు నెలలకు రూ.6 లక్షల వరకు నిర్వహణ కోసం వెచ్చిస్తుండగా..ప్రస్తుతం రూ.15 లక్షలు బకాయిలు ఉన్నట్లు జీజీహెచ్ వర్గాలు చెబుతున్నాయి.

ఎలా పడితే అలా.. వాస్తవానికి, ఫ్లో మీటర్లు, వాల్వ్‌ల పర్యవేక్షణకు మానిపోల్డ్ టెక్నీషియన్లు తప్పక ఉండాలి. అయితే, జీజీహెచ్‌లో ఆ పోస్టులే మంజూరు చేయలేదు. ప్రస్తుతం ఆక్సిజన్ పైపులైన్లను బయో మెడికల్ విభాగం సిబ్బందే చూస్తుండడంతో ఎక్కడ ఏం జరుగుతోందో పూర్తిస్థాయిలో తెలియడం లేదు. ప్రస్తుతానికి పైపులైన్ల పరంగా ఇబ్బంది లేదని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. అయితే, సిబ్బంది పరంగా మాత్రం చాలా కొరత ఉంది. కనీసం 10 నుంచి 15 మంది మానిపోల్డ్ టెక్నీషియన్లు ఉంటే తప్ప ఇక్కడ సమస్యకు పరిష్కారం దొరకని పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టులో ఉన్న గుత్త సంస్థ ఓ ముగ్గురిని ప్రస్తుతం వినియోగించి నెట్టుకొస్తోంది.

తనిఖీలు చేయట్లేదే.. నిరంతర ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ ఉన్నప్పుడు దాన్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం విధి. సరఫరా ఎలా ఉంటోంది..ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా..ప్రెజర్ పక్కాగా కొనసాగుతోందా..వాల్వ్‌లు బ్లాక్ అయ్యాయా..ఇలా అన్ని కోణాల్లోనూ పరిశీలించాల్సి ఉంటుంది. కానీ ఆ పరిస్థితి కరవైంది. అలాగే, స్పేర్‌పార్ట్స్ కొనుగోళ్లు మరో ఇబ్బందిగా మారాయి. ఎస్ఎస్ వాల్వులు, ఎల్ టైప్ అడాప్టర్లు, ఆక్సిజన్ కీ ప్లగ్స్..ఇలా ఎప్పటికప్పుడు మార్చాల్సి ఉంది. ప్రత్యేకంగా సిబ్బంది లేకపోవడంతో ఏవి ఎప్పుడు మార్చుతారో ఎవరికీ అర్థం కాని పరిస్థితి. రోగుల భద్రతను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు ఈ విభాగంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తే బాగుంటుంది.

30 రోజుల్లో ఈడబ్ల్యూఎస్ పత్రం

రేపల్లె అర్బన్, చుండూరు, న్యూస్‌టుడే

అగ్రవర్ణ పేదలకు ఏడేళ్ల కిందట కేంద్రప్రభుత్వం ఎకనామికల్లీ వీకర్స్ సెక్షన్ (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ల అమలకు శ్రీకారం చుట్టింది. అప్పటి నుంచి అన్ని తహసీల్దార్ల కార్యాలయాల్లో ధ్రువీకరణ పత్రాల జారీ ప్రక్రియ మొదలైంది. ఈ పత్రాలు పొందిన అగ్రవర్ణ పేద పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో పదిశాతం రిజర్వేషన్లు పొందేందుకు వీలుంది. విద్యాసంస్థలతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాలకు ఉపయోగపడుతుంది. 2026 జనవరి చివరిలో జేఈఈ, మేలో ఎంసెట్ తదితర పరీక్షలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల అమలకు సంబంధించిన ఈడబ్ల్యూఎస్ పత్రాల అవసరం పెరిగింది. దీనికి తొలుత మీసేవా కేంద్రాలు, వార్డు, గ్రామ సచివాలయాల్లో పేరు నమోదు చేసుకోవాలి. బియ్యం కార్డు, ఆధార్ కార్డు, ఏడాదికి రూ.8 లక్షలలోపు ఆదాయం ఉన్నట్లు బ్యాంకు లావాదేవీల వివరాలు, ఆదాయ పన్ను చెల్లింపు పత్రాలు, అఫిడవిట్, ఫొటో జతపర్చాలి. విద్యార్థులు తమ చిరునామాకు ఆధార్ కార్డు, చదువుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం, టీసీ, జనన ధ్రువీకరణ పత్రం ఏదైనా ఒకదానితోపాటు ఫొటో ఇవ్వాల్సి ఉంటుంది.

నిబంధనలు ఇవి.. దరఖాస్తుదారుని గత సంవత్సరం ఆదాయం రూ.8 లక్షలలోపు ఉండాలి. అయిదెకరాలు అంతకంటే తక్కువ వ్యవసాయ భూమి ఉండాలి. కుటుంబ నివాస గృహం వెయ్యి చదరపు అడుగులలోపు ఉండాలి. నివేశన స్థలం పురపాలికల్లో 100 చదరపు గజాలు, ఇతర ప్రాంతాల్లో 200 చదరపు గజాలు ఉండాలి. తమ ఆస్తులన్నింటినీ కుటుంబం ధ్రువీకరిస్తూ న్యాయవాది ద్వారా నోటరీ అఫడవిట్‌తో పాటు కుటుంబ సభ్యుల వాగ్మూలాన్ని దరఖాస్తుతోపాటు తహసీల్దారు కార్యాలయంలో సమర్పించాలి. దరఖాస్తుదారులు ఇతర ప్రాంతాలకు వలసపోయి అక్కడే స్థిరపడినట్లయితే సొంత మండలం నుంచి వలస ధ్రువీకరణ పత్రం తెచ్చుకుని తహసీల్దారుకు సమర్పించాలి.

30 రోజుల్లో జారీ.. మీ సేవా కేంద్రం లేదా సచివాలయాల్లో దరఖాస్తు చేసి రూ.30 రుసుం చెల్లిస్తే 30 రోజుల వ్యవధిలో దరఖాస్తును పరిశీలించి అభ్యంతరాలు లేకుంటే జారీ చేస్తారు. వీఆర్వో, ఆర్ఐ తమ విచారణ నివేదికలతో తహసీల్దారుకు ధ్రువీకరణ పత్రం నిమిత్తం సిఫార్సు చేస్తారు. అనంతరం దరఖాస్తు చేసుకున్న చోటే ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుంది.

శ్రద్ధాంజలి

మా తండ్రి గారైన కీ॥శే॥ అవ్వారు తాండవ వీర ప్రసాద్ (ATV ప్రసాద్) గారు 12-12-2025 శుక్రవారం నాడు స్వర్గస్తులైనారని తెలుపుటకు చింతిస్తున్నాము.
తేది: 22-12-2025 సోమవారం రోజున ఉ.గం. 11.30 లకు పెద్దకర్మ జరుపబడును
కార్యస్థలం: E-72, OCC కాలనీ, దేవాపూర్, మంచిర్యాల
కావున తామెల్లరు విచ్చేసి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి.
శోకతప్త హృదయాలతో...
భార్య: అవ్వారు పద్మావతి
కొడుకులు-కోడళ్ళు: అవ్వారు విద్యాసాగర్-శ్రీహర్ష, అవ్వారు పవన్‌సాగర్-రాజేశ్వరి
కూతురు-అల్లుడు: దామెర్ల పావని-పూర్ణచంద్రశేఖర్‌రావు
మనుమడు, మనుమరాళ్ళు మరియు సమస్త కుటుంబసభ్యులు

ఆంధ్రప్రదేశ్ రైతులకు శుభవార్త
రైతు సోదరులారా కేంద్ర వ్యవసాయ శాఖ వారి e-ANNADATA లో సభ్యత్వం తీసుకోండి.
ఏజంట్లు కావలెను
e-అన్నదాత కార్డులు రైతులకు పంపిణీ చేయుటకు ఏజంట్లు కావలెను
మరియు మీ మండలాల్లో త్వరలో ప్రారంభించే e-అన్నదాత క్యాంటీన్లు (ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు) కావలసినవారు సంప్రదించండి.
ఇట్లు: కన్నా రవి దేవరాజు (BJP)
e-అన్నదాత A.P కో ఆర్డినేటర్. ✆ 96184 25367

వరిగడ్డి.. మోపులుగా చుట్టి..

కొల్లూరు, భట్టిప్రోలు, న్యూస్‌టుడే: యంత్రాలతో వరి నూర్చిన తరువాత పొలంలో మిగిలిపోయే వరి గడ్డిని యంత్రంతో చుట్టలు చుడుతున్నారు. దీంతో సులువుగా పంట వ్యర్థాలు తొలగించడంతో పాటు సకాలంలో రెండో పంటగా జొన్న, మొక్కజొన్న విత్తుకునేందుకు అవకాశం లభిస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నూర్పిడి అనంతరం పొలంలో వరి గడ్డిని కూలీల ద్వారా తొలగించాలంటే ఖర్చుతో పాటు సమయం పడుతుంది. దీంతో అన్నదాతలు వరి గడ్డిని పొలంలోనే కాల్చేస్తున్నారు. దీని వల్ల పర్యావరణ కాలుష్యమవడంతో పాటు పశుగ్రాసం కొరత ఏర్పడుతోంది. దీనికి రైతులు పరిష్కారంగా యంత్రంతో వరిగడ్డిని చుట్టలుగా చుట్టించి ఒక్కో దాన్ని రూ.80కి విక్రయిస్తున్నారు. యంత్రంతో గడ్డిని చుట్టలు చేయడంతో ఇటు పర్యావరణ కాలుష్యం కాకుండా, రైతులకు ఆదాయం కూడా సమకూరుతోందని మండల వ్యవసాయాధికారి బుష్ తెలిపారు.

మోపులుగా చుడుతున్న యంత్రం

122 ఏళ్ల చరిత్ర.. ఎంతో ఘనత

ముప్పాళ్ల మండలం తురకపాలెంలోని పునీత అంతోని చర్చికి 122 ఏళ్ల చరిత్ర ఉంది. పోర్చుగల్ దేశానికి చెందిన మత బోధకుడు పునీత అంతోని క్రీస్తుమార్గం.. సామాజిక సేవను ప్రచారం చేశారు. ఆయన పేరుతో 1880లో చర్చి నిర్మాణం ప్రారంభించి 1903లో పూర్తి చేశారు. నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. క్రిస్మస్ వేడుకలతోపాటు ఏటా జనవరి 17న చర్చి తిరునాళ్ల నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి విశ్వాసులు, మత బోధకులు ఈ వేడుకల్లో పాల్గొంటారు. - న్యూస్‌టుడే, ముప్పాళ్ల

బహుమతులంటూ వచ్చే లింకులు క్లిక్ చేయొద్దు

బాపట్ల, న్యూస్‌టుడే: క్రిస్మస్, నూతన సంవత్సర బహుమతులు అంటూ వచ్చే అపరిచిత లింకులను క్లిక్ చేసి ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని ఎస్పీ ఉమామహేశ్వర్ అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు, ఫోన్లకు వచ్చే అపరిచిత లింకులు, ఏపీకే ఫైల్స్‌ను క్లిక్ చేస్తే సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తారని హెచ్చరించారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ షాపింగ్ ప్లాట్‌ఫారాల్లో విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. దీనిని ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు అమాయక పౌరులను మోసం చేసి నగదు దోచుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజలు తమ వ్యకిగత సమాచారం, పాన్, ఆధార్‌కార్డుల వివరాలు, చిత్రాలు, బ్యాంకు ఖాతా సమాచారం సామాజిక మాధ్యమాల్లో ఉంచరాదన్నారు. తెలియని వ్యక్తులతో పంచుకోరాదని హితవు పలికారు. ఓటీపీ, పిన్, సీవీవీ నంబర్లు, బ్యాంకు వివరాలను ఎట్టి పరిస్థితుల్లోను తెలియని వ్యక్తులతో పంచుకోవద్దని చెప్పారు. బహుమతులు, తక్షణ చర్య కోరే ఆయాచిత కాల్‌లు, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్ ఫోన్లో అప్లికేషన్లు క్రమం తప్పకుండా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. యాంటీ వైరస్ అప్లికేషన్లు ఇన్‌స్టాల్ చేసుకోవాలని పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే వెంటనే www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో లేదా సైబర్ నేరాల హెల్ప్‌లైన్ నంబరు 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. స్క్రీన్ షాట్లు, లావాదేవీల వివరాలు, ఫోన్‌నంబర్లు వంటి ఆధారాలను భద్రపరచాలన్నారు. వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఎస్పీ ఉమామహేశ్వర్

అన్నదాతకు అండగా సాంకేతికత

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే

✦ లాభదాయక పద్ధతులు తెలుపుతున్న యాప్‌లు

✦ రైతులకు అవగాహన ఉంటే మంచి ఫలితాలు

వ్యవసాయంలో కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతికతను రైతులు అందుకోలేక పోతున్నారు. వ్యవసాయ శాఖ నిర్లక్ష్యంతో ఏళ్లుగా అవస్థలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేసి లాభదాయక సాగు పద్ధతులను తెలుపుతూ యాప్‌లు నిర్వహిస్తున్నాయి. కావాల్సిన వాటిని చరవాణుల్లో నిక్షిప్తం చేసుకుని వినియోగించుకుంటే సాగు లాభదాయకంగా మారుతుంది.

నా పంటలో సమస్తం.. వ్యవసాయ, ఉద్యాన పంటల సమస్త సమాచారం 'నా పంట'లో ఉంటుంది. యాప్‌లోకి వెళ్లి ఏ పంటపై క్లిక్ చేస్తే దాని సంరక్షణకు సంబంధించిన వివరాలు వస్తాయి. వివిధ రాష్ట్రాల మార్కెట్లలో ధరలు తెలుసుకోవచ్చు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల డీలర్ల పేర్లు, ఫోన్ నంబర్లు ఉంటాయి. పంట నిల్వకు గోదాములు, పరికరాలు అద్దెకు ఇచ్చే వారి సమాచారం తెలుసుకోవచ్చు. రైతులు సైతం పరికరాలు అద్దెకు ఇవ్వొచ్చు.

అగ్రి సెంట్రల్ యాప్.. పంట తెగుళ్ల ఫొటో తీస్తే చీడపీడలను నిర్ధారించి పరిష్కారానికి ఏం చేయాలో చెబుతుంది. మార్కెట్లో పంట ధరల వివరాలు, ముందు రోజుతో పోలిస్తే తగ్గిందా పెరిగిందా తెలియజేస్తుంది. స్థానిక వాతావరణంపై 15 రోజుల వివరాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వ పథకాలు, తాజా వ్యవసాయ వార్తలు తెలుసుకోవచ్చు. తెలుగు, తమిళంలో సమాచారం ఉంటుంది.

పాడిపంటలు.. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పాడి పంటలు యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నారు. ఇందులో సమగ్ర యాజమాన్య పద్ధతుల గురించి వీడియోలు అప్‌లోడ్ చేస్తారు. వ్యవసాయ, ఉద్యాన పంటలతో లాభాలు పొందుతున్న రైతుల అభిప్రాయాలు ఉంటాయి. పాడి పశువుల పెంపకం, వినూత్న పంటలగురించి వివరిస్తారు.

ఎన్‌పీఎస్ఎస్.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఐసీఏఆర్-ఎన్ఆర్ఐపీఎం, ఈఎన్‌పీఎస్ఎస్ యాప్‌లను రూపొందించింది. ఏఐ ఆధారితంగా పనిచేస్తాయి. తెలుగులో అనుమానాలు నివృత్తి చేసుకోవచ్చు. చీడపీడల నివారణ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఈ యాప్‌లో క్రిమి సంహారక మందులు ఏ సమయంలో ఎంత మోతాదులో వినియోగించాలో తెలుసుకోవచ్చు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80085 10541

ఈఎస్ఎల్ క్రీడా సంబరానికి సై

నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రజెంట్స్' 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' (ఈఎస్ఎల్)-2025కు రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిభావంతుల్ని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ఈఎస్ఎల్' పండగ ఆసన్నమైంది. వర్ధమాన క్రికెటర్ల ప్రతిభకు వేదికగా నిలుస్తూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న 'ఈనాడు క్రికెట్' సోమవారం ప్రారంభం కానుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా క్రికెట్ మ్యాచ్‌లకు చలపతి ఇంజినీరింగ్ కళాశాల (ఎన్ఐఏటీ) మోతడక క్యాంపస్‌లోని క్రికెట్ మైదానాలు ఇందుకు వేదిక కానున్నాయి. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, మెడికల్, ఫార్మా కళాశాలల జట్లు క్రికెట్ టోర్నీలో తమ అదృష్టం పరీక్షించుకోనున్నాయి. తొలుత జిల్లా స్థాయిలో మ్యాచ్‌లు జరుగుతాయి. సోమవారం జిల్లా స్థాయి మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అనంతరం ప్రాంతీయ స్థాయిలో మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు. తర్వాత రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయి.

Aster Ramesh HOSPITALS We'll Treat You Well

EENADU SPORTS LEAGUE 2025

వేదిక: చలపతి ఇంజినీరింగ్ కళాశాల (ఎన్ఐఏటీ)

షెడ్యూల్ ఇలా.. గ్రౌండ్-1 ☛ ఉదయం 9.00 గంటలకు యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాల వర్సెస్ చలపతి ఇంజినీరింగ్ కళాశాల(ఎన్ఐటీఏ) ☛ ఉదయం 11.30 గంటలకు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల వర్సెస్ ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట **గ్రౌండ్-2** ☛ ఉదయం 9.00 గంటలకు కేఎల్ యూనివర్శిటీ వర్సెస్ ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ☛ ఉదయం 11.30 గంటలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల వర్సెస్ ఎన్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, విశదల

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative

Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust) NECC

Regional Sponsor: CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS

District Sponsor: CITY Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS

Beverage Partner: CMR SHOPPING MALL The joy of life — ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా | కర్ణాటక

Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)

Digital Partner: ఈనాడు.నెట్ Tv Partner: ETV BHARAT, ETV ఆంధ్రప్రదేశ్

Organised by ఈనాడు ఉత్తరం క్లబ్

ఆలోచన అదిరింది!

రాష్ట్రస్థాయికి వేటపాలెం ఉపాధ్యాయిని, విద్యార్థుల నమూనా ప్రాజెక్టుల ఎంపిక

వేటపాలెం, న్యూస్‌టుడే: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో రెండు రోజుల క్రితం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో వేటపాలెం బాలికోన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న బత్తుల నీలిమ రూపొందించిన ప్రకృతి వనరులతో సుస్థిరాభివృద్ధి నమూన, ఆమోదగిరిపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు కొలుకుల వసుంధర, పింజల హాసిని తయారు చేసిన పేదవాని ఎయిర్ కూలర్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. వీటి తయారీ వెనుక ఉన్న ఆలోచనలను 'న్యూస్‌టుడే'తో వారు పంచుకున్నారు. అవి వారి మాటల్లోనే...

పేద కుటుంబాలకు అందుబాటులోకి..

మా ప్రాంతంలో అధికంగా చేనేత కార్మికులు, అల్పాదాయ వర్గాల వారు ఉన్నారు. వేసవిలో మగ్గం నేయడానికి వీరు పడే బాధలు కళ్లారా చూశాం. వీళ్ల కోసమే పేదవాని కూలర్ తయారు చేశాం. ఇది ఫ్రెండ్లీ ఎయిర్ కూలర్. సాధారణంగా వాడే ఏసీలు, ఫ్రిజ్‌లతో ఫ్లోరో క్లోరో కార్బన్ ఏర్పడి పర్యావరణానికి హాని కలిగిస్తాయి. ఈ కూలర్‌తో పర్యావరణానికి ఎటువంటి హాని ఉండదు. దీనికోసం సోలార్ ప్యానల్‌తో పాటు కుండ, ఫ్యాను, మోటారు వినియోగించాం. ప్రతి ఒక్కరు దీన్ని సొంతంగా తయారు చేసుకోవచ్చు.

◄ వసుంధర, హాసిని తయారుచేసిన పేదవాని ఎయిర్ కూలర్

ప్రకృతి వనరులు ఉపయోగించుకుంటూ..

ఉపాధ్యాయిని నీలిమ రూపొందించిన 'ప్రకృతి వనరులతో- సుస్థిరాభివృద్ధి'

ప్రకృతి వనరులను ఉపయోగించుకుంటూనే ప్రకృతిని కాపాడుకోవడానికి చేసిన ప్రయత్నమే ఈ నమూనా ప్రధాన ఉద్దేశం. బహుళ అంతస్తుల్లో వచ్చే తడి చెత్త నుంచి కంపోస్టు ఎరువును తయారు చేసి, తక్కువ స్థలంలో స్టెప్ ఫార్మింగ్ అనే నూతన విధానం ద్వారా ఆర్గానిక్ పంటలు సాగు చేయవచ్చు. పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలతో పాటు టెర్రాస్ గార్డెన్‌ని డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పెంచడానికి వీలుంది. వైద్యశాలల్లో వచ్చే సర్జికల్ వేస్టేజ్‌ను రీసైకిలింగ్ ద్వారా తిరిగి వాడుకోవడం, వర్షపు నీటిని రూఫ్ టాప్ పద్ధతి ద్వారా శుద్ధి చేసి ఆసుపత్రి అవసరాలకు వాడుకోవచ్చు. సోలార్ ప్యానల్స్ ఉపయోగించి గేట్ వే ప్రాంగణాల్లో తక్కువ ఖర్చుతో వీధి లైట్లు, గాలిని ఉపయోగించి విండ్ మిల్లు ద్వారా విద్యుదుత్పత్తి చేసి తక్కువ ఖర్చుతో అందించవచ్చు.

ప్రకాశం జట్టుకు కప్ అందజేస్తున్న చెంచు గరటయ్య, సీతారామిరెడ్డి తదితరులు

బాలికల విజేత చిత్తూరు జట్టుతో..

ఖోఖో విజేతలు ప్రకాశం, చిత్తూరు

అద్దంకి, జె.పంగులూరు, న్యూస్‌టుడే: అండర్-18 రాష్ట్ర స్థాయి ఖోఖో ఫైనల్ పోటీలు పంగులూరులోని మాగుంట సుబ్బ రామిరెడ్డి బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆదివారం జరిగాయి. బాలుర విభాగంలో ప్రకాశం, కృష్ణా జిల్లాల మధ్య జరిగిన పోరులో ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో కృష్ణా, మూడో స్థానంలో చిత్తూరు, విశాఖపట్నం జట్లు సంయుక్తంగా నిలిచాయి. బాలికల విభాగంలో చిత్తూరు, శ్రీకాకుళం జట్లు తలపడగా చిత్తూరు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో శ్రీకాకుళం, మూడో స్థానంలో విజయనగరం, ప్రకాశం సంయుక్తంగా గెలుచుకున్నాయి. బాలుర విభాగంలో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా సీహెచ్.బాజీబాబు(ప్రకాశం), బెస్ట్ డిఫెండర్‌గా అజయ్ కుమార్ (విశాఖపట్నం), బెస్ట్ అటాకర్‌గా బి.భాస్కర్ (కృష్ణా) నిలిచారు. బాలికల విభాగంలో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎం.యువశ్రీ (చిత్తూరు), బెస్ట్ డిఫెండర్‌గా ఆది యశోద (ప్రకాశం), బెస్ట్ అటాకర్‌గా జి.యామిని (శ్రీకాకుళం) నిలిచారు. అనంతరం ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు మేకల సీతారామిరెడ్డి అధ్యక్షతన బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. విజేతలకు రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఛైర్మన్ బాచిన చెంచు గరటయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.హనుమంతరావు, కళాశాల ప్రిన్సిపల్ ఉషా సీతారామిరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీలు రిఫరీ బోర్డు ఛైర్మన్ వీరభద్రరెడ్డి, ఛైర్మన్ సీహెచ్.ఎల్.శ్రీనివాసులు పర్యవేక్షణలో జరిగాయి. రాజేష్ కన్నా, రావూరి రమేష్, యర్రం శ్రీనివాసరెడ్డి, డాక్టర్ బత్తుల నారాయణ, రాయిని రామారావు, వై.శ్రీనయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన మాంసాన్నే విక్రయించాలి

చికెన్ దుకాణంలో అపరిశుభ్రతపై ప్రశ్నిస్తున్న మాంసం అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాష్ నాయుడు

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రజలకు నాణ్యమైన మాంసాన్నే విక్రయించాలని రాష్ట్ర మాంసం అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రకాష్ నాయుడు అన్నారు. పట్టణంలో మాంసం, మటన్ దుకాణాలను ఆయన ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చీలు రోడ్డు, ఏఎంసీ సమీపంలో రెండు చికెన్ దుకాణాల్లో అపరిశుభ్రత వాతావరణంలో కోడి మాంసం విక్రయించటాన్ని పరిశీలించి వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పు సత్రం వద్ద ఆరు బయట నిర్వహిస్తున్న మటన్ దుకాణాలను, బయట గొర్రెలను కోసి మాంసం విక్రయిస్తున్న వ్యాపారులను ఆయన ప్రశ్నించారు. ఐదు మటన్ దుకాణాలకు రూ.ఐదు వేలు చొప్పున జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ బాపట్లలో తమ కార్పొరేషన్ నిధులతో జంతు వధశాల నిర్మిస్తామని తెలిపారు. ప్రజారోగ్యాన్ని కాపాడి జీవన ప్రమాణాలు పెంచటమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. కల్తీ లేని వాతావరణంలో నాణ్యమైన మాంసం ఉత్పత్తులను విక్రయించాలన్నారు. దీనిపై వ్యాపారులకు అవగాహన కల్పించటానికి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాసిరకం మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశుసంవర్ధక శాఖ జేడీ వేణుగోపాల్, పశువైద్యుడు శివారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణ, నజీర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రభీత్ పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించండి

ఇంకొల్లు,న్యూస్‌టుడే: రైతులు పండించిన మొక్కజొన్నలు, అపరాల పంటలకు మద్దతు కల్పించాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. స్థానిక టీచర్స్ హాల్‌లో ఆదివారం రాత్రి రైతుసంఘ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి టి.రామారావు మాట్లాడుతూ మొక్కజొన్నకు రూ.2వేలకు పైగా మద్దతు ధర ఉండగా, ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు రూ.1750 మించి కొనుగోలు చేయడంలేదన్నారు. కందులు, పెసల మద్దతు ధర రూ.8వేలకు గాను రూ.6వేలకు దిగజారిందన్నారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకోటేశ్వరరావు మాట్లాడుతూ మొక్కజొన్న, అపరాల పంటలను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

సంఘటితం.. సమరసతే ముఖ్యోద్దేశం

చీరాలలో హిందూ సమ్మేళనం

హాజరైన ప్రతినిధులు

పాపరాజుతోట(చీరాల అర్బన్), న్యూస్‌టుడే: పట్టణంలోని ఎన్ఆర్ అండ్ పీఎం ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం రాత్రి హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హిందువులను సంఘటితం చేసి సమాజంలో సమరసతను పెంపొందించడమే సమ్మేళనం ముఖ్య ఉద్దేశమన్నారు. కేసరిపల్లి భువనేశ్వర పీఠానికి చెందిన పరమ హంస కమలానంద భారతి, విశాఖ ఆర్‌కే స్కూల్స్ అధినేత మద్దులూరి అమర్‌నాథ్, ఎమ్మెల్సీ పోతుల సునీత, అన్నదానం చిదంబరశాస్త్రి, తెనాలి ఆర్ఎస్ఎస్ విభాగం ప్రచార ప్రముఖ్ అవ్వారు శ్రీనివాసరావు, మువ్వల వెంకట రమణారావు, బండారుపల్లి హేమంతకుమార్ ఉన్నారు.

రెండు చుక్కలతో నిండు జీవితానికి వెలుగులు

అద్దంకి, న్యూస్‌టుడే: రెండు పోలియో చుక్కలు.. నిండు జీవితానికి వెలుగులు అని జిల్లా టీకాల నియంత్రణాధికారి డాక్టర్ మనోజ్ అన్నారు. అద్దంకి సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. గాజులపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గొట్టిపాటి జయసింహ, పురపాలక కమిషనర్ డి.రవీంద్ర పాల్గొన్నారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కేంద్రం వద్ద నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి పావులూరి బాలమ్మ, ఎంపీడీవో బి.వరూధిని పోలియో చుక్కలు వేశారు. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో అద్దంకి క్రాంతి నర్సింగ్ హోమ్ వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తొలిరోజు అందుకోలేక పోయిన వారికి మంగళవారంలోపు ఇంటి వద్దనే టీకాలు అందిస్తామని డాక్టర్ మనోజ్ వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 33200 మంది 0-5 సంవత్సరాల లోపు వారికి పోలియో టీకాలు వేయాలనే లక్ష్యంతో పని చేసినట్లు వెల్లడించారు.

ఎస్టీల జీవన ప్రమాణాల మెరుగుకు కృషి

ఎస్టీ మహిళకు నిత్యాసర సరకులు అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, న్యూస్‌టుడే: ఎస్టీల జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ చెప్పారు. పట్టణంలోని మూడో వార్డు రాజీవ్‌గాంధీకాలనీలో నెస్లీ కంపెనీ ఆధ్వర్యంలో ఎస్టీ కుటుంబాలకు 13 రకాల నిత్యావసర సరుకుల పంపిణీని ఆదివారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 600 ఎస్టీ కుటుంబాలకు నెస్లీ కంపెనీ ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తామన్నారు. పిల్లలను బాగా చదివించాలన్నారు. నిరుపేదలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు. ఆర్డీవో గ్లోరియా, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి అబ్బులు, ఆహార భద్రతాధికారి ప్రణీత్‌కుమార్, నెస్లీ కంపెనీ అధికారి వసీమ్ పాల్గొన్నారు.

గుప్తనిధుల ముఠా అరెస్టు

మెటల్ డిటెక్టర్, స్కానర్ స్వాధీనం

అద్దంకి, న్యూస్‌టుడే: భూమి పొరల్లో ఉండే గుప్తనిధుల్ని గుర్తించేందుకు అద్దంకి వచ్చిన ఐదుగురు ముఠా సభ్యుల్ని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద మెటల్ డిటెక్టర్, స్కానర్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం అద్దంకి ఆర్టీసీ బస్టాండ్ వద్ద చోటు చేసుకుంది. సీఐ ఎ.సుబ్బరాజు అందించిన సమాచారం మేరకు.. కడప జిల్లా రాజంపేటకు చెందిన కె.సుధాకర్, పి.శివ కుమార్ అలియాస్ శివయ్య, పి.మనీంద్రతో పాటు విజయవాడ రాణిగారితోటకు చెందిన ఎం.తిరుపతిరెడ్డి, ఎల్.శ్రీనివాసరెడ్డిలు కొల్లూరు, గొల్లపేట, పులిచింతల వద్ద రంగురాళ్లు, వజ్రాలు ఏరుకునే సమయంలో మిత్రులయ్యారు. ఈ ముఠాకు నాయకత్వం వహిస్తున్న తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆధునిక యంత్రాలతో రంగురాళ్లు, వజ్రాలు గుర్తించేందుకు మెటల్ డిటెక్టర్, స్కానర్ కొనుగోలు చేశారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఇంట్లో లంకెబిందెలు ఉన్నట్లు తెలుసుకుని, వాటిని గుర్తించేందుకు అద్దంకి వచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న సమయంలో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా వివరాలు వెల్లడించారు. వీరిపై గతంలో ఎలాంటి నేరచరిత్ర లేదని పోలీసులు వెల్లడించారు. నేరం చేసే అవకాశం ఉన్న కారణంగా ముందస్తు జాగ్రత్త కోసం అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

బహుమతులు అందుకున్నవారితో నిర్వాహకులు

షటిల్ బ్యాడ్మింటన్ విజేత 'పొదిలి'

శింగరకొండ (అద్దంకి), న్యూస్‌టుడే: శింగరకొండ క్రీడాప్రాంగణం వద్ద జరిగిన ప్రకాశం, గుంటూరు జిల్లాల స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంటులో పొదిలి జట్టు విజేతగా నిలిచింది. రెండు రోజుల పాటు జరిగిన పోటీల్లో గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. తుది పోరులో చీరాల-పొదిలి జట్లు తలపడ్డాయి. విజేతగా పొదిలికి చెందిన రమేష్-రెహ్మాన్‌లు నిలిచారు. మూడోస్థానంలో చిలకలూరిపేట, నాలుగో స్థానంలో ఒంగోలు, ఐదో స్థానంలో అద్దంకి జట్లు నిలిచాయి. విజేతలకు ఆదివారం సాయంత్రం క్రీడాప్రాంగణం వద్ద వైద్యులు చదలవాడ ఫణీంద్ర బాబు బహుమతులు అందించారు. నెడమర్తి వెంకటకృష్ణ, మోతుకూరి సుభాష్‌బాబు, గట్టుపల్లి రామారావు, బుజ్జి, కోరె సురేంద్ర, బాచిన శివధర పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో సాగితే విజేతలే..

చినగంజాం, న్యూస్‌టుడే: క్రమశిక్షణతో ముందుకు సాగితే క్రీడాకారులు విజేతలుగా నిలుస్తారని రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల పీడీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బోగిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. చినగంజాం మండలం కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నాలుగు విభాగాల్లో క్రాస్ కంట్రీ పరుగు పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీలకు జిల్లా వ్యాప్తంగా 30 మంది హాజరయ్యారు. సభకు బాపట్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.స్వామిరెడ్డి, సంయుక్త కార్యదర్శి పి.శ్రీనివాసరెడ్డి, ఈపూరుపాలెం 'ఈనాడు' లక్ష్య కోచ్ పి.మాధవరావు, పీడీలు శ్రీనివాసరెడ్డి, ఉదయభాస్కర్, శ్రీవిద్య పాల్గొన్నారు. నాలుగు విభాగాల్లో 18 మందిని ఎంపిక చేసినట్లు ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి తెలిపారు. ఎంపికైన వారు ఈ నెల 24న కాకినాడ జిల్లా పెద్దాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

పోటీలు ప్రారంభిస్తున్న రాష్ట్ర పీడీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం

కంఠంరాజు కొండూరు గ్రామము, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా.

E-Procurement Tender

శ్రీ అమ్మవారి దేవస్థానము నందు 3 వివిధ అభివృద్ధి పనుల కొరకు టెండర్లు ప్రకటన చేయడమైనది. వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in నందు చూడగలరు.

శ్రీ అమ్మవారి సేవలో సం/- కార్యనిర్వహణాధికారి

గంజాయిని చూపుతున్న పోలీసులు

10 కేజీల గంజాయి పట్టివేత

బాపట్ల, చీరాల అర్బన్, న్యూస్‌టుడే: టాటానగర్-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా రవాణా చేస్తున్న పది కేజీల గంజాయిని ఎస్బీ, జీఆర్పీ, ఈగల్ పోలీసుల బృందం ఆదివారం పట్టుకుంది. బాపట్ల రైల్వేస్టేషన్లో ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో ఎస్బీ-2 సీఐ రాంబాబు నేతృత్వంలో జాగిలాలతో పోలీసుల బృందం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. బాపట్ల-చీరాల మధ్య రైలులో చేపట్టిన తనిఖీల్లో పది కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విజయనగరం నుంచి కేరళకు గంజాయిని అసిన్ శిబూ అక్రమంగా రవాణా చేస్తున్నట్లు పోలీసు అధికారులు గుర్తించారు. ఈవిషయంపై ఎస్పీ ఉమామహేశ్వర్ మాట్లాడుతూ గంజాయి కేసుల్లో పట్టుబడిన 228 మందిపై షీట్లు తెరిచినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ క్రయ, విక్రయాలు, అక్రమ రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలో గంజాయి కేసుల్లో అరెస్టు అయినవారి కార్యకలాపాలపై నిఘా పెట్టామని చెప్పారు. డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేశామని, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక

అద్దంకి, జె.పంగులూరు, న్యూస్‌టుడే: అండర్-18 రాష్ట్ర స్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు పంగులూరులోని మాగుంట సుబ్బ రామిరెడ్డి బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో జరిగిన సంగతి తెలిసిందే. వీటిలో ఉత్తమ ఆట తీరు ప్రదర్శించిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు మేకల సీతారామిరెడ్డి, ఖోఖో సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హనుమంతరావు ఆదివారం తెలిపారు.

బాలుర జట్టు: సీహెచ్.బాజీబాబు,ఎస్.మహేష్, పి.నరేష్, ఎల్.వీరేంద్ర, ఎం.భరత్‌కుమార్ (ప్రకాశం), డి.రాకేష్, డి.షణ్ముఖ శ్రీనివాస్, షాజిద్‌ఖాన్ (కృష్ణా), బి.అజయ్, బి.సాయి (వైజాగ్), డి.వరుణ్, టి.సూర్యనారాయణ (చిత్తూరు), సలీం (విజయనగరం), జీవీఆర్ కిరణ్(తూర్పుగోదావరి), షేక్ నబీ రసూల్(గుంటూరు), ఎ.నందకిషోర్‌రెడ్డి (కర్నూలు)

బాలికల జట్టు: గుణవతి, తేజశ్రీ, భవాని (శ్రీకాకుళం), లక్ష్మి, అమృత, గుణవతి(చిత్తూరు), పురందేశ్వరి, యశోద (ప్రకాశం), ఉమా హర్షిత(గుంటూరు), పూజిత (విజయనగరం), శ్రావణి (విశాఖ), శివకీర్తి (కర్నూలు), దుర్గాదేవి(తూర్పుగోదావరి), భార్గవి(అనంతపురం), గౌస్ ఉన్నీసా (నెల్లూరు).

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, రిటైల్ ధర - 165, చికెన్ విత్‌స్కిన్ - 239, చికెన్ స్కిన్‌లెస్ - 272.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232, చికెన్ స్కిన్‌లెస్ - 264.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 145, 151, 165 చికెన్ విత్ స్కిన్ - 280 చికెన్ స్కిన్‌లెస్ - 290.

బాలింత మృతిపై విచారణ

నరసరావుపేట అర్బన్: నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలలో బాలింత మృతి సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ డైరెక్టరేట్ ఆదేశాలతో అధికారులు ఆదివారం విచారణ చేశారు. సత్తెనపల్లి వైద్యశాలకు చెందిన గైనకాలజిస్ట్ సుజాత, మురో ముగ్గురితో కూడిన కమిటీ విచారణ చేసినట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన తెలిపారు. విచారణ నివేదికను ప్రభుత్వానికి పంపుతామని పేర్కొన్నారు.

91.9 FM Vijayawada ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు Cell: 80085 10541

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80085 14589

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph :81422 92071.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

గుంటూరు, పేరేచర్ల NRI IT కాలేజి ప్రక్కన ORRకి మధ్య APCRDA ప్లాట్లు కలవు. ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫ్రీ. 77290 75959, 99591 27008.

TO LET

COMMERCIAL

తెనాలి చెంచుపేట భాను టీస్టాల్ ఎదురు మెయిన్‌రోడ్ ఫేస్‌తో 24X60 అ||షెడ్డు, 18X30 అ|| ఖాళీ స్థలం, 4X60 అ|| సందు అద్దెకు. ✆ 78932 66771.

JOBS

Wanted Software Developer Cloud Adminstrator Fashion Designer Beautician Receptionist (Trainers). ✆ 93472 77429

Wanted Receptionist, Co-ordinator & Office Boys to Work in Educational Institution, Brodipet, 4/9, Guntur. Contact: 90007 46753 Interviews Tuesday (23rd Dec) from 11am.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/- 5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/- ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

డ్రీమ్‌స్కేప్ ఎడ్యుకేషన్ కన్సల్‌టెంట్స్ గుంటూరులో పనిచేయుటకు టెలీకాలర్స్(F) మార్కెటింగ్(M) కావలెను మంచిజీతం + ఇన్సెంటివ్స్ పార్ట్/ఫుల్‌టైం వర్క్. ✆ 9248865536

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు టెలికాలర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్, మరియు సీనియర్ టీం లీడర్స్ కావలెను. ✆ 95500 08995.

ప్రముఖ కంపెనీలలో సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటి ఆఫీసర్స్. 10-15 వేలు, 8గం|| డ్యూటీ, SSC పాస్, 20-50 సం||. ✆ 85209 77729, 85209 77759.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాస్ ఇన్‌ఛార్జ్‌స్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము : 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు : ఇంటర్ నుండి పి.జి వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర|| 91000 69089.

తెనాలి దగ్గర, దుగ్గిరాలలోని ప్రముఖ కాఫీ పరిశ్రమలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, ప్యాకింగ్ బాయ్స్ కావలెను. రూమ్, క్యాంటీన్ సౌకర్యం కలదు. ✆ 92980 11777, 80961 61777

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజ్ నందు వార్డెన్స్, క్యాంపస్ హాస్టల్ A.Oగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 18000/- వరకు ఇవ్వబడును. ఉచిత భోజనము వసతి కల్పించబడును. విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ వయస్సు:22 సం||ల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర. ✆: 92487 33320.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

1)మార్కెటింగ్ ఏజెంట్లు, 2) కలెక్షన్ ఏజెంట్లు 3) టెక్నికల్ పర్సన్లు 4) కంప్యూటర్ ఆపరేటర్లు 5) రిసెప్షనిస్ట్ కావలెను. SITI కేబుల్ & బ్రాడ్‌బ్యాండ్ ఆఫీసు, JKC రోడ్, గుంటూరు. 70930 76288.

తెనాలి రిలయన్స్ పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు 2 పంప్ బాయ్స్ (8 గం|| డ్యూటి) జీతం: 12 వేలు+ESI & ఎయిర్ బాయ్ ఒకరు కావలెను. 93470 51723.

గుంటూరులోని ప్రముఖ, శానిటరీ షాపులో పనిచేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ (M/F) కావలెను. జీతం 12K - 16K ✆ 94936 56892

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడులో ప్రకటన ఇవ్వటం పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

బాపట్ల

• బాపట్ల • రేపల్లె • వేమూరు

అతిథి గృహం.. స్థానికుల్లో భయం

గేటుకు తాళం వేసి ఉంచిన అతిథి గృహం

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : మండల కేంద్రం పిట్టలవానిపాలెంలో చారిత్రక నేపథ్యం ఉన్న జలవనరుల శాఖ అతిథి గృహం తుప్పలతో చిన్న పాటి అడవిని తలపిస్తోంది. విశాలంగా పచ్చదనంతో కళకళలాడే ఆవరణలో వ్యర్థాలు పేరుకుపోయి ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు మొలిచాయి. విష కీటకాలకు నిలయంగా మారి స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. గతంలో ఎందరో ప్రముఖులకు ఆతిథ్యం ఇచ్చిన గృహాలు శిథిలమై వర్షం పడితే నీరు చేరుతోంది. అధికారుల నివాసాలు శిథిలావస్థకు చేరడంతో రెండేళ్లుగా స్థానికంగా నివాసం ఉండటం లేదు.

నిర్వహణపై నిర్లక్ష్యం

తీర ప్రాంతంలో ఎంతో మంది అధికారులకు ఆతిథ్యం ఇచ్చిన బంగ్లా ఇప్పుడు నామరూపాలు లేకుండా పోతోంది. ఆవరణను శుభ్రం చేసి పక్కాగా వినియోగంలోకి తీసుకురావడానికి ఎవరూ చర్యలు తీసుకోవడంలేదని, అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.60 వేల వరకు విద్యుత్తు బిల్లుల బకాయిలు ఉండగా, పంచాయతీకి రూ.20 వేల వరకు పన్నులు చెల్లించాల్సి ఉంది. చాలాకాలం నుంచి అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రాంగణం అంతా ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయింది.

ప్రతిపాదనలు పంపాం

అతిథి గృహం అభివృద్ధి విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అధికారుల సూచనల మేరకు గదులు మరమ్మతులు, ఇతర పనులకు ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇతరులు ఎవరూ లోపలకు వెళ్లకుండా తలుపులకు తాళం వేసి ఉంచుతున్నాం.

- విజయ్, ఏఈ జలవనరుల శాఖ

మూతబడి.. మందుబాబులకు అడ్డాగా మారి..!

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే : బాపట్ల పరిధిలోని గులాం హుస్సేన్‌తోటలో ప్రాథమిక పాఠశాల గత ప్రభుత్వ హయాంలో మూతపడింది. నిర్వహణలేమి, ఇతర సమస్యలతో విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో చేరారు. విద్యార్థులకు భోజన వసతి కల్పించేందుకు ఇక్కడ రూ.లక్షలు పెట్టి వంట గది నిర్మించారు. దీన్ని ప్రారంభించక ముందే పాఠశాల మూతపడింది. దీంతో రాత్రి పూట పాఠశాల, వంటగదిని మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. మద్యం తాగి ఖాళీ సీసాలను అక్కడే పగులుగొడుతున్నారు. కొంతరు మహిళలను తీసుకెళ్లి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిథిలమైన పాఠశాల భవనాన్ని కూల్చివేలయాని, లేకుంటే మరమ్మతులు నిర్వహించి ఇతర ప్రభుత్వ అవసరాలకు ఉపయోగించాలని స్థానికులు కోరుతున్నారు.

మంచు కలవరం.. అప్రమత్తత అవసరం

కర్లపాలెంలో దట్టంగా కమ్మేసిన పొగమంచు

కర్లపాలెం, న్యూస్‌టుడే: రోజు రోజుకు ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయి చల్లటి గాలులు వీస్తున్నాయి. దీనికి తోడు పొగమంచు దట్టంగా అలముకుంటోంది. ఉదయం కొన్ని ప్రాంతాల్లో 9వరకు కూడా మంచు వీడటంలేదు. పొగమంచు రహదారులను కప్పేస్తుండటంతో రహదారులపై ముందు వెళ్లే వాహనాలు కనిపించడంలేదు. దగ్గరికి వచ్చేవరకు వాహనాలు కనిపించని స్థితిలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వారం రోజుల్లో పలువురు మంచు కారణంగా ప్రమాదాలకు గురయ్యారు. అప్రమత్తంగా ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. క్రిస్మస్, న్యూయర్, సంక్రాంతి పండగల నేపథ్యంలో అప్రమత్తంగా లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వాహనాలు కనిపించక అవస్థలు

జాగ్రత్తలతోనే సురక్షితం

డిసెంబరు, జనవరి నెలల్లో పొగమంచు ఎక్కువగా ఉంటుంది. అత్యవసరమైతే తప్ప తెల్లవారుజామున ప్రయాణాలు చేయకపోవడం మంచిది. ప్రయాణ సమయంలో వాహనం లైట్లు వేసి ఉంచాలి. పరిమిత వేగంతో వెళ్లాలి. కూడళ్ల వద్ద ఎదురుగా వచ్చే వాహనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రహదారి పక్కన ఆపినప్పుడు పార్కింగ్ లైట్లు వేసి ఉంచాలి. సాధ్యమైనంత వరకు మంచు కురిసే వేళలో వాహనాలు నడపకపోవడం మంచిది. తప్పనిసరైతే లైట్లు వేసుకుని వాహనాలు నడపాలని, కూడళ్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని, ఆమేరకు వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నామని కర్లపాలెం ఎస్సై రవీంద్ర తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

చందోలు(పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : ? చందోలు నుంచి చోడిపాలెం వెళ్లే రహదారిలో నదీముల్లాయపాలెం మలుపు వద్ద రహదారిపై చెత్త, వ్యర్థాలు వేయటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - సురేంద్ర, చోడిపాలెం

✔ పరిశీలించి రహదారి పక్కన చెత్త, వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకుంటాం. - సుజాత, పంచాయతీ కార్యదర్శి, చందోలు.

చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

బాపట్ల: చిన్నారికి పోలియో నివారణ చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, న్యూస్‌టుడే: ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. పట్టణంలోని రెల్లికాలనీ, శారదా రికాలనీలో కేంద్రాలను ఎమ్మెల్యే ఆదివారం వెళ్లి చిన్నారులకు పోలియో నివారణ చుక్కలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ చుక్కల మందు తప్పనిసరిగా వేయించాలన్నారు. వైద్య ఆరోగ్య రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్యాడిసన్‌పేటలోని పట్టణ ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసి సేవలు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. జనసేన సమన్వయకర్త శివనారాయణ, తెదేపా పట్టణాధ్యక్షుడు శ్రీనివాసరావు, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు, రేపల్లె అర్బన్, కొల్లూరు, న్యూస్‌టుడే : పెదపులివర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో వైద్యాధికారిణి కలిసి ఎంపీపీ చిట్టిపూడి వెంకటలక్ష్మమ్మ, ఎంపీడీవో ఎస్‌వీరమణ చిన్నారులకు చుక్కల మందు వేశారు. వైద్యులు, వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ❖ రేపల్లె పట్టణం, మండలంలోని విశ్వేశ్వరం, మోళ్లగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పిల్లలకు ఆరోగ్య సిబ్బంది పోలియో చుక్కల మందు వేశారు. వైద్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ❖ కొల్లూరు మండలంలో ఇంటింటా చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. బస్టాండ్ కూడలిలో కేంద్రాన్ని తెదేపా మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ ప్రారంభించారు.

మోపర్రు, (అమృతలూరు), న్యూస్‌టుడే: మోపర్రు ఏఆర్బీ వసతి గృహంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రీస్తు పాటలు ఆలపించారు. కేక్ కోసి అందరికీ పంపిణీ చేశారు.

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: చెరుకుపల్లి హరిజనవాడలో 60 మంది పేద పిల్లలకు న్యూలైఫ్ ఫౌండేషన్ ఛైర్మన్ గుండాల రవి నూతన వస్త్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ పేద పిల్లలను ఆదుకోవటం, నిరాశతో ఉన్న వారిని ప్రోత్సహించటం తమ సంస్థ ప్రధాన ఆశయమన్నారు. సభ్యులు మోహనరావు, దానియేలు, కంచెర్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేమూరు, చుండూరు: పోలియో రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని వేమూరు మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ విజయబాబు తెలిపారు. వేమూరు, చుండూరు మండలాల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. పల్స్ పోలియో నియోజకవర్గ ప్రత్యేకాధికారి అమర్, వైద్యులు సౌమ్య, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

కుటుంబీకుల చెంతకు వృద్ధురాలు

వృద్ధురాలి కుటుంబ సభ్యులతో శ్రద్ధ ఫౌండేషన్ వైద్యులు, స్థానికులు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే: రేపల్లె 4వ వార్డుకు చెందిన వృద్ధురాలు మేత్రా శివచెంచులక్ష్మి మతి స్థిమితం లేక ఈ ఏడాది ఆగస్టు 1న ఇంటి నుంచి వెళ్లిపోయింది. అదే నెల 22న విశాఖపట్నంలో తిరుగుతుండగా శ్రద్ధ ఫౌండేషన్ ఆశ్రయం కల్పించి వైద్యం చేయిస్తోంది. ఇటీవల ఆమెకు జ్ఞాపకశక్తి రావడంతో తన ఇంటి అడ్రస్ చెప్పింది. దీంతో ఫౌండేషన్ వైద్యులు గడ్డిపాటి శ్రావణ్ పొన్నూరు రోటరీక్లబ్ కార్యదర్శి నన్నపనేని బాలకృష్ణకు సమాచారం అందించారు. ఆయన రేపల్లెకు చెందిన ఉపాధ్యాయులు ఉల్లంగుల వెంకటేశ్వరరావును సంప్రదించి నిర్ధారణ చేసుకున్నారు. ఆదివారం శ్రద్ధ ఫౌండేషన్ వైద్యులు గౌతమ్, పోలీసుల రేపల్లె వచ్చి వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా వృద్ధురాలి కుటుంబ సభ్యులు ఫౌండేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

కవి మండేకు సాహితీ సత్కారం

మండేను సన్మానిస్తున్న నిర్వాహకులు

భోడపాడు, (అమృతలూరు), న్యూస్‌టుడే: అమృతలూరు మండలం బోడపాడు గ్రామానికి చెందిన కవి మండే సుబ్రహ్మణ్యం సాహితీ సత్కారం అందుకున్నారు. వందే మాతరం గీతం 150 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా రాజమహేంద్రవరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, విశ్వసాహితీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కవిసమ్మేళనం నిర్వహించారు. గోదావరి కవితా తరంగాలు వారి ఆహ్వానం మేరకు ఆయన పాల్గొన్నారు. 'నాన్నే నా దైవం' అనే స్వీయ కవితను గానం చేసి అందరి మన్ననలు పొందారు. సంస్థ ఛైర్మన్ కొల్లి రమావతి తదితరుల చేతుల మీదుగా సాహితీ సత్కారం పొందారు. కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకం పేరు మార్చటం సరికాదు

సమావేశంలో జేడీ శీలం, కాంగ్రెస్ పార్టీ నేతలు

బాపట్ల టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పేరు మార్చడం సరికాదని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ నాయకులు గంటా అంజిబాబు స్వగృహంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నిరుపేదలకు ఉన్న పనిహక్కును తొలగించాలని భాజపా కుయుక్తులు చేస్తోందన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు కులమతాలకు అతీతంగా అభివృద్ధి చెందారని, ప్రస్తుతం మతాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఈడీ ద్వారా భాజపా కాంగ్రెస్ అగ్రనేతలపై అక్రమంగా దొంగకేసులు బనాయిస్తోందని విమర్శించారు. వీవీప్యాట్‌లో వచ్చే రసీదులను ఓట్ల లెక్కింపునకు పరిగణలోకి తీసుకోవాలన్నారు. గంట అంజిబాబు, బాబురావు, శంకర్‌రెడ్డి, రవి, సాగర్, గిరిరెడ్డి, చింతా బాబు పాల్గొన్నారు.

ఏసు బోధనలు అనుసరణీయం

కేకు కోస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా తదితరులు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : ప్రపంచ దేశాలు ఆరాధించే దేవుడు ఏసుక్రీస్తు అని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని స్థానిక కేఎస్‌కే కళాశాలలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా, నాయకుల్ కేకు కోశారు. క్రీస్తు బోధనలు ద్వారా ప్రేమ, సహనం వంటివి బోధించారని జడ్పీ ఛైర్‌పర్సన్ అన్నారు. అనంతరం విద్యార్థినుల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో కేఎస్‌కే కళాశాలల కరస్పాండెంట్ కత్తెర సురేశ్‌కుమార్, డైరెక్టర్ కత్తెర డేవిడ్ యశ్వంత్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ప్రిన్సిపాల్స్ ఎంఎల్ సునీత, మాచర్ల భాస్కర్, విక్టర్, అధ్యాపకులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

1100 కు కాల్‌చేస్తే అర్జీల సమాచారం

బాపట్ల, న్యూస్‌టుడే: కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయాలన్నారు. రెవెన్యూ డివిజన్ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ జరుగుతుందన్నారు. ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవటానికి 1100 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

మూల మలుపులో పొంచిన ప్రమాదం

నగరం, న్యూస్‌టుడే: నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే వంతెన ప్రమాదకరంగా మారింది. సజ్జావారిపాలెం శివారు గుడ్డికాయలంక మురుగు కాలువపై వంతెన రక్షణ గోడలు గతంలో జరిగిన ప్రమాదంలో విరిగి కాలువలో పడ్డాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు రక్షణ గోడలు నిర్మించేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టలేదు. తరచూ మూల మలుపులో చిన్నకార్లు, ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఆదమరిస్తే నేరుగా కాలువలో పడటం ఖాయం. ప్రమాదాల నుంచి తప్పించుకున్న వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రక్షణ గోడలు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పూడివాడ రోడ్డు ఆక్రమణ

నగరం, న్యూస్‌టుడే: నగరం-పూడివాడ రోడ్డు ఆక్రమణలకు గురైంది. రేపల్లె ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కాసానివారిపాలెం వరకు సుమారు మూడు కిలోమీటర్ల పొడవున రహదారికి ఇరువైపుల పక్కా కట్టడాలు నిర్మించారు. నివాసాలతో పాటు దేవాలయాలున్నాయి. పేదలతో పాటు మధ్యతరగతి ప్రజలు ఇక్కడ నివసిస్తున్నారు. సుమారు 30 సంత్సరాలుగా 30కి పైగా కుటుంబాలు రోడ్డు పక్కన రేకుల షెడ్డులు, పూరిపాకలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. గతంలో కొందరికి నివేశన స్థలాలు మంజూరు చేసినా.. అనుకూలంగా లేదని వెళ్లలేదు. నగరం నుంచి పూడివాడ ఇతర గ్రామాలకు నిత్యం రాకపోకలు సాగించే వాహన చోదకులు ఆక్రమణలు తొలగించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

అనుసంధాన దారి అధ్వానం

పేటేరు(రేపల్లె అర్బన్), న్యూస్‌టుడే: రేపల్లె మండలం పేటేరు-రావిఅనంతవరం అనుసంధాన రోడ్డు అధ్వానంగా మారింది. పలుచోట్ల గుంతలు, కొంత దూరం రాళ్లు లేచి పోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గం నుంచి నిత్యం భట్టిప్రోలు మండలం తూర్పుపాలెం, రావి అనంతరం నుంచి సుమారు 30 మంది విద్యార్థులు సైకిళ్లపై పేటేరు ఉన్నత పాఠశాలకు వచ్చివెళ్తుంటారు. బేతపూడి నుంచి రావిఅనంతవరం వరకు రోడ్డు అభివృద్ధికి రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించినా పనులు చేపట్టలేదని విమర్శిస్తున్నారు. రోడ్డు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

తీగలు తొలగించక.. వెలుతురు కనిపించక..

నందిరాజుతోట (బాపట్లటౌన్), న్యూస్‌టుడే : మండల పరిధిలోని నందిరాజుతోటలో పిన్నిబోయినవారిపాలెం రోడ్డులో విద్యుత్తు తీగలకు చెట్ల తీగలు అల్లుకుపోయాయి. రాత్రివేళలో బల్బు వెలిగినప్పటికీ వెలుతురు కనిపించటంలేదు. తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని, ప్రమాదం జరగక ముందే తీగలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు కృషి

సమావేశంలో ఆర్ఎస్ఎస్ నేతలు

బాపట్ల, న్యూస్‌టుడే: హిందూ సమాజాన్ని జాగృతం చేసి హైందవ ధర్మ పరిరక్షణ కోసం ఆర్ఎస్ఎస్ కృషి చేస్తోందని భాజపా సీనియర్ నేత బాబూనాగేంద్ర అన్నారు. స్థానిక ఆర్ఎస్ఎస్ కార్యాలయంలో సంస్థ శత వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేవాభారతి ద్వారా సమాజ సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. నేటి యువత మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకోవాలన్నారు. సనాతన ధర్మం విశ్వాన్ని వసుధైక కుటుంబంగా భావిస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ నేతలు సుధాకరరావు, అప్పయ్య, శ్రీనివాస్, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఇంటి పన్ను వసూలు

కూచిపూడి, (అమృతలూరు): ఇంటి పన్నును కూచిపూడి గ్రామపంచాయతీలో నూరు శాతం వసూలు చేశారు. దీనికి కృషి చేసిన పంచాయతీ కార్యదర్శి బోగాది తిరుమలరావు, సిబ్బందిని ఎంపీపీ నరేంద్రకుమార్, ఎంపీడీవో శేషమాంబ, డిప్యూటీ ఎంపీడీవో వినయ్‌బాబు అభినందించారు.

బండ్లమ్మ ఆలయాల్లో పూజలు

శ్రీమాతగా చందోలు బండ్లమ్మ

చందోలు (పిట్టలవాని పాలెం), న్యూస్‌టుడే : చందోలు శ్రీబండ్లమ్మ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని సువర్ణమాతృకా బంగారు కాసులహారం, రజత కవచంతో అలకంరించగా శ్రీమాతగా భక్తులకు దర్శనమించారు. పిట్టలవానిపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెంలోని శ్రీబండ్లమ్మ వార్లకు భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అభయప్రదాయినిగా అల్లూరమ్మ

పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే : మండలంలోని అల్లూరు గ్రామ దేవత అల్లూరమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో అభయప్రదాయినిగా భక్తులకు దర్శనమిచ్చారు.

వైభవంగా ధనుర్మాస భజనలు

పూజల్లో పాల్గొన్న భక్తులు

అమృతలూరు: అమృతలూరు శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలను వైభవంగా నిర్వహించారు. గోదాదేవి, రంగనాయక స్వామికి పూజలు జరిపారు. భక్తబృందాల భజనలు ఆకట్టుకున్నాయి. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వెల్లటూరులో అర్ధ ఏకాహం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : తిరుమల తిరుపతి దేవస్థానం, దాస సాహిత్య ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో మండలంలోని వెల్లటూరు చెన్నకేశవస్వామి దేవస్థానంలో పురందర దాసుల సంకీర్తనలతో అర్ధ ఏకాహం జరిగింది. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాహిత్య ప్రాజెక్టు అధ్యక్షుడు గడ్డిపాటి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భజన బృంద సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు. వెల్లటూరు గ్రామ హరే శ్రీనివాస భజన బృందం, రేపల్లె, కిష్కిందపాలెం గ్రామాలకు చెందిన భజన బృందాలు పాల్గొన్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బాలికల నృత్య ప్రదర్శన

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని రైలుపేట పొట్టిశ్రీరాములు పురపాలక పార్కు వద్ద ఆనంద ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలు ఆశ్రిత, అక్షయ, వైష్ణవి, అక్షర, తేజశ్రీ ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాకారులకు అధికారులు జ్ఞాపికలు ప్రదానం చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ నారాయణభట్టు, జిల్లా సైన్స్ అధికారి సాధిక్, పురపాలక అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు

బాపట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని భావనారాయణ స్వామి, పాత బస్టాండ్ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించారు. ఆలయాల్లో తిరుప్పావై ప్రవచనాలు చెప్పారు.

ఒత్తిడికి లోనుకాకుండా చదువుకోండి

అవగాహన కల్పిస్తున్న వేణుగోపాలరావు

భట్టిప్రోలు, న్యూస్‌టుడే : విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ఇష్టంగా చదువుకోవాలని మానసిక, ఆరోగ్య జిల్లా కౌన్సిలర్ బి.వేణుగోపాలరావు అన్నారు. స్థానిక వసతిగృహంలోని విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, చదువుకొనే విధానంపై ఆదివారం అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే యోగా, ఆసనాలు వేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు బట్టీ విధానంతో కాకుండా ఉపాధ్యాయుల బోధన ఆధారంగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ జె.రాజు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వైద్యుడు శివనారాయణకు మొక్క అందజేస్తున్న స్వచ్ఛతా ప్రతినిధులు

బాపట్ల: ప్రతి రోజూ ధ్యానం, యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ప్రముఖ వైద్యుడు గోపాళం శివనారాయణ అన్నారు. సూర్యలంక రోడ్డులోని అటవీ శాఖ నగర వనంలో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని అన్నారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని పేర్కొన్నారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. మానవతా సంస్థ ఛైర్మన్ శరత్‌బోస్, అధ్యక్షుడు హరిప్రసాద్, డీఆర్వో బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ గౌరవాధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో శారీరక దారుఢ్యం

ప్రదర్శనలో పాల్గొన్న యువత

బాపట్ల, న్యూస్‌టుడే: సైక్లింగ్ ద్వారా శారీరక దారుఢ్యం మెరుగుపడుతుందని డీఎస్డీవో శ్రీనివాసరావు అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మినీ ఇండోర్ స్టేడియం నుంచి చేపట్టిన సైక్లింగ్ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. డీఎస్డీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోజు అర గంట సైకిల్ తొక్కటం ద్వారా ఆరోగ్య జీవనశైలిని అలవరుచుకోవాలన్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ నేడు

ఉల్లిపాలెం(నగరం), న్యూస్‌టుడే: పాత రేపల్లె నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న సుమారు రెండు వేల మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. తానా ఆర్థిక సహకారంతో సోమవారం ఉల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పరుపులు అందజేత

కేకు కోస్తున్న వైకాపా నేతలు

బాపట్ల, భట్టిప్రోలు: న్యూస్‌టుడే: వైకాపా అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. కేకు కోసి నాయకులకు తినిపించారు. చేజర్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ❖ భట్టిప్రోలులోని స్థానిక బీసీ వసతిగృహంలోని విద్యార్థులకు వరికూటి అశోక్‌బాబు పరుపులు అందజేశారు.

మహాసభలు విజయవంతానికి వినతి

ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

బాపట్లటౌన్, న్యూస్‌టుడే : విశాఖపట్నంలో ఈనెల 31న ప్రారంభం కానున్న సీఐటీయూ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి చీలురోడ్డు వరకు నాయకులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభలు జనవరి 4న మహార్యాలీతో ముగుస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో తిరుమల రెడ్డి, కె.శరత్, ఒ.లక్ష్మన్, నిరంజన్, బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

చర్చి నిర్మాణానికి విరాళం

నగదు అందిస్తున్న సుబ్బారావు, తదితరులు

కావూరు (చెరుకుపల్లి (గ్రామీణ)),: కావూరు ఎస్సీ కాలనీలో క్రైస్తవ సోదరుల ప్రార్థన మందిరం నిర్మాణం కోసం గ్రామానికి చెందిన డాక్టస్ అధినేత తుమ్మల రామకృష్ణ రూ.లక్ష నగదు విరాళంగా అందించారు. ఆదివారం ఆయన సోదరుడు తుమ్మల సుబ్బారావు చర్చి పెద్దలను కలిసి నగదును ఇచ్చారు. చర్చి నిర్మాణంలో ఇంకా తమ సాయం అందుతుందని వారికి భరోసా ఇచ్చారు. చర్చి పెద్దలు దాత క్షేమం కోరుతూ ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు సుఖవాసి వాసు, చెలి రవికుమార్, గోగినేని శివాజీ, కొడాలి శ్రీనివాసరావు, గడ్డిపాటి వెంకటకృష్ణ, సంఘ పెద్దలు తురుమెళ్ల సుందరావు, గాలి చంద్రశేఖర్, తురిమెళ్ల ఏసుబాబు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణ పనులు పరిశీలన

బాపట్ల, న్యూస్‌టుడే: నల్లమడ వాగుపై కప్పలవారిపాలెం-ముత్తాయపాలెం మధ్య వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. వంతెన నిర్మాణ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి పనుల పురోగతి తెలుసుకున్నారు. వేగేశన మాట్లాడుతూ వంతెన నిర్మాణం పూర్తయితే తీర గ్రామాల ప్రజలు వేగంగా జిల్లా కేంద్రానికి చేరుకోవటానికి వీలవుతుందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయించి పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్లు దూరం

చెరుకుపల్లి, న్యూస్‌టుడే: వరి మాగాణుల్లో రబీ పంటగా వేరుశనగ సాగుచేసే రైతులు తగు జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులు సాధ్యమవుతాయని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్ అన్నారు. వేరుకుళ్లు, మొదలుకుళ్లు, కాండ ముకుళ్లు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 4 గ్రాముల ట్రైకోడెర్మా పట్టించి విత్తనశుద్ధి చేయటం ద్వారా తెగుళ్లనుంచి కొంత ఉపశమనం పొందవచ్చన్నారు. విత్తనాన్ని మొదట క్రిమిసంహారక మందులతో విత్తనశుద్ధి చేసి ఆరనివ్వాలన్నారు.

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

మేదరమెట్ల, న్యూస్‌టుడే: ? మేదరమెట్ల బస్టాండ్ సెంటర్ వద్ద ఆటోలు రోడ్డు మధ్యలో ఉంచుతున్నారు. రవాణాకు ఆటంకంగా ఉంది. సమస్యను పరిష్కరించాలి.
స్థానికులు, మేదరమెట్ల

✔ ఆటో చోదకులతో మాట్లాడి ఆటోలను రోడ్డు పక్కన ఉంచేలా చర్యలు తీసుకుంటాను.
మహమ్మద్ రఫీ, ఎస్సై, మేదరమెట్ల

నేడు పింఛనుదారుల దినోత్సవం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఇంకొల్లు శాఖ ఆధ్వర్యంలో సోమవారం పింఛనుదారుల దినోత్సవం స్థానిక గొల్లపాలెం రోడ్డులోని తగిరశ వీరాంజనేయులు గృహంలో జరుగుతుందని సంఘ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు తెలిపారు.

చీరాల
•చీరాల •అద్దంకి •పర్చూరు

29న ఏసీబీపై వంతెన ప్రారంభం

బల్లికురవ, న్యూస్‌టుడే: మండలంలోని అద్దంకి- బల్లికురవ రహదారిలో అద్దంకి బ్రాంచి కెనాల్ 32వ మైలు వద్ద నూతనంగా నిర్మించిన హైలెవల్ వంతెన ఈ నెల 29న ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా ఇరువైపులా రోడ్డు అనుసంధానం పనులను గుత్తేదారు ఆదివారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న ఇక్కడి వంతెనను తొలగించి, మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవతో కొత్తది నిర్మించారు.

వసతి గృహం విద్యార్థులకు శిక్షణ

పందిళ్లపల్లి(వేటపాలెం), న్యూస్‌టుడే: స్థానిక బీసీ వసతి గృహం విద్యార్థుల్లో మానసిక ధైర్యం పెంచే లక్ష్యంతో కెరీర్ హెల్త్ కౌన్సిలరు జి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో ఒత్తిడి ఎదుర్కోవడం, నైపుణ్యాలు పెంపొందించుకోవడం, శ్వాసపై సాధన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వార్డెన్ రామయ్య ఉన్నారు.

సజావుగా ఆక్రమణల తొలగింపు పూర్తి

యంత్రంతో కాలువ కట్టపై కట్టడాల తొలగిస్తూ..

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి ఎన్నెస్పీ కాలువ కట్టపై గల ఆక్రమణల తొలగింపు పర్వం పూర్తయింది. మినీ బైపాస్ నిర్మాణానికి అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఈ విషయమై ప్రత్యేకశ్రద్ధ కనబరిచారు. ఈక్రమంలో ఆక్రమణదారులు తమ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. దీనికితోడు పురపాలక సంఘం పరిధిలోని పది సచివాలయాల సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు తమవంతు సహకారం అందించారు. పోలీసుల ప్రమేయం లేకుండానే అంతా సవ్యంగా సాగిపోయింది. పురపాలక ట్రాక్టర్లను అందుబాటులో ఉంచి, సామగ్రిని శింగరకొండ ఇళ్ల స్థలాల వద్దకు చేర్చారు. ఇదే క్రమంలో తాత్కాలిక సదుపాయాల్లో భాగంగా క్రీడాప్రాంగణం వద్ద సామాన్లు ఉంచారు. వారందరికీ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భోజన సదుపాయం సమకూర్చారు.

రక్షణగోడ లేక ప్రమాదకరంగా మారి

స్తంభాలరేవు వద్ద ఇలా..

జాండ్రపేట (చీరాల అర్బన్), న్యూస్‌టుడే: పాత చీరాల నుంచి రంగప్పనాయుడు పాలేనికి వెళ్లేదారిలో స్తంభాలరేవు (రొంపేరు)పై 2003 నవంబరు 12న రూ.1.63 కోట్లతో వంతెన నిర్మించారు. దీనికి అవతల ఉన్న పొలాలకు వెళ్లేందుకు దీన్ని అన్నదాతలు వినియోగిస్తుంటారు. విత్తు నాటిన దగ్గర నుంచి పంట దిగుబడులు ఇంటికి చేర్చేవరకు ఇదే ప్రధాన మార్గం. ఇంతటి ప్రాధాన్యం కలిగిన వంతెనకు ఆనాడు ఏర్పాటు చేసిన రెయిలింగ్ ఒకవైపు పడిపోయి ప్రమాదకరంగా మారింది. రాత్రులు ఇది కనపడక ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

చారిత్రక ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం

అద్దంకి, న్యూస్‌టుడే: చారిత్రక నేపథ్యం కలిగిన పట్టణంలోని పురాతన ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకొచ్చారు. భవానీకూడలి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే దారిలోని వీరభద్రస్వామి ఆలయం ముఖద్వారం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనికి రూ. రెండు లక్షలు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే గుడి లోపల జీవధ్వజ స్తంభం, గదులు నిర్మించారు. తాజాగా పలువురు దాతల సహకారంతో ముఖద్వారంతో పాటు నాపరాయి బండపరుపు పరుస్తున్నారు. భవానీకూడలి మలుపు వద్ద గల వినాయకస్వామి ఆలయం ముఖద్వారం నిర్మాణానికి రూ.1.50 లక్షల అంచనాతో పనులు జరుగుతున్నాయి. బెల్లారి మేస్త్రీలు కొమ్మినేని మల్లికార్జున, నరసింహారావు దాతృత్వంతో పనులు తుది దశకు చేరాయి.

రైల్వేస్టేషన్‌కు ఐక్యంగా అడుగులు వేద్దాం

సమావేశంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు

అద్దంకి, న్యూస్‌టుడే: అద్దంకి వాసులకు రైల్వేస్టేషన్ అవసరం ఎంతో ఉందని, దీన్ని సాధించేందుకు అందరం ఐక్యంగా అడుగులు వేద్దాం అని ఆడిటర్ కృష్ణమోహన్ అన్నారు. ఆదివారం బంగ్లా రోడ్డులోని లయన్స్ ఆఫ్‌వర్స్ భవన్‌లో సాధన సమితి ఇచ్చిన పిలుపు మేరకు పట్టణ ప్రముఖులు సమావేశమయ్యారు. ఇప్పటికే బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ నడికుడి-మాచర్లపురం మధ్య రైల్వేలైన్ కావాలని కేంద్ర మంత్రిని కలిసి వివరించినట్లు నేతలు గుర్తు చేశారు. వ్యవసాయ, వాణిజ్యపరంగా రైల్వే లైన్ అవసరం ఎంతో ఉందని.. ఈ అంశాన్ని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అనంతరం ఢిల్లీలోని రైల్వే మంత్రి, అధికారులను కలిసి తమ డిమాండ్‌లను వినతిపత్రం రూపంలో అందించాలని తీర్మానించారు. దొప్పలపూడి దుర్గాప్రసాద్, బచ్చల వాసు, నూకల రామాంజనేయులు, కూరపాటి రామకోటేశ్వరరావు, దుండాని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలకు మందులు సరఫరా చేయాలి

చీరాల, న్యూస్‌టుడే: పశు వైద్యశాలలకు మందులు, పీపీఆర్ టీకాలు వెంటనే సరఫరా చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసపాటి వెంకట్రావు డిమాండ్ చేశారు. వీటితో పాటు వీటి బీమాకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని, మొండి తుపాను ప్రభావంతో చనిపోయిన జీవాలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ఆదివారం చీరాల మండలంలోని పలు గ్రామాల్లో సంఘ సభ్యులు పర్యటించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గత ఏడెనిమిది నెలల నుంచి మందులు రావడంలేదన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి బుర్రి ఆంజనేయులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కొమ్మమూరు కాలువ శివారుకు నీరు


సంతరావూరు లాకుల వద్ద నుంచి ఉద్ధృతంగా వస్తున్న నీరు

ఈనాడు కథనానికి స్పందన

చినగంజాం, న్యూస్‌టుడే: కొమ్మమూరు కాలువ చివరి ఆయకట్టు వరి పొలాలకు ఆదివారం నీరు వచ్చింది. నీరు పారడంతో పొలాలకు దప్పిక తీరిందని రైతులు వడ్లమూడి కృష్ణారావు, శేషారావు, కొండలు, శ్రీను సంతోషం వ్యక్తం చేశారు. శివారు భూములకు నీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఈ నెల 19న 'ఈనాడు'లో 'కొమ్మమూరు కాలువ శివారు... ఎండిన పైరు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈక్రమంలో ఆయకట్టు పరిధిలోని వరి పొలాలను తెనాలి కృష్ణా, పశ్చిమ డెల్టా జలవనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధాకర్, చీరాల డీఈ ప్రసాద్‌లు శనివారం పరిశీలించారు. ఆదివారం నాటికి నీరు రెండున్నర, మూడు అడుగుల స్థాయిలో ఇస్తామని చెప్పిన విధంగానే అధికారులు కృషి చేసి నీటిని చివరి భూములకు విడుదల చేశారు. దీంతో రైతులు దగ్గరుండి కొమ్మమూరి కాలువ నుంచి కనపర్తి ఛానల్ ద్వారా వరి పొలాలకు పెట్టుకున్నారు. ఆదివారం జలవనరుల శాఖ లాక్ సూపరింటెండెంట్ అబ్దుల్ నజీర్, లస్కర్లు దుర్గాప్రసాద్, రాజశేఖర్, వెంకటేశ్వరరెడ్డి, అబ్రహాంలు దగ్గరుండి పొలాలకు నీటిని పంపించారు. కొందరు కొమ్మమూరు కాలువ, కనపర్తి ఛానల్‌పై కొందరు ఏర్పాటు చేసిన ఇంజిన్లను ఆపించి, శివారుకు నీటిని పంపామని లాక్ సూపరింటెండెంట్ తెలిపారు.

మార్టూరు: కృష్ణా పశ్చిమడెల్టా వ్యవస్థపరిధిలోని కొమ్మమూరు ప్రధాన కాలువ 109.4కిలోమీటరు వద్ద చివరి ఆయకట్టు ప్రాంతానికి సాగునీటిని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు ఆదివారం అధికారులు విడుదల చేసినట్లు క్యాంపు కార్యాలయ ప్రతినిధులు తెలిపారు. కొమ్మమూరు కాలువ ద్వారా దిగువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయటంతో చినగంజాం మండలం గొల్లపాలెం గ్రామ పరిధిలోని చివరి ఆయకట్టు రైతులకు ఎంతోగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

బిడ్డ భవిష్యత్తుకు రెండు చుక్కలు

వేటపాలెం, పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు, బల్లికురవ, జె.పంగులూరు, న్యూస్‌టుడే:

పర్చూరులో.. పోలియో చుక్కలు వేస్తున్న వైద్యసిబ్బంది, ప్రజాప్రతినిధులు

ఇంకొల్లులో..

జాతీయ పోలియో దినోత్సవాన్ని ఆదివారం చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో నిర్వహించారు. వైద్య శాఖ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు రెండు చుక్కలు వేయడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసినట్లు అవుతుందని నాయకులు పేర్కొన్నారు. మండల ప్రధాన కేంద్రాల్లోని బస్టాండ్లు, ప్రధాన కూడళ్లు, పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి చిన్నారులకు చుక్కలు వేశారు. ఆయా కేంద్రాల వద్ద పలువురు ప్రజాప్రతినిధులు, వైద్యులు పాల్గొని పోలియో చుక్కల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. వేటపాలెం మండలం కొత్తపేటలో ఎంపీడీవో రాజేష్‌బాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 8029 మంది చిన్నారులు లక్ష్యం కాగా, దాదాపు 95 శాతం వరకు పూర్తయింది. వైద్యులు స్వాతి కిరణ్, జయకుమార్‌లు పర్యవేక్షించారు. ఇంకొల్లు మండలంలో 2892 మందికి గాను 2599 మందికి (89.96 శాతం) చుక్కలు వేశామని మండల వైద్యాధికారిణి అంజలి తెలిపారు. బల్లికురవ సచివాలయం వద్ద కార్యక్రమాన్ని సర్పంచి పి.అంజిబాబు ప్రారంభించారు.

కిక్ బాక్సింగ్‌లో క్రీడాకారుల సత్తా

ప్రతిభ చాటిన క్రీడాకారులకు పతకాలు, ధ్రువపత్రాలు అందిస్తున్న నిర్వాహకులు

సంతమాగులూరు, న్యూస్‌టుడే: సంతమాగులూరు బాలాజీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఖేలో ఇండియా కిక్ బాక్సింగ్ అస్మిత లీగ్ జిల్లా స్థాయి పోటీల్లో క్రీడాకారులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో ఏడు నుంచి 17 ఏళ్ల లోపు క్రీడాకారులు 120 మందికి పైగా తలపడ్డారు. ప్రతిభ కనపరచిన క్రీడాకారుల బృందాలకు, వ్యక్తిగతంగా సత్తా చాటిన క్రీడాకారులకు బాలాజీ విద్యాసంస్థల నిర్వాహకుడు కొండారెడ్డి లక్ష్మీరెడ్డి, ఏపీ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరేంద్రచారి, స్పోర్ట్స్ ఛైర్మన్ సుధీర్ బహుమతులు అందజేశారు. కరాటే మాస్టర్ జి.అఖిల్, హైస్కూల్ ఇన్‌ఛార్జి కరీమూన్, విశ్రాంత పోలీసు అధికారి చంద్రశేఖరరెడ్డి, వాసురెడ్డి, వెంకటరెడ్డి, చెన్నారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భక్తచింతామణిని మించిన నాటకం లేదు

అక్కిరాజు సుందరరామకృష్ణకు అందిస్తున్న కళాపురస్కారం

అద్దంకి, న్యూస్‌టుడే: భక్తచింతామణిని మించిన నాటకం మరొకటి లేదని ప్రఖ్యాత రంగస్థల కళాకారులు, నటుడు అక్కిరాజు సుందరరామకృష్ణ అన్నారు. పుట్టంరాజు బుల్లెయ్య-రామలక్ష్మమ్మ ఛారిటబుల్ ట్రస్టు తరపున 2025 ఏడాదికి విస్తృత కళాపురస్కారం ఆయనకు ఆదివారం అందించారు. పుట్టంరాజు కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమానికి వాచస్పది వారణాశి రఘురామశర్మ అధ్యక్షత వహించారు. అనంతరం చింతామణి నాటకంలోని బిళ్వమంగళ ఏకపాత్రాభినయం వేసి ఆకట్టుకున్నారు. తదనంతరం సాహితీవేత్తలు సుందర రామకృష్ణను సత్కరించి, జ్ఞాపిక అందించారు. విశ్రాంత ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన, మోటుపల్లి రామదాసు, అడుసుమల్లి అనంత కోటేశ్వరరావు, గాడేపల్లి దివాకర్ దత్తు, పాలపర్తి జ్యోతిష్మతి, పీసీహెచ్.కోటయ్య పాల్గొన్నారు.

సీఐను కలిసిన తెదేపా నేతలు

మార్టూరు, న్యూస్‌టుడే: మార్టూరు పట్టణ సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వై.శ్రీనివాసరావును ఆదివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన తెదేపా నేతలు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధచూపుతోందని, గ్రామాల సంరక్షణలో తమ వంతు సహాయసహకారాలు అందిస్తామని వారు వెల్లడించారు. సీఐకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతించారు. సీఐని కలిసిన వారిలో తెదేపా మండల అధ్యక్షుడు తాటి నాగేశ్వరరావు, సీనియర్ నేతలు తెల్లపోలు సాంబశివరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, జాగర్లమూడి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పార్టీ జిల్లా నేతలకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

పర్చూరు, న్యూస్‌టుడే: తెలుగుదేశంపార్టీ బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బాధ్యతలు చేపట్టిన సలగల రాజశేఖర్‌బాబు, పర్చూరు నియోజకవర్గం చినగంజాం మండలం కడవకుదురు గ్రామానికి చెందిన నక్కల రామయ్య నియామకంపై ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హర్షం వ్యక్తం చేసి, ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. పర్చూరు నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గానికి సముచిత స్థానం దక్కిందన్నారు.

వార్షికోత్సవం, తిరునాళ్లను నిర్వహిద్దాం

సోపిరాల (చినగంజాం), న్యూస్‌టుడే: సోపిరాల ప్రజల ఆధ్వర్యంలో శ్రీఆదిమూర్తిస్వామి ఆలయం నిర్మించి ఏడేళ్లు అయిన సందర్భంగా ఫిబ్రవరి 10న ఆలయ వార్షికోత్సవాన్ని, ఫిబ్రవరి 15న మహాశివరాత్రి తిరునాళ్లను నిర్వహించుకుందామని ఆ ఆలయాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి గుడి ఆవరణలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పెద్దలు టి.సీతారామయ్య, కుర్రి రామసుబ్బారావు, జె.వెంకటస్వామి, టి.ఐయారావు, ఎస్.హరినాథ్, టి.శ్రీనివాసరావు, పి.రంగనాథ్, ఆర్.మధుసూదనరావు పాల్గొన్నారు.

సిద్ధాకు ఆర్యవైశ్య ప్రముఖుల అభినందనలు

మార్టూరు, న్యూస్‌టుడే: వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అంతర్జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన సిద్ధా సూర్యప్రకాశరావును మార్టూరు ఆర్యవైశ్య ప్రముఖులు అభినందించారు. ఆదివారం ప్రమాణ స్వీకార వేడుకకు హాజరై పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. మార్టూరు ప్రాంత ఆర్యవైశ్య నేతలు పొత్తూరి శివరావు, వెంకట్రావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పేదలకు నూతన వస్త్రాలు అందజేత

మార్టూరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ మానవ సంఘీభావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీక్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో ఆదివారం 15మంది నిరుపేదలకు నూతన వస్త్రాలు అందించారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు టి.సాంబశివరావు ఆర్థిక సాయంతో వీటిని అందించినట్లు క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మచౌదరి తెలిపారు. ఎం.సాంబశివరావు, చెరుకూరి నాగేశ్వరరావు, జె.రవికుమార్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని రేణింగవరంలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయం వద్ద విశ్వకర్మ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్టు ప్రధాన కార్యదర్శి, కోశాధికారి తక్కెళ్లపాటి నాగేంద్ర ప్రసాద్, రావి నూతల శ్రీనివాసు, మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మద్దు వెంకటేశ్వర్లు, కొండమూరి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆదివారమా.. నామ్ రహదారిపై ట్రాఫిక్ సమస్యే

మాంసం దుకాణాల వద్ద రోడ్డుపైనే వాహనాల పార్కింగ్

అద్దంకి, న్యూస్‌టుడే: ఆదివారమైతే చాలు.. అద్దంకి భవానీకూడలి వద్ద రవాణాకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. మాంసం, చేపల దుకాణాల వారు తమ పరిధి దాటి ముందుకొచ్చి కోళ్ల బుట్టలు, చేపల తొట్టెలు ఉంచుతున్నారు. వాటిని కొనుగోలు చేసే వారి ద్విచక్రవాహనాలు నామ్ రహదారిపైనే నిలుపుతున్నారు. తద్వారా రవాణాకు ఆటంకం కలుగుతుంది. పైపెచ్చు భవానీకూడలి ప్రాంతంలోనే మాంసం దుకాణాలు అధికంగా నెలకొన్నాయి. పోటాపోటీగా వ్యాపారం జరుగుతుంది. దీంతో కొనుగోలుదారులు ఇక్కడే అధికంగా నిలబడి ఉంటున్నారు. మంగళ, శని, ఆదివారాల్లో శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి భక్తులు ఎక్కువ ఉంటారు. ప్రత్యేక వాహనాలు, ట్రాక్టర్లలో వెళుతుంటారు. వింధ్యావాసిని సమేత నగరేశ్వరస్వామి(వేయి స్తంభాల గుడి) వద్ద భక్తులు అధిక సంఖ్యలో గుమి కూడి ఉంటున్నారు. అటు మాంసం దుకాణాలు, ఇటు భక్తులు.. నడుమ ప్రయాణం కష్టంగా మారింది. నాలుగురోడ్ల కూడలిలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పటికీ ఆక్రమణదారులు మాత్రం తమ ఆగడాలు ఆపడం లేదు. కోళ్ల అమ్మకందార్లు, మాంసం విక్రయదార్లతో భవానీకూడలి నుంచి వాహనాల ప్రయాణం మరింత కష్టంగా మారిందని పలువురు వాహన చోదకులు వ్యాఖ్యానిస్తున్నారు. తక్షణం పురపాలక, పోలీసు, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చేయాలని కోరుతున్నారు.

నిబంధనలు పట్టవు.. పట్టాలు ఉండవు!

చీరాల రోడ్డుపై వెనుక డోరు, పట్ట లేకుండా వెళుతున్న ఇసుక ట్రాక్టరు

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: ఇసుక రవాణా సమయంలో ట్రాక్టరు వెనుక డోరుతో పాటు పట్టా ఏర్పాటు చేసుకోవాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలున్నాయి. దీన్ని పక్కాగా అమలు చేయాలని జిల్లా రవాణా శాఖాధికారి సైతం సూచించారు. క్షేత్రస్థాయిలో ఇది ఎక్కడ అమలు కావడంలేదు. ఒకరిద్దరు పట్ట కప్పినా మిగిలిన వారు ఏర్పాటు చేయకుండానే నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్నారు. ప్రధానంగా చీరాల, వేటపాలెం, పందిళ్లపల్లి, ఈపూరుపాలెం రహదారులతో పాటు బైపాస్ రోడ్డులో జోరుగా ట్రాక్టర్లతో ఇసుక వెళుతున్నా... పైన పేర్కొన్న నిబంధనలు పాటించడంలేదు. దీనివల్ల వీటి వెనుక వెళుతున్న ద్విచక్ర వాహనదారుల కళ్లలో ఇసుక లేచి పడటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజు రోజుకూ ఈ సమస్య మరింత ఇబ్బందిగా మారుతోందని ద్విచక్ర వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఇసుక రవాణా చేసే వాహనాల వెనుక డోరుతో పాటు పట్టా ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అంబేడ్కర్‌నగర్‌లో క్రిస్మస్ శాంతి ర్యాలీ

చినగంజాం, న్యూస్‌టుడే: క్రిస్మస్ సందర్భంగా చినగంజాం అంబేడ్కర్‌నగర్‌లో సండే స్కూల్ చిన్నారులు ఆదివారం కొవ్వొత్తులతో క్రిస్మస్ శాంతి ర్యాలీ నిర్వహించారు. నిర్వాహకుడు ఎం.మేషక్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో అంబేడ్కర్‌నగర్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, యువజన సంఘ సభ్యులు యువతీ యువకులు, పెద్దలు పాల్గొన్నారు.

వీధుల వెంట రెచ్చగొట్టేలా ఫ్లెక్సీలు

పూనూరు(యద్దనపూడి), న్యూస్‌టుడే: కొందరు వ్యక్తులు వీధుల వెంట రెచ్చగొట్టే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వ్యవహరిస్తున్న తీరు గ్రామస్థులను ఆందోళనకు గురిచేస్తోంది. యద్దనపూడి మండలం పూనూరులోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ఓ వర్గం వారు రప్పా.... రప్పా... తలలు తెగిపడతాయి... టచ్ చేసి చూడు తెలుస్తుందంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసినప్పటికీ అధికారులు తెలియనట్లు వ్యవహరించడం గ్రామంలో తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఇప్పటికైనా ప్రజలు సామరస్యంగా మెలగేలా చొరవచూపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

త్రివిక్రమస్వామి సేవలో ఎమ్మెల్సీ ఆలపాటి

ఆలపాటిని సత్కరిస్తున్న ఈవో

చెరుకూరు(పర్చూరు), న్యూస్‌టుడే: మండల పరిధి చెరుకూరులోని శ్రీ త్రివిక్రమస్వామివారిని ఆదివారం ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దర్శించుకున్నారు. పండితులు ఆయనకు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికి, స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి ఆశీర్వచనాలు అందించారు. ఈవో దామా నాగేశ్వరరావు స్వామి ప్రసాదాలు అందజేశారు. వెంట ఏపీ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కె.వి.కృష్ణ ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

వైద్యుడు శివనారాయణకు మొక్క అందజేస్తున్న స్వచ్ఛతా ప్రతినిధులు

బాపట్ల: ప్రతి రోజూ ధ్యానం, యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ప్రముఖ వైద్యుడు గోపాళం శివనారాయణ అన్నారు. సూర్యలంక రోడ్డులోని అటవీ శాఖ నగరవనంలో మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని అన్నారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలని పేర్కొన్నారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. మానవతా సంస్థ ఛైర్మన్ శరత్ బోస్, అధ్యక్షుడు హరిప్రసాద్, డీఆర్వో బాలకృష్ణ., ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పద్మజ గౌరవాధ్యక్షుడు హరిబాబు పాల్గొన్నారు.

బోదె పద్ధతిలో మొక్కజొన్నలో అధిక దిగుబడి

ప్రదర్శనలో అధికారులు, రైతులు

బల్లికురవ, న్యూస్‌టుడే: బోదె పద్ధతిలో మొక్కజొన్న సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు వస్తాయని ఆత్మ అధికారి కె.రామిరెడ్డి అన్నారు. మండలంలోని వి.కొప్పెరపాడులో ఆదివారం ఆత్మ ఆధ్వర్యంలో రైతు 'ప్రదర్శనక్షేత్రన్' నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి పి.శ్రీనివాసరావు, ఆత్మ మార్టూరు అధికారి రామిరెడ్డి మాట్లాడారు. గ్రామ రైతులు, వీఏఏ చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

అలంకరణలో స్వామి,అమ్మవారు

ఉప్పుటూరు(పర్చూరు), న్యూస్‌టుడే: గ్రామంలోని శ్రీ అలివేలు మంగ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామివార్లకు ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుప్పావై గోదాదేవి వ్రతం విశిష్టతను ఆలయ పండితులు భక్తులకు వివరించారు.

గుంతలమయంగా కొండమంజులూరు-కల్లంవారిపాలెం రోడ్డు

కొండమంజులూరు (జె.పంగులూరు), న్యూస్‌టుడే: కల్లంవారిపాలెం నుంచి కొండమంజులూరు మధ్య 2016లో నిర్మించిన రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డు వెంబడి ముళ్లపొదలు దట్టంగా పెరిగి వాహనచోదకులు ప్రయాణించాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నారు. 5.6 కిలోమీటర్ల మేర ఇది విస్తరించి ఉంది. దీన్ని మరమ్మతులు చేస్తే బూదవాడ, కల్లంవారిపాలెం గ్రామాల ప్రజలు జాతీయ రహదారిని చేరుకోవడానికి పంగులూరు మీదుగా చుట్టూ ప్రయాణం చేయకుండా సులువుగా హైవేని చేరుకోవచ్చని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి కల్లంవారిపాలెం నుంచి బూదవాడ వరకు మరో కిలోమీటరు రోడ్డు పొడిగించి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పీఆర్ ఏఈ గడ్డం హనుమంతరావును వివరణ కోరగా మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

ధ్యాన గురువు ఆదినారాయణ మృతికి నివాళి



ఇంకొల్లు: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆఫ్ ఇండియా ధ్యాన గురువు మద్దినేని ఆదినారాయణ(82) ఆదివారం మృతి చెందారు. పత్రీజీ ప్రియ శిష్యుడిగా ధ్యాన, శాకాహార ప్రచారకర్తగా మన్ననలు పొందారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. ఆదినారాయణ మృతికి ధ్యాన గురువులు సుభాని, సుబ్బారావు, అనంతలక్ష్మి స్థానిక ప్రముఖులు నివాళులర్పించారు.

మహాసభలు విజయవంతానికి వినతి

బాపట్లటౌన్, న్యూస్‌టుడే : విశాఖపట్నంలో ఈనెల 31న ప్రారంభం కానున్న సీఐటీయూ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి చీలురోడ్డు వరకు నాయకులు ర్యాలీ నిర్వహించారు.

మట్టి తవ్వకాలు అడ్డగింత

జె.పంగులూరు, న్యూస్‌టుడే: మండలంలోని కొండమూరులో మట్టి తవ్వకాలను అధికారులు నిలుపుదల చేశారు. ఈ సంఘటన శనివారం జరిగింది. ఎస్సై వినోద్‌బాబు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన వాగు పోరంబోకు భూమిలో మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు తెలిపారు. అనంతరం రెవెన్యూ అధికారులు రేణింగవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మట్టి తవ్వకాలు జరుపుతున్న వారితో మాట్లాడామని, వాటిని జరపబోమని లిఖిత పూర్వకంగా తెలిపినట్లు ఎస్సై వినోద్‌బాబు తెలిపారు.

జగన్ పుట్టిన రోజు వేడుక

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకను ఆ పార్టీ నాయకులు ఆదివారం గడియారస్తంభం వద్ద నిర్వహించారు. కేకు కోసి, మిఠాయిలు పంచారు.

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్లలో నిర్వహించిన కార్యక్రమంలో వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ పాల్గొన్నారు. కేకు కోసి అందరికీ పంచారు. నేతలు వైవీ భద్రారెడ్డి, పాలపర్తి శ్రీధర్, కోయి అంకారావు, బి.ఎలిశమ్మ, పేరం నాగలక్ష్మి పాల్గొన్నారు.

(c) eenadu

పేదల కడుపు చల్లగా..!

బియ్యం, చక్కెరతో పాటు గోధుమ పిండి, జొన్నలు, రాగుల కేటాయింపు

పుంగనూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పౌర సరఫరాల వ్యవస్థలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. స్మార్ట్ రేషన్ కార్డులు, ఎఫ్ ఆర్ కిట్లను తీసుకొచ్చింది. ప్రస్తుతం చౌక దుకాణాల్లో బియ్యం, చక్కెరతో పాటు గోధుమ పిండి, జొన్నలు, రాగులు అందించనున్నారు. గోధుమ పిండి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 60 ఉండగా.. ప్రభుత్వం కిలో రూ. 16 కే అందిస్తోంది. పంపిణీలో అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని డీఎస్వో శంకరన్ తెలిపారు.

జిల్లా వివరాలిలా..
- **రేషన్‌కార్డులు:** 5.43లక్షలు
- **చౌక దుకాణాలు:** 1,379
- **గోధుమ పిండి:** 37 టన్నులు (చిత్తూరుకు మాత్రమే)
- **జొన్నలు:** 250 టన్నులు
- **రాగులు:** 350 టన్నులు

గంగమ్మా.. దయచూపమ్మా

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బోయకొండపై గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి.. ఆదిశక్తిని దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, బోయకొండ (చౌడేపల్లె)

104FM Tirupati
ఈ FM 104 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
8008555167, 9154991499

కుర్రకారు..
ఆలోచనల ప్రయాణం

తిరుపతి ఇన్నోవేషన్ సొల్యూషన్స్ సభ్యులు ఎన్. సంతోష్ కుమార్, వంశీకృష్ణ వీరు. రతన్ టాటా అభిమానులు. ఈ నెల 28వ తేదీన రతన్‌టాటా జయంతి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి నుంచి ముంబయికి సోమవారం ఈ నానో కారులో వీరితోపాటు మరో ఇద్దరు తమ ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు. 1200 కి.మీ ప్రయాణించి 28వ తేదీకి టాటా అంకుర ఆలోచనల ట్రస్టుకు చేరుకోనున్నారు. అక్కడ తమ ఆలోచనలను సంస్థకు వివరిస్తారు. వారికి నచ్చితే తమ ఆలోచనలకు ఓ రూపం వస్తుందని ఈ ప్రయాణం చేపట్టినట్లు వీరు వివరించారు. – **ఈనాడు, తిరుపతి**

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, తిరుపతి(తితిదే) న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 78,466 మంది దర్శించుకున్నారు.

16 వేల టోకెన్ల జారీ

తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం 16 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం వేకువజామున 3 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు 2 వేల టోకెన్లు ఇచ్చారు.

కాలువల్లోకి రూ.లక్షలు..
ఇళ్లలోకి దోమలు

పరిశీలన

పుత్తూరు, బంగారుపాళ్యం, జీడీ నెల్లూరు, కార్వేటినగరం, న్యూస్‌టుడే: ఇటీవల వర్షాలతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీ స్థలాల్లో నీరు చేరి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారిపోయాయి. పలు ప్రాంతాల్లో కాలువలు లేకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. దీంతో ప్రజలకు దోమలతో సావాసం తప్పడం లేదు. కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పర్యటించే సమయంలో వారి దృష్టికి సమస్యలు తీసుకొస్తే ఫాగింగ్‌తో మమ అనిపిస్తున్నారు.

పుత్తూరులో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం

రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా..

● తిరుపతి నగరపాలక సంస్థలో గత ప్రభుత్వ పాలనలో రూ. 36 లక్షలతో మూడు యంత్రాలు కొనుగోలు చేసి ఫాగింగ్ చేస్తున్నారు. కానీ దోమలు తగ్గడం లేదు. భూగర్భ కాలువ వ్యవస్థతో మలాథియాన్ పిచికారీ చేసే వీలు లేకపోవడంతో సమస్య ఏర్పడింది. నగరంలోని చాలా ప్రాంతాల్లో కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి. ● గూడూరులో 2, నాయుడుపేటలో 6, శ్రీకాళహస్తిలో 6 యంత్రాలు వినియోగంలో ఉన్నాయి. రూ. 15 లక్షల వరకు ఏటా ఖర్చవుతోంది. ● చిత్తూరు నగరంలో 10 ఫాగింగ్ యంత్రాలున్నాయి. ఏటా రూ. 5 లక్షల వరకు ఖర్చు అవుతోంది. ● పుత్తూరులో రెండు యంత్రాల్లో ఒకటే పని చేస్తోంది. పలమనేరు, పుంగనూరు, కుప్పంలో 12 యంత్రాలతో దోమల నియంత్రణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఏటా రూ. 12 లక్షల వరకు ఖర్చవుతోంది. ఫ్రైడే-డ్రైడే నిర్వహిస్తున్నా పరిసరాలు శుభ్రం చేయడం లేదు. దోమలు అదుపులోకి రావడం లేదు.

మలాథియన్ తక్కువ..

ఫాగింగ్ యంత్రాల్లో మలాథియాన్, కిరోసిన్ కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుతం మలాథియాన్ కంటే కిరోసిన్ అధికంగా వాడుతున్నారు. దీంతో దోమలు నియంత్రణలోకి రావడం లేదు. దోమల ఆవాస కేంద్రాలుగా ఉండే మురుగు గుంతల్లో ఆయిల్ బంతులు వేయాల్సి ఉన్నా ఎక్కడా ఆ చర్యలు కనిపించడం లేదు. గతంలో పురపాలికలే మలాథియాన్ కొనుగోలు చేసేవి. ప్రస్తుతం ఇండెంట్ పెడితే పుర అధికారులు పంపిస్తున్నారు. వాటిలో నాణ్యత లెక్కించడం కష్టంగా మారింది.

పట్టణాలు:

చిత్తూరు జిల్లా: చిత్తూరు, నగరి, కుప్పం, పలమనేరు, పుంగనూరు

తిరుపతి జిల్లా: తిరుపతి, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట

ఫాగింగ్‌లో నిర్లక్ష్యం వద్దు..

నగరాలు, పురపాలికల్లో ఫాగింగ్ పక్కాగా చేపట్టాలి. శీతాకాలంలో అన్ని ప్రాంతాల్లోనూ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా యంత్రాలు పాడైతే బాగు చేయాలని సూచించాం. ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే వివరాలు సేకరించి చర్యలు చేపడతాం.

- నాగరాజు, మున్సిపల్ ఆర్డీ

రెండు చుక్కలు.. సంపూర్ణ ఆరోగ్యం

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: రెండు చుక్కల మందుతో చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ తెలిపారు. చిత్తూరు నగరపాలక కార్యాలయంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ.. ఆదివారం 1,415 బూత్‌లలో కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

- మొత్తం కేంద్రాలు: 1,415
- ఐదేళ్లలోపు పిల్లలు: 2,21,502 మంది
- చుక్కల మందు వేసింది: 1,84,648 మందికి
- శాతంలో: 83.86
- ఇంకా వేయాల్సింది: 36,854 మందికి

చంటి బిడ్డకు పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్

వంతెన.. ప్రమాదం అంచున

బీఎన్‌ఆర్‌పేట నుంచి గంగాధరనెల్లూరు మండలం నీవానది పరివాహక ప్రాంతానికి వెళ్లే మార్గంలోని తాత్కాలిక వంతెన కుంగిపోయింది. ఇటీవల వర్షాలతో పలు చోట్ల కొట్టుకుపోయింది. తాత్కాలిక మరమ్మతుల్లో భాగంగా అధికారులు రూ. 10 లక్షలతో బాగు చేశారు. తర్వాత నీటి ప్రవాహం పెరగడంతో యథాస్థితికి చేరింది. దీంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు భయాందోళన చెందుతున్నారు.

– న్యూస్‌టుడే, చిత్తూరు గ్రామీణం

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలియజేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అన్ని శాఖల అధికారులు అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు.

ఏఆర్ కార్యాలయంలో..

చిత్తూరు (నేరవార్తలు), న్యూస్‌టుడే: జిల్లా ఏఆర్ (పాత డీపీవో) కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ నిర్వహిస్తామని పోలీసు అధికారులు చెప్పారు. ప్రజలు సమస్యలను ఫిర్యాదుల రూపంలో అందించి న్యాయం పొందాలని సూచించారు. వారం రోజుల్లో పరిష్కారం చూపాలే చర్యలు తీసుకుంటామన్నారు.

విధేయతకు పట్టం

- కలిసొచ్చిన సామాజిక సమీకరణలు
- చిత్తూరు పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడిగా షణ్ముగరెడ్డి

పుత్తూరు, చిత్తూరు (జిల్లా పంచాయతీ), తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: పార్టీకి విధేయతతో పనిచేయడం, సామాజిక సమీకరణలను తెదేపా అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుని చిత్తూరు, తిరుపతి పార్లమెంట్‌లకు అధ్యక్షులను ఆదివారం ప్రకటించింది. మంగళవారం సాయంత్రమే తెదేపా పార్లమెంట్ అధ్యక్షుల జాబితాను రూపొందించి సీఎం చంద్రబాబునాయుడు ముందు ఉంచారు.

సేవలకు తగిన గుర్తింపు..

సునీల్ కుమార్ చౌదరి (ప్రధాన కార్యదర్శి)

● చిత్తూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా నియమించిన సునీల్‌కుమార్‌చౌదరిది తవణంపల్లె మండలం కొండ్రాజుకాల్వ గ్రామం. ఆయన గతంలో వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా, తవణంపల్లె క్లస్టర్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

1999 నుంచి పార్టీ సేవలో..

షణ్ముగరెడ్డి (అధ్యక్షుడు)

● చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా షణ్ముగరెడ్డి (బీసీ, వన్నెకుల క్షత్రియ) పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. 1999 పార్టీలోకి వచ్చిన ఈయన పుత్తూరు పట్టణ తెదేపా ప్రధాన కార్యదర్శిగా, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శిగా, చిత్తూరు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడిగా వ్యవహరించారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో యువగళం పాదయాత్ర సందర్భంగా షణ్ముగరెడ్డి బీసీ సదస్సులు నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పార్టీ అవకాశం కల్పించింది. అదే సమయంలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌తో 2018 నుంచి వెన్నంటి ఉన్నారు. ఇవన్నీ ఆయనకు కలిసి వచ్చాయి.

అమృతమూర్తికి
కన్నీటి వీడ్కోలు

మూర్తీభవించిన వ్యక్తిత్వం, అమోఘ సౌశీల్యత,
అపరమిత సహనం, కల్పవృక్ష స్వభావం,
మహోన్నత మార్గదర్శకత్వంతో మా అందరి వెన్నంటవుండి
మమ్ములను ముందుకు నడిపించి, మా ఉన్నతికి కారకులైన
అజాత శత్రువు, సహృదయులు, మా ఇంటి దైవం
శ్రీ యల్లంటి మునిరత్నం నాయుడు గారు
21-12-2025వ తేది ఆదివారం సా॥ 6.00 గంటలకు
వైకుంఠప్రాప్తి చెందినారు.

వీరి దహనక్రియలు
22-12-2025వ తేది సోమవారం మ॥ 3.00 గం॥లకు
శ్రీనివాసపురంలోని స్వగృహము నుండి అంతిమయాత్రగా బయలుదేరి
తిరుపతి అక్కారంపల్లి వద్దనున్న గోవింద దామం నందు
జరుగునని తెలియజేయడమైనది. భాదాతప్త హృదయాలతో ...

భార్య : యల్లంటి భానుమతి
మరదళ్ళు - తోడళ్ళులు
దుత్తులూరి ఇందుమతి
లేట్ దుత్తులూరి గోవర్ధన్ నాయుడు
బత్తల సుశీల
డా॥ బత్తల రామచంద్రన్, నాగలాపురం
కస్తూరి వసుమతి
కస్తూరి జనార్ధన్

యల్లంటి సతీష్ - యల్లంటి భార్గవి
రావూరి బిందు మాదవి - రావూరి రఘు
వసంత శిరీష - వసంత మురళీకృష్ణ
బత్తల శ్రావణ్ కుమార్ - బత్తల రూప
కస్తూరి వంశీ - కస్తూరి సౌమ్య
కస్తూరి భరత్ - కస్తూరి మృదుల
మనుమలు, మనుమరాళ్ళు మరియు
కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

శ్రీ యల్లంటి మునిరత్నం నాయుడు గారు
Retd., ADE, APSEB, Tirupati

డోర్ నెం. 2-62, శ్రీనివాస పురం, తిరుచానూరు రోడ్డు, తిరుపతి
మొబైల్ : 9845315491

(c) eenadu

ఆలయ దర్శిని

కాణిపాకం వరసిద్ధుడి వినాయక ఆలయంలో

నిజరూప దర్శనం: ఉ.: 7-7.30, 8.30-9.00, 10.30-11.00, సా. 4.30- 5.00

సర్వదర్శనం: ఉ: 6- 7, 8-8.30, 9.30 -10.30, మధ్యాహ్నం: 12.00 సాయంత్రం: 4.30, రాత్రి: 7-9 గంటలు.

నిత్య సేవలు

సుప్రభాత సేవ, గోపూజ: వేకువజామున 4.00 బిందుతీర్థ అభిషేకం: 4.30 పంచామృతాభిషేకాలు: ఉ.5.30 ప్రథమ, 9.00 ద్వితీయ, 11.00 తృతీయ కాలాభిషేకాలు క్షీరాభిషేకం: ఉదయం 7.30, సాయంత్రం 5.45 ప్రమాణం: సాయంత్రం 5.00 గంటలు. నిత్య కల్యాణం: 11.00 గంటలకు (ప్రత్యేక మండపంలో)

– న్యూస్‌టుడే, కాణిపాకం

తిరుమల శ్రీవారి ఆలయంలో

నిత్యోత్సవాలు

రోజూ తెల్లవారు జామున 3 గంటలకు తిరుప్పావై పారాయణం నిర్వహిస్తారు. మంగళ, బుధ, గురువారం ఉ.3.45కు తోమాలసేవ, 4.45కు అర్చన, మ.12కు కల్యాణోత్సవం, 2 డోలోత్సవం, 3 ఆర్జిత బ్రహ్మోత్సవం, సా.5 సహస్ర దీపాలంకార సేవ నిర్వహిస్తారు.

సర్వదర్శనం: తెల్లవాజామున 3.30-5.45, ఉ.8-9.30 గంటలకు, మధ్యాహ్నం 12 నుంచి రాత్రి వరకు సర్వదర్శనానికి అనుమతిస్తారు.

వారోత్సవాలు

ప్రతి సోమవారం విశేషపూజ (ఏకాంతం), మంగళవారం అష్టదళ పాదపద్మారాధన సేవను ఉదయం 9 గంటలకు నిర్వహిస్తారు. బుధవారం సహస్ర కలశాభిషేకాన్ని తితిదే రద్దు చేసింది. గురువారం ఉదయం 6.30 గంటలకు తిరుప్పావడ సేవ, శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు శ్రీవారికి అభిషేకం నిర్వహిస్తారు.

–న్యూస్‌టుడే, తిరుమల

ముక్కంటి ఆలయంలో

ఉదయం: 3.00: పురవీధుల్లో జేగంట, 4.00: మంగళవాయిద్యాలు, 4.15: గోమాత పూజ, తిరుమంజనం, 5.00: ప్రథమకాల అభిషేకం (ఏకాంతం), 6.00: ద్వితీయ కాలాభిషేకం, 7.00: పరివార దేవతలకు నివేదన, 7.30: గొబ్బిదేవత పురవీధుల ఉత్సవం, 10.30: ఉచ్చికాల అభిషేకం

సాయంత్రం: 5.00:ప్రదోష కాలాభిషేకం 6.30: నీరాజన మంత్రపుష్పం

సర్వదర్శనం: ఉదయం 5 నుంచి రాత్రి 8.30 గంటల వరకు.

రాహు, కేతు పూజలు

ఉ. 6 నుంచి సా.5 గంటల వరకు

అభిషేకాలు: శ్రీమృత్యుంజయ శివలింగానికి (సోమవారం), కాలభైరవునికి (మంగళవారం), శ్రీమేధా దక్షిణామూర్తికి (గురువారం), శనిభగవానునికి (శనివారం), సూర్యనారాయణమూర్తికి (ఆదివారం). శుక్రవారం: మనోన్మణికి ఊంజల్‌సేవ

● శుక్ర, శని, ఆది, సోమవారాల్లో రాత్రి 9.00 గంటలకు, మంగళ, బుధ, గురువారాల్లో రాత్రి 8.30కు పల్లియర పూజ నిర్వహిస్తారు.

– న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

ప్రసన్న వేంకటేశ్వరునికి రూ.10 లక్షల విరాళం

డీడీ అందజేస్తున్న దాత డాక్టర్ చైతన్య

వడమాలపేట, న్యూస్‌టుడే: మండలంలోని అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన దాత విరాళం ఇచ్చారు. అన్నప్రసాద వితరణకు సంబంధించి రూ.10 లక్షల డీడీని ఆలయాధికారి వేణుగోపాల్‌రాజుకు డాక్టర్ చైతన్య అందజేశారు. అనంతరం దాతకు స్వామి వారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు.

నేడు వైకుంఠ ద్వార దర్శనాలపై ఉన్నతస్థాయి సమీక్ష

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో ఈనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు పది రోజులపాటు జరుగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై సోమవారం తిరుమలలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరుగనుంది. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి అనిత, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి ఆధ్వర్యంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు. భక్తుల భద్రత, దర్శన ఏర్పాట్లపై చర్చించనున్నారు.

83.36 శాతం మందికి పోలియో చుక్కలు

చిత్తూరు (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొదటి రోజు 1,84,648 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు. 83.36 శాతం లక్ష్యం పూర్తి చేశామన్నారు. జిల్లాలో అయిదేళ్లలోపు పిల్లలు 2,21,502 మంది ఉన్నారని, మరో 36,854 మందికి సోమ, మంగళవారాల్లో వేయనున్నట్లు చెప్పారు.

ముగిసిన రెవెన్యూ క్రీడలు

చిత్తూరు (క్రీడలు), న్యూస్‌టుడే: చిత్తూరులోని మెసానికల్ మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న రెవెన్యూ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీలను కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షించారు. క్రికెట్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, టెన్నిస్, క్యారమ్స్, చెస్, పరుగు పందెం పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. శిక్షణ కలెక్టర్ నరేంద్రపాడల్, డీఆర్‌వో మోహన్‌కుమార్, ఆర్డీవోలు పాల్గొన్నారు.

నేడు, రేపు పాలిటెక్నిక్ విద్యార్థులకు..

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమ, మంగళవారాల్లో రీజినల్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ పోటీలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 16 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

వసతిగృహ విద్యార్థులకు ముస్తాబు

■ కాస్మొటిక్ ఛార్జీలకు స్వస్తి ■ కిట్ల రూపంలో అందించనున్న వస్తువులు

చిత్తూరు జిల్లా పంచాయతీ, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాస్మొటిక్ ఛార్జీలు చెల్లించే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనున్నట్లు సమాచారం. దీనికి బదులుగా ముస్తాబుకు అవసరమైన 12 రకాల వస్తువులతో కూడిన కిట్లు రెండు నెలలకు ఒకసారి నేరుగా విద్యార్థులకు అందచేసే దిశగా సంక్షేమ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

వసతిగృహం

కిట్లలో 12 రకాలు

తరగతుల వారీగా ప్రభుత్వం అందజేస్తున్న కాస్మొటిక్ ఛార్జీలను మూడు కేటగిరీలుగా విభజించి 12 రకాల వస్తువులను కిట్ల ద్వారా విద్యార్థులకు అందించాలని సర్కారు యోచిస్తున్నారు. 5, 6 తరగతులకు 11 రకాలు, 7- ఇంటర్ వరకు 12 రకాల వస్తువులతో కూడిన కిట్లు సరఫరా చేసే అవకాశం ఉంది. కొబ్బరి నూనె, టూత్‌బ్రష్, పౌడర్, సబ్బు, వ్యాజలిన్, టూత్‌పేస్ట్, టంగ్ క్లీనర్, షాంపు డిటర్జెంట్ సబ్బు, వాషింగ్ పౌడర్, బాలికలకు హెయిర్ బ్యాండ్, రిబ్బన్, రబ్బర్ బ్యాండ్‌లను అదనంగా ఇవ్వనున్నారు. బాలురకు కిట్‌తో పాటు క్షౌరానికి అదనంగా రూ.50 చొప్పున రెండు నెలలకు కలిపి రూ.100 ఇవ్వనున్నట్లు సమాచారం.

నగదు జమతో ఇబ్బందులు

జిల్లాలో 67 వరకు సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో 9,500 వేల మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. వీరికి గతంలో ప్రతి నెల కాస్మొటిక్ ఛార్జీలు నగదు రూపంలో చెల్లించేవారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత కాస్మొటిక్ ఛార్జీలను తల్లుల ఖాతాలో జమ చేసేవారు. విద్యార్థులు చదువుతున్న సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు మారుమూల ప్రాంతంలో ఉండటం వల్ల ఖాతాల్లో జమ చేసిన కాస్మొటిక్ నగదు సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బంది పడేవారు. కొందరు తల్లులు కుటుంబ అవసరాలకు నగదును వాడుకోవడంతో విద్యార్థులు ఉపయోగించుకోలేక పోయేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు కిట్లను అందించనున్నారు.

వివరాలిలా..

సంక్షేమ వసతి గృహాలు: 57
విద్యార్థులు: 3500
గురుకులాలు: 10
విద్యార్థులు: 6,000

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిద్ధార్థ వర్మ, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ఉమా దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కూడా స్వామిని దర్శించుకున్నారు.

కుటుంబసభ్యులతో జస్టిస్ ఎంజీ ఉమా

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నయనాల జయసూర్య వాయులింగేశ్వరుడిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో దర్శనార్థం వచ్చిన వీరికి ఆదివారం స్థానిక న్యాయమూర్తులు, ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాదం అయ్యాక తీర్థ ప్రసాదాలు అందజేశారు. ముక్కంటిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చలపతిరావు, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేలుమురుగన్, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్యామసుందర్ కుటుంబ సభ్యులతో వేర్వేరుగా దర్శించుకున్నారు

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నయనాల జయసూర్యతో న్యాయమూర్తులు, ఆలయ అధికారులు

'కరెంటోళ్ల జనబాట'కు ఏపీఎస్పీడీసీఎల్ శ్రీకారం

తిరుపతి (నగరం), పాకాల, న్యూస్‌టుడే: ఏపీఎస్పీడీసీఎల్ మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు సీఎండీ శివశంకర్ 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమానికి రూపకల్పన చేశారు. సోమవారం పాకాల మండలం కృష్ణాపురంలో ఈ కార్యక్రమాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఉద్యోగులు స్వయంగా గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి పరిష్కరించనున్నారు. పాకాల మండలం మొగరాలలో రూ.4.50 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను మంత్రి సోమవారం ప్రారంభించనున్నారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొని కారుణ్య నియామకాల కింద 50 మందికి ఉత్తర్వులు అందజేయనున్నారు.

తిరుమలలో దివ్యౌషధ వనం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని జీఎన్‌సీ టోల్‌గేట్‌కు సమీపంలో 3.5 ఎకరాల్లో దివ్యౌషధ వనాన్ని ఏర్పాటు చేసేందుకు తితిదే నిర్ణయించింది. దాదాపు రూ.4.25 కోట్ల అంచనాలతో ఏర్పాటు చేయనున్న ఈ వనంలో దాదాపు 1500లకు పైగా ఆయుర్వేద, వారసత్వ జీవావరణ మొక్కలను పెంచనున్నారు. వనంలోకి ప్రవేశించిన భక్తుడికి ఔషధ మొక్కలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా ప్రణాళికలు రూపొందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా భక్తుల ప్రవేశం, నిష్క్రమణ, పార్కింగ్ ప్రదేశాలను, అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

ఉద్యానవనంలో పెంచుతున్న ఔషధ మొక్కలు

త్వరలో పనులు

సీఎం చంద్రబాబు సూచనలతో ఈ వనాన్ని ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. 2026లో భక్తులకు అందుబాటులోకి తెస్తాం.

- బీఆర్ నాయుడు, తితిదే ఛైర్మన్

ప్రత్యేక థీమ్ పార్కులా ఏర్పాటు

ఈ వనంలో ప్రధానంగా ఆయుర్వేదంలో వైద్యానికి ఉపయోగించే మొక్కలతో దేహచికిత్స వనం, సుగంధ పరిమళాలు వెదజల్లే మొక్కలతో సుగంధవనం, పూజలకు ఉపయోగించే మొక్కలతో పవిత్ర వనం, ప్రసాదాల తయారీకి ఉపయోగించే మొక్కలతో ప్రసాదవనం, పూజలకు ఉపయోగించే మొక్కలతో పూజా దివ్యవనం, పరిమళాలు వెదజల్లే మొక్కలతో సువాసన వనాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకమైన థీమ్‌లో భాగంగా ఔషధవనం, జీవరాశివనం, కల్పవృక్షధామం, ఔషధి కుండం, పవిత్ర వృక్షాలు, హెర్బల్ టీమీ పెవిలియన్‌ను, మూలికా వనం, రుతు వనం, మాసాల మొక్కల వనం, అరుదైన వృక్షాల వనాన్ని ఏర్పాటు చేస్తారు. స్టేట్ ఆఫ్ ఆర్ట్‌తో ఈ వనం ఏర్పాటు చేయనున్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక

అద్దంకి, జె.పంగులూరు, న్యూస్‌టుడే: అండర్-18 రాష్ట్రస్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు బాపట్ల జిల్లా పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. వీటిలో ఉత్తమ ఆట తీరు ప్రదర్శించిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు మేకల సీతారామిరెడ్డి, ఖోఖో సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హనుమంతరావు ఆదివారం తెలిపారు. **బాలుర జట్టు:** డి.వరుణ్, టి.సూర్యనారాయణ (చిత్తూరు), **బాలికల జట్టు:** లక్ష్మి, అమృత, గుణవతి(చిత్తూరు) ఎంపికయ్యారు.

సైకిల్ తొక్కండి.. ఆరోగ్యంగా ఉండండి

రాయితీపై లబ్ధిదారులకు త్వరలో అందించనున్న ఈ-సైకిళ్లను కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదివారం పరిశీలించారు. నగరపాలక కార్యాలయంలో వీటిని అందుబాటులో ఉంచారు. అందరూ సైకిల్ తొక్కుతూ ఆరోగ్యంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే సైకిళ్లను తొక్కారు. నగర మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, కమిషనర్ నరసింహప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

ఆగిన నిర్మాణాలు.. అడవిలా పొదలు..!

శాంతిపురం మండలం మఠం పంచాయతీలో వైకాపా హయాంలో చేపట్టిన గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, ఆయుష్మాన్ కేంద్ర భవనాలు నిధుల కొరతతో ఆగిపోయాయి. మూడేళ్లుగా భవనాల చుట్టూ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పరిసరాలు చిన్నపాటి అడవిని తలపిస్తూ.. విషసర్పాలకు నిలయంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, శాంతిపురం

ముక్కంటి చెంత 'కొండ'ంత జనం

వాయులింగ క్షేత్రమైన శ్రీకాళహస్తి ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరున్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఉదయం నుంచి క్యూలైన్లు నిండిపోయాయి. తిరుమలేశుని దర్శనార్థం వచ్చిన భక్తులు ఇక్కడికి రావడంతో రద్దీ నెలకొంది. రాత్రి ఆలయం మూత వేసే సమయానికి దాదాపు 27 వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. 4,360 రాహు, కేతు పూజలు జరిగాయి. ప్రవేశ దర్శనం, ప్రసాద విక్రయ టికెట్లు భారీగా అమ్ముడుపోయాయి.

- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి

పాఠం వినాలా.. పైన చూడాలా..?

పుంగనూరు మండలం కీలకిరి ప్రాథమిక పాఠశాలలో 21 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఒకటే తరగతి గది ఉంది. అది కూడా ఉరుస్తూ పెచ్చులూడటంతో విద్యార్థులు భయాందోళన నడుమ పాఠాలు వింటున్నారు. పైగా ఒకటి నుంచి ఐదు తరగతులూ అందులోనే నిర్వహించాల్సిన పరిస్థితి. వంట గది కూడా శిథిలావస్థకు చేరింది. ఈ అసౌకర్యాలతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ఎంఈవో నటరాజరెడ్డిని వివరణ కోరగా.. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. - న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: మిద్దెపై నుంచి టెంకాయలు కోసేందుకు యత్నించిన వ్యక్తికి విద్యుత్తు తీగలు తగలడంతో మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. పుంగనూరు మండలం ఎల్లారబైలుకు చెందిన గువ్వల శ్రీనివాసులురెడ్డి(34) నిమ్మనపల్లె మండలం దిగువపల్లెలో స్థిరపడ్డారు. టెంకాయలు కోసేందుకు మిద్దెపైకి వెళ్లగా చెట్టుకు ఆనుకుని ఉన్న తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్తు శాఖ నిర్లక్ష్యంతోనే శ్రీనివాసులురెడ్డి మృతి చెందారని న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించారు.

రోడ్డు ప్రమాదంలో మరొకరు..

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. నల్లాపల్లికి చెందిన గోవిందరెడ్డి కుమారుడు చిరంజీవి (38) ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై కొత్తపల్లిమిట్టకు బయలుదేరారు. కన్నికాపురం వద్ద చిత్తూరు- పుత్తూరు మార్గంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. తీవ్రగాయాలైన చిరంజీవి అక్కడకక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్య

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: మండలానికి చెందిన బాలుడు(16) తల్లి మందలించడంతో క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల మేరకు.. బాలుడు చౌడేపల్లెలో పదో తరగతి చదువుతూ అక్కడే వసతి గృహంలో ఉంటున్నాడు. వసతిగృహం నుంచి శనివారం ఇంటికి వచ్చాడు. ఇంట్లో చరవాణి చూస్తుండటంతో తల్లి మందలించింది. వెంటనే బయటకు వచ్చి ఇంటికి గడియ వేసి వరండాలో బాలుడు ఉరేసుకున్నాడు. వెంటనే తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించగా. . చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

చదరంగం ఛాంపియన్ ముంబయి ఐఐటీ

ముగిసిన అంతర ఐఐటీ క్రీడాపోటీలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి ఐఐటీ వేదికగా జరుగుతున్న 58వ అంతర ఐఐటీ క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. దేశంలోని పలు ఐఐటీల విద్యార్థులు చదరంగం, వెయిట్ లిఫ్టింగ్, టెన్నిస్ క్రీడల్లో తలపడ్డారు. చదరంగంలో ఐఐటీ ముంబయి ఛాంపియన్‌గా నిలిచింది. ఐఐటీ మద్రాస్, ఖరగ్‌పూర్, పాట్నా ఐఐటీలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. ■ టెన్నిస్ మహిళా, పురుషుల విభాగంలో ఐఐటీ మద్రాస్ ఛాంపియన్‌గా అవతరించింది. ■ బాడీవెయిట్ 60, 65, 71, 79 కిలోల పైబడిన విభాగాల్లో ఐఐటీ రూర్కీ విజేతగా నిలిచింది. 79 కిలోల విభాగంలో ఐఐటీ కాన్పూర్ అగ్రస్థానం సాధించింది. ■ వెయిట్ లిఫ్టింగ్‌లో ఐఐటీ రూర్కీ ఛాంపియన్‌గా నిలిచింది. ■ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ, మద్రాస్ ఐఐటీ డీన్ ప్రొఫెసర్ అశ్విన్ మహాలింగం విజేతలకు బహుమతులు అందజేశారు. అంతర ఐఐటీ క్రీడా పోటీలతో విద్యార్థుల్లో స్నేహభావం మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ, అశ్విన్ మహాలింగం

అన్నను హత్య చేసిన తమ్ముడు

గుర్రంకొండ, న్యూస్‌టుడే: గుర్రంకొండ పంచాయతీ మగ్బీరాలో తాగిన మైకంలో అన్నదమ్ములు గొడవ పడి.. తమ్ముడు అన్నను హత్య చేసిన ఉదంతం శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వాల్మీకిపురం సీఐ రాఘవరెడ్డి వివరాల మేరకు.. మగ్బీరాకు చెందిన షేక్ సాధిక్(26), షేక్ రఫీ(23) అన్నదమ్ములు. సాధిక్ తిరుపతిలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమ్ముడు రఫీ స్థానికంగా పనులకు వెళ్లేవాడు. శనివారం అర్ధరాత్రి తాగిన మైకంలో రఫీ, సాధిక్ ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో సాధిక్ మృతి చెందాడు.

సముద్రంలో మునిగి ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం



యుగంధర్‌రెడ్డి (పాత చిత్రం)

కోట, న్యూస్‌టుడే: శ్రీనివాససత్రం సమీపంలోని బంగాళాఖాతంలో ఆదివారం నెల్లూరు గ్రామీణ మండలం కొత్త ఎల్ఎన్‌టీ గ్రామానికి చెందిన యుగంధర్‌రెడ్డి(21) అలల ధాటికి మునిగి మృతి చెందాడు. ఎస్సై పవన్‌కుమార్ వివరాల మేరకు నెల్లూరు గ్రామీణ మండలం కొత్త ఎల్ఎన్‌టీ గ్రామానికి చెందిన సురేష్ కుమార్‌రెడ్డి కుమారుడైన యుగంధర్‌రెడ్డి గూడూరులోని నారాయణ కళాశాలలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సరదాగా గడపాలని యుగంధర్‌రెడ్డి తన నలుగురు స్నేహితులతో కలిసి శ్రీనివాససత్రం సమీపంలోని తీరానికి వెళ్లారు. సముద్రంలో హఠాత్తుగా వచ్చిన అలలు యుగంధర్‌రెడ్డితో పాటు మరో విద్యార్థిని లాక్కొని వెళ్లాయి. యుగంధర్‌రెడ్డి విగతజీవిగా సముద్రం ఒడ్డుకు చేరాడు. మరో విద్యార్థి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించారు.

నూతన నియామకం

జ్ఞానశేఖర్

పూతలపట్టు, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ శాఖ పొరుగు సేవల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా మండలంలోని పి.కొత్తకోట వసతి గృహ ఉద్యోగి జ్ఞానశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీ ఎన్జీవోల రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ పొరుగుసేవల ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నికైనట్లు ఆయన చెప్పారు.

నూతన కార్యవర్గ సభ్యులతో నాయకులు

నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా కార్యవర్గం ఎన్నిక

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: జిల్లాలోని నాలుగో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట చెన్నప్ప ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాసులు (ఇరిగేషన్), సహాధ్యక్షుడు- ఎ.పి.రాజా (వాణిజ్య పన్నుల శాఖ), ఉపాధ్యక్షులు- జయచంద్ర (పశుసంవర్ధక), బ్రహ్మయ్య (వ్యవసాయ), కార్యదర్శి- లోకనాథన్ (ఆర్అండ్‌బీ), సంయుక్త కార్యదర్శులు- ఉషారాణి (ఎస్సీ సంక్షేమం), భాస్కర్ (రవాణా), ప్రచార కార్యదర్శి- నవీన్‌సాయి (జడ్పీ), కోశాధికారిగా రామచంద్రయ్య (ఇరిగేషన్ డీఈఈ శాఖ) ఎన్నికయ్యారు. వీరు మూడేళ్లపాటు పదవిలో ఉంటారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు ఇ.సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో విజేతలు ప్రకాశం, చిత్తూరు

అద్దంకి, జె.పంగులూరు, న్యూస్‌టుడే: అండర్-18 రాష్ట్రస్థాయి ఖోఖో ఫైనల్ పోటీల్లో బాలుర విభాగంలో ప్రకాశం, కృష్ణా జిల్లాల మధ్య జరిగిన పోరులో ప్రకాశం జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో కృష్ణా, మూడో స్థానంలో చిత్తూరు, విశాఖపట్నం జట్లు సంయుక్తంగా నిలిచాయి. బాలికల విభాగంలో చిత్తూరు, శ్రీకాకుళం జట్లు తలపడగా చిత్తూరు విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ఎం.యువశ్రీ (చిత్తూరు) నిలిచింది.

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE : 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆ 9381287629.

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ క.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

MARRIAGE SERVICES

Reddy Boy, B.Tech (M) 7.2 LPA, 32 Yrs, Bharani, Wheatish, Employed in Chennai, Propertied wants Graduate Girl of Non-IT, Unemployed, Middle Class, Telugu Speaking Reddy/ Naidu (Second Marriage with Genuine Background is Acceptable). Ct- BCB. Reddy. ✆ 9444391787.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

చంద్రగిరి-తిరుపతిలో అంతర్భాగంగా గ్రేటర్ తిరుపతిలో కలవబోతున్న చంద్రగిరి టౌన్‌లో ఒకవైపు కాలేజ్ మరొకవైపు అమ్మవారి టెంపుల్‌కి దగ్గరలో 100 అడుగుల రోడ్డుకు TUDA అప్రూవల్స్ లే అవుట్ నందు వెంటనే హౌస్, అపార్ట్‌మెంట్ కట్టుకునే PLOTS అమ్మబడును. 9505502346.

JOBS

GRID PLUS Solar Energy Wanted Sales Executives @ Tirupati. Exp. 1-2 Years, Edu: Degree/ Diploma/ Inter. Cont: 96663 66205.

Urgent Requirement For Facility Management Company House Keeping Staff, Guest Room Attendants, Kitchen Stewarding Staff Vacancy In Star Hotel in Tirupati, Fresher/ Experience Attractive Salary Includes ESI, PF, Insurance, Food & Accommodation Provided. 9092665040, 8056799288.

USAలో 2y బాబును చూసుకోవడానికి వీసా కల్గిన ఆడ కేర్‌టేకర్ కావలెను. జీతం + భోజనం + ఉచిత వసతి. ✆ 92469 98571, 92469 99571.

HYD యూనిట్ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

ప్రముఖ కంపెనీలో టీం లీడర్స్‌గా చిత్తూరు, తిరుపతి, మదనపల్లి ఏరియాలలో P/F పనిచేయుటకు M/F కావలెను. Q: డిగ్రీ, MBA, MCA. ✆94403 51657.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS THE WAY

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు...

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

సాయినాథుని పల్లకి సేవ

ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పెనుమూరు, న్యూస్‌టుడే: పెనుమూరులో షిర్డీసాయి పల్లకి సేవ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయి సత్సంగం కేంద్రం 15వ వార్షికోత్సవం సందర్భంగా సాయిబాబా, శరత్ బాబాజీ చిత్రపటాలను అలంకరించి ఊరేగించారు. పిల్లలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

ముక్కళుత్తూరు అమ్మకు విశేష పూజలు

పాలసముద్రం మండలంలోని జీపీఎస్ కండ్రిగలో ముక్కళుత్తూరు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో విశేష పూజలు చేశారు. ఉదయం ప్రత్యేక హోమాలు, అభిషేకం, ఊయల సేవ నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. – న్యూస్‌టుడే, పాలసముద్రం

త్వరలో గ్రంథాలయాలకు పుస్తకాలు

చిత్తూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పాఠకుల కోసం కొత్త పుస్తకాలు కొనుగోలు చేసి గ్రంథాలయాలకు సరఫరా చేయనున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు సభ్యురాలు పేర్కొన్నారు. చిత్తూరులోని కేంద్ర గ్రంథాలయాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. కొత్త పుస్తకాలు కావాలని పాఠకులు కోరడంతో ఆమె స్పందించి త్వరలో పంపిణీ చేస్తామన్నారు. గ్రంథాలయ ఉపాధికారి గజేంద్ర బాబు, సిబ్బంది ఉన్నారు.

ధర్నా విజయవంతానికి పిలుపు

పూతలపట్టు, న్యూస్‌టుడే: మామిడి రైతులకు గుజ్జు పరిశ్రమల యజమానులు రూ.8 చెల్లించాలని సోమవారం కలెక్టరేట్ ముందు చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని మామిడి రైతుల సంఘం జిల్లా నాయకుడు చెంగల్రాయరెడ్డి కోరారు. పూతలపట్టులో ఆదివారం రైతులతో కలిసి మాట్లాడారు. ఇప్పటికే పలుమార్లు పరిశ్రమల యజమానుల వద్దకు వెళ్లి అడిగినా బకాయిలు చెల్లించలేదన్నారు. ఈ విషయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ జోక్యం చేసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

స్వయం ఉపాధిలో రాణులు

పుత్తూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే రుణాలను ఆ మహిళలు వినియోగించుకొని ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. భర్త కష్టానికి చేదోడు వాదోడుగా నిలిచి కుటుంబానికి ఆసరగా ఉన్నారు. చిరు వ్యాపారాలు చేస్తూ చుట్టుపక్కల వారికి ఆదర్శంగా నిలుస్తున్నారు పుత్తూరు పట్టణానికి చెందిన మహిళలు.

వ్యాపారంలో ఆదర్శం

భర్తకు చేదోడుగా..

కార్వేటినగరం మండలం కొత్తూరుకు చెందిన రేవతి నాలుగేళ్ల క్రితం రాస్ పొదుపు సేవా సంఘంలో సభ్యురాలుగా చేరారు. పొదుపు చేసిన తర్వాత బ్యాంకులో రూ.80 వేలు రుణం తీసుకున్నారు. భర్త చేస్తున్న సోడా వ్యాపారంలో తాను భాగస్వామురాలయ్యారు. చుట్టుపక్కల గ్రామాల్లోని దుకాణాలకు విక్రయిస్తూ నెలకు రూ.20 వేల వరకు ఆదాయం సంపాదిస్తున్నారు. దీంతో పాటు వ్యవసాయం చేస్తున్నారు. పిల్లలకు మంచి విద్యను అందించడమే తమ ధ్యేయమని రేవతి చెబుతున్నారు.

మగ్గం నేస్తూ..

నారాయణవనం మండలానికి చెందిన మోహన రాస్ పొదుపు సంఘంలో చేరారు. రూ.80 వేలు రుణం తీసుకొని ఇంట్లో అత్త, మామ, భర్తకు తోడుగా మగ్గం నేస్తున్నారు. నేత పని కష్టం కావడంతో మరమగ్గాలు ఏర్పాటు చేసుకున్నారు. మెటీరియల్స్ తయారు చేసి చెన్నై, తిరుపతి, చిత్తూరుతో పాటు పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.18 వేలు మిగులుతోందని చెబుతున్నారు మోహన. రాస్ ద్వారా ప్రస్తుతం టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్నట్లు చెప్పారు.

నాట్యంలో మయూరాలు

జాతీయ స్థాయిలో ప్రదర్శనలు..

కూచిపూడి ప్రదర్శనలో బాలికలు

వడమాలపేట, న్యూస్‌టుడే: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎక్కువ మంది విద్యార్థులు చదువుకే పరిమితం అవుతున్నారు. కానీ వడమాలపేటకు చెందిన అక్కాచెల్లెళ్లు మాత్రం నాట్యంలో రాణిస్తూ అబ్బురపరుస్తున్నారు. వివిధ వేదికలపై సత్తా చాటుతున్నారు.

వడమాలపేట మండలం వెంగళరాజు కండ్రిగకు చెందిన రాజముని, శశికళ దంపతుల కుమార్తెలు పూజ, భార్గవి. పూజ (5వ తరగతి), భార్గవి (2వ తరగతి) చదువుతున్నారు. వీరికి కూచిపూడిలో ఉన్న ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు నృత్య అకాడమీలో చేర్చారు. అన్నమయ్య కీర్తనలు, సమాజంలో స్త్రీ జీవితం తదితరాలపై బాలికలు ప్రదర్శనలు ఇస్తూ రాణిస్తున్నారు.

కళ తమ కోసం కాదని జనం కోసం అనే స్ఫూర్తితో ఇద్దరూ ముందుకు సాగుతున్నారు. పంజాబ్, తిరుపతి, మదనపల్లె, కదిరి, అనంతపురం ప్రాంతాల్లో వేదికలపై నృత్యాలు చేశారు. 2024 జనవరిలో పంజాబ్‌లో జరిగిన జాతీయ నృత్య ప్రదర్శనలో ద్వితీయ బహుమతి అందుకున్నారు. 2025 డిసెంబర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కూచిపూడి పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. కూచిపూడిని అయిదేళ్లుగా నేర్చుకుంటున్నామని, మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తోందని ఈ సోదరీమణులు చెబుతున్నారు. నాట్యంలో మెలకువలను గురువు డాక్టర్ మనోహర్ నేర్పించినట్లు చెప్పారు.

గజరాజుల బీభత్సం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: జంబువారిపల్లె, ముంగరమడుగులో ఏనుగులు శనివారం రాత్రి బీభత్సం సృష్టించాయి. ముంగరమడుగు పొలిమేర్లలోకి రావడంతో గ్రామస్థులు భయాందోళన చెందారు. అనంతరం జంబువారిపల్లె శ్మశానానికి చేరుకొని సమాధులు ధ్వంసం చేశాయి. శివరామిరెడ్డి, కమలనాథ్‌రెడ్డికి చెందిన మామిడి తోటల కంచెను తొలగించాయి. చెట్లు విరిచేశాయి. విజయ్, వాసు, కృష్ణమూర్తి, చిన్నబ్బ, వెంకటరమణకు చెందిన అరటి, కొబ్బరి పంటలను నాశనం చేశాయి.

మహిళలకు వైద్య పరీక్షలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా సఖి సురక్ష పేరుతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. 1 నుంచి 20 డివిజన్ల వారికి సోమవారం, 21 నుంచి 50 డివిజన్ల వారికి మంగళవారం పరీక్షలు ఉంటాయన్నారు. 30 ఏళ్లు పైబడిన వారికి 16 రకాల స్క్రీనింగ్, స్కానింగ్, రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. హైరిస్క్ కేసులుంటే ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా టెలీ మెడిసిన్‌తో పాటు రూ.5 లక్షల ఆరోగ్య బీమా సదుపాయం ఉన్న కార్డులు అందజేస్తామన్నారు. మహిళలు ఆధార్ కార్డులతో శిబిరానికి రావాలని సూచించారు.

హిందూ సంప్రదాయం ప్రాచీనమైనది

మాట్లాడుతున్న అప్రమేయానందగిరి స్వామి

చిత్తూరు(సంతపేట), న్యూస్‌టుడే: సనాతన హిందూ ధర్మం ప్రాచీనమైనది శివగిర్యాశ్రమం పీఠాధిపతి అప్రమేయానందగిరి స్వామి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని సంతపేటలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. భారతదేశానికి ఆత్మ హిందూ ధర్మమన్నారు. కుటుంబ, దేవాలయ వ్యవస్థలు బలంగా ఉన్నాయన్నారు. మనమంతా హిందువులం- బంధువులం అనే ఆత్మ విశ్వాసాన్ని పెంచడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఆర్ఎస్ఎస్ సేవకులు రవీంద్రనాథ్, అమ్మ ఒడి సేవాశ్రమ అధ్యక్షుడు పద్మనాభనాయుడు, వెంకటరమణ, ముని, ఉదయ్, ఈశ్వర్, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మురళీమోహన్ పేర్కొన్నారు. పూతలపట్టులో శనివారం వివిధ పనులకు శంకుస్థాపనలు చేశారు. జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.35 లక్షలతో నిర్మించనున్న వాణిజ్య సముదాయాల పనులు ప్రారంభించారు. వారపు సంతలో రూ.50 లక్షలో నిర్మించిన 15 గదులు, రూ.45 లక్షలతో రూపొందించిన భవనం, సచివాలయాన్ని ఆయన ప్రారంభించారు. సర్పంచి మసలామణి, ఎంపీటీసీ సభ్యులు విజయలక్ష్మి, సింగిల్‌విండో అధ్యక్షుడు జగన్నాథం, గ్రంథాలయాధికారి రవీంద్రబాబు, ఏఈ శ్రీనివాసులు, నాయకులు గోపి, దొరబాబుచౌదరి, యువరాజులునాయుడు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పింఛనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న గురురాజారావు

కార్వేటినగరం, న్యూస్‌టుడే: పింఛనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురురాజారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పింఛనర్ల భవనంలో సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. 75 ఏళ్లు పూర్తి చేసుకున్న విశ్రాంత ఉద్యోగి ఉమాపతిరెడ్డిని సత్కరించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చెంగమ్మ, నాయకులు విజయకుమార్ పిళ్లై, ఘటికాచలం తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న రోజా, కరుణాకరరెడ్డి తదితరులు

జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు

నగరి, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను నగరిలో ఆదివారం నిర్వహించారు. మాజీ మంత్రి ఆర్.కె.రోజా, వైకాపా ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి హాజరై బైపాస్ రోడ్డులో రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేశారు. క్లాక్ టవర్ వద్ద కేకు కోశారు. 1500 మందికి అన్నదానం చేసి, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిశీలకుడు రాహుల్‌రాజారెడ్డి, నగరి, పుత్తూరు పుర అధ్యక్షులు నీలమేఘం, హరి, నాయకులు పాల్గొన్నారు. బంగారుపాళ్యం, పెనుమూరు, గంగాధరనెల్లూరు, పాలసముద్రం, చిత్తూరు మండలాల్లోనూ నాయకులు కార్యక్రమాలు నిర్వహించారు.

గుట్ట తవ్వేసి.. గుట్టుగా తరలించి

కుమ్మరగుంట గుట్ట దుస్థితి

కార్వేటినగరం, న్యూస్‌టుడే: మండలంలో మట్టి మాఫియా దందా నిరాటంకంగా సాగుతోంది. గత ప్రభుత్వ పాలనలో జరిగిన భూ ఆక్రమణలు, గ్రావెల్ తవ్వకాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. అక్రమాలు ఆపేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా దళారులు, కొందరు అధికారుల అండతో ఈ ప్రక్రియ సాగుతోందని, ఎవరూ పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.

మండలంలోని కార్వేటినగరం, టీకేఎంపేట, నిశ్శంకదుర్గం, ఎల్ఆర్‌పేట, ఆర్‌కేవీబీపేట, పరిసర ప్రాంతాల్లో కొండలు, చెరువుల్లో మట్టిని కొందరు యథేచ్ఛగా తవ్విస్తున్నారు. పక్కనే ఉన్న తమిళనాడుకు తరలిస్తూ రూ.లక్షలు పోగు చేసుకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాల్లో పొక్లెయిన్ల సాయంతో కొండలను కొల్లగొడుతున్నారు. రియల్ ఎస్టేట్ స్థలాలకు మట్టి తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. దీనిపై తహసీల్దారు నాగరాజు వద్ద ప్రస్తావించగా.. మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. అక్రమంగా తవ్వి తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

న్యూస్‌టుడే, బృందం: జిలా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా సాగింది. చిన్నారులకు వైద్య సిబ్బంది చుక్కల మందు వేశారు. బంగారుపాళ్యంలో డీఎంహెచ్‌వో సుధారాణి, తెదేపా మండలాధ్యక్షుడు ధరణీప్రసాద్‌నాయుడు, కార్యదర్శి జనార్దన్‌గౌడ్, ఈడిగ సమితి అధ్యక్షుడు నాగరాజుగౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. 99 శాతం మందికి చుక్కలు వేసినట్లు తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యులు లోహిత్‌చెంగ్రాయన్, రమేష్ చెప్పారు. ● పుత్తూరులో ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్, సీహెచ్‌సీ వైద్యుడు చంద్రశేఖర్, పుత్తూరు ఏఎంసీ అధ్యక్షుడు గణేష్, నాయకులు, పెనుమూరులో తెదేపా జిల్లా నాయకుడు కృష్ణమూర్తి, తవణంపల్లెలో వైద్యాధికారిణి ప్రియాంక, ఐరాల, కాణిపాకంలో వినాయక ఆలయ ఛైర్మన్ మణినాయుడు, ఈవో కిశోర్, నింద్రలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి పీబీ.వినీషా, చిత్తూరులో భాజపా సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం, గుడిపాలలో వైద్యులు సంధ్య, రష్మిత చుక్కల మందు వేశారు. ● చిత్తూరు నగరంలోని రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

కాణిపాకంలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఛైర్మన్ మణినాయుడు

బంగారుపాళ్యంలో డీఎంహెచ్‌వో సుధారాణి..

నేడు బాల గణిత అవధానం

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలగణిత అవధానం నిర్వహించనున్నట్లు గణిత అవధాని అరుణశివప్రసాద్ తెలిపారు. జనవిజ్ఞానవేదిక, ఏపీ మ్యాథ్స్ ఫోరం సంయుక్తంగా తుమ్మింద పాఠశాలలో సోమవారం కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. 7, 8 తరగతుల విద్యార్థులు చాముండి, శర్వాణ్ అవధానంలో పాల్గొంటారన్నారు.

నగరిలో రక్తదాన శిబిరం

నగరి, న్యూస్‌టుడే: నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ హెచ్.ప్రభాకరరాజు తెలిపారు. రక్తదానం చేయాలనుకునే వారు ఉదయం 10 గంటలకు రావాలని సూచించారు. చిత్తూరు రక్తనిధి కేంద్రం వైద్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

షణ్ముగ రెడ్డికి సత్కారం

చిత్తూరు పార్లమెంటు తెదేపా అధ్యక్షుడిగా నియమితులైన పుత్తూరుకు చెందిన షణ్ముగరెడ్డిని ఆయన స్వగృహంలో పలు మండలాల నాయకులు సత్కరించారు. విజయపురం మండలానికి చెందిన రాష్ట్ర తెదేపా లీగల్ సెల్ సభ్యుడు, న్యాయవాది రావూరి పురుషోత్తం, జై, గాలి రమేష్ కలిసి సన్మానం చేశారు. - న్యూస్‌టుడే, విజయపురం

రవిరాజుకు సత్కారం చేస్తున్న సభ్యులు

వాకర్స్ అధ్యక్షుడిగా రవిరాజు

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరుకు చెందిన డాక్టర్ రవిరాజు వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. అసోసియేషన్ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. పుత్తూరుకు చెందిన కోనేటి రవిరాజు కార్యదర్శిగా, మునికృష్ణయాదవ్ కోశాధికారిగా నియమితులయ్యారు.

బాధ్యతల స్వీకరణ

మాధవరాజు, తహసీల్దారు

నాయక్, ఎస్సై

తవణంపల్లె, న్యూస్‌టుడే: తవణంపల్లె తహసీల్దారుగా మాధవరాజు, ఎస్సైగా డాక్టర్ నాయక్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌ఛార్జి తహసీల్దారుగా ఉన్న సుధాకర్ చిత్తూరు ఆర్డీవో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆ స్థానంలో గంగవరం నుంచి మాధవరాజు వచ్చారు. గత ఎస్సై చిరంజీవి చిత్తూరు 1టౌన్‌కు బదిలీ కావడంతో వీఆర్‌లో ఉన్న డాక్టర్ నాయక్ బాధ్యతలు తీసుకున్నారు.

కమ్మకండ్రిగలో దొంగతనం

విజయపురం, న్యూస్‌టుడే: అదును చూసి ఎవరు లేని ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మండలంలోని కమ్మకండ్రిగలో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన సుమతి వారం క్రితం చెన్నైలోని తన కుమార్తె ఇంటికి వెళ్లి ఆదివారం సాయంత్రం తిరిగి వచ్చారు. గేటు తాళం, ఇంటి తలుపులు విరిగిపోయి ఉన్నాయి. పూజ గదిలోని వెండి దీపాలు, ప్లేట్లు, బీరువాలో వెండి దీపస్తంభాలు, రెండు జతల బంగారు కమ్మలు, రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మహేశ్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

పుత్తూరు, న్యూస్‌టుడే: ధ్యానంతో ఒత్తిడి దూరం అవుతుందని ధ్యాన విద్యార్థి ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని గోపాలకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థులతో ధ్యానం చేయించారు. శ్వాసపై ధ్యాస ఉంచితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మానసిక ప్రశాంతత, ఆరోగ్యం సొంతం అవుతాయన్నారు. ప్రిన్సిపల్ శైలజకు శ్వాస విజ్ఞానజ్యోతి పుస్తకం అందజేశారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్రగాయాలు

పాలసముద్రం, న్యూస్‌టుడే: విద్యుత్తు స్తంభాలకు వీధి దీపాలు ఏర్పాటు చేస్తూ షాక్‌కు గురైన ఒకరికి గాయాలయ్యాయి. తిరుమలరాజుపురంలో వీధి దీపాలను సింహరాజుపురం పంచాయతీకి చెందిన లోకేశ్ అమర్చుతున్నారు. ఈ సమయంలో విద్యుదాఘాతంతో కింద పడిపోయారు. కాళ్లకు గాయాలు కావడంతో 108లో తమిళనాడు ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

ఐరాల, న్యూస్‌టుడే: మండలంలోని గుట్ట కిందపల్లెకు చెందిన లక్ష్మయ్య అలియాస్ యంగన్న (40) ఈ నెల 16 నుంచి కనిపించడం లేదని ఆయన భార్య శోభారాణి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఐరాల పోలీసులు తెలిపారు.

ఎమ్మెల్యే భానుప్రకాశ్‌కు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్య శిబిరానికి స్పందన

నింద్ర, న్యూస్‌టుడే: మండల పరిధిలోని పట్టెడకు చెందిన గోపాలకృష్ణ దిల్లీలోని నవోదయ విద్యా సంస్థల జేసీగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన సహకారంతో గ్రామంలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. హైదరాబాద్‌లో వైద్యుడిగా స్థిరపడిన చిన్నబాబు ఆధ్వర్యంలో గ్రామస్థులు 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎమ్మెల్యే భానుప్రకాశ్ హాజరై పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, సర్పంచి జయమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నాయకులు చెంచయ్యనాయుడు, వెంకటేశులురెడ్డి, బాబుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దూసుకొస్తూ.. దారి తప్పుతూ!

పుత్తూరు, న్యూస్‌టుడే: పుత్తూరు పురపాలిక ఆవిర్భావం తర్వాత రూ.4 కోట్ల వ్యయంతో తిరుపతి- అరక్కోణం, కార్వేటినగరం మార్గంలో పట్టణంలో సీసీ రోడ్లు నిర్మించారు. కార్వేటినగరం దారిలో విష్ణుమహల్ థియేటర్ నుంచి పుత్తూరు చెరువు వరకు, తిరుపతి- అరక్కోణం దారిలో ఎన్జీవో కాలనీ నుంచి ఆర్డీయం థియేటర్ వరకు డివైడర్లు ఉన్నాయి. భవిష్యత్తులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలనే ఆలోచనలో ఉన్నారు.

పుత్తూరు- కార్వేటినగరం రోడ్డులో డివైడర్‌పైకి ఎక్కిన కారు

వరుసగా ప్రమాదాలు..

ప్రస్తుతం పుత్తూరు మీదుగా చిత్తూరు, చెన్నైకు భారీ వాహనాలు వెళ్తున్నాయి. డివైడర్ ఎత్తు తక్కువ కావడంతో వేగంగా వచ్చే వాహనాలు దాని పైకి వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికే రెండు చోట్ల డివైడర్ పూర్తిగా దెబ్బతింది. ఈ ఏడాదిలో నాలుగు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గత గురువారం రాత్రి ఓ కారు డివైడర్‌పైకి వెళ్లగా ఆ సమయంలో ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతంలో కనీసం సూచికలు కూడా లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు.

ఇవీ వివరాలు..

పురపాలిక: పుత్తూరు

వార్డులు: 27

జనాభా: 65 వేలు

ప్రధాన రహదారులు: తిరుపతి- అరక్కోణం రోడ్డు, కార్వేటినగరం రోడ్డు

డివైడర్లు: కార్వేటినగరం మార్గంలో విష్ణుమహల్ థియేటర్ నుంచి పుత్తూరు చెరువు వరకు. తిరుపతి- అరక్కోణం రోడ్డులో ఎన్జీవో కాలనీ నుంచి ఆర్డీయం థియేటర్ వరకు.

వాహనాల రాకపోకలు: సుమారు 20 వేలు (రోజూ)

మహారాజ రాజశ్రీ తిరుపతి 4వ అదనపు జిల్లా కోర్టులో
ఇ.పి.నెం. 34/2019, ఎ.ఆర్.సి.నెం.389/2017
శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లి.
పుత్తూరు బ్రాంచి తరపు జి.పి.ఎ. హోల్డరు ...డిక్రీ హోల్డరు
V/s
యం.చిన్ని (Died) వగైరా ...రెస్పాండెంట్లు

వేలము ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా డిక్రీ హోల్డరుకు రావలసిన పైకము వసూలుకు పై దావా వేసి రెస్పాండెంట్స్ సంబంధించిన ఈ క్రింది స్థిరాస్తిని వేలము వేయుటకుగాను కోర్టువారు తేది. 05.01.2026న వాయిదా వేసియున్నారు. కావున ఆసక్తిగలవారు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థిని పై తెలిపిన తేదీన ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 5.30 గం॥ల లోగా పై తెలిపిన కోర్టు సందు హాజరై వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE: Chittoor District, Sri Balaji Registration District, Karvetinagar Sub-District, Karvetinagar Mandal, No.74 Karvetinagar Group, Karvetinagar Town, Ward No.2 in Bound Street, House bearing Door No.2/85, Survery No.312/2 bounded on:- **East:** House and vacant well site of Ramaiah; **West:** Bound Street; **North:** House and Draw Well of Ramaiah; **South:** Lane leading to the House of M.Nagaiah, Within these, site admeasuring East to West: 20 yards or 18.288 mts., and North to South: 12 yards or 10.972 mts., comprising a total extent of 240 sq. yards of site and in it constructed Madras Terraced Building admeasuring East to West: 10½ ft., or 3.200 mts., and North to South: 36 ft., or 10.972 mts.. comprising a total extent of 378 sq. ft., of house along with all fixtures and appurtenant site therein...
DHR value: Rs.18,00,000/-
Field Assistant value: Rs. 20,00,000/-

G.V.SUBBAIAH, B.A., B.L.,
Advocate for Decree Holder, Tirupati
Cell No.9440202564

అపూర్వ సమ్మేళనం

యాదమరి మండలంలోని డీకేచెరువు ఉన్నత పాఠశాలలో 2013-14లో పదో తరగతి చదివిన వారు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉల్లాసంగా గడిపారు. అప్పటి హెచ్ఎం బాలాజీ, ఉపాధ్యాయులు కనాకాచారి, జానకిరామ్, దినకర్, కరీం, కృష్ణమూర్తి, సురేంద్ర, మాధవి, గిరీష్‌లను సత్కరించారు. – న్యూస్‌టుడే, యాదమరి

క్రిస్మస్ ముందస్తు సంబరాలు

పుత్తూరులోని సెయింట్ జాన్ లూథరిన్ చర్చిలో రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం క్రిస్మస్ ముందస్తు వేడుకలు నిర్వహించారు. కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఏసుక్రీస్తు శాంతి సందేశాలను ఫాదర్ జాకోబ్ వివరించారు. ● నగరిలో వెస్ట్ చర్చి కమిటీ సభ్యులు ఏసు బొమ్మలతో ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ఎస్.వినయ్‌కుమార్, కార్యదర్శి ఎస్.సత్యమూర్తి, కోశాధికారి పి.వినీష్‌బెల్లా పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పుత్తూరు, నగరి

పలమనేరు

త్వరలో గ్రంథాలయాలకు పుస్తకాలు

చిత్తూరు కలెక్టరేట్: పాఠకుల కోసం కొత్త పుస్తకాలు కొనుగోలు చేసి గ్రంథాలయాలకు సరఫరా చేయనున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు సభ్యురాలు పద్మజ పేర్కొన్నారు. చిత్తూరులోని సీఆర్‌రెడ్డి కేంద్ర గ్రంథాలయాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. సౌకర్యాలపై ఆరా తీశారు. కొత్త పుస్తకాలు కావాలని పాఠకులు కోరడంతో ఆమె స్పందించి త్వరలో పంపిణీ చేస్తామన్నారు. గ్రంథాలయ ఉపాధికారి గజేంద్రబాబు, సిబ్బంది ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: కొత్తపేటలోని అంగాలపరమేశ్వరి ఆలయంలో పీఈఎస్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మహేష్, నాయకులు పాల్గొన్నారు

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లండి

రామకుప్పం: తెదేపా చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్ మునిరత్నం, గ్రంథాలయ శాఖ రాష్ట్ర డైరెక్టర్ మునస్వామి, తెదేపా మండల అధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ప్రాంగణంలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు ఆంజనేయరెడ్డి, నాయకులు సీతాపతి, పత్రనారాయణ, రామమూర్తి, రఘు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మునిరత్నం

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా..?

మండలంలోని చౌడేపల్లె-కల్లుపల్లె రోడ్డు నుంచి ఓదులపేటకు వెళ్లే మార్గం ఇటీవల వర్షాలకు కోతకు గురైంది. ఇదే ప్రాంతంలో మలుపు ఉండటంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. పెను ప్రమాదం జరిగే అవకాశముందని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, చౌడేపల్లె**

మట్టిని తవ్వి.. ఇసుక తరలించి..!

పుంగనూరు మండలంలో ఫిల్టర్ ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇసుకకు డిమాండ్ పెరిగిపోవడంతో అక్రమార్కులు కొత్త మార్గాన్ని ఎంచుకున్నారు. రాగానిపల్లె, భీమగానిపల్లె, చదళ్ల, నెక్కుంది పంచాయతీల్లో మట్టిని తవ్వి.. దానిని ఫిల్టర్ చేసి ఇసుకగా మార్చుతున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.3,500 నుంచి రూ.4 వేలకు విక్రయిస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ**

గోతులు పూడ్చండి సారూ..!

పుంగనూరు పట్టణంలోని పుంగమ్మ చెరువు కట్టపై నిర్మించిన వాకింగ్ ట్రాక్ ఇటీవల వర్షాలకు కోతకు గురైంది. ఆ కోతలతో నడకరులు ఇబ్బంది పడుతున్నారు. గోతులు పూడ్చకపోతే మరింత కోతకు గురయ్యే ప్రమాదం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, పుంగనూరు**

ఇదే సంపద కేంద్రమా..?

మండలంలోని పరికిదొన పంచాయతీలో చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా దర్శనమిస్తోంది. ఉపాధి హామీ నిధులు రూ.5లక్షలకు పైగా ఖర్చు చేసి నిర్మించారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో కేంద్రం దుస్థితికి చేరుతోంది. అధికారులు స్పందించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, చౌడేపల్లె**

పిల్లలందరికీ పోలియో చుక్కలు

పెద్దపంజాణి: పుట్టిన బిడ్డ నుంచి అయిదేళ్లలోపు పిల్లలందరికీ తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని డీఎంహెచ్‌వో సుధారాణి అన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని పంజాణిసత్రం ప్రాథమిక పాఠశాలలో పోలియో చుక్కల కేంద్రాన్ని తనిఖీ చేశారు. **పలమనేరు:** పలమనేరు మున్సిపల్ పరిధిలో 99 శాతం పోలియో చుక్కలు వేసినట్లు పీహెచ్‌సీ సబ్ యూనిట్ అధికారి జయశంకర్ తెలిపారు. **గంగవరం:** మండలంలోని పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని సుధారాణి ఆదేశించారు. పుంగనూరు గ్రామీణ: మండలంలో 90 శాతం పల్స్ పోలియో చుక్కలు పూర్తి చేసినట్లు వైద్యాధికారి సృజన తెలిపారు. **బైరెడ్డిపల్లె:** పోలియో చుక్కల కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయడానికి వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కుష్ఠు, క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్ అన్నారు. బైరెడ్డిపల్లె, బేలుపల్లె, తీర్థం గ్రామాల్లో పోలియో చుక్కల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. **పుంగనూరు:** అడవినాథునికుంటలో ఏఎంసీ ఛైర్మన్ సమీపతియాదవ్ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

కల్లూరు: పోలియో చుక్కలు వేస్తున్న రాష్ట్ర తెలుగురైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు

ఇక.. ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు

పలమనేరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్గో సేవలను విస్తృతం చేయడానికి ప్రయత్నిస్తోంది. ప్రైవేటు పార్శిల్ సర్వీసులకు దీటుగా ప్రస్తుతం ఆర్టీసీ పార్శిల్ సేవలు అందుతున్నాయి. బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకుంటూ లాభాలను ఆర్జిస్తోంది. ఇప్పుడు మరింత ఎక్కువ సేవలను అందించేందుకు రంగం సిద్ధం చేసింది.

పలమనేరు డిపోలో కార్గో కేంద్రం

కేంద్రానికి రావాల్సిన పనిలేదు..

వినియోగదారులు ఇప్పటివరకు ఆర్టీసీ బస్టాండులో ఉంటున్న పార్శిల్ కేంద్రం దగ్గరికి వచ్చి తమ పార్శిళ్లను తీసుకెళ్లేవారు. ఇక మీదట పార్శిల్ కోసం ఆర్టీసీ బస్టాండులోని కేంద్రం వద్దకు రావాల్సిన పని లేదు. నేరుగా ఇంటి వద్దకే అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

సర్వే ద్వారా వివరాల సేకరణ..

డోర్ డెలివరీ విధానం అమలు చేయడానికి అవసరమైన విధానాలను రూపొందించేందుకు అధికారులు సర్వే మొదలు పెట్టారు. ఈ నెల 21 నుంచి జనవరి 19 వరకు దీని కోసం ఇంటింటికి వెళ్లి సిబ్బంది సలహాలు సూచనలు తీసుకుంటారు. ఈ సర్వేలో ప్రజలు ఎలాంటి పార్శిళ్లను పంపుతున్నారు... దాన్ని ఎంత సమయంలో అందుకోవడానికి ఇష్టపడుతున్నారు. వంటి విషయాలను ప్రజల నుంచి సర్వే ద్వారా సేకరించే పని ప్రారంభించారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రస్తుతం పలమనేరు డిపోకు కార్గో సేవల ద్వారా సంవత్సరానికి రూ.60 లక్షల ఆదాయం వస్తోంది. ప్రైవేటు సంస్థల కంటే తక్కువ ఫీజు వసూలు చేయడంతో ప్రజలు ఆర్టీసీ కార్గో సేవలను వినియోగిస్తున్నారు. ఇకపై డోర్ డెలివరీ ప్రారంభిస్తే ఆదాయం మరింత పెరిగే అవకాశముంది. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– **అల్తాఫ్, ఆర్టీసీ డీఎం, పలమనేరు**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: టీబీ రోడ్డులో తాగునీటి పైపులు లీకేజీకి గురయ్యాయి. – సురేష్

సమాధానం: పరిశీలించి మరమ్మతు చేయిస్తాం.

– శ్రీనివాసరావు, కమిషనర్

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని పూజగానిపల్లె-నల్లగుట్లపల్లె మార్గంలో రోడ్డుపై చెత్త వేస్తున్నారు. – బాబు, పూజగానిపల్లె

సమాధానం: పరిశీలించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం.

– వెంకటరమణ, కార్యదర్శి

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని అన్న క్యాంటీన్ వద్ద మురుగు కాలువలో చెత్త పేరుకుపోయింది. దుర్వాసన వస్తోంది. – మురళి

సమాధానం: పరిశీలించి కాలువను శుభ్రం చేయిస్తాం.

– ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్

కాలనీల్లో పారిశుద్ధ్య పనులు

స్పందనకు వందనం

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కంగానెల్లూరులోని వీధుల్లో పారిశుద్ధ్య కార్మికులు కాలువలను శుభ్రం చేశారు. సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త రావడంతో కార్యదర్శి మహేశ్‌కుమార్ స్పందించి పనులు చేయించారు. **పలమనేరు:** పట్టణంలోని వినాయక నగర్‌లో మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు.

తెలుగుభాష రక్షణ ప్రథమ కర్తవ్యం కావాలి

పలమనేరు, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ తెలుగుభాష రక్షణ ప్రథమ కర్తవ్యంగా భావించాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథంనాయుడు పేర్కొన్నారు. తెలుగు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు కావడంతో ఆ ధ్రువపత్రాన్ని సంస్థ ప్రతినిధి నారాయణస్వామి తులసినాథంనాయుడు దంపతులకు ఆదివారం అందించారు. పట్టణంలోని కళా మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో గంగవరం ఎంఈవోలు వేణుగోపాలరెడ్డి, శ్రీనివాసులు, ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాన్ని అందుకుంటున్న తులసినాథంనాయుడు దంపతులు

నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పల్లెలకు విస్తరించాలి

పలమనేరు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయంసేవక్ కార్యకలాపాలను పల్లెలకు కూడా విస్తరించాలని హిందూ సమ్మేళనం పలమనేరు స్వాగత కమిటీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. సంఘ్ స్థాపన చేపట్టి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో హిందూ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సభ్యులు సత్యప్రకాష్, చెంచురెడ్డి, కృత్తివాసకృష్ణ పాల్గొన్నారు.

'పేరు మార్పు సమంజసం కాదు'

పలమనేరు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం పేరు మార్చడం సమంజసం కాదని సీపీఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు అభిప్రాయపడ్డారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకుడు చెన్నకేశవులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ విషయమై జిల్లా వ్యాప్తంగా ఈ నెల 22 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు దాసరిచంద్ర, ప్రకాష్, రఘు, గజేంద్రబాబు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: డ్వాక్రా మహిళల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా సఖి సురక్ష పేరుతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. 1 నుంచి 20 డివిజన్ల వరకు సోమవారం, 21 నుంచి 50 డివిజన్ల వారికి మంగళవారం పరీక్షలు చేపడతామన్నారు. 30 ఏళ్లు పైబడిన వారికి 16 రకాల స్క్రీనింగ్, స్కానింగ్, రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. హైరిస్క్ కేసులు ఉంటే ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా టెలీ మెడిసిన్‌తో పాటు రూ.5 లక్షల ఆరోగ్య బీమా సదుపాయం ఉన్న కార్డులు అందజేస్తామన్నారు. మహిళలు ఆధార్ కార్డులతో శిబిరానికి రావాలని సూచించారు.

కూలితే ప్రమాదమే

పలమనేరు-మదనపల్లె జాతీయ రహదారి పక్కన మేలుమాయి క్రాస్ వద్ద ఉన్న వాటర్ ట్యాంక్ కూలడానికి సిద్ధంగా ఉంది. మేలుమాయి క్రాస్ వద్ద నివాసం ఉన్న వారికి నీటి సరఫరా చేసే వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరుకుంది. వాటర్‌ట్యాంకు కూలితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. - **న్యూస్‌టుడే, గంగవరం**

'మత మార్పిడి నియంత్రించాలి'

పుంగనూరు, న్యూస్‌టుడే: కులమత వర్గ భేదాలు లేని భారతదేశంలో డబ్బు ఆశతో జరుగుతున్న మత మార్పిడిని నియంత్రించాలని ఆర్‌ఎస్‌ఎస్ సహప్రాంత బౌద్ధిక్ ప్రముఖ్ రామకృష్ణ అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తైన సందర్భంగా ఆదివారం పట్టణంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఎన్టీఆర్ కూడలి నుంచి బీఎంఎస్ క్లబ్ వరకు ర్యాలీ, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ముఖ్య అతిథులుగా రామకృష్ణ, రఘునాథశాస్త్రి పాల్గొని ప్రసంగించారు. నిర్వాహకులు త్రిమూర్తిరెడ్డి, బాలసుబ్రహ్మణ్యం, జీఆర్ విజయశంకర్, రవీంద్రనాథ్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ ర్యాలీలో హిందువులు

'సాహిత్యమే సత్యాన్వేషణ' పుస్తక ప్రదర్శన

పలమనేరు, న్యూస్‌టుడే: సాహిత్యమే సత్యాన్వేషణ అని సాహితీవేత్త మునిసురేష్ పిళ్లై అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో చేపట్టిన జాతీయ పుస్తక ప్రదర్శనలో పలమనేరు బాలాజీ వ్యాస సంపుటి 'సాహిత్యమే సత్యాన్వేషణ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు వేణుగోపాల్, కాత్యాయని, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

రామకుప్పం: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా తరఫున 24 మంది విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ఛైర్మన్ మహేష్, అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తెలిపారు. ఆదివారం స్థానిక డా.బీ.ఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జిల్లాస్థాయి బాలుర, బాలికల షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులు త్వరలో ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో తలపడనున్నట్లు తెలిపారు.

ఎంపికైన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

ఒత్తిడి నుంచి విముక్తి

పుంగనూరు: ధ్యానంతో ఒత్తిడి నుంచి విముక్తి పొందవచ్చని ప్రతి ఒక్కరూ ధ్యానాన్ని అనుసరించాలని హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ శిక్షకులు శివశంకర్, మానస పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఉచిత ధ్యాన కార్యక్రమం నిర్వహించారు.

ధ్యానం చేస్తున్న స్థానికులు

ప్రజల్లోకి తీసుకెళ్లాలి

పుంగనూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చిత్తూరు పార్లమెంట్ మాజీ సభ్యుడు ఎన్.రెడ్డెప్ప అన్నారు. ఆదివారం వైకాపా ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పురపాలక ఛైర్మన్ అలీంబాషా, నాయకులు పాల్గొన్నారు.

మాజీ సీఎం పుట్టిన రోజు

పలమనేరు, న్యూస్‌టుడే: పలమనేరులోని పట్టణంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి పుట్టినరోజును ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఆ పార్టీ నాయకులు పాల్గొని కేక్ కోశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. **సోమల, కల్లూరు, బైరెడ్డిపల్లె, పుంగనూరు:** మండలాల్లో ఆ పార్టీ నాయకులు ప్రధాన కూడళ్లలో సంబరాలు చేసుకున్నారు.

వి.కోట: రక్తదానం చేస్తున్న అభిమానులు

ఇళ్ల మధ్య పొదలు.. తప్పని తిప్పలు

పుంగనూరు, పలమనేరు, కుప్పం పట్టణం: పట్టణ ప్రాంతాల్లోని కొన్ని కాలనీలు, వీధులు గ్రామీణ ప్రాంతాలను తలపిస్తున్నాయి. ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసిన యజమానులు ఆ స్థలాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇళ్ల మధ్య చిట్టడవులుగా దర్శనమిస్తున్నాయి. ప్రైవేటు ఖాళీ స్థలాలకు పన్ను వేయకపోవడంతో వాటి యజమానులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. అధికారులు సైతం భవన నిర్మాణ అనుమతుల కోసం వచ్చినపుడు మాత్రమే నామమాత్రంగా ఖాళీ స్థలాల పన్ను వసూళ్లు చేస్తుండటంతో ఇలా ముళ్లపొదలు విషసర్పాలకు స్థావరంగా మారుతున్నాయి.

పలమనేరులో..

పలమనేరు పురపాలిక 16.53 కి.మీ. విస్తరించింది. 26 వార్డులు ఉన్న ఈ పురపాలికలో నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో విషసర్పాలు సంచరిస్తున్నాయి. పలుచోట్ల భవనాలకు ఆనుకుని ముళ్లపొదలు పెరగడంతో నివాస గృహాల వారు ఇబ్బంది పడుతున్నారు. ఖాళీ స్థలాల యజమానులకు ఎలాంటి నోటీసులు ఇవ్వడం లేదు. ముఖ్యంగా అంబేడ్కర్, శ్రీనగర్ కాలనీ, గుడియాత్తం రోడ్డు, గుండుబావి, పెద్దచెరువు ప్రాంతాల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు అధికంగా ఉన్నాయి.

పుంగనూరులో..

పుంగనూరు పురపాలక 17.76కి.మీ. విస్తరించింది. సుమారు 60వేల జనాభా ఉంది. మేలుపట్ల, సూర్యానగర్, కొత్తపేట, కొత్తఇండ్లు, మల్లారమ్మ గుడివీధి, షిర్డీసాయినగర్ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు విపరీతంగా ఉన్నాయి.

కుప్పం పురపాలికలో..

కుప్పం పురపాలికలో 34 కి.మీ. విస్తరించింది. 25 వార్డులు ఉన్నాయి. శాంతినగర్, శికారీ కాలనీ, మునస్వామిపురం, సామర్లగుట్ట ఖాళీ స్థలాల్లో ముళ్లపొదలు విపరీతంగా ఉన్నాయి.

చర్యలు తీసుకుంటాం

పట్టణ పరిధిలో శుభ్రంగా లేని ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇస్తున్నాం. వారి స్థలాలను శుభ్రంగా ఉంచుకోవడంపై స్పందించకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

- మధుసూదనరెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసరావు, కమిషనర్లు (పుంగనూరు, పలమనేరు, కుప్పం)

డ్రోన్‌తో నిఘా

సదుం, న్యూస్‌టుడే: అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు డ్రోన్ ద్వారా పర్యవేక్షించనున్నట్లు ఎస్సై షేక్‌షావలి తెలిపారు. సదుంలో ఆదివారం డ్రోన్ ద్వారా నిఘా విధానాన్ని ఆయన పరిశీలించారు. ఏఎస్సై సత్యనారాయణ పాల్గొన్నారు.

గజరాజుల బీభత్సం

బంగారుపాళ్యం, న్యూస్‌టుడే: జంబువారిపల్లె, ముంగరమడుగులో ఏనుగులు శనివారం రాత్రి బీభత్సం సృష్టించాయి. ముంగరమడుగు పొలిమేర్లలోకి రావడంతో గ్రామస్థులు భయాందోళన చెందారు. అనంతరం జంబువారిపల్లె శ్మశానానికి చేరుకొని సమాధులు ధ్వంసం చేశాయి. శివరామిరెడ్డి, కమలనాథ్‌రెడ్డికి చెందిన మామిడి తోటల కంచెను తొలగించాయి. చెట్లు విరిచేశాయి. విజయ్, వాసు, కృష్ణమూర్తి, చిన్నబ్బ, వెంకటరమణకు చెందిన అరటి, కొబ్బరి పంటలను నాశనం చేశాయి.

కుప్పంలో అభివృద్ధి వెలుగులు

◗ గ్రామాలకు వీధిదీపాల పంపిణీ ◗ కడా ఆధ్వర్యంలో పనులు

కుప్పం పట్టణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో అభివృద్ధి వెలుగులు ప్రసరిస్తున్నాయి. ఓ వైపు నీటి ప్రాజెక్టులు లేని ప్రాంతంలో హంద్రీ-నీవా ద్వారా కృష్ణమ్మ జలాలను కుప్పానికి తీసుకొచ్చి.. చెరువులను నింపుతున్నారు.. పరిశ్రమల స్థాపనలో భాగంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో భూములు కేటాయించారు. రూ.కోట్ల నిధులతో రోడ్లు, మౌలిక వసతుల కల్పన చేపట్టారు. 'స్వర్ణ కుప్పం' లక్ష్యంగా కడా ఆధ్వర్యంలో ప్రాంతాల వారీగా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కుప్పం పురపాలిక పరిధిలో ఇప్పటికే జమిందారు పార్కు, ఎన్టీఆర్ క్రీడా మైదానం, కుప్పం శ్మశాన వాటిక అభివృద్ధి పనులు చురుకుగా జరుగుతున్నాయి. అంతే కాకుండా ప్రతి గ్రామంలోనూ ఎల్ఈడీ వెలుగులు అందించేందుకు కడా నిధులతో వీధి దీపాలను పంపిణీ చేశారు.

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 38 హైమాస్ట్ వీధి దీపాలను పంపిణీ చేయగా, వీటిలో కుప్పం 11, గుడుపల్లె 8, శాంతిపురం 9, రామకుప్పం 10 పంపిణీ చేశారు. వీధి దీపాలు నియోజకవర్గానికి 8,049 ఇవ్వగా, వీటిలో కుప్పం 2,589, గుడుపల్లె-1,327, శాంతిపురం-2,220, రామకుప్పం-1,913 పంపిణీ చేశారు. అవసరం మేరకు మరిన్ని దీపాలు పంపిణీ చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. పగటి వేళ దీపాలు వెలగకుండా సెన్సార్లు ఏర్పాటు చేయనున్నామని కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు.

మలుపుల్లో సూచిక బోర్డులేవి..?

పుంగనూరు మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే మలుపు రోడ్లకు సూచికలు లేక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో గ్రామీణ రహదారుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మంగళం-ఏటవాకిలి పంచాయతీల మధ్య ఉన్న మలుపులో సూచికలు ఏర్పాటు చేస్తే ప్రమాదాలు అరికట్టవచ్చని వాహన చోదకులు చెబుతున్నారు. అధికారులు సూచికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

కారును ఢీకొనడంతో వ్యక్తిపై దాడి

పుంగనూరు గ్రామీణ: కారును మరో కారు ఓవర్ టేక్ చేసే సమయంలో స్వల్పంగా తగలడంతో వ్యక్తిపై దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి పుంగనూరులో జరిగింది. పెద్దపంజాణి మండలం చింతలపల్లికి చెందిన ఉదయ్‌శంకర్ మదనపల్లెకు కారులో వెళ్తుండగా.. పుంగనూరుకు చెందిన కారును ఓవర్ టేక్ చేసే సమయంలో ఢీకొన్నాడు. దీంతో పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఉదయ్‌శంకర్‌ను కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హోమ్‌గార్డుకు తీవ్రగాయాలు

వి.కోట, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో హోంగార్డు తీవ్రంగా గాయపడ్డ ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకొంది. స్థానిక సాయిగార్డెన్ సిటీకి చెందిన హోంగార్డు మునేగౌడ పెద్దపంజాణిలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సర్కిల్ వద్ద బస్సు కోసం ఎదురు చూస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో మునేగౌడ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం కుప్పం ఆస్పత్రికి తరలించారు.

ఎదురెదురుగా ద్విచక్ర వాహనాల ఢీ

సంగనపల్లె(గుడుపల్లె), న్యూస్‌టుడే: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన ఆదివారం సంగనపల్లె వద్ద చోటుచేసుకుంది. చిన్నపర్తికుంటకు చెందిన నగేష్, సంగనపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం ద్విచక్ర వాహనాలపై వస్తూ.. ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.

గొలుసు దుకాణ నిర్వాహకుల అరెస్టు

రొంపిచెర్ల, న్యూస్‌టుడే: జాండ్లవారిపల్లెలో బెల్టు దుకాణం నిర్వహిస్తున్న బారేషా, కరీంలను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్సై మధుసూదన్ తెలిపారు. మండలంలో గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియ జేయడం ఏమనగా నా కక్షిదారు మెసర్స్ శ్రీరాం ఫైనాన్స్ లి. V.Kota Branch మేనేజరు వారు ఇచ్చిన భోగట్టా ప్రకారం ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలు స్థిరాస్తి Smt H. Harindra S/o H.Yellappa, residing at of Attikuppam, Manendram, Muddanapalli, Ramakuppam Mandal, Chittoor District, Andhra Pradesh గారికి చెందిన ఆస్తి అని సదరు ఆస్తికి రిజిస్టరు తనఖా చేయించుకుని సదరు, Smt. H.Harindra S/o H.Yellappa గారికి ఋణమిచ్చుటకు నిర్ణయించు కున్నారు. కావున సదరు వ్యవహారము సంబంధించి ఈ క్రింది కనిన షెడ్యూల్ దాఖలా ఆస్తిపై ఏవిధమైన ఇప్పులు, చార్జీలు, క్లైములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న ఎడల నేడి నుండి 7 దినములలోగా క్రింద కనిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

SCHEDULE OF PROPERTY

Chittoor District, Kuppam Registration District, Ramakuppam Mandal, Ramakuppam Panchayathi, No. 84, Ramakuppam Village, Vijilapuram Road, Near to D.No.1n707, Survey Number 263/1, 263/2, 263/3 an extent of AC.1.106 cents of land, vide LP.No.1444, Open site bounded by:- **East:** Remaining Land belongs to Vendor, **West:** Vacant site belongs to N.Venkatramappa, **North:** 20 ft wide Road, **South:** Vacant site belongs to Vendor.

Within these boundaries vacant site measuring EastnWest 20 ft or 6.09 mts and North to South 60 ft or 18.29 mts total 1200 sq.ft or 133.33 sq.yds along with all easementary rights and appurtenant site therein.

పి.వి.మధుసూదన్,
బికాం., ఎల్.ఎల్.బి., అడ్వకేట్, కుప్పం.

(c) eenadu

ఆధ్యాత్మిక శోభ

అష్టోత్తర పూజలు చేస్తున్న అర్చకులు

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తిరుప్పావై సేవ, లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శత నామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగాయి. ఈవో ఎన్ఎస్ చక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

5 తరగతులు.. ముగ్గురు పిల్లలు

మామిడికుదురు మండలం గోగన్నమఠం పరిధి సత్తెమ్మచెరువు మండల పరిషత్ ప్రధాన ప్రాథమిక పాఠశాలలో అయిదు తరగతులున్నా అందులో ముగ్గురు మాత్రమే విద్యార్థులు ఉన్నారు. 1, 3, 5 తరగతుల్లో ఒక్కొక్కరు చొప్పున ఉండగా మిగతా 2, 4 తరగతులు ఖాళీగా ఉన్నాయి. ఉపాధ్యాయిని, ఆయా, మధ్యాహ్న భోజన పథకానికి ఒకరు చొప్పున ముగ్గురు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. రేకుల షెడ్డులో కొనసాగుతున్న పాఠశాల పక్కనున్న శిథిల భవనాన్ని తొలగించకపోవడం, దీని చెంతనే చెరువు ఉండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవో-2 మోకా వెంకన్నబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఇక్కడ రూ.15.75 లక్షల వ్యయంతో కొత్త భవనాన్ని నిర్మించేందుకు ఆమోదం రావాల్సి ఉందన్నారు.

– న్యూస్‌టుడే, మామిడికుదురు

బీసీల ఇళ్లల్లో రాయితీ వెలుగులు

పీఎం సూర్యఘర్‌లో అదనంగా రూ.20వేలు లబ్ధి

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

పీఎం సూర్యఘర్ పథకంలో వెనుకబడిన తరగతుల(బీసీలు) అదనపు ప్రయోజనం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సౌర విద్యుత్తు ఫలకాలు ఏర్పాటు చేసుకునేవారికి కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహానికి అదనంగా అర్హులకు రూ.20 వేలు రాయితీ అందిస్తారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

జిల్లా వివరాలు

పీఎం సూర్యఘర్ కనెక్షన్ల లక్ష్యం: 10,000

ఇప్పటి వరకు తీసుకున్నవారు: 2,400 మంది

ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలకు..

ఎస్సీ, ఎస్టీలకు రెండు కిలోవాట్ల సామర్థ్యం ఉన్న సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసే ఫలకాలను ఉచితంగా అమర్చుతారు. దీని కోసం రూ.1.40 లక్షల వరకు ఖర్చు అవుతోంది. దీని ద్వారా 240 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. గృహ వినియోగానికి పోనూ అదనపు విద్యుత్తును ఆ శాఖ కొనుగోలు చేసి లబ్ధిదారులకు నగదు చెల్లిస్తుంది. కేంద్రం రూ.60వేలు రాయితీ అందిస్తున్నారు. మిగిలిన వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోంది. జిల్లాలో 30వేల మందికి ఫలకాలు అమర్చాలని నిర్ణయించారు.

సాయం ఇలా..

ఈ పథకంలో రెండు కిలోవాట్లకు కేంద్రం ఇస్తున్న రాయితీ రూ.60వేలకు అదనంగా బీసీ లబ్ధిదారులకు రూ.20వేలు అందిస్తారు. దీంతో రాయితీ రూ.80వేలు అవుతుంది. మిగిలిన రూ.60వేలు బ్యాంకు నుంచి రుణం రూపంలో మంజూరు చేయనున్నారు. జిల్లాలో బీసీ వినియోగదారులు 40వేలకు పైగా ఉన్నట్లు అంచనా.

ఉత్తర్వులు రావాల్సి ఉంది

జిల్లాలో బీసీలకు అందించే రాయితీపై ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఉత్తర్వులు రావాల్సి ఉంది. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లా వ్యాప్తంగా 30వేల మంది ఎస్సీ, ఎస్టీల ఇళ్లపై సౌర ఫలకాలను ఏర్పాటు చేస్తాం.

- బి.రాజేశ్వరి, ఎస్ఈ

చరవాణిలో.. ఏం చూస్తున్నారో..!



✦ పిల్లలపై దుష్ప్రభావం
✦ ఇటీవల కొన్ని ఘటనలే నిదర్శనం

● ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో తొమ్మిదో తరగతి చదవుతున్న విద్యార్థిని సహచర విద్యార్థికి ప్రేమ లేఖ రాసింది. నిన్నే పెళ్లి చేసుకుంటాను, మరెవరినీ ప్రేమించినా పద్ధతిగా ఉండదని హెచ్చరించడం గమనార్హం.

● పి.గన్నవరం నియోజకవర్గం పరిధిలోని పదేళ్ల బాలుడు ఓ బాలికతో నిర్మానుష్య ప్రాంగణానికి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. సమీపంలోని ఓ వ్యక్తి చూసి బాలుడిని మందలించి వివరాలు ఆరా తీయగా.. విస్తుపోయే వాస్తవాలు చెప్పాడు. రాత్రిపూట తల్లిదండ్రులు నిద్రించిన తర్వాత చరవాణిలో అశ్లీల దృశ్యాలు చూస్తున్నట్లు చెప్పాడు.

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

ప్రస్తుతం ప్రతి ఇంట్లో రెండు నుంచి మూడు వరకు స్మార్ట్ ఫోన్లు ఉంటున్నాయి. పెద్దల నుంచి చిన్నారుల వరకు అవసరానికి మించి వీటి వినియోగం పెరగడంతో అనర్థాలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు [illegible] తర్వాత, ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు, గదుల్లో తలుపులు వేసుకుని పిల్లలు స్మార్ట్ ఫోన్లలో అసభ్యకర రీతిలో ఉంటున్న రీల్స్ చూసి వాటిని అనుకరిస్తుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం.

చూసినవి తొలగించకుండా..

తల్లిదండ్రులు కాలక్షేపానికి అంతర్జాలంలో పలు వీడియోలు చూస్తున్నారు. వాటిని తొలగించకుండానే [illegible] ఫోన్ తీసిన వెంటనే అవి ప్రత్యక్షం కావడంతో పిల్లలు వాటికి ఆకర్షితులవుతున్నారు. పిల్లలు అంతర్జాలంలో ఏం చూస్తున్నారు..? ఏయే యాప్‌లు ఎంతవరకు వినియోగిస్తున్నారో తల్లిదండ్రులు తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

యువతపై ప్రత్యేక నిఘా

స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న యువతపై కన్నవారు ప్రత్యేక నిఘా ఉంచాలి. ప్రస్తుతం 16 నుంచి 22 ఏళ్ల మధ్య యువకులు స్మార్ట్ ఫోన్లలో ఎక్కువగా ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్నారు. విలువైన సమయం కోల్పోవడంతో పాటుగా చెడువ్యసనాల బారిన పడే ప్రమాదం ఉంది. యాప్‌లలో అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకుని ప్రేమ పేరుతో వారివెంట గుడ్డిగా వెళ్లి మోసపోతున్నారు. ప్రతి ఇంట్లో చరవాణిని అవసరం మేరకు మాత్రమే వినియోగించాలని పోలీసులు చెబుతున్నారు.

పిల్లలతో ఎక్కువ సమయం గడపాలి

తల్లిదండ్రులు వీలైనంత ఎక్కువ సమయం పిల్లలతో గడపాలి. వారి ఎదుట ఫోన్ చూస్తూ ఉంటే అదే పిల్లలకు కూడా అలవాటు అవుతుంది. పిల్లలకు ఫోన్ ఇచ్చేటప్పుడు మంచి చెడుల వివరించాలి. చరవాణికి బానిసలుగా మారితే ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక కౌన్సెలింగ్ ఇస్తున్నాం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

- డా.సౌమ్య, మానసిక వైద్యనిపుణురాలు, ప్రాంతీయ ఆసుపత్రి, అమలాపురం

పాఠశాలల్లో అవగాహన కల్పిస్తాం

జిల్లాలోని అన్ని పాఠశాల్లో స్మార్ట్ ఫోన్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం యువత ఎక్కువగా ఫోన్‌లో రీల్స్ చూస్తూ కాలం వృథా చేస్తున్నారు. ఇళ్లల్లో పెద్దలు సైతం అవసరం మేరకే ఫోన్ వినియోగించాలి.

- పడాల నాగేశ్వరరావు, డీఈవో

కలిసొచ్చిన సమీకరణాలు

జిల్లా తెదేపా అధ్యక్షుడిగా గుత్తుల సాయి నియామకం

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: తెదేపాను సంస్థాగతంగా బలోపేతం చేసే ప్రక్రియలో భాగంగా ఆ పార్టీ జిల్లా కమిటీల కూర్పును పూర్తి చేసింది. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ముమ్మిడివరం మండలానికి చెందిన గుత్తుల వెంకట సాయి శ్రీనివాస్ (సాయి), కార్యదర్శిగా అమలాపురానికి చెందిన గంధం పల్లంరాజులను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ నెల 16వ తేదీనే వీరి నియామకం ఖరారైనా.. ఇప్పుడు అధికారికంగా ప్రకటించారు. పార్టీ జిల్లా అధ్యక్షుల ఎంపిక విషయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను ప్రామాణికంగా తీసుకున్నట్లు సమాచారం. కాకినాడ జిల్లాకు కాపు సామాజిక వర్గానికి చెందిన జ్యోతుల నవీన్‌కు, తూర్పుగోదావరి జిల్లాకు బొడ్డు వెంకటరమణ చౌదరికి దక్కడంతో కోనసీమ జిల్లాలో బీసీల్లోని బలమైన సామాజికవర్గం శెట్టిబలిజలకు అవకాశం ఇచ్చారు. కాపు సామాజికవర్గానికి చెందిన గంధం పల్లంరాజును ప్రధాన కార్యదర్శిగా నియమించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, జిల్లాలోని ఎమ్మెల్యేలు, పార్టీ నాయకుల అండదండలు వీరికి ఉండటంతో పార్టీ పగ్గాలు అప్పగించినట్లు చెబుతున్నారు.

పార్టీ బలోపేతానికి మరింత కృషి..

తెదేపా జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసి పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని గుత్తుల సాయి అన్నారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రోద్బలంతో పార్టీలోకి వచ్చిన తనకు ఈ పదవి అప్పగించడం చాలా ఆనందంగా ఉంది. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, మంత్రి వాసంశెట్టి సుభాష్, జిల్లాలోని ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలుపుతున్నా.. ఈ బాధ్యతలను పార్టీ ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తూ.. నాయకుల సహకారంతో కష్టపడి పనిచేస్తానని పేర్కొన్నారు.

బీపీఎస్‌పై నిరాసక్తత

అనధికార కట్టడాల క్రమబద్ధీకరణకు మిశ్రమ స్పందన

ఈనాడు, కాకినాడ

పురపాలకశాఖ పరిధిలో అక్రమ నిర్మాణాలు, అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్), ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పథకాలతో యజమానులకు హక్కులు కల్పించనున్నారు. దీంతో పట్టణ స్థానిక సంస్థలకు ఆదాయం రానుంది. అయితే ఈ పథకాలకు మిశ్రమ స్పందన వస్తోంది. అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు మొగ్గు చూపుతున్నా అక్రమ నిర్మాణాలను సక్రమం చేసుకోవడానికి మాత్రం వెనుకంజ వేస్తున్నారు.

అడ్డంకులివే..

గతంలో రూ.10 వేల రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకుంటే సరిపోయేది. ఇంజినీర్లు పరిశీలించి నిర్మాణాల విలువను లెక్కించి మిగతా అపరాధ రుసుము చెల్లించి సక్రమం చేసుకునేవారు. తాజా బీపీఎస్‌లో నిర్మాణానికి చెందిన డాక్యుమెంట్లు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాతనే జరిమానా చెల్లించడానికి అవకాశం ఇచ్చారు. యజమానుల వద్ద భూమి హక్కు పత్రాలు, నిర్మాణ ప్లాన్, సైట్ స్కెచ్ వంటివి ఉండటం లేదు. వీటి వల్ల బీపీఎస్ దరఖాస్తుకు ఎక్కువ మంది ముందుకు రాలేకపోతున్నారు.

పథకం అమలు ఇలా...	
గుర్తించిన అక్రమ నిర్మాణాలు	1,034
బీపీఎస్‌కు దరఖాస్తులు	56
జరిమానాతో వచ్చిన ఆదాయం (రూ. లక్షల్లో)	6.79
రాష్ట్రంలో స్థానం	17
ఎల్ఆర్ఎస్	
అనధికార లేఅవుట్ల నుంచి వచ్చిన దరఖాస్తులు	2,402
జరిమానా ఆదాయం(రూ.కోట్లలో)	21.99
రాష్ట్రంలో స్థానం	11

■ కొంత మంది రెండంతస్తులకు అనుమతి తీసుకుని మరో అంతస్తు నిర్మిస్తున్నారు. ఇలాంటి వారి నుంచి స్థానిక కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ముందే కొంత వసూలు చేసి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీలు ఇవ్వడంతో వారిలో చాలా మంది దరఖాస్తులు చేయడం లేదు.

■ వంద గజాలలోపు ఉన్న రెండంతస్తుల నివాస భవనాలకు బీపీఎస్ అవసరం లేదు. ఇదే అదునుగా వాణిజ్య భవనాలను నివాసాలుగా చూపించి దరఖాస్తులు చేయడం లేదు.

బ్యారేజీ వద్ద పరవళ్లు

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటి సోయగం కనువిందు చేస్తోంది. ఆదివారం పర్యాటకుల తాకిడితో పరిసరాలు సందడిగా మారాయి. పోలవరం జలాలు రావడంతో ఇన్‌ఫ్లో పెరిగింది. గోదావరిలో 50,169 క్యూసెక్కులు ఉండగా ధవళేశ్వరం వైపు బ్యారేజీ 18 గేట్లు 0.7 అడుగుల మేర పైకెత్తి 36,169 క్యూసెక్కులు కడలిలోకి విడిచిపెట్టారు. పశ్చిమ డెల్టాకు 7 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, తూర్పుడెల్టాకు 5 వేలు చొప్పున 14 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ సందర్భంగా హెడ్‌వర్క్స్ ఏఈ రాధాకృష్ణ మాట్లాడుతూ అధిక జలాలు వచ్చి చేరుతున్నందున దిగువకు విడిచి పెడుతున్నట్లు చెప్పారు.

- న్యూస్‌టుడే, ఆత్రేయపురం

పండగకూ పప్పు లేదు..!

రేషన్ దుకాణాల్లో పంపిణీ నిలిపివేత

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే కంది పప్పు పంపిణీకి దాదాపు మంగళం పాడేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిలిపి వేయగా కూటమి అధికారంలోకి వచ్చాక మూడు నెలల పాటు అందించారు. తర్వాత నిలిపివేశారు. ఏడాదికి పైగా రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులు పంపిణీ చేయడం లేదు.

రూ.3.20 కోట్ల భారం

జిల్లాలో 5.42 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీరికి ప్రతినెలా 926 రేషన్ దుకాణాల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నారు. కార్డుదారుల్లో 70 శాతం మంది రేషన్ సరకులపై ఆధారపడుతున్నారు. కిలో కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో రూ.120-140కు పైగా పలుకుతోంది. రేషన్ దుకాణాల్లో రూ.67కే అందించేవారు. ప్రతి నెలా 542 టన్నుల కందిపప్పు అవసరం. బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయడం వల్ల నెల నెలా లబ్ధిదారులపై రూ.3.2 కోట్లు భారం పడుతుంది. జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో జనవరి నుంచి గోధుమ పిండి పంపిణీకి చర్యలు తీసుకుంటున్నామని, కందిపప్పుపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు శ్రీనివాస్ తెలిపారు.

40 పాశురాలు.. 1,493 పదాలు

చీరపై లిఖించిన తిరుప్పావై పాశురాలు

కుంచెతో చీరపై తిరుప్పావై పాశురాలు రాస్తున్న లీలాపూర్ణిమ

గోదాదేవి అమ్మవారు గానం చేసిన తిరుప్పావైలోని 30, రంగనాథుడి మేలుకొలుపులోని 10 వెరసి మొత్తం 40 పాశురాలను చీరపై కుంచెతో రమణీయంగా లిఖించారు మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన శ్రీఘాకోళపు లీలాపూర్ణిమ. ఈ చీరను అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయంలోని గోదాదేవికి సమర్పించారు. ఒక్కో పాశురంలో 8 వాక్యాలు చొప్పున ఒక్కో దానిలో నాలుగైదు వరకు పదాలు ఉంటాయి. 320 వాక్యాల్లో మొత్తం 1,493 పదాలను పలు రంగులతో చూడముచ్చటగా లిఖించారు. వాటి మధ్యలో వైవిధ్యమైన రంగుల మేళవింపుతో గోదాదేవి చిత్రం సహా నెమలి, వేణువు బొమ్మలను కూడా చిత్రించారు. దీనికిగాను తనకు రోజుకు రెండు గంటల చొప్పున పది రోజుల పాటు సమయం పట్టిందన్నారు. ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న తనకు తల్లి కామాక్షి నుంచి నేర్చుకున్న పాశురాలను చక్కగా పఠించడంతో పాటు రంగులతో లిఖించడం నేర్చుకున్నట్లు వివరించారు. ఆరున్నర మీటర్ల చీరపై పాశురాలు, చిత్రాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, మామిడికుదురు

88 శాతం పల్స్‌పోలియో

చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

అల్లవరం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు అయిదేళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను 88 శాతం మందికి వేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి దుర్గారావు దొర తెలిపారు. జిల్లాలో 1,48,954 మంది అయిదేళ్ల లోపు చిన్నారులు ఉండగా వారిలో ఆదివారం 1,31,553 మందికి పోలియో చుక్కలు వేశారన్నారు. దీనికోసం జిల్లాలో 1687 బృందాలను ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన చిన్నారులకు సోమ, మంగళ వారాల్లో ఇంటింటికీ తిరిగి చుక్కలు వేస్తామన్నారు.

ఉద్యోగం పేరిట ఊడ్చేశారు

రూ.8.5 లక్షలు నష్టపోయిన మహిళ

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: సైబర్ నేరగాళ్లు ఉద్యోగం పేరిట ఎరవేసి ఓ మహిళ నుంచి రూ.8.5 లక్షలు లాగేసి నిండా ముంచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పలగుప్తం పంచాయతీ పేరాయిచెరువుకు చెందిన ఓ గృహిణి కొన్నాళ్లుగా ఉద్యోగ అన్వేషణలో ఉన్నారు. 20 రోజుల క్రితం ఉద్యోగం కల్పిస్తామంటూ అపరిచిత వ్యక్తుల నుంచి టెలిగ్రామ్ యాప్ ద్వారా ఓ లింక్ వచ్చింది. వారి మాయ మాటలు నమ్మి ఆమె వారిని టెలిగ్రామ్ ద్వారా సంప్రదించారు. ఇంటి వద్దనే ఉంటూ ఆన్‌లైన్‌లో రూ.లక్షలు సంపాదించ వచ్చునని నమ్మించారు. పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని ఆశ చూపారు. వారి మాటలు నమ్మిన ఆమె బ్యాంకు ఖాతాలు, యూపీఐ ఐడీల ద్వారా డబ్బులు పంపించారు. నమ్మకం కల్పించేందుకు రూ.లక్షల్లో లాభాలు వచ్చినట్లు ఆన్‌లైన్‌లో చూపించేవారు. ఆ మొత్తం ఆమె బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలంటే మరింత డబ్బు పంపించాలని కోరడంతో విడతల వారీగా రూ.8.5 లక్షలు చెల్లించారు. చివరకు రూ.11,500 ఆమె పంపించి సంప్రదింపులు నిలిపివేశారు. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ ఆదివారం తెలిపారు. టెలిగ్రామ్, వాట్సాప్, తదితర సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే వర్క్ ఫ్రమ్ హోం, అధిక లాభాలు వంటి ప్రకటనలు చూసి మోసపోవద్దని ఎస్సై సూచించారు.

నాడు 14 రోజులు.. నేడు 23 రోజులు

● మారిన ఇంటర్మీడియట్ పరీక్షల తీరు
● ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి

రామచంద్రపురం, అల్లవరం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ పరీక్షల తీరు మారింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యార్థులకు రోజు విడిచి రోజు చొప్పున గత విద్యా సంవత్సరం వరకు 12 రోజుల పాటు పరీక్షలు నిర్వహించేవారు. ఒకేషనల్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సుల పరీక్షలతో 14 రోజుల పాటు పరీక్షలు జరిగేవి. ఈ విద్యా సంవత్సరంలో ఏకంగా 23 రోజుల పాటు పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 24 వరకు నిర్వహించాలని ఇంటర్ బోర్డు టైంటేబుల్ ప్రకటించింది. ప్రతీ జిల్లాలోనూ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ఏప్రిల్‌లో ఒకసారి, నవంబరు, డిసెంబరు నెలల్లో మరోసారి వృత్యంతర శిక్షణ తరగతులు పూర్తిచేశారు. మారిన టైం టేబుల్, పరీక్షల నిర్వహణపై అమలాపురంలో ఈనెల 16వ తేదీన డీఐఈవో కె.చంద్రశేఖరబాబు అధ్యక్షతన అధ్యాపకులు, అధికారులకు ఒక్క రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఇంటర్ బోర్డు నుంచి అధికారి జె.వి.ఎస్.ఎస్.సుబ్రహ్మణ్యం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. గతంలో ఎంపీసీ, బైపీసీలకు 6 సబ్జెక్టులు ఉండగా ఈ ఏడాది నుంచి మొదటి సంవత్సరం విద్యార్థులు 5 సబ్జెక్టుల పరీక్షలే రాయాలి. 6వ సబ్జెక్టును ఆప్షనల్ చేశారు.

అధ్యాపకులు, సీఎస్, డీవోలకు అవగాహన కల్పించాం

డా.బి.ఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమయ్యే పరీక్షలపై అవగాహన, ప్రయోగ పరీక్షలపై సైన్సు అధ్యాపకులకు వృత్యంతర శిక్షణ పూర్తిచేశాం. 24 పేజీలు, 32 పేజీల జవాబు పత్రాలు ఎవరెవరికి ఇవ్వాలో శిక్షణలో వివరించాం. ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రథమ సంవత్సరం పాఠ్యాంశాల్లో మార్పులు అమలు చేస్తున్నాం, వచ్చే ఏడాది రెండో సంవత్సరం పాఠ్యాంశాల్లో చేసే మార్పులపై ఇప్పటికే ఇంటర్‌బోర్డు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

– కె.చంద్రశేఖరబాబు, డీఐఈవో

మండపేటలో అభివృద్ధికి శ్రీకారం

టిడ్కో ఫేజ్-2 గృహాలను ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

మండపేట, ద్వారపూడి, న్యూస్‌టుడే: టిడ్కో గృహాల్లో బాల్కనీ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ చెప్పారు. ఆదివారం మండపేటలో టిడ్కో రెండో విడత ఇళ్లను మంత్రి లబ్ధదారులకు పంపిణీ చేసి వారితో గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మండపేట ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన ఫౌంటెన్, ఐ లవ్ మండపేట గుర్తులను ప్రారంభించారు. జయలక్ష్మినగర్‌లో రూ.4.44 కోట్లతో నిర్మించిన సీసీ రహదారులు, డ్రెయిన్లను ఆయన ప్రారంభించారు. అనంతరం సత్యశ్రీరోడ్డులో వర్మీకంపోస్టు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రూ.68.50 లక్షలతో ఆధునికీకరించిన మున్సిపల్ కార్యాలయంతో పాటు సౌరశక్తి ప్లాంటును ప్రారంభించారు. అనంతరం పలువురు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కల మందు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన హ్యాపీ సండే కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైస్‌ఛైర్మన్ పి.గణేశ్వరరవావు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు పాల్గొన్నారు.

● టిడ్కో నివాసాల వద్ద ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిర్మించిన 408 రాజీవ్ గృహకల్ప సముదాయం అసంపూర్తిగా వదిలేస్తే ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి లబ్ధిదారులకు ఉచితంగా అందజేశామన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నీటి పారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి మాట్లాడారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

వృథాగా వదిలేశారు..!

మూతపడిన కొబ్బరిపీచు ఉత్పత్తికేంద్రం

న్యూస్‌టుడే, పి.గన్నవరం

ప్రభుత్వం ఏదైనా భవనం నిర్మించాలంటే ఇటీవల స్థలం అందుబాటులో ఉండటం లేదు. ఇక్కడ మాత్రం ప్రభుత్వానికి సంబంధించి రూ.కోట్ల విలువైన స్థలం వృథాగా మారింది. అందులో కొన్నేళ్లపాటు నడిచి ఆనక మూతపడిన పరిశ్రమ ఉంది. ఇప్పుడు యంత్రాంగం కనీసం దానివైపు కన్నెత్తి చూడటం లేదు. పి.గన్నవరంలో సుమారు 50 ఏళ్ల క్రితం విశాలమైన స్థలంలో ప్రభుత్వ కొబ్బరిపీచు ఉత్పత్తి పరిశ్రమ నడిచింది. అప్పట్లో కాయిర్‌బోర్డు అధికారులు ఇక్కడ ఉండి పరిశ్రమను విజయవంతంగా నడిపించటంతో పలువురు ఉపాధిపొందేవారు. కొన్నేళ్ల క్రితం అది మూతపడింది. తిరిగి 2002 డిసెంబరు 18న బాగుచేయించి అధునాతన యంత్రాలు ఏర్పాటు చేసి ప్రారంభించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నడిపించి డ్వాక్రా మహిళా సంఘానికి అప్పగించారు. లీజుపై అప్పగించటంతో కొంత మొత్తం ప్రభుత్వ ఖజానాకు వచ్చేది. కొంతమందికి ఉపాధి లభించేది. కాలక్రమేణా నష్టాలు వస్తున్నాయని నడిపించలేక వదిలేశారు. తొమ్మిదేళ్ల నుంచి పరిశ్రమ మూతపడింది. సుమారు ఎకరం విస్తీర్ణంలో ఈ పరిశ్రమ ఉంది. కొబ్బరిపీచు ఉత్పత్తి చేయటం, బేళ్లు కట్టడం వంటి ప్రక్రియ ఇక్కడ జరిగేది. దీనికి అవసరమైన యంత్రాలను అప్పట్లో ప్రభుత్వపరంగా ఏర్పాటుచేశారు. ప్రస్తుతం మూడు షెడ్లు, తుప్పపట్టిన బేలింగ్ మిషన్, విశాలమైన స్థలం, దాని చుట్టూ రక్షణగా ప్రహరీ గోడ ఉన్నాయి.

తుప్పపట్టిన బేలింగ్‌ప్రెష్ మిషన్

పట్టించుకుంటే ప్రయోజనం

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా(ఎం.ఎస్.ఎం.ఇ) పరిశ్రమలను ఏర్పాటుచేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. ఇక్కడ నిరుపయోగంగా ఉన్న మూడు షెడ్లకు మరమ్మతులు చేపట్టి, కొత్తగా కొబ్బరిపీచు ఉత్పత్తి యంత్రాలను ఏర్పాటుచేసి దీనిని ప్రారంభిస్తే నిరుద్యోగ యువతకు ఉపాధి కలుగుతుంది. గతంలో కొబ్బరి పొట్టుతో ఇటుకలు తయారుచేసి విక్రయిస్తే మంచి ఆదాయం వస్తుందని అప్పట్లో భావించారు. ఆ ప్రయత్నమూ ఫలించలేదు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఏర్పాటుచేసే దిశగా ప్రభుత్వం ముందుకెళ్లుతున్న తరుణంలో ఇలాంటి నిరుపయోగ ప్రభుత్వ పరిశ్రమలను తెరిపించేందుకు పాలకులు, అధికారయంత్రాంగం చొరవ చూపాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు.

(c) eenadu

సిద్ధివినాయక.. శుభదాయక



అయినవిల్లి సిద్ధి వినాయకస్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దీంతో క్యూలైన్లు నిండిపోయాయి. పలువురు నూతన వాహనాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

కృష్ణం వందే సర్వసుందరం

ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ముందు సాగాలని పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. తాళ్లరేవు మండలం గాడిమొగలో హరేకృష్ణ సత్సంగ కేంద్రం, రాధాకృష్ణ మందిర ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. రాధాకృష్ణుల విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తిగీతాలు ఆలపించారు. యానాం నాయకుడు, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, మందిరం అధ్యక్షుడు సంగాడి పూసలయ్య, సర్పంచి గోవలక్ష్మి, ఉపసర్పంచి లోకేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

పర్యాటకమంతా విద్యార్థుల సందడే

కోరంగి అభయారణ్యంలోని బోట్లింగ్ పర్యాటక కేంద్రం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. జిల్లా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన పాఠశాలల విద్యార్థులతో సందడి నెలకొంది. అనకాపల్లి జిల్లా యలమంచిలి నుంచి, కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడి వన్యప్రాణులు, మడ మొక్కల విశిష్టతను తెలుసుకున్నారు. సముద్రం మొగ వరకు బోటు షికారు చేశారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

గోదాదేవికి ప్రత్యేక అలంకరణ

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అప్పనపల్లి బాల బాలాజీస్వామి ఆలయంలో కొలువుదీరిన గోదాదేవి అమ్మవారికి ఆదివారం వేదపండితులు మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణలతో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కలశాలతో తీసుకొచ్చిన పవిత్ర జలాలతో అభిషేకించి వివిధ రకాల పూలు, తులసి మాలలతో అలంకరించారు. వేదపండితులు, అర్చకులు తిరుప్పావై పాశురాలను పఠించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అనేక మంది దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

అంతర్వేది క్షేత్రంలో రోడ్లకు మోక్షం

అంతర్వేది, మలికిపురం, న్యూస్‌టుడే: అంతర్వేది క్షేత్రంలో రోడ్లకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. పంచాయతీరాజ్‌శాఖ నుంచి రూ.1.85 కోట్లతో 6, ఆర్‌అండ్‌బీ నుంచి రూ.16 లక్షలతో ఒకరోడ్డు మంజూరయ్యాయి. లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు జనవరి 25 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకూడదనే లక్ష్యంతో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు. దీంతో బీచ్, ఆదర్శనగర్, వసంత మండపం రోడ్లను సీసీగాను, ఖాన్‌షాట్, పల్లిపాలెం, రామాలయం నుంచి లైట్‌హౌస్ వరకు ఉన్న రోడ్లను బీటీగాను వేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు మరోచోట బీచ్, లైట్‌హౌస్ రోడ్లను వేయడానికి టెండర్లు పిలిచారు. సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని జేఈలు సురేష్, గంగాధర్ వెల్లడించారు. ఇవి పూర్తయితే ప్రయాణికులు, భక్తులు, పర్యాటకులకు అవస్థలు తప్పుతాయని చెబుతున్నారు.

మార్చిలో యూనియన్ రాష్ట్ర మహాసభలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో మార్చి 10, 11, 12 తేదీల్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 6వ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారాయుడు వెల్లడించారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ మహాసభల్లో కార్మిక సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి పలు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వాలు అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, కోనసీమ జిల్లా గౌరవ అధ్యక్షుడు సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గమ్మ, జిల్లా అధ్యక్షుడు రమణ, కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలే లక్ష్యం: ఆలపాటి

పునశ్చరణ తరగతుల ముగింపు సభలో మాట్లాడుతున్న ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలే లక్ష్యంగా సి.ఆర్. మీడియా అకాడమీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ చెప్పారు. రామచంద్రపురం వీఎస్‌ఎం కళాశాలలో రెండో రోజు ఆదివారం పునశ్చరణ తరగతుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే జర్నలిస్టుగా రాణించగలమని పేర్కొన్నారు. క్రైమ్ రిపోర్టింగ్‌లో మెలకువలు అంశంపై శ్రీశైలం రమేష్ మాట్లాడుతూ సమాజం రెండో పార్శ్వాన్ని ఎత్తి చూపేవి నేర వార్తలని చెప్పారు. డెవలప్‌మెంట్ జర్నలిజం అంశంపై డా.జి.కొండలరావు అవగాహన కల్పించారు. సీనియర్ పాత్రికేయుడు అన్నవరపు బ్రహ్మయ్య కథనాలు ఎలా రాయాలో వివరించారు. దేవగళ్ల రామకృష్ణ గ్రామీణ రిపోర్టింగ్‌లో మెలకువలపై మాట్లాడారు. అనంతరం ఛైర్మన్ సురేష్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు ఎం.శ్రీరామమూర్తి సర్టిఫికెట్లు అందజేశారు.

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 9000180626, 9989993175

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	17,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	28,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	27,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	128-00
రిటైల్ లైవ్	155-00
డ్రెస్డ్	225-00
స్కిన్‌లెస్	256-00

రామానుజన్ చరిత్రను విద్యార్థులు అధ్యయనం చేయాలి

అవార్డు గ్రహీత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

అవార్డు గ్రహీతలతో రామానుజన్ గణిత అకాడమీ ఆహ్వాన కమిటీ సభ్యులు

రామచంద్రపురం, న్యూస్‌టుడే: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చరిత్రను విద్యార్థులు అధ్యయనం చేయాలని ఈ ఏడాది రామానుజన్ స్మారక గణిత అవార్డు గ్రహీత, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ చెప్పారు. గణిత సేవా సంస్థ రామానుజన్ గణిత అకాడమీ 36వ వార్షికోత్సవ సభ, రామానుజన్ జయంతి సందర్భంగా వీఎస్‌ఎం కళాశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ కె.వి.వి. మాట్లాడుతూ రామానుజన్ జయంతి గణితశాస్త్ర చరిత్రలో ఎర్రసిరాతో లిఖించిన రోజని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాసిన 'ద బ్యూటీ ఆఫ్ ప్రీ ఒలింపియాడ్ ప్రాబ్లమ్స్' గ్రంథాన్ని గణిత శాస్త్రజ్ఞులు ఆవిష్కరించారు. అనంతరం రామానుజన్ స్మారక గణిత పురస్కారాన్ని డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌కు, సంజీవరాయశర్మ అవార్డును బెంగళూరుకు చెందిన డీకే ప్రసన్నకుమార్‌కు, కృష్ణమూర్తి ఉపాధ్యాయ అవార్డును డాక్టర్ ఎస్.ధనుంజయకు అందించారు. గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కె.వి.వి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో రేవతి సైన్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి, అకాడమీ సభ్యులు తోటకూర సాయి రామకృష్ణ, ఎం.నాగార్జున, ఎస్.ఎన్.కె.ప్రసాద్, శ్రీధర్, చంద్రశేఖరశాస్త్రి, ముమ్మిడి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. జాతీయ స్థాయి, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాస్థాయిలో ప్రతిభచూపిన రామచంద్రపురం, ద్రాక్షారామ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

కన్నేశారంటే.. కొల్లగొడతారు..!

■ ముగ్గురు అరెస్టు ■ రూ.35 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

అమలాపురం ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ మీనా (అంతర చిత్రంలో) స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.35 లక్షల విలువైన 274.800 గ్రాముల బంగారం, 1750 గ్రాముల వెండి వస్తువులు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్‌మీనా ఆ వివరాలను వెల్లడించారు.

70 కేసుల్లో నిందితుడు..

అమలాపురం మండలం కొంకాపల్లికి చెందిన అంతర్రాష్ట్ర దొంగ పత్తివాడ లోవరాజు(31) ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుమారు 70 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ప్రతిసారీ జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత చోరీల బాటపడుతున్నాడు. వివిధ పరికరాలతో ఇంటి తాళాలను సులువుగా తెరుస్తాడు. అతడి నుంచి రూ.25 లక్షల విలువైన 185 గ్రాముల బంగారం, 1750 గ్రాముల వెండి వస్తువులు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇతడిపై అమలాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో -2, పెనుగొండలో -2, హైదరాబాద్‌లో-1 కేసు నమోదయ్యాయి.

స్నాచింగ్ దొంగ అరెస్ట్...

పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం సీతలంకొండేపాడు చిన్నవీధికి చెందిన కవురు మూర్తి(24) ద్విచక్ర వాహనంపై వెళ్తూ మహిళల మెడలోని బంగారు ఆభరణాలను లాక్కొని పరారవుతాడు. రావులపాలెం రూరల్, ఆత్రేయపురంలో కేసులున్నాయి. అతడి నుంచి రూ.6 లక్షలు విలువ చేసే 49.800 గ్రాముల బంగారం, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

తలుపులు బద్దలుకొట్టి చోరీలు

అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గంటి వారి వీధికి చెందిన గంటి గౌతమ్ (24) కొత్తపేటలో తాళాలు వేసిన ఇంటి తలుపులను రాడ్డుతో బద్దలు కొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అతడి నుంచి రూ.4.50 లక్షల విలువ చేసే 39 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

పోలియో చుక్కల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

పోలియో రహిత సమాజమే లక్ష్యం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజమే లక్ష్యమని మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. రామచంద్రపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి చిన్నారికి చుక్కల మందు వేశారు. ఐదేళ్లలోపు వయసున్న చిన్నారులకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలన్నారు. కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కమిషనర్ రాజు, ఐసీడీఎస్ సీడీపీవో వరాహలక్ష్మి, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉండవల్లి శివ, డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.

కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు, న్యూస్‌టుడే: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులుతీరారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దర్శనాల ద్వారా రూ.22,240, అన్నదాన ట్రస్ట్‌కు రూ.7,358, ప్రసాదం విక్రయాలు రూ.23,500, ఇతర టిక్కెట్ల అమ్మకాలు రూ.49,530 ఆదాయం వచ్చింది. ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్, ఆలయ ప్రధానార్చకుడు ఎస్వీకేపే శర్మ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ స్మృతి మందిరం ప్రారంభం



వైఎస్సార్ స్మృతి మందిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు యానాంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్మృతి మందిరాన్ని ఆదివారం కేవీపీ రామచంద్రరావు ప్రారంభించారు. స్థానిక యర్రాగార్డెన్‌లోని మల్లాడి ఇంటి వద్ద నిర్మించిన ఈ మందిరం వద్ద ఏర్పాటు చేసిన సభకు అధ్యక్షత వహించిన మల్లాడి మాట్లాడుతూ వైఎస్ఆర్ పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకుడు కంతేటి కాశి అందించిన విరాళంతో ఏర్పాటు ఎంబ్రాయిడరీ, జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణ కేంద్రాన్ని సభలో ప్రారంభించారు. మల్లాడి రాసిన 'ఆత్మీయులు రాజన్న స్మృతిలో' పుస్తకాన్ని కేవీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయి రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఏఐసీసీ సభ్యుడు జి.చిన్నారెడ్డి, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంతం నానాజీ, కేంద్ర మాజీమంత్రి పళ్లంరాజు, మాజీ ఎమ్మెల్సీ గిడుగు రుద్రరాజు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, సూరీడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలపై కక్షపూరిత రాజకీయాలు తగవు

ప్రతిపక్షాల పట్ల కక్షపూరిత రాజకీయాలు తగవని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి అన్నారు. ఇలాంటి కక్షపూరిత రాజకీయాలు ఎప్పుడు ప్రారంభమయ్యాయో.. తనకు తెలీదని, ఇది మంచి విధానం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షం ప్రతిపక్షాన్ని శత్రువుగా చూడకూడదన్నారు. తమిళనాడు తరహా రాజకీయాలు ఆంధ్రాలో అమలు చేయడం దురదృష్టకరమన్నారు.

చిన్నతరహా నీటివనరుల సర్వే

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

లంకలగన్నవరంలో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

జిల్లాలో అర్థగణాంక శాఖ ఆధ్వర్యంలో చిన్నతరహా నీటివనరులపై సర్వే చేస్తున్నారు. ఈ నెలాఖరుకు దీన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ప్రధానంగా భూగర్భజలాలపై ఆధారపడి సాగుచేస్తున్న భూములకు సంబంధించి బోర్లు ఎన్ని ఉన్నాయనే దానిపై వివరాలు సేకరిస్తున్నారు. గత ఏడాది చేసిన సర్వే ప్రకారం సుమారు 20 వేల వరకు వ్యవసాయ బోర్లు ఉన్నాయి. ఈ ఏడాదిలో మరో 15 శాతం పెరుగుతాయని అంచనా. శనివారం నాటికి 18,500 బోర్లకు సంబంధించి సర్వే పూర్తిచేశారు.

వివరాల సేకరణ

గత రెండు నెలలుగా గ్రామాల్లో ఈ సర్వే చేస్తున్నారు. గ్రామం, రైతు పేరు, బోరుపై ఎంత సాగవుతుంది, భూగర్భజలం ఏవిధంగా వస్తుంది, నీరు వస్తుందా లేదా తదితర వివరాలు సేకరిస్తున్నారు. నెలాఖరువరకు సర్వే కొనసాగుతుంది.

పలు మండలాల్లో ఇలా.. కొత్తపేట(2087), అయినవిల్లి(2002), మలికిపురం(1866), మండపేట(1559), రావులపాలెం(1639), ఆత్రేయపురం(1609), అంబాజీపేట(1909).

నిధుల కేటాయింపు

కేంద్ర ప్రభుత్వ అధీనంలో వ్యవసాయ బోర్ల సర్వే జరుగుతుంది. దీని ఆధారంగా చేసుకుని నిధుల కేటాయింపు ఉంటుంది. ప్రధానంగా దీనిద్వారా భూగర్భజలాలు ఏవిధంగా ఉన్నాయనేది తెలుస్తుంది. కాలువ జలాలు లేకుండా బోర్లు మీద సాగుచేసే రైతులకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

– ఎం.మురళీకృష్ణ, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph :81422 92071.

శ్రీ సాయి గోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ప్రైవేట్ సంస్థలు నుండి అయినా విడిపించి ఆ రోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్‌క్యాష్ ✆ 9493338823

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీకి పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, 7386201191

REAL ESTATE

LAND FOR SALE

JAGGAMPETA

రాజమండ్రికి 30-కి.మీ. దూరంలో మురారి-గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మకం. (నోబ్రోకర్స్), ✆ 9032988265.

JOBS

జై గణేష్ సెక్యూరిటీ తణుకులో విజిలెన్స్ ఆఫీసర్ 7గురు (Ex Service only) జీతం: 28,000/- గన్ మేన్ 3 మెంబర్స్ జీతం: 33,000/- వయసు 50 సం॥ లోపు. PF&ESI W/H, 8 గం॥ డ్యూటీ ✆ 95818 58667.

సెంట్రల్ గవర్నమెంట్ సోలార్ సబ్సిడీ స్కీమ్ నందు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. Q: 10 to PG. జీతం: 30 వేలు to 50 వేలు. ✆ 95155 05557, 99898 57775.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

వైజాగ్ ప్రముఖ షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం:10000 - 12000 + ఫుడ్, రూము. 9030588502, 9704637370

రాజమండ్రి, అనకాపల్లిల్లో ప్రై॥కం॥ & ప్రాజెక్టుల్లో సె॥గార్డ్స్, సూపర్‌వైజర్స్, ఆయాలు స్త్రీ/పు., జీ: 12 to15 వేలు. రూం+బో. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, RJY, ✆ 93922 69369

SECURITY GUARDS

కాకినాడ, టిక్కవోలు, పోలవరం ప్రాజెక్ట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు & గార్డ్స్ కావలెను. PF, ESI మరియు ఉచిత భోజన + వసతి కలదు. ✆ 8500498115, 9866594189

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-90 పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విద్యను అభ్యసించిన పాఠశాల దేవాలయంతో సమానమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం మంగళవారపుపేట బీఈడీ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 1970-75 ఏడాదిలో విద్యాభ్యాసం పూర్తి చేసిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యాబోధనతో పాఠశాల గురువులు నేర్పిన చదువుతో ఇక్కడ చదువుకున్న వారంతా ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారన్నారు. ఇదే పాఠశాలలో తాను చదువుకున్నానని, అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు చింతపెంట ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు హాజరై సందడి చేశారు. అలనాటి గురువులను సత్కరించారు. విశ్రాంత జడ్జి పాడిపిరెడ్డి రాంబాబు, మద్దుల సత్యనారాయణ, శ్యామ్ సింగ్, విఠోబా మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

బైపాస్‌పై ప్రయాణమంటే బెంబేలే..

రాజోలు మండలం శివకోటి పెట్రోలుబంక్ నుంచి పాశర్లపూడి వరకు విస్తరించి ఉన్న బైపాస్ ప్రమాదకరంగా మారింది. ఆయా గ్రామాల నుంచి అనుసంధానం చేసిన క్రాసింగ్‌ల వద్ద ఏవిధమైన హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వేగనియంత్రణ సూచికలు కూడా లేవు. ఈ విషయాన్ని జాతీయ రహదారుల ఏఈ వెంకటరమణ వద్ద ప్రస్తావించగా ప్రమాదకర ప్రాంతాల వద్ద రక్షణ చర్యలు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

నిడదవోలు, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై పి.అప్పారావు తెలిపారు. నిడదవోలు-తాడేపల్లిగూడెం స్టేషన్ల మధ్యం మారంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో 548/4వ కి.మీ వద్ద దిగువ రైలు పట్టాల మధ్యలో సుమారు 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడన్నారు. పచ్చరంగు టీ షర్టు, నాచు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసినవారు 94906 17090, 80191 57528 చరవాణి నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న రెడ్డిసుబ్రహ్మణ్యం, వేదికపై ఎమ్మెల్యే బుచ్చిబాబు తదితరులు

తెదేపాతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం

జిల్లా రజక ఆకాంక్ష సభలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: బీసీలకు రాజకీయ ప్రాధాన్యం తెదేపా ఆవిర్భావంతోనే ప్రారంభమైందని ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు అన్నారు. ముమ్మిడివరంలోని డీఎల్‌ఎఫ్ కల్యాణ మండపంలో ఏపీ రజక వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సి.సావిత్రి అధ్యక్షతన ఆదివారం జరిగిన రజక ఆకాంక్ష సభలో బుచ్చిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రజకులంతా కూటమి ప్రభుత్వానికి అండగా ఉన్నారని. . న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. శాసన మండలి మాజీ ఉప సభాపతి రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. తెదేపా హయాంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలుచేస్తే.. వైకాపా 10 శాతం తగ్గించి ద్రోహం చేసిందన్నారు. కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, గొల్లపల్లి ధర్మారావు, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తాడి నరసింహారావు, మోకా ఆనందసాగర్, సాగిరాజు సూరిబాబురాజు, పెచ్చెట్టి చంద్రమౌళి, జిల్లా భాజపా అధ్యక్షులు, అడబాల సత్యనారాయణ, కడలి ఈశ్వరి, నామన రాంబాబు, చెల్లి అశోక్, నాగిడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్ నుంచి బీప్ శబ్దం.. భయపడిన ప్రయాణికులు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు నుంచి భీమవరం వెళ్లే ప్యాసింజర్ రైలు బోగీలో ఒక బ్యాగ్ నుంచి బీప్ శబ్దం రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురై కిందికి దిగిపోయారు. రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బోగీలో బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. కిందకు దించి పరిశీలించగా పాడైన స్వైపింగ్ మిషన్, పాత దుస్తులు ఉన్నాయి. పాడైన మిషన్ నుంచి బీప్ శబ్దాలు వస్తున్నట్లు గుర్తించారు. ఆందోళనకరంగా ఏమీ లేకపోవడంతో ప్రయాణికులు తిరిగి రైలెక్కారు. ప్రయాణికుడు బ్యాగ్ వదిలి వెళ్లిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు.

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

అంగన్‌వాడీ సిబ్బందికి చరవాణుల అందజేత

మలికిపురం, న్యూస్‌టుడే: పిల్లల ఆరోగ్యం విష యంలో అంగన్‌వాడీ కేంద్రాలు బాధ్యతగా ఉండాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. విశ్వేశ్వరా యపురం క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన 5జీ చరవాణుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాజోలు ప్రాజెక్టు పరిధిలో 264 మందికి ప్రభుత్వం మంజూరు చేసిన సుమారు రూ.4 లక్షల విలువైన చరవాణులను కార్యకర్తలు, సూపర్‌వైజర్లకు అందజేశారు. సీడీపీవో ఇందిర, సూపర్‌వైజర్లు హైమ వతి, విజయభారతి, సరోజినీదేవి, మున్నిసా, చంద్ర కళ, ఎంపీపీ సత్యవాణి, ఉప ఎంపీపీ ఆనందరాజు, పెద్దకాపు, మహాలక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధితో పేదలకు చేయూత

మలికిపురం, పి.గన్నవరం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విశ్వేశ్వరాయపురం క్యాంపు కార్యాలయంలో ఆదివారం సీఎం సహాయ నిధి నుంచి 48 మందికి మంజూరైన రూ.25,16,953 మొత్తా నికి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం, ప్రయోజనం గురించి కూటమి నాయకులు ప్రచారం చేసి అర్హులైన మరింత మందికి లబ్ధి చేకూరేలా కృషి చేయాలన్నారు. పెద్దకాపు, మహాలక్ష్మీప్రసాద్, మోహన్, వెంకటసత్యవాణి, హేలీనా, శ్రీదేవి పాల్గొన్నారు. ✦ పి.గన్నవరం క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో 69 మందికి సీఎంఆర్ఎఫ్ కింద రూ.32.25 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అందించారు. ఏ.ఎం.సి. ఛైర్పర్సన్ లక్ష్మి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గంగాదేవి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీకు సంబంధించిన ఫిర్యాదులు ఫోన్ చేయాల్సిన నెంబరు: 80085 74174
ఉ. 10 - మ. 1 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

వెలిగిన వీధి దీపాలు

స్పందనకు వందనం

మామిడికుదురు: పాశర్ల పూడిలంక పరిధి పంచాయతీ కార్యాలయ సమీపం లోని బొర్రావారి వీధిలో విద్యుత్తు దీపాలు సక్ర మంగా వెలగడం లేదని స్థానికులు చెప్పిన సమ స్యను సర్పంచి సూర్యప్రకాశరావు, కార్యదర్శి సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. వాటి స్థానే ఎల్ఈడీ దీపాలు ఏర్పాటు చేయించారు.

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వసంతవాడలో వీధి దీపాలు వెలగక స్థానికులు ఇబ్బందులు పడు తున్నారు. ఈ విషయాన్ని సర్పంచి గాదిరాజు రామకృష్ణంరాజు వద్ద ప్రస్తావించగా లైట్లకు మర మ్మతులు చేయించి దీపాలు వెలిగించారు.

డ్రెయిన్‌లో పూడికతీత

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపా దులోని అమ్మవారి ఆలయం సమీపంలో డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోవడంతో మురుగునీరు పారడం లేదు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి వీరమాత దృష్టికి తీసుకుని వెళ్లగా పూడిక తీయించారు.

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెం ఇందిరాకాలనీలో డ్రెయిన్ పూడిపోవడంతో మురుగునీరు పారక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమ స్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసు కుని వెళ్లడంతో సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

సమాజ సేవకు తోడ్పాటు అందిద్దాం

సమాజ సేవకు తోడ్పాటు అందించడం ద్వారా మంచి గుర్తింపు పొందవచ్చని వాడపల్లి దేవస్థాన ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు అన్నారు. ఆయన ఆదివారం ఆత్రేయపురం రేవు నుంచి గ్రామం వరకు 'మన భూమి.. మన బాధ్యత' కార్యక్రమంలో పాల్గొని స్థాని కులతో కలిసి డ్రెయిన్లు, వీధులను శుభ్రం చేయడం వంటి పనులు చేశారు. మన పరి సరాలను మనమే శుభ్రం చేసుకుంటే ఆరోగ్య కర సమాజం సాధ్యమవుతుందన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

ఆకట్టుకున్న క్రిస్మస్ అలంకరణ

సఖినేటిపల్లిలో క్రిస్మస్ సందడి నెలకొంది. పలు చర్చిలను విద్యుత్తు దీపా లతో అందంగా అలంక రించి ఆరాధనలు చేస్తు న్నారు. అడ్డంపాలెం గ్రామ రహదారి చెంత ఏర్పాటు చేసిన శాంతా క్లాజ్ చూడముచ్చటగా ఉండి అందరినీ ఆకట్టుకుం టోంది. – న్యూస్‌టుడే, సఖినేటిపల్లి

దాళ్వా సాగులో సందేహాలా?

అంబాజీపేట: 'ఈనాడు' ఆధ్వ ర్యంలో అంబాజీపేట మండల వ్యవసాయాధికారి కె.ధర్మ ప్రసాద్‌తో 'ఫోన్ ఇన్' కార్య క్రమం జరగనుంది. దాళ్వా సాగుకు సంబంధించి తీసుకో వాల్సిన జాగ్రత్తలు, మెలకువలు, విత్తనాల ఎంపిక, సస్యరక్షణ, సాగునీటి కొరత, అన్న దాత సుఖీభవ, పీఎం కిసాన్ తదితర పథకాల అమలు వంటి సమస్యలను అన్నదాతలు వివరిం చాలి. వారు సందేహాలు నివృత్తి చేస్తారు.

తేదీ: నేడు (సోమవారం)
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
చరవాణి నంబరు: 83310 56529

ఆక్రమించేస్తారు.. అద్దెకు ఇచ్చేస్తారు

పరిశోధన

– న్యూస్‌టుడే, అంబాజీపేట, అయినవిల్లి

గ్రామాల్లో ఆర్అండ్‌బీ, జలవనరుల శాఖలకు చెందిన ఖాళీ భూములను ఆక్రమించి కొందరు వాటిల్లో పక్కా కట్ట డాలు నిర్మించేస్తున్నారు. దుకాణాల కోసం అద్దెకు ఇచ్చేస్తు న్నారు. ఏళ్లతరబడి ఇదే తంతు కొనసాగుతున్నా పాల కులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ముందుగా పూరి పాకలు మాదిరిగా వేస్తున్నారు. కొన్నాళ్లకు వాటినే భారీ కట్టడాలుగా మార్చేస్తున్నారు. రాజోలు, పి.గన్నవరం నియో జకవర్గాల్లోని చాలావరకు స్థలాలు ఆక్రమణల్లో ఉన్నాయి.

ఎక్కడెక్కడ అంటే..

● పుల్లేటికుర్రు పంచాయతీ పరిధి చినలంక నుంచి కము జువారిలంక మీదుగా ముక్కామల కూడలి వరకు ఇరువై పులా దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ● కె.పెదపూడి నుంచి పుల్లేటికుర్రు వెళ్లే ప్రధాన రహదారితో పాటు పంట కాలువలను ఆక్రమించుకున్నారు. ముక్కామల-నేదునూరు మార్గంలో కూడా ఇదే పరిస్థితి. ● అంబాజీపేట నుంచి అమలాపురం వైపు ప్రధాన రహదారి చెంతన దుకాణాలు ఏర్పాటు చేసుకుని నెలవారీ అద్దెలకు ఇవ్వడం విశేషం. ● అమలాపురం-ముక్తేశ్వరం ప్రధాన రహదారిలో విలస, సిరి పల్లి, ముక్తేశ్వరంలో ర.భ.శాఖకు చెందిన భూమిని ఆక్రమిం చారు. బొబ్బర్లంక-ముక్తేశ్వరం కాలువ గట్టు చెంతన ఉన్న

ముక్కామల-నేదునూరు మార్గంలో కట్టడాలు

మడుపల్లి, వెలవెలపల్లి, అయినవిల్లి, ముక్తేశ్వరం, తొత్ర రమూడిలో పెద్ద, పూరిపాకలు వేశారు. ● లక్క వరం, విశ్వేశ్వరాయపురం, మలికిపురం, టేకిశెట్టి పాలెం, అంతర్వేదిపాలెంలో దుకాణాలు నిర్మించారు. ● పొదలాడ లాకుల వద్ద ప్రధాన రహదారిని ఆనుకుని ఇటీవల దుకాణాలు వెలిశాయి. వీటికి పంచాయతీ అనుమ తులు లేకుండా విద్యుత్తుశాఖ మీటర్లు ఇవ్వడం విశేషం. ● మలికిపల్లి కూడలిలో ఇరువైపులా దుకాణాలు ప్రత్యక్షమ య్యాయి. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నా యని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

జలవనరులతో పాటు ర.భ.శాఖ, రెవెన్యూ, మండల పరి షత్తు, గ్రామ పంచాయతీ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకోవాలి. అక్రమ కట్టడాలు నిర్మించిన వారికి నోటీసులు ఇస్తున్నాం. జలజీవన్ మిషన్, రహదారి విస్తరణ పనులు మొదలు పెట్టిన సమయంలో ఇలాంటి ఆక్రమణలను తప్ప నిసరిగా తొలగించాల్సిందే. లేకుంటే వివిధ శాఖల అధికా రుల సమన్వయంతో చర్యలు తీసుకుంటాం.

– నవీన్‌కుమార్, జలవనరులశాఖ ఏఈ, కొత్తపేట సెక్షన్

వ్యాసరచనలో విద్యార్థిని ప్రతిభ

అంబాజీపేట, న్యూస్‌టుడే: జాతీయ వినియోగదారుల దినోత్సవం సంద ర్భంగా అమలాపురం జిల్లాపరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిం చిన వ్యాసరచన(ఆంగ్లం) పోటీలో అంబాజీపేట మండలం జి.అగ్రహారం ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని లేఖన మహాలక్ష్మి జిల్లా స్థాయిలో తొలి స్థానం దక్కించుకుంది. ఈ నెల 23న రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించిందని హెచ్ఎం అక్కిరాజు శేష సాయి ఆదివారం తెలిపారు. ఈ బాలికను సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, సర్పంచి దొంగ నాగేశ్వరరావు అభినందించారు.

లేఖన మహాలక్ష్మి

మాట్లాడుతున్న ప్రసాద్ స్వామీజీ

ప్రజా సేవకే అంకితం

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో ఎటువంటి పరిస్థితులు ఏర్పడినా వాటిని సరిదిద్ది ప్రజలకు సేవలం దించడమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, దాని అను బంధ సంస్థల ప్రధాన ఆశయమని అంతర్వేది వశిష్ఠాశ్రమ స్వామీజీ ఆచార్య ప్రసాద్‌స్వామీజీ, గోదావరి విభాగ్ కార్య కారిణి మట్టపర్తి మురళీకృష్ణ అన్నారు. సఖినేటిపల్లి గీతా మందిరంలో అల్లూరి సత్యనారాయణరాజు అధ్యక్షతన ఆదివారం హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చిన ముందుండేది స్వయం సేవకులేనని తెలి పారు. ఆచంట వెంకటేశ్వరరావు, డా.అర్జున్‌రావు, కొల్లు రాము, అనేక మంది హిందూ మహిళలు పాల్గొన్నారు.

గుర్రపు డెక్క, తూడు తొలగింపు

మలికిపురం, న్యూస్‌టుడే: చింతలపల్లి పంటకాలువ లక్కవరం పరిధిలో పెరిగిపోయిన గుర్రపు డెక్క, తూడును తొలగించారు. రుద్రరాజు గోపాలకృష్ణరాజు తదితర రైతులు ఇచ్చిన వినతిపత్రం మేరకు 'సాగునీరు పారక.. పంటచేలకు చేరక' శీర్షికతో ఈ నెల 19న ప్రచురితమైన కథనానికి స్పందించిన జలవనరుల శాఖ అధికారులు వెంటనే కాలువను శుభ్రం చేయించారు.

రథం దగ్ధం కేసులో పురోగతి ఏదీ?

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆల యంలో రథం దగ్ధమైన కేసుకు సంబంధించి నిందితు లను పట్టుకోకుండా శకలాలను నిమజ్జనం చేయడం వెనక ఆంతర్యమేంటని మాజీ శాసనసభ్యుడు, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా ప్రశ్నిం చారు. రాజోలులో ఆదివారం ఆయన స్థానిక విలేకరు లతో మాట్లాడారు. సంఘటన జరిగి ఐదేళ్లయినా కేసులో ఏవిధమైన పురోగతి లేదని వాపోయారు. ఇప్పటివరకు పోలీసులు ఎంత మందిని అరెస్ట్ చేశారు, కేసు వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. భక్తులు, ప్రజల మనో భావాలు దెబ్బతినకుండా చూడాలని కోరారు.

చుక్కల మందుతో చక్కని జీవితం

అంబాజీపేట, పి.గన్నవరం, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు, ఆత్రేయపురం, అయినవిల్లి, రావులపాలెం గ్రామీణం, రావులపాలెం పట్టణం, ఆలమూరు, రాజోలు, న్యూస్‌టుడే: పల్స్‌పోలియో కార్య క్రమాన్ని నూరుశాతం విజయ వంతం చేయడంలో వైద్యఆరోగ్య శాఖ పాత్ర కీలకమని పి.గన్న వరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారా యణ అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీ వద్ద, ఊడిమూడి గ్రామంలో ఆదివారం ఆయన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అంబాజీపేట, ముక్కా మల పీహెచ్‌సీల వద్ద ఉమ్మడి తూగో జిల్లా సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబ త్తుల శాంతకుమారి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మొస లపల్లిలో ఏపీ పరిశ్రమల అభి వృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి బాలభారతి తదితరులు పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. ✦ లక్కవరం పీహెచ్‌సీలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ చుక్కల మందు వేశారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటస త్యవాణి, స్థానిక సర్పంచి కోట పుష్ప కుమారి, మంగెన భూదేవి, గుండుబో గుల పెద్దకాపు పాల్గొన్నారు. సఖినేటిపల్లి, మోరి, రామే శ్వరం పీహెచ్‌సీల పరిధిలో ఎంపీపీ మల్లిబాబు పాల్గొ న్నారు. ✦ నగరం పీహెచ్‌సీలో మాజీ ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, మామిడికుదురులో నగరం సొసైటీ ఛైర్మన్ ఈలి శ్రీనివాసరావు, ఆత్రేయపురంలో వాడపల్లి దేవస్థానం ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, గోపాలపురంలో రాష్ట్ర తెలుగురైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పల్స్‌పో లియో కేంద్రాన్ని ప్రారంభించారు.

ఊడుమూడిలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

లక్కవరంలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్

నిత్యం పొగతో యాతన

గ్రామాల్లో పోగుచేసిన చెత్తాచెదారాన్ని వెలిచేరు వద్ద ర.భ.శాఖ రోడ్డు వెంబడి వేసి నిప్పు పెడుతు న్నారు. దీంతో నిత్యం ఆ మార్గం గుండా వెళ్లే ప్రయా ణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కోసారి చెత్తలో సీసాలు వంటివి ఉండటంతో పేలుతున్నాయి. దీంతో అంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విష యాన్ని ఎంపీడీవో వెంకటరామన్ వద్ద ప్రస్తావించగా ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

గుంత.. రాకపోకలకు చింత

కె.పెదపూడి ఉన్నత పాఠశాల సమీపంలో అమ లాపురం-బొబ్బర్లంక ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం వేలాది మంది ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుం టారు. రాత్రి సమయంలో గుంతను గమనించకపో వడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై సర్పంచి బీర శాంతిని వివరణ కోరగా ర.భ. శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరి స్తామన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

కుంగిన కాజ్‌వే అంచు

పాశర్లపూడి కరకట్ట దిగువలో పాటురేవు మధ్య ఉన్న కాజ్‌వే శిథిలమై రహదారి అంచులు కుంగిపోతుండటంతో వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిస్థానే ఇక్కడ కొత్త వంతెన నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూ రైనా పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు శ్రుతిమిం చుతున్నాయి. ఈ విషయాన్ని ర.భ.శాఖ ఏఈఈ సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా త్వరలోనే కొత్త వంతెన నిర్మాణం చేపడతామని, పక్కనే తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేస్తా మన్నారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

మలుపు వద్ద అంధకారం

రాజోలు జాతీయ రహదారిపై వన్‌వే మలుపు వద్ద కారుచీకట్లు అలముకున్నాయి. అక్కడ విద్యుత్తు స్తంభాలు ఉన్నా దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమ యాల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడు నేరుగా పోలీస్ హోర్డింగ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఓ యువతి తీవ్ర గాయాలపాలైంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి రెహ్మాన్‌ను వివరణ కోరగా అక్కడ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, రాజోలు

అదుపు తప్పితే అంతే..

సిరిపల్లి-నేదునూరు మార్గంలోని సిరిపల్లి చెరువు సమీపంలో రహదారి ఒకవైపు దిగబడి, మరోవైపు గుంతపడి ప్రమాదభరితంగా మారింది. వాహనాలు రాకపోకల సమయంలో అదుపుతప్పి బోల్తాపడుతు న్నాయి. పరిశీలించి మరమ్మతు చేపట్టేవిధంగా చర్యలు తీసుకుంటామని ర.భ.శాఖ జేఈ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

రైతులకు యూరియా కొరత లేదు

కొత్తపేట, రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రబీ పంటకు సరిపడా యూరియా రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని కొత్తపేట వ్యవ సాయ సహాయ సంచాలకులు ఎం.వెంకట రామారావు అన్నారు. ఆదివారం కొత్తపేటలో ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ యూరియా కొరత లేదని, ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. అందరికీ సమానంగా అందేలా చర్యలు చేపట్టామన్నారు. ఏవైనా సమస్యలు ఎదురైతే తమను సంప్రదిం చాలని సూచించారు. ఆత్రేయపురంలో 75.5, కొత్తపేటలో 92, ఆలమూ రులో 91.37, రావులపాలెంలో 211 మొత్తం 469 మెట్రిక్ టన్నులు అందు బాటులో ఉందని వివరించారు. ● కొత్తపేట నియోజకవర్గంలో రైతులకు యూరియా కొరత లేదని, వైకాపా కావాలనే అసత్య ప్రచారాలు చేస్తోందని నియోజకవర్గ ఆత్మ కమిటీ ఛైర్మన్ జక్కంపూడి బాలాజీ అన్నారు. రావుల పాలెం తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ కేలు, సొసైటీలు, వ్యవసాయ మార్కెట్ వద్ద యూరియా అమ్మకాలు జరు గుతున్నాయన్నారు. పంపిణీ పారదర్శకంగా జరుగుతుందన్నారు.

ఘనంగా పంచాయతీ ఆవిర్భావ దినోత్సవం

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్త పేట పంచాయతీ 87వ ఆవిర్భావ వేడుకలను ఆది వారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి బూసి జయలక్ష్మి మాట్లాడుతూ డిసెంబరు 21, 1939న ప్రత్యేక పంచాయతీగా ఏర్పడింద న్నారు. ప్రస్తుతం 26 వేల మంది జనాభాతో మండల, నియోజకవర్గ, రెవెన్యూ డివిజన్ కేంద్రంగా విరాజిల్లుతోందన్నారు. ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు విద్యాసంస్థలు, కోర్టులకు కేంద్రంగా నిలిచిం దన్నారు. తెలుగు దేశం పార్టీకి కంచుకోటగా ఉందన్నారు. పంచాయతీకి ఇప్ప టివరకు మూడు సార్లు ఆ పార్టీ సభ్యులే సర్పంచులు కావడం హర్షించదగ్గ విషయ మన్నారు. అనంతరం కేకు కోసి పంచారు. ఈ కార్యక్రమంలో ముత్యాల బాబ్జి, మిద్దె ఆదినారా యణ, బూసి భాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాస రావు, గనిశెట్టి వీరేష్, తమ్మన సాయి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కేకు కోస్తున్న సర్పంచి, తెదేపా నాయకులు

ఆర్థిక సాయం అందజేత

కొత్తపేట: గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కొత్తపేట మండలం బిళ్లకుర్రు గ్రామానికి చెందిన దూనబోయిన వెంకటేశ్వరరా వుకు కొత్తపేటకు చెందిన శెట్టిబలిజ సంఘ యువకులు ఆదివారం రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయనకు రెండు కిడ్నీలు పాడైపోయాయని, దాతలు ముందుకు వచ్చి సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొక్కా ప్రసాద్, ముషిని వెంకటరమణ పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

మలికిపురం, న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ అధ్యక్షుడు కొల్లు పెద్దిరాజు అన్నారు. గూడపల్లిపల్లిపాలెంలో అగ్నికులక్ష త్రియ సంఘం, మత్స్యకార సొసైటీల ఆధ్వ ర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోం దని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. పలువురు నాయకులు ఆయన్ని సత్కరించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు నాగిడి తాతాజీ, లంకే భీమరాజు, జిల్లా మత్స్యకార సంఘాల అధ్యక్షుడు సంకరపు ఆదినారాయణ, కొప్పాడి నరసింహరాజు, కొప్పాడి వీరవెంకటసత్యనారాయణ, శేరు శ్రీనుబాబు, బొమ్మిడి మధుసూద నరావు, కొల్లు సుబ్బారావు, చిట్టూరి వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ పెద్దిరాజు

ఆటో బోల్తాపడి 8 మందికి గాయాలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: మామిడికుదురు మండలం గెద్దాడ వద్ద 216 బైపాస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమా దంలో ఆటో బోల్తాపడి 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స కోసం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి గ్రామానికి చెందిన వారు ఆటోలో అయినవిల్లిలోని సిద్ధివినాయకస్వామి ఆలయానికి వెళ్లి దర్శనానంతరం తిరిగి వెళ్తుండగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగరం ఎస్సై చైతన్యకుమార్ తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటే శ్వరస్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయ వాడలోని మాచవ రానికి చెందిన ఎస్ టీపీ రాఘవకు మర్ కుటుంబ సభ్యులు రూ. 1,00,116, ఏలూరు జిల్లా కైకలూరు మండలం చాట్రాయి గ్రామానికి చెందిన ఘంటశాల నాగరాజు, నీరజాక్షి దంపతులు రూ. 55,980 విరాళం అందజేశారని ఈవో చక్రధరరావు ఆదివారం తెలిపారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేశారు.

హమ్మయ్య.. రోడ్లు వేశారు

– న్యూస్‌టుడే, మలికిపురం, సఖినేటిపల్లి

గత ఆరేళ్లుగా రాజోలు నియోజకవర్గంలో ప్రధాన రహదారులు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అప్పటి ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చాలావరకు మరమ్మతులు చేసి కొంత ఉపశమనం కలిగిం చారు. ప్రస్తుతం ర.భ.శాఖ ఆధ్వర్యంలో పలు రహదారుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఈ పనులు వేగంగా సాగుతున్నాయి.

ప్రజలకు సౌకర్యవంతంగా..

● మలికిపురం మండలం దిండి(బాలయోగి కూడలి) నుంచి రామరాజులంక వినాయకుడి ఆలయం వరకు రోడ్డు అత్యంత దారుణంగా గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందులు పడు తున్న నేపథ్యంలో 3 కిలోమీటర్ల మేర రూ.60 లక్షలతో బీటీగా అభివృద్ధి చేశారు. ● మట్ట పర్రు రావిచెట్టు నుంచి శివకోటి కుంతలేశ్వరి ఆలయం వరకు 1.8 కిలోమీటర్ల మేర రూ.45 లక్షలతో తీర్చిదిద్దారు. ● సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానంలో రూ.87 లక్ష లతో రథం రోడ్డు(రింగు రోడ్డు)ను బీటీగా అభి వృద్ధి చేశారు. దీనివల్ల రథోత్సవ సమ యంలో సౌకర్యంగా ఉంటుంది. ● రూ. 60 లక్షలతో 1.3 కిలోమీటర్ల గెద్దాడ రింగురోడ్డు నిర్మాణంలో ఉంది. ● బట్టే లంక వంతెన నుంచి శంకరగుప్తం బంకు సమీపంలోని వంతెన వరకు 2 కిలోమీ టర్ల మేర రూ.60 లక్షలతో పనులు ప్రారంభమయ్యాయి. ● రాజోలు మండ లంలో రూ.67 లక్షలతో 2.8 కిలోమీటర్ల చింతలపల్లి పిప్పళ్లవారి మెరక రోడ్డు పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

మరికొన్నింటికి నిధుల మంజూరు

ఏళ్లతరబడి నిలిచిన మలికిపురం(గుడిమెళ్లంక వంతెన కూడలి) నుంచి విశ్వేశ్వరాయపురం, లక్క వరం మీదుగా చింతలపల్లి కళింగులు కూడలి వరకు ఉన్న రహదారి 4.5 కిలోమీటర్ల మేర అభి వృద్ధికి రూ.4.20 కోట్ల నిధులు మంజూర య్యాయి. ప్రస్తుతం టెండరు దశలో ఉంది. విశ్వే శ్వరాయపురం అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎంపీ డీవో కార్యాలయం మీదుగా మలికిపురం గాంధీ బొమ్మల కూడలి వరకు రూ.1.08 కోట్లు మంజూ రయ్యాయి. దీనికి టెండర్లు పిలవాల్సి ఉంది. మలికిపురం విద్యుత్తు సబ్‌స్టేషను, మగటపల్లి రోడ్డుకు కూడా నిధులు మంజూరయ్యాయి.

అభివృద్ధి చేసిన దిండి-రామరాజులంక రోడ్డు

ప్రత్యేక శ్రద్ధ పెట్టాం

నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. కళింగులు-లక్కవరం రోడ్డుకు నిధులు మంజూరుకు తీవ్ర కసరత్తు చేశాం. చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. మరికొన్నింటి అభివృద్ధికి కృషి చేస్తాం.

– దేవ వరప్రసాద్, రాజోలు ఎమ్మెల్యే

మంత్రి నారాయణను కలిసిన కూటమి నేతలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణను అంబా జీపేటకు చెందిన రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వర రావు, అంబాజీపేట సొసైటీ అధ్యక్షుడు అరిగెల సూరిబాబు ఆది వారం కలిశారు. మండపేటలో టిడ్కో ఇళ్లు ప్రారంభించేందుకు వచ్చిన ఆయన్ని కలిసి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర జలవనరుల కార్పొ రేషన్ ఛైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినా యుడు, యర్రంశెట్టి నాగేంద్ర తదితరులు ఉన్నారు.

చిత్రపటం అందిస్తున్న నాయకులు

చిన్నారులకు ఊయలల పంపిణీ

కొత్తపేట, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను కొత్తపేటలో ఆదివారం వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ శాసనసభ్యుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కోశారు. కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పేదలకు దుప్పట్లు, రైతులకు యూరియా, పిల్ల లకు ఊయలలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జక్కంపూడి విజయ లక్ష్మి, రెడ్డి చంటి, గొల్లపల్లి డేవిడ్, మార్గాని గంగాధర్ పాల్గొన్నారు.

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

నేడు వినియోగదారుల దినోత్సవం

అమలాపురం కలెక్టరేట్ : జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఈనెల 22 అమలాపురం డిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉదయ్ భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో జేసీ నిశాంతి, ఇతర అధికారులు పాల్గొంటారన్నారు.

నేడు వినతుల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని చెప్పారు. ప్రజలు వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని సూచించారు.

రైతుబజార్‌లో నిన్నటి ధరలు (కిలోకు)

అమలాపురం పట్టణం : టమాటా - 40, వంకాయలు నలుపు - 38, తెలుపు - 30, బెండకాయలు - 50, పచ్చిమిర్చి - 42, కాకరకాయ - 40, బీరకాయలు - 52, క్యాబేజీ - 32, క్యారెట్ - 30, 40, దొండకాయలు - 42, బంగాళదుంపలు - 24, ఉల్లిపాయలు - 22, 32, గోరుచిక్కుళ్లు - 45, దోసకాయలు - 26, చిక్కుడుకాయలు - 42, చేమదుంపలు - 43, కంద - 45, బీట్‌రూట్ - 40, కీరదోసకాయలు -35, అల్లం - 75, క్యాప్సికం - 70, చిలకడ దుంపలు - 40, గుమ్మడి - 30, ముల్లంగి -45, ఉసిరి -80, నిమ్మకాయలు -30, ఆనబకాయ -28, పొట్లకాయ -25, అరటికాయ -6, మునగకాయ - 12, ఆకుకూరలు కట్ట -10, కొత్తిమీర కట్ట - 15, కొబ్బరికాయ - 25.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: మండల శివారుప్రాంతాల్లో కొన్నిచోట్ల తాగునీటి పైపులైన్లు లీకవుతున్నాయి. అధికారులు స్పందించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలి. -స్థానికులు

పరిష్కారం: సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. తమ సిబ్బందితో పైపులైన్లకు మరమ్మతులు చేయించారు.

సమస్య: కాట్రేనికోన మెయిన్ రోడ్డులో అక్కడక్కడ చెత్త పేరుకుపోయింది. పంచాయతీ అధికారులు స్పందించి తొలగించాలి. -గ్రామస్థులు

పరిష్కారం: సమస్యను సర్పంచి సుధాకర్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించారు. సిబ్బందితో చెత్త తొలగించారు. -న్యూస్‌టుడే, కాట్రేనికోన

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948

అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166

కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

ఇబ్బందులా.. చెప్పండిలా..?

వేధింపులకు అడ్డుకట్ట పడేలా పోలీసుల చర్యలు

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

బహిరంగ ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు జరుగుతున్నాయా..? ఎవరైనా నేరాలకు పాల్పడుతున్నారా..? భద్రత అవసరమా.. తదితర ప్రశ్నలకు పోలీసు శాఖ ప్రజల నుంచి సమాధానాలు ఆహ్వానిస్తోంది. దీని కోసం ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్ రూపొందించి విద్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్నారు. వాటిని స్కాన్ చేసి సమాధానం చెప్పవచ్చు. దీని ద్వారా వేధింపులు, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులు తెలుసుకునే వీలు కలుగుతోంది.

అమలాపురం సాంఘిక సంక్షేమ వసతిగృహంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వీరబాబు

సేవలు మెరుగు పరిచేందుకు..

అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో కళాశాలలు, బస్టాండ్లు, పార్కులు, సంక్షేమ వసతిగృహాలు, రద్దీ ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. మహిళలపై నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను 'హాట్ స్పాట్'లుగా గుర్తిస్తున్నారు. అలాంటి చోట్ల ప్రత్యేక నిఘా ఉంటుంది. ఆకతాయిలు, బహిరంగంగా మద్యం తాగేవాళ్లను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఫోన్ నంబర్లను అందుబాటులో ఉంచినా చాలామంది అవగాహన లేక వినియోగించుకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో మహిళల్లో చైతన్యం కలిగించేందుకు కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అమలాపురం చుట్టుపక్కల గ్రామాల నుంచి వేల మంది యువతులు రోజూ పాఠశాలలు, కళాశాలలకు వచ్చి వెళ్తుంటారు. మహిళా ఉద్యోగులు ఎక్కువ మంది వస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఉదయం, సాయంత్రం రద్దీగా ఉంటుంది. కళాశాలలు విడిచిపెట్టే సమయంలో ఆకతాయిలు వేధింపులు అరికట్టేందుకు పోలీసులు సైరన్లు ఉన్న వాహనాలపై గస్తీ నిర్వహిస్తున్నారు.

విస్తృతంగా ప్రచారం..

అమలాపురం డివిజన్‌లో క్యూ-ఆర్ కోడ్‌పై ప్రజలకు విస్తృత ప్రచారం చేస్తున్నాం. అభిప్రాయాలు తెలియజేసేలా కళాశాలలు, వసతి గృహాల్లో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తాం. పోలీస్‌శాఖకు ప్రజలు సహకరించాలి. చట్టవ్యతిరేక కార్యకలాపాలు ఎక్కడ జరుగుతున్నా సామాజిక బాధ్యతతో ప్రజలు సమాచారం అందించాలి. మహిళల రక్షణకు పోలీసుశాఖ పరంగా అనేక చర్యలు తీసుకుంటున్నాం.

-టీఎస్ఆర్‌కె ప్రసాద్, అమలాపురం డీఎస్పీ

బీచ్ వాలీబాల్‌లో ప్రతిభ

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్ర బీచ్ వాలీబాల్ పోటీల్లో గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన దేవరపల్లి మేఘనా షాలిని, రేవు దీపికలు ఇటీవల బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జట్టులో ఆడి రన్నర్స్‌గా నిలిచారు. వారిని హెచ్‌ఎం కనకదుర్గ, పీడీ గొలకోటి ఫణి, గ్రామస్థులు ఆదివారం అభినందించారు.

రన్నర్స్ కప్‌తో గొల్లవిల్లి విద్యార్థినిలు

స్వదేశానికి గల్ఫ్ బాధితురాలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లి ఇబ్బందులు పడుతున్న మహిళను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినట్లు డీఆర్వో కె. మాధవి తెలిపారు. ఉప్పలగుప్తం మండలం వాడపర్రుకు చెందిన ఎన్.దుర్గారాణి గత ఏడాది డిసెంబరులో ఉపాధి నిమిత్తం ప్రసాద్ అనే ఏజెంట్ ద్వారా గల్ఫ్ వెళ్లారు. మొదట సరైన ఉపాధి కల్పించక, తర్వాత పలు ఇళ్లలో మారుస్తూ తీవ్ర వేధింపులకు గురి చేయడంతో ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆమె భర్త కలెక్టరేట్‌లో కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ కార్యాలయాన్ని సంప్రదించారు. వారు భారతీయ రాయభార కార్యాలయంలో సంప్రదించి బాధిత మహిళను సురక్షితంగా స్వదేశానికి తీసుకు వచ్చినట్లు డీఆర్వో తెలిపారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి

మలికిపురం, న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ అధ్యక్షుడు కొల్లు పెద్దిరాజు అన్నారు. గూడపల్లిపల్లిపాలెంలో అగ్నికులక్షత్రియ సంఘం, మత్స్యకార సొసైటీల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. పలువురు నాయకులు ఆయన్ని సత్కరించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు నాగిడి తాతాజీ, లంకే భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుచ్చిబాబును కలిసిన సాయి

ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గుత్తుల సాయి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును మురమళ్లలోని క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అధ్యక్ష పదవి విషయంలో బుచ్చిబాబు తనపై విశ్వాసం ఉంచి మద్దతు ఇచ్చారన్నారు. నియోజకవర్గ శెట్టిబలిజ నాయకులు, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. ● జిల్లా తెదేపా అధ్యక్షుడిగా నియమితులైన గుత్తుల సాయిని పలువురు నాయకులు ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, మట్టమ మహాలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, బొంతు బాబులు సాయిని కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ● తెదేపా జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన గుత్తుల సాయిని కాట్రేనికోన మండలం ఉప్పూడికి చెందిన తెదేపా నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. సూదా బాబారావు, వెర్రిబాబు, ఇక్తార్ అహ్మద్, శ్రీనివాస వర్మ, వి.రమణ, కొంకి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుచ్చిబాబుకు కృతజ్ఞతలు చెబుతున్న గుత్తుల సాయి

కవిత్వానికి సామాజిక ప్రయోజనం ఉండాలి

అమలాపురం పట్టణం : కవిత్వానికి సామాజిక ప్రయోజనం ఉండాలని కమాండర్ కొండా నరసింహరావు అన్నారు. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అమలాపురం వడ్డిగూడెం కోనసీమ రెడ్డి జన సమాఖ్య మందిరంలో 160వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం నుంచి 126 మంది కవులు, 30 మంది కళాకారులు పాల్గొన్నారు. తమ కవిత్వాల ద్వారా కవులు అక్షర విందును, కళాకారులు గాన అమృతాన్ని అందించారు. నరసింహరావు, శ్రీకళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్, నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమాండర్ నరసింహారావు

మైక్‌సెట్‌ల బహూకరణ

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జి.వేమవరం సిద్ధార్థ నగర్, రాఘవేంద్రపురంలోని రామాలయాలకు హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో మైక్ సెట్‌లను అందజేసినట్లు ఆర్ఎస్ఎస్ పర్యావరణ ప్రముఖ్ రెల్లు గంగాధరం తెలిపారు. ఈ నెల 23న గుత్తెనదీవి ఉప మండలంలో మద్దింశెట్టి గంగారావు రైస్ మిల్లు వద్ద నిర్వహించే హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రజా సేవకే అంకితం

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: సమాజంలో ఎటువంటి పరిస్థితులు ఏర్పడినా వాటిని సరిదిద్ది ప్రజలకు సేవలందించడమే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, దాని అనుబంధ సంస్థల ప్రధాన ఆశయమని అంతర్వేది వశిష్ఠాశ్రమ స్వామీజీ ఆచార్య ప్రసాద్‌స్వామీజీ, గోదావరి విభాగ్ కార్యకారిణి మట్టపర్తి మురళీకృష్ణ అన్నారు. సఖినేటిపల్లి గీతామందిరంలో అల్లూరి సత్యనారాయణ రాజు అధ్యక్షతన ఆదివారం హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చిన ముందుండేది స్వయం సేవకులేనని తెలిపారు.

నిర్మాణాలు ఎప్పటికి పూర్తయ్యేనో..?

కాట్రేనికోనలోని వెంకమ్మచెరువు ప్రాథమిక పాఠశాల ఆవరణలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన వంటగది, టాయిలెట్ల నిర్మాణాలు సగంలో నిలిచాయి. ఈ పాఠశాలలో 30 మంది వరకు పిల్లలు చదువుకుంటున్నారు. సుమారు మూడేళ్ల క్రితం చేపట్టిన ఈ నిర్మాణాలు ఒకటి పునాది, మరొకటి గోడల దశలో నిలిచాయి. వంటను వేరొకచోట చేసి పాఠశాలకు తీసుకువస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు. -కాట్రేనికోన, న్యూస్‌టుడే

బెంబేలెత్తిస్తున్న శునకాలు..

పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా శునకాలు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. అమలాపురంలోని నల్లవంతెన దిగువన ముక్తేశ్వరం రోడ్డులో పెట్రోలు బంకు వద్ద కనిపించిన దృశ్యమిది. కుక్కల గుంపులు స్థానికులకు చుక్కలు చూపిస్తున్నాయి. వాహనదారులను ఆటకాయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అధికారులు చొరవచూపి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

వంతెనపై ప్రయాణమెలా..!

ముమ్మిడివరం మండలం అయినాపురం బాడవ వద్ద వంతెన ఇది. వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ విరిగిపోయాయి. అయినాపురం, కొత్తలంక గ్రామాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. రెయిలింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ముమ్మిడివరం

పోలియో చుక్కలతో ఆరోగ్యకర భవిష్యత్తు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: నవజాత శిశు ఆరోగ్యభద్రతకు అయిదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు మందు వేయించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. అమలాపురం ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్‌లో ఆదివారం కలెక్టర్ మహేష్‌కుమార్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ దుర్గారావుదొర మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు.

పాపకు పోలియో చుక్కలను వేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఉప్పలగుప్తం : రెండు పోలియో చుక్కలతో పిల్లల భవిష్యత్తు బాగుంటుందని తల్లిదండ్రులు గ్రహించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆదివారం ఎస్.యానాంలో పీహెచ్‌సీలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు

ఎస్.యానాం పీహెచ్‌సీలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

యానాం: యానాం ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ ప్రారంభించారు.

కాట్రేనికోన: కాట్రేనికోన పీహెచ్‌సీ పరిధిలో ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో 2,860 పిల్లలకు గాను మొదటిరోజు 2596 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యురాలు లిఖిత తెలిపారు.

ఐ.పోలవరం : చిన్నారులకు పోలియో చుక్కల మందును వేయడం ద్వారా చక్కని జీవితం అందించవచ్చని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్లలోని పల్స్ పోలియో కేంద్రంలో ఎమ్మెల్యే చిన్నారికి పోలియో చుక్కల మందును వేశారు.



ప్రచారరథం ప్రారంభిస్తున్న నాయకులు

బౌద్ధ దమ్మ ప్రచార రథం

కాట్రేనికోన, న్యూస్‌టుడే : భారతదేశంలో పుట్టిన బౌద్ధ ధర్మం చరిత్రను గ్రామాల్లో ప్రజలకు తెలియజేసే కార్యక్రమంలో భాగంగా భారతీయ బౌద్ధ దమ్మ సాంస్కృతిక ప్రచార రథం ర్యాలీని ఆదివారం చెయ్యేరులో సర్పంచి చెల్లి సురేష్ జెండా ఊపి ప్రారంభించారు. పండువారిపేట, కొమ్మాయిచెరువు, మరకోడు,జల్లగుంట, వడ్డివారిపేట, కంద్రిగచెరువు, గిడ్డివారిపేట అగ్రహారం, గొరగనమూడి, పెనుమల్ల తదితరచోట్ల బౌద్ధ ప్రచార రథం వెళ్లింది. బీసీఐ నాయకులు బౌద్ధ మత ప్రత్యేకను ప్రజలకు వివరించారు. కేవీ సత్యనారాయణ, ప్రసాద్, పెట్టా శ్రీను ,ధనరాజు, క్రాంతికుమార్, విజయ్‌కుమార్, జి.రమేష్, గోపి, నరసింహమూర్తి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత

ఉప్పలగుప్తం: ఇటీవల ఎన్.కొత్తపల్లి పంచాయతీ రాఘవులపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన మల్లాడి సూర్యనారాయణ కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆనందరావు ఆదివారం పరామర్శించారు. ప్రమాద సంఘటన వివరాలు తెలుసుకుని బాధిత కుటుంబానికి నగదు, నిత్యావసరాలు అందజేశారు.

రూ.లక్షలు వెచ్చించి.. వృథాగా వదిలేసి

న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

అమలాపురం పురపాలక సంఘానికి చెందిన నిధులు వివిధ రూపాల్లో వృథా అవుతున్నాయి. వైకాపా పాలనలో 2022లో అమలాపురం పట్టణంలో మురుగుకాలువలపై ఆక్రమణలు తొలగించి పూడికలు తీసేందుకు సుమారు రూ.5లక్షలు వెచ్చించారు. మున్సిపల్ సాధారణ నిధులతో రెండు దఫాలుగా స్థానిక ఈదరపల్లి వంతెన నుంచి ముమ్మిడివరం గేట్ వయా కిమ్స్ ఆసుపత్రి వరకు బౌండరీ పోల్స్ వేసేందుకు రూ.2.92 లక్షలు, రూ.3.82 లక్షలు చొప్పున కేటాయించారు. మురుగు కాలువలపై నిర్మాణం చేపట్టవద్దని, ఆక్రమణలు చేస్తే తొలగిస్తామని పెద్ద స్థాయిలో హెచ్చరించారు. కాలక్రమేణా వాటిని పట్టించుకోవడం మానేశారు. నేడు పట్టణంలో మురుగుకాలువలను దాటి ఆక్రమణలు యథావిధిగా పెరిగిపోయాయి. ఏర్పాటు చేసిన బౌండరీ పోల్స్‌ను పక్కన పడేసి యథేచ్ఛగా ఆక్రమణలు చేసినా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. వాహనాలు కదలలేక ట్రాఫిక్ జామ్ అవుతున్నాయి. నిర్మాణాలతో పాటు విద్యుత్తు స్తంభాలు రోడ్డుపైనే వేస్తున్నా స్పందించడం లేదు.

అమలాపురం పురపాలక సంఘ కార్యాలయంలో ఇలా వదిలేశారు..

విజయశేఖర్‌కు పురస్కారం

యానాం, న్యూస్‌టుడే: రీజెన్సీ జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకుడు **విజయశేఖర్**కు చెన్నైలోని ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ అకడమిక్ పురస్కారాన్ని అందజేసి సత్కరించినట్లు ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్ తెలిపారు. వివిధ రకాల సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో ఎదురవుతున్న సమస్యలపై విజయశేఖర్ సమర్పించిన పరిశోధనపత్రానికి ఈ పురస్కారాన్ని ఆదివారం అందజేశారన్నారు.

తెలుగుభాష సేవలకు సన్మానం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: తెలుగు పండితుడు, కవి మాకే బాలార్జున సత్యనారాయణను శ్రీశ్రీ కళావేదిక అక్షర స్వరాల కవితోత్సవ వేడుకల్లో సన్మానించారు. ఆదివారం అమలాపురంలో కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తెలుగు భాషాభివృద్ధికి ఆయన చేస్తున్న కృషికి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందించారు. ఈ సందర్భంగా జాతీయ కార్యవర్గ సభ్యులు, పలువురు సాహితీవేత్తలు, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

కాట్రేనికోన: శ్రీశ్రీ కళావేదిక, కోనసీమ రచయితల సంఘం ఆధ్వర్యంలో అమలాపురంలో నిర్వహించిన కవి సమ్మేళనంలో కాట్రేనికోనకు చెందిన చింతా రాంబాబు, ఎలిపే మధు కవితా గానం చేశారు. తెలుగు భాషాభివృద్ధికి వీరు చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ ఏపీఎస్పీ కమాండెంట్ కె. నరసింహారావు, కత్తిమండ ప్రతాప్, శ్రీనివాస శర్మ తదితరులు చేతుల మీదుగా సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు.

పోలీస్ అధికారులకు ప్రశంసలు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: చోరీలు, చైన్ స్నాచింగ్ కేసులను ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినందుకు పోలీసు అధికారులను ఎస్పీ రాహుల్‌మీనా అభినందించారు. ఆదివారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కె ప్రసాద్, కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, అమలాపురం పట్టణ సీఐ వీరబాబు, క్రైం సీఐ గజేంద్రకుమార్, క్రైం సీఐ గజేంద్రకుమార్, ఎస్సైలు పరదేశి, సురేంద్ర, విద్యసాగర్, రాము, ఏఎస్సై బాలకృష్ణ, రావులపాలెం రూరల్ ఎస్సై విద్యాసాగర్, ఆత్రేయపురం ఎస్సై రాము, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సీఐ వీరబాబుకు నగదు అందిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా

11 వాహనాల స్వాధీనం

తాళ్లరేవు, న్యూస్‌టుడే: చొల్లంగిపేట కొబ్బరిచెట్టు పేట కాలనీలో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కాకినాడ గ్రామీణ సీఐ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో కాలనీ, జాతీయ రహదారిపై పోలీసులు బృందాల వారీగా తనిఖీలు నిర్వహించారు. దస్త్రాలు లేని 11 ద్విచక్రవాహనాలను గుర్తించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి పేర్లు నమోదు చేసుకున్నారు. 11 ద్విచక్రవాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కోరింగ ఎస్సై పి.సత్యనారాయణతో పాటుగా పెదపూడి, తిమ్మాపురం, ఇంద్రపాలెం ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

తెదేపా బలోపేతానికి కృషి

అమలాపురం పట్టణం : తెలుగుదేశం పార్టీని జిల్లాలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గంధం పల్లంరాజు తెలిపారు. కొంకాపల్లిలో పల్లంరాజుకు మెట్రో అధినేత నందెపు వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ చిక్కాల గణేష్, జనసేన నాయకులు నల్లా శ్రీధర్, కౌన్సిలర్లు బొర్రా వెంకటేశ్వరరావు, యేడిద శ్రీను, జవ్వాది తాతాబాబు, నాయకులు అభినందనలు తెలిపారు.

పల్లంరాజును అభినందిస్తున్న కూటమి నాయకులు

యానాం వృద్ధాశ్రమం సేవలు అభినందనీయం

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి ప్రభుత్వం ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు 1997లో ప్రారంభించిన యానాం ఓల్డేజ్‌హోంలో సేవలు అభినందనీయమని మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి తదితరులు ఆదివారం పరిశీలించారు. నిత్యం రూపాయికి భోజనం అందించే విభాగాన్ని పరిశీలించి ఆహారాన్ని రుచిచూశారు. విజయసాయిరెడ్డి, చిన్నారెడ్డి, గిడుగు రుద్రరాజు, వైఎస్ఆర్ వ్యక్తిగత సహాయకుడు సూరీడు, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నాయకుడు కంతేటి కాశి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఆహారం రుచి చూస్తున్న విజయసాయిరెడ్డి

మల్లాడికి ఘన సన్మానం

మల్లాడి కృష్ణారావు రాజకీయాల్లోకి ప్రవేశించి 36ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక యర్రాగార్డెన్లో ఆదివారం నిర్వహించిన సభలో పలువురు అభిమానులు, రాజకీయ సహచరులు ఆయనను సత్కరించారు. ఎన్నార్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిడ్ల చంద్రరావు మాజీ కౌన్సిలర్ రక్ష ఆంజనేయులు, అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు శేరు కృష్ణ, విష్ణు, వెంకటేశ్వర్లు, మల్లాడి సత్తిబాబు, శ్రీను, హరికృష్ణ తదితర ప్రముఖులు కృష్ణారావుతో కేక్ కట్ చేయించారు. ఓల్డేజ్‌హోం కమిటీ ఛైర్మన్ పెండెం సూర్యప్రకాష్, మాజీ సీఐ గూటం శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

రథం దగ్ధం కేసులో పురోగతి ఏదీ?

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో రథం దగ్ధమైన కేసుకు సంబంధించి నిందితులను పట్టుకోకుండా శకలాలను నిమజ్జనం చేయడం వెనక ఆంతర్యమేంటని మాజీ శాసనసభ్యుడు, భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా ప్రశ్నించారు. రాజోలులో ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంఘటన జరిగి ఐదేళ్లయినా కేసులో ఏవిధమైన పురోగతి లేదని వాపోయారు. ఇప్పటి వరకు పోలీసులు ఎంత మందిని అరెస్ట్ చేశారు, కేసు వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. భక్తులు, ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని కోరారు.

పంచాయతీ విభజనకు వ్యతిరేకం

కాట్రేనికోన, న్యూస్‌టుడే : కాట్రేనికోన పంచాయతీ విభజనకు వార్డుసభ్యుల అభిప్రాయాల నిమిత్తం పంచాయతీ కార్యవర్గ సమావేశం ఆదివారం సర్పంచి గంటి సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభ్యులు ఎక్కువమంది పంచాయతీ విభజనను వ్యతిరేకించారు. కాట్రేనికోన మెయిన్‌లోని గ్రామాల ఆదాయం ఎక్కువగా ఉంటుందని, శివారున గ్రామాలకు అంత ఆదాయం ఉండదన్నారు.

జగన్ జన్మదిన వేడుకలు

అమలాపురం పట్టణం: విద్య, వైద్య రంగాలకు మాజీ సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇచ్చారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. జగన్ పుట్టినరోజు సందర్భంగా అమలాపురంలో ఆదివారం వైకాపా నాయకుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ ఎంపీ చింతా అనురాధ, పినిపే శ్రీకాంత్ పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.

ముమ్మిడివరం: జగన్ పుట్టిన రోజు వేడుకలను ముమ్మిడివరంలో నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ కేకు కోశారు

వైకాపాలో ప్రొటోకాల్ రగడ

ఉప్పలగుప్తం: మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో ప్రొటోకాల్ రగడ చోటు చేసుకుంది. ఉప్పలగుప్తం మండలంలో ఆదివారం ఆయన పుట్టినరోజు వేడుకలను వైకాపా శ్రేణులు రెండు వర్గాలు నిర్వహించారు. ఉప్పలగుప్తంలో నిర్వహించిన సభలో నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ చిత్రం లేకపోవడంతో పార్టీ నాయకుల మధ్య చర్చ చోటుచేసుకుంది. అధిష్ఠానం సూచించిన మేరకు నడుచుకోవాలంటూ నాయకులు శ్రేణులకు సూచించారు.

కృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయం

ఉప్పలగుప్తం: మాజీ ఎంపీ కుసుమ కృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. అమలాపురంలో ఆయన వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బుచ్చిమహేశ్వరరావు, ముషిణి కృష్ణారావు, గొల్లపల్లి డేవిడ్‌రాజు, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నక్కా బాలయోగి, డీబీ లోక్, నల్లా విష్ణు, పాల్గొన్నారు.

(c) eenadu

మండపేట

• మండపేట • రామచంద్రపురం

సీఎం సహాయ నిధి పేదలకు భరోసా

మండపేట: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసా నిస్తుందని, ఆపదలో ఆదుకుంటుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆయన ఆదివారం అందజేశారు. 13 మంది బాధితులకు రూ.10.12 లక్షల విలువైన చెక్కులను ఆయన ఆదివారం అందజే శారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీచ్ వాలీబాల్‌లో ప్రతిభ

ఉప్పలగుప్తం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్ర బీచ్ వాలీబాల్ పోటీల్లో గొల్లవిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థు నులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన దేవరపల్లి మేఘనా పావని, రేవు దీపికలు ఐపీఎల్ బాపట్ల జిల్లా సూర్యలంక బీచ్‌లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జట్టులో ఆడి రన్నర్స్‌గా నిలిచారు.

నేడు కలెక్టరేట్‌లో వినతుల స్వీకరణ

అమలాపురం కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమ వారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీక రించనున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని చెప్పారు. ప్రజలు వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొంద అని సూచించారు. జిల్లా స్థాయి పీజీఆర్ఎస్‌కు అనుసంధానంగా అన్ని మండల, డివిజన్, పురపా లిక కార్యాలయాల్లో ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు చెప్పారు.

చిన్నారులతో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే వేగుళ్ల

టిడ్కో గృహాల సమస్యల పరిష్కారానికి కృషి

మండపేట, న్యూస్‌టుడే: మండపేట పర్యటనలో భాగంగా ఆదివారం పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ వివిధ కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడ్కో గృహాల వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో గృహస్థులు తాగునీటి కోసం మూడు అంతస్తుల దిగి ఇబ్బంది పడుతుంటే డీఈ కె.శ్రీనివాస్, ఏఈ పవన్ తక్కువ ఖర్చులో నేరుగా పంపింగ్ పైపు నుంచి అన్ని అంతస్తులకు తక్కువ ఖర్చులో తాగునీటి సౌకర్యం కల్పించారని ఎమ్మెల్యే వేగుళ్ల వారి ప్రతిభను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా వారిద్దరిని వేదికపైకి పిలిచి మంత్రి అభినందించారు. టిడ్కో ఫేజ్-1లో ఉంటున్న పలువురు నివాసితులు సమస్యలు చిట్టా విన్నవించారు. ఇళ్ల చుట్టూ పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగి దోమలు విజృంభిస్తున్నాయని, వర్షం కురిస్తే స్లాబు నుంచి నీరు లీకవుతోందని చెప్పగా స్పందించిన మంత్రి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

62 సంవత్సరాలు కొనసాగించాలని వినతి

మండపేట: డీఎస్సీ 1998 ఉపాధ్యాయులు ఆదివారం మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణను మర్యాదపూర్వకంగా కలిసి 62 సంవత్సరాల వరకు ఉపాధ్యాయులుగా కొనసాగించాలని కోరారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఎంటీఎస్ ఉపాధ్యాయుల సర్వీసు క్రమబద్ధీకరించాలని వినతిపత్రం అందించారు. జీతాలు 11 నెలలు కాకుండా 12 నెలలు చెల్లించాలని కోరారు. సంఘం అధ్యక్షుడు కోటిపల్లి రాంబాబు, శ్రీనివాస్, టీవీవీఎస్ మూర్తి, జి.రమణ ఉన్నారు.

చిన్నారుల్లో పఠన.. గణన నైపుణ్యంపై దృష్టి

ప్రాథమిక విద్యార్థులకు గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్

న్యూస్‌టుడే, రాయవరం

విద్యార్థుల్లో అధిక శాతం మంది ఏటా తరగతులు మారుతున్నా.. చదువులో వెనకబడే ఉంటున్నారు. పైతరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక, ఇంటర్ విద్యార్థులకు సంకల్ప్ తరహాలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పఠన, గణన నైపుణ్యాల సాధన హామీ (గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్) పేరిట 75 రోజుల ప్రణాళికను విద్యాశాఖ అమలుచేస్తోంది. దీనిలో భాగంగా ఈనెల 8 నుంచి ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ గ్యారంటీ (ఎఫ్ఎల్ఎన్)లో రోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఫౌండేషన్ స్కూళ్లు 40, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు 158, ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు 58, 13 ప్రాథమికోన్నత పాఠశాల్లో మొత్తం 15,373 మంది విద్యార్థులు ఈ తరగతులకు హాజరవుతున్నారు.

ఆన్‌లైన్ పరీక్షల ఫలితాలతో...

విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించి స్కై (బాగాచదివే విద్యార్థులు), మౌంటెన్ (ద్వితీయ శ్రేణి), స్ట్రీమ్ (వెనుకబడినవారు)గా విభజించారు. వీరిలో వెనుకబడిన విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల భాషల్లో అక్షరాలు గుర్తించడం, చిన్న గణిత సమస్యలను సాధించడం నేర్పుతున్నారు.

మధ్యాహ్న భోజనానంతరం..

మధ్యాహ్న భోజనాల అనంతరం ఎఫ్ఎల్ఎన్ పాఠాలు ఒంటిగంట నుంచి 3.30 వరకు నేర్పిస్తారు. దీనిలో చదవడం, రాయడం, గణితంపై అవగాహన కల్పిస్తారు. ఉదయం తొమ్మిది నుంచి రోజూ ఆ బోధన ఉంటుంది.

● తెలుగు అక్షరాలు, పదాలు గుర్తించడం (మధ్యాహ్నం 1.10 నుంచి 1.40 వరకు), ఇంగ్లిష్‌పై పట్టు సాధించేందుకు శిక్షణ (1.40 నుంచి 2.10), గణితంలో మెలకువలు, చతుర్విధ ప్రక్రియలపై అవగాహన (2.25 నుంచి 2.55) అనంతరం 3.20 గంటల వరకు పరీక్షల నిర్వహణ, కృత్యాలు చేయిస్తారు. ● మధ్యాహ్నం 3.20 గంటల నుంచి పునశ్చరణ, ఇంటి వద్ద సాధన చేసుకునేలా హోం వర్కు ఇస్తారు. విద్యార్థుల స్థాయిని బట్టి ఏ, బీ, సీ, డీగా విభజించి వారి సామర్థ్యాన్ని గుర్తించి తరగతులు నిర్వహిస్తున్నారు. 1, 2 తరగతులకు ఒకలా, 3, 4, 5 తరగతులకు మరోలా బోధన జరుగుతోంది. వచ్చే విద్యా సంవత్సరంలో మార్పులు సాధించేలా ప్రణాళిక రూపొందించారు.



పి.కొంపల్లి ప్రాథమిక పాఠశాలలో గణిత సాధనలో విద్యార్థులు

నిత్యం సాధన చేయిస్తున్నాం..

ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక ఎఫ్ఎల్ఎన్ సామగ్రిని అన్ని పాఠశాలలకు సరఫరా చేశాం. విద్యార్థి పఠన, గణన సామర్థ్యాల పెంపే లక్ష్యంగా సాధన జరుగుతోంది. 75 రోజుల పాటు సాగే ఈ అభ్యసన ప్రక్రియలో విద్యార్థులు మెరుగైన చతుర్విత ప్రక్రియలు నేర్చుకుంటారు. ప్రస్తుత శిక్షణతో ఉన్నత తరగతుల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తారు.

- అలజంగి నాగరాజు, ఎంఈవో, కె.గంగవరం

విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర అభివృద్ధికి మూలం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర అభివృద్ధికి మూలమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు కళాశాల ప్రాంగణంలో ఆదివారం విద్యార్థుల సమస్యలపై మంత్రి సుభాష్ గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు వివిధ విద్యా సంబంధిత సమస్యలు, ఫీజులు, ఉపకార వేతనాలు, హాస్టల్ వసతులు, ఉద్యోగ అవకాశాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, బస్సు సౌకర్యం తదితర అంశాలపై వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మాట్లాడారు. సీడాప్ ద్వారా ఉచిత వసతి, భోజనం కల్పించి శిక్షణ ఇస్తామని జేకేసీ కిరణ్ వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రఘువీర్, ఆర్టీసీ డిపో మేనేజర్ పేపారావు భాస్కర్‌రావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్.రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ వై.పద్మజ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరి, జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లూరు విద్యార్థిని ప్రతిభ

పిల్లి కల్యాణి

అంగర, న్యూస్‌టుడే: అమలాపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన పోటీల్లో కపిలేశ్వరపురం మండలం నల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థిని పిల్లి కల్యాణి ప్రథమస్థానం సాధించిందని హెచ్‌ఎం చంద్రు రామలక్ష్మి తెలిపారు. ఈనెల 24న వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన తెలుగు వ్యాసరచన పోటీలో ప్రతిభతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని వివరించారు. విద్యార్థినితో పాటు గైడ్ ఉపాధ్యాయుడు ఎం.సూర్యనారాయణను ఎంఈవోలు తాతారావు, విజయ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

శతాబ్ది ఉత్సవాలకు ఆధునికీకరణ: మంత్రి సుభాష్

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: వేగాయమ్మపేట శ్రీమహాలక్ష్మమ్మ హిందూ ఉన్నత పాఠశాల ఏర్పాటుచేసి వందేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనాన్ని శతాబ్ది ఉత్సవాల నాటికి ఆధునికీకరించేలా కృషిచేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. ఆదివారం పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థి గారపాటి విశ్వనాథం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమ్మేళనంలో మంత్రి మాట్లాడారు. భవనం పూర్తిగా శిథిలమైన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకురాగా ఆయన సానుకూలంగా స్పందించారు. దత్తత తీసుకొని కోరమండల్ కంపెనీ సీఎస్ఆర్ నిధులతో భవన నిర్మాణానికి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పాఠశాలను జూనియర్ కళాశాల స్థాయికి పెంచేలా కృషిచేస్తానన్నారు. మార్చి నెలాఖరుకు పనులు పూర్తిచేయిస్తానని హామీ ఇచ్చారు. పూర్వ విద్యార్థులు కొమరిన వెంకటరాజు కుటుంబ నుంచి రూ.లక్ష, కుడుపూడి నాగమోహనరావు రూ.లక్ష, చాగంటి కుటుంబం నుంచి రూ.50 వేలు విరాళం వేదికపై ప్రకటించారు. నాగమోహనరావు సమకూర్చిన 40 దుప్పట్లు విద్యార్థులకు మంత్రి పంపిణీచేశారు. కార్యక్రమంలో వాడ్రేవు వెంకటరావు, స్థలదాత మనవడు వాడ్రేవు సుందర రత్నాకరరావు, సర్పంచి అంబటి తుకారాం, పూర్వ విద్యార్థులు కొమరిన శ్రీహరి, విస్సాప్రగడ కృష్ణమూర్తి, సూర్య సత్యనారాయణ, అనంత్ పతంజలి ప్రధానోపాధ్యాయుని విజయనిర్మల పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

చుక్కల మందు వేశారు..

మండపేట, రామచంద్రపురం బృందం: పోలియో మహమ్మారిని జయించాలని మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ పిలుపునిచ్చారు. మండపేట పర్యటనలో భాగంగా ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో చిన్నారులకు చుక్కల మందు వేశారు. టిడ్కో గృహాల వద్ద పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సంచార జాతుల నివాసాలకు వెళ్లి పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. పట్టణంలోని అన్ని ఆసుపత్రులు, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించారు. ● పోలియో మహమ్మారిని దూరం చేయడమే లక్ష్యంగా మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని మండలాలు, గ్రామాల్లో ఆదివారం అయిదేళ్లలోపు చిన్నారులకు పోలియో వ్యాక్సిన్ వేశారు. ఏడిద, ఏడిద సీతానగరం గ్రామాలు, రాయవరం, మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో, కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ పరిధిలోని శత శాతం లక్ష్యం పూర్తిచేసినట్లు వైద్యాధికారి డా.రత్న కుమారి తెలిపారు. ● రామచంద్రపురం మండలం ద్రాక్షారామ పీహెచ్‌సీ, వెల్ల పీహెచ్‌సీ పరిధిలో తొలిరోజు కార్యక్రమం విజయవంతమైందని వైద్యాధికారులు డా.రత్నసుధ, డా.స్వాతిభవాని తెలిపారు. ద్రాక్షారామ పీహెచ్‌సీలో ప్రత్యేకాధికారి డా.పద్మజా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ● పామర్రు పీహెచ్‌సీ వద్ద ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, ప్రధాన వైద్యుడు విష్ణువర్ధన్, సిబ్బంది పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని ప్రతిజ్ఞచేశారు. దంగేరు, కుందూరు, పేకేరు, శేరిలంక, పీహెచ్‌సీల పరిధిలో చుక్కల మందు వేశారు.

సంచార జాతుల చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య బృందం

రైతుల శ్రమదానం.. పంటకాలువలో తొలగిన ఆటంకం

ఈనాడు కథనానికి స్పందన

రామచంద్రపురం, న్యూస్‌టుడే: అధికారులకు ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో రైతులే నడుం బిగించారు. చేయిచేయి కలిపి ఆరేళ్ల కష్టాలను శ్రమదానంతో ఎదుర్కొన్నారు. ముచ్చుమిల్లి పంటకాలువ పరిధిలో పేరుకుపోయిన పూడికను తొలగించడానికి 62 మంది రైతులు సంయుక్తంగా కాలువలోకి దిగారు. ఈనెల 18న పూడికతీత పనులు ప్రారంభించి ఆదివారంతో పూర్తిచేశారు. పసలపూడి నుంచి రామచంద్రపురం పెద్దవంతెన వరకు దాదాపు 400 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే పంటకాలువను శుభ్రం చేశారు. పూడిక పేరుకుపోయి ఎదురవుతున్న కష్టాలను వివరిస్తూ 'ఈనాడు'లో ఈనెల 17న 'అయిదేళ్లుగా తొలగని కష్టాలు' శీర్షికతో ప్రచురించిన కథనానికి రైతులు స్పందించి శ్రమదానానికి ముందుకువచ్చారు. ఎట్టకేలకు 3.5 కిలోమీటర్ల పొడవునా కాలువలోని పూడిక తొలగించారు. కాలువలో పెరిగిన పెద్ద చెట్లను పొక్లయిన్ సాయంతో తీయించారు. అడ్డంకులు తొలగడంతో ప్రస్తుతం పంటకాలువలో ప్రవాహం సాఫీగా సాగుతోంది.

పంటకాలువ బాగుచేసేదెన్నడో..?

కపిలేశ్వరపురం మండలం నిడసనమెట్ట ప్రధాన పంటకాలువ వ్యర్థాలు, కలుషితాలతో నిండిపోయింది. కాలువ వెంబడి తూడు పేరుకుపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. దీని పరిధిలో సాగుచేపట్టిన వెదురుమూడి, అచ్యుతాపురం, నిడసనమెట్ట, వల్లూరు, నల్లూరు, వడ్లమూరు, నేలటూరు, కాలేరు తదితర గ్రామాల రైతులు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 8,000 ఎకరాలకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో దమ్ములు చేయడం ఆలస్యమవుతోందని రైతులు చెబుతున్నారు. బోరునీటిపై ఆధారపడి సాగుచేయడం అందరికీ సాధ్యంకావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కాలువను శుభ్రం చేయించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అంగర

కబేళా.. నిత్యం అపరిశుభ్రమేనా..?

ద్రాక్షారామ పరిసర ప్రాంతాల వారు మార్కెట్‌లో కొనుగోలు చేసే మేక, గొర్రె మాంసం ఈ కొట్టాం నుంచే తరలిస్తున్నారని తెలిస్తే అవాక్కవుతారు. తీవ్ర దుర్గంధంతో పాటు కుక్కలు, కాకులు సంచరించే కబేళా ద్రాక్షారామ గ్రామంలోనే ఉంది. నిబంధనల ప్రకారం జీవాలను ఇక్కడే వధించి పంచాయతీ అధికార ముద్ర వేయించుకొని మాంస విక్రయాలు చేపట్టాలి. అంతకు ముందు వాటిని పశు వైద్యాధికారి పరీక్షించి ధ్రువపత్రం జారీ చేయాలి. అయితే ఆయా నిబంధనలు పాటించకుండానే వధ, మాంస విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొందరైతే ఇళ్ల వద్దనే మేకలను కోసి మార్కెట్‌లో నేరుగా విక్రయిస్తున్నారు. అధికారులు స్పందించి ఆరోగ్యకర వాతావరణంలో వధించడంతో పాటు మాంస విక్రయాలు చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ద్రాక్షారామ

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

ర్యాలీలో పాల్గొన్న పీఎంపీ సభ్యులు

మండపేట, న్యూస్‌టుడే: పీఎంపీ అసోసియేషన్ 63వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం మండపేటలో పలువురు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీగా వెళుతూ హెల్మెట్ పెట్టుకుంటే ప్రాణ రక్షణకు తోడ్పడుతుందని అవగాహన కల్పించారు. అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోన సత్యనారాయణ, సభ్యులు పి.దేవానందం, బళ్లా వెంకటరమణ ఇరవాడ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామానుజన్‌కు ఘన నివాళి

ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకను మండపేట మండలం వెలగతోడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రామానుజన్ ఆవిష్కరించిన సంఖ్య 1729 ఆకారంలో కూర్చుని ఆయనకు ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా గణితంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శొంటేని శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉంగరాల వీరభద్రరావు, పి.శ్రీహరి, విద్యార్థులు పాల్గొన్నారు.

- న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం

ఉబ్బిన నరాలకు వైద్య సేవలు

పసలపూడిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

రాయవరం, న్యూస్‌టుడే: పసలపూడిలోని సత్యసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వెరికోస్ వెయిన్స్ వ్యాధిగ్రస్థులకు ప్రత్యేకంగా ఆదివారం వైద్య శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎన్నారై కర్రి రామారెడ్డి పర్యవేక్షణలో 120 మంది రోగులకు హైదరాబాద్‌కు చెందిన సుశ్రత ఫౌండేషన్, ఏషియన్ వాస్కులర్ హాస్పటల్ ఎండీ డా.జీవీప్రవణ్‌కుమార్, డా.నల్లమిల్లి విష్ణువర్ధన్‌రెడ్డి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. శిబిరంలో ఎంపికచేసిన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని ట్రస్ట్ సహాయ కార్యనిర్వహణాధికారి షేక్ ఆలీఅహ్మద్ తెలిపారు. శిబిరానికి హాజరైన రోగులకు సత్యసాయి సేవాశ్రమంలో అల్పాహారం, భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో నల్లమిల్లి మురళీకృష్ణారెడ్డి, నల్లమిల్లి నాగిరెడ్డి, నల్లమిల్లి వెంకన్నబాబు పాల్గొన్నారు.

రొట్టెలు, పండ్ల పంపిణీ

రామచంద్రపురం, మండపేట బృందం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలను రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించారు. అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో వైకాపా శ్రేణులు, అభిమానులు కేకులు కోసి. బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. రామచంద్రపురం పట్టణ వైకాపా కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం నిర్వహించారు. నియోజకవర్గం ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్, కార్యకర్తలు నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి రాజ్యసభ సభ్యుడు ఎంపీ బోస్‌కు కేక్ తినిపించారు. అనంతరం ఏరియా ఆసపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కె.గంగవరంలో వైకాపా నియోజకవర్గం ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ కేక్ కోసి, మిఠాయిలు పంచారు.

ఎంపీ బోస్‌కు కేకు తినిపిస్తున్న సూర్యప్రకాష్, ఎంపీపీ భవాని

వినియోగదారుల హక్కుల దినోత్సవ పోటీల్లో విజేతలు

పామర్రు, న్యూస్‌టుడే: జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డా.బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. మండలస్థాయి పోటీల్లోని విజేతలు జిల్లా పోటీల్లో పాల్గొన్నారు. అక్కడ రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వారి వివరాలు..

ప్రతిభావంతులు వీరే..

వ్యాసరచనలో ఇంటర్ స్థాయిలో పామర్రు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె.ఆశిష్‌కుమార్ ప్రథమ, వక్తృత్వంలో బి.సుజిత ద్వితీయ స్థానాల్లో నిలిచారు. రాయవరం జూనియర్ కళాశాల విద్యార్థులు తెలుగు మాధ్యమం వ్యాసరచనలో పి.త్రివేణి ప్రథమ, సిహెచ్.లక్ష్మీనరసింహ తృతీయ స్థానాలు సాధించారు. ఆంగ్ల మాధ్యమ వక్తృత్వం ఉన్నత పాఠశాలల్లో కె.గంగవరం మండలం కోటకు చెందిన జి.మౌనిక అష్టలక్ష్మి ద్వితీయ స్థానం, రామచంద్రపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన జి.శ్రీదుర్గ తెలుగు మాధ్యమ వక్తృత్వంలో తృతీయ స్థానంలో నిలిచారు. వ్యాసరచన తెలుగు మాధ్యమంలో నల్లూరు ఉన్నత పాఠశాలకు చెందిన పి.కల్యాణి ప్రథమ, మండపేట బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఆర్.అలేఖ్య వీరమణి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ప్రథమ స్థానం పొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతారు. విజేతలను ఆయా పాఠశాలల, కళాశాలల అధ్యాపకులు, ప్రధానాచార్యులు, ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

కవిత్వానికి సామాజిక ప్రయోజనం ఉండాలి

అమలాపురం పట్టణం: కవిత్వానికి సామాజిక ప్రయోజనం ఉండాలని కమాండర్ కొండా నరసింహారావు అన్నారు. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో అమలాపురం వడ్డిగూడెం కోనసీమ రెడ్డి జన సమాఖ్య మందిరంలో 160వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రం నుంచి 126 మంది కవులు, 30 మంది కళాకారులు పాల్గొన్నారు. తమ కవిత్వాల ద్వారా కవులు అక్షర విందును, కళాకారులు గాన అమృతాన్ని అందించారు. నరసింహారావు, శ్రీకళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్, కవులు నల్లా నరసింహమూర్తి, బీవీవీ సత్యనారాయణలు కవులు, కళాకారులను సన్మానించారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడలోని మాచవరానికి చెందిన ఎస్‌టీపీ రాఘవకుమార్ కుటుంబ సభ్యులు రూ.1,00,116, ఏలూరు జిల్లా కైకలూరు మండలం చాటకై గ్రామానికి చెందిన ఘంటశాల నాగరాజు, నీరజాక్షి దంపతులు రూ.55,980 విరాళం అందజేశారని ఈవో చక్రధరరావు ఆదివారం తెలిపారు. వీరికి స్వామివారి చిత్రపటం అందజేశారు.

యూరియా కొరత లేదు

కొత్తపేట, రావులపాలెం పట్టణం: రబీ పంటకు సరిపడా యూరియా రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందని కొత్తపేట వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకట రామారావు అన్నారు. ఆదివారం కొత్తపేటలో ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ యూరియా కొరత లేదని, ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. అందరికీ సమానంగా అందేలా చర్యలు చేపట్టామన్నారు. ఏమైనా సమస్యలు ఎదురైతే తమను సంప్రదించాలని సూచించారు. ఆత్రేయపురంలో 75.5, కొత్తపేటలో 92, ఆలమూరులో 91.37, రావులపాలెంలో 211 మొత్తం 469 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని వివరించారు. ● కొత్తపేట నియోజకవర్గంలో రైతులకు యూరియా కొరత లేదని, వైకాపా కావాలనే అసత్య ప్రచారాలు చేస్తోందని నియోజకవర్గ ఆత్మ కమిటీ ఛైర్మన్ జక్కంపూడి బాలాజీ అన్నారు. రావులపాలెం తెదేపా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్‌కేలు, సొసైటీలు, వ్యవసాయ మార్కెట్ వద్ద యూరియా అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. పంపిణీ పారదర్శకంగా జరుగుతుందన్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం, న్యూస్‌టుడే: ధ్యానం, గణితం విద్యార్థుల మేధస్సు, క్రమ శిక్షణను పెంపొందిస్తాయని మానవతా ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస్ చౌదరి అన్నారు. ఆదివారం లొల్ల మానవతా ఆశ్రమంలో నిర్వహించిన ధ్యాన శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులకు గణిత పోటీలు నిర్వహించారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆశ్రమంలో నిర్వహించిన హోమియో శిబిరంలో 83 మందికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు సుజాత, జ్యోతి, వైద్యులు పాల్గొన్నారు.

మండపేట: ధ్యాన సాధనతో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని మండపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఉద్యానవనంలో సంగీత ధ్యాన సాధనలో ఆమె పాల్గొన్నారు. వాయులీన కళాకారుడు గణేష్ బృందం ఆధ్వర్యంలో సుమారు రెండు గంటల పాటు సంగీత ధ్యానం సాగింది. అంతకు ముందు పిరమిడ్ కేంద్రం నుంచి వైఎస్ఆర్ ఉద్యానవనం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త కొనగళ్ల సత్యనారాయణ, కోనసీమ జిల్లా పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి విజయభాస్కరరెడ్డి, ధ్యాన శిక్షకురాలు నల్లమిల్లి అన్నపూర్ణ, బోనగిరి సత్యసుధ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

లొల్ల మానవతా ఆశ్రమంలో ధ్యానంలో అభ్యాసకులు

(c) eenadu

ఈనాడు
తూర్పుగోదావరి
సోమవారం డిసెంబరు 22, 2025

చైతన్య ఝరి.. స్వచ్ఛ గోదావరి

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో కదిలిన యువత

స్వచ్ఛ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, ఎన్ఎస్ఎస్ పీవో నాగేశ్వరరావు, 'ఈనాడు' రాజమహేంద్రవరం యూనిట్ ఇన్‌ఛార్జి ఐ.వి.శ్రీనివాససుబ్రహ్మణ్యం, ఆదిత్య కళాశాల విద్యార్థులు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: గోదావరి నదీ ప్రక్షాళనకు 'ఈనాడు-ఈటీవీ'తో కలిసి యువత ముందుకు కదిలింది. ఆదివారం ఉదయం రాజమహేంద్రవరంలోని కోటిలింగాలరేవు వద్ద స్వచ్ఛ గోదావరి కార్యక్రమం నిర్వహించారు. నగర పాలక సంస్థ యంత్రాంగం, ఆదిత్య కళాశాల విద్యార్థులు భాగస్వాములు అయ్యారు. ఘాట్ శుభ్రత కార్యక్రమంలో రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌తో కలిసి రేవులో వ్యర్థాలను తొలగించడంతో పాటు, ఘాట్ శుభ్రం చేశారు. సీసాలు, పువ్వు, పాలు, ప్యాకెట్లు, క్యారీబ్యాగులు, ప్లాస్టిక్ కవర్లు ఏరి శుభ్రం చేశారు. పిండ ప్రదాన కార్యక్రమాల్లో పసుపు, కుంకుమలతో పాటు ఆ ప్యాకెట్లను నదిలో పడేస్తున్నారు. ఇవన్నీ ఒడ్డుకు చేరి పేరుకుపోతున్నాయి. ఈ వ్యర్థాలన్నీంటికి తొలగించారు.

కోటిలింగాల రేవులో చెత్త తొలగిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, విద్యార్థులు

ఘాట్ వద్ద ఆలయం నుంచి దాదాపు 300 మీటర్ల మేర శుభ్రం చేశారు. కార్యక్రమంలో 'ఈనాడు' రాజమహేంద్రవరం యూనిట్ ఇన్‌ఛార్జి ఐవీ శ్రీనివాస సుబ్రహ్మణ్యం, ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ డీన్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, పి.సాయి, బి.విమల, మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ కర్రి రామలింగారెడ్డి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కె.లోవ రాజు, కె.విరూపాక్షరావు, అసిస్టెంట్ ఇంజినీరు ఎం.రమేష్‌బాబు, శానిటరీ అధికారులు గంటి రాంబాబు, అప్పారావు, ముత్యాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'గోదావరి ఘాట్‌లు నగరానికి సంపద. నదీ స్వచ్ఛతకు 'ఈనాడు-ఈటీవీ' నాంది పలకడం అభినందనీయం. ఇవన్నీ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. ఇక్కడకు వచ్చే వారు బాధ్యతగా ఉండాలి. వ్యర్థాలను చెత్తబుట్టల్లో వేయకుండా నదిలో వేయడంతో కాలుష్యం పెరుగుతోంది.' అని నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.

'నదీ పరిరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. గృహ, ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువలో వేయకూడదు. చెత్తబుట్టల్లో వేయాలి. శ్రమ తప్పకుండా స్వచ్ఛ కార్యక్రమం కొనసాగించేందుకు నగరపాలక సంస్థ యంత్రాంగం పనిచేస్తుంది.' అని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ అన్నారు.

స్ఫూర్తి ప్రదాత వాజ్‌పేయీ..!

సంస్కరణలతో భారత ఖ్యాతి పెంచిన నాయకుడు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, దేవీచౌక్: సాధారణ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చి మూడు దఫాలు ప్రధానిగా దేశానికి సేవలందించి, విలువలతో కూడిన రాజకీయం చేసిన మహోన్నత వ్యక్తి భారతరత్న దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయీ జీవితం నేటి తరం రాజకీయ నాయకులకు స్ఫూర్తిదాయకమని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అటల్-మోదీ సుపరిపాలన యాత్ర' ఆదివారం నగరానికి చేరుకున్న సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర అధ్యక్షతన నిర్వహించిన సభకు విష్ణుదేవ్ సాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ.. వాజ్‌పేయీ బహుముఖ ప్రజ్ఞాశాలని, విద్యకు ప్రాధ్యామిచ్చేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఓడిన సమయంలో కార్యాలయంలోని నెహ్రూ చిత్రపటాన్ని తొలగిస్తే.. తిరిగి అక్కడే ఏర్పాటు చేయించి, చరిత్రను మరిచిపోతే మన ఉనికి కోల్పోయినట్లేనని వివరించారన్నారు. 23 పార్టీలను ఏకం చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఆయనకే సొంతమని వివరించారు. కాంగ్రెస్ హయాంలో విదేశాలకు దేశ ప్రతినిధిగా వాజ్‌పేయీని పంపించారంటే.. అది ఆయన గొప్పదనమన్నారు. ● ప్రధాని మోదీ అందిస్తున్న సుపరిపాలనకు వాజ్‌పేయీ స్ఫూర్తి అని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. వాజ్‌పేయీ, అద్వానీ కలిసి చేసిన రాజకీయ ప్రయాణం ఒక చరిత్రన్నారు.

సభా వేదికపై ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రులు సత్యప్రసాద్, దుర్గేష్, ఎమ్మెల్సీ సోమువీర్రాజు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి

● మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ భాజపాను బలోపేతం చేసి మూడు దఫాలు ప్రధానిగా దేశానికి సేవ చేశారని, అజాతశత్రువుగా నిలిచారని కొనియాడారు. ● ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ వాజ్‌పేయీ విగ్రహావిష్కరణలతో ప్రజలు స్ఫూర్తిదాయం తరలివస్తున్నారని వెల్లడించారు. అందరి ఆమోదంతో రాజమహేంద్రవరంలో విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. ● ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తానెంతో అభిమానించే వాజ్‌పేయీ విగ్రహ ఏర్పాటులో కూటమి పార్టీలను కూడా భాగస్వాములను చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ● అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వాజ్‌పేయీ గురించి తెలియని భారతీయులు ఎవరూ ఉండరన్నారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, కార్యదర్శి బొమ్మల దత్తు, నాయకులు అడబాల రామకృష్ణారావు, నర్సిపల్లి హారిక, రేలంగి శ్రీదేవి, పరిమి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలతో పులకించిన బలభద్రపురం

గజవాహనంపై వేంకటా చలపతి

శ్రీవారి బ్రహ్మోత్సవాలతో బలభద్రపురం పులకించిపోతోంది. ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం 8వరోజు స్వామివారు గజవాహనంపై వేంకటా చలపతి అవతారంలో ఇద్దరు దేవేరిలతో కలిసి మాడవీధుల్లో విహరించారు. రథం లాగటానికి భక్తులు పోటీపడ్డారు. 9 సార్లు మాడవీధుల మీదుగా రథోత్సవం నిర్వహించారు. భక్తుల జయజయ ధ్వానాలతో రుత్వికులు ఇచ్చే హారతుల నడుమ స్వామివారి గజవాహనం ముందుకు కదిలింది.

– న్యూస్‌టుడే, బిక్కవోలు

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రూ.7కి చేరువలో గుడ్డు

● ప్రస్తుతం ఫారంలో గుడ్డు రూ.6.90పైసలు
● క్రిస్మస్, నూతన సంవత్సరాల ప్రభావం

రంగంపేట, న్యూస్‌టుడే: కోడిగుడ్డు ధర పరుగులు పెడుతోంది. ప్రస్తుతం కోళ్లఫారంలలో గుడ్డు ధర రూ.6.90పైసలు ఉండగా రూ.7లకు అతి త్వరలోనే చేరుతుందనే అంచనాలు ఉన్నాయి. దుకాణాల్లో గుడ్డుని విడిగా రూ.8లకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న క్రిస్మస్ సంబరాల సందడికి.. మరో వారం రోజుల్లో ప్రారంభంకానున్న నూతన సంవత్సర హడావిడిలో కేక్‌ల వినియోగం అధికంగా ఉంటుంది. కేక్‌ల తయారీలో కోడిగుడ్లలను ప్రధానంగా వినియోగించడంతో గుడ్డుకి డిమాండు నెలకొంది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతంలో రోజుకి కోటిగుడ్లు ఉత్పత్తి అవ్వగా వ్యాధులు, దాణా ధరలు ఆకాశాన్ని అంటడంతో కొన్ని ఫారంలు మూతబడగా మరికొన్ని సామర్థ్యం కంటే తక్కువ కోళ్లతో కొనసాగుతున్నాయి. రోజుకి 70లక్షల గుడ్లు ఉత్పత్తి అవుతుండగా ప్రస్తుతం చలితీవ్రతకు ఈ సంఖ్య మరింత తగ్గింది.

ఉత్తరాదిలో అధిక వినియోగం..

ఉత్తరాది రాష్ట్రాల్లో చలిని తట్టుకునేందుకు గుడ్డు వినియోగం అధికంగా ఉంది. గుడ్ల ఉత్పత్తి తగ్గడం.. వినియోగం పెరగడంతో కోడిగుడ్డుకి మంచి రోజులు వచ్చాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన కోళ్ల రైతులకు ఈ ధర కొంత ఉపశమనం కలిగిస్తుంది. సంక్రాంతి వరకు ఈ ధర కొనసాగవచ్చనే అంచనాలు ఉన్నాయి.

బీవీఆర్‌కు జిల్లా తెదేపా పగ్గాలు

ప్రధాన కార్యదర్శిగా కాశీ నవీన్

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, కోరుకొండ : తెదేపా అధిష్ఠానం నిర్ణయాలకు కట్టుబడి విధేయంగా ఉన్నవారికి, గత ఎన్నికల్లో టిక్కెట్ త్యాగం చేసిన వారికి తగిన గుర్తింపునిస్తూ తెదేపా అధినేత చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకుంటున్నారు. జిల్లా పార్టీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల నియామకంలో సామాజిక వర్గాలకు సమతూకం వేస్తూ అధ్యక్షుడి బొడ్డు వెంకటరమణ చౌదరి (ఓసీ), ప్రధాన కార్యదర్శిగా కాశీ నవీన్‌కుమార్ (ఎస్సీ)కు కేటాయించారు.

గత ఎన్నికల్లో రాజానగరం అసెంబ్లీ స్థానం నుంచి బరిలో నిలిచేందుకు నిర్ణయం జరిగిన తరువాత ఆ స్థానాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. పార్టీ అధినాయకత్వం సూచనల మేరకు అక్కడ కూటమి అభ్యర్థి విజయానికి పార్టీ శ్రేణులంతా కృషి చేసేలా వెంకటమరణ చౌదరి ప్రోత్సహించారు. రాజానగరం తెదేపా ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న ఆయనకు ఇటీవల రుడా ఛైర్మన్ బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో సుదీర్ఘ రాజకీయ ప్రాధాన్యమున్న కుటుంబం నుంచి వచ్చిన ఆయన సర్పంచిగా సేవలందించిన తరువాత 2014 ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా రాజమహేంద్రం ఎంపీ స్థానానికి పోటీ చేసి ఓటమి చెందారు. ఆ తరువాత రాజకీయలకు దూరంగా ఉంటూ 2022లో అన్నవరంలో చంద్రబాబునాయుడు సమక్షంలో తెదేపా చేరారు. ఆ తరువాత రాజానగరం బాధ్యతలు అప్పగించడంతో స్థానికంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ తగిన గుర్తింపు పొందారు. తండ్రి బొడ్డు భాస్కర రామారావు సర్పంచిగా, సమితి అధ్యక్షుడిగా, జడ్పీ ఛైర్మన్‌గా, రెండు సార్లు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పని చేశారు. తల్లి జగన్మోహిని సర్పంచిగా సేవలందించారు.

వెంకట రమణచౌదరిని ఆశీర్వదిస్తున్న తల్లి

నవీన్‌కుమార్

● పార్టీలో దీర్ఘకాలంగా వివిధ హోదాల్లో సేవలందించిన రాజమహేంద్రవరానికి చెందిన కాశీ నవీన్‌కుమార్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించి సామాజికవర్గాల సమతూకానికి ప్రాధాన్యమిచ్చారు. పార్టీలో అనేక పదవులు చేపట్టిన ఈయన ప్రస్తుతం తెదేపా రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. 'పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, యువనాయకుడు లోకేశ్‌కు కృతజ్ఞతలు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలు సమర్థంగా నిర్వర్తిస్తాను. పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఇన్‌ఛార్జులను సమన్వయం చేసుకుని పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తా.' అని బొడ్డు వెంకట రమణచౌదరి అన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో

1,89,550 మందికి పోలియో చుక్కలు

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: పిల్లల నిండు జీవితానికి పోలియో చుక్కలు రక్షణ ఇస్తాయని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో పల్స్ పోలియోను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,080 పోలియో బూత్‌లు ఏర్పాటు చేసి 1,89,550 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. 0-5 ఏళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు.

బ్యారేజీ వద్ద పరవళ్లు

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటి సోయగం కనువిందు చేస్తోంది. ఆదివారం పర్యాటకుల తాకిడితో పరిసరాలు సందడిగా మారాయి. పోలవరం జలాలు రావడంతో ఇన్‌ఫ్లో పెరిగింది. గోదావరిలో 50,169 క్యూసెక్కులు ఉండగా ధవళేశ్వరం వైపు బ్యారేజీ 18 గేట్లు 0.7 అడుగుల మేర పైకెత్తి 36,169 క్యూసెక్కులు కడలిలోకి విడిచిపెట్టారు. పశ్చిమ డెల్టాకు 7 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, తూర్పుడెల్టాకు 5 వేలు చొప్పున 14 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ సందర్భంగా హెడ్‌వర్క్సు ఏఈ రాధాకృష్ణ మాట్లాడుతూ అధిక జలాలు వచ్చి చేరుతున్నందున దిగువకు విడిచి పెడుతున్నట్లు చెప్పారు.

– న్యూస్‌టుడే, ఆత్రేయపురం

నాట్యమే పరేడ్‌కు తీసుకెళ్లింది..!

రాజమహేంద్రవరం ఆదిత్య డిగ్రీ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని మద్దిపట్ల పరిమళ హరిప్రియ 2026 జనవరి 26న దిల్లీలో జరిగే రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా ఆమె న్యూస్‌టుడేతో మాట్లాడారు." నా తండ్రి సత్యకుమార్ రాఘవేంద్రస్వామి ఆలయ అర్చకులుగా ఉన్నారు. తల్లి కృష్ణవేణి గృహిణి. ఎన్ఎస్ఎస్ పీవో నాగేశ్వరరావు ప్రోత్సాహంతో పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నా. చిన్నతనం నుంచే కూచిపూడి, భరతనాట్యం నేర్చుకొని పలు వేదికలపై ప్రదర్శనలు ఇచ్చా. రిపబ్లిక్ పెరేడ్‌లో పాల్గొనాలనే కాంక్షతో నన్నయ వర్సిటీ నిర్వహించిన ఎంపికల్లో రెండు సార్లు పాల్గొన్నా నిరాశే ఎదురైంది. అయితే మూడోసారి మరింత సాధన చేసి ఎంపికయ్యా. అక్టోబరు 31 నుంచి నవంబరు 10 వరకు గుజరాత్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలు రాష్ట్రాల నుంచి 200 మంది రాగా 44 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 29న దిల్లీకి వెళ్తా.' అని ఆమె అన్నారు.

- న్యూస్‌టుడే, శ్యామలాసెంటర్

కొత్త రేషన్ కార్డు.. పొందండి ఇలా..

మీ కోసం

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: కొత్త రేషన్ కార్డు కావాలన్నా, పిల్లల పేర్లు చేర్చాలన్నా, గతంలో కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఈ అవస్థకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎప్పుడైనా దరఖాస్తు చేసుకొనేలా సచివాలయాల్లో కొత్త వ్యవస్థను తీసుకొచ్చారు. డిజిటల్ సహాయకులకు ఆయ బాధ్యతలను అప్పగించారు.

● **కొత్తగా పెళ్లయిన వారు:** నూతన దంపతులు బియ్యం కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే గతంలో పెద్ద ప్రక్రియ ఉండేది. తొలుత ఆ మహిళను తల్లిదండ్రుల కార్డు నుంచి తొలగించి, ఆ తర్వాత ప్రక్రియ మొదలుపెట్టేవారు. ఈ వ్యవధిలో లబ్ధిని కోల్పోయేవారు. ఇకపై అలాంటి ఇబ్బందులు ఉండవు. భార్యాభర్తల ఇద్దరి ఆధార్, భర్త పాత బియ్యం కార్డు, పెళ్లి ధ్రువీకరణ పత్రం తీసుకొని సచివాలయానికి వెళ్తే ప్రభుత్వ వెబ్‌సైటులో మ్యారేజీ స్ప్లిట్ ఆప్షన్‌లో నమోదు చేస్తారు. వారికో నెంబరు కేటాయించి దాని ఆధారంగా ఈకేవైసీ చేస్తారు. తర్వాత వీఆర్వో, తహసీల్దారు పరిశీలనకు పంపుతారు. అక్కడి నుంచి అనుమతి పొందగానే కార్డు మంజూరు చేస్తారు.

● **పిల్లల పేర్లు చేర్చేందుకు:** పిల్లల పేర్లు చేర్చేందుకు పిల్లల ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రుల బియ్యం కార్డు వివరాలు నమోదు చేసి వీఆర్వో, తహసీల్దారు పరిశీలనకు పంపుతారు. వారు విచారణ జరిపి అనుమతించగానే కార్డులో పేర్లు చేరుస్తారు. మరిన్ని వివరాలకు ఆయా సచివాలయాలలో సంప్రదించాలని పౌరసరఫరాల శాఖ ఏఎస్‌వో నాగాంజనేయులు తెలిపారు.

● జనవరి నుంచి జూన్ వరకు దరఖాస్తు చేసుకున్న వారికి జులైలో, జులై నుంచి డిసెంబరు వరకు దరఖాస్తు చేసుకున్న వారికి జనవరిలో కొత్తరేషన్ కార్డులు అందజేయనున్నారు.

● ప్రస్తుతం కార్డులో చిరునామా మార్పునకు అవకాశం ఉంది.. అవసరమైన వారు గ్రామ, వార్డు సచివాలయాలు, వీఆర్వోలను సంప్రదించాలని ఏఎస్‌వో సూచిస్తున్నారు.

40 పాశురాలు.. 1,493 పదాలు

కుంచెతో చీరపై తిరుప్పావై పాశురాలు రాస్తున్న లీలాపూర్ణిమ

గోదాదేవి అమ్మవారు గానం చేసిన తిరుప్పావైలోని 30, రంగనాథుడి మేలు కొలుపులోని 10 వెరసి మొత్తం 40 పాశురాలను చీరపై కుంచెతో రమణీయంగా లిఖించారు మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన శ్రీఘాకోళపు లీలాపూర్ణిమ. ఈ చీరను అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయంలోని గోదాదేవికి సమర్పించారు. ఒక్కో పాశురంలో 8 వాక్యాలు చొప్పున ఒక్కో దానిలో నాలుగైదు వరకు పదాలు ఉంటాయి. 320 వాక్యాల్లో మొత్తం 1,493 పదాలను పలు రంగులతో చూడముచ్చటగా లిఖించారు. వాటి మధ్యలో వైవిధ్యమైన రంగుల మేళవింపుతో గోదాదేవి చిత్రం సహా నెమలి, వేణువు బొమ్మలను కూడా చిత్రించారు. దీనికిగాను తనకు రోజుకు రెండు గంటల చొప్పున పది రోజుల పాటు సమయం పట్టిందన్నారు.

- న్యూస్‌టుడే, మామిడికుదురు

లక్ష్యం ఘనం.. పనులు గగనం

● పదిరోజుల్లో పూర్తవుతున్న గడువు
● పూర్తికాని టెర్మినల్ నిర్మాణ పనులు

కోరుకొండ, సీతానగరం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం విమానాశ్రయం వేగంగా అభివృద్ధి చెందుతున్న సంగతి తెలిసిందే. ఒకప్పుడు ఒక విమానం వచ్చి వెళ్లడానికే గగనమైన రోజుల నుంచి ఇప్పుడు చాలా ప్రాంతాలకు సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి. గత కొంతకాలంగా విమానాశ్రయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నీలినీడలు అలముకున్నాయి.

కొనసాగుతున్న పనులు

మూడోసారీ తప్పదేమో..

విమానాశ్రయం టెర్మినల్ విస్తరణ పనులు పూర్తవ్వడానికి మరోసారి గడువు పెంచక తప్పేలా లేదు. 2023 ఆగస్టులో టెర్మినల్ నూతన భవనం, డ్రైనేజీ, అధునాతన, సాంకేతిక పనులకు శ్రీకారం చుట్టారు. గడిచిన ఆగస్టు నాటికే కొత్త టెర్మినల్ భవనం అందుబాటులోకి రావాల్సి ఉంది. పూర్తవ్వకపోవడంతో ఈ డిసెంబరు వరకు రెండోసారి గడువు పెంచారు. ఇంకా పది రోజులు మాత్రమే ఉండగా, నేటికీ పనులు పూర్తికాకపోవడం గమనార్హం. మరోసారి గడువు పెంచే సూచనలు కనిపిస్తున్నాయి.

కనిపించని పురోగతి

ఈ ఏడాది జనవరిలో నిర్మాణ దశలో ఐరన్ రాఫ్టర్లు పడిపోవడంతో పనులపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. అనుభవం లేనివారితో చేపడుతున్నారని, క్రమపద్ధతిలో జరగట్లేదని, భద్రతా ప్రమాణాలు పాటించట్లేదని ఆరోపణలు వెల్లువెత్తాయి. అప్పటి నుంచి పనుల్లో ఆశించిన పురోగతి కనిపించట్లేదు.

విస్తరణ ఇలా..

- ప్రాజెక్టు వ్యయం: రూ.350 కోట్లు
- టెర్మినల్ భవన విస్తీర్ణం: 17,029 చదరపు మీటర్లు
- ప్రయాణికుల సామర్థ్యం: 2,100 మంది(ఒకేసారి)
- ఏరో వంతెనలు: 3
- తనిఖీ కౌంటర్లు: 28
- ఎస్కలేటర్లు: 4
- ఎలివేటర్లు: 5
- కన్వేయరు బెల్టులు: 4
- కార్ల పార్కింగ్: 700

అన్ని పాఠశాలల్లో 'ముస్తాబు' : డీఈవో

ధవళేశ్వరం: రోజువారీ శుభ్రతా, క్రమశిక్షణ కార్యక్రమం ముస్తాబును జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సమర్థంగా అమలుచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు ఆదేశించారు. శ్రీసత్యసాయి గురుకులంలో జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, యాజమాన్య ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఉత్తర్వులలో నిర్దేశించిన పద్ధతులను కచ్చితంగా అమలుచేయాలని సూచించారు. ప్రతి పాఠశాలలోనూ ముస్తాబు కార్నర్ ఏర్పాటుచేసి సబ్బు, అద్దం, టవల్, నెయిల్ కట్టర్, దువ్వెన, బకెట్, మగ్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులను లీడర్‌లుగా ఏర్పాటు చేసి హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తుండాలన్నారు.

మట్టికి రెక్కలు..!

గోకవరంలో యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

ఈనాడు, రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే, గోకవరం : అనుమతులుండవు.. అక్రమ తవ్వకాలు ఆగవు..కొందరి నాయకుల అండదండలతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. గోకవరం మండలం గంగంపాలెం, రంప యర్రంపాలెంలో ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా రేయింబవళ్లు గ్రావెల్ తరలిస్తున్నారు. అధికారులు స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా కనీసం కన్నెత్తి చూడటం లేదంటే, అక్రమార్కుల పెత్తనం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

అక్రమ తవ్వకాలతో గోతులుగా మారిన గంగంపాలెంలోని ఎర్రమట్టి భూములు

నర్సరీలకు, లే అవుట్‌లకు తరలింపు..

ప్రస్తుతం నర్సరీలకు, లే అవుట్‌లకు గ్రావెల్ గిరాకీ ఉండటంతో గంగంపాలెం, యర్రంపాలెంలో అక్రమ తవ్వకాలకు తెరతీశారు. ఏ అనుమతులు లేకున్నా భారీ యంత్రాలతో మట్టి తవ్వి రాజమహేంద్రవరం చుట్టపక్కల ప్రాంతాలకు తరలించేస్తున్నారు. ఆరు యూనిట్ల టిప్పర్ మట్టి రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు ధర నిర్ణయించి రోజుకు 150 లారీల్లో తరలిస్తున్నారు. 15 రోజులుగా ఈ దందా సాగుతోంది.

దూసుకుపోతున్న టిప్పర్లు

మట్టిలోడుతో టిప్పర్లు ఆయా గ్రామాల ఇరుకు రోడ్లపై దూసుకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. రాకపోకల సమయంలో దుమ్ముధూళి వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి అక్రమ రవాణాకు సూరంపాలెం ప్రాజెక్టు కాలువలో తూరలు ఏర్పాటు చేసి చిన్నపాటి వంతెన నిర్మించడం గమనార్హం. దీనిపై జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి ఫణిభూషణ్‌రెడ్డి స్పందిస్తూ.. ఇటీవల ఫిర్యాదు అందడంతో జరిమానాలు విధించామన్నారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పిల్లలూ.. జీవితంలో ప్రతి అడుగూ కీలకమే

టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనాజైస్వాల్

రాజానగరం, న్యూస్‌టుడే: జీవితంలో ప్రతి అడుగూ ఆచితూచి వేయాలని అప్పుడే విజయాలు సాధ్యమవుతాయని ప్రముఖ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనాజైస్వాల్ అన్నారు. దివాన్‌చెరువులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన వార్షికోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ఆస్తి, అంతస్తులపై మక్కువ కాకుండా కష్టపడేతత్వాన్ని, సమస్యల నుంచి బయటపడే మనోధైర్యాన్ని తల్లిదండ్రులు అందించాలన్నారు. మనం ఎంత చదివామన్నది ముఖ్యం కాదని, ఎంత సంస్కారం నేర్చుకున్నాం అనేది ముఖ్యమని దిశా నిర్దేశం చేశారు.

ప్రజా సమస్య పరిష్కార వేదిక

నేడు

కలెక్టరేట్ (రాజమహేంద్రవరం): జిల్లాలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం యథావిధిగా జరుగుతుందని జేసీ మేఘాస్వరూప్ ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగే జిల్లాస్థాయి పీజీఆర్ఎస్‌లో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తోపాటు డివిజన్, మున్సిపల్, మండల కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ జరుగుతుందన్నారు. మీకోసం పోర్టల్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేయవచ్చన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

(c) eenadu

సిద్ధివినాయక.. శుభదాయక

అయినవిల్లి సిద్ధి వినాయకస్వామిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. దీంతో క్యూలైన్లు నిండిపోయాయి. పలువురు నూతన వాహనాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించారు. – న్యూస్‌టుడే, అయినవిల్లి

కృష్ణం వందే సర్వసుందరం



ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ముందు సాగాలని పుదుచ్చేరి ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. తాళ్లరేవు మండలం గాడిమొగలో హరేకృష్ణ సత్సంగ కేంద్రం, రాధాకృష్ణ మందిర ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. రాధాకృష్ణుల విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తిగీతాలు ఆలపించారు. యానాం నాయకుడు, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, మందిరం అధ్యక్షుడు సంగాడి పూసలయ్య, సర్పంచి గోవలక్ష్మి, ఉపసర్పంచి లోకేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

అభయారణ్యంలో ఆనందాల విందు

కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. జిల్లా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన పాఠశాలల విద్యార్థులతో సందడి నెలకొంది. అనకాపల్లి జిల్లా యలమంచిలి నుంచి,

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడి వన్యప్రాణులు, మడ మొక్కల విశిష్టతను తెలుసుకున్నారు. సముద్రం మొగ వరకు బోటు షికారు చేశారు. – న్యూస్‌టుడే, తాళ్లరేవు

గోదాదేవికి ప్రత్యేక అలంకరణ

ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అప్పనపల్లి బాల బాలాజీస్వామి ఆలయంలో కొలువుదీరిన గోదాదేవి అమ్మవారికి ఆదివారం వేకువజామున మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛరణలతో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కలశాలతో తీసుకొచ్చిన వైనతేయ జలాలతో అభిషేకించి వివిధ రకాల పూలు, తులసి మాలలతో అలంకరించారు. వేదపండితులు, అర్చకులు తిరుప్పావై పాశురాలను పఠించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అనేక మంది దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

కోటసత్తెమ్మకు ప్రత్యేక పూజలు

నిడదవోలు, న్యూస్‌టుడే: తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు బారులుతీరారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. దర్శనాల ద్వారా రూ.22,240, అన్నదాన ట్రస్టుకు రూ.7,358, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.23,500, ఇతర టికెట్ల అమ్మకాలు రూ.49,530 ఆదాయం వచ్చింది. ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి [illegible], ఆలయ ప్రధానార్చకుడు [illegible] శర్మ పాల్గొన్నారు.

రామానుజన్ చరిత్రను విద్యార్థులు అధ్యయనం చేయాలి

అవార్డు గ్రహీత డాక్టర్ నాగసూరి వేణుగోపాల్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చరిత్రను విద్యార్థులు అధ్యయనం చేయాలని ఈ ఏడాది రామానుజన్ స్మారక గణిత అవార్డు గ్రహీత, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ చెప్పారు. గణిత సేవా సంస్థ రామానుజన్ గణిత అకాడమీ 36వ వార్షికోత్సవ సభ, రామానుజన్ జయంతి సందర్భంగా వీఎస్ఎం కళాశాలలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ కె.వి.వి. మాట్లాడుతూ రామానుజన్ జయంతి గణితశాస్త్ర చరిత్రలో ఎర్రసిరాతో లిఖించిన రోజని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాసిన 'ద బ్యూటీ ఆఫ్ ప్రీ ఒలింపియాడ్ ప్రాబ్లమ్స్' గ్రంథాన్ని గణిత శాస్త్రజ్ఞులు ఆవిష్కరించారు. అనంతరం రామానుజన్ స్మారక గణిత పురస్కారాన్ని డాక్టర్ నాగసూరి వేణుగోపాల్‌కు, సంజీవరాయశర్మ అవార్డును బెంగళూరుకు చెందిన డీకే ప్రసన్నకుమార్‌కు, కృష్ణమూర్తి ఉపాధ్యాయ అవార్డును డాక్టర్ ఎస్.ధనుంజయకు అందించారు. గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు డా. కె.వి.వి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో [illegible] అధ్యక్షుడు కె.శ్రీకృష్ణ, అకాడమీ సభ్యులు తోటకూర సాయి రామకృష్ణ, ఎం.నాగార్జున, ఎస్.ఎస్.కె.ప్రసాద్, శ్రీధర్, చంద్రశేఖరశాస్త్రి, ముమ్మిడి సత్యనారాయణ తదితరులు ప్రసంగించారు. జాతీయ స్థాయి, తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాస్థాయిలో ప్రతిభచూపిన రామచంద్రపురం, ద్రాక్షారామ విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

అవార్డు గ్రహీతలతో రామానుజన్ గణిత అకాడమీ [illegible] కమిటీ సభ్యులు

అంతర్వేది క్షేత్రంలో రోడ్లకు మోక్షం

అంతర్వేది, మలికిపురం, న్యూస్‌టుడే: అంతర్వేది క్షేత్రంలో రోడ్లకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. పంచాయతీరాజ్‌శాఖ నుంచి రూ.1.85 కోట్లతో 6, ఆర్ అండ్ బీ నుంచి రూ.16 లక్షలతో ఒకరోడ్డు మంజూరయ్యాయి. లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు జనవరి 25 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకూడదనే లక్ష్యంతో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు. దీంతో బీచ్, ఆదర్శనగర్, వసంత మండపం రోడ్లను సీసీగాను, ఖాన్‌షాబ్, పల్లిపాలెం, రామాలయం నుంచి లైట్‌హౌస్ వరకు ఉన్న రోడ్లను బీటీగాను వేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు మరోచోట బీచ్, లైట్‌హౌస్ రోడ్లను వేయడానికి టెండర్లు పిలిచారు. సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని జేఈలు సురేష్, గంగాధర్ వెల్లడించారు. ఇవి పూర్తయితే ప్రయాణికులు, భక్తులు, పర్యాటకులకు అవస్థలు తప్పుతాయని చెబుతున్నారు.

మార్చిలో యూనియన్ రాష్ట్ర మహాసభలు

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో మార్చి 10, 11, 12 తేదీల్లో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ 6వ రాష్ట్ర మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారాయుడు వెల్లడించారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ఉమ్మడి జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ మహాసభల్లో కార్మిక సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి పలు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వాలు అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్, కోనసీమ జిల్లా గౌరవ అధ్యక్షుడు సత్తిబాబు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గమ్మ, జిల్లా అధ్యక్షుడు రమణ, కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి

చిన్నారులను అభినందిస్తున్న రాధామనోహర్‌దాస్

చాగల్లు, న్యూస్‌టుడే: భారతీయ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, హిందూ ధర్మానికి హాని జరిగితే సహించేది లేదని అభయ హిందూ సేన వ్యవస్థాపకుడు రాధామనోహర్‌దాస్ అన్నారు. చాగల్లులో ఆదివారం రాత్రి నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. [illegible] హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందన్నారు. స్వదేశీ నినాదం ఎంతో కీలకమని, భారతదేశం రానున్న రోజుల్లో విశ్వగురువుగా వర్ధిల్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసశర్మ, నిర్వహణ సమితి సభ్యులు తాళ్లూరి వరప్రసాద్, జె.వెంకట గణపతి, తదితరులు పాల్గొన్నారు. తొలుత చాగల్లులో శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని రాధామనోహర్‌దాస్ దర్శించుకుని పూజలు చేశారు.

కన్నేశారంటే.. కొల్లగొడతారు..!

■ ముగ్గురు అరెస్టు
■ రూ.35 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.35 లక్షల విలువైన 274.800 గ్రాముల బంగారం, 1750 గ్రాముల వెండి వస్తువులు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్‌మీనా ఆ వివరాలను వెల్లడించారు.

అమలాపురం ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ మీనా (అంతర చిత్రంలో) స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి వస్తువులు

70 కేసుల్లో నిందితుడు..

అమలాపురం మండలం కొంకాపల్లికి చెందిన అంతర్రాష్ట్ర దొంగ పత్తివాడ లోవరాజు(31) ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుమారు 70 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ప్రతిసారీ జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత చోరీల బాటపడుతున్నాడు. వివిధ పరికరాలతో ఇంటి తాళాలను సులువుగా తెరుస్తాడు. అతడి నుంచి రూ.25 లక్షల విలువైన 185 గ్రాముల బంగారం, 1750 గ్రాముల వెండి వస్తువులు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇతడిపై అమలాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో -2, పెనుగొండలో -2, హైదరాబాద్‌లో-1 కేసులు నమోదయ్యాయి.

స్నాచింగ్ దొంగ అరెస్ట్...

పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం సీతలంకొండేపాడు చిన్నవీధికి చెందిన కవురు మూర్తి(24) ద్విచక్ర వాహనంపై వెళ్తూ మహిళల మెడలోని బంగారు ఆభరణాలను లాక్కొని పరారవుతాడు. రావులపాలెం రూరల్, ఆత్రేయపురంలో కేసులున్నాయి. అతడి నుంచి రూ.6 లక్షలు విలువ చేసే 49.800 గ్రాముల బంగారం, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

తలుపులు బద్దలుకొట్టి చోరీలు

అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గంటి వారి వీధికి చెందిన గంటి గౌతమ్ (24) కొత్తపేటలో తాళాలు వేసిన ఇంటి తలుపులను రాడ్డుతో బద్దలు కొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అతడి నుంచి రూ.4.50 లక్షల విలువ చేసే 39 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలే లక్ష్యం: ఆలపాటి

రామచంద్రపురం: జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలే లక్ష్యంగా సి.ఆర్.మీడియా అకాడమీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ చెప్పారు. రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో రెండో రోజు ఆదివారం పునశ్చరణ తరగతుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే జర్నలిస్టుగా రాణించగలమని పేర్కొన్నారు. క్రైమ్ రిపోర్టింగ్‌లో మెలకువలు అంశంపై శ్రీశైలం రమేష్ మాట్లాడుతూ సమాజం రెండో పార్శ్వాన్ని ఎత్తి చూపేవి నేర వార్తలని చెప్పారు. డెవలప్‌మెంట్ జర్నలిజం అంశంపై డా.జి.కొండలరావు అవగాహన కల్పించారు. ఛైర్మన్ సురేష్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు ఎం.శ్రీరామమూర్తి సర్టిఫికెట్లు అందజేశారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

నిడదవోలు, న్యూస్‌టుడే: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై పి.అప్పారావు తెలిపారు. నిడదవోలు-తాడేపల్లిగూడెం స్టేషన్ల మధ్యం మారంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో 548/4వ కి.మీ వద్ద దిగువ రైలు పట్టాల మధ్యలో సుమారు 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడన్నారు. పచ్చరంగు టీ షర్టు, నాచు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసినవారు 94906 17090, 80191 57528 చరవాణి నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాతలు కనికరించినా.. నిలువని ప్రాణం

గోపాలపురం, న్యూస్‌టుడే: క్యాన్సర్‌తో బాధపడుతున్న వివాహిత చికిత్సకు దాతలు సహకరించినప్పటికీ మృత్యువు కనికరించలేదు. తలకు సంబంధించిన క్యాన్సర్‌తో రాపాక శ్రీలత(22) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మండలంలో పెద్దాపురం గ్రామానికి చెందిన వీరకృష్ణతో నాలుగేళ్ల కిందట ఆమెకు వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల వయసున్న విభిన్న ప్రతిభావంతుడైన బాబు ఉన్నాడు. తొమ్మిది నెలల కిందట ఆమెకు క్యాన్సర్ ఉందన్న విషయం బయటపడింది. పేద కుటుంబం కావడంతో పలువురు దాతలు, గ్రామస్థులు ఆర్థిక సాయం చేశారు. చికిత్సకు రూ.20 లక్షలకుపైగా ఖర్చు చేసినప్పటికీ ఆమె ప్రాణాలు నిలవలేదని కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విద్యను అభ్యసించిన పాఠశాల దేవాలయంతో సమానమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం మంగళవారపుపేట బీఈడీ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 1970-75 ఏడాదిలో విద్యాభ్యాసం పూర్తి చేసిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యాబోధనతో పాఠశాల గురువులు నేర్పిన చదువుతో ఇక్కడ చదువుకున్న వారంతా ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారన్నారు. ఇదే పాఠశాలలో తాను చదువుకున్నానని, అలనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు చింతపెంట ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు హాజరై సందడి చేశారు. అలనాటి గురువులను సత్కరించారు. విశ్రాంత జడ్జి పోడిపిరెడ్డి రాంబాబు, మద్దుల సత్యనారాయణ, శ్యామ్ సింగ్, విఠోబా మహరాజ్ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	17,000
పాతకాయ: గండేరా	28,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	27,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	128-00
రిటైల్ లైవ్	155-00
డ్రెస్డ్	225-00
స్కిన్‌లెస్	256-00

92.7 FM Rajamahendravaram 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్) నందు
I.P.No. 26/2025

గోపిరెడ్డి రమణయ్య, ప్రొద్దుటూరు, వై.ఎస్.ఆర్. కడప జిల్లా. ...పిటీషనర్/క్రెడిటార్

Vs

1. బెల్లాల చౌడయ్య, పెద్దశెట్టిపల్లె గ్రామం, ప్రొద్దుటూరు మండలం, వై.ఎస్.ఆర్.కడప జిల్లా.
2. గంధవరపు అమేయ, మైనర్, రెప్రజెంటెడ్ బై నెక్స్ట్ ఫ్రెండ్-తండ్రి- గందవరపు రవి, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.
3. అఫీసియల్ రిసీవర్, డిస్ట్రిక్ట్ కోర్టు కాంప్లెక్స్, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా. ఎ.పి. ....రెస్పాండెంట్లు

పై పిటీషనర్ పై 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా తీర్మానించి అతడు 2వ రెస్పాండెంట్ పేరిట 'బి' షెడ్యూలు ఆస్తికి సంబంధించి 18.08.2025వ తేదీన పోలవరం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ చేయించి ఇచ్చిన Doc.No.2203/2025 మరియు CS.No. 2285/2025గా గల విక్రయ దస్తావేజును రద్దుపరచి ఏలూరు అఫీసియల్ రిసీవర్ వారికి 'బి' షెడ్యూలు దాఖలా ఆస్తిని బాకీదారులందరికీ పంచడానికి స్వాధీనపరచి వగైరా కోరుతూ పై IP పిటీషన్ దాఖలు చేశాడు. ఇందుపైన ఎవ్వరికైనా ఏవైనా క్లెయిములు గానీ, ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు నందు 30.12.2025వ తేదీన ఉ॥ 10.30 గం॥లకు స్వయముగా గానీ లేక వకీలు గారి ద్వారా గానీ హాజరై తెలుపుకోవలెను.

వాయిదా తేదీ : 30.12.2025

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
ఎస్.సుబ్బారావు, అడ్వకేటు, కొవ్వూరు, సెల్: 9492917811,
వి.రమేష్‌బాబు 9441500950, వై.శ్రీనివాసరెడ్డి, అడ్వకేట్స్, ప్రొద్దుటూరు.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు (సీనియర్ డివిజన్) నందు
I.P. No.27/2025

సానే గురప్ప, ప్రొద్దుటూరు, వై.ఎస్.ఆర్. కడప జిల్లా. ...పిటీషనరు / క్రెడిటార్

Vs

1. శ్రీనివాస సిరామిక్ టైల్స్ Pvt. Ltd., CIN-U36990AP2017 PTC 107261, రెప్రజెంటెడ్ బై ఇట్స్ డైరెక్టర్, బెల్లాల చౌడయ్య, పెద్దశెట్టిపల్లె గ్రామం, ప్రొద్దుటూరు మండలం, వై.ఎస్.ఆర్. కడప జిల్లా.
2. గంధవరపు అమేయ, మైనర్, రెప్రజెంటెడ్ బై నెక్స్ట్ ఫ్రెండ్ - తండ్రి - గందవరపు రవి, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.
3. ఆఫీషియల్ రిసీవర్, ఏలూరు, డిస్ట్రిక్ట్ కోర్టు కాంప్లెక్స్, పశ్చిమ గోదావరి జిల్లా. ...రెస్పాండెంట్స్

పై పిటీషనర్ పై 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా తీర్మానించి అతడు 2వ రెస్పాండెంట్ పేరిట 'బి' షెడ్యూలు ఆస్తికి సంబంధించి 18.08.2025వ తేదీన పోలవరం సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో రిజిస్టర్ చేయించి ఇచ్చిన Doc. No.2203/2025 మరియు C.S.No.2285/2025గా గల విక్రయ దస్తావేజును రద్దుపరచి ఏలూరు ఆఫీషియల్ రిసీవర్ వారికి 'బి' షెడ్యూలు దాఖలా ఆస్తిని బాకీదారులందరికీ పంచడానికి స్వాధీనపరచి వగైరా కోరుతూ పై I.P. పిటీషన్ దాఖలు చేశాడు. ఇందుపైన ఎవ్వరికైనా ఏవైనా క్లెయిములు గానీ, ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు నందు 30.12.2025వ తేదీన ఉ॥ 10.30 గం॥లకు స్వయముగా గానీ లేక వకీలు గారి ద్వారా గానీ హాజరై తెలుపుకోవలెను.

వాయిదా తేదీ: 30.12.2025

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
యస్.సుబ్బారావు - 9492917811, అడ్వకేటు, కొవ్వూరు.
వి.రమేష్‌బాబు - 9441500950, వై.శ్రీనివాసరెడ్డి
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

అటల్-మోదీ సుపరిపాలన యాత్రలో భాగంగా రాజమహేంద్రవరం నగరంలో ఆదివారం వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. – ఈనాడు, రాజమహేంద్రవరం

ఆటపాటలతో బాల్యం

రాజానగరం: విద్యార్థుల బాల్యం ఆటపాటలతో నిండిపోవాలేకానీ, చరవాణిలతో కాదని ఏఎస్పీ ఎన్.మురళీకృష్ణ అన్నారు. సంపత్‌నగరంలోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థుల నృత్యప్రదర్శన అలరించింది.

వేదికపై నృత్యం చేస్తున్న విద్యార్థులు

బ్యాగ్ నుంచి బీప్ శబ్దం.. భయపడిన ప్రయాణికులు

నిడదవోలు: నిడదవోలు నుంచి భీమవరం వెళ్లే ప్యాసింజర్ రైలు బోగీలో ఒక బ్యాగ్ నుంచి బీప్ శబ్దం రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురై కిందికి దిగిపోయారు. రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బోగీలో బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. కిందకు దించి పరిశీలించగా పాడైన స్వైపింగ్ మిషన్, పాత దుస్తులు ఉన్నాయి. పాడైన మిషన్ నుంచి బీప్ శబ్దాలు వస్తున్నట్లు గుర్తించారు. ఆందోళనకరంగా ఏమీ లేకపోవడంతో ప్రయాణికులు తిరిగి రైలెక్కారు. ప్రయాణికుడు బ్యాగ్ వదిలి వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: స్క్రబ్ టైఫస్ వ్యాధి గురించి ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముందు జాగ్రత్తతో అప్రమత్తంగా ఉంటే చాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఇప్పటి వరకు మూడు కేసులు మాత్రమే గుర్తించామని, అవి కూడా సాధారణ ఆరోగ్య పరీక్షలలో భాగంగా నిర్ధారణ అయినవేనని తెలిపారు. దానిని ఎలా గుర్తించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో

ముఖాముఖి

గుర్తించాలి ఇలా..

స్క్రబ్ టైఫస్ ప్రధానంగా నల్లిని పోలిన చిన్న కీటకం కుడితే శరీరంలో బ్యాక్టీరియా పెరిగి స్క్రబ్ టైఫస్‌గా మారుతుంది. ● కీటకం కుట్టిన చోట కురుపు మాదిరిగా శరీరం కమిలిపోతుంది. కొన్ని రోజులకు నల్లిని మచ్చతో పాటు దద్దుర్లు ఏర్పడతాయి. ● వైరస్ శరీరంలో పెరిగిన రెండురోజులు గడచిన తర్వాత విపరీతమైన జ్వరం వస్తుంది. ● తలనొప్పి, అలసట వాంతులు ఉంటాయి. టైఫాయిడ్, మలేరియా మాదిరిగా జ్వరం వస్తుంది.

సకాలంలో పరీక్షలు అవసరం..

స్క్రబ్ టైఫస్ గురించి అవగాహన ఉంటే తీవ్రమైన సమస్య కాదు. సకాలంలో జ్వర లక్షణాలను బట్టి వ్యాధిని గుర్తిస్తే అయిదు రోజుల్లో చికిత్స చేసి తగ్గించవచ్చు. వైద్యుడి పర్యవేక్షణలో మందులు వాడితే చాలవరకు తగ్గిపోతుంది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు అందరూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారు. ఎవరైనా జ్వరాలతో బాధపడుతుంటే నమోదు చేసుకొని చికిత్స చేస్తున్నారు. నూతనంగా వస్తున్న ఈ వ్యాధితో పాటు మలేరియా ఇతర జ్వరాలపై అవగాహన కల్పిస్తున్నారు.

జాతీయస్థాయి మహిళా బాక్సింగ్ పోటీలకు 10 మంది ఎంపిక

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రెండు రోజులుగా రాష్ట్రస్థాయి మహిళా బాక్సింగ్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. ఆదివారం విజేతలకు బహుమతులు అందజేసి, జాతీయ స్థాయి పోటీలకు 10 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌గా విశాఖపట్నం, రన్నర్‌గా కాకినాడ జిల్లా, ద్వితీయ స్థానంలో నెల్లూరు జిల్లా క్రీడాకారులు బహుమతులు సాధించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, మధుసూదన్‌రావు, జిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగాయి.

త్వరలో నోయిడాలో...: విశాఖపట్నానికి చెందిన కె.శ్రీవర్షిత, ఎస్‌జీజేఎస్ మల్లిక, ఎండీ ముహురున్నీషా బేగం, కె.షైనీ శ్రీ, ఎస్.దీపిక, జె.స్వప్న, వి.రేష్మ, అనకాపల్లికి చెందిన మౌనిక కల్యాణి, బి.భవానీ, విజయనగరానికి చెందిన పి.సుమిత్రలను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. వీరంతా ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో డిసెంబరు 31 నుంచి జనవరి 5వరకు జరిగే జాతీయస్థాయి మహిళా బాక్సింగ్ పోటీల్లో తలపడతారని నిర్వహణా కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph :81422 92071.

శ్రీ సాయి గోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ప్రైవేట్ సంస్థలు నుండి అయినా విడిపించి ఆ రోజు మార్కెట్ రేట్‌కి కొనబడును. స్పాట్‌క్యాష్ ✆ 9493338823

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీకి పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ, 7386201191

REAL ESTATE

LAND FOR SALE JAGGAMPETA

రాజమండ్రికి 30-కి.మీ. దూరంలో మురారి-గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మకం. (నోబ్రోకర్స్), ✆ 9032988265.

JOBS

జై గణేష్ సెక్యూరిటీ తణుకులో విజిలెన్స్ ఆఫీసర్ 7గురు (Ex Service only) జీతం: 28,000/- గన్ మేన్ 3 మెంబర్స్ జీతం: 33,000/- వయసు 50 సం॥ లోపు, PF&ESI W/H, 8 గం॥ డ్యూటీ ✆ 95818 58667.

సెంట్రల్ గవర్నమెంట్ సోలార్ సబ్సిడీ స్కీమ్ నందు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. Q: 10 to PG. జీతం: 30 వేలు to 50 వేలు. ✆ 95155 05557, 99898 57775.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

వైజాగ్ ప్రముఖ షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం:10000 - 12000 + ఫుడ్, రూము. 9030588502, 9704637370

రాజమండ్రి అనకాపల్లిల్లో ప్రైవేట్ & ప్రాజెక్టుల్లో సె॥గార్డ్స్, సూపర్‌వైజర్స్, ఆయాలు స్త్రీ/పు., జీ: 12 to15 వేలు, రూం+బో. రాజ్ సెక్యూరిటీ, దేవిచౌక్, RJY, ✆ 93922 69369

SECURITY GUARDS

కాకినాడ, టిక్కవోలు, పోలవరం ప్రాజెక్ట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు & గార్డ్స్ కావలెను. PF, ESI మరియు ఉచిత భోజన + వసతి కలదు. ✆ 8500498115, 9866594189

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-90 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజమహేంద్రవరం

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైల్వేస్టేషన్ రోడ్డు, ఆల్కాట్‌గార్డెన్స్, కన్నమ్మతల్లిగుడి వెనుక ప్రాంతం, గోదావరి రోడ్డు, కన్నమాంబ వీధి, పోస్టాఫీసువీధి, ఆశ్రమం వీధి, నారాయణవీధి, శారదవీధి, వేమనవీధి, త్రినాధ్‌వీధి, విజయలక్ష్మి వీధి, గోకుల్‌వీధి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

గ్రంథావిష్కరణ

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆంధ్రీకరించిన శ్రీవాల్మీకి రామాయణ సంగ్రహానికి ఓలేటి వెంకట బంగారేశ్వరశర్మ రాసిన వ్యాఖ్యాన గ్రంథావిష్కరణ సభ గౌతమీ గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి పెరుమాళ్ల రఘునాథ్ నిర్వహణలో జరిగిన సభలో సాహితీవేత్త అరిపిరాల నారాయణరావు గ్రంథావిష్కరణ చేశారు. బంగారేశ్వరశర్మ మాట్లాడుతూ చిలకమర్తి రచనకు వ్యాఖ్యానం రాయడం అదృష్టమన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 83282 39927, 80089 02897

పైపులైనుకు మరమ్మతులు..

స్పందనకు వందనం

నగరంలోని వివిధ సమస్యలపై 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను నగరపాలక సంస్థ ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ● స్థానిక తిలక్‌రోడ్డులోని మాధవ్‌నర్సింగ్ హోమ్ ఎదుటి వీధిలో తాగునీటి పైపులైను లీకేజీకి సంబంధిత విభాగం సిబ్బంది మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించినట్లు ఫిర్యాదుదారు సుబ్బిరెడ్డి తెలిపారు. ● స్థానిక దానవాయిపేటలోని జెట్టిబిల్డింగ్ సమీపంలో రోడ్డు చెంత పేరుకుపోయిన చెత్తను సంబంధిత పారిశుద్ధ్య సిబ్బంది తొలగించి శుభ్రం చేసినట్లు ఫిర్యాదుదారుడు రాయుడు తెలిపారు. - న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

సమస్య: స్థానిక సీటీఆర్ఐ రోడ్డు సుబ్రహ్మణ్యనగర్‌లోని చర్చి వెనుక వీధిలో నెలల తరబడి డ్రెయిన్లు శుభ్రం చేయట్లేదు. కాలువలు పూడికతో నిండిపోయి మురుగు నీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. దోమల బెడద పెరిగి ఇబ్బందులు పడుతున్నాం.
- తోరం సత్యనారాయణ, స్థానికుడు

సమస్య: లాలాచెరువు చౌడేశ్వరినగర్‌లో కోతుల బెడద ఎక్కువగా ఉంది. ఇళ్లలోకి చొరబడి వస్తువులు పాడుచేయడంతో పాటు స్థానిక నివాసితులపై దాడి చేస్తున్నాయి. కోతులను పట్టి అటవీ ప్రాంతంలో వదిలేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రకాశ్, స్థానికుడు

సమాధానం: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- వినూత్న, ఎంహెచ్‌వో

- న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

శుభ సంకల్పానికి.. యువ భాగస్వామ్యం

'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో స్వచ్ఛ గోదావరి

ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: 'ఈనాడు-ఈటీవీ' ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని కోటిలింగాల ఘాట్‌లో స్వచ్ఛ గోదావరి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో ఆదిత్య కళాశాల విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ అభిప్రాయాలు పంచుకున్నారిలా..

ఆనందంగా ఉంది..

ప్రతి వారం కళాశాల ఎన్.ఎస్.ఎస్ తరపున ఓ ప్రయోజన కార్యక్రమంలో పాల్గొంటాం. 'ఈనాడు' నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. కొంతమంది బాధ్యతగా వ్యవహరించకపోవడంతో గోదావరిలో ఎన్నో వ్యర్థాలు కలిసిపోతున్నాయి. ఇలాంటి వాటితో పర్యావరణ పరిరక్షణపై యువతలో బాధ్యత పెరుగుతుంది. ఇందులో నేనూ భాగమవ్వడం ఆనందంగా ఉంది. - జాహ్నవి

ఘాట్ శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

గోదావరిని కాపాడుకోవాలి..

పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం బాగుంటుంది. స్వచ్ఛత వైపు మనం ఒక అడుగు వేస్తే మన వెంట మరి కొందరూ కలిసి నడుస్తూ స్వచ్ఛ భారత్ సాధ్యమవుతుంది. ముందు మన ఇంటి పరిసరాలు, నగరాన్ని శుభ్రంగా ఉంచితేనే దేశం కూడా స్వచ్ఛత వైపు అడుగులు వేస్తుంది. గోదావరిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. - నితీష

మార్పు రావాలి..

నగరంలో అనేక రేవుల్లో ప్లాస్టిక్ భూతం వెంటాడుతుంది. ఉదయం, సాయంత్రం నదీ తీరాన ఆహ్లాదంగా గడిపే పరిస్థితి లేదు. నీరు కలుషితమై వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంటుంది. ఇంటి వ్యర్థాలను చెత్తబుట్టల్లోనే వేయడం ద్వారా సగం కాలుష్యాన్ని తగ్గించొచ్చు. చాలామంది రహదారులపైనే పడేస్తున్నారు. ఇది మారాలి. - నమ్రత

ఆధ్యాత్మిక ప్రయాణం చేద్దామా..

'కర్ణాటక-మైసూర్', 'కాశీ-అయోధ్య' యాత్రలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ఆధ్యాత్మిక క్షేత్రాల దర్శనం పేరిట ఆర్టీసీ ప్రత్యేక యాత్ర బస్సులను ఏర్పాటు చేస్తోంది. ఆలయ పర్యాటకం(టెంపుల్ టూరిజం)లో భాగంగా రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి వచ్చే నెల 20న 'కర్ణాటక- మైసూర్ యాత్ర', ఫిబ్రవరి 7 తేదీల్లో 'కాశీ-అయోధ్య యాత్ర' పేరిట సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇవి నిర్ణీత తేదీల్లో సాయంత్రం 4 గంటలకు ఇక్కడి ప్రధాన డిపో నుంచి భక్తులతో బయలుదేరుతాయని ఆర్టీసీ డిపో మేనేజర్ కె.మాధవ్ తెలిపారు. యాత్రలో అన్ని రోజులు భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం ఏర్పాట్లు చేస్తారని, మార్గమధ్యలో ఎక్కడైనా విశ్రాంతి గదులు తీసుకుంటే దాని కయ్యే అదనపు ఖర్చులు భక్తులే చూసుకోవాలని డీఎం సూచించారు.

ఆర్టీసీ డిపోలో ప్రత్యేక యాత్ర బస్సులు

9 రోజులు.. 14 క్షేత్రాలు

'కర్ణాటక-మైసూర్ యాత్ర' తొమ్మిది రోజుల యాత్ర. ఇందులో శ్రీశైలం, మహానంది, మంత్రాలయం, హంపి, గోకర్ణ, మురుడేశ్వర్, కొల్లూరు, ఉడిపి, శృంగేరి, హొర్నాడు, ధర్మస్థలం, కుక్కే, శ్రీరంగపట్నం, మైసూర్‌లతో మొత్తం 14 ప్రముఖ ఆలయాలను దర్శించుకోవచ్చు. ఈ యాత్రకు ఒక్కొక్కరికీ రూ.11,500గా బస్సు టికెట్ ఛార్జీ నిర్ణయించారు.

11 రోజులు.. 13 క్షేత్రాలు

'కాశీ- అయోధ్య యాత్ర' 11 రోజుల యాత్ర. ఇందులో భువనేశ్వర్, పూరి, కోణార్క్, జాజ్‌పూర్, ఆలహాబాద్, కాశీ, అయోధ్య, నైమిశారణ్యం, గయ, బుద్ధగయ, అరసవిల్లి, శ్రీకూర్మం, అన్నవరం క్షేత్రాలను సందర్శించవచ్చు. మహాశివరాత్రి పర్వదినం రోజున కాశీవిశ్వేశ్వరుని దర్శనభాగ్యం లభిస్తుంది. ఒక్కొక్కరికీ రూ.13వేలుగా బస్సు ఛార్జీ నిర్ణయించారు.

మరింత సమాచారానికి..

ఆర్టీసీ ప్రత్యేక యాత్ర బస్సులకు సంబంధించి టికెట్ల బుకింగ్, ఇతర సమాచారం కోసం స్థానిక ఆర్టీసీ డిపోలో సంప్రదించవచ్చు. లేదా 95023 00189, 99666 66544, 98660 45588 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని ఆర్టీసీ డీఎం తెలిపారు.

మంత్రిని కలిసిన జీజీహెచ్ సూపరింటెండెంట్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం పర్యటనలో ఉన్న వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆదివారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. జీజీహెచ్‌లో కొత్త భవన నిర్మాణాల్లో జాప్యం, విద్యార్థులకు తరగతి గదుల కొరత తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై త్వరలో సమగ్రంగా చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో చర్చిస్తున్న సత్యనారాయణ

నిండు జీవితానికి రెండు చుక్కలు

రాజమహేంద్రవరం వైద్యం, టి.నగర్: పిల్లల నిండు జీవితానికి తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా నగరంలోని కంబాలపేట యూపీహెచ్‌సీలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలోని 153 బూత్‌లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో ఇంటింటికీ బృందాలు వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ అనూహ్య, తెదేపా నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

దేవీచౌక్: పోలియో రహిత భారతదేశం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపునిచ్చారు. ఆదివారం తారకరామనగర్‌లో ప్రజారోగ్యం-పిల్లల భవిష్యత్తు లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన పోలియో చుక్కల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

బహుమతులు సాధించిన చిన్నారులు

ముగిసిన చదరంగం పోటీలు

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: క్లాసికల్ ఓపెన్ చదరంగం పోటీల్లో షణ్ముఖ్‌సాయిసాత్, రామిరెడ్డి, శ్రీనికేష్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. రాజమహేంద్రవరంలోని కాలిఫ్యూజన్ చెస్ అకాడమీలో ఆదివారం అండర్-7, 9, 11, 13, 15తో పాటు ఓపెన్ విభాగాల్లో పోటీలు జరిగాయి. అకాడమీ డైరెక్టర్ కుమార్ విశ్వనాథ్ మాట్లాడుతూ ర్యాపిడ్ పోటీలకు భిన్నంగా క్లాసికల్ పోటీలు నిర్వహించడంతో క్రీడాకారుల ఆట తీరును మెరుగుపరుచుకునేందుకు దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

● అండర్-7లో కేతన్‌సాయి శ్రేయాన్స్, ఎస్వీఆర్ గౌతమ్. ● అండర్-9లో మోక్ష సత్య ఆద్య, దేవ హర్షసాయి. ● అండర్-11లో తీగల తన్మయి, సాత్విక్‌వర్మ. ● అండర్-13లో లక్ష్మీసాయి త్రినాధ్, హేమ్ చంద్. ● అండర్-15లో నాగసాయి ఆశ్లేష విజేతలుగా నిలిచారు.

తూకాల్లో మోసాలపై అప్రమత్తం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తూకాల్లో మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్ సూచించారు. రాజమహేంద్రవరంలోని వై-జంక్షన్ రైతుబజారులో ఆదివారం వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. వారు వినియోగించే ఎలక్ట్రానిక్ కాటాలను ఆ శాఖ ద్వారా ఏడాదికోసారి సీలింగ్ వేయించుకోవాలన్నారు. తూకం సరిగా ఉందో లేదో తెలుసుకునేందుకు మొబైల్ ఫోన్‌ను కాటాపై ఉంచి బరువు పరిశీలించవచ్చన్నారు. తేడాలుంటే వెంటనే లీగల్ మెట్రాలజీ అధికారులు, ఎస్టేట్ అధికారి, లేదా 1967, 1915 నంబర్లకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, రైతు బజారు ఎస్టేట్ అధికారి శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్

రాష్ట్రస్థాయి పోటీల్లో నగరవాసి విజయం

శ్యామలాసెంటర్, న్యూస్‌టుడే: విజయవాడ పటమటలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 10 రాష్ట్రస్థాయి మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన వీవీవీ సుబ్బారావు 50 ప్లస్ కేటగిరీలో ఛాంపియన్‌గా నిలిచారు. రెండేళ్లుగా టైటిల్ సాధించడంపై టీటీ సంఘ గౌరవాధ్యక్షులు బి.భాస్కరరామ్, అధ్యక్షులు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ తదితరులు ఆయనను అభినందించారు.

ట్రోఫీ అందుకుంటున్న సుబ్బారావు

విరిగిపోయిన పలకలు

నగరంలోని గోరక్షణపేట నుంచి కిమ్స్ ఆసుపత్రి వరకు రహదారి గుంతలు పడి అధ్వానంగా మారింది. కంకర వేసి వదిలేయడంతో దుమ్ము, ధూళి లేచి వాహనదారులకు తీవ్ర సమస్యగా మారింది. వందల మంది ప్రయాణించే మార్గంలో గుంతలతో పాటు కంకర పైకి లేచి ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేలలో విద్యుత్తు దీపాలు వెలగక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయవలసిందిగా వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, కోటగుమ్మం

గంటపాటు నిలిచిన వాహనాలు

మల్లయ్యపేట నుంచి కొంతమూరు వెళ్లే కాతేరు అడ్డరోడ్డులో ఆదివారం మధ్యాహ్నం భారీ లారీ నిలిచిపోయింది. వాహనదారులకు వెళ్లే దారి లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్రిస్మస్ నేపథ్యంలో ఆ మార్గంలో విద్యుత్తు దీపాలతో అందంగా తీర్చిదిద్దారు. ఈ క్రమంలో వాటిని దాటలేక, సింగిల్ రోడ్డులో వెనక్కి తిరగలేక సుమారు గంటపాటు సమస్య ఎదురైంది. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

పొగతో ఉక్కిరిబిక్కిరి

నగరంలో నిత్యం రద్దీగా ఉండే పేపరుమిల్లు రోడ్డులో లూథర్‌గిరి ప్రాంతంలో వాహనదారులు, పాదచారులు పొగతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి వెంబడి పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లు వంటివి కాల్చడంతో దట్టమైన పొగ వస్తుంది. రహదారిపై కాల్చకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏవీఏ రోడ్డు

'ఛాంపియన్' చిత్రబృందం సందడి

మాట్లాడుతున్న హీరో, హీరోయిన్లు

ఏవీఏ రోడ్డు: చరిత్రలో జరిగిన యదార్థ ఘటన ఆధారంగా తెరకెక్కిన 'ఛాంపియన్' చిత్రం ఈనెల 25న క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుందని హీరో రోషన్ వెల్లడించారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం హీరో, హీరోయిన్లు రోషన్, అనుస్వరను నగరంలో సందడి చేశారు. ఏవీఏ రోడ్డులోని ప్రసాదిత్య మాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్రీడాంశంతో యాక్షన్, రొమాంటిక్ లవ్‌స్టోరీతో దర్శకుడు ప్రదీప్ ఎంతో హృద్యంగా తీశారన్నారు. అనుస్వరను మట్లాడుతూ తెలుగులో తొలి చిత్రమే వైజయంతి బ్యానర్‌లో నటించడం సంతోషంగా ఉందన్నారు.

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాట-36, వంకాయలు నలుపు-18/గులాబీ-28/తెలుపు-24/దొమ్మేరు-38, బెండ-44, కాకర-42, బీర పందిరి-46, దొండ-30, క్యారెట్-28, బీట్‌రూట్-32, గోరు చిక్కుళ్లు-40, దోస-34, ఆనబకాయ-24/26, చిక్కుళ్లు-30, పచ్చిమిర్చి-40, బంగాళదుంప-20, ఉల్లి-22.

ప్రకటన

మా క్లయింటు రాజమండ్రి, క్వారీ మార్కెట్, డో.నెం. 64-35-2/5 కాపురస్తులు **బోనుల సన్యాశిరావు గారి కుమారుడు సుందరరావు** ఇచ్చిన సంజాయిషీ ప్రకారం,

మా క్లయింటు **R.S.No.68/1** మరియు **68/2** సింహాచలనగర్ సమీపంలో గల **య.2.26** సెంట్లు భూమిలో తనకు గల **1/24వ** వంతు వాటా నిమిత్తం **బేరి నాగేశ్వరరావు** వగైరాలపై రాజమండ్రి **5వ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో O.S.No.18/2014 దావా** దాఖలు చేసియున్నారు. సదరు దావా పెండింగులో ఉండగా దావా షెడ్యూలు ఆస్తులకు ఎటువంటి హక్కు లేకుండా మరియు నా క్లయింటుకు ఉన్న హక్కులను కప్పిపుచ్చి ఇతరులకు అమ్మజూపుతున్నట్లుగా తెలియవచ్చినది అని తెలియజేసినారు. కావున సదరు దావా ఆస్తిని ఎవరు కొనుగోలు చేసినను నష్టపోవుదురని, సదరు అమ్మకాలు మా క్లయింటు హక్కుపైన, దావాపైన "బైండు" కావని తెలియజేయడమైనది.

కె.భరణికుమార్
అడ్వకేట్, రాజమండ్రి
సెల్: 98483 15163
రాజమండ్రి,
22-12-2025.

రక్తదాన శిబిరం

వి.ఎల్.పురం: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆదివారం నగరంలో పలుచోట్ల నిర్వహించారు. తిలక్‌రోడ్డులోని పార్లమెంటు నియోజకవర్గ వైకాపా కార్యాలయంలో పార్టీ ఇన్‌ఛార్జి గూడూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగాయి. మోరంపూడి పైవంతెన వద్ద మాజీ ఎంపీ భరత్‌రామ్ ఆధ్వర్యంలో కేకు కోశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. మాజీ కార్పొరేషన్ మజ్జి నూకరత్నం, అప్పారావు ఆధ్వర్యంలో స్థానిక అన్నపూర్ణమ్మపేటలో, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో తితిదే కల్యాణమండపం రోడ్డులోని నిర్వహించారు.

గిరిజనులకు ఉచిత వైద్యసేవలు అభినందనీయం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): గిరిజనులకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలందించడం అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని గోరంట్ల శాంతారావు(జీఎస్ఆర్) ఫౌండేషన్, జీఎస్ఎల్ ఆసుపత్రి సంయుక్తంగా రంపచోడవరంలో ఆదివారం ఉదయం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. భువనేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై పరిశీలించారు. జీఎస్ఆర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఆధ్వర్యంలో వివిధ స్పెషాలిటీ వైద్యులు సేవలందించారు. సుమారు 1,800 మందికి మందులు పంపిణీ చేశారు. 1,000 మందికి పైగా వివిధ రకాల నిర్ధారణ పరీక్షలు చేశారు. 3,500 మందికి భోజనం అందించారు.

వైద్యులతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి, చిత్రంలో రవిరామ్‌కిరణ్

కార్మిక వ్యతిరేక విధానాలు విరమించుకోవాలి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: కార్మిక వ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుబ్బారాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుబ్బారాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి కార్మికులకు తీరని అన్యాయం చేసిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. పని గంటలు 10 నుంచి 12 గంటలకు పెంచుకునే వెసులుబాటు ఆయా యాజమాన్యాలకు కల్పించడం ద్వారా కార్మికుల శ్రమదోపిడీకి తెరలేపిందన్నారు. సమస్యలపై ఉద్యమించే హక్కును హరిస్తున్నారని మండిపడ్డారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారాయుడు

అప్పలస్వామి సేవలు చిరస్మరణీయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సమాజ సేవలో కనకం అప్పలస్వామి పాత్ర చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ సాహితీవేత్త ఎస్.ఆర్.పృథ్వీ రచించిన 'సంఘమిత్ర కనకం అప్పలస్వామి' పుస్తకావిష్కరణ సభ ఆదివారం ఉదయం వైజంక్షన్‌లోని ఆనం రోటరీ హాలులో జరిగింది.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: రైలు ఢీకొని గుర్తుతెలియని ఒక వృద్ధురాలు మృతి చెందింది. ఆదివారం ఉదయం 6.15 గంటల సమయంలో కడియం మండలం జేగురుపాడు గ్రామం పాములమిట్ట కాలనీ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రాజమహేంద్రవరం జీఆర్పీ హెచ్‌సీ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుంది. ఒంటిపై నీలం రంగుపై గోధుమ, ఆకుపచ్చ, నలుపు, పసుపు రంగుల డిజైన్ చీర, నీలం రంగు జాకెట్టు ధరించి ఉంది. పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతురాలి వివరాలు తెలిసినవారు 0883-2442821, 94948 19898 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని జీఆర్పీ హెచ్‌సీ కోరారు.

సమాజాన్ని చైతన్యం చేసేదే కవిత్వం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: సమాజాన్ని చైతన్యవంతం చేసే శక్తి కవిత్వానికే సాధ్యమని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, విశ్వసాహితి కళావేదిక నిర్వహణలో 150 ఏళ్ల వందేమాతర గీతం వేడుక సందర్భంగా 'గోదావరి కవితా తరంగాలు' పేరుతో శతాధిక కవి సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బలరామకృష్ణ మాట్లాడుతూ కవులు కలంతో సమాజానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శకులన్నారు. ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కవిత్వం వినోదం కాదు, ఆత్మ చైతన్యమన్నారు. యువతలో మానవీయ విలువలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో కవి సమ్మేళనం పాత్ర అపూర్వమన్నారు. జక్కంపూడి విజయలక్ష్మి, విశ్వసాహితి కళావేదిక ఛైర్‌పర్సన్ కొల్లి రమాదేవి, ప్రిన్సిపల్ బి.వి.తిరుపణ్యం, కండెపు సునీత, పి.వి.బి.సంజీవరావు, బేతా శారద, ఎస్.రాజ్‌కుమార్, కె.నీలకంఠేశ్వరరావు మాట్లాడారు.

కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

ఒత్తిడిలేని విద్యను అందించాలి

రాజానగరం, న్యూస్‌టుడే: విద్యార్థులకు చిన్నతనం నుంచే ఒత్తిడిలేని విద్యను అందించాలని చిన్మయమిషన్ ఏలూరుకు చెందిన పూజ్యస్వామిని పూర్వాజనంద సరస్వతి అన్నారు. దివాన్‌చెరువులో డా.కంబంపాటి రామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శ్రీవిశ్వేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. చిన్నతనం నుంచి పిల్లల్లో దేశభక్తి పెంపొందించాలని సరస్వతి తెలిపారు. జిల్లా బౌధిక్‌ప్రముఖ్ రామానుజం మాట్లాడుతూ పంచపరివర్తన ద్వారా సమాజంలో మార్పు సాధించగలమన్నారు. ఎక్కువ స్వదేశీ ఉత్పత్తుల్ని ఉపయోగిస్తూ దేశాభివృద్ధిలో ప్రత్యక్షంగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో భగవద్గీత శ్లోకాల పఠనం, శాస్త్రీయ నృత్యం, తెలుగు సంస్కృతీ కార్యక్రమాలు నిర్వహించారు.

నయన మనోహరం.. హారతి వీక్షణం

సకల కోటి జీవరాశుల దాహార్తిని తీర్చే గోదారమ్మను గౌరవిస్తూ రాజమహేంద్రవరం పుష్కరఘాట్‌లో దేవాదాయశాఖ నిర్వహణలో జరుగుతున్న నిత్య హారతి వేడుక వైభవంగా జరిగింది. ఆదివారం సాయంత్రం వేదపండితులు శాస్త్రోక్తంగా 14 రకాల హారతులను నదీమ తల్లికి భక్తితో సమర్పించారు. సెలవు రోజు కావడంతో నగరవాసులు పెద్ద సంఖ్యలో హాజరై హారతి వీక్షించారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

దశావతార మహోత్సవాలు ప్రారంభం

రంగంపేట : వడిశలేరులో ప్రముఖ ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీజనార్దనస్వామి ఆలయంలో ఆదివారం నుంచి దశావతార మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజున మత్స్యావతారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో రాంబాబురెడ్డితోపాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు స్వామి వారిని దర్శించుకున్నారు.

ఆదివారం ప్రత్యేక తరగతులు

బిక్కవోలు, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాల సాధనకోసం ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. ఆదివారం బిక్కవోలులో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఎంఈవో సత్యనారాయణ పాఠశాలను సందర్శించారు.

బిక్కవోలులో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతి

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, ఉ॥ 10 - మ॥ 1 కడియం: 91212 29062, అనపర్తి: 95333 66637

నీరు రావడం లేదు

సమస్య: హుకుంపేట రావి చెట్టు సెంటర్ మొదటి వీధిలోని వీధి కొళాయి మూడు రోజులుగా పని చేయడం లేదు. వీధి చివర పైపు నీరు వృథాగా పోతుంది. **- నిరంజన్, స్థానికుడు**

సమాధానం: మరమ్మతులు చేయించి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. **- కాశీ, గ్రామకార్యదర్శి, హుకుంపేట**

చెత్తను తొలగించండి.....

మోరంపూడి, న్యూస్‌టుడే: శాటిలైట్ సిటీ బీ బ్లాక్ ప్రధాన రహదారి పక్కన చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి చెత్తను తొలగించాలి. **- భయ్యా శ్రీను, స్థానికుడు.**

పరిష్కారం: పారిశుద్ధ్య కార్మికులను పంపి చర్యలు తీసుకుంటాం **- టి.కృష్ణ, శాటిలైట్ సిటీ పంచాయతీ కార్యదర్శి.**

దీపాలు మరమ్మతులు చేశారు

స్పందనకు వందనం

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలం కుతుకులూరులోని శివాలయం వెనక వీధిలో లైటు వెలగడం లేదంటూ స్థానికులు మేమున్నాం మీకు తోడుగాకు తెలిపారు. ఈ విషయమై కుతుకులూరు గ్రామపంచాయతీ కార్యదర్శి ఫణికుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన తక్షణమే వీధిలైటును మరమ్మతులు చేయించారు.

రుణం అందేనా.. సాగు కష్టాలు తీరేనా..?

అనపర్తి, బిక్కవోలు, న్యూస్‌టుడే: కౌలు రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోంది. వరి పంట విషయంలో భూమిగల రైతుల కన్నా కౌలు రైతులే ఎక్కువగా ఉన్నారు. వారికి రుణం లభించడం కష్టతరంగా మారింది. ప్రైవేటు వ్యాపారులపై ఆధారపడి అధిక వడ్డీకి రుణాలు పొందుతున్నారు. చివరికి పండించిన పంటలో వడ్డీలకే సరిపోతోంది. ఈ విషయాన్ని గమనించిన ప్రభుత్వం కౌలు రైతులకు సొసైటీల ద్వారా రూ. లక్ష వరకు రుణం ఇచ్చే ఏర్పాటు చేసింది.

63,525 మందికి రుణం..

జిల్లాలో సుమారు 1,20,000 మంది కౌలు రైతులు ఉన్నారు. అందులో 1,10,000 మందికి సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని వ్యవసాయ, రెవెన్యూ శాఖలు నిర్ణయించాయి. ఇప్పటి వరకు 63,525 మందికి సీసీఆర్‌సీ కార్డులు ఇచ్చారు. వీరిలో కొందరు వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు పొందినా మరి కొందరికి లభించలేదు. రుణం పొందాలంటే బ్యాంకులు తిరిగి వసూలు కావని భయపడి హామీలు అడగడంతో కొందరు కౌలు దారులకు రుణం లభించట్లేదు. ఈ నేపథ్యంలో సొసైటీల నుంచి కూడా

సీసీఆర్‌సీ కార్డులు పొందిన వారు

మండలం	లక్ష్యం	మంజూరు	లక్ష్యం
అనపర్తి	6,108	3293	53.91
బిక్కవోలు	6,624	2180	32.91
రంగంపేట	6,081	1962	32.26
రాజానగరం	9,845	3183	32.33
కోరుకొండ	9,981	4185	41.93
సీతానగరం	5,994	3858	64.36
కడియం	4,254	3054	71.79
రా.గ్రామీణం	1,701	921	54.14

ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడంతో సొసైటీ సీఈవోలకు జిల్లాలో సమావేశం ఏర్పాటు చేశారు. సాగు విస్తీర్ణం బట్టి రూ.లక్ష వరకు రుణం ఇవ్వనున్నారు.

ఇవీ నిబంధనలు..

● సొసైటీల్లో రుణం పొందాలంటే అందులో సభ్యుడై ఉండాలి. స్థానికంగా నివాసం ఉండాలి. ● కనీసం ఎకరం భూమి సాగులో ఉండాలి. ● రుణం పొందిన కౌలు రైతు ఏడాదిలోగా అసలు, వడ్డీ చెల్లించాలి. ● ఆ ప్రైవేట్ భూముల చేస్తున్న రైతులు కూడా రుణం పొందడానికి అర్హులే. ● రెవెన్యూ శాఖ ఇచ్చే కౌలు హక్కు పత్రం ఉండాలి. వ్యక్తిగతంగా లేదా సంఘంగా రుణం పొందవచ్చు. ● వ్యవసాయశాఖ కౌలు రైతుగా గుర్తించి సీసీఆర్‌సీ కార్డులు పొందిన వారికి రుణం ఇస్తుందని కాకినాడ డీసీసీబీ సీఈవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిబంధనలు అనుసరించి మంజూరు చేస్తారన్నారు.

భౌతికంలో ఉంటూ ఆధ్యాత్మికంగా ఎదగాలి

బిక్కవోలు, న్యూస్‌టుడే: మానవత్వానికి ఉన్న ఏకైక లక్ష్యం భౌతికంలో ఉంటూ ఆధ్యాత్మికంగా ఎదగటమేనని ఆధ్యాత్మిక గురువు వివేకానంద ప్రవచించారు. బలభద్రపురంలో జరుగుతున్న ట్రూత్ వివేకామృత రెండో రోజు కార్యక్రమంలో భక్తులనుద్దేశించి ప్రబోధించారు. ఆది శంకరాచార్యులు ప్రబోధించిన నిర్వాణ షట్కమ్ మానవాళిని జీవన ముక్తి పదంలో నడిపిస్తుందని తెలిపారు. అనంతరం ఆధ్యాత్మిక గురువు వివేకానంద రచించిన 'సుజ్ఞాన సంకీర్తన వేదం భేదం చెప్పలేదురా' అనే జ్ఞానగీతాన్ని భక్తులతో ఆవిష్కరింపచేశారు.

వివేకానంద రచించిన భక్తి గీతాన్ని ఆవిష్కరిస్తున్న శిష్యబృందం

తూకాల్లో మోసాలపై అప్రమత్తం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): తూకాల్లో మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని తూనికొలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ కుమార్ సూచించారు. రాజమహేంద్రవరంలోని వై-జంక్షన్ రైతుబజారులో ఆదివారం వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు వినియోగించే ఎలక్ట్రానిక్ కాటాలను ఆ శాఖ ద్వారా ఏడాదికో సారి సీలింగ్ వేయించుకోవాలన్నారు. తూకం సరిగా ఉందో లేదో తెలుసుకునేందుకు మొబైల్ ఫోన్‌ను కాటాపై ఉంచి బరువు పరిశీలించవచ్చన్నారు. తేడా లుంటే వెంటనే లీగల్ మెటలర్జీ అధికారులు, ఎస్టేట్ అధికారి, లేదా 1967, 1915 నంబర్లకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు, రైతు బజారు ఎస్టేట్ అధికారి శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న తూ.కొ. శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్

ఒత్తిడిలేని విద్యను అందించాలి

రాజానగరం, న్యూస్‌టుడే: విద్యార్థులకు చిన్నతనం నుంచే ఒత్తిడిలేని విద్యను అందించాలని చిన్మయమిషన్ ఏలూరుకు చెందిన పూజ్యస్వామిని పూర్వాజనంద సరస్వతి అన్నారు. దివాన్‌చెరువులో డా.కంబంపాటి రామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శ్రీవిశ్వేశ్వరీదేవి ఆలయ ప్రాంగణంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. చిన్నతనం నుంచి పిల్లల్లో దేశభక్తి పెంపొందించాలని సరస్వతి తెలిపారు. జిల్లా బౌధిక్‌ప్రముఖ్ రామానుజం మాట్లాడుతూ పంచపరివర్తన ద్వారా సమాజంలో మార్పు సాధించగలమన్నారు. ఎక్కువ స్వదేశీ ఉత్పత్తుల్ని ఉపయోగిస్తూ దేశాభివృద్ధిలో ప్రత్యక్షంగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో భగవద్గీత శ్లోకాల పఠనం, శాస్త్రీయ నృత్యం, తెలుగు సంస్కృతీ కార్యక్రమాలు నిర్వహించారు.

స్వామివారి భ్రమణోత్సవం

బిక్కవోలు, న్యూస్‌టుడే: బలభద్రపురంలోని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి భ్రమణోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవార్లను సుందరంగా అలంకరించి ఊయలలో వేసి దేవాలయం చుట్టూ 12సార్లు ప్రదక్షణ చేయించారు. ఇలా దేవాలయం చుట్టూ ప్రదక్షణ చేసే సమయంలో ఊంజల్ సేవ చేసినట్టు తెలిపారు.

గోపాలస్వామి దేవాలయంలో లక్ష తులసిపూజ

బిక్కవోలు : బలభద్రపురంలోని గోపాలస్వామి దేవాలయంలో ఆదివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్వామివారికి ఉదయం అంకురార్పణ, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, తదితర కార్యక్రమాలు చేశారు. అనంతరం లక్ష తులసిపూజ, అమ్మవారికి కుంకుమార్చన, రాత్రికి పూర్ణాహుతితో కార్యక్రమాలు ముగించారు. దేవస్థానం ఈవో భాస్కర్ పర్యవేక్షించారు.

పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాట-36, వంకాయలు నలుపు-18/ గులాబీ-28/తెలుపు-24/ దొమ్మేరు-38, బెండ-44, కాకర-42, బీర పందిరి-46, దొండ-30, క్యారెట్-28, బీట్ రూట్-32, గోరు చిక్కుళ్లు-40, దోస-34, ఆనబకాయ-24/26, చిక్కుళ్లు-30, పచ్చిమిర్చి-40, బంగాళదుంప-20, ఉల్లి-22.

ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

కోరుకొండ, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయికి రాజమహేంద్రవరం విమానాశ్రయంలో నాయకులు స్వాగతం పలికారు. ఆదివారం రాజమహేంద్రవరంలో వాజ్‌పేయి విగ్రహావిష్కరణకు విచ్చేసిన ఆయన ముందుగా విమానాశ్రయానికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి స్వాగతం పలికినవారిలో ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని సత్కరించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రామేశ్వరంపేట నుంచి భారీ ర్యాలీ

రంగంపేట, న్యూస్‌టుడే: మాజీ ప్రధాని దివంగత అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా రాజమహేంద్రవరంలో ఆయన విగ్రహావిష్కరణకు అభిమానులు భారీగా తరలివెళ్లారు. ఆదివారం అనపర్తి నియోజకవర్గంలోని కూటమి శ్రేణులు రంగంపేట మండలం రామేశ్వరంపేట చేరుకున్నాయి. భాజపా అధ్యక్షుడు ఉద్దండ్రావు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అభిమానులు కారు ర్యాలీగా రాజమహేంద్రవరానికి తరలి వెళ్లారు. ర్యాలీలో భాజపా అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు. ఈ ర్యాలీతో ఏడీబీ రోడ్డుపై సందడి నెలకొంది. జిల్లా తెదేపా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవిందు, ఆత్మ కమిటీ ఛైర్మన్ ఎలుబండి సత్తిబాబు, మండల తెదేపా

మంత్రి సత్యకుమార్‌తో నల్లమిల్లి, మాధవ్

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైల్వేస్టేషన్ రోడ్డు, ఆల్కాట్‌గార్డెన్స్, కన్నమ్మతల్లిగుడి వెనుక ప్రాంతం, గోదావరి రోడ్డు, కన్నమాంబ వీధి, పోస్టాఫీసువీధి, ఆశ్రమం వీధి, నారాయణవీధి, శారదవీధి, వేమన వీధి, త్రినాథ్‌వీధి, విజయలక్ష్మీవీధి, గోకుల్‌వీధి ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

యూరియా అందడం లేదంటూ ఆవేదన

కడియం, న్యూస్‌టుడే: కడియం సహకార సంఘం ఆధ్వర్యంలో సరఫరా చేస్తున్న యూరియా రైతులకు అందడం లేదంటూ పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కడియం రైతు సేవా కేంద్రానికి యూరియా కోసం ఆదివారం ఉదయం రైతులంతా తరలివెళ్లారు. అప్పటికే పంపిణీ పూర్తి కావడంతో వారంతా సిబ్బందిపై ఆగ్రహావేశాలు వెళ్లగక్కారు. రైతులు మాట్లాడుతూ ఇప్పటివరకూ సుమారు 70 టన్నుల యూరియా వచ్చిందని, దానిని కొందరికే అధిక బస్తాలు ఇవ్వడంతో సన్నకారు రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు. ప్రస్తుతం యూరియా అవసరం అధికంగా లేకున్నా కొరత ఉందని ప్రచారం చేయడంతో ఇళ్ల వద్ద నిల్వ చేస్తున్నారని అన్నారు. రైతులందరికీ ఎందుకు పంపిణీ చేయడం లేదని సొసైటీ సీఈవో అప్పారావును వారంతా నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ సరఫరాలో వివాదాలకు తావిచ్చిన సిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సూచించారు. బుధవారం నుంచి ఈ-క్రాప్‌లో నమోదైన రైతులకు స్పష్టమైన విధివిధానాలతో యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు.

సొసైటీ సిబ్బందిని నిలదీస్తున్న రైతులు

వైద్యులతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి, చిత్రంలో తెదేపా ఆరోగ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిరామ్‌కిరణ్

గిరిజనులకు ఉచిత వైద్యసేవలు అభినందనీయం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): గిరిజనులకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలందించడం అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలోని గోరంట్ల శాంతారావు(జీఎస్‌ఆర్) ఫౌండేషన్, జీఎస్‌ఎల్ ఆసుపత్రి సంయుక్తంగా రంపచోడవరంలో ఆదివారం ఉదయం మెగా వైద్యశిబిరం నిర్వహించారు. భువనేశ్వరి ముఖ్యఅతిథిగా హాజరై పరిశీలించారు. జీఎస్‌ఆర్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ ఆధ్వర్యంలో వివిధ స్పెషాలిటీ వైద్యులు సేవలందించారు. సుమారు 1,800 మందికి మందులు పంపిణీ చేశారు. 1,000 మందికి పైగా వివిధ రకాల నిర్ధారణ పరీక్షలు చేశారు. 3,500 మందికి భోజనం అందించారు.

ఆరోగ్య జీవనానికి రెండు చుక్కలు

అనపర్తి గ్రామీణం: పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరం పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామసర్పంచి గిరడా గంగాభవాని, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాజానగరం : పోలియో రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. రాజానగరం పీహెచ్‌సీ వద్ద ఆదివారం చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో డా.రామ్ భాస్కర్, ఎన్‌వీవీ రమణ, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రామవరంలో పోలియోచుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కోరుకొండ, సీతానగరం : మండలంలోని కోరుకొండ, కోటికేశవరం, దోసకాయలపల్లి పీహెచ్‌సీల పరిధిలో సీతానగరం సచివాలయం-1లో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

బొమ్మూరు, హుకుంపేట : నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో 0 నుంచి 5 ఏళ్లలోపు ఉన్న 16,964 చిన్నారులకు గాను 16,472 మందికి పోలియో చుక్కలు వేశామని మండల వైద్యాధికారి డా.ఆర్.వి.వి.సత్యనారాయణ ఆదివారం తెలిపారు. సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సమష్టిగా పనిచేసి 97 శాతం కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి వ్యాక్సీన్‌లు వేస్తారన్నారు.

కడియం : కడియం మండలంలో పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణను జోన్-2 వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పద్మా శశిధర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.శ్రీదేవి ఆదివారం ఉదయం పరిశీలించారు. వేమగిరి ఇటుకబట్టీల వద్ద నివాసముంటున్న నిర్వాసితుల వద్దకు వెళ్లి చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలను వేశారు. 6,542 మంది అయిదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయడంతో 91శాతం పూర్తి చేశామన్నారు. అందుకు 35 బూత్‌లను ఏర్పాటు చేసినట్లు సిబ్బంది వివరించారు.

● గ్రామాల్లో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. రెండు చుక్కలతో పోలియో రహిత భారత్‌కు కృషి చేయాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ సూచించారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

'ఛాంపియన్' చిత్రబృందం సందడి

ఏవీఏ రోడ్డు: చరిత్రలో జరిగిన యదార్థ ఘటన ఆధారంగా తెరకెక్కిన 'ఛాంపియన్' చిత్రం ఈనెల 25న క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుందని హీరో రోషన్ వెల్లడించారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఆదివారం హీరో, హీరోయిన్లు రోషన్, అనుస్వరను నగరంలో సందడి చేశారు. ఏవీఏ రోడ్డులోని ప్రసాదిత్య మాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్రీడాంశంతో యాక్షన్, రొమాంటిక్ లవ్‌స్టోరీతో దర్శకుడు ప్రదీప్ ఎంతో హృద్యంగా తీశారన్నారు. అనుస్వరను మట్లాడుతూ తెలుగులో తొలి చిత్రమే వైజయంతి బ్యానర్‌లో నటించడం సంతోషంగా ఉందన్నారు.

బహుమతులు సాధించిన చిన్నారులు

ముగిసిన చదరంగం పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: క్లాసికల్ ఓపెన్ చదరంగం పోటీల్లో షణ్ముఖ్‌సాయిాష్, రామిరెడ్డి, శ్రీనికేష్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. రాజమహేంద్రవరంలోని కాల్‌ఫ్యూజన్ చెస్ అకాడమీలో ఆదివారం అండర్-7, 9, 11, 13, 15తో పాటు ఓపెన్ విభాగాల్లో పోటీలు జరిగాయి. అకాడమీ డైరెక్టర్ కుమార్ విత్తనాల మాట్లాడుతూ రాపిడ్ పోటీలకు భిన్నంగా క్లాసికల్ పోటీలు నిర్వహించటంతో క్రీడాకారులు ఆట తీరును మెరుగుపరుచుకునేందుకు దోహదపడతాయన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

● అండర్-7లో కేతన్‌సాయి శ్రేయాన్స్, ఎస్వీఆర్ గౌతమ్. ● అండర్-9లో మోక్ష సత్య ఆద్య, దేవ హర్షసాయి. ● అండర్-11లో తీగల తన్మయి, సాత్వికవర్మ. ● అండర్-13లో లక్ష్మీసాయి త్రినాథ్, హేమ్‌చంద్. ● అండర్-15లో నాగసాయి ఆశ్లేష విజేతలుగా నిలిచారు.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

వి.ఎల్.పురం : రైలు ఢీకొని గుర్తుతెలియని ఒక వృద్ధురాలు మృతి చెందింది. ఆదివారం ఉదయం 6.15 గంటల సమయంలో కడియం మండలం జేగురుపాడు గ్రామం పాములమిట్ట కాలనీ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. రాజమహేంద్రవరం జీఆర్పీ హెచ్‌సీ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటుంది. ఒంటిపై నీలం రంగుపై గోధుమ, ఆకుపచ్చ, నలుపు, పసుపు రంగుల డిజైన్ చీర, నీలం రంగు జాకెట్టు ధరించి ఉంది. పట్టాలు దాటుతుండగా ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతురాలి వివరాలు తెలిసినవారు 0883-2442821, 94948 19898 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని జీఆర్పీ హెచ్‌సీ కోరారు.

మంత్రిని కలిసిన జీజీహెచ్ సూపరింటెండెంట్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం పర్యటనలో ఉన్న వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆదివారం జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. జీజీహెచ్‌లో కొత్త భవన నిర్మాణాల్లో జాప్యం, విద్యార్థులకు తరగతి గదుల కొరత తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై త్వరలో సమగ్రంగా చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ చంద్రమౌళీ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అంశాలపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో చర్చిస్తున్న సూపరింటెండెంట్

రాష్ట్రస్థాయి పోటీల్లో నగరవాసి విజయం

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: విజయవాడ ఫన్‌టైమ్స్‌క్లబ్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 10 రాష్ట్రస్థాయి మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన వీటీవీ సుబ్బారావు 50 ప్లస్ కేటగిరీలో ఛాంపియన్‌గా నిలిచారు. రెండేళ్లుగా టైటిల్ సాధించడంపై టీటీ సంఘ గౌరవాధ్యక్షులు బి.భాస్కరరామ్, అధ్యక్షులు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ తదితరులు ఆయనను అభినందించారు.

CHANGE OF NAME

I, **KOLLAMSETTI LAKSHMI MAHESWARI,** W/o Kollamsetti Harikrishna, D.No: 6-87/1, Kannapuram, Koyyalagudem Mandalam, W.G.Dt., A.P. I have changed my Name from **LAKSHMI MAHESWARI** (Old Name) to **KOLLAMSETTI LAKSHMI MAHESWARI** (New Name). Henceforth be known as **KOLLAMSETTI LAKSHMI MAHESWARI,** This is for kind information to all concerned.

గ్రంథావిష్కరణ

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆంధ్రీకరించిన శ్రీవాల్మీకి రామాయణ సంగ్రహానికి ఓలేటి వెంకట బంగారేశ్వరశర్మ రాసిన వ్యాఖ్యాన గ్రంథావిష్కరణ సభ గౌతమీ గ్రంథాలయంలో ఆదివారం జరిగింది. చిలకమర్తి ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి పెరుమాళ్ల రఘునాథ్ నిర్వహణలో జరిగిన సభలో సాహితీవేత్త అరిపిరాల నారాయణరావు గ్రంథావిష్కరణ చేశారు. బంగారేశ్వరశర్మ మాట్లాడుతూ చిలకమర్తి రచనకు వ్యాఖ్యానం రాయడం అదృష్టమన్నారు.

విలేజ్ క్రికెట్‌తో యువ ఆటగాళ్లకు ప్రోత్సాహం....

కొంతమూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లోని యువతను మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కెసిసి, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విలేజ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం కొంతమూరు గ్రామంలో నిర్వహించినట్లు గ్రామ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పామర్తి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా టోర్నమెంట్‌ను నిర్వహించామన్నారు. విన్నర్స్, రన్నర్స్‌కు బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రాజు, శంకర్, కెసిసి క్రికెట్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్‌లో పాల్గొన్న యువకులు

కెనాల్‌రోడ్డుకు ఎట్టకేలకు నిధులు విడుదల

బిక్కవోలు, న్యూస్‌టుడే: కెనాల్ రోడ్డు పేరు చెబితేనే ప్రయాణికులు హడలిపోతున్నారు. దశాబ్దాల నుంచి సరైన అభివృద్ధికి నోచుకోలేదు. తాత్కాలిక మరమ్మతులతోనే గడిచిపోతోంది. కనీసం సామర్లకోట నుంచి వేమగిరి వరకు ఒకసారి పూర్తిగా రోడ్డు వేస్తే 5 సంవత్సరాల పాటు ఉంటుందని ప్రయాణికులు ఆశించినా వారి ఆశలు నెరవేరటం లేదు. 12 కి.మీ పొడవు ఉన్న ఈరోడ్డుకు ఏడు కి.మీ మేర పనులకు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కృషితో రూ.4.5 కోట్లు మంజూరైంది. గోతులు పూడ్చటం కాకుండా మొత్తం రోడ్డు వేస్తారు. ఏడు కిలో మీటర్లు బిక్కవోలు నుంచి బలభద్రపురం వైపు 4 కి.మీ, అనపర్తి నుంచి లక్ష్మీనరసాపురం వైపు 3 కి.మీ రోడ్డు అభివృద్ధి చేయనున్నారు. మిగిలిన 5 కి.మీరోడ్డుకు ప్రతిపాదనలు పంపామని రోడ్లు భవనాల శాఖ ఏఈ రాంబాబు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అనపర్తి వద్ద పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

బలభద్రపురం వద్ద అధ్వానంగా ఉన్న కెనాల్‌రోడ్డు

(c) eenadu

ప్లాంటును ప్రారంభిస్తున్న జడ్పీ మాజీ ఛైర్మన్ బాపిరాజు

తాగునీటి ప్లాంట్ ప్రారంభం

నల్లజర్ల, న్యూస్‌టుడే: మండలంలోని సింగరాజుపాలెంలో గ్రామస్థుల దాహార్తిని తీర్చేందుకు కొరాడ వీరవెంకట సత్యనారాయణచౌదరి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు కూలింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆదివారం ఈ ప్లాంట్‌ను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జడ్పీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు ప్రారంభించారు. తెదేపా మండల శాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

దేవరపల్లి: ఆర్డీఎస్‌ఎస్ పనుల నిమిత్తం యర్నగూడెం ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ ఏజీఎల్ ఫీడర్‌లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. వ్యవసాయ విద్యుత్తు ఉదయం 4 నుంచి 9 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందన్నారు.

చాగల్లు పరిధిలో రేపు

చాగల్లు: లైన్ మరమ్మతుల కారణంగా ఈ నెల 23న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చాగల్లు, నెలటూరు, మీనానగరం గ్రామాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎన్.నారాయణఅప్పారావు తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 4 నుంచి 9 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు.

చిన్నారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

నృత్య కళా ప్రాభవానికి సహకరిస్తా

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పురాణ ప్రాశస్త్యమైన కొవ్వూరు కళలకూ నిలయమని, నృత్య కళ ప్రాభవాన్ని పెంచేందుకు సహకరిస్తానని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలోని ధారణ సరస్వతి ఆర్ట్స్ అకాడమీ 5వ వార్షికోత్సవాన్ని స్థానిక జీఎస్ రావు కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. చిన్నారుల కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన, సంగీత కచేరీ ఆకట్టుకున్నాయి. ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. అకాడమీ నిర్వాహకులు సునీతదేవి, ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, పురపాలక మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, పట్టణ సీఐ పి.విశ్వం తదితరులు పాల్గొన్నారు.

● రాజ్యసభ మాజీ సభ్యుడు కంభంపాటి రామ్మోహనరావు తన తల్లి వెంకట నరసమ్మ అస్థికలను కలిపే క్రతువు కోసం ఆదివారం కొవ్వూరు గోష్పద క్షేత్రానికి వచ్చారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు తెదేపా నాయకులతో కలిసి రామ్మోహనరావును పరామర్శించారు.

పుష్కర క్రతువు.. పుష్కల ప్రణాళిక

న్యూస్‌టుడే – కొవ్వూరు పట్టణం

కార్యాచరణకు రూ.450.70 కోట్లతో ప్రతిపాదనలు

పవిత్ర గోదావరి నదికి కొవ్వూరు మహా పుష్కరోత్సవాలను జరిపించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. 2027 జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు పుష్కరాలు నిర్వహించనున్నారు. కొవ్వూరు పట్టణంలో యాత్రికులకు సౌకర్యాల కల్పన, అభివృద్ధి పనులకు రూ.450.70 కోట్లతో చేసిన ప్రతిపాదనలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. కొవ్వూరు గోష్పద క్షేత్రంతోపాటు పట్టణ పరిధిలోని వచ్చే అన్ని ఘాట్లలో కలిపి 1.50 కోట్ల మంది భక్తులు, యాత్రికులు పుణ్యస్నానాలు చేయనున్నట్లు వస్తారని అంచనా వేశారు.

చేపట్టనున్న పనులివీ..

● పట్టణంలో 69 కిలోమీటర్ల మేర 77 రహదారులను రూ.134 కోట్లతో నిర్మిస్తారు. మరమ్మతులకు రూ.29 కోట్లు, మధ్యస్థ విభాజకాలు, ఫుట్‌పాత్‌ల ఆధునికీకరణకు రూ.5 కోట్లు, ప్రధాన కూడళ్లను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు రూ.5 కోట్లు, ప్రధాన ప్రాంతాల్లో సూచిక బోర్డులు, పార్కింగ్ ప్రదేశాల్లో వసతుల ఏర్పాటుకు రూ.6.50 కోట్లు, డ్రెయిన్ల నిర్మాణం, సీసీ, ఆర్‌సీసీ కాలువలు 64 కిలోమీటర్ల మేర 36 పనులు చేపట్టేందుకు రూ.61 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. ● తాగునీటి పథకాల సంబంధించిన భవనాల నిర్మాణం, పైపులైన్ల ఆధునికీకరణ పనులకు రూ.47 కోట్లు, విద్యుద్దీపాల ఏర్పాటు, గోదావరి సుందరీకరణ గట్టు పొడవునా తాత్కాలిక దీపాలకు రూ.20 కోట్లు, బోలోగేటు కాదని నుంచి ఆలకిరేవుల రోడ్డులో గామన్ వంతెన (కిండిగాం) వరకు సుందరీకరణ గట్టు నిర్మాణం, రాళ్ల అమరిక, విద్యుద్దీపాలు, పచ్చదనం వంటి పనులకు రూ.10 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేశారు. సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, ఉద్యానాలు, తాత్కాలిక మరుగుదొడ్లు, స్నానాల గదులు, దుస్తులు మార్చుకునే గదుల కోసం రూ.21.80 కోట్లు, ● పట్టణంలోని తొమ్మిది సచివాలయాల్లో అభివృద్ధి పనులు, సదుపాయాల కల్పనకు రూ.70 లక్షలు కేటాయించారు. పురపాలక సంఘ భవనం ఆధునికీకరణ, పైలింగ్ స్థలంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటుకు రూ.2.5 కోట్లు, సీసీ టీవీలు, కెమెరాలు, స్మార్ట్ పోల్స్, ఎల్‌ఈడీ తెరల ఏర్పాటుకు రూ.12 కోట్లు అవసరమని అంచనా వేశారు.

పుష్కర నగర్ కోసం రూ. 15 కోట్లు..

అధిక సంఖ్యలో వచ్చే యాత్రికులకు పుష్కర నగర్ ఏర్పాటు, సదుపాయాల కల్పన, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు రూ.15 కోట్లు, భక్తులు వేచి ఉండేందుకు షామియానాలు, టేబుళ్లు, పిండ ప్రదానం షెడ్ల నిర్మాణం, సౌకర్యాలకు రూ.2.20 కోట్లు, తాగునీటి సరఫరాకు, పారిశుద్ధ్య నిర్వహణకు వాహనాల ఏర్పాటుకు రూ.2 కోట్లు, ఘాట్‌ల ఆధునికీకరణ, ఇతర కోసం రూ.12 కోట్లు, పట్టణంలోకి ప్రవేశించే చోట ఆకట్టుకునేలా మహాద్వారాల ఏర్పాటుకు రూ.9 కోట్లు కావాలని కేటాయించారు. ● కాలువలపై సిమెంట్ బల్లలు, తంపర స్నానాలు, జేసీబీలు, ట్రాక్టర్లు, ఫాగింగ్ యంత్రాలు, దోమల నివారణ మందులు, రసాయనాలకు రూ.8 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. ● విద్యుత్తు, నీటి సరఫరా వంటి ఇతర శాఖలు చేపట్టే పనులకు పురపాలక సంఘం తరపున చేయాల్సిన పనులకు రూ.6 కోట్లు, బారికేడింగ్ పనులు, అనుబంధ పనులకు రూ.6 కోట్లు, ● సమగ్ర పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా ముగ్గు, బ్లీచింగ్ నిల్వలు, అదనపు కార్మికులు, శుభ్రత పనులకు రూ.40 కోట్లతో ప్రతిపాదనలు తయారుచేశారు.

కొవ్వూరులో గోష్పద క్షేత్రం

కార్యక్రమ విజయవంతంపై దుర్గేష్ కృతజ్ఞతలు

నిడదవోలు, న్యూస్‌టుడే: పెరవలిలో అమరజీవి జలధార వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు శంకుస్థాపన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రభుత్వ యంత్రాంగం, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులకు, కూటమి నాయకులు, కార్యకర్తలకు మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. అందరి ప్రోత్సాహం కూటమి ప్రభుత్వంపై ఎల్లవేళలా ఇలాగే ఉండాలని ఆకాంక్షించారు.

క్షతగాత్రుడికి మంత్రి పరామర్శ..: పెరవలిలో శనివారం జరిగిన అమరజీవి జలధార కార్యక్రమం ముగిసిన అనంతరం ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళ్తుండగా జరిగిన రహదారి ప్రమాదంలో గాయపడిన పట్టణంలో 27వ వార్డుకు చెందిన డి.నరేష్‌ను మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

గాయపడిన నరేష్‌ను పరామర్శిస్తున్న మంత్రి దుర్గేష్

ర్యాంపుల వద్ద సమస్యలు పరిష్కరించాలి..: ఇసుక ర్యాంపుల వద్ద కొన్ని లారీలకు బిల్లులు ఇవ్వకపోవడంతో నష్టపోతున్నామని ఆదివారం విజ్జేశ్వరం వద్ద మంత్రి కందుల దుర్గేష్‌కు లారీ యజమానులు తెలియజేశారు. బిల్లులు లేకుండా ఇసుక రవాణా చేస్తే అధికారులు జరిమానాలు విధిస్తున్నారన్నారు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని మంత్రి అన్నారు.

ఘనంగా హిందూ సమ్మేళనం

సమ్మేళనానికి హాజరైన ఆరెస్సెస్ ప్రముఖులు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆరెస్సెస్) ఆధ్వర్యంలో ఆదివారం కొవ్వూరు ఖండ పరిధిలోని పంగిడిలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. రామాలయం శోభాయాత్ర అనంతరం సంఘ సమావేశం నిర్వహించారు. డాక్టర్ వీరవల్లి రామ్మోహనరావు అధ్యక్షత వహించగా సిద్ధానందస్వామి (అమరావతి) సంఘ స్థాపన, సనాతన ధర్మం, హిందూ సమ్మేళన ఆవశ్యకతను వివరించారు. సహ కార్యవాహ గెడ్డం రాంబాబు, తీగల త్రిమూర్తులు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కృష్ణానందగిరి స్వామి, నాగలక్ష్మీమాత, అచల దాసనాయిక ప్రసంగించారు. ఖండ కార్యవాహ గోవర్ధనం శ్రీనివాసమూర్తి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

తాళ్లపూడి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం శతజయంతి పురస్కరించుకొనిస్థానిక సూర్య పబ్లిక్ పాఠశాలలో గోదావరి విభాగ్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. కాకినాడ శ్రీపీఠం ఆధ్యాత్మిక ప్రవచనకర్త రామచంద్ర శేఖరస్వామిజీ పాల్గొని సందేశమిచ్చారు. ప్రాంత కళాశాలల విద్యార్థి ప్రముఖ్ అశోక్, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు బొర్రా శ్రీరామ్మూర్తి, అడ్డా మోహన్, చిలకమర్తి శేషగిరి శర్మ, ఆధ్యాత్మిక ప్రముఖ్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

పాశుర పఠనంతో ధనుర్మాస వ్రతం

గోపాలస్వామి ఆలయంలో సామూహిక పూజల్లో భక్తులు

కొవ్వూరు పట్టణం: శ్రీకృష్ణుడిని ప్రార్థిస్తూ పాశుర పఠనంతో శ్రీరుక్మిణి, సత్యభామ, గోదాదేవి సమేత వరద గోపాలస్వామి ఆలయ ప్రాంగణం మార్మోగింది. ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా ఆదివారం కొవ్వూరు ఆర్యవైశ్య సంఘ సభ్యులు సామూహిక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అర్చకులు గోవర్ధనం శ్రీనివాసమూర్తి, అనంతగోపాల్ యాజ్ఞికంలో సుప్రభాత సేవ, ప్రత్యేక అభిషేకం, కాత్యాయనీ వ్రతం, తిరుప్పావై పాశుర, అచ్యుతాష్టక పఠనం, గోపికా గీతాలాపన, అనంతరం స్వామి వార్కి తులసిధాత్రి చేశారు. ఆర్యవైశ్య మహిళలు విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. సభ్యుల సౌజన్యంతో అయిదు రకాల ప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

తాడిపర్రులో నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

ఉండ్రాజవరం: ధనుర్మాసం పురస్కరించుకుని ఆదివారం వేకువజామున తాడిపర్రులో భక్తులు నగర సంకీర్తన చేశారు. అనంతరం ఆలయాల్లో పూజలు చేశారు. ధనుర్మాసం అంతా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని వీరన్నస్వామి తెలిపారు.

పెరవలి: ముక్కామల, పెరవలిలోని కేశవస్వామి, కానూరులోని వల్లభస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తెల్లవారుజామున అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

బెల్టులు, ప్రశంసాపత్రాలు పొందిన విద్యార్థులు

కరాటేతో ఆరోగ్య జీవనం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: యుద్ధ విద్య కరాటేలో ప్రావీణ్యం సాధించే చిన్నారులు ఆరోగ్యకర భవితను సొంతం చేసుకుంటారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరుకు చెందిన అచీవర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ సామర్థ్య పోటీలను ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని లిటరరీ క్లబ్ ఆవరణలో జరిగిన ఈ పోటీలకు కొవ్వూరు, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొని విన్యాసాలు ప్రదర్శించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు అందజేత

నిడదవోలు, న్యూస్‌టుడే: పురపాలక సంఘ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. లయన్స్ జిల్లా సేవా కోఆర్డినేటర్ రంగా వెంకటేశ్వరరావు ఆర్థికసాయంతో రంగా సుబ్బారావు, సత్యవతి జ్ఞాపకార్థం పురపాలక సంఘంలో 120 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం రూ.55 వేల విలువైన డ్రైఫ్రూట్స్, దుప్పట్లు, చలికోట్లు అందించారు. కొత్తపల్లి శ్రీరాములు కనకమ్మ లయన్స్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ తోట కృష్ణవేణి, లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్, క్లబ్ అధ్యక్షుడు కరుటూరి చౌదరి, కార్యదర్శి గారపాటి మోహన్, దాత రంగా వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గేట్‌వాల్వ్ లీకేజీతో శుద్ధజలం వృథా

తాళ్లపూడి నుంచి వేగేశ్వరపురం వెళ్లే ప్రధాన కాలువ వద్ద గేట్‌వాల్వ్ నుంచి శుద్ధిచేసిన గోదావరి నీరు వృథాగా పోతోంది. గేట్‌వాల్వ్ వద్ద నీరు పొంగిపొర్లుతూ సమీపంలోని కాలువలోకి, రహదారిపైకి చేరుతోంది. లీకేజీ కారణంగా శివారు ప్రాంతానికి సక్రమంగా తాగునీరు సరఫరా కావడం లేదని అంటున్నారు. లీకును సరిచేసి నీటి వృథాను అరికడతామని జాతీయ గ్రామీణ తాగునీటి పథకం సిబ్బంది తెలిపారు. - న్యూస్‌టుడే, తాళ్లపూడి

రోడ్డు పక్కన పొంచి ఉన్న ప్రమాదం

ఉండ్రాజవరం మండలంలోని మోర్త-పెరవలి రహదారిలో కల్వర్టు వద్ద మార్జిన్ కోతకు గురై గుంతలా మారింది. వాహనాలు పక్కకు వెళితే అందులోపడి అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రాత్రి వేళలో మరీ ఇబ్బందిగా ఉంటోందని, అధికారులు పట్టించుకోవడం లేదని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు స్పందించి ప్రమాద సూచికగా గుంతలో కర్రలు పెట్టి, తెల్లటి వస్త్రం కట్టారు. ఈ అంశాన్ని ర.భ.శాఖ ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా కోతకు గురైన చోట మరమ్మతులు చేపడతామన్నారు. – న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

ఎప్పుడు పూర్తి చేస్తారో?

గోపాలపురం మండలం వాదాలకుంటలో స్వయం సహాయక సంఘ సభ్యులు సమావేశాలు నిర్వహించేందుకు గతంలో రూ. 30 లక్షల వ్యయంతో మహిళా సమాఖ్య భవన నిర్మాణం చేపట్టారు. నిధుల లేమితో నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. భవనం అందుబాటులోకి రాకపోవడంతో మహిళలు ఇబ్బంది పడుతుఅన్నరు. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టి పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గోపాలపురం

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ధ్యానం చేస్తున్న విభిన్న ప్రతిభావంతులు

నిడదవోలు: ధ్యానంతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని యోగా గురువు సానెపు వెంకటసుబ్బారావు అన్నారు. అంతర్జాతీయ మెడిటేషన్ డే సందర్భంగా శంకరాపురంలోని హృదయాలయ దివ్యాంగుల పాఠశాలలో ఆదివారం ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు డాక్టర్ డి.గణేష్, బలగం విశాలక్షి తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో సీపీఎం నిరసన

నిడదవోలు, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సమిశ్రగూడెం అరుంధతీపేటలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకుడు జువ్వల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

గోపాలపురం, కొవ్వూరు పట్టణం, నిడదవోలు, దేవరపల్లి, ఉండ్రాజవరం: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించారు. పలు ఆసుపత్రుల్లో రోగులకు, వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం, పండ్లు, రొట్టెలు పంచారు. గోపాలపురంలో మాజీ హోంమంత్రి తానేటి వనిత, కొవ్వూరులో నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలారి వెంకట్రావు, నిడదవోలులో మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కేక్‌లు కోసి పంచారు. దేవరపల్లి, ఉండ్రాజవరంలో నిర్వహించిన కార్యక్రమాల్లో వైపాకా నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శనలు

ఉండ్రాజవరం: క్రిస్మస్ వేడుకను వెలగదుర్రులో బైబిలు మిషన్ చర్చి వద్ద ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన నాటికలు, నృత్యం, గానాలాపనలు ఆకట్టుకున్నాయి. సంఘకాపరి దాసరి జాన్ మోజెస్ దైవసందేశమిచ్చారు.

రామానుజన్ ప్రతిభ పరీక్షలు

నల్లజర్ల: స్థానిక ఏకేఆర్జీ విద్యా సంస్థలో ఆదివారం రామానుజన్ ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు నగదు, హాజరైన విద్యార్థులందరికీ ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు విద్యా సంస్థల ఛైర్మన్ చావా గోకుల్ తెలిపారు. కరస్పాండెంట్ వడ్లమూడి రామారావు, ప్రిన్సిపల్ టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఛైర్‌పర్సన్ రత్నకుమారి

వేలివెన్నులో బూరుగుపల్లి శేషారావు..

నిడదవోలులో పురపాలక కమిషనర్ కృష్ణవేణి, ఛైర్మన్ ఆదినారాయణ

చిన్నారుల ఆరోగ్య జీవితానికి దివ్యౌషధం

దేవరపల్లిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ దుర్గారావు

కొవ్వూరు పట్టణం, చాగల్లు, నిడదవోలు, గోపాలపురం, ఉండ్రాజవరం, నల్లజర్ల, తాళ్లపూడి, పెరవలి, దేవరపల్లి, న్యూస్‌టుడే: చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు దివ్యౌషధంగా పనిచేస్తాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. నిడదవోలు 4వ వార్డు పరిధి క్రిస్టియన్‌పేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు. పలు కేంద్రాలను ఆర్డీవో రాణి సుస్మిత సందర్శించారు. * చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీలో చిన్నారులకు ఎమ్మెల్యే ముప్పిడి పోలియో చుక్కలు వేశారు. చాగల్లు ఆరోగ్య కేంద్రంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఇంక్యుబేటర్ ఛాంబర్‌ను ఆయన ప్రారంభించారు. ● నిడదవోలు పురపాలక సంఘ కార్యాలయం వద్ద ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ తోట కృష్ణవేణిలు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో చిన్నారులకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు పోలియో చుక్కలు వేశారు. ● గోపాలపురం, నల్లజర్ల, తాళ్లపూడి, పెరవలి, దేవరపల్లి పీహెచ్‌సీల పరిధుల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

వైకాపా నుంచి తెదేపాలో చేరిక

గోపాలపురం, న్యూస్‌టుడే: తొక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన వైకాపా నాయకులు సత్తెనపల్లి మునియ్య, సత్తెనపల్లి వెంకయ్య ఆ పార్టీకి రాజీనామా చేసి తెదేపాలో చేరారు. వీరికి మండల తెదేపా ఉపాధ్యక్షుడు కాట్రగడ్డ సురేష్, సొసైటీ అధ్యక్షుడు వడ్లమూడి రమేష్‌బాబు, జ్యేష్ఠ శ్రీధర్ ఆధ్వర్యంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

'విద్యారంగంలో ప్రైవేటు విధానాలను తిప్పికొడతాం'

తాళ్లపూడి, న్యూస్‌టుడే: విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటు విధానాలను తిప్పికొట్టాలని ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. ఆదివారం బల్లిపాడులోని కల్యాణ మండపంలో జిల్లా యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు జయకర్, ప్రధాన కార్యదర్శి ఎ.షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి పాల్గొన్నారు.

వాజ్‌పేయీ విగ్రహావిష్కరణకు తరలిన నాయకులు

ఉండ్రాజవరం: రాజమహేంద్రవరంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహావిష్కరణకు ఆదివారం ఉండ్రాజవరం మండలం నుంచి భాజపా, తెదేపా నాయకులు పెద్దఎత్తున తరలివెళ్లారు. భాజపా మండలశాఖ అధ్యక్షుడు కొప్పినీటి సత్యనారాయణ, జిల్లా నాయకులు అక్కిన గోపాలకృష్ణ, బూరుగుపల్లి వెంకటేశ్వర్లు, ఆకెళ్ల శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ. 3.24 కోట్లతో రహదారి నిర్మాణం పూర్తి

ఉండ్రాజవరం: మండలంలో రూ. 3.24 కోట్ల వ్యయంతో చేపట్టిన వడ్లూరు-తీపర్రు రహదారి నిర్మాణం పూర్తయింది. మంత్రి కందుల దుర్గేష్, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు కృషితో నిధులు మంజూరుకాగా సుమారు 10 కిలోమీటర్ల మేర తారురోడ్డు వేశారు. ఉండ్రాజవరం, తాడిపర్రు గ్రామాల పరిధిలో అర కిలోమీటరు చొప్పున సిమెంటు రహదారి నిర్మించినట్లు ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసు తెలిపారు.

పుల్లయ్య మాస్టారు మృతి

కొవ్వూరు పట్టణం: రాజమహేంద్రవరం రైల్వే పాఠశాల విశ్రాంత ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీరాముల పుల్లయ్య (91) ఆదివారం మృతిచెందారు. ఔరంగాబాదుకు చెందిన ఆయన పుల్లయ్య మాస్టారుగా సుపరిచితులు. మూడు దశాబ్దాలుగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ దళితుల సంక్షేమానికి కృషి చేశారు. 2007 జనవరిలో అప్పటి లోక్‌సభ స్పీకరు మీరాకుమార్ ఇక్కడికి పర్యటనకు వచ్చినపుడు ఆమె ప్రసంగాలను పుల్లయ్య తెలుగులోకి అనువదించారు. ఆయన మృతికి పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

రేషన్ సరకుల పంపిణీలో పారదర్శకత

• అభిప్రాయాలు తెలిపేందుకు క్యూఆర్ కోడ్ విధానం

న్యూస్‌టుడే, గోపాలపురం

ప్రతినెలా ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఏ సమయంలోనైనా రేషన్ సరకులు తీసుకునేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు వారి ఇళ్లకే డీలర్ల ద్వారా సరకులు పంపిణీ చేయిస్తోంది. కార్డుదారులు నేరుగా తమ అభిప్రాయాలు తెలియజేసేలా క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి స్మార్ట్ కార్డులను అందజేసింది. తాజాగా అన్ని చౌక దుకాణాల వద్ద ధరలు, క్యూఆర్ కోడ్‌తో కూడిన బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు.

కొవ్వూరు డివిజన్ పరిధిలో..

చౌక దుకాణాలు	: 381
రేషన్ కార్డులు	: 2,24,876

ఐదు అంశాలపై..: క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే షాప్ ఫీడ్‌బ్యాక్ పేజీ తెరచుకుంటుంది. కార్డుదారుకు సంబంధించిన రేషన్ దుకాణం సంఖ్య నమోదు చేసిన తరువాత అయిదు ప్రశ్నలు కనిపిస్తాయి. మీరు ఈ నెల సరకులు తీసుకున్నారా? నాణ్యతపై సంతృప్తిగా ఉన్నారా? డీలరు మీతో మర్యాదపూర్వకంగా వ్యవహరించారా? సరకుల ధర కన్నా ఎక్కువ డబ్బులు తీసుకున్నారా? డీలరు సరైన తూకంతో సరకులు సరఫరా చేశారా? అనే ప్రశ్నలకు అవును లేదా కాదు అని సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇది పూర్తయ్యాక చరవాణికి వచ్చే ఓటీపీ నమోదు చేస్తే, మన అభిప్రాయాలు ప్రభుత్వ వెబ్‌సైట్‌కు చేరతాయి. ఇలా కార్డుదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల ఆధారంగా పౌర సరఫరాల శాఖ , రెవెన్యూ అధికారులు తదుపరి అవసరమైన చర్యలు తీసుకుంటారు.

అవగాహన అవసరం..: రేషన్ సరకులు తీసుకోవడంలో ఇబ్బందులపై క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియజేయవచ్చు. దీనిపై డీలర్ల ద్వారా కార్డుదారులకు అవగాహన కల్పిస్తున్నాం. - **దివాకర్, డిప్యూటీ తహసీల్దార్, పౌరసరఫరాల సంస్థ, గోపాలపురం**

ఈనాడు కర్ణాటక
సోమవారం డిసెంబరు 22, 2025 5

అతివల క్రిస్మస్ ర్యాలీ

రహదారుల్లో కొనసాగిన బైక్ ర్యాలీ

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే: ప్రత్యేక సామర్థ్యం కలిగిన బాలల కోసం ఆదివారం నగరంలో మహిళలు క్రిస్మస్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి రేషన్ రూమ్, షీ ఫర్ సొసైటీ నేతృత్వం వహించింది. ఆర్‌టీనగర హెచ్.ఎం.టి మైదానం నుంచి రెండు వందల మంది మహిళలు శాంత క్లాజ్ దుస్తులు ధరించి ద్విచక్రవాహనాల్లో బయలుదేరారు. ఆర్‌టీనగర నుంచి మేక్రి కూడలి, జయమహల్ ప్యాలెస్ రహదారి, టీవీ టవర్ వరకు ఆరు కిలోమీటర్ల వాహనాలను నడిపారు. నవచేతన ట్రస్టు బాలల కోసం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు షీ ఫర్ సొసైటీ నిర్వహకురాలు హర్షిణి వెంకటేశ్ తెలిపారు.

ఉద్యమ పిడికిలి

ప్రజా సమస్యలపై సీపీఎం కార్యకర్తలు ఆదివారం స్వాతంత్య్ర ఉద్యానవనంలో ఉద్యమించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా నినదిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు. - న్యూస్‌టుడే, బెంగళూరు

చిక్కోడి జిల్లా వర్గీకరణకు కసరత్తు

ఈనాడు, బెంగళూరు: బెంగళూరు తర్వాత అత్యధిక జనసంఖ్య కలిగిన (2025 మెట్రోమ్యాటర్ లెక్కల ప్రకారం) బెళగావి జిల్లా విభజనకు కసరత్తు జోరుగా సాగుతోందని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి హెచ్.కె.పాటిల్ తెలిపారు. ప్రస్తుతం ఈ జిల్లాలో 19 తాలూకాలుండగా, జనసంఖ్య 10 లక్షలకు పైమాటే. రాష్ట్రంలో సగటున ఒక జిల్లా జనసంఖ్య 3 లక్షలు కాగా బెళగావిలో ఈ సగటు మూడు రెట్లు దాటింది. పైగా గ్రామాల నుంచి పట్టణాలకు చేరేవారి సంఖ్య పెరగటం, జిల్లా, తాలూకా యంత్రాగానికి పాలన భారం పెరగటంతో ఈ జిల్లాను విభజించే ఏర్పాట్లు సాగుతున్నట్లు మంత్రి ఆదివారం వెల్లడించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఇప్పటికే చిక్కోడి, బెళగావి, గోకాక్ ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగంతో పలు మార్లు చర్చలు జరిపారు. చిక్కోడిని ప్రత్యేక జిల్లాగా విభజించేందుకు ఎంతో సమయం పట్టదని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల ముగిసిన బెళగావి సమావేశాల్లోనే ఈమేరకు ప్రకటన చేయాల్సి ఉన్నా కొన్ని సాంకేతిక కారణాలతో ఆగిపోయినట్లు తెలిపారు. చిక్కోడిలో వందల ఏళ్ల న్యాయస్థానం కొత్త కట్టడాన్ని మంత్రి ప్రారంభించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు చిక్కోడి న్యాయస్థానం అందించిన సేవలను ఈ సందర్భంగా మంత్రి హెచ్.కె.పాటిల్ గుర్తు చేసుకున్నారు.

అయినా.. హస్తినలో తేల్చాల్సిందే

- నేడో, రేపో అగ్రనేతల నుంచి సీఎం, డీసీఎంలకు పిలుపు
- రసకందాయంలో కన్నడ రాజకీయం

ఇక ఆలస్యం చేస్తే మనకే నష్టం - దీర్ఘాలోచనలో అధిష్ఠానం

ఈనాడు, బెంగళూరు: అధికార కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పు కోసం ఎత్తుకు పైఎత్తులు, బ్రేక్‌ఫాస్ట్, డిన్నర్ సమావేశాలు, విధానసభలో బహిరంగ ప్రకటనలు, నేతల రహస్య మంతనాలు, మద్దతుదారుల విసురుకున్న వాగ్బాణాలన్నీ రాష్ట్ర ప్రజలు చూశారు. ఈలోగా అటు దిల్లీలో, బెళగావిలో శీతాకాల సమావేశాలు కూడా ముగిశాయి. ఇక చేయాల్సిందల్లా అధిష్ఠానం ఓ నిర్ణయం తీసుకోవటం. ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రభుత్వ మనుగడకే ముప్పొస్తుందన్న హెచ్చరికలు ఎదురవటంతో దిల్లీ పెద్దలు రాష్ట్ర రాజకీయాలపై దృష్టి సారించే సమయం ఆసన్నమైంది.

డీకే రాజకీయ 'మంత్రం'

ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పోలిస్తే ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పీఠం కోసం కాస్త ఎక్కువగానే యత్నిస్తున్నారని తెలుస్తోంది. దేవాలయాల సందర్శన, ఇష్టదైవాల ప్రాంగణాల్లో కార్యసిద్ధి పూజలు, హిమగిరుల నుంచి నాగాల ఆహ్వానం, వారితో అలుపెరగక ఆశీర్వచనాలు అందుకుంటూ పీఠం కోసం అన్ని వైపులా ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యక్తిగతంగా ఆధ్యాత్మిక చింతన కాస్త ఎక్కువగానే ఉన్న డీసీఎం.. లౌకిక, ప్రగతిశీల భావజాలం అణువణువున్నా నింపుకొన్న ముఖ్యమంత్రితో శీతల సమరాన్ని సాగిస్తున్నారు. సమావేశాల్లో తానే సీఎం అంటూ ఘంటాపథంగా ప్రకటించిన సిద్ధరామయ్య.. అసలు రెండున్నరేళ్ల ఒప్పందమే మా మధ్యలేదని చెప్పి డీకే శిబిరంలో అలజడి రేపుతున్నారు. సభలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు బదులివ్వని డీసీఎం దేవస్థానాలు, నాగాల సమక్షంలో 'ఆ' ఒప్పందం ఉందని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక మంత్రాలతో పాటు రాజకీయ తంత్రాన్నీ జోరుగా అమలు చేస్తున్న డీకే తన అనుచర గణంతో సిద్ధు శిబిరానికి దీటుగా బదులిస్తున్నారు. సిద్ధరామయ్యకు ఆప్తులైన సతీశ్‌జార్కిహోళి, జమీర్ అహ్మద్, కేజే జార్జ్..లతో పాటు తనపై నిత్యం విరుచుకుపడే మాజీ మంత్రి కె.రాజణ్ణతోనూ చర్చించి తన వ్యూహమేమిటో చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.



నాగాల ఆశీర్వాదంతో పీఠం దక్కేనా?

అవకాశాలకు గండి

మరోవైపు తన ప్రయత్నాలను అలుపెరగక కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తాను కొనసాగకున్నా తర్వాతి అవకాశం డీకేకు దక్కకుండా చూస్తున్నారు. ఇందు కోసం అహింద అస్త్రాలకు పదును పెడుతున్నారు. బెళగావిలో అహింద, ఎస్టీ నేతలతో విందు సమావేశాలతో ప్రత్యర్థి శిబిరాలకు సందేశాలిచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అనివార్యంగా తాను వైదొలగాల్సి వస్తే దళిత నేతలకు అవకాశాలిచ్చేలా డా.జి.పరమేశ్వర్‌తో చర్చలు కొనసాగిస్తున్నారు. సుదీర్ఘకాలంగా పీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన పరమేశ్వర్ అంటే సోనియాగాంధీ సైతం సానుకూలంగా ఉండటం గమనార్హం. త్వరలో బెంగళూరులో అహింద సమావేశం నిర్వహించాలని సిద్ధు శిబిరం కసరత్తు చేస్తోంది. డీకేకు అవకాశం ఇస్తే ఉత్తర కర్ణాటకలో కనీసం 30 మంది ఎమ్మెల్యేలు భాజపాకు చేరే అవకాశం ఉందని సిద్ధు మద్దతుదారులు అధిష్ఠానానికి లేఖలు రాసి అప్రమత్తం చేస్తున్నారు.

దళిత సీఎం అస్త్రాన్ని సంధిస్తున్న సీఎం శిబిరం

పిలుపు కోసం ఎదురుచూపు

నాయకత్వంపై ముసురుకున్న వివాదంతో ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతోంది. బడ్జెట్‌లో ప్రకటించే కార్యక్రమాలు అమలు కావన్న అపనమ్మకం పెరిగే ప్రభుత్వానికే నష్టమని సీనియర్లు అధిష్ఠానానికి హెచ్చరిస్తున్నారు. ఏఐసీసీ సభ్యులు వి.ఆర్.సుదర్శన్ తాజాగా అధిష్ఠానానికి లేఖ రాసి వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని హెచ్చరించారు. ఇప్పటికే ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్, మాజీ కేంద్రమంత్రి వీరప్పమొయిలీ కూడా అధిష్ఠానానికి హెచ్చరించిన విషయం తెలిసిందే. మంగళవారం నీటిపారుదల ప్రాజెక్టుల కోసం డీకే, ఈనెల 27న ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిల్లీకి వెళ్లనున్నారు. ఆలోగా అధిష్ఠానం నుంచి పిలుపు వస్తే ఇద్దరూ క్షణాల్లో దిల్లీకి చేరుకోవాల్సి ఉంటుంది. మేమిద్దరం పార్టీ పెద్దల పిలుపు కోసం ఎదురు చూస్తున్నామని డీకే ఆదివారమూ స్పష్టం చేశారు. ఇప్పటికే ఓసారి రాష్ట్ర వ్యవహారంపై చర్చించిన సోనియాగాంధీ.. మరోవిడత చర్చించేందుకు సిద్ధంగా ఉన్నారని కేసీ వేణుగోపాల్ ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే.

వెనుకబడిన ప్రాంతాల ప్రగతికి కంకణం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ఆచార్య గోవిందరావు సమితి చేసిన సిఫార్సులను అమలుచేసి తీరుతామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. జాతీయ పల్స్ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇక్కడ తన అధికార కార్యాలయమైన కృష్ణలో మంత్రులు దినేశ్‌గుండూరావు, డాక్టర్ పరమేశ్వర్‌లతో కలిసి ఆయన బాలలకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా సిద్ధు విలేకర్లతో మాట్లాడుతూ ఉత్తర కర్ణాటక అభివృద్ధి పై భాజపా నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. భాజపా అధికారంలో ఉన్న సమయంలో ఈ ప్రాంతాభివృద్ధికి ఏమి చేశారని ప్రశ్నించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ఆచార్య గోవిందరావు నేతృత్వంలో ప్రత్యేక సమితి ఏర్పాటు చేశామని సమితి జనవరిలో నివేదిక ఇస్తుందన్నారు. అనంతరం సమితి చేసిన సిఫార్సులను అధ్యయనం చేసి అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం నంజుండప్ప సమితి, ఆచార్య గోవిందరావు సమితులను ఏర్పాటు చేసిందని, తమ పరిపాలనలో ఉత్తర కర్ణాటకలో కొత్తగా 504 హాస్టళ్లను ప్రారంభించామని గుర్తు చేశారు. భాజపా పరిపాలనలో కేవలం ఐదు హాస్టళ్లను ప్రారంభించారని ఎద్దేవా చేశారు. కల్యాణ కర్ణాటకకు 371-జె స్థానం కల్పించిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. ఈ ప్రదేశానికి ప్రత్యేక నిధులు కోసం భాజపా నేతలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అవకాశం ఉందని నిలదీశారు.

బాలల భవితకు చక్కని 'చుక్కల' మందు

బెంగళూరు (యలహంక): జాతీయ పల్స్ పోలియో దినోత్సవ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమైంది. బెంగళూరు, మంగళూరు, మైసూరు, దావణగెరె, బళ్లారి, రాయచూరు, విజయనగర, విజయపుర, బెళగావి తదితర ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు. ఉద్యాననగరిలో తొలుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఐదేళ్లలోపు బాలలకు పల్స్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార పరిధిలో ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్, కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి బాలలకు బాలలకు చుక్కలు వేసి మిఠాయిలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది ఐదేళ్ల బాలలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారికి పోలియో చుక్కలు వేసేందుకు 4,800 కేంద్రాలను ఏర్పాటు చేశారు. నర్సులు, నర్సింగ్ విద్యార్థులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. బెంగళూరు నగరంలో ఆరులక్షల మందికిపై ఐదేళ్లలోపు బాలలు ఉన్నట్లు గుర్తించారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పండ్లు, కూరగాయల మార్కెట్లు, మాల్స్, వ్యాపార వాణిజ్య కేంద్రాలు, తదితర ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల నుంచి పసిబిడ్డలతో వచ్చిన ప్రయాణికులను గుర్తించి వారి వయస్సు తెలుసుకుని ఆరోగ్య కార్యకర్తలు పోలియో చుక్కలు వేశారు. మురికివాడల్లో పల్స్ పోలియో చుక్కలు వేసేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. దేవస్థానాలు, చర్చిలు వద్ద పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి అక్కడికి వచ్చిన ఐదేళ్లలోపు బాలలకు చుక్కలు వేశారు. సోమ, మంగళవారాల్లో ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ సంచరించి పోలియో చుక్కలు వేయించుకోని బాలలను గుర్తించి చుక్కలు వేసే కార్యక్రమాన్ని చేపడతారని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

పల్స్‌పోలియో కార్యక్రమం సందర్భంగా బాలలకు పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు దినేశ్‌గుండూరావు, డాక్టర్ పరమేశ్వర్, తదితరులు

సదాశివనగరలో తన ఇంట్లో బాలలకు పోలియో చుక్కలు వేస్తున్న ఉపముఖ్యమంత్రి డీకేశివకుమార్, తదితరులు

విజయనగరలో ఉన్న ఆదిచుంచనగిరి ఆశ్రమంలో బాలలకు పోలియో చుక్కలు వేస్తున్న కేంద్ర మంత్రి కుమారస్వామి

స్థానిక నేతల సృష్టే ఈ గందరగోళం

ఈనాడు, బెంగళూరు: నాయకత్వ మార్పుపై రాష్ట్రంలో కొనసాగుతున్న గందరగోళం స్థానిక నేతల సృష్టేనని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. ఆయన ఆదివారం కలబురగిలో మాట్లాడుతూ ఈ వ్యవహారంలో అధిష్ఠానం పాత్ర లేదన్నారు. అలాంటప్పుడు అధిష్ఠానం ఎందుకు బాధ్యత వహించాలని ఆయన ప్రశ్నించారు. స్థానిక నేతలే ఇందుకు బాధ్యత వహించాలి. పైగా పార్టీ అధికారంలోనికి రావాలంటే ప్రతి ఒక్కరి కృషి వల్లనే సాధ్యం. ఏ ఒక్కరిద్దరి వల్ల సాధ్య పడదు. పార్టీలోని ప్రతి కార్యకర్తకూ ఆ ఘనత దక్కాలి. ఇది సమష్టి కృషి ఫలితమని ప్రతి ఒక్కరూ భావించాలని ఖర్గే సూచించారు. పార్టీలో నెలకొన్న పరిస్థితులను చక్కబెట్టాలని ఏఐసీసీ సభ్యుడు సుదర్శన్ రాసిన లేఖ నాకు అందలేదు. దిల్లీకి వెళ్లిన తర్వాత ఆ లేఖను పరిశీలిస్తానని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఇక ఎన్‌డీఏ సర్కారు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని పూర్తిగా మార్చేసింది. పేరుతో పాటు గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ గుర్తించిన పనుల్లోనే ఉపాధి కల్పించటం సరికాదన్నారు. కొవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో గ్రామీణ ప్రజలను ఆదుకున్న మహత్తర పథకాన్ని మోదీ సర్కారు పూర్తిగా నాశనం చేస్తోందని ఖర్గే ఆరోపించారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా ఈ పథకం పునరుద్ధరణపై ఆందోళన చేపడతామన్నారు.

తోటలపై గజరాజుల 'ఘీంకారం'

బెళగావి, న్యూస్‌టుడే: ఉత్తర కన్నడ జిల్లా ముండగోడు తాలూకా గుంజావతి పరిధిలోని తోటలపై ఏనుగుల దాడులు ఎక్కువ అయ్యాయి. కొబ్బరి, అరటి, చెరకు, వక్క తోటల్లోకి వచ్చి నాశనం చేస్తున్నాయని రైతులు ఆక్రోశించారు. గుంజావతి, బ్యానళ్లి, ఉగ్గినకేరి, కాతూర, శింగనళ్లి, హొన్నళ్లి, హోరవళ్లి, హనమ్మాపుర, సుళ్లళ్లి తదితర ప్రాంతాల్లో అడవి ఏనుగుల దాడులు ఎక్కువ అయ్యాయి. ఏనుగులను మళ్లీ అటవీ ప్రాంతానికి మళ్లించేందుకు చర్యలు చేపట్టామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

ఏనుగులు ధ్వంసం చేసిన వక్క చెట్లు

'అనుమతులు ఇవ్వకపోయినా కట్టేస్తాం'

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: ఎత్తినహొళె నీటిపారుదల పథకం, కళసాబండూరి ఆనకట్ట నిర్మాణ పనులకు కేంద్ర పరిసరాల శాఖ అనుమతులు ఇవ్వకపోయినా తాము పనులు కొనసాగించి తీరుతామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టం చేశారు. ఆదివారం ఇక్కడ ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎత్తినహొళె పథకం ద్వారా నీరు సరఫరా చేయకపోతే చిక్కబళ్లాపుర, కోలారు జిల్లా ప్రజలు తమపై దాడులు చేస్తారని, ఈ పథకం ద్వారా తుమకూరు ప్రజలకు నీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. అనుమతులు కోసం ఎన్ని రోజులు ఎదురు చూడాలన్నారు. ఈనెల 22న దిల్లీలో కేంద్ర జలశక్తి, అటవీ, పరిసరాల శాఖ మంత్రులను భేటీ చేసి రెండు పథకాలకు పరిసరాల అనుమతులు ఇవ్వాలని ఒత్తిడి తెస్తామన్నారు.

రైల్వేట్రాక్‌పై మంచులో వెలుగుతున్న దీపాలు

ఉత్తరలో చలి పులి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో శీతల గాలులు తీవ్రం కావడంతో పాటు ఉత్తర ప్రాంతంలో వాతావరణంలో తీవ్ర మార్పులకు లోనైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బళ్లారి, విజయనగర, చిత్రదుర్గ, దావణగెరె, శివమొగ్గ జిల్లాల్లో చలిగాలులు తీవ్రమవుతాయని, కరావళి ప్రాంతంలో కనీస వాతావరణంలో తీవ్ర మార్పులు వస్తాయన్నారు. బెంగళూరులో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 27 డిగ్రీల సెల్సియస్ నుంచి 15 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోతాయని పేర్కొన్నారు. రాయచూరు, ధార్వాడలో కనీస ఉష్ణోగ్రతలు తొమ్మిది డిగ్రీలకు, గదగ, హావేరిలో పది, హాసనలో 8.5, చిక్కబళ్లాపుర, శివమొగ్గలో 11, బీదర్, విజయపురలో 7.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వివరించారు.

శనివారంలోపు గృహలక్ష్మి నగదు జమ

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే: రాష్ట్రంలో గృహలక్ష్మి పథకం కింద 24వ కంతు నగదు సోమవారం నుంచి శనివారంలోపు లబ్ధిదారులైన మహిళల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ వెల్లడించారు. ఆదివారం బెళగావిలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ నగదు విడుదలకు ఆర్థిక శాఖ నుంచి అనుమతులు పొందామని సోమవారం నుంచి ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మృతి చెందిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను గుర్తించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రెండు ప్రత్యేక సమావేశాలు నిర్వహించామని, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉపయోగించి ఇక నుంచి మృతులు ఖాతాల్లోకి నగదు జమ కాకుండా చర్య తీసుకుంటామన్నారు. ఒకవేళ మృతి చెందిన లబ్ధిదారులు ఖాతాలో నగదు జమైతే దాన్ని వెనక్కి తీసుకుంటామని తెలిపారు.

సమాంతర జలాశయం సాధ్యమేనా

రాయచూరు, న్యూస్‌టుడే : తుంగభద్రకు ప్రత్యామ్నాయంగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సమాంతర జలాశయం)ను నిర్మించడం ఇప్పట్లో సాధ్యంకాదా? ప్రభుత్వంలో చిత్తశుద్ధి లోపించిందా? అన్న సందేహం తలెత్తుతోంది. కొప్పళ జిల్లా కనకగిరి తాలూకా నవళి వద్ద ఆనకట్టను కట్టేందుకు గత ముఖ్యమంత్రి బొమ్మై హయాంలో డీపీఆర్ (డీటైల్ ప్రాజెక్టు రిపోర్టు)ను రూపొందించారు. సీఎం సిద్ధరామయ్య మరో నివేదికను తయారు చేయించారు. నిర్మాణానికి అవసరమైన 1100 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. తుంగభద్ర కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో ముడిపడినందున జాప్యానికి ప్రధాన కారణం. ఉప ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి డి.కె.శివకుమార్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఈ విషయంపై తెలంగాణ, ఆంధ్రా ముఖ్యమంత్రులను ఒప్పిస్తానని హామీ ఇచ్చారు. సీఎంలు అందుబాటులోకి రాలేదని తర్వాత వాపోయారు. ఇదే ఏడాది హస్తినలో జరిగిన ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న శివకుమార్ తెలుగు రాష్ట్రాల మంత్రులతో సమాంతర జలాశయం ప్రతిపాదనపై నోరు విప్పలేదు. చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు గత నెలలో ఆంధ్రా ఇరిగేషన్ శాఖ అమాత్యులు నిమ్మల రామానాయుడితో భేటీ అయినప్పుడు తుంగభద్ర నదిపై చీకలపర్వి, చిక్క మంచాల వద్ద బ్యారేజి, వంతెన కట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరారే తప్పా.. సమాంతర జలాశయంపై ప్రస్తావించకపోవడం గమనార్హం. రాయచూరు, కొప్పళ, బళ్లారి జిల్లాల శాసనసభ, మండలి సభ్యులు చట్టసభల్లో చర్చించడంలో విఫలమయ్యారనేది రైతుల ఆరోపణ. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం ఆలస్యంపై గళం విప్పలేదని తప్పుబట్టారు.



ప్రత్యామ్నాయ ఆనకట్ట ఎందుకంటే..

75 సంవత్సరాల కిత్రం నిర్మించిన తుంగభద్ర డ్యామ్ మొత్తం నీటి సామర్థ్యం 133 శతకోటి ఘనపుటడుగులు. మూడు రాష్ట్రాల్లోని ఎనిమిది జిల్లాల్లో 16 లక్షల ఎకరాల సారవంతమైన భూమి సాగులో ఉంది. తాగునీటి అవసరాలను తీరుస్తోంది. వందలాది పరిశ్రమలు ఆధారపడ్డాయి. రిజర్వాయర్‌లో ఏటా 0.4 నుంచి 0.5 టీఎంసీల పూడిక చేరుతోంది. ప్రస్తుతం 32 టీఎంసీలకు పైగా పూడిక ఉన్నందున నీరు వృథా అవుతోంది. ఫలితంగా తుంగభద్ర నిండుకుండలా మారినప్పుడు కూడా ఎడమకాలువ, హెచ్‌ఎల్‌సీ, ఎల్‌ఎల్‌సీ పరిధిలో టేలండ్ ప్రాంతానికి ఒక సాగుకు నీరు అందడం కష్టమైంది. గతంలో రైతులు పూడికను తొలగించాలని ప్రయత్నించినా సాధ్యపడలేదు. ఒకవేళ ప్రభుత్వమే పూడిక తీతకు సిద్ధమైనా.. 73 వేల ఎకరాల్లో పది అడుగుల ఎత్తులో తొలగించిన మట్టిని వేయాలి. ప్రతి రోజు వెయ్యి ట్రాక్టర్లతో పూడికను రవాణా చేసినా రోజుకు ఒక టీఎంసీని ఖాళీ చేయవచ్చన్న విశ్లేషణలు వెలువడ్డాయి. ఇవన్నీ సాధ్యం కానందునే సమాంతర ఆనకట్ట ప్రతిపాదనలోకి వచ్చింది.

ఐక్యత కొరవడినందునే

స్వపక్ష, విపక్ష నేతల మధ్య ఐక్యత లేనందునే ఫీజుబిలిటి ఉన్న ప్రతిపాదన ప్రాజెక్టుకు ఒక అడుగు కూడా ముందుకు పడటం లేదు. బాండ్ల రూపంలో నిధుల కొరతను అధిగమించవచ్చు. మస్కి (రాయచూరు జిల్లా) అసెంబ్లీ ఉప ఎన్నికల్లో గెలవాలని గత భాజపా ప్రభుత్వం మంత్రి రమేశ్ జార్కిహోళితో హడావుడిగా శంకుస్థాపన చేయించింది. ఆనకట్ట నిర్మితమైతే ఏప్రిల్ 15 వరకు సిరివార, మాన్వి, రాయచూరు తాలూకాలకు సాగు నీరు అందించడం సాధ్యమవుతుంది. కవితాళ వద్ద 1.5 టీఎంసీల సామర్థ్యం డ్యామ్ నిర్మించవచ్చు. తుంగభద్రలోని పూడికను దశలవారీగా తొలగించాలి. ప్రతి ఏడాది కొంత తీయాలి. మట్టిని తరలించేందుకు రైతుల ట్రాక్టర్లకు డీజిల్ వేయిస్తే చాలు. - చామరస్ మాలిపాటిల్ (రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు)

రూ.20 వేల కోట్లకు పైగా వ్యయం!

భూస్వాధీనం, నిర్వాసితులకు పరిహారం, ప్రాజెక్టును నిర్మించేందుకు రూ.20 వేల కోట్లు వ్యయం కాగలదని అంచనా. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నందునే ఒక బడ్జెట్‌లో ఇంత మొత్తం నిధులు కేటాయించలేరు. రాయచూరు జిల్లాలోని చీకలపర్వి, చిక్క మంచాల వద్ద బ్యారేజీలు కట్టి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీరు సరఫరా చేయాలన్న ప్రభుత్వ యోచన సముచితమైనా.. వీటి వల్ల ఎడమ కాల్వలోని కొన్ని ప్రాంతాలకు లబ్ధి చేకూరుతుంది. సమాంతర డ్యామ్ కడితే తుంగభద్ర వరద నీటిని మళ్లించుకోవచ్చు. ఎగువ కృష్ణా ప్రాజెక్టుల మూడో దశ పనులకు రూ.2 లక్షల కోట్ల కేటాయిస్తామని ముఖ్యమంత్రి గత ఆగస్టులో ప్రకటించారు.

కుఖ్యాత చోరుడు ఎట్టకేలకు దొరికాడు

హాసన, న్యూస్‌టుడే: దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్న సోహిల్ ఖాన్ (38) అనే చోరుడ్ని పెన్షన్ మొహల్లా ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరు వినాయకనగరలో ఉంటున్న నిందితునిపై ఇప్పటికే 79 కేసులు ఉన్నాయి. ఉడుపిలో ఒక కేసుతో కలిపి కర్ణాటకలో 27, ఆంధ్రప్రదేశ్‌లో 52 కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఇతని నుంచి 250 గ్రాముల ఆభరణాలను జప్తు చేసుకుని విచారణ చేపట్టారు.

భళా.. మాగీ ఉత్సవ్

రాచనగరి మైసూరులో ఆదివారం మాగీ ఉత్సవ్(శీతాకాల ఉత్సవాలు) సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, రాజ్యాంగ ప్రతి నమూనా, ప్యాలెస్ భవనం మిరమిట్లు గొలిపే విద్యుద్దీపాలతో కాంతులీనింది. పూలతో అలంకరించిన ఆకృతులు చూపరులను ఇట్టే కట్టిపడేశాయి. - న్యూస్‌టుడే, బెంగళూరు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

జుమాది ఐల్యాండ్ ఇసుక తీరం

కొబ్బరి చెట్లతో కప్పేసిన ఐల్యాండ్

దీవిలో రిసార్ట్, స్టేహోంలు

అరేబియా దరి.. అందాల బరి

■ జుమాది ఐల్యాండ్‌కు సందర్శకుల తాకిడి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలు దగ్గర పడుతుండటంతో రాష్ట్రంలోని అరేబియా సముద్రం తీరంలోని బీచ్‌ల్లోని రిసార్ట్‌లు, స్టేహోంలతో పాటు సముద్రం మధ్యలో ఉన్న దీవుల్లో వేడుకలు జరుపుకొనేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఆయా బీచ్‌లలో ఉన్న రిసార్ట్‌లు, హోటళ్లు, స్టేహోంలలో గదులు 70 శాతం భర్తీ అయినట్లు పర్యాటక శాఖ అధికారులు వెల్లడించారు. మరోవైపు ఉడుపికి 40 కిలోమీటర్ల దూరంలో బ్రహ్మవర దగ్గరలో అరేబియా సముద్రంలో ఉన్న జుమాది ఐల్యాండ్‌కు వెళ్లేందుకు పర్యాటకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అక్కడ ఉన్న రిసార్ట్, స్టేహోంలను బుక్ చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. కొబ్బరి చెట్లతో కూడిన దీవిలో పర్యాటకుల కోసమే రిసార్ట్‌లు, స్టేహోంలు ఉన్నాయి. బ్రహ్మవర నుంచి పడవలో జుమాది ఐల్యాండ్‌కు వెళ్లాలి. రాత్రిళ్లు అక్కడ ఉండేందుకు పర్యాటకులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే పడవలు అక్కడికి సంచరిస్తాయి. దీవిలోకి వెళ్లిన పర్యాటకులు ప్రత్యేకంగా పడవ విహారం చేసే అవకాశం ఉంది. సముద్రతీరంలో కూర్చొని ప్రకృతి అందాలను తిలకించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. నూతన సంవత్సరం వేడుకలు దీవిలో జరుపుకొనేందుకు ఆసక్తి చూపుతున్న పర్యాటక శాఖ పరిమిత సంఖ్యలో అక్కడికి అనుమతిస్తారు. ప్రస్తుతం జుమాది ఐల్యాండ్‌లో అన్ని రకాల ఆహార పదార్థాలను పర్యాటకులకు అందుబాటులో ఉంచుతారు. పర్యాటకుల అభిరుచులకు తగ్గినట్లుగా కాటేజీలను ఏర్పాటు చేశారు. మరోవైపు వచ్చే పర్యాటకుల కోసం నిత్యం సురక్షిత చర్యలు చేపట్టి ఉంటారు.

చావులోనూ వీడని బంధం

బెంగళూరు(యలహంక): జీవితాంతం కలిసి జీవించిన భార్యాభర్తలిద్దరూ చావులోనూ కలిసే వెళ్లారు.. ఈ సంఘటన ఆదివారం ఉదయం యలహంక ఉపనగర పోలీసుఠాణా పరిధిలో జరిగింది. అనంతపుర నివాసి టి.సి.వెంకటగిరియప్ప (88) ఉదయం ఆరుగంటలకు మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే భార్య ఆర్.ఎం.నాగరత్నమ్మ (82) గుండెపోటుతో మృతి చెందారు. వారిద్దరి ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. చింతామణి ప్రాంతానికి చెందిన టి.సి.వెంకటగిరియప్ప రెవెన్యూశాఖలో సర్వేయరుగా 28 ఏళ్లు పని చేశారు. వయస్సుతో వచ్చిన వ్యాధుల కారణంగా ఆయన మృతి చెందారు. ఈ విషయం తెలిసి భార్య గుండెపోటుతో మృతి చెందారు. మృతికి స్థానిక శాసనసభ్యుడు విశ్వనాథ్, భాజపా నేతలు చొక్కనహళ్లి వెంకటేశ్, డాక్టర్ శశికుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: తలఘట్టపుర పోలీసుఠాణా పరిధిలోనిబాలాజి లేఔట్ నివాసి శోలిమండాల్ (32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీరు చక్రవర్తిని ఆమె ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తలు తరచూ గొడవ పడుతున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన తరువాత మృతి చెందారు. అత్తింటి వారి వరకట్నం వేధింపులకు తమ కుమార్తె మృతికి కారణమని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ స్నేహితుడి వేధింపులు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: కష్టకాలంలో ఓ మహిళకు సాయం చేసిన ఆన్‌లైన్ స్నేహితుడు ఆఖరి ఆమెను లైంగిక సుఖం కోసం తన వద్దకు రావాలనడంతో అతనిపై రాజగోపాలనగర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివాహమై పిల్లలు ఉన్న 38 ఏళ్ల వయస్సు కలిగిన మహిళకు సామాజిక మాధ్యమం ద్వారా పారితోశ్ యాదవ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. ఇటీవల గ్యాస్ సిలిండర్ లీకేజీ అయ్యి పేలడంతో ఆమె కుమారుడు గాయపడ్డారు. ఆ సమయంలో స్నేహితుడి నుంచి రూ.30వేల నగదు అప్పు తీసుకున్నారు. దాన్ని సాకుగా తీసుకుని అతడు ఆమెను లైంగిక వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టాడు. ఈ విషయం భర్తకు తెలిసి ఇద్దరి మధ్య గొడవ జరగ్గా ఆమె పీణ్యాలో ఉన్న స్నేహితురాలు ఇంటికి వెళ్లారు. అక్కడ ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా స్నేహితులు కాపాడారు. వారి సలహా మేరకు నిందితుడిపై పోలీసుఠాణాలో ఆమె ఫిర్యాదు చేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తాం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు సిద్ధమని బళ్లారి సాంస్కృతిక వ్యవహారాల సంఘం అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో హొయ్యాల సభాభవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పదాధికారులు, గౌరవ అధ్యక్షులు, కార్యవర్గసభ్యులు, ప్రత్యేక ఆహ్వానితుల సహకారంతో నాటకాలు, నృత్యం, సంగీతం, గీతాపఠనం, భజనపోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సంస్థ ఏటా నిర్వహించే పురస్కారాల ప్రదానాన్ని కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం నూతన మేయర్‌గా ఎన్నికైన పూజారిగాదెప్ప, కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సంస్థ జిల్లా కోఆర్డినేషన్ ఛైర్మన్‌గా ఎంపికైన యశ్వంత్‌రాజ్, బళ్లారి అర్బన్ సహకార బ్యాంకు అధ్యక్షుడు వెంకటేశ్‌లను ఘనంగా సత్కరించారు.

మేయర్ గాదెప్పను సత్కరిస్తున్న శీలాబ్రహ్మయ్య, యశ్వంత్‌రాజ్, రామచంద్ర తదితరులు

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ఉమా దర్శించుకున్నారు. న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కుటుంబసభ్యులతో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ఉమా

నిందితులకు దేహశుద్ధి

నిందితులు తెచ్చిన నాణేలు

మండ్య, న్యూస్‌టుడే: రామలక్ష్మణులు ఉన్న నాణేలు దగ్గర ఉంచుకుంటే అదృష్టం వరిస్తుందని నాగమంగల పట్టణం బస్టాండ్‌లో ఒక వ్యక్తిని నమ్మించి, రూ.లక్ష డిమాండ్ చేసిన ఇద్దరు వంచకులకు స్థానికులు దేహశుద్ధి చేశారు. నిందితులను నాగమంగల తాలూకా శికారిపురకు చెందిన యశవంత రావు, సుధీర్‌గా గుర్తించారు. వీరితో ఉన్న మరో యువకుడు తప్పించుకుని పరారయ్యాడు. వంచకులను నాగమంగల ఠాణా పోలీసులకు అప్పగించారు. తామ్రపు నాణేలను వీరే ముద్రించి వంచనకు పాల్పడుతున్నారని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

ఆ ఇంట్లో రక్తాన్ని ఎవరూ చల్లలేదు

మండ్య: మద్దూరు తాలూకా హొంబాళెగౌడనదొడ్డి గ్రామంలో సతీశ్, సౌమ్య దంపతుల నివాసంలో రక్తం మరకలు కనిపించాయి. వారిని పలకరించేందుకు స్థానికులు వచ్చినప్పుడు హాల్, స్నానాల గది, టీవీ, ఫ్యాను రెక్కలపై రక్తం చుక్కల్ని చూసి భయపడ్డారు. వారింట్లో ఏదో హత్య జరిగిందని లేదా ఏదైనా బాణామతి చేస్తుండవచ్చని వచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. రక్తం మరకల నమూనాను ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించారు. అది ఇంటి యజమాని సతీశ్ రక్తమేనని గుర్తించారు. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఆయనకు రక్తం పలచన చేసేందుకు వైద్యులు ఇచ్చిన ఔషధాన్ని వినియోగిస్తున్నారు. శరీరంపై అయిన చిన్న గాయం నుంచి కారిన రక్తమే అన్నిచోట్లా పడింది. ఆయా చోట్ల కనిపించిన రక్తం తనదేనని సతీశ్ కూడా గుర్తించలేకపోయారు. దర్యాప్తు అనంతరం నివేదిక రావడంతో గ్రామస్థులు అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

‘అన్ని మతాలు సమానమే’

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాజ్యాంగం ప్రకారం అన్నివర్గాల ప్రజలకు మత స్వేచ్ఛ ఉందని, అన్నిమతాలను సమానంగా గౌరవించి లౌకిక వాదానికి పెద్దపీట వేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం బెంగళూరు ఆర్చ్ బిషప్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి దూత ఏసుక్రీస్తు బోధనలను అందరూ గౌరవిస్తారని గుర్తు చేశారు. క్రైస్తవ సంస్థలు సామాజిక సేవలో ముందంజలో ఉన్నట్లు చెప్పారు. సమాజంలో శాంతి అవసరమని, అందువల్ల తాము అన్ని మతాలను సమానంగా గౌరవిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్చ్ బిషప్ డాక్టర్ పీటర్ మాచోడ్, విధానపరిషత్తులో ప్రతిపక్ష నేత చలవాది నారాయణస్వామి, తదితరులు హాజరయ్యారు.

ఆర్చ్ బిషప్ హౌస్‌లో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు హాజరైన ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆర్చ్ బిషప్ డాక్టర్ పీటర్ మాచోడ్ తదితరులు

ఎమ్మెల్యే, 17 మందిపై కేసు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నిబంధనలు అమలులో ఉన్న వాటిని ధిక్కరించి కోడి పందేలు నిర్వహించారనే ఆరోపణపై పుత్తూరు శాసనసభ్యుడు అశోక్ రైతో పాటు 17 మందికి వ్యతిరేకంగా దక్షిణ కన్నడ జిల్లా విట్లా పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి సంప్రదాయం ప్రకారం కోడి పందెం పోటీలను శాసనసభ్యుడు అశోక్ రై ప్రారంభించారు. కోడి పందేలు నిర్వహించకూడదని స్థానిక పోలీసులు ఆంక్షలు విధించారు. వాటిని ధిక్కరించి పందెం నిర్వహించారనే ఆరోపణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలింగ్ కేంద్రం వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ జాహ్నవి, అధికారులు

సీతారామ్‌తండా పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

హొసపేటె, న్యూస్‌టుడే: విజయనగర జిల్లా, హొసపేటె తాలూకా సీతారామ్‌తండా గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మూడు గ్రామాలు కలిగిన ఈ పంచాయతీ పరిధిలో 8 స్థానాలకు ఎన్నికలను నిర్వహించారు. 87.20శాతం ఓటింగ్ జరిగినట్లు జిల్లా యంత్రాంగం వెల్లడించింది. మొత్తం 23 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 2842 ఓటర్లలో 2504మంది ఓటు వేశారు. పోలింగ్‌కేంద్రాలను కలెక్టర్ కవితా మన్నికేరి, ఎస్పీ జాహ్నవి దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. 24వ తేదీన హొసపేటె తహసీల్దార్ కార్యాలయంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

‘శక్తి’పై బకాయిల గుదిబండ

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకు 600 కోట్ల జీరో టికెట్లను ఆర్టీసీ, బీఎంటీసీలు మంజూరు చేశారు. జీరో టికెట్ల జారీకి సంబంధించి బీఎంటీసీ, ఇతర మూడు కేఎస్ ఆర్టీసీ శాఖలకు ప్రభుత్వం రూ. 4,006.47 కోట్ల బకాయిలు మిగుల్చుకుంది. గ్యారంటీ పథకాలను జారీ చేయడంతో ఖజానా ఖాళీ అయిందని విపక్షాలు విమర్శిస్తూ వస్తుండగా, తమకు ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం విస్మరించిందని ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఆరోపిస్తున్నారు. తమ సంస్థలకు బకాయిలు విడుదల చేయడంతో పాటు, వేతన సవరణ, పింఛను పెంపు, తదితరాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలకు స్పందించకపోతే, సమ్మెకు పిలుపు ఇవ్వాలని రవాణాశాఖలోని కార్మిక సంఘాలు ఇప్పటికే తీర్మానించాయి.

చలి సమీరంలో.. విరులరంజితం


బెనగానహళ్లి చెరువు చుట్టూ గులాబీలతో కూడిన రమణీయమైన దృశ్యం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: శీతాకాలమొస్తే బెంగళూరు నగరంలోని పలు ప్రాంతాలు పూల బాటలుగా మారుతున్నాయి. మొన్నటి వరకు పచ్చటి ఆకులతో ఉన్న చెట్లు ఆకులు రాలి గులాబీ రంగు పూలతో నిండిపోతున్నాయి. ఆ చెట్టు వద్దకు వెళ్తే సువాసన వెదజల్లుతోంది. మనసుకు ఆహ్లాదకర అనుభూతి కలుగుతుంది. కేవలం ఉద్యానవనాలకు మాత్రమే పరిమితమైన గులాబీ రంగులతో పూలతో కూడిన విదేశీ జాతి చెట్లు వివిధ ప్రాంతాల్లో రహదారి పొడవు ఉన్నాయి. వైట్‌ఫీల్డ్, బెనగానహళ్లి, ఇందిరానగర, దొమ్మలూరు, పాత విమానాశ్రయం రహదారితో పాటు కబ్బన్‌పార్కులో గులాబీ పూల మొక్కలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఈ చెట్లకు పూలు తప్ప ఆకులు ఉండవు. బెనగానహళ్లి చెరువు చుట్టూ రంగు పూలచెట్లు ఉండటంతో ఈ ప్రదేశం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొందరు డ్రోన్ కెమెరాల ద్వారా ఛాయాచిత్రాలు తీసుకొని మురిసిపోతుంటారు. వాటితో పాటు బీడీఏ కూడలిలో పసుపుపచ్చ రంగుతో కూడిన విరుల సోయగాలను వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి. ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో మాత్రమే పూల అందాలు ప్రజలకు ఆనందాన్ని పంచుతున్నాయి.

ఏఈసీఎస్ లేఔట్ రహదారి పూలవర్ణమయం

వైట్‌ఫీల్డ్ రహదారిలో పూల సోయగం

‘నిధులు ఇవ్వకపోతే రాజీనామా చేస్తా’

కార్వార, న్యూస్‌టుడే: ఉత్తర కన్నడ జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేస్తానని సతీశ్ శైల్ ప్రకటించారు. గత ఎన్నికల ప్రచార సందర్భంలో ఇక్కడ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చానని, త్వరలో నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో కొంత ఊరట కలిగిందన్నారు. ఈ సారి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోతే, తన పదవికి రాజీనామా చేస్తానని స్థానిక దేవాలయంలో ఆయన ప్రకటించారు.

తాకట్టు ఆభరణాల్లో తేడాలపై నిరసన

మైసూరు, న్యూస్‌టుడే: హినకల్ కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టిన ఆభరణాల తూకంలో తేడా వచ్చిందని ఆరోపిస్తూ కొందరు ఖాతాదారులు ధర్నాకు దిగారు. తాను తాకట్టు పెట్టిన గొలుసులో 85 బంగారు పూజలు ఉండగా, ఇప్పుడు 77 మాత్రమే ఉన్నాయని గాయత్రి అనే మహిళ ఆరోపించింది. తాను 19 గ్రాముల గొలుసును తాకట్టు పెడితే ఇప్పుడు 16 గ్రాములు మాత్రమే ఉందని ఆమె పేర్కొంది. ఆమెకు మద్దతుగా పలువురు ఖాతాదారులు తాము కూడా ఇదే విధంగా మోసపోయామని ఆరోపించారు. బ్యాంకులో ఆచారి అశ్విన్‌పై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో విజయనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కాంగ్రెస్ నాయకునిపై ఫిర్యాదు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: అన్నభాగ్య పథకానికి కేటాయించిన బియ్యాన్ని యలచేనహళ్లి కాంగ్రెస్ నాయకుడు అలీమ్ నల్లబజారుకు తరలిస్తున్నారని కేఆర్‌ఎస్ పార్టీ ఆరోపించింది. లబ్ధిదారుల నుంచి నేరుగా బియ్యాన్ని కొనుగోలు చేసి, దాన్ని ఎక్కువ ధరకు నల్ల బజారులో విక్రయించుకుంటున్నారని హారోహళ్లి ఠాణాలో పార్టీ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుడ్డుతో చేసిన కేకు తినిపించారని ఆరోపణ

మండ్య, న్యూస్‌టుడే: మండ్యలోని పోదార్ పాఠశాలలో తాము వద్దన్నప్పటికీ గుడ్డుతో చేసిన కేకును బలవంతంగా తినిపించారని కొందరు జైన విద్యార్థులు ఆరోపించారు. పాఠశాలకు శిల్పా స్వాడ్లి ప్రిన్సిపల్‌గా వచ్చినప్పటి నుంచి ఇతర ధర్మాల వారిని కించపరుస్తూ మాట్లాడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాల వద్దకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నాకు దిగారు.

తండ్రీకొడుకులపై దాడి

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: చిన్న విషయానికే కడూరు తాలూకా బళ్లేకెరె గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులపై స్థానికులకు కొందరు మారణాయుధాలతో దాడి చేసి గాయపరచి పరారయ్యారు. దాడిలో తీవ్రంగా గాయపడిన విజయకుమార్, ఆయన కుమారుడు అభిషేక్‌లను చికిత్స కోసం కడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. బైకులో వచ్చిన సునీల్, రంగ అనే యువకులు బైకులో రాగా, ఊళ్లో ఉన్న మరికొందరు వారికి సహకరించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం కడూరు ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

శ్రీరామనగర, న్యూస్‌టుడే: గంగావతి తాలూకా హెబ్బాళ గ్రామంలో ఈనెల 12న గ్యాస్ సిలిండర్ పేలి గాయపడిన వారి కుటుంబాలను స్థానిక ఎమ్మెల్యే, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి ఆదివారం పరామర్శించారు. ప్రమాదంలో 8 మంది గాయపడగా రాజు, సురేశ్ అనే ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మృతి చెందిన వారి కుటుంబాలకు తలా రూ.5 లక్షల పరిహారం అందిస్తామని తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం లందించాలని అధికారులకు సూచించారు. గ్యాస్ సిలిండర్ పేలిన ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పాలనాధికారి సురేశ్ ఇట్నాళ, ఎస్పీ డాక్టర్ రామ్ అరసిద్ధి, ప్రభుత్వ పంచ గ్యారంటీ పథకాల అనుష్టాన సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బాధితులతో మాట్లాడుతున్న మంత్రి శివరాజ్ తంగడగి, జిల్లా పాలనాధికారి

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

బాణసవాడి: వేగంగా సంచరిస్తున్న ద్విచక్ర వాహనం హంప్ వద్ద ఎగిరి కిందపడి వాహనదారుడు గోపిమోహన్(32) మృతి చెందిన ఘటన శనివారం రాత్రి వైట్‌ఫీల్డ్ పోలీసుఠాణా పరిధిలో జరిగింది. రాత్రి 9.30 గంటలకు సర్జాపుర ప్రధాన రహదారిలోని సూలికుంటె బస్టాండు వద్ద ఉన్న హంప్‌ను గమనించకుండా వేగంగా వాహనం నడపడంతో ఎగిరి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

25న 45 విడుదల

కన్నడ ప్రముఖ హీరోలు శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి.శెట్టి కలిసి నటించిన మల్టీస్టారర్ చిత్రం ‘45’ చిత్రం ఈనెల 25న దేశవ్యాప్తంగా విడుదల కానుంది. నగరంలో జరిగిన కార్యక్రమంలో చిత్రానికి సంబంధించిన టీజర్‌ను నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ విడుదల చేశారు. ముగ్గురు హీరోలు నటిస్తున్న చిత్రానికి దర్శకత్వం వహించినట్లు అర్జున్ జన్య తెలిపారు. చిత్రం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రమోద్‌శెట్టి, సుధారాణి తదితరులు నటిస్తున్నారు.

‘45’ చిత్రం టీజర్ కార్యక్రమంలో ప్రముఖ హీరోలు శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి.శెట్టి, పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్

నయన మనోహర టీజర్ విడుదలలో చిత్ర బృందం

జస్ట్ యు చిత్రీకరణ

ఎక్సిసిట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ‘నయన మనోహర’ చిత్రం టీజర్ ఇటీవల విడుదల చేశారు. హీరో ధర్మకీర్తిరాజ్ 25వ చిత్రం. ప్రముఖ సినీనటులు ప్రియాంకా ఉపేంద్ర, వినోద్‌ప్రభాకర్ తదితరులు కలిసి టీజర్ ఆవిష్కరించారు. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు పునీత్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు.

ఏఐ ఆధారంగా కూరగజ్జ పాట

ప్రేక్షకులను సంతోషపెట్టే ‘సుఖీభవ’ చిత్రంలో హీరోశరణ్ ఓ పాటకు గాత్రం అందించారు. వేద ఆర్యన్ ఫిలింస్ బ్యానర్‌పై సంతోష్‌కుమార్, భార్గవి సంతోష్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విభిన్నమైన కథ చిత్రమని, ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుందని దర్శకుడు ఎన్.కె.రాజేశ్ నాయుడు తెలిపారు. చిత్రానికి కథ, చిత్రకథ, సంభాషణ అందిస్తున్నారు. మహేంద్ర నాయక్, సుస్మిత నాయక్, వియాన్‌శిగ్డేతో పాటు గౌరవ్‌శెట్టి, శోభరాజ్, రవిశంకర్‌గౌడ, సునీల్ పురాణిక్, తుకాలిసంతు, మైత్రి జగ్గి తదితరులు నటిస్తున్నారు.

సుఖీభవ చిత్రంలో హీరో శరణ్, తదితరులు

ల్యాండ్ లార్డ్ చిత్ర బృందం

జనవరి 23న ల్యాండ్‌లార్డ్ రాక

సారథి ఫిలింస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ‘ల్యాండ్ లార్డ్’ చిత్రం జనవరి 23న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. చిత్రానికి సంబంధించి యోగరాజ్‌భట్ రాసిన నింగవ్వ నింగవ్వ..ను ఇటీవల విడుదల చేశారు. అజనీశ్ లోక్‌నాథ్ సంగీతం అందించగా విజయ్‌ప్రకాశ్, అనన్యభట్ గానం చేశారు. చిత్రకథ అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని దర్శకుడు జడేశ్ తెలిపారు. దునియా విజయ్, రచితరామ్ తదితరులు నటిస్తున్నారు.

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

(c) eenadu

బళ్ళారి
● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

ఉత్తమ విద్యతో గ్రామాల అభివృద్ధి

పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న సిద్ధలింగస్వామి

చెళ్లకెరె(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: గ్రామాల్లో వివిధ పాఠశాలలు, కళాశాలలను ప్రారంభించి ఉత్తమ విద్యాసదుపాయాలను కల్పిస్తే అవి త్వరితగతిన అభివృద్ధి చెందగలవని తుమకూరు సిద్ధగంగ మఠాధిపతి సిద్ధలింగ స్వామి పేర్కొన్నారు. హిరియూరు తాలూకా ఆదివాల గ్రామంలో నెహ్రూ రూరల్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు నిర్మించిన గురుమందిర కార్యక్రమాన్ని జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన జిల్లా బాధ్యమంత్రి డి. సుధాకర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు పాఠశాలలో నూతన భవనాన్ని నిర్మించడం ప్రశంసనీయమన్నారు.

ప్రచార రథయాత్రకు బ్రహ్మరథం

రథాన్ని ప్రారంభిస్తున్న మహిళలు

కంప్లి, న్యూస్‌టుడే: నిర్మల తుంగభద్ర అభియాన్ మూడో విడత పాదయాత్ర-ప్రచారరథాన్ని కంప్లిలో ఆదివారం ప్రారంభించారు. పేట బసవేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించి రథయాత్రకు శ్రీకారం చుట్టారు. 27న కిష్కింధ నుంచి ప్రారంభం కానున్న పాదయాత్ర ఆదే రోజు కంప్లి రానుంది. తుంగభద్ర స్వచ్ఛతను కాపాడేందుకు ప్రజలు అధిక సంఖ్యలో పాదయాత్రలో పాల్గొనాలని అభియాన్ ప్రతినిధులు కోరారు.

జలజాగృతి పాదయాత్రపై సమావేశం

మాట్లాడుతున్న బాలకృష్ణనాయుడు

మాన్వి, న్యూస్‌టుడే: గంగావతి నుంచి మంత్రాలయం వరకు చేపట్టనున్న జలజాగృతి పాదయాత్ర నిర్వహణపై ఎమ్మెల్యే హంపయ్య నాయక్ అధ్యక్షతన స్థానిక ధ్యానమందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాదయాత్ర సంచాలకుడు బాలకృష్ణనాయుడు మాట్లాడుతూ ప్రజలు మేల్కొనకపోతే భవిష్యత్తు తరాల మనుగడకు ప్రమాదమన్నారు. హంపయ్యనాయక్ మాట్లాడుతూ జాగృతి కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని, పాఠశాలలు, కళాశాలల్లో చర్చా వేదికలు నిర్వహించాలన్నారు. జనవరి 1న తాలూకాకు వచ్చే పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. ప్రముఖులు బసవనగౌడ, గంగాధరనాయక్, ఎస్. ఉదయ్‌కుమార్, అనితా మాట్లాడారు. వివిధ సంఘ సంస్థల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

భూకబ్జాల నిరోధానికి అవగాహన శిబిరం

శిబిరాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ ఎన్.ఎస్.పాటిల్

గంగావతి, న్యూస్‌టుడే: భూకబ్జా నిషేధ సంబంధిత చట్టాలపై జిల్లా యంత్రాంగం అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర భూకబ్జా నిషేధ విశేష న్యాయస్థానం ఛైర్మన్ జస్టిస్ ఎన్.ఎస్.పాటిల్ అన్నారు. ఆయన జిల్లా పరిపాలనా భవనంలో అవగాహన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ భూములను కాపాడాలంటే కబ్జాలను తప్పించాలన్నారు. ఇలాంటి సందర్భం ఎదురైతే ఏవిధమైన చర్యలు తీసుకోవాలనే సమాచారం శిబిరంలో అందిస్తారన్నారు. 2016 నుంచి ఇప్పటి వరకు 23,849 కేసులు నమోదవగా ఆధారంగా పరిష్కరించినట్లు చెప్పారు. ఇంకా 4786 కేసులను పరిష్కరించాల్సి ఉందన్నారు. కబ్జాలకు గురైన 4585 ఎకరాల ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 133 మంది శిక్ష పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెషన్స్ న్యాయమూర్తి సి.చంద్రశేఖర్, పాలనాధికారి సురేశ్ ఇట్నాళ, ఎస్పీ రామ్ అరసిద్ధి, న్యాయమూర్తులు మహాంతేశ్ దరగద, అటవీశాఖ అధికారిణి నిర్మలా పాల్గొన్నారు.

చుక్కల మందుతో చక్కని భవిత

చుక్కల మందు వేస్తున్న జడ్పీ సీఈవో

పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ గాదెప్ప

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా వ్యాప్తంగా మొదటి రోజు ఆదివారం పల్స్ పోలియో చుక్కల మందు కార్యక్రమం విజయవంతమైంది. మొత్తం 1,98,136 మంది(0-5ఏళ్ల) పిల్లలు ఉండగా, మొదటి రోజు 920 బూత్‌ల్లో 1,91,995 మంది(96.09శాతం) పిల్లలకు చుక్కల మందు వేశారు.

బళ్లారి, న్యూస్‌టుడే: పిల్లల్లో వైకల్య నివారణకు తల్లిదండ్రులు తప్పకుండా చుక్కల మందు (టీకా) వేయించాలని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ తోలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ముండరగి నాగరాజు కోరారు. ఐదేళ్ల లోపు పిల్లలకు చుక్కల వేయించడం చాలా ముఖ్యమని మేయర్ పూజారి గాదెప్ప తల్లిదండ్రులకు సూచించారు.

గంగావతి,న్యూస్‌టుడే: పోలియో రహిత భారత్ లక్ష్యంతో పనిచేయాలని గంగావతి శాసనసభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి ఆరోగ్యశాఖ సిబ్బందిని కోరారు. ఆయన గంగావతి మహిళా,శిశు ఆసుపత్రిలో ఆదివారం పల్స్‌పోలియోను ప్రారంభించి మాట్లాడారు.

చుక్కల మందు వేస్తున్న వాణిజ్య, పరిశ్రమ అధ్యక్షుడు అవ్వారు మంజునాథ

కారటగి, న్యూస్‌టుడే: అందరికీ పోలియో చుక్కలు వేయాలని స్థానిక ఎమ్మెల్యే, జిల్లా బాధ్య మంత్రి శివరాజ్ తంగడగి అధికారులకు సూచించారు.

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి ప్రభుత్వ సముదాయ ఆసుపత్రిలో శిశువుకు పోలియో చుక్కలు వేయడం ద్వారా జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని తహసీల్దార్ మంజు నాయక్ ఆదివారం ప్రారంభించారు. తాలూకా నోడల్ అధికారిణి డాక్టర్ పూర్ణిమ కట్టమని సూచనలందించారు.

శ్రీరామనగర్, న్యూస్‌టుడే: గంగావతి తాలూకా శ్రీరామనగర్ ప్రభుత్వ ఆసుపత్రి పరిధి హొసకేర, కోటయ్య పుర, మరళి, ముష్టూరు, తాత్రపల్లి క్యాంపు, అంజూరి క్యాంపు తదితర గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది.

చెళ్లకెర,న్యూస్‌టుడే: పోలియో రహిత తాలూకా చేయడానికి ప్రజలు సహకరించాలని తాలూకా పంచాయితీ ఈఓ శశిధర్ పేర్కొన్నారు. చిన్న పిల్లలకు చుక్కలు మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

సింధనూరు, న్యూస్‌టుడే: కేవలం రెండు చుక్కల మందుతో పోలియో రహిత సమాజాన్ని నిర్మించవచ్చని విధాన పరిషత్ సభ్యుడు బసనగౌడ బాదర్లి పేర్కొన్నారు.

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హొళల్కెర తాలూకా ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఎం.చంద్రప్ప చిన్న పిల్లలకు చుక్కల మందు వేయగా మొలకాల్మూరు ఎమ్మెల్యే ఎన్‌వై గోపాలకృష్ణ రాంపుర ప్రభుత్వ ఆసుపత్రిలో పోలియో చుక్కలను వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సిరుగుప్ప, న్యూస్‌టుడే: పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి దివ్యాంగ రహిత దేశంగా తీర్చిదిద్దుదామని శాసనసభ్యుడు బి.ఎం.నాగరాజు పిలుపునిచ్చారు.

మాన్వి, న్యూస్‌టుడే : ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమిస్తున్నాయని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. స్థానిక మాతా శిశు ఆసుపత్రిలో చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.

గంగావతిలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న శాసనసభ్యుడు గాలి జనార్దన్‌రెడ్డి

కారటగిలో శిశువుకు చుక్కల మందు వేస్తున్న మంత్రి శివరాజ్ తంగడగి

కంప్లి ఆసుపత్రిలో చిన్నారికి చుక్కలు వేస్తున్న తహసీల్దార్ మంజు నాయక్

శ్రీరామనగర్: కోటయ్య పురలో పోలియో చుక్కలు వేస్తున్న వైద్యుడు

సింధనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో బాలికకు చుక్కలు వేస్తున్న ఎమ్మెల్సీ బసనగౌడ బాదర్లి

చెళ్లకెర:పిల్లలకు చుక్కలు వేస్తున్న హొళల్కెర ఎమ్మెల్యే చంద్రప్ప

సిరుగుప్పలో శిశువుకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

మాన్వి: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న హంపయ్యనాయక్

రామప్పకు శిక్షణ రత్న పురస్కారం

కంప్లి, న్యూస్‌టుడే: తాలూకా ఎమ్మిగనూరు ప్రభుత్వ శతమాన పాఠశాల అతిథి ఉపాధ్యాయుడు ఎస్.రామప్పకు శిక్షణ రత్న-25 పురస్కారం లభించింది. బెంగళూరు కావ్యశ్రీ ఛారిటబుల్ ట్రస్టు, విజయపుర యుగదర్శిని మహిళా ఫౌండేషన్ విజయపురలో సంయుక్తంగా నిర్వహించిన కావ్య సంభ్రమ కార్యక్రమంలో రామప్పకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు జి.శివణ్ణ, ఫౌండేషన్ అధ్యక్షురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కారిగనూరు హత్యకేసులో 9మంది అరెస్టు

రామప్పకు పురస్కారాన్ని ప్రదానం చేసిన నిర్వాహకులు

హొసపేటె, న్యూస్‌టుడే: స్వల్ప కారణానికి హొసపేటె తాలూకా కారిగనూరులో ఈ నెల 18న జరిగిన మాబూసాబ్ అనే వ్యక్తి హత్య కేసులో 9మంది నిందితులను గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు. హత్య జరిగిన తర్వాత నిందితులు పరారయ్యారు. డీఎస్పీ తళవార్ మంజునాథ్ నేతృత్వంలో ఐదుగురు సీఐల నేతృత్వంలో ఏర్పాటు చేసి బృందం నిందితులను అరెస్టు చేశారని ఆదివారం ఎస్పీ జాహ్నవి తెలిపారు. నిందితుల్లో కారిగనూరు వాసులైన భంగి హనుమంత, చరణ్, హులిగెమ్మ, రాఘవేంద్ర, చంద్రశేఖర్, గురయ్య, దర్శన్, మాలింగప్ప బాగలకోటె జిల్లా చిక్క ఆదాపురవాసి గురుసిద్ధయ్య ఉన్నారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని

బళ్లారి గ్రామీణ: కన్నడ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కలబురగిలో ఏర్పాటు చేసిన విభాగ స్థాయి నృత్య పోటీల్లో నగర విద్యార్థిని విజయం సాధించింది. శ్రీకళాంజలి నాట్య అకాడమీ నృత్య కళాకారిణి దీక్ష భరతనాట్యంలో ఉత్తమ ప్రతిభ చాటిందని నాట్యాచారిణి శ్రీజారెడ్డి తెలిపారు. వచ్చే నెలలో బెంగళూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు బాలిక ఎంపికైందన్నారు. ఈ సందర్భంగా దీక్షను అకాడమీ విద్యార్థులు, పోషకులు అభినందించారు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

21-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1614.26	1628.48
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	101	780
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	17,183	7,145
నీటి నిల్వ (టి.ఎం.సి)	46.686	88.466

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

ఆలోచనలు రేకెత్తించే విజ్ఞాన వనం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: రాష్ట్ర చట్ట సభల శీతాకాల సమావేశాలను నిర్వహించిన బెల్గాంలోని సువర్ణసౌధ భవన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజ్ఞానవనం విద్యార్థుల్లో ఆలోచనలను రేకెత్తిస్తోంది. సువర్ణసౌధకు సమీపాన సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో గణిత, భౌతిక, జీవ, భూగోళశాస్త్ర విషయాలకు సంబంధించిన 22 ఉపకరణాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులు విజ్ఞాన విషయాలకు సంబంధించిన సూత్రాలను కేవలం పుస్తకాల్లో చదవడమే కాకుండా మైదానంలో నేరుగా ప్రయోగాలను నిర్వహించి జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. తెలుపు రంగులో లీనమయ్యే సప్త వర్ణాల సాధనం, కన్వేయర్ బెల్ట్ పనిచేసే విధానాన్ని వివరించే సాధనం తదితరాలు ముఖ్యమైనవి. అంతేకాకుండా రసాయనిక శాస్త్రానికి సంబంధించిన విషయాలను కూడా ప్రయోగాల ద్వారా తెలుసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. సువర్ణసౌధకు విచ్చేసిన వేల మంది విద్యార్థులు విజ్ఞానవనాన్ని సందర్శించారు. ఈ విజ్ఞాన వనాన్ని వారం తప్ప రోజులలో ఏడాది పొడవునా విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు.

వేగంగా తిరిగినప్పుడు ఏర్పడే అయస్కాంత క్షేత్రాన్ని తెలిపే సాధనం

విద్యార్థులను ఆకట్టుకొనే విజ్ఞాన ప్రయోగాలు

ప్రయోగాల ద్వారా నేర్చుకొనే జ్ఞానం శాశ్వతం

తరగతి గదుల్లో పుస్తకాలను చదివి నేర్చుకొనే విజ్ఞానానికి తోడు మైదానంలో ప్రయోగాల ద్వారా సంగ్రహించే విషయాలు శాశ్వతంగా జ్ఞాపకం ఉంటాయని ప్రత్యక్షంగా తెలుసుకున్నాం. **- సృష్టి, శిరగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని**

24న కిష్కింధ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి నాగభూషణ, రిజిస్ట్రార్ యశ్వంత్ భూపాల్ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: కిష్కింద విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం ఈ నెల 24న బళ్లారి-సిరుగుప్ప రహదారిలోని మౌంట్ వ్యూ క్యాంపస్‌లో నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి డా.టి.ఎన్.నాగభూషణ తెలిపారు. ఆదివారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉపకులపతి మాట్లాడుతూ ఈ విద్యాలయం 2023 ఆగస్టులో మౌంట్ వ్యూ క్యాంపస్‌లో 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభమైంది. ప్రస్తుతం యూజీ, పీజీతో పాటు 2400మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. మొదటిసారిగా ఎం.బి.ఎ., ఎం.సి.ఎ విద్యార్థులు రెండేళ్ల కోర్సు పూర్తి కావడంతో స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొత్తం 80 మంది విద్యార్థులకు గాను 50 మంది విద్యార్థులు క్యాంపస్‌లో ఎంపికయ్యారు. స్నాతకోత్సవానికి గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవం సందర్భంగా సువర్ణగిరి విరక్త మఠం సిద్ధలింగప్ప మహాస్వామికి గౌరవ డాక్టరేట్ అందజేస్తున్నట్లు తెలిపారు.

30న అల్లీపురం మహదేవ తాత రథోత్సవం

సద్గురు మహదేవతాత స్వామికి విశేష అలంకరణ

బళ్లారి, న్యూస్‌టుడే: నగర శివారులో వెలిసిన అల్లీపురం మహదేవ తాత రథోత్సవం సందర్భంగా మఠంలో ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 30న మంగళవారం బ్రహ్మముహూర్తంలో మంగళ కలశపూజలు, వీరగాసె నృత్యం, గంగా పూజలు, ఉదయం 5 గంటలకు మహదేవ తాత మడితేరు ప్రారంభమౌతుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 4.40లకు జానపద నృత్యం, మంగళవాద్యం, అనంతరం తాత మహారథోత్సవం నిర్వహించనున్నారు. 31న బుధవారం సాయంత్రం 4గంటలకు మహదేవతాత మహారథోత్సవం ధార్మిక కార్యక్రమాలు ముగుస్తున్నట్లు ట్రస్ట్ సభ్యుడు చెన్నబసవస్వామి తెలిపారు.

బాలాంజనేయుడికి విశేష పూజలు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: రామనామక్షేత్రం బాలాంజనేయస్వామి మఠంలో ధనుర్మాసం పురస్కరించుకుని స్వామి వారికి విశేష పంచామృతాభిషేకం చేశారు. పుష్పాలు, రజతకవచంతో అలంకరించారు. భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పఠనం చేశారు. మఠం కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

రంజింపజేసిన అల్లమప్రభు

అల్లమ ప్రభు నాటకంలోని సన్నివేశం

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: కావ్యకళా ట్రస్ట్, నాట్యరాణి కళాసంఘం సంయుక్తాధ్వర్యంలో కొట్టూరు స్వామి మఠంలో ప్రదర్శించిన మాయమదమర్ధన అల్లమప్రభు అనే నాటక ప్రదర్శన ప్రేక్షకులను రంజింపజేసింది. కర్ణాటక చరిత్ర అకాడమీ జిల్లా అధ్యక్షుడు టి.హెచ్.ఎం బసవరాజు మృదంగవాద్యాన్ని వాయిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కళలు అంతరించిపోకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. చారిత్రక, భక్తిప్రధాన నాటకాలను నవతరానికి అందించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం నృత్య, రంగ గీతాలాపన, నాటక ప్రదర్శన విశేషంగా ప్రేక్షకులను ఆకట్టుకుంది. అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో రాజ్యోత్సవ పురస్కార గ్రహీత ఆదోని వీణ, వరలక్ష్మీ, ఉమారాని ఇళకల్, బస్సు బసవరాజు, సీనియర్ నటుడు రమేష్‌గౌడ పాటిల్, తిమ్మనగౌడ, కళాకారులు, నగరప్రజలు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కర్ణాటక చరిత్ర అకాడమీ అధ్యక్షుడు బసవరాజు, వీణ, వరలక్ష్మీ

నేత్రపర్వంగా అయ్యప్ప పూజలు

హోమం చేస్తున్న అయ్యప్ప స్వాములు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: ధర్మశాస్త్రమండలి నేతాజీనగర్ ఆధ్వర్యంలో గణపతి దేవస్థానం ఆవరణలో 26 వార్షిక అయ్యప్ప మండల పూజలు నేత్రపర్వంగా చేపట్టారు. గణపతి, అయ్యప్పస్వామి, సుబ్రహ్మణ్యస్వాములకు పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. పుష్పాలతో అలంకరించారు. హోమాలు చేపట్టారు. మాలధారులు అయ్యప్ప కీర్తనలు ఆలపించారు. భక్తులందరికీ అయ్యప్ప సేవాసమితి సభ్యులు అన్నదానం చేశారు. కళాబృందం చేసిన నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కళాకారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గురుస్వామి నాగేశ్‌గుప్ప, శీనస్వామి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, అయ్యప్ప మాలధారులు, నేతాజీ నగర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు..బాధితుల కన్నీళ్లు

● జిల్లాలో తగ్గని రహదారి ప్రమాదాలు ● అతి వేగంతో అనర్థాలు

ప్రమాదానికి కారణమైన టిప్పర్

బళ్లారి, న్యూస్‌టుడే: ప్రమాదాలను నివారించడానికి పోలీసుశాఖ వివిధ అవగాహన కార్యక్రమాలు, చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ గనినాడు జిల్లాలో వాహన ప్రమాదాలు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో ఐదు తాలూకాల్లో వాహనాల సంఖ్య కూడా ఏటా భారీగా పెరుగుతోంది. ముఖ్యంగా మైనర్లు పెద్దలతో పాటు ద్విచక్ర వాహనాలు, కార్లు తదితర వాహనాలను తీసుకుని రోడ్లపైకి రావడంతో ప్రమాద కేసులు సర్వసాధారణమయ్యాయి. ఒకవైపు మృతి చెందిన కుటుంబాల్లో రోదనలు, మరోవైపు ప్రమాదంలో కొందరు అవయవాలు కోల్పోయి జీవితాంతం దివ్యాంగులుగా జీవించే పరిస్థితి నెలకొంది.

ప్రమాద వివరాలు

జిల్లాలో 2021 నుంచి నేటి వరకు 3,277 ప్రమాదాలు కేసులు నమోదయ్యాయి. వాటిలో 1,324 మంది మృతి చెందగా, 4142 మంది గాయపడ్డారని పోలీసుశాఖ ద్వారా బెళగావి విధానసభ సమావేశాలకు అందజేసిన లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. 2021లో 1150 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా వాటిలో 437 మంది మృతిచెందారు. 1401 మంది గాయపడ్డారు. 2022లో 528 రోడ్డు ప్రమాదాల్లో 226 మంది మృతి, 628 మందికి గాయాలు,. 2023లో 575 ప్రమాదాల్లో 252 మంది మృతి చెందగా,730 మందికి గాయపడ్డారు. 2024లో 499 రోడ్డు ప్రమాదాల్లో 195 మంది మృతి, 711 మందికి గాయాలు,. 2025లో అక్టోబరు వరకు మొత్తం 471 రోడ్డు ప్రమాదాలు జరగ్గా 181 మంది మృతి చెందగా 620 మంది గాయపడ్డారు.

ప్రధాన కారణాలు ఇవీ..

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం, అతి వేగం, శిరస్త్రాణం లేకుండా ద్విచక్ర వాహనాలపై వెళ్లడం, మైనర్లకు.. తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వడం, అడ్డదిడ్డంగా నడపడం, మద్యం తాగి డ్రైవింగ్ చేయడం తదితరాల్ని పోలీసుశాఖ పేర్కొంది.

● నగరం, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో గుంతల రోడు.

● పగటి పూట లారీలు, టిప్పర్లు నగరంలో యథేచ్ఛగా తిరుగుతుండడం

● ఇటీవల బెళగల్లు క్రాస్‌లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళను టిప్పర్ ఢీకొనడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. ● 20 రోజులు క్రితం బైపాస్‌లో ఎడ్లబండిని ఢీకొనడంతో రైతు సహా రెండు ఎద్దులు మృతి చెందాయి.

● చెరుకుంట వద్ద మద్యం తాగి బైక్ నడుపుతున్న వ్యక్తి కిందపడి ప్రాణాలు కోల్పోయాడు.

ముందు జాగ్రత్త చర్యలు

ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం తప్పక ధరించాలి. కారు డ్రైవింగ్‌లో విధిగా సీటు బెల్టు వేసుకోవాలి. మద్యం తాగి డ్రైవింగ్ చేయకూడదు. అతి వేగం సరికాదు, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

జొన్న సొప్ప పొట్టు తెలంగాణకు తరలింపు

పొట్టును బస్తాల్లో నింపి లారీల్లో తరలింపు

యంత్రం ద్వారా జొన్న సొప్పను పొట్టుగా మారుస్తున్న వైనం

కంప్లి, న్యూస్‌టుడే: తుంగభద్ర కుడి దిగువ కాలువ పరిధి ఎమ్మిగనూరు ప్రాంతంలో రైతులు జొన్న పంటను అధికంగా పండిస్తారు. ప్రస్తుతం జొన్న పంట చేతికొచ్చింది. రైతులు మామూలుగా జొన్న సొప్పను పశువుల మేతకు వినియోగిస్తారు. జొన్న సొప్ప పొట్టుకు తెలంగాణలో రైతులు పశువులకు వినియోగిస్తుండడంతో ఇక్కడి జొన్న సొప్పకు డిమాండు ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొరపాటి నరసింహారెడ్డి గత రెండు మూడేళ్లుగా ఇక్కడి జొన్న సొప్పను ఎకరానికి రూ. 1500 చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడే స్థలాన్ని అద్దెకు తీసుకుని యంత్రం ద్వారా సొప్పను పొట్టుగా మార్చి బస్తాల్లో నింపి లారీల్లో తెలంగాణకు తరలిస్తున్నారు. ఈ సంవత్సరం దాదాపు 250 ఎకరాల్లో జొన్న సొప్పను కొనుగోలు చేశాను. తెలంగాణలో గోశాలల వారు, రైతులు టన్ను పొట్టును రూ.12 వేలకు కొనుగోలు చేస్తారని నరసింహ తెలిపారు. పశువులకు ఏడాది పొడవునా పచ్చి మేత దొరకదు. రసాయనిక ఎరువులు అధికంగా వాడే వరి పంట గడ్డి కన్నా ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు ఉండే జొన్న సొప్ప పశువులకు పౌష్టికాహారం. సొప్పను పొట్టుగా మార్చడం వల్ల త్వరగా జీర్ణమవుతుందని కంప్లి పశు వైద్యాధికారి కె.యు.బసవరాజ్ తెలిపారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTHAPURAMU
O.S.No: 469/2016
Between:
Badige Fazullulah ......**Plaintiff**
and
Badige Mohammad Naser and others ...**Defendants**
Notice to the Defendant No : 9, 10, 11 and 12
D9. Muzibullaha S/o Abdul Gani Sab, Muslim, Retired employee,
D10. Amreen D/o Muzibullaha,
D11. Fareen D/o Muzibullaha,
D12. Vaseem S/o Muzibullaha,
9 to 12 are R/of Behind Azad Floor Mill, Taj Peer Lay-out, Chitradurg, Karnataka.
పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 20-01-2026వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదురు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
D.Shyam Sunder, K.Mohan Rao
Advocates, Anantapur
Cell: 9440258700

(c) eenadu

జుమాది ఐల్యాండ్ ఇసుక తీరం

కొబ్బరి చెట్లతో కప్పేసిన ఐల్యాండ్


దీవిలో రిసార్ట్, స్టేహోంలు

అరేబియా దరి.. అందాల బరి

■ జుమాది ఐల్యాండ్‌కు సందర్శకుల తాకిడి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: క్రిస్మస్, నూతన సంవత్సరం వేడుకలు దగ్గర పడుతుండటంతో రాష్ట్రంలోని అరేబియా సముద్రం తీరంలోని బీచ్‌ల్లోని రిసార్ట్‌లు, స్టేహోంలతో పాటు సముద్రం మధ్యలో ఉన్న దీవుల్లో వేడుకలు జరుపుకొనేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు. ఇప్పటికే ఆయా బీచ్‌లలో ఉన్న రిసార్ట్‌లు, హోటళ్లు, స్టేహోంలలో గదులు 70 శాతం భర్తీ అయినట్లు పర్యాటక శాఖ అధికారులు వెల్లడించారు. మరోవైపు ఉడుపికి 40 కిలోమీటర్ల దూరంలో బ్రహ్మావర దగ్గరలో అరేబియా సముద్రంలో ఉన్న జుమాది ఐల్యాండ్‌కు వెళ్లేందుకు పర్యాటకులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. అక్కడ ఉన్న రిసార్ట్, స్టేహోంలను బుక్ చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. కొబ్బరి చెట్లతో కూడిన దీవిలో పర్యాటకుల కోసమే రిసార్ట్‌లు, స్టేహోంలు ఉన్నాయి. బ్రహ్మావర నుంచి పడవలో జుమాది ఐల్యాండ్‌కు వెళ్లాలి. రాత్రిళ్లు అక్కడ ఉండేందుకు పర్యాటకులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే పడవలు అక్కడికి సంచరిస్తాయి. దీవిలోకి వెళ్లిన పర్యాటకులు ప్రత్యేకంగా పడవ విహారం చేసే అవకాశం ఉంది. సముద్రతీరంలో కూర్చొని ప్రకృతి అందాలను తిలకించేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. నూతన సంవత్సరం వేడుకలు దీవిలో జరుపుకొనేందుకు ఆసక్తి చూపుతున్న పర్యాటక శాఖ పరిమిత సంఖ్యలో అక్కడికి అనుమతిస్తారు. ప్రస్తుతం జుమాది ఐల్యాండ్‌లో అన్ని రకాల ఆహార పదార్థాలను పర్యాటకులకు అందుబాటులో ఉంచుతారు. పర్యాటకుల అభిరుచులకు తగ్గినట్లుగా కాటేజీలను ఏర్పాటు చేశారు. మరోవైపు వచ్చే పర్యాటకుల కోసం నిత్యం సురక్షిత చర్యలు చేపట్టి ఉంటారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: వేగంగా సంచరిస్తున్న ద్విచక్ర వాహనం హంప్ వద్ద ఎగిరి కిందపడి వాహనదారుడు గోపిమోహన్(32) మృతి చెందిన ఘటన శనివారం రాత్రి వైట్‌ఫీల్డ్ పోలీసుఠాణా పరిధిలో జరిగింది. రాత్రి 9.30 గంటలకు సర్జాపుర ప్రధాన రహదారిలోని సూలికుంటె బస్టాండు వద్ద ఉన్న హంప్‌ను గమనించకుండా వేగంగా వాహనం నడపడటంతో ఎగిరి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

చావులోనూ వీడని బంధం

బెంగళూరు(యలహంక): జీవితాంతం కలిసి జీవించిన భార్యాభర్తలిద్దరూ చావులో నూ కలిసే వెళ్లారు.. ఈ సంఘటన ఆదివారం ఉదయం యలహంక ఉపనగర పోలీసుఠాణా పరిధిలో జరిగింది. అనంతపుర నివాసి టి.సి.వెంకటగిరియప్ప (88) ఉదయం ఆరుగంటలకు మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే భార్య ఆర్.ఎం.నాగరత్నమ్మ (82) గుండెపోటుతో మృతి చెందారు. వారిద్దరి ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. చింతామణి ప్రాంతానికి చెందిన టి.సి.వెంకటగిరియప్ప రెవెన్యూశాఖలో సర్వేయరుగా 28 ఏళ్లు పని చేశారు. వయస్సుతో వచ్చిన వ్యాధుల కారణంగా ఆయన మృతి చెందారు. ఈ విషయం తెలిసి భార్య గుండెపోటుతో మృతి చెందారు. మృతికి స్థానిక శాసనసభ్యుడు విశ్వనాథ్, భాజపా నేతలు చొక్కనహళ్లి వెంకటేశ్, డాక్టర్ శశికుమార్ సంతాపం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: తలఘట్టపుర పోలీసుఠాణా పరిధిలోని బాలాజి లేఔట్ నివాసి శోలిమండూల్ (32) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీరు చక్రవర్తిని ఆమె ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ఇటీవల భార్యాభర్తలు తరచూ గొడవ పడుతున్నారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆమె ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన తరువాత మృతి చెందారు. అత్తింటి వారి వరకట్నం వేధింపులకు తమ కుమార్తె మృతికి కారణమని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ స్నేహితుడి వేధింపులు

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: కష్టకాలంలో ఓ మహిళకు సాయం చేసిన ఆన్‌లైన్ స్నేహితుడు ఆఖరి ఆమెను లైంగిక సుఖం కోసం తన వద్దకు రావాలనడంతో అతనిపై రాజగోపాలనగర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వివాహమై పిల్లలు ఉన్న 38 ఏళ్ల వయస్సు కలిగిన మహిళకు సామాజిక మాధ్యమం ద్వారా పారితోశ్ యాదవ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. ఇద్దరి మధ్య స్నేహం పెరిగింది. ఇటీవల గ్యాస్ సిలిండర్ లీకేజీ అయ్యి పేలడంతో ఆమె కుమారుడు గాయపడ్డారు. ఆ సమయంలో స్నేహితుడి నుంచి రూ.30వేల నగదు అప్పు తీసుకున్నారు. దాన్ని సాకుగా తీసుకుని అతడు ఆమెను లైంగిక వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టాడు. ఈ విషయం భర్తకు తెలిసి ఇద్దరి మధ్య గొడవ జరగ్గా ఆమె పీణ్యాలో ఉన్న స్నేహితురాలు ఇంటికి వెళ్లారు. అక్కడ ఆమె ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా స్నేహితులు కాపాడారు. వారి సలహా మేరకు నిందితుడిపై పోలీసుఠాణాలో ఆమె ఫిర్యాదు చేశారు.

కార్వార తీరంలో ఆలివ్ రిడ్లీ గుడ్లు

కార్వార, న్యూస్‌టుడే: కార్వార తాలూకా మంజుగుణి సముద్ర తీరంలో అరుదైన ఆలివ్ రిడ్లీ సముద్ర తాబేలు గుడ్లను స్థానిక మత్స్యకారులు గుర్తించారు. ఏటా కార్వార తీర ప్రాంతంలో ఆలివ్ రిడ్లీ తాబేళ్లు గుడ్లు పొదిగేందుకు వస్తుంటాయి. కొన్నేళ్లుగా అవి ఈ తీరానికి రాలేదు. ఈ ఏడాది వచ్చి పెట్టిన గుడ్లను అటవీ శాఖ అధికారులు సంరక్షించారు. గుడ్లు పొదిగి వెళ్లిన చోట ఇనుప కంచెను, హెచ్చరిక ఫలకాలను ఏర్పాటు చేశామని అటవీశాఖ అధికారులు రవిశంకర్, జయేశ్ తెలిపారు.

నగదు ప్రోత్సాహకాన్ని అందుకుంటున్న మత్స్యకారుడు. అంతర్ చిత్రంలో గుడ్లు

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ఉమా దర్శించుకున్నారు. న్యాయమూర్తికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కుటుంబసభ్యులతో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ఉమా

నిందితులకు దేహశుద్ధి

మండ్య, న్యూస్‌టుడే: రామలక్ష్మణులు ఉన్న నాణేలు దగ్గర ఉంచుకుంటే అదృష్టం వరిస్తుందని నాగమంగల పట్టణం బస్టాండ్‌లో ఒక వ్యక్తిని నమ్మించి, రూ.లక్ష డిమాండ్ చేసిన ఇద్దరు వంచకులకు స్థానికులు దేహశుద్ధి చేశారు. నిందితులను నాగమంగల తాలూకా శికారిపురకు చెందిన యశవంత రావు, సుధీర్‌గా గుర్తించారు. వీరితో ఉన్న మరో యువకుడు తప్పించుకుని పరాయ్యాడు. వంచకులను నాగమంగల ఠాణా పోలీసులకు అప్పగించారు. తామ్రపు నాణేలను వీరే ముద్రించి వంచనలకు పాల్పడుతున్నారని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

నిందితులు తెచ్చిన నాణేలు

ఆ ఇంట్లో రక్తాన్ని ఎవరూ చల్లలేదు

మండ్య, న్యూస్‌టుడే: మద్దూరు తాలూకా హొంబాళే గౌడనదొడ్డి గ్రామంలో సతీశ్, సౌమ్య దంపతుల నివాసంలో రక్తం మరకలు కనిపించాయి. వారిని పలకరించేందుకు స్థానికులు వచ్చినప్పుడు హాల్, స్నానాల గది, టీవీ, ఫ్యాను రెక్కలపై రక్తం చుక్కల్ని చూసి భయపడ్డారు. వారింట్లో ఏదో హత్య జరిగిందని లేదా ఏదైనా మాటామంత్రం చేశారని భయపడ్డ వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రక్తం మరకల నమూనాను పోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించారు. అది ఇంటి యజమాని సతీశ్ రక్తమేనని గుర్తించారు. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఆయనకు రక్తం పలచన చేసేందుకు వైద్యులు ఇచ్చిన ఔషధాన్ని వినియోగిస్తున్నారు. శరీరంపై అయిన చిన్న గాయం నుంచి కారిన రక్తమే అన్నిచోట్లా పడింది. ఆయా చోట్ల కనిపించిన రక్తం తనదే నని సతీశ్ కూడా గుర్తించలేక పోయారు. దర్యాప్తు అనంతరం నివేదిక రావడంతో గ్రామస్థులు అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

'అన్ని మతాలు సమానమే'

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: రాజ్యాంగం ప్రకారం అన్నివర్గాల ప్రజలకు మత స్వేచ్ఛ ఉంది, అన్నిమతాలను సమానంగా గౌరవించి లౌకిక వాదానికి పెద్దపీట వేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం బెంగళూరు ఆర్చ్ బిషప్ హౌస్‌లో ఏర్పాటు చేసిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి దూత ఏసుక్రీస్తు బోధనలను అందరూ గౌరవిస్తారని గుర్తు చేశారు. క్రైస్తవ సంస్థలు సామాజిక సేవలో ముందంజలో ఉన్నట్లు చెప్పారు. సమాజంలో శాంతి అవసరమని, అందువల్ల తాము అన్ని మతాలను సమానంగా గౌరవిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్చ్ బిషప్ డాక్టర్ పీటర్ మాచోడ్, విధానపరిషత్తులో ప్రతిపక్ష నేత చలవాది నారాయణస్వామి, తదితరులు హాజరయ్యారు.

ఆర్చ్ బిషప్ హౌస్‌లో జరిగిన ముందస్తు క్రిస్మస్ వేడుకలకు హాజరైన ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఆర్చ్ బిషప్ డాక్టర్ పీటర్ మాచోడ్ తదితరులు

ఎమ్మెల్యే, 17 మందిపై కేసు

బెంగళూరు(యశ్వంతపుర),న్యూస్‌టుడే: నిబంధనలు అమలులో ఉన్న వాటిని ధిక్కరించి కోడి పందేలు నిర్వహించారనే ఆరోపణపై పుత్తూరు శాసనసభ్యుడు అశోక్ రైతో పాటు 17 మందికి వ్యతిరేకంగా దక్షిణ కన్నడ జిల్లా విట్లా పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి సంప్రదాయం ప్రకారం కోడి పందెం పోటీలను శాసనసభ్యుడు అశోక్ రై ప్రారంభించారు. కోడి పందేలు నిర్వహించకూడదని స్థానిక పోలీసులు ఆంక్షలు విధించారు. వాటిని ధిక్కరించి పందెం నిర్వహించారనే ఆరోపణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

'శక్తి'పై బకాయిల గుదిబండ

బెంగళూరు (రామమూర్తినగర), న్యూస్‌టుడే: శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకు 600 కోట్ల జీరో టికెట్లను ఆర్టీసీ, బీఎంటీసీలు మంజూరు చేశారు. జీరో టికెట్ల జారీకి సంబంధించి బీఎంటీసీ, ఇతర మూడు కేఎస్ఆర్టీసీ శాఖలకు ప్రభుత్వం రూ.4,006.47 కోట్ల బకాయిలు మిగుల్చుకుంది. గ్యారంటీ పథకాలను జారీ చేయడంతో ఖజానా ఖాళీ అయిందని విపక్షాలు విమర్శిస్తూ వస్తుండగా, తమకు ఇచ్చిన హామీలను కూడా ప్రభుత్వం విస్మరించిందని ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఆరోపిస్తున్నారు. తమ సంస్థలకు బకాయిలు విడుదల చేయడంతో పాటు, వేతన సవరణ, పింఛను పెంపు, తదితరాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ సమస్యలకు స్పందించకపోతే, సమ్మెకు పిలుపు ఇవ్వాలని రవాణాశాఖలోని కార్మిక సంఘాలు ఇప్పటికే తీర్మానించాయి.

చలి సమీరంలో.. విరులరంజితం


బెనగానహళ్లి చెరువు చుట్టూ గులాబీలతో కూడిన రమణీయమైన దృశ్యం

బెంగళూరు(బాణసవాడి),న్యూస్‌టుడే: శీతాకాలమొస్తే బెంగళూరు నగరంలోని పలు ప్రాంతాలు పూల బాటలుగా మారుతున్నాయి. మొన్నటి వరకు పచ్చటి ఆకులతో ఉన్న చెట్లు ఆకులు రాలి గులాబీ రంగు పూలతో నిండిపోతున్నాయి. ఆ చెట్టు వద్దకు వెళ్తే సువాసన వెదజల్లుతోంది. మనసుకు ఆహ్లాదకర అనుభూతి కలుగుతుంది. కేవలం ఉద్యానవనాలకు మాత్రమే పరిమితమైన గులాబీ రంగులతో పూలతో కూడిన విదేశీ జాతి చెట్లు వివిధ ప్రాంతాల్లో రహదారి పొడవు ఉన్నాయి. వైట్‌ఫీల్డ్, బెనగానహళ్లి, ఇందిరానగర, దొమ్మలూరు, పాత విమానాశ్రయం రహదారితో పాటు కబ్బన్‌పార్కులో గులాబీపూల మొక్కలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఈ చెట్లకు పూలు తప్ప ఆకులు ఉండవు. బెనగానహళ్లి చెరువు చుట్టూ రంగు పూలచెట్లు ఉండటంతో ఈ ప్రదేశం ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. కొందరు డ్రోన్ కెమెరాల ద్వారా ఛాయాచిత్రాలు తీసుకొని మురిసిపోతుంటారు. వాటితో పాటు బీడీఏ కూడలిలో పసుపుపచ్చ రంగుతో కూడిన విరుల సోయగాలను వాహనదారులను ఆకట్టుకుంటున్నాయి. ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో మాత్రమే పూల అందాలు ప్రజలకు ఆనందాన్ని పంచుతున్నాయి.

ఏఈసీఎస్ లేఔట్ రహదారి పూలవర్ణమయం

వైట్‌ఫీల్డ్ రహదారిలో పూల సోయగం

'నిధులు ఇవ్వకపోతే రాజీనామా చేస్తా'

కార్వార, న్యూస్‌టుడే: ఉత్తర కన్నడ జిల్లాలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేస్తానని సతీశ్ శైల్ ప్రకటించారు. గత ఎన్నికల ప్రచార సందర్భంలో ఇక్కడ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు తీసుకువస్తానని హామీ ఇచ్చానని, త్వరలో నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో కొంత ఊరట కలిగిందన్నారు. ఈ సారి బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోతే, తన పదవికి రాజీనామా చేస్తానని స్థానిక దేవాలయంలో ఆయన ప్రకటించారు.

తాకట్టు ఆభరణాల్లో తేడాలపై నిరసన

మైసూరు, న్యూస్‌టుడే: హినకల్ కెనరా బ్యాంకులో తాకట్టు పెట్టిన ఆభరణాల తూకంలో తేడా వచ్చిందని ఆరోపిస్తూ కొందరు ఖాతాదారులు ధర్నాకు దిగారు. తాను తాకట్టు పెట్టిన గొలుసులో 85 బంగారు పూజలు ఉండగా, ఇప్పుడు 77 మాత్రమే ఉన్నాయని గాయత్రి అనే మహిళ ఆరోపించింది. తాను 19 గ్రాముల గొలుసును తాకట్టు పెడితే ఇప్పుడు 16 గ్రాములు మాత్రమే ఉందని ఆమె పేర్కొంది. ఆమెకు మద్దతుగా పలువురు ఖాతాదారులు తాము కూడా ఇదే విధంగా మోసపోయామని ఆరోపించారు. బ్యాంకులో ఆచారి అశ్విన్‌పై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో విజయనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	70
క్యారెట్-	60
బీరకాయలు-	55
క్యాబేజి-	50
క్యాలీఫ్లవర్(ఒక్కొటి)-	30
సొరకాయ-	55
దొండకాయలు-	45
పొట్లకాయ-	45
పచ్చి మిరపకాయలు-	70
కాకర కాయలు-	55
టమాటా(నాటు)-	55
టమాటా(సాధారణ)-	45
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	45
ఉల్లి(మేలురకం)-	40
ఉల్లి(సాధారణ)-	35
వెల్లుల్లి-	160
సాంబారు ఉల్లి-	165
బీట్‌రూట్-	55
వంకాయలు-	55
బెండకాయలు-	55
ముల్లంగి-	55
నిమ్మకాయ-	120

పండ్లు, ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	385
సిమ్లా ఆపిల్-	265
గ్రీన్ ఆపిల్-	325
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	65
బొప్పాయి-	35
ఆరంజి-	95
బత్తాయి-	65

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

కాంగ్రెస్ నాయకునిపై ఫిర్యాదు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: అన్నభాగ్య పథకానికి కేటాయించిన బియ్యాన్ని యలచేనహళ్లి కాంగ్రెస్ నాయకుడు అలీమ్ నల్లబజారుకు తరలిస్తున్నారని కేఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. లబ్ధిదారుల నుంచి నేరుగా బియ్యాన్ని కొనుగోలు చేసి, దాన్ని ఎక్కువ ధరకు నల్ల బజారులో విక్రయించుకుంటున్నారని హారోహళ్లి ఠాణాలో పార్టీ ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

గుడ్డుతో చేసిన కేకు తినిపించారని ఆరోపణ

మండ్య, న్యూస్‌టుడే: మండ్యలోని పోదార్ పాఠశాలలో తాము వద్దన్నప్పటికీ గుడ్డుతో చేసిన కేకును బలవంతంగా తినిపించారని కొందరు జైన విద్యార్థులు ఆరోపించారు. పాఠశాలకు శిల్పా స్వాడ్లి ప్రిన్సిపల్‌గా వచ్చినప్పటి నుంచి ఇతర ధర్మాల వారిని కించపరుస్తూ మాట్లాడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాల వద్దకు వచ్చిన విద్యార్థుల తల్లిదండ్రులు ధర్నాకు దిగారు.

తండ్రీకొడుకులపై దాడి

చిక్కమగళూరు, న్యూస్‌టుడే: చిన్న విషయానికే కడూరు తాలూకా బళ్లేకెరె గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులపై స్థానికులకు కొందరు మారణాయుధాలతో దాడి చేసి గాయపరచి పరారయ్యారు. దాడిలో తీవ్రంగా గాయపడిన విజయకుమార్, ఆయన కుమారుడు అభిషేక్‌లను చికిత్స కోసం కడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. బైకులో వచ్చిన సునీల్, రంగ అనే యువకులు బైకులో రాగా, ఊళ్లో ఉన్న మరికొందరు వారికి సహకరించారు. పరారీలో ఉన్న నిందితుల కోసం కడూరు ఠాణా పోలీసులు గాలింపు తీవ్రం చేశారు.

ఏడాదిలో 700 మంది మృతి

బెంగళూరు(యలహంక),న్యూస్‌టుడే: బెంగళూరు నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 700 మంది మృతి చెందారు. గతేడాదితో పోలిస్తే మృతుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు సంచార పోలీసు అధికారులు తెలిపారు. జనవరి నుంచి అక్టోబరు వరకు 4,098 ప్రమాదాలు జరిగాయి. అందులో 700 మంది మృతి చెందగా 1,600 మంది తీవ్రంగా గాయపడ్డారు. 2025లో కేవలం 642 మంది మృతి చెందినట్లు తెలిపారు. మృతుల్లో 60 శాతం మంది ద్విచక్రవాహనదారులు ఉండటం గమనార్హం.

నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు, బైక్ ఢీకొన్న దృశ్యం (పాతచిత్రం)

25న 45 విడుదల

కన్నడ ప్రముఖ హీరోలు శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి.శెట్టి కలిసి నటించిన మల్టీస్టారర్ చిత్రం '45' చిత్రం ఈనెల 25న దేశవ్యాప్తంగా విడుదల కానుంది. నగరంలో జరిగిన కార్యక్రమంలో చిత్రానికి సంబంధించిన టీజర్‌ను నగర పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్ సింగ్ విడుదల చేశారు. ముగ్గురు హీరోలు నటిస్తున్న చిత్రానికి దర్శకత్వం వహించినట్లు అర్జున్ జన్య తెలిపారు. చిత్రం ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రమోద్‌శెట్టి, సుధారాణి తదితరులు నటిస్తున్నారు.

'45' చిత్రం టీజర్ కార్యక్రమంలో ప్రముఖ హీరోలు శివరాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి.శెట్టి, పోలీసు కమిషనర్ సీమంత్‌కుమార్‌సింగ్

నయన మనోహర టీజర్ విడుదలలో చిత్ర బృందం

జస్ట్ యు చిత్రీకరణ

ఎక్సిసిట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న 'నయన మనోహర' చిత్రం టీజర్ ఇటీవల విడుదల చేశారు. హీరో ధర్మకీర్తిరాజ్ 25వ చిత్రం. ప్రముఖ సినీనటులు ప్రియాంకా ఉపేంద్ర, వినోద్‌ప్రభాకర్ తదితరులు కలిసి టీజర్ ఆవిష్కరించారు. టీజర్‌కు ప్రేక్షకుల నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని దర్శకుడు పునీత్ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో పలు దృశ్యాలను చిత్రీకరిస్తున్నట్లు తెలిపారు.

ఏఐ ఆధారంగా కూరగజ్జ పాట

ప్రేక్షకులను సంతోషపెట్టే 'సుఖీభవ' చిత్రంలో హీరోశరణ్ ఓ పాటకు గాత్రం అందించారు. వేద ఆర్యన్ ఫిలిమ్స్ బ్యానర్‌పై సంతోష్‌కుమార్, భార్గవి సంతోష్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. విభిన్నమైన కథ చిత్రమని, ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుందని దర్శకుడు ఎన్.కె.రాజేశ్ నాయుడు తెలిపారు. చిత్రానికి కథ, చిత్రకథ, సంభాషణ అందిస్తున్నారు. మహేంద్ర నాయక్, సుస్మిత నాయక్, వియాన్‌శిగ్దేతో పాటు గౌరవ్‌శెట్టి, శోభరాజ్, రవిశంకర్‌గౌడ, సునీల్ పురాణిక్, తుకాలిసంతు, మైత్రి జగ్గి తదితరులు నటిస్తున్నారు.

సుఖీభవ చిత్రంలో హీరో శరణ్, తదితరులు

- న్యూస్‌టుడే, బెంగళూరు(యశ్వంతపుర)

ల్యాండ్ లార్డ్ చిత్ర బృందం

జనవరి 23న ల్యాండ్‌లార్డ్ రాక

సారథి ఫిలింస్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'ల్యాండ్ లార్డ్' చిత్రం జనవరి 23న రాష్ట్రవ్యాప్తంగా విడుదల కానుంది. చిత్రానికి సంబంధించి యోగరాజ్‌భట్ రాసిన నింగవ్వ నింగవ్వ..ను ఇటీవల విడుదల చేశారు. అజనీశ్ లోక్‌నాథ్ సంగీతం అందించగా విజయ్‌ప్రకాశ్, అనన్యభట్ గానం చేశారు. చిత్రకథ అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని దర్శకుడు జడేశ్ తెలిపారు. దునియా విజయ్, రచితరామ్ తదితరులు నటిస్తున్నారు.

(c) eenadu

బెంగళూరు
● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

శంకరానంద మూర్తి విగ్రహావిష్కరణ

కాంగ్రెస్ సీనియరు నాయకుడు, కేంద్ర మంత్రి, దివంగత బి.శంకరానంద విగ్రహాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆవిష్కరించారు. ఆయన బెళగావి జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన నాయకుడని సీఎం గుర్తు చేసుకున్నారు. చిక్కోడి నుంచి పలుసార్లు ఎంపీగా ఎన్నికైన ఆయన విగ్రహావిష్కరణలో మంత్రులు లక్ష్మీ హెబ్బాళ్కర్, చెలువరాయస్వామి, ఎమ్మెల్యే ఐవాన్ డిసౌజా, శంకరానంద కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, బెళగావి

ధ్యానం ద్వారా ఉత్తమ ఆరోగ్యం

చిత్రదుర్గం: ప్రతి ఒక్కరూ ధ్యానం చేస్తూ ఒత్తిడి నుంచి బయటపడి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఎమ్మెల్సీ కేఎస్ నవీన్ పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటే జీవితాన్ని ఆనందభరితం చేసుకోవచ్చునని అభిప్రాయపడ్డారు. యోగా గురు పేమనాథ్ మాట్లాడుతూ వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీతలో యోగ, ధ్యానం గురించి లిఖించారన్నారు.

కర్ణాటక జట్టు

నేటి నుంచి హుబ్బళ్లిలో దివ్యాంగుల క్రికెట్ పోటీలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక అంధుల క్రికెట్, సమర్థనం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నుంచి హుబ్బళ్లిలో ప్రారంభం కానున్న ఇండస్ ఇండ్ బ్యాంక్ నాగేశ్ ట్రోఫీ అఖిలభారత అంధుల క్రికెట్ పోటీలో పాల్గొంటున్న కర్ణాటక జట్టుకు కెప్టెన్, వైస్‌కెప్టెన్‌లను ఆదివారం ప్రకటించారు. జట్టు వివరాలు : బసప్పవడ్డగోలు, ఎం.బసవరాజు-బెళగావి, ఎస్.కృష్ణమూర్తి-చిత్రదుర్గ, కొప్పళకు చెందిన గుడదప్ప ఎస్.అరకేరి, ఎ.మంజునాథ, మైసూరుకు చెందిన ఏఎస్ అభీ, భాస్కర్-బెంగళూరు, ఆర్.సునీల్-చిక్కమగళూరు, హుసేన్ బాషా, సుబ్రమణి-కోలారు, బరమ్‌గౌడ-హావేరి పాల్గొంటారు. ఈనెల 26 దాక జరిగే ఈ పోటీలో కర్ణాటక జట్టుకు బసవరెగౌడ కెప్టెన్‌గా, లోకేశ్ వైస్‌కెప్టెన్‌గా నియమితులయ్యారు. గ్రూపు-సీలో పాల్గొంటున్న కర్ణాటక జట్టు లీగ్‌దశలో మహారాష్ట్ర, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, కేరళ జట్లతో తలపడనుంది. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి చంద్రకాంత్ మాట్లాడుతూ పోటీలకు రాష్ట్ర జట్టు సిద్ధంగా ఉందని, ఆటగాళ్లు చక్కని శిక్షణ పొందారని తెలిపారు.

హోసూరు ఖబర్లు

మెగా రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న మాదేశ్వరన్, తదితరులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరులోని మీరా మహల్‌లో మేయర్ ఎస్.ఎ.సత్య నేతృత్వంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో 1200 మంది రక్తదానం చేశారని, వారికి సర్టిఫికెట్లు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. హోసూరు ఎమ్మెల్యే వై.ప్రకాశ్, ఉప మేయర్ సి.ఆనందయ్య, నాయకులు చెన్నీరప్ప, గురుస్వామి, యువరాజ్, కె.నారాయణస్వామి, పాతకోట శ్రీనివాసన్, వీరారెడి, గజేంద్రప్ప, అలసపల్లి లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. హోసూరు బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు, వరం, మీరా ఆసుపత్రి డాక్టర్లు పాల్గొన్నారు.

విమానాశ్రయం వద్దంటూ రైతుల ఆందోళన

ప్రదర్శనలో బాలకృష్ణారెడ్డి, నరసింహన్, రైతులు

హోసూరు, న్యూస్‌టుడే : హోసూరు ప్రాంతంలో 12 గ్రామాలకు చెందిన రెండు వేల ఎకరాల వ్యవసాయ భూములను విమానాశ్రయం ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడంపై రైతులు మండిపడుతున్నారు. డి.ఎం.కె.ప్రభుత్వం రైతులను మోసం చేసిందని హోసూరు శివారు నందిమంగలం ఎస్.టి.ఆర్.ఆర్.రోడ్డు సమీపంలో రైతులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. మాజీ ఎంపీ బాలకృష్ణారెడ్డి, మాజీ మంత్రి పి.బాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేలుస్వామి, సినీ నటుడు మురళీ, నాయకులు కరిరవన్, అరుణ్‌రాజ్ తదితరులు మాట్లాడారు. భూమి సాధనానికి ప్రభుత్వం పంపించే నోటీసులను స్వీకరించరాదని నాయకులు రైతులకు సూచించారు.

కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ఆగ్రహం

మురళీధరన్ నేతృత్వంలో ఆందోళన చేస్తున్న కార్యకర్తలు

హోసూరు, న్యూస్‌టుడే : మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడం అన్యాయమని, మహాత్ముడిని అవమానించిన కేంద్ర ప్రభుత్వంపై దశలవారీగా ఆందోళన చేస్తామని కృష్ణగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎ.మురళీధరన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన నేతృత్వంలో గాంధీ విగ్రహం దగ్గర నిరసన ప్రదర్శన నిర్వహించారు. భాజపా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ కార్యకర్తలు నినాదాలు చేసారు. కార్యక్రమంలో నాయకులు త్యాగరాజన్, మహదేవ, కుమార్, హాళేసీబం హరీష్, శివప్పరెడ్డి, సరోజ, లలిత, కృష్ణన్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు చక్కని స్పందన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామచంద్రన్

డెంకణీకోట, న్యూస్‌టుడే : కెలమంగలం శివారు కూతనపల్లి వద్ద గల టాటా ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు ఆదివారం డెంకణీకోటలో ఉద్యోగ మేళా నిర్వహించారు. కంపెనీ యాజమాన్యంతో తళి ఎమ్మెల్యే రామచంద్రన్ సంప్రదించి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేయగా..స్పందించిన యాజమాన్యం మేళా ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యే మేళాను ప్రారంభించి మాట్లాడారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 600 మంది అభ్యర్థులు మేళాకు హాజరయ్యారు. కార్యక్రమంలో పట్టణ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాసన్, ఉపాధ్యక్షుడు అబ్దుల్‌కలాం, యూనియన్ ఆరోగ్యాధికారి డాక్టర్ రాజేశ్‌కుమార్, కౌన్సిలర్లు ప్రశాంత్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెబ్బాళ్ ఉపరితల వంతెన సిద్ధం

హెబ్బాళ్ కూడలిలోని లూప్ ఉపరితల వంతెన

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : దేశంలో అత్యంత సంచార రద్దీ కూడలిగా గుర్తింపు పొందిన హెబ్బాళ్ కూడలి వద్ద సంచార రద్దీ నియంత్రణ కోసం నిర్మించిన లూప్ ఉపరితల వంతెన నిర్మాణ పనులు పూర్తి చేశారు. వంతెనపై ప్రయోగాత్మకంగా వాహన సంచారానికి అనుమతిస్తామని బీడీఏ అధికారులు తెలిపారు. ఐదు వందల మీటర్ల పొడవు కలిగిన లూప్ ఉపరితల వంతెన నిర్మించారు. దీని వల్ల యలహంక, జక్కూరు, సహకార నగర, అంతర్జాతీయ విమానాశ్రయం వైపు నుంచి మేక్రికూడలి వైపు సంచరించే వాహనదారులకు అనుకూలం కానుంది. సాఫీగా వాహనాలు సంచరించే విధంగా వంతెన నిర్మించారు. ప్రధానంగా అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగించే ప్రయాణికులకు మరింత అనుకూలమవుతుందని అధికారులు తెలిపారు. ప్రయోగాత్మకంగా వాహన సంచారం అనుమతించి తరువాత లూప్ వంతెనపై అధికారికంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్ ప్రారంభిస్తామని ప్రకటించారు. కొత్త లూప్ వంతెనతో కూడలిలో ఉన్న ఇతర వంతెనలపై సంచార రద్దీ నియంత్రణలోకి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే నాగవార వైపు నుంచి మేక్రి కూడలి వరకు లూప్ ఉపరితల వంతెన నిర్మించడం వల్ల ఆమార్గంలో సంచార రద్దీ అదుపులోకి వచ్చింది.

సాగుతున్న తారు పనులు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రహదారుల్లో తారు పనులను గ్రేటర్ బెంగళూరు ప్రాధికార చేపట్టింది. దశలవారీగా అన్ని ప్రాంతాల్లో ఉన్న రహదారులకు తారు వేస్తారు. అందు కోసం ప్రాధికార రూ.650 కోట్లు వ్యయం చేస్తుంది. ఎక్కువగా పాడైన రహదారులను గుర్తించి అక్కడ రాత్రిళ్లు తారు పనులు చేపడుతున్నారు. వేస్తున్న తారు, కంకర మిశ్రమంలో నాణ్యత ఎంత ఉందో సాంకేతిక నిపుణులు పరీక్షిస్తున్నారు. దొమ్మలూరు, ఇందిరానగర, హలసూరు, సీవీరామన్‌నగర, బయ్యప్పనహళ్లి, టీన్‌ఫ్యాక్టరి, కె.ఆర్.పురం, మహదేవపుర, మారతహళ్లి, సర్జాపుర, దొడ్డగుబ్బి, కోరమంగల, మడివాళ, జేపీనగర, జయనగర తదితర ప్రాంతాల్లో తారు పనులు చేపట్టారు. ప్రధాన రహదారులతో పాటు వార్డు స్థాయి రహదారులను మరమ్మతులు చేపతామని అధికారులు తెలిపారు. ఎక్కువగా గుంతలు పడిన రహదారులను మొదట గుర్తించి ఆ రహదారులకు తారు, కంకర మిశ్రమం వేస్తున్నారు. పనుల్లో నాణ్యతను పరిశీలించేందుకు ప్రత్యేక సాంకేతిక నిపుణులను నియమించారు. నాణ్యత లేక పోతే సంబంధించిన గుత్తేదారుడికి నోటీసులు ఇస్తున్నారు. ఇప్పటి వరకు ఎవరికీ నోటీసులు ఇవ్వలేదని అధికారులు తెలిపారు. రెండు నెలల్లో నగరంలో ఉన్న అన్ని రహదారులకు తారు వేస్తామని అధికారులు ప్రకటించారు.

నాణ్యతను పరిశీలిస్తున్న నిపుణులు

నేటి బాలలే రేపటి పౌరులు

పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే మునిరత్న

బెంగళూరు (బ్యాటరాయనపుర), న్యూస్‌టుడే: చిన్నారులకు ఏడాదిలో రెండు సార్లు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే మునిరత్న సూచించారు. శనివారం, జె.పి.పార్కు లో ఆయన దగ్గరకు వెళ్లి కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అక్కడి ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ కృష్ణమూర్తితో కలిసి మాజీ కార్పొరేటర్ నాగభూషణం పిల్లలకు చుక్కలు వేశారు. సోమవారం ఇంటింటికి ఆశా కార్యకర్తలు, నర్సులు వచ్చి చుక్కలు వేయించని పిల్లలకు వేస్తారన్నారు. డాక్టర్ కృష్ణమూర్తి, వెంకటేష్‌గౌడ్, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రదుర్గం : ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయించడం ద్వారా వారి ఆరోగ్యం కాపాడవచ్చుని మంత్రి డి.సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో జాతీయ పల్స్ పోలియో దినోత్సవాన్ని మంత్రి చిన్న పిల్లలకు చుక్కల మందు వేసి ప్రారంభించారు. రేపటి పౌరులైన బాలలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశాఖ అధికారి ఓంప్రసాద్, జిల్లా ఆర్సీహెచ్ అధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తుమకూరు: చుక్కలు వేస్తున్న చంద్రశేఖర్, రాజేశ్వరి తదితరులు

చిత్రదుర్గం : చుక్కల మందు వేస్తున్న మంత్రి సుధాకర్

తుమకూరు : చిన్నారుల సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకు పోలియో చుక్కలు వేయించాలని నగర ఎమ్మెల్యే జ్యోతిగణేశ్ పిలుపునిచ్చారు. తుమకూరు పాలికె పరిధిలోని దిబ్బూరు ఆశ్రయ కాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ చుక్కల ద్వారా రోగ నిరోధకశక్తిని పెంచడమే ముఖ్య లక్ష్యమన్నారు. జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అనిల్, తహసీల్దార్ రాజేశ్వరి, మహిళా శిశు సంక్షేమాధికారి సిద్ధరామణ్ణ, మోహన్, రోటరీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాగేశ్‌నాయక్

పావగడ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో తాలూకా వైద్యాధికారి నాగేశ్‌నాయక్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. తాలూకాలో 167 కేంద్రాలు, 7 సంచార పోలియో కేంద్రాలు, 384 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజుల పాటు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలను వేస్తారన్నారు. పట్టణంలో 88 శాతం, తాలూకాలో 94 శాతంతో 17,448 మంది పిల్లలకు పోలియో చుక్కలను వేసినట్లు ఆరోగ్య అధికారి గణేశ్‌బాబు తెలిపారు. తనిణీ అధికారి రమేశ్, మంజునాథ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

'దివ్యాంగులకు మద్దతుగా ఉంటాం'

మహిళలతో మాట్లాడుతున్న మంత్రి శరణు ప్రకాశ్

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : దివ్యాంగుల సామర్థ్యానికి అనుగుణంగా వారికి ఉద్యోగ అవకాశాలను కల్పించాలని వైద్యవిద్య, కౌశల్యాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ శరణు ప్రకాశ్‌పాటిల్ పిలుపునిచ్చారు. దివ్యాంగుల కోసం బీఎంఎస్ మహిళా కళాశాలలో కేఎస్‌డీఏ, కేఎస్‌డీసీ, అసిన్ టెక్ ఫౌండేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన ఉద్యోగ మేళాను ప్రారంభించి మాట్లాడారు. కర్ణాటకలో 20 లక్షలకు పైగా దివ్యాంగులు ఉన్నారని, వారిలో ఎక్కువ మంది తమకు ఇష్టమైన రంగంలో ఉద్యోగాలను కల్పించుకున్నారని చెప్పారు. కార్పొరేట్ రంగంలోనూ దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు 5 శాతం రిజర్వేషన్‌ను కల్పించేందుకు ప్రభుత్వం ముసాయిదాను సిద్ధం చేసిందని తెలిపారు. పలువురు దివ్యాంగులతో ఆయన ముఖాముఖి అయి, వారి సమస్యలను, ఆసక్తులను శ్రద్ధగా ఆలకించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు ఎన్ఎం నాగరాజ, ప్రతీక్, శేఖర్ నాయక, డాక్టర్ ఎన్.రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏరోస్పేస్ రంగంలో గణనీయ మార్పులు

బెంగళూరు (రాజాజీనగర), న్యూస్‌టుడే : ఏరోస్పేస్, అంతరిక్ష రంగంలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని ఇస్రో మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.సోమనాథ్ తెలిపారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, డిజిటల్ ట్విన్స్ సాంకేతికతలను అలవర్చుకుంటూనే విమానాలు, డ్రోన్ల సురక్షతకు పెద్ద పీట వేయాలని పిలుపునిచ్చారు. జైన్ విశ్వవిద్యాలయంలో 'ఏరోస్పేస్ అండ్ అడ్వాన్స్‌డ్ ఇంజినీరింగ్'కు సంబంధించి నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. విమానాలు, అంతరిక్షంలోకి పంపించే వాహకనౌకల తయారీలో పూర్తిగా స్వదేశీ సాంకేతికతకు రక్షణశాఖ, ఇస్రో, ఇతర సంస్థలు ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. డీఆర్‌డీఓ ఆకాశ్ క్షిపణి వ్యవస్థను రూపొందించిన మాజీ డైరెక్టర్ ప్రహ్లాద్ రామారావు, సీనియరు శాస్త్రవేత్త వీకే ఆత్రే, ఆచార్య బి.దత్తగురు, కులపతి చెన్‌రాజ్ రాయ్‌చంద్ తదితరులు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఆదివారం సాయంత్రం వరకు కొనసాగిన సదస్సులో దేశీయ, అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలు, విమానాలు, డ్రోన్ల డిజైన్ రూపకర్తలు పాల్గొన్నారు.

స్మరణ సంచిక ప్రదర్శిస్తున్న వీకే ఆత్రే, సోమనాథ్ తదితరులు

పురస్కారాల ప్రదానోత్సవంతో గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు

ఒలింపిక్స్ విజేతలకు ప్రోత్సాహకాలు : సీఎం

బెంగళూరు (క్రీడలు) న్యూస్‌టుడే : ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని, క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఒలింపిక్స్ క్రీడల్లో పథకాలు సాధించిన క్రీడాకారులకు భారీ నగదు బహుమతులు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఒలింపిక్స్ క్రీడల్లో స్వర్ణ పతకం విజేతకు రూ.6 కోట్లు, వెండి పతకం విజేతకు రూ.4 కోట్లు, కాంస్య పతకం విజేతకు రూ.3 కోట్లు అందజేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన రాష్ట్ర క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కర్ణాటక ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం లోక్‌భవన్‌లో గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒలింపిక్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 1958లో ప్రారంభమైన ఒలింపిక్స్ సంస్థ క్రీడారంగానికి ఎంతో సేవచేసిందని కొనియాడారు. గోవిందరాజ్ నేతృత్వంలో సంస్థ క్రియాశీలకంగా మారిందన్నారు. తన హయాంలో సంస్థకు భవనం ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. కర్ణాటక క్రీడాకారులు ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధిస్తారని సిద్ధరామయ్య ధీమా వ్యక్తం చేశారు. క్రీడా రిజర్వేషన్ల కింద ఉద్యోగాలకు సంబంధించి జనవరిలో ఉత్తర్వులు జారీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హోంమంత్రి పరమేశ్వర్, క్రీడాశాఖ అధికారులు, పదాధికారులు పాల్గొన్నారు. ప్రశస్తులు అందుకున్న క్రీడాకారులు : బి.ఉన్నతి అయ్యప్ప, ఆయుశ్‌శెట్టి, ప్రత్యూంశ్ తోమర్, ఎన్.తన్వీ, నిఖిల్‌రాజు, ప్రణవీఅరసు, ఉదయ్‌నాయుడు, వి.ఐశ్వర్య, ఎస్.డి.ప్రజ్వల్‌దేవ్, జగదీప్‌దయాల్, సుజన్, టి.ఎస్.దివ్యా, అకాశ్‌మణి, కె.జె.ఆకాశ్, సతీశ్‌భారద్వాజ్, పి.ఎస్.జరినా, ముకుంద్, వి.ఎన్.వినయ్.

యువకుడి దుర్మరణం

ముళబాగిలు, న్యూస్‌టుడే : నగర శివార్లలోని తాయలూరు సర్కిల్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అగ్రహార గ్రామానికి చెందిన చందిన యువకుడు గంగరాజు (20) మృతి చెందాడు. చెన్నై కూరగాయల మార్కెట్‌కు సరుకుతో వెళుతుండగా వాహనానికి కట్టిన తాడు తెగిపోవడంతో గంగరాజు వాహనం నుంచి కిందపడ్డాడు. ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్న లారీ అతనిపైకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడని ముళబాగిలు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు వినయ విధేయతలు ముఖ్యం

గురువందనను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

పావగడ, న్యూస్‌టుడే : మానవతా విలువలతో కూడిన విద్య నేర్పించిన గురువులను తమ మనసులో పదిలంగా ఉంచుకొని గురువందన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని సిద్ధేశ్వరస్వామి పాఠశాల అధ్యక్షుడు దినేశ్ తెలిపారు. తాలూకాలోని హరిహరపురలో సిద్ధేశ్వర పాఠశాల ఆవరణలో ఆదివారం 1991-92లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు హనుమంతరాయప్ప, మల్లికార్జునప్ప, రాధాకృష్ణ, హొన్నప్ప, కృష్ణప్ప, రామచంద్రరావు, అంజినప్ప, చిన్నబోవి, మంజుల, ముద్దమ్మ, ప్రధానోపాధ్యాయుడు రమేశ్, జయరామప్ప, నరసింహమూర్తి, శేషాద్రి, సిద్ధప్ప, అక్కమ్మలను ఘనంగా సత్కరించారు. ఉత్తమ విద్యనభ్యసించి ఉన్నతస్థితికి చేరుకొని తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరావు సూచించారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకోవడం ఆనందంగా ఉందని, తరగతి గదులకు విద్యుత్తు, ఫ్యాన్లు, లైట్లను ఏర్పాటు చేస్తామని పూర్వ విద్యార్థి పవన్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి ఆనంద్‌రావు, ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

కోలారుకు శుద్ధ తాగునీరు అందిస్తాం

ముళబాగిలు, న్యూస్‌టుడే : కోలారు జిల్లాకు శుద్ధజలాలు అందించేందుకు ప్రయత్నిసున్నానని ఎంపీ ఎం.మల్లేష్‌బాబు తెలిపారు. నగరంలోని పాత్రికేయల భవనంలో నిర్వహించిన జలాగ్రహ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటి విషయంపై ఇప్పటికే పార్లమెంట్‌లో చర్చించామన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి కృష్ణాజలాలు తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేయల్సి ఉందన్నారు. బుక్కపట్నం జలాశయం నుంచి ఎత్తిపోతల ద్వారా నీటిని తీసుకురావచ్చుని, కోలారు జిల్లా నీటి సమస్య వారికి వివరించి ఒప్పించాలని కోరారు. కోలారు, బెంగళూరు రూరల్, చిక్కబళ్లాపుర జిల్లాలకు నీటి సౌకర్యం కల్పించే విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని పలువురు అభిప్రాయపడ్డారు. శాశ్వత నీటిపారుదల పథకాలు లేవని ఆరోపించారు. సంక్రాంతికి మరో సారి జలాగ్రహ సమావేశం నిర్వహించాలని తీర్మానించారు. సమావేశంలో భాజపా జిల్లా అధ్యక్షుడు ఓంశక్తి చలపతి, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు అనుమతి ఇవ్వాలని వినతి

ప్రతినిధులను సత్కరిస్తున్న మంత్రి పరమేశ్వర్

తుమకూరు : ఈనెల 24 నుంచి ప్రారంభమయ్యే జయహజారె ట్రోఫీ క్రికెట్ టోర్నీకి అనుమతి ఇవ్వాలని ఆదివారం బెంగళూరు సదాశివనగర్‌లో హోం మంత్రి జి.పరమేశ్వర్‌కు కర్ణాటక క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్, సభ్యులు ఆర్.హరీష్, వినయ్, మృత్యుంజయ వినతి పత్రం అందజేశారు. ప్రముఖ క్రికెట్ విరాట్ కోహ్లీ విచ్చేస్తున్న నేపథ్యంలో టోర్నీకి అనుమతి ఇవ్వాలని విన్నమించారు. అనుమతి ఇచ్చే విషయంపై ముఖ్యమంత్రి, పోలీస్ అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె.ఎస్.సి.ఎ.పాలక మండలి నూతన ప్రతినిధులను మంత్రి అభినందించి సత్కరించారు.

జనవరి 18న బహుభాషా కవుల సమ్మేళనం

ఏకాంబరం నాయుడుతో సమాఖ్య పదాధికారులు

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో జనవరి 18న నగరం కల్యాణ నగరలో ఉన్న ఇండో ఏషియన్ అకాడమీలో బహుభాషా కవుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ఛైర్మన్ డాక్టర్ మాల్యాద్రి బొగ్గవరపు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఇక్కడ సమాఖ్య గౌరవ పోషకుడు, అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ టి.ఏకాంబరం నాయుడును కలిసి కార్యక్రమానికి మార్గదర్శనం వహించాలని పదాధికారులు కోరారు. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం, హిందీ తదితర భాషలు చెందిన కవులు పాల్గొని భాషల మధ్య స్నేహం, సాహిత్య వైవిధ్యం, సాంస్కృతిక ఐక్యతను ప్రదర్శిస్తారని సమాఖ్య అధ్యక్షుడు మరంగంటి శ్రీనివాస్ వెల్లడించారు. రచయితలు, పండితులు, సాహిత్యాభిమానులకు పరస్పర పరిచయాలకు వేదిక అవుతుందని ప్రధాన కార్యదర్శి డాక్టర్ సింగూరు నరేంద్రబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు జరిగే కార్యక్రమానికి హాజరు కాదల్చిన కవులు, రచయితలు ఈనెల 24వ తేదీ లోగా ఫోన్ నెంబరు: 9591236666, 953840022, 9844207230లకు సంప్రదించాలని కోరారు.

హద్దు దాటితే తాటతీస్తాం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : నూతన సంవత్సర వేడుకల సమయంలో అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. తమ కార్యాలయాలు, హోటళ్లు, రిసార్టుల్లో వేడులను నిర్వహించుకోవాలంటే గురువారం లోగా స్థానిక ఠాణాలో వివరాలు నమోదు చేసుకుని అనుమతి తీసుకోవాలి. మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు నిఘాను ముమ్మరం చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే అన్ని రహదారులు, రైలు మార్గాలలో మాదక ద్రవ్యాలు రాకుండా సోదాలు కొనసాగించారు. ఇప్పటికే మాదక ద్రవ్యాలు విక్రయించి పట్టుబడిన నిందితులపై నిఘా ఉంచారు. క్రిస్మస్ సమయం నుంచే ప్రత్యేకంగా నాకాబందీలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. క్రిస్మస్, కొత్త ఏడాదికి కేకుల తయారీకి ప్రముఖ సంస్థలు ఆర్డర్లు తీసుకుంటున్నాయి. ఆన్‌లైన్‌లో ఆహారాన్ని వితరణ చేసే సంస్థలు తమ సిబ్బంది సంఖ్యను పెంచుకుంటున్నాయి. నగర శివార్లలోని రిసార్టుల్లో అనుమతి లేకుండా రేవ్ పార్టీలు నిర్వహించుకునేందుకు అవకాశం లేకుండా ముందస్తుగా నిఘా పెట్టారు. ఎంజీ రోడ్డు చుట్టపక్కల ప్రాంతాల్లో నిఘా కోసం డ్రోన్ కెమెరాలు, మంచెల ఏర్పాటును ఈ నెల చివరి వారంలో చేయనున్నారు. ముందు జాగ్రత్త చర్యగా రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మెట్రో స్టేషన్ల వద్ద ఇప్పటికే భద్రతను కట్టుదిట్టం చేశారు.

తెలుగు చర్చిలో యువ క్రిస్మస్

మిస్పా తెలుగు చర్చిలో ట్రోఫీ అందజేస్తున్న జాన్ తదితరులు

బెంగళూరు (బాణసవాడి), న్యూస్‌టుడే : ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా నగరంలోని పులికేశినగరలో ఉన్న మిస్పా తెలుగు చర్చిలో ఆదివారం ప్రత్యేకంగా యువ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. క్రిస్మస్ ప్రారంభంలో యువత కోసం నిర్వహించిన క్రికెట్ పోటీల ట్రోఫీని చర్చి పాలక మండలి కార్యదర్శి కెప్టెన్ జాన్ అందజేశారు. తొలిసారి నిర్వహించిన పోటీలకు యువత నుంచి ఉత్తమ స్పందన వచ్చిందని ఆయన తెలిపారు. యువతులు కోసం నిర్వహించి పోటీల్లో గెలుపు సాధించిన విజేతలకు పాస్టర్ బహుమతులు అందజేశారు. యువత చెడు మార్గాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. సమాజాన్ని పీడిస్తున్న మాదక ద్రవ్యాలు, మద్యపానానికి వ్యతిరేకంగా పోరు చేయాలని సూచించారు.

వేడుకల్లో ప్రముఖులు, చిన్నారులు

బెంగళూరు (మత్తికెరె) న్యూస్‌టుడే : యేసు క్రీస్తు లోకంలో మానవ రూపంలో జన్మించి పాపులను పరిశుద్ధులుగా మార్చారని బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎం.బెంజమన్ తెలిపారు. యశ్వంతపుర మోహన్‌కుమార్ నగరలోని అక్కయ్యప్ప గార్డెన్‌లోని బేతెల్ మిషన్ తెలుగు ప్రార్థనాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఆయన ప్రారంభించారు. సండే స్కూల్ చిన్నారులు, తెలుగు క్రైస్తవులు గీతాలను ఆలపించి, నృత్యం, నాటికలు ప్రదర్శించారు.. క్రీస్తు జన్మ వృత్తాంతం ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖులు కుమార్, అశోక్, మేరీ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

బళ్ళారి
• బళ్ళారి • రాయచూరు • కొప్పళ • విజయనగర • చిత్రదుర్గ

శనివారంలోపు గృహలక్ష్మి నగదు జమ

బెంగళూరు(యలహంక), న్యూస్‌టుడే: రాష్ట్రంలో గృహలక్ష్మి పథకం కింద 24వ కంతు నగదు సోమవారం నుంచి శనివారంలోపు లబ్ధిదారులైన మహిళా బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ వెల్లడించారు. ఆదివారం బెళగావిలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ నగదు విడుదలకు ఆర్థిక శాఖ నుంచి అనుమతులు పొందామని సోమవారం నుంచి ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మృతి చెందిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలను గుర్తించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రెండు ప్రత్యేక సమావేశాలు నిర్వహించామని, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ఉపయోగించి ఇక నుంచి మృతుల ఖాతాల్లోకి నగదు జమ కాకుండా చర్య తీసుకుంటున్నామన్నారు. ఒకవేళ మృతి చెందిన లబ్ధిదారుల ఖాతాలో నగదు జమైతే దాన్ని వెనక్కి తీసుకుంటామని తెలిపారు.

చిరుద్యోగుల గర్జన

బెంగళూరు(ఆడుగోడి), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధనకు బెంగళూరు నగరంలోని స్వతంత్ర ఉద్యానవనంలో శనివారం నుంచి చేపట్టిన ధర్నా ఆదివారమూ కొనసాగించారు. గ్రామ పంచాయతీల్లో పని చేసే ఉద్యోగులకు కనీస వేతనం రూ.36వేలు ఇవ్వాలని, వైద్య బీమా సౌకర్యం కల్పించాలని, సేవలను క్రమబద్ధీకరించాలని పోరాటం చేపట్టారు. తమ డిమాండ్ల పరిష్కరించేంత వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

స్వతంత్ర ఉద్యానవనంలో కొనసాగుతున్న ఉద్యోగుల ధర్నా

సమాంతర జలాశయం సాధ్యమేనా

రాయచూరు, న్యూస్‌టుడే : తుంగభద్రకు ప్రత్యామ్నాయంగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సమాంతర జలాశయం)ను నిర్మించడం ఇప్పట్లో సాధ్యంకాదా? ప్రభుత్వంలో ఏదైనా లోపించిందా? అన్న సందేహం తలెత్తుతోంది. కొప్పళ జిల్లా కనకగిరి తాలూకా నవలి వద్ద ఆనకట్టను కట్టేందుకు గత ముఖ్యమంత్రి బొమ్మై హయాంలో డీపీఆర్ (డీటెల్ ప్రాజెక్టు రిపోర్టు)ను రూపొందించారు. సీఎం సిద్దరామయ్య మరో నివేదికను తయారు చేయించారు. నిర్మాణానికి అవసరమైన 1100 ఎకరాల భూమి అందుబాటులో ఉంది. తుంగభద్ర కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో ముడిపడిన దున ఇబ్బందులు ప్రధాన కారణం. ఉప ముఖ్యమంత్రి, జలవనరుల శాఖ మంత్రి డి.కె.శివకుమార్ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఈ విషయంపై తెలంగాణ, ఆంధ్ర ముఖ్యమంత్రులను ఒప్పిస్తానని హామీ ఇచ్చారు. సీఎంలు అందుబాటులోకి రాలేదని తర్వాత వాపోయారు. ఇదే ఏడాది హస్పేటలో జరిగిన ఇరు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రుల సమావేశంలో పాల్గొన్న శివకుమార్ తెలుగు రాష్ట్రాల మంత్రులతో సమాంతర జలాశయం ప్రతిపాదనపై నోరు విప్పలేదు. చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు గత నెలలో ఆంధ్ర ఇరిగేషన్ శాఖ అమాత్యులు నిమ్మల రామానాయుడితో భేటీ అయినప్పుడు తుంగభద్ర నదిపై వీరాపుర, చిక్క మంచాల వద్ద బ్యారేజీ, వంతెన కట్టేందుకు అనుమతి ఇవ్వాలని కోరారే తప్ప.. బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఆవశ్యకతను ప్రస్తావించకపోవడం గమనార్హం. రాయచూరు, కొప్పళ, బళ్లారి జిల్లాల శాసన, శాసనమండలి సభ్యులు బడ్జెట్‌లో చర్చించడంలో విఫలమయ్యారనేది రైతుల ఆరోపణ. ఇటీవల బెళగావిలో ముగిసిన శీతాకాలపు సమావేశాల్లో ఉత్తర కర్ణాటక సమస్యల ప్రస్తావనకు అవకాశమున్నా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ ఆవశ్యకతపై గళం విప్పలేదని తప్పుబట్టారు. ఈ పరిణామాలను చూసి రైతులు ఆశలు వదిలేసుకుంటున్నారు.

ప్రత్యామ్నాయ ఆనకట్ట ఎందుకంటే..

75 సంవత్సరాల క్రితం నిర్మించిన తుంగభద్ర డ్యామ్ మొత్తం నీటి సామర్థ్యం 133 శతకోటి ఘనపుటడుగులు. మూడు రాష్ట్రాల్లోని ఎనిమిది జిల్లాల్లో 16 లక్షల ఎకరాల సారవంతమైన భూమి సాగులో ఉంది. తాగునీటి అవసరాలను తీరుస్తోంది. వందలాది పరిశ్రమలు ఆధారపడ్డాయి. రిజర్వాయర్‌లో ఏటా 0.4 నుంచి 0.5 టీఎంసీల పూడిక చేరుతోంది. ప్రస్తుతం 32 టీఎంసీలకు పైగా పూడిక ఉన్నందున నీరు వృథా అవుతోంది. ఫలితంగా తుంగభద్ర నిండుకుండలా మారినప్పుడు కూడా ఎడమకాలువ, హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ పరిధిలో టెయిల్ ప్రాంతానికి ఒక సాగుకు నీరు అందడం కష్టమైంది. గతంలో రైతులు పూడికను తొలగించాలని ప్రయత్నం చేసి సాధ్యపడలేదు. ఒక వేళ ప్రయత్నించినా.. 73 వేల ఎకరాల్లో పది అడుగుల ఎత్తులో తొలగించిన మట్టిని వేయాలి. ప్రతి రోజు వెయ్యి ట్రాక్టర్లతో పూడికను రవాణా చేసినా రోజుకు ఒక టీఎంసీని ఖాళీ చేయవచ్చన్న విశ్లేషణలు వెలువడ్డాయి. ఇవన్నీ సాధ్యం కానందునే సమాంతర ఆనకట్ట ప్రతిపాదనలోకి వచ్చింది.

రూ.20 వేల కోట్లకు పైగా వ్యయం!

భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం, ప్రాజెక్టు నిర్మించేందుకు రూ.20 వేల కోట్లు వ్యయం కాగలదని అంచనా. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉన్నందునే ఒక బడ్జెట్‌లో ఇంత మొత్తం నిధులు కేటాయించలేరు. రాయచూరు జిల్లాలోని వీరాపుర, చిక్క మంచాల వద్ద బ్యారేజీ నిర్మిస్తే పథకాల ద్వారా సాగు నీరు సరఫరా చేయాలన్న ప్రభుత్వ యోచన సమంజసమైనా.. వీటి వల్ల ఎడమ కాల్వలోని కొన్ని ప్రాంతాలకు లబ్ధి చేకూరుతుంది. సమాంతర డ్యామ్ కడితే తుంగభద్ర వరద నీటిని మళ్లించుకోవచ్చు. ఎగువ కృష్ణా ప్రాజెక్టుల మూడో దశ పనులకు రూ.2 లక్షల కోట్లు కేటాయిస్తామని ముఖ్యమంత్రి గత ఆగస్టులో ప్రకటించారు.

ఐక్యత కొరవడినందునే

సస్యక్షేత్ర, విపక్ష నేతల మధ్య ఐక్యత లేనందునే బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రతిపాదన ప్రాజెక్టుకు ఒక అడుగు కూడా ముందుకు పడటం లేదు. బాండ్ రూపంలో నిధుల కొరతను అధిగమించవచ్చు. మస్కి (రాయచూరు జిల్లా) అసెంబ్లీ ఉప ఎన్నికల్లో గెలవాలని గత భాజపా ప్రభుత్వ మంత్రి రమేశ్ జార్కిహొళి హడావుడిగా శంకుస్థాపన చేయించింది. ఆనకట్ట నిర్మితమైతే ఏప్రిల్ 15 వరకు సింధనూరు, మాన్వి, రాయచూరు తాలూకాలకు సాగునీరు అందించడం సాధ్యమవుతుంది. కవితాళ వద్ద 1.5 టీఎంసీల సామర్థ్యం డ్యామ్ నిర్మించవచ్చు. తుంగభద్రలోని పూడికను దశలవారీగా తొలగించాలి. ప్రతి ఏడాది కొంత తీయాలి. మట్టిని తరలించేందుకు రైతుల ట్రాక్టర్లకు డీజిల్ వేయిస్తే చాలు. **- చామరస్ మాలిపాటిల్ (రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు)**

వెనుకబడిన ప్రాంతాల ప్రగతికి కంకణం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ఆచార్య గోవిందరావు సమితి చేసిన సిఫార్సులను అమలుచేసి తీరుతామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. జాతీయ పల్స్ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇక్కడ తన అధికార కార్యాలయమైన కృష్ణలో మంత్రులు దినేశ్‌గుండూరావు, డాక్టర్ పరమేశ్వర్‌లతో కలిసి ఆయన బాలలకు పల్స్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా సిద్ధు విలేకర్లతో మాట్లాడుతూ ఉత్తర కర్ణాటక అభివృద్ధి పై భాజపా నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. భాజపా అధికారంలో ఉన్న సమయంలో ఈ ప్రదేశాభివృద్ధికి ఏమి చేశారని ప్రశ్నించారు. వెనుకబడిన ప్రదేశాల అభివృద్ధి కోసం ఆచార్య గోవిందరావు నేతృత్వంలో ప్రత్యేక సమితి ఏర్పాటు చేశామని సమితి జనవరిలో నివేదిక ఇస్తుందన్నారు. అనంతరం సమితి చేసిన సిఫార్సులను అధ్యయనం చేసి అమల్లోకి తెస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం నంజుండప్ప సమితి, ఆచార్య గోవిందరావు సమితులను ఏర్పాటు చేసిందని, తమ పరిపాలనలో ఉత్తర కర్ణాటకలో కొత్తగా 504 హాస్టళ్లను ప్రారంభించామని గుర్తు చేశారు. భాజపా పరిపాలనలో కేవలం ఐదు హాస్టళ్లను ప్రారంభించారని ఎద్దేవా చేశారు. కల్యాణ కర్ణాటకకు 371-జె స్థానం కల్పించిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. ఈ ప్రదేశానికి ప్రత్యేక నిధులు కోసం భాజపా నేతలు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు అవకాశం ఉందని నిలదీశారు.

బాలలకు పోలియో చుక్కలు వేస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మంత్రులు దినేశ్‌గుండూరావు, పరమేశ్వర్, తదితరులు

బాలల భవితకు చక్కని 'చుక్కల' మందు

బెంగళూరు (యలహంక), న్యూస్‌టుడే : జాతీయ పల్స్ పోలియో దినోత్సవ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతమైంది. బెంగళూరు, మంగళూరు, మైసూరు, దావణగెరె, బళ్లారి, రాయచూరు, విజయనగర, విజయపుర, బెళగావి తదితర ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు ఆరోగ్యశాఖ అధికారులు ప్రకటించారు. ఉద్యాననగరిలో తొలుత ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఐదేళ్లలోపు బాలలకు పల్స్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార పరిధిలో ఉప ముఖ్యమంత్రి డీకేశివకుమార్, కేంద్ర మంత్రి హెచ్.డి.కుమారస్వామి బాలలకు బాలలకు చుక్కలు వేసి మిఠాయిలు అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16 లక్షల మంది ఐదేళ్ల బాలలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారికి పోలియో చుక్కలు వేసేందుకు 4,800 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సోమ, మంగళవారాల్లో ఆశా, అంగన్‌వాడీ, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికీ సంచరించి పోలియో చుక్కలు వేయించుకోని బాలలను గుర్తించి చుక్కలు వేసే కార్యక్రమాన్ని చేపడతారని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

ఆదిచుంచనగిరి ఆశ్రమంలో బాలలకు పోలియో చుక్కలు వేస్తున్న కేంద్ర మంత్రి కుమారస్వామి

సాహిత్యానికి గోవిందాచార్య సేవలు అపారం

రాయచూరు, న్యూస్‌టుడే : స్థానిక సావిత్రి కాలనీలోని జోడు వీరాంజినేయ దేవస్థానంలో శనివారం రాత్రి దివంగత బన్నంజి గోవిందాచార్య స్మరణార్థం నిర్వహించిన బన్నంజి 90వ విశ్వ నమన కార్యక్రమం ఘనంగా జరిగింది. మంత్రి బోసురాజు తదితరులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి ప్రసంగిస్తూ విద్వాంసుడు, విద్యా వాచస్పతి, సంస్కృతం, కన్నడ సాహిత్య రంగానికి గోవిందాచార్య ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఆ మహనీయుడు ఔన్నత్యం గురించి నేటి తరానికి తెలియజేయాలని కోరారు. ఎంపీ కుమారనాయక్ ఉపన్యసిస్తూ దేశ సంస్కృతి, సామాజిక విలువలపై బన్నంజి విదేశాల్లో చేసిన ఉపన్యాసాలు ప్రజాదరణ పొందాయని తెలిపారు. ముఖ్యవక్త రోహిత్ చక్రవర్తి మాట్లాడుతూ ఆయన ప్రతి రచనలోనూ దేవుడిని అన్వేషించేందుకు ప్రయత్నించిన గొప్ప అధ్యాత్మిక వేత్తగా అభివర్ణించారు. విద్వాంసులు విజయ సింహాచార్య, రమేష్ వాసుదేవ్, ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ వీణా బన్నంజి, విశ్రాంత ఉప కులపతి వెంకటేష్, మురళీధర కులకర్ణి, రమేష్ యాదవ్, వీర హనుమాన్ తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మంత్రి తదితరులు

అధిష్ఠానం పట్టు జారి పోయింది

చిక్కమగళూరు (రాయచూరు, న్యూస్‌టుడే) : రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ సంక్షోభానికి తెరదించేలా అదిష్ఠానాన్ని ఒప్పించే స్థితిలో అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే లేరా? అని కేంద్ర మంత్రి ప్రహ్లాదజోషి ప్రశ్నించారు. ఆయన ఆదివారం చిక్కమగళూరు జిల్లా బాళెహొన్నూరులో పాత్రికేయులతో ముచ్చటించారు. కర్ణాటక నేతలపై దిల్లీ పెద్దలు పట్టు కోల్పోయినందునే రాజకీయ అస్థిరత కొనసాగుతోందన్నారు. పాలన గాడి తప్పిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో హై ఉందే తప్పా కమాండ్ లేదని ఎద్దేవా చేశారు. ఐదేళ్లు పాలించాలని ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని ఈ ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవడం లేదని మండిపడ్డారు. భాజపా ప్రతిపక్ష పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు కితాబిచ్చారు.

ఉపాధి పథకం పేరు మార్చొద్దు

రాయచూరు, న్యూస్‌టుడే : గ్రామీణ ఉపాధి పథకానికి వీబీ-జీ రామ్ జీగా నామకరణం చేయవద్దని, మహాత్మగాంధీ నరేగా పేరును కొనసాగించాలని సీపీఐ (ఎం.ఎల్) లిబరేషన్ పార్టీ, అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మికుల సంఘం డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఆదివారం నగరంలోని అంబేడ్కర్ కూడలి వద్ద ప్రదర్శన చేపట్టారు. జిల్లా కార్యదర్శి నాగరాజ్ పూజార్ మాట్లాడుతూ గ్రామీణ కూలీలు, కార్మికుల ఉపాధి వలసలను నివారించేందుకు ప్రవేశపెట్టిన పథకాన్ని రానున్న రోజుల్లో నిర్వీర్యం చేయటానికి పేరు మార్చిందని అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఉపాధి పనులకు ఇంత వరకూ కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులను సమకూర్చేదని తెలిపారు. కొత్త విధానంలో 60:40 శాతం కేటాయించి రాష్ట్రాలపై అదనపు భారం మోపడం అన్యాయమని పేర్కొన్నారు. నూతన బడ్జెట్‌లో ఉపాధి యోజనకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని కేంద్రంపై ఒత్తిడి తెచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు అజీజ్ జాగిర్దార్, కలమంగి, శ్రీనివాస్. పంపాపతి తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న నాయకులు

పటిష్ఠంగా భారత్ ఆర్థిక వ్యవస్థ

సమావేశంలో ప్రసంగిస్తున్న బొమ్మై

గదగ్ (రాయచూరు, న్యూస్‌టుడే) : అమెరికా, జపాన్, చైనాకు దీటుగా భారత్ ఆర్థిక ప్రగతి సాధిస్తోందని మాజీ ముఖ్యమంత్రి, హావేరి-గదగ్ లోక్‌సభ సభ్యుడు బసవరాజ బొమ్మై పేర్కొన్నారు. గదగ జిల్లా శిరహట్టి తాలూకా చబ్బి గ్రామంలో ఆదివారం రైతు సంఘటనల ఒక్కూట ఆధ్వర్యంలో అన్నదాతలు, విశ్రాంత సైనికులను సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ సీఎం పెట్రోలియం బంకును ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రసంగిస్తూ ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రజల తలసరి ఆదాయాన్ని పెంచుతూ తద్వారా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తోందని వివరించారు. ప్రత్యేక పథకంలో భాగంగానే దళితులు, గిరిజనులకు పెట్రోలు బంకులు కేటాయిస్తున్నారని తెలిపారు. పీఎం గతి శక్తి యోజనలో లక్ష్మేశ్వర-గదగ రహదారిని విస్తరించాలని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరికి విజ్ఞప్తి చేయగా.. ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. స్వామీజీలు సిద్ధరామేశ్వర, అభినవ బసవణ్ణ, భాజపా జిల్లా అధ్యక్షుడు రాజు కురడగి, మాజీ ఎమ్మెల్యే రామణ్ణ లమాణి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు అమలు చేయాలి

రాయచూరు, న్యూస్‌టుడే : స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఎస్‌సీఎపీ, టీఎస్పీ నిధుల కేటాయింపుల్లో దళిత అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలని డీఎస్ఎస్ బీమవాద రాష్ట్ర సంచాలకుడు మోహనరాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం పత్రికా భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళితులు, గిరిజనుల పురోగతికి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను గ్యారంటీ పథకాలకు మళ్లిస్తూ ఎస్సీ, ఎస్టీలకు సర్కారు అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు, విదేశాల్లో చదువుకునేందుకు సక్రమంగా ఆర్థిక సాయం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ స్థాపనపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు ఫిబ్రవరి 7న కలబురగిలో సమావేశం నిర్వహిస్తామన్నారు. మాజీ మంత్రి ఇబ్రహీం, రైతు సంఘం నాయకుడు కోడిహళ్లి చంద్రశేఖర్ నేతృత్వం వహిస్తారని వెల్లడించారు. సమావేశంలో జిల్లా ప్రతినిధులు రవీంద్రనాథ పట్టి, ఎం.ఈరణ్ణ, రాజుపట్టి, ప్రసాద్, మారెప్ప, లక్ష్మీదేవి, శరణప్ప పాల్గొన్నారు.

పాత్రికేయులతో మాట్లాడుతున్న మోహనరాజు

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

21-12-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1614.26	1628.48
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	101	780
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	17,183	7,145
నీటి నిల్వ (టి.ఎం.సి)	46.686	88.466

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

హస్తిన కోర్టులో బంతి

◆ నేడో, రేపో అగ్రనేతల నుంచి సీఎం, డీసీఎంలకు పిలుపు
◆ రసకందాయంలో కన్నడ రాజకీయం

నాగాల ఆశీర్వాదంతో పీఠం దక్కేనా?

ఈనాడు, బెంగళూరు: అధికార కాంగ్రెస్‌లో నాయకత్వ మార్పు కోసం ఎత్తుకు పైఎత్తులు, బ్రేక్‌ఫాస్ట్, డిన్నర్ సమావేశాలు, విధాన సభలో బహిరంగ ప్రకటనలు, నేతల రహస్య మంతనాలు, మద్దతుదారుల విసురుకున్న వాగ్బాణాలన్నీ రాష్ట్ర ప్రజలు చూశారు. ఈలోగా అటు దిల్లీలో, బెళగావిలో శీతాకాల సమావేశాలు కూడా ముగిశాయి. ఇక చేయాల్సిందల్లా అధిష్ఠానం ఓ నిర్ణయం తీసుకోవటం. ఏమాత్రం ఆలస్యం చేసినా ప్రభుత్వ మనుగడకే ముప్పొస్తుందన్న హెచ్చరికలు ఎదురవటంతో దిల్లీ పెద్దలు రాష్ట్ర రాజకీయాలపై దృష్టి సారించే సమయం ఆసన్నమైంది.

డీకే రాజకీయ 'మంత్రం'

ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో పోలిస్తే ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పీఠం కోసం కాస్త ఎక్కువగానే యత్నిస్తున్నారని తెలుస్తోంది. దేవాలయాల సందర్శన, ఇష్టదైవాల ప్రాంగణాల్లో కార్యశిద్ధి పూజలు, హిమగిరుల నుంచి నాగాల ఆహ్వానం, వారితో అలుపెరగక ఆశీర్వచనాలు అందుకుంటూ పీఠం కోసం అన్ని వైపులా ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యక్తిగతంగా ఆధ్యాత్మిక చింతన కాస్త ఎక్కువగానే ఉన్న డీసీఎం.. లౌకిక, ప్రగతిశీల భావజాలం అణువణువున్నా నింపుకొన్న ముఖ్యమంత్రితో శీతల సమరాన్ని సాగిస్తున్నారు. సమావేశాల్లో తానే సీఎం అంటూ ఘంటాపథంగా ప్రకటించిన సిద్ధరామయ్య.. అసలు రెండున్నరేళ్ల ఒప్పందమే మా మధ్యలేదని చెప్పి డీకే శిబిరంలో అలజడి రేపుతున్నారు. సభలో ముఖ్యమంత్రి వ్యాఖ్యలకు బదులివ్వని డీసీఎం దేవస్థానాలు, నాగాల సమక్షంలో 'ఆ' ఒప్పందం ఉందని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక మంత్రాలతో పాటు రాజకీయ తంత్రాన్నీ జోరుగా అమలు చేస్తున్న డీకే తన అనుచర గణంతో సిద్ధు శిబిరానికి దీటుగా బదులిస్తున్నారు. సిద్ధరామయ్యకు ఆప్తులైన సతీశ్‌జార్ఖిహొళి, జమీర్ అహ్మద్, కేజే జార్జ్..లతో పాటు తనపై నిత్యం విరుచుకుపడే మాజీ మంత్రి కె.రాజణ్ణతోనూ చర్చించి తన వ్యూహమేమిటో చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

అవకాశాలకు గండి

మరోవైపు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తన ప్రయత్నాలను అలుపెరగక కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి తాను కొనసాగకున్నా తర్వాతి అవకాశం డీకేకు దక్కకుండా చూస్తున్నారు. ఇందు కోసం అహింద అస్త్రాలకు పదును పెడుతున్నారు. బెళగావిలో అహింద, ఎస్టీ నేతలతో విందు సమావేశాలతో ప్రత్యర్థి శిబిరాలకు సందేశాలిచ్చే ప్రయత్నం చేస్తున్నారు. అనివార్యంగా తాను వైదొలగాల్సి వస్తే దళిత నేతలకు అవకాశాలిచ్చేలా డా.జి.పరమేశ్వర్‌తో చర్చలు కొనసాగిస్తున్నారు. సుదీర్ఘకాలంగా పీసీసీ అధ్యక్షులుగా పని చేసిన పరమేశ్వర్ అంటే సోనియాగాంధీ సైతం సానుకూలంగా ఉండటం గమనార్హం. త్వరలో బెంగళూరులో అహింద సమావేశం నిర్వహించాలని సిద్ధు శిబిరం కసరత్తు చేస్తోంది. డీకేకు అవకాశం ఇస్తే ఉత్తర కర్ణాటకలో కనీసం 30 మంది ఎమ్మెల్యేలు భాజపాకు చేరే అవకాశం ఉందని సిద్ధు మద్దతుదారులు అధిష్ఠానానికి లేఖలు రాసి అప్రమత్తం చేస్తున్నారు.

దళిత సీఎం అస్త్రాన్ని సంధిస్తున్న సీఎం శిబిరం

పిలుపు కోసం ఎదురుచూపు

నాయకత్వంపై ముసురుకున్న వివాదంతో ప్రజల్లో ప్రభుత్వంపై విశ్వాసం సన్నగిల్లుతోంది. బడ్జెట్‌లో ప్రకటించే కార్యక్రమాలు అమలు కావన్న అపనమ్మకం పెరిగే ప్రభుత్వానికే నష్టమని సీనియర్లు అధిష్ఠానానికి హెచ్చరిస్తున్నారు. ఏఐసీసీ సభ్యులు వి.ఆర్.సుదర్శన్ తాజాగా అధిష్ఠానానికి లేఖ రాసి వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని హెచ్చరించారు. ఇప్పటికే ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్, మాజీ కేంద్రమంత్రి వీరప్పమొయిలీ కూడా అధిష్ఠానానికి హెచ్చరించిన విషయం తెలిసిందే. మంగళవారం నీటి పారుదల ప్రాజెక్టుల కోసం డీకే, ఈనెల 27న ఏఐసీసీ ప్లీనరీ సమావేశాల కోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిల్లీకి వెళ్లనున్నారు. ఆలోగా అధిష్ఠానం నుంచి పిలుపు వస్తే ఇద్దరూ క్షణాల్లో దిల్లీకి చేరుకోవాల్సి ఉంటుంది. మేమిద్దరం పార్టీ పెద్దల పిలుపు కోసం ఎదురు చూస్తున్నామని డీకే ఆదివారమూ స్పష్టం చేశారు. ఇప్పటికే ఓసారి రాష్ట్ర వ్యవహారంపై చర్చించిన సోనియాగాంధీ.. మరో విడత చర్చించేందుకు సిద్ధంగా ఉన్నారని కేసీ వేణుగోపాల్ ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే.

రాయచూరు ఉత్సవంపై సన్నాహక సమావేశం

రాయచూరు, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం జనవరిలో జరగనున్న రాయచూరు ఉత్సవం నిర్వహణ ఏర్పాట్లపై చర్చించేందుకు సోమవారం జిల్లా పాలనాధికారి సభా భవనంలో ముందస్తు సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు మొదలయ్యే సన్నాహక సమావేశానికి జిల్లా పాలనాధికారి నితీష్ అధ్యక్షత వహిస్తారు. జిల్లా స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని జిల్లా అదనపు పాలనాధికారి శివానంద ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు సిరిధాన్యాలపై అవగాహన జాతా

రాయచూరు, న్యూస్‌టుడే : సిరి ధాన్యాలు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించడం వల్ల చేకూరే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలో అవగాహన కల్పించేందుకు సోమవారం జాతా నిర్వహిస్తారు. జిల్లా పంచాయతీ సీఈవో కార్యాలయం వద్ద ఉదయం మొదలవుతుంది. న్యాయస్థానం రహదారి, బసవేశ్వర కూడలి మీదుగా వ్యవసాయ విజ్ఞాన విశ్వవిద్యాలయం చేరుకుంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజలు హాజరై జాతాను విజయవంతం చేయాలని కోరుతున్నారు.

జలజాగృతి పాదయాత్రపై సమావేశం

మాన్వి, న్యూస్‌టుడే : గంగావతి నుంచి మంత్రాలయం వరకు చేపట్టనున్న జలజాగృతి పాదయాత్ర నిర్వహణపై ఎమ్మెల్యే హంపయ్య నాయక్ అధ్యక్షతన స్థానిక ధ్యానమందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాదయాత్ర సంచాలకుడు బాలకృష్ణనాయుడు మాట్లాడుతూ ప్రజలు మేల్కోనకపోతే భవిష్యత్తు తరాల మనుగడకు ప్రమాదమన్నారు. హంపయ్యనాయక్ మాట్లాడుతూ జాగృతి కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయాలని, పాఠశాలలు, కళాశాలల్లో చర్చా వేదికలు నిర్వహించాలన్నారు. జనవరి 1న తాలూకాకు వచ్చే పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. ప్రముఖులు బసవనగౌడ, గంగాధర్‌నాయక్, ఎన్.ఉదయ్‌కుమార్, అనితా మాట్లాడారు. వివిధ సంఘ సంస్థల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలకృష్ణనాయుడు

పల్స్ పోలియోకు ఉత్తమ స్పందన

బస్టాండ్‌లో బాలుడికి టీకా వేస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో రోగ నిరోధక టీకా కార్యక్రమం ఆదివారం మొదలైంది. బుధవారం వరకు కొనసాగనుంది. జిల్లా వ్యాప్తంగా 2,59,984 మంది పిల్లలకు చుక్కలు పోయటానికి 1132 కేంద్రాలు నెలకొల్పారు. ఆసుపత్రులు, రైల్వే స్టేషన్లు, విద్యాలయాలు, రద్దీ ఉండే స్థలాల్లో చుక్కలు వేశారు. 53 రవాణా, 33 మొబైల్ వాహనాల్లో బృందం సంచరిస్తూ వ్యాక్సిన్ ఇచ్చింది. మంత్రి బోసురాజు నగరంలోని కేబీ పాఠశాలలో చిన్నారి నోట్లో చుక్కల మందు వేశారు. గతంలో టీకా వేయించినా ఈ సారి కూడా వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎంపీ కుమార నాయక్, జిల్లా పాలనాధికారి నితీష్, జడ్పీ సీఈవో ఈశ్వరకుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ జుబిన్ మహాపాత్ర, డీహెచ్ఓ డాక్టర్ సురేంద్రబాబు, ఆర్‌సీహెచ్ అధికారిని డాక్టర్ ఎం.ఎస్.నందితా పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ కేంద్రంలో రెడ్ క్రాస్ విద్యా విభాగం సంచాలకుడు బిరాదార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి రోజు విజయవంతమైందని ఆరోగ్యశాఖ అధికారులు వెల్లడించారు.

కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

మాన్వి, న్యూస్‌టుడే : ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమిస్తున్నాయని ఎమ్మెల్యే హంపయ్యనాయక్ పేర్కొన్నారు. స్థానిక మాతా శిశు ఆసుపత్రిలో చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పోలియో ముక్త దేశం దిశగా ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా పల్స్ పోలియో కార్యక్రమాలను చేపట్టాయన్నారు. తాలూకా ఆరోగ్యాధికారి శరణబసవ రాజ్ మాట్లాడుతూ తాలూకాలో 47,920 మందికి చుక్కలు వేయాల్సి ఉందన్నారు. జిల్లా మలేరియా అధికారి చంద్రశేఖరయ్యస్వామి, పురపాలక సంఘం ముఖ్యాధికారి పరశురామ్, శిశు అభివృద్ధి అధికారి గోకుల్, గ్యారంటీ సమితి అధ్యక్షుడు బి.కె.అమరేశప్ప, ముడా అధ్యక్షుడు గఫూర్‌సాబ్, సత్తార్, కామేశ్, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న హంపయ్యనాయక్

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTHAPURAMU
O.S.No: 469/2016
Between:
Badige Fazullulah ......Plaintiff
and
Badige Mohammad Naser and others ...Defendants
Notice to the Defendant No : 9, 10, 11 and 12
D9. Muzibullaha S/o Abdul Gani Sab, Muslim, Retired employee,
D10. Amreen D/o Muzibullaha,
D11. Fareen D/o Muzibullaha,
D12. Vaseem S/o Muzibullaha,
9 to 12 are R/of Behind Azad Floor Mill, Taj Peer Lay-out, Chitradurg, Karnataka.
పై నెంబరు కేసులో ప్రతివాదులు అయిన మీ హాజరు నిమిత్తము 20-01-2026వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(కోర్టు ఉత్తర్వుల మేరకు)
D.Shyam Sunder, K.Mohan Rao
Advocates, Anantapur
Cell: 9440258700

(c) eenadu

సక్రమంగా కొనరు... రైతు కష్టాలు కనరు

- మండీల్లో జాగారం చేస్తున్న అమ్మకందారులు
- వివిధచోట్ల ఆందోళనలు, రాస్తారోకోలు
- ప్రతిపక్షాల కుట్ర అంటున్న మంత్రి

పశ్చిమ ఒడిశాలోని దేవ్‌గఢ్ మండీ వద్ద అన్నదాతలు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: మండీలు తెరిచి 12 రోజులైంది. ఈ ఏడాదిలో ఖరీఫ్ పంట కొనుగోళ్లు పారదర్శకంగా జరుగుతాయని, రైతన్నలకు ఇబ్బందులుండవని ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కృష్ణచంద్ర పాత్ర్ పదేపదే చెబుతున్నారు. మరోవైపు మండీల్లో కొనుగోళ్ల జాప్యం, టోకెన్ల కేటాయింపులో గందరగోళం వల్ల అన్నదాతలు ధాన్యం బస్తాలతో జాగరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పశ్చిమ ఒడిశాలోని కలహండి, సోన్‌పూర్, నువాపడ, బరగఢ్, సంబల్‌పూర్ జిల్లాల్లో అసంతృప్తి భగ్గుమంటోంది. రైతన్నలు ఆందోళనలు, రాస్తారోకోలు చేస్తున్నారు. దీనిపై శుక్రవారం కృషక్ సంఘటన్ సంబల్‌పూర్ జిల్లా బంద్ చేపట్టిన సంగతి తెలిసిందే.

కృష్ణచంద్రపాత్ర్

మంత్రులు పర్యవేక్షిస్తున్నారు

మంత్రి కృష్ణచంద్రపాత్ర్ శనివారం రాత్రి భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయన్నారు. మండీలను మంత్రులు, ఆయా జిల్లాల పాలనాధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రస్తుతం పశ్చిమ ఒడిశా జిల్లాల్లో విక్రయాలు జరుగుతుండగా, ఈ నెలాఖరులోగా మిగిలిన జిల్లాల్లో మండీలు తెరుస్తామన్నారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే వెంటనే పరిష్కరిస్తున్నామని, తరచూ అధికారులు సమీక్షిస్తున్నారన్నారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులందరికీ టోకెన్లు అందుతున్నాయని, కొనుగోలు జరిగిన 48 గంటల్లోగా వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమవుతోందని చెప్పారు. గిట్టని విపక్షాలు ఉద్దేశపూర్వకంగా ఆయాచోట్ల రైతన్నలను రెచ్చగొట్టి ఆందోళనలు చేయిస్తున్నాయని ఆరోపించారు.

- నువాపడ జిల్లా కేంద్రంలో ఈ నెల 17న రైతులు టోకెన్లు కేటాయింపులు కావడం లేదని, ఆహార, పౌరసరఫరాల అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆందోళన చేశారు.
- కలహండి జిల్లా ధర్మగఢ్ మండీ వద్ద 18న అన్నదాతలు ఆందోళన చేశారు.
- 19న సంబల్‌పూర్ జిల్లాలో కృషక్ మంచ్ ఆధ్వర్యంలో రైతన్నలు బంద్ చేశారు.
- బరగఢ్ జిల్లా సొహెలా, బట్లీ ప్రాంతాల్లో మండీల యాజమాన్యాలు ధాన్యం కొనుగోలు చేయడం లేదని రాస్తారోకో చేపట్టారు.
- సోన్‌పూర్ జిల్లా బినికా మండీ వద్ద శనివారం నుంచి ధర్నా చేస్తున్నారు. ఆదివారం వరకు ఇది కొనసాగింది.
- బౌద్ధ్ జిల్లాలోని మెరాముండ ప్రాంతం అన్నదాతలు ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యానికి నిరసనగా శనివారం (20న) ఆందోళన చేశారు. ఆదివారం(21న) రాస్తారోకో చేపట్టారు.

శాంతిభద్రతలపై సెంట్రల్ డీఐజీ సమీక్ష

పోలీసు అధికారులతో కరచాలనం చేస్తున్న సత్యజిత్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: జాజ్‌పూర్‌లో శాంతిభద్రతల అంశమై సెంట్రల్ డీఐజీ సత్యజిత్ నాయక్ శనివారం సాయంత్రం సమీక్షించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్ష నిర్వహించిన ఆయన పెండింగు కేసుల పరిస్థితి, ప్రస్తుత నేర తరహాలు, ఇతర అంశాలపై ఆరా తీశారు. ప్రజల భద్రతకు పోలీసు యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు, క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బంది బలోపేతం వంటి వాటి ప్రాధాన్యతను సత్యజిత్ నొక్కి చెప్పారు. ఆస్తులకు సంబంధించి నేరాలు, సైబర్ నేరాలను పోలీసులు సవాలుగా స్వీకరించి వాటిని పరిష్కరించాలని సూచించారు. నేరాల నియంత్రణకు సకాలంలో దర్యాప్తు, సమర్థవంతమైన పర్యవేక్షణ, సమన్వయంతో కూడిన కార్యాచరణ అవసరమని వివరించారు. ప్రజల్లో పోలీసు వ్యవస్థపై భయం పోగొట్టి, వారితో స్నేహపూర్వకంగా మెలగాలని డీఐజీ హితవు పలికారు.

బాలికపై ఇద్దరి అత్యాచారం

నిందితుల అరెస్టు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని ధౌళి పరిధిలో గల శిశుపాలగడలో బాలికపై సామూహిక అత్యాచార ఘటన నగరవాసుల స్మృతిపథం నుంచి వీడక ముందే మరో రాక్షసకృత్యం జరిగింది. డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉద్యోగం ఇస్తామని 17 ఏళ్ల 6 నెలల బాలికను నమ్మించిన ఇద్దరు దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. శుక్రవారం (19న) సాయంత్రం ఈ ఘటన జరిగింది.

ఇంటికి రమ్మన్నారు

సహీద్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్న అక్షయ దాస్ ఉద్యోగం ఇస్తానని తనకు తెలిసిన బాలికను నమ్మించాడు. ఇంటికి రమ్మన్నాడు. ఆయనను నమ్మి ఆమె ఆయనింటికి వెళ్లింది. అక్షయ నివాసంలో ఆయన స్నేహితుడు సాహిల్ ఖాన్ ఉన్నాడు. ఇద్దరూ బాలికపై అత్యాచారం చేశారు. దీనిపై బాధితురాలు శుక్రవారం రాత్రి సహీద్‌నగర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. డీసీపీ జగ్మోహన్ మీనా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం రాత్రి ఇద్దరు నిందితుల్ని అరెస్టు చేశారు. బాధితురాలికి వైద్య పరీక్షలు చేయించారు.

రెడ్‌ఫ్లాగ్‌లో చేర్చాం

భువనేశ్వర్, కటక్ నగరాల కమిషనర్ సురేష్ దేవదత్తసింగ్ ఈ అత్యాచారం కేసును రెడ్‌ఫ్లాగ్‌లో చేర్చినట్లు చెప్పారు. క్రైంబ్రాంచ్, పోలీసు అధికారులు సంయుక్తంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఏదీ మహిళలకు రక్షణ

దీనిపై బిజద చీఫ్‌విప్ **ప్రమీలా మల్లిక్** ఆదివారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ 18 నెలల డబుల్ ఇంజిన్ పాలనలో రాష్ట్రంలో 4 వేల ఘటనలు జరిగాయన్నారు. అత్యాచార ఘటనలు పెరిగాయని, రాజధాని నగరంలోనూ మహిళలకు భద్రత కరవైందన్నారు. హోంశాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి దీనికి జవాబుదారీ అని, ఆయన సొంత గొప్పలు చెప్పుకుని ప్రచారం చేసుకుంటున్నారని దుయ్యబట్టారు.

శాంతిభద్రతలు క్షీణించాయి

పీసీసీ అధ్యక్షుడు **భక్తచరణ్‌దాస్** ఆదివారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, రాజధానిలోనూ బాలికలు, యువతులపై వరుస అత్యాచార ఘటనలు జరుగుతున్నా, భాజపా పాలకులు మొద్దునిద్ర వీడకపోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. పోలీసు యంత్రాంగం వైఫల్యం తేటతెల్లమవుతున్నా, సీఎం మౌనంగా ఉండటం నిందనీయమన్నారు.

కఠిన చర్యలు తీసుకుంటున్నాం

న్యాయశాఖ మంత్రి **పృథ్వీరాజ్ హరిచందన్** ఆదివారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ మోహన్ ప్రభుత్వం శాంతిభద్రతలకు పెద్దపీట వేసిందని, నేరాలకు పాల్పడుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతోందన్నారు. శుక్రవారం సహీద్‌నగర్‌లో బాలికపై అత్యాచారం ఘటనలో 24 గంటల్లో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారని, పోక్సో చట్టం కింద కఠిన శిక్ష అమలవుతుందన్నారు. శిశుపాలగడ ఘటన మాదిరిగా సహీద్‌నగర్ అత్యాచారం కేసు రెడ్‌ఫ్లాగ్ జాబితాలో చేర్చిన పోలీసు యంత్రాంగం దర్యాప్తు చేస్తోందన్నారు. బిజద పాలనలో హత్యాచార ఘటనలు జరిగినా నిందితులపై చర్యలు కరవయ్యాయని, మోహన్ సర్కారు ఎవర్నీ వదలడం లేదన్నారు.

సహకార సేవలు అందరికీ చేరువవ్వాలి

- మంత్రి ప్రదీప్‌బల సామంత

సహకార రంగంలో విశిష్ట సేవలందించిన వారిని సన్మానిస్తున్న మంత్రి ప్రదీప్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: సహకార సేవలు అందరికీ చేరువ చేయాలన్నది ప్రభుత్వ ధ్యేయం కాగా స్వచ్ఛతగా ఈ బాధ్యత నెరవేర్చాలని సహకార బ్యాంకులు, సమితుల ప్రతినిధులు నిజాయతీగా సేవలందించాలని సహకార శాఖ మంత్రి ప్రదీప్ బలసామంత కోరారు. 'అంతర్జాతీయ సహకారోత్సం-2025' కార్యక్రమాల ముగింపు వేడుక శనివారం రాత్రి భువనేశ్వర్‌లోని స్వస్తి అతిథి భవనంలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ సహకార శాఖ పంచాయతీల్లో చేపడుతున్న కార్యక్రమాలు, అన్నదాతల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న పథకాల గురించి చెప్పారు. సహకార రంగంలో విశిష్ట సేవలందించిన సంస్థల ప్రతినిధులను సన్మానించారు. కార్యక్రమంలో సహకార శాఖ సంచాలకుడు కపిల్ మీనా, కమిషనర్ రాజేష్ ప్రభాకర్ పాటిల్, మత్స్యశాఖ సంచాలకుడు మహమ్మద్ సాదిక్ ఆలం, ఓంఫెడ్ సంచాలకుడు విజయ్ అమృతకుళంగె తదితర అధికారులు పాల్గొన్నారు.

బిజు పట్నాయక్ తీరానికి మహర్దశ

- 'బ్లూ ఫ్లాగ్' బీచ్‌గా అభివృద్ధికి చర్యలు

నొళియా నువాగావ్‌లోని సాగర తీరం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని ఛత్రపురం సమితిలో నొళియా నువాగావ్ గ్రామంలోని 'బిజు పట్నాయక్ బీచ్'కు మహర్దశ పట్టనుంది. ఈ తీరాన్ని 'బ్లూ ఫ్లాగ్ బీచ్'గా అభివృద్ధి చేయాలని పర్యాటక శాఖ జిల్లా యంత్రాంగానికి లేఖ రాసింది. దీంతో బ్రహ్మపుర అభివృద్ధి సంస్థ (బీఈడీఏ) ఉపాధ్యక్షునిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) కమిషనర్ ప్రథమేష్ అరవింద్ రాజేషిర్కె బిజు పట్నాయక్ తీరాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. తీరంలో అభివృద్ధి పనులపై వారితో చర్చించారు. గంజాం జిల్లాలోని సున్నాపురం తీరానికి వరుసగా మూడోసారి బ్లూ ఫ్లాగ్ హోదా లభించిన సంగతి తెలిసిందే. జిల్లాలోని గోపాలపూర్ తీరాన్ని బ్లూ ఫ్లాగ్ బీచ్ గుర్తింపునకు వీలుగా అభివృద్ధి పనులు చేపట్టిన సంగతి విదితమే. తాజాగా జిల్లాలో పరిశుభ్రమైన నొళియా నువాగావ్‌లోని బిజు పట్నాయక్ బీచ్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నారు.

త్వరలో ప్రభుత్వానికి నివేదిక

పర్యాటక శాఖ లేఖతో గంజాం జిల్లా యంత్రాంగం చకచకా చర్యలు చేపట్టింది. బిజు పట్నాయక్ బీచ్‌ను బ్లూఫ్లాగ్ బీచ్‌గా అభివృద్ధి చేసేందుకు 'సమగ్ర పథక నివేదిక' (డీపీఆర్)ను బీఈడీఏ సిద్ధం చేసి, త్వరలో రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తుందని ఆ సంస్థ ఉపాధ్యక్షుడు ప్రథమేష్ రాజేషిర్కె విలేకరులకు చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆమోదం లభించిన వెంటనే తీరంలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. తీరానికి వెళ్లేందుకు మంచి రహదారి, తీరంలో పాదచారుల బాట, శౌచాలయం, తాగునీరు, సందర్శకులు కూర్చునేందుకు ఏర్పాట్లు, సుందరీకరణ తదితర పనులు జరుగుతాయని ఆయన తెలిపారు. మరోవైపు ఈ తీరానికి అంతర్జాతీయ స్థాయి బ్లూఫ్లాగ్ గుర్తింపు లభిస్తే సందర్శకుల సంఖ్య పెరిగి, తమకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని నొళియా నువాగావ్ వాసులు కామేశు, జగన్నాథ్ విలేకరులకు చెప్పారు. తీరాన వివిధ రకాల సామగ్రి అమ్మకాలతో పలువురు గ్రామస్థులు ఉపాధి పొందుతారని వారు పేర్కొన్నారు.

తీరాన్ని సందర్శించి అధికారులతో చర్చిస్తున్న బీఈడీఏ ఉపాధ్యక్షుడు రాజేషిర్కె

యూసీసీసీ నూతన కార్యవర్గం ఎన్నిక

నూతన అధ్యక్షుడు జుగల్ కిశోర్, కార్యదర్శి రంజిత్, ఇతర కార్యవర్గ సభ్యులు

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: ఉత్కళ సినీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (యూసీసీసీ) 2025-2027 సంవత్సరాలకుగాను నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. కటక్‌లోని యూసీసీసీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఒడిశా సినీ నిర్మాతల సంఘం నూతన అధ్యక్షుడిగా జుగల్ కిశోర్ దేబతా, ఉపాధ్యక్షుడిగా అజయ్ కుమార్ రౌత్రాయ్, కార్యదర్శిగా రంజిత్ కుమార్ రౌత్, నిర్వాహక కార్యదర్శిగా సమరేష్ రౌత్రాయ్, కోశాధికారిగా చిత్తరంజన్ మిశ్ర ఎన్నికయ్యారు. వీరితోపాటు కార్యనిర్వాహక సభ్యులుగా అజయ్‌కుమార్ మహంతి, ప్రణయ్ జెరి, రమేష్ బారిక్, తపన్‌దాస్, కె.తమన్నా, లిటు మహంతి, కౌశిక్ దాస్, అక్షయ ప్రధాన్ ఎన్నికయ్యారు.

కానిస్టేబుల్ రశ్మితకు డీజీపీ సన్మానం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ప్రెసిడెంట్ కప్-2025లో సత్తా చాటిన కటక్ అర్బన్ పోలీసు డివిజన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ రశ్మిత సాహును డీజీపీ యోగేశ్ బహదూర్ ఖురానియా సన్మానించారు. ఉత్తరాఖండ్‌లోని తెహ్రిలో జరిగిన వెయ్యి మీటర్ల పడవ పందెంలో రజతం, 500 మీటర్ల కేటగిరీలో కాంస్య పతకం రశ్మిత దక్కించుకోవడాన్ని డీజీపీ ప్రశంసించారు. రశ్మితకు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సొంతం కావాలని ఖురానియా ఆకాంక్షిస్తూ, ఆమె సాధించిన విజయాలు తోటి వారికి స్ఫూర్తి అని కొనియాడారు.

రశ్మితను ప్రశంసిస్తున్న డీజీపీ ఖురానియా

పరబ్ వేడుకల్లో మంత్రి, ఎమ్మెల్యేల నృత్యం

సిమిలిగుడ, కొరాపుట్, న్యూస్‌టుడే: ఆదివాసీ కళా సంస్కృతి పరిరక్షణ ఉద్దేశంతో నిర్వహించే పరబ్ వేడుకలు శనివారం మూడో రోజుకు చేరింది. రాత్రి జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌరసరఫరాల, సైన్స్, టెక్నాలజీ శాఖల మంత్రి కృష్ణచంద్ర పాత్ర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. ఓ పాటకు మంత్రి పాత్ర్, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే పవిత్ర శాంత, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురామ్ మచ్చొ వేదికపై నృత్యం చేయడం విశేషంగా ఆకట్టుకుంది. ప్రముఖ గాయని ఆషిమా పండా సంగీత విభావరి కార్యక్రమం అలరించింది.

నృత్యం చేస్తున్న మంత్రి పాత్ర్, ఎమ్మెల్యేలు పవిత్ర, మచ్చొ

ఒక్కరోజే రూ.2 కోట్ల వ్యాపారం

పరబ్‌లో పాల్గొన్న ప్రజలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్‌లో పరబ్ ముఖ్య వేడుకల్లో భారీ రద్దీ కనిపించింది. గురువారం నుంచి వేడుకలు ప్రారంభం కాగా రోజూ సాయంత్రం నుంచి రాత్రి 12 గంటల వరకు అక్కడ ఏర్పాటు చేసిన మేళాలో భారీ ఎత్తున ప్రజలు తరలివస్తున్నారు. ఓర్మాస్ సంస్థ ఆధ్వర్యంలో 536 స్టాల్స్ ఏర్పాటైన విషయం తెలిసిందే. వివిధ రాష్ట్రాల సామగ్రి, చెప్పులు, గృహాలంకరణ తదితర స్టాల్స్ కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి. చలిని కూడా లెక్క చేయకుండా ప్రజలు భారీగా తరలి వస్తున్నారు. రికార్డు స్థాయిలో వ్యాపారం జరిగినట్లు అధికారులు వెల్లడించారు. మూడు రోజుల్లో సుమారు రూ.5 కోట్లు వ్యాపారాలు జరిగాయి. శనివారం ఒక్కరోజే రూ. రెండు కోట్ల వరకు వ్యాపారం జరిగింది.

చినజీయరుస్వామి ఆశీస్సులందుకున్న సీఎం

స్వామితో సీఎం మోహన్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: హైదరాబాద్ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి మోహన్‌చరణ్‌మాఝి శనివారం స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీని సందర్శించారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయరుస్వామి ఆశీస్సులందుకున్నారు. స్వామిజీ బోధనలు విన్నారు. మానవత్వం విలువలు, ఆధ్యాత్మిక, సన్మార్గం, సత్కర్మల గురించి బోధిస్తున్న స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ దివ్య సౌధంగా సీఎం పేర్కొన్నారు.

సాంస్కృతిక దర్పణం.. ఇడితాల్ ఉత్సవం


ఇడితాల్ వేదికపై అతిథులు

రాయగడ-గుణుపురం, న్యూస్‌టుడే: సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడుతూ ఏటా నిర్వహించే గుణుపురం సాంస్కృతిక చౌయితి-ఇడితాల్ ఉత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యింది. ఆదివారం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, సబ్ కలెక్టర్ దిలీప్ అభిషేక్ ఆధ్వర్యంలో సంప్రదాయ వాయిద్యాలు, ఆదివాసీ నృత్యాలు, సంకీర్తన మండలి నృత్య గీతాలు, అశేష ప్రజలు తరలిరాగా వంశధార నదీ జలాలను శోభాయాత్రగా ఉత్సవ వేదిక వద్దకు తీసుకెళ్లి దేవతా మూర్తులతో పాటు ఉంచారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు సరస్వతి మాఝి, పురాధ్యక్షురాలు మమత గౌడ, ఉపాధ్యక్షుడు శివప్రసాద్ గౌడ, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి.

పర్యాటక రంగంపై నీలినీడలు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో వీటి అభివృద్ధిపై నీలినీడలు అలుముకున్నాయి. జిల్లాలోని రాయగడ సమితితో పాటు కె.సింగ్‌పూర్ సమితిలో అనేక జలపాతాలున్నాయి. ముఖ్యంగా నియమగిరి పర్వత ప్రాంతాల్లో సింగారి గ్రామానికి సమీపంలో మూడు జలపాతాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోకపోవడంతో పర్యాటకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ జలపాతాల వద్ద ఏటా చుట్టుపక్కల ప్రాంతాల వారు పిక్నిక్‌లు, ఒడియా సినిమాల షూటింగులు లాంటికి జరుగుతాయి. ఆంధ్రా సరిహద్దున దుర్గాపడు కొరాపుట్ రహదారిలో గల సాంకేసు జలపాతం అభివృద్ధికి రెండేళ్ల కిందట ప్రణాళికలు సిద్ధమైనా నేటికీ నిధులు రాక పనులు జరగట్లేదు. ఇప్పటికైనా వీటి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

సింగారి గ్రామ సమీపంలో ఉన్న జలపాతాలు

పరిసలి వద్ద పర్యాటక ప్రాంతం

తల్లిదండ్రులు బాధ్యతగా పిల్లల్ని చదివించాలి

ప్రదర్శనలతో మెప్పించిన వారికి బహుమతులందజేస్తున్న మంత్రి కృష్ణచంద్ర, ఇతర అధికారులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు బాధ్యతగా పిల్లల్ని చదివించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని విద్య, గిరిజన, మైనార్టీ సంక్షేమశాఖల మంత్రి నిత్యానంద గొండ్ చెప్పారు. భువనేశ్వర్‌లోని ప్రదర్శనా మైదానంలో 'సొరొగొపుల్లో' రెండు రోజుల రాష్ట్రస్థాయి వేడుకలు శనివారం రాత్రి ముగిశాయి. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ పాఠశాలలో విద్య, క్రీడలు, విజ్ఞానదాయక కార్యక్రమాలు జరుగుతున్నాయని, అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 'సొరొగొపుల్లో' వేడుకలు విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి బి.పరమేశ్వరన్, ఎస్టీ శాఖ సంచాలకుడు లక్ష్మణ మల్లిక్, ఓబీసీ శాఖ సంచాలకురాలు యుగలేశ్వరిదాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు. బాలబాలికలు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. వారికి బహుమతులు అందజేశారు.

టాటా స్టీల్ ఫౌండేషన్ ఔదార్యం... పెరిగిన రైతు ఆదాయం

- జాజ్‌పూర్‌లో గడిచిన ఐదేళ్లలో 243 జల వనరులు నిర్మించిన టీఎస్ఎఫ్

అడుగడుగునా చెరువులతో ఆహ్లాదం పంచుతున్న పచ్చదనం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: అన్నదాతలు స్థిరమైన అభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో టాటా స్టీల్ ఫౌండేషన్ (టీఎస్ఎఫ్) తమవంతు సాయమందిస్తోంది. పంటలు సమృద్ధిగా పండేందుకు కావాల్సిన సాగునీటి కోసం చెరువులు తవ్విస్తూ రైతులకు చేయూతనిస్తోంది. జాజ్‌పూర్ జిల్లాలోని రెండు సమితుల పరిధిలో గడిచిన ఐదేళ్లలో 243 చెరువులను తవ్వి ఔదార్యాన్ని చాటుకుంది. కళింగ నగర్ క్లస్టర్ చేపట్టిన వీటి నిర్మాణాలతో ఆయా గ్రామాల్లో సాగునీటి కళ సంతరించుకుంటోంది. వివరాల్లోకి వెళితే దొనగడి, సుకింద సమితుల పరిధిలో నిర్మించిన 243 చెరువులతో 28 గ్రామాలకు చెందిన వేలాది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరుతోంది. వీటిలో దొనగడి సమితిలో 139 చెరువులు, సుకిందలో మరో 104 చెరువులు నిర్మించారు. దీంతో వీటి పరిధిలో ఆయా గ్రామాల పంట పొలాలకు సమృద్ధిగా సాగునీరు సమకూరుతోందని స్థానికులు చెబుతున్నారు. వర్షపునీటిని ఒడిసిపట్టేలా నిర్మిస్తున్న ఈ చెరువుల్లో భూగర్భ జలాల మెరుగుకు అవసరమైన చర్యలను అమలు చేస్తుండడం గమనార్హం. ఈ విషయమై టీఎస్ఎఫ్ కళింగనగర్ క్లస్టర్ హెడ్ దేబంజన్ ముఖర్జీ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో 59 చెరువుల నిర్మాణాన్ని పూర్తి చేశామన్నారు. వీటిలో దొనగడి పరిధి 27 కాగా, సుకిందలో 32 ఉన్నాయన్నారు.

పది రెట్లు లాభాలు

చెరువుల నిర్మాణంతో ఆయా ప్రాంతాలకు చెందిన అన్నదాతల వార్షిక ఆదాయం పదిరెట్లు మేర పెరగడం గమనార్హం. ఫూల్‌జోర్ గ్రామానికి చెందిన నరేష్‌సుద్ధా అనే రైతు మాట్లాడుతూ గతంలో సాగు నీటి కొరత కారణంగా కేవలం వరి సాగుకు మాత్రమే పరిమితం కావాల్సి వచ్చేదన్నారు. దీంతో వార్షిక ఆదాయం రూ. 5 వేలు నుంచి రూ. 1 లక్ష వరకు సమకూరుతోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పాతాపూర్ గ్రామానికి చెందిన సిద్దేశ్వర్ జముడా అనే అన్నదాత స్పందిస్తూ గతంలో ఏడాదికి ఒకసారి మాత్రమే వరి పండించేవారమని, టీఎస్ఎఫ్ చొరవతో రెండు పంటలతో పాటు, కూరగాయలు ఇతరత్రా వాణిజ్య పంటలు పండించే వీలు కలుగుతుందన్నారు. అంతేకాకుండా చెరువుల వల్ల మత్స్యసాగు, బాతుల పెంపకం వంటి ప్రత్యామ్నాయ ఆదాయం సమకూరుతున్నట్లు వెల్లడించారు.

(c) eenadu

సమాజానికి దర్పణం.. నాటకం

నాటికలో ఓ సన్నివేశం

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: నాటకం సమాజానికి దర్పణం వంటిదని, ఈ మాధ్యమం ద్వారా సమాజంలోని కుసంస్కారాలను దూరం చేసి, మంచి సందేశాలివ్వడం లక్ష్యమని అతిథులన్నారు. స్థానిక కవిసూర్య రంగమంచ్‌లో 'శాశ్వతి' నాటక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ స్థాయి బహుభాషా నాటికోత్సవాలు శనివారం రాత్రి ముగిశాయి. చివరి రోజు సమావేశానికి గంజాం జిల్లా సమాచార, ప్రజా సంబంధాల శాఖ విశ్రాంత అధికారి రబినారాయణ బెహర అధ్యక్షత వహించారు. రంగస్థల ప్రముఖుడు డాక్టర్ తిరుపతి సాహు, రచయిత్రి బిధుప్రభా రథ్, ఇతర ప్రముఖులు చరణ సాహు, అనూజా శ్రీవాస్తవ్, అనిల్‌కుమార్ పాత్ర్, రామచంద్ర సాస్మల్, సునీల్ స్వాయిన్ తదితరులు పాల్గొని మాట్లాడారు. చివరిగా నిర్వాహక సంస్థ కళాకారులు బసా ఘరా ఒడియా నాటికను ప్రదర్శించగా, నీలాద్రి థియేటర్స్ (పూరీ) కళాకారులు ఒడియా నాటిక 'కాయకల్ప' ప్రదర్శించారు. అంతకుముందు వివిధ సంస్థల కళాకారుల నృత్య ప్రదర్శనలు జరిగాయి.

జాతీయ స్థాయిలో అంకితకు బహుమతి

నగదు బహుమతి అందుకుంటున్న అంకిత బృందం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: పంజాబ్‌లోని చండీగఢ్‌కు చెందిన ఇంజినీరింగ్ కళాశాలలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025 ఫైనల్స్‌లో అంకితకు బహుమతి లభించింది. సిమిలిగుడ పట్టణంలో ఒడియా అమ్మాయి అంకితతో పాటు ఆమె బృందం పోటీలో పాల్గొని తక్కువ ఖర్చుతో మొబైల్ సాఫ్ట్‌వేర్ రూపొందించారు. ఈ ప్రాజెక్ట్ బోధనా సామర్థ్యాన్ని పెంచడం, గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన డేటా ఆధారిత మధ్యాహ్న భోజనాన్ని రికార్డ్ చేయడానికి విద్యార్థుల హాజరుకు సంబంధించి తల్లిదండ్రులకు మొబైల్ సందేశాలను పంపడానికి ఉపయోగపడేలా రూపొందించారు. దీంతో మొదటి స్థానాన్ని గెలుచుకున్నారు. విజేత బృందంలో అంకిత, పి.వంశీకృష్ణ వరుణ్ శర్మ, వి.యశ్వంత్, మధుహన్ శేఖర్, ప్రభాస్ రేలు ఉండగా విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.1.5 లక్షల నగదు బహుమతి లభించిందని తెలిసింది. అంకిత సిమిలిగుడలో నేతాజీ నగర్‌కు వ్యాపారవేత్త ప్రియరంజన్ బెహరా, రష్మిరేఖ దంపతుల కుమార్తె. ఆమె ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతోంది.

వాతావరణానికి అనుగుణంగా పంటలు వేయాలి

వ్యవసాయ సంచిక ఆవిష్కరిస్తున్న అరవింద పాఢి, ఇతర అతిథులు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: వాతావరణంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్న తరుణంలో ప్రతికూల పరిస్థితుల్లోనూ అధికోత్పత్తులు సాధించేలా సాగు చేయాలని, ఈ దిశగా అన్నదాతలకు సమగ్ర అవగాహన కల్పించాలని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలిసింగ్ సంస్థలు భువనేశ్వర్‌లోని కృషి భవన్‌లో 'ప్రతికూల వాతావరణం-పంటలు' అన్న అంశంపై రెండు రోజుల సదస్సు ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఓయూఏటీ) ఉపకులపతి ఆచార్య ప్రదాత్‌కుమార్ రౌళో, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి అరవింద పాఢి, ఇతర అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. 'వాతావరణ అనుకూల పంటలు' అన్న సంచిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులకు శిక్షణ, వారి సందేహాల నివృత్తి చేశారు.

రాయగడలో మంత్రి పర్యటన

ప్రేమ్ పహాడ్ కారిడార్‌లో నడుస్తున్న మంత్రి గోకులానంద్

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర మత్స్య, జంతు వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గోకులానంద్ మల్లిక్ ఆదివారం రాయగడలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రేమ్ పహాడ్‌ను సందర్శించిన ఆయన ఇక్కడ కొండ చుట్టూ ఉన్న కారిడార్‌లో నడుచుకుంటూ తిరిగారు. ఈ నేపథ్యంలో ఉదయం ప్రభాత నడకకు వచ్చి పట్టణ ప్రముఖులు, సీనియర్ పౌరులతో మల్లిక్ ముచ్చటించారు. పట్టణంలో నెలకొన్న వివిధ సమస్యలు అడిగి తెలుసుకొని వాటి పరిష్కార మార్గాల గురించి వారితో చర్చించారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో చలి మంట వద్ద కాసేపు సేదదీరారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కడం, లిల్లీ, దెబోలు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పొట్టంగి ఎమ్మెల్యే రామ్‌చంద్ర కడం అధికారులను ఆదేశించారు. సిమిలిగుడ సమితి కుందిలి లాంప్స్‌లో ఆదివారం మండీ (ధాన్యం కొనుగోలు కేంద్రం)ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కడం మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు మండీల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. రైతులు ఇబ్బంది పడకుండా చూడాలని సూచించారు. వాటర్‌షెడ్ విభాగం ప్రాజెక్టు అధికారి సతీష్ చంద్ర, లాంప్స్ మేనేజింగ్ డైరెక్టర్ బి.సబితా, సమితి అధ్యక్షురాలు లిల్లీ అంత బిరియా, తహసీల్దార్ దేబబ్రత కారట్, డైరెక్టర్ సామో హంతల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ రేషన్ కార్డులు అందజేయాలి

రేషన్ కార్డులు అందజేస్తున్న మంత్రి

సిమిలిగుడ, న్యూస్‌టుడే: పేదలందరికీ రేషన్ కార్డులు అందేలా చూడాలని రాష్ట్ర పౌరసరఫరాల, సైన్స్, టెక్నాలజీ విభాగాల మంత్రి కృష్ణచంద్ర పాత్ర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం సిమిలిగుడ సమితి కుందిలి గురుకుల ఆశ్రమంలో మంత్రి పాత్ర్ సందర్శించారు. అక్కడ విశ్వశాంతికి జరిగిన యజ్ఞంలో పాల్గొన్నారు. అనంతరం కొరియా గ్రామాన్ని సందర్శించారు. భాజపా నేతలు సుమంత్ ప్రధాన్, ఆశ్రమం అధ్యక్షులు ఆనంద్ పత్వనియ, సభ్యులు జలంధర్, జిల్లా పరిషత్తు సభ్యులు టికాయి గామెల్, సమితి అధ్యక్షురాలు కల్పన పంగి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ట్రాక్ సైక్లింగ్‌లో రాష్ట్ర యువతులకు పతకాలు

రజత పతకాలతో బర్షారాణి బారిక్, స్వస్తిసింగ్, రెజియదేవి

పసిడి పతకాలతో బృంద మహిళా క్రీడాకారిణులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రుద్రపూర్ (ఉత్తరాఖండ్)లోని షివాలిక్ వెలోడ్రోమ్‌లో ఈ నెల 19 నుంచి 23 వరకు జరుగుతున్న జాతీయ సీనియర్ ట్రాక్ సైక్లింగ్ పోటీల్లో రాష్ట్ర యువతులు సత్తా చాటారు. ఇందులో శనివారం నిర్వహించిన 4 కిలోమీటర్ల పుర్‌సుట్ బృంద అంశంలో రాష్ట్ర మహిళా సైక్లిస్టులు స్వస్తి సింగ్, ఖయిరామ్ రజియదేవి, బర్షారాణి బారిక్, మధుస్మిత బడెక్, మనీషా సాహులు చెరో పసిడి పతకం గెలుచుకున్నారు. 2 కిలోమీటర్ల పుర్‌సుట్ బృంద, స్ప్రింట్ అంశంలో పోటీపడి సైక్లింగ్ చేసిన బర్షారాణి బారిక్, స్వస్తి సింగ్, రెజియదేవి చెరో రజత, కాంస్యపతకాలు కైవసం చేసుకున్నారు. రాష్ట్ర క్రీడాశాఖ ఆయా వివరాలను 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. పతకాల విజేతలకు ఒడిశా సైక్లింగ్ సంఘం ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

26న కాంగ్రెస్ జనజాగరణ ఆందోళన

భువనేశ్వర్, న్యూస్‌టుడే: టాటా పవర్ కంపెనీ నియంతృత్వానికి నిరసనగా కాంగ్రెస్ ఈ నెల 26న భువనేశ్వర్‌లో జన జాగరణ ఆందోళన చేపడుతుందని పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్‌దాస్ ఆదివారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. వినియోగదారులను వేధిస్తూ అడ్డగోలుగా సొమ్ము దోచుకుంటున్న టాటా కంపెనీకి సాగనంపే వరకు కాంగ్రెస్ ఉద్యమిస్తుందన్నారు.

మండీ ప్రారంభం

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడలోని కాశీపూర్ సమితి కేంద్రంలో ధాన్యం మండీ శనివారం ప్రారంభమైంది. లాంప్స్ అధికారి సంతోష్ సాహు ధాన్యం పూజ చేసి ప్రారంభించారు. అధ్యక్షుడు మోహన్, నోడల్ అధికారి అధ్యాపకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి రైతు మండీలో ధాన్యం విక్రయించాలని మోహన్ తెలిపారు.

పరబ్ ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం

వేదికపై గిరిజన సంప్రదాయ ధింసా నృత్యం

మోహన్‌చరణ్ మాఝికి స్వాగతం పలుకుతున్న మహిళా కార్యకర్తలు

కోరాపుట్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ గిరిజన ఉత్సవాలకు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి, పౌర సరఫరాల మంత్రి కృష్ణచంద్ర పాత్ర్, ప్రాథమిక విద్యాశాఖ మంత్రి నిత్యానంద గోండ్, కోరాపుట్, పొట్టంగి, లక్ష్మీపూర్ ఎమ్మెల్యేలు, నవరంగపూర్ ఎంపీ బలభద్ర మాఝిలు అతిథులుగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథి సీఎం మోహన్ చరణ్ మాఝికి మహిళా కార్యకర్తలు స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ పరబ్ ఉత్సవాల వేదిక సంప్రదాయాల పరిచయ వేదికన్నారు. ముఖ్య అతిథులకు కోరాపుట్ సంప్రదాయ ధింసా నృత్యంతో స్వాగతం పలికారు.

జయపురంలో ఉచిత వైద్య శిబిరం

శిబిరంలో రోగికి రక్తపోటు చూస్తున్న వైద్యులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: జయపురం పట్టణంలోని జేసీ కల్యాణ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విక్రమ్‌నగర్‌కు చెందిన దోలో మండపం వీధిలో వార్డ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఏర్పాటు చేసిన శిబిరంలో అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్ అన్నా, సభ్యులు పాల్గొన్నారు. ఈఎన్‌టీ నిపుణులు సతీష్ రెడ్డి, వైద్య నిపుణులు ప్రసాద్ నల్లని, కె.సాయి తేజస్విని, సాయి అనూషలు పాల్గొని వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు.

పురపాలక బోర్డు పనితీరుపై నోటీసు

జయపూర్, న్యూస్‌టుడే: పట్టణ పురపాలిక బోర్డు పనితీరుపై సంబంధిత శాఖ నోటీసులు పంపింది. పురపాలిక ప్రాంత పరిధిలో పారిశుద్ధ్య పనులు సవ్యంగా జరగలేదని, వీధి దీపాలు వెలగడం లేదని, పలు మౌలిక సదుపాయాలు సవ్యంగా లేవని పలు ప్రశ్నలకు సమాధానం కోరింది. వారం రోజుల్లో జవాబు ఇవ్వాలని కోరింది. ఇది నిరాధార ఆరోపణని ఎవరు ఈ ఫిర్యాదు చేశారో వారే తమ విభాగాన్ని సవ్యంగా నడపడం లేదని దీనిపై కల్యాణి ఘోష్ మీడియాతో మాట్లాడుతూ తిప్పి కొట్టారు.

రాష్ట్ర యువ మహోత్సవాలకు సన్నాహాలు

మాట్లాడుతున్న క్రీడాశాఖ సంచాలకుడు విజయ్ ఎద్దుల, చిత్రంలో ఇతర అధికారులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ తరఫున భువనేశ్వర్‌లోని కళింగ మైదానంలో ఈ నెల 24 నుంచి 26 వరకు రాష్ట్ర యువ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర క్రీడా శాఖ సంచాలకుడు విజయ్ ఎద్దుల చెప్పారు. ఈమేరకు శనివారం భువనేశ్వర్‌లోని కళింగ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఓ ప్రత్యేక సమావేశం ఏర్పాటైంది. ఇందులో ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఉత్సవాలను విజయవంతం నిర్వహించేలా అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యువతకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన చెప్పారు.

క్రిస్మస్ సందడి

రాయగడ, న్యూస్‌టుడే: క్రిస్మస్ పండగ దగ్గర పడటంతో పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. చర్చిలన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. బెలూన్లు, స్టార్, క్రిస్మస్ ట్రీ అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రార్థనలు, ఆత్మీయ పలకరింపులు, శాంతాక్లాజ్ సందడి ప్రారంభమయ్యాయి.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

పూజల్లో పాల్గొన్న వర్సిటీ ఉపాధ్యక్షులు డీఎన్ రావు, పద్మ దంపతులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని ఆర్.సీతాపురంలోని సెంచూరియన్ యూనివర్సిటీ ప్రాంగణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నాలుగు రోజులపాటు వైభవంగా జరగబోయే స్వామివారి బ్రహ్మోత్సవ పూజలు శనివారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. ఆదివారం స్వామివారికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వర్సిటీ ఉపాధ్యక్షులు డి.ఎన్.రావు, పద్మ దంపతులు, వర్సిటీ సిబ్బంది పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మంగళవారం వరకు పూజలు జరుగుతాయని డి.ఎన్.రావు తెలిపారు.

కటక్‌లో మధుబాబు మ్యూజియం

సూర్యవంశీ సూరజ్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్‌లోని శైలబాల మహిళా కళాశాల క్యాంపస్‌లో ఉత్కళగౌరవ్ మధుసూదన్‌దాస్ స్మృతి పీఠం, మ్యూజియం ఏర్పాటు చేస్తామని ఉన్నత విద్య, సాంస్కృతిక శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ చెప్పారు. ఆదివారం కటక్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్వతంత్ర ఒడిశా నిర్మాతల్లో అగ్రగణ్యుడైన మధుబాబు రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆ మహనీయుని కుమార్తె శైలబాల మహిళాభ్యుదయం, సామాజిక సేవలకు తన జీవితం అంకితం చేశారన్నారు. ఆమె పేరిట కటక్‌లో ఏర్పాటైన కళాశాలను ఆధునీకరణ చేసి, మధుబాబు జ్ఞాపకాలు నిక్షిప్తం చేస్తామన్నారు.

ప్రతిభకు పదును పెట్టే ప్రదర్శనలు

ప్రసంగిస్తున్న నవీన్, వేదికపై సునీత, శాంతిలత

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక ప్రతిభను మరింత పదును పెట్టేందుకు ప్రదర్శనలు చక్కని వేదికలా పనిచేస్తాయని అదనపు పాలనాధికారి నవీన్‌చంద్ర నాయక్ అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటైన జిల్లాస్థాయి బాల్య వైజ్ఞానిక ప్రదర్శన, సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఇందులో జిల్లాలోని 11 సమితుల నుంచి 70 పాఠశాలల విద్యార్థులు పాల్గొని మొత్తం 143 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఏడీఈవోలు శాంతిలత ముని, భజన్‌లాల్ మాఝి, ప్రిన్సిపల్ సునీత బోయి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ వర్సిటీలో ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటు

రాయగడ, గుణుపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని జీఐఈటీ యూనివర్సిటీలో ఇంక్యుబేషన్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు బీఎస్ఎన్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. శనివారం వర్సిటీలో జరిగిన వార్షిక టెక్నో-సాంస్కృతిక ఉత్సవం సృజన్ 4.0లో విశాఖపట్నం బీఎస్ఎన్ఎల్ డీజీఎమ్ సత్యప్రసాద్, వర్సిటీ రిజిస్ట్రార్ ఎన్వీ జగన్నాథం సంతకాలు చేశారు. ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్ సహాయ సంచాలకుడు డాక్టర్ దీపన్ హాజ్రై ప్రసంగించారు. ఉపాధ్యక్షుడు చంద్రధ్వజ పండా, జగదీష్ పండా పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలతో అధికారులు, అతిథులు

సునాబెడలో క్షయ వ్యాధిపై చైతన్య శిబిరం

కిట్లును అందజేస్తున్న దృశ్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఆదివారం క్షయ వ్యాధిపై చైతన్య శిబిరాన్ని నిర్వహించారు. దమన్‌జోడిలోని నాల్కో ఆధ్వర్యంలో క్షయవ్యాధి సంపూర్ణ నివారణకు కేంద్ర ప్రభుత్వం చేపట్టే నిక్షయ మిత్ర కార్యక్రమం కింద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని నాల్కో జనరల్ మేనేజర్ చంద్రమోహన్ మహంతో ప్రారంభించారు. ఆరోగ్య కేంద్రం ముఖ్య వైద్యాధికారిని రోషిణి పాల్గొని వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ సందర్భంగా క్షయ రోగులకు న్యూట్రిషన్, మందులు కిట్లను అందజేశారు.

అట్టహాసంగా ప్రారంభమైన నాటిక పోటీలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ ప్రముఖ సంస్థ ప్రవాసాంధ్ర నవ్య కళాపరిషత్తు ఆధ్వర్యంలో శనివారం రాత్రి 67 వ అఖిలభారత తెలుగు నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, నాటిక పోటీలు ప్రారంభించారు. ఈ పోటీలకు తెలుగు ప్రముఖులు ఆచార్య ఎ.ఎన్.వి సత్యనారాయణ, వి.శేషగిరిరావు, కె.వేణుగోపాలరావు, ఉదయ్‌కుమార్, లక్ష్మణ్‌రావు శిందే, అప్పారావు తదితరులు హాజరయ్యారు.

వేదికపై అతిథులు

గండాహతి జలపాతం వద్ద బందోబస్తు

జలపాతం వద్ద అటవీ సిబ్బంది

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా రాయగడ సమితిలో పిక్నిక్ స్పాట్‌గా గుర్తింపు పొందిన గండాహతి జలపాతం వద్ద పర్యాటకుల తాకిడి పెరిగింది. కొద్ది రోజుల కిందట ఓ బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పర్యాటకుల భద్రత దృష్ట్యా పోలీసులు, అటవీ సిబ్బంది జలపాతం వద్ద ఉంటూ అప్రమత్తమయ్యారు.

25 నుంచి వాజ్‌పేయీ స్మారక క్రికెట్ టోర్నీ

★ఒడిశా, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్‌లకు చెందిన 12 జట్ల మధ్య పోటీ

టోర్నీ పిక్చర్‌ను విడుదల చేసిన ఎమ్మెల్యే అనిల్‌కుమార్, నిర్వాహక కమిటీ ప్రతినిధులు పార్థో పాఢి, రాజురెడ్డి, ప్రదీప్ తదితరులు

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపురలో ఈ నెల 25 నుంచి 31 వరకు అటల్ బిహారి వాజ్‌పేయీ స్మారక ద్వితీయ టీ-20 క్రికెట్ టోర్నీ (డే అండ్ నైట్) నిర్వహించనున్నారు. ఈమేరకు స్థానిక గాంధీనగర్‌లోని బ్రహ్మపుర ఎంపీ, ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం రాత్రి విలేకరుల సమావేశం ఏర్పాటైంది. ఇందులో బ్రహ్మపుర ఎమ్మెల్యే కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇవి జాతీయ స్థాయిలో నిర్వహించనున్న క్రికెట్ పోటీలని, బ్రహ్మపురలోని మహాత్మాగాంధీ క్రీడా మైదానంలో వారం రోజులపాటు సాగే టోర్నీలో ఒడిశా నుంచి 10 జట్లు, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన 2 జట్లు పోటీ పడతాయన్నారు. విజేత జట్టుకు ట్రోఫీతోపాటు రూ.లక్ష నగదు, ద్వితీయస్థానంలో నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.50 వేలు నగదు అందజేస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో టోర్నీ కమిటీ నిర్వాహక అధ్యక్షుడు పార్థో పాఢి, కార్యదర్శి ప్రదీప్ నాయక్, సలహాదారుడు రాజు రెడ్డి, ఎమ్మెల్యే మీడియా ప్రతినిధి స్మితాలి స్మృతి స్నిగ్ధ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ కుమార్, నిర్వాహక కమిటీ ప్రతినిధులు టోర్నీ పిక్చర్‌ను విడుదల చేశారు.

బ్రహ్మపురలో ఎంపీ నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు

లాంగ్‌జంప్ చేస్తున్న జూనియర్ క్రీడాకారిణి

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర ఎంపీ లోక్‌సభ నియోజకవర్గస్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. 'యువశక్తికా ఉత్సవ్ - సంసద్ ఖేల్ మహోత్సవ్' పేరిట ఈ నెల 25 వరకు నిర్వహిస్తున్న ఇందులో బ్రహ్మపుర లోక్‌సభ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాలలు, కళాశాలలు, క్రీడాసంస్థలు, క్లబ్‌ల క్రీడాకారులు పోటీపడుతున్నారు. స్థానిక మహాత్మా గాంధీ క్రీడామైదానం, స్పోర్ట్స్ ఎరీనా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన 100, 400 మీటర్ల పరుగు, షాట్‌పుట్, డిస్కస్‌త్రోలు, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ తదితర క్రీడాంశాల్లో బ్రహ్మపుర, గోపాలపూర్, ఛత్రపురం, కుకుడాఖండి, దిగపొహండి తదితర ప్రాంతాలకు చెందిన 1600 మంది సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ బాలబాలికలు, యువతీయువకులు పోటాపోటీగా పాల్గొంటున్నారు.

కౌన్సిలర్ మృతికి సంతాపం

దానిమా

సిమిలిగుడ, న్యూస్‌టుడే: జయపురం పురపాలక సంస్థ 16వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ నాయకురాలు దానిమా హరిజన్(47) శనివారం రాత్రి తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఉదయం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు రూపాక్ తురుక్, ఇతర నేతలు, కార్యకర్తలు ఆమె స్వగృహానికి చేరుకుని సంతాపం తెలిపారు. జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ వాహినిపతి, పుర అధ్యక్షుడు నరేంద్ర మహంతి, కాంగ్రెస్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విజయవంతంగా నేత్ర పరీక్షలు

నేత్ర పరీక్షల శిబిరం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పట్టణ 18వ వార్డు కొత్తకోళీ ప్రాంతంలో శ్రీ షిరిడీసాయి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షల శిబిరం విజయవంతంగా జరిగింది. ఇందులో 80 మందికి ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఆలయ కమిటీ కార్యదర్శి లక్ష్మణరావు, అధ్యక్షులు నారాయణరావు వైద్యులు సూచించిన 30 మందికి ఉచిత నేత్ర శస్త్ర చికిత్సలు త్వరలో జరిపిస్తామని తెలిపారు.

మహేంద్రగిరి ఘాట్‌రోడ్‌లో ప్రమాదం

రహదారి పక్కన బోల్తా పడి ఉన్న టూరిస్ట్ బస్సు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా రాయగడ సమితిలో మహేంద్రగిరి పర్వత ఘాట్ రహదారిలో పర్యాటకుల బస్సు బోల్తా పడిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గారబంద పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కటక్, డెంకనాల్ జిల్లాలకు చెందిన పర్యాటకులు ఆదివారం పర్వతాన్ని సందర్శించి ఓ మినీ బస్సులో తిరిగి వస్తున్న సమయంలో రహదారి పక్కన అదుపుతప్పి బోల్తాపడగా, మరో బస్సు రహదారి మధ్యలో బోల్తా పడింది. ఈ రెండు బస్సుల్లో సుమారు 32 మంది పర్యాటకులు ఉన్నారు. వారిలో కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను కోయిపూర్ ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఒకే రాత్రి నాలుగు మందిరాల్లో చోరీలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా ఛత్రపురం ఠాణా పరిధిలో ఒకే రాత్రి నాలుగు మందిరాల్లో చోరీ ఘటనలు శనివారం వేకువన జరిగాయి. నూతన పోలీసు కాలనీ సమీపంలోని షిరిడీ సాయి మందిరం తలుపుల తాళాలు విరిచి లోపలికి ప్రవేశించిన దొంగలు సాయిబాబా విగ్రహానికి అలంకరించిన వెండి కిరీటం, వెండి పాదాలు చోరీ చేశారు. సమీపంలోని వినాయకుడి మందిరంలో స్వామికి అలంకరించిన వెండి కిరీటాన్ని తస్కరించారు. అక్కడికి కొంత దూరంలోని బీరేశ్వర స్వామి మందిరం తలుపులు విరిచిన దొంగలు ఆలయంలోని వెండి నాగ ప్రతిమను, మందిరాన్ని ఆనుకుని దుర్గా మందిరంలో అమ్మవారికి అలంకరించిన వెండి హారాన్ని చోరీ చేశారు. ఆయా ఘటనలపై మందిరాల పూజారులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పోలీసులు సంఘటనా స్థలాలకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

చెట్టును ఢీకొని కారు బోల్తా

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా రాయగడ ఠాణా పరిధిలోని ఎస్.కరడసింగి-లంజిపోదర్ గ్రామ రహదారి మధ్యలో చెట్టును ఢీకొని కారు బోల్తాపడిన ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రాలోని విశాఖపట్నానికి చెందిన వైద్యులు జీరంగో ప్రాంతంలో ఉంటున్న చంద్రగిరి బౌద్ధ మందిరాన్ని సందర్శించి మహేంద్రగిరి వైపు వెళుతున్న సమయంలో గ్రామ మలుపు వద్ద అదుపు తప్పి చెట్టును ఢీకొని కారు బోల్తాపడింది. ఈ ఘటనలో వైద్యులకు స్వల్ప గాయాలయ్యాయి. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ సొత్తు స్వాధీనం: ఒకరి అరెస్టు


అరెస్టయిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు. చిత్రంలో ఠాణా సిబ్బంది

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా పొలసరా ఠాణా పరిధిలో ఇటీవల జరిగిన ఓ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఖుర్దా జిల్లా టాంగికు చెందిన శ్రీకాంత్ మహాపాత్ర్ అలియాస్ అజి అనే యువకుడ్ని అరెస్టు చేసి న్యాయస్థానానికి తరలించారు. నిందితుడి నుంచి 20 గ్రాముల బంగారం, 8 కిలోల వెండి ఆభరణాలు తదితరాలు స్వాధీనం చేసుకున్నామని గంజాం ఎస్పీ కార్యాలయం శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపింది.

హ్యూమన్ మృతిపై దర్యాప్తు చేయాలి

భువనేశ్వర్: ఒడియా గాయకుడు హ్యూమన్ సాగర్ మృతిచెంది నెల రోజులైంది. ఆయన తల్లి సెఫాలిసునా శనివారం కటక్‌లోని మార్కెట్ నగర్ ఠాణాలో లిఖిత ఫిర్యాదు చేశారు. తన కుమారుడి అనుమానాస్పద మృతి వెనక కొందరి ప్రమేయం ఉందని పేర్కొన్నారు. హ్యూమన్‌కు మానసికంగా వేధించారని, దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ఫిర్యాదులో తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

సాయిప్రియ వాకర్స్ క్లబ్‌కు అవార్డు

రాయగడ, న్యూస్‌టుడే: స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ రక్తదాన శిబిర నిర్వహణ అవార్డు లభించింది. శనివారం విశాఖపట్నంలో జరిగిన 34వ వార్షిక సమావేశంలో ఈ అవార్డు ప్రదానం చేశారు. అధ్యక్షుడు కొల్లూరు సూర్యనారాయణ శర్మ, పూర్వ అధ్యక్షుడు డా.ఎం. సురేష్‌కుమార్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వేదికపై అతిథులతో రాయగడ క్లబ్ సభ్యులు

జిల్లా స్థాయిలో సత్తా చాటిన సుభాసిస్

సుభాసిస్‌కు బహుమతి అందజేస్తున్న అతిథులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: జయపురం సబ్ డివిజన్ పరిధిలోని కుంద్రాలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి ఆదర్శ విద్యాలయాల వైజ్ఞానిక ప్రదర్శనలో నందపూర్‌కు చెందిన సుభాసిస్ త్రిపాఠికి ప్రథమ బహుమతి లభించింది. నందపూర్ ఆదర్శ విద్యాలయ విద్యార్థి సుభాసిస్ సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సుభాసిస్‌ను నందపూర్ సమితి విద్యాధికారి భవానీ నందన పట్నాయక్, ప్రిన్సిపల్ నంద కోరా, ఉపాధ్యాయులు అభినందించారు.

బాల్య వివాహాల నిర్మూలనపై శిక్షణ శిబిరం

ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

సిమిలిగుడ, న్యూస్‌టుడే: 100 రోజుల బాల్య వివాహ రహిత భారత మిషన్‌పై నవరంగపూర్‌లో శని, ఆదివారాలు జిల్లా స్థాయి శిక్షణ, ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మిషన్‌శక్తి హాల్లో అసోసియేషన్ ఫర్ వాలంటరీ యాక్షన్ సంస్థ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. అదనపు కలెక్టర్ తపన్‌కుమార్ ఖుంటియా దీన్ని ప్రారంభించారు. జిల్లాను బాల్య వివాహ రహితంగా మార్చడానికి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారాన్ని అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా సామాజిక సంక్షేమ అధికారి శ్రీమతి ద్రౌపది కన్హర్, రామ్‌ప్రసాద్ పట్నాయక్, విజయ్‌కుమార్ పట్నాయక్, కృష్ణాయ్ పాల్గొన్నారు.

(c) eenadu

రాళ్లపై ప్రయాణం.. నిత్యం నరకం

గుమ్మలక్ష్మీపురం మండలంలోని జోగిపురం గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. ఉన్నదారి కాస్తా పెద్దపెద్ద రాళ్లతో నిండింది. కనీసం నడవడానికి వీలులేని స్థితి. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లాలంటే డోలీలే దిక్కవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జగదీశ్వరి తెలిపారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

ప్రహరీ లేక అవస్థలు

పార్వతీపురం మండలంలోని చినబొండపల్లి బీసీ కాలనీ అంగన్‌వాడీ-1 కేంద్రానికి అన్నీ ఉన్నా.. ప్రహరీ లేక సిబ్బంది, పిల్లలు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ 25 మంది చిన్నారులు ఆటపాటలతో చదువుతున్నారు. ప్రహరీలేక కుక్కలు, పందులు ఆవరణాన్ని పాడు చేస్తున్నాయి. పిల్లలు భోజన సమయంలో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం సీడీపీవో రేఖారాణి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. పరిశీలించి, ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.
– న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

నిరుపయోగంగా గోశాల

సాలూరు మండలంలోని కరాసువలస పంచాయతీ కోదుకరకవలస గ్రామానికి సమీపంలో ఉన్న గోశాల ఇది. రూ.2.30 లక్షల వ్యయంతో పశువులను కట్టేందుకు నిర్మించారు. రెండు నెలలవుతున్నా.. వినియోగానికి దూరంగా ఉండడంతో స్థానికులు దుస్తులు ఆరబెడుతున్నారు. దీనిపై నరేగా ఏపీవో రామకృష్ణను వివరణ కోరగా.. వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. –న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

నిర్మించి.. వదిలేశారు

పాచిపెంట మండలం రావివలసలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా నిర్మించిన మరుగుదొడ్లు వినియోగానికి దూరంగా ఉన్నాయి. దీంతో బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. బొర్రమామిడి పంచాయతీ రావివలస సహా పలు గిరిజన గ్రామాల్లో అవగాహన లేక ప్రజలు వీటిని వినియోగించడం లేదు. దీనిపై కార్యదర్శి ఆదినారాయణను వివరణ కోరగా గ్రామస్థులకు అవగాహన కల్పించి వినియోగంలోకి తెస్తామన్నారు.
–న్యూస్‌టుడే, పాచిపెంట

రూ.10లక్షలు మోసం కేసులో ఒకరి అరెస్టు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాసలో ఈ నెల 8న జరిగిన రూ.10లక్షలు మోసం కేసులో సునీల్ అనే కారు డ్రైవర్‌ను ఆదివారం అరెస్టు చేశామని సీఐ వై.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన లక్ష్మయ్యకు పలాసకు చెందిన సునీల్‌తోపాటు ఒడిశాకు చెందిన రవిరాజు రూ.10లక్షలు ఇస్తే రూ.50లక్షలు నల్లధనం ఇస్తామని నమ్మించారు. ఈ మేరకు లక్ష్మయ్య డబ్బులు తీసుకుని పలాస సమీపానికి రాగా అతని నుంచి నగదు తీసుకొని నల్లధనం పేరుతో కాగితాల కట్టలు ఇచ్చేసి నిందితులు పరారయ్యారు. లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు సునీల్‌ను అరెస్ట్ చేశామని, అతని నుంచి రూ.4,42,000, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. రవిరాజును అరెస్టు చేయాల్సి ఉందని సీఐ పేర్కొన్నారు.

గంజాయితో ఒకరు..

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గలో గంజాయితో ఒడిశాకు చెందిన రాజేంద్ర సబార్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ వై.రామకృష్ణ తెలిపారు. గజపతి జిల్లాకు చెందిన రాజేంద్ర బ్రహ్మపురం నుంచి 10.795 కిలోల గంజాయి తీసుకొని రేణిగుంట వెళ్లేందుకు బస్ ద్వారా పలాస వస్తుండగా పట్టుకున్నామని సీఐ పేర్కొన్నారు. రేణిగుంటలో తమిళనాడుకు చెందిన సన్యాయ్యప్పనకు గంజాయి అందజేయడానికి వెళ్తున్నట్లు విచారణ తేలిందన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన: పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: బ్రాహ్మణతర్ల జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు చలం వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. కల్తీ వస్తువులు కొన్నామని గుర్తించినా, వస్తువులు కొని ఎవరైనా నష్టపోయినట్లు గమనిస్తే వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాలని సూచించారు.

విజ్ఞానదాయక వినోదమే అవధానం

బారువ వసతిగృహంలో తిరుపతిరావుకు సన్మానం

సోంపేట, న్యూస్‌టుడే: విజ్ఞానదాయకమైన వినోదమే అవధాన ప్రక్రియ అని గణిత అవధాని తిరుపతిరావు అన్నారు. ఆదివారం బారువ ఎస్సీ బాలుర వసతిగృహంలో అవధాన ప్రక్రియ నిర్వహించారు. ఇక్కడి విద్యార్థులకు గణితంలో 10 అంశాల గురించి వివరించారు. పిల్లలు అడిగిన ప్రశ్నలకు క్షణాల్లో సమాధానాలు చెప్పారు. సులభ సూత్రాలతో గణితం నేర్చుకోవాలని సూచించారు. గణిత చిట్కాలు నేర్పించారు. తిరుపతిరావును వార్డెన్ రవికుమార్ సన్మానించారు.

ఘనంగా ధనరాజతులసమ్మ పూజలు

లొద్దపుట్టి కూడలి వాహన దైవంగా పేరొందిన ధనరాజతులసమ్మకు భక్తులు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయం వద్దకు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. సమీప ప్రాంతాల నుంచి నడకదారిలో ప్రత్యేక నెయ్యి ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

పూజలందుకుంటున్న అమ్మవారు

చేసేదంత అరకొర వైద్యమే..

- సర్వజనాసుపత్రిలో దయనీయంగా డెంటల్ విభాగం పరిస్థితి

న్యూస్‌టుడే, బలగ(శ్రీకాకుళం)

శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో దంత వైద్యసేవలు సక్రమంగా అందడం లేదు. డెంటల్ విభాగానికి వచ్చే ఓపీలు సైతం మిగిలిన వాటితో పోలిస్తే చాలా తక్కువగా ఉంటున్నాయి. ప్రమాదకర స్థితిలో వచ్చిన రోగులకు ప్రథమ చికిత్స తప్ప.. మెరుగైన వైద్యం అందే పరిస్థితి లేకుండా పోయింది.

సిబ్బంది లేరు.. పరికరాల్లేవు..

- దంత వైద్య విభాగంలో విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్ మాత్రమే ఉన్నారు. అసిస్టెంట్, ట్యూటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- ఎక్స్‌రే మరమ్మతులకు గురైంది. ఓపీజీ ఎక్స్‌రే అందుబాటులో లేదు.
- పిప్పి పళ్ల చికిత్సకు అవసరమైన సామగ్రి లేక రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.
- దంత రుగ్మతలను నయం చేసేందుకు ఆధునిక పరికరాలు, శస్త్ర చికిత్స చేసే వైద్యుల్లేరు.

సర్జన్ లేక ఇక్కట్లు..

విభాగంలో ఎంతో కీలకమైన ఓరల్ అండ్ మెక్సిల్లో ఫేషియల్ సర్జన్ పోస్టు ఖాళీగా ఉంది. నాలుగేళ్ల నుంచి శస్త్రచికిత్సలు జరగడం లేదు. జిల్లాలో ఉన్న ఏకైక సర్జన్‌ను నరసన్నపేట సీహెచ్‌సీకి పరిమితం చేయడంతో జీజీహెచ్‌కు వచ్చే తీవ్రమైన కేసులను విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు రిఫర్ చేయాల్సి వస్తోంది. ప్రమాదాలు, ముఖగాయాలు, దంత సంబంధిత క్లిష్ట సమస్యలతో వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్జన్ నియామకం జరిగితే మరింత నాణ్యమైన సేవలందుతాయని దంత వైద్య విభాగాధిపతి ఎల్.వేణుగోపాల్ చెబుతున్నారు.

నెల	ఓపీ
ఆగస్టు	375
సెప్టెంబరు	400
అక్టోబరు	436
నవంబరు	553
డిసెంబరు (ఇప్పటివరకు)	335

లేఖ రాశాం..

ఆసుపత్రిలో స్కేలింగ్, పిప్పి పళ్ల తీయడం, చిన్నపాటి శస్త్రచికిత్సలు చేస్తున్నాం. తీవ్రమైన కేసుల్ని రిఫర్ చేస్తున్నాం. సర్జన్‌ను నియమించాలని కోరుతూ డీఎంఈకి ఇప్పటికే లేఖ రాశాం.
– డాక్టర్ లుకలాపు ప్రసన్నకుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్

నమ్మితే పని అయిపోయినట్లే..!

న్యూస్‌టుడే, శ్రీకాకుళం నేరవార్తావిభాగం

శ్రీకాకుళం గ్రామీణ ప్రాంతం పాత్రునివలస గ్రామానికి చెందిన ఓ వివాహితకు ఇటీవల ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఇంటి వద్ద ఉంటూ పెన్సిల్ ప్యాకింగ్ చేస్తే చాలు.. నెలకు రూ.30 వేల జీతం ఇస్తానని నమ్మించాడు. డిపాజిట్‌గా రూ.750 చెల్లిస్తే నమోదు ప్రక్రియ పూర్తవుతుందని చెప్పాడు. అవతలి వ్యక్తి ఓ క్యూఆర్ కోడ్ పంపగా.. దానికి నగదు బదిలీ చేసింది. 24 గంటలు గడిచినా ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో బ్యాంకు ఖాతాను పరిశీలించగా.. రూ.21 వేలు మాయమైనట్లు గుర్తించి.. పోలీసులను ఆశ్రయించింది. అప్పటికే ఆలస్యం కావడంతో డబ్బులు వేరే ఖాతాకు మళ్లించినట్లు గుర్తించిన సైబర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఇలాంటి ప్రకటనలు నమ్మొద్దు

ఉచ్చులో దించుతారిలా..

ఆన్‌లైన్ ద్వారా నిరుద్యోగుల నంబర్లు సేకరిస్తారు. వాటికి నేరుగా ఫోన్ చేసి ఇంటి వద్దే ఉండి పని చేసుకోవచ్చని.. నెలకు రూ.వేలల్లో జీతం వస్తుందని మాయమాటలు చెబుతారు. రిజిస్ట్రేషన్ పేరుతో వాట్సప్ ద్వారా ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలతో పాటు వ్యక్తిగత చిరునామా వివరాలు సేకరిస్తారు. డిపాజిట్ కింద కొంత మొత్తం చెల్లిస్తే వారం రోజుల్లో ముడిసరుకు ఇంటికి వస్తుందని చెప్తి.. క్యూఆర్ కోడ్ పంపుతారు. అలా బ్యాంకు ఖాతాల్లోని నగదు దోచేస్తున్నారు.

సైబరు నేరాళ్ల ఉచ్చులో నిరుద్యోగ యువత

- సైబర్ నేరాళ్లు కొత్త రకమైన నేరాలకు తెరలేపుతున్నారు. ఇంటి నుంచే పని(వర్క్ ఫ్రం హోం) పేరుతో నిరుద్యోగ యువతను ఉచ్చులోకి దించుతున్నారు. ఉద్యోగం వస్తుందనే ఆశతో చాలా మంది మోసాల వలలో చిక్కి విలవిల్లాడుతున్నారు. డబ్బులు పోగొట్టుకున్న తర్వాత లబోదిబోమంటున్నారు.

వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు..

సామాజిక మాధ్యమాల్లో వచ్చే ఆకర్షణీయ ప్రకటనలను నమ్మి మోసపోవద్దు. ఎవరితోనూ వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. పొరపాటున చెప్పే బ్యాంకు ఖాతాలు క్షణాల్లో ఖాళీ అవుతాయి. సత్వరమే తర్వాత తిరిగి తెచ్చుకోవడం చాలా శ్రమతో కూడుకున్న పని. అందరూ ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఒకవేళ మోసపోయినా ఆలస్యం చేయకుండా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే రికవరీ సాధ్యమవుతుంది.
– పి.శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ(క్రైం), శ్రీకాకుళం

- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబరుకు సమాచారమివ్వండి.
- అనుమానాస్పద ఫోన్లు, మెయిల్స్ వస్తే www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయొచ్చు.

రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలి

రామానుజన్ విశిష్ట సంఖ్య ఆకృతిలో ఇసకలపాలెం విద్యార్థులు

సోంపేట, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: గణిత పితా మహుడు రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఇసకల పాలెం ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనీల్‌కుమార్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవం, గణిత శాస్త్ర నిపుణులు శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు పురస్కరించుకుని ఆదివారం పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించి గణిత ఉపాధ్యాయులు నూకరాజు, వసంతరావులను సన్మానించారు. రామానుజన్ గుర్తించిన విశిష్ట సంఖ్య 1729 ఆకృతిలో విద్యార్థులు అలరించారు. పలాస మండలం రామకృష్ణాపురంలోని శ్రీ సత్యసాయి విద్యా విహార్‌లో నియోజకవర్గ స్థాయి సామూహిక గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. కాశీబుగ్గ శ్రీ చైతన్య హైస్కూల్ ప్రథమ స్థానం సాధించింది. మందస మండలం హరిపురానికి చెందిన గీతం టాలెంట్ స్కూల్, వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు పలాస ఎంఈవో శ్రీనివాసరావు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యితోపాటు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపల్ ప్రీతీచౌదరి పాల్గొన్నారు.

ఆ గాలి పీలుస్తూ.. రోగాలను పిలుస్తూ..!

జిల్లాలో తగ్గిపోతున్న వాయు నాణ్యత

న్యూస్‌టుడే, పాతబస్టాండ్

జిల్లాలో గాలి నాణ్యత తగ్గిపోతోంది. పారిశ్రామిక వాడలు, పెరుగుతున్న ఇంధన వినియోగంతో వాయు కాలుష్యం పెరుగుతోంది. తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే సమస్యల కోరల్లో చిక్కుకోక తప్పదనే పరిస్థితి నెలకొంది. ప్రజలు సామాజిక బాధ్యతగా ముందుకొచ్చి వాయు కాలుష్య నియంత్రణకు సహకరించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

శ్రీకాకుళం నగరం పొట్టి శ్రీరాములు కూడలిలో వాహనాల రద్దీ

- రాష్ట్రంలో వాయు కాలుష్యం వృద్ధి చెందిన 13 జిల్లాల్లో శ్రీకాకుళం ఒకటని జాతీయ కాలుష్య నియంత్రణ మండలి గుర్తించింది.
- జిల్లాలో ఎచ్చెర్ల ఏపీఐఐసీ, కుశాలపురం, డీసీవో కార్యాలయం, పైడిభీమవరం ప్రాంతాల్లో వాయు కాలుష్యం వివరాలు ప్రతి గంటకు నమోదు చేస్తారు.
- 2024-25 సంవత్సరంలో సూక్ష్మ ధూళికణాలు (పీఎం-10) 1 నుంచి 20 శాతం పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఆరోగ్యం.. జరభద్రం..

- వాయు కాలుష్యం కారణంగా ఊపిరితిత్తులు, హృద్రోగ సమస్యలు తలెత్తుతాయి.
- పీఎం-2.5 సూచీ పరిధి మించితే తలనొప్పి, కళ్ల మంటలు, నిద్ర సరిగ్గా పట్టకపోవడం, గొంతు నొప్పి వంటి రుగ్మతలు వేధిస్తాయి.
- దీర్ఘకాలికంగా కాలుష్య కారకాలను పీలిస్తే క్యాన్సర్ బారిన పడే అవకాశం కూడా ఉంటుంది.
- 'శీతాకాలంలో వాతావరణ పరిస్థితుల మార్పు కారణంగా అనారోగ్య సమస్యలు అధికమవుతాయి. చిన్నారులు, వృద్ధులు మరింత జాగ్రత్తగా ఉండాలి' అని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజనాసుపత్రి ఎండీ డాక్టర్ సనపల నర్సింహమూర్తి సూచిస్తున్నారు.

ఖర్చు పెడుతున్నా ఫలితం లేదు..

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛమైన గాలి అందించే కార్యక్రమం(ఎన్‌సీఏపీ) ద్వారా శ్రీకాకుళానికి 2024-25 సంవత్సరంలో రూ.2.57 కోట్ల నిధులు విడుదల చేసింది. వాటితో ధూళి కణాల్లేని రహదారులు, వ్యర్థాల నియంత్రణ, సహజ వనరుల ద్వారా పునరుత్పాదన శక్తి అందించడం, పారిశ్రామిక వాడల దత్తత, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఫలితం ఉండట్లేదు.

ఇలా చేద్దాం రండి..

- వారంలో ఆదివారం ఒక్క రోజైనా వాహన వినియోగం తగ్గించేందుకు ప్రయత్నించాలి.
- తక్కువ దూరం ప్రయాణించేందుకు నడక, సైకిల్‌తో పాటు విద్యుత్తు బ్యాటరీ వాహనాలు ఉపయోగించాలి.
- కాలం చెల్లిన ద్విచక్ర వాహనాలను పూర్తిగా పక్కనపెట్టాలి.
- పంట వ్యర్థాలను కాల్చకూడదు.

కేంద్ర బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, జీవన సురక్ష బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వజ్రపుకొత్తూరు గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు డి.మహేష్ పేర్కొన్నారు. నగరంపల్లిలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. తక్కువ జమతో ఎక్కువ బీమా చెల్లించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల మరణించిన ఆర్.పుష్పలత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా చెక్కు అందజేశారు. గ్రామ పెద్దలు జయరాం చౌదరి, అప్పారావు, ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

శిథిలం.. వృథాగా ప్రజా ధనం

బూర్జపాడు సమీపంలో ఐదు భవనాలు ఇలా వృథాగా మారి శిథిలావస్థకు చేరుతున్నాయి. 8 ఏళ్ల కిందట తెదేపా హయాంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలు శిథిలావస్థకు చేరాయి. వీటిని ఆనుకుని వైకాపా ప్రభుత్వం నిర్మించిన రైతు సేవా, ఆరోగ్య, పాలవెల్లువ కేంద్రాలు కూడా అదే పరిస్థితిలో ఉన్నాయి. ఈ విషయమై ఏవో కె.రామారావును వివరణ కోరగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

పొంచి ఉన్న ప్రమాదం

ఇచ్ఛాపురం పురపరిధి కృష్ణానగర్‌లో రోడ్డు ధ్వంసమై, చీలిక ఏర్పడింది. అది రహదారి మధ్య నుంచి కాలువ వరకు ఉండటంతో తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువ కూడా పాడవ్వడంతోపాటు వీధి ఇరుకుగా ఉండటంతో ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు వచ్చినా, ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పరిశీలించి, చర్యలు తీసుకుంటామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

భవనం పూర్తి చేయరూ..

బొగాబంద పంచాయతీ డబార్సింగిలోని అంగన్‌వాడీ భవనమిది. మూడేళ్ల కిందట మంజూరైంది. రూ.17 లక్షలతో పనులు ప్రారంభించి శ్లాబు వేసి వదిలేశారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాన్ని పాకలో నిర్వహిస్తుండగా.. నూతన భవనంలో గ్రామానికి చెందిన కొందరు మేకలు, గొర్రెలు కడుతున్నారు. పరిశీలించి భవనం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచి రౌతు జయలక్ష్మి తెలిపారు. – న్యూస్‌టుడే, మందస

కూలేలా ఉంది.. కరుణించండి

ఇచ్ఛాపురం పట్టణం డబ్బూరివీధి చివరలో టెలీఫోన్ పాత ఇనుప స్తంభం ప్రమాదకరంగా ఉంది. దీన్ని ప్రస్తుతం కేబుల్ తీగల కోసం వాడుతున్నారు. నిత్యం జన సంచారం ఉన్న ఈ మార్గంలో స్తంభం పడితే పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, దీన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను పరిశీలించి, టెలికాం అధికారులకు సమాచారమిస్తామని పుర కమిషనర్ రమేష్ తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

నిర్మించారు.. వదిలేశారు..

కవిటిలో స్వచ్ఛభారత్ నిధులతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం షెడ్డు నిరుపయోగంగా మారింది. గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన తడి, పొడి చెత్తను ఇక్కడికి తరలించకుండా పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పడేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక ఇలా తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈవో ఎం.రవిని వివరణ కోరగా కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

బస్సు బోల్తా: ఒకరి మృతి, 16 మందికి గాయాలు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా జరడా ఠాణా పరిధిలోని బరియా పథర పర్యాటక కేంద్రానికి విహార యాత్రకు సుమారు యాభై మందితో వెళ్లిన ఓ ప్రైవేటు బస్సు ఆదివారం సాయంత్రం సాపువాఖత సమీపాన ఘాటీ రోడ్డులో అదుపుతప్పి కిందకు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో రత్నా బిశోయి(45) మృతిచెందగా, పదహారు మందికి గాయాలయ్యాయి. వీరికి పాత్రపురం ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు చేర్పించారు. క్షతగాత్రుల్లో నలుగురి ఆరోగ్యం విషమించడంతో వారిని స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రికి తరలించారు. మృతుడు, క్షతగాత్రులు బ్రహ్మపుర సమీపంలో ఓ ద్విచక్ర వాహనాల షోరూం సిబ్బందిగా తెలిసింది.

పద్నాలుగేళ్ల కథ.. పాలకులకు పట్టని వ్యథ..!

బొండిగూడ.. అదో మారుమూల గిరిజన గ్రామం. హిరమండలంలో కొండలపై ఉంటుంది. అక్కడి జనం సరైన రహదారి సౌకర్యం లేక ఎన్నో ఏళ్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 2011లో వారి మొర ఆలకించి ఊరికి గ్రావెల్‌తో దారి వేశారు. అప్పటి నుంచి ఇంత వరకు రహదారి నిర్మాణం జరగలేదు. వర్షాలకు గ్రావెల్ సైతం కొట్టుకు పోవడంతో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. పిల్లలు బడికి వెళ్లాలన్నా.. రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా అవస్థలు తప్పట్లేదు. 14 ఏళ్లుగా ఎన్నో సార్లు.. ఎంతో మంది అధికారులకు వినతిపత్రాలు అందించారు. ప్రభుత్వాలు మారుతున్నా పట్టించుకునే వారే లేకపోవడంతో రెండు రోజులుగా వారే ఇలా తాత్కాలిక మరమ్మతులు చేసుకుంటున్నారు. ఎవరు అనారోగ్యానికి గురైనా డోలీయే దిక్కవుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో ఆర్.కాశీప్రసాదరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లామన్నారు.
– న్యూస్‌టుడే, హిరమండలం

జనసేన పార్టీ బలోపేతానికి శ్రమించాలి

మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు

సోంపేట, న్యూస్‌టుడే: జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త శ్రమించాలని పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు పిలుపునిచ్చారు. ఆదివారం సోంపేటలో జరిగిన సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడిగా బీన ప్రదీప్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీని బలపరిచేందుకు కార్యకర్తలు గ్రామస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని రాజు కోరారు. నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలు

విజేతలతో నిర్వాహకులు

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట ధ్యాన్‌చంద్ స్పీడ్ స్కాటర్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేసి, రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోంపేట ఎస్సై వి.లోవరాజు మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యం కోసం చిన్నారులు ఆటలు ఆడాలన్నారు. క్లబ్ నిర్వాహకులు టి.వెంకటరమణబాబు, టి.ప్రణీత్, ఎ.షణ్ముఖరావు, బి.చంద్రావతి పాల్గొన్నారు.

(c) eenadu

ఉపాధి హామీపై మౌనం ఎందుకు?

ఈపీఎస్‌ను ప్రశ్నించిన ముఖ్యమంత్రి స్టాలిన్

టీనగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం వంద రోజుల ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆరోపించారు. కేంద్రం ఈ పథకానికి నిధులను తగ్గించడమే కాక రాష్ట్రాలు 40 శాతం భరించాలనే భారం మోపుతోందని మండిపడ్డారు.

చారిత్రక వస్తువుల వివరాలు తెలుసుకుంటున్న స్టాలిన్

విద్యుద్దీపకాంతుల్లో పొరునై మ్యూజియం

పథకం నుంచి గాంధీ పేరును కూడా తొలగించారన్నారు. రైతు బిడ్డగా చెప్పుకొనే నకిలీ రైతు ఎడప్పాడి పళనిస్వామి ఈ విషయమై ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. తిరునెల్వేలి జిల్లాలోని పాళయంగోట్టైలో ఆదివారం జరిగిన భారీ బహిరంగసభలో ఆయన ప్రసంగించారు. తమిళుల చారిత్రక వారసత్వాన్ని కాపాడటంలో తమ ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. పొరునై నాగరికత అనేది భారతీయులందరీ గర్వకారణమన్నారు. తమిళుల చరిత్రను తక్కువ చేసి చూపేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. వీలైతే ప్రధానమంత్రి మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రంలోని కీలడి, పొరునై మ్యూజియాలను సందర్శించాలని, అప్పుడే వారికి తమిళ నాగరికత గొప్పదనం అర్థమవుతుందన్నారు. **టీనగర్:** పర్యటనలో భాగంగా ఆదివారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించి, లబ్ధిదారులకు సంక్షేమ సాయం అందజేశారు. రూ.356 కోట్లతో నరసింగనల్లూరులో సిడ్కో పారిశ్రామికవాడ, కాయిదే మిల్లత్ లైబ్రరీ తదితర 11 కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. రూ.236 కోట్ల విలువైన పనులు పూర్తవగా ప్రారంభించారు. ప్రజల సౌకర్యార్థం 15 కొత్త బస్సుల సేవలను అందుబాటులోకి తెచ్చారు. రెడ్డియార్‌పట్టిలో నిర్మించిన అత్యాధునిక పొరునై పురావస్తు మ్యూజియాన్ని శనివారం రాత్రి ప్రారంభించారు. తామరభరణి నదీ తీర నాగరికతకు సంబంధించిన చారిత్రక ఆధారాలను వీక్షించారు. ఎంపీ కనిమొళి, రాష్ట్ర మంత్రి తంగం తెన్నరసు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ప్రారంభించిన బస్సులు

రైతు బజార్‌కు పుట్టినరోజు

టీనగర్, న్యూస్‌టుడే: సేలం జిల్లా ఆత్తూర్ పుదుపేటలోని ఉళవర్ సంధై(రైతు సంత) శనివారం 26 ఏళ్లు పూర్తి చేసుకుంది. 27వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న నేపథ్యంలో అక్కడి రైతులు వేడుకలు నిర్వహించారు. సంతను గతంలో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి ప్రారంభించడంతో ఆయన చిత్రం పొందుపరిచిన 15 కిలోల కేక్ కోశారు. నిత్యం ఇక్కడ సుమారు రూ.20 లక్షల విలువైన కూరగాయల వ్యాపారం జరుగుతోంది.

పుదుచ్చేరి ప్రగతిపై చర్చించాం: సీఎం రంగసామి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ రెండ్రోజుల పర్యటనలో భాగంగా పుదుచ్చేరికి విచ్చేశారు. ఆదివారం ఉదయం ముఖ్యమంత్రి రంగసామిని కోరిమేడులోని నివాసంలో కలిశారు. అక్కడున్న అప్పా పైత్తియసామి ఆలయంలో పూజ నిర్వహించారు. వారితోపాటు కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ, అధిష్ఠాన ఇన్‌ఛార్జ్ నిర్మల్‌కుమార్ సురానా, స్పీకర్ సెల్వం, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామలింగం తదితరులు ఉన్నారు. అనంతరం భాజపా నిర్వాహకులతో ముఖ్యమంత్రి చర్చలు జరిపారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో మళ్లీ కూటమి పెట్టుకోవడంపై నితిన్ నబీన్ కోరారు. ఇది మార్గళి మాసం కావడంతో తై మాసంలో మాట్లాడుకుందామని రంగసామి తెలిపారు. దాదాపు 20 నిమిషాలపాటు వారి నివాసంలో చర్చలు జరిగాయి. అనంతరం రంగసామి విలేకరులతో మాట్లాడుతూ.. పుదుచ్చేరి అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఉంచుకొని అవసరమైన నిధులు పొందేందుకు ఏ ఏ శాఖలో, ఏం చేయాలనేదానిపై చర్చించామన్నారు. ప్రజలకు అవసరమైన పథకాలు అమలుచేస్తున్నామని పేర్కొన్నారు. భాజపాతో కూటమి కొనసాగుతుందా లేక విజయ్ వెంట నడుస్తారా అన్న ప్రశ్నకు బదులివ్వకుండా వెళ్లిపోయారు.



నితిన్ నబీన్‌కు శాలువా కప్పి ఆహ్వానిస్తున్న సీఎం రంగసామి

దక్షిణాది రాష్ట్రాల్లో భాజపా బలోపేతం

ఆర్కేనగర్: దక్షిణాది రాష్ట్రాల్లో భాజపా బలోపేతమవుతోందని ఆ పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలిపారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా పుదుచ్చేరికి విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల్లో కూటమి నిర్వాహకులందరూ కలిసి పనిచేసి విజయం అందుకుంటారన్నారు.

సైక్లింగ్‌తో చక్కటి ఆరోగ్యం

సైకిల్ ర్యాలీలో కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తదితరులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: వారంలో ఒకరోజు సైక్లింగ్ మన స్తత్వాన్ని, జీవనశైలిని మారుస్తుందని కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. పర్యావరణ కాలుష్యాన్ని తగ్గిస్తుందన్నారు. పుదుచ్చేరి సముద్రతీర రోడ్డులో భారత క్రీడా ప్రాధికార సంస్థ తరపున సైకిల్ ర్యాలీ ఆదివారం ఉదయం జరిగింది. కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవియ, లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్‌నాథన్, ముఖ్యమంత్రి రంగసామి, స్పీకర్ సెల్వం, మంత్రి నమశ్శివాయం తదితరులు పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. పద్మభూషణ్ అవార్డు గ్రహీతలు పీఆర్ శ్రీజేష్, శరత్‌కమల్ పాల్గొన్నారు. సీఎం రంగసామి మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండేందుకు వారంలో ఒక రోజు సైకిల్ తొక్కాలన్నారు.

సైదాపేట: ప్రజలు చిన్న దూరాలకు సైకిల్ ఉపయోగించాలని మాజీ డీజీపీ శైలేంద్రబాబు తెలిపారు. చెన్నై అడయారులో ఆదివారం ఎలిఫెంటైన్ సర్క్యూట్ తమిళనాడు సైక్లింగ్ సంఘం నేతృత్వంలో సైక్లోథాన్ జరిగింది. ఎలిఫెంటైన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమణన్ బాలగంగాధరన్‌తో కలిసి శైలేంద్రబాబు జెండా ఊపి ప్రారంభించారు. కళ ట్రస్టుకు చెందిన 35 మంది మానసిక దివ్యాంగులు పాల్గొన్నారు. 8 నెలల గర్భిణి మహిళ తన భర్తతో కలిసి డాండెమ్ బైక్‌లో పాల్గొన్నారు. శైలేంద్రబాబు విలేకర్లతో మాట్లాడుతూ... సైకిల్ ఉపయోగిస్తే పర్యావరణం, ఆరోగ్యానికి మంచిదని పేర్కొన్నారు.



చెన్నైలో సైక్లోథాన్ ప్రారంభిస్తున్న శైలేంద్రబాబు



తమిళనాడుకు చెందిన ఓ డాక్యుమెంటరీ చిత్రం 98వ ఆస్కార్ అకాడెమీ అవార్డుల పోటీకి అవకాశం సాధించింది. షార్ట్‌లిస్ట్‌లో అవకాశాన్ని తృటిలో పోగొట్టుకుంది. ఓ హిజ్రా దేశంలోనే తొలిసారిగా తన వివాహాన్ని రిజిస్టర్ చేసుకున్నప్పైనం, అందుకు తన తల్లితో పడిన తపన, తర్వాత పరిణామాలపై తెరకెక్కింది. ఆ చిత్రం పేరు.. 'అమ్మాస్ ప్రైడ్.

ఆస్కార్ దాకా వెళ్లిన అమ్మాస్ ప్రైడ్

- 117 డాక్యుమెంటరీల్లో ఒకటిగా నిలిచిన తమిళనాడు చిత్రం
- వాస్తవిక కథకు జై కొడుతున్న ప్రపంచదేశాలు

ఈనాడు-చెన్నై: కేవలం 20 నిమిషాల నిడివితో ప్రపంచదేశాల్ని ఆలోచింప చేసింది. హిజ్రాగా ఉన్న శ్రీజ.. అరుణ్‌కుమార్ అనే వ్యక్తితో చేసుకున్న వివాహాన్ని చట్టబద్ధం చేసుకోవాలని తపించడం, ఇందుకు తల్లి వల్లి మద్దతివ్వడం కీలక పరిణామం. ఇద్దరూ కలిసి చేసిన న్యాయపోరాటం, చివరికి పెళ్లిని అధికారికంగా నమోదు చేయించడం, తమ హక్కుల కోసం పోరాడి సాధించుకోవడం గొప్ప విజయం. ఈ వాస్తవ కథాంశాన్ని, వారే పాత్రధారులుగా తెరకెక్కిన డాక్యుమెంటరీ ఇది. శివ క్రిష్ దర్శకత్వం వహించారు.

తల్లి మనసు కనిపించింది

శ్రీజ తల్లి వల్లి రోజుకూలీ. పేద కుటుంబం. ఇలాంటి కుటుంబం తమ హక్కులకోసం పోరాటం, న్యాయం కోసం కోర్టుకెళ్లడం అరుదు. శ్రీజ, అరుణ్ కుమార్‌కు 2018 అక్టోబరులో పెళ్లయింది. అధికారులు రిజిస్టర్ చేసేందుకు నిరాకరించారు. శ్రీజ, తన తల్లితో కలిసి మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. 2019లో వారి వివాహానికి చట్టబద్ధత కల్పించాలని తీర్పు వెలువడింది. ఈ అంశాన్నే డాక్యుమెంటరీగా చేయడానికి కారణాన్ని వివరించారు దర్శకులు శివ క్రిష్. 'అది 2019. హిజ్రా శ్రీజ వివాహం అధికారికంగా రిజిస్టర్ అయిందని, ఇది తమిళనాడులోనే తొలిసారి అని ఓ పత్రికలో చదివాను. దేశానికే గర్వ కారణంగా నిలిచే మైలురాయి అనిపించింది. సినిమాగా తీస్తే ఎలా ఉంటుందని అనుకున్నా'నన్నారు. తూత్తుకుడిలో ఉన్న శ్రీజ కుటుంబాన్ని పలుమార్లు కలిసి తాను గతంలో ఎన్జీవోతో కలిసి చేసిన సేవా కార్యక్రమాలు వివరించి నమ్మకం కలిగేలా చేశారు. అన్నివేళలా శ్రీజకి వెన్నుదన్నుగా ఉన్న తల్లి వల్లి ప్రయాణం శివను కదిలించింది. అదే కథగా మలిచి డాక్యుమెంటరీగా తీయాలని అనుకున్నారు. శివ క్రిష్ గతంలో 2015 చెన్నై వరదలపై ఓ ఎన్జీవోతో కలిసి డాక్యుమెంటరీ తీసి పేరొందారు. అమెజాన్ ప్రైమ్ డాక్యుమెంటరీ సిరీస్ 'హార్మోనీ విత్ ఎ.ఆర్.రెహమాన్'కూ దర్శకుడిగా ఉన్నారు.

ఎన్నో అవార్డులు..

డాక్యుమెంటరీ పూర్తయ్యాక తొలిసారిగా గతేడాది తూత్తుకుడిలోనే ప్రదర్శించారు. రెండోసారి పోలాండ్‌లో. భారత్‌లోని వివిధ రాష్ట్రాల్లో, యూఎస్, యూకే, కెనడా తదితర దేశాల్లో ప్రదర్శించారు. ఈ చిత్ర సందేశం గ్రామీణులకు సైతం వెళ్లాలనే ఉద్దేశంతో ఒక్క తమిళనాడులోనే 12వేల పంచాయతీల్లోని ప్రజలకు చూపించారు. 55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఇంటర్నేషనల్ డాక్యుమెంటరీ అండ్ షార్ట్‌ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ కేరళ, ఐఎస్ఏఎఫ్ఎఫ్, ఔట్ అండ్ లౌడ్ ఫిల్మ్‌ఫెస్టివల్, హాబ్నోబెన్ ఫిల్మ్ ఫెస్టివల్, క్రాకో ఫిల్మ్‌ఫెస్టివల్స్‌లో ఉత్తమ డాక్యుమెంటరీగా అవార్డులు సాధించింది. తాజాగా ఆస్కార్ అవార్డులకోసం 117 డాక్యుమెంటరీలు పరిశీలించగా అందులో ఈ చిత్రముంది. తాజాగా ఆస్కార్ కమిటీ విడుదలచేసిన టాప్-15 చిత్రాల షార్ట్‌లిస్టులో స్థానం సాధించలేకపోయింది.

ఆ తృప్తి మాటల్లో చెప్పలేను

తల్లిదండ్రులు పిల్లలకు ఎప్పుడూ మద్దతుగా నిలవాలి. నా బిడ్డకూ అదే చేశాను. ఇందులోని తృప్తిని మాటల్లో చెప్పలేను. అమ్మాస్ ప్రైడ్ డాక్యుమెంటరీలో ఇదంతా చక్కగా తెరక్కించారు. ఇలాంటి సమస్యల్ని సమాజం అంగీకరించాలి. **- వల్లి**

మార్పు వస్తోంది

ఇతరుల్లానే మమ్మల్ని కూడా చూడాలని తపనపడ్డాను. సాధించుకున్నాను. అదే చిత్రంగా వచ్చింది. ఇప్పుడిది ఎందరినో ఆలోచింపచేస్తోంది. తల్లిదండ్రుల్లో మార్పు తెస్తోంది. ఇంతకన్నా ఆనందం ఏముంటుంది?. **- శ్రీజ**

వల్లి ప్రయత్నం అభినందనీయం

బిడ్డకు అండగా ఉండాలన్న ఒకే అంశం ప్రపంచాన్ని కదిలించింది. వల్లి ప్రయత్నానికి హ్యాట్సాఫ్ చెప్పాలనే ప్రయత్నమే ఈ డాక్యుమెంటరీ. ఎన్నో సవాళ్లకు ఆమె తపన ఓ సమాధానం. మిత్రత్వం ఇంటినుంచే మొదలవుతుందని చెప్పడానికి ఆమే ఉదాహరణ. **- శివ క్రిష్**

మనలి, తిరువొత్తియూరు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు 48 గంటలు అంతరాయం

వడపళని, న్యూస్‌టుడే: ఉత్తర చెన్నై అభివృద్ధి పనుల్లో భాగంగా తిరువొత్తియూరు నీటి పంపింగ్ స్టేషనులో మిలియన్ లీటర్ల నీటిని నిల్వ ఉంచేందుకు చేపట్టిన పనుల కారణంగా మనలి, తిరువొత్తియూరు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి బుధవారం ఉదయం 10 వరకు పైపుల ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగనుంది. కత్తివాక్కం, ఎన్నూరు, తిరువొత్తియూరు, కాలడిపేట, సడయాన్ కుప్పం వాసులు ముందుగా నీటి నిల్వ చేసుకోవాలని అధికారులు ప్రకటనలో తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ట్యాంకర్ల ద్వారా తెప్పించుకునేందుకు వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చన్నారు.

24న చేపల వేటకు నిషేధం

పొన్నేరి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట షార్ నుంచి 24న అమెరికాకు చెందిన ఎంవీఎంఎస్ బ్లూఫర్డ్‌బ్లాక్ 2 మిషన్ రాకెట్ నింగిలోకి ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో తిరువళ్లూరు జిల్లా పొన్నేరి, గుమ్మిడిపూండిలోని సముద్రతీర ప్రాంత జాలర్లు 24న చేపల వేటకు వెళ్లరాదని జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ అజయ్ ఆనందన్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో సూచించారు.

పెరిగిన ఆమ్ని బస్సు ఛార్జీలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: క్రిస్మస్, వరుస సెలవుల నేపథ్యంలో ఆమ్ని బస్సు ఛార్జీలు అమాంతం పెంచేశారు. చెన్నై నుంచి మదురై వెళ్లేందుకు రూ.1,900 నుంచి రూ.4వేలు వరకు వసూలు చేస్తున్నారు. చెన్నై నుంచి కోవైకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు, నాగర్‌కోవిల్‌కు రూ.2,500 నుంచి రూ.4,500 వరకు, నెల్లైకు రూ.2వేలు నుంచి రూ.4,500 వరకు ఛార్జీలు నిర్ణయించారు. ఛార్జీల పెంపుపై ప్రయాణికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

డీజీపీకి ఈడీ రాసిన లేఖ బయటికొచ్చిన వ్యవహారం

ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: డీజీపీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రాసిన లేఖ బయటికొచ్చిన వ్యవహారమై ముందస్తు బెయిల్‌కు నేర చరిత్ర కలిగిన వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం కొట్టివేసింది. మదురైకి చెందిన ఆది నారాయణన్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, నీటి సరఫరా శాఖలో రూ.కోట్లు అవినీతి జరిగినట్లు ఈడీ రాసిన లేఖ ఆధారంగా డీజీపీ కేసు నమోదు చేయాలని మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. అతను నేర చరిత్ర కలిగిన వ్యక్తి అని, పలు కేసులు ఉన్నాయని ప్రభుత్వం తరపున తెలిపారు. ఈడీ పంపిన రహస్య లేఖ పిటిషనర్‌కు ఎలా లభించిందనే విషయమై విచారించాలని తెలిపి తిరుచ్చికి చెందిన లాయరు పరంజ్యోతి పిటిషన్ వేశారు. రహస్య లేఖ పిటిషనర్‌కు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వ అధికారులు, వారికి సహాయపడిన లాయర్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసుల తరపున కోర్టులో తెలిపారు. సీబీసీఐడీ దర్యాప్తునకు డీజీపీ ఉత్తర్వులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో తనను అరెస్టు చేసే అవకాశం ఉండటంతో ముందస్తు బెయిల్ కోరి ఆది నారాయణన్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన మదురై ధర్మాసనం అతని పిటిషన్‌ను కొట్టివేస్తూ శనివారం ఉత్తర్వులు ఇచ్చింది.

క్రిస్మస్ కేక్ కోస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి తదితరులు

లోక్‌భవన్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

చెన్నై, న్యూస్‌టుడే: లోక్‌భవన్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. రాష్ట్రంలోని బిషప్‌లు, చర్చిల వాలంటీర్లు తదితరుల సమక్షంలో గిండిలోని లోక్‌భవన్‌లో గవర్నర్ ఆర్.ఎన్.రవి క్రిస్మస్ కేక్‌ను కోశారు. క్రిస్మస్ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను గవర్నర్ ఆర్.ఎన్.రవి, లక్ష్మీ దంపతులు తిలకించారు. వేడుకలు మతసామరస్యం, సంతోషం, ఐక్యతను నింపాయంటూ లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి.

గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగుల

డిమాండ్లు నెరవేర్చాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధిశాఖ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని అన్నాడీఎంకే కార్యకర్తల హక్కుల పరిరక్షణ కళగం సమన్వయకర్త, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. గ్రామీణ ప్రాంతాలు తమిళనాడు జీవనాడి అంటే అతిశయోక్తి కాదన్నారు. విద్య, తాగునీరు, వైద్యం తదితర అన్ని సదుపాయాలు ఆ ప్రాంతాల్లో ఉంటే వృత్తులు, పరిశ్రమలు అభివృద్ధి చెంది ప్రజల నగరాలకు వలస వెళ్లరని పేర్కొన్నారు. అందుకు పూర్తి విరుద్ధంగా గ్రామీణాభివృద్ధిశాఖ ఉద్యోగుల జీవనోపాధే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. నీళ్ల ట్యాంకు ఆపరేటర్, శుభ్రతా కార్మికులు, వైద్య సహాయకులు అంటూ గ్రామ పంచాయతీల్లో పని చేసేవారికి నెలకు రూ.2 వేల నుంచి రూ.5 వేలు మాత్రమే వేతనం అందుతోందన్నారు. కనీసం రూ.10 వేలు జీతం ఇవ్వాలని నాలుగేళ్లుగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదన్నారు.

నాడు వీధికుక్క.. నేడు పెంపుడు ప్రాణి

చెన్నై, న్యూస్‌టుడే: కాలు విరిగిన వీధికుక్కకు చికిత్స చేయించిన మంత్రి పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్ ప్రస్తుతం దానిని పెంపుడు ప్రాణిగా నమోదు చేయించారు. 2021లో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది నెలల్లోనే సచివాలయంలోని తన కార్యాలయం సమీపాన కాలు విరిగి బాధపడుతున్న వీధికుక్కను పీటీఆర్ పళనివేల్ త్యాగరాజన్ గమనించారు. దానిని పశువైద్యుల వద్దకు తీసుకెళ్లారు. విరిగిన కాలుకు వైద్యులు లోహపు ప్లేటు వేసి స్క్రూలు బిగించారు. దానిని మళ్లీ సచివాలయంలోనే విడిచిపెట్టడానికి మంత్రికి మనసురాక ఇంటికి తీసుకెళ్లి పెంచుకున్నారు. పీచ్చస్ అని నామకరణం కూడా చేశారు. ప్రస్తుతం చెన్నై మహానగర పాలకసంస్థ కొత్త నిబంధనలు మేరకు దానిని పెంపుడు ప్రాణిగా నమోదు చేయించారు. ఈ విషయాన్ని ఆయన తన సామాజిక మాధ్యమ పేజీలో వెల్లడించారు.

పెంపుడు కుక్కతో పళనివేల్ త్యాగరాజన్

రాయపురం జోన్‌లో క్రీడా కోర్టులు ప్రారంభం

చెన్నై, న్యూస్‌టుడే: రాయపురం జోన్‌లో నిర్మించిన క్రీడా కోర్టులను మంత్రి పి.కె.శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్ ప్రారంభించారు. జోన్‌లోని బ్యారక్స్ వీధి మైదానంలో ఉత్తర చెన్నై అభివృద్ధి ప్రాజెక్టు కింద రూ.1.54 కోట్లతో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్ కోర్టులు నిర్మించారు. వాటిని మంత్రి పి.కె.శేఖర్‌బాబు, మధ్య చెన్నై ఎంపీ దయానిధి మారన్ ప్రారంభించారు. అక్కడ జరిగిన పోటీలను తిలకించి విజేత జట్టుకు బహుమతులు ప్రదానం చేశారు. పునరుద్ధరించి అభివృద్ధి చేసిన ఆధునిక జిమ్‌నూ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మేయర్ ప్రియ, ప్రాంతీయ డిప్యూటీ కమిషనరు కట్టా రవితేజ, జోన్ కమిటీ ఛైర్మన్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు తిలకిస్తున్న మంత్రి పి.కె.శేఖర్‌బాబు తదితరులు

రాష్ట్రంలో ఎన్డీయే విజయం తథ్యం

సేలం, న్యూస్‌టుడే: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడులో ఎన్డీయే కూటమి విజయం సాధించడం ఖాయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఉద్ఘాటించారు. సేలం జిల్లా ఆత్తూరులో 'తమిళగం తలై నిమిర తమిళన్ పయనం' పేరిట శనివారం రాత్రి జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ద్వారా రాష్ట్రంలో సుమారు 97 లక్షల మంది నకిలీ ఓటర్లను తొలగించారని వెల్లడించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నియోజకవర్గంలోనే అత్యధికంగా నకిలీ ఓటర్లను తొలగించారని గుర్తు చేశారు. కొడుకును ముఖ్యమంత్రిని చేయాలనే ఏకైక లక్ష్యంతో స్టాలిన్ పని చేస్తున్నారని, రైతుల సమస్యలు ఆయనకు పట్టడం లేదని ఆరోపించారు.

ప్రసంగిస్తున్న నయినార్ నాగేంద్రన్

అన్ని పథకాలు అసంపూర్ణమే..

సైదాపేట: ఎన్నికల సమయంలో లెక్కలు చూపించేందుకు, ప్రచారం, కమీషన్ల డీఎంకే అసంపూర్ణంగా ఉన్న పథకాలు ప్రారంభిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ఆరోపించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... తిరునెల్వేలిలో పలు పథకాలు ప్రారంభించినట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. అక్టోబరులో తెన్‌కాశి జిల్లా గూడలూర్ ప్రభుత్వ పాఠశాలకు కొత్త భవనాలను ప్రారంభించారని, వాటికి ప్రహరీ సహా మరుగుదొడ్లు, ఇతర కనీస సదుపాయాలు కల్పించలేదని, తరగతి గదులు లేకపోవటంతో విద్యార్థులు చెట్లకింద చదివే పరిస్థితి నెలకొందన్నారు. ప్రచార వ్యామోహం కారణంగానే డీఎంకే ఓటమి పాలయ్యే రోజు ఎంతో దూరంలో లేదని తెలిపారు.

తైపూసం వేడుకలో సీఎం పాల్గొంటారా?

☛ వానతి శ్రీనివాసన్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్ తైపూసం వేడుకలో పాల్గొంటారా అని భాజపా మహిళా విభాగ అధ్యక్షురాలు వానతి శ్రీనివాసన్ ప్రశ్నించారు. ఆమె విడుదల చేసిన ప్రకటనలో.. తిరునెల్వేలి జిల్లా పాళయంగోట్టైలో క్రిస్మస్ వేడుకలో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్ మతాలతో సంబంధం లేకుండా ఎలాంటి వివక్షత చూపకుండా డిమాండ్లు నెరవేరుస్తున్నామని చెప్పారన్నారు. మతాల మధ్య వివక్ష చూపడం, ఓట్లకోసం మతపరమైన భావాలను రెచ్చగొట్టడం డీఎంకే చరిత్ర అని వానతి శ్రీనివాసన్ తెలిపారు. దీపావళి, వినాయక చవితి, తైపూసం వంటి హిందూ వేడుకల్లో ఆయన పాల్గొనరని పేర్కొన్నారు. కనీసం హిందూ వేడుకలకు శుభాకాంక్షలు కూడా తెలపడంలేదన్నారు. హిందూ దేవాలయాలను పునరుద్ధరిస్తున్నది డీఎంకే లేదా డీఎంకే ప్రభుత్వం కాదని హిందువుల విరాళాలతో మాత్రమేనని తెలిపారు. తిరుప్పరంకుండ్రం దీపస్తంభం వద్ద దీపం వెలిగించాలని న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాన్ని డీఎంకే ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమన్నారు.

జయంకొండంలో మద్యం దుకాణాలు ప్రారంభించకూడదు: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: అరియాలూరు జిల్లా జయంకొండంలో మద్యం దుకాణాలు ప్రారంభించాలన్న నిర్ణయాన్ని టాస్మాక్ సంస్థ ఉపసంహరించుకోవాలని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. తమిళనాడులో మద్యం దుకాణాలు లేని నగరంగా జయంకొండం ఉందన్నారు. ఇదే విషయమై అక్కడి ప్రజలు కూడా గర్వపడుతున్నారన్నారు. జయంకొండం నగర పీఎంకే చేసిన వరుస పోరాటాలే అందుకు కారణమని తెలిపారు. ప్రస్తుతం ఆ నగరంలో 10కి పైగా టాస్మాక్ దుకాణాలు తెరిచేందుకు టాస్మాక్ సంస్థ నిర్ణయించినట్లు, ఇందుకు జిల్లా యాజమాన్యం కూడా అండగా ఉన్నట్లు తెలిసిందన్నారు. ఇది అక్కడి ప్రజల మనోభావాలకు వ్యతిరేకమైందన్నారు. ప్రశాంతంగా ఉండే జయంకొండంలో మద్యం దుకాణాలు తెరిస్తే శాంతిభద్రతలు క్షీణిస్తాయని పేర్కొన్నారు. ఆ నిర్ణయాన్ని టాస్మాక్ సంస్థ, జిల్లా యాజమాన్యం ఉప సంహరించుకోవాలని, లేదంటే స్థానికులతో కలిసి పీఎంకే ఆందోళన చేస్తుందని హెచ్చరించారు.

ఇళంగోవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిదంబరం తదితరులు

కేంద్రం కక్ష సాధింపు చర్యలు ఆపాలి

చెన్నై, న్యూస్‌టుడే: కాంగ్రెస్‌పై కక్షసాధింపు చర్యలను కేంద్ర ప్రభుత్వం ఆపాలని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తెలిపారు. టీఎన్‌సీసీ సీనియర్ నేత దివంగత ఈవీకేఎస్ ఇళంగోవన్ జయంతి సందర్భంగా రాయపేటలోని సత్యమూర్తి భవన్‌లో ఆయన చిత్రపటానికి ఆదివారం పుష్పాంజలి ఘటించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో పి.చిదంబరం మాట్లాడుతూ... నేషనల్ హెరాల్డ్ కేసులో న్యాయమూర్తి మంచి తీర్పు ఇచ్చారని, ఎఫ్ఐఆర్ లేకుండా ఈడీ కేసు నమోదు చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. భాజపా అధికారంలో లేని రాష్ట్రాలపై ఈడీ దృష్టి సారించిందని ఆరోపించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును హిందీలోకి మార్చడం ద్వారా ఆయన్ను మరోసారి చంపేశారని ఆరోపించారు. టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షులు కృష్ణసామి, కేవీ తంగబాలు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ప్రత్యేక అలంకరణలో పెరుమాళ్ ▸ హాజరైన భక్తులు

కనులపండువగా కల్యాణోత్సవం

వడపళని: చెన్నై సాపుకారుపేట రెడ్డిరామన్ వీధిలోని శ్రీరామకృష్ణ చైతన్య మందిరంలో శ్రీవేంకట సుందరరాజ పెరుమాళ్ పాలరాతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 17 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం వార్షికోత్సవం పేరిట శ్రీ మహావిష్ణు, శ్రీసత్యనారాయణ స్వామికి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. ప్రధాన అర్చకులు కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేయించిన ఉభయ ఉభయదారులను ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకృష్ణ పరమేశ్వరి దేవస్థాన ధర్మకర్తృ పాలకమండలి సభ్యులు తాతా బద్రీనాథ్ దంపతులు ఘనంగా సత్కరించారు. అధ్యక్షుడు వి.జనార్దనరావు, కార్యదర్శి శరత్‌కుమార్, కోశాధికారి కె.రామప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుమ్మిడిపూండిలో పోటీకి జయచంద్రన్ దరఖాస్తు

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: రాబోయే ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున పోటీ చేయాలనుకునే ఆశావహుల నుంచి చెన్నై రాయపేటలోని ఎంజీఆర్ మాళిగైలో దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం సమీపం కన్నిగైపేర్‌లోని జేఎన్ఎన్ ఇంజినీరింగ్ కళాశాల అధినేత జయచంద్రన్ గుమ్మిడిపూండి నియోజకవర్గం నుంచి పోటీకి ఆదివారం దరఖాస్తు పొందారు. అన్నాడీఎంకే సీనియర్ నాయకులు కార్తిక్, తిరుమలై, సురేష్, సురేష్‌బాబు వెంట ఉన్నారు.

దరఖాస్తు తీసుకుంటున్న జయచంద్రన్

ఎడప్పాడి సభకు స్థల ఎంపిక

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి తిరువళ్లూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఇంకా తేదీ ఖరారు కాలేదు. గుమ్మిడిపూండిలో జరిగే సభలో ప్రసంగించనున్నారు. వేదిక ఏర్పాటుకు స్థల ఎంపిక ప్రక్రియ ఆదివారం పూర్తయింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయకుమార్, యూనియన్ కార్యదర్శులు వేదగిరి, పల్లవాడ రమేష్ పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న విజయకుమార్ తదితరులు

మార్గళిలో విదేశీ మెరుపులు

సంగీతోత్సవాల్లో పాల్గొననున్న నాట్య కళాకారులు

వడపళని, న్యూస్‌టుడే: శాస్త్రీయ, సంప్రదాయ కళలకు చెన్నై పేరొందింది. ఈ మహానగరం ఏటా మార్గళి మాసం(డిసెంబరు)లో సంగీత కచ్చేరీలు, నృత్యాలు, వాద్య సంగీతాలతో సందడిగా ఉంటుంది. సంగీతాభిమానులు చలిని సైతం లెక్క చేయక సభలకు విచ్చేస్తుంటారు. ఈ సంవత్సరం 'మేడై' మార్గళిలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భరతనాట్య కళాకారులు ప్రదర్శనలు ఇచ్చేందుకు చెన్నై రానుండడం ప్రత్యేకత సంతరించుకుంటోంది. ప్రతి నృత్యకారిణికి సరైన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో వారిని ఇక్కడికి రప్పిస్తున్నట్లు 'మేడై' సంస్థ డైరెక్టర్ షకీరా ముక్తార్ అన్నారు.

సాంస్కృతిక సంపూర్ణత..

● భారత్ నుంచి ఐర్లాండ్‌లోని గాల్వేలో స్థిరపడిన 28 ఏళ్ల సహనా శ్రీధర్ భరతనాట్యంలో అభ్యాస వాతావరణంలో పాతుకుపోయారు. ఆమె దృష్టిలో విదేశాలలో ముఖ్యంగా ఐర్లాండులో ప్రదర్శనలు ఇవ్వడంలో తరచూ విభిన్న ప్రేక్షకుల కోసం రూపాన్ని సందర్భోచితంగా మార్చుతున్నారు. చెన్నైలో మార్గళి సంగీతోత్సవాల్లో నృత్యం చేయడం అనేది ఉమ్మడి సాంస్కృతిక భాషలో సంపూర్ణ కచ్చితత్వం, సంప్రదాయంతో కూడుకుని ఉంటాయని సహనా పేర్కొంది. 29న సాయంత్రం 7 గంటలకు ఈమె ప్రదర్శన జరగనుంది.

ఐదేళ్ల నుంచే..

● కేరళలో జన్మించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే)లో ఉంటున్న దివ్యా రామ్‌కుమార్ ఐదేళ్ల ప్రాయం నుంచే భరతనాట్యం, కూచిపూడి, మోహినీయాట్టం, జానపద నృత్యాల్లో శిక్షణ ప్రారంభించి, 12వ తరగతి వరకు నేర్చుకుంది. ఉద్యోగ రీత్యా సింగపూర్, సౌదీ అరేబియా, యూకేకు వెళ్లింది. కొన్ని సందర్భాల్లో మాత్రమే భరతనాట్య ప్రదర్శనలిచ్చారు. ఆ తర్వాత 15 ఏళ్ల క్రితం యూకేలోని కేంబ్రిడ్జిలో నాట్యాంజలి స్కూల్ ఆఫ్ డాన్స్ కేంద్రం ప్రారంభమై ఇప్పుడు 110 మంది విద్యార్థులతో పని చేస్తోందని దివ్య పేర్కొన్నారు. ఈమె మార్గళి ఉత్సవాల్లో చెన్నైలో 27న రాత్రి 7.30 గంటలకు తొలిసారి ప్రదర్శన ఇవ్వనున్నారు.

హృదయంలోకి అడుగుపెట్టడం..

● ప్రముఖ భరతనాట్యకారిణి ఇందుమతి గోపాలకృష్ణన్ కుమారుడు అంకిత్ పిరామ్(14) ఈ ఏడాది మార్గళి వేడుకల్లో 'వేణుగానం' ప్రదర్శనకు అమెరికా నుంచి వస్తున్నాడు. రెండున్నరేళ్ల వయసులోనే తల్లి ద్వారా శాస్త్రీయ నృత్యానికి శ్రీకారం చుట్టాడు. క్రమంగా నృత్యంలో లయ, కథ చెప్పే శక్తిని అర్థం చేసుకోగలిగాడు. భారతీయ సంగీతం, నృత్యం దాదాపు అన్ని ప్రాంతాల్లో ఉన్నాయని, ప్రామాణికతను కాపాడుకోవడం అంటే కొత్త నేలలో ఒక విత్తనాన్ని నాటడంలాంటిదని అన్నాడు. శ్రద్ధతో నృత్యాన్ని పోషించడమే దాని మూలాలకు నిజమవుతుందని పిరామ్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. మార్గళి ఉత్సవాలలో చెన్నైలో నృత్యం చేయడమనేది భరతనాట్యం హృదయంలోకి అడుగు పెట్టినట్టుగా ఉంటుందన్నాడు. 29న సాయంత్రం 5.30కు నృత్య ప్రదర్శనలో పాల్గొంటున్నాడు.

దీక్షను సత్కరిస్తున్న కలెక్టర్ కందసామి

జాతీయ పోటీల్లో పసిడి పతకం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ రంగపాలయంలోని కొంగు విద్యాసంస్థ విద్యార్థిని దీక్ష ఇటీవల జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర పాఠశాలల క్రీడా సంఘం నిర్వహించిన 69వ జాతీయ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో 19 ఏళ్లలోపు బాలికల విభాగంలో తమిళనాడు తరపున పాల్గొని పసిడి పతకం సాధించింది. శనివారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీక్షను జిల్లా కలెక్టర్ కందసామి ప్రశంసించారు. శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం.చిన్నసామి, ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులు విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు.

దెబ్బతిన్న రోడ్లు బాగు చేయాలి

రాస్తారోకో నిర్వహిస్తున్న కొండక్కరై వాసులు

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా మీంజూరు పరిసర ప్రాంతాల్లో దిత్వా తుపాను కారణంగా భారీ వర్షాలు కురిశాయి. కొండక్కరై, కురివిమేడు తదితర ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిని పాదచారులు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోడ్డు బాగు చేయాలని గ్రామస్థులు మీంజూరు బీడీవో కార్యాలయంలో వినతి అందజేసినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇందుకు నిరసనగా వారు ఆదివారం తిరువొత్తియూరు రోడ్డులో రాస్తారోకోకు దిగారు. సీఐ వేలుమణి, బీడీవో కార్యాలయ అధికారులు చర్చలు జరిపారు. వారం రోజుల్లో కొత్త రోడ్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు.

'పీయూ'లో అవగాహన కార్యక్రమం

ప్రసంగిస్తున్న ఉపకులపతి ప్రకాశ్‌బాబు

వడపళని, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ జాతీయ మహిళా కమిషన్ యువమంథన్ పథకంలోని 'క్యాంపస్ కాలింగ్ పీఓఎస్‌హెచ్ అవగాహన ప్రచారం'లో భాగంగా పాండిచ్చేరి వర్సిటీ డీన్ కార్యాలయ మహిళా సెల్, విద్యార్థుల సంక్షేమం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 'లింగ సున్నితత్వం, పీఓఎస్‌హెచ్'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. వర్సిటీలో సురక్షిత, సమ్మిళితమైన లింగ సున్నితమైన వాతావరణాన్ని ప్రోత్సహించే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వర్సిటీ పేర్కొంది. ఉపకులపతి, ఆచార్యులు పి.ప్రకాశ్‌బాబు, మహిళా విభాగ హెడ్, ఆచార్యులు జి.వసంతి, విద్యార్థుల డీన్, ఆచార్యులు వై.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విత్తనక్షేత్రం పరిశీలన

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట సమీపంలోని నవ్‌లాక్ విత్తనక్షేత్రాన్ని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు సుందరం, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రూబన్, వాలాజాపేట వ్యవసాయ సహాయ డైరెక్టర్ తిలగవతి ఆదివారం పరిశీలించారు. సుందరం మాట్లాడుతూ.. నవ్‌లాక్‌లోని ఆధునిక విత్తనక్షేత్రంలో వెదురు, ఇతర మొక్కలను నాణ్యంగా పెంచుతున్నామన్నారు. చెట్ల ద్వారా కార్బన్ డయాక్సైడ్ స్థాయిలు తగ్గించవచ్చని సుందరం తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకంపై కార్యశాల 26న

వడపళని, న్యూస్‌టుడే: 'తమిళనాడు అగ్రికల్చరల్ యూనివర్సిటీ ఇన్‌ఫర్మేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్' పుట్టగొడుగుల పెంపకంపై ప్రత్యేక కార్యశాల ఏర్పాటు చేసింది. గిండీ, తిరువికా ఎస్టేట్‌లోని 'ఆగ్రోటెక్ గ్రీన్ పార్క్' మొదటి అంతస్తులోని కార్యాలయంలో ఈనెల 26న కార్యశాల జరగనుంది. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలి. 044-2953 0048 నెంబరులో పూర్తి వివరాలు అడిగి తెలుసుకోవచ్చు.

ఫిబ్రవరి 8న గణితంలో టాలెంట్ పరీక్ష

వడపళని, న్యూస్‌టుడే: 'తమిళనాడు సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్' 5 నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గణితంలో టాలెంట్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఫిబ్రవరి 8వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 90 నిమిషాల పాటు జరిగే పరీక్షకు 'పెరియార్ సైన్స్ అండ్ టెక్నాలజీ సెంటర్' వేదిక అని ప్రకటనలో తెలిపింది. ఆసక్తి గల విద్యార్థులు జనవరి 27లోపు పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 044-2441 0025 నెంబరును సంప్రదించవచ్చు.

జనవరి 10న 'ఎన్ఎంఎంఎస్' పరీక్ష

☛ దరఖాస్తు గడువు 23 వరకు పొడిగింపు

వడపళని, న్యూస్‌టుడే: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పథకం కింద జనవరి 10న జరగనున్న పరీక్షలకు దరఖాస్తు గడువు డిసెంబరు 23 వరకు పొడిగించినట్లు డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్(డీజీఈ) ప్రకటన విడుదల చేసింది. గతంలో 2025-26 సంవత్సరానికి పరీక్షలకు గడువు 20వ తేదీగా పేర్కొంది. విద్యార్థులనుంచి అధిక సంఖ్యలో దరఖాస్తులు రావడంతో 23 వరకు పొడిగించారు. శుక్రవారం వరకు 1.72 లక్షల దరఖాస్తులు అందాయి. ఒక్క చెన్నైలో శుక్రవారం నాటికి 4,992 మంది దరఖాస్తు చేసుకున్నారు. కేంద్ర విద్యాశాఖ ప్రవేశపెట్టిన 'ఎన్ఎంఎంఎస్' పరీక్షలు 8వ తరగతి చదువుతున్న, ఆర్థికంగా వెనుకబడినవర్గాల వారికి ఉపకారవేతనం అందించేందుకు వీలుగా ఉంది. 2024-25లో రాష్ట్రంలో 2.30 లక్షల మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 6,695 మంది అభ్యర్థులు ఉపకారవేతనం పొందడానికి అర్హులయ్యారు. ఏడాదికి రూ.1.5 లక్షల కన్నా ఆదాయం తక్కువ ఉన్నవారు ఉపకారవేతనాలకు అర్హులు. ఎన్ఎంఎంఎస్ పరీక్షను విజయవంతంగా పూర్తి చేసిన, 9 నుంచి 12 తరగతి చదువుతున్న విద్యార్థులు నెలకు రూ. 1,000 ఉపకారం వేతనం పొందుతారని ప్రకటనలో పేర్కొన్నారు.

బారులుతీరిన వాహనాలు

30వ రోజుకు చేరిన ట్యాంకర్ లారీల సమ్మె

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి పరిసర ప్రాంతాల్లో వందకు పైగా మురుగునీటి ట్యాంకర్ లారీలు ఉన్నాయి. వాటికి అయిదేళ్ల ముందు నిర్ణయించిన అద్దె చెల్లిస్తుండడంతో గిట్టుబాటు కావడంలేదని, పెంచాలని కోరుతూ యజమానులు నవంబరు 22 నుంచి నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. ఆదివారం 30వ రోజుకు చేరింది. గృహాలు, పరిశ్రమల్లో పూర్తిగా నిండిన సెప్టిక్ ట్యాంకుల నుంచి వెలువడుతున్న దుర్వాసన తట్టుకోలేక ఆయా ప్రాంతవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత శాఖాధికారులు ట్యాంకర్ యజమానులతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

పీఎంకే సర్వసభ్య సమావేశం 29న

టీనగర్, న్యూస్‌టుడే: పాట్టాలి మక్కల్ కట్చి(పీఎంకే) సర్వసభ్య సమావేశం 29న వ్యవస్థాపకుడు డాక్టర్ రామదాస్ నేతృత్వంలో సేలంలో జరగనుంది. ఈ మేరకు పార్టీ పెన్నాగరం ఎమ్మెల్యే జీకే మణి ప్రకటించారు. పార్టీ బలోపేతం, వచ్చే ఎన్నికలకు పొత్తులపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.

నటుడు శివకార్తికేయన్ కారుకు ప్రమాదం

ఇరు తరఫు వారితో మాట్లాడుతున్న ట్రాఫిక్ పోలీసు

ప్యారిస్, న్యూస్‌టుడే: నటుడు శివకార్తికేయన్ కారు మరో కారును ఢీకొంది. శనివారం రాత్రి ఆయన కారులో కొట్టూర్‌పురం వైపుగా ఓఎమ్మార్‌కి వెళ్తున్నారు. మధ్య కైలాష్ వద్ద ముందు వెళ్తున్న కారుని ఢీకొనడంతో ఇరు తరపు వారు వాగ్వాదానికి దిగారు. ట్రాఫిక్ పోలీసులు సమాధాన పరిచారు. ఎవరికీ గాయాలు కాలేదు. కారులోంచి శివకార్తికేయన్ బయటకు రావడంతో చూసేందుకు వాహనచోదకులు తమ వాహనాలను నిలిపేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను సరిచేశారు.

ప్రజలు ముందుగా ఇచ్చిన సమాచారం మేరకు ఇళ్లల్లో నిరుపయోగమైన 34.42 టన్నుల సామగ్రిని చెన్నై మహానగర పాలకసంస్థ సిబ్బంది శనివారం తొలగించారు. 187వ డివిజన్ కృష్ణానగర్‌లోని 1వ మెయిన్ రోడ్డులో పాత సోఫాలు తొలగిస్తున్న దృశ్యం. -న్యూస్‌టుడే, చెన్నై

గ్రామాల్లో సౌర విద్యుదుత్పత్తి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ పీఎం సూర్యఘర్ పథకం కింద చెన్నై మినహా 37 జిల్లాల్లో మోడల్ సోలార్ గ్రామం ఏర్పాటుకు నివేదిక రూపొందించడానికి కన్సల్టెంట్‌ను నియమించాలని నిర్ణయించింది. సెమీ-అర్బన్ ప్రాంతాల్లో సౌరవిద్యుదుత్పత్తిని వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇంధన భద్రత మెరుగుపరచడం, సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడడాన్ని, వాతావరణ మార్పులను తగ్గించడం, గృహాలకు ఉచిత లేదా రాయితీ విద్యుత్తును అందించడం పథకం లక్ష్యమని సంబంధిత శాఖాధికారులు తెలిపారు. స్థానిక శక్తి అంతరాలను తగ్గించడానికి సౌర వోల్టాక్ ప్యానెళ్లు, పైకప్పు వ్యవస్థలు, సౌర వీధిలైట్లు పథకపు పరిధిలో ఉన్నాయన్నారు.

టీవీకే తరఫున ముందస్తు క్రిస్మస్ వేడుకలు నేడు

మహాబలిపురం: తమిళగ వెట్రి కళగం(టీవీకే) తరపున సోమవారం చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలోని ఫోర్ పాయింట్ కన్వెన్షన్ సెంటర్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నారు. పార్టీ అధ్యక్షుడు నటుడు విజయ్, పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు.

ఉపాధి హామీలో గాంధీ పేరు తొలగించడం సరికాదు

ఆందోళన నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: జాతీయ ఉపాధి హామీ పథకంలో మహాత్మా గాంధీ పేరు తొలగించడం సరికాదని కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి బజారువీధిలో ఆదివారం జరిగిన ఆందోళనకు ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. **వేలూరు:** గాంధీ పేరును కేంద్రం తొలగించడాన్ని వేలూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే రామన్ ఖండించారు. అన్నా కలై అరంగం వద్ద ఆదివారం నిరసన చేపట్టారు. పార్టీ ఎస్సీ, ఎస్టీ విభాగం కార్యదర్శి చిత్తరంజన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆటోలు

తాళాలు అందిస్తున్న మంత్రి గాంధీ

అరక్కోణం, న్యూస్‌టుడే: ఆర్కాడు సమీపంలోని తిమిరి పంచాయతీ యూనియన్‌కు చెందిన కవలూరు వద్ద తమిళనాడు పట్టణ జీవనోపాధుల కల్పన, మహిళా పథకం కింద జరిగిన కార్యక్రమంలో మంత్రి ఆర్.గాంధీ పాల్గొని రూ.7 లక్షల విలువైన రెండు ఆటోలను ఇద్దరు స్వయం ఉపాధి మహిళలకు అందించారు. రాణిపేట కలెక్టర్ చంద్రకళ, ఆర్కాడు ఎమ్మెల్యే జేఎల్ ఈశ్వరప్పన్, పథకం సహాయ అధికారి వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధమిరుక్క భయమేన్' పుస్తకం విడుదల

ప్యారిస్, న్యూస్‌టుడే: సైన్సు చెప్పలేని అద్భుతాలను 2 వేల ఏళ్ల కిందటే సిద్ధ వైద్యులు తెలియజేశారని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహాదేవన్ పేర్కొన్నారు. సిద్ధ వైద్యుడు వై.ఆర్.మానోక్ షా రచించిన 'సిద్ధమిరుక్క భయమేన్' పుస్తకం విడుదల చెన్నైలో శనివారం జరిగింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి పుస్తకాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శరీరం, ఆత్మతో తిరుమూలర్ పాడిన పాటలే తమిళ వైద్యానికి పునాది అన్నారు. మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జగదీశ్ చంద్ర మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వ్యాధులకు సిద్ధ వైద్యం శాశ్వత పరిష్కారం చూపుతుందని తెలిపారు.

పుస్తకం విడుదల చేస్తున్న న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహాదేవన్ తదితరులు

డీఎంకే కార్యకర్తల రక్తదానం

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు జిల్లా చోళవరం దక్షిణ యూనియన్ డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆదివారం పాడియనల్లూరులో నిర్వహించారు. పార్టీ యూనియన్ కార్యదర్శి కరుణాకరన్ ప్రారంభించారు. ఎమ్మెల్యే సుదర్శనం సమక్షంలో 150 మంది రక్తదానం చేశారు. విద్యార్థి, యువజన విభాగాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

రేషన్ దుకాణం ప్రారంభం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పెరియపాళ్యం సమీపం పొందవాక్కం పంచాయతీ పరిధిలోని మాధవరంలో రూ.13 లక్షలతో కొత్త రేషన్ దుకాణ భవనం నిర్మించారు. ఎమ్మెల్యే దురైచంద్రశేఖర్ ప్రారంభించారు. సహకార సంఘ రిజిస్ట్రార్ ఇళయరాజా, తాలూకా కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తమన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నై మెరినా బ్లూఫ్లాగ్ బీచ్‌లో శనివారం రాత్రి జరిగిన రాష్ట్ర సంప్రదాయ కళల కార్యక్రమాలను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు -న్యూస్‌టుడే, చెన్నై

పనులు సకాలంలో పూర్తి చేయాలి

చెన్నై, న్యూస్‌టుడే: ఉత్తర చెన్నై అభివృద్ధి ప్రాజెక్టు కింద సీఎండీఏ తరపున మహానగర పాలకసంస్థ పరిధిలో జరుగుతున్న నిర్మాణ పనులను మంత్రి పి.కె.శేఖర్‌బాబు ఆదివారం పరిశీలించారు. ఐల్యాండ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఎగ్జిబిషన్ సెంటర్, స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డులో 776 నివాసాలతో నిర్మితమవుతున్న బహుళంతస్తుల భవనం, వాల్‌టాక్స్ రోడ్డులోని తణ్ణీర్ తొట్టి వీధి, 844 నివాసాలతో కూడిన బహుళంతస్తు భవనం, కమ్యూనిటీ హాలు, కార్పొరేషన్ ప్రింటింగ్ ప్రెస్, క్రీడామైదానంతో కూడిన సమీకృత ప్రాంగణం నిర్మాణ పనులను మంత్రి పి.కె.శేఖర్‌బాబు పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వెంట సీఎండీఏ సభ్యత్వ కార్యదర్శి ప్రకాశ్, సీఈవో శివజ్ఞానం, చెన్నై మహానగర పాలకసంస్థ ఉత్తర ప్రాంతీయ డిప్యూటీ కమిషనరు కట్టా రవితేజా, జోన్ కమిటీ ఛైర్మన్ శ్రీరాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రాజన్‌బాబు తదితరులు ఉన్నారు.

సమీకృత ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మంత్రి శేఖర్‌బాబు

నినాదాలు చేస్తున్న కావేరి రైతులు

రైతుల రుణాలు మాఫీ చేయాలి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: బ్యాంకులు, సహకార సంఘాల నుంచి రైతులు తీసుకున్న రుణాలు పూర్తిగా మాఫీ చేయాలని తమిళనాడు కావేరి రైతుల భద్రతా సంఘం అధ్యక్షుడు చిన్నదురై డిమాండ్ చేశారు. కుంభకోణంలో తమిళనాడు కావేరి రైతుల భద్రతా సంఘం తరపున రైతుల నాయకుడు నారాయణస్వామి నాయుడు, వ్యవసాయశాస్త్రవేత్త నమ్మాళ్వార్ స్మారక కార్యక్రమం ఆదివారం జరిగింది. నారాయణస్వామి, నమ్మాళ్వార్ చిత్రపటాలకు నివాళులర్పించారు. విద్యుత్‌శాఖను ప్రైవేటీకరించకూడదని, వ్యవసాయ విద్యుత్తుపై కేంద్రం సుంకాలు విధించకూడదని నినాదాలు చేశారు.

బేకరీ ఉత్పత్తుల తయారీపై శిక్షణ

వడపళని, న్యూస్‌టుడే: 'ఎంఎస్ఎంఈ' అనుబంధ సంస్థ 'ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్' బేకరీ ఉత్పత్తులపై మూడు రోజులపాటు శిక్షణ అందించనుంది. గిండీలోని సిడ్కో ఎస్టేట్‌లో ఉన్న కార్యాలయంలో ఈనెల 29 నుంచి 31 వరకు జరుగుతుందని ప్రకటన విడుదల చేసింది. రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందే వారికి ప్రభుత్వం అందించే రాయితీలు, రుణాలు వివరిస్తారు. కనీస విద్యార్హత 8వ తరగతి ఉత్తీర్ణులై, 18 ఏళ్లు పైబడిన వారు అర్హులు. రిజిస్ట్రేషన్ రుసుము రూ.5,500. పూర్తి వివరాలకు 86681 02600, 99436 85468 నెంబర్లు సంప్రదించాలి.

క్రిస్మస్, ఆంగ్ల నూతన సంవత్సరం ప్రత్యేక రైళ్లు

వడపళని, న్యూస్‌టుడే: క్రిస్మస్, ఆంగ్ల నూతన సంవత్సర రద్దీ కారణంగా ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే ఆదివారం ప్రకటన విడుదల చేసింది. ● **06126** మంగళూరు జంక్షన్‌లో 23, 30 తేదీల్లో 03.10కి బయలుదేరి అదే రోజు 23.30కి చెన్నై సెంట్రల్ వస్తుంది. ● **06125** చెన్నై సెంట్రల్‌లో 24, 31 తేదీల్లో 04.15కు బయలుదేరి అదేరోజు 23.30కి మంగళూరు జంక్షన్ వెళ్తుంది.

22, 25 తేదీల్లో పలు సబర్బన్‌లు రద్దు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్‌లోని మీంజూరు, అత్తిపట్టు స్టేషన్ల మధ్య జరుగుతున్న ఇంజినీరింగ్ పనుల కారణంగా 22, 25 తేదీల్లో పలు సబర్బన్ సేవలు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే శనివారం ప్రకటన విడుదల చేసింది. ● ఎంఎంసీ-గుమ్మిడిపూండి 09.00, 10.30, చెన్నై బీచ్- గుమ్మిడిపూండి 12.40, గుమ్మిడిపూండి-చెన్నై బీచ్ 10.55 సర్వీసులు 22, 25 తేదీల్లో రద్దయ్యాయి. ● **పాక్షికంగా...** సూళ్లూరుపేట-ఎంఎంసీ 10.00 రైలు 22, 25 తేదీలు పొన్నేరి నుంచి నడుస్తుంది.

చర్చలకు వేదికగా పార్లమెంట్ లేదు

చెన్నై, న్యూస్‌టుడే: చర్చలు జరిగే వేదికగా పార్లమెంట్ భవనం లేదని, తమ అభిప్రాయాలు సభా రికార్డుల్లోకి ఎక్కడానికి కూడా అరవాల్సి ఉంటుందని డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ తెలిపారు. శ్రీలంక సీనియర్ సంగీత దర్శకుడు పరమేశ్ తన తండ్రి, తమిళ భాషావేత్త పీతాంబరం జీవితచరిత్ర పుస్తకాన్ని పునర్ముద్రించారు. ఈ పుస్తకావిష్కరణ, పరమేశ్ 60ఏళ్ల సంగీత సేవను గౌరవించే కార్యక్రమాన్ని సాలిగ్రామంలో నిర్వహించారు. సినీ దర్శకుడు శీను రామసామి మాట్లాడుతూ... ప్రస్తుతం ఆవిష్కరించిన పుస్తకం తొలి పేజీలోనే శ్రీలంక తమిళుల జీవన సంబంధాలను తెలుసుకోవచ్చన్నారు. ఎంపీ తిరుచ్చి శివను నటించడానికి ఆహ్వానించగా పనులు కారణంగా ఆయన నిరాకరించారని తెలిపారు. అభిమానుల అభ్యర్థన మేరకు తర్వాతి చిత్రంలో ఆయన్ను పాడిద్దామంటూ సరదాగా మాట్లాడారు. పరమేశ్ మాట్లాడుతూ.. . అమెరికా విమానాశ్రయం తరహాలోనే చెన్నై విమానాశ్రయం ఉందన్నారు. తర్వాతి పదేళ్లకు అమెరికా కన్నా మిన్నగా తమిళనాడు మారుతుందని తెలిపారు. ఎంపీ తిరుచ్చి శివ మాట్లాడుతూ.. శ్రీలంక ఆకాశవాణి తరహాలో ఇక్కడ తమిళ పాటలను ప్రసారం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పి.సుశీల తమిళనాడులో ఉండటంతోనే ఆమె ఔన్నత్యం ఉత్తరాదికి విస్తరించలేదన్నారు.

పరమేశ్‌ను సత్కరిస్తున్న ఎంపీ శివ

ఎన్నికల హామీలు నెరవేర్చని డీఎంకే

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పొదట్టూరుపేటలో బీమా డబ్బు కోసం తండ్రిని చంపిన కుమారులు, గుమ్మిడిపూండిలో బాలికపై అత్యాచారంలాంటి నేరాలు మత్తు అలవాటుతోనే జరుగుతున్నాయని పీఎంకే మహిళా విభాగ అధ్యక్షురాలు సౌమ్య అన్బుమణి తెలిపారు. తిరుత్తణి ప్రాంతంలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారని, జౌళిపార్కు ఏర్పాటు చేస్తామన్న డీఎంకే ఎన్నికల హామీ ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. తిరుత్తణి ప్రభుత్వాసుపత్రి స్థాయి పెంచినా అక్కడ వైద్యుల కొరత ఉందని తెలిపారు. తిరువళ్లూరు జిల్లా ఆర్కేపేటలో ఆదివారం పీఎంకే మహిళా విభాగ సభలో ప్రసంగించారు. పంచాయతీ ఎన్నికల్లో మహిళలు ఎక్కువ స్థానాల్లో గెలుపొంది కావాల్సిన సదుపాయాలు కల్పించుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో తగినమంది ఉపాధ్యాయులు లేరని గుర్తు చేశారు. ఉద్యోగం పర్మినెంట్ చేయాలని నర్సులు పోరాటాలు చేస్తున్నారని, కరోనా సమయంలో వారి సేవలు చాలా గొప్పవని, వారిని ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. పార్టీ వర్గీయులు ఆమెకు బంగారు వేల్ బహూకరించారు.

ప్రసంగిస్తున్న సౌమ్య అన్బుమణి

(c) eenadu

'వరల్డ్ ఆఫ్ పరాశక్తి' ప్రదర్శన పొడిగింపు

పోస్టర్‌ను తిలకిస్తున్న శివకార్తికేయన్ కుటుంబ సభ్యులు

చెన్నై, న్యూస్‌టుడే: సుధా కొంగర దర్శకత్వంలో శివకార్తికేయన్, శ్రీలీల జంటగా నటించిన 'పరాశక్తి' జనవరి 14న విడుదలకానున్న నేపథ్యంలో ప్రచారంలో భాగంగా నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టంలో 'వరల్డ్ ఆఫ్ పరాశక్తి' పేరిట ప్రదర్శన ఏర్పాటు చేశారు. సినిమా కోసం వేసిన సెట్, ఉపయోగించిన అలనాటి వస్తువులు వంటివాటిని ఉంచారు. ఆదివారంతో ప్రదర్శన ముగుస్తుందని ప్రకటించిన నేపథ్యంలో దానిని మరో 4 రోజులకు పొడిగించారు. 25వ తేదీ వరకు నిత్యం మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 వరకు ప్రదర్శన చూసేందుకు అనుమతిస్తారు. ప్రదర్శనను శివకార్తికేయన్ కుటుంబ సభ్యులు తిలకించారు.

సెట్‌లో జేఎస్‌కే సతీశ్‌కుమార్ తదితరులు

డబ్బింగ్ పనుల్లో 'కుఱ్ఱం కడితల్ 2'

చెన్నై, న్యూస్‌టుడే: జాతీయ పురస్కారం పొందిన 'కుఱ్ఱం కడితల్' చిత్రానికి 2వ భాగం ప్రస్తుతం రూపొందుతోంది. ప్రధాన పాత్రధారిగా జేఎస్‌కే సతీశ్‌కుమార్ నటించి చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పాండియరాజన్, అప్పుకుట్టి, బాలాజీ మురుగదాస్, దీపక్, వీజే చంద్రశేఖర్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. తేని, సిరుమలై తదితర ప్రాంతాల్లో ముఖ్య సన్నివేశాలను చిత్రీకరించారు. ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఉద్యోగ విరమణకు ముందు ఎదుర్కొనే సమస్యతో సినిమా రూపొందుతోంది. చిత్రీకరణ పనులు ముగిసి 2 నెలలైన నేపథ్యంలో డబ్బింగ్ ప్రారంభించినట్లు చిత్రబృందం తెలిపింది.

ముగిసిన 'డి54' చిత్రీకరణ

చెన్నై, న్యూస్‌టుడే: విఘ్నేశ్ రాజా దర్శకత్వంలో ధనుష్, మమిత బైజు జంటగా నటిస్తున్న చిత్రానికి 'డి54' తాత్కాలిక టైటిల్ ఇచ్చారు. ఐషరి గణేశ్ భారీ వ్యయంతో నిర్మిస్తున్న చిత్రంలో కరుణాస్, దర్శకుడు కె.ఎస్.రవికుమార్, పృథ్వీ పాండియరాజన్, నితిన్ సత్య తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. చిత్రీకరణ ముగిసి సంబరాలు చేసుకుంటున్న వీడియోను చిత్రబృందం విడుదల చేసింది.

సంబరాల్లో చిత్రబృందం

అభిమానులతో శింబు సందడి

శింబుకు ఫొటో అందిస్తున్న అభిమాని

చెన్నై, న్యూస్‌టుడే: వెట్రిమారన్ దర్శకత్వంలో శింబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'అరసన్'. కలైపులి ఎస్.థాణు నిర్మిస్తున్న చిత్రంలో సముద్రకని, కిశోర్, విజయ్ సేతుపతి తదితరులు నటిస్తున్నారు. అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. తొలి షెడ్యూల్ తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టిలో ప్రారంభమై కొనసాగుతోంది. చిత్రీకరణ ప్రాంతానికి వచ్చిన అభిమానులతో శింబు ఫొటోలు దిగారు. అజిత్‌కుమార్‌తో శింబు కలిసి ఉన్న ఫొటోను ఓ అభిమాని ఫ్రేమ్ కట్టించి అందించారు. అభిమానులు శింబు ఆటోగ్రాఫ్ తీసుకుని హర్షం వ్యక్తం చేశారు. ప్రోమో వీడియో బీటీఎస్‌ను చిత్రబృందం ఆదివారం విడుదల చేసింది.

'విత్ లవ్' ఫస్ట్ సింగిల్ ప్రోమో విడుదల

చెన్నై, న్యూస్‌టుడే: 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు అభిషన్ జీవింత్ కథానాయకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'విత్ లవ్'. కేరళ నటి అనస్వర రాజన్ నాయిక. 'టూరిస్ట్ ఫ్యామిలీ' చిత్రానికి కో-డైరెక్టరుగా పనిచేసిన మదన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రాన్ని ఎంఆర్‌పీ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది. షాన్ రోల్డన్ సంగీతం అందిస్తున్నారు. చిత్రంలోని 'అయ్యో కాదలే' పాటను సోమవారం విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటిస్తూ ప్రోమో వీడియోను ఆదివారం సాయంత్రం విడుదల చేసింది.

ప్రోమోలోని ఓ సన్నివేశ దృశ్యం

పార్టీ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకుంటున్న ఆశావహులు

జోరుగా దరఖాస్తుల విక్రయం

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే తరఫున రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులకు 15వ తేదీ నుంచి దరఖాస్తులు విక్రయిస్తున్నారు. దరఖాస్తులు పొందేవారు, పూర్తి చేసినవి సమర్పించేవారు, నాయకులతో అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఆదివారం కూడా పలువురు దరఖాస్తులు పొందారు. పూర్తి చేసినవాటిని మాజీ మంత్రి గోకుల ఇందిరా తదితర సీనియర్ నేతలు తీసుకున్నారు. ఈనెల 23 దరఖాస్తులు పొందేందుకు చివరిరోజు.

అన్నాడీఎంకే నిర్వాహకుడి తొలగింపు

సైదాపేట, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే వేలూర్ మండల సమాచార, సాంకేతిక ఉపాధ్యక్షుడు ఎస్ఆర్ రాజశేఖర్‌ను పార్టీ నుంచి తొలగిస్తూ అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి చర్యలు తీసుకున్నారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... పార్టీ సిద్ధాంతాలకు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వేలూర్ మండల సమాచార విభాగ ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌ను పార్టీ కనీస సభ్యత్వం సహా అన్ని బాధ్యతల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. పార్టీ నేతలు అతనితో ఎలాంటి సంబంధాలు కొనసాగించకూడదని పేర్కొన్నారు.

అంతర్జాతీయ విమానాశ్రయం వద్దు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కృష్ణగిరి జిల్లా హోసూర్ డివిజన్ పరిధిలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని ఉపసంహరించుకోవాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌ను డిమాండ్ చేయాలని 12 గ్రామాల రైతులు తీర్మానించారు. హోసూర్ సమీపంలోని నందిమంగళంలో రైతులతో సమావేశం జరిగింది. అన్నాడీఎంకే మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, భాజపా మాజీ ఎంపీ నరసింహన్, పీఎంకే మాజీ ఎమ్మెల్యే వేలుసామి తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

మాట్లాడుతున్న మాజీ ఎంపీ నరసింహన్

చదరంగం ఛాంపియన్ ముంబయి ఐఐటీ

ముగిసిన అంతర ఐఐటీ క్రీడాపోటీలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి ఐఐటీ వేదికగా జరుగుతున్న 58వ అంతర ఐఐటీ క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. దేశంలోని పలు ఐఐటీల విద్యార్థులు చదరంగం, వెయిట్ లిఫ్టింగ్, టెన్నిస్ క్రీడల్లో తలపడ్డారు. చదరంగంలో ఐఐటీ ముంబయి ఛాంపియన్‌గా నిలిచింది. ఐఐటీ మద్రాస్, ఖరగ్‌పూర్, పాట్నా ఐఐటీలు తర్వాత స్థానాల్లో నిలిచాయి.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ, అశ్విన్ మహాలింగం

- టెన్నిస్ మహిళా, పురుషుల విభాగంలో ఐఐటీ మద్రాస్ ఛాంపియన్‌గా అవతరించింది.
- బాడీవెయిట్ 60, 65, 71, 79 కిలోల పైబడి విభాగాల్లో ఐఐటీ రూర్కీ విజేతగా నిలిచింది. 79 కిలోల విభాగంలో ఐఐటీ కాన్పూర్ అగ్రస్థానం సాధించింది.
- వెయిట్ లిఫ్టింగ్‌లో ఐఐటీ రూర్కీ ఛాంపియన్‌గా నిలిచింది.
- ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ, మద్రాస్ ఐఐటీ డీన్ ప్రొఫెసర్ అశ్విన్ మహాలింగం విజేతలకు బహుమతులు అందజేశారు. అంతర ఐఐటీ క్రీడా పోటీలతో విద్యార్థుల్లో స్నేహభావం మెరుగుపడుతుందని అభిప్రాయపడ్డారు.

శరణాగతి కోరడం శ్రేయస్కరం

ఉపన్యాసకులతో పాలకమండలి సభ్యులు

సైదాపేట, న్యూస్‌టుడే: దైవానుగ్రహం పొందేందుకు నవవిధ భక్తి మార్గాలు ఉన్నాయని, అన్నింటిలో భగవంతుని శరణు కోరడం అత్యంత శ్రేయస్కరమని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు ఉభయ వేదాంత కిడాంబి నారాయణస్వామి అభివర్ణించారు. పప్పిశెట్టి రాఘవయ్య శెట్టి ధర్మ సంస్థ ఆధ్వర్యంలో టీనగర్‌లోని పీఆర్‌సీసీ సెంటినరీ హాలులో మార్గళి ఉత్సవం పేరిట ఆదివారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం ఏర్పాటైంది. 'మామేకం శరణం వ్రజ' అని శ్రీకృష్ణపరమాత్మ అర్జునునితో చెప్పిన ఉదంతాన్ని నారాయణ స్వామి వివరిస్తూ అర్జునుని అన్నింటినీ విడిచిపెట్టి తనను మాత్రమే శరణు వేడుకోమని హితబోధ చేశారని తెలిపారు. పాలకమండలి సభ్యులు కోటా సుధాకర్(అధ్యక్షులు), ఉమ్మిడి సుధాకర్, గోరంట్ల బాలాజీ, ఏఎస్ హరప్రసాద్‌లు ఉపన్యాసకులను సత్కరించారు.

అన్నాడీఎంకేలో చేరిక

సేలం, న్యూస్‌టుడే: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సమక్షంలో వేర్వేరు పార్టీలకు చెందిన వందలాదిమంది ఆదివారం ఆ పార్టీలో చేరారు. సేలం హైవే నగర్‌లోని ఆయన నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. రైతు సంఘాల ప్రతినిధులు పలువురు పళనిస్వామిని కలిశారు. ఆయన అధికారంలో ఉండగా మేట్టూర్ డ్యామ్ మిగులు నీటిని వినియోగించుకుని సేలం జిల్లాలోని వంద చెరువులను నింపే పథకాన్ని విజయవంతంగా అమలు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపి జ్ఞాపిక అందించారు.

ఎడప్పాడి పళనిస్వామికి జ్ఞాపిక అందిస్తున్న రైతు సంఘాల ప్రతినిధులు

నెలాఖరులో బైపాస్ రోడ్డు ప్రారంభం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం-చెంగల్పట్టు మార్గంలో వాలాజాబాద్ సమీపాన రహదారుల శాఖ బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టింది. వాలాజాబాద్ పరిసరాల్లో పరిశ్రమలు ఎక్కువగా ఉండటంతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ఇందుకు పరిష్కారంగా వాలాజాబాద్ సమీప వెంగుడి నుంచి చెంగల్పట్టు మార్గాన్ని కలిపేలా 2022లో రూ.141 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కిదిరిపేట, పులియంబాక్కం గ్రామాల మీదుగా సుమారు 6.5 కి.మీ మేర నిర్మాణం పూర్తవడంతో నెలాఖరులో అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకొంటున్నారు. ఇది ప్రారంభమైతే చెంగల్పట్టువైపు నుంచి కాంచీపురం వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు వాలాజాబాద్‌లోకి ప్రవేశించకుండా పులియంబాక్కం వద్ద వంతెన పైనుంచి ఊత్తుక్కాడు, కిదిరిపేట మార్గాల గుండా వెంగుడి వద్ద కలిసే కాంచీపురం మార్గంలోకి చేరుకోవచ్చు.

కొత్తగా నిర్మించిన బైపాస్ రహదారి

స్టాలిన్ పర్యటనపై హిందూ మున్నని నిరసన

టీనగర్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ తిరునెల్వేలి పర్యటన సందర్భంగా ప్రభుత్వానికి, సీఎంకు వ్యతిరేకంగా హిందూ మున్నని కార్యకర్తలు నిరసన తెలిపారు. ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు కీలకనేతలను శనివారం రాత్రి గృహ నిర్బంధం చేశారు. ఆదివారం ముఖ్యమంత్రి వెళ్తున్న సమయంలో నెల్లై ప్రభుత్వ వైద్య కళాశాల సమీపంలో హిందూ మున్నని నగర అధ్యక్షుడు సంజయ్ నేతృత్వంలో సుమారు 20 మందికి పైగా కార్యకర్తలు హఠాత్తుగా అడ్డుగా వచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే పోలీసులు వారిని వాహనాల్లోకి ఎక్కించి అక్కడి నుంచి తరలించారు.

నర్సుల ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: నర్సుల ఉద్యోగం పర్మినెంట్ వ్యవహారంలో జయలలితపై ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ ఆరోపణలు చేయడం ఖండించదగినదని మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం తెలిపారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. నర్సుల డిమాండ్లు నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు. వారిని పర్మినెంట్ చేస్తామని డీఎంకే ఎన్నికల హామీ కూడా ఇచ్చిందని గుర్తు చేశారు.

ఉపకార వేతనాలకు టీవీకే దరఖాస్తుల ఆహ్వానం

చెన్నై, న్యూస్‌టుడే: యూజీ విద్య కోసం ఉపకారవేతనాలు పొందేందుకు తమిళగ వెట్రి కళగం(టీవీకే) దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. టీవీకే, జేప్పియార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంయుక్తంగా 2026-27 విద్యా సంవత్సరానికి విజయ్ మెరిట్ స్కాలర్‌షిప్ అవార్డు పథకాన్ని ప్రకటించాయి. ప్రతిభావంతులైన విద్యార్థులకు మద్దతు ఇచ్చేలా 2026-27వ ఏడాది ఉపకారవేతనాలు అందించనున్నారు. 12వ తరగతి పరీక్షల్లో 185కుపైగా కటాఫ్ మార్కులు పొందిన విద్యార్థులు, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లోని విజేతలు, యూపీఎస్సీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు, ఉత్తమ క్రీడాకారులు, ఉన్నత విద్యను పొందేవారు, సింగిల్ పేరెంట్ పిల్లలకు ఉపకారవేతనాలు అందించనున్నారు. దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి, దానికి మార్కుల జాబితా నకళ్లను జోడించి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28లోపు సమర్పించాలి. ఇతర వివరాలకు https://forms.gle/Vfvry5Wru4beQ64JA అనే పేజీని సందర్శించవచ్చు.

హైకోర్టు చుట్టుపక్కల రోడ్లపై వ్యాపారం చేయకూడదు

ప్యారిస్: మద్రాసు హైకోర్టు చుట్టుపక్కల ఉన్న రహదారుల వద్ద వ్యాపారం జరగడంలేదని నిర్ధారించాలని కార్పొరేషన్ కమిషనర్‌కు మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. చెన్నై ఎన్ఎస్సీ బోస్ సాలై ప్రాంతంలో రోడ్డు పక్కన దుకాణాలు తొలగించాలని, రహదారిని క్రమబద్ధీకరించాలన్న కేసును న్యాయమూర్తులు జస్టిస్ సురేష్‌కుమార్, జస్టిస్ జగదీశ్ చంద్ర ధర్మాసనం విచారణ జరిపింది. ఎన్ఎస్సీ బోస్ సాలై తదితర నాలుగు రోడ్లను ఆక్రమించుకుని దుకాణాలు నిర్వహిస్తున్నట్లు, లాయర్లు, ప్రజలు ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నట్లు న్యాయమూర్తులకు తెలిపారు. ఎన్ఎస్సీ బోస్‌సాలైలో రోడ్డు పక్కన వ్యాపారులను అనుమతించకూడదని ఇదివరకే హైకోర్టు హెచ్చరించిందని, అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని న్యాయమూర్తులు తెలిపారు. చెన్నై కార్పొరేషన్ అధికారులు నిర్ధారించి నివేదిక దాఖలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. హైకోర్టు చుట్టూ ఉన్న ఇతర రోడ్లలో ఆక్రమణలు తొలగించేందుకు కార్పొరేషన్, పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని, ఈ నాలుగు రోడ్ల వద్ద వ్యాపారం చేయకూడదని తెలిపి విచారణ జనవరి 7కి వాయిదా వేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

కలెక్టరేట్‌లో కొత్త సమావేశ మందిరం ప్రారంభం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు కలెక్టరు కార్యాలయంలో 1996లో నిర్మించిన సమావేశ మందిరం ఉంది. స్థలాభావం కారణంగా అధికారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య పరిష్కారానికి కొత్త హాలు నిర్మించారు. దీన్ని రాష్ట్ర మంత్రి నాజర్ ప్రారంభించారు. ఎమ్మెల్యేలు రాజేంద్రన్, గోవిందరాజన్, కలెక్టర్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని నర్సింగ్ విద్యార్థిని మృతి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా కడంబత్తూరు సమీపం వెన్మనంబుదూరుకు చెందిన హరిత(17) నెమిలిచ్చేరిలోని కళాశాలలో నర్సింగ్ తొలి ఏడాది చదువుతోంది. కడంబత్తూరు రైల్వేస్టేషన్ వద్ద సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటుతుండగా ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తిరువళ్లూరు రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో విద్యార్థిని మృతదేహం లభ్యం

అరక్కోణం, న్యూస్‌టుడే: వాలాజాపేట సమీపంలోని ఎడకుప్పం గ్రామానికి చెందిన రఘురామన్, మీనా దంపతులపెద్ద కుమార్తె సవిత(17) అక్కడి హయ్యర్ సెకండరీ పాఠశాలలో ప్లస్ వన్ చదువుతోంది. శనివారం సెలవు కావడంతో తల్లి మీనాను ఇంటివద్దనే ఉండమని చెప్పి సవిత పశువుల మేపడానికి సమీపంలో ఉన్న పొలానికి వెళ్లింది. సాయంత్రం పశువులు ఇంటికి చేరుకున్నాయి. సవిత రాకపోవడంతో భయాందోళనకు గురైన తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించారు. వ్యవసాయబావిలో సవిత మృతదేహం కనిపించింది. సమాచారం మేరకు వాలాజాపేట పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆత్మహత్యకు పాల్పడిందా లేక మరేదైనా కారణమా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య విద్యార్థినిపై అత్యాచారం

ఆసుపత్రి యజమాని అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: వైద్య విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన డాక్టర్‌ని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నై కొడుంగైయూర్‌కి చెందిన విద్యార్థిని చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్య కళాశాలలో ఫిజియోథెరపీ నాలుగో ఏడాది చదువుతోంది. పెరంబూర్‌లో ఉన్న ప్రముఖ ఆస్పత్రిలో శిక్షణ తీసుకుంటోంది. ఆస్పత్రి యజమాని అయిన డాక్టర్ కార్తికేయన్ తనపై అత్యాచారం చేసినట్లు పోలీసులకి ఫిర్యాదు చేసింది. ఆయన ఫోన్ చేసి ఓ రోగికి చికిత్స అందించాలని కారులో కొళత్తూర్‌లో ఉన్న అపార్ట్‌మెంట్‌కు తీసుకెళ్లాడని తెలిపింది. కూల్‌డ్రింక్ ఇచ్చాడని, గదిలోకి వెళ్లిన తర్వాత ఏం జరిగిందో తెలియలేదని, కళ్లు తెరిచి చూసేసరికి అత్యాచారం చేసినట్లు తెలిసి భయంతో ఇంటికి వచ్చినట్లు పేర్కొంది. విషయం సోదరితో చెప్పడంతో కుటుంబీకులు ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌తో గొడవపడ్డారని చెప్పింది. కొళత్తూర్ ఆల్ ఉమెన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి కార్తికేయన్‌ను ఆదివారం అరెస్టు చేశారు.

ఖైదీలకు గంజాయి విక్రయించిన జైలుగార్డు సస్పెన్షన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ జిల్లా జైల్లో ఉన్న ఖైదీలకు అక్కడి గార్డు అన్బరసు గంజాయి విక్రయించినట్లు ఫిర్యాదులు అందాయి. మదురై జైలు ఎస్పీ సతీష్‌కుమార్ ఖైదీల వద్ద వివరాలు సేకరించగా నిజమని తేలడంతో అన్బరసును సస్పెండ్ చేశారు.

గంజాయి తరలిస్తున్న నలుగురి అరెస్టు

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపం ఎళావూరులో ఆరంబాక్కం పోలీసులు ఆదివారం వాహన తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 4 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డవ్యక్తులు చెన్నై విల్లివాక్కానికి చెందిన కిషోర్‌కుమార్, శీలన్, నందకుమార్, విగ్నేష్‌గా తేలింది.

హవాలా నగదుతో ఉన్న నలుగురు..

అరెస్టైన నిందితులు

ప్యారిస్: హవాలా నగదుతో ఉన్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై తండయార్‌పేట రైల్వేస్టేషన్ వద్ద శనివారం పోలీసులు గస్తీ చేపట్టారు. అనుమానంతో నలుగురు వ్యక్తులు వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో నగదు ఉన్నట్లు గుర్తించారు. నగదుకి సంబంధించిన పత్రాలు లేకపోవడంతో రూ.70 లక్షల నగదు, 108 గ్రాముల బంగారం, కిలో వెండిని స్వాధీనం చేసుకున్నారు. వాటిని తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ నెల్లూరుకు చెందిన వెంకట సురేష్‌బాబు, పొన్నూరు వెంకట కమల్, దుర్గి గోపి కిషోర్, ఫసియుల్లా ఖాన్‌లను అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు.

హిందూ మున్నని కార్యకర్తలు..

రెడ్‌హిల్స్: తిరుప్పరంకుండ్రంలోని దీపస్తంభంపై దీపం వెలిగించాలనే డిమాండుతో హిందూ మున్నని కార్యకర్త పూర్ణచంద్రన్ కొద్దిరోజుల కిందట ఆత్మాహుతికి పాల్పడ్డాడు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ తిరువళ్లూరులో కార్యకర్తలు ఆదివారం మోక్ష దీపం వెలిగించేందుకు యత్నించారు. జిల్లా అధ్యక్షుడు వినోద్‌తోఖన్నా సహా 50 మందికి పైగా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు.

బంగారు గొలుసు దోపిడీ

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు సమీపంలో వృద్ధురాలిపై దొంగ దాడి చేసి గొలుసు లాక్కెళ్లిపోయారు. ఒడుకత్తూరు పుదుమనై ప్రాంతానికి చెందిన దేవరాజ్ భార్య మురుగమ్మాళ్(65), అదే ప్రాంతానికి చెందిన ఫిలోమినా(54) ఆదివారం తెల్లవారుజామున 5.30 ప్రాంతంలో ఉదయపు నడకకు బయల్దేరారు. ఓ యువకుడు మురుగమ్మాళ్ తలపై కర్రతో దాడిచేసి మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు లాక్కెళ్లిపోయారు. ఫిలోమినా బిగ్గరగా కేకలు వేయడంతో దొంగ ఆమె తలపైనా కర్రతో బాదాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు వృద్ధురాళ్లను అక్కడున్న వారు ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పల్లికొండ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లారీ డ్రైవర్‌కు గుండెనొప్పి

నాలుగు కార్లను ఢీకొన్న వాహనం

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: డ్రైవర్‌కు అకస్మాత్తుగా గుండెనొప్పి రావడంతో లారీ అదుపుతప్పి నాలుగు కార్లను ఢీకొంది. లారీ డ్రైవర్ మృతిచెందాడు. కోయంబత్తూరు పేరూర్‌కి చెందిన కుమార్ లారీ డ్రైవర్‌గా, ఇళైయరసు క్లీనర్‌గా పని చేస్తున్నారు. ఇద్దరూ శరవణంపట్టిలోని ప్రైవేటు కంపెనీకి శనివారం రాత్రి లారీలో సిలికాలోడు తీసుకెళ్లారు. అక్కడి నుంచి తుడియలూరు- శరవణంపట్టి రోడ్డు జంక్షన్‌లో వస్తుండగా కుమార్‌కు హఠాత్తుగా గుండెనొప్పి వచ్చింది. వాహనాన్ని అదుపు చేయలేకపోవడంతో ఎదురుగా వస్తున్న నాలుగు కార్లను ఢీకొంది. క్లీనర్ ఇళైయరసు బ్రేక్ వేసి రోడ్డు మధ్యలో లారీని ఆపేశాడు. ప్రమాదంలో ఎవరికీ గాయాలవలేదు. గాంధీపురం ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని రవాణాకు అంతరాయం లేకుండా సరి చేశారు. డ్రైవర్ కుమార్‌ను కోయంబత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

ప్రయాణికురాలిని నిర్బంధించిన బస్సు సిబ్బంది

వేలూరు, న్యూస్‌టుడే: బస్సు అద్దం పగిలిపోవటానికి మహిళా ప్రయాణికురాలు కారణమని డ్రైవర్, కండక్టర్ నిర్బంధించిన ఘటన తిరుపత్తూరు జిల్లాలో చోటుచేసుకుంది. కర్ణాటకలోని బెంగుళూరుకు చెందిన 36 ఏళ్ల మహిళ, భర్తతో కలిసి మేల్‌మలయనూరు, తిరువణ్ణామలై ఆలయాలు దర్శించుకుని తిరుపత్తూరుకు వెళ్లేందుకు ప్రభుత్వ బస్సు ఎక్కారు. బస్సు కుదుపులతో కిటికీ అద్దం ఊడి కిందపడి ముక్కలైంది. అందుకు కారణంగా సదరు మహిళే అంటూ డ్రైవర్ నందికేశ్వన్, కండక్టర్ జయచంద్రన్ నిందించి దుర్భాషలాడారు. బస్సు తిరుపత్తూరు బస్టాండ్‌కు చేరుకోగా మహిళను కిందకు దిగకుండా అడ్డుకొన్నారు. మహిళ భర్త బస్సు ఎదుట బైఠాయించడంతో ప్రయాణికులు డ్రైవర్, కండక్టర్‌ను నిలదీశారు. డ్రైవర్, కండక్టర్ తిరుపత్తూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు అక్కడికి చేరుకుని విచారణ జరిపారు. మహిళ, ఆమె భర్తను శాంతింపజేసి అక్కడి నుంచి పంపించేశారు.

పుస్తక ప్రదర్శనలో దేవాదాయ శాఖ స్టాల్

ఆకట్టుకొంటున్న దేవాదాయ శాఖ స్టాల్

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం కలెక్టరేట్ ప్రాంగణంలోని అన్నా పోలీస్ మైదానంలో 4వ వార్షిక పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. జిల్లా యంత్రాంగం, దక్షిణ భారత పుస్తక విక్రయ, ప్రచురణకర్తల సంఘం సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రదర్శనలో సుమారు వంద స్టాళ్లు ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ కాంచీపురం జోన్ కార్యాలయం తరఫున ఏర్పాటు చేసిన స్టాల్‌లో వివిధ ఆలయాల్లో మహా కుంభాభిషేక వివరాలతో పాటు దేవతా విగ్రహాలు, ఏకాంబరనాథర్ ఆలయం, స్వర్ణరథం నమూనా ఆకట్టుకొంటున్నాయి.

ఆన్‌లైన్ వర్తకం పేరిట మోసం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ వర్తకం పేరుతో రూ.కోట్లు మోసానికి పాల్పడిన కేసులో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. ఏఐతో రూపొందించిన కేంద్ర ఆర్థిక మంత్రి మాట్లాడుతున్న వీడియోను ఫేస్‌బుక్‌లో చూసి చెన్నై అడయారుకు చెందిన టీఏ శేఖర్ నకిలీ ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్‌లలో గత అక్టోబరు నుంచి డిసెంబరు 9 వరకు రూ.2.11 కోట్లను మోసగాళ్ల బ్యాంకు ఖాతాలకు పంపాడు. ఇంకా నగదు పంపాలని బెదిరించడంతో బ్యాంకులో లేదని, చేతిలో ఉందని చెప్పాడు. రూ.25 లక్షలను తాము పంపే వ్యక్తికి ఇవ్వాలని మోసగాళ్లు చెప్పారు. అనుమానం వచ్చిన శేఖర్ ఫిర్యాదు చేయడంతో చెన్నై సెంట్రల్ క్రైం బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేశారు. శేఖర్ వద్ద డబ్బు తీసుకోవడానికి వచ్చిన రాహుల్ రాజ్ పురోహిత్‌ను అదుపులోకి తీసుకున్నారు. తనకు ఏమీ తెలియదని తండ్రి పృథ్వీ రాజ్ పురోహిత్ చెప్పడంతో నగదు తీసుకోవడానికి వచ్చినట్లు చెప్పాడు. అనంతరం పృథ్వీరాజ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సైబర్ మోసగాళ్ల సూచనల మేరకు వారి చెప్పిన వ్యక్తుల నుంచి నగదు తీసుకొని, ముంబయిలో ఉన్న ముఠాకి పంపేవాడని తెలిసింది. కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు.

అరెస్టైన పృథ్వీరాజ్ పురోహిత్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

సినీ గీతాలు ఆలపిస్తున్న ఆర్పీ పట్నాయక్, సునీత, ఉష, గీతామాధురి, సాకేత్, వాగ్దేవి, రేవంత్ తదితరులు, వేయి శుభములు కలుగు నీకు సీరియల్ నటీమణులు శిల్ప బృందం నృత్యం

ఆనంద హేలాపురి

- మైమరిచి చిందేసిన జనం
- అంబరాన్నంటిన ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు

ఈనాడు డిజిటల్, భీమవరం, ఏలూరు రూరల్, న్యూస్‌టుడే: మనసులను మైమరపించిన పాటలతో.. తనువును ఊపేసిన నృత్యాలతో.. రంగు రంగుల దీపాల కాంతుల్లో.. హేలాపురి వాసులు ఆనంద డోలికల్లో మునిగారు. సంక్రాంతి సంబరాలు పది రోజులు ముందుగానే మొదలయ్యాయా అన్నట్లు ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు అంబరాన్ని అంటాయి. ఏలూరు నరసింహరావుపేటలోని ఇండోర్ స్టేడియంలో ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ సౌజన్యంతో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ వేడుకలు ఆద్యంతం అలరించాయి. ప్రాంగణమంతా రంగురంగుల విద్యుత్తు వెలుగులతో కొత్త శోభను సంతరించుకుంది. వారాంతం కావడంతో అంతా కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. వినోదానికి ఏలూరు సిద్ధమా అంటూ వ్యాఖ్యతలు రవి, అశు హుషారుగా కార్యక్రమాన్ని ప్రారంభించగా ప్రముఖ గాయకులు ఆర్పీ పట్నాయక్, ఉషా, సునీత, గీతా మాధురి, సాకేత్, వాగ్దేవి, ఇండియన్ ఐడల్ రేవంత్ ఆలపించిన గీతాలు ప్రేక్షకులను కేరింతలు కొట్టించాయి. వయసుతో సంబంధం లేకుండా గాయనీ గాయకుల పాటలకు పదం కలపడంతో పాటు పైకిలేచి స్టెప్పులేశారు. వెయ్యి శుభములు కలుగు నీకు సీరియల్ నటులు శిల్పా చక్రవర్తి, సంయుక్త, జ్యోతి, మౌనిక, జబర్దస్త్ యాంకర్లు మానస్, కావ్య డ్యాన్సులతో అలరించారు. కార్యక్రమం అనంతరం బాణసంచా కాల్పులు మిరుమిట్లు గొలిపాయి. కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిశోర్ హాజరయ్యారు.

✦ ఈటీవీ ప్రసారాలను 30 ఏళ్లుగా ప్రజల గుండెల్లోకి చేర్చి, ఈటీవీతో ప్రయాణిస్తున్న ఎంఎస్‌వో, కేబుల్ ఆపరేటర్లు యాక్ట్ డిజిటల్, హోం ఎంటర్‌టైన్‌మెంట్స్ మణిశేఖర్, బీసీఎన్ తాడేపల్లిగూడెం కమ్యూనికేషన్స్ కందులపాటి శ్రీనివాసరావులకు జ్ఞాపికలు ఇచ్చి గౌరవించారు.

పిల్లలు, పెద్దల కేరింతలు

పుట్టా సేవలు..

✦ మహేశ్ అన్న పెళ్లి కానుక పేరిట వెనుకబడిన కుటుంబాలకు చెందిన నూతన దంపతులకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. విజయవాడ వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధికి రూ.25లక్షలు వ్యక్తిగత సహాయం అందించారు. ఇతర సేవలను కొనియాడారు.

✦ ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ ఈనాడు 50, ఈటీవీ 30 వార్షికోత్సవం ఏలూరులో నిర్వహించడం చాలా గర్వకారణమన్నారు. ప్రజలకు ఈనాడు, ఈటీవీతో ఎనలేని అనుబంధం ఉందన్నారు.

అందుబాటులో ఉంటా..

కార్యక్రమం మధ్యలో ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ ఏవీ ప్రదర్శించిన సమయంలో ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. కొల్లేరు సమస్య పరిష్కారానికి, యువతకు ఉపాధి కల్పించేలా పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు తమ ఇబ్బందులు చెప్పుకొనేందుకు కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్నామని, దిల్లీలో ఉన్నా వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తీరు వివరించారు. ప్రభుత్వ నిధులు రాబట్టడంతో పాటు సొంత నిధులతో చేపట్టిన అభివృద్ధి గురించి తెలిపారు.

వీవీఐపీలు, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి), ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తదితరులు

బడేటికి తెదేపా జిల్లా పగ్గాలు

ప్రకటించిన పార్టీ అధిష్ఠానం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ జిల్లా పగ్గాలు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికే దక్కాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా లోక్‌సభ నియోజకవర్గ(జిల్లా) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు ఆదివారం ఖరారు చేశారు. జిల్లా అధ్యక్షుడిగా చంటి, ప్రధాన కార్యదర్శిగా చింతలపూడి మాజీ ఏఎంసీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డిని నియమించారు. ఇటీవల ప్రకటించిన తాత్కాలిక జాబితాలో వీరి పేర్లుండగా.. వారినే అధిష్ఠానం ఖరారు చేసింది.

చంటి

సామాజిక వర్గాలకు పెద్దపీట

తెదేపా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపికలో తెదేపా అధినేత చంద్రబాబు ఆయా సామాజిక వర్గాలకు పెద్దపీట వేశారు. ఏలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా తొలిసారిగా విజయం సాధించిన బడేటి చంటి కుటుంబానికి రాజకీయ ప్రాధాన్యముంది. ఆయన తాత బడేటి వెంకట్రామయ్య, తండ్రి బడేటి శ్రీహరిరావు ఏలూరు పురపాలక సంఘం ఛైర్మన్లుగా పనిచేశారు. సోదరుడు బడేటి కోట రామారావు(బుజ్జి) తెదేపా తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన మరణానంతరం బడేటి చంటి ఏలూరు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తూ.. పార్టీ కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ తనదైన శైలిలో ముందుకెళ్తున్నారు.

ఆచితూచి అడుగులు..

జిల్లా ప్రధాన కార్యదర్శి విషయంలోనూ అధిష్ఠానం ఆచితూచి అడుగులేసింది. చింతలపూడి ఏఎంసీ ఛైర్మన్‌గా మూడు సార్లు పని చేసిన జగ్గవరపు ముత్తారెడ్డికి ఆ నియోజకవర్గంలో పట్టుంది. జిల్లాలోని అందరు తెదేపా నాయకులతో సత్సంబంధాలున్నాయి. వీటిని పరిగణనలోకి తీసుకొని ఆయనకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా స్థానం కల్పించారు.

గట్టి పోటీ..

తెదేపా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవులకు గట్టి పోటీ ఎదురైంది. ఇప్పటి వరకు గన్ని వీరాంజనేయులు అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన హయాంలో జిల్లాలో తెదేపాను బలోపేతం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్ చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఈ దఫా కొత్తవారికి అవకాశం ఇవ్వాలని త్రీమెన్ కమిటీ అధిష్ఠానానికి సూచించింది. తదనుగుణంగానే వారికి పదవులు ఖరారు చేసింది.

పిల్లల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం: కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పిల్లల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. స్థానిక జేవీఆర్ నగర్ పరిధిలోని చిట్టిబాబు పల్స్ పోలియో కేంద్రాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు చుక్కల మందు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అనివార్య కారణాలతో పిల్లలకు పోలియో చుక్కలు వేయించలేకపోతే సోమ, మంగళవారాల్లో ఇళ్ల వద్ద వేసేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆమె వెంట డీఎంహెచ్‌వో అమృతం, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న వెట్రిసెల్వి

ముగిసిన టెట్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఆదివారంతో ముగిసింది. చివరి రోజు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో నిర్వహించిన పరీక్షకు 11కి 10 మంది హాజరయ్యారు. ఒకరు గైర్హాజరయ్యారని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

అర్ధనారీశ్వరి.. అభయనేత్రి

ఏలూరు పడమర వీధి గంగానమ్మ జాతర నయనానందకరంగా సాగుతోంది. ఆదివారం మేడ ప్రాంగణంలో అమ్మవారిని అర్ధనారీశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు సారె, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అర్ధనారీశ్వరిని హిజ్రాలు దర్శించుకుని పూజలు చేశారు. **- న్యూస్‌టుడే, ఏలూరు ఆధ్యాత్మికం**

ఉభయ కుశలోపరి!

- పునఃప్రారంభమైన రోడ్డు పనులు
- పూర్తయితే రెండు జిల్లాలకు ఉపయుక్తం

రహదారి: ఏలూరు-పెరికీడు	దూరం: 18.14 కిలోమీటర్లు
పర్యవేక్షణ: ర.భ.శాఖ	అంచనా వ్యయం రూ.58.27 కోట్లు
పనుల ప్రారంభం: 2021 జనవరి	ఉపయుక్తం: ఏలూరు, కృష్ణా జిల్లాల రాకపోకలు

పెరికీడులో సీసీ రోడ్డు నిర్మాణం

పెదపాడు, న్యూస్‌టుడే: ఏలూరు నగర శివారు వంగాయగూడెం నుంచి పెదపాడు మండలం పెరికీడు ర.భ.శా. రహదారి పనులు పునఃప్రారంభమయ్యాయి. వివిధ కారణాలతో ఏళ్లుగా నిలిచిన పనులు వారం రోజుల కిందట మళ్లీ మొదలయ్యాయి. ఇప్పటికే కొత్తూరు నుంచి వంగాయగూడెం వరకున్న గోతులు పూడ్చి రహదారి నిర్మించారు. ఇక పెదపాడు నుంచి పెరికీడు వరకు పలుచోట్ల అసంపూర్తిగా వదిలేసిన సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు.

11 కల్వర్టుల నిర్మాణాలు పూర్తి.. వంగాయగూడెం- పెరికీడు మధ్య మొత్తం 11 కల్వర్టుల నిర్మాణాలు పూర్తి చేశారు. గండిచెరువుగట్టు వద్ద సిమెంటు రోడ్డు నిర్మించారు. పెదపాడు బల్లరేవుతూము కూడలి వద్ద, వసంతవాడ పంచాయతీ అప్పు తలిగింపేట వద్ద ఓ వైపు సీసీ రోడ్డు నిర్మించారు. 'నిర్మాణ స్థలి వరకు చేసిన పనులకు బిల్లులు రాబోతుండటంతో వర్షాకాలం ముందు గుత్తేదారు పనులు నిలిపివేశారు. వారం రోజుల కిందటే పునఃప్రారంభించారు. అసంపూర్తి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాం. త్వరితంగా రహదారి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తాం' అని ర.భ.శా. ఏఈ శేషుకుమార్ తెలిపారు.

అడుగడుగునా అవినీతి..!

వారం వ్యవధిలో అనిశా వలలో ఇద్దరు అధికారులు.. ముగ్గురు రెవెన్యూ సిబ్బంది సస్పెన్షన్

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: అవినీతి దాహానికి సామాన్య ప్రజలు అల్లాడిపోవాల్సి వస్తోంది. ఏ చిన్న పని చేయాలన్నా ఎంతో కొంత ముట్టజెబితే తప్ప కాని అడుగులు ముందుకు పడటం లేదు. కొందరు అధికారులు, సిబ్బంది పని తీరుతో ప్రజలు విసిగెత్తిపోతున్నారు. దొరికితేనే దొంగలుగా లేదంటే దొరలుగా చెలామణి అవుతున్నారు. కొయ్యలగూడెం మండలంలో జరిగిన వారం వ్యవధిలో ఇద్దరు అధికారులు ఏసీబీకి పట్టుబడగా మరో ముగ్గురు రెవెన్యూ సిబ్బంది సస్పెన్షన్‌కు గురయ్యారంటే అవినీతి తాండవం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ముందు వరుసలో రెవెన్యూ శాఖ..

కొయ్యలగూడెం తహసీల్దారు కార్యాలయం పరిధిలో పనులు జరగాలంటే కాళ్లు అరిగేలా తిరగాల్సిందే అన్నట్లు ఉంది. గత కొంత కాలంగా కొందరు సిబ్బంది ముఖ్యంగా రైతులను చాలా ఇబ్బంది పెడుతున్నారనే విమర్శలున్నాయి. సర్వే లోపాలు సరిచేయాలన్నా, పట్టాదారు పాసు పుస్తకం కావాలన్నా ఎంత తడిపితేనే కాని పనులు జరగడం లేదని బహిరంగంగానే విమర్శలు వస్తున్నాయి. జోడిగూడెం వీఆర్వోగా పనిచేసిన ఒక వీఆర్వో ఈ నెల 11న అవినీతి ఆరోపణలపై సస్పెన్షన్‌కు గురయ్యారు. తహసీల్దారు కార్యాలయంలో ఆర్‌ఐగా చేసి ఇటీవలే బదిలీ అయిన మహిళా ఉద్యోగిని, కొయ్యలగూడెం వీఆర్వోను ఈ నెల 19న సస్పెండ్ చేశారు. అవినీతికి పాల్పడి తప్పుడు ధ్రువీకరణ పత్రం ఇచ్చినట్లు గుర్తించి వీరిద్దరినీ విధుల నుంచి తప్పించారు. ఈ కార్యాలయంలో మరో ఉద్యోగి కూడా లంచం లేనిదే పని చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

నీటి సరఫరా విభాగంలో.. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఇద్దరు అధికారులు ఈ నెల 4న ఏసీబీకి చిక్కారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జల జీవన్ మిషన్ పనులు చేసిన గుత్తేదారు నుంచి ఏకంగా ఒకరు రూ. లక్ష, మరొకరు రూ. 50వేలు తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఒక పక్క పనులు వేగంగా, సక్రమంగా జరగకపోగా చేసిన పనులకు లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

యాజమాన్య పద్ధతులే ఆక్వా సాగుకు రక్ష

కలిదిండి, న్యూస్‌టుడే: శీతాకాలంలో రొయ్యలు, చేపల సంరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలని మత్స్యశాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి బి.రాజ్‌కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డి.వరప్రసాద్ రెడ్డి సాగుదారులకు సూచించారు. 'ఈనాడు- మీతోడు' ఆధ్వర్యంలో ఆదివారం శీతాకాలంలో ఆక్వా సాగులో ఎదురయ్యే సమస్యలపై నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో రైతుల సమస్యలకు తగిన పరిష్కారాలు, సూచనలు అందించారు.

? సీడ్ వేసి 45 రోజులైనా ఎదుగుదల లేదు. - **వెంకటేశ్, భైరవపట్నం, కైకలూరు మండలం**

⊙ సీడులో లోపం ప్రధాన కారణం. సీడు కొన్నాక 200 పిల్లలను ఆపా పద్ధతిలో వేసి చెరువులో వదలాలి. మూడు రోజుల్లో 90 శాతం సీడ్ బతికితేనే అది నాణ్యత ఉన్నట్లుగా గుర్తించాలి.

? పది ఎకరాల్లో చేపల చెరువులో తెల్ల చేపల వేత. దీనిలో పీహెచ్ 9.3 వరకు ఉంది. - **సూర్యనారాయణ, భైరవపట్నం, మండవల్లి మండలం**

⊙ నీటి పరీక్షలు చేయించి, అవసరమైతే నీరు మార్పిడి చేయాలి. మందులు వాడి పీహెచ్ 8.56 తీసుకురావచ్చు.

? వ్యాధులతో వరుసగా మూడు పంటలు పోయాయి. మరోసారి వేయాలంటే భయంగా ఉంది. - **పేటేటి ఏడుకొండలు, వదర్లపాడు, కైకలూరు మండలం**

⊙ ఒకసారి వైరస్ సోకిన చెరువులో పట్టుబడి చేసిన తర్వాత బ్లీచింగ్ చల్లి 10 రోజుల తర్వాత ఆ నీటిని బయటకు తోడేయాలి. చెరువు ఎండగట్టిన అనంతరం కొత్త నీటిలో మరో పంట వేసుకోవాలి.

'ఈనాడు ఫోన్‌ఇన్'లో మత్స్యశాఖ జిల్లా అధికారి రాజ్‌కుమార్, శాస్త్రవేత్త వరప్రసాద్ రెడ్డి

రైతుల సమస్యలు వింటున్న రాజ్‌కుమార్, దేవీ వరప్రసాద్ రెడ్డి

? ఎసైన్డ్ భూమిలో రొయ్యల చెరువు చేస్తున్నా. ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే ఏమి చేయాలి? - **కుంభా నాగరాజు, కలిదిండి**

⊙ మత్స్యశాఖ నుంచి సాగుకు అనుమతి తీసుకోవాలి. ట్రాన్స్‌ఫార్మర్‌కు డ్రెయినేజీ శాఖ నుంచి అనుమతి అవసరం.

నేడు ఏలూరుకు మంత్రి సత్యకుమార్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ఏలూరు రానున్నారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక ఆటోనగర్ వద్దనున్న 'అటల్ మోదీ సుపరిపాలన యాత్ర'లో పాల్గొననున్నారు. అనంతరం 6 గంటలకు విజయవాడ బయల్దేరి వెళ్లనున్నారు.

నేత్రపర్వం.. శ్రీవారి ధనుర్మాసోత్సవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ధనుర్మాస ఉత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. తొలుత ఆలయ అర్చకులు, పండితులు స్వామి, అమ్మవార్లను తొళక్కం వాహనంపై కొలువుదీర్చి హారతులు పట్టి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి తిరు వీధుల్లో ఊరేగారు.

కుంకాల జలపాతంలో సందడి

పోలవరం మండలం రెడ్డి కుంకాల గిరిజన గ్రామం సమీపంలో తూర్పుకనుమల కొండల మధ్య జాలువారుతున్న జలపాతం సందర్శకులను ఆకట్టుకుంటోంది. స్థానికులు మేదర కొండగా పిలిచే ప్రాంతంలో ఎగువ నుంచి వచ్చే కొండవాగుల నీరు రాళ్ల మధ్య ప్రవహిస్తూ.. ఎగువ నుంచి కిందకు జారుతోంది. జిల్లెళ్లగూడెం పంచాయతీ పరిధిలోని రెడ్డికుంకాల నుంచి జలపాతం వద్దకు చేరుకోవాలంటే సుమారు 2.5 కి.మీ దూరం కొండల మధ్య.. బండరాళ్ల మధ్య, కొండ అంచున కాలినడకన వెళ్లాల్సిందే. వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రవేశించినా నీటి ఒరవడి ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం**

నేడు యథావిధిగా 'మీ కోసం'

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ'(మీ కోసం) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. మండల, పురపాలక, డివిజనల్ కార్యాలయాల్లోనూ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు.

ధాన్యం సేకరణలో ఎఫ్‌పీవోలు

జిల్లాలో 19 కేంద్రాల అప్పగింత

చింతలపూడి, న్యూస్‌టుడే: రైతు ఉత్పత్తి సంఘాలు (ఎఫ్‌పీవో) ధాన్యం కొనుగోలులో కీలకపాత్ర పోషిస్తున్నాయి. జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన 234 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 19 కేంద్రాలకు సంబంధించిన ధాన్యం సేకరణ బాధ్యతను జిల్లా అధికారులు వాటికి అప్పగించారు. ఎఫ్‌పీవోలుగా ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వం నుంచి సక్రమంగా ప్రోత్సాహం లభించకపోవడంతో ఈ సంఘాలు ఆయా గ్రామాల్లో ఎరువులు, పురుగుమందుల అమ్మకాలు ఇతర వ్యాపారాలను నిర్వహించుకుంటున్నాయి. ఈ ఏడాది కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ బాధ్యతలు ఇవ్వడంతో వీరంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్వింటాకు రూ.30

ఎఫ్‌పీవోలకు కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గోనె సంచుల ఏర్పాటు దగ్గర నుంచి మిల్లులకు లారీల ద్వారా ధాన్యం తరలించే వరకు పూర్తి బాధ్యత వీరిదే. దీనికి సంబంధించి ప్రతి ఆర్‌ఎస్‌కేలో అయిదు నుంచి ఏడుగురు ఎఫ్‌పీవో సభ్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. దీనికి సంబంధించి క్వింటా ధాన్యం తరలింపునకు ఎఫ్‌పీవోకు రూ.30 కమీషన్ రూపంలో ఇస్తోంది.

జిల్లాలో ఖరీఫ్‌లో వరి సాగు:	1,92,085 ఎకరాలు
ధాన్యం ఉత్పత్తి అంచనా	5.74 లక్షల మెట్రిక్ టన్నులు
మొత్తం కొనుగోలు కేంద్రాలు:	234

సేకరణలో భాగస్వాములు..

'ఎఫ్‌పీవోలకు జిల్లాలో 19 కొనుగోలు కేంద్రాలను కేటాయించాం. పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లతో పాటు ఎఫ్‌పీవోలు ధాన్యం సేకరణలో భాగస్వాములయ్యారు.' **- ఎ.శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి, ఏలూరు**

బతుకుదెరువుకెళ్లి.. బతుకుముగిసి!

- ఉప్పుటేరు సమీపంలో వ్యాను బోల్తా
- ఇద్దరు మత్స్యకారుల మృతి.. ముగ్గురి పరిస్థితి విషమం

వారు వేటను నమ్ముకున్నారు..
చేపల పట్టుబడికి వెళ్తుంటారు..
దాన్నే బతుకుదెరువుగా మార్చుకున్నారు..
పని ముగించి..
ఇంటికి బయల్దేరారు..
కానీ, విధి
మరోలా తలచింది..
మృత్యువు దారికాసింది..
ఇద్దరిని బలి తీసుకుంది..
బాధిత కుటుంబాల్లో
విషాదం నింపింది..

రహదారిపై పడి ఉన్న క్షతగాత్రులు

కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండి మండలంలోని ఉప్పుటేరు సమీపంలో మద్వానిగూడెం వద్ద ఆదివారం ఉదయం ప్రమాదం చోటు చేసుకుని రహదారి నెత్తురోడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కలిదిండి మండలం సున్నంపూడి గ్రామానికి చెందిన ఐదుగురు మత్స్యకారులు వ్యానులో కోరుకొల్లు శివారు చైతన్యపురంలో చెరువు పట్టుబడికి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఉప్పుటేరు సమీపంలో మద్వానిగూడెం వద్ద వ్యాను అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఆ సమయంలో వ్యానులో డ్రైవర్ సహా ఐదుగురు మత్స్యకారులు ఉన్నారు. వీరిలో ముగ్గురికి తీవ్రంగా గాయాలు కావడంతో ఇద్దరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన వాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి.

తండ్రి మృతి.. మృత్యువుతో పోరాడుతున్న కొడుకు

ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొల్లి వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి ఆంజనేయులు, తిరుమలశెట్టి వెంకట కృష్ణను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో వెంకటేశ్వరరావు, ఆంజనేయులు ప్రాణాలు కోల్పోయారు. ఆంజనేయులు కుమారుడు వెంకట కృష్ణ ప్రాణాలతో పోరాడుతున్నారు. ఈయన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దుర్ఘటనతో మత్స్యకార గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దీనిపై వెంకటేశ్వరరావు కుమారుడు హిమసాగర్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై కేసు చేసినట్లు ఎస్సై వివరించారు.

నేటి నుంచి ఈనాడు క్రికెట్ పోటీలు ప్రారంభం 6లో
పుష్కర ఏర్పాట్లకు ప్రణాళిక

కొండ గుట్టల్లో కంకర దొంగలు

రాత్రి వేళల్లో గుట్టుగా తవ్వకాలు

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కొండ గుట్టల్లో కంకర దొంగలు పడ్డారు. కొయ్యలగూడెం మండలం ఊట్లగూడెం, మంగపతిదేవిపేట, గంగవరం మెట్ట, బర్కిట్‌నగరం ప్రాంతాల్లో లభించే కంకర మట్టిని రాత్రి వేళల్లో తవ్వి తరలించుకుపోతున్నారు. ఊట్లగూడెం సమీపంలో రెండు రోజులుగా పొక్లెయిన్ సాయంతో తవ్వకాలు సాగిస్తూ.. లారీలతో కొయ్యలగూడెం మీదుగా ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. మట్టి రవాణాకు వీలుగా కొండ అంచును తవ్వి బాటగా చేయడం గమనార్హం. మంగపతిదేవిపేట శివారులో చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టు మట్టిని యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గంగవరం మెట్ట ప్రాంతంలో గ్రావెల్ తవ్వకం రోజువారీ పనిగా మారిపోయింది. ఈ విషయమై తహసీల్దారు ఎన్.నాగరాజు మాట్లాడుతూ.. గ్రావెల్ అక్రమ తవ్వకం, రవాణాపై చర్యలు తీసుకుంటామన్నారు. దాడులు జరిపి వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

ఊట్లగూడెం సమీపంలో మట్టి తవ్వకం జరుగుతున్న ప్రదేశం

కాసుల గలగల!

- ఆర్థిక సంఘం నిధుల విడుదల
- జిల్లాకు రూ.33.21 కోట్ల కేటాయింపు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆర్థిక సంఘం నిధులు గ్రామాల అభివృద్ధికి దన్నుగా నిలుస్తాయి. గత వైకాపా ప్రభుత్వం ఈ నిధులను దఫదఫాలుగా దారి మళ్లించి గ్రామీణ ప్రగతికి పాతరేసింది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక.. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పైసాను పూర్తిగా పంచాయతీలకే అందజేస్తోంది. తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం తొలి విడత నిధుల్ని పంచాయతీలకు మంజూరు చేసింది. ఏ పంచాయతీకి ఎంత కేటాయించారన్న వివరాల్ని తాజాగా వెల్లడించింది. ఈ నిధుల్ని పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తోంది.

544 పంచాయతీల ఖాతాల్లో..

జిల్లాలోని మొత్తం 544 పంచాయతీల ఖాతాల్లో రూ.33.21 కోట్లు జమ చేశారు. వీటిలో అన్ టైడ్ నిధులను విద్యుత్తు ఛార్జీలు, ఎల్ఈడీ దీపాల నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణం, శ్మశానవాటికల అభివృద్ధి, ఇతర అవసరాలకు వినియోగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టైడ్ నిధులు 50 శాతం పారిశుద్ధ్యం, మిగతా 50 శాతం తాగునీటి అవసరాలకు వెచ్చించాలని స్పష్టం చేసింది. ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత ఊపందుకునే అవకాశముంది. 'ఆర్థిక సంఘం నిధుల్ని పంచాయతీ ఖాతాలకు జమ చేస్తున్నాం. ఈ నిధుల వెచ్చింపులో సర్పంచులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి' అని జిల్లా పంచాయతీ అధికారిణి కె.అనురాధ పేర్కొన్నారు.

జిల్లాకు కేటాయింపు ఇలా(రూ.కోట్లలో)	పంచాయతీలు	మంజూరైన నిధులు	టైడ్ / అన్ టైడ్
	544	33.21	టైడ్: 19.92, అన్ టైడ్ నిధి: 3.28

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

నేటి నుంచి ఈనాడు క్రికెట్ పోటీలు ప్రారంభం

కళాశాలల ఆటగాళ్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'దానిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ప్రజెంట్స్, ఈనాడు స్పోర్ట్స్ లీగ్ 2025' క్రికెట్ పోటీలు జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఏలూరులో ఆశ్రం మెడికల్ కళాశాల, భీమవరంలో ఎస్.ఆర్.కె.ఆర్. కళాశాలల్లో జరుగుతాయి.

మ్యాచ్‌ల వివరాలు

22-12-2025 (సోమవారం) ఆశ్రం మెడికల్ కాలేజ్, ఏలూరు గ్రౌండ్‌లో
- **ఉదయం 9 గం॥లకు:** హేలాపురి ఇంజినీరింగ్ కాలేజ్, ఏలూరు X ఆశ్రం మెడికల్ కాలేజ్, ఏలూరు
- **మధ్యాహ్నం 1 గం॥లకు:** ఐఐఐటీ, నూజివీడు X ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ కాలేజ్, ఆగిరిపల్లి

23-12-2025 (మంగళవారం) ఆశ్రం మెడికల్ కాలేజ్, ఏలూరు గ్రౌండ్‌లో
- **ఉదయం 8 గం॥లకు:** హేలాపురి జూనియర్ కాలేజ్, ఏలూరు X గవర్నమెంట్ జూనియర్ కాలేజ్, ఏలూరు
- **ఉదయం 11.00 గం॥లకు:** ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఏలూరు X సీఆర్ఆర్ డిగ్రీ కాలేజ్, ఏలూరు
- **మధ్యాహ్నం 2 గం॥లకు:** సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్, ఏలూరు X సీఎస్‌టీఎస్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, జంగారెడ్డిగూడెం

22-12-2025 (సోమవారం) ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం గ్రౌండ్‌లో
- **ఉదయం 8 గం॥లకు:** డి.ఎన్.ఆర్. ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం X శశి ఇంజినీరింగ్ కాలేజ్, తాడేపల్లిగూడెం
- **ఉదయం 11.00 గం॥లకు:** స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కాలేజ్, నరసాపురం X బి.వి.ఆర్. డిగ్రీ కాలేజ్, భీమవరం
- **మధ్యాహ్నం 2 గం॥లకు:** ఆదిత్య డిగ్రీ కాలేజ్, పాలకొల్లు X శ్రీవాసవి ఇంజినీరింగ్ కాలేజ్, తాడేపల్లిగూడెం

23-12-2025 (మంగళవారం) ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం గ్రౌండ్‌లో
- **ఉదయం 8 గం॥లకు:** ఎ.ఎస్.ఎన్.ఎం. డిగ్రీ కాలేజ్, పాలకొల్లు X విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం
- **ఉదయం 11.00 గం॥లకు:** బి.ఆర్.ఆర్. & జి.కె.ఆర్. ఛాంబర్ డిగ్రీ కాలేజ్, పాలకొల్లు X ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం
- **మధ్యాహ్నం 2 గం॥లకు:** భీమవరం ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం X ఎస్.వి.కె.పి. & కె.ఎస్.రాజు డిగ్రీ కాలేజ్, పెనుగొండ

ఈనాడు-50, ఈటీవీ-30 వసంతాల వేడుకలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ చేతుల మీదుగా జ్ఞాపికలు స్వీకరిస్తున్న స్పాన్సర్లు

స్పాన్సర్లకు సత్కారం

ఈనాడు డిజిటల్, భీమవరం, ఏలూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుక ఏలూరు నరసింహారావుపేటలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పాన్సర్లను సత్కరించారు. స్పాన్సర్లు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఏలూరు మేనేజర్ హరీశ్; ప్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ (హైదరాబాద్) మార్కెటింగ్ ఇన్‌ఛార్జ్ వెంకటేశ్, ఏరియా సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉదయ్‌కుమార్, తెనాలి డబుల్ హార్స్ గ్రూపు పశ్చిమ గోదావరి జిల్లా సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఎస్.అప్పన్న, పావని; అంబికా దర్బార్ బత్తి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అంబికా అగర బత్తి మ్యానిఫ్యాక్చర్స్ ప్రెసిడెంట్ అంబికా రామాంజనేయులు, అంబికా రామచంద్రరావు; మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ కోనరాజు రవీంద్రనాథ్; శ్రీలలిత రైస్ ఏలూరు డిస్ట్రిబ్యూటర్ వెంకటరత్నం, మల్లేశ్వర ట్రేడర్స్ దివాకర్; వేగా జ్యూయలర్స్ డైరెక్టర్ సీహెచ్. హేమకుమార్, సీహెచ్. మాధవి; దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కె.రాజశేఖర్‌రావు, ఆల్టోస్ కూల్ డ్రింక్స్ ఏలూరు డీలర్ రవికుమార్, శశి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ ఏలూరు క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మేకా కిశోర్, ఆశ్రమ్ హాస్పిటల్స్ ఏలూరు సీఈఓ డాక్టర్ హనుమంతరావు; నంద గోకుల్ మీ మేనేజింగ్ పార్టనర్ మాసపల్లి శేఖర్; మన వీబీజీ యూనివర్సిటీ గుంటూరు ప్రతినిధి వై.వి.ఎస్.సురేశ్; పిజీఏమ్ ఏలూరు డిస్ట్రిబ్యూటర్, శ్రీ బాలాజీ ఫార్మా స్యూటికల్స్ గుట్ట రవిచంద్రలకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఎస్పీ కె.ప్రతాప్‌శివకిశోర్ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: చింతలపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యాన సీనియర్ పురుషులు, అంతర జిల్లా మహిళల కబడ్డీ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26న కర్నూలు వేదికగా నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, రంగారావు తెలిపారు. నూజివీడు డీవైఈవో సుధాకర్, విశ్రాంత వ్యాయామోపాధ్యాయులు మరడాని అచ్యుతరావు, ఎ.గిరిరాజు తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో జంగారెడ్డిగూడెం విద్యార్థుల ప్రతిభ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో తణుకులో ఆదివారం జరిగిన అండర్-19 చదరంగం పోటీల్లో జంగారెడ్డిగూడెం క్రీడాకారులు ఎం.కుషాంక్ శ్రీవిశ్వ, బి.చైతన్య శ్రీకర్ ప్రతిభ చూపారు. ఎం.కుషాంక్ శ్రీవిశ్వ ప్రథమ స్థానంలో, చైతన్య శ్రీకర్ ద్వితీయ స్థానంలో నిలిచారని కోచ్‌లు అయినపర్తి సరళామాధవి, చంద్రశేఖర్ తెలిపారు. ఇక్కడ చూపిన ప్రతిభతో వీరు విశాఖలో జరగనున్న అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారన్నారు.

ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కుషాంక్ శ్రీవిశ్వ, చైతన్య శ్రీకర్

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్యాలను అలవర్చుకోవాలని ట్రిపుల్ ఐటీ క్యాంపస్ సంచాలకుడు డా.అమరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం నూజివీడు ట్రిపుల్ ఐటీ లిటరరీ క్లబ్ ఆధ్వర్యంలో భక్తి వేదాంత వారి సహకారంతో ఏఐ మీద సెమినార్ నిర్వహించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన అఖిలేశ్వరికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన షేక్ హసియాకు రూ.3 వేలు, తృతీయ స్థానం సాధించిన హర్షవర్ధన్‌కు రూ.2 వేలు నగదును క్యాంపస్ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ భక్తి వేదాంత సంచాలకుడు డా.రామ్‌గోపాల్ చేతుల మీదుగా అందించారు. లిటరరీ క్లబ్ సహకారంతో నిర్వహించిన ఈ సెమినార్ విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న అధ్యాపకులు

సనాతన ధర్మం.. హైందవుల ప్రాణం

ఉండి, న్యూస్‌టుడే: యుగయుగాల నుంచి హైందవులకు ప్రాణం సనాతన ధర్మం అని.. దాన్ని చిరస్థాయిగా నిలుపుకొనేందుకు అందరూ ఐక్యమవ్వాలని, కుంభమేళాలు, పుష్కరాల మాదిరిగా హిందూ సమ్మేళనాలు విజయవంతం చేసేందుకు తరలిరావాలని పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) పిలుపునిచ్చారు. ఉండి శ్రీరామక్షేత్ర ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనానికి వేల సంఖ్యలో భక్తులు తరలొచ్చారు. నిర్వహణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు ద్వారంపూడి నారాయణరెడ్డి, నల్లా సత్య కృష్ణ కిరణ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభను ప్రజ్ఞానంద సరస్వతి ప్రారంభించి అనంతరం భక్తులకు మార్గదర్శనం చేశారు. శ్రీక్షేత్రంలో ధ్వజ స్తంభానికి ఉన్న వయసు ఏమతానికి లేదన్నారు. కలియుగంలో మానవరూపంలో దేవుడి సహాయం, సహకారాలు అందరికీ అందుతాయన్నారు. ఐటీపీఏ నిర్వహించిన కుంభమేళాకు 60 కోట్ల మంది భక్తులు పాల్గొనడమంటే హిందూ ధర్మ శక్తికి నిదర్శనమన్నారు. ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ్ సంఘ్ చాలక్ మంతెన రామరాజు ప్రజలు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో 70 చోట్ల హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్వహణ సమితి ముఖ్య కార్యకర్తలు చలపతిరావు, సింగరాజు, వెంకయ్య, సత్యానంద్ తదితరులు మాట్లాడారు.

జ్యోతి వెలిగిస్తున్న ప్రజ్ఞానంద సరస్వతి

పుష్కర ఏర్పాట్లకు ప్రణాళిక

మంత్రి ఆనం వెల్లడి

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: గోదావరి పుష్కరాలకు చేయాల్సిన ఏర్పాట్లపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి ఆయన పెనుగొండ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో చేయాల్సిన అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని శాఖల అధికారులు, కమిషనర్లకు ఆదేశాలిచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశారని, త్వరలోనే సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. అన్ని ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాల కోసం ఇచ్చే మొత్తం గతంలో రూ. 2 వేల నుంచి రూ.5 వేలు ఉండగా ఇప్పుడు రూ.10 వేలు ఇస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో 26 జిల్లాల్లోని ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధి పనులకు ఆదివారం నుంచి శ్రీకారం చుట్టామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 18 ఆలయాలకు రూ.23.13 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం సిద్ధాంతంలో పుష్కరఘాట్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. దేవాదాయశాఖ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలిస్తున్న రామనారాయణరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పితాని

జీరాంజీ బిల్లుతో ఒరిగేదేమీ లేదు: సీపీఎం

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీరాంజీ బిల్లుతో పేదలకు ఒరిగేదేమీ లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరాం ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నాయకులతో సమావేశమయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. బలరాం మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ పథకంలో గతంలో గ్రామీణ ప్రాంత పేదలకు వంద రోజులపాటు పని లభించేదని.. మిగతా రోజులు వ్యవసాయ పనులకు వెళ్లేవారని చెప్పారు. గతంలో కేంద్రం 90 శాతం, రాష్ట్రానికి 10 శాతం వాటాగా నిధులు కేటాయించేవారన్నారు. ప్రస్తుత జీరాంజీ బిల్లులో నిధుల కేటాయింపు 60:40గా మార్చారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. నాయకులు ఎ.రవి, డీఎన్‌వీడీ ప్రసాద్, రామకృష్ణ, నాగమణి, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల గోవింద నామస్మరణలు, పండితుల వేద మంత్రోచ్చారణలతో మారుమోగింది. సెలవు రోజు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా వచ్చి స్వామిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

నేడు జిల్లా స్థాయి సైన్స్ పోటీలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సుబ్బమ్మదేవి పాఠశాలలో సోమవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సైన్స్ పోటీలు నిర్వహించనున్నారు. మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో తమ సైన్స్ నమూనాలు ప్రదర్శించనున్నారు. మొత్తం ఏడు అంశాల్లో 'రాష్ట్రీయ బాల వైజ్ఞానిక' పేరుతో నిర్వహిస్తున్న పోటీల్లో విద్యార్థులు బృందాల వారీగా పాల్గొననున్నారు. ఇక్కడ గెలుపొందిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించనున్నారు. జిల్లా సైన్స్ పోటీలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి సోమయాజులు తెలిపారు.

పర్యాటక గృహాల వద్ద బయో టాయిలెట్లు

పోలవరం, న్యూస్‌టుడే: పాపికొండల అభయారణ్యంలో కొరుటూరులో పర్యాటకుల కోసం వెదురు కర్రలతో నిర్మించిన అతిథి గృహాల వద్ద బయో టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పోలవరం అటవీ శాఖాధికారి ఎస్కే వలీ చెప్పారు. రూ.60 వేల చొప్పున నాలుగు తీసుకొస్తున్నామన్నారు. ఇందులో ఒకటి నదిపై తిరిగే బోటులో, మరో మూడు బ్యాంబూ కాటేజ్‌ల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం పోలవరం అటవీశాఖ కార్యాలయానికి చేరుకున్నాయని, త్వరలో కొరుటూరు తరలిస్తామని వెల్లడించారు.

శతాధిక వృద్ధుడు మృతి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండలం చేవూరుకు చెందిన శతాధిక వృద్ధుడు వల్లభనేని మాధవరావు(103) మృతి గ్రామంలో విషాద ఛాయలను నింపింది. 1959-64లో గ్రామానికి మొదటి సర్పంచిగా ఎన్నికై గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా, జడ్పీ మాజీ ఛైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావుకు ముఖ్య అనుచరుడిగా, చేవూరు కోపరేటివ్ బ్యాంక్ వ్యవస్థాపకుడిగా, చేవూరు కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడిగా తనకంటూ ప్రత్యేక ముద్ర వేశారు. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మనవలు, మనవరాళ్లు, ముని మనవళ్లతో పెద్ద కుటుంబాన్ని కలిగి ఉన్నారు. పెద్ద దిక్కు మృతితో కుటుంబంతోపాటు గ్రామస్థులు శోకసంద్రంలో మునిగారు.

మాధవరావు (పాతచిత్రం)

వినోదం మాటున జూదం

- శిబిరంపై పోలీసుల మెరుపు దాడి
- పెద్ద సంఖ్యలో జూదరుల అరెస్టు
- పలువురు ప్రముఖులు ఉన్నట్లు సమాచారం

ఆ ప్రాంతంలో నిలిపిన కార్లు

నూజివీడు, న్యూస్‌టుడే: వినోదం మాటున నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం రాత్రి పోలీసు బృందాలు మెరుపు దాడులు నిర్వహించాయి. ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడులోని మ్యాంగో బే రిక్రియేషన్ సొసైటీలో నిర్వహిస్తున్న భారీ జూదాలపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. మ్యాంగో బే రిక్రియేషన్ సొసైటీ పేరుతో 2011లో రిక్రియేషన్ క్లబ్ ప్రారంభించారు. అక్కడ జూదాలు జరుగుతున్నాయనే ఆరోపణలతో 2014లో క్లబ్ మూతపడింది. ఇటీవల ఈ సొసైటీ సభ్యులు కోర్టును ఆశ్రయించి 13 ముక్కల ఆటకు అనుమతి తెచ్చుకున్నారు. ఈ ప్రాంతంలో జూదం నిర్వహించడం ద్వారా యువత భవిత నాశనం అవుతుందని ఈ సొసైటీ గేటు వద్ద ఇటీవల పలువురు యువకులు నిరసన తెలిపారు. అయితే ఈ ప్రాంతంలో భారీ ఎత్తున జూదాలు నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఆదివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. నూజివీడు డీఎస్పీ కెవీవీఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ.. హైకోర్టు నుంచి అన్ని అనుమతులు ఉన్నాయంటూ... నిర్వాహకులు తప్పుడు ప్రచారం చేస్తూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున జూదరులను రప్పించి భారీ జూదాలకు తెరతీశారని అన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జూదరులు ఖరీదైనా కార్లలో ఇక్కడకు రావడం గుర్తించారు. ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ క్రమంలో రాత్రి 10 గంటల వరకు రూ.18 లక్షల వరకు నగదు ఉన్నట్లు గుర్తించామని, ఇంకా పూర్తిగా లెక్కించాల్సి ఉందని అన్నారు. దాడులు నిర్వహించే సమయంలో సుమారు 150 మంది వరకు జూదం ఆడుతున్నట్లు గుర్తించారు. 120పైగా కార్లు, 50 వరకు ద్విచక్ర వాహనాలు ఆ ప్రాంతంలో ఉన్నాయని చెప్పారు. పంచనామా పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ దాడుల్లో పలువురు బడా బాబులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, 70 మంది పోలీసు సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ ప్రసాద్

ఏలూరులో 'గుర్రం పాపిరెడ్డి' బృందం సందడి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగరంలో గుర్రం పాపిరెడ్డి చిత్ర బృందం ఆదివారం సందడి చేసింది. స్థానికంగా సినిమా ప్రదర్శిస్తున్న విజయలక్ష్మి థియేటర్‌కు వెళ్లి ప్రేక్షకులను పలకరించారు. ఈ సందర్భంగా కథానాయిక ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ.. గుర్రం పాపిరెడ్డి సినిమాకు మంచి ప్రేక్షక ఆదరణ లభిస్తోందన్నారు. బ్రహ్మానందం, యోగిబాబు హాస్యం చిత్రానికి ప్రధాన బలంగా నిలిచిందన్నారు. దర్శకుడు మురళీమనోహర్, నిర్మాత వేణు సద్ధి, హాస్యనటుడు జీవన్ తదితరులు పాల్గొన్నారు. పడమరవీధి జాతర సందర్భంగా.. గంగానమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

నేటి నుంచి అతిరుద్ర మహా యజ్ఞం

నిడమర్రు, న్యూస్‌టుడే: మందలపర్రు ఉమానీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో సోమవారం అతిరుద్ర మహా యజ్ఞం ప్రారంభం కానుంది. ఈ నెల 29 వరకూ కొనసాగనుంది. బ్రహ్మశ్రీ వెంకట చాగంటి(యూఎస్ఏ) ఆశీస్సులతో అక్కిన ప్రగడ రాఘవేంద్రశర్మ దంపతులు(ఇంగ్లాండు) ఆర్థిక సహకారంతో పూడిపెద్ది నరసింహశర్మ బ్రహ్మత్వంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు యజ్ఞ గుండాలు సిద్ధం చేశారు. మహా యజ్ఞం పూర్తయ్యే వరకూ రోజూ భక్తులకు అన్నప్రసాద వినియోగం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సుపరిపాలన యాత్ర విజయవంతానికి పిలుపు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగరంలో సోమవారం నిర్వహిస్తున్న అటల్ మోదీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేయాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి పిలుపునిచ్చారు. స్థానిక ఆశ్రం కూడలిలో వాజ్‌పేయీ కాంస్య విగ్రహావిష్కరణ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. తమిళనాడుకు చెందిన భాజపా నేత అన్నామలై, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరై బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్, నాయకులు కట్నేని కృష్ణప్రసాద్, నిర్మల కిశోర్, సుధాకర్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీతారామాంజనేయ చౌదరి

రెచ్చగొట్టే వ్యాఖ్యలతో వైకాపా ఫ్లెక్సీ

ఏడుగురిపై కేసు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: గ్రామంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా ద్వారకాతిరుమల మండలం రామసింగవరం అంబేడ్కర్ సెంటర్‌లో '2029లో 88 మ్యాజిక్ ఫిగర్ దాటగానే గంగమ్మ జాతరలో వేట తలలు నరికినట్లు రప్పా రప్పా నరుకుతాం ఒక్కొక్కడిని' అని రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కూడిన ఫ్లెక్సీని గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. 'గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు.. తీసేయండి.' అని తెదేపా నేతలు రమణ, రాజు, దొప్పసాని బాబూరావు ఫ్లెక్సీ ఏర్పాటు చేసినవారిని అడిగారు. 'తీయమంటే ఫ్లెక్సీలో ఉన్నది నిజం చేస్తాం.' అని వారు బెదిరించారు. దీంతో దొప్పసాని బాబూరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన బిరుదు గడ్డ రాజు, మానుకొండ రాజ్‌కుమార్, కనికెళ్ల రవికిశోర్, మద్దాల దిలీప్‌కుమార్, మానుకొండ హిమకుమార్, కుండ శ్యాంబాబులపై, అలాగే ఫ్లెక్సీ తయారు చేసిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232, చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, 159, 170 చికెన్ విత్ స్కిన్ - 290 చికెన్ స్కిన్‌లెస్ - 300.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించొద్దు: ఏఎస్పీ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని, వాటిని ఎవరూ ఉల్లంఘించొద్దని ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. స్థానిక క్రాస్ రోడ్స్ ట్రాఫిక్ పార్కు ఆధునికీకరణలో భాగంగా ఆదివారం ట్రాం పోలిన్ జంప్‌ను ఆయన ప్రారంభించారు. పార్కులో సిగ్నల్స్, రోడ్డు మార్కింగ్స్, ట్రాఫిక్ రూల్స్ బోర్డులు ఏర్పాటు చేశారు. విజ్ఞానమే కాకుండా బాలలు ఉల్లాసంగా గడిపేందుకు ఈ పార్కు దోహదపడుతుందని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ శ్రావణ్‌కుమార్, సీఐ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

ట్రాం పోలిన్ జంప్‌ను ప్రారంభిస్తున్న సూర్యచంద్రరావు

ఉండి రైల్వే గేటు.. తెరుచుకుందండి

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో పైవంతెన వద్ద రైల్వే గేటును ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో అధికారులు తెరిచారు. ఆర్వోబీ పనులతో ఈ నెల 2న ఈ గేటును మూసివేశారు. దీంతో 165 జాతీయ రహదారిపై ఉండి - ఆకివీడు మధ్య వివిధ జిల్లాలు, చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే వాహనాలను మళ్లింపు మార్గాల్లో రాకపోకలకు అనుమతించారు. అంతంతమాత్రంగా ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలన్నీ భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా దెబ్బతిన్నాయి. పాములపర్రు - పెదకాపవరం రహదారి పట్టపగలే వాహన చోదకులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. పెదపుల్లేరు - సీసలి, ఉండి - కోపల్లె, పెదపుల్లేరు - వాంద్రం, పెదఅమిరం - కాళ్ల ఆర్అండ్‌బీ రహదారులు దయనీయ స్థితికి చేరాయి. దీంతో నిత్య ప్రయాణాలు సాగించేవారంతా రాకపోకలు తగ్గించుకున్నారు. జాతీయ రహదారిపై ఉండిలో 20 రోజుల తరువాత గేటు తెరిచారనే సమాచారం ఆదివారం మధ్యాహ్నానికి కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చేరింది. దీంతో రహదారి సమస్యలకు విముక్తి లభించిందంటూ వాహన చోదకులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సంక్రాంతి సంబరాలకు తరలి వచ్చే ప్రజల కోసం జనవరి నెలాఖరు వరకు మరోసారి ఈ గేటును మూసేయొద్దంటూ అధికారులకు పలువురు మొరపెట్టుకుంటున్నారు.

ప్రారంభమైన వాహన రాకపోకలు

విద్యుదాఘాతంతో కూలీ మృతి

పాలకొల్లు మార్కెట్, యలమంచిలి, న్యూస్‌టుడే: ఆక్వా చెరువు వద్ద పని చేస్తున్న కూలీ విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన ఘటన పాలకొల్లు మండలం వెలివెల గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. యలమంచిలి మండలం లక్ష్మీపాలేనికి చెందిన పొన్నమండ జయరాజు (27) రొయ్యల చెరువుల వద్ద కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం సహచర కూలీలతో కలిసి వెలివెలలో రొయ్యల చెరువుల వద్ద పనికి వెళ్లారు. అక్కడ పని చేస్తుండగా పంకాకు ఉన్న తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యారు. సహచరులు అతడికి హుటాహుటిన పాలకొల్లులో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై అతడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.సురేంద్ర కుమార్ కేసు నమోదు చేశారు.



జయరాజు (పాతచిత్రం)

పెను విషాదం.. జయరాజుకు ఏడాదికి కిందట వివాహం జరిగింది. ఈ దంపతులకు గత నెలలో కుమార్తె జన్మించగా ఇటీవల బారసాలను ఘనంగా నిర్వహించారు. ఇంతలోనే తండ్రి విద్యుదాఘాతంతో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph :81422 92071.

TO LET

COMMERCIAL

తణుకు ఆచంట వారి వీధి సాయి స్వప్న హైట్స్‌లో యూనియన్ బ్యాంక్ పైన, 1st ఫ్లోర్ 2,350 Sft బ్యాంక్స్, హాస్పిటల్స్ మొ॥ వాటికి అద్దెకు కలదు. ✆ 98491 95699, 93925 85699.

JOBS

Wanted Plant Supervisors for Kakatiya Coir Industries. Experience: 0-2 Years. Location: Vijayarai, Eluru. Contact: 79813 18373.

Wanted Accountant With Multimedia Knowledge Hiring Male Accountant With Tally & Multimedia Knowledge B.Com/ M.Com for Saraswathi Vidyalai, Prathipadu, Pentapadu Mandal. Cont: 96036 45678

జై గణేష్ సెక్యూరిటీ తణుకులో విజిలెన్స్ ఆఫీసర్ 7గురు(Ex Service only) జీతం:28,000/- గన్ మేన్ 3 మెంబర్స్ జీతం:33,000/- వయసు 50సం॥లోపు. PF&ESI W/H, 8 గం॥ డ్యూటీ ✆ 95818 58667

మదర్ హోంకేర్ సర్వీస్: Hyd. లేడీ టెలికాలర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, 2వీలర్ లైసెన్స్ కల్గి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ తెలిసిన 40సం॥ వారు కావలెను. జీ: 18-20K. భో+వసతి. ✆ 9618300688, 9666314488

సెంట్రల్ గవర్నమెంట్ సోలార్ సబ్సిడీ స్కీమ్ నందు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. Q: 10 to PG. జీతం: 30 వేలు to 50 వేలు. ✆ 95155 05557, 99898 57775.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

MARKETING/ SALES

కైకలూరులో చేపల మేత తయారీ మిషన్స్ సేల్స్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర. Cell No: 99899 88993.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
- ★ For the Information of Trade & Industry
- ★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.90 పై॥

తణుకు ఆఫీసు: 08819-224254

92.7 FM Rajamahendravaram (ఈ FM 92.7 Mee FM)

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

(c) eenadu

నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాతకు పత్రం ఇస్తున్న ఏఈవో నటరాజారావు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.1.01 లక్ష విరాళం సమకూరింది. ఏలూరు కండ్రికగూడేనికి చెందిన తొండ కళ్యాణ్ చక్రవర్తి విరాళాన్ని ఆలయ కార్యాలయంలో ఆదివారం జమ చేశారు. ఈ సందర్భంగా ఏఈవో నటరాజారావు దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

ఐక్యతతో సమాజ వికాసం

మాట్లాడుతున్న శ్రీధర్ స్వామీజీ

గుండుగొలను(భీమడోలు), న్యూస్‌టుడే: ప్రజా చైతన్యం, ఐక్యతతో హిందూ సమాజం, సద్ధర్మం వికసిస్తాయని శ్రీయజ్ఞపురుషోత్తం ప్రపంచ వాసవి మహా పీఠాధిపతి శ్రీధర్ స్వామీజీ అన్నారు. గుండుగొలనులోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. కె.ఎల్.ఎన్.మూర్తి అధ్యక్షత వహించారు. శ్రీధర్ స్వామీజీ మాట్లాడుతూ.. సనాతన హైందవ ధర్మంలో మహా విద్యల గొప్పతనాన్ని అందరూ తెలుసుకోవాలన్నారు. పూర్వప్రజ్ఞ మాట్లాడుతూ.. సనాతన ధర్మం విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు అర్బన్:	80085 74486	ఏలూరు టూటౌన్:	80085 74487
దెందులూరు:	80085 74535	పెదపాడు, పెదవేగి:	80085 74483
భీమడోలు:	80085 74527	నిడమర్రు(గ్రామీణం):	97040 21765
ఉంగుటూరు:	94939 90333	గణపవరం:	99480 66777

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ? స్థానిక మంచినీళ్లతోటలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంటోంది. పిల్లలు, పెద్దలపై దాడి చేస్తున్నాయి. వాహనదారులను వెంబడిస్తుండటంతో వారు ప్రమాదాల బారిన పడుతున్నారు. **- నరేశ్, స్థానికుడు**

✔ కుక్కలను పట్టుకుని దూరంగా విడిచిపెడతాం. నగరంలోని వీధి కుక్కలకు సంతానోత్పత్తి నివారణ శస్త్రచికిత్స చేయించి సమస్య పరిష్కరిస్తున్నాం. **- భానుప్రతాప్, కమిషనరు**

పెదపాడు, న్యూస్‌టుడే: ? పెదపాడు నుంచి 13 గ్రామాలకు మంచినీరు సరఫరా చేస్తున్న పైపులైన్ వీరమ్మకుంట వద్ద లీకవుతోంది. మంచినీరు వృథాగా రోడ్డుపై చేరుతోంది. **- సురేంద్ర**

✔ సమస్య నా దృష్టికి రాలేదు. తక్షణమే పైపు వాల్వ్ పరిశీలించి లీకేజీలు అరికడతాం. **- శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ**

నిడమర్రు (గ్రామీణం, న్యూస్‌టుడే: ? నిడమర్రు శ్మశానవాటిక ప్రధాన రహదారి వెంబడి వ్యర్థాలు పడేస్తున్నారు. రోజుల తరబడి పేరుకుపోయి ఉండటంతో దుర్వాసన వస్తోంది. **- నాగేంద్ర**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగింపజేస్తాం. దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లిస్తాం. **- సంజీవరావు, పంచాయతీ కార్యదర్శి**

తొలగిన చెత్త

ఏలూరు (గ్రామీణ, న్యూస్‌టుడే: హనుమాన్‌నగర్ రోడ్డు(శివాలయం సమీపం)లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సిబ్బంది తొలగించారు. దీనిపై 'మేమున్నాం.. మీకు తోడుగా'లో ఆదివారం ప్రచురితమైన వార్తకు నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించారు.

చెరువు ఆక్రమణకు యత్నం

అక్కుపల్లిగోకవరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: అక్కుపల్లిగోకవరంలోని పంచాయతీ చెరువును ఆక్రమించేందుకు ఓ వ్యక్తి యత్నిస్తున్నారు. చెరువు గట్టుపైనున్న చెట్లు తొలగించి, ఆ భూమిని తన పొలంలోకి కలుపుకొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చెరువు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్మార్టు ఫోన్లు.. సేవలు! తొలగనున్న సర్వర్ సమస్య

'గత వైకాపా ప్రభుత్వం 2022లో తక్కువ ధర ఉన్న 4జీబీ+32జీబీ స్టోరేజీ సదుపాయమున్న స్మార్ట్ ఫోన్లు అంగన్‌వాడీలకు అందజేసింది. తక్కువ స్టోరేజీ ఉండటంతో యాప్‌లు డౌన్‌లోడ్ అయ్యేవి కావు. లబ్ధిదారుల వివరాలు నమోదు కష్టంగా మారింది. హాజరు నమోదుకు గంటల సమయం తీసుకునేది.

కూటమి సర్కారు సామ్‌సంగ్ 5జీ స్మార్ట్ ఫోన్లను ఐసీడీఎస్ ద్వారా టెండర్లు పిలిచింది. ఒక్కో ఫోన్ రూ.12,500కు కొనుగోలు చేసింది. 6.7 అంగుళాల తెర, 50-8 ఎంపీ(ముందు-వెనక) కెమెరా, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ సామర్థ్యం, 4జీబీ+64జీబీ స్టోరేజీ, అడాప్టర్, టెంపర్ గ్లాస్, పౌచ్, బ్యాక్ కవర్ ఉన్నాయి.

ఉంగుటూరు, న్యూస్‌టుడే: మాతా శిశు సంరక్షణలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఆ కార్యకర్తల సేవలు స్మార్ట్‌గా మారనున్నాయి. యాప్ అప్‌లోడ్, సర్వర్, సిగ్నల్ సమస్యలు తొలగనున్నాయి.

కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లు ఇస్తున్న ఆర్డీడీ సుజాతరాణి

పాత 4జీ ఫోన్లతో ఆన్‌లైన్ వివరాలు నమోదు చేయలేకపోతున్నామని, ముఖ ఆధారిత హాజరు నమోదు, టీహెచ్ఆర్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. వారి సమస్యలు గుర్తించిన కూటమి ప్రభుత్వం.. 5జీ స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేస్తోంది.

చరవాణుల అందజేత వివరాలిలా..

ప్రాజెక్టు	కార్యకర్తలు	పర్యవేక్షకులు	బీపీసీ
భీమడోలు	196	8	1
ఏలూరు	205	6	1
పెదపాడు	241	9	1

పరిష్కారం లభించినట్లే.. భీమడోలు, ఏలూరు, పెదపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 642 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. మొత్తం 30,686 మంది చిన్నారులు, 2,603 మంది గర్భిణులు, 2,653 బాలింతలున్నారు. వీరికి ప్రతినెలా అందజేసే సరకుల పంపిణీ తీరును పర్యవేక్షించేందుకు కేంద్రం పోషణ్ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వం బాల సంజీవని యాప్‌లు తీసుకొచ్చాయి. కేంద్రం జులై 1 నుంచి ముఖ ఆధారిత గుర్తింపు తప్పనిసరి చేసింది. కిశోరి వికాసం, మిషన్ వాత్సల్య, సఖి తాజాగా ప్రధానమంత్రి మాతృ వందన యోజన సర్వర్ బాధ్యతలు అంగన్‌వాడీలకే అప్పగించింది. వేలిముద్రలు, ముఖ ఆధారిత హాజరు, ఐరిష్ హాజరు, క్షేత్రస్థాయిలో వివరాల నమోదవుతున్న కార్యకర్తల కష్టాలకు 5జీ స్మార్ట్‌ఫోన్లతో పరిష్కారం లభించినట్లయింది.

ఘనంగా హిందూ సమ్మేళనం

చింతలపూడి, న్యూస్‌టుడే: పట్టణంలో హిందూ సమ్మేళన సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరిదే కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ గురువు సదాశివ మాట్లాడుతూ.. హిందువులు చాలా మంచివారన్నారు. దేశంలో పుట్టిన ఏ వ్యక్తి అయినా హిందువుగానే పరిగణించబడతారన్నారు. అందరూ కలిసిమెలిసి జీవనం సాగించాలన్నారు. సమావేశానికి ముందు కొత్త బస్టాండు నుంచి తిరిదే కళ్యాణ మండపం వరకు హిందూ ప్రచారకుల ద్విచక్ర వాహనాలపై భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టిపల్లి మోహనరావు, శ్రీరంగనాథ స్వామీజీ, శ్రీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

తెదేపాను మరింత బలోపేతం చేస్తా: బడేటి

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆయన్ను పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించిన నేపథ్యంలో.. స్థానిక బడేటి నివాసం క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాజకీయంగా చైతన్యమైన జిల్లాలో అన్ని వర్గాలను సమన్వయం చేసుకొని ముందుకు సాగుతానన్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మేయర్ నూర్జహాన్, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, నాయకులు వెంకటరత్నం, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

● తెదేపా జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన బడేటి చంటిని ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సలహా కమిటీ ఛైర్మన్ సత్యవాడ దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

భీమడోలు: ఏలూరు ఎమ్మెల్యే చంటిని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ఆయన్ను సత్కరించారు.

పెదవేగి: చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్, ఏలూరులో జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మశ్రీ, మేయర్ నూర్జహాన్

రెండు చుక్కలు.. నిండునూరేళ్లు!

వాడవాడలా పల్స్ పోలియో

ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం పకడ్బందీగా నిర్వహించారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యారోగ్య సిబ్బంది చుక్కల మందు వేశారు. ఏలూరు సుబ్బమ్మదేవి పాఠశాలలో ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథితో కలిసి ఎమ్మెల్యే బడేటి చంటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మార్సీ కాలనీ నగరపాలక ప్రాథమిక పాఠశాలలో మేయర్ నూర్జహాన్ చుక్కల మందు పంపిణీ ప్రారంభించారు. ఆర్‌ఆర్‌పేటలో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పిల్లలకు పోలియో చుక్కలు పంపిణీ చేశారు. జిల్లా సర్వజన ఆసుపత్రిలో డీసీహెచ్ఎస్ పాల్ సతీశ్ చిన్నారులకు చుక్కల మందు వేశారు. పెదవేగి మండలం కొప్పాక పీహెచ్‌సీలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ చిన్నారులకు పోలియో చుక్కలు పంపిణీ చేశారు. భీమడోలులో ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్. జవహర్, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు పిల్లలకు చుక్కలు వేశారు. **-న్యూస్‌టుడే, బృందం**

భీమడోలులో.. ఎస్సీ కమిషన్ ఛైర్మన్ జవహర్, వీరాంజనేయులు

దారిపై అమ్మకాలు.. ప్రజల అవస్థలు

ఏలూరు ఒకటో పట్టణం గజవెల్లివారి చెరువు సమీప ప్రధాన రహదారిపైనే చేపల విక్రయాలు చేపడుతున్నారు. ఆదివారమైతే తెల్లవారుజాము నుంచే పెద్దఎత్తున అమ్మకాలు సాగిస్తుండటంతో.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. నడిచేందుకూ మార్గం లేకపోవడంతో నగరవాసులు అవస్థలు పడుతున్నారు. **- న్యూస్‌టుడే, ఏలూరు నగరం**

స్తంభం.. నిర్లక్ష్యానికి ప్రతిబింబం

గణపవరం మండలం కేశవరం బెయిలీ వంతెన సమీపంలో ఓ భారీ చెట్టు పక్కనున్న విద్యుత్తు స్తంభానికి పాదులు, పిచ్చిమొక్కలు అల్లుకుపోయాయి. ఏది చెట్టో.. ఏది స్తంభమో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రమాదాలు సంభవించక ముందే పాదులు తొలగించాలి. సత్వరమే చర్యలు తీసుకుంటామని విద్యుత్తు ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. **- న్యూస్‌టుడే, గణపవరం**

ప్రారంభించారు.. వదిలేశారు

ఉంగుటూరు మండలం రాచూరులో రూ.46.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం నిరుపయోగంగా మారింది. భవన నిర్మాణం చివరి దశలో ఉండగా.. 2024 మార్చి 13న అప్పటి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హడావుడిగా ప్రారంభించి వదిలేశారు. ఇక్కడ కార్యకలాపాలు జరగక అలంకారప్రాయంగా తయారైంది. **- న్యూస్‌టుడే, రాచూరు(ఉంగుటూరు)**

రోడ్డు.. గుంతలు చూడు!

నిడమర్రు మండలం మందలపర్రు శివారు నుంచి బువ్వనపల్లి శ్మశానవాటిక వరకున్న రహదారి దెబ్బతింది. సుమారు 2 కిలోమీటర్ల మేర అడుగుకో గుంత చందాన మారడంతో చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళ ద్విచక్ర వాహనదారులు గుంతలు తప్పించే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. **- న్యూస్‌టుడే, నిడమర్రు గ్రామీణం**

మురుగు నిలిచి.. దోమలు విజృంభించి

పెదవేగి మండలం కవ్వగుంట ఎన్టీఆర్ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. ఇక్కడ మురుగు కాలువలు నిర్మించకపోవడంతో.. ఇళ్లలోని వాడుకపు నీరు రోడ్డు పక్కన నిలిచిపోతోంది. దీంతో దుర్వాసన రావడంతో పాటు దోమలు విజృంభిస్తున్నాయి. రాత్రివేళ కంటి మీద కునుకు వేయలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, కవ్వగుంట(పెదవేగి)**

ఏలూరు సినీ మాల

అంబిక డీలక్స్	ఫైటర్స్
సాయి బాలాజీ	మోగ్లీ
బాలాజీ	అన్నగారు వస్తారు
సత్యనారాయణ 1	అవతార్ 3
సత్యనారాయణ 2	అఖండ 2
సత్యనారాయణ 3	మారియో
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	గుర్రం పాపిరెడ్డి
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ఆంధ్రా కింగ్ తాలూకా
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	అఖండ 2
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	ఆంధ్రా కింగ్ తాలూకా
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	అఖండ 2
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	అవతార్ 3

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగి మండలం కూచింపూడి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పనులు చేస్తున్నందున. . ఈ నెల 23న విద్యుత్తు సరఫరాకు విడతల వారీగా అంతరాయం ఉంటుందని ఆ శాఖ కార్యనిర్వాహక ఇంజినీర్ కేఎం అంబేడ్కర్ తెలిపారు. ఆయా గ్రామాల్లోని వ్యవసాయ బోర్లకు తెల్లవారుజామున 3 నుంచి ఉదయం 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సరఫరా ఇవ్వనున్నట్లు చెప్పారు. రైతులు, విద్యుత్తు వినియోగదారులు గమనించి, తమకు సహకరించాలని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

జూద స్థావరంపై దాడి

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: తోకలపల్లిలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.72,050 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలో ఎవరైనా జూదాలు ఆడితే తమకు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

శభాష్.. గెలుపు జోష్

పెదవేగి (పెదపాడు), న్యూస్‌టుడే

రోజంతా తరగతి గదుల్లో కుస్తీ పట్టే విద్యార్థులకు క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి. ఆటల మీద దృష్టి పెట్టగలిగితే ఉన్నత శిఖరాలకు చేరుకోవడం అంత కష్టమేమీ కాదు. అదే బాటలో సాగుతున్నారు పెదవేగిలోని గురుకుల పాఠశాల విద్యార్థులు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు వీరవాసంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 విభాగంలో పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

వైద్యుడు కావాలని.. ఆటల్లో సత్తా చాటి క్రీడా కోటా ద్వారా ఎంబీబీఎస్‌లో సీటు సాధించాలన్న లక్ష్యంతో సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొంటున్నా. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చినా నిరంతర సాధనతో జోనల్ స్థాయి, శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచా. జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే అర్హతను సాధించా. నా కల నెరవేర్చుకుంటా. **- ఎ.పూర్ణానంద్**

కఠోరంగా శ్రమిస్తున్నా.. క్రీడల్లో రాణించి జీవితంలో క్రీడా కోటా ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని చిన్నప్పటి నుంచి సాఫ్ట్‌బాల్ ఆటలో సాధన చేస్తున్నా. పట్టుదల, క్రమశిక్షణతో అనుకున్నది సాధించాలనే తపనతో రోజూ కఠోరంగా శ్రమిస్తున్నా. ఇప్పటికే పలు స్థాయిల్లో జరిగిన క్రీడా పోటీల్లో పతకాలు సాధించా. జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణిస్తానన్న నమ్మకం ఉంది. **- దుర్గారావు**

క్రీడల్లో సత్తా.. చిన్నప్పటి నుంచి క్రీడలంటే ఇష్టం. అందుకు అనుగుణంగానే చదువులో ప్రతిభ చూపుతూ నాకిష్టమైన సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తున్నా. పీడీ జయరాజు, వ్యాయామోపాధ్యాయుడు గురుమూర్తిల శిక్షణతో పాఠశాల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన పలు పోటీల్లో పాల్గొని పతకాలు సాధించా. క్రీడల్లో సత్తా చాటుతూ ఉన్నత చదువులు చదవాలన్నదే నా లక్ష్యం. **- ఎన్.నవసంపత్**

తొలి వేతనం ఆలోచన నూతనం

నిడమర్రు, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీ ద్వారా కొలువులు పొందిన ఉపాధ్యాయులు తమ మొదటి జీతాన్ని అందుకున్నారు. తొలి సంపాదనను తల్లిదండ్రులకు ఇస్తామని కొందరు, సేవా, దైవ కార్యక్రమాలకు వినియోగిస్తామని మరికొందరు అంటున్నారు.

ఉపాధి కూలీ నుంచి ఉపాధ్యాయినిగా

పెదనిండ్రకొలను ఉన్నత పాఠశాలకు హిందీ ఉపాధ్యాయినిగా వచ్చిన వంకా చిట్టి.. డీఎస్సీ ముందు వరకూ ఉపాధి పనులకు వెళ్లారు. తండ్రి ఆమె ఒకటో తరగతిలో ఉండగా చనిపోయారు. తల్లి రెక్కల కష్టంతో చదివించింది. మొదటి జీతంలో సగం తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీలో వేస్తానని తెలిపారు.

పేద కుటుంబం నుంచి..

దేవరగోపవరం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా వచ్చిన కమ్మిల అనిత ఆనందమణి పేద కుటుంబం నుంచి వచ్చారు. తండ్రి వ్యవసాయ కూలీ. ఉపాధ్యాయుడు కె.సుబ్బరాజు ప్రోత్సాహంతో ఈ వృత్తిలోకి వచ్చానని, చదువుకున్న పాఠశాలకు ఆర్థిక సహకారం అందిస్తానన్నారు.

తండ్రి చిన్నతనంలో చనిపోయినా

పెదనిండ్రకొలను వెలంపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయినిగా రంప షారోన్ రోజా. ఆమె తండ్రి చదువుకుంటున్న రోజుల్లో చనిపోయారు. అనేక కష్టనష్టాలను ఎదుర్కొని డీఎస్సీలో కొలువు సంపాదించారు. తన మొదటి జీతంలో కొంత భాగాన్ని చర్చికి ఇస్తానన్నారు.

పేదలకు సహకారం

పత్తేపురం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా వచ్చిన షేక్ అమీర్ భాషావలీ తన జీతంతో 10 మంది పేద కుటుంబాలకు సహాయం చేస్తానని నా తల్లిదండ్రులు నన్ను కష్టపడి చదివించారని, వారికి మిగిలిన జీతాన్ని ఇస్తాను. మసీదుకు నా వంతు విరాళం ఇస్తానన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ధ్యానం చేస్తున్న బ్రహ్మకుమారీలు

ఏలూరు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీరామ్ నగర్‌లోని కేంద్ర శాఖలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యాన ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ఎస్సై భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై ధ్యాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ధ్యానంతో మానసిక ప్రశాంతత పొందవచ్చని.. ఒత్తిడిని జయించవచ్చన్నారు. అనంతరం భాస్కర్‌ను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

ఏలూరు గ్రామీణ: స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ధ్యాన శిబిరం నిర్వహించారు. సంస్థ గౌరవాధ్యక్షుడు దత్తక్రియ, ధ్యాన శిక్షకుడు వేణుగోపాల్ లునాని ఆధ్వర్యంలో సభ్యులకు ధ్యానం, శ్వాస మీద ధ్యాసపై అవగాహన కల్పించారు. అనంతరం సంస్థ తరఫున లునానిని సత్కరించారు. యర్రా సోమలింగేశ్వరరావు, కె.వి.సత్యనారాయణ, అంబికా రాజా తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం.. కేసు నమోదు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఏలూరు మండలం పోణంగి రోడ్డులోని రాజరాజేశ్వరి కాలనీకి చెందిన చిలకంటి జాన్ ప్రకాశ్‌రావుకు కొంత పొలముంది. ఆ పొలంలోని 1.60 సెంట్లలో లేఅవుట్ వేసి అభివృద్ధి చేయిస్తామని, అందుకు రూ.30 లక్షలు ఖర్చవుతుందని బలే ఏసుపాదం, తాణింకి గంగాధరరావు నమ్మించారు. దాంతో జాన్ ప్రకాశ్‌రావు ఆ మొత్తం చెల్లించారు. ఆ తర్వాత లేఅవుట్‌ను అభివృద్ధి చేయించకపోగా, రూ.30 లక్షలు తిరిగి చెల్లించలేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనం

వంగూరు(పెదవేగి), న్యూస్‌టుడే: వంగూరులో ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక రామకోటి ప్రాంగణంలో ఎంజేఎఫ్ లయన్ మానేపల్లి రామారావు ఆధ్వర్యాన ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాల వైద్యులు పాల్గొని సుమారు 135 మందికి పరీక్షలు చేశారు. వారిలో 11 మందిని శస్త్రచికిత్సలకు వేమగిరి ఆసుపత్రికి తీసుకెళ్లారు. 27 మందికి రాయితీపై కళ్లద్దాలు అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రాంతీయ ఛైర్మన్ పీఎంజేఎఫ్ లయన్ పి.లక్ష్మీనారాయణ, బొలిశెట్టి సురేశ్, పిల్లి పండరీనాథ్, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెదవేగి: కేక్ కోస్తున్న బిషప్ జయరావు తదితరులు

శాంతి.. సహనంతోనే దేవుడి ఆశీస్సులు

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: ప్రేమ, శాంతి, సహనంతోనే దేవుడి ఆశీస్సులుంటాయని ఏలూరు మేత్రాసన పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాలలో ఆదివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు కేక్ కోసి పంచిపెట్టారు. సుమారు 125 మంది వృద్ధులకు తేజ, అభి ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో దుప్పట్లు పంపిణీ చేశారు. ఫాదర్లు మైఖేల్, ఇంజే పాల్, పలువురు విశ్వాసులు పాల్గొన్నారు.

ఏలూరు వన్‌టౌన్: స్థానిక జేవీఆర్ నగర్‌లోని బిషప్ గృహంలో.. ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు ఆధ్వర్యాన ఆదివారం సెమీ క్రిస్మస్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయరావు కేక్ కోసి.. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, మేయర్ షేక్ నూర్జహాన్, భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఆర్టీసీ విజయవాడ ప్రాంతీయ ఛైర్మన్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

పెదపాడు, పెదవేగి, దెందులూరు, నిడమర్రు, న్యూస్‌టుడే: పెదపాడు మండలం వట్లూరు రైల్వేగేట్ కూడలి, పెదవేగి మండలం విజయరాయి, దెందులూరు మండలం పోతునూరు, నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులో వైకాపా అధినేత జగన్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్య చౌదరి, పుప్పాల వాసుబాబు, పార్టీ నాయకులు సతీశ్ చౌదరి, డీవీఆర్‌కే చౌదరి తదితరులు కేక్ కోశారు. పోతునూరులో పేదలకు అన్నదానం చేశారు. పెదనిండ్రకొలనులో రోగులకు పండ్లు అందజేశారు.

మండల కేంద్రం పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలోని ఉపాధ్యాయుల నివాస సముదాయం శిథిలావస్థకు చేరిన దృశ్యమిది. ఇక్కడి నివాసం ఉండేందుకు ఉపాధ్యాయులు భయపడుతున్నారు. కేవలం 15 మంది మాత్రమే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు.

భద్రత లేక.. చదవలేక!

గురుకులంలో సమస్యల తిష్ఠ

పెదవేగి(పెదపాడు), న్యూస్‌టుడే: పెదవేగిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలలో రాజ్యమేలుతున్నాయి. ఇక్కడ సుమారు 650 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పూర్తి స్థాయిలో భద్రత కల్పించాల్సి ఉండగా.. ఆ విషయంలో అధికారులు విఫలమవుతున్నారు. బడి ప్రాంగణంలో ఎక్కడా సీసీ కెమెరా ల్లేవు. దాంతో గురుకులంలోకి ఎవరొస్తున్నారో.. ఎవరెళ్తున్నారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

ఫలితం శూన్యం.. పాఠశాలలో ఉపాధ్యాయుల నివాస సముదాయాలు దెబ్బతిన్నాయి. అందులో ఉండేందుకు ఎక్కువ మంది గురువులు నిరాసక్తత చూపుతున్నారు. విధి లేని పరిస్థితుల్లో కొందరు మాత్రమే నివాసం ఉంటున్నారు. వీటిని బాగు చేయించాలని పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించినా, ఫలితం మాత్రం శూన్యం. 'పాఠశాలలో విద్యార్థులకు అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తున్నాం. సీసీ కెమెరాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఉపాధ్యాయులకు వసతి గృహం సరిపోవడం లేదు. ఈ కారణంగా పలువురు బయట నివాసం ఉంటూ రోజూ బడికొస్తున్నారు' అని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానాచార్యుడు రమేశ్ తెలిపారు.

రాట్నాలమ్మకు అభిషేకం

రాట్నాలకుంట(పెదవేగి), న్యూస్‌టుడే: రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేకాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. ఆపై పట్టువస్త్రాలు, ఆభరణాలు, విశేష పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహిళలు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పూజా ద్రవ్యాలు, ప్రసాదాల విక్రయాలతో రూ.38,382 ఆదాయం వచ్చిందని ఆలయ ఛైర్మన్ మన్నే శ్రీనివాసరావు, ఈవో సతీశ్‌కుమార్ తెలిపారు.

సూర్యభగవానుడికి పూజలు

పవరుపేట(ఏలూరు ఆధ్యాత్మికం): పవరుపేట సూర్య దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారిని వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో నేత్రపర్వంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

మానవత ఆర్థిక సాయం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: చేబ్రోలుకు చెందిన కొమ్మిన ధనరాజ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుడికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, నారాయణపురం వర్తక సంఘ ప్రతినిధులు బాసటగా నిలిచారు. బాధితుడి వైద్య ఖర్చులకు ఆదివారం ఆర్థిక సాయం చేశారు. సంస్థ ప్రాంతీయ ఛైర్మన్ పుప్పాల గోపి, మండలాధ్యక్షుడు కోనే వీర వెంకట సత్యనారాయణ, వర్తక సంఘం అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

పోలవరం

•పోలవరం •చింతలపూడి

ఘనంగా హిందూ సమ్మేళనం

ప్రచారకుల ప్రదర్శన

చింతలపూడి, న్యూస్‌టుడే: పట్టణంలో హిందూ సమ్మేళన సభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. శివాలయం కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ గురువు సదాశివ మాట్లాడుతూ.. హిందువులు చాలా మంచివారన్నారు. దేశంలో పుట్టిన ఏ వ్యక్తి అయినా హిందువుగానే పరిగణించబడతారన్నారు. అందరూ కలిసిమెలిసి జీవనం సాగించాలన్నారు. సమావేశానికి ముందు కొత్త బస్టాండు నుంచి శివాలయం కల్యాణ మండపం వరకు హిందూ ప్రచారకులు ద్విచక్ర వాహనాలపై భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, శ్రీరంగనాథ స్వామీజీ, శ్రీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకర్ వితరణ

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: లక్కవరం గ్రామానికి చెందిన ఆనెం జయలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుమారులు వెంకట సుబ్బారావు, ప్రభాకర్ రూ.3 లక్షల విలువైన మంచినీటి ట్యాంకరును గ్రామానికి ఆదివారం అందించినట్లు జెడ్పీ సంస్థ అధ్యక్షుడు తొమ్మిద్దేల శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు జెడ్పీ సంస్థ ఆధ్వర్యంలో దాతలు ముందుకొచ్చి గ్రామానికి ఉచితంగా ట్యాంకరును అందించడం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. జడ్పీటీసీ సభ్యుడు పొల్నాటి బాబ్జి, జెడ్పీ కార్యదర్శి శీలం కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు దాకారపు కృష్ణ, గౌరవ సలహాదారు రావూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ పరిరక్షణకు కృషి చేయండి

మాట్లాడుతున్న ఆదిత్యానందస్వామీజీ

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: రామాయణం, మహాభారతం, భగవద్గీత వంటి ఆధ్యాత్మిక గ్రంథాలను ప్రతి ఒక్కరూ ఆచరించి ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని కామయ్యపాలెం దత్తసాయి పీఠాధిపతి ఆదిత్యానందస్వామీజీ పిలుపునిచ్చారు. దర్భగూడెంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా సంఘ్ చాలక్ గద్దమనుగు సత్యనారాయణ అధ్యక్షతన ఆదివారం హిందూ ధర్మ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా వక్త మాదిరాజు శారద, జిల్లా ప్రచార ప్రముఖ్ సీహెచ్‌వీవీ మూర్తి, డివిజన్ ప్రచార ప్రముఖ్, పలువురు భాజపా నేతలు పాల్గొన్నారు.

చిట్టి బుర్రలు.. గట్టి ఆలోచనలు

కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం, బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: అవకాశం, సరైన మార్గదర్శనం ఉంటే విద్యార్థుల్లోని సృజనాత్మకత ఆవిష్కరణల రూపం పోసుకుంది. ఈ బాటలోనే పయనిస్తున్నారు ఈ విద్యార్థులు. సోమవారం జిల్లాలో జరగనున్న వైజ్ఞానిక ప్రదర్శనల కోసం నియోజకవర్గంలోని వీరు రూపొందించిన నమూనాలు ఆకట్టుకుంటున్నాయి.

సుస్థిర వ్యవసాయం.. వాతావరణం, నేల తేమను బట్టి స్వయంచాలితంగా నీటిని పంపించే ఆధునిక నీటిపారుదల పద్ధతి ఇది. వృథాగా పోయే వర్షపు నీటిని నిల్వ చేసి అవసరమైన పంటలకు సాగునీరుగా అందించడంతో రైతులకు ఉపయోగం పడుతుంది. నీటి సంరక్షణ, దిగుబడులను పెంచడం, ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించడం అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు తయారు చేశాం. - సీహెచ్.అఖిల్, జడ్పీ ఉన్నత పాఠశాల, గవరవరం

అడ్డంకులను దాటి రోబో కారు.. ప్రయాణంలో రహదారిపై ముందున్న అడ్డంకులను గుర్తించి వాటిని దాటుకుని దారి మార్చుకుని కదులుతుంది. అడ్డంకులు ఎంత దూరంలో ఉన్నాయో గుర్తించడానికి అల్ట్రాసోనిక్ సెన్సార్లను వినియోగించాం. అడ్డంకి ఎదురైతే కారు ఆగి కుడి లేదా ఎడమ వైపుకు తిరుగుతుంది. పరిశ్రమలు, గోదాముల్లో సరకుల రవాణాకు ఈ వాహనాలు ఉపయోగపడతాయి. - బి.రామ్ వినయ్, కె.చిన్మయ్, వి.భరత్, జడ్పీ ఉన్నత పాఠశాల, గూటాల

జీవన ఎరువులతో భూసారం పెంపు.. 'రసాయన ఎరువుల, పురుగు మందుల వాడకం తగ్గించి నేల ఆరోగ్యం కాపాడటం కోసం జీవన ఎరువుల వినియోగం పెంచాలన్నదే మా నినాదం. పంచగవ్య, జీవామృతం మొదలైన గోఆధారిత ఎరువులు, పోషకాలను రైతులు సొంతంగా తయారు చేసుకోవచ్చు. ఆవులను పెంచడం ద్వారా అటు పాడి, ఇటు భూసారం పెంపు సాధ్యపడుతుంది. దీంతో అదనపు ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుంది. - వి.సుబ్రహ్మణ్యం, ఎస్.జయవర్ధన్, బయ్యనగూడెం

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా.. జంగారెడ్డిగూడెం: 80085 74476 కొయ్యలగూడెం: 80085 74947 చింతలపూడి: 76759 19086

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ? ఎల్1, ఎల్4 లేఅవుట్ కాలనీల్లో పగలు దీపాలు వెలుగుతున్నాయి. నివాసాలు ఉన్న చోట్ల దీపాలు వెలగడం లేదు. - సత్యనారాయణ
✔ సరిచేసి దీపాలు రాత్రి వేళల్లో వెలిగించేందుకు చర్యలు తీసుకుంటాం. - కె.వి.రమణ, కమిషనర్, జంగారెడ్డిగూడెం

బర్రింకలపాడు: చిన్నారికి చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

కష్టపడి పని చేయాలి: ఎమ్మెల్యే

ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రోషన్‌కుమార్

లింగపాలెం(చింతలపూడి), న్యూస్‌టుడే: పార్టీలో పదవులు మరింత బాధ్యతగా పనిచేసేందుకు ఇచ్చే గౌరవమని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నూతనంగా ఏర్పాటైన తెదేపా మండల, గ్రామ కమిటీలతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో లింగపాలెం మండలం ఫుష్పావారిగూడెంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెదేపా అభివృద్ధికి కష్టపడిన వారిని గుర్తించి పదవులు కేటాయించామన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ.. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ దక్కుతుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఫుష్పావారిగూడెంలో తెదేపా వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాజెక్టులో సందడి

పోలవరం, న్యూస్‌టుడే: అధికారుల బంధుమిత్రులు పెద్ద ఎత్తున రావడంతో ఆదివారం పోలవరం ప్రాజెక్టులో సందడి నెలకొంది. ఎప్పుడు ఖాళీగా ఉండే పోలవరం ఏటిగట్టు సెంటర్లో ఒక దాని వెనుక మరొక కారు ప్రాజెక్టు మార్గంలో పరుగులు తీయడంతో చూసిన స్థానికులు మూడు ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులకు కూడా అనుమతి ఇస్తే.. గ్రామ కాస్తా కళకళలాడుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ముఖ్యంగా సంక్రాంతి పండగ సందర్భంగా వచ్చే వారికి అనుమతి ఇచ్చే విషయంలో అధికారులు ఆలోచన చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తెదేపా పట్టణ అధ్యక్ష, కార్యదర్శుల ప్రమాణం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తెదేపా జంగారెడ్డిగూడెం పట్టణ నూతన కమిటీ ఆదివారం కొలువుదీరింది. లింగపాలెం మండలంలో ఆదివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పట్టణ కమిటీ చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సమక్షంలో ప్రమాణం చేశారు. తెదేపా పట్టణ అధ్యక్షుడిగా కొండ్రెడ్డి కిశోర్, ప్రధాన కార్యదర్శిగా కొనేటి బంటి, ఉపాధ్యక్షులుగా గడిగోయిల రాధాకృష్ణ, పాదిలి పణి, తానిగడప సుమలత, సహాయ కార్యదర్శిగా దుర్గేశ్, కార్యనిర్వాహక కార్యదర్శిగా వెంకట రాజు, కోశాధికారిగా శివ నియమితులయ్యారు. పట్టణంలోని 29 వార్డు కమిటీల ప్రతినిధులు బాధ్యతలు స్వీకరించారు.

వైద్య శిబిరానికి స్పందన

పోలవరం, న్యూస్‌టుడే: పాత పట్టిసీమలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గోశాలమంలో ఆదివారం హోమియోపతి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యుడు ఎన్‌వీ తిలక్ సుమారు వంద మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి నెలలో రెండుసార్లు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని కమిటీ సభ్యుడు టి.వెంకటేశ్వరరావు, ధర్మ ప్రచారక్ మూలం వెంకన్నబాబు తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

కొయ్యలగూడెం: పరిగాలకు నుంచి ప్రతి ఒక్కరూ రక్షణ చర్యలు తీసుకోవాలని నిడదవోలు ప్రభుత్వ వైద్యాధికారిణి సయ్యద్ రిహానా తెలిపారు. తెదేపా నాయకురాలు గంగిరెడ్ల మేఘలాదేవి ఇంటివద్ద ఆదివారం నిరు పేదలైన 50 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. మేఘలాదేవి మాట్లాడుతూ.. ఏటా శీతాకాలంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. సయ్యద్ మోహిద్దిన్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

బాధ్యతగా పోలియో చుక్కలు వేయించాలి

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: తల్లిదండ్రులు తమ ఐదేళ్ల లోపు చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కోరారు. బర్రింకలపాడులో చిన్నారికి పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: పట్టణంలోని పాత బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన కేంద్రం వద్ద ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: దిప్పకాయలపాడు ఉన్నత పాఠశాల వద్ద రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలు కాకి లక్ష్మి చిన్నారికి పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

జాతీయ రహదారిపై రేడియం బారికేడ్ల ఏర్పాటు

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: జీలుగుమిల్లి మండలంలో జాతీయ రహదారిపై ప్రమాదాలను నివారించే దిశలో భాగంగా ఎస్సై వి.క్రాంతికుమార్ ఆధ్వర్యంలో గుర్తించిన ప్రదేశాల్లో ఆదివారం రేడియం బారికేడ్లు, స్టాపర్లు, ప్రమాద హెచ్చరిక సంకేత సూచికలను ఏర్పాటు చేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం

చింతలపూడి, న్యూస్‌టుడే: సీపీఐ వందేళ్ల పోరాటంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చిందని సీపీఐ మండల కార్యదర్శి తొట్టపాటి బాబు అన్నారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా ఆదివారం చింతలపూడిలోని కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. బాబు మాట్లాడుతూ.. జనవరి 18న ఖమ్మం జిల్లాలో లక్షలాది మంది ప్రజలతో సీపీఐ నిర్వహించనున్న ఉత్సవాలకు అందరూ తరలి రావాలన్నారు.

ధ్యానంతో మంచి ఫలితాలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ప్రతిరోజు క్రమం తప్పకుండా కొద్దిసేపు ధ్యానం చేయడంతో మంచి ఫలితాలు పొందవచ్చని ఆధ్యాత్మికవేత్త యుగంధర్ అన్నారు. జంగారెడ్డిగూడెం పిరమిడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక మైత్రేయ మందిరంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఆదివారం సామూహిక ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. సంగీత విద్వాంసురాలు మల్లాది పర్వతవర్ధిని, పిరమిడ్ ట్రస్ట్ ప్రతినిధులు రామకృష్ణ, శిరీష, తహసీల్దారు స్లీవజోజి తదితరులు పాల్గొన్నారు.

పురపాలక పార్కులో.. స్థానిక అల్లూరి సీతారామరాజు పురపాలక పార్కులో యోగా గురువు తాండ్ర దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో సామూహిక ధ్యానం నిర్వహించారు.

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం), న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ నిత్యం క్రమం తప్పకుండా ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, తద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో కామయ్యపాలెంలో ఏర్పాటు చేసిన ధ్యాన మందిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు.

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ద్వారకాతిరుమలలోని శ్రీనివాస ధ్యాన మహాక్షేత్రంలో ప్రముఖ ఆధ్యాత్మిక శాస్త్రవేత్త బలరాం ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో ధ్యాన-ఆత్మజ్ఞాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ధ్యానం ప్రాముఖ్యాన్ని, ధ్యానం చేయడంతో మానవులు పొందే లాభాల గురించి తెలియజేశారు.

జంగారెడ్డిగూడెంలో సామూహిక ధ్యానం

కంకర తేలింది.. కాలు కదలనంది



వింజరం నుంచి ముత్యాలరావుపేట రోడ్డు పదిహేను ఏళ్లుగా అధ్వానంగా ఉంది. పలుమార్లు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేశామంటూ ప్రజా ప్రతినిధులు కొబ్బరికాయలు కొట్టారు. గుత్తేదారుడు కొంత మేర వెట్‌మిక్స్ వేసి సగంలో ఆపేశారు. ప్రస్తుతం వెట్‌మిక్స్‌లో కంకర లేచిపోవడంతో ఇటుగా రాకపోకలకు నిత్యం నరకం అనుభవిస్తున్నామని సుమారు పది గ్రామాల గిరిజన ప్రజలు వాపోతున్నారు. - న్యూస్‌టుడే, పోలవరం

రోడ్డుపై మురుగు.. ఎక్కడేయాలి అడుగు

కామవరపుకోట మండల పరిషత్తు కార్యాలయం సమీపంలోని ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. ఫలితంగా వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని స్థానికులు, దుకాణదారులు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రవినాయక్ మాట్లాడుతూ.. మురుగు నీరు రహదారిపైకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, కామవరపుకోట

నీటి వృథా..

జంగారెడ్డిగూడెం పట్టణం బుట్టాయగూడెం రోడ్డులోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న సత్యసాయి మంచినీటి పైపులైను లీకేజీ కారణంగా తాగునీరు వృథా అవుతుంది. రెండు నెలలకుపైగా భూమిలో నుంచి నీరు ఉబికి రావడంతో ఆ ప్రాంతమంతా మడుగును తలపిస్తోంది. రహదారి వెంబడి నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై పురపాలక కమిషనర్ కేవీ రమణ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా నీటి వృథా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, జంగారెడ్డిగూడెం పట్టణం

ఇక్కడ డ్రెయిన్ ఉందా.. లేదా..?

వేలేరుపాడు ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే మార్గానికి ఆనుకుని ఉన్న డ్రెయినేజీ పరిస్థితి అధ్వానంగా తయారైంది. రెండేళ్లుగా కాలువను పట్టించుకోకపోవడంతో పిచ్చి మొక్కలు ఏర్పడి మురుగు కదలక దుర్వాసన వస్తోంది. దోమల బెడదతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా బాగు చేయించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వేలేరుపాడు గ్రామీణ

కౌశలం.. సర్వర్ల విఘ్నం

చింతలపూడి, న్యూస్‌టుడే: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు స్థానికంగానే ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కౌశలం పేరుతో ఇంటి నుంచే ఉద్యోగం (వర్క్ ఫ్రం హోం) కల్పనకు చర్యలు చేపట్టింది. చింతలపూడి నియోజకవర్గంలో వందలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వారి అర్హతలు తేల్చేందుకు సచివాలయ ఉద్యోగులు చేపట్టిన సర్వే కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 50 శాతం మంది విద్యార్హతల ధ్రువపత్రాలను కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వారికి ఈ నెల 2 నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో కౌశలం పరీక్షలు నిర్వహిస్తున్నారు.

- పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. రెండు పేపర్లు ఉంటాయి. భావవ్యక్తీకరణ విశ్లేషణకు 45 నిమిషాలు కేటాయించారు. రోజుకు ఒకరిద్దరు చొప్పున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య పరీక్ష నిర్వహిస్తున్నారు.
- విద్యార్థి ఎక్కడి నుంచి పరీక్ష రాస్తున్నారో గుర్తించేందుకు వీలుగా లైవ్ లొకేషన్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉంది. ఈ విధానంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

లింగపాలెంలో పరీక్షకు హాజరైన విద్యార్థిని

మండలం	సచివాలయాలు
కామవరపుకోట	16
లింగపాలెం	19
చింతలపూడి	26
జంగారెడ్డిగూడెం	29

ఓటీపీ వస్తే ఒట్టు..

నియోజకవర్గంలో మొత్తం 90 సచివాలయాలున్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా అభ్యర్థులకు ఆయా సచివాలయాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థి ఆధార్, ఓటీపీ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. చాలా మంది అభ్యర్థులకు ఓటీపీ రావడం లేదు. ఆధార్ అథెంటికేషన్ సమస్య కూడా వస్తుండడంతో ఎక్కువ సమయం సచివాలయంలోనే నిరీక్షించాల్సి వస్తోంది.

అభ్యర్థులకు తప్పని పరీక్ష

పరీక్షకూ ఇబ్బందులు తప్పడం లేదు. సమస్య పరిష్కారానికి లైవ్ లొకేషన్ క్యాప్చర్ కోడ్ తొలగించినా చాలా చోట్ల సర్వర్లు పని చేయడం లేదు. సచివాలయాల్లోని కంప్యూటర్లకు యూపీఎస్, ఇన్వర్టర్ సదుపాయం లేకపోవడం వల్ల కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. మరో వైపు దరఖాస్తు చేసుకున్న వారిలో చాలా మంది అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో పరీక్షకు గైర్హాజరవుతున్నారు. అనివార్య కారణాల వల్ల పరీక్ష రాయలేని అభ్యర్థులు వారికిచ్చిన లింక్‌లో ఆధార్ సంఖ్య ద్వారా రీషెడ్యూల్ చేసుకోవచ్చని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.

లోక పావనీ.. పాహిమాం!

కైకలూరు, న్యూస్‌టుడే: కోరిన కోర్కెలు తీర్చే లోకపావనీ.. పాహిమాం. . అంటూ కొల్లేటికోటలో కొలువుదీరిన పెద్దింట్లమ్మను భక్తులు వేడుకున్నారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు పలు జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన అర్చకుడు పరమేశ్వరశర్మ ఆధ్వర్యంలో కుంకుమాభిషేకాలు, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ధూప సేవ, పంచ హారతుల సేవ నిర్వహించారు.

గుబ్బల మంగమ్మకు ప్రత్యేక పూజలు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని కామవరం అడవిలోని గుబ్బల మంగమ్మ గుడికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చేపట్టిన పూజాదికాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో ఆర్వీ చందన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

దాతకు పత్రాన్ని అందజేస్తున్న ఏఈవో

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.1.01లక్షల విరాళం సమకూరింది. ఏలూరు కండ్రికగూడేనికి చెందిన తొండ కల్యాణ్ చక్రవర్తి విరాళాన్ని ఆలయ కార్యాలయంలో ఆదివారం జమ చేశారు. ఈ సందర్భంగా ఏఈవో నటరాజారావు దాతను ప్రత్యేకంగా అభినందించి స్వామివారి ప్రసాదాలు, నిత్యాన్నదాన పత్రాన్ని అందజేశారు.

పారిజాతగిరిలో ధనుర్మాస ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: భగవంతుని నామ సంకీర్తనమే మోక్షదాయకమని పారిజాతగిరి ఆలయ ప్రధాన అర్చకుడు నల్లూరు రవికుమారాచార్యులు అన్నారు. ధనుర్మాస వ్రత పూజల్లో ఆరో రోజైన ఆదివారం తిరుప్పావై ప్రవచనం చేశారు. శ్రీరంగనాధుని కోసం గోదాదేవి చేసిన పూజలలో ఆరో రోజు విశిష్టతకు సంబంధించి తమిళంలో ఉన్న పాశురాల అర్థాలను రవికుమారాచార్యులు భక్తులు వివరించారు. గోదాదేవికి పూజలు చేశారు.

సాఫ్ట్‌గా సత్తా

కామవరపుకోట, న్యూస్‌టుడే: ఆ బాలిక బాల్యం నుంచి అటు చదువుతో పాటు ఇటు ఆటల్లోనూ రాణిస్తోంది. కేవలం ఏడాదిగా సాఫ్ట్ బాల్‌లో శిక్షణ పొందుతూ.. రాష్ట్ర స్థాయిలో సత్తా చాటింది. అత్యుత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. శిక్షకులు శ్యామలాదేవి, శిరీష, షణ్ముగం నేతృత్వంలో నిత్యం తర్ఫీదు పొందుతూ.. మరింత రాటుదేలుతోంది. త్వరలో రాయ్‌గడ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతానంటోంది **బొల్లుబోయిన నాగ శ్రావణి.**

'మాది కామవరపుకోట. నాన్న సర్వేశ్వరరావు, అమ్మ సుభద్ర. వ్యవసాయమే మాకు జీవనాధారం. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నా. సాఫ్ట్‌బాల్‌లో అండర్-14 విభాగంలో చిత్తూరు జిల్లా అరగొండలో జరిగిన పోటీల్లో ఛాంపియన్‌షిప్ సాధించా. అనంతరం ఇటీవల వీరవాసరంలో జరిగిన పోటీల్లో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని పతకం సాధించా. త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో రాణించేందుకు నిత్యం తర్ఫీదు పొందుతున్నా.' అని నాగ శ్రావణి చెబుతోంది.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత విస్సంపల్లి సిద్దూ ఆధ్వర్యంలో ఆదివారం ఎర్రబోరులో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. వేలేరుపాడు మండలాధ్యక్షుడిగా తుంగ శ్రీనివాసు, మహిళా సమాఖ్య మండలాధ్యక్షురాలిగా కొవ్వాల శ్రావణిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం ఎప్పుడో..?

లింగపాలెంలో సచివాలయ భవన నిర్మాణం పూర్తైనా ప్రారంభించకపోవడంతో పాత పంచాయతీ భవనంలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకే గది ఉండటంతో ఉద్యోగులంతా ఇబ్బందులు పడుతూ పని చేయాల్సి వస్తోంది. వివిధ పనులపై ప్రజలు సచివాలయానికి వచ్చేటప్పుడు మరిన్ని అవస్థలు పడాల్సి వస్తోంది. నిర్మాణం పూర్తయినా.. అధికారులు ఇంకా ప్రారంభానికి సిద్ధం చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, (చింతలపూడి) లింగపాలెం

బ్యారన్ రిజిస్ట్రేషన్ గడువు పొడిగించాలి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పొగాకు బ్యారన్‌ల రిజిస్ట్రేషన్ గడువు జనవరి నెలాఖరు వరకు పొడిగించాలని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయం కమిటీ ఛైర్మన్ అల్లూరి రామకృష్ణ కోరారు. ఈ విషయంపై ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కు ఆదివారం ఆయన వినతిపత్రం అందజేశారు.

కలప తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెం అటవీ బీట్ పరిధిలోని నాగులగూడెం సమీపాన కలపను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను అటవీశాఖ అధికారులు ఆదివారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌లో మారు జాతికి చెందిన 30 బాదులు ఉన్నట్లు గుర్తించామని ములగలంపల్లి సెక్షన్ అధికారి కురసం రాంబాబు తెలిపారు. ఒక్కొక్కటి సుమారు ఏడు అడుగుల పొడవు ఉన్నాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి ట్రాక్టర్, కలపను స్వాధీనం చేసుకుని జంగారెడ్డిగూడెం రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు.

భాజపా యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా అవినాశ్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా నూజివీడు పట్టణానికి చెందిన బోను అవినాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగ సురేశ్ చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన భాజపా జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్, ఉపాధ్యక్షుడు బోను అప్పారావుకు ధన్యవాదాలు తెలిపారు.

హెచ్చరిక ప్రకటన

మా కక్షిదారులైన శ్రీ మాటూరు సత్యనారాయణ తండ్రి స్వర్గీయ మాటూరు పంచాక్షరి, నివాసం: ఇ.నెం. 12-22, డోర్ నెం. 10-37, పోలవరం రోడ్, కొయ్యలగూడెం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వారిచ్చిన ఆదేశానుసారం ఈ హెచ్చరిక ప్రకటనను సాధారణ ప్రజలకు జారీ చేయడమైనది.

శ్రీ మాటూరు సత్యనారాయణ గారు, దిగువ వివరించిన షెడ్యూలు ఆస్తిలో తన ఆస్తిని విభజించి మరియు తన వాటాను కేటాయించమని కోరుతూ గౌరవ జడ్జిని కోరుతూ తాడేపల్లిగూడెంలోని XI అదనపు జడ్జి వారి న్యాయస్థానంలో OS నెం. 21/2024 తో విభజన కోరుతూ దావాను దాఖలు చేశారు.

దావా షెడ్యూలు ఆస్తి–ఎ: ఉమ్మడి గృహం మొత్తం, ఇ.నెం. 12-22, స.నెం. 456, విస్తీర్ణం ఎక 1-26 సెంట్లు పరింపూడి గ్రామం, కొయ్యలగూడెం మండలం, పాత పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–బి: గృహం (ఉమ్మడిది) మొత్తం, ఇ.నెం. 3-33-2, 378 చ.గ.లులో, నిర్మిత ప్రాంతం 3,641 చ.అ.లు, ఉన్నచోటు: తాడేపల్లిగూడెం, పాత పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–సి: ఉమ్మడి గొడౌన్ మొత్తం (కొయ్యలగూడెం పొగాకు బోర్డు), ఇ.నెం. 6-36, సర్వే నెం. 76/3లో, విస్తీర్ణం: 12,245.2 చ.గ.లు ఉన్నచోటు: గవరవరం గ్రామం, కొయ్యలగూడెం మండలం, పాత పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–డి: పాండురంగ రైస్ మిల్ మొత్తం, ఇ.నెం. 10-180, సర్వే నెం. 204/1లో, విస్తీర్ణం: ఎక 0-60 సెంట్లు, ఉన్నచోటు: కొయ్యలగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–ఇ: పెట్రోలు పంపు మొత్తం సర్వే నెం. 419/1బి, 468/2, విస్తీర్ణం: 532.4 చ.గ.లు పరింపూడి గ్రామంలో, కొయ్యలగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–ఎఫ్: ఉమ్మడి మాటూరు పంచాక్షరి ఫంక్షన్ హాలు మొత్తం, సర్వే నెం. 179/3, 179/4, 179/5, విస్తీర్ణం: 0.86 గుంటలు, పొంగుటూరు గ్రామంలో, కొయ్యలగూడెం (మం), పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–జి: భవనం మొత్తం, గ్రోమోరు సెంటరు మరియు కాలేజి, డోరు నెం. 4-142, విస్తీర్ణం: 1162 చ.గ.లు, ఆర్.ఎస్.నెం. 321/3లో, ఉన్నచోటు: పరింపూడి గ్రామం, కొయ్యలగూడెం (మం), పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–హెచ్: భవనం మొత్తం, ఇ.నెం. 13-28-32/2 (పాత ఇ.నెం. 13-29-24/1, 2), విస్తీర్ణం: సుమారు 241.66 చ.గ.లు, ఎం.వి.ఆర్. బిల్డింగ్, గూడ్స్ షెడ్ రోడ్, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.

సదరు దావా ముగిసే వరకు సదరు ఆస్తిని ఎలాంటి మూడవ పార్టీకి దారాదత్తం చేయరాదని, ఉత్తరువు జారీ చేయమని జడ్జి గారిని కోరుతూ సదరు దావాలో మధ్యంతర దరఖాస్తు 2025 నాటి ఐ.ఎ.నెం.1 కూడా దాఖలు అయింది. అందువల్ల సదరు దావా తీర్మానం అయ్యేవరకు సదరు ఆస్తిపై ఎలాంటి వ్యవహారం చేయరాదనీ సాధారణ ప్రజలందరికీ నా కక్షిదారుడు తెలుపడమైనది. ఒక వేళ ఎవ్వరైనా ఏ విధమైన వ్యవహారం చేసినచో అది సవాలు (ఛాలెంజి) చేయబడును. మరియు నా కక్షిదారునికి బంధింపజాలదు. మరియు అదనంగా న్యాయచర్యలు కూడా వారిపై తీసుకోబడును. పై సదరు ఆస్తులతో ఏ విధమైన అమ్మకం లేదా లీజు లేదా ఇంకే ఇతర వ్యవహారం చేయరాదని మేము సాధారణ ప్రజలకు తెలుపడమైనది. ఒక వేళ ఏ విధమైన వ్యవహారాలు జరిగినచో తీసుకొనే కాస్ట్ మరియు న్యాయపర చర్యలకు వారు మాత్రమే బాధ్యులగుదురు. అందువల్ల ఈ ప్రకటన ఇవ్వబడింది.

ఇట్లు: **మాటూరు సత్యనారాయణ**

సం/- **జి.జయేంద్రబాలాజీ,** న్యాయవాది, హైకోర్టు
ఆఫీసు: ఫ్లాటు నెం. 110, 11-5-8, హ్యాపీ హోమ్స్ క్యాస్టిల్ రెడ్ హిల్స్, నాంపల్లి, హైదరాబాద్, సెల్ నెం: 93933 90909

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

బాస్కెట్ బాల్ విజేత నూజివీడు సిద్ధార్థ కళాశాల జట్టు

క్రీడాకారులకు బహుమతి అందిస్తున్న అధ్యాపకులు

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నూజివీడు డీఏఆర్ కళాశాలలో ఈ నెల 19, 20 తేదీల్లో కృష్ణా యూనివర్సిటీ ఇంటర్ కళాశాల బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ పోటీల ఫైనల్‌లో నిర్వహించారు. విజయవాడ కేబీఎన్ కళాశాల జట్టుపై నూజివీడు సిద్ధార్థ కళాశాల జట్టు గెలుపొంది వరుసగా రెండోసారి ప్రథమ స్థానం ప్రైజ్‌ను కైవసం చేసుకుందని సిద్ధార్థ కళాశాల ప్రెసిడెంట్ గొల్లపూడి రవి ఆదివారం తెలిపారు. క్రీడాకారులను సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ సత్యనారాయణ, అంజాద్, పీజీ సెంటర్ ఫిజికల్ డైరెక్టర్లు శంకర్, రాజ్‌గోపాల్ తదితరులు అభినందించి బహుమతులు అందించారు.

లోక పావని.. పాహిమాం!

కైకలూరు, న్యూస్‌టుడే: కొలిచిన కొర్కెలు తీర్చే లోకపావని.. పాహిమాం.. అంటూ కొల్లేటికోటలో కొలువుదీరిన పెద్దింట్లమ్మ అమ్మవారి భక్తులు వేడుకున్నారు. ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు పలు జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. విశేష పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన ప్రధాన అర్చకుడు పరమేశ్వర శర్మ ఆధ్వర్యంలో కుంకుమార్చనలు, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ధూప సేవ, పంచహారతుల సేవ నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	ఆగిరిపల్లి:	9121229090
ముసునూరు	:93983 81268	చాట్రాయి:	8008574700
కైకలూరు	:73060 88555	మండవల్లి:	8106099008
కలిదిండి	:90594 84862	ముదినేపల్లి:	8008574693

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు బైపాస్ రోడ్డులో వినాయకుని గుడి సమీపంలో కొన్ని రోజులుగా చెత్త సేకరించడం లేదు. దీనిపై స్థానికురాలు హర్షిణి 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ ఈవో ప్రసాద్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన చెత్త వ్యర్థాలు తొలగింపజేశారు.

వీధి దీపాలు వెలిగాయి.. స్పందనకు సంకల్పం **ముసునూరు, న్యూస్‌టుడే:** ముసునూరు మండలం గోపవరంలో గత కొన్ని రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఆయా వీధుల్లో వెళ్లాలంటే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై శివారావు 'ఈనాడు' లో 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా కథనం ప్రచురితమైంది. దీనిపై ఆదివారం కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు స్పందించి వీధి దీపాలను మరమ్మతులు చేయించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం.. దళారుల రాజ్యం

● వ్యాపారుల బంధువర్గమే ఉద్యోగులు

● చిరిగిన సంచులు ఇచ్చిన సిబ్బందిపై జేసీ ఆగ్రహం

మండవల్లి, ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండలం పెదపాలపర్రులోని మిల్లును పరిశీలించిన జేసీ అభిషేక్‌గౌడ.. రైతులకు చిరిగిపోయిన సంచులు ఇవ్వడంపై సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముగ్గురు సిబ్బందిని ఇచ్చిన కనీసం వాటిని విడదీసి చూసి మంచివి ఇవ్వలేక పోతున్నారా అని ప్రశ్నించారు. ముదినేపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు పరిశీలనకు జేసీ అభిషేక్ గౌడ వచ్చి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అయితే అక్కడ సిబ్బంది ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆ గ్రామ వీఏఏకు షోకాజ్ నోటీసు అందించాలని అధికారులను ఆదేశించారు.

బొమ్మినంపాడులో తేమ పరిశీలన

నామమాత్రంగా నియామకం కొనుగోలు కేంద్రాల్లో పూర్తి స్థాయిలో సిబ్బందిని ఏర్పాటు చేయలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చాలా కేంద్రాల్లో రైతులకు కనీస సమాచారం అందించే నాథుడు కరవయ్యారు. ఏ కేంద్రంలో చూసినా ఒక్కరు మాత్రమే అందుబాటులో ఉంటున్నారు. దీంతో రైతులకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని రైతులు వాపోతున్నారు.

అమ్ముకోవడానికి తప్పని ఇక్కట్లు ఆరుగాలం రైతులు కష్టపడి ధాన్యం పండించినా, వాటిని అమ్ముకోవడానికి కష్టాలు తప్పడం లేదు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలోను వీఏఏతో పాటు సాంకేతిక సహాయకుడు, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పరును ఒప్పంద పద్ధతిలో నియమించారు. ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు పూర్తయ్యేవరకు వారు విధుల్లో ఉండాలి. ఇందుకు గాను నెలకు టీఏ, డీఈవోకు రూ.12 వేలు చొప్పున, హెల్పరుకు రూ.9 వేలు చొప్పున వేతనం అందిస్తారు. కైకలూరు నియోజకవర్గంలో అత్యధికంగా ముదినేపల్లి మండలంలో 14 కేంద్రాలు నియోజకవర్గంలో 23 కేంద్రాలు ఏర్పాటు చేశారు.

అంతా వారికి నచ్చిన వారే ముదినేపల్లి మండలంలో ఓ కేంద్రంలో టీఏగా ధాన్యం వ్యాపారి భార్యను నియమించారు. పైగా ఈ కేంద్రంలో మూడు ప్రధాన గ్రామాల రైతులు ధాన్యం విక్రయించుకుంటున్నారు. మరో కేంద్రంలో స్థానిక ప్రజాప్రతినిధి కుమారుడు, వీఏఏ బావాజీ కుమారుడిని నియమించుకున్నారు. వారు ఏనాడూ కేంద్రంలో కనిపించలేదని స్థానిక రైతులు వాపోతున్నారు. అలాగే కొన్ని కేంద్రాల్లో తమకు కావాల్సిన వారి పేర్లు రాసుకుని వారి విధులను వీవీఏలే ముక్కుబడిగా నిర్వర్తిస్తున్నారు. దీనివల్ల లక్ష్యం నీరుగారుతోంది. డీసీఎంఎస్ పర్యవేక్షకుడు విజయ్‌ను వివరణ కోరగా వెంటనే సిబ్బందితో సమావేశం నిర్వహించి రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం కూడలిలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా దేవస్థాన అర్చకుల ఆధ్వర్యంలో పలు అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు దర్శించుకున్నారు. అంతకు ముందు దేవస్థాన ప్రాంగణంలోని పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు దేవస్థానంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఆసౌకర్యం కలగకుండా ఈవో ఆర్.గంగాశ్రీదేవి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మద్ది క్షేత్రంలో హనుమద్ హోమం

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమద్ హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా చేపట్టిన పూజాది కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో ఆర్వీ చందన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చెత్త తొలగింపు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలంలోని భైరవపట్నం చెత్త సంపద కేంద్రం వద్ద చెత్తను అధికారులు తొలగించారు. చెత్త సంపద కేంద్రాల వినియోగం సక్రమంగా లేకపోవడంపై ఈ నెల 17న 'ఈనాడు' 'ఇదో చెత్త నిర్వహణ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో రమణబాబు ఆదేశాల మేరకు భైరవపట్నం చెత్త సంపద కేంద్రం వద్ద చెత్త తొలగించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బాలోత్సవంలో విద్యార్థుల ప్రతిభ

ముసునూరు, న్యూస్‌టుడే: నూజివీడులో సెయింట్ థామస్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన బాలోత్సవంలో ముసునూరు మండలం చెక్కపల్లికి చెందిన చైతన్య పాఠశాల విద్యార్థులు అత్యధిక ప్రదర్శన కనబరిచి అకడమిక్, నాన్ అకడమిక్‌లో విజయం సాధించారని పాఠశాల డైరెక్టర్ కొమిరినేని నాగబాబు, ప్రిన్సిపల్ కేశవరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లల్లో ప్రతిభను వెలికితీసేందుకు బాలోత్సవం ఎంతగానో దోహదపడుతుందన్నారు. బాలోత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. పిల్లలు అన్ని రంగాల్లోనూ రాణించేలా తల్లిదండ్రుల ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

బహుమతులు అందుకుంటున్న చిన్నారులు

భాజపా యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా అవినాశ్

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ యువ మోర్చా జిల్లా కార్యదర్శిగా నూజివీడు పట్టణానికి చెందిన బోను అవినాశ్ నియమితులయ్యారు. ఈ మేరకు యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగ సురేశ్ చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన భాజపా జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్, ఉపాధ్యక్షుడు బోను అప్పారావులకు ధన్యవాదాలు తెలిపారు. నియమితులైన అవినాశ్‌కు సీనియర్ నాయకులు జి.ఆర్.కె.రంగారావు ఎం.రాజశేఖర్, మాటూరి రవికాంత్ తదితరులు అభినందనలు తెలిపారు.

సన్మానిస్తున్న నాయకులు

సామాజిక సేవలో రాజేంద్రప్రసాద్‌కు పురస్కారం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సామాజిక సేవను బాధ్యతగా తీసుకున్న ముదినేపల్లి మండలం పెయ్యేరు పాఠశాల ఉపాధ్యాయుడు బేతాళరాజేంద్రప్రసాద్‌కు అవార్డు వరించింది. ద్వారకా తిరుమల రితిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ రామకృష్ణ, సినీ నటి జగదీశ్వరి చేతుల మీదుగా అవార్డు అందంచి, సన్మానించారు. పేద విద్యార్థులకు మరింతగా సేవలందించేందుకు కృషి చేయాలని సభా సభ్యులు కోరారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు

ముసునూరు, న్యూస్‌టుడే: కంటి వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయమని తెదేపా గ్రామ అధ్యక్షుడు కాటేపల్లి సత్యనారాయణ, నాయకులు చిలుకూరి వెంకటేశ్వరరావు, తల్లిబోయినపల్లి సత్యనారాయణ, కాటేపల్లి శ్రీనివాసరావు అన్నారు. ముసునూరు మండలం చెక్కపల్లిలో ఆదివారం నూజివీడు వర్ష క్లినిక్ అండ్ ఆప్టికల్స్ వైద్యులచే విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 150 మందికి వైద్యులు పరీక్షలు చేశారు.

రూ.కోట్ల వ్యయం.. లక్ష్యం శూన్యం

ముసునూరు, న్యూస్‌టుడే: ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంటలకు ఆశించిన ధరలు వచ్చేటప్పుడే అమ్ముకునేందుకు వీలుగా గత ప్రభుత్వం గిడ్డంగులు (గోదాముల) నిర్మించింది. కర్షకులను ఆదుకునేందుకు ప్రతిష్ఠాత్మకంగా గోదాముల నిర్మాణం చేపట్టామని చెప్పడం తప్ప వాటి ప్రారంభం, నిర్మాణానికి చర్యలు తీసుకోలేదు. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన గోదాములు నిరుపయోగంగానే దర్శనమిస్తున్నాయి. మరికొన్ని చోట్ల అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలనే ప్రభుత్వాల లక్ష్యం నీరుగారుతోంది.

ఇదీ పరిస్థితి

మండలం	మంజూరైనవి	పూర్తయినవి	పూర్తి కానివి
ముసునూరు	7	1	6
నూజివీడు	3	1	3
ఆగిరిపల్లి	3	2	1

గోపవరంలో నిరుపయోగంగా గోదాము

ప్రభుత్వ సొమ్ము వృథా

నూజివీడు నియోజకవర్గంలో రైతుల ఉత్పత్తులను నిల్వలు చేసుకునేందుకు వెయ్యి టన్నుల గోదాముల నిర్మాణానికి రూ.80 లక్షలు, 500 టన్నుల సామర్థ్యం గల గోదాము నిర్మాణానికి రూ.40 లక్షల మేర నిధులు కేటాయించారు. ఈ గోదాముల నిర్మాణానికి తీసుకున్న రుణ వడ్డీ భారం పెరుగుతుంది తప్ప ఉపయోగం ఉండటం లేదు. పూర్తయిన భవనాల సముదాయం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతున్నాయి. పలుచోట్ల కొన్ని భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. మరి కొన్ని చోట్ల భవనాలు పూర్తయినా అందుబాటులోకి రాలేదు. పండించిన ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీంతో దళారులు అడిగిన ధరకు పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వమైనా స్పందించి వాటిని నిర్మించి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తే తాము పండించిన పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి వీలు ఉంటుందని కర్షకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అందుబాటులోకి తెస్తాం

గోదాములను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం. వాటి నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పనులను పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.
- రవికుమార్, డీఎల్‌సీవో, నూజివీడు

తీరిన రెండేళ్ల కష్టాలు

శరవేగంగా జాతీయ రహదారి నిర్మాణం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పామర్రు-దిగమర్రు జాతీయ రహదారి-165 విస్తరణలో భాగంగా మండల కేంద్రమైన ముదినేపల్లిలో రెండేళ్లుగా పనులు సాగుతున్నాయి. రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం చేసి రోడ్డంతా తవ్వి వదిలేశారు. కొన్ని నెలల అనంతరం సిమెంటు మిశ్రమాన్ని వేయడంతో విపరీతమైన దుమ్ముతో వాహనదారులు, స్థానిక నివాసితులు, దుకాణదారులు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. వాహనాలపై వెళ్లే క్రమంలో గాలి వేగానికి దుమ్ము ఎగసిపడి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక.. కంకర రాళ్లపై వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురై వందలాది మంది ఆసుపత్రుల పాలయ్యారు. ఈ తరుణంలో ఇటీవల ప్రారంభించిన రోడ్డు విస్తరణ పనులు వేగం పుంజుకొన్నాయి. గతంతో ఇక్కట్లకు స్వస్తి పలుకుతూ ఆదివారం ముదినేపల్లిలో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. వాహనదారుల కష్టాలు ఎట్టకేలకు తీరడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న పనులు

గుంత పూడ్చారు.. మట్టి గుట్ట తొలగించడం మరిచారు..

ముదినేపల్లి, న్యూస్‌టుడే: వడాలిలోని ప్రధాన సెంటరులో పైపులైను లీకేజీ కావడంతో గుంత తవ్వారు. సుమారు వారంరోజుల తర్వాత మరమ్మతులు చేసి గుంత పూడ్చారు. అయితే ఆ గుంత పూడ్చి పది రోజులు కావస్తున్నా రహదారిపై ఉన్న మట్టి గుట్ట తొలగించలేదు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రులు ఆ గుట్ట కనిపించక వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి విజయబాబును సంప్రదించగా.. తాను కొత్తగా వచ్చానని, వెంటనే పరిశీలించి గుట్ట తొలగిస్తామని తెలిపారు.

రహదారి మధ్యలో ఉన్న మట్టిగుట్ట

పరిశీలిస్తున్న వినూత్న

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: అయిదేళ్ల లోపు చిన్నారుల్లో పోలియో వ్యాధి నియంత్రణకు రెండు పోలియో చుక్కలు వేయించాలని నూజివీడ్ సబ్ కలెక్టరు వినూత్న అన్నారు. ఆదివారం నూజివీడులో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. పోలియో చుక్కల మందు పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచి, వ్యాధులు రాకుండా కాపాడుతుందన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి మాట్లాడుతూ.. డివిజన్‌లో 45,789 మంది పిల్లలకు 353 బూత్‌లలో 1412 మంది సిబ్బందితో పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేస్తామని తెలిపారు.

పోలియో చుక్కలతో రోగ నిరోధక శక్తి: సబ్‌కలెక్టరు

కైకలూరు, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేసి చిన్నారుల బంగారు భవిష్యత్తును రక్షించుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి శోభారాణి, పల్స్ పోలియో నోడల్ అధికారి రోహిత్ అన్నారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం సీతనపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని దొడ్డిపట్ల, సీతనపల్లి, కైకలూరు తదితర గ్రామాల్లో నిర్వహించిన శిబిరాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో 4488 మంది 5 ఏళ్ల లోపు పిల్లలు ఉండగా 4399 మందికి పోలియో చుక్కలు వేసినట్లు సీతనపల్లి వైద్యురాలు కె.అన్నపూర్ణ తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కార్యక్రమం చేపట్టామని సోమవారం సైతం ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య, ఆశా కార్యకర్తలు చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు. సర్పంచులు సంఘం మండలాధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి, ముదినేపల్లి న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజంకోసం ప్రతిఒక్కరు పాటుపడాలని తెదేపా కన్వీనర్ వీరమల్లు నర్సింహారావు పేర్కొన్నారు. పోలియో ఆదివారాన్ని పురస్కరించుకుని ముదినేపల్లి, మండవల్లి మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. రెండు చుక్కలు చిన్నారులకు నిండైన జీవితాన్ని ప్రసాదిస్తాయని తెలిపారు. ఈ వ్యాధి ఒకసారి సోకితే జీవితాంతం బాధ పడాలని అందుకే ప్రతి చిన్నారికి చుక్కలు అందేలా చూడాలన్నారు. ఇందులో భాజపా మండలాధ్యక్షుడు బోయిడి సురేశ్‌బాబు, గణేశ్, మండవల్లి సర్పంచి ఝాన్సీ, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు

మంచినీటి చెరువును పరిశీలించిన ఎంపీడీవో

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం గన్నవరం మంచినీటి చెరువు నింపే నిమిత్తం నెలకొన్న వివాదంపై ఎంపీడీవో రమణబాబు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ చెరువును పరిశీలించారు. మండవల్లి వైపు నుంచి నీటిని నింపడంతో ఏటా రూ.3లక్షలు అదనంగా ఖర్చవుతుందని నీటి సంఘం అధ్యక్షుడు కూనపరెడ్డి కోటేశ్వరరావు ఆరోపించారు. మోఖసా కలవపూడి వైపు నుంచి నీటిని నింపడం వల్ల డబ్బు ఆదా అవుతున్నా సర్పంచి వినిపించుకోవడం లేదని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో చెప్పారు.

ఆసుపత్రి అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయండి

రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ప్రతాప అప్పారావు

ముసునూరు, న్యూస్‌టుడే: నూజివీడు ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ, స్థానిక మంత్రి ఆసుపత్రి అభివృద్ధికి కట్టుబడి, చిత్తశుద్ధితో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు అన్నారు. ఆదివారం వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నూజివీడు ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.

తమ్మిలేరు ముంపు భూములను విడదీయాలి

ముంపు భూముల్లో ఎర్ర జెండాలతో స్థానికులు

చాట్రాయి, న్యూస్‌టుడే: వలస భూస్వాముల ఆక్రమణలోని తమ్మిలేరు జలాశయం ముంపు భూములను వెంటనే విడదీయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. మంకొల్లులో ముంపు భూములను పేదల ఆధ్వర్యంలో ఆదివారం ఆక్రమించి ఎర్ర జెండాలను పాతారు. ఆయన మాట్లాడుతూ భీమవరానికి చెందిన వ్యాపారులు ఇక్కడ భూములను కబ్జా చేసి ఫెన్సింగ్ వేసి వాణిజ్య పంటల సాగుకు చేపట్టారని తెలిపారు. ముంపు భూములపై ఎవరికీ హక్కుల్లేకున్నా వారు సాగు చేస్తుంటే తమ్మిలేరు యంత్రాంగం పట్టనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో తగరం తిరుపతిరావు, నందిపాం గిరిబాబు, గొల్లమందల నారాయణరావు పేదలు పాల్గొన్నారు.

కష్టపడి పని చేయాలి: ఎమ్మెల్యే

లింగపాలెం(చింతలపూడి), న్యూస్‌టుడే: పార్టీలో పదవులు మరింత బాధ్యతగా పనిచేసేందుకు ఇచ్చే గౌరవం అని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో నూతనంగా ఏర్పాటైన తెదేపా మండల, గ్రామ కమిటీలతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో లింగపాలెం మండలం పుప్పాలవారిగూడెంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెదేపా అభివృద్ధికి కష్టపడిన వారిని గుర్తించి పదవులు కేటాయించామన్నారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ.. తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత దివంగత ఎన్టీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. పుప్పాలవారిగూడెంలో తెదేపా పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

సందడిగా.. మహిళల క్రిస్మస్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రేమను పంచడమే నిజమైన క్రిస్మస్ అని పాస్టర్ కాటూరి జాన్ సునీల్ తెలిపారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని మెట్రోపాలిటన్ మిషన్ చర్చిలో ఆదివారం సాయంత్రం 'మహిళల క్రిస్మస్' సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు కలపాల అజయ్, సందిపాము శారద దంపతులు 100 మంది వృద్ధులకు, వితంతువులకు చీరలను అందజేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో కలపాల ప్రసాద్, సీహెచ్ నాగేశ్వరరావు, కె.ఎలీషా పాల్గొన్నారు.

మహిళకు చీర అందజేస్తున్న ప్రధానోపాధ్యాయిని శారద, పక్కన పాస్టర్ జాన్‌సునీల్, ఉపాధ్యాయుడు అజరయ్య

ఘనంగా ముందస్తు వేడుకలు.. ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఏలూరు జేవియర్ నగర్‌లోని బిషప్ గృహంలో ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ సందర్భంగా ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ జయరావు కేక్ కోసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, జడ్పీ ఛైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, నగర మేయర్ షేక్ నూర్జహాన్, భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, ఏపీఎస్ ఆర్టీసీ జోన్ 2 రీజినల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జుంజు మోసెస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, ఎఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	అఖండ 2
సత్యనారాయణ మినీ	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	....
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	అవతార్ ఫైర్ అండ్ యాష్
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	....
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	తెలుసు కదా
కైకలూరు: శ్రీవిజయలక్ష్మి జీ3	అవతార్
మాగంటి సినిమాస్	గుర్రం పాపిరెడ్డి
శ్రీవెంకటరమణ సినిమాస్	అఖండ-2
ముదినేపల్లి: పూర్ణిమ	అఖండ-2

అర్హత తేల్చేలా.. అండగా నిలిచేలా..

● ఇక కుటుంబాల లెక్క పక్కా

● గ్రామాల్లో ఏకీకృత సర్వే ప్రారంభం

నూజివీడు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏదైనా సంక్షేమ.. అభివృద్ధి పథకం కొత్తగా అమల్లోకి తెస్తే సర్వే చేయాల్సి వస్తోంది. భవిష్యత్తులో సర్వేల అవసరం లేని విధంగా ప్రజల సమగ్ర సమాచార సేకరణకు కూటమి ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏకీకృత(యూఎఫ్ఎస్) సర్వే చేపట్టింది. ప్రతి కుటుంబం.. అందులోని సభ్యుల సమాచారాన్ని పక్కాగా సేకరిస్తోంది. తద్వారా సంక్షేమ పథకాలు, పౌరసేవల్ని మరింత నాణ్యంగా, వేగంగా పారదర్శకంగా అమలు చేసేలా చర్యలు చేపడుతోంది.

నియోజకవర్గ సమాచారం ఇలా..

మండలం	సచివాలయాలు	సర్వే చేయాల్సిన కుటుంబాలు
నూజివీడు పట్టణం	16	18,178
నూజివీడు రూరల్	26	25,591
ఆగిరిపల్లి	19	22,415
ముసునూరు	16	19,893
చాట్రాయి	16	18,777

వివరాలు తెలుసుకుంటున్న సచివాలయ ఉద్యోగి

అనంతరం అధికారులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ఇంటి ప్రదేశాన్ని గుర్తించి మ్యాపింగ్ చేస్తారు. దీంతో సర్వే పూర్తి అవుతుంది. సర్వే నెల రోజుల పాటు జరుగుతుంది. గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు.

ప్రయోజనాలు.. ప్రభుత్వం ప్రస్తుతం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఆటో డ్రైవర్ సేవలో, పీఎం కిసాన్ లబ్ధి తదితర సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా సంబంధిత ఆయా శాఖలు సర్వేను ప్రామాణికంగా తీసుకుంటాయి. తర్వాత ప్రభుత్వం ఏ పథకమైనా కొత్తగా పథకం అమల్లోకి తెస్తే దీన్నే ఆధారంగా తీసుకుంటుంది.

ప్రశ్నలివీ.. మొత్తం 38 రకాల ప్రశ్నల ద్వారా అధికారులు ఆయా వివరాలు తెలుసుకుంటారు. వాటిల్లో ముఖ్యంగా వ్యక్తిగత, తల్లిదండ్రుల వివరాలు, విద్య, ఉద్యోగం, జీవనోపాధి, గృహోపకరణాలు, వాహనాలు, కుటుంబ ఆదాయం తదితర వివరాలు తెలుసుకుంటారు. విద్యార్హత పత్రాలు, ఆధార్, కులధ్రువీకరణ, బియ్యం, ఓటు గుర్తింపు కార్డు వంటివి పరిశీలిస్తారు.

ప్రజలు సహకరించాలి.. ప్రతి ఒక్కరూ ఈ సర్వేకు సహకరించి కచ్చితమైన వివరాలు ఇచ్చి నమోదు చేసుకోవాలి. ఇది ప్రతి కుటుంబానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భవిష్యత్తులో ఈ సర్వే ఆధారంగానే ప్రభుత్వ పథకాలు అందుతాయి. - వెంకటరత్నం, డీఎల్‌డీవో, నూజివీడు

పట్టు తప్పితే ప్రమాదమే

ముసునూరు, న్యూస్‌టుడే: నిత్యం కళ్లెదుట జరుగుతున్న ఎన్నో ప్రమాదాలను చూస్తున్నాం. మరో వైపు నిబంధనలు పాటించాలంటూ పోలీసులు ప్రచారం చేస్తున్నారు. కొందరు వాహనదారులకు ఇవేవీ పట్టడం లేదు. పరిమితికి మించి ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వివిధ పనులు నిమిత్తం ముసునూరు నుంచి చింతలవల్లి వైపు వెళ్లే మినీ వాహనం ట్రాలీలపై కొందరు కూలీలు కూర్చొని నిర్లక్ష్యంగా ప్రయాణం చేస్తున్నారు. అసలే రహదారి గుంతల పడి అధ్వానంగా తయారైంది. వేగ నిరోధకాలు, గుంతల మధ్య కుదుపులకు అదుపు తప్పితే ప్రాణాలకు ముప్పు తప్పదు. బాధ్యతా రాహిత్యంతో జరిగే రోడ్డు ప్రమాదాలకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకర ప్రయాణాలు సాగించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గండ్లు పూడ్చివేతకు చర్యలు

ముసునూరు, న్యూస్‌టుడే: చివరి ఆయకట్టు వరకు సాగు నీరందించేందుకు చర్యలు చేపట్టినట్లు డీసీ ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ తెలిపారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు నాగార్జునసాగర్ ఎడమ కాలువ ద్వారా వేంపాడు మేజర్ కాలువకు వచ్చే నీరు ముసునూరు మండలం సూరేపల్లి వద్ద వరద ఉద్ధృతికి సుమారు 700 ఎకరాలకు వెళ్లే గట్లకు ఏడు చోట్ల గండ్లు పడ్డాయి. ఈ విషయాన్ని ఇటీవల రైతులు, తెదేపా గ్రామ అధ్యక్షుడు చళ్లగుళ్ల మల్లిబాబు, డీసీ ఛైర్మన్ బాలకృష్ణ మంత్రి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ఆదేశాలతో మంగళవారం యంత్రంతో గండ్లను పూడ్చేశారు. రైతుల పొలాలకు వెళ్లేందుకు దారి సౌకర్యం అనువుగా లేకపోవడంతో 100 ట్రిప్పుల మట్టి తోలించి చదును చేయించారు. ఈఈ రాందాస్, కొల్లి గంగారాం, సభ్యులు పాల్గొన్నారు.

(c) eenadu

ఆధ్యాత్మిక శోభ

అష్టోత్తర పూజలు చేస్తున్న అర్చకులు

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం ఆదివారం వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో శోభిల్లింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తిరుప్పావై సేవ, లక్ష్మీఐశ్వర్య హోమం, గోపూజ, అష్టోత్తర శతనామావళి, కల్యాణం, బాలభోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. ఆలయ పరిసరాలన్నీ గోవింద నామస్మరణతో మారుమోగాయి.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో

నిండు జీవితానికి రెండు చుక్కలు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: జిల్లాలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 1,94,437 మంది చిన్నారులకు గాను 1,46,061 మందికి పోలియోచుక్కలు వేశారు. ప్రజాప్రతినిధులు, డీఎంహెచ్‌వో నరసింహనాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్ఫూర్తిప్రదాత వాజ్‌పేయీ

కాకినాడలోని రామారావుపేట జంక్షన్ వద్ద వాటర్ వర్క్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. వైద్యారోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. వాజ్‌పేయీ అందరికీ స్ఫూర్తిప్రదాత అని కొనియాడారు. పెద్దసంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, గాంధీనగర్

ప్రమాదాల కట్టడిపై నిర్లక్ష్యం

సమీక్షలతో సరి.. సరిచెయ్యరేంటి మరి?

ఈనాడు, కాకినాడ: రోడ్డు ప్రమాదాలకు వాహనచోదకులే కాదు అధికారుల నిర్లక్ష్యం తోడవుతోంది. ప్రతి నెలా రహదారి భద్రతా కమిటీలు సమీక్షలు నిర్వహిస్తున్నా ప్రమాదాల కట్టడి దిశగా చర్యలు తీసుకోలేకపోతున్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం కొరవడటం, నిధుల లేమితో లోపాలను సరిచేయలేని దుస్థితిలో ఉన్నారు. రాష్ట్రంలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న జిల్లాల జాబితాలో కాకినాడ మూడో స్థానంలో ఉంది. జాతీయ రహదారులపైనే ఎక్కువ చోటు చేసుకుంటున్నాయి.

గండేపల్లి కూడలి వద్ద కానరాని రక్షణ చర్యలు

సమస్యలు గుర్తించినా..

రోడ్డు భద్రతా కమిటీకి కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తుంటారు. పోలీస్, రవాణా, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, పురపాలిక, ఆరోగ్య, విద్యాశాఖలకు చెందిన విభాగాల అధిపతులు, ఎన్జీవో నుంచి ఒకరు ఈ కమిటీ సభ్యులుగా ఉంటారు. నెలవారీ ప్రమాదాలపై సమీక్షించడం, లోపాలను గుర్తించి సరిదిద్దేలా ఆయా శాఖలకు బాధ్యతలు అప్పగిస్తారు. కానీ వాటిని పరిష్కరించడంలోనే విఫలమవుతున్నారు. కొన్ని లోపాలపై ఎన్‌హెచ్ఐకు సూచిస్తే వారు తమ చేతిలో ఏంలేదు దిల్లీ నుంచి అనుమతులు రావాలని దాటేస్తున్నారు. పురపాలక, ర.భ.శా అధికారులు కూడా నిధులు లేవు వచ్చాక చూస్తామంటూ సరిపెట్టేస్తున్నారు.

కొన్ని సమావేశాల్లో సూచించిన అంశాలు..

- గండేపల్లి నుంచి తుని వరకు వాహనాల వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాల్లోనే వేగాన్ని గుర్తించి నిబంధనలు అతిక్రమించిన వారికి నేరుగా చలానాలు పంపించే ఏర్పాటు చేయాలి.
- తుని నుంచి బెండపూడి మధ్యలో జాతీయ రహదారిపై సోలార్‌తో పనిచేసే బ్లింకర్లలో చాలావరకు పడకేశాయి. వాటిని వెంటనే సరిచేయాలి.
- బ్లాక్ స్పాట్‌లు పరిశీలించి, ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.
- పిఠాపురం, గొల్లప్రోలు కూడళ్లలో లైటింగ్ తక్కువగా ఉంటోంది. ఉప్పలంక నుంచి సుంకరపాలెం కూడలి మధ్యలో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడ బ్లింకర్లు పనిచేయడం లేదు. కాంతి తక్కువగా ఉంటోంది.
- తాళ్లరేవు మండలం కోరింగ ప్రాంతంలో వాహనాలను గమనించకుండా రోడ్లపైకి జనాలు అకస్మాత్తుగా వస్తున్నారు. ఆయా గ్రామాల పరిధిలో ఐరన్ గ్రిల్స్‌తో బారికేడ్‌లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడమే తప్ప వీటిలో ఏ ఒక్కటీ కార్యరూపంలోకి తేలేకపోతున్నారు.

లోపాలు సరిదిద్దుతున్నాం..

‘గతంలో సమీక్షించిన వాటిలో చాలా వరకు లోపాలు సరిదిద్దడంతో గతేడాదితో పోల్చితే ప్రమాదాలు తగ్గాయి. ఎన్‌హెచ్ 16లో వేగాన్ని గుర్తించే కెమెరాలు 150 చోట్ల ఏర్పాటుకు చేయాలని ప్రతిపాదించాం. - శ్రీధర్, ఉప కమిషనర్, రవాణా శాఖ

జనవరి నుంచి అక్టోబరు వరకు పరిశీలిస్తే..	
రోడ్డు ప్రమాదాలు	436
మరణాలు	285
జాతీయ రహదారులపై ప్రమాదాలు	294
మరణాలు	178

జిల్లా పరిధిలో జాతీయ రహదారులు	
ఎన్‌హెచ్ 16	80 కి.మీ
ఎన్‌హెచ్ 216	60.12 కి.మీ

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

సాంబమూర్తినగర్: ఈ నెల 22వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షాన్‌మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ వివేకానంద హాలులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫిర్యాదులకు సంబంధించిన పురోగతి, సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

పంచ్ కొట్టు.. పతకం పట్టు

వీరవరంలోని ఆర్ఆర్ బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళా బాక్సింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారిణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యర్థులపై పంచ్‌లతో విరుచుకుపడ్డారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే, వీరవరం

రూ.7కి చేరువలో గుడ్డు

రంగంపేట, న్యూస్‌టుడే: కోడిగుడ్డు ధర పరుగులు పెడుతోంది. ప్రస్తుతం కోళ్లఫారంలో గుడ్డు ధర రూ.6.90పైసలు ఉండగా రూ.7లకు అతిత్వరలోనే చేరుతుందని అంచనాలు ఉన్నాయి. దుకాణాల్లో గుడ్డుని విడిగా రూ.8లకు విక్రయిస్తున్నారు. క్రిస్మస్ సంబరాలు, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా కేకుల తయారీలో గుడ్లను వినియోగించడంతో డిమాండు నెలకొంది. మరో వైపు ఉత్తరాది రాష్ట్రాల్లో గుడ్డు వినియోగం పెరిగింది. గుడ్ల ఉత్పత్తి తగ్గడం.. వినియోగం పెరగడంతో ధర ఎగబాకుతోంది.

ఆలకించరండి.. సౌకర్యవాణి..!

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

గత వైకాపా ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేసిన చరవాణిలు సరిగా ఉపయోగపడకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యాప్‌లు సరిగా పనిచేయకపోవడం, మధ్యలో పోషణ ఆగిపోవడం తదితర కారణాలతో ఈ పోషణ్ వివరాల నిర్వహించాలంటే మంటూ గత ఆగస్టు నెలలో అంగన్‌వాడీ సిబ్బంది అంతా మూకుమ్మడిగా చరవాణిలను ఆయా ఐసీడీఎస్ కార్యాలయాలకు అప్పగించేశారు. చేసేది లేక సొంతంగా కొనుక్కున్న వాటితో పనులు నిర్వహించుకునేవారు. సిబ్బంది కష్టాలు గుర్తించిన కూటమి ప్రభుత్వం 5 జీ నెట్‌వర్క్‌తో కొత్త చరవాణిలు అందించింది. దాంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు	1,986
5 జీ చరవాణిలిచ్చింది	1986 మంది కార్యకర్తలకు
స్వీకరించిన ఇతరులు: సూపర్‌వైజర్లు	78
పోషన్ అభియాన్ బ్లాక్ సమన్వయ కర్తలు	9

కొత్త ఫోన్‌తో లబ్ధిదారుల వివరాల నమోదు

త్వరితగతిన వివరాల నమోదు

ఈ చరవాణిలో పోషణ్ ట్రాకర్‌తోపాటు బాల సంజీవని, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన(పీఎంఎంవీవై) తదితర యాప్‌లలో లబ్ధిదారుల నమోదు వివరాలు త్వరితగతిన చేయవచ్చని చెబుతున్నారు. ప్రభుత్వం సమకూర్చిన కొత్త చరవాణిలను జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిణీ చేశామని, ఒక్కో చరవాణి ధర రూ.13 వేల వరకు ఉంటుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి తెలిపారు.

అడ్డగోలుగా తవ్వకాలు.. ఖాళీ స్థలాలు హాంఫట్

అక్రమార్కుల దందా.. మౌనముద్రలో యంత్రాంగం

పెట్టుబడి అక్కర్లేదు.. జేబు నిండాలంటే పోలవరం కాలువ మట్టి కొల్లగొట్టాల్సిందే. రేయింబవళ్లు యథేచ్ఛగా తవ్వుతున్నా అడిగేవారు, ఆపేవారే ఉండరు. పరిమితికి మించి పల్లెలు, రహదారిపై మట్టిని తరలిస్తున్నా ట్రాక్టర్లను అడ్డుకునేవారే ఉండరు. గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల పరిధిలో పోలవరం కాలువ గట్టును అక్రమార్కులు గుల్లగొడుతూ ఇష్టారాజ్యంగా తరలిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు మౌనం వీడరు. – న్యూస్‌టుడే, గండేపల్లి

నీలాద్రిరావుపేటలో పోలవరం కాలువ మట్టిని తవ్వేస్తున్న అక్రమార్కులు

క్యూబిక్ మీటరు మట్టికి సుమారు రూ.145 చెల్లించి, ఎంత తవ్వుకుంటే అంత మొత్తానికి నగదు చెల్లించి అనుమతులు పొందాలి. అయితే ఒక్క రూపాయి చెల్లించకుండా అక్రమార్కులు ప్రభుత్వం చేసిన కోసం తీసుకొచ్చిన చట్టాలను ఉల్లంఘిస్తూ మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు మట్టి దూరాన్ని బట్టి రూ.400 నుంచి 600 వరకు వసూలు చేస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు.

జలవనరుల శాఖకు రూ.కోట్లు నష్టం..

నియోజకవర్గ పరిధిలో ఇలా..

గండేపల్లి, మల్లేపల్లి, తాళ్లూరు, నీలాద్రిరావుపేట, జగ్గంపేట మండలం రామవరం వరకు పోలవరం కాలువ మట్టి 13 కి.మీ మేర జగ్గంపేట సబ్‌డివిజన్-4లో ఉంది. తాళ్లూరు నుంచి రామవరం వరకు 5 కి.మీ మేర పుష్కర కాలువ మట్టి ఉంది. ప్రస్తుతం పుష్కరకాలువ గట్టు చూడ్డానికి కనిపించదు. అక్రమార్కులు దోచేయడం, కొండర స్థలలుగా, షెడ్లుగా, ఇతరేతర వాటిలో కాలక్రమేణ కలిసిపోయింది. ఈ పరిధిలో ఉన్న పోలవరం గట్లును లేఅవుట్లుకు, ఇతర ప్రాంతాల్లో పెద్ద,పెద్ద పొలాలను ఎత్తులు చేసేందుకు తరలిస్తున్నారు. ఖాళీ స్థలాలను కబ్జాలుగా మారుస్తున్నారు. అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా రెవెన్యూశాఖకు పట్టదు.

తవ్వకాలకు ఏ అనుమతులు లేవు

పుష్కర, పోలవరం గట్టు తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవు. సమాచారంతో తవ్వే ప్రాంతాలకు వెళ్లేసరికి జారుకుంటున్నారు. అక్రమ తవ్వకాల ప్రాంతాల్లో నిఘా పెట్టి, వాహనాలు సీజ్ చేస్తాం. - రమణమూర్తి జేఈ, పుష్కర, పోలవరం, జగ్గంపేట

భవనాలకు నై.. స్థలాలకు సై

ఈనాడు, కాకినాడ

పురపాలకశాఖ పరిధిలో అక్రమ నిర్మాణాలు, అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్), ఎల్ఆర్ఎస్ (లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) పథకాలతో యజమానులకు హక్కులు కల్పించనున్నారు. దీంతో పట్టణ స్థానిక సంస్థలకు ఆదాయం రానుంది. అయితే ఈ పథకాలకు మిశ్రమ స్పందన వస్తోంది. అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు మొగ్గు చూపుతున్నా అక్రమ నిర్మాణాలను సక్రమం చేసుకోవడానికి మాత్రం వెనుకంజ వేస్తున్నారు.

ఇవీ అడ్డంకులు..

- గతంలో రూ.10 వేల రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకుంటే సరిపోయేది. ఇంజినీర్లు పరిశీలించి నిర్మాణాల విలువను లెక్కించి మిగతా అపరాధ రుసుము చెల్లించి సక్రమం చేసుకునేవారు. తాజా బీపీఎస్‌లో నిర్మాణానికి చెందిన డాక్యుమెంట్లు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాతనే జరిమానా చెల్లించడానికి అవకాశం ఇచ్చారు. యజమానుల వద్ద భూమి హక్కు పత్రాలు, నిర్మాణ ప్లాన్, సైట్ స్కెచ్ వంటివి ఉండటం లేదు. దీంతో ఎక్కువ మంది ముందుకు రాలేకపోతున్నారు.
- కొంతమంది రెండంతస్తులకు అనుమతి తీసుకుని మరో అంతస్తు నిర్మిస్తున్నారు. ఇలాంటి వారి నుంచి స్థానిక నాయకులు ముందే కొంత వసూలు చేసి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీలు ఇవ్వడంతో చాలామంది దరఖాస్తులు చేయడం లేదు.
- వంద గజాలలోపు ఉన్న రెండంతస్తుల నివాస భవనాలకు బీపీఎస్ అవసరం లేదు. ఇదే అదునుగా వాణిజ్య భవనాలను నివాసాలుగా చూపించి దరఖాస్తులు చేయడం లేదు.

బీపీఎస్ పథకం అమలు	
గుర్తించిన అక్రమ నిర్మాణాలు	3,615
బీపీఎస్‌కు దరఖాస్తులు	111
జరిమానాతో వచ్చిన ఆదాయం (రూ. లక్షల్లో)	11
రాష్ట్రంలో స్థానం	23
ఎల్ఆర్ఎస్	
అనధికార లేఅవుట్ల నుంచి వచ్చిన దరఖాస్తులు	5,571
జరిమానా ఆదాయం(రూ.కోట్లలో)	44.36
రాష్ట్రంలో స్థానం	6

విధేయతకే పట్టం

తెదేపా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నవీన్, శ్రీనివాసబాబా

జ్యోతుల నవీన్‌కుమార్

పెంకే శ్రీనివాసబాబా

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా తెదేపా అధ్యక్ష, కార్యదర్శులుగా పాతవారికే అధిష్ఠానం పగ్గాలు అప్పగించింది. జిల్లా అధ్యక్షుడిగా జ్యోతుల నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పెంకే శ్రీనివాసబాబాల పేర్లు ఖరారు చేసింది. వీరిద్దరూ 2020 నుంచి అవే పదవుల్లో పనిచేశారు. పార్టీ ప్రతిపక్షంలో ఉండగా కష్టపడి పనిచేశారనే గుర్తింపు ఉంది. నవీన్‌కుమార్ గత ఎన్నికల్లో కాకినాడ ఎంపీ టిక్కెట్‌ను, శ్రీనివాసబాబా కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే టిక్కెట్‌ను ఆశించారు. ఈ రెండు సీట్లు సమీకరణాల రీత్యా జనసేనకు కేటాయించడంతో వీరికి అవకాశం దక్కలేదు. గత ఎన్నికల్లో ఇద్దరి పనితీరు, సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకుని తెదేపా జిల్లా కమిటీలో మరోసారి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా వారు ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ పార్టీ రెండోసారి ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, నాయకులను సమన్వయం చేసుకుని తెదేపాను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు.

దర్శనం నుంచి ప్రసాదం వరకు అంతా డిజిటల్

సాంకేతిక లోపాలతో భక్తులకు ఇబ్బంది

తుని పట్టణం, తుని గ్రామీణం, న్యూస్‌టుడే : భక్తులకు దర్శనాలు సులభతరం చేసేందుకు నగదు రహిత డిజిటల్ చెల్లింపులు దేవాదాయ శాఖ ప్రోత్సహిస్తోంది. ఈ విధానం సౌకర్యవంతంగా ఉన్నా కొన్ని సాంకేతిక లోపాలతో స్వల్ప ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లోవ, అన్నవరం ఆలయాల్లో ‘న్యూస్‌టుడే’ పరిశీలనలో ఈ విషయం వెల్లడైంది.

ఆన్‌లైన్ టికెట్లు జారీ చేస్తున్న అధికారులు

ప్రత్యేక లక్ష్యాలు..

ఆలయాల్లో ఆన్‌లైన్ టికెట్లకు ప్రత్యేక కౌంటర్లు, ఈ టికెట్టు తీసుకున్న వారికి ప్రత్యేక క్యూలైన్లో దర్శనాలు ఏర్పాటు చేశారు. ఎక్కువ ఆన్‌లైన్ చెల్లింపులు జరిపే ఆలయాలకు ర్యాంకులు ఇస్తున్నారు. ఆదివారం తలుపులమ్మ లోవ ఆలయం ప్రధానాలయాలతో పోటీపడి సుమారు 1900కు పైగా (సాయంత్రం 5 గంటలకు) ఆన్‌లైన్ టికెట్లు విక్రయించారు. అన్నవరంలో 2,087, వాడపల్లి 1,400 టికెట్లు విక్రయించారు.

సమస్యలివి..

12 గంటల ముందు వరకు మాత్రమే వసతి గదులను బుకింగ్ చేసుకునే విధానమే కాకుండా అప్పటికప్పుడు వచ్చిన భక్తులకు కరెంటు బుకింగ్‌కు అవకాశమివ్వాలి. ఆన్‌లైన్ బుకింగ్‌లో ఐదుగురు భక్తులు, అయిదు లడ్డూలు, ప్రసాదం ప్యాకెట్లకు ఒకేసారి అవకాశం ఉంది. దీని పరిమితి పెంచాలి. లోవ ఆలయ ప్రాంగణంలో నెట్‌వర్క్ సరిగ్గా ఉండడం లేదు. కొన్ని ఆలయాల్లో లడ్డూ, పులిహోర ఉండగా ఆన్‌లైన్లో ఒకసారే ఈ రెండు ప్రసాదాలు బుక్ చేసుకునే అవకాశం ఉండటం లేదు. దర్శనం, సేవలు, ప్రసాదం తదితరాలను వేర్వేరుగా కాకుండా ఒకేసారి బుకింగ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తే సౌకర్యంగా ఉంటుంది.

40 పాశురాలు.. 1,493 పదాలు

కుంచెతో చీరపై తిరుప్పావై పాశురాలు రాస్తున్న లీలాపూర్ణిమ

గోదాదేవి అమ్మవారు గానం చేసిన తిరుప్పావైలోని 30, రంగనాథుడి మేలుకొలుపులోని 10 వెరసి మొత్తం 40 పాశురాలను చీరపై కుంచెతో రమణీయంగా లిఖించారు మామిడికుదురు మండలం అప్పనపల్లికి చెందిన శ్రీఘాకోళపు లీలాపూర్ణిమ. ఈ చీరను అప్పనపల్లి బాలబాలాజీస్వామి ఆలయంలోని గోదాదేవికి సమర్పించారు. ఒక్కో పాశురంలో 8 వాక్యాలు చొప్పున ఒక్కో దానిలో నాలుగైదు వరకు పదాలు ఉంటాయి. 320 వాక్యాల్లో మొత్తం 1,493 పదాలను పలు రంగులతో చూడముచ్చటగా లిఖించారు. వాటి మధ్యలో వైవిధ్యమైన రంగుల మేళవింపుతో గోదాదేవి చిత్రం సహా నెమలి, వేణువు బొమ్మలను కూడా చిత్రించారు. దీనికిగాను తనకు రోజుకు రెండు గంటల చొప్పున పది రోజుల పాటు సమయం పట్టిందన్నారు. ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న తనకు తల్లి కామాక్షి నుంచి నేర్చుకున్న పాశురాలను చక్కగా పఠించడంతో పాటు రంగులతో లిఖించడం నేర్చుకున్నట్లు వివరించారు. ఆరున్నర మీటర్ల చీరపై పాశురాలు, చిత్రాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

బ్యారేజీ వద్ద పరవళ్లు

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద నీటి సోయగం కనువిందు చేస్తోంది. ఆదివారం పర్యాటకుల తాకిడితో పరిసరాలు సందడిగా మారాయి.

పోలవరం జలాలు రావడంతో ఇన్‌ఫ్లో పెరిగింది. గోదావరిలో 50,169 క్యూసెక్కులు ఉండగా ధవళేశ్వరం వైపు బ్యారేజీ 18 గేట్లు 0.7 అడుగుల మేర పైకెత్తి 36,169 క్యూసెక్కులు కడలిలోకి విడిచిపెట్టారు. పశ్చిమ డెల్టాకు 7 వేలు, మధ్య డెల్టాకు 2 వేలు, తూర్పుడెల్టాకు 5 వేలు చొప్పున 14 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. ఈ సందర్భంగా హెడ్‌వర్క్స్ ఏఈ రాధాకృష్ణ మాట్లాడుతూ అధిక జలాలు వచ్చి చేరుతున్నందున దిగువకు విడిచి పెడుతున్నట్లు చెప్పారు. – న్యూస్‌టుడే, ఆత్రేయపురం

శిరస్త్రాణం ప్రాణ కవచం

రోడ్డు ప్రమాదంలో అత్యధికంగా తలకు గాయమై ప్రాణాలు కోల్పోతున్నారని, ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ శిరస్త్రాణం ధరించాలని పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో పిఠాపురం సర్కిల్ పోలీస్ సిబ్బంది హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనంపై ర్యాలీ చేశారు. ప్రయాణికులకు శిరస్త్రాణం వల్ల కలిగే ఉపయోగాలు, ధరించకపోవడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. కొత్తపల్లి ఎస్సై వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు. -న్యూస్‌టుడే, కొత్తపల్లి

చక్రాలపై రయ్‌రయ్

స్కేటింగ్‌లో రాణిస్తున్న చిన్నారులు

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

రోలర్ స్కేటింగ్‌లో రయ్.. రయ్.. మంటూ దూసుకుపోతున్నారు కాకినాడకు చెందిన బాలబాలికలు. కాళ్లకు చక్రాలు కట్టుకుని వేగంగా కదులుతూ దూసుకుపోతున్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పలు పతకాలతో సత్తాచాటారు. పలువురి చేత శెభాష్ అనిపించుకుంటున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని..

నాలుగో తరగతి చదువుతున్నా. నాన్న సత్యనారాయణ బైక్ మెకానిక్, అమ్మ మహేశ్వరి గృహిణి. రెండేళ్ల నుంచి స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నా. తొలుత వేసవి శిబిరంలో చేరాను. తర్వాత ఆరోగ్యం బావుంటుందని కొనసాగించా. పలు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాను. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో అండర్ 8-10 విభాగంలో రోడ్డు, రింక్-2, 3 విభాగాల్లో మూడు బంగారు పతకాలు గెలుచుకున్నా. అంతర్జాతీయస్థాయిలో పతకం సాధించాలనేది నా కోరిక. - కావ్య

రోజూ మూడు గంటల సాధన

ఫిట్‌నెస్ బావుండాలని ఏడాది నుంచి స్కేటింగ్‌లో శిక్షణ పొందుతున్నా. నాన్న ఫణీంద్ర వెటర్నరీ మెడికల్ షాపు, అమ్మ శ్వేత గృహిణి. కొత్తలో ఒళ్లంతా దెబ్బలు తలిగేవి. అయినా శిక్షణ మానలేదు. ప్రతిరోజూ మూడు గంటలు సాధన చేస్తున్నా. రాష్ట్రస్థాయిలో పలు పతకాలు గెలుచుకున్నా. ఇటీవల జాతీయస్థాయి పోటీల్లో 6-8 ఏజ్ కేటగిరీలో ఇన్‌లైన్ విభాగంలో రెండు కాంస్య పతకాలు సాధించాను. అంతర్జాతీయ స్థాయిలో ఆడాలనేది నా లక్ష్యం. - సాయిశ్రీమహిత, రెండో తరగతి

పాల్గొంటే పతకం రావాల్సిందే..

ఆరో తరగతి చదువుతున్నా. నాన్న రాఘవేంద్రసుబ్బారెడ్డి ప్రైవేటు ఉద్యోగి, అమ్మ శ్రీలక్ష్మి గృహిణి. స్కేటింగ్‌పై మక్కువతో ఏడేళ్ల నుంచి శిక్షణ పొందుతున్నా. కోచ్ ఈశ్వర్ ప్రోత్సాహంతో ఉదయం, సాయంత్రం సాధన చేస్తున్నా. ఇప్పటివరకూ జిల్లా స్థాయిలో 31, రాష్ట్రస్థాయిలో 35, జాతీయస్థాయిలో 7 పతకాలు సాధించాను. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని రెండు పతకాలు గెలుచుకున్నా. అంతర్జాతీయ పతకమే నా లక్ష్యం. - శ్యామ్‌సుందర్‌రెడ్డి

క్రీడలతో ఉజ్వల భవిత

మా నాన్న సతీష్ ఫొటోగ్రాఫర్, అమ్మ శ్రీప్రియాంక గృహిణి. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏడాదిన్నర నుంచి శిక్షణకు పంపిస్తున్నారు. ప్రతిరోజూ రెండు, మూడు గంటల సాధన చేస్తున్నా. పలు జిల్లా, రాష్ట్రస్థాయి పతకాలు సాధించాను. జాతీయ స్థాయిలో మొదటిసారి పతకం రావడం ఆనందంగా ఉంది. మరిన్ని పోటీల్లో రాణించి, వైద్యురాలు కావాలనేది నా లక్ష్యం. -నిహారిక, మూడో తరగతి

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

తీరానికి కొట్టుకొచ్చిన మృత డాల్ఫిన్

కాకినాడ గ్రామీణంలోని నేమాం వద్ద సముద్ర తీరానికి ఆదివారం మృతి చెందిన డాల్ఫిన్ కొట్టుకువచ్చింది. కాకినాడ తీరానికి కూడా అరుదైన డాల్ఫిన్లు వస్తున్నాయని భావిస్తున్నారు. సుమారు 8 అడుగులు పొడవున్న డాల్ఫిన్ చేపల వేట సమయంలో మత్స్యకారుల వలలో చిక్కికానీ, బోటు పంకా తగిలి ప్రమాదవశాత్తు చనిపోయి ఉండొచ్చని భావిస్తున్నారు. - న్యూస్‌టుడే, సర్పవరం

కృష్ణం వందే సర్వసుందరం

ప్రతి ఒక్కరూ భక్తి భావంతో ముందు సాగాలని పుదుచ్చేరి ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. తాళ్లరేవు మండలం గాడిమొగలో హరేకృష్ణ సత్సంగ కేంద్రం, రాధాకృష్ణ మందిర ప్రారంభోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. రాధాకృష్ణుల విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తిగీతాలు ఆలపించారు. యానాం నాయకుడు, పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, మందిరం అధ్యక్షుడు సంగాడి పూసలయ్య, సర్పంచి గోవలక్ష్మి, ఉపసర్పంచి లోకేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

అభయారణ్యంలో ఆనందాల విందు

కోరింగ అభయారణ్యంలోని చొల్లంగి పర్యాటక కేంద్రం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడింది. జిల్లా, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన పాఠశాలల విద్యార్థులతో సందడి నెలకొంది. అనకాపల్లి జిల్లా యలమంచిలి నుంచి, కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి విద్యార్థులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇక్కడి వన్యప్రాణులు, మడ మొక్కల విశిష్టతను తెలుసుకున్నారు. సముద్రం మొగ వరకు బోటు షికారు చేశారు. - న్యూస్‌టుడే, తాళ్లరేవు

ముస్తాబవుతున్న గరుత్మంతుడి విగ్రహం

శ్రీరామగిరిపై గరుత్మంతుడి విగ్రహం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. రౌతులపూడి మండలం ములగపూడి శ్రీకోదండ రాముని ఆలయానికి చేరుకునే ఘాట్ రోడ్డులో 27 అడుగుల ఎత్తులో విగ్రహాన్ని సుమారు రూ.6 లక్షల వ్యయంతో నిర్మించారు. ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఈప్రాంతాన్ని అభివృద్ధిపరిచేందుకు చర్యలు తీసుకున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇంత ఎత్తైన విగ్రహం ఈ పరిసర గ్రామాల్లో లేదన్నారు. - న్యూస్‌టుడే, రౌతులపూడి

ఆయన ఇంటి మిద్దే సాగుభూమి

మిద్దెపై పంటలతో విశ్రాంత ఏఎస్పీ సుధాకర్

ఇంటి పెరట్లో మొక్కలు, ఇతర కూరగాయలు, ఆకు కూరలు సాగుచేయడానికి స్థలం లేకపోయినా సాగుపై ఆసక్తితో చాలా మంది తమ ఇంటి మిద్దెలపై అనేక రకాల పండ్లు, కూరగాయలు, ఆకు కూరలు సాగుచేస్తూ పలువురిని అబ్బుర పరుస్తుంటారు. అలాంటి కోవకే చెందుతారు ఈ పెద్దాపురం పట్టణం సుధా న్యూబ్యాంకు కాలనీకి చెందిన విశ్రాంత అడిషనల్ ఎస్పీ కొట్టి సుధాకర్. తన ఇంటి మేడపై ఏడాది నుంచి అనేక రకాల మొక్కలు పెంచుతున్నారు. చెత్త నుంచి సంపదను తయారుచేసి వంకాయ, టమోటా, చిక్కుడు, ఆనబ, బీర, దొండ, బెండ వంటి కూరగాయలు, కొత్తిమీరా, బచ్చల, చుక్కకూర, తోటకూర, మెంతుకూర, గోంగూర ఆకు కూరలు, పండ్ల జామ, డ్రాగన్, బొప్పాయితోపాటు అనేక రకాల పూల మొక్కలను సాగుచేస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు సాగు చూసి ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ విభాగంలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్నారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు ఇందులోనే గడుపుతారు. తన మేడపై సాగుచేసే అన్నీ రకాల కూరగాయలు, ఆకు కూరలనే ఇంట్లో వండుకుంటామని.. బయట మార్కెట్‌లో కొనుగోలు చేయమని అంటున్నారు. - న్యూస్‌టుడే, పెద్దాపురం

మన్యం వెతలు తీరేనా..!

- రేపు ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పర్యటన

ప్రధాన డిమాండ్లు ఇవీ..

ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు, ఏలేశ్వరం మండలంలోని 59 ఆదివాసీ గిరిజన గ్రామాలను కలిపి పెదమల్లాపురం కేంద్రంగా గిరిజన మండలం ఏర్పాటు ▲ సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ను పెదమల్లాపురంలో ఏర్పాటు ▲ ఉపప్రణాళికా ప్రాంతంలో ఆదివాసీ తెగలకు రాజ్యాంగంలోని హక్కులను కల్పించుట. నాన్ షెడ్యూల్ ప్రాంత ఆదివాసీలకు విద్య, వైద్యం, ఉద్యోగాలు, ఉపాధిలో అవకాశాలు కల్పించడం తదితర డిమాండ్ల పరిష్కారానికి గిరిజనులు ఎదురుచూస్తున్నారు.

శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు, న్యూస్‌టుడే: సహజ వనరులు, ప్రకృతి అందాలు, జలధారల సోయగంతో పచ్చని వాతావరణంతో ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న ఉపప్రణాళిక ప్రాంతంలో నేటికి మౌలిక వసతుల కొరత వేధిస్తూనే ఉంది. శంఖవరం మండలం పెదమల్లాపురం కేంద్రంగా మండలం ఏర్పాటు కోసం డిమాండ్ వినిపిస్తున్న వేళ.. ఆప్రాంతానికి ఎస్టీ కమిషన్ ఛైర్మన్ పర్యటన ఖరారుకావడంతో మన్యం వాసుల్లో ఆశలు చిగురించాయి.

సమస్యల పరిష్కారానికి నిరీక్షణ

జిల్లాలోని ఉపప్రణాళిక ప్రాంత వాసులు సమస్యలతో సతమతమవుతున్నారు. రహదారులు, మౌలిక వసతుల కల్పన, పక్కా ఇళ్ల నిర్మాణాలకు ఎదురుచూపులు చూస్తున్నారు. ఉప ప్రణాళికలో పలు ప్రాంతాలకు రహదారి సౌకర్యం కల్పన, సెల్ టవర్ల ఏర్పాటుచేయాలి. శంఖవరం మండలం పోలవరం నుంచి రౌతులపూడి మండలం డి.పైడిపాల వరకు పక్కా రహదారి అవసరం. ఇటీవల ఉపప్రణాళికా ప్రాంతానికి మంజూరైన రహదారుల పనులు త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తేవాల్సి ఉంది. ఈనెల 23న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి శంఖవరం మండలంలోని పెదమల్లాపురం ప్రాంతంలో పర్యటించి ప్రజలతో సమావేశం కానున్నారు. తమ సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కారం చూపుతారని గిరిజనులు కొండంత ఆశతో ఉన్నారు.

ఒండ్రేగులలో పూరిళ్లు

మహామండపంలో భక్తులు

లోవకు భక్తుల తాకిడి

తుని గ్రామీణం: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తుల తాకిడితో నిండిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ముడుపులు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో దేవస్థానంలోని వసతి గదులు నిండిపోవడంతో భక్తులు ఆలయ ప్రాంగణంలో ఉన్న చెట్లకింద వంటావార్పు చేసుకోని సామూహిక భోజనాలు చేశారు. ఈ ఒక్కరోజే సుమారు 8 వేలకు పైబడి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని దీంతో దేవస్థానానికి రూ.2.57 లక్షల ఆదాయం సమకూరినట్లు దేవస్థానం డిప్యూటీ కమిషనర్ విశ్వనాథరాజు తెలిపారు.

శాస్త్రీయకోణంలో ఆలోచించాలి

- జేఎన్టీయూకేలో చెకుముకి సైన్స్ సంబరాలు ప్రారంభం

మాట్లాడుతున్న సీసీఎంబీ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వేగేశ్న రాధ

సాంబమూర్తినగర(కాకినాడ), న్యూస్‌టుడే: శాస్త్రీయ కోణంలో ఆలోచించకపోవడమే మూఢనమ్మకానికి దారితీస్తుందని సీసీఎంబీ విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ డా. వేగేశ్న రాధ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు కాకినాడ జేఎన్‌టీయూకేలో ఆదివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన రాధ మాట్లాడుతూ జీవ జాతిలో మానవ జాతి మాత్రమే ఉత్కృష్టతతో ఉంటుందన్నారు. ప్రతి విషయాన్ని పరిశీలించి, ప్రయోగాల ద్వారా సమాజాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. శాస్త్రీయ మార్గంలో విద్యార్థులను ప్రోత్సహించాలని చెప్పారు. జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక గత 35 సంవత్సరాలుగా విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకునేందుకు, సైన్సు ప్రయోగాల పట్ల ఆసక్తిని పెంపొందింపజేసేందుకు ఈ సంబరాల ద్వారా కృషి చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్‌డీఏ జాయింట్ డైరెక్టర్ డా.యు.ఉర్వశి కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. జేవీవీ ప్రొఫెసర్ రామచంద్రయ్య, ఎవీవీ నాయకులు పాల్గొన్నారు. విజ్ఞానాన్ని విద్యార్థులకు పరిచయం చేస్తూ మాట్లాడుతూ విద్యార్థులు పరిశీలన, పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడు సీహెచ్ సుబ్బారావు, ఎం.మురళీధర్, రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, చెకుముకి కన్వీనర్ కేఎంఎంఆర్ ప్రసాద్, షఫీ, కాడా వెంకటరమణ, జి.శ్యామ్, డా.టీవీ గోపీనాథ్, ఆలపాటి శ్రీనివాస్, డా.లక్ష్మ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

విద్యను అభ్యసించిన పాఠశాల దేవాలయంతో సమానమని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రాజమహేంద్రవరం మంగళవారపుపేట వీఎండీ కళాశాల ఆవరణలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో 1970-75 ఏడాదిలో విద్యాభ్యాసం పూర్తిచేసిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యాబోధనతో పాఠశాల గురువులు నేర్పిన చదువుతో ఇక్కడ చదువుకున్న వారంతా ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. ఇదే పాఠశాలలో తాను చదువుకున్నానని, అలనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు చింతపెంట ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన విద్యార్థులు హాజరై సందడి చేశారు. నాటి గురువులను సత్కరించారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం సాంస్కృతికం

జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలే లక్ష్యం: ఆలపాటి

రామచంద్రపురం, న్యూస్‌టుడే: జర్నలిజంలో ఉన్నత ప్రమాణాలే లక్ష్యంగా సి.ఆర్. మీడియా అకాడమీ ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామని ప్రెస్ అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ చెప్పారు. రామచంద్రపురం వీఎస్‌ఎం కళాశాలలో రెండో రోజు ఆదివారం పునశ్చరణ తరగతుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే జర్నలిజంలో రాణించగలమని పేర్కొన్నారు. క్రైమ్ రిపోర్టింగ్‌లో మెలకువలు అంశంపై శ్రీకాంత్ ప్రసాద్ మాట్లాడుతూ సమాజం రెండో పార్శ్వాన్ని ఎత్తి చూపేది నేర వార్తలని చెప్పారు. డెవలప్‌మెంట్ జర్నలిజం అంశంపై డా.జె.కొండలరావు అవగాహన కల్పించారు. సీనియర్ పాత్రికేయుడు అన్నవరపు బ్రహ్మయ్య కథనాలు ఎలా రాయాలో వివరించారు. దేవగుప్త రామకృష్ణ గ్రామీణ రిపోర్టింగ్‌లో మెలకువలపై మాట్లాడారు. అనంతరం ఛైర్మన్ సురేష్‌కుమార్, సీనియర్ పాత్రికేయులు ఎం.శ్రీరామమూర్తి సర్టిఫికెట్లు అందజేశారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉండాలి

నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను అభినందిస్తున్న రాధామనోహర్‌దాస్

చాగల్లు, న్యూస్‌టుడే: భారతీయ హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, హిందూ ధర్మానికి హాని జరిగితే సహించేది లేదని అభయ హిందూ సేన వ్యవస్థాపకుడు రాధామనోహర్‌దాస్ అన్నారు. చాగల్లులో ఆదివారం రాత్రి నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశం, ధర్మం, భూమి, గోమాత అనే అంశాలు మనవి అనే విధంగా ఉండాలన్నారు. శంకరాచార్యులమైన భారతీయులకు వారి ధర్మ పరిరక్షణ కోసం పోరుకు ధర్మ పరిరక్షణ మార్గాన్ని బోధించాలన్నారు. హిందూ మతంపై జరిగే తప్పుడు ప్రచారాలను ఖండించాలన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ త్రిబంధ కార్యవాహ అనంతనాయుడు మాట్లాడుతూ హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు ఆర్‌ఎస్‌ఎస్ పనిచేస్తుందన్నారు. స్వదేశీ నినాదం ఎంతో కీలకమని, భారతదేశం రానున్న రోజుల్లో విశ్వగురువుగా వర్ధిల్లాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసశర్మ, నిర్వహణ సమితి సభ్యులు తాళ్లూరి వరప్రసాద్, జె.వెంకట గణపతి, తదితరులు పాల్గొన్నారు. తొలుత చాగల్లులో శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని రాధామనోహర్‌దాస్ దర్శించుకుని పూజలు చేశారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	17,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	28,000
గటగట	25,000
కొత్తకాయ: గండేరా	27,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	15,000-16,000
కొత్త (పచ్చి) కాయ	14,000-15,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	6,000
కిలో	400

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లలో

ఫారంరేటు	128-00
రిటైల్ లైవ్	155-00
డ్రెస్డ్	225-00
స్కిన్‌లెస్	256-00

దేశానికి దిశానిర్దేశం చేసిన నేత వాజ్‌పేయీ

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, వేదికపై మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: దేశసంక్షేమమే లక్ష్యంగా ఉన్నత విలువలతో శ్రీరాం చుట్టి, వాటి అమల్లో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని, దేశానికి దిశానిర్దేశం చేసిన గొప్ప నేత అటల్ బిహారీ వాజ్‌పేయీ అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడ రామారావుపేట జంక్షన్‌లోని వాటర్‌ట్యాంక్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ సభ అట్టహాసంగా సాగింది. తొలుత మాధవ్, వైద్యఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్, కూటమి నాయకులతో కలిసి అటల్, మోదీ సుపరిపాలన బస్సు యాత్రలో రాగా, బైక్ ర్యాలీతో కూటమి నాయకులు స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సభలో మాధవ్ మాట్లాడుతూ అటల్‌జీ ఆశయం మోదీతో సాధ్యమని, ఆ మహనీయుడి విగ్రహాన్ని కాకినాడలో ఆవిష్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ హిమాలయాల అంత ఎత్తు వ్యక్తిత్వం కలిగిన నేత వాజ్‌పేయీ అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వనమాడి వెంకటేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సత్యప్రభ, పంతం నానాజీ మాట్లాడుతూ దేశంలోనే ఎలాంటి మచ్చలేని నాయకుడు వాజ్‌పేయీ అని పేర్కొన్నారు. భావితరాల రాజకీయ నాయకులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

సవాల్ చేస్తున్నా.. ఒక్కరు వద్దన్నా సమీక్షిస్తాం

పీపీపీ విధానాన్ని దేశం, రాష్ట్ర ప్రజలు ఆమోదించారని మంత్రి సత్యకుమార్ ఈ సందర్భంగా చెప్పారు. మాజీ సీఎం జగన్, వైద్యకళాశాలలపై గవర్నర్‌కు కోటి సంతకాలు సేకరించి ఇచ్చారని, ప్రజలు ఎవరూ వ్యతిరేకించనప్పుడు సంతకాలు ఎలా వచ్చాయో వారికే తెలియాలని వ్యాఖ్యానించారు. ఇక్కడ ఒక్కరైనా పీపీపీకి వ్యతిరేకంగా చెప్పొద్దంటే దానిపై సమీక్ష చేస్తామంటూ సవాల్ చేశారు. అక్కడే ఉన్న కాకినాడ నగర ఎమ్మెల్యే మాజీ జోక్యం చేసుకుని జగన్ దగ్గర ఉండే మీడియా వారు సైతం సంతకాలు చేయలేదని ఎద్దేవా చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఛైర్మన్ తోట సుధీర్, భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మీప్రసన్న, ఏపీ అడ్వైజరీ బోర్డు, ఛైల్డ్‌లేబర్ ఛైర్మన్ వేటుకూరి సూర్యనారాయణరాజు, సీనియర్ నేతలు పైడా కృష్ణమోహన్, ముత్తా నవీన్, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిధారాజు, బాపిరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ, నాయకులు

జాతీయస్థాయి మహిళా బాక్సింగ్ పోటీలకు 10 మంది

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రెండురోజులుగా రాష్ట్రస్థాయి మహిళా బాక్సింగ్ పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. ఆదివారం విజేతలకు బహుమతులు అందజేసి, జాతీయ స్థాయి పోటీలకు 10 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌గా విశాఖపట్నం, రన్నర్‌గా కాకినాడ జిల్లా, ద్వితీయ స్థానంలో నెల్లూరు జిల్లా క్రీడాకారులు బహుమతులు సాధించారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ బహుమతులు ప్రదానం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, మధుసూదనరావు, జిల్లా అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రరావు, పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగాయి. తొలిసారి నోయిడాలో..: విశాఖపట్నానికి చెందిన కె.శ్రీవర్షిత, ఎన్‌జేపీఎస్ మల్లిక, ఎండీ మహారున్నీసా బేగం, కె.దివ్య శ్రీ, ఎస్.దీపిక, జి.స్నేహ, వి.రేష్మ, అనకాపల్లికి చెందిన మౌనిక కల్యాణి, బి.భవాని, విజయనగరానికి చెందిన పి.సుమిత్రలను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. వీరంతా ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో డిసెంబరు 31 నుంచి జనవరి 5వరకు జరిగే జాతీయస్థాయి మహిళా బాక్సింగ్ పోటీల్లో తలపడతారని నిర్వాహక కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు.

అంతర్వేది క్షేత్రంలో రోడ్లకు మోక్షం

అంతర్వేది, న్యూస్‌టుడే: అంతర్వేది క్షేత్రంలో రోడ్ల వ్యవస్థకు మోక్షం కలిగింది. పంచాయతీరాజ్‌శాఖ నుంచి రూ.1.85 కోట్లతో 6, ఆర్ అండ్ బీ నుంచి రూ.16 లక్షలతో ఒకరోడ్డు మంజూరయ్యాయి. లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు జనవరి 25 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో భక్తులకు వివిధమైన ఇబ్బందులు తలెత్తకూడదన్న లక్ష్యంతో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారు. దీంతో బీచ్, ఆదర్శనగర్, వసంత మండపం రోడ్లను సీసీగాను, ఖాన్‌షాబ్, పల్లిపాలెం, రామాలయం నుంచి లైట్‌హౌస్ వరకు ఉన్న రోడ్లను బీటీగాను వేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు మరోచోట బీచ్, లైట్‌హౌస్ రోడ్లను వేయడానికి టెండర్లు పిలిచారు. సంక్రాంతి నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని జేఈలు సురేష్, గంగాధర్ వెల్లడించారు. ఇవి పూర్తయితే ప్రయాణికులు, భక్తులు, పర్యాటకులకు అవస్థలు తప్పుతాయని చెబుతున్నారు.

బ్యాగ్ నుంచి బీప్ శబ్దం.. భయపడిన ప్రయాణికులు

నిడదవోలు: నిడదవోలు నుంచి భీమవరం వెళ్లే ప్యాసింజర్ రైలు బోగీలో ఒక బ్యాగ్ నుంచి బీప్ శబ్దం రావడంతో ప్రయాణికులు ఆందోళనకు గురై కిందికి దిగిపోయారు. రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బోగీలో బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. కిందకు దించి పరిశీలించగా పాడైన స్వైపింగ్ మిషన్, పాత దుస్తులు ఉన్నాయి. పాడైన మిషన్ నుంచి బీప్ శబ్దాలు వస్తున్నట్లు గుర్తించారు. ఆందోళనకరంగా ఏమీ లేకపోవడంతో ప్రయాణికులు తిరిగి రైలెక్కారు. ప్రయాణికుడు బ్యాగ్ వదిలి వెళ్లిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు.

రైలు నుంచి జారిపడి ప్రయాణికుడి మృతి

నిడదవోలు: రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి ఆదివారం మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై పి.అప్పారావు తెలిపారు. నిడదవోలు-తాడేపల్లిగూడెం స్టేషన్ల మధ్య మారంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో 548/4వ కి.మీ వద్ద దిగువ రైలు పట్టాల మధ్యలో సుమారు 40 సంవత్సరాల వయసు గల వ్యక్తి రైలు నుంచి జారిపడి మృతి చెందాడన్నారు. పచ్చ రంగు టీ షర్టు, నాచు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీ గదిలో భద్రపరిచామన్నారు. వివరాలు తెలిసినవారు 94906 17090, 80191 57528 చరవాణి నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ధ్యానం.. ఆనందమయం

పాల్గొన్న నగర వాసులు (అంతర చిత్రం) మాట్లాడుతున్న దీదీ

సాంబమూర్తినగర్, మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ప్రతిఒక్కరూ రోజూ కనీసం 15 నిమిషాలైన ధ్యానం చేయాలని బ్రహ్మకుమారీస్ తూర్పుగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి బీకే రజనీ దీదీ, బీకే రాధిక అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా కాకినాడ వివేకానంద పార్కులోని స్కేటింగ్ రింక్ వద్ద ధ్యాన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల స్వామి పాల్గొన్నారు. రజని మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళన, అశాంతిని దూరం చేసే క్రమంలో ఈ ఆధ్యాత్మిక ధ్యాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ధ్యానం ద్వారా మానసిక సమతుల్యత, మానసిక శక్తి పెరుగుతుందన్నారు. పద్మశ్రీ, తుమ్మల రామస్వామి మాట్లాడుతూ కోపం నియంత్రించి ఆనందం పొందాలంటే ధ్యానం ఎంతో అవసరమన్నారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన రాజయోగా ఉపాధ్యాయులు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. సుమారు 5 వేల మంది నగర వాసులు పాల్గొన్నారు.

కన్నేశారంటే.. కొల్లగొడతారు..!

- ముగ్గురు దొంగల అరెస్టు
- రూ.35 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.35 లక్షల విలువైన 274.800 గ్రాముల బంగారం, 1750 గ్రాముల వెండి వస్తువులు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్‌మీనా ఆ వివరాలను వెల్లడించారు.

70 కేసుల్లో నిందితుడు.. : అమలాపురం మండలం కొంకాపల్లికి చెందిన అంతర్రాష్ట్ర దొంగ పత్తివాడ లోవరాజు(31) ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుమారు 70 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ప్రతిసారీ జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత చోరీల బాటపడుతున్నాడు. వివిధ పరికరాలతో ఇంటి తాళాలను సులువుగా తెరుస్తాడు. అతడి నుంచి రూ.25 లక్షల విలువైన 185 గ్రాముల బంగారం, 1750 గ్రాముల వెండి వస్తువులు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇతడిపై అమలాపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో -2, పెనుగొండలో -2, హైదరాబాద్‌లో-1 కేసు నమోదయ్యాయి.

స్నాచింగ్ దొంగ అరెస్ట్...: పశ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం సీతలంకొండేపాడు చిన్నవీధికి చెందిన కవురు మూర్తి(24) ద్విచక్ర వాహనంపై వెళ్తూ మహిళల మెడలోని బంగారు ఆభరణాలను లాక్కొని పరారవుతాడు. రావులపాలెం రూరల్, ఆత్రేయపురంలో కేసులున్నాయి. అతడి నుంచి రూ.6 లక్షలు విలువ చేసే 49.800 గ్రాముల బంగారం, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు.

తలుపులు బద్దలుకొట్టి చోరీలు

అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గంటివారి వీధికి చెందిన గంటి గౌతమ్ (24) కొత్తపేటలో తాళాలు వేసిన ఇంటి తలుపులను రాడ్డుతో బద్దలు కొట్టి బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అతడి నుంచి రూ.4.50 లక్షల విలువ చేసే 39 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నది విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph :81422 92071.

శ్రీ సాయి గోల్డ్: తాకట్టులో ఉన్న బంగారం ఏ బ్యాంక్/ప్రైవేట్ సంస్థలు నుండి అయినా విడిపించి ఆ రోజు మార్కెట్ రేట్‌కే కొనబడును. స్పాట్‌క్యాష్ ✆ 9493338823

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లో Govt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదా లేదా నెలవారీ వడ్డీకి పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటి, 7386201191

REAL ESTATE

LAND FOR SALE JAGGAMPETA

రాజమండ్రికి 30-కి.మీ. దూరంలో మురారి-గండేపల్లి మధ్య నేషనల్ హైవేకి చేర్చి 100 అ॥ రోడ్ ఫేసింగ్‌తో 60 సెంట్లు భూమి అమ్మకం. (నోబ్రోకర్స్), ✆ 9032988265.

JOBS

జై గణేష్ సెక్యూరిటీ తణుకులో విజిలెన్స్ ఆఫీసర్ 7గురు (Ex Service only) జీతం: 28,000/- గన్ మేన్ 3 మెంబర్స్ జీతం: 33,000/- వయస్సు 50 సం॥ లోపు. PF&ESI W/H, 8 గం॥ డ్యూటీ ✆ 95818 58667.

సెంట్రల్ గవర్నమెంట్ సోలార్ సబ్సిడీ స్కీమ్ నందు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. Q: 10 to PG. జీతం: 30 వేలు to 50 వేలు. ✆ 95155 05557, 99898 57775.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

వైజాగ్ ప్రముఖ షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం:10000 - 12000 + ఫుడ్, రూము. 9030588502, 9704637370

రాజమండ్రి అనకాపల్లిల్లో ప్రా॥కం॥ & ప్రాజెక్టుల్లో సె॥గార్డ్స్, సూపర్‌వైజర్స్ ఆయాలు స్త్రీ/పు., జీ: 12 to15 వేలు. రూం+భో. రాజ్ సెక్యూరిటి, దేవిచౌక్, RJY, ✆ 93922 69369

SECURITY GUARDS

కాకినాడ, నిడదవోలు, పోలవరం ప్రాజెక్ట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు & గార్డ్స్ కావలెను. PF, ESI మరియు ఉచిత భోజన + వసతి కలదు. ✆ 8500498115, 9866594189

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 6-90 పైసలు
అనపర్తి ఆఫీసు: 08857-226908

EENADU for Advertisement Contact: 8008597607

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)

గాంధీనగర్, న్యూస్‌టుడే: టమాట- 36, పలు- 32, బీట్‌రూట్- 32, కీరదోస- 40, బీన్సా వంకాయలు- 36, బెండకాయలు- 60, పచ్చిమిర్చి- యలు- 60, అల్లం- 68, క్యాప్సికం- 52, బొబ్బర్లు- 48, 54, కాకరకాయ- 56, బీర- 60, క్యాలీఫ్లవర్- 40, చిలకడదుంపలు- 34, ఒకటి చొప్పున అనప 25, 30, క్యాబేజీ- 30, క్యారెట్- 32, దొండకాయ- 25, 30, పొట్లకాయ- 25, 30, అరటికాయలు- 46, బంగాళాదుంపలు- 24, 27, ఉల్లి- 28, 5, 7, మునగకాడ- 15, 18, మామిడికాయ- 15, 32, దోసకాయలు- 36, చిక్కుళ్లు- 32, చేమదుం 20, నిమ్మకాయలు(డజన్) - 18, 24.

తెరపై ఈనాడు

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఆనంద్ సినిమాస్ 4స్క్రీన్- అవతార్ ఫైర్ అండ్ యాష్, అఖండ 2, దురంధర్, గుర్రం పాపిరెడ్డి, మిస్టీరియస్, దేవీ మల్టీప్లెక్స్ 4స్క్రీన్- అఖండ 2, పెయిల్యూర్ బాయ్స్, అవతార్ ఫైర్ అండ్ యాష్, రాజ్ వెడ్స్ రాంబాయి. లక్ష్మి- అఖండ 2, సత్యగౌరి - అవతార్ ఫైర్ అండ్ యాష్, తిరుమల- అఖండ 2, సీలండ్స్ 1- అవతార్ ఫైర్ అండ్ యాష్, సీలండ్స్ 2- మోగ్లీ, శ్రీప్రియ - అవతార్ ఫైర్ అండ్ యాష్, పద్మప్రియ- అఖండ 2, సూర్య1(వాకలపూడి) - అఖండ 2, సూర్య 2.- అవతార్ ఫైర్ అండ్ యాష్.

మహోన్నత జీవనానికి ధ్యానమే దిక్సూచి

అవగాహన కల్పిస్తున్న చిట్టిబాబు, తదితరులు

ధ్యానం చేస్తున్న విద్యార్థులు

గాంధీనగర్: ధ్యానం ద్వారా విద్యార్థుల్లో పరీక్ష అంటే భయం, ఆందోళన, ఒత్తిడి అధిగమించవచ్చని, మనిషి మహోన్నత జీవనానికి ధ్యానమే దిక్సూచని ఆంధ్రప్రదేశ్ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షుడు, యోగాచార్య చిట్టిబాబు పేర్కొన్నారు. ఆదివారం శ్రీనగర్‌లోని ఆదిత్య విద్యాసంస్థల ఓపెన్ ఆడిటోరియం ప్రాంగణంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ మనస్సును స్వాధీనం చేసుకునే అద్భుతమైన ప్రాచీన భారతీయ కళ ధ్యానమన్నారు. అనంతరం విద్యార్థులతో సూర్యనమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపల్ సురేష్‌బాబు, హాస్టల్ వార్డెన్ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పరికరమిచ్చారు.. పక్కనెట్టారు..!

– న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

గొడారిగుంటలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలోని పెట్టెలో ఇండక్షన్ స్టౌ

స్త్రీ, శిశుసంక్షేమ శాఖ(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో నడిచే అంగన్‌వాడీ కేంద్రాల్లో వంట చేసే విషయంలో నెలకొన్న ఇబ్బందులను అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం కొత్తగా ఇండక్షన్ స్టౌలతోపాటు అనువైన కుక్కర్లు, ఇతర సామగ్రి పంపిణీ చేసింది. నగరంలోని పలు కేంద్రాల్లో ఈ స్టౌలు వాడకపోవడంతో మూలకు చేరాయి. గత వైకాపా ప్రభుత్వంలో సిలిండర్ల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో సమయానికి వంట పూర్తికాక అష్టకష్టాలు పడేవారు. చేసేదిలేక సిబ్బందే సొంత డబ్బుతో గ్యాస్ సిలిండర్లు కొని వంట పూర్తి చేయాల్సివచ్చేది. దాంతో ప్రభుత్వం ఆరు నెలల కిందట అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్తుతో పనిచేసే ఇండక్షన్ స్టౌలు అందజేసింది. వీటి వినియోగంపై ఐసీడీఎస్ అధికారులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చారు.

వాడితేనే కదా సౌకర్యం..

కాకినాడ అర్బన్‌లోని మొత్తం 172 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. విడతల వారీగా అన్నింటికీ ఈ ఇండక్షన్ స్టౌలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఆరు నెలలవుతున్నా.. కొన్ని కేంద్రాల్లో ఈ స్టౌలు నేటికీ అట్ట పెట్టెల్లోనే మూలుగుతున్నాయి. అంగన్‌వాడీ టీచర్లు సెలవులో ఉన్నప్పుడు కేంద్రం బాధ్యతలను ఆయాలే చూసుకోవాల్సివస్తోంది. విద్యుత్తు ఆధారిత స్టౌలు కావడం, దీనిపై ఆయాలకు అవగాహన లేకపోవడంతో నేటికీ గ్యాస్‌పైనే ఆధార పడాల్సివస్తోందని చెబుతున్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

వీరలక్ష్మీదేవి గ్రంథాల ఆవిష్కరణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: కృతి సాహిత్య, సంగీత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నరసన్ననగర్‌లోని శ్రీసాయిరామ్ సదనంలో వాడ్రేవు వీరలక్ష్మీదేవి రచించిన మధురవాణి నుంచి నళినీ జమీలాదాకా, శతపత్రి సమీక్షణం గ్రంథాల ఆవిష్కరణ, పరిచయ సభ నిర్వహించారు. మార్ని జానకిరామ్ చౌదరి, ధూళిపాల అన్నపూర్ణ, కొప్పరపు లక్ష్మీ నరసింహారావు, ఎం.సోమశేఖరరావు, కస్తూరి నాగ మురళీశంకర్, బి.శుభశ్రీ, జగన్నాథరావులు పాల్గొన్నారు. వసుధారాణి రచించిన రూమీ తర్వాత కవిత్వ సంపుటిని ఆవిష్కరించారు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, రాజా సమీరనందన్, రెంటాల శ్రీవేంకటేశ్వరరావు, గరికిపాటి మాష్టారు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: స్థానిక విముక్తి కాలనీలో రోటరీ క్లబ్ తరపున 50 మంది కుష్ఠురోగులకు దుప్పట్లు, నిత్యావసరాలను రోటరీ సన్‌రైజ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఏ.సామ్యూల్, కార్యదర్శి విజయలక్ష్మి కోశాధికారి ఏవీ రంగారావు పంపిణీ చేశారు.

సైన్స్ సంబరం.. అంతరిక్ష వీక్షణం

కాకినాడ జేఎన్‌టీయూలో ప్రారంభమైన జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాలు మొదటి రోజు ఆదివారం ఆసక్తికరంగా సాగాయి. మీట్ ద సైంటిస్టు, పుస్తక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, పేరెంట్స్ టీచర్స్ ఇంటరాక్షన్ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, సైన్సు, సామాజిక అంశాలపై విద్యార్థులకు ఉన్న అవగాహనను పరీక్షించే నిమిత్తం విశ్రాంత ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య విజువల్ రౌండ్ నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా సమాధానాలు చెప్పారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అధునాతన టెలిస్కోప్ పరికరం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులు అంతరిక్ష వీక్షణ చేశారు.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్(కాకినాడ)

ఉత్సాహంగా క్రీడా పోటీలు

సాంబమూర్తినగర్, మసీదుసెంటర్, న్యూస్‌టుడే: కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న జిల్లాస్థాయి ఉపాధ్యాయ క్రీడా పోటీలు ఆదివారం ఉత్సాహంగా సాగాయి. క్రికెట్ మ్యాచ్‌ను కేవీవీ సత్యనారాయణ ప్రారంభించారు. మహిళల త్రో బాల్ విజేతగా పెద్దాపురం డివిజన్ జట్టు నిలిచింది. పురుషుల క్రికెట్ పోటీల్లో కాకినాడ డివిజన్ అర్బన్ జట్టు గెలిచింది. అర్బన ఎంఈవోలు టీజీ సుబ్బారావు, సి.హెచ్.రవి, కరప, తొండంగి ఎంఈవోలు పి.సత్యనారాయణ, సుబ్బిరెడ్డి, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి, కోఆర్డినేటర్ ఎల్.జార్జి, జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాస్, విమాచరిరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన కాకినాడ అర్బన్ జట్టు

గ్రీన్ బెల్ట్‌లో శ్రమదానం

'సమాజం కోసం మూడు గంటలు' కార్యక్రమంలో భాగంగా కాకినాడకు చెందిన ఆల్‌ఈజ్‌వెల్ సంస్థ శశికాంత్‌నగర్ ప్రధాన రహదారిలో గల గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో శ్రమదానం నిర్వహించారు. పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం పలు రకాల మొక్కలు నాటి వాటికి నీరు పోశారు. సంస్థ సభ్యులతోపాటు అన్నవరం సత్యవతీ దేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్


సమావేశానికి హాజరైన పూర్వ విద్యార్థులు

సందడిగా పూర్వ విద్యార్థుల సమావేశం

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం సందడిగా సాగింది. సంఘ గౌరవాధ్యక్షుడు భామిరెడ్డి, అధ్యక్షుడు వి.గోపాలనరసరాజా, కార్యదర్శి ఆకెళ్ల సత్యస్వరూప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. సంఘ నాయకుల మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల తోడ్పాటుతో కళాశాలలో రూ.70లక్షల మేర విలువైన అభివృద్ధి పనులు చేసినట్లు గుర్తుచేశారు. భవిష్యత్తులో మరిన్ని పనులు చేద్దామని నిర్ణయించారు. కళాశాలను యూనివర్శిటీ స్థాయికి తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషిచేద్దామని నిర్ణయించారు. ఈ సందర్భంగా స్నేహితులు పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుని, ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. సంఘ నాయకులు మల్లిపూడి శ్రీనివాసరావు, నల్లా సత్యనారాయణమూర్తి, ఏఎన్ సుబ్రహ్మణ్యం, పీడీవీఎస్ రాజు, శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి వ్యక్తి మృతి

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: భవనంపై నుంచి ఓ వ్యక్తి చెందిన సంఘటన ఆదివారం కాకినాడలో చోటుచేసుకుంది. డెయిరీఫాం సెంటర్‌లోని రాజీవ్‌గృహకల్ప సముదాయానికి చెందిన జి.నాగేశ్వరరావు(48) రెండో అంతస్తులో టీ తాగుతుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తీవ్రగాయాలైన అతడిని ఆదివారం సాయంత్రం జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్సపొందుతూ కొద్దిసేపటికే మృతిచెందాడు. దీనిపై కాకినాడ పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు.

అది ప్రభుత్వ స్థలమే.. రాళ్లు తొలగించిన అధికారులు

ఈనాడు కథనానికి స్పందన

స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, అసోసియేషన్ నాయకులు

సాంబమూర్తినగర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నగరంలోని సురేష్‌నగర్‌లో రూ. కోట్లు ఖరీదు చేసే నగరపాలక సంస్థకు చెందిన సామాజిక స్థలం ఆక్రమణపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆదివారం పట్టణ ప్రణాళిక అధికారి రామ్మోహనరావు శాస్త్రినగర్‌లో సామాజిక స్థలంలో రాళ్లు పాతిన స్థలాన్ని పరిశీలించారు. ఇది ప్రభుత్వ స్థలమని చెప్పారు. సిబ్బందితో రాళ్లు తొలగింపజేశారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి స్థలానికి ఫెన్సింగ్‌తోపాటు బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సురేష్‌నగర్, శాస్త్రినగర్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్అసోసియేషన్ అధ్యక్షుడు లాయర్ బుజ్జి, కార్యదర్శి నాయుడు, గౌరవాధ్యక్షుడు రాజేష్, మాజీ కార్పొరేటర్ వడ్డి కుమార్, కె.నాగేశ్వరరావు, సుబ్బరాజు మాట్లాడుతూ కొన్నేళ్లుగా స్థలాన్ని కాపాడుకుంటూ వస్తున్నామని, గత శుక్రవారం కొందరు వ్యక్తులు వచ్చి, తమదంటూ రాళ్లు పాతారన్నారు. దీనిపై ఫిర్యాదు చేయడంతో నగరపాలక అధికారులు చర్యలు తీసుకున్నారని పేర్కొన్నారు.

ట్రాఫిక్ ఐలాండ్ ధ్వంసం

కాకినాడ భానుగుడి కూడలి వద్ద ఉన్న ట్రాఫిక్ ఐలాండ్‌ను ఆదివారం తెల్లవారుజామున ఓ గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. దాంతో అది ధ్వంసమైంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చోదకుడు అక్కడ నుంచి ఉడాయించాడు. కారు నెంబరు ప్లేటు, బంపర్ ఊడి కింద పడిపోవడంతో పోలీసులు అతడిని గుర్తించారు. చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, మసీదు సెంటర్

స్తంభం.. నవ్విపోరా జనం

కాకినాడ అచ్యుతాపురం రైల్వేగేట్ పక్క వీధిలోని దేవీసెంటర్ దారి మధ్యలో విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా ఉంది. ఆ దారి గుండా రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రివేళ ప్రమాదం పాలయ్యేలా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మసీదు సెంటర్

రాకపోకలకు ఇబ్బందెన్నాళ్లు..

కాకినాడ సురేష్‌నగర్ బైపాస్ రహదారి నుంచి వాడపేట వెళ్లే దారిలో నగరపాలక ఉద్యాన స్థలం వద్ద కాలువపై ఏర్పాటు చేసిన కల్వర్టు అంచు దెబ్బతింది. వాహనచోదకులు రాకపోకలప్పుడు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్

ముక్కు మూసుకోవాల్సిందేనా..

కాకినాడ రేచర్లపేట నుంచి సాంబమూర్తినగర్ వెళ్లే దారిలో గౌతమబుద్ధ నగరపాలక ఉద్యానం వద్ద వ్యర్థాలు పేరుకుపోయాయి. ఆ ప్రాంతంలో రెండు డస్ట్‌బిన్‌లలో వ్యర్థాలు నిండి రోడ్డుపైకి చేరాయి. పందులు, కుక్కలు చెల్లాచెదురు చేయడంతో దుర్వాసన వస్తోంది. స్థానికులతోపాటు రాకపోకలు సాగించేవారు వాపోతున్నారు. చర్యలు తీసుకోవాలి. – న్యూస్‌టుడే, భానుగుడి సెంటర్


మంత్రి సత్యకుమార్‌తో అధికారులు

మంత్రిని కలిసిన జీజీహెచ్, ఆర్ఎంసీ అధికారులు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ నగరానికి వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను ఆదివారం జీజీహెచ్, ఆర్ఎంసీ అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.లావణ్య, డా.నరసింహం, రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా.ఎ.విష్ణువర్ధన్, డా.విజయశేఖర్, ఆర్ఎంఓ డా.వరప్రసాద్ తదితరులు ఆర్ఎంసీ, జీజీహెచ్‌కు సంబంధించి అభివృద్ధి పనులు, ఇతర పలు అంశాలపై చర్చించారు.

కాకినాడ నగరం: 'అటల్- మోదీ' సుపరిపాలన యాత్రలో భాగంగా కాకినాడ వచ్చిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ఆదివారం నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కలిశారు. ఈ సందర్భంగా కాకినాడ జీజీహెచ్‌లో వైద్యులు, సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు.

పోలియో నిర్మూలనకు రోటరీ కృషి

గాంధీనగర్, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలనకు రెండున్నర దశాబ్దాలుగా రోటరీ విశేష కృషి చేస్తుందని, రోటరీ ఖర్చు చేసిందని రోటరీ పోలియో కమిటీ ఛైర్‌పర్సన్ ఉదయభాను అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో టూటౌన్ సమీపంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో వ్యాక్సినేషన్ కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. చాక్లెట్లు, బంతులు, ఈలలు, ఇతర ఆట వస్తువులను పూర్వాధ్యక్షుడు చిరంజీవిరెడ్డి పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ రెడ్డి, చందు, సత్తి రవిరెడ్డి, మాచా రెడ్డి, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న రోటరీ పోలియో కమిటీ ఛైర్‌పర్సన్ ఉదయభాను

ఆలోచన.. ఆవిష్కరణ

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

విద్యార్థులు తమ ఆలోచనకు పదును పెట్టారు. ఆవిష్కరణతో సృజన చాటారు. అందరిచేత శెభాష్ అనిపించుకున్నారు. స్థానిక నగరపాలక సంస్థ సాలిపేట బాలికోన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనల్లో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు అందరినీ ఆకట్టుకున్నాయి. భౌతిక, రసాయన శాస్త్రాలు, ఇంజినీరింగు, కంప్యూటర్ తదితర అంశాల్లో వారు తమ ప్రయోగాలతో ఆలోచింపజేశారు.

స్మార్ట్ ఐఓటీతో విద్యుత్తు సరఫరా నిలుపుదల

కొన్ని సందర్భాల్లో ఆదమరుపుతో ఇళ్లల్లోనే కాదు కార్యాలయాల్లోనూ లైట్లు, ఫ్యాన్లు తదితర వాటిని నిలుపుదల చేయకుండా వెళ్లిపోతాం. గమ్యస్థానానికి చేరుకున్నాక విషయం గుర్తొచ్చి పరుగులు తీస్తాం. అప్పటికే జరగరాని నష్టం జరిగిపోతుంది. అటువంటి పరిస్థితిని అధిగమించేందుకు కిర్లంపూడి మండలం మల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని శాంతిజ్యోతి 'స్మార్ట్ ఐఓటీతో ఎక్కడి నుంచైనా విద్యుత్తు సరఫరా నిలుపుదల' ప్రాజెక్టు రూపొందించింది. చరవాణికి అమర్చిన హెచ్‌సీ-05 మాడ్యుల్‌తో బ్లూటూత్ ద్వారా ఇల్లు లేదా కార్యాలయాల్లోని ఫ్యాన్లు, సిస్టమ్స్, ఐరన్ బాక్సు, ఎలక్ట్రికల్ కుక్కర్లు వంటి పరికరాలకు విద్యుత్తు సరఫరాను నిలిపివేయవచ్చని నిరూపించింది.

మద్యం తాగితే.. బండి నడవదంతే..!

ఇటీవల కాలంలో మద్యం తాగి వాహనాలు పడుపుతూ ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయి. ప్రాణ నష్టం కూడా జరుగుతోంది. ఈ దశలో ఇటువంటి ప్రమాదాలను తావులేకుండా బెండపూడి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి కె.తనిష్క్ రూపొందించిన 'ఆల్కహాల్ డిటెక్టర్' ప్రాజెక్టు ఆలోచింపజేసింది. మద్యం తాగి వాహనం నడిపేందుకు స్టీరింగ్ పట్టుకోగానే సెన్సార్లు వాసనను పసిగట్టేస్తాయి. వెంటనే వాహనానికి ఆటోమెటిక్‌గా లాక్ పడి బండి కదలదు. అలాగే వాహనానికి నాలుగు వైపులా ఉన్న సెన్సార్ల ద్వారా ఎదురయ్యే రోడ్డు ప్రమాదాలను గుర్తించి హెచ్చరిస్తుంది.

రొటేట్ సోలార్ ప్యానళ్లు..

ప్రస్తుత కాలంలో సౌర విద్యుత్తుకు ప్రాధాన్యం పెరిగింది. ఇళ్లు, దుకాణాలు, వ్యవసాయ భూముల వద్ద సోలార్ విద్యుదుత్పత్తికి యూనిట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే సూర్యకాంతి దిశ మార్చుకున్నా.. దుమ్ము, ధూళి పేరుకుపోయినా సోలార్ ప్యానెళ్ల నుంచి విద్యుదుత్పత్తి సరిగా ఉండదు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఏకే మల్లవరం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని నాగశ్రీవల్లి రూపొందించిన 'సోలార్ ట్రాకింగ్ సిస్టమ్ అండ్ సెల్ఫ్ క్లీనింగ్' ప్రాజెక్టు ఆకట్టుకుంది. సోలార్ ప్యానళ్లకు అమర్చిన మోటారు, సెన్సార్ వ్యవస్థ ద్వారా సూర్య కిరణాలు ఎటు వంటి ఉంటే అటువైపు రొటేట్ అవుతాయి. అలాగే ప్యానళ్లపై పేరుకున్న దుమ్మును సైతం దానికి అర్చిన సెన్సర్లు గుర్తించి బ్రష్‌తో శుభ్రం చేస్తాయి.

సందడిగా క్రిస్మస్ సంబరాలు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: కాకినాడ డెయిరీఫారం కూడలి సమీపంలో గల ఏఎంజీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆదివారం క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ డైరెక్టర్ డా. అరుణ్‌కుమార్ కే మహంతి, వైస్ ప్రెసిడెంట్ డా.ఎడ్విన్ పాల్, పాస్టర్ విజయ్ కుమార్, హెచ్ఎం సబ్బవరపు చందన పాల్గొని మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేశారు. సాంస్కృతిక సంబరాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథి మహంతి క్రీస్తు బోధనలను వివరించారు.

ఏఎంజీ స్కూల్‌లో వేడుకల్లో విద్యార్థినులు

మసీదు సెంటర్ (కాకినాడ): కాకినాడ మెడ్‌వే సంజీవి ఆసుపత్రిలో క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా యేసుక్రీస్తు జననంపై ఆసుపత్రి సిబ్బంది ప్రదర్శన చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఐఆర్ఎస్ అదనపు కమిషనర్ వినయ్‌కుమార్, డైరెక్టర్ నిక్కొంటి సూర్యప్రసాద్, సెంటర్ హెడ్ దినేష్, వివిధ విభాగాల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెడ్‌వే సంజీవి ఆసుపత్రిలో..

ప్రయాణం.. ప్రమాదకరం

నగరంలో ఆదివారం స్థానిక రామారావుపేట ప్రధాన రహదారిపై ఆటో వెనుక మహిళలు ఇలా ప్రమాదకరంగా కూర్చుని ప్రయాణం సాగిస్తున్నారు. కనీస జాగ్రత్తలు పాటించకుండా ఆటోడ్రైవర్లు నిర్లక్ష్యంగా తీసుకెళుతున్నారు. గుంతల్లో వాహనం పడినప్పుడు ప్రయాణికులు పొరపాటు జారితే పెను ప్రమాదం తప్పదు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మసీదు సెంటర్

(c) eenadu

కాకినాడ గ్రామీణం
• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

చిన్నారుల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక చైతన్యం

గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని రామాలయంలో చిన్నారుల్లో, యువతకు ప్రత్యేక శిక్షణాతరగతులు ఆదివారం నిర్వహించారు. హరి కృష్ణవేణి కూచిపూడి నృత్యం, అల్లంరాజు లక్ష్మీజ్యోతి కర్ణాటక సంగీతం, ములుకూరి సత్యవతి ఆధ్వర్యంలో భగవద్గీత బోధన చేపట్టారు. 40 మంది విద్యార్థులు శిక్షణ తరగతులు హాజరయ్యారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

తీరంలో సందడి

సర్పవరం: కాకినాడ గ్రామీణం సూర్యారావుపేట వద్ద సముద్ర తీరంలో ఆదివారం పెద్దసంఖ్యలో పర్యాటకులు సందడి చేశారు. ఆటలు, సముద్ర స్నానాలు ఆచరిస్తూ కాలక్షేపం చేశారు. అలల తాకిడి ఎక్కువగా ఉండడంతో మెరైన్ సీఐ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, గజ ఈతగాళ్లు భద్రతా చర్యలు చేపట్టారు.

పోలియో చుక్కలతో చిన్నారులకు ఆరోగ్యం

సామర్లకోట: ఆరోగ్యవంతమైన సమాజం కోసం రెండు చుక్కలు దోహదపడతాయని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. ఆదివారం సామర్లకోట బ్రౌన్‌పేట అంబేడ్కర్ పార్కులో పల్స్ పోలియో కార్యక్రమంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. పురపాలక ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ అందుగుల మణికుమారి, కమిషనర్ శ్రీవిద్య, నాయకులు శ్రీకాంత్, జగదీష్‌మోహన్, కుమారస్వామి పాల్గొన్నారు. **కరప:** వేళంగి పీహెచ్‌సీ పరిధిలోని చిన్నారులకు డా.శ్రీనివాసనాయక్ చుక్కలు వేశారు. **తాళ్లరేవు:** గాడిమొగ పీహెచ్‌సీ వైద్యులు జయభార్గవి, శ్యామల, ఈశ్వర్, సురేష్ పర్యవేక్షణలో తాళ్లరేవు మండలంలోని 5,536 మంది పిల్లలు లక్ష్యం కాగా.. 5,306 మందికి వేసినట్లు తెలిపారు. **పిఠాపురం:** పిఠాపురం మండలం విరవ, మల్లాం పీహెచ్‌సీలు, పట్టణంలోని మంగాయమ్మరావుపేట, ఇందిరానగర్ యూపీహెచ్‌సీల పరిధిలో వైద్యులు బి.జయరాం, వినయ్, రోజాప్రియ ఆధ్వర్యంలో 99 శాతం చుక్కల మందు చేశారు. **సర్పవరం:** కాకినాడ గ్రామీణ మండలంలో 14,272 మంది అయిదేళ్లలోపు చిన్నారులు ఉండగా మొదటిరోజు 11,462 మందికి చుక్కలు వేశారు. ఇంద్రపాలెంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు, తెదేపా నాయకుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ✦ **గొల్లప్రోలు:** గొల్లప్రోలు మండలంలో 37 బూత్‌ల్లో చుక్కలు వేయించారు. ✦ **పెద్దాపురం:** పెద్దాపురం పట్టణం, గ్రామీణ ప్రాంతంలో 40 కేంద్రాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. **కాజులూరు:** గొల్లపాలెం పీహెచ్‌సీ పరిధిలోని 22 పల్స్ పోలియో కేంద్రాల్లో 2,076 మందికి పల్స్ పోలియో చుక్కల మందు వేశామని వైద్యురాలు డాక్టర్ ఎన్.సౌజన్య తెలిపారు. దుగ్గదూరు పీహెచ్‌సీ పరిధిలో 27 కేంద్రాల ద్వారా 2,390 మందికి వ్యాక్సిన్ వేశామని వైద్యురాలు వై.సుప్రియ వివరించారు.

గొల్లప్రోలులో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

వైద్యశిబిరాలు.. పండ్లు, దుప్పట్లు పంపిణీ

పెద్దాపురం: పెద్దాపురంలో మాజీ సీఎం వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు, పురపాలక అధ్యక్షురాలు బొడ్డు తులసీ మంగతాయారు, సాయిప్రసాద్ పాల్గొన్నారు. ✦ **సామర్లకోట:** సామర్లకోట అన్నపూర్ణ కల్యాణ మండపంలో పెద్దాపురం నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. వైద్య శిబిరం నిర్వహించారు. ✦ **కొత్తపల్లి, కాజులూరు:** యు.కొత్తపల్లి మండలంలో రావు చిన్నారావు కేక్ కట్‌చేసి.. వంద మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ✦ **పిఠాపురం:** పిఠాపురం వైకాపా కార్యాలయంలో ఇన్‌ఛార్జి వంగా గీత ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. ✦ **గొల్లప్రోలు:** గొల్లప్రోలులో 200 మంది వృద్ధులు, దివ్యాంగులకు మాజీ జడ్పీటీసీ సభ్యురాలు అముజూరి విజయ, వైకాపా జిల్లా కార్యదర్శి అముజూరి రాంబాబు దుప్పట్లు పంపిణీ చేశారు. ✦ **సర్పవరం:** కాకినాడ వైద్యనగర్‌లోని కార్యాలయంలో మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో కేకు కోసి తినిపించారు. రమణయ్యపేటలోని శ్రావణ వృద్ధుల ఆశ్రమంలో భోజనాలు, పండ్లు అందించారు.

మాది పట్టణమా, గ్రామమా..?

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం పట్టణ శివారు గంగానగరం ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 60 ఏళ్ల క్రితం సర్వే నంబరు 85బై2లో ఉండే మెరక భూమి ప్రస్తుతం నివాస ప్రాంతంగా మారింది. పిఠాపురానికి రెండు కిలోమీటర్ల దూరం, విరవాడ గ్రామానికి అర కిలో మీటర్ దూరంలో కాలనీ ఉంది. కాని వీరు పట్టణ ప్రాంత ప్రజలా, గ్రామీణులో ఎవరూ తేల్చడం లేదు. ఇక్కడ 65 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాని మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. పన్నులు, ఇంటి నిర్మాణ ప్లాన్లు పట్టణం నుంచి తీసుకుంటున్నారు. ఓట్లు, ఆధార్, రేషన్‌కార్డుల్లోని చిరునామాలు మాత్రం విరవాడ పంచాయతీ పరిధిలో ఉన్నాయి. రోడ్లు, డ్రెయినేజీలు, విద్యుత్తు దీపాలు, మంచినీటి సమస్యలతో సతమతమవుతున్నా పరిష్కారం చూపడం లేదని ఆవేదన చెందుతున్నారు. గత సోమవారం పాడాలోనూ ఫిర్యాదు చేశారు. తహసీల్దారు గోపాలకృష్ణ ఆ ప్రాంతం పట్టణ పరిధిలోనిదేనని చెబుతున్నారు.

గంగానగరంలో కాలువ లేక ఇంటి ముందు మురుగు

ఉత్కంఠ భరితంగా కరాటే పోటీలు

సామర్లకోట: సామర్లకోట డీఎస్ఆర్ కల్యాణ మండపంలో 4వ నేషనల్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు ఉత్కంఠ భరితంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం లయన్స్‌క్లబ్ మొదటి వైస్ గవర్నర్ చిట్టినీడి శ్రీనివాసరావు, కరాటే ఇండియా చీఫ్ మల్లిఖార్జునగౌడ్‌లు ప్రారంభించారు. దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన సుమారు 600 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. సామర్లకోట భీమేశ్వర లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు, డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు, క్లబ్ ప్రతినిధులు చిత్తులూరి వీర్రాజు, ఏలేటి రమేష్, సీతారామరాజు పాల్గొన్నారు.

పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఆత్మీయంగా కలిశారు..

సర్పవరం: కాకినాడ అర్బన్ ఆర్ఆర్ నగర్‌లో ఆదివారం కోకనాడ డెకరేటర్స్, ఫంక్షన్ మెటీరియల్ సప్లయర్స్ ఓనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సిరి శ్రీనివాస్, కార్యదర్శి గారపాటి శివ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జిల్లా నలుమూలలనుంచి పెద్ద సంఖ్యలో కుటుంబ సభ్యులతో వచ్చి ఆటపాటలతో కాలక్షేపం చేశారు. పలువురిని సన్మానించారు.

రాష్ట్రస్థాయి వక్తృత్వ పోటీలకు మల్లాం విద్యార్థిని

పిఠాపురం: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా విద్యా, పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల పోటీలు నిర్వహించారు. కాకినాడలో జరిగిన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో పిఠాపురం మండలం మల్లాం జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న టి.లోహిత సత్యశ్రీ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు చోటు దక్కించుకుంది. ఈ నెల 23న విజయవాడలో జరిగే పోటీలో తలపడనుంది. అక్కడ కూడా మొదటి స్థానంలో నిలిచేలా శిక్షణ ఇస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు గాజుల మురళి తెలిపారు.

టి.లోహిత సత్య శ్రీ

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణానికి చెందిన ఇద్దరికి సీఎం సహాయనిధి చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే చినరాజప్ప అందించారు. పట్టణానికి చెందిన బత్తిన దుర్గాప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.1.78 లక్షలు, కిలపర్తి వీర వెంకట అప్పాజీకి శస్త్రచికిత్స కోసం రూ.62 వేలు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో రాజాసూరిబాబురాజు, రంగనాగ్, రంధి సత్యనారాయణ, మార్ని చిన్న, కొరిపూరి రాజు, టి.సాయి, చందు పాల్గొన్నారు.

టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషదాయకం

పెద్దాపురం, న్యూస్‌టుడే: ప్రతి ఏడాది పెద్దాపురం టెన్నిస్ అసోసియేషన్ క్రీడాకారులను ప్రోత్సహించడానికి టోర్నమెంట్లు నిర్వహించడం సంతోషదాయకమని ఎమ్మెల్యే చిన రాజప్ప అన్నారు. స్థానిక లిటరరీ అసోసియేషన్ హాలులో నిర్వహిస్తున్న సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ క్రీడాభివృద్ధికి అన్నీ విధాలుగా తోడ్పాటు ఇస్తానన్నారు. ఈ పోటీలకు (35, 45, 55, 65, 70, 75 ప్లస్‌లుగా) సింగిల్, డబుల్స్ కేటగిరిల నుంచి 20 టీమ్‌లు వచ్చాయని పట్టణ టెన్నిస్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి, పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరి రాజు, కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, టెన్నిస్ క్రీడాకారులు రాజాసూరిబాబురాజు, పసల పద్మరాఘవరావు ప్రసంగించారు. మట్టే శ్రీనివాసు, సీహెచ్. విజయప్రకాష్, రంగనాగ్, రమణమూర్తి, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి

పిఠాపురం, న్యూస్‌టుడే: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగా ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజర్‌బాబు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ మొగలి అప్పారావు అన్నారు. ఆదివారం పిఠాపురం జగ్గయ్యచెరువు ప్రాంతంలో స్థానిక కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు మాజీ ఛైర్మన్ బాలిపల్లి రాంబాబు ఆధ్వర్యంలో మోహనరంగా విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. పొలిశెట్టి శేఖర్, బి.సతీష్, బండి రవి, కావడి పోశయ్య, బాను, సూరిబాబు, లోవరాజు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణలో బాలిపల్లి రాంబాబు, తదితరులు

వైభవంగా గజ్జెల పూజ

పిఠాపురం: పిఠాపురం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గజ్జెల పూజ జరిగింది. ఆదివారం నాట్య కళాకారులచే ఆలయ ప్రధాన అర్చకుడు విజయ జనార్దనాచార్యులు సామూహిక గజ్జెల పూజ చేయించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నటరాజ నృత్య నికేతన్ నాట్య గురువు పిల్లా సత్యనారాయణ ఈ కార్యక్రమం నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198, పిఠాపురం: 80085 65544

సమస్య: కాకినాడ అర్బన్ ఒకటో డివిజన్ రమణయ్యపేటలో మురుగు కాలువల్లో పూడిక తీయడం లేదు. – శ్రీనివాసరావు

పరిష్కారం: పారిశుద్ధ్య విభాగం బాధ్యుడు జగన్‌కు చెప్పగా సిబ్బందితో శుభ్రం చేయించారు.
– న్యూస్‌టుడే, రమణయ్యపేట

సమస్య: కరపలో రసాయనం పిచికారీ చేయక దోమలు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నాం.
– బాలసుబ్రహ్మణ్యం

పరిష్కారం: డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు సిబ్బందితో దోమల నివారణ మందు చల్లించారు.
– న్యూస్‌టుడే, కరప

సమస్య: పిఠాపురం బొజ్జవారితోటలో పూడికలు తొలగించి, కాలువల చెంతనే వ్యర్థాలు వదిలేశారు.– సతీష్

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ప్రభాకర్‌కు చెప్పగా ఆ ప్రాంతంలో వ్యర్థాలు తొలగించే పనులు చేయించారు. – న్యూస్‌టుడే, పిఠాపురం

సమస్య: స్థానిక జంగారెడ్డివారి వీధిలో కాలువలో మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయాలి.
– వెంకట్రావు, స్థానికుడు

పరిష్కారం: పారిశుద్ధ్య అధికారి ఆదినారాయణకు తెలపగా కాలువలు శుభ్రం చేయించారు.
– న్యూస్‌టుడే, పెద్దాపురం

సమస్య: గొల్లప్రోలు కరణంగారి తోటలో డ్రెయిన్ వ్యర్థాలతో మూసుకుపోయి మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. – స్థానికులు

పరిష్కారం: ఇన్‌ఛార్జి పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి రఘుప్రసాద్ సిబ్బందితో వ్యర్థాలను తొలగింపజేశారు. – న్యూస్‌టుడే, గొల్లప్రోలు

సమస్య: కొత్తపల్లి గ్రామం విష్ణాలయం సమీపంలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. – స్థానికులు

పరిష్కారం: విద్యుత్తుశాఖ ఏఈ శ్రీనివాసరావు సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.
– న్యూస్‌టుడే, కొత్తపల్లి

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

లోవరాజు (దాచిన చిత్రం)

సామర్లకోట: సామర్లకోట భీమేశ్వరాలయం గోదావరి కాలువలో గల్లంతైన చేపూరి లోవరాజు(40) మృతదేహం ఆదివారం లభ్యమయ్యింది. శుక్రవారం గోదావరి కాలువలో గుర్రపుడెక్క తొలగింపు పనులు చేస్తుండగా కాలువలో పడి లోవరాజు గల్లంతైన విషయం పాఠకులకు తెలిసిందే. రెండు రోజులపాటు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం కాలువలో గుర్రపు డెక్కలో మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని పోలీసులు వెలికి తీసి పంచనామా నిమిత్తం పెద్దాపురం తరలించారు. మృతుడి భార్య గత కొంతకాలం కిందట కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రిస్మస్ కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

తెదేపా కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు

పిఠాపురం: పిఠాపురం తెదేపా కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం ఎస్సీసెల్ నాయకులు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పాల్గొన్నారు. కేక్ కోసి పంచారు.

సర్పవరం: చీడిగలోని ఇమ్మాన్యుయేల్ చర్చిలో బిషప్ నెహెమ్యా ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో అతిథిగా తెదేపా నేత వెంకట ప్రభాకర్ పాల్గొని కేకు కోసి పంచారు. 200 మంది వృద్ధులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ప్రకాష్‌గౌడ్, సీతయ్య దొర, నెహ్రూ, లావణ్య, గంగయ్య పాల్గొన్నారు.

మరిడమ్మ గుడిలో అన్నప్రసాదం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ఏసీ విజయలక్ష్మి, వేదపండితులు నాగ దేవర వేంకటశాస్త్రి, ఇంద్రగంటి ప్రసాదశర్మ, ఆసాదులు విజయ్, నాని, భక్తులు పాల్గొన్నారు.

దమ్ములపేట సమస్యలు పరిష్కరించాలని నిరసన

పెద్దాపురం: పెద్దాపురం పట్టణ ఒకటోవార్డు పరిధి దమ్ములపేటలో కాలనీవాసుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వల్లూరి రాజబాబు, రెడ్డి దుర్గాదేవి, కోట వీరబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

130 మందికి నేత్రవైద్య పరీక్షలు

తాళ్లరేవు: కొత్త కోరంగిలో మల్లాడి సత్యలింగ నాయకర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. దివంగత దోమ సూర్యనారాయణ జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ శిబిరంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వైద్య నిపుణులు లక్ష్మీ అనూష పర్యవేక్షణలో 130 మందికి కంటి పరీక్షలు చేశారు. 40 మందికి శస్త్రచికిత్స చేసేందుకు నిర్ధారించారు.

తెదేపా ఆత్మీయ సమావేశం

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం పట్టణానికి శివారు కట్టమూరు పుంతలోని ఆయిల్‌పామ్ తోటలో ఆదివారం పట్టణ తెదేపా ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, తెదేపా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు ఇతర తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేబ్రోలులో హిందూ సమ్మేళనం

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఆర్ఎస్ఎస్, సీతారామ్మూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగించారు. స్థానిక సీతారామస్వామి ఆలయం నుంచి హరేరామ గుడి వరకూ హరేరామ సంకీర్తనతో పాదయాత్ర నిర్వహించిన అనంతరం సభను ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రచార్ ప్రముఖ్ కృష్ణారెడ్డి హిందూ సంస్కృతి గొప్పతనం, ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్రపై ప్రసంగించారు. ఆర్ఎస్ఎస్ మండల ప్రముఖ్ సతీష్ రెడ్డి, వివిధ ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్ఎస్ఎస్ మండల ప్రముఖ్ సతీష్‌రెడ్డి

ఎ.కె.మల్లవరంలో ఘర్షణ ఆరుగురికి గాయాలు

గొల్లప్రోలు: గొల్లప్రోలు మండలం ఎ.కె.మల్లవరం గ్రామ శివారులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి వరి కోత యంత్రాలతో పనుల నిమిత్తం కొంత మంది కూలీలు వచ్చారు. వారంతా రెండు వర్గాలుగా కర్రలు, ఇనుపరాడ్లతో శనివారం రాత్రి ఘర్షణకు దిగడంతో ఆరుగురికి గాయాలైనట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. పరస్పరం చేసుకున్న ఫిర్యాదులపై ఆదివారం కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం మతేరా జిల్లా అజిపూర్ గ్రామానికి చెందిన దుర్గాదాస్, రవికుమార్, సత్పాల్‌రావులకు గాయాలు కాగా, మతేరా జిల్లా పైగాం గ్రామానికి చెందిన మరొకవర్గంలో ధీరజ్, మనోజ్, ప్రేమ్‌సింగ్‌లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాథమిక వైద్యసేవలు అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. దుర్గాదాస్ ఫిర్యాదుపై ముగ్గురు వ్యక్తులపై, ధీరజ్ ఫిర్యాదుపై ఎనిమిది మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఈ రెండు కేసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ పనుల్లో నెలకొన్న వివాదాలతో ఘర్షణకు తలపడ్డారన్నారు.

11 వాహనాల స్వాధీనం

తాళ్లరేవు: చొల్లంగిపేట కొబ్బరిచెట్టు పేట కాలనీలో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కాకినాడ గ్రామీణ సీఐ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో కాలనీ, జాతీయ రహదారిపై పోలీసులు బృందాల వారీగా తనిఖీలు నిర్వహించారు. దస్త్రాలు లేని 11 ద్విచక్రవాహనాలను గుర్తించారు. గ్రామంలో అనుమానాస్పద వ్యక్తుల వివరాలు అడిగి పేర్లు నమోదు చేసుకున్నారు. 11 ద్విచక్రవాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కోరింగ ఎస్సై పి.సత్యనారాయణతో పాటుగా పెదపూడి, తిమ్మాపురం, ఇంద్రపాలెం ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

జల్లూరి నరసయ్య సన్స్
జల్లూరి శ్రీనివాసరావు, జల్లూరి ఈశ్వరరావు
పెద్దాపురం

గ్రంధి రాజేష్
కాకినాడ జిల్లా వాసవి సేవాదళ్ చైర్మన్
పెద్దాపురం

సూరే మురళీకృష్ణ
శ్రీ సూరే సుబ్బారావు & కో.,
పెద్దాపురం

విజప్పు రాజశేఖర్
హోల్ మున్సిపల్ కౌన్సిలర్
7వ వార్డు, పెద్దాపురం

జల్లూరి వీర్రాజు
చైర్మన్: శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం
సిండికేట్ ఫైనాన్స్ & చిట్స్,
పెద్దాపురం

వేముల సతీష్ & అనిల్
పెద్దాపురం

అద్దేపల్లి రమేష్
పెద్దాపురం

గాల్లపూడి సునీత్‌కుమార్
పెద్దాపురం

అద్దేపల్లి లక్ష్మీనారాయణ (చినబాబు)
పెద్దాపురం

వంకాయల వెంకటేశ్వరరావు & సత్యనారాయణ,
పెద్దాపురం





(c) eenadu

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

చినశంకర్లపూడిలో నగదు అందిస్తున్న చిన్న వెంకన్న

శ్మశానవాటిక అభివృద్ధికి విరాళం

ప్రత్తిపాడు: చినశంకర్లపూడి గ్రామంలో శ్మశానవాటిక అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గ్రామానికి చెందిన గజ్జెల చిన్నవెంకన్న రూ.50 వేలను విరాళంగా సమకూర్చారు. మాజీ ఉప సర్పంచి, సగర సంఘ నాయకుడు ఏపూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరుగుతున్న పనులకు వినియోగించాలని నగదును ఆదివారం గజ్జెల చిన్న వెంకన్న అందజేశారు. సగర సంఘ పెద్దలు సీహెచ్ నాగేశ్వరరావు, రాంబాబు తదితరులు ఉన్నారు.

ధ్యాన దినోత్సవంపై వెబినార్

తొండంగి: అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఆదివారం జాతీయస్థాయి వెబినార్ ప్రిన్సిపల్ మెహర్ అధ్యక్షతన జరిగింది. హైదరాబాదుకు చెందిన యోగా నిష్ణాతుడు మెహర్‌కుషాల్, ఆర్ట్‌ఆఫ్ లివింగ్ యోగా గురువు లక్ష్మి ప్రకాష్‌లు మెదడు పనితీరు దాని ద్వారా ఆలోచనలు నియంత్రణలో పెట్టుకునే విధానాన్ని వివరించారు. హాజరైన విద్యార్థులందరినీ ఆన్‌లైన్లో ధ్యానసాధన చేయించారు. ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. నాయుడు, సిద్ధార్థబాబు పాల్గొన్నారు.

రోజూ వ్యాయామం అవసరం

తుని: పిల్లలు, పెద్దలు రోజూ వ్యాయామం చేయడంతో ఆరోగ్యంగా ఉండవచ్చునని రూరల్ సీఐ జి.చెన్నకేశవరావు అన్నారు. షెమ్‌ఫోర్డ్ స్కూల్లో జరిగిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్‌టచ్‌ల గురించి అవగాహన కలిగించాలన్నారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రముఖులు చోడిశెట్టి త్రిమూర్తి స్వామి, ప్రిన్సిపల్ నాగకుమారి చౌదరి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066
ఉ॥ 10 - మ॥ 1

వ్యర్థాలను తొలగించాలి

సమస్య: మల్లివీడు గ్రామంలో కాలువల్లో వ్యర్థాలు ఉండిపోతున్నాయి. మురుగు నీరు ముందుకు ప్రవహించడం లేదు. - రవి, మల్లివీడు

సమాధానం: కాలువలను శుభ్రం చేయిస్తాం. - రామరాజు వర్మ, డిప్యూటీ ఎంపీడీవో, ఏలేశ్వరం

సమస్య: పైడికొండలో పారిశుద్ధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. అధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించాలి. - దాసు, గ్రామస్థుడు

సమాధానం: పంచాయతీ సిబ్బందికి చెప్పి సమస్యలు పరిష్కరిస్తాం. - నాగమణి, పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, ఏలేశ్వరం, తొండంగి

కాలువలు లేక అవస్థ

సమస్య: కత్తిపూడి గ్రామంలో మూడో వార్డులో కాలువలు లేక వాడకపు నీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో రహదారులు చిత్తడిగా మారడంతో ఇబ్బందిగా ఉంది. - లింగేశ్వరరావు, స్థానికుడు

సమాధానం: గ్రామంలో కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. - సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, కత్తిపూడి
- న్యూస్‌టుడే, శంఖవరం

వీధి దీపాలకు మరమ్మతులు

స్పందనకు వందనం

రాజుపూడి శివారు కృష్ణాపురంలో రామాలయం వీధిలో గత కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట ఇంట్లోంచి బయటకు రావాలంటే కుక్కల బెడద ఎక్కువగా ఉంటుందని వాపోతున్నారు. సమస్యను గ్రామ సర్పంచి విష్ణుమూర్తి దృష్టికి తీసుకెళ్లగా పంచాయతీ సిబ్బందిచే సమస్యను పరిష్కరించారు. వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టారు. పలుచోట్ల కొత్తవి అమర్చి సమస్యకు పరిష్కారం చూపారు. - న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం

ఖర్చు తప్పదు.. ఊరు మెచ్చదు!

శరభవరంలో ప్రధాన రహదారి కూడలి

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

రూ. కోట్లు ఖర్చు పెడుతున్నారు. ప్రణాళిక లోపంతో ఏ ఒక్క గ్రామమూ పూర్తిస్థాయిలో ఉపయోగ పడటం లేదు. నియోజకవర్గంలో 126 గ్రామాలు ఉన్నాయి. ఏ గ్రామం సంతృప్తికరంగా అభివృద్ధి చెందిందని చెప్పలేని పరిస్థితి. అంతర్గత రహదారులు, కాలువలు, ఇంటింటికీ తాగునీరు, వ్యర్థాల నిర్వహణలో ఏ ఒక్క గ్రామం నూరు శాతం అభివృద్ధి చెందలేదు. కూటమి ప్రభుత్వం రాకతో నియోజకవర్గంలో సుమారు రూ.300 కోట్ల పనులు జరిగాయి. జల్‌జీవన్ పనులు ఇంకా సాగుతూనే ఉన్నాయి. శ్మశానవాటికలను సైతం ప్రతి గ్రామంలో సౌకర్యంగా ఉంచలేని దుస్థితి. గ్రామాల్లో శ్మశానవాటికల్లో ప్రహరీ, నీటి వసతి, దహన సంస్కారాలకు వసతులు అవసరం.

ఊరికో ఉద్యానం ఊసే లేదు..

ప్రతి ఊరికి ఉద్యానవనం తీర్చిదిద్దేలా 'ఉపాధి' పథకం తోడ్పాటునిస్తున్నా ధర్మవరంలో మినహా ఎక్కడా ఉద్యానం ఊసే లేదు. సామాజిక స్థలాలు, ప్రభుత్వ జాగాలు, చెరువులను ఆహ్లాదకర ప్రదేశంగా మార్చుకోవాల్సి ఉంది.

వ్యర్థానికి 'అర్థం' లేదు..

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ప్రతి గ్రామంలోనూ అవసరమే. దశాబ్దకాలంగా ఈ ప్రయత్నానికి సుమారు రూ.10 కోట్లు పైగా వెచ్చించినా దమ్మిడీ ఆదాయం పంచాయతీలకు రాలేదు. ఇప్పటికీ 67 పంచాయతీల్లో వ్యర్థాలకు అర్థం దొరకడం లేదు. తడి, పొడి చెత్త సేకరించేందుకు పంచాయతీలకు ఇచ్చిన స్వచ్ఛ వాహనాలు తుప్పు పట్టి ఉన్నాయి.

వ్యయం తప్ప..

నాలుగు మండలాల్లో 120 కి.మీ పక్కా డ్రైన్లు అవసరం. కచ్చా కాలువలకే కాసులు ఖర్చు పెడుతున్నారు. కనీసం ప్రధాన రహదారి వెంబడి డ్రెయిన్లను నిర్మించని పరిస్థితి ప్రత్తిపాడుతో సహా ప్రతి పంచాయతీలోనూ ఉంది. వానొస్తే ముంపు సమస్య మామూలే.

కొసమెరుపు

గ్రామ యూనిట్‌గా అన్ని సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాము. ఉపాధి నిధులతో పాటు, మిగతా కేటాయింపులను సమన్వయంతో ఖర్చు చేసేలా పర్యవేక్షిస్తున్నామని ఎంపీడీవో కుమార్ బాబు తెలిపారు.

మారని తీరు.. తగ్గని ప్రమాదాల జోరు

వి.కొత్తూరు హైవే పక్కన బోల్తాపడిన లారీ

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాదాల నియంత్రణకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఫలితాలు మాత్రం కనిపించడం లేదు. ఏటా ప్రమాదాలు, మృతుల సంఖ్య పెరుగుతూనే ఉంది. నియోజకవర్గ పరిధిలో సుమారు 24 కి.మీ. మేర జాతీయ రహదారి. తుని నుంచి కాకినాడ వెళ్లే మరో 15 కి.మీ. మేర సముద్రతీర ప్రాంత రహదారి, మరో పక్క తుని నుంచి నర్సీపట్నం వెళ్లే మరో 25 కి.మీ. మేర పొడవున్న రాష్ట్ర రహదారిపై ప్రమాదాలు జోరుగా సాగుతున్నాయి. గతేడాది ఈ రహదారులపై 109 ప్రమాదాలు జరగగా గడిచిన 12 నెలల వ్యవధిలో ఏకంగా వీటి సంఖ్య 121 కు చేరడం ప్రమాదాల తీవ్రతను సూచిస్తోంది.

నిబంధనలు పాటించాలి..

ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు, వాహనాలు సరైన స్థితి (కండీషన్) ఉండే విధంగా వాహనచోదకులు జాగ్రత్తలు పాటించాల్సిందిగా తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు కోరుతున్నారు. దీంతోపాటు హైవేపై ప్రమాదాల నియంత్రణకు వేగనియంత్రికలు ఏర్పాటు చేయడం, మద్యం మత్తులో వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తున్నామన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కాట్రావులపల్లిలో ప్రధాన రహదారి నిర్మాణ పనులు

జగ్గంపేట గ్రామీణం: మండలంలోని కాట్రావులపల్లిలో రూ. రెండు కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత ప్రకారం అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. కాట్రావులపల్లిలో ఎస్‌జి రోడ్డు నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు 1 కి.మీ. సీసీ రోడ్డు నిర్మాణానికి ఎస్‌హెచ్ ప్లాన్(సాకి) నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ర.భ.శాఖ అధికారులు, గుత్తేదారుడికి సూచించారు. నాయకులు ముసిరెడ్డి నాగేశ్వరరావు, కొత్త కొండబాబు, కంటే రామారావు, అడపా భరత్ తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని రథ సేవ

అన్నవరం: అన్నవరం సత్యదేవుని రథ సేవ ఆదివారం ఘనంగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేసి అర్చకులు పూజలు చేశారు. వేదమంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాలతో ఆలయ ప్రాకారం చుట్టూ మూడుసార్లు ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో వార్షిక కల్యాణవేదికపై సూర్య నమస్కారాల పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పరోక్ష సేవకు ఏదీ ప్రత్యక్ష ప్రసారం?

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం ఆలయంలో పరోక్ష సేవ పూర్తిస్థాయిలో అందడం లేదు. ఆన్‌లైన్లో రుసుం చెల్లించి పరోక్ష సేవలో పాల్గొనే భక్తులకు నిత్యం జరిగే ఆయుష్యహోమం, వనదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రతి శుక్రవారం జరిగే చండీహోమాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం లేదు. కొవిడ్ సమయంలో ఆలయానికి భక్తులు వచ్చి ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం లేనివారికి పరోక్ష సేవను 2020 అక్టోబరులో అందుబాటులోకి తెచ్చారు. ఆన్‌లైన్ ద్వారా ఆయా సేవలకు రుసుం చెల్లించే భక్తులకు గోత్ర, నామాలతో పూజలు చేస్తారు. ఈ పూజను కెమెరాలో రికార్డు చేస్తూ ప్రత్యక్ష ప్రసారం యూట్యూబ్ లింక్‌ను ఆయా భక్తులకు వాట్సాప్ ద్వారా పంపించేవారు. వారి పేరు మీద జరిగే పూజను యూట్యూబ్‌లో భక్తులు ప్రత్యక్షంగా చూసి తరించేవారు. అయితే వ్రతం, నిత్యకల్యాణం సేవలను మినహా మిగిలిన సేవలను ప్రత్యక్ష ప్రసారం చేయకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతుంది. కెమెరాలు మరమ్మతుల కారణంగా ఇబ్బంది వస్తుందని ఆ విభాగ సిబ్బంది చెబుతున్నారు.

ఆయుష్యహోమం నిర్వహిస్తున్న వైదిక బృందం

వాకర్స్ హెల్త్ క్లబ్‌కు పురస్కారాలు

పురస్కారం అందుకుంటున్న క్లబ్ ప్రతినిధులు

తుని పట్టణం: వాకర్స్ హెల్త్ క్లబ్‌కు పలు పురస్కారాలు దక్కాయి. ఇంటర్నేషనల్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి ఉత్తమ క్లబ్‌గా రూ.10 వేలు నగదు పురస్కారాన్ని తుని అధ్యక్షుడు డీఎస్ మూర్తి ఆదివారం విశాఖలో అందుకున్నారు. ఉత్తమ వాకర్‌గా కుందెం సత్యనారాయణకు పురస్కారం అందించారు. కార్యక్రమంలో చదరం శివాజీ, డీవీఎల్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో ఎంపికైన తూర్పుకాపు సంఘ కార్యవర్గం

తూర్పు కాపు నూతన కార్యవర్గం

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: అఖిల భారత తూర్పు కాపు సంక్షేమ సంఘ జాతీయ అధ్యక్షుడు చంద్రమోహన్ ఆదేశాల మేరకు సామాజిక వర్గీయులు ఆదివారం ఏలేశ్వరం సత్యదేవుని ఆలయంలో సమావేశమై పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శిడగం రామకృష్ణ, అధ్యక్షుడిగా డి.చిన్నారావు, సమన్వయకర్తగా దత్తి రాజు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఈశ్వరరావు, జి.రాజా, తూమురౌతు శ్రీను, ఉపాధ్యక్షులుగా లోగీసు శేఖర్, గణేష్, జి.రాజా, సహ అధ్యక్షుడిగా పి.ప్రసాద్, కార్యదర్శులుగా గొల్లబాబు, ఆర్.రాజా, శంకర్, రమేష్, రామకృష్ణ, వంశీకృష్ణ, కోశాధికారిగా సుధీర్ తదితరులు ఎంపికయ్యారు.

శాంతిభద్రతల విషయంలో అప్రమత్తం

కిర్లంపూడి, న్యూస్‌టుడే: గ్రామంలో ఈవ్‌టీచింగ్, జూదం, కోడిపందాలు, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు తావులేకుండా గ్రామస్థులు చైతన్యంతో వాటిని అడ్డుకోవాలని సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ తెలిపారు. గెద్దనాపల్లిలో ఆదివారం సాయంత్రం శాంతిభద్రతలు, అసాంఘిక కార్యక్రమాలపై రామాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దొంగతనాలు, సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని దర్శించుకున్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం సత్యనారాయణ స్వామిని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం ఈయనకు వేదపండితులు ఆశీర్వచనం గావించారు. ఆలయ అధికారులు గణపతి, గంటా విష్ణులు స్వామి చిత్రపటం, ప్రసాదం అందించారు. ఆయన వెంట నాయకులు వేటుకూరి సూర్యనారాయణ రాజు, రమేష్‌నాయుడు, లక్ష్మీ ప్రసన్న, కామర్స్ చిరంజీవి తదితరులు ఉన్నారు.

వేదాశీస్సులు పొందుతున్న మాధవ్

'బావి' జీవన బంధం!

ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలోని ఈ బావి వద్ద రోజూ సందడే! ఎస్సీ కాలనీలోని కూడలిలో ఉండే ఈ బావి దశాబ్దాల నాటిది. చేదతో తోడి, బిందెలతో నీళ్లు పట్టుకెళ్లే జంఝాటం వెనుక ఆ బావి నీటితో ఉన్న తరతరాల బాంధవ్యమే కారణమని మహిళలు చెపుతున్నారు. సుమారు 200 కుటుంబాల వారు ఈ బావి నీటినే తాగడానికి, వంటకూ వాడుతున్నారు. కొళాయిలు ఉన్నా బావి నీటినే ఇష్టపడుతున్నారు. చేతి పంపులు, రక్షిత నీటి పథకాలు, జల జీవన్ మిషన్ ఊరూరా బావుల చెంతకు పరుగులు తీసే ప్రయాసను తప్పించినా సాంకేతిక సమస్యలు ఎదురైతే నీటి కోసం తంటాలు తప్పవు. ఈ కాలనీవాసులకు బావి వల్ల ఆ పరిస్థితి ఎదురు కాదు. గ్రామంలోని బావి సంరక్షణ అనుసరణీయం! భూగర్భ జలాలను సంరక్షించడానికి బావికి మించిన ఏర్పాటు ఉండదు. - న్యూస్‌టుడే, ప్రత్తిపాడు


పెదశంకర్లపూడి: తాగునీటి బావి

బీసీ కాలనీ మురుగు సమస్యకు పరిష్కారం

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మల్లిసాల బీసీ కాలనీలో మురుగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీలో ఏళ్ల తరబడి మురుగునీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షంనీరు రోడ్లపై పారడం, రోజుల తరబడి నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాధాన్యత ప్రకారం నిధులు మంజూరు చేసి గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారు. సర్పంచి నూకరత్నం, ఆత్మ ఛైర్మన్ పైడిపాల సూరిబాబు ప్రత్యేక దృష్టిసారించి కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం చేపట్టి సమస్యకు పరిష్కారం చూపుతున్నారు. సీసీరోడ్ల నిర్మాణంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

తుని, న్యూస్‌టుడే: తుని పట్టణ పరిధిలోని ఉడిపి హోటల్ వెనుక జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.9,500 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశామని పట్టణ ఎస్సై విజయబాబు పేర్కొన్నారు.

ఆటాడితే.. అదుర్స్..!

షాట్‌పుట్, డిస్కస్‌త్రోలో సత్తా

గండేపల్లి, న్యూస్‌టుడే: ఉన్నత చదువులతోపాటు క్రీడల్లోనూ భళా అనిపిస్తున్నారు కల్వపల్లి సాంబశివరావు. ప్రస్తుతం సూరంపాలెం ఆదిత్య విశ్వవిద్యాలయంలో ఈసీఈ చదువుతున్నారు.. డిస్కస్‌త్రో, షాట్‌పుట్ క్రీడల్లో రాణిస్తూ బంగారు పతకాలు సాధిస్తున్నారు.

ఇదీ పతకాల చిట్టా..

- 2022లో కాకినాడ ఆంధ్ర పాలిటెక్నిక్, విజయవాడ లయోలా, సికింద్రాబాద్ వీఎన్ఆర్‌లో షాట్‌పుట్‌లో పసిడి, డిస్కస్‌త్రోలో వెండిపతకాలు
- 2023 రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో షాట్‌పుట్‌లో బంగారం, డిస్కస్‌త్రోలోనూ బంగారు పతకం.
- 2024 బొమ్మూరు పాలిటెక్నిక్ కళాశాల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో షాట్‌పుట్‌లో బంగారం, డిస్కస్‌త్రో బంగారం, విశాఖపట్నం ఆంధ్రపాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో షాట్‌పుట్‌లో బంగారు పతకం కైవసం.

షాట్‌పుట్‌లో రాణిస్తున్న సాంబశివరావు (అంతర చిత్రం) గెలిచిన కప్పుతో

లక్ష్యం: రైల్వేలో ఉద్యోగం సాధించాలన్నది లక్ష్యమని సాంబశివరావు తెలిపారు.

'గోదావరి పరవళ్లు.. భాష సందళ్లు'

తుని పట్టణం: పట్టణానికి చెందిన కవి, తెలుగు ఉపాధ్యాయుడు ఈరంకి వీర వెంకట సత్య వరప్రసాద్ రాజమహేంద్రవరంలో జరిగిన గోదావరి కవితా తరంగాలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన 'గోదావరి పరవళ్లు...తెలుగు భాష సందళ్లు' అనే స్వీయ కవిత గానం వినిపించి అలరించారు. విశ్వ సాహితీ కళావేదిక సంస్థ, ఆంధ్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలుగుశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వరప్రసాద్ కవితా గానానికి మెచ్చి నిర్వాహకులు కె.రమావతి ఆయనను సత్కరించారు.

వరప్రసాద్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

జగ్గంపేటలో నిర్మించిన అన్న క్యాంటీన్

తుదిమెరుగులు దిద్దుకుంటున్న అన్న క్యాంటీన్

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రం జగ్గంపేటలో నిర్మించిన అన్న క్యాంటీన్ భవనం నిర్మాణం పూర్తయింది. గోకవరం రోడ్డులో పోస్టాఫీసు ఎదురుగా ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాన్ని త్వరలో ప్రారంభించి అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఇది అందుబాటులోకి వస్తే పేదలు, కార్మికులు, విద్యార్థులు, నిరుద్యోగులకు కేవలం రూ.5కే పరిశుభ్రమైన భోజనం, అల్పాహారం, రాత్రి భోజనం అందిస్తామన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న రాంజీ, చిత్రంలో మాజీమంత్రి తోట నరసింహం తదితరులు

రక్తదాన శిబిరాలు.. పేదలకు వస్త్రదానాలు

ఏలేశ్వరం, ప్రత్తిపాడు, జగ్గంపేట గ్రామీణం, శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి తోట నరసింహం ఆధ్వర్యంలో జగ్గంపేటలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలుచోట్ల అభిమానులు, నాయకుల మధ్య కేకులు కోయడం, పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. వస్త్రదానం చేశారు. అలాగే జెడ్పిటీసీ సభ్యులు ఒమ్మి బిందు మాధవి పేదలకు చీరలు పంపిణీ చేశారు. ● రౌతులపూడిలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీలు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, వస్త్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 74 మంది రక్తదానం చేశారు. 500 మందికి ముద్రగడ గిరిబాబు, ఎ.లక్ష్మీశివకుమారి, చిన్నదివాణం, భాస్కరబాబు తదితరుల చేతులమీదుగా దుప్పట్లు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రత్తిపాడు: మండలంలోని ప్రత్తిపాడు - లంపకలోవ గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుత్తుల లోవరాజు (45) కాకినాడలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. కిర్లంపూడి మండలానికి చెందిన సింహాద్రిపురం గ్రామానికి చెందిన లోవరాజు ద్విచక్ర వాహనంపై ముగ్గు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. రహదారిపై శనివారం శునకం అడ్డు రావడంతో అదుపు తప్పి కిందపడిపోవడంతో గాయపడ్డారు. ప్రత్తిపాడులో ప్రాథమిక చికిత్స తర్వాత జిల్లా కేంద్రానికి తరలించగా, ఈరోజు మృతిచెందారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

కోటనందూరు, రౌతులపూడి, తొండంగి, గండేపల్లి, శంఖవరం, తుని, ఏలేశ్వరం, కిర్లంపూడి, న్యూస్‌టుడే: పోలియో మహమ్మారిని అరికట్టేందుకు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని వైద్యులు, కూటమి నాయకులు పేర్కొన్నారు. అన్ని మండల కేంద్రాలు, పీహెచ్‌సీలు, ప్రధాన కూడళ్లు, సచివాలయాల వద్ద ఆదివారం పోలియో చుక్కలు వేసే కార్యక్రమాలు జరిగాయి. 90 శాతం పైగా పోలియో చుక్కలు వేసే కార్యక్రమం పూర్తయిందని వైద్యులు తెలిపారు. ఈ నెల 22, 23 తేదీలలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి చుక్కలు వేస్తామన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. సంచార జాతులు ఉండే ప్రాంతాలకు ఏలేశ్వరం పట్టణ పీహెచ్‌సీ వైద్యురాలు సౌభాగ్య సరోజ వెళ్లి పోలియో చుక్కలు వేశారు.

ప్రత్తిపాడులో చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

తునిలో పురపాలక ఛైర్‌పర్సన్ భువన సుందరి

జగంపేట: పోలియో చుక్కలు వేస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

ముగ్గురు భక్తులను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గండేపల్లి: హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఢీకొని భక్తులకు గాయాలయ్యాయి. వివరాలివీ.. కట్టమూరు గ్రామం నుంచి మురారి దుర్గమ్మ తోటకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న ముగ్గురు గండేపల్లి మండలం తాళ్లూరు దాబాల వద్దకు వచ్చేసరికి తుని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో ఢీ కొంది. ఈ ప్రమాదంలో వారి వెంట తీసుకెళ్తున్న సామగ్రి కిందపడ్డాయి. వాహనంపై వెళ్తున్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని స్థానిక ఆసుపత్రికి తరలించారు.

త్రుటిలో తప్పిన కారు ప్రమాదం

గండేపల్లి: హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. వివరాలివీ.. నెల్లూరు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న కారు మల్లేపల్లి వచ్చేసరికి అదుపుతప్పి విభాగినిని ఢీ కొట్టింది. ఈప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. కారు ధ్వంసమైంది. ప్రమాదం జరిగిన సమయంలో వెనుక నుంచి ఎటువంటి వాహనాలు రాకపోవడంతో భారీ ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు.

మోసం చేశారని ఫిర్యాదు

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని బాలాజీ రోడ్డులో ఉన్న ఓ బ్లడ్ బ్యాంకులో పర్యవేక్షకుడు మోసాలకు పాల్పడినట్లు సదరు సంస్థ భాగస్వామి లక్ష్మణ్ కిరణ్ ఫిర్యాదు చేశారని ఎస్సై పాపారావు తెలిపారు. రోజువారీ ఆర్థిక లావాదేవీలు, రక్తనిధి నిల్వలు తదితర వాటిలో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారన్నారు. దీంతో పర్యవేక్షకుడు వి.దుర్గాప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సరైన పత్రాలు లేని 16 వాహనాలు స్వాధీనం

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.అన్నవరంలో ఆదివారం గ్రామీణ పోలీసులు నిర్వహించిన కార్డన్‌సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా సరైన రికార్డులు లేని 16 వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్సై కృష్ణమాచారి తెలిపారు. దీంట్లో 11 ద్విచక్ర వాహనాలు, మరో అయిదు ఆటోలు ఉన్నాయని చెప్పారు. తుని పట్టణ, గ్రామీణ సీఐలు గీతాకృష్ణ, చెన్నకేశవరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా రుణాలతో అతివల ప్రగతి

వివిధ రంగాల్లో ఆర్థిక స్వావలంబన

న్యూస్‌టుడే, తొండంగి, శంఖవరం, రౌతులపూడి

స్వయంశక్తి సంఘాల మహిళలు స్వయం ఉపాధి కల్పించుకుని ఆర్థిక స్వావలంబన పొందుతూ మరి కొందరికి ఉపాధి కల్పిస్తున్నారు. తొండంగి శంఖవరం, రౌతులపూడి మండలాల్లోని కొందరు మహిళలు వివిధ రకాల వ్యాపారాలు ఎంచుకుని ఉపాధి పొందుతున్నారని ఏపీఎం సౌభాగ్యవతి చెబుతున్నారు. తొండంగి మండలంలో 22 పంచాయతీలకు గాను 2,376 సంఘాలు ఉండగా 25,116 మంది సభ్యులుగా ఉన్నారు. శంఖవరం మండలంలో 1,500 సంఘాల్లో 15,123 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో కొందరు కిరాణా, దుస్తులు, నూడుల్స్ పాడిగేదెలు, టిఫిన్, ఎండు చేపలు, కోవా తయారీ ఇలా భిన్న రంగాల్లో ప్రగతి సాధిస్తున్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

మహిళలు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో మహిళా సమాఖ్య ద్వారా డ్వాక్రా సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నత, గ్రామైక్యసంఘ తదితర రుణాలు అందిస్తున్నాం. వీటిని అందిపుచ్చుకుని సభ్యులు అందరూ ఆర్థికంగా ఎదగాలి. తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే మరింత పెద్ద మొత్తంలో రుణాలు పొందవచ్చు.
- సౌభాగ్యవతి, ఏపీఎం, తొండంగి మండలం

కుటుంబానికి చేదోడుగా..

దుస్తులు, కిరాణా వ్యాపారంలో రాణిస్తున్న గంగాభవాని

ప్రభుత్వం అందించిన డ్వాక్రా నుంచి తీసుకున్న రూ.లక్షతో దుస్తులు, కిరాణా వ్యాపారం ప్రారంభించారు. పెట్టుబడి పోను నెలకు రూ.10 వేలు వరకు మిగులుతుంది. కుటుంబానికి చేదోడుగా ఉంటోంది. - తోట గంగాభవాని, తొండంగి

నూడుల్స్ యంత్రంతో ఉపాధి

మారుతున్న కాలానికి అనుగుణంగా యువత స్పైసీ ఆహారాన్ని ఇష్టపడుతున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని రూ.30 వేలు నుంచి రూ.40 వేలు కేటాయించి నూడుల్స్ తయారుచేసే యంత్రాన్ని కొన్నాను. వారానికోసారి సామగ్రిని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు సరఫరా చేస్తున్నాను. ప్రస్తుతం వ్యాపారం బాగుంది. పెట్టుబడి పోనూ నెలకు రూ.10 వేలు నుంచి రూ.15 వేల వరకు ఆదాయం సమకూరుతుంది.
- గుల్లివిల్లి జ్యోతి, శంఖవరం

(c) eenadu

బయోత్పాతమే

■ అటకెక్కిన నిర్వహణ

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : కర్నూలు సర్వజన వైద్యశాలకు ప్రతిరోజు సుమారు 3 వేల మంది రోగులు వస్తుంటారు. నిత్యం పదుల సంఖ్యలో శస్త్రచికిత్స జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో బయో వ్యర్థాలు పోగవుతుంటాయి. వీటిని శాస్త్రీయంగా వేరు చేసి తరలించాల్సి ఉంది. వీటి నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక సూచనలు సైతం జారీ చేసింది. కానీ సర్వజన ఆస్పత్రిలో వీటి నిర్వహణలో నిబంధనలు పాటించకపోవడంతో రోగులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాధారణ చెత్తలో బయో వ్యర్థాలు

ఇలా చేయాలి

● వార్డుల్లో ఏర్పాటుచేసిన పసుపు డబ్బాలో మానవ వ్యర్థాలు, కలుషిత దూది, విషపూరిత వ్యర్థాలు, గడువు ముగిసిన మందులు వేయాలి. ఎర్ర డబ్బాలో సిరంజిలు, ఐవీ సెట్, చేతి తొడుగులు, రక్తంబ్యాగ్, డయాలసిస్ కిట్ తదితరాలు వేయాలి. తెల్ల డబ్బాలో సూదులు, బ్లేడ్లు, శస్త్రచికిత్స బ్లేడ్లు వేయాలి. బ్లూ డబ్బాలో ఔషధ సీసాలు, ఇంప్లాంట్స్, కత్తెర తదితరాలు వేయాల్సి ఉంది.

కవర్లు ఇవ్వకుండా కక్కుర్తి

వైద్యాలయంలో రోజుకు 2 టన్నుల చొప్పున ఏడాదికి సరాసరిన 720 టన్నుల జనరల్ వ్యర్థాలు పోగవుతున్నాయి. నెలకు 3 టన్నుల చొప్పున ఏటా 36 టన్నుల బయో వ్యర్థాలు ఉత్పత్తవుతుంటాయి. వార్డుల్లోనే వీటిని వేరు చేసి ప్రత్యేకంగా కవర్లలో పంపాలి. టెండరు దక్కించుకున్న గుత్తేదారుడు బయో వ్యర్థాలతో పాటు జనరల్ వేస్టేజీని కూడా సేకరిస్తారు. సాధారణ వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలిస్తారు. . బయో వ్యర్థాలను ప్రత్యేక వాహనంలో చెట్లమల్లాపురం వద్దకు తీసుకెళ్లాల్సి ఉంది. సదరు గుత్తేదారుడు ఆసుపత్రికి నిత్యం సుమారు 400 కవర్లు ఇవ్వాల్సి ఉండగా సగమే ఇస్తుండటంతో పారిశుద్ధ్య కార్మికులు బయో వ్యర్థాలను కూడా కలిపేస్తున్నారు.

అన్నీ కలిపేసి..

వైద్యశాలలో 20 నుంచి 30 శాతం బయో వేస్టేజీని సాధారణ వ్యర్థాలతో కలిపి తరలిస్తున్నారు. రోజూ సుమారు వంద కిలోల బయో వ్యర్థాలు రావాల్సి ఉండగా. . 60 నుంచి 70 కిలోలు మాత్రమే వస్తోంది. మరోవైపు జనరల్ వేస్టేజీని నగరపాలక సిబ్బంది రెండు రోజులకోసారి కొంత మాత్రమే తీసుకెళ్తున్నారు. మరికొంత డంపింగ్ యార్డులో ఉంచుతున్నారు. జనరల్ వేస్టేజీలో బయో వ్యర్థాలు కలుస్తుండటంపై నగర పాలక సంస్థ అధికారులు రెండు రోజుల కిందట ఆరా తీసినట్లు సమాచారం.

ఒకే ట్యాంకు ఆధారం.. నీటికి జాగారం

కోసిగి రైల్వేగేటు అవతల ఉరుకుంద రోడ్డులో సుమారు 800 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఒకే తాగునీటి ట్యాంకు అందుబాటులో ఉంది. తాగునీటి సరఫరాలో సమయ పాలన లేకపోవడంతో జనం ట్యాంకు వద్ద తోపుడు బండ్లలో బిందెలు తీసుకొచ్చి గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. కాలనీలో చాలామంది చిన్న పాటి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరోవైపు వందలాది కుటుంబాలకు ఒకటే ట్యాంకు ఉండటంతో నీటికి నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. – ఈనాడు, కర్నూలు, – న్యూస్‌టుడే, కోసిగి

ఆత్మ ఘోష

● అన్నదాతల దరిచేరని సాంకేతిక పరిజ్ఞానం

అన్నదాతలకు సాంకేతిక పరిజ్ఞానం అందించి.. వారిని ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లించేందుకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ విభాగం పనితీరు మొక్కుబడిగా ఉంది. లక్ష్యాలను చేరుకోవడం లేదు. ఏడెనిమిది వ్యవసాయ సబ్ డివిజన్లలో బీటీఎంలు, ఏటీఎంల కొరత వేధిస్తోంది. –న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ఆత్మ పీడీ రత్నప్రసాద్ బదిలీ అయినా స.హ.చట్టం బోర్డులో ఆయన పేరే ఉంది..

ఏం చేయాలి?

సాగులో పెట్టుబడి తగ్గించి ఆదాయం పెంచే విధానాలపై ఈ విభాగం దృష్టి పెట్టాలి. వ్యవసాయం, పశు సంవర్ధక శాఖ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, మత్స్యశాఖల సమన్వయంతో శిక్షణలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలి. ఆయా శాఖలతో కలిసి పనిచేసిన దాఖలాలే లేవు.

మిగిలింది ఏడుగురే..

ఉమ్మడి జిల్లాలో 11 వ్యవసాయ సబ్ డివిజన్లు ఉన్నాయి. 11 మంది బ్లాక్ టెక్నికల్ మేనేజర్లు, 14 మంది అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్లు ఉండేవారు. ప్రస్తుతం ముగ్గురు బీటీఎంలు, నలుగురు ఏటీఎంలు ఉన్నారు. ఆత్మ విభాగంలో పీడీ, వ్యవసాయాధికారి, సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే ఉన్నారు.

నిధులున్నా నిస్సత్తువే

● ఉమ్మడి జిల్లాలో ఏడాది కాలంలో 449 మంది రైతులకు శిక్షణలు, ప్రదర్శనలు (డెమో)లు నిర్వహించేందుకు రూ.39.10 లక్షలు మంజూరైంది. గడిచిన తొమ్మిది నెలల్లో 129 మందికి అవగాహన కల్పించి రూ.13.48 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. మరో మూడు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆలోగా రూ.25.62 లక్షలు వెచ్చించి 320 మంది రైతులకు శిక్షణలు, ప్రదర్శనలు (డెమో)లు నిర్వహించాల్సి ఉంది.

● సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచేందుకు రైతులను విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లాల్సి ఉంది. హైదరాబాద్‌లోని ఇక్రిశాట్, గుంటూరులో ఏపీ అగ్రిటెక్ కార్యక్రమాలకు పంపాలి. వీటికిగాను రూ.9.20 లక్షలు వెచ్చించాల్సి ఉండగా.. పొరుగు రాష్ట్రానికి మాత్రమే తీసుకెళ్లి రూ.60 వేలు ఖర్చు చేశారు.

● జిల్లా స్థాయిలో ఎగ్జిబిషన్లు... కిసాన్ మేళా, పండ్ల, కూరగాయల ప్రదర్శనలు, రైతులతో ముఖాముఖి నిర్వహించేందుకు రూ.2.28 లక్షలు వెచ్చించాల్సి ఉండగా.. రూ.58 వేలు ఖర్చు చేసి రెండు కార్యక్రమాలతో సరిపెట్టారు.

ఆలయాలకు భక్తకోటి విరాళం

గ్రామంలో దేవాలయాలన్నీ శిథిలావస్థకు చేరాయి. దీనిని చూసి జనం కలత చెందారు. ఎలాగైనా వీటికి నూతన శోభ తీసుకురావాలని భావించారు. అందరూ కలిసి భారీగా విరాళాలు సేకరించి పనులు చేపట్టారు. ఐకమత్యంతో దేవాలయాలకు ఆధ్యాత్మిక శోభను తెచ్చారు. డోన్ మండలంలోని సీసంగుంతల గ్రామంలో రెండు వేల జనాభా ఉంది. గ్రామంలో ఎక్కువ మంది వ్యవసాయాన్నే ఆధారంగా జీవిస్తున్నారు. వీరంతా కలసికట్టుగా ఉంటూ అభివృద్ధి చేసుకుంటున్నారు. గ్రామంలో పురాతన సీతారాం, అభయాంజనేయ, రామలింగేశ్వరస్వామి, సుంకులమ్మ, పెద్దమ్మ ఆలయాలతో పాటు పీర్ల చావిడి ఉంది. 20 ఏళ్ల కిందట సీతారామాలయం జీర్ణోద్ధరణకు నడుం బిగించారు. కావాల్సిన నిధులను వారే సమకూర్చుకుని అనుకున్న రీతిలో ఆలయాన్ని నిర్మించుకున్నారు. ఇదే స్ఫూర్తితో 2008లో అభయాంజనేయ, సుంకులమ్మ ఆలయాలు నిర్మించారు. నిర్మాణాల కోసం ఊరంతా చందాలు వేసుకుని రూ.కోటిపైగా నిధులు సేకరించడం విశేషం.

● గ్రామ ప్రవేశ మార్గంలో అభయాంజనేయ స్వామి, శివారులో మారెమ్మ ఆలయాలున్నాయి. గ్రామంలో నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేయాలన్నా, ఊళ్లకు వెళ్లాలన్నా తప్పనిసరిగా అంజన్న దర్శనం చేసుకుని బయలుదేరడం ఇక్కడి ప్రజల ఆనవాయితీ. – న్యూస్‌టుడే, డోన్ గ్రామీణం

తెదేపాలో అతివలకు అందలం

● కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులుగా గుడిసె కృష్ణమ్మ, గౌరు చరితారెడ్డి

గుడిసె కృష్ణమ్మ

నాగరాజు

ఈనాడు, కర్నూలు : మహిళలకు తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేసింది. తెదేపా నంద్యాల జిల్లా అధ్యక్షురాలు, నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలిగా గౌరు చరితారెడ్డి, తెదేపా కర్నూలు జిల్లా అధ్యక్షురాలు, కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలిగా గుడిసె కృష్ణమ్మను నియమించింది. వాస్తవానికి కర్నూలు జిల్లాకు వహీద్, నంద్యాల జిల్లాకు మన్నె సుబ్బారెడ్డి పేర్లు దాదాపు ఖరారైనప్పటికీ ఆఖరి నిమిషంలో మార్చారు. మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని తెదేపా అధిష్ఠానం నిర్ణయించడంతో మార్పులు చేసింది.

2002లో గౌరు రాజకీయ ప్రవేశం

2002లో గౌరు చరితారెడ్డి రాజకీయ ప్రవేశం చేశారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2004లో నందికొట్కూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009లో నందికొట్కూరు నియోజకవర్గం రిజర్వు కావడంతో పోటీకి దూరమయ్యారు. వైకాపా ఆవిర్భవించిన తర్వాత ఆ పార్టీలో చేరారు. 2014లో పాణ్యం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019లో తెదేపాలో చేరి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2024లో కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై భారీ మెజారిటీతో విజయం సాధించారు. స్త్రీ సంక్షేమం, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమంపై ఏర్పాటు చేసిన అసెంబ్లీ కమిటీకి ఛైర్‌పర్సన్‌గా ఉన్నారు.

● తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్ఎండీ ఫిరోజ్ పేరును ఖరారు చేశారు. గత ఐదేళ్లుగా ఆయన ఆ పదవిలోనే కొనసాగుతున్నారు. మళ్లీ ఆయనకే అధిష్ఠానం అవకాశం కల్పించింది.

కృష్ణమ్మకు అవకాశం

కోసిగి మండలం కోలమాన్‌పేట గ్రామానికి చెందిన గుడిసె కృష్ణమ్మ 2004లో ఆదోని ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. మూడుసార్లు తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2017 నుంచి 2022 వరకు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పనిచేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గ పరిశీలకురాలిగా ఉన్నారు. తెదేపా జిల్లా అధ్యక్ష పదవిని బీసీ మహిళకు కేటాయించాలని అధిష్ఠానం నిర్ణయించడం ఆమెకు వరంగా మారింది. వాల్మీకి/బోయ సామాజిక వర్గానికి చెందిన ఆమె తెదేపాలో సీనియర్ నాయకురాలిగా ఉన్నారు.

● ప్రస్తుతం తెదేపా నగర అధ్యక్షుడిగా రెండేళ్లుగా పనిచేస్తున్న పూల నాగరాజుయాదవ్‌ను పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఆయన 2022లో తెదేపాలో చేరారు. తెదేపాలో కీలకమైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులు.. రెండింటినీ బీసీలకే కేటాయించడం విశేషం.

నేత్రపర్వం.. శ్రీనివాసుడి కల్యాణం

పట్టణ శివారులోని వాసవి కన్వెన్షన్ సెంటరులో తితిదే ఆధ్వర్యంలో శ్రీనివాసుడి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వాసవీమాత సేవా సంఘం సమన్వయంలో జరిగిన కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఉత్సవమూర్తులకు అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరణ చేసి కల్యాణోత్సవం జరిపారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు విట్టా రమేష్, విట్టా సురేంద్రబాబు, కె.వేణుగోపాల్, టీజీ పాండురంగయ్యశెట్టి, టీజీ శ్రీనివాస్, వీటీ ప్రకాశ్, శివ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఆదోని పాతపట్టణం

పేదల హృదయాలయం

పట్టణ శివారులోని శుక్రవారంపేటలో ఉన్న పురాతన చర్చి శతాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉంది. 1690లో పోర్చుగీసువారు ఈ ప్రాంతంలో జేసు తిరుహృదయ దేవాలయం (చర్చి)ను నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతూనే ఉన్నాయి. మరోవైపు నిర్వాహకులు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యమిస్తున్నారు. చర్చి నిర్మించే సమయంలో ఈ ప్రాంతంలో పేదలు ఎక్కువగా ఉండడంతో వారికి ఉచితంగా వైద్యం అందించడంతోపాటు పిల్లలకు చదువులు చెప్పడం ప్రారంభించారు. తల్లిదండ్రులు ఉదయం పనులకు వెళ్లే సమయంలో అయిదేళ్లలోపు పిల్లలను ఈ చర్చిలో వదిలేసి వెళ్లి సాయంత్రం తీసుకెళ్తుంటారు. పేద పిల్లలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచితంగా ట్యూషన్లు చెబుతుండటం విశేషం. చర్చి ఆవరణలో దేవమాత ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి టీబీ రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు అందిస్తున్నారు.

● క్రిస్మస్ పండగ నేపథ్యంలో 24వ తేదీ అర్ధరాత్రి సమయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం 25వ తేదీన వివిధ కార్యక్రమాలు జరుగుతాయి. – న్యూస్‌టుడే, ఆదోని సాంస్కృతికం

ప్రయోగమే పరీక్ష

● జనవరి 27 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

జిల్లా	ఎంపీసీ	బైపీసీ
కర్నూలు	10,805	5,076
నంద్యాల	8,210	4,531

విద్యార్థుల భవిష్యత్తును మలుపు తిప్పేది ఇంటర్ విద్యే. వారి లక్ష్య సాధనకు బాటలు పడేది ఇక్కడే. అందుకే ఎక్కువ మార్కులు సాధించేందుకు విద్యార్థులు కష్టపడుతుంటారు. థియరీలో మంచి మార్కులు తెచ్చుకున్నా ప్రాక్టికల్స్‌లో వెనుకబడుతున్నారు. చాలా కళాశాలల్లో ప్రయోగ పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కొన్ని ప్రభుత్వ, కస్తూర్బా విద్యాలయాల్లో ప్రయోగశాలలే లేవు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఒకేషనల్, ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు జనరల్ (ఎంపీసీ, బైపీసీ) విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉంటాయి. సమయం సమీపిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య

సీసీ కెమెరాల పర్యవేక్షణలో..

● ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ఆదర్శ, కేజీబీవీ, రెసిడెన్షియల్ కళాశాలలు 152, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 131 ఉన్నాయి. కర్నూలు జిల్లాలో ఎంపీసీ, బైపీసీ ద్వితీయ విద్యార్థులు 15,881, ఒకేషనల్ మొదటి, రెండో ఏడాది కలిపి 5,271 మంది చదువుతున్నారు. నంద్యాల జిల్లాలో ఎంపీసీ, బైపీసీ ద్వితీయ విద్యార్థులు 12,741 మంది చదువుతున్నారు. ఒకేషనల్ మొదటి, రెండో ఏడాది చదువుతున్న విద్యార్థులు 3,975 మంది ఉన్నారు.

● రెండో ఏడాది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో పాటు మొదటి, రెండో ఏడాదికి చెందిన ఒకేషనల్ విద్యార్థులకు జనవరిలో ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. ఏ కళాశాల విద్యార్థులకు ఆ విద్యాలయంలోనే ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు.

కేజీబీవీల్లో కానరాక..

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ విద్యార్థినులకు పూర్తి స్థాయిలో ప్రయోగశాలలు లేవు. వీరు ప్రయోగాలు చేసేందుకు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రభావం ఇంటర్ ఫలితాలతోపాటు ప్రవేశాలపైనా పడుతోందని అధికారులు గుర్తించారు. ప్రతి కేజీబీవీలో ల్యాబ్ ఏర్పాటు చేసి విద్యార్థినుల చదువుకు ఇబ్బందుల్లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

ఐదు పదులు.. మైదానంలో మెరుపులు

వారి ప్రాంతాలు వేరు.. వృత్తులు వేరు. క్రీడా మైదానం.. వీరిని స్నేహితులుగా మార్చింది. ఎక్కడ పోటీలు జరిగినా కలిసే వెళతారు.. ఐదు పదుల వయసు దాటినా ఉత్సాహంగా హాజరవుతున్నారు. నిత్య సాధనతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నారు. ఈనెల 13, 14 తేదీల్లో బాపట్లలో.. నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి భళా అనిపించారు.

– న్యూస్‌టుడే, ఆదోని పాత పట్టణం

చెన్నకేశవ.. ప్రతిభ భళా

ఆదోని ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్న కె.చెన్నకేశవకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇద్దరు పిల్లలకు వివాహం చేశారు. ఆయన గత పదేళ్లుగా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు ఎనిమిది సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. జావెలిన్‌త్రో, షాట్‌పుట్ తదితర పోటీల్లో ప్రతిభ చాటుతున్నారు. బాపట్లలో ఇటీవల జరిగిన 55+ పురుషుల విభాగంలో షాట్‌పుట్, వంద మీటర్ల పరుగు పోటీల్లో మూడో స్థానంలో నిలిచి పతకాలు అందుకున్నారు. "చిన్నతనం నుంచే పాఠశాల స్థాయిలో కబడ్డీ ఆడేవాడిని. 20 ఏళ్లుగా జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేసేవాడిని. ప్రస్తుతం వయసు మీద పడటంతో రోజూ నడక, యోగా, ప్రాణాయామం వంటివి చేస్తున్నా. అధిక బరువు ఉండేవాడిని. నిత్యం వ్యాయామం చేయడంతో బరువు తగ్గా. రక్తపోటు నియంత్రణలో పెట్టుకున్నా. ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా సమయం కేటాయించడం అలవాటు చేసుకున్నా. శరీరం సహకరించినన్ని రోజులు కచ్చితంగా పోటీల్లో పాల్గొంటా" అని చెన్నకేశవ పేర్కొన్నారు.

● ఇప్పటివరకు రెండు స్వర్ణాలు, ఆరు వెండి, నాలుగు కాంస్య పతకాలు సాధించారు.

గెలుపే నారాయణ మంత్రం

డోన్ మండలం కొచ్చెరువుకు చెందిన సి.నారాయణస్వామి ఇంటర్ వరకు చదివారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడికి పెళ్లి చేశారు. ఆటో డ్రైవర్‌గా ఉపాధి పొందుతున్నారు. గత ఎనిమిదేళ్లుగా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నారు. పోల్‌వాల్ట్, లాంగ్‌జంప్, హైజంప్‌లో పాల్గొంటున్నారు. ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పోల్‌వాల్ట్, లాంగ్‌జంప్‌లో స్వర్ణం, జావెలిన్ త్రోలో రెండో స్థానంలో నిలిచారు. మూడు సార్లు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చినప్పటికీ ఆర్థిక సమస్యలతో పాల్గొనలేకపోయారు. "ఎప్పటికైనా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నది నా ఆకాంక్ష. పాఠశాల విద్యనభ్యసించే సమయంలో పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్‌లో ప్రతిభ చాటేవాడిని. ఇదే నేటికీ అలవాటు చేసుకున్నా. ఉదయం లేవడం.. నడక, వ్యాయామం చేయడం.. తర్వాత ఆటో నడపడం నా రోజువారీ పని. ఇంతవరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాలేదు" అని నారాయణ చెప్పారు.

● నారాయణ ఇప్పటి వరకు ఆరు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. హరియాణా, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, దిల్లీ, కేరళ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఒక స్వర్ణం, రెండు వెండి, ఒక కాంస్య పతకం సాధించారు.

పోలియో చుక్కలు వేయించాలి

చుక్కల మందు వేస్తున్న కలెక్టర్ డా.సిరి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : జిల్లాలోని ఐదేళ్లలోపు చిన్నారులకు తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సూచించారు. కర్నూలు ఎ.క్యాంపులో ఉన్న ఇందిరాగాంధీ స్మారక నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులు 3,52,164 మంది ఉండగా.. 2,59,585 మందికి చుక్కల మందు వేసినట్లు వెల్లడించారు. ఆదివారం చుక్కలమందు వేయించుకోని వారికి 22, 23 తేదీల్లో వైద్య బృందాలు ఇంటింటికీ వెళ్లి వేస్తాయని వివరించారు.

పనులు మురుగుతున్నాయ్

☛ ఏళ్లుగా సాగుతున్న ప్లాంటు నిర్మాణం

ఆదోని పట్టణ శివారులోని టిడ్కో ఇళ్ల ప్రాంతంలో చేపట్టిన మురుగు నీటి శుద్ధి ప్లాంటు (ఎస్టీపీ) పనులు ముందుకు సాగడం లేదు. 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో అమృత్ పథకం కింద ఐదు మిలియన్ లీటర్ల సామర్థ్యంతో పనులు చేపట్టారు. 2021లో దీనిని వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. దీని కోసం సుమారు రూ.10 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. పట్టణంలో ప్రతిరోజూ 15 నుంచి 20 మిలియన్ లీటర్ల మురుగు ఉత్పత్తవుతుంది. దీనిని ఇక్కడ శుద్ధి చేయాల్సి ఉంది.

– న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

గత ప్రభుత్వం పట్టించుకోక..

తెదేపా ప్రభుత్వ హయాంలో పనులు సాఫీగా జరిగినా.. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో కదలిక వచ్చింది.

పట్టణ శివారులో జరుగుతున్న ప్లాంటు పనులు

ప్రస్తుతం సివిల్ పనులు పూర్తయ్యాయి. యాంత్రీకరణ పనులు చేపట్టాల్సి ఉంది. వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకు పూర్తి చేసేలా గడువు విధించినట్లు సమాచారం.

మరో రెండు ఏర్పాటుకు సన్నాహాలు

పట్టణంలో పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు నీటి అవసరాలు ఎక్కువవుతున్నాయి. రోజు రోజుకు మురుగు ఉత్పత్తి ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో పట్టణ పరిధిలో మరో రెండు సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణాలకు ప్రభుత్వం సిద్ధమైంది. కల్లుబావి, టిడ్కో ఇళ్ల ప్రాంతాల్లో 14 ఎంఎల్, 11 ఎంఎల్ సామర్థ్యంతో నిర్మించేలా చర్యలు చేపట్టారు. ఫలితంగా మురుగు సమస్య తొలగి ప్రజారోగ్యానికి మేలు జరుగుతుంది.

నేడు డయల్ యువర్ ఎస్ఈ

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : జిల్లాలోని విద్యుత్తు వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 22న డయల్ యువర్ ఎస్ఈ నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులు సోమవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్యలో 7382614308 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను నేరుగా ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

గోదాదేవి వైభవం

అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో.. గోదాదేవి సన్నిధిలో అర్చకులు తిరుప్పావైలోని ఆరో పాశురాన్ని ఆదివారం తెల్లవారుజామున స్వామికి విన్నవించారు. ఆలయ గర్భగుడి ఆవరణలో ఆళ్వార్లను అలంకరించి కొలువుంచి వేదప్రబంధ పారాయణాలు పఠించారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ గ్రామీణం

దారితప్పిన పర్యవేక్షణ

● ర.భ. శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆర్అండ్‌బీ శాఖలో ఏఈల కొరత వెన్నాడుతోంది. కీలకమైన శాఖలో మండల స్థాయిలోనే పోస్టులు భర్తీ కావడం కాలేదు. చాలాచోట్ల ఇన్‌ఛార్జులతోనే కాలం నెట్టుకొస్తున్నారు. ఫలితంగా ఉన్నవారిపై భారం పడుతోంది. మరోవైపు అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

అభివృద్ధికి నోచుకోని బొగ్గులైన్ రహదారి

అభివృద్ధి పనులపై ప్రభావం

ఉమ్మడి జిల్లాలో 17 ఏఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో వివిధ అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆర్అండ్‌బీ శాఖపై గత వైకాపా ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపింది. కనీసం గుంతలను కూడా పూడ్చలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులకు మరమ్మతులు, గుంతల పూడ్చివేత కార్యక్రమాలు చేపట్టింది. ఇదే సమయంలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో తగినంత మంది ఏఈలు లేకపోవడంతో పనులను పర్యవేక్షించేవారే కరవయ్యారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో రూ.30 కోట్ల వ్యయంతో గుంతలు పూడ్చే పనులు జరుగుతున్నాయి.

పనులను పర్యవేక్షించలేక..

నంద్యాలలో పట్టణంలోని పొగాకు కంపెనీ నుంచి వెంకటేశ్వరపురం, బొమ్మలసత్రం-బొగ్గులైన్ రోడ్ల మరమ్మతులకు రూ.2 కోట్ల వరకు నిధులు విడుదలయ్యాయి. సౌత్ సెక్షన్ కిందకు వచ్చే బొగ్గులైన్ రోడ్డుకు రెగ్యులర్ ఏఈ లేరు. నార్త్ సెక్షన్ ఏఈనే ఇన్‌ఛార్జిగా ఉన్నారు. దీంతో రెండు పనులను పర్యవేక్షించలేని పరిస్థితి ఏర్పడింది.

ఇన్‌ఛార్జులతో సరి..

● కర్నూలు జిల్లాలో తొమ్మిది ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్కిల్ కార్యాలయంలో ఒకటి, కర్నూలు టౌన్, కోడుమూరు, గోనెగండ్ల, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు, ఆస్పరి, కౌతాళం సెక్షన్ల పరిధిలో ఒక్కో ఏఈ పోస్టును భర్తీ చేయాల్సి ఉంది.

● నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో నార్త్, సౌత్‌లో రెండు ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆళ్లగడ్డ సౌత్‌లో రెండు, ఆత్మకూరు సబ్ డివిజన్‌లోని ఆత్మకూరు, నందికొట్కూరులో ఒక్కో పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. డోన్ సబ్ డివిజన్‌లో డోన్, ప్యాపిలిలో రెండు ఖాళీలున్నాయి. డోన్ డీఈ పోస్టు నింపాల్సి ఉంది. పలు ప్రాంతాల్లో పక్క మండలాల అధికారులు ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తున్నారు.

జిల్లా	రహదారులు (కి.మీ.లు)
నంద్యాల	1512.605
కర్నూలు	3399.756

అంచనాలు తయారు చేయలేక..

ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన సిఫార్సులు, ప్రభుత్వం వివిధ పథకాల కింద ఆదేశించిన ప్రతిపాదనలు తయారు చేసేందుకు క్షేత్రస్థాయిలో ఏఈల అవసరం ఉంది. వీరు స్థానికంగా పర్యటించి ప్రతిపాదనలు రూపొందించాల్సి ఉంది. పనుల పర్యవేక్షణ, నిర్వహణ చేపట్టాలి. ఏఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో అంచనాల నుంచి తనిఖీల వరకు వీటి ఊసే లేకుండా పోయింది. కొన్నిచోట్ల నోటిఫైడ్ గుత్తేదారులే అంచనాలు తయారు చేసి ఆర్అండ్‌బీ శాఖకు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

అదుపు తప్పితే.. తప్పదు ముప్పు

వీరంతా రోజువారీ మహిళా కూలీలు.. ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్తుంటారు. పని ప్రాంతాలకు చేరుకోవడానికి ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలను ఆశ్రయిస్తారు. రుద్రవరంలో శివారులో పొలం పనులు చేసేందుకు ఆదివారం ఓ ట్రాక్టరుపై మహిళా కూలీలు ప్రమాదకరంగా ప్రయాణించారు. ఏ మాత్రం పట్టు తప్పిన ప్రమాదం తప్పదు. ట్రాక్టరు ఇంజిను వెనుకవైపు వ్యవసాయ సామగ్రి బిగించారు. వాటిపై కూలీలు కూర్చొని ప్రయాణించారు. ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదం తప్పదు. - న్యూస్‌టుడే, రుద్రవరం

ఆహ్లాదం.. ఆదమరిస్తే ప్రమాదం

సుంకేసుల జలాశయానికి సెలవు దినాల్లో సందర్శకుల తాకిడి పెరుగుతోంది. జలాశయం రెండు గేట్ల నుంచి నీటి విడుదల చేస్తున్నారు. దీంతో చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్నూలు నగరం నుంచి ప్రజలు వస్తున్నారు. జలాశయం నుంచి దిగువకు విడుదల అవుతున్న నీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉన్నచోట కొంత మంది చిన్నారులతో కలిసి ప్రమాదకరంగా స్నానాలు చేస్తున్నారు. గతంలో జలాశయం దగ్గర సరదాగా గడిపేందుకు వచ్చి మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. -న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నంద్యాల బొమ్మలసత్రం, గాంధీచౌక్ న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పురపాలక కమిషనర్ బండి శేషన్న, శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెంటర్ నంద్యాల జిల్లా కోఆర్డినేటర్ సుజల పేర్కొన్నారు. ఆదివారం హార్ట్‌ఫుల్‌నెస్ గ్రీనరన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పురపాలక కార్యాలయం వద్ద ప్రారంభించి పద్మావతీనగర్, శ్రీనివాస సెంటర్, సంజీవనగర్‌గేట్ వరకు కొనసాగించారు. వారు మాట్లాడుతూ..మొక్కలు పెంచి పర్యావరణాన్ని రక్షించడంతో కలిగే ఉపయోగాలు తెలియజేశారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల్లో అవగాహన కల్పించారు. శ్రీరామచంద్ర మిషన్ సభ్యులు అరవింద్, ఆశ, రాణి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నంద్యాలలో నిర్వహించిన ర్యాలీ

యాగంటిలో భక్తుల సందడి

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి నంది, స్వామివారికి పూజలు చేశారు. ఆలయంలో వేదపారాయణ కార్యక్రమం కొనసాగింది.

పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

షూటింగ్ బాల్ విజేతలు బాపట్ల, అనకాపల్లి

అనకాపల్లి మహిళా జట్టు

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో రెండు రోజులపాటు నిర్వహించిన 44వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. పురుషుల విభాగంలో తుదిపోరులో బాపట్ల జట్టు నెల్లూరుపై విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. మహిళా విభాగంలో అనకాపల్లి జట్టు బాపట్లపై గెలుపొందింది. విజేతలకు ఒలింపిక్ సంఘం సీఈవో పి.విజయకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి పి.సునీల్‌కుమార్, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి ట్రోఫీలు అందజేశారు. యోగా సంఘం రాష్ట్ర కార్యదర్శి అవినాష్‌శెట్టి, స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కృష్ణ, జోసెఫ్ లక్ష్మయ్య, షూటింగ్ బాల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్ సురేంద్ర, కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు, డ్రాగన్ బోట్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయికృష్ణ పాల్గొన్నారు.

ADONI MUNICIPALITY
e-Procurement Tender Notice

Roc.No.38/2025-26-E1 **Dated: 16-12-2025**
Invites Tender Notice under 15th FC 2023-24 Funds and SAC Funds
Down loading Start date and Time : 22-12-2025 @ 10.00 AM
Down loading End date and Time : 30-12-2025 @ 3.00 PM
For further details the tenderer may visit e-procurement platform on **www.tender.apeprocurement.gov.in.** or Cell No. 98499 05859

Sd/- Commissioner, Adoni Municipality

ఫారం నం. URC-2

Chapter XXI Part I కింద రిజిస్ట్రేషన్ నిమిత్తం నోటీసు ఇస్తూ ప్రకటన (కంపెనీస్ (అథరైజ్డ్ టు రిజిస్ట్రార్) రూల్స్ 2014 యొక్క రూల్ 4(1)తో కలిపి చదువుకోవలసిన కంపెనీస్ చట్టం 2013 యొక్క సెక్షను 374(బి) ప్రకారం)

1. కంపెనీల చట్టం 2013 సెక్షను 366 సబ్‌సెక్షను (2) ప్రకారం నోటీసు ఇందుమూలముగా నోటీసు ఇచ్చేదేమనగా, **పదిహేను రోజుల తరువాత కానీ 30 రోజులు** ముగిసేలోగా రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, ఆంధ్రప్రదేశ్ (ది జ్యూరిస్‌డిక్షనల్ ఆర్‌ఓసి), 29-7-33, మొదటి అంతస్తు, విష్ణువర్ధనరావు వీధి, సూర్యారావుపేట, విజయవాడ -520002, ఆంధ్రప్రదేశ్‌కు రిజిస్ట్రార్ సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫెయిర్స్ (ఐఐసిఎ), ప్లాటు నం.6, 7, 8 సెక్టార్ 5, ఐఎంటి మానెసర్, గుర్‌గాం జిల్లా (హర్యానా), పిన్‌కోడ్ 122050 ద్వారా దరఖాస్తు చేయునదేమనగా "**మెసర్స్ శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్ అండ్ డెవలపర్స్**" (**గతంలో "మెసర్స్ శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్"** గా వ్యవహరించబడేది) ఒక భాగస్వామ్య సంస్థ (ఇండియన్ పార్ట్‌నర్‌షిప్ చట్టం 1932 కింద, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలులో రిజిస్ట్రార్ ఆఫ్ ఫర్మ్స్ తో ఎఫ్ఆర్ఎన్ 30/2011 ద్వారా 25 ఫిబ్రవరి 2011న నమోదు అయినది, ఆదాయపు పన్ను పాన్ ABWFS6158G గలది), వాటాల ద్వారా కంపెనీ లిమిటెడ్ అయినందున కంపెనీస్ చట్టం 2013 ఛాప్టర్ XXI ఛాప్టర్ I ప్రకారం షేర్స్ ద్వారా లిమిటెడ్ అయిన కంపెనీ "**మెసర్స్ శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్**"గా (ఆర్‌ఓసి ద్వారా అందుబాటులో గల పేరు) ఇకపై నామాంతరం చెందుతుంది.

2. కంపెనీ యొక్క ప్రధాన లక్ష్యాలు దిగువ విధంగా ఉన్నవి.

2.1. శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ అండ్ డెవలపర్స్, కంపెనీస్ చట్టం 2013 ఛాప్టర్ XXI ఛాప్టర్ I నిబంధనల ప్రకారం మెసర్స్ "మెసర్స్ శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్ అండ్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్" గా మారిన తరువాత, కంపెనీ తన సంస్థ వ్యాపారం అయిన కాంట్రాక్టర్లు, సర్వీసు ప్రొవైడర్లు మరియు మ్యాన్‌పవర్ ప్రొవైడర్లుగా హైవేలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు, రోడ్లు మరియు టోల్ ప్లాజా ఆపరేషన్స్, టోల్ మరియు యూజర్ ఫీ కలక్షను, ఎక్స్‌ప్రెస్‌వే మరియు హైవే ఆపరేషన్స్ మరియు మెయింటెనెన్స్, పార్కింగ్ మేనేజిమెంట్, సిబ్బంది ఏర్పాటు వంటి ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు సహా, టోల్ ప్లాజాల నిర్మాణం మరియు అనుబంధ సివిల్ పనులు, మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అమర్పు, నడపడం మరియు నిర్వహణ, ఎలక్ట్రానిక్ టోల్ కలక్షన్ (ఫాస్టాగ్/ఇటిసి) మరియు ఇతర మౌలిక వసతుల వ్యవస్థలను ప్రభుత్వం, సెమి-ప్రభుత్వం, చట్టబద్ధ వ్యవస్థలు, పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్స్ మరియు ప్రైవేటు సంస్థలతో చేస్తుంది.

2.2. లే అవుట్, డెవలప్, నిర్మాణం, కట్టడం, నిలుపుట, తొలగించి, తిరిగి నిలుపుట, మార్చుట, రి-మోడల్ లేదా మరే ఇతర పనిని అయినా ఏ భవన పథకం రోడ్లు, హైవేలు, డాక్స్, షిప్ రెక్స్, వంతెనలు, కాలువలు, బావులు, ఊటలు, బహుళ అంతస్తుల భవనాలు, పవర్ ప్లాంట్లు, రేవులు, పోర్టులు, రిజర్వాయర్లు, కట్టలు, ట్రాంవేలు, సాగునీటి అభివృద్ధి, పారిశుద్ధ్యం, నీరు, గ్యాస్ ఎలక్ట్రిక్ లైట్, టెలిఫోనిక్ మరియు విద్యుత్ సరఫరా పనులను చేయడం లేదా మరే ఇతర స్ట్రక్చరల్ లేదా ఆర్కిటెక్చరల్ పనిని ఏ రకం అయినా మరియు అట్టి ప్రయోజనం కొరకు అంచనాలు డిజైనులుతయారీ, ప్లాంట్లు స్పెసిఫికేషన్లు లేదా మోడళ్లను మరియు అటువంటి వాటిని లేదా అవసరం అయిన చర్యలను కొనుగోలు, పొందడం లీజుకు తీసుకోవడం లేదా బదిలీ లేదా మరే ఇతర చట్టపరమైన విధంగా ఏ ఇతర భూమి, భవనం బహుళ అంతస్తుల నిర్మాణాలుకు చేయుట మరియు వాటిని రియల్ ఎస్టేట్‌గా మార్చుట, వాటిని ఆకౌంట్ డెవలప్ చేయుట మరియు తొలగించుట లేదా దానిని నిర్వహించుట లేదా దానిని నిర్వహిస్తూ మరియు టౌన్‌షిప్‌లను, మార్కెట్లను లేదా ఇతర భవనాలు లేదా దానిపై కన్వీనియన్స్‌ను నిర్మించుట మరియు వాటిని లేదా దానిలో భాగాన్ని అన్ని సదుపాయాలు లేదా సౌకర్యాలు, డ్రైనేజి సదుపాయాలు, ఎలక్ట్రిక్ టెలిగ్రాఫిక్, టెలిఫోనిక్, టెలివిజన్లు ఏర్పరచుట మరియు వాటితో ఏరకమైన విధంగా అయినా వ్యవహరించుట.

2.3 కాంట్రాక్టర్లు, సబ్-కాంట్రాక్టర్లు, క్వాసి కాంట్రాక్టర్లుగా వ్యాపారాన్ని ప్రభుత్వం లేదా సెమీ ప్రభుత్వ బాడీలు లేదా కార్పొరేషను లేదా కంపెనీ లేదా సొసైటి లేదా బాడీ కార్పొరేట్ లేదా సంస్థలు లేదా వ్యక్తులు లేదా పాఠశాలలు లేదా క్లబ్బులు లేదా ఇతర బాడీలు లేదా ప్రైవేటు పనులతో చేయుట మరియు నిర్మాణం, నిర్వహణ, ఆపరేషన్, మోడిఫికేషన్, రిపెయిరింగ్, ఆల్టరేషన్, కన్‌స్ట్రక్షన్, రిమూవల్, రిడెకోరేషన్, రి డిజైనింగ్, ఎన్‌లార్జింగ్, మెరుగుపెట్టడం వంటివాటి కాంట్రాక్టులు మరియు సబ్‌కాంట్రాక్టులు చేయుట మరియు సివిల్ పనుల డిజైనింగ్, ఏ వినియోగానికి అయినా భవనం, రోడ్లు, హైవేలు, ఎక్స్‌ప్రెస్‌వేలు, అప్రోచ్‌రోడ్లు, వీధులు, కూడళ్లు, స్క్వేర్స్, పార్కులు, గార్డెన్లు, విగ్రహాలు, పార్కింగ్ ప్లేసులు, వంతెనలు, డ్యామ్‌లు, నీటి కాలువలు మరియు రిజర్వాయర్లు, టన్నెళ్లు, ఇతర భూమి తవ్వకం పనులు, మురుగుకాలువలు, చెరువులు, డ్రెయిన్లు, మురుగు, లైటు హౌజ్‌లు, టవర్లు, ట్రాన్స్‌మిషన్ టవర్లు, పైపులైనులు, భూగర్భ కేబుళ్లు, రైల్వే ట్రాకులు, రైల్వే సైడింగ్స్, రన్‌వేలు, షిప్ యార్డులు, స్టాక్ యార్డులు, కల్వర్టులు, ఛానళ్లను టర్న్‌కీ ప్రాతిపదిక లేదా లేబర్ కాంట్రాక్టు లేదా మరే ఇతర విధంగా నిర్మించుట.

3. నం.19, భూపాల్ కాంప్లెక్స్, పార్క్ రోడ్, కర్నూలు, ఆంధ్రప్రదేశ్-518001 వద్ద గల కార్యాలయంలో ప్రతిపాదిత కంపెనీ యొక్క డ్రాఫ్ట్ మెమోరాండం మరియు ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్ కాపీని తనిఖీ చేసుకోవచ్చును.

4. ఈ దరఖాస్తును ఆక్షేపించు ఏ వ్యక్తి అయినా తన అభ్యంతరాన్ని లిఖిత పూర్వకంగా, సెంట్రల్ రిజిస్ట్రేషన్ సెంటర్ (సిఆర్‌సి) వద్ద గల రిజిస్ట్రార్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫెయిర్స్ (ఐఐసిఎ), ప్లాటు నం.6,7,8, సెక్టార్ 5, ఐఎంటి మానెసర్, జిల్లా గుర్‌గాం (హర్యానా), పిన్ కోడ్ 122050కు ఈ నోటీసు ప్రచురితమైన తేది నుంచి ఇరవై-ఒక్క రోజుల్లోగా, తన రిజిస్టర్డ్ ఆఫీసు గల కంపెనీకి ఒక కాపీని పంపుతూ తెలియచేయవచ్చును.

తేది 22వ రోజు డిసెంబరు 2025 ప్రాంతం: కర్నూలు.

దరఖాస్తు దారు పేరు(ర్లు)
మెసర్స్ శ్రీ సాయి ఎంటర్‌ప్రైజెస్ అండ్ డెవలపర్స్
సం/- వై.రవి చంద్ర (భాగస్వామి) **సం/- కె ఉమా మహేశ్వరమ్మ (భాగస్వామి)**

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే : గిరిజనుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పత్తికొండ, కోడుమూరు, నందికొట్కూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, గిత్తా జయసూర్య పేర్కొన్నారు. కర్నూలు శివారులోని గిరిజన భవనంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప అధ్యక్షతన ఆదివారం ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప సన్మాన సభ జరిగింది. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మారుమూల గిరిజన తండాలు, గూడేల్లో రహదారులు, వైద్యం, విద్య వసతులు మెరుగయ్యాయని చెప్పారు. రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్ప మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడైనా గిరిజనులపై దాడులు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కైలాష్‌నాయక్, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ జేమ్స్, జాతీయ లంబాడి హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యోగేష్, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకుడు రమణ, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోకేనాథ్, విద్యార్థి విభాగం ఐకాస అధ్యక్షుడు శ్రీరాములు, టీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విష్ణునాయక్, ఉపాధ్యక్షుడు రవీందర్, జిల్లా అధ్యక్షుడు రామరాజు, జిల్లా కార్యదర్శి వెంకటేష్, గిరిజన సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

సగరుల బలోపేతానికి సీఎం హామీ

ఉపాధ్యాయులను సన్మానించిన సంఘం నాయకులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పూర్తిగా వెనుకబడి సగరులు.. కూటమి సర్కార్ రాకతో వందలాది మంది ఉపాధ్యాయులుగా ఎంపికకావడం గర్వంగా ఉందని రాష్ట్ర సగర(ఉప్పర) కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ అన్నారు. రాష్ట్రంలో ఎంపికైన సగర ఉపాధ్యాయుల సన్మాన సభ ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర సగర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఏపీ వీరన్న అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. వెంకటరమణ మాట్లాడుతూ.. సగరులను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని వివరించారు. విశ్రాంత డీఎస్పీ వెంకటయ్య.. కృషి, పట్టుదల, ఏకాగ్రతతో సాధన చేస్తే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పెనుగొండ డీఎస్పీ నరసింగప్ప మాట్లాడుతూ.. పిల్లలను ఉన్నత చదువులను చదివించి విద్యావంతులు చేయాలని సూచించారు. జాతీయ స్థాయిలో రాణించిన శ్రీశానవీని సన్మానించారు. రాష్ట్రస్థాయిలో ఉద్యోగుల సంక్షేమ నిధి కోసం రూ.10 లక్షల కేటాయిస్తున్నట్లు సగర సంఘం జిల్లా నాయకులు డాక్టర్ గిడ్డయ్య ప్రకటించారు.

వాట్సప్‌లో ఎఫ్ఐఆర్ కాపీ

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్ తెచ్చింది. నమోదైన కేసుకు సంబంధించి ప్రాథమిక సమాచార నివేదిక(ఎఫ్ఐఆర్) కాపీ కోసం గతంలో బాధితులు రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ఇకపై వాట్సప్‌లోనే పొందే వెసులుబాటు కల్పించింది. ఈ-చలానా, కేసు స్థితి తెలుసుకునే అవకాశాన్నీ తెచ్చింది. జిల్లావ్యాప్తంగా ఈ విషయంపై పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బందికి వాట్సప్ సేవలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇకపై ప్రజలు ఇంటి నుంచే చరవాణి ద్వారా వాట్సప్‌లో ఎఫ్ఐఆర్ కాపీ, పోలీసు సేవలు పొందవచ్చు.

మీ కోసం

నిబంధనలు వర్తిస్తాయి

ఎఫ్ఐఆర్ కాపీ పొందేందుకు కొన్ని నియమాలున్నాయి. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన ఫిర్యాదుదారు, కేసులో పేర్కొన్న బాధితుడు, లేదా చట్టబద్ధ హక్కు ఉన్న వ్యక్తులు మాత్రమే అర్హులు. కేసు దర్యాప్తులో గోప్యత దృష్ట్యా ప్రతి ఒక్కరికీ ఎఫ్ఐఆర్ కాపీలు అందుబాటులో ఉండవు. లైంగిక, పిల్లలపై నేరాలు(పోక్సో కేసులు), జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలు, కోర్టు ఆదేశాల మేరకు గోప్యంగా ఉంచాల్సిన కేసులు అందుబాటులో ఉండవు.

ఇలా పొందవచ్చు

చరవాణి నుంచి 95523 00009 నంబరుకు హాయ్ అని సందేశం పంపాలి. పోలీసు సర్వీసు సేవలు ఎంచుకోవాలి. ఎఫ్ఐఆర్ నంబరు, జిల్లా, పోలీసు స్టేషన్ వివరాల నమోదుకు సూచనలు వస్తాయి. వాటి నమోదు పూర్తయ్యాక చరవాణికి ఓటీపీ వస్తుంది. నంబరును ధ్రువీకరించిన వెంటనే ఎఫ్ఐఆర్ కాపీ వాట్సప్‌నకు వస్తుంది.

వివాహిత బలవన్మరణం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వివాహిత బలవన్మరణం చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధి మంగల్‌పల్లిలో జరిగింది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్‌కు చెందిన సంజనప్రియ (36) ఐటీ ఉద్యోగి. భర్త సంపత్‌కుమార్ ప్రైవేట్ ఉద్యోగి, 8 ఏళ్ల కూతురుతో కలిసి వనస్థలిపురంలో నివాసం ఉంటున్నారు. శనివారం ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలో ఉంటున్న ఆమె స్నేహితుడు సాయినాథ్‌రెడ్డిని కలిసేందుకు రాగా, ఇద్దరూ గొడవపడ్డారు. ఈ క్రమంలో సంజన గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. సాయినాథ్‌రెడ్డి స్వగ్రామం ఆమనగల్లు కాగా, మంగల్‌పల్లిలో నివాసం ఉంటు వ్యాపారం చేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పంట కాల్వలో పడి యువకుడి మృతి

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోనవరం గ్రామానికి చెందిన వెంకటసురేంద్ర(35) ప్రమాదవశాత్తు పంట కాల్వలో పడి మృతి చెందినట్లు ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన శేషన్న, వెంకటసుబ్బమ్మ దంపతుల కుమారుడు వెంకటసురేంద్ర కొణిదేడు గ్రామం వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం పని ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా ఆలమూరు గోనవరం గ్రామాల మధ్య అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకెళ్లాడు. పంట పొలాల్లోని కాల్వలో పడడం, అతనిపై ద్విచక్రవాహనం పడడంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. ఆదివారం తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాలింపు చేపట్టగా పంట కాల్వలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తొమ్మిదో తరగతి విద్యార్థిని అనుమానాస్పదంగా..

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : కర్నూలు నగర శివారులోని అధిన ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న వేదికరెడ్డి (14) పాఠశాల వసతిగృహంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం రాత్రి 2 గంటల సమయంలో మరో విద్యార్థిని వాష్‌రూమ్‌కు వెళ్లేందుకు సాయం కోసం వేదికరెడ్డిని నిద్ర లేపేందుకు ప్రయత్నించగా ఎంతకూ లేవకపోవడంతో వార్డెన్‌కు సమాచారం ఇచ్చినట్లు పాఠశాల యాజమాన్యం చెబుతోంది. వెంటనే ప్రిన్సిపల్ వసతిగృహానికి చేరుకొని హుటాహుటిన ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు సమాచారం. పోస్టుమార్టం నిమిత్తం శనివారం రాత్రి 2.30 గంటల సమయంలో మృతురాలి కుటుంబ సభ్యులు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై కర్నూలు తాలూకా పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అపూర్వ సమ్మేళనం

తమ గురువులతో పూర్వవిద్యార్థులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: వారంతా ఒకచోట చదువుకున్నారు. ఆ తర్వాత ఎక్కడెక్కడికో వెళ్లి వివిధ రంగాల్లో స్థిరపడి జీవనం సాగిస్తున్నారు. 32 ఏళ్ల తర్వాత బాల్య మిత్రులంతా ఒక చోట చేరి సంబరాలు చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమావేశానికి ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాల వేదికైంది. పాఠశాల 1993-94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాటి గురువులు రామకృష్ణ, జయమ్మ, జనార్దన్‌లను సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు. నాడు చేసిన అల్లరి చేష్టలను జ్ఞాపకాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులు రమేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

ప్రసంగిస్తున్న విరజానందస్వామి

బనగానపల్లి, న్యూస్‌టుడే: హిందువులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని వైఎస్సార్ జిల్లా కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలోని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి పేర్కొన్నారు. జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహణ సమితి అధ్యక్షుడు గాలి మద్దిలేటిరెడ్డి అధ్యక్షతన మండల హిందూ సమ్మేళనం నిర్వహించారు. విరజానందస్వామి మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. ఆర్ఎస్ఎస్ దేశ ప్రజల్లో జాతీయ భావాలు పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉంటే సమాజం బలంగా ఉంటుందన్నారు. పట్టణంలో టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో భారీగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎం.పార్వతి, సురేంద్ర, కాటసాని ప్రసాద్‌రెడ్డి, నాగిరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

కలిసికట్టుగా పోరాడి జిల్లాను సాధించుకుందాం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనకు ప్రజలంతా కలిసికట్టుగా పోరాడి సాధించుకుందామని ఆదోని జిల్లా సాధన సమితి ఐకాస నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, ప్రకాశ్‌జైన్, దేవిశెట్టి ప్రకాశ్, దస్తగిరినాయుడు, అశోకానందరెడ్డి తదితరులు అన్నారు. పట్టణంలో ఆదోని జిల్లా సాధన కోసం చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 36వ రోజుకు చేరుకున్నాయి. వారు మాట్లాడుతూ.. జిల్లా సాధనకు పెద్ద ఎత్తున మద్దతు రావడం అభినందనీయమన్నారు. ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల ప్రజలు పూర్తి స్థాయిలో మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలని కోరారు. ఆదివారం దీక్షలకు ఆదోని స్వకుళ సాళీ(చేనేత) సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణేశి నాగరాజు, జిందే లక్ష్మణ్ మద్దతు తెలిపారు. అలాగే ఐకాస ఐక్యవేదిక యూత్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై ప్రదర్శన నిర్వహించి కోట్ల కూడలి వద్ద రాస్తారోకో చేపట్టారు. భాజపా రాష్ట్ర నాయకులు విట్టా రమేష్, నాయకులు లోకేశ్, హుసేనప్పయాదవ్, రమేశ్‌యాదవ్ తదితరులు దీక్షలకు మద్దతు ప్రకటించారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. డివిజన్ పరిధిలోని వైకాపా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు రిలే నిరాహారదీక్షలు చేస్తున్నామన్నారు.

దీక్షలో పాల్గొన్న సంఘం నాయకులు, భాజపా నేతలు

సాహిత్యంలో యువత భాగస్వామ్యం కీలకం

మాట్లాడుతున్న అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : తెలుగు సాహిత్యంలో యువత భాగస్వామ్యం కీలకమని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. యువ రచయితలను ప్రోత్సహించేందుకు అరసం కృషి చేస్తోందని చెప్పారు. కర్నూలులోని ఎస్టీయూ భవన్‌లో సాహిత్య అకాడమీ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 90 ఏళ్ల తెలుగు అభ్యుదయ సాహిత్య సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. 1933లో శ్రీశ్రీ రచించిన జయభేరి కవితతో తెలుగునాట అభ్యుదయ సాహిత్యం మొదలైందన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి మార్గ నిర్దేశం చేసేలా అభ్యుదయ సాహిత్యం ఉండాలన్నారు. తెలుగు సాహిత్యంలో కొత్త తరహా రచనలతో మార్పు తేవాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు సలహామండలి సభ్యులు వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ సామాజిక దృష్టి కోణం నుంచి రచనలు చేసినపుడే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. తెలంగాణ విమోచన ఉద్యమ సాహిత్యంపై ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, అభ్యుదయ సాహిత్య విమర్శపై ఆచార్య కరిమిండ్ల లావణ్య, అభ్యుదయ నవల అన్న అంశంపై కేపీ అశోక్‌కుమార్, అభ్యుదయ కథ అంశంపై డా.హరికిషన్, అభ్యుదయ నాటకం అనే అంశంపై డా.వింధ్యవాసినీ దేవి, అభ్యుదయ కవిత్వంపై కెంగార తాయప్ప ప్రసంగించారు. అనంతరం అతిథులు, వక్తలను సత్కరించారు. అరసం జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాద, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

పరుగుల వీరుడు

➤ జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించిన యువకుడు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: యువకుడు పరుగుల వేటలో పతకాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతంలో సాధన చేసిన యువకుడు జాతీయ స్థాయిలో తన ప్రతిభ చూపారు. ఎమ్మిగనూరు పట్టణ కేంద్రంలో నిత్యం సాధన చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి ఆదర్శంగా నిలిచారు.

పేదింటి బిడ్డ భళా..

వెంకట్రామిరెడ్డి

నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన వెంకట్రామిరెడ్డి తల్లిదండ్రులు గోపాల్‌రెడ్డి, ఉమ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వెంకట్రామిరెడ్డి హైదరాబాదులో బీబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. అథ్లెటిక్స్ పోటీల్లో శిక్షణ తీసుకున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శాయ్‌కి ఎంపికయ్యారు. వెంకట్రామిరెడ్డికి చిన్నప్పటి నుంచి పరుగు పందెం అంటే ఇష్టం. కోచ్ మల్లికార్జున సహకారంతో ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ మైదానంలో నిత్యం సాధన చేస్తున్నారు. పరుగు పందెం పోటీల విభాగంలో సాధన చేశారు. దీంతో అంతర్జాతీయ స్థాయి పోటీకి ఎంపిక చేశారు. ఈ ఏడాది జైపుర్‌లో నిర్వహించిన ఖేల్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో 800 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించారు. రాంచీలో జరిగిన 4వ దక్షిణాసియా సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో 800 మీటర్ల విభాగంలో కాంస్య పతకం సాధించి దేశానికి ప్రాధాన్యం వహిస్తూ తొలిసారిగా సీనియర్ అంతర్జాతీయ పతకాన్ని అందుకున్నారు. అదే విధంగా ఈ ఏడాది అక్టోబర్ 10-14వ తేదీలో జరిగిన 40వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు భువనేశ్వర్‌లో జరిగాయి. ఛాంపియన్‌షిప్‌లో 880 మీటర్లు, 1500 మీటర్లు డబుల్ పరుగు పందెంలో బంగారు పతకాలు గెలుచుకున్నారు. వరల్డ్ అండర్-20, ఏషియన్ అండర్-22 అర్హత ప్రమాణాలను సాధించారు. నేషనల్ జూనియర్ ఫెడరేషన్ కప్, ఆల్ ఇండియా ఇంటర్-శాయ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించారు. ప్రస్తుతం బెంగళూరు ప్రభుత్వ శాయ్‌లో శిక్షణ పొందుతున్నారు.

పురాతన శిలాశాసనాల అనువాదం

మండలంలోని పోతుగల్లు గ్రామంలో చాలా రోజులుగా ఉన్న పురాతన శిలశాసనాలు.. వాటిపై ఉన్న రాతలను పురావస్తు శాఖ ద్వారా తెలుగులోకి అనువదించినట్లు భారత పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి తెలిపారు. గ్రామంలో ఎప్పటి నుంచో శిలా శాసనాలు ఉన్నాయని.. వాటిపై ఉన్న రాతలు అర్థం కావడం లేదని స్థానికులు మల్లేష్‌నాయుడు, నాగరాజు తదితరులు తమ దృష్టికి తీసుకురావడంతో వాటిని పరిశీలించి తెలుగులోకి అనువదించినట్లు తెలిపారు. విజయనగర రాజైన సదాశివరాయలు 1549, అక్టోబరు 9వ తేదీన గ్రామ చెరువు దానశాసనం రాసినట్లు తెలిసింది. గ్రామ సమీపంలో ఉన్న చెరువు మాన్యాన్ని గ్రామానికి దానం చేసినట్లు ఇందులో ఉంది. ఈ చెరువు ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామంలోని దేవాలయాల్లో పూజా కైంకర్యాలు చేయాల్సిందిగా అందులో రాసినట్లు ఆయన వివరించారు. - న్యూస్‌టుడే, పోతుగల్లు (కృష్ణగిరి)

EENADU e Classifieds

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ సందు లేడీ టెలికాలర్స్ (F) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M) కావలెను. నోటార్గెట్ ఫిక్స్ డ్ జీతం:10,000/- నుండి 15,000/- మరియు ఇన్సెంటీవ్స్. ✆ 9398616991.

పారుల్ యూనివర్సిటీ బ్రాండ్ ప్రమోషన్ కొరకు లేడీ టెలికాలర్స్ కావలెను. వ: 18-28 సం||, అ: బీటెక్, డిగ్రీ గ్రాడ్యుయేట్స్. నవీన్ చంద్, కొత్త అయ్యప్పస్వామి గుడి, కె.సి కెనాల్, కర్నూలు. సంప్ర|| 63000 97961.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్ర స్థాయికి ఎంపిక

కర్నూలులో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి అందుకుంటున్న హంప విద్యార్థులు

హంప, (మద్దికెర), న్యూస్‌టుడే: వైజ్ఞానిక ప్రదర్శనలో మద్దికెర మండలం హంప విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. కర్నూలులో శనివారం జరిగిన సైన్సు ఫేర్‌లో మొదటి స్థానంలో నిలిచారని, దీంతో జిల్లా స్థాయి అవార్డు అందుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 24న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు ఆయన చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులు లతీఫ్, రోషన్‌లను అభినందించారు.

ఆదోని

• ఆదోని • ఆలూరు • పత్తికొండ

విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దండి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దాలని ఆదోని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌ను ఆదివారం ఎంఈవో శ్రీనివాసులు తనిఖీ చేశారు. భోజన వసతిపై అరా తీశారు. దస్త్రాలు పరిశీలించి, విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 80085 73822

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: మండలంలోని నంచెర్లలో ప్రధాన రోడ్లలో చెత్తడబ్బాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. శుభ్రం చేయాలి. -రామాంజనేయులు, నంచెర్ల
✔: పారిశుద్ధ్య సిబ్బందితో రెండ్రోజుల్లో శుభ్రం చేయిస్తాం. - భీమ, సర్పంచి నంచెర్ల

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని పార్వతీనగర్ ప్రాంతం నుంచి శుక్రవారం పేటకు వెళ్లే సీసీ రహదారి దెబ్బతింది. పైపుల కోసం రహదారి ధ్వంసం చేసి, తాత్కాలికంగా పూడ్చివేయడంతో ఇబ్బందిగా మారింది. - మీనాక్షి, ఆదోని
✔: ఆ ప్రాంతంలో పర్యటించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. - కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

రామానుజన్ స్ఫూర్తితో రాణించాలి

విద్యార్థిని అభినందిస్తున్న శివశంకరగౌడ, ఉపాధ్యాయులు, హెడ్‌కానిస్టేబుల్

హొళగుంద, న్యూస్‌టుడే: ప్రపంచ గణిత మేధావుల్లో శ్రీనివాస రామానుజన్ ఒకరని, విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకొని రాణించాలని భారత్ యూత్ గౌరవాధ్యక్షుడు శివశంకరగౌడ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం భారత్ యూత్ అసోసియేషన్, వీకే ట్యుటోరియల్స్ ఆధ్వర్యంలో రామానుజన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. విద్యార్థులకు గణిత పరీక్ష పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు, ప్రమాణపత్రాలు శివశంకర గౌడ అందించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మీరావు, విజయ్, ఉపాధ్యాయులు పాండురంగ, ఉరుకుందప్ప, గాదిలింగ, భారత్ యూత్ సభ్యులు కన్నారావు, మల్లికార్జున, శ్రీధర్ శెట్టి, గాల్లప్ప, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

బోగస్ ఏరివేతకు ఈ-కేవైసీ

■ ఉపాధి పనుల్లో వ్యక్తిగత హాజరు తప్పనిసరి
■ అక్రమాలకు వీల్లేకుండా ప్రభుత్వం చర్యలు

పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ఆలూరు గ్రామీణం, హాలహర్వి, న్యూస్‌టుడే: ఉపాధి పనులను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఉపాధి కూలీలకు ఈ-కేవైసీ తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయంతో బోగస్ మస్టర్లకు చెక్ పడనుంది. దీని ద్వారా పనులకు హాజరై కూలీల నుంచి తప్పనిసరిగా బయోమెట్రిక్ చేయించాలి. దీని ద్వారా ఉపాధి పనులకు హాజరైన వారికే కూలి చెల్లిస్తారు. గతంలో పనులకు రాకపోయినా క్షేత్ర స్థాయి సహాయకుడు, కూలీలు కుమ్మక్కై హాజరు వేసి వేతనం చెల్లించేవారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బోగస్ హాజరుకు బ్రేకులు వేసినట్టు అవుతుంది.

నియోజకవర్గంలోని ఆలూరు, ఆస్పరి, హాలహర్వి, చిప్పగిరి, హొళగుంద, దేవనకొండ మండలాల్లో 1,20,027 మంది కూలీలు ఉన్నారు. ఇప్పటివరకు చాలా మంది శ్రామికులు పనులకు రాకున్నా, ఒకరి బదులు మరొకరు పనులకు వెళ్లడం, కొందరి పేర్ల మీద బోగస్ జాబ్‌కార్డులు ఉన్నట్లు గుర్తించారు. కొందరు ఉద్యోగులకు కూడా కార్డులు సృష్టించిన ఉదంతాలున్నాయి. ఇలాంటివన్నీ పలుమార్లు ఆడిట్ తనిఖీల్లో బయటపడటంతో ప్రభుత్వం అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది. పనులకు హాజరయ్యే ప్రతి ఒక్కరికి ఈ-కేవైసీ తప్పనిసరి చేసింది. ఇప్పటివరకు నియోజకవర్గంలో 79.11 శాతం మందికి మాత్రమే ఈకేవైసీ పూర్తిచేశారు.

నియోజకవర్గంలో ఈ-కేవైసీ వివరాలు ఇలా

మండలం	మొత్తం కూలీలు	ఈకేవైసీ పూర్తయినవి	శాతం
ఆలూరు	17721	13978	81.16
ఆస్పరి	25703	19674	77.51
చిప్పగిరి	12454	9958	81.26
దేవనకొండ	25606	19870	78.94
హాలహర్వి	17165	14088	82.9
హొళగుంద	21378	17391	82.27

అవన్నీ దొంగ జాబ్‌కార్డులే!

నియోజకవర్గంలో మొత్తం 94,959 మంది ఉపాధి కూలీలకు అధికారులు ఈ-కేవైసీ పూర్తి చేశారు. ఇంకా 25068 మందికి పూర్తి చేయాల్సి ఉంది. ప్రక్రియ పూర్తి కాకుంటే వాటిని బోగస్ జాబ్‌కార్డులుగా తేలుస్తారు. కొందరు స్వార్థపరుల వల్లే ఈ పథకం ఇలా పక్కదారి పడుతోంది. దీనికి ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం వంతపాడుతుండటంతో లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలొస్తున్నాయి. ప్రభుత్వ చర్యలతో అర్హులకు మాత్రమే లబ్ధి చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు.

పేదలకు అన్ని విధాలా చేయూత

సూర్యనారాయణను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, కమ్మ సంఘం నాయకులు

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: కమ్మ కార్పొరేషన్‌తో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు అన్ని విధాలుగా చేయూత అందిస్తామని రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోలిశెట్టి సూర్యనారాయణ అన్నారు. ఆదోనిలోని టీడీపీ సమావేశ మందిరంలో ఆదివారం కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, సంఘం నాయకులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ.. కమ్మ కులంలోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. తనపై విశ్వాసం ఉంచి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం ఆదోని అధ్యక్షుడు టీడీపీ మురళి, నాయకులు రఘురామయ్య, బలరామయ్య, లక్ష్మయ్య, రామస్వామి, బూపాల్ చౌదరి, మారుతిరామయ్య, వెంకటేశ్ చౌదరి, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చడం ఇలాగేనా?

పట్టణంలోని బావాజీపేటలో ఇటీవల తాగునీటి పైపు లైను కోసం గుంతలు తవ్వారు. పనులు పూర్తయిన తర్వాత వాటిని పూడ్చకుండా అలాగే వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి మీదుగా నిత్యం వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. రాత్రివేళల్లో ఇవి కానరాక ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు

కుంగింది.. ఎప్పుడు కూలుతుందో!

మండలంలోని పగిడిరాయి మదనంతపురానికి వెళ్లే దారిలో పగిడిరాయి పెద్ద బావి వద్ద పంట కాలువపై ఉన్న కల్వర్టు ఓ వైపు కుంగిపోయి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇటుగా రైతులు పంట ఉత్పత్తులను ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై తరలిస్తున్నారు. అయితే ఎప్పుడు కూలి ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. కుంగిన ప్రదేశంలో పెరిగిన గడ్డి ప్రమాద సూచిగా ఉంది. ఇప్పటికైనా మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తుగ్గలి

తిమ్మాపురం దారి.. తిప్పలే మరి

ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడంతో చిప్పగిరి మండలంలోని తిమ్మాపురం రహదారి కంకర తేలి అధ్వానంగా మారింది. నేమకల్లు నుంచి తిమ్మాపురానికి 4 కి.మీ. దూరం ఉండగా గ్రామానికి చేరాలంటే అరగంట సమయం పడుతోంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. 2002లో తెదేపా ప్రభుత్వ హయాంలో గ్రామానికి తారు రోడ్డు వేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తారు రోడ్డు వేయాలని గ్రామస్థులు శస్త్రశేఖర్, నాగార్జున, నాగేంద్ర కోరారు. - న్యూస్‌టుడే, చిప్పగిరి

ధ్యానంతో ఆరోగ్యం పదిలం

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలో బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం(ఓం శాంతి) ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి సబ్ కోర్టు జడ్జి జి.నారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి మాట్లాడారు. ధ్యానంతో ఆరోగ్యం పదిలంగా ఉంచుకోవడంతో పాటు ఒత్తిడి నుంచి బయటపడేందుకు దోహదపడుతుందన్నారు. శరీరం నియంత్రణలో ఉండటంతో పాటు మనస్సు ఎంతో ఉల్లాసంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వీరేశ సంఘం అధ్యక్షుడు పురుషోత్తం, ఉపాధ్యక్షుడు రాజశేఖర్, సీనియర్ న్యాయవాది రామిరెడ్డి, నిర్వాహకులు నిర్మలమ్మ, రాధమ్మ, లక్ష్మి పుష్ప, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్జి నారాయణరావు

నీటి లీకేజీ నివారణ

స్పందనకు వందనం

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: పట్టణంలోని అరుణ్‌జ్యోతినగర్‌లో ప్రధాన నీటి సరఫరా గొట్టానికి పురపాలక సంఘం నీటి విభాగం ఆధ్వర్యంలో లీకేజీ నివారణ పనులు చేపట్టారు. సమస్యపై ఈ నెల 20న 'మేమున్నాం -మీకు తోడుగా'లో ప్రచురితమవడగా స్పందించిన పురపాలక కమిషనర్ కృష్ణ, డీఈ రామ్మూర్తి సిబ్బందితో పనులు చేయించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

మాళమల్లేశ్వరస్వామి అమ్మవార్లు

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండలం దేవరగట్టు కొండలో వెలసిన మాళమల్లేశ్వర స్వామికి ఆదివారం జలాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, బండారు అర్చన, ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అమ్మవారికి, కుంకుమార్చన, ఆకుపూజలు, మహామంగళ హారతిని అర్చకులు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

హాలహర్వి, న్యూస్‌టుడే: హాలహర్వి మండల పరిధిలో నిట్రవట్టి గ్రామంలో ఆదివారం రామలింగేశ్వరస్వామి ఆరాధన వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి మఠంలో ప్రత్యేక భజన కార్యక్రమం జరిగింది. అనంతరం ఊరేగింపుగా వెళ్లి గంగిపూజ నిర్వహిచి, గ్రామంలో నందికోలు నృత్యం, తనువు బిందెతో మఠానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేపట్టారు. కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు సుంకులమ్మ, కర్రెమ్మ దేవర కార్యక్రమాలు

ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ అమ్మవారు

అమకతాడు (కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండలంలోని అమకతాడులో సోమ, మంగళవారాల్లో సుంకులమ్మ, కర్రెమ్మ దేవర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. సోమవారం అమ్మవార్లకు ప్రతి ఇంటి నుంచి నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహిస్తారు. మంగళవారం గ్రామస్థులంతా ఉమ్మడిగా అమ్మవార్లకు బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు. ఆదివారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన బంధువులతో గ్రామ వీధులన్నీ సందడిగా మారాయి.

తుంగభద్రకు తగ్గిన ఇన్‌ఫ్లో

హాలహర్వి, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం పూర్తిగా తగ్గుముఖం పట్టినట్లు టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. ఆదివారం 101 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరిందన్నారు. ప్రస్తుతం జలాశయం నుంచి వివిధ కాల్వలకు, నదికి కలిపి 17,183 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశామన్నారు. 1,614.26 అడుగులకు గాను 46.69 టీఎంసీల నీటి నిల్వ ఉందన్నారు. కాగా జనవరి 10వ తేదీన వివిధ కాల్వలకు నీటిని ఆపివేసి, గేట్లు మరమ్మతులు చేపట్టేందుకు బోర్డు అధికారులు చర్యలు చేపట్టారు.

తలనీలాలకు మరోసారి వేలం

పెరవలి (మద్దికెర), న్యూస్‌టుడే: మండలంలోని పెరవలి రంగనాథస్వామి దేవాలయంలో భక్తులు సమర్పించే తలనీలాల సేకరణకు గత నెలలో వేలంపాట నిర్వహించారు. రూ.14 లక్షలకు దక్కించుకున్న గుత్తేదారు ముందుకు రాలేదు. దీంతో ఈ నెల 31న మరోసారి వేలం నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని ఆలయ కార్యనిర్వహణాధికారి వీరయ్య తెలిపారు.

చుక్కల మందుకు చక్కని స్పందన

పల్స్ పోలియో సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు తల్లిదండ్రులు తరలివెళ్లి పిల్లలకు చుక్కలమందు వేయించారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో కార్యక్రమం ప్రశాంతంగా సాగింది. అధిక శాతం కేంద్రాల్లో 90 శాతానికి పైగా చుక్కల మందు పంపిణీ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, ఆలూరు, ఆదోని గ్రామీణం, ఆదోని వైద్యం, వెల్దుర్తి, దేవనకొండ, మద్దికెర, చిప్పగిరి, పత్తికొండ గ్రామీణం, తుగ్గలి

ఆలూరు గ్రామీణం: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న తెదేపా ఇన్‌ఛార్జి వైకుంఠం జ్యోతి

ఆదోని వైద్యం: చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే డా.పార్థసారథి

పత్తికొండ: కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లోక్‌నాథ్

దేవనకొండ: పోలియో చుక్కలు వేస్తున్న అడిషనల్ డైరెక్టర్ అనిల్‌కుమార్

అపూర్వ సమ్మేళనం.. ఆనంద వేడుక

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1985-86వ సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు నలభై ఏళ్ల తరువాత కలుసుకొన్నారు. ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువు కృష్ణయ్య దంపతులను సత్కరించారు. హైదరాబాద్, అమరావతి, అనంతపురం, కర్నూలు తదితర నగరాల నుంచి వచ్చారు.

తమకు చదువు చెప్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

కలుగొట్ల(వెల్దుర్తి), న్యూస్‌టుడే: కలుగొట్ల గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల 1993-94 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. 31 ఏళ్ల అనంతరం కలుసుకున్న స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. తాము చదువుకున్న సమయంలోని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తరగతి గదులకు వెళ్లి వారు అభ్యసించిన స్థలాలను చూసుకున్నారు. తమకు చదువులు చెప్పిన గురువులను సన్మానించారు. స్నేహితులు నృత్యాలు చేసి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు శేషయ్య, తిమ్మన్న, హుషేన్‌మియ్యా, దేవేంద్రరెడ్డి, కృష్ణమోహన్, రంగస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలుగొట్ల పాఠశాలలో సమావేశమైన 1993-94 బ్యాచ్ విద్యార్థులు

ఘనంగా నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలు

కేకు తినిపిస్తున్న వైకుంఠం శివప్రసాద్

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుందలో నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండు కూడలిలో ఆదివారం ఆమె జన్మదిన వేడుకలు సందర్భంగా తెదేపా రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ తిప్పయ్య, సింగిల్ విండో ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, తెదేపా సీనియర్ నాయకులు ఈడిగగోవింద గౌడ్, దుర్గయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు గ్రామీణం(ఆస్పరి), న్యూస్‌టుడే: ఆస్పరిలో తెదేపా నాయకుల ఆధ్వర్యంలో నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం వద్ద ఆదివారం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. మాజీ మండల కన్వీనర్ తిమ్మన్న, మండల తెదేపా యువ నాయకుడు కె.సతీష్ కుమార్, యుగంధర్, శేఖర్, రాజు, సాగర్ పాల్గొన్నారు.

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: నారా బ్రాహ్మణి జన్మదినం సందర్భంగా స్థానిక తెదేపా నాయకుడు మారుతినాయుడు కార్యాలయంలో కేకు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు భూపాల్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటి, నాయకులు అబ్దుల్ ఖాదర్, రమేశ్, వినయ్, జేపీ తదితరులు పాల్గొన్నారు.

గుడిసె కృష్ణమ్మకు అభినందన

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన గుడిసె కృష్ణమ్మను ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి సన్మానించి, అభినందించారు. ఆదివారం సాయంత్రం ఆమె నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి శాలువా, పూలమాలలతో సత్కరించారు. రెండున్నర దశాబ్దాలుగా కృష్ణమ్మ రాజకీయాల్లో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని.. ప్రజాసేవ చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. తమ పూర్తి మద్దతు ఉంటుందని, ఎలాంటి కష్టమొచ్చినా వెన్నంటి ఉంటామని భరోసానిచ్చారు.

ఆదోని హోటల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

శ్రీనివాసులు

ఆదోని ఎస్కేడి కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని హోటల్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక ద్వారకా ఫంక్షన్ హాల్‌లో కమిటీ ఎన్నిక కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా అవకాయ శ్రీనివాసులు, కార్యదర్శిగా అన్నుభాయ్, కోశాధికారిగా అరుణ్, గౌరవ సలహాదారులుగా విట్టా రమేష్, కేబీ రాజుస్వామి, మాధవస్వామి, టీ.వీరేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ హోటల్ నిర్వాహకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

సమాజ జాగృతమే లక్ష్యంగా రచనలు సాగించాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సమాజాన్ని తమ రచనల ద్వారా జాగృతం చేయాలని ప్రముఖ సాహితీవేత్త ఏలూరు ఎంగన్న అన్నారు. పత్తికొండకు చెందిన కమలా కళానికేతన్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ కవి సవ్వప్పగారి ఈరన్న రచించిన జనజీవన స్రవంతి పుస్తకాన్ని ఆదివారం పత్తికొండ గ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సవ్వప్పగారి ఈరన్న 75 ఏళ్ల వయసులో 75వ పుస్తకాన్ని రచించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ పుస్తకంలో సమాజానికి ఎంతో అవసరమైన అంశాలు పొందుపర్చారన్నారు. గ్రంథాలయ అధికారి విశ్వనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ అధికారి రామ్ కుమార్, పలువురు సాహితీవేత్తలు, అభిమానులు సుధాకర్, శిరీష, శశాంక్‌మౌళి, వెంకటేశ్వరయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్త ఏలూరు ఎంగన్న తదితరులు

బీసీ సంక్షేమ అధికారిపై చర్యలకు డిమాండ్

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని విద్య, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా బీసీ సంక్షేమ అధికారి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని.. జిల్లా అధికారులు స్పందించి అధికారిపై సమగ్ర విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండు చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల అధికారులను ఇన్‌ఛార్జిల పేరుతో, డిప్యూటేషన్ల పేరుతో రూ.లక్షలు వసూళ్లు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు.

కార్యకర్తల సేవా కార్యక్రమాలు

వృద్ధురాలికి కేకు తినిపిస్తున్న కంగాటి శ్రీదేవి

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని వైకాపా కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డా.మధుసూదన్ కార్యకర్తల మధ్య కేకు కోశారు. పార్టీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, దేవా, మహేందర్‌రెడ్డి, సన్నీ, తాయన్న, రంగస్వామి, ఇర్ఫాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం: పత్తికొండలోని వృద్ధాశ్రమంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఆధ్వర్యంలో కేకు కోశారు. వృద్ధులకు అన్నదానం చేశారు..

ఆలూరు గ్రామీణం, తుగ్గలి, వెల్దుర్తి: ఆలూరులోని గుంతకల్లు క్రాస్ నుంచి ద్విచక్రవాహనాలతో ఆ పార్టీ కార్యాలయం వరకు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేకు కోశారు. వెల్దుర్తి, తుగ్గలిలోనూ కేకులు కట్ చేశారు. వైకాపా నాయకులు వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, శ్రీరాములు, జడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాగులో పడి 15 గొర్రెల మృత్యువాత

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చిన్నహుల్తి సమీపంలో ఆదివారం హంద్రీవాగులో పడి 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మేత కోసం వాటిని తరలిస్తుండగా హంద్రీవాగు వంతెనపై వెళ్తుండగా ఇరువైపులా వాహనాలు రావటంతో బెదిరిపోయి సుమారు 20 అడుగుల లోతులో ఉన్న వాగులో పడిపోయాయి. అందులో 40కి పైగా గొర్రెలు అపస్మారక స్థితిలోకి వెళ్లగా గమనించిన గొర్రెల కాపరులు కొన్నింటిని కాపాడగలిగారు. 15 మృతి చెందినట్లు బాధితులు మాలకిష్టప్ప, వెంకటేశ్, వన్నూరప్ప, మల్లేశ్ తెలిపారు. సుమారు రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు వాపోయారు. సమాచారం అందుకున్న సీపీఐ, తెదేపా నాయకులు యం.కారన్న, పెద్దఈరన్న, కారుమంచి, సిద్ధు, మాదన్న, రంగన్న, నాగరాజు, లక్ష్మన్న తదితరులు ఘటనా స్థలానికి వెళ్లి మృత్యువాత పడిన గొర్రెలను పరిశీలించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గడ్డివామి దగ్ధం

బొమ్మిరెడ్డిపల్లి(వెల్దుర్తి), న్యూస్‌టుడే: మండలంలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామంలో వైకాపా నాయకుడు మధుసూదన్‌రెడ్డికి చెందిన గడ్డివామి కాలిపోయింది. గ్రామ శివారులోని వారి స్థలంలో రెండేళ్ల క్రితం వేసిన గడ్డివామి ఆదివారం అగ్నికి ఆహుతయ్యింది. దాదాపు రూ.80 వేల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు చెప్పారు.

పంచ్ కొడితే పతకాలే

■ బాక్సింగ్‌లో సత్తా చాటుతున్న ఆదోని బాలికలు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: బాక్సింగ్ క్రీడ అంటేనే చాలా ప్రమాదకరం. బాక్సింగ్ ఆడేందుకు అమ్మాయిలు భయపడుతుంటారు. అలాంటి క్రీడలో ఆదోని పట్టణంలోని కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థినులు ప్రతిభ చాటుతున్నారు. రింగ్‌లో దిగితే ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపిస్తున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు కైవసం చేసుకున్నారు.

☛ విద్యార్థినులకు కేజీబీవీ అధికారిణి శాంతి ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయిని సునంద ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఉదయం, సాయంత్రం సాధన చేయిస్తూ మెలకువలు నేర్పిస్తున్నారు. ఫిట్‌నెస్, తదితర అంశాలపై శిక్షణ ఇస్తూ సన్నద్ధం చేస్తున్నారు. ఈ నెల 8, 9 తేదీల్లో రాజమండ్రిలో జరిగిన అస్మిత్ ఖేలో ఇండియా రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన 17 మంది విద్యార్థినులు బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించారు.

అఖిల బరిలో దిగితే హడలే

మండలంలోని నారాయణపురానికి చెందిన వి.వీరేశ్, వి.జ్యోతి దంపతుల కుమార్తె వి.అఖిల. కేజీబీవీలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్నారు. బాక్సింగ్‌పై ఆసక్తితో ఉదయం, సాయంత్రం సాధన చేస్తూ మెలకువలు నేర్చుకుంటున్నారు. రాజమండ్రిలో జరిగిన పోటీల్లో అండర్- 80 కిలోల విభాగంలో స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. మరిన్ని వేదికలపై సత్తా చాటి గ్రామానికి, పాఠశాలకు పేరు తెస్తానంటున్నారు. ఉన్నత స్థాయికి చేరుకోవడమే తన లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు అఖిల.

తిరుగులేని గౌతమి

పట్టణానికి చెందిన హెచ్.నరసన్న, హెచ్.లక్ష్మి దంపతుల కుమార్తె హెచ్.గౌతమి. కేజీబీవీలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. బాక్సింగ్‌పై ఆసక్తితో సాధన చేస్తున్నారు. పంచ్‌లు, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇటీవల రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా బాక్సింగ్ పోటీల్లో గౌతమి అండర్- 75 విభాగంలో ప్రతిభ చాటారు. ప్రత్యర్థులను పంచ్‌లతో చిత్తు చేసి బంగారు పతకం సొంతం చేసుకున్నారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటడమే సాధన చేస్తున్నారు గౌతమి.

(c) eenadu

శ్రీమఠం ప్రాకారంలో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వెండి అంబారీపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను వెండి అంబారీపై వైభవంగా ఊరేగించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు మంత్రాలయం చేరుకున్నారు. అర్చకులు ప్రహ్లాదరాయలను వెండి అంబారి, చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉంచి శ్రీమఠం ప్రాకారంలో వైభవంగా ఊరేగించారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

వేరుసెనగ క్వింటా గరిష్ఠ ధర రూ.8,640

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో ఆదివారం క్వింటా గరిష్ఠ ధర రూ.8,640 మధ్యస్థ ధర రూ.7,740 కనిష్ఠ ధర రూ.3,006కు వ్యాపారులు కొన్నారు. 108మంది రైతులు 2428 వేరుసెనగ బస్తాలను అమ్మకానికి తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.6,070 మధ్యస్థ ధర రూ.6,034 కనిష్ఠ ధర రూ.4,010 పలికింది.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు 8008573824
కోడుమూరు 9885988357
కౌతాళం 8008574913

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: కోడుమూరు పట్టణంలోని చిన్నబోయ వీధిలో దోమల బెడద ఎక్కువగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి దోమల మందు పిచికారీ చేయించాలి. –గిరి, కాలనీవాసీ

✔: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి దోమల మందు పిచికారీ చేయిస్తాం. -వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: ఎద్దుల మార్కెట్‌లో పశువులకు నీటి తొట్టెలు లేవు. సమస్య పరిష్కరించాలని పలుమార్లు విన్నవించాం. –రంగన్న, రైతు

✔: నీటి తొట్టెలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం –గంగిరెడ్డి, పురపాలక కమిషనర్

?: రాఘవేంద్ర కాలనీలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం –శేఖర్,

✔: కాలనీలో త్వరలో కొత్త వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. సమస్య పరిష్కరిస్తాం. – నీరజా, డీఈ

కోడుమూరు పట్టణం, న్యూస్‌టుడే: ?: కొత్తపేట వీధిలో కొళాయి నీరు అపరిశుభ్రంగా వస్తున్నాయి. అధికారులు స్పందించి పరిష్కరించండి. –శ్రీకాంత్, స్థానికుడు

✔: తాగునీటి పైపులైన్‌ను పరిశీలించి త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. –మంజుల, ఈఓఆర్‌డీ

కేరళ గవర్నర్‌తో పీఠాధిపతి భేటీ

పీఠాధిపతికి జ్ఞాపిక అందజేస్తున్న గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ అర్లేకర్

మంత్రాలయం, న్యూస్‌టుడే: దార్మిక పర్యటనలో ఉన్న శ్రీమఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ అర్లేకర్‌తో భేటీ అయ్యారు. ఆదివారం అనంత పద్మనాభ స్వామి ఆలయం చేరుకున్న పీఠాధిపతికి ఆలయ అర్చకులు, రాజ కుటుంబీకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి ఇచ్చారు. పీఠాధిపతికి శేష వస్త్రం, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్.. పీఠాధిపతికి జ్ఞాపిక అందజేశారు. మఠం ప్రత్యేక అధికారి అజయ కృష్ణ కౌశిక్, రాజా అప్రమేయ ఆచార్, అధికారులు ఉన్నారు.

నిధులు విడుదల చేయాలి: ఆపస్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పదోతరగతి స్పాట్ మూల్యాంకన నిధులు విడుదల చేయాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆపస్ కార్యాలయంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ.. పదోతరగతి యాక్షన్ ప్లాన్‌లో సెలవు రోజుల్లో లేకుండా చూడాలన్నారు. జూనియర్ లెక్చరర్ల పదోన్నతులు పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ఇవ్వాలన్నారు. చాలా ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈహెచ్‌ఎస్, మెడికల్ బిల్లులు క్లియర్ చేయాలన్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అర్జిత సెలవులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ మండల అధ్యక్షులు ఉరుకుందారెడ్డి, నరసప్ప, రంగస్వామి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సాధనకు కొనసాగుతున్న దీక్షలు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంతాల అభివృద్ధి సాధించాలంటే ఆదోనిని జిల్లా చేయాలని ప్రజాసంఘాల నాయకులు సత్యన్న డిమాండ్ చేశారు. వైఎస్సార్ కూడలిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు ఆదివారం 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు స్పందించి ఆదోని జిల్లా సాధన కోసం కలిసి కట్టుగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌యాదవ్, శేఖర్, బాజా, ఉసేని, ఆఫ్రిది, నల్లారెడ్డి, మహేంద్ర, వీరేష్ పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న ప్రజాసంఘాల నాయకులు

పూడికతీత పనుల్లో నిర్లక్ష్యం

☛ రూ.73లక్షల నిధులు కేటాయించినా జాప్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కాలువలో పేరుకుపోయిన పూడిక తొలగింపులో నిర్లక్ష్యం చేస్తున్నారు. రూ.లక్షల నిధులు కేటాయించి చేపట్టిన పనుల్లో కొన్ని కాల్వలు చేసి మరికొన్నింటిని వదిలేశారు. ఏటా పూడిక తీత పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినా ఫలితం కానరావడం లేదు. మురుగు కాల్వల్లో దుర్వాసన భరించలేని పరిస్థితి. ప్రధానంగా పెద్ద కాల్వల్లో పూర్తిగా పూడిక నిండిపోయింది.

[illegible] కాలనీలో కాల్వలో పేరుకుపోయిన పూడిక

కొన్ని చోట్ల అరకొరగా

పట్టణంలో పూడికతీత పనుల కోసం రెండేళ్ల క్రితం రూ. 73లక్షల నిధులు కేటాయించారు. వీటిలో పెద్ద, చిన్న కాల్వల్లో పూడికను మనుషులు, యంత్రాలతో తొలగించాలి. కాల్వలను శుభ్రం చేసేందుకు యంత్రాలను వినియోగించి పనులు చేపట్టాలి. కొన్ని చోట్ల అరకొరగా చేయడంతో అప్పుడే పూడిక నిండిపోయి దుర్వాసన వస్తోంది. ఎమ్మిగనూరు పట్టణంలో ఏడాదిలో దాదాపు రెండు పనుల కోసం రూ. 22లక్షలు ఖర్చు పెట్టింది. వీటిలో పెద్ద కాలువలు 38కిలోమీటర్లు, మిగిలినవి చిన్న కాలువల కింద పనులు చేసి వదిలేశారు. వాస్తవంగా కొన్ని ప్రాంతాల్లో పూడిక నిండిపోవడంతో పనుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. నిధులు ఉన్నా.. పూడికతో నిండిపోయిన కాల్వలను ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించి తొలగించాల్సి ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కొనసాగుతోంది. దుర్వాసనతో కొన్ని కాలనీల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. జ్వరాలు, టైఫాయిడ్, మలేరియా, డెంగీ వ్యాధులు వస్తున్నాయి. ఇటీవలే డెంగీ లక్షణాలతో రెండు కేసులు నమోదు కావడంతో ఆయా వార్డుల్లో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వీటిపై అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం

- గంగిరెడ్డి, పురపాలక కమిషనర్, ఎమ్మిగనూరు

గతంలో పూడికతీత పనులతో అన్నీ కాల్వలు శుభ్రం చేయించాం. మళ్లీ పూడిక నిండిపోయింది. అయితే వీటికి ప్రతిపాదనలు తయారు చేసి పూడికతీత పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

నిండిన కాలువలు

- పట్టణంలో చెన్నకేశవ కాలనీలో ఉన్న పెద్ద మురుగు కాల్వలో పూడిక నిండిపోయింది.
- దాదాపు కిలోమీటరు మేరకు పూడిక ఉండడంతో 3వేల మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- వంద్యపుకొట్టాల సమీపంలో ఉన్న కాల్వలో పూడికతో పాటు, వ్యర్థాలు పేరుకుపోయాయి.
- ఆదోని-కర్నూలు రహదారిలో ఉన్న ప్రధాన కాల్వలో దుర్వాసన వస్తోంది.
- ఎంబీ చర్చి పెద్దకాలువ సమీపంలో మట్టితో నిండిపోయింది.
- గంజహళ్లి రోడ్డులో ఉన్న రెండు కాల్వల్లో పూడిక పెరిగింది.
- ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక ఉన్న పెద్ద కాల్వలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు నిండిపోయాయి.
- సంజీవ్‌నగర్ కాలనీ శివారు మురుగు కాల్వతో ఇబ్బందులు పడుతున్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.నాగలాపురం వద్ద తాగునీటి పైపులైన్ పగిలిపోయి నీటి వృథాపై 'తాగునీటి పైపు పగిలి..నీరు వృథా' అనే శీర్షికతో చిత్ర కథనం ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రేమ్‌కుమార్ తాగునీటి పైపునకు మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు.

'హిందువుగా జీవించడం గొప్ప వరం'

కోసిగి, న్యూస్‌టుడే: కోసిగి మండల కేంద్రంలోని శ్రీకోసిగయ్య (ఆంజనేయస్వామి) తేరు మైదానంలో ఆదివారం హిందూ సమ్మేళన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా ఆర్లబండ కృష్ణవధూత పీఠాధిపతి మఠ్రిస్వామి తాత, కామరం మఠం పీఠాధిపతి అలూరు రాఘవేంద్ర హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. భారత దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ భరతమాత ముద్దు బిడ్డలన్నారు. హిందువులుగా జీవించడం గొప్ప వరంగా భావించాలని అన్నారు. చిన్నారులు సాంస్కృతిక నృత్యాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్తురెడ్డి, రామిరెడ్డి, మురళి మోహన్‌రెడ్డి, పెద్ద ఎత్తున హిందువులు పాల్గొన్నారు.

సమావేశానికి పెద్ద ఎత్తున హాజరైన హిందువులు

ఉద్యోగులను సస్పెండ్ చేస్తే ఉద్యమాలు

ప్రసంగిస్తున్న పలిశెట్టి దామోదర రావు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకంలో భాగంగా నిర్లక్ష్యం చేస్తున్నారనే కారణంతో ఉద్యోగులను సస్పెండు చేయడం దారుణమని, వీటికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేద్దామని ఏపీపీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు అన్నారు. ఎమ్మిగనూరు డిపో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ. . కండీషన్ లేని బస్సులో దాదాపు వంద మందికిపైగానే ప్రయాణిస్తున్నారని ఆరోపించారు. పని ఒత్తిడితో పాటు, అన్నీ రకాల ప్రజలకు సేవలు అందిస్తున్నామని.. కానీ అధికారులు చిన్న తప్పు దొరికితే చాలు కండక్టర్లు, డ్రైవర్లను సస్పెండ్ చేసి ఒత్తిడికి గురి చేస్తున్నారని వాపోయారు. కనీసం 3వేల కొత్త బస్సులు మంజూరు చేయాలని, 10వేల పోస్టులను భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. కడప జోనల్ అధ్యక్షులు కుమార్ మాట్లాడుతూ.. న్యాయపరమైన చిక్కులతో నిలిచిపోయిన పదోన్నతులను పరిష్కరించాలని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, పీఏ జమీద్, కర్నూలు జిల్లా అధ్యక్షులు రంగస్వామి, ఏవీరెడ్డి, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, తిమ్మగురుడు పాల్గొన్నారు.

26న శతజయంతి ఉత్సవాలు

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్న భారత కమ్యూనిస్ట్ పార్టీ శతజయంతి ఉత్సవాలను ఈనెల 26న పట్టణంలో ఘనంగా నిర్వహించుకోవాలని సీపీఐ జిల్లా సభ్యులు కృష్ణ, శేష కుమార్‌లు అన్నారు. ఆదివారం పట్టణంలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఓబులేసు, విఘ్నేష్, బాలు, అంజి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

ఎమ్మిగనూరు పట్టణంలోని సాయిగణేష్ కాలనీలో ఇళ్ల మధ్య విద్యుత్తు తీగలు వేలాడుతున్నాయి. కొన్ని తీగలు ఇళ్ల మీద వాలడంతో ప్రమాదం పొంచి ఉందని కాలనీవాసులు వాపోతున్నారు. గాలి వీస్తే విద్యుత్తు తీగలు రాసుకుంటున్నాయి. కాలనీలో 25 నివాస ప్రాంతాల్లో ఇదే సమస్య నెలకొంది. దీనిపై ప్రజలు ఇటీవలే ఎమ్మెల్యే బీవీ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్తు తీగలను మార్చాలని కోరారు. అధికారులు స్పందించి విద్యుత్తు తీగలను మార్చాలని ప్రజలు కోరారు.

–న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

ఇరుకు దారితో అవస్థలు

ఎమ్మిగనూరు-కర్నూలు ప్రధాన రహదారిలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గోనెగండ్లలో గంజహళ్లి క్రాస్ రోడ్డు నుంచి బ్యాంకు వరకు రహదారికి సమీపంలోనే వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. వాహనాలు నిలుపుతున్నారు. దీంతో వాహనాల రద్దీ వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. బస్టాండు, వైఎస్సార్ కూడళ్లలో దుకాణాలు రోడ్డు వరకు రావడంతో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రోడ్డు వెడల్పు చేపట్టి ట్రాఫిక్ అంతరాయాలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, గోనెగండ్ల

గుంతలతో అధ్వానంగా మారి

కోడుమూరు మండలంలోని వర్కూర్ గ్రామ సమీపంలో ఎమ్మిగనూరుకు వెళ్లే ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు సాగించడానికి భయాందోళనకు గురవుతున్నారు. ఈ మార్గంలో నిత్యం ప్రజలు వేలాది వాహనాల్లో రాకపోకలు సాగిస్తారు. ఈ ప్రధాన రహదారి కోడుమూరు నుంచి ఎమ్మిగనూరుకు 35 కి.మీ దూరం ఉంది. గతం ఈ ప్రాంతం సమీపంలో పలు వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి.

–న్యూస్‌టుడే, కోడుమూరు పట్టణం

నిధులు లేక.. నిలిచిన పనులు

మండలంలోని కొత్తకోట గ్రామంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో రైతు సేవాకేంద్రం భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. భవనంలో బండ పరుపు, విద్యుత్తు, రంగుల సౌకర్యాలకు కొద్ది పాటు నిధులు వెచ్చిస్తే రైతు సేవా కేంద్రం భవనం వినియోగంలోకి తీసుకురావచ్చని గ్రామస్థులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వంలో భవనాన్ని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, కొత్తకోట (సి.బెళగల్)

గ్రంథాలయంలో శ్రమదానం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రంథాలయానికి కేడీసీసీ, అఖిలపక్ష నాయకులు శ్రమదానం చేశారు. ఆదివారం గ్రంథాలయం ప్రహరీ, ఆవరణ చుట్టూ పేరుకుపోయిన చెత్తను జేసీబీతో శుభ్రం చేయించారు. దుర్వాసనలు వస్తుండటంతో పారిశుద్ధ్య పనులు చేశారు. పాఠకులకు సౌకర్యవంతంగా ఉండేలా కృషి చేస్తున్నట్లు వారు తెలిపారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మందొడ్డి గ్రామంలో తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. సి.బెళగల్ చెందిన సుధాకర్‌ను ఇసుక ట్రాక్టరు యజమానిగా గుర్తించారు. ఈమేరకు ట్రాక్టరు రాణాకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వేణు గోపాల్ రాజ్ తెలిపారు.

జిల్లా స్థాయిలో కౌతాళం జట్టు విజయం

కౌతాళం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల్లో కౌతాళం ఉపాధ్యాయినులు సత్తాచాటారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న క్రీడల్లో భాగంగా కౌతాళం మండల ఉపాధ్యాయినుల జట్టు ఆదివారం జిల్లా స్థాయి

త్రోబాల్ పోటీల్లో విజేతగా నిలిచిన కౌతాళం జట్టు

క్రీడాపోటీల్లో పాల్గొంది. కర్నూలు డివిజన్ జట్టుతో తలపడి కౌతాళం జట్టు గెలిచింది. జిల్లా స్థాయిలో విజేతగా నిలవడం అభినందనీయమని కౌతాళం మండల విద్యాశాఖాధికారులు రామాంజినేయులు, శోభారాణి తెలిపారు.

10 గ్రామాల ప్రజలకు తప్పిన ఇబ్బందులు

చెట్నిహళ్లి (మంత్రాలయం), న్యూస్‌టుడే: నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి రాఘవేంద్రరెడ్డి సొంత నిధులతో చెట్నిహళ్లి గ్రామంలో ఎర్రమట్టితో రోడ్డు నిర్మించడంతో 10 గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేశ్‌లు ఆదివారం చెట్నిహళ్లి గ్రామం నుంచి తుంగభద్ర నది వరకు వెళ్లే 3 కిలోమీటర్ల మేర ముళ్ల కంపలు తీయించి, గరుసు రోడ్డు వేయించి చదును చేయించారు.

తెదేపాలో మహిళలకు సముచిత స్థానం

మాధవరం(మంత్రాలయం), న్యూస్‌టుడే: అట్టడుగున ఉన్న వాల్మీకీ మహిళలకు కూడా సముచిత స్థానం ఇచ్చి గౌరవించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితోనే సాధ్యమని నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి అన్నారు. కర్నూలు పార్లమెంట్ అధ్యక్షురాలిగా గుడిసె కృష్ణమ్మను ఎంపిక చేయడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌కు, పార్టీ అధ్యక్షుడికి రాఘవేంద్రరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు నియోజకవర్గంలోని ఏడుగురు లబ్ధిదారులకు రూ. 5,56,336 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అందజేశారు. మద్దిలేటి రూ. 41,019, విజయలక్ష్మి రూ. 1,63,300, వీరారెడ్డి రూ. 60,427, కేశన్న రూ. 40,688, షేక్ సలీంబాషా రూ. 1,48,275, చెన్నయ్య రూ. 60,000, రమణమ్మలకు రూ. 42,627 విలువైన చెక్కులు అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేడీసీసీబీ ఛైర్మన్ డి. విష్ణువర్దన్ రెడ్డి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

చెక్కులు తీసుకున్న వారితో ఎమ్మెల్యే దస్తగిరి

వైకాపాలో కొనసాగుతున్న విభేదాలు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు వైకాపాలో విభేదాలు కొనసాగుతున్నాయి. ఆదివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వేర్వేరుగా నిర్వహించడం ఇందుకు తార్కాణం. మాజీ ఎంపీ బుట్టా రేణుక ఆధ్వర్యంలో పార్లమెంటు కార్యాలయం వద్ద కేకు కోసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కూడలిలో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనవడు, వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త రాజీవ్‌రెడ్డి ఆధ్వర్యంలో కేకు కోసి రక్తదాన శిబిరం నిర్వహించారు. వీరశైవ సంఘం కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ రుద్రగౌడ్ తన స్వగృహంలో తన అనుచరులతో కలిసి వేడుకలు చేశారు. తాజాగా రుద్ర గౌడ్ ఓ వర్గంగా ఏర్పడటం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

హిందువులపై దాడి సరికాదు

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని భాజపా నాయకులు వంగూరు రాజు యాదవ్ అన్నారు. బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు నెలకొనాలని ఆదివారం మండలంలోని నాగలాపురంలోని సుంకులాపరమేశ్వరి ఆలయం, రోమన్ క్యాథలిక్ చర్చిలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. భాజపా నాయకులు భాస్కర్, వెంకటేష్, సూరి పాల్గొన్నారు.

పోలియో రహిత దేశాన్ని నిర్మిద్దాం

కోడుమూరు పట్టణం, ఎమ్మిగనూరు, కౌతాళం, కోడుమూరు గ్రామీణం, గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు చుక్కల మందు వేయించి పోలియో రహిత దేశాన్ని నిర్మిద్దాం అని రాష్ట్ర పల్స్ పోలియో పర్యవేక్షణ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ అన్నారు. ఆదివారం కోడుమూరు పట్టణంలో పల్స్ పోలియో కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫార్మసీ మేనేజర్ గిరిధర్, ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీమంత్ మాదన్న, ఆరోగ్య విస్తరణాధికారి కృష్ణమోహన్ పాల్గొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎమ్మిగనూరు ఆరోగ్య కేంద్రంలో పురపాలక కమిషనర్ గంగిరెడ్డి కమిషనర్ ప్రారంభించారు. కౌతాళం మండలంలో మొదటి రోజే 91% పూర్తయిందని అధికారులు తెలిపారు. పోలియో చుక్కలు వేయించుకొని వారి ఇంటింటికి తిరిగి వేయాలని ఆర్‌బీఎస్‌కే కార్యక్రమ జిల్లా అధికారి డా. మహేశ్వర తెలిపారు. గోరంట్ల, అమడగుంట్లలో తనిఖీ చేశారు. గూడూరు పట్టణం, గ్రామాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని కమిషనర్ రమేష్ బాబు ప్రారంభించారు.

పర్యవేక్షిస్తున్న సంచార చికిత్స నోడల్ అధికారి డాక్టర్ రఘు

పరిశీలిస్తున్న రాష్ట్ర పల్స్ పోలియో పర్యవేక్షణ అధికారి అనిల్ కుమార్

పోలియో చుక్కలు వేస్తున్న పురపాలక కమిషనర్ గంగిరెడ్డి

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామాంజనేయులు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని బోడబండ దగ్గర జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రహదారి ప్రమాదంలో రామాంజనేయులు(26) అనే వ్యక్తి మృతి చెందాడు. కోటేకల్ గ్రామానికి చెందిన రామాంజనేయులు సొంత ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కోటేకల్ నుంచి భార్య ఊరు పెద్దకడబూరు మండలం హనుమాపురానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయమై అక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొందా? అదుపు తప్పి పడ్డాడా? అన్న దానిపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. మృతుడికి భార్య రామేశ్వరి, కుమారుడు ఉన్నారు. భార్య ఐదు నెలల గర్భిణి అని గ్రామస్థులు తెలిపారు.

సేంద్రియ సాగు.. లాభాలు బాగు

ఎమ్మిగనూరు వ్యవసాయం, కొండాపురం (సి.బెళగల్,న్యూస్‌టుడే): రైతులు సేంద్రియ పద్ధతిలో సాగు చేసి అధిక ఆదాయం పొందుతున్నారు. చాలా మంది రైతులు అధిక ఎరువుల వినియోగంతో పెట్టుబడులు పెరిగి తీవ్రంగా నష్టపోతున్నారు. సేంద్రియ సాగుతో పెట్టుబడి కూడా తగ్గుతుంది. ఈ ఉత్పత్తులకు మార్కెట్‌లో డిమాండ్ కూడా అధికంగా ఉంటుంది.

రూ.2.3 లక్షల ఆదాయం

సి.బెళగల్ మండలంలోని కొండాపురం గ్రామంలో తుంగభద్ర సేంద్రియ వ్యవసాయ పరపతి ఉత్పత్తిదారుల సంఘం సభ్యుడు, రైతు మధుసూదన్‌రెడ్డి ఏటా సేంద్రియ పద్ధతిలో వరి పంట సాగుచేసి అధిక ఆదాయం పొందుతున్నారు. 2.75ఎకరాల్లో జీలుగ పంటలను పొలంలో ట్రాక్టరుతో తొక్కించారు. ఎకరానికి వేప చెక్క 20బస్తాల చొప్పున 42 బస్తాలు చల్లించారు. కూలీలతో ఎకరానికి రూ.5500 ప్రకారం ఆగస్టు 12న వరి నాట్లు వేశారు. రెండు సార్లు కూలీలతో కలుపు తీయించారు. ప్రస్తుతం 2.75 ఎకరాలకు కోత ఖర్చులతో సహ రూ.లక్ష ఖర్చు అవుతున్నట్లు రైతు తెలిపారు. వరి పంట సాగు ఎకరానికి 25 బస్తాల చొప్పున 60బస్తాలు (బస్తా 75కేజీల) దిగుబడి పొందవచ్చని అన్నారు. మార్కెట్‌లో ధాన్యం బస్తాలను మర ఆడించినా.. 50కేజీల బస్తా ధర రూ. 3500 ప్రకారం 60బస్తాలు అమ్మకాలు చేస్తున్నట్లు తెలిపారు. ఏటా సేంద్రియంగా పండించడంతో ధర ఎక్కువైనా వినియోగదారులు కొంటున్నారని అన్నారు. 60 బస్తాలు అమ్మకాలు జరపగా రూ. 3,30,000 వచ్చిందని.. పంట ఖర్చులు రూ. లక్ష పోగా రూ. 2,30,000 ఆదాయం పొందినట్లు తెలిపారు.

వరి పొలంలో రైతు మధుసూదన్ రెడ్డి

నేలకు ఆరోగ్యం

ఎమ్మిగనూరు వెంకటాపురానికి చెందిన దివాకర్ సేంద్రియ సాగుతో మంచి దిగుబడులు సాధిస్తున్నారు. బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సహకారంతో ఎనిమిదేళ్లుగా సేంద్రియ పద్ధతిలో పంటలు పండిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో రెండు ఎకరాల్లో కే-6, టీసీజీఎస్-విశిష్ట రకం వేరుసెనగ సాగు చేశారు. పంట విత్తనం నుంచి చేతికందే వరకు సేంద్రియ ఎరువు, తెగుళ్లు రాకుండా కషాయాలు పిచికారీ చేశారు. దిగుబడి 26క్వింటాళ్లు వచ్చింది. వేరుసెనగ దిగుబడి అమ్మగా చేతికి రూ. 1.80లక్షలు వచ్చింది. సేద్యం, విత్తనాలు, కలుపునకు రూ. 40వేలు పెట్టుబడి పెట్టారు. కల్లం ఖర్చు మరో రూ. 40వేలు అయ్యింది. పెట్టుబడి పోను రూ. లక్ష మిగిలినట్లు రైతు దివాకర్ తెలిపారు.

వేరుసెనగ పంటలో రైతు దివాకర్

సంక్షిప్త సమాచారం

గూడూరు గ్రామీణం,న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని గూడూరు పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన రాజ కుళ్లాయప్పను సీపీఐ నాయకులు కృష్ణ, శేషు కుమార్, శ్రీనివాసులు సన్మానించి అభినందనలు తెలిపారు.

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కె.నాగలాపురం పరిధిలోని ఓ వెంచర్‌లో జూదం ఆడుతున్న కొందరిని పోలీసులు పట్టుకున్నారు. ఇందులో కొందరు ప్రజాప్రతినిధులు ఉన్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధి పథకం కార్యాలయం ఆవరణలో ఈనెల 23వ తేదీన ఎన్‌ఆర్‌ఈజీఎస్‌కు సంబంధించిన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాముడు తెలిపారు. 2024-25 ఉపాధి పనులను తనిఖీ బృందం పరిశీలించిందన్నారు. ఎన్టీఆర్ పింఛన్లపై తనిఖీ చేసిందన్నారు.

సి.బెళగల్, న్యూస్‌టుడే: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి మిథున్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌వో ఉమామల్లేశ్వరీ తెలిపారు. గ్రామాల్లో ఉప ఆరోగ్యకేంద్రాల గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంబదహాల్ (సి.బెళగల్), న్యూస్‌టుడే: ప్రతిఒక్క వాహనదారుడు కచ్చితంగా శిరస్త్రాణం ధరించి వాహనం నడపాలని ఎస్సై వేణుగోపాల్‌రాజ్ పేర్కొన్నారు.

(c) eenadu

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరు కృషిచేయాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. కల్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులకు చుక్కలమందు వేశారు. ఐదేళ్లలోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

ఆత్మవిశ్వాసంతో పోటీ పడాలి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో పోటీల్లో పాల్గొంటే విజయాలు వస్తాయని వైద్యుడు డా. శంకర్‌శర్మ సూచించారు. కర్నూలు స్పోర్ట్స్ క్లబ్‌లోని ఇండోర్ స్టేడియంలో జిల్లా త్రైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి త్రైక్వాండో పోటీలు జరిగాయి. వీఆర్ ఉపసభ్య డైరెక్టర్ వాసురెడ్డి, క్రీడా సంఘం నాయకుడు బి.రామాంజనేయులుతో కలిసి శంకర్‌శర్మ పోటీలను ప్రారంభించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
కర్నూలు : 80065 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
నీళ్లకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : ?: అశోక్‌నగర్, కార్పొరేషన్ నగరంలో దోమల బెడద అధికంగా ఉంది. - ప్రకాష్, ?: గణేశ్‌నగర్ వీధుల్లో వీధిదీపాలు సరిగా వెలగడం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. - తేజ
✓: దోమల నియంత్రణకు ఫాగింగ్ చేస్తాం. వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - నగరపాలక అధికారులు

విజేతలకు బహుమతులు అందిస్తున్న అధ్యాపకులు

క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : విద్యార్థులు పాఠశాల దశ నుంచే పోటీతత్వం అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ప్రిన్సిపల్ రంగయ్య పేర్కొన్నారు. 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా నగరంలోని మాస్టర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలైన వైష్ణవి, మౌనిక, మహాలక్ష్మికి ప్రిన్సిపల్, అధ్యాపకులు పద్మావతి, తదితరులు బహుమతులు అందజేశారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

క్విజ్ పోటీలో విద్యార్థులు

బహుమతులు అందుకున్న విజేతలు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా నగరంలోని సాయిసుబ్బయ్య రవీంద్ర టాలెంట్ పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. ఆర్. నాని (తొమ్మిదో తరగతి), వి. భానుతేజ (ఎనిమిదో తరగతి), జి. సాయి రోహిత్ (ఏడో తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి కరస్పాండెంట్ సుబ్బయ్య, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

ఖాళీ ప్రచారం.. స్థలాలు అపరిశుభ్రం

◆ స్వచ్ఛ కార్యక్రమం రెండురోజులకే పరిమితం
◆ జనావాసాల్లో తొలగని పిచ్చిమొక్కలు.. చెత్త నిల్వలు

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే : కర్నూలు నగరంలో పెద్ద సంఖ్యలో ఉన్న ఖాళీ స్థలాలు రోగాలకు నిలయాలుగా మారాయి. మురుగు కుంటలను తలపిస్తున్నాయి. కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. చెత్తాచెదారం పేరుకుపోయింది. జనావాసాల మధ్య ఉన్న వీటి కారణంగా ఎదురవుతున్న సమస్యలపై నగర ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని శుభ్రం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు నగరపాలక అధికారులు ప్రకటించారు. కంపచెట్లు, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాన్ని కమిషనర్ ఈనెల 14న ప్రారంభించారు. రెండురోజులు కొన్నిచోట్ల పనులు చేశారు. ఆ తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో.. ఖాళీ స్థలాల సమస్య పరిష్కారం అవుతుందని సంతోషించిన ప్రజలకు నిరాశే మిగిలింది.

కొన్నిచోట్లే పనులు

నగరంలోని 52 వార్డుల పరిధిలో 2 వేలకు పైగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. వాటిని శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత యజమానులదే. చాలామంది స్థానికంగా నివసించడం లేదు. కొందరు ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో చుట్టుపక్కల వారు ఖాళీ స్థలాల్లో చెత్త, వ్యర్థాలు పడేస్తూ డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నారు. నెలల తరబడి వర్షం నీరు, మురుగు నిల్వ వేసి తీవ్ర అపరిశుభ్రంగా మారాయి. వాటిలో కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగాయి. పాములు, విష పురుగులకు ఆవాసాలుగా మారాయి. స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి శుభ్రం చేయించాల్సిన బాధ్యత నగరపాలక అధికారులపై ఉంది. వారి వద్ద చాలామంది యజమానుల వివరాలు కూడా లేవు. దీంతో వాటిని శుభ్రంగా ఉంచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించి చేతులు దులిపేసుకుంటున్నారు.

● ఐటీఐ నగరంలో 346 ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని శుభ్రం చేసేందుకు నగరపాలక అధికారులు చర్యలు చేపట్టారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో రెండు రోజుల పాటు వందకు పైగా ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, కంపచెట్లు తొలగించినట్లు చెబుతున్నారు. ఈ పనులు కూడా మొక్కుబడిగా సాగాయని స్థానికులు పేర్కొంటున్నారు. సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సంతోష్‌నగర్ సమీపంలో కంపచెట్లతో నిండిపోయిన ఖాళీ స్థలం

శివారులవైపు కన్నెత్తయినా చూడరు

● నగరపాలక పరిధిలోని శివారు కాలనీల్లో ఖాళీ స్థలాలు అధికంగా ఉన్నాయి. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని సరస్వతీనగర్, సోమిశెట్టినగర్, ధనలక్ష్మీనగర్, ఎన్జీవోకాలనీ, బి.క్యాంపు, కల్లూరు పారిశ్రామికవాడ, ముజఫర్‌నగర్, సంతోష్‌నగర్, విజయలక్ష్మీనగర్, ఎస్‌ఏపీ క్యాంపు సమీప స్థలాలు, బాలాజీనగర్, స్టాంటన్‌పురం, ఆదిత్యనగర్, విఠల్‌నగర్, తదితర కాలనీల్లో ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచి, కంపచెట్లు, పిచ్చిమొక్కలు పెరిగి తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నాయి. చాలా ప్రాంతాల్లో నెలల తరబడి వర్షంనీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి.

నిర్లక్ష్యం ఏరులు.. ప్రజలకు కష్టాలు

కర్నూలు నగరంలోని సంతోష్‌నగర్ మూడో రోడ్డులో తాగునీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్ పగిలిపోవడంతో పెద్దఎత్తున నీరు నేలపాలవుతోంది. ఉదయం నుంచి రహదారిపై నీరు ప్రవహించడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. నగరపాలక అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

ప్రమాదాలకు మూతవేయండి

కల్లూరు చెన్నమ్మ కూడలి నుంచి చింతలమునినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో కల్వర్టుపై ఉన్న మార్గబిలంపై ఏర్పాటు చేసిన ఇనుపచట్రం విరిగిపోయింది. ద్విచక్ర వాహనాల చక్రలు మార్గబిలంలో ఇరుక్కుపోయే ప్రమాదం ఉంది. కొన్ని నెలలుగా ఇక్కడ ప్రమాదం పొంచి ఉన్నా నగరపాలక యంత్రాంగం పట్టించుకోవడం లేదని ద్విచక్ర వాహనదారులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా మార్గబిలంపై మూత ఏర్పాటు చేసి ప్రమాదాలను అరికట్టాలని విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

క్రీస్తు మార్గం అనుసరణీయం

పాల్గొన్న ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, గిత్తా జయసూర్య, మేయర్ బీవై రామయ్య, బిషప్ గోరంట్ల జాన్వేష్

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : క్రీస్తు మార్గం అనుసరణీయమని, ఆయన బోధనలు బోధనలు సన్మార్గంలో వైపు నడిపిస్తాయని ఎమ్మెల్యేలు గౌరుచరితారెడ్డి, గిత్తా జయసూర్య, కర్నూలు మేయర్ బీవై రామయ్య అన్నారు. నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని బిషప్ చర్చిలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మేయర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు డయాసిస్ బిషప్ గోరంట్ల జాన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : క్రీస్తు జననం అపూర్వమైనదని మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, పాస్టర్ అన్నమ్మ, వినదోకుమార్, పార్టీ నగర అధ్యక్షుడు జిలానీ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు

కర్నూలు గాయత్రీ ఎస్టేట్, న్యూస్‌టుడే : నగరంలోని వీకర్‌సెక్షన్‌కాలనీలో ఉన్న ఎబెనేజర్ బాప్టిస్టు చర్చి వద్ద ఆదివారం రాత్రి క్యాండిల్ లైటింగ్ సర్వీసు కార్యక్రమం జరిగింది. ఏపీఎస్పీ రెండో పటాలం సహాయ దళాధిపతి మహబూబ్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పాస్టర్ చంద్రశేఖర్ ఏసుక్రీస్తు ప్రవచనాలను వివరించారు.

కళాకారులకు న్యాయం చేయండి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : నాటక రంగాన్ని నమ్ముకుని జీవిస్తున్న కళాకారులకు న్యాయం చేయాలని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కోరారు. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షురాలిగా నియమితులైన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని ఆదివారం కర్నూలులోని ఆమె నివాసంలో కళాకారులు కలిసి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎంతోమంది కళాకారులు పింఛన్లు, ఇళ్ల స్థలాలు మంజూరవక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. కళాకారులు మహ్మద్‌మియా, రాజారత్నం, శ్రీనివాసరెడ్డి, గురుమూర్తి, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : సీపీఐ వందేళ్ల ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా ఈనెల 23న స్థానిక ఎస్టీయూ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి మునెప్ప ఒక ప్రకటనలో తెలిపారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : సీఐటీయూ 18వ అఖిలభారత మహాసభలను ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ నగర కార్యదర్శి ఆర్.నరసింహులు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఈనెల 22న కల్లూరు చెన్నమ్మ కూడలి వద్ద శ్రామిక ఉత్సవ్ కళారూపాల ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

కొంగనపాడు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గృహ నిర్మాణ శాఖ పీడీ చిరంజీవి సూచించారు. కల్లూరు మండల పరిధిలోని కొంగనపాడులో పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన తరగతులను పరిశీలించారు.

కర్నూలు నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: ఎస్బీఐ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో సోమవారం ఉదయం 11 గంటలకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు నగరపాలక అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: ఓర్వకల్లు నుంచి ఉప్పలపాడు వరకు రహదారి నిర్మాణానికి రూ.2.80 కోట్లు మంజూరైనట్లు పీఆర్‌ఎస్‌ఈ వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం ఆయన రహదారిని పరిశీలించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈఈ మహేశ్వరరెడ్డి, డీఈ నాగిరెడ్డి, ఏఈ సతీష్ కుమార్, సర్పంచి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

శంకరాచార్య బోధనలను స్ఫూర్తిగా తీసుకోవాలి

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : ఆది శంకరాచార్య బోధనలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని శృంగేరి పీఠం ఆస్థాన పండితుడు శలాక రఘునాథశర్మ సూచించారు. స్థానిక తెలుగుతోటలో ఆదివారం జరిగిన సాహితీ సదస్సులో ఆయన మాట్లాడారు. శంకరాచార్య ఆధ్యాత్మిక, ధార్మిక ఉపన్యాసాలతో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని

రఘునాథశర్మను సత్కరిస్తున్న చంద్రశేఖర్ కల్కూర తదితరులు

చెప్పారు. సమాజానికి దిశానిర్దేశం చేసేలా పలు రచనలు చేసి, ప్రజలను భక్తి మార్గంలో నడిపారన్నారు. గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర, సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్కే శర్మ మాట్లాడారు. అనంతరం రఘునాథశర్మను సత్కరించారు. కార్యక్రమంలో గంగాధరరెడ్డి, లక్ష్మయ్య, ఎలమర్తి రమణయ్య, సుబ్బలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీజీవో సంఘం నగర కార్యవర్గం ఎన్నిక

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఏపీ ఎన్జీజీవో సంఘం కర్నూలు నగరశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలను ఆదివారం స్థానిక జిల్లా కోర్టు ఎదురుగా నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ఎమ్మిగనూరు తాలూకా అధ్యక్షుడు మద్దిలేటి, సహాయ ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. నగర శాఖలో 19 పదవులకు గాను 19 నామినేషన్లు మాత్రమే వచ్చాయి. దీంతో నగరశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కర్నూలు నగర సంఘం నూతన అధ్యక్షుడిగా ఎం.సి.కాశన్న మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగర కార్యదర్శిగా ఎం.రామకృష్ణ, నగర కోశాధికారిగా హరికృష్ణగౌడ్, అసోసియేట్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా సాయిరాం, కరీముల్లా, చలపతి, వరలక్ష్మి, రజని, కార్యనిర్వాహక కార్యదర్శిగా కృపాసాగర్, సంయుక్త కార్యదర్శులుగా సుధాకర్‌రెడ్డి, విజయ్‌కృష్ణ, ప్రవీణ్‌కుమార్, టి.సురేష్, లక్ష్మీనరసయ్య, ప్రమీలరాణి, జిల్లా కార్యవర్గ సభ్యులుగా నాగకిషోర్, మోహన్, మద్దయ్య, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో సంఘం అడ్‌హక్ కమిటీ ఛైర్మన్ నాగరాజు, కన్వీనర్ నాగేశ్వరరెడ్డి, కడప జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ ఎన్నికల అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన ఏపీ ఎన్జీజీవో సంఘం కార్యవర్గ సభ్యులు

హిందూ ధర్మాన్ని పాటించాలి

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : ప్రతిఒక్క హిందువు హిందూ ధర్మాన్ని ఆచరించాలని విశ్రాంత న్యాయమూర్తి కాశీభట్ల శివప్రసాద్ సూచించారు. నగరంలోని వెంకటరమణకాలనీ, సంతోష్‌నగర్ కాలనీల హిందూ ధార్మిక సమ్మేళనాన్ని ఆదివారం కమిటీ అధ్యక్షుడు మాధ

మాట్లాడుతున్న ఆదిత్య పరాశ్రీ స్వామి

వకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డా. ఆదిత్య పరాశ్రీ స్వామి మాట్లాడుతూ.. హిందూ అన్నది మతం కాదని, ధర్మమని తెలిపారు. ప్రతి హిందూ జంట ఆచార, సంప్రదాయాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో గిరిజమ్మ, ధార్మిక సమ్మేళనం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతాం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : కర్నూలు నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతామని సీపీఐ నగర కార్యదర్శి పి. రామకృష్ణారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం పేర్కొన్నారు. స్థానిక సీఆర్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. సీపీఐ 17వ నగర మహాసభల అనంతరం 17 తీర్మానాలను ప్రవేశపెట్టారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు నగరంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలాన్ని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరంలో నూతన రహదారులు, పైవంతెనలు నిర్మించాలని కోరారు. నగరంలోని ఏ, బీ, సీ క్వార్టర్స్‌ను పడగొట్టి హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తామనడం

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి

బాధాకరమన్నారు. అనంతరం సీపీఐ నగర కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శులుగా సి. మహేష్, డి. శ్రీనివాసరావు, జి. చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, నాయకులు శ్రీనివాసులు, బీసన్న, భద్రకుమార్, ఈశ్వర్, వెంకటేష్, గిడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని వీడకపోతే కఠిన చర్యలు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : రౌడీషీటర్లు నేర ప్రవృత్తిని వీడకపోతే పీడీ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఒకటో పట్టణ సీఐ పార్థసారథి హెచ్చరించారు. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు నగరంలోని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్లలో ఆదివారం రౌడీషీటర్లు, ఇతర నేర చరితులకు మంత్రణం నిర్వహించారు. నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు.

కష్టపడి చదివితే ఉన్నత స్థానాలు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అనస్థీషియా విభాగాధిపతి డా. విశాల ఆకాంక్షించారు. అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో స్కిల్ ల్యాబ్‌లో ఆదివారం డిప్లొమా ఇన్ అనస్థీషియా శిక్షణ విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనస్థీషియా విద్యార్థులు వైద్యుల వద్ద నైపుణ్యాలు నేర్చుకోవాలన్నారు. శస్త్రచికిత్స థియేటర్లలో అనస్థీషియా టెక్నీషియన్ల సేవలు అత్యంత అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డా.సుధీర్‌కుమార్, డా.రాథోడ్, ఎస్. దినేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో వైద్యులు

వీరశైవులు అన్ని రంగాల్లో రాణించాలి

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : వీరశైవులు అన్ని రంగాల్లో రాణించాలని చెందాలని వీరశైవ లింగాయత్ సమితి అధ్యక్షుడు చంద్రశేఖరప్ప పేర్కొన్నారు. కల్లూరులోని ఈశ్వర, వీరభద్ర స్వామి దేవాలయం వద్ద ఆదివారం 2026వ సంవత్సర కాలమానిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో వీరశైవ ఐక్యవేదిక అధ్యక్షుడు ఏజీ మల్లికార్జునప్ప, జంగమ పురోహితుడు పీఎం యాగంటయ్య, మల్లయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కాలమానిని ఆవిష్కరిస్తున్న సమితి ప్రతినిధులు

ఉపాధ్యాయ సమస్యలపై నిరంతర పోరాటం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలపై నిరంతర పోరాటాలు కొనసాగిస్తామని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రవిప్రకాష్, స్టేట్ కౌన్సిలర్ ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్య పరిరక్షణే లక్ష్యం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : ప్రభుత్వ విద్య పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆలిండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని డాక్టర్ బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్సు హాల్‌లో ప్రజా విద్యా విధానం ముసాయిదా అంశంపై ఆదివారం కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఈపీ-2020ని వెనక్కి తీసుకొని పీఈపీ- 2025 అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఈసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గోవిందరాజు, రామశేషయ్య, వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభతో మెరిశారు.. బహుమతులతో మురిశారు

◆ వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో యువకుల విజయం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే : విద్యార్థుల్లోని సృజనాత్మకత.. ప్రతిభను వెలికి తీయడంతో పాటు సమాజం పట్ల వారికున్న అవగాహనను అంచనా వేసేందుకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలుస్తున్నారు. డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు లక్ష్మీనరసింహ, అఖిల్ వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో పలు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందుకుని యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఉపన్యాసంలో మేటి లక్ష్మీనరసింహ

సిల్వర్‌జూబ్లీ కళాశాలలో బీఏ పొలిటికల్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న లక్ష్మీనరసింహ వక్తృత్వ పోటీల్లో రాణిస్తున్నారు. వీరి స్వగ్రామం గార్గేయపురం. ● ఇతను 2024 ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వేడుకల్లో భాగంగా కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన సాహితీ సదస్సులో మొదటి బహుమతి అందుకున్నారు. ● 2024 ఫిబ్రవరి 28న నేషనల్ సైన్స్ దినోత్సవం సందర్భంగా క్లస్టర్ విశ్వవిద్యాలయం ఆవరణలో నిర్వహించిన వక్తృత్వ పోటీలో మొదటి బహుమతి సాధించారు. ● 2024 జులై 28వ తేదీన సిల్వర్‌జూబ్లీ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై జరిగిన వక్తృత్వ పోటీల్లో మొదటి స్థానంలో నిలిచారు. ● 2024 ఆగస్టు 27న కర్నూలు నగరంలో గాడిచర్ల ఫౌండేషన్ నిర్వహించిన సాహితీ సదస్సులో వక్తృత్వ పోటీల్లో ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ● 2024 డిసెంబరు 20వ తేదీన కర్నూలు నగరంలోని పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై నిర్వహించిన పోటీల్లో మొదటి బహుమతులు గెలిచారు. ● 2025 జనవరి 31న నగరంలో గాడిచర్ల ఫౌండేషన్ నిర్వహించిన సాహితీ సదస్సులో వక్తృత్వ పోటీల్లో ప్రశంసాపత్రం అందుకున్నారు. ●అక్టోబరు 5న ఫిష్ ఆంధ్రపై నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో మొదటి, 22వ తేదీన జరిగిన కర్నూలు జిల్లా యూత్ ఫెస్ట్‌లో తృతీయ బహుమతులు అందుకున్నారు.

వ్యాసరచనలో విజేత అఖిల్

సిల్వర్‌జూబ్లీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న దాసరి అఖిల్ వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. కోడుమూరుకు చెందిన ఈ విద్యార్థి 2024లో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో మొదటి బహుమతులు అందుకున్నారు. ● 2024 జనవరి 11న అద్దంకిలో ప్రేరణ సంస్థ నిర్వహించిన జాతీయస్థాయి సదస్సులో రెండో స్థానంలో నిలిచారు. ● 2025 జనవరి 9న అద్దంకికి చెందిన కేఆర్‌కే జీడీసీ సంస్థ వారు వృక్షగనితామృతం అన్న అంశంపై నిర్వహించిన జాతీయస్థాయి వెబినార్‌లో మొదటి పాల్గొని బహుమతి సాధించారు. ● 2025 అక్టోబరు 10వ తేదీన విజయవాడలో సత్యసాయి సేవా సంస్థ వారు నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో మూడో స్థానంలో నిలిచారు. ● 2026 జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు అనంతపురంలో ఎమర్జింగ్ లీడర్ ఫెలోషిప్ అన్న అంశంపై జరిగే జాతీయస్థాయి వక్తృత్వ పోటీలకు జిల్లా నుంచి ఎంపికయ్యారు.

మహిళలకు చీరల పంపిణీ

కర్నూలు నగరం, న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైకాపా నాయకులు, కార్యకర్తలు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. స్థానిక ఎస్బీఐ కూడలిలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయమనోహరి దంపతులు, నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్ తదితరులు కేకు కోశారు. బిర్లాగేటు వద్ద

కేకు కోస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, విజయమనోహరి తదితరులు

వైకాపా రాష్ట్ర కార్యదర్శి మద్దూరు సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా 29వ వార్డు కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో శరీన్‌నగర్‌లో ఆదివారం వేడుకలు నిర్వహించారు. కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మీరెడ్డి, శ్వేతరెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపిక

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు ఝార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరగబోయే జాతీయస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ యోగా పోటీలకు జిల్లా నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు ఎంపికైనట్లు రాష్ట్ర యోగా సంఘం ఛైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. 8- 10 సంవత్సరాల విభాగంలో చేతన్ చక్రవర్తి, 10- 12 విభాగంలో సాకేత్, ఆర్.సాత్విక్, మనుశ్రీ, 12- 14 ఏళ్ల విభాగంలో లిఖిత, కె.సాత్విక్, కృష్ణప్రియ, సందీప్ ఎంపికయ్యారన్నారు. వీరికి డీఎస్‌ఏ స్టేడియంలో ఆదివారం క్రీడా కిట్లు పంపిణీ చేశారు. జాతీయస్థాయిలో ప్రతిభ చూపి పతకాలు సాధించాలన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

(c) eenadu

నీరందక.. ఉపయోగం లేక

● అన్నదాతలకు తప్పని ఇబ్బందులు

ఉయ్యాలవాడ మండలంలో కేసీ కాలువకు అనుబంధంగా 1964లో హరివరం సబ్ చానల్ ఏర్పాటు చేశారు. దీని కింద 5 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ఈ కాలువ నీటితో వరితోపాటు ఇతర పంటలు సాగు చేస్తున్నారు. ఉప కాలువల పర్యవేక్షణ కోసం డీఈ సెక్షన్ కార్యాలయం సైతం ఏర్పాటు చేశారు. కేసీ కాల్వ ఎగువన అనధికార సాగు పెరగడంతో 1975 వరకు మాత్రమే ఉప కాల్వల నుంచి పొలాలకు నీరందేది. 18వ కి.మీ. నుంచి 27వ కి.మీ. వరకు ఉన్న హరివరం, ఆర్. పాంపల్లె, పడిగపాడు, సుద్దమళ్ల, ఉయ్యాలవాడ, ఇంజేడు ఉప కాలువల పరిధిలోని పొలాలకు నీరందక అన్నదాతలు ఇబ్బందులు పడేవారు. – న్యూస్‌టుడే, ఉయ్యాలవాడ, ఆళ్లగడ్డ గ్రామీణం

రూ.22 కోట్లతో ప్రతిపాదనలు

ఏళ్లుగా ఉప కాలువల కింద పంట పొలాలకు నీరందకపోవడం.. ఏపుగా చెట్లు పెరిగి రూపు కోల్పోవడంతో పలువురు రైతులు వీటిని తొలగించి చదును చేసి వర్షాధారం కింద శనగ సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని హరివరం చానల్ పరిధిలోని ఉప కాల్వల పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అఖిలప్రియ జలవనరుల అధికారులతో మాట్లాడి రూ.22 కోట్లతో నివేదికలు రూపొందించారు. దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆమె అందజేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఉప కాలువల నిర్మాణానికి అడుగులు పడతాయి. ఆయకట్టు రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

గోదాదేవి వైభవం

అహోబిలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. గోదాదేవి సన్నిధిలో అర్చకులు తిరుప్పావైలోని ఆరో పాశురాన్ని ఆవిష్కరించి తెల్లవారుజామున స్వామికి విన్నవించారు. అధ్యయనోత్సవాల్లో రాపత్తు ఉత్సవంలో భాగంగా ఆలయ గర్భగుడి ఆవరణలో ఆళ్వార్లను ప్రత్యేకంగా అలంకరించి కొలువుంచి వేదమంత్ర పారాయణాలు పఠించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి గోదాదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మఠిదారు సొమ్మనారాయణన్ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. –న్యూస్‌టుడే, అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం)

దారితప్పిన పర్యవేక్షణ

● ర.భ. శాఖను వేధిస్తున్న సిబ్బంది కొరత

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆర్అండ్‌బీ శాఖలో ఏఈల కొరత వెన్నాడుతోంది. కీలకమైన శాఖలో మండల స్థాయిలోనే పోస్టులు భర్తీ కావడం కాలేదు. చాలాచోట్ల ఇన్‌ఛార్జులతోనే కాలం నెట్టుకొస్తున్నారు. ఫలితంగా ఉన్నవారిపై భారం పడుతోంది. మరోవైపు అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

అభివృద్ధికి నోచుకోని బొగ్గులైన్ రహదారి

అభివృద్ధి పనులపై ప్రభావం

ఉమ్మడి జిల్లాలో 17 ఏఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో వివిధ అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. ఆర్అండ్‌బీ శాఖపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం చూపింది. కనీసం గుంతలను పూడ్చలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారులకు మరమ్మతులు, గుంతల పూడ్చివేత చేపట్టింది. ఇదే సమయంలో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో తగినంత మంది ఏఈలు లేకపోవడంతో పనులను పర్యవేక్షించేవారే కరవయ్యారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో రూ.30 కోట్ల వ్యయంతో గుంతలు పూడ్చే పనులు జరుగుతున్నాయి.

నిధులు విడుదల చేసినా..

నంద్యాలలో పట్టణంలోని పొగాకు కంపెనీ నుంచి వెంకటేశ్వరపురం, బొమ్మలసత్రం-బొగ్గులైన్ రోడ్ల మరమ్మతులకు రూ.2 కోట్లు విడుదలయ్యాయి. సౌత్ సెక్షన్ కిందకు వచ్చే బొగ్గులైన్ రోడ్డుకు రెగ్యులర్ ఏఈ లేరు. నార్త్ సెక్షన్ ఏఈనే ఇన్‌ఛార్జిగా ఉన్నారు. దీంతో రెండు పనులను పర్యవేక్షించలేని పరిస్థితి ఏర్పడింది.

ఇన్‌ఛార్జులతో సరి..

● కర్నూలు జిల్లాలో తొమ్మిది ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్కిల్ కార్యాలయంలో ఒకటి, కర్నూలు టౌన్, కోడుమూరు, గోనెగండ్ల, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు, ఆస్పరి, కౌతాళం సెక్షన్ల పరిధిలో ఒక్కో ఏఈ పోస్టును భర్తీ చేయాల్సి ఉంది.

● నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో నార్త్, సౌత్‌లో రెండు ఏఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆళ్లగడ్డ సౌత్‌లో రెండు, ఆత్మకూరు సబ్ డివిజన్‌లోని ఆత్మకూరు, నందికొట్కూరులో ఒక్కో పోస్టు భర్తీ చేయాలి. డోన్ సబ్ డివిజన్‌లో డోన్, ప్యాపిలిలో రెండు ఖాళీలున్నాయి. పలు ప్రాంతాల్లో పక్క మండలాలవారు ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తున్నారు.

జిల్లా	రహదారులు (కి.మీ.లు)
నంద్యాల	1512.605
కర్నూలు	3399.756

అంచనాలు తయారు చేయలేక..

ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన సిఫార్సులు, ప్రభుత్వం వివిధ పథకాల కింద ఆదేశించిన ప్రతిపాదనలు తయారు చేసేందుకు క్షేత్రస్థాయిలో ఏఈల అవసరం ఉంది. పనులు జరుగుతున్న సమయంలో వాటి పర్యవేక్షణ, నిర్వహణ చేపట్టాలి. ఏఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో అంచనాల నుంచి తనిఖీల వరకు వీటి ఊసే లేకుండా పోయింది. కొన్నిచోట్ల నోటిఫైడ్ గుత్తేదారులే అంచనాలు తయారు చేసి ఆర్అండ్‌బీ శాఖకు ఇస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఆలయాలకు భక్తకోటి విరాళం

గ్రామంలో దేవాలయాలన్నీ శిథిలావస్థకు చేరాయి. దీనిని చూసి జనం కలత చెందారు. ఎలాగైనా వీటికి నూతన శోభ తీసుకురావాలని భావించారు. అందరూ కలిసి భారీగా విరాళాలు సేకరించి పనులు చేపట్టారు. త్వరలో దేవాలయాలు ఆధ్యాత్మిక శోభను తెచ్చారు. డోన్ మండలంలోని సీసంగుంతల గ్రామంలో రెండు వేల జనాభా ఉంది. గ్రామంలో ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వీరంతా కలిసికట్టుగా ఉంటూ అభివృద్ధి చేసుకుంటున్నారు. గ్రామంలో పురాతన సీతారామ, అభయాంజనేయ, రామలింగేశ్వరస్వామి, సుంకులమ్మ, పెద్దమ్మ ఆలయాలతో పాటు పీర్ల చావిడి ఉంది. 20 ఏళ్ల కిందట సీతారామాలయం జీర్ణోద్ధరణకు నడుం బిగించారు. కావాల్సిన నిధులను వారే సమకూర్చుకుని అనుకున్న విధంగా ఆలయాన్ని నిర్మించుకున్నారు. ఇదే స్ఫూర్తితో 2008లో అభయాంజనేయ, సుంకులమ్మ ఆలయాలు నిర్మించారు. నిర్మాణాల కోసం ఊరంతా చందాలు వేసుకుని రూ.కోటిపైగా నిధులు సేకరించడం విశేషం.

● గ్రామ ప్రవేశ మార్గంలో అభయాంజనేయ స్వామి, శివాలయంలో మారెమ్మ ఆలయాలున్నాయి. గ్రామంలో నుంచి ఎక్కడికైనా ప్రయాణం చేయాల్సి వస్తే.. ఊళ్లకు వెళ్లాలన్నా తప్పనిసరిగా అంజన్న దర్శనం చేసుకుని బయలుదేరడం ఇక్కడి ప్రజల ఆనవాయితీ. – న్యూస్‌టుడే, డోన్ గ్రామీణం

తెదేపాలో అతివలకు అందలం

● నంద్యాల, కర్నూలు జిల్లా అధ్యక్షులుగా గౌరు చరితారెడ్డి, గుడిసె కృష్ణమ్మ

గౌరు చరితారెడ్డి ఎస్ఎండీ ఫిరోజ్

ఈనాడు, కర్నూలు: మహిళలకు తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేసింది. తెదేపా నంద్యాల జిల్లా అధ్యక్షురాలు, నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలిగా గౌరు చరితారెడ్డి, తెదేపా కర్నూలు జిల్లా అధ్యక్షురాలు, కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలిగా గుడిసె కృష్ణమ్మను నియమించింది. వాస్తవానికి కర్నూలు జిల్లాకు వహీద్, నంద్యాల జిల్లాకు మాన్ని సుబ్బారెడ్డి పేర్లు దాదాపు ఖరారైనప్పటికీ ఆఖరి నిమిషంలో మార్పులు. మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పించాలని తెదేపా అధిష్ఠానం నిర్ణయించడంతో మార్పులు చేసింది.

2002లో గౌరు రాజకీయ ప్రవేశం

2002లో గౌరు చరితారెడ్డి రాజకీయ ప్రవేశం చేశారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2004లో నందికొట్కూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009లో నందికొట్కూరు నియోజకవర్గం రిజర్వు కావడంతో పోటీకి దూరమయ్యారు. వైకాపా ఆవిర్భవించిన తర్వాత ఆ పార్టీలో చేరారు. 2014లో పాణ్యం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2019లో తెదేపాలో చేరి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయారు. 2024లో కాటసాని రాంభూపాల్‌రెడ్డిపై భారీ మెజారిటీతో విజయం సాధించారు. స్త్రీ సంక్షేమం, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమంపై ఏర్పాటు చేసిన అసెంబ్లీ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఉన్నారు.

● తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎండీ ఫిరోజ్ పేరును ఖరారు చేశారు. గత ఐదేళ్లుగా ఆయన ఆ పదవిలోనే కొనసాగుతున్నారు. మళ్లీ ఆయనకే అవకాశం కల్పించింది.

కృష్ణమ్మకు అందలం

కోసిగి మండలం కోలమాన్‌పేట గ్రామానికి చెందిన గుడిసె కృష్ణమ్మ 2004లో ఆదోని ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. మూడుసార్లు తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. 2017 నుంచి 2022 వరకు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలిగా ఉన్నారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం తెదేపా జిల్లా అధ్యక్ష పదవిని బీసీ మహిళకు కేటాయించాలని అధిష్ఠానం నిర్ణయించడం ఆమెకు వరంగా మారింది. వాల్మీకి/బోయ సామాజిక వర్గానికి చెందిన ఆమె తెదేపాలో సీనియర్ నాయకురాలిగా ఉన్నారు.

● ప్రస్తుతం తెదేపా నగర అధ్యక్షుడిగా రెండేళ్లుగా పనిచేస్తున్న పూల నాగరాజు పదవిని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేశారు. ఆయన 2022లో తెదేపాలో చేరారు. తెదేపాలో కీలకమైన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులు.. రెండింటినీ బీసీలకే కేటాయించడం విశేషం.

పురాతన శిలాశాసనాల అనువాదం

మండలంలోని పోతుగల్లు గ్రామంలో చాలా రోజులుగా ఉన్న పురాతన శిలాశాసనాలు.. వాటిపై ఉన్న రాతలను పురావస్తు శాఖ ద్వారా తెలుగులోకి అనువదింపజేసినట్లు కర్నూలు పురావస్తు శాఖ డైరెక్టర్ మునిరత్నం రెడ్డి తెలిపారు. గ్రామంలో ఎప్పటి నుంచో శిలాశాసనాలు ఉన్నాయని.. వాటిపై ఉన్న రాతలు అర్థం కావడం లేదని స్థానికులు మల్లేశ్వరయ్య, నాగరాజు తదితరులు తమ దృష్టికి తీసుకురావడంతో వాటిని పరిశీలించి తెలుగులోకి అనువదించినట్లు తెలిపారు. విజయనగర రాజైన సదాశివరాయలు 1549, అక్టోబరు 9వ తేదీన గ్రామ చెరువు దానశాసనం రాసినట్లు తెలిసింది. గ్రామ సమీపంలో ఉన్న చెరువు మాన్యాన్ని గ్రామానికి దానం చేసినట్లు ఇందులో ఉంది. ఈ చెరువు ద్వారా వచ్చే ఆదాయంతో గ్రామంలోని దేవాలయాల్లో పూజా కైంకర్యాలు చేయాల్సిందిగా అందులో రాసినట్లు ఆయన వివరించారు. – న్యూస్‌టుడే, పోతుగల్లు (కృష్ణగిరి)

పేదల హృదయాలయం

పట్టణ శివారులోని శుక్రవారపేటలో ఉన్న పురాతన చర్చి శతాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉంది. 1690లో పోర్చుగీసువారు ఈ ప్రాంతంలో జేసు తిరుహృదయ దేవాలయం (చర్చి)ను నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు కొనసాగుతూనే ఉన్నాయి. మరోవైపు నిర్వాహకులు సేవా కార్యక్రమాలు ప్రారంభిస్తున్నారు. చర్చి నిర్మించే సమయంలో ఈ ప్రాంతంలో పేదలు ఎక్కువగా ఉండడంతో వారికి ఉచితంగా వైద్యం అందించడంతోపాటు పిల్లలకు చదువులు చెప్పడం ప్రారంభించారు. తల్లిదండ్రులు ఉపాధి పనుల కోసం వెళ్లే సమయంలో పిల్లలను ఈ చర్చిలో వదిలేసి వెళ్లి సాయంత్రం తీసుకెళ్తుంటారు. పేద పిల్లలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఉచితంగా ట్యూషన్లు చెబుతుండటం విశేషం. చర్చి ఆవరణలో దేవమాత ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించి టీబీ రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు మందులు అందిస్తున్నారు.

● క్రిస్మస్ పండగ నేపథ్యంలో 24వ తేదీ అర్ధరాత్రి సమయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం 25వ తేదీన వివిధ కార్యక్రమాలు జరుగుతాయి. – న్యూస్‌టుడే, ఆదోని సాంస్కృతికం

ప్రయోగమే పరీక్ష

● జనవరి 27 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

జిల్లా	ఎంపీసీ	బైపీసీ
కర్నూలు	10,805	5,076
నంద్యాల	8,210	4,531

విద్యార్థుల భవిష్యత్తును మలుపు తిప్పేది ఇంటర్ విద్య. ఈ దశలో ఎక్కువ సాధనకు బాటలు పడేది ఇక్కడే. అందుకే ఎక్కువ మార్కులు సాధించేందుకు విద్యార్థులు కష్టపడుతుంటారు. థియరీలో మంచి మార్కులు తెచ్చుకున్నా ప్రాక్టికల్స్‌లో వెనుకబడుతున్నారు. చాలా కళాశాలల్లో ప్రయోగ పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదు. కొన్ని ప్రభుత్వ, కస్తూర్బా విద్యాలయాల్లో ప్రయోగశాలలే లేవు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు ఒకేషనల్, ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు జనరల్ (ఎంపీసీ, బైపీసీ) విద్యార్థులకు ప్రాక్టికల్స్ ఉంటాయి. సమయం సమీపిస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య

సీసీ కెమెరాల పర్యవేక్షణలో

● ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, రెసిడెన్షియల్ కళాశాలలు 152, ప్రైవేటు జూనియర్ కళాశాలలు 131 ఉన్నాయి. కర్నూలు జిల్లాలో ఎంపీసీ, బైపీసీ ద్వితీయ విద్యార్థులు 15,881, ఒకేషనల్ మొదటి, రెండో ఏడాది కలిపి 5,271 మంది చదువుతున్నారు. నంద్యాల జిల్లాలో ఎంపీసీ, బైపీసీ ద్వితీయ విద్యార్థులు 12,741 మంది చదువుతున్నారు. ఒకేషనల్ మొదటి, రెండో ఏడాది చదువుతున్న విద్యార్థులు 3,975 మంది ఉన్నారు.

● రెండో ఏడాది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో పాటు మొదటి, రెండో ఏడాదికి చెందిన ఒకేషనల్ విద్యార్థులకు జనవరిలో ప్రాక్టికల్స్ ప్రారంభం కానున్నాయి. ఏ కళాశాల విద్యార్థులకు ఆ విద్యాలయంలోనే ప్రయోగ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిగేలా అధికారులు చర్యలు చేపట్టారు.

కేజీబీవీల్లో కానరాక..

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో చదువుతున్న బైపీసీ, ఎంపీసీ, ఒకేషనల్ విద్యార్థినులకు పూర్తి స్థాయిలో ప్రయోగశాలలు లేవు. వీరు ప్రయోగాలు చేసేందుకు సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ ప్రభావం ఇంటర్ ఫలితాలతోపాటు ప్రవేశాలపైనా పడుతోందని అధికారులు గుర్తించారు. ప్రతి కేజీబీవీలో ల్యాబ్ ఏర్పాటు చేసి విద్యార్థినుల చదువుకు ఇబ్బందుల్లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

కొండ తొలిచి.. మార్గం మలిచి

బేతంచెర్ల నుంచి కర్నూలు వెళ్లే మార్గంలో గోరుమానుకొండ మెట్ట వద్ద నిత్యం రహదారి ప్రమాదాలు జరిగేవి. రోడ్డు ఎత్తుగా ఉండటంతోపాటు మలుపు కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఎన్‌హెచ్ 340బి పనుల్లో భాగంగా సోమయాజులపల్లె నుంచి డోన్ సమీపంలోని గుత్తి రోడ్డు వరకు రూ.650 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో రాకపోకలు సాఫీగా సాగేలా పనులు చేపట్టారు. కొండను తవ్వి రహదారి నిర్మించడంతో చాలావరకు సమస్యలు తొలగాయి. – న్యూస్‌టుడే, బేతంచెర్ల

నిండు జీవితానికి రెండు చుక్కలు



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లి, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. బనగానపల్లిలోని ప్రియదర్శిని పాఠశాలలో ఆయన ఆదివారం చిన్నారులకు చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి బిడ్డ భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. అశ్రద్ధ వహిస్తే భవిష్యత్తులో చిన్నారులకు పోలియో సోకే ప్రమాదం ఉంటుందన్నారు. అధికారులు బాధ్యతగా ప్రతి ఇంటికి వెళ్లి పిల్లలను గుర్తించి చుక్కలు వేయాలని ఆదేశాలు జారీ చేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాలలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు ఆమె ఆదివారం తెలిపారు. జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతోపాటు డివిజన్, మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లోనూ వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారానూ వినతులు ఇవ్వొచ్చని తెలిపారు. దరఖాస్తులు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు ఆన్‌లైన్ ద్వారాకానీ.. టోల్‌ఫ్రీ నంబరు 1100ను సంప్రదించి తెలుసుకోవచ్చని వివరించారు.

ఐదు పదులు.. మైదానంలో మెరుపులు

వారి ప్రాంతాలు వేరు.. వృత్తులు వేరు. క్రీడా మైదానం.. వీరిని స్నేహితులుగా మార్చింది. ఎక్కడ పోటీలు జరిగినా కలిసే వెళతారు.. ఐదు పదుల వయసు దాటినా ఉత్సాహంగా హాజరవుతున్నారు. నిత్య సాధనతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ ప్రతిభ చాటుతున్నారు. ఈనెల 13, 14 తేదీల్లో బాపట్లలో.. నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి భళా అనిపించారు. – న్యూస్‌టుడే, ఆదోని పాత పట్టణం

చెన్నకేశవ.. ప్రతిభ భళా

● ఇప్పటివరకు రెండు స్వర్ణాలు, ఆరు వెండి, నాలుగు కాంస్య పతకాలు సాధించారు.

ఆదోని ఆర్టీసీ డిపోలో మెకానిక్‌గా పనిచేస్తున్న కె.చెన్నకేశవకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఇద్దరు పిల్లలకు వివాహం చేశారు. ఆయన గత పదేళ్లుగా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఇప్పటి వరకు ఎనిమిది సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. జావెలిన్‌త్రో, షాట్‌పుట్ తదితర పోటీల్లో ప్రతిభ చాటుతున్నారు. బాపట్లలో ఇటీవల జరిగిన 55+ పురుషుల విభాగంలో షాట్‌పుట్, వంద మీటర్ల పరుగు పోటీల్లో మూడో స్థానంలో నిలిచి పతకాలు అందుకున్నారు. "చిన్నతనం నుంచే పాఠశాల స్థాయిలో కబడ్డీ ఆడేవాడిని. 20 ఏళ్లుగా జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేసేవాడిని. ప్రస్తుతం వయసు మీద పడటంతో రోజూ నడక, యోగా, ప్రాణాయామం వంటివి చేస్తున్నా. అధిక బరువు ఉండేవాడిని. నిత్యం వ్యాయామం చేయడంతో బరువు తగ్గా. రక్తపోటు నియంత్రణలో పెట్టుకున్నా. ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా సమయం కేటాయించడం అలవాటు చేసుకున్నా. శరీరం సహకరించినన్ని రోజులు కచ్చితంగా పోటీల్లో పాల్గొంటా" అని చెన్నకేశవ పేర్కొన్నారు.

గెలుపే నారాయణ మంత్రం



● నారాయణ ఇప్పటి వరకు ఆరు సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. హరియాణా, పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్, దిల్లీ, కేరళ రాష్ట్రాల్లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఒక స్వర్ణం, రెండు వెండి, ఒక కాంస్య పతకం సాధించారు.

డోన్ మండలం కొచ్చెరువుకు చెందిన సి.నారాయణస్వామి ఇంటర్ వరకు చదివారు. ఈయనకు భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడికి పెళ్లి చేశారు. ఆటో డ్రైవర్‌గా ఉపాధి పొందుతున్నారు. గత ఎనిమిదేళ్లుగా మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నారు. పోల్‌వాల్ట్, లాంగ్‌జంప్, హైజంప్‌లో పాల్గొంటున్నారు. ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో పోల్‌వాల్ట్, లాంగ్‌జంప్‌లో స్వర్ణం, జావెలిన్ త్రోలో రెండో స్థానంలో నిలిచారు. మూడు సార్లు అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చినప్పటికీ ఆర్థిక సమస్యలతో పాల్గొనలేకపోయారు. "ఎప్పటికైనా అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నది నా ఆకాంక్ష. పాఠశాల విద్యనభ్యసించే సమయంలో పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్‌లో ప్రతిభ చాటేవాడిని. ఇదే నేటికీ అలవాటు చేసుకున్నా. ఉదయం లేవడం.. నడక, వ్యాయామం చేయడం.. తర్వాత ఆటో నడపడం నా రోజువారీ పని. ఇంతవరకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాలేదు" అని నారాయణ చెప్పారు.

ఆత్మ ఘోష

● అన్నదాతల దరిచేరని సాంకేతిక పరిజ్ఞానం

అన్నదాతలకు సాంకేతిక పరిజ్ఞానం అందించి.. వారిని ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లించేందుకు వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ)ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో ఈ విభాగం పనితీరు మొక్కుబడిగా ఉంది. లక్ష్యాలను చేరుకోవడం లేదు. ఏడెనిమిది వ్యవసాయ సబ్ డివిజన్లలో బీటీఎంలు, ఏటీఎంల కొరత వేధిస్తోంది. –న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

ఆత్మ పీడీ రత్నప్రసాద్ బదిలీ అయినా స.హ.చట్టం బోర్డులో ఆయన పేరే ఉంది..

ఏం చేయాలి?

సాగులో పెట్టుబడి తగ్గించి ఆదాయం పెంచే విధానాలపై ఈ విభాగం దృష్టి పెట్టాలి. వ్యవసాయం, పశు సంవర్ధక శాఖ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, మత్స్యశాఖల సమన్వయంతో శిక్షణలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించాలి. ఆయా శాఖలతో కలిసి పనిచేసిన దాఖలాలే లేవు.

మిగిలింది ఏడుగురే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 11 వ్యవసాయ సబ్ డివిజన్లు ఉన్నాయి. గతంలో వీటికి 11 మంది బ్లాక్ టెక్నికల్ మేనేజర్లు (బీటీఎంలు), 14 మంది అసిస్టెంట్ టెక్నికల్ మేనేజర్లు (ఏటీఎంలు) ఉండేవారు. ప్రస్తుతం ముగ్గురు బీటీఎంలు, నలుగురు ఏటీఎంలు మాత్రమే ఉన్నారు. ఆత్మ విభాగంలో ఒక పీడీ, ఒక మండల వ్యవసాయాధికారి, ఒక సీనియర్ అసిస్టెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్ మాత్రమే ఉన్నారు.

నిధులున్నా నిస్సత్తువే

● ఉమ్మడి జిల్లాలో ఏడాది కాలంలో 449 మంది రైతులకు శిక్షణలు, ప్రదర్శనలు (డెమో)లు నిర్వహించేందుకు రూ.39.10 లక్షలు మంజూరైంది. గడిచిన తొమ్మిది నెలల్లో 129 మందికి అవగాహన కల్పించి రూ.13.48 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. మరో మూడు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆలోగా రూ.25.62 లక్షలు వెచ్చించి 320 మంది రైతులకు శిక్షణలు, ప్రదర్శనలు (డెమో)లు నిర్వహించాల్సి ఉంది.

● సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన పెంచేందుకు రైతులను విజ్ఞాన యాత్రలకు తీసుకెళ్లాల్సి ఉంది. హైదరాబాద్‌లోని ఇక్రిశాట్, గుంటూరులో ఏపీ అగ్రిటెక్ కార్యక్రమాలకు పంపాలి. వీటికిగాను రూ.9.20 లక్షలు వెచ్చించాల్సి ఉండగా.. ఇప్పటివరకు పొరుగు రాష్ట్రానికి మాత్రమే రైతులను తీసుకెళ్లి రూ.60 వేలు ఖర్చు చేశారు.

● జిల్లా స్థాయిలో ఎగ్జిబిషన్లు... కిసాన్ మేళా, ఉద్యాన పంటలకు సంబంధించి పండ్లు, కూరగాయల ప్రదర్శనలు, రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించేందుకు రూ.2.28 లక్షలు వెచ్చించాల్సి ఉండగా.. రూ.58 వేలు ఖర్చు చేసి రెండు కార్యక్రమాలతో సరిపెట్టారు.

ముప్పుతిప్పలే

● బొగ్గు, స్లాగ్ తరలింపులో నిర్లక్ష్యం

పాణ్యం-నంద్యాల జాతీయ రహదారిపై పడిన వ్యర్థాలు

ముడి సరకు రవాణా.. ప్రజారోగ్యానికి ముప్పు తెస్తోంది. సరకు రవాణాలో సరైన రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. గడివేముల మండల పరిధిలోని జిందాల్ సిమెంట్ పరిశ్రమకు వివిధ ప్రాంతాల నుంచి సరకు రవాణా అవుతోంది. పరిశ్రమ వరకు రైలు మార్గం లేకపోవడంతో పాణ్యం రైల్వేస్టేషన్‌లో ముడి సరకు నిల్వ చేస్తున్నారు. వ్యాగన్లలో వచ్చిన బొగ్గు, స్లాగ్ తదితర వాటిని లారీల ద్వారా పరిశ్రమకు తరలిస్తున్నారు. సరకు రవాణా చేసే సమయంలో రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా బొగ్గు, స్లాగ్ రహదారిపై పడుతోంది. – న్యూస్‌టుడే, పాణ్యం, పాణ్యం గ్రామీణం

జాగ్రత్తలు తీసుకోకనే..

● కర్నూలు నగరపాలక సంస్థతో పాటు పురపాలక సంఘాల పరిధిలో సేకరించిన వ్యర్థాలను పరిశ్రమకు తరలిస్తున్నారు. వాహనాల్లో తరలించే సమయంలో తప్పనిసరిగా పట్టలు కప్పి తీసుకెళ్లాల్సి ఉంది. కానీ అలానే తరలిస్తున్నా అధికారులు దృష్టి సారించడం లేదు.

● పరిశ్రమకు ముడి సరకు రవాణా చేసే వాహనాలు సరైన రక్షణ చర్యలు తీసుకోవడం లేదు. ఫలితంగా వీటి వెనుక వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. స్లాగ్ గాజు ముక్కల్లా ఉంటుంది.. ఇది కళ్లలో పడినప్పుడు తీవ్ర ప్రభావం చూపుతోంది. మరోవైపు పాత వాహనాల్లో తరలిస్తుండడంతో అందులోని బొగ్గు, స్లాగ్ పెద్ద ఎత్తున రహదారులపై పడుతుండటం గమనార్హం.

(c) eenadu

అదుపు తప్పితే.. తప్పదు ముప్పు

వీరంతా రోజువారీ మహిళా కూలీలు.. ఎక్కడ పని దొరికితే అక్కడికి వెళ్తుంటారు. పని ప్రాంతాలకు చేరుకోవడానికి ట్రాక్టర్లు, ట్రాలీ ఆటోలను ఆశ్రయిస్తారు. రుద్రవరంలో శివారులో పొలం పనులు చేసేందుకు ఆదివారం ఓ ట్రాక్టరుపై మహిళా కూలీలు ప్రమాదకరంగా ప్రయాణించారు. ఏ మాత్రం పట్టు తప్పినా ప్రమాదం తప్పదు. ట్రాక్టరు ఇంజిను వెనుకవైపు వ్యవసాయ సామగ్రి బిగించారు. వాటిపై కూలీలు కూర్చొని ప్రయాణించారు. ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదం తప్పదు. – న్యూస్‌టుడే, రుద్రవరం

ఆహ్లాదం.. ఆదమరిస్తే ప్రమాదం

సుంకేసుల జలాశయానికి సెలవు దినాల్లో సందర్శకుల తాకిడి పెరుగుతోంది. జలాశయం రెండు గేట్ల నుంచి నీటి విడుదల చేస్తున్నారు. దీంతో చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్నూలు నగరం నుంచి ప్రజలు వస్తున్నారు. జలాశయం నుంచి దిగువకు విడుదల అవుతున్న నీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉన్నచోట కొంత మంది చిన్నారులతో కలిసి ప్రమాదకరంగా స్నానాలు చేస్తున్నారు. గతంలో జలాశయం దగ్గర సరదాగా గడిపేందుకు వచ్చి మృత్యువాత పడిన సందర్భాలున్నాయి. –న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నంద్యాల బొమ్మలసత్రం, గాంధీచౌక్ న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పురపాలక కమిషనర్ బండి శేషన్న, శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ సెంటర్ నంద్యాల జిల్లా కోఆర్డినేటర్ సుజల పేర్కొన్నారు. ఆదివారం హార్ట్‌ఫుల్‌నెస్ గ్రీన్‌రన్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పురపాలక కార్యాలయం వద్ద ప్రారంభించి పద్మావతీనగర్, శ్రీనివాస సెంటర్, సంజీవనగర్‌గేట్ వరకు కొనసాగించారు. వారు మాట్లాడుతూ..మొక్కలు పెంచి పర్యావరణాన్ని రక్షించడంతో కలిగే ఉపయోగాలు తెలియజేశారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజల్లో అవగాహన కల్పించారు. శ్రీరామచంద్ర మిషన్ సభ్యులు అరవింద్, ఆశ, రాణి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నంద్యాలలో నిర్వహించిన ర్యాలీ

యాగంటిలో భక్తుల సందడి

యాగంటి (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బనగానపల్లి మండల పరిధిలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి నంది, స్వామివారికి పూజలు చేశారు. ఆలయంలో వేదపారాయణ కార్యక్రమం కొనసాగింది.

పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

పల్స్ పోలియో విజయవంతానికి కృషి చేయాలి

మహానంది, న్యూస్‌టుడే: పల్స్ పోలియో విజయవంతానికి అంకిత భావమే ప్రమాణమని రాష్ట్ర లెప్రసీ ఆఫీసర్, పల్స్ పోలియో నంద్యాల జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ దేవసాగర్ పేర్కొన్నారు. మహానంది మండలం గాజులపల్లెఆర్ఎస్ చెంచుకాలనీలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో బూతును ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో కొన్ని చెంచు కుటుంబాలను కలిసి వారి పిల్లలకు పోలియో చుక్కలు వేయించుకున్న గుర్తులను పరిశీలించారు. ఆయన వెంట నంద్యాల జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ సుదర్శన్, ఎంపీహెచ్ఈవోలు బీసీ హుస్సేన్‌రెడ్డి, జగదీశ్వరప్ప, పర్యవేక్షకులు నరసింహారావు, ల్యాబ్‌టెక్నీషియన్ సికిందర్, విజయ్ పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న నోడల్ అధికారి డాక్టర్ దేవసాగర్

షూటింగ్ బాల్ విజేతలు బాపట్ల, అనకాపల్లి

కర్నూలు (క్రీడలు), న్యూస్‌టుడే: కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 44వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. పురుషుల విభాగంలో జరిగిన తుది పోరులో బాపట్ల జట్టు నెల్లూరుపై విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. మహిళా విభాగంలో అనకాపల్లి జట్టు బాపట్లపై గెలుపొందింది. విజేతలకు ఒలింపిక్ సంఘం సీఈవో పి.విజయ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి పి.సునీల్‌కుమార్, కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో యోగా సంఘం రాష్ట్ర కార్యదర్శి అవినాష్‌శెట్టి, స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కృష్ణ, జోసెఫ్ లక్ష్మయ్య, షూటింగ్ బాల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్ సురేంద్ర, కార్యదర్శి ఈశ్వర్‌నాయుడు, డ్రాగన్ బోట్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయికృష్ణ, కేడీసీసీ మాజీ డైరెక్టర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాట్యమయూరి.. కళారంజని

◆ కూచిపూడిలో రాణిస్తున్న మౌనిక

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: సంప్రదాయ నృత్యం కూచిపూడిలో అద్భుత అభినయంతో గుర్తింపు తెచ్చుకుంది నంద్యాలకు చెందిన కురవ మౌనిక. అనేక పుణ్యక్షేత్రాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాల సందర్భంగా ప్రదర్శనలిస్తూ.. పోటీల్లో పాల్గొంటూ రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తోంది. మరోవైపు తనకు వచ్చిన కళను మరికొందరికి నేర్పించాలన్న సంకల్పంతో పలువురికి కూచిపూడి నేర్పిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది.

◆ నంద్యాల పట్టణం ఎన్జీవోస్ కాలనీకి చెందిన రామిరెడ్డి, పద్మావతి దంపతుల కుమార్తె మౌనిక. తండ్రి చిన్నపుడే మరణించారు. తల్లి నీటిపారుదల శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. మౌనికకు చిన్నతనం నుంచి చదువుతోపాటు నృత్యంపై ఆసక్తి. తల్లికి కూడా కుమార్తెకు నృత్యం నేర్పించాలని ఇష్టం ఉండడంతో స్థానికంగా గురువు సురేష్ వద్ద కూచిపూడిలో శిక్షణ ఇప్పించారు. ఎనిమిదేళ్లగా రోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తూ మెలకువలు నేర్చుకుంటోంది. ఎక్కడ పోటీ జరిగినా పాల్గొని బహుమతులు అందుకుంటోంది.

సాధించిన పురస్కారాలు

◆ 2023 శ్రీశైలంలో నిర్వహించిన 6వ జాతీయస్థాయి మహాశివరాత్రి నృత్య పోటీల్లో నాట్య ఆర్యక అవార్డు.

◆ 2023 తిరుపతిలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్య పోటీల్లో అద్విత్ నాట్య ప్రతిభ అవార్డు.

◆ 2023 కాణిపాకంలో నిర్వహించిన 8వ జాతీయస్థాయి నంది నృత్య పోటీల్లో బాల గణపతి నాట్య సంకీర్తన పురస్కారం.

◆ 2024 శ్రీశైలంలో నిర్వహించిన 7వ జాతీయస్థాయి మహాశివరాత్రి నృత్య పోటీల్లో నాట్య సాధన సాక్షిగణపతి పురస్కారం.

◆ 2024 అయినవిల్లిలో నిర్వహించిన 9వ జాతీయస్థాయి నంది నృత్య పోటీల్లో ఆరుబయట నందీశ్వర పురస్కారం.

◆ 2024 రాజమండ్రిలో కూచిపూడి నృత్య కళాక్షేత్రం వారు నిర్వహించిన సంగీత నృత్యోత్సవాల్లో డా.నటరాజ రామకృష్ణ పురస్కారం.

◆ 2025 ప్రొద్దుటూరులో నిర్వహించిన రాయలసీమ సంగీత నృత్యోత్సవంలో రాయలసీమ మణిదీపిక పురస్కారం.

◆ 2025 శ్రీశైలంలో నిర్వహించిన 8వ జాతీయస్థాయి మహాశివరాత్రి నృత్య పోటీల్లో తాండవ నృత్యసాధన పురస్కారం.

నాట్యగురువుగా సేవలందించాలి : కురవ మౌనిక

పీజీ చదువుతున్నాను. నాట్యం, విద్య రెండింటినీ నేర్చుకోవడం చాలా సంతోషంగా ఉంది. నాట్యం, సంగీతం వంటి కళలు నేర్చుకోవడంతో విద్య మీద దృష్టి పెట్టలేమన్నది అపోహ. మన సంకల్ప బలం గట్టిగా ఉంటే సమయపాలనతో అన్ని రంగాల్లో విజయం సాధించవచ్చు. మా గురువు వద్ద పిల్లలకు శిక్షణ ఇస్తున్నాను. ఎప్పటికైనా నాట్యగురువుగా స్థిరపడాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నా.

వాట్సప్‌లో ఎఫ్ఐఆర్ కాపీ

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ప్రజలకు పారదర్శకంగా, వేగంగా సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వాట్సప్ గవర్నెన్స్ తెచ్చింది. నమోదైన కేసుకు సంబంధించి ప్రాథమిక సమాచార నివేదిక(ఎఫ్ఐఆర్) కాపీ కోసం గతంలో బాధితులు రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ఇకపై వాట్సప్‌లోనే పొందే వెసులుబాటు కల్పించింది. ఈ-చలానా, కేసు స్థితి తెలుసుకునే అవకాశాన్నీ తెచ్చింది. జిల్లావ్యాప్తంగా ఈ విషయంపై పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బందికి వాట్సప్ సేవలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇకపై ప్రజలు ఇంటి నుంచే చరవాణి ద్వారా వాట్సప్‌లో ఎఫ్ఐఆర్ కాపీ, పోలీసు సేవలు పొందవచ్చు.

మీ కోసం

నిబంధనలు వర్తిస్తాయి

ఎఫ్ఐఆర్ కాపీ పొందేందుకు కొన్ని నియమాలున్నాయి. ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసిన ఫిర్యాదుదారు, కేసులో పేర్కొన్న బాధితుడు, లేదా చట్టబద్ధ హక్కు ఉన్న వ్యక్తులు మాత్రమే అర్హులు. కేసు దర్యాప్తులో గోప్యత దృష్ట్యా ప్రతి ఒక్కరికీ ఎఫ్ఐఆర్ కాపీలు అందుబాటులో ఉండవు. లైంగిక, పిల్లలపై నేరాలు(పోక్సో కేసులు), జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలు, కోర్టు ఆదేశాల మేరకు గోప్యంగా ఉంచాల్సిన కేసులు అందుబాటులో ఉండవు.

ఇలా పొందవచ్చు

చరవాణి నుంచి 95523 00009 నంబరుకు హాయ్ అని సందేశం పంపాలి. పోలీసు సర్వీసు సేవలు ఎంచుకోవాలి. ఎఫ్ఐఆర్ నంబరు, జిల్లా, పోలీసు స్టేషన్ వివరాల నమోదుకు సూచనలు వస్తాయి. వాటి నమోదు పూర్తయ్యాక చరవాణికి ఓటీపీ వస్తుంది. నంబరును ధ్రువీకరించిన వెంటనే ఎఫ్ఐఆర్ కాపీ వాట్సప్‌నకు వస్తుంది.

గ్రామ సభల నిర్వహణ తీరుపై అసహనం

అవుకు, న్యూస్‌టుడే: మండల పునర్విభజన నేపథ్యంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలు ఉద్రిక్తతలకు దారితీశాయి. ముందస్తు సమాచారం లేకుండా అధికారులు చేతులెత్తి ఓటింగ్ నిర్వహించారంటూ గ్రామస్థులు అసహనం వ్యక్తం చేశారు. అవుకు మండలంలోని కొండమనాయునిపల్లె, జూనూతలను కొలిమిగుండ్ల మండలంలో చేర్చాలంటూ కొందరు గ్రామస్థులు అధికారులకు విన్నవించారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లో అధికారులు ఆదివారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల పరిధి చేర్చడానికి సంబంధించి స్థానిక ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడంతో పాటు పంచాయతీ తీర్మానం పొందాల్సి ఉంది. ఈ క్రమంలో ప్రజాభిప్రాయ సేకరణ, గ్రామసభల ముందస్తు సమాచారం గ్రామస్థులకు తెలియజేయడంలో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతులెత్తి అభిప్రాయాలు తెలపాలనే విషయాన్ని ముందుగా వెల్లడించలేదని, వందల సంఖ్యలో ప్రజలు పాల్గొనే సభలో ఇది ఎలా సాధ్యమవుతుందని విమర్శించారు. గ్రామసభల నిర్వహణ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

భిన్నాభిప్రాయాలు వెల్లడి

కొండమనాయునిపల్లె, జూనూతల గ్రామాలు అవుకు మండలంలో కొనసాగితే సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోందని, ప్రభుత్వ పథకాలు పొందలేక పోతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. కొలిమిగుండ్ల మండలంలో చేర్చడం ద్వారా మెరుగైన సౌకర్యాలు పొందే అవకాశమున్నట్లు కోరుతున్నారు. అవుకు మండల కేంద్రానికి రవాణా ఉండటంతోపాటు విద్య, వైద్యం సదుపాయాలు అవుకులో ఉన్నాయని, అవుకు మండలంలోనే కొనసాగించాలంటూ మరికొందరు కోరుతున్నారు. ప్రజాభిప్రాయ వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

కొండమనాయునిపల్లెలో అభిప్రాయాలు వెల్లడిస్తున్న గ్రామస్థులు

కలిసికట్టుగా పోరాడి జిల్లాను సాధించుకుందాం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని జిల్లా సాధనకు ప్రజలంతా కలిసికట్టుగా పోరాడి సాధించుకుందామని ఆదోని జిల్లా సాధన సమితి ఐకాస నాయకులు రఘురామయ్య, కృష్ణమూర్తిగౌడు, ప్రకాశ్‌జైన్, దేవిశెట్టి ప్రకాశ్, దస్తగిరినాయుడు, అశోకానందరెడ్డి తదితరులు అన్నారు. పట్టణంలో ఆదోని జిల్లా సాధన కోసం చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 36వ రోజుకు చేరుకున్నాయి. వారు మాట్లాడుతూ.. జిల్లా సాధనకు పెద్ద ఎత్తున మద్దతు రావడం అభినందనీయమన్నారు. ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ, ఎమ్మిగనూరు నియోజకవర్గాల ప్రజలు పూర్తి స్థాయిలో మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించాలని కోరారు. ఆదివారం దీక్షలకు ఆదోని స్వకుళసాలీ(చేనేత) సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గణేశ్ నాగరాజు, జిందే లక్ష్మణ్ మద్దతు తెలిపారు. అలాగే ఐకాస ఐక్యవేదిక యూత్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై ప్రదర్శన నిర్వహించి కోట్ల కూడలి వద్ద రాస్తారోకో చేపట్టారు. భాజపా రాష్ట్ర నాయకులు విట్టా రమేశ్, నాయకులు లోకేశ్, హుసేనప్పయాదవ్, రమేశ్‌యాదవ్ తదితరులు దీక్షలకు మద్దతు ప్రకటించారు.

ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దీక్షా శిబిరాన్ని సందర్శించారు. డివిజన్ పరిధిలోని వైకాపా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు రిలే నిరాహారదీక్షలు చేస్తున్నామన్నారు.

దీక్షలో పాల్గొన్న సంఘం నాయకులు, భాజపా నేతలు

సాహిత్యంలో యువత భాగస్వామ్యం కీలకం

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: తెలుగు సాహిత్యంలో యువత భాగస్వామ్యం కీలకమని అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. యువ రచయితలను ప్రోత్సహించేందుకు అరసం కృషి చేస్తోందని చెప్పారు. కర్నూలులోని ఎస్టీయూ భవన్‌లో సాహిత్య అకాడమీ, అభ్యుదయ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 90 ఏళ్ల తెలుగు అభ్యుదయ సాహిత్య సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. 1933లో శ్రీశ్రీ రచించిన జయభేరి కవితతో తెలుగునాట అభ్యుదయ సాహిత్యం మొదలైందన్నారు. అరసం రాష్ట్ర అధ్యక్షుడు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి మార్గ నిర్దేశం చేసేలా అభ్యుదయ సాహిత్యం ఉండాలన్నారు. తెలుగు సాహిత్యంలో కొత్త తరహా రచనలతో మార్పు తేవాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు సలహామండలి సభ్యులు వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ సామాజిక దృష్టి కోణం నుంచి రచనలు చేసినపుడే సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు. తెలంగాణ విమోచన ఉద్యమ సాహిత్యంపై ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, అభ్యుదయ సాహిత్య విమర్శపై ఆచార్య కరిమిండ్ల లావణ్య, అభ్యుదయ నవల అన్న అంశంపై కేపీ అశోక్‌కుమార్, అభ్యుదయ కథ అంశంపై డా.హరికిషన్, అభ్యుదయ నాటకం అనే అంశంపై డా.వింధ్యవాసినీదేవి, అభ్యుదయ కవిత్వంపై కెంగార తాయప్ప ప్రసంగించారు. అనంతరం అతిథులు, వక్తలను సత్కరించారు.

మాట్లాడుతున్న అరసం జాతీయ అధ్యక్షుడు పెనుకొండ లక్ష్మీనారాయణ

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

బనగానపల్లి, న్యూస్‌టుడే: హిందువులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని వైఎస్సార్ జిల్లా కడప జిల్లా బ్రహ్మంగారి మఠంలోని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి పేర్కొన్నారు. జీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహణ సమితి అధ్యక్షుడు గాలి మద్దిలేటిరెడ్డి అధ్యక్షతన మండల హిందూ సమ్మేళనం నిర్వహించారు. విరజానందస్వామి మాట్లాడుతూ.. హిందూ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. ఆర్ఎస్ఎస్ దేశ ప్రజల్లో జాతీయ భావాలు పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు అందరూ పాటుపడాలన్నారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉంటే సమాజం బలంగా ఉంటుందన్నారు. పట్టణంలో టంగుటూరి శీనయ్య ఆధ్వర్యంలో భారీగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎం.పార్వతి, సురేంద్ర, కాటసాని ప్రసాద్‌రెడ్డి, నాగిరెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న విరజానందస్వామి

సగరుల బలోపేతానికి సీఎం హామీ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పూర్తిగా వెనుకబడి సగరులు. . కూటమి సర్కార్ రాకతో వందలాది మంది ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ఎంతో గర్వంగా ఉందని రాష్ట్ర సగర(ఉప్పర) కార్పొరేషన్ ఛైర్మన్ వెంకటరమణ అన్నారు. రాష్ట్రంలో ఎంపికైన సగర ఉపాధ్యాయుల సన్మాన సభ ఎమ్మిగనూరు పట్టణంలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర సగర ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ఏపీ వీరన్న అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. వెంకటరమణ మాట్లాడుతూ.. సగరులను రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని వివరించారు. ఆర్థిక పరిస్థితులతో చదువులకు దూరమైన విద్యార్థులను ఆదుకొనేందుకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. విశ్రాంత డీఎస్పీ వెంకటయ్య.. కృషి, పట్టుదల, ఏకాగ్రతతో సాధన చేస్తే ఉద్యోగాలు లభిస్తాయన్నారు. పెనుగొండ డీఎస్పీ నరసింగప్ప మాట్లాడుతూ.. పిల్లలను ఉన్నత చదువులను చదివించి విద్యావంతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు పీడీ సిద్ధలింగమూర్తి, విశ్రాంత డీఎఫ్‌వో శ్రీనివాసులు, సీఐ శ్రీనివాసులు, వైజాగ్ వెంకటేశ్వర్లు, ప్రకాశం రాజు, గుంటూరు వెంకట్‌రావు, భీమవరం స్వామి, తిరుపతి విజయ్, కాకినాడ సత్యవతి, అన్నమయ్య ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉద్యోగుల సంఘం రవీంద్ర, కృష్ణమూర్తి, నరసింహులు, పార్వతి, వీరేంద్ర, చింతలయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉద్యోగులు సాధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించిన శ్రీశానవీని సన్మానించారు. రాష్ట్రస్థాయిలో ఉద్యోగుల సంక్షేమ నిధి కోసం రూ.10 లక్షల కేటాయిస్తున్నట్లు సగర సంఘం జిల్లా నాయకులు డాక్టర్ గిడ్డయ్య ప్రకటించారు.

ఉపాధ్యాయులను సన్మానించిన రాష్ట్ర సగర కార్పొరేషన్ ఛైర్మన్, రాష్ట్ర ఉద్యోగుల సంఘం నాయకులు

చదువుతోనే గిరిజనుల అభివృద్ధి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: చదువుతోనే గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని నేషనల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఛైర్మన్ ఈదరు పద్మాకర్, కర్నూలు జిల్లా ఛైర్మన్ రోషన్న, లేబర్ యూనియన్ నాయకులు గడిగా అడివప్ప, ఎస్టీ బీసీ రిటైర్డ్ ప్రినిపల్ దేవరాజు అన్నారు. పాములపాడు మండలం గుండాలనట్టులో చెంచు, సుగాలి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి నెల రెండు గ్రామాల్లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సంస్థ ద్వారా పేద విద్యార్థులకు సహాయం చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న పద్మాకర్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర పూర్వ గౌరవాధ్యక్షుడు నరసింహుడు పేర్కొన్నారు. ప్యాపిలి యూటీఎఫ్ మండలశాఖ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్షుడిగా రాజేంద్ర, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ లతీఫ్, గౌరవ అధ్యక్షుడిగా శేషయ్య, సహఅధ్యక్షులుగా రహీం, నాగమణి, ఆర్థిక కార్యదర్శిగా సాలయ్య, జిల్లా కౌన్సిలర్లుగా అమీర్‌బాషా, వీరాంజనేయ ప్రసాద్, మద్దిలేటి, సర్వజ్ఞ, మదనగోపాల్‌తో పాటు మండల కార్యవర్గ సభ్యులుగా శివప్రసాద్, ఫర్జానా, అస్మాబేగంలతో పాటు మరి కొందరిని ఎన్నుకున్నారు.

నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

పరుగుల వీరుడు

➤ జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించిన యువకుడు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: యువకుడు పరుగుల వేటలో పతకాలు సాధించారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటి అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతంలో సాధన చేసిన యువకుడు జాతీయ స్థాయిలో తన ప్రతిభ చూపారు. ఎమ్మిగనూరు పట్టణ కేంద్రంలో నిత్యం సాధన చేశారు. పేద కుటుంబానికి చెందిన క్రీడాకారుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి ఆదర్శంగా నిలిచారు.

పేదింటి బిడ్డ భళా..

నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన వెంకట్రామిరెడ్డి తల్లిదండ్రులు గోపాల్‌రెడ్డి, ఉమ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వెంకట్రామిరెడ్డి హైదరాబాదులో బీబీఏ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. అథ్లెటిక్స్ పోటీల్లో శిక్షణ తీసుకున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శాయ్‌కి ఎంపికయ్యారు. ఇందులో 2019 నుంచి సాధన చేస్తున్నారు. వెంకట్రామిరెడ్డికి చిన్నప్పటి నుంచి పరుగు పందెం అంటే ఇష్టం. కోచ్ మల్లికార్జున సహకారంతో ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ మైదానంలో నిత్యం సాధన చేస్తున్నారు. పరుగు పందెం పోటీల విభాగంలో సాధన చేశారు. దీంతో అంతర్జాతీయ స్థాయి పోటీకి ఎంపిక చేశారు. ఈ ఏడాది జైపూర్‌లో నిర్వహించిన ఖేల్ ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో 800 మీటర్ల పరుగు పందెంలో స్వర్ణ పతకం సాధించారు. రాంచీలో జరిగిన 4వ దక్షిణాసియా సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో 800 మీటర్ల విభాగంలో కాంస్య పతకం సాధించి దేశానికి ప్రాధాన్యం వహిస్తూ తొలిసారిగా సీనియర్ అంతర్జాతీయ పతకాన్ని అందుకున్నారు. అదే విధంగా ఈ ఏడాది అక్టోబర్ 10-14వ తేదీలో జరిగిన 40వ నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు భువనేశ్వర్‌లో జరిగాయి. ఛాంపియన్‌షిప్‌లో 880 మీటర్లు, 1500 మీటర్లు డబుల్ పరుగు పందెంలో బంగారు పతకాలు గెలుచుకున్నారు. వరల్డ్ అండర్-20, ఏషియన్ అండర్-22 అర్హత ప్రమాణాలను సాధించారు. నేషనల్ జూనియర్ ఫెడరేషన్ కప్, ఆల్ ఇండియా ఇంటర్-శాయ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించారు. ప్రస్తుతం బెంగళూరు ప్రభుత్వ శాయ్‌లో శిక్షణ పొందుతున్నారు.

భువనేశ్వర్‌లో జరిగిన పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారుడు వెంకట్రామిరెడ్డి

శ్రీరంగాపురంలో వ్యక్తి బలవన్మరణం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రుద్రవరం మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన ఎస్.రాజన్న(36) అనే వ్యక్తి పురుగు మందు తాగి మృతి చెందారు. రుద్రవరం పోలీసుల కథనం మేరకు.. మృతుడు మద్యానికి బానిసయ్యారు. కుటుంబ సభ్యులు తాగేందుకు డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపంతో ఈ నెల 19వ తేదీన పురుగుల మందు తాగారు. నంద్యాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. మృతుడి తల్లి ఫిర్యాదు రుద్రవరం పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉరేసుకొని ఆత్మహత్య..

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండలంలోని హెచ్‌కొట్టాల గ్రామానికి చెందిన ఉన్నం భాస్కర్ (56) ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. భర్త నిత్యం మద్యం తాగి వచ్చి గొడవ పడుతుండటంతో భార్య పుట్టింటికి వెళ్లింది. భార్య తిరిగి కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల సమీపంలో ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలైనట్లు పట్టణ పోలీసులు తెలిపారు. పట్టణం నుంచి హైవే వైపు ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు వెళ్తుండగా ఐటీఐ కళాశాల వద్ద ఉన్న మలుపు వద్ద కర్నూలు వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. గాయపడిన ముగ్గురు యువకులను వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ కానిస్టేబుల్ మృతి



నాగేశ్ (దాచిన చిత్రం)

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ నాగేశ్(53) చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందారని నందికొట్కూరు ఏఎస్సై రామచంద్ర తెలిపారు. గతనెల 25న బిజినవేముల సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి తీవ్ర గాయాలపాలయ్యాడు. అప్పటి నుంచి కర్నూలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందాడని మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పంట కాల్వలో పడి యువకుడు..

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోనవరం గ్రామానికి చెందిన వెంకటసురేంద్ర(35) ప్రమాదవశాత్తు పంట కాల్వలో పడి మృతి చెందినట్లు ఎస్సై నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన శేషన్న, వెంకటసుబ్బమ్మ దంపతుల కుమారుడు వెంకటసురేంద్ర కొణిదేడు గ్రామం వద్ద ఉన్న పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం పని ముగించుకుని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తుండగా ఆలమూరు గోనవరం గ్రామాల మధ్య అదుపుతప్పి రహదారి పక్కకు దూసుకెళ్లాడు. పంట పొలాల్లోని కాల్వలో పడడం, అతనిపై ద్విచక్రవాహనం పడడంతో ఊపిరాడక మృతి చెందినట్లు తెలిపారు. ఆదివారం తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాలింపు చేపట్టగా పంట కాల్వలో పడి మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

EENADU Classifieds

JOBS

ప్రముఖ రియల్ ఎస్టేట్ నందు లేడీ టెలీకాలర్స్ (F) & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M) కావలెను. నోటార్గెట్ ఫిక్స్‌డ్ జీతం:10,000/- నుండి 15,000/- మరియు ఇన్సెంటివ్స్. ✆ 9398616991.

పారుల్ యూనివర్సిటీ బ్రాండ్ ప్రమోషన్ కొరకు లేడీ టెలికాలర్స్ కావలెను. వ: 18-28 సం॥. అ: బీటెక్, డిగ్రీ గ్రాడ్యుయేట్స్. నవీన్ చంద్, కొత్త అయ్యప్పస్వామి గుడి, కె.సి కెనాల్, కర్నూలు. సంప్ర॥ 63000 97961.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

వైభవంగా మువ్వ పూజ వేడుకలు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణానికి చెందిన పలువురు బాలికలు కూచిపూడి నృత్యం నేర్చుకొని ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం స్ఫటికలింగేశ్వరస్వామి ఆలయంలో మువ్వ పూజ వేడుకలు నిర్వహించారు. విద్యార్థినులకు సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం నిర్వాహకులు, శిక్షకుడు సురేష్ మువ్వ కట్టి పోటీలు ప్రారంభించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నటరాజస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

← నటరాజస్వామికి పూజలు

నంద్యాల

•నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

సైబర్ నేరాలపై జాగ్రత్త

కడమలకాల్వ(బండిఆత్మకూరు): సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. మండలంలోని కడమలకాల్వ గ్రామంలో సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అనుమానితుల ఇళ్లల్లో ముమ్మరంగా తనిఖీలు చేశారు. గ్రామంలోని ప్రధాన రహదారుల వెంట పర్యటించారు. సమస్యలుంటే ఫిర్యాదు చేయాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) నందికొట్కూరు : 94403 61729 ఆత్మకూరు : 90149 09024 నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం: ?: పట్టణంలోని పప్పులబట్టి వీధిలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి.- **పాండు**

?: పట్టణంలోని నౌమాన్‌నగర్, అబ్దుల్లా గ్రీన్ సిటీలో కోతుల బెడద ఎక్కువైంది. - **సలాంఖాన్**

?: రెవెన్యూ క్వార్టర్స్‌లో కాల్వలు శుభ్రం చేయడం లేదు. - **నిరంజన్** ✔: సిబ్బందితో కాల్వలను శుభ్రం చేసి దోమల మందు పిచికారీ చేయిస్తాం. కుక్కలు, కోతులను పట్టిస్తాం. - **లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్, నంద్యాల**

పాణ్యం గ్రామీణం?: ఆలమూరు గ్రామంలో ఎక్కడపడితే అక్కడ చెత్త పడవేస్తున్నారు. - **ప్రకాశ్** ✔: గ్రామంలో అవగాహన కల్పించి చెత్తను వేయకుండా చూస్తాం.- **వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఎంపీడీవో, పాణ్యం**

మహానంది, న్యూస్‌టుడే: ?:ఎం.తిమ్మాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెలుపల ఉన్న మరుగుదొడ్లు నిర్మించినా అవి నిరుపయోగంగా మారాయి. వాటిని రోగులకు అందుబాటులోకి తీసుకురావాలి. - **హుస్సేన్ సాబ్, తిమ్మాపురం.** ✔: మరుగుదొడ్ల ప్రాంతంలో కొత్తగా భవనాన్ని నిర్మిస్తున్నారు. దీంతో మట్టి అధికమైంది. దాన్ని తీయించి అందుబాటులోకి తీసుకువస్తాం.

- **డాక్టర్ భగవాన్‌దాస్, తిమ్మాపురం ఆసుపత్రి.**

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: ?:తోటగేరి నుంచి జమ్ములమ్మ దేవాలయం వెళ్లే మార్గంలో ఉన్న మురుగు కాల్వలో పూడిక పేరుకుపోయింది. దుర్వాసన వస్తుంది.

- **నాగరాజు, స్థానికుడు.** ✔: కాల్వల్లో పూడిక తొలగిస్తాం. - **జీవన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.**

?: ఇందిరానగర్‌లో జంగాలవీధికి వెళ్లే మార్గంలో ఉన్న వీధి దీపం వెలగటం లేదు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాములు సంచరిస్తున్నాయి.-**నాగన్న, స్థానికుడు.** ✔: వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం.

- **షాహీర్‌బాషా, పురపాలక ఏఈ.**

పోటీల్లో పాల్గొని.. విజేతలుగా నిలిచి

పోటీల్లో పాల్గొన్న నారాయణ కళాశాల విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని నంద్యాల నారాయణ కళాశాల ఏజీఎం అంజన్‌కుమార్‌రెడ్డి అన్నారు. నారాయణ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో హర్షిని, శిల్పా, అర్షద్‌లకు కళాశాల ఏజీఎంతోపాటు ప్రిన్సిపల్ రమేష్, స్మార్ట్ బహుమతులు అందజేశారు.

నందికొట్కూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు చక్కటి సమాధానాలతో విజేతలుగా నిలిచి బహుమతులు పట్టారని విజ్డమ్ పాఠశాల ఏవో మౌలాలి తెలిపారు. నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని విజ్డమ్ పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. టాబు, భరత్‌రెడ్డి, వేదచంద్రికలు వరసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ఏవో, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు.

పోటీల్లో పాల్గొన్న విజ్డమ్ పాఠశాల విద్యార్థులు

గెలుపొందిన వారికి బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

అక్రమ దందాలు.. ఆందోళనలో ప్రజలు

★ నందికొట్కూరులో అసాంఘిక కార్యకలాపాలు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణ కేంద్రంగా అసాంఘిక వ్యాపారాలు సాగుతున్నాయి. గంజాయి విక్రయం, మత్తు పదార్థాల తయారీ, పశువుల కొవ్వుతో నూనె తయారీ, బియ్యం దందా, అక్రమ పాస్ పోర్టులు వంటి కార్యకలాపాలకు నందికొట్కూరును కేంద్రంగా చేసుకుని వ్యాపారాలు సాగించారు. పోలీసులు వీటన్నింటినీ పూర్తిగా నిర్మూలించారా? లేదా అన్న సందిగ్ధంలో నందికొట్కూరులో ప్రజలు భయంభయంగా జీవనం సాగిస్తున్నారు.

పట్టణంలో నిఘా కోసం డ్రోన్ కెమెరాను వినియోగిస్తున్న పోలీసులు

రేషన్ బియ్యం నుంచి పాస్‌పోర్టు వరకు

● అబూసలీమ్ ఇండియాకు రావటానికి పాస్‌పోర్టును నందికొట్కూరు కేంద్రంగా తయారు చేయడంపై అప్పట్లో కలకలం రేపింది. ఈ విషయాన్ని పోలీసులు గుట్టు రట్టు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకున్నారు.

● నందికొట్కూరు పట్టణం శివారులోని డంపింగ్ యార్డు సమీపాన పశువుల ఎముకలు, కొవ్వుతో నూనెను తయారు చేసి హోటల్స్, దుకాణాలకు సరఫరా చేసేవారు. పోలీసులు దాడి చేసి అక్కడున్న నూనె, తయారీ వస్తువులను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి కోర్టుకు అప్పగించారు.

● రాజకీయ నాయకులు, పోలీసుల అండదండలతో నందికొట్కూరులో రేషన్ బియ్యం దందా సాగుతోంది. పోలీసులు వారితో చేతులు కలపడంపై విమర్శలున్నాయి. ఓ రెవెన్యూ అధికారి ఇటీవల సుమారు 200 క్వింటాళ్ల వరకు ఫ్రాడ్ చేసి దాన్ని డీలర్లపై నెట్టేసి వెళ్లినట్లు చర్చ సాగుతోంది. దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ చేస్తామని డీలర్లకు హామీ ఇచ్చి గమ్మున ఉండటంపై విమర్శలున్నాయి.

● మట్కా, నంబర్ల గేమ్ వంటివి పట్టణంలో జోరుగా సాగుతున్నాయని, పోలీసులు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు కేజీ రోడ్డు అడ్డాగా మట్కా, వాహనాలకు చెందిన నంబర్ల గేమ్‌లు ఆడుతూ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారని తెలిసింది.

మత్తు సామ్రాజ్యం

● గంజాయి విక్రయిస్తున్న ముఠాను పట్టణం, గ్రామీణ సర్కిల్ ఆధ్వర్యంలో వేర్వేరుగా అరెస్టు చేసి రెండు కేసుల్లో వారి నుంచి సుమారు 20కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో తప్పించుకున్న నిందితులను ఇప్పటికీ అరెస్టు చేయలేదన్న విమర్శలున్నాయి.

● ఇటీవల సంచలనం సృష్టించిన మత్తు పదార్థాల తయారీ కేంద్రాన్ని నార్కోటిక్ పోలీసులు గుట్టు రట్టు చేయడంపై ప్రజలకు భయం వీడలేదు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కిలోల పౌండర, రసాయనాలు, ల్యాబ్‌కు సంబంధించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

● పట్టణంలోని ఓ పాఠశాలలో విద్యార్థులు చాక్లెట్ తినడంతో అనారోగ్య సమస్యలు వచ్చాయన్న భయంతో ఉన్నారు.

మెనూ ప్రకారం చికెన్ వడ్డించాలి

ఆత్మకూరు: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో మెనూ ప్రకారం చికెన్ వడ్డించాలని ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగరాజు అన్నారు. కొట్టాలచెరువు ఆశ్రమ పాఠశాలలో ఆదివారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

దారి ఇలా.. ప్రయాణం ఎలా..

నంద్యాల పట్టణంలోని దేనియల్‌పురంకాలనీలో సిమెంటు రోడ్డు కుంగి, నెర్రలివ్వడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని.. దెబ్బతిన్న చోట సంచిలో మట్టి నింపి ఉంచారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న చోట మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

కల్వర్టుపై గుంతలు.. చూడకుంటే ఇబ్బందులు

నంద్యాల బొమ్మలసత్రం గొల్లపేటలో మసీదుకు వెళ్లేదారిలో కల్వర్టు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. రాత్రి సమయాల్లో వీటిని గమనించకుండా ప్రయాణిస్తూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నంద్యాల రైతునగరం

గాలులు వీస్తే.. పడిపోయేలా దిమ్మె

నంద్యాల నుంచి బండిఆత్మకూరు మండలంలోని ఎర్రగుంట్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన భీమవరం గ్రామ శివారులో ఉన్న విద్యుత్తు నియంత్రిక దిమ్మె ఒక వైపునకు వాలింది. దాని కింద ఒక చిన్నపాటి రాయి పెట్టడంతో నియంత్రిక కింద పడకుండా ఉంది. ఈదురు గాలులు వీస్తే దిమ్మె పడిపోయి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, భీమవరం (నంద్యాల గ్రామీణం)

అల్లుకున్న ప్రమాదం

నందికొట్కూరు పట్టణంలోని అల్లూరు రోడ్డులో విద్యుత్తు స్తంభానికి పచ్చని తీగలు అల్లుకున్నాయి. ఆ తీగలను అటువైపు వైపు పశువులు, మనుషులు తాకితే పెను ప్రమాదం జరిగే అవకాశముందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు అధికారులు స్పందించి తీగలకు అల్లుకున్న ఆకు తీగలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం



ఆవుల సంచారం.. ప్రయాణికులకు గండం

పట్టణంలోని ప్రధాన రహదారుల్లో పశువుల సంచారం అధికంగా ఉంది. కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిలో వేలసంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయి. రద్దీ వేళల్లో వాహనాల మధ్య పశువులు తిరుగుతుండటం, రహదారి మధ్యలో సేదతీరుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పురపాలక అధికారులు స్పందించి పశువుల యజమానులు తరలించుకుపోవాలనీ, లేకపోతే గోశాలలకు తరలిస్తామని స్పష్టం చేశారు.

– న్యూస్‌టుడే, ఆత్మకూరు పట్టణం

కొత్తూరులో అన్నదానానికి రూ.69 వేలు విరాళం

ఆలయ ఈవోకు నగదు అందిస్తున్న భక్తులు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని ఎస్.కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిత్య అన్నదానం అందించడానికి భక్తులు రూ.69 వేల విరాళం అందించినట్లు ఈవో రామకృష్ణ పేర్కొన్నారు. కర్నూలు పట్టణానికి చెందిన మోహన్‌కుమార్, గాయత్రి దంపతుల కుమారుడు నాగ రిత్విక్ ఆదివారం ఆలయ సిబ్బందికి రూ.69,116 నగదు విరాళాన్ని అందజేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు.

సంక్షిప్త సమాచారం

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు పట్టణానికి నేడు శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి రానున్నట్లు మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేంద్ర తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ వాణిజ్య సముదాయము, రోఖియాబి దర్గా వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రహదారులను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

వెలుగోడు: వాహనదారులు రహదారి సూత్రాలు పాటించాలని ఎస్సై సురేష్ తెలిపారు. వెలుగోడు పట్టణంలోని నంద్యాల-ఆత్మకూరు ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని పలు వాహనాల యజమానులకు జరిమానాలు వేసినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం తప్పనిసరిగా ధరించి సురక్షిత ప్రయాణం చేయాలన్నారు.

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: నంద్యాల పట్టణంలోని మహంకాళి హనుమాన్ వ్యాయామ చరక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. శారదా విద్యాపీఠంలో గత నాలుగు రోజులుగా చదరంగం, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నిస్ పోటీలు జరిపారు. ప్రతిభ కనబర్చిన క్రీడారులకు కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్, శ్యాంసుందర్‌గుప్తా, పుల్లయ్య, శ్రావణ్, తెదేపా రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, వాసు క్రిష్ణయ్య బహుమతులు అందజేశారు.

ఆత్మకూరు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) వందో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కులమతాలకు అతీతంగా ఆత్మకూరు ప్రభుత్వ బాలురోన్నత పాఠశాల క్రీడా మైదానంలో 23వ తేదీ నిర్వహిస్తున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నిర్వహణ సమితి సభ్యులు తెలిపారు. విశిష్ట అతిథిగా వేదాంత గీత శివ ఫౌండేషన్ అధ్యక్షుడు శంకరానంద స్వామీజీ ప్రసంగిస్తారని తెలిపారు.

హిందువులు సంఘటితం కావాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: హిందువులందరూ సంఘటితం కావాలని ఆ సంఘం నాయకులు చింతల నాగకుమార్, గోవిందనాయుడు, రామమూర్తిస్వామి, జయలక్ష్మి, చంద్రమౌళీశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని చిత్తులూరి వారి వీధిలోని శ్రీకృష్ణ మందిరం వద్ద ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. వారు మాట్లాడుతూ..ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రతి బస్తీలో హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. సభ్యులు శ్రీనివాసులు, మల్లికార్జున, రమేష్, భాను, శేఖర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చిత్తులూరి వారి వీధిలో పాల్గొన్న అతిథులు

● నంద్యాల పట్టణం బాలాజీ కాంప్లెక్స్, ప్రథమనంది ఆలయంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. శివయోగేంద్ర సరస్వతి స్వామి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. హిందువులందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. సభ్యులు వేణుగోపాల్, శ్యాంసుందర్‌లాల్, సురేష్‌బాబు, శ్యాంసుందర్‌గుప్తా, రవికుమార్, గాయత్రీ, శ్రీవల్లి, శ్రీదేవివాసు, చంద్రశేఖర్, శబరీష్, పోలయ్య, నాగదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడిగా దరగయ్య

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగమైన మహాజన సోషలిస్టు పార్టీ(ఎమ్మెస్పీ) జిల్లా అధ్యక్షుడిగా దరగయ్యను నియమించినట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డా.మున్నంగి నాగరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అత్యవసర జూమ్ సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నియమించినట్లు తెలిపారు. జిల్లాలో దళిత పీడిత వర్గాల ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తానని దరగయ్య తెలిపారు. దరగయ్యకు పలువురు అభినందనలు తెలిపారు.

పరమాత్ముడి లీలలు అమోఘం

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: శ్రీకృష్ణ పరమాత్ముని లీలలు అమోఘమని తితిదే బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత, ప్రవచనకర్త డాక్టర్ హయగ్రీవాచార్యులు అన్నారు. పట్టణంలోని సంజీవ నగర్ రామాలయంలో ఆదివారం భగవత్ సేవా సమాజ్, నంది రైతు సమైఖ్య, తితిదే దివ్య ప్రబంధ ప్రాజెక్టు వారి సహకారంతో తిరుప్పావై దివ్య ప్రవచనాల్లో భాగంగా ఆధ్యాత్మిక ప్రవచనాలను భక్తులకు వివరించారు. ఆయన ఉపన్యసిస్తూ పరమాత్ముని ప్రేమ ప్రతి ఒక్కరిపై సమానంగా ఉంటుందన్నారు.

ప్రసంగిస్తున్న డాక్టర్ హయగ్రీవాచార్యులు

గ్రామాల్లో జనసేన కమిటీలు వేస్తాం

పాణ్యం గ్రామీణ, న్యూస్‌టుడే: రాబోవు రెండు నెలల్లో గ్రామ స్థాయి నుంచి జనసేన పార్టీ నూతన కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు పాణ్యం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి చింతా రమేష్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం పాణ్యంలో ఆదివారం పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఉద్యోగులకు మంచి స్థానాలు కల్పించారన్నారు. మండల అధ్యక్షుడు జగదీష్ బాబు, నాయకులు సుబ్బకృష్ణ, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చింతా రమేష్

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

★ 'ఈనాడు' ఆధ్వర్యంలో వైద్యశిబిరం

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: వసతి గృహాలు, కస్తూరిబా పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినులు కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని కంటి వైద్యాధికారి డాక్టర్ షేక్షావలి సూచించారు. ఆత్మకూరు పట్టణంలోని కస్తూరిబా బాలికల వసతిగృహంలో ఆదివారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 64 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో చిన్నచిన్న సమస్యలున్న 12 మందిని గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. డాక్టర్ షేక్షావలి మాట్లాడుతూ..రాత్రి ఎక్కువ సమయం మేల్కోవటం, సెల్‌ఫోన్ చూడటం, పుస్తకాలు దగ్గరగా పెట్టుకుని చదవటంతో కంటిపై ప్రభావం పడుతుందన్నారు. దూరపు, దగ్గరి చూపు తగ్గటం, తలనొప్పి రావటం, కళ్లల్లో నీళ్ల కారటం, మంటలు, గుచ్చుకున్నట్లు అనిపిస్తే వెంటనే కంటి వైద్యులను సంప్రదించాల్సిందిగా సూచించారు. కళ్లలో లోపాలు గుర్తించిన విద్యార్థినులను ప్రభుత్వ ఆసుపత్రికి పిలుచుకొని వెళ్లి మెరుగైన వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వెల్లడించారు. కస్తూరిబా పాఠశాల ప్రత్యేక అధికారిణి శ్యామల, ఏఎన్ఎం మల్లేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు షేక్షావలి

నిండు జీవితానికి.. రెండు చుక్కలు

నందికొట్కూరు గ్రామీణం: పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

సున్నిపెంట సర్కిల్: శ్రీశైలంలో.. సిబ్బంది

నంద్యాల, నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గాల్లో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బూత్‌లలో 0-5 సంవత్సరాలలోపు చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. పలువురు అతిథులు మాట్లాడుతూ.. పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేయించడంతో వారి నిండు జీవితం ఆరోగ్యకరంగా సాగుందని పేర్కొన్నారు. – న్యూస్‌టుడే బృందం

నంద్యాల పురపాలకం: నూనెపల్లెలోని పాఠశాలలో.. కమిషనర్ బండి శేషన్న

వెలుగోడు: ఇంద్రానగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

కుంచె పడితే.. పతకాలే

★ చిత్రలేఖనంలో రాణిస్తున్న లాస్య

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: ఆమె కుంచె పడితే చిత్రానికి ప్రాణం వస్తుంది. మనసులోని భావాలను పేపర్‌పై అందంగా చూపించగలదు. గీచిన చిత్రంలో అద్భుతాలే కనిపిస్తాయి. అందుకే చిన్న వయసులోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు అందుకుంది. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపుతూ రాణిస్తుంది లాస్య.

సాధించిన పతకాలతో లాస్య

సామాజిక బాధ్యత గుర్తు చేస్తూ..

నంద్యాల పట్టణానికి చెందిన నాగరాజు, మధుప్రియ దంపతుల కుమార్తె లాస్య 7వ తరగతి చదువుతుంది. అతి చిన్న ప్రాయంలోనే అద్భుతంగా చిత్రాలు వేస్తూ ఆకట్టుకుంటుంది. చిన్నతనం నుంచి చిత్రకళా మక్కువతో పలక, పుస్తకాలపై నచ్చిన చిత్రాలు వేస్తుండేది. మరింత శిక్షణ కోసం శిక్షకుడు కోటేష్ వద్ద శిక్షణ ఇప్పిస్తున్నారు. ఈ చిన్నారి కాలుష్యం, ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలను తన చిత్రాల ద్వారా ఆలోచింపచేసేలా గీస్తుంది. పసి ప్రాయంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పసిడి పతకాలు అందుకుంది. ఎన్నో సందేశాత్మక చిత్రాలు వేయడమే కాకుండా రన్నింగ్, త్రోబాల్, మ్యూజిక్ వంటి వాటిల్లో ప్రతిభ కనబరుస్తుంది.

సాధించిన విజయాలు

✣ 2020, 2021 విజయవాడలో డ్రీమ్స్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయ చిత్రలేఖన పోటీల్లో రెండుసార్లు బంగారు పతకాలు అందుకుంది.

✣ 2021, 2022 హైదరాబాద్‌లో కేంద్రప్రభుత్వం సాంస్కృతిక శాఖ, యంగ్ ఇన్ఫో సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళ ప్రదర్శన పోటీల్లో రజత పతకాలు అందుకుంది.

✣ 2022లో తూర్పుగోదావరిలోని అమలాపురంలోని కోనసీమ చిత్రకళాపరిషత్ వారు నిర్వహించిన అంతర్జాతీయ చిత్రకళ ప్రదర్శన పోటీల్లో జ్యూరీ అవార్డు అందుకుంది.

✣ 2023 చెన్నైలోని శ్రీదర్శిని కళైకూడమ్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనలో బంగారు పతకం అందుకుంది.

✣ 2024 పల్నాడు జిల్లాలోని వినుకొండలో జెజవాడ చారిటబుల్ ట్రస్ట్‌వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకం అందుకుంది.

✣ 2025 నెల్లూరులోని అమీర్ ఆర్ట్ అకాడమీ వారు నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనలో బంగారు పతకం పొందారు.

ఉపాధి కూలీలు ఉద్యమబాట పట్టాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవడానికి ఉపాధి కూలీలు ఉద్యమ బాట పట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం(వ్య.కా.స.) నాయకులు జయన్న, శ్రీనివాసగౌడ్, నరసింహనాయక్ అన్నారు. నంద్యాల మండలంలోని చాపిరేవుల, పోలూరు గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో కలిసి ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉపాధి హామీ సవరణ బిల్లును దగ్ధం చేశారు. వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలయ్యాక చిన్న, సన్నకారు రైతులు బీడు భూములు సాగు చేసుకుంటున్నారన్నారు. వలసలు కొద్దిమేర తగ్గాయన్నారు. జీ రామ్ జీ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కృష్ణ, చింతలయ్య, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డి, తులసిరెడ్డి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

బిల్లు ప్రతులు దహనం చేస్తున్న ఉపాధి కూలీలు, వ్య.కా.స. నాయకులు

శ్రీశైలం మండల వైకాపా అధ్యక్ష పదవికి రాజీనామా

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం మండల వైకాపా అధ్యక్ష పదవికి వట్టి వెంకటరెడ్డి రాజీనామా చేసినట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి పనిచేయలేక తప్పనిసరి పరిస్థితుల్లో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీశైలంలో ఓ నాయకుడు నోటి దురుసుతో, అక్రమాలతో, అవమానకరంగా తిడుతూ పార్టీకి తీవ్ర నష్టం చేసి, ఓటమికి కారణమైన అతనికి రాష్ట్రస్థాయి పదవులు కట్టబెడుతూ వైకాపా పార్టీని ఓటమి దిశగా నడిపించే ప్రయత్నాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. తమ రాజీనామా పత్రాన్ని వైకాపా జిల్లా అధ్యక్షులకు పంపినట్లు తెలిపారు.

పండ్లు పంచి.. రక్తదానం చేసి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్‌రెడ్డి నివాసంలో కేకు కోశారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పరివర్తన సెంటర్‌లో చిన్నారులకు, దుస్తులు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ పీపీ నాగిరెడ్డి, పురపాలక ఛైర్‌పర్సన్ మాబున్నిసా నాయకులు పాల్గొన్నారు.

మసీదుపురం(మహానంది): మహానంది మండలం మసీదుపురం గ్రామంలో సర్పంచి లక్ష్మీరెడ్డి, ఎంపీటీసీ మల్లికార్జునరెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ కొమ్ము పాల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి విగ్రహం వద్ద ర్యాలీ చేపట్టారు. కేకు కోశారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

(c) eenadu

ప్రతిభను వెలికి తీసేందుకే పోటీలు

పోటీలకు హాజరైన విద్యార్థులు

విజేతలతో కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి ప్రోత్సహించేందుకు పోటీలు ఉపయోగపడతాయని కరస్పాండెంట్ గురుస్వామి అన్నారు. కోవెలకుంట్లలోని సాయి చిదానంద పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో పదో తరగతి విద్యార్థులు ఏఎం ముజామిల్ మొదటి, సుహానా ద్వితీయం, సీమా తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారు. వీరికి కరస్పాండెంట్ బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, నాగరాజు, బాలు పాల్గొన్నారు.

పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బహుమతులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అధ్యక్షతన 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీలు జరిగాయి. పోటీల్లో షాజాదీబేగం (పదో తరగతి), త్రినాథ్ (తొమ్మిదో తరగతి), తస్లీమ్ ఫాతిమా(పదో తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రధానోపాధ్యాయులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ధ్యానం.. ఆత్మసాక్షాత్కారానికి మార్గం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ధ్యానం చేస్తే శరీరం ఆరోగ్యం.. మనసు ప్రశాంతంగా ఉంటుందని గాధంశెట్టి రమణయ్య, అప్పపోగు వెంకటసుబ్బయ్య, న్యాయవాది తిరుపతయ్య అన్నారు. ధ్యానంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కోవెలకుంట్లలోని రామచంద్రమిషన్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుంజలపాడు రోడ్డులోని ధ్యాన మందిరం నుంచి అంకాలమ్మ గుడి వరకు ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని సంరక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ధ్యాన మందిర సభ్యులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ

శిరివెళ్ల, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆళ్లగడ్డ: 8008 574916
డోన్ పట్టణం: 94408 57790
బనగానపల్లె: 80085 73763

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ?: భారతీ విద్యామందిరం వెనుక వైపు ఇంకా చెత్తను కాలుస్తున్నారు. పొగ విపరీతంగా వస్తోంది. - డా.గణపతి, అమ్మవారిశాల వీధి.
✔: చెత్తను తగుల పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. - పి.కిశోర్, కమిషనర్.

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ప్రవేశమార్గంలో చెత్తాచెదారం వేస్తున్నారు. - మణికంఠ, ప్రయాణికుడు.
✔: చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. - ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.

సంజామల, న్యూస్‌టుడే: ?: ఆకుమల్లలోని ఆంజనేయస్వామి దేవాలయం సమీపంలో రహదారి దెబ్బతింది. - వెంకటేశ్వర్లు, ఆకుమల్ల.
✔: త్వరలో రహదారి మరమ్మతులు చేపడతాం. - రెడ్డి గోవింద్, ఆర్అండ్‌బీ ఏఈ.
✔: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జి ఈవో.

శిరివెళ్ల, ?: మండలంలోని మహదేవపురం బీసీ కాలనీలో డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయాలి. - పార్వతి.
✔: పారిశుద్ధ్య సిబ్బందితో సమస్యను పరిష్కరిస్తాం. -వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి, మహదేవపురం.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని సిద్ధప్ప దేవాలయం ముందు చెత్తాచెదారం తొలగించక పోవడంతో అపరిశుభ్రంగా ఉంది. - కాలనీ వాసులు.
✔: సిబ్బందితో శుభ్రం చేయిస్తాం. - మధుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్.
?: పోలీసు స్టేషన్ ఎదురుగా వైపు లీకేజీతో నీరు వృథాగా పారుతోంది. - స్థానికులు.
✔: తాగునీటి విభాగం సిబ్బందితో మరమ్మతులు చేయిస్తాం. - మధుతేజరెడ్డి, ఏఈ మున్సిపల్.

నిర్వహణ శూన్యం.. లక్ష్యం దూరం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: రైతులకు అండగా ఉండాల్సిన వ్యవసాయ మార్కెట్ యార్డులు నిరుపయోగంగా మారిపోతున్నాయి. అటు రైతులు పండించిన ధాన్యాన్ని నామమాత్రపు రుసుముతో నిల్వ ఉంచడంతో పాటు బ్యాంకుల ద్వారా సులభంగా రుణాలు ఇప్పించాల్సిన బాధ్యత మార్కెట్ కమిటీలపై ఉంది. అలాంటి వ్యవస్థ నిర్వీర్యమైంది. రైతులకు ఏమాత్రం ఉపయోగపడక పోగా రైతుల నుంచి సెస్సుల రూపంలో రూ. కోట్లను వసూలు చేస్తుండడం గమనార్హం. గతంలో మార్కెట్ కమిటీలు రైతు పండించిన పంటలకు సరైన ధర అందేలా అండగా ఉండేవి. అవసరమైతే ధాన్యాన్ని గోదాముల్లో నిల్వ ఉంచుకుని రైతు బంధు పథకం పేరిట రుణం ఇవ్వడం చేసేవి.

నిరుపయోగంగా మార్కెట్ కమిటీ గోదాము

ఆసక్తి చూపని రైతులు

ఆళ్లగడ్డ మార్కెట్ యార్డులో రూ. 2.34 కోట్లతో ఐదు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ప్రభుత్వ గోదాము నిర్మించారు. వీటితో పాటు మరో 2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాములు ఉన్నాయి. ఆళ్లగడ్డలో రైతుల కోసం 18 ఎకరాల విస్తీర్ణంలో కొత్త మార్కెట్ యార్డును నిర్మించారు. రైతులు ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అనువైన చోటుగా ఉన్నా ధాన్యాన్ని నిల్వ చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. రైతు బంధు పథకం లేకపోవడంతో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు.

ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయం

సంవత్సరం	లక్ష్యం	ఆదాయం (రూ.కోట్లలో)
2022-23	5.45	5.05
2023-24	5.65	5.15
2024-25	6.00	5.15

రైతు బంధు లేక విలవిల

గతంలో రైతు బంధు రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండేది. తాను పండించిన పంటకు మద్దతు ధరలేని సమయంలో రైతు స్వయంగా మార్కెట్ గోదాములకు తరలించి అందులో సరకును నిల్వ ఉంచుకోవచ్చు. నేడు అవేమీ అమలు కాకపోవడంతో రైతు నేడు దళారులు ఇచ్చిన ధరకే గత్యంతరం లేని స్థితిలో అమ్మేస్తున్నారు. మార్కెట్ కమిటీ గోదాముల్లో రైతులు ధాన్యం నిల్వ చేసుకునేందుకు సరైన వసతులు లేకపోవడంతో గత్యంతరం లేక రైతులు అధిక అద్దె చెల్లిస్తూ ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచుకుంటున్నారు.

సెస్సు వసూళ్లకే పరిమితం

2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత మార్కెట్ కమిటీలు రైతు నుంచి సెస్సు వసూళ్లకే పరిమితమయ్యాయి. సాధారణంగా వీటి ద్వారా వచ్చిన ఆదాయం నుంచి రైతుల పొలాలకు రహదారులను నిర్మించాలి. రైతులు తమ పంట ఉత్పత్తులను ఇళ్లకు, కల్లాలకు తరలించేందుకు రహదారుల నిర్మాణం చేపట్టాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పరిస్థితుల్లో మార్పు రాలేదు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి. అవేమీ నిర్వహించడం లేదు.

విష ప్రచారం చేయడం తగదు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మెప్పుకోసమే తెదేపా నేతలపై వైకాపా రాజకీయ నాయకులు అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మండిపడ్డారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. అహోబిలంలో టెంకాయల వేలం పాటలు బాక్స్ టెండర్ల ద్వారా జరిగాయని, అందులో వైకాపా మద్దతుదారుడే పాల్గొన్నారని, టెండరు వారికి దక్కకపోవడంతో తమపై విమర్శలు చేస్తున్నారన్నారు. అహోబిలం దేవస్థానం మఠం ఆధీనంలో ఉందని, ప్రభుత్వ పెత్తనం లేని క్షేత్రంలో తాము అక్రమాలు ఎలా చేస్తామని ప్రశ్నించారు. తలనీలాల వేలంలో అసలు పాల్గొనని మహిళా ఠాకూర్ మామాకు ఇప్పించిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వాహనాల గేటు వసూళ్ల ధరలను వైకాపా సర్పంచే పెంచారని, ఆ మేరకే నేడు కూడా వసూళ్లు జరుగుతున్నాయన్నారు.

మలుపులు.. ప్రమాదానికి పిలుపులు

ఆళ్లగడ్డ-పాలసాగరం రహదారిలో ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి ముందు నుంచి వస్తున్న వాహనాలు కన్పించడం లేదు. ముఖ్యంగా మలుపుల వద్ద పరిస్థితులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇరువైపులా ముళ్లపొదలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. రహదారికి ఇరువైపులా పెరిగిన ముళ్లచెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. అధికలోడుతో కూడిన వాహనాల రాకపోకలు అధికం కావడంతో వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ

ఏళ్లుగా అద్దె భవనంలోనే గ్రంథాలయం

శిరివెళ్లలో సొంత భవనం లేకపోవడంతో ఏళ్లుగా గ్రంథాలయం అద్దె భవనంలో కొనసాగుతోంది. గ్రంథాలయానికి శాశ్వత భవనం లేని కారణంగా ప్రతి రెండేళ్లకోసారి అద్దె భవనంలోకి మార్చాల్సిన దుస్థితి నెలకొంది. రూ.4 వేలు అద్దె చెల్లిస్తున్నా మౌలిక సౌకర్యాలు లోపించాయి. ప్రస్తుతం గ్రంథాలయంలో 7,930 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. నిత్యం 50 మంది వరకు పాఠకులు, విద్యార్థులు వస్తున్నారు. శాశ్వత భవనం నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, శిరివెళ్ల

చూపుతిప్పితే వాగులోకే..

బనగానపల్లి మండలం ఖాలేనాయక్‌తండా శివారులోని రహదారి ప్రమాదకరంగా మారింది. గ్రామశివారులో సీసీ రహదారి వేశారు కానీ దానికి ఇరువైపులా ఎటువంటి మట్టి దారి ఏర్పాటు చేయలేదు. పక్కనే వాగు ఉండటంతో పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. వాహనదారులు ఏమాత్రం అదుపు తప్పినా వాగులో పడే ప్రమాదముంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రక్షణ గోడలు నిర్మించాల్సిన అవసరం ఉంది. – న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి

శిబిరాన్ని ప్రారంభిస్తున్న డా.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కోవెలకుంట్లలోని సీహెచ్‌సీలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు వెంకటరాముడు, కార్యదర్శి సుబ్బరాయుడు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం, బాలాంజనేయరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా భావం అలవర్చుకోవాలి

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం

ప్యాపిలి, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవాభావాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో వెంగళాంపల్లి గ్రామంలో ఆదివారం ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో వారం రోజుల పాటు పలు సేవా కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నవీనపాటి, అధ్యాపకులు సురేష్, వెంకటరమణ, మద్దిలేటి, బాలరంగం, నాగరాజు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతమే లక్ష్యం

కార్యక్రమంలో మాట్లాడుతున్న రంగనాయుడు

డోన్‌పట్టణం, ప్యాపిలి, న్యూస్‌టుడే: గ్రామాల్లో సీపీఐ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. డోన్ పట్టణంతోపాటు ప్యాపిలిలో మండల సమితి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 26న శత వసంతోత్సవాలు నిర్వహించాలన్నారు. వసంతోత్సవాలు సందర్భంగా వచ్చే నెల 18న ఖమ్మంలో భారీ బహిరంగసభను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ, నాయకులు జె.మహేష్, పి.వెంకటేష్, శ్రీనివాసులు, నాగన్న, రాము పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక నిఘా

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఉంటుందని ఎస్సై మల్లికార్జునరెడ్డి అన్నారు. అనుమానితులపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోవెలకుంట్ల పోలీసు స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన మంత్రణం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ జాతీయ రహదారిలోని దొరపల్లి జగనన్న కాలనీ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అనంతపురం నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న ఐచర్ వాహనాన్ని వెనుక భాగాన కారు ఢీకొట్టింది. కారులో ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

మండలూరు(రుద్రవరం), న్యూస్‌టుడే: తెదేపా నాయకుడు గోపాల్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం మండలూరు సర్పంచి దొరెడ్డి గోపాల్‌రెడ్డి ఆకస్మికంగా మృతి చెందారు. ఎమ్మెల్యే అఖిలప్రియ ఆదివారం మండలూరు చేరుకుని పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం మాజీ గనమినే నగేష్ మృతి చెందారు. ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి నగేష్ మృతదేహంపై ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి ప్రాథమ్య బాధ్యతని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. స్వచ్ఛరథ, పరిసరాల పరిశుభ్రతలో భాగంగా అధికారులు ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.

కోటపాడు (శిరివెళ్ల), న్యూస్‌టుడే: ప్రజల సహాయ, సహకారంతోనే గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తాయని సర్పంచి ఆదివారం తెలిపారు. పలు కాలనీల్లో వీధిదీపాలు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

యర్రగుంట్ల (శిరివెళ్ల), న్యూస్‌టుడే: యర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థుల బృందం ప్రింటర్‌ను విరాళంగా అందించినట్లు హెచ్‌ఎం విజయ్‌కుమార్ తెలిపారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక యశోద ఆసుపత్రిలో వైద్యులు ఓ మహిళకు అరుదైన శస్త్రచికిత్స చేసి 3.5 కిలోల అండాశయ కణితితోపాటు 2.5 కిలోల ఫైబ్రాయిడ్ గడ్డలు తొలగించారు. గైనకాలజిస్టు డా.సుంకన్న, డా.చంద్రారెడ్డి, డా.బాలసారయ్య పాల్గొన్నారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలో రానున్న క్రిస్మస్ పండగ సందర్భంగా పారిశ్రామికవేత్త చక్రం షబ్బీర్ పేదలకు చీరలు, దుస్తులను పంపిణీ చేశారు.

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పాలకులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.సుంకయ్య, పట్టణ కన్వీనర్ మోటారాముడులు పేర్కొన్నారు.

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే: డోన్ రైల్వే స్టేషన్ బయట గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే: కొండాపురం-దొర్నిపాడు గ్రామాల ఇటీవల ట్రాక్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్యాపిలి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని ప్యాపిలి ఎస్సై నాగార్జున పేర్కొన్నారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండు వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం పోలీసులు అవగాహన కల్పించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: యాగంటి ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్పీ దంపతులకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆర్.కృష్ణాపురంలోని రామలింగ పుట్టాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూర్వాసుల నుంచి తరలివచ్చి పుట్టాలమ్మ, పరశురామేశ్వర, లక్ష్మీనరసింహస్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. దొర్నిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో ఆదివారం మాల పెద్దమ్మతల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఐక్యతతోనే సమాజాభివృద్ధి సాధ్యం

ఆధ్యాత్మికం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: హిందువులందరూ ఏకమై సమాజాభివృద్ధికి కృషి చేయాలని తోటపల్లె బ్రహ్మంగారి మఠం, అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన 'హిందూ సమ్మేళనం'లో ఆయన ప్రసంగిస్తూ ప్రతి హిందువు మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. భుజం భుజం కలిపి ముందుకు సాగి ఐక్యతను చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో పి.రామకృష్ణ, రాధిక పాల్గొన్నారు.

చింతలచెరువు(చాగలమర్రి), న్యూస్‌టుడే: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అభినవశంకరానంద స్వామి తెలియజేశారు. చింతలచెరువు గంగమ్మ ఆలయ సమీపంలో ఆదివారం హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అభినవశంకరానంద స్వామి మాట్లాడుతూ సనాతన ధర్మం గొప్పతనాన్ని వివరించారు. నంద్యాల, కర్నూలు జిల్లాల ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ ఆంజనేయులు, సమ రసత సేవా ఫౌండేషన్ సభ్యులు సల్లానాగరాజు, ఆవుల ప్రతాప్, సుమంత్ పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: వేదికపై ఉపన్యసిస్తున్న విరజానందస్వామి

అవుకు: బాలికల నృత్య ప్రదర్శన

అవుకు, న్యూస్‌టుడే: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ధర్మ పరిరక్షణ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఆదివారం స్థానిక కేబీఎన్ పాఠశాలలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు.

పల్స్ పోలియో విజయవంతం

డోన్ పట్టణం: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి

ఆళ్లగడ్డ పట్టణ ఆరోగ్య కేంద్రంలో..

అందరి సహకారంతో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు ప్రజా ప్రతినిధులు, అధికారులు వెల్లడించారు. పిల్లల ఆరోగ్యం సమాజ భవిష్యత్తుకు పునాది అని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం డోన్ కేవీఎస్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు పోలియో చుక్కలను వేశారు. ఐదేళ్లలోపు చిన్నారులందరికీ కచ్చితంగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, ఆళ్లగడ్డ గ్రామీణం, కోవెలకుంట్ల, కోవెలకుంట్ల గ్రామీణం, బనగానపల్లి, బనగానపల్లి గ్రామీణం, సంజామల, అవుకు, చాగలమర్రి, డోన్.

బేతంచెర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో..

చాగలమర్రి పీహెచ్‌సీలో..

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: రౌడీషీటర్లుగా నమోదైన వారు గొడవలకు దూరంగా ఉండాలని సీఐ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం బేతంచెర్ల పోలీసు స్టేషన్‌లో ఎస్సై రమేష్ బాబు, కేసీ తిరుపాల్‌తో కలిసి రౌడీషీటర్లకు మంత్రణం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదుతో పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. సత్ప్రవర్తనతో ఉంటే రౌడీషీటర్ జాబితాలో పేర్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. ఏఎస్సై నబి, కానిస్టేబుళ్లు సూర్యనారాయణ, చంద్రశేఖరప్ప పాల్గొన్నారు.

పలువురు కార్యకర్తల రక్తదానం

మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం వైకాపా నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఆసుపత్రుల్లో రోగులకు పాలు, బెడ్లు పంపిణీ చేశారు. ఆళ్లగడ్డలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. – న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ, బనగానపల్లి, కోవెలకుంట్ల, డోన్‌పట్టణం, బేతంచెర్ల, చాగలమర్రి.


ఆళ్లగడ్డ: రక్తదానం చేస్తున్న వైకాపా కార్యకర్తలు

రెండు కార్ల ఢీ.. తప్పిన ప్రమాదం

బేతంచెర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని హెచ్‌కొట్టాల గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. రెండు వాహనాల్లోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వాహనాల ముందు భాగం దెబ్బతిన్నాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద కారణాలను తెలుసుకున్నారు.

అతివ.. స్వయం ఉపాధి తోవ

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: మహిళలు ఒకనాడు వంటింటికే పరిమితం.. అడుగడుగునా అడ్డుతెరలు.. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడ్డారు. అయితే పొదుపు సంఘాలుగా ఏర్పడటం వారి జీవితాల్లో మార్పునకు నాంది పలికింది. మెల్లమెల్లగా అవరోధాలు అధిగమించి స్వయం ఉపాధి వైపు అడుగులు వేశారు. బ్యాంకుల ద్వారా రుణ సాయం పొంది వివిధ వ్యాపారాలు చేస్తూ ఆర్థిక స్థిరత్వం సాధించి ఆదర్శంగా నిలిచారు డోన్ పట్టణానికి చెందిన పొదుపు సంఘాల మహిళలు.

కుటుంబానికి అండగా నిలుస్తూ..

గ్రామీణ హోం ఫుడ్స్ సెంటర్‌ను నిర్వహిస్తున్న ఈమె పేరు కె.కవిత. ఈమె ఏడేళ్ల కిందట జనతా గ్రూపులో పొదుపు సభ్యురాలిగా చేరారు. ఇంటి వద్ద ఖాళీగా కూర్చోకుండా.. స్వశక్తితో ఉపాధి పొందాలనుకున్నారు. బ్యాంకు ద్వారా రూ.లక్ష వరకు రుణం తీసుకుని కేవీఎస్ కాలనీలో గ్రామీణ హోంఫుడ్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ దుకాణంలో పిల్లల నుంచి పెద్దల వరకు తీసుకునే ఆహార పదార్థాలను నెయ్యి, సేమీ ఆర్గానిక్‌తో తయారు చేసిన చిక్కీలు, చిరుధాన్యాల జావ, వెజ్, నాన్‌వెజ్ పచ్చళ్లు, అన్ని రకాల పొడులు, పలు రకాలైన చిరుతిళ్లు, బిస్కెట్లు వంటి పలు రకాల హోం ఫుడ్స్‌ను తయారుచేసి వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఈమె భర్త హరేంద్ర సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. దినదినాభివృద్ధి చేస్తూ ఖర్చులన్నీ పోను నెలకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం సంపాదిస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలుస్తూ ఇతర మహిళలకు ఆదర్శంగా నిలిచారు కవిత.

స్వశక్తితో రాణిస్తూ..

అప్పడాలు తయారు చేస్తున్న ఈమె పేరు కుమ్మరి లక్ష్మి. పాతపేటలో నివాసం ఉంటున్నారు. ఈమె పొదుపులో తొమ్మిదేళ్ల కిందట శ్రీరామా మహిళా సంఘం గ్రూపులో సభ్యురాలిగా చేరారు. ఇంటిపట్టున ఖాళీగా కూర్చోకుండా స్వశక్తితో రాణించాలనుకున్నారు. తన భర్త మునిస్వామి సహకారంతో అప్పడాల వ్యాపారం ప్రారంభించారు. మెప్మా ద్వారా రూ.లక్ష బ్యాంకు రుణం తీసుకుని ఆమె తన ఇంటి వద్దే అప్పడాలు తయారు చేయడం ప్రారంభించారు. అప్పడాలు తయారు చేసి.. ప్యాకింగ్ చేసిన వాటిని తన భర్త మునిస్వామి డోన్, ప్యాపిలి, గుత్తి, కృష్ణగిరి మండలాల్లోని గ్రామాలు, పట్టణాల్లో తిరుగుతూ అప్పడాల వ్యాపారం చేస్తున్నారు. ఖర్చులన్నీ పోను నెలకు రూ.20 వేల వరకు సంపాదిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు వంశీ గుజరాత్‌లో బీటెక్, రెండో కుమారుడు రవి కడపలో బీటెక్ అభ్యసిస్తున్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా నా క్లయింట్ వెరిటాస్ ఫైనాన్స్ లిమిటెడ్, నంద్యాల శాఖ వారి తరుపున తెలియజేయడం ఏమనగా ఈపూరి జనార్దన్ గుప్త S/o ఈపూరి పాండురంగయ్య, నివాసం బనగానపల్లె గ్రామము, బనగానపల్లె మండలం, నంద్యాల జిల్లా అనే వారు నా క్లయింట్ బ్యాంక్‌ను లోను కొరకు సంప్రదించినారు. సదరు లోనుకు సంబంధించి ఒరిజినల్ లింక్ విక్రయ దస్తావేజు నెంబరు: 1283/2022 తేది: 25-05-2022 గల విక్రయ దస్తావేజు పోయినది అని తెలిపినారు. సదరు దస్తావేజు క్రింద షెడ్యూల్‌కు సంబంధించినవి. కావున ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పైన పేర్కొన్న ఒరిజినల్ లింక్ విక్రయ దస్తావేజుకు సంబంధించి ఎవ్వరికైనా హక్కులు, అధికారాలు, తాకట్టు ఉన్నయెడల ఈ తేది నుండి వారం రోజుల లోపల నాకు తగిన ఆధారములతో మీ అభ్యంతరములు తెలుపుకొనగలరు. లేనిచో యెలాంటి అభ్యంతరములు లేవని ఈపూరి జనార్దన్ గుప్త గారికి లోను మంజూరు చేయబడునని తెలియజేయడమైనది.
షెడ్యూలు: నంద్యాల రిజిస్ట్రేషన్ జిల్లా, బనగానపల్లె సబ్-రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలోని బనగానపల్లె గ్రామ పంచాయతీలో 9వ వార్డు ఖాది ఆఫీస్ వెనుక వీధిలోని, సర్వే నెం. 163/1 పైకి, విస్తీర్ణం 45.38 చదరపు గజాలు గల విస్తీర్ణం ఈ క్రింది విధంగా సరిహద్దులుగా ఉన్నాయి.
దిక్కులు: తూర్పు: జాయింట్ సందు రస్తా, పడమర: సర్కారు రోడ్, ఉత్తరం: ఈపూరి వెంకట సుబ్బసత్యనారాయణ గుప్త ఇల్లు, దక్షిణం: ఇల్లూరి సుధాకర్ ఇల్లు.
కొలతలు: తూ-ప: 38 అడుగులు, ఉ-ద: 10 3/4 అడుగులు
తాతిరెడ్డి లక్ష్మీ వసంతం రెడ్డి, అడ్వకేట్, రూమ్ నెం: 2, S.R.S.C. Complex, Beside: Court Complex, Nandyal Town & District. Cell: 94931 34081.

(c) eenadu

విధేయతకు పట్టం

నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గం పార్టీ అధ్యక్షుడిగా షేక్ జానీసైదా, ప్రధాన కార్యదర్శిగా నల్లపాటి రాము

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, అమరావతి, నరసరావుపేట అర్బన్ : తెదేపా కష్టకాలంలో ఉన్నప్పుడు అంకితభావంతో పని చేసి పార్టీకి అండగా నిలిచిన నేతలకు అధిష్ఠానం గుర్తింపునిచ్చింది. నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడిగా పెదకూరపాడు నియోజకవర్గం అమరావతికి చెందిన మైనారిటీ నేత షేక్ జానీసైదా, ప్రధాన కార్యదర్శిగా నరసరావుపేట నియోజకవర్గానికి చెందిన నల్లపాటి రామచంద్రప్రసాద్(రాము)ను నియమించింది. ఇప్పటి వరకు పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను అదే పదవిలో కొనసాగిస్తారని ప్రచారం జరిగింది. అయితే అనూహ్యంగా జానీ సైదాను నియమించడం గమనార్హం. జిల్లాలో మైనార్టీలకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో అధిష్ఠానం జానీసైదా పేరును పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. వివిధ రాజకీయ, సామాజిక సమీకరణాలను బేరీజు వేసిన తెదేపా అధిష్ఠానం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల పదవులను భర్తీ చేసింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీలను సమన్వయం చేసుకుని పల్నాడు జిల్లాలో పార్టీని విజయం దిశగా నడిపించాల్సి ఉంటుంది.

కార్యకర్త నుంచి జిల్లా అధ్యక్ష పదవికి..

జానీసైదా 2010 నుంచి పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఆయన తల్లి హజరాబీ అమరావతి మండల జడ్పీటీసీగా పనిచేశారు. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత జానీసైదా అనేకమార్లు నిర్బంధాలకు గురయ్యారు. గత ప్రభుత్వ పాలనలో అనేక అక్రమ కేసులు ఎదుర్కొన్నారు. ఆయనపై ఏకంగా 28 అక్రమ కేసులు నమోదు చేయించడంతో పాటు రౌడీషీట్ కూడా తెరిచింది. అయిదేళ్లపాటు అమరావతి మండలంలో తెదేపా ఏ కార్యక్రమానికి పిలుపిచ్చినా చురుగ్గా పాల్గొని వైకాపా దుర్మార్గాలను ఎండగట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జానీసైదా కృషికి గుర్తింపుగా ఆయన భార్య జరీనా క్రోసూరు మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఎంపికయ్యేలా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సహకరించారు. ఈ నేపథ్యంలోనే మైనారిటీ కోటాలో సైదాను లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమించింది.

మొదటి నుంచి రాజకీయ కుటుంబం

నల్లపాటి రాము తండ్రి చంద్రశేఖరరావు తెదేపా ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా ఉన్నారు. జడ్పీటీసీ సభ్యునిగానూ ఎన్నికయ్యారు. అనంతరం స్థానిక రాజకీయాల కారణంగా కుమారుడు రాముతో కలిసి చంద్రశేఖరరావు 2004 ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. 2019 ఎన్నికలకు ముందు రాము తెదేపాలో చేరారు. 2024 ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గ పరిశీలకులుగా సేవలందించారు. తాజాగా తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శిగా అధిష్ఠానం పదవి బాధ్యతలు అప్పగించింది.

122 ఏళ్ల చరిత్ర.. ఎంతో ఘనత

ముప్పాళ్ల మండలం తురకపాలెంలోని పునీత అంతోని చర్చికి 122 ఏళ్ల చరిత్ర ఉంది. పోర్చుగల్ దేశానికి చెందిన మత బోధకుడు పునీత అంతోని క్రీస్తుమార్గం.. సామాజిక సేవను ప్రచారం చేశారు. ఆయన పేరుతో 1880లో చర్చి నిర్మాణం ప్రారంభించి 1903లో పూర్తి చేశారు. నేటికీ చెక్కుచెదరకుండా ఉంది. క్రిస్మస్ వేడుకలతో పాటు ఏటా జనవరి 17న చర్చి తిరునాళ్ల నిర్వహిస్తున్నారు. దేశ, విదేశాల నుంచి విశ్వాసులు, మత బోధకులు ఈ వేడుకల్లో పాల్గొంటారు. – న్యూస్‌టుడే, ముప్పాళ్ల

ప్రథమ ఇంటర్ పరీక్షల తీరు మారే

ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు

న్యూస్‌టుడే, సత్తెనపల్లి నెహ్రూనగర్ (మాచర్ల), పసుమర్రు (చిలకలూరిపేట గ్రామీణ)

జిల్లాలో జూనియర్ ఇంటర్ కళాశాలలు: 132
పరీక్ష రాస్తున్న ప్రథమ సంవత్సర విద్యార్థులు: 17,900

పదో తరగతి పరీక్షల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిన ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యలోనూ సంస్కరణలు అమలు చేస్తోంది. జూనియర్ ఇంటర్ విద్యార్థుల సిలబస్ మార్చారు. ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు ప్రశ్నపత్రం పూర్తిగా మారింది. పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు ఇప్పటికే విడుదల చేసింది. నూతన పరీక్ష విధానంపై జిల్లా స్థాయిలో కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులకు ఇంటర్ బోర్డు అధికారులు ఇటీవల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

❖ భౌతిక రసాయన శాస్త్రాలకు 85 మార్కుల ప్రశ్నపత్రం ఇస్తారు. ప్రస్తుత విధానంలో 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. పబ్లిక్ పరీక్షల్లో గణితం, భౌతిక, రసాయన శాస్త్రం, చరిత్ర, కామర్స్ రాజనీతి శాస్త్రం, ఎకనామిక్స్‌లకు 32 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. గతంలో 24 పేజీలు ఉండేవి. ప్రశ్నల సంఖ్య పెరగటంతో బుక్‌లెట్‌లో పేజీలు పెరిగాయి. వృక్ష, జంతుశాస్త్రాలను కలిపి జీవశాస్త్రంగా ఒకే సబ్జెక్టుగా పరిగణిస్తారు. మొత్తం 85 మార్కులకు వృక్ష, జంతు శాస్త్రాల ప్రశ్నపత్రాలు ఉంటాయి. ఒకేరోజు పరీక్ష రాయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వృక్ష, జంతు శాస్త్రాలకు 24 పేజీల చొప్పున రెండు బుక్‌లెట్లు ఇవ్వనున్నారు. గతంలో రెండు వేర్వేరు సబ్జెక్టులుగా 60 మార్కుల చొప్పున మొత్తం 120 మార్కులకు ప్రశ్నపత్రాలు ఇచ్చేవారు. రెండ్రోజులు విడివిడిగా పరీక్ష రాశారు. మిగతా సబ్జెక్టులకు 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో 29 (85) మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లే.

గణితం వంద మార్కులకే..

గణిత ప్రశ్నపత్రం 1990 సంవత్సరం నుంచి 150 మార్కులకు ఉండేది. ఆ తర్వాత దీన్ని గణితం-1ఏ, గణితం-1బిగా మార్చారు. ఒక్కో పేపరు 75 మార్కుల చొప్పున రెండు పేపర్ల విధానాన్ని ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. తాజాగా జూనియర్ ఇంటర్ విద్యార్థులకు గణితంలో ఒకే పేపరు విధానాన్ని ప్రవేశపెట్టారు. మార్కులను వందకు కుదించారు. ఇంటర్ ప్రథమ ఏడాది పరీక్ష విధానంలో వచ్చిన మార్పులపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని, మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహిస్తున్నామని ఇంటర్ విద్య జిల్లా అధికారి నీలావతి దేవి చెప్పారు. ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌లో భాగంగా పరీక్షా విధానం మారింది. తడబాటుకు గురికాకుండా పరీక్షలు బాగా రాసేలా జూనియర్ ఇంటర్ విద్యార్థులకు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.

కార్ల కేసులో ప్రధాన నిందితుడు ఎక్కడ?

రామకృష్ణ అలియాస్ ఆర్‌కె పట్టుబడితే మరిన్ని విషయాలు వెలుగులోకి..

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: దొంగ, ఫైనాన్స్ కార్ల కేసులో ప్రధాన నిందితుడిని ఇంత వరకు పోలీసులు పట్టుకోలేదని సమాచారం. ఇంత వరకు ఈ కేసులో వెంకటనాయుడు, భాను, అంజిలే ప్రధాన సూత్రదారులుగా అనుకుంటున్న తరుణంలో వీరికి గురువుగా ఉన్న నకరికల్లుకు చెందిన పి.రామకృష్ణ అలియాస్ ఆర్‌కే ప్రధాన సూత్రధారిగా పోలీసులు దర్యాప్తులో గుర్తించినా ఇంత వరకు అతని జాడ కనిపెట్టలేదు. రోడ్డు ప్రమాదం జరిగిన మరుసటి రోజే రామకృష్ణ సోదరుని కుమారుడిని చిలకలూరిపేట పోలీసులు తీసుకొచ్చి విచారించి పంపించేశారు. ఇతను వైకాపా హయాంలో మాజీ మంత్రి అంబటి రాంబాబుతో సన్నిహితంగా ఉండేవాడు. అప్పట్లోనే కార్లను దొంగతనంగా తీసుకొచ్చి స్థానికంగా విక్రయించే వాడని సమాచారం. ఆ సమయంలో కార్ల వ్యవహారం విషయమై హైదరాబాదులో కేసు నమోదైంది. దీంతో తెలంగాణ పోలీసులు నకరికల్లుకు వచ్చిన సమయంలో మాజీ మంత్రి అంబటి కార్ల వ్యవహారం బయటకు రానివ్వకుండా చక్కబెట్టారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులతో సన్నిహితంగా ఉండటం ఆర్‌కే కు వెన్నతో పెట్టిన విద్య.

ఇంటి నుంచే అక్రమ వ్యవహారం!

వెంకటనాయుడు బృందానికి రామకృష్ణ నాయకత్వం వహించి అక్రమ కార్యకలాపాలకు అండగా నిలిచే వాడని, రూ.లక్షల విలువైన కార్లను టార్గెట్‌గా చేసుకొని అక్రమాలకు పాల్పడేవాడు. చోరీ చేసిన తెచ్చిన కార్లను రామకృష్ణ ఇంటి వద్ద ఉంచి నంబర్ ప్లేట్లు మార్చి వేరే వారికి విక్రయించే వారు. ఈ తతంగమంతా రామకృష్ణ కనుసన్నలలోనే జరిగేదని సమాచారం. వీరందరికి పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు వద్ద గెస్ట్‌హౌస్ ఉందని, అక్రమ కార్యకలాపాలకు దాన్ని అడ్డాగా వినియోగించుకునే వారు. అంజి, భాను ఇచ్చిన సమాచారంతో మొత్తం 22 కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా కార్లనే కాకుండా రూ.లక్షల విలువైన ద్విచక్రవాహనాలు, ఫైనాన్స్ చెల్లించలేని వాటిని గుర్తించి తక్కువ ధరకు కొనుగోలు చేసి నంబర్లు, రంగులు మార్చి అధిక ధరకు విక్రయించే వారు. కారు ప్రమాద సమయంలో రామకృష్ణ ఇంటి వద్ద కార్లు కాకుండా విలువైన ద్విచక్రవాహనాలు ఉన్నట్లు తెలియటంతో పోలీసులు అక్కడికి వెళ్లి విచారించారు. అయితే అప్పటికే అక్కడి నుంచి వాటిని తప్పించేశారు. ఇదంతా ఒకలా ఉంటే ఏఎస్సై కుమారుడు వెంకట నాయుడు రోజుకో కారులో తిరుగుతూ నకరికల్లు, నరసరావుపేట పట్టణాల్లో చక్కర్లు కొట్టడం గమనార్హం.

కొనసాగుతున్న విచారణ

కారు ప్రమాద నిందితులు అయిదుగురి విచారణ నాదెండ్ల పోలీసుస్టేషన్‌లో కొనసాగుతోంది. ఈ విచారణలో నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు మూడు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. నేటితో నిందితుల విచారణ పూర్తి కానుంది. అయితే దర్యాప్తు బృందంలో కొందరు పోలీసులను బదిలీ చేసిన విషయం తెలిసిందే. వారిని సోమవారంలోగా ఆయా పోలీస్‌స్టేషన్లలో రిపోర్టు చేయాలని ఉన్నతాధికారులు సూచించారు.

గుండ్లకమ్మలో నిల్వ చేసిన ఇసుక దిబ్బలు

అక్రమంగా తవ్వేసి... అప్పనంగా దోచేసి..

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: మండలంలో గోకనకొండ సమీపంలోని గుండ్లకమ్మ నదిలో ఇసుకను కొందరు అక్రమార్కులు అడ్డగోలుగా దోచేస్తున్నారు. ఇటీవల మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నదికి పెద్దఎత్తున వరద రావడంతో భారీగా ఇసుక మేటలు ఏర్పడ్డాయి. ఇది ఇసుక అక్రమ వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక పేదల ఇంటి నిర్మాణాలకు ఉచిత ఇసుక పథకం ప్రవేశపెట్టింది. దీన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు యథేచ్ఛగా దందా నిర్వహిస్తున్నారు. గుండ్లకమ్మ నదిలోకి ట్రాక్టరు వెళ్లడానికి దారి ఏర్పాటు చేసి భారీ యంత్రాలతో ఇసుకను తోడి కుప్పలుగా పోస్తున్నారు. కొందరు అక్కడే జల్లెడ పట్టి ట్రాక్టర్లు నింపుతున్నారు. నిజంగా అవసరం ఉన్న వారు వస్తే బెదిరిస్తున్నారు. అక్రమార్కులు అడుగడుగునా తమ అనుయాయులను కాపలాగా ఉంచి ఎవరైనా అధికారులు, కొత్త వారు వస్తే ఫోన్‌లో సమాచారం చేరవేసేలా ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయమై తహసీల్దార్ సురేష్‌ను సంప్రదించగా పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని నది వద్ద పర్యవేక్షణకు పంపుతామని అనధికారికంగా ఎవరూ ఇసుక తరలించకుండా చర్యలు చేపడతామన్నారు.

రెండు చుక్కలతో భవిత భద్రం

చుక్కల మందు వేస్తున్న అరవింద బాబు, శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట అర్బన్: రెండు చుక్కల మందు చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి కాపాడుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో పల్స్ పోలియో కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. చిన్నారుల భవిష్యత్తు కాపాడేందుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి టీకాలు వేయిస్తుందని తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ జిల్లాలో 1137 చుక్కల మందు పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రయాణాల్లో ఉన్న వారు సైతం అయిదేళ్లలోపు చిన్నారులకు బస్టాండ్, రైల్వేస్టేషన్లలో చుక్కల మందు వేయించాలని సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే అరవిందబాబు పోలియో కేంద్రాలను సందర్శించి పోలియో చుక్కలు

జిల్లాలో 94.8 శాతం పల్స్ పోలియో.. జిల్లాలో జాతీయ ఇమ్యునైజేషన్ కార్యక్రమం 2025 కింద ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు డీఐవో డాక్టర్ రాంబాబు పేర్కొన్నారు. 1147 కేంద్రాల్లో పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. మొత్తం 94.8 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. జిల్లాలో 189746 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉండగా వారిలో 179895 మందికి వేశామన్నారు. మిగిలిన వారికి 22, 23 తేదీల్లో సిబ్బంది గృహాలను సందర్శించి పోలియో చుక్కలు వేస్తారని సహకరించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ రైతులకు శుభవార్త

రైతు సోదరులారా కేంద్ర వ్యవసాయ శాఖ వారి e-ANNADATA లో సభ్యత్వం తీసుకోండి.

e-Annadata

ఏజంట్లు కావలెను

e-అన్నదాత కార్డులు రైతులకు పంపిణీ చేయుటకు ఏజంట్లు కావలెను

మరియు మీ మండలాల్లో త్వరలో ప్రారంభించే e-అన్నదాత క్యాంటీన్లు (ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు) కావలసినవారు సంప్రదించండి.

ఇట్లు: కన్నా రవి దేవరాజు (BJP)

e-అన్నదాత A.P కో ఆర్డినేటర్, ✆ 96184 25367

అవే పనులు మళ్లీ చేయడం కుదరదిక

యుక్తధార పోర్టల్‌తో అక్రమాలకు అడ్డుకట్ట

న్యూస్‌టుడే, నరసరావుపేట

జిల్లాలో ఇలా..

మొత్తం జాబ్‌కార్డులు : **3,16,335**

ఉపాధి శ్రామికులు : **5,41,594**

2025–26లో పనులు కల్పిస్తున్న శ్రామికుల లక్ష్యం మొత్తం : **74.04 లక్షలు**

అవే పంట కాలువలు.. అదే శ్రామికులు.. ఏటా అక్కడే పనులు.. ఇదీ ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం పనుల తీరు. మొక్కుబడి పనులు.. తప్పుడు లెక్కలు.. సాంకేతిక పరిజ్ఞానాన్ని మస్కా కొట్టే హాజరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం, సామాజిక తనిఖీల్లో కొన్ని అక్రమాలు బయటపడటం పరిపాటిగా మారుతోంది. పనులు పూర్తయిన తర్వాత అక్రమాలను గుర్తించడం కాకుండా అసలు అవకతవకలకే ఆస్కారం లేని చర్యల్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. చేసిన పనులే మళ్లీ చేయడం కుదరనివ్వకుండా యుక్తధార పోర్టల్‌ను రూపకల్పన చేసింది. ఇందులో నమోదు చేసిన పనులకే ఇకనుంచి అనుమతి లభించనుంది. జీఐఎస్ పరిజ్ఞానంతో వాస్తవికంగా జరిగిన పనులు.. వాటిలో పాల్గొన్న శ్రామికులకే బిల్లులు, వేతనాలు చెల్లించనున్నారు. ఇప్పటికే జిల్లాలో యుక్తధార పోర్టల్‌లో పనుల వివరాల నమోదు ప్రక్రియ మొదలైంది.

ఉపాధి పనిలో శ్రామికులు

పనుల గుర్తింపు

2026-27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టేందుకు ఉపాధి పనుల్ని గ్రామ సభల ద్వారా జిల్లాలోని 530 పంచాయతీల్లో గుర్తించారు. వాటికి ఆమోదం కూడా తీసుకున్నారు. అయితే పనుల వివరాలన్నింటిని యుక్తధార పోర్టల్‌లో నమోదు చేయాలని తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించాయి. పనుల నమోదు బాధ్యతను టెక్నికల్ అసిస్టెంట్(టీఏ)లకు అప్పగించారు.

❖ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును వికసిత్ భారత్- గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ)(వీబీ-జీ రామ్ జీ)గా కేంద్ర ప్రభుత్వం మార్చింది. అవినీతి, అక్రమాల అడ్డుకట్టకు ఇటీవలే ఈకేవైసీ ప్రక్రియ పూర్తి చేసింది. ఇప్పుడు యుక్తధారతో పనులు సక్రమంగా జరిగేలా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పర్యవేక్షణను ఏర్పాటు చేసింది.

రూ.50 వేలు లాభం చూపి.. రూ.17.61 లక్షలు దోచి

బ్లాక్ ట్రేడింగ్ పేరుతో సైబర్ మోసం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: రూ.50 వేలు లాభం చూపించి సైబర్ నేరగాళ్లు రూ.17.61 లక్షలు దోచేసిన ఘటన పట్టణంలో వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. సత్తెనపల్లికి చెందిన గొట్టిముక్కల వెంకట రాఘవేంద్ర శ్యాంప్రసాద్, ఆయన స్నేహితురాలు నెల్లూరి పద్మావతి టైలరింగ్ కేంద్రం నడుపుతున్నారు. యస్ సెక్యూరిటి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వాట్సాప్ గ్రూపులో మిథాలీ మిశ్రా, రాజీవ్ మాథూర్‌లు వారికి పరిచమయ్యారు. బ్లాక్ ట్రేడింగ్(షేర్లు అమ్మడం కొనడం)లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని ఆశ చూపారు. దీంతో శ్యాంప్రసాద్, విజయలక్ష్మి గత నెల 16న ట్రేడింగ్ కోసం రెండు బ్యాంకు ఖాతాలు తెరిచారు. మొదటి ట్రేడింగ్‌లో వారికి రూ.50 వేలు లాభం చూపించారు. ఆ నగదు విత్‌డ్రా చేసుకున్నారు. ఆ తర్వాత ఎక్కువ పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని సైబర్ నేరగాళ్లు నమ్మించడంతో రూ.17,61,100 పంపించారు. లాభాలు రాకపోగా అసలు కూడా తిరిగి ఇవ్వకపోవడంతో గట్టిగా అడిగారు. నగదు జమ చేయడంలో ఆలస్యం కావడంతో బ్యాంకు ఖాతాలు నిలిపివేశామని, 20 శాతం ట్యాక్స్ కడితే తిరిగి యాక్టివ్ అవుతాయని చెప్పడంతో తాము మోసపోయామని గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు డీ ఐటీ యాక్టు కింద కేసు నమోదు చేశారు.

డీసీసీబీ శాఖల్లో 51 విచారణకు నిర్ణయం

గుంటూరు: జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని సహకార బ్యాంకుల్లో చోటుచేసుకున్న అవకతవకల విషయం అసెంబ్లీలోనూ చర్చనీయాంశమైంది. ప్రభుత్వం దీనిపై హౌస్ కమిటీని నియమించింది. విచారణలో గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కూడా ఉంది. గత నెలలో జరిగిన హౌస్ కమిటీ విచారణకు జిల్లా సహకార బ్యాంకు అధికారులు వెళ్లి సభ్యులు అడిగిన వివరాలు తెలిపారు. జిల్లాలోని సహకార బ్యాంకు శాఖలన్నింటిపైనా 51వ విచారణ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రెండు సార్లు గడువు పెంచింది. తాజాగా కూడా రెండు నెలల్లో విచారణ చేపట్టి నివేదిక అందించాలని సహకార శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం నుంచి జిల్లాలోని సహకార బ్యాంకు శాఖల్లో విచారణ చేయనున్నారు.

తొలుత 19 చోట్ల... ఉమ్మడి గుంటూరు జిల్లాలో సహకార బ్యాంకు బ్రాంచులు 44 ఉన్నాయి. వీటిలో ఉమ్మడి జిల్లా పరిధిలో 19 శాఖల్లో సోమవారం నుంచి సహకార శాఖ అధికారులు విచారణ చేయనున్నారు. పది రోజుల కిందటే బ్యాంకు అధికారులకు సహకార శాఖ అధికారులు నోటీసులు జారీ చేసి విచారణ సమయంలో అడిగిన దస్త్రాలు చూపించేలా ఆదేశాలివ్వాలని సూచించారు. ఈనేపథ్యంలో బ్యాంకు ఇన్‌ఛార్జి సీఈఓ.. బ్రాంచి మేనేజర్లు, ఉద్యోగులు విచారణకు సహకరించాలని సూచనలు చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని పరిపాలన కార్యాలయంతో పాటు నగరంలోని శాఖలు ప్రస్తుతం విచారించనున్న జాబితాలో ఉన్నట్లు తెలిసింది.

వాయు నాణ్యత.. ఏమా కథ!

ఉమ్మడి జిల్లాలో 9 కొత్త కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు

ఈనాడు, అమరావతి

వాయు కాలుష్యాన్ని అధ్యయనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. .ఉమ్మడి గుంటూరు జిల్లాలో 9 కొత్త కేంద్రాల ఏర్పాటుకు కసరత్తు ఆరంభించారు. తద్వారా పారిశ్రామిక, వాహనాల ద్వారా వెలువడుతున్న కాలుష్య స్థాయిలను అంచనా వేయడం తోపాటు..పరిష్కార మార్గాలపై దృష్టి పెట్టనున్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) రాష్ట్రంలో 62 గాలి నాణ్యత పరీక్ష కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా అన్ని పుర, నగరపాలికల్లో ఇవి తప్పక ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కసరత్తు చేస్తున్నారు. ఇందులో అమరావతి, గుంటూరు, పల్నాడు, బాపట్ల రీజియన్‌లో 9 కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. వీటి ద్వారా పారిశ్రామిక, ట్రాఫిక్ వల్ల ఏర్పడుతోన్న కాలుష్యాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం, ప్రజారోగ్యాన్ని కాపాడడానికి ఉన్న మార్గాలపై దృష్టి పెట్టనున్నారు.

గుంటూరులో ఇప్పటికే నాలుగు..

గుంటూరు నగరంలో పదేళ్ల క్రితమే నాలుగు కేంద్రాలు ఏర్పాటయ్యాయి. దేశవ్యాప్తంగా కాలుష్య కోరల్లో చిక్కిన నగరాలపై అధ్యయనం చేసిన కేంద్రప్రభుత్వం, ఆ జాబితాలో గుంటూరు కూడా ఉన్నట్లు తేల్చింది. ఇక్కడ వాయు నాణ్యతను పెంచడానికి అప్పట్లోనే కసరత్తు ప్రారంభించి, ఈ కేంద్రాల ఏర్పాటుకు పూనుకుంది. అలాగే, ఏటా రూ.కోట్లు మంజూరు చేస్తోంది. ఆ నిధులతో జీఎంసీ పరిధిలో పలు కార్యక్రమాలు చేపట్టారు. వాహనాల కాలుష్యాన్ని తగ్గించేందుకు చెత్త తరలింపునకు 200 ఈ-ఆటోలు సమకూర్చారు. సీసీరోడ్ల నిర్మాణం, మొక్కల పెంపు..ఇలా అనేకం ఈ జాబితాలో ఉన్నాయి. నాలుగు కేంద్రాల ద్వారా ఎప్పటికప్పుడు గాలి కాలుష్యాన్ని అధ్యయనం చేస్తుండగా.. ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో తాజాగా ఉమ్మడి జిల్లాలో మరికొన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

(c) eenadu

ఈఎస్‌ఎల్ క్రీడా సంబరానికి సై

నేటి నుంచి క్రికెట్ మ్యాచ్‌లు

గుంటూరు క్రీడలు, తాడికొండ, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రజెంట్స్' 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్' (ఈఎస్ఎల్)-2025కు రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిభావంతుల్ని వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న 'ఈఎస్ఎల్' పండగ ఆసన్నమైంది. వర్ధమాన క్రికెటర్ల ప్రతిభకు వేదికగా నిలుస్తూ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న 'ఈనాడు క్రికెట్' సోమవారం ప్రారంభం కానుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా క్రికెట్ మ్యాచ్‌లకు చలపతి ఇంజినీరింగ్ కళాశాల (ఎన్ఐఏటీ) మోతడక క్యాంపస్‌లోని క్రికెట్ మైదానాలు ఇందుకు వేదిక కానున్నాయి. జూనియర్ విభాగంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, సీనియర్ కేటగిరీలో డిగ్రీ, ఇంజినీరింగ్, పీజీ, మెడికల్, ఫార్మా కళాశాలల జట్లు క్రికెట్ టోర్నీలో తమ అదృష్టం పరీక్షించుకోనున్నాయి. తొలుత జిల్లా స్థాయిలో మ్యాచ్‌లు జరుగుతాయి. సోమవారం జిల్లా స్థాయి మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. అనంతరం ప్రాంతీయ స్థాయిలో మ్యాచ్‌లు నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారు. తర్వాత రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయి.

EENADU SPORTS LEAGUE 2025

Aster Ramesh HOSPITALS We'll Treat You Well

వేదిక: చలపతి ఇంజినీరింగ్ కళాశాల (ఎన్ఐఏటీ)

షెడ్యూల్ ఇలా.. గ్రౌండ్-1 ☛ ఉదయం 9.00 గంటలకు యూనివర్సల్ ఇంజినీరింగ్ కళాశాల వర్సెస్ చలపతి ఇంజినీరింగ్ కళాశాల(ఎన్ఐటీఏ) ☛ ఉదయం 11.30 గంటలకు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల వర్సెస్ ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట **గ్రౌండ్-2** ☛ ఉదయం 9.00 గంటలకు కేఎల్ యూనివర్సిటీ వర్సెస్ ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాల, నరసరావుపేట ☛ ఉదయం 11.30 గంటలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల వర్సెస్ ఎన్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, విశదల

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Protein Partner: NECC నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Regional Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
District Sponsor: City Chalapathi Institute of Technology AUTONOMOUS MOTHADAKA CAMPUS
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్ · TV Partner: ETV Bharat, ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

కష్టాల్ని చూశారు.. కసిగా ఎదిగారు..!

ఫుట్‌బాల్‌లో రాణిస్తున్న క్రీడాకారులు ★ సౌత్‌జోన్ పోటీల్లో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం

న్యూస్‌టుడే నరసరావుపేట క్రీడలు

తల్లిదండ్రుల కష్టాన్ని చిన్నతనం నుంచి చూసిన ఆ యువకులు ఉన్నతంగా ఎదగాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచంలోనే ఆదరణ ఉన్న ఫుట్‌బాల్ క్రీడను ఎంచుకున్నారు. నిరంతర సాధనతో పాఠశాల స్థాయి నుంచే ప్రతిభ చాటుతున్నారు. తాజాగా ఏఎన్‌యూ అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ పోటీలకు నరసరావుపేట వాసవి డిగ్రీ కళాశాల తరఫున పాల్గొని తృతీయ స్థానం సాధించారు. నలుగురు క్రీడాకారులు ఏఎన్‌యూ విశ్వవిద్యాలయం ఫుట్‌బాల్ జట్టులో చోటు దక్కించుకొన్నారు. ఈనెల 22నుంచి 25 వరకు కేరళ రాష్ట్రంలోని కాలికట్ విశ్వ విద్యాలయంలో నిర్వహించే సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో ఏఎన్‌యూ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు.

శిక్షణ పొందుతున్న ఫుట్‌బాల్ ఆటగాళ్లు

జాతీయ స్థాయిలో గుర్తింపు

నరసరావుపేటకు చెందిన **షేక్ నాగషరీఫ్** ప్రాథమిక విద్య నుంచి ఫుట్‌బాల్ ఆడుతూ ఎన్నో పతకాలు సాధించాడు. 2024, 2025లో ఏఎన్‌యూ విశ్వవిద్యాలయం ఫుట్‌బాల్ జట్టులో స్ట్రైకర్‌గా ఆడాడు. అండర్-14,17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాడు. 2023లో కశ్మీర్‌లో జరిగిన అండర్-19లో జాతీయ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించాడు. ఈ తర్వాత హైదరాబాదులోని ఫిలికానా క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. క్రీడా కోటాలో ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు.

గోల్స్ వేయడంలో దిట్ట



నరసరావుపేటకు చెందిన **సయ్యద్ రవూఫ్** ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటుతున్నాడు. మిడ్ ఫీల్డ్, ఫార్వర్డ్ ఇలా ఏ స్థానంలోనైనా మైదానంలో చురుకుగా పరుగులు తీస్తూ గోల్స్ చేయడంలో దిట్ట. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగంలో 5సార్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. 2023 కశ్మీర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో తొలిసారి జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. తాజాగా ఏఎన్‌యూ విశ్వవిద్యాలయం ఫుట్‌బాల్ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యం

నరసరావుపేట పట్టణానికి చెందిన **ముకేష్** కొన్నేళ్లుగా ఫుట్‌బాల్ ఆడుతూ ఎన్నో పతకాలు సాధించాడు. 2024లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో మణిపూర్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టుకు సారథిగా వ్యవహరించాడు. తాజాగా ఏఎన్‌యూ అంతర్ కళాశాలల ఫుట్‌బాల్ పోటీలో పాల్గొన్నాడు. మిడ్‌ఫీల్డర్‌గా ప్రతిభ చూపి ఏఎన్‌యూ విశ్వ విద్యాలయం జట్టుకు ఎంపికయ్యాడు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా క్రీడా కోటాలో ఉద్యోగం సాధించటమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు.

ఆల్ రౌండర్‌గా సత్తా

పట్టణానికి చెందిన **సయ్యద్ ఖాజాపీర్** ఫుట్‌బాల్ ఆటలో ఆల్‌రౌండర్‌గా ప్రతిభ చాటుతున్నాడు. మిడ్ ఫార్వర్డ్, ఫార్వర్డ్, డిఫెన్స్ ఇలా ఏస్థానంలోనైనా మైదానంలో చిరుతలా కదులుతూ గోల్స్ చేస్తాడు. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024లో నిర్వహించిన అండర్-20 విభాగంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. 2024, 2025లో ఏఎన్‌యూ విశ్వవిద్యాలయం జట్టుకు ఎంపికయ్యాడు. ఆల్‌రౌండర్‌గా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాడు.

అమ్మో.. ఆరు కిలోమీటర్లు!

చిలకలూరిపేట-నరసరావుపేట మార్గంలో భయం గుప్పిట ప్రయాణం

కావూరు (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే: చిలకలూరిపేట- నరసరావుపేట మధ్య 20 కి.మీ. దూరంలో నిత్యం ప్రమాదాలు జరుగుతుండటం, ట్రాఫిక్ నిలిచిపోతుండటంతో వాహనచోదకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాడరేవు- చిలకలూరిపేట - నకరికల్లు అడ్డరోడ్డు 167ఏ జాతీయ రహదారిగా ఉన్న ఈ మార్గాన్ని నాలుగు వరుసలుగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. చిలకలూరిపేట నుంచి వాడరేవు వరకు నాలుగు వరుసల రహదారి పనులు చివరి దశకు చేరుకున్నాయి. చిలకలూరిపేట నుంచి నరసరావుపేట మీదుగా నకరికల్లు అడ్డరోడ్డు వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణానికి ఈ ఏడాది జూన్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తయినా ఇంతవరకు పనులు చేపట్టలేదు. నరసరావుపేట వద్ద బైపాస్‌కు సంబంధించి భూముల యజమానులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడమే దీనికి కారణం. చిలకలూరిపేట పట్టణంలో ఎన్ఆర్‌టీ సెంటర్ నుంచి లింగంగుంట్ల వంతెన దాటే వరకు ఉన్న 6 కి.మీ. దూరం అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఈ మార్గంలో రెండు వైపులా బరమ్స్ పూర్తిగా దెబ్బతినడం, ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు అంచులు దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. కర్నూలు, వినుకొండ వైపు నుంచి వచ్చేవారు నరసరావుపేట, చిలకలూరిపేట మీదుగా గుంటూరు, అమరావతి రాజధాని, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్తుండటంతో విపరీతంగా ట్రాఫిక్ పెరిగింది. ఈ రహదారిలో గంటకు 500 నుంచి 700 వాహనాలు ప్రయాణిస్తున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి.

ఇటీవల ప్రమాదానికి గురైన బస్సు

ఈ ఏడాది ఇలా.. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఈ మార్గంలో 42 ప్రమాదాలు జరగగా 11 మంది మృత్యువాత పడ్డారు. మరో 24 మంది క్షతగాత్రులయ్యారు. రాత్రిపూట ప్రయాణం మరీ ప్రమాదకరంగా మారింది. ముందుగా చిలకలూరిపేట నుంచి నరసరావుపేట వరకు నాలుగు వరుసల రహదారి పూర్తి చేస్తే చాలా వరకు ప్రమాదాలు నివారించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా ఎన్‌హెచ్ 167ఏ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని లింగంగుంట్ల, కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెం, అమీన్‌సాహెబ్‌పాలెం, కావూరు, కేశనుపల్లి తదితర గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

1300 ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుకు సన్నాహాలు

నెల్లూరు ప్రాంత ఆర్టీసీ ఛైర్మన్ సురేష్‌రెడ్డి

వినుకొండ, న్యూస్‌టుడే: ఆర్టీసీ కొత్తగా 1300 ఎలక్ట్రికల్ బస్సుల కొనుగోలుకు సన్నాహాలు చేస్తుందని ఇందుకు కేంద్రం రాయితీ నిధులు విడుదల చేసిందని ఆ సంస్థ నెల్లూరు ప్రాంత ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి తెలిపారు. స్వచ్ఛ బస్టాండ్ పేరుతో వినుకొండ డిపోలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో ఆక్యుపెన్సీ పెరిగిందని ఇందుకు సంస్థకు కొత్త బస్సుల అవసరం ఎంతో ఉందన్నారు. సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయడంతో రాష్ట్రంలో స్త్రీశక్తి పథకం విజయవంతం అయిందన్నారు. సంస్థ తల్లి వంటిందని అది బాగుంటేనే మనం ఉంటామన్న ఆలోచనతో సిబ్బంది పనిచేయాలని, ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. సిబ్బంది చేసే చిన్న పొరపాట్లను ఉన్నతాధికారులు మానవత్వంతో పరిశీలించాలని సూచించారు. బస్టాండ్‌లో సౌకర్యాల కల్పనకు సంస్థల సహాయం తీసుకోవాలన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబరిచిన అన్ని స్థాయిల సిబ్బందిని సత్కరించి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి రజితకుమారి, డిపో మేనేజర్ జె.నాగేశ్వరరావు, భాజపా నాయకులు కట్టా సుబ్బారావు, పెండ్యాల శ్రీనివాసరావు ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు కొమ్మాల పాటి రమేష్‌బాబు, పి.సాంబశివరావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలిని సన్మానిస్తున్న ఆర్టీసీ నెల్లూరు ప్రాంత ఛైర్మన్ సురేష్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి అజితకుమారి తదితరులు

స్వచ్ఛతకు పెద్దపీట.. స్వచ్ఛాంధ్ర..స్వర్ణాంధ్ర స్ఫూర్తితో స్వచ్ఛ బస్టాండ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దాతల సహకారంతో ఐదు జిల్లాలోని 27 డిపోలకు రూ.20లక్షల విలువైన పారిశుద్ధ్య పరికరాలు పంపిణీ చేశారు. ఇందులో చెత్తపోసే డబ్బాలు, చీపుర్లు, క్లీనింగ్ లిక్విడ్, రేపర్‌తో పాటు పొరుగు సేవల సిబ్బంది ధరించేందుకు యాప్రాన్లు, చలికోట్లు ఉన్నాయి. సామాజిక సేవలో భాగంగా పలు సంస్థలు సాయం అందించేందుకు ముందుకొచ్చాయని ఆర్టీసీ బస్టాండ్లలో పరిశుభ్రత మెరుగుపరచడంతో పాటు అవసరమైన డిపోలలో త్వరలో ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ఛైర్మన్ సురేష్‌రెడ్డి తెలిపారు.

చరవాణులతో అంగన్‌వాడీ కార్యకర్తలు

సాఫ్ట్‌వేర్ లోడింగ్

గర్భిణులు, బాలింతలు, అయిదేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ వివరాల్ని పోషణ్ ట్రాకర్‌తోపాటు వివిధ యాప్‌లలో నమోదు చేసేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు కూటమి ప్రభుత్వం 5జీ స్మార్ట్‌ఫోన్లను అందజేసింది. ఈ నెల 11వ తేదీ నుంచి జిల్లావ్యాప్తంగా పంపిణీ ప్రారంభమైంది. నూతన సాఫ్ట్‌వేర్ చేర్చేందుకు సమయం తీసుకోవడంతో అవి వాడుకలోకి రాలేదు. తాజాగా అన్ని ఫోన్లలో నూతన సాఫ్ట్‌వేర్ లోడ్ చేశారు. సోమవారం నుంచి వినియోగంలోకి రానున్నట్లు ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి చెప్పారు. జిల్లాలో 2,031 అంగన్‌వాడీ కేంద్రాలకు ఖరీదైన 5జీ చరవాణులు అందజేసినట్లు ఆమె తెలిపారు.

- న్యూస్‌టుడే, సత్తెనపల్లి

స్వర్ణోత్సవం.. మధుర జ్ఞాపకం

సమావేశమైన పూర్వ విద్యార్థులు, గురువులు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: 'మిత్రమా.. కుశలమా.. ఎన్నాళ్లయ్యిందో నిన్ను చూసి.. బాగా మారిపోయావ్.. ఆరోగ్యం ఎలా ఉంది' అంటూ పూర్వ విద్యార్థులు యోగక్షేమాల్ని తెలుసుకున్నారు. 50 ఏళ్ల తర్వాత వారంతా కలిశారు. పట్టణంలోని శరభయ్య గుప్తా హైందవోన్నత పాఠశాల 1974-75 పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక శుభమస్తు కన్వెన్షన్‌లో స్వర్ణోత్సవ మధుర జ్ఞాపకం నిర్వహించారు. 65 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి సందడి చేశారు. బాల్యం, పాఠశాలలోని మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. బడి నేర్పిన విద్య, క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు చేరామని అభిప్రాయపడ్డారు. విద్యాభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని వారు నిర్ణయించారు. చదువు చెప్పిన గురువులు గుర్రం కోటేశ్వరరావు, తాడేపల్లి సీతారామాంజనేయులు, నూతలపాటి సాంబయ్య, వసంతరావు, అమరావతి జ్ఞానానందం, బేగ్‌ను సత్కరించారు. స్వర్ణోత్సవ నిర్వాహకులు పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ, చినకనకయ్య, పెద్దకనకయ్య, వెంకటేశ్వరరావు, సింహాచలం, మల్లికార్జునరావు, దుర్గారావు, ఇబ్రహీం, సదాశివరావు కీలకంగా వ్యవహరించారు.

శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం
కంఠంరాజు కొండూరు గ్రామము, దుగ్గిరాల మండలం, గుంటూరు జిల్లా.
E-Procurement Tender
శ్రీ అమ్మవారి దేవస్థానము నందు 3 వివిధ అభివృద్ధి పనుల కొరకు టెండర్లు ప్రకటన చేయడమైనది. వివరముల కొరకు https://tender.apeprocurement.gov.in నందు చూడగలరు.
శ్రీ అమ్మవారి సేవలో సం/- కార్యనిర్వహణాధికారి

కాల్‌సెంటర్ సేవలు వినియోగించుకోండి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఆన్‌లైన్ ద్వారా అధికారులకు పంపవచ్చని కలెక్టర్ కృతికా శుక్లా పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఈనెల 22న సోమవారం ప్రజా సమస్యల పరిష్కారవేదిక నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. అర్జీదారులు కాల్ సెంటర్ నంబరు 1100కు ఫోన్ చేసి అర్జీ పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే అర్జీదారులు తమ సమస్యలపై అర్జీలను ఆన్‌లైన్‌లో Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. సమస్యల పరిష్కారానికి సంబంధించిన సమాచారం ఫోన్‌కు పంపుతుందని తెలిపారు. గతంలో అర్జీలు ఇచ్చిన వారు సమస్య పరిష్కారం కాకుంటే పాత రసీదును వెంట తెచ్చుకోవాలని సూచించారు. అర్జీలపై పరిష్కారానికి సంబంధించిన అంశంపై సమాధానాలు, నోటీసులు వాట్సప్‌కు పంపుతారని అర్జీదారులు గమనించాలన్నారు.

హిందూ ధర్మపరిరక్షణ సమష్టి బాధ్యత

వేదికపై జీవీ ఆంజనేయులు, మల్లికార్జునరావు, చండీశ్వరశర్మ, వాసు తదితరులు

వినుకొండ, న్యూస్‌టుడే: హిందూ ధర్మం, సంస్కృతి, ఆలయాలు, ఆడబిడ్డలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ప్రకాశం జిల్లా మేదమెట్ల చండీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు చండీశ్వర శర్మ అన్నారు. స్థానిక ఎన్నెస్పీ కాలనీ మైదానంలో సుంకర శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ వందేమాతరం గీతం విశిష్టతను వివరించారు. ఆ గీతానికి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అందరి గుండెల్లో పెట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణకు ఆర్ఎస్ఎస్ చేస్తున్న కృషిని ఆయన ప్రశంసించారు. జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు సంస్కృతికి చిహ్నాలైన హిందు ఆలయాలను రక్షించుకోవాలని సూచించారు. ఆర్ఎస్ఎస్ రాష్ట్ర ప్రచారక్ వాసు మాట్లాడుతూ శ్రీరాముడు, వివేకానందుడి బాటలో నడిచి దేశాన్ని విశ్వగురు స్థానంలో నిలపాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. వేదికపై గాలి రేవతి శిష్య బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో పారెళ్ల అనసూర్య, ఆర్ఎస్ఎస్ ప్రముఖులు ఇమ్మడిశెట్టి మల్లికార్జున, కాశీవిశ్వనాథం, రవికుమార్, భాజపా పట్టణ అధ్యక్షుడు కోట వెంకట సుధాకరరావు, పట్టణ పురోహితులు యడవల్లి శ్రీనివాసశర్మ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు జొన్నలగడ్డ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల నృత్యం

అదృశ్యం కేసు.. పోక్సోగా మార్పిడి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికకు ప్రేమ పేరుతో నమ్మించి, కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన యువకుడిని నున్న పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన బాలిక (17) విజయవాడ, నున్న పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసించే పెదనాన్న ఇంట్లో ఉండి ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో ఇన్‌స్టాగ్రామ్‌లో రాహుల్ అనే యువకుడు పరిచయం అయ్యాడు. ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పాడు. వాటిని నమ్మిన బాలిక.. ఈ నెల 18న యువకుడితో కలిసి వెళ్లిపోయింది. 19న తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు.

పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు...

అదృశ్యం కేసుపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో బాలిక కిడ్నాపర్ల బారి నుంచి తప్పించుకుని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు తీసుకువచ్చారు. రాహుల్ పక్కా ప్రణాళిక ప్రకారం హైదరాబాద్ నుంచి అద్దె కారు తీసుకొచ్చాడు. పోలీసులకు దొరకకుండా ఉండేందుకు నంబరు ప్లేటు మార్చాడు. స్నేహితులతో కలిసి ఆమెను కిడ్నాప్ చేశాడు. సత్తెనపల్లిలో ఓ లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. దీంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అతడి స్నేహితులపై కిడ్నాప్ సెక్షన్లు పెట్టారు. ప్రధాన నిందితుడితోపాటు సహకరించిన ఇద్దరు స్నేహితులను నున్న పోలీసులు అరెస్టు చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

బాలింత మృతిపై విచారణ

నరసరావుపేట అర్బన్: నరసరావుపేటలోని ప్రభుత్వ వైద్యశాలలో బాలింత మృతి సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వ విజిలెన్స్ డైరెక్టరేట్ ఆదేశాలతో అధికారులు ఆదివారం విచారణ చేశారు. సత్తెనపల్లి వైద్యశాలకు చెందిన గైనకాలజిస్ట్ సుజాత, మరో ముగ్గురితో కూడిన కమిటీ విచారణ చేసినట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ ప్రసూన తెలిపారు. విచారణ నివేదికను ప్రభుత్వానికి పంపుతామని పేర్కొన్నారు. మహిళకు సిజేరియన్‌కు ముందు చేసిన పరీక్షలకు సంబంధించిన నివేదికలు, రక్త పరీక్షల నివేదిక, రక్తం మారిన అంశం అందులో బాధ్యులను ప్రశ్నించి సమాధానాలు రాబట్టారు. చికిత్సలో లోపం ఉందా అనే విషయమై కూడా ఆరా తీస్తున్నట్లు తెలిపారు.

క్రీడలతో పోటీతత్వం అలవడుతుంది

నరసరావుపేట క్రీడలు, న్యూస్‌టుడే: మండలంలో పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి స్మారక ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో ఏఎంఆర్ ఇగ్నైటెడ్ మైండ్స్ 2కె క్రీడోత్సవాలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.తేజోమూర్తి ప్రారంభించి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందన్నారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతిశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ క్రీడోత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి ఫార్మసీ కళాశాలల జట్లు పాల్గొన్నాయని ప్రిన్సిపల్ పి.భార్గవ్‌భూషణ్‌రావు అన్నారు. ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మల్లికార్జున్ డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ కె.కృష్ణారెడ్డి, కళాశాల డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ పావని తదితరులు పాల్గొన్నారు.

క్రీడా జ్యోతితో విద్యార్థినులు, అతిథులు

పోటీల వివరాలిలా.. ✦ మహిళల త్రోబాల్ పోటీల్లో ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాల, చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలు ఫైనల్స్‌కు చేరాయి. ✦ పురుషులు, మహిళల ఖోఖో పోటీల్లో ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాల, చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలు సెమీఫైనల్స్‌కు చేరాయి. ✦ మహిళ 100 మీటర్ల పరుగు పోటీలో సీమ్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థిని జె.ద్వారక మొదటి స్థానం, ఏఎంరెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థిని టి.అశ్విని రెండోస్థానం సాధించారు. ✦ పురుషుల 100 మీటర్ల పరుగులో కేసీరెడ్డి ఫార్మసీ కళాశాల విద్యార్థి బి.విజయ్ ప్రథమ స్థానం సాధించాడు.

బ్రాయిలర్ ధరలు (కిలో/కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 138, రిటైల్ ధర - 165, చికెన్ విత్‌స్కిన్ - 239, చికెన్ స్కిన్‌లెస్ - 272.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232, చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 145, 151, 165 చికెన్ విత్ స్కిన్ - 280 చికెన్ స్కిన్‌లెస్ - 290.

91.9FM Vijayawada 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

EENADU eClassifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 87907 41166.

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph :81422 92071.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

గుంటూరు, పేరేచర్ల NRI IT కాలేజి ప్రక్కన ORRకి మధ్య APCRDA ప్లాట్లు కలవు. ప్లాట్ కొనుగోలుపై రిజిస్ట్రేషన్ ఫ్రీ. 77290 75959, 99591 27008.

TO LET

COMMERCIAL

తెనాలి చెంచుపేట భాను టీస్టాల్ ఎదురు మెయిన్‌రోడ్ ఫేస్‌తో 24X60 అ॥షెడ్డు, 18X30 అ॥ ఖాళీ స్థలం, 4X60 అ॥ సందు అద్దెకు. ✆ 78932 66771.

JOBS

Wanted Software Developer Cloud Adminstrator Fashion Designer Beautician Receptionist (Trainers). ✆ 93472 77429

Wanted Receptionist, Co-ordinator & Office Boys to Work in Educational Institution, Brodipet, 4/9, Guntur. Contact: 90007 46753 Interviews Tuesday (23rd Dec) from 11am.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

డ్రీమ్‌స్కేప్ ఎడ్యుకేషన్ కన్సల్టెంట్స్ గుంటూరులో పనిచేయుటకు టెలికాలర్స్(F) మార్కెటింగ్(M) కావలెను మంచిజీతం + ఇన్సెంటివ్స్ పార్ట్/ఫుల్‌టైం వర్క్ ✆ 9248865536

ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు టెలికాలర్స్, మార్కెటింగ్ ఏజెంట్స్, మరియు సీనియర్ టీం లీడర్స్ కావలెను. ✆ 95500 08995.

ప్రముఖ కంపెనీలలో సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ ఆఫీసర్స్. 10-15 వేలు, 8గం॥ డ్యూటీ, SSC పాస్, 20-50 సం॥. ✆ 85209 77729, 85209 77759.

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్లాస్ ఇన్‌ఛార్జీస్ మరియు క్యాంపస్ ఇన్‌ఛార్జీస్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము : 14000/- నుండి 21000/- వరకు ఇవ్వబడును. అర్హతలు : ఇంటర్ నుండి పి.జి వరకు. వయస్సు: 22 సంవత్సరాలు నుండి 45 సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయ్యి ఉండాలి. సంప్ర॥ 91000 69089.

తెనాలి దగ్గర, దుగ్గిరాలలోని ప్రముఖ కాఫీ పరిశ్రమలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, ప్యాకింగ్ బాయ్స్ కావలెను. రూమ్, క్యాంటీన్ సౌకర్యం కలదు. ✆ 92980 11777, 80961 61777

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, క్యాంపస్ హాస్టల్ A.Oగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 18000/- వరకు ఇవ్వబడును. ఉచిత భోజనము వసతి కల్పించబడును. విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు:22 సం॥ల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర. ✆: 92487 33320.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం, మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

1)మార్కెటింగ్ ఏజెంట్లు, 2) కలెక్షన్ ఏజెంట్లు 3) టెక్నికల్ పర్సన్లు 4) కంప్యూటర్ ఆపరేటర్లు 5) రిసెప్షనిస్ట్ కావలెను. SITI కేబుల్ & బ్రాడ్‌బ్యాండ్ ఆఫీసు, JKC రోడ్, గుంటూరు. 70930 76288.

తెనాలి రిలయన్స్ పెట్రోల్ బంక్‌లో పనిచేయుటకు 2 పంప్ బాయ్స్ (8 గం॥ డ్యూటీ) జీతం: 12 వేలు+ESI & ఎయిర్ బాయ్ ఒకరు కావలెను. 93470 51723.

గుంటూరులోని ప్రముఖ, శానిటరీ షాపులో పనిచేయుటకు అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ (M/F) కావలెను. జీతం 12K - 16K ✆ 94936 56892

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

(c) eenadu

నరసరావుపేట

● నరసరావుపేట ● వినుకొండ ● చిలకలూరిపేట

ప్రేమకు ప్రతిరూపం ఏసుక్రీస్తు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : ద్వేషం విడనాడి ప్రతి ఒక్కరినీ ప్రేమించాలని చెప్పిన మహోన్నతుడు ఏసుక్రీస్తు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. తెదేపా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్తిపాటి గార్డెన్స్‌లో నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఆయన కేక్ కోసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ప్రభువు ఆశీస్సులతో అందరూ ఆనందంగా ఉండాలనే గొప్ప సందేశం క్రిస్మస్ పండగ తెలియజేస్తుందన్నారు. పేదరికం లేని సమాజమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. దళితవాడల అభివృద్ధికి ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించారన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ ఛైర్మన్ ఎస్కే రఫాని, యార్డు ఛైర్మన్ షేక్ కరీముల్లా, వైస్ ఛైర్మన్ పిల్లి కోటి, నాయకులు గంగా శ్రీనివాసరావు, మద్దుమాల రవి, ఇనగంటి జగదీష్, కొండా వీరయ్య, కుల్లి చిన్నబాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? పట్టణంలోని అరండల్‌పేటలో డ్రెయినేజీ కాలువ వ్యర్థాలతో నిండిపోయింది. దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. పూడిక తొలగించాలి. - **బాషా, స్థానికుడు** ✔ సిబ్బందిని పంపి డ్రెయినేజీ పూడిక తీయిస్తాం. - **రమాదేవి, పారిశుద్ధ్య అధికారిణి**
– న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

? పట్టణంలో రాజీవ్ గృహకల్ప సముదాయంలో విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. - **రామారావు** ✔ పరిశీలించి ఒరిగిన స్తంభాలను సరిచేయిస్తాం. అవసరమైతే కొత్తవి ఏర్పాటు చేస్తాం. - **లావణ్య, ఏఈ, విద్యుత్తుశాఖ**
– న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

నేడు రేమిడిచర్లకు ఎంపీ, ఎమ్మెల్యే రాక

బొల్లాపల్లి, న్యూస్‌టుడే: బొల్లాపల్లి ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రేమిడిచర్లలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. నిర్మాణం పూర్తి కావడంతో నేడు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేసినట్లు అధ్యక్షుడు పెసల వెంకట నారాయణ తెలిపారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు ప్రారంభిస్తారని వివరించారు. గ్రామంలో జల్‌జీవన్ పథకం పనులు ప్రారంభిస్తారని మాజీ సర్పంచి బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

చురుగ్గా కొత్తపాలెం-కోటప్పకొండ రోడ్డు నిర్మాణం

నరసరావుపేట సెంట్రల్: మండలంలో బసికాపురం పంచాయతీ పరిధి కొత్తపాలెం నుంచి కోటప్పకొండ వరకు 7 కి.మీ మేర రోడ్డు నిర్మాణ పనులు ఏడు నెలలుగా నిలిచాయి. ఈ విషయమై గత నెల 11న 'ఈనాడు'లో 'కంకర పోసి వదిలేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు పనులు ప్రారంభించారు. కోటప్పకొండ తిరునాళ్ల నాటికి పనులు పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించామని పీయూఐ జేఈ ప్రసన్నకుమార్ తెలిపారు.

స్వీయ జాగ్రత్తలే శ్రేయస్కరం

నిబంధనలు మరవద్దంటున్న అధికారులు

వినుకొండ, గణపవరం (చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే

శిరస్త్రాణం లేకుండా ప్రయాణించే వారికి గణపవరం వద్ద పోలీసుల కౌన్సెలింగ్

రోడ్డు ప్రమాదాల్లో పల్నాడు జిల్లా రాష్ట్రంలో ఐదో స్థానంలో ఉండగా అందులో మూడొంతు కేసులు ద్విచక్రవాహనాలవే ఉంటున్నాయి. ఇటీవల రాజధాని అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో ఈ విషయం వెల్లడైంది. అతివేగం నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు వాహనచోదకుడు కిందపడి తలకు గాయమై తీవ్ర రక్తస్రావంతో ప్రాణాలు కోల్పోతున్నారు. శిరస్త్రాణం (హెల్మెట్) ధరిస్తే ప్రమాదం నుంచి బయటపడొచ్చునని రవాణా శాఖ అధికారులు, నిపుణులు సూచిస్తున్నారు.

జిల్లాలో ద్విచక్ర వాహన ప్రమాదాల వివరాలు	
సంవత్సరం	సంఖ్య
2024	182
2025	129 (జూన్ వరకు)

ప్రమాదాలకు కారణాలు

అతి వేగం, ముందు వెళ్తున్న వాహనాలను దాటే క్రమంలో చోదకుడు నియంత్రణ కోల్పోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రహదారి మలుపులు, కూడళ్లు, వంతెనలు, రోడ్ క్రాసింగ్‌లు ప్రమాద కేంద్రాలుగా మారుతున్నాయి. వేకువజామున పొగమంచు కారణంగా ఎదురెదురుగా వాహనాలు కనిపించక ఢీకొన్న సంఘటనలు అనేకం ఉన్నాయి. జాతీయ రహదారులూ నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి.

జరిమానాలు ఇలా..
లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే - రూ.5వేలు
శిరస్త్రాణం లేకుంటే.. - రూ.1000
బీమా పత్రాలు లేనట్లయితే - రూ.2వేలు
కాలుష్యరహిత ధ్రువపత్రం లేకపోతే - రూ.1000

ఇవి పాటిస్తే..

ద్విచక్రవాహన చోదకుడితో పాటు వెనుక కూర్చున్న వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. దీని వల్ల కిందపడినా తలకు ప్రమాదం లేకుండా బయటపడగలరు. డిస్క్ బ్రేకులు ఉన్న బైక్‌లు నడిపే వారు మరింత అప్రమత్తంగా ఉండాలి. రహదారి మలుపుల వద్ద సిగ్నల్ లైట్లు తప్పనిసరిగా వినియోగించాలి. వేగ నియంత్రణ పాటించడం వల్ల ప్రమాదాల సంఖ్య నివారించవచ్చు.

శిరస్త్రాణం తప్పనిసరి

బైక్‌పై వెళ్లే వారు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించి మెడ కింద బెల్టు పెట్టాలి. శిరస్త్రాణం లేకుండా ఎవరైనా రాష్ట్ర, జాతీయ రహదారుల్లో ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తే రవాణా శాఖతో పాటు పోలీస్‌శాఖ రూ.వెయ్యి జరిమానా విధిస్తారని నరసరావుపేట ఎంవీఐ ఎన్.శివనాగేశ్వరరావు అన్నారు. వాహనం నడుపుతున్నప్పుడు నిర్లక్ష్యం వీడి ప్రమాదాల బారిన పడకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం

జీడీసీఎంఎస్ గోదాము, దుకాణ సముదాయం ప్రారంభం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. జిల్లా కేంద్రం నరసరావుపేటలో సత్తెనపల్లి రోడ్డులోని జీడీసీఎంఎస్ కార్యాలయ ఆవరణలో 2,100 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నూతనంగా నిర్మించిన గోదాము, దుకాణ సముదాయాన్ని ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, చదలవాడ అరవింద బాబు, ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, డీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జీడీసీఎంఎస్ ఛైర్మన్ వడ్లమాని హరిబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక వసతులతో ఈ భవన సముదాయం, గోదాములు నిర్మించామన్నారు. జిల్లా అధికారులు హరిగోపాల్, శ్రీనివాసరావు, జనసేన నాయకుడు జిలానీ, మార్కెట్‌యార్డు ఛైర్మన్ శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యేలు చదలవాడ, జీవీ

ప్రజలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

నరసరావుపేట సెంట్రల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని ఇసప్పాలెంలో రూ.2.80 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి స్థలాన్ని ఉచితంగా అందజేసిన దాతలను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థల దాతలు లాం కోటేశ్వరరావు, కంచేటి వరప్రసాద్, బండ్ల రాఘవరావు, నలమాల వేమలయ్య, మున్నంగి ముత్యాలు, రాధ, కోటయ్య శేషయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికాభివృద్ధికి కృషి

నరసరావుపేట అర్బన్: ఆలయ పాలకమండళ్లు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు కృషి చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని శ్రీగంగమ్మ, అంకమ్మ దేవస్థానం పాలక మండలి ప్రమాణ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి పాల్గొన్నారు. అధ్యక్షుడిగా కొత్తమాసు సుధాకర్, సభ్యులుగా దూళిపాళ్ల వెంకటేశ్వర్లు, తవ్వా వీరాంజనేయులు, ఎం.గిరిజారాణి, దమ్మాటి మల్లికార్జున, బొందిలి శివనాగేంద్ర, కె.దుర్గ, ఎ.శ్రీలక్ష్మి, రామమూర్తి, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా దత్తాత్రేయశాస్త్రి బాధ్యతలు స్వీకరించారు.

బ్రాహ్మణి సేవలు అభినందనీయం

యడ్లపాడు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా నారా బ్రాహ్మణి ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని జగ్గాపురంలో తెదేపా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బ్రాహ్మణి జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. కేకు కోసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నేతలు తోట శ్రీనివాసరావు, పోపూరి శ్రీనివాసరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బ్రాహ్మణి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి

మహంకాళి ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: మండలంలో ఇస్సపాలెం శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ఉప్పలపాడు గ్రామానికి చెందిన మహిపతి ఆంజనేయులు, తులసమ్మ దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఆలయ ఈవో మాధవిదేవికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, లక్ష్మి, శివపార్వతి, భార్గవ్, వెంకట నాగశ్రావణి తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందిస్తున్న దాత దంపతులు

పోలియో రహిత సమాజం సాధిద్దాం

చిలకలూరిపేట పట్టణం, వినుకొండ రూరల్, రొంపిచర్ల, యడ్లపాడు, నూజండ్ల, కనమర్లపూడి(శావల్యాపురం), ఈపూరు, న్యూస్‌టుడే : పోలియో రహిత సమాజ స్థాపన లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆయా నియోజకవర్గాల్లో అయిదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు పంపిణీ చేసి మాట్లాడారు. పురుషోత్తమపట్నంలో ప్రత్తిపాటి ఫౌండేషన్, శంకర కంటి ఆసుపత్రి, రమేష్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రారంభించారు. యార్డు ఛైర్మన్ షేక్ కరీముల్లా, జనసేన పార్టీ ఇన్‌ఛార్జి తోట రాజారమేష్, తెదేపా సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు తదితరులు పాల్గొన్నారు. వినుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే జీవీ మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కొక్కరికి రూ.25 లక్షల ఆరోగ్య బీమాను వచ్చే ఏప్రిల్‌లో అందుబాటులోకి తీసుకు రానున్నారన్నారు. జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, కౌన్సిలర్ షకీలా, సూపరింటెండెంట్ దయానిధి తదితరులు పాల్గొన్నారు. ఈపూరు మండలం ముప్పాళ్లలో జిల్లా వైద్యాధికారి రవి ముప్పాళ్లను సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ముప్పాళ్ల, కొచ్చెర్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు షమీమ, సుచరిత పాల్గొన్నారు. శావల్యాపురం మండలం కనమర్లపూడిలో జిల్లా కుష్ఠు, క్షయ ఎయిడ్స్ నియంత్రణ విభాగం వైద్యాధికారిణి మాధవీలత పల్స్ పోలియోను ప్రారంభించారు. వైద్యాధికారి ఎం.రాధాకృష్ణన్ పాల్గొన్నారు. రొంపిచర్ల మండలం రొంపిచర్ల, గోగులపాడులో పల్స్ పోలియో కార్యక్రమాన్ని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా అధికారిణి స్వర్ణ రాజేశ్వరి పరిశీలించారు. వైద్యులు డాక్టర్ జగన్‌నరసింహారెడ్డి, సాయిబాబు, రేవతిబాయి తదితరులు పర్యవేక్షించారు. నూజండ్ల మండలం కమ్మవారిపాలెం యానాది కాలనీలో మండల తెదేపా అధ్యక్షుడు గంగినేని రాధాకృష్ణమూర్తి (బాబు) చిన్నారికి పోలియో చుక్కల పంపిణీ ప్రారంభించారు.

ఈపూరు: ముప్పాళ్లలో పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా వైద్యాధికారి రవి

శావల్యాపురం: కనమర్లపూడిలో వైద్యాధికారిణి మాధవీలత

నిర్లక్ష్యం ఎగబాకుతోంది

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో నరగాయకుంట శ్మశాన వాటిక ప్రహరీ వద్ద విద్యుత్తు స్తంభానికి పిచ్చి చెట్టు తీగలు ఎగబాకాయి. ప్రతి వారం మరమ్మతుల పేరిట విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్న సిబ్బంది ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తీగలకు ఆకులు అల్లుకోవడంతో తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోందని వాపోతున్నారు. ఈ విషయమై పట్టణ విద్యుత్తు ఏఈ పిచ్చయ్యను సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రమాదం వేలాడుతోంది

వినుకొండ రూరల్: మండలంలో అందుగుల కొత్తపాలెంలోని ఎస్సీ కాలనీలో సిమెంటు రోడ్డు అడుగున మట్టి కొట్టుకుపోయి బలహీనంగా మారింది. మొంథా తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వరద నీటి ఉద్ధృతి ఎక్కువై రోడ్డు కింద నుంచి నీరు పారడంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. దానిని పంచాయతీ అధికారులు పూడ్చలేదు. దీంతో ఈ ప్రాంతం వాలుగా మారి తరచూ వృథా నీరంతా ఇదే మార్గంలో వెళుతోంది. ఈ రహదారిపై బరువైన వాహనాలు వెళితే రోడ్డు కూలడం ఖాయం.

పక్కనే విద్యుత్తు స్తంభం ఉండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సందీప్‌ను సంప్రదించగా పరిశీలించి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

చువ్వలు చొచ్చుకుపోతాయ్.. జాగ్రత్త

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట), న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిరంతరం రద్దీగా ఉండే మల్లమ్మ సెంటర్, పల్నాడు రోడ్లలో కొన్ని వాహనాలు భవన నిర్మాణ సామగ్రి తరలింపులో జాగ్రత్తలు పాటించడం లేదు. పరిమితికి మించి ఇనుప చువ్వలు నింపుకొని ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. కనీస భద్రత నిబంధనలు పాటించడంలేదని చోదకులు వాపోతున్నారు. లోడుతో వెళ్లే వాహనం అకస్మాత్తుగా ఆపేస్తే వెనుక వచ్చేవారికి చువ్వలు గుచ్చుకుని ప్రమాదం జరిగే అవకాశముంది. ఇలాంటి లోడు వాహనాలను ట్రాఫిక్ రద్దీ లేని సమయంలో మాత్రమే అనుమతించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాఫిక్ ఎస్సై వేణును అడగ్గా పట్టణంలో పరిమితికి మించి ప్రమాదకర వస్తువులుతో ప్రయాణించే వాహనాలు రద్దీ సమయంలో రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎట్టకేలకు విద్యుత్తు తీగల తొలగింపు

ఈనాడు కథనాలకు స్పందన

గణపవరం(చిలకలూరిపేట గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం గణపవరం గ్రామస్థులు దాతల సహకారంతో రూ.4కోట్ల వ్యయంతో కుప్పగంజి వాగు పక్కన అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులు చేపట్టారు. ఈ ఆలయం మధ్య నుంచి విద్యుత్తు లైన్లు ఉన్నాయి. వాటిని తొలగించకపోవడంతో పనులకు ఆటంకం కలిగింది. ఈ విషయమై 'ఈనాడు'లో 'ఆలయ పనులకు ఆటంకం తొలగేదెన్నడు..?' శీర్షికన ప్రచురించిన కథనానికి విద్యుత్తుశాఖ అధికారులు స్పందించారు. ఎట్టకేలకు తీగలు తొలగించి విద్యుత్తు లైను పక్కకు మార్చడంతో ఆలయ నిర్మాణ పనులు వేగవంతం అయ్యాయి. సమస్య పరిష్కారమైనందుకు అయ్యప్ప భక్తులు ఆనందం వెలిబుచ్చారు.

బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలో బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం నుంచి గ్రామంలోకి వెళ్లే మార్గంలో రహదారి మరమ్మతుల్లో భాగంగా పలుచోట్ల రోడ్డును తవ్వి వదిలివేశారు. దీనిపై 'ఈనాడు'లో ఈనెల 2న 'తవ్వి వదిలేశారు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు చేపట్టి పూర్తి చేశారు. ఈ సందర్భంగా బొప్పూడి, రాజాపేట, గోపాళంవారిపాలెం గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

రహదారికి మరమ్మతులు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల నుంచి నాదెండ్ల మండలం గణపవరం వైపు వెళ్లే రహదారి ఇటీవల తుపానుకు దెబ్బతింది. ఈ మార్గంలో ప్రయాణం నరకంగా మారింది. ఈ నేపథ్యంలో 'అంచుకెళ్తే అపాయమే' శీర్షికన ఈనెల 16న 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో స్పందించిన అధికారులు మరమ్మతులు చేపట్టారు. దీంతో రెండు గ్రామాల ప్రజలు హర్షం వెలిబుచ్చారు.

బెట్టింగ్‌లో డబ్బు కోల్పోయి.. తుపాకీతో కాల్చుకుని..!

హైడ్రా కమిషనర్ వ్యక్తిగత భద్రతాధికారి ఆత్మహత్యాయత్నం

ఈనాడు, హైదరాబాద్ - హాయత్‌నగర్, న్యూస్‌టుడే: బెట్టింగ్, గేమింగ్ యాప్‌లలో ఆడుతూ భారీగా డబ్బు నష్టపోయిన ఏఆర్ కానిస్టేబుల్, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యక్తిగత భద్రతాధికారి (పీఎస్‌వో)గా పనిచేస్తున్న కృష్ణచైతన్య ఇంట్లో తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు యత్నించారు. హైదరాబాద్‌లోని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన కలకలం రేపింది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని రావిపాడుకు చెందిన ముత్యాలపామటి శివరామప్రసాద్‌కు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడు, హైడ్రా కమిషనర్‌కు వ్యక్తిగత భద్రతాధికారి (గన్‌మేన్)గా విధులు నిర్వహిస్తున్న కృష్ణచైతన్య (32) హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిసూర్యనగర్‌లో అద్దెకు ఉంటున్నారు. ఆయనకు 2021లో పూజితతో వివాహమైంది. రెండేళ్లుగా ఫోన్‌లో బెట్టింగ్, గేమింగ్ యాప్స్‌లకు అలవాటుపడి రూ.లక్షల్లో నష్టపోయారు. ఈ అప్పులు తీర్చేందుకు బ్యాంకు నుంచి రుణం తీసుకున్నారు. ఈక్రమంలో ఆర్థికపరమైన సమస్యలు చుట్టుముట్టాయి. ఒత్తిడి భరించలేక కృష్ణచైతన్య మే నెలలో ఒకసారి ఇంట్లోంచి వెళ్లిపోవడంతో ఆయన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ కనుగొన్న పోలీసులు సర్దిచెప్పి తల్లిదండ్రులకు అప్పగించారు. కృష్ణచైతన్య పలు ఆరోగ్య సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారు. శనివారం విధులు ముగించుకుని ఇంటికొచ్చిన ఆయన రాత్రి భోజనం చేసి నిద్రపోయారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో పూజిత శౌచాలయానికి వెళ్లగా.. ఆ సమయంలోనే ఆయన తన సర్వీస్ రివాల్వర్‌తో తలపై కాల్చుకున్నారు. శబ్దం రావడంతో భార్య, ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకున్నారు. హుటాహుటిన ఆయనను ఆసుపత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ నాగరాజుగౌడ్ తెలిపారు. విషయం తెలుసుకున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆసుపత్రికి చేరుకుని కృష్ణచైతన్య ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యానికి హైడ్రా చేయూత అందిస్తుందని కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. విధుల్లో కృష్ణచైతన్య అప్రమత్తంగా ఉండేవారని ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు చెబుతున్నారు.

కృష్ణచైతన్య

వైద్య శిబిరాలకు విశేష స్పందన

ఈపూరు, నరసరావుపేట అర్బన్, సంతగుడిపాడు(రొంపిచర్ల), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ వైద్యశాలలు నిర్వహించే ఉచిత మెగా వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, వైద్యులు పిలుపునిచ్చారు. ఈపూరు మండలం ముప్పాళ్లలో నరసరావుపేటకు చెందిన అంజిరెడ్డి ఆసుపత్రి వైద్యులు ఆదివారం వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శిబిరాన్ని సందర్శించారు. వైద్యులు వీరవల్లి వేణు, ఏపీ సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టరు రాపర్ల జగ్గారావు తదితరులు

✦ నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో నేస్తం ట్రస్టు ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ ఆసుపత్రి సహకారంతో కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ట్రస్టు సభ్యుడు డాక్టర్ నూతక్కి శ్రీధర్ ప్రారంభించారు. వైద్యులు 170 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి 90 మందికి కళ్లజోళ్లు అవసరమని, 35 మందికి శస్త్రచికిత్సలు చేయాలని నిర్ధారించారు. కళ్లజోళ్లకు అవసరమైన రూ.40వేలు ఎస్‌బీఐ ట్రైనీ అధికారుల సంఘం (1998) సమకూర్చింది. ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

✦ రొంపిచర్ల మండలం సంతగుడిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో గుంటూరు కిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటైన శిబిరాన్ని హెచ్ఎం శ్రీనివాసరావు ప్రారంభించారు. సీనియర్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఆకుల శివప్రసాద్, సీనియర్ న్యూరో వైద్యుడు ఎస్.ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఊపిరితిత్తుల స్పెషలిస్టు డాక్టర్ మోదేపల్లి అనూష, జనరల్ వైద్యనిపుణుడు డాక్టర్ వడ్లమూడి సుధీర్‌కుమార్ 723 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. స్వగ్రామంలో ఉచితంగా వైద్యసేవలు అందించటం తన బాధ్యత అని డాక్టర్ శివప్రసాద్ అన్నారు.

యూటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

నూజండ్ల, న్యూస్‌టుడే: యూటీఎఫ్ నూజండ్ల మండల శాఖ అధ్యక్షుడిగా ఎ.సోమ సూర్య ప్రకాశరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వినుకొండలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆదివారం నూతన కమిటీ ఎన్నిక జరిగినట్లు యూటీఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ ఆడిట్ కమిటీ సభ్యుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా రామిరెడ్డి, సహాధ్యక్షులుగా అచ్చయ్య, పద్మజ, ప్రధాన కార్యదర్శిగా మల్లికార్జునరావు, కార్యదర్శులుగా 9 మందిని, కోశాధికారిగా గౌస్ మొహిద్దీన్, జిల్లా కౌన్సిలర్‌గా అచ్యుత్ కుమార్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

ప్రతిభ పరీక్షకు భారీగా హాజరు

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో ఎన్నెస్పీ కాల్వ కట్ట వద్ద ఎంకేఆర్‌అండ్‌కేఎల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలోని పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఒలంపియాడ్ నమూనా పరీక్షకు విద్యార్థుల నుంచి స్పందన లభించింది. మూడు నుంచి ఎనిమిది తరగతుల విద్యార్థులు సుమారు 1200 మంది పరీక్ష రాశారని నిర్వాహకులు తెలిపారు. ఇందులో ప్రతి తరగతిలో ప్రతిభ చాటిన మొదటి ముగ్గురికి వరుసగా రూ.2వేలు, రూ.1500, రూ.1000 వంతున నగదు బహుమతి అందజేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎం.కోటిరెడ్డి తెలిపారు.

నిరుపయోగంగా వారధి

చిలకలూరిపేట వద్ద బొందిలపాలెం రోడ్డులో ఓగేరు వాగుపై నిర్మించిన వంతెన ఏళ్లతరబడి ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారింది. ప్రధాన రహదారిపై వాహనాల తాకిడి అధికంగా ఉండడం నిత్యం ట్రాఫిక్ నిలుస్తుండటంతో పట్టణంలో నుంచి జాతీయ రహదారి, పసుమర్రు గ్రామానికి తేలిగ్గా వెళ్లేందుకు ఈ వంతెన నిర్మించారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలోనే రూ.6.5కోట్లు మంజూరు చేసి వంతెన నిర్మాణం పనులు పూర్తిచేశారు. తర్వాత వచ్చిన వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో వంతెన పనులు, ప్రారంభంపై దృష్టిపెట్టలేదు. జాతీయ రహదారి వైపు వంతెన మీదుగా రహదారి నిర్మాణం పూర్తి చేసి ఈ వంతెనను ప్రారంభిస్తే ట్రాఫిక్ అంతా ఇటుగా మళ్లించవచ్చునని,

దీని వల్ల పట్టణంలో ప్రధాన ట్రాఫిక్ సమస్య తీరుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వంలో అధికారులు ఆ దిశగా దృష్టిపెట్టాలని కోరుతున్నారు. ఈ విషయమై డ్రెయినేజీ బోర్డు అధికారులను సంప్రదించగా వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు

- ఈనాడు అమరావతి, - న్యూస్‌టుడే, కళామందిర్‌సెంటర్ (చిలకలూరిపేట పట్టణం)

వర్షం లేదు.. నీరెలా వచ్చిందో?

చిలకలూరిపేట పట్టణంలో మూడు సినిమా హాళ్ల సెంటర్‌లో వివేకానంద విగ్రహం వద్ద మంచి నీటి పైపులైన్ పగిలి నీరు రోడ్డు పాలవుతోంది. ఈ నీరు రోడ్డుపై పారడంతో ఆ ప్రాంతం బురదగా మారింది. ఆ మార్గంలో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. సమస్యను పురపాలక సంఘ ఏఈ మణికుమార్ దృష్టికి తీసుకెళ్లగా పైపులైన్‌కు మరమ్మతులు చేసి నీటి వృథా అరికడతామన్నారు. **- న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం**

రోగులకు పండ్లు పంపిణీ

నరసరావుపేట వ్యవసాయం, వినుకొండ రూరల్, చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లో ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. నరసరావుపేటలోని జిల్లా వైకాపా కార్యాలయంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్‌ను కోశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంచి, సత్తెనపల్లి రోడ్డులోని అనాథాశ్రమంలో పిల్లలకు అన్నదానం నిర్వహించారు. తొలుత పట్టణంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే విడదల రజని తన ఇంటి వద్ద పార్టీ నాయకుల సమక్షంలో భారీ కేక్ కోశారు. వినుకొండలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అమిరెడ్డి అంజిరెడ్డి, నూజండ్ల ఎంపీపీ మేడం జయరామిరెడ్డి ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు, రొట్టెలు పంచారు. విఠంరాజుపల్లిలోని చెవిటి, మూగ, మానసిక దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి కేక్ కోసి అన్నదానం చేశారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

IA:367/2024 in IA:358/2021 in OS:347/2009

Between:

తుర్లపాటి రమాదేవి ... పిటిషనర్/D4

And

కె.రామారావు మరియు ఇతరులు

రెస్పాండెంట్స్/ప్రతివాదులు

పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటిషన్ IA:367/2024 in IA:358/2021 in OS:347/2009 లో చూపబడిన దావా షెడ్యూలు దాఖలా ఆస్తిలో ఐటమ్ నెం:7 ఆస్తిని శ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నరసరావుపేట వారు అప్పాయింట్ చేసిన అడ్వకేట్ కమిషనర్ గారు తన యొక్క రిపోర్టు నందు షెడ్యూలు ప్రాపర్టీ బాగ పంపిణీ చేయుటకు వీలుకానందున శ్రీ కోర్టు వారు పిటిషనర్ మరియు రెస్పాండెంట్స్ మధ్య వేలం వేయు నిమిత్తం నన్ను అడ్వకేట్ కమిషనర్ గా నియమించినందున ది.10-01-2026 న ఉదయం 10:30 లకు సదరు పల్నాడు జిల్లా చిలకలూరిపేట సబ్.డి పసుమర్రు గ్రామం లోని డోర్ నెంబర్ 6-44 (ప్రస్తుతం ఖాళీ స్థలం) గా గల డాబా ఇంటి దగ్గర షెడ్యూలు దాఖల ఆస్తిని అక్కడే బహిరంగ వేలం నిర్వహించబడును. కనుక వేలం పాటలో ఎవరైనా వచ్చి పాల్గొనవచ్చును. కావున యావన్మందికి ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూల్: పల్నాడు జిల్లా (గుంటూరు జిల్లా), నరసరావుపేట రి.డి. చిలకలూరిపేట స.డి. పసుమర్రు గ్రామములోని డోర్ నెం. 6-44 (ప్రస్తుతం ఖాళీ స్థలం) గా గల డాబా ఇంటికి హద్దులు...
తూర్పు: మాకినేని మోహన్ రావు గారి ఇల్లు హద్దు.
దక్షిణం: గొట్టిపాటి హనుమంతరావు గారి ఆస్థి హద్దు.
పడమర: సోమేపల్లి కోటయ్య గారి ఆస్థి హద్దు. **ఉత్తరం :** సర్కారు బజార్.
మొత్తం ఆస్థి మార్కెట్ విలువ: 4,84,000
నోట్: షరతులకు లోబడి వేలం జరపబడును.
వేలం జరుగు తేది: 10-01-2026

ఇట్లు : K.BUCHIDANTACHARI,
Advocate - Commissioner

(c) eenadu

సత్తెనపల్లి

•సత్తెనపల్లి •పెదకూరపాడు •మాచర్ల •గురజాల

బైపాస్ పనులు ముమ్మరం

గురజాల, మాచర్ల: నడికుడి- మాచర్ల జాతీయ రహదారిలో భాగంగా మాచర్ల బైపాస్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైల్వేట్రాక్‌పై గడ్డర్లు ఏర్పాటు చేశారు. ఎంతో కాలంగా అనుమతి కోసం ఎదురు చూసిన గడ్డర్ల ఏర్పాటుతో మాచర్ల బైపాస్ త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మాచర్ల వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. బైపాస్ అందుబాటులోకి వస్తే కారంపూడి, గురజాల నుంచి మాచర్ల మీదుగా నాగార్జునసాగర్, ప్రకాశం జిల్లా వైపు వెళ్లే వాహనాలు పట్టణంలోకి రాకుండా వెళ్తాయి. ఇదే బైపాస్‌లో పాలువాయి గేటు వద్ద కూడా గడ్డర్లను ఏర్పాటు చేయాల్సి ఉంది.

రైల్వే ట్రాక్‌పై ఏర్పాటు చేసిన గడ్డర్లు

97 శాతం మందికి చుక్కల మందు

దుర్గి, న్యూస్‌టుడే: మండలంలో ఆదివారం దుర్గి, ముటుకూరు ఆరోగ్యకేంద్రాల పరిధిలో 97 శాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు ఆరోగ్యకేంద్రాల వైద్యులు భానుప్రకాష్, సుదర్శన్ చెప్పారు. అడిగొప్పల, రాజానగర్, ఓబులేశునిపల్లె, దుర్గి, ముటుకూరు, కంచరగుంట గ్రామాల్లో పోలియో కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో వెస్లీ ఆరా తీశారు.

పల్స్‌పోలియో వివరాలు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వెస్లీ

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
కారంపూడి: 80085 73185 గురజాల: 80085 7 3176

? గ్రామంలోని రామాలయం వీధిలో దీపాలు వెలగక రాత్రుళ్లు ఇబ్బందులు పడుతున్నాం. - **మండాది గ్రామస్తులు**
✔ త్వరలో దీపాలు ఏర్పాటు చేయిస్తాం. - **ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, వెల్దుర్తి
? రాజుపాలెంలోని పునరావాస కాలనీకి వెళ్లే దారిలో చేతి పంపు పని చేయడం లేదు. - **సుబ్రమణ్యం, రాజుపాలెం**
✔ మెటీరియల్ అందింది పంచాయతీ సహకారంతో వెంటనే బాగు చేయిస్తాం. - **శ్రీనివాసరావు, ఏఈ** - న్యూస్‌టుడే, రాజుపాలెం
? దీపాలపల్లెలోని ఖర్షఘాట్ మార్గంలో రోడ్డుపై చెత్త వేస్తున్నారు. ఆ పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారి దుర్వాసన వస్తోంది. - **స్థానికులు**
✔ సిబ్బందిని పంపి చెత్త తొలగించి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. - **రమేష్, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, అమరావతి
? తేలుకుట్లలోని పలు వీధుల్లో చెత్త తొలగించడం లేదు. దోమలు విజృంభిస్తున్నాయి. - **నాగేశ్వరావు, స్థానికుడు**
✔ చెత్తను తొలగిస్తాం.- **సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ

నిబంధన మరవొద్దు.. ప్రమాదం తెచ్చుకోవద్దు

రఘురామ్‌నగర్, రామకృష్ణాపురం (సత్తెనపల్లి), ముప్పాళ్ల, న్యూస్‌టుడే

రోడ్డు ప్రమాదాల్లో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా అయిదో స్థానంలో ఉంది. అందులోనూ సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో ఎక్కువ. పేరేచర్ల- కొండమోడు జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు మలుపులు, బ్లాక్ స్పాట్లలో నిత్యం రక్తమోడుతోంది.

● ప్రమాద మరణాల్లో హెల్మెట్ లేకుండా బైకులు నడిపేవారే 80 శాతం ఉంటున్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారు 65 శాతం ఉంటున్నారు. నిర్లక్ష్యంతో కార్లు నడపడం, బ్లాక్‌స్పాట్ల వద్ద వేగంగా దూసుకెళ్లడంతో మరణాలు సంభవిస్తున్నాయి. జాతీయ రహదారి పొడవునా.. చల్లగుండ్ల బ్రిడ్జి, దేవరంపాడు మిల్లె(నకరికల్లు), పెదమనులపల్లి మలుపు, కొండమోడు(రాజుపాలెం), తాళ్లచెరువు కూడలి(అచ్చంపేట), ఆరుబండుకల భావి సెంటర్(అమరావతి), కట్టమూరు క్రాస్ రోడ్డు, యర్రబాలెం క్రాస్ రోడ్డు(క్రోసూరు)ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ● శిరస్త్రాణం ధరించని ద్విచక్రవాహన చోదకులకు పోలీసులు రూ.వెయ్యి నుంచి రూ.2 వేలు జరిమానా విధిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతుంటే బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేసి, కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తున్నారు.

● రోడ్డు భద్రతా నిబంధనల్ని ప్రతి ఒక్కరూ పాటించాలని డీఎస్పీ హనుమంతరావు ప్రజల్ని కోరారు. స్వీయ జాగ్రత్తలు పాటించడం ఎంతో శ్రేయస్కరమన్నారు.

సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో జనవరి నుంచి నవంబరు వరకు ఘటనలు ఇలా..
* ప్రాణాంతక రోడ్డు ప్రమాదాలు: 73
* సాధారణ ప్రమాదాలు: 72.
* మృతుల సంఖ్య: 81 * క్షతగాత్రులు: 133
* గుర్తించిన బ్లాక్‌స్పాట్లు: 25.
* హెల్మెట్ ధరించని వారిపై కేసులు: 5,237
* డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు: 761

కొండమోడు-పేరేచర్ల జాతీయ రహదారిపై వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పోలియో రహిత సమాజ స్థాపనే ధ్యేయం

పిడుగురాళ్లలో చుక్కలు వేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు

వెల్దుర్తి: చిన్నారికి చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

పోలియో రహిత సమాజ స్థాపనే లక్ష్యమని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అధికారులు, నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకుని ఐదేళ్లలోపు చిన్నారులకు చుక్కల మందు వేశారు. మొబైల్ బృందం ద్వారా ఇటుక బట్టీలు, ఇతర ప్రాంతాల్లోని వలస కూలీల పిల్లలకు చుక్కలు వేశారు. పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, వెల్దుర్తి మండలం ఉప్పలపాడు ఆరోగ్య కేంద్రంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి చిన్నారులకు చుక్కలు వేసి కార్యక్రమం ప్రారంభించారు. - **న్యూస్‌టుడే, బృందం**

ఎర్రబాలెంలో ఇటుక బట్టీల వద్ద..

నారసింహుడిగా శ్రీవారు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారు ఆదివారం వేకువ నారసింహ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. వడ్డవల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలోనూ శ్రీవారికి ప్రత్యేక పూజలు చేశారు.

నరసింహ అవతారంలో శ్రీవారు

భక్తిశ్రద్ధలతో అమ్మవారి పల్లకీసేవ

అడిగొప్పల(దుర్గి), న్యూస్‌టుడే: అడిగొప్పల శ్రీనిదానంపాటి అమ్మవారి పల్లకీ సేవ ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు శనివారం రాత్రి నుంచే అమ్మవారి సన్నిధికి తరలివచ్చారు. పొంగళ్లు చేసి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

సనాతన ధర్మాన్ని పరిరక్షిద్దాం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని, దేవాలయాలు, వాటి ఆస్తులను సంరక్షించడం ప్రతి హిందువు కర్తవ్యమని నిత్యానంద భారతిస్వామి అన్నారు. పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులను దైవసమానంగా గౌరవించి ఆదరించాలన్నారు. హిందూ కుటుంబ జీవన విధానం ప్రపంచానికే ఆదర్శనీయమన్నారు. ఆర్ఎస్ఎస్ సహప్రాంత శారీరిక ప్రముఖ్ వోలేటి రవి మాట్లాడుతూ ప్రపంచానికి జ్ఞానభిక్ష పెట్టిన దేశం మనదే అన్నారు. ప్రజల్లో దేశభక్తి, ఐక్యత పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆధ్యాత్మికవేత్త సుందరం లక్ష్మి ప్రసంగిస్తూ రామాయణం మన జీవన విధానమన్నారు. జీవీఎల్ రావు, కేంద్ర పురస్కారాలు పొందిన కళాకారులు లక్ష్మయ్య, కర్నాటి మురళీలతోపాటు అతిథి సంతానం కలిగిన దంపతులు, వృద్ధాశ్రమ నిర్వాహకులను సత్కరించారు. శిశుమందిర్ విద్యార్థులు దేశభక్తి ప్రదర్శనలు సభికుల్ని ఆకట్టుకున్నాయి. ఏపీ మరాఠా సంఘ కార్యవర్గ సభ్యుడు భానోజీ, నిర్వాహకులు చినసత్యనారాయణ, రవి కుమార్, హరికుమార్, రాంబాబు, సత్యనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నిత్యానంద భారతిస్వామి

ఆర్టీసీ బస్టాండ్ల రూపురేఖలు మారుస్తున్నాం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఆర్టీసీ బస్టాండ్ల రూపురేఖల్ని కూటమి ప్రభుత్వం మారుస్తోందని, పరిశుభ్రత.. సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి తెలిపారు. స్థానిక బస్టాండ్‌లో ఆదివారం స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్రలో భాగంగా స్వచ్ఛత ఉపకరణాలు పంపిణీకి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శ్రీశ్రీ సూపర్‌హిట్ అయ్యిందని, బస్టాండ్లలో వసతులు కూడా మెరుగుపర్చనున్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ అంతటిని పరిశీలించి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని చెప్పారు. పారిశుద్ధ్య కార్మికులు, ఉద్యోగులను సత్కరించారు. ఎన్జీ ఎపిఎస్ఆర్టీసీలో సత్తెనపల్లి డిపో రెండోస్థానం ప్రథమస్థానం సాధించేందుకు కృషి చేయాలని డీఎం విజయకుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. డీపీటీవో అజితకుమారి పాల్గొన్నారు.

బస్సులు తక్కువగా ఉన్నా..

పిడుగురాళ్ల: డిపోలో బస్సులు తక్కువగా ఉన్నా, మహిళలకు ఉచిత బస్సు పథకంలో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కిస్తూ విజయవంతంగా నిర్వహిస్తున్నారని ఆర్టీసీ నెల్లూరు జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి చెప్పారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ డిపోను సందర్శించారు. 28 ఏళ్ల నుంచి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవింగ్ చేసిన కె.రామారావు, కేపీ ఎక్కువ తెచ్చిన డ్రైవర్లు పి.ఎస్.రెడ్డి, ఎస్.కె.జలీల్‌కు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. అత్యధిక ఈపీకే తెచ్చిన కండక్టర్లు వై.ఎస్.రావు, కె.ఎస్.ఎస్.దేవి, బి.ఆదినారాయణ, డి.శ్రీనివాసరావులను సత్కరించారు. బస్సులకు బాగా మరమ్మతులు చేసే మెకానిక్‌లు ఎస్.రామకృష్ణ, కె.రామకృష్ణ, యజ్ఞనారాయణలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. స్వీపర్లుకు స్వెటర్లు, చీరెలు, ఆప్రాన్లు అందజేశారు. డిపో మేనేజరు వెంకటేశ్వరనాయక్ పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న జోనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డి

మాదలలో చోరీ

ముప్పాళ్ల, న్యూస్‌టుడే: మండలంలోని మాదలలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై అనిల్‌కుమార్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జి.బాలనాగేశ్వరమ్మ మూడు నెలల కిందట ఇంట్లో జారిపడటంతో ఆమె కుడిచెయ్యి విరిగింది. దీంతో విజయవాడలోని పెద్ద కుమారుడి వద్ద ఉంటూ చికిత్స పొందుతున్నారు. గ్రామానికి వచ్చి వెళ్తూ ఉన్నారు. ఈనెల 7న మాదల నుంచి విజయవాడ వెళ్లారు. ఇంటి ప్రహరీ గేటు తాళాలు పగలగొట్టి ఉన్నాయని, చోరీ జరిగిందని సమీప బంధువు శనివారం ఆమెకు ఫోన్ చేయడంతో హుటాహుటిన వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. దొంగలు బీరువా తాళాలు పగలగొట్టి 28 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి ఎత్తుకెళ్లారని, వాటి విలువ సుమారు రూ.2.05 లక్షలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆవులవారిపాలెం ఆలయంలో..

క్రోసూరు(అచ్చంపేట): క్రోసూరు మండలం ఆవులవారిపాలెంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు హుండీని దేవాలయ పొలాల్లోకి తీసుకెళ్లి, అందులోని కానుకలు చోరీ చేశారు. ఆదివారం ఆలయ ధర్మకర్త గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హుండీలో సుమారు రూ.40 వేలు నగదు చోరీకి గురైందని చెబుతున్నారు. గత ఆగస్టులోనే నూతనంగా నిర్మించిన ఈ ఆలయం ప్రతిష్ఠ జరిగింది. ఎస్సై రవిబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

దుర్గి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన ముటుకూరులో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి(32) మాచర్లకు వెళ్లేందుకు స్థానిక బస్టాప్ వద్దకు వచ్చింది. శిరిగిరిపాడు నుంచి ముటుకూరు మీదుగా నరసరావుపేటకు వెళ్లే బస్సు రాగా, ఎక్కేందుకు ముందుకు వచ్చే సమయంలో ఆమెను బస్సు ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఆమె భర్త అంకారావు ఫిర్యాదు మేరకు ఎస్సై సుధీర్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

రెంటచింతల, న్యూస్‌టుడే: పశర్లపాడులో కౌలు రైతు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. వీరేపల్లి వెంకటేశ్వర్లు(48) కొన్నేళ్లుగా అయిదెకరాల భూమి కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి సాగు చేస్తున్నారు. పెట్టుబడులు పెరిగి, దిగుబడులు తగ్గడం, మద్దతు ధర లభించక సుమారు రూ.10 లక్షల అప్పులపాలయ్యారు. అప్పులు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై శనివారం పురుగు మందు తాగారు. వెంటనే కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి సంతాపం తెలియజేశారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

గురజాల, న్యూస్‌టుడే: గురజాల నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం సోమవారం జరగనుంది. ప్రధానంగా జంగమహేశ్వరపురాన్ని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలన్న డిమాండు ఉంది. దీనిపై ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. జంగమహేశ్వరపురంలో గ్రామసభ నిర్వహించారు. నగర పంచాయతీ సమావేశంలోనూ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో సమావేశం నిర్వహిస్తుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండగా, ఒకరు రాజీనామా చేశారు. మరొకరు సెలవులో ఉన్నారు. దీంతో 18 మంది హాజరు కానున్నారు. గత ఎన్నికల్లో వైకాపా 16, తెదేపా 3, జనసేన ఒక స్థానంలో విజయం సాధించాయి. మారిన సమీకరణాలలో పలువురు వైకాపా కౌన్సిలర్లు తెదేపా వైపు మొగ్గుచూపడం, వైకాపా నుంచి గెలుపొందిన షేక్ బడేజాని ఛైర్మన్‌గా ఉన్నారు. జంగమహేశ్వరపురాన్ని ప్రత్యేక పంచాయతీ చేయాలని తెదేపా భావిస్తుండగా, వైకాపా వ్యతిరేకిస్తోంది.

సభా వేదిక నిర్మాణానికి భూమిపూజ

మాచవరం, న్యూస్‌టుడే: మాచవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సభా వేదిక నిర్మాణానికి ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. తానా మాజీ అధ్యక్షుడు, చెన్నాయపాలెం గ్రామానికి చెందిన బండ్ల హనుమయ్య ఆధ్వర్యంలో దీనిని నిర్మిస్తున్నారు. తొలుత తెదేపా జిల్లా కార్యవర్గ సభ్యుడు యడ్లపల్లి రామారావు సోదరుడి కుమార్తె పుష్పాలంకరణకు ఆయన హాజరై, చిన్నారిని దీవించారు.

ప్రధానోపాధ్యాయినికి సన్మానం

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న కొప్పునూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని నాగమణి దంపతులను ఆదివారం సన్మానించారు. ఎంఈవో సురేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పేదల సమస్యలపై పోరాటాలు

అచ్చంపేట, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ కాంప్లెక్స్ కూడలి వద్ద ఆదివారం సీపీఐ శత వసంతాల వేడుకలు నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బుజ్జి జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ వందేళ్లుగా తమ పార్టీ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. పేదల సమస్యలపై ఉద్యమాలు నడిపినట్లు వివరించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకుడు ఏడుకొండలును సత్కరించారు. నాయకులు సుభాని, కోటేశ్వరరావు, నరసింహారావు, నూకారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలే లక్ష్యం

నరసరావుపేట సెంట్రల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని పమిడిపాడులో రూ.2.80 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి స్థలాన్ని ఉచితంగా అందజేసిన దాతలను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.

ఆధ్యాత్మికాభివృద్ధికి కృషి.. ఆలయాల పాలకమండళ్లు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు కృషి చేయాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలోని శ్రీగంగమ్మ, అంకమ్మ దేవస్థానం పాలక మండలి ప్రమాణ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి పాల్గొన్నారు. అధ్యక్షుడిగా కొత్తమాసు సుధాకర్, సభ్యులుగా ధూళిపాళ్ల వెంకటేశ్వర్లు, తవ్వా వీరాంజనేయులు, ఎం.గిరిజారాణి, దమ్మాటి మల్లికార్జున, బొందిలి శివనాగేంద్రం బాధ్యతలు స్వీకరించారు.

ప్రతిభ పరీక్షకు స్పందన

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జడ్పీ ఉన్నత పాఠశాలలో పల్నాడు ఉపాధ్యాయులు, అనసూయమాత సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదోతరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభ పరీక్షకు మంచి స్పందన లభించింది. 45 జిల్లా పరిషత్ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, గిరిజన పాఠశాలలు, కస్తూరిబా గాంధీ గురుకుల విద్యాలయాల నుంచి 375 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ బహుమతి రూ.10 వేలు వెదులారపు శ్రీవల్లిక (పందిటివారిపాలెం), ద్వితీయ బహుమతి రూ.5 వేలు పి.శృతి (గణపవరం), తృతీయ బహుమతి రూ.3 వేలు జి.సుశాంక్ అందుకున్నారు. పదహారు మందికి రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహకాలు అందజేశారు. ట్రస్టు నిర్వాహకులు కె.శేషాద్రి, శ్రీనివాసులు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు శంకరనారాయణ, బి.సత్యనారాయణరాజు, బి.వి.రమణ, డి.వెంకటేశ్వర్లు, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మైనార్టీలకు సముచిత స్థానం

బెల్లంకొండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు సముచిత స్థానం దక్కుతోందని రాష్ట్ర మైనార్టీసెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్కే మస్తాన్ షరీఫ్ అన్నారు. నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా షేక్ జానీసైదాను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం బెల్లంకొండలో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రసూల్, వహాబ్, రజాక్, ముస్తఫా, సర్పంచి జ్యోతిసముద్రం పాల్గొన్నారు.

అచ్చంపేట, క్రోసూరు: తెదేపా అధ్యక్షుడిగా జానీసైదా ఎంపిక పట్ల క్రోసూరు మండల తెదేపా అధ్యక్షుడు మొగల్‌జాన్, అచ్చంపేట మండల మైనార్టీ నాయకుడు మౌలాలి, సొసైటీ డైరెక్టర్ ఖాజావలి, మహమ్మద్ సుభాని, రహెమాన్, ఖాసిం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అమరావతి: తెదేపా జిల్లా అధ్యక్షుడిగా అమరావతికి చెందిన షేక్ జానీసైదాను అధిష్ఠానం నియమించడంపై అమరావతిలో పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బృందావన్ సెంటర్, పెదమద్దూరు జంక్షన్ వద్ద బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచిపెట్టారు. తెదేపా నేతలు పలువురు జానీసైదాను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. మైనారిటీలకు పార్టీలో పెద్దపీట వేస్తున్నారని, అందుకు జానీసైదా ఎంపికే నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

బెల్లంకొండలో మిఠాయిలు పంపిణీ చేస్తున్న మస్తాన్ షరీఫ్

గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో జానీసైదాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

మాచర్ల (కారంపూడి): పవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మాచర్లలోని సొసైటీ కాలనీలోని నిరుపేదలకు అన్నదానం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు అప్పారావు, జీజేరావు, మునెయ్య, నాగేశ్వరరావు, కోటయ్య, సాంబశివరావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే: కారంపూడి పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి చేపట్టిన నిర్మాణాన్ని ఆదివారం రాత్రి సంబంధిత అధికారులు కూల్చివేశారు. ఏడేళ్ల కిందట వైకాపాకు చెందిన ఓ నాయకుడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని సర్వే నంబరు 347లో రూ.30 లక్షల విలువ చేసే పంచాయతీ భూమిని ఆక్రమించాడు. ఆపై తనకు పూర్వీకుల నుంచి సంక్రమించినట్లుగా నకిలీ రిజిస్ట్రేషన్ చేయించి, ఆ స్థలంలో దుకాణాన్ని నిర్మించి అద్దెకిచ్చాడు. ఇన్నాళ్లు అద్దె రూపంలో సొమ్ము చేసుకున్నాడు. దీనిపై పలు ఫిర్యాదులు అందడంతో ఎట్టకేలకు ఉన్నతాధికారులు స్పందించారు. వారి సూచనల మేరకు పంచాయతీ అధికారులు దుకాణాన్ని కూల్చి వేశారు. ఈ క్రమంలో ఆక్రమణదారుడికి, పంచాయతీ పాలకుల మధ్య కొంతవాగ్వాదం చోటు చేసుకుంది. పంచాయతీకి చెందిన స్థలాలు, భూములు ఎక్కడ ఆక్రమించినా స్వాధీనం చేసుకుంటామని సర్పంచి సరస్వతిబాయి, కార్యదర్శి కశిన్యానాయక్ తెలిపారు. ఆక్రమణదారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సంకల్ప్‌తో నూతనోత్తేజం

నారాయణపురం, రైల్వేస్టేషన్ రోడ్డు (దాచేపల్లి), న్యూస్‌టుడే

ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ విద్యను గాడిలో పెట్టేందుకు, విద్యా ప్రమాణాలు మరింత బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. కార్పొరేట్ కళాశాలలకు ఏమాత్రం తీసిపోకుండా నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని సంకల్ప్ అమలు చేస్తోంది. ఈ కార్యక్రమం 50 రోజుల పాటు సాగేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, అమలు చేస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు కల్పించింది.

వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం.. దాచేపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 252 మంది చదువుతున్నారు. పబ్లిక్ పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణులు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో భాగంగా సంకల్ప్ కార్యక్రమానికి నవంబరు 24న శ్రీకారం చుట్టారు. ఫిబ్రవరి 20 వరకు సాగనుంది. ఉదయం 9.10 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పాఠాలు బోధిస్తుండగా.. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. అర్ధ సంవత్సరం పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎ,బి,సి కేటగిరీలుగా విభజించారు. వెనుకబడిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టులపై ప్రత్యేకంగా తర్ఫీదు ఇస్తున్నారు. ఏ కేటగిరీ విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు, ప్రాక్టిస్ బిట్స్, అడ్వాన్స్‌డ్ స్టడీ మెటీరియల్ అందించారు. బి, సి కేటగిరీ విద్యార్థులకు ఇంటర్ బోర్డు అందించిన ముఖ్య ప్రశ్నలు, చాప్టర్ వారీగా ముఖ్యాంశాలపై పట్టు సాధించేలా చేస్తున్నారు.

స్టడీ అవర్స్‌లో ఇంటర్ విద్యార్థులు

విద్యార్థుల చదువులో మార్పు

విద్యార్థులందరికీ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు సందేహాలు నివృత్తి చేస్తున్నాం. సంకల్ప్ కార్యక్రమంతో విద్యార్థుల చదువులో మార్పు కనిపిస్తోంది. వారికి ఆత్మవిశ్వాసం కలిగేలా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారు.
- చంద్రశేఖర్, ప్రిన్సిపల్, దాచేపల్లి

26న సీపీఐ వందేళ్ల వేడుకలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఈ నెల 26న జిల్లావ్యాప్తంగా వేడుకలు నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాద్ నాయకులు, కార్యకర్తల్ని కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వందేళ్ల సీపీఐ ప్రస్థానంలో ఎన్నో విజయాలు, పోరాటాలు, పేదలకు ఇళ్లస్థలాలు, భూముల పంపిణీ, కార్మికుల రక్షణ చట్టాల సాధన ఉన్నాయన్నారు. పార్టీ వందేళ్ల వేడుకల్ని వచ్చే జనవరి 18న ఖమ్మంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్, పట్టణ కార్యదర్శి లక్ష్మీచెన్నకేశవరావు, నాయకులు రమేష్‌బాబు, శేషయ్య, శ్రీనివాస్, రామతిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల (కారంపూడి): సీపీఐ శత వార్షిక వేడుకలు జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ అన్నారు. మాచర్లలోని వీరస్వామి భవన్‌లో ఏరియ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులు, కర్షకుల హక్కులకు పోరాటాలు చేశామని, లక్షల మందికి ఇళ్ల స్థలాలు, భూములను తమ పోరాటాలతోనే దక్కాయన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శ మారుతి వరప్రసాద్

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన గుంటూరు సిటీ, వికాస్ నగర్ 5వ లైను కాపురస్తులు ఈదర చంద్రశేఖర్, S/o.ఈదర లక్ష్మీ నారాయణ, గారి సూచనలమేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు ఆస్తి గుంటూరు సిటీ, విద్యానగర్ 4/4వ లైను కాపురస్తులు కొడాలి నరసింహారావుగారి కుమారుడు శశి శేఖరరావు గారు ది.08-08-2018న విక్రయ దస్తావేజు నెం.3541/2018 యస్.ఆర్.ఓ. అమరావతి ద్వారా క్రయం పొంది ఆ తదాది సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవించుచున్న ఆస్తిని విక్రయించుటకు బహిరంగ పరచగా మాక్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి యున్నారు. కావున షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరములు, తనఖాలు, తాకట్లు, కోర్టు జప్తులు, ఇతర క్లయిములు ఉన్నయెడల ఈ ప్రకటన తేది నుండి వారం రోజులలోగా మాకు గాని, మాక్లయింటుకు గాని వ్రాతపూర్వకమైన ఆధారాలతో లిఖితపూర్వకంగా తెలియజేయగలరు. గడువు లోగా షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎట్టి క్లయిములు రాని యెడల నిష్పేచి ఆస్తిగా భావించి మాక్లయింటు సదరు కొడాలి శశి శేఖరరావు వద్ద నుండి సక్రమమైన విక్రయ దస్తావేజును పొందగలరని తదుపరి వచ్చు ఎట్టి క్లయిములు షెడ్యూలు ఆస్తిని గాని, మాక్లయింటు హక్కులను గాని బైండుచేయజాలవు.

షెడ్యూలు:గుంటూరు డి., నరసరావుపేట రి.డి., అమరావతి సబ్ డి. యిలాకా అమరావతి మండలం, కర్లపూడి గ్రామం డి.నెం.204 మింజుమలె య. 2-32శెంట్లు స్థిరాస్తి శేరీ మెరక భూమికి **హద్దులు:తూర్పు :** మంచికలపూడి శేషయ్య గారి భూమి హద్దు,**దక్షిణం:**పోన్నం కృష్ణ గారి భూమి హద్దు,**పడమర:**మంచికలపూడి శ్రీనివాసరావు గారి భూమి హద్దు, **ఉత్తరం:**మంచికలపూడి శ్రీనివాసరావు గారి భూమిహద్దు, **తిరిగి పడమర:** మంచికలపూడి శ్రీనివాసరావు గారి భూమి హద్దు, **తిరిగిఉత్తరం:** సర్కారు డొంక

మన్నవ శ్రావణ్ కుమార్
మన్నవ అపరాజిత,
మన్నవ మదాలస, అడ్వకేట్స్

అడ్రస్ : "అపరాజిత" 4/19, బ్రాడీపేట, గుంటూరు. సెల్ : 9440260814

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
SME మంగళగిరి బ్రాంచ్ (63653), గుంటూరు జిల్లా-522503

ఇ-వేలము రద్దు చేయబడినది

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా **తేది.07.12.2025** న ఈనాడు **(సత్తెనపల్లి ఎడిషన్) & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (విజయవాడ ఎడిషన్)** దినపత్రికలలో ప్రచురించబడిన ఇ-వేలం నోటీసులోని **తేది.23-12-2025** న జరుపవలసిన ఋణగ్రహీత : మెస్సర్స్ శ్వేత పివిసి ఇండస్ట్రీస్, ప్రాతినిథ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్: శ్రీమతి మక్కపాటి కళ్యాణి, **భర్త: జగత్ ప్రతాప్ రంగారావు మరియు శ్రీమతి మక్కపాటి శ్వేత, భర్త : గోరంట్ల విష్ణువర్ధన్ గార్లకు** చెందిన ఆస్తుల ఆన్‌లైన్ ఇ-వేలం కొన్ని సాంకేతిక కారణముల వలన **వేలం రద్దు చేయబడినది.**

తేది : 20.12.2025, ప్రదేశం : మంగళగిరి సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

(c) eenadu

న్యూస్‌టుడే బృందం

చల్లని మనసులు.. చలిని దూరం చేశాయ్..

దాతలను కదిలించిన 'ఈనాడు' పిలుపు

ఈనాడు మీ తోడు

శీతాకాలం వెన్నులో వణుకు పుడుతోంది. ఇంట్లో దుప్పట్లు, రగ్గులు ఎన్ని ఉన్నా ఇంకా ఇబ్బందే. అలాంటిది పేదలు, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే బాలల పరిస్థితి తలచుకుంటేనే అయ్యో అనిపిస్తుంది. కొందరి అవస్థలైనా తీర్చాలనే సత్సంకల్పంతో 'ఈనాడు' దాతల సాయం కోరింది. ఒక్క పిలుపు పలువురిని కదిలించింది. అడిగిందే తడవుగా మేమున్నామంటూ దాతలు స్పందించారు. దుప్పట్లు, రగ్గులు, చాపలు, జంబుఖానాలు.. ఇలా ఎక్కడ ఏది అవసరం ఉందో అవి కొని బాలలకు అందించారు. మరోచోట వసతి గృహ కిటీకీలనే దాత పూర్తిగా మార్పించేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం **రూ. 1,29,400** విలువైన సాయం అందించారు.

గుమ్మలక్ష్మీపురం మండలం కోసింగిభద్ర ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు రగ్గులు అందజేస్తున్న శ్రీనివాసరావు

దుప్పట్ల పంపిణీ

సాలూరు, న్యూస్‌టుడే: సాలూరు మండలంలోని కరాసువలస కస్తూర్బా పాఠశాలకు చెందిన విద్యార్థులకు దాత, పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మహంతి రాంబాబు దుప్పట్లు అందజేశారు. చలితీవ్రతకు చిన్నారులు పడుతున్న ఇబ్బందులను చూసి చలించారు. పనిచేసే పాఠశాలలో విద్యార్థుల విజ్ఞానం పెంచడమే కాకుండా వారి అవసరాలను తీర్చారు.

...వివరాలు 6లో

నియోజకవర్గం	దాత	ఎవరికి సాయం	ఇచ్చినవి	విలువ(రూ.ల్లో)	ఎంతమందికి
విజయనగరం	చెరుకూరి శ్రీధర్, మారుతీ సేవా సంఘం	సారథి సంక్షేమ సంఘం అంధుల వసతి గృహం	రగ్గులు, మిక్సీ	15 వేలు	30
చీపురుపల్లి	సాదెం వెంకటరమణ	చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ వసతిగృహం	రగ్గులు	14 వేలు	40
గజపతినగరం	శీరంరెడ్డి చంద్రశేఖర్	దేవుపల్లి బీసీ బాలికల వసతి గృహం(బొండపల్లి)	కిటికీలకు మెస్‌లు	25 వేలు	18
ఎస్. కోట	స్నేహ స్వచ్ఛంద సంస్థ	దారపర్తి పంచాయతీ కురిడి గ్రామస్థులు	రగ్గులు	15,750	63
నెల్లిమర్ల	తాటికొండ సాయిసూర్య ఫణికీర్తి	భోగాపురం బీసీ వసతి గృహం	దుప్పట్లు, జంబుఖానాలు	10 వేలు	26
బొబ్బిలి	శతపతి అన్నపూర్ణ	రామభద్రపురం సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం	చాపలు	15 వేలు	90
సాలూరు	మహంతి రాంబాబు	కస్తూర్బా పాఠశాల(కరాసువలస)	దుప్పట్లు	12,600	105
పాలకొండ	సత్యసాయి సేవా సమితి	ఎస్సీ బాలుర వసతిగృహం	రగ్గులు	2,500	14
పార్వతీపురం	పొట్నూరు గౌరీశంకరరావు, సూర్యప్రకాష్, చలపతిరావు	ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థులకు	చాపలు	9,000	113
కురుపాం	బుడంకాయల శ్రీనివాసరావు	కోసింగిభద్ర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల	రగ్గులు	10,550	94

ఘంటసాలకు స్వరనీరాజనం

ఘంటసాల గానం చిరస్మరణీయమని మంత్రి సంధ్యారాణి అన్నారు. కబీర్‌షా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఘంటసాలకు 12గంటల స్వర నీరాజన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె, పట్టణంలోని సంగీత పాఠశాల అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ జె. ఈశ్వరరావు తొలుత ఘంటసాల విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠ్యాంశంగా ఘంటసాల జీవిత చరిత్రను చేర్చేందుకు కృషి చేస్తానన్నారు. సంగీత పాఠశాల అభివృద్ధికి హామీ ఇచ్చారు. గోల్డ్‌కింగ్, ఘంటసాల గానసభ, భూషణ్ బ్రదర్స్ సంగీత కచేరీల సభ్యులు, గాయకులు పలు గీతాలతో శ్రోతలను రంజింపజేశారు. కబీర్‌షా పార్టీ అధ్యక్షుడు భాషా, పి. ఈశ్వరరావు, సూరిబాబు, గణేశ్వరరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే,సాలూరు

విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి, అభిమానులు

కోడలే ఆ కుటుంబానికి కొడుకైంది..

భర్త మరణం ఆమెను కుంగదీసింది.. ఇద్దరు పిల్లలు.. వృద్ధులైన అత్తమామలు పనిచేస్తేనే పూట గడిచేది.. కన్నీటిని గుండె గోడల్లో దాచేసి.. భర్త నడిపిన ఆటోనే బతుకు బండిగా మార్చుకుంది కష్టమన్నది తెలియకుండా కుటుంబాన్ని కంటికి రెప్పలా చూసుకుంటోంది.

పార్వతీపురం మండలంలోని నర్సిపురం పంచాయతీ కారాడవలసకు చెందిన రాయగడ **గంగవేణి**కి చిన్నతనంలోనే పెళ్లి జరిగింది. ఇద్దరు పిల్లలు. భర్త సురేష్ అనారోగ్యంతో మరణించారు. మామయ్య గోపాలానికి వృద్ధాప్య పింఛను మినహా వేరే ఆదాయం లేదు. కుటుంబ జీవనం భారమైంది.

దీంతో భర్త నడిపిన ఆటోనే జీవనోపాధిగా ఎంచుకుంది. ఆ ఆదాయంతో ఇంటిని బాగుచేసి. . ఇద్దరు పిల్లలను చదివిస్తూ.. అత్తమామలను తల్లిదండ్రుల్లా చూసుకుంటోంది.

బతుకు పోరాటమే నేర్పింది..

'కూలి పనులకు వెళ్లినా కుటుంబాన్ని నడపడం కష్టంగా మారింది. చిన్న పిల్లలు, అత్తమామ.. ఏంచేయాలో తెలియని పరిస్థితి. భర్త ఉన్నప్పుడు ఆటో నడపడం సరదాగా నేర్చుకున్నా. తర్వాత పూర్తిగా నేర్చుకుని అనుమతులు పొందా. పిల్లిద్దరినీ ఆశ్రమ పాఠశాలలో చదివిస్తున్నా. వితంతు పింఛను మంజూరైతే మరింత సాయం అవుతుంది' అంటోంది గంగవేణి. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

ఈనాడు, పార్వతీపురం మన్యం

తేజోవతికి అరకు పగ్గాలు

తెదేపా అరకు పార్లమెంటరీ అధ్యక్షురాలిగా నియామకం

అరకు పార్లమెంటు స్థానం ఎస్టీ సామాజిక వర్గానికి కేటాయించారు. అప్పటి నుంచి తెదేపా ఒక్కసారి కూడా గెలవలేకపోయింది. దీంతో ఆ పార్టీ అధిష్ఠానం దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. పార్టీ బలోపేతం, వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా తెదేపా అరకు పార్లమెంటరీ అధ్యక్షురాలిగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మోజూరు తేజోవతి(42)ని, ప్రధాన కార్యదర్శిగా బీసీకి చెందిన దత్తి లక్ష్మణరావు (61)ను నియమించింది. చాలా మంది ఆశావహులు ప్రయత్నించినా ఈమెనే పదవి వరించింది.

తేజోవతికి కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

దత్తి లక్ష్మణరావు

ప్రధాన కార్యదర్శి పదవి దక్కిన దత్తి లక్ష్మణరావు రెండు సార్లు, ఆయన భార్య రెండు సార్లు జియ్యమ్మవలస మండలాధ్యక్షులుగా పనిచేశారు. ఈయనది వెంకట్రాజుపురం. ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా, పలు నియోజకవర్గాల పార్టీ పరిశీలకుడిగా పనిచేశారు.

పాలకొండ నియోజకవర్గంలో ఉపాధ్యాయినిగా పని చేస్తూ రెండేళ్ల కిందట రాజీనామా చేసి తెదేపాలో చేరిన తేజోవతి వైపే అధిష్ఠానం మొగ్గు చూపింది. గిరిజన సలహా మండలి సభ్యురాలిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సాలూరు, పాలకొండ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని టిక్కెట్ ఆశించారు. ఇందుకు ప్రభుత్వోద్యోగాన్ని వదిలేసి రాజకీయ అరంగేట్రం చేశారు. ఎన్నికల్లో టిక్కెట్ దక్కకపోవడంతో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశారు.

జోడు పదవులు మన్యానికే..

ఈ పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో రెండు జిల్లాలు ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు శాసనసభ స్థానాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూడు స్థానాలు ఉన్నాయి. మన్యం జిల్లాలోని నాలుగింటినీ కూటమి అభ్యర్థులు దక్కించుకున్నారు. అందులో సాలూరు నుంచి మంత్రి, కురుపాం నుంచి ప్రభుత్వ విప్ పదవులు ఉన్నాయి. దీంతో అరకు పార్లమెంటు అధ్యక్ష పదవి అల్లూరి జిల్లాకు దక్కొచ్చని అంతా భావించారు. ప్రస్తుత అధ్యక్షుడు కిడారి శ్రావణ్‌కుమార్ అరకు నియోజకవర్గానికి చెందిన నాయకుడే. ఈ సారీ ఆ నియోజకవర్గానికే కేటాయిస్తారని భావించారు. మన్యం జిల్లాకు చెందిన ఇద్దరు నేతలకు పదవులిచ్చారు.

రాజకీయాల్లో ఎదగాలనే ఆకాంక్షతో..

శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం జోగిపాడు తేజోవతి స్వగ్రామం. ఎస్టీ కొండదొర సామాజిక వర్గం. విద్యాభ్యాసం సీతంపేటలో సాగింది. తెర్లాం మండలం కాగాం గ్రామానికి చెందిన విద్యుత్తు శాఖ ఉద్యోగి కె.జయరాజును కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారు. పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితురాలినై ఉద్యోగం వదిలి తెదేపాలో చేరానని ఆమె ఈ సందర్భంగా 'ఈనాడు'కు చెప్పారు. రాజకీయాల్లోకి వచ్చిన తక్కువ సమయంలో అధినేత పెద్ద బాధ్యతలు అప్పగించారన్నారు. ఏడు నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు.

తంగలాం గ్రామ సమీపంలో చేపడుతున్న రోడ్డు

6.8 కి.మీ. దారొస్తే.. అందాల అరకులో అడుగు

న్యూస్‌టుడే, పాచిపెంట

ఆంధ్రా ఊటీ అరకు పేరు చెబితేనే మనసుకు ఆహ్లాదం. అక్కడికెళ్లి సందడి చేసేందుకు జిల్లావాసులు ఆసక్తి చూపుతుంటారు. పాచిపెంట మీదుగా 55 కి.మీ. ప్రయాణిస్తే అరకు చేరుకోవచ్చు. అయితే మండల పరిధిలో చేపట్టిన రహదారి నిర్మాణం నెమ్మదిగా సాగుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మండలంలోని కన్నయ్యవలస నుంచి అరకు రోడ్డు నిర్మాణంలో భాగంగా నాబార్డు నిధులతో చిల్లమామిడి కూడలి వరకు 18 కి.మీ. మేర బీటీ రహదారి 2013లో వేశారు. అక్కడి నుంచి తంగలాం మీదుగా అల్లూరి సీతారామరాజు జిల్లా అంటిపర్తి గ్రామం వరకు 6.8 కి.మీ. రహదారి నిర్మాణాన్ని రూ.6.28 కోట్లతో గతేడాది ప్రారంభించారు. పలు కారణాలతో పనులు నెమ్మదిస్తున్నాయి. తంగలాంని ఆనుకుని ఉన్న అంటిపత్తి నుంచి లోతేరు వరకు ఆరు కి.మీ. మట్టి రోడ్డు కావడంతో అవస్థలు తప్పడం లేదు. 13 ఏళ్ల క్రితమే లోతేరు నుంచి అరకు వరకు బీటీ రోడ్డు వేసినా మట్టి దారి మార్చలేదు.

ఉభయ జిల్లాలకు ఉపయుక్తం..

6.8 కి.మీ. రహదారి పూర్తయితే ఉభయ జిల్లాల సరిహద్దు గిరిజనుల రాకపోకలకు వీలు కలుగుతుంది. మండలంలో గొట్టూరు, మూటకూడు, గరిసిగుడ్డి, బొర్రమామిడి, సతాబి, తంగలాం గిరిజన పంచాయతీల పరిధిలోని 30 పైగా గిరిజన గ్రామాలు, అల్లూరి జిల్లా అనంతగిరి మండలానికి చెందిన మరో పది గ్రామాలకు రవాణా సౌకర్యానికి ఉపయుక్తంగా ఉంటుంది. వచ్చేఏడాది మార్చికల్లా మిగతా పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని జేఈ చిన్నంనాయుడు తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సీతంపేట పార్కులో బోటింగ్, కయాకింగ్ చేస్తున్న పర్యాటకులు

జలజలపారే సెలయేర్లు.. పచ్చని ఉద్యానాలు.. చుట్టూ కొండలు.. పడవ ప్రయాణానికి నీటి వనరులు.. ప్రకృతి సోయగాలు.. పర్యాటకులను ఆహ్లాదం, ఆనందం కలిగిస్తున్నాయి. ఓ వైపు చల్లటి గాలి తాకిడి.. మరోవైపు జలపాతాల అలికిడి కట్టిపడేస్తుండడంతో సందడి చేశారు. సీతంపేట మన్యం పరిసరాల్లో పలు పర్యాటక ప్రాంతాలు ఇందుకు వేదికలయ్యాయి. ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కులో బోటింగ్, కయాకింగ్ చేస్తూ 5డీ థియేటర్‌లో ప్రదర్శనలు వీక్షిస్తూ ఆదివారం పర్యాటకులు ఉల్లాసంగా గడిపారు. ఆనంద వేదిక వద్ద ఉత్సాహంగా డ్యాన్స్ వేశారు. మెట్టుగూడ జలపాతం, దోనుబాయి దరి సున్నపుగెడ్డ, మల్లి, బెనరాయి జలపాతాల వద్ద కేరింతలు కొట్టారు. స్థానికంగా కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఎస్సై వై.అమ్మనరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. – న్యూస్‌టుడే, సీతంపేట

మెట్టుగూడ జలపాతం వద్ద పర్యాటకుల జలకాలాట

న్యూస్‌టుడే, సీతంపేట

సీతంపేట మన్యంలో గిరిజనులు విస్తృతంగా పండిస్తున్న అనాస(పైనాపిల్)కు మద్దతు ధర, ప్రాసెసింగ్ యూనిట్లు లేక దళారుల పాలవుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వీటిని సరఫరా చేసేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలెక్టర్ ప్రభాకరరెడ్డి కోరిన విషయం తెలిసిందే. ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి. . తగు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం నుంచి ఆమోదం వస్తే రైతులకు ఇబ్బందులు తొలగుతాయన్నారు.

సంతలో విక్రయించడానికి తీసుకొచ్చిన అనాస (పాత చిత్రం)

పాఠశాలలకు అందిస్తే పైనాపిల్

● అనుమతులు వస్తేనే గిరి రైతుకు సిరులు

జిల్లాలో అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యా సంస్థలు 116 ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 30 వేల మంది చదువుతున్నారు. అన్ని యాజమాన్యాలకు సంబంధించి 1,447 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 98 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. సమీప జిల్లాల్లోనూ వేలాది మంది చదువుతున్నారు. ఈ పిల్లలందరికీ అనాస సరఫరా జరిగేలా చూస్తే సీజన్‌లో పండే పంటలో ఎక్కువ మొత్తం ఇక్కడే వినియోగించేందుకు వీలు కలుగుతుంది. అప్పుడు ధర విషయంలో రైతులు దగాకు గురవ్వరు.

7,322 ఎకరాల్లో సాగు..

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 7,322 ఎకరాల్లో సేంద్రియ పద్ధతిలో అనాస పండిస్తున్నట్లు అధికారిక లెక్క. అనధికారికంగా మరికొంత విస్తీర్ణంలో సాగవుతోంది. సింహాచలం, క్యూ, మారిషస్ రకాలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఎకరాకు ఆరు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ లెక్కన 43,932 కాయలు వస్తాయి. కొనుగోలు కేంద్రాలు, గిట్టుబాటు ధర లేక గిరిజన రైతులు నష్టపోతున్నారు. ధరరాక ఒక్కో పండు రూ.3కు విక్రయించిన సందర్భాలున్నాయి. పంటంతా దళారుల పాలవుతోంది.

పోషకాలు మెండు..

అనాస మంచి రుచితోపాటు పోషకాలు మెండుగా కలిగి ఉంది. విటమిన్ సి, ఫైబర్, బ్రోమలైన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి వాపును తగ్గించడం, ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడం, చర్మాన్ని మెరుగుపర్చడం, గుండె ఆరోగ్యం, రోగ నిరోధక శక్తి పెంపు, జీర్ణక్రియ మెరుగు తదితరాలకు ఉపయోగపడుతుంది. సీజన్‌లో పండే పంటలు పిల్లలకు అందజేస్తే పోషకాలు అందుతాయి. – ఎస్వీ గణేష్, ప్రాజెక్టు ఉద్యానాధికారి(పీహెచ్‌వో), ఐటీడీఏ, సీతంపేట

వ్యాధులొస్తేనే వస్తాం.. శుభ్రం చేస్తాం!

● పల్లెల్లో అధ్వానంగా పారిశుద్ధ్య నిర్వహణ

జిల్లాలో పంచాయతీలు: 451
హరిత రాయబారులు: 972 మంది
కాలువల పొడవు: 902 కి.మీ.

● వాస్తవానికి..: వారానికి ఒక్కసారైనా పంచాయతీలు కాలువలు శుభ్రం చేయించాలి.
● అమలు: ఎక్కడా పనులు జరగడం లేదు.

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, గ్రామీణం, సీతానగరం

జిల్లాలోని ఏ గ్రామం చూసినా పారిశుద్ధ్య పరిస్థితులు ఘోరంగా కనిపిస్తున్నాయి. నెలల తరబడి శుభ్రం చేయక వీధి కాలువలు మురుగు, చెత్త, వ్యర్థాలతో నిండిపోతున్నాయి. దీంతో దోమలు పెరిగి ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు.

డ్రై డే.. ఫొటోలకే..

ప్రభుత్వం ప్రతి శుక్రవారం డ్రై డే పాటిస్తున్నామని, స్వచ్ఛ పరిసరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెబుతోంది. క్షేత్రస్థాయిలో ఇది ఫొటోలు తీసుకోవడం వరకే పరిమితం అవుతోందన్న ఆరోపణలున్నాయి. తాగునీటి వనరుల వద్ద అపరిశుభ్రత వల్ల అతిసారం, పచ్చకామెర్లు వంటివి వ్యాపిస్తున్నాయి. దోమల వ్యాప్తితో మలేరియా, డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి.

చెత్త సేకరణకు పరిమితం...: ప్రస్తుతం పల్లెల్లో స్వచ్ఛత కార్యక్రమాలకు 972 మంది హరిత రాయబారులు ఉన్నారు. వీరు చెత్త సేకరణకే పరిమితం అవుతున్నారు. ఎప్పటికప్పుడు కాలువల శుభ్రత పంచాయతీలే చేపట్టాలి. ఏడాదిలో కనీసం రెండుసార్లు కూడా చాలా చోట్ల చేపట్టడం లేదని ప్రజలు చెబుతున్నారు. దోమల మందు పిచికారీ, ఫాగింగ్ నిర్వహణ ప్రశ్నార్థకమే.

ప్రత్యేక చర్యలు తీసుకుంటాం..

పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కాలువల శుభ్రతపై దృష్టి సారిస్తాం. చెత్త సేకరణ సక్రమంగా జరుగుతోంది. బ్లీచింగ్, సున్నం ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తున్నారు. – కొండలరావు, జిల్లా పంచాయతీ అధికారి



నేడు 'క్రిస్మస్ హైటీ' వేడుకలు

పార్వతీపురం, న్యూస్‌టుడే: ఐక్య క్రిస్మస్‌ను పురస్కరించుకుని మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం 'క్రిస్మస్ హైటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మైనారిటీ సంక్షేమశాఖాధికారి షేక్ మహబూబ్ షరీఫ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా దీన్ని ఏర్పాటు చేసిందని వెల్లడించారు. పట్టణంలోని సీఎస్ఎన్ ఫంక్షన్ హాలు వేదికగా నిర్వహించే ఈ కార్యక్రమంలో స్నేహపూర్వక కలయిక ఉంటుందన్నారు. జిల్లాలోని క్రైస్తవ మత పెద్దలు, సంఘాల ప్రతినిధులు, విశ్వాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అతివకు ఆర్థిక భరోసా!

మకోసం

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

బొగ్గు, కట్టెల పొయ్యి వంటతో మహిళలు అనేక అనారోగ్య సమస్యలకు గురవుతుంటారు. ఆ పరిస్థితి నుంచి గట్టెక్కించాలని కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఉజ్వల యోజన(పీఎంయూవై) పేరుతో ఉచిత గ్యాస్ సిలిండరు పథకాన్ని తీసుకొచ్చింది. నాలుగేళ్లుగా ఆగిపోయిన ఈ పథకాన్ని మళ్లీ పునఃప్రారంభించారు. దీంతో దారిద్ర్యరేఖకు దిగువ నున్న పేద మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు కావాల్సిన వారు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

జిల్లాలోని 15 మండలాల్లో 451 పంచాయతీల్లో 2.13 లక్షల కుటుంబాలు ఉన్నాయి. వీరిలో లక్షకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఇప్పటికీ చాలా మంది కట్టెలు, బొగ్గుల పొయ్యిలతో వంట చేసుకుంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తోంది. అయినా చాలా మంది పొయ్యిలపైనే ఆధారపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని అర్హతలతో ఉచితంగా కనెక్షన్లు అందిస్తోంది.

పూర్తిగా ఉచితం

ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద మంజూరయ్యే గ్యాస్ కనెక్షన్ పూర్తిగా ఉచితం. సిలిండరు రూ.1700, రెగ్యులేటర్ రూ.150, గ్యాస్ పైపు రూ.100, పుస్తకం రూ.25, కనెక్షన్ అమర్చేందుకు రూ.75తో కలిపి మొత్తం రూ.2,050 ఇంధన కంపెనీలు భరిస్తాయి. మొదటి సారి ఇచ్చే సిలిండరు ఉచితం, తర్వాత నుంచి ఇచ్చే వాటిపై కేంద్ర ప్రభుత్వం రూ.300 రాయితీ ఇస్తుంది. ఈ పథకం అమలుకు జిల్లాల్లో ఉజ్వల కమిటీలను నియమించారు. కలెక్టరు ఛైర్మన్‌గా ఇంధన మార్కెటింగ్ కంపెనీ ప్రతినిధి సమన్వయకర్తగా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సభ్యుడిగా ఉంటారు.

● 'ఉజ్వల యోజన'లో ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు

అవసరమైన ధ్రువపత్రాలివీ..

● కుటుంబంలో ఎవరి పేరునా గ్యాస్ కనెక్షన్ ఉండకూడదు. రేషన్ కార్డులో ఉన్న పేర్లపై ఎలాంటి కనెక్షన్ ఉండకూడదు. బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు జిరాక్సులు సమర్పించాలి.
● వలస కార్మికులు రేషన్ కార్డుతో పత్రాలు జతచేసి అందిస్తే కనెక్షన్ ఇస్తారు.
● నెలకు రూ.10వేల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవారు అనర్హులు. రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఆదాయ ధ్రువపత్రం జత చేయాలి. ● అర్హులైన పేద మహిళలు గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి పైన తెలిపిన పత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హులైన ప్రతి మహిళా పథకాన్ని వినియోగించుకోవాలని చెబుతున్నాం. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ సైట్ ఓపెన్ అయింది. దరఖాస్తులు చేసుకోవచ్చని పార్వతీపురం హెచ్‌పీ గ్యాస్ డీలర్ పి. కిరణ్ తెలిపారు.

పోలియో నియంత్రణకు కృషి

చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పోలియో చుక్కలు వేయిస్తే చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు మందు వేశారు. డీడీఎం హెచ్‌వో పద్మావతి, ఎంపీవో లక్ష్మి, వైద్యులు బుద్దేశ్వరరావు, అభిలాష్ ఉన్నారు.

శివ్వన్నపేటలో ఏనుగుల తిష్ఠ

కురుపాం మండలంలోని శివ్వన్నపేట, చెరువుకొమ్మవలస పరిసరాల్లో రెండు రోజులుగా ఏనుగుల గుంపు తిష్ఠ వేసింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సమీప గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం



(c) eenadu

కుటుంబాలు లక్ష్యంగా 'ముస్తాబు'

పార్వతీపురం, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా శని వారం నుంచి అన్ని విద్యాసంస్థల్లో ప్రారంభమైన 'ముస్తాబు' కార్యక్రమాన్ని కుటుంబాలకు చేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు.. కలెక్టరు ప్రభాకరరెడ్డి ప్రణాళిక రూపొందించారు. ప్రతి ఇంటి వారికీ 'ముస్తాబు'ను చేరువ చేసేలా స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను సమా యత్తం చేసేందుకు నిర్ణయించారు. సోమవారం జిల్లా లోని ఎస్‌హెచ్‌జీల మహిళలకు అవగాహన కల్పించే దుకు పార్వతీపురంలో సమావేశం నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని చర్చి వీధిలో ఉన్న లూథరన్ చర్చి సమావేశ మంది రంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరుగు తుంది. కలెక్టరు, జిల్లా అధికారులు, డీఆర్‌డీఏ సిబ్బంది, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొంటారు.

నేడు వినతుల స్వీకరణ

పార్వతీపురం, న్యూస్‌టుడే: కలెక్టరు కార్యా లయంలోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో సోమవారం కలెక్టరు ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో విన తుల స్వీకరిస్తారు. దీంతోపాటు జేసీ యశ్వంత్ కు మార్‌రెడ్డి నేతృత్వంలో సమావేశ మందిరం-4లో రెవెన్యూ క్లినిక్ జరుగుతుంది. భూ సమస్యలు, వివా దాలను అక్కడే పరిశీలిస్తారు. వారంలో మిగిలిన అయిదు రోజుల్లో పీజీఆర్‌ఎస్ విభాగంలో యంత్రాంగం అర్జీలు స్వీకరించి, ఆయా శాఖలకు పరి ష్కారం కోసం పంపిస్తారు. అర్జీల స్థితిని 1100 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా తెలుసుకోవచ్చు.

కదిలిన దాతలు

ఉమ్మడి జిల్లాలోని పలు వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు దాతలు అండగా నిలిచారు. 'ఈనాడు' అధ్వర్యంలో వారికి వివిధ రకాల దుస్తులు, దుప్పట్లు తదితరాలను అందించారు. పేద బాలలను ఆదుకునేందుకు మరింత మంది ముందుకొస్తామని భరోసానిచ్చారు.

దాత గౌరీశంకర రావుతో బాలికలు

స్పందించారు.. అండగా నిలిచారు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థులు గుమ్మలక్ష్మీపురం చిన్న పాటి జంబు ఖానాలు పరుచుకుని నిద్రిస్తున్నారు. చలికాలం కావడంతో నిద్రకు దూరం అవుతున్నారు. 'ఈనాడు' పిలుపు మేరకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీహెచ్.చలపతిరావు స్పందించారు. మాజీ అధ్యక్షుడు పొట్నూరు గౌరీశంకరరావు సహకారంతో క్లబ్ తరఫున 70 చాపలు అందించారు. క్లబ్ జిల్లా గవర్నర్ డి.సూర్యప్రకాశ్ చేతుల మీదుగా బాలికలకు అందజేశారు. క్లబ్ కార్యదర్శి బీవీఎస్.నాయుడు, కోశాధికారి జె.శ్రీనివాసరావు, సభ్యులు బీవీఎస్.రావు, గౌరునాయుడు, జగన్నాథరావు, విమల కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి భక్తుల సేవ

పాలకొండ, గ్రామీణం: పాల కొండలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహానికి చెందిన విద్యార్థులకు పట్టణానికి చెందిన శ్రీసత్యసాయి సేవా సమితి సంస్థ రగ్గులు సమకూ ర్చింది. కన్వీనర్ కె.సుధాకర్, ఆధ్యాత్మిక విభాగం బాధ్యుడు జి.శ్రీరాములునాయుడు మాట్లాడుతూ ఈ ఏడాది చలి తీవ్రత అధి కంగా ఉండ డంతో 'ఈనాడు' సంస్థ విద్యార్థులకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. వసతిగృహ సంక్షేమాధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: గిరిజన ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కు వగా ఉండడంతో వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు చలితో ఇబ్బం దులు పడుతున్నారు. ఈ తరుణంలో 'ఈనాడు' పిలుపు మేరకు గుమ్మలక్ష్మీపు రానికి చెందిన ఋుండకరావు శ్రీనివాస

కురుపాం కస్తూర్బా పాఠశాలలో...

బాలలకు అండ

రావు స్పందించి దాతృత్వాన్ని చాటుకున్నారు. కొసంగిభద్ర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలోని 94 మంది విద్యార్థులకు రగ్గులు కొనుగోలు చేసి, చలి నుంచి రక్షణ కల్పించారు. శ్రీనివాసరావు బావ గుడ్ల హరిప్రసాద్ ఆధ్వర్యంలో డీఈవో బ్రహ్మాజీరావు, ఎంఈవో చంద్రశేఖర్, హెచ్‌ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు, తెదేపా ఎస్టీ సెల్ కన్వీనర్ భూషణరావు చేతులమీదుగా అందజేశారు.

తాళాలుంటేనే చోరీ.. తీసేది కొంతే మరి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: బీరువా తలుపులు పగలగొట్టడు.. తాళాలు వెతికి మరీ వాటిని తెరుస్తాడు. అందులో ఓ నాలుగు తులాల బంగారం కనిపిస్తే రెండు తులాలతో పరారవుతాడు.. డబ్బులు మాత్రం ముట్టడు. అలాగని ఆతడేమీ మామూలోడు కాదు.. గజ దొంగ.. అంతర్రాష్ట్ర నిందితుడు.. బాధితులకు అనుమానం రాకుండా ఇలా పదుల సంఖ్యలో చోరీలు చేశాడు. ఎట్టకేలకు కృష్ణా జిల్లా కంకిపాడు పోలీసులకు పట్టుబడ్డాడు. చీపురుపల్లి మండలం పీపీవలసకు చెందిన పి.రాంబాబు.. ఈ కేసు వివరాలను అక్కడి డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు.

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వ్యసనాలకు బానిసై.. పీపీవలసకు చెందిన రాంబాబు చెడు వ్యసనాలకు బానిసై కన్వేక్షన్‌గా తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బీరువాలు పగలగొట్టకుండా.. తాళాలు ఎక్కడ పెడతారో గుర్తించి మరీ లాకర్ తలుపులను తెరుస్తాడు. కొంతమేర బంగారాన్ని ఎత్తుకెళతాడు. ఇంట్లో వాళ్లకి అనుమానం రాకుండా అన్నీ జాగ్రత్తగా సర్దేస్తాడు. ఇటీవల పలువురు బాధితుల ఇళ్లలో వివరాలు జరిగాయి.

తాకట్టు పెట్టి.. చోరీ చేసిన ఆభరణాలను పెనమలూరు మండలం మురళీనగర్‌కు చెందిన పఠాన్ పవిమ్ ఖాన్, పఠాన్ నాగర్, చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన షేక్ ఆస్గా, కానూరు వాసి ఎం.నాగ విష్ణుమీ, ఎం.చిట్టిరెడ్డితో ముత్తూట్, మణప్పురం ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టించాడు. ఆ డబ్బు తీసుకుని వారికి కమీషన్ ఇచ్చేవాడు. ఆదివారం పునా దిపాడు వంతెన వద్ద అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనాలపై నిలబడి మాట్లాడుకుంటుండగా అటుగా వెళు తున్న పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయ త్నించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 2023లో కంకిపాడులో జరిగిన దొంగతనం బయటకు వచ్చింది. అనంతరం రాంబాబును అదుపులోకి తీసుకొన్నారు. 15 చోరీల వివరాలు చెప్పేశారు. ఈమేరకు ఆతడి నుంచి 409 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడిపై ఏకంగా 50 కేసులున్నాయి. ఒక్క విజయనగరం జిల్లాలోనే 14 వరకు నమోదయ్యాయి.

ఆయన సేవలు లెక్కగట్టలేం!

సాలూరు, న్యూస్‌టుడే: గణితం పట్ల విద్యార్థులకున్న భయాన్ని తొలగిం చేందుకు సాలూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు ఆర్.రజనీకాంత్ కృషి చేస్తున్నారు. 2000 సంవత్సరంలో రామానుజన్ మ్యాథ్స్ క్లబ్ ఏర్పాటు చేశారు. జిల్లా, ఉత్త రాంధ్ర స్థాయిలో విద్యార్థులకు గణిత ప్రతిభా పరీక్షలు నిర్వ హించారు. దాదాపు లక్ష మందికి పైగా రాశారు. పాఠ శాలలు, కళాశాలల్లో ఆయన హన సదస్సులు నిర్వహిం చారు. తెలియని వారికి పుస్తకాలు, ప్రశంసా పత్రాలు అందించారు. 25 ఏళ్లుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లా, రాష్ట్రస్థాయి పురస్కా రాలు పొందారు. గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. తాను పనిచేసే విద్యాలయానికి ఉపకరణాలు, ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఉమ్మడి జిల్లా కలెక్టరు హరి జవహర్ పాఠశాలకు వచ్చి సత్కరించారు.

గణిత పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థికి పతకం, ప్రశంసా పత్రం అందిస్తున్న రజనీకాంత్(పాత చిత్రం)

సొంత నిధులతో..

పట్టణంలోని యామిజాల వీధి, గాంధీనగర్ సమీపంలో రజనీకాంత్ సొంత నిధులతో పదేళ్లుగా గ్రంథాలయం నిర్వ హిస్తున్నారు. ప్రతిరోజూ 50కి పైగా విద్యార్థులు ఇక్కడకు వస్తారు. గతంలో ఆయన పనిచేసిన బంగారమ్మ పాఠశాలలో బాలలు రాకపోకలు సాగించేందుకు దూరం భారంగా కావడంతో సొంత నిధులతో ఆటో కూడా ఏర్పాటు చేశారు.

రాష్ట్ర జట్టు మేనేజర్‌గా రాజు

గంట్యాడ, న్యూస్‌టుడే: జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-19 రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా గంట్యాడ జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పీవీఎస్ఎన్.రాజు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి 28 వరకు మధ్యప్రదేశ్‌లో జరగనున్న ఖోఖో పోటీలకు వెళుతున్న మన రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా వ్యవహరించను న్నారు. ఖోఖో అసోసియేషన్ ఆయనను అభినందించింది.

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

సిబ్బంది లేక అవస్థలు

గ్రంథాలయాల్లో పాఠకులకు ఇక్కట్లు

విజ్ఞాన భాండాగారాల నిర్వహణ గ్రంథాలయ అధికారులకు కత్తిమీద సాములా మారింది. ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ కాకపోవడంతో అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. కొన్నిచోట్ల సిబ్బంది నిర్వహించాల్సినంతలో పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో పాఠకులు ఇబ్బంది పడుతు న్నారు. కొన్నిచోట్ల ఆలస్యంగా తెరుస్తున్నారనే విమర్శలున్నాయి.

ఆ సేవలే.. రెండు జిల్లాలో డీసీఎల్(డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ)తో పాటు 40 శాఖలున్నాయి. ఇందులో ద్వితీయ శ్రేణి కింద నాలుగు(ఎస్.కోట, పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి), గ్రామీణ కింద మూడు(శెల్ల, రెల్లివలస, జరజాపుపేట) ఉండగా.. 33 తృతీయ శ్రేణి విభాగంలో కొనసా గుతున్నాయి. ఒక్క డీసీఎల్‌కే రోజూ 700 మంది నుంచి 1000 మంది వరకు వస్తుంటారు. మిగిలిన చోట్ల 60- 210 మంది వరకు సందర్శి స్తున్నారు. డీసీఎల్‌లో 55 వేలు, ఇతర శాఖల్లో 30 వేల పుస్తకాలున్నాయి. పాఠకులకు వీటిని అందించడం, డిమాండు మేరకు కొత్తవి తెప్పిం చడం, వివరాల సేకరణ, శుభ్రత, దినపత్రికలు, మ్యాగజైన్లు, పోటీ పరీక్షల పుస్తకాలను అందుబా టులో ఉంచాలి. కొన్నిచోట్ల ఈ ప్రక్రియలేవీ సాగడం లేదు.

విజయనగరంలోని గ్రంథాలయంలో చదువుతున్న పాఠకులు

ఉన్నది 36 మందే.. నిబంధనల ప్రకారం గ్రేడ్-2, 3 లైబ్రేరియన్లు, జూనియర్ సహాయకులు, రికార్డు సహాయకులు, కార్యాలయ సహాయకులు, పార్ట్‌టైం వర్కర్లు, వాచ్‌మెన్లు.. తదితర విభాగాల్లో 86 పోస్టులు అవసరం. ప్రస్తుతం 36 మందే ఉన్నారు. దీంతో కొందరు అధి కారులు రెండు, మూడు శాఖలను చూస్తున్నారు. పూసపాటిరేగ, భోగాపురం, చీపురుపల్లి, పార్వతీపురం, ఎస్.కోట కేంద్రాలు ఇన్ ఛార్జుల పాలనలో ఉన్నాయి గరుగుబిల్లి, మక్కువ, కురుపాం, సీతానగరంలో పార్ట్‌టైం వర్కర్లే నడిపిస్తున్నారు.

ప్రకటనలేవీ..? కొత్త కొలువుల భర్తీ కోసం చాలామంది ఎదురు చూస్తున్నారు. గతంలో పార్ట్‌టైం ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు ఆ ప్రక్రియ సాగలేదు. కేవలం కరుణ్య నియామకాలకే పరి మితం అవుతున్నాయి. వాటి విషయంలోనూ జాప్యం జరుగుతోంది. ఇప్పటికే రెండు, మూడు సార్లు ఉన్న తాధికారులు, మంత్రులకు తెలియజేశామని గ్రంథాల యాల ఉమ్మడి జిల్లా కార్య దర్శి లక్ష్మి తెలిపారు. శాఖల్లో ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో చోదకుడి దుర్మరణం

రేగిడి, న్యూస్‌టుడే: భార్య పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడా నికి వచ్చిన ఓ వ్యక్తి తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన రేగిడి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివ రాల ప్రకారం.. పాలకొండ మండలం బెజ్జి గ్రామానికి చెందిన బి.భానుప్రకాశ్(25)కు వీరఘట్టం మండలం తెట్టంగికి చెందిన దేవితో రెండేళ్ల క్రితం వివాహమైంది. స్థానికంగా చోదకుడిగా పనిచేసేవాడు. ఇటీవల విశాఖలో ప్రైవేటు ఉద్యోగంలో చేరాడు. రెండ్రోజుల క్రితం భార్య పుట్టినరోజు వేడుక నిర్వహించేందుకు స్వగ్రామం వచ్చాడు. కుటుంబంతో సంతోషంగా గడిపాడు. ఆదివారం తిరిగి ద్విచక్రవాహనంపై విశాఖ వెళ్తుం డగా.. రేగిడి మండలం కిట్టా పెట్రోల్ బంకు సమీపంలో రాజాం నుంచి పాలకొండ వైపు లోడుతో వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో మటనాస్థ లంలోనే మృతిచెందాడు. భానుప్రకాశ్ తల్లి లక్ష్మి, సోదరుడు రవిశంకర్ ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

భానుప్రకాశ్ (పాతచిత్రం)

బొండపల్లి, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బొండపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మెంటాడ మండలానికి చెందిన బి.స్వామినాయుడు(35) మూడు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై వెళుతూ గొల్లుపాలెం సమీపంలో హరిత రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి, విజయనగరంలోని మహారాజా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తవలస, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కొత్తవలస మండలంలో చోటుచేసుకుంది. సీఐ షణ్ముఖరావు వివరాల ప్రకారం.. కొత్తవలసకు చెందిన జి.శ్రీరాములు(55) అద్దెకుంటూ పనిచేసేవాడు. అనారోగ్యం, ఆర్థిక సమస్యల కారణంగా గతనెల 14న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు శివ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి నట్లు సీఐ తెలిపారు.

శఠగోపాన్నీ వదల్లేదు

కొత్తవలస, న్యూస్‌టుడే: మంగ ళపాలెం సమీపంలోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి ఆల యంలో శనివారం రాత్రి దొంగ తనం జరిగింది. వెండి శఠగోపం, వెండి సామగ్రి, రూ.25 వేల నగదు దొంగిలించారు. చోరీ సొత్తు విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని సమాచారం. దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఆలయంలోని సీసీ కెమెరాలు కొన్ని రోజులుగా పని చేయడం లేదని తెలుస్తోంది. దీంతో నేరం జరిగినట్లు చెబుతున్నారు.

అపూర్వ కలయిక

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: శంకరం బొజ్జన్న కొండ వద్ద విజయనగరం జిల్లా వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలకు చెందిన పదో తరగతి పూర్వ విద్యా ర్థులు సందడి చేశారు. 42 మంది స్నేహి తులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలక రించుకున్నారు. నాటి తరగతి గదుల్లో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 56 ఏళ్ల పైబడిన వారంతా యువకుల్లా ఆటపాట లతో సందడి చేశారు. అనంతరం వనభోజ నాలు చేసి సాయంత్రం వరకు ఉత్సా హంగా గడిపారు.

రూ.14.87 కోట్లతో రోడ్లకు మరమ్మతులు

పాచిపెంట, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చొరవతో పాచిపెంట మండలంలో 5 రోడ్ల మరమ్మతులకు రూ.14.87 కోట్లు మంజూరైనట్లు సాలూరు ఏఎంసీ ఛైర్మన్ ఎం.సూర్యనా రాయణ, తెదేపా మండలాధ్యక్షుడు యుగంధర్ తెలి పారు. రాయిగుడ్డివలస గ్రామ కూడలి నుంచి నీలంవ లస వరకు రూ.2.59 కోట్లు, పద్మాపురం కూడలి- కుంతాం వరకు రూ.2.23 కోట్లు, మాతుమూరు- వేటగా నివలస రహదారికి రూ.3.13 కోట్లు, పెదచీపురువలస- సాలూరు మండలం జీగిరాం- రూ.2.49 కోట్లు, పనుకు వలస జాతీయ రహదారి నుంచి కొత్తవలస వరకు బాగు చేసేందుకు రూ.4.43 కోట్లు వచ్చాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

చక్కని చుక్కలు.. భవితకు కాంతులు

కంటోన్మెంట్ పార్కులో చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

పల్స్ పోలియో కార్య క్రమం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆది వారం ప్రశాం తంగా జరి గింది. విజయ నగరంలో మంత్రి కొండ పల్లి శ్రీనివాస్, కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ప్రారంభించారు. 1172 బూత్‌ల ద్వారా 2 లక్షల మందికి పైగా చిన్నారులకు చుక్కల మందు వేశామన్నారు. సోమ వారం నుంచి మూడు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ వేస్తా రని చెప్పారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో 5 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారన్నారు. డీఎంహెచ్‌వో జీవనరాణి, అదనపు డీఎంహెచ్‌వో కె.రాణి, నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

మన్యంలో.. పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: మన్యం జిల్లాలో తొలిరోజు 90,557 మంది పిల్లలకు చుక్కల మందు వేసినట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. 91 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి మిగతా వాళ్లకు వేయనున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 905 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 42 మొబైల్ బృందాలు పర్యవేక్షించాయన్నారు.

రాష్ట్రస్థాయి ఆంగ్ల భాష ప్రతిభ పరీక్ష

జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, చిత్రంలో నిర్వాహకులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘం (డెల్టా) ఆధ్వర్యంలో ఆదివారం బొబ్బిలి ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీ పరీక్ష జరిగింది. డిప్యూటీ డీఈవో కె.మోహనరావు పోటీలు ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి 256 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ స్థానంలో నిలిచిన పి.పావని (పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్, బొబ్బిలి)కి రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వి.రోహిణి (చినమేరంగి ఉన్నత పాఠశాల)కి రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన సీహెచ్.శైలజ (కేపీ ఎన్ఎంహెచ్- సాలూరు)కు రూ.2 వేలు నగదు అందజేశారు. మిగిలిన ఏడుగురికి రూ.వెయ్యి చొప్పున ఇచ్చారు. పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, స్టడీ మెటీరియల్స్ అందజేశారు. డెల్టా అధ్యక్షుడు ఎం.విజయమోహనరావు, గ్రంథాలయ పరిషత్తు డైరెక్టర్ రౌతు రామ్మూర్తినాయుడు, ఎంఈవో సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి మనోళ్లు

అద్దంకి, పిఠాపురం: అండర్-18 రాష్ట్రస్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు బాపట్ల జిల్లా లో జరిగాయి. ఉత్తమ ఆట తీరు ప్రదర్శించిన క్రీడాకారు లను జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు ఖోఖో ఫెడరేషన్ తెలిపింది. జట్టులో జిల్లాకు చెందిన సలీం, పూజిత ఉన్నారు. ★ కాకినాడలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటిన పి.సుమిత్రను జాతీయస్థాయికి ఎంపిక చేశారు.

చికెన్ ధరలు

రకం	బ్రాగ్(లైవ్)	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	134	238	248

అప్పన్నస్వామికి బంగారు హారం బహూకరణ

విజయనగరం పట్టణం, సింహాచలం, న్యూస్‌టుడే: జడ్పీ ఛైర్మన్, వైకాపా భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) ఆదివారం విశాఖలోని సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించారు. కుటుంబ సమేతంగా సింహగిరికి విచ్చేసిన ఆయన బంగారు పగడాల హారాన్ని డిప్యూటీ ఈవో సింగం రాధ, పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావుకు అందజేశారు. హారం సుమారు 400 గ్రాముల బరువు ఉంటుందని అధికారులు తెలిపారు.

డిప్యూటీ ఈవో రాధకు హారం అందజేస్తున్న వైకాపా నేత మజ్జి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు

భక్తులకు అవస్థలు..: చిన్న శ్రీను కుటుంబంతో పాటు పదుల సంఖ్యలో అనుచరులు ఆలయానికి విచ్చేశారు. వీరందరికీ అధికారులు దర్శనాలకు అనుమతించారు. దీంతో సుమారు గంట పాటు సామాన్య భక్తులకు దర్శనాలు నిలిపివేశారు. అదే సమయంలో ఆస్థాన మండపంలోని స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అంతరాలయంలోకి తీసుకువెళ్లాల్సి ఉన్నా జాప్యం జరిగింది.

EENADU Classifieds

REAL ESTATE

ఇండివిడ్యువల్ ఇండ్లు అపార్ట్‌మెంట్ 2 BHK, 3 BHK flats, VUDA Plots బ్యాంకులోన్స్ చేయబడును. C:7207307421.

MVP కాలనీ గెస్ట్‌హౌస్ (Oyo హోటల్) నందు పని చేయుటకు రిసెప్షనిస్ట్ & రూమ్ బాయ్స్ కావలెను. ఫుడ్&వసతి కలదు. వ:28 సం॥లోపు ✆7036488899.

JOBS

వైజాగ్ ప్రముఖ షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం:10000 - 12000 + ఫుడ్, రూము. 9030588502, 9704637370

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కనక మహాలక్ష్మికి సారె సమర్పణ

తల్లికి పిండి వంటలు, పండ్లతో నైవేద్యం

విజయనగరం సిటీబస్టాండ్ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో కొలువై ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం పలువురు భక్తులు సారె సమర్పించారు. ఉదయం అమ్మవారి సన్నిధిలో లక్ష్మీ గణపతి, మహాలక్ష్మి చండీహోమాలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు గాయత్రీశర్మ పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలంకరణ అనంతరం పువ్వులు, పండ్లు, మిఠాయిలను నైవేద్యంగా సమర్పించారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

వైద్యుడి దాతృత్వంతో బడి బాగు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలం రావుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ప్రముఖ వైద్య నిపుణుడు గుల్ల సూర్యప్రకాష్‌రావు అన్నారు. విద్యార్థుల కోసం తన సొంత నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన భోజనశాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. సంక్రాంతికి గ్రామంలోని అన్ని వీధి కూడళ్లలో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రాంగణంలో మొక్కలు నాటారు. సర్పంచి బి.మహేష్, మాజీ సర్పంచి గుల్ల కాశీనాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు. సూర్యప్రకాష్‌రావు ఇప్పటికే తన తల్లిదండ్రులు లక్ష్మునాయుడు, రాములమ్మ జ్ఞాపకార్థం రూ.4 లక్షలతో పాఠశాల ఆవరణను బాగు చేశారు. విద్యార్థులకు కంప్యూటర్లు సమకూర్చారు. రూ.40 వేలతో వేదిక నిర్మించారు.

భోజనశాలను ప్రారంభిస్తున్న వైద్యుడు

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: మన్యం జిల్లాలో క్రీడాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణ అందించాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి నిర్ణయించారు. దీనికోసం మైదానాలున్న చోట క్రీడా పాఠశాలలు నడపబోతున్నారు. ముందుగా నియోజకవర్గస్థాయి పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను గుర్తిస్తారు. అక్కడ సత్తా చూపిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు. సోమవారం నుంచి ఈ ప్రక్రియ జరగనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ఎస్.మురళి, కె.నాగమణి తెలిపారు. ఈ మేరకు వేదికలు, ఇన్‌ఛార్జుల నియామకాల వివరాలను తెలియజేశారు.

నేటి నుంచే పోటీలు.. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో సోమవారం నిర్వహించనున్నారు. పాలకొండ జీహెచ్ స్కూల్, కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు జరుగుతాయి. ఇన్‌ఛార్జులుగా ఆర్.రాములు, నిరీక్షణ, బి.మాధవరావు, హరికృష్ణ వ్యవహరిస్తారు.

★ మంగళవారం పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి సీతానగరం మండలం బూర్జ పాఠశాల, సాలూరుకు సంబంధించి మామిడిపల్లిలో పోటీలు జరుగుతాయి. కబడ్డీ, అథ్లెటిక్స్, చదరంగం, బ్యాడ్మింటన్ నిర్వహిస్తారు. ఇన్‌ఛార్జులుగా బి.వైకుంఠరావు, డీటీ గాంధీ, చక్రవర్తి, ఎం.చిన్నారావు వ్యవహరించనున్నారు.

రోటరీ సేవలు మరింత విస్తృతం

మయూరి కూడలి, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్- విజయనగరం సెంట్రల్ ద్వారా ఈ ఏడాది సేవలను మరింత విస్తరించనున్నట్లు ప్రస్తుత క్లబ్ అధ్యక్షుడు విజయ అగర్వాల్ అన్నారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వచ్చే ఏడాదికి సంబంధించి నూతన అధ్యక్షుడిగా జి.జగదీష్ బాబు, కార్యదర్శిగా బత్తుల చందు, రోటేరియన్లుగా జయకృష్ణ, రామారావు, మూర్తి, రాజేష్ తదితర సభ్యులను ఎంపిక చేశారు. 2027- 28కి సంబంధించి రెయ్యి శంకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పేదలకు అండగా నిలవాలని అగర్వాల్ సూచించారు.

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

ఈనాడు దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి Cell: 80085 97609 ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి Cell: 80081 11237

(c) eenadu

ప్రమాదం అంచున.. ప్రయాణం

పాలకొండ నుంచి వీరఘట్టం మార్గంలో తంపటాపల్లి కూడలి సమీపంలోని రహదారి బాగా పాడైంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిధులు కేటాయించగా.. మరమ్మతులు చేశారు. మళ్లీ కొద్ది నెలలకే రోడ్డు కోతకు గురైంది. అంతర్రాష్ట్ర రహదారి కావడంతో రద్దీగా ఉంటుంది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తక్షణమే మరమ్మతులు చేయిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ టి.కిరణ్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

రూపు మారుతున్నాయ్!

తాగునీటి చెరువులు రూపు కోల్పోతున్నాయి. కనీస నిర్వహణ కరవు కావడంతో వ్యవసాయానికి కూడా ఉపయోగపడని దుస్థితి ఏర్పడుతోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్నా.. ప్రయోజనం కనిపించడం లేదు. రుద్రసాగరం, వెలగవాడ, సింగన్నవలస చెరువులు పూర్తిగా వినియోగానికి దూరమయ్యాయి. అధికారులు స్పందించి, పూడిక తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఎంవీ రంగారావు తెలిపారు. – న్యూస్‌టుడే, పాలకొండ

ఎండ.. వానకు తప్పని నిరీక్షణ

పెదఖర్జ కూడలిలో బస్సు షెల్టరు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండైనా, వానైనా అక్కడి చెట్టు కింద నిరీక్షించాల్సి వస్తోంది. గ్రామం నుంచి ప్రధాన రహదారి కూడలికి సుమారు కిలోమీటరు దూరం ఉంటుంది. ఏజెన్సీ ప్రాంతంలో అసలే వాహనాలు తక్కువ కావడంతో గంటల తరబడి ఉండాల్సిన పరిస్థితి. వర్షాకాలం వచ్చిందంటే ఉరుములు, మెరుపులకు భయాందోళన చెందుతున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. – న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం

చివరి దశలో వదిలేస్తే ఎలా?

బగ్గందొరవలస గ్రామ సచివాలయం పరిధిలోని రైతు సేవా కేంద్రం భవన నిర్మాణం నిలిచి మూడేళ్లు అవుతోంది. స్థానిక ప్రాథమిక పాఠశాల పక్కన 2020లో పనులు ప్రారంభించారు. రెండేళ్లలో దాదాపు 90 శాతం పూర్తి చేశారు. చివరి దశలో బిల్లుల జాప్యంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. ప్రస్తుతం అద్దె భవనంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పనుల పూర్తికి చర్యలు తీసుకుంటామని ఏఈ చంద్రమౌళి చెప్పారు. – న్యూస్‌టుడే, సీతానగరం

తాటి దుంగే వంతెన!

కొత్తూరు, శివ్వాం గ్రామాల మధ్యలో ఉన్న పంట పొలాలకు వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నాగావళి కుడి ప్రధాన కాలువపై తాటి దుంగ వేసుకుని.. రాకపోకలు సాగిస్తున్నారు. అదుపు తప్పితే నేరుగా కాలువలో పడిపోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు. ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నామని, ఇరిగేషన్ అధికారులు కాలిబాట వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గరుగుబిల్లి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

? పలగర గ్రామంలో పశువైద్య భవనం శిథిలావస్థకు చేరుకుంది. మందులు తడిసిపోతున్నాయి. - **ఎం.అప్పారావు, పలగర** ★ భవన నిర్మాణ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను. - **గణేష్, పశువైద్యాధికారి** – న్యూస్‌టుడే, బలిజిపేట

? రెల్లివీధిలో సామాజిక మరుగుదొడ్డి మరమ్మతులు చేయాలి. - **మోహన్, రెల్లివీధి** ★ టెండర్లు వేశాం. త్వరలో పనులు చేయిస్తాం. -**ప్రసాద్, డీఈ** – న్యూస్‌టుడే, సాలూరు

? తామరఖండి పరిధిలోని బురద గెడ్డకు రక్షణ గోడ లేకపోవడంతో కోతకు గురవుతోంది. - **రామినాయుడు, స్థానికుడు** ★ చర్యలు తీసుకుంటాం. - **సోమేశ్వరరావు, ఏఈ** – న్యూస్‌టుడే, సీతానగరం

? కురుపాంలోని వంగర వీధిలో పూర్తిస్థాయిలో వీధి కాలువలు లేక పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. - **హేమంత్, స్థానికుడు** ★ కాలువల నిర్మాణం చేపడతాం. - **సురేష్, ఈవో** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? అడ్డాపుశీల పంచాయతీ పీఆర్‌ఎన్ వలసలో కాలువలు పూడికతో నిండాయి. - **రమణయ్య, పీఆర్‌ఎన్‌వలస** ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **పాపారావు, ఉప ఎంపీడీవో** – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? జోగింపేటలో ఇంటింటి కుళాయిల నుంచి వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. - **సత్యనారాయణ, స్థానికుడు** ★ మరమ్మతులు చేపడతాం. - **పవన్ కుమార్, ఏఈ** – న్యూస్‌టుడే, సీతానగరం

? గుంజరాడ గ్రామం నుంచి ఉరిడి పంచాయతీ కేంద్రం వరకు రహదారి నిర్మాణం ప్రారంభించి మధ్యలో వదిలేశారు. - **శంకరరావు, స్థానికుడు** ★ నిర్మాణం పూర్తయ్యేలా చూస్తాం. - **ఎస్.అప్పారావు, ఇంజినీరింగ్ అధికారి** – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

? రావివలస సమీప బీటీ రోడ్డుకు అనుసంధానంగా నిర్మించిన సిమెంటు ర్యాంపు పాడయ్యింది. - **గ్రామస్థులు** ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. - **శంకరరావు, జేఈ** – న్యూస్‌టుడే, పాచిపెంట

ఆనంద యోగం ఆరోగ్య భాగ్యం

ఉరుకుల పరుగుల జీవితం.. పీల్చే గాలి నుంచి తినే ఆహారం వరకు ఎంతో కొంత కలుషితంగానే శరీరంలోకి వెళ్తోంది. ఈ పరిస్థితుల మధ్య 30 ఏళ్లు నిండని వారిని సైతం రక్తపోటు, మధుమేహం, గుండెపోటు వంటి రకరకాల రుగ్మతలు పీడిస్తున్నాయి. దినదినమూ పని ఒత్తిడి, ఇతర సమస్యలతో మానసిక ప్రశాంతతకు దూరం అవుతున్నారు. దీన్ని అధిగమించేందుకు యోగా, ధ్యానం దోహదపడతాయని చెబుతున్నారు పార్వతీపురం పట్టణంలోని యోగా కేంద్రం నిపుణులు. ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా కథనం. – న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

పెరిగిన ఆదరణ

జిల్లాలో అయిదేళ్ల క్రితం 20 వరకు యోగా కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 80కి చేరింది. పార్వతీపురం పట్టణంలో కొన్నేళ్ల క్రితం రెండు చోట్ల ఉచిత యోగా, ధ్యాన సాధన కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 10కి చేరింది. వందల మంది మహిళలు, వృద్ధులు, యువత ఉదయాన్నే చేరుకుని సాధన చేస్తూ ఆరోగ్యాన్ని సొంతం చేసుకుంటున్నారు.

చిన్నారుల ఆసనాలు

వేల మంది బాధితులు..

మన్యం జిల్లాలో 15 మండలాల పరిధిలో 9.25 లక్షల మంది జనాభా ఉన్నారు. ఏటా వేలాది మంది మధుమేహం, అధిక రక్తపోటు వంటి రుగ్మతల బారిన పడుతున్నారు. ఇటీవల నిర్వహించిన ఎన్‌సీడీ సర్వే ప్రకారం 36 వేల మంది వరకు రక్తపోటు, 24 వేల మంది మధుమేహం బాధితులు ఉన్నట్లు గుర్తించారు. గుండె సంబంధిత సమస్యలు ఎక్కువవుతున్నాయి.

సూర్య నమస్కారాలు చేస్తున్న మహిళలు

ప్రయోజనాలు ఎన్నో..

క్రమం తప్పకుండా ధ్యానం చేస్తే ఒత్తిడి నియంత్రణలో ఉంటుంది. రక్తపోటు అదుపులోకి వస్తుంది. ఏకాగ్రత పెరుగుతుంది. మానసిక ప్రశాంతతతో మెరుగైన నిద్రకు ఆస్కారం ఉంటుంది. భావోద్వేగాలు నియంత్రణలో ఉంటాయి. – **మోహన్ గంతయత్, పట్టణానికి చెందిన యోగా గురువు**

హుషారుగా పనులు చేస్తున్నా

కొన్నేళ్లుగా యోగా, ధ్యానం సాధన చేస్తున్నాను. అనారోగ్య సమస్యలు క్రమంగా దూరం అయ్యాయి. కీళ్ల నొప్పులు, ఆయాసం తగ్గాయి. మానసిక ప్రశాంతత సొంతమైంది. రోజంతా ఎంతో హుషారుగా ఇంటి పనులు చేసుకుంటున్నా. - **సూర్యకాంతి, గృహిణి, పార్వతీపురం**

ఇసుక తవ్వకాల పరిశీలన

పార్వతీపురం, కొమరాడ, న్యూస్‌టుడే: కూనేరు-రామభద్రపురం నాగావళి తీరం వద్ద అక్రమ ఇసుక తవ్వకాలను గనులశాఖ ఏడీ శ్రీనివాస్, ఎస్సై నీలకంఠం ఆదివారం పరిశీలించారు. మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. సిబ్బందితో కలిసి ఇసుక దిబ్బలకు కొలతలు వేశారు. నది గర్భం ఏ సర్వే నంబర్లలో ఉందో రెవెన్యూ అధికారుల నుంచి సమాచారం రావాల్సి ఉందన్నారు.

ఈనాడు కథనానికి స్పందన

తీరం వద్ద దిబ్బలను పరిశీలిస్తున్న ఏడీ తదితరులు

రోడ్డు నిర్మాణం ప్రారంభం

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: బందలుప్పి కూడలి నుంచి పులిగుమ్మి మీదుగా చిన్నారాయుడుపేట వరకు తారు రోడ్డు నిర్మాణం మొదలైంది. గత పాలకుల నిర్లక్ష్యంతో ఆరేళ్లుగా నిర్వహణ లేక మార్గం పూర్తిగా దెబ్బతింది. దీనిపై పలుమార్లు 'ఈనాడు'లో వచ్చిన కథనాలకు ఎమ్మెల్యే విజయచంద్ర స్పందించారు. రూ.3 కోట్లు మంజూరు చేయించడంతో పనులు జరుగుతున్నాయి. ఈనెలాఖరుకి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని పర్యవేక్షక డీఈఈ నాగేశ్వరరావు తెలిపారు.

వీధి దీపాలు వెలగాలి

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణంలోని అన్ని వీధుల్లో పది రోజుల్లో దీపాలు వెలగాలని సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవార్ పేర్కొన్నారు. 'ఈనాడు'లో శనివారం 'అంధకారమే ఆగంతుకుల అడ్డా' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పట్టణం చీకటిలో మగ్గితే ఉపేక్షించేది లేదన్నారు. ఏఈ దేవీ వరప్రసాద్, సిబ్బందితో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు.

పసికందుకు చుక్కల మందు వేస్తున్న మంత్రి సంధ్యారాణి

జిల్లా ఆసుపత్రి వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర, అధికారులు

నేటి ఆరోగ్య బాలలే.. రేపటి బలమైన పౌరులు

– న్యూస్‌టుడే బృందం

నేటి ఆరోగ్య బాలలే రేపటి బలమైన పౌరులని ఎమ్మెల్యే విజయచంద్ర, జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా ఆసుపత్రి వద్ద ఎమ్మెల్యే, డీవీఎంఎం పాఠశాల వద్ద జేసీ 0-5 ఏళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రోగ్రాం అధికారి ఎం.వినోద్‌కుమార్, హెచ్‌వీ పుష్ప, సిబ్బంది పాల్గొన్నారు. సాలూరు పట్టణంలోని డబ్బి వీధి పాఠశాల ఆవరణలో మంత్రి జి.సంధ్యారాణి చిన్నారులకు చుక్కల మందు వేశారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు, వైద్యుడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. భామినిలోని బాలేరు, భామిని పీహెచ్‌సీలను డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయ పార్వతి పరిశీలించారు.

పాలకొండ: కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ విక్రాంత్

వేసిన టీకాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వైద్యాధికారులు రవీంద్ర, దామోదర్, శివకుమార్ వైద్య సిబ్బంది ఉన్నారు. సీతానగరంలో ఎంపీడీవో ప్రసాద్, పార్వతీపురంలోని నర్సిపురంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ గౌరి కార్యక్రమాలు ప్రారంభించారు. కురుపాం మండలం రామభద్రపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జియ్యమ్మవలస మండలంలోని బీజేపురం, జియ్యమ్మవలస, ఇటిక, జీటీవాడ, జోగులడుమ్మ, పెదమేరంగి పోలియో బూత్‌లను జిల్లా ఆర్‌బీఎస్‌కే, ఎన్‌డీసీడీ వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు పరిశీలించారు.

అందరి సహకారంతో అభివృద్ధి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, న్యూస్‌టుడే: మండలంలోని గంగంపేటలో తెదేపా, జనసేన, భాజపా నాయకులు, క్రియాశీలక కార్యకర్తలతో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడిన తక్కువ కాలంలో అందరి సహకారంతో పాలకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. మండలంలో జరగాల్సిన అభివృద్ధి పనులను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామాలకు కొత్తగా బీటీ రోడ్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కూటమి నాయకులు, నేతలు పాల్గొన్నారు.

యువత శ్రమదానం

సీతానగరం, న్యూస్‌టుడే: గెడ్డలుప్పి వద్ద సువర్ణముఖి నదిపై వంతెనకు ఇరువైపులా గడ్డి, చెత్త పేరుకుపోవడంతో అధ్వానంగా మారింది. జనసేన నాయకుడు రమేష్ ఆధ్వర్యంలో గ్రామ యువత, జనసైనికులు శ్రమదానంతో శుభ్రం చేశారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి సూచించారు. ఆదివారం కురుపాం మండలంలోని నీలకంఠాపురం, మొండెంఖల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. రోగులతో మాట్లాడి సమస్యలు, సేవలపై ఆరా తీశారు. గదులు, దస్త్రాలు, మందుల నిల్వలు పరిశీలించిన అనంతరం ధర్మలక్ష్మీపురంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. వైద్యులు కేఎంకే వల్లీ, నిహారిక, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా సునీత

పాలకొండ, న్యూస్‌టుడే: భాజపా గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా తాడంగి సునీత ఎంపికయ్యారు. ఈ మేరకు గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పి.రాజారావు ఆదేశాలు జారీ చేశారు. ఆమె 2023లో రైల్వే బోర్డు సభ్యురాలిగా పనిచేశారు. బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'కార్మిక చట్టం నిర్వీర్యం చేస్తున్నారు'

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: పోరాటాలు, ప్రాణ త్యాగాలతో కార్మిక వర్గం సాధించిన చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. ఇదే సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఆర్.సత్యారావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌వీఎస్ కుమార్, ఉపాధ్యక్షులుగా జి.మోహనరావు, కుమారమ్మ, బి.రాధతోపాటు 9 మంది సభ్యులను ఎన్నుకున్నారు. పి.కామేశ్వరరావు, రమణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కళింగాంధ్ర జన జీవితమే 'ముంజూరు'

పార్వతీపురం, న్యూస్‌టుడే: కళింగాంధ్ర జన జీవితం వస్తువుగా వచ్చిన కవితల సమాహారంగా 'ముంజూరు' కవితా సంకలనాన్ని సాహితీ లోకానికి పరిచయం చేశామని ప్రచురణకర్త డి.రవికుమార్ అన్నారు. ఆదివారం పార్వతీపురంలోని గిరిజన భవన్‌లో స్నేహ కళా సాహితీ అధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో 'ముంజూరు', రెడ్డి శంకరరావు రాసిన 'కాలంఒడిలో' పుస్తకాల పరిచయ కార్యక్రమం జరిగింది. 'ముంజూరు' కవితా సంకలనాన్ని రచయిత జి.గౌరునాయుడు విడుదల చేశారు. ఈ పుస్తకంలో కవితలను రవికుమార్ పరిచయం చేశారు. 'కాలం ఒడిలో' పుస్తకాన్ని సిరికి స్వామినాయుడు పరిచయం చేశారు. పీఎస్ నాగరాజు, కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులంతా తెదేపా కుటుంబ సభ్యులేనని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. ఆదివారం పార్వతీపురం ప్రభుత్వ ఎస్వీ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ సమావేశానికి హాజరై, మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేసిందని చెప్పారు. ఇదే సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షుడిగా బంకురు మహేశ్వరరావు, కార్యదర్శిగా మహారాణి, గౌరవాధ్యక్షుడిగా పి.గోవిందరాజుతోపాటు పలువుర్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి బి.హైమరావు, జి.చినతిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

చినమేరంగి విద్యార్థుల ప్రతిభ

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా బొబ్బిలిలో డెల్టా ఆధ్వర్యంలో ఎస్ఎస్ఎస్ కళాశాలలో ఆదివారం జరిగిన ఆంగ్ల నైపుణ్య పోటీ పరీక్షలో జియ్యమ్మవలస మండలం చినమేరంగి జడ్పీ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థిని వెలగాడ రోషిణి ద్వితీయ స్థానం సాధించింది. బొబ్బిలి డిప్యూటీ డీఈవో మోహనరావు బహుమతులు అందించారు. గైడు టీచరుగా నరసింహాచౌదరి ఉన్నారు.

108 వాహన చోదకుడి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం పట్టణం: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పార్వతీపురంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు పట్టణంలోని ఇందిరా కాలనీలో ఉంటున్న గిరి.. సీతానగరం 108 వాహన చోదకుడిగా పనిచేస్తున్నాడు. ఓ రోగిని విజయనగరం తీసుకెళ్లేందుకు జిల్లా ఆసుపత్రికి వచ్చాడు. తోటి సిబ్బంది లోపలికి వెళ్లిన సమయంలో బయట గడ్డి మందుతాగాడు. గుర్తించిన అక్కడి వారు ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం విజయనగరం రిఫర్ చేశారు. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న గిరిజనుల వ్యక్తిగత, గ్రామ సమస్యలపై వినతులు తీసుకోనున్నట్లు తెలిపారు.

గిరిజనులకు వితరణ

పాచిపెంట, న్యూస్‌టుడే: మండలంలోని మెలియకంచూరు పంచాయతీ అల్లంపాడు గ్రామ గిరిజనులకు మాతృభూమి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రగ్గులు అందజేశారు. ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, కార్యదర్శి ఇ.గోపాలరావు, జిల్లా అధ్యక్షుడు టి.రామ్మోహనరావు, సంఘం ప్రతినిధులు టి.రాజారావు, జగదీశ్, పాచిపెంట బంగారమ్మ ఛారిటబుల్ సభ్యులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రాయితీ వరం

వీరఘట్టం, న్యూస్‌టుడే: పాడి రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పశుదాణా, పశుగ్రాస విత్తనాలు, పిల్లిపెసర రైతు సేవా కేంద్రాల ద్వారా రాయితీపై అందించేందుకు పశుసంవర్ధకశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. విత్తనాలు 75 శాతం, సమీకృత దాణా 50 శాతం రాయితీపై అందిస్తున్నారు. ఆయా వివరాలు చూస్తే..



విత్తనాలు	ధర(రూ.)	రాయితీ	పరిమాణం(కిలో)
పశుగ్రాసం: సీఎస్‌హెచ్ 24 జొన్న రకం	460	345	5
(మూడు ఆఫ్రికనాల్ట్ మొక్కజొన్న	340	255	5
రకాలు) పూసాచారి (జొన్న రకం)	357	268	5
పిల్లి పెసర	295	221	3
సమీకృత దాణా	1,110	555	50

సద్వినియోగం చేసుకోండి

గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు, దాణా అందుబాటులో ఉంటాయి. రైతులు సద్వినియోగం చేసుకోవాలి. – ఎస్.మన్మథరావు, డీఏహెచ్‌వో, పార్వతీపురం మన్యం జిల్లా

జగన్ పుట్టినరోజు వేడుకలు

కేకు కోస్తున్న పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస, పాలకొండ, సాలూరు, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివారం చినమేరంగి కోటలో మాజీ ఉపముఖ్యమంత్రి పుష్పశ్రీవాణి, వైకాపా జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేకు కోసి, మిఠాయి పంచారు. అనంతరం పేదలకు చీరలు, స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు అందించారు. ● పాలకొండలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 33 మంది కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. ● సాలూరు పట్టణంలోని బోసుబొమ్మ కూడలిలో మాజీ ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర కేకు కోసి, నాయకులకు తినిపించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ పాలకొండ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని కేశవ సాయి జూనియర్ కళాశాలలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శాసపు వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీరాములునాయుడు ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎ.రామ్‌లాల్, ఎం.జయప్రదం, బి.ఉమామహేశ్వరరావు, బి.లీలాప్రసాద్‌తోపాటు పలువురిని నియమించారు. ఎన్నిక పరిశీలకులుగా ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.బాలకృష్ణ, ఎం.మహేశ్ వ్యవహరించారు.

ప్రమాణం చేస్తున్న సభ్యులు

ధ్యానంతోనే జ్ఞానం

సాలూరు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా పట్టణ జాతీయ రహదారిపై ధ్యానమండలి సభ్యులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. బోసుబొమ్మ కూడలిలో కూర్చుని ధ్యానం చేశారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ నినాదాలు చేశారు. సత్యసాయి ధ్యానమండలి సభ్యులు, యోగాభ్యాసకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం

వీరఘట్టం గ్రామీణం: మెట్టవెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాల గణితశాస్త్ర ఉపాధ్యాయురాలు డి.సంతోషికుమారిని హెచ్ఎం శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో సత్కరించారు. ఆమె సైన్సు ప్రదర్శనలో (ఉపాధ్యాయుల విభాగం) ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా అభినందించారు.

హిందువులంతా ఐక్యంగా ఉండాలి

పాలకొండ, న్యూస్‌టుడే: ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలకొండ పట్టణంలో ఆదివారం హిందూ సమ్మేళనం నిర్వహించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విభాగ్ ప్రచార ప్రముఖ్ మోహన్‌రావునాయుడు అతిథిగా పాల్గొన్నారు. హిందువులు ఐక్యంగా ఉండాలన్నారు. డ్యాన్స్ మాస్టర్ నివేదిత ఆధ్వర్యంలో చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కవి, విద్వాన్ జానకి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇవ్వండి

మాట్లాడుతున్న కుమార్

పార్వతీపురం గ్రామీణం, పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అధిక సంఖ్యలో ఉన్న కొప్పలవెలమ కులానికి అన్నిరంగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర కొప్పల వెలమ సంక్షేమ సంఘ ఛైర్మన్ పీవీజీ కుమార్ కోరారు. ఆదివారం నర్సిపురంలో ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చుక్క భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కేవీ ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలో తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టులు పూర్తిచేసి అన్నదాతలకు సాగునీరందించాలని కోరారు. ఈ విషయాన్ని సీఎంతో చర్చిస్తామన్నారు. ఎమ్మెల్సీ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్సీ జగదీష్, జీవీనాయుడు, జిల్లా కార్యదర్శి రమేష్, కేవీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



(c) eenadu

ఈనాడు
ప్రకాశం
సోమవారం 22 డిసెంబరు 2025

సమర్థత, విధేయతకు పట్టం

▶ తెదేపా ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే ఉగ్ర
ప్రధాన కార్యదర్శిగా కొఠారి నాగేశ్వరరావు

ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కొఠారి నాగేశ్వరరావు నియమితులయ్యారు. సామాజిక సమీకరణాలు, సామర్థ్యం, సీనియారిటీ, విధేయత, అనుభవం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు వీరి పేర్లను ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న నూకసాని బాలాజీ... రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా కొనసాగుతున్న విషయం తెలిసిందే. - న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్, కనిగిరి

నిత్యం ప్రజల్లోనే ఉంటూ...

ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి స్వగ్రామం హనుమంతునిపాడు మండలంలోని తిమ్మారెడ్డిపల్లి. కర్ణాటక రాష్ట్రం దావణగిరిలో ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్య వృత్తిలో కొనసాగారు. తల్లిదండ్రులు నరసారెడ్డి, రత్నమ్మ. తండ్రి గ్రామ సర్పంచిగా, తల్లి హనుమంతునిపాడు జడ్పీటీసీ సభ్యురాలిగా పనిచేశారు. వారి స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చిన ఉగ్ర... 2009లో కనిగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2014లో ఓటమి చవిచూశారు. 2019లో తెదేపా తరఫున బరిలో దిగి పరాజయం పొందారు. అయినప్పటికీ ప్రజల్లోనే ఉంటూ... ఉచిత నేత్ర, వైద్య శిబిరాలు, ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగించారు. సొంత నిధులతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేశారు. వైకాపా ప్రభుత్వ పాలనను ఎండగడుతూ పార్టీ చేపట్టిన ఆందోళనలను సమర్థంగా నిర్వహించారు. ఈ అంశాలే ఆయనను అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టాయి. 'తనను గుర్తించి పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు జీవితాంతం రుణపడి ఉంటాన'ని ఎమ్మెల్యే ఉగ్ర తెలిపారు.

కేసులకు వెరవకుండా...

ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కొఠారి నాగేశ్వరరావు... ఒంగోలు నగరం మంగమూరువారిపాలెం వాసి. 1994లో తెదేపా బూత్ ఏజెంట్‌గా పని చేశారు. 1999లో తెలుగు విద్యార్థి, 2001-05 వరకు పట్టణ యువత అధ్యక్షుడిగా కొనసాగారు. 2009 నుంచి పార్టీ కార్యాలయంలో వివిధ పదవుల్లో కొనసాగారు. 2017 నుంచి 2025 వరకు నగర అధ్యక్షుడిగా సేవలందించారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాలు, అక్రమాలపై గట్టిగా నిరసన గళం వినిపించారు. ఆ అక్కసుతోనే ఆ పార్టీ కార్యకర్తలు ఆయనపై దాడికి తెగబడ్డారు. అయిదేళ్ల వ్యవధిలో అక్రమంగా మొత్తం 16 కేసులు బనాయించారు. అయినప్పటికీ పార్టీ తరఫున నగరంలో నిర్వహించిన అన్ని ఆందోళనల్లోనూ చురుగ్గా పాల్గొన్నారు. ఆ తెగువే పదవిని తెచ్చిపెట్టాయి.

సాయికి లక్ష గులాబీలతో అర్చన

పేర్నమిట్టలో కొలువుదీరిన శిర్డీ సుందర సాయి మందిరంలో ఆదివారం... లక్ష గులాబీలతో బాబాకు నిర్వహించిన పూలంగి సేవ కనులపండువగా సాగింది. ముందుగా ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులే స్వయంగా పూలతో అర్చించే అవకాశం కల్పించారు. వందలాదిగా మహిళలు పాల్గొన్నారు. సాయిపద సేవకులు పేర్నమిట్ట హరిప్రసాద్, రావూరి శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. - న్యూస్‌టుడే, పేర్నమిట్ట (సంతనూతలపాడు)

అనధికార వెంచర్లు... అక్రమాల పుట్టలు!

▶ అధికారులు గుర్తించినా చర్యలకు మీనమేషాలు

న్యూస్‌టుడే, కనిగిరి

గత వైకాపా సర్కారు హయాంలో చేయని భూమాయ లేదు. ప్రభుత్వ స్థలం కనిపిస్తే చాలు పాగా వేశారు. ప్రైవేటు వ్యక్తుల జాగాలను వదల్లేదు. రియల్ మాటున చోటుచేసుకున్న అక్రమాలకు లెక్కేలేదు. ఇదంతా ఒక ఎత్తయితే ఆ ప్రాంతాల్లో అడ్డగోలుగా వెంచర్లు వేసి ఇష్టానుసారం ప్లాట్లు విక్రయించడం మరో ఎత్తు. భవిష్యత్తులో కొనుగోలుదారులు ఇబ్బందులు పడతారని తెలిసినా... కొందరు అధికారులు ఆక్రమార్కులకు వంతపాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నాటి కబ్జాలు, అడ్డగోలు లే అవుట్లపై నిర్దిష్ట చర్యలు లేకపోవడంతో నేటికీ అక్రమాల తంతు కొనసాగుతూనే ఉంది.

కనిగిరి - పామూరు రోడ్డులో అనుమతి లేని ఓ లేఅవుట్

నిబంధనలకు తిలోదకాలు...

సొంత వ్యవసాయ భూమిలో వెంచర్ వేయాలన్నా దానిని వ్యవసాయేతరంగా మార్చాలి. ఇందుకోసం నిర్దేశిత రుసుము చెల్లించి రెవెన్యూ, మున్సిపల్/పంచాయతీల నుంచి అనుమతి పొందాలి. మొత్తం స్థలంలో పది శాతం సామాజిక అవసరాల కోసం విడిచిపెట్టాలి. రహదారులు, కాలువలు, విద్యుత్తు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలి. వాగులు, వంకలు ఉంటే జల వనరులశాఖ అనుమతులు తప్పనిసరి. క్షేత్రస్థాయిలో మాత్రం ఇవేవీ అమలు కావడం లేదు. ఆక్రమిత భూములనే కలిపి అనుమతులు లేకుండా ప్లాట్లుగా విక్రయించేస్తున్నారు. కొన్నిచోట్ల సాగునీటి వనరులను సైతం కప్పేసి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటుండడం గమనార్హం. కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల్లో మునుపెన్నడూ లేని స్థాయిలో అనధికార వెంచర్లు వెలిశాయి.

గత వైకాపా ప్రభుత్వ హయాంలో ప్రైవేటు భూములకూ రక్షణ లేకుండా పోయింది. ఒంగోలు నగరం, మార్కాపురం పట్టణాల్లో వెలుగు చూసిన భూబాగోతాలే ఇందుకు నిదర్శనం. రాష్ట్రవ్యాప్తంగానూ ఇవి సంచలనం కావడంతో కేసుల విచారణకు ప్రత్యేకం సిట్ ఏర్పాటు చేశారు. నేటికీ పలువురు బాధితులు న్యాయం కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

క్రమబద్ధీకరణకు స్పందన కరవు...

రెవెన్యూ అధికారులు ఇటీవల నిర్వహించిన సర్వేలో మార్కాపురం పట్టణంలో 32, ఒంగోలులో దాదాపు 270, కనిగిరిలో వందకు పైగా అనధికార వెంచర్లను గుర్తించారు. ప్రభుత్వ, ఆక్రమిత భూములు కాని వాటి క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినా అంతగా స్పందన లేకపోవడం గమనార్హం. ఈ విషయమై కనిగిరి ఆర్డీవో జి.కేశవర్ధన్‌రెడ్డి స్పందిస్తూ... అనధికార వెంచర్లపై పీవోటీ కింద కేసులు నమోదు చేసి, 5 శాతం అపరాధ రుసుము చెల్లించాలని నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల్లో వాటిని క్రమబద్ధీకరించుకోకుంటే ఇతరత్రా అనుమతులేవీ లభించవని స్పష్టం చేశారు.

నేటి నుంచి కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభం

▶ ముఖ్యఅతిథిగా హోంమంత్రి అనిత రాక

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: స్టయిఫండరీ క్యాడెట్ ట్రైనీ (ఎస్‌సీటీ) పోలీసు కానిస్టేబుళ్ల శిక్షణ... ఒంగోలులోని పోలీసు శిక్షణ కళాశాల (పీటీసీ), జిల్లా శిక్షణ కేంద్రం (డీటీసీ)లో సోమవారం నుంచి ప్రారంభం కానుంది. పీటీసీలో 532 మంది మహిళలకు, డీటీసీలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన 207 మంది పురుష కానిస్టేబుళ్లకు తొమ్మిది నెలల పాటు ఈ శిబిరం కొనసాగనుంది. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. శిక్షణకు సంబంధించి అన్ని ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తిచేసింది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జిల్లా కలెక్టర్ రాజాబాబు హాజరుకానున్నారు.

హలో ఒంగోల్!

సినీ నటి, వ్యాఖ్యాత అనసూయ భరద్వాజ్ ఒంగోలు నగరంలో ఆదివారం సందడి చేశారు. ఓ షాపింగ్ మాల్ ప్రారంభానికి వచ్చిన ఆమెను చూసేందుకు అభిమానులు ఎగబడ్డారు. వారిని ఉత్సాహపరుస్తూ ఆమె ఇలా ఫొటోకు పోజిచ్చారు. – ఈనాడు, ఒంగోలు

మత్తుకు వ్యతిరేకంగా యువత పోరాడాలి

▶ ఏబీవీపీ మహా సభల్లో ఒడిశా గవర్నర్ హరిబాబు

ఒంగోలు, న్యూస్‌టుడే: దేశంలో నేడు ప్రధాన సమస్యగా మారిన డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత, విద్యార్థులు పోరాడాలని ఒడిశా రాష్ట్ర గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. గత మూడు రోజులుగా ఒంగోలులో నిర్వహిస్తున్న అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర 44వ మహా సభల్లో ఆదివారం ముఖ్య అతిథిగా ప్రసంగించారు. మాదకద్రవ్యాల వల్ల తలెత్తే దుష్పరిణామాలను తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈశాన్య రాష్ట్రాలకు దేశంలోని ఇతర ప్రాంతాలతో సంబంధాలు మెరుగుపరచడంలో ఏబీవీపీ ప్రారంభించిన సీల్ ప్రాజెక్టు కీలకపాత్ర పోషించిందని కొనియాడారు. మిజోరం గవర్నర్‌గా పనిచేసిన కాలంలో దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు అక్కడ పర్యటించిన విషయాన్ని గుర్తు చేశారు. నూతన విద్యా విధానం అమలుతో సమాజం మరిన్ని ప్రయోజనాలు పొందుతోందని తెలిపారు. జనమంచి గౌరీ శంకర్ పురస్కారాన్ని మదనపల్లికి చెందిన వెల్‌విషర్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గిరీష్ నల్లగుట్టకు అందజేశారు. సభా ప్రాంగణంలో పెద్ద ఫ్రేములతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ ప్రతులను ఆసక్తి తిలకించి నిర్వాహకులను అభినందించారు. ముందుగా విద్యార్థి పోరాటాల్లో అమరులైన వారికి నివాళులర్పించారు. ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు నూజిళ్ల శ్రీనివాస్, కార్యదర్శి యాగంటి గోపి, డాక్టర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. గవర్నర్ హోదాలో వచ్చిన హరిబాబును పలువురు ప్రముఖులు, మిత్రులు కలిశారు.

మాట్లాడుతున్న ఒడిశా గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు, వేదికపై ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, గిరీష్ తదితరులు

పల్స్‌పోలియో విజయవంతం

ఒంగోలు వైద్యం, న్యూస్‌టుడే: పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా సాగింది. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో అవసరమైన ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి తూర్పునాయుడుపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒంగోలు రాజీవ్ గృహకల్ప కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన శిబిరంలో కలెక్టర్ రాజాబాబు పాల్గొన్నారు. అయిదేళ్లలోపు పిల్లలందరికీ వ్యాక్సిన్ అందేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కొప్పోలు రోడ్డులోని కేంద్రంలో మేయర్ సుజాత పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,44,112 మంది చిన్నారులకు చుక్కల మందు వేయాలన్నది లక్ష్యం కాగా... తొలి రోజు 92.88 శాతం లక్ష్యం చేరినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ డి. వెంకటేశ్వర్లు తెలిపారు. తొలిరోజు కేంద్రాలకు రాని పిల్లలకు సోమ, మంగళవారాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు అందిస్తారని చెప్పారు.

తూర్పునాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న మంత్రి స్వామి

రేపు ఉద్యోగ మేళా

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో పాత రిమ్స్ ప్రాంగణంలో ఈ నెల 23న ఉదయం 10 గంటలకు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రమాదేవి తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసు కలిగి; పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ పూర్తిచేసిన వారు అర్హులన్నారు. ఆసక్తిగల వారు తగిన ధ్రువపత్రాలతో నేరుగా హాజరు కావచ్చని వెల్లడించారు.

చంద్రశేఖర పురం ఆ పేరు ఎలా వచ్చిందంటే!

మీకు తెలుసా?

చంద్రశేఖర పురం అంటే చాలామందికి తెలియదు కానీ... సి.ఎస్.పురం అంటే మాత్రం ఠక్కున గుర్తుపడతారు. ఆ పేరు రావడం వెనుక ఓ చరిత్ర ఉంది. క్రీ.శ. 1211లో ఈ ప్రాంతాన్ని శ్రీకాళహస్తి మహారాజులు పాలించారు. అప్పట్లోనే ఇక్కడ శ్రీకామాక్షి చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంతో పాటు ఓ చెరువును చంద్రశేఖర మహారాజు నిర్మించారు. సంబంధిత శాసన ఆధారాలు సైతం ఉన్నాయి. తరువాతి కాలంలో ఆయన పేరిటే ఈ ప్రాంతానికి చంద్రశేఖర పురం అన్న పేరు వచ్చింది. ఆలయం నిర్మించి 814 ఏళ్లు అయినప్పటికీ నేటికీ చెక్కుచెదరలేదు. సాధారణంగా శివాలయాల్లో ఆదిదేవుడి దర్శనం తరువాత అమ్మవారిని దర్శించుకుంటారు. ఇక్కడ మాత్రం కామాక్షమ్మ దర్శనం అయ్యాకే శివుడిని దర్శించుకోవడం ప్రత్యేకత. – న్యూస్‌టుడే, సి.ఎస్.పురం

ఎనిమిది శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం

లారీల లాలిత్యం

▶ వై.పాలెం స్టేషన్‌లో కుందేళ్లు, పక్షుల సంరక్షణ

మనం ఏదైనా పోలీసు స్టేషన్‌కు వెళ్తే కేసులు, ఫిర్యాదుదారులతో వాతావరణం గంభీరంగా ఉంటుంది. యర్రగొండపాలెం స్టేషన్ మాత్రం ఇందుకు భిన్నం. పచ్చని పరిసరాలు... కుందేళ్లు, పక్షుల కిలకిలారావాలతో ప్రాంగణం ఆహ్లాదం పంచుతుంది. ప్రస్తుతం ఇక్కడ ఎనభైకి పైగా కుందేళ్లతో పాటు రామచిలుకలు, పావురాలు, గిన్నె కోళ్లు; సాధారణ, హంసలను పోలిన బాతులు ఉన్నాయి. పోలీసులే వీటిని ప్రేమగా సాకుతుండడం విశేషం. –న్యూస్‌టుడే, యర్రగొండపాలెం పట్టణం

రామచిలుకలు

హంసలను పోలిన బాతులు

ఆరంభం ఇలా...

2014లో ఇక్కడ ఎస్సైగా పనిచేసిన మాతంగి శ్రీనివాసరావు స్వతహాగా పక్షి ప్రేమికుడు. ఆయనే బెంగళూరు నుంచి ప్రత్యేకంగా ఒక్కో జత చొప్పున వివిధ రకాల పక్షులను తెచ్చారు. స్టేషన్ ఆవరణలోని పూల మొక్కల మధ్యనే వాటి కోసం గూళ్లు ఏర్పాటు చేశారు. షెడ్లు నిర్మించి వాటిని జాగ్రత్తగా సంరక్షించారు. తరువాత వచ్చిన అధికారులు సైతం ఆ సంస్కృతిని కొనసాగించారు. వాటి సంతతే క్రమంగా పెరిగి ఇప్పుడు పదుల సంఖ్యలో కనువిందు చేస్తున్నాయి. గతంలో నెమళ్లు సైతం ఉండేవి. కాలక్రమంలో కొన్ని ఎగిరిపోగా... అననుకూల వాతావరణంతో మరికొన్ని చనిపోయాయి.

కుందేళ్లకు మేత వేస్తున్న సిబ్బంది

నిత్యం పర్యవేక్షణ...

సిబ్బంది ఎంత ఒత్తిడిలో ఉన్నా రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వీటికి ఆహారం అందజేస్తుంటారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ నుంచి ప్రత్యేకంగా ఆకుకూరలు, క్యాబేజీ వంటివి తెస్తుంటారు. పక్షులకు సజ్జలు, బియ్యం వంటి గింజలను అందుబాటులో ఉంచుతున్నారు. సీఐ అజయ్‌కుమార్, ఎస్సై చౌడయ్య పర్యవేక్షిస్తున్నారు. వార్షిక తనిఖీలు, ఇతర సందర్భాల్లో స్టేషన్‌కు వచ్చే ఉన్నతాధికారులు సైతం వీటిని చూసి సిబ్బందిని అభినందిస్తుంటారు.

ఎవరిదో రుణం... డ్వాక్రా సభ్యులపై భారం

▶ మార్కాపురంలో చోద్యం

ఎవరో చెల్లించని రుణ బకాయిలను ఇప్పుడు డ్వాక్రా మహిళల నుంచి వసూలు చేయడం విమర్శలకు తావిస్తోంది. చివరకు జమా ఖర్చుల నమోదుకు ఇచ్చే పుస్తకాలకు సైతం పెద్ద మొత్తంలో అదనంగా వసూలు చేస్తున్నారు. మార్కాపురంలో చోటుచేసుకుంటున్న ఈ వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. –న్యూస్‌టుడే, మార్కాపురం

ఇదీ విషయం...

మార్కాపురం మండలంలో 2014-19 మధ్య డీఆర్‌డీఏ (వెలుగు) ద్వారా కొన్ని పొదుపు సంఘాలకు స్త్రీనిధి రుణాలు అందజేశారు. ఆ మొత్తం తీసుకున్న వారిలో కొందరు తిరిగి చెల్లించగా... మరికొందరు చెల్లించలేదు. దీంతో రూ.40 లక్షల మేర బకాయిలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఈ మొత్తం చెల్లిస్తేనే కొత్తగా రుణాలు ఇస్తామని స్త్రీనిధి కార్పొరేషన్ వారు స్థానిక అధికారులకు స్పష్టం చేశారు. ఇక్కడి సిబ్బంది ఆయా సంఘాల నుంచి రికవరీ చేయకుండా... కొత్తగా రుణం తీసుకునే వారి నుంచి అనధికారికంగా రూ.5 వేలు చొప్పున వసూలు చేస్తున్నారు. లేదంటే రుణం ఇప్పించేంది లేదని చెబుతున్నారు. వెలుగు నుంచి ఇచ్చే ఎంసీపీ (మైక్రో క్రెడిట్ ప్లాన్) సైతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గత నెల రోజులుగా ఈ వ్యవహారం సాగుతోంది. ఎవరో చెల్లించని రుణం మా నుంచి వసూలు చేయడమేంటని పొదుపు మహిళలు వాపోతున్నారు.

పుస్తకాలకూ అదనంగా వసూళ్లు...

పొదుపు సంఘాలకు సంబంధించిన నగదు లావాదేవీలు, జమా ఖర్చుల నమోదుకు జిల్లా కేంద్రం నుంచి అన్ని మండలాలకు పుస్తకాలు సరఫరా చేశారు. ఒక్కో సంఘంలోని మంది మంది సభ్యులకు ఒక్కొక్కటి చొప్పున పది; తీర్మానాల కోసం మరో పుస్తకం అందజేస్తున్నారు. వీటి మొత్తం ఖరీదు రూ.275 కాగా... అన్ని గ్రామాల్లోనూ రూ. 3 వేల నుంచి రూ.3,300 వరకు వసూలు చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విషయాన్ని ఏపీఎం పిచ్చయ్య దృష్టికి తీసుకువెళ్లగా... మండల సమాఖ్య నిధి కోసం ఆ మొత్తం సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...!

▶ ఏళ్ల తరువాత చివరి ఆయకట్టుకు సాగర్ జలాలు

ఏళ్ల తరువాత జిల్లాలోని సాగర్ ఆయకట్టు చివరి భూములకు సాగర్ జలాలు చేరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వరకు త్రిపురాంతకం, కురిచేడు, దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు, చీమకుర్తి, మద్దిపాడు, సంతనూతలపాడు, ఒంగోలు గ్రామీణం తదితర మండలాల పరిధిలో దాదాపు రెండు లక్షల ఎకరాల్లో సాగర్ ఆయకట్టు ఉంది. ప్రస్తుతం వీటిలో వరి, మిర్చి, పొగాకు, మొక్కజొన్న, కంది, శనగ పంటలతో పాటు కొన్ని చోట్ల పశుగ్రాసం సాగు చేస్తున్నారు. గతంలో తగినంత సరఫరా లేక ఆయా మేజర్, మైనర్ కాలువల చివరి భూములకు నీరందేది కాదు. ప్రస్తుతం నాగార్జున సాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా జలాలు చేరడంతో సాగుకు పూర్తిస్థాయిలో నీరివ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు జలాలు సరఫరా కావడంతో చివరి భూములకు నీరు చేరుతున్నాయి.

దర్శి వద్ద ఓబీసీలో సాగర్ నీటి పరవళ్లు

గత దశాబ్దకాలంలో ఎన్నడూ లేని విధంగా దర్శి బ్రాంచి కాలువకు 828 క్యూసెక్కులు, పమిడిపాడు... 630, ఒంగోలు బ్రాంచి కాలువకు 935 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. దీంతో ఆయా కాలువలు జలకళను సంతరించుకున్నాయి. రజానగరం మేజరుకు 180, కరవది మేజరుకు 200 క్యూసెక్కులు ఇస్తుండడంతో గత పాతికేళ్లుగా నీరందని భూములకు సైతం ఇప్పుడు నీరందుతోంది. – న్యూస్‌టుడే, తాళ్లూరు

ఆన్‌లైన్‌లో పుస్తక భాండాగారం

న్యూస్‌టుడే, సి.ఎస్ పురం

▶ అందరికీ అందుబాటులో సమస్త సమాచారం

విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులకు అన్ని విధాలా ప్రయోజనం చేకూరేలా వారికి అవసరమైన పుస్తకాలు ఆన్‌లైన్‌లో ఉచితంగా చదివేందుకు వీలుగా ప్రభుత్వం నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎల్‌డీఐ)ని అందుబాటులోకి తెచ్చింది. టెక్నాలజీ, సైన్స్, సోషల్ సైన్సు, లా, మెడికల్ ఇలా ఒకటేమిటి... ప్రైమరీ నుంచి పీజీ వరకు అన్ని విభాగాలకు సంబంధించిన పుస్తకాలు అన్ని భాషల్లో ఇందులో పొందుపరిచారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి సిలబస్ ప్రకారం అభ్యసన సామగ్రిని అందుబాటులో ఉంచారు. మన వివరాలు నమోదు చేసుకుని ఎప్పుడైనా, ఎక్కడైనా వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా దీనిని వినియోగించుకోవచ్చు. విషయ నిపుణుల వీడియోలు సైతం ఉన్నాయి.

వినియోగం ఇలా...

గూగుల్ బ్రౌజర్‌లో సంస్థ సైట్‌ను ఓపెన్ చేసి మనకు ఏ అంశం కావాలో ఎంచుకుని చదువుకోవచ్చు. సంబంధిత వీడియోలూ వీక్షించవచ్చు. అవసరమైన వాటిని డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటూ ఉంది. ప్లేస్టోర్ నుంచి ఎన్‌డీఎల్‌ఐ యాప్‌ను సైతం డౌన్‌లోడ్ చేసుకొని స్మార్ట్ ఫోన్, డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌ల్లో దేనితోనైనా వినియోగించుకోవచ్చు. అంతా ఉచితమే.

రూ.లక్షల్లో లెక్క... అందని నీటి చుక్క!

పుల్లలచెరువుతో పాటు మరో 42 గ్రామాలకు రక్షిత జలాలు అందించేందుకు ఉద్దేశించిన ముటుకుల తాగు నీటి పథకం నిర్వహణ లోపభూయిష్టంగా మారింది. సగం గ్రామాలకు అదీ అరకొరగా నీరిస్తున్నా... నిర్వహణ పేరిట ఏటా రూ.లక్షల మేర బిల్లులు చెల్లిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గుత్తేదారుల కుమ్మక్కై పథకం నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
– న్యూస్‌టుడే, పుల్లలచెరువు (యర్రగొండపాలెం)

▶ ముటుకుల ప్రాజెక్టు పరిధిలో పరిస్థితి ఇది

ముటుకులలో తాగు నీటి పథకం

సగం గ్రామాలకే సరఫరా

దాదాపు రూ.17 కోట్ల నాబార్డు నిధులతో 2009లో నిర్మించిన ప్రాజెక్టు... తొలి నుంచీ అధికారులు, గుత్తేదారులకు కాసులు కురిపించే పథకంగానే కొనసాగుతోంది. మొత్తం 43 ఆవాస ప్రాంతాలకు జలాలు ఇవ్వాల్సి ఉన్నా... ప్రస్తుతం ఇరవై గ్రామాలకు ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పథకమున్న ముటుకులకే సరిగా నీరందని దుస్థితి. అయిదు కి.మీ. దూరంలో ఉన్న మర్రివేములకు నేటికీ చుక్క నీరందలేదు. మిగతా గ్రామాల్లో ట్యాంకులు మాత్రమే నింపుతూ... వీధులకు సరఫరా చేయడంలేదు. మండల కేంద్రమైన పుల్లలచెరువుకు అప్పుడప్పుడూ సరఫరా చేస్తున్నా... అక్కడి సంపు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసనతో కూడిన నీళ్లు వస్తున్నాయి. వాడుకలకు తప్ప తాగేందుకు అవి పనికిరావడం లేదని స్థానికులు వాపోతున్నారు.

ఏటా రూ.58 లక్షల చెల్లింపు...

తాగేందుకు పనికిరాని జలాలు సరఫరా చేస్తున్నా... పథకం నిర్వహణ పేరిట ఏటా గుత్తేదారుకు రూ.58 లక్షలు చెల్లిస్తున్నారు. ఇవి కాకుండా మరమ్మతులు, ఇతర ఖర్చుల పేరిట మరింత దండుకుంటున్నారు. ఈ విషయమై ప్రాజెక్టు ఏఈ శ్రీకాంత్ మాట్లాడుతూ.. గతం కంటే సరఫరా మెరుగ్గా ఉందన్నారు. గ్రామాల్లో పంపిణీ బాధ్యత పంచాయతీల వారు చూడాలన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిద్ధమవుతున్న టిడ్కో ఇళ్లు

కనిగిరి సమీపంలోని చాకిరాల వద్ద అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్ల సముదాయ నిర్మాణం చేపట్టారు. తొలి దశలో దాదాపు రూ.60 కోట్లు వెచ్చించి మొత్తం 19 బ్లాకుల్లో 912 గృహాలకు శ్రీకారం చుట్టారు. 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. కనీస నిర్వహణా పట్టించుకోక పోవడంతో నిండా చిల్లచెట్లు పెరిగాయి. కిటికీలు, ద్వారాలు సైతం దెబ్బతిన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిపై దృష్టి సారించింది. వారం రోజులుగా జంగిల్ క్లియరెన్స్, అంతర్గత రహదారుల నిర్మాణం, టైల్స్ ఏర్పాటు వంటి పనులు చేపడుతున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వచ్చిన కూలీలు వీటిని చేస్తున్నారు. కొత్త సంవత్సరంలో లబ్ధిదారులకు వీటిని అందించనున్నట్లు టిడ్కో అధికారి నాగరాజు తెలిపారు.
– న్యూస్‌టుడే, వెలిగండ్ల

(c) eenadu

ఫలించిన కష్టం.. వరించిన ఉద్యోగం

● కానిస్టేబుల్ పోస్టులకు పొదిలి యువత ఎంపిక

పొదిలికి చెందిన వారంతా పేద, మధ్య తరగతి కుటుంబాల యువకులు. ఇటీవల జరిగిన ఏపీ ఎస్పీ కానిస్టేబుల్ పరీక్షల్లో చక్కటి ప్రతిభ చూపారు. తల్లిదండ్రుల కష్టాన్ని వృథా కానివ్వకుండా ఉద్యోగ సాధనలో సఫలీకృతులయ్యారు. వారి మాటల్లోనే విజయ రహస్యాలు ఇలా..

- న్యూస్‌టుడే, పొదిలి

తొలిసారి విఫలమైనా నిరుత్సాహ పడలేదు

పొదిలికి చెందిన కె.రామాంజనేయులు తల్లిదండ్రులు కె.గురవమ్మ, వెంకట్రావు. వీరికి ఇద్దరు కుమారులు. రామాంజనేయులు డిగ్రీ చదివారు. తండ్రి చనిపోయిన తరువాత కుటుంబ పోషణ భారమైంది. తమ్ముడు శ్రీను అన్నలోని ప్రతిభను గుర్తించి అండగా నిలిచారు. ఆటల్లో చురుగ్గా ఉండే రామాంజనేయులు పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం కోసం ప్రతిరోజు ఎస్వీకేపీ డిగ్రీ కళాశాలలో సాధన చేశాడు. మొదటిసారి ఉద్యోగం రాకపోయినా నిరుత్సాహపడకుండా రెండో ప్రయత్నంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు.

ప్రణాళికాబద్ధంగా సిద్ధం

పొదిలి నవాబుమిట్టకు చెందిన షేక్ ఇమ్రాన్ తల్లిదండ్రులు షేక్ జిలానిబాషా బల్కీస్‌భాను. కోడి గుడ్ల వ్యాపారం. డిగ్రీ చదివిన ఇమ్రాన్ కానిస్టేబుల్ ఉద్యోగానికి పద్ధతిగా సాధన చేసి సాధించారు. ప్రణాళికాబద్ధంగా చదవడం వల్లే ఉద్యోగం సాధించినట్లు పేర్కొన్నారు.

వెన్నంటిన ప్రోత్సాహంతో ముందుకు..

పొదిలికి చెందిన కానిస్టేబుల్ ముల్లా సలీం, తహీరున్‌ల కుమారుడు ముల్లా మహమ్మద్ నవీద్ కానిస్టేబుల్ ఉద్యోగ సాధనలో 2019లో మొదటి ప్రయత్నంలో విఫలమైనా నిరాశచెందలేదు. తల్లిదండ్రులు, స్నేహితుల సహకారంతో పొదిలి ఎస్వీకేపీ డిగ్రీకళాశాల ప్రాంగణంలో నిరంతరం సాధన చేశారు. మంచి ర్యాంకుతో ఉద్యోగం సాధించాడు.

అయిదేళ్లుగా సాధన

పొదిలికి చెందిన మదార్ వలి, బషీరాల కుమారుడు ముల్లా దరియా ఎంబీఏ చదివారు. మధ్యతరగతి కుటుంబం. ఐదేళ్లుగా ప్రతి రోజు ఎస్వీకేపీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో సాధన చేశారు. పొదిలి కొత్తూరులో ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన లైబ్రరీలో పుస్తకాలను చదివేవారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు నాసర్ అహమ్మద్, స్నేహితుల సహకారం, ప్రోత్సాహంతో ఉద్యోగం సాధించగలిగినట్లు దరియా తెలిపారు.

ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలు

ఒంగోలు అంజయ్యరోడ్డు, న్యూస్‌టుడే: ఆర్టీసీలో డోర్ డెలివరీ పార్సిల్స్ మాసోత్సవాలను శనివారం నుంచి ప్రారంభించామని ఒంగోలు డిపో మేనేజర్ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలోని 87 ముఖ్య నగరాలకు ఎక్కడి నుంచి ఎక్కడికైనా కార్గో పార్సిళ్లను డోర్ స్టెప్ వద్ద డెలివరీ ఇచ్చే సౌకర్యం ఏపీఎస్ ఆర్టీసీ కల్పించినట్లు చెప్పారు.

ప్రమాదంలో గాయాలు

కురిచేడు: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కురిచేడు- నమశ్శివాయపుర అగ్రహారంల మధ్య ఆదివారం చోటుచేసుకుంది. దేకనకొండకు చెందిన పాతకోట మస్తాన్ తన ద్విచక్ర వాహనంపై కురిచేడు వచ్చి పనులు ముగించుకుని స్వగ్రామానికి బయలుదేరారు. మార్గంమధ్యలో వాహనం అదుపుతప్పి రహదారిపై పడటంతో మస్తాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రుడిని దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మీ పొదుపు డబ్బుల్లో అక్రమాలు జరిగాయా..?

మెప్మా పీడీ శ్రీహరితో నేడు 'ఈనాడు' ఆధ్వర్యంలో ఫోన్‌ఇన్ కార్యక్రమం

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా అమలవుతున్న పథకాలు, పొదుపు సంఘాల రుణాల్లో అక్రమాలు, దివ్యాంగుల సంక్షేమ పథకాలు, స్ట్రీట్ వెండర్స్ సమస్యలు, బోగస్ గ్రూపులపై జరుగుతున్న విచారణ.. ఇలా పొదుపు సంఘాల మహిళలు, ఇతర గ్రూపుల సభ్యులు తమ సమస్యలను నేరుగా జిల్లా అధికారితో మాట్లాడే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తుంది. జిల్లా మెప్మా ప్రాజెక్టు అధికారి శ్రీహరితో సోమవారం ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల్లోని పొదుపు సంఘాల సభ్యులు, ఇతరులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. - న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

తేదీ: 22-12-2025 (సోమవారం) | సమయం: ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు | ఫోన్ చేయాల్సిన నంబరు: 79016 10215

సూర్యప్రకాశరావుకు ప్రముఖుల అభినందనలు

శిద్దా సూర్యప్రకాశరావును అభినందిస్తున్న సుధీర్‌కుమార్, హనుమంతరావు, బాలాజీ తదితరులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రముఖ పారిశ్రామిక వేత్త శిద్దా సూర్య ప్రకాశరావు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులుగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శిద్దా హనుమంతరావు, శిద్దా భరత్, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, పారిశ్రామిక వేత్త సుధీర్ కుమార్, సూర్యప్రకాశరావు సోదరుడు శిద్దా బాలాజీ కుటుంబ సభ్యులు కార్యక్రమంలో పాల్గొని ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలతో సత్కరించారు. రాబోయే సంవత్సరంలో వాసవీ క్లబ్ ద్వారా మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని అభిలాషించారు. వాసవి క్లబ్‌కు తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని మాజీ మంత్రి రాఘవరావు తెలిపారు. జిల్లా నుంచి ప్రకాశరావు అభిమానులు, మిత్రులు, వ్యాపారవేత్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత వెంకటేశ్వర్లు, చిత్రంలో కార్మిక సంఘ నేతలు

'హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు'

దర్శి, న్యూస్‌టుడే: కార్మిక సంఘాల పోరాటాలతో సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు విమర్శించారు. దర్శిలో ఆదివారం హమాలీ కార్మికుల ప్రథమ మహాసభలు ఏఐటీయూసీ జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడు హనుమంతరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన చట్టం వల్ల కార్మికులు తమ హక్కుల కోసం పోరాడేందుకు అవకాశం కూడా ఉండదన్నారు. అంతకుముందు కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సభా ప్రాంగణంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సుభానీనాయుడు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రభాకర్, సుబ్బయ్య, ఇతరులు, కార్మికులు పాల్గొన్నారు.

కనుల పండువగా ముద్దసానమ్మకు పూజలు

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కోలభీమునిపాడు గ్రామశివారులో వెలసిన ముద్దసానమ్మతల్లి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారు విశేష పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొంగు బంగారంగా విలసిల్లుతున్న తల్లిని మార్కాపురం పరిసర ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు.

చెన్నకేశవునికి రూ.10 లక్షల విరాళం

దేవాదాయశాఖ అధికారికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: హనుమంతునిపాడు మండలం చినగొల్లపల్లిలో పునఃనిర్మిస్తున్న శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానానికి కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి రూ. 10 లక్షల విరాళం అందజేశారు. ఆదివారం స్థానిక సాయిబాబా దేవస్థానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర కల్గిన దేవస్థానానికి తనవంతు సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. మరింతమంది దాతలు ముందుకొస్తే దేవస్థానానికి పూర్వ వైభవం తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈవో నరసింహబాబు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అథ్లెటిక్స్ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో సిబ్బంది

మార్కాపురం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కమలా పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్-16, 18, 20 పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి యువకులు ఉత్సాహంగా తరలివచ్చారు. ఈ పోటీల్లో ఎ.సాంబశివరావు, డి.రమేష్‌రెడ్డి, డి.హాసిని, శ్రీజాహాసిని, డీవీ.శ్రీకాంత్, ఏ.సాయితేజేశ్వర్ రెడ్డి, ఎం.శివకాశి, టి.శ్రీలక్ష్మి, వై.శిరీష, కె.సంతోష్‌నాయక్, పి.నాగరాజు, బి.మల్లికార్జున, డి.రవణయ్య తదితరులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. త్వరలో కాకినాడ జిల్లా పెద్దాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

సందడిగా స్వాతి షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం

జ్యోతి వెలిగించి షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి అనసూయ, పాల్గొన్న నిర్వాహకులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని అద్దంకి బస్టాండ్ వద్ద సరికొత్తగా ఏర్పాటు చేసిన స్వాతి షాపింగ్ మాల్‌ను ఆదివారం సినీనటి అనసూయ భరద్వాజ్ ప్రారంభించారు. మూడో వార్షికోత్సవం సందర్భంగా ప్రారంభమైన మాల్‌ను అధునాతన హంగులతో ఒక సంపూర్ణ సకుటుంబ ఫ్యాషన్ ప్రపంచంగా తీర్చిదిద్దినట్లు యజమానులు పూర రమణబాబు, సాత్విక్, సాకేత్‌లు పేర్కొన్నారు. కొనుగోళ్లను ప్రారంభించిన అనసూయ అభిమానుల మధ్య సందడి చేశారు.

యువతను చైతన్యపరచడం అభినందనీయం

ప్రొఫెసర్ పీహెచ్‌జీ కృష్ణంరాజు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఆయన వయసు 80 దాటినా యువతలో చైతన్యం తేవడానికి పుస్తకం రాయడం అభినందనీయమని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ ఉపకులపతి డాక్టర్ చుండూరి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రముఖ ఆచార్యులు ఒంగోలుకు చెందిన పీహెచ్‌జీ కృష్ణంరాజు సేజ్ రిఫ్లక్షన్-2 అనే పేరుతో ఆంగ్లంలో రాసిన పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. మాజీ ఉపకులపతితోపాటు, మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనుభవజ్ఞులు రాసిన ఇలాంటి పుస్తకాలు యువతకు మార్గదర్శకంగా ఉంటాయన్నారు. కృష్ణంరాజు విద్యారంగానికి చేసిన సేవలు గురించి హరిబాబు వివరించారు. కార్యక్రమంలో హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్, విశ్రాంత ప్రభుత్వ కార్యదర్శి వి.సాంబశివరాజు, రచయిత, కవి టి.అరుణ, డాక్టర్ నల్లూరి రాఘవరావు, చల్లా నాగేశ్వరమ్మ, విద్యాసంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రైలులో గంజాయి పట్టివేత

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: అలప్పుజా ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న ఏడు కేజీల గంజాయిని ఈగిల్ పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. మహిళా పీఎస్ సీఐ యు.సుధాకర్ సారథ్యంలోని ఈగిల్ బృందం ఒంగోలు రైల్వేస్టేషన్ పరిసరాలు, పలు రైళ్లలో తనిఖీలు చేపట్టారు. అలప్పుజా ఎక్స్‌ప్రెస్‌లో సింగరాయకొండ వరకు నిర్వహించిన తనిఖీల్లో గంజాయితో ఏడుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరు ఒడిశా సరిహద్దు ప్రాంతం నుంచి తమిళనాడుకు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. అనుమానిత వ్యక్తులను ఒంగోలు జీఆర్పీ పోలీసులకు అప్పగించారు.

భార్యపై కత్తితో దాడి

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కుటుంబ వివాదాల నేపథ్యంలో భార్యపై కత్తితో భర్త దాడిచేసిన సంఘటన ఒంగోలు జీజీహెచ్‌లో ఆదివారం జరిగింది. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.. షేక్ అలేఖ్య, బాషా భార్యభర్తలు. స్థానిక వెంగముక్కపాలెంలో నివాసం ఉంటున్నారు. అలేఖ్య జీజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. వీరిమధ్య కొద్ది రోజులుగా వివాదాలు ఉన్నాయి. ఆదివారం జీజీహెచ్ వద్దకు వచ్చిన బాషా విధుల్లో ఉన్న అలేఖ్యపై కూరగాయలు కోసే కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమెకు పక్కటెముకల వద్ద గాయాలయ్యాయి. సహచర సిబ్బంది వెంటనే స్పందించి ఆసుపత్రిలోకి తరలించారు. నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.

ప్రాణం తీసిన ఈత సరదా

● మడనూరు తీరంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: స్నేహితులతో కలిసి సరదాగా సముద్ర తీరానికి వచ్చిన ఓ విద్యార్థి అలలు దాటికి నీట మునిగి మృతి చెందిన సంఘటన కొత్తపట్నం మండలం మడనూరు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం. . నెల్లూరు నగరానికి చెందిన కొమరి హర్షసాయి(19), ఒంగోలులోని హాస్టల్‌లో ఉంటూ నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన స్నేహితులతో కలిసి సముద్ర తీరానికి వచ్చాడు. అందరూ కలిసి కొంత సేపు సముద్రంలో దిగి స్నానాలు చేశారు. కొందరు మళ్లీ సముద్రంలోకి దిగారు. ఆ సమయంలో ఒక విద్యార్థి అలల్లో చిక్కుకున్నాడు. అతడిని కాపాడేందుకు మరొకరు వెళ్లారు. అతడు కూడా నీటిలో మునిగిపోవడం గమనించిన హర్షసాయి కాపాడేందుకు వెళ్లాడు. వారు దిగిన చోట సముద్రంలో గుంతలు ఉండటంతో ముగ్గురూ చిక్కుకుపోయారు. దీనిని గమనించిన స్థానిక మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి వారిని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే హర్షసాయి మృతి చెందినట్లు గుర్తించారు. మిగిలిన ఇద్దరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా.. మరొక విద్యార్థి నీరు అధికంగా తాగడంతో స్పృహకోల్పోయాడు. అతడిని ఒంగోలులోని ఓ ఆసుపత్రికి తరలించారు. హర్షసాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడికి తీవ్ర గాయాలు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పూల సుబ్బయ్య కాలనీకి చెందిన శివ (26) ఔషధ దుకాణంలో గుమస్తాగా పనిచేస్తున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి సమయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి మార్కాపురం- తర్లుపాడు రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్‌కు ఎదురుగా బోల్తాపడినట్లు చెప్పారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిని స్థానికంగా వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించినట్లు తెలిపారు. ఈ విషయంపై మార్కాపురం పట్టణ పోలీసులను సంప్రదించగా ఇంకా సమాచారం అందలేదని తెలిపారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు సంతపేటలో శనివారం రాత్రి చోరీ జరిగింది. స్థానిక సాయిబాబా గుడికి సమీపంలోని వీధిలో నివశించే పురాణం నరసింహమూర్తి ఇంటిలో దొంగలు పడ్డారు. ఎస్సీ కార్పొరేషన్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన నరసింహమూర్తి ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తి తలుపు స్క్రూలు తీసి లోపలికి వెళ్లి బీరువాలో ఉన్న 36 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించాడు. చోరీ జరిగిన విషయాన్ని ఆదివారం గుర్తించిన నరసింహమూర్తి సోదరుడు పురాణం ఉమామహేష్ ఈ విషయాన్ని తన సోదరుడికి తెలిపి, అనంతరం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై పున్నారావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 138, రిటైల్ లైవ్ - 165, చికెన్ విత్ స్కిన్ - 239, చికెన్ స్కిన్‌లెస్- 272

అభివృద్ధి పనులకు పంచాయితీ అవసరమా..?

● ఆర్ఎల్‌పురంలో మూలుగుతున్న రూ.కోట్ల నిధులు

● వర్గపోరుతో వసతులు సమకూరక ప్రజలకు తప్పని కష్టాలు

న్యూస్‌టుడే, చీమకుర్తి

మురుగు కాలువల్లో పూడిక తీయించడానికి, వీధుల్లో విద్యుత్తు దీపాల ఏర్పాటుకు కూడా కొన్ని గ్రామ పంచాయతీల్లో నిధులు ఉండవు. ఎప్పుడు నిధులు మంజూరు చేస్తారా.. అభివృద్ధి పనులు చేయిద్దామా.. అని ఎన్నో పంచాయతీలు ఎదురు చూస్తుంటాయి. అలాంటిది ఏటా రూ.కోట్లలో ఆదాయం వచ్చినా.. ఏడిదిన్నరగా రూ.కోట్ల నిధులు మూలుగుతున్నా అక్కడి వారికి మాత్రం ప్రజల కష్టాలు పట్టడం లేదు. వారికి తెలిసినదంతా రాజకీయమే.. అందుకు నిదర్శనమే ఇది.

రామతీర్థం కూడలి సమీపంలో రాజుపాలెం రహదారి దుస్థితి

గ్రానైట్ గనులు విస్తరించి ఉండడంతో

గెలాక్సీపురిగా రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయ వనరుల పంచాయతీగా వాసికెక్కిన చీమకుర్తిమండలం రాజుపాలెం లక్ష్మీపురం (ఆర్ఎల్‌పురం) పంచాయతీ ఖాతాలో రూ.23 కోట్లకు పైగా నిధులున్నా వాటిని వినియోగించే దిశగా చర్యలు తీసుకోలేకపోవడం గమనార్హం. కనీసం రహదారులకు మరమ్మతులు చేపట్టే దిశగా ఆలోచన చేయడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గెలాక్సీ గ్రానైట్ గనులు విస్తరించి ఉన్న పంచాయతీలో డబ్బులకు కొదవ లేదు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రూ.3 కోట్ల చొప్పున ఏడాదికి రూ.6 కోట్ల గ్రానైట్ సీనరేజీ నిధులు ఖాతాలో జమ అవుతుంటాయి.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా పంచాయతీ పాలకవర్గం వైకాపా చేతుల్లో ఉంది. అధికార పార్టీలో ఉన్న వర్గాలతోపాటు, పాలకవర్గం మధ్య తగిన రీతిలో సయోధ్య కుదరక పోవడంతో నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టే విషయంలో కొంత కాలంగా ప్రతిష్టంభన కొనసాగుతోంది. దీంతో రామతీర్థం-రాజుపాలెం మధ్య రహదారి దారుణంగా దెబ్బతిన్నా, ఇతర రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టేందుకు వీలులేని పరిస్థితులు నెలకొన్నాయి. ఆయా వర్గాల మధ్య సమన్వయానికి

కనీస మరమ్మతులూ కరవే..

గతంలో ఒకటి రెండుసార్లు చర్చలు జరిగినా ఫలించలేదు. చీమకుర్తి మండల పరిషత్తులోనూ ఇదే రీతిలో ప్రతిష్టంభన నెలకొనగా ప్రజా ప్రతినిధుల చొరవతో నిధుల వినియోగం దిశగా అడుగులు పడ్డాయి. దీంతో ఇటీవల జరిగిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో రూ.12.5 కోట్లతో పలు అభివృద్ధి పనులకు ఆమోద ముద్ర వేశారు. ప్రజా ప్రతినిధులు ఇదే చొరవను రాజుపాలెం లక్ష్మీపురం పంచాయతీ విషయంలోను చూపితే అభివృద్ధి పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ విషయమై పంచాయతీ అధికారులు స్పందిస్తూ రాజుపాలెం నుంచి రామతీర్థం మధ్య డివైడర్‌తో రెండు వరుసల్లో సిమెంటు రహదారి నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఆర్‌అండ్‌బీ రహదారి అయినందున పంచాయతీ నిధులు వెచ్చించేందుకు జిల్లా అధికారుల అనుమతి ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూడా ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph :81422 92071.

JOBS

కావేరిగ్రాండ్ హోటల్ ఒంగోలు నందు పనిచేయుటకు అనుభవం గల లేడి రిసెప్షనిస్ట్ & నైట్ డ్యూటి రిసెప్షనిస్ట్ (Male) కావలెను. ✆ 75692 35857.

JOHN DEERE ట్రాక్టర్ షోరూమ్, ఒంగోలు, అద్దంకి, కందుకూరు, ఇంకొల్లు డివిజన్‌లో మండలాల వారీగా పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 9177904555, 8712019197

సురక్ష హాస్పిటల్, కందుకూరు నందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. ఇది కేవలం ఆడవాళ్ళకు మాత్రమే. సంప్రదించండి. ✆ 93476 41395

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, క్యాంపస్ హాస్టల్ A.Oగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 18000/- వరకు ఇవ్వబడును. ఉచిత భోజనము వసతి కల్పించబడును. విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సం||ల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర. ✆: 92487 33320.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

ఒంగోలులోని ప్రముఖ విద్యాసంస్థ నందు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ JL's కావలెను. Q: M.Sc. జీతం: 15,000/- సంప్ర|| ✆ 87121 64111.

ఒంగోలు, గుళ్ళాపల్లిలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, S.Oలు కావలెను. జీతం 11-15 వేలు. డ్యూటీ 12 గం||లు. ✆ 81796 95848, 96766 49517.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బు వసూలు చేసే ప్రకటనకర్తలు బ్లాక్-లిస్టులో ఉంచడం మరియు/లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

బహుమతులు అందుకున్న విద్యార్థినులతో టీచర్లు

వై.పాలెం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

మార్కాపురం

● మార్కాపురం ● గిద్దలూరు ● యర్రగొండపాలెం

వర్తమానంలో ప్రతిభ చాటారు.. బహుమతి పట్టారు

కంభం, న్యూస్‌టుడే: పట్టణంలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ‘ఈనాడు’ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ‘జనరల్ నాలెడ్జ్’పై అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు చక్కటి సమాధానాలు రాశారు. ఈ పోటీల్లో అత్యధిక మంది విద్యార్థులు పాల్గొన్నారు. టి.స్వస్తి (10వ తరగతి), సీహెచ్.గీతిక (9వ తరగతి), వి.సుకన్య (9వ తరగతి) ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు ఉపాధ్యాయినిలు ఎం.శారద, ఎ.ఉషశ్రీ, పి.మాధవరాణి బహుమతులు అందజేశారు. ● యర్రగొండపాలెం: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనాడు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యధిక మంది విద్యార్థులు పాల్గొన్నారు. పి.ప్రవీణ్ (ప్రథమ) రాఘవ (ద్వితీయ) ఎస్కే ఉమైజ (తృతీయ) స్థానాల్లో బహుమతులు గెలచుకున్నారు. విజేతలకు ఉపాధ్యాయులు బత్తి బాదరయ్య, పి.బ్రహ్మయ్య, సుబ్బాయమ్మ, శ్రీనివాస్ బహుమతులు అందజేసి అభినందించారు.

రోడ్డు మార్జిన్లు ఆక్రమిస్తే చర్యలు

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రోడ్డు మార్జిన్ ఆక్రమణలపై సీఐ చర్యలు చేపట్టారు. ఇందు కోసం ప్రతి ఆదివారం తన సర్కిల్లోని పట్టణాల్లో సైకిల్ రైడింగ్ చేస్తున్నారు. ఆదివారం వై.పాలెంలో సైకిల్ రైడింగ్ చేసి రహదారుల మార్జిన్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైకిల్ రైడింగ్ చేస్తున్న సీఐ అజయ్‌కుమార్

23న రగ్బీ జిల్లా జట్టు ఎంపిక పోటీలు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 23న జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలబాలికల జట్ల ఎంపికలు జరుగుతాయి. ఈ విషయాన్ని నిర్వహణ అధ్యక్ష, కార్యదర్శులు బి.వి.రెడ్డి, ఓ.డి.షకీలా తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

రాచర్ల: మండలంలోని యడవల్లి విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్తు సరఫరా ఉండదు. ఈ విషయాన్ని ఏఈ బాలగురవయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ పనులు, మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు వివరించారు. ఈ మేరకు ప్రజలు సహకరించాలని కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

పొదిలి: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం ద్వారా మానసికంగా ప్రశాంతంగా ఉండవచ్చని సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎం.రమాదేవి అన్నారు. ఆదివారం పొదిలిలోని ఎస్ఎస్ఎన్ కళాశాల, పాతూరులోని సాయిబాబా దేవాలయం ఆవరణలో జరిగిన ఉచిత ధ్యాన జ్ఞాన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ధ్యాన సాధనతో వివిధ రకాల రుగ్మతల నుంచి బయటపడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.శ్రీనివాసులు, ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి కృషి

‘న్యూస్‌టుడే’తో ఉప కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి

ముఖాముఖి

న్యూస్‌టుడే, మార్కాపురం:

ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రజలకు జవాబుదారీగా పని చేయడానికి సకల చర్యలు తీసుకుంటాం. ముఖ్యంగా రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకుంటామని మార్కాపురం ఉప కలెక్టర్ ఎం.వెంకట శివరామిరెడ్డి అన్నారు. ఓవైపు కొత్త జిల్లా ఏర్పాటుకు చర్యలు సాగుతుండగా, మరోవైపు వివిధ సమస్యల పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ‘న్యూస్‌టుడే’ ఆయనతో ‘ముఖాముఖి’ నిర్వహించగా పలు విషయాలు తెలిపారు. ఆ వివరాలిలా..

వీలైనంత త్వరగా పాస్ పుస్తకాల జారీ..

రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల జారీ వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకునేలా కృషి చేస్తున్నాం. పట్టా భూములు ప్రభుత్వ భూములుగా ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు అయిన వాటిని డివిజన్ స్థాయిలో పరిష్కరించి జిల్లా కేంద్రానికి పంపిస్తున్నాం. మార్కాపురం డివిజన్‌లోని ప్రజలు సాదాబైనాంకు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్నిశాఖల అధికారులు వారంలో తప్పనిసరిగా ఆయా మండలాలు, గ్రామాల్లో మూడు రోజులు ప్రజల్లో ఉండాలి.

ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తున్నాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర కల్పిస్తున్నాం. మార్కాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో ఏడు ధాన్యం కొనుగోలు కేంద్రాలున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం విక్రయం జరుగుతుంది. 75 కేజీలకు మద్దతు ధర రూ.1,792 నిర్ణయించారు. క్వింటాకు రూ.2,389 మద్దతు ధరను చెల్లిస్తారు.

భూముల రీ సర్వే వేగవంతం

మార్కాపురం డివిజన్‌లో భూముల రీ సర్వే వేగవంతంగా జరుగుతోంది. డివిజన్‌లోని 13 మండలాల్లో మండలానికి ఒక్క గ్రామాన్ని ఎంపిక చేసుకుని ఇప్పటి వరకు రెండు విడతల వారీగా రీ సర్వే జరిగింది.

దర్శిని కలపాలని 650 దరఖాస్తులు

మార్కాపురం జిల్లాను ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే దర్శి నియోజకవర్గాన్ని కలపాలని 650 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాపై అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 28వ తేదీ వరకు సమయం ఉంది. వచ్చిన దరఖాస్తులు అన్నీ జిల్లా కేంద్రానికి పంపిస్తాం.

ఆలయాల్లో ఆధ్యాత్మిక వైభవం

కంభం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని కోట సత్యమాంబదేవి అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పసుపు, చందనం, పుష్పాలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు.

పట్టాభిరామునికి పుష్పాలంకరణ

కంభం, బేస్తవారపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ధనుర్మాసం పురస్కరించుకొని కంభంలో వేంకటేశ్వరస్వామిని, బేస్తవారపేటలోని పట్టాభి రామ స్వామిని ఆదివారం పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

పోలేరమ్మకు నిమ్మకాయలతో..

మార్కాపురం పట్టణం: పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ వేడుకలను ఆదివారం మనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలు, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదే విధంగా ఆలయంలో వెలసిన నాగమయ్య విగ్రహాల వద్ద మహిళలు పూజలు నిర్వహించారు.

పశ్చిమానికి మార్కాపురం జిల్లా గర్వకారణం

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం జిల్లాతో పశ్చిమ ప్రాంత వాసుల కల నెరవేరిందని.. ఎంతో గర్వకారణంగా ఉందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వం జిల్లా ప్రకటించిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సెవెన్ హిల్స్ నుంచి 2కె రన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతాన్ని జిల్లా చేయడం వల్ల అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటరెడ్డి, జనసేన, భాజపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు ఇమ్మడి కాశీనాథ్, పి.వి.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ● మార్కాపురంలో పోలియో చుక్కల కార్యక్రమాన్ని స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఎమ్మెల్యే కందుల ప్రారంభించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ పి.బి.మనష్షే, నాయకులు పాల్గొన్నారు. ● రాయవరంలో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు.

2కె రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, అధికారులు

గ్రీన్‌ఫీల్డ్ హైవే పేరుతో రైతులకు అన్యాయం

తర్లుపాడు, న్యూస్‌టుడే: తర్లుపాడు మండలానికి మంజూరైన గ్రీన్‌ఫీల్డ్ హైవేను జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాకుండా అడ్డుకుని రైతులకు తీవ్ర అన్యాయం చేశారని ఎమ్మెల్యే నారాయణరెడ్డి విమర్శించారు. మండలంలోని తాడివారిపల్లెలో ‘రైతన్నా...మీకోసం’ కార్యక్రమంలో ముఖ్యాతిథిగా పాల్గొని మాట్లాడారు.

● పొదిలి: వెనుకబడిన పశ్చిమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక జిల్లాతోనే సాధ్యమని తెదేపా నాయకులు అన్నారు. ఆదివారం మండలంలోని నందిపాలెం గ్రామంలో తెదేపా ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు,ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించి మాట్లాడారు.

కవయిత్రి షకీలాను సన్మానిస్తున్న దృశ్యం

ఉత్తమ కవయిత్రికి సన్మానం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్న షేక్.షకీలా ఇటీవల ఉత్తమ కవయిత్రిగా అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం గిద్దలూరు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. గ్రంథ పాలకురాలు ఎస్.ప్రసన్న కుమారి, గ్రంథాలయ కమిటీ సభ్యులు బి.నారాయణరెడ్డి, డి.నారాయణరెడ్డి, ముసలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ తోటల సాగుపై అవగాహన

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రైతులు మల్బరీ తోటలను పెంచి పట్టుపురుగుల పెంపకంలో పట్టు సాధించాలని సెరికల్చర్ అసిస్టెంట్ అధికారి సుబ్బారెడ్డి అన్నారు. పుల్లలచెరువు మండలం కొమరోలు గ్రామంలో పట్టు పురుగుల పెంపకంలో రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా వారికి అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ వాణి, శ్రీధర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడదామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం గిద్దలూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణంశెట్టిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ● కొమరోలు గ్రామీణం: కొమరోలు సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవ రెడ్డి పోలియో చుక్కలు వేసి మాట్లాడారు. ● త్రిపురాంతకం: మండలంలో 98 శాతం మంది చిన్నారులు పోలియో చుక్కలు వేయించుకున్నట్లు వైద్యాధికారి డా.భాస్కర్ రెడ్డి తెలిపారు. ● కంభం: మండలంలోని కందులాపురంలో ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, తురిమెళ్లలో సర్పంచి మాదా సుభద్ర చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. డీవైఈవో జగదీశ్ కేంద్రాలను పరిశీలించారు. ● తర్లుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం నుంచే పోలియో చుక్కలు వేశారు. ● మార్కాపురం గ్రామీణం: పెద్దయాచవరం వైద్యులు డాక్టర్ సాయిదరహాస్‌రెడ్డి, వైద్యులు కిషోర్ కుమార్, పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్నారు. ● గిద్దలూరు పట్టణం: పోలియో తీరును జిల్లా ఆరోగ్య విస్తరణ మీడియా అధికారి బెల్లం నరసింహారావు తనిఖీ చేశారు. ● బేస్తవారపేట: మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు జిల్లా పల్స్ పోలియో సూపర్‌వైజర్ అధికారి డాక్టర్ భగీరథ పేర్కొన్నారు. ●పొదిలి: పొదిలి మండలంలో ఉప్పలపాడు వైద్యాధికారి డాక్టర్ ఎం.సుగుణకుమార్ పాల్గొన్నారు.

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, వైద్యసిబ్బంది

వై.పాలెం: పోలియో చుక్కలు వేస్తున్న నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, తదితరులు

మార్కాపురం పట్టణం: పోలియో చుక్కలు వేస్తున్న మున్సిపల్ కమిషనర్ నారాయణరావు

సంక్షేమం, అభివృద్ధికి కృషి

మార్కాపురం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన పదవీ కాలంలో సంక్షేమం, అభివృద్ధికి కృషి చేశారని ఆయన జన్మదిన వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉందని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. జగన్ జన్మదినం సందర్భంగా స్థానిక గడియార స్తంభం కూడలి వద్ద భారీ కేక్ కోసి అందరికీ పంచిపెట్టి మాట్లాడారు. ● పెద్దారవీడు: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వైకాపా ఎమ్మెల్యే చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ● పొదిలి: పొదిలిలో మార్కాపురం అడ్డరోడ్డు, పెద్దబస్టాండ్, చిన్నబస్టాండ్ ప్రాంతాల్లోని వైఎస్ఆర్ విగ్రహాలకు వైకాపా ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పూలమాలవేసి నివాళ్లర్పించారు.

రోడ్డుకిరువైపులా చెట్లు.. రాకపోకలకు ఇక్కట్లు

చిత్రంలో కనిపిస్తోంది వెంకటాద్రిపాలెం-అంకమ్మగూడెం వెళ్లే తారు రోడ్డు. గిరిజనులు నిత్యం రాకపోకలు సాగించే ఈ రోడ్డుకిరువైపులా చిల్లచెట్లు పెరిగిపోయి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పరస్పరం ఢీకొని ప్రమాదాల పాలవుతున్నామని కొందరు వాహనదారులు తెలిపారు. ఒకటిన్నర కిలోమీటరు పొడవున్న దారికి ఏళ్లతరబడి నిర్వహణ లేకపోవడంతో చాలాచోట్ల గుంతలు పడ్డాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, యర్రగొండపాలెం

ప్రారంభించక ముందే.. పగలగొట్టేశారు!

పుల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే బాలికల కోసం ప్రభుత్వం నిర్మించిన వసతిగృహం ప్రారంభించకుండానే మరమ్మతులకు గురవుతోంది. పల్లెల నుంచి వచ్చే విద్యార్థినుల వసతికోసం రూ.1.94కోట్లు ఖర్చుచేశారు. ఈ నిధులు సరిపోకపోవడంతో ఇటీవల మరో రూ.34 లక్షలు వెచ్చించి పూర్తిచేశారు. చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఆకతాయిల అడ్డాగా మారింది. కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో ప్రారంభానికి సిద్ధమైన సమయంలో మరోసారి మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయంపై ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా.. అదనపు నిధులతో ఇటీవల పనులు పూర్తిచేశామన్నారు. దాదాపు పది కిటికీలు ధ్వంసమైనట్లు వివరించారు.

- న్యూస్‌టుడే, పుల్లలచెరువు(యర్రగొండపాలెం)

రోడ్డుపై గుంతలు.. చేయాలి మరమ్మతులు

పొదిలి పట్టణంలోని ఉడుముల ఆసుపత్రి ముందు వైపు ప్రధాన రహదారిపై గుంతలు పడి మరమ్మతులు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో తాత్కాలికంగా డస్ట్ వేసినప్పటికీ మళ్లీ గుంతలు పడ్డాయి. దీంతో వాహనచోదకులు, ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పోలీసుపెట్రోలు బంకు సమీపంలోనూ నడిరోడ్డుపై గుంత పడింది. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, పొదిలి

విజేతలకు జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేస్తున్న దాతలు

గణిత క్విజ్ పోటీల్లో చక్కటి ప్రతిభ

కంభం: ముగ్గురు స్నేహితుల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి గణిత క్విజ్ పోటీలు నిర్వహించారు. వాటిల్లో పెద్దారవీడు మండల దేవరాజుగట్టు విద్యార్థులు భవిత, కారుణ్య, శివనందిని, వెంకట తరుణ్‌తేజ్‌ల జట్టు ప్రథమ, టంగుటూరు మండలం ఆలకూరపాడు హైస్కూల్ విద్యార్థులు అర్చన, నీహారిక, సంధ్య, లివీన జట్టు ద్వితీయ స్థానంలో నిలిచారు. దోర్నాల ఉన్నత పాఠశాల విద్యార్థులు వెంకటనాగ బసవేశ్వర నిశాంత్, నాగవంశీ, మాధవ్, మహమ్మద్ రెహాన్, వంశీల జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. వాకా వెంకటేశ్వరరెడ్డి, చల్లా వెంకటరమణ జయదేవి, గని వెంకటేశ్వర్లు ఆర్థిక సహకారం అందించారు. డి.నబి, వెంకటేశ్వరరెడ్డి, శివప్రసాద్, లక్ష్మీశ్రీనివాసులు, శ్రీకృష్ణ, కనకదుర్గ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం : 8008574135
యర్రగొండపాలెం : 8008552658

?: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి జగదీశ్వరి థియేటర్‌కు వెళ్లే వీధిలో రోడ్డు అధ్వానంగా ఉంది. పైపులైన్ల కోసం సీసీ రోడ్డు తవ్వి అలానే వదిలి వేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలి. – ఎస్.రమేష్, పట్టణవాసి

✓: గుంతలు పూడ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. నిధులు మంజూరైన వెంటనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. –డీవీఎస్.నారాయణరావు, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం

?: మండల కేంద్రంలోని దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. దీంతో చిన్నారులు, ప్రజలు అనారోగ్యానికి పాలవుతున్నారు. వెంటనే చర్యలు తీసుకోండి.స్థానికులు, త్రిపురాంతకం.

✓: దోమల మందు పిచికారీ చేయించి రెండు రోజుల్లో కాలువలను శుభ్రం చేయిస్తాను.

- రామసుబ్బయ్య, పంచాయతీ అధికారి, త్రిపురాంతకం.

మార్కాపురం పట్టణం, త్రిపురాంతకం, న్యూస్‌టుడే:

నృత్యం చేస్తున్న విద్యార్థులు

సేవలోనే అసలైన ఆనందం

మార్కాపురం పట్టణం: పట్టణంలోని జార్జి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ వేడుకల్లో పాల్గొని కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేవుని యందు కృప ఉంచి సమాజసేవకు కృషి చేయాలన్నారు. సేవలోనే అసలైన ఆనందం ఉందని వివరించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్‌ఖాశిం, వైస్ ప్రిన్సిపల్ రాజారావు, వివిధ చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా సురేంద్ర

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం పట్టణానికి చెందిన సూరే సురేంద్ర.. 2026 సంవత్సరానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్‌గా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రతిష్ఠాత్మకమైన ఐకాన్-2025 అవార్డును అంతర్జాతీయ అధ్యక్షుడు శిద్దా వెంకట సూర్య ప్రకాశరావు చేతుల మీదుగా అందుకున్నట్లు చెప్పారు.

వెంకట సూర్యప్రకాశరావు నుంచి అవార్డు అందుకుంటున్న సురేంద్ర

ఉద్యోగ నియామక పత్రాలు చూపుతున్న అభ్యర్థులు

ఉద్యోగ మేళాకు స్పందన

కంభం, న్యూస్‌టుడే: పట్టణంలోని గౌతమ్ విద్యా సంస్థలు, శాండ్ స్పేస్ ప్రైవేటు లిమిటెడ్ కంపెని ఆధ్వర్యంలో ఆదివారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్, హుందాయ్ మోటార్స్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 120 మందికి ఆయా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు అందుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ చేగిరెడ్డి రామభూపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మహేశ్వరరెడ్డి, విద్యా సంస్థల డీన్ ఎన్.సుబ్బారెడ్డి, అధ్యాపకులు, కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు అందరికీ ఆదర్శం

కంభం: ఏసుక్రీస్తు సూచించిన ప్రేమ, దయ, కరుణ వంటి మార్గాల్లో ప్రపంచ మానవాళి ముందుకు నడుస్తోందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని యర్రబాలెం గ్రామంలో రాష్ట్ర ఎడ్యుకేషన్, సోషల్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గోనా చెన్నకేశవులు ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. క్రీస్తు మార్గం ఆదర్శమన్నారు. ● బేస్తవారపేట: బేస్తవారపేటలోని అంబేడ్కర్ కాలనీలో వేశపోగు భరణీ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కంభం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూనూరు భూపాల్‌రెడ్డి మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

పనులు నత్తనడక.. ప్రయాణికులకు అవస్థ

❑ రైల్వేస్టేషన్ అభివృద్ధికి అధికారుల చొరవ అవసరం

న్యూస్‌టుడే, కంభం:

కంభం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

‘అమృత్ భారత్ పథకం’లో భాగంగా..

అమృత్ భారత్ పథకంలో భాగంగా ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. స్టేషన్ పరిసరాల్లో సరైన మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళా ప్రయాణికులకు అవస్థలు పడుతున్నారు. మొదటి ఫ్లాట్‌ఫాంపై ఒకచోట మాత్రమే గతంలో నిర్మించిన మరుగుదొడ్లు ఉన్నాయి. వాటి నిర్వహణ అధ్వానంగా ఉంది. కుళాయిలు పాచిపట్టి, దుర్వాసన వస్తున్నాయి. మొదటి ప్లాట్‌ఫాంపై కొంతభాగం బాగు చేయాల్సి ఉంది. రైలు ఎక్కే ప్రాంతంలో గుంతలు పడి ఉంది. ఎగుడు, దిగుడుగా అసౌకర్యంగా మారింది. దానిపై కొత్తగా అభివృద్ధి చేసిన ప్రాంతంలో కూర్చునేందుకు కనీసం బెంచీలు లేవు.

ముఖ్య పట్టణాలకు నిత్యం రాకపోకలు

కంభం రైల్వేస్టేషన్‌కు కంభం, బేస్తవారపేట, అర్ధవీడు, హనుమంతునిపాడు, కనిగిరి, తర్లుపాడు తదితర మండలాల నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. కంభం స్టేషన్ మీదుగా సుమారు 15 రైళ్లు హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, హుబ్లీ, భువనేశ్వర్, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి.

రాత్రిపూటే ఎక్కువగా తిరిగే రైళ్లు

రాత్రివేళల్లోనే ఎక్కువగా ట్రైన్లు రాకపోకలు సాగిస్తుండడంతో శౌచాలయాలు కూడా సరిగ్గా లేక మహిళలకు అవస్థలు తప్పడం లేదు. రెండో ఫ్లాట్‌ఫాంపై కుళాయిలు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లు లేవు. ఫ్లాట్ ఫాం మట్టి, వ్యర్థాలున్నాయి. స్టేషన్ ముందు భాగంలో అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. రైల్వేస్టేషన్ వచ్చే రహదారి గుంతలమయంగా మారింది. మరికొంత భాగంలో రోడ్డుకు రెండు వైపులా ముళ్లచెట్లు పెరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రెండు ప్లాట్‌ఫాంలపై మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, కుళాయిలు శుభ్రంగా ఉంచి కనీస వసతులు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెండో ప్లాట్‌ఫాంపై తొలగించని వ్యర్థాలు

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్
(Scheduled Bank Owned by Government)
రీజనల్ ఆఫీస్: మార్కాపురం, బ్రాంచ్: అయినముక్కల

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (SARFAESI ACT, 2002)లోని యాక్ట్ 54 ఆఫ్ 2002 లోని సెక్షన్ 13(2) క్రింద ప్రకటన

డిమాండ్ నోటీసు

దిగువ వారికి
ఋణగ్రహీత(లు): 1)పొట్టిపాటి అనిల్ కుమార్ రెడ్డి, తండ్రి: చిన్న అంకిరెడ్డి, మల్లికార్జున సత్రం ఎదురు, రజక సత్రం దగ్గర, శ్రీశైలం పిన్: 518101
2)పొట్టిపాటి హరిచందన, భర్త: పి. అనిల్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున సత్రం ఎదురు, రజక సత్రం దగ్గర, శ్రీశైలం పిన్: 518101
డియర్ సార్/మేడం
తేది: 27-10-2025న సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు ప్రకారం దోర్నాల (మం), అయినముక్కల బ్రాంచ్ నేను, అధీకృత అధికారి వారు మీ లోను ఖాతాలకు సంబంధించిన బకాయిలను తిరిగి చెల్లించమని చివరిసారిగా మీరు బ్యాంకు వారికి తెలియపరచిన చిరునామాకు నోటీసు పంపడం జరిగినది. కానీ సదరు నోటీసులు బట్వాడా కాక తిరిగి వచ్చినవి. అందువలన సదరు డిమాండ్ నోటీసు ఈ వార్తా పత్రికలో ప్రచురించడమైనది.
మీరు లోను అసలు / వాయిదా / మరియు వడ్డీ లేదా ఆ రెండూ కట్టని కారణంగా తేది. 29/05/2025న ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం లోను అకౌంట్‌ను ఎన్.పి.ఏ.గా వర్గీకరించడమైనది. బకాయి మొత్తం తేది 26/10/2025 నాటికి రూ. 14,51,091/- (అక్షరాల పద్నాలుగు లక్షల యాభై ఒక్క వేల తొంభైఒక్కటి రూపాయలు మాత్రమే)
తనఖా ఉంచిన ఆస్తులు (సెక్యూరిటీల వివరములు క్లుప్తంగా ఇక్కడ తెలుపబడినవి)
తనఖా ఉంచిన స్థిరా ఆస్తుల వివరములు దిగువ తెలుపబడినవి.
ఆస్తి వివరాలు: ప్రకాశం జిల్లా, మార్కాపురం రిజిస్ట్రేషన్ అండ్ సబ్ రిజిస్ట్రేషన్ జిల్లాలో, దోర్నాల గ్రామం మరియు మండలం సివారులో సర్వే నం.90బి/1బి2బి2లోని 894.16 చ.గజాలు లేదా 751.09 చ.మీ.ల స్థలంలో నిర్మించబడిన సాయిమిత్ర హోమ్స్ అపార్ట్‌మెంట్‌లోని 2వ అంతస్తులోని అవిభాజ్య వాటా 41.25 చ.గజాలు లేదా 34.48 చ.మీల గల రెసిడెన్షియల్ ఫ్లాట్ నం.302 యొక్క రిజిస్టర్డ్ ఈక్విటబుల్ మార్ట్‌గేజ్ ప్రాంతం: దోర్నాల. సర్వే నం.90బి/1బి2బి2 విస్తీర్ణం: 41.25 చ.గజాలు లేదా 34.48 చ.మీలు. స్వంతదారు పేరు: పొట్టిపాటి అనిల్ కుమార్ రెడ్డి.
ఫ్లాట్‌కు హద్దులు: తూరు: ఓపెన్ టు స్కై. దక్షిణం: ఓపెన్ టు స్కై. పడమర: 7అడుగుల వెడల్పు కామన్ కారిడార్. ఉత్తరం: ఫ్లాట్ నం.301.
పైన చెప్పబడిన మీలో నెం.1 మరియు 2 వారు ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/హామీదారు(లు)/సహ పూచీదారు(లు) మా నుండి ఋణాలు పొందియున్నారు. కావున సదరు ఋణగ్రహీత/హామీదార్లు పైన పేర్కొన్న రూ. 14,51,091/- (అక్షరముల పద్నాలుగు లక్షల యాభైఒక్కవేయి తొంభైఒక్క రూపాయలు మాత్రమే) నోటీసు తేది నుండి 60 రోజులలోగా, వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా చెల్లించవలసినదిగా ఇందుమూలముగా కోరడమైనది. లేని పక్షములో 60 రోజుల తరువాత SARFAESI ACT 2002లో సెక్షన్ 13(4) ప్రకారం తదుపరి చర్యలు తీసుకొందురు. సెక్షన్ 131(3) ప్రకారం సెక్యూర్డు ఆస్తులను అమ్మకం/లీజు బదిలీ చేయరాదు. చట్టము ప్రకారము బ్యాంకు బకాయిని రాబట్టుకొను నిమిత్తం తదుపరి చర్యలు గైకొనుట దిగువ సంతకందారునికి అని రాయడం గురించి సెక్షన్ 13లో సబ్ సెక్షన్ (8) ప్రకారం మీరు గమనించవలసినది బకాయి సొమ్ము మరియు వడ్డీ పూర్తిగా చెల్లించి ఆస్తులు విడిపించుకోవచ్చును సదరు తేదీ తదుపరి అట్టి అవకాశం ఉండదు.

తేది: 22-12-2025 సం/- అధీకృత అధికారి
స్థలం: మార్కాపురం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్

(c) eenadu

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

దర్శిలో పోలియో చుక్కలు వేస్తున్న ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డా.రమేష్

పొన్నలూరు: పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీడీవో సుజాత

నిండు జీవితానికి పోలియో చుక్కలు

హనుమంతునిపాడు : ఆదివారం పలు గ్రామాల్లో పోలియో చుక్కల కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. మండలంలోని 23 పంచాయతీల్లో 2,500 మంది పిల్లలకు వేసి 97 శాతం లక్ష్యం పూర్తి చేశామని పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ తెలిపారు. ఎంపీపీ గాయం సావిత్రి ప్రాథమిక వైద్యశాలలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్యాధికారి భార్గవి స్థానిక కేంద్రాలను పరిశీలించారు. తెదేపా మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. ● పొన్నలూరు : స్థానిక సచివాలయంలో పీహెచ్‌సీ వైద్యుడు కృష్ణచైతన్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత పోలియో చుక్కలు వేశారు. తొలిరోజే 97% పూర్తి చేశారు.

● సి.ఎస్.పురం: మండలంలో 97 శాతం మందికి పోలియో చుక్కలు వేసినట్లు ప్రభుత్వ వైద్యాధికారి మురళి తెలిపారు. 4,234 మందికి గానూ, 4,028 మందికి వేసినట్లు చెప్పారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి వేస్తామని తెలిపారు.

● దర్శి, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ డా.టి.రమేష్ దర్శి ఆరోగ్య కేంద్రం వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. జిల్లా క్షయ నివారణాధికారి డా.బాలాజీ, డా.సృజన, వైద్యులు పాల్గొన్నారు. 96.5 శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యులు డా.బ్లెస్సీ, డా.సురేఖ తెలిపారు.

● కనిగిరి: స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో చిన్నారులకు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్మన్ అబ్దులగఫార్ పోలియో చుక్కలు వేశారు. వైద్యాధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు. ● తాళ్లూరు: తాళ్లూరు పీహెచ్‌సీలో జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి చుక్కల మందు వేశారు. తాళ్లూరు, తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు డాక్టరు ప్రవీణ్, రాజేష్‌యాదవ్, కె.మౌనిక, సీహెచ్.శ్రీకాంత్‌రెడ్డి పిల్లలకు చుక్కలు వేశారు. మన్నేపల్లిలో సొసైటీ అధ్యక్షులు జి.రమణారెడ్డి పిల్లలకు చుక్కలు వేశారు.

● సింగరాయకొండ గ్రామీణం: పాకలలో పోలియో చుక్కల కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి డా. వెంకటేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారులకు పోలియో చుక్కలు అందిస్తున్నామన్నారు. వైద్యులు ధీరేందర్, వంశీధర్, రవి, సిబ్బంది పాల్గొన్నారు. ● టంగుటూరు, న్యూస్‌టుడే: తూర్పు నాయుడుపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఏర్పాటుచేసిన పల్స్‌పోలియో కార్యక్రమానికి మంత్రి బాలవీరాంజనేయస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు చుక్కల మందు అందించారు. గ్రామ సర్పంచి తలపనేని రవికుమార్, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

● మర్రిపూడి: చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని వైద్యాధికారి వీరబాబు అన్నారు. ఆదివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 1508 చిన్నారులకు గాను 1428 మందికి చుక్కలమందు వేసినట్లు తెలిపారు. మిగిలిపోయిన చిన్నారులకు రెండు రోజుల్లో పోలియో చుక్కలు వేయనున్నట్లు చెప్పారు.

● జరుగుమల్లి: కామేపల్లి పీహెచ్‌సీలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. 1534 మంది పిల్లలకు గాను మొదటి రోజు 1455 మంది పిల్లలకు చుక్కలమందు వేశారు. మెడికల్ ఆఫీసర్లు జె.నాగరాజు, కె.స్వర్ణలత పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కూలీలతో మాట్లాడుతున్న సీఐ హజరత్తయ్య.

జరుగుమల్లి, న్యూస్‌టుడే: వావిలేటిపాడు అడ్డరోడ్డు వద్ద నిబంధనలకు విరుద్ధంగా, సామర్థ్యానికి మించి కూలీలను తరలిస్తున్న ఆటో చోదకులకు పోలీసులు ఆదివారం అవగాహన కల్పించారు. సీఐ హజరత్తయ్య, జరుగుమల్లి ఎస్సై మహేంద్ర ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వ్యవసాయ పనుల కోసం కూలీలను తరలించే క్రమంలో వాహనాల్లో పరిమితికి మించి ఎక్కించుకోవడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ట్రాక్టర్లలో తరలించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

అన్నదానానికి ఉచితంగా బియ్యం అందజేత

తాళ్లూరు: భక్తులకు అన్నదానం

తాళ్లూరు, న్యూస్‌టుడే : గుంటిగంగలో కొలువుదీరిన గంగాభవానీ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కొందరు భక్తులకు చెందిన కొత్త వాహనాలకు పూజలు చేశారు. దేవాలయం తరపున ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న అన్నదానానికి అవసరమైన బియ్యాన్ని అందించేందుకు నిస్వంకి వెంకట స్వామి కుటుంబ సభ్యులు వెంకట సుబ్బారావు, సుప్రజ, వెంకట సురేష్‌బాబు, అనూష ముందుకొచ్చారు. ఈ మేరకు క్వింటా బియ్యాన్ని ఈవో నారాయణరెడ్డి, ఆర్‌ఏ ప్రసాద్‌కు అందజేశారు.

గోపూజ చేస్తున్న అర్చకులు

వైభవంగా రథోత్సవం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నారాయణస్వామి మూలవిరాట్టును వివిధ రకాల పూల మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానంలో అర్చకులు గోపూజ చేశారు. నారాయణస్వామి పల్లకీసేవ, రథోత్సవం వైభవంగా జరిగాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.నరసింహబాబు, దేవస్థానం వ్యవస్థాపక ఛైర్మన్ కె.చినఆదినారాయణ, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

పేదింట ప్రతిభ.. స్పైకింగ్‌లో సత్తా

స్ఫూర్తి

◆ రాణిస్తున్న ప్రభుత్వ విద్యార్థినులు

ఆ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటుతున్నారు. వాలీబాల్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ పాఠశాలకు గర్వకారణంగా నిలుస్తున్నారు. టంగుటూరు మండలం ఆలకూరపాడు, మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినుల క్రీడా ప్రస్థానం ఆసక్తిదాయకం. - న్యూస్‌టుడే, టంగుటూరు

అలు పెరుగని సాధనతో..

ఆలకూరపాడు జడ్పీ పాఠశాలలో చదువుతున్న **కడియం జెస్సిక** ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచి వాలీబాల్‌లో తర్ఫీదు పొందుతోంది. తల్లిదండ్రులు శివకోటి, సౌజన్య బేల్దారి పనులు చేస్తుంటారు. ఉదయం, సాయంత్రం అలుపెరుగని సాధన చేస్తూ ఇప్పటికి పదిసార్లకు పైగా రాష్ట్రస్థాయిలో పాల్గొని బంగారు, వెండి, రజతం పతకాలు సాధించింది.

జాతీయ స్థాయిలో మెరిసి..

ఆలకూరపాడుకు చెందిన **వరికూటి వందన** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. తండ్రి రాము వాచ్‌మెన్‌గా పని చేస్తుండగా...తల్లి కుమారి వ్యవసాయ పనులకు వెళ్తుంటారు. పాఠశాల పీఈటీ వెంకట్రావు ప్రోత్సాహంతో మూడేళ్లుగా వాలీబాల్ క్రీడలో రాణిస్తోంది. ఇటు స్పైకింగ్..అటు డిఫెన్స్‌లో జట్టుకు కొండంత అండగా ఉంటోంది. ఇప్పటికే పలుమార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. ఇటీవల జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఎస్సై ఉద్యోగమే లక్ష్యంగా నిత్యం సాధన చేస్తున్నట్లు ఆమె తెలిపింది.

ప్రభుత్వ కొలువు సాధించాలని..

టంగుటూరు మండలం మర్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీ కౌసల్య సహకారంతో మూడేళ్లుగా సాఫ్ట్‌బాల్ క్రీడలో తర్ఫీదు పొందుతోంది **గుమ్మా కీర్తన.** తండ్రి అనారోగ్యంతో ఇబ్బంది పడుతుండగా..తల్లి మాధవి పాడి పరిశ్రమపై ఆధారపడి కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆమె అద్భుత హిట్టింగ్‌లతో పలుమార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించింది. ఇటీవల జాతీయస్థాయిలోనూ సత్తా చాటింది. క్రీడా కోటాలో ప్రభుత్వ కొలువు సాధిస్తానని కీర్తన చెబుతోంది.

కనిగిరిలో తెలుగుతమ్ముళ్ల సంబరాలు

● 'ఉగ్ర'కు పదవి దక్కడంతో ర్యాలీలు

ఉగ్రకు మిఠాయి తినిపిస్తున్న తెదేపా నాయకులు

కనిగిరి పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ

కనిగిరి, న్యూస్‌టుడే: తెదేపా ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడిగా కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డిని అధిష్ఠానం ప్రకటించడంతో ఆదివారం కనిగిరి పట్టణంలో తెదేపా నాయకులు సంబరాలు జరుపుకున్నారు. తెదేపా, తెలుగు యువత ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అమరావతి మైదానంలో తెలుగు తమ్ముళ్లు కేక్ కోసి మిఠాయిలు పంచుకున్నారు. బాణ సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పట్టణ, మండల తెదేపా అధ్యక్షులు ఫిరోజ్, కృష్ణారెడ్డి మాట్లాడుతూ జిల్లా తెదేపా రథ సారథిగా ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డిని నియమించడం వల్ల పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. తెదేపా నాయకులు రాచమల్ల శ్రీనివాసులరెడ్డి, బాలు ఓబులరెడ్డి తదితరులు ఎమ్మెల్యేకు స్వీట్లు తినిపించారు.

అవీ.. ఇవీ.. అన్నీ..

పామూరులో నిర్వహించిన శాకాహార ర్యాలీ

శాకాహారంతో మంచి ఆరోగ్యం

పామూరు, న్యూస్‌టుడే : ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని పామూరులోని పత్రీ సాయి ప్రజాపిత పిరమిడ్ ధ్యాన కేంద్రం నుంచి సత్యనారాయణ స్వామి దేవస్థానం వరకు శాకాహార ర్యాలీ నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ స్వామి కల్యాణ మండపంలో శాకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని స్థానికులకు వివరించారు. తదుపరి అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. పామూరు పిరమిడ్ మాస్టర్లు పాల్గొన్నారు.

వీఆర్‌ఏ ఆకస్మిక మృతి

హనుమంతునిపాడు: ఉమ్మనపల్లి వీఆర్‌ఏ కన్నెర బాలఅంకయ్య (58) ఆదివారం అస్వస్థతతో ఆకస్మికంగా మృతి చెందారు. తహసీల్దారు నాగులమీరా, వీఆర్‌ఏల సంఘం మండల అధ్యక్షులు చింతగుంట ఏసు, కార్యదర్శి ఎస్.మౌలాలీ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని తెలిపారు.

నూతన చప్టాకు నిధుల మంజూరు

గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులను సన్మానిస్తున్న మారెళ్ల నాయకులు

ముండ్లమూరు, న్యూస్‌టుడే: మారెళ్ల గ్రామ సమీపంలో ఈదరవాగు నూతన చప్టాకు నిధులు మంజూరు చేయించినందుకు గానూ స్థానిక తెదేపా నాయకులు దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గొట్టిపాటి లక్ష్మి, కడియాల లలిత్‌సాగర్ దంపతులను మాజీ సొసైటీ అధ్యక్షుడు మట్టా సుబ్బారెడ్డి, నాయకులు ఘనంగా సత్కరించారు. చిన్నపాటి వర్షానికే చప్టాపై నుంచి వరద ప్రవహించి రాకపోకలు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల వారు ఇబ్బందులు పడేవారు. ఈమేరకు రూ.28 లక్షలు మంజూరు చేయించడంతో లక్ష్మి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు వాకా బ్రహ్మానందరెడ్డి, గార్లపాటి కృష్ణ, యల్లయ్య, రామారావు, అంజయ్య, చిన్నపుల్లయ్య పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పొగాకు రిజిస్ట్రేషన్లు

కొండపి గ్రామీణం: 2025-26 కాలానికి సంబంధించి పొగాకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ రూ.400 అపరాధ రుసుంతో ఈ నెల 22తో ముగియనున్నట్లు కొండపి వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు గమనించి సోమవారం కొండపి వేలం కేంద్రానికి వచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.

ఎలికావారిపల్లిలో ప్రత్యేక పశువైద్య శిబిరం

ఈనాడు కథనానికి స్పందన

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: ఎలికావారిపల్లిలో గురక వ్యాధితో ఎక్కువ సంఖ్యలో గేదెలు మృతి చెందుతుండటంతో పోషకులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై శనివారం 'ఈనాడు'లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆదివారం ఆ గ్రామంలో ఏడీఏ నరేంద్రరెడ్డి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటుచేసి గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు తీశారు. అవసరమైన మందులు అందజేసి పోషకులకు సూచనలిచ్చారు. ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలుచేసి తెచ్చిన గేదెలకు గురకవ్యాధి సోకిందని ఏడీఏ అన్నారు. ఇలాంటి మూగజీవాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన పశు పోషకులకు సూచించారు. రెండు రోజులుగా నీలకంఠాపురం తదితర గ్రామాల్లో వ్యాక్సినేషన్‌ను వేగవంతం చేశామన్నారు. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

దేవస్థానం చెంత పేరుకున్న చెత్త

కొండపి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులోని నాగార్పమ్మ దేవస్థానం ఎదుట చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తోంది. అక్కడి చెత్తను తొలగించకుండా నిప్పుపెడుతుండటంతో ఆ మార్గంలో వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌ను వివరణ కోరాగా సమస్య పరిష్కరిస్తామన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

పొదిలి: ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం ద్వారా మానసికంగా ప్రశాంతంగా ఉండవచ్చని సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎం.రమాదేవి అన్నారు. ఆదివారం పొదిలిలోని ఎస్ఎస్ఎన్ కళాశాల, పాతూరులోని సాయిబాబా దేవాలయం ఆవరణలో జరిగిన ఉచిత ధ్యాన జ్ఞాన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ధ్యాన సాధనతో వివిధ రకాల రుగ్మతల నుంచి బయటపడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎం.శ్రీనివాసులు, ధ్యాన సాధకులు పాల్గొన్నారు.

మురుగుతో వ్యాధుల ముప్పు

బిట్రగుంటలోని డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. పలు వీధుల్లో ఇదే దుస్థితి నెలకొంది. ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా మురుగు ముందుకు వెళ్లే వీలుండటం లేదు. దీంతో దోమల బెడద తీవ్రతరమవుతోంది. విషజ్వరాలు ప్రబలుతున్నాయని, వ్యాధుల ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి షఫీని వివరణ కోరగా త్వరలో కాలువల్లో పూడిక తీయించి, దోమల నివారణకు చర్యలు చేపడతామని తెలిపారు.

– జరుగుమల్లి, న్యూస్‌టుడే

నేటి నుంచి క్రికెట్ పోటీలు

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: డీజీపేటలో సీవైసీపీ యూత్‌ఫోర్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం నుంచి మెగా క్రికెట్ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కనిగిరి నియోజకవర్గం, నెల్లూరు జిల్లా సీతారామపురం పరిధిలోని వారు ఇందులో పాల్గొనవచ్చన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.30,116, రూ.20,116, 10,116తో పాటు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

తాళ్లూరు : తూర్పుగంగవరంలోని ఆలయంలో భక్తుల సందడి

తాళ్లూరు, న్యూస్‌టుడే: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని తూర్పుగంగవరంలోని కోదండ రామాలయంలో నిత్యం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. తాళ్లూరులోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం, బొద్దికూరపాడులోని శ్రీదేవి, భూదేవి సమేత మాధవస్వామి ఆలయాల్లో అర్చనలు నిర్వహిస్తున్నారు.

నలభైమూడేళ్ల నాటి మధుర స్మృతులతో..

బొమ్మ పలుకు

నలభై మూడేళ్ల నాటి జ్ఞాపకాలను వారు గుర్తుకు తెచ్చుకున్నారు. కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1981-82 సంవత్సరాల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న వారంతా ఆదివారం కలుసుకున్నారు. వివిధ రంగాల్లో ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలుగా స్థిరపడిన వారంతా కలుసుకుని భావోద్వేగానికి గురయ్యారు. పదో తరగతి విద్యార్థులకు అభ్యసన సామగ్రి అందించారు. పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు, పీసీపల్లి ఎంఈవో రాచగుండ్ల శ్రీనివాసరావుతో పాటు ముత్యాల ధర్మ, వేమారంగ, ఇన్నమూరి శ్రీనివాసరావు, పార్థసారథి, మస్తాన్‌వలీ, సురేష్, కేశవ పాల్గొన్నారు. - **కనిగిరి, న్యూస్‌టుడే**

ఎట్టకేలకు సాగర్ కట్టలు బలోపేతం

నాగార్జునసాగర్ కాలువల కట్టల రూపురేఖలు ఎట్టకేలకు మారుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా నిర్వహణ లేక అవి శిథిలమయ్యాయి. గత ఆగస్టు నెలలో కాలువల్లో పూడికతీతతో పాటు కట్టల బలోపేతానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. అందులో భాగంగా కరవది మేజరుకు సుమారు రూ.నలభై లక్షలు మంజూరు చేయగా కట్టల అభివృద్ధి పనులు మొదలుపెట్టారు. తాళ్లూరు మండలంలోని గుంటిగంగ సమీపాన కరవది మేజరు ప్రధాన కాలువ కట్టను ఇలా బలోపేతం చేశారు. - **న్యూస్‌టుడే, తాళ్లూరు,**

కేకు కోస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

'రాష్ట్రాభివృద్ధికి కృషిచేసిన జగన్'

దర్శి, న్యూస్‌టుడే: వైకాపా అధ్యక్షుడు వైఎస్. జగన్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం దర్శిలో పార్టీ శ్రేణులు జరుపుకున్నారు. ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ పాల్గొనగా అద్దంకి రోడ్డులో రెడ్డి కాంప్లెక్స్, గడియారస్తంభం కూడలిలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ రాష్ట్రాభివృద్ధికి కృషి చేశారన్నారు. కేకు కోసి, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అయిదు మండలాల వైకాపా నాయకులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మాజీ ముఖ్యమంత్రి జగన్ జన్మదినోత్సవం తాళ్లూరులో జరిగాయి. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన వైకాపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి, ఆయన తల్లి జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మలు గ్రామంలోని పలు వీధుల్లో భారీ ప్రదర్శన నిర్వహించారు. నాయకులు తూము సుబ్బారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వెంకటేశ్వరెడ్డి, కోట కృష్ణారెడ్డి, వెంకట్రావు, ప్రభుదాసు, తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

కనిగిరి : 8008574114, దర్శి: 9848671678, కొండపి: 96424 56296

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

మర్రిపూడి, న్యూస్‌టుడే:

?: జువ్విగుంట బీసీ కాలనీలో వీధిదీపాలు నాలుగురోజులుగా వెలగటం లేదు. రాత్రి పూట చీకట్లో తిరుగుతున్నాం. **- బాలగురవయ్య, స్థానికుడు**

✓: సిబ్బందిని పంపి వెంటనే మరమ్మతులు చేయిస్తాం. **-హరికృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

పీసీపల్లి, న్యూస్‌టుడే

?: మండలంలోని తలకొండపాడు పరిధిలోని చిరుకూరివారిపల్లి వద్ద వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్తు స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. సరిచేయగలరు.

✓: పరిశీలించి సరిచేస్తాం. - **శ్రీను. లైన్‌మెన్ తలకొండపాడు**

మళ్లీ గుంతల స్వాగతం

న్యూస్‌టుడే, దర్శి

● ఏడాది కాకుండానే రోడ్లకు తూట్లు

రాజంపల్లి-రామచంద్రాపురం రహదారిపై తారులేచి..

దర్శి - పోతవరం మార్గంలో రోడ్డు దుస్థితి

ఏడాది కాకుండానే రహదారులు ఛిద్రమయ్యాయి. గుంతలు పడిన రోడ్లపైనే కష్టాల ప్రయాణం తప్పడం లేదు. దర్శి నియోజకవర్గంలో గ్రామీణ రోడ్లు దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వైకాపా పాలనలో పూర్తిగా ధ్వంసమైన రహదారులకు కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టింది. అయితే వాహనాల తాకిడితో కొన్నిచోట్ల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

దర్శి-పోతవరం మార్గంలో ప్రయాణించే వారికి అవస్థలు తప్పడం లేదు. చలివేంద్ర నుంచి పోతవరం వరకు నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డుపై తారు మాయమై గుంతలు పడ్డాయి. ఇదే మార్గంలో దేవవరం, శేషంవారిపాలెం, తానంచింతలకు వెళ్లే రోడ్లు కూడా పాడయ్యాయి. రాజంపల్లి-రామచంద్రాపురం; దర్శి - తూర్పువెంకటాపురం మీదుగా గణేషునిపురం, బండివెలిగండ్ల నుంచి దొనకొండ, మార్కాపురం వైపు వెళ్లే రహదారులు కూడా గుంతలమయమయ్యాయి. రాజంపల్లి నుంచి కొత్తపల్లి, కొర్లమడుగు మార్గం అధ్వానంగా మారింది. దర్శి - చందలూరు- దొనకొండ రోడ్డు వర్షాల ధాటికి రాళ్లు తేలింది. ఇది మార్కాపురానికి, శ్రీశైలానికి వెళ్లే దారి కావడంతో వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గుంతలు తేలిన రోడ్లపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనిపై ర.భ. పంచాయతీ అధికారులను వివరణ కోరగా, రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు విడుదల చేయగానే పనులు చేపడతామన్నారు.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

బాలవిహార్ చిన్నారులతో శ్రీగిరి ఆలయ నిర్వాహకులు, చిన్మయ మిషన్ సభ్యులు

చిన్నారుల నోట.. భగవద్గీత!

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీగిరిలో బాల విహార్ శిక్షణ తరగతులు ఉత్సాహంగా సాగాయి. శ్రీగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానం, చిన్మయ మిషన్ సంయుక్త నిర్వహణలో ఆదివారం గోక్షేత్ర భవన్‌లో నిర్వహించిన తరగతుల్లో చిన్నారులు హనుమాన్ చాలీసాతో పాటు గోవింద నామాలు, భగవద్గీత శ్లోకాలతో అంత్యాక్షరి పోటీల్లో ప్రతిభ చాటారు. చిన్మయ మిషన్ ప్రబోధకులు పవిత్ర చైతన్య అభ్యసన ప్రణాళికను రూపొందించారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: మరమ్మతుల దృష్ట్యా ఒంగోలు నగర పరిధిలోని పేర్న మిట్ట, ప్రతిభా కళాశాల, లింగారెడ్డి కుంట తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ పాండురంగారావు తెలిపారు.

ప్రకాశం భవన్‌లో తేనీటి విందు

నేడు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం భవన్‌లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు సెమీ క్రిస్మస్ తేనీటి విందు ఏర్పాటు చేసినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి పార్థసారథి తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, పాస్టర్లు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
కొత్తపట్నం : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

?: ఒంగోలు నగరంలోని రాజాపానగల్ రోడ్డు ప్రాంతానికి మూడు రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదు. – స్థానికులు

✓: నీటి శుద్ధి కేంద్రంలో మోటారు రిపేరు రావడం వల్ల ఆలస్యమైంది. నీటి సరఫరా చేసి సమస్య పరిష్కరిస్తాం.
– ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?: శివాజీనగర్, భాష్యం స్కూలు ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉంది.
– ఆరేటి బ్రహ్మయ్య

✓: సిబ్బందిని పంపించి కాలువల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తాం.
– షేక్ బాజ్జి, ఇన్‌ఛార్జి సూపర్‌వైజర్

?: శివప్రసాద్‌కాలని కొత్తడొంకలో రెండు వీధి దీపాలు వెలగడం లేదు.
– ఎస్.బాబూరావు

✓: సిబ్బందిని పంపించి వెంటనే వీధి దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.
– ఏసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?: మద్దిపాడు మండలం బూరేపల్లిలోని మురుగు కాలువల్లో నీరు నిలిచిపోయింది. దీని వల్ల దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. వ్యాధుల బారిన పడతామని ఆందోళనగా ఉంది. –ఆర్.శేషయ్య, బూరేపల్లి

✓: పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి కాలువలను శుభ్రం చేయిస్తాం. దోమల నివారణకు ఫాగింగ్ చేయిస్తాం.
–చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి

?: మద్దిపాడు మండల పరిధిలోని పారిశ్రామికవాడలో నీరు లీకేజీ అవుతుందని మరమ్మతుల కోసం గుంత తీశారు. పూడ్చిన తరువాత కూడా నీరు లీకవుతూనే ఉంది.
–కొప్పోలు వెంకట్రావు, గుండ్లాపల్లి

✓: సిబ్బందిని పంపించి పైపులైన్‌కు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటాం.
–బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం, మద్దిపాడు

వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

సందడిగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ఒంగోలు కర్నూలు రోడ్డు: నగరంలోని కరణా కాలనీ ఒకటో లైన్ గెత్సెమనె ప్రార్థనా మందిరం గిద్యోన్ శంకర్, ప్రేమ గిద్యోన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. చిన్నారులు అధికంగా హాజరయ్యారు. ప్రత్యేక గీతాలు ఆలపించి ప్రార్థనలు చేశారు. అనంతరం రోగులు, అంధులకు బియ్యం, దుస్తులు పంపిణీ చేశారు. పాస్టర్ రాజేష్, సురేష్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బ్యారన్ లైసెన్స్ పునరుద్ధరణకు నేటితో గడువు ముగింపు

ఒంగోలు గ్రామీణం: 2025-26 ఆంధ్రా సీజన్‌కు సంబంధించి పొగాకు పంట కాలానికి బ్యారన్ లైసెన్స్ పునరుద్ధరణ గడువు రూ.400 అపరాధ రుసుంతో సోమవారంతో పూర్తి కానున్నట్లు ఒంగోలు-2 వేలం కేంద్రం నిర్వహణాధికారిణి తులసి తెలిపారు. ఈ మేరకు రైతులు వేలం కేంద్రంలోని క్షేత్ర సహాయకులను సంప్రదించి తమ దరఖాస్తులు అందజేయాలని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సమన్వయ లోపం.. నీటి సరఫరాకు శాపం

❖ ఒంగోలు నగరవాసులకు తప్పని ఇబ్బందులు

న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ఒంగోలు నగరంలోని వేసవి చెరువుల్లో నిండా నీరున్నా.. పంపిణీలో లోపాల వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. రంగారాయుడు చెరువు వద్దగల ఫిల్టరేషన్ ప్లాంటులో రెండు మోటార్లు ఇటీవల వెంట వెంటనే మొరాయించాయి. దీంతో దాదాపు 10 కాలనీల ప్రజలకు మూడు రోజులు ఆలస్యంగా నీరు విడుదల చేశారు. శనివారం రాత్రికి ఒక మోటారుకు మరమ్మతులు చేయించి ఆదివారం మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. స్టాండ్‌బై మోటారు ఇంకా అందుబాటులోకి రాలేదు. దీనివల్ల గాంధీ రోడ్డు, అంకమ్మపాలెం, గొడుగుపాలెం, రాజాపానగల్‌రోడ్డు, కోర్టుసెంటర్, గాంధీనగర్ తదితర ప్రాంతాలకు ఆదివారం అర్ధరాత్రి వరకు నీరు విడుదల చేశారు.

రంగారాయుడు చెరువు వద్ద నీటి శుద్ధి కేంద్రంలో మోటార్లు

జేసీబీ పనులతో పగిలిపోతున్న పైపులు..

రహదారులు, కాలువల నిర్మాణ సమయంలో జేసీబీలతో తవ్వకం పనులు చేపడుతున్నారు. ఆ సమయంలో తాగునీటి పైపులైన్లు పగిలిపోయి సరఫరాకు ఆటంకం కలుగుతుంది. దీంతో పాటు మురుగునీరు, మంచినీటి పైపుల్లోకి చేరి కొళాయిల ద్వారా కొన్ని సరఫరా జరిగిపోతుంది. ఏదైనా పని నిమిత్తం తవ్వకం చేపట్టేముందు గుత్తేదారులు సంబంధిత ఇంజినీర్ల ద్వారా వాటర్‌వర్క్స్ విభాగం సిబ్బందిని సంప్రదించాలి. ఎందుకంటే పైపులైన్లు ఎటు నుంచి వెళుతున్నాయో వారే చెప్పగలరు. ఈ సమన్వయం లేకుండా పనులు చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల రంగారాయుడు చెరువు వద్ద రోడ్డు విస్తరణ పనులు చేస్తుండగా రెండుచోట్ల పైపులైన్ పగిలిపోయింది. మరమ్మతులకు రూ.30 వేలు ఖర్చు చేశారు. గత నెలలో భాగ్యనగర్‌లో, అంతకు ముందు మంగమూరురోడ్డు కళానికేతన్ వద్ద, బృందావననగర్‌లో పైపులు దెబ్బతిన్నాయి. వాటి రిపేరు ఖర్చుతోపాటు, కొళాయిల్లో కొన్ని రోజులు మురుగునీరు కలిసి వచ్చింది. ఇళ్లకు సంబంధించిన పైపులు పగిలితే అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. అంజయ్యరోడ్డు నుంచి బృందావననగర్‌కు వెళ్లే రహదారిలో కొళాయి పైపులు పగిలి నెలరోజులు ఇబ్బంది పడినట్లు స్థానిక నివాసి కృష్ణయ్య తెలిపారు. ఈ సమస్యను నగరపాలక కమిషనర్ కె.వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లగా.. ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పర్యవేక్షణ, సమన్వయం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఒంగోలులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కలెక్టర్ రాజాబాబు

వాడవాడలా పల్స్‌పోలియో

ఒంగోలు నగరం, సంతనూతలపాడు నియోజకవర్గాల పరిధిలో వాడవాడలా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. ఒంగోలులో జిల్లా కలెక్టర్ రాజాబాబుతోపాటు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ▸ కొత్తపట్నం పీహెచ్‌సీలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ పీడీ నారాయణ హాజరై చిన్నారులకు చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుట్టిన పిల్లల నుంచి అయిదు ఏళ్లు కలిగిన చిన్నారులకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు. ఇప్పుడు వేయించుకోని వారికి సోమవారం సిబ్బంది ఇంటింటా తిరిగి సర్వే నిర్వహించి మందు వేస్తారని చెప్పారు. వైద్యాధికారిణి శ్రావ్య, సిబ్బంది పాల్గొన్నారు. ▸ సంతనూతలపాడుతోపాటు, ఎం.వేములపాడు పీహెచ్‌సీల పరిధిలో విజయవంతంగా పల్స్ పోలియో చేపట్టారు. ఎంపీడీవో సురేష్ బాబు, తెదేపా మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ఎంఈవో వెంకారెడ్డిలు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ▸ మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 104 నోడల్ అధికారి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో 5419 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తెదేపా మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరావు, వైద్యులు అన్వేష్, జగదీష్‌బాబు, వినీలా చౌదరి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, బృందం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు డిమాండు చేశారు. ఆదివారం ఒంగోలులోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన నాగులుప్పలపాడు మండల యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అనంతరం యూటీఎఫ్ మండల నూతన కమిటీని ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా ఏ.మాలకొండయ్య, ప్రధాన కార్యదర్శిగా బొజ్జ ఆంజనేయులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు

పదిలం.. నాటి జ్ఞాపకం

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నగరంలోని పీవీఆర్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల 1992-93 పదోతరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహభరితంగా సాగింది. 32 సంవత్సరాల తరువాత ఒక చోటకు చేరడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరికొకరు పాత జ్ఞాపకాలు పంచుకుంటూ కుటుంబ క్షేమ సమాచారాలు తెలుసుకున్నారు. నాటి గురువులను తలచుకున్నారు. సుమారు వంద మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువులు చెప్పిన సూక్తులు ఇప్పటికి గుర్తున్నాయన్నారు. చాలా కాలం తరువాత ఇలా కలుసుకోవడం మరపురాని అనుభూతి అన్నారు. సమష్టిగా భోజనాలు చేసి ఆటపాటలతో సాయంత్రం వరకు పాఠశాలలోనే గడిపారు.

పీవీఆర్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల పూర్వవిద్యార్థులు

మానవతా విలువలపై అవగాహన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే మానవతా విలువలను ప్రజలకు తెలియజేసేందుకు స్థానిక మంగమూరురోడ్డులోని శ్రీ సత్యసాయి సమగ్ర విద్యాకేంద్రం విద్యార్థులు నగరంలో ప్రదర్శన నిర్వహించారు. బాలవికాస్ విభాగం విద్యార్థులు ప్లకార్డులు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. సత్యసాయి మందిరం వద్ద నుంచి మొదలైన ప్రదర్శన మోర్ మార్కెట్ మీదుగా అంజయ్యరోడ్డు వరకు సాగింది. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కోడె శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మానవతా విలువలపై పాఠశాలలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ ఏర్పాటుచేశామన్నారు. పాఠశాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు శ్రీరామమూర్తి, బాలాజీ, కె.పుష్పలత, కృష్ణగీత, సుహాసిని, బాల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సమగ్ర విద్యాకేంద్రం విద్యార్థుల ప్రదర్శన

వంతెనపై చీకట్లు..

ఈ చిత్రం ఒంగోలు నగరంలోని రైల్వే వంతెనపైది. వారధిపై ఏర్పాటు చేసిన వీధి దీపాలు కొద్ది రోజులుగా వెలగడం లేదు. దీంతో ఆ మార్గమంతా రాత్రి వేళల్లో చీకట్లు అలముకుంటున్నాయి. దీంతో ఇలా రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి వంతెనపై విద్యుద్దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ.. వెంటనే పరిశీలించి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.
–న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

మట్టి దారి.. అధ్వానంగా మారి

ఒంగోలు మండలం సర్వేరెడ్డి పాలెం నుంచి మంగమూరురోడ్డు ఆశ్రమం వరకు 2.5 కి.మీ మేర గ్రావెల్ రోడ్డు అధ్వానంగా ఉంది. సదరు గ్రామస్థులు ఒంగోలు నగరానికి వచ్చేందుకు తక్కువ దూరం కావడంతో ద్విచక్ర వాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారు. పొలాలకు వెళ్లే ట్రాక్టర్లతోపాటు, ఆటోలు సైతం ఎక్కువగానే తిరుగుతుంటాయి. దీనిని బీటీ రోడ్డుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఏపీవో నాగేశ్వరరావును వివరణ కోరగా.. ఉపాధిహామీ మెటీరియల్ నిధుల కింద రహదారి నిర్మాణానికి ప్రతిపాదించనున్నట్లు తెలిపారు. –న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

శ్మశాన వాటికలో వసతులేవీ?

ఒంగోలు మండలం దేవరంపాడు దళితవాడకు చెందిన శ్మశాన వాటిక ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోలేదు. కనీసం అక్కడకు వెళ్లేందుకు బాట కూడా లేకపోవడంతో చిన్నపాటి వర్షం పడినా అంత్యక్రియల నిర్వహణకు ఇబ్బందికరంగా మారింది. చిల్లచెట్లతో పాటు, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. శ్మశాన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణంతోపాటు, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో రాజశేఖర్‌ను వివరణ కోరగా.. శ్మశాన స్థలం అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. –న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

గుండ్లకమ్మ నీళ్లు.. రోడ్డుపాలు

గుండ్లకమ్మ జలాశయం నుంచి ఒంగోలు నగరం, మండల పరిధిలోని పలు గ్రామాలకు తాగునీరు అందించే పైపులైన్ ఉంది. 16వ నంబరు జాతీయ రహదారి పక్కన గుండ్లాపల్లి సమీపంలో లీకేజీలతో నీరు వృథా అవుతుంది. నెల రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇటీవల వారం రోజులపాటు నీటి సరఫరా ఆగినప్పుడైనా అధికారులు మరమ్మతులు చేయించలేదు. ఒకవైపు జల సురక్ష మాసం పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా.. వృథాను అరికట్టలేకపోతున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. –న్యూస్‌టుడే, మద్దిపాడు

ఆదివారం.. ఆనందతీరం

కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం సముద్ర తీరానికి ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. జిల్లా నలుమూలల నుంచి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి రోజంతా ఆనందంగా గడిపారు. దీంతో ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు తీరంలో సందడి వాతావరణం నెలకొంది. చిన్నారులు, యువత కేరింతలు కొడుతూ సముద్ర స్నానాలు చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా మెరైన్ పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూ అప్రమత్తం చేశారు. –న్యూస్‌టుడే, కొత్తపట్నం

కోడి పందేల శిబిరంపై దాడి

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఒంగోలు మండలం గుండాయిపాలెంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి దాడి చేశారు. మహిళా పీఎస్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలోని బృందం ఆరుగురు వ్యక్తులు, రెండు కోళ్లు, రూ.6,500 నగదు, మూడు బైకులను స్వాధీనం చేసుకుంది. పట్టుబడిన వారిని తాలూకా పీఎస్‌లో అప్పగించారు. ఎస్సై సుదర్శన్, ఏఎస్సై మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

❖ **సత్యనారాయణపురంలో వ్యభిచార గృహంపై..**

స్థానిక సత్యనారాయణపురంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు ఒక మహిళ, ఒక విటుడ్ని పట్టుకుని తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు

సంతనూతలపాడు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అజయ్‌బాబు హెచ్చరించారు. ఆదివారం స్థానిక బస్టాండ్ పక్కనున్న బజారులో మందు బాబులు వేసిన ప్లాస్టిక్ గ్లాసులను, మద్యం తాగే వారితోనే తీయించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు.

ఈ రేయి.. ఎంతో తీయనిది!

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: జాన్ మెలోడీస్ ఆధ్వర్యంలో 'ఈ రేయి తీయనిది' పేరుతో ఏర్పాటు చేసిన సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఆదివారం సాయంత్రం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో గాయకులు ఆలపించిన సినీ గేయాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ఈ కార్యక్రమానికి జాన్ అధ్యక్షత వహించగా.. అధిక సంఖ్యలో నగరవాసులు పాల్గొన్నారు. గాయకులు వెంకటరమణ, శివప్రసాద్, సాయి మాస్టర్, సుహాసిని, శైలజ తదితరులు పాల్గొన్నారు. వ్యాఖ్యాతగా గుర్రం కృష్ణ వ్యవహరించారు.

గీతాలాపన చేస్తున్న కళాకారులు

దేశ పునర్నిర్మాణంలో కమ్యూనిస్టు పార్టీలది కీలకపాత్ర

మద్దిపాడు, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు దేశ పునర్నిర్మాణంలో భారత కమ్యూనిస్టు పార్టీల పాత్ర కీలకమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య తెలిపారు. మండలంలోని మారెళ్లగుంటపాలెంలో ఆదివారం ఆ పార్టీ శత వార్షికోత్సవంతోపాటు, నల్లూరి అంజయ్య శత జయంతి సభను పార్టీ జిల్లా నాయకుడు ఉప్పుటూరి ప్రకాశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకయ్య మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలోకి ప్రజలను సమీకరించడంలో సీపీఐ కీలకంగా వ్యవహరించిందన్నారు. ఆంధ్ర ప్రజా నాట్యమండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న) మాట్లాడుతూ.. ఒంగోలు ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీని నిర్మించడమే కాకుండా, హరిజనుల పక్షాన నిలిచి తాగునీరు, కార్మికుల వేతనాల పెంపుదల కోసం పోరాటాలు చేసిన ఘనత అంజయ్యదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు హనుమారెడ్డి, చిడిపోతు వెంకటేశ్వర్లు, కేవీవీ ప్రసాద్, సీపీఐ నాయకులు, అంజయ్య అభిమానులు పాల్గొన్నారు.

అంజయ్య శత జయంతి సభలో మాట్లాడుతున్న రావుల వెంకయ్య, పాల్గొన్న సీపీఐ నాయకులు

జూదరుల అరెస్టు

చీమకుర్తి: మండలంలోని బూదవాడ శివారు పొలాల్లో జరుగుతున్న జూద శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు సీఐ డి.ప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.14,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

❖ సంతనూతలపాడు: ఎనికపాడు-మద్దులూరు మధ్య జూద శిబిరంపై దాడులు చేసినట్లు ఎస్సై అజయ్‌బాబు తెలిపారు. అరుగురిని అదుపులోకి తీసుకొని రూ.3,190 లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఒడిశా గవర్నర్‌ను కలిసిన కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఒంగోలు పర్యటనకు వచ్చిన ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును స్థానిక ఉత్తర బైపాస్‌లోని విష్ణుప్రియా ఫంక్షన్ హాలులో ఆదివారం కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ హర్షవర్ధన్‌రాజులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వైకాపా కార్యకర్తల రక్తదానం

సంతనూతలపాడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సంతనూతలపాడులో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జవహర్ రక్తదాన కేంద్రం పర్యవేక్షణలో 72 మంది రక్తదానం చేశారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ❖ చీమకుర్తి: స్థానిక ఎస్‌కెఆర్.బధిరుల పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీమంత్రి మేరుగ నాగార్జున పాల్గొని కేకు కోశారు.

చిన్నారి పాఠం.. అభ్యసన సులభం!

❖ పిల్లలను ఆకట్టుకునేలా బోధనోపకరణాలు

న్యూస్‌టుడే, చీమకుర్తి

తెలుగు, గణితం, ఆంగ్లంలో ప్రాథమిక భావనలు బోధించేందుకు ఉపాధ్యాయులు తయారు చేస్తున్న బోధనోపకరణాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఆయా తరగతుల్లో ఉన్న విద్యార్థులు ఆశించిన సామర్థ్యాలు సాధించే దిశగా ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో గ్యారంటీ ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (జీఎఫ్‌ఎల్‌ఎన్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఈ నెల 8న ప్రారంభమైన ఈ కార్యక్రమం మార్చి 24 వరకు కొనసాగనుంది.

చేతి పప్పెట్‌లను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయినులు

అర్ధగంటలోనే రూపకల్పన..

ఇందులో ప్రతి తరగతిలోని విద్యార్థుల సామర్థ్యాలను ముందుగానే పరిశీలిస్తారు. వారు ఏస్థాయిలో ఉన్నారో నిర్ధారణకు వస్తారు. అందుకు తగిన రీతిలో ప్రతిరోజు మధ్యాహ్నం నుంచి విద్యార్థులకు ప్రత్యేక బోధన చేసే దిశగా కార్యాచరణ రూపొందించారు. వెనుకబడిన విద్యార్థులకు తెలుగు, గణితం, ఆంగ్లంలో ప్రాథమిక భావనలు నేర్పించేందుకు బోధనోపకరణాలు ఎంతో ఉపయోగపడనున్న నేపథ్యంలో ఈ నెల 20న నిర్వహించిన సముదాయ సమావేశాల్లో టీఎల్‌ఎంల తయారీకి ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. ఆయా సముదాయ సమావేశాల్లో ఉపాధ్యాయులు, ప్రధానంగా మహిళా టీచర్లు బృందాలుగా ఏర్పడి తమలోని సృజనాత్మకతకు పదును పెట్టారు. నిర్ధారించిన గంట సమయంలో వివిధ రకాల టీఎల్‌ఎంలను చకాచకా రూపొందించారు.

ఆసక్తికరంగా వివరించి..

తెలుగులో అక్షరాలను కలిపి పదాలుగా చదవడం, పదాలకు అర్థాలు, వ్యతిరేక పదాలు సులువుగా నేర్పించే దిశగా తయారు చేసిన ఉపకరణాలు ఆకట్టుకున్నాయి. గణిత భావనలైన సంకలనం, వ్యవకలనం, గుణకార, భాగహార ప్రక్రియలు, వాటి గుర్తులు, వృత్తం, త్రిభుజం, చతురస్రం, దీర్ఘ చతురస్రాల భావన అవగాహన కల్పించేందుకు రూపొందించిన ఉపకరణాలు ఆలోచింపజేశాయి. ఉపాధ్యాయులు విద్యార్థులుగా మారి ఉపకరణాలు తయారీతోపాటు వాటి గురించి ఆసక్తికరంగా వివరించారు. ఉపాధ్యాయినులు ఎంతో ఉత్సాహంగా ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. ఇదేస్ఫూర్తితో చిన్నారులకు బోధన చేస్తే ఆశించిన లక్ష్యం నెరవేరేందుకు మార్గం సుగమం అవుతుంది.



కూలిస్తే.. మేలెంచినట్లే!

నెల్లూరు నగరంలోని బట్వాడి పాలెం సెంటర్‌లో టెలిఫోన్ కార్యాలయం పక్కనే ఉన్న మంచినీటి ట్యాంకు వినియోగంలో లేదు. పగుళ్లు ఏర్పడి తుప్పు పట్టి పెచ్చులూడుతూ పడిపోవడానికి సిద్ధంగా ఉంది. ప్రమాదం జరగక ముందే ట్యాంకును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – ఈనాడు, నెల్లూరు

పగలు తరగతి గది.. రాత్రికి పడక గది

కావలి మండలం ముసునూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఐదు నుంచి ఇంటర్ వరకు తరగతులు నిర్వహిస్తుండగా.. 270 మందికి పైగా బాలికలు చదువుతున్నారు. విద్యార్థినులకు సరిపడా గదులు లేవు. ఉన్న వాటిలో పగలు తరగతులు నిర్వహిస్తుండగా.. రాత్రివేళ అక్కడే నిద్రపోతున్నారు. ఇక్కడ నాడు- నేడు కింద చేపట్టిన మూడు గదులు అసంపూర్తిగా ఉన్నాయి. అవి పూర్తయితే సమస్య తీరుతుంది. –ఈనాడు, నెల్లూరు

ఆలయ ప్రత్యేకం.. రంగడి గోపురం

నెల్లూరు నగరంలో పెన్నానది ఒడ్డున ఉన్న రంగనాథస్వామి ఆలయం, గోపురం పలు ప్రత్యేకతలను సంతరించుకున్నాయి. ఏడో శతాబ్దంలో పల్లవ రాజుల కాలంలో స్వామివారిని ప్రతిష్ఠించినట్లు చరిత్ర తెలుస్తోంది. 12వ శతాబ్దంలో రాజమహేంద్రవరం రాజరాజ నరేంద్రుడు ఆలయానికి గర్భాలయాన్ని నిర్మించారు. ఆ తరువాత పలువురు రాజులు అభివృద్ధి చేశారు. యెరగుడిపాటి వెంకటాచలం పంతులు 1849 సంవత్సరంలో ఆలయ గోపురం నిర్మించారు. పాత రాజగోపురం స్థానంలో అదే ఆకృతిలో 2004లో పునరుద్ధరణ చేశారు. ఇది 113 అడుగుల ఎత్తులో ఏడు అంతస్తులతో నిర్మితమైంది. దీనిపై ఆరు బంగారు పూత ఉన్న కలశాలు ఉన్నాయి. ఇవి ఒక్కొక్కటి ఏడు అడుగుల ఎత్తు ఉండటం ప్రత్యేకం. గర్భగుడి లోపలి నుంచి పైకి చూస్తే రాజగోపుర శిఖరం కనిపించేలా నిర్మాణం చేపట్టారు. ఇక్కడ ముక్కోటి రోజు ఉత్తర ద్వార దర్శనం ప్రత్యేకం.

– న్యూస్‌టుడే, నెల్లూరు(సాంస్కృతికం)

పతక వీరుడు.. ఈ పోలీస్

పోలీసుశాఖలో జరిగిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటుతున్నారు.. ఏఆర్ కానిస్టేబుల్ కె.చరణ్. నెల్లూరు కిసాన్ నగర్‌కు చెందిన ఈయన.. ఈ ఏడాది అక్టోబరు 8 నుంచి 16వ తేదీ వరకు జమ్మూ కశ్మీర్‌లో జరిగిన పోటీల్లో జిల్లా తరపున పాల్గొని పెన్‌కాక్ సిలాట్‌లో మొదటి స్థానంలో నిలిచి.. బంగారు పతకం గెలుచుకున్నారు. 2020 బ్యాచ్‌కు చెందిన చరణ్ ఓ వైపు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ.. మరోవైపు క్రీడా సాధన చేస్తూ.. ఇప్పటి వరకు నాలుగుసార్లు జాతీయ స్థాయి పోలీసు క్రీడల్లో పాల్గొన్నారు. 2023లో నాసిక్‌లో, ఈ ఏడాది దిల్లీలో జరిగిన పోటీల్లోనూ భళా అనిపించుకున్నారు. గత ఏడాది అసోంలో జరిగిన పోలీసు క్రీడల్లో విజేతగా నిలిచారు. 2018, 2019లో జరిగిన తైక్వాండో జాతీయస్థాయి పోటీల్లోనూ పతకాలు కైవసం చేసుకున్నారు.

– న్యూస్‌టుడే, నెల్లూరు(క్రీడా విభాగం)

లక్ష్యంతో సాగితే.. ఉన్నత స్థానం: సతీష్‌రెడ్డి

కార్యక్రమంలో మాట్లాడుతున్న సతీష్‌రెడ్డి

దుత్తలూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని.. సాకారానికి పట్టుదలతో కృషి చేయాలని భారత రక్షణ మంత్రి సాంకేతిక సలహాదారుడు, రాష్ట్ర ప్రభుత్వ గౌరవ సలహాదారు సతీష్ రెడ్డి పేర్కొన్నారు. దుత్తలూరులో సీడ్స్ సంస్థ నిర్వహించిన జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన అబ్దుల్ కలాంను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉన్నత స్థానాల్లో ఉన్న వారు వారి సొంత గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో సీడ్స్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల వారిలో పోటీతత్వం పెరుగుతుందన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలైన పాఠశాలలకు నగదుతోపాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను సంస్థ వ్యవస్థాపకుడు రామిరెడ్డి చంద్రమౌళీశ్వరరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు నాగరాజు, ఎంపీడీవో చెంచమ్మ, పలు శాఖల అధికారులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీదకే.. పార్టీ పగ్గాలు

ప్రధాన కార్యదర్శిగా చేజర్ల

రవిచంద్ర చేజర్ల

ఈనాడు, నెల్లూరు: కలెక్టరేట్, న్యూస్‌టుడే: నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బీద రవిచంద్రను నియమించారు. జిల్లాలో పార్టీ పరిస్థితులు, కార్యకర్తల మనోభావాలు, సామాజిక సమీకరణలను పరిగణలోకి తీసుకున్న అధిష్ఠానం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. దీనిపై ఆదివారం అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డిని ఎంపిక చేసింది.

● కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెదేపా నాయకులతో పాటు.. భాజపా, జనసేన పార్టీ శ్రేణులను కలుపుకొని పోవాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు.. కార్యకర్తలు, అభిమానుల సమస్యలపైనా ప్రత్యేక దృష్టిని సారించాల్సి ఉంది. ఈ క్రమంలో కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం, క్షేత్రస్థాయిలో పరిస్థితులను చక్కదిద్దడంతో పాటు.. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తుండటంతో క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై అధిష్ఠానం దృష్టి సారించి బీదను నియమించింది.

తొలి నుంచి తెదేపాతోనే...

అల్లూరు మండల పార్టీ అధ్యక్షుడిగా, ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అల్లూరు నియోజకవర్గ సమన్వయకర్తగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, కార్యనిర్వాహక కార్యదర్శిగా పలు పదవుల్లో తెదేపా బలోపేతానికి బీద రవిచంద్ర కృషి చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడిగా ఉన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా 2012-21 మధ్య కాలంలో పని చేశారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ 2021లో జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్సీగా రెండోసారి అవకాశం కల్పించింది.

నింగిలో వీక్షణ నేలపై రక్షణ

నేరాల కట్టడికి డ్రోన్ల వినియోగం

నిఘాతో నమోదైన కేసులు	నవంబరు	డిసెంబరు
బహిరంగ మద్యపానం	775	567
ట్రిపుల్ రైడింగ్	375	324
సెల్‌ఫోన్ డ్రైవింగ్	432	382
రాంగ్ రూట్ డ్రైవింగ్	223	201
అధిక వేగం	185	165

న్యూస్‌టుడే, నెల్లూరు(నేర విభాగం)

జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో పోలీసు శాఖ ప్రయోగాత్మకంగా చేపట్టిన 'డ్రోన్ నిఘా' సత్ఫలితాలిస్తోంది. నేరాలు తగ్గుముఖం పట్టడంతో పోలీసులు నిత్యం డ్రోన్‌తో నిఘా ఏర్పాటు చేస్తున్నారు. వ్యక్తులు వెళ్లలేని ప్రదేశాల్లో సైతం ఇది వెళ్లి నిఘా పెడుతోంది. ఆకాశంలో వస్తున్న డ్రోన్‌ను చూసి ఆకతాయిలు పరుగులు తీస్తున్నారు.

3 కి.మీ. వరకు పరిధి

పోలీసులు ప్రతిరోజూ బీట్ విధులు నిర్వహించాల్సి ఉంది. ప్రతి బీట్‌కు ఇద్దరు లేక ముగ్గురు సిబ్బంది ఉంటారు. వీరికి కేటాయించిన ప్రాంతాల్లో నిఘా ఉండాలి. కొన్ని ప్రాంతాల్లోకి వెళ్లలేరు.. ఖాళీ ప్రదేశాలు పరిశీలించలేరు. ఈ సమయంలో డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. ఒక్కో డ్రోన్ రెండు నుంచి 3 కి.మీ. వరకు ఆకాశంలో ఎగిరి వీక్షిస్తుంది. దీనివల్ల సిబ్బంది వినియోగం తగ్గుతోంది.

● ఇందుకూరుపేట మండలం కుడితిపాలెం సమీపంలోని పెన్నానది ఐలాండ్‌లో రహస్యంగా జూద స్థావరం ఏర్పాటు చేసుకుని జూదం ఆడుతున్న 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. డ్రోన్ సాయంతో స్థావరాన్ని గుర్తించగలిగారు.

● నగరంలోని శివారు ప్రాంతంలో యువకులు బహిరంగంగా మద్యం తాగుతున్నారు. డ్రోన్ సాయంతో ఆరుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుంటున్న తరుణంలో డ్రోన్ల ఉపయోగం భారీగా పెరిగింది.

డ్రోన్లు	
నెల్లూరు	7
కావలి	4
ఆత్మకూరు	2
కందుకూరు	2

ప్రస్తుతం ప్రతి కార్యక్రమానికి వీటినే ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలోనే పోలీసులు దీన్ని వినియోగిస్తున్నారు. శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాల్లో వీటి ద్వారా వీక్షిస్తూ అక్కడికి వెళ్తున్నారు. దాంతో పాటు అసాంఘిక కార్యకలాపాలు, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తిస్తున్నారు. పాడుబడిన బంగ్లాలు, తోటలు, పార్కులు, నది తీరాల్లో నిఘా ఉంచుతున్నారు.

నియోజకవర్గానికో నక్షత్ర వనం

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ) : పల్లెల ప్రగతికి అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నేతృత్వంలో అమలవుతున్న జీ రామ్ జీ పథకంలో నక్షత్రవనాల పేరిట పార్కులు మంజూరయ్యాయి. వీటిని ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసేలా ఇప్పటికే డ్వామా జిల్లా అధికారులకు మౌఖిక ఆదేశాలు అందాయి. పెద్ద పంచాయతీలకు దగ్గరగా సుమారు రెండు నుంచి అయిదు ఎకరాల విస్తీర్ణంలో దాదాపు రూ.50 లక్షలతో పార్కులు ఏర్పాటు చేయనున్నారు. సర్వేపల్లి, ఆత్మకూరు, కోవూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి, నెల్లూరు గ్రామీణం నియోజకవర్గాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. ప్రత్యేకంగా పూజకు పనికొచ్చే వృక్షాలు, వాకింగ్ ట్రాక్‌లు, సిమెంటు కుర్చీలు, సోలార్ దీపాల ఏర్పాటు తదితర వసతులు కల్పించనున్నారు. వీటి ఏర్పాటుతో పల్లెలకు కొత్త అందాలు రానున్నాయి. ఇందుకు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులు పల్లెల్లో సర్వే చేయనున్నారు.

చెరువుల చెంతనే..

మండలాల పరిధిలో పెద్ద గ్రామాల్లో చెరువుల పక్కనే పార్కులు ఏర్పాటు చేస్తారు. వీటి కోసం డ్వామా మండల, జిల్లా స్థాయి అధికారులు ముందుగా ప్రజాప్రతినిధులతో సంప్రదించి వారి సలహాలు తీసుకోనున్నారు. వారు సూచించిన గ్రామాల్లో నిబంధనలు అనుసరించి ఏర్పాటు చేస్తారు. అనంతరం పనులను జిల్లా పంచాయతీరాజ్ శాఖకు అప్పగిస్తారు. ఈనెల చివరివారం నుంచి ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఆదేశాలు అందాయి

జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు పార్కులు మంజూరు అవుతున్నట్లు మౌఖిక ఆదేశాలు అందాయి. లిఖితపూర్వకంగా ఉత్తర్వులు రావాల్సి ఉంది. త్వరలో ఈ ప్రక్రియ ప్రారంభిస్తాం. – గంగా భవాని, పీడీ, డ్వామా

గణితం.. ప్రతిభతో ఫలితం

ఎక్కువ మంది విద్యార్థులు గణితమంటే భయపడుతుంటారు. కొందరు అలవోకగా లెక్కల్లో రాణిస్తున్నారు. పాఠశాలతోపాటు వివిధ పోటీల్లో రాణిస్తున్నారు. నేడు గణిత దినోత్సవం. ఈ సందర్భంగా లెక్కల్లో రాణిస్తున్న విద్యార్థులపై ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, సంగం, గుడ్లూరు, కావలి

అతి వేగంగా పరిష్కారం

సంగంలోని జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులు ఆర్.ఖుష్బూకౌర్, వి.వెంకట ప్రణీక్ష గణితంలో రాణిస్తున్నారు. పాఠ్యాంశాలకు సంబంధం లేని గణిత సమస్యలను వారిద్దరూ సులభంగా, అతి వేగంతో పరిష్కరిస్తున్నారు. వారిద్దరి ఆధ్వర్యంలో సంగం జట్టు ఆదివారం జరిగిన సీడ్స్ సంస్థ క్విజ్ పోటీల్లో జిల్లాస్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది.

● ఆర్.ఖుష్బూకౌర్ బీజ గణితంపాటు క్షేత్ర గణితం, త్రికోణమితిలో తన మేధస్సును ఉపయోగించి ఉపాధ్యాయులు పాఠ్యాంశం పూర్తి చేసేలోపు జవాబు చెబుతోంది. మౌఖికంగా సమాధానం చెప్పడంలో ముందుంటారు.

● రేఖా గణితమంటే వెంకట ప్రణీక్షకి అవలీలగా ఉంటుంది. గణితశాస్త్రంలో క్లిష్టతరంగా ఉంటే ఈ విభాగంతో పాటు వ్యాపార గణితం, త్రికోణమితిలోనూ పట్టు సాధించింది. తరగతి గదిలో సమాధానాలు సులభంగా చెబుతోంది.

త్రికోణమితిలో చొరవ

ఎత్తు, దూరం కొలతలకు త్రికోణమితి ప్రధాన ఆధారం. భవనాలు, పర్వతాల లెక్కల అంచనాల్లో ఈ విధానాన్నే అనుసరిస్తారు. ఈ అంశంపై గతనెలలో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్‌లో జిల్లాలోని టీపీగూడూరు మండలం కోడూరు బీఆర్ అంబేడ్కర్ గురుకులం ఇంటర్ విద్యార్థినులు బీ కీర్తి, డీ రాజశ్రీ ప్రతిభ చూపారు. సైన్స్‌లో అంతర్భాగంగా ఉండే త్రికోణమితి గురించి అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. వారికి గైడ్ టీచర్‌గా డీ కామాక్షి వ్యవహరిస్తున్నారు.

నూరుశాతం మార్కులు

గుడ్లూరు శ్రీచైతన్య హైస్కూల్‌కు చెందిన బాలిక రేవతికి చిన్నప్పటి నుంచి గణితమంటే ఆసక్తి. ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయులు చెప్పిన చిట్కాలతో ప్రస్తుతం రాణిస్తోంది. పోటీ పరీక్షలు, ప్రతిభా పోటీల్లో గణితంలో నూరుశాతం మార్కులు రావాల్సిందే. క్యూబ్స్‌లో ప్రతిభ చూపుతోంది. గణిత సూత్రాలు అలవోకగా వివరిస్తుంది.

ఓటీపీతో అక్రమాలకు అడ్డుకట్ట



న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్) : గ్యాస్ ఏజెన్సీల్లో పనిచేసే డెలివరీ బాయ్‌లు.. వంట గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే ఓటీపీ విధానం ప్రవేశపెట్టినా అంతంత మాత్రంగానే అమలవుతోంది. ఇక నుంచి నూరుశాతం అమలు చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలో 7,87,483 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. కొందరు ఆన్‌లైన్‌లో, మరి కొందరు టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి బుక్ చేసుకుంటున్నారు. మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. పంపిణీ కోసం ఇంటి వద్దకు వచ్చిన డెలివరీ బాయ్‌కు ఓటీపీ నంబరు చెప్పాల్సి ఉంటుంది. వెంటనే సిలిండర్ ఇస్తారు.

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లు ఇలా..	
సాధారణ	4,64,871
దీపం	2,67.421
ఉజ్వల	18,986
సీఎస్ఆర్	33,589
వాణిజ్య	2,616

ఇలా ఫిర్యాదు చేయవచ్చు.. గ్యాస్ వినియోగదారులకు ఏవైనా సమస్యలుంటే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ సేల్స్ ఆఫీసర్‌కు లేదా టోల్‌ఫ్రీ నంబరు 1967 ద్వారా ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్‌కు, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ టోల్‌ఫ్రీ నంబరు 1800 2333555కు ఫిర్యాదు చేయాలని అధికారులు చెబుతున్నారు.

దాతలు దిద్దిన.. బడి

మల్రిపాడు జడ్పీ ఉన్నత పాఠశాల

న్యూస్‌టుడే, సంగం : చదువు నేర్పిన బడికి అండగా నిలిచారు.. పూర్వ విద్యార్థులు. వారితోపాటు గ్రామస్థులు చేయూతనిచ్చారు.. దాంతో సరస్వతీ నిలయానికి వసతులు సమకూరాయి. సంగం మండలంలో మారుమూల గ్రామమైన మల్రిపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 320 మంది విద్యార్థులు ఉండగా.. 20 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. గ్రామంతో పాటు చెర్లోవంగల్లు, జంగాలకండ్రిక విద్యార్థులు చదువుతున్నారు.

నేనున్నానంటూ.. మేకల హనుమంతరావు.. పాఠశాలలో చదువుకుని ప్రస్తుతం అమెరికాలో ఉన్నతస్థాయి ఉద్యోగం చేస్తున్నారు. ఏటా పదో తరగతిలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులతో పాటు 500 కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్నవారికి నగదు బహుమతులు అందించి ప్రోత్సహిస్తున్నారు. ఇటీవలే రూ.8 లక్షలతో పాఠశాల ప్రాంగణంలో సరస్వతీదేవి మందిరం, అందులో విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు.

పలు వసతులు.. నెల్లూరు వాసి విజయచంద్ర జంగాలకండ్రికకు చెందిన తాత మల్లికార్జున, తల్లి ప్రమీలమ్మ జ్ఞాపకార్థం రూ.రెండు లక్షలతో తరగతి నిర్మించారు. మల్రిపాడు వాసి వెంకటేశ్వరరెడ్డి రూ.50 వేలతో బోరు ఏర్పాటు చేయించగా.. రవీంద్రనాథ్ ఠాగూర్ రూ.రెండు లక్షలతో కళావేదిక నిర్మించారు. గ్రామ సర్పంచి సురేష్ రూ.పదివేలతో కుర్చీలు, పూర్వవిద్యార్థి అజయ్ రెడ్డి బాలల దినోత్సవానికి బహుమతులు అందిస్తున్నారు.

గురువుపై మమకారంతో..

పాఠశాల హెచ్‌ఎం నరసింహమూర్తి శిష్యుడైన నెల్లూరు వాసి పి.రాజేష్ డీఆర్‌డీవో శాస్త్రవేత్తగా ఉన్నారు. ఇటీవల రూ.రెండు లక్షలతో వాటర్ కూలర్, మైక్‌సెట్, ప్రయోగశాల, గ్రంథాలయంలో ర్యాక్‌లు ఏర్పాటు చేయించారు.

● ప్రధానోపాధ్యాయుడు నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల రవాణాకు ప్రత్యేకంగా బస్సు వసతికి ప్రయత్నిస్తున్నట్లు వివరించారు.

ఖాళీ జాగాపై కన్ను.. అధికారుల దన్ను

న్యూస్‌టుడే, కావలి

పట్టణంలో ప్రభుత్వ ఖాళీ జాగా కనిపిస్తే చాలు ఆక్రమణదారులు ఇట్టే వాలిపోతున్నారు. కావలి పట్టణంలోని బాపూజీనగర్‌కాలనీ ఐడీఎస్ఎంటీ (ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ స్మాల్, మీడియం టౌన్‌షిప్) ప్లాట్లలో ఆక్రమణదారులు తిష్ఠవేశారు. ఇటీవల కాలనీలోని ఖాళీప్లాట్లకు పురపాలక సంఘం ఇ-వేలం విధానంలో విక్రయించేందుకు సన్నద్ధమైంది. దీంతో కబ్జాల పర్వం వెలుగులోకి వచ్చింది. ఖాళీ ప్లాట్లతోపాటు ఉమ్మడి అవసరాల కోసం నిర్దేశించిన రిజర్వ్‌డ్ స్థలాలు కూడా చాలావరకు ఆక్రమించారు. ప్రస్తుతం పురపాలకం తరఫున చేపట్టే పనులను కూడా ఆక్రమణదారులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వేలంలో పాల్గొని ప్లాట్లను కొనుగోలు చేద్దామనుకున్న మధ్యతరగతి ప్రజలు సందిగ్ధంలో పడుతున్నారు. ఖాళీ ప్లాట్లన్నీ కాకుండా కొన్నింటిని మాత్రమే విక్రయించేందుకు సిద్ధం కావడంతో పురపాలక అధికారుల తీరు సైతం అనుమానాలకు తావిస్తోంది.

ఐడీఎస్ఎంటీ ఖాళీ ప్లాట్లలో ఆక్రమణల్ని తొలగిస్తున్న పురపాలక యంత్రాంగం

కావలి బాపూజీనగర్‌కాలనీలో..	
లేఅవుట్ విస్తీర్ణం	40 ఎకరాలు
నాలుగు కేటగిరిల్లో ప్లాట్లు	463
గతంలో రిజిస్ట్రేషన్ల పెండింగ్	14
మిగిలిన ఖాళీ ప్లాట్లు	74
ప్రస్తుతం వేలానికి పిలిచినవి	29

ప్రైవేట్‌భూమిలో నిర్మాణాలు జరగాలంటే పురపాలక పట్టణ ప్రణాళికా విభాగం అధికారుల అనుమతులు తప్పనిసరి. అలాంటప్పుడు పురపాలకమే యాజమాన్యంగా ఉన్న ఖాళీప్లాట్లలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఆ విభాగం మిన్నకుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అంతా పారదర్శకమే

వేలం ప్రక్రియ అంతా పారదర్శకంగానే జరుగుతోంది. ఆక్రమణదారులను ఇప్పటికే గుర్తించాం. ఆక్రమణలు తొలగిస్తున్నాం. మొత్తం ప్లాట్లన్నీ విడతలవారీగా వేలం వేయాలని నిర్ణయించాం. – జి.శ్రావణ్‌కుమార్, కమిషనర్, కావలి పురపాలక సంఘం

సోమశిలకు 5,403 క్యూసెక్కుల వరద

అనంతసాగరం : సోమశిల జలాశయంలో ఆదివారానికి ఎగువ ప్రాంతాల నుంచి 5,403 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయంలో 77.988కి 74.930 టీఎంసీల నీరు నిల్వ ఉండగా 328.619 అడుగుల మేర నీటిమట్టం నమోదైంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 50, పవర్ టన్నల్ ద్వారా 2,600 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన కండలేరు వరద కాలువకు 2,000, దక్షిణ కాలువకు 200, ఉత్తర కాలువకు 100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రసన్నుడి కోవెల మరో తిరుమల

సౌకర్యాలకు అడుగులు

బిట్రగుంట, న్యూస్‌టుడే

శతాబ్దాల చరిత్ర కలిగిన వైష్ణవ పుణ్యక్షేత్రం బోగోలు మండలంలోని కొండబిట్రగుంటలోని ప్రసన్న వేంకటేశ్వరాలయం. దీన్ని మరో తిరుమలగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈమేరకు పనులు జరుగుతున్నాయి.

శతాబ్దాల కాలం నాటి ఆలయం శిథిలావస్థకు చేరగా బీద సోదరులు మస్తాన్‌రావు, రవిచంద్ర పూర్వవైభవం తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. గర్భాలయాలు, ప్రాకారం, ఉత్తర రాజగోపురం తదితర నిర్మాణాలు చేశారు. తాజాగా ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి దాతలు, దేవాదాయ శాఖ సహకారంతో పలు సౌకర్యాలు ఏర్పాటవుతున్నాయి. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి సహకారంతో 17.30 ఎకరాలకు రూ.1.65 కోట్లతో మహాప్రాకారం నిర్మాణం చేపట్టారు. రూ.2 కోట్లతో ధ్యాన మందిరం, అతిథిగృహానికి శంకుస్థాపన జరిగాయి. ఎంపీ వేమిరెడ్డి దంపతులు రూ.2 కోట్లకు పైగా నిధులతో పుష్కరిణి సుందరీకరణ పనులు చేయిస్తున్నారు.

పలువురి సహకారంతో..

ప్రవాసాంధ్రులు బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతులు తమ అమర చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.5 కోట్లతో పలు నిర్మాణాలు చేయిస్తున్నారు. స్వామి కల్యాణాన్ని ఆరు వేల మంది తిలకించేలా మండపం నిర్మిస్తున్నారు. ఆలయానికి తూర్పున గరుత్మంతుడి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కావలి పట్టణానికి చెందిన అనికేపల్లి రమేష్‌రెడ్డి, ప్రశాంతి దంపతులు తూర్పు రాజగోపురం ఎదుట మండపం, అక్కడి నుంచి కొండ దిగువన పుష్కరిణి వరకు మెట్లు నిర్మిస్తున్నారు. కావలికి చెందిన వీరాస్వామి, లక్ష్మి దంపతులు కల్యాణకట్ట, స్నానఘట్టానికి సన్నాహాలు చేస్తున్నారు.

తూర్పువైపు కొండ దిగువన నిర్మిస్తున్న మెట్ల మార్గం

బ్రహ్మోత్సవాలకు ముందుగా..

2026 ఫిబ్రవరి నెలాఖరులో జరిగే బ్రహ్మోత్సవాలకు ముందుగానే మార్పులు పూర్తవుతాయని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, ఈవో రాధాకృష్ణ పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉత్తర రాజగోపురం, మెట్ల నుంచే భక్తుల రాకపోకలు జరిగేవని.. రాబోయే బ్రహ్మోత్సవాలకు తూర్పున మెట్లు, మన్నెమాల సుకుమార్‌రెడ్డి సహకారంతో నిర్మిస్తున్న రాజగోపురం నుంచి కూడా స్వామి దర్శనానికి వెళ్లే ఏర్పాట్లు చేస్తామన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

(c) eenadu

ప్రమాదమని తెలిసినా నిర్లక్ష్యమేనా..

పొదలకూరులో కూలీలను తరలించే ఆటోలు నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణిస్తున్నాయి. వెనుక భాగంలో పరిమితికి మించి తరలిస్తున్నారు. వాహనం ఏ కొంచెం అదుపు తప్పినా భారీ ప్రమాదం జరిగే అవకాశముంది. ఎంవీఐ అధికారులు కనీసం నెల రోజులకు ఒక సారి కూడా తనిఖీలు చేయకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది. ఆదివారం ఒక ఆటో కూలీలతో ప్రమాదకరంగా ప్రధాన రహదారిలో వెళుతుండగా అది చూసిన పలువురు అవాక్కవుతున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

అయిదు నెలలుగా గుర్తుల్లేక.. తికమక

ప్రమాదాల నియంత్రణకు చర్యల్లో భాగంగా చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిపై ప్రధాన కూడళ్ల వద్ద వంతెన నిర్మాణాలు చేపట్టారు. మండల పరిధిలోని కృష్ణపట్నం పోర్టు అడ్డ రోడ్డు వద్ద ఇటీవల ఆరు వరుసలతో వంతెన నిర్మించారు. అయిదు నెలలుగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనపై గుర్తులు, సూచికలు లేకపోవడంతో కొందరు సర్వీసు రోడ్డు నుంచి వెళుతున్నారు. ఎన్‌హెచ్ అధికారులు స్పందించి పనులు చేపట్టాలని సూచిస్తున్నారు.

- న్యూస్‌టుడే, మనుబోలు

గణిత సూత్రాలు.. అలరించిన రంగవల్లులు

చిలకలమర్రి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆదివారం గణిత సూత్రాల రంగవల్లులతో స్థానికులను అలరించారు. సోమవారం జాతీయ గణిత దినోత్సవం, శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా విద్యార్థులు వినూత్న రీతిలో ముగ్గులు వేసి పాఠశాలను అందంగా ముస్తాబు చేశారు. త్రికోణమితి సూత్రాలతో రంగవల్లులు వేయడంతో చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభతో ముగ్గులు వేసిన విద్యార్థులను గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు. - న్యూస్‌టుడే, అనంతసాగరం

పొదలకూరులో అంధకారం

పొదలకూరు పట్టణ ప్రధాన మార్గంలో వీధి దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన రోడ్డుపైనే వీధిలైట్లు లేక అవస్థలు పడుతుంటే లోపల వీధుల్లో పరిస్థితి ఎలా ఉందో తెలుసోంది. కోటి రూపాయలకు పైగా పంచాయతీకి ఆదాయం సమకూరుతున్నా కనీస వసతులు కల్పించడం లేదని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, పొదలకూరు

బాక్సింగ్ పోటీలకు ఎంపిక

పిఠాపురం : కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి మహిళా బాక్సింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. జాతీయ స్థాయి పోటీలకు 10 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌గా విశాఖపట్నం, రన్నర్‌గా కాకినాడ జిల్లా, ద్వితీయ స్థానంలో నెల్లూరు జిల్లా క్రీడాకారులు బహుమతులు సాధించారు.

సమాచార స్రవంతి

బంగారం ధరలు

గ్రాముధర:	రూ. 12,669
(3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	
సవర ధర:	రూ. 1,01,352
వెండి గ్రాము :	రూ. 213.50

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	153
లేయర్	118
బ్రాయిలర్స్	266
బ్రాయిలర్స్‌స్కిన్‌లెస్	294
లేయర్ మాంసం	200

మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి కడప వారి కోర్టులో

ఇ.పి.నెం.348/2022
ఎ.ఆర్.సి.39/2013

M/s శ్రీరామ్ సిటి యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, బద్వేల్ ..డి.హెచ్.ఆర్

వర్సెస్

ఎన్.రామయ్య ..జె.డి.ఆర్
పి.తిరుపాలయ్య

పై ఇపి లో జె.డి.ఆర్.నెం.1నకు పత్రిక ముఖముగా ఆర్డర్ 21 రూల్ 48 సిపిసి

టు
జె.డి.ఆర్.నెం.1 ఎన్.రామయ్య
తండ్రి ఎన్.అంకయ్య
వర్కింగ్ మ్యాథ్స్, ఎస్‌జి టీచర్, ఎంపీయూపీ స్కూల్, దామనం(గ్రామం) జలదత్తి మండలం, నెల్లూరు(డి).

అను మీ మీద డి.హెచ్.ఆర్ కంపెనీ తనకు డిక్రి ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ సిపిసి క్రింద మీ యొక్క జీతమునకు జప్తుచేసి, తదుపరి కోర్టుకు తెప్పించు కొనుటకు గాను, పై ఇ.పి ని సలుపగ సదరు ఇ.పి.లో మీ యొక్క హాజరుకు గాను **23-12-2025**వ తేదీకి వాయిదా ఉన్నది. కావున **23-12-2025**వ తేదీ ఉ॥10.30 ని॥లకు మీరు నేరుగా గాని, వకీలు ద్వారా గాని మహారాజశ్రీ పై కోర్టు నందు హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు/అభ్యంతరాలు వున్న యెడల కోర్టు వారికి తెలుపుకోనంతట పై ఇ.పి ని మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(రాజశ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)
ఎం.సుధాకర్ బాబ్జి, వకీలు, కడప

సృజనాత్మక ఆలోచనలు..

వినూత్న ఆవిష్కరణలు

పల్లిపాడులో జరిగిన ప్రదర్శనలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది.. రేపటి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేలా నిర్వహించిన జిల్లా స్థాయి దక్షిణ భారత విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లాలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు వినూత్న ఆలోచనలతో చేసిన ప్రదర్శనలు భళా అనిపించాయి.. వివిధ విభాగాల్లో నూతన సాంకేతిక విభాగాల్లో చేసినవి ఆకట్టుకున్నాయి. పల్లిపాడులో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన వాటిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఆటోమేటిక్ పద్ధతితో మోటారు పనితీరు

అంశం: హరిత శక్తి
(విద్యార్థుల బృంద విభాగం)

● ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు హేమశ్రీ రామ్, హరిచందన్ పవన్ గైడ్ టీచర్ ఫణి కుమార్ సహకారంతో సోలార్ ఉపయోగించుకొని వ్యవసాయం, నీటిపారుదల విభాగంలో రైతులు ఇంటి వద్ద నుంచి పొలాలకు నీటి సౌకర్యం కల్పించేలా రూపొందించారు. పొలం ఎండిపోతే ఆటోమేటిక్‌గా మోటారు ఆన్ చేసి, పొలం నిండిన తరువాత ఆగిపోయేలా రూపకల్పన చేశారు. రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడకుండా, సోలార్ అనుసంధానం చేస్తే విద్యుత్తు బిల్లు కూడా ఆదా అవుతుంది. పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు.

కృత్రిమ మేధతో పాఠశాల పరిపాలన

అంశం: పాత్ టు టీచ్ (ఉపాధ్యాయుడి విభాగం)

కందుకూరు మండలం జి.మేకపాడులోని ఏపీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు షేక్ హుస్సేన్ పీర్... పాత్ టు టీచ్ ఆలోచనతో కృత్రిమ మేధ ఉపయోగించి పాఠశాల పరిపాలన సులభంగా సమర్థవంతంగా నిర్వహణ, ఉపాధ్యాయుల బోధనలో విశ్లేషణలో తోడ్పాటు లభించేలా ప్రాజెక్టు రూపొందించారు. దీనివల్ల సమయం ఆదా అవడంతో పాటు పనిభారం తగ్గుతుంది. చరవాణిలో అందుబాటులో ఉండే చాట్ జీపీటీ, గూగుల్ జెమినీ వంటి ఏఐ సాధనాల ద్వారా ఈ వ్యవస్థ అమలు చేయొచ్చు.

ఆటోమేటిక్ విధానంలో ట్రాఫిక్ సిగ్నల్స్

అంశం: డ్రైవింగ్ బెస్ట్ రోబో
(విద్యార్థి వ్యక్తిగత విభాగం)

● అనంతసాగరం మండలం రేవూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ముజమ్మిల్ గైడ్ టీచర్ రత్నారెడ్డి సహకారంతో డ్రైవింగ్ బెస్ట్ రోబో అంశం ఎంచుకొని ప్రాజెక్టు తయారు చేశారు. అల్ట్రాసోనిక్ సెన్సార్‌తో పనిచేస్తుంది. దూరం ఎంపిక చేస్తే దాని కంటే ముందు వాహనం ఉంటే అక్కడికి రాగానే ఆగిపోతుంది. కారు ఎంత వేగంగా వెళుతున్నా ఎంపిక చేసిన దూరం రాగానే ముందు వాహనం ఉంటే దానంతటే అదే ఆగిపోతుంది. దీంతో రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు.

రైతు కలత.. నిమ్మ పారబోత

పొదలకూరు మార్కెట్ సమీపంలో పారబోసిన నిమ్మకాయలు

పొదలకూరు, న్యూస్‌టుడే: రోజు రోజుకూ దిగజారుతున్న నిమ్మ ధరలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మెట్ట ప్రాంతంలో ఎక్కువ మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారు. వరుస విపత్తులతో భారీగా నష్టపోయారు. గత కొన్ని రోజులుగా నేపాల్‌లో ధరలు ఆశాజనకంగా ఉండడంతో తరలిస్తున్నారు. ఆదివారం క్వింటా బస్తా ధర రూ.600 నుంచి రూ.1200 పలికినా ఎక్కువగా రూ.700 పలికిందని వ్యాపారులు చెబుతున్నారు. దిత్వా తుపాను కారణంగా వారం రోజులు కురిసిన వర్షాలకు తీరని నష్టం వాటిల్లింది. చెట్లకు ఉన్నవి ఎక్కువ శాతం నాణ్యత కోల్పోవడం, పూత, పిందె సీజన్‌లో రాకపోవడంతో నష్టాలు తప్పడం లేదు. పొదలకూరు మార్కెట్‌కు వంద బస్తాలొస్తే వాటిలో 80 శాతం దెబ్బతిన్నవే వస్తుండగా, కేవలం 20 శాతం మాత్రమే దూరప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇటీవల 500 బస్తాలకుపైగా వృథా అవడంతో దిబ్బల్లో పారబోశారు. రోజుకు పది లారీల సరకు వస్తుండగా గ్రేడింగ్ చేసి బిహార్, దిల్లీ, కోల్‌కతా, యూపీ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నవంబరు, డిసెంబరు నెలల్లో నిమ్మ రైతుల పరిస్థితి దయనీయంగా మారడంతో భారీగా నష్టపోయామని సాగుదారులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.

ఉపాధి పథకం పేరు మార్పు దారుణం: నారాయణ

నెల్లూరు (విద్య) : ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం గాంధీ పేరు మార్చి, కొత్త నిబంధనలు తీసుకురావడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. ఆదివారం నెల్లూరు నగరంలోని ఎస్‌బీఎస్ కల్యాణ మండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేశం కోసం పోరాటాలు చేసిన నాయకుల పేర్లను పథకాలకు తీసేయడం దుర్మార్గమన్నారు. ఉపాధి హామీ పథకానికి పేరు మారిస్తే కూటమి నాయకులు ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. రాష్ట్రాన్ని ఏఐతో అభివృద్ధి చేస్తామని చెబుతున్న సీఎం చంద్రబాబు ముందు ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. నక్సలిజాన్ని అణచివేస్తామని చెబుతున్న నాయకులు గంజాయి, ఎర్రచందనం, రేషన్ బియ్యం అక్రమ రవాణాను కట్టడి చేయాలని కోరారు. రాష్ట్రంలో రాజకీయంగా విమర్శలు చేసే వారు, సోషల్ మీడియాపై దాడులు చేయడం అన్యాయమన్నారు. అన్ని వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేసేందుకు జీవో తీసుకురావడం దారుణమని రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య ఆరోపించారు. దీంతో ప్రజలు నష్టపోతారని, వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాయిపాల్గొన్నారు.

96.12 శాతం మందికి పోలియో చుక్కలు

నెల్లూరు (నవాబుపేట, జీజీహెచ్), న్యూస్‌టుడే: పల్స్ పోలియో కార్యక్రమం మొదటి రోజు విజయవంతంగా సాగింది. జిల్లాలో 2,94,604 మంది 0 నుంచి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నది లక్ష్యం కాగా 2,83,173 (96.12 శాతం) మందికి ఆదివారం వేశారు. నెల్లూరు నగరం జీజీహెచ్‌లోని చిన్నపిల్లల విభాగం వద్ద ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లో నవజాత శిశువులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ హేనా సుజన్, నగరపాలక సంస్థ కమిషనర్ నందన్‌తో కలిసి డీఎంహెచ్‌వో వి.సుజాత ప్రారంభించారు.

పోలియో చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

● పల్స్ పోలియో కార్యక్రమం అమలు తీరును పరిశీలించేందుకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుంచి మానిటరింగ్ అధికారిగా వచ్చిన ఏపీ సాక్స్ జాయింట్ డైరెక్టర్ వై.కామేశ్వర్ ప్రసాద్ నగరంలోని పలు పల్స్‌పోలియో బూత్‌లను తనిఖీ చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా

వేర్వేరు చోట్ల ఇంజినీరింగ్ విద్యార్థుల మృతి

కోట, న్యూస్‌టుడే: శ్రీనివాససత్రం సమీపంలోని బంగాళాఖాతంలో ఆదివారం నెల్లూరు గ్రామీణ మండలం కొత్త ఎల్ఎన్‌టీ గ్రామానికి చెందిన **యుగంధర్‌రెడ్డి**(21) అలల ధాటికి మునిగి మృతి చెందాడు. ఎస్సై పవన్‌కుమార్ వివరాల మేరకు నెల్లూరు గ్రామీణ మండలం కొత్త ఎల్ఎన్‌టీ గ్రామానికి చెందిన సురేష్ కుమార్‌రెడ్డి కుమారుడైన యుగంధర్‌రెడ్డి గూడూరులోని నారాయణ కళాశాలలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సరదాగా గడపాలని యుగంధర్‌రెడ్డి తన నలుగురు స్నేహితులతో కలిసి శ్రీనివాససత్రం సమీపంలోని తీరానికి వెళ్లారు. సముద్రంలో సరదాగా గడుపుతుండగా హఠాత్తుగా అలలు యుగంధర్‌రెడ్డితో పాటు మరో విద్యార్థినిని లాక్కొని వెళ్లాయి. యుగంధర్‌రెడ్డి విగతజీవిగా సముద్రం ఒడ్డుకు చేరాడు. మరో విద్యార్థి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. మృతుని స్నేహితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. స్నేహితుల నుంచి వివరాలు సేకరించి, కుటుంబీకులకు సమాచారం తెలియజేశారు.

కొత్తపట్నం: స్నేహితులతో కలిసి సరదాగా సముద్ర తీరానికి వచ్చిన ఓ విద్యార్థి అలల ధాటికి నీట మునిగి మృతి చెందిన సంఘటన కొత్తపట్నం మండలం మడనూరు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లూరు నగరానికి చెందిన కొమరి హర్షసాయి(19), ఒంగోలులోని హాస్టల్‌లో ఉంటూ నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన స్నేహితులతో కలిసి సముద్ర తీరానికి వచ్చాడు. అందరూ కలిసి కొంత సేపు సముద్రంలో దిగి స్నానాలు చేశారు. కొందరు మళ్లీ సముద్రంలోకి దిగారు. ఆ సమయంలో ఒక విద్యార్థి అలల్లో చిక్కుకున్నాడు. అతడిని కాపాడేందుకు మరొకరు వెళ్లారు. అతడు కూడా నీటిలో మునిగిపోవడం గమనించిన హర్షసాయి కాపాడేందుకు వెళ్లాడు. వారు దిగిన చోట సముద్రంలో గుంతలు ఉండటంతో ముగ్గురూ చిక్కుకుపోయారు. దీనిని గమనించిన స్థానిక మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లి వారిని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే హర్షసాయి మృతి చెందినట్లు గుర్తించారు. మిగిలిన ఇద్దరిలో ఒకరు ప్రాణాలతో బయటపడగా.. మరొక విద్యార్థి నీరు అధికంగా తాగడంతో స్పృహకోల్పోయాడు. అతడిని ఒంగోలులోని ఓ ఆసుపత్రికి తరలించారు. హర్షసాయి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు.

రహదారుణం

అడుగుకో గండం.. గజానికో ప్రమాదం

అధ్వానంగా సంగం- కలిగిరి రహదారి

గోతుల్లో పడిపోయేలా వెళుతున్న ఆటో

నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు దారుణంగా తయారయ్యాయి. బావుల మాదిరి గోతులతో అడుగు పెడితే ఎక్కడ పడిపోతామోనని ప్రజలు భయపడుతున్నారు. అడుగుకో గొయ్యి.. గజానికో గతుకు అన్న చందంగా మారాయి. రాత్రిళ్లు వాహనచోదకులు పడిపోతున్నారు. అయినా అధికారులు గుంతల్లో చారెడు మట్టి పోసిన దాఖలాలు లేవు. వీటిపై 'ఈనాడు-ఈటీవీ' ప్రత్యేక కథనం.

న్యూస్‌టుడే, కలిగిరి

కలిగిరి- సంగం ప్రధాన రహదారిపై ప్రయాణమంటేనే వాహనదారులు హడలిపోతున్నారు. పాతనాపురం నుంచి హసనాపురం వరకు ఏడు కి.మీలలో లెక్కలేనన్ని గోతులు పడ్డాయి. వీటిలో దారి వెతుక్కుంటూ వెళుతున్నారు. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వాహనం వస్తే పక్కకు తొలగలేని పరిస్థితి. ఉదయగిరి నియోజకవర్గ ప్రజలతో పాటు ప్రకాశం జిల్లాలోని పలు ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగుతుంటాయి. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు వేగంగా వెళ్లే పరిస్థితులు లేవు.

డబుల్ రోడ్డులోనూ..

కలిగిరి నుంచి పాతనాపురం వరకు 11 కిలోమీటర్ల మేరకు గత తెదేపా ప్రభుత్వ హయాంలో డబుల్ రోడ్డు నిర్మించారు. ఇది కూడా గుంతలమయంగా తయారైంది. వేగంగా వచ్చే వాహనాలు గోతుల్లో దిగి ప్రమాదాలకు గురవుతున్నాయి.

తప్పిన ముప్పు

రహదారిపై కావలియడవల్లి కూడలి సమీపంలో ఇటీవల వంతెన కూలిపోయింది. ఆ సమయంలో వాహనాలు ఏవీ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం రాకపోకలు సాగుతున్నాయి.

రూ.14 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

అమానుల్లా, ఏఈ, ర.భ

అత్యవసర పనులకు రూ.50 లక్షలతో అంచనాలు సిద్ధం చేశాం. అనుమతి రాగానే చేస్తాం. హసనాపురం నుంచి పాతనాపురం వరకు విస్తరణకు రూ.14 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే చేస్తాం. కూలిన వంతెన స్థానంలో రూ.40 లక్షలతో కొత్తది నిర్మిస్తాం.

EENADU e Classifieds JOBS

లేడీ / జెంట్స్ సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. నెల్లూరు టౌన్‌లో పనిచేయుటకు 12Hr డ్యూటీ, జీతం: 13,000/-. Contact ✆ 72880 04466-77

నెల్లూరులోని ప్రముఖ ఐరన్ & సిమెంట్ షాపు నందు మార్కెటింగ్ చేయుటకు Sales Executive కావలెను. Ph: 99488 33991, 93925 09999

సురక్ష హాస్పిటల్, కందుకూరు నందు పని చేయుటకు కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. ఇది కేవలం ఆడవాళ్ళకు మాత్రమే. సంప్రదించండి. Contact ✆ 93476 41395

కోవూరు పడుగుపాడు, ITC కంపెనీ నందు పనిచేయుటకు గోడౌన్ ఇన్‌ఛార్జ్ & DOST వెహికల్ డ్రైవర్ కావలెను. Contact Number ✆ 63033 84090

ప్రముఖ కాస్మోటిక్స్ & హెర్బల్ ప్రొడక్ట్స్ మార్కెటింగ్ కొరకు అనుభవం కలిగిన మార్కెటింగ్ మేనేజర్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ & లేడీ కౌన్సిలర్స్ కావలెను.7989048868

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు వార్డెన్స్, క్యాంపస్ హాస్టల్ A.Oగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 18000/- వరకు ఇవ్వబడును. ఉచిత భోజనము వసతి కల్పించబడును. విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు:22 సం॥ల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్ర. ✆: 92487 33320.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

నెల్లూరు జిల్లా ముత్తుకూరు, ప్రముఖ పవర్ ప్లాంట్‌లో పర్మనెంట్‌గా పని చేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్/ కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. డ్యూటీ : 8 గంటలు, Qlf: Inter, ఎత్తు: 5'9". జీతం: 22,800. ఉచిత వసతి కలదు. 98492 40858, 77999 27624.

ఫీల్డ్ సూపర్‌వైజర్స్ కావలెను. సెక్యూరిటీ ఏజెన్సీ నందు పనిచేయుటకు. వ॥30-40, ఏదైనా డిగ్రీ, టూవీలర్ మస్ట్, (రిటైర్డ్ ఆర్మీ) జీ॥ 15-20 వేలు. ✆ 72880 04466

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు...
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
వివరాలకు..
నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.
B&W : రూ. 600
Colour : రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

స్త్రీశక్తి పథకంలో సమస్యలు పరిష్కరించాలి

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: స్త్రీశక్తి పథకంలో ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. నెల్లూరు ఆర్టీసీ బస్టాండ్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జిలానీబాషా, రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య, ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రమణ్యం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీని నియమించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. స్త్రీశక్తి పథకం అమలు తర్వాత పెరిగిన రద్దీకి అనుగుణంగా నాలుగు వేల బస్సులు కొనుగోలు చేసి, 11 వేల మంది సిబ్బందిని నియమించాలని వివరించారు. విద్యుత్తు బస్సులు ఆర్టీసీ ద్వారానే నిర్వహించాలని కోరారు. ఆర్టీసీ పెట్రోల్ బంకుల్లో అవినీతి జరిగిన చోట సంబంధిత వ్యక్తులపైనే చర్యలు తీసుకుని, అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అయ్యప్పరెడ్డి, శివకుమార్, నాగేంద్ర, కృష్ణారావు, అజంఖాన్, రాజేశ్వరి, వినీల, సుజాత, దశరథ, శ్రీనివాసులురెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలకు చిరునామా వైకాపా: నారాయణ

నెల్లూరు (నగరపాలకసంస్థ) : దిగజారుడు రాజకీయాలకు వైకాపా చిరునామా అని, తెదేపాలోకి వచ్చిన కార్పొరేటర్లను తీసుకెళ్లి తాడేపల్లిలో కండువాలు వేయించిన ఘనత ఆ పార్టీకే దక్కుతుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆరోపించారు. ఆదివారం నగరంలోని 16, 15, 8, 6, 5 డివిజన్లలో ఎన్టీఆర్ సుజల స్రవంతి నీటి ప్లాంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీరు మారకుంటే భవిష్యత్తులో 11 సీట్లు కూడా రావన్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో నెల్లూరులో ఇప్పటికే 15 ఎన్టీఆర్ సుజల స్రవంతి నీటి ప్లాంట్లను ప్రారంభించామన్నారు. కాలువల పునరుద్ధరణ నేపథ్యంలో ఆక్రమణల తొలగింపునకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నెల్లూరు నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ వైవో నందన్, నెల్లూరు మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ అనూరాధ, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు విజేత, తెదేపా నగర అధ్యక్షులు మామిడాల మధు పాల్గొన్నారు.

మహిళలకు నీటి డబ్బా ఇస్తున్న మంత్రి నారాయణ

క్రికెట్‌లో విజేతగా నిలిచిన విడవలూరు జట్టుతో డీఈవో

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఇందుకూరుపేట, విడవలూరు, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపోటములు సహజమని డీఈవో బాలాజీరావు అన్నారు. పల్లిపాడు డైట్ కళాశాలలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి క్రికెట్, త్రోబాల్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు పని ఒత్తిడిని తగ్గిస్తాయన్నారు. క్రికెట్‌లో కావలి జట్టుపై విడవలూరు విజేతగా నిలవగా.. త్రోబాల్‌లో నెల్లూరు జట్టుపై నెల్లూరు రూరల్ జట్టు గెలుపొందాయి. విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని అధికారులు పేర్కొన్నారు. విడవలూరు జట్టును ఎంఈవో వెంకటేశ్వర్లు అభినందించారు.

రాయితీపై ఇంజిన్లు.. ఉపాధికి మార్గాలు

న్యూస్‌టుడే, తోటపల్లిగూడూరు, ఇందుకూరుపేట

మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోంది... ఉపాధి అవకాశాలు పెంచి వారు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం అమలు చేస్తోంది. వారికి మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రాయితీపై పరికరాలు అందజేస్తోంది. సముద్రంలో చేపల వేట సాగించే మత్స్యకారులకు రాయితీపై వేట సామగ్రిని ప్రభుత్వం అందజేస్తోంది. ఇప్పటికే అనేక మంది సద్వినియోగం చేసుకోగా అర్హులకు మంజూరు చేసేందుకు అధికారులు అవకాశం కల్పిస్తున్నారు.

వివరాలు ఇలా..

తీర ప్రాంత మండలాలు : 9
మత్స్యకార గ్రామాలు : 74
జనాభా : 83 వేలు

గత పాలనలో ఇవ్వకపోవడంతో..

గతంలో తెదేపా ప్రభుత్వం హయాంలో మత్స్యకారులకు ఇంజిన్లు, వలలు, తెప్పలను రాయితీపై ఇచ్చేవారు. వైకాపా పాలనలో అది కాస్త అటకెక్కింది. అప్పట్లో పీఎంఎంఎస్‌వై ఉన్నా ఇంజిన్, తెప్ప, వల కలిపి ఒకే యూనిట్‌గా ఇచ్చారు. దీని ధర రూ.5 లక్షలు ఉండగా రాయితీ పోను మత్స్యకారులు రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉండడంతో పెద్దగా ఆసక్తి చూపలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పథకంలో వల, ఇంజిన్, బోటు వేర్వేరు యూనిట్లుగా ఇచ్చేలా కేంద్రంతో మాట్లాడింది. మత్స్యశాఖ అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది.

మత్స్యకారులకు చేయూతనిస్తున్న ప్రభుత్వం

● మత్స్యకారశాఖ **జేడీ డాక్టర్ శాంతి** మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన మేరకు దరఖాస్తుదారుల నుంచి డీడీలు స్వీకరించినట్లు చెప్పారు. అవసరమైన వారు ఉంటే ప్రతిపాదనలు పంపి అనుమతి తీసుకొని మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

జిల్లాకు 159 యూనిట్ల కేటాయింపు

రాయితీపై ఇంజిన్, వల జీపీఎస్ వంటివి పొందాలంటే సొంత బోటుతో పాటు లైసెన్సు మనుగడలో ఉండాలి. ఒక్కో ఇంజిన్ ఖరీదు రూ.83,300 కాగా రాయితీ 40 శాతం పోగా రూ.33,200 ఉంటుంది. మత్స్యకారుడి వాటా రూ.49,980 డీడీ రూపంలో అందజేయాలి. జిల్లాకు 159 యూనిట్లు కేటాయించారు. కోవూరు, బోగోలు, అల్లూరు మండలాల పరిధిలో 91 ఇంజిన్లు ఇచ్చారు. తోటపల్లిగూడూరు, ముత్తుకూరు పరిధిలో 25, ఇందుకూరుపేట, విడవలూరు మండలాల్లో 30 ఇంజిన్లు మంజూరుకు దరఖాస్తులు వచ్చాయి. మరో 60 యూనిట్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆర్టీసీ స్థలాలు

ఆదాయానికి అడుగులు

న్యూస్‌టుడే, పొదలకూరు రూరల్

ఆదాయాన్ని పెంచుకునే దిశగా ఆర్టీసీ దృష్టి సారించింది. జిల్లావ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాలను వ్యాపార కార్యకలాపాలకు లీజు(ఒప్పంద) ప్రాతిపదికన ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఇచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఆయా డిపోల పరిధిలోని బస్టాండ్ల వద్ద ఖాళీ స్థలాలను షాపింగ్ మాల్స్, దుకాణాలకు కొన్నిచోట్ల భవన సముదాయాల నిర్మాణాలకు అనుమతించారు. తద్వారా ప్రతి నెలా అదనపు ఆదాయం సమకూరుతోంది.

జిల్లా పరిధిలో ఆర్టీసీ స్థలాల వివరాలు.. (చదరపు గజాల్లో)

నియోజకవర్గం	స్థలం	విస్తీర్ణం
కోవూరు	3	8381
సర్వేపల్లి	4	30994
ఆత్మకూరు	2	5955
కావలి	3	6112

పొదలకూరు ఆర్టీసీ ప్రాంగణంలో నిర్మించిన దుకాణ సముదాయం

పదిహేనేళ్లు లీజుకిచ్చేలా..

జిల్లా పరిధిలోని 14 చోట్ల 52,765 గజాల స్థలాన్ని 15 ఏళ్ల పాటు లీజుకివ్వనున్నారు. టెండర్ల ప్రక్రియ ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. త్వరలో వేలం నిర్వహించి అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. లీజు ప్రాతిపదికన దక్కించుకున్న వారు వాటిని అభివృద్ధి చేసుకుని నిబంధనల మేరకు వ్యాపార కార్యకలాపాలు సాగించాలి.

(c) eenadu

పోటీలో మెరిసి.. విజేతలుగా నిలిచి

బహుమతులు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ ఆది

కావలి, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయి కోఆపరేటివ్ జూనియర్ కళాశాలలో జేసీఐ ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. సమకాలీన అంశాలపై క్విజ్ నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. సూరగాని చందుకుమార్, ఉప్పాల ఇందు, వి.అమృతవల్లి విజేతలుగా నిలిచారు. వీరికి కళాశాల డైరెక్టర్ బి.ఆది బహుమతులు అందజేశారు.

కావలి

•కావలి • ఉదయగిరి • కందుకూరు

ప్రజలకు అసౌకర్యం కల్పిస్తే చర్యలు

బిట్రగుంట: రాత్రిళ్లు అనవసరంగా బైకులపై తిరుగుతూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని బిట్రగుంట గ్రామీణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పాపారావు హెచ్చరించారు. ఆదివారం రాత్రి స్థానిక [illegible] ప్రజలతో కలిసి [illegible] కూడళ్లలో [illegible] పరిశీలించారు. [illegible] కులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో స్పందించారు. క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాలు [illegible] రాత్రిళ్లు ప్రత్యేక నిఘా పెడతామన్నారు. చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు ఉంటాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: అంకభూపాలపురంలోని ప్రాథమిక నూతన పాఠశాల సమీపంలో రహదారి పక్కనే వ్యర్థాలు వేయడంతో పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. **- వెంకటేశ్వర్లు, స్థానికుడు**

సమాధానం: పరిశుభ్రత సిబ్బందికి తెలిపి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకుంటాం. **- గణేష్‌బాబు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, వలేటివారిపాలెం**

? పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్‌లో నాగేంద్ర స్వామి పుట్టదగ్గరకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం ఎక్కువై దారంతా అధ్వానంగా ఉంది. **- రాజేశ్, స్థానికుడు**

✓ వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. **- బషీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కావలి**

? కావలి పట్టణంలోని పాతూరు ప్రాంతంలో కొన్నాళ్లుగా మురుగు కాలువలో పూడిక తీయడం లేదు. దీంతో దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉంది. **- కేశవరావు, స్థానికుడు**

✓ పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయిస్తాం. **- బషీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

? స్థానిక అంకమ్మ గుడి వీధి నుంచి యాదవ బజారుకు వెళ్లే మార్గంలో విద్యుత్తు తీగలకు చిల్లచెట్లు తగులుతున్నాయి. **- భానుప్రసాద్**

✓ సిబ్బందికి తెలిపి సరిచేయిస్తాం. **- మధుబాబు, విద్యుత్తు ఏఈ - న్యూస్‌టుడే, గుడ్లూరు**

రక్తనిధి.. నిండుకుంది


రక్త నిల్వలు లేవని చూపుతున్న బోర్డు

కావలి, న్యూస్‌టుడే: అన్ని వేళల్లో రక్తం లభించే కావలి రెడ్‌క్రాస్ కేంద్రంలో ఆదివారం రక్త నిల్వలు ఖాళీ అయ్యాయి. ఈ సేకరణ, నిల్వ కేంద్రంలో 1000 యూనిట్ల వరకు నిల్వ చేసేందుకు వసతులు ఉన్నాయి. నెలకు 300 యూనిట్ల వరకు ఇక్కడ నుంచి ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులకు తరలిస్తుంటారు. రక్తదాతలకు పెట్టింది పేరుగా ఉన్న కావలిలో ఏ గ్రూప్ రక్తం చూసినా అందుబాటులో లేదని చెబుతుండడం గమనార్హం. ప్రస్తుతం విషజ్వరాలు ప్రబలడం కారణంగా రక్తకణాల సంఖ్య విపరీతంగా తగ్గిపోతుండటంతో అందరూ ఇబ్బందులకు పరుగులు తీస్తున్నారని దీంతో సమస్య నెలకొన్నట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. రోగి సంబంధీకులు ఎవరైనా రక్తం ఇస్తేనే సరఫరా చేయగలమంటూ నిల్వకేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. రెడ్‌క్రాస్ కావలి బ్రాంచి ఛైర్మన్ డి.రవిప్రకాశ్ మాట్లాడుతూ కొరత ఏర్పడడం వాస్తవమేనన్నారు. ఎప్పటికప్పుడు సర్దుబాటు చేస్తున్నామన్నారు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొందని ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చూపేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు.

రాబడి లేని సాగు.. ప్రత్యామ్నాయం వైపు చూపు

కందుకూరు(గ్రామీణం), న్యూస్‌టుడే: కందుకూరు నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు 113 చెరువులు జలకళను సంతరించుకున్నాయి. కానీ పంటలు వేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. వాతావరణ మార్పులతో దిగుబడులు లేకపోవడం, పండించిన పంటకు గిట్టుబాటు ధర రాకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో ఏటా వరి, ఉద్యాన, వాణిజ్య పంటల సాగు తగ్గిపోతోంది. అన్నదాతలు జామాయిల్, సరుగుడు వంటి సామాజిక వనాల సాగువైపు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది రబీలో 43,395 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేస్తే ఈ ఏడాది ఇప్పటి వరకు 16వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఖరీఫ్‌లో వరి ధాన్యం బస్తా(75కిలోలు) రూ.1300లకు మించి మిల్లర్లు కొనుగోలు చేయక పోవటంతో రైతులకు నష్టాలే మిగిలాయి. గత ఏడాది మిరప, పత్తి, మినుము పంటలు వేసిన వారి పరిస్థితి ఇలాగే ఉంది.

కొండముదుసుపాలెంలో మిరపకు బదులుగా వేసిన జామాయిల్

నియోజకవర్గంలో రబీ సాగు(ఎకరాల్లో)

పంట	గత ఏడాది	ఈ ఏడాది (ఇప్పటివరకు)
వరి	12300	4700
మినుము	1650	170
సెనగ	1050	235
పొగాకు	16175	11050
పత్తి	7670	1060
మిరప	1490	230
ఇతర	2205	120

పూర్తిస్థాయిలో నిండినా..

ఈసారి రాళ్లపాడు జలాశయం పూర్తిస్థాయిలో నిండినా వరి, పత్తి సాగుకు వెనకడుగు వేస్తున్నారు. ఒక్క రాళ్లపాడు జలాశయం కిందే గతంలో 13 వేల ఎకరాల్లో వరి, ఆరువేల ఎకరాలకుపైగా పత్తిసాగు అయ్యేది. డివిజన్‌లో ఇప్పటి వరకు 4700 ఎకరాల్లోనే వరి వేశారు. కందుకూరు మండలంలో ప్రధాన చెరువులు నిండినా సాగు విస్తీర్ణంలో అధిక భాగం జామాయిల్, సవక వేశారు. కొండముదుసుపాలెం సమీపంలో సుమారు 200 ఎకరాల్లో కేవలం మిరపసాగు చేసిన రైతులు ప్రస్తుతం సామాజిక వనాలను అభివృద్ధి చేసుకున్నారు.

ధరల వ్యత్యాసంతో..

కె.వి.శేషారెడ్డి, ఏడీఏ, కందుకూరు

వరి,పత్తి సాగుకు కొంత సమయం ఉంది. ప్రస్తుతం మినుము, సెనగ ధరలు తక్కువగా ఉన్నాయి. రైతులు ఎక్కువగా ఏ పంటలకు ధరలు ఉంటే అటువైపు మొగ్గు చూపుతున్నారు. నియోజకవర్గంలో జామాయిల్ అధికంగా సాగులో ఉంది.

మిరప పంట తగ్గింది

జ్యోతి, ఉద్యానశాఖ అధికారిణి

డివిజన్‌లో మిరప పంట వేసేందుకు రైతులు ఆసక్తి చూపటం లేదు. రెండేళ్లుగా ధరలు లేకపోవడంతో కందుకూరు డివిజన్‌లో 230 ఎకరాల్లోనే మిరప వేశారు.

ధ్యాన శక్తి అద్భుతం

వింజమూరు, న్యూస్‌టుడే: ధ్యానం ద్వారా అద్భుతమైన శక్తి సామర్థ్యాలు వస్తాయని కేరళ మాస్టర్ సీమా సుభాష్ అన్నారు. స్థానిక వేద వ్యాస పత్రీజీ ధ్యాన మందిరంలో ఆదివారం యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతకు ముందు ఎమ్మెల్యే కాకర్ల నల్ల గొండ్ల గిరిజనకాలనీలో అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన నంబూరు అంజయ్య కుటుంబానికి రూ. 25 వేల నగదు అందజేశారు.

హాజరైన ధ్యానులు

పరివర్తనతోనే సమాజంలో మార్పు

హాజరైన మహిళలు

వింజమూరు, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని కాపాడే బాధ్యత హిందువులదేనని ఆర్ఎస్ఎస్ నెల్లూరు విభాగ్ సభ్యుడు బాలు సుబ్బారావు అన్నారు. ఆదివారం స్థానిక వేదగాయత్రి ఆలయంలో యజ్ఞం, హోమం తదితర కార్యక్రమాలు జరిగాయి. అనంతరం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచ పరివర్తన పేరుతో సమాజంలో మార్పునకు సంఘ్ కృషి చేస్తోందన్నారు. ఇందుకూరుపేట స్వామీజీ రామాయణం మహేష్ ఆనందస్వామీజీ, భాజపా నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

దగదర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన దగదర్తిలోని దుర్గాభవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస తిరువెంబావై ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం రామ లింగేశ్వరుడికి విశేష ద్రవ్యాలతో అభిషేకం, హోమం నిర్వహించారు. దుర్గాభవాని అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు విశేషంగా హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా గంధ మహోత్సవం

దగదర్తి, న్యూస్‌టుడే: మండలంలోని రంగసముద్రంలో మహబూబ్, పజల్ అలం దర్గా గంధ మహోత్సవ కార్యక్రమాన్ని మత పెద్దలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామస్థులందరూ పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు పేదలకు అన్నదానం చేశారు. తెదేపా నాయకుడు మాలేపాటి లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగుతోనే వెలుగు

కావలి, న్యూస్‌టుడే: తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు అందరూ పాటుపడాలని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి అన్నారు. ఇటీవల రాష్ట్ర తెలుగు సాంస్కృతిక అకాడమి ఛైర్మన్‌గా బాధ్యత స్వీకరించిన కావలి ఆర్డీ విల్సన్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విల్సన్ నాయకత్వంలో అకాడమి మరింత బలపడాలన్నారు. కావలిలోని కరోనేషన్ క్లబ్‌లో తెలుగు మ్యూజియం వంటిది ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. దాతల సహకారంతో తెలుగుగ్రంథాలు, వంద కంప్యూటర్లతో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారికి అక్కరకొచ్చేలా కృషిచేస్తామన్నారు. మార్కెట్ ఛైర్మన్ పోతుగంటి అలేఖ్య, భాజపా నాయకులు బ్రహ్మానందం, భరత్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విల్సన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి తదితరులు

బీదతో తెదేపా పటిష్ఠం

కావలి, న్యూస్‌టుడే: నెల్లూరు పార్లమెంట్ తెదేపా అధ్యక్షుడిగా బీద రవిచంద్ర ఎన్నిక కావడంపై రాష్ట్ర పౌరసరఫరాలసంస్థ డైరెక్టర్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, మార్కెట్‌ఛైర్మన్ అలేఖ్య, నాయకులు మన్నవ రవిచంద్ర, శ్రీహరినాయుడు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి కావలి ఎంపీ ట్రంకురోడ్డు ఎన్టీఆర్ కూడలి వద్ద బాణసంచా పేల్చడంతోపాటు మిఠాయిలు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీద సారథ్యంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. నాయకులు మంచాల ప్రసాద్, జనిగర్ల మనోహర్, బొంతా శ్రీనివాసులు యాదవ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ ఇలా.. మురుగు పారేదెలా?

అల్లూరుపేటలోని శివాలయం వీధిలో మురుగునీటి కాలువ మట్టితో పూడిపోయింది. దీనికితోడు దానిపై నిర్మాణాలు చేపట్టడంతో కుంచించుకుపోతోంది. మురుగు నీరు ముందుకు కదలడం లేదని స్థానికులు చెబుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ తెలిపారు. **- న్యూస్‌టుడే, అల్లూరు**

నిరుపయోగంగా చేతిపంపు

మండలంలోని పోకూరు గ్రామంలో చేతిపంపు ఏడాదిన్నర నుంచి పనిచేయకపోయినా పట్టించుకునే వారే లేరని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయంలో, ఎంపీడీవోకు పలుమార్లు అర్జీలు ఇచ్చినా స్పందించడం లేదని, ఇప్పటికైనా మండలస్థాయి అధికారులైనా స్పందించి బోరు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వలేటివారిపాలెం**

మొదలైన క్రిస్మస్ సందడి

మండలంలోని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబవుతున్నాయి. అలాగే కాలనీల్లో పలువురు స్టార్‌లను విద్యుత్తు దీపాలతో ఏర్పాటు చేస్తున్నారు. సీతారామపురం, మారంరెడ్డిపల్లిలోని ఆర్సీఎం చర్చిలవద్ద క్రిబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, సీతారామపురం**

నీటి నిల్వ.. తప్పని తంటా

పట్టణంలోని పామూరు రోడ్డు నుంచి ప్రశాంతి కాలనీ వెళ్లే దారిలో పెద్ద కాలువలో మురుగు నీరు పారుదల కావడం లేదు. తటాకంలా మారింది. రోజుల తరబడి నీటి నిల్వ ఉండటంతోదుర్వాసన వస్తుండటమే కాక దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం**

ఒరిగిన స్తంభాలు

కందుకూరు విక్కిరాలపేట రహదారిలో విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయాయి. దూరం నుంచి చూస్తే ఒకదానికి మరొకటి సపోర్టుగా ఉన్నట్లు కనిపిస్తున్నాయి. దగ్గరకు వెళ్లి చూస్తే అలా ఉండదు. స్తంభాలను సరిచేయాలని అటుగా వెళ్లే వాహనదారులు, రైతులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గుడ్లూరు**



ముమ్మరంగా వరి నాట్లు.. కూలీలకు డిమాండ్

బిట్రగుంట : మండల పరిధిలో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో కూలీల డిమాండ్ ఊహించని విధంగా పెరిగింది. సీజన్ ప్రారంభంలో ఎకరాలో వరినాట్లు రూ.2500కు వేసేవారు. అటువంటిది బెంగాల్, బిహార్ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున్న కూలీలు వచ్చినా ఏ మాత్రం డిమాండ్ తగ్గడం లేదు. ఏకంగా ఎకరాకు నాట్లు వేసేందుకు రూ.7500 వరకు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొంతమంది యజమానులే ఆ భారం భరించలేక కూలీలుగా మారితే, మరికొందరు యంత్రాల సాయంతో వరినాట్లు వేసుకుంటున్నారు. రోజురోజుకు కూలీల డిమాండ్ పెరుగుతుండడంతో ఈసారి కూడా వరిసాగు మరింత భారమైందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంపచెట్ల తొలగింపు

కలిగిరి, న్యూస్‌టుడే: ప్రధాన రహదారులకు ఇరువైపులా రోడ్డుపైకి విస్తరించిన కంపచెట్ల తొలగింపు పనులు మండలంలో ముమ్మరంగా జరుగుతున్నాయి. గంగిరెడ్డిపాలెం, 14వ మైలు-అనంతపురం, పాతనాపురం-కలిగిరి తదితర రహదారులపై ఉన్న ముళ్లచెట్ల తొలగింపునకు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధుల్లోనే ఆయా మార్గాల్లో ఉన్న గోతులను పూడుస్తామని ర.భ ఏఈ అహ్మద్ బాషా తెలిపారు. **బిట్రగుంట:** బోగోలు బృందావనం శివారు ప్రాంతాల్లో 11కెవీ విద్యుత్తు స్తంభాలపైకి ఎగబాకిన పిచ్చిమొక్కల తీగలను అధికారులు తొలగించారు. ఆదివారం ఈనాడులో 'ఇలా వదిలేస్తే కష్టాలే' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి డిస్కం ఏఈ జడరాయ స్పందించారు. సిబ్బందితో సమస్య పరిష్కరించారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

సీతారామపురం: వివరాలు పరిశీలిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి

దుత్తలూరు, కందుకూరు పట్టణం, దగదర్తి, సీతారామపురం, బిట్రగుంట, న్యూస్‌టుడే : రాష్ట్రాన్ని పోలియో రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. దుత్తలూరులోని పీహెచ్‌సీలో ఆదివారం జరిగిన పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని కోవూరురోడ్డు అర్బన్ ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు చుక్కలు వేశారు. మున్సిపల్ కమిషనర్ కె.అనూష, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ తదితరులు పాల్గొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు, వైద్య,ఆరోగ్యసిబ్బందికి పూర్తిస్థాయిలో కార్యక్రమంపై అవగాహన ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి సూచించారు. సీతారామపురం మండలంలోని బసినేనిపల్లి, సీతారామపురం బెస్త కాలనీ, బస్టాండ్‌సెంటర్‌లోని కేంద్రాలను తనిఖీచేశారు. దగదర్తి పీహెచ్‌సీ పరిధిలో 98 శాతం పల్స్ పోలియో లక్ష్యాన్ని సాధించినట్లు డాక్టర్ అఖిల తెలిపారు. బోగోలులో కోవూరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రామకృష్ణ పర్యవేక్షణలో కళాభారతి సాంస్కృతిక సంఘం బాధ్యులు డాక్టర్ ఆనందసాగర్ ఆర్టీసీ బస్సుల్లో, రైలుగేటు వద్ద ఇరువైపులా చిన్న వయసు ఉన్న పిల్లలకు చుక్కలు వేశారు. **ఉదయగిరి, వింజమూరు, కొండాపురం:** గండిపాళెం పీహెచ్‌సీ పరిధిలో 99 శాతం, కొండాపురం మండలంలో 95 శాతం వింజమూరులో 98 శాతం చుక్కలు వేసినట్లు వైద్యులు తెలిపారు.

చిన్నారికి చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

పోలియోచుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

ఆరోగ్య కేంద్రాలకు నిధుల మంజూరు

నూకవరంలో అసంపూర్తిగా భవనం

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాలను చేపట్టారు. గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా కొన్ని, నిధులు చాలక పోవడంతో మరికొన్ని చోట్ల మధ్యలోనే పనులు ఆపేశారు. అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా పట్టించుకోకపోవడంతో భవనాలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. కొన్ని చోట్ల పగుళ్లు వచ్చి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వీటిని పూర్తి చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలోని స్లాబ్ అంతకంటే ఎక్కువగా నిర్మాణాలు జరిగిన 91 విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలకు రూ.14.68 కోట్లు నిధులు విడుదల చేసింది. కందుకూరు మండలంలోని కొండికందుకూరు రూ.4.30 లక్షలు, మాచవరం రూ.14 లక్షలు, మహాదేవపురం రూ.12.50 లక్షలు, జీ మేకపాడు రూ.12.50 లక్షలు, గుడ్లూరు మండలంలోని పరకొండపాడు రూ.22.50 లక్షలు, పోట్లూరు రూ.5.60 లక్షలు, చేవూరు రూ.21.20 లక్షలు, చిమిడితిపాడు రూ.5.70 లక్షలు, భీమవరం1 రూ.8 లక్షలు, భీమవరం2 రూ.8 లక్షలు, కరేడు3 రూ.15 లక్షలు, పెద్దపట్టపుపాలెం రూ.20.50 లక్షలు, ఉలవపాడు1 రూ.12 లక్షలు, అంకభూపాలపురం రూ.19.30 లక్షలు, చుండి రూ.15.30 లక్షలు, నూకవరం రూ.14.30 లక్షలు, పోకూరు రూ.15.30 లక్షలు, పోలినేనిపాలెం రూ.15.30 లక్షలు, శామీరపాలెం రూ.15.30లక్షల చొప్పున మంజూరు అయినట్టు అధికారులు తెలిపారు. వలేటివారిపాలెం మండల ఏఈ మాట్లాడుతూ మండలంలో అసంపూర్తిగా ఉన్న 6 హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయని త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు.

ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి

ఉదయగిరి, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలంటూ ఆదివారం కృష్ణారెడ్డిపల్లిలో రైతు సంఘం ఆధ్వర్యంలో కూలీలు ఆందోళన చేశారు. జిల్లా రైతు సంఘం నాయకుడు వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఖర్చు చేసేలా చట్టం తీసుకురావటం దారుణమన్నారు. మార్పుల వల్ల పథకం నీరుగారే ప్రమాదముందని, భవిష్యత్తులో కూలీలకు పని లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

పేదలకు దుస్తుల పంపిణీ

ఉలవపాడు, గుడ్లూరు, న్యూస్‌టుడే: మోచర్లకు చెందిన పీపుల్స్ హెల్పింగ్ హ్యాండ్స్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో వీరేపల్లి ఎస్టీ కాలనీలో ఆదివారం పేదలకు దుస్తులు అందజేశారు. నిర్వాహకులు టి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.
సీతారామపురం : సీతారామపురం అరుంధతీవాడలో క్రిస్మస్ సందర్భంగా ఆదివారం క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.9999, రెండోబహుమతి రూ.5555గా అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను స్థానిక ఆర్సీఎం చర్చి ఫాదర్ వరప్రసాద్, సర్పంచి భాగ్యకుమారి ప్రారంభించారు.

మాజీ సీఎం పుట్టిన రోజు వేడుకలు

కందుకూరు పట్టణం,న్యూస్‌టుడే: మాజీ సీఎం, వైకాపా అధినేత జగన్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పామూరురోడ్డులోని వైకాపా కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ భారీ కేకును కోసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఆరోవార్డులో పట్టణ అధ్యక్షుడు షేక్‌రఫి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. **ఉదయగిరి, బిట్రగుంట, కలిగిరి, సీతారామపురం:** ఉదయగిరి, కలిగిరిలో వైకాపా నాయకులు నిర్వహించిన కార్యక్రమాలు, రక్తదాన శిబిరంలో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. బిట్రగుంట మండలం నాగులవరం, సీతారామపురంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు.

చీరలు పంపిణీ చేస్తున్న వైకాపా ఇన్‌ఛార్జి బుర్రామధుసూదన్, రఫీ

నాల్గో తరగతి ఉద్యోగుల ప్లాట్లకు మోక్షం

రిజిస్ట్రేషన్లకు తొలగిన ఇబ్బందులు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: దశాబ్దానికి పైగా నిషేధిత జాబితాలో ఉన్న జనార్దనస్వామి మాన్యం భూములకు కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు పరిష్కారం చూపింది. ముఖ్యంగా నాలుగోతరగతి ఉద్యోగుల(ఎన్జీవో) ప్లాట్లకు క్రయ విక్రయాలు జరిగినా రిజిస్ట్రేషన్లు జరగక కేవలం అగ్రిమెంట్లకే పరిమితమయ్యేవి. తాజా ప్రభుత్వ నిర్ణయంతో లైన్ క్లియర్ అయింది. దీంతో సదరు భూ యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిషేధిత జాబితా నుంచి విముక్తి

పట్టణంలోని ఉప్పుచెరువు, జనార్దనకాలనీ ప్రాంతాల్లో జనార్దనస్వామి ఆలయానికి సంబంధించి సర్వేనంబరు 297లో సుమారు 620 ఎకరాలు భూములున్నాయి. వీటిలో దాదాపు 330 ఎకరాలు ప్రభుత్వ, ప్రజా అవసరాల కోసం వినియోగించారు. అందులో 15 ఎకరాలు 1993లో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ విలువ ప్రకారం ప్రభుత్వం నుంచి కొనుగోలు చేసి లేఅవుట్ వేశారు. అందులో అనేకమంది ఉద్యోగులు ప్లాట్లు కొనుగోలు చేశారు. అయితే సదరు భూములు రెవెన్యూ రికార్డుల్లో ఆర్ఎస్ఆర్ దాఖలా దేవస్థానం భూములుగా నమోదై ఉండటంతో 2012లో వాటిని 22ఏ జాబితాలో చేర్చారు. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్యమంత్రిచంద్రబాబుతోపాటు రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెండు నెలల క్రితం ఆ భూములను 22ఏ నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే తహసీల్దారు కార్యాలయం నుంచి ఎన్‌వోసీ తీసుకురావాలని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో చెప్పడంతో సమస్య మరలా మొదటికొచ్చింది.

❖ దీంతో ఆ ప్రాంతవాసులు మరోసారి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో.. తహసీల్దారుతో మాట్లాడి ఆ సర్వే.నం.లోని 15 ఎకరాలను 297-1డి గా సబ్‌డివిజన్ చేయించారు. ఆ మేరకు నిరభ్యంతర పత్రాన్ని ఈనెల 19న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపడంతో రిజిస్ట్రేషన్లకు లైన్ క్లియర్ అయింది. నాలుగో తరగతి ఉద్యోగుల ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఎలాంటి ఆటంకం లేదని సబ్‌రిజిస్ట్రార్ రామకోటయ్య తెలిపారు.

జిల్లా విద్యార్థులకు బహుమతులు

నెల్లూరు (విద్యుత్తు): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన నెల్లూరు విద్యార్థులకు ఆదివారం తిరుపతిలోని విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ సీఎండీ శివశంకర్, జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ రాఘవేంద్రం, ఈఈ బాలచంద్ర పాల్గొన్నారు.

విద్యుత్తు వారోత్సవాల్లో బహుమతులు అందుకుంటున్న జిల్లా విద్యార్థులు

లైసెన్సు పునరుద్ధరణకు నేటితో గడువు ముగింపు

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: 2025-27 పంట కాలాలకు సంబంధించి పొగాకు బ్యారన్ల లైసెన్సుల పునరుద్ధరణకు సోమవారంతో గడువు ముగియనున్నట్లు కందుకూరు-2 వేలం కేంద్ర నిర్వహణాధికారి వి.శివకుమార్ తెలిపారు. తప్పనిసరిగా పొగాకు సాగు చేసే రైతులు.. లైసెన్స్‌లు పొందాలన్నారు.

Mathematics Day Greetings
మెథడ్స్ అంటే ఫలితాల ప్రభంజనం - ఉద్యోగాల ఉప్పెన
DSC - 2025 లో మెథడ్స్ విజయ దుందుభి
S.G.T. పోస్ట్‌లో 50% above
S.G.T: K.Dinesh - 94.41 State Topper
S.A(T): S.Anjani Kumari - 83.70 (Guntur) State Topper
S.A(E): M.Babu - 84.70 (State Topper)
ప్రతి S.A.లలో 40% above
S.A (M): B.Bharghavi - 83.17 (State Topper)
S.A.(PS): N.B. Penchalamma - 77.17 (State Topper)
S.A.(SS): M.Babu - 85.01 (State Topper)
V. లక్ష్మీ - 83.08 (ప్రకాశం) (State Topper)
M.Navya - 3 Posts SGT, SA (Maths),
Sk Karishma - 2 Posts SA (Social) సాధించారు.
విద్యార్థినీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు మ్యాథమ్యాటిక్స్ డే శుభాకాంక్షలు.
Class Batch & Exam Batch Starts 22-12-2025 @ 4 PM
మెథడ్స్ కాంపిటేటివ్ అకాడమి
కావలి, నెల్లూరు - 92474 45194, 62818 69053

(c) eenadu

క్రిస్మస్ కానుకల పంపిణీ

అనుమసముద్రంపేట, ఏఎస్‌పేట, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, న్యూస్‌టుడే: ఏఎస్‌పేట మండలం కావలియడవల్లిలో క్రిస్మస్ పండగను పురస్కరించుకుని తెదేపా ఆధ్వర్యంలో పేదలకు కానుకలు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు మాల్యాద్రినాయుడు సొంత నిధులతో ఎస్సీ కాలనీలోని 70 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. గత 30 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా అందజేస్తున్నట్లు తెలిపారు. సర్పంచి ముప్పూరి దనమ్మ, ఉప సర్పంచు అన్నపూర్ణమ్మ, పంచాయతీ సభ్యులు మోహన్‌రావు, మాజీ సర్పంచి విమలమ్మ తదితరులు పాల్గొన్నారు. ● ఏఎస్‌పేట మండలం రాజవోలులోని విద్యమ్మ మెమోరియల్ చర్చిలో నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ● ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల పరిధిలో పలు ప్రార్థనా మందిరాల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరిగాయి.

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

స్తంభాలను సరిచేశారు

మనుబోలు, న్యూస్‌టుడే: మండలంలోని కొమ్మలపూడి ఆర్అండ్‌బీ రోడ్డు సమీపంలో విద్యుత్తు స్తంభాలు పక్కకు వాలి ప్రమాదకరంగా ఉన్నాయని 'ఈనాడు'లో 'స్తంభాలు సరిచేయరూ' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఐదేళ్ల కిందట కురిసిన వర్షాలకు వరద ప్రవాహంతో పక్కకు ఒరిగి తీగలు ఆధారంగా నిలబడి ప్రమాదకరంగా ఉన్నాయి. డిస్కం ఏఈ అనిల్‌కుమార్ స్పందించి సిబ్బందితో సరిచేయించారు. సమస్య పరిష్కారమవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు :79950 67034, సర్వేపల్లి :80085 73980, ఆత్మకూరు: 8008573949

? **సమస్య:** పొదలకూరులో వీధిలైట్లు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. ప్రధాన రహదారి వెంట ఒక్క లైటు కూడా వెలగడం లేదు. – వెంకటేశ్వర్లు, పొదలకూరు

✓ **సమాధానం:** పంచాయతీ సిబ్బందికి చెబుతాం. – నరసింహారావు, ఎంపీడీవో

? తోటపల్లిగూడూరు మండలం పాపిరెడ్డిపాలెం కలుజు వద్ద కాలువలో గుర్రపుడెక్క నిండిపోయింది. – చంద్ర

✓ తొలగిస్తాం–అరీ, నీటిపారుదలశాఖ ఏఈ

? తోటపల్లిగూడూరు మండలం పేడూరులో వర్షాలు రోడ్లు పక్కనే నిలుస్తున్నాయి. –స్థానికుడు

✓ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. –లక్ష్మీనారాయణ, డి.ఎంపీడీవో

? మర్రిపాడు మండలం, ముంచలూరు ఎస్సీ కాలనీలో పలు వీధుల్లో వీధి దీపాలు వెలగడం లేదు. – వెంకటయ్య, స్థానికుడు

✓ నూతన దీపాలు ఏర్పాటు చేస్తాం. – నరసింహనాయుడు, పంచాయతీ కార్యదర్శి

? సంగం మండలం కోలగట్లలో నాగవరపమ్మ ఆలయానికి వెళ్లే మార్గం వర్షాలకు దెబ్బతింది. –సురేంద్ర, కోలగట్ల

✓ బాగు చేస్తాం.–మల్లికార్జున, పీఆర్ ఏఈ

? పొదలకూరు రూరల్ పరిధిలోని చాటగొట్లలో గుంతలు ఏర్పడ్డాయి. – ఫయాజ్

✓ సరిచేస్తాం. – శ్రీనివాసులు, ర.భ ఏఈ

? అనంతసాగరం మండలం ఉప్పలపాడు చెరువు కట్ట వద్ద గల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.–పెంచలయ్య, గ్రామస్థుడు

✓ చెట్లను తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. – శ్రీనివాసులురెడ్డి, ఎస్సై, సోమశిల

ఇళ్ల నిర్మాణాల పేరుతో దోచుకున్న వైకాపా నాయకులు

దామరమడుగులో వృద్ధురాలితో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: దామరమడుగు గ్రామ అభివృద్ధికి రూ.1.5 కోట్లు కేటాయించామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. దామరమడుగులో 2015 నుంచి ఉన్న ఇళ్ల పట్టాల సమస్యను తెలియజేయగానే వెంటనే పరిష్కరించి అధికారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 18 మందికి ఇళ్ల పట్టాలిచ్చామని పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గంలో పేదల కాలనీలో వైకాపా గుత్తేదారులు దోచుకుని పేదలకు ఇళ్లు కట్టివ్వడం లేదని ధ్వజమెత్తారు. వైకాపా పాలనలో దోపిడీ ఎక్కువగా జరిగిందని విమర్శించారు. త్వరలోనే సరైన పరిష్కారం ఉంటుందని హామీ ఇచ్చారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

జిల్లా స్థాయిలో సంగం విద్యార్థుల ప్రతిభ

బహుమతి, చెక్కు అందుకుంటున్న విద్యార్థులు

సంగం, న్యూస్‌టుడే: దుత్తలూరులో సీడ్స్ సంస్థ ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో సంగం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖుష్బుకౌర్, రీతుకౌర్, వెంకటప్రణీక్ష, యోగిత, హరిత నాలుగో స్థానంలో నిలిచి, నగదు బహుమతులతో పాటు జ్ఞాపిక, పతకాలు పొందారు. సీడ్స్ సంస్థ వ్యవస్థాపకులు చంద్రమౌళీశ్వరరెడ్డి వారిని అభినందించారు.

ఎస్పీ ఆదేశాలతో ఆకస్మిక తనిఖీ

సంగం, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాలతో శనివారం అర్ధరాత్రి నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై పోలీసులు నాకాబందీ నిర్వహించి, పలు వాహనాలను తనిఖీ చేశారు. సంగం సీఐ శ్రీనివాసులు రెడ్డి, ఎస్సై రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అవస్థల దారులు.. వాహనదారుల పాట్లు

గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా మారడంతో వాహనచోదకులు, ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. కోవూరు, సర్వేపల్లి, వెంకటగిరి నియోజకవర్గాల్లో అనుసంధాన రోడ్లు, అంతర్గత మార్గాలు మరమ్మతులు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. అడుగడుగునా భారీ గుంతలతో ప్రజలు సతమతమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రోడ్ల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించి పల్లెరోడ్లను బాగుచేసి తమ అవస్థలు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కోవూరు, మనుబోలు, తోటపల్లిగూడూరు, సైదాపురం

గోతులమయంగా బండేపల్లి రోడ్డు

వరిగొండ వద్ద రోడ్డుపై భారీ గుంత

● కోవూరు నియోజకవర్గ పరిధిలో అనుసంధాన రోడ్లు బాగా లేవు. విడవలూరు మండలంలో గత పాలనలో రోడ్లు గుంతలు పడి రూపు కోల్పోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రధాన మార్గాల్లో రోడ్లు వేశారు. దమ్ము వ్యక్తులు వెళుతున్న ట్రాక్టర్లతో రోడ్లు కొద్ది రోజులకే మళ్లీ గుంతలు పడి కోల్పోతున్నాయి. కోవూరు, బుచ్చి, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి.

● వెంకటాచలం, పొదలకూరు మండలాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ముత్తుకూరు మండల పరిధిలో భారీ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. నిత్యం వేలాది మంది ఉద్యోగులు, కూలీలు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఉన్న బీసీ కాలనీ రోడ్డు, మామిడిపూడి, గోపాలపురం వెళ్లే రోడ్లు కొన్నేళ్లుగా అధ్వానంగా ఉన్నాయి. ఆటోలు, ద్విచక్రవాహనాలు గుంతల్లో పడుతూ లేస్తూ వెళుతున్నాయి. మనుబోలు, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు మండలాల పరిధిలోని తీర ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు ఛిద్రమయ్యాయి. విధిలేని పరిస్థితుల్లో ఈ మార్గం మీదుగానే ప్రయాణించాల్సి వస్తోందని వృద్ధులు, గర్భిణులు చెబుతున్నారు.

● సైదాపురం మండలంలో 31 గ్రామ పంచాయతీలున్నాయి. దాదాపు 13 మైనర్ గ్రామాలున్నాయి. పలు గ్రామాలకు వెళ్లేందుకు తారు రోడ్లు కాదు కనీసం మట్టి రోడ్లు సరిగా లేవు. కలువాయి, రాపూరు మండలాల పరిధిలో రోడ్లు బాగు చేయాలని పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో రోడ్లు దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సైదాపురం: జాఫలాపురం వెళ్లే మట్టి రోడ్డు

ముగిసిన శిబిరం

రాపూరు, న్యూస్‌టుడే: మండలంలోని నవాబుపేటలో వారం క్రితం ప్రారంభమైన ఎన్ఎస్ఎస్ శిబిరం ఆదివారంతో ముగిసింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.హనుమంతయ్య మాట్లాడుతూ చదువుతోపాటు సామాజిక సేవా కార్యక్రమాలను విద్యార్థి దశనుంచే అలవరచుకోవాలని సూచించారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట న్యూస్‌టుడే: ఇందుకూరుపేట మండలం పల్లిపాడులోని గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. కోఆర్డినేటర్ ప్రసాద్ రెడ్డి, కమిటీ సభ్యుడు రవీంద్రా రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పట్టు వస్త్రాలు, ఆశ్రమ స్థల దాత పొనకా కనకమ్మకు పట్టు, నూలు వస్త్రాలు సమర్పించారు. విద్యార్థులకు గాంధీ జీవిత విశేషాలను వివరించారు.

చుక్కల మందుకు చక్కని స్పందన

కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు, వెంకటగిరి బృందం, న్యూస్‌టుడే: పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 2.94 లక్షల మంది బాలలకు పోలియో చుక్కల మందు వేయాలని లక్ష్యం పెట్టుకున్నామని జిల్లా కుష్ఠువ్యాధి నివారణ విభాగం అధికారి ఖాదర్‌వలీ ఆదివారం తెలిపారు. సంగంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన తరువాత విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 26లక్షల మందికి పైగా జనాభా ఉండగా, వారిలో 2.94లక్షల మంది సున్నా నుంచి అయిదేళ్లలోపు బాలలున్నట్లు గుర్తించామన్నారు. వారికి 2,396 పల్స్ పోలియో కేంద్రాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వంటి రద్దీ ప్రాంతాల్లో 85 ట్రాన్సిట్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. హైరిస్క్ ప్రాంతాలుగా ఉన్న 403 ప్రదేశాలకు 82 వాహనాల ద్వారా సిబ్బంది వెళ్లి పోలియో చుక్కలు వేస్తారన్నారు. తొలి రోజు చుక్కలు వేయించని బాలల ఇళ్లకు సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది వెళ్లి వేస్తారన్నారు. ● పొదలకూరు పంచాయతీ బస్టాండులో ఏర్పాటు చేసిన కేంద్రంలో జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ పిల్లలకు చుక్కల మందు వేశారు. ● పొదలకూరులో పల్స్ పోలియో కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు డాక్టరు రామేశ్వర ప్రసాద్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ● ఏఎస్‌పేట, మనుబోలు, చేజర్ల, ఇందుకూరుపేట, ముత్తుకూరు, రాపూరు, సైదాపురం, కలువాయి, విడవలూరు, కొడవలూరు, కోవూరు, బుచ్చి, తోటపల్లిగూడూరు ఆరోగ్య కేంద్రాలు, వివిధ ప్రాంతాల్లో పోలియో కేంద్రాల్లో చిన్నారులకు చుక్కల మందు వేశారు. అనంతసాగరంలో జిల్లా ఎన్‌సీడీఆర్బీఎస్‌కే అధికారి డాక్టర్ యశ్వంత్ పరిశీలించారు.

చేజర్ల : పొలాల వద్ద చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది

జిల్లాలోనే కొనసాగించాలని హోమం

కలువాయి, సైదాపురం, రాపూరు, న్యూస్‌టుడే: కలువాయిని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని సంకల్పంతో ఐకాస సభ్యులు ఆదివారం కలువాయమ్మ దేవస్థానం ఆవరణలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కలువాయి, సైదాపురం, రాపూరులో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. మూడు మండలాలను నెల్లూరులోనే ఉంచుతామని ప్రభుత్వం అధికారిక ప్రకటన చేసే వరకు ఆందోళన కొనసాగుతుందని ఐకాస నాయకులు ప్రకటించారు.

కలువాయి: హోమంలో పాల్గొన్న ఐకాస సభ్యులు

ప్రయాణికులు కూర్చునేదెలా

ఆత్మకూరు మండలం వింజమూరు మార్గంలోని నబ్బీనగరంలో బస్సు షెల్టర్ అధ్వానంగా ఉంది. సమీపంలోని షాపుల వారు సైకిళ్లు, ఇతర సామగ్రి అక్కడ పెడుతున్నారు. దీంతో ప్రయాణికులు కూర్చునేందుకు వీలులేకుండా ఉంది. రోడ్డు పైనే నిల్చొని బస్సుల కోసం ఎదురు చూస్తున్నారు. బస్సు షెల్టర్ ప్రయాణికులకు సేవలందించేలా తీర్చిదిద్దాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఆత్మకూరు

విద్యుత్తు తీగలు సరిచేయరూ..

కోవూరు మండలం ఇనమడుగు పరిధిలోని వేగూరు కాలువ వద్ద విద్యుత్తు తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా ఉన్నాయి. స్థానిక విద్యుత్తు సిబ్బందికి చెప్పినా పట్టించుకోకపోవడంతో రైతులు వాటిని కర్రలతో లాగి పెట్టుకుంటున్నారు. డిస్కం అధికారులు పరిశీలించి పొలాల్లో కిందకు వాలిన తీగలను సరిచేయాలని విన్నవిస్తున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

సంపద కేంద్రం చెంతనే చెత్త

కోవూరు మండలం మోడేగుంటలో రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వం చెత్త సంపద కేంద్రం నిర్మించినా వినియోగంలో లేదు. స్థానికులు చెత్త, వ్యర్థాలు రోడ్ల వెంట వేయడంతో పేరుకుపోతున్నాయి. డిప్యూటీ ఎంపీడీవో, ఇతర అధికారులు రోజుకు రెండు గ్రామాలు సందర్శించి, స్థానికులకు అవగాహన కల్పించాల్సి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా డీడీవో, డీఎల్‌పీవో పరిశీలించి వినియోగంలోకి తేవాలని పలువురు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, కోవూరు

తాగునీరు కలుషితం

ఏఎస్‌పేటలోని ప్రధాన వీధిలో నగారఖానా ప్రాంతం నుంచి పీర్లచావిడి వరకు ఉన్న ప్రాంతంలో కుళాయిల్లో తాగునీరు కలుషితమై మురుగునీరు వస్తోంది. తెలియక తాగిన వారు ఎక్కువ మంది వ్యాధుల బారిన పడుతున్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లామని అయినా స్పందన లేదని స్థానికులు వాపోతున్నారు. రెండు రోజులుగా సరఫరా అయిన మురుగు నీటిని సీసాలో పట్టగా దుర్వాసన వస్తోంది. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, అనుమసముద్రంపేట

దుర్గంధమయం

విడవలూరు ప్రధాన రహదారిలో పైపులు లీకేజీతో తాగునీరు వృథాగా పోతున్నాయి. నెల రోజులుగా నీరు రోడ్డుపై ప్రవహిస్తూ బురదమయంగా మారింది. సమీపంలో ఎంపీడీవో, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం అధికారులు రాకపోకలు సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు పరిశీలించి మరమ్మతులు చేసి నీటి వృథా అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, విడవలూరు

ప్రకృతి వ్యవసాయం.. దిగుబడులు అధికం

విడవలూరు, న్యూస్‌టుడే: ఏడు పదుల వయసులోనూ సేంద్రియ వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధిస్తున్నారు.. అలగానిపాడుకు చెందిన ఇందుపూరు దామోదర్‌రెడ్డి. ఎమ్మెస్సీ చదివినా వ్యవసాయంపై ఆసక్తితో 20 ఏళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఎడగారులో ఎకరాకు మూడు పుట్లు దిగుబడులు సాధించారు. రసాయన ఎరువులు, యూరియాతో మూడు పుట్లు వస్తుంటే.. ఆయన సేంద్రియ పద్ధతిలో అంతే దిగుబడులు సాధించి లాభాలు సాధిస్తున్నారు. ఎరువుల వినియోగం పరిహరించి, పెట్టుబడులను గణనీయంగా తగ్గించి సాగు చేస్తున్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులను సొంతగా మార్కెట్ చేస్తున్నారు. 25 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తుండగా, వయోభారంతో ప్రస్తుతం అయిదెకరాల్లో మాత్రమే పండిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతోపాటు, ఉత్పత్తులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరుతున్నారు. సాగుదారులు దీనిపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని వ్యవసాయం యాంత్రీకరణపై రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఆయన చెబుతున్నారు.

బియ్యం ప్యాకెట్లతో రైతు దామోదర్‌రెడ్డి

పొగమంచు.. ప్రయాణించాలంటే ఇక్కట్లు

పొదలకూరు రూరల్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా పొగ మంచుతో రాకపోకల సమయంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. శీతాకాలంలో కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో రోడ్డుపై దట్టమైన పొగ మంచు కురుస్తోంది. రాపూరు- నెల్లూరు మార్గంలో మలుపులు అధికంగా ఉండడంతో కొందరు వాహనాలు ఆపేసి తగ్గిన తరువాత వెళుతున్నారు. మర్రిపల్లి, డేగపూడి, దుగ్గుంట, చాటగొట్ల, పాలిచెర్లపాడు, ఆమంచర్ల వద్ద ఉన్న మలుపులు ప్రమాదాలకు సూచికగా మారాయి. వాహనదారులు పగలే లైట్లు వేసుకొని ప్రయాణిస్తున్నప్పటికీ అవతలి వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ● ఎంవీఐ బాబు మాట్లాడుతూ.. మంచు కురిసే వేళలో వాహనాలను నడపకుండా ఉండమే మంచిదన్నారు. వేకువ జామున ప్రయాణించేవారు మలుపులు, కూడళ్ల వద్ద రాకపోకల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేస్తున్నామని పేర్కొన్నారు.

పొదలకూరు- సంగం రహదారిని కమ్మేసిన పొగ మంచు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

● తెల్లవారుజామున 4 నుంచి 7 గంటల వరకు అత్యవసరమైతే తప్ప వాహనాలు నడపొద్దు.
● వాహనాలకు వెయ్యి సామర్థ్యం గల దీపాలను వేసుకొని ముందుకు సాగాలి. ● తెల్లవారుజామున ఎట్టి పరిస్థితుల్లో రోడ్డు పక్కన వాహనాలను నిలపరాదు.● 30 కి.మీ మించి వేగంగా వెళ్లరాదు. ● వాహనానికి ముందు, వెనుక రేడియం స్టిక్కర్లు మూడు మీటర్ల మేరకు అతికించాలి.

విజేతలకు బహుమతుల అందజేత

విడవలూరు, న్యూస్‌టుడే: నెల్లూరులో వేదిక్ మ్యాథ్స్, అబాకస్ వావిళ్ల ప్రగతి ప్రైవేట్ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాము ఆదివారం తెలిపారు. బహుమతులందుకున్న విద్యార్థులు కుసుమార్, కుషిత, శరణ్యశ్రీ జూనియర్ లెవెల్-3లో ప్రథమ, జగదీశ్.. జూనియర్ లెవల్-5లో ప్రథమ బహుమతి సాధించారు. 14న కోవూరు నియోజకవర్గ స్థాయిలో ప్రైవేటు పాఠశాలలకు జరిగిన పోటీల్లో నందిని (షాట్‌పుట్), వెంకట తనూజ(లాంగ్‌జంప్), అఖిల్ రన్నింగ్ రేస్‌లో ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వారిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

బహుమతులందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపల్

సీఐటీయూ మహాసభలు విజయవంతం చేయండి

కోవూరు, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు మోహన్‌రావు పేర్కొన్నారు. కోవూరు పట్టణ పరిధిలోని ఇనమడుగు కూడలిలో ప్రచారం నిర్వహించి పలువురికి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పులిగొండ్ల శ్రీరాములు, గండవరపు శేషయ్య, బుజ్జియ్య, అఫ్రోజ్, పెద్దబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి పెద్దపీట

వెంకటాచలం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో గిరిజనుల సంక్షేమానికి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పెద్దపీట వేస్తూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వ్యవసాయ సహకార సంఘ ఛైర్మన్ రాధాకృష్ణమ నాయుడు స్పష్టం చేశారు. గోమతి పాఠశాల వ్యవస్థాపకురాలు అరుణ ఆధ్వర్యంలో కసుమూరు తిప్పమీద గిరిజన కాలనీ, కురిచెర్లపాడు గిరిజన కాలనీల్లోని పలువురు మహిళలకు చీరలతో పాటు, చిన్నారులకు భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు

సంగం, ఆత్మకూరు, ఏఎస్‌పేట, పొదలకూరు, ముత్తుకూరు, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు కోవూరు, సర్వేపల్లి, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో ఆదివారం స్థానిక నాయకుల ఆధ్వర్యంలో జరిగాయి. పొదలకూరు పంచాయతీ బస్టాండులో కేకు కోసి కార్యకర్తలకు పంచారు. నర్సారెడ్డికాలనీలోని వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు భోజనాలు పంపిణీ చేశారు. సంగంలో కేకు కోసి నినాదాలుచేశారు. ఆత్మకూరు జిల్లా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ముత్తుకూరు, ఏఎస్‌పేట, హసనాపురం, గుడిపాడులో జరిగిన కార్యక్రమాల్లో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలుతున్నా పట్టదా

కోవూరు మండలం పడుగుపాడు ప్రధాన రోడ్డు నుంచి ధాత్రీ హోమ్స్‌కు వెళ్లే మార్గంలో చెత్త కొన్ని రోజులుగా పేరుకుపోయింది. సుమారు అయిదు వందలకు పైగా నివాస గృహాలు ఉన్న ప్రాంతంలో పది రోజులుగా రోడ్డు మార్గంలో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. కొన్ని రోజుల నుంచి చెత్త తొలగించకపోవడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్యం మెరుగుపరచాలని పలువురు కోరుతున్నారు.– న్యూస్‌టుడే, కోవూరు

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు

సంగం, న్యూస్‌టుడే: సంగం కొండ కూడలిలో శనివారం రాత్రి జరిగిన దాడి ఘటనపై సంగం పోలీసులు ఇరువర్గాలకు చెందిన పలువురిపై ఆదివారం కేసునమోదు చేశారు. సంగం చెక్‌పోస్టు ఎస్సీ కాలనీకి చెందిన ఏడుగురితో పాటు తన సోదరుడు, సోదరిపై దాడి చేశారంటూ సాయికృష్ణ ఫిర్యాదు చేశారు. తమపై అయిదుగురు దాడి చేశారని ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు సంగం ఎస్సై రాజేశ్ తెలిపారు.

పెంచలకోన మార్గం.. గుంతలమయం

చేజర్ల, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్య క్షేత్రమైన పెంచలకోనకు వెళ్లే రహదారి గోతులతో అధ్వానంగా మారి భక్తులకు పరీక్షగా మారింది. ఆదూరుపల్లి నుంచి 32 కి.మీ నిడివి ఉన్న ఈ మార్గంలో 15 కి.మీ రోడ్డంతా గుంతలమయంగా ఉండడంతో కొన్ని నెలలుగా వాహనదారులు నరకయాతన పడుతున్నారు. మే నెలలో బ్రహ్మోత్సవాలకు ముందు చేసిన మరమ్మతుల పనులు నాసిరక సామగ్రితో చేయగా వర్షాలకు సమస్య తీవ్రమైందని గ్రామస్థులు చెబుతున్నారు. చేజర్ల, కలువాయి, రాపూరు మండలాల్లో గ్రామాల మీదుగా ఉన్న ఈ మార్గం బాగు చేయించాలని కోరుతూ స్థానిక యువత ఇటీవల ప్రధానమంత్రి కార్యాలయం గ్రీవెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశారు. వారు రాష్ట్ర ర.భ శాఖకు వినతి బదిలీ చేశారు. ఈ మార్గంలో పెంచలకోనకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణంలో ఇటుగా రావాలంటే హడలిపోతున్నారు. ఎక్కువ మంది వాహనాలు ధ్వంసమవడంతో పాటు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, రాపూరు, కలువాయి మార్గాల్లో 30 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్డు పునర్నిర్మాణానికి అంచనాలు వేసి నిధుల మంజూరు కోరుతూ ప్రభుత్వానికి పంపినట్లు ఏఈ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

తెలుగు గంగ కాలువ వంతెన సమీపంలో రోడ్డు దుస్థితి

అడ్డొస్తే.. యమపురికే..! జాతీయ రహదారిపై పశువులు గుంపులుగా రావడంతో ప్రమాదాలు

న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం), అనంతసాగరం

జాతీయ రహదారులపై ఆవులు, గేదెల సంచారంతో నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. కూలీపనులు, వ్యవసాయ పనులు పెరగడం.. ఇతర కారణాల వల్ల కొందరు పశుపోషకుల్లో మార్పు వచ్చింది. పాకల్లో జాగ్రత్తగా సంరక్షించాల్సిన పశువులను రోడ్లపైకి వదిలేస్తున్నారు. అవి గుంపులుగా సంచరిస్తూ.. అడ్డంగా పడుకుంటూ.. రహదారిపై పరుగులు తీస్తుండగా వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల పరిధిలో రెండు జాతీయ రహదారులున్నాయి. నెల్లూరు- ముంబయి జాతీయ రహదారి జిల్లాలో 110 కిలోమీటర్లు ఉండగా, మరొకటి 565 జాతీయ రహదారి మర్రిపాడు, అనంతసాగరం మండలాల్లో 70 కిలోమీటర్లు ఉంది. నిత్యం ఏదో ఒక చోట ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు గాని, ఇటు యజమానులు గాని పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రంగా మారింది. నివారించాలంటే ఇటు పోలీసులు, అటు మండల అధికారులు సంయుక్తంగా ముందుకు కదలాలి. గ్రామాల్లో పశువుల యజమానులతో మాట్లాడి రోడ్లపై వదలకుండా హెచ్చరిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయి. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

● సెప్టెంబర్ 5న అనంతసాగరం మండలం చిలకలమర్రి వద్ద జాతీయ రహదారిపై వెంకటయ్య (55) ద్విచక్రవాహనంపై వెళుతూ గేదెను ఢీకొని మృతిచెందారు.
● నవంబరు 30న రాజుపాలెం సమీపంలో ద్విచక్రవాహనంపై వెళుతున్న యువకులు గేదెను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి.
● ఈ నెల 15న మండల పరిధిలో వేర్వేరు చోట్ల ద్విచక్రవాహనాలపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు గేదెలను ఢీకొట్టి మృత్యువాత పడ్డారు.
● 18న చుంచులూరు సమీపంలో కారు గేదెను ఢీకొట్టి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. ప్రతిరోజూ మండల పరిధిలో ఎక్కడో ఒక చోట గేదెలతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

రాత్రి సమయంలో రహదారిపై సంచరిస్తున్న గేదెలు

CHANGE OF NAME

I, **MARDAN ABDUL RASOOL** father of **SHAIK MARDAN MUKHEED,** Army No. **15703146X** Rank-HAV, Residing at Karatampadu (Vi) , Atmakur (M), SPSR Nellore Dt, AP-524307. In my army records my son name wrongly mentioned is **SHAIK MARDAN MUKHEED** (Old name), I have changed my son name as **SHAIK ABDUL MUKHEED**(New name). I further declare that my son both names are one and the same person.

మహారాజశ్రీ కోవూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో
E.P. No. 17 / 2025
O.S.No. 135 / 2023
Challagundla Venkateswarlu .. D.Hr.
Vs
Atluri Vani .. J.Dr.
0.21 R.66 Notice
J.Dr. సాకిన్ :
Atluri Vani W/o Suresh, Dammarapalem, Near Saibaba Temple, Kovur (V & M) SPSR, Nellore (Dist.)
పై నెంబరు E.P. లోని డిక్రీ హోల్డరు తన డిక్రీ బాకీని వసూలు నిమిత్తం దాఖలు చేసిన E.P.లో మీకు నోటీసు నిమిత్తం తే: 09-01-2026దికి వాయిదా వేసియున్నారు. ఆ దినం మీరు పై కోర్టుకు ఉదయం 10.30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనేది. లేనియెడల మీ పరోక్షమున కేసు తీర్మానించెదరు.
పి.సునీల్‌కుమార్, D.Hr. వకీలు.

(c) eenadu

నెల్లూరు
•నెల్లూరు •నెల్లూరు గ్రామీణం

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

నెల్లూరు(నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: రాబోయే సర్పంచి, కార్పొరేటర్ ఎన్నికల్లో అన్నిస్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి సీఎం చంద్రబాబునాయుడుకు బహుమతిగా ఇస్తామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో ఆమంచర్ల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు రత్నమ్మ, అప్పయకండ్రిగ వైకాపా నాయకుడు గుడి మస్తానయ్య, స్వర్ణజ్యోతినగర్, సేవాజ్యోతినగర్, మట్టెంపాడు, మన్నవరప్పాడు గ్రామాల నాయకులు వైకాపాకు రాజీనామా చేసి తెదేపాలో చేరారు. 31వ డివిజన్‌కు చెందిన వైకాపా నాయకులు విజయరామిరెడ్డి, చెన్నారెడ్డి జనార్దన్‌రెడ్డి, హరిచంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, మురళి, మహేష్ తదితరులు చేరారు. కార్యక్రమంలో నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, జలదంకి సుధాకర్ పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేస్తున్న అధికారులు

పోలియో చుక్కలు వేస్తున్న ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

నెల్లూరు(నగరపాలకసంస్థ, టౌన్), న్యూస్‌టుడే: అయిదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ వి.సుజాత తెలిపారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండు, వీఆర్సీ సెంటరు, ముత్తుకూరు బస్టాండు, గాంధీ బొమ్మ, పుట్టా ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ నెల్లూరు ప్రెసిడెంట్ ఉదయభాస్కర్, సెక్రటరీ కొండపల్లి రవీంద్ర, రోటరీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ కొండా శేఖర్‌రెడ్డి, కొట్టే మధుసూదన్‌రావు, కేవీ సుబ్బారెడ్డి, కేవీ సుబ్రహ్మణ్యం, మోహన్‌సాయి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గాంధీబొమ్మ సెంటరులో కమిషనర్ నందన్‌తో కలిసి చిన్నారులకు ఇన్‌ఛార్జి మేయర్ పి.రూప్‌కుమార్‌యాదవ్ పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి తదితరులు పాల్గొన్నారు. కమిషనర్ నందన్ ప్రభుత్వ సర్వజన ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలోని మెటర్నిటీ విభాగంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

వైకుంఠనాథుడి అవతారంలో రంగనాథుడు

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం పగల్‌పత్తు ఉత్సవం వేడుకగా సాగింది. వైకుంఠనాథుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఊరేగింపు జరిగింది. ఉభయకర్తగా వెంకటేశ్వర్లు వ్యవహరించగా, కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కాలువలు అధ్వానం
మురుగుమయం

న్యూస్‌టుడే, నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట)

నగరపాలక సంస్థ పరిధిలోని పలు కాలనీల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. చిన్న వర్షానికే మురుగునీరు రోడ్లపైకి వస్తోంది. రాకపోకల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఉన్న వాటిలో పూడిక తీయక ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతుంది. దుర్గంధంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

నగరం 149.02 కి.మీలలో విస్తరించింది. 54 డివిజన్లు, తొమ్మిది లక్షల మందికి పైగా నివసిస్తున్నారు. నివాస ప్రాంతాల్లోని ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు వెళ్లేందుకు 800 కి.మీల వరకు కాలువలు ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఏళ్ల క్రితం నిర్మించినవి కావడంతో ఛిద్రమయ్యాయి. గోడలు కూలిపోయి పూర్తిగా పూడుకుపోయాయి. మరికొన్ని కాలనీల్లో వీటి జాడేలేదు. దీంతో చిన్నపాటి వర్షమొచ్చినా మురుగునీరు వీధులు, రోడ్లపైనే పారుతోంది. ఇళ్ల మధ్య నిల్వ ఉంటోంది. ఫలితంగా భరించలేని దుర్గంధం, దోమల బెడదతో ప్రజలు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు.

పుట్ట వీధిలో ఇదీ మురుగు కాలువ పరిస్థితి

శివారు ప్రాంతాల్లో..

శివారు ప్రాంతాలు, కొత్తగా విస్తరిస్తున్న కాలనీల్లో కాలువల కొరత తీవ్రంగా ఉంది. ఆయా ప్రాంతాల నుంచి నగరపాలక సంస్థకు ఏటా రూ.కోట్లలో పన్నులు వసూలవుతున్నాయి. వీటిని వసూలుచేస్తున్న అధికారులు వసతుల కల్పనపై దృష్టి పెట్టడం లేదని ప్రజలు ఆరోపణలు గుప్పిస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

బాలాజీనగర్‌లోని పలు ప్రాంతాల్లో మురుగుకాలువల నిర్మాణాలు దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల నీరు పోయేందుకు వీల్లేక నిరుపయోగంగా మారాయి. ● స్టోన్‌హౌస్‌పేట రేబాల వీధిలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించినా మురుగు ప్రవాహం సాగడం లేదు. ● రామ్మూర్తి నగర్ ఒకటో వీధిలో పూర్తిగా లేవు. ● పుట్ట వీధిలో రోడ్డుకు ఇరువైపులా కాలువల గోడలు పలు చోట్ల దెబ్బతిన్నాయి. ● సిరి గార్డెన్స్, బాబానగర్, పార్థసారథి నగర్ తదితర ప్రాంతాల్లో దుర్భరంగా ఉన్నాయి.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని ఆదివారం నగరానికి వచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్యకు సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ మీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి సైదా హాఫీజ్, సురేష్, షాహినా శ్రీనివాసులు పాల్గొన్నారు.

NOTICE Date: 19.12.2025

To,
1. Basireddy Thrivendra S/o. Basireddy Thirumala Reddy, R/o. Devarajusuryapally, Seethrampuram, Ayyavaripalem, Nellore District. A.P.

Sir,
Please take notice that my clients, LAXMI INFRAA DEVELOPERS, Rep. by its proprietor Smt. Dasari Rajya Lakshmi W/o. Sammeta Subrahmanyam and 14 others have filed the Writ Petition No. 10490 of 2023, challenging orders issued by The Addl. Collector, Revenue, FAC, Ranga Reddy District in Case No. F1/4886/2017, Dated: 24-08-2022. The said Writ Petition came up for admission and hearing on 17-12-2025 and the Hon'ble High Court for the State of Telangana, at Hyderabad was pleased to permit me to serve the notice through paper publication in Telugu Daily News Paper. Therefore, it is hereby informed that, you are directed by Hon'ble High Court to appear on 31-12-2025 either in person or through an advocate on the next date of hearing, failing which the Hon'ble Court shall proceed with the case basing on records available.
Hence, this notice
Sd/- KARNAM RAMESH
Counsel for the Petitioner High Court of T.S
H.No: 2-2-1109/BK/MIG 17 & 18
Nandanavanam Colony, Bathukammakunta, Bagh Amberpet, Amberpet, Hydeabad- 500013
Ph: 9849295468

NOTICE Date: 19.12.2025

To,
1. Basireddy Thrivendra S/o. Basireddy Thirumala Reddy, R/o. Devarajusuryapally, Seethrampuram, Ayyavaripalem, Nellore District. A.P.

Sir,
Please take notice that my clients, LAXMI INFRAA DEVELOPERS, Rep. by its proprietor Smt. Dasari Rajya Lakshmi W/o. Sammeta Subrahmanyam and 14 others have filed the Writ Petition No. 10486 of 2023, challenging orders issued by The Revenue Divisional Officer, Chevella Division, Ranga Reddy District in ORC No. L/3093/2007, Dated: 07-01-2008. The said Writ Petition came up for admission and hearing on 17-12-2025 and the Hon'ble High Court for the State of Telangana, at Hyderabad was pleased to permit me to serve the notice through paper publication in Telugu Daily News Paper. Therefore, I am hereby informed that, you are directed by Hon'ble High Court to appear on 31-12-2025 either in person or through an advocate on the next date of hearing, failing which the Hon'ble Court shall proceed with the case basing on records available.
Hence, this notice
Sd/- KARNAM RAMESH
Counsel for the Petitioner High Court of T.S
H.No: 2-2-1109/BK/MIG 17 & 18
Nandanavanam Colony, Bathukammakunta, Bagh Amberpet, Amberpet, Hydeabad- 500013
Ph: 9849295468

ఆటలు.. పాటలు.. కేరింతలు

ఆటలాడుతున్న మహిళలు

నెల్లూరు (నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే : నగరవాసులు ఆదివారం సాయంత్రం సరదాగా గడిపారు. ఆడిపాడారు. మైపాడు గేటు కూడలిలో స్మార్ట్‌స్ట్రీట్ బజారు ప్రాంతంలో 'హ్యాపీ సండే' కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులు, పెద్దలు పాటలకు నృత్యాలు చేసి ఆనందంగా ఆడిపాడారు. దీంతో ఈప్రాంతం ఈలలతో మార్మోగింది. ఈ సందర్భంగా నగర ఇన్‌ఛార్జి మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఆదివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఇలా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నందన్, సిటీప్లానర్ హిమబిందు, ఆరోగ్యాధికారి డాక్టర్ కనకాద్రి, టీపీఆర్వో వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి బియ్యం వితరణ

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలిసిన శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయానికి నెల్లూరు చిన్నబజారుకు చెందిన శివ భక్తబృందం బియ్యం వితరణగా అందజేసింది. ఆదివారం రూ.20 వేలు విలువైన బియ్యం బస్తాలను ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు శ్రీ ఆనందవల్లీదేవి సమేత శ్రీ పరశురామేశ్వరస్వామి దర్శన ఏర్పాట్లు చేసి ఆలయం తరపున తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

TO-LET
Semifurnished, A/c Commercial Space for rent @ near Venkateswara Temple, Magunta Layout 2400 sft on 3rd floor
Cont: 6302967553

పట్టు స్పర్శ
చేనేత వస్త్రాల గొప్పతనం!
100% చేనేత ఉత్పత్తులతో
ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో వారి
వెడ్డింగ్, క్రిస్మస్ & సంక్రాంతి పండుగల సందర్భంగా
అతిపెద్ద & అత్యంత విశ్వసనీయ ప్రదర్శన అమ్మకం
తేది: 20 నుంచి 25 డిసెంబర్ 2025 (4 రోజులు మాత్రమే) ఉ. 10.30 నుంచి రా. 8.00 వరకు
వేదిక: PVR కళ్యాణ మండపం, అన్నమయ్య సర్కిల్ దగ్గర, మిని బైపాస్ రోడ్, నెల్లూరు.
బనారసి ప్రత్యేక సేకరణ | పశ్చిమ బెంగాల్ బోటిక్ వస్తువులు | టస్సార్ కాంత & ప్రింటెడ్ | చందేరి / మహేశ్వరి / కోటా రాజ్‌కోట్ పటోలా | పోచంపల్లి ఇక్కత్ | బెంగళూరు ప్యూర్ క్రేప్ సిల్క్స్ | బీహార్ & జార్ఖండ్ టస్సార్ వస్త్రాల మెటీరియల్స్ | గద్వాల్ | కలంకారి | కాంచీపురం | పైతాని చీరలు | వెంకటగిరి / ఉప్పాడ జమ్దాని చీరలు మరియు కాటన్ దుస్తులు మెటీరియల్స్ | బెడ్ లినెన్లు | ఆభరణాలు
సంప్రదించండి: 95735 53337 లేదా 9000346337 Info@indiansilkgallery.com

రోడ్డుపైనే లారీలు.. ప్రమాదాలు జరగవా!

జాతీయ రహదారిపై రోడ్డుపైనే లారీలు పార్కింగ్ చేస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. జాతీయ రహదారి సంస్థ అధికారులు, హైవే మొబైల్ పోలీసులు వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.
– న్యూస్‌టుడే, నెల్లూరు (నేర విభాగం)

కొమ్మలు కొట్టారు.. తొలగించడం మరిచారు

నగరంలోని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నగర్‌లో విద్యుత్తు తీగలకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలు నరికేశారు. పది రోజులైనా వీటిని తొలగించకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. జీఎన్‌టీ రోడ్డులో నుంచి నగరపాలక సంస్థ కార్యాలయంలోకి వెళ్లే దారి కావడంతో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు.
– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

అసలే మలుపు.. ఆపై గుంతలు

పొదలకూరు రోడ్డులో నుంచి బుజబుజనెల్లూరుకు వెళ్లే మలుపులో గుంతలు పడ్డాయి. ఈ ప్రాంతంలో విద్యుద్దీపాలు కూడా లేకపోవడంతో రాత్రి పూట కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్రవాహనచోదకులు పడి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. – న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్)

మంత్రి నుంచి బహుమతులు అందుకున్న విద్యార్థులు

జిల్లా విద్యార్థులకు బహుమతులు

నెల్లూరు (విద్యుత్తు): జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన నెల్లూరు విద్యార్థులకు ఆదివారం తిరుపతిలోని విద్యుత్తు శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ సీఎండీ శివశంకర్, జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ రాఘవేంద్రం, ఈఈ బాలచంద్ర పాల్గొన్నారు.

27న యువ సంగీతోత్సవం

నెల్లూరు (మార్కెట్ సెంటర్): నగరంలోని ఎస్వీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలలో ఈ నెల 27వ తేదీ యువ సంగీతోత్సవం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ మునికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో సంగీతప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రతి ఆదివారం సైక్లింగ్

ర్యాలీలో పాల్గొన్న క్రీడాకారులు

నెల్లూరు (క్రీడా విభాగం), న్యూస్‌టుడే: ప్రతి ఆదివారం ప్రతిఒక్కరూ సైక్లింగ్ చేయాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.పాండురంగారావు పిలుపునిచ్చారు. ఫిట్ ఇండియా కార్యక్రమానికి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం 'సండేస్ ఆన్ సైకిల్' ర్యాలీ చేపట్టారు. ఏసీ సుబ్బారెడ్డి మైదానం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీలో క్రీడాధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి సీహెచ్ వెంకటరాయులు, విశ్రాంత డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్, వీఎస్‌యూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎ.ప్రవీణ్, డీఎస్ఏ శిక్షకులు, సిబ్బంది, వాకర్లు పాల్గొన్నారు.

జనసేన ముందస్తు క్రిస్మస్ వేడుకలు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆదివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు జరిగాయి. కేక్ కోసి క్రిస్టియన్ సోదరులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నూనె మల్లికార్జునయాదవ్, నాయకులు గునుకుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య పోటీలు

నెల్లూరు (మార్కెట్ సెంటర్): క్లాసికల్ కల్చరల్ రిసోర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఐఎంఏ హాల్‌లో ఆదివారం కూచిపూడి నృత్య పోటీలు కోలాహలంగా సాగాయి. విజేతలకు సీసీఆర్ఎఫ్ డైరెక్టర్ సంతోష్ మిశ్రా, చెన్నారెడ్డి శరణ్యారెడ్డి, నారాయణ హాస్పిటల్ ఏజీఎం భాస్కర్‌రెడ్డి, 25 కళా సంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి బహుమతులు అందజేశారు.

సండే మార్కెట్ ప్రారంభం

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : రోడ్డు నిర్మాణంలో భాగంగా మూసేసిన సండే మార్కెట్‌ను మళ్లీ ప్రారంభించినట్లు ఈ మార్కెట్ వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడు కిశోర్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం షాపులను ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎండీ హాఫీజుద్దీన్, కార్యదర్శి ఆర్.సెంథిల్ కుమార్, మాజీ కార్యదర్శి పి.శరవణన్, సభ్యులు చంద్రన్, జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: టక్కేమిట్ట మెయిన్ రోడ్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ద్విచక్ర వాహనచోదకుల వెంటపడుతున్నాయి. – రబ్బాని

సమాధానం: కుక్కలను పట్టించేందుకు వెంటనే చర్యలు చేపడతాం. – డాక్టర్ మదన్‌మోహన్, వెటర్నరీ అధికారి

? బాలాజీనగర్ సరస్వతీనగర్‌లో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. – లక్ష్మి, స్థానికురాలు

✓ కాలువలను శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ కనకాద్రి, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు (నగరపాలకసంస్థ)

హవాలా నగదుతో ఉన్న నలుగురి అరెస్టు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: హవాలా నగదుతో ఉన్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై తండయార్‌పేట రైల్వేస్టేషన్ వద్ద శనివారం పోలీసులు గస్తీ చేపట్టారు. అనుమానంతో నలుగురు వ్యక్తుల వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా పెద్ద మొత్తంలో నగదు ఉన్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించిన పత్రాలు లేకపోవడంతో రూ.70 లక్షల నగదు, 108 గ్రాముల బంగారం, కిలో వెండి స్వాధీనం చేసుకున్నారు. వాటిని తీసుకొచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన వెంకట సురేష్ బాబు, పొన్నూరు వెంకట కమల్, దుర్గి గోపీకిషోర్, షఫియుల్లాఖాన్‌ను అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలించారు.

సింస సేవలు నిరుపమానం: రేలంగి

జ్యోతి వెలిగిస్తున్న రేలంగి, వాసూరావు

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: కళారంగానికి సింహపురి సంస్కృతి సమాఖ్య చేస్తున్న సేవలు నిరుపమానమని సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు పేర్కొన్నారు. నగరంలోని పురమందిరంలో ఆదివారం సింహపురి సంస్కృతి సమాఖ్య (సింస) వార్షికోత్సవం జరిగింది. ఇందులో సంగీత దర్శకుడు వాసూరావుతో పాటు పలువురు కళాకారులను సత్కరించారు. సమాఖ్య వ్యవస్థాపక కార్యదర్శి రాంజీ ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాజమండ్రి ఏఎస్పీ మురళీకృష్ణ, మేడిన్ వెంకటేశ్వరరావు, ప్రసాద్, పిండి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మీటర్ రీడర్లను ఆదుకోవాలి

నెల్లూరు (విద్య), న్యూస్‌టుడే : నగరంలోని రామకోటయ్య భవన్‌లో ఆదివారం విద్యుత్తు మీటర్ రీడర్ల యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శివారెడ్డి మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లను తీసుకొచ్చి మీటర్ రీడర్లకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. వీరిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పూనమల్లి కృష్ణ, పెనుబల్లి శంకరకిషోర్, బొద్దుకూరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

పార్వీ సినిమాస్ (ఎం.I) షెడ్యూల్ ; స్క్రీన్ 1.. అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి (తెలుగు) స్క్రీన్ 2.. అఖండ 2 (తెలుగు) స్క్రీన్ 3 ..అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి (తెలుగు, ఇంగ్లిష్) **పార్వీ సినిమాస్ (స్పైస్) ;** స్క్రీన్..1 .అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి (తెలుగు) స్క్రీన్ 2. ధురంధర్ (హిందీ) స్క్రీన్ 3 అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి (తెలుగు) స్క్రీన్.4.. అఖండ 2 (తెలుగు) అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి (తెలుగు) **రెయిన్ సినిమా:** స్క్రీన్..1..అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి (తెలుగు, ఇంగ్లిష్) స్క్రీన్..2. .అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి (తెలుగు).అఖండ 2 (తెలుగు) స్క్రీన్..3. . అవతార్ ఫైర్ అండ్ యాష్ ..3డి (ఇంగ్లిష్),అఖండ 2 (తెలుగు) స్క్రీన్ 4..గుర్రం పాపిరెడ్డి (తెలుగు), ధురంధర్ (హిందీ)

ఉచిత వైద్య శిబిరం

రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

నెల్లూరు(మార్కెట్ సెంటర్); తెదేపా నాయకుడు మదన్‌కుమార్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం మాగుంట లేఅవుట్‌లో వైద్య శిబిరం, క్యాన్సర్‌పై అవగాహన సదస్సు జరిగింది. మెడికవర్ హాస్పిటల్ వైద్యులు వెంకటసుధాకర్, జయరామ్, విజయకుమార్, రమేష్‌బాబు రోగులకు పరీక్షలు నిర్వహించారు. లెక్చరర్స్ కాలనీ, గిలకబావి సంఘం, అరవిందనగర్, పాతకాలువకట్ట కాలనీ ప్రాంతాల వాసులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ప్రథమ వర్ధంతి

కీ॥శే॥ గుజ్జలపూడి చంద్రమౌళి నాయుడు గారు
మరణం : 02-01-2025
మా ఇంటి దైవం, మాకు మార్గదర్శకులు,
కీ॥శే॥ గుజ్జలపూడి చంద్రమౌళి నాయుడు గారు
భౌతికంగా మాకు దూరమై సంవత్సర కాలం గడిచింది.
ఆ అమృతమూర్తి జ్ఞాపకాల నీడలలో జీవిస్తూ..
ప్రథమ వర్ధంతి సందర్భంగా అశ్రుతాంజలి ఘటిస్తున్నాము.
భార్య: గుజ్జలపూడి ఉషారాణి
కుమారుడు: G. హరికుమార్ - కోడలు: హరిత
హరి పిక్చర్స్
కుమార్తెలు - అల్లుళ్ళు
R.K. సుప్రజ - G.K. కుమార్ తాళ్ళూరు రజని - వెంకటేశ్వర్లు
మనుమళ్ళు: సాయి రక్షిత్, నితిన్ చౌదరి మనుమరాండ్రు: R.K.నేహ, R.K. కృతీ G. విక్షచౌదరి

(c) eenadu

అంతటా సాయి స్వరూపం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: దేవుడిలో భక్తుడు లీనమవడమే దైవత్వం అన్న సత్యసాయి సందేశాన్ని కళ్లకు కట్టినట్లుగా భక్తులు చూపారు. ఆదివారం సాయికుల్వంత్ మందిరంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో భాగంగా న్యూజిలాండ్ దేశానికి చెందిన భక్త బృందం 'త్వమేవాహం' (నేనే నీవు.. నువ్వే నేను) నృత్య నాటిక ప్రదర్శించింది. సత్యసాయి, శ్రీకృష్ణుడు, ఏసు ప్రభు, శిర్డిసాయి మానవాళికి అందించిన సందేశాన్ని ఈ నాటిక ద్వారా తెలిపింది. అనంతరం భక్తులు సత్యసాయి, ఏసు భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించి, మహాసమాధిని దర్శించుకున్నారు. న్యూజిలాండ్ బాలవికాస్ చిన్నారులు తమ సంప్రదాయ నృత్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. సత్యసాయి గ్లోబల్ క్రిస్మస్ బృందం ప్రశాంతి నిలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసింది.

విశ్వాసులకు ఏసు సందేశం

23న ఉద్యోగమేళా

పుట్టపర్తి, న్యూస్‌టుడే: కొత్తచెరువులో ఈనెల 23న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో శ్రీశివసాయి డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 20కి పైగా బహుళజాతి సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. పది, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఎం.ఫార్మసీ, నర్సింగ్, బీటెక్, పీజీ అర్హత కలిగిన 18 నుంచి 35 ఏళ్ల వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99666 82246, 79815 41994 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలియో రహిత జిల్లా లక్ష్యం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పోలియో రహిత జిల్లా కోసం ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జేసీ మౌర్యభరద్వాజ్ పిలుపునిచ్చారు. ఆదివారం పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి, లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 2037 కేంద్రాల ద్వారా 1,98,028 మందికి చుక్కలు వేయడమే లక్ష్యం కాగా, 1,88,126 మందికి వేసినట్లు తెలిపారు. 95 శాతం మందికి పల్స్ పోలియో చుక్కలు వేయగా, మిగిలిన వారికి 22, 23 తేదీల్లో ఇంటింటికి వెళ్లి వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, తహసీల్దార్ కల్యాణచక్రవర్తి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న జేసీ మౌర్యభరద్వాజ్

ప్రశాంతంగా ముగిసిన టెట్

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) ఆదివారం ముగిసాయి. ఈ నెల 10న ఆరంభమై 21న ముగిశాయి. జిల్లాలో 7 కేంద్రాల్లో చివరి రోజు 1,256 మందికిగాను 1129 మంది హాజరయ్యారు.

అక్రమాల తతంగం

➤ ఐసీడీఎస్‌లో అస్తవ్యస్తం! ➤ 65 ఏళ్లకూ ఉద్యోగ విరమణ లేని వైనం

ఏదీ పట్టని యంత్రాంగం!

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖలో (ఐసీడీఎస్) నిత్యం ఏదో ఒక సమస్యపై వివాదం తలెత్తడం సర్వసాధారణమైంది. రెండు జిల్లాల్లోనూ పరిపాలన అస్తవ్యస్తంగా.. గందరగోళంగా మారింది. అత్యధిక సీడీపీఓలు ఉన్నతాధికారులను అసలు లెక్కచేయడం లేదు. ధర్మవరం సీడీపీఓ అక్రమాల బాగోతంపై ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయానికే ఆధారాలతో సహా ఫిర్యాదు వెళ్లడం ప్రస్తావనార్హం. కొందరు అంగన్‌వాడీ సిబ్బందికి పదవీ విరమణ వయసు దాటినా విధుల్లోనే ఉంచడం విశేషం. ఈ అక్రమాల తతంగాన్ని స్వయంగా ఆ శాఖ డైరెక్టర్ వారంతపు వీసీలో ప్రస్తావించడం కలకలం రేపుతోంది.

65 ఏళ్లు దాటినా విధుల్లోనే..

రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేనివిధంగా అనంత, శ్రీసత్యసాయి జిల్లాల్లో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లు. అంగన్‌వాడీ సిబ్బందికీ ఇదే వర్తిస్తుంది. 'ఈ-సాధన' రికార్డు ప్రకారం సీకేపల్లి ప్రాజెక్టులో ఒక ఆయాకు 65 ఏళ్ల ఐదు నెలలు దాటినా విధుల్లో ఉన్నారు. ఇదే ప్రాజెక్టులో మరొకరు, బత్తలపల్లి, మడకశిర, హిందూపురం ప్రాజెక్టుల్లో ఒక్కొక్కరు ఉన్నారు. వీరందరికి 62 ఏళ్లు పూర్తయ్యాయి. ఆయా ప్రాజెక్టుల సీడీపీఓలు మాత్రం వారికి వత్తాసు పలికేలా నివేదిక పంపించారు.

అనంతలో ఎఫ్‌ఎన్‌ఓ.. ధర్మవరంలో ఆయా

ధర్మవరం ప్రాజెక్టు గాంధీనగర్-2 అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలు(ఆయా) 2022, 2024 సంవత్సరంలో లెక్కలేనన్నీ సెలవులు పెట్టారు. అయినా సీడీపీఓ, సంబంధిత సూపర్‌వైజర్ ఏమాత్రం పట్టించుకోలేదు. ఈ విషయమై అదే కేంద్రంలో పని చేసే కార్యకర్త అన్ని ఆధారాలతో సీఎం కార్యాలయానికి, పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై సమగ్ర సంజాయిషీ ఇవ్వాలంటూ సీడీపీఓ, సూపర్‌వైజర్లకు ఈనెల 12న తాఖీదులు ఇస్తే.. ఇప్పటికీ వారు సమాధానం ఇవ్వలేదు. సదరు ఆయా అనంత ఆస్పత్రిలో ఎఫ్ఎన్‌ఓగా పని చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఆమె అంటే హడల్!

ధర్మవరం సీడీపీఓపై లెక్కలేనన్నీ ఫిర్యాదులు అందాయి. ఈమెకు తాఖీదు ఇవ్వడానికి పీడీ భయపడే పరిస్థితి. సీడీపీఓను టచ్ చేస్తే కొందరు రిపోర్టర్లుగా చెప్పుకొనే వ్యక్తులు పీడీని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇదే విషయాన్ని ఆమె స్వయంగా డైరెక్టర్ ముందు మొరపెట్టుకున్నట్లు తెలిసింది. ఆమెపై సమగ్ర నివేదిక పంపాలని డైరెక్టర్ ఆదేశించినా నేటికీ అతీగతీలేదు.

సీడీపీఓలకు తాఖీదులు ఇచ్చాం

ధర్మవరం పట్టణం గాంధీనగర్-2 ఆయాపై విచారణ చేశాం. అక్కడి సీడీపీఓ, సూపర్‌వైజర్‌కు తాఖీదు ఇచ్చాం. దీనిపై సమగ్ర నివేదిక డైరెక్టర్‌కు పంపిస్తున్నాం. వయసు దాటినా విధుల్లో ఉంచిన ఆ నాలుగు ప్రాజెక్టుల సీడీపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేశాం. దీనిపై కలెక్టర్‌కు ప్రత్యేక నివేదిక పంపిస్తాం. **- ప్రమీల, పీడీ, ఐసీడీఎస్**

హిందూపురం లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా ఎం.ఎస్.రాజు

● ప్రధాన కార్యదర్శిగా హనుమప్ప

ఈనాడు, పుట్టపర్తి: తెలుగుదేశం పార్టీ లోక్‌సభ నియోజకవర్గ (జిల్లా) అధ్యక్షుడిగా మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వి.హనుమప్పను నియమించారు. పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు నిర్ణయం మేరకు ఆదివారం అధికారికంగా ప్రకటించారు.

సామాజిక సమీకరణ, సామర్థ్యం..

★జాబితా రూపకల్పనలో వివిధ సామాజిక సమీకరణాలు, సామర్థ్యం, అనుభవం, విధేయత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఎం.ఎస్.రాజు ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు. పార్టీకి సంబంధించి ఎవరు ఆరోపణలు, విమర్శలు గుప్పించినా.. తక్షణం స్పందించి తిప్పికొడతారు. వైకాపా హయాంలో ఆ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటానికి కూడా ముందుకురాని పరిస్థితుల్లో ఎం.ఎస్.రాజు వారి అరాచకాలపై గట్టిగా పోరాడారు. కేసులు నమోదైనా వెరవలేదు. ఇవన్నీ ఆయనకు కలిసొచ్చాయి. జిల్లాలోని శాసనసభ్యులు, తెదేపా నాయకులు, కార్యకర్తలు అందర్నీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఎం.ఎస్.రాజు అన్నారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విధేయతకు పట్టం

ఎం.ఎస్.రాజు తెదేపాకు విధేయుడిగా.. కష్టకాలంలో అండగా నిలిచినవాడిగా పేరుంది. అందరితో కలిసిపోవడం, కార్యకర్తలను సమన్వయం చేసుకుపోవడం, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తుండటం అధిష్ఠానం గుర్తించింది. ఆయన ఇప్పటికే మడకశిర ఎమ్మెల్యేగా, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా కూడా ఉన్నారు. ప్రస్తుతం మరో అవకాశం లభించింది.

★పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా పరిగికి చెందిన **వి.హనుమప్ప**కు అవకాశం లభించింది. ఈయన గతంలో పార్టీ రాష్ట్ర వడ్డెర సాధికార సమితి సభ్యుడిగా, తెదేపా పరిగి మండల కన్వీనర్‌గా పనిచేశారు. 2014లో జడ్పీటీసీ సభ్యుడి టికెట్ కోసం ప్రయత్నించారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, విధేయత ఆయనకు కలిసొచ్చాయి. ముఖ్యంగా ఇప్పటి వరకు అధ్యక్షుడిగా పనిచేసిన హిందూపురానికి చెందిన అంజినప్ప వడ్డెర సామాజిక వర్గానికి చెందినవారు. ఈ పార్లమెంటు నియోజకవర్గంలో వారి సంఖ్య కూడా ఎక్కువే. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో అదే సామాజిక వర్గానికి చెందిన హనుమప్పకు అవకాశం ఇచ్చినట్లు కనిపిస్తోంది. పనిచేస్తే పదవులు కలిసొస్తాయనడానికి నిదర్శనం వీరి నియామకం.

మైనర్లతో ఆ తప్పు ముప్పే!

బాలబాలికలకు పోక్సో రక్షణ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:

ఈ ఏడాది ప్రారంభంలో శ్రీసత్యసాయి జిల్లాలో ఓ యువకుడు ప్రేమపేరుతో ఓ బాలికపై లైంగికదాడి చేశాడు. ఆ ఘటనను ఫోన్‌లో చిత్రీకరించి మిత్రులకు పంపాడు. దీన్ని చూపి బెదిరించి రెండేళ్లపాటు ఇరవై మందికి పైగా అత్యాచారం చేశారు. బాధితురాలు గర్భం దాల్చడంతో విషయం బయటకు వచ్చింది. 15 మందిపై పోక్సో కేసు నమోదైంది. అందులో పదిమంది యువకులే.

★ తాజాగా అనంతపురం నగరంలో చదువుతున్న ఓ అమ్మాయిని ముగ్గురు యువకులు వేర్వేరుగా ప్రేమపేరుతో వేధించారు. ఆమెను బెదిరించి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అందరిపై పోక్సో నమోదైంది.

జిల్లాలో పోక్సో కేసులిలా..

2023	89
2024	82
2025	79

సామాజిక మాధ్యమాలతో పక్కదారి

పిల్లలు, టీనేజర్లు సోషల్ మీడియాకు విపరీతంగా బానిసలవుతున్నారు. పిల్లలు వారికి తెలియకుండానే లైంగిక విషయాలపై ఆసక్తి ఏర్పరచుకుంటున్నారు. టీనేజీలోకి అడుగు పెట్టిన మగ, ఆడపిల్లల్లో ఈ ధోరణికి ఎక్కువైంది. ఈ దుష్ప్రభావాల నుంచి రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

'పోక్సో' అంటే: (ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్స్ యాక్టు) అనేది లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించే భారతీయ చట్టం.

అమలు: 2012 నవంబరు 14 నుంచి

ఉద్దేశం: ఇది 18 ఏళ్ల లోపు బాలబాలికలపై జరిగే లైంగిక దాడులను అరికట్టడానికి ఉద్దేశించినది. పరస్పరం ఇద్దరి మధ్య ఇష్టపూర్వకంగా శారీరకంగా కలిసినా పోక్సో చట్టం దృష్టిలో నేరమే.

శిక్షలు ఇలా..

18ఏళ్ల లోపు బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులన్నీ 'పోక్సో' చట్టం పరిధిలోకి వస్తాయి. లైంగిక దాడి చేస్తే కొత్త 'భారత న్యాయ సంహిత' చట్టంలోని సెక్షన్-64, వేధింపులకు గురి చేస్తే సెక్షన్-74లతోపాటు నిర్భయ, పోక్సో చట్టాల కింద కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే పదేళ్లు లేదా అంతకంటే ఎక్కువ జైలుశిక్ష పడుతుంది.

★ శిక్షలు నేర తీవ్రతను బట్టి ఉంటాయి. లైంగికదాడి కనీసం 3 సంవత్సరాల నుంచి 30 ఏళ్లదాకా జైలు శిక్ష ఉంటుంది. 12 ఏళ్లలోపు బాలబాలికలపై అత్యాచారానికి పాల్పడిన వారికి మరణశిక్ష కూడా విధించొచ్చు.

అవగాహన ముఖ్యం

ఇటీవల పాఠశాలలు, కళాశాలలే కాకుండా ఇళ్ల వద్ద కూడా ఆడపిల్లలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. చట్టాల గురించి తెలుసుకున్నపుడే భయం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలకు ఇలాంటి చట్టాలపై సున్నితంగా తెలియజెప్పాలి. పాఠశాలల్లో చట్టంపైన అవగాహన కల్పించాలి. **- శాంతామణి, సఖిసెంటర్, అడ్మినిస్ట్రేటర్**

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే: జిల్లా కలెక్టరేట్‌లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. కదిరి, పెనుకొండ, ధర్మవరం ఆర్డీవో కార్యాలయాలతో పాటు మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారన్నారు. మరింత సమాచారం కోసం కాల్ సెంటర్ 1100కు సంప్రదించవచ్చన్నారు. ఫిర్యాదుదారుడు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకురావాలని కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

అనుసంధానం.. అయోమయం

● మేళాపురం నుంచి జాతీయ రహదారి వరకు విస్తరణపై మిశ్రమ స్పందన

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం పట్టణం మేళాపురం నుంచి ముద్దిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి మీదుగా జాతీయ రహదారి వరకు అనుసంధాన రహదారి ఏర్పాటుపై స్థానికుల్లో మిశ్రమ స్పందన కనిపిస్తోంది. ఇప్పటికే ఈ విషయంపై మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యదర్శి వీరయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తదితరులు స్థానికులతో సమావేశమై పలువిషయాలు చర్చించారు.

కలిగే ప్రయోజనాలు

- 5 కి.మీ మేరకు దూరం ఉన్న ఈ రహదారిని అనుసంధానిస్తే ప్రస్తుతం ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్న ట్రాఫిక్ సమస్యతో ఉపశమనం కలుగుతుంది. ముద్దిరెడ్డిపల్లి, జాతీయ రహదారికి వెళ్లే వారికి ఎంతో అనుకూలంగా ఉంటుంది.
- ప్రస్తుత రహదారి మలుపులతో కూడుకొన్నందున తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. కొత్తది వేస్తే తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.
- ప్రస్తుత రహదారిలో రెండు చోట్ల కొట్నూరు చెరువు మరువలు ఉన్నాయి. చెరువు నిండినప్పుడు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారి అనుసంధానిస్తే ఈ సమస్య వాహనదారులకు తటస్థపడదు.

ఇబ్బందులేమున్నాయంటే..

- ప్రస్తుతం మాస్టర్ ప్లాన్‌లో 40, వాస్తవంగా 20 అడుగులు ఉన్న ఈ రహదారిని 80 అడుగులకు విస్తరించాలన్నది ప్రజాప్రతినిధులు, అధికారుల ఆలోచన. దీనివలన అధికంగా ఇళ్ల నిర్మాణాలు తొలగించాలి. ఈ ఇళ్లు ప్రైవేట్ వారివి కావడంతో మున్సిపాలిటీ పరిహారం చెల్లించాల్సి వస్తుంది. మున్సిపల్ ఖజానాపై అధిక భారం పడుతుంది.
- ప్రస్తుతం పట్టణంలోని రైల్వేరోడ్ విస్తరణ పనులు చేపట్టి ప్రభుత్వాలు మారినా పనులు పూర్తి కాలేదు.. అలాగే ఈ రహదారి కూడా మరో రైల్వేరోడ్‌లా మారుతుందేమోనని స్థానికుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.
- ప్రస్తుతం ఈ రహదారికి ఇరువైపులా కోళ్లదుకాణాలు, చిన్నచిన్న చిరువ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. రహదారి విస్తరణకు దుకాణాల కట్టడాలు తొలగించాల్సి ఉన్నందున వీరు ఉపాధి కోల్పోయే అవకాశం ఉంది.

మేళాపురం నుంచి ముద్దిరెడ్డిపల్లికి వెళ్లే రహదారి

ఏదైనా మెజార్టీ ఆమోదంతోనే - డీఈ రమేశ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్, హిందూపురం

ముద్దిరెడ్డిపల్లి రహదారి అనుసంధానంపై ప్రజాభిప్రాయం తెలుసుకోవాలి. ఇప్పటికే సమావేశం ఏర్పాటు చేసి విషయం వారి ముందు ఉంచాం. ఎక్కువమంది దేనికి మొగ్గు చూపితే ఆ దిశగా చర్యలు ఉంటాయి. దీనిపై ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

కోటగోడకు ఆక్రమణ చెదలు

■ కూలగొట్టి ఇంటి నిర్మాణాలు చోద్యం చూస్తున్న అధికారులు

తలుపుల, న్యూస్‌టుడే: అక్రమార్కులకు తలుపుల కోట కాసులు కురిపిస్తోంది. చారిత్రక ఆనవాళ్లు కనుమరుగు అవుతున్నా పట్టించుకొనే వారే కరవయ్యారు. రాయల కాలంలో తలుపులను పాలించిన సామంతరాజులు (పాలేగాళ్లు) కోటగోడను నిర్మించారు. వృత్తాకారంలో ఉన్న కోటగోడ 8.95 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. కబ్జాదారులు కోటగోడను పగులకొట్టి రాళ్లు, మట్టి తరలించి గోడ స్థానంలో ఇళ్లు, రస్తాలను ఏర్పాటు చేసి క్రయవిక్రయాలు జరిపారు.

మిగిలింది 30 శాతమే

ప్రస్తుత సమాచారాన్ని బట్టి 70 శాతం పైగా కోట గోడ ఆక్రమణకు గురైంది. మరో 30 శాతం మాత్రమే ఈశాన్యంలో మిగిలింది. ఇంత జరిగినా రెవెన్యూ, పంచాయతీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వీటిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రస్తా పేరుతో కబ్జా

ఓ గుత్తేదారు వేసిన ఇంటి ప్లాట్లకు రస్తా పేరుతో షాదీమహల్ పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించాడు. ప్రధాన కోటగోడను కళాశాల ఎదురుగా, పోలీస్ వెనుకవైపు, బీసీ వసతి గృహం సమీపంలో మూడుచోట్ల, కోటగోడ ఉత్తరం వైపు కోటనుగోడను పగులగొట్టి రహదారి వేసి ఇంటి నిర్మాణాలు చేపట్టారు.

ఆనవాళ్లు కనుమరుగు

సర్వే నంబరు 415లో 8.93 ఎకరాల విస్తీర్ణంలో వృత్తాకారంలో కోటగోడను సామంత రాజులు నిర్మించారు. ఆ కోటగోడ ఆనవాళ్లు చాలావరకు తుడిచిపెట్టుకుపోయాయి. కోటలో మరో చిన్నపాటి లోకోటను 417 సర్వేనంబరులో 1.26 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. వీటి ఆనవాళ్లు రికార్డులకే పరిమితమయ్యాయి. ఆ మొత్తం స్థలాన్ని చుట్టూ ఉన్న పట్టాదారులు కబ్జాచేసి ప్లాట్లు వేసి, వేరు వేరు సర్వేనంబరు వేసి ఏకరంగా రిజిస్టర్లు చేయించుకున్నారు.

విశ్రాంత సైనికుల స్థలాలకూ దిక్కులేదు

కొంతమంది విశ్రాంత సైనికులకు ప్రభుత్వం లోకోటలోని 417 సర్వేనంబరులో ఇంటిపట్టాలు ఇచ్చింది. ఆ స్థలాన్ని సైతం కబ్జాదారులు విక్రయిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఓ సైనికుడికి చెందిన స్థలంలో ఓ వ్యక్తి రేకుల షెడ్డు నిర్మించి, మరో సర్వే నంబరు వేసి రూ.17 లక్షలకు విక్రయించాడన్న ఆరోపణలు ఉన్నాయి.

అక్రమార్కులపై చర్యలు తప్పవు

-రెడ్డిశేఖర్, తహసీల్దార్, తలుపుల

కోటగోడ ఆక్రమణలు ఇప్పటివి కావు. కోటగోడను ధ్వంసం చేసి రహదారులు, ఇళ్లు నిర్మించుకొన్నారు. ఈ మధ్య విశ్రాంత సైనికుడి స్థలం కబ్జాపై కొలతలు వేశాం. చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించాం. ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా చూస్తాం, ఉన్న కోటగోడను రక్షించేలా చర్యలు తీసుకుంటాం.

నేటి నుంచి కానిస్టేబుళ్లకు శిక్షణ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇటీవల ఎంపికైన స్టైఫండరీ కేడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల (ఎస్‌సీటీపీసీ)కు ఈనెల 22 నుంచి 9 నెలల శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో, శిక్షణార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయా? అనే అంశాన్ని పరిశీలించేందుకు అనంతపురం జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డీటీసీ) ఆదివారం డీఐజీ షిముషి, ఎస్పీ జగదీశ్ వేర్వేరుగా సందర్శించారు. అధికారులు డీటీసీ పరిసర ప్రాంతాలు, వసతులు, బ్యారక్‌లు, వంటశాల, జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్ తదితర ప్రాంతాలను పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ అలియాస్ బాషా, డీటీసీ, ఏఆర్ డీఎస్పీలు సూర్యనారాయణరెడ్డి, నీలకంఠేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

చెత్త ఊడుస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు

స్వచ్ఛ సేవకులకు.. చలి గండం

■ వణుకుతూనే పారిశుద్ధ్య పనులు ■ అందని రక్షణ సామగ్రి

ధర్మవరం పట్టణం, కదిరి, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాత్రి ఉష్ణోగ్రతలు రోజురోజుకీ పడిపోతున్నాయి. చలి వణికిస్తోంది. పారిశుద్ధ్య కార్మికులు మాత్రం కోడి కూయక ముందే ఎముకలు కొరికే చలిలో విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి కేటాయించిన ప్రదేశాలకు చేరుకొని చెత్తను తొలగించి పట్టణాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దుతున్నారు. అయితే చలి నుంచి రక్షణ పొందేందుకు చలి కోట్లు, చేతులకు తొడుక్కునే గ్లౌజులు లేవు. ఆప్రాన్ దుస్తులు, రెయిన్ కోట్లు, బూట్లు, సబ్బులు, కొబ్బరినూనె, మాస్కులు పంపిణీ చేయకపోవడంతో కార్మికులు వణుకుతూనే చెత్తను ఊడ్చుతున్నారు. తమ కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీల్లో కార్మికుల వివరాలు

- ధర్మవరం పట్టణంలో 40 వార్డులుండగా 350 మంది కార్మికులు అవసరం. అయితే 271 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి మూడేళ్ల నుంచి ఎటువంటి సామగ్రి అందడం లేదు.
- కదిరి పురపాలకలో 36 వార్డులకుగాను 229 మంది ఉండాల్సి ఉండగా 165 మంది కార్మికులు పని చేస్తున్నారు.
- హిందూపురంలో 420 మందికిగాను 360 మంది కార్మికులు పనిచేస్తున్నారు.
- పుట్టపర్తిలో వంద మంది అవసరం ఉండగా 59 మంది మాత్రమే ఉన్నారు. వీరందరికి పరికరాలు, సామగ్రి అందడం లేదు.

త్వరలోనే అందజేస్తాం

- నటరాజ్, శ్యామ్‌సన్, కదిరి, ధర్మవరం పట్టణ శానిటేషన్ అధికారులు

పారిశుద్ధ్య కార్మికులకు రెగ్యులర్ దుస్తులు, ఉపకరణాలు, కాస్మోటిక్స్‌ను త్వరలోనే అందజేస్తాం. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

అడ్డంగా నిలిపితే ఆపదే!

బెంగళూరు- హైదరాబాద్ జాతీయ రహదారిపై భారీ వాహనాల తాకిడి, వేగం తెలియంది కాదు. అలాంటి రద్దీ ఉన్నచోట ఎక్కడంటే అక్కడ ఇష్టానుసారం వాహనాలను ఆపి కొందరు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఈ ఏడాదిలో ఆగి ఉన్న వాహనాలను ఢీకొని ఎంతోమంది మృత్యువాత పడినా మేల్కొలుపు ఉండటం లేదు. హంపాపురం వద్ద జాతీయ రహదారిపై బెంగళూరు వైపు వెళ్తున్న ఓ లారీని డ్రైవర్ రోడ్డుపై అడ్డంగా ఆపేశాడు. వెనుక నుంచి వేగంగా వస్తున్న వాహనాలకు ఈ విషయం తెలిపేందుకు హెచ్చరిక బోర్డును పెట్టాలన్న విషయాన్ని మర్చిపోయాడు. ఇలా చేయడం భారీ ప్రమాదాలకు తావిచ్చినట్టే అవుతుంది. **- ఈనాడు, అనంతపురం**

పాలిటెక్నిక్ కళాశాలల మహిళా జోనల్ పోటీలు

హిందూపురం: హిందూపురంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నుంచి రెండు రోజులు పాలిటెక్నిక్ కళాశాల జోనల్ స్థాయి మహిళా పోటీలు కొనసాగుతాయని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కృష్ణమనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 28వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ జోనల్ స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లాల 10 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 150 మంది మహిళా క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రన్నింగ్, షాట్‌పుట్, హైజంప్, లాంగ్‌జంప్, కోకో, బ్యాడ్మింటన్, టేబుల్‌టెన్నిస్, చెస్ తదితర పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు తిరుపతిలో 2026, జనవరి మాసం చివరిలో జరిగే ఫైనల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి పీడీ వెంకట్రాములు, అధ్యాపకులు రెడ్డిశేఖర్, శ్రీనివాసులు, హరినాథ్‌బాబు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



12వ వేతన సవరణ సంఘాన్ని నియమించాలి

ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులతో జిల్లా కొత్త కార్యవర్గం

కొత్తచెరువు, న్యూస్‌టుడే: ప్రభుత్వం వెంటనే 12వ వేతన సవరణ సంఘాన్ని నియమించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. 11వ పీఆర్‌సీ గడువు ముగిసి రెండేళ్లయినా 12వ పీఆర్‌సీ గురించి పట్టించుకోకపోవడం భావ్యం కాదన్నారు. సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనంకి అశోక్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల వంద రోజుల ప్రణాళిక కార్యాచరణ పర్యవేక్షణకు విద్యాశాఖేతర అధికారులను నియమించడం తగదన్నారు. సెలవు రోజుల్లో మినహాయింపు ఇవ్వాలన్నారు. సీపీఎస్ ఉపాధ్యాయులకు డీఏ బకాయిలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో నిలిచిపోయిన స్కూల్ అసిస్టెంటు ఇంగ్లిష్ పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక: అనంతరం జిల్లా నూతన అధ్యక్షుడిగా కోడూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ఆర్.చంద్ర, గౌరవాధ్యక్షుడిగా త్రిమూర్తి, ఉపాధ్యక్షులుగా రవీంద్రారెడ్డి, రాజశేఖర్, ఉషారాణి, రాందాస్ నాయక్, బలరాముడు, ఐదుగురు కార్యదర్శులు, ఆరుగురు కౌన్సిలర్లు, పదిమందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా నాయకులు నరేష్‌కుమార్, లతా రామకృష్ణ, ఆది బయన్న, భానుప్రియ, యంజారప్ప, సంగీత, కృష్ణవేణి, అంజనామూర్తి, లలిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవో సిరి కార్యవర్గం ఏకగ్రీవం

హిందూపురం, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో సిరి అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం హిందూపురం పట్టణం పట్టుగూళ్ల మార్కెట్‌లోని సమావేశ భవనంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లా నూతన కార్యవర్గం అధ్యక్షుడు బాబాఫకృద్దీన్, అసోసియేట్ అధ్యక్షుడు టీవీ పార్థసారథి, ఉపాధ్యక్షులు లావణ్యలత, రెడ్డప్ప ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీలో కార్యదర్శులుగా శ్రీనివాసులు, మహేశ్‌లకు స్థానం కల్పించారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నట్లు వివరించారు.

హిందూ సమాజ జాగృతే లక్ష్యం

వేదికపై మాట్లాడుతున్న దేవేంద్రజీ

ధర్మవరం: హిందూ సమాజాన్ని జాగృతి పరచడానికే 'హిందూ సమ్మేళనం' నిర్వహించినట్లు అఖిలభారత సహ సంఘటక్ దేవేంద్రజీ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన హిందూ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హిందువులు ఐక్యంగా ఉండాలని, హిందూ సమాజానికి ఇబ్బంది కలిగితే హిందువులు బయట కొచ్చి ప్రశ్నించే రోజులు రావాలన్నారు. మంచి కోసం, దేశం కోసం పాటుపడేవారిని ఆర్‌ఎస్‌ఎస్ తయారు చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ కృషితో ప్రపంచ దేశాల్లో భారత్ 3వ స్థానంలో నిలిచిందన్నారు. రాబోయే రోజుల్లో అగ్రస్థానానికి చేరుకోవడం ఖాయమన్నారు. హిందూ ధర్మం విశిష్టత గురించి దత్తానందగిరి స్వామి వివరించారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలకు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి పులిచెర్ల వేణుగోపాల్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు జయశ్రీ, గురుస్వామి పి.జె.విజయ్‌కుమార్, మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు, భాజపా నాయకులు, స్థానిక హిందూ సంఘాల ప్రతినిధులు, ఆలయ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పొరుగుసేవల ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శిగా శిరీష్‌రెడ్డి

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా పొరుగు సేవల ఉద్యోగుల సంఘం జేఏసీ ప్రధాన కార్యదర్శిగా శిరీష్‌రెడ్డి నియమితులయ్యారు. నగరంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయనను ఎంపిక చేశారు. శిరీష్‌రెడ్డి ప్రస్తుతం జేఎన్‌టీయూలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా ఉన్నారు.

ఆలయ సమాచారం

కదిరి, న్యూస్‌టుడే: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ధనుర్మాస పూజల్లో భాగంగా నేడు(సోమవారం) వేకువజామునే పూజలు మొదలవుతాయి. ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, 8 గంటల నుంచి 10 గంటల వరకు రెండు పర్యాయాలు అభిషేకాలు. తర్వాత పది నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 వరకు స్వామివారి దర్శనం ఉంటుంది.

ఈఎస్‌ఎల్ క్రీడా సంబరానికి సై

నేటి నుంచి క్రికెట్ పోటీలు

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల కళాశాలల క్రీడల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన 'ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్' సమర్పణలో 'ఈనాడు స్పోర్ట్స్ లీగ్ (ఈఎస్‌ఎల్)-2025' క్రికెట్ పోటీలకు రంగం సిద్ధమైంది. క్రికెట్‌లో ప్రతిభావంతులను వెలికి తీయాలన్న దృఢ సంకల్పంతో 'ఈనాడు-ఈటీవీ-క్రికెట్ ఉత్సవంలో' ఈ పోటీలు నిర్వహించనున్నారు. ఇప్పటికే గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో స్థానం సంపాదించిన 'ఈనాడు క్రికెట్' సోమవారం ప్రారంభం కానుంది. ఉమ్మడి అనంత జిల్లా క్రికెట్ పోటీలకు అనంత క్రీడా గ్రామం వేదిక కానుంది. సోమవారం తొలిరోజు జూనియర్ విభాగంలో పోటీలు జరుగుతాయి. తొలిదశలో ఇంటర్, పాలిటెక్నిక్, వృత్తి విద్యా కళాశాలలకు, రెండో అంచెలో ప్రాంతీయ, మూడో అంచెలో ఉమ్మడి రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయి.

EENADU SPORTS LEAGUE 2025

వేదిక : అనంత క్రీడా గ్రామం, అనంతపురం

హాకీ మైదానంలో జరిగే పోటీల వివరాలు

- ఉదయం 9 గంటలకు శాల × ప్రభుత్వ జూనియర్ కళాశాల, ధర్మవరం × ఎస్ఎస్‌బీఎన్ జూనియర్ కళాశాల, అనంతపురం
- ఉదయం 11 గంటలకు అనంతపురం పాలిటెక్నిక్ కళాశాల, రాయదుర్గం
- మధ్యాహ్నం 2 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, గుంతకల్లు × ప్రభుత్వ జూనియర్ కళాశాల, తలుపుల

ఫుట్‌బాల్ మైదానంలో..

- ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, కళ్యాణదుర్గం × శ్రీ సత్యసాయి జూనియర్ కళాశాల, అనంతపురం
- ఉదయం 11 గంటలకు శ్రీసాయి జూనియర్ కళాశాల, ధర్మవరం × ఎస్ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాల, గుంతకల్లు
- మధ్యాహ్నం 2 గంటలకు బాలాజీ విద్యావిహార్ జూనియర్ కళాశాల, హిందూపురం × సీవీ రామన్ డిప్లొమా కళాశాల, తాడిపత్రి

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Beverage Partner: CMR SHOPPING MALL
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY — MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్
TV Partner: ETV
Organised by ఈనాడు

EENADU Classifieds

REAL ESTATE
FLAT FOR SALE
క్రిష్ణన్ నూతన సంవత్సర స్పెషల్ ఆఫర్ 3 BHK, 2BHK ఫ్లాట్స్ ఆధునిక సౌకర్యాలతో అనంతపురం నడిమధ్యన గల మిన్మీ అపార్ట్‌మెంట్ నందు కొన్ని ఫ్లాట్స్ మాత్రమే కలవు. సెల్: 7416560179, 9515651111

JOBS
Required Sales Executives for Tanishq Jewellery Store. Inter Pass with Retail Experience * Tanishq Jewellery, R.F. Road, Anantapur. Ph: 9441719143

Wanted: Nurses, Custodians, Tutors, Councillor, Computer Teacher. Montessori Elite EM School, ATP. ✆ 7386261972, 9052061355.

గుంటూరు మార్కెట్‌యార్డ్ కాలేజీ నందు హాస్టల్ ఇన్‌ఛార్జి, వార్డెన్లుగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ వయస్సు: 22సం||రాల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించండి. ✆: 92487 33371.

HYD యూనిట్ హాస్టల్‌లో పనిచేయుటకు ఏజెంట్లకు అవకాశం. మీరు పర్మినెంట్ వంటవారి ప్రతిభను కలిగిన ఉద్యోగం మహిళ వారికి ప్రాధాన్యత 20k, ఫుడ్. ✆ 81215 41212.

ఇంటర్ కాలేజీలో పనిచేయడానికి మహిళా లెక్చరర్స్ కావలెను. సంప్రదించండి: ✆ 8019999913.

AIRTEL WIFI హిందూపురం పట్టణం నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం: 16500 + ఇన్సెంటివ్స్ కలవు. ఆండ్రాయిడ్ ఫోన్ - బైక్ + డ్రైవింగ్ లైసెన్స్ ఉండవలెను. సంప్రదించండి ✆ 9000029003.

FACULTY/TEACHERS
Wanted Physical Science teacher to teach upto 10th (ITI also) EXP. Min. 3 Years. Send Resumes to Whatsapp 9441011084. UshaKiran High School, Vempalli, Kadapa Dist.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలు ప్రచురించడానికి ముందు తగిన విధంగా పరిశీలించి ప్రచురించడానికి ప్రయత్నిస్తాము. ప్రకటనలలోని విషయాల వాస్తవికతకు ఈనాడు బాధ్యత వహించదు. పాఠకులు తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రకటనదారులతో వ్యవహరించాలని మనవి.

ఈనాడు e Classifieds
₹ 395/- నుండి
వివరాలకు 8008709784

డా.సుష్మాకు బెస్ట్ ఓవరాల్ ప్రెజెంటేషన్ పురస్కారం

రుద్రంపేట, శ్రీనివాసనగర్, : బెంగళూరులో ఆదివారం బీఐఈసీ వేదికగా 74వ ఇండియన్ నేషనల్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో ముచ్చుకోటకు చెందిన డాక్టర్ సుష్మా గర్భాశయ ముఖక్యాన్సర్ అంశంపై బెస్ట్ ఓవరాల్ ప్రెజెంటేషన్ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి అవార్డు అందుకున్నారు. డాక్టర్ సుష్మా బెంగళూరులో ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అవార్డుతోపాటు రూ.10 వేల నగదు బహుమతిని అందించారు. ఈ నగదు మొత్తాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతగా క్యాన్సర్ బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి విరాళంగా అందజేయనున్నట్లు ప్రకటించారు.

పీఎస్‌హెచ్‌ఎం కమిటీ కొత్త కార్యవర్గం

ఎంపికైన కార్యవర్గ సభ్యులు

కదిరి, న్యూస్‌టుడే: తనకల్లు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పి.మహబూబ్ షరీఫ్ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల కమిటీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. హిందూపురంలో జరిగిన ఈ ఎన్నికల్లో జిల్లాస్థాయి కమిటీని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బందారు నారాయణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కొత్త కార్యవర్గం వివరాలను జిల్లా అధ్యక్షుడు మహబూబ్ షరీఫ్ వెల్లడించారు. కమిటీ ఉపాధ్యక్షులుగా జె.నాగేంద్ర, శేఖరయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం.సాయిరామ్‌నాయక్, అదనపు కార్యదర్శిగా ఎస్.క్రాంతిబాషా, అదనపు ఉపాధ్యక్షులుగా బి.ఆనంద్‌కుమార్, కె.గంగయ్య, ఎం.రవీంద్రనాయక్, డీవీఎస్ సుమలత, కార్యదర్శులుగా బి.శివకుమార్, ఎస్.నరసింహులు, కె.అనితారెడ్డి, ఎస్జీ కృష్ణా నాయక్, ఎస్.కమలమ్మ ఎన్నికైన వారిలో ఉన్నారు.

'యోగి వేమన జయంతి అధికారికంగా నిర్వహించాలి'

గాండ్లపెంట, న్యూస్‌టుడే: జనవరి 19న కటారుపల్లిలోని యోగి వేమన సమాధి వద్ద జయంత్యుత్సవాన్ని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను విన్నవిస్తూ లేఖ పంపారు. ప్రజల ఆకాంక్ష మేరకు కదిరి నియోజకవర్గ శాసనసభ్యుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉన్నత అధికారులకు ఈమేరకు విజ్ఞప్తి చేస్తున్నానని, తప్పకుండా పరిగణలోకి తీసుకోవాలని అందులో కోరారు. ఆరోజు వేమన సమాధి వద్ద జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి సానుకూల స్పందన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే లేఖపై మండల, కటారుపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. వేమన జయంత్యుత్సవాలతో పాటు కదిరిలోని జీవిమాను సర్కిల్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి, వేమన కూడలిగా పేరు మార్చేలా నిర్ణయం తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

వైకాపాలో భగ్గుమన్న విభేదాలు

జగన్ జన్మదిన వేడుకల్లో నాయకుల మధ్య వాగ్వాదం

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బ్రహ్మసముద్రం సర్పంచి పరంధాములు (అయ్యప్ప మాలధారణలో ఉన్న వ్యక్తి)

సోమందేపల్లి: సోమందేపల్లిలో వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో నాయకుల మధ్య వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. మాజీ మంత్రులు ఉష, శంకరనారాయణ వర్గాల మధ్య ఆదివారం మరోమారు బయటపడ్డాయి. పెద్దమ్మగుడి వద్ద సోమందేపల్లి ఉప సర్పంచి వేణు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఒక వర్గంగా, మరోవైపు వైఎస్సార్ విగ్రహం వద్ద మండల కన్వీనర్ గజేంద్ర, జడ్పీటీసీ సభ్యుడు డీసీ అశోక్‌కుమార్ తదితర వర్గంగా జగన్ జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి ఉష భర్త చరణ్‌రెడ్డితో కేకులు కోయించేందుకు పోటాపోటీగా సిద్ధమయ్యారు. ఇదే సమయంలో వైఎస్సార్ విగ్రహం వద్దకు వచ్చిన బ్రహ్మసముద్రం సర్పంచి పరంధాములు ఇరువర్గాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రెండు వర్గాలుగా నాయకులు, కార్యకర్తలు జగన్ జన్మదిన వేడుకలు ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎన్నికలముందు ఇలా వర్గాలుగా విడిపోతే మరోమారు ఇక్కడికి రాకుండా తమ గ్రామాల్లోనే కలిసి వేడుకలు, కార్యక్రమాలను చేసుకొంటామని ఆయన తెగేసి చెప్పారు. ఈసందర్భంగా మొదట వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకొన్న చరణ్‌రెడ్డి.. రెండు వర్గాలుగా నాయకులు, కార్యకర్తలు విడిపోయి, కేకులు కోయడానికి రెండుచోట్ల ఏర్పాటు చేసినట్లు తెలుసుకొని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. చివరకు రెండు కేకులను ఒకచోట ఉంచి నాయకులు, కార్యకర్తల మధ్య ఆయన వాటిని కోశారు.

నల్లచెరువు: నల్లచెరువు మండలంలో ఆదివారం వైకాపా నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలో గొడవపడ్డారు. తొలుత నల్లచెరువు పంచాయతీ సర్పంచి పంచరత్నమ్మ వర్గం పుట్టిన రోజు వేడుకలు జరుపుకొంది. అనంతరం వైకాపా మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి వర్గం జగన్ పుట్టిన రోజు వేడుక నిర్వహించుకోవడానికి బస్టాండు దగ్గర ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు వచ్చింది. అక్కడ అప్పటికే సర్పంచి వర్గం కట్టిన ఫ్లెక్సీ ఉండటంతో రవికుమార్‌రెడ్డి వర్గం దాన్ని పక్కకు తోసేసింది. అక్కడే ఉన్న సర్పంచి వర్గం అడ్డుకోవడంతో విభేదాలు బయటపడ్డాయి. దళిత వర్గానికి చెందిన సర్పంచి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలగించడంపై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు దళిత సంఘం సభ్యులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు.

భగవద్గీత పఠనం.. ప్రతిభకు పతకం

అంతర్జాతీయ భగవద్గీత అంతర్జాల పరీక్షా పోటీల్లో పసిడి పతకాలను సాధించిన హిందూపురం దత్తభక్తులు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచశాంతి కోసం మైసూరు దత్త పీఠంలోని అంతర్జాతీయ గీతా ఫౌండేషన్ నేతృత్వంలో అంతర్జాలంలో అంతర్జాతీయ స్థాయి భగవద్గీత-2025 పరీక్ష పోటీలను గత నవంబరు నెలలో నిర్వహించారు. దేశ, విదేశాల్లోని వేలాదిమంది దత్తభక్తులు ఇందులో పాల్గొని గీతలోని శ్లోకాలను పారాయణం చేసి ప్రతిభ చాటారు. డిసెంబరు 1న జరిగిన గీతాజయంతి పురస్కరించుకొని ఆ పీఠం వ్యవస్థాపకులు గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతులమీదుగా విజేతలకు పసిడి పతకాలు, ప్రశంస పాత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. కైవసం చేసుకున్న వారిలో హిందూపురం పట్టణానికి చెందిన దత్తభక్తులు డాక్టర్ రమ్య, గృహిణులు కల్పన, హర్చిత, లావణ్య, తేజశ్విని, శ్వేత, సరస్వతి, విద్యార్థులు వాగ్దేవి, రుశ్యంత్, చిన్మయి, రవికిరణ్‌సాయి, శ్రీకర్ ఉన్నారు.

శ్రద్ధాసక్తి ఉంటే దేనినైనా సాధించవచ్చు

శ్రద్ధ, ఆసక్తి, పట్టుదల, ఉత్సాహం, ప్రోత్సాహం, ఆలోచన ఉంటే దేన్నైనా సాధించవచ్చునేది నేను భగవద్గీతలోని శ్లోకాలను నేర్చుకొని అంతర్జాల పరీక్షలో నెగ్గి పసిడి పతకం తీసుకోవడంలో నిరూపణ అయిందని భావస్తున్నా. అంతర్జాల పరీక్షలో దృశ్య విధానంలో కళ్లు మూసుకోమంటారు. తర్వాత శ్లోకం పేరు చెప్పినపుడు ప్రారంభిస్తే జైగురుదత్త అంటే నిలిపివేయాలి. ఇలా పోటీలు జరిగాయి. **-రమ్య, దంతవైద్యురాలు, హిందూపురం**

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

తల్లిదండ్రుల ప్రోత్సహంతో చదువు కుంటూ భగవద్గీతలోని శ్లోకాలను కంఠస్థం చేయడాన్ని నేర్చుకున్నాను. రోజులో 3 గంటలు కేటాయించాను. బంగారు పతకం దక్కించుకొని అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం నాకెంతో ఆనందంగా ఉంది. **- రవికిరణ్‌సాయి, 8వతరగతి**

ఫుట్‌బాల్ ఫైనల్ రౌండ్‌కు తమిళనాడు

చివరి మ్యాచ్‌లో నెగ్గిన ఆంధ్ర జట్టు

తమిళనాడు జట్టు సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: దేశవాళీలో ప్రతిష్ఠాత్మకమైన సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ నాకౌట్ పోటీలకు తమిళనాడు జట్టు అర్హత సాధించింది. గ్రూపు-జిలో తమిళనాడు జట్టు ఒక్క ఓటమి లేకుండా విజయఢంకా మోగించింది. దీంతో క్వార్టర్ ఫైనల్ పోటీలకు దూసుకెళ్లింది. ఒక్కో గ్రూపు నుంచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానం సాధించిన జట్టు నాకౌట్ పోటీల్లో పాల్గొంటుంది. తమిళనాడు జట్టు వరుసగా అండమాన్ నికోబార్, ఆంధ్ర, పుదుచ్చేరి జట్లపై విజయాలు సాధించింది. ఆదివారం ఆర్డీటీ ఫుట్‌బాల్ మైదానంలో జరిగిన చివరి లీగ్ పోటీలో తమిళనాడు జట్టు 3-0 గోల్స్ తేడాతో పుదుచ్చేరి జట్టుపై ఘన విజయం సాధించింది. ప్రత్యర్థి జట్టుకు గోల్ చేసే అవకాశం లేకుండా మ్యాచ్ ముగిసింది. మరో పోటీలో ఆంధ్ర జట్టు అండమాన్ నికోబార్ జట్టుపై 1-0 గోల్ తేడాతో విజయం సాధించింది. ఈ పోటీల్లో వరుస ఓటములతో కుంగిపోయిన ఆంధ్ర జట్టుకు చివరి మ్యాచ్‌లో విజయం సాధించడంపై కాస్త ఊరట లభించింది. గత ఏడాది ఒక్క మ్యాచ్‌లో కూడా ఆంధ్ర జట్టు గెలవలేక చతికిల బడింది. ఈసారి సాధించిన ఈ గెలుపు ఆంధ్ర జట్టుకు ఊపిరిపోసింది. చివరి పోటీలో ఆంధ్ర జట్టు ఆటగాడు అక్షయ్‌రెడ్డి గోల్ చేసి జట్టును గెలిపించాడు. కలెక్టర్ ఓ.ఆనంద్, రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి డేనియల్ ప్రదీప్ తిలకించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లా ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమన్నారు. వైద్య, ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖల సహకారంతో ఈ పోటీలు విజయవంతంగా ముగిశాయని డేనియల్ ప్రదీప్ తెలిపారు. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, ఇతర సభ్యుల సహకారంతోనే సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ పోటీలు జయప్రదమయ్యాయని వెల్లడించారు.

జగన్ పుట్టిన రోజు వేడుకల్లో వికృత చేష్టలు

కనగానపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా వైకాపా నాయకులు వికృత చేష్టలు చేశారు. ఆదివారం జగన్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోటలో వైకాపా నాయకులు వేట కొడవళ్లతో పొట్టేళ్ల తలలు నరికి వాటి రక్తంతో జగన్, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి చిత్రపటాలకు అభిషేకించి.. జై జగన్ అంటు నినాదాలు చేశారు. అనంతపురం జిల్లా విడపనకల్లులో ఇదే తరహా వికృత చేష్టలకు పాల్పడటం గమనార్హం.

23న శిశుగృహ పోస్టులకు ముఖాముఖి

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) అనుబంధ శిశు గృహ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అర్హత కల్గిన అభ్యర్థులకు ఈనెల 23 లేదా 24న మౌఖిక పరీక్ష(ఇంటర్వ్యూ) నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన దస్త్రంపై కలెక్టర్ ఆనంద్ ఆమోదం తెలియజేసినట్లు పీడీ అరుణకుమారి తెలిపారు. ఐసీడీఎస్ పీడీ కార్యాలయం ఎదురుగా బీసీ స్టడీ సర్కిల్ హాలులో ఈ ఇంటర్వ్యూలు నిర్వహించే అవకాశం ఉంది. ఇక్కడి పోస్టుల భర్తీకి ఈనెల 8 నుంచి 14దాకా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తంగా 137 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వడపోసిన తర్వాత ఇంటర్వ్యూకు 80 మంది అర్హత సాధించారు. మేనేజర్ పోస్టుకు ఆరుగురు, సోషల్ వర్కర్‌కు ఏడుగురు, ఏఎన్ఎంకు 32, ఆయా పోస్టులకు 29 మంది, వాచ్‌మెన్‌కు ఆరుగురే ప్రకారం ఉన్నారు. ఇంటర్వ్యూ నిర్వహణకు సంబంధించిన సమాచారాన్ని నిర్దేశిత అభ్యర్థులకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి తెలియజేయనున్నారు.

రేపు జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు

కదిరి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లా కబడ్డీ జట్ల (72వ సీనియర్ పురుష, మహిళలు) ఎంపిక పోటీలు 23న మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని పీసీ కబడ్డీ క్లబ్‌లో జరుగనున్నాయి. ఈమేరకు కబడ్డీ జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి సుహాసిని, కార్యదర్శి వెంకటరమణ తెలిపారు. అర్హులైన క్రీడాకారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని వారు కోరారు.

ఆంధ్ర సీనియర్ వన్‌డే జట్టులో వినయ్‌కుమార్‌కు చోటు

అనంతపురం క్రీడలు: బీసీసీఐ ఆధ్వర్యంలో బెంగళూరులో జరగనున్న విజయ్ హజారే సీనియర్ వన్‌డే పోటీలకు జిల్లాకు చెందిన బి.వినయ్‌కుమార్ ఎంపికయ్యాడు. అనంతపురం గ్రామీణ మండలం కురుగుంట గ్రామానికి చెందిన ఈ యువకుడు ఎడమచేతి వాటం స్పిన్నర్, మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తున్నాడు. బంతితో, బ్యాటుతో కదం తొక్కడంతో వన్‌డే జట్టుకు ఎంపికయ్యాడు. ఆంధ్ర సీనియర్ జట్టులో గత ఏడాది అన్ని ఫార్మాట్లలో ఎంపికయ్యాడు. ఈసారి ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో అమరావతి రాయల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఈసారి వన్‌డే విజయ్ హజారే టోర్నీకి ఎంపికయ్యాడు. బెంగళూరులో ఈ నెల 24 నుంచి జనవరి 8వరకు ఈ పోటీలు జరుగుతాయి. ఆంధ్ర వన్‌డే జట్టుకు ఎంపికైన వినయ్‌కుమార్‌ను జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్, కార్యదర్శి ఎ.యుగంధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సర్దార్ తదితరులు అభినందించారు. వన్‌డే పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలని వారు పిలుపునిచ్చారు.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

అర్జున్ కుమార్

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే : నరసాపురం గ్రామంలో చేనేత కార్మికుడు అర్జున్‌కుమార్(24) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. అర్జున్‌కుమార్ మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తండ్రి, తల్లి అనారోగ్యానికి గురవడంతో చికిత్స కోసం అప్పులు చేశాడు. తల్లి అనారోగ్యంతో మృతిచెందింది. తండ్రి మల్లేష్‌తో కలిసి జీవిస్తున్నాడు. చేసిన అప్పులు తీరకపోవడంతో నిత్యం బాధపడుతూ ఉండేవాడు. ఈక్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం రాత్రి తల వెంట్రుకలకు వాడే రంగును తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. బంధువులకు తండ్రి మల్లేష్ సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అమానుల్లా తెలిపారు.

మోతాదుకు మించి మందుల వాడకం.. విద్యార్థిని మృతి

ఎస్కేయూలో ఘటన

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో విద్యార్థి మాధుర్య అనారోగ్యంతో ఆదివారం మరణించడం చర్చనీయాంశం అయింది. గోదావరి వసతి గృహంలో ఉంటూ ఆ విద్యార్థి బయోటెక్నాలజీ విభాగంలో ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఉదయం 6.30 గంటలకు అస్వస్తతకు గురికావడంతో అంబులెన్స్‌లో సర్వజన ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే మృతి చెందినట్లు సమాచారం. ఇన్‌ఛార్జి వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, పరీక్షల విభాగం సంచాలకులు జీవీ రమణ విద్యార్థిని మృతిపై ఆరా తీశారు. ఆ విద్యార్థిని మోతాదుకు మించి మందులు తీసుకోవడంతో గుండె పోటు వచ్చి మరణించినట్లు అధికారులు తెలిపారు.

నేటి పరీక్షలు వాయిదా..

మాధుర్య అనే విద్యార్థి మరణించినందున 22న విశ్వవిద్యాలయానికి సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ రమేష్‌బాబు తెలిపారు. వర్సిటీలో 22న జరగాల్సిన పీజీ పరీక్షలు వాయిదా వేసినట్లు పరీక్షల విభాగం సంచాలకులు జీవీ రమణ తెలిపారు.

నీటికుంటలో పడి బాలుడి విషాదాంతం



కమలేశ్వరరెడ్డి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : తల్లి పొలం వద్ద పనులు చేస్తుండగా చూడటానికి వెళ్లిన ఆ బాలుడు ప్రమాదవశాత్తు నీటికుంటలో కాలుజారి పడి మృతిచెందాడు. ఈఘటన పెద్దవడుగూరు మండలం రాలువుడికిలో ఆదివారం జరిగింది. గ్రామానికి చెందిన ఆకుల సోమశేఖరరెడ్డి, సువర్ణ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. సువర్ణ భర్త పదేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కుమారుడైన ఆకుల కమలేశ్వరరెడ్డి(13)కి మతిస్థిమితం సరిగా ఉండదు. రెండో తరగతి చదువుతున్నాడు. తల్లి పొలంలో పత్తి కోత పనుల్లో ఉండగా ఇంటి వద్ద ఒక్కడే ఉండలేక పొలం వద్దకు వెళ్లాడు. అక్కడికి వెళ్లిన తర్వాత ఇంటికి వెళ్తున్నానని తల్లి సువర్ణతో చెప్పి బయలుదేరాడు. సమీపంలో కుంట వద్దకు రాగానే కాలుజారి అందులో పడిపోయాడు. ఎవరూ గమనించకపోవడం వల్ల బాలుడు కుంటనీటిలో ఊపిరాడక మృత్యువాత పడ్డారు. అటుగా కొందరు కూలీలు గమనించి బాలుడి బంధువులకు తెలియజేశారు. వారొచ్చేపాటికి మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లి సువర్ణ విలపించిన తీరు అందర్నీ కలచి వేసింది. బాలుడు మృతిచెందడంతో ఉపాధ్యాయులు వెళ్లి బంధువులను పరామర్శించి సంతాపం తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థి బలవన్మరణం

ధర్మవరం, న్యూస్‌టుడే: రాప్తాడు సమీపంలోని రైల్వేగేట్ వద్ద ఆదివారం రైలుకిందపడి బీటెక్ విద్యార్థి సాయిరాజ్ (22) ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. గుత్తి మండలం బసినేపల్లికి చెందిన సాయిరాజ్ అనంతపురం జేఎన్‌టీయూలో బీటెక్ తృతీయ ఏడాది చదువుతున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. అతడు అయ్యప్ప మాల ధరించి ఉన్నట్లు చెప్పారు. ఆత్మహత్యకు కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

వివాహిత మృతి అనుమానాస్పదం

కనగానపల్లి, న్యూస్‌టుడే: వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కనగానపల్లి మండలం మామిళ్లపల్లిలో ఆదివారం చోటచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై మహమ్మద్ రిజ్వాన్ తెలిపిన వివరాల మేరకు.. మామిళ్లపల్లికి చెందిన మహిళ(30) ఈనెల 18న రాత్రి ఇంటిలో పెట్రోలు పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వెంటనే భర్త గమనించి మంటలు ఆర్పి ధర్మవరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్య సేవలను అందిస్తుండగా ఆదివారం మృతి చెందింది. మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నార్పల మండలం నలపరెడ్డిపల్లికి చెందిన ప్రహల్లాదరెడ్డి తన కుమార్తెతో సన్నిహితంగా ఉండేవాడని, అప్పుడప్పుడు పలకరించి వెళ్లేవాడని ఈనెల 18న రాత్రి మామిళ్లపల్లిలో కూతురు ఇంటికి వచ్చి గొడవ పడ్డాడని ఫిర్యాదులో పేర్కొంది. తన కూతురిని ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించడంతో విసుగుతో పెట్రోలు ఒంటిపై పోసుకొని నిప్పు అంటించుకుందని, పక్కగదిలో ఉన్న భర్త గమనించి మంటలను ఆర్పి వేసి వైద్యశాలకు తీసుకెళ్లినట్లు వివరించింది. ప్రహల్లాదరెడ్డిపై కేసు నమోదు చేయాలని పోలీసులను కోరింది. ప్రహల్లాదరెడ్డిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు.

హిందూపురం
• హిందూపురం • పెనుకొండ • మడకశిర

అలరించిన చిన్నారుల శివతాండవం

శివతాండవం చేస్తున్న చిన్నారులు

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎంఎఫ్ రోడ్డులో ఉన్న లక్ష్మీహయగ్రీవ దేవాలయంలో ఆదివారం రాత్రి స్థానిక లక్ష్మీపురానికి చెందిన ప్రియా నాట్యమండలి చిన్నారులు సంస్కృతి, సంప్రదాయాలు తెలిసేలా నృత్యం, భాగవతం, శ్రీకృష్ణుడు, శివతాండవం పై చేసిన నృత్య ప్రదర్శన మహిళలను విశేషంగా ఆకట్టుకుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 91548 46650
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: చిగతుర్పి ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారం **-రంగనాథ్**
సమాధానం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం **-శివరుద్రమ్మ, సర్పంచి, చిగతుర్పి**
సమస్య: పూజారిపల్లి రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది **స్థానికుడు:ఆనందప్ప**
సమాధానం: హరితరాయబారుల ద్వారా తొలగిస్తాం **-కవిత, సర్పంచి, కొంకల్లు**
సమస్య: ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కందూరికాం ఫ్లెక్స్ వరకు చెత్త తొలగించండి. **-వెంకటేశ్‌బాబు**
సమాధానం: కార్మికులతో శుభ్రం చేయిస్తా. **-శంకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, హిందూపురం.**
-న్యూస్‌టుడే, గుడిబండ, హిందూపురం సాంస్కృతికం

సమస్య: వీరజ్జనపల్లి ఎస్సీ కాలనీలో మురుగు ప్రవహిస్తోంది. **-హనుమంతరాయుడు**
సమాధానం: హరితరాయబారుల ద్వారా తొలగిస్తాం. **- తిప్పేస్వామి, సర్పంచి, మోరుబాగల్**
సమస్య: కురుబరపల్లి బీసీ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **-నారాయణప్ప**
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. **-అమరీశ్, పంచాయతీ కార్యదర్శి**
-న్యూస్‌టుడే, గుడిబండ

చిట్టి బుర్రలు.. వినూత్న ఆలోచనలు

రాష్ట్రస్థాయికి ఎంపికైన నమూనాలు

లేపాక్షి, హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: వారందరూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు. చదువుతో పాటు చిట్టి బుర్రలతో వినూత్న ఆలోచనలు చేసి సృజనాత్మకమైన నమూనాలను ఉపాధ్యాయుల పర్యవేక్షణలో రూపొందించి అందరితో ఔరా అనిపించుకున్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని తమ ఆవిష్కరణలను ప్రదర్శించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరు రూపొందించిన నమూనాల గురించి తెలుసుకుందాం.

నీరు, విద్యుత్తు ఆదా చేయడం ఎలాగంటే..

◆ **విద్యార్థులు:** యశ్వంత్, జగన్నాథ్
◆ **పాఠశాల:** జ్యోతిబా పులే బీసీ గురుకుల పాఠశాల, లేపాక్షి
◆ **ప్రాజెక్టు:** ప్రతి నీటి బొట్టు లెక్కించబడుతుంది
◆ **పనితీరు:** మన ఇళ్లు, కార్యాలయాలు, ఆస్పత్రుల పైకప్పుపై ఉండే సింటెక్స్ ట్యాంకు నిండినా గమనించక పోవడంతో నీటితో పాటు విద్యుత్తు వృథా అవుతుంది. దీన్ని నివారించేందుకు సింటిక్స్‌లో వాటర్ సెన్సార్ అమర్చుతారు. దీనిద్వారా ట్యాంకులో నీరు పూర్తిగా వచ్చినప్పుడు అలారం మోగడమే కాకుండా మోటార్ ఆటోమెటిక్‌గా ఆగుతుంది. తద్వారా నీరు, విద్యుత్తు ఆదా అవుతుంది. దీన్ని గైడ్ టీచర్ నదీముల్లాబాషా పర్యవేక్షణలో విద్యార్థులు రూపొందించారు.

పంటలను చీడపీడల నుంచి రక్షించే పరికరం

◆ **విద్యార్థులు:** హేమంత్, శబరీష్
◆ **పాఠశాల:** కొటిపి ఉన్నత పాఠశాల, హిందూపురం మండలం
◆ **ప్రాజెక్టు:** చీడపీడల నుంచి పంటలను రక్షించడం
◆ **పనితీరు:** సౌరశక్తితో పనిచేసే ఈ పరికరాన్ని అతి తక్కువ ఖర్చుతో తయారు చేయవచ్చు. సౌరశక్తి సహాయంతో రీఛార్జ్ అయిన బల్బు రాత్రిపూట వెలుగుతూ కీటకాలను ఆకర్షిస్తుంది. ఇలా ఆకర్షితమైన కీటకాలు దాని కింద ఉన్న ఫ్యాన్‌లో బంధింపబడి కింద ట్రేలో ఉన్న నీటిలో పడిపోతాయి. గైడ్ టీచర్ జగదీష్ పర్యవేక్షణలో విద్యార్థులు ఈ నమూనాను రూపొందించారు.

సేంద్రీయ వ్యవసాయంతో లాభాలెన్నో....

◆ **విద్యార్థులు:** వర్షిణి, స్వాతి
◆ **పాఠశాల:** దేమకేతేపల్లి ఉన్నత పాఠశాల, చిలమత్తూరు మండలం
◆ **ప్రాజెక్టు:** సుస్థిర వ్యవసాయం
◆ **పనితీరు:** ప్రస్తుత కాలంలో పెరిగిపోతున్న కృత్రిమ ఎరువులు, క్రిమి సంహారక మందుల ప్రభావంతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వీటన్నింటి బదులు సేంద్రీయ పదార్థాలు, పంచగవ్య, వేప నూనె, ఆవు మూత్రం వంటివి వాడి సారవంతమైన నేలను భవిష్యత్ తరాలకు అందించాలి. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుంది. గైడ్ టీచర్ రూపారాణి పర్యవేక్షణలో విద్యార్థులు రూపొందించిన నమూనా ఇది.

హిందువులంతా ఏకతాటిపై ముందుకెళ్లండి

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: హిందువులందరూ ఏకతాటిపై ముందుకెళ్లినప్పుడు దేశం అభివృద్ధి చెందుతుందని కోన కణ్వాశ్రమం పీఠాధిపతి దత్తానందస్వామి పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలోని ఎంఎఫ్‌రోడ్డులో ఉన్న సరస్వతి విద్యామందిరంలో హిందూ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి, అనంతపురం ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యనిర్వాహక కార్యదర్శి జగదీశ్వరప్రసాద్‌లు మాట్లాడుతూ పిల్లల పెంపకంలో ప్రధాన పాత్ర తల్లిదండ్రులదేనని ఉద్ఘాటించారు. హిందూ సమ్మేళన సంచాలన సమితి సభ్యుడు అశ్వర్థబాబు, సుధాస్రవంతి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా టీచర్స్‌కాలనీలోని చింతుపండు ఫ్యాక్టరీ ఆవరణలోనూ నిర్వహించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కోన కణ్వాశ్రమం పీఠాధిపతి దత్తానందస్వామి

లేపాక్షి, న్యూస్‌టుడే: ప్రపంచంలోనే హిందూ ధర్మం పురాతనమైనదని ఉపాధ్యాయుడు లింగేష్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కొండూరులో జరిగిన హిందూ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందూ మతంలో ఆచరించాల్సిన అంశాలను తెలిపి పరమత దూషణను చేయరాదని సూచించారు.

రొద్దం : సర్వ సమస్యల పరిష్కారానికి భగవద్గీత పఠనమే ఏకైక మార్గమని చిన్నారి హేమలత అనే పదోతరగతి విద్యార్థిని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్ల నేపథ్యంలో ఆదివారం స్థానిక పెన్నానది పరివాహక ప్రాంతం సమీపంలో ఎస్ఆర్ఎస్ లేఅవుట్ వద్ద హిందూవుగా జీవించు హిందువుగా గర్వించు అనే భహిరంగ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చిన్నారులకు పోలియో చుక్కలు తప్పనిసరి

హిందూపురం, న్యూస్‌టుడే: పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు తప్పని సరిగా వేయించాలని హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ అన్నారు. ఆదివారం మూడు నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లోనూ ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ప్రభుత్వ వైద్యులు, అధికారులు, తెదేపా నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు చుక్కలు వేశారు. వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ ప్రభుత్వ వైద్యశాలలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఆర్డీవో

రాష్ట్ర స్థాయికి విద్యార్థినుల ఎంపిక

అనుష, లత

అగళి, న్యూస్‌టుడే: 'వినియోగదారుల హక్కులు-సమస్యల పరిష్కారం' అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీలో మండలంలోని కేజీబీవీ పాఠశాలకు చెందిన ఇంటర్ విద్యార్థిని అనుష ఎంపికైనట్లు ఎస్‌వో నాగరత్నమ్మ తెలిపారు. వ్యాసరచన పోటీలో డి.లత మొదటిస్థానంలో నిలిచిందన్నారు. ఇద్దరు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని, వీరికి ప్రభుత్వం రూ.5000 నగదు బహుమతి అందించిందని సంతోషం వ్యక్తం చేశారు.

తెలుగు తమ్ముళ్ల సంబరాలు

మడకశిర, గుడిబండ, న్యూస్‌టుడే : మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుకు తెదేపా జిల్లా అధ్యక్షుడిగా అధిష్ఠానం నియమించడంతో ఆదివారం తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టారు. పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కష్టపడి పనిచేసే ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుకు అధిష్ఠానం జిల్లా అధ్యక్షుడిగా నియమించడం శుభపరిణామమని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డా.శ్రీనివాసమూర్తి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్ నాగరాజు, సింగిల్ విండో ఛైర్మన్ నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు. గుడిబండలోనూ మండల అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, న్యాయవాది శివకుమార్, జిల్లా వీరశైవలింగాయతల అధ్యక్షుడు దుర్గేశ్, నాయకులు శశిధర్, నాగేంద్రప్ప, రామాంజనేయులు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచారు.

గుడిబండ బస్టాండు వద్ద..

మడకశిరలో సంబరాల్లో తెదేపా నాయకులు

యాదవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

పెనుకొండ, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న యాదవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, కులగణన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహప్ప డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ర.భ.శాఖ అతిథి గృహంలో నియోజకవర్గంలోని యాదవ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 15 శాతం జనాభా ఉన్న యాదవులకు అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉన్నతమైన స్థానం కల్పించలేదు. యాదవులను చైతన్య పరచడానికి ఈనెల 28వ తేదీన యాదవ సంఘం బహిరంగసభ నిర్వహిస్తున్నామన్నారు.. 5లక్షల ఓటర్లున్న యాదవులకు ఉమ్మడి జిల్లాలో జడ్పీటీసీ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, ఉమ్మడి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు జయపాల్, తెదేపా పెనుకొండ పట్టణ కన్వీనర్ శ్రీరాములు, నాయకులు కృష్ణమూర్తి, ఈశ్వర్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న యాదవులు

ఘనంగా అయ్యప్ప మండలపూజ

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలోని సరస్వతీ విద్యామందిర్ సమీపంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో 17వ మండల పూజ ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించారు. పంచామృతాభిషేకం, అయ్యప్పస్వామి అలంకరణ, మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి స్వామివారిని పూలపల్లకిలో విద్యుద్దీపాలంకరణ నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

ధ్యానంతోనే మనసు ప్రశాంతత

మాట్లాడుతున్న నతమల్ అగర్వాల్

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రతి వ్యక్తి నిత్యం ధ్యానం చేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందని బ్రహ్మకుమారీల నేషనల్ కోఆర్డినేటర్ న్యాయనిర్ణేత నతమల్ అగర్వాల్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని సత్యనారాయణపేటలో ఉన్న ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన నతమల్‌అగర్వాల్, బ్రహ్మకుమారీల నిర్వాహకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం న్యాయవాదులు, చార్టెడ్ అకౌంటెంట్ వారికి అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ప్రజాపిత బ్రహ్మకుమారీ నిర్వాహకురాలు సుగంధదీదీ, రాజయోగిని కమల, పెద్దసంఖ్యలో బ్రహ్మకుమారీలు, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

అగళి : మండలంలో నాలుగు అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైనట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇనగలూరు-1, హెచ్‌డీహళ్లి కేంద్రానికి బీసీ-డీ, వడగుంటనహళ్లి, రామనపల్లి సెంటర్‌కు ఓసీలకు కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'పేదలకు అండగా ఎమ్మెల్యే బాలకృష్ణ'

హిందూపురం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే బాలకృష్ణ ఎక్కడున్నా పేదలకు అండగా నిలవాలనే ఆకాంక్షతో నిత్యం పనిచేస్తున్నారని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్, ఎమ్మెల్యే కార్యదర్శులు వీరయ్య, బాలాజీలు అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 20 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.10లక్షలు చెక్కులు లబ్ధిదారులకు అందించారు.

జగన్ జన్మదిన వేడుకలు

హిందూపురం, న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను హిందూపురం, పెనుకొండ, సోమందేపల్లి, లేపాక్షి మండలాల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఆయా కూడళ్లలో కేకులు కోసి సంబరాలు జరుపుకొన్నారు. మిఠాయిలు పంచిపెట్టారు.

విద్యార్థినికి ఆర్థిక చేయూత

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: పట్టణంలోని సువర్ణభారతి జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో మంచి ఉత్తీర్ణత సాధించి రెండో సంవత్సరం చదువుతున్న అక్షితకు తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఆమె ఉన్నత చదువులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న స్థానిక పాండురంగనగర్‌లో ఉన్న లయన్స్‌క్లబ్‌లో అధ్యక్షుడు కలిపి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు దొంతిమ హేంద్రలు విద్యార్థినికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్తులో క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడానికి ముందుంటామన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

హిందూపురం, న్యూస్‌టుడే: పట్టణం పరిగి రోడ్‌లోని న్యూ జెరుసలేం ప్రార్థనా మందిరంలో ఆదివారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ రంగరాజు బైబిల్‌లో యేసుబోధనలు వివరించి ప్రతి ఒక్కరూ శాంతి, కరుణ, దయ కలిగి ఉండాలని అప్పుడే మనకు అన్ని లభిస్తాయన్నారు. మందిరాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఆనంద్, మూర్తి, అరుణ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిషప్ రంగరాజు

విద్యుత్తు కాంతులతో సీఅండ్ఐజీ చర్చి

నీరున్నా నిరుపయోగమే..!

శుభ్రతకు నోచుకోని జీఎల్ఎస్ఆర్‌లు

మడకశిర గ్రామీణం, గుడిబండ, న్యూస్‌టుడే: ప్రజల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల్లో నిర్మించిన జీఎల్ఎస్ఆర్ (గ్రౌండ్ లెవెల్ స్టోరేజ్ రిజర్వాయర్)ట్యాంకులు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఏళ్లుగా ట్యాంకులను శుభ్రపరచకపోవడంతో ఆ నీటిని ప్రజలు ఉపయోగించుకోలేకపోతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 100 జీఎల్ఎస్ఆర్ ట్యాంకులున్నాయి. గతంలో వీటి పరిధిలో 15వేల మందికిపైగా నీటిని వాడుకునేవారు. అయితే వీటిని శుభ్రతను పట్టించుకోకపోవడంతో నీరున్నా నిరుపయోగంగా మారాయి.

సిద్దగిరిలో వృథాగా

గ్రామాల్లో ఇలా..

● మడకశిర మండలం భీమరాయునిపల్లి జీఎల్ఎస్ఆర్ ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత పేరుకుపోయింది. శుభ్రపరచకపోవడంతో నీరున్నా నిరుపయోగంగా మారింది. వైబీహళ్లిలో కుళాయిలు బిగించినప్పుడల్లా ఆకతాయిలు ధ్వంసం చేస్తున్నారని స్థానిక సర్పంచి వాపోతున్నారు. సిద్దగిరి, ఉప్పిడిపల్లి, ఎం.రంగాపురం పాతకాలనీ, సి.రంగాపురం జీఎల్ఎస్ఆర్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని పట్టించుకునే వారే కరవయ్యారు.

● గుడిబండ మండలంలో ఎన్ఆర్ రొప్పం, కల్లురొప్పం, కొంకల్లు, కురుబరపల్లి, కేకేపాళ్యం, హిరేతుర్పి తదితర గ్రామాల్లో జీఎల్ఎస్ఆర్‌లు ఉన్న పని చేయడం లేదు.

ఉపరితల ట్యాంకులు నిర్మిస్తున్నాం

గతంలో అప్పటి ప్రజల అవసరం మేరకు జీఎల్ఎస్ఆర్‌ల నిర్మాణం చేశారు. ఆ ట్యాంకుల వద్దనే నీటిని పట్టుకునే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం ఉపరితల ట్యాంకులు నిర్మిస్తున్నాం. కుళాయిల ద్వారా నీటి సరఫరా చేసే సౌలభ్యం ఉంది. **-హరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరు, గుడిబండ**

భవనాన్ని పూర్తి చేయండి



చిగతుర్పిలో అంగన్‌వాడీ భవనం అర్ధాంతరంగా ఆగిపోయింది. గత వైకాపా ప్రభుత్వంలో నిధులు పూర్తిగా విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. కిటికీలు, వాకిళ్లు, ఫ్లోరింగ్ ప్లాస్టింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఈ విషయమై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ మాట్లాడుతూ పనులు పూర్తిచేసేందుకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. **-న్యూస్‌టుడే, గుడిబండ**

ఒరిగిన స్తంభం.. ప్రమాదకరం



స్థానిక ఒకటోవార్డు శ్రీకన్యకపరమేశ్వరి ఆలయం వెనుక వీధిలో ఓ విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. అంతేకాదు చేతితో ముట్టుకుంటే కదులుతోంది. ఏదైనా సమస్యపై ఆ స్తంభం ఎక్కాలన్నా భయపడుతున్నారు. ఏం జరగకముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యను మండల ఏఈ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా సిబ్బందిని పంపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. **-న్యూస్‌టుడే, గోరంట్ల**

ఒకరి ఆత్మహత్య

రొద్దం, న్యూస్‌టుడే : తన భార్య గిరిజమ్మ పుట్టింటికి వెళ్లి తిరిగి కాపురానికి రాలేదని బైలాంజనేయులు(50) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తురకలాపట్నంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బైలాంజనేయులు ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. కొన్ని నెలల నుంచి భార్య కాపురానికి రాలేదని, తాగుడికి బానిసై మనస్తాపంతో ఆదివారం అఘాయిత్యానికి పాల్పడినట్లు అతడి బంధువులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆత్మీయం.. పూర్వవిద్యార్థుల సమ్మేళనం

హిందూపురం, న్యూస్‌టుడే: స్థానిక ఎంజీఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన 1991-92 పదోతరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆత్మీయంగా సాగింది. ఈ సందర్భంగా ఆర్గనైజర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ తమకు విద్యాబుద్ధులు అందించిన పాఠశాలను ఎన్నటికీ మరువలేమన్నారు.

ఎంజీఎం మున్సిపల్ పాఠశాలలో..

పెనుకొండలో గురువులతో పూర్వవిద్యార్థులు

పెనుకొండ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విన్సెంట్‌ఫెర్రర్ కళామందిరంలో 1990-93 బీఏ డిగ్రీ బ్యాచ్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈసదర్భంగా మిత్రులందరూ కలిసి తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలతో సత్కరించారు. కళాశాలలో జరిగిన సంఘటనలు గుర్తుచేసుకున్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

హిందూపురం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్మాణాలను చేపట్టాలని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని 36వార్డు ముద్దిరెడ్డిపల్లిలోని అయ్యప్పదేవాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న కాలువ పనులను ఛైర్మన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30సం.రాలుగా డ్రైనేజీ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ నీరంతా రోడ్లపైకి వచ్చి దుర్వాసనతో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని గత వారంలో వార్డు పర్యటనలో నా దృష్టికి రావడంతో 15 ఆర్థిక సంఘం నిధులతో నూతన కాలువ నిర్మాణం చేపట్టామన్నారు. అనంతరం నాణ్యతగా పనులు చేయాలని మున్సిపల్ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భారతి, ఎంఈ దస్తగిరి, ఏసీపీ చంద్రమ్మ, సచివాలయ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలను ఛైర్మన్‌కు వివరిస్తున్న మహిళలు

పంచాయతీ కార్మికుల వేతన వెతలు

గోరంట్లలో చెత్తతొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

మూడు నెలలుగా అందక అవస్థలు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు సెప్టెంబరు నుంచి వేతనాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరు పూర్తి కావస్తున్నా ఇప్పటికీ చెల్లించడం లేదని వాపోతున్నారు. అసలే అంతంత మాత్రం జీతాలతో కుటుంబాలు నెట్టుకొస్తున్న తమకు నాలుగు నెలలుగా వేతనాలు రాకపోతే భార్య, పిల్లలను ఎలా పోషించాలని ప్రశ్నిస్తున్నారు. ఒకరోజు ఆలస్యమైన ఎప్పుడు అందుతాయాని ఎదురుచూసే పరిస్థితి ఉంటుందని కన్నీరు పెడుతున్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ఎనలేని కృషి చేస్తున్నామని, నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాలు ఎలా నెట్టుకురావాలంటున్నారు.

● వందమంది వరకు: మేజర్ పంచాయతీ వంద మంది వరకు కార్మికులు ఉన్నారు. ఇందులో 60 మంది వరకు సాధారణ వర్గానికి చెందిన వారు కాగా మిగిలిన వారు స్వచ్ఛభారత్‌కింద ఎంపికైన వారు. ఒక్కొక్కరికి నెలకు రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు అందుతున్నట్లు తెలిపారు. త్వరగా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని విన్నవిస్తున్నారు.

బిల్లు పెట్టాం

సెప్టెంబరు నుంచి వేతనాలు అందని విషయం వాస్తవమే. నవంబరు వరకు మూడునెలల బిల్లులు వారం క్రితమే పంపించాం. ట్రెజరీలో జమ కావాల్సి ఉంది. మరోసారి అధికారులతో మాట్లాడి ఆలస్యం లేకుండా అందేవిధంగా చర్యలు తీసుకుంటా. **సాయిసంజయ్, పంచాయతీ కార్యదర్శి, గోరంట్ల**

గోరంట్లలో నారా బ్రాహ్మణి జన్మదిన వేడుకలు

గోరంట్ల, న్యూస్‌టుడే: స్థానిక ఆంజనేయస్వామి కాలనీలో మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి ఆధ్వర్యంలో ఆదివారం నారాబ్రాహ్మణి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాలనీతో పాటు కూటమి పార్టీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కేకుకోసి వేడుకలు చేసుకున్నారు.

కేకుకోస్తున్న మహిళలు

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

హిందూపురం, న్యూస్‌టుడే: సిద్ద సమాధి యోగ, ఎస్‌కేయూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆచార్యులు సదాశివరెడ్డి బృందం ప్రతినిధులు నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. రాత్రి రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు, వాల్మీకి కూడలి, చిన్న మార్కెట్, పరిగి బస్టాండు, సూగూరు ఆంజనేయస్వామి దేవాలయం, రహదారి సమీపంలో నిద్రిస్తున్న దాదాపు 75 మంది నిరాశ్రయులకు ఈ దుప్పట్లు అందించినట్లు ఆచార్యులు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక సేవలు, మాండలిక రచయిత సడ్లపల్లె చిదంబరరెడ్డి, ఉపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, సిద్దగిరిశ్రీనివాసులు, అధ్యాపకులు ఏటిగడ్డ అశ్వర్థనారాయణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో నిరాశ్రయులకు దుప్పట్లు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

(c) eenadu

ఇంటి వద్దకే ఆర్టీసీ పార్సిల్ సేవలు

మాసోత్సవ బ్యానర్ ఆవిష్కరిస్తున్న డీఎం ఇనాయతుల్లా, ఉద్యోగులు సిబ్బంది

పుట్టపర్తి, న్యూస్‌టుడే: కార్గో సేవల్లో భాగంగా పది కిలో మీటర్లలోపు 50 కిలోల బరువు పార్సిళ్లను తక్కువ ధరలకు ఇళ్ల వద్దకే అందిస్తామని ఆర్టీసీ డిపో మేనేజరు ఇనాయతుల్లా తెలిపారు. ఆయన ఆదివారం ఆర్టీసీ డిపోలో ఉద్యోగులు, సిబ్బందితో కలిసి కార్గో మాసోత్సవ బ్యానరును ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సదుపాయం పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి, మడకశిర, పెనుకొండ డిపోల పరిధిలోనే కల్పించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పుట్టపర్తి

•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఉక్కునగరం (స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే: నిస్వార్థ సేవే సానుకూల సామాజిక మార్పునకు పునాది అని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఉక్కునగరం శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఆదివారం జరిగిన రజతోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వినయం, నిస్వార్థ సేవే శ్రీసత్యసాయి సేవా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, ప్రతినిధులు ఆర్.లక్ష్మణరావు, పి.ఆర్.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039
కదిరి : 80085 73033
ధర్మవరం: 99596 98222

సమస్య: పురపాలిక పరిధిలోని ఎనుములపల్లి బీసీ కాలనీలో మురుగు రోడ్లపై పారుతూ దుర్వాసన వస్తోంది. **-సతీష్, నాగరాజు, గ్రామస్థులు**

పరిష్కారం: వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తాం. **-శివయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

-న్యూస్‌టుడే, పుట్టపర్తి పట్టణం

సమస్య: చెన్నేకొత్తపల్లి మండలం ఒంటికొండ నుంచి నారాయణపురం(?) గ్రామానికి వెళ్లే దారికి ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి రాకపోకలకు కష్టం ఉంది. **- నారాయణస్వామి, స్థానికుడు**

సమాధానం: కంపచెట్లు తొలగించేందుకు చర్యలు చేపడతాం. **- అశోక్, పంచాయతీ కార్యదర్శి**

సమస్య: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు తాగేందుకు శుద్ధ నీటిని ఉంచడంలేదు. శుద్ధ జలం అందుబాటులో ఉంచేందుకు కృషి చేయాలి. **- నాగేంద్ర, స్థానికుడు**

సమాధానం: శుద్ధ జలం అందుబాటులో ఉంచుతాం. **-నరసింహమూర్తి, వసతి గృహ పర్యవేక్షకుడు**

సమస్య: చెన్నేకొత్తపల్లి బీసీ కాలనీలోని రెండో వీధిలో దారికి ఇరువైపులా ఉన్న నివాసాల వారు వృథా నీటిని దారిపై వదులుతుండటంతో అపరిశుభ్రత నెలకొంది. **- గోవిందు, స్థానికుడు**

సమాధానం: కాలువల నిర్మాణానికి నివేదికలు పంపించాం. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తాం. **-అశోక్, పంచాయతీ కార్యదర్శి**

- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి

చిట్టి మెదళ్లు.. గట్టి ఆలోచనలు

అబ్బురపరిచిన వైజ్ఞానిక నమూనాలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కళ్లెదుట కనిపిస్తున్న సమస్యలకు విద్యార్థులు తమ ఆలోచనలతో పరిష్కారం చూపేలా ప్రాజెక్టులతో వినూత్న ఆవిష్కరణలు చేశారు. దీనికి వైజ్ఞానిక మేళా వేదికగా నిలిచింది. గైడ్ ఉపాధ్యాయుల సలహాలు, సూచనలు తోడ్పడ్డాయి. నమూనాల లక్ష్యం, ఎలా పనిచేస్తాయో విద్యార్థులు వివరించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన కొన్ని ప్రాజెక్టుల గురించి తెలుసుకుందాం... రండి.

త్రిభుజాకార మరుగుదొడ్లు

కలెక్టర్‌కు ప్రాజెక్టు గురించి వివరిస్తున్న కోరేవాండ్లపల్లి విద్యార్థులు

విద్యార్థుల పేరు: బిందుశ్రీ, ఉదయ్ కుమార్
పాఠశాల: జడ్పీహెచ్ఎస్, కోరేవాండ్లపల్లి
మండలం: గోరంట్ల
ప్రాజెక్టు పేరు: సులభ్ టాయిలెట్
ప్రయోగం: సాధారణంగా మరుగుదొడ్లు చతురస్రం, దీర్ఘ చతురస్రం ఆకారాల్లో నిర్మిస్తుంటారు. పట్టణాలు, రైల్వేస్టేషన్, మార్కెట్లు, పాఠశాలల్లో స్థలం తక్కువగా ఉండడంతో అవసరానికి తగినట్లుగా టాయిలెట్లు అందుబాటులో ఉండవు. దీనికి పరిష్కారం త్రిభుజాకారం మరుగుదొడ్లు. తక్కువ స్థలంలో ఎక్కువ సంఖ్యలో వీటిని నిర్మించవచ్చు. మూలల్లో హ్యాండ్ వాష్, మరుగుదొడ్లలో ఉపయోగించే సామగ్రిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకునే వీలుంటుంది.

ప్రతి నీటి బొట్టు విలువైనదే

ప్రాజెక్టు నమూనాతో విద్యార్థులు

విద్యార్థుల పేరు: యశ్వంత్, జగన్ నాయక్
పాఠశాల: మహాత్మా జ్యోతిబా పులే, లేపాక్షి
మండలం: లేపాక్షి
ప్రాజెక్టు పేరు: వాటర్ కన్జర్వేషన్ అండ్ మేనేజ్‌మెంట్
ప్రయోగం: బోర్ల నుంచి ట్యాంకులకు నీరందించే సమయంలో ఒక్క బొట్టు, విద్యుత్తు వృథా కాకుండా కాపాడుకోవడమే దీని లక్ష్యం. మోటారు, ఆటో స్టార్ట్, స్విచ్‌లు, సెన్సార్లు, అలారం పరికరాలతో ప్రాజెక్టు రూపొందింది. ట్యాంకులు నిండినపుడు ఆటోమేటిక్‌గా సెన్సార్ల ద్వారా అలారం మోగడం, స్విచ్ ఆన్‌లో ఉన్నా మోటారు నిలిచిపోవడంతో చుక్క నీరు, విద్యుత్తు వృథా కాదు.

సేంద్రియ సాగుకు పెద్దపీట

ప్రాజెక్టుతో విద్యార్థులు, గైడ్ టీచర్ రూపారాణి

విద్యార్థి పేరు: వర్షిని, లాస్య
పాఠశాల: జడ్పీహెచ్ఎస్, దేమకేతేపల్లి
మండలం: చిలమత్తూరు
ప్రాజెక్టు పేరు: సుస్థిర వ్యవసాయం
ప్రయోగం: ప్రస్తుతం పంట సాగులో కృత్రిమ ఎరువులు, క్రిమిసంహారక మందుల ప్రభావంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి సేంద్రియ ఎరువులు ఉపయోగించాలి. పంచగవ్య, వేపనూనె, ఆవు మూత్రం తదితరాలతో సహజంగా నేలను సారవంతం చేయాలి. ఫలితంగా మొక్కలు ఆరోగ్యంగా ఎదిగి అధిక దిగుబడులు వస్తాయి. భావి తరాలకు ఆరోగ్యకర నేలతో పాటు పోషక విలువలతో కూడిన ఉత్పత్తులు అందించడమే లక్ష్యం.

తక్కువ ఖర్చుతో సస్యరక్షణ

నమూనాతో విద్యార్థులు, గైడ్ టీచర్ జగదీశ్

విద్యార్థుల పేర్లు: శబరీష్, హేమంత్
పాఠశాల: జడ్పీహెచ్ఎస్, కొటిపి
మండలం: హిందూపురం
ప్రాజెక్టు పేరు: సోలార్ ఇన్‌సెక్ట్ ట్రాప్
ప్రయోగం: పొలాల్లో పంటలను ఆశించే క్రిమికీటకాల నివారణ ఖర్చు రైతులకు పెద్ద సమస్య. సౌరశక్తితో పనిచేసే ఈ పరికరం రీఛార్జి శక్తితో రాత్రివేళల్లో వెలుగుతూ కీటకాలను ఆకర్షిస్తుంది. ఆ కీటకాలు దాని కింద ఏర్పాటు చేసిన ఫ్యాన్‌లో బంధించబడి కిందనున్న ట్రేలోని నీటిలో పడి చనిపోతాయి. తద్వారా పంటలకు నష్టం కలగకుండా ఉంటుంది. రైతుకు క్రిమిసంహారక మందుల ఖర్చు, శ్రమ తగ్గుతుంది.

కార్యకర్తలకు అండగా ఉంటా: మాజీ మంత్రి

బుక్కపట్నం, న్యూస్‌టుడే: తెదేపా నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని మాజీ మంత్రి, ఆ పార్టీ సీనియర్ నేత పల్లె రఘునాథరెడ్డి తెలిపారు. మండలంలోని మారాలకు చెందిన నాయకుడు నారాయణస్వామి, కొట్లాటకు చెందిన పార్టీ నాయకుడు లక్ష్మీనారాయణ భార్య గంగమ్మ ఇటీవల మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ మంత్రి ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఆరోగ్యానికి ధ్యానం దోహదం

ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యానం, శాకాహారంతో ఆరోగ్యంగా ఉంటారని, ఏకాగ్రత లభిస్తుందని, ఊపిరితిత్తులు బలపడతాయంటూ పిరమిడ్ కేంద్రం సభ్యులు నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. పట్టణ ప్రధాన రహదారుల మీదుగా సాగిన ర్యాలీ తిరిగి పిరమిడ్ ధ్యాన కేంద్రాన్ని చేరింది. – న్యూస్‌టుడే, ధర్మవరం

ఘనంగా అయ్యప్ప మండలపూజ

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలోని సరస్వతీ విద్యామందిర్ సమీపంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో 17వ మండల పూజ ఆదివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభించారు. పంచామృతాభిషేకం, అయ్యప్పస్వామి అలంకరణ, మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి స్వామివారిని పూలపల్లకిలో విద్యుద్దీపాలంకరణ నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

ఉపాధి పథకం పేరు మార్పుపై నిరసన

జీవో ప్రతులను కాలుస్తున్న రైతు సంఘం నాయకులు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పును కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా రద్దు చేయాలంటూ ఏపీ రైతు సంఘం, సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. పుట్టపర్తిలోని ధర్మశాల వద్ద ఆదివారం జరిగిన నిరసనలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. కేంద్రం ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని నీరుగార్చేలా(?) చట్టాన్ని సవరించిందని, గాంధీ అంటే భాజపాకు ఎందుకంత కోపమో తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. భాజపా మహాత్ముడిని మరిచినా, చరిత్ర మరవదన్నారు. అనంతరం రైతు సంఘం నాయకులు జీవో కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు హరి, పెద్దన్న, అంజి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీ

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: బస్సులో మరిచిపోయిన చరవాణిని ప్రయాణికురాలికి అప్పగించిన ఆర్టీసీ డ్రైవర్ నిజాయతీని డిపో సిబ్బంది అభినందించారు. ఆదివారం పుట్టపర్తి-అనంతపురం బస్సులో అనంతపురం వెళ్లిన సునీత అనే ప్రయాణికురాలు తన సెల్‌ఫోన్ మరిచిపోయారు. గమనించిన డ్రైవర్ సుబహాన్ దాన్ని పుట్టపర్తి డిపో మేనేజర్‌కు అప్పగించారు. అనంతరం ఆయన దాన్ని ప్రయాణికురాలి వద్దకు చేర్చారు.

అలరించిన ఉపాధ్యాయుల క్రీడాపోటీలు

సాధించిన ట్రోఫీలతో విజేతలు

కదిరి, న్యూస్‌టుడే: కదిరిలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడాపోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. సిమ్స్ ఆసుపత్రి ఎండీ నిసార్‌యాసిన్ ఖాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో కదిరితో పాటు పరిసర పది మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తొలుత ముఖ్య అతిథులు నిసార్‌యాసిన్, ఎంఈఓలు చెన్నకృష్ణ, రమణ, శ్రీనివాసులు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం క్రీడలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. దీనివల్ల వారు రెట్టింపు ఉత్సాహంతో చక్కగా పాఠాలు చెబుతారన్నారు. అనంతరం పలు అంశాల్లో ఉపాధ్యాయులు పోటీపడ్డారు.

విజేతలు వీరే..: పురుష ఉపాధ్యాయుల వాలీబాల్ ఫైనల్స్‌లో తలుపులపై నంబులపూలకుంట జట్టు గెలిచింది. ఉపాధ్యాయినులకు జరిగిన టెన్నికాయిట్‌లో సింగిల్స్‌లో సుజాత విజేతగా నిలవగా, మహేశ్వరి రన్నర్‌గా సంతృప్తి చెందారు. డబుల్స్‌లో సుజాత, సృజన మొదటి స్థానంలో నిలవగా, సీతారత్నం, శ్యామల రెండో స్థానం సాధించారు. షటిల్ సింగిల్స్‌లో లక్ష్మీరాజ్యం, మహేశ్వరి తొలి రెండు స్థానాల్లో నిలిచారు. డబుల్స్‌లో లక్ష్మీరాజ్యం, శ్రీవాణి విజేతలుగా నిలవగా, అనురాధ, లలితమ్మ రన్నర్స్‌తో సంతృప్తి చెందారు. విజేతలకు నిసార్‌యాసిన్‌ఖాన్, మైనుద్దీన్ ట్రోఫీలు ప్రదానం చేశారు. పోటీలను ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రెడ్డి, పీడీలు షఫీ, హరిప్రసాద్, యూటీఎఫ్ నాయకులు తాహిర్‌వలి, మల్లికార్జున, ఆజంబాషా, సునీల్, మధుసూదన్, ఖాజామోహిద్దీన్ తదితరులు పర్యవేక్షించారు.

క్రికెట్: ఫైనల్స్‌లో ధర్మవరం, కదిరి జట్లు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి ప్రభుత్వ ఉపాధ్యాయ క్రికెట్ పోటీల్లో ధర్మవరం, కదిరి జట్లు ఫైనల్స్‌కు చేరాయి. ఆదివారం పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్‌బాబు, విద్యాశాఖధికారులు గోపాల్‌నాయక్, రాజేశ్వరీదేవి ప్రారంభించారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన సెమీఫైనల్స్‌లో పెనుగొండ, ధర్మవరం, కదిరి, పుట్టపర్తి జట్లు తలపడ్డాయి. ధర్మవరం పెనుగొండపై, కదిరి పుట్టపర్తిపై గెలిచాయి. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లుగా వెంకటేష్‌నాయక్ (ధర్మవరం), ఆనంద్‌నాయక్ (కదిరి) నిలిచారు. సోమవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఫైనల్స్ జరుగుతుందని విద్యాశాఖాధికారులు తెలిపారు.

చిన్నారులకు రెండు చుక్కలు

కనగానపల్లిలో..చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

కదిరి: బుజ్జాయికి చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో విజయవంతమైంది. 0-5 ఏళ్లలోపు చిన్నారులకు రెండు చుక్కల పోలియో మందును వైద్యుల పర్యవేక్షణలో ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు వేశారు. 99 శాతంపైగా చిన్నారులకు చుక్కల మందు అందిందని, మిగిలిపోయిన ఒక శాతం మందికి నేడు, రేపు ఇంటింటికీ వెళ్లి వేస్తారని జిల్లా వైద్యాధికారిణి ఫైరోజ్ బేగం తెలిపారు. –న్యూస్‌టుడే బృందం

ధర్మవరం ప్రభుత్వాసుపత్రిలో..

నల్లమాడలో..

వృద్ధుల బాధ్యత కుటుంబ సభ్యులదే

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సొసైటీ, విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం జరిగింది. ఇందులో వృద్ధుల సంరక్షణ, సమస్యలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ వృద్ధుల సంరక్షణ బాధ్యత కుటుంబ సభ్యులదేనని, వారు నిరాదరణ చూపితే స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలని అన్నారు. వారు వయసులో ఉన్నప్పుడు కుటుంబాన్ని ఉన్నత స్థాయికి తెచ్చేందుకు ఎంతో శ్రమించారని, ఇప్పుడు వృద్ధాప్యంలో పట్టించుకోకపోవడం తగదన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు సత్యనిర్ధారణ్, కొండయ్య, నారాయణమూర్తి, సుజాతమ్మ, శ్రీనివాసులు, నారాయణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కంకర పరిచారు.. వదిలేశారు

ముదిగుబ్బలో కదిరి జాతీయ రహదారి నుంచి కాలనీలోకి వెళ్లే అప్రోచ్ రోడ్డులోకి రావాలంటే స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ, డ్రైనేజీ నిర్మాణ పనుల్లో భాగంగా గుత్తేదారు కంకర వేసి వదిలేశారు. దీనిపై రాకపోకలు సాగించడానికి ద్విచక్ర వాహనాలు, ఆటో చోదకులు అవస్థలు పడుతున్నారు. ఆదివారం లోడుతో కూడిన మినీ ఆటో చక్రాలు కంకరలో ఇరుక్కుపోయింది. చేసేదీలేక చోదకుడు అక్కడే లోడు దించి ముందుకు సాగాడు. రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు, వాహనాల చోదకులు వాపోతున్నారు. **-న్యూస్‌టుడే, ముదిగుబ్బ**

ఘనంగా హిందూ సమ్మేళనం

ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది హిందూ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆర్ఎస్ఎస్ సంచాలకులు చంద్రమోహన్, కింకిరవాండ్లపల్లికి చెందిన భాస్కర్‌స్వామి, ఎంపీపీ ఆదినారాయణయాదవ్, భాజపా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సోమల ప్రకాష్‌నాయుడు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులందరూ ఐక్యమత్యంగా ఉండాలని, సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హిందూ సమాజానికి అన్యాయం జరిగినప్పుడు ఎలుగెత్తి చాటడానికి హిందువులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామస్థులు, హిందూ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మిత్రుల చేయూత

నల్లమాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రానికి చెందిన పి.హసన్‌ఖాన్ అనే వ్యక్తి అనారోగ్య కారణాలతో ఇటీవల మృతి చెందారు. ఈ సమాచారం అందుకున్న సహధ్యాయులు సూర్యనారాయణరెడ్డి, అబ్దుల్‌రఫీ, సుధాకర్ రెడ్డి, రంగనాయుకులు, సి.గోపాల్ రెడ్డి, నాగభూషణం, వేణుగోపాల్, దామోదర్‌రెడ్డి, మహబూబ్‌బాష, అబ్దుల్ హమీద్ ఆదివారం మిత్రుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుడి కుమారుడు బాబాజాన్‌కు రూ.13వేలు ఆర్థిక సాయం అందజేశారు.

తరలించరు.. తగలబెడుతున్నారు

మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ సున్నపుగుట్ట తండా ప్రధాన రహదారిపై పేరుకుపోతున్న వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బంది తరలించడంలో జాప్యం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు వాటికి నిప్పు పెడుతుండంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపిస్తోంది. సమీప నివాస ప్రాంతాల ప్రజలు, వాహనచోదకులు పొగతో అవస్థలు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలను క్రమం తప్పకుండా తరలించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కదిరి గ్రామీణం

మాజీ సీఎం జన్మదిన వేడుకలు

ధర్మవరం పట్టణం: వైఎస్సార్ విగ్రహం వద్ద కేకు కోస్తున్న వైకాపా నాయకులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇక్కడి వైఎస్సార్ విగ్రహం వద్ద నాయకులు కేకు కోసి అందరికీ పంచారు. తాడిమర్రిలో డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు జగన్ పుట్టిన రోజు వేడుకలు జరుపుకొన్నారు.

నంబులపూలకుంట, న్యూస్‌టుడే: మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను వైకాపా మండల కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వేడుకగా నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి కేకు కోసి అందరికీ పంచిపెట్టారు.

28న యాదవ సంఘం మహాసభ

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: పుట్టపర్తిలో ఈ నెల 28న యాదవ సంఘం మహాసభ జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసప్ప తెలిపారు. ఆయన ఆదివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ వసతిగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తమ వర్గం జనాభాను దృష్టిలో ఉంచుకుని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. యాదవులందరూ ఐక్యంగా ముందుకు సాగుతూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహాసభకు యాదవులందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు శ్రీరామ్, సూర్యనారాయణ, రామచంద్ర, సుధాకర్, ఆంజనేయులు, శ్యామ్‌ప్రసాద్, బయప్ప, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కంది పంటైనా చేతికందేనా?

వాతావరణం మార్పులతో తెగుళ్ల బాధ

మారక పురుగు సోకడంతో పూతలేని కంది

ధర్మవరం పట్టణం, ముదిగుబ్బ, తాడిమర్రి, న్యూస్‌టుడే: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన కంది పంట చేతికందుతుందా లేదా అన్న ఊగిసలాటలో అన్నదాతలు పడ్డారు. పంట వేసిన నాటినుంచి వాతావరణంలో నెలకొన్న మార్పులతో పూతపడే సమయంలో వర్షాలు కురిశాయి. ఫలితంగా పలుచోట్ల పూత రాలిపోతోంది. దీనికితోడు ఆకులపై మారక పురుగు (తెగులు) వ్యాప్తి చెందుతుండటంతో కంది కాయలు వృద్ధి చెందడం లేదు. పంట వేసిన నెల రోజులకే వర్షాలు కురవడంతో బాగా దెబ్బతింది. సంరక్షించుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. మచ్చ తెగులును నివారించుకొని.. కాసిన కాయల సంరక్షణకు రూ.వేలు వెచ్చించి ఖరీదైన మందులను ప్రతి 15 రోజులకోసారి పిచికారీ చేస్తున్నారు. అరకొర దిగుబడితోనైనా పెట్టుబడులు దక్కించుకుంటే చాలని కర్షకులు యత్నిస్తున్నారు.

వేరుసెనగకు ప్రత్యామ్నాయంగా..

జిల్లాలో ఐదారేళ్లుగా వేరుసెనగ సాగు నానాటికి తగ్గిపోతోంది. సకాలంలో వర్షాలు కురవక, సరైన దిగుబడులు రాక, వచ్చినా ధరలు లేక చాలామంది రైతులు వేరుసెనగకు విరామం ప్రకటించి ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టారు. ఈక్రమంలో కంది, ఉలవ, జొన్న, సద్దలు, రాగులు, అలసందలు, మొక్కజొన్న తదితర పంటల వైపు మళ్లారు. అధిక శాతం రైతులు కంది పంటనే సాగు చేస్తున్నారు. ఎకరాకు సరాసరి రూ.15వేలు వరకు పెట్టుబడులు వెచ్చించి పంటను కాపాడుకుంటున్నారు. ఏపుగా పెరిగి పూత, పిందె వస్తున్న దశలో కందికి వాతావరణం, వర్షాలు శాపంగా మారాయి. అన్నీ సక్రమంగా ఉంటే ఎకరాకు 4 నుంచి 6 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుత స్థితిలో రెండు నుంచి మూడుకంటే ఎక్కువగా వచ్చేలా కనబడటం లేదని రైతులు వాపోతున్నారు. డివిజన్ వ్యాప్తంగా 27,910 ఎకరాల్లో కంది పంట సాగులో ఉంది.

సూచించిన మందులు పిచికారీ చేయాలి

వాతావరణంలో నెలకొన్న మార్పులతో కంది పంటకు మారక తెగులు సోకింది. దీనికి ఇమాయిక్టివ్ (0.3 ఎంఎల్) లేదా, లామ్డోసయోత్రిన్ (వన్ ఎంఎల్) లేదా నివాల్విరిన్ (వన్ ఎంఎల్) మందును వేపనూనె (5ఎంఎల్)తో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది. సూచించిన మందులు వాడితే పూత రాలకుండా ఉంటుంది. **-లక్ష్మానాయక్, డివిజన్ వ్యవసాయాధికారి**

ముగ్గురు పిల్లలు, తల్లి అదృశ్యం

నేరేడ్‌మెట్, న్యూస్‌టుడే: ముగ్గురు పిల్లలతో కలిసి బయటికెళ్లిన తల్లి కనిపించకుండా పోయిన ఘటన హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని పుట్టపర్తికి చెందిన మహిళ(32) తన భర్త, ముగ్గురు పిల్లలతో కలిసి స్థానికంగా నివసిస్తోంది. ఈ నెల 1న భర్తతో గొడవపడిన ఆమె, మరునాడు ఇంట్లో చెప్పకుండా పిల్లలను తీసుకొని సైనిక్‌పురిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. 4న తన స్వగ్రామానికి వెళుతున్నట్లు వారికి చెప్పి బయల్దేరింది. భార్య, పిల్లల కోసం గాలించిన ఆమె భర్త ఆచూకీ లభించక పోలీసులను ఆశ్రయించాడు. శనివారం రాత్రి అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

ప్రమాదంలో ప్రధానోపాధ్యాయుడికి గాయాలు

బుక్కపట్నం, న్యూస్‌టుడే: మండలంలోని సిద్ధరాంపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్ ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వంద రోజుల ప్రణాళిక కార్యాచరణలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులకు ఆయన హాజరయ్యారు. తరగతులు ముగిసిన తర్వాత ద్విచక్ర వాహనంపై వెళుతుండగా బుచ్చయ్యగారిపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో గాయాల పాలయ్యారు. స్పందించిన స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం 108 వాహనంలో సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

క్రైం కార్నర్

జూదరుల అరెస్టు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: పట్టణ శివారులోని బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం కొంతమంది జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో దాడులు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు. ముదిగుబ్బకు చెందిన ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2,200లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా జూదం ఆడినట్లు తెలిస్తే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

IN THE COURT OF THE Prl. DISTRICT JUDGE, ANANTHAPURAMU
E.A. No. 1189 /2025, in E.P. No. 773/2024 in O.S. No. 38/2023
Between:
Y.Vijaya Lakshmi .. **Petitioner/D.Hr**
And
Chitapulusu Krishna Kumari
.. **Respondent/J.Dr**
Notice to the J.Dr
To,
Chintahapulusu Krishna Kumari wife of C.Peddanna, House wife, D.No.15-111, S.B.I. Colony Dharmavaram, Sri Sathyasai Dist.
పై నెంబరు కేసులో J.Dr. అయిన మీ హాజరు నిమిత్తము 09-01-2026వ తేది ఉదయం 10.30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(By Order of the Court)
N.R.K. Mohan, Advocate, Ananthapuramu. Cell: 9440787100

(c) eenadu

ఈనాడు
శ్రీకాకుళం
సోమవారం డిసెంబరు 22, 2025

ధనుష్ పవన్‌సాయి

ఆడుకుంటామన్నారు.. అందని లోకాలకు వెళ్లిపోయారా..!

వారు నవ్వితే ఇల్లంతా సందడే
మాట్లాడితే కన్నోళ్లకు పట్టలేని సంతోషం
ఒక తల్లి కడుపున పుట్టకపోయినా
స్నేహ బంధంతో చివరి వరకు సాగారు
అల్లరి, ఆటపాటలే తెలిసిన వారికి
ప్రమాదం పొంచి ఉందని తెలియదు
అభం శుభం తెలియని ఆ చిన్నారులను
మృత్యువు పుష్కరిణి రూపంలో మింగేసింది
కన్నోళ్ల ఆశలు పేక మేడలా కూల్చేసింది..
బోసి నవ్వుల్ని మాయం చేసి
కడుపుకోత మిగిల్చింది

పుష్కరిణిలో మునిగి ఇద్దరు చిన్నారుల మృతి

ఆమదాలవలసలో విషాద ఘటన

ఆమదాలవలస పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన శంకు ధనుష్ (6), సురవరపు పవన్‌సాయి (8) స్నేహితులు. ఆదివారం సాయంత్రం మోనింగివారి వీధిలోని శ్రీరామలింగేశ్వర ఆలయ పుష్కరిణి వద్ద ఆడుకోవడానికి వెళ్లారు. మెట్లు నాచు పట్టి ఉండటంతో ధనుష్ కాలుజారి పడిపోగా పవన్ కాపాడేందుకు వెళ్లి నీటిలో చిక్కుకుపోయాడు. ఇద్దరూ ఊపిరాడక చనిపోయారు. కొంత సమయానికి స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. విగతజీవులుగా మారిన చిన్నారులను బయటకు తీసిన తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై ఎస్సై బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

కన్నోళ్లకు కడుపుకోత..

ధనుష్ తల్లి పద్మావతి గృహిణి, తండ్రి సుధాకర్ టిఫిన్ దుకాణం నడుపుతున్నారు. వారికి ఇద్దరు పిల్లలు కుమార్తె యామిని 7వ తరగతి చదువుతోంది. చాలా ఏళ్ల తర్వాత కుమారుడు పుట్టడంతో అల్లారు ముద్దుగా చూసుకుంటున్నారు. బాలుడు ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. కుమారుడి మృతితో గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ధనుష్ మృతదేహాన్ని భుజాన మోసుకుంటూ ఇంటికి తీసుకెళ్తున్న తండ్రి సుధాకర్

★ పవన్‌సాయి తల్లి పార్వతి గృహిణి. తండ్రి నాగరాజు డ్రైవర్. వీరికి ముగ్గురు పిల్లలు అన్న చైతన్య (7వ తరగతి), అక్క హనీప్రియ(4వ తరగతి)తో కలిసి పవన్‌సాయి లక్ష్మీగనర్ ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం వరకు తమ కళ్ల ముందే తిరిగిన పవన్ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పవన్‌సాయి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి పార్వతి, అక్క హనీప్రియ

పట్టించుకోని యంత్రాంగం: పుష్కరిణిలో గతంలో ఓ బాలుడు కాలు జారిపడి మృతి చెందాడు. చెత్తతో నిండి ప్రమాదకరంగా మారినా పురపాలక అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రుల దిగ్భ్రాంతి

చిన్నారులపై మృతిపై కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కలెక్టర్, అధికారులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా పుష్కరిణి చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ స్పందిస్తూ ప్రభుత్వం తరఫున బాధిత కుటుంబాలను ఆదుకుంటా మని తెలిపారు.

ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులా..?

- జేసీ దృష్టికి తీసుకెళ్లండి

ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయా..? అధికారులు, సిబ్బంది సహకరించడం లేదా..? అదనపు తూకం పేరిట మోసాలకు పాల్పడుతున్నారా..? విక్రయాల్లో అక్రమాలు జరుగుతున్నాయా..? ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులు పడుతున్న ఇబ్బందులపై సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో మాట్లాడే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా కింది నంబర్లకు ఫోన్ చేసి సమస్య వివరించడమే. ఆయన స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.
– ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

ఫోన్ చేయాల్సిన వివరాలు: / మంగళవారం: 23-12-2025 / ఉదయం: 10:00 నుంచి 11:00 గంటల వరకు
సంప్రదించాల్సిన నంబర్లు: 94906 12884, 80082 22985

అంబరాన్నంటిన క్రిస్మస్ సంబరాలు

జెండాలతో ప్రదర్శనగా వెళ్తున్న యువతులు

జిల్లా వ్యాప్తంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో ఆకట్టుకుంటున్నారు. ప్రత్యేక ప్రార్థనలు, బైబిల్ సందేశాలు, భక్తిగీతాల ఆలాపనతో సందడి నెలకొంది. శ్రీకాకుళం నగరంలో ఆదివారం రాత్రి కీస్టోన్ చర్చి ఆధ్వర్యంలో క్రిస్మస్ ర్యాలీ నిర్వహించారు. రామలక్ష్మణ కూడలి, జి.టి.రహదారి, ఏడు రోడ్ల కూడలి, డే అండ్ నైట్ కూడలి మీదుగా ముందుకు సాగారు. యువత, పిల్లలు పెద్దఎత్తున ప్రదర్శనలో పాల్గొన్నారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

వాహనంపై శాంతాక్లాజ్ వేషధారణలో చిన్నారుల సందడి

రైతులు మనోళ్లే.. ధాన్యం ఒడిశాది!

న్యూస్‌టుడే, సోంపేట

కంచిలి మండలం భైరిపురం, ఘాటీముకుందపురం, రేఖాదేవిపురం, ఎం.ఎస్.పల్లి, అర్జునాపురం, కేసరపడ, ముండ్ల, కుంబరనౌగాం తదితర ప్రాంతాల్లో 10 మంది దళారులు ఒడిశా నుంచి ధాన్యం తెచ్చి ఇక్కడి రైతుల పేరిట అమ్మకాలు సాగిస్తున్నారు. ఓ నాయకుడు ఈ దందాలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రతి గ్రామం నుంచి 20 మంది రైతుల పేరిట మిల్లులకు ధాన్యం పంపుతున్నారు. సోంపేట, ఇచ్ఛాపురం, కవిటి మండలాల్లోనూ దందా యథేచ్ఛగా సాగుతోంది.

పెచ్చుమీరిన దళారుల ఆగడాలు

ధాన్యం సేకరణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ దళారులే లాభపడుతున్నారు. ఒడిశాలో సేకరించిన పంటను ఇక్కడి మిల్లులకు అప్పగించి వాటి పరిమితి దాటే పరిస్థితి కల్పించారు. క్వింటాల్ మద్దతు ధర రూ.2,369 కాగా బస్తా (80 కిలోలు) రూ.1,895 చెల్లిస్తున్నారు. సరిహద్దు గ్రామాల నుంచి బస్తాలను జిల్లా పరిధిలోకి అక్రమంగా తీసుకొచ్చి సొమ్ము చేసుకుంటున్నారు.

సోంపేటలో ఓ మిల్లు వద్ద బారులు తీరిన ధాన్యం ట్రాక్టర్లు

అర్ధరాత్రి దందా

◆ పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలో ఆలస్యంగా వరి నాట్లు వేయడంతో కోతలు ఇటీవల ప్రారంభమయ్యాయి. మిల్లులకు చేర్చడానికి మరో వారం, 10 రోజుల సమయం పడుతుంది.
◆ దళారులు ఒడిశా సరిహద్దు గ్రామాలు, ఇతర ప్రాంతాల్లో సేకరించిన ధాన్యాన్ని ఇక్కడి రైతుల పేరిట ట్రక్ షీట్‌తో మిల్లులకు చేర్చుతున్నారు.
◆ సిబ్బంది, మిల్లర్ల సహకారంతో అర్ధరాత్రి దాటాక ట్రక్ షీట్లు సంపాదించి దందా చేస్తున్నారు.

దోపిడీ ఇలా..

◆ ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, మందస, పలాస, టెక్కలి మండలాల పరిధిలో 50 మందికి పైగా దళారులు రైతుల నుంచి ధాన్యం సేకరణకు పథకం ప్రకారం ముందుకెళ్తున్నారు.
◆ కొంత మొత్తం ముందస్తుగా అందజేసి పరిస్థితి మేరకు ధర చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు.
◆ కోతలు జరిగిన ప్రాంతాల్లో 80 కిలోల బస్తా వద్ద రూ.300 తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. సంబంధిత రైతుల పేరిట సరకు మిల్లులకు చేర్చడానికి సిబ్బంది సహకారంతో ట్రక్ షీట్లు సిద్ధం చేసుకుంటున్నారు.
◆ ఇదే క్రమంలో ఒడిశా నుంచి సేకరించిన ధాన్యాన్ని అప్పగిస్తున్నారు.
◆ తేమ, ఇతర అంశాలను సాకుగా చూపి బస్తా వద్ద 5 నుంచి 7 కిలోల వరకు అధికంగా తీసుకుంటున్నారు.

సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం..

దళారుల వివరాలు తెలియజేస్తే చర్యలు తీసుకుంటాం. ఒడిశా నుంచి ధాన్యం రాకుండా నియంత్రించడానికి ఇచ్ఛాపురం, మెళియాపుట్టి, కొత్తూరు మండలాల పరిధిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రతి మండలంలో ఉప తహసీల్దారు, పోలీసులతో ఓ బృందాన్ని ఏర్పాటు చేసి పరిశీలన చేయిస్తున్నాం. దళారులకు మిల్లర్లు, సిబ్బంది సహకరిస్తే ఉపేక్షించం.
-వేణుగోపాల్, జిల్లా మేనేజర్, పౌర సరఫరాల సంస్థ

మొదలవలసకే తెదేపా పీఠం

ప్రధాన కార్యదర్శిగా పీరికట్ల విఠల్ నియామకం

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం

తొలి నుంచి తెదేపాను నమ్ముకుని కష్టకాలంలో అండగా ఉన్న సీనియర్ నేతలను ఆ పార్టీ అధిష్ఠానం గుర్తించి జిల్లా స్థాయి పదవులు కట్టబెట్టింది. తెదేపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ముందు నుంచి అనుకున్నట్లే మొదలవలస రమేశ్, ప్రధాన కార్యదర్శిగా పీరికట్ల విఠల్‌ను నియమించింది. పార్టీ పట్ల విధేయత, అనుభవం, వివాదరహితంగా ఉండటం, విద్యాధికులు కావడం, జిల్లాలో పరిస్థితులపై పూర్తిగా అవగాహన ఉండటం, సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేశారు. సాధారణ ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపులో వారి పని తీరు, జిల్లాలో పార్టీని సమర్థంగా నడిపించగలరని గుర్తించి అవకాశమిచ్చారని సమాచారం.

పేరు: మొదలవలస రమేశ్
వయసు: 55 **విద్యార్హత:** బీఏ
స్వస్థలం: ఆమదాలవలస

అనుభవం: 1983లో తెదేపా క్రియాశీలక సభ్యత్వం స్వీకరించారు. 1984లో తెలుగు విద్యార్థి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, 1984-87 వరకు ఆ విభాగం జిల్లా అధ్యక్షుడిగా, 1987-95 వరకు తెలుగు యువత జిల్లా కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం తెదేపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులయ్యారు.

బాధ్యతగా పని చేస్తా..

కష్టపడి పని చేస్తే పార్టీ తప్పనిసరిగా గుర్తిస్తుందనడానికి నేనే నిదర్శనం. నాకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తా. కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, జిల్లా నేతలకు ప్రత్యేక కృతజ్ఞతలు. **- మొదలవలస రమేశ్**

పేరు: పీరికట్ల విఠల్
వయసు: 59 **విద్యార్హత:** బీకాం
స్వస్థలం: పలాస

అనుభవం: 2001-06 వరకు ఎంపీటీసీ సభ్యుడిగా, 2006-11 సర్పంచిగా (ఏకగ్రీవం) పని చేశారు. సర్పంచుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, తెదేపా జిల్లా అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. 2015-19లో, ఇటీవల రెండోసారి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం తెదేపా శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పదవి వరించింది.

పార్టీ బలోపేతానికి కృషి

నాపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను పార్టీ ఆదేశాలకు అనుగుణంగా నిర్వహిస్తా. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్, జిల్లా నేతలకు కృతజ్ఞతలు. **- పీరికట్ల విఠల్**

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో యోగా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు విద్యార్థులతో ధ్యానం చేయించారు. రోజూ చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. డైరెక్టర్ కేవీజీడీ బాలాజీ, యోగా శిక్షకులు జి.ఈశ్వరరావు, కె.అర్చన పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

రావి చెరువు.. ఆక్రమణలకు నెలవు

జలుమూరు మండలం చల్లవానిపేట కూడలి సమీపంలో రావి చెరువు ఆక్రమణకు గురవుతోంది. జర్జంగి-పింద్రువాడ రహదారి పక్కన కొందరు అందులో మట్టి వేసి కర్రలు పాతి హద్దులు పెట్టుకున్నారు. రెవెన్యూ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈశ్వరప్ప కోనేరు ఆక్రమణదారులకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై ఉప తహసీల్దారు ఎస్.శంకరరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. – న్యూస్‌టుడే, జలుమూరు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. అర్జీలు నేరుగా లేదా ఆన్‌లైన్‌లో సమర్పించొచ్చని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్జీల స్థితి, సమాచారం అవసరమైన వారు 1100కు ఫోన్ చేయొచ్చన్నారు.

రూ.వెయ్యి కోట్లతో బీచ్‌శాండ్ పరిశ్రమ

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: పరిశ్రమల స్థాపనకు కార్మికుల సహకారం అవసరమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఆదివారం ఏఐటీయూసీ జిల్లా మహాసభలు నిర్వహించారు. డైమండ్ పార్కు నుంచి ఎన్టీఆర్ నగరపాలకోన్నత పాఠశాల మైదానం వరకు సంఘ నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా వెళ్లారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. 'నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పరిశ్రమలు రావాలి. వాటిని నెలకొల్పడానికి కార్మిక సంఘాలు సహకారం అందించాలి. రూ.వెయ్యి కోట్లతో బీచ్ శాండ్ పరిశ్రమ స్థాపించడానికి కృషి చేస్తున్నాం' అని వెల్లడించారు. పోరాటాలతోనే హక్కులను రక్షించుకోగలమని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ అన్నారు. ప్రస్తుతం దేశంలో కార్మిక వ్యతిరేక ప్రభుత్వాలు నడుస్తున్నాయని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి అన్యాయం చేశారని వ్యాఖ్యానించారు. సంఘ రాష్ట్ర కార్యదర్శి పి.రమణ తదితరులు ప్రసంగించారు.

ప్రదర్శనగా వెళ్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

పూడివలసలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పోలియో రహిత సమాజమే లక్ష్యం

బలగ (శ్రీకాకుళం), ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజమే లక్ష్యంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఎచ్చెర్ల మండలం పూడివలసలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. జిల్లాలో 0-5 ఏళ్ల పిల్లలు 1,80,003 మందికి మందు పంపిణీ చేయాలని వైద్య శాఖ లక్ష్యం పెట్టుకోగా 1,74,860 మందికి వేశారు. 97.10 శాతం ప్రక్రియ పూర్తయిందని అధికారులు తెలిపారు.

కొత్త విధానంలో ఇంటర్ పరీక్షలు..!

ప్రథమ సంవత్సరం విద్యార్థులకే మార్పులు

న్యూస్‌టుడే, జి.సిగడాం, సరుబుజ్జిలి

ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు పరీక్ష విధానంలో మార్పులొచ్చాయి. ప్రశ్నపత్రం రూపొందించే తీరు మారింది. పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు ఇప్పటికే విడుదల చేసింది. కొత్త పద్ధతి విద్యార్థులకు ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు.

సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నమూనా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జిల్లాలో ప్రభుత్వ కళాశాలలు: 38
ప్రైవేటు: 71
ఆదర్శ: 13
ప్లస్ వన్: 6
కేజీబీవీలు: 25
గురుకులాలు: 9
ఇంటర్ మొదటి ఏడాది విద్యార్థులు: 6,491 మంది

మార్పులు ఇలా..

★ భౌతిక, రసాయన శాస్త్రాలకు 85 మార్కుల ప్రశ్నపత్రం ఇస్తారు. ప్రస్తుత విధానంలో 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలకు జవాబులు రాయాలి. ★ గణితం, భౌతిక, రసాయన శాస్త్రాలు, చరిత్ర, కామర్స్, రాజనీతి శాస్త్రం, ఎకనామిక్స్ పరీక్ష రాసే వారికి 32 పేజీలతో కూడిన బుక్‌లెట్ ఇస్తారు. గతంలో 24 పేజీలే ఉండేవి. ప్రశ్నల సంఖ్య పెరగడంతో ఈ మార్పు చేశారు. ★ భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో 29 (85) మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లే.

గణితం 100 మార్కులకే..

గణితం పేపర్ గతంలో 150 మార్కులకు ఉండేది. ఆ తరువాత దీన్ని గణితం-1ఏ, 1బీగా మారుస్తూ ఒక్కో పేపరు 75 మార్కులు చొప్పున రెండు పేపర్ల విధానాన్ని ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అమలు చేశారు. ప్రస్తుతం ప్రథమ సంవత్సర విద్యార్థులకు గణితంలో ఒకే పేపరు విధానానికి శ్రీకారం చుట్టారు. దీన్ని 100 మార్కులకు కుదించారు.

నమూనా పరీక్షలు నిర్వహించాం..: ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు కొత్త విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే నమూనా పరీక్షలు నిర్వహించాం. **- రేగ సురేష్‌కుమార్, డీవీఈవో, శ్రీకాకుళం**

హాయ్ అని పెట్టండి.. ఎఫ్ఐఆర్ కాపీ పొందండి

న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఏదైనా విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసి రసీదు పొందొచ్చు. ప్రాథమిక సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)లో వివరాలు తెలుసుకోవడం సామాన్యులకు కష్టం. అవి బయటకు వెళ్తే దర్యాప్తులో ఇబ్బందులుంటాయని పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటారు. కూటమి ప్రభుత్వం వివిధ సేవల్ని మనమిత్ర యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫిర్యాదిదారులు వాట్సప్‌లో 'హాయ్' అని పెడితే ఎఫ్ఐఆర్ కాపీ పీడీఎఫ్ రూపంలో పొందొచ్చు.

నిబంధనలున్నాయ్..

ఎఫ్ఐఆర్ కాపీ పొందడానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఫిర్యాదిదారు, కేసులో పేర్కొన్న బాధితుడు లేదా చట్టబద్ధమైన హక్కు ఉన్న వ్యక్తులు మాత్రమే డిజిటల్ రూపంలో తీసుకోవచ్చు. కేసు దర్యాప్తులో గోప్యత దృష్ట్యా ఈ పద్ధతిని అనుసరిస్తున్నారు. కొన్ని స్టేషన్లలో కేసు పరిస్థితిని అనుసరించి కాపీ ఇస్తున్నారు.

అనుమతి మేరకే..

ప్రజల్లో అపోహలు రాకుండా ప్రభుత్వం కొన్ని పరిమితులు విధించింది. లైంగిక వేధింపులు, పిల్లలపై నేరాలు (పోక్సో), జాతీయ భద్రతకు సంబంధించిన అంశాలు, కోర్టు ఆదేశాల మేరకు గోప్యంగా ఉంచాల్సిన కేసుల వివరాలను ఈ సేవ ద్వారా ఎఫ్ఐఆర్ కాపీ తీసుకోలేరు.

తీసుకోవడం ఇలా..

ముందుగా 95523 00009కు వాట్సప్‌లో 'హాయ్' అని సందేశం పంపాలి. అనంతరం తెరపై కనిపించే సేవల్లో పోలీసు సర్వీసును ఎంపిక చేసుకుని ఎఫ్ఐఆర్ కాపీ అనే ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకోవాలి. ఎఫ్ఐఆర్ నంబరు, జిల్లా, పోలీసు స్టేషన్ వివరాల నమోదుకు సూచనలు వస్తాయి. వాటి నమోదు పూర్తయ్యాక సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఆ సంఖ్యను ధ్రువీకరించిన వెంటనే పీడీఎఫ్ రూపంలో కాపీ తీసుకోవచ్చు.

మొక్కజొన్నపై కత్తెర పంజా..!

ఆందోళనలో రైతులు

న్యూస్‌టుడే, లావేరు

రబీలో మొక్కజొన్న పంటను కత్తెర పురుగు దెబ్బతిస్తోంది. మొలక దశ నుంచే ఉద్ధృతంగా దాడి చేస్తుండటంతో నష్టం వాటిల్లుతోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తెదేపా హయాంలో పురుగు మందులు, వేపనూనె, విత్తనాలు రాయితీపై అందేవని.. వైకాపా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిలిపివేసిందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు పునరుద్ధరించకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం చేయూత అందించాలని కోరుతున్నారు.

కంకిని తినేస్తున్న పురుగు

రూ.వేలల్లో నష్టం

◆ ఒక్కో మొక్కలో పదుల సంఖ్యలో కత్తెర పురుగులు వ్యాప్తి చెందుతుండటంతో రూ.వేలల్లో నష్టం తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.
◆ వారానికి ఒకసారి నివారణ మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. దుక్కులు, ఎరువులు, విత్తనాలు, కలుపు నివారణ ఇతర ఖర్చులకు ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టామని చెబుతున్నారు.

పెరిగిన ఆర్థిక భారం

◆ కత్తెర పురుగు జీవితకాలం 30 రోజులు. 1,300 నుంచి 2 వేల వరకు గుడ్లు పెడుతుంది. రాత్రి వేళ సుమారు 200 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.
◆ నివారణకు ఎకరానికి సుమారు రూ.800 నుంచి రూ.1,200 వరకు ఖర్చవుతుంది. మందు పిచికారీకి రూ.600 వరకు వ్యయం చేస్తున్నారు. ఉద్ధృతి మేరకు రెండు నుంచి నాలుగు సార్లు పిచికారీ చేస్తున్నారు.
◆ ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో పురుగు ఉద్ధృతి అధికంగా ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మొక్క దశలోనే నివారించకపోతే కంకులను తినేస్తుందని.. దిగుబడిపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు.

ఇదీ పరిస్థితి

◆ రబీలో లావేరు, రణస్థలం, జి.సిగడాం, పొందూరు, ఎచ్చెర్ల తదితర మండలాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు.
◆ ప్రస్తుతం కత్తెర పురుగు బెడద అధికంగా ఉండటంతో రైతులు ఎరువుల దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు పురుగు మందులు విక్రయిస్తున్నారని గగ్గోలు పెడుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..: కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యవసాయాధికారుల సూచనలు మేరకు పురుగు మందులు వినియోగించాలి. రాయితీపై పంపిణీ విషయమై ప్రభుత్వానికి నివేదిస్తాం.
- త్రినాథస్వామి, జిల్లా వ్యవసాయాధికారి, శ్రీకాకుళం

(c) eenadu

ఘంటసాలకు స్వరాభిషేకం

గీతాన్ని ఆలపిస్తున్న గాయకుడు కారుణ్య

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఆడిటోరియంలో ఆదివారం 12 గంటల నిర్విరామ ఘంటసాల ఆరాధనోత్సవం సందడిగా జరిగింది. డా. ఘంటసాల వెంకటేశ్వరరావు పేరిట హైదరాబాదుకు చెందిన కిన్నెర ఆర్ట్ థియేటర్‌సంస్థ వ్యవస్థాపకుడు మద్దాళి రఘురామ్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పది గంటల నుంచి రాత్రి పది వరకు ప్రసిద్ధ గాయనీ, గాయకులు ఘంటసాల పాడిన గీతాలను ఆలపించారు. ప్రసిద్ధ గాయకుడు కారుణ్య తన గాత్రంతో మనోరంజకం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు కిన్నెర ఘంటసాల పురస్కారాన్ని ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్ఞాపికతో సత్కరించి అభినందించారు.

వారిలో కదలిక.. ఆనంద డోలిక..!

ఆశాకిరణంగా భవిత కేంద్రాలు

–న్యూస్‌టుడే, సారవకోట

ప్రభుత్వం నిర్వహిస్తున్న భవిత కేంద్రాలు, ప్రత్యేక అవసరాల పిల్లల పాలిట ఆశాకిరణంగా నిలుస్తున్నాయి. అందరిలా అవయవాలు సహకరించకపోయినా జీవితంలో ఎదగాలన్న సంకల్పమే వారికి, వారి తల్లిదండ్రులకు ధైర్యాన్ని నింపుతున్నాయి. జిల్లాలో 5,888 మంది పిల్లలు ఉన్నారు. 30 భవిత కేంద్రాలు ఉండగా 54 మంది ఐఈఆర్టీ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 593 మందికి వారంలో ఒక రోజు ఫిజియోథెరపీ అందిస్తున్నారు. దీంతో శారీరక దృఢత్వం, చలాకీతనం ఉండటంతో తల్లిదండ్రులు ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. ప్రభుత్వం ఈ ఏడాది 586 మందికి వినికిడి యంత్రాలు, వీల్‌ఛైర్లు అందించింది. 2850 మందికి ఏడాదికి రూ. 6వేలు చొప్పున అలవెన్స్‌లు ఇచ్చింది.

తల్లి సమక్షంలో చిన్నారికి చికిత్స చేస్తున్న ఫిజియోథెరపిస్ట్ ఈశ్వరరావు

❖ మహన్విక వయసు 3 ఏళ్లు ఒకే చోట కదలకుండా ఉండేది. 12 నెలలుగా సారవకోటలో భవిత కేంద్రంలో ఎలక్ట్రో థెరపీ ఇస్తున్నారు. ఆరోగ్యం మెరుగుపడింది. మరో ఏడాదిలో నా కుమార్తె నడవగలదనే ఆశ కలుగుతోంది.

–మహన్విక తల్లి హేమ, (మహశింగి గ్రామం)

❖ పొంద్రంకి ఉమాశంకర్ వయసు 10 సంవత్సరాలు. నరాల బలహీనతతో మంచంపైనే ఉండేవాడు. ఫిజియోథెరపీతో మెరుగు పడ్డాడు. ఫిజియో థెరపిస్ట్, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు ఏ విధంగా కుమారుడికి వ్యాయామం చేయిస్తున్నారో గుర్తించి ఇంటి వద్ద చేయిస్తున్నాను.

–ఉమాశంకర్ తల్లి గౌతమి (ధర్మలక్ష్మీపురం)

❖ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల విషయంలో ప్రజల్లో చైతన్యం పెరగాలి. త్వరలోనే ఆర్ట్ అండ్ కల్చర్‌పై వీరికి పోటీలు నిర్వహించి వారి ఆసక్తికి అనుగుణంగా శిక్షణ ఇస్తాం. ఫిజియోథెరపీకి పిల్లలను తీసుకుని రావాలి. అని జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గోవిందరావు తెలిపారు.

ఊడిన బస్సు చక్రం.. తప్పిన ప్రమాదం

ఆమదాలవలస మండలం తొల్లవలస గ్రామం వద్ద ఆదివారం నడుస్తున్న ఓ ప్రైవేటు బస్సు చక్రం ఊడిపోయింది. కొంత దూరం రోడ్డును రాసుకుంటూ వెళ్లి బస్సు ఆగిపోయింది. బస్సులో విద్యార్థులు, ఎదురుగా వాహనాలు, మనుషులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపితే ఇలాంటి ప్రమాదాలే జరుగుతాయని ఇప్పటికైనా అధికారులు పక్కాగా తనిఖీలు చేయాలని స్థానికులు కోరారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

తెదేపాలో సుమారు 3 వేల కుటుంబాల చేరిక

సమన్వయంతో పనిచేయాలని శ్రేణులకు నాయకుల సూచన

పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న జోనల్ సమన్వయకర్త శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో తెదేపా ప్రగతికి కృషి చేయాలని ఆ పార్టీ ఉత్తరాంధ్ర జోనల్ సమన్వయకర్త పెళ్లకూరు శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. పాతపట్నం ఆదివారం వైకాపాను వీడి తెదేపా కండువా కప్పుకొన్నాయి. పాతపట్నం మండలం పాగోగులుపేట సర్పంచి గేదెల వెంకటలక్ష్మి, ఉప ఎంపీటీసీ గంగు శోభారాణితో పాటు గ్రామానికి చెందిన సుమారు 300 కుటుంబాలు, బోరుభద్ర సర్పంచి సవిరిగాన శ్రీదేవి, ఉప సర్పంచి అంగూరు హేమలత, 500కు పైగా కుటుంబాలు తెదేపా తీర్థం పుచ్చుకున్నాయి. కాగువాడ సర్పంచి నల్లి జగదీశ్వరరావుతో పాటు సుమారు 300 కుటుంబాలు, తిడ్డిమి ఎంపీటీసీ సభ్యురాలు కొవ్వాల గీత, బూరగాం సర్పంచి బిజిలి పొల్లాయతో పాటు 300కు పైగా కుటుంబాలు పార్టీలో చేరాయి. కొమనాపల్లి సర్పంచి నల్లి శారద, ఉపసర్పంచి అంబటి లక్ష్మి, సుమారు 300 కుటుంబాలు, లోకొండ సర్పంచి వబ్బంగి లక్ష్మి, దారాపు 300 కుటుంబాలు, రుగడ మాజీ సర్పంచి చెంచల రామకృష్ణరావు, 300కు పైగా కుటుంబాలు, చవితిసీది మాజీ సర్పంచి భగవాన్‌దాస్, సుమారు 300 కుటుంబాలు పసుపు కండువాలు కప్పుకున్నాయి. ఆర్టీసీ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సర్పంచి యందవ విజయమ్మ, ఉప సర్పంచి పిసిని వెంకటరమణ, సుమారు 150 కుటుంబాలు పార్టీలో చేరాయి. మెళియాపుట్టి జడ్పీటీసీ సభ్యుడు గూడ ఎండయ్యతో పాటు 150 కుటుంబాలు, సిరియాకండి సర్పంచి తడల రామరాజు, 50 కుటుంబాలు, బాణాపురం ఉపసర్పంచి నిక్కల బాబూరావు, 50 కుటుంబాలు, వసుంధర నుంచి ఉపసర్పంచి మురళీ ప్రధాన్‌తో పాటు 75 కుటుంబాలు కప్పుకొన్నాయి.

తీరంలో సందడి

వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి శివసాగర తీరం సందర్శకుల తాకిడితో కిటకిటలాడింది. ఒడిశాతోపాటు ఆంధ్రా ప్రాంతాలకు చెందిన పర్యాటకులు, పాఠశాల విద్యార్థులతో కిక్కిరిసింది. సమీప తోటల్లో వనభోజనాలు చేసి సముద్రంలో స్నానాలు చేశారు. అనంతరం కెరటాల సవ్వడిలో ఉత్సాహంగా గడిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ఆదిత్యుని ఆదాయం రూ.5.23 లక్షలు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు మహిళా భక్తులు ఇంద్రపుష్కరిణిలో స్నానాలు ఆచరించి గోశాలలో గోవులకు పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఆన్‌లైన్ దర్శన బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేశారు. దర్శన టిక్కెట్లు, ప్రసాదాల విక్రయాలు, ప్రత్యేక పూజల రూపంలో రూ.5.23 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ తెలిపారు.

దర్శనానికి వరుసలో నిల్చున్న భక్తులు

డబ్బులు అడుగుతోందని హతమార్చాడు

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ఏఎస్‌ఎన్ కాలనీకి చెందిన సీతారత్నం ఈ నెల 2న ఇంటి నుంచి ఆసుపత్రి వెళ్లి హత్యకు గురైన ఘటనలో నిందితుడు గొల్లపల్లి ప్రశాంత్‌కుమార్ (32)ను ఆదివారం అరెస్టు చేసినట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి వెల్లడించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. నరసన్నపేటకు చెందిన ప్రశాంత్ కుమార్ కారు, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు సీతారత్నంతో పరిచయం వివాహేతర సంబంధంగా మారింది. అడిగినప్పుడల్లా ఆమెకు డబ్బులు ఇస్తుండేవాడు. ఈ నెల 2న శ్రీకాకుళం కిమ్స్ రోడ్డులో వీరిద్దరు కలుసుకున్నారు. పెద్ద మొత్తంలో డబ్బు కావాలని లేదంటే ఇంటికి వచ్చి గొడవ చేస్తానని సీతారత్నం బెదిరించడంతో ఆమె మెడకు వైరు బిగించి హతమార్చాడు. అనంతరం మృతదేహాన్ని ఎచ్చెర్ల మండలం కేశవరావు పేట వద్ద జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో పడేసి కారులో రాత్రి 10 గంటల సమయంలో తిరిగి నరసన్నపేట వెళ్లిపోయాడు. ఆమె కాల్ డేటా పరిశీలించిన పోలీసులు నిందితుడిని గుర్తించి, ఆదివారం కింతలి మిల్లు సమీపంలో పట్టుకున్నట్లు వివరించారు. బంగారం పుస్తెల తాడుతోపాటు గిల్ట్ నగ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

పిస్తోలు గుర్తింపు.. నేరస్థుల ముఠా అరెస్టు

విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నుంచి తండ్యాంవలసకు వెళ్లే రోడ్డులో పాత ఆర్టీవో ఆఫీసు వద్ద నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లో ఐదుగురు యువకులు అనుమానాస్పదంగా ఉన్నట్లు పోలీసులకు ఆదివారం సమాచారం అందింది. శ్రీకాకుళం గ్రామీణ ఎస్సై రాము, పోలీసుల బృందంతో కలిసి వెళ్లి చూడగా వారంతా పాత నేరస్థులుగా గుర్తించారు. దీనిపై ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరుకు చెందిన పంచి రెడ్డి కైలాస్, గుజరాతీపేటకు చెందిన అలబణి రమణ, పెద్దపాడుకు చెందిన కలగ ఉమామహేశ్వరరావు, కోటబొమ్మాళి మండలం నారాయణ వలసకు చెందిన ఉర్జాన ప్రశాంత్‌కుమార్, నగరంలోని ఎల్‌బీఎస్ కాలనీకి చెందిన దండాశి కార్తీక్‌లని వెల్లడించారు. వీరి వద్ద పిస్తోలు, తూటాలు, 5 చరవాణులు స్వాధీనం చేసుకున్నామన్నారు. కైలాస్‌పై ఎచ్చెర్ల, శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో మూడు కేసులు ఉన్నాయని, ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట గ్రామంలో ఇటీవల హత్యకు గురైన సత్తారు గోపీ సన్నిహితుడని వివరించారు. ఇద్దరూ కలిసి ఒడిశాలోని బ్రహ్మపురలో ఆరు నెలల కిందట పిస్తోలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. గుజరాతీపేటకు చెందిన అలబణి రమణ (32)పై ఎచ్చెర్ల, ఒకటో పట్టణ పోలీసుస్టేషన్లలో మూడు కేసులు, ఉర్జాన ప్రశాంత్‌కుమార్‌పై జేఆర్‌పురం పోలీసుస్టేషన్లో ఒక కేసు, కలగఉమామహేశ్వరరావుపై ఎచ్చెర్లలో ఒక కేసు ఉందన్నారు. పిస్తోలు ఎందుకు కొన్నారు? వీరికిఅండగా ఎవరున్నారన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నామని, న్యాయస్థానంలో హాజరుపరచి తదుపరి విచారణ కోరుతామని ఎస్పీ పేర్కొన్నారు.

మోసగాడు దొరికాడు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పలాసలో ఈ నెల 8న జరిగిన రూ.10లక్షలు మోసం కేసులో సునీల్ అనే కారు డ్రైవర్‌ను ఆదివారం అరెస్టు చేశామని సీఐ వై.రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా చెందిన లక్ష్మయ్యకు పలాసకు చెందిన సునీల్‌తో పాటు ఒడిశాకు చెందిన రవిరాజు రూ.10లక్షలు ఇస్తే రూ.50లక్షలు నల్లధనం ఇస్తామని నమ్మించారు. ఈ మేరకు లక్ష్మయ్య డబ్బులు తీసుకుని పలాస సమీపానికి రాగా అతని నుంచి నగదు తీసుకొని నల్ల ధనం పేరుతో కాగితాల కట్టలు ఇచ్చేసి నిందితులు పరారయ్యారు. లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు సునీల్‌ను అరెస్ట్ చేశామని, అతని నుంచి రూ.4,42,000, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. రవిరాజును అరెస్టు చేయాల్సి ఉందని సీఐ పేర్కొన్నారు.

గంజాయితో ఒకరు..

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: కాశీబుగ్గలో గంజాయితో ఒడిశాకు చెందిన రాజేంద్ర సబార్‌ను ఆదివారం అరెస్టు చేసినట్లు సీఐ వై.రామకృష్ణ తెలిపారు. గజపతి జిల్లాకు చెందిన రాజేంద్ర బ్రహ్మపుర నుంచి 10.795 కిలోల గంజాయి తీసుకొని రేణిగుంట వెళ్లేందుకు బస్ ద్వారా పలాస వస్తుండగా పట్టుకున్నామని సీఐ పేర్కొన్నారు. రేణిగుంటలో తమిళనాడుకు చెందిన సన్యాయ్యప్పనకు గంజాయి అందజేయడానికి వెళ్తున్నట్లు విచారణ తేలిందన్నారు.

రెవెన్యూ సర్వీసుల సంఘ ఎన్నికలు ఏకగ్రీవం

కలెక్టర్ కార్యాలయ విభాగ రెవెన్యూ సర్వీసుల సంఘం నూతన కార్యవర్గం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం జిల్లాలోని కలెక్టర్ కార్యాలయంతో పాటు మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఎన్నికలు నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయ విభాగ ఎన్నికలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగాయి. కలెక్టరేట్ విభాగ అధ్యక్షురాలిగా కె.ప్రవల్లిక ప్రియ, అసోసియేట్ అధ్యక్షుడిగా కె.రాజా ప్రేమ్‌చంద్, కార్యదర్శిగా పి.పద్మావతి, కార్యనిర్వాహక కార్యదర్శిగా అనిల్‌బాబు, కోశాధికారిగా జి.వెంకటరమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారి జీఏ సూర్యనారాయణ వ్యవహరించారు. ❖ శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ విభాగ అధ్యక్షుడిగా ఎస్.కిరణ్‌కుమార్, అసోసియేట్‌గా ఆర్.వెంకటేష్, కార్యదర్శిగా డి.ప్రకాశరావు, కార్యనిర్వహక కార్యదర్శిగా కె.శరత్‌బాబు, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా శ్రీకాకుళం తహసీల్దారు ఎస్.గణపతిరావు వ్యవహరించారు.

తడిపితే పదిలం.. లేదంటే శిథిలం

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీ 2వ లైనులో కొద్ది రోజులు కిందట నగరపాలక సంస్థ నిధులతో సీసీ రహదారి నిర్మించారు. ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నిబంధనలు ప్రకారం సిమెంట్‌తో కూడిన కాంక్రీట్ పనులకు 21 రోజులు నీటితో తడపాలి. చేయకపోతే కాంక్రీటు గట్టిపడక నాణ్యత దెబ్బతింటుంది. పీఎన్ కాలనీ రోడ్డు విషయంలో అదే జరుగుతోంది. ఇప్పటి వరకు నీటి తడి అందించలేదు. చర్యలు తీసుకోవాల్సిన ఇంజినీరింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు వివరణ కోరగా గుత్తేదారుకి నోటీసులు జారీ చేసి తీసుకుంటామన్నారు.

పోలీసులకు చిక్కిన అంతర్రాష్ట దొంగ

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా కంకిపాడు పోలీసులు అంతర్ రాష్ట్ర దొంగను పట్టుకుని రూ.50 లక్షల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పునాదిపాడు ఫ్లైఓవర్‌పై ఐదుగురు ద్విచక్ర వాహనాలపై నిలబడి మాట్లాడుకుంటూ ఉండగా అటుగా వెళుతున్న పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 2023లో కంకిపాడులోని కంకిపాటి శివశంకరరావు ఇంట్లో జరిగిన దొంగతనం బయటకు వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిని విచారించగా సుమారు 15 చోరీలు చేసి.. ఆ సొత్తు వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టినట్లు తేలింది. దీంతో 409 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మిగతా నలుగురిని విచారణ చేస్తున్నారు. ఆదివారం కంకిపాడు పోలీస్ స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సీఐ జె.మురళీకృష్ణ, ఎస్సై సందీప్ కేసు వివరాలు వెల్లడించారు.

చోరీలు చేయడంలో ప్రత్యేక విధానం

విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయ పాలవలస గ్రామానికి చెందిన పున్నాన రాంబాబు చెడు వ్యసనాలకు బానిసై తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతను ప్రత్యేకించి ఇళ్లలో బీరువా తాళాలు ఎక్కడ పెడతారో గుర్తించి బీరువా తెరిచి అందులోని కొంతమేర మాత్రమే బంగారు ఆభరణాలు చోరీ చేస్తుంటాడు. దీంతో ఇంట్లో వారికి చోరీ జరిగినట్లు అనుమానం రాకుండా ఉండటంతో పాటు ఇంట్లో వారిపై, బంధువులపై అనుమానం వచ్చేలా ఉంటుంది. ఇలా చోరీ చేయడంతో నిందితుడు దొరక్కుండా తిరుగుతున్నాడు. దీంతో పలు కుటుంబాల్లో కుటుంబ కలహాలు, బంధువులు, సన్నిహితుల మధ్య వివాదాలు జరిగాయి.

తాకట్టు పెట్టేందుకు మధ్యవర్తుల సహకారం

చోరీ చేసిన బంగారు ఆభరణాలను నిందితుడు తాను తాకట్టు పెట్టకుండా పెనమలూరు మండలం మురళీనగర్‌కు చెందిన పఠాన్ వసీమ్‌ఖాన్, పఠాన్ నాగూర్, చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన షేక్ అస్లాం, కానూరుకు చెందిన ఎం.నాగ విఘ్నేష్, మొర్ల పిచ్చిరెడ్డితో ముత్తూట్, మనప్పురం ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టిస్తాడు. ఆ డబ్బు తీసుకుని వారికి కమిషన్ ఇచ్చేవాడు.

నిందితుడిపై 50 కేసులు

నిందితుడు గతంలో శ్రీకాకుళం జిల్లాలో 29, విజయనగరం జిల్లాలో 14, విశాఖపట్నం జిల్లాలో 2, ఎన్టీఆర్ జిల్లాలో 2, ఏలూరు జిల్లాలో 2, గుంటూరు జిల్లాలో 1 కేసు ఉన్నాయి. ఆదివారం నిందితుడిని అరెస్టు చేసి.. కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు.

క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్‌కు జట్టు ఖరారు

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా పెద్దాపురంలో ఈ నెల 24న జరగనున్న రాష్ట్ర స్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టు ఆదివారం ఖరారైంది. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియం ఆవరణలో ఆదివారం జట్టు ఎంపిక పోటీలను నిర్వహించారు. ❖ అండర్ 16 బాలుర జట్టు: బి.కార్తీక్, గౌతం, బాలికల జట్టుకు కె.సురేఖ, బి.పల్లవి ❖ అండర్ 18 బాలుర జట్టు: ఎస్.సతీష్, కేశవరావు, బాలికల జట్టుకు పి.సంజన, మధు ❖ అండర్ 20 బాలుర జట్టు: ఆర్.సాయి, ఆర్.లోకేశ్, కె.యాదగిరి, కె.పోలా ప్రసాద్, బాలికల జట్టుకు బి.దీపిక, ఎస్.మాధురి, కె.శిరీష ఎంపికయ్యారు. ❖ ఈ నెల 23న బయల్దేరి వెళ్లనున్నట్లు కోచ్ అప్పన్న, కె.కె.రాజు, బి .నారాయణరావులు తెలిపారు.

జట్టును ఎంపిక చేస్తున్న అసోషియేషన్ సభ్యులు

EENADU e Classifieds

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

CHANGE OF NAME
Undersigned BINGI SRINIVASA (Old Name) S/o BINGI VASUDEVARAO Plot No:28A, Friends Colony, Patrunivalasa (Rural), Srikakulam Dist., Pin Code: 532401, Andhrapradesh changing my name from BINGI SRINIVASA (Old Name) to BINGI SRINIVAS (New Name) S/o BINGI VASUDEVARAO for all purposes.
BINGI SRINIVAS, S/o Vasudevarao, Friends Colony, Srikakulam

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే
సంప్రదించండి: 8008597609

JOBS

వైజాగ్ ప్రముఖ షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం:10000 - 12000 + ఫుడ్, రూము. 9030588502, 9704637370

డోర్ టు డోర్ మార్కెటింగ్ చేయుటకు M/F కావలెను. జీతం 25000 మరియు ఇన్సెంటివ్ ఇవ్వబడును. Cont: 7670877376.

డెస్టినేషన్ హాలీడే ఇన్, న్యూబ్రిడ్జ్ రోడ్, శ్రీకాకుళంలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F), రిసెప్షనిస్ట్ (F) కావలెను. సంప్ర|| ✆ 8977211596.

వైజాగ్ IVF ఆసుపత్రి శ్రీకాకుళం (బ్రాంచ్)లో పనిచేయుటకు 0-2సం|| అనుభవం గల మార్కెటింగ్ సిబ్బంది కావలెను. ✆ 7799772221, 7799772223.

గోపీ's హనిమాన్ హోమియోహాల్ చిన్న బరాటం వీధి, శ్రీకాకుళం నందు పనిచేయుటకు హెల్పర్స్ (పురుషులు)కావలెను. అర్హత:10th, సంప్ర: 9440024777.

ప్రముఖ రెస్టారెంట్‌లో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి, 35సం||లు లోపు ఉన్న పురుష అభ్యర్థులు శ్రీకాకుళం టౌన్ వారు మాత్రమే కావలెను. ✆ 9985558662

MVP కాలనీ గెస్ట్‌హౌస్ (Oyo హోటల్) నందు పని చేయుటకు రిసెప్షనిస్ట్ & రూమ్ బాయ్స్ కావలెను. ఫుడ్&వసతి కలదు. వ|| 28 సం||లోపు ✆7036488899.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు రాష్ట్ర జట్ల ఎంపిక

అద్దంకి, జె.పంగులూరు, న్యూస్‌టుడే: అండర్-18 రాష్ట్ర స్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు బాపట్ల జిల్లా పంగులూరులోని మాగుంట సుబ్బరామిరెడ్డి బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. వీటిలో ఉత్తమ ఆట తీరు ప్రదర్శించిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు మేకల సీతారామిరెడ్డి, ఖోఖో సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హనుమంతరావు ఆదివారం తెలిపారు. **బాలికల జట్టు:** గుణవతి, తేజశ్రీ, భవాని (శ్రీకాకుళం), లక్ష్మి, అమృత, గుణవతి(చిత్తూరు), పురందేశ్వరి, యశోద (ప్రకాశం), ఉమా హర్షిత(గుంటూరు), పూజిత (విజయనగరం), శ్రావణి (విశాఖ), శివకీర్తి (కర్నూలు), దుర్గాదేవీ(తూర్పుగోదావరి), భార్గవి(అనంతపురం), గౌస్ ఉన్నీసా (నెల్లూరు).

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	145	245	265

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

రైసుమిల్లు వద్ద హైడ్రామా

జమ్ము కూడలి వద్ద ధాన్యం బస్తాలతో లారీ

నరసన్నపేట, న్యూస్‌టుడే: నరసన్నపేట సమీపంలోని ఓ రైసుమిల్లుకు తీసుకొచ్చిన ధాన్యం దింపేందుకు హైడ్రామా నెలకొంది. దాదాపు రెండు రోజుల పాటు రాత్రింబవళ్లు మిల్లు వద్దే పడిగాపులు కాసినా అధికారులు చర్యలు తీసుకోలేదని రైతులు వాపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే జలుమూరు మండలం టెక్కలిపాడు గ్రామానికి చెందిన నలుగురు రైతులు శనివారం ఉదయం ఓ లారీలో 256 ధాన్యం బస్తాలు స్థానిక జమ్ము కూడలి వద్ద రైసుమిల్లుకు తరలించారు. ధాన్యంలో ఊక శాతం ఎక్కువగా ఉందని మిల్లరు సరకు తీసుకునేందుకు నిరాకరించారు. దీంతో రైతులు చెంచల కృష్ణమూర్తి సాయిబాబు, జనార్దనరావు, విష్ణుమూర్తి అధికారులను ఆశ్రయించారు. వారి నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్ర స్థాయి అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు వారి జోక్యంతో ఆదివారం రాత్రి నాటికి సమస్య పరిష్కారమైందని బాధితులు పేర్కొన్నారు.

జూడోలో సత్తా.. పాత బస్టాండ్: కర్నూలులోని డా.కేవీ సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి జూడో క్యాడెట్, జూనియర్ విభాగాల్లో జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సౌమ్యరాణి, అక్షయ బంగారు పతకాలను సాధించగా శివరామరాజు రజతం, యశ్వంత్ కాంస్య పతకాలు సాధించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను క్రీడాకారులు కైవసం చేసుకున్నారు.

సర్వేలన్నీ ఒకే గొడుగు కిందకు..!

–న్యూస్‌టుడే, పొందూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొత్త యాప్‌ల ద్వారా పలు సర్వేలు చేస్తున్నాయి. అందులో కొన్ని పొరపాట్లు జరుగుతున్నాయి. వాటికి తావు లేకుండా ప్రజలకు ప్రభుత్వ పథకాల లబ్ధి, ఎంపిక విషయంలో తప్పిదాలు జరకుండా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం(ఎఫ్‌బీఎంఎస్)ను తీసుకొస్తోంది. ❖ ప్రభుత్వం లబ్ధిదారులకు అందించే సంక్షేమ పథకాలు వివిధ శాఖల ద్వారా అమలవుతున్నాయి. పింఛన్లు, రైతు భరోసా, తల్లికి వందనం, ఆటో డ్రైవర్ల సేవలో ఇలా వివిధ పథకాలు వేర్వేరు శాఖల పరిధిలో అమలవుతున్నాయి. వీటన్నిటినీ క్రోడీకరించి లబ్ధిదారులకు ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు అందించనున్నారు. ఈ వివరాల ఆధారంగా వారికి ఏయే పథకాలు అందించాలో ప్రణాళికలు రూపొందించనున్నారు.

❖ యూఎఫ్‌ఎస్-2025 సర్వేకు సంబంధించి రూపొందించిన యాప్‌లో వ్యక్తిగత, కుటుంబ స్థాయి వివరాలు నమోదు చేస్తారు. దీనికి సంబంధించి ప్రభుత్వం మొబైల్ యాప్‌ను రూపొందించింది.

❖ ప్రస్తుత, శాశ్వత చిరునామా, ఇంటి నంబరు, ఇంటి పైకప్పు రకం, సొంత, అద్దె ఇళ్లు, తాగునీటి, అంతర్జాలం, మొబైల్ ఫోన్, మరుగుదొడ్డి, ఎలక్ట్రానిక్ వస్తువులు, వాహనాలు, వాహన యజమాని, వ్యవసాయ యంత్రాలు, పశు సంపద, ఇతర ఆస్తులు నమోదు చేస్తారు.

❖ విద్య, నైపుణ్యం విభాగంలో ప్రస్తుత చదువు, గరిష్ఠ విద్యార్హత, చదువు మానేశారా? నైపుణ్య శిక్షణ పొందారా, నైపుణ్యం రకం వివరాలు నమోదు చేస్తారు.

జి.సిగడాం మండల పరిషత్ కార్యాలయంలో సర్వేపై శిక్షణ పొందుతున్న సచివాలయ ఉద్యోగులు

❖ వ్యక్తిగత స్థాయిలో ఆధార్ నంబరు, పేరు, పుట్టిన తేదీ, చరవాణి నంబరు, ఏపీలో ఎప్పటి నుంచి నివసిస్తున్నారనే విషయాలను నమోదు చేస్తారు.

❖ ఉమ్మడి వివరాల్లో వివాహ స్థితి, తండ్రి, భర్త పేరు, వారి ఆధార్ నంబర్లు, కులం, కులవర్గం, మతం నమోదు చేస్తారు.

❖ ఉపాధి, ఆదాయ విభాగంలో వృత్తి, ఉపాధి, స్వయం ఉపాధి ఉందా? నెల వారీ ఆదాయం, కాలానుగుణంగా ఉపాధి నిమిత్తం వలస వెళ్తారా? అనే ప్రశ్నలు ఉన్నాయి.

❖ 'రెండు రోజుల్లో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు కుటుంబాల సర్వే పక్కాగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పలువురికి శిక్షణ ఇచ్చాం. మరింత పారదర్శకంగా పథకాలు అందించేందుకు ఉపయోగపడుతుంది.' గ్రామ, వార్డు సచివాయాల కోఆర్డినేటర్ ఉదయ్‌కుమార్ తెలిపారు.

❖ సర్వే చేయాల్సిన కుటుంబాలు: **సుమారు 7 లక్షలు** ❖ సర్వేలో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులు: **6,400 మంది**

(c) eenadu

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

సాగరతీరం జనసంద్రం

డొంకూరు తీరంలో పర్యాటకుల సందడి

ఇచ్ఛాపురం మండలం డొంకూరు, లక్ష్మీపురం, వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు తీరాలు ఆదివారం వనభోజనాల్లో భాగంగా పర్యాటకులతో జనసంద్రంగా మారాయి. ఒడిశాతోపాటు ఆంధ్రా ప్రాంతాలకు చెందిన పర్యాటకులు, పాఠశాల విద్యార్థులతో కిక్కిరిసిపోయాయి. మహిళలు, యువత, పిల్లలు ఆటపాటలతో సందడి చేశారు. సమీప కొబ్బరి, జీడి, సరుగుడు తోటల్లో సామూహిక భోజనాలు చేసి ఉల్లాసంభరితంగా గడిపారు. సముద్ర స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. తీరం జనసమూహంతో నిండిపోయింది. డోకులపాడు తీరంలో పల్లిసారథికి చెందిన వయోవృద్ధుల సంఘం సామూహిక వన భోజనాలు చేశారు. తీరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మెరైన్, స్థానిక పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం, వజ్రపుకొత్తూరు

డోకులపాడు తీరంలో సమావేశమైన వృద్ధులు

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

కుత్తుమలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ఆదివారం కుత్తుమ గ్రామంలో రూ. 1.35 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, సామాజిక భవనాలు ప్రారంభించారు. సర్పంచి సరళ, తెదేపా మండలాధ్యక్షుడు రామారావు, పీఏసీఎస్ ఛైర్మన్ పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి పూర్ణ, కామేశ్వరరావు, జగదీష్‌పట్నాయక్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

కవిటి గ్రామీణం: దూగానపుట్టుగ తదితర గ్రామాలకు 30 ఏళ్లుగా బస్సు సౌకర్యం లేదని, తమకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు ఆదివారం రామయ్యపుట్టుగ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆయన వెంటనే ఆర్టీసీ రీజనల్ మేనేజర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించి సహలాలపుట్టుగ, దూగానపుట్టుగ, బి.గొణపపుట్టుగ మార్గాల్లో బస్సు సౌకర్యం కల్పించమని చెప్పారు.

పాద'రెల్లు' సోయగాలు

ప్రకృతి అందాలకు ఎంతటి వారైనా పరవశించాల్సిందే. అలాంటి కోవకు చెందినదే ఈ రమణీయమైన దృశ్యం. ఒక వైపు సూరీడు అస్తమిస్తున్న సమయం, మరో వైపు రెల్లు పూలు సోయగం చూపరులను కనువిందు చేస్తోంది. ఇచ్ఛాపురం జాతీయ రహదారికి పక్కన పెరిగిన రెల్లు పూల సోయగాలు అటుగా వెళ్తున్న వారికి ఆహ్లాదాన్ని నింపుతున్నాయి.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

పునాది పటిష్ఠంగా ఉండేలా..!

– న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం, కాశీబుగ్గ, సోంపేట

• విద్యాశాఖ 75 రోజుల కార్యాచరణ

అయిదో తరగతికి వచ్చినా కొందరు విద్యార్థులు చదవడంలో కంగారు, గణితంలో తడబాటు, అక్షరాలు గుర్తించకలేకపోవడం జరుగుతోంది. ఇకపై ఇలాంటి పరిస్థితి ఎదురుకాకుండా ప్రభుత్వం విద్యాశాఖ ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) బోధనకు శ్రీకారం చుట్టింది.

నియోజకవర్గాల వివరాలు		
మండలం	పాఠశాలలు	విద్యార్థులు
కవిటి	102	8,169
ఇచ్ఛాపురం	70	9,943
కంచిలి	101	5,973
సోంపేట	79	6,512
పలాస	76	2,840
మందస	93	4,356
వజ్రపుకొత్తూరు	74	2,884

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 75 రోజుల ప్రణాళికను అమలు చేస్తోంది. 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు కనీస అక్షర పరిజ్ఞానం ఉండేలా చూడటమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఉదయం ఆ రోజుకు సంబంధించిన పాఠాలు బోధిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.30 వరకు ఎఫ్ఎల్ఎన్ అమలవుతోంది. చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం ప్రాథమిక గణితంపై అవగాహన చేసుకోవడమే కాకుండా ఆ అంశాల్లో నైపుణ్యాన్ని సాధించేలా చూస్తారు.

ఇదీ షెడ్యూల్..

మధ్యాహ్నం ఒంటిగంట నుంచి పిల్లలు ప్రశాంతంగా ఉండేలా చూస్తారు. 1.10 గంటల నుంచి 1.40 వరకు తెలుగు అక్షరాలు, పదాలు, వాటిని కలిపి చదివించి, పలికిస్తారు. 2.15 నుంచి 2.55 వరకు గణితంలో అంకెలు, సంఖ్యలు గుర్తించడం, కృత్యాధార బోధన, చతుర్విధ ప్రక్రియలు నేర్పిస్తారు. 2.55 నుంచి 3.20 వరకు చిన్న చిన్న పరీక్షలు లేదా సమూహంగా కృత్యాలు లేదా సాధనపత్రాలు పూర్తి చేయిస్తారు. 3.20 నుంచి 3.35 వరకు ఆ రోజు బోధించిన దానిపై పునశ్చరణ, హోం వర్క్ చేయిస్తారు.

విద్యార్థినితో మాట్లాడుతున్న అధికారులు

☆ 1, 2 తరగతులకు ఒక విధంగా 3, 4, 5 తరగతులకు మరో విధంగా బోధన ఉంటుంది. విద్యార్థులను వారి సామర్థ్యాన్ని బట్టి ఎ, బి, సి గ్రూపులుగా విభజించారు. మొదట్లో అక్షరాలతో మొదలు పెట్టి 75వ రోజు పూర్తయ్యే సరికి ఏదైనా సబ్జెక్టు విషయాలపై మాట్లాడటం, సొంతంగా కథలు రాయడం వంటివి చేయాలి. దీనిపై కవిటి ఎంఈవో ధనంజయ మజ్జి వద్ద ప్రస్తావించగా 'అన్ని పాఠశాలల్లో కూడా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం పగడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. దీనిపై రోజూ కొన్ని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామ'న్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 8008574279 9063144707

సమస్య: ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో పురుషోత్తపురం కాలనీ ప్రధాన రహదారిలో రోడ్డు సగం వరకే వేశారు.
- కె.రామారావు, ఇచ్ఛాపురం
సమాధానం: నిధుల లభ్యత మేరకు పనులు చేపట్టి రోడ్డును పూర్తిచేస్తాం. **- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం** –న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

సమస్య: పలాస మండలం దానగోరలో కాలువలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం **- గ్రామస్థులు**
సమాధానం: ప్రతిపాదనలు పంపించాం. మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.
- సుధాకర్, పంచాయతీ కార్యదర్శి, తర్లాకోట – న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

సమస్య: కంచిలి మండలం ఆదివారం సంత వద్ద జాతీయ రహదారిపై విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. **- ఎస్.జగ్గారావు, స్థానికుడు**
సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.
- అనూప్, సీనియర్ ఇంజినీరు, ఎన్‌హెచ్ఏఐ – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

మూసుకుపోతోంది..

కవిటి మండలం నెలవంక నుంచి గొనపపుట్టుగ వెళ్లే పంచాయతీరాజ్ శాఖ రోడ్డు ముళ్లపొదలు, పనికిరాని మొక్కలతో మూసుకుపోతోంది. మలుపు వద్ద ఎదురుగా వచ్చిన వాహనం వస్తే కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని గ్రామస్థులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ ధనంజయను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పడిపోతున్నాం.. పట్టించుకోండి..

ఇచ్ఛాపురం పుర పరిధి నాయిబ్రాహ్మణ కాలనీ ఎగువ వీధి రహదారి అధ్వానంగా ఉంది. రాళ్లుతేలి ఎత్తుగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పాదచారులు కూడా రాళ్లపై కాలువేసి, అదుపు తప్పుతున్నారు. సమస్యను పుర కమిషనర్ నల్లి రమేష్ వద్ద ప్రస్తావించగా రోడ్డు వేసేందుకు నిధులు కేటాయించామని, గుత్తేదారు అలసత్వంతో పనులు జరగలేదని, పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

తాగునీరు వృథా

జె.నారాయణపురం ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న తాగునీటి సరఫరా పైపులైను లీకవుతోంది. దీంతో నీరు వృథాగా పోతోంది. ఆ నీరు రోడ్డుపైకి చేరుతుండటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ఉద్దానం ప్రాజెక్టు జేఈ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

మురుగు తిష్ఠ

ఇచ్ఛాపురం పుర పరిధి 17వ వార్డు లాలాపేట నుంచి ప్రధాన రహదారి మార్గానికి చేరుకునే రోడ్డులో మసీదు వద్ద మట్టి కాలువ ఉంది. ఇది వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగు తిష్ఠ వేస్తోంది. ఇక్కడ రోడ్డు కూడా సగంలో వదిలివేయడంతో మురుగునీరు రోడ్డుపైన పారుతోంది. సమస్యను కమిషనర్ రమేష్ వద్ద ప్రస్తావించగా గతంలో ఎన్నికల ముందు నిధులు కేటాయించినా పనులు జరగలేదన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పలకలు అమర్చారు

స్పందనకు వందనం

పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో కాలువకు మరమ్మతులు చేశారు. ఈ సమస్యపై ఈనెల 14న 'రాళ్లు వేశారు.. మురుగు ఆపేశారు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి పురపాలకులు స్పందించారు. కాలువకు మరమ్మతులు చేపట్టి పలకలు అమర్చారు. – న్యూస్‌టుడే, పలాస

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కవిటి గ్రామీణం: రాజపురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతు పనుల నిమిత్తం సోమవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్తుశాఖ ఈఈ యజ్ఞేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నెలవంక, సీహెచ్.పద్మపుట్టుగ, బైరిపురం, మద్దుపుట్టుగ, కొమ్ముపుట్టుగ గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రెండు చుక్కలు.. జీవితానికి రక్ష

కవిటి సామాజిక ఆసుపత్రిలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

రెండు పోలియో చుక్కలే ఐదేళ్లలోపు చిన్నారుల జీవితానికి రక్ష అని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, వైద్యాధికారులు అన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కవిటి సామాజిక ఆసుపత్రిలో ప్రభుత్వ విప్ అశోక్, పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో పుర కమిషనర్ ఇ.శ్రీనివాసులు, సోంపేట మండలంలో పలు పీహెచ్‌సీల్లో ఏఎంసీ ఛైర్మన్ ఎం.విజయలక్ష్మి, ఎంపీపీ డాక్టర్ ఎన్.దాసు, జడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద, జాగృతి సంస్థ అధ్యక్షుడు రాయుడు గణపతి, కంచిలి మండలంలోని పలు ప్రాంతాల్లో ఎంపీపీ దేవదాసురెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు లోలాక్షి, ఎంపీడీవో వి.తిరుమలరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఇచ్ఛాపురం పరిధిలో ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి, బెల్లుపడ అర్బన్ పీహెచ్‌సీ, రోటరీక్లబ్, పురపాలక సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పుర కమిషనర్ నల్లి రమేష్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డా. టి.ఎం వెంకటేష్, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ అధ్యక్షురాలు బి.హైమవతి, పాల్గొన్నారు. మందసలో పూర్వాధ్యక్షురాలు పిలక రాజలక్ష్మి, బస్టాండులో డా.దేవేంద్రరెడ్డి పల్స్‌పోలియో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.
–న్యూస్‌టుడే, పలాస/గ్రామీణం, ఇచ్ఛాపురం/గ్రామీణం, కంచిలి, కవిటి గ్రామీణం, సోంపేట

పలాసలో పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

రామానుజన్ స్ఫూర్తితో ఎదగాలి

సోంపేట, ఇచ్ఛాపురం, పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: గణిత పితామహుడు రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఇసకలపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనిల్ కుమార్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవం, గణిత శాస్త్ర నిపుణులు శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు నూకరాజు, వసంతరావులను సన్మానించారు. రామానుజన్ గుర్తించిన విశిష్ట సంఖ్య 1729 ఆకృతిలో విద్యార్థులు అలరించారు. ఇచ్ఛాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినులు రంగవల్లికలు వేశారు. పలాస మండలం రామకృష్ణాపురంలోని శ్రీ సత్య సాయి విద్యా విహార్‌లో నియోజకవర్గ స్థాయి సామూహిక గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. కాశీబుగ్గ శ్రీ చైతన్య హైస్కూల్ ప్రథమ స్థానం సాధించింది. మందస మండలం హరిపురానికి చెందిన గీతం టాలెంట్ స్కూల్, వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల జట్లు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు పలాస ఎంఈవో శ్రీనివాసరావు వరుసగా రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యితోపాటు ధ్రువపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ట్రస్టు ఛైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపల్ ప్రీతీచౌదరి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: గణిత చిహ్నాలతో రంగవల్లిక

సోంపేట: 1729 ఆకృతిలో ఇసకలపాలెం విద్యార్థులు

సత్తా చాటిన కంచిలి యువకుడు

కంచిలి, న్యూస్‌టుడే: కంచిలి పట్టణానికి చెందిన కార్తీక్ పట్నాయక్ విజయవాడ కేఎల్ విశ్వవిద్యాలయంలో జరిగిన యువత ఆవిష్కరణ కార్యక్రమంలో సత్తా చాటాడు. ఏఐతో వ్యవసాయం ఎలా చేయొచ్చు అంశంపై ప్రదర్శన ఇచ్చి ప్రథమ బహుమతి సాధించాడు. కార్తీక్ డిగ్రీ పూర్తి చేసి బెంగళూరులో ఏఐ కృత్రిమ మేధస్సులో శిక్షణ పూర్తి చేశారు. తండ్రి శివ పట్నాయక్ వడ్రంగి పని చేస్తున్నారు. సత్తా చాటిన యువకుడిని పలువురు అభినందించారు.

బోధనకు దూరం చేయొద్దు

ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనీల్‌కుమార్

మందస, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యాశాఖలో రోజుకో కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఉపాధ్యాయులను బోధనకు దూరం చేస్తోందని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీ అనీల్‌కుమార్ అన్నారు. మందసలో మండలశాఖ కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా బి.భైరాగి, ప్రధాన కార్యదర్శిగా బి.రామారావు, ఉపాధ్యక్షులుగా సింహాచలపతి, పీటీ గైర్వాణి, షేక్ హమీద్, వైకుంఠ బెహరా ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా 18, ఆడిట్ కమిటీ సభ్యులుగా 7, అకాడమిక్ కమిటీ సభ్యులుగా 10 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అనీల్ కుమార్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రత్యేకంగా సంక్షేమాధికారులను నియమించకుండా ఆ బాధ్యతలను ఉపాధ్యాయులకే కట్టబెడుతున్నారన్నారు.

విఠల్‌కు సత్కారం

జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్, తెదేపా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసిన పీరికట్ల విఠల్‌కు పార్టీ నాయకులు ఆదివారం సత్కరించారు. నాయకులు హెచ్.మురళీమోహన్, వి.వెంకటరావు, కుమార్ నాయక్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, పలాస

ధనరాజతులసమ్మకు పూజలు

లొద్దపుట్టి కూడలి వాహన దైవంగా పేరొందిన ధనరాజతులసమ్మకు భక్తులు ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయం వద్దకు ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. సమీప ప్రాంతాల నుంచి నడకదారిలో ప్రత్యేక నెయ్యి ఘటాలను సమర్పించి మొక్కులు చెల్లించారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

విజ్ఞానదాయక వినోదమే అవధానం

సోంపేట: విజ్ఞానదాయక వినోదమే అవధాన ప్రక్రియ అని గణిత అవధాని తిరుపతిరావు అన్నారు. ఆదివారం బారువ ఎస్సీ బాలుర వసతిగృహంలో అవధాన ప్రక్రియ నిర్వహించారు. ఇక్కడి విద్యార్థులకు గణితంలో 10 అంశాల గురించి వివరించారు. పిల్లలు అడిగిన ప్రశ్నలకు క్షణాల్లో సమాధానాలు చెప్పారు. సులభ సూత్రాలతో గణితం నేర్చుకోవాలని సూచించారు. గణిత చిట్కాలు నేర్పించారు. తిరుపతిరావును వార్డెన్ రవికుమార్ సన్మానించారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన.. పలాస గ్రామీణం: బ్రాహ్మణతర్లా జడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు చలం వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన కల్పించారు. కల్తీ వస్తువులు కొన్నామని గుర్తించినా, వస్తువులు కొని ఎవరైనా నష్టపోయినట్లు గమనించినా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించాలని సూచించారు. వస్తువులు కొన్నప్పుడు కచ్చితంగా బిల్లు తీసుకోవాలన్నారు. కార్యవర్గ సభ్యులు జనార్దనరావు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో విజ్ఞానం

పోటీ పరీక్షలతో విజ్ఞానం పెరుగుతుందని వక్తలు అన్నారు. హుండిలో విన్నర్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు కోనారి చిరంజీవి ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో యోగంద్ర (హుండి), సాహితి(పీఎంపురం), తృతీయ స్థానంలో గుణశేఖర్(హుండి), అర్చన(హరిదాసుపురం), అజయ్(హుకుంపేట) నిలిచారు. విజేతలకు జ్ఞాపికలతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

జిల్లా స్థాయి స్పీడ్ స్కేటింగ్ పోటీలు

విజేతలతో నిర్వాహకులు

సోంపేట, న్యూస్‌టుడే: సోంపేట ధ్యాన్‌చంద్ స్పీడ్ స్కేటర్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలు ఆదివారం ముగిశాయి. నిర్వాహకులు విజేతలకు బహుమతులు అందజేసి, రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోంపేట ఎస్సై వి.లోవరాజు మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యం కోసం చిన్నారులు ఆడాలన్నారు. క్లబ్ నిర్వాహకులు టి.వెంకటరమణబాబు, టి.ప్రణీత్, ఎ.షణ్ముఖరావు, బి.చంద్రావతి పాల్గొన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి శ్రమించాలి

సోంపేట, న్యూస్‌టుడే: జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త శ్రమించాలని పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు పిలుపునిచ్చారు. ఆదివారం సోంపేటలో జరిగిన సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడిగా బీన ప్రదీప్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీని బలపరిచేందుకు కార్యకర్తలు గ్రామస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని రాజు కోరారు. నాయకులు, వీరమహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు

ప్రవీణ్‌కు ఎకనామిక్ టైమ్స్ అవార్డు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: రైజ్ గ్రూప్ అధ్యక్షుడు, ఎండీ డా.ప్రవీణ్ పుల్లటకు ఎకనామిక్ టైమ్స్ అవార్డుల్లో మోస్ట్ ఇన్‌స్పైరింగ్, ఇన్‌ఫ్లూయెన్షియల్ లీడర్ షిప్ ఆఫ్ ద ఇయర్ 2025 అవార్డు లభించింది. ఉద్యమశీలత, రాజకీయ పరిశోధన అంశాల్లో ఆయన సాధించిన విశిష్ట ప్రతిభకు గుర్తింపుగా ఇది దక్కింది. దేహ్రాదూన్‌లో ఆదివారం జరిగిన వేడుకల్లో ఉత్తరాఖండ్ గవర్నర్ గుర్మీత్‌సింగ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్లు డా.ప్రవీణ్ తెలిపారు. కవిటి మండలం భైరిపురం గ్రామానికి చెందిన ఈయన సాధించిన విజయాలకు పలువురు అభినందనలు తెలిపారు.

మరమ్మతులతో సరి.. విస్తరణో మరి

– న్యూస్‌టుడే, కంచిలి/గ్రామీణం

కవిటి మండలంలో దశాబ్దాల కిందట నిర్మించిన అంపురం, ఘాటీముకుందపురం రోడ్డు విస్తరణకు నోచుకోక ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈ రహదారి దుస్థితిపై స్థానికులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేయగా.. తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వదిలేస్తున్నారు తప్ప పూర్తిస్థాయి అభివృద్ధి పనులు చేపట్టలేదు. సోంపేట నుంచి అంపురం, ఘాటీముకుందపురం మీదుగా ఒడిశాలో పలు గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. దీంతో నిత్యం రద్దీగా ఉంటోంది. విస్తరణ జరగకపోవడంతో ఇప్పటివరకు మూడుసార్లు ఆర్టీసీ బస్సులు బోల్తా పడ్డాయి.

✤ రహదారి విస్తరణకు ఈ ఏడాది ఫిబ్రవరి 23న కేంద్ర ప్రభుత్వం సీఆర్ఐఫ్ (సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్) నిధులు రూ.23 కోట్లు విడుదల చేసినప్పటికీ రాష్ట్రప్రభుత్వం డీపీఆర్ అందించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించి రహదారి విస్తరణకు చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు.

అంపురం, ఘాటీ ముకుంద పురం రోడ్డు పరిస్థితి

✤ 11 పంచాయతీల పరిధిలో సుమారు 30 గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారి గుండా కంచిలి, సోంపేట పట్టణాలకు వివిధ పనుల కోసం ప్రయాణాలు సాగిస్తుంటారు. కర్తలి నుంచి అంపురం వరకు రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడటంతో అధికారులు వాటిని తాత్కాలికంగా పూడ్చారు. రూ. లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపడుతున్నా పనుల్లో నాణ్యత లోపం కారణంగా కొన్ని రోజుల తరవాత మళ్లీ యథాస్థితికి చేరుకోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

చర్యలు చేపడతాం..

గత తెదేపా హయాంలో రహదారి విస్తరణకు రూ.11 కోట్లు కేటాయించాం. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా రివర్స్ టెండరింగ్ చేపట్టడంతో కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత అంచనా వ్యయం రూ.23 కోట్లకు చేరింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అందించబోయే డీపీఆర్‌పై అధికారులతో చర్చించి రహదారి విస్తరణకు చర్యలు తీసుకుంటాం. - బెందాళం అశోక్, ప్రభుత్వ విప్

ఘనంగా జగన్ జన్మదిన వేడుక

కాశీబుగ్గలో కేకు కోస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ, పలాస, ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ హయాంలో అన్నివర్గాలకు ఇబ్బందులు తప్పడం లేదని, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందేవని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, జడ్పీ అధ్యక్షురాలు పిరియా విజయ అన్నారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో వైకాపా నాయకులు ఆదివారం జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కాశీబుగ్గలో నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి పాల్గొన్నారు. ఇచ్ఛాపురంలో శ్రీస్వేచ్ఛావతి అమ్మవారికి జడ్పీ అధ్యక్షురాలు విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, పురాధ్యక్షురాలు రాజలక్ష్మి ప్రత్యేక పూజలు చేశారు. సోంపేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, పలాస ఇందిరాచౌక్ కూడలి వద్ద పురాధ్యక్షుడు గిరిబాబు కేకు కోశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించారు. మండపల్లి సీతయ్య ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి అన్నదానం చేశారు.

ఇచ్ఛాపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జడ్పీ అధ్యక్షురాలు విజయ, ఎమ్మెల్సీ రామారావు, రాజలక్ష్మి

నాటుసారాతో ఇద్దరి అరెస్టు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: పెదంచల పరిధిలో నాటుసారాతో మోహనరావు, శ్రీరాములను ఆదివారం అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ సీఐ వై.రామకృష్ణ తెలిపారు. ఒడిశా నుంచి 2 లీటర్ల సారా కొనుగోలు చేసి పెదంచలలో విక్రయించేందుకు తీసుకొస్తుండగా వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

కేంద్ర బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, జీవన సురక్ష బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వజ్రపుకొత్తూరు గ్రామీణ బ్యాంకు అసిస్టెంట్ మేనేజరు డి.మహేష్ పేర్కొన్నారు. నగరంపల్లిలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతాదారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. తక్కువ జమతో ఎక్కువ బీమా చెల్లించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇటీవల మరణించిన ఆర్.పుష్పలత కుటుంబ సభ్యులకు రూ.2 లక్షల బీమా చెక్కు అందజేశారు.

ఢిల్లీ ఫ్యాకల్టీచే సోంపేటలో కాంపిటీటివ్ కోచింగ్
SSC - GD కానిస్టేబుల్స్ | DSC - SGT SA (All Subjects)
రైల్వే NTPC | Bank ఆర్మీ
ఒకసారి ఫీజు చెల్లిస్తే జాబ్ వచ్చేవరకు కోచింగ్ హాస్టల్ కలదు
NCC NARGITA COMPETITIVE CLASSES
SOMPETA, Ph: 9938583230

పబ్లిక్ నోటీసు
YAVVARI HEMAKUMAR
ADVOCATE, PALASA-532221
Cell: 9440592204, 8186869808

టెక్కలి
• టెక్కలి • నరసన్నపేట • పాతపట్నం

సారూ.. ఇటు కొంచెం చూడరూ

టెక్కలి పట్టణంలోని శ్రీనివాసనగర్ కొళ్లఫారం వీధిలో సీసీ రహదారి నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు చొరవతో కాలనీలో మౌలిక సదుపాయాల ఏర్పాటుతో ముంపు సమస్య తీరిందని చెబుతున్నారు. కొన్నిచోట్ల పాత రోడ్ల పైనే కొత్తవి వేశారు తప్ప ఇబ్బంది ఉన్న మరో మూడు ప్రాంతాలను పట్టించుకోలేదని వాపోతున్నారు. సమస్యపై మండల ఇంజినీరింగ్ అధికారి ఎస్.లక్ష్మణనాయుడు మాట్లాడుతూ.. త్వరలో మిగిలిన చోట్ల పనులు ప్రారంభిస్తామన్నారు. – న్యూస్‌టుడే, టెక్కలి పట్టణం

ఆర్భాటం.. అమ్మకానికి ఆలస్యం

ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతకు పాట్లు తప్పడం లేదు. మిల్లులకు తీసుకొచ్చిన ధాన్యం బస్తాలను అన్‌లోడ్ చేయడానికి రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. పెంటూరు, పెద్దతామరాపల్లి రైస్ మిల్లుల వద్ద కళాసీలు లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. కళాసీల సంఖ్య పెంచి, సమస్యను పరిష్కరిస్తామని మండల రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ఇంద్రజిమ్ పేర్కొన్నారు – న్యూస్‌టుడే, నందిగాం

నిండు జీవితానికి రెండు చుక్కలు

మబగాంలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పాతపట్నంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో..

పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం విజయవంతంగా సాగింది. ఐదేళ్ల లోపు చిన్నారులకు చుక్కల మందు వేయించాలని నాయకులు, అధికారులు పిల్లల తల్లిదండ్రులకు సూచించారు. లేకుంటే కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని వైద్యాధికారులు పరిశీలించారు. – న్యూస్‌టుడే బృందం

ప్రతిభ వెలికితీసేందుకే పోటీ పరీక్షలు

పరీక్షకు హాజరైన విద్యార్థులు

పాతపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం స్థానిక మహేంద్ర జూనియర్ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. ఈ పోటీల్లో 52 పాఠశాలల నుంచి 936 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. టాలెంట్ టెస్ట్ కన్వీనర్ ఎం.ఆంజనేయులు, నాయకులు సైలాడ సతీష్, అక్కెంద్ర సన్యాసిరావు, అధ్యాపకులు బి.వి.రమణ, శాంతారావు, సాయికుమార్ పాల్గొన్నారు.

కలలకు రెక్కలు తొడిగారు

– న్యూస్‌టుడే, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం, ఎల్‌ఎన్‌పేట, మెళియాపుట్టి

హిరమండలంలో పిండి, నూనెమిల్లు నిర్వహిస్తున్న రత్నాలమ్మ

స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలు అందించి సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు కూటమి ప్రభుత్వం చేయూత అందిస్తోంది. వెలుగు ప్రాజెక్టు ద్వారా అమలవుతున్న స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ, ఉన్నతి పథకాల నిధులు వినియోగించుకుంటూ అతివలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. గతంలో సొంత అవసరాలకు నిధులు వినియోగించుకునే వారు, నేడు యూనిట్లు ఏర్పాటు తప్పనిసరి చేశారు. పాతపట్నం నియోజకవర్గంలో పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం.

ఇదీ పరిస్థితి..

పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాల్లో 160 పంచాయతీల్లో 6,482 స్వయం శక్తి సంఘాలున్నాయి. వీటిలో 70,911 మంది సభ్యులుగా ఉన్నారు. వీరు 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి ద్వారా రూ.21.81 కోట్లు, బ్యాంకు లింకేజీతో రూ.152.41 కోట్లు రుణాలు పొందారు. ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళలు రాయితీ పొందారు.

పాతపట్నం నియోజకవర్గం వివరాలు

మండలం	పంచాయతీలు	స్వయంశక్తి సంఘాలు	సభ్యులు
హిరమండలం	23	1,147	12,465
కొత్తూరు	43	1,650	18,241
పాతపట్నం	34	1,587	17,216
మెళియాపుట్టి	37	1,364	14,956
ఎల్ఎన్‌పేట	23	734	8,033

కుటుంబాలకు చేయూత

అతివల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అండ

★ చొర్లంగి గ్రామానికి చెందిన శ్రీకనక దుర్గ స్వయం శక్తి సంఘం సభ్యురాలు కరణం అశ్విని రూ.2 లక్షల రుణం పొందారు. ఆటో, కుట్టు మిషన్ కొనుగోలు చేశారు. భర్త ఆటో నడుపుతుండగా ఆమె ఇంటి వద్దనే బట్టలు కుడుతూ స్వయం ఉపాధి పొందుతున్నారు. నెలకు ఖర్చులు పోనూ రూ.15 వేల వరకు ఆదాయం పొందుతున్నట్లు పేర్కొన్నారు.

★ హిరమండలం గ్రామానికి చెందిన జై భవాని స్వయంశక్తి మహిళా సంఘం సభ్యులు డి.రత్నాలమ్మ రూ.3 లక్షలు రుణం తీసుకుని పిండి, నూనె మిల్లులు నిర్వహిస్తున్నారు. వచ్చిన ఆదాయంలో నెలకు రూ.10 వేలు బ్యాంకుకు చెల్లిస్తూ, రూ.15 వేలు కుటుంబ ఖర్చులకు వినియోగిస్తున్నట్లు చెప్పారు.

★ చొర్లంగి గ్రామానికి చెందిన నిధి రూ.3 లక్షలు రుణంతో పిండి మిల్లు నిర్వహిస్తున్నారు. నెలకు రూ.10 వేలు బ్యాంకు రుణం తీరుస్తూ, రూ.10 వేలు మిగులుతున్నట్లు ఆమె తెలిపారు.

ప్రగతి సాధించాలి

గ్రామాల్లో మహిళలు వెలుగు పథకం ద్వారా పొందిన రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించాలి. క్షేత్రస్థాయి ఉద్యోగుల ద్వారా స్వయంశక్తి సంఘాల సభ్యులకు చైతన్యం కల్పిస్తున్నాం. ఆదాయం పొందేలా చర్యలు చేపడుతున్నాం. – వి.లక్ష్మణరావు స్త్రీ నిధి మేనేజర్, పాతపట్నం నియోజకవర్గం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజాసమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్లో వివరించొచ్చు. వాటిని బాధ్యులదృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: కళింగపట్నం- పాతపట్నం 326ఏ జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా చల్లవానిపేట గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించారు. సంతోషిమాత కల్యాణమండపం సమీపంలో పలక విరిగిపోవడంతో పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. **- కొండక ఆదేశ్, చల్లవానిపేట**

★ క్షేత్రస్థాయిలో పరిశీలించాం. పలక వేయాలని గుత్తేదారుకు ఆదేశించాం. త్వరలో సమస్యను పరిష్కరిస్తాం. **- రఘు, జేఈ, జాతీయ రహదారుల విభాగం** – న్యూస్‌టుడే, జలుమూరు

?: తురకలకోటలో జాతీయ రహదారి పక్కన విద్యుద్దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి సమయంలో రాకపోకలకు ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- ఏదూరు కామరాజు, స్థానికుడు**

★ తక్షణమే సిబ్బందికి తెలియజేసి, బల్బులు వెలిగేలా చూస్తాం. **- రాజేంద్ర, పంచాయతీ కార్యదర్శి, దేవుపురం**

– న్యూస్‌టుడే, నందిగాం

నిర్లక్ష్యానికి ఏడేళ్లు నిండాయి..!

సంతబొమ్మాళి మండల కేంద్రంలో గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయం పైకప్పు రేకులు 2018లో వచ్చిన తిత్లీ తుపాను ధాటికి ధ్వంసమయ్యాయి. దీంతో భవనం పైన పెద్ద రంధ్రం ఏర్పడటంతో చిన్నపాటి వర్షం కురిసినా దస్త్రాలు తడిసి పోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఏడేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని ఏపీవో నరసింహమూర్తి చెప్పారు. – న్యూస్‌టుడే, సంతబొమ్మాళి

పాఠశాలే.. పశువుల శాలగా మారింది

నందిగాం పంచాయతీ కొండపేటలో ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవనం నిర్మించారు. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండటంతో హేతుబద్ధీకరణలో విద్యాలయాన్ని 2015లో మూసేశారు. భవనాలను పశువులు కట్టడానికి స్థానికులు వినియోగిస్తున్నారు. పిల్లలు సుమారు 2 కి.మీ. దూరంలో ఉన్న నరేంద్రపురం బడికి వెళ్తున్నారు. 10 మంది విద్యార్థులు ఉంటే పాఠశాల తెరుస్తామని ఎంఈవో జి.నరసింహులు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, నందిగాం

దయనీయం.. రాకపోకలకు భయం

సారవకోట మండలం మదనాపురం నుంచి కిడిమిబుడితి వరకు 3 కి.మీ.కంకర రోడ్డు దయనీయంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల కోతకు గురై అధ్వానంగా తయారైంది. మండల కేంద్రానికి దగ్గర మార్గం కావడంతో చాలా గ్రామాల వారు నిత్యం ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి పక్కారోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. ప్రతిపాదనలు పంపిస్తామని పీఆర్ ఏఈ భార్గవి అన్నారు. – న్యూస్‌టుడే, సారవకోట

నియంత్రిక.. ప్రమాద ఘంటిక

పోలాకి మండలం ఎస్.ఎల్.పురం పాల కేంద్రం వద్ద విద్యుత్తు నియంత్రిక చుట్టూ పనికిరాని మొక్కలు పెరిగిపోయాయి. మరమ్మతులకు గురైతే పనులు చేయలన్నా ట్రాన్స్‌కో సిబ్బంది ఇక్కట్లు పడాల్సి వస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తామన్నారు. పంచాయతీ అధికారులు రోడ్డు పక్కన చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. – న్యూస్‌టుడే, పోలాకి

అల్పాహారం అందించారు

స్పందనకు వందనం

కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు జరుగుతున్నాయి. సాయంత్రానికి అల్పాహారం లేక వారు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 19న 'సత్తువ లేకుండా సత్తాచాటేదెలా' శీర్షికన వచ్చిన కథనానికి దాతలు స్పందించారు. అక్కడ చదువుతున్న 129 మందికి ఆదివారం కొత్తూరుకు చెందిన సామాజిక వేత్త అర్జునరావు, రెడ్‌క్రాస్ సంస్థ మండల కార్యదర్శి రవి బిస్కట్లు అందించారు. హెచ్ఎం గోవిందరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

గ్రంథాలయంలో తనిఖీలు

పాతపట్నం, న్యూస్‌టుడే: స్థానిక శాఖ గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి వి.జి.ఎస్.శంకరరావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విద్యార్థులు, పాఠకులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రావాల్సిన సెస్ బకాయిలు వసూలు చేయాలన్నారు. దస్త్రాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయాధికారిణి డి.సాయమ్మ ఉన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న శంకరరావు

పెచ్చులూడి.. బీటలు వారి..!

జలుమూరు మండలం వాసుదేవపురం పాఠశాల భవనం పనులు చివరిదశలో అసంపూర్తిగా నిలిపేశారు. ఏళ్ల తరబడి నిరుపయోగంగా వదిలేయడంతో పునాదులు బీటలు వారి, శ్లాబ్ పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవో బమ్మిడి మాధవరావు వద్ద ప్రస్తావించగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, జలుమూరు

ధ్యానంతో ఆరోగ్యం

హిరమండలం, న్యూస్‌టుడే: ధ్యానంతోనే ఆరోగ్యం మెరుగుపడుతుందని బ్రహ్మకుమారీ మోహిని, నీరజ అన్నారు. ఆదివారం స్థానిక కేజీబీవీలో మెడిటేషన్ డే నిర్వహించారు. యోగాతో ఒత్తిడి దూరమవుతుందని సూచించారు. ఇదే విధంగా రోజూ చేయాలని తెలిపారు. ఎస్‌వో కృష్ణవేణి పాల్గొన్నారు.

వరికుప్ప దగ్ధం.. మెళియాపుట్టి, న్యూస్‌టుడే: గొప్పిలి ప్రాంతంలో ఆదివారం వరి కుప్ప దగ్ధమైంది. పి.శంకరరావుకు చెందిన 50 సెంట్లలో పండిన వరి పంటను కుప్పగా పెట్టారు. సమీపంలో వేరొక రైతు గడ్డికి అగ్గి పెట్టడంతో.. గాలికి నిప్పు రవ్వలు ఎగిరి పడటంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. పలాస అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

వైద్య సేవలు పెంపొందించాలి

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

నరసన్నపేట, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు పెంపొందించాలని ఆ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు సూచించారు. స్థానిక ఇందిరానగర్‌లోని శిష్టకరణ సంఘ భవనంలో ఆదివారం పారా మెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి సత్తారు భాస్కరరావు సంఘ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున సంఘం నుంచి తొలగించేందుకు తీర్మానించారు. రాష్ట్ర శాఖ ప్రధాన కార్యదర్శి గణపతిరావు, సత్యనారాయణ, వినోద్‌కుమార్, నరసన్నపేట అధ్యక్షుడు కూర్మారావు, ఎస్ఎం ప్రసాద్, రాజు పాల్గొన్నారు. అనంతరం పారామెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షుడిగా టి.భాస్కరరావు, గౌరవాధ్యక్షుడిగా కూర్మారావు, కార్యదర్శిగా విజయ్, ఉపాధ్యక్షుడిగా రమేష్‌ను ఎన్నుకున్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘ ఎన్నిక

నరసన్నపేట నియోజకవర్గ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘ అధ్యక్షుడిగా పుచ్చల ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక శ్రీదేవి కాంప్లెక్స్‌లో ఆదివారం ఈ సంఘ సమావేశం జరిగింది. ఉపాధ్యక్షుడిగా ఎస్.శ్రీను, కార్యదర్శిగా గోవింద, సంయుక్త కార్యదర్శిగా ధర్మ, కోశాధికారిగా అశోక్, సభ్యులుగా శంకర్, దాలిశెట్టి, రాంబాబు, సంతోష్ బాధ్యతలు స్వీకరించారు. – న్యూస్‌టుడే, నరసన్నపేట

హిందువులు ఐక్యంగా ఉండాలి

ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే: హిందువులు ఐక్యంగా ఉండి ధర్మ రక్షణ, సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షించాలని జిల్లా సంఘ చాలక్ రమణమూర్తి కోరారు. ఎల్‌ఎన్‌పేట గ్రామంలో శ్రీజగన్నాథస్వామి ఆలయం ఆవరణలో హిందూ సమ్మేళన్ కార్యక్రమాన్ని సమరసత సేవా ఫౌండేషన్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జిల్లా సభ్యులు వసంతరావు, షణ్ముఖరావు, మిశ్రో, వాన సోమేశ్వరరావు, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్త పంచాయతీ ఏర్పాటు చేయండి

జలుమూరు: తలతరియా పంచాయతీలోని సంతలుబైలు, ఎర్రన్నపేట గ్రామాలను విభజించి కొత్త పంచాయతీ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల నాయకులు ఎమ్మెల్యే రమణమూర్తిని కోరారు. ఆదివారం ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. నీటి సంఘం అధ్యక్షుడు బలగ కృష్ణారావు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

టెక్కలి, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఏఎంసీ ఛైర్మన్ బగాది శేషగిరిరావు అన్నారు. నంబాళ్లపేట గ్రామంలో రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రహదారి పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. గ్రామస్థులతో మాట్లాడి ఇతర మౌలిక సదుపాయాల గురించి చర్చించారు. మూలపేట పోర్టు కోసం నిర్మిస్తున్న రహదారి వద్ద అండర్‌పాసేజీ లోతుగా నిర్మిస్తుండటం వల్ల భవిష్యత్తులో సమస్యలు తలెత్తుతాయని వారు వివరించారు. కార్యక్రమంలో సనపల మురళీధర్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అమెరికాకు చెందిన విఫర్ నీడి సంస్థ చేయూత అందించింది. సంతబొమ్మాళి మండలం నౌపడ గ్రామానికి చెందిన జీరు చిన్నారావుకు రూ.10 వేలు, కోటబొమ్మాళి వాసి దేవాది మహేశ్వరరావుకు రూ.8 వేలు వైద్య ఖర్చులకు సంస్థ అధ్యక్షుడు భరత్ పంపించారు. ఆ నగదును బాధిత కుటుంబాలకు సభ్యులు ఆదివారం అందజేశారు. మెండ రామినాయుడు, రెడ్డి సూరిబాబు, శివారెడ్డి ఉన్నారు.

రేపు ఉద్యోగ మేళా

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 23న ఉదయం 10 గంటల నుంచి ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జీఎంఆర్ రక్ష సెక్యూరిటీ సర్వీసెస్ మేనేజర్ అగ్గాల హనుమంతరావు ఆదివారం తెలిపారు. సెక్యూరిటీ గార్డుల నియామకానికి జరుగుతున్న ఎంపికల్లో 166 సెంటీమీటర్ల పొడవు ఉండి, పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఎంపికైన వారికి శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: స్థానిక ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి బాలికలు దాక్షాయణి, వెంకటలక్ష్మి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయులు వాసుదేవరావు, వెంకటరావు, గణేష్ తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం గ్రామీణ మండలం సింగుపురంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపినట్లు చెప్పారు. వీరు కోటబొమ్మాళి బాలికల వసతిగృహంలో ఉండి చదువుకుంటున్నారు. విద్యార్థినులతో పాటు వ్యాయామోపాధ్యాయులను ఎంఈవో (2), ప్రధానోపాధ్యాయుడు డబీరు గోవిందరావు, వసతిగృహ కార్యనిర్వహణాధికారిణి శ్రీదేవి అభినందించారు.

తెదేపా బలోపేతానికి కృషి

ఎల్‌ఎన్‌పేట, న్యూస్‌టుడే: జిల్లాలో తెదేపా బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మొదలవలస రమేష్ పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చింతాడ శ్రీనివాసరావు ఆమదాలవలసలో రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్‌ఎన్‌పేట మండలంలో పార్టీ పరిస్థితిని వివరించారు. చింతాడ సురేష్ పాల్గొన్నారు.

పనికిరాని మొక్కల తొలగింపు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: అభివృద్ధికి నోచుకోక పనికిరాని మొక్కలు పెరిగి అధ్వానంగా మారిన ఉర్లాం శ్మశాన వాటిక పరిస్థితిపై సర్పంచి పోలాకి నరసింహమూర్తి స్పందించారు. స్థానిక యువత సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో ఆదివారం చదును చేయించారు.

విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలి

ఐతమ్ పూర్వ విద్యార్థులతో సమావేశమైన కళాశాల ప్రతినిధులు

టెక్కలి, న్యూస్‌టుడే: విద్యాభ్యాసం పూర్తిచేసి ఉన్నత స్థానాల్లో స్థిరపడిన కళాశాల పూర్వ విద్యార్థులు ప్రస్తుతం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు మార్గదర్శకులుగా నిలవాలని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు కోరారు. కళాశాల పూర్వ విద్యార్థుల సమాఖ్యతో ఆదివారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. పరిశ్రమ అవసరాలను, విద్యార్థుల లోపాలను వివరించి అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ఎటువంటి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలో సూచించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఏఎస్ శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్, యుగంధర్ పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో శ్రీమహావిష్ణువు

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీమహావిష్ణువుకు మాఘమాసం సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగాలకు పుష్పాలతో అభిషేకం చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. – న్యూస్‌టుడే, జలుమూరు

అడుగు ముందుకి.. 2 అడుగులు వెనక్కి..!

బాలారిష్టాలు దాటని రిపీటర్ స్టేషన్ రోడ్డు పనులు

పేరు	: మైక్రోటవర్, రిపీటర్ స్టేషన్‌కు రోడ్డు
అంచనా విలువ	: రూ.4 కోట్లు (నరేగా)
బిల్లుల చెల్లింపు	: రూ.73 లక్షలు
పర్యవేక్షణ	: పంచాయతీరాజ్ శాఖ
పనులు ప్రారంభం	: ఈ ఏడాది జనవరి 12
తాజా పరిస్థితి	: కొన్ని నెలలుగా నిలిచిపోయాయి

– న్యూస్‌టుడే, కోటబొమ్మాళి



కొండపైకి వెళ్లే మార్గంలో ఒక వైపు నిర్మించిన రక్షణ గోడ

కోటబొమ్మాళి మండలం కొత్తపేట కొండపైనున్న మైక్రోటవర్, జిల్లా పోలీసు రిపీటర్ స్టేషన్‌కు రూ.4 కోట్ల నరేగా నిధులతో రహదారిని నిర్మించేందుకు ఈ ఏడాది జనవరి 12న భూమిపూజ చేశారు. కొండపైకి వెళ్లే మార్గంలో ఒక వైపు రక్షణగోడ నిర్మించారు. అనంతరం ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అంతకు ముందు కొండపైన రిసార్ట్‌లు నిర్మించాలని పర్యాటకశాఖ అధికారులు, ప్రైవేటు వ్యక్తులు వేర్వేరుగా స్థల పరిశీలన చేశారు. అనంతరం పట్టించుకునే వారే లేకుండా పోయారు.

ఆది నుంచి అడ్డంకులే

కొండపైకి మార్గం నిర్మించాలని ఏళ్లుగా అధికారులు, పాలకులు ఆలోచనలు చేస్తున్నారే తప్ప అమలుకు నోచుకోవడం లేదు. ఆది నుంచి అడ్డంకులు ఎదురవుతున్నాయి. తెదేపా హయాంలో 2017లో రూ.50 లక్షలతో మార్కెట్‌యార్డు వెనక నుంచి వేసిన రోడ్డు వాహనాలు వెళ్లేందుకు వీలుగా లేకపోవడంతో దాన్ని అలాగే వదిలేశారు. 2018లో కొత్తపేట ఇందిరమ్మ కాలనీ నుంచి మళ్లీ నిర్మించారు. రాళ్లు పడటంతో వాటిని తొలగించి పనులు చేపట్టారు. ఇది కూడా మధ్యలో నిలిచిపోయింది. 2019లో నాటి ఎస్పీ అమ్మిరాజు వివిధ శాఖల అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం వైకాపా హయాంలో రూ.2 కోట్ల నిధుల కోసం ప్రతిపాదనలు పంపించినా మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు రూ.4 కోట్ల అంచనాతో పనులు ప్రారంభించినా పరిస్థితి షరా మామూలే. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మధ్యలో వదిలేశారు. ఇప్పటికైనా త్వరితగతిన పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సర్వత్రా కోరుతున్నారు.

గుత్తేదారుకు తెలియజేశాం

రహదారి నిర్మాణం చేపట్టిన వరకు బిల్లుల చెల్లింపులు జరిగాయి. సత్వరమే పనులు ప్రారంభించాలని గుత్తేదారుకు తెలియజేశాం. కొద్ది రోజుల్లో పునః ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేస్తాం.
– అంజిత్‌కుమార్, ఏఈఈ, పంచాయతీరాజ్ శాఖ

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

శ్రీవైష్ణవ సంఘ ప్రతినిధులతో వెంకట సత్యనారాయణ ప్రసాదాచార్యులు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: సనాతన ధర్మాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని చాత్తాద శ్రీవైష్ణవ తాళ్లూరు మఠాధిపతి పొడుగు వెంకట సత్యనారాయణ ప్రసాదాచార్యులు కోరారు. ఆదివారం టెక్కలిలో చాత్తాద శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ధనుర్మాస వన సమారాధన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. బ్రిటీష్ పాలన ముగిసినా దేశంలో ఇంకా ఆంగ్ల సంప్రదాయాలే కొనసాగుతుండటం సరికాదన్నారు. పాశ్చాత్య పోకడలు వీడి పండగలు ఆరోగ్యకర వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు అల్లవెల్లి తిరుమలరావు, నియోజకవర్గ అధ్యక్షుడు వకుళాభరణం ఈశ్వరరావు హాజరయ్యారు.

ఘనంగా జగన్ జన్మదిన వేడుకలు

నరసన్నపేటలో కేకు కోస్తున్న వైకాపా జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్, చిత్రంలో పార్టీ శ్రేణులు

టెక్కలి పట్టణం, కొత్తూరు, మెళియాపుట్టి, నరసన్నపేట, ఎల్‌ఎన్‌పేట, పాతపట్నం, న్యూస్‌టుడే: నరసన్నపేట, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్ని వైకాపా శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో నాయకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆసుపత్రుల్లో రోగులకు పళ్లు పంచిపెట్టారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు.

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

అసంపూర్తిగా వదిలేశారు..

పొందూరు మండలం తుంగపేట గ్రామంలో అంగన్‌వాడీ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. బిల్లులు సకాలంలో అందక మధ్యలోనే వదిలేయడంతో గ్రామంలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇరుకైన గదిలో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా భవన నిర్మాణం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, పొందూరు

గ్రంథాలయంలో సూర్య నమస్కారాలు

ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా లావేరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రోజూ ధ్యానం, సూర్య నమస్కారాలు చేయడం ద్వారా ఆరోగ్యం లభిస్తుందన్నారు. గ్రంథాలయాల్లో లభించే మంచి పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.- న్యూస్‌టుడే, లావేరు

నిండు జీవితానికి రెండు చుక్కలు

ఆమదాలవలసలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

రణస్థలంలో పాల్గొన్న విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

చిన్నారికి చుక్కల మందు వేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్‌రావు, పోలియో రాష్ట్ర పరిశీలకులు డా.జి.మీనాక్షి, డీఎంహెచ్‌వో డా.కె.అనిత

పిల్లల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయాలని ప్రజాప్రతినిధులు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం జరిగింది. ఐదేళ్లలోపు చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పోలియో చుక్కలు వేశారు. - న్యూస్‌టుడే, బృందం

ఆలయాల్లో ధనుర్మాస పూజలు.. శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలో పలు ప్రాంతాల్లో దేవాలయాల్లో ధనుర్మాసోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పాలకొండరోడ్డులో కోదండరామాలయంలో స్వామికి అర్చన, ఆరాధన, తిరుప్పావై పాశురం పారాయణం, నక్షత్ర హారతి, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం, ప్రత్యేక పూజలు చేశారు. బ్యాంకర్స్‌కాలనీలో శివాలయం ఆలయంలో, పి.ఎన్.కాలనీలో నారాయణ తిరుమలలో ధనుర్మాస మేలుకొలుపు, భజనలు జరిగాయి.

సెలవు రోజుల్లోనూ భోజనం..

పదోతరగతిలో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కార్యక్రమం

- న్యూస్‌టుడే, సరుబుజ్జిలి, పొందూరు

కొత్తకోట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న సిబ్బంది

పదో తరగతి విద్యార్థుల వార్షిక పరీక్షల్లో శతశాతం మార్కులు సాధించే దానికి 100 రోజుల ప్రణాళికను కూటమి ప్రభుత్వం ప్రారంభించిన విషయం విదితమే. తాజాగా వారికి సెలవు రోజుల్లోనూ మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగానే ఈనెల 7 నుంచి ఆదివారాలు, పాఠశాల సెలవు ప్రకటించిన రోజుల్లోనూ నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు చేపడుతోంది. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా సర్కారు విద్యాలయాలు మంచి ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గ వివరాలు

మండలం	పాఠశాలలు	బాలురు	బాలికలు
సరుబుజ్జిలి	08	119	134
ఆమదాలవలస	15	33	521
పొందూరు	12	420	270
బూర్జ	11	320	140

• ఉదయం 8 గంటల నుంచి 9 గంటలు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో మధ్యాహ్న భోజనం లేక విద్యార్థుల హాజరు తగ్గుతుందని ప్రభుత్వం దృష్టి సారించింది.

• ఆమదాలవలస నియోజకవర్గంలో మొత్తం 46 జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. దాదాపు 1,957 మంది పదోతరగతి చదువుతున్నారు. వీరందరికీ కూటమి ప్రభుత్వం భోజనం ఏర్పాటు చేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళిక ప్రకారం కృషి

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రణాళిక ప్రకారం సబ్జెక్టులను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యార్థులకు సెలవు రోజుల్లో సైతం భోజనం అందిస్తున్నాం. పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలాగా కృషి చేయాలని వారికి సూచించాం. - డి.బాలరాజు, కె.అప్పలనాయుడు, రాజారావు, శ్యామసుందరరావు నియోజకవర్గ ఎంఈవోలు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9502198883 8008552704

?: పట్టణంలోని పారిశ్రామిక వాడలో విద్యుత్తు దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నాం. - వైకుంఠరావు, స్థానికుడు ❖ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - జాన్సన్, పుర ఏఈ, ఆమదాలవలస

?: పాతఆమదాలవలస శివారు వీధిలో చెత్త పోగులు వేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. - తవుడు, స్థానికుడు ❖ సకాలంలో చెత్తపోగులు తరలించేలా చర్యలు చేపడతాం. టి.రవి, పుర కమిషనర్, ఆమదాలవలస - న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

నేడు చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కృష్ణాపురం (గారపేట) గ్రామంలో సోమవారం ఉదయం 10 గంటలకు చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆనందాశ్రమ వ్యవస్థాపకుడు, ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షుడు స్వామి శ్రీనివాసానంద సరస్వతి కోరారు.

అడుగుకో గుంత.. ఎన్నాళ్లీ చింత?

పొందూరు మండలంలోని కనిమెట్ట-శ్రీకాకుళం మధ్య ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈఈ పీటీ రాజు వద్ద సమస్యను ప్రస్తావించగా, వారం రోజుల్లో పనులు పూర్తి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

మురుగు నిలిచి.. తిప్పలు

శ్రీకాకుళం గ్రామీణ మండలం లంకాంలో ప్రజలు అపరిశుభ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు రహదారి పక్కన, నివాసాల మధ్య నిలిచి దుర్వాసన భరించలేకపోతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి రెడ్డి మంజుల వివరణ కోరగా కాలువల నిర్మాణానికి నిధుల నిమిత్తం ప్రతిపాదనలు పంపించామన్నారు. - న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

బోరుమంటోంది!

పొందూరు మండలంలోని గోరింట ప్రభుత్వ పాఠశాల పక్కనున్న చేతి పంపు మరమ్మతులకు గురై కొన్ని నెలలు కావొస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. తాగునీటి కోసం విద్యార్థులు సైతం ఇబ్బందులు పడుతున్నారని, ఇళ్ల నుంచి నీళ్ల సీసాలు తెచ్చుకుంటున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా కార్యదర్శితో మాట్లాడి పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

వ్యర్థాలను తొలగించరూ..

ఆమదాలవలస పట్టణంలోని ప్రధాన రహదారిలో పంచాయతీ కార్యాలయం వద్ద వ్యర్థాలు ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజులుగా చెత్త నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోందని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని మున్సిపల్ కమిషనర్ టి.రవి తెలిపారు. -న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

సిబ్బంది ఇబ్బంది తీర్చండి

పొందూరు మండలం మొదలవలసలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయం భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం చిన్నగదిలో కార్యకలాపాలు నిర్వహించడంతో సచివాలయ సిబ్బందితో పాటు గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. -న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల్ని ఉపేక్షించం

ర్యాలీలో నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు, కూటమి నాయకులు

రణస్థలం, న్యూస్‌టుడే: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. దాడులను అరికట్టాలని జేఆర్‌పురంలో కూటమి నాయకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత పోటీలు

ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామంలో స్థానిక గరుడ యూత్ ఆధ్వర్యంలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలస్థాయిలో విద్యార్థులకు గణిత పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే,ఎచ్చెర్ల

తూనికలు, కొలతలపై అవగాహన

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా శ్రీకాకుళం తూనికలు, కొలతలు అధికారులు ఆదివారం శ్రీకాకుళం నగరలోని పొట్టిశ్రీరాములు చేపల మార్కెట్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. దుకాణాల్లో తనిఖీలు చేపట్టి వినియోగదారులకు తూనికలు, కొలతలపై అవగాహన కల్పించారు. గోడపత్రికను ఆవిష్కరించారు.

అవీ..ఇవీ..అన్నీ

చిన్నారుల క్రిస్మస్

శ్రీకాకుళం సాంస్కృతికం: నగరంలో ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల రహదారిలో క్రీస్తు ఆరాధన కేంద్రంలో ఆదివారం సండే స్కూల్ పిల్లల క్రిస్మస్ వేడుకలు ఆనందోత్సాహలతో జరుపుకొన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కోసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గ ఎన్నిక

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పాత్రికేయులు ఉండాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లి ధర్మారావు అన్నారు. ఆదివారం పట్టణంలో ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా గురుగుబెల్లి ప్రసాదరావు, అధ్యక్షుడిగా గురుగుబెల్లి రమణారావు, ఉపాధ్యక్షుడిగా తాంర్ర అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శిగా పేడాడ వాసుదేవరావుతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి

గార, న్యూస్‌టుడే: వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా భద్రతా నియమాలు పాటించాలని గార ఎస్సై సీహెచ్. గంగరాజు అన్నారు. మండల కేంద్రం గారలో ఆదివారం ఆటో యజమానులతో సమావేశమై రహదారి భద్రతపై సూచనలు చేశారు. ముందు సీటులో ప్రయాణికులను కూర్చోబెట్టడం, పరిమితికి మించి ప్రయాణం చేయొద్దని హెచ్చరించారు.

ఆక్రమణల తొలగింపు

పొందూరు, న్యూస్‌టుడే: మండలంలోని తాడివలస పంచాయతీలో రహదారిపై అక్రమ ర్యాంపులు, నిర్మాణాలను ఆదివారం పోలీసుల సమక్షంలో సర్పంచి తమ్మినేని మణెమ్మ ఆధ్వర్యంలో తొలగించారు. పంచాయతీలో ప్రజలకు ఇబ్బందులు కలిగించరాదని చెప్పారు. కార్యదర్శి రాజీవ్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

ఆమదాలవలస పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొత్తకోటవారివీధి వద్ద ఆదివారం సరుబుజ్జిలి వైపు నుంచి వస్తున్న ఆటో అదుపు తప్పి ద్విచక్రవాహనంతో పాటు రహదారిపై ఉన్న స్వామి వివేకానంద విగ్రహాన్ని ఢీకొట్టింది. ద్విచక్ర వాహనదారునికి స్వల్పగాయాలు కాగా, ఆటోలో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే స్థానికులు క్షతగాత్రుణ్ని ఆసుపత్రికి తరలించారు. ఎస్సై బాలరాజును వివరణ కోరగా విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఆదిత్యుని సేవలో ప్రముఖులు



స్వామివారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈవో ప్రసాద్

శ్రీకాకుళం నగరం, గార (శ్రీకూర్మం), న్యూస్‌టుడే: అరసవల్లి సూర్యనారాయణస్వామిని శాంత బయోటెక్ ఛైర్మన్ వరప్రసాద్‌రెడ్డి, కూచిపూడి నృత్య కళాకారిణి స్వాతిసోమనాథ్ తదితరులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. స్వామికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అనివెట్టి మండపంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ వేద ఆశీర్వచనాలు, స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ స్వామి చిత్రపటాన్ని బహుకరించారు. ● గార మండలంలోని కూర్మ క్షేత్రాన్ని సైతం సందర్శించారు. ఆలయ ఇన్‌ఛార్జ్ ఈవో వాసుదేవరావు, వైదిక సిబ్బంది మర్యాదపూర్వకంగా స్వాగతించి క్షేత్రమహత్యం వివరించారు. ● స్వామివారి నిత్యాన్నదాన కార్యక్రమానికి శ్రీకాకుళానికి చెందిన చిన్న వరహాలమ్మ రూ. 50వేలు విరాళంగా అందజేశారు.

ప్రారంభిస్తే ప్రయోజనం..!

గార మండలం శ్రీకూర్మంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (అనుబంధ) బాలికల వసతి గృహం.. ప్రారంభానికి ఎదురు చూస్తోంది. రెండు అంతస్తుల్లో గదులు, కిచెన్, డైనింగ్‌హాల్, మెడికల్, వార్డెన్, లైబ్రరీ కోసం కేటాయించే విధంగా నిర్మించారు. ఒక్కో గదిలో నలుగురు విద్యార్థినులు ఉండొచ్చు. త్వరితగతిన ప్రారంభిస్తే విద్యార్థులకు ప్రయోజనకంగా ఉంటుందని పలువురు కోరారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని జేఈ కిరణ్ కుమార్ తెలిపారు.

–న్యూస్‌టుడే, గార (శ్రీకూర్మం)

అవినీతిపై విచారణకు ఆదేశం

శ్రీకాకుళం నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: పశుసంవర్ధక శాఖలో జరిగిన అవినీతికి బాధ్యులను చేస్తూ డా. అమరేంద్రకుమార్‌తోపాటు 52 మందిపై కేసు నమోదు చేయాలని డాక్టర్ పి.సూర్యారావు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. అతడి అభ్యర్థన మేరకు శ్రీకాకుళం స్పెషల్ జ్యుడీషియల్ రెండో తరగతి మేజిస్ట్రేట్ రెండో పట్టణ పోలీసులకు విచారణకు ఆదేశించారు. వచ్చే నెల 21లోగా ఈ కేసు పూర్తి విచారణ జరిపి న్యాయస్థానానికి నివేదించాలని న్యాయమూర్తి సూచించారు. దీనిపై రెండోపట్టణ సీఐ ఈశ్వరరావుకు వివరణ కోరగా ఉన్నత స్థాయి అధికారులతో చర్చించనున్నట్లు తెలిపారు.

ఇంటింటికీ జలం ఇంకెప్పుడు?

జల్‌జీవన్ మిషన్ పథకం పనులు మందకొడిగా సాగుతున్నాయి. గార మండలంలో 24 పంచాయతీల్లో 119 నీటి ట్యాంకులు నిర్మాణాలు, బోర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరాకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చంద్రకళ వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా చర్యలు తీసుకుంటామన్నారు.

–న్యూస్‌టుడే, గార

సందడిగా జగన్ జన్మదిన వేడుకలు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైకాపా నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీకాకుళం, ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గాల వ్యాప్తంగా పార్టీశ్రేణులు కేకులు కోశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. శ్రీకాకుళం నగరంలో పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌ను చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, బృందం

మొక్కలు తొలగింపు

స్పందనకు వందనం

తోలాపి గ్రామంలో శివాలయం వెనక ఉన్న విద్యుత్తు నియంత్రికపై తీగలు, పనికిరాని మొక్కలు అల్లుకుపోయాయి. ప్రమాదం జరిగే అవకాశముందని ఈనెల 14న 'అల్లుకున్న నిరక్ష్యం' అంటూ ఈనాడులో ప్రచురితమైన వార్తకు విద్యుత్తు శాఖ ఏఈ సుధీర్ స్పందించారు. మొక్కలను తొలగించారు.

– న్యూస్‌టుడే, పొందూరు గ్రామీణం

మిత్రమా..కుశలమా?

జి.సిగడాంలో 1991-92 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

జి.సిగడాం, పొందూరు గ్రామీణం, బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జి.సిగడాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1991-92 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. అప్పటి గురువులను సన్మానించారు. ● పొందూరులోని ఓ కల్యాణ మండపంలో స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 1966-67 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆనాటి మధురానుభూతులను నెమరువేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. పూర్వ గురువులను స్మరించుకున్నారు.

● డా. బి.ఆర్.అంబేడ్కర్ వర్సిటీలో చదువుకున్న విద్యార్థులంతా ఒక చోట కలిశారు. శ్రీకాకుళం నగరంలోని జాతీయ రహదారి సమీపంలోని ఓ ప్రైవేటు భవనంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి ఉల్లాసంగా గడిపారు. వివిధ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ వర్సిటీ విద్యార్థులు

పొందూరులో 1966-67 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

విలీనం.. సమస్యలతో జీవనం

❖ గతంలో స్మార్ట్‌కెం పరిశ్రమ ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం ద్వారా పూర్తిస్థాయిలో ప్రజల అవసరాలకు సరిపడే తాగునీరు సరఫరా జరగడం లేదు. ప్రజలు మహిళలు నీటి కోసం రెండు మూడు రోజులకోసారి వచ్చే తాగునీటి సరఫరా ట్యాంకర్ వద్ద గంటలు తరబడి పడిగాపులు కాస్తున్నారు. అప్పుడు వేసిన పైపులైన్లు పలు చోట్ల లీకులు ఏర్పడి వీధుల్లో వేసిన కుళాయిలకు తాగునీరు అందటం లేదు.

❖ ఈ ప్రాంతంలో రోజూ ఇంటింటా చెత్త సేకరణ విషయాన్నే సిబ్బంది విస్మరించారు. రోజులు తరబడి చెత్త సేకరణకు రాకపోవడంతో స్థానికులు చెత్తను వీధుల్లో ఎక్కడికక్కడ పడేస్తున్నారు. దీంతో వీధులు అపరిశుభ్రంగా తయారై దోమలతో ఇబ్బంది పడుతున్నారు. కనీసం ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.

❖ తోటపాలెంలోని పలు చోట్ల వీధి దీపాలు పనిచేయడంలేదు. ప్రాథమిక పాఠశాలలో నాడు- నేడు పథకం ద్వారా చేపట్టిన ప్రహరీ నిర్మాణంతో పాటు ఇతర పనులు మధ్యలో అసంపూర్తిగా నిలిచిపోయినా పట్టించుకునే వారు కరవయ్యారు. శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరం, టీచర్స్ కాలనీ మీదుగా తోటపాలెం వెళ్లే మట్టి రహదారి గుంతలతో అధ్వానంగా ఉన్నా పట్టించుకునేవారు కరవయ్యారు.

మౌలిక వసతులు లేక తోటపాలెం వాసుల ఇబ్బందులు

పట్టించుకోని నగర పాలకులు

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో విలీన ప్రాంతమైన తోటపాలెంలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు నిత్యం అవస్థలు ఎదుర్కొంటున్నారు. కనీసం సీసీ కాలువలు లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎక్కడికక్కడ మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. బిందెడు తాగునీటికి రోజుల తరబడి ఎదురుచూస్తున్నారు. డ్రమ్ముల్లో నీటిని నింపుకొని నిల్వ చేసుకుంటున్న దుస్థితి నెలకొంటోంది.

నీటి నిల్వ కోసం ఇంటి ముందు ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములు

చర్యలు తీసుకుంటాం..

ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. మరమ్మతులకు గురైన పైపులైన్లు, వీధి దీపాలను తక్షణమే పునరుద్ధరిస్తాం. నిధుల లభ్యత ఆధారంగా అవసరమైన చోట్ల సీసీ రహదారులు, కాలువల నిర్మాణం చేపడతాం.

– పి.వి.వి.డి. ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్

ప్రాంతం: తోటపాలెం కుటుంబాలు: 1,350 జనాభా: 2,545

నిత్యం ఇదే యాతన!



పొందూరు అగ్రహారం వీధిలో తాగునీటి పథకం నుంచి రోజూ నీరు వృథాగా పోతోంది. రహదారిపై నీరు చేరడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నెల రోజులుగా రక్షిత మంచినీటి పథకం నుంచి నీరు కిందకు కారిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో వాసుదేవరావు వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, పొందూరు

కూరగాయల ధరలు

● టమాటాలు 45 ● వంకాయలు 36/40 ● బెండ 58 ● పచ్చిమిర్చి 58 ● కాకర 50 ● బీర 54 ● కాలీఫ్లవర్ 25/30 ● క్యాబేజీ బుట్ట 30 ● క్యారెట్ 40 ● దొండ 36 ● బంగాళ దుంపలు 20 ● ఉల్లిపాయలు 23/27 ● గోరు చిక్కుడు 50 ● ఆనప 26 ● అరటికాయ(జత) 18 ● గోల్కొండ చిక్కుడు 40 ● అల్లం 90 ● వెల్లుల్లి 130 – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)

(c) eenadu

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: మండల, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ డా.వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు.

పోలీసుల పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. జిల్లాకు ప్రముఖులు రానున్నందున.. తగిన ఏర్పాట్ల నిమిత్తం పీజీఆర్ఎస్ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేయదలచిన ప్రజలు సమీప పోలీస్ స్టేషన్లో అందజేయాలని కోరారు. ఆ ఫిర్యాదులను పీజీఆర్ఎస్‌గా పరిగణించి సత్వరమే పరిష్కరిస్తామని తెలిపారు.

కుర్రకారు.. ఆలోచనల ప్రయాణం

తిరుపతి ఇన్నోవేషన్ సొల్యూషన్స్ సభ్యులు ఎస్.సంతోష్ కుమార్, వంశీకృష్ణ వీరు. రతన్ టాటా అభిమానులు. ఈ నెల 28వ తేదీన రతన్ టాటా జయంతి నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో తిరుపతి నుంచి ముంబయికి సోమవారం ఈ నానో కారులో వీరితోపాటు మరో ఇద్దరు తమ ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు. 1200 కి.మీ ప్రయాణించి 28వ తేదీకి టాటా అంకుర ఆలోచనల ట్రస్టుకు చేరుకోనున్నారు. అక్కడ తమ ఆలోచనలను సంస్థకు వివరిస్తారు. వారికి నచ్చితే తమ ఆలోచనలకు ఓ రూపం వస్తుందని ఈ ప్రయాణం చేపట్టినట్లు వీరు వివరించారు. –ఈనాడు, తిరుపతి

కొంగలు కాదు.. బొమ్మలు

సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అటకానితిప్ప వద్ద ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన పులికాట్ పక్షుల రక్షితప్రాంతానికి సంబంధించిన మ్యూజియం ఆకట్టుకుంటోంది. జనవరి 10,11 తేదీల్లో జరగనున్న ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్భంగా నూతన శోభను సంతరించుకుంది. 600 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన పులికాట్ సరస్సులో ఉండే వేలాది వలస, నివాస నీటి పక్షుల నమూనాలు మ్యూజియంలో ముచ్చటగొలుపుతున్నాయి. – ఈనాడు, తిరుపతి

చెట్టు ఒక్కటే.. కాయలే ఐదు రకాలు



తిరుపతి అన్నారావు కూడలి నుంచి నంది సర్కిల్‌కు వెళ్లే మార్గంలో ఉన్న శ్రీ రామచంద్ర మిషన్ ధ్యానమందిరం ఆవరణలోని మొక్కలు ఇవి. వీటి ప్రత్యేకత ఏమిటని అనుకుంటున్నారా.. ఒకే చెట్టుకు ఐదు రకాల మామిడి కాయలు కాస్తాయట. ఒక్కో మొక్కకు రూ.10 వేలు వెచ్చించి.. హైదరాబాద్ నుంచి 15 మామిడి మొక్కలు తీసుకొచ్చారు. ఆస్ట్రేలియాలో ఈ తరహా చెట్లు ఎక్కువగా ఉంటాయని, ఆ పద్ధతులను అనుసరించి హైదరాబాద్‌లోని కన్హ నర్సరీలో ఈ మొక్కలకు ఏడాది కిందట డ్రాఫ్టింగ్ చేసి సంరక్షించారని ధ్యాన మందిరం నిర్వాహకులు తెలిపారు. ధ్యాన దినోత్సవం సందర్భంగా వీటిని నాటారు. – ఈనాడు, తిరుపతి

విధేయతకు పట్టం

- కలిసొచ్చిన సామాజిక సమీకరణలు
- తిరుపతి పార్లమెంట్ తెదేపా అధ్యక్షురాలిగా పనబాక లక్ష్మి

పుత్తూరు, చిత్తూరు (జిల్లా పంచాయతీ), తిరుపతి (నగరపాలిక), న్యూస్‌టుడే: పార్టీకి విధేయతతో పనిచేయడం, సామాజిక సమీకరణలను తెదేపా అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుని చిత్తూరు, తిరుపతి పార్లమెంట్‌లకు అధ్యక్షులను ఆదివారం ప్రకటించింది. మంగళవారం సాయంత్రమే తెదేపా పార్లమెంట్ అధ్యక్షుల జాబితాను రూపొందించి సీఎం చంద్రబాబునాయుడు ముందు ఉంచారు.

అధినేత మన్నన పొంది..

పనబాక లక్ష్మి (అధ్యక్షురాలు)

- తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షురాలిగా పనబాక లక్ష్మిని అధిష్ఠానం ప్రకటించింది. ఆమె మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నారు. నాలుగు దఫాలు ఎంపీగా గెలుపొందారు. కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 2019లో తెదేపాలో చేరారు. అప్పట్లో తిరుపతి పార్లమెంట్‌లో పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఉప ఎన్నికల్లోనూ ఆమె ఓటమి చవిచూసినా వైకాపా నేతల దొంగ ఓట్ల దందాను బహిర్గతం చేశారు. 2024లో ఎన్నికల్లో పొత్తులో భాగంగా భాజపాకు తిరుపతి పార్లమెంట్‌ను కేటాయించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతోటే ఆమెను తితిదే పాలక మండలి సభ్యురాలిగా నియమించారు. ఆరేళ్లుగా పార్టీలో ఉంటూ అధినేత మన్నన పొందారు. ఆమె సేవలను గుర్తించి తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలిగా నియమించారు.

అనతికాలంలోనే అందలం

దివాకర్‌రెడ్డి (ప్రధాన కార్యదర్శి)

- తిరుపతి పార్లమెంట్ తెదేపా ప్రధాన కార్యదర్శి డాలర్ దివాకర్‌రెడ్డిది తిరుపతి గ్రామీణ మండలం పెరుమాళ్లపల్లి. ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన అనతి కాలంలోనే తుడా ఛైర్మన్, తితిదే ఎక్స్ అఫిషియో సభ్యుడిగా పదవులతో పాటు తాజాగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి దక్కించుకోగలిగారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్‌కు చేరువైన దివాకర్‌రెడ్డి పార్టీ విధేయుడిగా ఇప్పటికే గుర్తింపు పొందారు. ఐవీఆర్ఎస్ సర్వేలు అనుకూలంగా ఉండటంతో ఆయనవైపు అధిష్ఠానం మొగ్గుచూపింది. తుడా ఛైర్మన్‌గా ఆపరేషన్ స్వర్ణ పేరిట స్వర్ణముఖి ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. దీర్ఘకాలంగా వేధిస్తున్న శెట్టిపల్లి భూముల సమస్యకు పరిష్కారం చూపడం, అభివృద్ధి పనులు చేపట్టడం ఆయనకు కలిసొచ్చాయి. కొత్తగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులకు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

పేదల కడుపు చల్లగా..!

బియ్యం, చక్కెరతో పాటు గోధుమ పిండి, జొన్నలు, రాగుల కేటాయింపు

తిరుపతి గాంధీరోడ్డు, పుంగనూరు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో చౌక దుకాణాలు చక్కెర, బియ్యం పంపిణీకే పరిమితమయ్యాయి. ఎండీయూ వాహనాల ద్వారా వాటిని పంపిణీ చేయడంతో కార్డుదారులకు సక్రమంగా చేరలేదు. ఐదేళ్లు ఇలాగే సాగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పౌర సరఫరాల వ్యవస్థలో పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే ఎండీయూ వాహనాలను రద్దు చేసి చౌక దుకాణాల్లోనే సరకుల పంపిణీ చేపట్టింది. తర్వాత స్మార్ట్ రేషన్ కార్డులు, ఎఫ్‌ఆర్ కిట్లను తీసుకొచ్చింది. ప్రస్తుతం చౌక దుకాణాల్లో బియ్యం, చక్కెరతో పాటు గోధుమ పిండి, జొన్నలు, రాగులు అందించనున్నారు. గోధుమ పిండి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.60 ఉండగా.. ప్రభుత్వం కిలో రూ.16కే అందిస్తోంది. పంపిణీలో అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాల శాఖ డీఎం బాలకృష్ణ తెలిపారు.

జిల్లా వివరాలిలా..

- రేషన్‌కార్డులు: 5.80 లక్షలు
- చౌక దుకాణాలు: 1,457
- గోధుమ పిండి: 50 టన్నులు
- జొన్నలు: 250 టన్నులు
- రాగులు: 350 టన్నులు

కాలువల్లోకి రూ.లక్షలు.. ఇళ్లలోకి దోమలు

పరిశీలన

పుత్తూరు, బంగారుపాళ్యం, జీడీనెల్లూరు, కార్వేటినగరం, న్యూస్‌టుడే: ఇటీవల వర్షాలతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఖాళీ స్థలాల్లో నీరు చేరి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారిపోయాయి. పలు ప్రాంతాల్లో కాలువలు లేకపోవడంతో సమస్య ఏర్పడుతోంది. దీంతో ప్రజలకు దోమలతో సావాసం తప్పడం లేదు. కౌన్సిలర్లు, కార్పొరేటర్లు పర్యటించే సమయంలో వారి దృష్టికి సమస్యలు తీసుకొస్తే ఫాగింగ్‌తో మమ అనిపిస్తున్నారు.

పుత్తూరులో మూలకు చేరిన ఫాగింగ్ యంత్రం

రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా..

- తిరుపతి నగరపాలక సంస్థలో గత ప్రభుత్వ పాలనలో రూ.36 లక్షలతో మూడు యంత్రాలు కొనుగోలు చేసి ఫాగింగ్ చేస్తున్నారు. కానీ దోమలు తగ్గడం లేదు. భూగర్భ కాలువ వ్యవస్థతో మలాథియాన్ పిచికారీ చేసే వీలు లేకపోవడంతో సమస్య ఏర్పడింది. నగరంలోని చాలా ప్రాంతాల్లో కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు పెరుగుతున్నాయి.
- గూడూరులో 2, నాయుడుపేటలో 6, శ్రీకాళహస్తిలో 6 యంత్రాలు వినియోగంలో ఉన్నాయి. రూ.15 లక్షల వరకు ఏటా ఖర్చవుతోంది.
- చిత్తూరు నగరంలో 10 ఫాగింగ్ యంత్రాలున్నాయి. ఏటా రూ.5 లక్షల వరకు ఖర్చు అవుతోంది.
- పుత్తూరులో రెండు యంత్రాల్లో ఒకటే పని చేస్తోంది. పలమనేరు, పుంగనూరు, కుప్పంలో 12 యంత్రాలతో దోమల నియంత్రణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఏటా రూ.12 లక్షల వరకు ఖర్చవుతోంది. డ్రైడే- డ్రైడే నిర్వహిస్తున్నా పరిసరాలు శుభ్రం కావడం లేదు. దోమలు అదుపులోకి రావడం లేదు.

మలాథియన్ తక్కువ..

ఫాగింగ్ యంత్రాల్లో మలాథియాన్, కిరోసిన్ కలిపి పిచికారీ చేయాలి. ప్రస్తుతం మలాథియాన్ కంటే కిరోసిన్ అధికంగా వాడుతున్నారు. దీంతో దోమలు నియంత్రణలోకి రావాడం లేదు. దోమల ఆవాస కేంద్రాలుగా ఉండే మురుగు గుంతల్లో ఆయిల్ బంతులు వేయాల్సి ఉన్నా ఎక్కడా ఆ చర్యలు కనిపించడం లేదు. గతంలో పురపాలికలే మలాథియాన్ కొనుగోలు చేసేవి. ప్రస్తుతం ఇండెంట్ పెడితే పుర అధికారులు పంపిస్తున్నారు. వాటిలో నాణ్యత లెక్కించడం కష్టంగా మారింది.

పట్టణాలు:

చిత్తూరు జిల్లా: చిత్తూరు, నగరి, కుప్పం, పలమనేరు, పుంగనూరు

తిరుపతి జిల్లా: తిరుపతి, పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట

ఫాగింగ్‌లో నిర్లక్ష్యం వద్దు..

నగరాలు, పురపాలికల్లో ఫాగింగ్ పక్కాగా చేపట్టాలి. శీతాకాలంలో అన్ని ప్రాంతాల్లోనూ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాం. ఎక్కడైనా యంత్రాలు పాడైతే బాగు చేయాలని సూచించాం. ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే వివరాలు సేకరించి చర్యలు చేపడతాం.

- నాగరాజు, మున్సిపల్ ఆర్డీ

104FM Tirupati

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వానేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact

8008555167, 9154991499

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, తిరుపతి(తితిదే) న్యూస్‌టుడే: శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శనివారం శ్రీవారిని 78,466 మంది దర్శించుకున్నారు.

16 వేల టోకెన్ల జారీ

తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులకు ఆదివారం 16 వేల టోకెన్లు జారీ చేశారు. వీరికి సోమవారం వేకువజామున 3 నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం జరుగనుంది. శ్రీవారి మెట్టు మార్గం భక్తులకు 2 వేల టోకెన్లు ఇచ్చారు.

అమృతమూర్తికి

కన్నీటి వీడ్కోలు

మూర్తీభవించిన వ్యక్తిత్వం, అమోఘ సౌశీల్యత,
అపరమిత సహనం, కల్పవృక్ష స్వభావం,
మహోన్నత మార్గదర్శకత్వంతో మా అందరి వెన్నంటవుండి
మమ్ములను ముందుకు నడిపించి, మా ఉన్నతికి కారకులైన
అజాత శత్రువు, సహృదయులు, మా ఇంటి దైవం
శ్రీ యల్లంటి మునిరత్నం నాయుడు గారు
21-12-2025వ తేది ఆదివారం సా॥ 6.00 గంటలకు
వైకుంఠప్రాప్తి చెందినారు.

వీరి దహనక్రియలు
22-12-2025వ తేది సోమవారం మ॥ 3.00 గం॥లకు
శ్రీనివాసపురంలోని స్వగృహము నుండి అంతిమయాత్రగా బయలుదేరి
తిరుపతి అక్కారంపల్లి వద్దనున్న గోవింద దామం నందు
జరుగునని తెలియజేయడమైనది. భాదాతప్త హృదయాలతో ...

భార్య : యల్లంటి భానుమతి

మరదళ్ళు - తోడళ్ళులు
దుత్తులూరి ఇందుమతి
లేట్ దుత్తులూరి గోవర్ధన్ నాయుడు

బత్తల సుశీల
డా॥ బత్తల రామచంద్రన్, నాగలాపురం

కస్తూరి వసుమతి
కస్తూరి జనార్ధన్

యల్లంటి సతీష్ - యల్లంటి భార్గవి
రావూరి బిందు మాదవి - రావూరి రఘు
వసంత శిరీష - వసంత మురళీకృష్ణ
బత్తల శ్రావణ్ కుమార్ - బత్తల రూప
కస్తూరి వంశీ - కస్తూరి సౌమ్య
కస్తూరి భరత్ - కస్తూరి మృదుల
మనుమలు, మనుమరాళ్ళు మరియు
కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

శ్రీ యల్లంటి మునిరత్నం నాయుడు గారు
Retd., ADE, APSEB, Tirupati

డోర్ నెం. 2-62, శ్రీనివాస పురం, తిరుచానూరు రోడ్డు, తిరుపతి
మొబైల్ : 9845315491

(c) eenadu

బాలలం.. భావి శాస్త్రవేత్తలం

■ జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో ఆకట్టుకున్న ప్రాజెక్టులు

జిల్లాలో పలు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిత్యం సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరికరాలను తక్కువ ఖర్చుతో తయారు చేయడంతో విద్యాశాఖ అధికారుల ప్రశంసలు అందుకున్నారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్ పర్యవేక్షణలో స్థానిక ఉన్నత పాఠశాలలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుల గైడెన్స్‌తో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రదర్శించిన ప్రయోగాలు విజ్ఞానదాయకంగా నిలిచాయి. ప్రాజెక్టుల రూపకల్పనలో పాల్గొన్న విద్యార్థులందరికీ జిల్లా విద్యా వైజ్ఞానిక అధికారి ప్రశంసపత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, నాయుడుపేట

ఆరోగ్యకర ఆనందానికి

➡ విద్యార్థులు: ఒ.అభిరామ్, కె.సుశాంత్ నాయక్ ◆ తరగతి: తొమ్మిది ➤ పాఠశాల: ఎస్‌బీజేఎస్ సీహెచ్‌ఎస్ (తిరుపతి) ◆ ప్రాజెక్టు: బిగ్రిన్ గార్డెన్ ➤ ఉద్దేశం: మిద్దెలపై తక్కువ ఖర్చుతో ఆకుకూరల సాగు

తేమ శాతం నియంత్రించడం

➡ సి.హెచ్ లిఖిత్‌కుమార్, కె.జస్వంత్‌కుమార్ ◆ తొమ్మిది ➡ జడ్పీహెచ్‌ఎస్ బాలిరెడ్డిపాలెం(వాకాడు) ➤ హ్యుమిడిఫైయర్ సిస్టమ్ ➤ ఆస్తమా రోగులకు పరిష్కారం తయారుచేయడం

పర్యావరణ రహితంగా ఫోర్క్లీనర్

➡ వనీత్, టి.అవంతిక ➡ జడ్పీహెచ్ (ఓజిలి) ➡ ఫోర్క్లీనర్ పరికరం ➤ రసాయనాలు లేకుండా ఫోర్క్లీనింగ్ చేయడం

యంత్రంతో తాగునీటి శుభ్రం

➡ జి.స్వాతి, ఎస్.మాన్విత్ ➡ జడ్పీహెచ్‌ఎస్ (పిచ్చాటూరు) ➡ వాటర్ ట్యాంక్ క్లీనింగ్ పరికరం ➤ పెద్ద ట్యాంకులను తక్కువ వ్యవధిలో శుభ్రం చేయడం

మానవ హృదయంపై అవగాహన

➡ ఎస్.అమల్, సి.దీక్షిత ➡ జడ్పీహెచ్ (సత్యవేడు) ➤ మానవ గుండె నిర్మాణం ➤ గుండె పనిచేసే విధానం

శంఖువు, స్థూపాకారం కొలిచే విధానం

➡ ఎ.పోలమ్మ గీతాంజలి ➡ కేజీబీవీ(కె.వి.బి.పురం) ➡ కొలతలు తీసే సాంకేతిక పరికరం ➤ శంఖువు, స్థూపం ఆకారం లోని పరికరాలు సులభంగా కొలవడం

తీగలు లేకుండానే విద్యుత్తు సరఫరా

➡ ఎం.సాయిప్రణీత్ ➡ జడ్పీహెచ్‌ఎస్ శిరసనంబేడు(పెళ్లకూరు) ➡ టెస్లా కాయిల్ రూపకల్పన ➤ తీగలు లేకుండా విద్యుత్తు సరఫరా

శ్రీకాళహస్తీశ్వరుని సేవలో హైకోర్టు న్యాయమూర్తి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నయనాల జయసూర్యతో న్యాయమూర్తులు, ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నయనాల జయసూర్య వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో దర్శనార్థం వచ్చిన వీరికి ఆదివారం స్థానిక న్యాయమూర్తులు, ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాదం అయ్యాక తీర్థ ప్రసాదాలు అందజేశారు. ముక్కంటిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చలపతిరావు, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేలుమురుగన్, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శ్యామసుందర్ కుటుంబ సభ్యులతో వేర్వేరుగా దర్శించుకున్నారు.

ముక్కంటి చెంత కొండంత జనం

రాహు, కేతు అర్జిత సేవా కౌంటర్ల వద్ద బారులు తీరిన భక్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వాయులింగ క్షేత్రమైన శ్రీకాళహస్తి ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఉదయం నుంచి క్యూలైన్లు నిండిపోయాయి. తిరుమలేశుని దర్శనార్థం వచ్చిన భక్తులు ఇక్కడికి రావడంతో రద్దీ నెలకొంది. రాత్రి ఆలయం మూత వేసే సమయానికి దాదాపు 27 వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

వసతి గృహ విద్యార్థులకు ముస్తాబు

■ కాస్మెటిక్ ఛార్జీలకు స్వస్తి ■ కిట్ల రూపంలో అందించనున్న వస్తువులు

వివరాలిలా..
సంక్షేమ వసతి గృహాలు: 125
విద్యార్థులు: 9685
గురుకులాలు: 23
విద్యార్థులు: 13140

గూడూరు, నాయుడుపేట, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాస్మెటిక్ ఛార్జీలు చెల్లించే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనున్నట్లు సమాచారం. దీనికి బదులుగా ముస్తాబుకు అవసరమైన 12 రకాల వస్తువులతో కూడిన కిట్లు రెండు నెలలకు ఒకసారి నేరుగా విద్యార్థులకు అందచేసే దిశగా సంక్షేమ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

వసతిగృహం

తరగతుల వారీగా ప్రభుత్వం అందజేస్తున్న కాస్మెటిక్ ఛార్జీలను మూడు కేటగిరీలుగా విభజించి 12 రకాల వస్తువులను కిట్ల ద్వారా విద్యార్థులకు

వస్తువులు ఇవే..

రెండు నెలలకు ఒకసారి సరఫరా చేయనున్నారు. 5, 6 తరగతులకు 11 రకాలు, 7- పదో తరగతి వరకు 12 రకాల వస్తువులతో కూడిన కిట్లు సరఫరా చేసే అవకాశం ఉంది. కొబ్బరి నూనె, టూత్‌బ్రష్, పౌడర్, సబ్బు, వ్యాజలిన్, టూత్‌పేస్ట్, టంగ్ క్లీనర్, షాంపు డిటర్జెంట్ సబ్బు, వాషింగ్ పౌడర్, బాలికలకు హెయిర్ బ్యాండ్, రిబ్బన్, రబ్బర్ బ్యాండ్‌లను అదనంగా ఇవ్వనున్నారు. బాలురకు కిట్‌తో పాటు క్షవరానికి అదనంగా రూ.50 చొప్పున రెండు నెలలకు కలిపి రూ.100 ఇవ్వనున్నట్లు సమాచారం.

నగదు జమతో ఇబ్బందులు

జిల్లాలో 143 వరకు సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో 22 వేల మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. వీరికి గతంలో ప్రతి నెల కాస్మెటిక్ ఛార్జీలు నగదు రూపంలో చెల్లించేవారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత కాస్మెటిక్ ఛార్జీలను తల్లుల ఖాతాలో జమ చేసేవారు. విద్యార్థులు చదువుతున్న సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు మరోక ప్రాంతంలో ఉండటం వల్ల ఖాతాల్లో జమ చేసిన కాస్మెటిక్ నగదు సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బంది పడేవారు. కొందరు తల్లులు కుటుంబ అవసరాలకు నగదును వాడుకోవడంతో విద్యార్థులు ఉపయోగించుకోలేక పోయేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు కిట్లను అందించనున్నారు.

కుటుంబసభ్యులతో జస్టిస్ ఎంజీ ఉమా

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిద్ధార్థ వర్మ, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ఉమా దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. ● హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శ్రీవారిని, తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రసన్న వేంకటేశ్వరునికి రూ.10 లక్షల విరాళం

వడమాలపేట: అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన దాత భారీ విరాళం ఇచ్చారు. అన్నప్రసాద వితరణకు సంబంధించి రూ.10 లక్షల డీడీని ఆలయాధికారి వేణుగోపాల్‌రాజుకు డాక్టర్ చైతన్య అందజేశారు. అనంతరం దాతకు స్వామి వారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు.

డీడీ అందజేస్తున్న దాత చైతన్య

నేడు వైకుంఠ ద్వార దర్శనాలపై ఉన్నతస్థాయి సమీక్ష

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో ఈనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు పది రోజులపాటు జరుగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై సోమవారం తిరుమలలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరుగనుంది. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి అనిత, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగనుంది. భక్తుల భద్రత, దర్శన ఏర్పాట్లపై చర్చించనున్నారు.

'కరెంటోళ్ల జనబాట'కు ఏపీఎస్పీడీసీఎల్ శ్రీకారం

తిరుపతి(నగరం), పాకాల, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమానికి రూపకల్పన చేశారు. సోమవారం పాకాల మండలం కృష్ణాపురంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఉద్యోగులు గ్రామాల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించనున్నారు. పాకాల మండలం మొగరాలలో రూ.4.50 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను మంత్రి సోమవారం ప్రారంభించనున్నారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొని కారుణ్య నియామకాల కింద 50 మందికి ఉత్తర్వులు అందజేయనున్నారు.

కొత్త ఆవిష్కరణలకు వేదిక ఏపీ

తిరుపతి(నగరం): కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు ఆంధ్రప్రదేశ్ వేదికగా నిలుస్తోందని రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇంధన వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో జరుగుతున్న సైన్స్ ఎగ్జిబిషన్‌ను సీఎండీ శివశంకర్ లోతేటి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి ఆయన పరిశీలించారు. వివిధ జిల్లాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు మంత్రి బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎస్ఈ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే నాని, సీఎండీ శివశంకర్

95 శాతం పిల్లలకు పల్స్ పోలియో

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో 2,46,974 మంది (95 శాతం) పిల్లలకు మొదటి రోజు పోలియో చుక్కలు వేసినట్లు డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ పేర్కొన్నారు. మిగిలిన 5 శాతం మంది పిల్లలకు ఈ నెల 22, 23వ తేదీల్లో 3,736 బృందాలు ఇంటింటికి వెళ్లి చుక్కలు వేస్తారని తెలిపారు. ముత్యాలరెడ్డిపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, తెదేపా నాయకులు నరసింహ యాదవ్, శంకరనారాయణ, బాల సుబ్రహ్మణ్యం, డీఎంహెచ్‌వో పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, చిత్రంలో నేతలు

ఎస్ఐల బదిలీ

తిరుపతి (నేరవిభాగం): పరిపాలన సౌలభ్యం, రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 19 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు శనివారం రాత్రి ఉత్తర్వులిచ్చారు. అలిపిరి ఎస్ఐలు స్వాతి శ్రీకాళహస్తి 1 టౌన్, లోకేష్‌కుమార్‌ను తిరుపతి ఎస్బీకి బదిలీ చేశారు. తిరుచానూరు ఎస్ఐలు జగన్నాథరెడ్డి మహిళా పీఎస్‌కు, సాయినాథ్ చౌదరిని సత్యవేడు పంపారు. తొట్టంబేడులోని వెంకటరమణను తిరుమల టూటౌన్‌కు, శ్రీసిటీ ఎస్ఐ తరుణ్‌ను పాకాలకు, డీసీఆర్‌బీ ఎస్ఐ తలారి ఓబయ్యను కేవీబీపురానికి, శ్రీకాళహస్తి టూటౌన్ ఎస్ఐ పార్థసారథిని డీసీఆర్‌బీకి, తిరుపతి పడమర పీఎస్ ఎస్ఐ అనిల్‌కుమార్ తిరుపతి ఎస్‌బీకి, సత్యవేడు ఎస్ఐ రామస్వామి తిరుపతి తూర్పు పీఎస్‌కు, శ్రీకాళహస్తి 1 టౌన్ ఎస్ఐ అరుణను తిరుచానూరు బదిలీ చేశారు. తిరుపతి ఎస్పీ వీఆర్‌లో ఉన్న నాగరాజు ట్రాఫిక్ పీఎస్‌కు, నరేష్ తిరుమల సీసీఎస్‌కు, రవిప్రకాష్‌రెడ్డి చంద్రగిరి యూపీఎస్‌కు, నాగార్జున రెడ్డి సీసీఎస్ తిరుపతికి, బలరామయ్య తిరుమల ట్రాఫిక్ పీఎస్‌కు, మహబూబ్ బాషా తిరుపతి ట్రాఫిక్ పీఎస్‌కు, రవిప్రకాష్ ఏర్పేడుకు, సంజీవరాయుడును తిరుమల ట్రాఫిక్‌కు బదిలీ చేశారు.

చింతవరం ఉన్నత పాఠశాల గేటు ముందు ఏర్పాటు చేసిన వైకాపా ఫ్లెక్సీ

పాఠశాల వద్ద వైకాపా ఫ్లెక్సీ

చిల్లకూరు, న్యూస్‌టుడే : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని వైకాపా కార్యకర్తలు ఆదివారం ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చింతవరం ఉన్నత పాఠశాల గేటు ముందు ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎంఈవో మహ్మద్ రవూఫ్ వద్ద ప్రస్తావించగా పాఠశాల దగ్గర ఏర్పాటు చేయడానికి వీల్లేదన్నారు. సంబంధిత ప్రధానోపాధ్యాయుడికి చెప్పి తొలగిస్తామని బదులిచ్చారు.

దెబ్బతిన్న పునాదులు.. కానరాని ఆసరా తీగలు

స్తంభాల బేస్ వద్ద పరిస్థితి

తిరుపతి జిల్లా పులికాట్ సరస్సులో ఉన్న విద్యుత్తు స్తంభాల వద్ద సపోర్టింగ్ తీగలు తెగిపోయాయి. బేస్ వద్ద ప్లాస్టింగ్ కొట్టుకు పోయి కంకర బయటికి ప్రమాదకరంగా కనిపిస్తోంది. ఏదైనా అనుకోని సంఘటన జరగక ముందే సంబంధిత అధికారులు పర్యవేక్షించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. **- ఈనాడు, తిరుపతి**

అమ్మ దర్శనం.. సకల పాపహరణం

బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె మండలంలోని బోయకొండపై ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే ఆదివారం అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా ఈవో ఏకాంబరం ప్రత్యేక చర్యలు చేపట్టారు. **- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

దర్శనానికి వేచి ఉన్న భక్తులు

క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల క్రీడల్లో పాల్గొనే క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ఎస్‌వీపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం గూడూరు, తిరుపతి; సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి డివిజన్ల మధ్య సెమీఫైనల్స్ జరిగాయి. ఈ పోటీల్లో గూడూరు, శ్రీకాళహస్తి డివిజన్లు విజేతలుగా నిలిచినట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కిషోర్‌కుమార్ తెలిపారు. ఈ రెండు జట్ల మధ్య సోమవారం ఫైనల్స్ జరుగుతాయన్నారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన క్రీడాకారులతో రాష్ట్ర స్థాయి జట్టును ఎంపిక చేస్తామన్నారు. క్రీడా పోటీలను భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవోలు భాస్కర్, లక్ష్మీపతి, ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, కృష్ణతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తా: పనబాక లక్ష్మి

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ తనపై ఎంతో నమ్మకంతో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలిగా నియమించిందని, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని తితిదే పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె తిరుపతిలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి లోక్‌సభ స్థానం పరిధిలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణుల సహకారంతో కష్టపడి పనిచేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

తిరుమలలో దివ్యౌషధ వనం

ఉద్యానవనంలో పెంచుతున్న ఔషధ మొక్కలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని జీఎన్‌సీ టోల్‌గేట్‌కు సమీపంలో 3.5 ఎకరాల్లో దివ్యౌషధ వనాన్ని ఏర్పాటు చేసేందుకు తితిదే నిర్ణయించింది. దాదాపు రూ.4.25 కోట్ల అంచనాలతో ఏర్పాటు చేయనున్న ఈ వనంలో దాదాపు 1500లకుపైగా ఆయుర్వేద, వారసత్వ జీవారణ మొక్కలను పెంచనున్నారు. వనంలోకి ప్రవేశించిన భక్తుడికి ఔషధ మొక్కలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా రూపొందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా భక్తుల ప్రవేశం, నిష్క్రమణ, పార్కింగ్ ప్రదేశాలను, అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక థీమ్ పార్క్‌లా ఏర్పాటు

ఈ వనంలో ప్రధానంగా ఆయుర్వేదంలో వైద్యానికి ఉపయోగించే మొక్కలతో దేహచికిత్స వనం, సుగంధ పరిమళాలు వెదజల్లే మొక్కలతో సుగంధవనం, పూజలకు ఉపయోగించే మొక్కలతో పవిత్ర వనం, ప్రసాదాల తయారీకి ఉపయోగించే మొక్కలతో ప్రసాద వనం, పూజలకు ఉపయోగించే మొక్కలతో పూజా దివ్యవనం, పరిమళాలు వెదజల్లే మొక్కలతో సువాసన వనాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకమైన థీమ్‌లో భాగంగా ఔషధవనం, జీవరాశివనం, కల్పవృక్షదామం, ఔషధి కుండం, పవిత్ర వృక్షాలు, హెర్బల్ టీమీ పెవిలియన్‌ను, మూలికా వనం, రుతు వనం, మసాల మొక్కల వనం, అరుదైన వృక్షాల వనాన్ని ఏర్పాటు చేస్తారు. స్టేట్ ఆఫ్ ఆర్ట్‌తో ఈ వనం ఏర్పాటు చేయనున్నారు.

త్వరలోనే పనులు

సీఎం చంద్రబాబు సూచనలతో ఈ వనాన్ని ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. 2026లో భక్తులకు అందుబాటులోకి తెస్తాం. **- బీఆర్ నాయుడు, తితిదే ఛైర్మన్**

చదరంగం ఛాంపియన్ ముంబయి ఐఐటీ

ముగిసిన అంతర ఐఐటీ క్రీడాపోటీలు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో డైరెక్టర్ సత్యనారాయణ, అశ్విన్ మహాలింగం

ఏర్పేడు, న్యూస్‌టుడే: తిరుపతి ఐఐటీ వేదికగా జరుగుతున్న 58వ అంతర ఐఐటీ క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. చదరంగంలో ఐఐటీ ముంబయి ఛాంపియన్‌గా నిలిచింది. ఐఐటీ మద్రాస్, ఖరగ్‌పూర్, పాట్నా ఐఐటీలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. ● టెన్నిస్ మహిళా, పురుషుల విభాగంలో ఐఐటీ మద్రాస్ ఛాంపియన్‌గా అవతరించింది. ● బాడీవెయిట్ 60, 65, 71, 79 కిలోల పైబడి విభాగాల్లో ఐఐటీ రూర్కీ విజేతగా నిలిచింది. 79 కిలోల విభాగంలో ఐఐటీ కాన్పూర్ అగ్రస్థానం సాధించింది. ● వెయిట్ లిఫ్టింగ్‌లో ఐఐటీ రూర్కీ ఛాంపియన్‌గా నిలిచింది. విజేతలకు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్.సత్యనారాయణ, మద్రాస్ ఐఐటీ డీన్ అశ్విన్ మహాలింగం బహుమతులు అందజేశారు.

వాట్సప్ సందేశాలపై స్పందించొద్దు: ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం): వాట్సప్‌నకు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, ఫొటోలపై స్పందించవద్దని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. నకిలీ లింకును క్లిక్ చేస్తే ఫోన్ హ్యాక్ చేసి వ్యక్తిగత సమాచారాన్ని నియంత్రణలోకి తీసుకుంటారని పేర్కొన్నారు. బాధితుడి పేరుతో ఇతరులకు సందేశాలు పంపి డబ్బు డిమాండ్ చేస్తారని గుర్తు చేశారు. ఫోన్ హ్యాక్ అయినట్లు అనుమానం వచ్చిన వెంటనే సైబర్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము, శ్రీకాళహస్తి - తిరుపతి జిల్లా.

బహిరంగ వేలము ప్రకటన

ఆర్.సి.నెం.REV59-సి1/4/2024, తేది: 20.12.2025

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం హక్కు భుక్తములలో గల ఈ క్రింది తెల్పిన గ్రామాలలో ఉన్న దేవస్థానం భూములను (3) సంవత్సరముల కాలమునకు సాగు చేసుకొనుటకు బహిరంగ వేలము నిర్వహించుట. ఆసక్తి గల రైతులు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలములో పాల్గొనవచ్చును.

తిరుపతి జిల్లా

వ.సం.	గ్రామం పేరు	విస్తీర్ణం	ధరావత్తు డిపాజిట్	తేది & సమయము
1	బోడిరెడ్డి కండ్రిగ (మహాదేవపురం)	ఎ 1.05 సెం	రూ. 2000/-	తేది:29.12.2025, ఉ:11.00 గం.లకు
2	పాతగుంట	ఎ 3.72 సెం	రూ. 5000/-	తేది:29.12.2025, మధ్యాహ్నం:3.00 గం.లకు
3	కాపుగున్నేరు గ్రామము	ఎ 2.29 సెం ఎ 0.96 సెం ఎ 0.49 సెం	రూ. 5000/- రూ. 2000/- రూ. 1000/-	తేది:30.12.2025, ఉ:11.00 గం.లకు
4	శ్రీకాళహస్తి	ఎ3.32 c (కైలాస పర్వతములలో ఒక భాగమైన)	రూ. 10,000/-	తేది:30.12.2025, మధ్యాహ్నం:3.00 గం.లకు

ఇతర వివరముల కొరకై సెల్ నెం: 70130 14433, 99126 52553, 98664 56141, 99660 13456 ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

సం/- టి.బాపి రెడ్డి, కార్యనిర్వహణాధికారి

నేడు, రేపు పాలిటెక్నిక్ విద్యార్థులకు క్రీడలు

తిరుపతి(విద్య): తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమ, మంగళవారాల్లో రీజినల్ ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడలు జరుగుతాయని ప్రిన్సిపల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 16 పాలిటెక్నిక్ కళాశాల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

అన్నను హత్య చేసిన తమ్ముడు

గుర్రంకొండ, న్యూస్‌టుడే: గుర్రంకొండ పంచాయతీ మగ్బీరాలో తాగిన మైకంలో అన్నదమ్ములు గొడవ పడి. . తమ్ముడు అన్నను హత్య చేసిన ఉదంతం శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వాల్మీకిపురం సీఐ రాఘవరెడ్డి వివరాల మేరకు.. మగ్బీరాకు చెందిన షేక్ సాధిక్(26), షేక్ రఫీ(23) అన్నదమ్ములు. సాధిక్ తిరుపతిలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమ్ముడు రఫీ స్థానికంగా పనులకు వెళ్లేవాడు. శనివారం అర్ధరాత్రి తాగిన మైకంలో రఫీ, సాధిక్ ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో సాధిక్ మృతి చెందాడు.

సముద్రంలో మునిగి ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

కోట, న్యూస్‌టుడే: శ్రీనివాససత్రం సమీపంలోని బంగాళాఖాతంలో ఆదివారం నెల్లూరు గ్రామీణ మండలం కొత్త ఎల్ఎన్‌టీ గ్రామానికి చెందిన యుగంధర్‌రెడ్డి(21) అలల ధాటికి మునిగి మృతి చెందాడు. ఎస్సై పవన్‌కుమార్ వివరాల మేరకు నెల్లూరు గ్రామీణ మండలం కొత్త ఎల్ఎన్‌టీ గ్రామానికి చెందిన సురేష్ కుమార్‌రెడ్డి కుమారుడైన యుగంధర్‌రెడ్డి గూడూరులోని నారాయణ కళాశాలలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం సరదాగా గడపాలని యుగంధర్‌రెడ్డి తన నలుగురు స్నేహితులతో కలిసి శ్రీనివాససత్రం సమీపంలోని తీరానికి వెళ్లారు. సముద్రంలో హఠాత్తుగా వచ్చిన అలలు యుగంధర్‌రెడ్డితో పాటు మరో విద్యార్థిని లాక్కొని వెళ్లాయి. యుగంధర్‌రెడ్డి విగతజీవిగా సముద్రం ఒడ్డుకు చేరాడు. మరో విద్యార్థి ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది మృతదేహాన్ని పరిశీలించారు. స్నేహితుల నుంచి వివరాలు సేకరించి, కుటుంబీకులకు సమాచారం తెలియజేశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని మరణానంతర పరీక్షల నిమిత్తం కోటలోని ఆసుపత్రికి తరలించారు.

యుగంధర్‌రెడ్డి (పాత చిత్రం)

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE : 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆ 9381287629.

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పురిటి బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

MARRIAGE SERVICES

Reddy Boy, B.Tech (M) 7.2 LPA, 32 Yrs, Bharani, Wheatish, Employed in Chennai, Propertied wants Graduate Girl of Non-IT, Unemployed, Middle Class, Telugu Speaking Reddy/ Naidu (Second Marriage with Genuine Background is Acceptable). Ct- BCB. Reddy. ✆ 9444391787.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

చంద్రగిరి-తిరుతిలో అంతర్భాగంగా గ్రేటర్ తిరుపతిలో కలవబోతున్న చంద్రగిరి టౌన్‌లో ఒకవైపు కాలేజ్ మరోకవైపు అమ్మవారి టెంపుల్‌కి దగ్గరలో 100 అడుగుల రోడ్డుకు TUDA అప్రూవల్స్ లే అవుట్ నందు వెంటనే హౌస్, అపార్టమెంట్ కట్టుకునే PLOTS అమ్మబడును. 9505502346.

JOBS

GRID PLUS Solar Energy Wanted Sales Executives @ Tirupati. Exp. 1-2 Years, Edu: Degree/ Diploma/ Inter. Cont: 96663 66205.

Urgent Requirement For Facility Management Company House Keeping Staff, Guest Room Attendants, Kitchen Stewarding Staff Vacancy In Star Hotel in Tirupati, Fresher/ Experience Attractive Salary Includes ESI, PF, Insurance, Food & Accommodation Provided. 9092665040, 8056799288.

USAలో 2y బాబును చూసుకోవడానికి వీసా కల్గిన ఆడ కేర్‌టేకర్ కావలెను. జీతం + భోజనం + ఉచిత వసతి. ✆ 92469 98571, 92469 99571.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

ప్రముఖ కంపెనీలో టీం లీడర్స్‌గా చిత్తూరు, తిరుపతి, మదనపల్లి ఏరియాలలో P/F పనిచేయుటకు M/F కావలెను. Q: డిగ్రీ, MBA, MCA. ✆94403 51657.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు...
80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి
B/W: రూ. 600
Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

తిరుపతి

•తిరుపతి •చంద్రగిరి

అలరించిన భరతనాట్య ప్రదర్శన

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఆదివారం తిరుచానూరుకు చెందిన శివనాట్య కళా నిలయం కళాకారుల భరతనాట్య ప్రదర్శన జరిగింది. పలు సంకీర్తనలకు కళాకారులు చేసిన నృత్యాలు అబ్బురపరిచాయి. ఏవో సుధాకర్, ఏఈ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: సమస్య: పరసాలవీధి రేణుకా పరమేశ్వరి ఆలయం ఎదురుగా మ్యాన్‌హోల్ పొంగి వీధంతా పారుతోంది. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. **- ప్రభాకర్, పరసాల వీధి**

సమస్య: ఇస్కాన్ మార్గంలో మాలమూత్ర విసర్జన చేస్తున్నారు. ఈ మార్గంలో ప్రజా మరుగుదొడ్లు పని చేయడం లేదు. **- సురేష్, రామచంద్ర నగర్**

సమాధానం: మ్యాన్‌హోల్ సమస్య పరిష్కరిస్తాం. మరుగుదొడ్లు పని చేసేలా చూస్తాం.

- యువ అన్వేష్, వైద్యాధికారి, నగరపాలిక

పారిశుద్ధ్య పనులు

స్పందనకు వందనం

రామచంద్రాపురం: చిట్టతూరులో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇటీవల ఈనాడులో వచ్చిన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు.

రెండు చుక్కలు.. నిండు జీవితానికి రెక్కలు

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక అంగన్‌వాడీ, పోలియో కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు, వైద్యాధికారులు పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. **-న్యూస్‌టుడే బృందం**

తిరుమలలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న తితిదే ముఖ్యవైద్యాధికారి కుసుమకుమారి తదితరులు

హరేకృష్ణ మహతాబ్ ఆశయాలు ఆదర్శం

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: ఉత్కళ కేసరి, స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ హరేకృష్ణ మహతాబ్ జయంతి సందర్భంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల సదస్సును ఆదివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. తొలి ఒడిశా ముఖ్యమంత్రిగా ఆ రాష్ట్ర నిర్మాణంలో మహతాబ్ పాత్ర ఎనలేనిదని కొనియాడారు. వీసీ కృష్ణమూర్తి, ఆచార్యులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రజంటేషన్‌కు అవార్డు

విద్యావతి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం ఆచార్యులు విద్యావతికి ఉత్తమ ఓరల్ ప్రజంటేషన్ అవార్డు లభించింది. బెంగళూరులోని ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగిన 74వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో ఆమె పాల్గొన్నారు. 'త్రీడీ ప్రింటింగ్ ఆఫ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ ఆప్టిమైజ్డ్ కాలజెన్ బేస్డ్ బయోస్కాఫోల్డ్స్ ఫర్ స్కిన్ టిష్యూ ఇంజినీరింగ్' అంశంపై పరిశోధన పత్రం సమర్పించడంతోపాటు మౌఖిక ప్రదర్శనకు ఆమె అవార్డు అందుకున్నారు. టీబీఐ నిధి ప్రయాస్ నిధులతో పరిశోధక విద్యార్థిని తేజశ్వినితో కలిసి ఈ పరిశోధనను పూర్తి చేసినట్లు ఆమె చెప్పారు.

ర్యాలీ ప్రారంభిస్తున్న ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు

ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని ధ్యాన కేంద్రాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. విశేష కార్యక్రమాలు, ధ్యాన సాధన, సమావేశాలు నిర్వహించారు. రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో సమస్త గ్రీన్ హార్ట్ ఫుల్‌నెస్ రన్ పేరుతో నిర్వహించిన ర్యాలీని ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ ప్రారంభించారు. నాయకులు జల్లి మధుసూదన్, శ్రీనివాసకుమార్, ఈశ్వరయ్య, రామచంద్ర మిషన్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులురెడ్డి, రామ్మూర్తి, మురళీనాథ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థం.. సామాజిక ప్రయోజనం

నగరంలో డ్రాప్ బాక్స్ విధానానికి శ్రీకారం

ఒకరి దృష్టిలో వ్యర్థం అనేది ఇంకొకరికి అవసరం అవ్వొచ్చు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఇతర నివాస సముదాయాల్లో ఇతరులకు ఉపయోగపడే దుస్తులు, చెప్పులు, పుస్తకాలు, వంటసామగ్రి, ప్లాస్టిక్ వస్తువులు వ్యర్థాలుగా నగరపాలిక పారిశుద్ధ్య కార్మికులకు అందిస్తుంటారు. దుస్తులు, విరిగిన డబ్బాలు లాంటి వ్యర్థాల నిర్వహణ కూడా కష్టమే. ఈ సమస్యను పరిష్కరించేందుకు తిరుపతి నగరపాలక సంస్థ 'డ్రాప్ బాక్స్' అనే వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. నగరంలోని ప్రముఖ అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల నివాస సముదాయాలను లక్ష్యంగా చేసుకొని డ్రాప్ బాక్స్‌లను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో తొలిసారిగా తిరుపతిలో ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, తిరుపతి(నగరపాలిక)

డ్రాప్ బాక్స్ వద్ద అపార్ట్‌మెంట్ వాసులు

ఎలా పనిచేస్తుందంటే..

అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల అసోసియేషన్లతో మాట్లాడి కొంత స్థలాన్ని, గదిని సేకరించి డ్రాప్ బాక్స్ ఏర్పాటు చేస్తారు. గృహస్థులు తమకు ఉపయోగపడవు అనుకునే పాత దుస్తులు, చెప్పులు, పుస్తకాలను వేర్వేరుగా డ్రాప్ బాక్స్ ద్వారా సేకరిస్తారు. వారానికి ఒకసారి అక్కడి వస్తువులను సేకరించి నగరపాలక సంస్థకు చెందిన ఆర్ఆర్ఆర్ కేంద్రానికి తరలిస్తారు. అందులో పునర్వినియోగానికి అనుకూలమైన వస్తువులను అవసరమైన వారికి చేరుస్తారు. అవసరమైతే మరమ్మతులు చేసి అందిస్తారు. డ్రాప్ బాక్స్‌లో నుంచి వ్యర్థాల సేకరణ కోసం నగరపాలక సంస్థ ప్రత్యేక వాహనాన్ని సైతం సమకూర్చింది. ఈ విధానం వల్ల వ్యర్థాల విభజన సులభమై, రీసైక్లింగ్, పునర్వినియోగం సమర్థంగా చేసేందుకు అవకాశం కలుగుతుంది.

స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రలో భాగంగా..

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రతినెలా ఒక ప్రత్యేక థీమ్‌ను ఎంపిక చేసి, దానికి అనుగుణంగా స్వచ్ఛ కార్యాచరణ చేపడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెలకు సంబంధించిన పర్యావరణంలో అవకాశాలు అనే థీమ్‌ను దృష్టిలో ఉంచుకొని పర్యావరణ స్థిరత్వం సాధించేందుకు డ్రాప్ బాక్స్ అనే వినూత్న కార్యక్రమాన్ని నగరపాలిక ప్రారంభించింది.

స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యం

డ్రాప్ బాక్స్‌ల ద్వారా సేకరించిన వ్యర్థాలను ఆర్ఆర్ఆర్ సెంటర్‌కు తరలించి వాటి నిర్వహణ బాధ్యతను స్వయం సహాయక సంఘాల సభ్యులకు అప్పగించనున్నారు. వ్యర్థాల పునర్వినియోగంపై శిక్షణ కోసం ఇప్పటికే భారత ప్రభుత్వ టెక్స్‌టైల్ విభాగం సహకారం కోరుతూ నగరపాలిక కమిషనర్ ఎన్. మౌర్య లేఖ రాశారు.

జీవితాన్ని ఉత్తమంగా మలచుకోవాలి

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: యువత చెడు వ్యసనాల బారిన పడకుండా జీవితాన్ని ఉత్తమంగా మలచుకోవాలని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి పల్లవి పేర్కొన్నారు. రామానుజపల్లి పంచాయతీలో వారం రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది.

చంద్రగిరిలో అన్నదానం చేస్తున్న వైకాపా నియోజకవర్గ బాధ్యుడు మోహిత్‌రెడ్డి

మాజీ సీఎం పుట్టినరోజు వేడుకలు

న్యూస్‌టుడే బృందం: మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకల్ని తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో ఆదివారం వైకాపా శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకులు కోశారు. రక్తదానాలు చేశారు. అన్నదానాలు చేపట్టారు.

సాయిగీతంను స్ఫూర్తిగా తీసుకోవాలి

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: యూపీఎస్సీ ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీసెస్‌లో 14వ ర్యాంకు సాధించిన గుండ్రాతి సాయిగీతం గౌడ్‌ను ఆదివారం అతని ఇంటి వద్ద గౌడ సంఘం నేతలు దిండుపాటి కుమారస్వామి, యార్లపల్లి గోపిగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు సత్కరించారు. చదువులో రాణించి ఉన్నతంగా ఎదిగేందుకు విద్యార్థులను ప్రోత్సహించడంలో తాము ముందుంటామని, ఇతన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా చదువులో రాణించాలని తెలిపారు. నాయకులు లోకనాథం, కృష్ణమూర్తి, చింతమాని ఆనంద్, రాజమోహన్, మల్లికార్జున, రెడ్డిముని, మద్దెల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయిగీతంను సన్మానిస్తున్న గౌడ సంఘం నేతలు

నేడు, రేపు పాలిటెక్నిక్ విద్యార్థులకు క్రీడలు

తిరుపతి(విద్య): తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సోమ, మంగళవారాల్లో రీజినల్ ఇంటర్ పాలిటెక్నిక్ క్రీడలు జరుగుతాయని ప్రిన్సిపల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 16 పాలిటెక్నిక్ కళాశాల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు.

నారా సుహాసినికి ఎమ్మెల్యే నివాళి

చంద్రగిరి గ్రామీణ, న్యూస్‌టుడే: నారావారిపల్లిలో నారా సుహాసిని కర్మక్రియలు ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే పులివర్తి నాని నాయకులతో కలిసి హాజరై ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉంది'

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: తన తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని, అధికారులు రక్షణ కల్పించాలని వెదురుకుప్పం మండలం సద్దికూళ్లపల్లికి చెందిన ఓ యువతి విజ్ఞప్తి చేసింది. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ.. తనకు ఇష్టం లేని పెళ్లి చేయడంతో ఇంటి నుంచి వచ్చేసినట్లు తెలిపింది.

తెదేపా నేతలకు కృతజ్ఞతలు

మాట్లాడుతున్న నరసింహ యాదవ్

తిరుపతి(భవానీనగర్), న్యూస్‌టుడే: తెదేపా తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడిగా తన పదవీకాలం పూర్తయిన సందర్భంగా పార్టీ నేతలకు రాష్ట్ర యాదవ అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. తిరుపతి శ్రీవారి పాదాల చెంత తెదేపా కార్యాలయ నిర్మాణం తన చిరకాల కోరిక అని, ప్రస్తుతం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించడం ద్వారా ఆ స్వప్నం నెరవేరుతోందని హర్షం వ్యక్తం చేశారు.

గాంధీపురంలో భూవివాదం.. ఇరువర్గాలపై కేసు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీలో ఆదివారం భూవివాదం నెలకొంది. ఇరువర్గాలు దాడులకు పాల్పడగా కేసులు నమోదు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు వివరాల మేరకు.. గాంధీపురం పంచాయతీ సర్వే నంబర్ 13లోని భూమికి సంబంధించి పూర్వీకుల లావాదేవీలను ఆసరాగా చేసుకుని మించిన శివయ్య మరికొందరితో కలిసి అక్రమంగా ప్రవేశించి ప్రహరీ ధ్వంసం చేశారు. సుమారు 50 మంది గుంపుగా వచ్చి రాళ్లతో దాడులకు పాల్పడ్డారు. గోవిందరాజులు, దేవరాజులు, మురారి మరికొందరు రక్త గాయాలకు గురయ్యారు. ఈ ఘటనను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడాన్ని గమనించి మూడు సెల్‌ఫోన్లు లాక్కున్నారు. గాంధీ పురం ప్రజలు జోక్యం చేసుకోవడంతో నిందితులు పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలాగే అదే భూమిని దౌర్జన్యంగా ఆక్రమించి అక్కడికి తమను రానీయకుండా అడ్డుకుంటున్నారని.. గోవిందరాజులు, దేవరాజులు తదితరులపై రాళ్లు, చేతులతో కొట్టి గాయపరిచారని శివయ్య ఫిర్యాదు చేశారు. దీనిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.





(c) eenadu

శ్రీకాళహస్తి
• శ్రీకాళహస్తి • సత్యవేడు

అయ్యప్పస్వామి సేవలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి శబరిమలలో అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. మాలధారణ చేసిన ఆయన స్నేహితులతో కలిసి ఆదివారం శబరిగిరీశుని సేవలో పాల్గొన్నారు.

సత్యవేడు ఎస్సైగా సాయినాథ్.. సత్యవేడు: సత్యవేడు ఎస్సైగా సాయినాథ్ చౌదరి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న రామస్వామిని తిరుపతి తూర్పు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వుల మేరకు.. తిరుపతి సీసీఎస్ నుంచి బదిలీపై సాయినాథ్ ఆదివారం ఇక్కడ నియమితులయ్యారు.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన సూర్యభగవానుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణతో క్షీరం, నారికేళం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి.. దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రత్యేక అలంకరణలో సూర్యభగవానుడు

ఉద్యమంలా 'పల్స్‌పోలియో'

శ్రీకాళహస్తి, సత్యవేడు న్యూస్‌టుడే బృందం: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఉద్యమంలా నిర్వహించారు. ఏర్పేడు, పాపానాయుడుపేట పీహెచ్‌సీల పరిధిలో 6346 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తొట్టంబేడు, కాసరం పీహెచ్‌సీల్లో లహరి, శివకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నారాయణవనం పీహెచ్‌సీలో చిన్నారులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పోలియో చుక్కలు వేశారు. వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం మండలాల్లో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జిల్లా కార్యక్రమ పర్యవేక్షణాధికారి వత్ర ప్రకాష్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిచ్చాటూరు మండలంలో 3,457 మందికి, నాగలాపురంలో 3,908, బీఎన్ కండ్రిగలో 3,820, రేణిగుంటలో 9,415 మందికి పోలియో చుక్కలు వేశారు.

తొట్టంబేడు: చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీడీవో సురేంద్రనాథ్

బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం

నారాయణవనం, నాగలాపురం, న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచేలా సీఎం చంద్రబాబు నిర్ణయాలు భరోసా కల్పిస్తాయని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఆదివారం నారాయణవనంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని 12 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.11,83,290 ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, రామ్‌లక్ష్మణ్, గోవిందశెట్టి పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: స్కౌట్ మాస్టర్లు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ కోరారు. స్థానిక ఆర్‌పీబీఎస్ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి స్కౌట్ మాస్టర్ల బేసిక్ శిబిరం ముగింపును పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు. స్కౌట్స్ విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఇన్‌ఛార్జి కార్యదర్శి విజయకుమార్, స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి కిషోర్, ప్రధానోపాధ్యాయులు తీగల వెంకటయ్య, స్కౌట్ మాస్టర్లు సత్యనారాయణ, మణి, అజారుద్దీన్, మహేంద్ర, మణికంఠ, విద్యాసాగర్ పాల్గొన్నారు.

సత్యవేడు రహదారులకు మహర్దశ

పనులకు అనుమతుల మంజూరు.. టెండర్లే తరువాయి

నాగలాపురం, న్యూస్‌టుడే: సత్యవేడు నియోజకవర్గంలో ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న రహదారుల బాగుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ర.భ.శాఖకు చెందిన రెండు రోడ్లకు రూ.11.75 కోట్లు కేటాయించగా.. పంచాయతీరాజ్ శాఖలో రూ.11.02 కోట్లు విడుదల చేసింది.

అధ్వానంగా కొట్టకాడు రహదారి

నాగలాపురం- పీవీపురం దారికి మోక్షం

నాగలాపురం నుంచి పీవీ పురం వరకు ఉన్న చిన్నపాండూరు రహదారిని రెండు వరుసల రోడ్డుగా మార్చేందుకు రూ.49 కోట్లు కేటాయించి 2021లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ చేసిన పనులు జరగలేదు. ఈ రహదారిని ఉన్న వెడల్పులోనే ఆధునికీకరించేందుకు ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు ఎమ్మెల్యే ఆదిమూలం ఇటీవల భూమిపూజ చేశారు. బీఎన్‌కండ్రిగ మండలంలోని సూళ్లూరుపేట-సంతవేలూరు రహదారికి రూ.75 లక్షలు విడుదలయ్యాయి.

ఆరు నెలల్లో గుంతల రహితంగా..

నియోజకవర్గంలోని రహదారుల అధ్వాన స్థితిపై ముఖ్యమంత్రితో పాటు ర.భ., పీఆర్ ఉన్నతాధికారులకు పలుమార్లు లేఖ రాశా. రూ.22.77 కోట్ల విలువైన పనులు మంజూరయ్యాయి. త్వరితగతిన టెండర్ల ప్రక్రియతో పాటు పనులు పూర్తి చేయించి ఆరు నెలల్లో రహదారులను గుంతల రహితంగా మార్చుతాం. దాసుకుప్పం బైపాస్‌కు సైతం అనుమతి రానుంది. నాగలాపురంలో దెబ్బతిన్న బీటీరోడ్డుకు రూ.99 లక్షలు మంజూరయ్యాయి. - కోనేటి ఆదిమూలం, ఎమ్మెల్యే

మరో ఏడు మార్గాలకు..

బీఎన్‌కండ్రిగ మండలంలో శ్రీకాళహస్తి-తడ రహదారి నుంచి జంబుగోళానికి 6.31 కి.మీలకు రూ.3.47 కోట్లు, శ్రీకాళహస్తి-తడ రహదారి నుంచి ఆలత్తూరుకు 5.7 కి.మీలకు రూ.2.24 కోట్లు, సత్యవేడు మండలంలో ఇరుగుళం వద్ద 1.45 కి.మీ. రహదారికి రూ.1.45 కోట్లు, పిచ్చాటూరు మండలంలో పెన్నాలూరుపేట-వెంగళత్తూరు రహదారి నుంచి ఎస్‌ఎస్‌బీపేటకు 1.14 కి.మీ. రహదారికి రూ.69 లక్షలు, నాగలాపురం మండలంలో వడ్డిపాళెం నుంచి జంబుకేశ్వరపురానికి 3.2 కి.మీ. దూరానికి రూ.1.77 కోట్లు, వేంబాకం రహదారి నుంచి కొట్టకాడు ఎస్సీకాలనీ వరకు 1.66 కి.మీ.కు రూ.1.01 కోట్లు, కేవీబీపురం మండలంలో కాళంగి రహదారి నుంచి కండ్లూరుకు 0.71 కి.మీ.కు రూ.39 లక్షలు మంజూరయ్యాయి.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సమస్య: గజేంద్రనగర్‌లో వీధిదీపాలు వెలగడం లేదు. **- రాజేశ్వరి, గజేంద్రనగర్**
సమాధానం: సమస్య గుర్తించి చర్యలు చేపడుతాం. - రవి, పురపాలిక ఎలక్ట్రికల్ విభాగం

శ్రీకాళహస్తి గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: శ్రీకాళహస్తి మండలం మంగళపురిలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. **- పోలయ్య, స్థానికుడు**
సమాధానం: పంచాయతీ కార్యదర్శితో చర్చించి సమస్య పరిష్కరిస్తాం. - పద్మజ, డిప్యూటీ ఎంపీడీవో

నారాయణవనం, న్యూస్‌టుడే: సమస్య: బొప్పరాజుపాలెంలో కాలువల నిర్వహణ సక్రమంగా లేక దుర్గంధంతో అల్లాడుతున్నాం. **- రమేష్, స్థానికుడు**
సమాధానం: కాలువలను శుభ్రం చేయిస్తాం. - వేనయ్య, డిప్యూటీ ఎంపీడీవో

నాగలాపురం, న్యూస్‌టుడే: సమస్య: కోటవీధిలో కాలువలు అధ్వానంగా ఉన్నాయి. **- సుబ్రహ్మణ్యం**
సమాధానం: శుభ్రం చేయిస్తాం. - రాధిక, ఈవో

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకర వాతావరణాన్ని నెలకొల్పవచ్చని శ్రీకాళహస్తి ఎస్పీవీ పురుషుల డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు సూచించారు. స్థానిక శుకబ్రహ్మాశ్రమంలో విద్యార్థులు ఆదివారం ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి స్థానికులకు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై పలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం వాడాలని సూచించారు.

శిరస్త్రాణం లేకుంటే జరిమానా

రేణిగుంట, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన చోదకులు శిరస్త్రాణం లేకుండా నడిపితే జరిమానా తప్పదని రేణిగుంట గ్రామీణ సీఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక తూకివాకం పెట్రోల్ బంక్ వద్ద ఆయన ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పించారు. శిరస్త్రాణం ధరించని ద్విచక్ర వాహన చోదకులకు బంకుల్లో పెట్రోల్ కూడా ఇవ్వరని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్టార్టర్లు, సర్వీసు వైర్ల అపహరణ

రేణిగుంట, న్యూస్‌టుడే: ఆర్.మల్లవరం పంచాయతీ సుబ్బయ్యగుంతలోని పొలాల్లో పలువురు రైతులకు చెందిన స్టార్టర్లు, సర్వీసు వైర్లను దొంగలు అపహరించినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతులు చిన్నరెడ్డి, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, కిరణ్‌కుమార్, ఆనంద్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యరెడ్డి, వెంకటేష్, వెంకటచలపతి, మునిరెడ్డి, రవి, వెంకటేశులు, సుబ్రహ్మణ్యరెడ్డి, విజయ తదితరులకు సంబంధించిన వ్యవసాయ మోటార్ల స్టార్టర్లు, సర్వీసు వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించామన్నారు.

రాష్ట్ర జట్టుకు విద్యార్థినుల ఎంపిక

రేణిగుంట, న్యూస్‌టుడే: జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టులో తమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు సాత్విక, శాలిని హిమసుత ఎంపికయ్యారని డాక్టర్ బషీర్స్ తపస్య పాఠశాల కరస్పాండెంట్ విక్రమ్ షాలీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంతకల్లులో నిర్వహించిన 3వ రాష్ట్ర సబ్‌జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ గోల్ షాట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అద్భుత ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఆయన అభినందించారు.

సాత్విక, శాలిని హిమసుతలతో ఉపాధ్యాయులు

జావేదను సత్కరిస్తున్న సచివాలయ కార్యదర్శులు

బాడీ బిల్డర్‌కు సన్మానం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: గోవాలో నిర్వహించిన దేహదారుఢ్య పోటీల్లో శ్రీకాళహస్తి పురపాలిక పరిధిలోని సచివాలయ కార్యదర్శి జావేద పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా శనివారం రాత్రి పురపాలిక కార్యాలయంలో కమిషనర్ భవానీప్రసాద్‌తో పాటు సచివాలయ కార్యదర్శులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

ఘన సత్కారం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో సంఘం తాలుకా అధ్యక్షుడు చెంచురత్నం యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరిలను వారి మిత్రబృందం ఘనంగా సత్కరించింది. పట్టణంలోని శ్రీచాముండేశ్వరి ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో చంద్రమౌళి, బాలాజీ, జగదీష్, కపిల్ తదితరులు పాల్గొన్నారు.

చెంచురత్నం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాదగిరిని సత్కరిస్తున్న మిత్రబృందం

వర్గాలుగా విడిపోయి వేడుకలు

నాగలాపురం, సత్యవేడు, న్యూస్‌టుడే: పిచ్చాటూరులో వైకాపా నేతలు మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజును రెండు వర్గాలుగా ఆదివారం నిర్వహించారు. పార్టీ సంయుక్త కార్యదర్శులు హరిశ్చంద్రారెడ్డి, భాస్కర్‌నాయుడులు వేర్వేరుగా అన్నదానం చేశారు. నాగలాపురం, సత్యవేడుల్లో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆధ్వర్యంలో కేక్ కోసి స్థానికులకు అన్నదానం చేశారు. ● **బీఎన్ కండ్రిగ:** బీఎన్‌కండ్రిగలో పార్టీ మండల కన్వీనర్ మణినాయుడు ఆధ్వర్యంలో 200 మందికి అన్నదానం, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ● **రేణిగుంట:** మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్షయక్షేత్రంలో ప్రత్యేక ప్రతిభావంతులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

నాగలాపురంలో అన్నదానం చేస్తున్న వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్

నైపుణ్యం.. పతకాలు సొంతం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: క్రీడల్లో మెరికల్లా తయారవుతున్నారు శ్రీకాళహస్తి విద్యార్థులు. చదువుతో పాటు క్రీడల్లోనూ తమదైన సత్తాను చాటుకుంటున్నారు. జిల్లా, అంతర్‌రాష్ట్ర పోటీల్లో పాల్గొని విజయకేతనం ఎగురవేసి ఎన్నో పతకాలు దక్కించుకున్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణింపు

హరియాణా రాష్ట్రంలో రోహతక్ సైనిక్ స్కూలు ఆవరణలో జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. రాష్ట్రం తరపున పాల్గొన్న జట్టులో శ్రీకాళహస్తి క్రీడాకారులు తమదైన భాగస్వామ్యాన్ని చాటారు.

బాల్‌బ్యాడ్మింటన్‌లో సత్తా

స్థానికంగా వివిధ పాఠశాలల్లో చదువుతున్న హేమచరణ్, దర్శన్, హేమంత్‌లు తమదైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి అందరి మన్ననలు అందుకున్నారు. జాతీయ స్థాయిలో రాష్ట్రం తరపున క్రీడల్లో పాల్గొన్న వీరి జట్టు పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. వ్యాయామ ఉపాధ్యాయులు, బాల్‌బ్యాడ్మింటన్ శిక్షకులు చంద్ర నేతృత్వంలో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు.

ఆనందం.. రెట్టింపు ఉత్సాహం

జాతీయ స్థాయి పోటీలంటే భయం ఉండేది. తరచూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆనందంతో పాటు రెట్టింపు ఉత్సాహంతో పాల్గొన్నాం. జాతీయ స్థాయిలో శ్రీకాళహస్తి నుంచి ప్రాతినిధ్యం ఉండటం ఎంతో ఆనందంగా ఉంది.
- హేమచరణ్, విద్యాజ్యోతి పాఠశాల, శ్రీకాళహస్తి

సూచనలతో సత్ఫలితాలు

బాల్‌బ్యాడ్మింటన్ ఆడుతున్నా జాతీయ పోటీల్లో పాల్గొనే స్థాయికి వెళ్లడమంటే అంత సులువు కాదు. వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు ఇచ్చిన సూచనలతో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనగలిగా. తక్కువ సమయంలోనే మెలకువలు నేర్చుకోగలగడంతో పాటు రాణించగలిగాం. **- దర్శన్, నారాయణ ఇంగ్లిషు మీడియం స్కూలు, శ్రీకాళహస్తి**

ప్రోత్సాహంతో ఉత్సాహం

ప్రత్యర్థి జట్టుతో పోటీలో తలబడే ధైర్యం మరింతగా పెరిగింది. గతంలో ఈ విషయంలో కొంత ఇబ్బంది ఉండేది. ప్రస్తుతం రాష్ట్ర స్థాయి పోటీల సందర్భంగా శిక్షకులు ఇచ్చిన ప్రోత్సాహంతో మరింత ఉత్సాహంగా, నేర్పుతో ఆడగలిగాం.
- హేమంత్, ఆర్‌పీబీఎస్ జడ్పీహెచ్‌ఎస్, శ్రీకాళహస్తి

ఇల్లు.. పొదరిల్లు..

పెరటిసాగుపై మహిళల ఆసక్తి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: పల్లెలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ మహిళలు పెరటిసాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇన్నాళ్ల పాటు పలు రకాల పుష్పజాతుల పెంపకంపై మక్కువ చూపిన వారు.. ప్రస్తుతం నిత్యావసరాలకు తగ్గట్టుగా కాయగూరలు, ఆకుకూరలు సాగు చేస్తూ రోజువారీ మార్కెట్ ఖర్చులు తగ్గించుకుంటూ పలువురికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు.

మార్కెట్‌లో దొరికే కాయగూరలు చాలావరకు రైతులు రసాయన ఎరువులతో సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇంటికి అవసరమైన కాయగూరలు, అరటిపండ్లు, పుష్పాలు, ఆకుకూరలు ఇంట్లోనే సాగు చేసుకుంటున్నారు. ప్రధానంగా చిక్కుడు, కాకర, బీర, సొర, పుదీనా, కరివేపాకు, కొత్తిమీర, మెంతాకు వాడుకుంటున్నారు. దీంతో రోజువారీ మార్కెట్ ఖర్చులు మిగిలిపోవడంతో పాటు సేంద్రియ ఎరువులతో పండించే వాటిని స్వయంగా పెంచుకోవడం, వాటినే వాడుకుంటూ ఎంతో ఆనందాన్ని పొందుతున్నారు.

ఇంటి ఆవరణలో పండించిన కూరగాయలు

ఔషధ మొక్కలకు ప్రాధాన్యం

ఇంటి ఆవరణలో సాధారణ కాయగూరలతో పాటు ఔషధ మొక్కలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. ఖాళీ ప్రదేశంలో అవసరమైన అన్నీ రకాల మొక్కలు సాగు చేస్తున్నాం. ప్రధానంగా కలబంద, తిప్పతీగ, రణపాల తదితరాలు వేస్తున్నాం.
- తారాలక్ష్మి, తుఫాన్‌నగర్, శ్రీకాళహస్తి

కూరగాయల ఖర్చు మిగిలింది

ఆకుకూరలు, కాయగూరలకు నెలకు రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అవుతోంది. ఇంటి పట్టున వాటిని పెంచడంతో ఖర్చు మిగలడంతో పాటు తాజాగా ఉన్నవి అందుబాటులో ఉండటంతో మరింత ఆనందమే.
- ఉమామహేశ్వరి, సంతమైదానం, శ్రీకాళహస్తి

పేదలకు చీరల పంపిణీ

చీరలు, దుప్పట్లు అందజేసిన యంగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో భాగంగా పట్టణంలోని బృందమ్మకాలనీ సీఎస్ఐ చర్చిలో యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సభ్యులు పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. చర్చి ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు హేమకుమార్, షరీఫ్, అభిలాష్, నారాయణ, ప్రదీప్‌కుమార్, లలిత, తేజ, చంద్రకాంత్, రాజా పాల్గొన్నారు.

సత్యవేడును రెవెన్యూ డివిజన్ కేంద్రం చేయాలి

సత్యవేడు, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడును రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడారు. ఎన్నికల ముందు సీఎం నారా చంద్రబాబు సత్యవేడును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, నాగరాజు, శంకర్ పాల్గొన్నారు.

ఆలయానికి బియ్యం వితరణ

ఏర్పేడు, న్యూస్‌టుడే: ఏర్పేడు మండలం గుడిమల్లంలో వెలిసిన శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయానికి నెల్లూరు చిన్నబజారుకు చెందిన శివ భక్తబృందం బియ్యం వితరణగా అందజేసింది. ఆదివారం రూ.20వేలు విలువైన బియ్యం బస్తాలను ఆలయ అధికారులకు వారు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు శ్రీ ఆనందవల్లీదేవి సమేత శ్రీ పరశురామేశ్వరస్వామి దర్శన ఏర్పాట్లు చేసి ఆలయం తరపున తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మమ్మ, కోటేశ్వర్, వేణుగోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు, కమలకుమార్ పాల్గొన్నారు.

బియ్యం బస్తాలు వితరణగా అందజేస్తున్న శివభక్త బృందం

రెవెన్యూ డివిజన్ అధ్యక్షుడిగా శ్యామ్‌ప్రసాద్

డీటీ శ్యామ్, ఆర్ఐ జయకృష్ణను సన్మానిస్తున్న వీఆర్వోలు

రేణిగుంట: రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ సంఘం శ్రీకాళహస్తి డివిజన్ అధ్యక్షుడిగా రేణిగుంట ఉప తహసీల్దార్ (డీటీ) శ్యామ్‌ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఆదివారం శ్రీకాళహస్తిలో నిర్వహించిన ఎన్నికల్లో కార్యవర్గ సభ్యులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. సంయుక్త కార్యదర్శిగా రేణిగుంట ఆర్ఐ జయకృష్ణ ఎన్నికయ్యారన్నారు. వీరిని రేణిగుంట మండల వీఆర్వోలు ఘనంగా సన్మానించారు.

ఇలాగైతే ఎలా చూడాలి?



పులికాట్ సరస్సు వద్ద ఉన్న సందర్శకుల వ్యూ పాయింట్ టవర్ పెచ్చులూడి, ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా తయారైంది. ఫ్లెమింగో ఫెస్టివల్ నేపథ్యంలో సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు పర్యవేక్షించి మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.
– ఈనాడు, తిరుపతి

నాగలాపురంలో ఆక్రమణల తొలగింపు

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురంలో వివాదాస్పదంగా ఉన్న అగడ్త భూముల్లో ఆక్రమణలను తహసీల్దారు హనుమాన్‌నాయక్ ఆదివారం తొలగించారు. అగడ్తలో వీకేఎం వీధికి చెందిన వ్యక్తులు సరిహద్దు రాళ్లను నాటుతుండగా. . వీఆర్వో నాగభూషణం ఆధ్వర్యంలో వీఆర్ఏలు తనిఖీ చేశారు. వివాదం పరిష్కారమయ్యే వరకు రాళ్లు నాటవద్దని హెచ్చరించారు. టీపీపాళెం పంచాయతీ పరిధిలోని గోళ్లవారికండ్రిగ ఎస్టీ కాలనీలోనూ ఆక్రమణలను వీఆర్ఏ రమేష్ తొలగించారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: వరదయ్యపాళెం మండలం చిన్నపాండూరు పంచాయతీ వడ్డిపాళెంలో ఆదివారం శ్రీసిటీ పోలీసులు జూదం ఆడుతున్న వారిపై ఆకస్మిక దాడులు చేపట్టారు. ఎస్సైలు తరుణ్, ప్రియాంక ఆధ్వర్యంలో సిబ్బంది ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4500 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆలయంలో చోరీ

తొట్టంబేడు: మండలంలోని కారాకొల్లు పంచాయతీ దొంగలముదూరులో నిర్మించిన శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకోగా ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు ఆలయ తాళాలు పగులగొట్టారు. అమ్మవారికి అలంకరించిన బంగారు పుస్తెలు, ముక్కుపుడక, వంద గ్రాముల వెండి ఆభరణాలు దొంగలించారు.

మద్యం సీసాల స్వాధీనం

తొట్టంబేడు: అనుమతి లేకుండా విక్రయించేందుకు తీసుకొచ్చిన మద్యాన్ని తొట్టంబేడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శివనాథపురానికి చెందిన వెంకటమునిరెడ్డి ఇంట్లో మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారంతో పోలీసులు దాడి చేసి అతని నుంచి 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

గుంతల దారులు.. నిత్యం ప్రమాదాలు

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: వరదయ్యపాళెం - తడ మార్గం, సత్యవేడు మార్గాలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఇటీవల వర్షాలకు రహదారులు కోతకు గురై మడుగులను తలపిస్తున్నాయి. నెలరోజుల కిందట వరదయ్యపాళెం నుంచి తడకు ద్విచక్రవాహనంపై వెళ్తున్న శ్రీసిటీలో పనిచేస్తున్న ఓ యువకుడు రాత్రివేళ గుంతను గమనించక అదుపు తప్పి ప్రమాదంలో మరణించాడు. శ్రీసిటీలోని పలు కంపెనీలకు వెళ్లే కార్మికులు రాత్రివేళల్లో గుంతలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు.

మందుబాబులకు నిలయంగా కార్యాలయం

నాగలాపురం, న్యూస్‌టుడే: నాగలాపురం మండల కార్యాలయ సముదాయం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా తయారవుతోంది. సెలవు రోజుల్లో కార్యాలయ వెనుకభాగం మందుబాబుల అడ్డాగా మారుతోంది. కార్యాలయ ఆవరణలో వందల సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో పాటు కొన్ని కార్లు ఆపి పార్కింగ్ కేంద్రంగానూ వాడుతున్నారు. అధికారులు స్పందించి కార్యాలయ పరిసరాలను శుభ్రం చేయించడంతో పాటు ప్రైవేటు వ్యక్తుల వాహనాలు కార్యాలయ ఆవరణలో నిలపకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

వెలుగులో సంత.. చీకట్లే వీధులంతా

బీఎన్‌కండ్రిగ, న్యూస్‌టుడే: బీఎన్ కండ్రిగలో పలు వీధుల్లో దీపాలు వెలగడంలేదు. వారంలో ఒక్కరోజు నిర్వహించే సంత ప్రాంతంలో మాత్రం ఒక్కో స్తంభానికి రెండు లైట్ల చొప్పున ప్రతి నిత్యం వెలుగుతున్నాయి. ఆదాయం వచ్చే సంతకు మాత్రం అవసరం లేకున్నా రెండు చొప్పున వేశారు. ప్రజలు నిత్యం తిరిగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రహదారితో పాటు పలు వీధుల్లో చిమ్మచీకట్లు కమ్ముకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

శ్రీసిటీ మీదుగా గోవుల అక్రమ రవాణా

వరదయ్యపాళెం, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి గోవులు, గేదెల వంటి పాడిపశువుల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అధికారులు పట్టించుకోకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. నిత్యం మూగజీవాలు చెన్నైలోని గోవధశాలలకు తరలిపోతున్నాయి. తడ, శ్రీసిటీ మీదుగా జాతీయ రహదారి నుంచి చెన్నైకి ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారు. శని వారం, మంగళవారం రోజుల్లో అధికంగా రవాణా చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించాల్సి ఉంది.

ఆత్మీయ మిత్రునికి అశ్రునివాళి

కీ॥శే॥ జి. మురళీధర్ రెడ్డి గారు
Excutive Engineer
15-4-1967 12-12-2025

మిత్రమా ...!
నీ పలకరింపు ప్రతి ఒక్కరికీ పెద్ద పులకరింపు,
నిరాడంబరతకు నీవు నిలువెత్తు నిదర్శనం.
ఓ స్నేహశీలీ ...!
భౌతికంగా నీవు మాకు దూరమయినా మా మనసుల్లో కొలువై ఉంటావు.
నీ ఆత్మకి శాంతి, కుటుంబ సభ్యులకు మనఃశాంతి కలగాలని
ఆ శ్రీ కాళహస్తీశ్వరుణ్ణి ప్రార్థిస్తూ...

మీ ...... జి.వి.ఆర్. శేఖర్ (Chief Engineer), కె. గంగయ్య (Excutive Engineer)
డాక్టర్ భవిరి రవి (టెక్నికల్ ఆఫీసర్) మరియు రాష్ట్ర దేవదాయ శాఖ ఇంజనీరింగ్ సిబ్బంది

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

సత్కారం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ఏపీ ఎన్జీవో సంఘం తాలుకా అధ్యక్షుడు చెంచురత్నం యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ యాద గిరిలను వారి మిత్రబృందం ఘనంగా సత్కరించింది.

గూడూరులో నిమ్మ ధరలు

మొదటి రకం: కేజీ రూ. 12 నుంచి రూ. 15 వరకు

రెండో రకం: కిలో రూ. 10 నుంచి రూ. 12 వరకు

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

బ్రాయిలర్ (రైతు ధర)	123
లేయర్	115
బ్రాయిలర్స్	224
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	246
లేయర్ మాంసం	195

లక్ష్యం నెరవేరకనే.. తుప్పుపట్టి

ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర సమయాల్లో రోగులను పెద్ద ఆసుపత్రులకు తరలించేందుకు శ్రీసిటీలోని ఓ పరిశ్రమ యాజమాన్యం అంబులెన్స్‌ను ఇచ్చింది. దాన్ని వినియోగంలోకి తీసుకురాకుండా మూలన పడేశారు. అత్యవసర సమయాలలో ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సిన పరిస్థితి. నిర్లక్ష్యంతో అంబులెన్స్‌ను తుప్పుపట్టి పోయే పరిస్థితికి తెచ్చారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

పనబాక దంపతులను గజమాలతో సత్కరిస్తున్న తెదేపా నాయకులు

తెదేపా పార్లమెంటు అధ్యక్షురాలిని కలిసిన నాయకులు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: రేణిగుంట విమానాశ్రయంలో ఆదివారం తిరుపతి పార్లమెంటు తెదేపా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, కృష్ణయ్య దంపతుల్ని నాయుడుపేట తెదేపా పట్టణాధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్, పురపాలక సంఘం మాజీ వైస్ ఛైర్మన్ అత్తికాయల సుబ్రహ్మణ్యం, సీనియర్ నాయకులు కార్యకర్తలు కలసి గజమాలతో సన్మానించారు. తర్వాత విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించారు.

పక్షుల పండుగకు సిద్ధమవుతున్న నేలపట్టు

పక్షుల ప్రతిమలకు రంగులు వేస్తున్న చిత్రకారులు

దొరవారిసత్రం, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది జనవరి 10 నుంచి రెండు రోజుల పాటు పక్షుల పండుగ నిర్వహించేలా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో మండలంలోని నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని అధికారులు ముస్తాబు చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి నేలపట్టు పక్షుల కేంద్రం వరకు ఉన్న పక్షుల హోర్డింగ్‌లకు రంగులు దిద్దుతున్నారు. ప్రకృతి శిబిరం షెడ్‌కు అదురున టైల్స్ వేస్తున్నారు. సందర్శకులకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చే పనిలో ఉన్నారు. నేలపట్టు చెరువుకట్టతో పాటు పరిసర ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టారు.

నాడు అనుమతులు లేక.. నేడు తీసుకోలేక

✦ అక్రమ కట్టడాలపై అధికారుల కన్నెర్ర

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని తుమ్మూరు వద్ద ధన్య బహుళ అంతస్తును వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులు నిర్మించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా భూమిపూజ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టారు. పనులు నాసిరకంగా చేశారు. అనుమతుల మేరకు బహుళ అంతస్తును నిర్మించలేదు. కొంత వరకే అనుమతులు పొంది రైలుపట్టాల పక్కన నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. వర్షం కురిస్తే నీరంతా ఇళ్ల ముందు నిలుస్తోంది. తాజాగా పార్కింగ్ స్థలంలో చుట్టూ గోడలు కట్టి వ్యాపారానికి వినియోగించేందుకు విక్రయించేందుకు పూనుకున్నారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో అక్రమ కట్టడాలను తొలగించారు. భవనంలోని అవకతవకల్ని వెలుగులోకి తెచ్చి సంబంధిత యజమానిపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

వివరాలిలా..

పురపాలక సంఘం : నాయుడుపేట

అసెస్‌మెంట్లు : 12500

అక్రమ కట్టడాలు : 3 వేలు

వార్డులు : 25

జనాభా : 65 వేలు

ఏడాదికి పెరిగిన రాబడి : రూ.2 కోట్లు పైనే

యంత్రంతో గోడల్ని తొలగిస్తున్న అధికారులు

వైకాపా హయాంలోనే అవకతవకలు

పురపాలిక పరిధిలో 3 వేల వరకూ అక్రమ కట్టడాలు ఉన్నాయి. వీటిలో అసలు అనుమతుల్లేనివి, ఒక అంతస్తుకు పర్మిషన్ తీసుకొని బహుళ అంతస్తులు నిర్మించినవి, చెప్పిన చోట కాకుండా మరో ప్రాంతంలో కట్టడాలు కట్టడం, కాలువలు, నదులు, ప్రభుత్వ భూములు, రోడ్లు, అసైన్‌మెంట్ భూముల్లో శాశ్వతంగా నిర్మించినవి ఉన్నాయి. పెక్కుభాగం అవకతవకలు వైకాపా హయాంలోనే జరిగాయి. నిర్మాణానికి ఇంత మొత్తం చొప్పున ధరలు పెట్టి మరీ వసూలు చేశారు.

నోటీసులు ఇవ్వకుండానే

పిచ్చిరెడ్డితోపు వద్ద అనుమతుల్లేని లేఅవుట్‌లో రేకుల షెడ్డుకు పర్మిషన్ కోసం దరఖాస్తు చేశారు. ఇంకా అనుమతులు రాలేదు. అధికారులు రేకుల షెడ్డు గోడల్ని తొలగించారు. అనుమతుల కోసం దరఖాస్తు చేశామని, నోటీసులు ఇవ్వకనే కొట్టేశారని బాధితులు ఆవేదన చెందుతున్నారు.

సద్వినియోగం చేసుకోండి

అక్రమ కట్టడాలకు అనుమతులను 2026 మార్చి 3 వరకు గడువు పొడిగించారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. కమిషనర్ ఎస్‌కే.ఫజులుల్లా పలుమార్లు అక్రమ నిర్మాణదారులకు హెచ్చరికలు జారీ చేసినా పట్టించుకోలేదని, యంత్రాలతో తొలగిస్తుంటే ఇప్పుడు అనుమతులకు దరఖాస్తు చేస్తున్నారని వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు: 85002 02046 | నాయుడుపేట: 80085 73970 | సూళ్లూరుపేట: 88979 08890 | వెంకటగిరి: 80085 73966 | సమయం 10 AM TO 1 PM

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: గూడూరు పట్టణంలోని రైల్వేక్వార్టర్స్ వద్ద చెత్తా చెదారాలు రోడ్లపై ఉండటంతో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. – చక్రధర్, గూడూరు

సమాధానం: చెత్తా చెదారాలను సిబ్బందితో వెంటనే తొలగిస్తాం. – వెంకటేశ్వర్లు, కమిషనర్

నాయుడుపేట, న్యూస్‌టుడే: సమస్య: నాయుడుపేట పట్టణంలో జ్వాలపాళెం గ్రామం క్రాస్‌రోడ్డు వద్ద వేగ నియంత్రికలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. – స్థానికులు

సమాధానం: పరిశీలించి వేగ నియంత్రికలు ఏర్పాటు చేస్తాం – ఏఈ చిన్నరాయుడు ర.భ శాఖ

సమస్య: నాయుడుపేట పట్టణంలోని లక్ష్మణ్‌నగర్‌లో రోడ్డుకు అడ్డంగా పైపులైన్ దిమ్మెలు నిర్మించడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. – స్థానికులు

సమాధానం: పరిశీలించి దిమ్మెలను తొలగిస్తాం – చంద్ర ఏఈ నాయుడుపేట

బాడీ బిల్డర్‌కు సన్మానం.. శ్రీకాళహస్తి:గోవాలో నిర్వహించిన దేహదారుఢ్య పోటీల్లో శ్రీకాళహస్తి సచివాలయ కార్యదర్శి జావేద్ పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నారు. శనివారం పురపాలికలో కమిషనర్ భవానీప్రసాద్ ఘనంగా సత్కరించారు.

23న గూడూరు నియోజకవర్గ బంద్

దీక్షలో పాల్గొన్న మహిళా మండలి సభ్యులు, ఐకాస నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: గూడూరును జిల్లా చేయాలి, లేకుంటే నెల్లూరులో విలీనం చేయాలని ఐకాస నాయకులు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం 15వ రోజుకు చేరాయి. ఆంధ్ర మహిళా మండలి సభ్యులు, ఇన్నర్‌వీల్ క్లబ్, గూడూరు మెడికల్ షాప్స్, కార్పొరేట్ అసోసియేషన్ నాయకులు మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ 23న గూడూరు నియోజకవర్గం బంద్ నిర్వహిస్తున్నట్లు, ప్రజలందరు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దశరథరామిరెడ్డి, జమాలుల్లా, ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి, విష్ణువందన, శంకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, ఎల్వీ సుబ్బయ్య, సుబాన్ పాల్గొన్నారు.

సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు

ఏర్పేడు, న్యూస్‌టుడే: గుడిమల్లం శ్రీ పరశురామేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన సూర్యభగవానుడికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణతో క్షీరం, నారికేళం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి.. దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. ఈ విశేషోత్సవాన్ని పురస్కరించుకుని స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు.

మాజీ సీఎం పుట్టినరోజు వేడుకలు

కోటలో కేక్ కోస్తున్న వైకాపా నాయకులు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని సవితానగర్‌లో నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, బత్తిన విజయ్‌కుమార్, బొమ్మిడి శ్రీనివాసులు, నాశన నాగులు, సురేష్‌బాబు పాల్గొన్నారు. **సూళ్లూరుపేట, న్యూస్‌టుడే:** ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, ఛైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, కళత్తూరు శేఖర్ రెడ్డి, జట్టి వేణు, ఎమ్ రామకృష్ణ పాల్గొన్నారు. **కోట, న్యూస్‌టుడే:** కోట, చిట్టమూరు మండలాల్లో వైకాపా అధినేత జగన్ జన్మదిన వేడుకలను నాయకులు ఘనంగా నిర్వహించారు.

'బూటకపు హామీలు నమ్మరు'

వెంకటగిరి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఇచ్చే బూటకపు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వైకాపా నియోజకవర్గ సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం నేదురుమల్లి నివాసంలో మాజీ సీఎం జగన్ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 118 మంది రక్తదానం చేశారు. బాలసదనంలో చిన్నారులకు దుప్పట్లు, పుస్తకాలు పంపిణీ చేపట్టారు.

శిరస్త్రాణం ధరించకుంటే చర్యలు తప్పవు

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపాలని డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. పట్టణంలోని ఆసుపత్రి రోడ్డు వద్ద ఆదివారం హెల్మెట్ ధరించడంపై అవగాహన కల్పించారు. నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. పట్టణ సీఐ శేఖర్‌బాబు, ఎస్సై మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ✦ వెంకటగిరిలో..

నిండు జీవితానికి రెండే చుక్కలు

సూళ్లూరుపేట పట్టణంలోని కాపు వీధిలో ఆదివారం ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పాల్గొని పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. వెంకటగిరి ఎన్టీఆర్ కాలనీలో తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి బీరం రాజేశ్వరరావు, గూడూరు పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాలలో డీఎస్పీ గీతాకుమారి పోలియో చుక్కలు వేశారు. దొరవారిసత్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 2599 మందికి, బాలాయపల్లి మండలంలో 3,489 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే బృందం

గూడూరు పట్టణంలో పాల్గొన్న డీఎస్పీ గీతాకుమారి

తప్పిన ప్రమాదం

చిల్లకూరు, న్యూస్‌టుడే: వరగలి అడ్డరోడ్డు జాతీయ రహదారి కూడలి వద్ద ఆర్టీసీ బస్సు, లారీ ఆదివారం అదుపుతప్పి ఢీకొన్నాయి. నెల్లూరు నుంచి సత్యవేడుకు ప్రయాణికులతో వెళ్తున్న బస్సును చెన్నై మార్గంలో వెళ్లే లారీ ఢీకొంది. దీంతో బస్సు ముందుభాగం దెబ్బతింది. ఘటనలో ఎవరూ గాయపడక పోవడంతో ప్రమాదం తప్పింది. రహదారిపై మరమ్మతులు చేస్తున్న క్రమంలో ట్రాఫిక్ స్తంభించింది.

తారులేచి కంకర మిగిలి

మండలంలోని మన్నెముత్తూరు గ్రామం నుంచి సూళ్లూరుపేట వెళ్లే మార్గంలో రోడ్డుపై పొర లేచిపోయి కంకర మిగిలింది. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి మరింత దుస్థితికి చేరింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. దీంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని చోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

విన్నవించినా.. అరణ్య రోదనే

నాయుడుపేటలోని కెనరా బ్యాంకు మలుపులో రోడ్లు, మురుగు కాలువలు దుస్థితికి చేరుకున్నాయి. దీన్ని బాగుచేయాలని స్థానికులు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా అరణ్యరోదనగానే మిగిలింది. పురపాలికలో అవసరం లేని వాటికి నిధులు ఖర్చు చేస్తున్న అధికారులు అత్యవసరమైన పనులకు కేటాయించడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకున్న వారే కరవయ్యారు. – న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం

రహదారి బురదమయం

చిట్టమూరు మినీ బస్టాండ్‌కు వెళ్లే ర.భ శాఖ రోడ్డు పలుచోట్ల గుంతలమయమై అధ్వానంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా రహదారి బురదమయం అవుతోంది. దీంతో ఈ మార్గంలో వెళ్లాలంటే చోదకులు అవస్థలు పడుతున్నారు. వాహనదారులు కిందపడి ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. త్వరలోనే మరమ్మతులు చేస్తామని ర.భ శాఖ అధికారులు తెలిపారు. – న్యూస్‌టుడే, చిట్టమూరు

ఊడిపడుతున్న పెచ్చులు.. పగుళ్లిచ్చిన గోడలు

కోట సామాజిక ఆరోగ్య కేంద్రంలోని మరణానంతర పరీక్షల గది శిథిలావస్థకు చేరింది. గోడలు పగుళ్లిచ్చి, శ్లాబ్‌పై నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. వర్షం వస్తే భవనమంతా ఉరుస్తోంది. ఈ సామాజిక ఆరోగ్య కేంద్రం కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు మండలాలకు కూడలిగా ఉంది. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యలు, మెడికో లీగల్ కేసులు అధిక సంఖ్యలో వస్తుంటాయి. మరణానంతర పరీక్షల గది దుస్థితికి చేరడంతో వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, కోట

వినియోగం తక్కువగా.. దుస్థితికి చేరువగా

సూళ్లూరుపేట మండలం కొరిడి గ్రామంలో ఉన్న బస్టాండు లోపల చెత్త, గాజు ముక్కలతో నిండిపోయింది. గ్రామానికి బస్సు సర్వీసులు తక్కువగా ఉండటంతో ప్రయాణికులు బస్టాపును తక్కువగా వినియోగిస్తుంటారు. దీంతో ప్రాంగణంపై పర్యవేక్షణ కొరవడి దుస్థితికి చేరింది. నిత్యం కూలి పనుల నిమిత్తం వెళ్లే కార్మికులు బస్సు కోసం వేచి ఉండటానికి బస్టాపు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, సూళ్లూరుపేట గ్రామీణం

రక్తదాన శిబిరం

వాకాడు, న్యూస్‌టుడే: చెందోడుకు చెందిన ఎంవీ రావు సంస్థ ఆధ్వర్యంలో వాకాడు ఆర్టీసీ డిపో సమీపంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు రక్తదానం చేశారు. ముప్పవరపు లీలామోహన్‌కృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కోట, న్యూస్‌టుడే: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు తెదేపా సీనియర్ నాయకుడు పవన్‌కుమార్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, నాయకుల ఆధ్వర్యంలో పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు ఫలాలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలు

వాకాడు, న్యూస్‌టుడే: కొండాపురంలో గత వారం రోజులుగా విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు చేపట్టిన సేవా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. విద్యార్థులు పలు ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రం చేసి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ సుధాకర్, విక్రమసింహపురి యూనివర్సిటీ కోఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి, విభాధిపతి గాది శ్రీనివాస్, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ఉపాధి హామీ పథకానికి తూట్లు

మాట్లాడుతున్న వి.వి.రమణయ్య

వెంకటగిరి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచే నిర్ణయం తీసుకుందని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.వి. రమణయ్య అన్నారు. ఆదివారం కాళహస్తి శేషయ్య స్మారక భవనంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాలు తమ వాటా కింద 40 శాతం చెల్లించాలని షరతు పెట్టడం వల్ల ఆర్థిక భారం పడి పథకాన్ని సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీనిపై 23న మండలంలో నిరసన చేపడుతున్నట్లు వివరించారు. కోశాధికారి కృష్ణారెడ్డి, సభ్యులు పెంచలయ్య, తిరుపాల్ పాల్గొన్నారు.

ప్రతి పనికి ఓ రేటు.. వసూలయ్యేట్లు

✦ రెవెన్యూలో అక్రమాల జోరు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రెవెన్యూ శాఖలో అవినీతి లేకుండా ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని సీఎం చంద్రబాబు పదేపదే చెబుతున్నారు. పేదలను ఇబ్బందులకు గురి చేయవద్దని రెవెన్యూ సమీక్షల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ హెచ్చరిస్తూనే ఉన్నా, అధికారుల తీరు మారడం లేదు. గూడూరు నియోజకవర్గంలోని చిట్టమూరు మండల రెవెన్యూలో ప్రతి పనికి ఓ రేటు నడుస్తోంది. ఇక్కడ వీఆర్వో నుంచి తహసీల్దార్ వరకు చేయి తడపందే పనులు కావన్నది జగమెరిగిన సత్యం. ఒక్కో పనికి ఓ రేటు నిర్ణయించి వసూలు చేయడం పరిపాటిగా మారింది. గత వైకాపా పాలనలో ఇక్కడి రెవెన్యూ అధికారులు విచ్చలవిడిగా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆగడాలు మరింత పెరిగాయని స్థానికులు చెబుతున్న మాట. ఇక్కడి కార్యాలయంలో కొందరు కిందిస్థాయి సిబ్బంది పాతుకుపోయి వసూలు రాజాలుగా మారారు. అక్రమ వసూళ్ల వ్యవహారం అంతా వీఆర్వోల ద్వారా ఫోన్‌పేలలో సాగుతోంది.

చిట్టమూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతుకు బ్యాంకు రుణం కావాల్సి వచ్చింది. సంబంధిత పత్రాలను రెవెన్యూ అధికారుల నుంచి తీసుకొని రమ్మని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఆయన సదరు కార్యాలయానికి వెళ్లి పత్రం అడిగారు. రూ.5 వేలు ఇచ్చి పత్రం తీసుకెళ్లమని వారు చెప్పడంతో చేసేది లేక అన్నదాత అడిగిన మొత్తం ముట్టచెప్పారు. అనంతరం ఆయన బ్యాంకులో రుణం పొందారు.



చిట్టమూరు తహసీల్దార్ కార్యాలయం

ప్రభుత్వ భూముల ఆక్రమణ

మండలంలోని ఎల్లసిరి, అరవపాలెం, యాకశిరి, ఆరూరు, పిట్టివానిపల్లె తదితర గ్రామాల్లో ప్రభుత్వ భూములను కొందరు రెవెన్యూ అధికారుల అండదండలతో దున్ని సాగులోకి తెస్తున్నారు. గ్రావెల్, ఇసుక వంటివి అక్రమంగా తరలిపోతూనే ఉన్నాయి. వీటిపై ప్రజలు ఫిర్యాదు చేస్తే చర్యలు ఉండటం లేదు.

అడ్వాన్స్‌ల రూపంలో

ప్రభుత్వం సాదాబైనామా ద్వారా అగ్రిమెంట్లపై భూములు రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతి ఇవ్వడంతో మండలంలోని వీఆర్వోల నుంచి తహసీల్దార్ వరకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. కొందరు రైతుల వద్ద అడ్వాన్స్‌ల రూపేణ వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై గూడూరు ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ భానుప్రకాష్‌రెడ్డిని వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్రమ వసూళ్లపై ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

క్రైం కార్నర్

ద్రావకం తాగి వ్యక్తి ఆత్మహత్య

పెళ్లకూరు, న్యూస్‌టుడే: అర్లపాడు గ్రామంలో ద్రావకం తాగి శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గోను మురళీ(45) శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సమస్యలతో ఆయన ద్రావకం తాగి ఆత్మహత్యకు పాల్పడటంతో బంధువులు మొదట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, ద్విచక్ర వాహనం ఢీ: ఒకరి మృతి

తడ, న్యూస్‌టుడే: రామాపురం పంచాయతీ పన్నంగాడు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో తమిళనాడు పరిధిలోని ఆరంబాకం పంచాయతీ ఎడకండ్రిగకు చెందిన వెంకటేష్(35) దుర్మరణం చెందాడు. వెంకటేష్ వ్యక్తిగత పని నిమిత్తం ఎళావూరు వెళ్లి తిరిగి వస్తుండగా పన్నంగాడు వద్ద వెనుక వస్తున్న లారీ ఢీకొంది. మృతునికి భార్య, కుమారుడు ఉన్నట్టు సమాచారం. మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కొండప నాయుడు తెలిపారు.

కోడి పందెం స్థావరంపై దాడులు

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని మన్నేగుంట సమీపంలో నిర్వహిస్తున్న కోడి పందెం స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి నాలుగు కోళ్లు, రూ.900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. **వాకాడు:** కొండాపురం సమీపంలో కోడి పందెం స్థావరంపై ఆదివారం పోలీసులు దాడులు చేపట్టారు. ఐదుగురు జూదరులు, రూ.520 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నిఖిల్‌బాబు చెప్పారు.

యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని సత్యసాయి కల్యాణ మండపంలో ఆదివారం జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ అధ్యక్షతన యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నూతన విద్యావిధానం పేరుతో రాష్ట్రంలో పాఠశాలలను వివిధ రకాలుగా విభజించడం ద్వారా నూతన పరిణామాలకు దారి తీసిందని పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రెడ్డప్ప పాల్గొన్నారు.

లీకులు.. తప్పని వెతలు

✦ పురపాలికలో పరిష్కారానికి నోచుకోని సమస్య

వెంకటగిరి, న్యూస్‌టుడే: సమ్మర్ స్టోరేజీ ద్వారా పట్టణంలోని 25 వార్డుల ప్రజలకు నిత్యం తాగునీరు సరఫరా చేస్తున్నారు. 60 వేల మంది జనాభాకు 9 ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నా నిత్యం ఏదో ఒక వార్డులో పైపులు పగిలి నీరంతా వృథాగా పోతోంది. 2014లో ప్రారంభించిన సమ్మర్‌స్టోరేజీ ద్వారా నీటిని పంపిణీ చేపట్టారు. ట్యాంక్ నిర్మాణం సమయంలో నాసిరకం పైపులు వేయడంతో తరచూ ఈ సమస్య ఏర్పడుతోంది. పథకం ప్రారంభం నాటి నుంచి నేటి వరకు లీకేజీ మరమ్మతులకు పురపాలిక తరపున రూ.లక్షలు ఖర్చు చేసిన ప్రయోజనం శూన్యం. పట్టణంలోని కాశీపేట కూడలి వద్ద గత 50 రోజులకు పైగా తాగునీటి పైపు పగిలి నీరంతా వృథాగా పోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున పాపాన పోలేదు. నిత్యం ఈ మార్గంలో అధికారులు తిరుగుతున్నా పగిలిన పైపునకు రిపేరు చేయాలనే ధ్యాస లేకుండా పోయింది. పైపు పగిలి నీరంతా రోడ్డుపై మడుగులా నిల్వ ఉంటోంది.

త్రిభువని కూడలి వద్ద లీకవుతున్న నీరు

మూడేళ్లుగా ఇదే పరిస్థితి

త్రిభువని కూడలి వద్ద మూడేళ్ల కిందట మాజీ సీఎం జనార్దన్‌రెడ్డి విగ్రహవిష్కరణకు అప్పటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వచ్చే క్రమంలో విగ్రహం వెనుక భాగంలో ఉన్న చెట్టును తొలగించారు. దీంతో మున్సిపాలిటీకి వెళ్లే తాగునీటి పైపు పగిలిపోయింది. నాడు తాత్కాలికంగా మరమ్మతు చేసి వదిలేశారు. ఆ తర్వాత అనేకసార్లు రిపేర్లు చేసినా ఫలితం లేకుండా పోయింది. నాటి నుంచి నేటి వరకు ఇక్కడ తాగునీటి పైపు ద్వారా నీరు పొంగి పారుతోంది. అధికారులు స్పందించి లీకేజీలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

(c) eenadu

బాలలం.. భావి శాస్త్రవేత్తలం

■ జిల్లా స్థాయి సైన్స్ ప్రదర్శనలో ఆకట్టుకున్న ప్రాజెక్టులు

జిల్లాలో పలు ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు నిత్యం సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరికరాలను తక్కువ ఖర్చుతో తయారు చేయడంతో విద్యాశాఖ అధికారుల ప్రశంసలు అందుకున్నారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్ పర్యవేక్షణలో స్థానిక ఉన్నత పాఠశాలలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయుల గైడెన్స్‌తో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రదర్శించిన ప్రయోగాలు విజ్ఞానదాయకంగా నిలిచాయి. ప్రాజెక్టుల రూపకల్పనలో పాల్గొన్న విద్యార్థులందరికీ జిల్లా విద్యా వైజ్ఞానిక అధికారి ధ్రువపత్రాలు అందజేశారు. - న్యూస్‌టుడే, నాయుడుపేట

ఆరోగ్యకర ఆనందానికి

➡ విద్యార్థులు: ఒ. అభిరామ్, కె. సుశాంత్ నాయక్ ◆ తరగతి: తొమ్మిది ➡ పాఠశాల: ఎస్‌పిజేఎన్ఎం సీహెచ్ఎస్ (తిరుపతి) ➡ ప్రాజెక్టు: టెర్రస్ గార్డన్ ➤ ఉద్దేశం: మిద్దెలపై తక్కువ ఖర్చుతో ఆకుకూరల సాగు

తేమ శాతం నియంత్రించడం

➡ సి. హెచ్ లిఖిత్‌కుమార్, కె. జస్వంత్‌కుమార్ ◆ తొమ్మిది ➡ జడ్పీహెచ్ఎస్ బాలిరెడ్డిపాళెం(వాకాడు) ➡ హ్యుమిడిఫైయర్ సిస్టమ్ ➤ ఆస్తమా రోగులకు పరికరం తయారుచేయడం

పర్యావరణ రహితంగా ఫ్లోర్‌క్లీనర్

➡ వసీదా, టి. అవంతిక ➡ జడ్పీహెచ్ (ఓజిలి) ➡ ఫ్లోర్‌క్లీనర్ పరికరం ➤ రసాయనాలు లేకుండా ఫ్లోర్‌క్లీనింగ్ చేయడం

యంత్రంతో తాగునీటి శుభ్రం

➡ జి. స్వాతి, ఎన్. మాన్యశ్రీ ➡ జడ్పీహెచ్ఎస్ (పిచ్చాటూరు) ➡ వాటర్ ట్యాంక్ క్లీనింగ్ పరికరం ➤ పెద్ద ట్యాంకులను తక్కువ వ్యవధిలో శుభ్రం చేయడం

మానవ హృదయంపై అవగాహన

➡ ఎస్. అమల్, సి. దీక్షిత ➡ జడ్పీహెచ్ (సత్యవేడు) ➡ మానవ గుండె నిర్మాణం ➤ గుండె పనిచేసే విధానం

శంఖువు, స్థూపాకారం కొలిచే విధానం

➡ ఏ. పోలమ్మ గీతాంజలి ➡ కేజీబీవీ(కె.వి.బి.పురం) ➡ కొలతలు తీసే సాంకేతిక పరికరం ➤ శంఖువు, స్థూపం ఆకారం లోని పరికరాలు సులభంగా కొలవడం

తీగలు లేకుండానే విద్యుత్తు సరఫరా

➡ ఎం. సాయిప్రణీత్ ➡ జడ్పీహెచ్ఎస్ శిరసనంబేడు(పెళ్లకూరు) ➡ టెస్లా కాయిల్ రూపకల్పన ➤ తీగలు లేకుండా భవిష్యత్తు విద్యుత్తు సరఫరా

ప్రభుత్వ సహకారంతో వడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటు

తిరుపతి(నగరం, మంగళం), న్యూస్‌టుడే: తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కూటమి ప్రభుత్వ సహకారంతో వడ్డెర ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు దేవళ్ల మురళి తెలిపారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వడ్డెర ఓబన్న విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన పనులను జనసేన నాయకుడు పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. నాయకులు గుంజ మదన్మోహన్, దేవళ్ల శ్రీనివాసులు, రమణ, శేఖర్, బాలాజీ, అమరనాథ్, యోగానంద్, నాగరాజు, పురుషోత్తం, మదన్, రామాంజనేయులు పాల్గొన్నారు.

శంకుస్థాపన పనులు ప్రారంభిస్తున్న హరిప్రసాద్, నాయకులు

రచయితలు రుగ్మతలు రూపుమాపాలి

తిరుపతి(బైరాగిపట్టెడ): కవులు, రచయితలు, సాహితీవేత్తలు సమాజంలో రుగ్మతలను రూపుమాపి, అనేక అంశాల్లో దిశాదశ చూపాలని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేటు హాల్లో జిల్లా రచయితల సంఘం వార్షిక వేడుకలు నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తోట వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా మన్నవ గంగాధరప్రసాద్, కోశాధికారిగా వాకా ప్రసాద్, ఉపాధ్యక్షులుగా నాదెండ్ల శ్రీమన్నారాయణ, డి.మస్తానమ్మ, చెన్న కేశవులు నాయుడు, సంయుక్త కార్యదర్శులుగా యువశ్రీ మురళి, రొడ్డా సురేంద్ర, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. కొన్నేళ్లుగా రచయితలను ఏకతాటిపై నడిపించిన గార్లపాటి దామోదరనాయుడు, సాకం నాగరాజ సేవలను కొనియాడి సత్కరించారు.

జిల్లా రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు

వసతి గృహ విద్యార్థులకు ముస్తాబు

■ కాస్మెటిక్ ఛార్జీలకు స్వస్తి ■ కిట్ల రూపంలో అందించనున్న వస్తువులు

గూడూరు, నాయుడుపేట, న్యూస్‌టుడే: సాంఘిక సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి కాస్మెటిక్ ఛార్జీలు చెల్లించే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలకనున్నట్లు సమాచారం. దీనికి బదులుగా ముస్తాబుకు అవసరమైన 12 రకాల వస్తువులతో కూడిన కిట్లు రెండు నెలలకు ఒకసారి నేరుగా విద్యార్థులకు అందచేసే దిశగా సంక్షేమ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

వసతిగృహం

తరగతుల వారీగా ప్రభుత్వం అందజేస్తున్న కాస్మెటిక్ ఛార్జీలను మూడు కేటగిరీలుగా విభజించి 12 రకాల వస్తువులను కిట్ల ద్వారా విద్యార్థులకు

వస్తువులు ఇవే..

రెండు నెలలకు ఒకసారి సరఫరా చేయనున్నారు. 5, 6 తరగతులకు 11 రకాలు, 7- ఇంటర్ వరకు 12 రకాల వస్తువులతో కూడిన కిట్లు సరఫరా చేసే అవకాశం ఉంది. కొబ్బరి నూనె, టూత్‌బ్రష్, పౌడర్, సబ్బు, వ్యాజలిన్, టూత్‌పేస్ట్, టంగ్ క్లీనర్, షాంపు డిటర్జెంట్ సబ్బు, వాషింగ్ పౌడర్, బాలికలకు హెయిర్ బ్యాండ్, రిబ్బన్, రబ్బర్ బ్యాండ్‌లను అదనంగా ఇవ్వనున్నారు. బాలురకు కిట్‌తో పాటు క్షవరానికి అదనంగా రూ.50 చొప్పున రెండు నెలలకు కలిపి రూ.100 ఇవ్వనున్నట్లు సమాచారం.

నగదు జమతో ఇబ్బందులు

జిల్లాలో 143 వరకు సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో 22 వేల మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. వీరికి గతంలో ప్రతి నెల కాస్మెటిక్ ఛార్జీలు నగదు రూపంలో చెల్లించేవారు. వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత కాస్మెటిక్ ఛార్జీలను తల్లుల ఖాతాలో జమ చేసేవారు. విద్యార్థులు చదువుతున్న సంక్షేమ వసతి గృహాలు, గురుకులాలు మరోక ప్రాంతంలో ఉండటం వల్ల ఖాతాల్లో జమ చేసిన కాస్మెటిక్ ఛార్జీల నగదు సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బంది పడేవారు. కొందరు తల్లులు కుటుంబ అవసరాలకు నగదును వాడుకోవడంతో విద్యార్థులు ఉపయోగించుకోలేక పోయేవారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు కిట్లను అందించనున్నారు.

వివరాలిలా..
సంక్షేమ వసతి గృహాలు: 125
విద్యార్థులు: 9685
గురుకులాలు: 23
విద్యార్థులు: 13140

కుటుంబసభ్యులతో జస్టిస్ ఎంజీ ఉమా

శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఆదివారం ఉదయం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిద్ధార్థ వర్మ, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ ఉమా దర్శించుకున్నారు. వీరికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. ● హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శ్రీవారిని, తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు తిరుమలలో పరదాల అందజేత

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుపతికి చెందిన శ్రీవారి పరమ భక్తుడు పరదాల మణి 28 సంవత్సరాలుగా శ్రీవారి మీద భక్తిప్రపత్తులతో ఏటా ఏడాదికి నాలుగు పర్యాయాలు గర్భాలయంలో అలంకరించే అతి సుందరమైన పరదాలు, కురాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం జరగనున్న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనాన్ని పురస్కరించుకొని సోమవారం తిరుమలలో తితిదే ఉన్నతాధికారులు, ఆలయ అర్చకులకు పరదాలను అందజేయనున్నారు. ఈసారి ప్రత్యేకంగా శ్రీవేంకటేశ్వర స్వామి మహాలక్ష్మి పూర్ణకుంభం, గజవాహనం.. ధనుర్మాసం కావడంతో గోదాదేవి సహిత సమేత శంఖుచక్ర నామాలను బంగారు లేసుల ఆర్టిఫిషియల్ డైమండ్స్‌తో అందంగా, కళాత్మకంగా పరదాలను తీర్చిదిద్దారు.

పరదాలతో శ్రీవారి భక్తుడు మణి

'కరెంటోళ్ల జనబాట'కు ఏపీఎస్పీడీసీఎల్ శ్రీకారం

తిరుపతి(నగరం), పాకాల, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ శివశంకర్ 'కరెంటోళ్ల జనబాట' కార్యక్రమానికి రూపకల్పన చేశారు. సోమవారం పాకాల మండలం కృష్ణాపురంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రారంభించనున్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం ఉద్యోగులు గ్రామాల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించనున్నారు. పాకాల మండలం మొగరాలలో రూ.4.50 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్‌ను మంత్రి సోమవారం ప్రారంభించనున్నారు. అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో మంత్రి పాల్గొని కారుణ్య నియామకాల కింద 50 మందికి ఉత్తర్వులు అందజేయనున్నారు.

కొత్త ఆవిష్కరణలకు వేదిక ఏపీ

తిరుపతి(నగరం): కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లకు ఆంధ్రప్రదేశ్ వేదికగా నిలుస్తోందని రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఇంధన వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో జరుగుతున్న సైన్స్ ఎగ్జిబిషన్‌ను సీఎండీ శివశంకర్ లోతేటి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానితో కలిసి ఆయన పరిశీలించారు. వివిధ జిల్లాల్లో నిర్వహించిన పోటీల విజేతలకు మంత్రి బహుమతులు, ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎస్ఈ చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే నాని, సీఎండీ శివశంకర్

నేడు వైకుంఠ ద్వార దర్శనాలపై ఉన్నతస్థాయి సమీక్ష

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో ఈనెల 30 నుంచి జనవరి 8వ తేదీ వరకు పది రోజులపాటు జరగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై సోమవారం తిరుమలలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరుగనుంది. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, హోంమంత్రి అనిత, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగనుంది. భక్తుల భద్రత, దర్శన ఏర్పాట్లపై చర్చించనున్నారు.

95 శాతం పిల్లలకు పల్స్ పోలియో

తిరుపతి (వైద్యవిభాగం), న్యూస్‌టుడే: జిల్లాలో 2,46,974 మంది (95 శాతం) పిల్లలకు మొదటి రోజు పోలియో చుక్కలు వేసినట్లు డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ పేర్కొన్నారు. మిగిలిన 5 శాతం మంది పిల్లలకు ఈ నెల 22, 23వ తేదీల్లో 3,736 బృందాలు ఇంటింటికి వెళ్లి చుక్కలు వేస్తారని తెలిపారు. ముత్యాలరెడ్డిపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. శాప్ ఛైర్మన్ రవి నాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, తెదేపా నాయకులు నరసింహ యాదవ్, శంకరనారాయణ, బాల సుబ్రహ్మణ్యం, డీఎంహెచ్‌వో పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే ఆరణి, చిత్రంలో నేతలు

ఎస్ఐల బదిలీ

తిరుపతి (నేరవిభాగం): పరిపాలన సౌలభ్యం, రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 19 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు శనివారం రాత్రి ఉత్తర్వులిచ్చారు. అలిపిరి ఎస్ఐలు స్వాతి శ్రీకాళహస్తి 1 టౌన్, లోకేష్‌కుమార్‌ను తిరుపతి ఎస్బీకి బదిలీ చేశారు. తిరుచానూరు ఎస్ఐలు జగన్నాథరెడ్డి మహిళా పీఎస్‌కు, సాయినాథ్ చౌదరిని సత్యవేడు పంపారు. తొట్టంబేడులోని వెంకటరమణను తిరుమల టూటౌన్‌కు, శ్రీసిటీ ఎస్ఐ తరుణ్‌ను పాకాలకు, డీసీఆర్‌బీ ఎస్ఐ తలారి ఓబయ్యను కేవీబీపురానికి, శ్రీకాళహస్తి టూటౌన్ ఎస్ఐ పార్థసారథిని డీసీఆర్‌బీకి, తిరుపతి పడమర పీఎస్ ఎస్ఐ అనిల్‌కుమార్ తిరుపతి ఎస్బీకి, సత్యవేడు ఎస్ఐ రామస్వామి తిరుపతి తూర్పు పీఎస్‌కు, శ్రీకాళహస్తి 1 టౌన్ ఎస్ఐ అరుణను తిరుచానూరు బదిలీ చేశారు. తిరుపతి ఎస్పీ వీఆర్‌లో ఉన్న నాగరాజు ట్రాఫిక్ పీఎస్‌కు, నరేష్ తిరుమల సీసీఎస్‌కు, రవిప్రకాష్‌రెడ్డి చంద్రగిరి యూపీఎస్‌కు, నాగార్జున రెడ్డి సీసీఎస్ తిరుపతికి, బలరామయ్య తిరుమల ట్రాఫిక్ పీఎస్‌కు, మహబూబ్ బాషా తిరుపతి ట్రాఫిక్ పీఎస్‌కు, రవిప్రకాష్ ఏర్పేడుకు, సంజీవరాయుడును తిరుమల ట్రాఫిక్‌కు బదిలీ చేశారు.

రాయలపురంలో రంకెలేసిన గిత్తలు

చంద్రగిరి, న్యూస్‌టుడే: రాయలపురం గ్రామంలో ఆదివారం పశువుల పరస ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి పరిసర గ్రామాల ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కోడె గిత్తలు, ఎద్దులను వాహనాల్లో తీసుకొచ్చి జన సమూహంలో పరుగులెత్తించారు. పలకలను పట్టుకోవడానికి యువత పోటీ పడ్డారు. కొందరు కింద పడి గాయపడ్డారు. నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

జనంలో పరుగు తీస్తున్న ఎద్దు

ముక్కంటి చెంత కొండంత జనం

రాహు, కేతు ఆర్జిత సేవా కౌంటర్ల వద్ద బారులు తీరిన భక్తులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: వాయులింగ క్షేత్రమైన శ్రీకాళహస్తి ఆదివారం భక్తజన సంద్రంగా మారింది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఉదయం నుంచి క్యూలైన్లు నిండిపోయాయి. తిరుమలేశుని దర్శనార్థం వచ్చిన భక్తులు ఇక్కడికి రావడంతో రద్దీ నెలకొంది. రాత్రి ఆలయం మూత వేసే సమయానికి దాదాపు 27 వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

పాఠశాల వద్ద వైకాపా ఫ్లెక్సీ

చిల్లకూరు, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదినాన్ని పురస్కరించుకుని వైకాపా కార్యకర్తలు ఆదివారం ఎక్కడపడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. చింతవరం ఉన్నత పాఠశాల గేటు ముందు ఫ్లెక్సీని ఏర్పాటు చేయడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఎంఈవో మహ్మద్ రవూఫ్ వద్ద ప్రస్తావించగా పాఠశాల దగ్గర ఏర్పాటు చేయడానికి వీల్లేదన్నారు. సంబంధిత ప్రధానోపాధ్యాయుడికి చెప్పి తొలగిస్తామని బదులిచ్చారు.

శ్రీవారి భక్తుల భద్రతకు ప్రాధాన్యం

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల భద్రతా చర్యల్లో భాగంగా జిల్లా పోలీసు యంత్రాంగానికి 20 బ్రీత్ అనలైజర్లు అందించినట్లు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ చెప్పారు. తిరుపతిలోని దేవస్థానం పరిపాలన భవనంలో ఆదివారం ఉదయం ఈవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ సుబ్బారాయుడు, తితిదే సీవీఎస్‌వో మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈవో మాట్లాడుతూ ఘాట్‌రోడ్లలో ప్రమాదాల నివారణ, వాహనాల భద్రతకు తితిదే చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సుమారు రూ.8 లక్షల విలువైన 20 బ్రీత్ ఎనలైజర్లు ఎస్పీకి అందించినట్లు చెప్పారు. 4 తిరుమలకు, 4 అలిపిరి తనిఖీ కేంద్రం, తిరుపతిలో పోలీస్ శాఖ 12 పరికరాలను వినియోగిస్తుందని తెలిపారు.

పరికరాలతో తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్‌వో మురళీకృష్ణ తదితరులు

వాట్సప్ సందేశాలపై స్పందించొద్దు: ఎస్పీ

తిరుపతి (నేరవిభాగం): వాట్సప్‌నకు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, ఫొటోలపై స్పందించవద్దని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. నకిలీ లింకును క్లిక్ చేస్తే ఫోన్ హ్యాక్ చేసి వ్యక్తిగత సమాచారాన్ని నియంత్రణలోకి తీసుకుంటారని పేర్కొన్నారు. బాధితుడి పేరుతో ఇతరులకు సందేశాలు పంపి డబ్బు డిమాండ్ చేస్తారని గుర్తు చేశారు. ఫోన్ హ్యాక్ అయినట్లు అనుమానం వచ్చిన వెంటనే సైబర్ పోలీసులను సంప్రదించాలని సూచించారు.

తిరుమలలో దివ్యౌషధ వనం



ఉద్యానవనంలో పెంచుతున్న ఔషధ మొక్కలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని జీఎన్‌సీ టోల్‌గేట్‌కు సమీపంలో 3.5 ఎకరాల్లో దివ్యౌషధ వనాన్ని ఏర్పాటు చేసేందుకు తితిదే నిర్ణయించింది. దాదాపు రూ.4.25 కోట్ల అంచనాలతో ఏర్పాటు చేయనున్న ఈ వనంలో దాదాపు 1500లకుపైగా ఆయుర్వేద, వారసత్వ జీవారణ మొక్కలను పెంచనున్నారు. వనంలోకి ప్రవేశించిన భక్తుడికి ఔషధ మొక్కలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేలా రూపొందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా భక్తుల ప్రవేశం, నిష్క్రమణ, పార్కింగ్ ప్రదేశాలను, అవగాహన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు.

ప్రత్యేక థీమ్ పార్కులా ఏర్పాటు

ఈ వనంలో ప్రధానంగా ఆయుర్వేదంలో వైద్యానికి ఉపయోగించే మొక్కలతో దేహచికిత్స వనం, సుగంధ పరిమళాలు వెదజల్లే మొక్కలతో సుగంధవనం, పూజలకు ఉపయోగించే మొక్కలతో పవిత్ర వనం, ప్రసాదాల తయారీకి ఉపయోగించే మొక్కలతో ప్రసాద వనం, పూజలకు ఉపయోగించే మొక్కలతో పూజా దివ్యవనం, పరిమళాలు వెదజల్లే మొక్కలతో సువాసన వనాన్ని ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకమైన థీమ్‌లో భాగంగా ఔషధవనం, జీవరాశివనం, కల్పవృక్షదామం, ఔషధి కుండం, పవిత్ర వృక్షాలు, హెర్బల్ టీమీ పెవిలియన్‌ను, మూలికా వనం, రుతు వనం, మాసాల మొక్కల వనం, అరుదైన వృక్షాల వనాన్ని ఏర్పాటు చేస్తారు. స్టేట్ ఆఫ్ ఆర్ట్‌తో ఈ వనం ఏర్పాటు చేయనున్నారు.

త్వరలోనే పనులు

సీఎం చంద్రబాబు సూచనలతో ఈ వనాన్ని ఏర్పాటు చేస్తున్నాం. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. 2026లో భక్తులకు అందుబాటులోకి తెస్తాం. **- బీఆర్ నాయుడు, తితిదే ఛైర్మన్**

బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తా: పనబాక లక్ష్మి

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: తెలుగుదేశం పార్టీ తనపై ఎంతో నమ్మకంతో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షురాలిగా నియమించిందని, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తానని తితిదే పాలకమండలి సభ్యురాలు పనబాక లక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె తిరుపతిలో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి లోక్‌సభ స్థానం పరిధిలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, పార్టీ శ్రేణుల సహకారంతో కష్టపడి పనిచేస్తానన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేయొద్దు'

తిరుపతి(గాంధీ రోడ్డు), న్యూస్‌టుడే: భారత ఎన్నికల ప్రక్రియ అపహాస్యం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని భాజపా జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ పేర్కొన్నారు. లోక్‌సభలో ఎన్నికల సంస్కరణపై ఆదివారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రసంగాన్ని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతోపాటు కూటమి నాయకులు వీక్షించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో సామంచి శ్రీనివాస మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణపై కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని కేంద్రమంత్రి అమిత్ షా వాస్తవాలతో తిప్పికొట్టారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ యాదవ్, పసుపులేటి హరిప్రసాద్, చంద్రారెడ్డి, జల్లి మధుసూదన్, పుష్పలత, నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము, శ్రీకాళహస్తి - తిరుపతి జిల్లా.

బహిరంగ వేలము ప్రకటన

ఆర్.సి.నెం.REV59-సి1/4/2024, తేది: 20.12.2025

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం హక్కు భుక్తములలో గల ఈ క్రింది తెల్పిన గ్రామాలలో ఉన్న దేవస్థానం భూములను (3) సంవత్సరముల కాలమునకు సాగు చేసుకొనుటకు బహిరంగ వేలము నిర్వహించుట. ఆసక్తి గల రైతులు డిపాజిట్ చెల్లించి బహిరంగ వేలములో పాల్గొనవచ్చును.

తిరుపతి జిల్లా

వ.సం.	గ్రామం పేరు	విస్తీర్ణం	ధరావత్తు డిపాజిట్	తేది & సమయము
1	బోడిరెడ్డి కండ్రిగ (మహాదేవపురం)	ఎ 1.05 సెం	రూ. 2000/-	తేది:29.12.2025, ఉ:11.00 గం.లకు
2	పాతగుంట	ఎ 3.72 సెం	రూ. 5000/-	తేది:29.12.2025, మధ్యాహ్నం:3.00 గం.లకు
3	కాపుగున్నేరు గ్రామము	ఎ 2.29 సెం ఎ 0.96 సెం ఎ 0.49 సెం	రూ. 5000/- రూ. 2000/- రూ. 1000/-	తేది:30.12.2025, ఉ:11.00 గం.లకు
4	శ్రీకాళహస్తి	ఎ3.32 c (కైలాస పర్వతములలో ఒక భాగమైన)	రూ. 10,000/-	తేది:30.12.2025, మధ్యాహ్నం:3.00 గం.లకు

ఇతర వివరముల కొరకై సెల్ నెం: 70130 14433, 99126 52553, 98664 56141, 99660 13456 ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

సం/- టి.బాపి రెడ్డి, కార్యనిర్వహణాధికారి

లారీని ఢీకొన్న కోళ్ల వ్యాను: లారీ డ్రైవర్ మృతి

పాకాల, న్యూస్‌టుడే: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై మండలంలోని తోటపల్లి వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. రాజస్థాన్ రాష్ట్ర దుల్పూరి సమీపంలోని చందూళికి చెందిన అసుద్దీన్(55) రోడ్డు పక్కనే తన లారీని ఆపి టైర్లలో గాలిని పరిశీలిస్తుండగా తిరుపతి నుంచి చిత్తూరుకు వెళ్తున్న కోళ్ల వ్యాను వెనుక నుంచి వచ్చి బలంగా ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అసుద్దీన్‌ను ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. పాకాల సీఐ సుదర్శనప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టగొడుగుల పెంపకంతో మహిళలకు ఉపాధి

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: పుట్టగొడుగుల పెంపకంతో మహిళకు ఉపాధితో పాటు ఆశాజనకంగా ఆదాయం పొందవచ్చని ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వి.చౌదరి అన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్, జేసీఐ, పద్మావతి మహిళా సంఘం సంయుక్త సహకారంతో సంచిత ప్రాజెక్టు పేరుతో శెట్టిపల్లి వద్ద శబరి మహిళా వృద్ధాశ్రమంలో మహిళా సభ్యులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. పుట్టగొడుగుల పెంపకాన్ని మహిళలు వారి ఇళ్ల వద్దే కుటీర పరిశ్రమగా పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టవచ్చని ఆయన సూచించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ స్టేట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రజిత రెడ్డి మాట్లాడుతూ తాము ఆయిస్టర్ రకం పుట్టగొడుగుల గురించి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. 21 రోజులు పాటు మహిళలకు శిక్షణ అందిస్తామని, తర్వాత పుట్టగొడుగులు పెంపకం, వ్యాపారంలో మెలకువలు నేర్పనున్నట్లు వివరించారు. తిరుపతితో పాటు రాయలసీమ జిల్లాలో మహిళా సభ్యులకు పుట్టగొడుగులు పెంపకంపై శిక్షణ ఇస్తామని వెల్లడించారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.రవీంద్రారెడ్డి, జేసీఐ, తిరుపతి అధ్యక్షురాలు మునిలక్ష్మి పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన మహిళలు

EENADU Classifieds

EDUCATION

LAST CHANCE : 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, B.Tech, MA, M.Com, M.Sc, MBA, MCA. Regular/ Lateral Entry. ✆ 9381287629.

HEALTH & CARE

PAEDIATRIC

శ్రీవిష్ణు చిన్నపిల్లల హాస్పిటల్: డా॥ కె.కీర్తన (M.D., Pediatrics, SVMC & Ex. Senior Resident RUIA, Fellow in Neonatology) పుట్టిన బిడ్డలు & చిన్నపిల్లల వైద్యనిపుణులు, 24X7 ఎమర్జెన్సీ కేసులు చూడబడును. మనోహరి హాస్పిటల్ ప్రక్కన, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి ✆ 63035 53359.

MARRIAGE SERVICES

Reddy Boy, B.Tech (M) 7.2 LPA, 32 Yrs, Bharani, Wheatish, Employed in Chennai, Propertied wants Graduate Girl of Non-IT, Unemployed, Middle Class, Telugu Speaking Reddy/ Naidu (Second Marriage with Genuine Background is Acceptable). Ct- BCB. Reddy. ✆ 9444391787.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

చంద్రగిరి-తిరుపతిలో అంతర్భాగంగా గ్రేటర్ తిరుపతిలో కలవబోతున్న చంద్రగిరి టౌన్‌లో ఒకవైపు కాలేజ్ మరోకవైపు అమ్మవారి టెంపుల్‌కి దగ్గరలో 100 అడుగుల రోడ్డుకు TUDA అప్రూవల్స్ లే అవుట్ నందు వెంటనే హౌస్, అపార్ట్‌మెంట్ కట్టుకునే PLOTS అమ్మబడును. 9505502346.

JOBS

GRID PLUS Solar Energy Wanted Sales Executives @ Tirupati. Exp. 1-2 Years, Edu: Degree/ Diploma/ Inter. Cont: 96663 66205.

Urgent Requirement For Facility Management Company House Keeping Staff, Guest Room Attendants, Kitchen Stewarding Staff Vacancy In Star Hotel in Tirupati, Fresher/ Experience Attractive Salary Includes ESI, PF, Insurance, Food & Accommodation Provided. 9092665040, 8056799288.

USAలో 2y బాబును చూసుకోవడానికి వీసా కల్గిన ఆడ కేర్‌టేకర్ కావలెను. జీతం + భోజనం + ఉచిత వసతి. ✆ 92469 98571, 92469 99571.

HYD యూనిట్ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

ప్రముఖ కంపెనీలో టీం లీడర్స్‌గా చిత్తూరు, తిరుపతి, మదనపల్లి ఏరియాలలో P/F పనిచేయుటకు M/F కావలెను. Q: డిగ్రీ, MBA, MCA. ✆94403 51657.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే
అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు
వివరాలకు... 80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800
ప్రకటనలపై 5% GST వర్తించును

డాక్‌యార్డుకి జాతీయ నాణ్యతా పురస్కారం

జాతీయ నాణ్యతా పురస్కారంతో విశాఖ నేవల్ డాక్‌యార్డు ఉద్యోగులు

సింధియా, న్యూస్‌టుడే: ఈస్టర్న్ నేవల్ కమాండ్‌కు చెందిన విశాఖపట్నం నేవల్ డాక్‌యార్డుకు జాతీయ నాణ్యతా పురస్కారం లభించింది. నోయిడాలో ఈనెల 19 నుంచి 21 వరకు 39వ నేషనల్ క్వాలిటీ అవార్డ్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 2వేల టీమ్‌ల నుంచి 10 వేల మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. నేవల్ డాక్‌యార్డు నుంచి 16 టీమ్‌లు పాల్గొని ఉత్తమ ప్రదర్శన జరిపి రెండు ఉత్తమ అవార్డులను దక్కించుకున్నాయి.

'ఛాంపియన్' తారలు.. తళుక్కు!

ఛాంపియన్ సినిమా ప్రచార కార్యక్రమంలో ఆదివారం బీచ్‌రోడ్డు గోకుల్ పార్కు తీరంలో మ్యూజికల్ నైట్ వేడుకలు నిర్వహించారు. హీరో రోషన్, హీరోయిన్ అనస్వర రాజన్ తళుక్కుమని మెరిశారు. గిరగిర గింగిరాగిరే.. తదితర పాటలకు నృత్యాలు చేసి అభిమానులను అలరించారు. –న్యూస్‌టుడే, పెదవాల్తేరు

చివరికి మిగిలింది 292 ఎకరాలు..!

★ ఎర్రమట్టి దిబ్బల ప్రస్తుత విస్తీర్ణం ఇది
★ సంరక్షించకపోతే చరిత్రగా మిగిలే అవకాశం



నేర్లవలస గ్రామంలో విస్తరించిన ఎర్రమట్టి దిబ్బలు

గ్రామీణ భీమిలి, న్యూస్‌టుడే: భీమునిపట్నం మండలం నేర్లవలస గ్రామంలోని ఎర్రమట్టి దిబ్బలు ప్రపంచంలోనే అరుదైన వారసత్వ సంపదగా పేరొందాయి. ఒకప్పుడు 1185 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఇవి ప్రస్తుతం 292 ఎకరాల్లో మాత్రమే ఉండటం పర్యావరణవేత్తలను కలవరపరుస్తోంది. చారిత్రక, పరిశోధన ఆధారాలను బట్టి వేలాది ఏళ్ల పాటు సంభవించిన వాతావరణ మార్పులు, సముద్ర మట్టం హెచ్చుతగ్గులు, కోత, నిక్షేపణ ప్రక్రియల కారణంగా ఎర్రమట్టి దిబ్బలు ఏర్పడినట్లు భూ విజ్ఞాన శాస్త్రవేత్తలు తేల్చారు.

అరుదైన అంతర్జాతీయ వారసత్వం: భీమిలి బీచ్‌రోడ్డు నుంచి జేవీ అగ్రహారం వరకూ నాలుగు కిలోమీటర్ల పొడవు, రెండు కిలోమీటర్ల వెడల్పుతో దాదాపు 432 ఎకరాల్లో ఎర్రదిబ్బలు విస్తరించి ఉన్నాయి. ఇందులో 292 ఎకరాలను మాత్రమే కేంద్ర జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా అరుదైన జాతీయ వారసత్వ సంపదగా గుర్తించింది. కొద్దినెలల కిందట యునెస్కో కూడా దీన్ని అంతర్జాతీయ వారసత్వ సంపదగా ప్రకటించింది.

కేటాయింపులు ఇలా..

★ బిల్డింగ్ సొసైటీకి ఇచ్చిన భూముల్లో 98 ఎకరాలు, ఐఎన్ఎస్ కళింగకు కేటాయించిన దాంట్లో దాదాపు 57 ఎకరాలను ఎర్రమట్టి దిబ్బలకు విడిచిపెట్టారు.

మొత్తం విస్తీర్ణం: 1185.65 ఎకరాలు

భీమిలి బిల్డింగ్ సొసైటీకి:	ఐఎన్ఎస్ కళింగ (నేవీ)కి:	రైతులకు డి. పట్టాలు:
373.95 ఎకరాలు	655 ఎకరాలు	19 ఎకరాలు

ఉన్నదాంట్లో సగం అన్యాక్రాంతం: ఒకప్పుడు 1185 ఎకరాలకు పైగా ఉన్న ఎర్రమట్టి దిబ్బలు ఆఖరికి 292 ఎకరాలు మిగిలాయి. అయితే ఇందులో కూడా సగం వరకు అన్యాక్రాంతం కావడం ఆందోళన కలిగిస్తోంది. జేవీ అగ్రహారం వైపు 2018లో రూ.24 లక్షలు వెచ్చించి 40 అడుగుల వ్యూపాయింట్‌ను వీఎంఆర్‌డీఏ ఏర్పాటు చేసింది. మరో రూ.10 లక్షలతో బీచ్‌వైపు తాటి దుంగలతో ఏర్పాటు చేసిన వ్యూపాయింట్ శిథిలం కావడంతో తొలగించారు.

దిబ్బల ఎత్తు: కొన్ని చోట్ల 20 మీటర్లు, మరికొన్ని చోట్ల 60 నుంచి 100 మీటర్లు.

తగ్గిపోతున్న ఎత్తు: ఎర్రదిబ్బలను సరైన విధంగా సంరక్షించకపోవడంతో బీచ్‌వైపు క్రమంగా ఎత్తు తగ్గుతున్నాయి. చాలా ప్రాంతాలు మైదానాలుగా మారాయి. ఈ నేపథ్యంలో హైకోర్టు వీటి సరిహద్దులు గుర్తించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ ఇటీవల వివిధ ప్రాంతాల్లో పరిశీలించి వెళ్లింది. అరుదైన ఎర్రమట్టి దిబ్బలను పరిరక్షించుకోకుంటే భవిష్యత్తులో చరిత్రగా మిగిలే అవకాశం ఉందని భూవిజ్ఞాన శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

చెలరేగి ఆడుతున్న జెమీమా రోడ్రిగ్స్

మ్యాచ్‌ను తిలకిస్తున్న అభిమానులు

అచ్చొచ్చిన చోట.. ధనాధన్ ఆట..!

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: భారత మహిళల క్రికెట్ జట్టు అదరగొట్టింది. అచ్చొచ్చిన విశాఖ మైదానంలో తిరుగులేదని మరో మారు నిరూపించింది. ఆదివారం రాత్రి పీఎంపాలెం ఏసీఏ-వీడీసీఏ అంతర్జాతీయ స్టేడియంలో భారత్, శ్రీలంక మధ్య జరిగిన తొలి టీ-20 మ్యాచ్ అభిమానులను ఉర్రూతలూగించింది. జెమీమా రోడ్రిగ్స్ చెలరేగడంతో మరో ఐదు ఓవర్లు ఉండగానే భారత్ విజయదుందుభి మోగించింది.

★ జెమీమా రోడ్రిగ్స్ 69 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. అందులో 10 ఫోర్లు ఉన్నాయి. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన చెప్పుకోదగ్గ స్కోరు చేయకపోవడం అభిమానులను నిరాశపర్చింది.

షాట్ కొడుతున్న స్మృతి మంధాన

★ మ్యాచ్‌ను తిలకించేందుకు 7,500 మంది అభిమానులు స్టేడియానికి తరలివచ్చారు. భారత బౌలర్లు క్రాంతి గౌడ్, దీప్తిశర్మ, శ్రీచరణి వికెట్లు తీసుకున్నప్పుడు అభిమానులు కేరింతలు కొడుతూ వారిని ఉత్సాహపరిచారు. భారత బౌలర్ శ్రీచరణి బౌలింగ్‌లో శ్రీలంక బ్యాటర్ విష్మి గుణరత్నే భారీ సిక్సర్ కొట్టింది. 17.4 మీటర్ల ఎత్తులో వెళ్లిన ఆ బంతిని పట్టుకోవడంలో స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన విఫలమైంది. శ్రీలంక జట్టులో బ్యాటర్ విష్మి గుణరత్నే అత్యధికంగా 39 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాటర్లు అంతా కలిసి 9 బౌండరీలు, 1 సిక్సర్ కొట్టారు. భారత జట్టు క్రీడాకారిణులు ఐదు క్యాచ్‌లు వదిలేయడం గమనార్హం.

★ భారత బౌలర్లలో వైష్ణవి శర్మ పొదుపుగా బౌలింగ్ చేసింది. నాలుగు ఓవర్లు వేసి కేవలం 16 పరుగులు మాత్రమే ఇచ్చింది.

శ్రీలంక బ్యాటరు కవీసా దిల్హారిని రనౌట్ చేస్తున్న కీపర్ రిచా ఘోష్

సేవలు... సీనియార్టీకి పెద్దపీట...!

తెదేపా విశాఖ లోక్‌సభ నియోజకవర్గ అధ్యక్షుడిగా పట్టాభిరామ్

ప్రధాన కార్యదర్శిగా లొడగల కృష్ణ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా కమిటీ పదవుల్లో సేవలు, సీనియార్టీకి పెద్దపీట వేశారు. దీర్ఘకాలం నుంచి సేవలందిస్తున్న ఇద్దరు నాయకులకు కీలకమైన పదవులు దక్కాయి. [illegible] బోడె వెంకట పట్టాభిరామ్ (బీసీ), లొడగల కృష్ణ (ఓసీ)ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ప్రకటన విడుదల చేసింది. [illegible]

బోడె వెంకట పట్టాభిరామ్: [illegible] ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన ఆయన 1983 నుంచి పార్టీకి సేవలందిస్తున్నారు. వార్డు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2007 కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. అనంతరం పార్టీ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శిగా, విశాఖపట్నం లోకల్ ఏరియా తితిదే సలహా మండలి ఛైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

లొడగల కృష్ణ: ఐదు పర్యాయాలు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడిగా పని చేశారు. ప్రస్తుతం తెదేపా రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. [illegible] 25ఏళ్ల నుంచి పార్టీలో కొనసాగుతున్నారు.

★ పార్టీని మరింత బలోపేతం చేసి రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పట్టాభిరామ్, కృష్ణ తెలిపారు.

అధిక ధరలు.. అరకొర సౌకర్యాలు..!

పర్యాటక ప్రాంతాలపై సందర్శకుల ఫిర్యాదు

గాజు వంతెన వద్ద సందర్శకుల సందడి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: సెలవు దినాల్లో నగరంలోని పర్యాటక ప్రదేశాలు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. ఆదివారం కైలాసగిరికి పర్యాటకులు పోటెత్తారు. గాజు వంతెనను 2,228 మంది, స్కై సైక్లింగ్, జిప్‌లైనర్‌ను 825 మంది, అద్దాల రైలును 1582 మంది, రోప్‌వేను 1887 మంది ఎక్కారని వీఎంఆర్డీఏ అధికారులు తెలిపారు. అయితే ఇక్కడి సౌకర్యాల తీరుపై పలువురు అధికారులకు ఫిర్యాదులు చేశారు. బ్యాటరీ కార్లు తక్కువగా ఉన్నాయని, మంచినీరు, మరుగుదొడ్లు, సేద తీరేందుకు షెడ్లు తక్కువగా ఉన్నాయని తెలిపారు. రెస్టారెంట్లు, ఐస్‌క్రీం సెంటర్లు, న్యూడిల్స్ దుకాణాల నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. పర్యాటక ప్రదేశానికి వస్తే దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. అధికారులు కలుగజేసుకుని పర్యాటక కేంద్రాల్లో వ్యాపారాత్మక ధోరణి తగ్గించి, ప్రకృతి అందాలు వీక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆల్ రొయ్య.. అ'ధర'హో!

రుషికొండ తీరంలో ఆదివారం మత్స్యకారులకు పొడవాటి మీసాలు ఉన్న ఆల్ రొయ్యలు చిక్కాయి. సముద్రంలోని రాళ్ల వద్ద మనుగడ సాగించే ఇవి ఆహార అన్వేషణలో భాగంగా బయటకు వచ్చే క్రమంలో వలకు చిక్కుతాయి. రుచికరమైన ఈ రొయ్యలు కిలో రూ.1200 నుంచి 1600 వరకు ధర పలుకుతాయని జాలర్లు తెలిపారు. వీటిని విశాఖ చేపలరేవు నుంచి తమిళనాడు, కర్ణాటక, కేరళ, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారన్నారు. అధిక సంఖ్యలో ఈ రొయ్యలు లభ్యం కావడంపై మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. –న్యూస్‌టుడే, సాగర్‌నగర్

వహ్వా.. వియత్నాం రుచులు..!

డిన్నర్ క్లబ్ పేరిట నగరవాసులకు పరిచయం

సామాజిక మాధ్యమాల ద్వారా ఆహ్వానం

ఈనాడు, విశాఖపట్నం: నగరవాసులకు వియత్నాం రుచులు పరిచయం చేస్తున్నారు పలువురు యువత. తక్కువ మందితో డైనింగ్ టేబుల్ ఏర్పాటు చేసి స్వయంగా వడ్డిస్తున్నారు. ఇందుకోసం ఫేస్‌బుక్, ఇన్‌స్టా వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఆహ్వానం పలుకుతున్నారు. దీనికి యువత ఫిదా అవుతోంది. ఎంవీపీ, పాండురంగాపురం, మధురవాడ ప్రాంతాల్లో వీటిని నిర్వహిస్తున్నారు. విదేశాల్లో చదివి విశాఖ తిరిగొచ్చిన కొందరు యువత వీటిని ఏర్పాటు చేయడం విశేషం.

వియత్నాం ఆహారం

నైపుణ్యాల వేదికగా..: కేవలం విదేశీ రుచులు పరిచయం చేయడం వరకే నిర్వాహకులు పరిమితం కాలేదు. యువతను ఆకట్టుకోవడానికి కొత్తగా ప్రయత్నిస్తున్నారు. భోజనం చేయడానికి ముందు 15నిమిషాల వరకు వియత్నాం దేశంలో వంటలు ఎలా ఉంటాయి.. అక్కడి ప్రజల ఆహారపు అలవాట్లు.. తదితరాలు వివరిస్తారు. వచ్చిన వారు తమలోని వివిధ నైపుణ్యాలను తెలియజేస్తారు. వాటిని అక్కడి గోడలపై అంటిస్తారు. ఎవరైనా వాటిని నేర్చుకోవాలనుకుంటే వారిని సంప్రదించే ఏర్పాట్లు చేశారు.

మెనూ అదుర్స్..

వియత్నాం ఆహారంలో ఐస్‌టీ రుచే వేరు. నిమ్మరసం, గ్రీన్ టీ, తేనెను ఐస్‌తో కలిపి దీన్ని తయారు చేస్తున్నారు. ఇందులో తినేందుకు వడియాల్లా వేయించిన రొయ్యలు ఇస్తున్నారు.

రుచులు ఆస్వాదిస్తున్న యువత

★ స్టార్టర్స్‌గా రొయ్యలను రోల్ చేసి అందులో అన్నం, వెనిగర్ కలిపిన కాయగూర ముక్కలు ఇస్తున్నారు. అలాగే బాన్మీ అనే రొట్టెలో వేయించిన చికెన్ వేసి వడ్డిస్తున్నారు.

★ కోల్డ్ న్యూడిల్స్‌లో చికెన్ కర్రీ వడ్డిస్తున్నారు. వెళ్లేటప్పుడు గిఫ్టులు ఇస్తున్నారు.

ఏడాదిన్నరపాటు కసరత్తు: నేను ఫ్రాన్స్‌లో చదువుకున్నా. ఆ సమయంలో అక్కడ రెస్టారెంట్ బిజినెస్‌పై అధ్యయనం చేశా. వియత్నాం ఆహారపు రుచులు భిన్నంగా అనిపించాయి. విశాఖ వచ్చాక ఏదైనా వినూత్నంగా చేయాలనిపించింది. వియత్నాం రుచులు నగరవాసులకు పంచితే ఎలా ఉంటుందని ఆలోచన చేశా. దీన్ని ఆచరణలోకి తీసుకురావడానికి ఏడాదిన్నరపాటు కసరత్తు చేశా. ఇందుకోసం డిన్నర్ క్లబ్ ఏర్పాటు చేసి నెలలో రెండు, మూడు సార్లు వంటలు చేసి పెడుతున్నా. దీనికి మంచి స్పందన వచ్చింది. విదేశీ రుచులే కాకుండా కొత్త వంటకాలను పరిచయం చేయాలనుకుంటున్నాం. భవిష్యత్తులో లాంగ్ టేబుల్ సొసైటీ ఏర్పాటు చేయాలనుకుంటున్నా.

– ఒనిమి హైందవి, నిర్వాహకురాలు

నేడు పీజీఆర్ఎస్

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను ఈనెల 22న సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. ముస్సోరిలో జరిగిన శిక్షణకు హాజరైన జేసీ మయూర్ అశోక్ ఆదివారం విశాఖ చేరుకున్నారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అమరావతి వెళ్లారు. 24న ఆయన తిరిగి విశాఖ రానున్నారు.

బొంబేడయింగ్ since 1879
పండుగ ఆఫర్స్
కింగ్‌సైజ్ MRP. 2899
క్వీన్‌సైజ్ MRP. 2699
సింగిల్ కాట్ MRP. 1499
బెడ్‌షీట్ సెట్స్‌పై
60% డిస్కౌంట్
Raymond | TRIDENT
200 T.C. డబుల్‌కాట్ MRP. 2999
3 సెట్స్ కేవలం రు.3300 లకే
2 ప్యాంట్సు కొనండి
1 ప్యాంటు ఉచితం
మానస ద్వారకానగర్ ✆ 2710471
మానస జగదాంబజంక్షన్ ✆ 2569343
మానస అశీల్‌మెట్ట ✆ 2565646

అదును చూసి.. భూమాయ చేసి..!

'ఫ్రీహోల్డ్'లో కొట్టేసిన నాయకులు

అక్రమాలపై కొలిక్కిరాని విచారణ

ఆనందపురంలో ఫ్రీహోల్డ్ చేసిన భూములు

ఈనాడు, విశాఖపట్నం, వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఫ్రీహోల్డ్‌గా మార్చిన భూముల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ ఇంకా ఒక కొలిక్కి రాలేదు.

★ విశాఖలో భూముల విలువ పెరగడంతో ఎలాగైనా అసైన్డ్ భూములను కొట్టేయాలని గత ప్రభుత్వంలో వైకాపా నాయకులు పన్నాగం పన్నారు. ఫ్రీహోల్డ్ ప్రకటన రాగానే జలవనరులు, ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులకు కేటాయించిన భూములను అందులోకి మార్చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటన్నింటిపై విచారణ చేపట్టింది. అయితే ఇప్పటికీ అక్రమార్కులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

చోటు చేసుకున్న అక్రమాలు ఇలా..: ఆనందపురం మండలం రామవరంలో 20ఏళ్ల కిందట ఓ రైతుకు మేకల పెంపకం పేరుతో ఇచ్చిన 8 ఎకరాలపై కన్నేసిన అప్పటి వైకాపా నేత అధికారులపై ఒత్తిడి తెచ్చి ఫ్రీహోల్డ్‌లోకి మార్చేశారు. అనంతరం ఆ భూములు చేతులు మారిపోయాయి. ★ పాలవలసలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 45 సెంట్ల స్థలాన్ని, గాజువాకలో చేపల పెంపకానికి ఓ వ్యక్తికి కేటాయించిన భూములను కొట్టేయాలని ఫ్రీహోల్డ్‌లోకి చేర్చారు. ఆనందపురం మండలం గంభీరం, గిడిజాల, ఇతర గ్రామాల్లో చెరువులు, వాగులు తదితర జలవనరులనూ ఫ్రీహోల్డ్‌లోకి చేర్చారు. అప్పట్లో నీరు ఎండిపోయాక వాటిని చదును చేసి స్వరూపాలు మార్చేశారు.

మండలం	అసైన్డ్ భూములు	ఫ్రీహోల్డు చేసినవి (ఎకరాల్లో)
ఆనందపురం	3050.19	407.77
భీమిలి	1417.33	52.51
పద్మనాభం	1591.56	145.74
పెందుర్తి	1144.67	20.38

ఆనందపురం మండలంలోనే అత్యధికం: జిల్లా వ్యాప్తంగా 626 ఎకరాలను ఫ్రీహోల్డు చేయగా అందులో ఒక్క ఆనందపురం మండలంలోనే 407 ఎకరాలు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వంలో చక్రం తిప్పిన కొందరు నాయకులు రైతుల నుంచి తక్కువ ధరకు ఆయా భూములు కొనుగోలు చేశారు. వాటిల్లో అత్యధికం మధ్యవర్తుల పేర్లతో రిజిస్ట్రేషన్ అయిపోయాయి. ★ గాజువాక, పెదగంట్యాడ, విశాఖ గ్రామీణ మండలాల్లోని భూములు జీవీఎంసీ పరిధిలో ఉన్నాయి. వీటి విలువ ఎక్కువగా ఉన్నందున నాటి అధికారులు ఫ్రీహోల్డుకు అవకాశం ఇవ్వలేదు.

మరో 2వేల ఎకరాలు సిద్ధం

జిల్లాలోని ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి, పెదగంట్యాడ, గాజువాక, విశాఖ గ్రామీణ మండలాల పరిధిలో 8841.71 ఎకరాల భూములను పేదలకు గతంలో పంపిణీ (అసైన్డ్) చేశారు. వాటిలో 20ఏళ్ల కిందట ఇచ్చిన 626 ఎకరాలను ఫ్రీహోల్డు చేశారు. ఆయా భూముల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. జిల్లాలో ఇంకా ఫ్రీహోల్డు చేయడానికి దాదాపు 2వేల ఎకరాలు సిద్ధంగా ఉన్నాయి.

పల్స్ పోలియో 76.70 శాతం నమోదు

సీతంపేట, న్యూస్‌టుడే: జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం రాత్రి 9 గంటల సమయానికి 76.70 శాతం నమోదైందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 0 నుంచి 5 ఏళ్ల లోపు 2,09,652 మంది పిల్లలు ఉండగా 1,60,895 మందికి పోలియో చుక్కలు వేశారు. మిగిలిన వారిని 22 నుంచి 24వ తేదీ వరకు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వేయనున్నారు.

నమోదు చేస్తే చాలు.. నెలనెలా పోషకాలు..!

గర్భిణులూ మీకోసమే..!

గాజువాక, న్యూస్‌టుడే : గర్భిణులకు నెలనెలా పోషకాహారం అందించడంలో అంగన్‌వాడీ కేంద్రాలు ముందుంటున్నాయి. అయితే ఈ అవకాశం చాలా మంది అందిపుచ్చుకోలేకపోతున్నారు. దీనికి అవగాహన లేమి ప్రధాన కారణం. పీహెచ్‌సీ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు సమాచారమిస్తే అంగన్‌వాడీ కార్యకర్తలు తెలుసుకుని నెలనెలా పోషకాహారం అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. కేవలం నమోదు చేసుకుంటే చాలు గర్భిణులు ప్రసవించినా, మూడేళ్ల వరకూ బిడ్డకు కావాల్సిన పోషకాలు అందిస్తారు. అవేమిటో తెలుసుకుందాం..!

ఎంసీపీ కార్డు ఉండాల్సిందే..: మహిళ గర్భం ధరించినట్లు వైద్యాధికారులు నిర్ధారించాక వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ద్వారా మాతా శిశు సంరక్షణ కార్డు(ఎంసీపీ) జారీ చేస్తారు. రీ ప్రొడక్ట్ అండ్ చైల్డ్ హెల్త్ (ఆర్‌సీహెచ్) ఐడీని బట్టి నెలనెలా పోషకాహారం తీసుకెళ్లడానికి అంగన్‌వాడీలు అవకాశం కల్పిస్తారు. గర్భిణి రికార్డులో చివరగా బహిష్టు అయిన తేదీ(ఎల్ఎంపీ), ఆ తర్వాత అంచనా ప్రకారం ప్రసవ తేదీ(ఈడీడీ) నమోదు చేస్తారు.

పోషకాహారం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

ఏమేమి ఇస్తారంటే..

గర్భిణులకు: 3 కిలోల బియ్యం, 1కిలో కందిపప్పు, 500గ్రాముల నూనె. దీంతోపాటు అదనపు పోషకాలకోసం 1 కేజీ అటుకులు, రెండు కిలోల రాగి, జొన్నపిండి, పావుకేజీ చెక్కీలు, బెల్లం, ఖర్జూరంతో కూడిన కిట్లు అందిస్తారు. ఇవే కాకుండా 5 లీటర్ల పాలు, 25 గుడ్లు (నెలలో రెండుసార్లు).

బిడ్డ పుట్టాక (బాలింతలకు): మూడేళ్ల వరకూ బాలామృతం, పాలు, కోడిగుడ్లు ఇస్తారు.

★ ప్రతి నెలా 6వ తేదీ లోగా గర్భిణులు పేర్లు నమోదు చేసుకుంటే ఆ మరుసటి నెల నుంచి పోషకాహారం తీసుకెళ్లవచ్చు.

గాలి నాణ్యతపై తనిఖీలు

మాధవధార, న్యూస్‌టుడే: పరిశ్రమల్లో గాలి నాణ్యత సూచీ(ఏక్యూఐ) పరిశీలన కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆదివారం పలు పరిశ్రమల వద్ద తనిఖీలు చేశారు. పోర్టు, కార్గోబెర్త్, మిత్తల్ స్టీల్, రైన్ సీపీఐ కార్బన్ కోక్ స్టోరేజ్, కోరమండల్, హిందుస్థాన్ పెట్రోలియం పరిశ్రమల వద్దనున్న పరిసరాలను పరిశీలించి అక్కడ గాలి నాణ్యతను తనిఖీ చేశారు. ఆయా పరిశ్రమల వద్ద గ్రీన్ టార్పాలిన్లు వేయాలని, నిరంతరం శుభ్రత పాటించాలని, కాలుష్య పరిమితులను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ పి.వి.ముకుందరావుతో పాటు, టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రిస్మస్ ‘కళ’..ఆకట్టుకునేలా..!

ఏర్పాటు చేసిన భారీ క్రిస్మస్ చెట్టు

నగరంలో క్రిస్మస్ సందడి వచ్చేసింది. ఇప్పటికే చర్చిలు ముస్తాబయ్యాయి. పండగ వేళ వినియోగదారులను ఆకర్షించడానికి పలు హోటళ్లు, దుకాణాలను సుందరంగా అలంకరిస్తున్నారు. ప్రాంగణాల్లో భారీ క్రిస్మస్ చెట్లను ఏర్పాటు చేశారు. శాంతాక్లాజ్ బొమ్మలు, క్రిస్మస్ ఇళ్లను తీర్చిద్దారు. ఈ అలంకరణలు చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. – ఈనాడు, విశాఖపట్నం

హోటల్ ఆవరణలో ఆకట్టుకునేలా అలంకరణ

నేటి నుంచి ‘ఈనాడు’ క్రికెట్ పోటీలు

■ ఈఎస్ఎల్ ట్రోఫీలో సత్తా చాటేందుకు సిద్ధమైన యువ క్రికెటర్లు

■ ముస్తాబైన ఆంధ్రా మెడికల్ కళాశాల మైదానం

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే : ‘ఈనాడు-ఈతరం క్లబ్’ ఆధ్వర్యంలో ‘ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్’ ప్రజెంట్స్ ‘ఈనాడు స్పోర్ట్స్ లీగ్ - 2025’ (ఈఎస్ఎల్) క్రికెట్ పోటీలు నేటి(సోమవారం) నుంచి నగరంలోని ఆంధ్ర మెడికల్ కళాశాల (ఏఎంసీ) మైదానంలో ప్రారంభం కానున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ‘ఈఎస్ఎల్’ వేదికగా నిలుస్తుంది. ఇప్పటికే అతి పెద్ద టోర్నీగా ‘గిన్నిస్ బుక్ రికార్డ్స్’లో చోటు సంపాదించిన మెగా ఈవెంట్‌లో భాగస్వాములయ్యేందుకు యువ క్రికెటర్లు ఉత్సాహంగా ఉన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభ చూపి.. ప్రత్యర్థులపై పైచేయి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. మ్యాచ్‌ల నిర్వహణకు ఏఎంసీ మైదానంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేటి మ్యాచ్‌లు: ఉదయం 9 గంటలకు: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కాలేజ్ ఆఫ్ లా(ఏయూ) × అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(తగరపువలస); ఉదయం 11 గంటలకు: సాంకేతిక విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కాలేజ్(పీఎంపాలెం), × టి.సుబ్బరామిరెడ్డి అండ్ టి.బలరామ కృష్ణ డిగ్రీ కాలేజ్(గాజువాక)

రేపటి మ్యాచ్‌లు (23-12-25) : ఉదయం 8 గంటలకు గీతం కాలేజ్(రుషికొండ) × ఆదిత్య డిగ్రీ కాలేజ్(గోపాలపట్నం), ఉదయం 10 గంటలకు: ఆదర్శ డిగ్రీ కాలేజ్(విశాఖ) × బెహరా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(నరవ); మధ్యాహ్నం 1 గంటకు: విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(దువ్వాడ) × గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ(రుషికొండ)

EENADU SPORTS LEAGUE 2025

Title Sponsor
Dhanik Bharat Educational Institutions
The Lloyd Group Initiative

Protein Partner
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
NECC
(Non-Govt. Public Charitable Trust)
"Sunday ho yah Monday roz khao ande"

Beverage Partner
CMR SHOPPING MALL
The joy of life

Gift Partner
KL (DEEMED TO BE UNIVERSITY)

Regional Sponsor
GGU GODAVARI GLOBAL UNIVERSITY
RAJAMAHENDRAVARAM, A.P.
Call: 974 999 3483 | www.ggu.edu.in

TV Partner
ETV

Digital Partner
ఈనాడు.నెట్ ETV BHARAT

Dolphin Diagnostic Services

District Sponsor
TIRUMALA విద్యాసంస్థలు

Organised by ఈనాడు ఈతరం

సాగర తీరాన.. నగర సంకీర్తన

నగర సంకీర్తన చేస్తున్న నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ సభ్యులు, నగరవాసులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: బీచ్‌రోడ్డు కాళీ మాతా ఆలయ ఆవరణలో ఆదివారం ఉదయం నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ, డ్యాన్స్ ఇండియా మ్యాగ్జైన్ సంయుక్త ఆధ్వర్యంలో నగర నాట్య సంకీర్తన పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందు ఆర్.కె.బీచ్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో సుమారు 200 మంది కళాకారులు పాల్గొన్నారు. నృత్యాలు ప్రదర్శిస్తూ ర్యాలీలో ముందుకుసాగారు. జనవరి 2 నుంచి 4 తేదీ వరకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సంప్రదాయ నృత్య కాంగ్రెస్ జరగనున్న నేపథ్యంలో సన్నాహక కార్యక్రమంగా దీనిని నిర్వహించినట్లు ఐటీడీసీ వ్యవస్థాపక అధ్యక్షులు విక్రమ్‌కుమార్ తెలిపారు. ప్రముఖ కూచిపూడి నృత్యకారుడు పసుమర్తి వెంకటరమణ, నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ కార్యదర్శి కె.వి.లక్ష్మి, ఎస్.ఎం.డి.ఎ అధ్యక్షురాలు అరుణ పరమేష్, కూచిపూడి టీచర్ భానురేఖ పాల్గొన్నారు. కళాకారులకు ధ్రువపత్రాలు అందజేశారు.

‘ఛాంపియన్’ తప్పక అలరిస్తుంది

నృత్యం చేస్తున్న రోషన్, అనస్వర రాజన్

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : మూడేళ్ల విరామం తర్వాత మంచి చిత్రంతో ముందుకు వచ్చానని ఛాంపియన్ సినిమా హీరో రోషన్ అన్నారు. బీచ్‌రోడ్డు గోకుల్‌పార్కు తీరంలో ఆదివారం సాయంత్రం ఛాంపియన్ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా రోషన్ మాట్లాడుతూ.. ఛాంపియన్ తప్పక అలరిస్తుందన్నారు. దర్శకుడు ప్రదీప్ అద్వైతం మాట్లాడుతూ.. 1948 నేపథ్యంలో సాగే యాక్షన్ వార్ డ్రామాగా దీన్ని తీర్చిదిద్దామన్నారు. సినిమా చాలా బాగా వచ్చిందన్నారు. హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ.. ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ మూవీ కాబోతుందన్నారు. కార్యక్రమంలో నిర్మాత జెమిని కిరణ్, నటి ఊహ, చిత్ర బృందం పాల్గొంది.

ఫ్లెక్సీ కాల్చివేతపై వివాదం

గురుద్వారా, న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్ ఫ్లెక్సీ కాల్చివేతపై వివాదం రాజుకుంది. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ ఉమాకాంత్ తెలిపిన వివరాలు ప్రకారం.. అక్కయ్యపాలెం కూడలిలోని ఎడమ వైపు కొద్ది రోజుల క్రితం వంగవీటి రంగా మహాసభ తాలూకా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా వైకాపా అభిమానులు ఇటీవల వాటిపై ఫ్లెక్సీలు పెట్టడంతో కొంతమంది వ్యక్తులు దాన్ని ఆదివారం ఉదయం కాల్చివేశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనకు కారణమైన వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

సమగ్రశిక్షా అభియాన్‌కు మూడు బహుమతుల రాక

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లైడ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో కాన్పూర్‌లో ఇటీవల జరిగిన సదస్సులో వ్యక్తిగత విభాగంలో పలు బహుమతులు సాధించినట్లు జిల్లా సమగ్ర శిక్షా అదనపు సమన్వయకర్త, భౌతికశాస్త్ర అధ్యాపకులు జోగ చంద్రశేఖర్ తెలిపారు. పాదరక గొట్టం నుంచి ధ్వని ఎలా ఉత్పత్తి చేయవచ్చో చెప్పూ చేసిన ప్రయోగానికి ఈ బహుమతి దక్కిందన్నారు. మొత్తం మూడు బహుమతులు వచ్చాయన్నారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు అభినందించారన్నారు.

సామాజిక సేవకు గుర్తింపు

కమల్ బైద్‌కు పురస్కార ప్రదానం

కమల్ బైద్‌కు పురస్కారం అందిస్తున్న క్లబ్ సభ్యులు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: గత నలభై ఏళ్లుగా ఇంటర్నేషనల్ వాకర్స్‌లో సేవలందిస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ డైరెక్టర్ కమల్ బైద్‌కు ‘విశ్వ విఖ్యాత వాకర్ మిత్ర’ పురస్కారం అందించారు. ఆదివారం సిరిపురం బాలల ప్రాంగణంలో జరిగిన ఇంటర్నేషనల్ వాకర్స్ సదస్సులో దీనిని ప్రదానం చేశారు. రెండు రోజులుగా జరుగుతున్న ఈ సదస్సు ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి వాకర్స్ ఇంటర్నేషనల్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ ట్రస్టీ కె.రామానందం మాట్లాడుతూ.. కమల్ బైద్ సామాజిక సేవలో ముందున్నారన్నారు. వెటరన్ అథ్లెటిక్ ట్రస్టును ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అధ్యక్షులు కె.పద్మావతి, పూర్వ అధ్యక్షులు రవీంద్ర, మీడియా కన్వీనర్ సుందరి రామకృష్ణ, శ్రీనివాస రాజు, డాక్టర్ డి.డి.నాయుడు, ద్వారకానాథ్, యూత్ ఛైర్‌పర్సన్ వంశీ, స్మైల్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాది జి.రాజగోపాలరెడ్డి, ఎస్.కె.మస్తాని, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌లో కాస్మోటిక్స్, ఫుట్‌వేర్, హోమ్‌నీడ్స్ విభాగాల ప్రారంభం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నగరంలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న సీఎంఆర్‌లో సరికొత్త హంగులతో కాస్మోటిక్స్, ఫుట్‌వేర్, హోమ్‌నీడ్స్ విభాగాలను ఆదివారం ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, గంటా శ్రీనివాసరావు, గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, కంకటాల మల్లిక్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంటా మాట్లాడుతూ విశాఖలో కాకుండా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో సీఎంఆర్ ఒక ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. నాణ్యమైన వస్త్రాలను తక్కువ ధరకే అందించడం సీఎంఆర్ ప్రత్యేకత అన్నారు. వ్యాపారంలోనే కాకుండా సామాజిక సేవలోనూ మావూరి వెంకటరమణ ముందుంటున్నారని, ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని కొనియాడారు. మావూరి వెంకట రమణ మాట్లాడుతూ 40కి పైగా శాఖలను విజయవంతంగా నడుపుతున్నామన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు. జబర్దస్త్ టీం నటులు బుల్లెట్ భాస్కర్, నరేష్, వినోద్ సందడి చేశారు. కొనుగోలుదారులతో ముచ్చటించారు.

జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, గంటా శ్రీనివాసరావు, గణబాబు, సీఎంఆర్, కంకటాల అధినేతలు మావూరి వెంకటరమణ, మల్లిక్

జాతీయస్థాయి మహిళా బాక్సింగ్ పోటీలకు ఎంపిక

పిఠాపురం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రెండురోజులుగా రాష్ట్రస్థాయి మహిళా బాక్సింగ్ పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. ఆదివారం విజేతలకు బహుమతులు అందజేశారు. జాతీయ స్థాయి పోటీలకు 10 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ విన్నర్‌గా విశాఖపట్నం, రన్నర్‌గా కాకినాడ జిల్లా, ద్వితీయ స్థానంలో నెల్లూరు జిల్లా క్రీడాకారులు బహుమతులు సాధించారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బహుమతులు ప్రదానం చేశారు.

✦ విశాఖపట్నానికి చెందిన కె.శ్రీవర్ధన్, ఎస్‌కే.జీనత్ మల్లిక, ఎండీ ముహంమదిస్తాహ్ బేగం, కె.ప్రైసి శ్రీ, ఎస్.దీపిక, జె.స్వప్న, వి.రిష్య, అనకాపల్లికి చెందిన మౌనిక కల్యాణి, బి.భువని, విజయనగరానికి చెందిన పి.సుమిత్రలను జాతీయస్థాయికి ఎంపిక చేశారు. వీరంతా ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో డిసెంబరు 31 నుంచి జనవరి 5వరకు జరిగే జాతీయ స్థాయి మహిళా బాక్సింగ్ పోటీల్లో తలపడతారని నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

స్థిరాస్తి రంగానికి ప్రోత్సాహకాలు

మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విశాఖలో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా విస్తరిస్తోందని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. బీచ్‌రోడ్డు గాదిరాజు ప్యాలెస్‌లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడురోజుల పాటు జరిగిన క్రెడాయ్ 11వ ప్రాపర్టీ ఎక్స్‌పో ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్లాన్ అనుమతుల్లో వేగం, గ్రీన్ బిల్డింగ్ ప్రోత్సాహకాలు, డిజిటల్ సింగిల్ విండో వ్యవస్థతో పెట్టుబడిదారుల్లో మరింత విశ్వాసం పెరిగిందన్నారు. క్రెడాయ్ విశాఖపట్నం అధ్యక్షుడు ఇ.అశోక్‌కుమార్ మాట్లాడుతూ సుమారు 14 వేల మంది ఎక్స్‌పోను సందర్శించారన్నారు. క్రెడాయ్ విశాఖపట్నం ఛైర్మన్ ధర్మేంద్ర మాట్లాడారు. అనంతరం ఏయూకు చెందిన ప్రతిభావంతులైన బి.ఆర్క్ విద్యార్థులకు బి.ఆర్.రాజు మెమోరియల్ అవార్డు-2025 పేరిట పురస్కారాలను ప్రదానం చేశారు. లక్కీ డ్రాలో బహుమతిగా గెలుచుకున్న ద్విచక్ర వాహనాన్ని సంబంధిత విజేతకు అందజేశారు. క్రెడాయ్ కార్యదర్శి బి.శ్రీను, సభ్యులు గోవింద రాజు, ఏపీ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా సెంట్రల్ బ్యాంక్ వార్షికోత్సవం

సీతంపేట: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 115వ వార్షికోత్సవాన్ని విశాఖ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రీజనల్ హెడ్ డీజీఎం ఏవీ రమణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 115 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో విశ్వాసానికి ప్రతీకగా నిలిచి, సమాజ సేవలకు నిర్వచనంగా మారిందన్నారు. వేడుకల్లో నగర పరిధిలో పలు బ్రాంచీల అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రజలందరికీ బీమా రక్షణ కల్పించాలి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: బీమా రక్షణ 2047వ సంవత్సరం నాటికి అందరికీ అందేలా చూడాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు కె.పద్మ అన్నారు. వైజాగ్ ఇన్సూరెన్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఇన్సూరెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (ముంబయి) ఆధ్వర్యంలో ప్రజల్లో బీమాపై అవగాహన పెంచేందుకు ఎంవీపీకాలనీ ఐక్యత భవన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆమె మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా బీమా రక్షణ అందరికీ అందడం లేదన్నారు. చిన్నమొత్తాల పొదుపును ప్రోత్సహించినట్లే దీన్ని కూడా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. వైజాగ్ ఇన్సూరెన్సు ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి ఎ.వి.ఆర్.కృష్ణమూర్తి మాట్లాడుతూ గత 69 సంవత్సరాలుగా ఎల్.ఐ.సి. బీమా రక్షణ కల్పిస్తోందన్నారు. ఈ సదుపాయం గ్రామీణ ప్రాంతాలకు బాగా విస్తరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఐ.సి. బ్రాంచి మేనేజర్ డి.రామారావు, డి.వి.ఎస్.వై.శర్మ, ఎస్.ఎస్.మూర్తి, ఎం.కామేశ్వరి, జి.వరప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశ్రాంత అధ్యాపకురాలు కె.పద్మ, చిత్రంలో వైజాగ్ ఇన్సూరెన్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు

IN THE HONOURABLE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATHI
W.P. No. 27046 OF 2025

Between:
P.D.A. Srinivasa Rao, S/o Late Babu Rao, Aged 55 years, **Occ:** Business, R/o Flat No. 202, Dr. No. 115-1/4/4, Andhra Residency, NE Layout, Seethammadhara, MIG-101, Visakhapatnam Town & District. **...PETITIONER**

Vs.

1. The Legal Services Authority, State of Andhra Pradesh, rep by Chairman, Near AP Secretariat, Amaravati
2. The Permanent Lok Adalat at Visakhapatnam, rep by its Presiding Officer, Visakhapatnam.
3. Mylapalli Sattayamma W/o Appanna, Aged about 70 years, R/o Door No.32-6-33, Allipuram, Visakhapatnam.
4. Kommakula Appalanarasamma, W/o Sathiraju, aged 70 years, R/o Drivers Colony Gajuvaka, Visakhapatnam.
5. Vurumiti Mani, W/o Suryanarayana, Aged about 71 years, R/o Door No. 18-2-16, Kummara Veedhi, Maharanipeta, Visakhapatnam.
6. Kommanapalli Palaveni, W/o Nagabhushanam, Aged about 73 years, R/o Asavenipalem, Near Marripalem, Kancharapalem Post, Vishakapatnam.
7. Mummidisetty Rama Rao, S/o late Venkataraju, Aged about 74 years, Business, R/o 14-4-2, Kolajatlavari Veedhi, Vijayanagaram.
8. Mummidisetty Venkata Ramanamma (died)
9. Mummidisetty Surya Rao, S/o late Venkata Raju, Aged about 77 years, Business, R/o F-1/6, Dasapalla Towers, Nowroji Road, Maharanipeta, Visakhapatnam.
10. Mummidisetty Subba Rao, S/o late Venkata Raj, Aged 71 years, R/o F-3/6, Dasapalla Towers, Nowroji Road, Maharanipeta, Visakhapatnam.
11. Mummidisetty Kameswara Rao, S/o late Venkata Raju, Aged about 67 years, R/o D.No. 30-10-12, Rajakrishna Residency, Pidaparthivari Street, Dabagardens, Visakhapatnam.
12. M. Eswara Rao (died).
13. Polisetty Bhagyalakshmi, W/o Sri. Gopala Rao, Aged 72 years, R/o Near Sankaramatam, Madhuranagar, Visakhapatnam.
14. Guduru Varalakshmi, W/o Mallikarjuna Rao, D/O P.Gopala Rao, Aged about 68 years, R/o D.No.6-7-75, Chinna Veedhi, Vijayanagaram
15. Sandala Satyavathi (Suit not pressed by the Plaintiffs).
16. Mudunuru Venkata Veerabhadra Rao (died), S/o late Appa Rao, R/o D.No.43-14-6/1, Railway New Colony, Dondaparthy, Visakhapatnam.
17. Pattapu Siva Ramakrishna (P.S. Ramakrishna), S/o late Seethayya, aged about 85 years, Retired Addl. Supdt. of Police, R/o D.No.6-13-1, Koyya Street China Waltair, Visakhapatnam.

...RESPONDENTS

Take notice that the Hon'ble High Court of Andhra Pradesh at Amaravati, in **W.P. No. 27046 of 2025,** has directed publication of this notice to effect service on **Respondents 3 to 14 and 17,** as service through Registered Post Acknowledgment Due could not be effected.

The above Writ Petition is filed seeking an order or direction, more particularly a Writ in the nature of Certiorari, duly calling for the records relating to the Lok Adalat Award dated 26.04.2005 passed in O.S. No. 883 of 1999, pertaining to the property admeasuring about 780 Square Yards, covered by TS No. 1196, Block No. 56, Plot No. 15, Waltair Ward, within the limits of Visakhapatnam Municipal Corporation, and to set aside the said Lok Adalat Award, in the interest of justice.

You, the above-named respondents, are hereby required to appear before the Hon'ble High Court of Andhra Pradesh at Amaravati on **29.12.2025,** failing which the matter will be heard and appropriate orders will be passed in your absence in accordance with law.

This notice is issued pursuant to the directions of the Hon'ble High Court of Andhra Pradesh at Amaravati, in Order dated 15.12.2025 in W.P. No. 27046 of 2025.

HENCE, THIS PUBLIC NOTICE.

Date: 21-12-2025
Place: Amaravati

P. RAMA SHARANA SHARMA
Advocate for the Petitioner

ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

పద్మనాభం, న్యూస్‌టుడే: దేశం, ధర్మ పరిరక్షణకు ప్రతి హిందువూ బాధ్యత తీసుకోవాలని, సర్వ జనుల క్షేమంగా ఉండాలన్నదే హిందూ మతం నినాదమని అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షులు శ్రీ పరమాత్మానంద గిరి స్వామీజీ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పద్మనాభంలో కుంతీమాధవ స్వామి ఆలయం వద్ద ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తొలుత సమాజానికి చేస్తున్న సేవను గుర్తించి వివిధ కుల వృత్తుల వారిని సత్కరించారు. హిందూ ధర్మాన్ని నాశనం చేయడానికి అనేక దుష్ట శక్తులు ప్రయత్నిస్తున్నాయని హిందువులంతా ఐక్యంగా ఉండి ధర్మ పరిరక్షణ గావించాలన్నారు. ముఖ్య వక్త ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర సంఘచాలక్ మానవీయ దూసి రామకృష్ణ మాట్లాడుతూ.. అన్ని దేశాల ప్రజలు ఆచరించాల్సిన ధర్మాన్ని హిందుత్వం బోధిస్తుందన్నారు. అనంతరం శ్రీ పరమాత్మానందగిరి స్వామిని సత్కరించారు. కృష్ణాపురం, కొవ్వాడ గ్రామాలకు చెందిన కోలాట బృందం సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తమ్మిన నరసింగరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కె.రాంబాబు, డీఎల్‌డీఏ ఛైర్మన్ గాడు వెంకటప్పడు, మాజీ మండల తెదేపా అధ్యక్షుడు కె.నగేష్‌కుమార్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు కె.కేశవరావు, నాయుడు, దేముడు తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న శ్రీపరమాత్మానంద గిరిస్వామి

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

FOR SALE

వైజాగ్, డైమండ్ పార్క్ దగ్గర నెలకు 5-6 లక్షల బిజినెస్ గల రన్నింగ్ రెస్టారెంట్ సామాన్లు అన్ని కలిపి 10 లక్షలు మాత్రమే. Ph: 9849724847, 7799338085

FINANCIAL SERVICES

ఆంధ్రప్రదేశ్‌లోGovt. ఉద్యోగస్తులకు, రిటైర్డ్ పెన్షనర్లకు సులభ వాయిదాలేదా నెలవారీవడ్డీకి పర్సనల్ లోన్స్ ఇవ్వబడును. అయోధ్య కో-ఆపరేటివ్ సొసైటీ 7386201191

PERSONAL CLASSIFIEDS

MISSING

కనిపించుట లేదు



శ్రీ జితేంద్ర సాహూ, తండ్రి పేరు భగిరథి సాహూ, ఎటి/ పిఒ- టింకిపిర, పిఎస్- రీమల్, జిల్లా- దేవ్‌ఘర్, పిన్-768109. ఐఎంఎఫ్ఎ ఫ్యాక్టరీ నుంచి 13.12.2025న ట్రక్కులతో పాటుగా వారు విశాఖపట్నం పోర్టుకు ఎస్కార్టుగా వెళ్లారు, ఫ్యాక్టరీని సా.7.30 గం. సాయంత్రం వదలి వెళ్లి, విశాఖపట్నాన్ని 15.12.2025న ఉదయం చేరారు. వారు కటక్‌ను 16.12.2025న చేరలేదు మరియు వారి మొబైల్ నంబర్ స్విచ్ ఆఫ్ చేయబడి ఉన్నది. ఈ వ్యక్తిని ఎవరైనా కనుగొంటే దయచేసి 9338062120 ను సంప్రదించండి.

REAL ESTATE

FLAT FOR SALE

MADHURAWADA

MVV Flora - 3+1 BHK | 2421 sq.ft | UDS: 83.4 sq.yds 2 Car Parkings Ph: 8309390836

EENADU Classifieds

LAND FOR SALE

GENERAL

పూసపాటిరేగ మం. గోవిందపురంరోడ్డు, హైవేకి 1/2km తా.రోడ్డు ఫేసింగ్, 9ఎకరాలు కొబ్బరితోట &13ఎకరాలు 100' రోడ్డు ఉన్న స్థలం అమ్మకం. 9440255187

JOBS

Computer Data Operator (M/F) with min 1 year exp. in Excel. Job at MVP Sector-1, Visakhapatnam. Email:giri.fomra@gmail.com ✆ 93902 07565, 99482 05000.

Service Engineers / Sales Coordinators (Females) / ITI-Fitter & Electricians with 5 Years Exp. in Pumps/ Motors/ Panels for Vizag & Hyderabad Branch. WhatsApp Resume and Contact Later. Cell No: 9444391787.

Wanted Insurance Advisors for a Reputed Insurance Company Unemployees, Retired, Housewives & Others. ✆ 9652530409.

సెంట్రల్ గవర్నమెంట్ సోలార్ సబ్సిడీ స్కీమ్ నందు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. Q: 10 to PG. జీతం: 30 వేలు to 50 వేలు. ✆ 95155 05557, 99898 57775.

ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పనిచేయుటకు హమాలీనికి సూపర్‌వైజర్ కావలెను. జీ: 13,500/- (26 రో॥)+PF, ESI. Ph.: 9247356570, 9032456763.

USAలో 2y బాబును చూసుకోవడానికి వీసా కల్గిన ఆడ కేర్‌టేకర్ కావలెను. జీతం + భోజనం + ఉచిత వసతి. ✆ 92469 98571, 92469 99571.

గాజువాక, గోపాలపట్నం షాపింగ్ మాల్స్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం : 18,000. Ph: 9154296343, 9154296345.

వైజాగ్ ప్రముఖ షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం:10000 - 12000 + ఫుడ్, రూము. 9030588502, 9704637370

MVP కాలనీ గెస్ట్‌హౌస్ (Oyo హోటల్) నందు పని చేయుటకు రిసెప్షనిస్ట్ & రూమ్ బాయ్స్ కావలెను. ఫుడ్&వసతి కలదు. వ॥28 సం॥లోపు ✆7036488899.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఫుట్‌బాల్ విజేత శ్రీధర్ స్పోర్టింగ్ క్లబ్

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: రైల్వే స్టేడియంలో నిర్వహించిన డీఆర్ఎం కప్ అఖిల భారత ఆహ్వానపు ఫుట్‌బాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. టోర్నీలో శ్రీధర్ స్పోర్టింగ్ క్లబ్ జట్టు ప్రథమ, తూర్పు కోస్తా రైల్వే జట్టు ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ఇరు జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో శ్రీధర్ స్పోర్టింగ్ క్లబ్ జట్టు 2-1తో తూ.కో. రైల్వే జట్టుపై విజయం సాధించింది. విజేతలకు డీఆర్ఎం లలిత్ బోహ్రా ట్రోఫీలు అందజేశారు. రైల్వే ఏడీఆర్ఎం కె.రామారావు, స్పోర్ట్స్ అధికారి ఎం.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న డీఆర్ఎం లలిత్ బోహ్రా

అప్పన్న స్వామికి బంగారు హారం బహూకరణ

సింహాచలం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్, భీమిలి నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆదివారం సింహాద్రి అప్పన్న స్వామికి బంగారు పగడాల హారం బహూకరించారు. కుటుంబ సమేతంగా సింహగిరికి విచ్చేసిన ఆయనకు అధికారులు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకుని బేడామండపం ప్రదక్షిణం చేశారు. అంతరాలయంలో స్వామిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. అనంతరం బంగారు పడగడాల హారాన్ని డిప్యూటీ ఈవో సింగం రాధ, పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావుకు అందజేశారు. హారం సుమారు 400 గ్రాముల బరువు ఉంటుందని అధికారులు తెలిపారు.

సామాన్య భక్తులకు అవస్థలు..: చిన్న శ్రీను కుటుంబంతో పాటు పదుల సంఖ్యలో అనుచరులు ఆలయానికి విచ్చేశారు. వీరందరికీ అధికారులు దర్శనాలకు అనుమతించారు. ఆయన దర్శనం చేసుకునే సమయంలో సుమారు గంట పాటు సామాన్య భక్తులకు దర్శనాలు నిలిపివేయడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఆస్థాన మండపంలోని స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అంతరాలయంలోకి తీసుకువెళ్లాల్సి ఉండగా అప్పటికే చిన్న శ్రీను కుటుంబం స్వామి వద్ద ఉండటంతో జాప్యం చోటుచేసుకుంది. దర్శనం విషయంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని భక్తులు విమర్శించారు.



డిప్యూటీ ఈవో రాధకు హారం అందజేస్తున్న వైకాపా నేత మజ్జి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు

గంజాయి స్వాధీనం

గోపాలపట్నం, న్యూస్‌టుడే: గంజాయి విక్రయాలు, కొనుగోళ్లు చేస్తున్న ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించి స్థానిక సీఐ లెంక సన్యాసినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఒడిశాలోని కొరాపుట్‌కు చెందిన కె.లాలూ(20), కె.అశీస్(19), సాల్మన్ పారీస్(28) గంజాయి విక్రయిస్తుండగా.. పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన గంజి వంశీ(27), నీలం అనీల్(19), ఎం.ప్రవీణ్(20) కొనుగోలు చేసి రవాణా చేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు.. స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి ఆరున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	116	112
లైవ్	143	132
డ్రెస్డ్	207	234
స్కిన్‌లెస్	236	244

పెందుర్తి

తెరపై ఈనాడు
లక్ష్మీకాంత్
స్క్రీన్-1: అఖండ-2
స్క్రీన్-2: మోగ్లీ

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి హైదరాబాద్ సమీప ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన దుప్పలపూడి శ్రీనివాసరావు, సౌమ్య దంపతులు వారి కుమార్తె ఈష పేరిట ఆదివారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో దేవస్థానం ఈవో ఎన్.సుజాతకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

సబ్బవరం, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం నారపాడు శివారు బల్జిపాలెం గ్రామంలో రోడ్డుపక్కన వ్యర్థాలు పేరుకుపోయి రోగాల భయం వెంటాడుతోంది. -శ్రీనివాసరావు, బల్జిపాలెం. ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. -మామిడి శంకరరావు, సర్పంచి, నారపాడు

?: సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెం ఆంజనేయ స్వామి మందిర సమీపంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. -ఎస్. సత్యనారాయణ, మల్లునాయుడుపాలెం. ✓: ఆ ప్రాంతంలో వెంటనే వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. -బోను దేవుడమ్మ, సర్పంచి, మల్లునాయుడుపాలెం

వేపగుంట, న్యూస్‌టుడే: ?: వేపగుంట ఎస్సీకాలనీలో కాలువలు శిథిలావస్థకు చేరి ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. -శ్రీనివాసరావు. ✓: కాలువల నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటాం. -దిలీప్‌కుమార్, వర్క్స్ విభాగం ఈఈ

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ-భరణికం మార్గంలో వీధిదీపాలు లేక రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. -శ్రీనివాస్, పరవాడ. ✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. -రమేశ్‌నాయుడు, ఎంపీడీవో, పరవాడ

పర్యాటక తీర ప్రాంతాల్లో వసతులేవీ..!

పరవాడ, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలో ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, అప్పికొండ తీరాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయి. ఆకట్టుకునే విశాల పర్యాటక తీర ప్రాంతం ఉన్నప్పటికీ వసతులు లేని కారణంగా పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, ఎస్ఈజెడ్, మెడ్‌టెక్ జోన్, హిందుజా వంటి పారిశ్రామిక సంస్థలు ఈప్రాంతంలో ఏర్పడడంతో పర్యాటకుల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. కుటుంబ సభ్యులతో సంబంధిత తీరాలకు సరదాగా వచ్చే వారంతా వసతులు లేకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారు. గత ప్రభుత్వం అభివృద్ధి చేస్తామని హామీలిచ్చినా కార్యరూపం దాల్చలేదని స్థానికులు అంటున్నారు. కూటమి సర్కారు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అప్పికొండ తీరం

అభివృద్ధికి నోచుకోని తిక్కవానిపాలెం తీరం

ఇవీ సమస్యలు

తీరప్రాంతం వెంబడి వచ్చిన తోటలున్నా పర్యాటకుల కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు, నీడనిచ్చే విడిది గొడుగులు, గుడారాలు లేవు. ★ పిల్లలు ఆడుకోవడానికి ఆట పరికరాలు, పార్కులు కానరావు. విశ్రాంతి గదులు లేవు. ★ ప్రమాదకరం కానిచోట సరదాగా స్నానాలు చేసిన వారు దుస్తులు మార్చుకోవడానికి సౌకర్యం లేదు. ★ ఉప్పుటేరులో బోటు షికారు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు లేవు. ★ తిక్కవానిపాలెం తీరంలో దశాబ్దాల క్రితం నిర్మించిన సిమెంట్ బెంచీలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ★ అప్పికొండలో మరుగుదొడ్లు మూతపడి ఉండడంతో పర్యాటకులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాటికి నిరంతర నీటి సరఫరా కల్పించి అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

చీకటి పడితే అంధకారమే..

ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీరాల్లో సాయంత్రం వేళ విద్యుత్తుదీపాలు లేకపోవడంతో అంధకారం అలముకుంటుంది. సాయంత్రం సమయంలో కుటుంబసభ్యులతో కలిసి ఆయా ప్రాంతాలకు వచ్చే పర్యాటకులు కాసేపు తీర ప్రాంతంలో గడపుదామన్నా చీకటి కారణంగా వీలుకాని పరిస్థితి. గతంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన సోలార్ ఎల్ఈడీ విద్యుత్తు దీపాలు కొద్దినెలలకే మూలకు చేరాయి. గుర్తు తెలియని వ్యక్తులు స్తంభాలు, సోలార్ పలకలు పట్టుకుపోయారు. పర్యాటకులు తాగునీరు, అల్పాహారం వంటివి ఇంటి నుంచే తెచ్చుకోవాల్సిన పరిస్థితి.

చుక్కల మందుకు చక్కని స్పందన

పెందుర్తిలో చిన్నారికి పల్స్‌పోలియో చుక్కలు వేస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలో ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. పెందుర్తి గ్రామీణ మండలంలో కొండ్రాం పీహెచ్‌సీ, జీవీఎంసీ వార్డుల్లోని యూపీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ జరిగింది. పాత పెందుర్తిలో మేయర్ పీలా శ్రీనివాసరావు చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. సరిపల్లిలో సర్పంచి గొర్లె రామకృష్ణ, రాంపురంలో జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, చినముషిడివాడలో 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత, పాపయ్యరాజుపాలెంలో 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు దీన్ని ప్రారంభించారు.

వేపగుంట, న్యూస్‌టుడే: జెర్రిపోతులపాలెంలో సర్పంచి మడక అప్పలరాజు పోలియో కేంద్రాన్ని ప్రారంభించి పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేశారు. వేపగుంట బీసీకాలనీలో కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు, ఆర్.ఆర్.వెంకటాపురం, సత్తివానిపాలెం తదితర చోట్ల స్థానిక నాయకులు ఈ ప్రక్రియ ప్రారంభించారు.

పరవాడ, న్యూస్‌టుడే: లంకెలపాలెంలో ఈ కార్యక్రమాన్ని కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ప్రారంభించారు. పరవాడ పీహెచ్‌సీలో వైద్యాధికారులు జయశ్రీకృష్ణ, హారిక చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వాడచీపురుపల్లి పీహెచ్‌సీ పరిధిలో ఈ ప్రక్రియ నూరు శాతం పూర్తయినట్లు వైద్యాధికారి కనకదుర్గారావు తెలిపారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలంలో 97.4 శాతం మందికి పోలియో చుక్కలు వేసినట్లు సబ్బవరం పీహెచ్‌సీ వైద్యుడు ఎన్ఎస్ఆర్ చక్రవర్తి తెలిపారు. మొగలిపురంలో పెందుర్తి తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, 88వ వార్డులో కార్పొరేటర్ మొల్లి ముత్యాలు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఉక్కునగరంలో ఫిట్‌థాన్ ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న ఉక్కు డైరెక్టర్ డాక్టర్ సలీమ్ ఎం.పురుషోత్తమన్, తదితరులు

ఉక్కునగరం(స్టీల్ సెక్టార్-3), న్యూస్‌టుడే: ఉక్కునగరం డిపాల్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్‌థాన్ నిర్వహించారు. ఉక్కు డైరెక్టర్ డాక్టర్ సలీమ్ ఎం.పురుషోత్తమన్ ఫిట్‌థాన్ ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు. సుమారు 1100 మంది పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉక్కు అధికారులు ఎం.మధుసూదనరావు, ఎన్.బాను, వి.లీల, డాక్టర్ సాగర్, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఫాదర్ అనీష్ మాథ్యూ, ఫాదర్ సాజి, ఫాదర్ జోషప్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గంగవరం మత్స్యకార గ్రామంలో పులిచెర్ల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పేద ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పులిచెర్ల మురళీకృష్ణ, మాజీ కౌన్సిలర్ పులిచెర్ల రాజేశ్వర, పోర్ట్ ఎస్ హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ పి.రవికిరణ్, డాక్టర్లు తపన్‌కుమార్, రాధిక, త్రివేణి, గీతిక, కృష్ణ, అనిల్, జోయ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

'ములకలపల్లి' సేవలు ఆదర్శనీయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నాలుగు దశాబ్దాలుగా ఉక్కు ఎస్సీ నిర్వాసితుల సమస్యలపై పోరాడిన ములకలపల్లి అప్పారావు జీవితం ఆదర్శనీయమని భాజపా ఎస్సీ మోర్చా విశాఖ జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి ప్రకాశ్ కొనియాడారు. ఆదివారం పెదగంట్యాడ కూడలిలో ఉక్కునిర్వాసిత ఎస్సీ సంఘం అధ్యక్షుడు అప్పారావు 25వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజూరి దీపక్, నాయకులు మహేశ్వరరెడ్డి, వంశీ, సత్యారావు, భువనేశ్వరి, ముసలయ్య, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు కర్నూలులో జరిగిన 44వ సీనియర్ మహిళలు, పురుషుల రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అనకాపల్లి జిల్లా మహిళల జట్టు ప్రథమ స్థానంలో నిలిచినట్లు అనకాపల్లి జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి పైలా ప్రవీణ్ తెలిపారు. బాపట్ల జిల్లా జట్టు ద్వితీయ స్థానంలో, గుంటూరు జిల్లా జట్టు తృతీయ స్థానంలో నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి జట్టు సభ్యులను ఆయన అభినందించారు.

పోటీల్లో విజేతగా నిలిచిన అనకాపల్లి జట్టు

రాంకీ ఫౌండేషన్ చేయూత

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో వసతుల కల్పనకు రాంకీ ఫౌండేషన్ చేయూతనిచ్చింది. సంస్థ సీఎస్ఆర్ నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టింది. పాఠశాల ప్రధాన ద్వారానికి కొంతకాలంగా గేటు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల నూతన గేటు తయారు చేయించి ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేశారు. విద్యార్థుల సైకిళ్ల కోసం ఓ షెడ్డు నిర్మించారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించి గోడలపై ఆకట్టుకునే బొమ్మలు కూడా వేయించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాల ప్రధాన ద్వారానికి గేటుతో పాటు సమీపంలో నిర్మించిన సైకిల్ షెడ్డు

సింహగిరిపై వైభవంగా అయ్యవారి సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం అయ్యవారి సేవ వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి బంగారు తొళక్కియాన్ పల్లకిలో కొలువుదీర్చారు. పండితుల పారాయణాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ పల్లకీని నడకలతో ఆలయ బేడామండపంలో దేవతామూర్తుల తిరువీధి నిర్వహించారు. ఆండాళ్ సన్నిధి వద్ద స్వామి, అమ్మవార్లకు పూలదండలు మార్చి తాంబూలం నివేదించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తిరుప్పావై సేవాకాలం జరిగింది. అమ్మవారి తిరువీధి, తిరుప్పావై పాశుర విన్నపం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తిరువీధిలో పాల్గొని గోవింద నామస్మరణ చేశారు.

స్వామి, అమ్మవార్లు

నూతన నియామకం

ఏకగ్రీవంగా ఎన్నికైన యాదవ సంఘం సభ్యులు

సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు బి.సాయినారాయణ ఆధ్వర్యంలో ఆదివారం సబ్బవరం శ్రీనివాసరామ కల్యాణ మండపంలో పెందుర్తి నియోజకవర్గ యాదవ సంఘం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడుగా పెందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు కసిరాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా పల్లా కృష్ణ, ఉపాధ్యక్షుడుగా గొలగాని సత్యనారాయణ, కార్యదర్శులుగా నమ్మి నరసింగరావు, నంబారు రమణ, కోశాధికారిగా ఈశ్వరరావు, అధికార ప్రతినిధిగా పల్లా సత్యనారాయణ, ప్రచార కార్యదర్శిగా మొల్లి సత్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, మూడు మండలాలకు చెందిన అధ్యక్షులు, పాల్గొన్నారు.

ఘనంగా వన సమారాధన

పాపయ్యరాజుపాలెం (పెందుర్తి), న్యూస్‌టుడే: సుజాతనగర్ సత్యసాయి భజన మండలి సభ్యులు ఆదివారం పాపయ్యరాజుపాలెం సమీప మూడు ఆలయాల కూడలి వద్ద వన సమారాధన చేపట్టారు. సత్యసాయి ఆనంద నిలయం గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సత్యసాయి చిత్రపటం వద్ద దీపారాధన చేసి భజనలు చేశారు. భజన మండలి సభ్యులు జ్యోతి, గోపి, బుజ్జిబాబు, సీతారాం, తాతారావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న భజన మండలి సభ్యులు

వైభవంగా తిరుప్పావై సేవాకాలం

పూజలందుకుంటున్న స్వామివారు

పెందుర్తి, న్యూస్‌టుడే: వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తిరుప్పావై సేవాకాలం వైభవోపేతంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు వేకువ జామున శ్రీవారికి ధూపదీప సేవలు నిర్వహించారు. సేవాకాలం నిర్వహించి తిరుప్పావై ఆరవ పాశురాన్ని స్వామికి విన్నపం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పాశుర పారాయణం చేశారు. అర్చకులు స్వామికి విశేష నివేదనలు సమర్పించి భక్తులకు ప్రసాదం వితరణ చేశారు.

ఆలయ ప్రాంగణంలో ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

ఆధ్యాత్మికం

వేపగుంట, న్యూస్‌టుడే: నాయుడుతోట సమీప రవినగర్ శేషాద్రి శిఖరంపై గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం పాశుర విన్నపం, తిరుప్పావై ప్రవచన కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు శ్రీనివాసస్వామి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. లక్ష్మీపురం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, చింతలగ్రహారం కృష్ణాలయంలో, సింహపురికాలనీ రామాలయంలో, లక్ష్మీనరసింహనగర్ గోపీజనవల్లభస్వామి ఆలయంలోనూ ఈ వేడుకలు ఘనంగా జరిగాయి.

ప్రత్యేక అలంకరణలో గోదాదేవి

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు

పరవాడ, న్యూస్‌టుడే: లంకెలపాలెం, నాయుడుపాలెం, పరవాడ, వాడచీపురుపల్లి, ధర్మారాయుడుపేట, కలపాక, సినిమాహాల్ కూడలి తదితర ప్రాంతాల్లో ఆదివారం మేలుకొలుపు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు రామాలయాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల విగ్రహాలను వీధుల్లో ఊరేగించారు. నగర సంకీర్తనలో స్థానికులు పాల్గొని భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నాయుడుపాలెం నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

దేశపాత్రునిపాలెంలో రింగులైట్లు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 79వ వార్డు పరిధి దేశపాత్రునిపాలెం బాలాజీనగర్, శ్మశానవాటిక, దుర్గమాంబ గుడి, శ్రీసాయి దర్శిని రెసిడెన్సీ, సుబ్రహ్మణ్యనగర్-2 తదితర ప్రాంతాల్లో కొత్తగా వీధి దీపాలు (రింగులైట్లు) ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఆదివారం రాత్రి వాటిని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలు, కాలనీల్లో విద్యుత్తు దీపాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్‌ను ఘనంగా సత్కరించారు. కూటమి నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వీధిదీపాలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు

హద్దు దాటితే బహిష్కరణ వేటు తప్పదు

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ కె.వి.సతీశ్‌కుమార్

పెందుర్తి, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు హద్దు దాటితే నగర బహిష్కరణ వేటు తప్పదని పెందుర్తి సీఐ కె.వి. సతీశ్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు స్టేషన్ ఆవరణలో ఆదివారం సాయంత్రం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పూర్వపు ప్రవృత్తిని వీడి మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. నేరాలకు పాల్పడినా, నేరాలు చేసే వారికి ఆశ్రయం కల్పించినా, సహకరించినా కఠిన చర్యలు తప్పవన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

వాహనదారులకు అవగాహన

పెందుర్తి, న్యూస్‌టుడే: నగరంలో ఇకపై ఉదయం 10గంటల నుంచి రాత్రి 8గంటల వరకు శిరస్త్రాణం ధరించని వాహన చోదకులకు బంకుల్లో పెట్రోల్ వెయ్యరని వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ కె.సురేశ్ తెలిపారు. ఇటీవల పాత గోశాల - వేపగుంట బీఆర్టీఎస్ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మరణించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన చినముషిడివాడ వద్ద శిరస్త్రాణం ఆవశ్యకతపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు.

★ వాహనం నడుపుతున్న వ్యక్తితో పాటు వెనుక కూర్చున్నవారు కూడా తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలన్నారు. ★ పెందుర్తి, సింహాచలం బీఆర్టీఎస్ కారిడార్లలోని మధ్య మార్గంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర పెద్ద వాహనాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. ★ ద్విచక్ర వాహనంపై ముగ్గురు ప్రయాణించవద్దని సూచించారు. వాహన చోదకులు నిబంధనలు పాటించి ప్రాణరక్షణ చర్యలు అనుసరించాలని కోరారు.

వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ సురేశ్

మానసిక వికాసానికి ధ్యానం దోహదం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ధ్యానంతో మానసిక వికాసం వృద్ధి చెందుతుందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ధ్యాన దినం పురస్కరించుకుని అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నెల్లిముక్కు కల్యాణ మండపంలో ధ్యాన వేడుక నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, అహింస ధ్యానకేంద్రం నిర్వాహకులు మీసాల శివగణేశ్వరరావు, వనితి, పిట్టా రెడ్డి, కిలాని ముసలయ్య, ధ్యాన కేంద్రాల సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, చిత్రంలో ధ్యాన కేంద్రాల ప్రతినిధులు

టిడ్కో ఇళ్లు కేటాయించాలి

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడలో టిడ్కో ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ఆదివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసనకు దిగారు. వక్తలు మాట్లాడుతూ.. ఈనెల 17 నాటికల్లా గృహాలు కేటాయిస్తామని అధికారులు మాట తప్పారన్నారు. నేటికీ కేటాయించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నివాసిత సంఘం సభ్యులు రమణి, లక్ష్మి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో లబ్ధిదారుల నిరసన

సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులోని ఏపీ ఈపీడీసీఎల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (సీఓఈఈటీ) కార్యాలయ భవన సముదాయంలో ఏపీ విద్యుత్తురంగ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఎలక్ట్రాన్‌వైబ్-ఏపీ హ్యాకథాన్ ఫలితాలను ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. హ్యాకథాన్ పోటీలను సీఓఈఈటీ, క్లీన్ క్లైమేట్ ఫౌండేషన్ (సీసీఎఫ్) ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ సంయుక్తంగా నిర్వహించాయి. ఇందులో హమ్‌సాట్, ఐసెన్‌సెస్, ఏరోవ్యన్, స్మార్ట్ గ్రిడ్, ఓల్డ్‌వైస్ సంస్థలు విజేతలుగా నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవంలో సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ.. వివిధ సంస్థల మధ్య పోటీతత్వంతో పాటు సృజనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించి, స్టార్టప్ సంస్థలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గత ఏడాది ఏపీ హ్యాకథాన్-2024 విజేతలకు ఇప్పటికే ఏపీఈపీడీసీఎల్‌లో ప్రాజెక్టులు కేటాయించామన్నారు. ★ స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించే దిశగా ఈ ఏడాది అక్టోబరులో ఆహ్వానించిన మేరకు 45 సంస్థలు పాల్గొన్నాయి. వీటిల్లో రాష్ట్ర విద్యుత్తు పంపిణీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు స్మార్ట్ డేటా, ఆధారిత ఆధునిక సాంకేతిక పరిష్కార మార్గాలను కనుగొనేలా తుదిజాబితాలో 9 స్టార్టప్ సంస్థలు ఎంపికయ్యాయన్నారు. సీఎండీలు పృథ్వీతేజ్, లోతేటి శివశంకర్, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి. సూర్యసాయి ప్రవీణ్‌చంద్ విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.

విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీలు పృథ్వీతేజ్, శివశంకర్

బింగో సర్కస్ ప్రారంభం

జ్యోతి వెలిగించి సర్కస్‌ను ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు

వేపగుంట, న్యూస్‌టుడే: పొట్టకూటి కోసం ప్రమాదకర విన్యాసాలతో చూపరులను అలరించే సర్కస్ కళాకారులను ప్రజలు ఆదరించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు కోరారు. వేపగుంట ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం వారు కళాకారులతో కలసి బింగో సర్కస్‌ను ప్రారంభించారు. వేపగుంట, పెందుర్తి పరిసర ప్రాంతాల ప్రజలకు ఇదో చక్కటి అవకాశమని, ఈ ప్రదర్శన పిల్లలకు చూపించడం వల్ల వారికి వినోదంతోపాటు, విజ్ఞానాన్ని అందించే అంశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సునీల్ చౌహాన్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారుల విన్యాసాలను అతిథులు తిలకించి వారిని అభినందించారు.

జగన్ పుట్టిన రోజు వేడుకలు

పెందుర్తి, పరవాడ, వేపగుంట, సబ్బవరం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నియోజకవర్గంలో ఆదివారం పలుచోట్ల జరిగాయి. పెందుర్తిలో చిన అప్పలనాయుడు యువసేన ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్వతీపురం మన్యం జిల్లా వైకాపా పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు తదితరులు కేక్ కోశారు. 96వ వార్డు డీఆర్సీ మాల్ వద్ద అన్నదానం నిర్వహించారు. పరవాడ మండలం పిట్టవానిపాలెంలో నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వేపగుంట సమీప గౌతంనగర్‌లో అనాథ పిల్లలకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పించారు. మొగలిపురంలో నిత్యావసర వస్తువులు అందించారు. మల్లునాయుడు చెరువు గట్టుపై మొక్కలు నాటారు.

కేకు కోస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు

11వ వర్ధంతి

మంచికి, మమతానురాగాలకు మారుపేరుగా నిలిచి, మహోన్నతమైన వ్యక్తిత్వంతో అందరినీ ఆప్యాయంగా చిరునవ్వుతో పలుకరిస్తూ... పేదల పెన్నిధిగా పిలువబడే మీరు దైవస్వరూపులు. ఎందరో విద్యార్థులకు బంగారు భవిష్యత్తును ఇచ్చి, కుటుంబ ఉన్నతికై అహర్నిశలు శ్రమించిన మీరు మానుండి దూరమై నేటికి 11 సం॥లు గడిచినను మీ మధుర జ్ఞాపకాలు మరువలేనివి. భగవంతుని సన్నిధిలో మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ పేరూరి అప్పారావు గారు
Rtd. HM
ఆలయ ధర్మకర్త: షిరిడిసాయి ఆలయం
జననం: 01-07-1946 మరణం: 22-12-2014
పాపయ్యరాజుపాలెం

భార్య: రమణమ్మ గారు
Rtd. Teacher

కుమారులు - కోడళ్ళు:
పి.వి. రఘు (లేటు) - విజయభాస్కరలక్ష్మి
పి.ఎ. రాజశేఖర్ (లేటు) - జానకి, టీచర్

కుమార్తెలు - అల్లుళ్ళు:
కె. కృష్ణవేణి - వెంకటరావు, సివిల్ ఇంజినీర్
కె. శాంతికుమారి, టీచర్ - నాగేశ్వరరావు, టీచర్

చెల్లి: బుచ్చియ్యమ్మ

మనుమలు, మనుమరాళ్ళు: చందనసాయి, ప్రత్యూష, గ్రీష్మసంపత్, వెంకటసత్యసంహిత్, జవహర్, షర్మిల, మనస్విని, పూర్ణిక శ్రేయస్విని

(c) eenadu

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేష్- **అవతార్**
రామలక్ష్మి- **అఖండ-2**
తార- **మోగ్లీ**
సప్తగిరి- **గుర్రం పాపిరెడ్డి**

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ఇస్కాన్ మందిరం (సాగర్‌నగర్)లో హరేరామ.. హరేకృష్ణ నామస్మరణతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాధాకృష్ణులు, సుభద్ర బలభద్ర జగన్నాథస్వామి మహిమల్ని అభివర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపనలు చేశారు. ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్, మాతాజీ నితాయిసేవిని పర్యవేక్షణలో అన్నసమారాధన చేపట్టారు.

భీమిలి

ఎస్సైల బాధ్యతల స్వీకరణ

ఎస్సైలు జె.సురేష్, లలిత్ ఆదిత్య

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి పోలీసు స్టేషన్‌కు కొత్త ఎస్.ఐ.లుగా జె.సురేష్, సి.హెచ్.లలిత్ ఆదిత్య ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్.ఐ.లుగా పని చేసిన జి.హరీశ్ సిటీ ట్రాన్స్‌పోర్ట్‌కు, బి.రాధాకృష్ణ గాజువాక ట్రాఫిక్ ఎస్.ఐ.గా బదిలీ అయ్యారు. ఆయా స్థానాల్లో పద్మనాభం స్టేషన్ నుంచి జె.సురేష్ రాగా ఎం.వి.పి.కాలనీ స్టేషన్‌లో ట్రైనీ ఎస్.ఐ.గా పని చేసిన లలిత్ ఆదిత్య నియమితులయ్యారు. అలాగే భీమిలి స్టేషన్‌లో ట్రైనీ ఎస్.ఐ.గా పని చేసిన శశాంక విశాఖ త్రీటౌన్ స్టేషన్‌లో, జస్వ ఎం.వి.పి. స్టేషన్‌లో నియమితులయ్యారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ. 10 నుంచి 11 ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే: పీఎంపాలెం క్రికెట్ మైదానం ఎదురుగా ఉన్న స్టేట్ బ్యాంక్ దగ్గర మైపైప్‌లైన్ లీకై మంచినీరు వృథాగాపోతోంది. - అన్నా సాహెబ్, పీఎంపాలెం
✓: మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపడతాం. - శ్రీనివాస్, ఏఈ

?: గాయత్రీనగర్ (పీఎంపాలెం) పార్కు అభివృద్ధి కోసం నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. - గాయత్రీనగర్ వాసులు
✓: త్వరలో పనులు ప్రారంభిస్తాం. - కమిలి, వార్డు ఏఈ

?: మిథిలాపురి వుడాకాలనీ(మధురవాడ)లో బ్లాక్ ఆఫ్ జోరెడా ఎదురుగా ఉన్న రోడ్డులో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. - లక్ష్మణరావు, స్థానికుడు
✓: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - రవి, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: అన్నపూర్ణ నగర్(కొమ్మాది)లో రోడ్లు గతుకులమయంగా ఉన్నాయి. - దేవప్రసాద్
✓: త్వరలో తారురోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాస్, ఏఈ

?: 6వ వార్డు పరిధి కొత్తపాలెంలో రూడా రహదారి బురదమయంగా ఉన్నాయి. - స్థానికులు
✓: త్వరలో రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం. - అయ్యప్పనాయుడు, జెడ్సీ

?: గాయత్రీనగర్ (పీఎంపాలెం)లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. - కాలనీవాసులు
✓: వీధి కుక్కల నివారణకు చర్యలు చేపడతాం. - రాజా రవికుమార్, ఆరోగ్య అధికారి

సృజన.. సమాజహితానికి తోడ్పడేలా

సాగర్‌నగర్, న్యూస్‌టుడే

జీవితంలో ఎదురయ్యే సమస్యలను అధిగమించేలా వినూత్న ఆలోచనలతో గీతం డీమ్డ్ వర్సిటీ విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను రూపొందించారు. సాంకేతికతను వినియోగించి వ్యవసాయం, నీటి సంరక్షణ, పర్యావరణం వంటి అంశాలపై మొత్తం 32 ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఐఈఈఈ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వీటిని ప్రదర్శించారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఆర్.రాజేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో ఆయనతో కలిసి ఉపకరణాలు, త్రీడీ ప్రింటింగ్, డ్రిల్లింగ్, కటింగ్, ఐనుము, ప్లాస్టిక్, చెక్కతో యువత తమ మేధో శక్తికి పదును పెట్టి సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను శ్రీకారం చుట్టడంతో పలువురు అభినందిస్తున్నారు.

సమయం ఆదా అయ్యేలా..: ప్రాజెక్టు పేరు ఎక్యూబెట్. కంప్యూటర్ సాయంతో ఎంపికున్న ఆకారం వచ్చేలా పేపర్‌ను కట్ చేయొచ్చు. దీంతో పేపరు, సమయం వృథా కాదు. పైపుడ్, అల్యూమినియం, రెయిలింగ్ డీసీ మోటార్ తదితర సామగ్రితో రెండు వారాల్లో రూ.5,500 వెచ్చించి రూపకల్పన చేశారు.
రూపకర్తలు: శశాంక్, గోపాలకృష్ణ, అక్షయసిద్ధు, తర్షత్, హర్షవర్ధన్ (సీఎస్ఈ)

ఇంటి నుంచే పొలాలకు నీరు..: ప్రాజెక్టు పేరు స్మార్ట్ ఇరిగేషన్. రైతులు పొలాల్లో ఏర్పాటు చేసిన మోటార్లు, పైపులైన్లను ఇంటి నుంచే మొబైల్ ద్వారా ఆపరేట్ చేయవచ్చును. మొబైల్ ఫోన్‌ను అనుసంధానం చేసిన సెన్సార్ల సాయంతో అవసరం మేరకు దానంతట అదే పని చేసేలా నీటిని నిలిపేయొచ్చు. నెలరోజుల్లో రూ.2,900 వ్యయంతో ఈఎస్‌పీ 32 మాడ్యూల్, సెన్సార్ పరికరాలతో ఈ ప్రాజెక్టును రూపొందించారు.
రూపకర్తలు: విద్యార్థులు ఉజ్జలేన్నా, ఎన్.ప్రెషిత్, సాయితనుష్, డి.ఆశిత్, సంతోష్‌రెడ్డి, వై.రాహుల్, నిఖిత్ (సీఎస్ఈ ఏఐఎంఎల్)

మొబైల్ ఆపరేటింగ్‌తో పొలం దున్నేలా..: ప్రాజెక్టు పేరు ఆగ్రోబోట్. మనిషి సాయం లేకుండా మొబైల్ ద్వారా ఆపరేట్ చేస్తూ పొలం దున్నే యంత్రాన్ని రూపొందించారు. ఈ క్రమంలో అడ్డుగా ఉన్న కలుపు మొక్కలను తొలగిస్తుంది. అలాగే పిచికారీ సైతం చేయవచ్చును. దీంతో రసాయనాల వల్ల రైతులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవు. రూ.1000 వెచ్చించి ఆర్డినో, బ్లూటూత్ మాడ్యూల్, సర్వో, డీసీ మోటార్లు, అల్ట్రాసోనిక్ సెన్సార్ పరికరాలను ఉపయోగించి వారం రోజుల్లో ఆవిష్కరించారు.
రూపకర్తలు: ప్రణయ్, కె.రిషిరామ్, శ్రీకాంత్, కె. హేమంత్, కె.విశాల్, ఆకాశ్ (సీఎస్ఈ ఏఐఎంఎల్)

బాధితులను రక్షించేందుకు..: ప్రాజెక్టు పేరు నోవారోవర్. మైన్స్ ప్రమాదాల్లో చిక్కుకున్న వారిని రక్షించేలా అధ్యాపకుడు డాక్టర్ బి.వి.నాయుడు సహకారంతో దీనికి అంకురార్పణ చేశారు. రిమోట్ కంట్రోల్ ద్వారా ఈ పరికరాన్ని ఆపరేట్ చేయవచ్చు. ఈ పరికరానికి అమర్చిన కెమెరా సాయంతో బాధితులు ఏ పరిస్థితుల్లో ఉన్నారో తెలుసుకుని తాగునీరు, ఆహారం, ఔషధాలను పంపించొచ్చు.
రూపకర్తలు: ఆరాధ్యఅభిలేష్, అనికేత్‌కుమార్ యాదవ్ (సీఎస్ఈ ఏఐఎంఎల్)



లింగాయత్‌ల సంక్షేమానికి కృషి

ఆత్మీయ సమావేశంలో వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ స్వప్న, సభ్యులు

అడివివరం (సింహాచలం), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్, లింగ బలిజల సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ బలిజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ తుల్జాపూర్ స్వప్న అన్నారు. అడివివరం పాత గోశాల దరి ప్రైవేటు కల్యాణ మండపంలో కె.సత్తిబాబు అధ్యక్షతన విశాఖ, అనకాపల్లి, విజయనగరం జిల్లాల వీరశైవ లింగాయత్ కమిటీల ఆత్మీయ సమావేశం జరిగింది. అధిక సంఖ్యలో సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

అతిథులను సత్కరిస్తున్న కేటీబీ అసోసియేషన్ ప్రతినిధులు

★ సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్సు దరి మాధవి హిల్‌టాప్‌లో డాక్‌యార్డ్ ఉద్యోగుల కేటీబీ అసోసియేషన్ వన సమారాధన మహోత్సవం జరిగింది. భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.జనార్దనరావు, గైనకాలజిస్టు బొత్స లక్ష్మీకొండమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షుడు బత్తుల చిరంజీవి, కార్యదర్శి వి.భాస్కరరావు అతిథులను సత్కరించారు. ఉద్యోగుల బృందం నటులు బుల్లెట్ భాస్కర్, అప్పారావు, ఆర్టిరి నరేష్, తదితరులు స్కిట్లు ప్రదర్శించారు.

సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

విజేతలకు జ్ఞాపిక అందజేస్తున్న ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీలు పృథ్వీతేజ్, శివశంకర్

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులోని ఏపీ ఈపీడీసీఎల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (సీఓఈఈటీ) కార్యాలయ భవన సముదాయంలో ఏపీ విద్యుత్తురంగ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఎలక్ట్రాన్ వైజ్-ఏపీ హ్యాకథాన్ ఫలితాలను ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. హ్యాకథాన్ పోటీలను సీఈఈటీ, క్లీన్ క్లైమెట్ ఫౌండేషన్ (సీసీఎఫ్) ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ సంయుక్తంగా నిర్వహించారు. ఇందులో హమ్‌సెల్, ఎవెసెన్స్, ఏరోవ్యాన్, స్మార్ట్‌గ్రిడ్, ఓల్టేజ్ సంస్థలు విజేతలుగా నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవంలో సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ.. వివిధ సంస్థల మధ్య పోటీతత్వంతో పాటు సృజనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, స్టార్టప్ సంస్థలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గత ఏడాది ఏపీ హ్యాకథాన్-2024 విజేతలకు ఇప్పటికే ఏపీఈపీడీసీఎల్‌లో ప్రాజెక్టులు కేటాయించామన్నారు.

★ స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించే దిశగా ఈ ఏడాది ఆక్టోబరులో అభ్యాసించిన మేరకు 45 సంస్థలు పాల్గొన్నాయి. వీటిల్లో రాష్ట్ర విద్యుత్తు పంపిణీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు స్మార్ట్ డేటా, ఆధారిత ఆధునిక సాంకేతిక పరిష్కారాలను కనుగొనేలా తుదిజాబితాలో 9 స్టార్టప్ సంస్థలు ఎంపికయ్యాయన్నారు. సీఎండీలు పృథ్వీతేజ్, లోతేటి శివశంకర్, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.

జగన్ జన్మదిన వేడుకలు

కేకు కోస్తున్న వైకాపా భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు తదితరులు

ఆనందపురం, న్యూస్‌టుడే: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను వైకాపా భీమిలి నియోజకవర్గం కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో కేకు కోశారు. అనంతరం పలుచోట్ల పార్టీ నాయకులు వృద్ధులు, నిరాశ్రయులకు దుప్పట్లు, చీరలు, పండ్లు పంపిణీ చేశారు.

సింహగిరిపై వైభవంగా అయ్యవారి సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం అయ్యవారి సేవ వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి బంగారు తొళక్కి యాన్ పల్లకిలో కొలువుదీర్చారు. పండితుల పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ వయ్యారి నడకతో ఆలయ బేడ మండపంలో వేంచేపుచేశారు. అనంతరం అయ్యవారి ఆభరణాలు తొలగించి వీధి తిరువీధి నిర్వహించారు. ఆండాళ్ సన్నిధి వద్ద స్వామి, అమ్మవార్లకు పూలదండలు మార్చి తాంబూలాలు నివేదించారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా తిరుప్పావై సేవాకాలం జరిగింది. అమ్మవారి తిరువీధి, తిరుప్పావై పాశుర విన్నపం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తిరువీధిలో పాల్గొని గోవింద నామ స్మరణ చేశారు.

స్వామివారి తిరువీధి ఉత్సవం

లాకౌట్ బాధిత కార్మిక సంఘం విజయోత్సవం

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: చిట్టివలస జ్యూటుమిల్లు లాకౌట్ బాధిత కార్మిక సంఘం విజయోత్సవ సభ స్థానిక కూడలిలోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మీసాల నరసింహ రాజు మాట్లాడుతూ మిల్లు యాజమాన్యానికి వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టులో వేసిన గ్రాట్యుటీ కేసులో బాధిత కార్మికులకు అనుకూలంగా తీర్పునివ్వడం హర్షణీయమన్నారు. ఈ తీర్పు మిల్లు యాజమాన్యానికి, కార్మికులను తప్పుదోవ పట్టించిన కొన్ని కార్మిక సంఘాల నాయకులకు గుణపాఠం వంటిదన్నారు. ఈ విజయం మిల్లు కార్మికులందరికీ చెందుతుందన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు నాగోతు అప్పలరాజు మాట్లాడుతూ.. తమ జీవితాలను పణంగా పెట్టి శ్రమించిన ఆరువేల మంది కార్మికులను లాకౌట్ పేరిట రోడ్డున పడేసిన యాజమాన్యం పశ్చాత్తాపపడాలన్నారు. కోర్టుల్లో తీర్పులున్నా వేజెస్ ఆఫ్ పేమెంట్ కేసులో కూడా బాధిత కార్మిక వర్గం విజయం సాధించడం ఖాయమన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరమణ, నాయకులు పాశల శివ, యరబాల తాతారావు, గిడుతూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో లాకౌట్ బాధిత కార్మిక సంఘం నేతలు

ఉత్తమ సేవలకు గుర్తింపు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెంలో ఉన్న వనితా వాకర్స్ క్లబ్ చేస్తున్న సేవలకు ఉత్తమ బెస్ట్ క్లబ్ అవార్డును దక్కించుకుంది. నగరంలో ఆదివారం వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్-2025 సంవత్సరానికి పలు అవార్డులను అందించింది. ఇందులో భాగంగా వనితా వాకర్స్ క్లబ్ ఉచిత ఆరోగ్య శిబిరాలు, 40 రోజుల పాటు నిర్వహించిన చలివేంద్రానికి వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ప్రభావతి చేతులమీదుగా వనితా వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ భ్రమరాంబ అవార్డును అందుకున్నారు.

భ్రమరాంబకు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

తాగునీటికి ఇక్కట్లు

ట్యాంకులతో నీటి సరఫరా

కొమ్మాది, న్యూస్‌టుడే: తాగునీటి కోసం ఇంటి నుంచి బయటకు రాక తప్పడం లేదు. జోన్-2 పరిధిలో 5, 6, 7 వార్డుల్లో కొన్ని చోట్ల తాగునీటి కోసం స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు క్షేత్రస్థాయి వాస్తవాలు చెబుతున్నాయి. మారికవలస రాజీవ్‌గృహకల్ప, వైఎస్ఆర్‌నగర్, గాంధీనగర్, మధురవాడ పై వంతెన సమీపంలో కాలనీ, సాయిరాం కాలనీ, స్వతంత్రనగర్ ఎన్టీఆర్‌కాలనీ, మారికవలస శారదానగర్, అమరావతినగర్ తదితర ప్రాంతాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా కనిపిస్తోంది. ఇక్కడ బోర్లు సక్రమంగా లేకపోవడం, కుళాయి కనెక్షన్లు ఉన్నా అంతంతమాత్రం నీరు రావడం, సరిపడా ట్యాంకర్లు లేకపోవడం, కొండవాలు ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలు కిందికొచ్చి ఆటోలు, ద్విచక్రవాహనాలపై నీరు పట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహసముదాయాల్లో ఉన్న ప్రాంతాల్లో కేవలం అరగంటే నీరు రావడంతో ఆ సమయంలో నీటి కోసం పోరాడాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి మంచినీటి ఇక్కట్లు తీర్చాలని కోరుతున్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి హైదరాబాద్ సమీప ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన దుప్పలపూడి శ్రీనివాసరావు, సౌమ్య దంపతులు వారి కుమార్తె ఈష పేరిట ఆదివారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని నగదు రూపంలో దేవస్థానం ఈవో ఎన్.సుజాతకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

దాతలకు విరాళ ధ్రువపత్రం అందిస్తున్న ఈవో సుజాత

పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి

పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఎండాడ, న్యూస్‌టుడే: 8వ వార్డు పరిధి దసపల్లాలేఅవుట్ (ఎండాడ)లో తుప్పలతో నిండిపోయిన పార్కులో తక్షణమే పిచ్చిమొక్కలు తొలగించాలని ఎమ్మెల్యే గంటా అధికారులను ఆదేశించారు. చుట్టూ పలు అపార్ట్‌మెంట్‌లు ఉన్న ఈ ప్రాంతంలో పార్కు అభివృద్ధికి కాలనీ అసోసియేషన్ ముందుకు రావాలని కోరారు. చుట్టుపక్కల పిల్లలు, పెద్దలు వినియోగానికి వీలుగా పార్కులో ఆటవస్తువులు, జిమ్‌పరికరాలు, వాకింగ్ ట్రాక్ వంటివి ఏర్పాటు చేయాలని జెడ్సీ అయ్యప్పనాయడును ఆదేశించారు. జోన్-2 పరిధిలో ప్రధాన పార్కులన్నీ ఇదే స్థితిలో ఉన్నాయని స్థానిక నాయకులు ఫిర్యాదు చేయగా వాటి పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని జెడ్సీను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఎల్.అప్పారావు, తెదేపా, జనసేన వార్డు అధ్యక్షులు సీహెచ్ సన్యాసిరావు, శాఖరి శ్రీనివాస్, సీహెచ్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

వెలమ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పీఎంపాలెం, న్యూస్‌టుడే: వెలమ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి. అధ్యక్షుడిగా సూరెడ్డి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా టి.సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయా సంఘం తెలిపింది. నాయకులు చలుమారినాయుడు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలపై పట్టుతో ఉత్తమ ఫలితాలు

భీమునిపట్నం, న్యూస్‌టుడే: పదో తరగతి పాఠ్యాంశాల పట్ల పూర్తిస్థాయిలో పట్టును సాధించడం ద్వారా రానున్న పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమశ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు ఇప్పటి నుంచి అకుంఠిత దీక్షతో కృషి చేయాలని విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె. రామారావు పేర్కొన్నారు. భీమిలిలోని యోగా చైతన్య సంస్థ ప్రాంగణంలో ఆదివారం జిల్లాలోని విశాఖపట్నం, భీమునిపట్నం డివిజన్లకు చెందిన ఎనిమిది ఎస్సీ వసతిగృహాలకు చెందిన 76 మంది విద్యార్థులకు ప్రేరణ కింద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గత ఏడాది జిల్లాలో పదోతరగతిలో సాధించిన 85 శాతం ఉత్తీర్ణతను ఈసారి శతశాతం సాధించేలా హాస్టల్ సంక్షేమాధికారులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠ్యాంశాలకు చెందిన నిపుణులతో ఒత్తిడికి గురి కాకుండా మంచి మార్కులను సాధించేందుకు అవసరమైన మెలకువలను వివరించారు. విశాఖ, భీమిలి డివిజన్ల సహాయ సాంఘిక సంక్షేమాధికారులు ఆర్. శ్యామల, కె.కృష్ణారావు, హాస్టల్ సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

భీమిలి ఎస్సీ హాస్టల్‌లో మాట్లాడుతున్న జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు కె.రామారావు

పోలియో చుక్కలతో చిన్నారులకు రక్షణ

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడంలో తల్లిదండ్రులదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ విషయంలో శతశాతం లక్ష్యాన్ని సాధించేలా వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. సాగర్‌నగర్ జీవీఎంసీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్పొరేటర్ ఎల్.అప్పారావు, 8వ వార్డు తెదేపా, జనసేన అధ్యక్షులు సీహెచ్.సన్యాసిరావు, శాఖరి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

మధురవాడ, న్యూస్‌టుడే: మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు పోలియో కేంద్రాలను రీజనల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.రాధారాణి పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వైద్యాధికారిణి డాక్టర్ దీపికాదేవి, విస్తరణాధికారి పరమేశ్వరరావు, సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. మధురవాడ పీహెచ్‌సీతో పాటు వాంబేకాలనీ తదితర ప్రాంతాల్లో వార్డు తెదేపా కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, 6వ వార్డులో తెదేపా వార్డు అధ్యక్షులు గరే గురునాథ్ పలు కేంద్రాల్లో పోలియో చుక్కలు వేశారు.

అడివివరం (సింహాచలం): జీవీఎంసీ 98వ వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం సింహాచలం గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో జరిగిన పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు.

కొమ్మాది, న్యూస్‌టుడే: రెండు పోలియో చుక్కలతోనే చిన్నారులకు రక్షణ ఉంటుందని తెదేపా 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. మారికవలస రాజీవ్‌గృహకల్ప యూపీహెచ్‌సీలో, శారదానగర్, బొట్టవానిపాలెం తదితర ప్రాంతాల్లో చిన్నారులను కలిసి పోలియో చుక్కలు వేశారు. జనసేన 5వ వార్డు అధ్యక్షులు దేవరశివ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండలం రేఖవానిపాలెంలో మాజీ ఎంపీపీ యరబాల కృష్ణవేణి, సర్పంచి సమ్మిడి శ్రీను, తెదేపా నేత అనిల్‌ప్రసాద్, తదితరులు పాల్గొని పల్స్‌పోలియో చుక్కల మందును పంపిణీ చేశారు. తాళ్లవలసలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి డీఏఎన్ రాజు, కాపులుప్పాడలో మాజీ జడ్పీటీసీ సభ్యులు బోర బంగారరెడ్డి, రాధాకుమారిలు, కృష్ణంరాజుపేటలో జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, పీఏసీఎస్ ఛైర్మన్ గుడ్డాల ఎల్లయ్య, సర్పంచి జీవీ నారాయణ, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే: తగరపువలస పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో తెదేపా కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి, జనసేన వార్డు అధ్యక్షుడు నీలాపు శంకర్‌రెడ్డి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం, న్యూస్‌టుడే: భీమిలి వాసవి కల్యాణ మండపం కేంద్రంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డా.జి.కల్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కాగా ఇంకా మిగిలి ఉన్న పిల్లలకు 22, 23 తేదీల్లో ఇళ్ల వద్దకు వెళ్లి చుక్కలు వేస్తామని అధికారులు పేర్కొన్నారు.

మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోలియో చుక్కలు వేస్తున్న రీజనల్ డైరెక్టర్ రాధారాణి

జాతరలో అలరించిన నృత్యాలు

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడ శిల్పారామం (జాతర)లో ఆదివారం కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జోష్ డాన్స్ అకాడమీ చిన్నారులు నిధి, సుహాని, జస్మిత, మహాన్య, దక్షిత, భవిష్య, మోక్ష, హాసినిలు వారి హావభావాలతో నర్తించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు సందర్శకుల్లో మరింత జోష్‌ను నింపాయి. ఈ నృత్యాలకు మురళీగోవింద్ దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలనాధికారి రమేష్ రెడ్డి చిన్నారులను అభినందించారు.

నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

జూలో 'బ్లాక్‌స్వాన్' దత్తత

ఎండాడ, న్యూస్‌టుడే: జంతువుల సంరక్షణలో భాగంగా ఆళ్వార్ దాస్ పబ్లిక్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న నలం జెస్వికా పుట్టినరోజు సందర్భంగా ఆమె జూ పార్కులో ఒక బ్లాక్ స్వాన్‌ను ఏడాది పాటు దత్తత తీసుకున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఆదివారం తెలిపారు. ఇందుకు అయ్యే ఖర్చును రూ.10,800 అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని బ్లాక్ స్వాన్ ఆరోగ్య సంరక్షణ, పోషణకు వినియోగించనున్నట్లు వెల్లడించారు. అదే విధంగా పిల్లలు, సామాన్య ప్రజల్లో వన్యప్రాణుల పట్ల ప్రేమ, సంరక్షణ పెంపొందించడానికి రోజు, నెల, వార్షిక పరంగా జంతువుల దత్తత తీసుకునే అవకాశం కల్పించామన్నారు. అనంతరం జెస్వికాకు ధ్రువపత్రం అందించారు. ఏడాది పాటు ఆమె ఎన్నిసార్లయినా జూలో ఉచిత ప్రవేశం పొందవచ్చునని పేర్కొన్నారు.

జెస్వికాకు ధ్రువపత్రం అందజేస్తున్న క్యూరేటర్ మంగమ్మ

నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్‌కు సత్కారం

భీమునిపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టరుగా నియమితులైన గాడు సన్యాసినాయుడును భీమిలి జమ్మిచెరువు పార్కు వాకర్స్ అసోసియేషన్ తరఫున ఆదివారం సత్కరించారు. భీమిలికి చెందిన ఆయన 1983 నుంచి తెదేపాలో కొనసాగుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. భీమిలి జమ్మిచెరువు పార్కులో వాకర్స్ సంఘం సభ్యుడు కావడంతో ఆయన్ను సన్మానించారు. జమ్మిచెరువు పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, భీమిలి న్యాయవాద సంఘం అధ్యక్షుడు ఎన్.జనార్దనరావు ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు బి.వెంకటేశ్వరరావు, వి.ఎస్. శంకర్ కుమార్, కె.ముత్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ గాడు సన్యాసి నాయుడును సత్కరిస్తున్న వాకర్స్ సంఘ సభ్యులు

సీపీఐ శత వసంతాల వేడుకలు

పార్టీ జెండాను ఎగురవేస్తున్న సీనియర్ నాయకులు కొల్లి మేఘూరావు

మధురవాడ, న్యూస్‌టుడే: సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం 7వ వార్డు మల్లయ్యపాలెంలో శత వసంతాల వేడుకలు నిర్వహించారు. సీనియర్ నాయకులు కొల్లి మేఘూరావు జెండాను ఎగురవేశారు. ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం సీపీఐ పోరాటం చేస్తోందన్నారు. డిసెంబరు 26న ఉదయం 10 గంటలకు నగరంలో సరస్వతీ పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ప్రజాప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.డి.బేగమ్, ఏరియా కార్యదర్శి వాండ్రాసి సత్యనారాయణ, కె.జగ్గాస్వామి, తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

విశాఖ తూర్పు

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : నిస్వార్థ సేవే సానుకూల సామాజిక మార్పునకు పునాది అని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఉక్కునగరం శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక, సేవా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రజతోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినయం, నిస్వార్థ సేవే శ్రీసత్యసాయి సేవా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, సంస్థ ప్రతినిధులు ఆర్.లక్ష్మణరావు, పి.ఆర్.ఎస్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై వైభవంగా అయ్యవారి సేవ

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి దేవాలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం అయ్యవారి సేవ వైభవోపేతంగా జరిగింది. అర్చకులు దేవేరుల సమేతుడైన గోవిందరాజ స్వామిని పట్టు పీతాంబరాలు, ఆభరణాలతో అలంకరించి బంగారు తొళక్కియాన్ పల్లకిలో కొలువుదీర్చారు. పండితుల పారాయణలు, నాదస్వర మంగళవాయిద్యాల నడమ వయ్యారి నడకలతో ఆలయ బేడామండపంలో దేవతామూర్తుల తిరువీధి నిర్వహించారు. ఆండాళ్ సన్నిధి వద్ద స్వామి, అమ్మవార్లకు పూలదండలు మార్చి తాంబూలం నివేదించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

పెదవాల్తేరు, ఎంవీపీ కాలనీ: 8008574769

మద్దిలపాలెం: 9912120229

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ?: ఈస్టు పాయింట్ కాలనీలో చెత్త పేరుకుపోయింది. సంబంధిత అధికారులు పట్టించుకుని తక్షణం చెత్తను తొలగించాలి. - రామరాజు, స్థానికులు.
✓: రెండు రోజుల్లో సిబ్బందిని పంపించి చెత్త తొలగిస్తాం. - ప్రకాశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ?: 15వ వార్డు పరిధి పాతవెంకోజీపాలెం, హెచ్‌బీకాలనీ రహదారులపై వ్యర్థాలు పేరుకుపోయాయి. - సింహాచలం ✓: తక్షణమే సంబంధిత సిబ్బందిని పంపించి సమస్య పరిష్కరిస్తాం. - కిశోర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: 11వ వార్డు పరిధి ఆరిలోవ అన్నానగర్‌లో అంతర్గత రహదారులలో పైపులైన్ల వాల్‌ల వద్ద మంచి నీరు లీకై వృథాగా పోతోంది. - డాక్టర్ చోరీగల రామారావు ✓: పరిశీలించి సమస్య లేకుండా చూస్తాం. - శ్రీనివాస్, ఏఈ

ఇందిరానగర్, (విశాలాక్షినగర్) న్యూస్‌టుడే: ?: పాత డెయిరీ ఫారం, హనుమంతువాక కూడలి నుంచి ధారపాలెం వరకు వాహనాలు చాలా వేగంగా వెళ్తున్నాయి. - శివకుమార్ ✓: తగిన చర్యలు తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను. - ధర్మేంద్ర, ట్రాఫిక్ ఎస్సై, ఆరిలోవ జోన్

కాలనీల్లో సమస్యలతో సతమతం

ఒకే స్తంభానికి విద్యుత్తు, కేబుల్ తీగలు ఇలా..

మద్దిలపాలెం, న్యూస్‌టుడే

నగర పరిధిలోని పలు కాలనీల్లో ప్రజలు మౌలిక వసతులు అందక ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలతో నిత్యం సతమతం అవుతున్నారు. కొన్ని చోట్ల పేరు గొప్ప.. ఊరు దిబ్బ.. చందంగా పరిస్థితులు నెలకొన్నాయి.

★ అతి పెద్ద కాలనీగా గుర్తింపు పొందిన ఎంవీపీ కాలనీలో నిత్యం పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. 18వ వార్డు పరిధిలోని ఎంవీపీ సెక్టార్-9లో యూజీడీ కోసం తీసిన గోతులు అధ్వానంగా ఉన్నాయి. వీటి కారణంగా స్థానికులు తమ ఇళ్లకు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ పనులు నత్తనడకన సాగుతుండడంతో వృద్ధులు, పిల్లలు అవస్థలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు.

★ డీఆర్‌డీఏ కార్యాలయం వెనుక భాగంలో రహదారులు దారుణంగా మారాయి. అప్పుఘర్ ప్రాంతంలోని కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో దోమల బెడద వెంటాడుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల నియంత్రణకు కనీసం ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టడం లేదని వాపోతున్నారు.

డీఆర్‌డీఏ కార్యాలయం వెనుక భాగంలో రహదారి దుస్థితి

★ అప్పుఘర్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వెనుకనున్న నివాస ప్రాంతాల్లో జీవీఎంసీ సరఫరా చేసే తాగునీటిని కాలనీవాసులు డ్రమ్ముల్లో నింపుకొని మోటార్ల సహాయంతో తీసుకువెళ్లాల్సి వస్తోంది. వీధి దీపాలు వెలగక రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

★ విద్యుత్తు తీగలు చేతికి అందినంత ఎత్తులో ఉండడం, పిచ్చుక గూళ్ల మాదిరిగా విద్యుత్తు, కేబుల్ తీగలు కలిసిపోయి ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీ వాసులు భయపడుతున్నారు.

★ కాలనీలో కొన్నిచోట్ల తాగునీటి బోరుబావులు అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. అనుబంధ రహదారులపై వ్యర్థాలు పేరుకుపోతున్నా యంత్రాంగం పట్టించుకోవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు.

★ పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దుర్వాసన వెంటాడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విభాగాల అధికారులు స్పందించి స్థానిక సమస్యలు పరిష్కరించాలని ఎంవీపీ కాలనీతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలు కోరుతున్నారు.

పబ్లిక్ జిమ్‌లు నిరుపయోగం

పాడైన వ్యాయామ పరికరాలు

పెదవాల్తేరు, న్యూస్‌టుడే: ప్రజల కోసం ఏర్పాటు చేసిన పబ్లిక్ జిమ్‌లు ఒక్కొక్కటి తొలగిస్తున్నారు. బీచ్‌రోడ్డులో గతంలో ఆర్.కె.బీచ్, యోగా విలేజ్, పార్కు హోటల్ కూడలి వద్ద పబ్లిక్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. సుమారు ఒక జిమ్ వద్ద 2 వేల మంది వ్యాయామం చేసేవారు. కనీస నిర్వహణ లేకపోవడంతో వ్యాయామ పరికరాలకు పాడైపోయాయి. ప్రస్తుతం యోగా విలేజ్ వద్దకూడా వ్యాయామ పరికరాలు పూర్తిగా తుప్పు పట్టడంతో కొన్ని పరికరాలు తొలగించారు. కొన్ని నిరుపయోగంగా ఉన్నాయి. పార్కుహోటల్ కూడలి వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి తిరిగి వ్యాయామ పరికరాలు పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

తూనికలు, కొలతలపై అవగాహన

ప్లకార్డులతో లీగల్ మెట్రాలజీ అధికారులు, సిబ్బంది

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ఎంవీపీకాలనీ రైతుబజారులో జాతీయ వినియోగదారుల వారోత్సవాలు పురస్కరించుకొని ఆదివారం ఉదయం తూనికలు, కొలతలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లీగల్ మెట్రాలజీ స్మార్ట్ సిటీ కన్జ్యూమర్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ సభ్యులు, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర్‌నాయుడు వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శించారు. లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ పి.డి.వి.అప్పలరాజు, రాజేష్‌లు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న కాకి గంగరాజు, తదితరులు

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఆరిలోవ, న్యూస్‌టుడే: అన్నానగర్‌లో ఆదివారం ఎస్‌కేడీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య పరీక్షలు జరిపి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. అన్నానగర్, బాలాజీ నగర్, పాత ఆరిలోవ, బీసీ కాలనీ నుంచి పలువురు వైద్య సహాయం పొందారని నిర్వాహకులు కాకి గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక తెదేపా నాయకులు జి.సత్యం, ఒ.అప్పలరాజు, ఎం.రాజారావు, ఆర్.అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రామ కమిటీ ఎన్నికలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 13వ వార్డు పరిధి రామకృష్ణాపురంలో ఆదివారం గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. పోటీలో ముగ్గురు అభ్యర్థులు నిలబడగా 99 ఓట్ల మెజారిటీతో వంకర బాబూరావు ఎన్నికైనట్లు నిర్వాహకులు తెలిపారు. బాబూరావుకు 288 ఓట్లు రాగా ప్రత్యర్థులైన డోల బైరెడ్డికు 189 ఓట్లు, ఆదినారాయణకు 32 ఓట్లు వచ్చాయని ఎన్నికల నిర్వాహక సభ్యులు తెలిపారు. గ్రామంలో సభ్యత్వం కలిగి ఉన్న ప్రజలు ఎన్నికల్లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకున్నారు.

వి.బాబూరావుకు ధ్రువపత్రం అందజేస్తున్న దృశ్యం

యోగా దినోత్సవంలో పాల్గొన్న ట్రస్టు సభ్యులు

యోగాతో అంతర్గత ప్రశాంతత

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ధ్యానం ఆత్మ పరిశీలన, అంతర్గత ప్రశాంతతకు దోహదపడుతుందని సహజ యోగా ట్రస్టు కన్వీనర్ రామకృష్ణ అన్నారు. బీచ్‌రోడ్డు వైఎంసీఏ ఎదురుగా ఆదివారం ఉదయం యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగా అలవర్చుకోవాలని అన్నారు. మాతాజీ నిర్మలాదేవి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

జూలో ‘బ్లాక్‌స్వాన్’ దత్తత

ఎండాడ, న్యూస్‌టుడే: జంతువుల సంరక్షణలో భాగంగా ఆళ్వార్ దాస్ పబ్లిక్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న నలం జెస్వికా పుట్టిన రోజు సందర్భంగా ఆమె జూ పార్కులో ఒక బ్లాక్ స్వాన్‌ను ఏడాది పాటు దత్తత తీసుకున్నట్లు జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఆదివారం తెలిపారు. ఇందుకు అయ్యే ఖర్చు రూ.10,800 అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తాన్ని బ్లాక్ స్వాన్ ఆరోగ్య సంరక్షణ, పోషణకు వినియోగించనున్నట్లు వెల్లడించారు. ఇదే విధంగా పిల్లలు, సామాన్య ప్రజల్లో వన్యప్రాణుల పట్ల ప్రేమ, సంరక్షణ పెంపొందించడానికి రోజు, నెల, వార్షికపరంగా జంతువుల దత్తత తీసుకునే అవకాశం కల్పించామన్నారు. అనంతరం జెస్వికాకు ధ్రువపత్రం అందించారు. ఏడాది పాటు ఆమె ఎన్నిసార్లయినా జూలో ఉచిత ప్రవేశం పొందవచ్చునని పేర్కొన్నారు.

జెస్వికాకు ధ్రువపత్రం అందజేస్తున్న క్యూరేటర్ మంగమ్మ

స్పందనకు వందనం

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: 22వ వార్డు పరిధిలోని శివాజీపాలెం, శ్రీకృష్ణ ఆలయ సమీప కాలువల్లో పూడికలు తొలగించక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ఆదివారం ‘ఈనాడు’లో వెలువడిన వార్తాకథనానికి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు స్పందించారు. సంబంధిత సిబ్బందితో కాలువల్లో పూడిక తీయించి శుభ్రత చర్యలు చేపట్టారు.

జేసీఐ సేవలు మరువలేనివి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) వేదిక, చిన్నారుల లక్ష్యంగా చేస్తున్న సేవలు మరువలేనివని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు చేయాలని ఆకాంక్షించారు. డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో జేసీఐ 10వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గంటా పాల్గొని జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ఇటువంటి సంఘాలు, సంస్థలు మరిన్ని పెరగాలన్నారు. జేసీఐ అధ్యక్షురాలు మోనిక శ్రీనివాస్, నేషనల్ కోఆర్డినేటర్ గుంటు రాజేష్‌బాబు, జోన్-4 అధ్యక్షుడు వసంతవాడ చైతన్య, మైరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కొర్రపాటి శ్రీవల్లి పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జేసీఐ అధ్యక్షురాలు మోనిక శ్రీనివాస్, ప్రతినిధులు

వాడవాడలా పల్స్‌పోలియో

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమం ఆదివారం వాడవాడలా జరిగింది. ఇందులో భాగంగా 16వ వార్డు కేఆర్ఎంకాలనీలో ఫైవ్‌లైట్స్ ఎవర్‌గ్రీన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొంప సీతారాం, డాక్టర్ వీవీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం ఆర్టీసీ కాంప్లెక్సు ఆవరణలో, 22వ వార్డు పీతలవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 15వ వార్డులో కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, ఇతర ప్రాంతాల్లో స్థానిక నాయకులు పోలియో చుక్కలు వేశారు.

ఆరిలోవ, న్యూస్‌టుడే: పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం 11, 12, 13 వార్డుల పరిధిని పలు ప్రాంతాల్లో జరిగింది. కార్యక్రమంలో వైద్యులు కిరణ్ లలితాదేవి, జి.మహిత, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, 13వ వార్డు కార్పొరేటర్ కె.సునీత, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

చిన్నారికి పోలియోచుక్కలు వేస్తున్న కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్

ఘనంగా ‘గురు పరంపర’

ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శన

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురు పరంపర పేరిట జాతీయ నృత్యోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నగరానికి చెందిన పలు శిక్షణ సంస్థల విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కృష్ణా జిల్లా కూచిపూడి గ్రామానికి చెందిన ఎం.శ్రీరామచంద్రమూర్తికి వెంపటి రవిశంకర్ జీవిత సాఫల్య పురస్కారాన్ని అందజేశారు. నిర్వాహకులు వెంకటరమణరావు, పైడా విద్యాసంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత సూరపునేని విజయ్‌కుమార్, డాక్టర్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

పురస్కారం అందుకున్న శ్రీరామచంద్రమూర్తితో నిర్వాహకులు

సీఎం సహాయనిధి అందజేత

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధిని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం ఎంవీపీ కాలనీలోని తన కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఇసుకతోటకు చెందిన వారణాసి సుశీలకు రూ.41,463, ప్రియదర్శిని కాలనీకి చెందిన పొట్నూరు కనకదుర్గకు రూ.61,572 చొప్పున ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైంది. సంబంధిత మంజూరు పత్రాలను, చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నాయకులు వెలగపూడి ప్రతాప్‌రుద్ర, పల్లా ఉమారాణి, మొల్లి శంకర్, జి.అప్పన్న, ఎన్.గోపి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

డాక్టర్ డీవీ సూర్యారావుకు పురస్కారం

సీతంపేట, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత, సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావుకు సోమనాథ కళాపీఠం 2023-24 సంవత్సరానికి గాను సాహిత్య పురస్కారాన్ని ప్రకటించారు. తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుడి జన్మ స్థలమైన జనగామ జిల్లా పాలకుర్తిలోని సోమనాథ కళాపీఠం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ నెల 31న పాలకుర్తిలో పురస్కార సభ జరుగుతుందని పీఠం అధ్యక్ష, కార్యదర్శులు రాపోలు సత్యనారాయణ, ఇమ్మడి దామోదర్ డాక్టర్ సూర్యారావుకు లేఖ ద్వారా తెలియజేశారు.

వనితా వాకర్స్ క్లబ్‌కు అవార్డుల పంట

మురళీనగర్, న్యూస్‌టుడే: సమాజహిత కార్యక్రమాల్లో ముందుంటూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న వనితా వాకర్స్ క్లబ్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ నుంచి 3 అవార్డులు దక్కాయి. ఆదివారం నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ 34వ కౌన్సిల్ మీటింగులో అధ్యక్షురాలు పి.ప్రభావతికి బెస్ట్ సర్వీసు క్లబ్, ఎం.జయకు బెస్ట్ యోగాటీచర్, చదువుల పద్మావతికి బెస్ట్ బులెటిన్ అవార్డులు వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి చేతులమీదుగా అందుకున్నారు. ఇంటర్నేషనల్ క్లబ్‌కు ఆర్థిక పరిపుష్టి కలిగించినందుకు రీజనల్ కౌన్సిలర్ యు.శుభకు ప్రత్యేక అవార్డు అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఆంధ్రవిశ్వవిద్యాలయం పాఠశాలలో 1985లో పదో తరగతి చదువుకొని వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఏయూ ప్లాటినం జూబ్లీ ఆతిథ్య గృహంలో జరిగింది. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడిగా గడిపారు. తొలుత తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఒమ్మి నూకరాజు, మజ్జి శ్రీనివాస్, వెంకట్ ప్రభు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ పాఠశాల పూర్వవిద్యార్థులు

సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులోని ఏపీ ఈపీడీసీఎల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (సీఓఈఈటీ) కార్యాలయ భవన సముదాయంలో ఏపీ విద్యుత్తురంగ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఎలక్ట్రాన్‌వైబ్-ఏపీ హ్యాకథాన్ ఫలితాలను ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. హ్యాకథాన్ పోటీలను సీఓఈఈటీ, క్లీన్ క్లైమేట్ ఫౌండేషన్ (సీసీఎఫ్) ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ సంయుక్తంగా నిర్వహించాయి. ఇందులో హమ్‌సాట్, ఐసెన్‌సెస్, ఏరోవ్యన్, స్మార్ట్‌గ్రిడ్, ఓల్డ్ వైస్ సంస్థలు విజేతలుగా నిలిచాయి. బహుమతి ప్రదానోత్సవంలో సీఎండీ పృథ్వీతేజ్ మాట్లాడుతూ.. వివిధ సంస్థల మధ్య పోటీతత్వంతో పాటు సృజనాత్మక ఆవిష్కరణలను ప్రోత్సహించి, స్టార్టప్ సంస్థలను బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గత ఏడాది ఏపీ హ్యాకథాన్-2024 విజేతలకు ఇప్పటికే ఏపీఈపీడీసీఎల్‌లో ప్రాజెక్టులు కేటాయించామన్నారు.

విజేతకు జ్ఞాపిక అందజేస్తున్న ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సీఎండీలు పృథ్వీతేజ్, శివశంకర్

★ స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించే దిశగా ఈ ఏడాది అక్టోబరులో ఆహ్వానించిన మేరకు 45 సంస్థలు పాల్గొన్నాయి. వీటిల్లో రాష్ట్ర విద్యుత్తు పంపిణీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు స్మార్ట్‌డేటా, ఆధారిత ఆధునిక సాంకేతిక పరిష్కార మార్గాలను కనుగొనేలా తుదిజాబితాలో 9 స్టార్టప్ సంస్థలు ఎంపిక య్యాయన్నారు. సీఎండీలు పృథ్వీతేజ్, లోతేటి శివశంకర్, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.

జగన్ జన్మదిన వేడుకలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం మద్దిలపాలెం వైకాపా కార్యాలయంలో నిర్వహించారు. కేక్ కోసి నాయకులకు పంచిపెట్టారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎంపీ గొల్ల బాబూరావు, ఆపార్టీ నేతలు కె.కె.రాజు, మళ్ల విజయప్రసాద్, మొల్లి అప్పారావు, వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కోస్తున్న ఎంపీ గొల్ల బాబూరావు, నాయకులు కె.కె.రాజు తదితరులు

4న గీతకులాల వనసమారాధన

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: గీతకులాల ఐక్యవేదిక సభ్యుల ఆధ్వర్యంలో జనవరి 4వ తేదీన ముడసర్లోవ పార్కులో వన సమారాధన చేపట్టనున్నట్లు ఐక్యవేదిక సభ్యులు గిరిబాబు తెలిపారు. ఈ మేరకు సంబంధిత గోడపత్రికను ఆదివారం ఎంవీపీ కాలనీలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు ఆవిష్కరించారు. సభ్యులు కృష్ణగౌడ్, సంపంగి శ్రీను, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య అన్నప్రసాద పథకానికి హైదరాబాద్ సమీప ఇబ్రహీంపట్నం ప్రాంతానికి చెందిన దుప్పలపూడి శ్రీనివాసరావు, సౌమ్య దంపతులు ఆదివారం రూ.లక్ష విరాళంగా సమర్పించారు. నగదు రూపంలో దేవస్థానం ఈవో ఎన్.సుజాతకు అందజేశారు. అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మర్యాదపూర్వక కలయిక

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: విశాఖ లోక్‌సభ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడిగా చోడే వెంకట పట్టాభిరామ్‌ను ఆపార్టీ నియమించింది. ఈ నేపథ్యంలో ఆదివారం జనసేన నాయకుడు, 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ మర్యాదపూర్వకంగా పట్టాభిరామ్‌ను కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

పట్టాభిరామ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మూర్తియాదవ్

శ్రద్ధాంజలి

ఆలయ అభివృద్ధికి అహర్నిశలు మీరు చేసిన కృషిని మరువలేము. అనుక్షణం మీ జ్ఞాపకాలతో.. మీ అడుగుజాడల్లో నడుస్తూ... మీ ఆశయములకు అనుగుణంగా ఐకమత్యంతో మెలుగుతూ.. మీ చల్లని దీవెనలు ఆశిస్తూ... మీరు మాకు పంచిన ప్రేమ, ఆప్యాయత, అనురాగాలను మా జీవితాంతం మరువలేము. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

శ్రీ మామిడి వెంకటరావు గారు

కమిటీ మెంబర్స్

అక్కరబోయిన చంద్రరావు | కిలాని బంగారురాజు
వీర్ని నరశింగరావు | అక్కరబోయిన అప్పలరాజు
సీరపు గణేష్‌రెడ్డి | అక్కిరెడ్డి కనకరాజు
అక్కరబోయిన మురళీమోహన్ | పిరియా రాజగోపాలరావు
రెడ్డిపల్లి వెంకట సునీల్ | యర్ర మల్లేశ్వరరావు
వైకుంఠం లక్ష్మునాయుడు | రాజమహేంద్ర వీరభద్రస్వామి
కంచుబోయిన సూర్యనారాయణ | శ్రీ సిద్ధసాయి కృష్ణ మందిర్ సేవా సంక్షేమ సంఘం, ముడుగుల్లు, ఆదర్శనగర్, విశాఖపట్నం

ఉత్సాహంగా సైకిల్ ర్యాలీ

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఈస్ట్ కోస్ట్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తెన్నేటిపార్కు నుంచి వైజాగ్ వ్యూపాయింట్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఫిట్‌గా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు డీఆర్ఎం లలిత్ బోహ్రా అన్నారు. ప్రతి ఒక్కరూ యోగా, స్కిప్పింగ్ రోప్, నడక, పరుగు, సైక్లింగ్, జాగింగ్, రన్నింగ్ లాంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సహాయ క్రీడా అధికారి రంతిదేవ్ ఇతర అధికారులు సాహూ, ఎన్ ఉషా తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

బియ్యం లారీ బోల్తా..

గురుద్వారా, న్యూస్‌టుడే: డ్రైవర్ నిద్ర మత్తులో విభాగినిని ఢీకొనడంతో బియ్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదురు జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ నుంచి గాజువాకకు బియ్యం బస్తాలతో లారీ వస్తుండగా తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ వద్దనున్న పెట్రోల్ బంక్ ఎదురుగా విభాగినిని ఢీకొట్టడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. నాలుగో పట్టణ ట్రాఫిక్ ఎస్సై సుదర్శన్ లారీని తరలించేలా చర్యలు తీసుకున్నారు.

ఔషధ మొక్కలను కాపాడుకుందాం

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఔషధ మొక్కలను కాపాడుకుందాం అని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమార స్వామి పిలుపునిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్ ఆవరణలో ప్రకృతి ఆధారంగా పండిన పంటల సంతలో ఆయన మాట్లాడారు. గ్రీన్ క్లైమేట్ టీం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు జేవీ రత్నం తీసుకువచ్చిన శతావరి గురించి చర్చించారు. దేశీయ ఆయుర్వేద సంపదను కాపాడాలని కోరారు. ప్రతి పొలంలో ఆయుర్వేద వైద్యానికి అవసరమైన మొక్కలను నాటాలన్నారు. కార్యక్రమంలో గోఆధారిత ప్రకృతి రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్యం, సుభాష్, రిషి, నరేంద్ర బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న గోఆధారిత ప్రకృతి రైతుల సంఘం సభ్యులు

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

పేదలకు వస్త్రాలు అందజేస్తున్న డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, సంస్థ సభ్యులు

పేదలకు వస్త్రాల పంపిణీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతనగరంలోని స్వామి వివేకానంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సంస్థ గౌరవాధ్యక్షుడు డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్ పాల్గొని వాటిని అందజేశారు. తదుపరి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయండి

వన్‌టౌన్, న్యూస్‌టుడే: సామాజిక, సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సూచించారు. పాతనగరంలోని టౌన్‌హాలు వద్దనున్న వైజాగ్‌పటం క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వనభోజనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు ఎమ్మెల్యే వంశీకృష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పీఎస్‌నాయుడు, అదనపు ప్రభుత్వ న్యాయవాది కన్నూరు అప్పలనాయుడు, సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ పైల సన్నిబాబును ఈ సందర్భంగా నిర్వాహకులు సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు వంకాయల తాతాజీ, కార్యదర్శి బి.రాజాపాత్రుడు, ఉపాధ్యక్షుడు నరవ రాంబాబు, ఇతర ప్రతినిధులు భరత్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న వైజాగ్ పటం క్లబ్ సభ్యులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
విశాఖ ఉత్తరం: 8008574796
విశాఖ దక్షిణం: 8008574977

గురుద్వారా, న్యూస్‌టుడే: ?: నక్కవానిపాలెం పాత ఏఎంజీ ఆసుపత్రి నుంచి దిగువ ప్రాంతంలో ఎడమ వైపు కాలువ శిథిలమైంది. దీంతో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దుర్వాసన వస్తోంది. – శ్రీనివాస్ ✓: త్వరగా మరమ్మతులు చేస్తాం. – వార్డు సచివాలయ కార్యదర్శి

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: సెక్టార్-11 లోని 7బీ స్తంభానికి ఉన్న వీధి దీపం వెలగక అంధకారం అలుముకుంటోంది. రాత్రుళ్లు ఇబ్బందులు పడుతున్నాం. – జి.పుష్పలత ✓: సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం. – అర్చన, వీధిదీపాల ఏఈ

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు మహాత్‌కాలనీలో చెత్త కుండీలు వ్యర్థాలతో నిండి, తీవ్ర దుర్వాసన వెదజల్లుతున్నాయి. –కె.అప్పారావు ✓: సిబ్బందిని పంపించి వ్యర్థాలను తొలగించేలా చూస్తాం. – వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 37వ వార్డు రెల్లివీధిలో వేగ నిరోధకాలకు జీబ్రా గుర్తులు వేయకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. – కృష్ణ ✓: పరిశీలించి జీబ్రా గుర్తులు వేయిస్తాం. – మల్లయ్యనాయుడు, జోన్–4, జేడీ

సిబ్బంది ఉండరు.. సేవలు అందవు..

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: విశాఖ ఉత్తరం నియోజకవర్గంలోని పలు సచివాలయాల్లో సిబ్బంది కానరావడం లేదు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే దివ్యాంగులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారు. దొండపర్తి సమీపంలోని నెహ్రూబజార్‌లోని 144 నెంబరు, శంకరమఠం వెనకాల రోడ్డులోని 143 నెంబరు సచివాలయాల్లోని సిబ్బంది సక్రమంగా విధుల్లో ఉండటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సచివాలయానికి ఎప్పుడు వెళ్లినా డేటా ఎంట్రీ ఆపరేటర్లు లేరనే సమాధానమే వస్తోందని ప్రజలు చెబుతున్నారు. అడ్మిన్ కూడా అందుబాటులో ఉండకపోవడంతో తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నామని స్థానికులు వాపోతున్నారు. నెలలు తరబడి సచివాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండటం లేదని చెబుతున్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న నెహ్రూబజార్‌లోని సచివాలయం

తిప్పుతున్నారు తప్ప పని చేయడం లేదు: నా భర్త చనిపోయి ఇద్దరు పిల్లలతో బతుకీడుస్తున్నాను. నా పెద్ద కుమారుడు ఇంటర్, చిన్న కుమారుడు పదో తరగతి చదువుతున్నారు. మా పిల్లలకు గతంలో అమ్మఒడి రాలేదు. ఈ కూటమి ప్రభుత్వంలోనైనా 'తల్లికి వందనం' వస్తోందని ఆశించాను. కానీ రాలేదు. మా రేషన్ కార్డుకు ఎవరిదో విద్యుత్తు బిల్లు లింకయ్యిందని తెలిసింది. దీంతో విద్యుత్తు కార్యాలయానికి వెళ్లి సరి చేయించి 143 సచివాలయంలో గ్రీవెన్స్‌లో ఆ పత్రాలు సమర్పించాను. అయినా పని జరగలేదు. సచివాలయ సిబ్బంది విద్యుత్తు కార్యాలయానికి వెళ్లాలని పంపుతున్నారు. అటు ఇటు తిప్పుతున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదు. – అల్లూరి మహేశ్వరి

✦ **సదరం ధ్రువీకరణ కోసం తిరుగుతున్నా:** నేనొక దివ్యాంగుడిని. సదరం ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకోగా విజయనగరం జిల్లాలో స్లాట్ వచ్చింది. అక్కడికి వెళ్లగా వైద్యులు పరీక్షలు నిర్వహించారు. దివ్యాంగ ధ్రువీకరణ పత్రం సంబంధిత సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని వైద్యులు చెప్పడంతో నెహ్రూబజార్‌లోని సచివాలయానికి వెళ్లాను. 45 రోజులుగా తిరుగుతున్నా అక్కడ సంక్షేమ కార్యదర్శి తప్ప వేరే సిబ్బంది ఉండటం లేదు. ఉన్నవారు సమాధానం చెప్పడం లేదు. ధ్రువీకరణ పత్రం ఇవ్వకపోవడంతో పింఛనకు అర్జీ చేసుకోవడానికి వీలు లేకుండా పోతోంది. – వాడపల్లి వెంకటరమణ

జాతీయ స్థాయి అబాకస్ పోటీలు

గురుద్వారా, న్యూస్‌టుడే: వామా అబాకస్ సంస్థ ఆధ్వర్యంలో సీతమ్మధార కేఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లో ఆదివారం ఉదయం జాతీయ స్థాయి అబాకస్ పోటీలు నిర్వహించారు. నగరం, ఇతర రాష్ట్రాల నుంచి 5 - 14 ఏళ్ల విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సంస్థ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, మాధవి బహుమతులు ప్రదానం చేశారు.

ప్రతిభ కనబరచిన చిన్నారులు

రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో మెలగాలి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు సత్‌ప్రవర్తనతో మెలగాలని మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ అన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి రౌడీషీటర్లతో పాటు వారి కుటుంబ సభ్యులను పిలిపించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు మంచి మార్గంలో నడవాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నారు. గొడవలు, భూవివాదాలు, బెదిరింపులు, హత్యలో పాల్గొంటే తక్షణం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లను మంచి మార్గంలో నడిపించే బాధ్యత కుటుంబ సభ్యులపైనా ఉందన్నారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం అందజేత

గురుద్వారా, న్యూస్‌టుడే: టీపీటీకాలనీలో ప్రమాదానికి గురై కాళ్లు విరిగిపోయిన హెల్త్ హోం జిమ్ నిర్వాహకుడు ఆనంద్‌కు విశాఖ జిమ్ ఓనర్స్ సంక్షేమ సంఘం తరఫున ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. సంఘం అధ్యక్షులు గణేశ్, కార్యదర్శి బి.కోటిరెడ్డి సుమారు రూ.25 వేల నగదు ఆయనకు అందజేశారు. సంఘం కోశాధికారి షిప్ సురేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి మోహన్, గురునాథరావు, మూర్తి, సత్యరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

పోర్టుల ప్రైవేటీకరణను ఐక్యంగా అడ్డుకోవాలి

మాధవధార, న్యూస్‌టుడే: దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ పరిశ్రమలైన పోర్టులను ప్రైవేటు పరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు ముమ్మురం చేస్తోందని, దీనిని పోర్టు ఉద్యోగులు, పింఛనర్లు, కార్మిక సంఘాలు కలిసికట్టుగా అడ్డుకోవాలని పోర్టు మాజీ ట్రస్టీ, సంఘం ప్రధాన కార్యదర్శి బి.సి.హెచ్.మసేన్ పేర్కొన్నారు. మాధవధారలోని ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన హార్బర్ అండ్ పోర్టు పింఛనర్ల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోర్టు ఆస్పత్రులను కార్పొరేట్‌కు అప్పగిస్తే వైద్య సేవల కోసం పింఛనర్లు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఈ సందర్భంగా పింఛనర్ల సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావును సత్కరించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పన్న నారాయణరావు, కార్యదర్శి పి.ఎస్.ప్రకాశరావు, శివ ప్రకాష్, పిల్లా అప్పయ్యదొర తదితరులు పాల్గొన్నారు.

చౌదరి అప్పారావును సత్కరిస్తున్న పోర్టు పింఛనర్ల సంఘం సభ్యులు

'జైల్లో పెడతామని బెదిరించడం సరికాదు'

సీతంపేట, న్యూస్‌టుడే: అధికారంలో ఉన్నన్నాళ్లు ఒక్క వైద్య కళాశాల కూడా నిర్మించలేని వైకాపా అధినేత జగన్.. నేడు కూటమి ప్రభుత్వం పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు కడుతుంటే ఆస్పత్రుల నిర్వాహకులను జైల్లో పెడతామని బెదిరించడం సరికాదని జనసేన నాయకురాలు, కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆరోపించారు. విశాఖ పౌర గ్రంథాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రుషికొండ ప్యాలెస్, సర్వేరాళ్ల మీద బొమ్మల కోసం వందల కోట్లు ఖర్చు చేసిన జగన్.. ప్రజారోగ్యం కోసం చంద్రబాబు యోగాంధ్ర నిర్వహిస్తే దానిపై విషప్రచారం చేయడం తగదన్నారు. వైకాపా హయాంలో రాష్ట్రం నుంచి పరిశ్రమలను వెళ్లగొడితే కూటమి ప్రభుత్వ హయాంలో కంపెనీలను తీసుకొస్తున్నారన్నారు.

బియ్యం లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

గురుద్వారా, న్యూస్‌టుడే: డ్రైవర్ నిద్రమత్తులో విభాగినిని ఢీకొనడంతో బియ్యం లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడిన ఘటన నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్ నుంచి గాజువాకకు ఆదివారం ఉదయం బియ్యం బస్తాలతో లారీ వస్తుండగా తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ వద్దనున్న పెట్రోల్ బంక్ ఎదురుగా విభాగినిని ఢీకొట్టడంతో అదుపుతప్పి లారీ బోల్తా పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. సంఘటన స్థలానికి చేరుకున్న నాలుగో పట్టణ ట్రాఫిక్ ఎస్సై సుదర్శన్ లారీని తరలించేలా చర్యలు తీసుకున్నారు.

బోల్తా పడిన లారీ

28న కాళింగల ఆత్మీయ సమావేశం

మాధవధార, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లలో ఈ నెల 28న నిర్వహించనున్న కాళింగల ఆత్మీయ సమావేశానికి జిల్లాలోని కాళింగులు కుటుంబ సభ్యులతో హాజరై విజయవంతం చేయాలని జిల్లా ఖారవేల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పేడాడ నర్సింగరావు పిలుపునిచ్చారు. మాధవధారలోని కసకుర్తు కల్యాణ మండపంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. కాళింగుల ఐక్యతను పెంపొందించేందుకు ఏటా ఒక్కొక్క ప్రాంతంలో ఈ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. నిర్వాహకులు పేడాడ రమణికుమారి, కె.వి.రమణ, ఎస్.నరసింహస్వామి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.వరప్రసాద్, ఎస్.కీర్తి, టి.పద్మజ, పి.పుణ్యవతి, బి.లలిత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఖారవేల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పేడాడ నర్సింగరావు

'స్టీల్‌ప్లాంట్‌ను నిర్వీర్యం చేయాలని ప్రయత్నం'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు ఆరోపించారు. జగదాంబ కూడలి వద్దనున్న సీటూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీచ్‌రోడ్డులో వాజ్‌పేయి విగ్రహావిష్కరణ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడం లేదని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో 10 వేల మంది కార్మికులను తొలగించారని, సొంత గనులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

జేసీఐ సేవలు మరువలేనివి

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) పేదలకు, చిన్నారులకు చేస్తున్న సేవలు మరవలేనివని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవలు చేయాలని ఆకాంక్షించారు. డైమండ్ పార్కు సమీపంలోని ఓ హోటల్‌లో జేసీఐ 10వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గంటా పాల్గొని జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో ఇటువంటి సంఘాలు, సంస్థలు మరిన్ని పెరగాలన్నారు. కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షురాలు మోనిక శ్రీనివాస్, నేషనల్ కోఆర్డినేటర్ గుంటు రాజేష్‌బాబు, జోన్-4 అధ్యక్షుడు వసంతవాడ చైతన్య, మైరా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ కొర్రపాటి శ్రీవల్లి, బి. దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జేసీఐ అధ్యక్షురాలు మోనిక శ్రీనివాస్, ప్రతినిధులు

జగదాంబ కూడలి వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్

జగదాంబ దాటాలంటే గంట

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండగలు వస్తుండటంతో జగదాంబ కూడలి ఆదివారం జనాలతో కిక్కిరిసిపోయింది. వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా కోర్టు, కలెక్టరేట్, సూర్యబాగ్ వైపుగా జగదాంబ కూడలికి వచ్చే వాహనాలు ఆయా ప్రాంతాల్లో గంటల కొద్ది నిలిచిపోయాయి. దీనికి తోడు ఈ కూడలిలో సిగ్నల్స్ లేవు. ట్రాఫిక్ నియంత్రణకు ఒకే ఒక్క కానిస్టేబుల్ పనిచేయడంతో పాటు పార్కింగ్‌కు స్థలం లేకపోవడంతో దుకాణాలు ఎదుటే వాహనాలు నిలిపివేయడంలో మరింత ఇబ్బందులు ఎదురయ్యాయి. వాహనచోదకులు తీవ్ర అసహనానికి గురయ్యారు. 108 అంబులెన్సులకు కూడా దారి లేకుండా పోవడంతో రోగులు ఇబ్బందులకు గురయ్యారు.

వనితా వాకర్స్ క్లబ్‌కు అవార్డుల పంట

మురళీనగర్, న్యూస్‌టుడే: సమాజహిత కార్యక్రమాల్లో ముందుంటూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్న వనితా వాకర్స్ క్లబ్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ నుంచి 3 అవార్డులు దక్కాయి. ఆదివారం నిర్వహించిన వాకర్స్ ఇంటర్నేషనల్ 34వ కౌన్సిల్ మీటింగులో అధ్యక్షురాలు పి.ప్రభావతికి బెస్ట్ సర్వీసు క్లబ్, ఎం.జయకు బెస్ట్ యోగాటీచర్, చదువుల పద్మావతికి బెస్ట్ బులెటిన్ అవార్డులు వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ప్రభావతి చేతులమీదుగా అందుకున్నారు. ఇంటర్నేషనల్ క్లబ్‌కు ఆర్థిక పరిపుష్టి కలిగించినందుకు రీజనల్ కౌన్సిలర్ యు.శుభకు ప్రత్యేక అవార్డు అందజేశారు.

నిర్వాహకుల నుంచి అవార్డు అందుకుంటున్న ప్రభావతి

ధ్యానంతో మానసిక ప్రశాంతత

ధ్యానం చేస్తున్న ఆక్సిజన్ టవర్స్ వాసులు

గురుద్వారా, న్యూస్‌టుడే: ధ్యానం చేయడంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఓం ఉచిత యోగా సంస్థ వ్యవస్థాపకుడు సీహెచ్.వెంకటరమేశ్ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో ఆదివారం ధ్యానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ధ్యానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏయూ యోగా కేంద్రం అధ్యక్షులు శాంతారాం, ఉష, కాశీ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: ధ్యానం చేయడం వల్ల ఉల్లాసంగా ఉంటారని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధి జె.మోహన్‌రావు పేర్కొన్నారు. బీచ్‌రోడ్డులోని బుద్ధుడి విగ్రహం వద్ద సొసైటీ సభ్యులు ధ్యానం చేశారు.

సీతంపేట, న్యూస్‌టుడే: రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ డిగ్రీ, పీజీ కళాశాలలో గత మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న ధ్యాన సాధన ఆదివారంతో ముగిసింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ శిక్షకురాలు కవిత ముఖ్యఅతిథిగా పాల్గొని ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల కరస్పాండెంట్ డి.సత్యనారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి విజయ, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో..

ప్రిజమ్ కళాశాలలో..

సృజనాత్మక ఆలోచనలకు ప్రోత్సాహం

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: సాగర్‌నగర్ బీచ్‌రోడ్డులోని ఏపీఈపీడీసీఎల్ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (సీఓఈఈటీ) కార్యాలయంలో ఏపీ విద్యుత్తురంగ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన ఎలక్ట్రాన్ వైబ్-ఏపీ హ్యాకథాన్ ఫలితాలను ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆదివారం సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. హ్యాకథాన్ పోటీలను సీఓఈఈటీ, క్లీన్ క్లైమేట్ ఫౌండేషన్ (సీసీఎఫ్) ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ సంయుక్తంగా నిర్వహించాయి. ఇందులో హమ్‌సాట్, ఐసెన్‌సెస్, స్మార్ట్‌గ్రిడ్, ఓల్డ్‌వైస్ సంస్థలు విజేతలుగా నిలిచాయి. స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించే దిశగా ఈ ఏడాది అక్టోబరులో ఆహ్వానించిన మేరకు 45 సంస్థలు పాల్గొన్నాయి. వీటిల్లో రాష్ట్ర విద్యుత్తు పంపిణీ వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లకు స్మార్ట్‌డేటా, ఆధారిత ఆధునిక సాంకేతిక పరిష్కార మార్గాలను కనుగొనేలా తుదిజాబితాలో 9 స్టార్టప్ సంస్థలు ఎంపికయ్యాయన్నారు. సీఎండీలు పృథ్వీతేజ్, లోతేటి శివశంకర్, ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు.

కేంద్రానికి తీసుకొచ్చి.. పోలియో చుక్కలు వేయించి..

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించి పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని ఉత్తరం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 26వ వార్డు ఎన్‌జీజీఓఎస్‌కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కార్పొరేటర్ ముక్కా శ్రావణితో కలిసి ఎమ్మెల్యే చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 44వ వార్డులోని పోలియో కేంద్రాలను తెదేపా రాష్ట్ర బి.సి.సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేష్ పరిశీలించారు. దొండపర్తిలోని యూపీహెచ్‌సీలో కేంద్రాలను కార్పొరేటర్ గొలగాని వీరారావు పర్యవేక్షించారు.

కంచరపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 48, 54 వార్డుల్లో నాయకులు ముందుగానే ప్రచారం చేయడంతో తల్లిదండ్రులు పిల్లలను తీసుకుని పోలియో కేంద్రాల వద్దకు వచ్చారు. కూటమి నేతలు వింజుమూరి భాస్కర్, గంకల అప్పారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మాధవధార, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో 8 యూపీహెచ్‌సీల్లో, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, సామాజిక భవనాల్లో మొత్తం 60 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివారం హాజరుకాలేని వారికి, 22, 23 తేదీల్లో సిబ్బంది ఇంటింటికి వెళ్లి వేయనున్నట్లు అధికారులు తెలిపారు.

పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

గురుద్వారా, న్యూస్‌టుడే: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ భవనంలో వార్డు తెదేపా అధ్యక్షురాలు బర్ల పద్మలత చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 29వ వార్డు శ్రీరంగపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో పోలియో కేంద్రానికి భాజపా వైద్య విభాగం ప్రతినిధులు పిల్లలను తీసుకొచ్చారు. భాజపా వైద్య విభాగ కన్వీనర్ ఆర్.రవి కుమార్, డాక్టర్ ఎస్.శ్రీలక్ష్మి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 55వా వార్డు గంగానగర్‌లోని సచివాలయంలో రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు.

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 38వ వార్డులో కార్పొరేటర్ గోడి విజయలక్ష్మి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వార్డు సీనియర్ నాయకులు నరసింహాచారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మురళీనగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ 49, 50వ వార్డుల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు బహుళ అంతస్తుల సముదాయాల వద్ద మురళీనగర్ ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ జయంత్ ఆధ్వర్యంలో పోలియో చుక్కలు వేశారు.

గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో

శ్రీరంగపురం పాఠశాల ఆవరణలో..

38వ వార్డులో..

వైభవ వేంకటేశ్వరుడికి విశేష భోగం

మురళీనగర్, న్యూస్‌టుడే: ప్రకృతిని కాపాడటం, సమాజ శ్రేయస్సు, సామాజిక అభ్యుదయాన్ని కోరుతూ గోదాదేవి గోపికలను మేల్కొలిపి భక్తిపారవశ్యంతో చేసిన పూజల గురించి వైభవుడి దివ్యక్షేత్రం ప్రధాన అర్చకులు శేషాచార్యులు వివరించారు. ఆదివారం జరిగిన 6వ పాశుర విన్నపం అనంతరం 150 రకాల ప్రత్యేక సుగంధ ద్రవ్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, దుంపలు మేళవింపుతో తయారుచేసిన కదంబం ప్రసాదాన్ని విశేషభోగంగా స్వామివారికి నివేదించి భక్తులకు వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవుడికి నివేదించిన కదంబ ప్రసాదం

డాక్టర్ డీవీ సూర్యారావుకు పురస్కారం

సీతంపేట, న్యూస్‌టుడే: ప్రముఖ రచయిత, సాహితీవేత్త డాక్టర్ డీవీ సూర్యారావుకు సోమనాథ కళాపీఠం 2023-24 సంవత్సరానికి గాను సాహిత్య పురస్కారాన్ని ప్రకటించారు. తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుడి జన్మ స్థలమైన జనగామ జిల్లా పాలకుర్తిలోని సోమనాథ కళాపీఠం ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ నెల 31న పాలకుర్తిలో పురస్కార సభ జరుగుతుందని పీఠం అధ్యక్ష, కార్యదర్శులు రాపోలు సత్యనారాయణ, ఇమ్మడి దామోదర్ డాక్టర్ సూర్యారావుకు లేఖ ద్వారా తెలియజేశారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: క్రీస్తు ప్రభువు బోధించిన ప్రేమ, క్షమాపణను మానవాళి అనుసరిస్తే జీవనం సుఖంగా ఉంటుందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని జ్ఞానాపురం దరి భాజపా కార్యాలయంలో ఆదివారం వార్డు భాజపా అధ్యక్షుడు వంక సంజీవి మహిళలకు చీరలు, రగ్గులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని వస్త్రాలు అందజేశారు. వార్డు జనసేన అధ్యక్షుడు ఆంథోని శేఖర్, గవర రమణ, బేతరాణి తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట, న్యూస్‌టుడే: విశాఖ పౌర గ్రంథాలయంలో చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన మియావాకీలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కథలను కథకులు ఎం.సీతాశ్రీనివాస్ వివరించారు. ఆర్.వరలక్ష్మి జపనీస్ చెక్క థియేటర్ విధానం కమిషిమాయి ద్వారా ప్రదర్శించారు. * బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో బీవీ ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ ఛైర్మన్ నరవ ప్రకాశరావు ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు జరిపారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. డాక్టర్ కె.వి.ఎస్ మూర్తి, అశోక్, శ్రీనివాసరావు, ఫాదర్ రవితేజ, బి.కె.ప్రసాదరావు, అబ్దుల్ సలీం, మహమ్మద్ హుసేన్, బ్రహ్మకుమారి రమ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

పౌర గ్రంథాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

(c) eenadu

గాజువాక

•గాజువాక •విశాఖ పశ్చిమం

టిడ్కో ఇళ్లు కేటాయించాలని ఆందోళన

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడలో టిడ్కో ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు ఆదివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసనకు దిగారు. వక్తలు మాట్లాడుతూ.. ఈనెల 17 నాటికల్లా గృహాలు కేటాయిస్తామని అధికారులు మాట తప్పారన్నారు. నేటికీ కేటాయించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నివాసిత సంఘం సభ్యులు రమణి, లక్ష్మి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

గోపాలపట్నం(కొత్తపాలెం): జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలేనికి చెందిన కె.జయపతి రాజారావు, పి.పేరయ్య ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు ఇంటికి వెళ్లి పరామర్శించి.. వారికి సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.8లక్షల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దాడి వెంకటరమేశ్, వార్డు తెదేపా అధ్యక్షులు బి.విజయ్‌కుమార్, దాడి సురేశ్ పాల్గొన్నారు.

దారి చెంత.. మృత్యు గుంత..!

దర్పణం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: తాగునీటి పైపులైను మరమ్మతుల పేరుతో రహదారి మధ్యలో గుంతను తవ్వేసి వదిలేశారు. దీంతో రాకపోకలకు నివాసితులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి గాజువాక 74వ వార్డు సిద్ధేశ్వరం వాటర్ ట్యాంకు రోడ్డులో కనిపిస్తోంది. భూగర్భ లైను పునరుద్ధరణ నిమిత్తం ఇటీవల నడిరోడ్డును తవ్వారు. మరమ్మతులకు జాప్యం జరగడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు బిక్కు బిక్కుమంటున్నారు. అసలే కొండ ప్రాంతకాలనీ, ఆపై తవ్వకాల ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణం లైను సరిచేసి రాకపోకలకు వెసులుబాటు కల్పించాలని వీరంతా కోరుతున్నారు.

ప్రతిభ చూపారు.. 'జిల్లా' దాటారు..

వైజ్ఞానిక ప్రదర్శనలో రాణించిన విద్యార్థులు..

గోపాలపట్నం (కొత్తపాలెం), అక్కిరెడ్డిపాలెం, మల్కాపురం (యారాడ), న్యూస్‌టుడే : నగరంలోని కేవీఎం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో గాజువాక, పశ్చిమ నియోజకవర్గాలకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలకు ఎంపికయ్యారు. ఈనెల 23 నుంచి విజయవాడలో ఈ ప్రదర్శనలు జరగనున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు.. వాటి ఉపయోగాలు తెలుసుకుందాం..

సుస్థిర వ్యవసాయం..: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థిని లావణ్య, 9వ తరగతి విద్యార్థిని లక్ష్మీప్రసన్న కలిసి 'మంచి పోషక పదార్థంతో సుస్థిరమైన వ్యవసాయం(సూపర్ శోషక పాలిమర్) నమూనా తయారు చేశారు. వీరు చేసిన నమూనా నీరు అంతగా లభించని ప్రాంతాల్లోనూ సుస్థిర వ్యవసాయం చేయటానికి దోహదం పడుతుంది. ఒకసారి నీరుపెడితే పదిరోజుల పాటు తడి ఉంటుంది.

నమూనా తయారు చేసిన విద్యార్థులు లావణ్య, లక్ష్మీప్రసన్న

చెత్త నుంచి సంపద... మిందిి జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బొడ్డి కుషాలిని, పట్నాన లావణ్య చెత్త నుంచి సంపద ఎలా తయారు చేయవచ్చో తమ ప్రయోగంతో వివరించారు. వ్యర్థాల నిర్వహణ- ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం థీమ్‌ను ఎంచుకున్న పిల్లలు చెత్త నుంచి సంపద అనే వైజ్ఞానిక ప్రదర్శన చేపట్టారు. చెత్తను మండించడం ద్వారా విద్యుత్తు తయారు చేసినప్పుడు ఉష్ణశక్తిని వినియోగించి కాంతి శక్తిని విస్మరిస్తున్నాం. వృథాగా పోతున్న కాంతి శక్తిని ఉపయోగించి విద్యుత్తును తయారు చేయడమే ఈ ప్రదర్శన ముఖ్యఉద్దేశం.



విద్యార్థులు తయారు చేసిన చెత్త నుంచి సంపద ప్రాజెక్టు

జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో కుషాలిని, లావణ్య, టీచర్ రామునాయుడు

ప్రమాదాలు నివారిద్దాం..: యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.సాత్విక్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. 'విద్యుత్తు ఆదా.. ప్రయాణ సమయాల్లో ప్రమాదాల నివారణ' నమూనాను తయారు చేశాడు. వాహనాల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అదే సమయంలో ప్రమాదాలు కూడా ఎక్కువవుతున్నాయి. దీన్ని అరికట్టేందుకు ఎలాంటి సాంకేతికత ఉపయోగించాలనే కోణంలో నమూనాను తయారు చేశాడు. అలాగే ఆటోమేటిక్ వీధి దీపాల వ్యవస్థ వల్ల విద్యుత్తును ఆదా చేయవచ్చని తన ప్రయోగంలో వివరించాడు.

తాను రూపొందించిన ఆటోమేటిక్ వీధి దీపాల ప్రాజెక్టుతో సాత్విక్

పారిశ్రామిక ప్రాంతంలో క్రిస్మస్ సందడి

ధ్రువపు జింకల బండిపై కానుకలు పంచే క్రిస్మస్ తాత



ఆకట్టుకుంటున్న ఏసు, మేరీమాత విగ్రహాలు

మల్కాపురం, న్యూస్‌టుడే : నగరంలో క్రిస్మస్ సందడి నెలకొంది. చర్చిలు ముస్తాబయ్యాయి. ఇళ్ల మీద స్టార్స్ మెరుస్తున్నాయి. ఏసుప్రభు, మేరీమాత, శాంతాక్లాజ్ బొమ్మలతో పాటు క్రిస్మస్ టీ విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి. పారిశ్రామిక ప్రాంతంలోని మల్కాపురం ప్రధాన రహదారి మీద ఆదివారం ఓ వ్యక్తి వీటిని విక్రయిస్తుండగా.. పెద్దఎత్తున వీటిని కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే : జీవీఎంసీ 69వ వార్డులోని పలు అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆదివారం ప్రారంభించారు. వార్డులోని తుంగ్లాంలో ఇటీవల పూర్తయిన రహదారులను రిబ్బను కత్తిరించి ప్రారంభించారు. వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను గుత్తేదారులు సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

ప్రసన్నగిరిపై లక్ష తులసీ పూజ

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: బీహెచ్‌పీవీ కూడలిలోని ప్రసన్నగిరిపై ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ఆదివారం లక్ష తులసీ పూజ జరిగింది. ధనుర్మాస మాసోత్సవంలో భాగంగా ప్రసన్న వేంకటేశ్వర స్వామిని సుందరంగా అలంకరించి అర్చకులు లక్ష తులసీలతో భక్తి శ్రద్ధలతో పూజను నిర్వహించారు. ధనుర్మాసంలో భాగంగా ఈనెల 30న ఉత్తర ద్వార దర్శనం, వచ్చే నెల 11న కూడార్రై, 14న గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కె.పద్మావతి తెలిపారు.

స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం

కూర్మన్నపాలెం,(దువ్వాడ): దువ్వాడ రైల్వేస్టేషన్ పరిసరాల్లో అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని 88వ వార్డు కార్పొరేటర్ మెల్లి ముత్యాలనాయుడు అన్నారు. ఆదివారం దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పందన చేయూత ఫౌండేషన్, ఇండియన్ ఆస్తి కల్స్ నిర్వాహకులు శాశ్వత ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన సిమెంటు బెంచీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో దువ్వాడ రైల్వే వినియోగదారుల సంఘం ప్రతినిధులు కె. ఈశ్వర్, బి.కామేశ్వరరావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఇ.బుచ్చిరాజు, ఎంఎస్ఎన్ మూర్తి, సీతారామరాజు, ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

గాజువాక: 98494 65088

పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే :

?: కణితిరోడ్డు అజీమాబాద్‌లో సిమెంటు రోడ్డు వేసి డ్రైనేజీని మూసేశారు. జీవీఎంసీ అధికారులు విస్మరించకుండా పట్టించుకోవడం లేదు. - వి.ప్రసాద్, అజీముద్దీన్, -సంతోష్, బీసీరోడ్డు, ✓: జోన్-6 ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించాము. - శేషాద్రి, ఈఈ

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం పుడేవీయల్ సామాజిక భవనం వద్ద డ్రైనేజీని తరలించడం లేదు. - అంజిబాబు, మర్రిపాలెం, ✓: ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపడతాం. - మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

?: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం శివారు మహేంద్రనగర్ వీధిదీపాలు వెలగడం లేదు. - బాబూరావు, మహేంద్రనగర్, ✓: దీపాల మరమ్మతులు చేపడతాం. - గోవిందరావు, వీధిదీపాల నిర్వాహకులు

వైద్య శిబిరం విజయవంతం

శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గంగవరం మత్స్యకార గ్రామంలో పులిచెర్ల ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పేద ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పులిచెర్ల మురళీకృష్ణ, మాజీ కౌన్సిలర్ పులిచెర్ల రాజేశ్వర్, పోర్ట్ ఎస్ హాస్పిటల్ ప్రతినిధి డాక్టర్ పి.రవి శంకర్, డాక్టర్లు తరుణ్‌కుమార్, రాజిత, శ్రావణి, గీతిక, కృష్ణ, అనిల్, జోయ్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

మోసాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

బీసీరోడ్డు(గాజువాక), న్యూస్‌టుడే : వినియోగదారులు చైతన్యవంతులైతేనే మోసాలకు అడ్డుకట్ట వేయవచ్చని లీగల్ మెట్రాలజీ సహాయ నియంత్రకులు ఎస్‌ఎం రాధాకృష్ణ అన్నారు. గాజువాక వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా బీసీరోడ్డులో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. వర్తక సంఘం అధ్యక్షుడు కొల్లా గుప్తా, సభ్యులు విశ్వేశ్వరరావు, చైతన్య, ప్రకాశ్, తాతాజీ, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణలో రాధాకృష్ణ, వర్తక సంఘం ప్రతినిధులు

ఉక్కునగరంలో ఫిట్‌థాన్ ప్రారంభం

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3), న్యూస్‌టుడే : ఉక్కునగరం డిపాల్ పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం ఫిట్‌థాన్ నిర్వహించారు. ఉక్కు డైరెక్టర్ డాక్టర్ సలీమ్ ఎం. పురుషోత్తమన్ ఫిట్‌థాన్ ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు. సుమారు 1100 మంది పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉక్కు అధికారులు ఎం. మధుసూదనరావు, ఎన్.భాను, వి.లీల, డాక్టర్ సారంగి, పాఠశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఫాదర్ అనీష్ మాథ్యూ, ఫాదర్ సాజి, ఫాదర్ జోషన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిట్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఉక్కు డైరెక్టర్ డాక్టర్ సలీమ్ ఎం.పురుషోత్తమన్

మరో ఏడాదిలో ఫేజ్-3 ఇళ్ల నిర్మాణం పూర్తి

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: బీహెచ్‌పీవీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ 49వ సర్వసభ్య సమావేశం ఆదివారం బెల్ కాలనీలోని ఆడిటోరియంలో జరిగింది. సొసైటీ ఉపాధ్యక్షుడు ఎ.వెంకటరావు మాట్లాడుతూ.. సొసైటీ సాలాపువానిపాలెంలోని ఫేజ్-3 ఇళ్ల నిర్మాణం ఏడాదిలో పూర్తి కాబోతుందన్నారు. ఉద్యోగుల సొంతింటి కల ఎట్టకేలకు నెరవేరబోతుందన్నారు. సభ్యులు నిర్మాణానికి అవసరమైన డబ్బులు చెల్లించి సహకరించాలన్నారు. సమావేశంలో వాగ్వాదాలు జరిగే అవకాశం ఉందని పాలకవర్గం సమాచారం ఇవ్వడంతో గాజువాక సీఐ పార్థసారథి, ఎస్సై జగదీశ్, ఏఎస్సై, కొంత మంది పోలీలు బందోబస్తుగా వచ్చారు. కోర్టుకి వెళ్లిన వారు అక్కడి రాజీవంతో కొంత ఆందోళనకు పరిస్థితి నెలకొంది. సీఐ వారితో మాట్లాడారు. సమావేశంలో 290 మంది సభ్యుల్లో 8 మంది మినహా మిగతా వారు అందరూ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో డైరెక్టర్లు ఎస్. సాహు, పీవీఎన్ రాజు, పాలవలస భాస్కరరావు, మూర్తి, సీనియర్ సభ్యుల కమిటీ, సభ్యులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు, చిత్రంలో డైరెక్టర్లు సాహు, పీవీఎన్ రాజు, భాస్కరరావు, మూర్తి

వస్తువులు కొనేటప్పుడు జాగ్రత్తలు పాటించండి

గోపాలపట్నం, న్యూస్‌టుడే: జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గోపాలపట్నం రైతుబజార్‌లో తూనికలు, కొలతల శాఖ గాజువాక విభాగం ఆధ్వర్యంలో వినియోగదారులకు, వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వస్తువులు కొనేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఎస్.ఎం. రాధాకృష్ణ, ఇన్‌స్పెక్టర్ రాజారావ్, ఎస్టేట్ అధికారి ప్రసాద్, సహాయకులు శ్రీనాథ్ పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

బాక్సింగ్‌లో అక్కాచెల్లెళ్ల ప్రతిభ

రేష్మాయాదవ్, ప్రవల్లిక యాదవ్

మల్కాపురం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 20, 21వ తేదీల్లో కాకినాడ జిల్లా పిఠాపురం జూనియర్ ప్రత్యేక కళాశాలలో జరిగిన ఎలైట్ రాష్ట్ర మహిళా ఛాంపియన్ షిప్-2025 బాక్సింగ్ పోటీల్లో అక్కాచెల్లెళ్లు రేష్మాయాదవ్ 65-70, ప్రవల్లిక 80 కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించారు. వీరిద్దరు వచ్చే ఏడాది జనవరిలో ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు శిక్షకులు తెలిపారు.

'ములకలపల్లి' సేవలు ఆదర్శనీయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే : నాలుగు దశాబ్దాలుగా ఉక్కు ఎస్సీ నిర్వాసితుల సమస్యలపై పోరాడిన ములకలపల్లి అప్పారావు జీవితం ఆదర్శనీయమని భాజపా ఎస్సీ మోర్చా విశాఖ జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి ప్రకాశ్ కొనియాడారు. ఆదివారం పెదగంట్యాడ కూడలిలో ఉక్కునిర్వాసిత ఎస్సీ సంఘం అధ్యక్షుడు అప్పారావు 25వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజూరి దీపక్, నాయకులు మహేశ్వరరెడ్డి, వంశీ, సత్యారావు, భువనేశ్వరి, ముసలయ్య, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వార్షిక క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రామికనగర్(గాజువాక), న్యూస్‌టుడే: భావనారుషి మార్కండేయ పద్మశాలి సంఘం గాజువాక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పాతగాజువాకలో వార్షిక క్యాలెండర్ ఆవిష్కరించారు. సంఘం అధ్యక్ష కార్యదర్శులు కోడి శ్రీను, బొజ్జ శ్రీను, గౌరవాధ్యక్షులు కె.కోటేశ్వరరావు, కె.గోవిందరాజు, కోశాధికారి సిద్ధనాతి సన్యాసిరావు, సభ్యులు పి.భవానీ, దేవుళ్లు, సన్యాసిరావు, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

బింగో సర్కస్ ప్రారంభం

వేపగుంట, న్యూస్‌టుడే: పొట్టకూటి కోసం ప్రమాదకర విన్యాసాలతో చూపరులను అలరించే సర్కస్ కళాకారులను ప్రజలు ఆదరించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు కోరారు. వేపగుంట ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం వారు కళాకారులతో కలిసి బింగో సర్కస్‌ను ప్రారంభించారు. వేపగుంట, పెందుర్తి పరిసర ప్రాంతాల ప్రజలకు ఇదో చక్కటి అవకాశమని, ఈ ప్రదర్శన పిల్లలకు చూపించడం వల్ల వారికి వినోదంతోపాటు, విజ్ఞానాన్ని అందించే అంశాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సునీల్ చౌహాన్, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారుల విన్యాసాలను అతిథులు తిలకించి వారిని అభినందించారు.

జ్యోతి వెలిగించి సర్కస్‌ను ప్రారంభిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు

రక్తదాన శిబిరం విజయవంతం

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: ఆటోనగర్ ఎస్ఎఫ్ఎ క్వార్టర్సులో ఆదివారం జరిగిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. స్థానిక యువకుడు కుంపట్ల మణికంఠ, ఆయన మిత్ర బృందం, వందేభారత్ బ్లడ్‌బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. 101 మంది దాతలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని నిర్వాహకులు పేర్కొన్నారు.

యోగ సాధనతో ఒత్తిడి నుంచి ఉపశమనం

యోగా సాధనలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

సింధియా, న్యూస్‌టుడే : శ్రీహరిపురం దరి అన్నపూర్ణనగర్‌లో పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సాధన, ఉపాధ్యాయుల శిక్షణ ముగింపు వేడుకల్లో ఎమ్మెల్యే గణబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. యోగాను చులకన భావంతో విమర్శించటం ప్రతిపక్ష నాయకుడికి సమంజసం కాదన్నారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, సభ్యులు పాల్గొన్నారు.

అగనంపూడి, న్యూస్‌టుడే : ఉరుకులు, పరుగుల జీవనంలో మానసిక ప్రశాంతత పొందడానికి ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని ప్రజాపిత బ్రహ్మకుమారీ సంస్థ మురళీనగర్ ఇన్‌ఛార్జి పి.కె.విద్య కోరారు. ఆదివారం ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా ధ్యానంపై నిర్వహించిన శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. దివ్యజ్యోతి భవనం ఇన్‌ఛార్జి రామకోటి, స్థానిక స్వచ్ఛంద సేవా సంఘాల ప్రతినిధులు బొండా అప్పారావు, బి.సత్యనారాయణ, కె.హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ధ్యానంతో మానసిక వికాసం వృద్ధి చెందుతుందని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం అంతర్జాతీయ ధ్యాన దినం పురస్కరించుకుని అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో నెల్లిముక్కు కల్యాణ మండపంలో ధ్యాన వేడుక నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, భాజపా కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, అహింస ధ్యానకేంద్రం నిర్వాహకులు మీసాల శివగణేశ్వరరావు, వనిత, పిట్టా రెడ్డి, కిలాని ముసలయ్య, ధ్యాన కేంద్రాల సభ్యులు పాల్గొన్నారు.



ధ్యానంపై శిక్షణ ఇస్తున్న విద్య



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, చిత్రంలో ధ్యాన కేంద్రాల ప్రతినిధులు

పోలియో నిర్మూలనకు కృషిచేద్దాం..

చినగంట్యాడలో పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఎన్ఏడీకూడలి, గోపాలపట్నం, న్యూస్‌టుడే: పోలియో నిర్మూలనకు అందరూ కృషిచేయాలని ఎమ్మెల్యే గణబాబు అన్నారు. పలు వార్డుల్లో స్థానిక కార్పొరేటర్లు, నాయకులతో కలిసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: పల్స్ పోలియో కార్యక్రమాల్లో 88వ వార్డు కార్పొరేటర్ ఎం. ముత్యాలునాయుడు, నియోజకవర్గ వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు మాటూరి రాము, కర్రి కృష్ణ, జి.భాస్కర్, ఎస్.రాజేష్, డి.శ్రీను, తెదేపా సీనియర్ నాయకులు గొలగాని సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గాజువాక, పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక పీహెచ్‌సీ వద్ద ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పోలియో చుక్కలు వేశారు. వైద్యాధికారులు డాక్టర్లు శ్రీనివాస్, బద్రీనారాయణమూర్తి, హేమలత, సంపత్‌బాబు, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, పులి లక్ష్మీబాయి, మాజీ కౌన్సిలర్లు ఎండీ రఫీ, పప్పు రాజారావు, భాజపా కన్వీనర్ కేవీఎన్ ఆర్, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడి ప్రాంతంలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో గాజువాక తెదేపా మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవాని, జీవీఎంసీ 85వ వార్డు తెదేపా అధ్యక్షుడు కర్రి దశేంద్ర పాల్గొన్నారు.

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3) న్యూస్‌టుడే: ఉక్కునగరంలోని స్టీల్ జనరల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 980 మందికి పోలియో చుక్కలు వేశారు. స్టీల్ జనరల్ ఆసుపత్రి హెచ్ఓడీ డాక్టర్ సారంగి, తదితరులు పాల్గొన్నారు.

సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో 27 అంగన్వాడీ కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం కొనసాగింది. పోలియో చుక్కలు వేయకుండా మిగిలిపోతే ఈనెల 22, 23 తేదీల్లో అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని సిబ్బంది వెల్లడించారు.

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 69, 68వ వార్డు కార్పొరేటర్లు కాకి గోవిందరెడ్డి, గుడివాడ అనూష తమ వార్డుల్లో పోలియో చుక్కలు వేశారు.

మల్కాపురం, న్యూస్‌టుడే : ఐదేళ్ల వయసులోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలను వేయించాలని జీవీఎంసీ 62వ వార్డు తెదేపా అధ్యక్షులు మజ్జి మాలినాయుడు అన్నారు. వార్డు పరిధిలో నున్న పోలియో చుక్కల కేంద్రాలను ఆదివారం ఆయన సందర్శించారు. పిల్లలకు పోలియో చుక్కలను వేశారు. భవిష్యత్తు పోలియో రహిత సమాజంగా తీర్చిదిద్దాలన్నారు.

కరాస, న్యూస్‌టుడే : వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మడపాలెంలో పిల్లలకు గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్ బాబు పోలియో చుక్కలు వేశారు.

తుమ్మడపాలెం పోలియో కేంద్రంలో ..

దిబ్బపాలెంలో..

'ఆటో' వెళ్లేది ఎటో..!

ఫోకస్

కణితిరోడ్డు (గాజువాక), న్యూస్‌టుడే: వైద్యసేవల నిమిత్తం కణితిరోడ్డులోని యూపీహెచ్‌సీకి వచ్చేవారికి అనధికార వాహనాల పార్కింగ్ చుక్కలు చూపిస్తోంది. ఆరోగ్య కేంద్రం పక్కనే ఆటో స్టాండ్ ఉండడంతో వాహనదారులు నేరుగా తెచ్చి ముందునే పార్కు చేస్తున్నారు. దీంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకున్న వారులేక ఇతర వాహనాలను ఆరుబయటే నిలుపుతున్నారు. వైద్యసిబ్బంది తమ వెంటతెచ్చిన వాహనాలు పార్కు చేయడానికి వీల్లేకపోతోంది. అనధికార పార్కింగ్‌కు ఇకనైనా చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఆసుపత్రి వద్ద ఆటోల పార్కింగ్

నిస్వార్థ సేవలతోనే గుర్తింపు

సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3): నిస్వార్థ సేవే సానుకూల సామాజిక మార్పునకు పునాది అని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఉక్కునగరం శ్రీసత్యసాయి ఆధ్యాత్మిక, సేవా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రజతోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వినయం, నిస్వార్థ సేవే శ్రీసత్యసాయి సేవా సంస్థలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సమితి కన్వీనర్ జి.రామకృష్ణ, సంస్థ ప్రతినిధులు ఆర్.లక్ష్మణరావు, పి.ఆర్.ఎస్.నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 68, 69వ వార్డుల్లోని పలు కాలనీల్లో ఆదివారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు జరిగాయి. వైకాపా నాయకులు గుడివాడ అనూష, లతీశ్, అప్పలరామ్మూర్తి, సంద్రాన నూకరాజు, భోగాది సన్యాసిరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుక సందర్భంగా వైకాపా సీనియర్ నాయకులు ఇల్లపు రాము పలువురికి నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య చేతుల మీదుగా వీటిని అందించారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక, పెదగంట్యాడలో ఆదివారం వైకాపా కార్యకర్తలు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పార్టీ ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నాయకులు మార్డుపూడి పరదేశి, ధర్మాల శ్రీను, పల్లా చినతల్లి, అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి, న్యూస్‌టుడే: అగనంపూడిలో జీవీఎంసీ 85వ వార్డు వైకాపా అధ్యక్షుడు జి. పూర్ణానందశర్మ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పాల్గొన్నారు.

నిత్యావసర సరకులు, నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకట్రామయ్య

సీపీఐ పతాకావిష్కరణ

పతాకావిష్కరణలో స్టాలిన్, తదితరులు

గాజువాక, న్యూస్‌టుడే: సీపీఐ శతవార్షికోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం గాజువాక, పెదగంట్యాడలో పలుచోట్ల పతాకావిష్కరణలు నిర్వహించారు. రాష్ట్ర పార్టీ కంట్రోల్ కమిషన్ కార్యదర్శి ఎ.జె.స్టాలిన్ జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ.. పేదల పక్షాన సీపీఐ పోరు సాగిస్తుందని పేర్కొన్నారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

(c) eenadu

న్యూస్‌టుడే బృందం

ఈనాడు మీ తోడు

శీతాకాలం వెన్నులో వణుకు పుడుతోంది. ఇంట్లో దుప్పట్లు, రగ్గులు ఎన్ని ఉన్నా ఇంకా ఇబ్బందే. అలాంటిది పేదలు, ప్రభుత్వ వసతి గృహాల్లో ఉండే బాలల పరిస్థితి తలచుకుంటేనే అయ్యో అనిపిస్తుంది. కొందరి అవస్థలైనా తీర్చాలనే సత్సంకల్పంతో 'ఈనాడు' దాతల సాయం కోరింది. ఒక్క పిలుపు పలువురిని కదిలించింది. అడిగిందే తడవుగా మేమున్నామంటూ దాతలు స్పందించారు. దుప్పట్లు, రగ్గులు, చాపలు, జంబుఖానాలు.. ఇలా ఎక్కడ ఏది అవసరం ఉందో అవి కొని బాలలకు అందించారు. మరోచోట వసతి గృహ కిటీకీలనే దాత పూర్తిగా మార్పించేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం **రూ. 1,29,400** విలువైన సాయం అందించారు.

చల్లని మనసులు.. చలిని దూరం చేశాయ్..

దాతలను కదిలించిన 'ఈనాడు' పిలుపు

కిటికీలకు మెస్‌లు

గజపతినగరం/బొండపల్లి: బొండపల్లి మండలం దేవుపల్లి బీసీ బాలికల వసతి గృహంలో కిటీకీలకు మెస్‌లు లేక దోమలతో విద్యార్థినులు అవస్థలు పడేవారు. జర్వాల బారిన పడేవారు. గజపతినగరంలోని శీరంరెడ్డి సన్యాసినాయుడు ఎడ్యుకేషనల్ అనుబంధ సంస్థ సాయి సిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ ఎస్.చంద్రశేఖర్ స్పందించారు. మెస్‌లను ఏర్పాటు చేయించారు.

...వివరాలు 6లో

నియోజకవర్గం	దాత	ఎవరికి సాయం	ఇచ్చినవి	విలువ(రూ.లలో)	ఎంతమందికి
విజయనగరం	చెరుకూరి శ్రీధర్, మారుతీ సేవా సంఘం	సారథి సంక్షేమ సంఘం అంధుల వసతి గృహం	రగ్గులు, మిక్సీ	15 వేలు	30
చీపురుపల్లి	సాదెం వెంకటరమణ	చీపురుపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ వసతిగృహం	రగ్గులు	14 వేలు	40
గజపతినగరం	శీరంరెడ్డి చంద్రశేఖర్	దేవుపల్లి బీసీ బాలికల వసతి గృహం(బొండపల్లి)	కిటికీలకు మెస్‌లు	25 వేలు	18
ఎస్. కోట	స్నేహ స్వచ్ఛంద సంస్థ	దారపర్తి పంచాయతీ కురిడి గ్రామస్థులు	రగ్గులు	15,750	63
నెల్లిమర్ల	తాటికొండ సాయిసూర్య ఫణికీర్తి	భోగాపురం బీసీ వసతి గృహం	దుప్పట్లు, జంబుఖానాలు	10 వేలు	26
బొబ్బిలి	శతపతి అన్నపూర్ణ	రామభద్రపురం సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం	చాపలు	15 వేలు	90
సాలూరు	మహంతి రాంబాబు	కస్తూర్బా పాఠశాల(కరాసువలస)	దుప్పట్లు	12,600	105
పాలకొండ	సత్యసాయి సేవా సమితి	ఎస్సీ బాలుర వసతిగృహం	రగ్గులు	2,500	14
పార్వతీపురం	పొట్నూరు గౌరీశంకరరావు, సూర్యప్రకాష్, చలపతిరావు	ఎస్సీ బాలికల వసతి గృహం విద్యార్థులకు	చాపలు	9,000	113
కురుపాం	బుడంకాయల శ్రీనివాసరావు	కోసింగిభద్ర గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల	రగ్గులు	10,550	94

రాష్ట్ర నైపుణ్య పోటీలో 'బంగారు పతకం'

కొత్తవలస, న్యూస్‌టుడే: జాతీయ నైపుణ్య అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో 'రోబోటిక్ సిస్టం ఇంటిగ్రేషన్' అంశంపై నిర్వహించిన రాష్ట్ర నైపుణ్య పోటీ-2025లో కొత్తవలస మండలం చిన్నిపాలెంకి చెందిన వి.జగదీష్ బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈనెల 19, 20 తేదీల్లో గుంటూరులో జరిగిన పోటీల్లో ప్రతిభ చూపాడు. ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ, సీఈవో జి.గణేష్ కుమార్ చేతుల మీదుగా బంగారు పతకం, ప్రశంసాపత్రం అందుకున్నట్లు చెప్పాడు. ఆదివారం ఎమ్మెల్యే లలిత కుమారి ఆయనను అభినందించారు

పోలియో రహిత సమాజానికి కృషి చేద్దాం

చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న మంత్రి శ్రీనివాస్

బొండపల్లి, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజానికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం గొట్లాం గ్రామంలో పల్స్‌పోలియో కేంద్రాన్ని ఆయన సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పలు విషయాలను గ్రామీణ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తెదేపా మండల అధ్యక్షుడు రాపాక అచ్చెంనాయుడు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ కోరాడ కృష్ణ, జిల్లా వైద్యశాఖాధికారిణి జీవనరాణి తదితరులు పాల్గొన్నారు.

హాయిగా.. హుషారుగా..

తాటిపూడి జలాశయంలో కయాక్ బోటులో విహారం

తాటిపూడి(గంట్యాడ), న్యూస్‌టుడే: తాటిపూడి జలాశయంలో బోటు షికారు పర్యాటకులను అలరిస్తోంది. పలు ప్రాంతాల నుంచి జలవిహారం చేసేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు తాటిపూడికి తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో బోటు నిర్వాహక సంస్థ (వాటర్ స్పోర్ట్స్ సింపుల్) ఇంతవరకు 18 బోట్లను అందుబాటులో ఉంచింది. వీటిలో 4 కయాక్ బోట్లు. వీటి తెడ్డు సహాయంతో నడపాల్సి ఉంటుంది. ఇవి సాధారణంగా కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లో ఉంటాయి. ఒక బోటులో ఇద్దరు ప్రయాణించాలి, ఒక్కొక్కరికి రూ. 150 చొప్పున వసూలు చేస్తున్నామని సూపర్‌వైజర్ కృష్ణ తెలిపారు. రద్దీగా ఉన్న రోజుల్లో కూడా సాధారణ దినాల్లో నిపుణుల పర్యవేక్షణలో వీటిని పర్యాటకులకు ఇస్తున్నామని తెలిపారు.

శివన్నపేటలో ఏనుగుల తిష్ఠ

కురుపాం మండలంలోని శివన్నపేట, చెరుపుకొమ్ము వలస పరిసరాల్లో రెండు రోజులుగా ఏనుగుల గుంపు తిష్ఠ వేసింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సమీప గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

విధేయత, సమర్థతకే మళ్లీ పట్టం

● విజయనగరం పార్లమెంటరీ అధ్యక్షుడిగా కిమిడి నాగార్జున

ఈనాడు, విజయనగరం

జిల్లాలో పార్టీ బలోపేతం, వచ్చే ఏడాది జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్రంలో పార్లమెంటు జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకాన్ని తెదేపా చేపట్టింది. విజయనగరం పార్లమెంటు నియోజకవర్గం అధ్యక్షుడిగా కిమిడి నాగార్జున(38)కు రెండోసారి పదవి కట్టబెట్టింది. 2020లో తొలిసారి ఈ పదవిలో నియమితులైన ఆయన గతేడాది ఎన్నికల వరకు చీపురుపల్లి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రస్తుత అధ్యక్షుడిగా నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా నగరానికి చెందిన ప్రసాదుల వరప్రసాద్ (42)ను నియమిస్తూ పార్టీ ఆదివారం ప్రకటించింది. సమర్థత కలిగిన ముగ్గురు నాయకులు పోటీపడినా, నాగార్జునకే మొగ్గు చూపింది. వారికి రాష్ట్ర పార్టీలో పదవులు కట్టబెట్టాలని నాయకత్వం యోచిస్తోంది.

కసరత్తు చేసి..

ఈ నియామకాలకు నాయకత్వం తీవ్ర కసరత్తు చేసింది. త్రిసభ్య కమిటీతో పాటు పార్టీ ప్రాంతీయ, నియోజకవర్గాల సమన్వయకర్తల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంది. చివరకు ఐవీఆర్ఎస్ ద్వారా జిల్లా ప్రజల అభిప్రాయాలను సైతం తెలుసుకుంది. మూడు నెలల పాటు అన్ని కోణాల్లో కసరత్తు చేసిన అధిష్ఠానం మళ్లీ అధ్యక్షుడిగా కొనసాగిన నాగార్జునకే మళ్లీ అవకాశం కల్పించింది. యువకుడు, విద్యావంతుడు రాజకీయ అనుభవం కలిగిన ఆయన వైపే మొగ్గు చూపింది. రాష్ట్రంలోని 25 పార్లమెంటు జిల్లాల అధ్యక్షుల్లో కాకినాడ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, నాగార్జునకే రెండో సారి అవకాశం ఇచ్చింది. ప్రధానంగా అధ్యక్ష పదవి కోసం ముగ్గురు సీనియర్ నాయకులు పోటీపడ్డారు. గజపతినగరం నియోజకవర్గం నుంచి కరణం శివరామకృష్ణ, నెల్లిమర్ల నుంచి సువ్వాడ రవిశేఖర్, కంది చంద్రశేఖర్‌లు పోటీపడ్డారు.

● జిల్లా ప్రధాన కార్యదర్శి పదవిలో పుష్కరకాలానికి పైగా కొనసాగుతున్న ఐవీపీ రాజును తప్పించి మొన్నటి వరకు విజయనగరం పట్టణ కమిటీ అధ్యక్షుడిగా పనిచేసిన వరప్రసాద్‌కు పదోన్నతి కల్పించింది. ప్రసాద్ తండ్రి ఒకసారి, తల్లి రెండుసార్లు విజయనగరం మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేశారు. 18 ఏళ్లుగా పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు.

కిమిడి నాగార్జున

ప్రసాదుల వరప్రసాద్

విదేశాల నుంచి నేరుగా రాజకీయాల్లోకి..

కిమిడి నాగార్జున అమెరికాలో ఎంఎస్ పూర్తి చేశారు. తండ్రి గణపతిరావు ఎమ్మెల్యేగా, తల్లి డాక్టర్ మృణాళిని శ్రీకాకుళం జడ్పీ ఛైర్మన్‌గా, చీపురుపల్లి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. రాజకీయ కుటుంబం కావడంతో 2016లో ఇక్కడికి వచ్చి ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అప్పటికే మంత్రిగా ఉన్న తల్లికి పరోక్షంగా అన్ని విధాలా సహకరించారు. 2019లో చీపురుపల్లి శాసనసభ స్థానం నుంచి పోటీ చేసి వైకాపా నేత బొత్స సత్యనారాయణ చేతిలో ఓటమి పాలయ్యారు. 2024 ఎన్నికల్లో టిక్కెట్ ఆశించగా, కూటమి పార్టీల మధ్య పొత్తు కారణంగా పెదనాన్న కళావెంకటరావుకు ఆ సీటు దక్కడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయనను డీసీసీబీ ఛైర్మన్‌గా నియమించింది. ఈ సందర్భంగా నాగార్జున 'ఈనాడు'తో మాట్లాడుతూ విదేశాల్లో ఉన్నత విద్య పూర్తి చేసినా, సొంత గడ్డపై ఏదో ఒకటి చేయాలనే తపనతో ఆత్మసంతృప్తి కోసం వచ్చానన్నారు. పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. రెండోసారి అధ్యక్ష పదవి కట్టబెట్టిన అధినేత చంద్రబాబు, మంత్రి లోకేశ్, పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

స్ట్రాలతో ధ్వని తరంగాల ఉత్పత్తి

● అంతర్జాతీయ వేదికపై మెరిసిన ప్రాజెక్టు

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

భౌతికశాస్త్రంలో ప్రయోగాలంటే పెద్ద ల్యాబ్‌లు ఉండాలన్న భావన చాలా మందిలో ఉంటుంది. కానీ వ్యర్థాలతోనూ చేయవచ్చని నిరూపించారు జిల్లాకు చెందిన భౌతిక శాస్త్ర సీనియర్ అధ్యాపకుడు డా.జోగా చంద్రశేఖర్. ఇటీవల పంజాబ్‌లోని రోపార్ ఐఐటీలో నిర్వహించిన అంతర్జాతీయ వేదికపై పీవీసీ పైపు, పక్షి బొమ్మ, స్ట్రాలు, నీటితో నింపిన గొట్టాన్ని ఉపయోగించి ధ్వని ఉత్పత్తిపై ప్రయోగాలు చేసి అందరినీ ఆకట్టుకున్నారు. వ్యక్తిగత విభాగంలో ఒకటి, బృంద ప్రదర్శన, ఉత్తమ ప్రగతి విభాగాల్లో ఒక్కొక్కటి చొప్పున మూడు బహుమతులు అందుకున్నారు.

ప్రయోగం చేస్తున్న చంద్రశేఖర్

సదస్సు నేపథ్యమిదీ..

రెండు దశాబ్దాల తర్వాత ఈ సదస్సులో నిర్వహించారు. తొలిసారిగా 2005లో దిల్లీలో జరిగింది. ఐఐటీ రోపార్, ఐఐఎస్ఈఆర్- మొహాలీ, ఐఏపీటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లైడ్ ఫిజిక్స్(ఐయూపీఏపీ) సంయుక్తంగా ఈనెల 16 నుంచి 20 వరకు నిర్వహించాయి. భౌతికశాస్త్రంలో ఆసక్తి ఉన్న వారందరికీ ఈ సదస్సు అంతర్జాతీయ వేదికగా నిలుస్తోంది. క్లిష్టమైన అంశాలపై జరిగిన స్టేజ్ షోలో నేషనల్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా, కాన్పూర్ బృందంతో కలిసి రాష్ట్రం నుంచి చంద్రశేఖర్ ఒక్కరే పాల్గొన్నారు. ప్రస్తుతం ఈయన అన్వేషిక రాష్ట్ర సమన్వయకర్తగా, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ సంస్థకు రాష్ట్ర అధ్యక్షుడిగా, సమగ్ర శిక్షా విభాగం విశాఖ ప్రాజెక్టు సమన్వయకర్తగా ఉన్నారు.

ప్రయోగాలివీ..

- పీవీసీ పైపు, పక్షి బొమ్మ, స్ట్రాలు, నీటితో నింపిన పారదర్శక గొట్టం తదితర వాటితో ధ్వని ఉత్పత్తి, పౌనఃపున్యం తదితర ప్రయోగాలను వివరించారు. ఈ వేదికపై ధ్వని శబ్దాన్ని కాంతి కిరణాలతో చూపించినందుకు గానూ ప్రశంసలు లభించాయి.
- తరంగ వేగం, తన్యత, తరంగదైర్ఘ్య సాంద్రత, వాటి మధ్య సంబంధాలను వివరించారు. తరంగదైర్ఘ్యం, తరంగ కంపన పరిమితి, అనుదైర్ఘ్య తరంగాలు, తిర్యక్ తరంగాలు.. తదితర వాటిని స్ట్రాలను ఉపయోగించి, సరళంగా ప్రయోగపూర్వకంగా తెలియజేశారు.
- కాగితాలతో తయారు చేసిన శంఖు ఆకారాలు, పీవీసీ పైపుతో ప్రక్షేపక కణం వ్యాప్తి, మూఢనమ్మకాలను పారదోలే ప్రయోగాలను చేశారు.
- వ్యక్తిగత విభాగంలో అతని పేరుపై పేటెంట్ ఉన్న సమాంతర కాంతి కిరణాలను ఉత్పత్తి చేసే పరికరాన్ని ఉపయోగించి కాంతి ధర్మాలను ప్రయోగ పూర్వకంగా వివరించారు.

రూ.100కే వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్

● వారసత్వ పంపిణీలకు వర్తింపు

న్యూస్‌టుడే- రాజాం

తండ్రి, తల్లి, తాత మరణించాక వ్యవసాయ భూములు వారసుల పేరున రెవెన్యూ రికార్డుల్లో నమోదు కాక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. భూములు మ్యుటేషన్ కావడం లేదు. పట్టాదారు పాసుపుస్తకాలు రావడం లేదు. తరచూ సివిల్ వివాదాలకు దారితీస్తున్నాయి. వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం ప్రభుత్వం చూపింది. రూ.10 లక్షలలోపు విలువైన వ్యవసాయ భూమిని రూ.100కే రిజిస్ట్రేషన్ చేయించుకునే అవకాశాన్ని కల్పించింది. వారసులంతా తగిన ధ్రువీకరణ పత్రాలతో రావాలని, అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఇది అమల్లోకి వచ్చిందని స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ నాగలక్ష్మి తెలిపారు.

వైకాపా బాదుడు..

● ఆస్తిలో భాగం పంపిణీ రిజిస్ట్రేషన్‌లో 2021 నవంబరుకు ముందు హెచ్చు వాటాకు మినహాయింపు ఉండేది. ఉదాహరణకు రూ.30 లక్షల విలువైన ఆస్తిని ముగ్గురు కుటుంబసభ్యులు సమానంగా పంచుకుంటే అందులో రూ.10 లక్షలు మినహాయించి మిగిలిన రూ.20 లక్షలపై 1 శాతం చొప్పున రూ.20 వేలు స్టాంపు రుసుము చెల్లించాలి. భాగం పంపిణీ సమానంగా లేకున్నా కుటుంబసభ్యుల్లో మేజర్ విలువ కలిగిన ఆస్తికి మినహాయింపు ఇచ్చి మిగిలిన ఇద్దరి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువపై స్టాంపు రుసుము వసూలు చేసేవారు. ● వైకాపా హయాంలో స్టాంపు రుసుమును 3 శాతానికి పెంచారు. అన్నింటికీ స్టాంపు డ్యూటీ వసూలు చేసేలా 2021 నవంబరు 2న ఉత్తర్వులిచ్చారు.

వర్తింపు ఇలా..

- తండ్రి వీలునామా రాయకుండా మరణించి, ఆయన పేరున 1బీ ఉండాలి.
- ఆ ఆస్తిని అతని భార్యతో సహా వారసులంతా పంచుకోవాలి.
- తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, వారసులకు సంబంధించిన ఫ్యామిలీ సర్టిఫికెట్ సమర్పించాలి.
- వ్యవసాయ భూములకు మాత్రమే ఇది వర్తిస్తుంది.
- భూమి విలువ రూ.10 లక్షలలోపు ఉంటే రూ.100 స్టాంపు డ్యూటీ, రూ.వెయ్యి ఫీజు.. రూ.10 లక్షల పైబడి ఎంత విలువున్నా రూ. వెయ్యి స్టాంపు డ్యూటీ, రూ. వెయ్యి ఫీజు చెల్లిస్తే చాలు.
- రిజిస్ట్రేషన్ చేసుకుంటే ఆటో మ్యుటేషన్ జరుగుతుంది. పట్టాదారు పాసుపుస్తకాలతో పూర్తి హక్కులు వస్తాయి.

ఘంటసాలకు స్వరనీరాజనం

ఘంటసాల గానం చిరస్మరణీయమని మంత్రి సంధ్యారాణి అన్నారు. కబీర్‌షా పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఘంటసాలకు 12గంటల స్వర నీరాజన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె, పత్రాయిని సంగీత పాఠశాల అధ్యక్షుడు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ జె.ఈశ్వరరావు తొలుత ఘంటసాల విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పాఠ్యాంశంగా ఘంటసాల జీవిత చరిత్రను చేర్చేందుకు కృషి చేస్తానన్నారు. సంగీత పాఠశాల అభివృద్ధికి హామీ ఇచ్చారు. గోల్డ్‌కింగ్, ఘంటసాల గాన సభ, భూషణ్ బ్రదర్స్ సంగీత కచేరీల సభ్యులు, గాయకులు పలు గీతాలతో శ్రోతలను రంజింపజేశారు. కబీర్‌షా పార్టీ అధ్యక్షుడు భాషా, పి.ఈశ్వరరావు, సూరిబాబు, గణేశ్వరరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సాలూరు

విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సంధ్యారాణి, సంగీతాభిమానులు

నియామకాలే తరువాయి..

● పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రాల విలీన ప్రక్రియ

న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

అంగన్‌వాడీల నిర్వహణను నాటి వైకాపా ప్రభుత్వం పూర్తిగా విస్మరించగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గాడినపెట్టే చర్యలు తీసుకుంటోంది. కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పన, చిన్నారులు, గర్భిణులకు పోషకాహారం పంపిణీ, కార్యకర్తలకు 5జీ చరవాణుల అందజేత, తాగునీటి పథకాలు, మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధుల మంజూరు, బాలసంజీవని, పోషణ ట్రాకర్ యాప్‌ల నవీకరణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీనిలో భాగంగా మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చుతున్నట్లు నాలుగు నెలల కిందట సీఎం ప్రకటించారు. ఈ మేరకు జిల్లాలోని కేంద్రాల్లో కార్యకర్తల నియామక ప్రక్రియను కలెక్టర్ ఛైర్మన్‌గా కమిటీ పూర్తి చేసిందని, త్వరలో పత్రాలు అందిస్తామని ఐసీడీఎస్ పీడీ టి.విమలారాణి 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

ప్రధాన కేంద్రంగా గుర్తించిన చెల్లివలస కేంద్రం

169 మంది ఎంపిక

ప్రస్తుతం జిల్లాలో 293 మినీ అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 201 క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చే ప్రక్రియను ప్రభుత్వం జిల్లా స్థాయి ఎంపిక కమిటీ(డీఎస్సీ)కి అప్పగించింది. వివరాలను పరిశీలించి 169 మంది నియామకానికి కమిటీ ఎంపిక చేసింది. వీరికి త్వరలో నియామక పత్రాలు అందజేయనున్నారు.

జిల్లాలో..

మొత్తం ప్రాజెక్టులు	:	11
కేంద్రాలు	:	2,499
మినీ కేంద్రాలు	:	293

సేవలు మరింత చేరువయ్యేలా...

మినీ కార్యకర్తలు ఇప్పుడు ప్రధాన కార్యకర్తలుగా మారతారు. వీరు చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు మరింత మెరుగైన సేవలు అందించాలి. బాలసంజీవని, పోషణ్‌ట్రాకర్ యాప్‌ల్లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ.. సమస్యల్లేకుండా చూడాలి.
– టి.విమలారాణి, ఐసీడీఎస్ పీడీ

నిలిచిన పనులు.. ప్రాజెక్టులపైనే ఆశలు

న్యూస్‌టుడే, మెంటాడ

సాగునీటి సమస్య తీరుతుందన్న గుర్లగెడ్డ మినీ జలాశయ ఆయకట్టు రైతుల ఆశలు అడియాశలయ్యాయి. పాలకులు మారుతున్నా, ఏళ్లు గడుస్తున్నా తమ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అసంపూర్తిగా ఉన్న గుర్లగెడ్డ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తానని ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో రైతులకు నిరాశే ఎదురైంది. 1998 డిసెంబరులో ఆంధ్ర ప్రాజెక్టు ప్రారంభోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గుర్లగెడ్డ మినీ జలాశయానికి నిధులు మంజూరు చేశారు.

శిథిలమవుతున్న నిర్మాణాలు..

గుర్లగెడ్డ మినీ ప్రాజెక్టు కాలువ పనుల్లో భాగంగా చేపట్టిన నిర్మాణాల్లో చాలా వరకు ఇప్పటికే శిథిలమయ్యాయి. పనులు నిలిచిపోయే నాటికి ఎడమ కాలువ పరిధిలో 90, కుడి కాలువ పరిధిలో 10 శాతం పనులు పూర్తయినట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుతం కాలువలు పూడికతో నిండాయి. అనుబంధంగా చీపురువలసకు సమీపంలో నిర్మించిన అక్విడక్టులో ఒక దోనె నేల కూలింది. పనికిరాని మొక్కలు పెరిగిపోతున్నాయి.

ఆక్రమణలకు గురవుతున్నాయి.. జలాశయ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయంటూ రైతు సంఘాల నాయకులు, ఆయకట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జలాశయ ప్రాంతంలోని సర్‌ప్లస్‌వీర్ దిగువ ఉన్న భూములను వారు పరిశీలించి, ఆక్రమణలకు గురవుతున్నాయని, పూర్తి స్థాయిలో సర్వే జరపాలని రొంపల్లి వీఆర్వోకు ఫిర్యాదు అందజేశారు.

పనుల పూర్తికి రూ.20కోట్లు

ప్రాజెక్టు పూర్తికి సుమారుగా రూ.20 కోట్ల వరకు వ్యయం అవుతుందని డీఈఈ నవీన్ తెలిపారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు. దస్త్రాలు పరిశీలిస్తే జలాశయ భూములు ఆక్రమణకు గురయ్యాయా, లేదా అనే విషయంపై స్పష్టత వస్తుందన్నారు.

2001లో ప్రారంభం..

విశాఖ జిల్లా అనంతగిరి, మెంటాడ మండలాల సరిహద్దు గ్రామమైన రొంపల్లికి సమీపంలో గుర్లగెడ్డపై మినీ జలాశయ నిర్మాణ పనులు 2001లో ప్రారంభించారు. వృథాగా పోతున్న నీటిని సద్వినియోగం చేసుకుంటూ దాదాపు 3 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని భావించిన నీటిపారుదల శాఖ అధికారులు, ప్రభుత్వం అప్పట్లో రూ.4.67 కోట్ల అంచనా వ్యయంతో జలాశయ పనులు ప్రారంభించారు. అయిదేళ్లలో పూర్తి చేయాలనేది లక్ష్యం. కుడి, ఎడమ ప్రధాన తూములు తదితర పనులు పూర్తి చేశారు.

జామిలో వెలుగు కార్యాలయ సిబ్బందికి కంప్యూటర్, ఇతర పరికరాలు ఇస్తున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్

సాంకేతికతతో వెలుగులీనేలా!!

కూటమి ప్రభుత్వం అన్ని శాఖల్లో సాంకేతికతను పెంచుతోంది. వాట్సప్ గవర్నెన్స్ కింద వినియోగదారులకు సులువుగా సేవలు అందించేందుకు చర్యలు చేపడుతోంది. ఈమేరకు విభాగాలన్నింట్లో అంతర్జాలాన్ని పొందుపరుస్తోంది. గతంలో డీఆర్డీఏ, వెలుగులో కాగితాల రూపంలోనే కార్యకలాపాలు సాగాయి. రుణాల మంజూరు, వసూళ్ల ప్రక్రియలదీ అదే తీరు. ఈ నేపథ్యంలో అక్రమాలు చోటుచేసుకునేవి. ఈ పరిస్థితిని అడ్డుకునేందుకు ఇప్పటికే వివిధ రకాల యాప్‌లను తీసుకొచ్చారు. సభ్యులు ఆన్‌లైన్‌లో వివరాలు తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రాల నుంచి పర్యవేక్షణ పెంచేందుకు తాజాగా కంప్యూటర్లు, సంబంధిత పరికరాలను అందిస్తున్నారు. ఇప్పటికే 26 మండలాల్లోని కేంద్రాలకు చేరవేసినట్లు డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్ తెలిపారు. తమ విభాగాలకు సంబంధించి ఏం కావాలన్నా ఆయా కేంద్రాల్లో అందిస్తారని చెప్పారు. – న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

(c) eenadu

కదిలిన దాతలు

ఉమ్మడి జిల్లాలోని పలు వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు దాతలు అండగా నిలిచారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో వారికి వివిధ రకాల దుప్పట్లు, దుస్తులు తదితరాలను అందించారు. పేద బాలలను ఆదుకునేందుకు మరింత మంది ముందుకొస్తామని భరోసానిచ్చారు.

వెలుగులు నింపాలని..

విజయనగరం కంటోన్మెంట్: విజయనగరంలోని కణపాక మారుతీ సేవా సంఘం సభ్యులు.. స్థానిక తోటపాలెంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఉంటున్న బాలికలకు సాయం అందించారు. సంఘం అధ్యక్షుడు గుత్తుల చంద్రశేఖరరావు రూ.10 వేల విలువ చేసే రగ్గులు, రూ.5 వేల విలువ చేసే మిక్సీని సారథి ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు ప్రదీప్‌కుమార్‌కు అందజేశారు. సంఘ ప్రతినిధులు తులసీరామ్, వెంకటరావు, మహేష్ పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ

చీపురుపల్లి: చీపురుపల్లిలోని జీబీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు చదువుతూ అక్కడే వసతి గృహంలో ఉంటున్నారు. వీరికి అండగా నిలిచేందుకు వంగర మండలం కొప్పరవలస గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరావు ముందుకొచ్చారు. 40 మందికి రగ్గులు పంపిణీ చేశారు. అధ్యాపకులు చంద్రమౌళి, సింహాద్రి కృతజ్ఞతలు తెలియజేశారు.

బాలలకు అండ

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. చలితో కటిక నేలపై నిద్రిస్తున్నారు. సమస్యను 'ఈనాడు' గుర్తించింది. దాత కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్ (సీడీసీ) ప్రాజెక్టు డైరెక్టర్ శతపతి అన్నపూర్ణ ముందుకొచ్చి 90 మందికి రూ.15 వేల విలువైన చాపలు పంపిణీ చేశారు. సీడీసీ కో-ఆర్డినేటర్లు డొకల రవిశేఖర్, కె.లక్ష్మణరావు చేతులమీదుగా అందజేశారు. సంక్షేమాధికారి జి.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక్కట్లు తీర్చాలని..

భోగాపురం: వసతి గృహ విద్యార్థులకు పూసపాటిరేగ మండలం కొవాడ గ్రామానికి చెందిన తాటికొండ సాయిసూర్య పజిత్ తనవంతు సాయం అందించారు. భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల బీసీ వసతి గృహంలో ఉంటున్న బాలలకు దుప్పట్లు, జంబుఖానాలు పంపిణీ చేశారు. వార్డెన్ శరత్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, పీటీ చిన్నారి పాల్గొన్నారు.

గిరిజనులకు 'స్నేహ' హస్తం..

శృంగవరపుకోట: గిరిజనులను ఆదుకునేందుకు 'ఈనాడు' పిలుపు మేరకు ఎస్.కోట పట్టణానికి చెందిన 'స్నేహ' స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చింది. మండలంలోని దారపర్తి పంచాయతీలోని గిరిశిఖర కురిడి గ్రామానికి చెందిన 63 కుటుంబాలకు ఆ సంస్థ అధ్యక్షుడు అట్టాడ వెంకటరావు ఆధ్వర్యంలో సభ్యులు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి రగ్గు, బియ్యం, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి మంతిన సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

తాళాలుంటేనే చోరీ.. తీసేది కొంతే మరి

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: బీరువా తలుపులు పగలగొడతారు.. తాళాలు వెతికి మరీ వాటిని తెరుస్తారు. అందులో ఓ నాలుగు తులాల బంగారం కనిపిస్తే రెండు తులాలతో పరారవుతారు.. డబ్బులు మాత్రం ముట్టరు.. అలాగని అతడు మామూలోడు కాదు.. గజ దొంగ.. అంతర్రాష్ట్ర నిందితుడు.. బాధితులకు అనుమానం రాకుండా ఇలా పదుల సంఖ్యలో చోరీలు చేశాడు. ఎట్టకేలకు కృష్ణా జిల్లా కంకిపాడు పోలీసులకు పట్టుబడ్డాడు చీపురుపల్లి మండలం పేకేపాలెంనకు చెందిన పి.రాంబాబు. ఈ కేసు వివరాలను అక్కడి డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు.

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

వ్యసనాలకు బానిసై.. పేకేపాలెంనకు చెందిన రాంబాబు చెడు వ్యసనాలకు బానిసై కొన్నేళ్లుగా తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. బీరువాలను పగలగొట్టకుండా.. తాళాలు ఎక్కడ పెడతారో గుర్తించి మరీ లాకర్ తలుపులను తెరుస్తాడు. కొంతమేర బంగారాన్ని ఎత్తుకెళతాడు. ఇంట్లో వాళ్లకి అనుమానం రాకుండా అన్నీ జాగ్రత్తగా సర్దేస్తాడు. ఇతడి తీరుతో ఇప్పటికే పలువురు బాధితుల ఇళ్లల్లో వివాదాలు జరిగాయి.

తాకట్టు పెట్టి.. చోరీ చేసిన ఆభరణాలను పెనమలూరు మండలం మురళీనగర్‌కు చెందిన పఠాన్ వసీమ్ ఖాన్, పఠాన్ నాగూర్, చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన షేక్ అస్లాం, కానూరు వాసి ఎం.నాగ విష్ణుస్, ఎం.పిచ్చిరెడ్డితో ముత్తూట్, మణప్పురం ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టిస్తాడు. ఆ డబ్బు తీసుకుని వారికి కమిషన్ ఇస్తాడు. ఆదివారం పునాదిపాడు వంతెన వద్ద అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై నిలబడి మాట్లాడుతుండగా అటుగా వెళ్తున్న పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 2023లో కంకిపాడులో జరిగిన దొంగతనం బయటకు వచ్చింది. అనంతరం రాంబాబును అదుపులోకి తీసుకున్నారు. 15 చోరీల వివరాలు చెప్పాడు. ఈమేరకు అతడి నుంచి 409 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. నిందితుడిపై ఏకంగా 50 కేసులున్నాయి. ఒక్క విజయనగరం జిల్లాలోనే 14 వరకు నమోదయ్యాయి.

ఆయన సేవలు లెక్కగట్టలేం!

సాలూరు, న్యూస్‌టుడే: గణితం పట్ల విద్యార్థులకున్న భయాన్ని తొలగించేందుకు సాలూరు పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు ఆర్.రజనీకాంత్ కృషి చేస్తున్నారు. 2000 సంవత్సరంలో రామానుజన్ మ్యాథ్స్ క్లబ్ ఏర్పాటు చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులను గణిత ప్రతిభా పరీక్షల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు. దాదాపు లక్ష మందికి పైగా రాశారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి పతకాలు, ప్రశంసాపత్రాలు అందించారు. 25 ఏళ్లుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లా, రాష్ట్రస్థాయి పురస్కారాలు పొందారు. గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. తాను పనిచేసే విద్యాలయానికి ఉపకరణాలు, ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఉమ్మడి జిల్లా కలెక్టర్ హరి జవహర్‌లాల్ పాఠశాలకు వచ్చి సత్కరించారు.

గణిత పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థికి పతకం, ప్రశంసా పత్రం అందిస్తున్న రజనీకాంత్(పాత చిత్రం)

సొంత నిధులతో..

పట్టణంలోని యామిజాల వీధి, గాంధీనగర్ సమీపంలో రజనీకాంత్ సొంత నిధులతో పదేళ్లుగా గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ 50కి పైగా విద్యార్థులు ఇక్కడకు వస్తారు. గతంలో ఆయన పనిచేసిన బంగారమ్మ పాఠశాలలో బాలలు రాకపోకలు సాగించేందుకు దూరం భారం కాకూడదని సొంత నిధులతో ఆటో కూడా ఏర్పాటు చేశారు.

రాష్ట్ర జట్టు మేనేజర్‌గా రాజు

గంట్యాడ, న్యూస్‌టుడే: జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-19 రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా గంట్యాడ జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు పీవీఎస్ఎన్.రాజు ఎంపికయ్యారు. ఈ నెల 23 నుంచి 28 వరకు మధ్యప్రదేశ్‌లో జరగనున్న ఖోఖో పోటీలకు వెళుతున్న మన రాష్ట్ర జట్టుకు మేనేజర్‌గా వ్యవహరించనున్నారు. ఖోఖో అసోసియేషన్ ఆయనను అభినందించింది.

సిబ్బంది లేక అవస్థలు

గ్రంథాలయాల్లో పాఠకులకు ఇక్కట్లు

– న్యూస్‌టుడే, విజయనగరం మయూరికూడలి

విజ్ఞాన భాండాగారాల నిర్వహణ గ్రంథాలయ అధికారులకు కత్తిమీద సాములా మారింది. ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ కాకపోవడంతో అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్నారు. కొన్నిచోట్ల స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో పాఠకులు ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల ఆలస్యంగా తెరుస్తున్నారని ఆరోపిస్తున్నారు.

విజయనగరంలోని గ్రంథాలయంలో చదువుతున్న పాఠకులు

ఆ సేవలేవీ.. రెండు జిల్లాల్లో డీసీఎల్(డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరీ)తో పాటు 40 శాఖలున్నాయి. ఇందులో ద్వితీయ శ్రేణి కింద నాలుగు(ఎస్.కోట, పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి), గ్రామీణం కింద మూడు(కొత్తవలస, చీపురుపల్లి, బెల్గాం, జరజాపుపేట) ఉండగా.. 33 తృతీయ శ్రేణి విభాగంలో కొనసాగుతున్నాయి. ఒక్క డీసీఎల్‌కే రోజూ 700 మంది నుంచి 1000 మంది వరకు వస్తుంటారు. మిగిలిన చోట్ల 60- 210 మంది వరకు సందర్శిస్తున్నారు. డీసీఎల్‌లో 55 వేలు, ఇతర శాఖల్లో 30 వేల పుస్తకాలున్నాయి. పాఠకులకు వీటిని అందించడం, డిమాండు మేరకు కొత్తవి తెప్పించడం, వివరాల సేకరణ, శుభ్రత, దినపత్రికలు, మ్యాగజైన్లు, పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచాలి. కొన్నిచోట్ల ఈ ప్రక్రియలేవీ సాగడం లేదు.

ఉన్నది 36 మందే.. నిబంధనల ప్రకారం గ్రేడ్-2, 3 లైబ్రేరియన్లు, జూనియర్ సహాయకులు, రికార్డు సహాయకులు, కార్యాలయ సహాయకులు, పార్ట్‌టైం వర్కర్లు, వాచ్‌మెన్లు.. తదితర విభాగాల్లో 86 పోస్టులు అవసరం. ప్రస్తుతం 36 మందే ఉన్నారు. దీంతో కొందరు అధికారులు రెండు, మూడు శాఖలను చూస్తున్నారు. పూసపాటిరేగ, భోగాపురం, చీపురుపల్లి, పార్వతీపురం, ఎస్.కోట కేంద్రాలు ఇన్‌ఛార్జుల పాలనలో ఉన్నాయి గరుగుబిల్లి, మక్కువ, కురుపాం, సీతానగరంలో పార్ట్‌టైం వర్కర్లే నడిపిస్తున్నారు.

ప్రకటనలేవీ..?

కొత్త కొలువుల భర్తీ కోసం చాలామంది ఎదురు చూస్తున్నారు. గతంలో పార్ట్‌టైం ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు ఆ ప్రక్రియ సాగలేదు. కేవలం కాంట్రాక్టు నియామకాలకే పరిమితం అవుతున్నారు. దీనిపై విద్యాశాఖలోనూ జాప్యం జరుగుతోంది. ఇప్పటికే రెండు, మూడు సార్లు ఉన్నతాధికారులు, మంత్రులకు తెలియజేశామని గ్రంథాలయాల ఉమ్మడి జిల్లా కార్యదర్శి లక్ష్మి తెలిపారు. శాఖల్లో ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో చోదకుడి దుర్మరణం

భానుప్రకాష్ (పాతచిత్రం)

రేగిడి, న్యూస్‌టుడే: భార్య పుట్టిన రోజు వేడుకలు నిర్వహించాలని వచ్చిన ఓ వ్యక్తి తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన ఘటన రేగిడి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పాలకొండ మండలం బెజ్జి గ్రామానికి చెందిన బి.భానుప్రకాష్(25)కు వీరఘట్టం మండలం తెట్టంగికి చెందిన దేవితో రెండేళ్ల క్రితం వివాహమైంది. స్థానికంగా చోదకుడిగా పనిచేస్తున్నాడు. శనివారం భార్య పుట్టినరోజు వేడుక నిర్వహించేందుకు స్వగ్రామం వచ్చాడు. కుటుంబంతో సంతోషంగా గడిపాడు. ఆదివారం తిరిగి ద్విచక్రవాహనంపై విశాఖ వెళ్తుండగా.. రేగిడి మండలం శిర్లం పెట్రోల్ బంకు సమీపంలో రాజాం నుంచి పాలకొండ వైపు లోడుతో వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. భానుప్రకాష్ తల్లి లక్ష్మి, సోదరుడు దామోదర్ ఉన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

బొండపల్లి, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బొండపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మెంటాడ మండలానికి చెందిన బి.స్వామినాయుడు(35) మూడు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై వెళుతూ గొల్లుపాలెం సమీపంలో హరిత రహదారిపై ఉన్న డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి, విజయనగరంలోని మహారాజా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అపూర్వ కలయిక

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: శంకరం బొజ్జన్న కొండ వద్ద విజయనగరం జిల్లా వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సందడి చేశారు. 42 మంది స్నేహితులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి తరగతి గదుల్లో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 56 ఏళ్లు పైబడిన వారంతా యువకుల్లా ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం వనభోజనాలు చేసి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు.

రూ.14.87 కోట్లతో రోడ్లకు మరమ్మతులు

పాచిపెంట, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చొరవతో పాచిపెంట మండలంలో 5 రోడ్ల మరమ్మతులకు రూ.14.87 కోట్లు మంజూరైనట్లు సాలూరు ఏఎంసీ ఛైర్మన్ ఎం.సూర్యనారాయణ, తెదేపా మండలాధ్యక్షుడు యుగంధర్ తెలిపారు. రాయిగుడ్డివలస గ్రామ కూడలి నుంచి నీలంవలస వరకు రూ.2.59 కోట్లు, పద్మాపురం కూడలి- కుంతాం వరకు రూ.2.23 కోట్లు, మాతుమూరు- వేటగానివలస రహదారికి రూ.3.13 కోట్లు, పెదచీపురువలస-సాలూరు మండలం జీగిరాం- రూ.2.49 కోట్లు, పనుకువలస జాతీయ రహదారి నుంచి కొత్తవలస వరకు బాగుచేసేందుకు రూ.4.43 కోట్లు వచ్చాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తవలస, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కొత్తవలస మండలంలో చోటుచేసుకుంది. సీఐ షణ్ముఖరావు వివరాల ప్రకారం.. కొత్తవలసకు చెందిన జి.త్రిమూర్తులు(55) తాపీమేస్త్రీగా పనిచేసేవాడు. అనారోగ్యం, ఆర్థిక సమస్యల కారణంగా గతనెల 14న పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆయనను విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు శివ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శఠగోపాన్నీ వదల్లేదు

కొత్తవలస, న్యూస్‌టుడే: మంగళపాలెం సమీపంలోని అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగతనం జరిగింది. వెండి శఠగోపం, వెండి సామగ్రి, రూ.25 వేల నగదు దొంగిలించారు. చోరీ సొత్తు విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని సమాచారం. దీనిపై ఇంకా ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. ఆలయంలోని సీసీ కెమెరాలు కొన్ని రోజులుగా పని చేయడం లేదని తెలుస్తోంది. దీంతో నేరం జరిగినట్లు చెబుతున్నారు.

చక్కని చుక్కలు.. భవితకు కాంతులు

కంటోన్మెంట్ పార్కులో చిన్నారులకు చుక్కల మందు వేస్తున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

పల్స్ పోలియో కార్యక్రమం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆదివారం ప్రశాంతంగా జరిగింది. విజయనగరంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి ప్రారంభించారు. 1172 బూత్‌ల ద్వారా 2 లక్షల మందికి పైగా చిన్నారులకు చుక్కల మందు వేశామన్నారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ వేస్తారని చెప్పారు. ఈమేరకు క్షేత్రస్థాయిలో 5 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారన్నారు. డీఎంహెచ్‌వో జీవనరాణి, అదనపు డీఎంహెచ్‌వో కె.రాణి, నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, విజయనగరం అయ్యన్నపేట

మన్యంలో..

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: మన్యం జిల్లాలో తొలిరోజు 90,557 మంది పిల్లలకు చుక్కల మందు వేసినట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. 91 శాతం ప్రక్రియ పూర్తయిందన్నారు. సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి మిగతా వాళ్లకు వేయనున్నట్లు చెప్పారు. జిల్లావ్యాప్తంగా 905 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 42 మొబైల్ బృందాలు పర్యవేక్షించాయన్నారు.

రాష్ట్రస్థాయి ఆంగ్ల భాష ప్రతిభ పరీక్ష

జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, చిత్రంలో నిర్వాహకులు

బొబ్బిలి, న్యూస్‌టుడే: ఆంగ్ల భాషా ఉపాధ్యాయ సంఘం (డెల్టా) ఆధ్వర్యంలో ఆదివారం బొబ్బిలి ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి ప్రతిభా పోటీ పరీక్ష జరిగింది. డిప్యూటీ డీఈవో కె.మోహనరావు పోటీలు ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి 256 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ స్థానంలో నిలిచిన పి.పావని (పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూల్, బొబ్బిలి)కి రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వి.రోహిణి (చినమేరంగి ఉన్నత పాఠశాల)కి రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన సీహెచ్.శైలజ (కేఏ ఎన్ఎంహెచ్- సాలూరు)కు రూ.2 వేలు నగదు అందజేశారు. మిగిలిన ఏడుగురికి రూ.వెయ్యి చొప్పున ఇచ్చారు. పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, స్టడీ మెటీరియల్స్ అందజేశారు. డెల్టా అధ్యక్షుడు ఎం.విజయమోహనరావు, గ్రంథాలయ పరిషత్తు డైరెక్టర్ రౌతు రామ్మూర్తినాయుడు, ఎంఈవో సీహెచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి మనోళ్లు

అద్దంకి, పిఠాపురం: అండర్-18 రాష్ట్రస్థాయి బాలబాలికల ఖోఖో పోటీలు బాపట్ల జిల్లాలో జరిగాయి. ఉత్తమ ఆటతీరు ప్రదర్శించిన క్రీడాకారులను జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు ఖోఖో ఫెడరేషన్ తెలిపింది. జట్టులో జిల్లాకు చెందిన సలీం, పూజిత ఉన్నారు.

★ కాకినాడలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో సత్తా చాటిన పి.సుమిత్రను జాతీయస్థాయికి ఎంపిక చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	134	238	248

అప్పన్నస్వామికి బంగారు హారం బహూకరణ

డిప్యూటీ ఈవో రాధకు హారం అందజేస్తున్న వైకాపా నేత మజ్జి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు

విజయనగరం పట్టణం, సింహాచలం, న్యూస్‌టుడే: జడ్పీ ఛైర్మన్, వైకాపా భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) ఆదివారం విశాఖలోని సింహాద్రి అప్పన్న స్వామిని దర్శించారు. కుటుంబ సమేతంగా సింహగిరికి విచ్చేసిన ఆయన బంగారు పగడాల హారాన్ని డిప్యూటీ ఈవో సింగం రాధ, పర్యవేక్షకుడు వెంకటేశ్వరరావుకు అందజేశారు. హారం సుమారు 400 గ్రాముల బరువు ఉంటుందని అధికారులు తెలిపారు.

భక్తులకు అవస్థలు..: చిన్న శ్రీను కుటుంబంతో పాటు పదుల సంఖ్యలో అనుచరులు ఆలయానికి విచ్చేశారు. వీరందరికీ అధికారులు దర్శనాలకు అనుమతించారు. దీంతో సుమారు గంట పాటు సామాన్య భక్తులకు దర్శనాలు నిలిపివేశారు. అదే సమయంలో ఆస్థాన మండపంలోని స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను అంతరాలయంలోకి తీసుకువెళ్లాల్సి ఉన్నా జాప్యం జరిగింది.

EENADU Classifieds

REAL ESTATE

ఇండివిడ్యువల్ ఇండ్లు అపార్ట్‌మెంట్ 2 BHK, 3 BHK flats, VUDA Plots బ్యాంకులోన్స్ చేయబడును. C:7207307421.

MVP కాలనీ గెస్ట్‌హౌస్ (Oyo హోటల్) నందు పని చేయుటకు రిసెప్షనిస్ట్ & రూమ్ బాయ్స్ కావలెను. ఫుడ్&వసతి కలదు. వ॥28 సం॥లోపు ✆7036488899.

JOBS

వైజాగ్ ప్రముఖ షాపింగ్‌మాల్‌లో పనిచేయుటకు 18-35 వయస్సు యువకులు కావలెను. జీతం:10000 - 12000 + ఫుడ్, రూము. 9030588502, 9704637370

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తల్లికి పిండి వంటలు, పండ్లతో నైవేద్యం

కనక మహాలక్ష్మికి సారె సమర్పణ

విజయనగరం సిటీబస్టాండ్ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో కొలువై ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారికి ఆదివారం పలువురు భక్తులు సారె సమర్పించారు. ఉదయం అమ్మవారి సన్నిధిలో లక్ష్మీ గణపతి, మహాలక్ష్మి చండీహోమాలు జరిగాయి. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు గాయత్రీశర్మ పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలంకరణ అనంతరం పువ్వులు, పండ్లు, మిఠాయిలను నైవేద్యంగా సమర్పించారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

వైద్యుడి దాతృత్వంతో బడి బాగు

భోజనశాలను ప్రారంభిస్తున్న వైద్యుడు

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: గరుగుబిల్లి మండలం రావుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని ప్రముఖ వైద్య నిపుణుడు గుల్ల సూర్యప్రకాష్‌రావు అన్నారు. విద్యార్థుల కోసం తన సొంత నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన భోజనశాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. సంక్రాంతికి గ్రామంలోని అన్ని వీధి కూడళ్లలో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రాంగణంలో మొక్కలు నాటారు. సర్పంచి బి.మహేష్, మాజీ సర్పంచి గుల్ల కాశీనాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు. సూర్యప్రకాష్‌రావు ఇప్పటికే తన తల్లిదండ్రులు లక్ష్మునాయుడు, రాములమ్మ జ్ఞాపకార్థం రూ.4 లక్షలతో పాఠశాల ఆవరణను బాగు చేశారు. విద్యార్థులకు కంప్యూటర్లు సమకూర్చారు. రూ.40 వేలతో వేదిక నిర్మించారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: మన్యం జిల్లాలో క్రీడాభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయస్థాయి పోటీలకు సిద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణ అందించాలని కలెక్టరు ప్రభాకరరెడ్డి నిర్ణయించారు. దీనికోసం మైదానాలున్న చోట క్రీడా పాఠశాలలు నడపబోతున్నారు. ముందుగా నియోజకవర్గస్థాయి పోటీలు నిర్వహించి ప్రతిభావంతులను గుర్తిస్తారు. అక్కడ సత్తా చూపిన వారిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు. సోమవారం నుంచి ఈ ప్రక్రియ జరగనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శులు ఎస్.మురళి, కె.నాగమణి తెలిపారు. ఈ మేరకు వేదికలు, ఇన్‌ఛార్జుల నియామకాల వివరాలను తెలియజేశారు.

నేటి నుంచే పోటీలు.. పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో సోమవారం నిర్వహించనున్నారు. పాలకొండ జీహెచ్ స్కూల్, కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఖోఖో, వాలీబాల్, యోగా పోటీలు జరుగుతాయి. ఇన్‌ఛార్జులుగా ఆర్.రాములు, నిరీక్షణ, బి.మాధవరావు, హరికృష్ణ వ్యవహరిస్తారు.

★ మంగళవారం పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించి సీతానగరం మండలం బూర్జ పాఠశాల, సాలూరుకు సంబంధించి మామిడిపల్లిలో పోటీలు జరుగుతాయి. కబడ్డీ, అథ్లెటిక్స్, చదరంగం, బ్యాడ్మింటన్ నిర్వహిస్తారు. ఇన్‌ఛార్జులుగా బి.వైకుంఠరావు, డీటీ గాంధీ, చక్రవర్తి, ఎం.చిన్నారావు వ్యవహరించనున్నారు.

రోటరీ సేవలు మరింత విస్తృతం

ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

మయూరి కూడలి, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్- విజయనగరం సెంట్రల్ ద్వారా ఈ ఏడాది సేవలను మరింత విస్తరించనున్నట్లు ప్రస్తుత క్లబ్ అధ్యక్షుడు విజయ అగర్వాల్ అన్నారు. ఆదివారం నగరంలోని కార్యాలయంలో జరిగిన సమావేశంలో వచ్చే ఏడాదికి సంబంధించి నూతన అధ్యక్షుడిగా జి.జగదీష్ బాబు, కార్యదర్శిగా బత్తుల చందు, రోటేరియన్లుగా జయకృష్ణ, రామారావు, మూర్తి, రాజేష్ తదితర సభ్యులను ఎంపిక చేశారు. 2027- 28కి సంబంధించి రెయ్యి శంకర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పేదలకు అండగా నిలవాలని అగర్వాల్ సూచించారు.

(c) eenadu

బొబ్బిలి

• బొబ్బిలి • రాజాం • గజపతినగరం • చీపురుపల్లి

బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గాల్లో సమస్యలా?

ఈనాడు ఫోన్ ఇన్ కార్యక్రమం

బొబ్బిలి రెవెన్యూ డివిజన్ పరిధిలోని బొబ్బిలి, గజపతినగరం నియోజకవర్గ ప్రజలారా. . మీ గ్రామాల్లో సమస్యలా? తాగునీరు సక్రమంగా అందడం లేదా? వీధిదీపాలు వెలగడం లేదా? సచివాలయాల్లో సేవలు సక్రమంగా అందడం లేదా? పారిశుద్ధ్య సమస్యలు అధికంగా ఉన్నాయా? 'ఈనాడు' మీకు తోడుగా నిలుస్తోంది. సమస్యలను డివిజనల్ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా నిర్దేశిత సమయంలో ఫోన్ చేయడమే. - న్యూస్‌టుడే, బొబ్బిలి

తేది: 22/12/25 (సోమవారం)
☛ సమయం: మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల మధ్య

సంప్రదించాల్సిన నంబరు: 91544 09825

కూరగాయల ధరలు

రాజాం రైతుబజారులో ఆదివారం కూరగాయల ధరలు (కిలో రూ.లలో) ✦ టమాటా: 48 ✦ వంకాయలు: 42 ✦ దొండ: 40 ✦ బీర: 68 ✦ బెండ: 60 ✦ కాకర: 50 ✦ చిక్కుడు: 45 ✦ అనపకాయ (ఒకటి): 30 ✦ అరటి (జత): 20 ✦ ఉల్లి: 30 ✦ బంగాళదుంపలు: 30 ✦ అల్లం: 70 ✦ వెల్లుల్లి: 100 ✦ పచ్చిమిర్చి: 52 ✦ క్యాబేజీ: 30 - న్యూస్‌టుడే, రాజాం

తెరపై ఈనాడు

★ ఎస్‌వీసీ సీతారామా: **అవతార్** ★ ఎస్‌వీసీ అప్సర: **అఖండ-2** - న్యూస్‌టుడే, రాజాం ★ లక్ష్మీ థియేటర్: **అవతార్** ★ వాసవి: **మరియో** ★ టీబీఆర్ స్క్రీన్-1: **అఖండ-2** ★ టీబీఆర్ స్క్రీన్-2: **అవతార్** - న్యూస్‌టుడే, బొబ్బిలి

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)
బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? వసంత ప్రభుత్వ పాఠశాల చుట్టూ మురుగు చేరుతోంది. అవస్థలు పడుతున్నాం. **- స్థానికులు** ★ పరిశీలించి, చర్యలు తీసుకుంటాం. **- విజయ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో** – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

? దేవుపల్లి సాలిపేటలో కాలువల్లో మురుగు పేరుకుపోయింది. **- గ్రామస్థులు** ★ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడతాం. **- రఘుపతిరావు, ఈవోపీఆర్డీ** – బొండపల్లి

వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: గింజేరు మండల పరిషత్తు పాఠశాల ఆవరణలో వ్యర్థాలు పేరుకుపోయాయి. పాఠశాలకు ఆనుకుని ఉన్న పరిసరాల్లో వ్యర్థాలు, మలమూత్ర విసర్జన చేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై ఇటీవల 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగింపజేశారు.

రాజాం.. పాలకవర్గంలేని పురపాలక సంఘం

20 ఏళ్లుగా అదే సమస్య
అభివృద్ధికి దూరంగా పట్టణం

అభివృద్ధికి నోచుకోని బుచ్చెంపేట రహదారి

న్యూస్‌టుడే- రాజాం

రాజాం పురపాలిక పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. 20 ఏళ్లుగా ప్రత్యేకాధికారి పాలనలోనే మగ్గుతోంది. పాలకవర్గం ఏర్పాటు కాకపోవడంతో ప్రజలకు సేవలు మృగ్యమవుతున్నాయి. ప్రతి చిన్న పనికీ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

2005లో రాజాం, కొత్తవలస, పొనుగుటివలస, కొండంపేట, సారథి పంచాయతీలను కలుపుతూ రాజాం నగరపంచాయతీగా ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఎన్నికల దిశగా అడుగులు పడలేదు. నిబంధనలకు విరుద్ధంగా నగరపంచాయతీని ఏర్పాటు చేశారని అప్పట్లో పలువురు కేసులు వేయడంతో చాలా ఏళ్లు న్యాయస్థానంలో వివాదాలు కొలిక్కిరాలేదు. తరువాత స్పష్టత వచ్చినా.. తమ గ్రామాలను వదిలేయాలని కొత్తవలస, పొనుగుటివలస వాసులు మళ్లీ కోర్టు తలుపు తట్టారు.

ఇప్పటికైనా మారేనా..?

రాజాం మున్సిపాల్టీలో కొత్తవలస, పొనుగుటివలస నుంచి అభ్యంతరాలు రావడంతో ఈ రెండు గ్రామాల ప్రజలు, నాయకులతో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఇటీవల చర్చలు జరిపారు. కోర్టులో వేసిన వ్యాజ్యాలను ఉపసంహరించుకోవాలని కోరారు. పొనుగుటివలస నుంచి కొంత సానుకూలత వచ్చినా.. కొత్తవలస నుంచి వ్యతిరేకత వచ్చింది. గ్రామం పట్టణానికి దూరంగా ఉండడం, పల్లె వాతావరణం కావడంతో దీన్ని తప్పించి ఎన్నికలకు మార్గం సుగుమం చేస్తారనే వాదన వినబడింది. రాష్ట్రంలో కొత్త పంచాయతీల ఏర్పాటు, భౌగోళిక మార్పులు, చేర్పులకు ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. పాలకవర్గం, ప్రత్యేకాధికారి, గ్రామసభ తీర్మానంతో విభజనకు అవకాశం ఉంటుంది. ప్రతిపాదనలకు సోమవారంతో గడువు ముగుస్తోంది. ఇంతవరకు తీర్మానాలేవీ చేయలేదని పురపాలిక కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు తెలిపారు.

స్థాయి పెరిగినా అంతే..

నగరపంచాయతీ నుంచి మున్సిపాల్టీగా స్థాయిని పెంచుతూ ప్రభుత్వం మూడేళ్ల కిందట ఆర్డినెన్స్ జారీ చేసింది. వార్డుల సంఖ్యను 24కు పెంచి, భౌగోళిక గుర్తింపు పూర్తి చేశారు. ఇంత జరిగినా ఎన్నికలకు నోచుకోలేదు. దీనిపై కేంద్ర ప్రభుత్వం కన్నెర్రజేస్తోంది. ఎన్నికలు జరగని కారణంగా మూడు పర్యాయాల నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులను నిలిపేసింది. దీంతో రూ.6 కోట్లు వరకు పురపాలిక వదులుకోవాల్సి వచ్చింది. రహదారులు, కాలువలు, తాగునీటి వసతులు వంటి పనులకు ఆర్థిక సమస్యలు పీడిస్తున్నాయి. సాధారణ నిధులతోనే నెట్టుకు రావాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే ధ్యేయం

కార్యక్రమంలో మంత్రి కొండపల్లి తదితరులు

బొండపల్లి, న్యూస్‌టుడే: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బొండపల్లిలో తెదేపా మండలాధ్యక్షుడు రాపాక అచ్చిమినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సదస్సులో మాట్లాడారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు సంక్రాంతిలోగా అందుతాయన్నారు. నాయకులు కొండపల్లి భాస్కరనాయుడు, జి.శ్రీదేవి, చప్ప చంద్రశేఖర్, కొండపల్లి కొండలరావు, పీవీవీ గోపారావు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత

బొబ్బిలి, న్యూస్‌టుడే: ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ కేంద్రం ఇన్‌ఛార్జి బీకే రాజేశ్వరి అన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా ఆదివారం బొబ్బిలి రాజా కళాశాల మైదానంలో సామూహిక రాజయోగ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో రవికుమార్, తెదేపా మండలాధ్యక్షుడు వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథా.. తీరని వ్యథ!

గజపతినగరం బూర్లివీధిలో పైపులైను లీకై నీరు వృథాగా పోతోంది. కుళాయిలకు అందించే నీటి కన్నా.. వృథాగా పోతున్న నీరే అధికమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా లీకులను సరిచేసి, వృథాను అరికట్టాలని కోరుతున్నారు. విషయం పంచాయతీ కార్యదర్శి రమణ వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి, మరమ్మతులు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, గజపతినగరం

అసంపూర్తి నిర్మాణం.. అవస్థలమయం

గంట్యాడ మండలం పెదమజ్జిపాలెం గ్రామ సచివాలయం ఆవరణలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. సచివాలయం, ఆరోగ్య, రైతు సేవా కేంద్రాల సిబ్బంది సౌకర్యార్థం తలపెట్టిన మరుగుదొడ్ల నిర్మాణం రెండేళ్లుగా పూర్తికాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తక్షణ చర్యలు తీసుకుంటామని గంట్యాడ ఏఈ ఇన్‌ఛార్జి జేఈ నానిబాబు అన్నారు. - న్యూస్‌టుడే, పెదమజ్జిపాలెం (గంట్యాడ గ్రామీణం)

పునాదుల్లోనే వెల్‌నెస్ కేంద్ర నిర్మాణం

బొబ్బిలి మండలం శివడవలసలో గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన వెల్‌నెస్ భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. నాలుగేళ్లుగా పనులు ముందుకు సాగడంలేదు. దీనికి రూ.21.80 లక్షలు ఉపాధిహామీ నిధులు మంజూరు చేశారు. సకాలంలో బిల్లులు విడుదల కాకపోవడంతో గుత్తేదారు పనులను నిలిపివేశారు. సమస్యను ఏఈ రాజశేఖర్ వద్ద ప్రస్తావించగా.. ప్రభుత్వానికి తెలియజేశామని, ఆదేశాలు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

మార్కెట్‌లో పశువుల తిష్ఠ

బొబ్బిలి పట్టణంలోని చెరికాని సీతయ్యమ్మ పురపాలక మార్కెట్‌లో పశువుల సంచారంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్కువగా ఉండటంతో మార్కెట్‌లో అడుగు పెట్టలేకపోతున్నామని, తాము తెచ్చుకున్న సంచులను కూడా లాగేస్తున్నాయని వాపోతున్నారు. ఇటీవల ఆ ప్రాంతాన్ని సందర్శించిన పురపాలక కమిషనర్ రామలక్ష్మి పశువుల పెంపకందారులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించినా కదలిక లేదు. సమస్యను శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీ వద్ద ప్రస్తావించగా.. దొరికిన పశువులను చెత్త శుద్ధి పార్కులోని షెల్టర్‌కు తరలిస్తామన్నారు. - న్యూస్‌టుడే, బొబ్బిలి

ప్రయాణం.. భయం భయం

రామభద్రపురం మండలం పాడివానివలస నుంచి ఆర్ చింతలవలస రోడ్డుకు రూ.5 కోట్లు, ఆరికతోట నుంచి జగన్నాథపురానికి రహదారి నిర్మాణానికి రూ.90 లక్షలు గత ప్రభుత్వ హయాంలో మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి, తారు వేయకుండా వదిలేశారు. రాళ్లు తేలి రోడ్డు ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. సమస్యను పంచాయతీరాజ్ ప్రాజెక్టు ఏఈ నాయుడు వద్ద ప్రస్తావించగా.. రోడ్డు నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. - న్యూస్‌టుడే, రామభద్రపురం

యువతను ప్రోత్సహించడమే లక్ష్యం

ప్రశంసాపత్రాలతో విజేతలు, నిర్వాహకులు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరకంగా, మానసికంగా మెరుగుపడొచ్చని మైభారత్ జిల్లా అధికారి ప్రేమ్‌భరత్‌కుమార్ అన్నారు. ఆదివారం మైభారత్ శాఖ ఆధ్వర్యంలో చీపురుపల్లి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బ్లాక్ స్థాయిలో షాట్‌పుట్, పరుగు, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు జరిగాయి. భాజపా నియోజకవర్గ కో-కన్వీనర్ ఎం.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సొసైటీ చీపురుపల్లి డివిజన్ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు పోటీలు ప్రారంభించారు. యువతను క్రీడల్లో ప్రోత్సహించడమే దీని లక్ష్యమన్నారు. భాజపా నాయకుడు ఎస్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

చక్కని జీవితానికి రెండు చుక్కలు

గంట్యాడ మండలం డీకే పర్తిలో వరుసలో చిన్నారులు

న్యూస్‌టుడే, బృందం: రెండు పోలియో చుక్కలు చిన్నారుల చక్కని జీవితానికి తోడ్పాటు అని జిల్లా ఉపవైద్యాధికారి సూర్యనారాయణ అన్నారు. ఆదివారం రాజాంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పట్టణంలో 3,029 మంది పిల్లలు లక్ష్యంగా.. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల పిల్లలకు వేయడంతో 100.19 శాతం ప్రగతి సాధించినట్లు అడర్వనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి ఎం కిరణ్‌కుమార్ తెలిపారు. ★ మెరకముడిదాం మండలం ఊటపల్లి గ్రామంలో తహసీల్దారు సులోచనరాణి చిన్నారులకు చుక్కలు వేశారు. ★ సంతకవిటి, మండవకురిటి పీహెచ్‌సీల పరిధిలో 95 శాతం పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారులు నాగేంద్రప్రసాద్, ప్రశాంత్ తెలిపారు. ★ గంట్యాడ, పెదమజ్జిపాలెం పీహెచ్‌సీల పరిధిలో 97 శాతం, బొబ్బిలి పట్టణంలో 90 శాతం, గజపతినగరం మండలంలో 98 శాతం, గరివిడి మండలంలో 95 శాతం పూర్తయినట్లు వైద్యులు తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు

గరివిడి, న్యూస్‌టుడే: గరివిడిలోని అవంతీ సెయింట్ థెరిసా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం పదోతరగతి విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం, నెల్లిమర్ల మండలాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. గరివిడి గోదావరి దేవి సీనియర్ సెకండరీ పాఠశాల విద్యార్థినులు కె.అవంతిక ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, సిహెచ్ నిహారిక ద్వితీయ బహుమతిగా రూ.7 వేలు, చీపురుపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని జె.హరిణి తృతీయ బహుమతిగా రూ. 3 వేలు గెలుచుకున్నారు.

అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపిక

సంతోష్‌ప్రీతమ్ విజయ్‌కుమార్

రాజాం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎ.సంతోష్‌ప్రీతమ్, వి.విజయ్‌కుమార్ అంతర్ విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల పీడీ బీహెచ్ అరుణ్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈనెల 25 నుంచి 28 వరకు చెన్నైలోని అమెట్ డీమ్డ్ యూనివర్సిటీలో జరగనున్న పోటీల్లో జేఎన్‌టీయూ జట్టు తరఫున ఆడనున్నారు. ప్రిన్సిపల్ సీఎల్‌వీఆర్ఎస్‌వీ ప్రసాద్, జీఎంఆర్ఐటీ విద్యా విభాగం డైరెక్టర్ జె.గిరీష్, డీన్ వి.రాంబాబు వీరిని అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

దత్తిరాజేరు, న్యూస్‌టుడే: తమిళనాడు రాష్ట్రం రామనాథపురం వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందినవారి కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం కె.కొత్తవలసలో మూడు కుటుంబాలకు రూ.50 వేలు చొప్పున అందించారు. ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, ఉప ఎంపీపీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం

తెర్లాం, న్యూస్‌టుడే: తెర్లాం మండలం కె.సీతారాంపురంలో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగి 12 పూరిళ్లు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న బొబ్బిలి అభ్యుదయ విద్యాసంస్థల అధినేత శారద, సహాయ్, స్ఫూర్తి సంస్థల అధ్యక్ష, కార్యదర్శులు సాయికుమార్, రేవంత్ ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అవసరమైన దుస్తులు, నిత్యావసరాలు, పిల్లలకు నోటు పుస్తకాలు అందజేశారు.

క్రిస్మస్ సందడి.. బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో క్రిస్మస్ సందడి మొదలైంది. ఆదివారం పాతబొబ్బిలి ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు, క్రిస్మస్ చెట్టు ఆకట్టుకున్నాయి.

మాజీ ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ

గరివిడి, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం గరివిడిలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ కేకు కోశారు. మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ★ **బొబ్బిలి, గజపతినగరం:** పట్టణంలోని వైకాపా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య వేడుకలు నిర్వహించారు.

అనుమానంతో తొలగించారని ఆవేదన

చీపురుపల్లి, న్యూస్‌టుడే: దళిత కులానికి చెందిన మహిళను కావడంతో మిగతా సభ్యులంతా ఒక్కటై అన్యాయంగా డ్వాక్రా సంఘం నుంచి తొలగించారని చీపురుపల్లిలోని జి.అగ్రహారానికి చెందిన ముత్యాలమ్మ స్వయం సహాయక సంఘ సభ్యురాలు డి.అప్పలనరసమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చీపురుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. 30 ఏళ్లుగా సంఘంలో సభ్యురాలిగా ఉన్నానని, అన్యాయంగా తప్పించారని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. కట్టిన పొదుపు సొమ్ము తిరిగి చెల్లించలేదని వాపోయారు. న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు అందిందని, మాట్లాడి పరిష్కరిస్తామని ఎస్సై దామోదరరావు తెలిపారు.

గణిత ప్రతిభా పరీక్షలో సత్తా

రేగిడి, న్యూస్‌టుడే: రామానుజన్ జయంతి పురస్కరించుకుని రేగిడి మండలం చాటాయవలసలో యువత ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గస్థాయి గణిత ప్రతిభా పోటీలు నిర్వహించారు. రాజాం డీపీవీ పబ్లిక్‌స్కూల్ విద్యార్థి ఎ.దీపక్‌కుమార్, రేగిడి మండలం దేవుదళ విద్యార్థి కె.గణేష్, లక్ష్మీపురం విద్యార్థి ఎం.ప్రశాంత్‌కుమార్, సంతకవిటి మండలం హొంజరానికి చెందిన ఎస్.జాహ్నవి, లక్ష్మీపురం విద్యార్థి కె.పవన్ వరుసగా అయిదు స్థానాల్లో నిలిచారు.

నైపుణ్యాలు పెంపొందించేందుకు పోటీలు

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

రాజాం, న్యూస్‌టుడే: ఫోరం ఆఫ్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ (ఫెల్ట్) ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఆదివారం రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఆంగ్లంలో నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు ఈ పోటీలు దోహద పడతాయని ఫెల్ట్ అధ్యక్ష, కార్యదర్శులు బీవీ అచ్యుత్‌కుమార్, ఆర్‌వీజే నాయుడు అన్నారు. సాద్విక, విష్ణుప్రియ, హర్షిత మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

లీకులు.. తాగునీటికి వెతలు

రాజాం పట్టణం, న్యూస్‌టుడే: రాజాం పట్టణంలోని బొబ్బిలి కూడలి వద్ద రాజాం- రామభద్రపురం ప్రధాన రహదారిలో మంచినీటి పైపులైనులు లీకై తాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ లైను ద్వారా పది గ్రామాలకు సరఫరా కావాల్సి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. సమస్యను గ్రామీణ నీటి సరఫరా విభాగం జేఈ జగన్‌మోహన్ వద్ద ప్రస్తావించగా చర్యలు చేపడతామన్నారు.

ఉపాధ్యాయురాలికి సత్కారం.. గజపతినగరం: మండలంలోని మహిళలకు 15 ఏళ్ల పాటు పొదుపు పాఠాలు చెప్పి, సంఘాలను బలోపేతం చేసి, గ్రామైక్య సంఘ అధ్యక్షురాలిగా పనిచేసిన రెడ్డి కుమారి ఇటీవల మెగా డీఎస్సీలో ఉద్యోగం సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమెను మండల సమాఖ్య సభ్యులు, వీవోఏలు ఘనంగా సత్కరించారు.

విశ్రాంత భవనం ప్రారంభం.. బొండపల్లి: బొండపల్లి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన వన మిత్ర కేంద్రంలో విశ్రాంత భవనాన్ని రాష్ట్ర అటవీ శాఖాధికారి పీవీ చలపతిరావు ప్రారంభించారు. డీఎఫ్‌వో ఆర్.కొండలరావు, ఎఫ్ఆర్‌వో జె.సింధు, ఎఫ్ఎస్‌వో ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం!

గజపతినగరం, న్యూస్‌టుడే: నిత్యం వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉండే గజపతినగరంలోని ఎన్టీఆర్ విగ్రహం ప్రాంతంలో ఆదివారం సాయంత్రం కంటైనర్ లారీ బీభత్సం సృష్టించింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఎన్టీఆర్ విగ్రహం పక్కన పార్కింగ్‌లో ఉన్న కారుపైకి దూసుకెళ్లడంతో పూర్తిగా నుజ్జయింది. వివరాలు సేకరించి, చర్యలు తీసుకుంటామని ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు.

జీడిమామిడి తోటలు తీసేస్తున్న రైతులు

మెంటాడ, న్యూస్‌టుడే: ఏటా జీడిమామిడి సాగుతో నష్టపోతున్న రైతులు ఆ పంటలను తొలగించేందుకు సిద్ధపడుతున్నారు. మెంటాడ మండలంలోని పలు గ్రామాల్లో తోటలు సాగుచేస్తున్నారు. రూ.వేలు వెచ్చిస్తున్నారు. పంట చేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు, మద్దతు ధర లేకపోవడం, నాణ్యత లోపం తదితర కారణాలతో నష్టపోతున్నారు. ప్రస్తుతం వాణిజ, గుర్ల, ఆండ్ర, ఇప్పలవలస, కొండలింగాలవలస తదితర గ్రామాల్లోని రైతులు ఆయా పంటలను తొలగిస్తున్నారు.

ఇంతి.. ఆర్థిక కాంతి

న్యూస్‌టుడే- పెదమజ్జిపాలెం (గంట్యాడ గ్రామీణం)

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపును గంట్యాడ మండలంలోని స్వయం శక్తి సంఘాల మహిళలు అందిపుచ్చుకుంటున్నారు. మినీ పారిశ్రామికవేత్తలుగా మారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ఆర్థికంగా వృద్ధి సాధించి ముందుకు సాగుతున్నారు. ప్రధానమంత్రి ఉపాధికల్పన పథకం కింద గంట్యాడ మండలంలోని 90 మందికి రాయితీ రుణాలు మంజూరయ్యాయి. దీంతో పలు రకాల యూనిట్లు ఏర్పాటు చేసుకొని రాణిస్తున్నారు.

బ్యూటీ పార్లర్‌తో ఉపాధి..

పీఎంఈజీపీ పథకం కింద మంజూరైన రూ.2 లక్షలతో బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేశాను. దీంతో పాటు విద్యార్థులకు అవసరమైన సామగ్రి విక్రయిస్తున్నాను. ప్రతినెలా ఖర్చులు పోనూ రూ.10 వేలు ఆదాయం వస్తోంది. - లక్ష్మి, గంట్యాడ

రూ.10 వేలు మిగులుతోంది..

11 పాడి గెదెలను కొనుగోలు చేశాను. రెండు ఎకరాల్లో దాణాకు అవసరమైన గడ్డి చేనుతో పాటు వివిధ రకాల కూరగాయల పంటలు సాగు చేస్తున్నాను. ప్రతినెలా ఖర్చులు పోనూ రూ.10 వేలు మిగులుతోంది. - గండి సత్యవతి, మురపాక

సప్లయర్స్ అద్దెకు ఇస్తున్నాను..

పేపరు ప్లేట్లకు డిమాండ్ అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఇచ్చే రుణంతో యూనిట్ ప్రారంభించాను. దీంతో పాటుగా లైటింగ్, సప్లయర్స్ సామగ్రి అద్దెలకు ఇస్తున్నాను. శుభకార్యాలకు సామగ్రి అద్దెకు తీసుకెళ్తుండడంతో ఖర్చులు పోనూ ప్రతినెలా రూ.10 వేలు సంపాదిస్తున్నాను. - పాశల చెల్లమ్మ, చినమానాపురం

కుటుంబానికి బాసటగా..

కాటన్ బ్యాగులకు గిరాకీ పెరుగుతోంది. యూనిట్ పెట్టాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నాను. పొదుపు సంఘాల ఆధ్వర్యంలో పీఎంఈజీపీ పథకంలో అందించిన రూ.2 లక్షల రాయితీ రుణంతో యూనిట్ ప్రారంభించాను. నెల నెలా రూ.11 వేలు ఆదాయం తీసుకుంటున్నాను. కుటుంబానికి కొంత బాసటగా ఉంది. - సిరపు భారతి, పెదవేమలి



విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

కీర్తిక

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కొత్తవలస, న్యూస్‌టుడే: అర్ధానపాలెం ఆదర్శ పాఠశాల విద్యార్థిని పి.కీర్తిక రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ జి.ప్రసన్న లక్ష్మి ఆదివారం తెలిపారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విజయనగరంలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఇదే కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి బి.షారూన్ జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

బాధిత కుటుంబానికి చెక్కు ఇస్తున్న బంగార్రాజు

భోగాపురం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. రావాడ గ్రామానికి చెందిన దంతులూరి అప్పలనర్సమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షల చెక్కును ఆమె కుటుంబానికి ఆదివారం అందజేశారు. నాయకులు అవనాపు నారాయణరావు, శ్రీనివాసరావు, పి.అప్పలనాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: పిరమిడ్స్ స్పిరిచ్యువల్ సొసైటీ విజయనగరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని బాలాజీ కూడలి సమీపంలో ఉన్న ఎగ్జిబిషన్ మైదానంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పట్టణాధ్యక్షుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ శారీరక, మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి పిరమిడ్స్ సొసైటీ ప్రతినిధులు సుమారు 200 మంది వరకు హాజరయ్యారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. శ్రీనివాసరాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచన అదిరె.. ఆవిష్కరణ మెరిసె..

– న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

విద్యార్థులు తమలో దాగి ఉన్న వినూత్న ఆలోచనలను ప్రాజెక్టుల రూపంలో ఆవిష్కరించారు. ఈనెల 19న నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌లో వివిధ పాఠశాలకు చెందిన చిన్నారుల ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఉత్తమంగా నిలిచిన వాటిని రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికచేశారు. అందుకు చేసిన కృషి వారి మాటల్లోనే..

స్కూల్ గ్రీన్ ల్యాబ్

పాఠశాలలో పచ్చదనాన్ని ప్రయోగశాలగా మార్చడం దీని ఉద్దేశం. మొక్కలను ప్రత్యేక విధానంలో నాటి, తేమ రూపంలో నీటిని అందిస్తాం. కొన్ని రకాల మొక్కల నుంచి వచ్చిన వృథాను లిక్విడ్ బయో ఫెర్టిలైజర్స్‌గా మార్చుతాం. – పొట్టా స్వప్న, జీవశాస్త్ర ఉపాధ్యాయిని, జడ్పీహెచ్‌ఎస్ కొట్టాం.

స్మోక్ అబ్జార్బర్

ఫ్యాక్టరీల నుంచి వచ్చే కాలుష్యం వాతావరణంలో కలవకుండా నివారించవచ్చు. ఫ్యాక్టరీల దగ్గరలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్ గదుల్లోకి నీటి ఆవిరిని పంపించాలి. పొగలోని కార్బన్‌డయాక్సైడ్, నైట్రోజన్‌డయాక్సైడ్, సల్ఫర్‌డయాక్సైడ్‌లు నీటి ఆవిరితో చర్య జరిపి యాసిడ్‌లుగా మార్చుతుంది.
– పి.సందీప్, కె.సతీష్, జడ్పీహెచ్‌ఎస్, కెల్ల

నీటి సంరక్షణ

వర్షం, వాడుక, వృథా నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపే విధానాన్ని గణితం, గ్రాఫ్‌ల ద్వారా తెలియజేశారు. – కె.వాత్సల్య, జె.కనకమహాలక్ష్మి, రామతీర్థం

డిటెన్షన్ విధానం

పైప్‌లైన్లలో లీకేజీలు, కాల్వల్లో నీరు పైకొచ్చి ప్రవహించి వృథాతోపాటు కలుషితమవుతోంది. డిటెన్షన్ విధానంతో పైపునకు సెన్సార్ సహాయంతో సర్క్యూట్ అమర్చాలి. లీకైతే ఆటోమేటిక్‌గా బజర్ మోగి సంకేతాలివ్వడంతో అప్రమత్తమై సమస్య ఆపవచ్చు.
– ఎ.పార్థు, బి.మోహిత్, జడ్పీహెచ్‌ఎస్, కొండవెలగాడ

మాగ్నటిక్ గేర్స్

వాహనాలు, ఇతర యంత్రాల్లో ఉండే గేర్లు ఇనుముతో చేయడం వల్ల పళ్ల చక్రాల రాపిడికి వేడెక్కుతాయి. ఇందుకోసం నూనె, గ్రీజులు వాడుతారు. ఈ అవసరం లేకుండా మాగ్నటిక్ ద్వారా గేర్లు రూపొందించాం. ఒకదానికొకటి తాకకుండా ఎక్కువ కాలం పని చేస్తాయి. వైబ్రేషన్, ధ్వని ఉండదు. రోబోటిక్స్, రాకెట్లలో వీటి ఉపయోగం ఎక్కువ.
– జి.అమృతవర్షిని, సి.హెచ్.శ్రీదేవి, వల్లాపురం జడ్పీహెచ్‌ఎస్, గుర్ల మండలం

క్రాప్ డాక్టర్

ఏఐ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ యాప్ రైతులకు మార్గదర్శకం చేస్తుంది. పార్టీరాక్ ప్లాట్‌ఫాం నుంచి తయారు చేశాం. పంటలకు వచ్చిన తెగుళ్లు, ఇతరత్రా సమస్యలు యాప్‌లో అప్‌లోడ్ చేసి సలహాలు, సూచనలు పొందవచ్చు. – కె.లిఖితా స్వరాజ్, సి.హెచ్.మనస్విని, జడ్పీహెచ్‌ఎస్, చీపురుపల్లి

తెరపై ఈనాడు

● ఎన్‌సీఎస్: అవతార్ ● శ్రీకృష్ణ: మోగ్లీ ● ఆదిత్య: ఫైటర్ శివ ● లీలామహల్: గుర్రం పాపిరెడ్డి ● రంజనీ స్క్రీన్-1: అవతార్ ● శివరంజనీ స్క్రీన్-2: అఖండ 2, ఫెయిల్యూర్ బాయ్స్ ● హిమగిరి: అవతార్ ● సప్తగిరి: అఖండ 2 – న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	8008574326
భోగాపురం	70959 54646

?: రాజీవ్‌నగర్ కాలనీలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. – స్థానికులు
● నివారణకు చర్యలు తీసుకుంటాం. – పి.నల్లనయ్య, కమిషనరు
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

రహదారి పనులు ప్రారంభం

విజయనగరం పట్టణం: నగరంలోని 45వ డివిజన్ పరిధిలో కేఎల్‌పురం ప్రధాన రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సమస్యపై 'ఈనాడు'లో ఈ నెల 20న 'మౌలిక సదుపాయాల కరవు' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.35.40 లక్షల అంచనా విలువతో పనులు చేపట్టారు.

దీపాలు వెలిగాయ్ (స్పందనకు వందనం)

విజయనగరం పట్టణం: నగరంలోని వైఎస్సార్ నగర్ దారిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద వీధిదీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. సమస్యను ఏఈ స్రవంతి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి చర్యలు తీసుకున్నారు.

పరిసరాలు శుభ్రం

విజయనగరం పట్టణం: నగరంలోని బాలాజీ వస్త్ర దుకాణం దక్షిణ గేట్ వైపు వ్యర్థాలు పేరుకుపోవడం, పారిశుద్ధ్య పనులు జరగకపోవడంపై 'ఈనాడు'లో ఈనె16న 'కాలనీలు.. సమస్యలకు చిరునామాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక ఏర్పాట్లు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ధనుర్మాస పూజల్లో భాగంగా ఈ నెల 30 వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి పుణ్యగిరిలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే ఇ.రమురాజు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆ రోజు భక్తులు భారీగా తరలి రానున్నారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉదయం 5 గంటలకు ఉత్తర ద్వారా దర్శనం ప్రారంభం అవుతుందన్నారు.

ఆ ఊర్లో జై గంటకు 91 ఏళ్లు

నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో ధనుర్మాసం సందర్భంగా రోజూ తెల్లవారుజాము 3 గంటలకు జై గంట కొడుతూ గ్రామస్థులను మేల్కొల్పుతున్నారు. గత 91 ఏళ్లుగా ఆనవాయితీగా దీన్ని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది ఈనెల 16 నుంచి శ్రీసత్యనారాయణ ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రారంభించారు. భోగి పండగ వరకు నిర్వహిస్తారు. ఈ నెలరోజులు పండగ వాతావరణం ఉంటుందని చెబుతున్నారు. – న్యూస్‌టుడే, జరజాపుపేట (నెల్లిమర్ల)

నత్తతో పోటీ.. ఎన్నటికో పూర్తి.!

జామి, అలమండ పీహెచ్‌సీల అదనపు భవనాల నిర్మాణాలు నత్తనడకగా సాగుతున్నాయి. నిధుల లేమితో రెండేళ్లుగా అసంపూర్తిగా ఉన్నాయి. సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. జామిలో రూ.184.36లక్షలు, అలమండలో రూ.166.97లక్షలతో అదనపు భవనాల పనులు చేపట్టారు. జామిలో 90శాతం వరకు పూర్తికాగా, రూ.25 లక్షల బిల్లుల బకాయి ఉంది. అలమండలో మధ్యలో ఆగిపోవడంతో టెండర్ రద్దయింది. కొంతమేర చేయగా రూ.41.79లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఆర్‌అండ్‌బీ ఏఈ ఉదయ్ మాట్లాడుతూ.. జామిలో మరో నెలలో పూర్తి చేస్తామని, అలమండ పీహెచ్‌సీకి సంబంధించి త్వరలో బిల్లులు చెల్లిస్తామన్నారు. – న్యూస్‌టుడే, జామి

నిత్యం వెలుగులు.. పట్టించుకునే వారెవరు?



ఎల్.కోట మండల పరిధిలో విద్యుత్తు వృథాకు అడ్డుకట్ట పడటం లేదు. కళ్లేపల్లి, పూడివానిపాలెం, లింగంపేట, మార్లాపల్లి, సంతపేట, ఎల్.కోటలో కొన్ని ప్రాంతాల్లో నిరంతరం విద్యుత్తు దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. నియంత్రించే మార్గం లేక ఈ పరిస్థితి ఎదురవుతోందని పలువురు చెబుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై విద్యుత్తు శాఖ ఇంజినీరింగు అధికారి గొలగాని వెంకట సత్యారావును వివరణ కోరగా పంచాయతీ అధికారులు పట్టించుకోక ఈ పరిస్థితి ఏర్పడిందని, చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. – న్యూస్‌టుడే, లక్కవరపుకోట

దుప్పట్ల అందజేత

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: వెంకటరమణపేట గ్రామానికి చెందిన సురేంద్ర 150 మంది నిరుపేద మహిళలకు దుప్పట్లు సమకూర్చారు. వీటిని బీసీసెల్ ఛైర్మన్ గొంప కృష్ణ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, జి.రామసత్యం, కె.ఈశ్వరరావు, సన్యాసినాయుడు, ఎ.మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుక


భోగాపురంలో కేకు కోస్తున్న ఉప్పాడ శివారెడ్డి

భోగాపురం, న్యూస్‌టుడే బృందం: మండలంలోని ఏ.రావివలస పంచాయతీ సర్పంచి ఉప్పాడ శివారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి 53వ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. 53 కిలోల భారీ కేకును కోసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం గ్రామంలో 5 వేల మందికి భోజనాలు పెట్టారు. ఉప్పాడపేటలో మండల అధ్యక్షుడు యు.సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● జరజాపుపేటలో పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ ఎస్.రామారావు, ఎం.ఎ., అప్పలరాజు, నారాయణమూర్తి, డెంకాడలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మండలాధ్యక్షుడు అద్దెప్ప పి.తమ్మినాయుడు, ఎస్.కోటలో మాజీ ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు తదితరుల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ● విజయనగరం పట్టణం: నగరంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ● మేయరు వెంపల్లి విజయలక్ష్మి, డిప్యూటీ మేయరు కోలగట్ల శ్రావణి హాస్పిటల్‌లో గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ముఖ్యంగా లావేరు వద్ద పేదలకు దుప్పట్లు ఇచ్చారు. అన్నసమారాధన నిర్వహించారు. దివ్యాంగులకు కోలగట్ల చేతులమీదుగా వీల్‌ఛెయిర్లు అందించారు.

ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందుతున్నాయని తెదేపా మండలాధ్యక్షుడు గంట పోలినాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం విజయనగరం మండలం నారాయణపురం, పడాలపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.

పోలీసుల శ్రమదానం

అయ్యన్నపేట: నగరంలోని ఉపాధి కల్పన కార్యాలయం వద్దగల ఉద్యానంలో పోలీసులు శ్రమదానం చేశారు. మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ ఇ.నర్సింహమూర్తి ఆధ్వర్యంలో వ్యర్థాలు, చెత్తను తొలగించారు. విగ్రహాలను శుభ్రం చేశారు.

వందశాతం నిర్వాసితులకు న్యాయం

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: జిందాల్ నిర్వాసితులకు వంద శాతం న్యాయం జరుగుతుందని ఎమ్మెల్సీ రఘురాజు అన్నారు. ఆదివారం బొడ్డవరలో నిర్వాసితుల 191వ రోజు దీక్షా శిబిరంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగే వరకు మద్దతు కొనసాగుతుందన్నారు. ● అనంతరం శిబిరం వద్ద ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేకు కోసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

చిన్నారులకు పోటీలు

మయూరి కూడలి, న్యూస్‌టుడే: గాజులరేగలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పోటీలు పెట్టి, బహుమతులు అందించినట్లు గ్రంథపాలకుడు లక్ష్మణరావు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: న్యాయ శాఖ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు సంగం భగవాన్, తాడి ప్రసాద్ కోరారు. ఆదివారం విజయనగరం మండలం ముడిదాంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆర్థికంగా ఆదుకునేందుకు రుణాలివ్వాలని కోరారు. అనంతరం విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. కొల్లి పైడిరాజు, పి.బి.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేయూత

కంటోన్మెంట్: నగరంలోని కవిపాక నవజీవన్ ట్రస్ట్ పేదలకు అండగా నిలిచింది. ఆదివారం 50 మందికి నిత్యావసరాలు, వస్త్రాలు పంపిణీ చేసింది. ట్రస్ట్ వ్యవస్థాపకుడు కె.శ్రీధర్, కుసుమంచి సుబ్బారావు, అప్పిరెడ్డి, రామారావు, బుజ్జి, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధాంజలి
మరణం: 12-12-2025
కీ॥శే॥ శ్రీమతి కొల్లి దేముడమ్మ
మాజీ సర్పంచ్, చందులూరు గ్రామం, ఎల్.కోట మండలం
మమతానురాగాలకు మారుపేరుగా మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి ప్రజలందరి ఆదరాభిమానాలు సంపాదించుకొని, మా నుండి ఆకస్మికంగా దూరమైనందుకు చింతిస్తూ... మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ...
భర్త: కొల్లి దేముడు, రిటైర్డ్ టీచర్
అన్నయ్య: గొర్రెపాటి అప్పలనాయుడు, రిటైర్డ్ టీచర్
కుమారులు - కోడలు: కొల్లి రమణమూర్తి, Ex. MPP, L.KOTA; కొల్లి మహేష్ - క్రిష్ణవేణి
కుమార్తెలు - అల్లుళ్లు: గేదెల భారతి - వెంకటరమణమూర్తి; గొర్రెపాటి రామలక్ష్మి - జవహర్‌లాల్
మనుమరాలు: వింధ్యశ్రీ మనుమడు: శ్రీకర్ మరియు బంధుమిత్రులు
మనుమలు: జి.తరుణ్, జి.గౌతమ్, మనుమరాలు: తేజ
పెద్దకర్మ: తే 22-12-2025న సోమవారం నాడు చందులూరు గ్రామంలో మా స్వగృహమునందు జరుపబడును.

IN THE HONOURABLE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATHI
W.P. No. 27046 OF 2025

Between:
P.D.A. Srinivasa Rao, S/o Late Babu Rao, Aged 55 years, **Occ:** Business, R/o Flat No. 202, Dr. No. 115-1/4/4, Andhra Residency, NE Layout, Seethammadhara, MIG-101, Visakhapatnam Town & District. **...PETITIONER**

Vs.

1. The Legal Services Authority, State of Andhra Pradesh, rep by Chairman, Near AP Secretariat, Amaravati
2. The Permanent Lok Adalat at Visakhapatnam, rep by its Presiding Officer, Visakhapatnam.
3. Mylapalli Sattayamma W/o Appanna, Aged about 70 years, R/o Door No.32-6-33, Allipuram, Visakhapatnam.
4. Kommakula Appalanarasamma, W/o Sathiraju, aged 70 years, R/o Drivers Colony Gajuvaka, Visakhapatnam.
5. Vurumiti Mani, W/o Suryanarayana, Aged about 71 years, R/o Door No. 18-2-16, Kummara Veedhi, Maharanipeta, Visakhapatnam.
6. Kommanapalli Palaveni, W/o Nagabhushanam, Aged about 73 years, R/o Asavenipalem, Near Marripalem, Kancharapalem Post, Vishakapatnam.
7. Mummidisetty Rama Rao, S/o late Venkataraju, Aged about 74 years, Business, R/o 14-4-2, Kolajatlavari Veedhi, Vijayanagaram.
8. Mummidisetty Venkata Ramanamma (died)
9. Mummidisetty Surya Rao, S/o late Venkata Raju, Aged about 77 years, Business, R/o F-1/6, Dasapalla Towers, Nowroji Road, Maharanipeta, Visakhapatnam.
10. Mummidisetty Subba Rao, S/o late Venkata Raj, Aged 71 years, R/o F-3/6, Dasapalla Towers, Nowroji Road, Maharanipeta, Visakhapatnam.
11. Mummidisetty Kameswara Rao, S/o late Venkata Raju, Aged about 67 years, R/o D.No. 30-10-12, Rajakrishna Residency, Pidaparthivari Street, Dabagardens, Visakhapatnam.
12. M. Eswara Rao (died).
13. Polisetty Bhagyalakshmi, W/o Sri. Gopala Rao, Aged 72 years, R/o Near Sankaramatam, Madhuranagar, Visakhapatnam.
14. Guduru Varalakshmi, W/o Mallikarjuna Rao, D/O P.Gopala Rao, Aged about 68 years, R/o D.No.6-7-75, Chinna Veedhi, Vijayanagaram
15. Sandala Satyavathi (Suit 'not pressed by the Plaintiffs).
16. Mudunuru Venkata Veerabhadra Rao (died), S/o late Appa Rao, R/o D.No.43-14-6/1, Railway New Colony, Dondaparthy, Visakhapatnam.
17. Pattapu Siva Ramakrishna (P.S. Ramakrishna), S/o late Seethayya, aged about 85 years, Retired Addl. Supdt. of Police, R/o D.No.6-13-1, Koyya Street China Waltair, Visakhapatnam.

...RESPONDENTS

Take notice that the Hon'ble High Court of Andhra Pradesh at Amaravati, in **W.P. No. 27046 of 2025,** has directed publication of this notice to effect service on **Respondents 3 to 14 and 17,** as service through Registered Post Acknowledgment Due could not be effected.

The above Writ Petition is filed seeking an order or direction, more particularly a Writ in the nature of Certiorari, duly calling for the records relating to the Lok Adalat Award dated 26.04.2005 passed in O.S. No. 883 of 1999, pertaining to the property admeasuring about 780 Square Yards, covered by TS No. 1196, Block No. 56, Plot No. 15, Waltair Ward, within the limits of Visakhapatnam Municipal Corporation, and to set aside the said Lok Adalat Award, in the interest of justice.

You, the above-named respondents, are hereby required to appear before the Hon'ble High Court of Andhra Pradesh at Amaravati on **29.12.2025,** failing which the matter will be heard and appropriate orders will be passed in your absence in accordance with law.

This notice is issued pursuant to the directions of the Hon'ble High Court of Andhra Pradesh at Amaravati, in Order dated 15.12.2025 in W.P. No. 27046 of 2025.

HENCE, THIS PUBLIC NOTICE.

Date: 21-12-2025
Place: Amaravati

P. RAMA SHARANA SHARMA
Advocate for the Petitioner

ఆఖరి మజిలీకి అవస్థలు

అయ్యన్నపేట శివారులో అధ్వానంగా శ్మశానవాటిక

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం నగరపాలకసంస్థ 44వ డివిజన్ పరిధిలోని విలీన పంచాయతీ అయ్యన్నపేటలో సమస్యలు తిష్ఠ వేశాయి ● బీసీ కాలనీ దారిలోని కోమటి చెరువు వద్దగల శ్మశాన వాటిక అధ్వానంగా మారింది. ముళ్ల కంపలు పెరిగాయి. వర్షాల సమయంలో అక్కడికి వెళ్లలేకపోతున్నామని స్థానికులు చెబుతున్నారు ● పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. ● కరకవలస రోడ్డు గుంతలమయమైంది ● చెంచుల కాలనీలో తాగునీరు, మురుగు సమస్య వేధిస్తోంది ● రాజవీధి, తుమ్మగంటివారి వీధి, చిన్నవీధి, మజ్జివారి వీధి, బియ్యాల వీధి, యాతవీధి తదితర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు లేవు ● మహాలక్ష్మీ కాలనీ, సాగర్ నగర్, సరస్వతీ కాలనీ, నల్లమారమ్మ కాలనీలోని మూడు లైన్లు, శ్రీరామకాలనీ, తిరుమలనగర్, ఎస్‌వీకే.నగర్, సూర్యానగర్, విజయలక్ష్మి కాలనీ, ఎంప్లాయీస్ వెల్ఫేర్ కాలనీ, మారుతీనగర్ ప్రాంతాల్లో కాలువలు, రోడ్లు నిర్మించాల్సి ఉంది ● అన్నిచోట్లా కుక్కలు, పందుల బెడద కనిపిస్తోంది ● పరిశీలించి, చర్యలు తీసుకుంటామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.

బాబామెట్టలో ముంపు బెడద

అభివృద్ధికి నోచుకోని హౌసింగ్ బోర్డు పార్కు

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా కేంద్రంలోని బాబామెట్ట ప్రాంతంలో కనీస సౌకర్యాలు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వుడా, హౌసింగ్ బోర్డు అభివృద్ధి చేసిన లేఅవుట్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి ● ద్వారకానగర్ ఎనిమిది లైన్లతో విస్తరించి ఉంది. శివారుల్లో మురుగు కాలువ ఉంది. సమీపంలోనే లేఅవుట్ గోడ ఉండడంతో దుర్వాసన వస్తోంది ● ఏపీ హౌసింగ్ బోర్డు కాలనీ పార్కు అభివృద్ధికి దూరమైంది ● ఉడాకాలనీ ఫేజ్-2లో రహదారి, కాలువ నిర్మాణాలు అవసరం
● నల్లచెరువు దారిలో కల్వర్టు పలకలు వేయాలి ● విజ్జీ స్టేడియం దారిలో ప్రధాన కాలువ పనులు చేపట్టాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు ● సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ నల్లనయ్య వెల్లడించారు.

మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న లింగరాజు

ఉడాకాలనీ, న్యూస్‌టుడే: మంచి సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ విజయనగరం విభాగ్ సహ కార్యావాహ కె.లింగరాజు అన్నారు. ఆదివారం రాత్రి ఉడాకాలనీ ఫేజ్-2లో జరిగిన హిందూ సమ్మేళనంలో మాట్లాడారు. దేశం కోసం ఆర్‌ఎస్‌ఎస్ ఎంతో పాటుపడుతోందన్నారు. గాయత్రీ విద్యా సంస్థల డైరెక్టర్ జి.ఎరుకునాయుడు, రఘు ఇంజినీరింగ్ కళాశాల డీన్ సతీష్ రామచౌదరి, టి.అరుణ, కొరుపోలు సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు ఆర్థిక అండ

మాట్లాడుతున్న ఛైర్మన్ సత్తిబాబు

విజయనగరం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు అండగా నిలుస్తోందని రాష్ట్ర శెట్టిబలిజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. ఆదివారం విజయనగరం మండలం సారిక సమీపంలో యాత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేశామన్నారు. నీరా ప్రాజెక్టు ఏర్పాటుతో కార్మిక కుటుంబాల సమస్యలు దూరమవుతాయన్నారు. యాత సాధికారత సమితి రాష్ట్ర కన్వీనర్ ఓనం శ్రీనివాసరావు, భీమిలి ఏఎంసీ డైరెక్టర్ కె.రామలక్ష్మి, సంఘం జిల్లా అధ్యక్షుడు సిమ్మ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కుటుంబాల ఆత్మీయ సమావేశం

ఎమ్మెల్యేతో రుద్రాభిషేకం చేయిస్తున్న పురోహితులు

జామి, న్యూస్‌టుడే: మండలానికి చెందిన బ్రాహ్మణ కుటుంబాల ఆత్మీయ సమావేశం ఆదివారం జామిలో నిర్వహించారు. ఎమ్మెల్యే లలితకుమారి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బ్రాహ్మణ కుటుంబాలను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుంటూ అండగా ఉంటోందన్నారు. ఆ సంఘ పెద్దలు బంకుపల్లి చంద్రశేఖర్, ఎం.జనార్దనరావు, సీహెచ్‌వీఎల్‌ఎన్ శాస్త్రి, సూరిబాబు, రామశర్మ తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజమే లక్ష్యం

చిన్నారికి చుక్కల మందు వేస్తున్న కమిషనర్

పోలియో రహిత సమాజమే లక్ష్యం కావాలని, అందుకు ప్రణాళికతో ముందుకెళ్లాలని వక్తలు అన్నారు. ఆదివారం జిల్లా వ్యాప్తంగా పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. విజయనగరంలో కమిషనర్ పి.నల్లనయ్య, ఎల్.కోటలో ఎమ్మెల్యే లలితకుమారి, ఎస్.కోటలో ఎమ్మెల్సీ రఘురాజు, నెల్లిమర్లలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు. ఆయా మండలాల్లో వైద్యాధికారులు, సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, బృందం

సినీ గీతాలు ఆలపిస్తున్న అర్చ పట్నాయక్, సునీత, ఉష, గీతామాధురి, సాకేత్, వాగ్దేవి, రేవంత్ తదితరులు ★ ఎమ్మెల్యే బడేటి చంటి, ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తదితరులు

ఆనంద హేలాపురి

అంబరాన్నంటిన ఈనాడు-50, ఈటీవీ-30 వసంతాల వేడుకలు

ఈనాడు డిజిటల్, భీమవరం, ఏలూరు రూరల్, న్యూస్‌టుడే: మనసులను మైమరపించిన పాటలతో.. తనువును ఊపేసిన నృత్యాలతో.. 'హేలాపురి' వాసులు ఆనంద డోలికల్లో మునిగారు. సంక్రాంతి సంబరాలు పది రోజులు ముందుగానే మొదలయ్యాయా అన్నట్లు ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలు అంబరాన్నంటాయి. ఏలూరు నరసింహారావుపేటలోని ఇండోర్ స్టేడియంలో ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ సౌజన్యంతో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ వేడుకలు అద్భుతంగా అలరించాయి. ప్రాంగణమంతా రంగురంగుల విద్యుత్తు వెలుగులతో కొత్త శోభను సంతరించుకుంది. వారాంతం కావడంతో అంతా కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. వినోదానికి ఏలూరు సిద్ధమా అంటూ వ్యాఖ్యాతలు రవి, ఆశు హుషారుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ గాయకులు ఆర్చ పట్నాయక్, ఉషా, సునీత, గీతా మాధురి, సాకేత్, వాగ్దేవి, ఇండియన్ ఐడల్ రేవంత్ ఆలపించిన గీతాలు ప్రేక్షకులను కేరింతలు కొట్టించాయి. వయసుతో సంబంధం లేకుండా గాయనీ గాయకుల పాటలకు పదం కలుపుతూ నృత్యాలు చేశారు. వెయ్యి శుభములు కలుగు నీకు సీరియల్ నటులు శిల్ప చక్రవర్తి, సంయుక్త, జ్యోతి, మౌనిక, జబర్దస్త్ యాంకర్లు మానస్, కావ్య నృత్యాలతో అలరించారు. కార్యక్రమం ఆసాంతం బాణసంచా కాల్పులు మిరుమిట్లు గొలిపాయి. కార్యక్రమానికి ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ముఖ్యఅతిథిగా, విశిష్ట అతిథిగా ఎస్పీ కె.ప్రతాప్‌శివకిశోర్ హాజరయ్యారు.

అందుబాటులో ఉంటూ.. కార్యక్రమం మధ్యలో ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ ఏపీ ప్రభుత్వంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆయన మాట్లాడారు. కొత్తగా ఉపాధి కల్పించేలా పరిశ్రమల స్థాపన దిశగా కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు తమ ఇబ్బందులు చెప్పుకొనేందుకు కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్నామని, దిల్లీలో ఉన్నా వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ నిధులు రాబట్టడంతో పాటు సొంత నిధులతో చేపట్టిన అభివృద్ధి గురించి తెలిపారు.

పుట్టా సేవలు.. వేదిక శుభాకాంక్షలు కలుగు నీకు సీరియల్ నటీమణులు శిల్ప బృందం నృత్యం ★ పిల్లలు, పిల్లల కేరింతలు

✦ మహేశ్ అన్న పెళ్లి కానుక పేరిట పేదింటి కుటుంబాలకు చెందిన నూతన దంపతులకు ఆర్థిక సహకారం అందిస్తున్నారు. విజయవాడ వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధికి రూ.25లక్షలు వ్యక్తిగత సహాయం అందించారు. ఇతర సేవలను కొనియాడారు. ✦ ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య మాట్లాడుతూ ఈనాడు 50, ఈటీవీ 30 వార్షికోత్సవ వేడుకలు ఏలూరులో నిర్వహించడం చాలా గర్వకారణమన్నారు. ప్రజలకు ఈనాడు, ఈటీవీ ఎనలేని అనుబంధం ఉందన్నారు.

✦ ఈటీవీ ప్రసారాలను 30 ఏళ్లుగా ప్రజల గుండెల్లోకి చేర్చిన ఈటీవీ వీటో ప్రయాణిస్తున్న ఎంఎస్‌ఓ, కేబుల్ ఆపరేటర్లు యాక్ట్ డిజిటల్, హాథ్ ఎంటర్‌టైన్‌మెంట్ మహేశ్వర్, టీసీఎస్ తాడేపల్లిగూడెం కమ్యూనికేషన్స్ కందులపాటి శ్రీనివాసరావులకు జ్ఞాపికలు ఇచ్చి గౌరవించారు.

వీవీఐపీలు, గాయని సునీత

చుక్కల మందు వేస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

పోలియో రహిత దేశంగా కొనసాగిద్దాం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పోలియో రహిత దేశంగా కొనసాగించేందుకు సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం మూడు రోజులపాటు పల్స్ పోలియో కార్యక్రమం చేపట్టిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. భీమవరం నర్సయ్య అగ్రహారంలోని బి.వీరాజు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రంలో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. 14 ఏళ్లుగా దేశం పోలియో రహితంగా ఉందన్నారు. డీఎంహెచ్‌వో జి.గీతాబాయి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

★ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి తదితర ప్రముఖులు పట్టణంలోని పలు కేంద్రాల్లోని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

రెండో సారీ తెదేపా జిల్లా పగ్గాలు రామరాజుకే

న్యూస్‌టుడే, భీమవరం అర్బన్: తెదేపా జిల్లా అధ్యక్షుడిగా మంతెన రామరాజును పార్టీ అధిష్ఠానం నియమించింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆ బాధ్యతలు చేపట్టిన ఆయన పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశారని పేరు తెచ్చుకున్నారు. సౌమ్యుడిగా ఉంటూ అటు పార్టీ పెద్దలతో బాగా కలిసి ఉంటారనే అభిప్రాయం ఉంది. వివాదాలకు దూరంగా ఉంటూ పార్టీ అప్పగించిన పనిని కచ్చితంగా నెరవేరుస్తారని పేరుంది.

విధేయతకు గుర్తింపు.. స్వతహాగా ఆక్వా వ్యాపారి అయిన రామరాజు నాటి ఎమ్మెల్యే కలవపూడి శివకు వెన్నంటి ఉండేవారు. 2019లో శివను ఎంపీ అభ్యర్థిగా నరసాపురం నుంచి పోటీ చేయించిన పార్టీ రామరాజుకు ఉండి టికెట్ కేటాయించింది. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్లు పార్టీ కార్యక్రమాలు చురుగ్గా నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం సీటు ఆయనకే ఇచ్చినా చివరి దశలో రఘురామకృష్ణరాజుకు కేటాయించాల్సి రావడంతో వెంటనే రామరాజుకు తెదేపా జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. కూటమి అధికారంలోకి రాగానే ఆయన్ను ఏపీఏసీసీ చైర్మన్ పదవి వరించింది. జిల్లా అధ్యక్షుడిగానూ కొనసాగుతూ వచ్చారు. ఇప్పుడు రెండోసారి ఆయనకే పార్టీ జిల్లా బాధ్యతలను సీఎం చంద్రబాబు అప్పగించారు.

అందరి మద్దతుతో.. జిల్లా అధ్యక్ష పదవికి తెదేపా రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు పేరును పార్టీ పరిశీలించింది. బీసీలకు ఇవ్వాలనే ప్రతిపాదన కూడా వచ్చింది. దీంతోపాటు జిల్లాలోని తెదేపాకి చెందిన నలుగురు ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల బాధ్యులు రామరాజుకే మద్దతు పలికినట్లు సమాచారం. జిల్లా ప్రధాన కార్యదర్శి పదవిని ఓటర్లు, జనాభాపరంగా జిల్లాలో రెండో పెద్ద సామాజిక వర్గమైన శెట్టిబలిజకు కేటాయించారు. తణుకులో పార్టీ విధేయుడిగా పేరున్న పితాని మోహనరావుకు ఈ పదవి దక్కింది. ఆయన గతంలో మండల, గ్రామ స్థాయిలో వివిధ పదవులు నిర్వహించారు.

పుష్కర ఏర్పాట్లకు ప్రణాళిక

సిద్ధాంతం: పుష్కరఘాట్ వద్ద అధికారులకు సూచనలిస్తున్న మంత్రి ఆనం, చిత్రంలో ఎమ్మెల్యే పితాని

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: గోదావరి పుష్కరాలకు చేయాల్సిన ఏర్పాట్లపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి ఆయన పెనుగొండ మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడారు. గోదావరి పుష్కరాలు 2027 జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో చేయాల్సిన అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని శాఖల అధికారులు, కమిషనర్లకు ఆదేశాలిచ్చారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశారని, త్వరలోనే సమావేశం నిర్వహిస్తారని వెల్లడించారు. అన్ని ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆలయాల్లో ధూప, దీప, నైవేద్యాల కోసం ఇచ్చే మొత్తం గతంలో రూ. 2 వేల నుంచి రూ.5 వేలు ఉండగా ఇప్పుడు రూ.10 వేలు ఇస్తున్నామని వివరించారు. జిల్లాలో 18 ఆలయాలకు రూ.23.13 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. అనంతరం సిద్ధాంతంలో పుష్కరఘాట్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. దేవాదాయశాఖ అధికారులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు పోసి.. నీళ్లొదిలేసి..!

న్యూస్‌టుడే : భీమవరం పట్టణం, తాడేపల్లి గూడెం వన్‌టౌన్, తణుకు, నరసాపురం

జిల్లాలోని పట్టణాల్లో పైపులైన్ల లీకుల్లోకి రూ.కోట్లు చేరుతున్నాయి. మంచినీటి లీకేజీల నివారణ, పైపులైన్ల మరమ్మతుల పేరుతో నిధులు ఖర్చవుతున్నా సత్ఫలితాలు రావడం లేదు. లీకుల వల్ల నిత్యం 14 ఎంఎల్‌డీ నీరు వృథా అవుతోంది. దీంతో లక్షలాది మంది ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతోంది. మరోవైపు ప్రజాధనం పక్కదారి పడుతోంది.

భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడు పట్టణాల్లో నీటి సరఫరా నిర్వహణలో అంతర్గత లోపాలకు తోడు లీకేజీల నివారణ తూతూమంత్రంగా చేసి వదిలేస్తున్నారు. ఫలితంగా ఏటా రూ.కోట్లలో ప్రజాధనం పక్కదారి పడుతోంది. భూమిలో ఉన్న ఆర్‌సీసీ, హెచ్‌డీపీ, సిమెంటు పైపులు పరిశీలించి వాటికి తగ్గట్టుగా పనులు చేయాలి. అందుకు వ్యతిరేకంగా తవ్వినచోట రబ్బరు ట్యూబ్‌లు, గోనె సంచులు కట్టి తాత్కాలిక మరమ్మతులు చేస్తుండటంతో నీటి వృథా అరికట్టలేకపోతున్నారు. పట్టణాల్లో రోజూ 4 నుంచి 6 ప్రాంతాల్లో పనులు చేసినట్లు దస్త్రాల్లో నమోదవుతున్నాయి.

భీమవరం పీపీ రోడ్డు పక్కన పైపులైను మరమ్మతులకు నెలన్నర కిందట తవ్వారు. పనులు పూర్తయ్యాక పూడ్చినా నీటి వృథా ఆగలేదు. లీకేజీ మరమ్మతులకు రూ. 30 వేలు ఖర్చు చేశారు.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే.. భీమవరం పట్టణంలోని పీపీ రోడ్డు పొడవునా విస్సాకోడేరు వంతెన వరకు పైపులైన్ల లీకేజీలుంటాయి. నర్సయ్య అగ్రహారంలోనూ ఇదే పరిస్థితి. ఆయా ప్రాంతాల్లో తవ్విన చోటే మళ్లీ తవ్వుతున్నారు. పారిశ్రామికవాడ, ఎఫ్‌సీఐ గోదాముల దగ్గర ఇప్పటికీ నాలుగైదుసార్లు తవ్వేసి ఇప్పటికీ లీకేజీలు అరికట్టలేదు. తణుకులో తవ్వినచోటే తవ్వుతున్నారు. తాడేపల్లిగూడెం, నరసాపురంలోనూ అదే పరిస్థితితో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కలుషిత నీరు తాగలేక కొనుగోలు చేసుకుంటున్నామని స్థానికులు తెలిపారు. ఎం.ఎల్. నీరు అంటే పది లక్షల లీటర్లు. వాటిని శుద్ధి చేసి సరఫరా చేయాలంటే రూ.12 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇలా నెలకు రూ.కోట్లు ఖర్చవుతోంది.

పట్టణాల్లో ఆగని పైపుల లీకులు

తాడేపల్లిగూడెం పట్టణం ఏలూరు రోడ్డులోని శంకరమఠం సమీపంలో గతంలో తవ్వారు. ఇప్పటికీ అక్కడ నీటి వృథా ఆగలేదు.

జిల్లాలో ఇలా..
మొత్తం పట్టణాలు 6
రోజూ నీటి వృథా 14 ఎంఎల్‌డీ
ఏటా లీకులకు బడ్జెట్ కేటాయింపు రూ.2.40 కోట్లు

ఖర్చు, పనుల నాణ్యతపై ఆరా తీస్తాం.. పట్టణాల వారీగా పనుల తీరు పరిశీలిస్తాం. పైపులైన్ల మరమ్మతులు, లీకేజీలకు చేస్తున్న ఖర్చులు, పనుల నాణ్యతపై ఆరా తీస్తాం.

- నాగనరసింహారావు, పురపాలక రాజమహేంద్రవరం ప్రాంతీయ సంచాలకుడు

సంగీతంలో బాల సుబ్రహ్మణ్యం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

భీమవరానికి చెందిన శ్రీపాద కార్తికేయ దత్త సుబ్రహ్మణ్యం యూకేజీ నుంచే రాగాలు తీస్తూ.. ప్రముఖుల మన్నన పొందుతున్నాడు. రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో ప్రథమ స్థానం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించాడు. ఒకటో తరగతి చదువుతున్నప్పుడే అన్నమాచార్య సంకీర్తనలు, భక్తి గీతాలు అవలీలగా పాడేవాడు. ఓ కచేరిలో పాడిన కీర్తనలకు పులకించిపోయిన ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త గరికిపాటి నరసింహారావు సుబ్రహ్మణ్యంను సత్కరించారు. భవిష్యత్తులో మంచి సంగీత విద్వాంసుడు అవుతావని ఆశీర్వదించారు. ఇటీవల రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో ప్రథమ స్థానం సాధించి ఉప సభాపతి రఘురామకృష్ణ రాజు నుంచి ప్రశంసా పత్రం అందుకున్నాడు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకుంటూ సంగీత గురువులు పైడిరాజు, ప్రభావతి దంపతుల శిక్షణలో నిత్య సాధన చేస్తున్నట్లు బాల గాయకుడు తెలిపాడు.

ఇది భీమవరం మండలం కొవ్వాడ పంచాయతీలో రూ.10 లక్షలతో నిర్మించిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం. ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. సేకరించిన చెత్తను దాని పక్కనే వేసి నిప్పు పెడుతున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పెనుమంట్ర మండలంలో 18 పంచాయతీలుండగా 12 చోట్ల కేంద్రాలు నిర్మించారు. వాటిలో ఒకటి కూడా వినియోగంలో లేదు. పొలమూరులో చెత్త శుద్ధి కోసం రూ.10 లక్షలతో రెండు యంత్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి తుప్పుపడుతున్నాయి.

తాడేపల్లిగూడెం మండలంలో 31 పంచాయతీల్లో దాదాపు అన్ని చోట్లా పారిశుద్ధ్యం పడకేసింది.

చెత్త సేకరణ మమ.. సంపద సృష్టి భ్రమ

న్యూస్‌టుడే, భీమవరం అర్బన్, ఉండి, పెనుమంట్ర, తాడేపల్లి గూడెం వన్‌టౌన్: పల్లెల్లో నిత్యం సేకరించే చెత్త నుంచి సేంద్రియ ఎరువు తయారు చేయాలి... దాన్ని విక్రయించి సంపద సృష్టించాలి. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకం ఇది. ఈ మేరకు ఒక్కో గ్రామంలో ఆరు నుంచి పది లక్షలు ఖర్చు చేసి వందల సంఖ్యలో ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు నిర్మించారు. కొన్నిచోట్ల అనుకున్నట్లుగానే ఆచరించి పంచాయతీలకు ఆదాయం తేగలిగారు. గత వైకాపా ప్రభుత్వం వాటి నిర్వహణ గాలికొదిలేసింది.

జిల్లాలో ఇలా
మొత్తం పంచాయతీలు 409
ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు 380
ప్రస్తుతం నిర్వహణలో ఉన్నవి 36

సేకరించిన చెత్తను ఉండి మండలం పెద పుల్లేరు ప్రధాన రహదారి వెంబడి వేస్తుండడంతో కొండలా మారింది. ఇక్కడ రూ.లక్షలతో నిర్మించిన ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో ఇప్పటి వరకు తట్ట చెత్త కూడా వేయలేదు. చెత్తను అప్పుడప్పుడు తగలబెడుతున్నారు.

380 కేంద్రాల్లో ఇప్పుడు 36 మాత్రమే నిర్వహణలో ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దాన్ని గాడిన పెట్టేలా ప్రయత్నాలు చేస్తున్నా గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల తీరు వల్ల మార్పు రావడం లేదు. దీంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఫలితంగా ప్రధాన రహదారులు, పంట కాలువల వెంట చెత్త గుట్టలు పేరుకుపోతున్నాయి. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి రామ్‌నాథ్‌రెడ్డి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా అన్ని కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేలా చూస్తామని.. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని తెలిపారు.

క్రీడలు, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ వ్యాయామం, క్రీడలకు కొంత సమయం కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని రాజ్యసభ సభ్యుడు పాకా వెంకటసత్యనారాయణ అన్నారు. గన్నాబత్తులవారి క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పురోహిత క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పోటీలను కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. డీఎన్నార్ కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, పోటీల నిర్వాహక ప్రతినిధులు సుబ్రహ్మణ్యంశర్మ, ప్రసాద్‌శర్మ, కామేశ్వరరావుశర్మ, సంతోష్‌కుమార్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

బ్యాటింగ్ చేస్తున్న నాగరాణి, చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

నేత్రపర్వం.. శ్రీవారి ధనుర్మాసోత్సవం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ధనుర్మాస ఉత్సవం ఆదివారం నేత్రపర్వంగా జరిగింది. తొలుత ఆలయ అర్చకులు, పండితులు స్వామి, అమ్మవార్లను తొళక్కం వాహనంపై కొలువుదీర్చి హారతులు పట్టి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారు ఉభయ దేవేరులతో కలిసి తిరు వీధుల్లో ఊరేగారు.

పనులు మొదలైతే పండగే!

పాలకొల్లు, న్యూస్‌టుడే: 'పల్లె పండగ' పేరిట వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి రూ.3 కోట్ల చొప్పున కేటాయించారు. ఆయా పనులకు డ్వామా, పంచాయతీరాజ్‌శాఖల అధికారులు మండలాల వారీగా ఇటీవల ప్రతిపాదనలు చేశారు. ప్రతి మండలంలో సగటున రూ. కోటి విలువైన పనులు జరగాల్సి ఉండగా పాత బిల్లులు పెండింగ్ ఉండటంతో కొత్తవి ఎంతవరకు ముందుకెళ్తాయో తెలియని పరిస్థితి. గతేడాది జిల్లాకు ఇచ్చిన రూ. 30 కోట్లతో పోలిస్తే ఈసారి కేటాయింపులు తగ్గాయి.

రూ. 200 కోట్లు విడుదల.. పల్లె పండగలో 2025 మార్చి వరకు చేసిన పనులకు బిల్లుల చెల్లింపులకుగాను జిల్లాకు రూ. 200 కోట్లు విడుదలయ్యాయి. రానున్న రెండు మూడు రోజుల్లో గుత్తేదారుల ఖాతాలకు ఈ నిధులు జమవుతాయని డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు తెలిపారు. కొత్త ప్రతిపాదనల్లో గ్రామాల్లో రహదారులను సీసీ రోడ్లుగా మార్చడం, డ్రెయిన్ల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం గుత్తేదారులకు కొంతమేర బిల్లులు చెల్లించనుండటంతో కొత్త పనులు సకాలంలో మొదలవుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

ఈ ఏడాది ఆలస్యం.. గతేడాది డిసెంబరు, జనవరిలో సంక్రాంతికి ముందే కొత్త పనులు ప్రారంభించగా ఈ ఏడాది ఇంకా మంజూరు దశలోనే ఉన్నాయి. గతంలో కేంద్రం ఉపాధి హామీ పనులకు 90 శాతం నిధులు ఇచ్చేది. ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో ఈ పథకంలో దీనిని 60 శాతానికి పరిమితం చేయాలని నిర్ణయించడం అభివృద్ధి పనులపై కొంత మేరకు ప్రభావం చూపుతుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై భారం పెరగడంతోపాటు గతంతో పోలిస్తే ఉపాధి హామీ పనులకు కేటాయింపులు తగ్గొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పాలకొల్లు మండలం వరిధనంలో అభివృద్ధి చేయాల్సిన రహదారి

సనాతన ధర్మం.. హైందవుల ప్రాణం

ఉండి, న్యూస్‌టుడే : యుగయుగాల నుంచి హైందవులకు ప్రాణం సనాతన ధర్మం అని.. దాన్ని చిరస్థాయిగా నిలుపుకొనేందుకు అందరూ ఐక్యమవ్వాలని, కుంభమేళాలు, పుష్కరాల మాదిరిగా హిందూ సమ్మేళనాలు విజయవంతం చేసేందుకు తరలిరావాలని పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామిజీ) పిలుపునిచ్చారు. ఉండి శ్రీరామక్షేత్ర ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన హిందూ సమ్మేళనానికి వేలాదిగా భక్తులు తరలొచ్చారు. నిర్వహణ సమితి అధ్యక్ష, కార్యదర్శులు ద్వారంపూడి నారాయణరెడ్డి, నల్లా సత్యకృష్ణ కిరణ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభను ప్రజ్ఞానంద సరస్వతి ప్రారంభించి అనంతరం భక్తులకు మార్గదర్శనం చేశారు. శ్రీశైలంలో ధ్వజ స్తంభానికి ఉన్న వయసు ఏమతానికీ లేదన్నారు. కలియుగంలో మానవరూపంలో దేవుడి సహాయ, సహకారాలు అందరికీ అందుతాయన్నారు. ఇటీవల నిర్వహించిన కుంభమేళాకు 60 కోట్ల మంది భక్తులు పాల్గొనడమంటే హిందూ ధర్మ శక్తికి నిదర్శనమన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ గోదావరి విభాగ్ సంఘ్ చాలక్ మంతెన రామచంద్రరాజు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో 70 చోట్ల హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్వహణ సమితి ముఖ్య కార్యవర్గం చలపతిరావు, సింగరాజు, వెంకయ్య, సత్యానంద్ తదితరులు మాట్లాడారు.

ప్రారంభిస్తున్న పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతి

నేటి నుంచి ఈనాడు క్రికెట్ పోటీలు ప్రారంభం 6లో

బతుకుదెరువుకెళ్లి.. బతుకుముగిసి!

ఉప్పుటేరు సమీపంలో వ్యాను బోల్తా ★ ఇద్దరు మత్స్యకారుల మృతి.. ముగ్గురి పరిస్థితి విషమం

వారు వేటను నమ్ముకున్నారు.. చేపల పట్టుబడికి వెళ్తుంటారు.. దాన్నే బతుకుదెరువుగా మార్చుకున్నారు.. పని ముగించి.. ఇంటికి బయల్దేరారు.. కానీ, విధి మరోలా తలచింది.. మృత్యువు దారికాసింది.. ఇద్దరిని బలి తీసుకుంది.. బాధిత కుటుంబాల్లో విషాదం నింపింది..

కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండి మండలంలోని ఉప్పుటేరు సమీపంలో మద్వానిగూడెం వద్ద ఆదివారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుని రహదారి నెత్తురోడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కలిదిండి మండలం సున్నంపూడి గ్రామానికి చెందిన ఐదుగురు మత్స్యకారులు వ్యానులో కోరుకొల్లు శివారు చైతన్యపురంలో చెరువు పట్టుబడికి వెళ్లి తిరిగి వస్తుండగా.. ఉప్పుటేరు సమీపంలో మద్వానిగూడెం వద్ద వ్యాను అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఆ సమయంలో వ్యానులో డ్రైవర్ సహా ఐదుగురు మత్స్యకారులు ఉన్నారు. వీరిలో ముగ్గురికి తీవ్రంగా గాయాలు కావడంతో ఇద్దరు మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మిగిలిన వాళ్లకు స్వల్ప గాయాలయ్యాయి.

రహదారిపై పడి ఉన్న క్షతగాత్రులు

తండ్రి మృతి.. మృత్యువుతో పోరాడుతున్న కొడుకు

ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కొల్లి వెంకటేశ్వరరావు, తిరుమలశెట్టి ఆంజనేయులు, తిరుమలశెట్టి వెంకటకృష్ణను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో వెంకటేశ్వరరావు, ఆంజనేయులు ప్రాణాలు కోల్పోయారు. ఆంజనేయులు కుమారుడు వెంకటకృష్ణ ప్రాణాలతో పోరాడుతున్నారు. ఈయన ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ దుర్ఘటనతో మత్స్యకార గ్రామాల్లో తీవ్ర విషాదం నెలకొంది. దీనిపై వెంకటేశ్వరరావు కుమారుడు హిమసాగర్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై కేసు చేసినట్లు ఎస్సై వివరించారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

నేటి నుంచి ఈనాడు క్రికెట్ పోటీలు ప్రారంభం

కళాశాలల ఆటగాళ్లు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న "ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ప్రజెంట్స్, ఈనాడు స్పోర్ట్స్ లీగ్ 2025" క్రికెట్ పోటీలు జిల్లాలో నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఏలూరులో ఆశ్రం మెడికల్ కళాశాల, భీమవరంలో ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ కళాశాలల్లో జరుగుతాయి.

EENADU SPORTS LEAGUE 2025

మ్యాచ్‌ల వివరాలు

22-12-2025 (సోమవారం) ఆశ్రం మెడికల్ కాలేజ్, ఏలూరు గ్రౌండ్‌లో

ఉదయం 9 గం॥లకు: హేలాపురి ఇంజినీరింగ్ కాలేజ్, ఏలూరు X ఆశ్రం మెడికల్ కాలేజ్, ఏలూరు
మధ్యాహ్నం 1 గం॥కు: ఐఐఐటీ, నూజివీడు X ఎన్.ఆర్.ఐ. ఇంజినీరింగ్ కాలేజ్, ఆగిరిపల్లి

23-12-2025 (మంగళవారం) ఆశ్రం మెడికల్ కాలేజ్, ఏలూరు గ్రౌండ్‌లో

ఉదయం 8 గం॥లకు: హేలాపురి జూనియర్ కాలేజ్, ఏలూరు X గవర్నమెంట్ ఐటీఐ కాలేజ్, ఏలూరు
ఉదయం 11.00 గం॥లకు: ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఏలూరు X సీఆర్ఆర్ డిగ్రీ కాలేజ్, ఏలూరు
మధ్యాహ్నం 2 గం॥లకు: సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్, ఏలూరు X సిఎస్‌టీఎస్ గవర్నమెంట్ కాలేజ్, జంగారెడ్డిగూడెం

22-12-2025 (సోమవారం) ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం గ్రౌండ్‌లో

ఉదయం 8 గం॥లకు: డి.ఎన్.ఆర్. ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం X శశి ఇంజినీరింగ్ కాలేజ్, తాడేపల్లిగూడెం
ఉదయం 11.00 గం॥లకు: స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కాలేజ్, నరసాపురం X బి.వి.ఆర్. డిగ్రీ కాలేజ్, భీమవరం
మధ్యాహ్నం 2 గం॥లకు: ఆదిత్య డిగ్రీ కాలేజ్, పాలకొల్లు X శ్రీవాసవీ ఇంజినీరింగ్ కాలేజ్, తాడేపల్లిగూడెం

23-12-2025 (మంగళవారం) ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం గ్రౌండ్‌లో

ఉదయం 8 గం॥లకు: ఎ.ఎస్.ఎన్.ఎం. డిగ్రీ కాలేజ్, పాలకొల్లు X విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం
ఉదయం 11.00 గం॥లకు: బి.ఆర్.ఆర్. & జి.కె.ఆర్. ఛాంబర్ డిగ్రీ కాలేజ్, పాలకొల్లు X ఎస్.ఆర్.కె.ఆర్. ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం
మధ్యాహ్నం 2 గం॥లకు: భీమవరం ఇంజినీరింగ్ కాలేజ్, భీమవరం X ఎస్.వి.కె.పి. & కె.ఎస్.రాజు డిగ్రీ కాలేజ్, పెనుగొండ

ఈనాడు-50, ఈటీవీ-30 వసంతాల వేడుకలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ చేతుల మీదుగా జ్ఞాపికలు స్వీకరిస్తున్న స్పాన్సర్లు

స్పాన్సర్లకు సత్కారం

ఈనాడు డిజిటల్, భీమవరం, ఏలూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుక ఏలూరు నరసింహారావుపేటలోని ఇండోర్ స్టేడియంలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పాన్సర్లను సత్కరించారు. స్పాన్సర్లు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ఏలూరు మేనేజర్ హరీశ్; ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ (హైదరాబాద్) మార్కెటింగ్ ఇన్‌ఛార్జి వెంకట్, ఏరియా సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉదయ్‌కుమార్; తెనాలి డబుల్ హార్స్ గ్రూపు పశ్చిమ గోదావరి జిల్లా సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఎస్.అప్పన్న, పావని; అంబికా దర్బార్ బత్తి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆలిండియా అగరబత్తి మ్యానిఫ్యాక్చరర్స్ ప్రెసిడెంట్ అంబికా రామాంజనేయులు, అంబికా రామచంద్రరావు; మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ కొసరాజు రవీంద్రనాథ్; శ్రీలలిత రైస్ ఏలూరు డిస్ట్రిబ్యూటర్ వెంకటదుర్గ, మల్లేశ్వర ట్రేడర్స్ దివాకర్; వేగా జ్యూయలర్స్ డైరెక్టర్స్ సీహెచ్. హేమకుమారి, సీహెచ్. మాధవి; దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ కె.రాజశేఖర్‌రావు, ఆర్టోస్ కూల్ డ్రింక్స్ ఏలూరు డీలర్ రవికుమార్, శశి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ ఏలూరు క్యాంపస్ ఇన్‌ఛార్జి మేకా కిశోర్; ఆశ్రమ్ హాస్పిటల్స్ ఏలూరు సీఈవో డాక్టర్ హనుమంతరావు; నంద గోకుల్ ఘీ మేనేజింగ్ పార్టనర్ మానేపల్లి శేఖర్; మన వీవీఐటీ యూనివర్సిటీ గుంటూరు ప్రతినిధి వై.వి.ఎస్.సురేశ్; ఫిజికిమ్ మధుక్యూర్ జ్యూస్-క్యాపుసుల్స్ ఏలూరు డిస్ట్రిబ్యూటర్, శ్రీ బాలాజీ ఫార్మాస్యూటికల్స్ గుట్టా రవిచంద్రలకు ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), ఎస్పీ కె.ప్రతాప్‌శివకిశోర్ జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి క్షేత్రం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల క్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల గోవింద నామస్మరణలు, పండితుల వేద మంత్రోచ్ఛరణలతో మార్మోగింది. సెలవు రోజు కావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా వచ్చి స్వామిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి

చుక్కల మందుకు చక్కని స్పందన

కాళ్ల(భీమవరం గునుపూడి), న్యూస్‌టుడే: పల్స్ పోలియో శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పెదఅమిరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన పల్స్ పోలియో శిబిరంలో చిన్నారులకు చుక్కలు వేసి ఆమె మాట్లాడారు. అయిదేళ్లలోపు పిల్లలకు వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చుక్కల మందు వేసే అవకాశాన్ని కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో 5 ఏళ్లలోపు చిన్నారులు 1,87,204 మందికి చుక్కలు వేసేందుకు 1,315 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,520 మంది ఉద్యోగులు విధుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. 22, 23 తేదీల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి వస్తారని అలాగే బస్టాండ్, రైల్వే స్టేషన్ల వద్ద శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. డీఎంహెచ్‌వో గీతాబాయి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి దేవ సుధాలక్ష్మి, వైద్య, ఆరోగ్య శాఖ సంయుక్త సంచాలకులు ఎస్.మల్లేశ్వరి, సర్పంచి డొక్కు సోమేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యులు రంగమనాయుడు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పెదఅమిరంలో చిన్నారికి మందు వేస్తున్న కలెక్టర్ నాగరాణి తదితరులు

ఇళ్ల నిర్మాణాల గుత్తేదారులపై చర్యలు..

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: మూడో ఐచ్ఛిక ఇళ్ల నిర్మాణం తక్షణం పూర్తి చేయాలని లేదంటే గుత్తేదారులపై చర్యలు తప్పవని కలెక్టర్ నాగరాణి హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలపై సంబంధిత అధికారుల, గుత్తేదారులతో ఆమె సమావేశం నిర్వహించారు. గుత్తేదారులు అజయ్ వెంచర్స్, పళ్లా ఏసుబాబు, జి.వెంకటేశ్వరరావు నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని.. ఇకపై వాటిని త్వరగా పూర్తి చేయకపోతే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను ఉగాది నాటికి పూర్తి చేయాలని గృహనిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆ సంస్థ పీడీ పిచ్చయ్య, డీఈలు, గుత్తేదారులు పాల్గొన్నారు.

భీమవరంలో నేడు వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: అటల్- మోదీ సుపరిపాలన యాత్ర సోమవారం భీమవరానికి చేరుకోనుంది. భీమవరంలోని బైపాస్‌రోడ్డు కూడలిలో ఏర్పాటు చేసిన అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆవిష్కరిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లను కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆదివారం పరిశీలించారు. విస్సాకోడేరు వంతెన దగ్గర నుంచి యాత్ర ప్రారంభమై విగ్రహ ప్రాంగణానికి చేరుతుంది. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ విగ్రహావిష్కరణ సమయంలో భీమవరం పట్టణంలోకి భారీ వాహనాలను సోమవారం ఉదయం రానీయడంలేదని ట్రాఫిక్ సీఐ శ్రీనివాసు తెలిపారు. ఉండి రోడ్డు, బైపాస్‌రోడ్డు, పీపీరోడ్డు మీదుగా మళ్లిస్తామన్నారు.

పర్యాటక గృహాల వద్ద బయో టాయిలెట్లు

పోలవరం, న్యూస్‌టుడే: పాపికొండల అభయారణ్యంలో కొరుటూరులో పర్యాటకుల కోసం వెదురు కర్రలతో నిర్మించిన అతిథి గృహాల వద్ద బయో టాయిలెట్లు ఏర్పాటు చేస్తున్నట్లు పోలవరం అటవీ శాఖాధికారి ఎస్కే వలీ చెప్పారు. రూ.60 వేల చొప్పున నాలుగు తీసుకొస్తున్నామన్నారు. ఇందులో ఒకటి నదిపై తిరిగే బోటులో, మరో మూడు బ్యాంబు కాటేజ్‌ల వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం పోలవరం అటవీశాఖ కార్యాలయానికి చేరుకున్నాయని, త్వరలో కొరుటూరు తరలిస్తామని వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు పశ్చిమగోదావరి జిల్లా మహిళలు, పురుషుల జట్లను ఆదివారం ఎంపిక చేశారు. భీమవరంలోని బ్రౌనింగ్ జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జట్టుగా ఎంపిక చేశామని నెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి విజయలక్ష్మి తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలు రావులపాలెంలో ఈ నెల 27 నుంచి 29 వరకు జరుగుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులను బ్రౌనింగ్ విద్యాసంస్థల అధ్యక్షుడు మేడిది జాన్సన్, కార్యదర్శి ఎస్తేర్ ప్రియాంక తదితరులు అభినందించారు.

ఉండి రైల్వే గేటు.. తెరుచుకుందండి

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో పైవంతెన వద్ద రైల్వే గేటును ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో అధికారులు తెరిచారు. ఆర్వోబీ పనులతో ఈ నెల 2న ఈ గేటును మూసివేశారు. దీంతో 165 జాతీయ రహదారిపై ఉండి - ఆకివీడు మధ్య వివిధ జిల్లాలు, చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లే వాహనాలను మళ్లింపు మార్గాల్లో రాకపోకలకు అనుమతించారు. అంతంతమాత్రంగా ఉన్న ప్రత్యామ్నాయ మార్గాల్లో భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా దెబ్బతిన్నాయి. పాములపర్రు - పెదకాపవరం రహదారి పట్టణంలో వాహన చోదకులకు ప్రత్యక్ష నరకాన్ని చూపించింది. పెదపుల్లేరు - సీసలి, ఉండి - కోపల్లె, పెదపుల్లేరు - వాండ్రం, పెదఅమిరం - కాళ్ల ఆర్ అండ్‌బీ రహదారులు దయనీయ స్థితికి చేరాయి. దీంతో నిత్య ప్రయాణాలు సాగించేవారంతా రాకపోకలు తగ్గించుకున్నారు. జాతీయ రహదారిపై ఉండిలో 20 రోజుల తరువాత గేటు తెరిచారనే సమాచారం ఆదివారం మధ్యాహ్నానికి కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చేరింది. దీంతో రహదారి సమస్యలకు విముక్తి లభించిందంటూ వాహన చోదకులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. సంక్రాంతి సంబరాలకు తరలి వచ్చే ప్రజల కోసం జనవరి నెలాఖరు వరకు మరోసారి ఈ గేటును మూసేయొద్దంటూ అధికారులకు పలువురు మొరపెట్టుకుంటున్నారు.

ప్రారంభమైన వాహన రాకపోకలు

వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం ఎంఆర్‌కే జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు [illegible] జి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు మొత్తం 176 నమూనాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

జంగారెడ్డిగూడెం విద్యార్థుల ప్రతిభ

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో తణుకులో ఆదివారం జరిగిన అండర్-19 చదరంగం పోటీల్లో జంగారెడ్డిగూడెం క్రీడాకారులు ఎం.కుషాంక్ శ్రీవిశ్వ, బి.చైతన్య శ్రీకర్ ప్రతిభ చూపారు. ఎం.కుషాంక్ శ్రీవిశ్వ ప్రథమ స్థానంలో, చైతన్య శ్రీకర్ ద్వితీయ స్థానంలో నిలిచారని కోచ్‌లు అయినపర్తి సరళా మాధవి, చంద్రశేఖర్ తెలిపారు. ఇక్కడ చూపిన ప్రతిభతో వీరు విశాఖలో జరగనున్న అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారన్నారు.

ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కుషాంక్ శ్రీవిశ్వ, చైతన్య శ్రీకర్

శతాధిక వృద్ధుడు మృతి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి మండలం చేవూరుకు చెందిన శతాధిక వృద్ధుడు వల్లభనేని మాధవరావు(103) మృతి గ్రామంలో విషాద ఛాయలను నింపింది. 1959-64లో గ్రామానికి మొదటి సర్పంచిగా ఎన్నికై గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా, జడ్పీ మాజీ ఛైర్మన్ పిన్నమనేని కోటేశ్వరరావుకు ముఖ్య అనుచరుడిగా, చేవూరు కోపరేటివ్ బ్యాంక్ [illegible] తనదైన ప్రత్యేక ముద్ర వేశారు. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మనవలు, మనవరాళ్లు, ముని మనవళ్లతో పెద్ద కుటుంబాన్ని కలిగి ఉన్నారు. పెద్ద దిక్కు మృతితో కుటుంబంతోపాటు గ్రామస్థులు శోకసంద్రంలో మునిగారు.

మాధవరావు (పాతచిత్రం)

వేలం ప్రకటన

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE :: TANUKU
E.P. No.73/2022
A.A.C.F. No.221/2019
Between:
M/s. Margadarsi Chit Fund Pvt. Ltd., Rep by its Manager, Mandapeta. ... Decree Holder
And
V.Rama Murthy and Others ... Judgement Debtors
4th JDR: Vailla Avanthi, W/o V.Rama Murthy, Business, R/o. D.No:73-22-2a, Near Nagamma Temple, Narayanapuram, Rajamahendravaram, E.G.Dist.,

[illegible] షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టువారి ఎదుట తేది 07-01-2026న ఉదయం 10-30 నిలకు వేలం నిర్వహించబడును. ఆసక్తిగలవారు వచ్చి పాడుకొనగలరు. వివరములు పై శ్రీ కోర్టువారి నజారత్ ఆఫీసు నందు గాని, డిక్రీ హోల్డర్ గారి లాయర్ గారి ఆఫీసులో గాని తెలియజేయబడును.

SCHEDULE OF PROPERTY BELONGING TO 4TH JDR

All that piece and parcel of that the vacant site situated at West Godavari District, Attili Mandal, Attili Sub-Registry, Attili, Document No.2861/2015, R.S. No.829/1, Nearest D.No:2-233, covered by an extent of 240 Sq.Yards of Vacant site bounded by:
EAST: Road; WEST: Site of Ramba Ramulu; SOUTH: Site of Executant; NORTH: Site of Prasanthi Residency Apartment.
Within the above boundaries an extent of 240 Sq. Yards of vacant site and along with Common Ways and easementary rights.
DHR Value : 10,00,000/-
AMIN VALUE : 45,00,000/-
JDR VALUE : Not given
O.NAGENDRA KRISHNA, Advocate
TANUKU, Cell: 80084 41888, 98481 99440

వినోదం మాటున జూదం

- శిబిరంపై పోలీసుల మెరుపు దాడి
- పెద్ద సంఖ్యలో జూదరుల అరెస్టు
- పలువురు ప్రముఖులు ఉన్నట్లు సమాచారం

నూజివీడు, న్యూస్‌టుడే: వినోదం మాటున నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం రాత్రి పోలీసు బృందాలు మెరుపు దాడులు నిర్వహించాయి. ఆగిరిపల్లి మండలం పోతవరప్పాడులోని మ్యాంగో బే రిక్రియేషన్ సొసైటీలో నిర్వహిస్తున్న భారీ జూదాలపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. మ్యాంగో బే రిక్రియేషన్ సొసైటీ పేరుతో 2011లో రిక్రియేషన్ క్లబ్ ప్రారంభించారు. అక్కడ జూదాలు జరుగుతున్నాయనే ఆరోపణలతో 2014లో క్లబ్ మూతపడింది. ఇటీవల ఈ సొసైటీ సభ్యులు కోర్టును ఆశ్రయించి 13 ముక్కల ఆటకు అనుమతి తెచ్చుకున్నారు. ఈ ప్రాంతంలో జూదం నిర్వహించడం ద్వారా యువత భవిత నాశనం అవుతుందని ఈ సొసైటీ గేటు వద్ద ఇటీవల పలువురు యువకులు నిరసన తెలిపారు. అయితే ఈ ప్రాంతంలో భారీ ఎత్తున జూదాలు నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఆదివారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్ మాట్లాడుతూ.. హైకోర్టు నుంచి అన్ని అనుమతులు ఉన్నాయంటూ... నిర్వాహకులు తప్పుడు ప్రచారం చేస్తూ రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున జూదరులను రప్పించి భారీ జూదాలకు తెరతీశారని అన్నారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల నుంచే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జూదరులు ఖరీదైనా కార్లలో ఇక్కడకు రావడం గుర్తించారు. ప్రత్యేక బృందాలతో దాడులు నిర్వహించామని తెలిపారు. ఈ క్రమంలో రాత్రి 10 గంటల వరకు రూ.18 లక్షల వరకు నగదు ఉన్నట్లు గుర్తించామని, ఇంకా పూర్తిగా లెక్కించాల్సి ఉందని అన్నారు. దాడులు నిర్వహించే సమయంలో సుమారు 150 మంది వరకు జూదం ఆడుతున్నట్లు గుర్తించారు. 120పైగా కార్లు, 50 వరకు ద్విచక్ర వాహనాలు ఆ ప్రాంతంలో ఉన్నాయని చెప్పారు. పంచనామా పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ స్పష్టం చేశారు. ఈ దాడుల్లో పలువురు బడా బాబులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇద్దరు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, 70 మంది పోలీసు సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ ప్రసాద్

ఆ ప్రాంతంలో నిలిపిన కార్లు

చదరంగంతో మేధస్సుకు పదును: ఆరిమిల్లి

తణుకు, న్యూస్‌టుడే: చదరంగంతో మేధస్సు మెరుగుపడుతుందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్-19 చదరంగ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు చరవాణి, సామాజిక మాధ్యమాలకు ప్రభావితం కాకుండా వారి తల్లిదండ్రులు చదరంగం క్రీడను ప్రోత్సహించాలన్నారు. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో ఓపెన్ విభాగంలో మూడు, 15 ఏళ్లలోపు రెండు స్థానాలకు విజేతలను ఎంపిక చేసినట్లు నిర్వాహకుడు ఎస్.ఎస్.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. వీరంతా ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు విశాఖలో జరిగే ఆలిండియా పీడియా రేటింగ్ టోర్నమెంట్‌కి ఎంపికవుతారన్నారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అర్బిటర్ జీవి కుమార్, ఫిజికల్ డైరెక్టర్ జి.రత్నకుమారి, సభ్యులు జె.రాంబాబు, ఎల్లా ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

బాలుడితో ఆడుతున్న రాధాకృష్ణ

ఏలూరులో 'గుర్రం పాపిరెడ్డి' బృందం సందడి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగరంలో గుర్రం పాపిరెడ్డి చిత్ర బృందం ఆదివారం సందడి చేసింది. స్థానికంగా సినిమా ప్రదర్శిస్తున్న విజయలక్ష్మి థియేటర్‌కు వెళ్లి ప్రేక్షకులను పలకరించారు. ఈ సందర్భంగా కథానాయిక ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ.. గుర్రం పాపిరెడ్డి సినిమాకు మంచి ప్రేక్షక ఆదరణ లభిస్తోందన్నారు. బ్రహ్మానందం, యోగిబాబు హాస్యం చిత్రానికి ప్రధాన బలంగా నిలిచిందన్నారు. దర్శకుడు మురళీమనోహర్, నిర్మాత వేణు సద్ధి, హాస్యనటుడు జీవన్ తదితరులు పాల్గొన్నారు. పడమరవీధి జాతర సందర్భంగా.. గంగానమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈరోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్). Ph :81422 92071.

మదర్ హోంకేర్ సర్వీస్: Hyd. లేడీ టెలికాలర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, 2వీలర్ లైసెన్స్ కల్గి తెలుగు, హిందీ, ఇంగ్లీష్ తెలిసిన 40సం॥ వారు కావలెను. జీ: 18-20K. భో+వసతి. ✆ 9618300688, 9666314488

సెంట్రల్ గవర్నమెంట్ సోలార్ సబ్సిడీ స్కీమ్ నందు మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. Q: 10 to PG. జీతం: 30 వేలు to 50 వేలు. ✆ 95155 05557, 99898 57775.

TO LET

COMMERCIAL

తణుకు ఆచంట వారి వీధి సాయి స్వప్న హైట్స్‌లో యూనియన్ బ్యాంక్ పైన, 1st ఫ్లోర్ 2,350 Sft బ్యాంక్స్, హాస్పిటల్స్ మొ॥ వాటికి అద్దెకు కలదు. ✆ 98491 95699, 93925 85699.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆ 81215 41212.

MARKETING/ SALES

కైకలూరులో చేపల మేత తయారీ మిషన్స్ సేల్స్ చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర. Cell No: 99899 88993.

JOBS

Wanted Plant Supervisors for Kakatiya Coir Industries. Experience: 0-2 Years. Location: Vijayarai, Eluru. Contact: 79813 18373.

Wanted Accountant With Multimedia Knowledge Hiring Male Accountant With Tally & Multimedia Knowledge B.Com/ M.Com for Saraswathi Vidyalai, Prathipadu, Pentapadu Mandal. Cont: 96036 45678

జై గణేష్ సెక్యూరిటీ తణుకులో విజిలెన్స్ ఆఫీసర్ 7గురు(Ex Service only) జీతం:28,000/- గన్ మేన్ 3 మెంబర్స్ జీతం:33,000/- వయసు 50సం॥లోపు, PF&ESI W/H, 8 గం॥ డ్యూటీ ✆ 95818 58667

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 6.90 పై॥
తణుకు ఆఫీసు: 08819-224254

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

రెచ్చగొట్టే వ్యాఖ్యలతో వైకాపా ఫ్లెక్సీ

ఏడుగురిపై కేసు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: గ్రామంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ద్వారకాతిరుమల ఎస్సై సుధీర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వైకాపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు సందర్భంగా ద్వారకాతిరుమల మండలం రామసింగవరం అంబేడ్కర్ సెంటర్‌లో '2029లో 88 మ్యాజిక్ ఫిగర్ దాటగానే గంగమ్మ జాతరలో వేట తలలు నరికినట్లు రప్పా రప్పా నరుకుతాం ఒక్కొక్కడిని' అని రెచ్చగొట్టే వ్యాఖ్యలతో కూడిన ఫ్లెక్సీని గ్రామానికి చెందిన ఏడుగురు వ్యక్తులు ఏర్పాటు చేశారు. దీంతో గ్రామంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. 'గ్రామస్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు.. తీసేయండి.' అని తెదేపా నేతలు రమణ, రాజు, దొప్పసాని బాబూరావు ఫ్లెక్సీ ఏర్పాటు చేసినవారిని అడిగారు. 'తీయమంటే ఫ్లెక్సీలో ఉన్నది నిజం చేస్తాం.' అని వారు బెదిరించారు. దీంతో దొప్పసాని బాబూరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన బిరుదుగడ్డ రాజు, మానుకొండ రాజ్‌కుమార్, కనికెళ్ల రవికిశోర్, మద్దాల దిలీప్ కుమార్, మానుకొండ హిమకుమార్, కుండ శ్యాంబాబులపై, అలాగే ఫ్లెక్సీ తయారు చేసిన వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232, చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, 159, 170 చికెన్ విత్ స్కిన్ - 290 చికెన్ స్కిన్‌లెస్ - 300.

జిల్లా నూతన కార్యవర్గం

ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఫోరం ఎంపిక

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఏపీ ప్రైమరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల జిల్లా ఫోరం భీమవరంలోని పీఎస్ఎం పాఠశాల ఆవరణలో ఆదివారం ఎంపికైంది. గౌరవాధ్యక్షుడిగా కాకర్ల శామ్‌సన్(గణపవరం), జిల్లా అధ్యక్షుడిగా సౌజన్య(గణపవరం), కార్యదర్శిగా భూక్య నరేష్(భీమవరం), ఉపాధ్యక్షుడిగా రవీంద్రనాథ్‌కుమార్(పెనుగొండ) అసోసియేట్ జిల్లా అధ్యక్షుడిగా చంద్రశేఖర్(పెంటపాడు)తోపాటు కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

నేటి నుంచి అతిరుద్ర మహా యజ్ఞం

నిడమర్రు, న్యూస్‌టుడే: మందలపర్రు ఉమానీలకంఠేశ్వరస్వామి పంచాయతన క్షేత్రంలో సోమవారం అతిరుద్ర మహా యజ్ఞం ప్రారంభం కానుంది. ఈ నెల 29 వరకూ కొనసాగనుంది. బ్రహ్మశ్రీ వెంకట చాగంటి(యూఎస్ఏ) ఆశీస్సులతో అక్కినప్రగడ రాఘవేంద్రశర్మ దంపతులు(ఇంగ్లాండు) ఆర్థిక సహకారంతో పూడిపెద్ది నరసింహశర్మ బ్రహ్మత్వంలో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మేరకు యజ్ఞ గుండాలు సిద్ధం చేశారు. మహా యజ్ఞం పూర్తయ్యే వరకూ రోజూ భక్తులకు అన్నప్రసాద వినియోగం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థులు నైపుణ్యాలను అలవర్చుకోవాలని ట్రిపుల్ ఐటీ క్యాంపస్ సంచాలకుడు డా. అమరేంద్రకుమార్ అన్నారు. ఆదివారం నూజివీడు ట్రిపుల్ ఐటీ లిటరరీ క్లబ్ ఆధ్వర్యంలో భక్తి వేదాంత వారి సహకారంతో ఏఐ మీద సెమినార్ నిర్వహించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన అఖిలేశ్వరికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన షేక్ హసియాకు రూ.3 వేలు, తృతీయ స్థానం సాధించిన హర్షవర్ధన్‌కు రూ.2 వేలు నగదును క్యాంపస్ డైరెక్టర్ అమరేంద్ర కుమార్ భక్తి వేదాంత సంచాలకుడు డా.రామ్‌గోపాల్ చేతుల మీదుగా అందించారు. లిటరరీ క్లబ్ సహకారంతో నిర్వహించిన ఈ సెమినార్ విద్యార్థులకు ఎంతో దోహదపడుతుందన్నారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న అధ్యాపకులు

సుపరిపాలన యాత్ర విజయవంతానికి పిలుపు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: నగరంలో సోమవారం నిర్వహిస్తున్న అటల్ మోదీ సుపరిపాలన యాత్రను విజయవంతం చేయాలని భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి పిలుపునిచ్చారు. స్థానిక ఆశ్రం కూడలిలో వాజ్‌పేయీ కాంస్య విగ్రహావిష్కరణ ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. తమిళనాడుకు చెందిన భాజపా నేత అన్నామలై, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథులుగా హాజరై బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. భాజపా జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్, నాయకులు కట్నేని కృష్ణప్రసాద్, నిర్మల కిశోర్, సుధాకర్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

పాలకొల్లు మార్కెట్, యలమంచిలి, న్యూస్‌టుడే: ఆక్వా చెరువు వద్ద పని చేస్తున్న కూలీ విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన ఘటన పాలకొల్లు మండలం వెలివెల గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. యలమంచిలి మండలం లక్ష్మీపాలేనికి చెందిన పొన్నమండ జయరాజు (27) రొయ్యల చెరువుల వద్ద కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం సహచర కూలీలతో కలిసి వెలివెలలో రొయ్యల చెరువుల వద్ద పనికి వెళ్లారు. అక్కడ పని చేస్తుండగా పంకాకు ఉన్న తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యారు. సహచరులు అతడికి హుటాహుటిన పాలకొల్లులో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై అతడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.సురేంద్ర కుమార్ కేసు నమోదు చేశారు.

జయరాజు (పాతచిత్రం)

పెను విషాదం.. జయరాజుకు ఏడాదికి కిందట వివాహం జరిగింది. ఈ దంపతులకు గత నెలలో కుమార్తె జన్మించగా ఇటీవల బారసాలను ఘనంగా నిర్వహించారు. ఇంతలోనే తండ్రి విద్యుదాఘాతంతో మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

నేడు విద్యుత్తు సరఫరా ఉండని ప్రాంతాలు

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ఉండి 220/132 కేవీ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో మరమ్మతుల కోసం సోమ, మంగళవారాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటలలోపు లోడ్ సర్దుబాటు కోసం కొన్ని చోట్ల అంతరాయం కలుగుతుందని విద్యుత్తు శాఖ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. అంతరాయం కలిగే ప్రాంతాలు భీమవరం పట్టణం, గ్రామీణ, పాలకోడేరు, వీరవాసరం, కాళ్ల, ఉండి, ఆకివీడు ప్రాంతాల పరిధిలో కొన్నిచోట్ల అంతరాయం ఉంటుందన్నారు.

క్రిస్మస్ ప్రదర్శన

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులో ఆదివారం రాత్రి క్రిస్మస్ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ ఎస్ఎస్ చర్చి వద్ద నుంచి పురవీధుల గుండా జాతీయ రహదారి మీదుగా పాస్టర్ జోసఫ్‌రాజు ఆధ్వర్యంలో ప్రదర్శన కొనసాగించారు. పలువురు క్రిస్మస్ తాత వేషధారణలో ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

భీమవరం

•భీమవరం •ఉండి

పాటల పోటీలు

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడులోని పీఎల్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 'సరిగమ సంగీత పరిషత్' ఆధ్వర్యంలో ఆదివారం ఉభయ రాష్ట్రాల స్థాయి సినిమా పాటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పలువురు గాయనీ, గాయకులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలుగా నిలిచిన గాయకులకు బహుమతులు అందజేశారు.

ఉపాధి పథకం పేరు మార్పుపై నిరసన

ఉండి, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడాన్ని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని సీపీఎం ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు అన్నారు. ఉండి పార్టీ సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ అంశంపై ఈనెల 22న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు ఉపాధి శ్రామికులు, రైతు కూలీలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మేమున్నాం... మీకు తోడుగా..

భీమవరం పట్టణం: 80085 74471	10 AM to 1 PM
భీమవరం మండలం: 80085 74533	వీరవాసరం: 80085 74475
పాలకోడేరు: 80085 74467	ఉండి: 80085 74526
ఆకివీడు: 80085 74525	కాళ్ల: 94401 04042

పాలకోడేరు, న్యూస్‌టుడే: ? పాలకోడేరు చినపేట సమీపంలో ఖాళీలో పల్లాలు, చెత్తను పంట కాలువలో వేస్తున్నారు. దీంతో కల్వర్టుపై తూరల వద్ద అడ్డుపడి గుర్రపుడెక్క పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. - ఎం.రామారావు, రైతు, పాలకోడేరు

✔ చర్యలు తీసుకుంటాం. - బి.గోపి కార్యదర్శి

ఉండి, న్యూస్‌టుడే: ? ఉండి రాజులపేటలో సరైన డ్రెయినేజీ సౌకర్యం లేక మురుగునీరు సిమెంట్ రహదారిపైకి ఎగదన్నుతోంది. రాకపోకలు సాగించేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - కృష్ణవేణి

✔ సమాధానం : డ్రెయినేజీ ఏర్పాటుకు కృషి చేస్తాం. - అనిల్‌కుమార్, పంచాయతీ అభివృద్ధి అధికారి

ఉప్పుటేరు...ముంపు ముప్పు ఎప్పుడు తీరు

ఏటా పెరిగిపోతున్న ఆక్రమణలు

న్యూస్‌టుడే, భీమవరం అర్బన్

డ్రైనేజీ నుంచి నీటిని సముద్రంలోకి తీసుకెళ్లే సహజ మార్గమైన ఉప్పుటేరు పూడిక ప్రజలకు శాపంగా మారింది. దీని వల్ల ఏటా వేల ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయి. దాన్ని ప్రక్షాళన చేయ స్థాయిలో పాలకులు చేస్తున్న ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. భీమవరం మండలం లోసరి వద్ద నుంచి పాతపాడు మీదుగా మెలికలు తిరుగుతూ మోళ్లపర్రు వద్ద సముద్రంలో కలిసే వరకు పెద్ద ఎత్తున పూడిక పేరుకుపోయింది. 15 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ మార్గంలో కనీసం 3 మీటర్ల మేర పూడిక తీస్తేనే సమస్య పరిష్కారమవుతుందని అధికారులు గతంలోనే గుర్తించారు. దీంతో పాటు

లోసరి వద్ద జలం..

లోసరి, దొంగపిండి, పాతపాడు తదితర చోట్ల దీని వెంబడి పెద్ద ఎత్తున ఆక్రమణలు చోటు చేసుకున్నాయి. వాటిని సైతం తొలగిస్తేనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

● ఉప్పుటేరులో పూడిక సమస్య వల్ల ఇందులో కలిసే బొండాడ, గొంతేరు, గునుపూడి సౌత్, యనమదుర్రు డ్రెయిన్ వంటి ప్రధాన మురుగు కాలువల వెంబడి ఏటా తీవ్ర ముంపు ఏర్పడుతోంది. కొద్ది రోజుల కిందట కురిసిన వర్షాలకు భీమవరం మండలం కొత్తపూసలమర్రు, గూట్లపాడు, దొంగపిండి తదితర గ్రామాల పరిధిలో రహదారులు సైతం నీట మునిగాయి. దీనికి కారణం బొండాడ డ్రెయిన్ ఆక్రమణలకు గురవడమేనని అధికారులు గుర్తించారు.

> ఉప్పుటేరు ప్రక్షాళనకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు రాగానే కలెక్టర్ ప్రారంభం నుంచి ప్రక్షాళన పనులు ప్రారంభిస్తాం. ఆక్రమణల్ని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటాం. - రుద్రరాజసింహ అప్పన్న, డ్రెయినేజీ శాఖ డీఈ

పోటీల్లో పాల్గొన్న అధికారులతో నాగరాణి

ప్రతిభావంతులకు కలెక్టర్ అభినందన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: గోదావరి క్రీడోత్సవాల్లో భాగంగా ఉద్యోగుల క్రీడా పోటీలు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో కొనసాగుతున్నాయి. పోటీలను కలెక్టర్ నాగరాణి ఆదివారం పరిశీలించారు. క్రికెట్, చదరంగం, క్యారం, షటిల్, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచినవారిని అభినందించారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సామూహికంగా సత్యదేవుని వ్రతం

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: గోవిందమాల కల్యాణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పాలకొల్లు ఆర్‌ఆర్ రైసుమిల్లు ప్రాంగణంలో అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం భక్తులతో సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతం చేయించారు. రాజమహేంద్రవరం ఎస్పీ కొండా నర్సింహారావు, గురుస్వామి యాదంరెడ్డి సత్యం, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ కృష్ణవర్మ, కఠారి నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: చిన్నారుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. పట్టణంలోని చింతలపాటి బాపిరాజు స్మారక పురపాలక పాఠశాలలో ఆదివారం ఆమె చిన్నారులకు చుక్కల మందు వేశారు.

వీరవాసరం: వీరవాసరం పీహెచ్‌సీ పరిధిలో 3,966 మంది చిన్నారులకు గాను మొదటి రోజు 3,831 మందికి పోలియో చుక్కలు వేసినట్లు సీహెచ్‌ఓ కల్యాణ్ ప్రసాద్ తెలిపారు.

ఉండి: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు అందరూ కృషిచేయాలని ఉండి ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు (హరిబాబు) పిలుపునిచ్చారు. ఉండి పీహెచ్‌సీలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసేలా వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్, వైద్యాధికారిణి సునంద, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భీమవరం గ్రామీణ: రాయలంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, గొల్లవానితిప్పలో తెదేపా మండల కమిటీ అధ్యక్షుడు కొయ్యలగడ్డ గణపతి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

చిన్నారికి చుక్కల మందు వేస్తున్న సీతారామలక్ష్మి

ఆకివీడు: పట్టణం, మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. తొలి రోజు 95 శాతానికి పైగానే చుక్కలు వేశామని, మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారాలలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని వైద్యాధికారులు రాజశేఖర్, గోవర్ధన తెలిపారు.

96 శాతం మందికి.. పాలకోడేరు, న్యూస్‌టుడే: చిన్న పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించడంలో ఎవరూ అశ్రద్ధ చేయవద్దని పల్స్ పోలియో కార్యక్రమం జాయింట్ డైరెక్టర్ ఎస్ మల్లేశ్వరరావు అన్నారు. పాలకోడేరు, కుముదవల్లిలో పర్యటించిన ఆమె పోలియో కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆదివారం మండల వ్యాప్తంగా 32 కేంద్రాల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించారు. 3299 మంది పిల్లలకు గాను 3198 మందికి పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి గులాబ్‌రాజ్‌కుమార్ తెలిపారు. డెల్టా ప్రాజెక్టు ఛైర్మన్ మురళీకృష్ణంరాజు, సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు, ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు, తెదేపా సీనియర్ నాయకులు సందీప్‌వర్మ తదితరులు ఆయా గ్రామాల్లో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఎన్జీవోల సంఘం ఎన్నిక

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: భీమవరం తాలూకా ఏపీ ఎన్జీవోల సంఘం కార్యవర్గ ఎన్నికలు స్థానిక ఎన్జీవోల హోంలో ఆదివారం నిర్వహించారు. నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీవీ సోమేశ్వరరావు, కార్యదర్శిగా యూవీ పాండురంగారావు, కోశాధికారిగా విష్ణువర్ధన్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా సీహెచ్ జయనిర్మలతోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా పోతన సుకుమార్, గుడాల హరిబాబు వ్యవహరించారు. అతిథులుగా సంఘం జిల్లా ప్రతినిధులు శ్రీనివాసరావు, రామారావు, హరినాథ్ హాజరయ్యారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ ప్రతినిధులు

ఉత్తమ వాకర్స్ సంఘంగా మారుతీనగర్ క్లబ్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉత్తమ వాకర్స్ క్లబ్‌గా భీమవరంలోని మారుతీనగర్ వాకర్స్‌క్లబ్ ఎంపికైంది. విశాఖపట్నం కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 20న అంతర్జాతీయ అధ్యక్షులు ప్రభావతి, జిల్లా గవర్నర్ రామరాజు ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందజేశారని మారుతీనగర్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు పావిరాల రామమోహనరావు తెలిపారు. వాకర్స్ సంఘం చేసిన కార్యక్రమాలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేయడంపట్ల క్లబ్ కార్యదర్శి వలవల నరసింహారావు, కార్యవర్గం సంతోషం వ్యక్తం చేసింది.

పురస్కారం అందుకుంటున్న రామమోహనరావు

గుంతలో పడితే గల్లంతే..

ఆకివీడు పరిధిలో వెంకయ్యవయ్యేరు కాలువపై వంతెన శివారున జాతీయ రహదారి కుంగిపోయి పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ రహదారిపై రోజుకు 12 వేల వాహనాలకు పైగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఆకివీడు నుంచి ఉండి వైపు వెళ్లే వాహనచోదకులకు ఈ గుంత కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో వీధి దీపాలు కూడా లేవు. రాత్రి సమయంలో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే ఆస్కారం ఉంది. అధికారులు వెంటనే స్పందించి గుంతకు మరమ్మతులు చేయించి ప్రమాదాలకు తావులేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆకివీడు**

ఎట్టకేలకు వినియోగంలోకి

ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని రోజువారీ మార్కెట్ ప్రాంతంలో అనేక ఏళ్లుగా 18 దుకాణాలు నిరుపయోగంగా ఉన్నాయి.

ఇటీవల ఈ దుకాణాలను పరిశీలించిన ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు వీటిని వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. దీంతో శిథిలావస్థకు చేరుకుంటున్న ఈ దుకాణాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించారు. రంగులు వేసి సిద్ధం చేశారు. అన్నిటిని వినియోగంలోకి తీసుకొచ్చి అద్దెకు ఇస్తామని కమిషనర్ కృష్ణమోహన్ తెలిపారు. **- న్యూస్‌టుడే, ఆకివీడు**

రూ.లక్షలు పోసి.. మురుగు వదిలేసి

భీమవరం రెండో పట్టణంలోని కొమరాడ దారి పొడవునా ఉన్న కాలనీలను మురుగు సమస్య వెంటాడుతోంది. ఇక్కడ కొన్నేళ్లకిందట డ్రెయిన్ నిర్మించినా నిర్వహణకు నోచుకోక

మురుగు ముందుకు కదలడం లేదు. చెత్త, సిల్ట్, గడ్డితో కమ్మేసింది. పారిశుద్ధ్య సిబ్బంది ఇటువైపు కన్నెత్తి చూడడం లేదని స్థానికులు చెబుతున్నారు. మురుగు వెళ్లేదారి లేక ఖాళీ స్థలాల్లోకి, ఇళ్ల ముందు నిలిచిపోయి దుర్వాసన, దోమల బెడదతో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. దీనిపై పురపాలక కమిషనర్ కె.రామచంద్రారెడ్డి వద్ద 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా వెంటనే శుభ్రం చేయించి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. **- న్యూస్‌టుడే, భీమవరం పట్టణం**

అధ్వానంగా పుంత దారులు

ఉండి, న్యూస్‌టుడే: ఉండి వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పుంత మార్గాలు అధ్వానస్థితికి చేరాయి. ఉండి, కాళ్ల, పాలకోడేరు మండలాల పరిధిలోని వ్యవసాయ పంట ఉత్పత్తులు ఒడ్డుకు చేర్చాలన్నా .. చేను వద్దకే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు చేరాలన్నా రైతులు ప్రధానంగా పుంత మార్గాలపైనే రాకపోకలు సాగిస్తుంటారు. గత అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసిన అధిక వర్షాలకు ఈ మార్గాలు పలుచోట్ల ఛిద్రమైపోయాయి. దీంతో మారుమూల ప్రాంతాల్లో ఖరీఫ్ ధాన్యాన్ని ఒడ్డుకు చేర్చేందుకు రైతులు పలు ఇబ్బందులు చవిచూశారు. అర్తమూరు, రామాపురం, ఉప్పులూరు, కోలమూరు, ఉండి తదితర ప్రాంతాల్లో ఈ మార్గాల సమీపంలోని డ్రెయిన్‌లోకి జారిపోతున్నాయని సాగుదారులు ఆవేదన చెందుతున్నారు. ఉండి ఏఎంసీ కార్యదర్శి ఎన్.మావుళ్లు ఈఅంశంపై స్పందిస్తూ ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉందని తెలిపారు.

జగన్ పుట్టినరోజు వేడుకలు

చినకాపవరం (ఆకివీడు), న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టిన రోజు వేడుకలు ఆదివారం చినకాపవరంలోని ప్రధాన కూడలి వద్ద జడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు, నాతిరెడ్డి అన్నవరం ఆధ్వర్యంలో నిర్వహించారు. కేకు కోసి పంచారు. పలువురు వృద్ధులకు దుప్పట్లు, పండ్లను అందజేశారు.

కాళ్ల: పెదఅమిరంలోని వైకాపా కార్యాలయంలో పలువురు నాయకులు ఆదివారం రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీవీఎల్ నరసింహరాజు ప్రారంభించి మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడిన అందరికీ గుర్తింపు ఉంటుందన్నారు.

రెచ్చగొట్టే వారిపై చర్యలు తీసుకోవాలి

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు ధర్మాపురం అగ్రహారంలో నివసిస్తున్న దళితుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే యత్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు సమష్టిగా కోరారు. ఆదివారం స్థానిక కమ్యూనిటీ భవనం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల దళిత సంఘ నాయకులమంటూ కొందరు మా ప్రాంతంలో పర్యటించి మంచినీటి చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణ తొలగింపు అంశంపై ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. వారిపై చట్టపరమైన తీసుకోవాలని అధికారులను కోరనున్నట్లు కటికతల శంకరావు, కొదమ శ్యాంబాబు, దొనిపాటి చంటి, స్థానిక ప్రజలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వీరవాసరం, న్యూస్‌టుడే: వీరవాసరం వద్ద 165 జాతీయ రహదారిపై శనివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై సుందర శ్రీనివాస్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎన్. రాజ్‌కుమార్ తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ఉండి, న్యూస్‌టుడే: అర్తమూరులోని కోడిపందేల స్థావరంపై ఆదివారం దాడి చేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.5,400ల నగదు, రెండు పుంజులను స్వాధీనపరచుకున్నామని వివరించారు.

ఆటో బోల్తాపడి 8 మందికి గాయాలు

మామిడికుదురు, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గెద్దాడ వద్ద 216 బైపాస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఆటో బోల్తాపడి 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స కోసం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉండి గ్రామానికి చెందిన వారు ఆటోలో అయినవిల్లిలోని సిద్ధి వినాయకస్వామి ఆలయానికి వెళ్లి దర్శనానంతరం తిరిగి వెళ్తుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది.

నృత్య ప్రదర్శనలో చిన్నారుల ప్రతిభ

వీరవాసరం, న్యూస్‌టుడే: ద్వారక సాయి సేవా సమితి, సనాతన భారతీయ నృత్యోత్సవం -2025 పేరుతో ఆదివారం గుడివాడలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో వీరవాసరం గ్రామానికి చెందిన పలువురు చిన్నారులు ప్రతిభ కనబరచి ఇండియన్ బుక్ ఆఫ్ పురస్కారాలు సాధించినట్లు నాట్యాచార్యుడు వినయ్‌కృష్ణ తెలిపారు. నృత్య ప్రదర్శనలో గ్రామానికి చెందిన కె.కావ్య శ్రీనంద, ఎ.దివ్యశ్రీ, కె.లక్ష్య, ఆనంది, అమృత, వాసవి, చైత్రశ్రీన, జాహ్నవి, వేణు కార్తిక, మోక్ష, దివిష, నక్షిత, శివ, దింపుల్, తన్మయి పాల్గొన్నట్లు తెలిపారు.

అవార్డులు సాధించిన చిన్నారులు

భక్తితో గొబ్బిళ్ల పూజలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ధనుర్మాసం సందర్భంగా మెంటే వారితోటలో ఉన్న బాలాత్రిపురసుందరి ఆలయ ప్రాంగణంలో గొబ్బిళ్ల వేడుకలు ఆదివారం రాత్రి నిర్వహించారు. పలువురు చిన్నారులతో గొబ్బిళ్ల పూజలు, ఆట పాటలు నిర్వహించి భక్తుల సహకారంతో విజేతలకు బహుమతులు అందించినట్లు ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

గొబ్బిళ్ల పూజలో చిన్నారులు

కుంకాల జలపాతంలో సందడి

పోలవరం మండలం రెడ్డి కుంకాల గిరిజన గ్రామం సమీపంలో తూర్పుకనుమల కొండల మధ్య జాలువారుతున్న జలపాతం సందర్శకులను ఆకట్టుకుంటోంది. స్థానికులు మేదర కొండగా పిలిచే ప్రాంతంలో ఎగువ నుంచి వచ్చే కొండవాగుల నీరు రాళ్ల మధ్య ప్రవహిస్తూ.. ఎగువ నుంచి కిందకు జారుతోంది. జిల్లెళ్లగూడెం పంచాయతీ పరిధిలోని రెడ్డికుంకాల నుంచి జలపాతం వద్దకు చేరుకోవాలంటే సుమారు 2.5 కి.మీ దూరం కొండల మధ్య. . బండరాళ్ల మధ్య, కొండ అంచున కాలినడకన వెళ్లాల్సిందే. వర్షాకాలం ముగిసి శీతాకాలం ప్రవేశించినా నీటి ఒరవడి ఎక్కువగా ఉందని స్థానికులు చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, కొయ్యలగూడెం గ్రామీణ, పోలవరం**

రహదారులకు పండగొచ్చింది..!

మారుమూల మార్గాల్లో చురుగ్గా పనులు

న్యూస్‌టుడే, ఉండి

పల్లెల్లోంచి పట్టణాలను కలిపే ప్రధాన రహదారులకు పండగొచ్చింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిరాధారణకు గురై పూర్తిగా అధ్వానస్థితికి చేరిన మార్గాల్లో మరమ్మతులు చేపట్టారు. నియోజకవర్గంలోని ఎనిమిది ప్రాంతాల్లో ఈ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. సంక్రాంతి నాటికి అన్ని రహదారులకు మరమ్మతులు చేస్తామని ఇటీవల పాలకులు ప్రకటించారు. ఉండి - కోలమూరు మధ్య రాష్ట్రీయ రహదారిలో మూడు కిలోమీటర్ల మేర మరమ్మతులు పూర్తి చేశారు. పాలకోడేరు మండలం గరగపర్రు - ఉండి మండలంలోని యండగండి మధ్య అధ్వాన స్థితికి చేరిన పిప్పర మార్గంలో గుంతలు కనిపించకుండా పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సీసలి-వాండ్రం మధ్య ఆర్అండ్‌బీ రహదారిలో పనులు చేపట్టారు. వాటిలో రెండుచోట్ల అభివృద్ధి పనులు చేపట్టారు.

యండగండిలో రహదారి నిర్మాణం

నాబార్డు నిధులతో..!

కోలమూరు - కొండేపాడు (కేకే రహదారి)లో పిప్పర - భీమవరం నుంచి ప్రారంభమయ్యే యండగండి - ఉప్పులూరు వెళ్లే మార్గంలో రెండు కిలోమీటర్ల మేర విస్తరణ, అభివృద్ధి పనులు నాబార్డు నిధులతో చేపట్టారు. దశాబ్దంన్నర నుంచి ఈ మార్గం అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో భారీ గుంతలు పడి పూర్తిగా ఛిద్రమైంది. యండగండి ఉన్నత పాఠశాల నుంచి పీహెచ్‌సీ వరకూ వర్షం కురిస్తే చాలు రహదారులు చెరువుల్లా మారిపోయేది. ఆ సమయంలో ద్విచక్ర వాహనదారులు ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే ఎక్కడ ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోననే ఆందోళనతో నలిగిపోయేవారు. తాజాగా కొనసాగుతన్న అభివృద్ధి పనులతో ఊరట చెందుతున్నారు. ఉణుదుర్రు గ్రామంలోని రావిచెరువు మలుపు నుంచి పాందువ్వ ఖండ్రిక వరకూ రహదారి అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని ఆర్అండ్‌బీ ఏఈ కె.శ్రీహరిరాజు తెలిపారు. సంక్రాంతికి ముందే యండగండి - ఉప్పులూరు, ఉణుదుర్రు - పాందువ్వ ఖండ్రిక రహదారుల అభివృద్ధి పనులు పూర్తవుతాయని ఆయన వివరించారు. మిగిలిన మార్గాల్లోనూ మరమ్మతులు చేపడతామన్నారు.

విద్యుత్తు ఉద్యోగి అదృశ్యం

చిట్టినగర్, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖలో పని చేస్తున్న ఉద్యోగి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. విజయవాడ గ్రామీణ ప్రాంతం కొత్తూరు తాడేపల్లి గ్రామానికి చెందిన కనికళ్ల వరలక్ష్మి, సత్తిరాజుల కుమారుడు సతీష్ (46) తణుకులో భార్యతో కలిసి ఉంటున్నాడు. తాడేపల్లిగూడెంలోని విద్యుత్తు విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తి ఇంటికి, ఉద్యోగానికి వెళ్లకుండా రోడ్డు మీద, రైల్వేస్టేషన్‌లో పడుకుంటున్నాడని విద్యుత్తు కార్యాలయం నుంచి తల్లికి ఫోన్ చేసి చెప్పారు. అక్కడికి తల్లి వెళ్లి సతీష్‌ను ఇంటికి తీసుకు వచ్చింది. 10 రోజులు ఉన్నాడు. అనంతరం 2025 అక్టోబరు 18న ఉద్యోగానికి వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు తల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

రూ.50 లక్షల విలువైన బంగారం రికవరీ

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే : కృష్ణా జిల్లా కంకిపాడు పోలీసులు అంతర్ రాష్ట్ర దొంగను పట్టుకుని రూ. 50 లక్షల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పునాదిపాడు ఫ్లైఓవర్‌పై ఐదుగురు ద్విచక్ర వాహనాలపై నిలబడి మాట్లాడుకుంటూ ఉండగా అటుగా వెళుతున్న పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా 2023లో కంకిపాడులోని కంకిపాటి శివశంకరరావు ఇంట్లో జరిగిన దొంగతనం బయటకు వచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిని విచారించగా సుమారు 15 చోరీలు చేసి.. ఆ సొత్తు వివిధ బ్యాంకుల్లో తాకట్టు పెట్టినట్లు తేలింది. దీంతో 409 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు గన్నవరం డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సీఐ జె.మురళీకృష్ణ, ఎస్సై సందీప్ విలేకరులకు వెల్లడించారు.

చోరీల్లో ప్రత్యేక విధానం.. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పత్తికాయ పాలవలసకి చెందిన పున్నాన రాంబాబు చెడు వ్యసనాలకు బానిసై తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతను ప్రత్యేకించి ఇళ్లలో బీరువా తాళాలు ఎక్కడ పెడతారో గుర్తించి బీరువా తెరిచి అందులోని కొంతమేర మాత్రమే బంగారు ఆభరణాలు చోరీ చేస్తుంటాడు.

తాకట్టు పెట్టేందుకు మధ్యవర్తుల సహకారం.. చోరీ చేసిన ఆభరణాలను నిందితుడు తాను తాకట్టు పెట్టకుండా పెనమలూరు మండలం మురళీనగర్‌కు చెందిన పఠాన్ వసీమ్‌ఖాన్, పఠాన్ నాగూర్, చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన షేక్ అస్లాం, కానూరుకు చెందిన ఎం.నాగ విఘ్నేష్, మోర్ల పిచ్చిరెడ్డితో ముత్తూట్, మణప్పురం ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టిస్తాడు. ఆ డబ్బు తీసుకుని వారికి కమిషన్ ఇచ్చేవాడు.

నిందితుడిపై 50 కేసులు.. నిందితుడు గతంలో శ్రీకాకుళం జిల్లాలో 29, విజయనగరం జిల్లాలో 14, విశాఖపట్నం జిల్లాలో 2, ఎన్టీఆర్ జిల్లాలో 2, ఏలూరు జిల్లాలో 2, గుంటూరు జిల్లాలో 1 కేసు ఉన్నాయి. ఆదివారం నిందితుడిని అరెస్టు చేసి.. కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించారు.

శ్రద్ధాంజలి

ఎదుట పడిన ప్రతి వ్యక్తి హృదయంలో తన ఆత్మీయతతో చెరగని ముద్ర వేసిన డి.ఎన్.ఆర్. కాలేజ్ రిటైర్డ్ కామర్స్ అధ్యాపకులు డాక్టర్ నిమ్మగడ్డ గంగాధర రావు గారు డిసెంబర్ 12న శివైక్యం చెందారు. వారి పవిత్ర ఆత్మ శాంతికై భగవంతుని ప్రార్థిస్తూ..

భార్య: రాధాకృష్ణ

కుమారులు: జ్యోతికుమార్, శేషగిరిరావు, గోపీకృష్ణ

పెదకర్మ: ది. 22-12-25, ఉదయం 11 గం. నుండి భీమవరం, ప్రకాశం రోడ్, ఏఎస్ఆర్ నగర్‌లోని మా స్వగృహం నందు జరుగును.

శ్రద్ధాంజలి

మా మిత్రులు K.V.సత్యనారాయణరాజు గారి తల్లి గారైన కీ॥శే॥ శ్రీమతి K.వెంకట నర్సమ్మ గారి మరణానికి చింతిస్తూ.. దివికేగిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ..

కీ॥శే॥ K. వెంకట నర్సమ్మ గారు

అయిభీమవరం, ఆకివీడు మండలం

మరణం: 12-12-2025

సత్తి ఆదివిష్ణు రెడ్డి, నిడదవోలు	నేరెళ్ళ పెదబాబు, ఆకివీడు
పెనుమూడి మల్లేశ్వరరావు, ఆలపాడు	కొట్టు మాణిక్యాలరావు, దుంపగడప
యర్రా రఘురామ్, ఆకివీడు	శ్రీకృష్ణ వంశి DKV, HP గ్యాస్ ఏజన్సీస్, ఆలపాడు

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

ధ్యానంతో ఒత్తిడి దూరం

కళాకారులను సత్కరించిన నిర్వాహకులు

పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుమంట్రలోని పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆదివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తాడేపల్లిగూడెనికి చెందిన గాయని సుస్మిత బృందం ఆధ్వర్యంలో సంగీత నాద ధ్యానం నిర్వహించారు. సీనియర్ శిక్షకుడు కేవీడీ ప్రసాద్ మాట్లాడుతూ ధ్యాన సాధనతో ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు. అనంతరం సాధకులతో సామూహికంగా ధ్యానం చేయించారు. రాయకుదురుకు చెందిన శిక్షకురాలు నార్కెడిమిల్లి రేవతి ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన కోలాటం, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం సుస్మిత, రేవతిలను నిర్వాహకులు సత్కరించారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

వేడుకలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: క్రీస్తు బోధనలు ఆచరణీయమని పాలకొల్లు పట్టణ సీఐ కె.రజనీకుమార్ అన్నారు. పాలకొల్లు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద క్రిస్మస్ వేడుకలను ఆదివారం నిర్వహించారు. పట్టణ ఎస్సై జి. పృథ్వీ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో సీఐ రజనీకుమార్ కేకు కోసి ప్రారంభించారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించి ప్రార్థనలు చేశారు. గ్రామీణ సీఐ జి.శ్రీనివాస్, ఎస్సైలు బి.సురేంద్రకుమార్, కె.గురయ్య, కె.సుధాకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య భగవానుడికి అభిషేకాలు

అలంకరణలో స్వామివారు

నరసాపురం పట్టణం, పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: నరసాపురంలో గోదావరి తీరాన బాబు ఘాట్ వద్ద, పాలకొల్లులో సర్వోదయ పురంలో ఉన్న సూర్యనారాయణ స్వామి ఆలయాల్లో ఆదివారం ఉదయం పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు నిర్వహించి పంచహారతులు ఇచ్చారు. అనంతరం స్వామిని పుష్పాలు, తులసిమాలలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

సామూహికంగా సత్యదేవుని వ్రతం

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: గోవిందమాల కల్యాణ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పాలకొల్లు రైస్‌మిల్లు ప్రాంగణంలో అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం భక్తులతో సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతం చేయించారు. రామమహేంద్రవరం ఎస్కే నర్సింహాచార్యులు, గురుస్వామి యాదంరెడ్డి సత్యం, కమిటీ అధ్యక్షుడు, కార్యదర్శులు కేవీ కృష్ణవర్మ, కరరి నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాసోత్సవాలు

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పాలకొల్లులోని అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం స్వామివారిని పార్థసారథి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మండపంలో పండితులు తిరుప్పావై ప్రవచనం చేశారు.

అమ్మవారికి వెండి కర్ణ పత్రాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురంలోని ఆదికేశవ ఎంబెరుమన్నార్ స్వామి ఆలయంలో అమ్మవారికి కనుమూరి గుప్తా, లక్ష్మీ దంపతులు, కనుమూరి ప్రసాద్, లక్ష్మీ దంపతులు 100 గ్రాముల వెండి కర్ణ పత్రాలను సమర్పించారు. సంప్రోక్షణ అనంతరం వాటిని ఆదివారం అమ్మవారికి అలంకరించారు. దాతలకు ఆలయ ఛైర్మన్ పొలిశెట్టి వెంకట కృష్ణారావు, ఆదిబాబు, ఈవో రామచంద్ర కుమార్ ప్రసాదం అందజేశారు.

మందాలమ్మను దర్శించుకున్న మంత్రి

పెనుగొండ, న్యూస్‌టుడే: వడలిలో కొలువైన మందాలమ్మను రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు.

పల్లె దారులకు కొత్త రూపు!

పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాలకు రూ.28.98 కోట్లు విడుదల

అభివృద్ధి చేయాల్సిన కొమ్ముచిక్కాల - అరట్లకట్ట రహదారి

పోడూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహణను పట్టించుకోకపోవడంతో గ్రామీణ రహదారులు అధ్వానంగా మారి ప్రజలు నరకం అనుభవించారు. మండల, జిల్లా పరిషత్తు రహదారులు కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో రైతులు, గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని రహదారులకు మరమ్మతులు చేసినా భారీ వర్షాలతో మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. ఈ నేపథ్యంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసింది. రానున్న ఐదారు నెలల్లో రహదారుల సమస్యకు మోక్షం లభించనుంది. పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో 25 రహదారులను రూ.28.98 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. ఆయా పనులు టెండర్ల దశలో ఉన్నట్లు పంచాయతీరాజ్ స్పెషల్ ప్రాజెక్టు ఏఈ సూర్యకుమార్ తెలిపారు.

మండలాల వారీగా మంజూరైన పనులు, నిధులు(రూ.కోట్లలో) వివరాలు ఇలా..

మండలం	పనులు	కిలోమీటర్లు	నిధులు
పెనుమంట్ర	02	3.798	1.76
పెనుగొండ	03	9.498	4.84
ఆచంట	04	6.131	2.86
యలమంచిలి	04	8.350	4.65
పోడూరు	08	24.563	12.07
పాలకొల్లు	04	6.946	2.80

• పాలకొల్లు నియోజకవర్గంలో కట్టుపాలెం- పెనుమర్రు- రావిపాడు, నార్నిమెరక పరిధి గమళ్లపెంట ఎస్సీ కాలనీ రహదారి, అడవిపాలెం- గగ్గిపర్రు, కాజ- దిగమర్రు- వరిధనం, పాలకొల్లు - ఆచంట - రాజులగరువు - మేడపాడు, పెనుమదం- గుమ్మలూరు- ఆనబకాయలదిబ్బ, పెనుమదం- అప్పిచెరువు, చాకిరేవుగుంట- జిన్నూరు, కొమ్ముచిక్కాల- అరట్లకట్ట, వేడంగి- మట్టపర్రు (కాజ డ్రెయిన్), మట్టపర్రు- పెనుమదం, ఆగర్రు- ఆగర్తిపాలెం, తిల్లపూడి- పాటిగరువు, భగ్గేశ్వరం- సత్యనారాయణపురం రహదారులకు నిధులు మంజూరు చేశారు.

• ఆచంట నియోజకవర్గ పరిధిలో జుత్తిగ - పెనుమంట్ర, పంపనవారిపాలెం- నత్తారామేశ్వరం, నడిపూడి - చినమల్లం, దొంగరావిపాలెం రహదారి, కొడమంచిలి - ఉత్తరపాలెం, గుమ్మలూరు -భీమలాపురం- కరుగోరుమిల్లి ఫెర్రీ, ఆచంట- కండెల్లివారి పేట - కరుగోరుమిల్లి, ఆచంట- పెళ్లికూతురమ్మచెరువు వరకు రహదారులను అభివృద్ధి చేయనున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసాపురం:	80085 74504	ఆచంట :	90631 44737
పాలకొల్లు :	80085 74510	పెనుగొండ:	80085 74469
పోడూరు :	90631 44741	పెనుమంట్ర:	91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? ఎన్టీఆర్ కాలనీలో వీధి దీపాలు సక్రమంగా వెలగటం లేదు. - చంద్రశేఖర్, నరసాపురం

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - ఎం. అంజయ్య, పురపాలక కమిషనర్

నరసాపురం, న్యూస్‌టుడే: ? ప్రాంతీయ ఆసుపత్రి సమీపాన వీధి దీపాలు వెలగడంలేదు. ఈ మార్గంలో రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. - మండెల కుమార్, నరసాపురం

✔ వీధిదీపాలకు మరమ్మతులు చేయిస్తాం. - ఆర్.గంగావరప్రసాద్, పురపాలక డీఈ

మొగల్తూరు, న్యూస్‌టుడే: ? వారతిప్ప గ్రామానికి శుద్ధిజలాలు సరఫరా చేసే పైపులైను వంతెన వద్ద మరమ్మతులకు గురై తాగునీరు వృథాగా పోతోంది. - నాగరాజు, వారతిప్ప

✔ పైపులైనుకు మరమ్మతులు చేయిస్తాం. - టి.లోకేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ఛార్జి ఏఈ

ప్రతిష్ఠాత్మకంగా పుష్కరాల నిర్వహణ: మంత్రి

కవిటంలో శివాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్యే పితాని

పోడూరు, న్యూస్‌టుడే: గోదావరి పుష్కరాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. పోడూరు మండలం కవిటంలో రూ.1.96 కోట్లతో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు ఆయన ఆదివారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18 ఆలయాలను రూ.23.98 కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. గోదావరి నదికి అయి కిలోమీటర్ల పరిధిలో ఉన్న 77 ఆలయాల్లో రూ.10.02 కోట్లతో సుందరీకరణ పనులకు నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అనంతరం జగన్నాథపురంలో రూ.కోటితో పునర్నిర్మిస్తున్న రామేశ్వరస్వామి ఆలయ పనులను పరిశీలించారు. ప్రహరీ, టైల్స్, ఇతర పనులకు అవసరమైన రూ.50 లక్షల మంజూరుకు మంత్రి హామీ ఇచ్చారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ మేడపాటి నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: ఇలపర్రు సొసైటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం సిద్ధాంతంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆవిష్కరించారు. అనంతరం సిద్ధాంతం పీహెచ్‌సీ పరిధిలో చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. కోడిపందేల దిబ్బ కాలనీలో ఉపాధి హామీ నిధులు రూ.1.50 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లను ఆయన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణతో కలిసి ఆదివారం ప్రారంభించారు. బాక్స్ కల్వర్టు, సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

వేగంగా కాలువల ప్రక్షాళన పనులు

మొగల్తూరు వద్ద లాకులను పరిశీలిస్తున్న నాయకర్, రామరాజు

మొగల్తూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో సాగునీటి కాలువల ప్రక్షాళన పనులను వేగంగా పూర్తిచేసేలా చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. నరసాపురం కాలువ శివారులో మొగల్తూరు లాకులను ఆయన తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానిక రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. తెదేపా మండల అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, మాజీ సర్పంచి మామిడిశెట్టి సత్యనారాయణ, ఉప సర్పంచి బోణం నరసింహారావు, సొసైటీ ఛైర్మన్ నిప్పులేటి తారకరామారావు, పశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌ఛైర్మన్ మాద్రాజు, నీటి సంఘం అధ్యక్షుడు కడలి వీరమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాల పాలకవర్గాలు పని చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. పెదమైనవానిలంక సహకార సంఘ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం తూర్పుతాళ్లులో జరిగింది. ఛైర్‌పర్సన్‌గా పులపర్తి సూర్యారావు, పర్సన్లుగా కోడి వీరవెంకట సత్యనారాయణ, పొన్నమండ ముత్యాలరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సహకార వ్యవస్థ పట్ల నమ్మకం కలిగేలా పని చేయాలని సూచించారు. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జిల్లా మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య అధ్యక్షుడు వసంతరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో ఉన్నతి

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

బహుమతులు అందుకున్న వారితో ఉపాధ్యాయులు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: విద్యలో రాణించడంతో పాటు క్రమశిక్షణతో మెలిగే వారికి ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలను పాలకొల్లు చాతుర్య ఇంగ్లిషు మీడియం పాఠశాలలో శనివారం నిర్వహించారు. 'కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్' అంశాల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో డి.సాయినాథ్(9వ తరగతి), ఎస్.చంద్రిక(8వ తరగతి), వై.కార్తిక శ్రీనరేంద్రశర్మ(8వ తరగతి)లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ కె.ఎన్.ఆర్.లక్ష్మి, పి.చంద్రశేఖర్, ఎస్.డఫెదర్‌లు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

కర్ణభక్తుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరంలో కర్ణభక్తుల సంక్షేమం కోసం సంఘ సభ్యులంతా ఐక్యంగా కృషి చేయాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సమతం రమణ మహేశ్ పిలుపునిచ్చారు. ఆ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాలులో ఆయన ఆదివారం ఆవిష్కరించారు. రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ తమ్మా రవి, సభ్యులు వాసా భ్రమరాంబ, కాసా చాముండేశ్వరి, విశ్వనాథం కృష్ణవేణి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడిన ఘటన పాలకొల్లు మండలం దిగమర్రులో చోటు చేసుకుంది. గ్రామీణ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొన్నాడ దుర్గాప్రసాద్, భార్యతో సహా శనివారం తాడేపల్లిగూడెం వెళ్లారు. ఆదివారం ఇంటికి తిరిగి వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉంచిన బంగారు ఆభరణాలు, వెంబడి సామగ్రి అపరిహరణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపారు.

టీవీలు ఇచ్చారు.. పాఠాలు మరిచారు!


కొమ్ముచిక్కాల అంగన్‌వాడీ కేంద్రంలో ఇలా..

పోడూరు, న్యూస్‌టుడే: టెలివిజన్ పాఠాలతో చిన్నారులకు విద్యాబోధన చేయాలనే లక్ష్యంతో సక్షం పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాలకు దాదాపు ఐదు నెలల క్రితం టెలివిజన్‌లు సమకూర్చాయి. పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో 99 కేంద్రాలకు వీటిని అందజేశారు. ఇవి వినియోగంలోకి రాకపోవడంతో అలంకార ప్రాయంగా మారాయి. ఈ కేంద్రాలకు అంతర్జాల సౌకర్యం కల్పించలేదు. దీంతో పెన్‌డ్రైవ్ ద్వారా కొన్ని కేంద్రాల్లో మాత్రమే బొమ్మల చిత్రాలతో రూపొందించిన నీతి కథలు ప్రదర్శిస్తున్నాయి. మరోపక్క సాంకేతిక కారణాలతో కొన్ని కేంద్రాల్లో టెలివిజన్లు పనిచేయడం లేదు. కొన్ని చోట్ల తగిన స్విచ్‌బోర్డులు లేక టెలివిజన్లను వినియోగించడం లేదు. పోడూరు మండలంలో కొమ్ముచిక్కాల, గుమ్మలూరు శివారు రావిగొప్పు అంగన్‌వాడీ కేంద్రాల్లో టెలివిజన్లు పని చేయడం లేదని 'న్యూస్‌టుడే' పరిశీలనలో తేలింది. ఈ అంశంపై సీడీపీవో ఎం. ఉమ స్పందిస్తూ సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలకు ఏటా రూ.3 వేలు నిర్వహణ కోసం ఇస్తామన్నారు. అన్ని కేంద్రాల్లో టెలివిజన్‌లు పనిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

భగభగ.. కాలుష్య సెగ!

నరసాపురం బైపాస్ వెంబడి దహనమవుతున్న వ్యర్థాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో పలు ప్రాంతాల్లో చెత్తను సక్రమంగా తొలగించడం లేదు. దీంతో చెత్త కుళ్లిపోయి దుర్వాసన, దోమల బెడద పెరిగిపోతోంది. ఈ బాధ భరించలేక స్థానికులు రహదారి వెంబడి ఉన్న చెత్త కుప్పలను తగలబెడుతున్నారు. వాటిలో ప్లాస్టిక్, రసాయన వ్యర్థాల నుంచి వెలువడే దట్టమైన పొగతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, చుట్టుపక్కల నివాసితులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ సమస్యపై పురపాలక శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు స్పందిస్తూ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు చేపడతామన్నారు.

జగన్ పాలనలో సంక్షేమం: వైకాపా

ఆచంట: వేడుకల్లో శ్రీరంగనాథరాజు, నాయకులు

ఆచంట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వ హయాంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమ పాలన అందించారని మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆదివారం ఆచంటలో నిర్వహించిన జగన్ పుట్టిన రోజు వేడుకల్లో ఆయన పాల్గొని కార్యకర్తలు, నాయకులతో కలిసి కేకు కోశారు. సర్పంచులు కోట సరోజని, సుంకర సీతారామ్, నాయకులు పాల్గొన్నారు.

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం, మొగల్తూరులలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు వేడుకల్లో పాల్గొని కేకు కోశారు.

పెనుగొండ, పెనుమంట్ర, న్యూస్‌టుడే: పెనుగొండ గాంధీబొమ్మల కూడలి వద్ద, మార్టేరులో వైకాపా నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాలను మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ప్రారంభించారు.

28న బీసీ చైతన్య వేదిక బహిరంగ సభ

పెనుగొండ, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈతకోటలో ఈ నెల 28న నిర్వహించనున్న బీసీ చైతన్య వేదిక బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ వేదిక జాతీయ అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన పెనుగొండలో విలేకరులతో మాట్లాడారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ మల్లుల లక్ష్మీనారాయణలను ఆదివారం కలిసి బహిరంగ సభ కరపత్రాలు అందజేసినట్లు చెప్పారు. వేదిక జిల్లా అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, ఆచంట నియోజకవర్గ అధ్యక్షుడు వేంద్ర రాము, మండల అధ్యక్షుడు సూర్యప్రసాద్, ఆచంట మండల అధ్యక్షుడు కేతా వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: కారు ఢీకొట్టడంతో సైకిలిస్టుకు గాయాలైన ఘటన పాలకొల్లు మండలం దిగమర్రులో చోటు చేసుకుంది. గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం.. దిగమర్రుకు చెందిన కె.శివశంకరుడు ఆదివారం ఉదయం గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సైకిల్‌పై రోడ్డు దాటుతుండగా రాజోలు వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన శంకురుడిని స్థానికులు పాలకొల్లు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం భీమవరంలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అతడి సోదరుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ మూర్తి తెలిపారు.

సమష్టి కృషితో పోలియోపై విజయం

పాలకొల్లు: చుక్కల మందు వేస్తున్న అంగర

పోడూరు, న్యూస్‌టుడే: సమష్టి కృషితో దేశవ్యాప్తంగా పోలియోను శాశ్వతంగా నిర్మూలించగలిగామని రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. పోడూరు మండలం కవిటం ఆరోగ్య ఉపకేంద్రం వద్ద ఆదివారం ఆయన చిన్నారులకు పోలియో చుక్కల మందు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొరుగు దేశాల్లో ఇప్పటికీ పోలియో కేసులు వెలుగు చూస్తున్నాయని, మనదేశంలో ఏటా చుక్కల మందు శిబిరాలు ఏర్పాటుతో ఈ వ్యాధిని నిర్మూలించగలిగామని పేర్కొన్నారు. సర్పంచి చుట్టుగుళ్ల పూర్ణిమ, ఎంపీపీ మంగళి, ఉప వైద్యాధికారి ప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు రుద్రరాజు రమేశ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: నరసాపురం నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో శిబిరాల్లో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొని చిన్నారులకు చుక్కల మందు వేశారు. మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లులో పురపాలక కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ ప్రారంభించి చిన్నారులకు చుక్కల మందు వేశారు. నోడల్ అధికారి పి.నరేశ్‌కుమార్, వైద్యులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రెవెన్యూ సంస్కరణలతో మేలు

మొగల్తూరు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన రెవెన్యూ సంస్కరణలతో ప్రజలకు మేలు జరగనుందని సొసైటీ మాజీ అధ్యక్షుడు, తెదేపా నాయకుడు మోటుపల్లి రామభాస్కరరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెవెన్యూ అధికారులు కూడా ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు.

నరేశ్‌బాబుకు హ్యూమన్ సోలిడారిటీ అవార్డు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: న్యూదిల్లీలోని సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ సోలిడారిటీ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. ఈ వేడుకలో పాలకొల్లుకు చెందిన చవాకుల సూర్య నరేశ్‌బాబు పురస్కారం అందుకున్నారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సి.రాజన్ తండాజీ, దిల్లీ యూనివర్సిటీ డీన్ నిరంజన్, మేజర్ జనరల్ పి.కె.జైన్‌ల నుంచి అవార్డు అందుకున్నట్లు నరేశ్‌బాబు తెలిపారు.

ఉపాధి పథకం పేరు మార్పుపై నిరసన

ఉండి, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చడాన్ని తమ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని సీపీఐ ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు అన్నారు. ఉండి పార్టీ సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఈ అంశంపై ఈనెల 22న స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు ఉపాధి శ్రామికులు, రైతు కూలీలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

హస్తకళల ప్రదర్శనకు ఆదరణ

ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: రుస్తుంబాదలోని అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శనకు ఆదివారం సందర్శకులు పోటెత్తారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు రాష్ట్రాలకు చెందిన స్టాల్స్‌ను సందర్శించి విభిన్నమైన లేసు, కలంకారి, ఎంబ్రాయిడరీ దుస్తులు, చిన్న పిల్లల బొమ్మలు, ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఆర్డీవో దాసి రాజు స్టాళ్లను సందర్శించి పలు ఉత్పత్తులను కొనుగోలు చేశారు.

అమ్మ కోవెల.. ఇక కొత్త కళ!

ఆలయ నిర్మాణానికి మంత్రి హామీ

ఆచంటలో ముత్యాలమ్మ ఆలయం

బీటలు తీసిన గోడ, పైకప్పు

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంటలో ఒకే ప్రాంగణంలో గ్రామదేవత ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ, గోగులమ్మ ఆలయం జీర్ణావస్థకు చేరింది. దాదాపు వందేళ్ల కిందట గానుగ సున్నంతో నిర్మించిన రాతి కట్టడం గోడలు, పైకప్పు కొన్నేళ్ల కిందటే బీటలు తీశాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ ఆలయానికి 9 ఎకరాల పొలం ఉంది. దీనిపై ఏటా రూ.3.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతోంది. ఈ ఆలయ పునర్నిర్మాణానికి గ్రామస్థులు, భక్తులు రూ.50 లక్షలకు పైగా విరాళాలు సమకూర్చి బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఆలయంతో పాటు ప్రహరీ, గోపురాల నిర్మాణానికి రూ.2 కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా. ఈ ఆలయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం సందర్శించి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. నూతన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈవో ఏవీ సత్యనారాయణను ఆదేశించారు.

మురుగుతో ముప్పు తిప్పలు!

22 వార్డు నివేదన

జనాభా : 1,900

ప్రాంతాలు: కొత్తపేట, హరి రామజోగయ్య కాలనీ.

ఇంకుడు గుంతలోకి చేరిన వాడకం నీరు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: పాలకొల్లు పట్టణ పరిధి 22వ వార్డులోని కొన్ని ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేక స్థానికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హరిరామజోగయ్య కాలనీ ప్రాంతంలో ఖాళీ స్థలాల్లో, ఇళ్ల ముందు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని మురుగును వాటిలోకి మళ్లిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు రహదారులు, పల్లపు ప్రాంతాల్లో రోజుల తరబడి మురుగు నిలిచిపోతోందని స్థానికులు వాపోతున్నారు. డ్రెయిన్లు ఉన్న చోట కూడా వాటిని శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన, దోమల బెడదతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాముల బెడద.. కొత్తపేట, హరిరామజోగయ్య కాలనీల్లో ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలు, చెత్త, వ్యర్థాలతో నిండిపోయాయి. దీంతో పాములు, విష కీటకాలతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రివేళలో రాకపోకలు సాగించేందుకు మహిళలు, చిన్నారులు ఆందోళన చెందుతున్నారు. వార్డులో కుక్కల బెడద కూడా ఎక్కువైంది. వార్డులో క్షేత్ర పరిశీలన చేసి మురుగు, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పురపాలక కమిషనర్ బి.విజయసారథి తెలిపారు.

పర్యాటకుల రక్షణకు డ్రోన్

మొగల్తూరు, న్యూస్‌టుడే: పేరుపాలెం సౌత్, కేపీపాలెం సౌత్ బీచ్‌లో పర్యాటకుల రక్షణకు డ్రోన్ అందుబాటులోకి రానుంది. డీఎస్పీ జి.శ్రీవేదఅరవింద చొరవతో బీచ్‌లో రక్షణ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా దాతల నుంచి విరాళాలు సేకరించి డ్రోన్ కొనుగోలు చేశారు. విశాఖపట్నంలో స్థిరపడిన కేపీపాలెంవాసి అందె కాశీవిశ్వేశ్వరరావు రూ.5 లక్షలు, కొప్పర్రుకు చెందిన పారిశ్రామిక వేత్త పోలిశెట్టి శ్రీనివాసు రూ.లక్ష విరాళం అందించారు. ఈ మొత్తంతో నేరుగా తయారీ సంస్థ నుంచి అధునాతన డ్రోన్ కొనుగోలు చేశారు. సోమవారం బీచ్‌లో ప్రయోగాత్మకంగా డ్రోన్‌ను వినియోగిస్తామని డీఎస్పీ 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

తీరంలో సందడి

మొగల్తూరు, న్యూస్‌టుడే: పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన పర్యాటకులతో పేరుపాలెం బీచ్ ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి వాతావరణం నెలకొంది. పలువురు పర్యాటకులు వణికించే చలిని లెక్క చేయకుండా సముద్ర అలల్లో స్నానాలు చేశారు. ఎస్సై జి.వాసు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తు విధులు నిర్వహించారు.

(c) eenadu

తాడేపల్లిగూడెం
● తాడేపల్లిగూడెం ● తణుకు

మహాసభల విజయవంతానికి పిలుపు

గోడపత్రాలను చూపుతున్న నాయకులు

తణుకు, న్యూస్‌టుడే: విశాఖలో డిసెంబరు 31 నుంచి నిర్వహించే సీఐటీయూ ఆల్ ఇండియా మహాసభలను విజయవంతం చేయాలని బిల్డింగ్ వర్కర్స్ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఇరగవరం మండలం పొదలాడలో గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ మండల కన్వీనర్ జి.రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బి.నాగబాబు, జి.వెంకటేశ్వరరావు, పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తణుకు, న్యూస్‌టుడే: మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనల్లో స్థానిక బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని తోట వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎమర్జింగ్ టెక్నాలజీ విభాగానికి సంబంధించి గైడ్ ఉపాధ్యాయిని ఎ.మాణిక్యమ్మ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ ప్రాజెక్టు, ఉపాధ్యాయ విభాగం నుంచి షర్మిల సుల్తాన్ రూపొందించిన ఉమెన్ సేఫ్టీ డివైజ్ అనే ప్రాజెక్టులు సోమవారం భీమవరంలో జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శిస్తారని ఆమె వివరించారు.

కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు, తదితరులు

ధ్యానం, యోగాతో రోగాలు దరిచేరవు

తణుకు, న్యూస్‌టుడే: ప్రతి రోజూ ధ్యానం, యోగా ఆచరిస్తే అనారోగ్యం సమస్యలు దరిచేరవని యోగా గురువు బి.రాఘవేంద్రరావు అన్నారు. అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భంగా శ్రీసత్యసాయి నిత్యయోగ సాధన కేంద్రం 16వ వార్షికోత్సవం ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధ్యానం, యోగా మార్గాన్ని అనుసరిస్తే మంచి ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. అనంతరం 21 రోజులు క్రమం తప్పకుండా ధ్యాన సాధన చేసిన యోగా సాధకులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు సీహెచ్.శ్రీనివాస్, కె.వాసంతి, బి.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొండెక్కిన ట్యాంకుల పరిశుభ్రత
పట్టించుకోని పంచాయతీ అధికారులు

మండపాకలో అపరిశుభ్రంగా ట్యాంకు పరిసరాలు

తణుకు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు శుద్ధి చేసిన నీరు అందించడంలో అధికారులు విఫలమవుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ట్యాంకుల నిర్వహణ గాలికొదిలేశారు. దీంతో కలుషిత జలాలు తాగి రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో అలసత్వం వహించొద్దని ప్రజా ప్రతినిధులు హెచ్చరిస్తున్నా సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. 'ట్యాంకుల శుభ్రత పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలిస్తున్నాం. నిర్వహణలో అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటాం' అని తణుకు డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, ఇరగవరం ఎంపీడీవో శ్రీనివాస్ పేర్కొన్నారు.

15 రోజులకోసారి.. పంచాయతీ పరిధిలో ఓవర్ హెడ్ ట్యాంకులను 15 రోజులకోసారి శుభ్రం చేసి నీటిని క్లోరినేషన్ చేయాలి. శుభ్రం చేసిన తేదీ, మళ్లీ ఎప్పుడు చేస్తారో ఆ తేదీని నోటీసు బోర్డులో నమోదు చేయాలి. అయితే క్షేత్రస్థాయిలో ఇవేమీ అమలు కావడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు హెచ్చరించినప్పుడు కొద్ది రోజులు పాటిస్తున్నా మళ్లీ పరిస్థితి యథాస్థితికి వచ్చేస్తోంది.

అపరిశుభ్రంగా పరిసరాలు తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల పరిధిలోని 48 గ్రామాల్లో అధిక సంఖ్యలో ఓవర్ హెడ్ ట్యాంకులు ఉన్నాయి. వాటి వద్ద గడ్డి, పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తున్నాయి. పలు పాత ట్యాంకుల మూతలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాటిలో దుమ్ము ధూళి పడి నీరు అపరిశుభ్రంగా మారుతోంది.

కనిపించని కిట్లు.. నీటిని పరీక్షించే బాధ్యతలను సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అప్పగించారు. వీరికి నీటి శుద్ధి కిట్లను సైతం అందజేశారు. వాటిని ఎక్కడా వినియోగించిన దాఖలాలు కనిపించడం లేదు. అలాగే ట్యాంకుల వద్దకెళ్లి చూస్తే వివరాలు నమోదు చేసిన ఆనవాళ్లు కూడా లేకపోవడం గమనార్హం. కొన్ని పంచాయతీల్లో ఎప్పుడో ఒకసారి నామమాత్రంగా ట్యాంకులను శుభ్రం చేస్తున్నారని, మరి కొన్ని చోట్ల ట్యాంకులు శుభ్రం చేయకపోయినా చేసినట్లు రికార్డుల్లో చూపిస్తున్నారని గ్రామాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అధికశాతం ప్రజలు ప్రైవేటు ఆర్వో ప్లాంట్లపై ఆధారపడుతున్నారు.

కొమరవరంలో ఖాళీగా దర్శనమిస్తున్న నోటీసు బోర్డు

మేమున్నాం.. మీకు తోడుగా..
10 AM to 1 PM

తాడేపల్లిగూడెం	99488 53114
తణుకు	85558 50851
తణుకు (గ్రామీణం)	63005 79402
అత్తిలి	91548 46774

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: ? తాడేపల్లిగూడెం టీటీడీ కళ్యాణ మండపం ఎదురుగా రోడ్డులో చెత్త పేరుకుని రహదారులకే వస్తోంది. - విజయ్, స్థానికుడు
✔ చర్యలు చేపడతాం - సోమేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్
? తాడేపల్లిగూడెం దొమ్మర్లకాలనీ శివారు మురుగు బోదెలో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధిచెంది కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. - రాజేంద్ర, స్థానికుడు
✔ నీటి నిల్వలు లేకుండా చేసి దోమల నివారణ చర్యలు చేపడతాం. - ఎం.ఏసుబాబు, పురపాలక కమిషనర్

రైతులకు అందుబాటులో యూరియా

రైల్వేగూడ్స్‌షెడ్(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: రైతులకు అందుబాటులో యూరియా ఉందని తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆర్.గంగాధర్ తెలిపారు. గత మూడు సంవత్సరాల సరాసరి వాడకాన్ని దృష్టిలో ఉంచుకుని తాడేపల్లిగూడెం వ్యవసాయ డివిజన్‌కు ప్రభుత్వం యూరియా సరఫరా చేసిందన్నారు. ఆమేరకు పట్టణంలోని రైల్వే గూడ్స్‌షెడ్ రేక్ పాయింట్‌కు వచ్చిన యూరియాను ఆదివారం పరిశీలించి గోదాములకు తరలించారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో సొసైటీలు, ప్రైవేటు డీలర్లు, రైతు సేవాకేంద్రాల వద్ద 2,089 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు.

తెదేపా జిల్లా కార్యదర్శిగా మోహన్‌రావు

తణుకు, న్యూస్‌టుడే: తెదేపా జిల్లా కార్యదర్శిగా పితాని మోహన్‌రావు నియమితులయ్యారు. గతంలో తెదేపా తణుకు మండల అధ్యక్షుడిగా పనిచేసిన మోహన్‌రావును జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోహన్‌రావును రాధాకృష్ణ, కూటమి నాయకులు సత్కరించి అభినందించారు.

ప్రతిభావంతులకు కలెక్టర్ అభినందన

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: గోదావరి క్రీడోత్సవాల్లో భాగంగా ఉద్యోగుల క్రీడా పోటీలు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో కొనసాగుతున్నాయి. పోటీలను కలెక్టర్ నాగరాణి ఆదివారం పరిశీలించారు. క్రికెట్, చదరంగం, క్యారం, షటిల్, వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచినవారిని అభినందించారు. ఆర్డీవో కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అలంపురంలో ముల్లమ్మ జాతర

అలంపురం(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: పెంటపాడు మండలం అలంపురంలో ముళ్లమ్మ జాతర ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. దీనిలో భాగంగా అష్టదిగ్బంధనం, పొలిమేర కట్టుట కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ముందుగా గాంధీ బొమ్మ సెంటరులో అమ్మవారి పూరిగుడెసెల నిర్మాణం జరిగిందని తెలిపారు.

ప్రతి పేదవాడికి అండగా కూటమి ప్రభుత్వం

వినతులు స్వీకరిస్తున్న బాజ్జీ

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పేదలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ఏపీ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ వలవల బాజ్జీ అన్నారు. ఆదివారం పట్టణంలోని భాగ్యలక్ష్మీ పేటలోని విడిది కార్యాలయంలో పలువురి నుంచి ఆయన వినతులు స్వీకరించారు. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నియోజకవర్గంలోని 8 మందికి రూ.4,97,117 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ, గూడెం, పెంటపాడు మండలాల అధ్యక్షులు పట్నాల రాంపండు, పసల రవికుమార్, శీలపల్లి వెంకట్రావు, ఏపీ టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి పాల్గొన్నారు.

ఇంటింటికీ వైద్యం

తణుకు, న్యూస్‌టుడే: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచారశకటం ద్వారా ఇంటింటికీ వైద్యం కార్యక్రమం నిర్వహించారు. హుస్సేన్ అహ్మద్ తణుకు, మండపాక, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి మంచానికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందించారు. సభ్యుడు కోడూరి హనుమంతరావు ఆర్థిక సహాయంతో ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి అర్జి భాస్కరరావు, సభ్యుడు గిరిజాల నాగేశ్వరరావు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

గోపీ కుటుంబసభ్యులతో మాగంటి బాబు, ఎమ్మెల్యే శ్రీనివాస్

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కూటమి పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఏలూరు మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు(బాబు) అన్నారు. ఆదివారం తాడేపల్లిగూడెం మాజీ ఏఎంసీ ఛైర్మన్ తోటగోపీని ఆయన నివాసంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాగంటి బాబు మాట్లాడుతూ తనకు ఎమ్మెల్యే శ్రీనివాస్, గోపీ చిరకాల మిత్రులని, గతంలో తాను ఎంపీగా పోటీచేసినప్పుడు తన విజయానికి వారు విశేషంగా కృషి చేశారని తెలిపారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథాన వెళుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొలిశెట్టి రాజేష్, తోట రాజా, పైబోయిన రమ, కొమ్మన, పుల్ల బాబీ, చాపల రమేష్, పాలూరి వెంకటేశ్వరరావు, బొడ్డు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజం కోసం కృషి

చుక్కలు వేస్తున్న రాధాకృష్ణ

తణుకు, ఇరగవరం, న్యూస్‌టుడే: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తణుకు నియోజకవర్గంలో 190 కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు 27వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ★ రేలంగి, గోటేరులో జరిగిన పల్స్ పోలియో కేంద్రాలను పల్స్‌పోలియో కార్యక్రమ పరిశీలన ప్రత్యేక అధికారి కీర్తి పరిశీలించారు, నూరుశాతం లక్ష్యం సాధించాలని సిబ్బందికి సూచించారు.

నిండు జీవితానికి.. రెండు చుక్కలు.. తాడేపల్లిగూడెం అర్బన్, వన్‌టౌన్, న్యూస్‌టుడే: పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కూటమి ప్రభుత్వం చేపట్టిన అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. స్థానిక 28వ వార్డు అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు చుక్కల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఆరోగ్య అధికారి ఎన్.రాజు, వైద్యులు, ఎ.ఎన్.ఎం.లు, ఆశావర్కర్లు, కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. ★ తాడేపల్లిగూడెం హౌసింగ్‌బోర్డు కాలనీలో పల్స్ పోలియోపై అవగాహన కార్యక్రమాన్ని దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు.

అధ్వానంగా రహదారి

ఇరగవరం, న్యూస్‌టుడే: ఇరగవరం నుంచి సూరంపూడి వెళ్లే కాలువ గట్టు రహదారి అధ్వానంగా తయారైంది. అడుగడుగునా గోతులతో నిండిన ఈ మార్గాన ప్రయాణమంటేనే వాహన చోదకులు బెంబేలెత్తే పరిస్థితి నెలకొంది. సూరంపూడి గ్రామ వాసులకు ఇరగవరం చేరేందుకు ఇది దగ్గర మార్గం. కొన్నేళ్లుగా ఈ రహదారి అభివృద్ధికి నోచుకోకపోవడంతో మండల కేంద్రానికి చుట్టు తిరిగి రావాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు.

నివాసాల మధ్య చెత్తగుట్ట

నివాసాల మధ్య పేరుకుపోయిన చెత్త

ఇరగవరం, న్యూస్‌టుడే: రేలంగి శివారు ఇందిరానగర్‌లో ఎక్కడ చూసినా చెత్త గుట్టలు కనిపిస్తున్నాయి. పంచాయతీ చెరువు గట్టు వెంబడి, వంతెన వద్ద, నివాసాల మధ్య చెత్త పేరుకుపోతోంది. ఈ ప్రాంతంలో సుమారు 450 మంది జనాభా ఉన్నారు. దుర్వాసనతోపాటు దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్తంతా సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు వాపోతున్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

మంచిలిలో ఇలా..

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మంచిలి గ్రామం ప్రధాన రహదారిలో కాలువపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరి ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెనకు ఇరువైపులా మలుపులు కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరవల్లి గ్రామంలో ప్రధాన రహదారి పై నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలమైంది. కంచుమర్రు, ఈడూరు, కొమ్మర, పాలి, పాలూరు గ్రామాల్లో నిర్మించిన వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు స్పందించి వంతెనలు, కల్వర్టులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పరిశీలించి వంతెనల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతామని ర.భ.శా జేఈ యశ్వంత్ చెప్పారు.

జూద స్థావరంపై దాడి

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: తోకలపల్లిలో నిర్వహిస్తున్న జూద స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.72,050 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలో ఎవరైనా జూదాలు ఆడితే తమకు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే ఊరుకోం: సీపీఎం

ఇటుకులకుంట(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే ఊరుకునేది లేదని ప్రజా సంఘాలు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ఆమేరకు మండలంలోని ఇటుకులకుంటలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి పేరును జీరాంజీగా మార్చడం వలన ఒరిగేది ఏమి లేదన్నారు. గ్రామ గ్రామాన వ్యవసాయ కూలీలు, పేదలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, మండల కార్యదర్శి కండెల్లి రమేష్‌బాబు, సీఐటీయూ నాయకుడు సిరిపరపు రంగారావు పాల్గొన్నారు.

జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

తాడేపల్లిగూడెం వన్‌టౌన్, అర్బన్, తణుకు, న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం పట్టణం, తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కేకులు కోసి అందరికీ పంచారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తన విడిది కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఏపీ రైతు విభాగ ఉపాధ్యక్షుడు వడ్డి రఘురామ్ ఆధ్వర్యంలో ఆరుగొలను తదితర గ్రామాల్లో నిర్వహించారు.
★ వైకాపా పట్టణ మాజీ అధ్యక్షుడు గుండుబోగుల నాగు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ గుండుబోగుల వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యకర్తలు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.
★ తణుకు వైకాపా కార్యాలయం వద్ద మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కేకు కోసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏలూరు ఆశ్రం ఆసుపత్రి నుంచి వచ్చిన బృందం సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద 200 మంది పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. జిల్లా ఆసుపత్రిలో కార్మికులకు బియ్యం, నిత్యావసరాలు, ఆసుపత్రిలోని రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. సంధ్యాజ్యోతి వృద్ధ జనాశ్రమంలో వృద్ధులకు భోజన వసతి, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు.

తణుకు: రక్తదాన శిబిరంలో పాల్గొన్న కారుమూరి, నాయకులు

రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం

మారంపల్లి(తాడేపల్లిగూడెం వన్‌టౌన్), న్యూస్‌టుడే: తాడేపల్లిగూడెం మండలం మారంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం కనుగొన్నామని తాడేపల్లిగూడెం జీఆర్పీ ఎస్సై పి.అప్పారావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లవారు జామున రైలులోంచి జారి పడి మృతిచెంది ఉండవచ్చన్నారు. మరణించిన వ్యక్తి పురుషుడని, అతని వయసు సుమారు 40 సంవత్సరాలు ఉంటాయని భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో భద్రపరిచామన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు. పూర్తి వివరాలు తెలిసిన వారు ఎస్సై నం.9490617090 లేదా రైటర్ నం. 8019157528 లకు తెలియజేయాలని సూచించారు.

విద్యుత్తు ఉద్యోగి అదృశ్యం

చిట్టినగర్, న్యూస్‌టుడే : విద్యుత్తు శాఖలో పని చేస్తున్న ఉద్యోగి అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. విజయవాడ గ్రామీణ ప్రాంతం కొత్తూరు తాడేపల్లి గ్రామానికి చెందిన కనికళ్ల వరలక్ష్మి, సత్తిరాజుల కుమారుడు సతీష్ (46) తణుకులో భార్యతో కలిసి ఉంటున్నాడు. తాడేపల్లిగూడెంలోని విద్యుత్తు విభాగంలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తి ఇంటికి, ఉద్యోగానికి వెళ్లకుండా రోడ్డు మీద, రైల్వేస్టేషన్‌లో పడుకుంటున్నాడని విద్యుత్తు కార్యాలయం నుంచి తల్లికి ఫోన్ చేసి చెప్పారు. అక్కడికి తల్లి వెళ్లి సతీష్‌ను ఇంటికి తీసుకు వచ్చింది. 10 రోజులు ఉన్నాడు. అనంతరం 2025 అక్టోబరు 18న ఉద్యోగానికి వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్లా వెతికినా ఆచూకీ తెలియలేదు. ఈ మేరకు తల్లి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చెరువు ఆక్రమణకు యత్నం

అక్కుపల్లిగోకవరం(ఉంగుటూరు), న్యూస్‌టుడే: అక్కుపల్లి గోకవరంలోని పంచాయతీ చెరువును ఆక్రమించేందుకు ఓ వ్యక్తి యత్నిస్తున్నారు. చెరువు గట్టుపైనున్న చెట్లు తొలగించి, ఆ భూమిని తన పొలంలోకి కలుపుకొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి చెరువు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హెచ్చరిక ప్రకటన

మా కక్షిదారులైన శ్రీ మాటూరు సత్యనారాయణ తండ్రి స్వర్గీయ మాటూరు పంచాక్షరి, నివాసం: ఇ.నెం. 12-22, డోర్ నెం. 10-37, పోలవరం రోడ్, కొయ్యలగూడెం, ఏలూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వారిచ్చిన ఆదేశానుసారం ఈ హెచ్చరిక ప్రకటనను సాధారణ ప్రజలకు జారీ చేయడమైనది.

శ్రీ మాటూరు సత్యనారాయణ గారు, దిగువ వివరించిన షెడ్యూలు ఆస్తిలో తన ఆస్తిని విభజించి మరియు తన వాటాను కేటాయించమని కోరుతూ గౌరవ జడ్జిని కోరుతూ తాడేపల్లిగూడెంలోని XI అదనపు జడ్జి వారి న్యాయస్థానంలో OS నెం. 21/2024 తో విభజన కోరుతూ దావాను దాఖలు చేశారు.

దావా షెడ్యూలు ఆస్తి–ఎ: ఉమ్మడి గృహం మొత్తం, ఇ.నెం. 12-22, స.నెం. 456, విస్తీర్ణం ఎక 1-26 సెంట్లు పరింపూడి గ్రామం, కొయ్యలగూడెం మండలం, పాత పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–బి: గృహం (ఉమ్మడిది) మొత్తం, ఇ.నెం. 3-33-2, 378 చ.గ.లులో, నిర్మిత ప్రాంతం 3,641 చ.అ.లు, ఉన్నచోటు: తాడేపల్లిగూడెం, పాత పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–సి: ఉమ్మడి గొడౌన్ మొత్తం (కొయ్యలగూడెం పొగాకు బోర్డు), ఇ.నెం. 6-36, సర్వే నెం. 76/3లో, విస్తీర్ణం: 12,245.2 చ.గ.లు ఉన్నచోటు: గవరవరం గ్రామం, కొయ్యలగూడెం మండలం, పాత పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–డి: పాండురంగ రైస్ మిల్ మొత్తం, ఇ.నెం. 10-180, సర్వే నెం. 204/1లో, విస్తీర్ణం: ఎక 0-60 సెంట్లు, ఉన్నచోటు: కొయ్యలగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–ఇ: పెట్రోలు పంపు మొత్తం సర్వే నెం. 419/1బి, 468/2, విస్తీర్ణం: 532.4 చ.గ.లు పరింపూడి గ్రామంలో, కొయ్యలగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–ఎఫ్: ఉమ్మడి మాటూరు పంచాక్షరి ఫంక్షన్ హాలు మొత్తం, సర్వే నెం. 179/3, 179/4, 179/5, విస్తీర్ణం: 0.86 గుంటలు, పొంగుటూరు గ్రామంలో, కొయ్యలగూడెం (మం), పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–జి: భవనం మొత్తం, గ్రోమోరు సెంటరు మరియు కాలేజి, డోరు నెం. 4-142, విస్తీర్ణం: 1162 చ.గ.లు, ఆర్.ఎస్.నెం. 321/3లో, ఉన్నచోటు: పరింపూడి గ్రామం, కొయ్యలగూడెం (మం), పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.
దావా షెడ్యూలు ఆస్తి–హెచ్: భవనం మొత్తం, ఇ.నెం. 13-28-32/2 (పాత ఇ.నెం. 13-29-24/1, 2), విస్తీర్ణం: సుమారు 241.66 చ.గ.లు, ఎం.వి.ఆర్. బిల్డింగ్, గూడ్స్ షెడ్ రోడ్, తాడేపల్లిగూడెం, పశ్చిమగోదావరి జిల్లా, ఆం.ప్ర.

సదరు దావా ముగిసే వరకు సదరు ఆస్తిని ఎలాంటి మూడవ పార్టీకి దారాదత్తం చేయరాదని, ఉత్తరువు జారీ చేయమని జడ్జి గారిని కోరుతూ సదరు దావాలో మధ్యంతర దరఖాస్తు 2025 నాటి ఐ.ఎ.నెం.1 కూడా దాఖలు అయింది. అందువల్ల సదరు దావా తీర్మానం అయ్యేవరకు సదరు ఆస్తిపై ఎలాంటి వ్యవహారం చేయరాదనీ సాధారణ ప్రజలందరికీ నా కక్షిదారుడు తెలుపడమైనది. ఒక వేళ ఎవ్వరైనా ఏ విధమైన వ్యవహారం చేసినచో అది సవాలు (ఛాలెంజి) చేయబడును. మరియు నా కక్షిదారునికి బంధింపజాలదు. మరియు అదనంగా న్యాయచర్యలు కూడా వారిపై తీసుకోబడును. పై సదరు ఆస్తులతో ఏ విధమైన అమ్మకం లేదా లీజు లేదా ఇంకే ఇతర వ్యవహారం చేయరాదని మేము సాధారణ ప్రజలకు తెలుపడమైనది. ఒక వేళ ఏ విధమైన వ్యవహారాలు జరిగినచో తీసుకొనే కాస్ట్ మరియు న్యాయపర చర్యలకు వారు మాత్రమే బాధ్యులగుదురు. అందువల్ల ఈ ప్రకటన ఇవ్వబడింది.
ఇట్లు: **మాటూరు సత్యనారాయణ**
సం/- **జి.జయేంద్రబాలాజీ,** న్యాయవాది, హైకోర్టు
ఆఫీసు: ప్లాటు నెం. 110, 11-5-8, హ్యాపీ హోమ్స్ క్యాసిల్
రెడ్ హిల్స్, నాంపల్లి, హైదరాబాద్, సెల్ నెం: 93933 90909

కొట్లాట ఘటనలో 16 మందిపై కేసులు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మంచిలిలో ఇంటి వద్ద డ్రెయినేజీ విషయంలో జరిగిన కొట్లాటకు సంబంధించి ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు 16 మందిపై కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామానికి చెందిన కేతా నరసింహమూర్తి, కవురు దుర్గారావు కుటుంబాలు ఎదురెదురుగా నివసిస్తున్నాయి. వీరికి డ్రైనేజీ విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం కవురు దుర్గారావు అతని కుటుంబ సభ్యులు మరో ఆరుగురు కలిసి తనను ఇనుప రాడ్‌లతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని కేతా నరసింహమూర్తి ఫిర్యాదు చేశారు. ★ తాను నీళ్లు తీసుకురావడానికి పంచాయతీ కుళాయి వద్దకు వెళ్లగా కేతా జగదీష్, మరో 8 మంది కుటుంబ సభ్యులు కళ్లలో కారం కొట్టి, కర్రలు, ఇనుప రాడ్డులతో కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని కవురు దుర్గారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన ఇంట్లోకి వెళ్లి వస్తువులు పగులగొట్టారని పేర్కొన్నారు. క్షతగాత్రులిద్దరూ తణుకు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా.. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు కవురు దుర్గారావుతో పాటు మరో 6 గురిపై, కేతా జగదీష్‌తో పాటు మరో 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ప్రేమరాజు వివరించారు.

అసంపూర్తి అదనపు గదులు పూర్తయ్యేనా?

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అత్తిలి మండలంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అదనపు గదుల నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచాయి. గత ప్రభుత్వ పాలనలో నాడు- నేడు కింద పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు చాలీచాలని గదుల్లో విద్యనభ్యసిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కంచుమర్రు ఉన్నత పాఠశాల భవనం ఇలా..

గత వైకాపా కాలంలో అత్తిలి జడ్పీ బాలికోన్నత పాఠశాల రెండో అంతస్తులో అదనపు గదుల నిర్మాణాన్ని రూ.22 లక్షలతో ప్రారంభించారు. సుమారు రూ.6 లక్షలు ఖర్చు చేశారు. అనంతరం నిధులు విడుదల కాకపోవడంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. సుమారు 500 మంది విద్యార్థులు ఉన్నప్పటికీ ఉన్న గదుల్లో సర్దుకుపోవాల్సి వస్తోంది.

కంచుమర్రు ఉన్నత పాఠశాల అదనపు గదులను అసంపూర్తిగా నిర్మించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసి నూతన భవనాల నిర్మాణాలు పూర్తి చేస్తోందని ఎదురు చూస్తున్నారు.

అత్తిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా ప్రజాప్రతినిధులు సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. భవన నిర్మాణం పూర్తిచేయడానికి నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించామని ఎస్ఎస్ఏ అధికారులు తెలిపారు.

ప్రతిపాదనలు పంపాం.. అత్తిలి మండలంలోని వరిఘేడు, యర్రనీలిగుంట, ఉరదాళ్లపాలెం, అత్తిలి, పాలి, కొమ్మర, కంచుమర్రు, ఈడూరు, ఆరవల్లి, లక్ష్మీనారాయణపురం గ్రామాల్లోని పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న 18 గదులను పూర్తిచేసేందుకు రూ.2.20 కోట్లు, అత్తిలిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల 14 గదుల నిర్మాణానికి రూ.1.53 కోట్లు అంచనాలు సమర్పించినట్లు ఎస్ఎస్ఏ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

(c) eenadu

ఈనాడు
వైఎస్సార్ కడప
సోమవారం డిసెంబరు 22, 2025 5

రామయ్య క్షేత్రం.. ఆధ్యాత్మిక శోభితం

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయం ఆధ్యాత్మిక శోభితమై ప్రకాశించింది. పవిత్ర ధనుర్మాసాన్ని పురస్కరించుకుని అధ్యయనోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. రంగమండపంలో సీతారామలక్ష్మణమూర్తులను పట్టువస్త్రాలు, పుష్పమాలికలు, ముత్యపు ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేద పండితులు పారాయణం చేశారు. రాములోరి దర్శనానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఇష్టదైవాన్ని దర్శించి ఆధ్యాత్మిక దివ్యానుభూతి పొందారు. అర్చకులు ఎ.శ్రావణ్‌కుమార్, వీణా రాఘవాచార్యులు పాల్గొన్నారు.

శబరిమలకు రెండు రైళ్లు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : అయ్యప్ప స్వామి దర్శనార్థం జిల్లా కడప రైల్వేస్టేషన్ మీదుగా ఒక రెగ్యులర్ ట్రైన్, ప్రత్యేక వారాంతపు రైలును నడుపుతున్నారు. ● కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ (16381) రైలు రోజూ పుణె నుంచి బయలుదేరి ఉమ్మడి కడప జిల్లాలోని కొండాపురం, ఎర్రగుంట్ల, కడప, నందలూరు, రాజంపేట, కోడూరులలో ఆగుతుంది. కడప నుంచి కొట్టాయం వెళ్లేందుకు స్లీపర్ తరగతిలో రూ.455 ఛార్జి చేస్తున్నారు. ఈ రైలు కొండాపురానికి ఉదయం 11.22 గంటలకు, ఎర్రగుంట్లకు 11.54, కడపకు మధ్యాహ్నం 12.23కు, నందలూరు 12.49, రాజంపేటకు 12.59, కోడూరు 1.29 గంటలకు చేరుకుని ఎర్నాకులం మీదుగా కొట్టాయానికి మరుసటి రోజు ఉదయం 5.10 గంటలకు చేరుతుంది. ● మచిలీపట్నం నుంచి కొల్లాంకు కడప మీదుగా ప్రత్యేక రైలును జనవరి 9, 16 తేదీల్లో నడుపనున్నారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మచిలీపట్నంలో (07103) బయలుదేరి బనగానపల్లె మీదుగా అదే రోజు రాత్రి 11 గంటలకు ప్రొద్దుటూరుకు, 11.30కు ఎర్రగుంట్లకు, 12.10 గంటలకు కడపకు, అర్ధరాత్రి ఒంటిగంటకు రాజంపేటకు చేరుతుంది. ఎర్నాకులం మీదుగా కొట్టాయంకు శనివారం 6.37 గంటలకు, కొల్లాంకు అదేరోజు రాత్రి 10 గంటలకు రైలు చేరుకోనుంది. కడప నుంచి కొట్టాయంకు స్లీపర్ తరగతికి రూ.575 ఛార్జి చేస్తున్నారు.

ప్రకృతి రమణీయం గండికోట సొంతం

◆ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని వినతి
◆ కేరళ తరహా బోటులో వసతికి అనుకూలం



రెండు కొండల మధ్య నిర్మించిన గండికోట జలాశయం

కొండాపురం, న్యూస్‌టుడే: జిల్లాలోనే అతిపెద్ద జలాశయం.. సాగునీటి పెద్దదిక్కు.. గండికోట. 26.85 టీఎంసీల నీరు నిల్వ చేసేలా ఈ జలాశయాన్ని నిర్మించారు. ఈ ప్రాజెక్టులో మూడు నదుల నీరు చేరుతుండటంతో 'త్రివేణి సంగమం'గా మారింది. పెన్నా, చిత్రావతి, కృష్ణా జలాల కలయికతో ప్రసిద్ధి పొందుతోంది. సాగునీటికి గండికోట ఆయువుపట్టుగా మారడంతో పాటు, మత్స్యకారులకు కాసులు కురిపిస్తోంది. పర్యాటకంగానూ అనేక ప్రత్యేకతల సమాహారంగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ప్రభుత్వం స్పందించి బ్యాక్ వాటర్‌లో పర్యాటకుల కోసం కేరళ తరహా విలాసవంతమైన పడవలు (అల్ట్రా లగ్జరీ బోట్లు) ఏర్పాటు చేయడానికి అనుకూలమైన ప్రదేశం.
● విజన్ 2047లో భాగంగా జిల్లాను టూరిజం హబ్‌గా మార్చడానికి అధికారులు వివిధ రకాల ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఇప్పటికే గండికోట పర్యాటకంగా ప్రసిద్ధి పొందగా అందుకు అనుబంధంగా ఇంకా ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్న దిశగా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందటంతో పాటు ఉపాధి, ఆదాయ మార్గాలు పెంచడానికి పలు మార్పులకు శ్రీకారం చుట్టింది.

ప్రకృతి సోయగాల సంగమం

● రెండు కొండల మధ్య నిర్మితమైన గండికోట ప్రాజెక్టు అందాలు పర్యాటకుల మనసును కట్టి పడేస్తున్నాయి. గండికోట సొరంగం ద్వారా కృష్ణా జలాలు ప్రాజెక్టు వైపు పరుగులిడే సమయంలో ఎన్నో అందాలు ఆకట్టుకుంటాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో సూర్యోదయం, సూర్యాస్తమయం అద్భుత సుందర దృశ్యాలు. ● కడప-తాడిపత్రి జాతీయ రహదారిలోని కొండాపురం గ్రామం కేంద్రంగా కనుచూపుమేర గండికోట వెనుక జలాలు కనిపిస్తుంటాయి. ఈ మార్గంలో రోడ్డు, రైల్వే మార్గాల ద్వారా ప్రయాణం చేసే వారికి ఆ నీటి సవ్వడుల్లో ఎన్నెన్నో అందాలు కనువిందు చేస్తుంటాయి. ● గండికోట ప్రాజెక్టు నుంచి పెన్నాలోయ మీదుగా మైలవరం జలాశయం వరకు సుమారు 12 కిలోమీటర్ల దూరం బోటు షికారు ఏర్పాటు చేస్తే ప్రకృతి సౌందర్యాన్ని, ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదించవచ్చు. ● గండికోట వెనుక జలాల్లో సాయం సంధ్య వేళ భానుడి లేలేత కిరణాలు మధురానుభూతిని పంచుతాయి. ప్రాజెక్టు వద్ద పర్యాటకులు సేద తీరడానికి ఉద్యానవనం (పార్కు) తదితర వాటిని ఏర్పాటు చేస్తే మరింత అభివృద్ధి చెందుతుంది. ● చిత్రావతి, పెన్నా, కృష్ణా జలాలు కలుస్తుండటంతో ఇక్కడ ప్రత్యేక మెట్లు నిర్మిస్తే పుణ్య స్నానాలకు వచ్చే వారికి అనుకూలంగా ఉంటుంది. ● గండికోట, మైలవరం జలాశయాల్లో కేరళ తరహా లగ్జరీ బోట్లలో విడిది ఏర్పాటు చేస్తే నీటి మధ్యనే రోజంతా ప్రకృతిని ఆస్వాదించడంతో పాటు ఇక్కడ లభించే అరుదైన జల చరాలతో పర్యాటకుల జిహ్వ చాపల్యాన్ని తీరుస్తుంది.

ఈనాడు మెగా క్రికెట్ టోర్నీకి సై

నేటి నుంచి పోటీలు ప్రారంభం

కడప క్రీడలు, న్యూస్‌టుడే : ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రెజెంట్స్ ఈనాడు స్పోర్ట్స్ లీగ్-2025 జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు కడప నగర శివార్లలోని కేఎస్ఆర్ఎం, కేవోఆర్ఎం క్రికెట్ మైదానాలు వేదికగా ప్రారంభం కానున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు 'ఈఎస్ఎల్' వేదిగా నిలుస్తోంది. ఇప్పటికే అతిపెద్ద టోర్నీగా 'గిన్నిస్ రికార్డ్స్'లో చోటు సంపాదించిన మెగా ఈవెంట్‌లో భాగస్వాములయ్యేందుకు వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన యువ, మహిళా క్రికెటర్లు తమ సత్తాను చాటుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో ప్రతిభ చూపి ప్రత్యర్థులపై పైచేయి సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. నాకౌట్ పద్ధతిలో ఈ నెల 22 నుంచి జనవరి 6వ తేదీ వరకు జిల్లాస్థాయిలో క్రికెట్ సమరం జరగనుంది.

నేటి మ్యాచ్‌లు (22-12-2025)

సీనియర్స్ మెన్స్ (KSRM Ground)
ఫాతిమా మెడికల్ కాలేజీ, కడప x ఎస్వీ డిగ్రీ కళాశాల, కడప 8.00 A.M.
సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల, జమ్మలమడుగు x SDHR డిగ్రీ కళాశాల, రాయచోటి, 10.00 A.M.
శ్రీ జ్ఞానాంబికా డిగ్రీ కళాశాల, మదనపల్లి x అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల, రాజంపేట. 1.00 P.M.

ఉమెన్స్ (KORM Ground)
SRIT ఇంజినీరింగ్ కళాశాల, ప్రొద్దుటూరు x KSRM ఇంజినీరింగ్ కళాశాల, కడప. 8.00 A.M.
KORM ఇంజినీరింగ్ కళాశాల, కడప x SBSYM డిగ్రీ కళాశాల, మైదుకూరు. 10.00 A.M.
SRIT డిప్లొమా కళాశాల, ప్రొద్దుటూరు x SBSYM జూనియర్ కళాశాల, మైదుకూరు. 1.00 P.M.

Title Sponsor: Dhanik Bharat Educational Institutions — The Lloyd Group Initiative —
Protein Partner: నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (Non-Govt. Public Charitable Trust)
Beverage Partner: CMR SHOPPING MALL The joy of life
Regional Sponsor: MITS DEEMED TO BE UNIVERSITY MADANAPALLE INSTITUTE OF TECHNOLOGY & SCIENCE
Gift Partner: KL (DEEMED TO BE UNIVERSITY)
Digital Partner: ఈనాడు.నెట్, ETV BHARAT
TV Partner: ETV ఆంధ్రప్రదేశ్
Organised by ఈనాడు

వ్యక్తులుగా వెళ్తున్నారు.. శక్తులుగా తిరిగొస్తారు

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు ఆదివారం కడప పోలీసు మైదానం నుంచి శిక్షణకు బయలుదేరి వెళ్లారు. మహిళా అభ్యర్థులను ఒంగోలు పీటీసీ, పురుష అభ్యర్థులను తిరుపతి కల్యాణీ డ్యాం కేంద్రానికి పంపించారు. ఈ శిక్షణ తొమ్మిది నెలల పాటు ఉంటుంది. అభ్యర్థులు లగేజీతో సహా బయలుదేరి వెళ్లారు. వీరందరినీ ప్రత్యేక బస్సుల్లో పంపించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులు వారికి పలు సూచనలు జారీ చేశారు. శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణా కాలంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. జిల్లా పేరును నిలబెట్టాలని కోరారు. జిల్లా నుంచి సుమారు 311 మంది అభ్యర్థులు వెళ్లారు.
● **అనంత వాసులు కడపలో..** కడప శివారులోని పోలీసు శిక్షణా కేంద్రంలో సోమవారం నుంచి అనంతపురం జిల్లా అభ్యర్థులకు కానిస్టేబుల్ శిక్షణ ప్రారంభమవుతుంది. ఈ మేరకు పోలీసు అధికారులు శిక్షణకు సంబంధించి అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశారు. ఉదయం కల్లా అభ్యర్థులు శిక్షణా కేంద్రానికి చేరుకుంటారు. అభ్యర్థులను ఉద్దేశిస్తూ ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వారికి దిశదశా నిర్దేశిస్తారు.

పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికై శిక్షణ నిమిత్తం వెళ్తున్న అభ్యర్థులు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: కడప కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు సభాభవనంలో జరిగే కార్యక్రమానికి జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు ఉంటుందన్నారు. సుదూర ప్రాంతాల నుంచి రాలేని వారు 08562-244437 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు చెప్పుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు.

లంకమల.. అరుదైన పక్షుల కళ



లంకమల అభయారణ్యం అరుదైన, అపురూపమైన పక్షులకు ఆలవాలం. ఇక్కడ జీవ వైవిధ్యం చూస్తే భళా అనాల్సిందే. విభిన్నమైన 113 రకాల పక్షి జాతులకు ఆవాస కేంద్రం. ఇక్కడి అనుకూలమైన వాతావరణం విహంగాలకు వరప్రసాదంగా మారింది. అరుదైన ఎన్నో రకాల రంగు రంగుల పక్షులు ఈ ప్రాంతానికి వన్నె తీసుకొస్తున్నాయి. ఈ ప్రదేశం పక్షులకు స్వేచ్ఛగా విహరించడానికి అనుకూలమని అటవీ శాఖ విశ్రాంత క్షేత్రాధికారి మహమ్మద్ హయాత్ తెలిపారు. **- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట, సిద్దవటం**

విధేయతకు తెదేపా పట్టం

◆ కడప పార్లమెంట్ అధ్యక్షుడిగా భూపేష్
◆ ప్రధాన కార్యదర్శిగా వై.ఎస్.జబీవుల్లా

భూపేష్‌రెడ్డి.. జబీవుల్లా

ఈనాడు, కడప : తెదేపా కడప పార్లమెంట్ అధ్యక్షుడిగా చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి (భూపేష్‌రెడ్డి)ని నియమిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన కార్యదర్శిగా ప్రొద్దుటూరుకు చెందిన వై.ఎస్.జబీవుల్లాను నియమించింది. జిల్లాలో బలమైన సామాజిక వర్గానికి చెందిన భూపేష్‌రెడ్డి పార్టీకి విధేయుడిగా ముద్ర వేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ మనసును చూరగొన్న వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. జమ్మలమడుగులో పార్టీని బలోపేతం చేసిన భూపేష్‌రెడ్డిని కాదని పొత్తులో భాగంగా గత సాధారణ ఎన్నికల్లో భాజపాకు సీటు కేటాయించాల్సి వచ్చింది. ఆయన బాబాయ్ ఆదినారాయణరెడ్డి జమ్మలమడుగు నుంచి భాజపా అభ్యర్థిగా పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఈ విజయంలో భూపేష్ పాత్ర కీలకంగా ఉంది. యువతకు ప్రాధాన్యం ఇవ్వాలనే ప్రయత్నంలో భాగంగా పార్టీ ఆయనకు అవకాశం ఇచ్చింది. సౌమ్యుడు, వివాదరహితుడిగా పేరు తెచ్చుకున్న భూపేష్‌రెడ్డి చిన్న వయస్సులోనే జిల్లా అధ్యక్ష పదవి వరించింది. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన శ్రీనివాసులరెడ్డికి మరింత ఉన్నత పదవి ఇవ్వాలని పార్టీ భావిస్తున్నట్లుగా ఉంది. భూపేష్‌రెడ్డికి పార్లమెంట్ అధ్యక్ష బాధ్యతలు అప్పగింతపై జిల్లా నేతల్లో సానుకూలత వ్యక్తమవుతోంది. జమ్మలమడుగు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్నారు. కడపలోని పార్టీ కార్యాలయం నుంచి బాధ్యతలు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ కార్యాలయానికి స్థలాన్ని కేటాయించారు. ఇందులో పార్టీ కార్యాలయం నిర్మాణానికి వీలుగా అక్కడే ఉన్న తాత్కాలిక కార్యాలయం వేదికగా కార్యకలాపాలు నిర్వహించాలని భావిస్తున్నారు.

మైనార్టీలకు పెద్దపేట

పార్లమెంట్ స్థానంలో మైనార్టీ ఓటర్లు అధికంగా ఉండటం, ఆ వర్గం నుంచి పార్టీ మద్దతు పెరుగుతోందనే అంచనాతో మరో కీలకమైన ప్రధాన కార్యదర్శి పదవి జబీవుల్లాకు అప్పగించారు. ప్రొద్దుటూరుకు చెందిన మైనార్టీ నాయకుడిగా బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ పదవుల కోసం నేతలు పోటీపడుతున్నారు. ఈ కార్యవర్గం కూర్పు భూపేష్‌రెడ్డికి క్లిష్టంగా ఉండనుంది. మరోవైపు భూపేష్‌రెడ్డికి కీలక పదవి వరించడంతో పార్టీ శ్రేణులు జమ్మలమడుగులో భారీ ర్యాలీకి శ్రీకారం చుట్టారు.

140 ఏళ్లు.. తరగని చర్చి వన్నెలు

రైల్వేకోడూరు పట్టణంలోని టోల్‌గేట్ వద్ద ఉన్న దక్షిణాంధ్ర లూథరన్ చర్చి జిల్లాలో అందమైన నిర్మాణాల్లో ఒకటి. ఈ చర్చిని 1882లో ప్రారంభించి 1884లో పూర్తి చేశారు. అప్పటి బ్రిటీష్ పాలనలో జర్మన్ మిషనరీలకు చెందిన హెన్రీ మేయర్ అనే ఆయన ఈ చర్చిని నిర్మించినట్లు క్రైస్తవ మత పెద్దలు చెబుతుంటారు. ఇప్పటికి 140 సంవత్సరాలు పూర్తవుతున్నా ఎక్కడా చెక్కు చెదరని నిర్మాణంగా నిలుస్తూ నిరంతరం క్రీస్తు ప్రార్థనలకు నెలవై ఉంది. ఈ నెల 25న క్రిస్మస్ వేడుకలకు ముస్తాబవుతోంది. **- న్యూస్‌టుడే, రైల్వేకోడూరు**

పల్లెసీమలకు ప్రగతి పద్దు

జిల్లాకు రూ.28.62 కోట్లు రాక

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: దేశానికి పట్టుగొమ్మలైన పల్లెసీమల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రగతి పద్దు కేటాయించింది. మొన్నటి దాకా గల్లాపెట్టె ఖాళీ కావడంతో నిధుల కోసం పంచాయతీల ప్రథమ పౌరులు, అధికారులు దిక్కులు చూడాల్సి వచ్చింది. ఎట్టకేలకు ఖజానాకు కాసుల రావడంతో సర్పంచులు ఊరట చెందుతున్నారు. మౌలిక వసతుల కల్పనకు మార్గం సుగమమైంది. గత వైకాపా పాలనలో గ్రామసభల్లో ఎలాంటి తీర్మానం తీసుకోకుండానే అడ్డగోలుగా ఇతర అవసరాల నిమిత్తం వినియోగించారు. రూకల్లేవని సర్పంచులు భిక్షాటన చేసి నిరసన చేశారు. అయినా గత ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లింది. కేంద్రం, కూటమి ప్రభుత్వాలు ఈ సమస్యను గుర్తించాయి. నేరుగా పబ్లిక్ ఫైనాన్సియల్ మేనేజ్‌మెంట్ సిస్టం (పీఎఫ్ఎంఎస్) ద్వారా ఖాతాలకు సర్దుబాటు చేస్తున్నారు.
● జిల్లాలో గ్రామ పంచాయతీలు 557 ఉన్నాయి. ఎన్నికలు జరగని నాలుగింటికి ఎలాంటి పద్దు కేటాయించలేదు. మిగతా 553 పంచాయతీలకు 2011 జనాభా గణనను పరిగణనలోకి తీసుకొని జిల్లాకు 2025-26 సంవత్సరానికిగాను 15వ ఆర్థిక సంఘం తొలి విడతలో బేసిక్ (అన్‌టైడ్), టైడ్ విభాగంలో రూ.28,62,50,485 కేటాయించారు. రెండు రోజుల కిందట పంచాయతీల ఖాతాల్లోకి జమ చేశారు.

కొత్తమాధవరం గ్రామ ముఖ చిత్రం

నాడన్నీ మళ్లింపులే : గత వైకాపా పాలనలో సర్పంచుల ఆమోదం లేకుండా ఇష్టారాజ్యంగా నిధులు కరెంటు ఛార్జీలకు మళ్లించారు. పల్లె ప్రథమ పౌరుల విన్నపాలను అసలు ఆలకించలేదు. వాస్తవంగా 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామసభలో తీర్మానం, ఆమోదం చేశాక వినియోగించాలి. ఈ ప్రాథమిక సూత్రాన్ని నాటి సీఎం జగన్‌రెడ్డి ఏమాత్రం పట్టించుకోలేదు. గల్లాపెట్టె ఖాళీ చేయడంతో కనీసం సున్నం, బ్లీచింగ్ పౌడిని కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. తాగునీటి ట్యాంకుల శుభ్రత చేయలేదు. మోటార్లు కాలిపోతే మరమ్మతుల్లో అంతులేని జాప్యం జరిగేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

● పీఎఫ్ఎంఎస్ విధానాన్ని అమలు చేయాలని కూటమి సర్కారు నిర్ణయించింది. సర్పంచి అనుమతి లేకుండా పద్దును మళ్లించే వీల్లేకుండా చేశారు. తొలివిడత పద్దు రావడంతో సర్పంచులు కూడా ఊరట చెందుతున్నారు. పారిశుద్ధ్యం మెరుగుపడనుంది. దోమల ఉత్పత్తి ప్రదేశాల్లో ఫాగింగ్ చేసుకోవచ్చు. వెలగని, పనిచేయని వీధి దీపాలకు మరమ్మతులు చేయవచ్చు. మురుగు పారుదల కాలువల్లో పూడిక తీయవచ్చు. భూతల, భూ ఉపరితల జలాశయాలను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవడానికి అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నాయి.

15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు ఇలా	మొత్తం పంచాయతీలు	నిధులు వచ్చినవి		
	557	553	బేసిక్	11,45,00,200
			టైడ్	17,17,50,285
			మొత్తం(రూపాయల్లో)	28,62,50,485

మదనపల్లెలో టమాట కిలో రూ.52

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: మదనపల్లె మార్కెట్‌లో ఆదివారం టమాట అత్యల్పంగా కిలో రూ.30 నుంచి అత్యధికంగా రూ.52 వరకు పలికింది. దిగుబడులు తగ్గటంతో బయట మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దీంతో పాటు దేశవ్యాప్తంగా శీతోష్ణస్థితి పెరుగుతోంది. దీంతో పంట దిగుబడి బయట రాష్ట్రాల్లో తగ్గింది. దీంతో పాటు మదనపల్లె మార్కెట్ కూడా అన్‌సీజన్ కావడంతో మార్కెట్లకు తక్కువగా కాయలు వస్తున్నాయి. క్రిస్మస్, సంక్రాంతి పండగలు సమీపిస్తున్నాయి. డిమాండ్ కూడా పెరుగుతుంది. ఆదివారం మదనపల్లె మార్కెట్‌కు 97 టన్నులు మాత్రమే రైతులు టమాటను తీసుకొచ్చారు.

ములకలచెరువు టు అండమాన్ నికోబార్

టమాటాల ఎగుమతితో రైతులకు లాభాలు

ములకలచెరువు, న్యూస్‌టుడే : జిల్లా నుంచి అండమాన్ నికోబార్ దీవులకు టమాటాలు ఎగుమతి అవుతున్నాయి. అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో పండించిన టమాటాలకు అక్కడ మంచి డిమాండు ఉంది. నవంబరుతో పాటు డిసెంబరు మొదటి వారంలో ధరలు పతనం కావడంతో అన్నదాతలు దిగాలు చెందారు. తాజాగా ఓ వ్యాపారి అండమాన్ నికోబార్ దీవులకు ఎగుమతి చేసేందుకు రైతుల నుంచి పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తుండటంతో లాభాలు పొందుతున్నారు.
● పీలేరుకు చెందిన రైతు రాంబాబు 700 బాక్సులు, అన్నమయ్య జిల్లా ములకలచెరువుకు కిలోమీటరు దూరంలో ఉన్న శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం యర్రబల్లికి చెందిన రైతు సిద్ధారెడ్డి 400 బాక్సులు అండమాన్‌కు ఎగుమతి చేశారు. చాలా మంది రైతులు కూడా ఎగుమతి బాటే పట్టారు.

టమాటాలు గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఖర్చులన్నీ వ్యాపారివే : టమాట పంట కోత దశకు వచ్చే సమయానికి ధరలు పతనమవడంతో దిగాలు చెందిన అన్నదాతలు కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన వ్యాపారిని ఆశ్రయించారు. ఆయన పంటను పరిశీలించి ఊజీ, మచ్చలు లేని తోటలను పరిశీలించి ఎంపిక చేసుకుంటున్నారు. నాణ్యమైన కాయలు కాసిన పంటను వాటిని ఎంపిక చేసుకుని పొలం వద్దే కొనుగోలు చేస్తున్నారు. కాయల కోత, రవాణా తదితర వాటి ఖర్చులన్నీ ఆ వ్యాపారే భరిస్తుండటంతో రైతులకు ఎలాంటి భారం లేదు. సేకరించిన మేలు రకం టమాటాలను చెన్నై ఓడ రేవుకు తరలించి.. అక్కడ్నుంచి అండమాన్ నికోబార్ దీవులకు రవాణా చేస్తున్నారు. పంట దిగుమతులు అండమాన్ నికోబార్ దీవులకు చేరాలంటే వారం రోజుల సమయం పడుతుంది. ఈ రకం టమాట ఎనిమిది రోజులైనా తాజాగా ఉంటోంది. జిల్లా నుంచి గత ఏడాది అండమాన్‌కు పంట ఉత్పత్తులు ఎగుమతి చేయగా.. ఈ ఏడాది శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం నుంచి వెళ్లడం మొట్టమొదటి సారి.

● **ఇక్కడ రూ.750.. అక్కడ రూ.1100 :** ములకలచెరువు టమాట మార్కెట్‌కు తరలిస్తే రైతులు కూలీ, కమిషన్, రవాణా ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే అండమాన్ దీవులకు ఎగుమతి చేస్తుండడంతో వ్యాపారులే పంట కోత, రవాణా ఖర్చులు చెల్లిస్తున్నారు. దీంతో రైతుకు ఊరట లభించింది. స్థానికంగా తోటల వద్ద 25 కిలోల బాక్సు ధర రూ.750 చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అండమాన్ దీవులలో 25 కిలోల బాక్సు ధర రూ.1100లకు విక్రయిస్తున్నట్లు వ్యాపారి చెప్పారు.

డయల్ యువర్ సీఎండీ నేడు రద్దు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: వినియోగదారుల సమస్యలు పరిష్కారం కోసం ప్రతి సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు విద్యుత్తు సంస్థ సీఎండీ శివశంకర్ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి రవికుమార్ తిరుపతి పర్యటన కారణంగా రద్దు చేశామన్నారు.

ఆయుర్వేద ఆసుపత్రికి మహర్దశ

భవనాలకు రూ.30 లక్షలు కేటాయింపు

జమ్మలమడుగులో శిథిలావస్థకు చేరిన భవనంలో కొనసాగుతున్న ఆయుర్వేద ఆసుపత్రి

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: ఎన్నో ఏళ్ల సమస్యకు కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపింది. శిథిలావస్థకు చేరిన ఆయుర్వేద వైద్యశాల నూతన భవనాలకు రూ.30 లక్షలు కేటాయించింది. సుమారు 17 ఏళ్లుగా ఎంపీడీవో కార్యాలయ రోడ్డులో జమ్మలమడుగు అభివృద్ధి కమిటీ నిర్మించిన భవనంలో ఆయుర్వేద ఆసుపత్రి కొనసాగుతోంది. ఆరేడేళ్ల నుంచి భవనం శిథిలావస్థకు చేరడంతో విధుల నిర్వహణకు ఆటంకం ఏర్పడేది. పెచ్చులూడిపోయి పైకప్పు ప్రమాదకరంగా మారింది. జమ్మలమడుగుతో పాటు మైలవరం, పెద్దముడియం మండలాలకు చెందిన ప్రజలు చికిత్సకు ఇక్కడికే వస్తుంటారు. దాదాపు 40 రకాల రోగాలకు మందులు అందుబాటులో ఉండడంతో బాధితుల సంఖ్య పెరుగుతోంది. రోజూ సుమారు 50 మంది వరకు రోగులు వచ్చి వెళ్తుంటారు. ఇటీవల కాలంలో ఈనాడులోనూ వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన కూటమి ప్రభుత్వం నూతన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. త్వరలో పనులు ప్రారంభించే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు.



(c) eenadu

వడ్డే ఓబన్న త్యాగాలు స్ఫూర్తిదాయకం

వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: తెలుగు ప్రజా సాహిత్యంలో సాధారణ ప్రజలజీవితాలు, కష్టాలు, అన్యాయాలపై, కుల వివక్షపై పద్యాలు, పాటల రూపంలో చైతన్యం కల్పించిన మహనీయుడు వడ్డే ఓబన్న అని కడప ఎమ్మెల్యే మాధవి, తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కడపలోని రాజంపేట బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన వడ్డే ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సమాజాభివృద్ధికి ఓబన్న త్యాగాలు స్ఫూర్తిదాయకమన్నారు. బీసీలకు తెదేపా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ శత వసంతాల ఉత్సవాలు ప్రారంభం

సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్ర, నాయకులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: స్థానిక మృత్యుంజయకుంటలో సీపీఐ శత వసంత ఉత్సవాలు ఆదివారం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్ర ప్రారంభించారు. అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్ర మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా భారతదేశంలో సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పిలుపునిచ్చిన ఏకైక పార్టీ సీపీఐ అని స్పష్టం చేశారు. దేశంలో వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీలు కాంగ్రెస్, సీపీఐ మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటశివ, శంకర్‌నాయక్, బ్రహ్మం, మల్లికార్జున, సుబ్బరాయుడు, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చరిత్రకారుడికి సత్కారం

బొమ్మిశెట్టి రమేష్‌ను సత్కరిస్తున్న స్వర్ణ భారత్ ట్రస్ట్ దీపా వెంకట్

మారుతీనగర్, న్యూస్‌టుడే: మైదుకూరుకు చెందిన చరిత్రకారుడు, రచయిత బొమ్మిశెట్టి రమేష్‌ను స్వర్ణ భారత్ ట్రస్ట్ దీపా వెంకట్ సన్మానించారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం జరిగిన కడప జిల్లా శాసన ప్రతిరూప ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా సత్కరించారు. జానమద్ది సాహితీపీఠం నిర్వాహకులు జానమద్ది విజయభాస్కర్, అధికార భాషా సంఘం అధ్యక్షుడు త్రివిక్రమరావు, వైవీయూ వీసీ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు పక్కాగా శిక్షణ

సిద్దవటం, న్యూస్‌టుడే: శిక్షణకు వచ్చిన ఏపీఎస్పీ శిక్షణ పోలీసులకు పక్కాగా శిక్షణ ఇవ్వనున్నట్లు బెటాలియన్ కమాండెంటు ఆనంద్‌రెడ్డి తెలిపారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట ఏపీఎస్పీ పదకొండో బెటాలియన్‌లో ఆదివారం శిక్షణకు వచ్చిన వారికి పలు రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంటు మాట్లాడుతూ.. వైఎస్సార్ కడప జిల్లా మినహాయించి మిగిలిన జిల్లాలకు చెందిన 336 మంది శిక్షణ తీసుకునేందుకు వచ్చారని తెలిపారు.

EENADU Classifieds

JOBS

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌ఛార్జిస్, వార్డెన్స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 12000/- నుండి 15000/- వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యా అర్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ. వయస్సు: 22సం||లపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ✆: 92487 33371.

HYD యూనిటీ హోంకేర్‌లో ఏజెంట్లకు అవకాశం. మీరు వర్కర్స్‌ని పంపితే ప్రతినెల 5వేల కమీషన్ వర్కర్ జీ 20k, ఫ్రీ వసతి, ఫుడ్. ✆: 81215 41212.

ప్రముఖ కంపెనీలో టీం లీడర్స్‌గా మదనపల్లి, ప్రొద్దుటూరు ఏరియాలో P/F పనిచేయుటకు M/F కావలెను. Q: డిగ్రీ, MBA, MCA. ✆:94403 51657.

కడపలో డా|| పరమేశ్వరరావు ENT హాస్పిటల్ నందు పనిచేయుటకు ఇద్దరు నర్సులు, కాంపౌండర్స్ మరియు ఇంట్లో పనిచేయుటకు ఇద్దరు ఆడవారు కావలెను. కడప వారికి ప్రాధాన్యత. Cont: 9492410402.

కడప, అప్సర సర్కిల్ మా హోటల్ నందు పనిచేయడానికి టిఫిన్ మాస్టర్ & సర్వింగ్ స్టాఫ్ వెంటనే కావలెను. ✆: 9505522723.

ప్రముఖ కంపెనీలో ఫుడ్ డెలివరీ జాబ్స్, డ్రైవర్స్ కార్ & బైక్ నడుపుటకు అర్జెంటుగా కావలెను. Ph: 89786 70153.

FACULTY/ TEACHERS

Wanted Teachers, Watchman (Husband & Wife), Caretakers for Hostel. Teachers for Pre-Primary, Primary and High School for a School in Kadapa. Wardens for Hostel, PET, Music Teacher. For details Contact: 9963970766.

Wanted Physical Science teacher to teach upto 10th (IIT also) EXP. Min. 3 Years. Send Resumes to Whatsapp 9441011084. UshaKiran High School, Vempalli, Kadapa Dist.

ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
రూ|| 350/- మాత్రమే
Contact:
KDP: 9989997626
8008514248
PDTR: 8008597620
ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

యువ పథం.. సమాజ హితం

- దీర్ఘకాలిక సమస్యలపై విద్యార్థుల ఆరా
- ప్రజా చైతన్యం దిశగా అవగాహన కార్యక్రమాలు

–న్యూస్‌టుడే, చాపాడు

మనిషి జీవనశైలిలో ఆర్థిక అవసరత ఒక్కటే కాదు.. అన్ని రకాల అభివృద్ధి, భావితరాల భవిష్యత్తుకు మనుగడ సాగించాలంటున్నారు ఆ విద్యార్థులు. విషయ పరిజ్ఞానంతోపాటు క్షేత్ర స్థాయిలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సంబంధిత శాఖ ప్రభుత్వాధికారులతో చర్చించారు. సీబీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులు ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్‌లో భాగంగా క్షేత్రస్థాయిలో పర్యటించారు. పలు సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు.

జూదాలు వద్దు.. ఆర్థిక ప్రణాళిక ముద్దు

త్వరగా డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో చాలా మంది జూదాలకు అలవాటుపడుతూ నష్టాలతో ఆత్మహత్యలకు ప్రేరేపితులవుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రాథమిక విద్యాభ్యాసం నుంచే క్రమశిక్షణ, పొదుపుపై అవగాహన పెంచాలి. పబ్లిక్ డిపాజిట్స్, జీవితా బీమా, మ్యూచువల్ ఫండ్స్ వంటి ఆర్థిక సంస్థలపై వివరించాలి. వ్యాపారాలు, పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవాలి. అనారోగ్యం, ప్రమాదాలు సంభవించినప్పుడు ఇబ్బందుల్లేకుండా ఆర్థిక ప్రణాళిక కోసం 'బ్యాన్ బెట్టింగ్ - స్టార్ట్ ఇన్వెస్ట్‌మెంట్' అవసరమని హరిచందన, హర్షిత, కరిష్మ, లిఖిత చెబుతున్నారు.

రైలు ప్రయాణికుడితో మాట్లాడుతున్న విద్యార్థులు

రైలు ప్రయాణికులకు భద్రత

ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ నుంచి చుట్టుపక్కల ప్రాంతాలకెళ్లే ప్రయాణికులు రాత్రివేళ ఎదుర్కొనే కష్టాలు చాలా ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి స్టేషనుకు రాగానే ప్రైవేటు వాహనాల్లో ఇరుకుగా ప్రయాణించి అవస్థలు పడుతున్నారు. సురక్షితంగా ఇళ్లకు చేరుకునేందుకు రైల్వే, ఆర్టీసీ అధికారులు చొరవ చూపేలా చేశారు. రైలు వచ్చే సమయానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకున్నారు లలిత్‌కుమార్, సురేష్‌రెడ్డి, రాహుల్, హరీష్.

పోలీసు అధికారి నుంచి వివరాలు సేకరిస్తున్న విద్యార్థినులు

పనిలో నైపుణ్యాలుంటే మేలు

యువత నిరుద్యోగంతో సతమతమవ్వాల్సిన అవసరం లేదు. మనం ఏ పని చేస్తున్నా అందులో నైపుణ్యాలుంటే చాలని చెబుతున్నారు హితైష్ణి, శిరీష, స్నేహ. మార్కులు, ఉద్యోగం కోసం బలవంతపు చదువులొద్దు. చేతి, కుల వృత్తులపై మమకారం పెంచుకుంటే, అందులో రాణించి ప్రయోజకులు కావొచ్చని యువతకు సూచిస్తున్నారు.

నీటి సమస్య పరిష్కారానికి కృషి

ఎర్రగుంట్ల పురపాలక పరిధిలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని 'ఈటీవీ' కథనం ఆధారంగా స్థానిక గృహిణులతో చర్చించారు. మూడు రోజులకు ఒకసారి వచ్చేవని తెలుసుకుని స్థానిక కమిషనరు దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కరించేలా చేశారు లోహిత, నేహా, సుమిత్ర, గౌతమి.

ప్రవేశ పరీక్షతో ఉజ్వల భవిత

కడప విద్య, న్యూస్‌టుడే: కేంద్ర విశ్వవిద్యాలయాల ఉమ్మడి ప్రవేశ పరీక్ష(సీయూఈటీ) ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని ప్రభుత్వ కళాశాలల (ఉన్నత విద్య) ఆర్జేడీ డాక్టర్ రవీంద్రనాథ్ అన్నారు. స్థానిక జిల్లా సైన్స్ మ్యూజియంలో ఆదివారం సీయూఈటీ-2026పై అవగాహన కార్యక్రమానికి సంబంధించి కరపత్రాన్ని సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ సీయూఈటీ ఒకే ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాల్లో ప్రవేశం పొందవచ్చన్నారు. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తోందన్నారు. కోటిరెడ్డి మహిళా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సలీంబాషా మాట్లాడుతూ ఈ పరీక్ష దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరికీ సమాన ప్రవేశ అవకాశాలు అందిస్తుందన్నారు. ప్రవేశ పరీక్ష ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభమైందని జనవరి 14వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. విద్యా భారతి జిల్లా బాధ్యులు డాక్టర్ బయపురెడ్డి మాట్లాడుతూ పరీక్ష విధానంపై అవగాహన కల్పించేందుకు సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప, విద్యాభారతి ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఆన్‌లైన్‌లో వెబినార్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, సావిత్రి, రెహమాన్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్జేడీ రవీంద్రనాథ్, తదితరులు

డిమాండ్ల సాధనకు రాజీలేని పోరాటం సాగిస్తాం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా ఆర్ఎం స్పందించకపోవడం దారుణమని ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివారెడ్డి పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కడప ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు ఆదివారం 34వ రోజుకు చేరుకున్నాయి. తమ పోరాటం ప్రభుత్వంపై కాదని, కడప ఆర్టీసీ ఆర్ఎంపై అని వివరించారు. చిన్న తప్పిదాలకు ఎలాంటి విచారణ లేకుండా బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. సమావేశంలో ఆర్టీసీ ఎన్ఎంయూ ప్రాంతీయ అధ్యక్షుడు నాగముని, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, జోనల్ నాయకులు జనార్దన్, కోడూరు సుబ్బారావు, ఎస్ఎం.వల్లీ, జయరాం, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం ఎదుట ఎన్ఎంయూ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

క్విజ్ పోటీల్లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: విద్యుత్తు సంస్థ నిర్వహించిన క్విజ్ పోటీల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రశంసించారు. ఇటీవల జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎస్పీడీసీఎల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఆయా జిల్లాల ఎస్ఈ కార్యాలయాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ శివశంకర్, అధికారులు క్విజ్ పోటీలు నిర్వహించారు. జిల్లా నుంచి ఖాజీపేట మండలం ఆదర్శ పాఠశాల విద్యార్థులు జీవీవీ నాగిరెడ్డి, ఇ.నాగరిషిత, ప్రొద్దుటూరు రామేశ్వరం పాఠశాలకు చెందిన వై.ప్రణీత్‌రెడ్డి, ప్రొద్దుటూరు వైవీఎస్ పాఠశాలకు చెందిన వి.వైష్ణవిలు విజేతలుగా నిలిచారు. వీరు మంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందుకున్నారు. కార్యక్రమంలో సీఎండీ శివశంకర్, ఎస్ఈ రమణ, ఈఈ హరి సేవ్యానాయక్, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులతో విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎండీ శివశంకర్, అధికారులు

సంస్కరణల పేరుతో సంక్షోభంలోకి విద్యారంగం

మైదుకూరు, న్యూస్‌టుడే : విద్యారంగ పరిరక్షణ ధ్యేయమని ఒకవైపు చెబుతూనే మరోవైపు ప్రభుత్వ విద్యకు కూటమి ప్రభుత్వం పాతరేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా విమర్శించారు. ఆదివారం మైదుకూరు పట్టణంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అంతకుముందు పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కరణల పేరుతో పాలకులు విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెట్టేస్తున్నారని, విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుంచి క్రమేపీ తప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బోధన సమయాన్ని హరిస్తూ బోధనేతర కార్యక్రమాల్లో భాగస్వాములు చేస్తున్నారని పేర్కొన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం ఛైర్మన్ ఎం.హనుమంతురావు మాట్లాడుతూ 12వ పీఆర్సీ అమలు చేయలేదన్నారు. ఆర్థిక బకాయిల రూ.30 వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఉద్యోగుల విషయంలో మొండిగా వ్యవహరించడం తగదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, యూటీఎఫ్ ప్రతినిధులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్ బాబు, ఎన్.నాగార్జునరెడ్డి, వై.రవికుమార్, డి.సుజాతరాణి పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శన

బద్వేలు, న్యూస్‌టుడే : బద్వేలు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు బి.టోనీవర్థన్, ఎస్.అబ్దుల్ రహమాన్ చేసిన 'క్యూ థియరీ' సైన్సు వైజ్ఞానిక ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపికైంది. ఈ సందర్భంగా హైస్కూల్లో ఆదివారం విద్యార్థులు, ప్రదర్శనకు సహకరించిన టీచర్లు టి.రామకృష్ణ, అక్షయ కుమార్‌లను ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి తదితరులు

మామిడి తోటలో మహిళ హత్య

- నిందితుల కోసం గాలింపు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలోని కోనరాజుపల్లె పంచాయతీ గుంటికాడిపల్లెలో మామిడి తోటలో ఓ మహిళ (40) హత్యకు గురైంది. గుంటికాడిపల్లెకు చెందిన చింతకుంట వెంకటసుబ్బారెడ్డి, రాజారెడ్డి, రమణారెడ్డిలు సమీప బంధువులు కావడంతో ఉమ్మడి వ్యవసాయం చేస్తున్నారు. మామిడి తోటలో కాపలా కోసం నాలుగు రోజుల కిందట భార్యాభర్తలు ఇక్కడికి వచ్చారు. నెలకు రూ.4,000 ఇచ్చేలా, పొలంలో పనిచేసిన రోజు మళ్లీ అదనంగా రూ.500 చెల్లిస్తామని మౌఖికంగా ఒప్పందం చేసుకున్నారు. రోజులాగే కాపలా ఉంటున్న వారి కోసం ఏర్పాటు చేసిన గుడిసె వద్దకు రైతులు వెళ్లారు. అక్కడ పనిలో చేరిన వెంకటరమణ అందుబాటులో లేరు. గుడిసె లోపలికి వెళ్లి చూస్తే మంచంపై మహిళ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు, ఒంటిమిట్ట సీఐ పి.నరసింహరాజు, ఎస్ఐలు శ్రీనివాసులు, మహమ్మద్ రఫీ తమ బృందంతో చేరుకున్నారు. శరీరంపై ఆరు చోట్ల రక్త గాయాలు ఉన్నట్లు గుర్తించి హత్య జరిగినట్లు నిర్ధారించారు. కడప నుంచి క్లూస్ టీం, జాగిలాన్ని రప్పించారు. ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. ఆమెది ఏ గ్రామం, ఎక్కడి నుంచి వచ్చారనేది ఎలాంటి ఆధారాలు దొరకలేదు. హత్య కేసును ఛేదించడానికి నాలుగు బృందాలను నియమించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. హత్యకు గురైన ఆమె ఒంటిపై నూలు పోగు కూడా లేదు. వివిధ కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రాజంపేట మండలం కూచివారిపల్లె నుంచి ఇక్కడికి వచ్చి పనిలో చేరినట్లు చెప్పారని రైతులు చెబుతున్నారు. కొత్త వ్యక్తుల సమాచారం లేకుండా కాపలా కోసం ఎందుకు పెట్టుకున్నారని తోట యజమానులతో పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం కడప సర్వజన ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘటనా స్థలంలో పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, పోలీసులు

చెట్ల నరికివేతపై కొనసాగుతున్న విచారణ

అట్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని దుత్తపాపాయపల్లె నుంచి వేమలూరు వంతెన వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్న సుమారు 48 వేప వృక్షాలను బొగ్గుల వ్యాపారి ఎటువంటి అనుమతులు లేకుండా నరికిన సంఘటనపై అధికారుల విచారణ కొనసాగుతోంది. రెండు రోజుల కిందట చెట్లను కోత యంత్రాల ద్వారా నరికి వేయడంతో వేమలూరు వాసులు ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పోలీసుల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్అండ్‌బీ ఏఈ రాధా రత్నకుమారి, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు నరికిన చెట్లు పట్టా లేక ప్రభుత్వ భూమిలో ఉన్నాయా అని శనివారం సంఘటనా ప్రాంతంలో పరిశీలించారు. సర్వే ఆధారంగా దస్త్రాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ రమణ తెలిపారు.

జాతీయ స్థాయిలో విద్యార్థులు మెరవాలి

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: క్రీడాకారులు జాతీయ స్థాయిలో మెరవాలని అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మార్తల సుధాకర్‌రెడ్డి అన్నారు. బాషా అథ్లెటిక్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఏబీఎంహెచ్ఎస్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అండర్-14, 16 బాలబాలికలకు ఖేలో ఇండియా అస్మితా లీగ్ క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 120 మంది క్రీడాకారులు హాజరవగా పోటీలను ఎస్ఆర్ఐటీ ప్రతినిధి బసిరెడ్డి వీరకల్యాణ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ట్రియాథాన్-ఎ 60 మీ, బి 60 మీ, సి 600 మీ, లాంగ్, హై జంపు, జావెలిన్, డిస్కస్ త్రో, షాట్‌పుట్ పోటీల విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి వై.అహమ్మర్ బాషా, కోచ్ రాజా, పీడీ నాగూర్‌బాషా పాల్గొన్నారు.

షాట్‌పుట్ త్రో చేస్తున్న క్రీడాకారిణి

జూదరుల అరెస్టు.. రూ.1.20 లక్షల స్వాధీనం

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని పద్మశాలీ కల్యాణ మండపం సమీపంలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఒకటో పట్టణ ఠాణా ఎస్.ఐ సంజీవరెడ్డి సిబ్బందితో కలిసి ఆదివారం రాత్రి దాడి చేశారు. ప్రొద్దుటూరుకు చెందిన నాగార్జున, కంబగిరి, సాన శ్రీను, నరసింహులు, గౌస్, రామ్మోహన్‌రెడ్డిలను అరెస్టు చేసి వారి నుంచి రూ.1,20,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. పోసా శ్రీను, గజేంద్ర, నాగరాజు అనే ముగ్గురు పరారైనట్లు తెలిపారు.

అరెస్టు చేసిన జూదరులతో ఎస్.ఐ సంజీవరెడ్డి, సిబ్బంది

ఆధ్యాత్మిక జ్ఞానంతోనే ధర్మానికి రక్షణ

ప్రసంగిస్తున్న చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురియానంద స్వామి

ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

మైదుకూరు, న్యూస్‌టుడే : ప్రాపంచిక జ్ఞానంతోపాటు ఆధ్యాత్మిక జ్ఞానం పెంపొందించుకున్నప్పుడే ధర్మానికి రక్షణ చేకూరుతుందని చిన్మయ మిషన్ అధ్యక్షుడు తురియానంద స్వామి అన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం మైదుకూరు పట్టణం బ్లూబెల్స్ పాఠశాల వద్ద హిందూ సమ్మేళన నిర్వాహక సమితి ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ధర్మ రక్షణ కావాలన్నా, సంస్కృతిని కాపాడుకోవాలన్నా ధర్మాన్ని ఆచరించడమే మార్గమన్నారు. పూర్వీకులు అందించిన గ్రంథాలు, పురాణాలు, ఇతిహాసాలను చదవాలని సూచించారు. నాదేశ వారసత్వ సంపద గర్వకారణమనే ప్రతిజ్ఞ చేయడం కాదని ఆచరణ ముఖ్యమన్నారు. పిల్లలకు ఆధ్యాత్మిక విద్య అవసరమన్నారు. తొలుత పట్టణంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. రాయలకూడలి నుంచి మహిళలతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో మాతృసేవ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి ఓంకార్ రమణస్వామి, ఆర్ఎస్ఎస్ సద్భావ ప్రముఖ్ ఓలేటి సత్యనారాయణ, విరజానంద ఆశ్రమ విద్యా చైతన్యానంద మాత, వైద్యురాలు లలిత, భాజపా నియోజకవర్గ ప్రతినిధి మాచనూరు సుబ్బరాయుడు ప్రసంగించారు. కోలాటంతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న స్థానాల్లో నియామకాలను చేపట్టాలని ఏపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంజా సోమశేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో 15 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా తాత్కాలిక ఉద్యోగులు చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణే భారమై కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గరుడాచలం, సాధారణ కార్యదర్శి సాయికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఏపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి

ఉద్యమాలతోనే ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ

వేంపల్లె, న్యూస్‌టుడే : ఉద్యమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన తరుణం ఆసన్నమైందని ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు నర్రెడ్డి సంగమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలోని ఎస్టీయూ రీజియన్ కార్యాలయంలో ఆదివారం సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శివారెడ్డి, రీజియన్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు గోవిందు, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రసంగిస్తున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వరరెడ్డి

ఐఆర్ ప్రకటించాలని డిమాండ్

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, పీఎస్టీయూ నాయకులు

కడప విద్య, న్యూస్‌టుడే : ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం 12వ కమిషన్ నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. కడప నగరంలో ఆదివారం ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (పీఎస్టీయూ) జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు వీవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. అనంతరం 2026వ సంవత్సరం నూతన కాలమానిని, కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర గౌరవాధ్యక్షులు రెడ్డన్న, ఉపాధ్యక్షులు పురుషోత్తంరెడ్డి, రామాంజనేయరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మునిరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీవీ సుబ్బారెడ్డి, గాజుల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

కడప విద్య, న్యూస్‌టుడే : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పీఆర్సీ కమిటీ వేసి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని బహుజన టీచర్స్ యూనియన్ (బీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మేకల శివార్జున కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేకల శివార్జున మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఐఆర్, పీఆర్సీ కమిటీ వంటి ఆర్థిక విషయాలపై ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగరాజు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు కట్టా గంగాధర్, జిల్లా కార్యదర్శి జయరాం తదితరులు పాల్గొన్నారు.

వీబీ-జీ రామ్ జీతో పేదలకు నష్టం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం స్థానంలో వీబీ-జీ రామ్ జీ చట్టాన్ని తీసుకొస్తే రాయలసీమలో మళ్లీ కరవు వచ్చే అవకాశం ఉందని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (రాకపా) రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. కడప ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకం చట్ట సవరణతో పేద ప్రజలకు తీరని నష్టం కల్గుతుందన్నారు. 2005లో యూపీఏ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురాగా, 2008-09లో ఈ పథకం దేశ వ్యాప్తంగా అమలైందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేసి ఆ స్థానంలో వీబీ- జీ రామ్ జీ చట్టాన్ని తీసుకురావడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆర్సీపీ నాయకులు ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, విజయ్ వెంకటేష్, మునిరెడ్డి తదితరులున్నారు.

మాట్లాడుతున్న రవిశంకర్‌రెడ్డి, పక్కన నాయకులు

(c) eenadu

ఎరక్కపోయి వచ్చింది.. ఇరుక్కుపోయింది

ఇరుక్కుపోయిన భారీ ట్యాంకరు

విజయవాడ-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి తిరుగుతున్న భారీ వాహనాలతో అల్లాడుపల్లె రహదారి ధ్వంసమైంది. దేవళాలు నుంచి ఖాజీపేట మండలం ఏటూరు వరకు రూ.4 కోట్లతో నిర్మించిన తారురోడ్డు రెండేళ్లు గడవకుండానే పనికిరాకుండా పోయింది. ఈ మార్గంలో ప్రయాణం చాలా ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పెద్దపెద్ద గుంతలుపడినా ఆర్‌అండ్‌బీ అధికారులు కనీసం మరమ్మతులు చేసేందుకు పట్టించుకోలేదని వాపోతున్నారు. -న్యూస్‌టుడే, చాపాడు

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

హిందూ జీవన విధానం శ్రేయస్కరం

మాట్లాడుతున్న శంకరానంద స్వామీ

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణం బొల్లవరంలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హిందూ సమ్మేళనాన్ని నిర్వహించారు. సభకు ఆ సంఘం నాయకుడు సి.సుధాకర్‌రెడ్డి అధ్యక్షత వహించారు. వక్తలు మాట్లాడుతూ హిందూ జీవన విధానం అందరికీ మేలు చేస్తుందని వివరించారు. ప్రాంత సద్భావన ప్రముఖ్ ఓలేటి సత్యనారాయణ, వేదాంత గీత శివం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అభినవ శంకరానందస్వామి, శివ దర్శనానంద ఆధ్యాత్మిక ట్రస్టు వ్యవస్థాపకుడు శివదర్శనానంద సరస్వతి ప్రసంగించారు. ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ ఈసీ సభ్యుడు, హిందూ సమ్మేళన సమితి సమన్వయకర్త డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, హిందూ ధర్మాన్ని బోధించారు.

ధ్యానంతో ప్రశాంతత

మాట్లాడుతున్న ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ ఈసీ మెంబర్ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు విద్య, ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక సరస్వతీ విద్యా మందిరంలో సంస్కృతీ సేవా సమితి, ప్రొద్దుటూరు స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్టీఆర్ వైద్య విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, సేవా సమితి కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి హాజరై మాట్లాడారు. ధ్యానం చేసే ప్రతి ఒక్కరికి ... మాస్టర్ లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు గ్రామీణ: దైనందిన జీవనంలో శారీరక, మానసిక ప్రశాంతతోపాటు భావోద్వేగాల నియంత్రణకు ధ్యానం ఎంతో దోహదపడుతుందని బ్రహ్మకుమారి శాంత తెలిపారు. ఆదివారం స్థానిక త్రిభువన్ వీధిలోని ఓంశాంతి భవనంలో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రుగ్మతలను అధిగమించడానికి ధ్యానం ఉపయోగపడుతుందన్నారు.

రూపు మారుతున్న శ్మశానాలు

❖ ఉపాధి హామీ నిధులతో కట్టడాలు ❖ రాష్ట్రంలోనే మైదుకూరు నియోజకవర్గం ప్రత్యేకం

-న్యూస్‌టుడే, చాపాడు

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మైదుకూరు నియోజకవర్గంలో ఉపాధిహామీ పథకం కింద నిధులు సమకూర్చి శ్మశానాల అభివృద్ధి జరుగుతోంది. ఒక్కో దానికి రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేశారు. బర్నింగ్ ప్లాట్‌ఫాం, వెయిటింగ్ ఏరియా, వెయిటింగ్ హాలు, రిమూవల్ ప్లాట్‌ఫాం, డ్రెస్సింగ్‌రూం, ప్రధానద్వారం (గేటు) నిర్మించాల్సి ఉంది. ఆవరణలో చుట్టూ మొక్కలు నాటాలి. ఉపాధిహామీ అధికారులు, సిబ్బంది పనులు పర్యవేక్షిస్తున్నారు.

చాపాడు మండలం నాగులపల్లెలో నిర్మాణంలో శ్మశానవాటిక

గ్రామాల్లో సమకూరిన స్థలాల వివరాలు

మైదుకూరు : కొత్తసీతారామపురం, గంజికుంట, వనిపెంట, చెర్లోపల్లె, మిట్టమానుపల్లె, గంగాయపల్లె, లక్ష్మీనారాయణపురం, ఉప్పుగుంటపల్లె, జీవీ.సత్రం, జాండ్లవరం, సోమయాజులపల్లె, దయాంఖాన్‌పల్లె, తిప్పిరెడ్డిపల్లె. ఒకటి పూర్తిచేసి ప్రారంభించారు. రెండు చోట్ల పనులు మొదలయ్యాయి.

ఖాజీపేట : భూమాయపల్లె, ఏటూరు, దుంపలగట్టు, తవ్వారుపల్లె, కొత్తపేట(2), పల్లూరు, అప్పనపల్లె, ఖాజీపేట (2), రావులపల్లె, చెమ్ముళ్లపల్లె, నాగసానిపల్లె, మిడుతూరు. ఒకటి పూర్తయి ప్రారంభించారు. మరో రెండు పనులు జరుగుతున్నాయి.

దువ్వూరు : కృష్ణంపల్లె, బుక్కాయపల్లె, గుడిపాడు, దువ్వూరు, మిర్జాన్‌ఖాన్‌పల్లె, కానగూడూరు, జిల్లెల. ఒక్కచోట పనులు ప్రారంభించారు.

బ్రహ్మంగారిమఠం : కందిమల్లాయపల్లె (2), సోమిరెడ్డిపల్లె, పాపిరెడ్డిపల్లె, బీసీ కాలనీ, మల్లేపల్లె, చెంచయ్యగారిపల్లె, ముదుమాల, కొత్తపల్లె, నెల్లూరుపల్లె, చౌదరివారిపల్లె, పెద్దిరాజుపల్లె, డి.అగ్రహారం, రేకులకుంట. నాలుగు చోట్ల పనులు జరుగుతున్నాయి.

చాపాడు : నాగులపల్లె, అయ్యవారిపల్లె, భద్రిపల్లె, లక్ష్మీపేట, అన్నవరం, సోమాపురం, పల్లవోలు, పెద్దగురువలూరు, రామదాసుపురం, కేతవరం, తిప్పిరెడ్డిపల్లె. మూడుచోట్ల పనులు మొదలయ్యాయి.

కల్యాణ మండపం అధ్యక్షుడిగా సూర్యనారాయణ

మద్దతుదారులుతో ర్యాలీలో పాల్గొన్న తొగటవీర అధ్యక్షుడు సూర్యనారాయణ (వలయంలో..)

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక వసంతపేటలోని తొగటవీర క్షత్రియ కల్యాణ మండపానికి అధ్యక్షుడిగా ఎన్నికలో పోటీ చేసిన బండారు సూర్యనారాయణ 'గడియారం' గుర్తుపై 104 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా మొత్తం 435 మంది సభ్యులకు ఓట్లు ఉండగా 423 మంది వినియోగించుకున్నారు. సుమారు 8 ఏళ్ల తర్వాత అధ్యక్ష పదవికి ఎన్నికలు చేపట్టారు. అనంతరం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. నూతన అధ్యక్షుడు స్థానిక వసంతపేటలోని చౌడేశ్వరి ఆలయంలో పూజలు చేశారు.

తెదేపా కడప పార్లమెంట్ అధ్యక్షుడి రాక నేడు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: తెదేపా కడప పార్లమెంట్ సభ్యుడిగా నియమితులైన చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి సోమవారం తొలిసారి నియోజకవర్గానికి రానున్నారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు పెద్దముడియం మండలం సుద్దపల్లె గ్రామం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తెదేపా కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ర్యాలీని విజయవంతం చేయాలని పార్టీ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

పోలియో రహిత సమాజం అందరి ధ్యేయం

దువ్వూరు పంచాయతీ కార్యాలయంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

బద్వేలులో చుక్కలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, వైద్యాధికారులు

పోలియో రహిత సమాజంగా తీర్చిద్దిదడమే ప్రభుత్వ ధ్యేయమని ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్యులు, రాజకీయ, ఉద్యోగ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అన్నారు. ఆదివారం పలు ప్రాంతాల్లో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం విస్తృతంగా జరిగింది. వక్తలు మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. -న్యూస్‌టుడే, బృందం

జమ్మలమడుగులో పాల్గొన్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరులో ఎన్జీవో సంఘం సభా భవనంలో చిన్నారికి చుక్కలు వేస్తున్న ఆ సంఘం అధ్యక్షుడు రామసుబ్బయ్యయాదవ్

ప్రతిభ చూపారు.. విజయంతో మెరిశారు

ప్రొద్దుటూరు విద్య, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ, జాతీయ సంఘటనలతోపాటు కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జి అంశాలపై విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ప్రొద్దుటూరు పట్టణంలోని వసంతపేట పురపాలిక ఉన్నత పాఠశాల విద్యార్థులు మేఘన (8వ తరగతి), శివ (6వ తరగతి), అఫ్సానా (9వ తరగతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి పాఠశాల హెచ్‌ఎం గుర్రప్ప, ఉపాధ్యాయులు బహుమతులు అందించారు. • ప్రొద్దుటూరు శ్రీచక్ర పాఠశాల విద్యార్థినులు దివ్యనిస్సి (9వ తరగతి), లహరి (8వ తరగతి), కీర్తన (7వ తరగతి) విద్యార్థులు మొదటి, రెండో, మూడో స్థానంలో గెలిచి సత్తా చాటారు. వీరికి ప్రిన్సిపల్ సంజయ్, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. • ప్రొద్దుటూరు పట్టణంలోని సంగమేశ్వర పాఠశాల విద్యార్థులు ఇయ్యద్ హుస్సేన్ (9వ తరగతి), నేహ (10వ తరగతి), అబ్దుల్ రెహమాన్ (7వ తరగతి) వరుస విజేతలుగా నిలిచారు. వీరికి కరస్పాండెంట్ శివచంద్రారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. • ప్రొద్దుటూరు పట్టణంలోని జీవనజ్యోతి పాఠశాల విద్యార్థులు మేఘనరెడ్డి (9వ తరగతి), హక్షయశ్రీ (7వ తరగతి), ప్రాణహిత (8వ తరగతి) విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. వీరికి పాఠశాల కరస్పాండెంట్ అమర్‌నాథ్‌రెడ్డి బహుమతులు అందించారు. • ప్రొద్దుటూరు పట్టణంలోని బాలాజీ పాఠశాల విద్యార్థులు హేమంత్‌యాదవ్ (9వ తరగతి), జుబేరియా (8వ తరగతి), మౌనిక (7వ తరగతి) వరుస స్థానాల్లో నిలిచారు. వీరికి హెచ్‌ఎం సుబ్బలక్ష్మమ్మ బహుమతులు అందించారు.

విజేతలతో ప్రొద్దుటూరులోని వసంతపేట మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం గుర్రప్ప, ఉపాధ్యాయులు

విజేతలతో ప్రొద్దుటూరులోని శ్రీచక్ర పాఠశాల ప్రిన్సిపల్ సంజయ్, ఉపాధ్యాయులు

సంగమేశ్వర పాఠశాలలో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న కరస్పాండెంట్ శివచంద్రారెడ్డి

జీవనజ్యోతి పాఠశాల విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న కరస్పాండెంట్ అమర్‌నాథ్‌రెడ్డి

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బాలాజీ పాఠశాల హెచ్‌ఎం సుబ్బలక్ష్మమ్మ

సంపద కాదు.. విద్య శాశ్వతం

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: సంపాదన కాదని.. ఎప్పటికీ విద్యనే శాశ్వతమని ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి అన్నారు. స్థానిక నడింపల్లెవీధిలో ఉన్న ఎస్‌బీ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 'మనదస్తూ' పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విశ్రాంత జిల్లా జడ్జి మహమ్మద్ ఇస్మాయిల్, మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, వైద్యులు వరలక్ష్మీదేవి, పద్మలత, జీఆర్.చంద్రశేఖర్‌తోపాటుగా ఎస్.దస్తగిరి సాహెబ్ రచించిన ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్.దస్తగిరిసాహెబ్ మరణించి పదేళ్లవుతున్నా తనకు నేటికీ గుర్తుండి పోయారన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి పక్కన వైద్యులు

ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే: స్థానిక జమ్మలమడుగురోడ్డులో వైద్యులు విజయనాగేంద్ర, సుమలత ఏర్పాటుచేసిన హర్ష మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి నూతన భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి ప్రారంభించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... గత 15 సంవత్సరాలుగా హోమస్‌పేటలో వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలకోసం అన్ని వసతులు, వైద్య సేవలతో 100 పడకల ఆసుపత్రి ప్రొద్దుటూరులో మొట్టమొదటగా ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదురెడ్డి, నారాయణ వైద్య కళాశాల విశ్రాంత హెచ్‌వోడీ నరసింహారెడ్డి, షేక్ సంక్షేమ, అభివృద్ధి సొసైటీ ఛైర్మన్ ముక్తియార్, తెదేపా నాయకులు వద్దిబాలుడు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

మైదుకూరు, న్యూస్‌టుడే : ఖాజీపేట మండలం కుమ్మరకొట్టాలు వద్ద చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి లారీ బోల్తాపడింది. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన చోదకుడు ప్రకాష్ తీవ్రంగా గాయపడ్డారు. గుజరాత్‌లోని సూరత్ నుంచి పాలిప్రొపిలీన్ బస్తాల లోడుతో వెళ్తున్న లారీ డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ప్రమాదంలో గాయపడిన చోదకుడిని 108లో కడప రిమ్స్‌కు తరలించారు.

దిమ్మె ధ్వంసాన్ని అడ్డుకున్న మహిళలు

ప్రొద్దుటూరుపట్టణం, న్యూస్‌టుడే: స్థానిక వెదుర్లబజారువీధిలో పురపాలక తాగునీటి బోరింగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి తొలగించారు. బోరింగ్ దిమ్మెను ధ్వంసం చేస్తుండగా మహిళలు అడ్డుకోవడంతో వెనుదిరిగి వెళ్లారు. వేసవి కాలంలో ఈ బోరింగ్ ఆధారంగానే తాగునీటిని నిల్వ చేసుకుంటున్నారు. బోరింగ్ లేకుంటే తాగునీటి సమస్య వస్తుందని స్థానికులు ఆదివారం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఇంటి నిర్మాణానికి అడ్డువస్తోందని వైకాపాకు చెందిన ఓ మహిళా కౌన్సిలర్ ఈ చర్యను ప్రోత్సహిస్తున్నట్లు ఆరోపించారు. 20వ వార్డు వైకాపా కౌన్సిలర్ నాగేంద్ర ఈ చర్యను వ్యతిరేకిస్తూ కమిషనర్ రవిచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లుకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్

ప్రార్థనల్లో పాల్గొన్న పాస్టర్లు, సంఘ పెద్దలు

చాపాడు, న్యూస్‌టుడే: మండలంలోని కేతవరం సీఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయలసీమ డయాసిస్ మాజీ సహాయ కార్యదర్శి ప్రభాకర్, పాస్టర్లు రాజేంద్రప్రసాద్, సంపత్, ప్రేమ్‌కుమార్, బాలజోసఫ్ పాల్గొని క్రీస్తు సందేశం ఇచ్చారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గణితం.. ఆయన బోధిస్తే సులభం

❖ ఉపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి వినూత్న శిక్షణ ❖ నేడు జాతీయ గణిత దినోత్సవం

సామగ్రితో బోధిస్తున్న గణిత ఉపాధ్యాయుడు వెంకట సుబ్బారెడ్డి

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు విద్య

గణిత శాస్త్రం అంటే చాలా మంది విద్యార్థులకు భయం. అందులో రాణిస్తామోలేదోనన్న ఆందోళన వెంటాడుతూ ఉంటుంది. ఇలాంటి వాళ్లకు ప్రొద్దుటూరు దొరసానిపల్లెలోని కడప శింగరప్ప అండ్ సైన్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లెక్కల ఉపాధ్యాయుడి బోధన ధైర్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుంది. ఈయన ఏళ్ల కాలంగా వినూత్నంగా పాఠాలు చెబుతున్నారు. అన్ని సబ్జెక్టుల మాదిరిగానే గణితం కూడా సులభతరమేననే స్పష్టత విద్యార్థుల్లో నింపుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం.

జాతీయ స్థాయికి ప్రాజెక్టు

ప్రొద్దుటూరుకు చెందిన మన్నె వెంకటసుబ్బారెడ్డి 1996లో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టి 15 ఏళ్లపాటు బాలలు సైన్సు, గణితం నమూనాలు, ప్రాజెక్టులు తయారీకి గైడ్‌గా వ్యవహరించారు. జిల్లా నుంచి 'జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్'కు తొలిసారి ఆయన గైడ్ చేసిన ప్రాజెక్టు 2003లో జాతీయ స్థాయికి ఎంపికైంది. 2009లో గణిత శాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఈయన 2014లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు.

సామగ్రి తయారీ

తాను బోధించే పాఠ్యాంశంలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేకంగా సామగ్రి సిద్ధం చేశారు. క్లిష్టమైన విషయాలు సులువుగా విద్యార్థులకు అర్థం అయ్యేందుకు ప్రత్యేకంగా బోధన సామగ్రి తయారు చేయించారు. వీటితో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వినూత్నంగా బోధిస్తున్నారు.

విద్యార్థులకు అవగాహన

ప్రకృతిపై మక్కువ పెంచుకున్న వెంకటసుబ్బారెడ్డి ఆయన పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులతో మొక్కలు నాటించారు. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, పలు వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. జల సంరక్షణ చేపట్టే విధానంపై పాఠశాలల ఆవరణంలో ఇంకుడు గుంతలను విద్యార్థులతో తయారు చేయించారు. పాఠశాలలో గణిత ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలన్నదే తన లక్ష్యమని ఆయన 'న్యూస్‌టుడే'తో అన్నారు.

డాక్యుమెంట్ పోయినది

నా క్లయింట్ చప్పిడి గోవిందరెడ్డి, తండ్రి సి.వెంకటరెడ్డి, డి.నెం. 4/231, సూపర్ బజార్ రోడ్డు, ప్రొద్దుటూరు వారు శ్రీమతి సుంకు రామలక్షుమ్మ వగైరాలతో కొనుగోలు చేసిన విక్రయ దస్తావేజు ఒరిజినల్ డాక్యుమెంట్ ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద జిరాక్స్ కోసం వెళుతుండగా పోయినది. DOC No. 6775/2009 తేదీ 12.10.2009. దొరికిన వారు క్రింది చిరునామాకు గానీ, పైన తెలిపిన నా క్లయింట్‌కు గానీ తెలియజేయగలరు.

షెడ్యూలు

కడప డి॥., ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ డి॥., ప్రొద్దుటూరు సబ్ డి॥., ప్రొద్దుటూరు టౌన్, మునిసిపాలిటి ఏరియా ముస్లింపుర వీధిలోని పాత వార్డు నెం.5, డి.నెం. 5/28, ప్రస్తుత వార్డు నెం.10, డి.నెం. 10/729, 10/730, 10/731, 10/732, 10/733 గల యిండ్లుగా ఉండి ప్రస్తుతం పడగొట్టబడిన బయలు జాగా సర్వే నెం. 482, 8 సెంట్లు విస్తీర్ణం (లేక) 387.14 చ॥గ॥లు. **తూర్పు :** రాశి గోడ, బండి వీరారెడ్డి గారి ఇల్లు, **పడమర :** ఈ దినం మేము ఇదే డోర్ నెంబర్లలోని చప్పిడి ఇందిర వగైరాలకు విక్రయించిన జాగా, **ఉత్తరం :** 20 అడుగులు వెడల్పు గల రాశి రస్తా, **దక్షిణం :** పబ్లిక్ రోడ్డు.

ఎ.ఎస్.విజయకుమార్, అడ్వకేట్
ప్రొద్దుటూరు, సెల్ : 9985503399

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే

దువ్వూరు, న్యూస్‌టుడే : నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తమ ఆశయమని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. దువ్వూరులో రూ.6 లక్షల నిధులతో మంజూరైన కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణం, చింతకుంట పంచాయతీ అరుంధతీనగర్‌లో రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు ఆదివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ భూమిపూజ చేశారు. నాయకులు బోరెడ్డి వెంకటరమణారెడ్డి, పాపినేని రాంబాబు, లక్ష్మయ్య యాదవ్, గంగాధర్, షరీఫ్, పి.వి.ప్రతాప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులపై నిర్లక్ష్య వైఖరి తగదు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రస్తుతం ఉద్యోగ వర్గాన్ని విస్మరిస్తోందని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బద్వేలు పట్టణంలో ఏర్పాటు చేసిన ఎస్టీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అనేక హామీలు ఇచ్చిన కూటమి పెద్దలు అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా అమలు చేయలేదని ఆరోపించారు.

ఆ పంచాయతీలు విభజించొద్దని తీర్మానం

అట్లూరు, న్యూస్‌టుడే : అట్లూరు, కుంభగిరి పంచాయతీలను విడగొట్టొద్దని యథావిధిగానే ఉంచాలని వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఆదివారం అట్లూరు, కుంభగిరి సచివాలయాల్లో స్థానిక సర్పంచులు రేణుకా యల్లమ్మ, గంగమ్మ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అట్లూరు నుంచి అట్లూరు క్రాస్‌రోడ్డును, కుంభగిరి నుంచి ఎస్.వెంకటాపురాన్ని విభజించి నూతన పంచాయతీలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనపై అత్యవసర సమావేశాన్ని పంచాయతీ కార్యదర్శులు నిర్వహించారు.

దేవాదాయ శాఖ భూ ఆక్రమణపై ఆందోళన

నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

మైదుకూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఉత్సలవరం ఎస్సీకాలనీ వద్ద దేవాదాయశాఖ భూమి అన్యాక్రాంతం చేస్తున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం ఆక్రమిత ప్రాంతానికి కాలనీవాసులు చేరుకుని నిరసన తెలిపారు. గంజికుంట రెవెన్యూ గ్రామం సర్వేనెంబరు 17/7లో గతంలో మరుగుదొడ్డి నిర్మించగా ఉత్సలవరం రైతుకు చెందిన ఒకరు ఆక్రమించి పశువులు, జీవాల షెడ్డుగా మార్చి గడ్డివాములు వేశారని , పక్కనే మరో 37 సెంట్ల స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. దేవాదాయ స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. ఖాజీపేటలో ఎంపీ అవినాష్‌రెడ్డి తదితరులు రక్తదానం చేశారు. రాజుపాళెంలో 53 మంది రక్తదానం చేశారు. జమ్మలమడుగులో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. - న్యూస్‌టుడే, బృందం

అట్లూరు : కేకు కోస్తున్న ఎమ్మెల్యే సుధ

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

శిల్పారామంలో సందడి

శిల్పారామం కళావేదికపై నృత్యం చేస్తున్న చిన్నారులు

మారుతీనగర్: ఆటవిడుపులో భాగంగా శిల్పారామం కళావేదికపై ఆదివారం చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. నగర ప్రజల కోసం విద్యార్థులు, కళాకారులతో నిర్వహించిన పలు సాంస్కృతిక, జానపద, పల్లెటూరు, సినీగీతాల కార్యక్రమాలు ఆహ్లాదం కోసం వచ్చిన ప్రజలను ఎంతో ఉత్సాహపరిచాయి. నగర ప్రజలు, చిన్నారులు, మహిళలు పెద్ద ఎత్తున శిల్పారామానికి చేరుకుని సేద తీరి సందడి చేశారు. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, శిల్పారామం సిబ్బంది, నగర ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : సీకేదిన్నె మండలంలోని బయనపల్లెలోని శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీనదయాల్ తెలిపారు. శనివారం కమలాపురంలో జిల్లా స్థాయి ప్రదర్శనలో బయనపల్లె పాఠశాల విద్యార్థులు శివశంకర్, హరిబాబు ఉపాధ్యాయుడు విజయకుమార్ ఆధ్వర్యంలో రూపొందించిన స్మార్ట్ డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ ప్రాజెక్టు గ్రూపు విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది.

రాష్ట్రస్థాయికి ఎంపికైన బయనపల్లె పాఠశాల విద్యార్థులు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : మండలంలోని బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి ఆదివారం భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేంపల్లె : వేంపల్లెలో వెలసిన వేంకటేశ్వరస్వామికి ఆదివారం ధనుర్మాస పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

వేంపల్లెలో వేంకటేశ్వరస్వామి

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు..

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఈ నెల 30న జరిగే వైకుంఠ ఏకాదశి పర్వదినం వేళ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను తితిదే ఆధ్వర్యంలో చేపట్టారు. క్యూలైన్లు సిద్ధం చేస్తున్నారు. ఆలయంలో రంగ మండపం, గర్భగుడి చుట్టూ నీడ కోసం చలువ పందిళ్ల పనులు చేపట్టారు.

మురుగు కూపం.. నగరావాసికి శాపం

పలు కాలనీల్లో మారని దుస్థితి

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. మురుగు కూపాలే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రజలకు దుర్వాసనతో పాటు దోమలబెడద ఎక్కువైంది. దీంతో స్థానికులు వ్యాధులబారిన పడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి పారిశుద్ధ్యానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిన్నచౌకు గురుకుల పాఠశాల ప్రహరీ పక్కనే మురుగు కూపం

• కడప శివారులోని రామకృష్ణనగర్‌కు వెళ్లే దారి ప్రారంభంలో ఖాళీ ప్రదేశంలో గత కొన్ని రోజుల నుంచి మురుగునీరు నిల్వ ఉండడంతో అది కాస్త మురుగుకుంటగా మారింది. దోమలకు నివాసంగా మారి దుర్వాసన వస్తోంది. దీంతో రామకృష్ణనగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

• కడప శివారులోని చిన్నచౌకు గురుకుల పాఠశాల చుట్టూ మురుగునీరు నిల్వ ఉంది. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులున్నారు. సరైన మురుగు కాలువల వ్యవస్థ లేకపోవడంతో నీరంతా పాఠశాల బయట ప్రహరీ చుట్టూ చేరుతోంది. పాఠశాల పక్కనే చౌడమ్మ వృద్ధాశ్రమం ఉంది. ఇక్కడికి వెళ్లే దారిలో మురుగునీరు ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంచేలా మ్యూజియం

పరికరాలను పరిశీలిస్తున్న ఆర్జేడీ రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ సలీంబాషా

కడప విద్య, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేలా, సైన్స్‌పై ఆసక్తి పెంచేలా మ్యూజియం ఉందని ప్రభుత్వ కళాశాలల (ఉన్నత విద్య) ఆర్జేడీ డాక్టర్ రవీంద్రనాథ్, కోటిరెడ్డి మహిళా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ సలీంబాషా అన్నారు. స్థానిక జిల్లా సైన్స్ మ్యూజియాన్ని ఆదివారం వారు పరిశీలించారు. అక్కడి పరికరాల గురించి క్యురేటర్ రెహమాన్‌ను అడిగి తెలుసుకున్నారు.

పరిశోధకుడికి డాక్టరేట్ ప్రదానం

వైవీయూ, న్యూస్‌టుడే: వైవీయూ వృక్షశాస్త్ర పరిశోధకుడు ప్రీతమ్ నాయక్‌కు డాక్టరేట్ వరించింది. వృక్షశాఖ ప్రొఫెసర్ చంద్ర ఓబుల్ రెడ్డి పర్యవేక్షణలో చేసిన అంశంపై పరిశోధన పూర్తి చేసి సమర్పించారు. ఈ మేరకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎస్వీ కృష్ణారావు స్కాలర్‌కు పీహెచ్‌డీ నోటిఫికేషన్ ప్రకటించారు.

ప్రీతమ్ నాయక్

ఆరోగ్య మాత చర్చిలో ప్రార్థనలు

కేక్ కోస్తున్న తెదేపా నేత అమీర్‌బాబు, పాస్టర్లు

అరవిందనగర్ (కడప): మానవజాతి మనుగడకు భూలోకంలో జన్మించిన మహనీయుడు ఏసుక్రీస్తు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు అన్నారు. ఆదివారం కడప నగరంలోని ఆరోగ్యమాత చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు తెదేపా జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు ఆధ్వర్యంలో జరిగాయి. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

మాట్లాడుతున్న వైద్యుడు హరిప్రసాద్, ధ్యానంలో పాల్గొన్న విద్యార్థులు

వేంపల్లె, న్యూస్‌టుడే: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని వైద్యుడు, అబ్బా టీవీ ఫౌండర్ హరిప్రసాద్ పేర్కొన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఆదివారం జాతీయస్థాయి పతకం 11, 15 యూనిట్ల ఆధ్వర్యంలో ప్రపంచ ధ్యాన దినోత్సవం, 23రన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, ఏవో రవికుమార్, అకడమిక్ డీన్ రమేష్‌కైలాస్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలని వినతి

వేముల, న్యూస్‌టుడే: ప్రభుత్వం 12వ పీఆర్సీని నియమించి కనీసం 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎస్టీయూఏపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్. దాదావలీ కోరారు. మాజీ ఎమ్మెల్సీ నుంచి చెల్లించని సరెండర్ బకాయిలు, పదవీ విరమణ ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలను తగ్గించి బోధనకే పరిమితం చేయాలని కోరారు.

సనాతన ధర్మ పరిరక్షణకు కృషి

లింగాల, న్యూస్‌టుడే: హైందవ ధర్మాన్ని, హిందూ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకుడు జయపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నకుడాలలో తితిదే కల్యాణ మండపంలో హిందూ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందువులంతా ఐక్యంగా ఉండాలన్నారు. విశ్వ హిందూ పరిషత్ డీవో విజయరామరెడ్డి, ధర్మ ప్రచార సమితి సభ్యులు శేషయ్య మాట్లాడారు. **పెండ్లిమర్రి:** హిందూ ధర్మాన్ని ఆచరించి కాపాడుకుందామని మహానందిపల్లె పీఠం (పులివెందుల) పీఠాధిపతి నాగేంద్ర మహారాజ స్వామి అన్నారు. ఆదివారం వెల్లటూరు చెన్నకేశవ స్వామి ఆలయ సన్నిధిలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. **సిద్దవటం:** అందరూ ఐక్యమత్యంగా మెలిగి హిందూ ధర్మాన్ని కాపాడాలని శ్రీశైలం శ్రీగిరి భువనేశ్వరీ పీఠాధిపతి ఆదిశివ కల్యాణంద భారతీస్వామి పిలుపునిచ్చారు. సిద్దవటం మండలం మాచుపల్లె పరిధిలోని శాంతినగర్‌లో ఆదివారం హిందూ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు.

చిన్నకుడాలలో సమ్మేళనానికి హాజరైన హిందువులు

క్రీడాకారులకు హాకీ స్టిక్స్ అందజేత

స్టిక్స్ అందుకున్న క్రీడాకారులతో ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టరు సుభాన్‌బాషా

కడప ఏడు రోడ్లు, న్యూస్‌టుడే : కడప మున్సిపల్ స్టేడియంలో హాకీ క్రీడకు ఏర్పాటు చేసిన ఆస్ట్రో టర్ఫ్ ఇప్పటికీ ప్రారంభం చకపోవడం బాధాకరమని ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ డైరెక్టరు సుభాన్‌బాషా అన్నారు. స్థానిక నగరంలోని గుంతబజార్‌లో క్రీడాకారులకు హాకీ స్టిక్స్, మున్సిపల్ కార్మికులకు దుస్తులను ఆదివారం పంపిణీ చేశారు

శక్తి యాప్‌తో మహిళలకు భద్రత

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: చరవాణుల్లో శక్తియాప్ ఉంటే మీ వెంట పోలీసులు ఉన్నట్లేనని రిమ్స్ ఎస్సై సుభాన్‌బాషా అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం శిల్పారామంలో శక్తియాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తియాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రతి ఒక్క విద్యార్థిని, మహిళ వారి చరవాణుల్లో శక్తియాప్‌ను డౌన్‌లోడు చేయించుకోవాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కడప విద్య, న్యూస్‌టుడే : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని జిల్లా విద్యాశాఖ బోధనేతర ఉద్యోగులు విన్నవించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ బోధనేతర సిబ్బంది బీఈడీ దూర విద్య చేసేందుకు వీలు కల్పించాలని కోరారు. బోధనేతర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మున్నెల్లి రమేష్, జాయింట్ సెక్రటరీ ఆనంద్, నాయకులు శనివారపు ప్రతాప్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని సత్కరిస్తున్న బోధనేతర ఉద్యోగులు

వేమన పద్య పఠన పోటీల్లో సత్తా

మారుతీనగర్, న్యూస్‌టుడే: విద్యార్థులు విజ్ఞానానికి, ఉన్నత జీవన విధానానికి వేమన పద్యాలు ఔషధంలా పని చేస్తున్నాయని రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి అన్నారు. వేమన పద్య పఠన పోటీల్లో ఎంపికైన 32 మంది విద్యార్థులకు రెడ్డి సేవాసమితి కార్యాలయంలో ఆదివారం తుది పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ. 10వేలు, ద్వితీయ బహుమతి రూ. 8 వేలు, తృతీయ బహుమతి రూ. 6 వేలు, 5 మందికి ప్రోత్సాహక బహుమతులు రూ. 2 వేలు అందించారు. కార్యక్రమంలో రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి, డాక్టర్ సాయిప్రసాద్, డాక్టర్ నాగరాజు, దామోదరమ్మ న్యాయ నిర్ణేతలుగా పాల్గొన్నారు.

పోటీల్లో గెలుపొందిన చిన్నారులతో రెడ్డి సేవా సమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ్డి

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. కడప నగర శివారులోని వెంకటేశ్వరపురం నుంచి శివ, దుర్గ దంపతులు నందలూరు మండలం దుర్గాపురానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అదుపు కిందపడి వారు గాయపడ్డారు. ● రాజంపేట మండలం శేషమాంబపురం నుంచి సునీల్, వైష్ణవి కడపకు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆటో ఢీకొంది. కడప సర్వజన ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పోలీసులకు భాజపా నాయకుల ఫిర్యాదు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది సామాజిక మాధ్యమంలో ఆర్ఎస్ఎస్‌పై అసభ్యకరంగా డీపీ పెట్టినందుకు భాజపా నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇతనిపై కఠిన చర్యలు తీసుకోవాలని భాజపా మండల అధ్యక్షుడు గజ్జల వెంకటసుబ్బారెడ్డి కోరారు. ఈ విషయమై విచారిస్తున్నట్లు సీఐ బాలమద్దిలేటి వివరించారు.

బంగారు గొలుసు చోరీ

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: కడప తాలూకా ఠాణా పరిధిలో ఓ మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని దుండగుడు బంగారు గొలుసు లాక్కెళ్లాడు. కడప రామరాజుపల్లెకు చెందిన పద్మావతి ఆదివారం తమ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లాడనే బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

NOTICE

Date: 19.12.2025

To,
1. Palakolanu Anupriya
D/o. Palakolanu Srinivas Reddy,
R/o. 3/88/3, Siddamurthypalle,
Mahanandipalle, Kalasapadu,
Kadapa District. A.P.

Sir's,
Please take notice that my clients, LAXMI INFRAA DEVELOPERS, Rep. by its proprietor Smt. Dasari Rajya Lakshmi W/o. Sammeta Subrahmanyam and 14 others have filed the Writ Petition No. 10490 of 2023, challenging orders issued by The Addl. Collector, Revenue, FAC, Ranga Reddy District in Case No. F1/4886/2017, Dated: 24-08-2022. The said Writ Petition came up for admission and hearing on 17-12-2025 and the Hon'ble High Court for the State of Telangana, at Hyderabad was pleased to permit me to serve the notice through paper publication in Telugu Daily News Paper. Therefore, it is hereby informed that, you are directed by Hon'ble High Court to appear on 31-12-2025 either in person or through an advocate on the next date of hearing, failing which the Hon'ble Court shall proceed with the case basing on records available.

Hence, this notice
Sd/- KARNAM RAMESH
Counsel for the Petitioner High Court of T.S
H.No: 2-2-1109/BK/MIG 17 & 18
Nandanavanam Colony, Bathukammakunta,
Bagh Amberpet, Amberpet, Hydeabad- 500013
Ph: 9849295468

NOTICE

Date: 19.12.2025

To,
1. Palakolanu Anupriya
D/o. Palakolanu Srinivas Reddy,
R/o. 3/88/3, Siddamurthypalle,
Mahanandipalle, Kalasapadu,
Kadapa District. A.P.

Sir,
Please take notice that my clients, LAXMI INFRAA DEVELOPERS, Rep. by its proprietor Smt. Dasari Rajya Lakshmi W/o. Sammeta Subrahmanyam and 14 others have filed the Writ Petition No. 10486 of 2023, challenging orders issued by the Revenue Divisional Officer, Chevella Division, Ranga Reddy District in ORC No. L/3093/2007, Dated: 07-01-2008. The said Writ Petition came up for admission and hearing on 17-12-2025 and the Hon'ble High Court for the State of Telangana, at Hyderabad was pleased to permit me to serve the notice through paper publication in Telugu Daily News Paper. Therefore, it is hereby informed that, you are directed by Hon'ble High Court to appear on 31-12-2025 either in person or through an advocate on the next date of hearing, failing which the Hon'ble Court shall proceed with the case basing on records available.

Hence, this notice
Sd/- KARNAM RAMESH
Counsel for the Petitioner High Court of T.S
H.No: 2-2-1109/BK/MIG 17 & 18
Nandanavanam Colony, Bathukammakunta,
Bagh Amberpet, Amberpet, Hydeabad- 500013
Ph: 9849295468

చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న కడప ఎమ్మెల్యే మాధవి, ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య

పల్స్ పోలియో విజయవంతం

పోలియోరహిత సమాజానికి కృషి చేద్దామని అధికారులు, నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు కడప, కమలాపురం, పులివెందుల నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. కడప ప్రెస్‌క్లబ్ సమీపంలోని పీహెచ్‌సీలో కడప ఎమ్మెల్యే మాధవి, 23వ డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కడప పోలీసు మైదానంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, పులివెందులలో ఎంపీ అవినాష్‌రెడ్డి, వేంపల్లెలో మాజీ ఎంపీ తులసిరెడ్డి, కడప సీపీ బ్రౌన్ గ్రంథాలయం వద్ద భాజపా జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి కార్యక్రమాల్లో పాల్గొని పోలియో చుక్కలు వేశారు. - న్యూస్‌టుడే బృందం

చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలి

సిద్దవటంలో రిలే దీక్షల్లో ఐకాస నాయకులు

సిద్దవటం, న్యూస్‌టుడే : సిద్దవటాన్ని కడపలోనే కొనసాగించాలని సిద్దవటం నుంచి కడపలోని కలెక్టరు కార్యాలయానికి సోమవారం చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని జేఏసీ నాయకులు పాలెం నారాయణ, రాజగోపాలయ్య, బాలుగారి వెంకటసుబ్బయ్య, పోలు వెంకటసుబ్బయ్య, శ్రీకాంత్, రవిశంకర్, అనిల్‌కుమార్, వెంకట్ పిలుపు నిచ్చారు. సిద్దవటం, మాధవరం-1 గ్రామాల్లో ఆదివారం రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి.

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలను వైఎస్సార్ కడప జిల్లాలో కొనసాగించేలా కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని మైనార్టీ నాయకులు పేర్కొన్నారు. ఒంటిమిట్టలో 16వ రోజు ఆదివారం ఐకాస నాయకులు షేక్ జిలానిబాషా, ఖాదర్‌బాషా, అలీబాషా, మౌలాలి, మహమ్మద్ రఫీ, రిలే నిరాహార దీక్ష చేపట్టి నిరసన తెలిపారు.

రైతు బజారులో కూరగాయల ధరలు

కడప వ్యవసాయం: రైతుబజారులో కూరగాయల ధరలు కిలో (నిన్నటివి) ఇలా...బంగాళదుంప-40, క్యాబేజి-28, క్యారెట్-68, బీన్స్-65, బీట్‌రూట్-40, కీర-40, దోస-40, దొండకాయలు-45, ముల్లంగి-35, అల్లం-60, 80, కాలీఫ్లవర్-38, క్యాప్సికం-70, టమాట-35, మిరపకాయలు-40, వంకాయలు-30, బెండకాయలు-45, బీర-45, నాటుకాకర-55, హైబ్రిడ్ కాకర-40, మటిక్కాయ-40, చిక్కుడు-35, అలసందకాయలు-45, అనపకాయలు-50, ఉల్లిపాయలు-20, 25

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

పేదలను ఆదుకోవడం అందరి బాధ్యత

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని సీఐ పురుషోత్తంరాజు అన్నారు. కడప నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం మానవత స్వచ్ఛంద సంస్థ సమావేశాన్ని నిర్వహించారు. పలురకాల సేవల్లో సంస్థ ముందంజలో ఉందని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి, విశ్రాంత డీఎస్పీ రాజశేఖర్‌రెడ్డి, కేంద్ర కమిటీ డైరెక్టరు రామాంజుల రెడ్డి, గోపి, సుబ్రహ్మణ్యం, మాధవి, రామకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు, సత్యనారాయణ, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఓటు నమోదుకు తిప్పలే!

చెన్నూరు, న్యూస్‌టుడే: ప్రజాసామ్యంలో ఓటే వజ్రాయుధం. అలాంటి ఓటును నమోదు చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో చెన్నూరు మండలంలోని యువత నిరుత్సాహంతో ఉంది. ఓటు నమోదు చేయాలని మండలంలోని కొక్కరాయపల్లె గ్రామానికి చెందిన పలువురు తమను ఓటరుగా నమోదు చేయాలని బీఎల్‌వో వద్దకు వెళ్లగా తనకు నిర్దేశించిన లాగిన్ సక్రమంగా పని చేయనందున మీ సేవా కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసిన అనంతరం తహసీల్దారు కార్యాలయంలో స్పందన కరవైంది. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలే స్థానికంగా ఓటు నమోదు చేసి ఇబ్బంది లేకుండా చూసేవారని, ప్రస్తుతం అధికారులు బీఎల్‌వోలుగా ఉన్నా ప్రయోజనం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై తహసీల్దార్ సరస్వతి మాట్లాడుతూ సమస్యను గుర్తించి పరిష్కరిస్తామన్నారు.

ఘనంగా మాజీ సీఎం జగన్ పుట్టిన రోజు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు కడప, పులివెందుల, కమలాపురం నియోజకవర్గాల వ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైకాపా శ్రేణులు కేకు కోసి సంబరాలు చేసుకున్నారు. అనాథ ఆశ్రమాలు, ఆసుపత్రుల్లో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పులివెందుల వైఎస్ఆర్ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం భారీ కేకు కోశారు. - న్యూస్‌టుడే కడప క్లస్టర్ బృందం

పులివెందులలో కేకు కోస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, వైకాపా శ్రేణులు

కూటమి నేతలు గొప్పలు చెప్పడం సరికాదు

పులివెందుల, న్యూస్‌టుడే: గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 95 శాతం పనులు పూర్తయిన ఎత్తిపోతల పథకాలకు రంగులు పూసి ప్రారంభోత్సవాలు చేసి తామే అంతా చేశామని కూటమి నాయకులు గొప్పలు చెబుతున్నారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం ఎంపీ పులివెందులలో విలేకరులతో మాట్లాడారు. వచ్చే నెలలో పులివెందులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చి వాటర్ గ్రిడ్ పనులను ప్రారంభిస్తారని కూటమి నేతలు చెబుతున్నారని, పనులు వారి హయాంలో మంజూరుచేసి పూర్తిచేసి ప్రారంభించనున్నట్లు గొప్పలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగరం గౌస్‌నగర్‌లో ఆదివారం చేపట్టిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ జుబేర్ అహ్మద్ ఆధ్వర్యంలో వైద్యులు ఉచితంగా 150 మందికి పరీక్షలు నిర్వహించి మందులను అందించారు.

చామంతి సాగు.. లాభాలు బాగు

పులివెందుల, న్యూస్‌టుడే: చామంతి పూల దిగుబడులు, ధరలు బాగుండటంతో సాగుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చామంతి సాగుకు పెట్టుబడి ఎకరాకు రూ. 70 వేల నుంచి రూ. 90 వేల వరకు అవుతోంది. కిలో చామంతి పూలు రూ. 60 నుంచి రూ. 80దాకా పలుకుతోంది. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆర్జిస్తున్నారు.

● జిల్లా వ్యాప్తంగా 1731 ఎకరాల్లో చామంతి పూల సాగు చేస్తుండగా పెండ్లిమర్రి మండలంలో 836 ఎకరాల్లో, పులివెందుల నియోజకవర్గంలో 356 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 5 రకాల పూల మొక్కలను రైతులు నాటుతున్నారు. నాటిన తర్వాత అయిదో నెల నుంచి దిగుబడి ప్రారంభమవుతుందని ఉద్యాన అధికారి రాఘవేంద్రారెడ్డి తెలిపారు.

మూడు ఎకరాల్లో పంట వేశా

మూడు ఎకరాల్లో చామంతి పూల పంటను సాగు చేస్తున్నాను. ప్రస్తుతం రెండు కోతలు పూర్తయ్యాయి. మొదటి కోతలో ధర తక్కువగా ఉండేది. రెండో కోతలో ధర బాగుండటంతో లాభాలు వచ్చాయి. - రవీంద్ర, మొట్నూతలపల్లె

ఆశాజనకంగా ధరలు

ప్రస్తుతం చామంతి పూల సాగులో లాభాలు చూస్తున్నాం. రెండు ఎకరాల్లో సాగు చేశాను. ధరతో పాటు దిగుబడి బాగా ఉండటంతో ఆశాజనకంగా రాబడి ఉంది. పెట్టుబడి పోను రూ. రెండు లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. - మహేశ్వరరెడ్డి, పులివెందుల



8వ వర్ధంతి
యథా దీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా!
యోగినో యత చిత్తస్య యుంజతో యోగమాత్మనః !!
భావము : వాయు ప్రసారము లేని చోట నిశ్చలముగానుండు, దీపమువలె యోగికి వశమైయున్న చిత్తము పరమాత్మ ధ్యానమున నిమగ్నమై యున్నప్పుడు నిర్వికారముగా నిశ్చలముగా నుండును.
మీరు మరణించి 8 సం॥లు గడిచినా మీ గత స్మృతులు మాకు సదా చిరస్మరణీయం. మీ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ...
కీ.శే. బండి నాగిరెడ్డి గారు
Rtd. H.M., SBI కాలనీ, పులివెందుల.
జననం : 04.05.1953 మరణం : 22.12.2017
మీ భార్య : బి.లక్ష్మీదేవమ్మ
కుమార్తెలు : ఎస్.వీణ, బి.శ్రీవాణి
అల్లుళ్లు : ఎస్.రవికాంత్‌రెడ్డి, బి.వి.నారాయణరెడ్డి
మనుమడు : బి.సాత్విక్‌రెడ్డి
మనుమరాళ్లు : ఎస్.అభిజ్ఞ, ఎస్.జాహ్నవి, బి.చైత్ర

(c) eenadu